శ్రీ మండలి బుద్ధప్రసాద్ జన్మదిన బహూకృతి



తెలుగు వ్యాస మండలి

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, విశిష్ట వ్యాస సంకలనం)



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి గారిచే

తెలుగు వ్యాస మండలి

ఆవిష్కరణోత్సవం

25 మే, 2011 • రవీంద్ర భారతి, హైదరాబాద్



'తెలుగు వ్యాస మండలి'ని ఆవిష్కరించి బుద్ధప్రసాద్ గారికి జన్మదిన బహూకృతిగా అందజేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి గారు.

చిత్రంలో శ్రీ గుత్తికొండ సుబ్బారావు, డా॥ ఎల్లా వెంకటేశ్వరరావు, డా॥ దాసరి నారాయణరావు, డా॥ సి. నారాయణరెడ్డి, డా॥ జి.వి. పూర్ణచందు, డా॥ ఆర్. ప్రభాకరరావు, డా॥ రాళ్ళబండి కవితాప్రసాద్ గార్లను కూడా చూడవచ్చు.




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి, శ్రీ బుద్ధప్రసాద్,
శ్రీ మద్దాలి రఘురాం, శ్రీమతి ఉషా గాయత్రి




ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న దృశ్యం



మండలి దంపతులను సన్మానిస్తున్న
డా॥ సి. నారాయణరెడ్డి,
ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి



డా॥ దాసరి నారాయణరావు అభినందన.



కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు
శ్రీ గుత్తికొండ సుబ్బారావు,
కార్యదర్శి డా॥ జి.వి. పూర్ణచందర్‌రావుల అభినందన.



ప్రముఖ మృదంగ విద్వాంసులు
డా॥ ఎల్లా వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ముఖ్యమంత్రి



డా॥ రాళ్ళబండి కవితా ప్రసాద్ అష్టావధానం




సదస్సులో ఒక భాగం




పురాతత్త్వ శాస్త్రవేత్త డా॥ వి.వి. కృష్ణశాస్త్రిని
సన్మానిస్తున్న ముఖ్యమంత్రి




స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ ఎం.ఎస్. రాజలింగంను
సత్కరిస్తున్న ముఖ్యమంత్రి



హోసూరు (తమిళనాడు) నుంచి శాసనసభ్యుడుగా
మూడవసారి ఎన్నికైన తెలుగువాడు శ్రీ గోపీనాథ్‌కు
ముఖ్యమంత్రి సత్కారం.



'తెలుగు వ్యాస మండలి' ప్రచురణకర్త,
'రైతునేస్తం' మాసపత్రిక సంపాదకులు
శ్రీ వై. వేంకటేశ్వరరావుకు ముఖ్యమంత్రి సత్కారం.



తెలుగు జాతి రత్నం


స్వర్గీయ **మండలి వెంకట కృష్ణారావు**

1926 – 1997

దివ్యస్మృతికి నీరాజనం

తెలుగు వ్యాస మండలి

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, విశిష్ట వ్యాస సంకలనం)



శ్రీ మండలి బుద్ధప్రసాద్

జన్మదిన బహూకృతి

26 మే, 2011

ప్రచురణ :

కిన్నెర పబ్లికేషన్స్, హైదరాబాద్ మరియు దివి ఐతిహాసిక పరిశోధక మండలి, అవనిగడ్డ వారి సహకారంతో

కృష్ణా జిల్లా రచయితల సంఘం

1వ అంతస్తు, సత్యం టవర్స్, బకింగ్‌హాంపేట పోస్టాఫీస్ ఎదురు, గవర్నరుపేట, విజయవాడ - 520 002.

Telugu Vyasamandali

A compendium of rare articles on Telugu
Language, History, Culture & Literature

Birthday presentation to
Sri Mandali Buddha Prasad

Published by :
Krishna District Writers Association
First Floor, Satnam Towers,
Opp. Bukinghampet Post Office,
Governorpet, Vijayawada - 520 002.

With the support of
Kinnera Publications, Hyderabad
Divi Itihasika Parisodhaka Mandali
Avanigadda, Krishna Dist., Andhra Pradesh

Pages : 624

Price : Rs. 500/-

Copies : 1000

First Edition : May, 2011

Front Cover Art by :
Sri S. Janardhan

Back Cover Art by :
Sri Trisulapani

For Copies :
EMESCO BOOKS
H.No. 1-2-7, Gaganmahal Road,
Domalaguda, Hyderabad - 29.

Printed at :
Sai Likhita Printers
Khairatabad, Hyderabad-4.
Ph: 040-65545979

ఒక చారిత్రక విభాత సంధ్యలో....

చరిత్ర ఒక వాస్తవం - చారిత్రక అధ్యయనం ఒక సిద్ధాంతం -

చరిత్ర ఒక సత్యం - చారిత్రక భాష్యం ఒక అవగాహన -

21వ శతాబ్దంలో, రెండవ దశాబ్ది గడపలో నిల్చొని, గతాన్ని అనుశీలిద్దాం. కాలంతెరమీద 'చరిత్ర', చలన చిత్రంలా కనిపిస్తుంది. దర్శకుడెవరో తెలియదు. చిత్రానికి మాత్రం ప్రతి ప్రేక్షకుడు భాష్యకారుడే! ప్రతి విమర్శకుడు సిద్ధాంతవేత్తే!

తెలుగుజాతి ఇప్పుడు చరిత్ర చౌరాస్తాలో నిలబడింది. దిక్కులు చూస్తోంది. ప్రతి దిక్కులోను ఎగుడు దిగుళ్లు - ఎత్తు పల్లాలు - ఉద్ధాన పతనాలు - "వైభవోజ్జ్వల మహాయుగాలు ! వెల్లివిరిసిన అజ్ఞానాలు ! ఆశాకుసుమాలు పూచే మధుర వసంతాలు - నైరాశ్యపుచలిగుబుళ్లు"!...

ఈ నేపథ్యంలో మీ చేతుల్లో "తెలుగు వ్యాసమండలి"

గతకాలాన్ని ఆనాడే అక్షరాల్లో అనువదించి, పత్రికల సంచికల పేటికల్లో భద్రపరిచిన వ్యాసమణి కర్ణికలు !

ఈనాటికీ ఆశ్చర్యపరిచే విజ్ఞాన కాంతుల రసప్రసరణలు !

శతాధికంగా సమకూర్చిన వ్యాసాల వజ్రాలహారం ఈ "తెలుగువ్యాసమండలి".

ఈ గ్రంథం ఇప్పటి ఒక చారిత్రక అవసరం. ఇది నాటి తెలుగు చరిత్ర కార్చిన ఆనంద, విషాద బాష్పాలకు అక్షర స్వరూపం.

భారతదేశానికి 1947లో లభించిన స్వాతంత్ర్యమూ, తెలుగువారికి 1956లో లభించిన భాషా ప్రయుక్త రాష్ట్రమూ, రెండూ దేశచరిత్రలో ప్రముఖ ఘట్టాలు.

ఏ ప్రయోజనాన్ని కాంక్షించి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చుకున్నామో, ఏ లక్ష్యాన్ని నిర్దేశించుకుని తెలుగు రాష్ట్రం ఏర్పరచుకున్నామో, అన్నీ పరమసౌకర్యవంతంగా మర్చిపోయిన చరిత్ర మనది -

ఈ మరుపు యాదృచ్ఛికమూ కాదు. మన దురదృష్టమూ కాదు.

కేవలం మనకు మనపట్ల ఉన్న అలసత్వం - అశ్రద్ధ - అవగాహనారాహిత్యం అజ్ఞానం ! వ్యక్తిని కేంద్రబిందువుగా చేసుకుని నడిచే రాజకీయ వ్యవస్థల పనితీరుకు ప్రతిబింబమే నేటి స్థితి !

నేడు మనకు ఒక సైద్ధాంతిక నేపథ్యమూ లేదు. చరిత్రపట్ల నిర్దిష్టమైన, నిర్దుష్టమైన అవగాహనా లేదు. రాబోయే కాలపు ప్రపంచపు అవసరాలని అంచనా కట్టే దార్శనిక నైశిత్యమూ లేదు. ఫలితంగా ఒక మహోన్నత జాతి తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది.

స్వతంత్ర భారతదేశపు తొలి ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ ఒక దార్శనికుడు. ఒక సాంస్కృతిక స్వాప్నికుడు. దేశానికి సాంస్కృతిక పథనిర్దేశకుడు. అకాడమీల వ్యవస్థాపనం చేసి భారతీయ సంస్కృతికి ఒక శాశ్వతమైన పునాది ఏర్పరచిన రాజనీతిజ్ఞుడు.

ఇవ్వాళ, అంటే 64 ఏళ్ల తర్వాత, భారతజాతి తన సాంస్కృతిక విధివిధానాలను సమగ్రంగా వ్యక్తపరిచే పరిపాలనా మార్గం అటు దేశంలోకానీ, ఇటు రాష్ట్రంలోకానీ ఉందా? అనే ప్రశ్నకు సమాధానం "ఒక మౌనం" మాత్రమే! ఈ స్థితి ఎందుకొచ్చింది?!

వేలగొంతుకలతో మేధావులు గత శతాబ్దంలోనే ఈ స్థితిని హెచ్చరిస్తూనే వచ్చారు.

ఆ హెచ్చరికలే ఈ వ్యాసాలు -

ప్రతి వ్యాసం వెనుక ఒక సమర్థ సైద్ధాంతిక నేపథ్యం ఉంది.

ప్రతి వ్యాసం వెనుక సత్యనిష్ఠగల సమాచారం ఉంది.

ప్రతి వ్యాసం వెనుక ధర్మాగ్రహం ఉంది.

కానీ, ఆ వ్యాసాలు చదివి హృదయంలో నింపుకున్న పౌరుల సంఖ్యే తక్కువ.

సమాజం అనే పెద్ద సంతలో ఎవరిగోల వారిది! అయినా ఆ సంతలోనే ఎవరో ఒక భావుకుడు ఒక పిల్లనగ్రోవి వాయిస్తుంటాడు. ఎవరు విన్నా వినకున్నా... అతడు పాట కొనసాగిస్తూనే ఉంటాడు. అలాగే ఈ గ్రంథంలోని వ్యాసమహర్షుల్లాంటి రచయితలు తమ భావాలను విభిన్న కాలాల్లో వ్యక్తం చేశారు. ఆ వ్యాసాల సమాహారమే ఈ గ్రంథం. "తెలుగు వ్యాసమండలి".

ఈ గ్రంథం చదువుతుంటే తెలుగు చరిత్రోద్యానవనంలో విహరించినట్లు కాసేపు అనిపిస్తుంది. తెలుగు చరిత్ర అరణ్యంలో కాసేపు నడుస్తున్నట్లుంటుంది. మనం కోల్పోయిన మహాశక్తులని మననం చేసుకున్నట్లు, మనకు దాపురించిన దురదృష్టాలని తలచుకున్నట్లు అనిపిస్తుంది -

ఇది ప్రతి తెలుగుపౌరుని జీవితానికి పాఠ్యగ్రంథం. ప్రతి రాజకీయవేత్తను చైతన్యం చేసే కరదీపిక...

వేలాది సంచికలు వడపోసి, ఎంపిక చేసిన సంస్కృతి, చరిత్ర వ్యాసాలతో నిర్మించిన అక్షరాల మంటపం ఇది!

ఈ గ్రంథానికి వైజ్ఞానికనేపథ్యాన్ని అందించింది శ్రీ మండలి బుద్ధప్రసాద్. పుత్రాకృతినున్న శ్రీ మండలి వేంకటకృష్ణారావుగారు.

ఇవ్వాళ తెలుగునేలపై తెలుగుభాష, చరిత్ర సంస్కృతిపై సమర్థమైన, సమగ్రమైన అవగాహనగల ఏకైక అగ్రశ్రేణి రాజకీయవేత్త - శ్రీ మండలి బుద్ధప్రసాద్.

నాటి తరంలోని నిబద్ధత, నేటితరంలోని వైజ్ఞానికత కలబోసిన వ్యక్తిత్వం శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిది. తెలుగు జాతిపట్ల తనకర్తవ్యాన్ని అనుక్షణం నిర్వహిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ మండలి బుద్ధప్రసాద్.

కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో రెండుసార్లు శాసనసభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో కేబినెట్ స్థాయి మంత్రిగా, ఎన్నో ఇతర సంస్థలకు అధ్యక్షునిగా, సభ్యునిగా ఉన్న శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు ఏ పదవిలో ఉన్నా ఆయన మేధలో తెలుగు సంస్కృతి, భాష, చరిత్ర పట్ల నిర్విరామ మేధామథనం జరుగుతూనే ఉంటుంది. ఆ మథనానికి ఫలితంగా కృష్ణామహోత్సవాలు, దివి మహోత్సవము, శ్రీకృష్ణదేవరాయ ఉత్సవాలు, ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు, సాహిత్య సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శతాధికంగా ప్రచురించే వ్యాసాలు, వ్యాససంపుటలు, చారిత్రక గ్రంథాలు... ఎన్నో ఎన్నెన్నో ఉన్నాయి.

ఒక విశ్వవిద్యాలయం చేయలేని కృషి శ్రీ మండలి బుద్ధప్రసాద్ చేస్తున్నారు. నిజానికి ఆయన వద్ద ఉన్న కొన్ని రకాల సమాచారాలు ఏ ప్రసిద్ధ విశ్వవిద్యాలయంలోను ఉండవు. అందుకే శ్రీ మండలి బుద్ధప్రసాద్ ఒక నడుస్తున్న తెలుగు సాంస్కృతిక విశ్వవిద్యాలయం, వారి జన్మదినం మే, 26.

జన్మదినాన్ని హంగు ఆర్భాటాలతో కాకుండా ఒక చారిత్రక చైతన్యంతో నిర్వహించడం ఒక ఔచిత్యవంతమైన సత్క్రియ.

'కిన్నెర ఆర్ట్ థియేటర్స్' - 'కృష్ణాజిల్లా రచయితల సంఘం' సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవం రాష్ట్రంలోని ఎందరో తెలుగు సంస్కృతి ప్రియులకు మందారమకరంద మహోత్సవంగా భాసిస్తుంది.

ఈ ఉత్సవంలోనే ఈ **'తెలుగు వ్యాసమండలి'** బృహత్ గ్రంథం ప్రచురించడం, దాన్ని శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి పుట్టినరోజు కానుకగా అందించడం, తెలుగు వారందరికీ పరవశాన్ని కలిగిస్తుంది.

ఈ గ్రంథం తెలుగు తల్లికి బొట్టుపెట్టి, అక్షరాల పట్టుచీర కట్టబెట్టినట్లు అనిపిస్తుంది.

ఈ గ్రంథం తెలుగుజాతి చరిత్రను వ్యాసాల స్వర్ణకలశంలో నింపి తెలుగుతల్లి పాదాలచెంత సమర్పించినట్లుంది.

ఈ గ్రంథం ఒక 'చారిత్రక విభాత సంధ్య'లో తెలుగుజాతి పరిణామాన్ని ప్రతిబింబించినట్లుంది.

ఇంకా ఆలస్యందేనికి...

"తెలుగు వ్యాసమండలి"లోకి...

పదండి ముందుకు...

- డా॥ రాళ్లబండి కవితాప్రసాద్

తెలుగుభాషకు 'బుద్ధ' పూర్ణిమ

శ్రీ మండలి బుద్ధప్రసాద్ తెలుగు భాషా ప్రయోజనం కోసం పుట్టిన వ్యక్తి. తెలుగుభాషా వికాసమే ఆయన ఏకైక నిష్ఠ. దానిపైనే తదేక ధ్యానమూ కూడా !

రాజకీయాలు ఆయనకు సేవా ధర్మం అయితే, భాషాసంస్కృతి అధ్యయనం అభివృద్ధి దార్శనికత జన్మతః అబ్బిన అంశం. 2009 ఎన్నికల సంగ్రామంలో ముమ్మరమైన పోటీ జరుగుతున్నా, ఎన్నికలకు ముందు రోజు బందరులో కృష్ణాజిల్లా రచయితల సంఘం సభ జరుగుతుంటే వచ్చి పాల్గొని వెళ్లిన నిబద్ధత ఆయనది. గెలిచినా, ఓడినా, ఒకేలా ప్రతిస్పందించే స్థిత ప్రజ్ఞత ఆయనది.

ఆయనలో కేవలం భాషాభిమాని మాత్రమే కాదు, ఒక మంచి రచయిత కూడా కనిపిస్తాడు. గొప్ప విమర్శకుడు తొంగి చూస్తాడు. ఒక భాషావేత్త పలకరిస్తాడు, చక్కని వచనం రాసే పత్రికా రచయిత భాసిస్తుంటాడు. చక్కగా విడమరిచి వివరించి చెప్పగల వచోవైభవం ఆయనలో ప్రకాశిస్తుంది. వీటన్నింటికీ మించి, ఆయనలో ఒక చరిత్రకారుడు ఈ లోకం పుట్టు పూర్వోత్తరాలను అధ్యయనం చేస్తు-శోధిస్తూ తడిమి చూస్తుంటాడు.

తెలుగుభాషా సంస్కృతుల పరిరక్షణ, పునరుజ్జీవనం, పురావైభవాన్ని చాటటం ఆయన లక్ష్యం. అందుకోసం ఎంతటి శ్రమకైనా తట్టుకోగలిగే గుండె నిబ్బరం ఆయనకుంది. సమాజం, సాహిత్యం, సంస్కృతి త్రివేణి సంగమం శ్రీ మండలి బుద్ధ ప్రసాద్. తెలుగు వారి జీవన వాస్తవికతకు నిలువెత్తు భావ దర్పణం ఆయన. మహర్షులందరూ ఒక ఎత్తూ, అగస్త్యుడొకరూ ఒక ఎత్తూ అన్నట్టుగా, ఈ తెలుగు సాంస్కృతిక పునర్జీవనోద్యమంలో శ్రీ బుద్ధప్రసాద్ ఒక్కరూ ఒక ఎత్తు - మిగతా వ్యవహారాలన్నీ ఒక ఎత్తు.

అగ్రశ్రేణి రాజనీతిజ్ఞుడైన తండ్రి శ్రీ మండలి వేంకటకృష్ణారావు, సంస్కృతికి ప్రతిబింబమైన తల్లి శ్రీమతి ప్రభావతీదేవి కలలపంటగా 1956 మే నెల 26వ తేదీన శ్రీ బుద్ధప్రసాద్ జన్మించారు. తెలుగుదనం నిండిన కుటుంబం వారిది. శ్రీ బుద్ధప్రసాద్ ఆలోచనలన్నీ తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ దిశగా సాగాయి.

గాంధేయ వాదం, గాంధీ నాదం ప్రతిధ్వనించే గాంధీక్షేత్రం ఆయన ఇల్లు... మూర్తీభవించిన జాతీయభావంగా పెరిగి, ఎదిగిన వ్యక్తి శ్రీ బుద్ధప్రసాద్. డా. బెజవాడ గోపాలరెడ్డి, ఆచార్య యన్.జి.రంగా, ప్రభాకర్‌జీ వంటి సత్పురుషుల సాంగత్యం చిన్ననాటి నుంచే ఆయనకు కలిగాయి. శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారి సేవానిరతిని ఆదర్శంగా తీసికుంటూ తండ్రి ఆలోచనల్లోంచి, ఆచరణల్లోంచి, ఆకాంక్షలోంచి ఉన్నత భావాలు అంకురించి, తండ్రిని మించిన మహావృక్షమై ఎదిగాడు శ్రీ బుద్ధప్రసాద్.

చిన్ననాడే అఖిలభారత నిర్మాణ కార్యకర్తల మహాసభలని, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంఘ సేవకుల మహాసభలని అవనిగడ్డలో నిర్వహించిన అనుభవం, తద్వారా పొందిన పరిణతి ఆయనకు గాంధేయవాద నిర్మాణ కార్యక్రమాలు బాగా వంటబట్టే అవకాశం కలిగించాయి. గాంధీజీ పద్దెనిమిది అంశాల నిర్మాణ కార్యక్రమంలో మాతృభాష పరిరక్షణ ఒకటి కావటంతో ఆయన ఆలోచనలన్నీ అమ్మభాష మీద లగ్నం అయ్యాయి.

'మాతృభాష తృణీకారం మాతృమూర్తి తిరస్కారం' అనే గాంధీ సూక్తి చిన్ననాడే మనసును పట్టుకొంది. అదే పట్టుగొమ్మగా ఏకైక నినాదంగా, ఏకైక విధానంగా, తెలుగు భాషోద్యమ నిర్మాణానికి నడుం బిగించేందుకు ఆయనకు స్ఫూర్తి నిచ్చింది.

శ్రీ బుద్ధప్రసాద్ తానే ప్రేరకుడిగా, తానే సూత్రధారిగా, తెలుగుభాషోద్యమ నిర్మాణం కోసం మొదటగా నడుం బిగించారు. భాషా పరిరక్షకులు వెలిగించిన జ్యోతిని అందిపుచ్చుకున్నారు. ఒకజ్యోతితో అనేక జ్యోతులను వెలిగించినట్టు అనేకమంది భాషోద్యమ కార్యకర్తలకు మార్గదర్శి అయ్యారు.

ఆయనకు ఎంతో ఇష్టమైన కవి డా. సి. నారాయణరెడ్డి. "శ్రీ బుద్ధప్రసాద్ పూర్వమంత్రి కాదు, అపూర్వమంత్రి" అన్న పలుకులు అక్షర సత్యాలు. "జాతీయతా భావం, జాతి సాంస్కృతిక సంప్రదాయాల పట్ల నిబద్ధత కలిగిన గాంధీతరం రాజకీయ నాయకుల వారసత్వాన్ని నిలుపుకొస్తున్న ఏకైక వారసుడు శ్రీ బుద్ధప్రసాద్" అని కేరళ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాస్తిచలమేశ్వర్ అభివర్ణించారు. ఈ మాటలు శ్రీ బుద్ధప్రసాద్ వ్యక్తిత్వానికి అక్షర రూపాలు.

ఇప్పుడు నడుస్తున్న తెలుగు భాషోద్యమానికి కర్త, కర్మ, క్రియ ఆయనే! ప్రజల గుండె తలుపులు తట్టి వారిలో తెలుగు భాష పట్ల గౌరవాన్ని, తెలుగు సంస్కృతి పట్ల అభిమానాన్ని ప్రేరేపిస్తూ, తెలుగు జాతీయులుగా తెలుగు వారి చరిత్రని వెలుగులోకి తేవటం ఆయన

ప్రణాళిక. ఆయన అడుగులో అడుగు వేస్తూ ఆయన్ని వెన్నంటి ఎందరో ప్రముఖులైన సాహితీవేత్తలు, భాషావేత్తలూ, చరిత్రవేత్తలు నడుస్తున్నారు. మరెందరో భాషాభిమానులు వీర సైనికులై కవాతు చేస్తు ముందుకు సాగుతున్నారు.

ఇంటిభాషగా, బడి భాషగా, ఏలుబడి భాషగా తెలుగు అమలు గురించి ఆయన నేతృత్వంలో 2002 నుంచి జరుగుతున్న ప్రణాళికాబద్ధమైన పోరాటాలకు ఫలాలు అందటం అప్పడే ప్రారంభమయ్యాయి. ప్రజలు తెలుగులో మాట్లాడటం ఒక గౌరవనీయమైన అంశంగా భావించుకోవటం ఎల్లెడలా కనిపిస్తోంది. ఇది ఆహ్వానించదగిన చక్కని పరిణామం.

"తెలుగు వ్యాసమండలి" గ్రంథాన్ని శ్రీ బుద్ధప్రసాద్ పుట్టినరోజు కానుకగా కృష్ణా జిల్లా రచయితల సంఘం తెలుగు భాషా ప్రియులకు అందించటానికి ఇది ముఖ్యమైన నేపథ్యం.

ఈనాడు అన్ని రంగాలలో స్వాతంత్రోద్యమం తర్వాత పుట్టినవారే ఎక్కువగా ఉన్నారు. ఆనాటి ఉద్యమస్ఫూర్తి ఎలా ఉండేదో ఇప్పటి తరానికి తెలిసే అవకాశం లేదు. నాటి గాంధీ సిద్ధాంతాలను, ఆయన ఉద్యమ విధానాన్నీ, ఆయన కార్యాచరణను తన ఆదర్శంగా శ్రీ బుద్ధప్రసాద్ చేసికున్నారు. వారి నాయకత్వం భాషోద్యమంలో పనిచేస్తున్న వారికి ప్రత్యక్షంగా అనుభవంలోకి వస్తోంది. వ్యక్తిగతమైన ప్రచారాలకు ప్రయోజనాలకు ప్రభావాలకూ తావులేని రీతిలో ఆయన ఉద్యమాన్ని నడుపుతున్న తీరు ఆనందాశ్చర్యాలు గొలుపుతుంది. ఈ సందర్భంగా ఓ చిన్న సంఘటన.

2008 రాష్ట్రం అంతా శ్రీ బుద్ధప్రసాద్‌కు రెండవ విడత మంత్రివర్గ విస్తరణలో తప్పకుండా అవకాశం వస్తుందనీ ఆయనకు విద్యా, సాంస్కృతిక శాఖలు అప్పగిస్తారని ఎదురు చూస్తున్న సమయం అది. కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో ఆంధ్రమహావిష్ణు దేవాలయ ప్రాంగణంలో కూర్చుని కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద కావ్యానికి శ్రీకారం చుట్టిన మంటపాన్ని పునర్నిర్మింపచేసి, కావ్యరచన చేస్తున్న భంగిమలో కృష్ణదేవరాయలు నిలువెత్తు విగ్రహాన్ని శ్రీ బుద్ధప్రసాద్ అప్పడు ప్రతిష్ఠింపచేస్తున్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ పక్షాన, సంచాలకులు డా. రాళ్ళబండి కవితాప్రసాద్ పర్యవేక్షణలో రెండు రోజులు సభలు జరుగుతున్నాయి. సరిగ్గా సభలు ప్రారంభమయ్యే సమయానికి కృష్ణాజిల్లాకు ముఖ్యమంత్రి అధికార పర్యటనకు వచ్చారు. పదవులు ఆశిస్తున్న జిల్లా రాజకీయ శక్తులన్నీ ముఖ్యమంత్రి చుట్టూ కేంద్రీకరించి ఉన్నాయి. శ్రీ బుద్ధప్రసాద్ మాత్రం సభల ఏర్పాటు మీద మాత్రమే మనసు లగ్నం చేశారు ముఖ్యమంత్రిని కలవటానికి వెళ్లనే లేదు. అదీ ఆయన ఏకాగ్రత. పదవులూ, ప్రలోభాలు కాదు, ఉద్యమాలు నిబద్ధతతో నిర్మాణం కావాలి. అందుకే మళ్ళీ చెప్పిందే చెప్పినా తప్ప లేదు- గాంధీ నాయకత్వం ఎలా ఉండేదో శ్రీ బుద్ధప్రసాదు నీడన పనిచేస్తున్న వారికి అనుభవేక వేద్యం అవుతోంది.

శ్రీకాకుళం సభలు : రెండవ తెలుగు భాషోద్యమం

శ్రీ మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో తెలుగువారి తొలి రాజధాని కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో 2002 నవంబరు 1, 2 తేదీలలో జరిగిన తెలుగు భాషోద్యమ సమాలోచన శిబిరం తెలుగు భాషోద్యమానికి నాంది పలికింది. అమ్మ భాష పట్ల మమతానురాగాల్ని పెంపొందించటం ప్రధాన కార్యక్రమంగా ప్రజల గుండె తలుపులు తట్టి భాషా చైతన్యాన్ని కలిగించే అనేక కార్యక్రమాలు ఆనాటినుంచే తెలుగు నేల మీద ముమ్మరంగా జరిగాయి. ఇదే సభలో "తెలుగు భాషోద్యమ సమాఖ్య" ఆవిర్భవించింది. శ్రీ బుద్ధప్రసాద్ నాయకత్వంలో శ్రీ సి. ధర్మారావు, డా. సామల రమేష్ బాబు... ఇంకా ఎందరో భాషోద్యమానికి నడుం బిగించారు. గిడుగు వారు నడిపిన వ్యావహారిక భాషోద్యమానికి కొనసాగింపుగా దీనిని రెండవ తెలుగు భాషోద్యమం అన్నారు.

భాషోద్యమ విజయాలు

శ్రీ బుద్ధప్రసాద్ కేంద్రంగా తెలుగు భాషోద్యమం ఊపందుకుంటున్న కొద్దీ, ప్రజలలో రాజకీయంగానూ, సాంస్కృతికంగానూ తమకు అన్యాయం జరిగినట్లు గ్రహింపు రాసాగింది. 21-3-2003న ఆనాటి ప్రతిపక్ష కాంగ్రెస్ శాసనసభ్యుడు శ్రీ బుద్ధప్రసాద్ అసెంబ్లీలో ఒక అనధికార తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోను ఏ మాధ్యమంలో ఏ పాఠ్యప్రణాళికని అనుసరించిప్పటికీ నర్సరీ నుండి 5వ తరగతి వరకూ విద్యార్థులకు కేవలం తెలుగులోనే విద్యను బోధించాలని ఆయన ఆ తీర్మానంలో కోరారు. విద్యామంత్రి శ్రీ మండవ వెంకటేశ్వరరావు ఆ మేరకు సభలో శ్రీ బుద్ధప్రసాద్‌కు హామీ ఇచ్చారు కూడా! ఆనాటి శాసన సభ్యులు శ్రీ కోట శ్రీనివాసరావు, డా. కె. లక్ష్మణ్, శ్రీ జి. రామకృష్ణారెడ్డి, శ్రీ ఎన్. రఘు వీరారెడ్డి, శ్రీ సి. కృష్ణయాదవ్ ఈ తీర్మానానికి మద్దతు ప్రకటించారు.

తెలుగువాడిగా పుట్టి, తెలుగునేల మీద తెలుగు అక్షరం ముక్క నేర్చుకోకుండా 'పోస్ట్ గ్రాడ్యుయేషన్లు' పూర్తి చేసుకొంటున్నారనీ,

ఈ తెలుగు రాష్ట్రంలో తెలుగు చదవకపోతేనే ప్రభుత్వ గుర్తింపు ఉంటుందనే పరిస్థితి నడుస్తోందనీ, అసెంబ్లీలో ఘాటుగా విమర్శించి, ప్రభుత్వాన్ని మేల్కొల్పారు శ్రీబుద్ధప్రసాద్. దానిపైన విస్తృత పోరాటమే ఆయన చేయాల్సి వచ్చింది. తెలుగు భాషోద్యమం, తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెలుగు భాషాభిమానులు విశేషమైన పోరాటాలు చేశారు. దాని ఫలితంగానే జీవో నెం 86ను ఆనాటి ప్రభుత్వం విడుదల చేసింది. అక్షరాభ్యాసం నుంచి 10వ తరగతి వరకూ తెలుగు తప్పనిసరిగా బోధనాంశంగా ఉండాలనేది ఈ 86వ జీవో సారాంశం. త్రిభాషా సూత్రానికి అనుగుణంగా తెలుగును తప్పనిసరి చేస్తున్న జీవో ఇది. భాషోద్యమ పరంగా ఇది శ్రీ బుద్ధప్రసాద్‌కు ఒక భాషావిజయం.

హైదరాబాదులో తెలుగుతల్లి విగ్రహంమీద 'తెలుగుతల్లి' అని తెలుగులో రాయకపోవటం, సెక్రెటేరియట్‌లో 'రాష్ట్ర సచివాలయం' అని తెలుగు అక్షరాల్లో ఎక్కడా లేకపోవటం, ఏ ఊళ్ళోనూ ఏ దుకాణం మీదా ఒక్క తెలుగు బోర్డు కనిపించకపోవటం ఇలా తెలుగు అనేది ఒక పనికిరాని అంశంగా మారిపోతోందని ఆయన ఆవేదన చెంది చేసిన ఆందోళన ఫలితంగా సచివాలయంలో ఎక్కడ చూసినా తెలుగు అక్షరాలు కనిపిస్తున్నాయి. 'తెలుగుతల్లి' అని మనం ఇప్పడు తెలుగులో చదవవచ్చు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, డా. ఏ.బి.కె. ప్రసాద్ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా శ్రీ బుద్ధప్రసాద్‌కు తోడయి నడిచారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. అవుల మంజులత గారితో ఎన్నో భాషోద్యమ కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించారు.

2006 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శ్రీ బుద్ధప్రసాద్ ప్రేరణతో, హైదరాబాదు ఇందిరా పార్క్ దగ్గరున్న 'సత్యాగ్రహచౌక్'లో సాహితీవేత్తలతో సామూహిక సత్యాగ్రహం నిర్వహించారు. తెలుగు భాష విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపారు. తెలుగుభాషకు 'క్లాసికల్' హోదా మరియూ, పాలనా భాషగా తెలుగు అమలు విషయాల గురించీ ఉద్యమించారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడు శ్రీ చంద్రబాబునాయుడితో సహా అన్ని రాజకీయ పార్టీలవారూ వచ్చి శ్రీ బుద్ధప్రసాద్‌కు తమ సంఘీభావం ప్రకటించారు.

నిజానికి, 2004 సంవత్సరాంతంలో, కేంద్ర ప్రభుత్వం ప్రాచీన భాషగా తమిళాన్ని గుర్తించిన మర్నాడే .... మనకు అన్యాయం జరుగుతోందంటూ దానిమీద చర్చను కోరుతూ ఒక అనధికార తీర్మానాన్ని శ్రీ బుద్ధప్రసాద్ రాష్ట్రశాసన సభలో ప్రవేశ పెట్టారు. కానీ, అది ఆనాడు చర్చకు నోచుకోలేదు. అప్పట్లో ఏ రాజకీయ పక్షమూ భాషా వివక్షత గురించి పట్టించుకోలేదు. శ్రీ బుద్ధప్రసాద్ ప్రజల్లోకి వెళ్ళి ఊరూరా ఉద్యమ నిర్మాణం చేశాకే రాజకీయ పక్షాల్లో కదలిక వచ్చింది.

2004 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో తెలుగు భాషాభివృద్ధిని ఒక అంశంగా శ్రీ బుద్ధప్రసాద్ చేర్పించారు. ఇతర ప్రధాన రాజకీయ పక్షాలు తెలుగు భాష గురించి ప్రస్తావించనేలేదు. ఉద్యమం ఊపందుకున్న తర్వాత డా. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం వేగంగా స్పందించింది, తెలుగుభాషకు క్లాసికల్ హోదా ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ ఒక తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఏకగ్రీవ ఆమోదాన్ని పొందింది. పాలనాభాషగా తెలుగు అమలు విషయమై స్పష్టమైన హామీనిచ్చింది. తెలుగు మాధ్యమాన్ని ప్రాథమిక విద్య వరకూ విధిగా కొనసాగించాలనీ, 86వ జీవోని చిత్తశుద్ధితో అమలు చేయాలనీ శ్రీ బుద్ధప్రసాదు ప్రభుత్వాన్ని కోరారు.

2004 సెప్టెంబర్ 17వ తేదీన కేంద్ర ప్రభుత్వం తమిళ భాషకు క్లాసికల్ హోదాని ప్రకటించిన తరువాత శ్రీబుద్ధప్రసాద్ తెలుగు భాష ప్రాచీనత నిరూపించే పరిశోధనలవైపు దృష్టి సారించారు. నిజానికి, కేంద్ర ప్రభుత్వంపైన రాజకీయ వత్తిళ్ళతోనే తెలుగు భాషకు ప్రాచీనతా హోదాని సాధించగలమనేది వాస్తవం. అయినా, శ్రీ బుద్ధప్రసాద్ తెలుగువారి ప్రాచీనతని నిరూపించవలసిందిగా పరిశోధకులకు గట్టి పిలుపునిచ్చారు.

బడిభాష, ఏలుబడి భాషలుగా తెలుగు వాడకం గురించి తెలుగు భాషోద్యమ సమాఖ్య ఒక ఉద్యమ స్వరూపాన్ని తీసుకురాగా, కృష్ణాజిల్లా రచయితల సంఘం ఇంటిభాషగా తెలుగు వాడకం గురించి, తెలుగు భాష ప్రాచీనతని నిరూపించే పరిశోధనల గురించీ భాషాభిమానులూ, భాషావేత్తలూ, పరిశోధకులూ కదిలేలా గట్టి ఊపు తీసుకు వచ్చింది. ఈ రెండు సంస్థల నిర్మాణానికీ ఊతంగా నిలిచిన వ్యక్తి శ్రీ బుద్ధప్రసాద్. ఈ రెండు సంస్థల కార్యక్రమాలు పూసలో దారంలా తెలుగు భాషోద్యమ నిర్మాణానికి తోడ్పడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడెమీ అధ్యక్షులు పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ఢిల్లీ స్థాయిలో తన పలుకుబడితో చేసిన కృషి, ఆనాటి ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి పైన రాష్ట్రమంత్రిగా శ్రీ బుద్ధప్రసాద్ తీసుకువచ్చిన రాజకీయ వత్తిడి, క్లాసికల్ హోదాని సాధించటానికి ప్రముఖంగా తోడ్పడ్డాయి.

కృష్ణాజిల్లా రచయితల సంఘం శ్రీ బుద్ధప్రసాద్ అధ్యక్షతన విజయవాడలో తెలుగుభాష ప్రాచీనత గురించి నిర్వహించిన జాతీయ

సదస్సు, ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గంగిసెట్టి లక్ష్మీనారాయణ శ్రీ బుద్ధప్రసాద్ ప్రేరణతో ఢిల్లీలో 2008 జూలైలో 'తెలుగు-కన్నడ సదస్సు' ముఖ్యమైన మలుపులుగా తెలుగుభాషకు క్లాసికల్ హోదా లభించింది.

శ్రీ బుద్ధప్రసాద్ ఎందరినో ఇందులో భాగస్వాములను చేసి అన్నింటా తానై, ఎన్నోవిధాలుగా తీసుకువచ్చిన వత్తిడి ఫలితంగానే మనం తెలుగు భాషకు క్లాసికల్ హోదాని సాధించుకో గలిగామన్నది వాస్తవం.

అవనిగడ్డలో ఒక సాహితీ సభ కోసం వచ్చిన శ్రీ వేటూరి సుందరరామ్మూర్తి శ్రీ బుద్ధప్రసాద్ ప్రేరణతో ఉత్తేజితులై, తెలుగు భాషకు క్లాసికల్ హోదా కోరుతూ తన జాతీయ అవార్డ్‌ని తిరిగి ఇచ్చేస్తున్నట్లు ప్రకటించి ఒక సంచలనం కలిగించారు. దాంతో మొత్తం తెలుగు సినిమా ప్రపంచం కదిలింది. ప్రజల్లో ఎక్కడాలేని చైతన్యం వచ్చింది. అలా ఎవరితో ఎప్పుడు ఏ పని చేయించాలో తెలిసి చేయించగల నేర్పరితనం శ్రీ బుద్ధప్రసాద్ గారిలో కనిపిస్తుంది. ఉద్యమ నిర్మాత ముఖ్య లక్షణం ఇది.

తెలుగు భాషకు ప్రాచీనతా హోదా కోసం ప్రభుత్వం నియమించిన టాస్క్ ఫోర్స్ పక్షాన శ్రీ బుద్ధప్రసాద్ సీనియర్ మంత్రి శ్రీ యం. సత్యనారాయణరావు నాయకత్వంలో ఈ రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులందరినీ వెంట బెట్టుకొని, ఢిల్లీలో కేంద్రమంత్రుల్ని, అలాగే ప్రధాని మన్మోహన్ సింగ్‌నీ కలిసి తెలుగు భాషకు క్లాసికల్ హోదాని అభ్యర్థించారు.

భాషకోసం అటు ప్రజానీకాన్ని, ఇటు రాజకీయ వ్యవస్థని కదలించగలగడం మన రాష్ట్రంలో ఇదే మొదటిసారి. భాషాభిమానులపట్ల రాజకీయ నాయకులకు సహజంగా ఉండే చిన్న చూపుని శ్రీ బుద్ధప్రసాద్ తోసి రాజనగలిగారు. యావద్భారత దేశంలోనే తెలుగు భాషా సంస్కృతుల నిలువెత్తు ప్రతినిధిగా శ్రీబుద్ధప్రసాద్ భాసిస్తున్న తీరుని చూసి ఇతర రాజకీయ శక్తులు నేర్చుకోవాల్సింది చాలా వుంది.

కృష్ణా జిల్లా రచయితల సంఘం ద్వారా చేసిన భాషా సేవ

1982లో కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రారంభమయ్యింది. ఆనాడు యువకుడయిన శ్రీ బుద్ధప్రసాద్ వ్యవస్థాపక కార్యదర్శిగా ఉన్నారు. ఆ రోజుల్లో శ్రీ బుద్ధప్రసాద్ ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీలో కూడా సభ్యుడుగా ఉండేవారు. 2005లో కృష్ణా జిల్లా రచయితల సంఘాన్ని తెలుగు భాషోద్యమం వైపు మళ్లించి ఊరూరా తెలుగు భాషా సదస్సులు ఏర్పాటు చేయించారు.

- 2006 అక్టోబర్ 27, 28 తేదీలలో జాతీయ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించి తెలుగు భాషోద్యమానికి రచయితలు పునరంకితమయ్యేలా చేశారు. 50 ఏళ్ల ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషా సాహిత్యాలు పొందిన పరిణామక్రమాన్ని విశ్లేషిస్తూ 112 పరిశోధనా వ్యాసాలతో వెయ్యిపుటల "తెలుగు పసిడి" ఉద్గ్రంథాన్ని వెలువరింపచేశారు.
- 2007లోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తెలుగు భాషను ఆధునీకరించే అంశంపైన కంప్యూటర్ ద్వారా తెలుగు భాషకు ఇంగ్లీషు తదితర భాషలకు ఒనగూరుతున్న సౌకర్యాలను వర్తింప చేయటం పైన, తెలుగు యూనీకోడ్ లిపిని అభివృద్ధి చేయటంపైన విజయవాడలో ఒక జాతీయ సదస్సుకు ఆయన రూపకల్పన చేశారు. ఆ సదస్సులో తెలుగు పసిడి కృష్ణా జిల్లా రచయితల సంఘం వెబ్‌సైట్‌ని కూడా ఆయన ప్రారంభించారు. నాలుగేళ్ల తర్వాత, శ్రీ బుద్ధప్రసాద్ సిలికానాంధ్ర సంస్థ సహకారంతో అంతర్జాలంలో తెలుగు అమలు అనే అంశంపైన మరో సదస్సుని 2011 ఏప్రియల్ 16న హైదరాబాదులో నిర్వహించి భాష ఆధునిక అవసరాలపైన స్ఫూర్తిదాయకమైన చర్చ జరిపించారు.
- 2007 సెప్టెంబర్ 21-23లలో మొదటి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను విజయవాడలో నిర్వహింపచేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వజ్రోత్సవాల సందర్భంగా ఈ సభలు జరిగాయి. ప్రజలలో భాషోద్యమ స్ఫూర్తిని కలిగించి, భాషాభిమానాన్ని రేకెత్తించటమే లక్ష్యంగా ఈ ప్రపంచ సభలను నిర్వహిస్తున్నామని శ్రీ బుద్ధప్రసాద్ ప్రకటించారు. నాటి రాష్ట్ర గవర్నర్ శ్రీ యన్.డి. తివారీని ఆహ్వానించి సభలను ప్రారంభింపచేశారు. 60 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో తెలుగువారు నిర్వహించిన పాత్ర గురించి 216 పరిశోధనావ్యాసాలతో 'వజ్రభారతి' గ్రంథాన్ని ప్రచురించి, ఈ సభలలో కేంద్రమంత్రివర్యులు శ్రీమతి పురందేశ్వరి చేత ఆవిష్కరింపచేశారు.
- 2007 డిసెంబర్ 2న న్యాయస్థానాలలో తెలుగు అమలు అనే విషయం మీద న్యాయమూర్తులు శ్రీ జింబో, శ్రీ సుబ్రహ్మణ్యం, న్యాయవేత్త శ్రీ మాడభూషి శ్రీధర్ ప్రభృతులతో ఒక జాతీయ సదస్సును నిర్వహించారు. తెలుగులోనే తీర్పులివ్వాలనే ఆలోచనని న్యాయమూర్తులకు కలిగించటం ఈ సదస్సు లక్ష్యం.
- 2008 ఫిబ్రవరి 17, 18 తేదీలలో భారతీయ భాషా కేంద్రం, ద్రవిడ విశ్వవిద్యాలయం వారి సహకారంతో కృష్ణాజిల్లా రచయిత

సంఘం ద్వారా తెలుగు భాష ప్రాచీనత - విశిష్టత అనే అంశం మీద మొదటి సారిగా జాతీయ సదస్సుని నిర్వహించి తెలుగే ప్రాచీనమని ఎలుగెత్తి చాటారు శ్రీ బుద్ధప్రసాద్. ఈ సదస్సులో సమర్పితమైన పరిశోధనా పత్రాలని "తెలుగు భాష ప్రాచీనత-విశిష్టత" పేరుతో ఒక ఆకర గ్రంథంగా తన సంపాదకత్వాన ప్రచురించారు.

✦ 2008 మార్చి 21, 22 తేదీలలో మచిలీపట్నం డచ్ కోటలో కృష్ణాజిల్లా చారిత్రక వైభవం జాతీయ సదస్సుని, భారతీయ పురావస్తు సర్వేక్షణ వారి సౌజన్యంతో నిర్వహించి 116 మంది పరిశోధకుల రచనలతో "కృష్ణాజిల్లా సర్వస్వం" ప్రచురించారు.

✦ 2008 మార్చిలోనే చిన్నయసూరి ద్విశతాబ్ది ఉత్సవాలను రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలలోను, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహించి తెలుగు వ్యాకరణం మీద సమగ్రమైన పునర్మూల్యాంకనం జరిపించారు.

✦ 2008 ఆగస్టు 2 నుంచి 5 వరకూ మచిలీపట్నం నుంచి నెల్లూరు వరకూ దాదాపు 300 మంది సాహితీవేత్తలతో తెలుగు భాష, సంస్కృతి చైతన్య యాత్రని నిర్వహించారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాదు ఈ యాత్రకు సారధ్యం వహించగా, శ్రీ బుద్ధప్రసాద్ నేతృత్వంలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల రచయితల సంఘాలు సహకరించాయి. భాషకోసం రచయితలు చేస్తున్న ఈ యాత్రని దండి యాత్రతో పోల్చి, ఈ యాత్రలో పాల్గొన్న రచయితలను భాషాసత్యాగ్రహులుగా అభివర్ణించారు శ్రీ బుద్ధప్రసాద్. "మన ఇంట్లో మనం తెలుగులోనే మాట్లాడుకుందాం" అనే నినాదంతో ప్రజల గుండె తలుపులు తట్టిన యాత్ర ఇది.

✦ 2009 జనవరి 24, 25 తేదీలలో రాష్ట్రంలోని పురావస్తు శాస్త్రవేత్తలు అనేకమందిని ఆహ్వానించి సింధు-కృష్ణా లోయల నాగరికతల తులనాత్మక అధ్యయన సదస్సును విజయవాడలో నిర్వహించారు. ఈ సదస్సులో సింధు నాగరికతకు సమాంతరంగా తెలుగునేల మీద కూడా జనావాసాలు ఉండేవని అంగీకరిస్తున్న పరిశోధకులకు ఆ సంస్కృతిని తెలుగు సంస్కృతిగా ప్రకటించవలసిన అవసరాన్ని శ్రీ బుద్ధప్రసాద్ గుర్తు చేశారు.

✦ 2010లో కృష్ణా జిల్లా రచయితల సంఘం ద్వారా, ఎమెస్కో వారి సహకారంతో "తెలుగు మణిదీపాలు" అనే 1200 పేజీల ఉద్గ్రంథాన్ని ప్రచురించారు. వివిధ రంగాలలో ప్రసిద్ధులైన 70 మంది తెలుగువారి జీవిత చరిత్రలు ఇందులో సంకలితం చేశారు.

✦ 2010 సంవత్సరాంతంలో ఉత్తర అమెరికా తెలుగు సంస్థ తానా వారి సహకారంతో తరతరాల తెలుగు సంస్కృతిపైన స్ఫూర్తిదాయకమైన సదస్సుని నిర్వహించి తెలుగు సంస్కృతి ప్రాచీనతని, దాని ప్రశస్తిని వెలుగులోనికి తెచ్చే ప్రయత్నం చేశారు. "తరతరాల తెలుగు సంస్కృతి" గ్రంథం తానా ప్రచురణగా 2011 జూలైలో అమెరికాలో ఆవిష్కరించబడనుంది.

ఇంకా... తెలుగు మాండలికాలపైన కృష్ణా విశ్వవిద్యాలయంలో ఒక సదస్సుని, తెలుగు కథకి నూరేళ్ళ సందర్భంగా భారతీయ భాషాకేంద్రం సహకారంతో మచిలీపట్టణంలో ఒక జాతీయ సదస్సునీ, మచిలీపట్టణంలోనే శ్రీ కృష్ణదేవరాయ వైభవం సదస్సునీ ఇలా ఎన్నో జాతీయ స్థాయి సెమినార్లను కృష్ణాజిల్లా రచయితల సంఘం ద్వారా ఆయన నిర్వహింపచేసి, తెలుగు భాషోద్యమ స్ఫూర్తిని కలిగించారు. ప్రాచీనతా హోదాని సాధించటానికి అవరోధంగా ఉన్న చెన్నై హైకోర్టులో కేసుని పరిష్కరించటం కోసం శ్రీబుద్ధప్రసాదు పడిన ఆవేదన అంతా ఇంతా కాదు. మరొక పరిష్కారం కానక, ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘంతో కలిసి సుప్రీంకోర్టుని ఆశ్రయించటమే శరణ్యం అనుకున్నప్పుడు కృష్ణా జిల్లా రచయితల సంఘం ముందుకు వచ్చి, మద్రాసు కోర్టులో కేసుని కొట్టివేయవలసిందిగా సుప్రీంకోర్టును కోరింది. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి కేసుపై తీర్పు నివ్వటానికి అశక్తతని వ్యక్తం చేయటం, తెలుగు కన్నడ భాషలకు క్లాసికల్ హోదా ఇచ్చినందువలన కలిగే ప్రయోజనాలను అందించటానికి ఎలాంటి అడ్డంకులూ లేవని కేంద్రప్రభుత్వం న్యాయ సలహా ఇవ్వటంతో తెలుగు భాషకు క్లాసికల్ హోదా ప్రక్రియ పూర్తయింది.

రాజకీయ రంగ ప్రవేశం

శ్రీ బుద్ధప్రసాద్ జాతీయ సమైక్య వాది... కుటుంబ వారసత్వంగా ఆయనకు సంక్రమించిన అంశం అది! సహజంగా మృదు స్వభావిగా కనిపించినా, మాట మెత్తగా అనిపించినా, నిర్ణయాల విషయంలో ఆయన దృఢచిత్తత ఆశ్చర్యాన్ని కల్గించేదిగా ఉంటుంది.

ఆయన రాజకీయ రంగ ప్రవేశం కూడా తప్పనిసరి పరిస్థితుల్లో జరిగింది. 1972 జై ఆంధ్ర ఉద్యమ కాలంలో తండ్రి శ్రీ మండలి వేంకట కృష్ణారావు రాష్ట్ర మంత్రిగా సమైక్య వాదానికి కట్టుబడి ఉన్నందుకు, కుటుంబ వెలిలాంటి స్థితిని ఎదుర్కొన్నారు. తండ్రి జిల్లాకు రాలేని పరిస్థితి. అవనిగడ్డలో కుటుంబం అంతా ఒక ఏడాదిపాటు గృహ నిర్బంధంలో, పోలీస్ పహారా మధ్య జీవన్మరణ సమస్యగా జీవించారు. ఆ సమయంలో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు శ్రీ బుద్ధప్రసాద్ రాజకీయాల్లోకి రావలసి వచ్చింది.

పలకరించేందుకు చుట్టూ ఎవరూ లేని పీడకలలాంటి ఆ రోజుల్లో శ్రీ బుద్ధ ప్రసాద్‌కు పుస్తకాలే నేస్తాలయ్యాయి. తెలుగు భాషా సాహిత్యాల మీద ఆయనకు ఆసక్తి కలగటానికి అప్పుడు చేసిన అధ్యయనమే కారణం అయింది. అదే రాజకీయ నాయకులలో ఆయనకు ఒక ప్రత్యేక వ్యక్తిగా గుర్తింపు తీసుకొచ్చింది. దివిసీమ ఉప్పెన సమయంలో చేసిన సేవలు, అనాథ బాలల సంరక్షణ కేంద్రమూ, ఇంకా ఎన్నో అంశాలు అయన్ని సేవామయుణ్ణి చేసాయి.

2009 డిసెంబరు 9న శ్రీ చిదంబరం ప్రకటన వెలువడిన సమయంలో శ్రీ బుద్ధప్రసాద్ కర్ణాటకలో పర్యటిస్తున్నారు. రెండు రోజుల తర్వాత విజయవాడకు తిరిగి వచ్చినప్పుడు అన్ని రాజకీయ పక్షాలూ కలిసి ఐక్య కార్యాచరణ సమితిగా ఏర్పడి శ్రీ బుద్ధప్రసాద్‌ని నాయకుడుగా ఎన్నుకున్నారు. ఎలాంటి ఉద్రిక్తతలూ, అవాంఛనీయ సంఘటనలు లేకుండా గాంధేయ మార్గాన ఆయన ఉద్యమాన్ని నడిపిన తీరు అందరూ గమనించిన అంశమే!

1990లలో గాంధేయభావ వ్యాప్తి కోసం దశాబ్దికి పైగా "గాంధీక్షేత్రం" మాసపత్రిక సంపాదకులుగా ఆ పత్రికని వ్యయప్రయాసలకోర్చి నిర్వహించారు. ఆం.ప్ర. చిన్న ప్రతికల సంఘం ఆయనకు ఆనాడే ఉత్తమ సంపాదకుని పురస్కారం ఇచ్చి గౌరవించింది.

గాంధేయ సమాజ సేవా సంస్థ కార్యదర్శిగా అనేక శిక్షణా శిబిరాలను నిర్వహించారు. శ్రీ ఏటుకూరి బలరామ మూర్తి 'గాంధేయ మార్గం-తాత్వికత', శ్రీ తల్లాప్రగడ ప్రకాశరాయుడు ఆత్మకథ, 'నా రాట్న చక్రం'; శ్రీమధురాంతకం రాజారాం, 'తెలుగు కథలలో గాంధీ దర్శనం'; శ్రీ జోశ్యుల సూర్యనారాయణమూర్తి 'ఆచార్య వినోబా', శ్రీ కాశీనాథుని పూర్ణ మల్లికార్జునుడు 'గాంధీ నిర్మాణ కార్యక్రమాలు' శ్రీ వియోగి హరి 'అస్పృశ్యత' గ్రంథాలను ఆ సంస్థ పక్షాన ప్రచురించారు.

ప్రతిపక్షంలో గడుపుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కష్టాలలో కూరుకొని, కృష్ణాజిల్లాలో నిస్తేజంగా ఉన్న కాలంలో పదేళ్లపాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆ పార్టీకి జవసత్వాలు నింపి మెజారిటీ బాటన నడిపించ గలిగారు.

కృష్ణా డెల్టా ఎండిపోతున్న సమయంలో డెల్టా రైతాంగాన్ని సమకూర్చి లక్షలాది జనవాహినితో ప్రకాశం బ్యారేజిని దిగ్బంధం చేసి, ఆనాటి ప్రభుత్వం దిగివచ్చేలా చేసిన ఆయన ఉద్యమ స్ఫూర్తి తెలుగు ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగానే ఉంటుంది. అవనిగడ్డని రేపల్లెతో కలుపుతూ కృష్ణానదిపైన వంతెన పెనుమూడి వారధి కోసం, అనేక సంవత్సరాలుగా దివిసీమ ప్రజలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోని సందర్భంలో, ప్రతిపక్ష కాంగ్రెస్ శాసనసభ్యుడిగా ఉన్న శ్రీ బుద్ధప్రసాద్ తన శాసన సభ్యత్వానికి రాజీనామా ఇస్తానని ప్రకటించి, వంతెనని సాధించారు. దివిసీమ వాసులు పక్కనున్న రేపల్లెకు పది నిమిషాల ప్రయాణానికి బెజవాడ దాకా వచ్చి నదిని దాటవలసిన శ్రమ తప్పింది. ఇలాంటి చిరస్మరణీయమైన విజయాలు. ఇలా అన్నీ రాస్తే శ్రీ బుద్ధప్రసాద్ సాధించినవి ఒక పెద్ద పుస్తకం అవుతాయి.

రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, పశువైద్య విశ్వవిద్యాలయ, మత్స్య శాఖల మంత్రిగా శ్రీ బుద్ధప్రసాద్ ఆ మంత్రిత్వ శాఖలకే వన్నె తెచ్చారు. ఆయన పదవీ కాలంలో పశుక్రాంతి, జీవక్రాంతి పథకాలను ప్రవేశపెట్టారు. పశువులకు కూడా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉండాలని విజయవాడ, హైదరాబాదు, పులివెందులలో ఆసుపత్రులను మంజూరు చేశారు! దేశంలో ఎక్కడా లేని ఫిషరీస్ పాలిటెక్నిక్‌ని దివిసీమలో నెలకొనేలా చేశారు. ఇవన్నీ ఆయన మేథలో పుట్టి, మానస పుత్రికలుగా రూపొందిన వినూత్న ప్రాజెక్టులు.

మూగజీవాల మంత్రిగా ఆయనని చూసినప్పుడు, గాయపడిన హంసని సేదతీర్చిన వాడికే ఆ హంసమీద హక్కుంటుందని, వేటాడిన కిరాతకుడికి ఉండదనీ వాదించిన గౌతమబుద్ధుడు ఆయనలో కనిపించేవాడు. శ్రీ బుద్ధప్రసాద్ దృష్టిలో నిరాదరణకు గురవుతున్న తెలుగు అక్షరాలూ మూగజీవాలే! రెండింటికీ సమానంగా సేవచేసి తెలుగు బుద్ధుడయ్యారాయన!

హంసలదీవి దగ్గర కృష్ణా సాగర సంగమం వరకూ, రహదారి నిర్మించి దానిని పెద్ద యాత్రా స్థలిగా తీర్చిదిద్దారు.

కృష్ణా నది వెంబడీ, అవనిగడ్డ వరకూ ఉన్న కట్టని గట్టిపరిచి రెండులైన్ల రహదారిగా మంజూరు చేయించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ నిర్మాణ దశలో ఉంది.

కృష్ణా డెల్టా ఆధునీకరణ కార్యక్రమానికి అనుమతి సాధనలో కృషి ఆయనదే!

అనుక్షణం రైతాంగం ప్రయోజనాల కోసం ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండే రైతుమిత్రుడు ఆయనే!

పులిచింతల పోలవరం ప్రాజక్టులకోసం రైతుపక్షాన నిలబడి పోరాడింది, పోరాడుతోందీ ఆయనే!

రాజకీయ నాయకులలో అరుదైన వ్యక్తిత్వం ఆయనది. ప్రజలే కాదు, అధికారులు ప్రభుత్వం కూడా ఆయనను సంస్కృతి

సంప్రదాయాలకు ప్రతినిధిగానే సంభావిస్తారు. 'రాజకీయ నాయకులకు ప్రవేశం లేదు' అని నిషేధించిన చోటుకి కూడా సగర్వంగ తలఎత్తుకొని వెళ్ళగలిగే ఉన్నత వ్యక్తిత్వం గల రాజకీయ వేత్త శ్రీ బుద్ధప్రసాద్. నేటి నేతలకు ఆయనొక 'రోల్ మోడల్', ఒక ఆచరణీయ ఆదర్శం.

యాత్రా సాహితీవేత్త!

శ్రీ బుద్ధప్రసాద్ విస్తృతంగా విదేశీ పర్యటనలు చేశారు. కేవలం విహార యాత్రలుగా కాకుండా, ఆయా దేశాల సంస్కృతి వికాసాలను సునిశితంగా గమనించి తన ప్రతి యాత్రనూ ఒక యాత్రా చరిత్ర గ్రంథంగా తెలుగువారికి అందించారు. 'మారిషస్‌లో తెలుగు జీవనం', 'నా జర్మనీ యాత్ర', 'లండన్‌లో తెలుగు వైభవ స్మృతులు' గ్రంథాలతో పాటు శాసన సభ్యుడిగా ఎన్నో దేశాలలో అధికారికంగా జరిపిన విశేషాలతో 'ప్రజలూ-ప్రగతి' అనే విశ్లేషణాత్మక గ్రంథాన్ని రచించారు... నాటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు, ప్రతిపక్షనాయకుడు డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఈ గ్రంథానికి ముందుమాటలు వ్రాశారు.

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారితో కలిసి లండన్‌లో పర్యటించినప్పుడు తెలుగు భాషకు అపూర్వ సేవ చేసిన ప్రాతఃస్మరణీయుడు సి.పి. బ్రౌన్ సమాధిని ఆ ఇద్దరూ కలిసి లండన్ శ్మశాన వాటికలో సమాధులన్నీ గాలించి గుర్తించి లండన్ తెలుగు సంఘం వారి చేత దాన్ని పునరుద్ధరింపచేశారు. అలాగే, లండన్‌లోనే సర్ ఆర్థర్ కాటన్ సమాధిని సందర్శించి ఘనంగా నివాళి అర్పించారు. కాటన్ గారి మనుమడు రాబర్ట్ కాటన్‌ని ప్రభుత్వ అతిథిగా రాష్ట్రానికి ఆహ్వానించి కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాలన్నీ సందర్శింపచేసి, ఘనంగా సత్కరించి పంపారు.

హోసూరులోనూ, బ్రహ్మపురంలోనూ, చెన్నైలోనూ, ముంబాయిలోనూ, బెంగుళూరులోనూ.... ఇంకా ఎన్నో చోట్ల తెలుగు సభలు, తెలుగు ఉత్సవాలు, తెలుగు జానపద కళల ప్రదర్శనలలో ఆయన ప్రత్యక్ష ప్రమేయం సుస్పష్టం.

ఈ కృతి అందుకే ఆయనకు బహూకృతి

రాజకీయ పరంగానూ, సంస్కృతి పరంగానూ, శ్రీ మండలి బుద్ధప్రసాద్ వ్యక్తిత్వ పరిశీలనకు ఇవి కొన్ని పరిచయవాక్యాలు మాత్రమే! నిజంగా ఒక వ్యక్తి ఇన్ని విజయాలను సాధించగలడా... అని సందేహం కలిగేలా అసంఖ్యాకమైన కార్యక్రమాలెన్నో చేసి చూపించారాయన! కృష్ణాజిల్లా చారిత్రక వైభవం సదస్సు ప్రారంభోత్సవానికి కొద్ది నిమిషాల ముందు సుడిగాలులతో కూడిన భయంకరమైన వాన రావటంతో ఎక్కడివారక్కడ చెల్లా చెదురైపోయారు. అప్పటికప్పడు వేదికని మరొక సురక్షిత స్థావరానికి మార్చినప్పడు, మంత్రిగా ఉన్న శ్రీ బుద్ధప్రసాద్ స్వయంగా బల్ల ఎక్కి తన చేతులతో బ్యానరు కట్టిన దృశ్యం కళ్ళను చెమరుస్తుంది.

స్వదేశీ విశ్వవిద్యాలయాలు, అనేక ఇతర మహత్తర సంస్థలు చేయలేని, చెయ్యని పనులెన్నింటినో ఒంటిచేత్తో చేసిచూపించిన వ్యక్తి శ్రీ బుద్ధప్రసాద్. ఒక భాషోద్యమ కార్యకర్తగా, ఒక భాషా సేవకుడిగా, ఒక మార్గ నిర్దేశకుడిగా, ఒక నిరంతర అధ్యయన శీలిగా, తెలుగు సంస్కృతి, వికాసాలకు ప్రతినిధిగా నిలిచిన శ్రీ బుద్ధప్రసాద్ పుట్టిన రోజునాడు కృష్ణా జిల్లా రచయితల సంఘం అందిస్తున్న ఈ విశిష్ట వ్యాసాల సంకలనాన్ని ఒక చిరుకానుకగానే భావిస్తున్నాం.

తెలుగుజాతి జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా సగర్వంగా తల ఎత్తుకొని నిలబడాలనేది శ్రీ బుద్ధప్రసాద్ ఆకాంక్ష, ఆదర్శం కూడా! "తెలుగు వ్యాసమండలి"లోని ఉత్తమ వ్యాసాలను ఈ దృష్టికోణంలోంచే ఎంపిక చేసుకున్నాం. ఈ వ్యాసాల లోని స్ఫూర్తి లోకానికి అందాలని, జాతి ఔన్నత్యానికి పాటుపడాలని ప్రతిఒక్కరం సంకల్పం చేసుకోవటానికి "తెలుగు వ్యాస మండలి" తోడ్పడుతుందని మా ఆశంస.

కృతజ్ఞతాంజలి...

ఈ పుస్తకం ఇలా రూపుదిద్దుకోవటానికి డా. రాళ్ళబండి కవితా ప్రసాద్ తోడ్పాటు మరువలేనిది. వ్యక్తిగతంగానూ, అధికారిగాను తెలుగు భాషోద్యమానికీ, మీదుమిక్కిలి కృష్ణాజిల్లా రచయితల సంఘం కార్యక్రమాలకు ఆయన చేస్తూ వస్తున్న సాయానికి కృతజ్ఞతలనే నాలుగు అక్షరాలు చాలవు. అంతకు మించిన పదాలు లేని స్థితి మాది.

ఈ పుస్తకం ఇలా రూపుకట్టుకోవటానికి తన భుజాన బరువునంతా మోస్తున్నవారు 'రైతునేస్తం' సంపాదకులు శ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు గారు. వారి వదాన్యతకు నమస్కృతులు. ఈ 'తెలుగు వ్యాసమండలి' వెలుగు చూడటానికి హైదరాబాద్ కిన్నెర ఆర్ట్ థియేటర్స్ శ్రీరఘురాంకు వేలాది వందనాలు. మాతో కలిసి పనిచేసిన దివి ఐతిహాసిక మండలికి మా నమోవాకాలు.

ఇందులోని వ్యాసాలను ఎంచుకోవటానికి సహకరించిన పెద్దలు మాన్యులు శ్రీ వకుళాభరణం రామకృష్ణగారికీ, శ్రీ కుర్రా జితేంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ ఆర్కయివ్స్ శ్రీరామకృష్ణ, శ్రీ వడ్డేపల్లి శ్రీనివాసరావు (జగ్గయ్యపేట), డా. కోట నిత్యానంద శాస్త్రి, డా. రావి శారద, డా. పోతుకూచి సాంబశివరావు, వేటపాలెం సారస్వత నికేతన్ మల్లికార్జున రావు, డా॥ రాపాక ఏకాంబరాచార్యులు గార్లకు అందరికీ నమస్సులు.

ఇందులోని వ్యాసాలను ప్రముఖంగా భారతి మాసపత్రిక, ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలు, జమీన్ రైతు, ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సంచికలు, కిన్నెర, కృష్ణాపత్రిక, తెలుగు స్వతంత్ర, తెలుగువాణి, గాంధీక్షేత్రం, అఖిల భారత తెలుగు రచయితల సభల ప్రత్యేక సంచిక, వేంగి సంచిక మొదలైన వాటి నుంచి స్వీకరించాము. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం, ఆంధ్రకేసరి ప్రకాశం శతజయంతి సంచిక మొదలైన వాటి నుంచి స్వీకరించాము. ఎంతో విలువైన వ్యాసాలను వ్రాయించి ప్రచురించిన ఆనాటి సంపాదకులకు తెలుగు ప్రజలు ఋణపడి ఉన్నారు.

ఇదొక సరికొత్త ప్రయత్నం. ఇదొక భాషా మహాయజ్ఞం

ఇదొక చారిత్రక భాండాగారం

దీన్ని సవినయంగా తెలుగువారికి అందిస్తూ

మన మండలి బుద్ధప్రసాద్ గారికి బహూకరిస్తున్నాం.

- గుత్తికొండ సుబ్బారావు

అధ్యక్షుడు

డా॥ జి.వి. పూర్ణచందు

ప్రధాన కార్యదర్శి

కృష్ణా జిల్లా రచయితల సంఘం

విజయవాడ
25 మే, 2011

విషయసూచిక

★ ★ ★

డాక్టర్ మారేమండ రామారావు

ఆంధ్ర ప్రజల కథా-కమామీషు

ఆంధ్రజాతి చరిత్ర అతి ప్రాచీనమైంది. భారత దేశ చరిత్ర సంస్కృతుల పరిణామంలో ఆంధ్రజాతి, గణనీయమైన పాత్ర వహించింది. దేశంలో ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతానికి, భాషా ప్రాంతానికి ఆంధ్రుల పేరు సార్థకం కావడమేకాకుండా వారి పేరుతో ఒక ప్రముఖ భాష రూపుదిద్దుకుంది. ఆంధ్రులు, వీరే తెలుగువారు. ఈ తెలుగు ప్రజల్లో అధిక సంఖ్యాకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివసిస్తున్నప్పటికీ, ఇంకా చాలా మంది దేశంలో భిన్న ప్రాంతాలలో ఉంటున్నారు. బహుళ సంఖ్యాకులు దక్షిణాదిన తమిళ, కన్నడ ప్రాంతాలలో కూడా స్థిరపడ్డారు.

స్థల నిర్దేశం

ఆంధ్రుల మాతృభూమి అయిన ఆంధ్రదేశం భారతదేశంలో ఒక విశిష్ట స్థాన మాక్రమించుకొంది. దక్కన్ పీటభూమి పూర్వార్ధ భాగంలో, ఉత్తరావ్యావర్తం దక్షిణ ద్రావిడ ప్రాంతాల మధ్యగా నెలకొన్నది ఆంధ్రదేశం. అందువల్ల ఉభయ సంస్కృతుల సమిశ్రణకు అనుకూలమైన కీలక ప్రదేశమది. నిజానికి ఈ ఉభయ సంస్కృతుల సమ్మేళన స్వరూపాన్ని భారతీయ సంస్కృతి అంటారు. ఈ భారతీయ సంస్కృతిలో ఆంధ్రులు ముద్ర సుస్పష్టమైనదే కాక, క్రీస్తు శకం తొలి శతాబ్దుల్లో ఆగ్నేయాశియా దేశాలకు కూడా వ్యాపించింది. సరిహద్దుల్లో నివసించే ప్రజల భాష, ఆచార, వ్యవహారాలపై పొరుగు భాషా వర్గాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. కాగా, ఆంధ్ర దేశాన్ని చారిత్రక లక్షణాన్ని బట్టి మూడు భాగాలుగా – తెలంగాణా, సర్కార్లు, రాయలసీమ అని వ్యవహరించారు. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం అభివృద్ధి సాధించుకొంది. అప్పుడప్పుడు స్వల్పకాల వ్యవధుల్లో మినహాయిస్తే, ఈ మూడు ప్రాంతాలు రాజకీయంగా ఏక పాలన క్రిందనే ఉన్నాయి. రాజకీయ వైవిధ్యంలో సాంస్కృతిక ఐక్యతకు ఆంధ్రులు నిదర్శనం.

సరిగణన, ప్రస్తావన

ఆంధ్రుల్ని గురించిన అతిప్రాచీన ప్రస్తావన ఐత్తరేయ బ్రాహ్మణంలో ఉంది. ఆ తర్వాత రామాయణంలో మహాభారతంలో, పురాణాల్లో, ఆంధ్రుల మాట ఉంది. తొలుత ఆంధ్రులు ఆర్య కుటుంబంలోని వారనీ, తరువాత దక్కను ప్రాంతానికి వలస వచ్చిన స్థానికులతో కలిసి పోయారని తెలుస్తుంది. చరిత్ర గతంగా ఆంధ్రుల్ని గురించి క్రీస్తు పూర్వం 4వ శతాబ్దంలో మెగస్తనీసు వ్రాశాడు. మూడో శతాబ్దంలో మవుర్య సామ్రాట్టు అశోకుని శాసనాల్లోనూ ఆంధ్రుల ప్రస్తావన ఉంది. అప్పట్లో ఆంధ్రులదొక ఆదివాసి రాజ్యం, బలవంతులై రాజులు పాలిస్తుండేవారు.

రాజకీయ చరిత్ర

అయినప్పటికీ, ఆంధ్రుల రాజకీయ చరిత్ర అశోకుని అస్తమయం నుంచి మొదలైంది. శాతాహన రాజు నాయకత్వాన ఆంధ్రుల స్వతంత్ర రాజ్యానికి నాందీ వాచకం జరిగింది. శాతవాహన వంశస్తులు ఆంధ్రదేశాన్ని నాలుగు శతాబ్దాలపాటు పరిపాలించారు. త్వరలోనే ఈ రాజ్యమొక సామ్రాజ్యంగా విస్తరించి, యావత్తు దక్కన్ ప్రాంతాన్ని వ్యాపించింది. అప్పుడప్పుడు ఉత్తర భారతపు ఎల్లల్ని, తమిళ దేశాన్ని కూడా తాకింది.

ఆంధ్రదేశ సింహాసనాన్ని ఆంధ్ర శాతవాహన రాజులు కొన్నాళ్లు అధిష్ఠించారు కాబట్టి, ప్రాచీన భారత సామ్రాట్టుల్లో శాతవాహన వంశం పేర్కొనబడింది. ఎన్నో దండయాత్రల్ని వారు త్రిప్పికొట్టారు. కళల్ని, సాహిత్యాల్ని, మతాల్ని ఉదారంగా పోషించారు. శాతవాహనుల పాలనలో ఆర్థికాభ్యున్నతిని దేశం సాధించింది.

ప్రథమ, ద్వితీయ శాతకర్ణులు, గౌతమీ పుత్ర శాతకర్ణి, యజ్ఞ ప్రభృతులు ప్రాచీన భారత దేశంలో గణుతికెక్కిన వారు.

శాతవాహనానంతర యుగం

క్రీ.శ. మూడవ శతాబ్దం పడ బోతున్దనగా శాతవాహన సామ్రాజ్యం పతనమైంది. ఆంధ్రదేశం చీలి పోయింది. తెలంగాణా ప్రాంతం వాకటకుల, తొలిబాదామి చాణుక్యుల ఆధీనంలోకి వచ్చింది. కోస్తా ఆంధ్రప్రాంతం ఇక్ష్వాకులు సాలంకాయన రాజుల పాలనలోకి పోయింది. తర్వాత విష్ణుకుండినులు పాలించారు. ఆగ్నేయ ప్రాంతం పల్లవ రాజుల ఆధీనమైంది. ఐదో శతాబ్దంవరకూ గోదావరి మండలాన్ని రకరకాల రాజ వంశాలు పరిపాలించాయి. అప్పటికి తూర్పు గంగ వంశం రాజ్యాన్ని స్థాపించింది. ఏడవ శతాబ్దం తొలి భాగంలో తూర్పు చాళుక్యులు కోస్తా ఆంధ్రప్రాంతంపై తమ ఏలుబడి సాగించి నాలుగు వందలేళ్లు పరిపాలించారు. మొదట రాష్ట్ర కూటులు, తర్వాత చాళుక్య వంశజులు తెలంగాణా ప్రాంతాన్ని ఏలారు. తెలుగు చోళుల్లో ఒక శాఖ అయిన పల్లవులు, చామలు, వైదుంబరులు కొంతకాలం రాయల సీమలో కొంత భాగాన్ని పాలించారు. తరువాత చోళ సామ్రాట్టుల వశమైంది. ఆ భాగం ఈ కాలంలో అంతర్యుద్ధాలు, నిరంతర దండయాత్రలు, రాజకీయ సంక్షోభ దశలు గడిచాయి. అటు యుద్ధకాలంలో ఇటు శాంతి కాలంలో ఈ తరుణంలో పేరు కెక్కినవారు – ఇక్ష్వాకులకు చెందిన కంతు మూలుడు, విష్ణుకుండిన రాజైన మొదటి మాధవ వర్మ, మొదటి విష్ణు వర్ధనుడు, నరేంద్ర మృగరాజు విజయాదిత్యుడు, గుణగ విజయాదిత్యుడు, రాజరాజులు.

కాకతీయ యుగం

పదకొండవ శతాబ్దం మధ్యభాగంలో ఆంధ్రదేశం పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. చాణుక్యుల అధికారం తగ్గిపోయి, తెలంగాణాలో పలువురు తెలుగు సామంతులు స్వాతంత్ర్యం ప్రకటించారు. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో కూడా రకరకాల రాజ వంశాలు ఏలుబడికి వచ్చాయి. తెలుగు చోళులు, తెలుగు పల్లవుల వంటి చిన్న చిన్న రాజులు చోళుల ఆధిపత్యం నుంచి చీలిపోతూ వచ్చారు. ఈ అస్తవ్యస్త స్థితి నుంచి ఓరుగల్లు కాకతీయ సామ్రాజ్యం ఆవిర్భవించింది. మొదట్లో ఈ కాకతీయులు తెలంగాణాలో చోళుల సామంతులు. రెండవ ప్రోలుని కాంలో వీరు స్వతంత్రించారు. ఆయన తర్వాత సింహాసనానికి వచ్చిన రుద్రదేవుడు తెలంగాణా ప్రాంతం ఆక్రమణను పూర్తి చేశాడు. రుద్రదేవుని మేనల్లుడైన గణపతి దేవుడు కోస్తా ఆంధ్ర ప్రాంతం మీద, రాయలసీమ ప్రాంతం మీద దండయాత్రలు సాగించి ఆంధ్రులనందరినీ కాకతీయ సామ్రాజ్యం క్రిందికి తెచ్చాడు. ఈ సామ్రాజ్యాన్ని రాణి రుద్రమదేవి నిర్వహించింది. కాకతీయ రాజుల్లో చివరివాడు, రుద్రమాంబ మనుమడైన ప్రతాపరుద్ర దేవుని కాలంలో ఢిల్లీ సుల్తానుల దండయాత్రలు ముమ్మురించాయి. ముస్లిం దండ యాత్రలను నిరోధించడంలోను, తరువాత హైందవ పునరుద్ధానంలోను ప్రతాపరుద్రుడు ప్రధానవ్యక్తి.

కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం ఆర్థిక సంపత్తిని సాధించడంతో పాటు లలితకళల్లో, సాహిత్య రంగంలో గొప్ప ప్రగతి నందుకొంది.

కాకతీయానంతర దశ

1323లో కాకతీయ సామ్రాజ్యం అంతరించింది. మళ్లీ రాజకీయంగా దేశం అస్థిమితమైంది. ముస్లిం దండ యాత్రలు ఆక్రమణలు తీవ్ర తరమయ్యాయి. యువరాజుగా ఉన్న సుల్తాన్ మహమ్మద్ తుగ్లక్ ఓరుగల్లును స్వాధీన పరుచుకొని తూర్పున నెల్లూరి నుంచి పశ్చిమాన క్విలన్ వరకూ దక్షిణాపథాన్ని జయించాడు. తన ఆధీనంలో ఈ ప్రాంతాన్ని పాలించడానికి ముస్లిం గవర్నరుని నియమించాడు. ఆంధ్ర ప్రజలు ఈ ప్రమాదాన్ని గ్రహించి, సత్వరమే తిరుగుబాటు ప్రారంభించారు. కాపయ నాయకుడు, ప్రోలయవేముడు, సింగమ నాయకుడు వంటి వారు ముస్లింలను తరిమివేసి దేశాన్ని స్వతంత్రం చేశారు. ఈ సంక్షోభం దశ నుంచి అనేక కొత్త రాజ్యాలు తలయెత్తాయి. కొండవీటిరెడ్డి రాజ్యం, రాజకొండ వెలమ రాజ్యం, 1336లో హరిహర బుక్కరాయ సోదరులు స్థాపించిన విజయనగర రాజ్యం అలా ఏర్పడినవే. 1347లో దక్షిణాన స్వతంత్ర ముస్లిం రాజ్యంగా బహ్మనీ రాజ్యం ఏర్పడింది. ఈ బహ్మనీయ రాజులు నిరంతరం హిందూరాజులతో పోరాటాలు సాగిస్తూనే వచ్చారు. రెడ్డి, వెలమ రాజులు మంచి పండితులు, పండిత పోషకులు, వారిలో కుమారగిరి, పెదకోమటివేముడు, కాటమ వేముడు వంటి రెడ్డిరాజులు, సింగభూపాలుని వంటి వెలమ రాజులు గొప్ప గ్రంథకర్తలు కూడా. ఈ కాలంలోనే ప్రసిద్ధాంధ్ర కవి శ్రీనాథునియుగం గడిచింది.

కుతుబ్‌షాహీ యుగం

కుతుబ్‌షాహి రాజులు 1520లో గోల్కొండ కేంద్రంగా తెలంగాణాలో స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని స్థాపించారు. ఒరిస్సాలోని గణపతి రాజులు కుతుబ్‌షాహిలు చివరి విజయనగర రాజులు తమ సామ్రాజ్యాల విస్తరణ కోసం ఆధిపత్యాల కోపం పరస్పరం తీవ్రంగా కలహించుకుంటూవచ్చారు. చివరికి కుతుబ్‌షాహి రాజులు ఆంధ్రదేశంలో ఎక్కువ ప్రాంతాన్ని తమ పరిపాలన క్రిందకి తేవడంలో కృతకృత్యులయ్యారు. గోల్కొండను మొగల్ చక్రవర్తి ఔరంగజేబు జయించడంతో గోల్కొండరాజ్యం మొగల్ సామ్రాజ్యంతో కలిసిపోయింది. కుతుబ్‌షాహి రాజుల కాలంలో జరిగిన ఒక ముఖ్యమైన పరిణామం- ఫ్రెంచి ఇంగ్లీషు వర్తకులు వచ్చి ఆంధ్రదేశంలో పలు ప్రాంతాల్లో తమ తమ వ్యాపార కేంద్రాల్ని ఏర్పాటు చేసుకోవడం.

నిజాం రాజుల పాలన

దక్కన్‌లో మొగల్ సుబేదార్లుగా ఉన్న నిజాం-ఉల్-ముల్క్ ఆతని తరువాతవారు నిజాం వంశస్థులుగా పేరుపొంది 1723లో ఆంధ్రదేశానికి పరిపాలకులే అయ్యారు. ఆ తరువాత ముప్పయి సంవత్సరాలలో ఎన్నో సంఘటనలు జరిగి చివరకు నిజాం నవాబులు 1753లో ఫ్రెంచి వారికి సర్కారు ప్రాంతాన్ని దత్తం చేయవలసి వచ్చింది. ఆ వెను వెంటనే ఇంగ్లీషువారి ఈస్టుఇండియా కంపెనీ ఆప్రాంతాన్ని జయించి ఆక్రమించింది. ఇంగ్లీషువారితో ఒప్పందం చేసుకుని నిజాంనవాబు రాయలసీమ ప్రాంతాన్ని ఇంగ్లీషువారికి అప్పగించాడు. ఆవిధంగా ఆంధ్రదేశంలో రెండు ముఖ్య ప్రాంతాలు ఆంగ్లేయుల వశమైపోయి, తెలంగాణాప్రాంతం మాత్రం నిజాం నవాబుల పాలనలో మిగిలిపోయింది.

మతాల చరిత్ర

వైదిక మతాన్ని పోషించి వ్యాప్తిచెందించడంలో ఆంధ్రుల పాత్ర గణనీయమైనది. యజ్ఞయాగాది క్రతుదీకృతమైన హైందవం బాగా ప్రచారంలో వుంది. అనేకమంది రాజులు అశ్వమేధ రాజసూయవాజపేయాది క్రతువులు చేశారు. అనేకమంది సోమయాజులకు తామ్ర శాసనాల ద్వారా అగ్రహారాలు లభించాయి. బౌద్ధ యుగం తర్వాత నాగార్జున కొండ ప్రాంతాన్ని పాలించిన ఇక్ష్వాకులు బ్రాహ్మమతాన్ని పునరుద్ధరించారు. అప్పటికి రాజులు పరమ భాగవతులమని పరమ మహేశ్వరులమని చెప్పుకుని గర్వించారు. వేదపండితులను హిందూదేవాలయాల్ని పోషించారు. దక్షిణాదిన ముస్లిం దండయాత్రలతో హిందూమతానికి ఇస్లాంమతం వల్ల ప్రమాదం ఏర్పడినప్పుడు ఆంధ్రులంతా ఏకమై గట్టిగా ప్రతిఘటించి మతోద్ధరణోద్యమాన్ని శక్తివంతంగా సాగించారు. హిందూమతం సంస్కృతి పరిరక్షణకు విజయనగర సామ్రాజ్యస్థాపనం ఒక గొప్ప విజయం.

అశోకచక్రవర్తి బౌద్ధ మతాన్ని ప్రచారం చేయడం ప్రారంభించక ముందునుంచీ కూడా ఆంధ్రులకు బౌద్ధ మతం పట్ల ఒక అభిమానం ఉండేది. ఆంధ్రదేశంలో లబించిన ప్రాచీన బౌద్ధ శిల్పశిధిలాలే ఇందుకు తార్కాణం. బౌద్ధ భిక్షుకుల్లోనే అంధకులు లేదా అంధ్రకులు అని ఒక ప్రత్యేక తెగ ఉండేది. ఆంధ్రదేశంలోని అనేక తీర్థాల్లో బౌద్ధులు నివసిస్తున్నట్లు చరిత్ర పుటల్లో నిక్షిప్తమైవుంది. నాగార్జునాచార్యునివల్ల ఆంధ్రదేశం పవిత్రం కావడమే కాక ఆయన మహాయాన సిద్దాంతం ఆంధ్రులను ప్రభావితం చేసింది. వజ్రయాన తంత్రయానాలు కూడా కొంతవరకిక్కడ నిలదొక్కుకున్నాయి. ఘంటసాల, భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండ అంతర్జాతీయ బౌద్ధ యాత్రా స్థలాలయ్యాయి.

కళలూ, శిల్పమూ

మనదేశంలో కళలు, శిల్పమూ అభివృద్ధి చెందటానికి ఆంధ్రులు మహోజ్వలమైన కృషి చేశారు. బౌద్ధ యుగంలో ఆకర్షణకు ముఖ్య లక్ష్యం స్తూపం. తరువాత నాలుగు ఆయక వేదికలు, ఇటుక కట్టుబడి, సుందర శిల్పవిన్యాసంగల పాలరాయితాపడం, స్తూపనిర్మాణానికి ఆంధ్రులు కూర్చిన ఉదాత్తత ప్రత్యేకం. అమరావతిలోని మహా చైత్యపు పాలరాతి పనితనం బౌద్ధ శిల్ప చరిత్రలోనే అనుపమానం. ఒకే శిల నుంచి మలిచిన అతిపెద్ద అతిచిన్న స్తూపాలు ఆంధ్రదేశంలోని శంకరం వద్ద కనిపిస్తాయి. భారతీయ శిల్పకళకు అటు సాంచి, ఇటు అమరావతి రెండూ చరిత్ర ప్రసిద్ధ మైనవి. క్రీస్తుపూర్వం మొదటి శతాబ్దంలో నిర్మించిన సాంచిస్తూప తోరణ శిల్పాలు ఆంధ్ర శాతవాహన రాజు రెండవ శాతకర్ణి కాలంలో రచించారు. ప్రకృతి చిత్రణ సంప్రదాయం నుంచి భారతీయ శిల్పి విడివడి స్వతంత్ర రచన చేయడానికి అనుకున్న తొలి ప్రయత్నానికది ప్రతీక. అర్థచంద్రాకృతుల్ని మలచడం అప్పుడే ప్రారంభం. నాలుగువందల సంత్సరాల పాటు అమరావతిలో ఒక విశిష్ట కళా దృక్పథం వెల్లివిరిసింది. ఈ శిల్పరీతిలో నిర్మాణమైన ఆకృతుల్లో మానవ శరీర సౌందర్యం పరాకాష్ట నందుకొంది. రేఖలు, వంపులు నిరుపమానశక్తి, చలనం, సౌకుమార్యం, మనోహర లావణ్యం, ఆకర్షణ – అన్నీ కలబోసిన ఒక గొప్ప శిల్ప విన్యాసం రూపుదాల్చింది. మానవ మనస్తత్వం చిత్రణలో ఆ శిల్పాలు దర్పణాలు.

ఇక్ష్వాకు కాలంలో హిందూ దేవతలకు అనేక ఆలయాలు వెలిశాయి. ఈ దేవాలయ నిర్మాణాన్ని పల్లవులు కొనసాగించారు. విష్ణుకుండినులు బౌద్ధుల కుడ్య శిల్పకళను అనుసరించి కొద్ది మార్పులతో, విజయవాడ, మొగల్రాజపురం, ఉండవల్లి కొండలలో హిందూ దేవాలయాలను తొలిచారు. ఈ పద్ధతినే పల్లవులు నెల్లూరు జిల్లాలో భైరవకొండలో గుహాలయాలు నిర్మించారు. ఈ శిల్ప పద్ధతిని వారు తమిళ ప్రాంతానికి కూడా వ్యాప్తి కావించి గుహాలయాలనే కాకుండా మహాబలిపురంలోని రథాల వంటి గోపుర ప్రాధాన్యం కల శిల్పాలను రూపొందించారు.

చాళుక్యుల హయాంలో ఆంధ్రదేశంలో ద్రవిడ, వేసర – అను రెండు భిన్న శిల్పశైలులుండేవి. విశిష్టత నార్జించిన ఆది చాళుక్య శైలిలోని

వేసర ఆలయాలు ఆలంపురంలో, సత్యవోలులో కనిపిస్తాయి. తూర్పు చాళుక్యుల కాలంనాటి ద్రావిడ, నాగరశైలి దేవాలయాలు ద్రాక్షారామము, చాళుక్య భీమవరం, చేబ్రోలు, అమరావతిల్లో చూడవచ్చు. కొత్తకల్పనలతో తూర్పుగంగులు అభివృద్ధి పరచిన వేసర శైలి శిల్ప నిర్మాణాలు సింహాచలం, ముఖలింగాల్లో ఉన్నాయి.

చివరి చాళుక్యుల శిల్ప సంప్రదాయం పాటించి కొన్ని కల్పనలతో కాకతీయులు అనేక శిల్పాలను నిర్మించారు. ఈ శైలిలో ఒకే దేవునికి ఒకే ఆలయం ముగ్గురేసి దేవుళ్ళకు ఒకే ఆలయం కట్టిన తీరుతెన్నులు మనకు హనుమకొండ, రామప్ప, పిల్లలమఱ్ఱి, నాగుల పాడుల్లో సాక్షాత్కరిస్తాయి. కోయసల పద్ధతి సంక్లిష్టమైన చెక్కడాల శైలికి గాని, చాళుక్యపద్ధతి సమశైలికి గాని లోబడకుండా కాకతీయ దేవాలయ శిల్పకళ, దక్కను ప్రాంతంలో శిల్పకళావిర్భావంతో పతాక స్థాయిని అందుకున్న ఒక సంస్కరణకు ఒక సౌందర్య దృష్టికి నిదర్శనంగా నిలిచింది.

చిత్రకళారంగంలో కూడా ఆంధ్రులు నైపుణ్యంగలవారు. అజంతా గుహల్లో కనుపించే సుందర చిత్రాలు శాతవాహనుల కాలంనాడు చిత్రించినవి. ఆతరువాత వచ్చిన కొన్ని చిత్రాలు సాంచి, అమరావతి శిల్పాల ప్రతి రూపాలుగా ఉంటాయి. ఈ తరహా ఆంధ్రచిత్రరచనా శైలి అనేక శతాబ్దాలు ప్రాచుర్యంలో ఉంది. ఈ చిత్రకళకు కొన్ని సాదృశ్యాలు కాకతీయ దేవాలయాల్లో చూడకలగుతాం. కుడ్యచిత్ర కళ కూడా విజయ నగర రాజుల కాలంలో పెంపొందింది. లేపాక్షి, సోంపేటల్లో ఈ కళా నిదర్శనాలున్నాయి.

భారతీయ సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో ఆంధ్రులకృషి బహుధా విశిష్టమైంది. ఆంధ్రచక్రవర్తి హాలుడు సంగ్రధ్యం చేసిన సప్తశతి, శాతవాహన మంత్రి గుణాఢ్యుడు రచించిన బృహత్కథ ప్రాకృత గ్రంథాల్లో ఆణిముత్యాలు. విష్ణుకుండిన మాధవ వర్మ విరచిత జనాశ్రయ, ఛందస్సు కాకతీయ పత్రాపరుద్రుని ఆస్థానకవి విద్యానాథ పండితుడు రచించిన ప్రతాపరుద్రయశోభూషణం, అన్నంభట్టు వ్రాసిన తర్కసంగ్రహం జగన్నాథ పండిత రాయల రసార్ణవసుధాకరం ఆంధ్రులు రచించిన సంస్కృత మహాగ్రంథాల్లో కొన్ని మాత్రమే. అలాగే కుమారగిరి భూపతి "వసంతరాజీయం" కాళిదాసు నాటకత్రయంపై కాలయవేముని వ్యాఖ్యానాలు, పెదకోమటివేమన 'సాహిత్య రత్నాకరం' సంగీత రత్నాకరాలు సర్వజ్ఞసింగ భూపాలుని 'రసార్ణవసుధాకరం' ఆంధ్రరాజకాలకృతులు, సంస్కృత సాహిత్యంలో అనంత గౌరవం పొందిన గ్రంథాలు.

దక్షిణ భారత దేశంలో ...

ఆంధ్ర ప్రజలు, తమ ఆంధ్రదేశానికి సంబంధించినంతవరకే కాక పరిసర ప్రాంతాల చరిత్రలో కూడా ప్రముఖ పాత్రవహించారు. హరిహర బుక్కరాయ సోదరులు కర్ణాటక ప్రాంతంలో విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. నాలుగువందల సంవత్సరాలు ఈ సామ్రాజ్య మొక స్వర్ణయుగాన్ని సృష్టించింది. అనేకమంది ఆంధ్రకవులు, పండితులు, దండనాథులు, – ఈ కాలంలో తమిళ దేశానికి వెళ్లి, అక్కడ స్థిరపడ్డారు. విజయనగర సామ్రాజ్య వైభవంగా సాగుతున్న అనేకమంది తెనుగు నాయక రాజులు దక్షిణ ప్రాంతంలో మండలాధిపతులుగా ఉన్నారు. రక్కిసగడి యుద్ధానంతరం విజయనగర సామ్రాజ్య పతన దశలో ఈ మండలాధిపతులు స్వతంత్రులయ్యారు. ఆ విధంగా స్వాతంత్ర్యం ప్రకటించుకున్న నాయక రాజుల ఏలుబడిలో తంజావూరు, మధుర, పుదుకోట, గంజి మొదలైన సంస్థానాలు ఏర్పడ్డాయి. వీటిని తెనుగు దండనాథులే పాలించారు. వారు విద్యారంగంలో లలిత కళారంగంలో విజయనగర రాజుల సంప్రదాయాన్ని అనుసరించి ఆయా కళలని పోషించారు. తంజావూరు వసునాథనాయకుడు, విజయరాఘవనాయకుడు మధుర విజయరంగ చొక్కనాథుడు పుదుకోటరాజు రఘునాథ నాయకుడు ప్రసిద్ధ గ్రంథ కర్తలుకూడా. అక్కడ స్థిరపడిపోయిన తెలుగులైన త్యాగరాజు, పల్లవి గోపాలయ్య, దేవుడయ్య, దక్షిణామూర్తిశాస్త్రి అప్పటి ప్రసిద్ధ స్వరకర్తలు.

నబృహద్భారతం

అనేక శతాబ్దాలుగా భారతదేశం విశాల సాంస్కృతిక సామ్రాజ్య కేంద్ర స్థానంగా ఉండేది. అనేక మంది భారతీయులు సాహస యాత్రలు చేసి విదేశాలతో వ్యాపార సంబంధాలు పెట్టుకున్నారు. మతప్రచారకులుగా, పండితులుగా, సముద్రాంతరదేశాలకు కూడా వెళ్లారు. అక్కడ అనేక హిందూ రాజ్యాలు వెలిశాయి. హైందవ సంస్కృతి పరివ్యాప్తమైంది. ఈ సుదూర విదేశాల్లో భారతీయ సంస్కృతి ప్రతిష్టాతలుగా ఆంధ్రులు ఎంతో సేవచేశారు. ఆగ్నేయాశియా దేశాల్లో ఉన్న అమరావతి, విజయపురి, సింహపురి, కళింగవంటి పేర్లు ఆంధ్రదేశంలోని ఆయా కేంద్రాల ప్రభావాన్ని చెప్పక చెపుతాయి. శకయుగంనాటి తేదీలలో క్రీస్తుశకం తొలి శతాబ్దాలనాటి తెలుగు లిపిలో వ్రాసిన అనేక శాసనాలు ఆదేశాల్లో లభించాయి. అమరావతి శిల్పశైలి, కోస్తాఆంధ్ర ప్రాంతంలో కనిపించే కాంస్యశైలిలో నిర్మాణమైన వస్తువులు ఆ దేశాల్లో అనేకచోట్ల లభ్యమైనాయి.

తేకుమళ్ల రామచంద్రరావు

తెలుగువారి చరిత్ర 7000 ఏండ్ల క్రిందట నారంభమైనది

'భారతి' ఆంగీరస సం. వైశాఖమాసపు (మే నెల 1932 సం.) సంచికలో సూర్యారాధన సమన్విత మగు విజ్ఞానము (Haebolithic culture) దక్షిణ భారత దేశమున క్రీ.పూ. 5000 మొదలు 3000 సం. ప్రాంతములందు ప్రబలియుండెనని వ్రాసియుంటిని. ఆ కాలమున ఆంధ్ర దేశాదులగు దక్షిణ భరత ఖండదేశ ములం దెవరు నివసించుచుండిరి, వారి పుట్టుపూర్వోత్తరము లెవ్వి, వారి నాగరకత ఎట్లుండెను, అందలి విశేషము లెవ్వి అను విషయములు గూర్చి ఈ వ్యాసమును వ్రాయబూనితిని.

కోయలు - వారి కాలము

సూర్యుని పాములను ఆరాధించుట, మానవుల శవములను భద్రపరచుట, రాతికంబములను నిలవబెట్టుట, పచ్చపొడిపించుకొనుట మొదలగునవి సూర్యారాధన సమన్విత మగు విజ్ఞానమున ముఖ్యాంగము లయి యున్నవి. నేటికిని ఆంధ్రదేశమునను తత్పరిసర భూములందును నివసించుచు 'గాండులు' అను పేరుతో వ్యవహరింపబడుచున్న కోయవారియం దీవిజ్ఞానము విరివిగ వ్యాప్తమయి యుండినట్లు అనేక నిదర్శనములు గోచరించుచున్నవి.

కోయల దేవతలలో సూర్యుడొకడు ఈతని 'నారాయణ' దేవుడను పేరుతో వారు వ్యవహరింతురు. మనకు నారాయణుడు సూర్యాంతర్గతుడు; సూర్యుడాతనికి లోకువ. కోయలకు సూర్యుడే నారాయణుడు.

నాగదేవుడు అను త్రాచుపాము రూపము గల దేవుని కోయ లారాధింతురు. ఇంతే గాక వారిలో గల పెక్కు తెగలం దొకటి 'నాగవంశము'. మరావి, పోతారి, కరంగ, నురెత్తి, ధుర్వా అను పేరులు గల అయిదు కులముల వారును ఈ నాగవంశమునకు జెందిన వారే.

శవములను భద్రపరచుటకు గాను కొన్ని లేపములను భారతదేశముననే కాక ప్రపంచమున ననేక భాగములం దుపయోగించుచుండిరి. కోయలలో గూడ నొక రకపు లేపము వాడుకలో నుండెను. చనిపోయినవాని దేహము మొట్టమొదట పరిశుభ్రముగ కడిగివేయబడుచుండెను. పిమ్మట మృతకళేబరముపై పాలను ఒత్తుగ చిలికి, బొగ్గును పసుపుకొమ్ములను వేఱువేఱుగ పొడి యగునట్లు చేసి ఈ రెండు పొడులను ఇప్పనూనెలో కలిపి రంగరించి శవమునకు పట్టించెడివారు.

గతించిన తమ పూర్వులయెడ గౌరవమును జూపుటకు గాను రాతికంబములను నిలువబెట్టుట యను నాచారము సూర్యారాధన సమన్విత మగు విజ్ఞానము వెల్లివిరిసిన అన్ని దేశములందును

గాననగును. రాతికంబములను గాని, పొడుగైన శిలలనుగాని, కొన్ని యెడల పొట్టి రాళ్లనుగాని కోయలు నిలువబెట్టుచుండిరి. ఈ శిలలకు ముందువైపు చనిపోయిన తమ పూర్వికుడు హాయిగ నప్పుడప్పుడు కూర్చుండుటకై అరుగులు నిర్మించబడుచుండెను. అప్పుడప్పుడాశిలల దగ్గరకు చనిపోయినవాని బంధువులు పోయి ఆ శిలలకు పెరుగు, నేయి, ఇప్పనూనె, పసుపు మొదలగు పదార్థములను రాయుచుండెడివారు.

పచ్చ పొడిపించుకొనుట కోయలలో నెక్కువగ ప్రబలియుండెను. ఇందుల కుదాహరణముగ నొక్క యాచారమును మాత్రము పేర్కొందును. వారి బాలికలు రజస్వల లైనప్పుడు నాలుగుదినములు విడిగ నుండి, అయిదవనాడు స్నానము చేసి నల్ల కోడిని దేవతలకు బలియిచ్చిన పిమ్మట దేహమున కిరుప్రక్కలను పచ్చపొడిపించు కొందురు. దీనివలన నా యువతికి కడుపునిండ కడుపెడు బిడ్డలు పుట్టుదురని కోయల నమ్మకము.

పై విషములను బట్టి క్రీ.పూ. 5000 మొదలు 3000 సం.ల వరకు సూర్యారాధన సమన్విత మగు విజ్ఞానము దక్షిణ భారత దేశమున వ్యాపించియుండెను ఆ విజ్ఞానముగల కోయలకాలము నిర్ధారణయగుచున్నది. ఇంతేగాక ఈ కాల నిర్ణయమున కితరాధారములును గలవు.

కోయలు 'రావణవంశము' వార మని చెప్పుకొందురు. ఈ ప్రతీతి గ్రంథస్థమును, సంప్రదాయసిద్ధమునునై యున్నది. కోయలు విరివిగ నున్న మధ్యపరగణాల యందలి 'భానువారఘర్' అనునూరి రాజు మదాంధుడై కోయల నేదోబాధపెట్టెను. అప్పు డారాజును కోయలు "అదే మా రావణుడు వచ్చుచున్నాడు, నిన్ను చంపనున్నాడు" అని పాటలు పాడిరి.

కోయలలో నొక ముఖ్యమైన అయిదుదినముల తంతు కలదు. ఈ తంతును రావణుని కుమారుడైన మేఘనాధుని (ఇంద్రజిత్తు) పేర 'మేఘనాథ్' అందురు. ఈ అయిదుదినములలో నొకనాడు కోయలొక చోట సుమారేడడుగుల లోతు గల గుంటను త్రవ్వి దానిలో తెల్లగుగ్గిలపు మ్రానునో, టేకుమ్రానునో పాతి ఆ గోతినంతటిని ఉప్పుతో నింపివేయుదురు.ఆ పిమ్మట కుంకుమతోను, రంగులతోను ఆ గోతి నలంకరింతురు. అంతట మ్రొక్కు బడులు చెల్లించవలసినవారందరును మేకలను, కోళ్లను మేఘనాథ స్తంభమునకు బలియిత్తురు. తరువాత ఆకంబుపై నడ్డముగ నొక చిన్న దూలము నుంతురు. ఈ అడ్డదూలమున కొకచివర పురోహితుని కట్టుదురు. రెండవచివర నొక త్రాటిని కట్టుదురు. కోయలందఱును ఈ త్రాటిని పట్టుకొనిలాగుచు, వదలుచు అడ్డదూలమును ఏతమువలె నూగింతురు. ఇట్లు లైదుసారు లూగించిన పిమ్మట పురోహితునకు కొబ్బరికాయ, బట్టలు కానుకగ నొసంగుదురు. మేఘనాధునికి ప్రియతమమైన ఈ తంతువలన రోగములు రావని కోయల నమ్మకము.

ఈ విషయజాలమునుబట్టి చూచినచో కోయలగ్ర గణ్యులై యుండినకాలము మతింతఖచితముగ మనకు తెలియుచున్నది. రావణుడు అయోధ్యారామునకు సమకాలికుడుగదా? పైన పేర్కొన్న నావ్యాసమున అయోధ్యరాముని కాలము క్రీ.పూ. 4000 సం. ప్రాంతము అని నిర్ణయించియున్నాను. రావణ వంశీయులగు కోయలకు ఆ కాలము స్వర్ణయుగమై యుండెను.

కోయల ఆగమనము

తమ పుట్టువునుగూర్చి కోయలలో నొకకథ కలదు.

ఆదిని ధవళగిరియందు కోయదొరలు పదునారు వందలకోట్లమంది నివసించుచుండిరి. వీరు స్నానము చేయకుండుటయేకాక చుంచులను, కుక్కలను, పిల్లులను, పందులను, గేదెలను, దున్నపోతులను తినుచుండిరి. ఇట్టి అసహ్యవర్తనులగు కోయదొరలపై శివున కాగ్రహము గలిగి వీరినందఱ నొకగుహలో బడవైచి యొక పెద్దబండను గుహయొక్క ద్వారమున కడ్డము పెట్టి భస్మాసురుడు అను పేరుగల తనకుక్క నక్కడ కాపుంచి వెడలిపోయెను. పార్వతికి కోయదొరలన్న మిక్కిలి ప్రీతి. వీరిట్లు బంధితులై యుండుట ఆమె తెలిసికొని తనయొడలి మట్టిని నలిచి దానితో నొకకుమారుని తయారు చేసెను. (వినాయకునిజననముతో పోలిక కనబడుచున్నది). ఆ కుమారుని పేరు 'లింగో'. ఈతడు శివునిగూర్చి ఘోరమగు తపము చేయగా శివుడు ప్రత్యక్షుడై సముద్రతీరముననున్న 'బిందో'లను (రాబందులను) తనకడకు తెచ్చినచో కోరికను నెరవేర్తునని చెప్పెను. అంతట లింగో సముద్రతీరమునకు బోయి అచ్చటి పిల్ల రాబందులను దొంగతనముగ తెచ్చుట భావ్యము కాదని పెద్దరాబందులు వచ్చువఱకు నిరీక్షించుచుండెను. ఇంతలో సముద్రములోనుండి భవరనాగుడు అనుపేరు గల యొక పాము వచ్చి పిల్లరాబందులను తినుట కుద్యుక్తమగుచుండగా లింగో ఆ పామును చంపివైచెను. పిమ్మట పెద్దరాబందులు వచ్చి తమ పిల్లల వలన జరిగిన వృత్తాంతమును విని లింగోకోరిక ననుసరించి వెంటనే పిల్లలతోను, లింగోతోను ధవళగిరికి పయనమయ్యెను. అచ్చటకును ధవళగిరికి ప్రయాణము సుమారారు నెలలు పట్టును. కాని ఆరుదినములలోనే ప్రయాణము ముగించబడెను. శివుడు గత్యంతరము లేక గుహయొక్క ద్వారమున కడ్డమున్న రాతిని తొలగించెను. అంతట తన పదునారు వందలకోట్ల కోయదొరలతోను లింగో ప్రయాణమై వచ్చుచుండగా త్రోవలో నొకనది తగిలెను. లింగో వారికి బియ్యమును, జొన్నపిండిని ఇచ్చెను. కోయదొరలు అచ్చట ఆర్యులదేవతలయొక్క నేతిని కొల్లగొట్టిరి. ఆ నది దగ్గర వంటచేసికొని భుజించి వారు నదిని దాటిరి. అప్పటికి వారిలో నాలుగుజాతులవారుండిరి. ఆ జాతులకు 'టేకం', 'మార్కం', 'పూసం', 'తెలింగం' అను పేర్లుండెను. నదిని దాటినపిమ్మట లింగో కోయదొరల కొకపట్టణమును నిర్మించెను. వారిని తెగలుగ విభజించెను. తెగలను కులములుగ విభజించెను. ఒక కులమువా రింకొకకులము నుండియే గాని వివాహము చేసికొనరాదని నియమ మేర్పరచెను. కోయదొరలందరిలోను వయోధికుని ప్రధాని (పురోహితుని)గ నియమించెను. దేవతలను నిర్ణయించెను. వివాహాద్యాచారములను నిర్ధారణ చేసెను. పిమ్మట లింగో దేవతల దగ్గరకు వెడలిపోయెను.

దేవతలు

కోయల దేవతలందఱిలోను బూరదేవుడు గొప్పవాడు. ఇతర దేవతలందఱు బూరదేవునియం దిమిడి యున్నట్లు వారు భావించుచుండిరి. ఈ దేవుని చాల కాలము వఱకు తెల్లగుగ్గిలపు (సజ్) చెట్టులో నున్నట్లు భావించి వారు ఆ చెట్టును పూజించుచుండిరి. ఇట్లే టేకుచెట్టునుగూడ

వారు పూజించుచుండిరి. నారాయణదేవుడు (సూర్యుడు), నాగదేవుడు (త్రాచుపాము), దేవుడు (అల్లరికి దేవుడు), కల్మ దేవుడు (దేవతల నౌఖరు)+ అను వారిని గూడ కోయలు ప్రథమము నుండి పూజించుచుండిరి. కాలక్రమమున నితర దేవతలను గూడ వీరితో చేర్చి కోయ లారాధింపసాగిరి. ఇట్లు భీమ (బలమునకు) దేవుడు, గొర్ర (గుఱ్ఱముల) దేవుడు హొలెరా (కొయ్యముచ్చ) దేవుడు, సలే (పశువుల కొట్టపు) దేవుడు, జూలన్ (జోల, లేక ఊయల) దేవి, చావర (ఆవుతోక) దేవుడు, ఘంఘ్రు (కంచుగంట) దేవుడు పరశిపెను అను పరశు (గొడ్డలి) దేవుడు, ఘనశ్యామ (పెండ్లికొడుకు) ++ దేవుడు, పాలో (ఈటె-బట్ట) దేవుడు ననువారు కోయలచేనారాధితులై యుండిరి.

కులములు

లింగో నాయకత్వమున కోయలు పట్టణ నిర్మాణ మొనర్చుకొన్నప్పుడు వారిలో ముఖ్యముగా నాలుగు తెగలుండెనని పైన వ్రాసియున్నాను. టేకం అను పేరుగల టేకుచెట్టు తెగ, మార్క అను పేరుగల వేపచెట్టు తెగ, పూసం అనుపేరుగల పూసతెగ, తెలింగం అనుపేరుగల తెలుగుతెగ అనునవి యీ నాలుగు తెగలు. శోది (పెద్ద పులి) కులము, సుయబదివ (అడవిపంది) కులము, బకరవంశ మను మేకతెగ, నాగవంశము అను త్రాచుపాము తెగ యనునవి కూడ వారిలో గలవు.

వృత్తులు

మానవులు చరిత్రారంభకాలమున అడవులందు తిరుగాడుచు అందలి వృక్షాదులవలనను, మృగముల మాంసమువలనను పొట్టపోసికొనుచుండి రను నంశము చరిత్రలయం దంతటను గానుపించును. అట్లే లింగో నాయకత్వమున పట్టణనిర్మాణ మొనర్చుకొని స్థిమిత మగు నాగరికతావస్థకు వచ్చుటకు పూర్వము కోయలు మానవచరిత్రయందలి పై జెప్పిన శైశవదశయం దుండిరి. శోది (పెద్దపులి), సుయబదివ (అడవిపంది) మొదలగు మృగముల పేర్లును, టేకు, వెదురు మొదలగు అడవిచెట్ల పేర్లును వారి తెగలయొక్కయు, కులములయొక్కయు పేర్లుగ వాడుకలో నుండుట కిదియే కారణము.

మానవుని నాగరికతాభివృద్ధియందలి రెండవసోపానము గొడ్లకాపరిదశ, కోయలు మేకలనుగూర్చి ఎరిగి యున్నట్లు వారిలోని 'బకర' (మేక) వంశము నిదర్శనము.

లింగోనాయకత్వమున పట్టణనిర్మాణ మొనర్చు కొనునప్పటికి వారు మానవుని నాగరికతాభివృద్ధియందలి మూడవ సోపానము నధిష్టించియుండిరి; ఆచటి వారప్పుడే వ్యవసాయమును వృత్తిగ నవలంబించిరి. ఇందుకు నిదర్శనములుగ నీక్రిందియంశములు మనకు గోచరించుచున్నవి. ఆకాలపు కోయలదేవతలలో హొలెరా అను నొక దేవుడు గలడు. పాడిపంటలు సమృద్ధిగ గలుగుటకు ఈదేవుని కోయలు కొయ్యముచ్చ+++ రూపము గల వానిగ పూజించుచుండిరి. ఇట్లే ఆవుతోకయాకృతి గల 'చవార'దేవుని, పశువులకొట్టముల కధిష్ఠాత యగు 'సలే' దేవునికూడ వారు పూజించుచుండిరి. మరియు కోయలయందలి 'ఉయక' అను పేరుగల యొక్క కులము నందు 'కడపచోరు' అను నొక శాఖ గలదు. ఈ పదము నకు 'ధాన్యము నెత్తుకొనిపోయినివాడు' అని యర్థము. ఈ శాఖయందలి ప్రథమపురుషుడు దేవవాటిక ++++ యందలి ధాన్యమును దొంగలించెనని యొకగాథ కలదు. పైన చెప్పిన లింగోకథయందు కోయదొరలకు లింగో జొన్నపిండిని, బియ్యమును ఇచ్చినట్లు ఈ కోయదొరలు వానితో వంటచేసికొని భోజనము చేసినట్లును కనబడుచున్నది. ఈ విషయజాలమునుబట్టి కోయలవృత్తులలో వ్యవసాయముమొక్కటిగ నున్నట్లు మనకు ద్యోతకమగును. కావున పట్టణనిర్మాణకాలమున కోయలు వేట, పశువులను మేపుట, వ్యవసాయము నను వృత్తులవలంభించి యుండిరి.

ఆహారాది పదార్థములు

పై సంగతులనుబట్టి మాంసము, పాలు, జొన్న, బియ్యము కోయల యాహారపదార్థము లయియున్నట్లు మనకు విశదమగుచున్నది. జొన్న మొదలగు ధాన్యము లను పిండిచేసి వంటకము చేసికొనుటయు వారెరిగియుండిరి. ఇప్పనూనె దేవతలకుగూడ నతిప్రీతికరమగు నూనెగ వారు భావించి దానిని, ఇప్పచెట్టును వా రతి మర్యాదతో చూచుచుండిరి. టేకు, మామిడి, ఒకరకపు గుమ్మడి, బిల్వ, వెదురు మొదలగు చెట్లను వారు బాగుగ నెరిగి యుపయోగించుకొనుచుండిరి.

లింగోకథలో కోయలకు జొన్నపిండి, బియ్యము ఇచ్చినప్పుడు కోయదొరకు ఆర్యులదేవతల యొద్ద నేతిని కొల్లగొట్టి దానితో వంట చేసికొన్నట్లు చెప్పబడి యున్నది. అంతకుపూర్వము జొన్నపిండి, బియ్యము వలె నేయి వారియొద్దనున్న పదార్థము గాదు. ఇది వారికి నూతనము.

+ ఈతని నారదునితోగాని, దేవతలకునోరని మనము భావించు అగ్నిదేవునితోగాని పోల్చనగును.

++ నేడు మనలోవలెనే పూర్వము కోయలలో గూడ వివాహమునకు పెండ్లికుమారుడు పెండ్లి కుమార్తె యింటికి పోవుచుండెను. కాని, ఒకసారి త్రోవలో పెండ్లికుమారుని పెద్దపులి యొకటి చంపుట తటస్థించెను. అప్పటి నుండియే పెండ్లి కుమార్తెయే పెండ్లి కుమారునింటికి వచ్చుట యాచారమయ్యెను. చనిపోయిన పెండ్లికొడుకు దేవుడుగ పరిగణింపబడి ఘనశ్యామదేవుడయ్యెను.

+++ ఎద్దుల మెడలలో కట్టబడునొక యాభరణము.

++++ కోయలు దీనిని 'దేవకులము' అందురు.

బట్టలు

అందఅవలెనే కోయలును ఆదియందు తోళ్లను, ఆకులను ధరించి పిమ్మట నారబట్టలను కట్టుకొనుచుండిరి. వారియందలి నాగవంశీయులలో 'ధుర్వా' యను పేరుగల శాఖ యొకటి గలదు. ఈ శాఖయందు 'కుశాద్య' (ఒకవిధమగు పట్టు) అను తెగ కలదు. ఈ తెగకు చెందిన ప్రథమ పురుషు డీపట్టును గనిపెట్టిన ట్లొక సంప్రదాయసిద్ధమగు ప్రతీతి గలదు. నూలుబట్టలు వారిలో నప్పటికి వాడుకలో లేవు.

కోయల ఆదిమ దేవతలలో లేని 'పాలో' దేవుడు మిక్కిలి వ్యయమునకు కారకుడు. ఈటెకొన చుట్టును నొక నూలుబట్టను కుట్టి తయారు చేసిన ప్రతిమయే ఈ'పాలో' దేవుని ప్రతిమ. పురోహితుడు తప్ప నింకెవ్వరును ఈ ప్రతిమను నిర్మించరాదు. సుమా రారు మాసములు ప్రధాని (పురోహితుడు) ఎవ్వరితోను మాట లాడక ఒంటరిగ పరులకు గనబడకుండ నొకగదిలో గూర్చుండి ఈ ప్రతిమను నిర్మించవలెను. ఈయారుమాసముల వ్యయమును ఊరికోయలు భరింతురు. ఇంతటి నిష్ఠ, ఇంతటికష్టము, ఇంతటి వ్యయము ఇతర దేవతల ప్రతిమల నిర్మాణమునందు కానరాదు. దీనినిబట్టి చూచినచో నూలుబట్టలు మనదేశమున కోయలకాలమున ప్రప్రథమమున వాడుకలోనికి వచ్చినవని తేటతెల్లమగును.

ఇనుము

నూలుబట్టయేగాక ఇనుముగూడ కోయలకాలముననే మనదేశమున నవతరించెను. పరికించగా ఇనుమును కోయలే కనిపెట్టినట్లు ఈ క్రింది నిదర్శనములు మనకు గానవచ్చుచున్నవి.

1. కోయలదేవతల ప్రతిమ లన్నియు ఇనుముతో చేయబడినవి. వారి దేవతలందఅలో నధికుడగు బూర దేవుడు సైతము, పూర్వపు తన తెల్లగుగ్గిలపు చెట్టు రూపమును మాని ఇనుప ప్రతిమ రూపమున నారాధితుడు కానొచ్చెను. హోలెరా (కొయ్యముప్వ) దేవుడును, 'ఘంఘ్రు' (కంచుగంట) దేవుడును తప్ప మిగిలిన దేవత లందఱును ఇనుపప్రతిమ యాకారము గలవారే.

2. కోయలలో వృత్తులనుబట్టి ఏర్పడిన విభజన ప్రకారమైదు వ్యవస్థలు గలవు. అందఱకంటె నగ్రస్థానము ఇనుపపని వారిది. వారి తరువాతివారు 'ఒజ్జలు'. వీరు వారములు, వర్జ్యములు చెప్పుచు విద్యలను గరపుచు నుండెడివారు. మూడవవ్యవస్థవారు ప్రధానులు (పురోహితులు), నాలుగవవారు సోలహులు (వడ్రంగులు), చివరివారు వేశ్యలు, నటకులు.

3. కోయల వివాహాచారములందు సైతము ఇనుము ప్రాముఖ్యము వహించినది. పెండ్లికుమారుడు పెండ్లి కుమార్తెవ్రేలి కొక యినుప యుంగరమును తొడుగ వలెను.

ఇను మెప్పుడు వాడుకలోనికి వచ్చినదో మన మించుక పరిశీలింతము.

ఆర్యులలో అయోధ్యరాముడు శివుని ఇనుప (ఉక్కు) విల్లు విరిచి సీతను పెండ్లియాడిన కథ సుప్రసిద్ధము. అంతకు పూర్వము ఆర్యులు ఇనుమును ఆయుధముల కుపయోగించినట్లు మనకు నిదర్శనములు లేవు; పరశురాముడు (కోయల పరిశిదేవుడు) గండ్రగొడ్డలి నుపయోగించినట్లు మాత్రము తెలుపబడియున్నది. కావున క్రీ.పూ. 4000 సం. ప్రాంతముల నాటికి ఆర్యులు ఆయుధములకు ఇనుము నుపయోగించియుండలేదు.

కోయలు పైన చెప్పిన విధముగ ఇనుము నుపయోగించుటయే కాక 'ఈటె' రూపుడుగ 'పాలో' దేవుని, గండ్రగొడ్డలి ఆయుధముగ గల పరిశిదేవుని ఆరాధించు చుండిరి. కోయలలో ఇనుమువాడుక విశేషముగ నుండుటచే వారి నుండి అది ఆర్యులకు వ్యాపించియుండవలెను. కావున క్రీ.పూ. 4000 సం. ప్రాంతములకు పూర్వమే కోయలలో నీవాడుక ప్రబలియుండెను.

ఈటె ననుసరించియున్న 'పాలో' దేవుని నూలు బట్టయు ఈటె వాడుకలోనికి వచ్చిన సంవత్సర ప్రాంతముల కించుక యనంతరమున వాడుకలోనికి వచ్చియుండ వలెను.

కోయలు తెలుగువారు

పైన వ్రాసిన లింగోకథలోని విషయములను జూచినచో ఆకాలపుకోయలలోని నాలుగు ముఖ్య తెగలలో 'తెలింగం' (తెలుగువారు) అనుతెగ యున్నట్లు కానబడుచున్నది. శ్రీశైలేశుడు, భీమకాళేశుడు, ద్రాక్షారామ భీమేశుడు నను మూడు లింగమూర్తుల దేశము త్రిలింగదేశ మనియు, ఈ దేశమున మాటలాడు భాష ఈ కారణమున తెలుగు అని వ్యవహరింపబడుచున్నదనియు పండితాభిప్రాయము. కాని ఈ వ్యాసమునం దుదాహృతములైన సంగతులను గమనించినచో మూడులింగముల నడిమి దేశమును బట్టికాక, ఈ దేశమునకు రాకపూర్వమే ధరింపబడిన యొక తెగనామమును బట్టి మనకును, మన భాషకును ఈపేరు గలిగెనని మనకు ద్యోతకమగు చున్నది.

మరియు, మధ్యపరగణాలయందును, మధ్య ఇండియా యందును నివసించుచున్న 'గాండులు'ను, మనమును, సవరలు, కొదులు, చెంచులు నను మొదలగు పేర్లు గల కోయవారును ఒకే తల్లి వేరు గల సోదరులము.

ఈ విషయము పై యంశమువలననే కాక మన మన ఆచారవ్యవహారముల పోలికవలనగూడ స్పష్టపడుచున్నది.

మన వివాహములలో పసుపులో ముంచిన దారములను చేతులకు కట్టుకొను నాచారము గలదు. గాండులలో వివాహమునందలి మొదటిదినమున పెండ్లి కుమారుడు పెండ్లికుమార్తె చేతికిని, పెండ్లి కుమార్తె పెండ్లికుమారుని చేతికిన పసుపుదారమును గట్టుదురని ల్యాంగుహోరన్ గారు వ్రాసియున్నారు.

మనలో పసుపునీరు (వసంతము) భార్యాభర్తల సంబంధమును, ఉల్లాసమును సూచించును. గాండులలో కూడ నింతే. బస్తర్ సంస్థానమునందలి గాండులలో ఏ అవివాహితయైనను పసుపునీటి నొక పురుషునిపై పోయుచో వారు వేరే తంతు అవసరము లేకుండగనే భార్యాభర్త లగుదురు. విడాకులిచ్చిన స్త్రీలును ఇట్లే మరొకరి చేపట్టవచ్చును.+

మన వివాహములందు వధూవరు లిరువురును గలసి రాత్రి పూలబంతులాట యాడుట ఆచారము. గాండులలో పెండ్లి మొదటిరోజురాత్రి పెండ్లి కుమారుడును, పెండ్లి కుమార్తెయు గలసి నృత్యము చేయుదురు.

మనలో 'వప్పగింతలు' అనునది యొక ముఖ్యమగు వైవాహికాచారము. ఇది గాండులలో గూడ కనబడుచున్నది. పైన చెప్పిన నృత్యమున కనంతరము పెండ్లి కుమార్తె తనవిడిదికి వెడలిపోవును. మఱునాటి ప్రాతర్భోజనానంతరమున వధువును ఆమెతల్లిదండ్రులు వరునింటికి తీసికొనివచ్చి యింటిలోనికి త్రోయుదురు. అప్పుడు వరునితండ్రితో "ఈ పిల్లను మీరు స్వాధీనపరచుకొనుడు" అని వారు చెప్పుదురు. పిల్లతో "నీ వింతటినుండియు నీ భర్తయొక్క కుటుంబంలోని దానవు. మాయొద్దకు నీ వొక్కతెవును రాకుము" అని వారందురు. ఇంతటితో వివాహము పరిసమాప్తినందును.

తెలుగువారి పెండ్లిండ్లలో తెర కవ్వల వధువును, ఇవ్వల వరుని కూర్చుండబెట్టి తెరను కొంచెముగ నెత్తి బెల్లము, జీలకఱ్ఱ మొదలగు వస్తువులను గలిపిన యొక లేహ్యము వంటి పాకము నొకరితలపై నొక రుంతురు. ఎవరు ముందు రెండవవారి తలపై దీనిని నిలకడగ నుంతురో వారియాజ్ఞలను రెండవవారు శిరసావహింతురని మనలో నందురు. గాండులలోను ఇట్లే తెరకట్టబడును. తెరయడుగున నేలపై తెరపొడుగునను మద్యమును జల్లుదురు. పిమ్మట పెండ్లి కుమారుడు తెర నించుక పైకెత్తి, వధువుదగ్గరకు పరుగెత్తి వీపుపై నొకదెబ్బ కొట్టును. ఆమెచేతి కొకయుంగరమును తొడిగి మేకవలె అరచుట నభినయించును. ఇట్లు వీపుపై కొట్టినయెడల భార్యభర్తయాజ్ఞలను యావజ్జీవము శిరసావహించునని వారి నమ్మకము.

గాండుల వివాహసందర్భమునందు వధువుతరపు స్త్రీలును, వరునితరపు స్త్రీలును చెరియొక జట్టుగ నేర్పడి మామిడియాకుల తోరణమునకు చెరి యొక ప్రక్కన నిలిచి ఇష్టము వచ్చినట్లు పాటలు పాడుదురు. ఇట్టి యాచారము మనలోను ఉన్నది.

బుక్కాచల్లు నాచారము ఇరు జాతులలో గలదు.

మనలో వివాహాంతమున జరుగు నొకవేడుక సందర్భమున పానుపుపై పెండ్లికుమార్తెయు, పెండ్లి కుమారుడును నొకరికెదురుగ నొకరు కూర్చుందురు. ఇరువురు నడుమ నొకగుడ్డయూయల కట్టబడును. తాటాకుతో నొక చిన్నబొమ్మను చేసి, ఆ బొమ్మ వధూవరులకు బుట్టిన బిడ్డయైన ట్లెంచబడి యూయలలోను, వధూవరుల చేతులలోను మెలగును. కోయలవివాహములందు ఏతము వంటి యొక సాధనముపైన గాని, ఊయలలో గాని పెండ్లి కుమారునితండ్రిని కూర్చుండబెట్టి పెండ్లికుమార్తె, ఆ ఏతమను పైకిని క్రిందికిని ఊపును. బంధువులు "నీ కొడుకు ఏడ్చుచున్నాడు, ఏడ్చుచున్నాడు" అని ఆమెతో పరియాచకము లాడుదురు.

కోయలలో వివాహానంతరమున భార్యాభర్తలు వారికి నిర్దేశింపబడిన యొక ఇంట ప్రవేశింతురు. ఆరాత్రి బంధువులు ఇంటిచుట్టును చేరి, అరచుచు గోలచేయుదురు. ఆయింటిమీదను, చుట్టును మట్టిముద్దలను, రాళ్లను, చెత్తను పోయుదురు. తెల్లవారకమునుపే నూతన దంపతులు ఆప్రదేశమునంతను శుభ్రపరచవలెను. తెలుగు వారిలో కార్యమునాడు గదిచుట్టును బంధువులు (స్త్రీలు) చేరి తిరుగుదురు. తెల్లవారకమునుపే దంపతులు లేచి యావలకు పోవలెను. అందరును లేచునప్పటికి గది చెక్కు చెదరనట్లుండవలెను.

ఆంధ్రుల పెండ్లిండ్లలో తోడు పెండ్లికొడుకు నొకని తయారు చేయుదురు. కోయలలో వివామము లందు దేవుని పూజించుటకుగాను వధూవరులు బయలు దేరుదురు. వారికి ముందిరువురు పురుషులు బట్టులో నొక కోడిపిల్ల నుంచుకొని బయలుదేరుదురు. ఈ కోడి పిల్లను 'ధెంధా' యందురు. ఈ పదమునకు 'తోడు' యని యర్థము. గుడిని సమీపించినప్పుడు గ్రామములోని గంధోళిగాడు ఈతోడుకోడిపిల్లను తీసికొని కొరకుకొని తినుట నభినయించును.

కోయలలో వధువు గృహప్రవేశ సమయమున నొకకోడిని చంపి దానిరక్తమును వధూవరులతలలపై జల్లుదురు. ఆ సమయముననే వధు వొక కోడిపిల్లను కాలి క్రిందపెట్టి త్రొక్కివేయును. కొన్ని తెగలవారిలో పెండ్లికూతురు వివాహాగారమును చేరు సందర్భమున గొడ్డలితోనో, కత్తితోనో కోడిపిల్ల తలను ఛేదించును. ఆంధ్రులలో గృహప్రవేశ సమయమున వాకిట నిలువబెట్టి వధూవరుల పాదములకు పసుపు పూసి వారి తలలపై రక్తాక్షతలను జల్లుదుము. ఆ పిమ్మట గడపపై నొకగిన్నెలోనో, శేరులోనో, పావుశేరులోనో బియ్యమును పోసి యుంతురు. వధువు దానిని కాలితో తన్ని లోపల ప్రవేశించవలెను.

వివాహాచారములందేగాక జనన సమయాచారము లందును, ఆంధ్రులకును, కోయలకును చాల పోలికలు కానవచ్చుచున్నవి.

కోయలలో శిశువు పుట్టిన యైదవ నాడుగాని, అంతటి నుండి పన్నెండవ నాటిలోగా గాని తల్లికి పిల్లకు స్నానము చేయించి అక్క మగనిచేతగాని, మేనత్తమగని చేతగాని పిల్లలకు క్షౌరము చేయించి, ఇంటినంతటిని శుభ్రపరచి వెల్లవేయించి ఆవుపేడతో ఇల్లలికిన పిమ్మట నొక చేరిలో వారు తిను ధాన్యమును పోసి దాని మీద శిశువును పరుండబెట్టుదురు. శిశువుకొర కందరు నొకగిన్నెలో కాసులు వేయుదరు. ఆంధ్రులు చేట బదులు జల్లెడ నుపయోగింతురు. అప్పుడు క్షురకర్మ చేయరు. ఆంధ్రులలో పిల్లలకి క్షురకర్మ చేయునప్పుడు గిన్నెలో కాసులు వేయుదురు. వానిని మంగలి తీసికొనును.

+ ఆర్.వి.రస్సెల్ గారు వ్రాసిన Tribes and Castes of the Central Provinces అను గ్రంథము 73వ పుట.

పుట్టిన శిశువు చెవిటగ గనబడుచో కోయలు జననసమయానంతరమున నెల్లప్పుడు నొక ఇత్తడిగిన్నెను గట్టిగ చప్పుడు చేయుదురు. శిశువు యొక్క కర్ణకుహరములందీ చప్పుడు చొరబడి వినికి కడ్డముగ నున్న యడ్డును తొలగించునని వారి నమ్మకము. ఆంధ్రులలో శిశువు పుట్టగనే యేడువనిచో ఇత్తడిచేట నొకదానిని గట్టిగ వాయింతురు.

కోయలయాచారములలో కొన్ని మనభాషలో మాత్రము నిలిచి యున్నవి. కోయలలో గొప్పవారు అనగా క్షత్రియుల మనుకొనువారు కొందరు గలరు. వారిలో వివాహములకు పెండ్లికొడుకులు వెడలరు. వారి బదులు కత్తులను పంపుదురు. ఈ కత్తి నొకసువాసిని వివాహస్తంభముచుట్టును ఏడుసారులు త్రిప్పును. అంతట పెండ్లికుమార్తె కత్తిపై నొకపూలమాలను వేయును. ఇది తెలుగువారిలో 'కత్తికి భాషికము కట్టుట' అని ప్రవచనమున నిలిచియున్నది. మరియు కోయలలో తాత యొక స్త్రీని వివాహమాడి మరణించుచో మనుమడామెను పరిగ్రహించవచ్చును. ఇది 'అవ్వను బట్టుకొని వసంతము లాడుట', 'తాతా అవ్వావరుస' అను పదము లందు ఆంధ్రులలో నున్నది. గాండులలో 'పైసా ముండి' యను నొకపదము గలదు. దీనికి 'ఉంపుడుకత్తె' యని అర్థము. వారిలో నొకస్త్రీ ఎవనికో ఉంపుడుకత్తె కాఁబోవునప్పుడు దానిని దాని బంధువులు పసుపుతోను, నూనెతోను స్నానమాడించి కొబ్బరియాకుల కిరీటములను వారిరువురి తలలపై నుంచి ఇప్పచెట్టు చుట్టును వారిని ఏడుసారులు త్రిప్పుదురు. ఇట్టి స్త్రీ 'పైసా ముండి'. తెలుగువారిలో 'ముండి' యను పదము ఉంపుడుకత్తె యను నర్థముతో వాడుకలో నున్నది.

ఇంతేకాక కోయలకును తెలుగువారికిని మరి కొన్ని పోలికలు గోచరించుచున్నవి. సంవత్సరాది పండుగనాడు మనము అప్పుడే కాపు మొదలిడిన మామిడి కాయలను క్రొత్తచింతపండుతోను, అప్పటి చెరకు పానకముతో క్రొత్తగా తయారైన బెల్లముతోను, వేప పువ్వుతోను సేవింతుము. ఇట్లే కోయలును సంత్సరాదినాడు పండుగ చేసికొని క్రొత్తపంటను, పండ్లను కలుపుకొని తిందురు. మనవలెనే వారును పులిని జూచినచో నదృష్టము గలుగునని నమ్ముదురు. మండ్లపై బరుండి కష్టపడినచో దుఃఖము తొలగునని మనవలె కోయలును భావింతురు. భార్య భర్త పేరు చెప్పుటయు, భర్త భార్య పేరు చెప్పుటయు తప్పని వారు మనవలెనే తలంతురు. చేతులవ్రేళ్లను గడ్డముక్రిందబెట్టి, బుగ్గలను బొటనవ్రేలికిని తక్కిన వ్రేళ్లకును నడిమికి వచ్చునట్లు పట్టుకొని పిమ్మట ఆ చేతివ్రేళ్ల కొనల నన్నిటిని కలిపి ముద్దిడుకొనుట కోయలలోవలె మనలోను వాడుకలో నున్నది.

మన జాతీయకథావళిలోనున్న కథలవంటి కథలు కోయల జాతీయకథలలోను కానవచ్చుచున్నవి. ఇందులకుదాహరణముగ ఫోర్సిత్‌గారు రచించిన 'హైలాండ్స్ ఆఫ్ సెంట్రల్ ఇండియా' అను గ్రంథమున వ్రాయబడిన కోయలజాతీయ కథ నీ క్రింద పొందుపరచుచున్నాను.

కోయల నాయకుడు లింగోకాలమున 'రికడ్-గవాది' అను నొక్కరక్కసుడుండెను. అతని ఏడుగురు కుమార్తెలను లింగో తెచ్చి తన నలుగురన్నలకు వివాహము చేసెను. పెద్దవారు ముగ్గురకు చెరియిద్దరును, చివరియన్నకు నొక్క భార్యయు నైరి. లింగో వివాహమాడుట కొప్పుకొనలేదు. తమకు భార్యలను దెచ్చినందుకు సంతసించి నలుగరన్నలును అడవిలో వేటాడి లింగోకు మంచి మాంసమును తెచ్చి ఇచ్చెదమని చెప్పి వెడలిరి. ఇట్లు పోవునప్పుడు లింగోను ఒక ఊయలలో గూర్చుండబెట్టి ఆతని నూపునట్లు భార్యల కాజ్ఞాపించిరి. ఊయలలోని 'లింగో' ధ్యానావస్థలో నుండెను. ఆతనితో సరసల్లాపము లాడు నుద్దేశముతో ఆతని కాలుసేతులను వదినలు లాగిరి. కాని లింగో వారిని కూక లిడి "మీరు నాకు తల్లులతోను అక్కలతోను సమానులు. ఇది మీకు తగదు" అని చెప్పెను. వారు వినక లింగోపైన పడి కౌగిలించుకొనిరి. లింగోకు కోపమువచ్చి వారిని రోకలితో చావమోదెను. అంతట వారింటిలోని కేగి ఏడ్చుచుండగా వారిభర్తలు వచ్చిరి. భార్యలు వారితో లింగో తమ పాతివ్రత్యమును హరింప సంకల్పించుకొనెననియు, తా మక్కడ నుండజాలమనియు, పుట్టింటికి పోదుమనియు చెప్పగా భర్తలు కోపించి మంచిమాటలు చెప్పి లింగోను అడవికి తీసికొనిపోయి వానిని చంపి గ్రుడ్లు పెకలించి గ్రుడ్లతో బంతులాడిరి. కాని భగవాను డాతని పునర్జీవితుని చేసెను.

ఆంధ్రులలో శ్రీకృష్ణ జయంతి సందర్భమున 'ఉట్టికొట్టు' యనువేడుక జరుగుచున్నది. ఇట్టిదే కోయలలోను గలదు. ఒక కంబమును నాటి, దానికి వెన్నను, నూనెను, ఇతరములగు జారిపడిపోవున ట్లొనర్పు పదార్థములను రాచి దానిపైన నొక సంచిని కట్టుదురు. ఆ సంచిలో నొక రూపాయను, ఒక పావలాను, ఒక శేరునేతిని ఉంచుదురు. నేయిబదులు వెన్న నుంచుటయు గలదు. పురుషులాకంబము నెక్కి పైనున్న సంచియే బహుమతిగ నందజూతురు. స్త్రీ లట్లు కంబమెక్కు పురుషుని కఱ్ఱలతో గొట్టియు, నడ్డుపట్టియు, ఎక్కకుండ చేయజూతురు. పురుషు లెవ్వరును విజయులు గాకున్నచో ఆ సంచి స్త్రీల కిచ్చివేయబడును. వారందలి వస్తువులను పంచుకొందురు. దీనికిని శ్రీకృష్ణునకును ఏలాటి సంబంధమును లేదు.

ఈ విషయములను జాగరూకతతో పరిశీలించుచో, తెలుగువారు తెలుగుమీరిన కోయలని తోచును. సోదర-కోయలకంటె ఆచారములను విరివిగ ననుసరించి, ఎక్కువ నాగరకుల మైనను వారికిని మనకును గల సంబంధ మింకను గోచరించుచునే యున్నది.

ఈ వ్యాసమునందలి విషయజాలమునుబట్టి తెలుగువారి చరిత్ర క్రీ.పూ. 5000 సం. ప్రాంతములం దారంభమగుచున్నది. అప్పుడు వారు కోయలలో నొకతెగగనుండి ధవళగిరినుండి పయనమై వచ్చి సూర్యారాధనసమన్వితమగు విజ్ఞానము నవలంబించిరి. రావణాదులగు తమ రాజుల పాలనమున వన్నెయు వాసియు గాంచిరి. నాగరకతను వృద్ధిపరచుకొనిరి. ఇనుమును నూలుబట్టలను కనిపెట్టి యుపయోగించిరి. ఇకముందు, తెలుగువారి చరిత్ర ఇప్పటివలె ఏ రెండువేలయేండ్ల క్రిందటిది మాత్రముగానో మనము పరిగణించుట పొరపాటు. మన చరిత్ర నేటికి అధమము ఏడువేల సంవత్సరములకు పూర్వమున నైనను ప్రారంభించినదని మనము ఘంటాపథముగ చెప్పవచ్చును.

(భారతి, శ్రావణాల ఈశ్వరనామ సంవత్సరం, 1933)

పండిత కోట వెంకటాచలం

ఆంధ్రరాజుకాలము

ఇప్పుడు జరుగుచుండిన సృష్టి ప్రారంభమై నేటికి (అనగా కలి 5054 సంవత్సరమునకు) నూటతొంబది యైదుకోట్ల యేబదియెనిమిదిలక్షల యెనుబది యైదువేల యేబది నాలుగు సంవత్సరములు గడిచినవి. ఈ కాలములో అంతర్భాగములుగా ఆఱు "మనుకాలములు" గతించినవి. అందు మొదటిది 'స్వాయంభువ' మనుకాలము, రెండవది 'స్వారోచిష' మూడవది 'ఉత్తమ' నాలుగు 'తామస' ఐదు 'రైవత' ఆఱు 'చాక్షుష' మనుకాలములను పేరుగలవి గతించినవి. ఏడవదగు వైవస్వత మనుకాలమున ఇప్పుడు మన ముండియుంటిమి. ఈవైవస్వత మను కాలములో ఇరువదియేడు మహాయుగములు గతించినవి. (ఒక్కొక మహాయుగము 43,20,000 సంవత్సరకాలములు) ఇరువదియెనిమిదవ మహాయుగములో కృత, త్రేతా, ద్వాపరయుగములు మూడు (38,88,000 సం) ను గతించినవి. మనమిప్పుడు ఇరువది ఎనిమిదవ కలియుగములో 5054 సంవత్సరములు గడిచి 5055 సంవత్సరములో నుంటిమి. ఏడవ మను కాలములోని ఇరువదినాలుగు మహాయుగములో శ్రీమద్రామాయణములోని రామ, రావణ యుద్ధము జరిగియున్నది. అది జరిగి ఇప్పటికి ఒకకోటి నలువది ఆఱులక్షల పైకాలము గతించినది. అట్లుకాక కొందరెంచినట్లు ఈయిరువదెనిమిదవ మహా యుగములో త్రేతాయుగాంత మని యెంచినచో ఇప్పటికి తొమ్మిదిలక్షల సంవత్సరముల పైకాలమగును. శ్రీరాముని తండ్రి "దశరథుడు" సూర్యవంశపు రాజు. చంద్రవంశమునకు చెందిన "రోమపాదుడ"నెడి రాజు ఈదశరథునికి ప్రాణమిత్రుడు. వీరిద్దరును సమకాలికులు. దశరథుడు తన కుమార్తెయైన "శాంత" 'ను సంతానము లేని రోమపాదునకు పెంచికొనుట కిచ్చియుండెను ఉశీనర, తితీక్షువు లనువార లిద్దరన్నదమ్ములు. అందు ఉశీనరునినుండి ఏడవ తరమువాడు "రోమపాదుడు". ఉశీనరుని తమ్ముడగు తితీక్షువునుండి ఆఱవతరము వాడు "ఆంధ్రరాజు". ఈ రోమపాద- ఆంధ్రరాజులు సమకాలికులు. రోమపాదుడు దశరథునికి మిత్రుడు. దశరథుని కుమార్తెయైన శాంతాదేవిని పెంచికొనినవాడు. అందువలన రోమపాదుడు, దశరథుడు, ఆంధ్రరాజు ఈ ముగ్గురు సమకాలికులు. (భాగవతము 9-685-686 చూడుడు.)

ఆర్యాంధ్రులు

ఆర్యులైన ఈ తెలుగుజాతీయులు చాలా ఉదారులు. పరాక్రమవంతులై ప్రజాహితముగా చిరకాలము రాజ్యపాలన మొనర్చియుండిరి. వారి చరిత్ర యించుక దిగువ ఉదాహరింప బడుచున్నది. ప్రాచ్యక దేశస్థులైన ఈ ఆర్యాంధ్రులను గురించి శ్రీరామాయణము నందు సుగ్రీవుడు సీతాన్వేషణమునకు

వానరులను పంపు ఘట్టమున, స్మరింపబడినది. శ్రీ దేవీభాగవతమున సుక్షత్రియుడైన సింహళదేశాధీశుడు తన కుమారైను ఆంధ్రదేశపు రాజునకిచ్చుటకు రాయబారములు నడిపియుండెను. భారతములో రాజసూయాధ్వరము చేయు ప్రయత్నమున దిగ్విజయ యాత్రాసందర్భమున సహదేవునివలన జయింపబడిన రాజ్యములలో "ఆంధ్రదేశము" గలదు. ***(సభాపర్వావాంతర దిగ్విజయ పర్వం 31 అధ్యా)***

అశ్వమేధపర్వము - చతుర్థాశ్వాసమున యజ్ఞాశ్వముతో వెళ్ళిన అర్జునుడు దక్షిణ సముద్ర తీరంబున గల ద్రవిడ, ఆంధ్ర, రౌద్ర, మాహిషక, కేరళ కర్ణాట దేశాధీశులను జయించి యజ్ఞాశ్వమును తోలుకొని పోయినట్లు గలదు. ఉషాకన్య స్వప్నమందు గనిక పురుషుని గుర్తించుకొఱకు ఆమెచెలికత్తె వ్రాసి చూపిన రూపపటములలో ఆంధ్రరాజు కూడా గలడని చెప్పబడెను. ఈవిధముగా శ్రీమద్రామాయణ చరిత్ర జరుగుటకు పూర్వము దశరథుని కాలముననే 'ప్రాచ్యక' దేశభాగమైన యీదేశమునకు "ఆంధ్రదేశ" మను పేరు వచ్చినట్లు స్పష్టమైన చరిత్ర గలిగియుండగా మన ఊహలతో కల్పింపబడిన గాథల కెట్టి విలువయు గలగబోదని వేఱుగా చెప్ప నక్కరలేదు.

ఆంధ్రరాజుయొక్క దరిమిలా వంశపరంపర మనకు దొరకుటలేదు. అది త్రేతాయుగములోని చరిత్ర. ద్వాపరయుగాంతమున జరిగిన మహాభారత యుద్ధములో ఆంధ్రుల ప్రశంస వచ్చినట్లు కనబడదు. వీరుభయపక్షములలో నే పక్షమునకును సాయపడి యుద్ధము చేసినట్లు కనబడదు. కాశ్మీరరాజు పసిబాలుడుగా నుండుటవలన కాశ్మీర సైన్యములు భారతయుద్ధమున పాల్గొనియుండలేదని కల్హణపండితుడు తన రాజతరంగిణియందు వ్రాసియున్నాడు. భారతయుద్ధవర్ణనమునందెచ్చటను కాశ్మీరసైన్యములు పాల్గొనినట్లు చెప్పబడి యుండలేదు. అటులనే నాటి ఆంధ్రరాజు ఏపక్షమునను చేరక తటస్థుడుగా నుండి యుండుటవలన ఆంధ్రరాజుగాని, సైన్యములుగాని భారతయుద్ధవర్ణనమున గానిపించుటలేదు. కొందఱు ఆంధ్రసైన్యములు భారతయుద్ధములో కౌరవపక్షమున చేరి పాండవులతో యుద్ధము చేసినట్లు మాతో వాదించి యుండిరి గాని వారు భారతములోని వాక్యముల నుదాహరించలేక పోయిరి. ఆంధ్రసైన్యములు భారతయుద్ధములో పాల్గొని నట్లు తెలుపు వాక్యములు భారతమున చూపిన వారికి కృతజ్ఞులుగా నుండునటులు ఒప్పుకొనక తప్పుటలేదు. భారతయుద్ధము కలిశక ప్రారంభమునకు పూర్వము 36 వత్సరములు క్రిందట జరిగియున్నది. కలిశకము క్రీస్తునకుపూర్వము 3102 సంవత్సరములలో ప్రారంభించినది. క్రీ॥పూ॥ 3102 +36 = క్రీ॥పూ॥ 3138 సంవత్సరము భారతయుద్ధ కాలము. భారతయుద్ధము ముగియగానే క్రీ॥పూ॥3138 సం॥ర లోనే మగధలో బార్హద్రథవంశములో సోమాధి లేక మార్జారి యను వాడు మగధకు రాజధానియగు "గిరివ్రజ" పట్టణమున పట్టాభిషిక్తుడై నట్లు మత్స్య, వాయు, బ్రహ్మాండ, భాగవత, విష్ణు, కలియుగరాజు వృత్తాంతాది గ్రంధములు చెప్పుచున్నవి.

మగధరాజ వంశములు

వంశము పేరు	రాజుల సంఖ్య	రాజ్య కాలం	క్రీ॥పూ. నుండి	వరకు
1. బార్హద్రథ వంశము	22	1006	3138	2132
2. ప్రద్యోతవంశము	5	138	2132	1994
3. శిశు నాగ వంశము	10	360	1994	1634
4. నందవంశము, మహాపద్మనంద, ఆతని కుమాళ్ళు8 మంది వెరశి 9 మంది వీనిని రెండుతరములుగా చారిత్రకు లెంచుచున్నారు.	2	100	1634	1534
5. మౌర్యవంశము,చంద్రగుప్తమౌర్యునితో ఆతని వంశమువారు	12	316	1534	1218
6. శుంగవంశము	10	300	1218	918
7. కాణ్వవంశము	4	85	918	833
8. ఆంధ్రవంశము	32	506	833	327
9. ఆంధ్రభృత్యవంశము- వీరే గుప్త వంశపురాజులు	7	245	327	82
10. పొన్వారు లేక పరమారవంశ ములో ఎనిమదవవాడగు విక్రమా దాత్యుని లగాయతు	24	1275	82-	క్రీ.శ. 1193 వఱకు

పైజాబితాలోని మగధసామ్రాజ్యమును పరిపాలించిన రాజవంశములలో ఎనిమిదవది ఆంధ్రవంశము. మనకు ఆంధ్రులను పేరు వచ్చుటకు కారణమైన ఆంధ్రరాజులగాయతు ఆంధ్రరాజ్యము ప్రత్యేకముగా ఆర్యాంధ్ర రాజులచే పరిపాలింప బడుచున్నది. ఆంధ్రరాజు లగాయతు రాగారాగా మనకు తెలియవచ్చిన ఆంధ్రదేశచరిత్రకాలము కలిశకము 2269 సం॥ (అనగా క్రీ.పూ. 833 సం॥) ఐయున్నది. చివరి కాణ్వరాజు కొలువులోనుండిన శ్రీముఖు డనెడి ఆంధ్రుడు మగధ చక్రవర్తియైన కాణ్వరాజు 'సుశర్మ' యనువాని కొలువులో చేరి క్రమక్రమముగా మగధ

సామ్రాజ్యమునకు ముఖ్యమంత్రియు, సేనాధ్యక్షుడునాయెను. అతడు మగధరాజుల కొలువులో ఆంధ్ర సైన్యములను చేర్చి కొంత కాలమునకు చివరి కాణ్వరాజగు సుశర్మను సంహరించి ఆంధ్రసైన్య సహాయమున తాను మగధసామ్రాజ్యమునకు చక్రవర్తి యాయెను. ఆనా డాసేతుహిమాచలముగా గల భరత ఖండ మంతయు మగధచక్రవర్తులకు లోబడి యుండెడిది.

శాతవాహనచక్రవర్తులు

మగధసామ్రాజ్యమును పాలించిన ఆంధ్రచక్రవర్తులను శాతవాహన, శాతకర్ణులనెడి బిరుదులతో పురాణములు వర్ణించుచున్నవి. ఈ చక్రవర్తుల శాసనములలో కూడ ఆబిరుదులే కనబడుచున్నవి. ఈ వంశమునకు "ఆంధ్ర శాతవాహన వంశ" మని పేరు. 'శాత' మనగా సింహము. దానిని వాహనముగా గలవాడు "శాతవాహనుడు" లేక శాతవాహనుని బొమ్మను జాతీయజెండాగా గల రాజులు "శాతవాహనరాజులు". సింహముపై నెక్కిన యోధుని బొమ్మతోగూడిన జాతీయజెండాను కలిగినందున వీరికి "శాతవాహను"లను బిరుదు కలిగి నట్లు బుద్ధిమంతు లూహించుచున్నారు. ఆంధ్రజాతి మృగములలో సింహము నెక్కువగా ప్రేమించెడి జాతి. వీరి మత సంబంధమైన దేవతబొమ్మలలో సింహముపై నెక్కియుండిన స్త్రీదేవత గలదు. ఆమెకు "సింహస్థా" యనెడి నామము గలదు.

కాత్యాయనీ దేవి రాక్షస సంహారమునకై యుద్ధమునకు వెడలునపుడు సింహవాహనముమీద నెక్కి వెళ్ళియున్నటుల దేవీభాగవతమున వర్ణితమైనది. ఆంధ్రదేశమున అనేక దేవాలయముల మీదను, గృహములయందు ప్రహరీగోడలోని సింహద్వారముల కిరుప్రక్కలను సింహవిగ్రహములు కాననగును. ఆంధ్రజాతి సింహమువంటి బల, పరాక్రమ, గాంభీర్య, ఔదార్యములు గల జాతి. కనుకనే ఆజాతికి సింహము ప్రీతిపాత్రము, స్తుతిపాత్రము నైనది.

1941 సంవత్సరము మార్చినెల "గోష్ఠి" పత్రిక 129 పుటయం దిట్లు వ్రాయబడినది.

'అమరావతి శిల్పకాలము లగాయతు ఇటీవలి శతశిల్పియొక్క సింహచిత్రములవఱకు ఆంధ్రజాతికి సింహముగుర్తే ఆదర్శప్రాయముగా నుండియున్నది. అంతర్వేది, మంగళగిరి, హంపివిజయనగరము, సింహాచలము మొదలుగా "నరసింహము" అనెడి దేవత ఆంధ్రులకు పాస్యమూర్తి. దీనిని బట్టియే 'ఆంధ్రుడు' మానవులలో 'సింహము' వలె బ్రవర్తింప నిచ్ఛయించుచు ఎల్లపుడు నుద్రేకపూరితుడై, కార్యశూరుడై యుండును.

"సింహాసనాధిపత్యము" సింహముమీద కూర్చుండి ఆధిపత్యము వహించుట (అనగా ఉత్తమాసన మలంకరించుట అని అర్థము) ప్రతి ఆంధ్రుని మనోరథమై యున్నది. ఆంధ్రులలో 'నరసింహము' అను పేరుగల వారలనేకులు గలరు.

"నెమలి బర్మాజాతికి చిహ్నము. బెంగాలు, అయోధ్య, జౌన్ ప్రజలకు 'మత్స్యము' చిహ్నము. తమిళులకు 'చిలుక'. రాజరాజ యను రాజు, గోవు-దూడ చిహ్నమును గలిగి యుండెను. విజయనగర రాజులు ఆదివరాహ చిహ్నము గలవారు. శాతవాహనులు, ఆంధ్రచక్రవర్తులు 'సింహ' చిహ్నము గలవారు. కళింగులకు ఏనుగు. ఈ మొదలగు చిహ్నములు అందరికిని గలవు. ఆంధ్రులు సింహము మీద కూర్చుండిన యోధుని చిహ్నము గల జెండా కలిగి యుండెడివారు. అందువలన మగధలోని ఆంధ్రచక్రవర్తులకు "శాతవాహనులు" అను బిరుదు కలిగినది.

ఆంధ్రచక్రవర్తులు

వ.నెం	చక్రవర్తుల పేర్లు	రాజ్య కాలం	కలి సం॥లు నుండి-వరకు	క్రీ.పూ. నుండి-వరకు
1	శ్రీముఖశాతవాహన చక్రవర్తి	23	2269-2292	833-810
2	శ్రీకృష్ణశాతకర్ణి	18	2292-2310	810-792
3	శ్రీమల్లుశాతకర్ణి	10	2310-2320	792-782
4	పూర్ణోత్సంగశాతకర్ణి	18	2320-2338	782-764
5	శ్రీశాతకర్ణి	56	2338-2394	764-708
6	స్కంధస్తంభిన్	18	2394-2412	708-690
7	లంబోదరశాతవాహన	18	2412-2430	690-672
8	ఆపీతకశాతవాహన	12	2430-2442	672-660
9	మేఘస్వాతిశాతవాహన	18	2442-2460	660-642
10	శాతస్వాతిశాతవాహన	18	2460-2472	642-624
11	స్కందశాతకర్ణి	7	2478-2485	624-617
12	మృగేంద్రశాతకర్ణి	3	2485-2488	617-614
13	కుంతలశాతకర్ణి	8	2488-2496	614-606
14	సౌమ్యశాతకర్ణి	12	2496-2508	606-594
	B.F	239		

15	శాతశాతకర్ణి	1	2508-2509	594-593
16	పులోమశాతకర్ణి (ప్రథమపులోమ)	36	2509-2545	593-557
17	మేఘశాతకర్ణి	38	2545-2583	557-519
18	అరిష్టశాతకర్ణి. ఇతని రాజ్యకాలము పదవ సం॥లో (క్రీ.పూ 209 సం॥లో)శ్రీ ఆదిశంకరుల జననము	25	2583-2608	519-494
19	హాలశాతవాహన	5	2608-2613	494-489
20	మండలకశాతవాహన	5	2613-2618	489-484
21	పురీంద్రసేనశాతవాహన	21	2618-2639	484-463
22	సుందరశితకర్ణి	1	2639-2640	463-462
23	చకోరశాతకర్ణి	1/2	2640-2640$^1/_2$	462-461$^1/_2$
॥	(అ)మహేంద్రశాతకర్ణి	1/2	2640$^1/_2$-2641	461$^1/_2$-461
24	శివశాతకర్ణి	28	2641-2669	461-433
25	గౌతమీపుత్రశ్రీ శాతకర్ణి (ద్వితీయ వినిమయకూర)	25	2669-2694	433-408
26	రెండవపులోమశాతకర్ణి	32	2694-2726	408-376
27	శివశ్రీశాతకర్ణి	7	2726-2733	376-369
28	శివస్కందశాతకర్ణి	7	2733-2740	369-362
29	యజ్ఞశ్రీశాతకర్ణి	19	2740-2759	362-343
30	విజయశ్రీశాతకర్ణి	6	2759-2765	343-337
31	చంద్రశ్రీశాతకర్ణి	3	2756-2768	337-334
32	మూడవపులోమశ్రీశాతకర్ణి	7	2768-2775	334-327

		506		

పైనచూపబడిన జాబితాదాఖలా ఆంధ్ర శాతవాహన చక్రవర్తులు ముప్పదియిద్దరు కలి 2269 సంవత్సరము లేక క్రీ.పూ. 833లగాయతు కలి 2775 లేక క్రీ.పూ.327సం॥ వరకు (506సం॥) అయిదువందల ఆఱుసంవత్సరములు రాజ్యము చేయుచుండిరి. వీరికి పిమ్మట ఆంధ్రభృత్యులనబడు "గుప్తవంశము" మొదటిరాజు 'గుప్త చంద్రగుప్తుడు' చివరి ఆంధ్రరాజు చంద్రశ్రీ, పులోముల సంహరించి క్రీ.పూ. 327 సం॥లో రాజ్యమునకు వచ్చియుండెను. అలెగ్జాండరు దండయాత్రాకాలమున మగధరాజ్య భాగమును కలుపుకొని పాటలీపుత్రమున పట్టాభిషేకమొనర్చుకొని పరిపాలించినవాడు గుప్తచంద్రగుప్తుడుగాని చంద్రగుప్త మౌర్యుడు కాడు. ఈవిధముగ తప్పుగ గుర్తించినటుల నటించి పాశ్చాత్య చరిత్రకారులు భారతదేశ చరిత్రములో క్రీ.పూ. 3138సం॥లో జరిగిన భారతయుద్ధమున కిటీవల క్రీ.పూ. 1534 సం.లో గావింపబడిన చంద్రగుప్తమౌర్యుని పట్టాభిషేక కాలమును క్రీ.పూ. 322సం॥లో జరిగినటుల కల్పించి భారతదేశచరిత్ర కాలములో క్రీ.పూ. 1534-322 = 1212 సం॥లు తగ్గించిరి. ఈవిషయములో పాశ్చాతులచే వ్రాయబడిన వివరములన్నియు మాచే ప్రకటించబడిన "The Plot in Indian Chronology" అను ఇంగ్లీషు గ్రంథములో చూడగలరు. క్రీ.పూ. 327 సంవత్సరములో ఆంధ్రులసామ్రాజాధిపత్య మంతరించినది. కాని ఆంధ్ర శాతవిహన రాజవంశము లంతరింపలేదు. ఆంధ్ర రాజవంశము అంతః కలహముల కాలవాలమై సామ్రాజ్యమును ముక్కలుగా చేసి పంచుకొని ఎవరికి వారు స్వతంత్రులై అందరును అల్పరాజ్యములను పరిపాలించెడి రాజులైరి. ఈవిధముగా ఆంధ్రరాజవంశము 12విభాగములైనటుల పురాణములు చెప్పుచున్నవి.

"ఆంధ్రాణాం సంస్థితా పంచ తేషాం వంశాశ్చ యే పునః,
సప్తైవతు భవిష్యంతి"

బ్రహ్మాండపురాణము 77 అధ్యాయము 171 వశ్లోకము. **(వాయుపురాణము 99-358)**

అటుపిమ్మట అగ్ని వంశపురాజులు ఇంకను విభాగములు అయియుండవచ్చును. పల్లవచేత, సేన, కదంబ, రాష్ట్రకూట, విష్ణుకుండిన, బృహత్పలాయన, బాణ, గాంగ, హోసల, రాజపుత్ర, శాతవాహనవంశీయులకు చెందిన రాజబంధువులు. అందు రాజపుత్రులు అనగా రాజుల కుమాళ్ళు అని యర్థము. శాతవాహన రాజులకు కలిగిన సంతానములో జేష్ఠ పుత్రులు రాజ్యమునకు వారసులు కాగా తక్కిన కుమాళ్ళకును, కుమారైల నిచ్చి వివాహమొనర్చిన అల్లుళ్ళు మొదలుగాగల సన్నిహిత రాజబంధువులకును రాజపుటానాలో అల్పరాష్ట్రముల నేర్పరచి వారిని

ఆరాష్ట్రములకు ప్రభువులుగా చేసియుండిరి. రాజపుత్రవంశములు అట్లు ఏర్పడినవే. వారినుండియే ప్రమర లేక పరమార, చపహాని లేక చాహుమాన, శుక్ల లేక చాళుక్య పరిహార లేక ప్రతీహార అనబడు నాలుగు అగ్నివంశము లేర్పడినవి. అట్లేర్పడిన "అగ్నివంశము"లనే గాక రాజపుత్రవంశములన్నింటిని బ్రహ్మక్షత్రులని పిలిచెడివారు. అగ్ని వంశములకు మూలపురుషులైన పైనలుగురును వేదవేదాండముల నధ్యయనము చేసిన సద్బ్రాహ్మణులు. వారిని గురించి పురాణ మిట్లు చెప్పుచున్నది. :-

"ప్రమర స్సామవేదీ చ, చపహాని ర్యజుర్విదః

త్రివేదీ చ తథా శుక్లో 2 థర్వణ స్స పరిమారకః॥ (భవిష్యమహాపురాణము - ప్రతిసర్గపర్వము)

తా॥ ప్రమరుడు సామవేదము నధ్యయనము చేసినవాడు, చపహాని యజుర్వేదాధ్యాయి, శుక్లుడు మూడువేదముల నధ్యయనము చేసినాడు, పరిహారకుడు అధర్వణ వేదము నధ్యయనము చేసినవాడు.

కలి 2710 సంవత్సరమున (క్రీ.పూ.392) పండితులును తపశ్శాలురునగు పైనలుగురిని అర్బుద పర్వతముమీద (రాజపుటనాలో గలదు) వారియందు క్షాత్రతేజస్సు నిల్చునటుల సంకల్పించి వారిచే అగ్ని హోత్రమున హవిస్సులను వేల్పించి వారిని దేశములో నాల్గుభాగములకు రాజులనుగా చేసియుండిరి. (ఇందునుగురించిన వివరములకు నాచే రచింపబడిన 'అగ్నివంశపు రాజులు' అనెడి గ్రంథమును చూడుడు.)

ఈవిధముగా ఆంధ్ర శాతవాహన వంశము అనేక విభాగములై భారతదేశము నంతను పరిపాలించి యున్నది. క్రీ.శ. పండ్రెండవ శతాబ్దములో కల్హణపండితునిచే వ్రాయబడిన రాజతరంగిణి గ్రంథములో ఆంధ్రశాతవాహన వంశజులు కాశ్మీరులోను, లాహోరులోను, అభిసార, ఉరగ, సిహపుర, దివ్యకటక, ఉత్తరజ్యోతిష (చివరి మూడును అఫ్ఘనిస్తానములో అంతర్భూతమైనవి. మొదటివి ఇప్పటి కాశ్మీరులో చేరిపోయినవి.) అను క్షత్రియ యవనరాష్ట్రములలోను క్రీ.శ. ఎనిమదవ శతాబ్దమునుండి పరిపాలించుచున్నటుల వ్రాసియున్నాడు. లోహోరువంశము, హిందూసాహివంశము (వీరు తోమరవంశీయులు) ఆంధ్రశాతవాహనులనుండియు, రాజపుత్రులనుండి ఏర్పడిన తోమరవంశము నుండియు ఏర్పడినవైయున్నవి. ప్రమర వంశము పరమార వంశము లేక పొన్వారు వంశము అని ప్రసిద్ధికెక్కినది. ఈవంశములోనే విక్రమాదాత్య శాలివాహన భోజరాజు లుద్భవించిరి. చపహాని వంశమువారు చాహుమాన్‌లని పిలువబడిరి. అందు చపహాని కుమారులలో (వీర తోమర వంశమువారలు) కేవలము క్షత్రియాచారముల నవలంబించి క్షత్రియులుగానే పరిగణింపబడి రని "తోమరాః క్షత్రియాః స్మృతాః" అని పురాణమే చెప్పుచున్నది. ఈవంశములోనే పృథ్వీరాజు, జయచంద్రుడు, రాణిసంయుక్త మొదలగు మహామహులుద్భవించిరి. శుక్లవంశము చాళుక్య వంశమనుపేరును ప్రసిద్ధి కెక్కినది. ఈ రాజులు దక్షిణాపథమున రాజ్యములు చేసియుండిరి.

అందు తూర్పుచాళుక్యులు తూర్పురాజ్యములను, పశ్చిమ చాళుక్యులు సముద్రతీర రాజ్యములను పరిపాలించి ప్రసిద్ధి కెక్కిరి. మహాభారతమును తెలుగున వ్రాయించిన రాజరాజ నరేంద్రుడీ చాళుక్యవంశములోని వాడు. క్రీస్తుశకమున కిటీవలి శతాబ్దులనుండి యీ చాళుక్యరాజులు క్షత్రియులుగా పిలువబడుటయే గౌరవముగా నెంచి తమ వంశములను ప్రాచీన క్షత్రియ మూలపురుషులతో కలుపుకొని వంశవృక్షములను వ్రాయించుకొని శాసనములలో తాము క్షత్రియులమని వ్రాయించుకొనిరి. పరిహార వంశీయులు బెంగాలు దేశమున రాజ్యములు చేసిరి. బంగాళా దేశములోని శాక్తేయ బ్రాహ్మణులాశాఖకు చెందినవారు.

కదంబ వంశపు రాజులు- ఆంధ్రులు

ఆంధ్ర శాతవాహన వంశమునుండి యేర్పడిన కదంబ రాజవంశమునకు మూలపురుషుడైన "మయూరశర్మ" మలయాళ (కేరళదేశము) దేశమునకు క్రీ,పూ. ఆఱవ శాతాబ్దములో రాజయ్యెను. ఈతని వంశములో 'కాకుత్థవర్మ'యను రాజు క్రీ.శ.550 సంవత్సరములో రాజ్యము చేయుచుండెను. (Ancient Dekkan P.27).

ఆకాలమున మళయాళ దేశమున బ్రాహ్మణులు లేకుండుటవలన 'మయూర శర్మ' తన జన్మదేశమైన గోదావరి మండలములోని "అహిక్షేత్రము" ('అనగా సర్పవర మనెడి గ్రామము) నుండి బ్రాహ్మణ కుటుంబములను తీసుకొనివెళ్లి మళయాళ దేశమున నెలకొల్పెను.

"దక్షిణిండియా వర్ణములు, తెగలు" అను గ్రంథము 7సంపుటములుగా మద్రాసు దొరతనమువారిచే ప్రచురింపబడినది. అందు మళయాళ (కేరళ) దేశ బ్రాహ్మణులను గురించి యిట్లు చెప్పబడినది:-

"బ్రాహ్మణులయొక్క లిఖితములైన కొన్ని గ్రంథములలో కదంబవంశజుడైన మయూరవర్మ కాలమున ఆంధ్రబ్రాహ్మణులు కొందరు దక్షిణ కన్నడమునకు తీసుకొని పోబడిరని చెప్పబడియున్నది. పరశురాముని శాపానంతరము కదంబవంశములోని మయూరశర్మ అహిక్షేత్రము నుండి బ్రాహ్మణులను తీసుకొని వచ్చువఱకును ఆదేశమునందు బ్రాహ్మణులు లేరు. ఉత్తర కన్నడములోని 'బనవాసి' రాజధానిగా రాజ్యము చేసిన కదంబవంశమునకు మూలపురుషుడు "మయూర వర్మ" యని శాసనములు చెప్పుచున్నవి. (మయూర శర్మ, మయూరవర్మ యని రెండువిధముల ప్రయోగములు ఆయనకు గలవు. మయూరశర్మ బ్రాహ్మణవంశమైన కదంబ వంశమునకు మూలపురుషుడు.)

నంబూద్రి బ్రాహ్మణుల కథలు, వ్రాతలన్నియు మయూరశర్మ వఱకును తీసుకొని పోగలవు. మయూరవర్మచే బ్రాహ్మణులు కొనిరాబడి నపుడు వారు భట్టాచార్యులవారి (కుమారిలభట్టు) శిష్యులుగా నుండిరి. కాని పడమటి తీరమునకు వీరు వచ్చినపిమ్మట మళయాళ దేశపు వేదాంతగురువగు శంకరాచార్యులవారి (వీరి జననము క్రీ.పూ. 509సం) సిద్ధాంతముల నంగీకరించిరి.

పైగ్రంథములనే ఐదవ సంపుటములో శ్రీ సుబ్రహ్మణ్య అయ్యరుగారిట్లు వ్రాయుచున్నారు :-

"కేరళ మాహాత్మ్యములో వ్రాయబడిన దంతకథా పర్పరంపర (కేరళదేశములోని) నంబూద్రీ బ్రాహ్మణులు అహిక్షేత్రమునుండివచ్చి నట్లుగా చెప్పును."

ఈ పైవాక్యములు కేరళ మాహాత్మ్యము, కేరళోత్పత్తి యను సంస్కృత గ్రంథములనుండి గ్రహింపబడినవి.

మయూరవర్మయను, భట్టాచార్యులవారును, శ్రీ శంకరాచార్యులవారును 'ఆంధ్రు'లని ఆంధ్రమహాసభవారిచే ప్రచురించబడిన 'ఆంధ్రప్రచలనము' అను చిన్న గ్రంథమున ప్రథమ ఆంధ్రసభానంతరము ప్రచురింపబడెను. మరికొన్ని దంతకథలను పైవిధముననే చెప్పుచున్నవి అని వ్రాసియుండెను.

"కనరా రాష్ట్రమును, మైసూరురాష్ట్రములోని ఉత్తరజిల్లాలను క్రీ.శ. మూడవ శతాబ్దమునుండి ఆఱవ శతాబ్దమువరకు పరిపాలించిన కదంబవంశపు రాజులు బ్రాహ్మణులు." (వి.ఎ. స్మిత్‌యొక్క అర్లీ హిస్టరీ ఆఫ్ ఇండియా గ్రంథము 43పుట చూడుడు). కేరళదేశమును క్రీ.పూ. ఆఱవశతాబ్దమునుండి క్రీ.శ.ఆఱవ శతాబ్దమువరకు పరిపాలించిన కదంబవంశపు రాజులును వారిచే తీసికొని పోబడిన బ్రాహ్మణులును ఆంధ్రులైయుండిరి.

అట్లు గోదావరీమండలములోని సర్పవర గ్రామము (అహిక్షేత్రము) నుండి కేరళదేశపు బ్రాహ్మణరాజగు మయూరశర్మచే ప్రేరేపింపబడి వలసపోయిన ఆంధ్ర బ్రామ్మణ కుటుంబములలో శివగురు వనెడి పండితుడు గలడు. అతడు కేరళదేశములోని "కాలటి" అగ్రభాగమున స్థిరపడిన పిమ్మట అతనికి శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారవతరించిరి. కనుక శ్రీ శంకరులును, కేరళదేశములోని నంబూద్రి బ్రాహ్మణులును 'ఆంధ్రులై' యుండిరి. విశిష్టాద్వైత మత స్థాపనాచార్యులైన శ్రీ రామానుజాచార్యుల వారింటిపేరు 'ఆసూరివారు.' ఇంటిపేర్లు తెలుగు వారికి మాత్రమే కలవు. తమిళులకు ఇండ్లపేర్లు లేవు. శ్రీ రామానుజాచార్య స్వాములు తెలుగుదేశమునుండి పోయి అరవదేశములో స్థిరపడిన ఆంధ్ర బ్రాహ్మణ కుటుంబమునకు చెందినవారై యున్నారు. అటులనే ద్వైత మత స్థాపకులగు శ్రీమధ్వాచార్యస్వాములవారి యింటిపేరు 'నడిమింటి' వారు. వీరును కర్ణాటకదేశమున నివసించిన ఆంధ్రబ్రాహ్మణ కుటుంబమునకు చెందినవారై యుండిరి. గొప్ప మతకర్తలై పీఠాధిపతులైన శ్రీ శంకర, శ్రీరామానుజ, శ్రీమధ్వాచార్యులను ఆచార్యత్రయమును ఆంద్రులై యున్నారు. క్రీ.శ. 15వ శతాబ్దములోని శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులును ఈయనకుమారుడు శ్రీతిరువెంగళయ్యగారును, క్షేత్రయ్యపదములను రచించిన క్షేత్రయ్యగారును (17వ శాతాబ్దము) భక్తిజ్ఞానవైరాగ్యములను సంగీతమున మేళవించి అసంఖ్యాక కృతులను రచించిన త్యాగరాజుగారును (18వ శతాబ్దము) ఆంధ్రమాత కనిన బిడ్డలై యున్నారు. జైన, బౌద్ధమతముల వ్యాప్తి నరికట్టి వైదిక మత సంరక్షణమొనర్చిన "కుమారిలభట్టు" (557 B.C) ఆంధ్రుడై యున్నాడు. నాలుగు వేదములకు భాష్యములను రచించి (బి.సి.) ప్రపంచమున కీనాడు వేదార్థమును దెలిపిన మహామహుడు శ్రీవిద్యారణ్యస్వామి ఆంధ్రుడు.

"ఆంధ్రత్వ మాంధ్రభాషా చ, ప్రాభాకర పరిశ్రమః।
తత్రాపి యాజుషీ శాఖా నాల్పస్య తపసః ఫలం॥" (అప్పయ్యదీక్షితులు)

"తా॥ ఆంధ్రుడుగా పుట్టుట, ఆంధ్రభాష మాతృభాషగలవాడుగా నుండుట, వైదిక ధర్మావలంబి యగుట అందునను యజుశ్శాఖాధ్యాయి యగుట అల్పతపస్సు గలవానికి అభ్యము కానేరదు. అనగా పూర్వజన్మములందు గొప్ప తపస్సు చేసినవారికే ఆంధ్రభాషను మాట్లాడు ఆంధ్రుడుగా పుట్టు భాగ్య మబ్బునని తాత్పర్యము."

అని అప్పయ్యదీక్షితులవారు చెప్పియున్నారు. వీరు ఆంధ్రులని వేఋగ చెప్పవలసిన పని లేదు. (కొందరు వీరు ద్రవిడశాఖకు చెందినవారని అనుచున్నారు. అటులైనను వీరు "ఆంధ్రదేశము"న స్థిరనివాసము లేర్పరచుకొని (ద్రవిడభాషను మఱచి) ఆంధ్రమునే మాతృభాషగా చేసికొని ఆంధ్రదేశమున నివసించిన ద్రవిడులని చెప్పుట సమంజసము. ఎటులైనను వారాంధ్రులనియే చెప్పుట న్యాయము.) ఇంకను అనేకులగు మహామహులు ఆంధ్రులలో అన్ని శాఖలలోనుగలరు.

('ఆంధ్రుల పుట్టుపూర్వోత్తరాలు' గ్రంథం నుండి)

దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు

ఆంధ్రులు

ఆసేతు హిమాచల పర్యంతంబునుఁ బ్రాక్పశ్చిమ సముద్రముల నడుమనుఁ దనరారెడి భారతమాతా సంతతివార లనేక జాతీయులు. తల్లులు స్వశరీర రసముచేఁ దమ బిల్లలం బోషింతురు. తల్లులకుఁ దల్లి యగు దేశమాత స్వకీయ పరకీయ భేదములేక దేశవాసుల నెల్లరఁ గాపాడును. క్షీరసాగర మథనంబున దేవదానవులు గలుముల వేలుపునుఁ గాంచినటులు మహాసముద్ర మథనంబున భారతమాత ప్రభవించినది. కమలమునుండి మంగళ దేవత వలెఁ గమలాకారముగల లంకనుండి భరతఖండము వెలువడినటులఁ దోచుచున్నది. ఈ దేశమాత కున్నత నగరాజం బుత్తమాంగంబు వలెను, సముద్రశాఖలు బాహులభంగిని, సుజల పూరితంబు లైన నదీ నదంబులు ప్రాణాధారంబులైన రక్తనాళికల రీతిని నొప్పుచున్నవి. భరతఖండమున లేని సుఖ శీతోష్ణస్థితి వేరొక దేశమునందుఁ గనఁబడదు. భూమి ఫలవంతమై సస్య సమృద్ధిని గలిగియున్నది. ఈ సుఫలత్వము స్వదేశ సంతానాభివృద్ధికినిఁ బర దేశీయుల రాకకును ముఖ్య కారణము.

హైందవు లార్యులనియు నార్యేతరులనియును రెండు విధములుగ నున్నారు. కిరాతులు, భిల్లులు, చెంచులు, కోయలు మొదలగు వనచరు లాదిమ దేశీయులు. ద్రావిడు లార్యేతరులలో వేఱొక జాతీయులు. ద్రావిడు లాదిమ దేశీయుల నిర్జించి దేశము నాక్రమించుకొనిరి. ఆర్యులు ద్రావిడులను దక్షిణమునకుఁ బారదోలి యుత్తర భాగముల నాక్రమించుకొనిరి. ఆదిమ దేశీయులును ద్రావిడులును గాక నార్యేతరు లనేకు లీ దేశమును నివాసముగఁ గైకొనిరి. ఆదిమ దేశీయులు ద్రావిడులవలనను నార్యులవలనను జయింపబడి హీన స్థితియందుంచఁబడిరి. ఇదియ మన దేశమందలి హీన జాతీయుల దుస్థితికిఁ గారణము. భరతఖండమునందలి దక్షిణ ప్రదేశములందు ద్రావిడులును నుత్తర దేశములం దార్యులునుఁ బ్రబలిరి. కాలక్రమమున నార్యులు దేశమునందంతట వ్యాపించి యార్యేతరులపైఁదమ యాచార వ్యవహారములంఁ బ్రసరింపఁజేసిరి. కాని దక్షిణాపథ మార్యావర్తమువలె నార్యులకు ముఖ్యస్థానము గాలేదు. మగధరాజ్య మార్యుల రాజ్యములలోఁ బ్రఖ్యాతిగాంచిన దక్షిణ రాజ్యము నడుమ దండకారణ్యమును, దాని క్రింద ద్రవిడ రాజ్యములును వ్యాపించియుండెను. వింధ్యపర్వతములకు దక్షిణమునను ద్రవిడ రాజ్యముల కుత్తరమునను నాంధ్రులు దమ సామ్రాజ్యమును స్థాపించిరి. రామాయణమునం దాంధ్రరాజ్యము దక్షిణ దేశములలో నొకటిగఁ బేర్కొఁబడినది.

"తథైనాంధ్రాంశ్చ పుండ్రాంశ్చ చోళాన్ పాండ్యాంశ్చ కేరళాన్"

దక్షిణ దేశమునందలి యాంధ్రదేశమునందు సయితము సీతను వెదకుమని సుగ్రీవుఁడు హనుమంతుని నాజ్ఞాపించెను. ఆంధ్ర నామ మెటుల గలిగినది విచారనీయము. ఆంధ్ర, అంధ్ర, తెలుగు, తెనుగు పదములు పర్యాయపదములు. త్రిలింగ దేశముల నడుమ నుండుటంజేసి తెలుగు దేశముగ

నెంచఁబడినదని కొందరి మతము. భూమి నల్లగా నుండుటంజేసి తెనుగునాడు లేక తెనుగుదేశ మనఁబడినదని కొందరి మతము. ఆంధ్రులార్యులా ద్రావిడులా యను సంశయము గలుగుట సహజము. ఆంధ్ర ద్రావిడ భాషలకుఁగల సన్నిహిత బాంధవ్యమునుబట్టి యాంధ్రులును ద్రావిడులలో నొక శాఖగా నెంచఁబడవలయును. రామాయణకాలమునాటికి దక్షిణమునం దార్యుల రాజ్యములు ప్రబలలేదు. నందులు మగధరాజ్యము నేలునపు డాంధ్రులు స్వతంత్రులుగ నుండిరి. మౌర్యవంశజుఁడైన యశోకవర్ధనుని కాలమునం దాంధ్రులు మౌర్యసామ్రాజ్యములోని వారుగ నుండిరి. ఆంధ్రరాజులు 30 దుర్గములను, 1,00,000 పదాతులను, 2,000 ఆశ్వికులను, 1000 గజములను గలిగి యుండిరి. కృష్ణా నదీతీరమునందున్న శ్రీకాకుళము వీరికి రాజధానిగా నుండెను. రాజ్యము కృష్ణా గోదావరుల నడుమను దూర్పు సముద్రమునుండి పడమటి కనుమలదగ్గర గోదావరీ నదీతీరమునందున్న సుప్రసిద్ధమైన నాశికాక్షేత్రము వరకు వ్యాపించియుండెను. కొన్నిసమయములందు దక్షిణమున పెన్నవరకును నుత్తరమున జగన్నాథమువరకును వ్యాపించి యుండినది.

"జగన్నాథా దూర్ధ్వభాగా దర్వాక్ శ్రీభ్రమరాత్మకాత్,
తావదాంధ్రాభిదో దేశః ...."

అశోకవర్ధనుఁడు లోకాంతరగతుఁడై నపుడు వాని సామ్రాజ్యము విచ్ఛిన్నముకాగా నాంధ్రులు మరల స్వతంత్రరాజులైరి. ఆంధ్రులు రమారమి 550 ఏండ్లు క్రీ.పూ. 300 నుండి క్రీ.త. 236 వరకు నాంధ్రదేశమును బాలించిరి. ఈ రాజులలో నేడవ పురుషుఁడు హాలుఁడు దేశభాషఁ బోషించెను. బృహత్కథ పైశాచీభాషలో వీని కాలమునందు రచియింపఁబడినది. క్రీ.త. 111 నుండి 138 వరకు నేలిన రెండవ విలివాయకురుఁడు శకబాహ్లిక యవన ఘూర్జరాదులైన పరదేశీయుల నోడించి కీర్తిశేషుండయ్యె. యజ్ఞశ్రీ యనురాజు కడపటి యాంధ్రరాజులలోఁ బ్రసిద్ధికెక్కెను. ఆంధ్రసామ్రాజ్యము క్రీ.త. 236వ సంవత్సరముతో విచ్ఛిన్నమాయెను. పిమ్మట నారవ శతాబ్దమువర కాంధ్రుల చరిత్రాంశములు దెలియవు. కొందరి మతమున నాంధ్ర రాజులు ద్రావిడులు, కొందరి మతమున వా రార్యులు. కాని చోళ పాండ్య కేరళ దేశాధిపతులవలె నాంధ్రులును నార్యులు గారనుటయె యుక్తి యుక్తముగ నుండెడిని. ఆంధ్రదేశమున కుత్తరమున నార్యులును దక్షిణమున ద్రావిడులు నుండుటంజేసి ఈ యుభయ జాతీయుల యాచార వ్యవహారముల కెక్కువ సంయోగ మీదేశ మునం దేర్పడినది. వీరి యాచార వ్యవహారములును, భాషా విశేషములును, గుణశీలములును, నాకార విలాసములును దీని నిరూపించుచున్నవి. ఆంధ్రదేశమునందు దక్షిణ దేశమునకన్న బౌద్ధమత మెక్కువగా వ్యాపించినది. అమరావతి, భట్టిప్రోలు, గుడివాడ, జగ్గయ్యపేట మొదలగుచోట్ల నున్న స్తూపములు దీనికి నిదర్శనములు. దక్షిణదేశమునందువలె నాంధ్రదేశమునందు బెద్ద దేవాలయములు లేవు. ఆంధ్రులు వర్తకమునకై సముద్రమును దాటి దూరదేశములకు వెళ్లినటుల నిదర్శనము లనేకములు గలవు. ఆకాలమునందు వర్ణభేద మింత పట్టుదలగా నున్నటులఁదోచదు. స్త్రీలు విద్యా స్వతంత్రములను గలిగియున్నటుల విజయసింహుడైన విలివాయకరునికై వానితల్లి బలశ్రీ చెక్కించిన శిలా శాసనములవలన నూహింపఁదగియున్నది. మూడవ శతాబ్దము నడుమ నాంధ్రరాజ్య మంతరించినది. తిరిగి యాఱవ శతాబ్దము వరకు నాంధ్ర దేశ చరిత్రాంశములు దెలియవు. ఆఱవ శతాబ్దమునుండి పదునొకొండవ శతాబ్దము దనుక నాంధ్రదేశమును చాళుక్యులు పాలించిరి. ఆంధ్రరాజులు తూర్పునుండి బశ్చిమమునకుఁ దమరాజ్యమును వ్యాపింపఁజేసినటులు చాళుక్యులు పడమటి నుండి తూర్పువరకు రాజ్యమును వ్యాపింపఁజేసిరి. తూర్పుదేశమునందు వెంగిపురము రాజధానిగ నుండెను. రాజ్యాభివృద్ధియైన పిదప రాజధాని రాజమహేంద్రవరమునకు మార్పఁబడియె. చాళుక్య లుత్తర హిందూస్థానము నుండివచ్చిన రాజపుత్రులు, చంద్రవంశజులు. వీరికాలమునం దాంధ్రదేశమున బౌద్ధమతము తగ్గి బ్రాహ్మణమతము హెచ్చినది. ఎల్లూరా ఎజెంటాలలో నుండు గుహావిహారములు వీరి రాజ్యవ్యాప్తిని బ్రాహ్మణమతాభిమానమునుఁ దెలుపుచున్నవి. ఈ రాజులలో నిరువదియేడవరాజగు రాజరాజనరేంద్రుడు నన్నయ భట్టారకునిచే నాంధ్రీకరింపఁబడిన మహాభారతమునకుఁ గృతిపతియై తెలుగుబాసకు మహోపకారమునుఁజేసి శాశ్వతకీర్తినిఁ గాంచెను. పంద్రెండవ శతాబ్దమునం దాంధ్రదేశమును చోళరాజులు పాలించిరి. ఓరుగంటి సంస్థానాధీశులైన గణపతిరాజులు పంద్రెండు, పదుమూడు శతాబ్దములం దాంధ్రదేశమును మహావైభవముతోఁ బాలించిరి. ఈ వంశజులలోని రుద్రమదేవియును బ్రతాపరుద్రుఁడును సుప్రసిద్ధులు. కళింగరాజులైన గజపతులు పదునాల్గవ శతాబ్దమునందాంధ్రదేశములోని కొన్నిభాగముల నాక్రమించుకొనిరి. రెడ్డులు నీ కాలములోఁగొంత దేశమునకుఁ బాలకులైరి. పదునాల్గవ శతాబ్దమునం దాంధ్రదేశమునందు మహమ్మదీయులు నెలవుల నేర్పరచుకొనిరి. పదునాఱవ శతాబ్దారంభమున నాంధ్ర రాజ్యలక్ష్మి కృష్ణదేవరాయల వశవర్తిని యయ్యె. ఈ శూరాగ్రేసరుడాంధ్ర భాషాయోషామణినిఁ బోషించి చిరకీర్తినిఁగాంచెను. పిమ్మట నాంధ్రదేశము మహమ్మదీయుల వశమైనది. ఆంధ్రదేశమునం దాంగ్లేయుల పరిపాలనము పదునెనిమిదవ శతాబ్దమునందు బ్రారంభమై పందొమ్మిదవ శతాబ్దమునందు సుస్థిరముగా స్థాపింపబఁడినది.

దేశాభివృద్ధికిని భాషాభివృద్ధికిని సుస్థిరమైన సత్పరిపాలనము ఆవశ్యకము. రాజ్యలక్ష్మినిఁగాపాడఁజాలినవారలె భాషాయోషనుఁ బోషింపనోపుదురు. పూర్వము భూపతులు పండితులఁ బోషించి విద్యాభివృద్ధినిఁజేయుచుండిరి. ఈ సత్పరిపాలకులవలన సత్కవులు, శూరాగ్రేసరులు, మంత్రిపుంగవులు, దేశభక్తులు గౌరవింపఁబడుచుండిరి. ఆంధ్రులును నితర హైందవ జాతీయుల వలె దురాచారపీడితులై యజ్ఞానాంధకారములోఁబడి తమ యుచ్ఛస్థితినుండి దొలగిపోయిరి. ఆంధ్రుల గత వైభవము దేశాభిమానమునుఁ బురికొల్పనోపదా? వాగనుశాసనుఁడు, కవిబ్రహ్మ, ప్రబంధ పరమేశ్వరుఁడు మున్నగు సార్థక నామధేయులచే రచియింపఁబడిన కావ్యరాజంబులు భాషాభిమానమును బుట్టింపఁజాలవా? నాజన్మ భూమి, నా మాతృభాష, నా స్వదేశము అని యొకసారియై నను దలపోయని తేజోవిహీనుఁడైన కుక్షింభరుఁడుండునా? నవశక్తి దేశమునందంతట దన ప్రతాపమును వ్యాపింపఁజేసి దేశి భాషాభిమానుల మనంబుల దృఢముగ నాకర్షించుచున్నది. సాధువృత్తిని బూని దేశాభివృద్ధికై ఈ ప్రతాపమును నియమించుట దేశభక్తుల విధి. కాలమునుబట్టి సాధన సంపత్తియును మారినది. దేశభక్తుల దేశసేవ ఈ సాధన సంపత్తి ననుసరించియుండవలయును. లేనియెడల ననిష్టములకుఁ గారణము గాఁగలదు. దేశారాధనమునకు దౌర్జన్య మీ కాలమున నెంతమాత్రమునుఁబనికిరాదు. దౌర్జన్యమువలన దేశమునందు సంక్షోభము గలిగి దేశాభివృద్ధికి భంగము గలుగును. దౌర్జన్య మిహపరసుఖములనుఁబాడుజేయును, ధర్మారంభమువలన నంతరాయములు నశించి విజయము సమకూరును.

ప్రస్తుతము తెలుగుబాసను మాటలాడుజనులు రెండు కోట్లకుపైగాఁ గలరు. వీర లన్నిరాష్ట్రములందును వ్యాపించి యున్నారు. 1,50,00,000 తెలుగువారు బ్రిటిషు ఇండియాలోను, 50,00,000 నైజాము రాజ్యమునందునుఁ గలరు. బ్రిటిషు ఇండియాలోనివారు విశేషముగఁ దెలుగు మండలములలో నున్నారు. కాని రామేశ్వరమునకునుఁ గాశికాపురమునకును, రంగూనునకును క్వెట్టాకును నడుమనున్న ముఖ్యపట్టణములందెల్లఁ దెలుగువారు గలరు. వీరల నందఱ నేకీభావులుగఁజేయుట కాంధ్రభాషకు శక్తి సామర్థ్యములు గలవు. భిన్నదేశములందుండు తెలుగువారి నేకజాతీయులనుగఁ జేయుటకు మాతృభాషయె తగిన బంధన సాధనము.

హైందవుల భాగ్యవశమున నాంగ్లేయులు హిందూ దేశమునకు బాలకులై దేశమునందు శాంతిని స్థాపించి దేశాభివృద్ధినిఁ జేయుచున్నారు. వీరి సత్పరిపాలనము విద్యాభివృద్ధికిని వాణిజ్యాభివృద్ధికినిఁ దోడ్పడుచున్నది. ఆంధ్రులును మిగిలిన హైందవులు వర్థిల్లు చున్నారనుట నిర్వివాదాంశము. కాని వంగ మహారాష్ట్ర ఘూర్జర ద్రవిడాది దేశీయులవలెఁ దమ జనబాహుళ్యమునకుఁ దగినటుల వృద్ధిఁ జెందునటుల తోఁచదు. ద్రావిడులును, మహారాష్ట్రులును ఘూర్జరులును నాంధ్రుల కన్న సంఖ్యాబాహుళ్యమున దక్కు వగనున్నను శక్తి సామర్థ్యములం దాంధ్రులను మించియున్నారు. దీనికి ముఖ్యకారణము వారల యధిక విద్యాభివృద్ధి. తెలుగుదేశము నందు దక్షిణదేశముకంటెఁ గళాశాలలును బాఠశాలలును దక్కువగ నున్నవి. చెన్నపురియందు దేశీయులచేఁ బ్రచురింపఁబడుచున్న యాంగ్లేయ దైనిక వార్తాపత్రికలు మూఁడును నాంధ్రేతరులచేఁ బ్రచురింపఁబడుచున్నవి. విశేష వ్యాసముగల తెలుగు వార్తా పత్రిక యొకటియును లేదు. ఇంతవర కొక యాంధ్రుఁడును నున్నత న్యాయాధీశుఁడు గాలేదు. ఉన్నత న్యాయవాది పద వినిఁ బొందియుండలేదు. మండలాధిపతియును గాలేదు. ఎల్లేపద్ది జానకిరామయ్య గారొకరు మాత్రము మండల న్యాయమూర్తిగ నుండిరి. వ్యవస్థా కల్పిత పౌరసేవా పరీక్షలలోఁ (Statutory Civil Service) గృతార్థులైనవారు గానరారు. స్త్రీల కుపయుక్తమైన యున్నత విద్యాలయ మొక్కటియైన నాంధ్రదేశమునందు లేదు. చెన్నపురి రాష్ట్రమునకు రాజధానియైన చెన్నపురి తెలుగు మాటలాడువారికి దక్షిణ సరిహద్దు అయిన నది ప్రధాన నగరంబగుటంజేసి యాంధ్ర భాషా వ్యాపన కదియె ముఖ్య స్థానముగ నున్నది. అచ్చటినుండిగాని లేక వేరొక ముఖ్యపట్టణము నుండిగాని యాంధ్ర భాషా వ్యాపనకుఁ దగిన వ్యవస్థల నేర్పాటుఁ జేయవలయును. ప్రజలు విద్యావ్యాపనకై పాలకుల సహాయమునె నమ్మియుండక స్వయం సహాయమును నమ్మి పని జేయవలయును. పాలకులు సేయవలసిన పను లనేకములు. వారి యాదాయ మనేక కార్యములకై యుపయోగింపఁబడవలసియున్నది. ధనము వివిధ ప్రదేశములనుండి వచ్చుటంజేసి యన్ని ప్రదేశములవారి కొరకు వినియోగింపఁబడవలసియుండును. ఇందువలననె మిగిలిన దేశీయులును విద్యాభివృద్ధికై స్వయంసహాయము రెండువిధములఁ జేయఁదగియున్నది, మొదటి విధము ధనసహాయము. రెండుకోట్లకు పైగానున్న యాంధ్రులు నిశ్చలమైన భాషాభిమానమునుఁ బూని రేని యాంధ్రకళాశాలకుఁ దగిన ధన మొక్క పెట్టునఁ బోగు గాఁగలదు. మహద్భావనాంకురంబులు మహత్కార్యములకు బీజములు. స్వల్పారంభంబులె మహత్కార్యములుగఁ బరిణమించును. ఆంధ్రదేశంబున విద్యావ్యాపనముజేసి సరసశబ్దార్థాలంకృతంబును మృదు మధుర గంభీరంబునునైన దేశభాషను నుద్ధరింపఁగోరని యాంధ్రులుందురని నమ్ముట కవకాశము లేదు. ఈ దేశ భాషాభ్యుదయము మన సకలారంభములకునుఁబునాది. ఐకమత్యమునకు మూలబీజము. పారిశ్రామికాభివృద్ధికిఁ బ్రధాన సాధనము, వాణిజ్యాభివృద్ధికిఁ జతురోపాయము, జ్ఞానాభివృద్ధికి సరళమార్గము, పురుషార్థ సాధనమునకుఁ జక్కని త్రోవ.

ఇపుడు ధనార్జనమునకును జ్ఞానాభివృద్ధికిని రాజ భాషయైన యాంగ్లేయభాష యభ్యసింపఁబడుచున్నది. ఈ భాష యందుఁగల గ్రంథసామగ్రి వేరొకభాష యందుఁగానరాదు. దీని యందుగల శాస్త్రగ్రంథములకుఁ బరిమితి లేదు. మత గ్రంథములకు మితిలేదు. కల్పనా కథల కంతము లేదు. చరిత్ర గ్రంథములకు గడువు లేదు. కావ్యనాటకములకు గణన లేదు. ఈ భాష విద్యాధికులకు బఠనార్హమైనదైనను నాంగ్లేయభాష యెన్నటికిని దేశభాష గాఁజాలదు. సామాన్య జనులకు విద్యాసంపత్తి దేశభాష వలననె గలుగనున్నది గాన దేశభాషను వృద్ధి చేయుట భాషాభిమానులకుఁ బ్రథమ కర్తవ్యము.

స్వయంసహాయము నవలంబించుటకు రెండవ మార్గము స్వార్థత్యాగము. విద్యాధికులందరును రాజకీయోద్యోగములను న్యాయవాదివృత్తిని నవలంబించుదురేని దేశహితార్థము కంకణమును గట్టుకొనువారుండుటకు వీలుండదు. ఉపాధ్యాయవృత్తి నవలంబించుటవలనను ధనార్జనము తక్కువైనను దేశహితమునుఁజేయుట కెక్కువ వీలు గలదు. పునహాలో ఫర్గసను కళాశాలోపాధ్యాయులు మహారాష్ట్ర దేశమునకు మహోపకారమునుఁజేయుచున్నారు. మచిలీపట్నం, బందరులో స్థాపింపఁబడుచున్న యాంధ్రజాతీయ కళాశాలోద్ధారకులు స్వయంసహాయమును నమ్మి స్వార్థ త్యాగదీక్షను వహించి పనిజేయుచున్నారు. ఆంధ్రదేశీయు లీ సదుద్యమమునకుఁ దోడ్పడి దీనిం బోషింపఁ బ్రయత్నింపవలయును. ఇట్టి సదుద్యమములను బోషించుటయె దేశభక్తులకు భాషాభిమానులకు బ్రథమ కర్తవ్యము.

నైజాము రాజ్యమునందు ధన సంపన్ను లనేకులు గలరు. ఆ రాజ్యమునందు 50 లక్షల జనులు తెలుగు భాషను మాట లాడువారు గలరు. వారి యభివృద్ధికై యొక యాంధ్రకళాశాల నైజాము రాజ్యములో స్థాపించుట ముఖ్యము. ఈ రాజ్యమును బూర్వము గజపతిరాజులు పాలించి యాంధ్రభాషను పోషించిరి. ఇపుడీ రాజ్యము స్వదేశ రాజ్యములలో బ్రథమ స్థానము నలంకరించుచున్నది. సహజ సద్గుణాలంకారులును స్వదేశ భాషాభిమానులునైన శ్రీ నైజాముగా రీ యుద్యమమునకుఁ దోడ్పడవచ్చును.

ఆంధ్రదేశ బాంధవులారా! మన పూర్వపు యున్నతస్థితిని దలపోయుడు, భాషాభిమానులారా! భాషాభివృద్ధికై ఇతర రాష్ట్రీయులు సేయుచున్న ప్రయత్నములను గమనింపుడు. మనము చేయవలసిన యత్నములను యోచింపుడు. కవివరులచే రచయింపఁ బడిన భారతాది గ్రంథరాజములలోని భాషాస్వారస్యమును, మాధుర్యమునుఁ గ్రోలి చూడుడు. బ్రిటిషు పరిపాలనమువలన సౌలభ్యంబులైన సాధన సంపత్తినిఁ జేపట్టుడు. దయామయుఁడైన సర్వేశ్వరుని నమ్మి దేశ భాషాహితార్థమై పనిచేయుడు. సఫలీకృతమనోరథుల చిరకాలమునఁ గాఁగలరు.

(1910 సాధారణ సంవత్సరాది ఆంధ్ర పత్రిక సంచిక)

కుందూరి ఈశ్వరదత్తు

పురాణయుగములో ఆంధ్రదేశము

సర్వసాధారణముగా పురాణములనగా వెంటనే రామాయణ, భారత, భాగవత గ్రంథములు మనకు స్ఫురణకు వచ్చును. పురాణములు పదునెనిమిది. అందు భాగవతమొకటి. మిగిలిన పదునేడు, బ్రహ్మ, పద్మ, విష్ణు, శివ, నారద, మార్కండేయ, అగ్నేయ, భవిష్య, బ్రహ్మవైవర్త, లింగ, వరాహ, స్కాంద, వామన, కూర్మ, మత్స్య, గారుడ, బ్రహ్మాండమనునవి. రామాయణ భారతములు సహితము పురాణములలోనికే గణనకు వచ్చును. నన్నయభట్టు రాజరాజకొల్వుకూటమును వర్ణించుచు, దానిలో భారతరామాయణాద్యనేక పురాణప్రవీణులు పరివేష్టించి యున్నట్లు వ్రాసియున్నాడు. పురాణ శబ్దమున కర్థము పూర్వవృత్తము. పురాతనాఖ్యానము ప్రతిపాదించునదియే పురాణము. పురాణములలో జెప్పబడిన ముఖ్యవిషయములు ఐదు. వీనినే పంచలక్షణములందురు. అవి యేవనగా సృష్టి, ప్రతి సృష్టి, మునుల దేవతల వంశక్రమము, మన్వంతరములు, చంద్రసూర్య వంశ రాజన్యుల చరిత్రములు. అన్ని పురాణములలో నీయైదు విషయములుండవచ్చును. లేకపోవచ్చును. ప్రాచీన భారతదేశ చరిత్ర కుపయుక్తములుగా నున్న విషయము లెన్నో యీ పురాణములందుగలవు. వానిలో ముఖ్యముగా భూగోళ విన్యాసమునుగూర్చి ప్రశంసయొకటి. నేడు భూమండలమునంతయు, ఆసియా, ఐరోపా, అమెరికా, ఆస్ట్రేలియా యని వేర్వేఋ ఖండములుగా విభజించినట్లే మన ప్రాచీనులు సహితము భూభాగము నేడు ద్వీపములుగను, నేడు సముద్రములుగను విభజించిరి.

'సప్తద్వీపావసుమతీ' యని మార్కండేయము.

'స ప్తదీపవతీమహీ' యని బ్రహ్మాండము

సప్తద్వీపములు - జంబూద్వీపము

సప్తద్వీపము లేవియనగా, జంబు, ప్లక్ష, కుశ, క్రౌంచ, శాక, శాల్మలి, పుష్కరములు. పురాణములలో వర్ణింపబడిన ప్రకారము జంబూద్వీపమే యీ యేడు ద్వీపములకు నడుమనున్నది. ఈ జంబూ ద్వీపమే, ఇప్పటి ఆసియా (Asia) ఖండమునకును, దానికి తూర్పు దక్షిణములోగల ద్వీపములకును సరివచ్చును. ఈ జంబూద్వీపములోని మొదటి పదము, నేటి జమ్ము-కాశ్మీరము (Jammu-Kashmir) అను రాష్ట్రములో జమ్ము విభాగములో శేషించియున్నది.

భరత వర్షము

జంబూద్వీపము మరల తొమ్మిది వర్షములుగ విభజింపబడినది. ఈ జంబూ ద్వీపములో నేడు

కులపర్వతములు గలవు. అవి హిమవంతము, హేమకూటము, నిషధము, మేరువు, నీలగిరి, శ్వేతాచలము, శృంగవంతము ననునవి. ఈ కులపర్వతమునంటుకొని యేడు వర్షములు గలవు. అవి ఇలావృత, భద్రాశ్వ, కేతుమాల, హరి, కింపురుష, రమ్యక, హిరణ్మయ, కురు, భరతవర్షములు. వాయుపురాణములో,

నవవర్షం ప్రవక్ష్యామి జంబూద్వీపం యథాతథా
ఉత్తరం యస్సముద్రస్య హిమవద్దక్షిణం చయత్ ।
వర్షం తద్భారతం నామ యత్రేమాం భారతప్రజాః
పూర్వేకిరాతా హ్యస్యాంతే పశ్చిమే యవనాః స్మృతాః ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా మధ్యే శూద్రాశ్చ భాగశః
యదిదం భారతం వర్షం యస్మిబీక స్వాయభువాదయః ॥

హిమవన్నగమునకు దక్షిణమునను, సముద్రమున కుత్తరమునను భరతవర్షములగలదనియు, ఈ భరతవర్షమునకు తూర్పున కిరాతులు, పశ్చిమమున యవనులు, మధ్యమమున బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రలు గలరనియు వ్రాయబడినది. ఈ భారతవర్షాంతర భాగమే నేటి భరతఖండము. హిందూ దేశము, భరత ఖండము, అని (India i.e., Bharat) మన రాజ్యాంగశాసనమునందుగలదు. భరతఖండమునకీ పేరు ఏల గల్గెనో పురాణములందు దెలుపబడినది. స్వాయంభువమనువు తనయుడైన ప్రియవ్రతునకు తొమ్మండుగురు పుత్రులు. వారిలో అగ్నీధ్రుడను పుత్రుని జంబూద్వీప పాలకునిగా నియమించెను. ఈ అగ్నీధ్రునికి దొమ్మండుగురు పుత్రులు వారిలో ఋషభుడను వానిని హిమవంతమునకు దక్షిణఖండమున కధిపతిగాజేసెను. ఋషభునకు భరతుడను కుమారుడు గలడు. ఋషభుని తర్వాత భరతుడీ భూమండలమును బాలించెను. కావున నీ ఖండమునకు భరత ఖండమనీ పేరు వచ్చెను.

భరతఖండము - ఆంధ్రదేశము

భరత వర్షము మన పురాణములో దొమ్మిది విభాగములుగ జేయబడినది. వాని నామములు, ఇంద్ర, కేతుమంత, తామ్రవర్ణ, గభస్తిమంత, నాగ, సౌమ్య, గాంధర్వ, వారుణ, కుమారికాద్వీపములు. నాటి కుమారికా ద్వీపమే, నేటి హిందూ దేశముతో సరిపోవును. ఈ కుమారీద్వీప మేడు విషయములుగ విభజింపబడినది. అవి, మధ్య, ఉదీచ్య, ప్రాచ్య, దక్షిణాపథ, అపరాంత, వింధ్య, హిమాలయప్రదేశములు. ఇందలి దక్షిణాపథమే నేటి డక్కన్ పీఠభూమి. ఈ దక్షిణాపథదేశములలో, పాండ్య, కేరళ, చోళ, కుల్య, మహారాష్ట్ర, మహిష, కళింగ, విదర్భ, కుండల, ఆంధ్రదేశములు తెలుపబడినవి. మార్కండేయపురాణాదులలో ఆంధ్రదేశము దక్షిణాపథదేశములలో జెప్పబడినది. కాని నాటి దేశముల యెల్లలు పురాణములలో వివరింపబడలేదు. స్థలనిర్దేశము ననుసరించి, ఆంధ్రదేశము కళింగ దేశమునకు దక్షిణముగను, ద్రావిడ దేశమున కుత్తరముగను, కర్ణాటక మహారాష్ట్ర దేశములకు పశ్చిమమున నున్నట్లు మాత్రము చెప్పవచ్చును. ఈ స్థల నిర్దేశము సంస్కృత కావ్యయుగమునందును, తర్వాత శిలాశాసనములందును స్పష్టము చేయబడినది.

రామాయణ-భారతములు-ఆంధ్రదేశము

నేటికిని మనము సంకల్పములో 'జంబూద్వీపే, భరతఖండే, దండకారణ్యే, కృష్ణాగోదావరీ మధ్యదేశే' అని చెప్పుకొందుము. నేటి ఆంధ్రదేశము సగముభాగము దండకారణ్యములోను, సగము భాగము కిష్కింధారాజ్యములో నిమిడియుండెను. వింధ్యపర్వతమును దక్షిణమునను, కృష్ణా స్రవంతి కుత్తరమునకు మలయ మహేంద్రపర్వతములకు మధ్యమమున, దండకారణ్యముండెను. దానిలో దూర్పు భాగము జనస్థానము. కృష్ణకు దక్షిణమున కిష్కింధారాజ్యముండెను. రామాయణకాలమున రావణుని సోదరుడగు ఖరుడు ఈ జనస్థానమునకధిపతి. ఈ జనస్థానమందే పంచవటి కలదు. శ్రీ రామభద్రుడు సీతాసౌమిత్రి సమేతుడై, ఈ పంచవటి యందే కొంత కాలము కాపురముండెను. ఇచ్చటనే సీతాపరహరణము జరిగినది. ఈ పంచవటి ఆంధ్రదేశములోని తూర్పుగోదావరీ మండలములో భద్రాచలక్షేత్రమున కుత్తరముగా నిరువది రెండు మైళ్ళ దూరమున నున్నది. శ్రీ మద్రామాయణము, కిష్కింధాకాండములో హనుమదాదులను సీతను వెదుకుటకై దక్షిణదిక్కునకుబోయి, దండకారణ్యమున కరిగి, యచట గిరివన దుర్గముల, గోదావరీతీరముల, నంద్రపుంద్ర కేరళ కురుదేశములబరికించి రండని యాజ్ఞాపించినట్లు గలదు. కాని క్రీ.శ.పూర్వమాఱవ శతాబ్దమున వాల్మీకి రామాయణము రచింపబడెననియు, దానిలో దాక్షిణాత్యములైన ఆంధ్ర, చోళ, పాండ్యాది దేశముల ప్రశంస ప్రక్షిప్తమనియు, నాటి కా పేర ప్రజలు గాని, రాజ్యములుగాని యుండలేదని గొందఱు చరిత్రకారులు వ్రాయుచున్నారు.

మహాభారతములో సభాపర్వమునందలి సభాక్రియాపర్వణాధ్యాయమునందును, సహదేవుని దక్షిణ దిగ్విజయ యాత్రాసందర్భమునను, నియంత్రితరాజానుగమనములోను, భీష్మపర్వములో భారతీయనద్యాదికథనములోను ఆంధ్రదేశప్రశంస యున్నది. ధర్మజుని కొల్వుకూటమును బరివేష్టించియుండిన నృపాలురలో ఆంధ్రభూమీశుడు కలడు. ఈతని పేరు తెలియదు. తిక్కన సోమయాజియు ఆంధ్రీకృత భారతములో ఆంధ్రదేశమును మూలమున కనుగుణముగా, దాక్షిణాత్యజనపదములలో నొకటిగా వ్రాసెను. భీష్మపర్వములోని ఆంధ్రజనపదము కృష్ణాగోదావరీ మధ్యదేశమని

ఆంధ్రకాః కృష్ణాగోదావర్యోర్మధ్యే విద్యమానదేశః ॥

అని వ్యాఖ్యానమున గలదు. కురుపాండవ సంగ్రామములో దాక్షిణాత్యజనపదములైన, ఆంధ్ర, కేరళ, టేంకణ, కర్ణాట, కోసల, కాళింగ,

కుంతల, విదర్భములు కౌరవపక్షమునజేరును. పాండ్యచోళ జానపదములు మాత్రము పాండవపక్షమునగలిసెను కర్ణునికి బ్రాపైపుళింద, టేంకణ, బాహ్లిక, ఆంధ్రసైన్యములు పోరినట్లును, పాండ్యడైన మలయధ్వజుడీ సైన్యములతో బోరాడి నిహతుండైనట్లును కర్ణపర్వమునందుగలదు.

ఆంధ్రదేశము- తెలుగు దేశము

మన భాష తెలుగు భాషయనియు, మనము తెలుగు వారమనియు మన దేశమునకు తెలుగు దేశమనియు పేర్లుగలవు గదా. పురాణములలో నత్యంత ప్రాచీనమైనవానిలో మార్కండేయ పురాణమొకటి. ఇది క్రీ.శ.నాల్గు, ఆఱవ శతాబ్దముల మధ్యమున రచింపబడెనని పురాణములన్నింటిని గూలంకషముగా బరిశోధించిన, హైందవ ఆంగ్ల పరిశోధకుల యభిప్రాయములు. ఈ పురాణములను బరిష్కరించి, ప్రచురించిన పర్గిటార్ దొరగారు (Pargitar) తత్పురాణములలో కూర్మ సంస్థాపన వర్ణనమునందలి కూర్మదక్షిణకుక్షియందలి దేశవిభాగములో గల క్రింది శ్లోకము గూర్చి, ఇట్లు వ్రాసియున్నారు.

తిలింగో కుంజరదరీ కచ్ఛవాసాశ్చ యే జనాః ।
తామ్రపర్ణీ తథాక్షుక్షిరితికూర్మస్య దక్షిణః ॥

పై శ్లోకములోని తిలంగులనువారు నేటి తెలుగువారనియు వారు నివసించు దేశమే తెలుగు దేశమనియు, దీని ప్రసక్తిననుసరించి, ప్రాచీనాంధ్ర జనపదమునకు సరివచ్చుననియు వ్రాసియున్నారు. మనము తిలింగులమనియు, కావుననే మన భాషకు తిలింగ భాషయనియు, దేశమునకు తిలింగ దేశమనియు మొదట పేర్లుగల్గి, తర్వాత తిలంగపదమె, తెలుగుగా మాఱెననియుజెప్పవచ్చును. ఈ మార్కండేయ పురాణములో దక్క ఈ పద మీ రూపమున నేపురాణములలో నెక్కడనులేదు. కాని యొక విచిత్రమేమనగా క్రీ.శ.1876వ సంవత్సరములో తెలుగులిపిలో ముద్రింపబడిన సంస్కృత మార్కండేయ పురాణములో, ఈ శ్లోకములోని తిలింగపదము త్రిలింగ పదముగా బరిష్కర్తలు దిద్దినారు. మార్కండేయ పురాణములోని యీ తిలింగపదము ఆంధ్ర భాషాచరిత్ర కారులకేమి, ఆంధ్రచరిత్ర పరిశోధకులకేమి యత్యంత ప్రాధాన్యమైన విషయము. మారన ఆంధ్రీకృత మార్కండేయ పురాణములో కూర్మసంస్థాపన వర్ణనమను సంక్షిప్తముగా నొనర్చి మూలములోని వేర్వేఱు జనపదవాసుల వర్ణింపలేదు. ఈ విషయ మిదివఱకు ఆంధ్ర సాహిత్య పరిష్పత్రిక 28వ సంపుటము 4వ సంచికలో సవిమర్శముగా జర్చించి యున్నాను.

స్కాంద బ్రహ్మాండ పురాణములు
త్రిలింగ దేశము

మన భాష ఆంధ్రభాష, తెలుగుభాష, మనదేశము ఆంధ్రదేశము, తెలుగు దేశమని యెట్లు వ్యవహరింపబడుచున్నదో, అట్లే మన భాష త్రిలింగభాష మనదేశము త్రిలింగ దేశమనియు వ్యవహరింపబడుచున్నది. కానినేడు త్రిలింగ పదమునకు బహుళ వ్యాప్తిలేదు. త్రిలింగ దేశ విభాగము స్కాంద బ్రహ్మాండ పురాణములందు మాత్రముగలదు. స్కాంద పురాణములో త్రైలింగులనువారు వింధ్య దక్షిణ వాసులలో నొకరుగబేర్కొనబడిరి. ఆంధ్రదేశము శ్రీశైలము, భీమేశ్వరము, కాళేశ్వరములను మూడు శివక్షేత్రములమధ్య గల దేశమని వ్రాయబడినది. శ్రీశైలము కర్నూలు మండలములోని సుప్రసిద్ధ శివక్షేత్రము. భీమేశ్వరము తూర్పుగోదావరీ మండలములోని దాక్షారామమను మఱియొక శివక్షేత్రము. కాళేశ్వరము నైజాము రాష్ట్రములోని నెలగందల మండలమునగల మంథని (మంథెన) యను గ్రామసమీపమునగల వేఱొక శివక్షేత్రము.

బ్రహ్మాండ పురణామునసుసరించి 'ఆంధ్రవిష్ణు'వనువాడు శ్రీశైలము, భీమేశ్వరము, కాళేశ్వరము, మహేంద్ర పర్వతమును గూడగలియునట్లుగా బ్రాకారములు నిర్మించి, యామూటిని ద్వారములుగాజేసెననియు, నీద్వారములయందీశ్వరుడు శూలపాణియై ప్రమథగణములచే గొలువబడుచు లింగరూపములను దాల్చి యుండెననియు, ఆంధ్రవిష్ణువు సురల సాహాయ్యమునొంది దానవాగ్రేసరుడగు శంభునితో బదుమూడు యుగములు యుద్ధముచేసి వానిని హతుని గావించి, గోదావరీ తటమునందలి ఋష్యాశ్రమములలో వానినివాసము నాక్రమించుకొనెననియు నప్పటినుండియు, నీ దేశము త్రిలింగ దేశమని పేరబరగుచున్నదనియు, దెలియుచున్నది. ఈ త్రిలింగపదము, తిలంగ పదమున కన్న ప్రాచీనమైనదని చెప్పరాదు. స్కాంద బ్రహ్మాండ పురాణములలో లెక్కలేనన్ని సంహితలు, ఖండములు, మహాత్మ్యములు, ఎవరికి దోచినవి వారు, ఎప్పటికప్పుడు చేర్చుచుండిరి. వీనిలోని విషయములు పెక్కు భాగములు అధునికములు. ఈ త్రిలింగ పదము ఆంధ్రదేశములో కాకతీయుల కాలమున శైవమతము విజృంభించినసమయమున, నుత్పత్తి నొందియుండును. పదమూడవ పదునాల్గవ శతాబ్దములనాటి ఆంధ్రదేశపు శాసనములలో త్రిలింగ పదములు బహుళముగా బ్రయోగింపబడెను. ఆనాటి సంస్కృత కావ్యములందు త్రిలింగ పదముగా కవులు ప్రయోగించిరి. కాకతీయ ప్రభువులు త్రిలింగ పరమేశ్వరులని వర్ణింపబడిరి. ఈ త్రిలింగ దేశప్రసక్తి కాకతీయ రాజ్యకాలమున బ్రభవించి, రెడ్ల రాజ్యకాలమున సారస్వతములోను, శాసనములలోను బహుళవ్యాప్తిని గావించెనని ఘంటాపథముగ జెప్పవచ్చును. తెలుగు పదము వేఱు, త్రిలింగ పదము వేఱు. త్రిలింగ పద తద్భవము తెలుగు కాదు. ఆ కాలమునాటి పండితులెవరో త్రిలింగ సంబంధమైన శ్లోకమును బ్రహ్మాండ, స్కాంద పురాణములలో పదునాల్గవ శతాబ్దముననో తరువాతనో చేర్చియుందురు. పాశ్చాత్య చరిత్రకారులలో కొందఱు ఈ రెండు పురాణములలోని విషయము లర్వాచీనములనియు, ననేక విషయములు ప్రామాణ్య రహితములనియు వ్రాసియున్నారు.

పురాణములలో ఆంధ్రులు కిరాత, హూణ, పుళింద, యవనదేశీయులతో చేర్చి, వీరు నికృష్టజాతిగ వర్ణింపబడిరి. భాగవతము ద్వితీయ స్కంధములో,

"కిరాతహూణాంధ్రపుళిందపుల్కసా అభీరకంకాయవనాఃకషాదయః

యేఽన్యేచ పాపా యదుపాశ్రయాశ్శుధ్యంతి తస్మై్రప్రభవిష్ణవేనమః"

అని ఆంధ్రులు పాపజాతిగ వర్ణింపబడిరి. మఱియు నవమస్కంధములో భవిష్యద్రాజేతిహాసములో దుష్యంతుని కుమారుడగు భరతుడు ఆంధ్రహూణయవనదేశీయులను జయించెననియు, వీరందఱు మ్లేచ్ఛులనియు చెప్పబడెను.

"కిరాతహూణాన్ యవనాంధ్రాన్ వంగాన్ శకాన్ కషాన్

అబ్రహ్మణ్యాన్నృపాంశ్చాహన్ మ్లేచ్ఛాన్ దిగ్విజయే బలాత్" ॥

ఆంధ్రీకృతభాగములో శక, శబర, బర్బర, కిరాతక, హూణ, మ్లేచ్ఛదేశములు మాత్రము పేర్కొనబడి, ఆంధ్రులమాట వదలివేయబడినది. భాగవతము ద్వాదశస్కంధములో నాంధ్రరాజ్యస్థాపకుడొక వృషలుడని ఈ క్రింది విధముగ వ్రాయబడినది.

"మఱియు గణ్వవంశజుడను సుశర్ముండను రాజుదయించిన వాని హింసించి తద్భృత్యుం డంధ్రజాతియుండైన వృషలుం డధర్మ మార్గవర్తియై వసుమతీ చక్రం బవక్రుండై యేలె"

ఆంధ్రులు మగధరాజగు జరాసంధునితో జేరి యాదవులతో బోరాడిరి. చాణూరుడను ఆంధ్రమల్లుడు శ్రీ కృష్ణునితో మల్లయుద్ధమునందు నిహతుడయ్యెను. శ్రీ మహావిష్ణువునకు జాణూరాంధ్ర నిషూదనుడను పేరు విష్ణు సహస్రనామములలో నొకటి. ఈ విష్ణు సహస్రనామములు మహా భారతములో అనుశాసనిక పర్వాంతర్భాగము.

మత్స్యపురాణ మాంధ్రదేశచరిత్ర కత్యంత ప్రధానమైనది. ప్రాచీనాంధ్ర రాజ్యస్థాపకులగుర్చి యిందు విపులముగ వ్రాయబడినది. కాణ్వ వంశీయులగు బ్రాహ్మణప్రభువులలో గడపటివాడగు సుశర్మయనువానిని సంహరించి ఆంధ్రుడగు శ్రీ శిశుకు డనువాడు శుంగ రాజ్యాధికారమును నిర్మూలించి ఆంధ్రభూమిశుడయ్యెదని చెప్పబడినది.

"కాణ్వాయస్తతో భూపాః సుశర్మాణః ప్రసహ్యతామ్ ।

శుంగానాంచైవ యచ్ఛేషం క్షిపిత్వాతుబలీయసః ॥

శిశుకోంధ్రః సజాతీయః ప్రాప్స్యతీమాం వసుంధరామ్

త్రయోవింశసమా రాజా శిశుకస్తు భవిష్యతి ॥ 273- అధ్యాయము

ఈ శిశుకుడే విష్ణుపురాణములో శ్రీ పకుడనియు, సింధకుడని వాయుపురాణములోను చెప్పబడెను. మత్స్యపురాణములో పందొమ్మండుగురు ఆంధ్రరాజులు నాల్గువందల యఱువది వత్సరములు పాలించిన తర్వాత వారి రాజ్యము భృత్య వంశముల పాలయ్యెనని కలదు.

"తేషాంవర్ష శతానిస్స్యుశ్చ త్వారిషష్టి రేవచ ।

ఆంధ్రాణాం సంస్థితో రాజ్యేతేషాం భృత్యాస్స్వ యేన్నృపాః ॥

పై విధముగ పురాణములలో నాంధ్రదేశమును గూర్చియు, ఆంధ్రులను గూర్చియు దిక్ప్రదర్శముగ వివరించి, ప్రసంగమును వివరించుచున్నాను.

(ఆంధ్రసాహిత్య పరిషత్తు పత్రిక)

జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశ భాషలందు తెలుగు లెస్స
జగతి తల్లికంటె సౌభాగ్య సంపద
మెచ్చు టాడుబిడ్డ మేలుగాదె?

- శ్రీనాథ మహాకవి

తెలుఁగ దేల యన్న, దేశంబు దెలుఁగ, గేను
దెలుఁగు వల్లభుండఁ, దెలుఁగొకండ,
యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స

- శ్రీకృష్ణ దేవరాయలు

ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య

తెలుగు రాజుల చరిత్ర : ప్రజ్ఞాప్రాభవాలు

తెలుగురాజుల చరిత్ర చాలా దీర్ఘమైనట్టిది. వీరిలో కొన్ని వంశాలవారు తెలుగు ప్రజలనందరిని ఒక పరిపాలనలోకి తేగలిగారు. కానిఆలాంటి వారిసంఖ్య చాలా తక్కువ. రాజులలో అధిక సంఖ్యాకులు తెలుగుదేశంలో ఏదోఒక ప్రాంతాన్ని మాత్రమే పరిపాలించగలిగారు. భాషనుబట్టి, భాషసాధనాన ఏర్పడిన సంస్కృతినిబట్టి తెలుగువారంతా ఒక సముదాయానికి చెందినవారైనా, రాజకీయంగా వారు ఏవోకొన్ని కాలాలలో మాత్రమే కలిసియుండిన కారణాన ఇప్పటికి కూడా వారిలో ప్రాంతీయాభిమానాలు పూర్తిగా తొలగిపోలేదు. మనదేశ చరిత్రకు కూడా ఇది ఒక ప్రధానలక్షణం. దేశసమైక్యత, సమగ్రత ఒక సమస్యగా పరిణమించినట్లే ఒక భాషను మాట్లాడేవారిమధ్య కూడా ఆలాటి సమగ్రత ఒక సమస్యగా ఉంటున్నది. దీనికి చరిత్రయే ప్రధాన కారణం.

శాతవాహనులు

చరిత్రలో ప్రసిద్ధిగాంచిన రాజులలో మొదట పేర్కొనదగినవారు శాతవాహనులు. వంశాన్ని బట్టి వారికి ఈ పేరు లభించింది. వీరి సంఖ్య ముప్పై-వీరి కాలంలో -అనగా సుమారు క్రీ.పూ. 225 నుండి క్రీ.శ. 225 వరకు తెలుగుదేశమంతా ఒక పాలనలోకి వచ్చింది. ఇంతేగాక వీరు తూర్పుసముద్రతీరాన నుండి పడమటి సముద్రంవరకు వ్యాపించిన దక్షిణాపథాన్ని, ఉత్తరహిందూస్థానంలోని అనేక ప్రాంతాల్ని పరిపాలించారు. వీరిది పురాణ ప్రసిద్ధమైన సామ్రాజ్యాలలో ఒకటి, ఈ రాజులలో రెండవ గౌతమీపుత్ర శాతకర్ణి గొప్ప యోధుడుగాను చక్రవర్తిగాను ప్రసిద్ధిగాంచినవాడు, వీరికి ఒక నౌకాబలంకూడా ఉండేది. ఈ వంశానికి చెందిన హాలుడనే చక్రవర్తి ప్రాకృతభాషలో గాథాసప్తశతి అనే గ్రంథాన్ని రచించాడు. వీరి మాతృభాష ప్రాకృతంగా ఉన్నట్లు చెప్పవచ్చు. కొన్ని వందల సంవత్సరాలకు పూర్వం ఆర్యావర్తనంనుండి వింధ్యకు దక్షిణంగా ఉన్న దక్షిణాపథాన్ని ప్రవేశించిన ఆంధ్రజాతికి వీరు చెందిన కారణంగా వీరు ప్రాకృతభాషలలో ఒకదానిని మాట్లాడే వారయ్యారు. వీరు పరిపాలించిన ప్రజలు తెలుగుభాషను, ఇతర ప్రాంతీయ భాషలను మాట్లాడేవారు, వీరి మూలంగానే తెలుగుదేశానికి ఆంధ్రదేశం అనే పేరు, తెలుగు భాషకు ఆంధ్రభాష అనే పేరు వచ్చింది.

వీరి పరిపాలనలో ప్రజలు సుఖంగా సిరిసంపదలతో జీవితం సాగింపగలిగారు. విదేశవ్యాపారం విరివిగా జరిగేది. ఈ రాజులు వైదికమతాన్ని బౌద్ధమతాన్ని సమంగా ఆదరించారు. జగత్ప్రసిద్ధిగాంచిన అమరావతి స్తూపము, నాగార్జునకొండ స్తూపములేగాక ఆనాడు ఘంటసాల, భట్టిప్రోలు, గుమ్మడిదుర్రు, గుడివాడ, గోలి మొదలైన ప్రదేశాలలో కూడా ఎన్నో స్తూపాలు ఉండేవి. అమరావతి నాగార్జున కొండలలో

విశ్వవిద్యాలయాలు ఏర్పడి విద్యలకు కేంద్రంగా ప్రఖ్యాతిగాంచి, ప్రాకృతభాషతో పాటు సంస్కృతంకూడా వర్ధిల్లింది. ఆనాటికి తెలుగుభాష గ్రంథరచనకు సాధనంగా రూపొందలేదు. అది ప్రజలు మాట్లాడే వ్యవహారభాషగా మాత్రమే ఉండినది. బౌద్ధంలోని మహాయానశాఖకు పేరు ప్రతిష్ఠలు కల్పించిన నాగార్జునుడు ఆనాటివాడు.

ఇక్ష్వాకులు

శాతవాహన సామ్రాజ్యం విచ్ఛిత్తిగాంచిన తర్వాత తెలుగుదేశంలో అనేక చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. కృష్ణానదీతీరాన విజయపురి రాజధానిగా ఇక్ష్వాకులు క్రీ.శ 220 నుండి క్రీ.శ 260 వరకు పరిపాలించారు. వీరు కొన్ని సంవత్సరాలకాలం మాత్రమే పరిపాలించినా బౌద్ధమతానికి వీరు చేసిన సేవ వీరి కీర్తికి చిరస్థాయి కల్పించింది. నాగార్జునకొండ సమీపాన ఈనాడు మనకు కనిపించే శిధిలాలన్నీ వీరికాలంలోని నిర్మాణాల శిధిలాలు. బౌద్ధమతానికి శాతవాహనుల యొక్కయు ఇక్ష్వాకుల యొక్కయు కాలంలో రాజులకంటే రాణులు, రాణివాసంలోని ఇతర స్త్రీలు ఎక్కువ సేవచేశారు.

పల్లవులు

ఇక్ష్వాకుల తర్వాత వారు పరిపాలించిన ప్రాంతానికి దానికి దక్షిణంగాను పశ్చిమంగాను ఉన్న ప్రాంతానికి పల్లవులు రాజులయ్యారు. పల్నాడు అనే పేరు వీరి మూలంగానే వచ్చింది. వీరు క్రీ.శ. మూడవ శతాబ్దం నుండి తొమ్మిదవ శతాబ్దం వరకు కృష్ణా కావేరీల నడుమ నుండు దేశాన్ని పాలించారు. కొంతకాలమైన తర్వాత వీరు కంచిని రాజధానిగా చేసుకొన్నారు. క్రమక్రమంగా తెలుగుదేశంపై వీరికి ఉండిన ప్రభావం తగ్గి తమిళదేశం వీరికి ప్రధాన కేంద్రంగా ఏర్పడింది.

బృహత్పలాయనులు

బృహత్పలాయనులు పల్లవుల బారినుండి తప్పించుకొని కృష్ణానదీ ముఖప్రాంతాన క్రీ.శ. మూడవ శతాబ్దిలో పాలించినారు. వీరు శైవమతావలంబకులుగా కనుపిస్తారు. పల్లవులు కూడా చాలాకాలం శైవమతాన్ని అవలంబించినవారు.

శాలంకాయనులు

శాలంకాయనులు క్రీ.శ 4,5 శతాబ్దాలలో కృష్ణా గోదావరి నదుల నడిమి ప్రదేశాన్ని పాలించారు. వీరికి వేంగీపట్టణము రాజధాని కావడంచేత వీరిని వైంగేయకులని చెప్పడంకూడా కద్దు. వీరు వైదిక ధర్మానుసారం యజ్ఞయాగాదులను చేసి, సనాతన ధర్మాన్ని నిలబెట్టిన వారు. కాని జైనము, బౌద్ధము కూడా ఆనాడు వృద్ధిలో ఉండినట్లు కనబడుతుంది.

ఈ కాలముననే గుంటూరు, తెనాలి, ఒంగోలు ప్రాంతాలను ఆనందగోత్రులు పాలిస్తూ ఉండేవారు. వారి రాజధాని కందరపురం (కంతేరు)

విష్ణుకుండినులు

శాలంకాయనుల తర్వాత ప్రసిద్ధిగాంచినవారు విష్ణుకుండినులు. వీరి రాజధాని వేంగికి సమీపాన ఉండే వెందులూరు, (అది ఇప్పటి దెందులూరు). ఈ వంశంలో మొదటి మాధవవర్మ. జనాశ్రయుడను బిరుదు వహించిన మూడవ మాధవవర్మ ప్రఖ్యాతిగాంచినవారు. వీరికాలంలో గుహాలయాలనిర్మాణం చాలా ప్రాధాన్యాన్ని వహించింది. ఆనాటి ఆలయాలు ఉండవల్లి, సీతానగరము, విజయవాడ, మొగలురాజపురము మొదలైన ప్రదేశాలలో ఈనాటికి కూడా చూడవచ్చు. క్రీ.శ. 624 లో చాళుక్యచక్రవర్తి రెండవ పులకేశి విష్ణుకుండినులను ఓడించి, ఈ ప్రాంతాన్నంతా తన ఏలుబడిలోకి తెచ్చుకొని, తన ప్రతినిధిగా తమ్ముడైన కుబ్జవిష్ణువర్ధను నియమించాడు. తూర్పు చాళుక్యులను పేర ఈతని వంశానికి చెందినవారు క్రీ.శ. 1076 వరకు తెలుగుదేశంలోని చాలా భాగాన్ని పాలించారు.

తూర్పు చాళుక్యులు

కుబ్జ విష్ణువర్ధనుని పూర్వులు అయోధ్యనుండి దక్షిణాపథానికి వచ్చినట్లు ప్రతీతి. వీరు క్షత్రియులు. చంద్రవంశానికి చెందిన చాళుక్యులు. ఈనాటి బిజాపూరు జిల్లాలోని వాతాపి (దీనికి బాదామి అని నామాంతరము) రాజధానిగా వీరు క్రీ.శ. 543 ప్రాంతాన ఒక స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకొన్నారు. కుబ్జ విష్ణువర్ధనుని కాలాన నుండి వీరు రెండు శాఖలుగా చీలిపోయి, వాతాపి రాజధానిగా పాలించినవారు పశ్చిమచాళుక్యులనీ, వేంగిని పాలించినవారు తూర్పుచాళుక్యులనీ చరిత్రలో ప్రసిద్ధిగాంచారు.

తెలుగు దేశచరిత్రలో తూర్పుచాళుక్యులయుగం చాలా ప్రఖ్యాతి గాంచినట్టిది. వీరు 450 సంవత్సరాల కాలం దేశంలో చాలా భాగాన్ని పరిపాలించారు. వీరు పదేపదే పశ్చిమ చాళుక్యులతోను, అటుతర్వాత రాష్ట్రకూటులతోను పశ్చిమభాగాన యుద్ధం చేయవలసిన వారయ్యారు. అప్పుడప్పుడు దక్షిణాన పల్లవులతోడను ఉత్తరాన కళింగ గాంగులతోడను యుద్ధాలు తప్పినవికావు. వీరిలో క్రీ.శ. 848 నుండి 892 వరకు పాలించిన మూడవ విజయాదిత్యుడు (గణక విజయాదిత్యుడనేది ఇతనికి నామాంతరము) బహుప్రసిద్ధిగాంచినవాడు, పరాక్రమవంతుడైన యోధుడు. ఇతనివద్ద పాండురంగడనువాడు సేనాధిపతిగనుండెను. ఇతని సహాయముచే దక్షిణమందున్న చిన్నచిన్న రాజ్యములనేకములను

జయించెను. ఇతడు నెల్లూరును తగలబెట్టినట్లు నోలంబిరాజగు మంగిని చంపినట్లు, పశ్చిమగాంగులను ఓడించినట్లు, రాష్ట్రకూటులను కలింగగాంగులను ఓడించి కప్పము వసూలు చేసినట్లు, దక్షిణకోసలముపై దండెత్తి విజయము సాధించినట్లు, పల్లవులను పాండ్యులను ఓడించినట్లు, ఇతని శాసనములు తెలియపరచుచున్నవి. కాని రాష్ట్రకూటుల రాజు అమోఘవర్షుడు ఇతనిని ఓడించి కొంతకాలము ఇతనిని తనకు సామంతునిగ జేసుకొనెను. అతడు మృతిచెందిన తర్వాత విజయాదిత్యుడు విజృంభించి, అతని కుమారుడు కృష్ణుని ఓడించి, తన స్వాతంత్ర్యాన్ని తిరిగి సంపాదించుకొనడమేకాక, వేములవాడ బస్తరు రాజ్యాలను వశపరచుకొని, దీపాల, కిరణ, నిరాత, అచల మొదలైన పట్టణములను పట్టుకొని తగులబెట్టెను. ఇతని కాలమున తూర్పు చాళుక్యరాజ్యము అత్యున్నత స్థితికి వచ్చెను.

ఇతని తర్వాత యధాప్రకారము ఇరుగుపొరుగు రాజులతో యుద్ధములు ఒక్కొక్కప్పుడు సింహాసనమునకై అన్నదమ్ములమధ్య అంతర్యుద్ధములు సంభవించుచుండెను. ఈలాటిపరిణామాల ఫలితంగా క్రీ.శ. 973-1000 మధ్య దేశంలో అరాజక పరిస్థితులు వ్యాపించాయి. ఆ సమయంలో ద్రావిడదేశంలోని చోళ చక్రవర్తి క్రీ.శ. 999 లో వేంగిరాజ్యంపై దండెత్తివచ్చి రాజ్యాన్ని వశపరచుకొనెను. అప్పటినుండి తూర్పుచాళుక్యరాజులు సింహాసనాధిష్ఠితులుగా ఉండినా చాలావరకు చోళ చక్రవర్తులకు లోబడి దేశాన్ని పరిపాలించవలసిన వారయ్యారు. చోళ చక్రవర్తులు వీరితో వివాహ సంబంధాలు కల్పించుకొని వీరికి అండగానిలిచారు. వీరితో రాజరాజుకుమార్తె కుందలాంబికను పెండ్లాడిన విమలాదిత్యుడు క్రీ.శ. 1011 లో రాజ్యానికి వచ్చాడు. నన్నయ భట్టారకుని చేత ఆంధ్రమహా భారతమును తెనిగింపజేసిన రాజరాజనరేంద్రుడు ఇతని కుమారుడు. ఇతడు తన మేనమామ రాజేంద్ర చోళచక్రవర్తి కుమార్తెను అమ్మంగదేవిని వివాహమాడెను. ఈ సంబంధాల మూలంగా చాళుక్య చోళరాజ్యాలు సన్నిహితములు కావడం జరిగింది.

రాజరాజనరేంద్రుడు క్రీ.శ. 1022 నుండి 1062 వరకు వేంగిరాజ్యాన్ని పాలించాడు. కాని మధ్యమధ్య రాజ్యాన్ని కోల్పోవడమూ, తుదకు పశ్చిమచాళుక్య చక్రవర్తికి లోబడిపోవడమూ తప్పినదికాదు. ఈ చక్రవర్తి తన ప్రధానులలో ఒకడైన నారాయణభట్టును రాజరాజనరేంద్రుని రాజధానియగు రాజమహేంద్రవరమునకు తన ప్రతినిధిగా పంపెను. ఇతడు నన్నయభట్టునకు సహాధ్యాయి. ఈ కారణముచేత భారతరచనలో అతనికి సహాయపడెను.

రాజరాజనరేంద్రుని కుమారుడు కులోత్తుంగచోళుడు తండ్రి మరణానంతరము ఇతడు సింహాసనమధిష్ఠించలేకపోయెను. రాజ్యము దాయాదులలో ఒకడైన విజయాదిత్యుని వశమయ్యెను. కులోత్తుంగుడు మేనమామ అయిన చోళచక్రవర్తిని ఆశ్రయించెను. చోళచక్రవర్తి వీరరాజేంద్రుడు వేంగీదేశముపై 1068 లో దండెత్తి, విజయాదిత్యుని ఓడించి కులోత్తుంగునికి పట్టముగట్టెను. ఇది జరిగిన తర్వాత రెండు సంవత్సరాలకు అనగా 1070 లో వీరరాజేంద్రుడు మరణించుటయు కులోత్తుంగుడు చోళరాజధానికి వెళ్ళి, అక్కడ చోళచక్రవర్తిగా పట్టాభిషిక్తుడగుటయు, అప్పటినుండి అతడు చోళరాజధానిలో ఉండిపోవుటయు జరిగెను. పరిస్థితులు కొన్ని ప్రతికూలమగుటచే వేంగీరాజ్యము 1078 వరకు విజయాదిత్యుని వశములోనికి వచ్చెను. ఆ సంవత్సరమున అతడు మరణము చెందగా కులోత్తుంగుడు దానిని వశపరచుకొని దానిని తాను స్వయముగా పరిపాలించుటకు బదులు తన కుమాళ్లలో ఒకరిని రాజప్రతినిధిగా నియమించి వారి ద్వారా పరిపాలనను సాగించెను. వీటి అన్నిటి ఫలితంగా వేంగీరాజ్యం చోళ సామ్రాజ్యంలో ఒక రాష్ట్రంగా ఏర్పడెను. రాజ్యంలోని తెలుగుప్రజలు చోళుల పరిపాలనలోకి వచ్చారు.

తూర్పు చాళుక్యుల రాజ్యకాలంలో తెలుగు దేశంలో జైనమతము శైవము ప్రాధాన్యాన్ని వహించాయి. రాజులు అనేక శివాలయాలను కట్టించారు. ద్రాక్షారామంలోని భీమేశ్వరాలయం వాటిలో ఒకటి. బ్రాహ్మణులకు సేనానులకు మంత్రులకు అనేక గ్రామాలు దానం చెయ్యబడ్డాయి. అగ్రహారాలు వైదిక విద్యలకు కేంద్రాలుగా ప్రఖ్యాతిగాంచాయి. యుద్ధాల మూలంగా శాంతిభద్రతలకు భంగం కలిగినా మొత్తంమీద ప్రజలు సిరిసంపదలతో జీవితాన్ని గడపగలవారయ్యారు. నన్నయభట్టు గావించిన మహాభారత రచనతో తెలుగు వాఙ్మయాభివృద్ధికి గట్టి పునాదులు ఏర్పడ్డాయి. ప్రారంభంలో తూర్పు చాళుక్యులు కర్ణాటకులైనా, కర్ణాటకభాష వారిమాతృభాష అయినా కాలక్రమాన వారు తెలుగువారై, తెలుగు వాఙ్మయానికి పునాదులు వేసినవారు కావడంచేత తెలుగు దేశచరిత్రలో వారికీర్తి చిరస్థాయిగా ఉండిపోయింది. ఇందుచేత వారు తెలుగువారికి చిరస్మరణీయులయ్యారు.

తెలుగు చోళులు

తూర్పుచాళుక్యుల వేంగీరాజ్యం ప్రతిభను కోల్పోయిన తర్వాత తెలుగుదేశంలో తెలుగుచోళులనే పేరిట అనేక రాజవంశాలు ప్రసిద్ధిగాంచినాయి. ఈ వంశాలన్నిటిలోకి చోళులనే పేరు ఉండడంచేత ద్రావిడదేశంలో చోళులతో వీరికి చారిత్రకమైన సంబంధం ఉండినట్లు తోచుచున్నది. బహుశః వీరు చోళవంశానికి చెందినవారై తెలుగుదేశానికి వచ్చి తమ అధికారాన్ని అక్కడక్కడ స్థాపించుకొని ఉండవచ్చు. చాళుక్యులు చంద్రవంశానికి చెందినవారు కాగా వీరు సూర్యవంశానికి చెందినట్లు చెప్పుకొన్నారు. వీరిలో కొందరు తాము చోళత్రినేత్రునియొక్కయు కరికాలుని యొక్కయు సంతతివారైనట్లు వారి శాసనాలలో పేర్కొన్నారు. కొందరు తూర్పుచాళుక్యుల ఆడపిల్లలను వివాహమాడినందున వారితోకూడ సంబంధాల్ని కలుపుకొన్నారు.

ఈ తెలుగు చోళుల వంశాలవారు వారు పరిపాలించిన ప్రాంతాలనుబట్టి వెలనాటి చోళులని, పొత్తపినాటి చోళులని, కమ్మనాటి చోళులని, నెల్లూరు చోళులని పేర్కొనబడ్డారు. కులోత్తుంగుని కాలములోను అటు తర్వాతను వెలనాటిచోళులు చోళసామ్రాజ్యానికి ప్రతినిధులుగా కృష్ణా గోదావరి ప్రాంతాలను పాలించారు. కమ్మనాటి చోళులు కొణిదెన రాజధానిగా గుంటూరు జిల్లాలో చాలా భాగానికి పరిపాలకులయ్యారు. కుమారసంభవగ్రంథ కర్త నన్నెచోళుడు ఈ శాఖకు చెందినవాడు. వీరు 1050 మొదలు 1300 వరకూ చోళులకు కాకతీయులకు

సామంతులుగానుండిరి. ఆనాటి రాజులందరివలె వీరుకూడా శివాలయాలను ప్రతిష్ఠించడంలోను అగ్రహారాలు దానం చేయండంలోను ఆసక్తిని ప్రదర్శించారు.

పొత్తపిచోళులు కడపజిల్లాలోని పొత్తపి రాజధానిగా 15వ శతాబ్దంవరకు పాలించారు. వీరు పరిస్థితులకు అనుగుణంగా చోళులకు, పశ్చిమ చాళుక్యులకు, కాకతీయులకు, పాండ్యులకు, విజయనగర రాజులకు సామంతులుగ నుండిరి. వీరుకూడా దైవభక్తి బ్రాహ్మణభక్తి కలవారై అనేక భూదానాలను చేసినవారు.

నెల్లూరులోని చోళులు 1100 నుండి 1320 వరకు ప్రసిద్ధిగాంచిరి. ఈ వంశానికి చెందిన 12 గురు రాజులలో కొందరు పాండ్యులు మొదలగువారితో యుద్ధముచేసి, ఘనవిజయాలను సాధించినారు. ఒకప్పుడు కంచినికూడ స్వాధీనపరచుకొనిరి. చోళులకు, కాకతీయులకు సామంతులై వారికి యుద్ధములలో సహాయపడుచుండిరి. వీరి శాసనములు తెలుగు, సంస్కృతము, అరవము, గ్రంధి, కన్నడ లిపిలలో ఉన్నందున వీరి అధికారము అనేక ప్రాంతాలలో వ్యాపించినట్లు చెప్పవచ్చును. ఎర్రసిద్ధి, మనుమసిద్ధి, తిక్కసిద్ధి, మొదలైనవారు ఈ వంశములోనివారు. తిక్కనసోమయాజి తన నిర్వచనోత్తర రామాయణాన్ని, మహాభారతములోని పదిహేను పర్వాలను ఈ రాజుల ప్రోత్సాహముననే రచించెను. వీరి కీర్తికి వీరిక్షాత్రము, సాధించిన విజయాలు ఆధారములైనను, వీరిద్వారా తెలుగు వాఙ్మయము అభివృద్ధిగాంచినందున వీరికి శాశ్వత కీర్తి లభించినట్లు చెప్పవచ్చును.

12వ శతాబ్దంనుండి చారిత్రక రంగాన్ని అధిరోహించిన మాండలిక పరిపాలకులలో తెలుగు చోళులుకాక మరికొందరు కూడా ఉండిరి. వీరిలో పిష్ఠపురం (ఇప్పటి పిఠాపురం), ఎలమంచిలి, కోనమండలాన్ని పాలించిన వారు కొంత ప్రసిద్ధిని సంపాదించిరి.

సామ్రాజ్యాలు రాజ్యాలు మారుతూ వచ్చినా సాధారణంగా స్థానిక పరిపాలకులు సుస్థిరంగా అధికారాన్ని చెలాయిస్తూ ఉండడం అనాదిగా మన రాజకీయ వ్యవస్థకు ఒక ప్రధాన లక్షణం. ఏగాలికి ఆ గొడుగు అనే సూత్రాన్ని ఆధారం చేసుకొని ఎవరు చక్రవర్తులైతే వారికి సామంతులుగా ప్రవర్తించుటకు అలవాటు పడినారు. ఇతర దేశాలలోని ఫ్యూడల్ అధికారులతో వీరు కొంతవరకు పోల్చదగినవారు. కాని ఆ దేశాలలో ఫ్యూడల్ వ్యవస్థయు దానితో కూడిన వికేంద్రీకృత పరిపాలనా విధానమూ ఒక యుగానికి మాత్రము పరిమితమై తర్వాత అదృశ్యమైపోయింది. మనదేశంలో అలాగుకాక ఇటీవలివరకు ఇది ప్రాధాన్యం వహించి ఉండింది. చక్రవర్తులయొక్కయు రాజుల యొక్కయు అధికారానికంటె ప్రజలదృష్టిలో వీరిదే వాస్తవమైన అధికారం.

కాకతీయ రాజులు

శాతవాహనుల తర్వాత తెలుగుదేశ రాజకీయ సమైక్యతను సమగ్రతను నిలబెట్టినవారు కాకతీయ రాజులు. ఇందులో ఒక విశిష్టతకూడా కనుపిస్తుంది. వీరు స్వచ్ఛమైన తెలుగువారు. ఆర్యావర్తంనుండి వచ్చి, ప్రాకృతభాషను మాట్లాడుచుండిన శాతవాహనులవంటి వారుకారు. తెలుగు గడ్డపై పుట్టి పెరిగి తెలుగుభాషను మాట్లాడుచుండిన వారు. దీనికి తోడు వీరు చతుర్థకులజులు. శాతవాహనులు అగ్రవర్ణానికి చెందినవారు. తూర్పు చాళుక్యులు క్షత్రియులు. కర్ణాటక దేశంనుండి వచ్చినవారు. వారి మాతృభాష కర్ణాటము.

కాకతీయ రాజ్యానికి కేంద్రం కోస్తా తెలుగుదేశం కాదు. అది దేశంలోపలి మెట్టప్రాంతం. వీరిలో మొదటి రాజు కాకతి ప్రోలరాజు (1050–1080), ఆఖరు రాజు ప్రతాపరుద్రుడు (1290–1323). వీరిద్దరిమధ్య ఆర్గురు రాజ్యంచేశారు. వీరిలో 1158 మొదలు 1195 వరకు పాలించిన రుద్రదేవుడు. 1198 మొదలు 1261 వరకు పాలించిన గణపతిదేవుడు, 1258 నుండి1296 వరకు పాలించిన అతని కుమార్తె రుద్రమదేవి సుప్రసిద్ధులు. వీరు క్రమక్రమముగ తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని ఇరుగు పొరుగుననుండిన దొమ్మెరాజు, మైలిగదేవుడు, చోడోదయుడు, వెలనాటి చోడులు మొదలగు వారినోడించిరి. గణపతిదేవుడు కళింగములోని దక్షిణ భాగమును, గుంటూరు, నెల్లూరు, కడప ప్రాంతాలను జయించెను. వీరును, రుద్రాంబికయు దేవగిరి యాదవుల నుండి వచ్చిన ప్రమాదాన్ని ఎదుర్కొన్నారు. ప్రతాపరుద్రుడు సింహాసనమునకు వచ్చునాటికి ఆంధ్రదేశమంతయు కాకతీయుల పాలనలోకి వచ్చెను.

ఇతని రాజ్యకాలములో ఢిల్లీసుల్తాను దక్కనుపై దండయాత్రలు సాగించి, యాదవరాజ్యాన్ని వశపరచుకొని ఓరుగల్లుపై పడ్డాడు. 1302, 1309 యాత్రలలో ప్రతాపరుద్రుడు వారినోడించెను. కాని 1310లో వారి దండయాత్రను ప్రతిఘటించుకొనలేక, వారికి కప్పము కట్టుట కంగీకరించెను. 1318లో వారు ఓరుగల్లును ముట్టడించి ప్రతిహతులైరి. 1323లో వారు తిరిగి ముట్టడించగా ప్రతాపరుద్రుడు వారికి లొంగిపోయి, ఢిల్లీకి పంపబడగా దారిలో మృతిచెందెను. దీనితో కాకతీయుల ప్రతిభ అస్తమించెను.

రుద్రదేవుడు ఏకశిలానగరమును– ఓరుగల్లును – నిర్మాణము చేసెను. రుద్రాంబిక దానిని బలిష్టమైన దుర్గముగ మార్చెను. ఇది కాకతీయులకు రాజధానియై ఆలయములకు చిత్రకళలకు, వర్తక వ్యాపారములకు కేంద్రమయ్యెను. కాకతీయరాజులు విద్యల నన్నిటిని పోషించిరి. విద్యానాథుని ప్రతాపరుద్రయశోభూషణమను అలంకార శాస్త్రము, తెనుగులో అనేక ఉద్గ్రంథములు వీరి కాలమునాటివే. వీరు శైవమతమును ఎక్కువగా ప్రోత్సహించి వీరు అడవులను ఛేదించి, గ్రామాలను ఏర్పరచి, వ్యవసాయానికి అనుకూలముగా అనేక తటాకములను నిర్మించిరి. వీరి కాలమున తూర్పుతీరములలోని మోటుపల్లి విదేశవ్యాపారమునకు కేంద్రముగా ప్రసిద్ధిగాంచెను.

ముసునూరి నాయకులు

ఓరుగల్లు పతనముతో తెలుగుదేశమేకాక దక్షిణ భారతదేశమంతయు స్వాతంత్ర్యమును కోల్పోయి ఢిల్లీ సుల్తానుల వశమయ్యెను. వారు

పెట్టు బాధలను విధ్వంసక చర్యలను భరించలేక ప్రతాపరుద్రుని కొలువులో ఉండిన నాయకులనేకులు ముసునూరి ప్రోలయనాయకుని ఆధ్వర్యమున తిరుగుబాటుచేసి 1336 నాటికి తీరస్థ ఆంధ్రదేశమును వశపరచుకొనిరి. ప్రోలయ నాయకుని తర్వాత అతని పినతండ్రి కుమారుడు కాపయనాయకుడు నాయకత్వము వహించి 1358లో ఓరుగల్లును వశపరచుకొని మధ్యాంధ్రమునకు పాలకుడై అప్పటికి కొంత పూర్వము బహ్మని రాజ్యమును స్థాపించిన సుల్తానులతో తరచూ యుద్ధములను సాగించవలసిన వాడయ్యెను. వీటిలో అతడు పూర్తి విజయమును సాధించలేక 1364లో వారితో సంధిజేసుకొని తన రాజ్యములో చాలాభాగము వారికి దత్తముచేసెను. అప్పటికే స్వతంత్రరాజ్యము నొకదానిని స్థాపించదలచుకొన్న రేచర్ల సింగమ నాయకుడు కాపయనాయకునికి బద్ధవిరోధియై అనుమనగల్లు, పిల్లలమఱ్ఱి ప్రాంతములను జయించసాగెను. తుదకు వీరిద్దరిమధ్య యుద్ధములు తప్పలేదు. 1361లో సింగమ నాయకుడు జిల్లిపల్లి కోట ముట్టడిలో చనిపోయెను. అటు పిమ్మట అతని కుమాళ్ళు అనపోతమాదానాయకులు నిరంతరము యుద్ధముల సాగించి భువనగిరి, రాజాచలము మొదలైన కోటలను వశపరచుకొని 1377 ప్రాంతమున భీమవరములో (వరంగల్లు జిల్లాలోనిది) కాపయనాయకుని ఓడించి హతమార్చిరి. అంతటితో ముసునూరి నాయకుల ప్రాబల్యము నశించెను. కాని తెలుగుదేశపు స్వాతంత్ర్యము పునరుద్ధరణమగుటలో వీరు వహించిన పాత్ర అమోఘమైనది.

రేచర్ల వెలమరాజులు

భీమవర యుద్ధంలో కాపయనాయకుని జయించిన ఫలితంగా రేచర్ల వెలమరాజులు కాలక్రమాన తెలంగాణా ప్రాంతమునంతను వారి ఏలుబడిలో తెచ్చుకొనగలిగిరి. ఓరుగల్లును కూడా వారు స్వాధీనపరచుకొన్నారు. వీరు రెండు శాఖలుగా ఏర్పడినను రెండు శాఖలవారు కలసికట్టుగా అన్ని వ్యవహారాలను జరుపుకొనుచుండిరి. ఒక శాఖవారికి రాచకొండయు, ఇంకొక శాఖవారికి దేవరకొండయు రాజధానులుగ నుండెను.

వీరి రాజకీయాలకు బహ్మనీ సుల్తానులతో మైత్రియు, ఆంధ్రప్రాంతములోని కొండవీటిరెడ్డి రాజులతో విరోధమూ ప్రధాన లక్షణాలు. బహ్మనీ సుల్తానులు విజయనగర చక్రవర్తులతో సాగించిన యుద్ధాలలో సుల్తానుల పక్షమును వహించుచుండిరి. అందుచేత విజయనగర చక్రవర్తులు అనేకపర్యాయాలు తెలంగాణాపై దండెత్తి రావడం జరిగింది. రెడ్డి రాజులతో విరోధకారణంగా వీరు వారి రాజ్యంపై దండెత్తడం జరుగుతుండేది. కాని ఏ కారణాల మూలంగానో క్రీ.శ. 1417 లో విజయనగర చక్రవర్తులవశంలో ఉండిన పానుగంటిని సుల్తాను ముట్టడించినప్పుడు వెలమరాజులు విజయనగరపక్షము వహించిరి. సుల్తాను ఓడి పారిపోయెను. అది మొదలు వీరి మధ్య వైరం ప్రబలి సుల్తానులు తెలంగాణాను జయించతలపెట్టిరి. వెలమరాజులు ఈ యుద్ధాలలో చాలా నష్టపడి తుదకు తత్కాలరాజ్యాధిపతియైన కపిలేశ్వర గజపతి సహాయమును అర్థించి సంపాదించిరి. అతని సహాయమున తమ రాజ్యమును తిరిగి సంపాదించుకొనగలిగిరి గాని గజపతులకు సామంతులు కావలసివచ్చినది. కపిలేశ్వర గజపతి మరణానంతరము (1470) ఉత్కళుల సహాయం వీరికి లభించలేదు. అందుచేత సుల్తానులు వీరి కోటలను ఒక్కొక్కటిగా వశపరచుకొని 1485 లో వెలమరాజులను అధికారమునుండి పూర్తిగా తొలగించిరి. అటు తర్వాత వీరు విజయనగర చక్రవర్తుల కొలువులో ప్రవేశించి వారికి అనుచరులైరి.

రాచకొండను దేవరకొండను పాలించిన వెలమ రాజులు (పద్మనాయకులు) శూరాగ్రేసరులు. యుద్ధము చేయుట వారికి ఒక క్రీడగా నుండెను. దీనికి తోడు వారిలో అనేకులు సంస్కృతాంధ్రములలో సాటిలేని పాండిత్యాన్ని సంపాదించి అనేక గ్రంథాలను రచించిరి. అనేక కవులను పోషించి వారిచేత గ్రంథాలను వ్రాయించిరి. సర్వజ్ఞసింగ భూపాలుడు ఈలాటివారిలో అగ్రగణ్యుడు. రేచర్ల వారి అస్తమయంతో తెలంగాణాలో పండితపోషణము సుమారు రెండువందల సంవత్సరాలకాలం అదృశ్యమైంది.

రెడ్డిరాజులు

రెడ్డి రాజ్యమును స్థాపించినవాడు ప్రోలయ వేమారెడ్డి. ఇతడు 1320 ప్రాంతాన ధరణికోటలో ప్రతాపరుద్రునిపై తిరుగుబాటు చేసి స్వతంత్ర్యమును ప్రకటించి అద్దంకి రాజధానిగా తన రాజ్యాన్ని పాలించెను. తర్వాత వీరికి కొండవీడు రాజధాని అయ్యెను. ఇతని పిమ్మట ఆర్గురు పాలించిరి. వీరు కళింగరాజులతోను, వెలమరాజులతోను, తెలుగు చోళులతోను విజయనగర రాజులతోను యుద్ధములను చేయవలసిన వారైరి. తీరస్థ ఆంధ్రదేశమంతయు వీరి పాలనలోకి వచ్చెను.

నాల్గవ రాజైన కుమారగిరిరెడ్డి (1386–1404) 1395 లో తన రాజ్యములో కొంతభాగాన్ని విడదీసి రాజమహేంద్రవరము రాజధానిగా కాటయ వేమారెడ్డికి ఇచ్చెను. రాజమహేంద్ర రెడ్లు తరుచు కళింగముపై దండెత్తి వారి రాజ్యమును విస్తృతపరచుకొనగలిగిరి. 1432 ప్రాంతాన విజయనగర చక్రవర్తి రెండవ దేవరాయలు కొండవీడు రెడ్లను ఓడించి వారి రాజ్యములు వశపరచుకొనెను. 1450 లో కపిలేశ్వర గజపతి రాజమహేంద్ర రెడ్లను ఓడించి వారి రాజ్యమునంతను వశపరచుకొనెను.

రెడ్డి రాజులు శైవమతాభిమానులు, సమస్త విద్యలను ప్రోత్సహించినవారు. వారిలో కొందరు స్వయముగ గ్రంథములను రచించినవారు. కవిత్రయములో ఒకడైన ఎఱ్ఱాప్రగడ, కవిసార్వభౌముడను బిరుదుగాంచిన శ్రీనాథుడు వారి ఆస్థానాలలో కవులుగ ఉండినవారు. వారు బ్రాహ్మణులకు అనేక అగ్రహారాలను ఇచ్చినవారు. ఆయుర్వేదము, జ్యోతిషము వారి ఆదరణకు ప్రత్యేకముగ పాత్రమయ్యెను.

విజయనగర మహారాజులు

దక్షిణభారత దేశాననుండి ఢిల్లీసుల్తానుల అధికారాన్ని పూర్తిగా నిర్మూలించి సుమారు మూడు శతాబ్దాలకాలం తమ సామ్రాజ్యాధికారం

ద్వారా హిందూ ధర్మాన్ని నిలబెట్టినవారు విజయనగర రాజులు. సామ్రాజ్యాన్ని స్థాపించినవారు హరిహరుడు బుక్కరాయలు అను ఇద్దరు సోదరులు. వీరు 1335 లో విద్యారణ్య యతీంద్రుని ఉపదేశానుసారం తుంగభద్రానదీ తీరాన విజయనగరమును నిర్మాణంచేసి దానిని రాజధానిగా చేసుకొని సామ్రాజ్యాన్ని పాలించారు. విజయనగర రాజులందరిలో సర్వవిధాలా ప్రఖ్యాతిగాంచినవారు శ్రీకృష్ణదేవరాయలు(1509–1530). వీరు సర్వదా తమ సామ్రాజ్యానికి ఉత్తరప్రాంతంలో పాలిస్తూవచ్చిన బహ్మనీ సుల్తానులతో యుద్ధంచేయవలసిన వారయ్యారు. బహ్మనీ రాజ్యం అయిదురాజ్యాలుగా చీలిపోయిన తర్వాత కూడా ఈ యుద్ధాలు తప్పినవికావు. తుదకు 1565 లో ఈ రాజ్యాలన్నీ కలసి రాక్షసి–తంగడి యుద్ధంలో విజయనగర సైన్యాలను ఓడించడంతో సామ్రాజ్యం తన ప్రాబల్యాన్ని పూర్తిగా కోల్పోయింది. తర్వాత ఒక శతాబ్ది కాలం పెనుకొండ, చంద్రగిరి మొదలైన నగరాలను రాజధానులుగ జేసుకొని వీరు రాజ్యం చేసినా వీరు తొలి వైభవాన్ని కోల్పోయి నామమాత్రాధికారం కలవారయ్యారు.

విజయనగర రాజులు వారి రాజ్యాన్ని హిందూ ధర్మానుసారం పరిపాలించారు. పోర్చుగీసువారితో స్నేహసంబంధాలు వృద్ధిచేసుకొని తమ సైనిక బలాన్ని పెంపొందించుకొన్నారు. వర్తక వ్యాపారాలను సర్వవిధాలా ప్రోత్సాహపరిచారు. దేవాలయాలను, గోపురాలను, తటాకాలను నిర్మాణం చేశారు. పండితులను, కవులను పోషించారు. ప్రధానంగా ఆంధ్రవాఙ్మయాభివృద్ధికి వీరు అపారమైన సేవచేశారు. విదేశీయులనేకులు విజయనగరాన్ని సందర్శించి ప్రపంచంలో అంతటి వైభవంగల నగరం ఇంకొకటి లేదని అచ్చెరువు పొందారు. తెలుగు దేశాన్ని పాలించిన వారిలో విజయనగర రాజులు అగ్రస్థానం వహిస్తున్నారు.

నాయక రాజులు

విజయనగర సామ్రాజ్యం ఉచ్ఛస్థితిలో ఉండిన కాలంలో ద్రావిడ దేశంలోని తంజావూరు, మధుర మొదలైన రాష్ట్రాలకు చక్రవర్తుల ప్రతినిధులుగ కొందరు నాయకులు వెళ్ళారు. 1565 తర్వాత వారు స్వతంత్రులై సుమారు 150 సంవత్సరాలకాలం తంజావూరు, మధుల రాజ్యాలను పరిపాలించారు. వీరికే నాయక రాజులని పేరు. వీరి ప్రాబల్యాన తెలుగు సంస్కృతి ఈ ప్రాంతంలో వ్యాపించగలిగింది. వీరి పోషణలోని తెలుగు కవులు కవయిత్రులు అనేక గ్రంథాలు వ్రాసి తెలుగు భాషకు వన్నె తేగలిగారు. నాయకరాజులు తెలుగు దేశాన్ని పాలించినవారు కాకపోయినా తెలుగు సంస్కృతికి వారు చేసిన సేవ కారణంగా వారు తెలుగువారి ప్రశంసకు పాత్రులయ్యారు.

విజయనగర పతనానంతరం తెలుగుదేశంలో పరిపాలనాధికారం వహించిన రాజులు ఉండినా వారు భాషను బట్టిగాని సంస్కృతిని బట్టిగాని తెలుగువారు కాకపోవడం చేత వారిని గురించిన వివరాలు ఈ వ్యాసంలో చేర్చబడలేదు.

(అఖిల భారత తెలుగు సాంస్కృతికోత్సవాల సంచిక 1974)

అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించునాఁడు
ఓరుగల్లున రాజ వీర లాంఛనముగాఁ
బలు శస్త్రశాలలు నిలుపునాఁడు

విద్యానగర రాజ వీధులఁగవితకు
పెండ్లి పందిండ్లు కప్పించునాఁడు
పొట్నూరికి సమీపమున నాంధ్రసామ్రాజ్య
దిగ్జయస్తంభమెత్తించునాఁడు
ఆంధ్ర సంతతి కే మహితాభిమాన
దివ్యదీక్షాసుఖస్ఫూర్తి తీవరించె
నా మహావేశ మర్థించి యాంధ్రులారా!
చల్లుడాంధ్ర లోకమున నక్షతలు నేడు.

– రాయప్రోలు సుబ్బారావు

భావరాజు వేంకట కృష్ణారావు

భారత చరిత్రలో ఆంధ్రుల స్థానం

ఇదియొక శుభ సమయము. గత కాలమువైపు ఒకసారి మానసిక దృష్టి సారించి సింహావలోకనము చేయుదము! సరిగా నేటికి ఆరువందల ముప్పయి సంవత్సరముల క్రిందట, క్షయ సంవత్సర అధిక భాద్రపద మాసమున దక్షిణాపథ పూర్వ దిగ్భాగమునందు ఆసేతు నర్మదా పర్యంతము తేజో విలాసవంతమై బలదర్ప వైభవోపేతమై విరాజిల్లిన కాకతీయాంధ్ర మహా సామ్రాజ్యము, దానితో పాటు అఖండమై విలసిల్లిన అఖిలాంధ్ర భూభాగము క్షయమై, కూలిపోయి నామ మాత్రావశిష్టమయ్యెను. మూడు భాగములుగా విడిపోయిన ఆంధ్ర భూఖండము నేడు మరల ఏకము కానున్నది. అఖండముగా, అఖిలముగా అభ్యుదయపరంపరాశాభావముతో అవతరించుచున్నది. క్రీస్తుశకము 1326 మొదలుకొని 1956 వరకు గల కాలస్రవంతి ఎన్ని చిత్రవైచిత్రములను, ఎన్ని విషమ ఘట్టములను, ఎంతమంది మహాపురుషులను, నారీరత్నములను, ఎన్ని ఘన కార్యములను దిలకించి యున్నదో సింహావలోకనము చేయుదము. కాకతీయాంధ్ర మహా సామ్రాజ్యము క్షయమైపోయినను, ఆంధ్రుల ప్రతిభ, ప్రజ్ఞా దౌరంధర్యము, కార్యదీక్ష, దేశభక్తి, ఐక్యభావము, లక్ష్యము, జీర్ణించి పోలేదు. వేళ్ళు పాదుకొని, కూకటి వేరుతో మూలస్కంధము బలీయమై, మహా వృక్షమై, శాఖోపశాఖలు కల్గి, చేవదేరి తేజముతో జీవించియున్నది. కావుననే ఈ యాంధ్ర జాతికి ఒక భవిష్యత్తు, ఒక శోభావంతమైన మేలుకాలము కలదను ఆశాభావము అవతరించుచున్నది. ఆంధ్ర ప్రదేశమను నవ్యనామకరణముతో అవతరణమగుచున్న అఖండాంధ్ర భూమియందు ఆంధ్ర ప్రజ తమ తొల్లింటి వైభవముతో సాటియగు దానిని మరల సాధించి, తిరిగి మిన్నతనము నందగలరనుట నిస్సంశయము.

ఆంధ్ర ప్రజలొకనాడు సాధించిన ఘన కార్యములను స్మరించుకొనినప్పుడు ఈనాటి యాంధ్రులు ఆ ప్రాచీనాంధ్రుల సంతతి – దేనిని సాధింపజాలరు? అని ధైర్యము, సాహసముతో కూడిన ఆశాభావము అంకురించుచుండును. ఆంధ్రుల కార్యదీక్షను మరింత నుద్దీపింప జేయుచుండును. పూర్వము ఆంధ్రప్రజ సాధించిన వాటిని కొన్నింటిని సగర్వముగా స్మరింప వచ్చును. కాకతీయ చక్రవర్తులకు పూర్వము వర్ధిల్లినవాటినిపుడు తలపనక్కరలేదు. ఆ కాలము తరువాత సాధించినవే చెప్పుకొనతగినవి చాలా కలవు. సామ్రాజ్య స్థాపకులైన చక్రవర్తు లీ ఆరువందల సంవత్సరముల కాలమందు గూడ నవతరించిరి. కవిరాజ మార్గమున దీపులు నిలిపిన మహా కవులు, సంగీత, నృత్య, నాట్యాభినయనాది విద్యలం దారితేరిన భరత శాస్త్రవేత్తలు, కావ్య నాటకాలంకార తర్క వ్యాకరణ మీమాంసాది శాస్త్రపారంగతులు, శిల్పులు, చిత్రకారులు, పుర నిర్మాతలు, రాజ్య కార్యనిర్వహణదక్షులు, మహామతులైన మంత్రులు ఎందరెందరో ఈ కాలమున జన్మించి, ఘన కార్యములను సాధించి యశఃకాయులైరి. కాకతీయుల యనంతరము రాజ్య స్థాపకులయిన రాజవంశము లనేకములు గలవు. రెడ్డి భూపాలురు వారిలో ఆద్యులు. వారిలో

ప్రోలయ వౌరి, వేమారెడ్డి, అనవేమ భూపతి, కుమారగిరి, కోమటి వేమా రెడ్డి, కాటయ వేముడు, అల్లయ వేమభూపాలుడు మున్నగు మహనీయు లెందరో గలరు. సంస్కృతాంధ్ర భాషలు వారల పోషణ క్రింద సమానముగ వర్ధిల్లియుండెను. ఆనాటి భరత చరిత్రయందు సంస్కృత సాహిత్యమునకు ఆంధ్రులు చేసిన కృషి యసమానము. రాచకొండ వెలమ భూపతులలో వీరులలో రావు సింగభూపాలుడు (సర్వజ్ఞ సింగభూపతి) వంటివారెందరో యుద్భవించిరి. విజయనగర మహాసామ్రాజ్యమున కీ కాలమందే పునాది వేయబడెను. హరిహరరాయలు, బుక్కరాయులు, సాళువ నరసింహరాయలు, కృష్ణదేవరాయలు, అళియ రామనృపాలుడు వంటి చక్రవర్తులెందరో యవతరించి యాంధ్రభూమి కఖండమైన కీర్తి నార్జించిరి. కృష్ణదేవ మహారాయలవంటి చక్రవర్తి, ఆహవ కార్యదక్షుడు, విజేత, సామ్రాజ్యస్థాత, కవి, మనీషి, రాజనీతి ధురంధరుడు నాటి కాలము మొదలుకొని నేటివరకు ఆంధ్రదేశమందేగాక, సకల భారతావనియందు సయితము అవతరించలేదు. అతని కతడే సాటి. కాకతీయ సామ్రాజ్యానంతరము ప్రతాపరుద్రుడు బందీగా పట్టుబడిపోయిన తరువాత, క్రుంగిపోయిన ఆంధ్రజాతిని మరల మహోచ్ఛదశకు దెచ్చి నిలిపిన మహానుభావుడు సార్వభౌముడు కృష్ణరాయలు. మరియు పదునాల్గవ శతాబ్దమాదిగా, మాధవ విద్యారణ్యుడు, రామయ మంత్రి, మామిడి సింగనామాత్యుడు, బెండపూడి అన్నయ మంత్రిశేఖరుడు, నాదెండ్ల చిటి గంగనామాత్యుడు, రాచిరాజు తిమ్మరసు, అక్కన మాదన మంత్రులవంటి గురుభార్గవ సదృశులయిన రాజ్యకార్య దురంధరులు అవతరించిన పుణ్యకాల మిది. అట్టి మహనీయుల వంటి మహామంత్రులు భరతచరిత్రయందు సయిత మీ కాలమున గానరారు. దిగంత విశ్రాంతమైన గోలకొండ కుతుబుశాహీల సామ్రాజ్యము అఖిలాంధ్ర భూఖండమందు విస్తరించెను. తెలుగు వీరులు, మంత్రులు, ఆంధ్రనాయకు లెందరెందరో గోల్కొండ సామ్రాజ్యమున కఖండ యశో వైభవములను సమకూర్చియుండిరి. ఈ కాలమునందే తంజావూరు, మధుర రాజ్యములందు ఆంధ్ర నాయక రాజులు రాజ్యకర్తలై కీర్తి నార్జించిరి. అటు ఢిల్లీ నుండి, దక్షిణమున తంజాపుర, మధురా పట్టణములవరకు ఆంధ్రుల కీర్తి వైభవములు విస్తరించిన కాలమది.

కవి ప్రకాండులు, పండితులు మున్నగువారి మాట తలచినప్పుడు ఎఱ్ఱాప్రగడ, నాచన సోముడు, కవిసార్వభౌమ శ్రీనాథభట్టు, అందరికంటె నొకవిధముగా అతి మిన్నయైన బమ్మెర పోతనరాజు, కృష్ణరాయ కవీంద్రుడు, అష్టదిగ్గజము లని ప్రఖ్యాతి గాంచిన పెద్దనాది మహాకవులు, పింగళి సూరన, రామరాజ భూషణుడు, తెనాలి రామకృష్ణకవి, కంకంటి పాపరాజు, రామభద్రాంబ, రఘునాథ భూపాలుడు – మొదలయిన సుకవి శ్రేష్ఠులీ యుగమందు జన్మించి యశము గూర్చినారు. వారు రచించిన గ్రంథముల కావ్యములు అన్యప్రాంతముల వారికి తెలియవు. కాని యీ ఆరునూరేండ్ల కాలమందు భరతావనియందు వెలసిన దేశభాషల సారస్వతములోకెల్ల ఆంధ్ర భాషా సారస్వతము ఉన్నతస్థాయి నలంకరింపగలదు. ఆంధ్ర కవుల గొప్పతనము తెనుగువారికే సరిగా తెలియని యీ దుష్కాలము.

ఈ విధముగా ఒక్కొక్క శాస్త్రమందు, విద్యయందు అశేష శేముషీ దురంధరులయినవారు, ఆంధ్రభాషకుమాత్రమే గాక సంస్కృత భాషకు, సంస్కృత సారస్వతమునకు సేవచేసి, సౌరభము, యశస్సు సంపాదించి, సకలభారతావనిలో ఆంధ్రులకు ఒక విశిష్టమైన గొప్పస్థానమున్నదని నిరూపించిరి. సాహిత్యము, అలంకారశాస్త్రము, సంగీతము, కావ్య, మహాకావ్య లఘు కావ్యరచనలందు, దృశ్య, శ్రవ్యరచనలందు పేరు ప్రతిష్ఠలందుకొన్న మహామేధావులైన ఆంధ్రులు ఎందరెందరోగలరు. వారందరిపేర్లను ఇపుడు మాలగాగ్రుచ్చి వివరించుటకు స్థలంచాలదు. ఆంధ్రుల పాండిత్య వైభవ సంపదను అఖిల భారతదేశమందు స్థిరముగా నిల్పి ఖ్యాతిగన్న ఉపద్రష్ట జగన్నాథ పండితరాయలను నొక్కరిని స్మరించిన చాలును. నేటికిని రాజస్థానములోని జయపురి సంస్థానమందు విద్వత్కవులై, ఆస్థానకవులై విఖ్యాతి జెందినవారు ఆంధ్ర కుటుంబమువారలే!

ఆంధ్రుల రాజ్యకార్య నిర్వహణ దక్షత సర్వతోముఖమైనది. కాకతీయులనాడే ఆంధ్రదేశమున పన్నులు విధించు విధానము, గ్రామ స్వయం పరిపాలనము, వాణిజ్యము పెంపుచేయు మార్గములు, నాణెముల చలామణి పద్ధతి మొదలైన నేడచ్చెరువు కల్గింపగల యుచ్ఛస్థితికి వచ్చియుండెను. కాకతీయులనాడు సంతలందు "అమ్మబడి" పన్ను విధింపబడు చుండెను. ఈ "అమ్మబడి" పన్నును మనవారు సేల్సుటాక్సు అని వ్యవహరించుచున్నారు. కాకతీయులనాడు విశిష్టతగాంచిన దేశపాలనా విధానము, గ్రామ పరిపాలనా విధానము విజయనగర సామ్రాజ్యమందు పరిపూర్ణత నొంది, తరువాతి కాలమున విస్తరించిన మహారాష్ట్ర సామ్రాజ్యమునందు అనుసరణీయమైన యోగ్యత గాంచెను. ఈమాట ఒకసారి లోకమాన్య బాలగంగాధర తిలక్ మహాశయుడే వచించెను.

సంఘ సంస్కరణ కార్యాచరణమందు ముందంజవేసి దేశమునకు ఘనమైన యశము నార్జించినది ఆంధ్రులు. వీరేశలింగం పంతులు సంఘ సంస్కరణకర్తయై, దీక్షవహించి కృషి చేసి భరతఖండ పటమునందు ఆంధ్రజాతికి ఒక విశిష్టమైన తావులు సంపాదించినారు. వంగదేశీయులైన రాజా రామమోహనరాయులు, ఈశ్వరచంద్ర విద్యాసాగరు లెంతటి ఘనకార్యములు సాధించారో, యంతటి ఘనకార్యమును సాధించి దిగంత విశ్రాంతమైన కీర్తినార్జించినారు వీరేశలింగం పంతులు. వంగదేశమున ఆవిర్భవించిన జాతీయోద్యమమునకు, స్వాతంత్ర్య సమర సన్నాహమునకు ఆంధ్రుల దేశాభిమానము, అకుంఠిత దీక్ష, కార్యాచరణములు ఇంధనములుగా పరిణమించెను. ఆంధ్రుల స్వార్థత్యాగబుద్ధి అఖిల భారత ప్రపంచమును ఆశ్చర్యమగ్నమానసులను చేయజాలెను. స్వాతంత్ర్య సాధనకై భారతనాయకులతో పాటు అహింసాత్మకమైన మహాసంగ్రామమునందు ఆంధ్రులత్యద్భుతముగ పాల్గొనిరి. ప్రత్యేకాంధ్రరాష్ట్ర సంపాదనోద్యమమును ఒకింతకాలము నిలిపి స్వాతంత్ర్య సంపాదనకై సంసిద్ధులైరి. సమయము వచ్చినప్పుడు ప్రాణములపై ఆశవీడి ఆంధ్రరాష్ట్ర సంపాదనకు, భాషాప్రయుక్త రాష్ట్రముల నిర్మాణమునకు, అసాధారణమైనది, అద్వితీయమైనది, ఆశ్చర్యము గొల్పినది అయిన మహాత్యాగమును జూపి ప్రాయోపవేశమును చేసిన ఆంధ్ర వీరుడు అమరజీవి పొట్టి శ్రీరాములు. ఆంధ్రజాతి, ఆంధ్ర దేశము లెట్టివో భారతదేశమునకు త్రుళ్ళిపడి లేచునట్లు చేయగల్గెను ఆ మహామహితాత్ముడు శ్రీరాములు.

ఈ విధముగ గత కాలమును ఒకసారి తేరిపార జూచినపుడు, సింహావలోకనము జేసినపుడు ఆంధ్రజాతి ప్రతిభ, దేశాభిమానము, శక్తి, పౌరుషము, కార్యదీక్ష, ధౌరంధర్యము, గాంభీర్యము, త్యాగశీలము మున్నగు ఉత్తమ గుణములు మరల యీ రానున్న కాలమున నూత్న తేజముతో విజృంభించగలవను ఆశాభావము జనించును. అఖిలాంధ్రమును ఆంధ్రప్రదేశమను నవ్య నామకరణముతో నుదయించుచున్న యీ తరుణమందు ఆంధ్రజాతికి ఒక సందేశ మత్యవసరము. అట్టి సందేశము చరిత్రవలన నేర్చుకొన్న గుణపాఠము ప్రజ్ఞాన్వితులైన ఆంధ్రప్రజను, ఆంధ్రనాయకులను

కాకతీయ సామ్రాజ్య వినాశహేతువులైన దుర్గుణములు కొన్ని నాటి నుండి నేటివరకు ఒక రూపమున గాకపోయినను మరియొక రూపముతో నైనను నిలచియున్నవి. జాతి మత కులభేదములు, వర్గద్వేషములు పాలకులను, పాలితులనుకూడా సమానముగ పీడించుచు, ప్రజను, పాలకులనుగూడా నిర్వీర్యులనుజేయుచూ, అంతర్ద్వేషములను, అమిత్రతను, అసహనమును పుట్టించుచున్నవి. ఆరువందల ముప్పదిఏండ్ల క్రిందట ఈ జాతి మత, వర్గద్వేషములు కాకతీయ సామ్రాజ్య విచ్ఛిన్నతకు కారణములయ్యెను. వీరరుద్రదేవనృపతి బందీగా తురుష్క సేనానులచే పట్టుబడుటకు దుస్సాధ్యమైన ఓరుగల్లు దుర్గము విపక్షులకు సులభముగా వశమగుటకును వర్ణ విభేదములు, కుల వైషమ్యములు, జాతి విద్వేషములు అనల జ్వాలలై ఎగసి కాకతీయ మహాంధ్ర సామ్రాజ్యమును బూడిద చేసియుండెను. రాచకొండ పద్మనాయక వెలమ ప్రభువులు, వైష్ణవ, శైవ ధర్మములు కారణములు జేసికొని కొండవీడు, రాజమహేంద్రవరం రెడ్డి భూపతులతో ఎడతెగని నిరంతరము వైరానలమును రగులుకొల్పుచు పోరాడుచు ప్రజను సంక్షోభింపజేసిరి. స్వమతస్థులను, స్వజాతీయులను ద్వేషించి విజాతీయులను విమతస్థులను విదేశీయులునగు తురుష్కుల నాశ్రయించి బహమనీ సుల్తానులతోడి మైత్రి స్థిరమని భావించి వెలమ భూపతులు అటు విజయనగర చక్రవర్తులతోడను, ఇటు రెడ్డి క్ష్మాపతుల తోడను వైరము దెచ్చుకొనిరి. చివరకు తాము కూలిపోయి నాశము నొందుటయేగాక, రెడ్డి రాజ్యముకూడ కూలిపోవుటకు కారణభూతులయిరి. విజయనగర సామ్రాజ్యము తల్లికోట యుద్ధము కారణముగా మట్టికుండవలె మాయమైపోవుటకు ఆరవేటి రాజవంశమువారలు రాజ్యభారమును బూని కుల, మత ద్వేషములను పెంచుకొని సంఘీభావమునకు స్వస్తిచెప్పిన విధానము మూలకారణము.

విజయనగరాంధ్ర సామ్రాజ్యము విధ్వస్తమైనదాదిగా నాలుగువందల సంవత్సరములు ఆంధ్రజాతి మరల నైక్యమగుటకు తహతహ లాడినది. ఆర్తియై కృశించినది. అఖండముగా వర్ధిల్లిన అఖిలాంధ్ర భూమి ఖిలమైపోయినది. ఆంధ్ర జాతి యందు ప్రాంతీయ భావములు, ప్రాంతీయ భేదములు అంకురించియుండెను. అక్కడక్కడ మహా పురుషులు ప్రత్యేక వ్యక్తులుగా నవతరించిరీ కాలమున. కాని జాతియైక్యత సాధింపబడుటకు అవాంతరములు పరంపరగా నేర్పడియెను. ఏ చారిత్రాత్మకమైన ఏ కారణముల మూలముగా ఆంధ్రభూమి ఖండఖండము లయ్యెనో ఆ కారణములు వాటి యంతట యవి అంతర్ధానములయ్యెను. శుభ సమయ మేతెంచి అఖిలాంధ్రమైన ఆంధ్ర ప్రదేశము ఏర్పడినది.

ఇంతవరకు స్థూలదృష్టితో గత కాలమును సింహావలోకనము చేసితిమి. బుద్ధిశాలురైన మన ప్రజలు, నాయకులు వెనుకటి కాలమందువలె మరల ముందు కాలమందుగూడ సంకుచిత భావములతో నడచి ప్రమాదకరమైన దుష్ట పరిస్థితులకు త్రోవలు తీయరాదు. మరల వర్ణ, జాతి, కుల, మత ధర్మ విభేదములను నెమరువేయుచు, ప్రాంతీయ దురభిమానమును తలనెత్తజేసి దుష్టకాలమును మరల బుసకొట్టనీయరాదు. వెలుపలకు రాకుండజేసి, లోపలకు దించుకొనిపోవు ఊబిలోనికి మన రాజనీతివేత్తలు ప్రజను దేశమును దింపరాదు. రాక రాక వచ్చినది ఆరువందల ముప్పది సంవత్సరములకు మరియొక అవకాశము. సకలాంధ్రవనియు నేడు అఖండాంధ్ర భూమియైనది. ఈ శుభ సమయమువేళ తురుష్క, మొగలు సాంప్రదాయములతో వెలసి వర్ధిల్లిన హైదరాబాద్ నగరము మరల భారతీయ సంప్రదాయములతో భాగ్యనగర నామకరణముతో నవతరించునను ఆశాభావము అంకురించు చున్నది. సకలాంధ్రము నే దఖండాంధ్ర మగుట ఈ యాశా భావమునకు కారణము; ఉద్బోధకముగూడ నగుచున్నది.

భారతీయులకు సంపూర్ణ స్వాతంత్ర్యము సంప్రాప్తించి ఇప్పటికి తొమ్మిదియేండ్లు గతించెను. ఒక లెక్క ననుసరించి అయిదేండ్లొక యుగము. ఆ మేరకు రెండవ యుగము ఇంక రెండేండ్లలో ముగియగలదు. సంపూర్ణ స్వాతంత్ర్యమును సంపాదించుకొన్నది మొదలు భరతదేశముతో పాటు ఆంధ్ర దేశముకూడ నొక మహా విప్లవ ప్రవాహమునందు - అహింసాత్మకమైన విప్లవమందుపడి కొట్టుకొనిపోవుచున్నది. ఈ మహావిప్లవ స్రవంతికి గమ్యస్థానమెక్కడో, దీని స్వభావ మెట్టిదో గుర్తింపజాలక, అవగాహన చేసికొనజాలక ప్రజలు, వారి నాయకులుకూడా మహానాయకుని యాదేశానుసారము ప్రవాహమునబడి కొట్టుకొని పోవుచున్నారు. ఎల్లవారలు అభ్యుదయ పరంపరాభివృద్ధినే అభిలషించుచున్నారు. కాలము-సర్వకాలము ఒక్కరీతిగ సాగిపోదు. మారుచుండును, మారవలయును. మారుచుండుట కాలస్వరూపము; కాలస్వభావము కూడ. కాలము మారకున్న అభివృద్ధి ఉండదు. సర్వము స్తంభించిపోవును. కాల ప్రవాహమున కొట్టుకొనివచ్చు మార్పంతయు విప్లవమో, పరిణామమో లేక ఆ రెండింటి కలయికయో గ్రహింపజాలకున్నారు. మన నాయకులు, ప్రజలును దీని యంతరార్థమును గ్రహించి భవిష్యత్కాలమందు ఆంధ్రప్రజకు - వారితో పాటు భారతీయులందరికిని అభ్యుదయము పరంపరగా సంపాదింపగల నాయకులు మునుపటి కాలమునందువలె వర్ధమాన కాలమందును అవతరింపవలసిన అగత్యము కలిగినది. దేశభాగ్యము దిద్ది గమ్యస్థానము చేర్చగల దక్షుడైన మహానాయకుడు, ధీశాలి, ఉపద్రష్ట నేడు ఆంధ్రభూమికి కావలయును. భవిష్యత్కాలమున ఓడలు బండ్లును, బండ్లు ఓడలును కానున్నవి. అహింసాత్మకమైన ఈ మహావిప్లవమందు, పూర్వచరిత్రయందు వోలె ఆంధ్రప్రజకు నాయకులకు ఒక విద్యుక్త ధర్మము, ఒక స్థానము, కార్య నిర్వహణ భారమును గలవు. కావుననే అఖిలాంధ్రము ఏక ఖండముగా మరల ఈనాడు అవతరించినది.

విచిత్ర గతి నడచుచున్న ఈ అహింసాత్మకమైన విప్లవ మందు ఆంధ్రప్రజలు తమపైనున్న భారమును ఎరుగగల్గు చున్నారు. భారతాభ్యుదయమునకు సర్వతోముఖమైన సహనము, సహకారము, సుహృద్భావము, అత్యావశ్యకములు, హృదయ పరివర్తనము, అన్యోన్య సమీక్ష, సంకుచితభావ విసర్జనము, సంకీర్ణములుగాని తలంపులు అత్యవసరములు.

గతమును తలచినపుడు ఆంధ్రప్రజలయందు విశాలమైన దూరదృష్టిగల మహానాయకుడు, మహామహితాత్ముడు ఈ మహావిప్లవ తరుణమందు అవతరింపనున్నాడని తోచగలదు. గత కాలమునందువోలె మహత్కార్యములను దేశమితైక లక్ష్యముతో, ప్రజాక్షేమైక దృష్టితో నిర్వహించి, సాధించిన వీరులు ఆంధ్రజాతియందు జన్మింపగలరు. ఆంధ్రులది అకుంఠితమైన దేశభక్తి, ఈనాడు ఆంధ్రనాయకులు స్వార్థపరులై చరించి, చక్కని రాజమార్గమునువీడి శూన్యమార్గముల పోజాలరు. వారి సంప్రదాయం అట్టిది! వారి చరిత్ర, ప్రతిభ, అట్టివి. ఆంధ్రప్రజ లొక్కరు సాధింపగల్గిన మహత్కార్యములను వారితో సరిసమానముగ నేయొక్క ఇతర భారతీయ జాతియు సాధింపజాలదు. భావికాలమున ఆంధ్రప్రదేశమునకు, ఆంధ్రులకు, ఆంధ్రభాషకు ఒక మహోన్నత స్థానము గలదు.

ఆచార్య దామెర్ల వేంకట్రావు

ఆంధ్రుల చరిత్రలో స్వర్ణయుగము

విశాలాంధ్ర పురుజ్జీవనమొందే ఈ శుభసమయంలో మరువరాని ఆంధ్రుల సువిశాల చరిత్ర జ్ఞప్తికి రాకతప్పదు. ఏనాటి ఆంధ్రులో, శతశతాబ్దాలుగా వీరి చరిత్రలో ఎల్లాటి ఘట్టాలు నడిచాయో, ఎంతెంత రాజ్యాలనూ సామ్రాజ్యాలనూ ఏలుకున్నారో, భారతీయసంస్కృతీ వికాస పరిణామంలో వీరి స్థానమేమో, ఇదంతా మననం చేసుకోవలసిన సమయమిది.

ఆంధ్రుల ప్రాచీనత

ఆంధ్రుల చరిత్ర అతి పురాతనమైనది. మన శ్రుతుల కాలంనుండీ ఆంధ్రులున్నట్లు ప్రమాణాలు కనపడుతున్నాయి. ఐతరేయ బ్రాహ్మణులలో, మహాభారత రామాయణ ఇతిహాసాలలో, పాణినీపతంజలుల గ్రంథాలలో, పురాణాలలో ఆంధ్రులు దక్షిణాపథంలోని ప్రధాన జాతులలో పేర్కొనబడ్డాదు. ప్రఖ్యాత సూత్రకారులయిన బోధాయనుడు, ఆపస్తంభుడు దక్షిణాపథంలో అనగా ఆనాటి ఆంధ్రభూమిలో సంస్కర్తలు సూత్రకారులునయి మన ఆర్షసంస్కృతికి వన్నెబెట్టిన మహనీయులు. క్రీ.పూ. నాల్గవశతాబ్దాంతంలో యవనుల రాయబారిగా మౌర్యరాజధానికి వచ్చియుండిన మగాస్తనీసు మగధసామ్రాజ్యం తరువాత సైనికబలానికీ, ఐశ్వర్యానికీ, గోదావరీ కృష్ణానదీప్రాంత నివాసులయిన ఆంధ్రులే ఎన్నికగన్న జాతిగా వర్ణించాదు.

మౌర్య చక్రవర్తి అశోకుడు క్రీ.పూ మూడవ శతాబ్దం మధ్యలో ఆంధ్రులను తన సామ్రాజ్యంలో చేర్చబడిన సామంతజాతిగా పేర్కొంటూ తను ప్రబోధించిన ధర్మమార్గాన్ని విశ్వాసంతో అనుకరించిన ప్రజలుగా వీరిని తన శిలాశాసనాల్లో గుర్తించాదు.

ఇవన్నీ ఆంధ్రుల ప్రాచీనతను వ్యక్తపరచే చారిత్రక ప్రమాణాలు.

కథాసాంప్రదాయంలో ఆంధ్రరాజులలో ప్రప్రథములుగా కృష్ణానదీతీరపు కాకుళేశ్వరులయిన సుచంద్రుడు, అతని కుమారుడు ఆంధ్రవిష్ణువు కనుపడుతున్నారు. ఈ ఆంధ్రవిష్ణువు కృష్ణానదీతీరపు శ్రీకాకుళం వద్దనున్న ప్రాచీన దేవాలయంలోని ఆరాధ్యదేవుదై ఆంధ్రజాతి పితామహుదుగా పరిగణింపబడుతున్నాదు.

ఆంధ్రుల విజృంభణం

అశోక చక్రవర్తి అస్తమించినవెంటనే ఆంధ్రులు స్వతంత్రులై శాతవాహనరాజవంశం ఆంధ్రసామ్రాజ్యాన్ని స్థాపించింది. కృష్ణానదీ ప్రాంతం ఆంధ్రదేశానికి ఆయువుపట్టయి ఆ నదీతీరపు

పట్టణాలు ఆంధ్రశాతవాహన సామ్రాజ్యానికి తొలికేంద్రాలై విలసిల్లినవి. తొలుత శ్రీకాకుళం, తరువాత ధాన్యకటకం ముఖ్య పట్టణాలు. ధాన్యకటకం ప్రక్కదే సుప్రసిద్ధ బౌద్ధారామమయిన అమరావతీ క్షేత్రం. క్రీ.పూ.3-వ శతాబ్దాంతంలో గోదావరీ కృష్ణానదుల నడుమ నిమిడిన చిన్నరాజ్యంగా ప్రారంభమయిన శాతవాహనసామ్రాజ్యం క్రీ.శ. 1-వ శతాబ్దంనాటికి అతి విశాలమై, భరత ఖండములోని ముప్పాతిక మువ్వీసం ప్రాంతం అలుముకున్నవి. మగధ సామ్రాజ్యాన్నికూడా జయించి శాతవాహనులు తమ సామ్రాజ్యాన్ని గంగానదివరకు విస్తరింపజేశారు. వాయవ్యాన్ని సింధునదివరకు, దక్షిణాన్ని కావేరివరకు ఈ ఆంధ్ర సామ్రాజ్యం పెరిగిపోయింది. మౌర్య సామ్రాజ్యమయ్యాక ఈ శాతవాహన సామ్రాజ్యమే అఖిల భారతంలో అంత విస్తృతిగాంచి శత శతాబ్దాల పాటు నిలచి వర్ధిల్లిన మహారాజ్యం.

ఆంధ్రుల చరిత్రలో స్వర్ణయుగం

క్రీ.పూ. 1-వ శతాబ్దంనుండి క్రీ.శ.3-వ శతాబ్దంవరకూగల నాలుగు శతాబ్దాల కాలాన్ని ఆంధ్ర చరిత్రలో స్వర్ణయుగంగా గుర్తిస్తున్నాం. క్రీ.శ. 1-వ శతాబ్దంలో అధిక ప్రఖ్యాతిగాంచిన హాలుడు, గౌతమీపుత్ర శ్రీశాతకర్ణి లేక శాలివాహనుడు అన్న ఆంధ్ర చక్రవర్తులు రాజ్యం చేశారు. క్రీ.శ. 78-వ సంవత్సరం ప్రారంభమయిన శాలివాహన శకానికి ఈ గౌతమీపుత్ర శాలివాహనుడే మూలపురుషుడైనాడు. ఈ చక్రవర్తి గాంచిన విజయపరంపరలు, ముఖ్యంగా ఈయన క్షాత్రవులను జయించి సామ్రాజ్యాన్ని వాయవ్యదిక్కున సింధునది వరకూ వ్యాపింపజేసిన ఉదంతం ఈ శకనిర్మాణానికి కారణమైనది. ఆంధ్రుల ప్రభావం ఉన్నత శిఖరాలనందుకొని మరో రెండు శతాబ్దాలపాటు ఆంధ్రుల చరిత్ర మహోజ్వలమానంగా నడిచింది. క్రీ.శ. 2-వ శతాబ్దంలో వాసిష్టీపుత్ర శ్రీశాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణి అన్న మహాచక్రవర్తులేలారు. అప్పటి విస్తృతసామ్రాజ్యానికి గోదావరీతీరస్థపట్టణములయిన నాశిక, పిదప ప్రతిస్థానపురం(పైథన్) ముఖ్యపట్టణాలయ్యాయి.

సామ్రాజ్య విస్తరణ - ఆర్థిక ఐశ్వర్యం

సామ్రాజ్యం విస్తరించి పశ్చిమ సముద్రంనుండి తూర్పు సముద్రంవరకూ, ఉత్తరం సింధునదినుండి దక్షిణం కావేరి వరకూగల విశాలదేశమంతా ఏకఛత్రంక్రిందకు వచ్చిన ఆ కాలమందే ఆంధ్రరాజుల పరిపాలన క్రింద భారత భూమి మహదైశ్వర్య మనుభవించింది. వర్తకవ్యాపారాలు విశ్వవ్యాప్తమై ఆంధ్రులయోడలు సముద్రాలు దాటి పశ్చిమాన్ని రోమను సామ్రాజ్యంనుండి తూర్పున మలయద్వీపాలూ చీనాదేశం వరకూ గల అనేకదేశాలకు మనదేశపు అపురూపసరకులను అందజేసి గడించిన విశేషధనంతో మాతృభూమిని స్వర్ణమయం చేసిన స్వర్ణయుగమది. ఆనాటి మాటే రోమీయ చరిత్రకారుడైన 'ప్లిని' హిందూదేశానికి రోము సామ్రాజ్యపు బంగారమంతా తరలిపోతున్నదని విలపించిన ఉదంతం. దీనికి నిదర్శనంగా దక్షిణాపథ సముద్ర తీరప్రాంతాలలో అనేకచోట్ల ఆనాటి రోము సామ్రాజ్యపు బంగారు నాణాలెన్నో పాతర పాతర్లగా దొరికాయి.

బౌద్ధమత వ్యాప్తి

అశోక చక్రవర్తి ప్రోద్బలంక్రింద ప్రవేశపెట్టబడిన బౌద్ధమతం విశాలవ్యాప్తమై ఆంధ్రసామ్రాజ్యమంతటా ప్రబలమైపోయింది. ఈ బౌద్ధమత వ్యాప్తికి ఆంధ్రరాజులు గొప్ప సహాయకారులయ్యారు. తాము హైందవమతస్థులయినా బౌద్ధమతాన్ని విరివిగా ప్రోత్సహించారు. బౌద్ధమతంలో వెలువడిన మహాయానమనే మతపక్షానికి నిర్మాత, నాయకుడు అయిన నాగార్జునాచార్యుడు క్రీ.శ మొదటి శతాబ్దంలో ఆంధ్రరాజ్యంలో కృష్ణానదీ తీరస్థమయిన శ్రీపర్వతక్షేత్రాన్ని తన కార్యస్థానంగా ఏర్పరచుకొని ఈ మహాయాన బౌద్ధమతాన్ని ప్రపంచానికంతకూ అందచేశాడు. హాల చక్రవర్తి నాగార్జునాచార్యునకు శ్రీపర్వతక్షేత్రంలో నివాసమేర్పరచి ఈ క్షేత్రాన్ని శోభాయమానం చేశాడు. 'గాధాసప్తశతి' ని రచించిన సాహిత్యచక్రవర్తికూడా ఈ హాలుడే. మహాయాన బౌద్ధమతాన్నే పశ్చిమోత్తర భారతంలోని కుషాను సామ్రాజ్యాధినేత అయిన కనిష్క చక్రవర్తి హిమాలయ పర్వతాంతరమయిన ఆసియాఖండాని కంతకూ వెదజల్లాడు. తదాదిగా శీఘ్రగతిని బౌద్ధమతంమధ్య, తూర్పు, ఆగ్నేయ ఆసియాదేశాలనన్నిటినీ అలుముకుంది. కాలగతిని టిబెట్, చీనా, మంగోలియా, మంచూరియా, జపాను, బర్మా, సయాం, కాంబోడియా, మలయాదీవులు బౌద్ధమతానికి విశాలాలవాలమయ్యాయి.

కళావైభవం

బౌద్ధమతవ్యాప్తి వికాసాలతోబాటు సాహిత్యము, కళలు, విజ్ఞానము అప్రతిమానమయిన అభివృద్ధినొందాయి. కృష్ణానదీతీరాన్ని శ్రీపర్వతం వద్ద వెలసిన బౌద్ధసాహితీ కేంద్రం ప్రఖ్యాత విశ్వకళాపరిషత్తయి, ఆసియాఖండానికంతకూ ప్రధానమైన విద్యా విజ్ఞానకేంద్రంగా వెలుగొందింది. ఈ శ్రీపర్వత క్షేత్రమే నాగార్జునాచార్యుని ప్రఖ్యాతిమూలంగా నాగార్జునకొండ అని రూపాంతరం పొందింది. బౌద్ధసాహిత్యం ఆనాడు విస్తృతించినంతగా చరిత్రలో మరేకాలంలోనూ విస్తృతించలేదు. బౌద్ధజాతక కథల ఉజ్వలఘోషతో అఖిలభారతమేకాక ఆసియా ఖండమంతా మారుమ్రోగింది. బౌద్ధసంస్కృతి విశేషంగా కళాస్వరూపంకూడా దాల్చింది. అద్భుతమైన ప్రస్తారశిల్పం పరిణమించింది. రమ్యనిర్మాణాలు దేశమంతటా వెలిశాయి. బౌద్ధస్థూపాలు, విహారమందిరాలు, చైత్యగృహాలు, పూజాస్తంభాలూ కుప్పతిప్పలుగా సుందరరూపాలు దాల్చాయి. శిల్పశోభ, చిత్రలేఖనా వైదగ్ధ్యం మహోన్నత శిఖరాలను చేరుకొన్నాయి.

ఆంధ్రప్రజల నాకర్షించి, ఆంధ్రరాజుల పోషణకు పాత్రమయి విజృంభించిన బౌద్ధసంస్కృతికి ఆంధ్రశిల్పులు, చిత్రకారులూ పెట్టినవన్నె భారతదేశంలో అప్రతిహాన మనిపించుకున్నది. అజంతా, ఎల్లోరా గుహసంచయాలు, నాగార్జునకొండ, అమరావతీ శిల్ప నిర్మాణాలు దీనికి ప్రధాన

నిదర్శనాలు. ఇవేకాక ఆంధ్రదేశంలో విరివిగా ఇంకా ఎన్నోచోట్ల వెలువడ్డ బౌద్ధశిల్పశిథిలాలు దీనికి సాక్షీభూతాలు. భట్టిప్రోలు, ఘంటసాల, గుడివాడ, జగ్గయ్యపేట, గుమ్మడిదుర్రు, గుంటుపల్లి, ఆర్యవట్టం, శంఖారం మున్నగు స్థలాలిందులో కొన్ని.

ఆంధ్రశాతవాహన సామ్రాజ్యానికి మూలస్థానమయిన దక్షిణాపథంలోని బౌద్ధశిల్పసంపద ఆనాటి బౌద్ధమత ప్రాబల్యానికి సాక్షీభూతంగా నిల్చిపోయింది. ఆంధ్రదేశంలో లభించిన అసంఖ్యాకములయిన ప్రాచీన శాసనాలు, నాణాలుకూడ ఆనాడు ఈ ప్రాంతంలో బౌద్ధమతానికి కలిగిన ప్రాబల్యాన్ని చాటిస్తున్నాయి. ఈ బౌద్ధక్షేత్రాల నిర్మాతలు, దాతలు, రాజులు, మహాభోజులు, మహారథులేగాక అన్ని తరగతులకు చెందిన శ్రేణికులు, సైగములు, సామాన్య గృహస్థులుకూడ ఎందరో ఉన్నట్లు శాసనాలవల్ల తెలుస్తోంది. దీనినిబట్టి బౌద్ధమతం ఎట్టి జనసామాన్యాన్ని అందరినీ ఆకర్షించిందో సుభోధకమవుతుంది.

వలసరాజ్య విస్తృతి

శాతవాహనుల ఓడ బొమ్మలుగల నాణాలవల్ల ఆ యుగంలో ఆంధ్రుల వలసరాజ్య విస్తృతి విశదమవుతుంది. మలయద్వీపసంచయంలో జావాద్వీపంలోని బొరబుదూరు మహాస్తూపం మున్నగు అద్భుత శిల్పశిథిలాలయాలు ఆనాటి బౌద్ధసంస్కృతికి స్మారకచిహ్నాలయి నిలచివున్నాయి.

ఇక్ష్వాకుల రాజ్యవారసత్వం

దక్షిణాపథంలో వికసించిన మహాయాన బౌద్ధమత విభూతి, ఆంధ్రశాతవాహన సామ్రాజ్య వైభవంతో మిళితమయి వెలసిన విషయం మరువరాని మహావిశేషం. శాతవాహన సామ్రాజ్యం క్రీ.శ. మూడవ శతాబ్ద మధ్యంలో అంతరించింది. కాని రాజవంశం మారినా బౌద్ధమత ప్రాబల్యం వెనుకబడలేదు. మరోమూడు శతాబ్దాలపాటు వివిధ రాజవంశాల క్రింద దక్షిణాపథమంతటా బౌద్ధమతం ప్రవర్ధమానంగా నడిచింది. శాతవాహనుల అనంతరం కృష్ణానదీప్రాంతంలో ఇక్ష్వాకువంశంవారు ఇతర ప్రాంతాలలో వాకాటకులు, బృహత్ఫాలాయనులు, సాలంకాయనులు, విష్ణుకుండినులు మొదలగు వంశాలవారు రాజ్యాలేలారు.

నాగార్జునకొండ విశ్వవిఖ్యాతి

క్రీ.శ. 3వ శతాబ్దంలో కృష్ణానదీ ప్రాంతంలో రాజ్యమేలిన ఇక్ష్వాకురాజులకు నాగార్జునకొండ ముఖ్యపట్టణమయి విజయపురి అనే పేరుతో మహావైభవం దాల్చింది. ఇక్ష్వాకురాజవంశపు రాణులు, రాజపుత్రికల పోషణ క్రింద ఇక్కడి బౌద్ధశిల్పసంపద విశేషంగా వృద్ధిచెందినట్లు శాసనప్రమాణాలు కనబడుచున్నది. 'శాంతిశ్రీ' అను ఇక్ష్వాకురాణి ఇక్కడి మహాచైత్యాన్ని, మహావిహారాన్ని అతిసుందరమయిన చలువరాతి పూజాస్తంభ పంచకాలనూ నిర్మించినట్లు ఈ స్తంభాలమీదనే చెక్కబడిన శాసనాలవల్ల తెలుస్తోంది. మరో బౌద్ధ భక్తురాలయిన రాజపుత్రి 'బోధిశ్రీ' అనునామె సింహళ, కాశ్మీర, నేపాళ, చీనాదేశాలనుండి వచ్చిన బౌద్ధభిక్షుబృందాలకుగాను చైత్యగృహాలను నిర్మించి ఈ క్షేత్రాన్ని విశ్వప్రఖ్యాతం గావించడంలో తోడ్పడినట్లు ద్యోతకమవుతోంది. ఈ విధంగా నాగార్జునకొండ ఆనాడు బౌద్ధవిజ్ఞానానికి విశిష్టకేంద్రమయి సింహళం, బర్మా, సయాం, చీనా, జపాను మున్నగు అనేక పరిసరదేశాలనుండి విద్యార్థులను, భిక్షుబృందాలనూ ఆకర్షించిన విశ్వవిద్యాలయమై ఆసియాఖండానికంతకూ విజ్ఞాన కేంద్రమనిపించుకున్నది.

క్రీ.శ. 3వ శతాబ్దంతో ఆంధ్రుల స్వర్ణయుగం ముగిసింది. కాని ఆంధ్రదేశహృదయసీమలో ప్రతిష్ఠించిన నాగార్జునకొండ క్షేత్రం మాత్రం బౌద్ధసంస్కృతీ కేంద్రంగా విశ్వప్రఖ్యాతమై క్రీ.శ. 7వ శతాబ్దం వరకు ప్రవర్ధమానంగా బౌద్ధలోకానికంతకూ మహాపుణ్య క్షేత్రమయి నిలచింది.

మరో స్వర్ణయుగాని కెదురుచూద్దాం

ఈనాడు తిరిగీ చారిత్రక న్యాయంగా ఆంధ్రులందరూ ఏకరాష్ట్రంలో చేరుకుంటున్నారు. కృష్ణానదికిరుప్రక్కలా ఆంధ్రప్రదేశం విస్తరించి పూర్వంవలెనే సువిశాల రాష్ట్రం ఏర్పడింది. కొన్ని శతాబ్దాలుగా ఆధునికయుగంలో దక్షిణాంధ్రులను, తెలంగాణులను విడదీసిన కల్పిత సరిహద్దు అయివుండిన కృష్ణాస్రవంతి ఈనాడు తిరిగి ఆంధ్రప్రదేశహృత్సీమలో మధ్యగా ప్రవహిస్తూ ఇరుపార్శ్వాలనూ తన దివ్య హస్తాలలో చేర్చుకొని ఆంధ్రపుత్రులనందరనూ ఏకంచేసి మాతృప్రేమతో ఆలింగనం చేస్తోంది. ఈ కృష్ణానదీతీరాన్ని వెనుకటి స్వర్ణయుగంలో ప్రజ్వలించిన మహాసంస్కృతీ కేంద్రమయిన నాగార్జునకొండ పరిసరాలలో వెలువడ్డ సుందరశిథిలాలయాలు ఆంధ్రులనందరను ఏకంచేసిన సంస్కృతిని తిరిగి ప్రకటిస్తూ ఆంధ్రుల హృదయాలలో ఉన్నతాశయాలను రేకెత్తిస్తున్నాయి. ఆ సమీపంలోనే నిర్మింపబడుతున్న నాగార్జునసాగరం ఆనకట్ట కృష్ణానదీ అమృతజలాలను ఇరుపార్శ్వాల ఆంధ్రజనానీకానికి అందజేస్తూ లక్షలాది ఎకరాల పంటభూమిని సస్యశ్యామలమొనర్చి ఆంధ్రులకు ఆర్థిక ఐశ్వర్యాన్ని చేకూర్చనున్నది.

ఇల్లాంటి మధుర భావాలతో విశాలాంధ్రనుపక్రమించు కుంటున్న ఆంధ్రప్రజానీకం త్వరలో మరో స్వర్ణయుగానికెదురు చూడడం సహజధర్మంకాదా !

డాక్టరు మారేమండ రామారావు

మహాంధ్రము

ప్రాచీనాంధ్రదేశం మహావైభవం అనుభవించింది. నాటి ఆంధ్రుల సామర్థ్యమూ, ఉపజ్ఞా రాజకీయార్థిక సాంఘిక సాహిత్య కళారంగములలో కనిపించాయి. ఈ రంగములే కాకుండా ఆంధ్రుల ప్రతిభకు ప్రబల నిదర్శనమైన మరి ఒక రంగం ఉన్నది. అది విశాల భారత నిర్మాణరంగం. ఆనాటి భారతదేశం నేటివలె సంకుచితమై ఉండలేదు. ఆ నాడు ఆసియాఖండం యావత్తూకూడా ఒక విశాల భారతంగా ఉండేది. ఈ ఖండంలోని అన్ని దేశాలలోకీ పోయి నాటి భారతీయులు భారతీయ సంస్కృతిని ప్రచారంచేసి ఒక విలక్షణమైన భారతీయ సాంస్కృతిక సామ్రాజ్యం నిర్మించారు. ఈ రంగంలోకూడా ప్రాచీనాంధ్రులు ముఖ్యమైన పాత్రను నిర్వహించారు. ఇక్కడి భారతంలో ఆంధ్రం ప్రఖ్యాతమైన భాగంగా ఉండినట్లే విశాల భారతంలోకూడా మహాంధ్రం ముఖ్యాతిముఖ్యమైన భాగంగా ఉంటూ వచ్చేది. విదేశములలో వలసలు నిర్మించి, భారతీయ సంస్కృతిని ప్రచారం చేయడంలో ఆంధ్రులది అగ్రస్థానం.

చిరకాలంనుంచీ ఆంధ్రదేశానికి ప్రాచ్యదేశాలతో బహువిధములైన సంబంధం ఉండేది. ఉత్తరాన గంజాం జిల్లాలోని పాలూరు మొదలు దక్షిణాన పులికాట్ వరకూ గల సుదీర్ఘమైన సముద్రతీరంలో ఎన్నో రేవులు ఉండేవి. వీటిలో మనర్ఫా, కొత్తపట్టణం, ఘంటశాల, గూడూరు, మోటుపల్లి, బెండమూర్లంక మొదలయినవి ముఖ్యములు. క్రీస్తుశకారంభానికి పూర్వమే కృష్ణాగోదావరీ ముఖద్వారములవద్ద గల రేవులనుంచి ఎన్నో పెద్ద పెద్ద ఓడలు తూర్పు దేశాలకి ప్రయాణం చేసేవి.

వర్తకులతోపాటు అనేకమంది సాహసులూ, సంస్కృతి ప్రచారకులూ విదేశాలకి వెళ్ళేవారు. ఇలా వెళ్ళినవారు ఆయా దేశాలలో స్థిరపడిపోయి, ఎన్నో రాజ్యాలు నిర్మించి పరిపాలించారు. ఈ విధంగా ఇక్కడ స్థాపించబడిన వలసలకీ, నగరాలకీ వాటి నిర్మాతలు ఆంధ్రదేశంలో తమ నివాస స్థానములుగా వుండిన నగరములయొక్క, దేశములయొక్క పేర్లు పెట్టుకున్నారు. ఆ విధంగా కళింగ, కాకుళం, అమరావతి, కొత్తూరు, విజయపురి, సింహపురి మొదలైన పేర్లు వెలిశాయి. ఈ యీ దేశాలలో లభించిన ప్రాచీన శాసనములు ఆయా కాలములలో ఆంధ్రదేశాన్ని పాలించిన పల్లవ, సాలంకాయన, విష్ణుకుండి, వేంగీ చాళుక్య రాజుల శాసనములు వ్రాయబడిన లిపులలో చెక్కబడినవి. ఇక్కడవలెనే అక్కడకూడా శాలివాహనశకం వ్యాప్తిలో ఉండేది. ఇక్కడ వలెనే అక్కడ రాజుల పేర్లుకూడా 'వర్మ' శబ్దంతో అంతమయ్యేవి. ఈ ప్రాచ్యదేశాలలో బయలుదేరిన ఆంధ్రరాజ్యములలో నిర్మించబడిన కట్టడములలోనూ, శిల్పములలోనూ ఆంధ్రదేశంలోని బౌద్ధ వాస్తువులయొక్క, అమరావతీ శిల్పసంప్రదాయం యొక్క, వీటి నుండి యేర్పడిన మహాబలిపుర పల్లవవాస్తు శిల్పములయొక్క ప్రభావం స్ఫుటంగా కనిపిస్తుంది.

బర్మా

బర్మాలోని ప్రజలందరిలోను తలెంగులనే వారిది బహుప్రాచీనమైన జాతి. వీరు తెలుగు దేశం నుంచి వలసపోయారు. వీరు బర్మాలోని దక్షిణ భాగాన్ని ఆక్రమించి అక్కడ ఒక రాజ్యం నిర్మించారు. దీనికి రామణ్యదేశం అని పేరు. ఈ రాజ్యానికి హంసవతీనగరం రాజధానిగా ఉండేది. ఇది క్రీ.శ.573 నుంచి కొన్ని శతాబ్దులకాలం సాగిన ఆంధ్రరాజ్యం. ఈ రాజ్యానికి పక్కన ఉండిన కోస్తాకు కళింగమనే పేరు ఉండేది. కృష్ణా, గోదావరీ ముఖ ద్వారాలనుంచి వచ్చిన ఆంధ్రులు ఇక్కడ స్థిరపడినారు. రామణ్యదేశానికి ఉత్తరంగా వనవాసి అనే మరిఒక రాజ్యం ఉండేది. దానికి శ్రీక్షేత్రనగరం రాజధాని. ఈ రాజ్యంలో కూడ ఆంధ్రసంస్కృతి వర్ధిల్లింది.

బర్మాలో దొరికిన ప్రాచీన శాసనములు వేంగీ లిపిలో వ్రాయబడినవి. ఇక్కడ బంగారపు రేకులమీద వ్రాయబడిన ఒక పాళీబౌద్ధగ్రంథం క్రీ.శ.5,6 శతాబ్దులనాటి తెలుగు లిపిలో ఉన్నది. ప్రోం జిల్లాలో ఒకచోట ఒక స్తూపం బయలు వెడలింది. దానిలో అవశేషములను ఉంచే గూడు ఒకటి ఉన్నది. ఆ గూటిలో ఒక చిన్న వెండిగిల్టుచేయబడిన స్తూపం ఉన్నది. ఇలాంటి చిన్న స్తూపాలు ఆంధ్రదేశబౌద్ధక్షేత్రాలలో దొరికిన అవశేషపాత్రలలో అనేకం లభించాయి. దీనిమీద ఆంధ్రదేశపు తెలుగు కన్నడ లిపిలో చెక్కబడిన శాసనం ఒకటి ఉన్నది. బర్మాలో శాన్‌లన్‌క్రోం అనే రాజు బౌద్ధమతాన్ని ప్రవేశపెట్టాడు. ఇతడు క్రీ.శ. 3–5 శతాబ్దులలో ఆంధ్రదేశాన్ని పరిపాలించిన శాలంకాయన రాజుల సంతతివాడు.

మలే

మలే ద్వీపకల్పంలో ప్రాచీనాంధ్రులు చిరకాలం రాజ్యాలు నిర్మించి పరిపాలించారు. ఇక్కడి పెయాల్ జిల్లాలో వేంగీ తెలుగు లిపిలో వ్రాయబడిన సంస్కృత శాసనములు దొరికినవి. ఇక్కడి లిగోర్ ప్రాంతంలో ఎన్నో హిందూ దేవాలయములు ఉన్నవి. వీటి వాస్తు శిల్పములు ఆంధ్రబౌద్ధయుగంనాటి శిల్పపద్ధతులకూ, పల్లవుల మహాబలిపుర వాస్తువులకూ అనుకరణములు. ఈ దేశంలో స్వర్గలోకం అనే చోట దొరికిన కంచువిగ్రహములు ఆంధ్రదేశంలో బుద్ధాంలో దొరికిన విగ్రహములకు నకళ్లు.

సయాం

మలేకి ఉత్తరంగా ఉన్న సయాంలో కూడా ఆంధ్రరాజ్యములు వర్ధిల్లినవి. ప్రాచీనాంధ్రులు క్రీ.శ. 1,2, శతాబ్దులలోనే ఇక్కడ రాజ్యములు నిర్మించినారు. ఇక్కడి ప్రాచీనబౌద్ధ నిర్మాణములు సింహళంలోని అనురాధపురం లోనూ, ఆంధ్రదేశంలోని అమరావతిలోనూ ఉన్న స్తూపముల అనుకరణములు. సయాంలో ప్రాఫతోన్ అనేచోట ఒక బౌద్ధాలయం ఉన్నది. దానిలో చక్కని బౌద్ధశిల్పాలు ఉన్నవి. ఇవి ఆంధ్రదేశంలోని శంకరం అనే బౌద్ధక్షేత్రంలో గల గుహాశిల్పాలను పోలిఉన్నవి. ఇక్కడ దొరికినవిగ్రహాలలో అమరావతీ, మహాబలిపుర శిల్పసంప్రదాయాల సమ్మేళనం కనిపిస్తుంది.

ఫునాన్

సయాంను చేరి పూర్వం ఫునాన్ అనే హిందూ రాజ్యం ఉండేది. నేటి కాంబోడియా, కొచ్చిన్ చైనాలు దానిలో చేరి ఉండేవి. ఇక్కడి హిందూరాజ్యం క్రీ.శ.1వ శతాబ్దినుంచీ వర్ధిల్లింది. దీనిని యేలిన మొదటి రాజవంశీకులు తమవంశం కౌండిన్యసోమవంశం అనీ; అది కౌండిన్యుడనే ఆంధ్రదేశ బ్రాహ్మణుడికీ, స్థానికంగా యేలికగా వుండిన సోమ అనే రాణికీ జరిగిన వివాహంవల్ల ఏర్పడినది అనీ చెప్పుకున్నారు. ఇక్కడకూడా క్రీ.శ. 4,5,6 శతాబ్దులనాటి ఆంధ్రలిపిలో వ్రాయబడిన శాసనములు చాలా దొరికినవి. ఇక్కడ భక్తి శ్రద్ధలతో ఆరాధించబడుతూ వచ్చిన అనంతశాయి విగ్రహం గుంటూరు జిల్లా ఉండవల్లి గుహలోని విగ్రహానికి అనుకరణం.

చంపా

ఇది మరి ఒక ప్రాచీన హిందూరాజ్యం. ఇది నేటి ఆనాంకు సరిపోతుంది. ఇక్కడి మొదటి హిందూ రాజ్యాన్ని కౌండిన్య సోమవంశీకులు పాలించారు. ఇక్కడ అమరావతి, కాథార, విజయ అనే తెలుగు నదుల పేర్లుగల రాష్ట్రాలు ఉండేవి. ఇక్కడి ప్రాచీన రాజధానీ నగరం అయిన సింహపురాన్ని క్రీ.శ.4,5,6 శతాబ్దులలో కళింగ దేశంలో సుప్రసిద్ధంగా ఉండిన సింహపురంనుంచి వలసపోయిన కళింగ ఆంధ్రులు నిర్మించారు. ఇక్కడ వోకాన్ అనే చోట దొరికిన ప్రాచీన శాసనం ఆంధ్ర శాతవాహనరాజైన నాల్గవ శాతకర్ణికన్హేణ శాసనపు లిపిలో చెక్కబడి ఉన్నది. ఈ ప్రాంతంలో దొరికిన బుద్ధవిగ్రహాలు అమరావతీ శిల్ప సంప్రదాయానికి చెందినవి.

కాంభోజి

ఈ హిందూరాజ్యం నేటి కాంబోడియాలో వర్ధిల్లింది. ఆంధ్రకళింగములనుంచి వలసవచ్చిన ప్రజలు ఈ రాజ్యాన్ని నిర్మించారు. ఇక్కడి రాజులపేర్ల చివరకూడా ఆంధ్రరాజుల పేర్లలో వలెనే 'వర్మ' శబ్దం ఉండేది. ఇక్కడివారికి ఆంధ్రదేశంలోని సుప్రసిద్ధశైవక్షేత్రం అయిన శ్రీశైలం పరిచితం ఐన యాత్రాస్థలంగా ఉండేది.

జావా

జావాద్వీపం ప్రాచీనాంధ్రులకు సుపరిచితమైన దేశం. ఈ ద్వీపానికి కళింగం అని పేరు ఉండేది. ఆంధ్ర కళింగ దేశాల ప్రజలు ఇక్కడికి వలస వచ్చి రాజ్యాలు స్థాపించారు. ఇక్కడి ప్రాచీన శాసనములు వేంగీలిపిలో చెక్కబడినవి. ఇక్కడ బోరొబుదుర్ అనేచోట అద్భుతమైన బౌద్ధ నిర్మాణం ఉన్నది. ఒక కొండమీద మధ్య ఒక పెద్ద స్తూపము, దాని చుట్టు 108 చిన్న చిన్న స్తూపాలు నిర్మించబడినవి. మధ్య మధ్య మూడు మైళ్ల పొడుగుకు సరిపోయేటంత స్థలములో శిల్పములు చెక్కబడినవి. ఈ పెద్దస్తూపం శంకరంలో బొజ్జన్న కొండమీదగల ఏకశిలా స్తూపానికి అనుకరణవలె ఉన్నది. ఇక్కడి శిల్ప శ్రేణులు అమరావతీ మహాచైత్యంమీదా, దాని ప్రాకారం మీద ఉండిన శిల్ప శ్రేణులను స్ఫురింపచేస్తాయి.

సుమాత్రా

ఆంధ్రులు క్రీ.శ. 1,2 శతాబ్దులలోనే ఈ ద్వీపంలో వలసలు ఏర్పరచారు. ఇక్కడ కూడా ప్రాచీనాంధ్ర లిపులూ, శాలివాహన శకమూ, వాస్తు శిల్ప సంప్రదాయాలూ వ్యాప్తిలో ఉండేవి.

ఈ విధంగా ప్రాచీనాంధ్రులు దూరప్రాచ్య దేశములన్నిటిలోనూ రాజ్యములు నిర్మించి పరిపాలించారు. ఈ దేశాలలో ఆంధ్రలిపులనూ; ఆంధ్రరాజ్యముల యొక్క, నగరముల యొక్క పేర్లనూ; కళా సంప్రదాయములనూ నెలకొల్పారు. ఈ యీ వలస రాజ్యములతోకూడి ఒక మహాంధ్రదేశం శతాబ్దుల కాలం వర్థిల్లింది.

(ఆంధ్రప్రదేశ్ అవతరణ సంచిక, 1956
వెంకట్రామ అండ్ కో ప్రచురణ)

జయమహాంధ్ర జనయిత్రీ
జయప్రియాంధ్ర జనయిత్రీ
జయజయ ప్రియతమ భారత
ధాత్రి పుత్రి శుభధాత్రీ!
శ్యామల నవసస్యాంచల
కోమల సుమవల్లీ చికురా
కదళీ రసాల లాంగలీచల
చ్ఛద మృదులానిలచామర!
నీ పూర్వ చరిత స్మరియించీ
నీ భావిఘనత దరిశించీ
ఇటు మంజీర అటు వంశధార
ఎలుగెత్తి నిన్ను కీర్తించు
కబరీకాశ కదంబము లూగ
శబరీ పెన్నలు నర్తించు
మరిమరి కృష్ణాగోదావరీ
ఝరులు తలలూపి హర్షించు
ఎల్లర కోర్కులు నిండుననీ
ఎల్లర స్వప్నాల్ పండునని
ఇటు తెలంగాణ అటు కళింగాన
అటనట కోస్తా రాయలసీమల
ప్రత్యాంధ్ర మందిర గేహళి
సదామ్రోగు నీ మంగళ కాహళి

శ్రీ విశాల మానవతా సమతా
సాధనమే మా మనోరథం
భావిలోక కల్యాణ సుస్థిర
స్థాపనమే మాదృఢశపథం
ఒక అడుగేనీ చెదరనీము చెదరనీము
ఒక క్షణమేనీ వృధాపోనీము – వృథాపోనీము
శ్రీరస్తు శుభమస్తు శాంతిరస్తనీ దీవించు

– శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

వేపా రామేశం

ఆంధ్రదేశములో శకముల వాడుక

శకమనగా నేమి? కొన్ని విషయములు సంభవించిన కాలమును వర్ణించవలసివచ్చినప్పుడు ఒక మహాపురుషుని జననము, లేదా మరణము, లేదా వారి జీవితములో మరేదైనా ముఖ్యసంఘటన జరిగిన కాలము నుంచిగాని, లేక మరేదైనా గొప్ప సంఘటన జరిగినప్పటి నుంచిగాని సంవత్సరములు లెక్క పెట్టించుట మామూలు. అందులో మొదటి అంశమునకే శకమని పేరు. మన దక్షిణదేశములో మనము శాలివాహన శకమును వాడుచున్నాము. ఉత్తరదేశమువారు విక్రమార్కశకమును వాడుచున్నారు. హూణులు క్రీస్తు జననం దగ్గర నుంచి సంవత్సరాలు లెక్కపెట్టుకొంటున్నారు. మహమ్మదీయులు మహమ్మదు మక్కానుండి మదీనా వెళ్లిన సంవత్సరంనుంచి లెక్కచూచుకొంటున్నారు. ముఖ్యముగా ఇప్పుడు ఆంధ్రదేశములో ఏ శకము ఎప్పటినుంచి అమలులోనున్నదీ విచారిద్దాము.

మనకు దొరికిన మట్టుకు శాసనములలో ఎక్కడా క్రీస్తు అనంతరము 400 సంవత్సరాలకు ఏశకమున్నూ వాడుక చేసినట్లు కనపడదు. ఏదైనా ఒక విషయముయొక్క కాలమును వర్ణించవలసి వచ్చినప్పుడు అప్పటిరాజు పరిపాలన సంవత్సరము, ఋతువు, అందులో పక్షము, అందులో తిథి చెప్పుకుంటూ వచ్చేవారు. ఉదా: బళ్లారి జిల్లాలో మయ 9 దో నెలో శాలివాహనవంశపు రాజైన శ్రీవాశిష్ఠపుత్ర స్వామిశ్రీ పులిమావి అనే రాజుయొక్క శాసనం ఒకటి ఉన్నది. అది వారి 8 వ సంవత్సరంలో హేమంతఋతువునందు రెండవపక్షంలో ప్రథమదినమున వ్రాసినట్లున్నది. ఇదే విధంగా ఇక్ష్వాకుల శాసనములలోను, పల్లవుల శాసనములలోను కనిపిస్తున్నది. సాలంకాయనులూ, బృహత్ఫలాయనులూ మొదలైన వంశాల రాజులచరిత్రలున్ను ఇదేరీతిగా వర్ణింపబడియున్నవి. ఇందుకు నిదర్శనంగా పల్లవుల కాలంలో రెండవ సింహవర్మయిచ్చిన వంగోలుశాసనం ఒకటి వున్నది. అది వారి నాలుగవసంవత్సరంలో వైశాఖమాస ప్రథమపక్షమందు రెండవతిథిలో సూర్యగ్రహణకాలము నిమిత్తం ఒక అగ్రహారం (కొణికి) దానమిచ్చినట్లు కనబడుతోంది. ఇంతకుముందు హిందూదేశంలో గ్రహణములు, మాసము, తేదీలు మొదలైనవి చెప్పినట్లు లేవు. ఈ సింహవర్మశాసనము క్రీ.శ.328 వ సంవత్సరం 6వ తేదీ ఏప్రిల్ నాటిది.

ఇంక శకప్రయోగము ఎప్పటినుంచి వచ్చినదో విచారిద్దాము. కళింగదేశపు మాథరులు, వాసిష్ఠులు మొదలైనవారి శాసనములలో శకము తెలుపబడి ఉండలేదు. వీరి తర్వాతను గంగవంశమువారు, అనగా గాంగేయులు ఏలినట్లు శాసనములలో కనిపిస్తున్నది. ఈ శాసనములన్నీ గాంగేయశకమునుండి లెక్కింపబడివున్నవి. ఈ గాంగేయశకమును వాడుకచేసిన శాసనములన్నీ శ్రీకాకుళమునకు ఉత్తరముగా ఉన్న ప్రదేశములోనే ఉన్నట్లు కనిపిస్తుంది. ఈశకము క్రీ.వె.498 లో స్థాపించబడినట్లు నేను “ఆంధ్రా

క్రానాలజీ’ గ్రంథంలో నిర్ణయించివున్నాను. తర్వాత మిరాశి అనే గవర్మెంటు పురావస్తుపరిశోధన సూపరింటెండెంటు కూడ ఇదే అభిప్రాయపడినారు. గంగ వంశమువారి ఈ శకము సుమారు 900 సంవత్సరముల వరకు వాడుక చేయబడినది. మొదటి గంగవంశము అప్పటితో అంతరించినది. అప్పుడు మరియొక గంగ వంశము ఆరంభమైనది. వారు వెనుకటి రెండు మూడు శాసనములలో అదివరకటి గాంగేయశకమునే వాడుకచేసి తర్వాత శాలివాహనశకమును అమలులోనికి తెచ్చినారు. క్రీ.వె. 1045 సంవత్సరములో శాలివాహన శకమారంభించి, అప్పటినుంచి అమలులో ఉన్నది.

అయితే, శ్రీకాకుళమునకు దక్షిణంగాఉన్న ఆంధ్రదేశంలో ఏ శకము, ఎప్పటినుంచి అమలులోనికి వచ్చినది అనేది యోచింప వలసియున్నది. ఆంధ్రదేశంలో మొదట ఏలూరు దగ్గర ఉన్న పెదవేగి గ్రామమునున్ను, తర్వాత రాజమహేంద్రవరమునున్ను తమ ముఖ్యపట్నముగా చేసుకొన్నటువంటి తూర్పు చాళుక్యవంశరాజులు క్రీ.వె.624 లగాయతు 1070 వరకూ పరిపాలన చేసి తర్వాత అరవదేశమునకు వివాహాది సంబంధములచే రాజులై, అక్కడ 1260 వరకూ పరిపాలనచేసినట్లు కనబడుతున్నది. కాని వీరి మొదటి శాసనములలో శాలివాహనశకము కానరాదు. వీరు బొంబాయి రాజధానిలో ఉన్న బీజపూరు జిల్లాలో ఇప్పుడు బాదామి అనే పేరుగల వాతాపిపురమునుంచి మన తెనుగు దేశమునకు వచ్చిరాజులైనారు. అన్నవచ్చి తమ్ముణ్ణి సింహాసనాధిపతిని చేసి బొంబాయి రాజధానికి వెళ్లిపోయినాడు. అక్కడ వాతాపిలో ఉన్న రోజుల్లో శాలివాహనశకము మూడేమూడు శాసనములలో మాత్రము వాడుకచేసినట్లు కనబడుతుంది. (1) ఈ రాజుల తండ్రి కీర్తి వర్మ ఇచ్చిన శాసనం వాతాపిపుర గుహలో ఒకటి ఉన్నది అది శా.శ.500 (క్రీ.వె.5787)లో ఇచ్చినట్లు కనబడుతున్నది. (2) ఆయన కుమారుడు పులకేశి ఇచ్చిన ఒక శాసనము హైదరాబాదులో ఇటీవల దొరికినది. అందులోనూ శాలివాహనశకము చెప్పబడినది. అది సూర్యగ్రహణ నిమిత్తం ఇవ్వబడినది. (3) మూడవది వీరే అయిహోలు గ్రామంలో ఇచ్చిన శాసనం. అందులో వారి దండయాత్రాక్రమము, పిఠాపురము మున్నగు ప్రాంతములను జయించిన విధము చెప్పబడినది. ఈ మూడు శాసనములున్ను బొంబాయి రాజధానిలో ఇవ్వబడినవిగాని ఆంధ్రదేశములో ఇచ్చినవి కావు.

తర్వాత రెండో పులకేశి మనుమడు వినయాదిత్యుడు పల్లవులతో చేసిన యుద్ధంలో తంజావూరు వరకు వచ్చి, కావేరిని దాటి అక్కడ ఒక శాసనము ప్రకారం ఒక బ్రాహ్మణునికి అగ్రహారం ఇచ్చినట్లు కనిపిస్తుంది. ఇప్పుడు ఆ శాసనం గద్వాలలో ఒక బ్రాహ్మణునియింట, కర్నూలు హైస్కూల్లో చదువుకొంటున్న ఒక కుఱ్ఱవానిద్వారా, దొరికినది. ఇప్పుడిది గవర్నమెంటుమ్యూజియములో ఉన్నది. ఆ శాసనం తమయింట్లో చిరకాలంగా ఉన్నదని ఆ చిన్నవాడు చెప్పినాడు. దాని తేది 674 (క్రీ.వె.) ఇదిన్నీ తెనుగుదేశమున ఇవ్వబడినది కాదు. దీని తర్వాతను మరియొక శాసనము– ఆ రాజకుమారుడే (వినయాదిత్యుడు) ఇచ్చినది – కర్నూలు జిల్లాలో నంద్యాలకు నైరృతిమూలగా ఉన్నటువంటి తొగర్చేటి గ్రామంలో దొరికినది. అదిన్నీ బొంబాయిరాజధానిలోని బాదామినుంచి ఇవ్వబడినదే. ఈ అయుదున్ను పశ్చిమాచాళుక్యులిచ్చినవే.

తూర్పు చాళుక్యులిచ్చిన తొలిశాసనము చాళుక్యభీముడు (ప్రథమ) ఇచ్చిన అత్తిలి శాసనము. ఇది శక సంవత్సరము కీ.వె. 814. మేషచైత్ర బహుళ 2 సోమవారమున ఇవ్వబడినది. (1917 సంవత్సరములో జాగ్రత్తచేసిన రాగిశాసనాలలో 14–వ నెంబరు.) ఇదే ఆంధ్రదేశంలో మొట్ట మొదటిసారిగా శాలివాహన శకము వాడుకచేసిన సందర్భము. అప్పటినుంచి క్రమక్రమంగా దీని వాడుక హెచ్చయి, దేశంలో బాగా పరిపాటి అయిపోయింది.

ఇక ఈ శాలివాహనశకమనగా నేమో విచారిద్దాము. శాతవాహనులని ఒక వంశము పురాణాలలో ఆంధ్రులు, ఆంధ్రభృత్యులు, శాతవాహనులు అనే పేర్లలో చెప్పబడివున్నది. మత్స్య, వాయు, బ్రహ్మాండ, విష్ణు, భాగవతపురాణాలన్నిటిలో ఈ వంశపురాజులు చెప్పబడివున్నారు. ఈ వంశపు రాజుల్లో మొదటివారు మన ఆంధ్రదేశాన్ని ఏలినట్లు కనబడదు. పూనా చుట్టుపట్టు ప్రదేశాలను పరిపాలించినట్లు కనిపిస్తున్నది. పూనాదగ్గర నానాఘాట్ కనుమలోనున్ను, జుర్నార్ అనే గ్రామంలోను, ఇంకా కొన్ని గ్రామాలలోను వీరి శాసనములున్నవి. వీరిలో బహుకీర్తివంతుడైన రాజు గౌతమీపుత్రశాతకర్ణి అనే అతడు. వీరి కాలంలో ఈశకం స్థాపించబడినదని నా అభిప్రాయం. ఈ శక సంవత్సరము చెప్పిన మొదటి శాసనములన్నిటిలోను దీనిని శాలివాహనశకమని అనలేదు. ‘శకనృపకాలే’ అనే చెప్పబడినది. అనగా ‘శక’ మనే పేరుగల వంశపురాజుల కాలమని సూచించబడినది. ఉజ్జయినీ ఆ ప్రాంతమందు శకరాజులు కొందరు ఏలినట్లు మనకు శాసనములు, ఇతర నిదర్శనములవల్ల తెలియవచ్చుచున్నది. వారు మొదట కేవలము హిందువులు కారు. పారసీక దేశమునుంచి వచ్చినవారు. వారికి సత్రాపులని (క్షాత్రప అనే పక్ష.....శబ్దం) పేరు. వీరిలో మొదటివాడు భూషాన. వాని తర్వాత జయ దామన. మూడవవాడు రుద్రదమనుడు. క్రీ.వె.320 సంవత్సరముతో ఈ వంశమంతరించిపోయింది. హిందూ దేశంలో ఉన్న శాలివాహన శకరాజుల శాసనములు ఈ క్షాత్రపరాజులవే అయియున్నవి. మొదటి అయిదు శాసనములలో నాలుగు క్షాత్రపులవిన్నీ, ఒకటి వాని బంధువుడైన అభీరుడు ఈశ్వరసేనుడిదిన్నీ అయియున్నవి. ఇవన్నీ గుజరాతుదేశంలోనే ఉన్నవి. ఇవి దొరికిన గ్రామాల పేర్లు : జునాఘడ్ గుండా మూలవాసర్, జాన్‌దాన్, నాసిక్. ఇందువల్ల నాకు తోచుచున్నదేమిటంటే, ఈ క్షాత్రపులవల్లనే ఈ శకం మొదట స్థాపించడమైనది.

సుమారు వెయ్యి సంవత్సరాలకు ‘శకనృపకాలే’ అనే చెప్పబడినది. ఇటీవల శకనృపులంటే ఎవరో తెలియక, శాలివాహన అనే శబ్దం కలిపి శాలివాహనశకం అని వాడుతూవచ్చినారు. రమారమి కీ.వె. 1000లో శాలివాహననామం చేర్చడమైనది.

శాలివాహనుడనే రాజు లేదు. సంస్కృతంలో శాతవాహనశబ్దానికి ప్రాకృతరూపం ‘శాలివాహన’ అని. ఆ వంశస్థులందరూ శాలివాహనులే. వారికే శాతకర్ణి అనే బిరుదు ఉన్నది. వీరు మొదట పూనా ప్రాంతాలలో పరిపాలనచేస్తూ తర్వాత ప్రతిష్ఠానపురములోనున్ను, ఆ తర్వాత అమరావతి, ధాన్యకటకములలోనున్ను పరిపాలించుటచేత వీరి రాజ్యమునకు ఆంధ్రరాజ్యమనే పేరు తటస్థించినది.

పోతే, విక్రమార్క శకం అనేది దక్షిణదేశంలో గాని, ఆంధ్రదేశంలోగాని ఎన్నడైనా ప్రయోగింపబడిందా అని యోచిద్దాము. తూర్పుచాళుక్యరాజులలో కుబ్జవిష్ణువర్ధనుడు (పులకేశి తమ్ముడు) ప్రథముడు. వీరి దగ్గరనుంచే తూర్పు చాళుక్యవంశం ప్రారంభమైంది. వీరు కీ.వె.624 లగయతు కీ.వె. 641 వరకు పాలించినారు. 641 జూలై నెలలో, అనగా 18వ సంవత్సరంలో వారికి కొంత జబ్బుచేసి, తన్నివారణ కొరకు శ్రావణమాసములో ఒక అగ్రహారమును ఇద్దరన్నదమ్ములకు ఇచ్చినారు. ఆ గ్రామం పేరు చీపురుపల్లి. ఆనాటికి ఇంటిపేర్లు లేవు. ఆ సోదరుల పేర్లు మాధవవర్మ, చంద్రవర్మ. ఈ దానం చంద్రగ్రహణ నిమిత్తం ఇవ్వబడింది. కీ.వె.632, 641, 650– ఈ మూడు సంవత్సరాలలోనే శ్రావణమాసపు చంద్రగ్రహణాలున్నవి. ఆ శాసనపు తేది 632, 650 అగుటకు వీలులేదు. కనుక వారి శాసనసంవత్సరం 650 అయియుండవలెను. అది 12వ సంవత్సరంలో అని వున్నది. గనుక వారి రాజ్య ప్రారంభం కీ.వె.624లో అయియుండవలెను. ఇది గాక 621వ సంవత్సరంలో విష్ణుకుండినవంశంవాడైన మూడవ మాధవ వర్మ ఇచ్చిన పొలమూరు శాసనం ఒకటి ఉన్నది. ఇది తూర్పు చాళుక్యుల రాజ్యంతర్వాత అయియుండవలెను గాని 621కి ముందు అయి యుండదు.

ముషినికొండ అనే ఒక గ్రామం జైనులకు దానం చెయ్యబడినట్లు ఒక రాగిశాసనం దొరికింది. అది పైన చెప్పిన కుబ్జవిష్ణువర్ధనుని మనుమని మనుమడు (ఇను మనుమడు) మూడవ విష్ణువర్ధనునిచే ఇవ్వబడింది. శాసనంలోనే ఈ గ్రామం మొదటి కుబ్జ విష్ణువర్ధనునిచేత, అతని భార్యఅయిన మహాదేవిచేత కొందరు జైనాచార్యులకు ఇవ్వబడినట్లున్న, బెజవాడలో ఉన్న 'నదుంబవసతి' అనే జైనమఠం వాడుకకొరకు ఇచ్చినట్లున్ను ఉన్నది. ఉదకపూర్వకముగా ఇచ్చిందిది. దీని సరిహద్దునుగూర్చి తకరార్లు ఉండుటచేతనో, లేక మరేకారణంచేతనో రాగిశాసనంతో మరల అది ఖాయపరచబడింది. దీనిలో సంవత్సరము 'స్వాదిత' అనే సంజ్ఞతో సాంఖ్యమున, చెప్పబడియున్నది. మార్గశిర బహుళ ద్వాదశి అని ఉన్నది. 'స్వాదిత' అనగా నేమిటి? సాంఖ్యం ప్రకారం చూచుకొంటే క్రీ.శే. 684 ఏర్పడుతున్నది. 624 ఎవరి శకంలో అనే మీమాంస వెంటనే కలుగుతుంది. ఇది శాలివాహన శకం కానేరదు. ఎందుకంటే 684కు 78 కలిపితే 762 వచ్చును. 762 ప్రథమ విష్ణువర్ధనుని తారీఖూ కాదు; రెండో విష్ణువర్ధనుని సంవత్సరమూ కాదు; మూడో విష్ణువర్ధనుడిదీ కాదు. కాన ఆ తేదీ మనము శాలివాహనశకం ప్రకారం గుణించుకోవడానికి వీలులేదు. విక్రమార్కశకం ఒక వేళ దీనికి కుదురుతుందేమో చూతాము. 684లో 57 కొట్టి వేస్తే 627 వస్తుంది. 627 కుబ్జవిష్ణువర్ధనుడిదై ఉన్నది. కనుక దీనిని విక్రమార్క శకం ప్రకారం అర్థం చేసుకోవలసియున్నది. అంటే, దక్షిణ దేశంలో విక్రమార్కశకప్రయోగం లేదే, ఇది యెలా అన్వయిస్తారు అనే మీమాంస కలుగవచ్చును. దీనికి ప్రతి పక్ష మేమనగా– అప్పుడు దక్షిణాదిన విక్రమార్కశకమూ లేదు; శాలివాహన శకమూ లేదు; గాంగేయ శకమూ లేదు; ఏ శకమూ లేదు. ఒక శకపు వాడుక ఎక్కువ సంభవమనీ, మరొకటి తక్కువ సంభవమనీ చెప్పుటకు వీలులేదు. విక్రమార్క శకమని చెప్పుటకు ఎక్కువ అవకాశాలున్నవి. జైనులు ఎప్పుడున్ను విక్రమార్కశకమే వాడుతున్నారు. పి.టి.శ్రీనివాసయ్యంగారి హిందూ దేశచరిత్ర, (పేజీ 199 తర్వాత విక్రమార్కచరిత్ర జైనగ్రంథములలోనే ఉన్నట్లు యస్.కృష్ణస్వామయ్యంగారు, స్టెంకోనల్ మొదలైన పండితులు వాడినారు. (ఎపి గ్రాఫియా ఇండికా 14వ సంపుటం, 293వ పేజీ) ఈ తర్వాత విక్రమార్కశకం దక్షిణ దేశంలో వాడుకలోకి రాకపోవడం, శాలివాహనశకం అమలులోకి రావడంవల్ల మనం కలవరపడగూడదు. అప్పటి రెండూ సమస్థాయిలోనే ఉన్నవి. కనుక మషినికొండశాసనం మొదట ఉదకపూర్వకంగా ఇవ్వడం ప్రథమవిష్ణువర్ధనునివల్ల 627లో ఇచ్చినట్లు స్థిరపడుతోంది. జైనులకు విక్రమ సంవత్సరము ఎక్కువ ప్రీతికరము. కనుక మూడవ విష్ణువర్ధనుని దగ్గర పుచ్చుకొన్నప్పుడు తమకు అలవాటైన సంవత్సరమును చెప్పినారు. వారిచ్చిన భోగట్టా ప్రకారం శాసనం చెక్కబడింది.

పైన చర్చించినదానివల్ల తేలిన సారాంశమేమంటే – (1) కీ.వె. 627కు ముందు ఆంధ్రదేశంలో ఏ శకమూ వాడుక కాలేదు. (2) ఆ సంవత్సరములో 627 విక్రమ సంవత్సరాన ఒక దానము జైనులకు పుట్టింది. కాని విక్రమశకం మరి మన దక్షిణదేశంలో వాడుకలోకి రాలేదు. (3) క్రీ.వె. 892లో మొట్ట మొదటి ప్రథమ శాలివాహనశక శాసనం ఇవ్వబడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అమలులో ఉన్నది. (4) గాంగేయశకం శ్రీకాకుళమునకు ఉత్తరంగా ఉన్న కళింగదేశంలోకి ప్రాకలేదు. అక్కడగూడా 1025 తర్వాత నిలిచిపోయింది. ఇవి తప్ప ఏ శకములున్ను ఆంధ్రదేశంలో వాడుక కాలేదు. తురకలవల్ల వాడుకలోకి వచ్చిన హిజరీ (627 క్రీ.శ.), ఇంగ్లీషు వారు వచ్చిన తర్వాత (1757) వచ్చిన క్రీస్తు శకములను గూర్చి చెప్పేదేమిటి? చాంద్రమాన ప్రకారం మన ప్రస్తుతపు వాడుకలోఉన్న చైత్రాదిమాసముల పేరులలో ఒకటి – దామోదరవర్మ ఇచ్చిన శాసనంలో కార్తీకశుద్ధ త్రయోదశి ప్రస్తావన ఉంది. అంతకు పూర్వం వేద సంబంధమైన పేర్లు – మధు – మాధవ, శుక్ర–శుచి, నభస్– నభస్య, ఈశ–ఊర్జ, సహస్–సహస్య, తపస్–తపస్య అనేవి ఉత్తరహిందూస్థానంలో అమలులోఉన్నవి. తర్వాత చంద్రమాన మాసాలు ప్రయోగంలోకి వచ్చినవి.

మషినికొండశాసనంవల్ల బెజవాడ అనే నామం ఆ పట్నానికి 627 నుంచీ అమలులోకి ఉన్నట్లు కనబడుతుంది.

రాళ్లబండి సుబ్బారావు

చారిత్రక మహాసభ - అధ్యక్షోపన్యాసము

కాకినాడ సాహిత్యపరిషత్ కార్యదర్శులు నన్నీ మహాసభకు నధ్యక్షత వహించవలసినదిగా కోరినందులకు గృతజ్ఞుడను.

ఈ పరిషత్తునకు, మా పరిశోధక మండలికిని, కొంత సంబంధమున్నది. రెండును నాంధ్రదేశములోని వాఙ్మయేతిహాసములకు సంబంధించిన విషయములగుఱించి చాల కాలముగ నాంధ్రదేశమునకు సేవచేయుచున్న విషయ మందఱకును తెలిసినదే. సాహిత్యపరిషత్తు 45 సంవత్సములకు పైగా, మా ఇతిహాసక పరిశోధక మండలి 35 సంవత్సరములును సేవచేసినవి. ఇంకను జేయనున్నవి.

చరిత్ర నెంత పరిశోధించి నిర్ణయించినను, ఆ నిర్ణయమే దుది నిర్ణయము కాజాలదు. పరిశోధనలు చేసినకొలది నెప్పటికప్పుడు క్రొత్త విషయములు బైటపడుచునే యుండును. ఈ విషయములను మనము గ్రహించవలెను. అనేక శాస్త్రములలో నుత్తీర్ణుడైన పండితోత్తములు చరిత్ర విషయంలో జాల వెనుకబడియున్నారు. చారిత్రక పరిశోధకులు భాషావాఙ్మయములో జాల వెనుకబడియున్నారు. సాహితీపరులు, చారిత్రకవేత్తలు నుభయులు గలిసి సాహిత్యమును, చరిత్రను సమన్వయముచేసి, ఆంధ్రదేశ వాఙ్మయ చరిత్రను, ఆంధ్రదేశ చరిత్రను వ్రాసినయెడల దేశమునకు ఎంతో యపకారము చేసినవారు కాగలరు. అందువలన మనకుగల యీలోటును బూర్తి చేయుట కాంధ్ర సాహితీ పరులు, చారిత్రక వేత్తలు పూనుకోవలసియున్నది. మన దేశములోని యున్నత పాఠశాలలోను, కళాశాలలోను, సర్వకళాశాలలోను మన దేశ చరిత్ర, వాఙ్మయము తగినట్లు గ్రహించుటకుదగిన యవకాశములు లేనందువలన చరిత్ర, వాఙ్మయము, భాష, యుచితరీతిన నేర్చుకొనుటకు విద్యార్థులకు దగిన యవకాశములు లేకుండుట యందఱకును తెలిసిన విషయమే. మన దేశములో దొరుకుచున్న పురావస్తు శిథిలములవల్లనేమి, శిలా, తామ్ర, శాసనములవల్లనేమి, నాణెములవల్లనేమి, తాళపత్ర గ్రంథములవల్లనేమి, ఇంక ఇతర చారిత్రక విషయములవల్లనేమి (సర్వ కళలు) మనము మన దేశచరిత్రను నెక్కువ బాగుగ నేర్చుకొనగలము. ఈ విషయములను సంగ్రహించి పరిశోధన చేయించుటకు ప్రభుత్వము పూనుకొనవలెను. మన యాంధ్ర దేశములోను, తెలంగాణాలోను, పల్లె పల్లెలలోను వేలకొలది తాళపత్ర గ్రంథములు కలవు. వీనిని నన్నిటిని సేకరించి యుపయోగించుకొను స్థితిలో మన దేశములోనే సంస్థయునున్నట్లు కనబడదు. అందువల్ల ప్రభుత్వమే తాము స్వయముగా గాని, యున్న సంస్థలకే ధన సహాయ మొనరించిగాని, వానిని సేకరించి యందలి విషయములను బ్రచురించిన యెడల ననేక ముత్తమ గ్రంథములు వెలువడగలవు. ఇట్టి పని కొంత వఱకు జెన్న

రాజధానియందు జరుగుచున్నది. మన యాంధ్రదేశమునగూడ నిట్టి పనికొనసాగించినచో మన జీవిత పరిస్థితులేగాక జాతిపరిస్థితులేగాక, సర్వప్రపంచమునకు నభివృద్ధి కలుగగలదు.

తేనెవంటి తెలుగుభాష ద్రావిడ భాషలలో కెల్ల ప్రాచీనతను బట్టి రెండవది. మొదటిది మరవము. ప్రాచీన కాలమునుండియు దెలుగు, కన్నడ భాషలు కవలపిల్లలవలె వృద్ధిచెందినవి. శ్రీనాథుడు (1375–1455) ఆ తరువాత కృష్ణదేవరాయలు (1509–1530) దేశభాషలయందు దెలుగు లెస్సయని చెప్పిరి. రసోల్లాసమునందు మధురవచన మునందు దెలుగువంటి భాషలేదని యప్పయ్యదీక్షితులు మొదలగువారు చెప్పిరి. దీనికి ముఖ్యకారణ మాంధ్రులకు సంస్కృత భాషయందు బరిపూర్ణజ్ఞానముండుటయే. ఆంధ్రులార్యులేగదా? అర్యభాష వారిసొత్తు. అర్యమత సాంప్రదాయములను వీరు ప్రథమమునుండియు ననుసరించినటు లాంధ్రుల శాసనములు దృఢపఱచుచున్నవి. ఐతరేయ బ్రాహ్మమున నాంధ్రులు విశ్వామిత్ర సంతతివారని తెలుపబడినది. కాలక్రమమున దక్షిణాపథమున వ్యాపింపగా వారి రాజులు సామ్రాజ్య మేలిరి. క్రీస్తుకు ననేక వందల సంవత్సరములకు పూర్వమే వీరుత్తరమున మాల్వ మొదలు దక్షిణమున మైసూరు వరకును, తూర్పుతీరము మొదలు పశ్చిమ తీరమువఱకును గల ప్రదేశమును పరిపాలించిరని వారి శాసనములేమి, నాణెములేమి, పురాణములేమి, చెప్పుచున్నవి.

వీరు పైశాచి (గుణాఢ్యుని బృహత్కథ) ప్రాకృతము (హాలుని గాథాసప్తశతి, అదే కాలమునాటి లీలావతి) సంస్కృతము, దేశి భాషలను బ్రోత్సహించి, యా భాషలను నభ్యసించిరి. రాజభాష యాంధ్రశాతవాహనుల కాలమునాడు ప్రాకృతమే. ఈ భాషయందే యనేక శాసనములప్పటిరాజకీయ, సాంఘిక, విషయములను దెలుపునవి దేశమునందంతటను దొరికినవి. కొద్దిపాటి సంస్కృత శాసనములును గలవు. ఆ కాలమున బౌద్ధగ్రంథములు పాళిభాషయందు రచింపబడి, దేశీయులగు తెలుగువారికి దెలియుచుండెను. హాలుని గాథాసప్తశతి, బేతాళుని పంచవింశతి తెలుగుకవులు రచించిన ప్రాకృత కావ్యములే. గాథా సప్తశతియందుకగొన్ని తెలుగు పదములు కలవు. బుద్ధఘోషుని యాంధ్రఅట్ఠకథ (క్రీస్తుపూర్వము నాటిది) తెలుగు, ప్రాకృతపదములు గలదే. సంస్కృతము నేర్చిన తెలుగువారికా కాలమున దేశకవిత్వము నందు సంస్కృతమును వాడుచుండుట యలవాటయ్యెను. శాసనములందు గల ప్రశస్తచంపు, కావ్యముక్రింద మాఱి యిదియే క్రమముగ మార్గ కవితయయ్యెను. దేశివాఙ్మయ మంతయు బ్రాచీన తెలుగునందే రచింపబడెను. ప్రాచీన అరవ, కన్నడ భాషకు నిది సంధి మార్గము చూపెను.

ఇంక బ్రాచీనాంధ్రరాజుల కాలమునాటి సాంఘిక, మత విషయములను, రాజకీయ విషయములును, వశిష్ఠపుత్ర, పులోమావి నాశిక్ గుహలయందు దొరికిన ప్రాకృత గానీసముబట్టి తెలియును. మూడు సముద్రములమధ్య నున్న దేశమును నేలినవాడును, వింధ్య పర్వత దక్షిణ ప్రదేశము నంతను జయించి సామంతరాజులచే సేవింపబడుచు, పౌరజనులలో సమసుఖదుఃఖములు కలవాడును, క్షత్రియుల గర్వమణచి, శక, యవన, పల్లవులను నాశనముచేసి ధర్మమార్గమున బన్నులను గైకొనుచు ద్విజుల కుటుంబములను వృద్ధిచేయుచు, శాతవాహన వంశకీర్తి ప్రతిష్ఠించి, చాతుర్వర్ణ్యసంకరమును నివారించి యనేక యుద్ధములలో శత్రు సంఘములను జయించి, ఆగమములకు నిలయమై సత్పురుషులకు నాశ్రయుడై, సత్రపవర్తన కలిగి ఏకాంకుశ, 'ఏకధనుర్ధర, ఏకశూర', ఏకబ్రాహ్మణ, మొదలగు బిరుదములుగలవాడును, రాజరాజును, గౌతమీపుత్రుడునగు శ్రీ శాతకర్ణగుణవిశేషములు వర్ణింపబడినవి.

ఆంధ్ర శాతవాహనుల తరువాత మన దేశము చిన్న చిన్న రాజ్యములుగజీలిపోయి యనేక వంశముల వారిచే బరిపాలించబడెను. వర్ణాశ్రమధర్మములు మరింత స్థిరపడెను. రాజులు బ్రాహ్మణమతమును బోషించుచు, సంస్కృత, ప్రాకృత భాషలకు, విద్యలను, సహాయ మొనర్చు చుండెడివారు. రాణులు (ఆంధ్ర శాతవాహన రాజ్యకాలములో వలెనే) బౌద్ధధర్మమునకు, మతమునకును సహాయ మొనర్చుచు, బౌద్ధ సంఘారామములు, చైత్యములు కట్టించుచుండెడివారు. ఆంధ్రశిల్పకళ వృద్ధి చెందెను. ఆంధ్రదేశ మా తరువాత శాలంకాయన విష్ణుకుండిన రాజుల వశమయ్యెను. మొదట శాలంకాయన రాజులశాసనములు (క్రీస్తు 3వ శతాబ్దము) ప్రాకృతభాషలో జెక్కింపబడినను, ఆ తరువాత రాజుల శాసనములు సంస్కృత భాషయందే వ్రాయబడెను. వాని నన్నిటియందును, దేవాలయములకును వేదాధ్యయనసంపన్నులగు బ్రాహ్మణులకుదదితరులకుజేసిన తామ్రశాసనములందు, దానముచేయబడిన భూములు, అగ్రహారములు, వానికి సరిహద్దులు, తెలుగు భాషయందే వ్రాయబడెను. అగ్రహారములు పొందిన బ్రాహ్మణులు ఘటికాశ్రమములు స్థాపించి వారి వారి యగ్రహారములందే సంస్కృతమున, సకల విద్యలను, సర్వకళలను బోధించుచుండెడివారు. తటస్థాంధ్రదేశమునేలిన యీ రాజ వంశకాలమున (200–600 ఎ.డి) బౌద్ధమతము క్రమముగా క్షీణించెను. బ్రాహ్మణమతము తలయెత్తి స్థిరపడెను. విష్ణుకుండిన వంశకర్త మహేంద్రవర్మ వాజిపేయ, బహుసువర్ణ, పౌండరీకాది శతసహస్రక్రతువులు చేసిననియు, రాజసూయ, పురుషమేధ, ఏకాదశాశ్వమేధ, యజ్ఞములను చేసినట్లు శాసనములు ప్రకటించుచున్నవి. సూర్య, శివ, విష్ణు, మతము లభివృద్ధిచెందెను. వేదభాష, వేదమతము దేశమున వ్యాపించెను. తెలుగు సంస్కృత భాషలను, బ్రజలును, రాజులును, పండితులు వాడుచుండిరి. శాసనములందలి లిపి తెలుగు, కన్నడలిపి, జనాశ్రయుని ఛందోలిశ్చతి యను గ్రంథమునుబట్టి శీర్షిక, ద్విపద, త్రిపద మొదలగు గుణ, యతిప్రాసలు వాడబడెను. ఆకాలపు శిలా శాసనములందును (6వ శతాబ్దము) తెలుగు వాడబడెను. (ముఖ్యముగా దానగ్రామముల సరిహద్దులను దెలుపు సందర్భమున).

క్రీస్తు 600 మొదలు 1200 వఱకు నాంధ్ర దేశము తూర్పు చాళుక్యులచే బరిపాలించబడెను. వీరు దేశము జయించి పాలించిరి. వీరి కాలము జైనమతముగూడ దేశమున నాదరింపబడుచుండెను. రాజులును, రాణులును జైన మతములకు దానము లిచ్చుచుండెడివారు. నన్నయ–రాజరాజనరేంద్రుల కాలమునుండి వైదిక మతమే రాజులచేతను బ్రజలచేతను నాదరణ పొందసాగెను. అప్పటినుండి తెలుగు భాషకు, వాఙ్మయమునకు బ్రశస్తి కల్గెను. ఆంధ్రదేశమున దెలుగు వాఙ్మయము చాళుక్యరాజులవల్లనే పుట్టి పెరిగినది. ప్రప్రథమమున బద్యరచన మార్గశైలిని, ఆ తర్వాత దేశీశైలిని (చాళుక్యులు ప్రోత్సాహించిన రీతిని) రచింపబడెను.

9వ శతాబ్ద ప్రారంభమునదెలుగు పద్యరచన (గుణగణ విజయాదిత్యుని శాసనములందువలె) ఆంధ్ర దేశమునగనబడెను. రెండువందల సంవత్సరాల వఱకు దెలుగు కావ్యమే లేకుండెను. శాసనములందుమాత్రము పద్యరచన గద్యతోపాటు విరివిగా గనబడును. దీనికి కారణము తెలుగు కవులు కన్నడ భాషయందే (కన్నడ రాజులను మెప్పించి బహుమతులు పొందుటకు) కవిత్వము చెప్పుచు, రచనలు సాగించుచుండుట. ఇట్లు వారే పొన్న, పంప, నాగ అను కమ్మనాటి (గుంటూరు) కవులు. పొన్న రచించిన శాంతి పురాణము జినేంద్రుని కంకితము చేయబడెను. పంప విక్రమార్కుని విజయము, ఆదిపురాణము రచించెను. నాగ చందోంబుధి, కాదంబరి యను కన్నడ కావ్యములను రచించెను. ఇద్దరును జైనమతస్థులు. ఈ పంప జైన భారతమునకు బోటీగానే నన్నయభట్టు తన యాంధ్రభారతమును రాజాజ్ఞచేరచించెను.

చేయెత్తి జైకొట్టు తెలుగోడా
గతమెంతొ ఘనకీర్తి కలవాడా

సాటిలేని జాతి
ఓట మెరుగని కోట
నివురు గప్పీ నేడు
నిదుర పోతుండాది

జేకొట్టి మేల్కొలుపు తెలుగోడా!
గతమెంతొ ఘనకీర్తి కలవాడా!

వీర రక్తపు ధార
వారపోసిన సీమ
పలనాడు నీదెరా
వెలనాడు నీదెరా

బాలచంద్రుడు చూడ ఎవరోడోయ్
తాండ్ర పాపయ కూడ నీవోడూ

నాయకీ నాగమ్మ
మల్లమాంబా మొల్ల
మగువ మాంచాల నీ
తోడబుట్టిన వాళ్లె
వీరవనితల గన్న తల్లేరా
ధీర మాతల జన్మ భూమిరా

గతములో నీ కీర్తి
కతలల్లి సెప్పారు
పసయేడ దాచావు
వుసిలేక పోయెరా

బ్రతుకే బరువై యుంటి వీనాడు
శతపోరి సాధించు తొలి పేరూ

నాగార్జునుని కొండ
అమరావతీ
భావాల పుట్టలో
జీవకళ పొదిగావు

అల్పుడను కానంచు తెల్పావు
శిల్పి వంటిరి దేశదేశాలు

రాజ్యమంటే వీర
భోజ్యమన్నాడు, మన
తిక్కనార్యుని మాట
ధీరులకు బాటరా
పూర్వ పౌరుష మెరిగి బ్రతకాలి
కార్యశూరులు నేడు కావాలోయ్

దేశమంటే వట్టి
మట్టి కాదన్నాడు
మనుషులన్నామాట
మరువబోకన్నాడు
అమర కవి గురజాడ నీవోడూ
ప్రజల కవితను పాడి చూపేడోయ్

రాయలేలిన సీమ
రతనాల సీమరా
దాయగట్టి పరులు
ధారతీస్తుండారు

నోరెత్తి అడగరా దానోడా
వారసుడ నీవెరా, తెలుగోడా

కల్లోల గౌతమీ
వెల్లువల కృష్ణమ్మ
తుంగభద్రా తల్లి

పొంగి పారిన చాలు
ధాన్యరాసులె పండు దేశాన
కూడు గుడ్డకు కొదవ లేదోయ్

పసిడి పాతరనీది
పరుల నోరూరెనోయ్
నీలో నీకె పెట్టి
నెత్తి చే యెట్టారు

దేశాన్ని దిగమింగి పోయినారోయ్
మోసాన్ని గుర్తెరిగి కాపాడోయ్

ఉత్తరాదీ మొదలు
దత్త మండల మంత
తెలంగాణ ప్రాంతముతో
చెలిమి గలిగించాలె

కలిసి మెలిసే నేడు పోవాలోయ్
కలిమి బలిమి గూర్చుకోవాలోయ్

ఆరుకోట్ల బలగమోయ్
ఒక్కటై మనముంటె
యిరుగు పొరుగులోన
వూరు పేరుంటాది
తల్లి ఒక్కతె నీకు తెలుగోడా!
సవతి బిడ్డల పోరు మనకేలా?

పెనుగాలి వీచింది
అణగారి పోయింది
నట్ట నడి సంద్రాన
నావ నిలుచుండాది

చుక్కాని బట్టరా తెలుగోడా!
నావ దరి జేర్చరా మొనగాడా!

– వేములపల్లి శ్రీకృష్ణ

నేలటూరి వెంకటరమణయ్య

ఆంధ్రదేశమున చరిత్ర పరిశోధన

సర్వశాస్త్రములను, విద్యలను పరిశీలించి గ్రంథములను రచించిన మన పూర్వికులేలనో చరిత్ర రచన చేయలేదు. ఇది యొక యాంధ్రదేశముననే కాదు భరత ఖండమంతతటను ప్రాచీనులెవ్వరును దేశచరిత్రను గూర్చి చింతించినవారు గారు. కల్హణుడొక్కడు మాత్రము రాజతరంగిణియనుపేర గాశ్మీర దేశచరిత్రను వ్రాసెను. మహమ్మదీయులతోడి సంపర్కము రాజ తరంగిణిరచనకు గారణమగుటవలన నది కేవలము భారతీయులకు జరిత్రయందు గల అభిమానమువలన విరచింపబడెనని యెంచుటకు వీలులేదు. మహమ్మదీయయుగమున హిందువులనేకులు చరిత్రరచనకు గడగిరి; కాని వీరి రచనలు మహమ్మదీయరచయితల గ్రంథములబడి సర్వసామాన్యమహమ్మదీయరాజులయొక్కయు, రాజ్యముల యొక్కయు చరిత్రలే యగుటచేత హిందూ మహాయుగ చరిత్ర వాని వలన దెలీయవచ్చుట లేదు. ప్రాచీన భారతదేశస్థితిగతులను దెలుపు చరిత్ర గ్రంథములు లేక పోయినను, చరిత్ర లేకపోలేదు. మన ప్రాచీనుల చరిత్రను దెలుపగల పరికరములు పెక్కు లభ్యమైనవి. వీని నాధారపఱచుకొని యత్యంతసూక్ష్మముగ గాక పోయినను స్థూలముగ నైనను మన పూర్వచరిత్రను విరచించుటకు సాధ్యమగుచున్నది. ఆధునిక చరిత్రపరిశోధకు లీ పరికరములను నాలుగైదు తరగతులుగ విభజించియున్నారు. ప్రాచీన వాస్తువిశేషములు, శిల్పములు, శాసనములు, నాణెములు, వాఙ్మయము మొదలగువాని మూలమున జరిత్రకారులు మన పూర్వచరిత్రను పునర్నిర్మాణము గావించుటకు బ్రయత్నము చేయుచున్నారు.

పాశ్చాత్య సంయోగమువలన మన కలవడిన విద్యలలో జరిత్రపరిశోధన యెకటి. తత్పూర్వము మనవారు జాతీయ జీవనమందు చరిత్రయొక్క ప్రాముఖ్యమును గుర్తించియుండలేదు. అటుతరువాతనే మన పాఠశాలల యందును, కళాశాలలయందును, విశ్వవిద్యాలయములందును చరిత్రల నభ్యసించి పట్టభద్రులైన మన యువకులకు నిజదేశచరిత్రను దెలిసికొనవలయునని యుత్సాహము గలిగినది. దీనికితోడు దేశపాలనార్థము నియుక్తులైవచ్చిన యాంగ్లేయాధికారుల కనేకులకు దాము పాలించు ప్రజల చరిత్రను, సంస్కృతిని దెలిసికొనవలయునను నభిలాష కలిగినది. కావున వారు చరిత్రరచన కనువగు సామగ్రిని సమకూర్చ నారంభించుటయే కాక మన దేశభాషల నలవఱచుకొని చారిత్రక వాఙ్మయాధిపరిశోధనకు మార్గదర్శకులైరి; ఆంగ్ల విద్యావిశారదులైన మనవారిని చరిత్రరచనకు బ్రోత్సహించిరి. ఇట్లు పాశ్చాత్యభారతీయపరిశోధకుల సహకారమువలన మన దేశమున చరిత్ర పరిశోధనము, దాని ఫలితమగు చరిత్ర రచనయు బ్రారంభమైనవి.

చరిత్రపరిశోధన భరతఖండమునందలి యన్ని దేశములకంటె ముందే యాంధ్రదేశమున నారంభమైనది. క్రీ.శ.19వ శతాబ్దపూర్వార్థమున కుంఫిణీ ప్రభుత్వమువారు కర్నల్ కాలిన్ మెకంజీ

యనునతనిని దక్షిణభారతదేశమునందు సర్వేయరుజనరల్ పదవికి నియమించిరి. ఇతనికి హైందవ సంస్కృతిని జక్కగ గ్రహించి దాని యభ్యుదయమునను వివరించు చరిత్ర గ్రంథమును వ్రాయవలయునని యభిలాష గలిగినది. తన యుద్యమము నెఱవేఱుటకు దగిన సామాగ్రిని సేకరించుట కొఱకు నిజద్రవ్యమును వెచ్చపెట్టి కొందఱు వ్రాయసకాండ్రను, గుమాస్తాలను నేర్పాటుచేసుకొని, వారిని దక్షిణాపథమందలి గ్రామగ్రామమునకుబోయి యచట లభ్యమగు తామ్రశిలాశాసనములకును, తాళపత్ర గ్రంథములకును బ్రతులు లిఖించుటయే కాక యచటిజనుల జాతివిశేషములను, వారి మత సాంఘికార్థిక పరిస్థితులను విచారించి వాని వివరములను వ్రాసి తేవలయునని నియోగించెను.

మెకంజీగారి గుమాస్తాల కందఱికిని నాయకుడొక యాంధ్రబ్రాహ్మణుడు. అతని పేరు కావలి వెంకట బొఱ్ఱయ్య; ఇతని క్రింద నితని సోదరుడు రామస్వామియు, వెంకటరావు, నారాయణరావు, నిట్టలనైనారు మొదలగు గుమాస్తాలనేకులు పనిచేయుచుండిరి. వెంకట బొఱ్ఱయ్యగారి యుత్తరవుననుసరించి పై పేర్కొనిన గుమాస్తాలు దేశసంచారము చేసి ప్రతి గ్రామముయొక్క పుట్టుపూర్వోత్తరమును, నందుండు శాసనాదులను యాథామాతృకముగ వ్రాసి పంపిరి; వారికి దెలియని వ్రాతయందుల్లేఖింపబడియుండిన శాసనములును దామ్రఫలకములందుగాని, శిలాతలమునందుగాని యేరీతి జెక్క బడియుండెనో యట్లే వానికి మాఱుప్రతులను దయారుచేసి యంపిరి. గుమాస్తాల పైని అధికారియగు కావలి వెంకటబొఱ్ఱయ్యయు, దక్కిన గుమాస్తాలలో బెక్కండ్రును దెనుగువారగుటచేత వారిచే దయారుచేయబడిన గ్రామకైఫియ్యతులు మున్నగు సర్వవిషయములును దెనుగు భాషయందే వ్రాయబడినవి. వీని నాధారపఱచుకొని వెంకటబొఱ్ఱయ్యగారు సందర్భానుసారముగ నచట నచట నాడులచరిత్రలను, రాజుల చరిత్రమును వివరించిరి. మెకంజీ గుమాస్తాలే మొదటి యాంధ్రచరిత్ర పరిశోధకులు. పరిశోధనా పద్ధతులను వీరికి నేర్పి శాస్త్ర సమ్మతమార్గముల నుల్లంఘింపనీయక పరిశోధన నడిపించిన వెంకటబొఱ్ఱయ్యగా రాంధ్రచారిత్రకపితామహు లనదగినవారు. ఆంధ్రచరిత్రకు వీరు వేసిన పునాదులననుసరించియే తరువాతి పరిశోధకులు చరిత్ర రచనను సాగించిరి. వెంకటబొఱ్ఱయ్యగారి పరిశోధన కేవలము స్థానిక చరిత్రరచనతోడనే ముగియలేదు. ఆయన గొప్ప లిపిమర్మజ్ఞుడు. మెకంజీ గుమాస్తాల దేశ సంచారమున వారికి దెలియని లిపియందు వ్రాయబడి యుండు ప్రాచీనశాసనములు పెక్కు తావుల గాన వచ్చినవి. మఱియు గ్రామాదులయం దచటనచట లభ్యములైన తామ్రపట్టికలుసైతమీలిపియందే వ్రాయబడియుండినవి. వీటిని జదువనప్పటివా రెవ్వరు నెఱుగరు. ఈ లిపి సామాన్యముగ నాంధ్రకర్ణాటకశాసనములయందే కానవచ్చుచుండుటచే నప్పటి పరిశోధన పండితులు దీనికి తెలుగుకన్నడలిపి యని నామకరణము గావించిరి. తెలుగుకన్నడలిపిమర్మమును గనిపెట్టి ప్రాచీన దక్షిణాత్యశాసనములను జదువు మార్గమును చరిత్రపరిశోధకులకు గఱపి శాసనపరిశోధనకు బునాది వేసినవాడు కావలి వెంకటబొఱ్ఱయ్య. చరిత్రరచనకు కావలసిన సాధనములందు శాసనముల ప్రాముఖ్యము అందఱు నెఱిగినదే. కావున దాక్షిణాత్యచరిత్ర రచనకు వెంకటబొఱ్ఱయ్యగా రొనర్చిన సేవ యమూల్యమని చెప్పుట యతిశయోక్తికాదు.

మెకంజీ గుమాస్తాల వ్రాతలు దాదాపు నాలుగు వందల సంపుటములు మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున గలవు. వీనికి మెకంజీ వ్రాతపుస్తకము లని పేరు. కాలక్రమమున క్రిమిదష్టములైపోవు వానిని సంరక్షింప నిశ్చయించి వీనియందు జాలభాగమును చార్లెసు ఫిలిప్ బ్రౌనుగారు అఱువదికి నెక్కుడైన సంపుటములను దిరుగ వ్రాయించిరి. ఇట్లు తిరుగవ్రాయించబడిన గ్రంథములకు లోకల్ రికార్డ్సు అని పేరు. మెకంజీ వ్రాతపుస్తకములుగాని, వానికి బ్రత్యంతరములనదగిన లోకల్ రికార్డ్సు గాని యాంధ్ర చరిత్రరచన కమూల్యమైన సాధనములు. వాఙ్మయదృష్టిగ జూచినను వాని విలువ కొంచెమైనది కాదు. ఇట్టి గ్రంథ సంచయ మింకను నముద్రితముగ నుండుట శోచనీయము. ఆంధ్రవిశ్వవిద్యాలయమువంటి మహనీయసంస్థ లీ కార్యమునకు బూనుకొనవలసియున్నది.

కావలి వెంకటబొఱ్ఱయ్యకు తరువాత పేర్కొన దగిన చరిత్రపరిశోధకుడు శ్రీమాన్ బుక్కపట్టణము రాఘవాచార్యులవారు. వీరు క్రీ.శ.19వ శతాబ్దపుటుత్తరార్ధమున గుంటూరు మండలమున వెలసిరి. వీరు మొదట ఫస్ట్‌క్లాసు రెవిన్యూ ఇన్‌స్పెక్టరైయుండి తరువాత సబ్ మెజిస్ట్రేటుపదమును బడసిరి. ఆ కాలమున మద్రాసు గవర్నరుగారి కౌన్సిలు మెంబరగు కార్మైకేలుదొర గారి ప్రోత్సాహమువలన నాయన దనకు లభ్యములైన చారిత్రక సాధన సామాగ్రి నాధారపఱచుకొని యాంధ్రదేశచరిత్రను గొన్ని సంపుటముల గ్రంథముగా దయారుచేసెను. రాఘవాచార్యులవారి యాంధ్రదేశ చరిత్రనుగూర్చి బ్రహ్మశ్రీ వేటూరు ప్రభాకర శాస్త్రులవారిట్లు వ్రాయుచున్నారు :

"బోర్డు మెంబరగు కార్మైకేలుదొరగారి ప్రాపున వీరు పెక్కు శాసనములను బరిశోధించి యాంధ్రదేశ చరిత్రను గొన్ని వాల్యుములుగా వ్రాసిరి. అందుగొన్ని వాల్యుములను మద్రాసులోనున్న యా దొరగారికి పంపినట్లు తెలియును. దొరవారాగ్రంథమును సరిగా సంరక్షింపకపోయియుందురు. మన్మిత్రులు మా.రామకృష్ణకవిగారు పెక్కు సంవత్సరములకు ముందు గుజిలీ పుస్తకముల యంగళ్లలో వ్రాతప్రతులను–శాసనచారిత్ర విషయములతోనున్నవానిని జూచి కొంత సొమ్మిచ్చి కొనిరట! కాకతీయులనుగూర్చి వ్రాసిన భాగము వారిదగ్గఱ గలదట! మఱొక పట్టు చరిత్రలో వ్రాసిన విషయములకు ఆకరములయిన శాసనములు గొన్ని గలది. అట్టిది కవిగారు నాకు ఎరవుగా ఒసగిరి.. అందలి శాసనము ఇటీవల ప్రకటితము అయినవే. క్రొత్తవిగా దోచినవి కవిగారు గాని, వారి యనుమతిని నేనుగాని ప్రకటింతుము... నర్సారావుపేటలోను, పొన్నూరులోను గ్రంథకర్తయగు శ్రీ రాఘవాచార్యులువారి కుటుంబము వారిని యాదృచ్ఛికముగా తెలిసికొనగల్గితిని. వారి దత్తపుత్రులు తమయింట బొడిపొడియై చెడిపోయి యొక వాల్యము పెంటపాలు కాగా దత్త్యుదశలోనున్న వేఱొక వాల్యమును నాకు జూపిరి. కార్మైకేలుదొరగారికి బంపిన వాల్యుముల ప్రత్యంతరములు గాబోలును వారియింటనున్నవి. నేడు క్రొత్తగా నపేక్షింపదగిన విషయములనేకములు లేకున్నను నేటి చరిత్రకారులెవ్వరును దలలెత్తకపూర్వము అనన్య సాధారణమయిన పరిశ్రమ చేసిన మహనీయుని గ్రంథమని కన్నులద్దుకొని పెద్దల యస్థులబోలెనాచినిగిన తునకలకట్టను ప్రాచ్యలిఖితపుస్తకశాలకు జేర్చితిని." (దుందుభి సంవత్సరాది సంచిక 197 అధోజ్ఞాపిక.)

రాఘవాచార్యులనాటికంటె నేడు పెక్కండ్రు పరిశోధకుల కృషికి ఫలితముగ మన చరిత్రజ్ఞానమత్యంతాభివృద్ధి నందినది. కావున శ్రీ ప్రభాకరశాస్త్రులవారన్నట్లు నేడు క్రొత్తగా నపేక్షింపదగిన విషయములనేకములు లేక పోయినను ఆంధ్రచారిత్రకపరిశోధనవాఙ్మయస్థానమున దానిస్థానమున్నతమైనది. చరిత్రరచనయందు రాఘవాచార్యులవారవలంభించిన పద్ధతి యుత్తమమైనది. ఆధునిక చరిత్రకారులవలె రాఘవాచార్యులవారు నిరాధారమైన వ్రాతకు మదింపు కలుగదని గుర్తించి శాసనాద్యుత్తమచారిత్రకసాధన సామగ్రి నాధారపఱచుకొనియే చరిత్రరచనను సాగించిరి. క్రొత్త విషయములను దెలిసికొనుట కొఱకు గాకపోయినను చరిత్రరచనాపద్ధతిని గనుగొనుటకైనను రాఘవాచార్యులవారి గ్రంథమును జదువవలసియున్నది.

రాఘవాచార్యులవారి పరిశోధనలతో క్రీ.శ.19వ శతాబ్దము ముగిసినది. ఇరువదవ శతాబ్దముతో మన జాతీయ చరిత్రయందు నూతనయుగము ప్రారంభమైనది. అప్పటి కాంగ్ల భాషాభ్యసనము దేశమునవిస్తరించుటచే దన్మూలమున పాశ్చాత్య విజ్ఞాన మెల్లయెడలను బ్రసరించినది. మన జాతీయజీవనమున నూతన చైతన్యము బొడసూపినది. విద్యావంతులకు బాశ్చాత్యశాస్త్ర పరిశోధనాపద్ధతులు సుపరిచితములైనవి. సర్వ విషయములయందు పాశ్చాత్యపద్ధతులే సర్వోత్కృష్టములైనవను నమ్మకము జనసామాన్యమున గలిగినది. వాఙ్మయమునందేమి, కళలయందేమి, శాస్త్రములయందేమి మనవారికి పాశ్చాత్యదేశము లాదర్శప్రాయములైనవి. పాశ్చాత్యమార్గముల ననుసరించి నవీన వాఙ్మయమును సృజించుటకును, కళానిర్మాణము గావించుటకును, శాస్త్రవిచారము చేయుటకును మనవారారంభించిరి. ప్రప్రథమమున మన పాశ్చాత్యమార్గానువర్తులదృష్టికి గురియైన విషయము చరిత్రరచన; చరిత్ర లేని జనపదమునకు నాగరక ప్రపంచమున గణుతి లేదని పాశ్చాత్యుల యభిప్రాయమగుటవలన చరిత్రగ్రంథములు లేని మనదేశమునకు ఆ లోపమును దొలగించుట దమ ప్రథమ కర్తవ్యమని నిశ్చయించి మన యాంగ్లవిద్యావిశారదులు చరిత్రపరిశోధనకు గడగిరి. ఈ నవయుగ ప్రారంభమున నాంధ్రదేశచరిత్రపరిశోధనకు గడసిన ప్రముఖులలో నగ్రగణ్యుడు కందుకూరి వీరేశలింగం పంతులు; కాని పంతులువారి పరిశోధనకు గారణము వారి చరిత్రాభిమానము గాదు. వారి కాంధ్రదేశచరిత్రను రచింపవలయుననునుద్దేశము లేదు; వారి హృదయమున దేశాభిమానముయొక్క స్థలమును భాషాభిమాన మాక్రమించుకొనెను. ఆయన స్వయము కవియును, విద్వాంసుడును నగుటచేత నాంధ్రభాషను బెంపొందించిన యాంధ్రకవుల చరిత్రను రచింపవలయునను నభిలాష గలిగెను. కవుల కాలము నెఱగక వారి చరిత్రను వ్రాయుటకు సాధ్యము గాదు; కావున వీరేశలింగంపంతులుగారు మొట్టమొదట ప్రతియాంధ్రకవియొక్క కాలమును నిర్ణయించుకొనవలసివచ్చెను. కొంచెమించుమించుగ నాంధ్రకవులందఱును రాజా శ్రయమును బొంది వారి ప్రోత్సాహాదరణలమీద కావ్యరచన జేసియుండుటచేత నారాజుల కాలము దెలిసిన వారి కాలము సులభముగ దెలిసికొనవచ్చును. కావున వీరేశలింగం పంతులుగారు రాజవంశచరిత్రపరిశోధనకును, దన్మూలమున దేశచరిత్ర పరిశోధనకును బూనుకొనవలసివచ్చినది. వీరేశలింగం పంతులుగారు తత్పూర్వపరిశోధకులవలె చారిత్రక సాధన సామాగ్రిని సమకూర్చుకొనుటకు దేశాటనము గావింపలేదు. వీరి పరిశోధనయంతయు మెకంజీ గ్రంథపరిచయముమీదను, లోకల్ రికార్డ్సు మీదను నాధారపడియున్నది. వీరేశలింగం పంతులు గారు కేవలము చరిత్రపరిశోధకుడు కాకపోయినను, వీరి యాంధ్రకవులచరిత్ర పెక్కండ్రను చరిత్రపరిశోధనకు బురికొల్పినది.

వీరేశలింగముగారి వెనుక బేర్కొనదగిన పరిశోధకులు చిలుకూరి వీరభద్రరావుగారు. ఆంధ్రకవుల చరిత్రను బఠియించిన పిమ్మట వీరభద్రరావుగారికి ఆంధ్ర దేశచరిత్రను రచింపవలయునను నాస పొడమినది. నిజనివాసస్థలమగు రాజమహేంద్రవరమున చరిత్రపరిశోధనను సాగించు వసతి లేకపోవుటచేత వీరభద్రరావు గారు తమ ద్రవ్యమును వెచ్చపెట్టుకొని వచ్చి మదరాసున గాపురము సేయవలసినవాడాయెను.

చిలుకూరి వీరభద్రరావుగారితో గూడ, బేర్కొనవలసిన మఱియొక పరిశోధక మహాశయుడు కొమఱ్ఱాజు వెంకటలక్ష్మణరావు పంతులుగారు. వీరు గొప్ప విద్యాంసులు. సంస్కృత మహారాష్ట్రాంధ్ర భాషలయందు వీరి పాండిత్యమద్వితీయము. లక్ష్మణరావుగారు చరిత్రనభిమాన శాస్త్రముగ గొని, ఎం.ఏ. పరీక్ష యందుతీర్ణులైపట్టభద్రులగుటచే వారికి పాశ్చాత్యచరిత్రపరిశోధనాపద్ధతులన్నియు జక్కగ నలవడియుండినవి. విద్యార్థి దశయందు మహారాష్ట్రదేశమునందుండిన కారణమున సుప్రసిద్ధ మహారాష్ట్రపరిశోధకులతో జెలిమి కుదిరినది. వారి యుదాహరణమునననుసరించి యాంధ్రదేశమున నవ్య విజ్ఞానమును బ్రసరింపజేయవలయుననియు, సాధన సామగ్రిని సమకూర్చి దేశచరిత్రను రచింపవలయుననియు నిశ్చయించి తనయుద్దేశమును నెఱవేర్చుకొనుటకొఱకు విజ్ఞానచంద్రికామండలి యను సంస్థను స్థాపించెను. ఆంధ్రాభ్యుదయముకొఱకు విజ్ఞాన చంద్రికామండలి యొనర్చిన దేశసేవ ప్రశస్తము; చిరసంస్మరణీయము. దీని యాదర్శము లత్యున్నతములు; కృషి బహుళఫలప్రదాయకము. కాని మండలి యాదరణకు పాత్రములైన యంశములన్నిటను ప్రకటితములైన గ్రంథములను వర్ణించుటకిదియదను గాదు; చరిత్ర పరిశోధన కది యెట్లు తోడ్పడెనో తెల్పుటయే ప్రస్తుతోద్దేశము. లక్ష్మణరావుపంతులుగారు స్వయము చరిత్రకారులు. మహారాష్ట్ర స్వాతంత్ర్య సంస్థాపకుడైన ఛత్రపతి శివాజీ చరిత్రను తెలుగున వ్రాసిరి. హిందూదేశచరిత్రను సమగ్రముగా వ్రాయ సంకల్పించి హిందూ మహమ్మదీయ మహాయుగములను రెండు సంపుటములను విజ్ఞాన చంద్రికయందు ప్రకటించిరి. లక్ష్మణరావు గారి హిందూదేశచరిత్ర గ్రంథముశైలి మృదుమధురము, భాష పటుత్వము గలది, చదువుటకు హృదయంగమముగ నుండును. రచన నిష్పక్షపాతము, జంకు గొంకులేని విమర్శన. ఇట్టిగుణ సంపత్తి గలవగుటచే పై గ్రంథముల మూలమున లక్ష్మణరావుగారికి ఆంధ్రచారిత్రకవాఙ్మయముననత్యున్నత స్థానము జేకూఱినది. లక్ష్మణ రావుగారు కేవలము చరిత్రరచయితమాత్రమేకాదు, శాసన పరిశోధకుడుగూడ. ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించిన శిలాతామ్రశాసనములను బెక్కింటిని బయలు పఱచి పరిష్కరించి ప్రకటించిరి. వీరి పరిశ్రమలవలననే ఆంధ్రదేశపు శాసనముల ప్రాముఖ్యము జనులకు దెలియవచ్చినది.

లక్ష్మణరావుగారు స్వరచనలతో దృష్టిపడి యుండలేదు. చరిత్రాభిమానుల నెల్ల వీరు పరిశోధనకును, గ్రంథరచనకును బురికొల్పినారు. వీరి ప్రోత్సాహ సహాయములవలన చరిత్రరచన యొనర్చినవారిలో ముఖ్యుడు శ్రీ చిలుకూరు వీరభద్రరావుగారు, లక్ష్మణ రావుగారి

చరిత్రాభిమానమువలలనే వీరభద్రరావుగారికి విజ్ఞానచంద్రికామండలి ప్రాపు చేకూరినది. లక్ష్మణరావుగారు తనకొనర్చిన సాహాయ్యమునుగూర్చి వీరభద్రరావుగారే యిట్లు చెప్పియున్నారు:

"విజ్ఞాన చంద్రికామండలివారు నా కీ గ్రంథము (ఆంధ్రదేశకథాసంగ్రహము) నుచితముగా ముద్రించి యిచ్చుటకు నౌదార్యము గలవారైనను, వారి గ్రంథములపై వచ్చు నాదాయమంతయు వారి గ్రంథముల ముద్రాభృతికే సరిపోవుచున్నందున నంతకన్న నెక్కువ సాహాయ్యమును జేయజాలకుండిరి. కాని మండలివారే యొకానొక విద్యాప్రియుడగు శ్రీమంతునకు జెప్పి ముద్రాభృతియు నాకు నిప్పించిరి. చరిత్రాసక్తియు నౌదార్యముగల యీ శ్రీమంతుడు నా ప్రయాసమును స్వయముగా వీక్షించుచుండిన మండలి సభాసదుడగు లక్ష్మణరావుపంతులుగారిచే నా చేయుచున్న పనినంతయు విని దయార్ద్ర హృదయుడై నాగ్రంథము యొక్క యీ ప్రథమ భాగమునకు ముద్రాభృతినంతయుదామువహింతుమని తెలియజేయుటయేగాక వాగ్దత్తముప్రకారము నెఱవేర్చి నాకిష్టములన్నిటిని తుదముట్టించి నాకు మహోపకారము జేసిరి."

ఇంత వరకు లక్ష్మణరావుగారి మూలమున దాను పొందిన ధనసాహాయ్యమునుగూర్చి చెప్పినారు వీరభద్రరావుగారు. ఇక ఆయన తనకు గ్రంథరచనయం దెట్లు తోడ్పడినారో చెప్పుచున్నారు :

"అందరికంటెను ముఖ్యముగా గంటికి ఱెప్పవలె దగ్గరనుండి నిరుత్సాహపడుచుండినప్పుడు ధైర్యమును జెప్పుచు సర్వవిధములదోడ్పడి మఱువగూడని సాహాయ్యమొనర్చి నాచే నీ కార్యము నిర్వహింపజేసిన బ్రహ్మశ్రీ కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు పంతులు ఎం.ఏ. గారికి నా కృతజ్ఞతావందనములను దెలుపుకొనుచున్నాను. దేశాభిమానులయిన యిట్టి మిత్రవర్గము యొక్క తోడ్పాటుతో నొక సంవత్సరకాల మహోరాత్రములు కృషిచేసి యేదో యొక్క విధముగా నాంధ్రదేశచరిత్రముయొక్క యీ ప్రథమభాగమును రచించి ప్రకటింపగల్గితిని." (ఆంధ్రదేశకథాసంగ్రహము - పూర్వయుగము, అవతారిక, పుటలు 13, 15, 16)

ఇట్లు వీరభద్రరావుగారు లక్ష్మణరావుగారి వలన దాము పొందిన సాహాయ్యమును స్పష్టముగ దెలియజేసియున్నను ఒక్క విషయము నిచ్చట నొక్కి చెప్పవలసియున్నది. లక్ష్మణరావుగారితోడి చెలిమివలన వీరభద్రరావుగారి పరిశీలనాదృష్టి విశాలతను బొందినది; లక్ష్మణరావుగారి సలహావలన పూర్వచరిత్ర పరిశోధకులవలె కేవలము మెకంజీ పుస్తకములు మీదను, పరంపరగ జనసామాన్యమున వాడుకయందుండు నైతిహ్యములమీదను నాధారపడక గవర్నమెంటుశాసన పరిశోధనశాఖవారిచే బ్రకటితములైన శాసన గ్రంథములను, వారి సాంవత్సరిక కార్యనివేదికలను బరిశీలించి గ్రంథరచన జేయగడగిరి.

వీరభద్రరావుగారి యూహకుఱెక్కలు గలవు. తఱచుగ నదివాస్తవ ప్రపంచమును వీడి యంతర్మేఘసీమకు సంచారము వెడలుచుండును. అట్టి సమయమున లక్ష్మణరావుగారి సునిశిత విమర్శనాప్రతిభ దానిని శృంఖలాబద్ధము గావించి వాస్తవదూరము గానీయక పట్టి నిలపెడిదని చెప్పుదురు.

వీరభద్రరావుగారు ఆంధ్రుల చరిత్రగాక మఱికొన్ని చరిత్ర గ్రంథములను, శ్రీనాథ చరిత్రను రచించిరి; కాని వీరు వ్రాసిన గ్రంథములన్నిటియందును ఆంధ్రుల చరిత్రయే శ్రేష్ఠతమమైనది. ఆంధ్రుల చరిత్ర కేవలము ఆంధ్రదేశమును పాలించిన రాజవంశముల చరిత్రకాదు. ఆంధ్రప్రజల రాజకీయార్థిక సాంఘిక మతాదివిషయములందు వర్ణింపబడియున్నవి. తెనుగున చరిత్ర రచనకు గడగిన గ్రంథకర్తలలో, రాజ వంశ చరిత్రతోపాటు ప్రజల యభ్యుదయమును వర్ణింపమొదలు దలపెట్టినవారు వీరభద్రరావుగారే. వీరిది మనోహరమైన శైలి. చదువజదువ బాఠకుల యభిలాషయతిశయమగుచుండును. వాదములను నడపుటయందు వీరి దందెవేసిన చేయి; వివాదగ్రస్తమైన విషయములను జర్చించు సమయములందు వీరి భాషకు నూతన గుణము లలవడును. అమ్ముపోటువలెను, శూలఘాత విధమునను, కత్తివ్రేటు తెఱగునను నొప్పింపగలదు; పాముపలె బుసకొట్టును; పులివలె చీఱివేయును.

వీరభద్రరావుగారి యాంధ్రుల చరిత్రయం దొక గొప్ప లోపము గలదు. అది శాఖా చంక్రమణము తాము వ్రాయుచున్నది. యాంధ్రదేశచరిత్ర యను విషయమును విస్మరించి, సమయము చిక్కినప్పుడెల్లను రాజులకంటెను, రాజవంశములకంటెను నధికముగ మంత్రులను, వారి వంశములను వర్ణించియున్నారు. వీరభద్రరావుగారి ప్రశంసకు బాత్రులైన మంత్రులనేకులు నియోగిబ్రాహ్మణశాఖకు జెందినవారగుటచేత, వీరు వ్రాసిన గ్రంథము నాంధ్రుల చరిత్రయనుటకంటె నియోగిచరిత్ర యనుట యుక్తమనీ కొందఱు చెప్పుదురు. ఇది సరికాదు. ఏలన, ఔచితిని పరిగణింపక వీరభద్రరావుగారు విశేషముగ బ్రశంసించినదొక మంత్రులను మాత్రమే కాదు; కవులయెడగూడ వీరీ పద్ధతినే యవలంబించియున్నారు. కవులందఱును నియోగులు గారు; నన్నెచోడకవిరాజు, బద్దెన మొదలగు క్షత్రియకవులుగూడ గలరు; కావున వీరభద్రరావుగారు మంత్రులనుగూర్చియు, గవులను గూర్చియు నౌచిత్యమును బరిగణింపక విశేషముగ బెంచి వ్రాయుటకు గారణము వారి స్వకులాభిమాన మనుట సరికాదు. రాజ్యపాలనయందు బేరెన్నికకెక్కిన రాజకార్యమర్మవిధులైన మంత్రిసత్తములయొక్కయు, వాఙ్మయమున కలంకారభూతులైన మహాకవుల యొక్కయు జారిత్రమును బ్రకటించుటకొఱకే యని తలచుట యుక్తము.

క్రీ.శ.20వ శతాబ్ద ప్రథమద్వితీయశకములందు లక్ష్మణరావుగారును, వీరభద్రరావుగారును నాంధ్రచారిత్రక పరిశోధక ప్రపంచమున సూర్య చంద్రులవలె వెలుగొందిరి. అక్షరజ్ఞులైన యాంధ్రులలో వీరి గ్రంథములను జదువనివారరుదు. ఆంధ్రయువజనులకెల్ల వారాదర్శప్రాయములైరి. వారివలె చరిత్ర పరిశోధన సేయవలయుననియు, నాంధ్రదేశచరిత్రను రచియింపవలయుననియు నాశ, ప్రతి విద్యావంతుని హృదయమున నంకురించెను. వీరి కృషిమూలమున నాంధ్రలోకమున గాఢమైన చరిత్రాభిమానము గలిగినది. వీరి దేశసేవ యద్వితీయము. ఇట్టి మహనీయులు ఋషి కల్పులు గదా.

విజ్ఞానచంద్రికామండలి క్రమక్రమముగ ఖిలపడిపోయినది; కాని యాంధ్రచరిత్రపరిశోధన పెక్కుతావుల నెలకొనినది. వీనియందు ముఖ్యముగ బరిగణింపదగినది మదరాసు. క్రీ.శ.1915వ సంవత్సర ప్రాంతమున మదరాసు విశ్వవిద్యాలయమున దక్షిణ హిందూ దేశచరిత్ర పరిశోధనార్థము

చారిత్రపరిశోధన శాఖ యేర్పఱుపబడినప్పటినుండియు నచట నాంధ్రదేశచరిత్రపరిశోధన ప్రారంభమాయెను. వీరి పరిశోధనకు ముఖ్యముగ గుఱియైనది విజయనగర సామ్రాజ్యచరిత్ర. మదరాసు విశ్వవిద్యాలయమున మొదటి ఇండియన్ హిస్టరీ ప్రొఫెసర్‌గా నుండిన డాక్టరు యస్.కృష్ణస్వామి అయ్యంగారికి విజయనగరసామ్రాజ్యముపై నభిమానముమెండు. కాని యతనికి సంస్కృతాంధ్రకర్ణాటకభాషలు దెలియకపోవుటచే నా భాషలయందు త్రవ్వింతండములుగ లభించు విజయనగర చరిత్ర సాధన సామగ్రి యందని మ్రానిపండ్లాయెను. కావున నతడు దనయొద్ద పరిశోధక విద్యార్థిగ బనిసేయుచుండిన యానూరి రంగస్వామి సరస్వతి గారిని పై భాషలయందు గానవచ్చెడి విజయనగర సంస్థానమునకు సంబంధించిన యావద్విషయమును సమకూర్చి యాంగ్ల భాషాపరివర్తనముతోగూడ నొక గ్రంథమును దయారుసేయ నియోగించెను. రంగస్వామి సరస్వతి బహుమేధావి. సంస్కృతాంధ్రములయందు చక్కని వైదుష్యము గలదు. ప్రతిభయద్భుతమైనది. చరిత్రపరిశోధనయందు సహజనైపుణ్యము గలవాడు. సంస్కృతాంధ్రాదివాఙ్మయములను బరిశోధించి యతడచిరకాలముననే ఆంగ్లానువాదములతోగూడ 342 పుటల గ్రంథమును తయారుగావించెను. యూనివర్సిటీ ప్రొఫెసరగు డాక్టరు కృష్ణస్వామిఅయ్యంగారు దీనికి "సోర్సెస్ ఆఫ్ విజయనగర హిస్టరీ"యని నామకరణము గావించి తమ పేరిట బ్రకటించుకొన్నను, నది రంగస్వామి సరస్వతిగారిచే విరచితమని పీఠికయందొప్పుకొనియున్నారు. రంగస్వామి సరస్వతి కొన్ని చారిత్రకవ్యాసములను ఆంధ్రమునను, నాంగ్లమునను వ్రాసియున్నారు. కాని యతని ముఖ్య గ్రంథము "విజయనగర చరిత్రకాధారములే". సాధారణముగ పరిశోధకుల కందని చరిత్రాంశములనెల్ల బరిశోధించి యెకచో సమకూర్చి తరువాతి విజయనగర చరిత్రపరిశోధనలకు బునాది వేసిరి. కావున వీరి కృషి కడుంగడు ప్రశంసనీయము.

ఇంతవఱకును దెనుగున చరిత్రపరిశోధనాంశములను జర్చించుట కనుకూలమైన పత్రికలు లేవు. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక, శారద మున్నగు పత్రికల యందు కొన్ని చరిత్రాత్మకవ్యాసములు బ్రచురింపబడియుండుట వాస్తవమే. కాని ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక ముఖ్యముగ వాఙ్మయవిషయచర్చలకొఱకేర్పడినది. మఱి ఇది సామాన్యుల కందుబాటగునది కాదు. పలుకుబడిగల గొప్పవారల వ్యాసములకేగాని యన్యుల వ్రాతలకందు తావుదొరకుట యరుదు. శారదకు ధన సంపత్తి చాలదు. కాదాచిత్కముగనందు చరిత్రాత్మకవ్యాసములు బ్రకటితములగుచువచ్చినను శాసనాదులను బ్రతిబింబములతోగూడ ప్రకటించుట కవకాశముండెడిదికాదు. ఈ పరిస్థితులందు విశ్వదాత కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు గారు భారతి మాసపత్రికను బ్రకటింప నారంభించి యాంధ్రచరిత్రపరిశోధకులకు పెన్నుబ్రాపై నిలచిరి. విశ్వదాతగారి సర్వతోముఖవదాన్యతను జగమెఱుగును. వారి యీవినిపొగడుట కిది సమయము కాదు. పొలిటీషియనులకును, గవులకును ఆయన పట్టుకొమ్మ యని యందఱెఱిగిన విషయమే. చరిత్రపరిశోధకులకు నాగేశ్వరరావుపంతులుగారొనర్చిన మేలు మరువరానిది. ప్రతిమాసము భారతి యందును చరిత్రపరిశోధకుల నాహ్వానించి పారితోషికములనిచ్చి వారిచే వ్యాసములను వ్రాయించి ప్రకటించుటయే కాక శాసన ప్రకటనకు ధనము ధారళముగ వెచ్చపెట్టి చక్కని ప్రతిబింబములను తయారుచేసి ముద్రించుటకు దగు నేర్పాటులను గావించిరి. భారతియందు బ్రకటితములైనన్ని శాసనములు మఱి యే భాషా పత్రికలలోను ప్రకటితము గాలేదు. క్రమక్రమముగ నదిజారిత్రక విషయచర్చలకు సహజ రంగస్థలమైనది. పరిశోధనయందారితేఱి పేరు ప్రఖ్యాతులుగన్న పండితులనేకులమూల్యములైన వ్యాసములను వ్రాసి యజ్ఞాతమైన మన పూర్వచరిత్రను భారతి మూలమున నాంధ్రప్రపంచమునకు వెల్లడిసేయగడగిరి. భారతి ప్రకటనలవలన నాంధ్రదేశమున చారిత్రక విజ్ఞానము పెంపొందినది. ప్రజలకు చరిత్రాభిమానము మెండైనది. ఇట్టి దేశసేవ జేయు భాగ్యము మఱి యే పత్రికకును గలుగలేదు.

ఆంధ్రచరిత్రపరిశోధనయే ప్రధానోద్దేశముగ గల మఱికొన్ని యాంగ్ల త్రైమాస పత్రికలు గలవు. ఇందు ముఖ్యమైనది యాంధ్రేతిహాసకసంశోధక త్రైమాసిక. (త్రైమాసిక యనుపేర నియి యింకను బ్రకటితమగుచున్నను వాస్తవముగ నిది వార్షిక పత్రికగ మారినది. ఇది కడుశోచనీయము). రాజ మహేంద్రవరచారిత్రక పరిశోధక సంఘమువారి పరిశోధనలందు ప్రకటింపబడుచున్నవి. ఈ త్రైమాసికయందు దమ పరిశోధనల నాంగ్లమున బ్రకటించుటయేకాక ఆంధ్రేతిహాసకపరిశోధక సంఘమువారాంధ్రమున గూడ కొన్ని చరిత్రగ్రంథములను బ్రచురించియున్నారు. ఇంతవఱకును వీరి కృషి వలన నాలుగు 'సంచిక'లు వెలువడినవి. ఇందు మొదటిది.

శ్రీ రాజరాజనరేంద్రపట్టాభిషేక సంచిక :- 1922వ సంవత్సరమున బ్రచురింపబడెను. సంపాదకుడు శ్రీ భావరాజు వేంకటకృష్ణరావుపంతులుగారు. పూర్వ చాళుక్యవంశజుడును, నాంధ్రమహాభారత ప్రథమ పర్వత్రయమునకు గృతిపతియు నగు రాజరాజనరేంద్రుని మంగళకీర్తిని స్మరించుకొఱకీసంచిక ప్రకటితమైనను, పూర్వచాళుక్యచరిత్రకు సంబంధించిన పెక్కు విషయము లిందు వర్ణింపబడియున్నవి. రెండవది కళింగ సంచిక. కళింగదేశపు చరిత్రయని తత్సంపాదకులు శ్రీ రాళ్లబండి సుబ్బారావుపంతులుగారు దీనికి నామకరణము జేసియున్నారు. సంకీర్ణ గ్రంథ మగుటచే దీనిని సంచిక యనుటయే యుక్తము. ఇది 1930వ సంవత్సరమున బ్రచురింపబడెను. కళింగ దేశచరిత్రకు సంబంధించిన పెక్కు విషయములిందు వర్ణింపబడియున్నవి. మూడవది కాకతీయ సంచిక. ఇది శ్రీ డాక్టరు మారేమండ రామారావుగారి సంపాదకత్వమున 1935వ సంవత్సరమున బ్రకటింపబడెను. కాకతీయచరిత్ర మిందు వర్ణింపబడియున్నది. నాల్గవది రెడ్డి సంచిక. శ్రీ వద్దాది అప్పారావుగారి సంపాదకత్వమున 1947వ సంవత్సరమున బ్రకటింపబడెను. ఇందు కొండవీటి రెడ్లచరిత్ర వర్ణింపబడియున్నది. రాజమహేంద్రవరరెడ్ల ప్రస్తావనయు గొంతకలదు.

పైబేర్కొనిన నాలుగు సంచికలను బ్రకటించి ఆంధ్రేతిహాసకసంశోధకమండలివారు ఆంగ్ల భాషనెఱుగని యాంధ్రజనులకు మహోపకారము గావించిరి. ఇటీవల శ్రీ డాక్టరు మారేమండ రామారావుగారి కృషివలన నాంధ్రేతిహాసకసంశోధక మండలి యొకటి గుంటూరునందేర్పడెను. 'ఆంధ్రచరిత్ర-సంస్కృతి'యను త్రైమాసిక పత్రిక యొకటి ప్రకటింపబడుచున్నది. కొంత పరిశ్రమ సాగినది. కొన్ని విషయములు చర్చింపబడినవి.

శ్రీ పి.శేషాద్రిశాస్త్రి గారు కొన్ని విషయప్రకటితములైన తెనుగు శాసనములను ప్రకటించిరి. ఈ మండలివలన నింతవఱకు నడచిన కృషి యింతయే.

ఆంధ్రేతిహాసకపరిశోధక, సంశోధక మండలులే కాక నైజామురాష్ట్రమునందు చరిత్ర పరిశోధక సంస్థలు కొన్నియున్నవి. హైదరాబాదునగరమందలి లక్ష్మణ రాయపరిశోధకమండలి నైజాముపాలన క్రింది యాంధ్ర రాష్ట్రప్రాచీన చరిత్రగూర్చి కొంత కృషిని చేసియున్నారు. తెలంగాణమున నుండు శాసనములను నెదకి కనుగొని వానిని తెలంగాణాశాసనములను నొక ప్రత్యేక గ్రంథముగ బ్రకటించిరి. ఈ సంపుటమున ప్రాచీనాంధ్రదేశచరిత్రకు సంబంధించిన శాసనముల పూర్వములైనవి పెక్కు గలవు. కాని ఈ గ్రంథము పరిష్కృతమైన గాని పరిశోధకుల కంతగ నుపయోగకారి కాదు.

పై సంస్థలతోపాటు గవర్నమెంటు ఆర్కియాలజీ శాఖవారును జాల కృషిసల్పి వేలకొలది ప్రాచీన శాసనములకు బ్రతిబింబములను దీయించి ప్రకటించిరి. ఎపిగ్రాఫియా ఇండికాయందును, దక్షిణ ఇండియా శాసన సంపుటములందును నాంధ్రదేశ చరిత్రకు సంబంధించిన శాసనములనేకము సంపూర్ణశాసన గ్రంథములతో ముద్రింపబడియున్నవి. ఇట్లే నైజాముగవర్నమెంటు ఆర్కియాలజీశాఖవారు తెలంగాణ చరిత్రకు సంబంధించిన శాసనములను గొన్నింటిని ప్రచురించిరి. ఈ శాసన గ్రంథము లాంధ్రచరిత్ర పరిశోధకులపాలిటి పెన్నిధులని చెప్పవచ్చును.

గవర్నమెంటు ఆర్కియాలజీశాఖను బోలి మన విశ్వవిద్యాలయములును చరిత్ర పరిశోధనను బ్రోదిసేయగడగినవి. మదరాసు విశ్వవిద్యాలయమందు విజయనగర సామ్రాజ్య చరిత్ర పరిశోధన యెట్లు ప్రారంభమయెనో పూర్వ ప్రకరణమున వర్ణింపబడెను. ఆచార్య కృష్ణ స్వామి అయ్యంగారికి వెనుక విశ్వవిద్యాలయపు చరిత్ర శాఖ కధ్యక్షుడైన ఆచార్య నీలకంఠశాస్త్రులువారును విజయనగర చరిత్ర పరిశోధనయందేకాక యావదాంధ్ర దేశచరిత్ర విషయముననును గడు శ్రద్ధవహించి, తన యాధిపత్యముక్రింద బనిసేయుచుండిన తోడి పరిశోధకులను, పరిశోధక విద్యార్థులను బురికొల్పి వారిచే బెక్కు గ్రంథములాంగ్లమున వ్రాయించిరి. ఆంధ్రదేశ చరిత్ర పరిశోధనలకు మదరాసు విశ్వవిద్యాలయమువారొసగిన చేయూత యలతియైనది కాదు. ఈ మేలునకు ఆంధ్రలోకము వారికి దగురీతిని కృతజ్ఞత సూపవలసియున్నది.

ఆంధ్రవిశ్వవిద్యాలయ మాంధ్ర సంస్కృతిని బ్రోదిసేయు నుద్దేశముతో స్థాపింపబడినను నాంధ్రచరిత్రపరిశోధనకందు తావులేకపోయెను. కాదాచిత్కముగనొకటి రెండు చరిత్ర పరిశోధన గ్రంథములీవిశ్వ విద్యాలయమునుండి వెలువడినను నవి విశ్వవిద్యాలయాధికారుల చరిత్రాభిమానమునకు సూచకములు గావు. మన జన్మదేశచరిత్రను దెలిసికొనుటకు మన యువకులన్యవిద్యాపీఠములపై నాధారపడవలసియున్నది. చీనా, జపాను, జర్మనీ, రష్యా మొదలగు ప్రాచ్యపాశ్చాత్య చరిత్రలను గఱపుట కవకాశము కలదు. కాని యాంధ్రదేశచరిత్రను బోధించుటకందు వలనులేదు. మన విశ్వవిద్యాలయ పరిస్థితులిట్లుండినను చరిత్రాభిమానము గల పరిశోధకపండితులుద్యోగమునకు గుదురుటవలన గొంత పరిశ్రమ నడచినది. ఆంధ్రదేశచరిత్రకు సంబంధించిన గ్రంథములు రెండు మూడు వెలువడినవి. ఈపాటి మేలొనరించినందులకైనను ఆంధ్రులు వీరికి కృతజ్ఞతాబద్ధులు కావలసియున్నది.

పరిశోధకసంఘములు, విశ్వవిద్యాలయములుమున్నగు సంస్థలమూలమున నడచిన చరిత్రపరిశోధన ఇంతవఱకు స్థూలముగ వివరింపబడినది. ఇక నీ సంఘముల పక్షముననును, దమంతట స్వతంత్రముగను సాగించిన పరిశోధనలగూర్చి యించుకంత వ్రాయవలసియున్నది. లక్ష్మణరావు, వీరభద్రరావుగార్లచే నుద్బోధితులై విద్యాధికులనేకులు చరిత్రరచనకు బూనుకొనిరి. వీరిలో ప్రముఖుడు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు. అధ్యయన శర్మగారు కొన్ని యేండ్లపాటు లక్ష్మణరావు గారికి చేదోడువాదోడుగ పనిచేసి చరిత్ర పరిశోధన మందధునాతన పద్ధతులను గ్రహించిరి. వీరభద్రరావుగారియెడ వీరికి గాఢమైత్రి గలదు. ఉద్యోగధర్మము వలన పరిశోధనకు గడగు విద్యాధికులవలెగాక శర్మ గారికి చరిత్రపరిశోధన సమాజక్రీడ; శాసన పరిష్కార మాభిమానవిద్య. లిపిశాస్త్రమున వీరితో సమానమైన జ్ఞానముగలవారి సంఖ్య యల్పిష్ఠము. లిపిమర్మ విశారదుడగుటచే నెట్టి ప్రాచీన శాసనముయొక్క గుప్తార్థమును నాయనకు బట్టబయలు. శర్మగారు సంపాదించి పరిష్కరించి ప్రకటించినన్ని శాసనములను మఱియెవ్వఱును ప్రకటించియుండలేదు. ప్రాచీన దక్షిణ హిందూ దేశచరిత్రయందు శర్మగారికి దెలియని విషయము లేదు. ఎంతటి గూఢసమస్యయైనను వీరి దృక్పథమును బడిన చిక్కులను బెడబాసి విశదము కాగలదు. ఆంధ్రముననను, ఆంగ్లముననను సోమశేఖర శర్మగారు పెక్కు పరిశోధన వ్యాసములను, గ్రంథములను వివరించియున్నారు. అన్నిటిని ఇచట పేర్కొనుటకు దావులేదు. అమరావతీస్తూపము, మన ప్రాచీన విద్యాసంస్థలు, హిందూదేశ చరిత్ర వీరి ప్రధానాంధ్రగ్రంథములు. శర్మగారి వచన రచన మనోహరమైనది. మాటలు మధురములు. భావోద్రేకమును గల్గించి పాఠకుల నుఱ్ఱూతలూపజాలు శైలి. కాని వ్యావహారిక భాషావాది. పంటెడు పాలలోని పాంసులేశమునుబోలి వీరి రచనల నీవ్యావహారిక భాష కళంకాంకితము సేయుచున్నది. ఇవిగాక ఆంగ్ల భాషయందు 'ఎ ఫర్గాటన్ చాప్టర్ ఆఫ్ ఆంధ్రహిస్టరీ', 'ది హిస్టరీ ఆఫ్ రెడ్డి కింగ్డమ్స్' అను చరిత్ర గ్రంథములను రచించియున్నారు. వీనివలన నాంధ్రదేశచరిత్ర యందును, సంస్కృతియందును నజ్ఞాతములైన పెక్కు విషయములు వెల్లడియగుచున్నవి.

సోమశేఖర శర్మగారి తరువాత పేర్కొనదగిన వారు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. వీరు మహామేధావియగు సంస్కృతాంధ్రభాషావిశారదులు. పండిత ప్రపంచమున దప్పబుట్టిన మహనీయులు, కేవల భాషాపండితులయందు లేని చరిత్ర జిజ్ఞాస వీరియందు గానవచ్చుచున్నది. ఇది ప్రయత్న పూర్వకముగ నలవరచుకొన్నది కాదు. పూర్వజన్మ వాసనవలన గలిగినది. చరిత్ర రచియింపవలయుననునుద్దేశము లేకపోయినను, శ్రీనాథకవి రాజు జీవన చరిత్రను రచియించుటకు కొండవీడు రాజ మహేంద్రవర్మ రెడ్డి రాజ్యముల చరిత్రను జక్కగ పరిశీలించి తమ శృంగార శ్రీనాథమున సంగ్రహముగ వర్ణించి యున్నారు. ప్రభాకరశాస్త్రులవారి యభిప్రాయములందఱికి నంగీకార్యములు గాకపోవచ్చును. కాని పరిశోధనాపద్ధతులు నిర్దుష్టములు. శృంగార శ్రీనాథ రచనచే ప్రభాకరశాస్త్రులవారు రెడ్డి రాజ్యసంశోధనకు బునాదివేసిరని చెప్పవచ్చును. ఇతరపరిశోధకులకు వీరు మార్గదర్శకులైరనుటతిశయోక్తికాదు.

శ్రీ కుందూరు ఈశ్వరదత్తు గారు : ఈ పేరిట సుప్రసిద్ధ పత్రికావిలేఖరి కంటె భిన్నుడు, సర్కారు ఆడిటుశాఖయందుద్యోగము సేయుచున్నను దేశచరిత్రయందలి గాఢాభిమానములవలన పరిశోధనకు గడగియమూల్యములైన పెక్కు వ్యాసములనాంధ్రాంగ్ల భాషలందు రెంటియందును వ్రాసియున్నారు. విజయనగర పరిపాలన విధానమును వర్ణించుచు నాంగ్లమున వీరు వ్రాసి ప్రకటించిన వ్యాసావళి వీరి పరిశ్రమను వెల్లడి చేయుచున్నది. జీర్ణకర్ణాటసామ్రాజ్యమనుపేర తెనుగున విజయనగరచరిత్రమును సంగ్రహముగ వర్ణించి యున్నారు. వీరి చిల్లరవ్యాసము లెన్నియో కలవు. వానిని బేర్కొనుటకిచట వీలులేదు. వాదమును నడపుటయందు ఈశ్వరదత్తు గారు నేర్పరి. తాబట్టిన కుందేటికి మూడే కాళ్లని వాదించు స్వభావము, అభిప్రాయభేదమును సహింపని బుద్ధి. సామాన్య గ్రంథరచనయందు వీరిది సరసమైన శైలియైనను వివాద సందర్భములయందు పెళుచుదనమును బొందును. ఈ నెరసులంతగ పరిగణింపదగినవి కావు. ఈశ్వరదత్తుగారు దొడ్డ పరిశోధకులు. అమూల్యమగు కృషి సల్పియున్నారు. ఇంక ఎంతయేనియు జేయగలరు.

శ్రీ భావరాజు వెంకటకృష్ణరావు పంతులు గారు : వీరు ఆంధ్రపరిశోధకులలో మొదటిబంతికి చెందినవారు. చరిత్ర పరిశోధనయందు వీరికి గల యాసక్తి యసాధారణమైనది. వీరికి ఆంధ్రాభిమానము మెండు. వృత్తిచే న్యాయవాదులైనను ఆంధ్రదేశచరిత్రకు వీరుచేసిన సేవ యద్వితీయము. ఆంధ్రేతిహాసపరిశోధక మండలి రాజ మహేంద్రవరమున ముఖ్యముగ వీరి కృషి మూలముననే నెలకొనినది. పూర్వ చాళుక్య చరిత్రయందు వీరి కత్యంతాభిమానము. ఆంగ్లముననొక గ్రంథమును వ్రాసిరని వినికిడి. ప్రాచీనాంధ్రదేశచరిత్రను గూర్చి గొప్ప గ్రంథమును వ్రాసి ప్రకటించియున్నారు. రాజమహేంద్రవరచరిత్రపై బెక్కు వ్యాసములను ఆంధ్రేతిహాసపరిశోధన పత్రికయందు ప్రకటించిరి. రాజరాజ నరేంద్రపట్టాభిషేక సంచికకు వీరు సంపాదకులని ఇంతకు పూర్వము చెప్పియున్నాను. ఆంధ్రాభిమానము వలన వీరి రచనలయందు చరిత్రకారునికి ముఖ్యమైన సర్వసమత్వము లేకపోయినదని కొందఱు విమర్శకుల యభిప్రాయము. ఇందలి సత్యాసత్యము లెట్లున్నను ఇప్పటి యాంధ్రచరిత్రపరిశోధకులలో గృష్ణరావుపంతులవారి స్థానమున్నతమైనదని దృఢముగ చెప్పవచ్చును.

కృష్ణరావు పంతులు గారితో గూడ బేర్కొనదగిన వాడు వారి చిరమిత్రుడును, జోడును నగు శ్రీ రాళ్లబండి సుబ్బారావు పంతులుగారు. ఆంధ్రేతిహాసక పరిశోధక మండలి రథమునకు వీరిరువురును రెండుకన్నుల వంటివారు. పుట్టుకచే సుబ్బారావు పంతులుగారాంధ్రులైనను, చరిత్రాభిమానాతిశయమువలన కాళింగులు. వీరి పరిశోధన కొంచెమించుమించుగ సర్వమును కళింగదేశ చరిత్రయందే. అందును ముఖ్యముగ పూర్వగంగా చరిత్ర సుబ్బారావుగారికి పులకండమువంటిది. కళింగ సంచికయందు వీరు కళింగదేశచరిత్రను విపులముగ వ్రాసియున్నారు. ఆంధ్రేతిహాసపరిశోధన పత్రిక యందు పూర్వగంగాచరిత్రపై బెక్కు వ్యాసములను బ్రకటించియున్నారు. సుబ్బారావుగారి రచన మహాగహనమువంటిదని కొందఱందురు. పద్మవ్యూహమని యెకానొక విమర్శకుని యభిప్రాయము. వాస్తవముగ వీరి కళింగదేశచరిత్రయందు కొంత గజిబిజి గానవచ్చుచున్నను నది విషయనిగూఢతవల్ల గలిగినది కాని కావలయునని తెచ్చి పెట్టినది కాదు. సుబ్బారావుగారు పట్టుదల కార్యకుడు. ఉద్దేశించిన కార్యము నెఱవేరునంతవఱకు కాయనకు నిదురపట్టదు. ఆంధ్రచారిత్రక పరిశోధనకు సుబ్బారావుగారు చేయగల సేవ యెంతయెనియుగలదు.

కళింగ దేశచరిత్ర పరిశోధనయందు పాల్గొనిన పండితుల నిద్దరి నిచట బేర్కొనుట యుక్తము. వీరు ప్రత్యేక గ్రంథములను వ్రాయకపోయినను ఇంగ్లీషునను దెనుగునను పెక్కు వ్యాసములను రచియించియున్నారు. వీరియందు ప్రథముడు శ్రీ గొడవర్తి రాసుదాసుపంతులు గారు. ఖారవేలుని కాలమునుండి యెడ్డె గజపతుల యేలుబడివరకును గల కళింగ దేశ చరిత్ర వీరి పరిశోధనకు లోనైనది. పూర్వ గంగాచరిత్రపై వీరికభిమానము మెండు. పూర్వగంగా శక ప్రారంభకాలనిర్ణయమును గూర్చి వీరు విపులముగ వ్రాసియున్నారు. చరిత్ర పరిశోధనరంగమున రామదాసుపంతులుగా రసహాయ శూరులు; ఏకాంగివీరులు. కళింగ దేశ చరిత్ర విషయమున తాము సర్వజ్ఞులమని వీరియభిప్రాయము. కాని యన్యపరిశోధకులు వీరితో నేకీభవింపరు. రెండవ వారు సత్యనారాయణరాజగురువులవారు. వీరు పూర్వ గాంగ చరిత్రయందు కొంత పరిశోధన సలిపియున్నారు.

శ్రీ కురుగంటి సీతారామభట్టాచార్యులవారు: సంస్కృతాంధ్రములందు భట్టాచార్యులవారి పాండిత్యము బ్రశంసనీయము. దేశచరిత్రయందు వీరికిగల గాఢాభిమానము వీరిని వాఙ్మయరంగమునుండి చరిత్ర పరిశోధనకు దింపినది. వీరి ముఖ్య చరిత్రరచన తంజాపూరాంధ్రరాజుల చరిత్ర. వీరి భాషా జ్ఞానమును చరిత్ర రచనయందు చక్కగ వినియోగపెట్టి యన్యచరిత్రపరిశోధకుల కందని విషయముల ననేకములను బయలు పఱచినారు. వీరి రచన ఇంపైనది. భట్టాచార్యులవారి సిద్ధాంతములన్నియు నంగీకార్యములు గాకపోయినను వీరి కృషి మూలమున దంజాపురాంధ్రనాయకుల చరిత్ర చక్కగ విశదపడినది.

డాక్టరు మారేమండ రామారావుగారు : మదరాసు విశ్వవిద్యాలయమున చరిత్రశాఖయందు పరిశోధనపద్ధతులలో శిక్షితులైన యాంధ్రయువకులలో రామారావుగారు ప్రథములు. వీరు మొదట డాక్టరు యస్.కృష్ణస్వామి అయ్యంగార్లకడను, నటు పిమ్మట నాచార్య కె.ఎ.నీలకంఠశాస్త్రులవారి యొద్దను చరిత్రపరిశోధనాపద్ధతుల నభ్యసించిరి. గురుభక్తిగల శిష్యుడు. ఇంకను పసితనము సంపూర్ణముగ వీడికోకున్నను నపారమైన కృషివలన కీర్తి వహించినాడు. మంచి వక్త. నెఱవాది. కాకతీయ రెడ్డి రాజ్యముల చరిత్రములను జక్కగ శోధించి యనేకనూతనాంశములను గనుగొని యాకాలపరిస్థితులను విపులముగ గ్రంథములందును, బ్రత్యేక వ్యాసములందును వర్ణించియున్నాడు. కాకతీయ సంచికకు సంపాదకీయ వ్యాసమున గాకతివంశచరిత్రను వివరించియున్నాడు. ఆంగ్లమున రచించిన కాకతీయ చరిత్ర ఇంకనూ ముద్రితము గాలేదు. డాక్టరు రామారావుగారి వ్రాతలలో గొంత తొందరపాటు గానవచ్చును. లభ్యములగు చరిత్రాంశములనన్నిటిని గ్రోడీకరించి సిద్ధాంతముసేయుటకు దగిన తాలిమియు లేదు. కాని యనుభవముమీదనిట్టి నెరసులు దమంతటనవియె పాసిపోగలవు.

డాక్టరు పుట్టపర్తి శ్రీనివాసచార్యులు గారు : మంచి మేధావి. ఆంధ్రచరిత్ర పరిశోధకు లందరిలో శ్రీనివాసాచార్యుల వారొక్కరే ఇంగ్లాండున లండను యూనివర్సిటీలో పరిశోధనా పద్ధతులను నేర్చి డాక్టరేటును పొందినారు. క్రీ.శ. 1000 మొదలు 1500ల మధ్య ఆంధ్రదేశచరిత్రను పరిశోధించి యాంగ్లమున నొక గ్రంథమును వ్రాసిరి. ఇది యింకను అప్రకటితము. హైదరాబాదు సర్కారు పక్షమున కాకతీయ శాసనములను బరిష్కరించిరి. ఇది నైజాము గవర్నమెంటుచే బ్రకటించబడినది. డాక్టర్ రామారావు గారిచే బరిష్కరింపబడిన తెలంగాణా శాసనములకంటె నిది సర్వవిధముల శ్రేష్ఠతరము. శ్రీనివాసాచార్యులవారు మంచివక్త. చరిత్రపరిశోధనను జన సామాన్యమునకు దెలుపుటకు వీరు చాల కృషి సల్పియున్నారు. కాని వీరికి ఓపికతక్కువ. ఎంతటి ప్రతిభాశాలియైనను ఓపికలేని పరిశోధకుడు నుతికెక్కడు. ఓపికతో లభ్యమైన చరిత్రాంశములన్నిటిని నేర్చికూర్చి పరిశీలించి గ్రంథరచనకు గడగిన శ్రీనివాసాచార్యులవారు చక్కని పరిశోధకులుగ తేలగలరు.

శ్రీ వడ్డాది అప్పారావుగారు : వృత్తిచే న్యాయవాదులైనను అప్పారావు గారికి ఆంధ్రేతిహాస పరిశోధక మండలి వారి సంసర్గమువలన చరిత్ర పరిశోధనయందభిరుచి కలిగినది. అన్నదేవచోడుని రాజమహేంద్రవరమ్యూజియపుదామ్రశాసనమును బ్రకటించి కీర్తిని గడించిరి. రెడ్డి సంచికకు సంపాదకులై తమ సంపాదకీయవ్యాసమున కొండవీడురాజమహేంద్రవర రెడ్డి రాజుల చరిత్రను వివరించిరి. రెడ్డి రాజ్యముల చరిత్ర సంపూర్ణముగ విరచించియుండిన నప్పారావు పంతులు గారి వ్యాసము మఱియును నుపయోగకారియైయుండెడిది. ఇది వీరి ప్రథమ చరిత్రరచన. రాబోవు గ్రంథములయందప్పారావుగారి పరిశోధనల యాధిక్యత తెల్లముకాగలదు.

శ్రీ పి. శేషాద్రిశాస్త్రిగారు : ఆంధ్రులయందలపు నెఱుగని పరిశోధకుడు. వ్రాసిన గ్రంథములనేకములు లేవు. చరిత్ర సాధన సామగ్రిని వెదకి కనిపెట్టి సేకరించుటయందు శేషాద్రిశాస్త్రిగారికి సమానులెవ్వరును లేరు. గుంటూరిసీమ వీరి కాణయాచి. వెలుపట సాధారణముగ నడుగిడడు. అందు వెదకి వెదకి ప్రాచీన వస్తుసముదాయమును వెలికీడ్చుట యతని క్రీడ. అముద్రితశాసనముల నెన్నిటినో సంపాదించి ప్రకటించియున్నాడు. ఇట్టి పరిశోధక పండితుని యునికిచే గుంటూరు మండలము ధన్యమైనది.

డాక్టరు నేలటూరి వెంకటరమణయ్య : ప్రస్తుత వ్యాసకర్తయగు నాంధ్రదేశచరిత్ర పరిశోధనయందు వ్రేలిడియున్నాడు. తెనుగునను, నింగ్లీషునను కొన్ని వ్యాసములను, గ్రంథములను వ్రాసియున్నాడు. ఇతనికి అభిమాన విషయము విజయనగర సామ్రాజ్యచరిత్రము. ప్రాచీనపల్లవ రాజుపైని వ్యాసావళి, వేములవాడ చాళుక్యుల చరిత్ర ఇతని తెనుగు రచనలలో ముఖ్యమైనవి. వెలుగోటివారి వంశావళిని పరిష్కరించి మదరాసు విశ్వవిద్యాలయ చరిత్రశాఖ ప్రచురణలయందు ప్రకటించియున్నాడు. 'కంపిలి అండ్ విజయనగర', 'ఆరిజన్ ఆఫ్ ది సిటీ అండ్ యంపైర్ ఆఫ్ విజయనగర', 'యర్లీ ముస్లిమ్ యక్స్పాన్షన్ ఇన్ సౌత్ ఇండియా', 'ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ ది హిస్టరీ ఆఫ్ విజయనగర', 'ది హిస్టరీ ఆఫ్ ది యీస్టరన్ చాళుక్యాస్' అను గ్రంథముల నింగ్లీషున వ్రాసియున్నాడు. కొన్ని ప్రాచీనతామ్రశిలాశాసనములను పరిష్కరించి ప్రకటించియున్నాడు. డాక్టరు వెంకటరమణయ్య గారి వ్రాతలు నిలుకడ లేనివనియు, నతడు దన యభిప్రాయములను దఱచుగా మార్చుకొనుచుండు ననియు నొకానొక విమర్శకుడు చెప్పియున్నాడు. సత్యమే. ప్రాచీన చరిత్రపరిశోధకుల కందఱకును ఈ జాడ్యము సామాన్యమైనదే. దీనికి కారణము లేకపోలేదు. ప్రాచీనకాలపు చరిత్రకు సంబంధించిన విషయము సర్వమును మనకు లభ్యపడలేదు. దొరకిన సాధన సామాగ్రిని ఆధారపఱచుకొని పరిశోధకులు ప్రాచీన చరిత్రపునర్నిర్మాణము సాగించుచుందురు. క్రొత్త విషయ మెద్దియేనియు బయలు పడినప్పుడుకాని దాని ననుసరించి యెకప్పుడు పూర్వాభిప్రాయములు పరిశోధకులు మార్చుకొనవలసివచ్చును. ఇది గుణమే కాని దోషము కాదు.

పై బేర్కొనిన పరిశోధకుల కృషివలన నాంధ్రదేశమున చరిత్రపఠన జనాదరణమును బొందినది. విద్యావంతులగు యువకులనేకులు చరిత్ర పరిశోధనకు దొడగికొంత కృషి సల్పియున్నారు. వీరి పరిశోధన లింకను బయలుపడలేదు. వీరిలో ముఖ్యులను, వారి యభిమానవిషయములను నీక్రింది బేర్కొనుచున్నాను. డాక్టరు ఓరుగంటి రామచంద్రయ్య గారు– కృష్ణదేవరాయలు; డాక్టరు అనంతరావు బాజీ గారు– పాశ్చాత్య గాంగులు; డాక్టరు సత్యవోలు కామేశ్వరరావు గారు– పూర్వగాంగులు; శ్రీ మట్లూరి వెంకటరామయ్యగారు– తెనుగుచోళులు; శ్రీ వేదము వెంకటరాయశాస్త్రి గారు– కళ్యాణిచాళుక్యులు; డాక్టరు రాయప్రోలు సుబ్రహ్మణ్యము గారు– కళింగ సూర్యవంశగజపతులు; శ్రీ మామిడిపూడి వెంకటేశ్వరులు గారు– వెల్నాటిచోళులు; డాక్టర్ కవుతా యశోదాదేవి గారు – రెడ్డి రాజ్యములు, క్రీ.శ. 1000–1500 మధ్య తెనుగు దేశ చరిత్ర; శ్రీ వడ్డాది రామచంద్రమూర్తిగారు– ఆనందవంశరాజులు మొదలగు చిల్లరవిషయములు.

స్వరాజ్యస్థాపనతో ప్రారంభమైన ఈ నవయుగమున ఆంధ్రదేశచరిత్రను పరిశోధించి మన జాతీయ వ్యక్తిత్వము నిలబెట్టవలసిన బాధ్యత యంతయు నీ యువయువతీజనములపైనున్నది.

(భారతి రజతోత్సవ సంచిక)

కపిల కాశీపతి

అలనాటి తెలుగులు - తెలుగు ఉద్యమాలు

తూర్పుపడమరలుగా విశాఖపట్నం మొదలు వికారాబాదు వరకూ, ఉత్తర దక్షిణాలుగా పెన్గంగ మొదలు పెన్నజన్మర్థ వరకూ ప్రచారంలో ఉన్న భాష తెలుగు, లేక తెనుగు. ఈ దేశాన్ని ఆంధ్రదేశమనీ, దేశాన్ని బట్టి భాష కూడా ఆంధ్రభాష అనీ వాడుతున్నారు. మంత్రశాస్త్ర ప్రకారం "ఆంధ్ర" "తెనుగు" అనడం ప్రశస్తం అంటారు శ్రీ భావరాజు వేంకటకృష్ణారావుగారు. ఎవరు ఏమన్నా ఈ 'ఆంధ్ర' శబ్దపరీక్ష ప్రారంభిస్తే గ్రంథం పెరగటం తప్ప పర్యవసానం ఏమీ తేలదు. ఒక్క విషయం మాత్రం సూటిగా తెలుస్తుంది. ఆంధ్రులు ఎప్పుడూ తెనుగే మాట్లాడలేదు.

ఋగ్వేదంలో చెప్పబడిన ఆంధ్రులు, రామాయణంలో పేర్కొన్న ఆంధ్రులు, యుధిష్ఠిరచక్రవర్తి పట్టాభిషేకానికి ఇంద్రప్రస్థం తర్లి వెళ్లిన ఆంధ్రరాజు– వీరంతా విశ్వామిత్ర సంతతివారని ఒక మతం. భాగవత ఆధార ప్రకారం సుతపుడి వంశీయుడైన బలీకుమాళ్లు, అంగ, వంగ, కళింగ, సింహళ, పుళింద, ఆంధ్రులలో ఆఖరివాడు పరిపాలించిన దేశం గనుక ఆంధ్రదేశమైనది. ఈ భాష అంధకారశబ్దంలోంచి వచ్చిందని మరికొందరు. ఆంధ్రభాషలో సూర్యభగవానుణ్ణి ఆరాధించి, పోయిన కళ్లు తెచ్చుకుని, అంధకారంలోంచి ప్రకాశంలోకి వచ్చిన వోరాజుగారి మూలంగా ఈ పేరు వచ్చిందని మరోకథ.

తెలుగు, తెనుగు శబ్దాలకి కూడా ఇటువంటి వాద ప్రతివాదనలుఉన్నవి. ఎన్ని వాదాలు పెంచినా ఈ ఆంధ్రులు తెనుగు మాట్లాడడం, వ్రాయడం ఎప్పుడు ప్రారంభించారో తెలియదు. భాషతత్వవేత్తలు ఈ భాష పుట్టు పూర్వోత్తరాల విషయంలోగాని, స్వరూప విషయంలోగాని ఒక నిశ్చితాభిప్రాయానికి ఇంకా రాలేదు. బిందువితమైన లిపిస్వరూపం చూస్తే బౌద్ధయుగంలో, ఆంధ్రులు దేశాంతర సామ్రాజ్య నిర్మాణం చేసిన కాలంలో ఇది ప్రచారంలోకి వచ్చిఉండాలి. ఓఢ్రభాష, సింహళభాష, బర్మాభాష, మరికొన్ని తూర్పు ఆశియా భాషలు ఇటువంటి స్వరూపమే కలిగివున్నవి. ఒకనాడు తూర్పు ఆశియాయావత్తూ ఒకే సంస్కృతితో విలసిల్లినది. సంస్కృతికి మూలపురుషులు ఆంధ్రులు. కర్ణాటాంధ్రభాషలూ, దేశాలు ఒకప్పుడు ఒకటిగా వుండేవి.

స్థూలంగా ఒక్క విషయం మాత్రం తెలుస్తుంది. అటు అర్యులకీ, ఇటు ద్రావిడులకీ మధ్యవున్న జాతిగనుక తెనుగుజాతి ఆర్య–ద్రావిడజాతి అని. భాషకూడా ఆర్య ద్రావిడ సమ్మేళనం. ద్రావిడంలో పుట్టింది. సంస్కృతంలో పెరిగింది. పెంచిన ప్రేమే పెంచుకుంది. తెనుగుపిల్ల షోకులాడి. సంస్కారాభిలాషిణి. దేశ దేశాలూ తిరిగి కొత్త పోకడలు నేర్చినది. అరేబియానుంచి అత్తరులు, పారశీకంనించి గులాబులు, పాశ్చాత్యదేశాల్నించి పన్నీరు తెనుగు రాజులు తెనుగుపిల్లకు కానుకలుగా తెచ్చారు.

పాకపద్ధతిలో తెనుగువారి పోపు, లేక తాళింపు, విశిష్టమైనది. ఇన్ని వస్తువులెవరూ వాడరు. మొదట్లో ఇంత ఘాటూ, తర్వాత ఇంత సువాసనా, ఆఖరికి ఇంత కమ్మదనంకూడా మరి దేనికీ లేవు. అల్లాగే భాషాపరిణామంలో కూడా తెనుగుభాషకివో విశిష్టతవున్నది. భాషాభాండారం తూర్పారబడితే వట్టిపోపులపెట్టి. కలిపి తాళిస్తే కమ్మని వంటకం. భాషలాగే జాతీ, దేశమూనూ. అన్నీ అరలు, రాజకీయంగా ఒకటిరెండు శతాబ్దాల క్రితమే మూడు చెక్కలైనా ఆ ప్రత్యేకత నిల్చిపోయినది. ఇవన్నీ కలిపి తాళించగలిగిన పాకశాసనుణ్ణి తల్చుకుంటే నోరూరుతుంది.

ఈ తెలుగుల తత్వం ఏమిటి? వ్యక్తిత్వం ఏమిటి? ఉద్యమాలేవి? వాటికేవి లక్ష్యాలు? లభించిన సిద్ధులేవి?

ఆంధ్రులలోంచే తెలుగులు వచ్చారు గనుక, ఈ చర్చలో ఆంధ్రుల్ని విడిచిపెట్టడానికి వీలులేదు. ఆంధ్రశబ్దోత్పత్తి విషయం పుట్టిన కథలన్నిటిలోనూ వుండే వ్యక్తుల విషయం మనకి అంతగా తెలియదు. ఒక వాదన ప్రకారం మూలపురుషుడనే విశ్వామిత్రుడి సంగతి కొంత తెలుసును. పురాణవ్యక్తులలో విశిష్టుడైనవాడూ, విచిత్రమైనవాడూ విశ్వామిత్రుడు. వో తల్లి సహజస్వార్థంవల్ల, కూతురు త్యాగబుద్ధివల్ల, మొత్తానికి ఇద్దరూ కలిసి చేసిన పొరపాటువల్ల, క్షేత్రభ్రష్టమైన మహాబీజోద్భవుడు విశ్వామిత్రుడు. ఆ పొరబాటు పర్యవసానమే పరశురాముడూకూడాను. ఇద్దరూ విపరీత వ్యక్తులే.

విశ్వామిత్రుడికి తన కులగురువైన వశిష్ఠుడిమీద విపరీతమైన గౌరవం. అంతవాణ్ణి కావాలని మహదాశయం. ఆశయసిద్ధికోసం ఉత్కృష్టమైన దీక్ష. అందాకా కక్ష సాధించి బ్రహ్మర్షిననిపించుకున్నాడు. బ్రహ్మసృష్టికి ప్రతిసృష్టిచేసినాడు. వంకాయ, గోంగూర మొదలైనవి ఈయన సృష్టిలోవని గోదావరీ తీర బ్రాహ్మణులు ఈ కాయగూరలు పితృదినాలలో ఉపయోగించరు. ఇవి రెండూ తెనుగువారికి ఇష్టమైన వస్తువులు. విశ్వామిత్రుడు ప్రథమ అ బ్రాహ్మణోద్యమ సంస్థాపకుడు. బ్రహ్మజ్ఞానం సాధించి లోకానికి గాయత్రీమంత్రం ప్రసాదించినాడు. తెనుగు బ్రాహ్మణేతరోద్యమంకూడా ఈ పంథాలోనే నడుస్తోంది. దాక్షిణాత్యోద్యమంలా బ్రాహ్మణదూషణకి పాలుబడక బ్రహ్మజ్ఞానసాధన ప్రారంభించి యజ్ఞోపవీతం ధరించినది. తెనుగు వ్యక్తిత్వంలో విశ్వామిత్రం చాలా ఉన్నది. తెనుగువారికి ఆయన దీక్ష అంతగా రాకపోయినా ఆయన కక్షమాత్రం మిగిలిపోయింది. ఫలం విశ్వామిత్రసృష్టిలోదే; త్రిశంకుస్వర్గం.

పురాణయుగంలో విశ్వామిత్రుడి తర్వాత పరిశీలించవలసిన వారు ఆంధ్రదేశీవాసులైన వ్యక్తులు. "రామాయణములో వానరులు ఆంధ్రులా" అనే పాతశీర్షిక జ్ఞాపకం వస్తున్నది. కిష్కింధ ఆంధ్ర దేశభాగం గనుక ఈ విషయం ఆలోచించవలసినదే. కిష్కిందాపురీ వాసులకున్న గుణాలు కొన్ని మనకు లేకపోలేదు. వీరిలో ముఖ్యులు వాలీ సుగ్రీవులు. వారి బంటు హనుమంతుడు. వాలిసుగ్రీవులు స్త్రీ విషయంలో తగాదాపడ్డారు. బలవంతులు. అన్నదమ్ముల కక్షలు సాధించుకున్నారు.

హనుమంతుడు పంచభూతాలలో వాయుపుత్రుడు. బ్రహ్మచారి. చిరంజీవి. ఈయన ఆంధ్రుల అభిమానదేవుడు. మన దేశంలోవున్నన్ని ఆంజనేయదండకాలు మరెక్కడా లేవు. ఇంత విరివిగా ఆంజనేయపూజకూడా లేదు. తమిళులు సుబ్రహ్మణ్యస్వామిభక్తులు. మళయాళదేశస్థులు అనంతపద్మనాభస్వామిని కొలుస్తారు. పురాణయుగంలో విషయాలు చర్చించేటప్పుడు పురాణాలేమనకి ఆధారం, అధికారం. అది వ్రాతగాని, పుక్కిటి పురాణం గాని. వాయుపుత్ర భక్తులైన ఆంధ్రులికీ వాయుభూతభాగం ఎక్కువగా సంక్రమించడం సహజం. హనుమంతుడు శ్రీరామభక్తుడు. నమ్మిన బంటు. వెట్టి చాకిరీ చెయ్యడంలో సాటిలేనివాడు. తన స్వామికిమల్లేనే ఆయనకూడా తన విషయం ఎప్పుడూ చూసుకోలేదు. ఇవన్నీ తెలుగు లక్షణాలే. తెనుగువారు నమ్మిన బంట్లుమాత్రం కారేమోననే సందేహం తోచవచ్చును. కొన్ని గుణాలు వికటించడంకూడా తెనుగు తనమే.

ఇక విలక్షణాలు. చూసి రమ్మంటే కాల్చిరావడం; కొమ్మ తెమ్మంటే కొండ మోసుకురావడం; అవసరానికి ఆలస్యంగా రావడం. ఈ ఆఖరి అవగుణమే హనుమంతుడికి లేకపోతే, ఆంధ్రదేశమే భారతదేశంలో ముఖ్యభాగమై, స్వతంత్రభారతకేంద్రం గోదావరీతీరాన్నో, గోస్తనీతీరాన్నో వుండేది. రాజమహేంద్రవరం, ఆ నగర మహాప్రజలు హనుమంతుడి వుసురుపోసుకుని అణగారి పోవడం తెలిసిన విషయమే. నిజానికి హనుమంతుడు శ్రీ రాముడభిలాష ప్రకారం తెల్లవారకముందు కోటిలింగాలు తీసుకొస్తే కాశీ క్షేత్రం గోదావరీతీరాన్నే వెలసివుండేది. అల్లా ఎందుకు చేస్తాడు. తొంభైతొమ్మిదిలక్షల, తొంభై తొమ్మిది వేల, తొమ్మిది వందల తొంభై తొమ్మిది లింగాలు తెచ్చి వూరుకుంటాడు. అందుచేత కోటి లింగక్షేత్రం అని పేరుతప్ప ప్రభావం ఏది? ఫరవాలేదు, అఖరి లింగం వీరేశలింగం అన్నారు ఒకరు. నిజమేకూడాను. ఒక్క రాజమహేంద్రవరానికేమిటి, ఆంధ్రక్షేత్రానికే ఆయన ఆఖరి లింగం.

రామాయణకాలంలోనే పేరుపొందిన ఆంధ్రవ్యక్తి శబరి. ఆమె తెనుగుతల్లి. అభ్యాగతి అయిన శ్రీ రామచంద్రమూర్తికి ఆతిథ్యం ఇచ్చింది. శ్రీ రాముడికి పూర్వం ఆ దారిని వచ్చినవారికి చాలా మందికి భోజనం పెట్టివుంటుంది. ఆ విషయం గ్రంథస్థం మాత్రం కాలేదు. తెనుగు స్త్రీలకి భోజనం పెట్టడం అంటే చాలా సరదా. పేరుకు కాశీలో వెలిసిందిగాని అన్నపూర్ణమ్మ అసలు తెలుగుతల్లి. తెనుగమ్మలికి సంతర్పణ అంటే సంతోషం. పది మందికి వడ్డించాలి. రేషను వున్నా సరే లేకపోయినా సరే. అన్నపూర్ణమ్మపేరు మనదేశంలో వాడినంత విరివిగా మరే దేశంలోనూ వాడరు. డొక్కా సీతమ్మగారు, మంగళగిరి బాలాంబగారు లోక ప్రసిద్ధులు. ఈ లక్షణం శబరిలో ఆనాడే కనబడింది.

భారతయుగంలో ఆంధ్రులికి అట్టే ప్రాముఖ్యం లేదు. అందుకనే కాబోలు ఆంధ్రులికి భారతంమీద అంత అభిమానం. ఇతర రాష్ట్రాలలో రామాయణానికే ఎక్కువ గౌరవం. భారతకథ జరిగిన దేశంలోకూడా ప్రజాజీవనంలో భారతగాథ ఎక్కలేదు. కర్ణుడిలో తెనుగు ఛాయలు వున్నాయి, కాని ఆయన తెనుగువాడు కాడు.

చరిత్రయుగంలో ఆంధ్రులు అదినుంచీ బౌద్ధులు. గౌతమబుద్ధుడుకూడా బ్రాహ్మణేతరోద్యమసంస్థాపకుడే. బౌద్ధమహాయుగంలో ఆంధ్రులు భారతదేశంలోనేకాదు, యావత్తు ప్రపంచంలోనూ గొప్పవారు. ఈ యుగంలోనే బహుశః తెనుగు భాషకూడా అవతరించివుంటుంది. ఈ యుగంలో గొప్ప ఆంధ్రవ్యక్తి నాగార్జునుడు. ఈయన అపరబుద్ధుడు. హీనయానబౌద్ధానికి ప్రతిగా మహాయానబౌద్ధం స్థాపించిన ప్రవక్త. తెనుగువారు

సంస్కారులు. వారికి కొత్త వింత, పాత రోత అయినా, పాతకొత్తల మేలుకలయికకోసం పాటుపడ్డవారు. ఏ ఉద్యమం గాని, వస్తువుగాని సంస్కరించి ఉపయోగిస్తారు. బౌద్ధంకూడా సంస్కరించి ప్రచారం చేశారు. నాగార్జునుడు జగత్ప్రఖ్యాతి గాంచిన రసాయన శాస్త్రజ్ఞుడు. ఆయుర్వేదాచార్యుడు. తెనుగువూరు శ్రీ పర్వతవాసి. కృష్ణాతీరస్థుడు.

బౌద్ధయుగంలోనే కృష్ణాముఖద్వారం నుంచీ, చిల్కాసరస్సు ప్రాంతం నించీ, తూర్పు ఖండం అంతా నౌకాయానం చేసి ఆంధ్రబౌద్ధులు మత ప్రచారం చేశారు. సామ్రాజ్యప్రతిష్ఠ చేశారు, వలస రాజ్యాలు స్థాపించారు, అంతర్జాతీయ వ్యాపారం చేశారు, విద్యావాన వ్యాపకం చేశారు, లోకాద్భుతకరమైన శిల్పసృష్టి చేశారు. ఆనాడు ఆంధ్రదేశం ఆశియాఖండానికి శిరోమణి. బర్మా, సయాం, డొనిసియా, చీనా, జపాన్ దేశాలలో బౌద్ధ దర్మ సంస్థాన చేసినారా రంధ్రులు. బర్మాలో తైలంగసామ్రాజ్యం నిర్మాణం చేసినవారు ఆంధ్రులు. సుమత్రా, జావా, బోర్నియోద్వీపావళిలో వలసరాజ్యం ఏర్పాటు చేసినవారాంధ్రులు. తూర్పున చీనాతో వ్యాపారం చేసి చీనాంబరాలు తెచ్చినారు. పశ్చిమాన ఈజిప్టు రోమన సామ్రాజ్యములతో నౌకా వ్యాపారం చేసి తెనుగు వస్త్రాలు పాశ్చాత్యరాణులకు కట్టబెట్టినారు. బౌద్ధధర్మం శిలాక్షరాలతో లిఖించడానికి అజంతా, అమరావతి, నాగార్జునకొండ, సాంచి క్షేత్రాలలో అపూర్వ లోక నైపుణ్యంతో శిల్పసృష్టి చేసినారు. ధాన్యకటకవిద్యాలయం తెనుగు తీర్థం. ఆనాడు తెనుగుభూమి వజ్రభూమి. కోహినూరు తెనుగు వజ్రం. అసలు ప్రపంచంలో గొప్ప వజ్రాలు చాలావరకు తెనుగువే. దక్షిణ ఆఫ్రికా వజ్రగనులు రాకపూర్వం అంతర్జాతీయ వజ్ర వాణిజ్యానికి కేంద్రం తెనుగు దేశంలో గోలకొండ.

దేశ దేశాంతరాలలో ప్రజాసామాన్యం ఆదరం, ప్రభువుల పోషణ సాధించిన బౌద్ధమత ప్రాబల్యంముందు వేదమతం పోషణ లేక క్షీణించినది. ఆ సమయంలో గోదావరీతీర వేద బ్రాహ్మణకుటుంబాలు కొన్ని పశ్చిమతీరానికి వలసపోయినవి. వీరే నంబూద్రీ బ్రాహ్మణులైనారు. శంకరాచార్యుడు నంబూద్రీ.

కాలక్రమేణా ఆనాటి బౌద్ధానికి తెనుగువాసన పట్టి తేజం తగ్గిపోయింది. బౌద్ధానికి శాక్తేయం కలిసి పంచ మకారాలు ప్రచారంలోకి రాగానే, మహాముద్రదీక్షలో విహారాలలో స్వేచ్ఛావిహారం, ఆరామాలలో రామావిలాసం ప్రబలినవి. తెనుగువారి సుగుణాలు రసం, రాగం బౌద్ధసన్యాసుల్ని ఆవేశించినవి. తలలు బోడులే గాని తలపులు బోడులు కాలేదు. అవి చిగిర్చినవి. పుష్పించి ఫలించినవి– చివరికి పాపం పండినది.

ఈ దుర్దశ చూసి తెనుగుజాతి తనకుతానే అసహ్యించుకున్నది. అప్పుడు పశ్చిమతీరానికి వలసపోయిన బ్రాహ్మణులికి వేదమతం పునరుద్ధరించడానికి సదవకాశం కలిగినది. ఆ అవకాశం ఉపయోగించడానికి అవతరించినవాడే శ్రీ శంకరాచార్యుడు. వేదానికి భాష్యాలు వ్రాసి, ఆసేతు హిమాచలపర్యంతం సంచారం చేసి, దిగ్విజయాలు సాధించి, పీఠాలు స్థాపించి, ముప్పై రెండు సంవత్సరముల అల్పవయస్సులో లోకాద్భుతకరమైన మత సంస్కారం చేసిన మహామేధావి, ప్రజ్ఞావంతుడు శంకరాచార్యుడు. కర్మ జ్ఞానామార్గాలు లోకానికి చూపించి సంస్కృతం, బ్రాహ్మణమతం పునరుద్ధరించినాడు.

ఒక సృష్టి మరోసృష్టికి నాశహేతువు. ఒక నిర్మాణం మరో నిర్మాణానికి మొప్పం. శంకర నిర్మాణం ముందు బౌద్ధనిర్మాణం కూలిపోయింది. ఎంత ఆవేశంతో, ఎంత దీక్షతో, ఎంత చాతుర్యంతో తెనుగునాట బౌద్ధ సంస్కృతి నిర్మించారో, అంత ఆవేశంతోనూ, అంత దీక్షతోనూ, అంత చాతుర్యంతోనూ ఆ సంస్కృతి నాశనం చేసినారు మనవారు. వూరూ పేరూ లేకుండా, సున్నంలోకి ఎముక లేకుండా, ఆఖరికి ఆ మహాయుగానికి సంబంధించిన అక్షరం లేకుండా సర్వనాశనం చేశారు. కాలదేవతకరుకుదనాన్ని మించిన కాఠిన్యంతో బౌద్ధసంస్కృతి భగ్గంపాడు చేశారు. ఆ బీభత్స చిహ్నాలు నేటి వూళ్లపేర్లు, నరుకుళ్ళ పాడు, పెంటపాడు, మిగిలినవి పాటిదిబ్బలు, లంజదిబ్బలు. వాటిమీద వెలిసిన శైవ, వైష్ణవ క్షేత్రాలు.

ఆ దురంతాలముందు పాంచాలనవ కాళీమతావేశం చిన్న పిల్లల ఆట; చేతకాని చచ్చుపెద్దమ్మల ఉబలాటం. శిలలకి వులితో ప్రాణంపోసిన తెనుగుచేతులే వురితో బౌద్ధుల ప్రాణాలు తీసినవి. తిలలు పోసి నూనె ఆడిన గానుగలలో శిరస్సులు నలిగి రక్తం స్రవించినది. పెళ్లి అయిదోరోజుని నాకబలి చేసినంత ఉత్సాహంతో మనవారు ఆ మహాబలి చేసినారు. బౌద్ధుల రక్తంతో వసంతాలాడారు. ఆనాడు శివమెత్తి ప్రళయకాలరుద్రుడు తెనుగునాట తాండవించినాడు. అశోకచక్రవర్తి ప్రారంభించిన శిలాక్షరప్రచార చిహ్నాలు లేకపోతే, దేశదేశాంతరాలనించి వచ్చిన బౌద్ధయాత్రికుల పొగడ్తలు అన్యభాషలలో లేకపోతే, నిర్జనారణ్యాలలో గుహాంతర్భాగాలలో శిథిలమైపోయిన శిల్పకళ లేకపోతే, ఒకనాడు బౌద్ధం, జైనం తెనుగుసీమలో వెల్లివిరిసిన సాక్ష్యమే వుండేదికాదు. అందుకనే నన్నయకుపూర్వం తెనుగుకవిత్వం వున్నదా లేదా అనే సందేహం కలగడం, ఆంధ్రమహాభారతం ప్రథమాంధ్రకావ్యం కావడం, తూర్పుచాళుక్యులు నూతన సామ్రాజ్యనిర్మాత కావడం.

దేశంలో బౌద్ధం క్షీణించినతర్వాత ఆంధ్రుల అంతర్జాతీయ ప్రాబల్యం కూడా క్షీణించినది. పాత లక్ష్యం పోయింది. కొత్త లక్ష్యం దొరకలేదు. ప్రజాసామాన్యానికి పారమార్థికచింత పో దుర్దశ సంభవించినది. శంకరుడి సందేశం జనసామాన్యానికి దురవగాహనమైనది. కర్మాధికారం లేని బ్రాహ్మణేతరులికి అది చెందలేదు. అజ్ఞానులైన మూఢుల్ని పొందలేదు. మత గ్రంథాలన్నియు సంస్కృతంలో వున్నవి. ఆ భాష జనసామాన్యానికి రాదు. అందుచేత వేదరహస్యాలు, వేద ప్రాశస్త్యం జనబాహుళ్యానికి అందేలేదని అది అందజెయ్యడానికే రాజరాజనరేంద్రుడి పోషణలో వున్న నన్నయభట్టు నారాయణభట్టు సహాయంతో పంచమవేదమైన భారత సంహిత తెనిగించడం ప్రారంభించాడు. ఈ భారతసంహిత ప్రచారంచేసి, ప్రజాసామాన్యంలో వేదమతం పునస్థాపన చెయ్యడం అతని ఉద్దేశం. పండితులికి మాన్యాలిచ్చి, పురాణాలు చెప్పించి, తన మతం దేశీయభాషలో పామరజనానికి అందజెయ్యాలని ప్రయత్నం. భాష తెనుగైనా పద్ధతి సంస్కృత పద్ధతి. భాషాకూడ తత్సమతద్భవము. దీన్నే మార్గపద్ధతి అన్నారు. మతంలో, సంఘంలో, భాషలో, కవితలో సంస్కృతపద్ధతిలో నడిచే ఈ మార్గానికి, దేశీయ పద్ధతులికీ సరిపడలేదు. సంస్కృతానికీ తెనుక్కీ ఈ యుద్ధం జరుగుతూనే వచ్చింది. అందుకనే భారతాంధ్రీకరణం రెండు వందల ఎనభై సంవత్సరాలు పట్టింది. ఈ ఉద్యమం శీఘ్రంగా కొనసాగకపోవడానికి కారణం తెనుగుప్రజల జాతీయత, ఆ జాతీయత రేకెత్తించిన శైవమతం.

బౌద్ధం తర్వాత తెనుగు దేశంలో ప్రజానీకంలో ప్రబలిన మతం శైవం. నిజానికి శైవమే తెనుగుమతం అనాలి. తెనుగు అనే శబ్దమే త్రిలింగంలోంచి వచ్చినదనడానికి మూలాధారం శైవమే. శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామ అనే త్రిలింగక్షేత్రంతో కూడిన దేశమే త్రిలింగదేశం అన్నారు. ఆ దేశ భాష త్రిలింగభాష. త్రిలింగ తెలుంగు అయినది. అరవ లింకా తెలుంగు అంటారు. తెలుంగు, తెలుగు, తెనుగు అయినది.

శైవం భక్తిప్రధానమైన మతం. సామాన్యజనులకోసం పుట్టినది. నన్నెచోడమహారాజు కాలంలో ఈ మతానికి సంబంధించిన వాఙ్మయం తెనుగులో పుట్టినది. ఆయనే కుమారసంభవం సులభశైలిలో తెనుగున రచించినాడు. ఈయన కాలంలోనే వీరశైవమత సంస్థాపకుడు బసవేశ్వరుడు అవతరించాడు. ఈయన జన్మభూమి కర్ణాటకదేశం. కర్ణాటకశబ్దం ఆంధ్రరాజులైన శాతకర్ణి వంశస్థుల పరంగా వచ్చినదని ఒక మతం. కర్ణినాడు కర్ణాటక మైనది. బసవేశ్వరుడు బ్రాహ్మణుడు. వృత్తి మంత్రాంగం. ఉనికి కళ్యాణకటకం. సాహిత్య సంగీత శాస్త్రజ్ఞుడు. కులతత్వాలతో కుళ్ళిపోయిన వేదమతాన్ని తోసి రాజని, జాతి, కుల, మత వివక్షలు లేని సంఘం సృష్టించదలుచుకున్నాడు. ఆ నిశ్చయఫలితమే వీరశైవం. సంగీతం సాహిత్యానికి సంధించి, దేశీయభాషలో తన సందేశం ప్రజాలోకంలో ప్రచారంచేసి, రాజాశ్రయంతో దానికి బలం చేకూర్చినాడు.

బసవరాజుమతం కర్ణాటక దేశంలో పూర్తిగానూ, తెనుగు దేశంలో కొంతవరకూ పాకింది గాని, తెలుగులు వేదమతాభిమానం విడిచి పెట్టలేకపోయారు. అందుచేత తమ సంప్రదాయానుసారం వీరశైవంకూడా సంస్కరించాలన్నారు. వేదాలకి విరుద్ధమైన వీరశైవం సవైదికంచేస్తేనేగాని వీలులేకపోయినది. ఆర్యద్రావిడ సమ్మేళనం ఎప్పుడూ ఆంధ్రుల కర్తవ్యం. ఈ కర్తవ్యం నెరవేర్చడానికి దాక్షారామలో మల్లికార్జునపండితుడు అవతరించినాడు. వీరశైవమతం వైదిక కర్మానుసారంగా సంస్కరించి తెనుగు తత్వానికి అనుకూలంగా చేసినాడు. సంస్కరించబడిన వీరశైవం ఆరాధ్యమైనది. సంస్కారి పండితారాధ్యుడైనాడు. తత్కారణం వల్లనే ఇతర ప్రాంతాలలో వీరశైవమైన లింగాయతుమతం నిల్చివున్నా ఆంధ్రదేశంలో ఆరాధ్యం వ్యాపించింది.

ఈ రెండు మతాల్నీ, జాతీయ సాహిత్యంద్వారా దేశంలో ప్రచారం చేసినవాడు బసవపురాణకర్త పాల్కురికి సోమనాథుడు. దేశికవితకి మూలపురుషుడు. సంస్కృతం విసర్జించి తెనుగే వాడడం శివకవుల సంప్రదాయం. ఇటువంటి సంప్రదాయంలోంచి వచ్చినవాడే వేమన. రక్తి నెరిగిన ముక్తుడు. కామిగా మోక్షగామి కాగలిగినవాడు. రసవాదంలో సిద్ధిపొంది అది సాంకేతికంగా ప్రచారం చేసినవాడు. తెలుగు సంఘసంస్కారులలో ఉత్తముడు. తన ఉద్యమానికి కవిత ఆధారంచేసుకున్న యోగిపుంగవుడు.

ఇటువంటి దేశీయాభిమానాన్నే సంస్కృతాభిమానులు "తెనుగు మీరిపోవడం" అన్నారు. ప్రతికక్షులు "తెనుగురాని సంస్కృతానికి తెన్నేమిట్రా?" అన్నారు. తెనుగు భాషాచరిత్రలో నాలుగుసార్లు సంస్కృతంతో యుద్ధం జరిగింది. జరుగుతూనే వుంది. ప్రతి యుద్ధంలోనూ తెనుగు గెలుస్తూ వుంటుంది. నాలుగుసార్లు యుద్ధావసరం రావడం చూస్తే సంస్కృతం కూడా అన్ని సార్లూ గెల్చిందన్న మాట యుద్ధం సంధితో ఆగిపోతుంది. గీర్వాణాంధ్రభాషా సంప్రదాయాలు మేళవించి సాహిత్యవేత్తలు సంధిచేస్తారు. ఇది సాధించినవారు తిక్కన, కృష్ణదేవరాయలు, రఘునాథనాయకుడు, వీరేశలింగం. వీరికి మార్గదర్శకులు నన్నయ, పండితారాధ్యుడు. నన్నయ శివం సంస్కరించి సుందరం మేళవించాడు. పండితారాధ్యుడు శివం సంస్కరించి సత్యం మేళవించాడు. సంస్కారం లేకపోతే తెనుగుతనం శివం మాత్రమే.

కాకతీయ సామ్రాజ్యకాలంలో కూడా శివమతానికే ప్రాబల్యం వుండేది. బౌద్ధం, జైనం, వేదమతం కూడా వుండేవి. ఆంధ్రదేశంలో వేదమతం మాత్రం ఎప్పుడూ సర్వనాశనం కాలేదు. అణిగిమణిగి వుండి మళ్లీ ప్రచారంలోకి వస్తూవుండేది. మతానికీ సాహిత్యానికీ మాత్రం ఎప్పుడూ సన్నిహిత సంబంధం వుండేది. ఎప్పుడూ మతానికి సాహిత్యం ఉపకరించేది. శైవం వెర్రితలలు వేసే కాలంలో తిక్కన అవతరించి, అద్వైతమతం పునరుద్ధరించినాడు. యజ్ఞంచేసి సోమయాజి ననిపించుకుని, మార్గదేశికవితాసంప్రదాయాలు సంధించి, దేశీయకవితకి ప్రాముఖ్యం ఇచ్చి, భారతాంధ్రీకరణం చాలావరకు సాగించి ధన్యుడైనాడు. ఇదం బ్రాహ్మం, ఇదం క్షాత్రం అనే విశ్వామిత్ర ప్రతిభ తిక్కనలోకూడా వుండెను.

మహమ్మదీయదండయాత్రలకి తాళలేక అంతరించిన కాకతీయ సామ్రాజ్యం తర్వాత హిందూమతానికే అపాయం వచ్చినది. ఈ శిథిలావస్థలో హిందూ సామ్రాజ్యాన్ని, వేదమతాన్ని పునరుద్ధరించడానికి అవతరించినవాడు శ్రీ విద్యారణ్య స్వామి. కాకతీయ శిథిలాలతో విజయనగర సామ్రాజ్యం స్థాపించి దక్షిణాపథంలో తెలుగుల ఏలుబడి నిలబెట్టినాడు. భారతదేశచరిత్రలో విజయనగర ఘట్టం స్వర్ణయుగం. కృష్ణదేవరాయలు యుగపురుషుడు. "దేశ భాషలందు తెలుగు లెస్స" అనే బిరుదు ప్రసాదించి, తెనుగు ప్రబంధకవిత్వానికి పునాది వేసినాడు. కృష్ణరాయలు తుళువంశీయుడు. అసలు తెనుగువాడు కాడు. పరాయివాడిచ్చిన బిరుదు గనుకనే అమూల్యం. ఆయన పరిపాలించిన 'దేశంబు తెలుగు'. ఆ బిరుదుతో తెలుగువారికి ఆత్మసాక్షాత్కారం అయినది. అటువంటి బిరుదే తెలుగు భాషకి మరో విదేశీయుడు ప్రసాదించినాడు. ఆయన ఆంగ్లేయుడైన బ్రౌను. తూర్పుఖండపు ఇటలీభాష అన్నాడు. తెలుగులాలిత్యము, మాధుర్యము చూసి ముగ్ధుడై ప్రథమనిఘంటు తయారు చేసినాడు. నిజానికి తెనుగులో కొత్త తోవలు తొక్కినవారందరూ తెనుగులవారు కారేమో ! నన్నయ కర్ణాటుడనే వాదన వున్నది. ఆయన్ను పోషించిన రాజరాజుతల్లి, భార్య ద్రావిడులు. అనువాదానికీ, మార్గకవితకీ ఆయన అంకురార్పణ చేస్తే, తుళువదేశీయుడైన కృష్ణరాయలు ప్రబంధరచనకి పునాది వేసినాడు. మార్గపద్ధతిని ప్రథమవచనరచన చేసిన చిన్నయసూరికి ద్రావిడ సంపర్కం ఎక్కువ. తెనుగునాట ఆశుకవితాధారలు కురింపించి, ఆధునికాంధ్రకవిత్వానికీ, ఇప్పుడు నవ్యవచనరచనకీ మెరుగులు పెడుతున్న శ్రీ చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రిగా రారామద్రావిడులు. నిజానికి తెలుగు నాటపుట్టి, తెలుగునాటనే పెరిగి దేశంలోగాని, దేశాంతరాలలో గాని కీర్తి సాధించినవారు లేరు. రాష్ట్రేతరాంధ్రులు, రాష్ట్రభ్రష్టాంధ్రులు పేరు సంపాదిస్తారు. జగన్నాథ పండితుడు ఢిల్లీ దర్బారులో పేరు సాధించినాడు. వల్లభాచార్యుడు రాష్ట్రాంతరంలో తన మతం ప్రచారం చేసినాడు. ఈనాడు రాధాకృష్ణ పండితుడు దేశాంతరాలలో కీర్తి సాధించిన తర్వాతనే స్వదేశంలో గౌరవం పొందగలిగినాడు. పట్టాభి బందరు వదలి ఢిల్లీ చేరితేనేగాని రాష్ట్రపతిత్వం పొందలేకపోయాడు. అసలు వర్తమాన కాలంలో అంతర్జాతీయ కీర్తి సాధించిన తెనుగువారు కోడి రామమూర్తి,

సి.కే.నాయుడు, జిడ్డు కృష్ణమూర్తి, సర్వేపల్లి రాధాకృష్ణ మాత్రమే. యల్లంరాజు సుబ్బారావు గారు అమెరికాలో స్వర్గస్థులైనదాకా తెనుగువారికి తెలియనే తెలియదు. రష్యాలో ఇంజనీరు రావుగారెవరో వున్నారంటారు. జర్మనీలో వుండి వచ్చిన జ్ఞానానంద స్వామి విషయంకూడా మనకి అట్టే తెలియదు. నాగేశ్వర రావు పంతులు గారికి బొంబాయిలో మొదట లక్ష్మీప్రసన్నమైనది. అత్త ఆశ్వీరచనంతో కోడలికి కొత్తనగలు చేయించినారు. ఈ తెనుగు సంప్రదాయానికి కొంతవరకు విరుద్ధమైనవారు పండితారాధ్యుడు, వీరేశలింగం. ఇద్దరూ ఆంధ్రదేశాంతర్భాగంలోనే పుట్టి, పెరిగి మహానుభావులైనారు.

శ్రీ కృష్ణదేవరాయల తదనంతరం, విజయనగర సామ్రాజ్యం క్రమేణా క్షీణించి, దక్షిణాన నాయకరాజుల ప్రభ బలిసినది. దక్షిణయాత్ర ప్రారంభించడానికి ముందు ఇద్దరు ప్రత్యేకాంధ్రవ్యక్తుల సంగతి చెప్పితీరాలి. వారు శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణుడు. వీరిని గురించిన కథలు చాలా వున్నవి. కట్టుకథలే కావచ్చుగాని, అవన్నీ తెనుగు కథలు. శ్రీనాథుడు సమస్తఐశ్వర్యాలూ అనుభవించి చివరికి అష్టకష్టాలు పడి చచ్చిపోతో ఇక స్వర్గంలో కవుల డొక్క చీలుస్తానన్నాడు. చావుమంచంమీద కూడా ప్రగల్భాలు కొట్టగలిగినవాడు తెలుగువాడే. తెనుగుచింత చచ్చినా పులుపు చావదు.

తెనాలి రామకృష్ణుడు కాళికాదేవిని ఆరాధించి, ఆమె ప్రత్యక్షమైతే, వరాలు అడగడానికి ముందు ఆమె అంగ సౌలభ్యం చూసి ఫక్కున నవ్వినాడు. మహాశక్తి ప్రత్యక్షంలో, పగలబడి నవ్వగలిగినవాడు తెనుగువాడొక్కడే. మేధస్సు, ప్రతిభ వికటించడం తెనుగు సంప్రదాయం. రామకృష్ణుడు వికటకవి.

విజయనగర సామ్రాజ్యానంతరం ఆంధ్రప్రతిభ నాయకరాజులతోపాటు ద్రావిడదేశం వలసపోయినది. విజయనగరానికి దీటైన ఆంధ్రసంస్కృతి మధుర, తంజావూరునగరాలలో ప్రతిష్ఠించి, సంగీతం, సాహిత్యం, నృత్యం, నాట్యకళ, శాస్త్రం, పరిపాలనా దక్షత, శిల్పచాతుర్యం, అన్నీ ద్రావిడదేశానికి అంకితమైనవి. రఘునాథరాయలు, విజయరాఘవరాయలు దక్షిణాంధ్రభోజులు. ఆదిలో తెనుగు వెనుకబడి జింజీ, మధుర, తంజావూరు సంస్థానాల ప్రోద్బలంతో సంస్కృతమే ప్రబలినది. అప్పయ్యదీక్షితులు, రత్నఖేట శ్రీనివాస పండితుడు సంస్కృతం పునరుద్ధరించిన వారు. కాని ముఖ్యంగా తంజావూరు, మధుర స్త్రీ జన ప్రోద్బలంవల్ల కాబోలు మళ్లీ తెనుగు పరాయిదేశంలో స్వస్థానం సాధించినది. ఆనాడు దక్షిణదేశం పట్టిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు నలభై లక్షలమంది ఈనాటికీ ఆ దేశంలో వుండి, ప్రజాయుగంలోకూడా రాజచక్రం తిప్పుతున్నారు. ఆచారవ్యవహారాలలో తమిళులే అయినా భాషమాత్రం ఇంకా విడిచిపెట్టలేదు. ఈ దక్షిణాంధ్రులలో మాతృభాష ప్రచారం చెయ్యడానికి తిరునెల్వేలివాస్తవ్యులు శ్రీ సాధు వరదరాజం పంతులుగారు యావజ్జీవం కృషి చేసినారు.

దక్షిణాంధ్రులందరిలోనూ, అసలు ఆంధ్రులందరిలోనూ త్యాగరాజు విశిష్టుడు. త్యాగరాజు ప్రశంస వచ్చినప్పుడు మరి ఇద్దరు రాజుల్ని తల్చుకోక తప్పదు. వారు యుద్ధాలు గెల్చి సామ్రాజ్యాలు ఏలిన రాజులు కారు. ప్రజా హృదయ సామ్రాజ్యం పరిపాలించే భక్త రాజులు. బమ్మెరపోతరాజు, కంచెర్ల గోపరాజు. ఆంధ్రదేశం నశించి, ఆంధ్ర సంస్కృతి రూపుమాసిపోయినా ఈ ముగ్గురు రాజుల కీర్తిమాత్రం ఆచంద్రతారార్కంగా నిల్చిపోతుందన్నారు శ్రీ పురాణం సూరిశాస్త్రిగారు. ఈ ముగ్గురు రాజుల్దీ ఒక ఉద్యమం అది భక్తి యోగం. సంగీత సాహిత్య సమన్వితం.

పోతరాజు అసలైన, సిసలైన తెనుగువాడు. తెనుగు కృష్ణుణ్ణి గొప్పగా చేసినవాడైనా, అతని అభిమాన పాత్రలు ప్రహ్లాదుడు, బలిచక్రవర్తులేమో! మందారమకరందంలో ఆంధ్రహృదయం అక్షరాలా చిత్రించినారు. తెనుగుహృదయం భక్తిహృదయం అని నిరూపించినాడు. బలిచక్రవర్తి తానేనేమో! శ్రీ మహావిష్ణువు మాయరూపంతో ప్రత్యక్షమై తన సర్వస్వం అపహరించడానికి వచ్చినప్పుడు, కులగురువు కోపించి శాపమిచ్చినప్పుడు, మాటలనిలకడకోసం, కీర్తికోసం, “ఆదిక్ శ్రీసతికొప్పుపై తనువుపై, నంసోత్తరీయంబుపై, పాదాబ్జంబులపై, పాలిండ్లపై నూతన మర్యాదం జెంబు కరంబు క్రిందగుట మీదై నాదుకర బుంట మేల్గాదె” అన్నాడు. సత్యశీలంలో, త్యాగదీక్షలో, శృంగార హాస్యం. పోతన్నగారి .... ఆంధ్రుడు. ఫలం పాతాళలోకనివాసం. పోతన్న కూడా విశ్వ శ్రేయస్సుకోసం సృష్టించిన తన కోమల కావ్య కన్యను రాజులకిచ్చి పడుపుకూడు తినక, శ్రీ రామపాదపద్మాల కంకితమిచ్చినాడు. ఆంధ్రుల ఇలవేల్పు శ్రీ రామచంద్రమూర్తి ఆదర్శం లోకానికి లోకాద్భుతంగా పునఃప్రదర్శనం చేసిన మహానుభావుడు. ఆనాడు రాజులు నీచులైనారు. మంత్రులు స్వార్థపరులైనారు. ప్రజలు అవినీతిపరులై లంచాలకు మంచములు వేసినారు. మహమ్మదీయ సంపర్కంతో, సంఘర్షణతో హిందూసంఘం నీరసించినది. దేశం అభ్యున్నతికి రావడానికి ఆధ్యాత్మికచింతగాని, పరార్థచింతగాని లేదు. అటువంటి ప్రజని మంచిదారిలో పెట్టడానికి మార్గం, బాపుజీ జీవితాంతం వరకు ఘోషించినట్టు రామరాజ్యసంస్థాపనమే. అవతారపురుషులందరిలో శ్రీరాముడు ఆదర్శమైనవాడు. ఆయన తనకోసం ఏమీ చెయ్యలేదు. రాముడు ఆదర్శ ప్రభువు. రామరాజ్యం ఆదర్శరాజ్యం. ఆ సందేశం ప్రపంచానికి చాటడమే భాగవతాంధ్రీకరణం కర్తవ్యం. పోతనచేతులో తెనుగు తల్లి రాణించినది. తెనుగువాడు సంగీతాభిలాషి. సాహిత్యాభిలాషి. సహజంగా తెనుగువాడొక్కడే పద్యం పాడతాడు. తక్కినవారు చదువుతారు. అందుకని తెనుగువాఙ్మయం సంగీతసాహిత్యం. భక్తి పారవశ్యంలో తెలుగులు రామభజన చేస్తారు. నృత్యం, సంగీతం, సాహిత్యం అన్నీ మేళవించి ఇలవేల్పుని కొలుస్తారు. పోతరాజు లేఖినిలో తెనుగు తీగలసాగినది. సహజమాధుర్యం సార్థకం చేసుకున్నది. కాని సహజంగా పోతున్న పాటగాడు కాడు.

ఆ పాట సాధించినవాడు కంచెర్ల గోపరాజు. గోదావరీతీరాన, గోలకొండరాజ్యపు సరిహద్దులలో ప్రజలు దుర్నీతపరులై, అరాజకం ప్రబలి, సుంకాలు చెల్లించకుండా విచ్చలవిడిగా వున్న విషమసమయంలో రాజ్యపరిపాలన ఆ భాగంలో బలపర్చడానికి తానీషా కంచెర్ల గోపన్న గార్ని భద్రాచలం తహశీల్దారుగా నియోగించినాడు. ఆలోచించగా గోపరాజుకి ఒకటే మార్గం కనబడినది. ఆ మార్గం చూపించినవాడు భద్రగిరి రాముడు. ప్రజల్నీ భక్తి మార్గంలో పెట్టమన్నాడు. ఆ భక్తితో వినయం, విద్యా, తదితర సుగుణాలూ అలవడి, నాగరికులవుతారు. ప్రజల్నీ బాగు

చెయ్యాలంటే వారిలో ఉత్సాహం, ఉద్రేకం రేకెత్తించాలి. ఉత్సాహానికి ఏదైనా నిర్మాణ కార్యక్రమం వుండాలి. ఉద్రేకం వల్ల వాని నిర్మాణం సాధించవచ్చు. ప్రజలలో భక్తి ఉత్సాహం కలుగజెయ్యడనానికి గోపరాజు వో నిర్మాణం తలపెట్టినాడు. అది పాడైపోయిన భద్రగిరి శ్రీరామాలయం పునర్నిర్మాణం చెయ్యడం. తురకసంపర్కంవల్ల క్షీణించిన హిందూమతం పునరుద్ధరించడం కూడా అయివుండవచ్చు. ప్రజాబలంతో శ్రీరామాలయ పునర్నిర్మాణం చేస్తే తన ఆశయం నెరవేర్తుంది. కార్యక్రమం ప్రారంభించినాడు. కార్యదీక్షలో తాత్కాలికంగా రాజమర్యాద అతిక్రమించి సర్కారు ఖజానాలో సొమ్ము కొంత శ్రీరాముడి కైంకర్యం చేసి వుండవచ్చు. బహుశః మహమ్మదీయోద్యోగులు ఆ విధంగా మసీదులు నిర్మించడం నాటి రివాజైవుండవచ్చు. లేదా ఆనాటి తహశీల్దార్లకి ఈ అధికారం వుండివుండవచ్చు. హిందూ మత ప్రచారం చేస్తున్నాడనే భయంవల్ల తోటి మహమ్మదీయ ఉద్యోగులానేరారోపణ చేసివుండవచ్చు. ఫలితం ఖైదువాసం. శిక్ష అనుభవించినాడుగాని శ్రీరామచంద్రుడి పాదపద్మములు వదలలేదు. చివరికి ఆ సొమ్ము శ్రీరామునిపేరిట ప్రజలంతా కలిసి చెల్లించారో, సహృదయుడైన తానీషా కలగన్నాడో గోపరాజు ఆశయం నెరవేరింది. ఆనాటినించి ఈనాటి వరకూ తురకరాజ్యంలో, సర్కారు సొమ్ముతో ప్రతియేటా శ్రీరామకల్యాణోత్సవం జరుగుతోంది. శ్రీరాముడి జన్మక్షేత్రం అయోధ్యకంటె, ఆయన వనవాసతీర్థం భద్రగిరి ఈనాడు గొప్ప క్షేత్రం. గోపరాజు తన భక్తి పారవశ్యంలో పాటపాడినాడు. రాముని కీర్తించి కీర్తనలు పాడినాడు. తెనుగువారికిమల్లేనే నిందాస్తుతి కూడా చేసినాడు. సంగీతం సహజంగా వెల్లివిరిసినది. కాని పోతరాజుకి లభించిన కవితాపటిమ దొరకలేదు.

ఈ రెంటినీ సమపాళ్లుగా సాధించి చరితార్థుడైనవాడు సంగీత సాహిత్య బ్రహ్మ, త్యాగబ్రహ్మం.

ఉత్తర దేశంలో మహమ్మదీయ మహాయుగం అంతరించినది. దక్షిణాన నాయకరాజులు, మహారాష్ట్రులు క్షీణించినారు. పాశ్చాత్యులు భారతదేశంలో ప్రవేశించి ప్రబలుతున్నారు. పూర్వ సంప్రదాయాలు నశించినవి. అవినీతి పెరిగినది. చదువుకున్న వారు స్త్రీలోలురైనారు. ధనాభిలాషులైనారు. అవినీతిపరులకే రాజాశ్రయం లభించినది. భారత జాతీయత క్షీణించిపోయింది. ఆ క్లిష్ట సమయంలో ప్రజాసామాన్యాన్ని లేవనెత్తడానికి అద్భుతమైన సందేశం, అద్భుతమైన పద్ధతిలో ప్రచారంచేస్తేనేగాని వీలుకాదు. క్రియవల్ల, ఆదర్శజీవితంవల్ల ప్రజకి నీతిమార్గం బోధించాలి. త్యాగరాజు తాను ధనభూషణాదులు త్యజించినాడు. రాజాశ్రయం నిరసించినాడు. శ్రీరాముడే రక్ష అన్నాడు. ఆ శ్రీరామమంత్రం విశ్వశ్రేయస్సుకోసం సంగీతముగా వాడవాడలలో, వీథి వీథిలలో పాడి, ప్రజాలోకాన్ని రంజింపచేసి, వారి త్యాగబుద్ధి, పారమార్థిక చింతనలను అభివృద్ధిచేసినాడు. వారిని తన్మయుల్ని చేసి తాను తన్మయుడైనాడు. వేశ్యాలోకంలో నీచమైపోయిన సంగీతకళ నుద్ధరించి సాహిత్యంతో సంధించి పరమేశ్వరాంకితము చేసినాడు. తన జీవితము ఆదర్శప్రాయముగా నాలుగు ఆశ్రమాలలోనూ నడిపి, సన్యసించి అద్వైతిగా పరమపదించినాడు. "ఈశ్వర అల్లా తేరే నామ్, సబకో సన్మతి దే భగవాన్" అన్న బాపుజీగీతానాదం నూటాఏభై సంవత్సరాల క్రితమే దక్షిణాపథంలో త్యాగరాజకృతిగా తెనుగున మ్రోగినది.

త్యాగరాజు తెలుగుల కాదర్శపురుషుడు. రామదాసుకికూడా అందని సంగీతం, పోతన సాహిత్యం త్యాగరాజుకి సిద్ధించినవి. తన్మూలంగ సంగీత సాహిత్యం, సాహిత్య సంగీతం ప్రసాదించి తెనుగు భాషను, తెనుగు ప్రజనేకాక, దక్షిణాపథమంతా పునీతం చేసినాడు. తనజన్మ క్షేత్రం తిరువాయూరు, పంచనద క్షేత్రం, అసలు తెనుగే పంచనర క్షేత్రం. గంగనీరు గోదావరిలో కలవడం తెనుగుయాత్రికుల కర్తవ్యం. మన ఆర్యమతాభిమానం అందులోనే వ్యక్తమవుతుంది. మహాయాత్రికులెందరో, పుణ్యచరితులు ఆర్యస్రవంతి గంగను ఆంధ్రస్రవంతి గోదావరిలో కలిపినారు. ఈ ఆర్యాంధ్ర తీర్థం దక్షిణా పథంలో తెలుగులు పంచిపెట్టినారు. గోదావరి, కృష్ణ, పెన్న, తుంగభద్ర ఈ నదీతీరాలలో వెలసిన ఆంధ్రసంస్కృతి త్యాగరాజు కాలంలో తిరువాయూరికావేరిలో కలిసి పంచనద క్షేత్రమైనది. తెనుగువారు తాగేవి "మంచినీళ్లు." తాగే నీటికి "మంచినీళ్లు" అనే మాట మరెవ్వరూ ఏ దేశంలోనూ వాడరు. ఆంధ్రులు అన్ని నీళ్లూ తాగరన్నమాట. నీటిలో మంచినీటినే త్రాగుతారు. తెనుగు భాషకూడా మంచినీరువంటిది. మంచినే స్పృశిస్తుంది. తెనుగుకవితా ఈ తీర్థంలోనే పునీతమైనది. తెనుగువారు మంచినీళ్ల ప్రాయంగా నిష్కల్మషంగా మాట్లాడతారు. పంచనద క్షేత్రంలో త్యాగరాజు ఈ నీటినే తేర్చి, తేటజేసి తెనుగుతేట సార్థకం చేసినాడు.

(ఆంధ్రపత్రిక విరోధి సంవత్సరాది సంచిక)

తెలుగు కవిత్వము చెప్పం
దలచిన కవి యర్థమునకు దగి యుండెడు మా
టలు గొని వళులుం బ్రాసం
బులు నిలుపక యొగిని బులిమి పుచ్చుట చదురే?

– తిక్కన సోమయాజి

జవహర్‌లాల్ నెహ్రూ

విజయనగరము

వెనుకటి జాబులో మనము చర్చించిన రాజ్యములన్నిటిలోను చిరకాలము నిలిచినది విజయనగర రాజ్యము. విదేశీయులనేకులు దానిని సందర్శించుట తటస్థించినది. వారారాజ్యమును గురించి, నగరమును గురించీ వృత్తాంతములు వ్రాసివుంచిరి. 1420లో ఇటలీ దేశస్థుదు నికొలొకాంటే అనువాదు వచ్చెను. 1443లో మధ్యఆసియాలోని గొప్పఖాను కొలువునుండి హీరట్ పట్టణవాసి అబ్దుల్‌రజాక్ వచ్చెను. 1552లో పాస్ అను పోర్చుగీసువాడు విజయనగరము దర్శించెను. ఇంకా ఇతరులు అనేకులు వచ్చిరి. దక్షిణ ఇండియన్ రాజ్యములను అందు ముఖ్యముగా బీజాపూరును గురించి వ్రాసిన హిందూదేశ చరిత్ర కూడ ఒకటున్నది. ఇది ఆక్బరు కాలమున పర్షియన్ భాషలో ఫరిస్టాచే వ్రాయబడినది. మనము ప్రసంగించుకొను కాలమునకు కొంచెము తరువాత అది వ్రాయబడినది. సమకాలమున వ్రాయబడిన చరిత్రలు తరుచుగా అతిశయోక్తులతో నిండి పక్షపాతసహితముగా వుంటవి. కాని అవి చాలా ప్రయోజనకరములు. ముస్లిముల కాలమునకు ముందు ఇట్టి గ్రంథములేవీ వున్నట్లు మనకు తెలియదు కాశ్మీరమును గురించి వ్రాసిన ఒక్క రాజతరంగిణి అను గ్రంథముతప్ప. అందుచే ఫరిస్టా చరిత్ర విశిష్ఠమైనది. అతని తరువాత అట్టి చరిత్రలు పలువురు వ్రాశారు.

విజయనగరమును దర్శించిన విదేశీయులు చేసిన వర్ణనములు సరిగా నిష్పక్షపాతముగా వున్నవి. వీటినిబట్టి విజయనగరముయొక్క స్వస్వరూపము మనము తెలుసుకోవచ్చును. తరుచు జరుగుచున్న పాడుయుద్ధములను గురించిగాక అంతకన్న అతిశయముగా వారు చెప్పిరి. కాబట్టి వీరు చెప్పిన విషయములను గురించి నీకు కొంత వ్రాస్తాను.

విజయనగరము 1336 ప్రాంతమున స్థాపించబడినది. దక్షిణ ఇండియాలో కర్ణాటక దేశమున అది వున్నది. హిందూరాజ్యముగానచుట్టుపట్టులనున్న ముస్లిమురాజ్యముల నుండి హిందూ ప్రజలు వచ్చుట సహజమే. అది త్వరత్వరగా వృద్ధినందినది. కొద్ది సంవత్సరములలో అది దక్షిణమున ప్రబలమయ్యెను. రాజధానీనగరము భాగ్యముతో తులతూగుచుండెను. అందముగా వుండెను. దక్కనులో విజయనగరము ప్రబల రాజ్యమయ్యెను.

ఫెరిస్టా విజయనగరముయొక్క భాగ్యాతిశయమును వర్ణించెను. గుల్బర్గానుండి ఒక ముస్లిం భామినీ రాజు విజయనగర రాచపుత్రికను వివాహమాడ 1406లో విజయనగరము వెళ్ళెను. ఆనాటి నగర వైభవము నాతడు వర్ణించెను. ఆరుమైళ్ళ దూరము రాచబాట పొడుగునా బంగారు జలతారుగల మొహమల్ మొదలగు వస్త్రములు పరచబడినవట. ఎంతటి దారుణమైన, అకీర్తికరమయిన దుర్వ్యయమో!

1420లో ఇటలీ దేశస్థుదు నికొలోకాంటి వచ్చెను. ఆ నగరము చుట్టుకొలత 60 మైళ్ళని అతదు

చెప్పెను. ఈ విస్తీర్ణము చాలా పెద్దది. అనేకమగు తోటలు అందుండుట కారణము. వియజనగర భూపాలుడు, రాయలనువాడు, ఆ కాలమున ఇండియాలో మిక్కిలి ప్రబలుడగు రాజని కాంటీ అభిప్రాయపడెను.

మధ్య ఆసియానుండి తరువాత అబ్దుల్ రజాకు వచ్చెను. విజయనగరమునకు పోవుదారిలో, మంగుళూరువద్ద అతడొక అద్భుతమగు దేవళమును చూచెను. మంచి ఇత్తడి కరిగించి దేవళమును నిర్మించిరట. అది 15 అడుగుల యెత్తు. నేలమట్టమువద్ద 30 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు వుండెను. ముందుకుపోగా బేలూరువద్ద వేరొక దేవళము అతనిని ఆశ్చర్యమున ముంచినది. అతడు దానిని వర్ణించుటకు ప్రయత్నించలేదు. వర్ణించి వున్నట్లయితే "అతిశయోక్తి చెప్పావని" అంటారని అతడు భయపడెనట. తరువాత అతడు విజయనగరమును చేరెను. దానినిచూచి అతడు ఆనందముతో పారవశ్యము నందెను. అతడు చెప్పినమాట లేమనగా : "భూలోకమున దానికి సాటివచ్చు నగరము కన్ను చూడలేదు. చెవి వినలేదు. అట్టిదా నగరము!" అచ్చటనున్న బజారులనేకము. వాటినతడు వర్ణించెను : "ప్రతి బజారు మొగను అత్యున్నతమయిన ముఖద్వారము లుండెను. పైకప్పుగల మార్గములుండెను. కాని రాజుగారి నగరు వీటి అన్నిటికన్న యెత్తుగా వుండెను. బజారులు మిక్కిలి పొడుగుగాను, విశాలముగాను వుండెను. సౌరభముతో కూడుకొన్న పుష్పములన్నివేళలయందు ఆనగరమున లభ్యమగుచుండెను. ప్రాణాధారములుగా వాటిని గణించెడువారు. పువ్వులు లేనిదేవారు బ్రదుకలేరు. ప్రతి సంఘమునకు, వృత్తికిని సంబంధించిన వ్యాపారస్థులు తమ అంగళ్ళను ఒకదానికొకటి సమీపముగా పెట్టుకొనుచుండిరి. నగలనమ్ము షరాబులు బజారులో బహిరంగముగా మాణిక్యములు, ముత్యములు, వజ్రములు, పచ్చలు అమ్ముచుండిరి." అబ్దుల్ రజాక్ ఇంకను వర్ణిస్తున్నాడు : "రాజుగారి ప్రసాదమున్న ఈ మనోహర పద్రేశమున యెన్నో పిల్లనదులు ప్రవాహములు మలచిన నున్నని రాతి కాలువలగుండా ప్రవహించుచుండెను.... దేశము జనసంకీర్ణమైవుండెను. జనసంఖ్య ఇంత అని నిర్ణయించుట కష్టము." ఈ విధముగా అతడు వర్ణించుకొంటూ పోయెను. 15వ శతాబ్ది మధ్యలో మధ్య ఆసియా నుండి వచ్చిన ఈ పరదేశి విజయనగర వైభవములను చూచి పరవశుడై వర్ణించుకొంటూ పోయెను.

అబ్దుల్ రజాక్ పెద్దనగరములనేకములు చూడనికారణముచేత విజయనగరమునుచూచి పరవశుడయ్యెనని తలంచవచ్చును. తరువాత దర్శించినవాడు బహుదేశములు చూచినవాడే. అతడు పాస్ అను పేరుగల పోర్చుగీసువాడు. అతడు 1522లో వచ్చెను. సరిగా ఈ సమయమునందే ఇటలీలో పునరుజ్జీవనము తలయెత్తినది. ఇటలీ నగరములలో చక్కని భవనములు లేచుచుండెను. పాస్ ఆ నగరములను చూచి యుండును. కాబట్టి అతని సాక్ష్యము నమ్మదగినది. అతడు చెప్పిన మాటలు : "విజయనగరము రోమునగరమంత పెద్దది. చూచుటకెంతో చక్కగా వుండెను." అతడు నగరమునందలి అద్భుతములనూ, లెక్కపెట్టలేనన్ని చెరువులు, కాలువలు, ఫలారామములవల్ల కలుగు అందములనూ విపులముగా వర్ణించాడు. "విజయనగరము ప్రపంచమందెల్ల సుభిక్షమగు నగరముగా వుండెను. అది యితర నగరముల వలె లేదు. ఇతర నగరములలో సరకులు ఆహారపదార్థములు తరుచు తక్కువపడవచ్చును. కాని ఈ నగరమున సర్వపదార్థములును పుష్కలముగా వుండెను." రాజుగారి ప్రాసాదములో అతడొక గదిని చూచెను. అది అంతా దంతముతో నిర్మింపబడినది. పైనుండి క్రింది వరకూ గోడలు దంతముతో నైనవే. దూలములక్రిందనున్న స్తంభములపై గులాబీపువ్వులు, పద్మములు రమణీయముగా చెక్కబడివున్నవి. అంతా దంతముతోనైనవే. అందులోపము లేమియులేవు. ఇంతకన్న చక్కగా తయారుచేయుట యెవరికీ సాధ్యముకాదు. విలువయందు కాని, అందము విషయమునగాని దానికి సాటివచ్చునది మరి యొకటి యెచ్చటాలేదు.

తాను దర్శించినప్పుడు విజయనగర భూపాలుడెట్లుండెనో పాస్ వర్ణించెను. దక్షిణ హిందూదేశచరిత్రలో పేర్కొన్న మహారాజులలో ఇతడొక్కడు. మహావీరుడనిన్నీ, శత్రువులపట్ల ఔదార్యబుద్ధి కలవాడనిన్నీ, విద్యాపోషకుడనిన్నీ, ప్రజారంజకుడనిన్నీ, దయాశీలుడనిన్నీ నేటి వరకు అతనిపేరు దక్షిణమున ప్రసిద్ధముగా వున్నది. అతనిపేరు కృష్ణదేవరాయలు. 1509 మొదలు 1529 వరకూ అతడు ఇరవై సంవత్సరములు రాజ్యమేలెను. అతడు ఎంత ఎత్తో, అతని విగ్రహమెట్టిదో, అతని దేహచ్ఛాయ ఎట్టిదోకూడా పాస్ చెప్పెను. కృష్ణదేవరాయలు పచ్చగా ఉండేవారట. "శత్రువులకతని పేరు సింహ స్వప్నము. అతడు ఆదర్శప్రాయుడగు రాజు. మందహాసము అతని ముఖమున తాండవమాడుచుండును. ఎప్పుడును ఉల్లాసముగా వుండేవాడు. పరదేశుల నతడు దయతో ఆహ్వానించి, గౌరవించేవాడు. వారెట్టి స్థితిలోనున్నా వారిని పలుకరించి వారి వ్యవహారములన్నీ కనుక్కొనేవాడు. రాజుకున్న బిరుదములన్నిటినీ చెప్పిన తరువాత పాస్ ఇట్లంటున్నాడు :"అతని హోదాలు నున్నవాని కుండవలసినవేమీ అతనికున్నట్లు తోచదు. అన్ని విషయములలోనూ అంతడంతటి ఉదారుడు, ఆదర్శప్రాయుడు."

ఇది గొప్పస్తుతియే! ఈ కాలమున విజయనగర సామ్రాజ్యము దక్షిణమునంతనూ, తూర్పు తీరమునూ వ్యాపించెను. మైసూరు, తిరువాంకూరు, నేటి మద్రాసు రాజధాని అంతయూ అందు చేరివుండెను.

ఇంకో విషయము నేను చెప్పవలసియున్నది. నగరమునకు మంచినీటి వసతి వుండుటకై క్రీ.వె.1400లో గొప్ప పారుదల కట్టడములు నిర్మింపబడ్డవి. నదికి అడ్డముగా పెద్ద కట్టకట్టి ఆ నీటిని నిలువయుంచుటకు ఒక జలాశయము కట్టబడ్డది. దీని నుండి 15 మైళ్ళ పొడుగుగల రాయిమలచిన గొట్టముగుండా నీరు నగరమునకు పోవుచుండెను.

విజయనగర మట్లుండెను. తన భాగ్యమును చూచుకొని, అందమును చూచుకొని గర్వముతో వుండెను. తన బలమును చూచుకొని అతిధైర్యముతో వుండెను. నగరముయొక్కయు, సామ్రాజ్యము యొక్కయు అవసానకాలము సమీపిస్తున్నదని ఎవ్వరూ అనుకొనలేదు. పాస్ దర్శించివెళ్ళిన 43 సంవత్సరముల తరువాత హఠాత్తుగా ప్రమాదము పొడచూపింది. దక్కనులోని యితర రాజ్యములకు విజయనగరమును చూడ కన్నుకుట్టినది. వారందరును చేరి విజయనగరమును తుదముట్టించ తీర్మానించుకొనిరి. అప్పుడుకూడా విజయనగరము తెలివి తక్కువవల్ల ఆత్మవిశ్వాసముతో వుండెను. అవసాన కాలము త్వరలోనే వచ్చినది. అది దారుణమైన పతనము.

1565లో దక్కను రాజ్యములు చేరి విజయనగరమును ఓడించెనని చెప్పియుంటిని. హత్యలమితముగా జరిగెను. తరువాత నగరము కొల్లగొట్టబడ్డది. అందమగు భవనములన్నియు, దేవాలయములు, ప్రాసాదములు నాశనము చేయబడ్డవి. నిరూపమానమగు చెక్కడపు పనులు, శిల్పములు ధ్వంసము చేయబడ్డవి. సమస్తమును పెద్ద మంటలు వెలిగించి తగులబెట్టబడెను. పట్టెడు శిథిలములు మిగులువరకు వినాశనము జరుగుచునే వుండెను. ఒక ఇంగ్లీషు చరిత్రకారుడిట్లు చెప్పెను : "ప్రపంచ చరిత్రలో ఎన్నడును ఇంత హఠాత్తుగా ఇట్టి వైభవతోపేత మైన నగరము ఇట్టి వినాశనమునకు గురికాలేదు. ఆ నగరము ఒక దినమున ఐశ్వర్యసమృద్ధితో తులతూగుచు కష్టపడి పనిచేయు ప్రజలచే కిటకిటలాడుచుండెను. మరుసటి దినమున అది శత్రువశమయ్యెను. కొల్లగొట్టబడెను. క్రూరహత్యలు జరిగెను. వర్ణింప నలవికాని దారుణములు జరిగెను. చివరకది వినాశనము చేయబడెను."

(ప్రపంచ చరిత్ర నుంచి) జూలై 15, 1932

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్ !
గట్టి మేల్ తలపెట్టవోయ్!
పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయ్;
తిండికలిగితె కండకలదోయ్,
కండగలవాడేను మనిషోయ్!
యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్?
జల్డుకొని కళలెల్ల నేర్చుకు
దేశిసరుకులు నింపవోయ్!
అన్ని దేశాల్ క్రమ్మవలెనోయ్
దేశిసరుకుల నమ్మవలెనోయ్!
డబ్బుతేలేనట్టి నరులకు
కీర్తి సంపద లబ్బవోయ్!
వెనక చూచిన కార్యమేమోయ్?
మంచిగతమున కొంచెమేనోయ్!
మందగించక ముందు అడుగేయ్!
వెనకపడితే వెనకేనోయ్!
పూను స్పర్ధను విద్యలందే
వైరములు వాణిజ్యమందే;
వ్యర్థకలహం పెంచబోకోయ్
కత్తివైరం కాల్చవోయ్!
దేశాభిమానం నాకు కద్దని
వొట్టిగొప్పలు చెప్పుకోకోయ్
పూని యేదైనాను వొకమేల్
కూర్చి జనులకు చూపవోయ్!
ఓర్వలేమిపిశాచి, దేశం
మూలుగులు పీల్చేసెనోయ్!
ఒరులమేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయ్!
పరుల కలిమికి పొర్లియేడ్చే
పాపికెక్కడ సుఖం కద్దోయ్!
ఒకరి మేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్కొల్లలోయ్!
స్వంతలాభం కొంత మానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్!
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్!
చెట్టపట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడవవలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్
మతంవేరైతేను యేమోయ్?
మనసులొకటై మనుషులుంటే
జాతమన్నది లేచిపెరిగీ
లోకమున రాణించునోయ్!
దేశమనియెడి దొడ్డవృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయ్
నరులచెమటను తడిసిమూలం
ధనం పంటలు పండవలెనోయ్!
ఆకులందున అణగిమణగీ
కవిత కోకిల పలకవలెనోయ్
పలుకులను విని'దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయ్!

– గురజాడ అప్పారావు

అల్లూరి బాపినీడు

పూర్వాంధ్ర వీరాంగనలు

మాన రక్షణార్థం ప్రాణత్యాగమైనా చేయగలిగిన రాజపుత్ర స్త్రీల అభిమాన సంపద, రాజకార్య ధురంధరతలోనూ, రణక్రీడను శాశించు చాతుర్యములోను వీరాబాయి, దుర్గావతి, చాంద్‌బీబీ, ఝాన్సీలక్ష్మీ బాయి మొదలయిన వారిని మరిపించే ధీశక్తి, ధైర్యోత్సాహములు చూపగలిగిన వీరవనితల దివ్య జీవిత కథలతో ఆంధ్రుల చరిత్ర అనుపమాన సుందరము అయింది.

పురుష వీరులలో శౌర్యోత్సాహాలను పురిగొల్పిన ఆంధ్ర వీరాంగనలు :

చానమ్మ, ప్రోలాంబ

13 వ శాతాబ్దంలో విక్రమసింహపురం (నేటి నెల్లూరు) మనుమసిద్ధిచే పరిపాలించబడుతూ ఉండేది. ప్రక్కను కాటమరాజు అనే ప్రభువు ఎఱ్రగడ్డపాడు రాజధానిగా చేసుకొని కనిగిరిసీమను పాలిస్తూ ఉండేవాడు. దురదృష్టవశాత్తూ కనిగిరిసీమలో గొప్ప క్షామం సంభవించింది. పశువులకు మేతకూడా దొరకని పెద్ద ఎడారి అయిపోయింది. కనిగిరి యాదవులు విక్రమసింహపురి ప్రభువుతో సంప్రదించారు. తమ పశువుల్ని వారి బీళ్లలో మేపుకొననిచ్చేట్టు దానికి ప్రతిఫలంగా వారు పుల్లరి చెల్లించేట్టు ఏర్పాటు చేసుకొన్నారు. కాని ఇది జరిగిన కొంతకాలానికే తమ పశువులు కొన్ని నష్టమయాయని యాదవులు పుల్లరి చెల్లించటము మానివేశారు. మనుమసిద్ధికి కోపంవచ్చింది. యుద్ధం ప్రకటించాడు. యాదవులూ యుద్ధసన్నద్ధులయారు.

సింహపురి సైన్యాధ్యక్షుడు రణతిక్కన అనే నామాంతరము గల ఖడ్గతిక్కన. బ్రహ్మరుద్రయ్య అనే ఆరాధ్య బ్రాహ్మణుడు యాదవులకు సైన్యాధిపతి. ఇరువాగుల వారికి ఘోర సంగ్రామం జరిగింది. విక్రమ సింహపురి సైన్యాలు చెదిరిపోయినాయి. ఇక లాభము లేదని రణతిక్కన యుద్ధరంగము విడిచి ఇంటికి వచ్చేశాడు. తన పూర్వుల ప్రతిష్ఠను, తన పూర్వ ప్రతిష్ఠను మంటగలిపి భీరుడై పారిపోయి వచ్చాడని విక్రమసింహపురి ప్రజలు గుస గుస లాడుకొన్నారు.

రణతిక్కన ఇల్లుచేరాడు. భార్య చానమ్మ ధీర మనస్క, మహాబుద్ధిశాలిని. తనపతికి చిత్రమైన స్వాగతం ఇచ్చింది. స్నానం చేయడానికి నీళ్ళుపెట్టి ఒక నులక మంచం అడ్డంపెట్టింది. ఒకపసుపు ముద్దను కూడా అక్కడ ఉంచింది. భర్తను వచ్చి స్నానం చేయమని ఆహ్వానించింది. ఆయన పోయి చూచాడు దృశ్యం. తిరిగి భార్యవంక చూచాడు. “ఇది యేమి” అను ప్రశ్నార్థకమైన అతని చూపునకు సమాధానంగా ఆమె ఇలా చెప్పింది.

పగరకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకులెందున్
ముగు రాడువార మైతిమి
వగపేటికి జలకమాడ వచ్చిన చోటన్.

క్రుంగిన గుండెతో స్నానము ముగించుకొని భోజనానికి వెళ్లినాడు. తల్లి ప్రోలాంబ విరిగిపోయిన పాలు తెచ్చి, వడ్డించ వచ్చింది. తిక్కన తల్లి ముఖం చూచాడు. "పాలు విరిగినాయే" మని ప్రశ్న. "నాయనా! భీరుడై వంశగౌరవాన్ని మంటగలిపి యుద్ధగండం విడిచి పారిపోయి వచ్చిన వాని ముఖము చూడటానికి సిగ్గుపడినా యేమో!" అని సమాధానం చెప్పింది. తిక్కనకు తల తిరిగిపోయింది. అన్నము విడిచి లేచి ఖడ్గధారియై తిరిగి రణరంగానికి పరుగెత్తాడు. ప్రళయభీకరుడై శత్రువులను చెండాడాడు. చివరకు ఆ యుద్ధంలోనే గాయపడి మరణించాడు. వీరపత్ని చానమ్మ సంతోషంగా సహగమనం చేసింది. ఆతని కీర్తి, వంశగౌరవము నిలవబెట్టు కొన్నాడు. అంతకంటె ప్రకాశవంతములై ఆయనకు కర్తవ్యాన్ని బోధించిన ఆయన భార్య చానమ్మ, తల్లి ప్రోలాంబల పవిత్ర నామాలు చరిత్రలో బంగారు పంక్తులై తళతళలాడుతూ శాశ్వతంగా నిలిచిపోయినాయి. ఇట్టివారే....

మాంచాల, రేఖాంబలు

భారతనారీ మాణిక్యమైన మరియొక యువతి చరిత్ర ఉజ్జ్వలతరమై, ఆధునిక భారత యువతులకు కర్తవ్యాన్ని బోధిస్తుంది. ఆమె పలనాటి మాంచాల.

పలనాటి యుద్ధం తెలుగునాట జరిగిన మహా భారత యుద్ధమని ప్రసిద్ధి పొందింది. ఒకవంక మలిదేవరాజు, రెండవ పక్షం ఆలగామ రాజు. ఇరువర్గాల వారు తమ తమ సైన్యాల్ని సమకూర్చుకొని యుద్ధసన్నద్ధులైనారు. మలిదేవరాజు పక్షానికి నాయకుడైన బ్రహ్మనాయుడు పలనాటి కృష్ణుడు. ఆయన కుమారుడు బాలచంద్రుడు ముక్కు పచ్చలారని యువకుడు; అభిమన్యుని వలె చిన్ననాటనే రణకళా పండితుడైనాడు. పిన్నవాడని బ్రహ్మనాయుడు ఆ బాలుని యుద్ధానికి పిలుచుకొని పోలేదు. కాని బాలుడు వీరకుమారుడు అతని లోని పొంగులు వారే వీరరక్తం అతనిని కూరుచుండనీయలేదు.

కారంపూడి వద్ద రెండు సేనలు బ్రహ్మాండముగ సమకూడిన వని వార్త తెలిసింది. తల్లి ఐతమ్మ వద్దకు వెళ్లి "అమ్మా! నేను యుద్ధానికి పోతున్నాను. ఆశీర్వదించి పంపు" మని ప్రార్థించాడు. పుత్ర ప్రేమ ఆమెను అందుకు అంగీకరించనీయలేదు. కాని బాలుడు ఆగేటట్టులేడు. ఏమి చేస్తుంది? "నాయనా! యుద్ధానికి పోయేవీరులు భార్య అనుమతి కూడా తీసుకోవాలి" అని చెప్పి, తానుముందేపోయి కోడలు మాంచాలతో అతనిని వారించవలసిందని చెప్పి వచ్చింది. నాటికి మాంచాలా బాలచంద్రుల పరిచయం క్రొత్త క్రొత్తగానే ఉన్నది. బాలచంద్రుడు మాంచాల కోసం వచ్చాడు. పతిరాక ఆమెకు మహానందహేతువు. ప్రణయబంధురమైన స్వాగతమిచ్చింది. యుద్ధానికి పోవడానికి అనుజ్ఞకోరాడు బాలచంద్రుడు. పతిని నిలువరించడమెలాగో ఆ పసితనము వాయని యువతికి తెలియలేదు. పోయి తనతల్లి రేఖాంబను అడిగింది.

"అమ్మా ప్రపంచమున పుట్టి అనుభవించదగినవి రెండు. ఒకటి భోగము, రెండవది కీర్తి. తొలిదాని అనుభవము కోరువారు సామాన్యులు. రెండవది శాశ్వతమైనది; ఉత్తమ జన్ములకే గాని లభింపనిది; సూర్య చంద్రాదులున్నంతవరకు వారి పేరును శాశ్వతంగా నిలిపి ఉంచేది. నీ పతి మహావీరుడు. అతనిని యుద్ధానికి పోకుండ నిలువరించావా నీకు అపయశం కలుగుతుంది. నీపతి యుద్ధమునకుపోయి విజయమందివస్తే నీవు వీరపత్నివౌతావు. తల్లి! నేను చెప్పదగినది, చెప్పవలసినది చెప్పాను. నీ మనసువచ్చినట్లుచెయ్యి" అని ఉపదేశించింది.

ఓహో! ఏమి ఉపదేశం! తన జాతికే అపార గౌరవాన్ని సంపాదించిపెట్టిన మహోపదేశం! మాంచాల మనసు మళ్లింది. ఆమెలోని వీరపత్నీత్వము తెరతొలగి బయల్పడింది. ప్రణయ సామ్రాజ్యాధిదేవతయై మహానందంతో పింపిళ్లుకూసే తన మనస్సును కఠోరమైన తన కర్తవ్య పాలన దెసకు త్రిప్పింది. తనస్వాగతంతో తానురేకెత్తించిన అనురాగాతిశయంలో, తనను తానుమరచి, యుద్ధాన్నిమరచి, కర్తవ్యాన్ని మరచి, తనకై నిమేషయగప్రతీక్ష చేస్తున్న ప్రియతముని సమీపించింది.

బాలచంద్రునికి ప్రపంచము అక్కర లేదు. మాంచాల! తన బంగరు బొమ్మ, మాంచాల కావాలి. అంతే.

మాంచాల ప్రియుని మనసు పసికట్టింది. అలాంటి ప్రణయమూర్తికి కఠోరమైన కర్తవ్యాన్ని బోధించాలి! తన కౌగిలికై చేతులుచాచే ప్రియతముని వారించి యుద్ధోన్ముఖుని చెయ్యాలి!

అత్తగారి ఆజ్ఞ జ్ఞప్తికి వచ్చింది. భోగమో, శాశ్వతకీర్తిహేతువగు కర్తవ్యపాలనమో నిర్ణయించుకొనుమన్న తల్లిమాటలు కూడా స్ఫురణకు వచ్చాయి.

ఆమె ధైర్యం సడలలేదు. సిగ్గుతెరలతొలిగించుకొని భర్తతో అన్నది: "వీరకుమారులు మీరు. మీ బంధువులు, మీ ప్రజలు యుద్ధరంగాన వీరవిహారం చేస్తున్నారు. లెండి! ఆలస్యంచేయకండి ! నాపై అనురాగంలో క్షణికమైన భోగాన్ని అభిలషించి కర్తవ్యాన్ని మరచిపోరాదని మీ ప్రియురాలి ప్రార్థన ! నన్ను క్షమించండి ! సాటిలేని మీశౌర్యం దిగంతాల పరిమళించేట్టు చేసి, విజయులై తిరిగిరండి! నాడు మీకై సంతరించి యుంచెడి ప్రణయ సుగంధిలమైన పుష్పమాలికతో శౌర్యసుందరతరమైన మీ కంఠమును అలంకరించే భాగ్యం తనకు కలిగించవలసిందిగా మీ ప్రియురాలు తొలిసారి మిమ్ము ప్రార్థిస్తూంది!"

బాలచంద్రునికి తిరిగి కనువిప్పు అయింది. అతని మోహం పటాపంచలయింది. పోయి రణరంగ మార్తాండుడై పరాక్రమించాడు. శత్రువుల్ని

చెండాడాడు. కాని దురదృష్టం – ఆ యుద్ధంలోనే అతడు మరణించాడు.

పతికొరకు విజయమాలిక లల్లుకొనుచున్న నిర్భాగ్య, మాంచాలకి పిడుగులాంటి ఈ దుర్వార్తను వినిపించారు.

మాంచాల కంట తడిపెట్టలేదు. సంతోషంతో సహగమనంచేసి అమరజీవినియై, ఆంధ్రయువతులకు ఆరాధ్యదేవత అయింది.

ఆంధ్రవీరాంగనలలో మరొక విలక్షణమైన ధీరత్వమును ప్రదర్శించి మృతజీవులైనారు :

రాగమ్మ, మహాలక్ష్మమ్మలు

పెద్దాపురం సంస్థానపు ప్రభువు వత్సవాయి రాయపరాజు క్రీ.శ. 1714 వ సంవత్సరాన చనిపోయాడు. అతనికి ఇద్దరు కుమారులు : తిమ్మరాజు, బలభద్రరాజు – పదిసంవత్సరాలు దాటని పిన్నవారు. అందువల్ల రాజకార్యధురీణ అయిన రాయపరాజుభార్య, రాగమ్మే రాజకార్యాలు చక్కబెడుతూండేది ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. హైదరాబాదు నవాబు తాబేదారు రుస్తుంఖాను – ఎప్పుడో రాగమ్మ తన శత్రువులకు సహాయం చేసిందనే కోపంతో – పెద్దాపురం వచ్చి, మిత్రునివలె నటించి, "రాజకుమారుల దర్శనం చేసుకొనిపోవటానికి వచ్చా" నని చెప్పి, వారిని తన శిబిరానికి రప్పించుకొని, హత్యచేశాడు; క్రూరుడు.

ఇక రుస్తుంఖానుని సేన పెద్దాపురంకోటమీదపడి నాశనం చేయడమేలాగూ తప్పదు. ఈ సంగతి రాగమ్మ గ్రహించింది. తత్క్షణం మహాలక్ష్మమ్మ అనే ఉత్తమ బ్రాహ్మణస్త్రీని పిలిపించింది. తనకొడుకు బిడ్డ, – ఏడుమాసాలశిశువు, రాయజగపతిని ఆమె చేతులలోపెట్టింది. "తల్లీ! నీవు మహాసాధ్వివి. ఈ కసుగందును ఈ దుర్మార్గులనుండి రక్షించి మావత్సవాయి వంశాన్ని నిలువ బెట్టగలిగిన మహాతల్లివి నీవు ఉన్నావని గంపెడాశ పెట్టుకొన్నాను. విజయనగరాధీశుడు పూసపాటి సీతారామ చంద్రరాజు భార్య ఈ బాలునికి పినతల్లి. కడుపున బెట్టుకొని కాపాడి – ఎట్లైనా. ఈ మా వంశాకురమును అక్కడికి చేర్చు. తల్లీ! మరోక జన్మలోనైనా పాదసేవచేసి నీ రుణం తీర్చుకుంటాను" అని అప్పగింతలు చేసి ఆ అభిమానవతి, ఆత్యాగశీల, ఆ రాజకార్యధురీణ, ఆ వీరవనిత – కోడండ్రతో లక్కయింట ప్రవేశించి అగ్ని ముట్టించుకొని ఆహుతి అయి పోయింది.

మహాలక్ష్మమ్మ భుజములమీద బ్రహ్మాండమైన భారంవచ్చిపడింది. కుర్రవానితో కోటదాటి పోతూ ఉండగా మహమ్మదీయ భటులు అనుమానించి అడ్డగించారు. "ఈ శిశువురాచబిడ్డకాడా?" అని ప్రశ్నించారు. "కాదు నాబిడ్డ" డని సమాధానం చెప్పింది. వారు నమ్మలేదు. ఆమెను పరీక్షించదలచుకొని "అయితే ఆ కుర్రవాని ఎంగిలి తిను" అని ఒక జామిపండు ఇచ్చారు. ఆమె బ్రాహ్మణి. ఆ బిడ్డ క్షత్రియుడు. ఆమె కులము చెడిపోతుంది. కాని ఆ మహాసాధ్వి ఈ సందేహాలను సరకు చేయలేదు. భటులు చూస్తూ ఉండగా పండును ఆ కుర్రవానినోట బెట్టి తీసి, తాను తిని వేసింది. భటులు విశ్వసించి ఆమెను వదిలివేశారు. ఆమె ఇల్లు చేరుకొన్నది. ఆలస్యం చేయకూడదు. ఆనాడే తన భర్తతోను, రాచబిడ్డతోను విజయనగరానికి బయలుదేరింది.

కాని, ఆమె దూరము పోలేదు. రాజకుమారుని ఏలాగోకోట దాటించారని ఖాను కనిపెట్టాడు. తహ తహలాడాడు. అన్ని దిశలకు భటులను పంపాడు. చేబ్రోలువద్ద మహాలక్ష్మమ్మను పట్టుకొన్నారు. రాచబిడ్డను ఖైదుచేశారు. కన్నీరు మున్నీరుగా ఏడ్చి తనబిడ్డను తనకిమ్మని గోలపెట్టింది మహాలక్ష్మమ్మ. వాళ్ళునమ్మలేదు. చివరకు "నన్నుకూడ ఖైదుచేసి నాబిడ్డకు సేవచేసికొననీయండి" అని ప్రార్థించింది. ఏ కళనున్నారో తురకలు ఒప్పుకొన్నారు. కంటికి రెప్పలా కాపాడుతూంది రాచబిడ్డను. రుస్తుంక్రూరుడు; ఏ క్షణంలో ఆ కసుగందును కత్తిపాలు చేస్తాడో!

తనభర్తచే విజయనగరం కబురంపింది. అక్కడి నుంచి సహాయంవస్తుందనే ఆశతో గడియొక గండంగా కాపాడుతోంది – ఆ నెత్తురుగుడ్డును. ఖాను భార్యను కలుసుకొని తనకు పుత్రభిక్ష పెట్టమని ప్రార్థించింది. ఆమె జాలితలచి తనభర్త రాయజగపతిని చంపకుండా అడ్డుపడి కాపాడింది.

అష్ట కష్టములు పడుతూ రోజులు గడుపుతూంది మహాలక్ష్మమ్మ. క్రమంగా నెలలుకూడా గడుస్తున్నై. విజయనగరమునుండి సహాయంరాలేదు. ఇంతలో రుస్తుంఖానును చంపి అతని కుమారుడు నూరుద్దీను హుస్సేను పెద్దాపురానికి అధిపతి అయ్యాడు. అక్కడ విజయనగరంలో సీతారామ చంద్రరాజును చంపి అతని సోదరుడు విజయరామరాజు ఆధిపత్యం వహించాడు. సీతారామచంద్రరాజు హత్యను గురించి వినగానే మహాలక్ష్మమ్మ ఆశలు నిరాశలైనాయి. నిజానికి విజయరామరాజుకు కూడా రాయజగపతిని రక్షించాలనే పట్టుదల ఉంది. కాని సహాయంమాత్రం అందలేదు మహాలక్ష్మమ్మకు.

కొంతకాలానికి నూరుద్దీను కళింగ రాజ్యంమీదకు దండెత్తి వెళ్లాడు. ఆ సమయం కనిపెట్టి విజయరామరాజు పెద్దాపురం మీదకు దండువచ్చాడు. మహాలక్ష్మమ్మ తపస్సు ఫలించింది. అతి నిపుణతతో కావలి వారికి లంచములు పెట్టి కుర్రవానిని, కోటదాటించింది. విజయనగరం చేర్చి రామరాజు చేతులలో పెట్టింది. నూరుద్దీను ఈ వార్తవిని, మండిపడుతూవచ్చి, విజయనగరమునకు పోతూన్న రామరాజును చేబ్రోలు వద్దకలుసుకొన్నాడు. ఘోరయుద్ధం జరిగింది. చివరకు నూరుద్దీను యుద్ధంలో చనిపోయాడు.

విజయరామరాజు రాయజగపతిని పెంచి తిరిగి పెద్దాపుర సంస్థానాధీశుని చేశాడు. మహాత్యాగంచేసి వత్సవాయి వంశము నిలువబెట్టిన మహాలక్ష్మమ్మకు లక్ష్మీపురం అనే అగ్రహారాన్ని ఇచ్చి సన్మానించాడు. ఆ మహాతల్లి కీర్తిని పాడుతూ నేటికి ఆ అగ్రహారం ఉన్నది.

సరిగా రాగమ్మ మహాలక్ష్మమ్మ చరిత్రలను పోలిన అసామ్య చరిత్రలు :

రాజగోపాలమ్మ, దాది మాలక్ష్మమ్మ

వీరవనితల ఉజ్జ్వల గాథలతో ఆంధ్ర చరిత్ర వెన్నెలలు కాస్తూంది.

క్రీ.శ. 17వ శతాబ్దపు మధ్యభాగంలో దక్షిణాదిని మధురలోను, తంజావూరులోను, చొక్కనాథనాయుడు, విజయరాఘవనాయుడు అనే ఇద్దరు ఆంధ్రనాయక రాజులు పాలిస్తూ ఉండేవారు. తంజావూరు ప్రభువులైన విజయరాఘవనాయనికి సర్వవిద్యా ప్రవీణ, సౌందర్యవతి అయిన కుమార్తె ఉండేది.

"మన ఉభయకుటుంబాలకు పూర్వంనుండి సంబంధాలు వస్తూనే ఉన్నాయి గనుక మీ అమ్మాయిని నాకు ఇచ్చి వివాహంచేయవలసిన దని" చొక్కనాథనాయుడు విజయరాఘవనాయనికి రాయబారం పంపాడు.

అసలు పూర్వసంబంధాలు ఉన్నమాట నిజమే గాని, చొక్కనాథనాయని పూర్వుడు, తిరుమలశౌరి అనే ప్రభువు విజయరాఘవనాయని వంశంలోని పిల్లను చేసుకొని, ఏదో ఒక చిన్నవిషయానికి కోపంవచ్చి, ఆమెను కత్తితో పొడిచి చంపాడు. నాటినుండి ఆ యిరువంగడాలకు సంబంధాలు పొసగటంలేదు.

ఈ పూర్వచరిత్రను విస్మరింపని విజయరాఘవునకు ఈ రాయబారం కోప కారణమయింది. తిరస్కరించి పంపేశాడు. ఈ అవమానానికి ఆగ్రహించి చొక్కనాథుడు తంజావూరుపై దండెత్తివచ్చి కోట ముట్టడించాడు. మధురవారిదే పైచేయి అయింది. సైనికులు కోట గోడలుదాటి లోపల ప్రవేశించారు. అంతకు పూర్వమే రాణి రాజగోపాలమ్మ తనబిడ్డతో, ఇతర బంధువర్గమువారి స్త్రీలతో ఒక చోటకూడి, మానరక్షణకై అందరకు కత్తులిచ్చి, ఒకరినొకరు పొడుచుకొని మరణింప నిర్ణయంచేసి, అందుకు అవకాశంకూడా దొరకదేమో అని తనచుట్టూ తుపాకిమందు కుండలు పేరిపించుకొని శత్రుసేన హటాత్తుగా లోపలికి చొరబడితే ఒక్కమాటుగా కుండలకు నిప్పు ముట్టంచవలసిందిగా భటులకు ఆజ్ఞ ఇచ్చింది.

ఇలా ఉండగా విజయరాఘవనాయుడు శత్రువులు కోటలో ప్రవేశించిన సంగతి తెలిపి రావలసినదిగా తన కుమారుణ్ణి రాణివాసానికి పంపాడు. ఈ వార్తవినగానే రాణి రాజగోపాలమ్మ పొడుచుకొని మరణించింది. కుండలన్నీ ప్రేలినవి. అభిమానవతులైన ఆ తెలుగు తల్లులంతా ప్రాణత్యాగం చేశారు.

తండ్రి కొడుకులు ఇద్దరు కడముట్టపోరి వీరస్వర్గం చేరారు. ఆ వంశాకురము, విజయరాఘవనాయని మనుమడొకడు మాత్రం ఉన్నాడు. అతని రక్షణభారం మరొక త్యాగశీల చేతులలో పడింది. ఆమె మరోక

మహాలక్ష్మమ్మ

మందుకుండలుప్రేలి తంజావూరి శుద్ధాంతజనము నశించడానికి పూర్వం రాణి రాజగోపాలమ్మ కోడలు తన నాలుగేండ్లబిడ్డ, చెంగమలదాసును దాది మహాలక్ష్మమ్మ చేతులలో పెట్టి ఎట్లైన రక్షించి వంశమును నిలబెట్టమని ప్రార్థించింది. అంతకు పూర్వమే కోటలోని బంగారము, ధనము ఒక రహస్యప్రదేశమున పాతిపెట్టి పదిలంచేశారు. ఆ స్థలాన్ని మహాలక్ష్మమ్మకు చూపి, పెంచి పెద్దవాణ్ణిచేసి చెంగమలదాసుకు ఆ ధనాన్ని అప్పజెప్పవలసినదిగా ప్రార్థించింది. దాది తలయూచింది. మందుప్రేలి పొగక్రమ్మింది. దాది రాజశిశువుతో కోటదాటిపోయింది. కాలినడకను ఒంటరిగా పోయిపోయి నాగపట్టణంచేరింది. అచ్చట ఒక వైశ్యప్రముఖుడు దాదికీ, చెంగమలదాసుకూ ఆశ్రయ మిచ్చాడు. దాది ఆ వైశ్య కుటుంబానికి ఎంత తలలోని నాలుకయై ప్రవర్తించినదో – పదియేండ్లు వారిరువురను అమిత గౌరవంతో పోషించాడు శ్రేష్ఠి. చెంగమలదాసు రాజకుమారోచితములైన సర్వవిద్యలు నేరిపించాడు.

ఇంతలో తంజావూరులో విజయరాఘవనాయని వద్ద మంత్రిత్వం నెరపిన నియోగిబ్రాహ్మణుడు, రాయసం వెంకన్నకు చెంగమలదాసు నాగపట్టణంలో పెరుగుతున్నాడను వార్త తెలిసి వచ్చాడు. తిరిగి చెంగమలదాసును – తంజావూరి సింహాసన మెక్కించడానికి ఒక పథకం తయారు చేశాడు. కొద్దిమందిసేననుకూర్చి దాసుతో, దాదితో, శెట్టితో బయలుదేరి, ఆనాడు దక్షిణ హిందూదేశమున పెద్దరాజ్యమైన బిజాపూరుచేరాడు. అక్కడ ఉద్యోగులనందరిని కట్టుకున్నాడు. సుల్తాను సహాయం కోరాడు. వెంటనే సుల్తాను, ఏకోజీఅనే మహారాష్ట్ర సరదారుకు నాయకత్వాన పన్నెండువేల సేనను పంపి, తంజావూరునకు దాసును ప్రభువుచేసి రమ్మన్నాడు. కొద్దిపాటియుద్ధంతోనే కోట వీరివశమైంది. చెంగమలదాసు తన తాతతండ్రుల సింహాసనమెక్కాడు. ఏకోజీకి ఇతరసైనికులకు బహుమానాలిచ్చిపంపాడు. దాది నిక్షిప్తమైయున్నధనాన్నికూడా అతనికిచూపించి, తన మాటచెల్లించుకున్నది.

చెంగమలదాసు వివేకి. ఆమె యెడల అతని కృతజ్ఞతాభావానికి మేరలేదు. ఆమె ఆజ్ఞ ప్రకారం శ్రేష్ఠిని మంత్రిపదవితో గౌరవించాడు. దాది మాలక్ష్మమ్మ ఆనందమునకు దరిదాపులులేవు.

ఆమె ప్రభుభక్తి త్యాగశీలత ఆమెను అమరజీవిని చేసినై.

ఇట్టి ధైర్యసాహసములవలననే శాశ్వత చరిత్ర యైన మూడవ ఆంధ్రరమణి బొబ్బిలి మల్లమాంబ కుమారుడు వెంకట రంగారావును రక్షించిన వెంకటలక్ష్మి.

శౌర్యలక్ష్మికి వాసస్థానములైన రాజదుర్గములలోను అంతఃపురములలోనేకాదు. సామాన్యసంసారులలో కూడ ప్రభుక్షేమానికై, ప్రజారక్షకై మహాత్యాగంచేసిన వారున్నారు. వీరిలో ప్రథమగణ్య అయినది ఒక సామాన్య తెలగ కుటుంబిని:

సంగమ్మ

విద్యానగరప్రభువు ప్రౌఢదేవరాయలు తన సరదారులతో మేటి అయిన కాటారెడ్డిని రాయచూరులో ఒక కోటకట్టించమని నియోగించాడు. రెడ్డిపోయి పనిప్రారంభించాడు. గోడలులేచినాయి. బురుజుకూడా పూర్తి అయింది. కాని వెంటనే కూలిపోయింది. మరల ప్రయత్నంచేసి పూర్తిచేశాడు. కాని మరల అదేస్థితి. ఇలా ఎన్నిసారులో బురుజుకట్టడము అది మాలమట్టుగ నేల కూలడం జరిగింది. కాటారెడ్డి విసిగిపోయాడు.

ఏమి చేయదానికి తోచక క్రుంగిపోయిన మనస్సుతో అతడు కూర్చుని ఉండగా, ఒక కూలివానికి ఒళ్ళుపొంగింది. "నేనొకశక్తిని, నాకు ఒక బాలెంతరాలిని శిశువుసహితంగా బలియిస్తేనేగాని నీ బురుజును నిలువనీయను" అని చెప్పాడు. ఈ భయంకరవార్త నలుదెసల ప్రాకిపోయింది. కాటారెడ్డికి ఏమిచేయదానికి పాలు పోవడంలేదు.

మూడుదినముల ముద్దుబిడ్డనితో పురిటిమంచములోనున్న సంగమ్మ చెవినపడింది ఈ మాట. ఆమె ఆలోచించింది. కోటకట్టుట రాజ్యరక్షణకు, ప్రజారక్షణకు, ఒక్కప్రాణము బలియైనచో అది నిరాటంకంగా జరిగి పోతుంది. లోకములో ప్రతిదినము నెందరు చచ్చుచున్నారుకారు. కడ కందరును చావవలసినవారే. ఆమె మనసులో నొకనిర్ణయముచేసుకొన్నది. బిడ్డను చేతులలోనికి తీసుకొని లేచినది.

"నాచిట్టితండ్రీ! నాలుగు ప్రొద్దుపొడుపులైన చూడని ఈ పసితనముననే నీవు ప్రభుభక్తుడవై, ప్రజారక్షకుడవై జన్మిస్తావు నాకుతెలుసు" అని ఆనందముతో ముద్దాడుతూ బురుజు పునాదుల వైపునకు నడిచిపోయింది.

పునాదులలో నెవరోస్త్రీ బిడ్డతో వచ్చిదూకింది. పనివారు చూశారు. కొందరు కాటారెడ్డివద్దకు పరుగెత్తారు. తక్కినవారు త్వరగా రాళ్ళుపేర్చి గోడకట్టారు. క్రమముగా బురుజులేచింది. పనిపూర్తి అయింది. సంగమ్మ పవిత్రజీవిత చిహ్నంగా నిలిచిఉన్నది. ప్రజలు దానికి "సంగమ్మకోట" అని నామకరణంచేశారు.

ఇంకామహిషాసురమర్దని కాళికాదేవివలె, సాత్రాజితివలె, కైకవలె, దుర్గావతి వలె చాంద్‌వలె రణరంగమున కురికి కేవలము పౌరుషముగ భావింపబడుతూన్న సేనాపతిత్వాన్నివహించి, పురుషులకు తోడైనిలచి, పురుషులను మించి, పురుషులను నిర్జించి, పురుషుల ప్రాణరక్షాదక్షయైన ఆంధ్రవీరాంగనా శిరోరత్నం :

రుద్రమ

ఈమె కాకతీయాంధ్ర సమ్రాట్టు గణపతిదేవ చక్రవర్తి కూతురు. గణపతిదేవునకు రుద్రమ్మ, గణపమ్మలను ఇరువురు కుమార్తెలు తప్ప, కుమారులు లేక పోవడమువలన చిన్ననాటినుండి వారిద్దరినీ రాజనీతి, రణనీతులతోసహా సర్వవిద్యాప్రవీణులనుచేశాడు. తన అనంతరం తన ప్రథమపుత్రి రుద్రాంబయే కాకతీయ సింహ పీఠాన్ని అధిష్ఠించాలని శాసించాడు. ఈ అభిప్రాయముతోడనే నేమో ఆమెకు తొలినుండి పురుష వేషమువేసి రుద్రమదేవుడని పిలుచుకొనుచుండెడివాడు.

క్రీ.శ.1260వ సంవత్సరాన గణపతిదేవచక్రవర్తి మరణించాడు. మంత్రిమణి, శివదేవయ్య రుద్రమ్మను ఓరుగంటి కాకతి సింహాసనమెక్కించాడు. ఆమెభర్త అంతకు పూర్వమే మరణించి యుండవచ్చును. రుద్రమ పురుషవేషముతో రుద్రదేవమహారాజు అను పేరుతో కొలువుతీర్చి, విశాలకాకతీయ సామ్రాజ్యాన్ని శాసించదమారంభించినది.

ఎందరోసామంతులు, మండలేశ్వరులు ఆ సింహాసనానికి జోహారులర్పించి, కప్పములు చెల్లించవలసి ఉంది. కాని ఆమె స్త్రీ. ఆమె మ్రోలతలవంచడానికి వారు ఇష్టపడలేదు.

దేవగిరిప్రభువు మహాదేవరాజు, దక్షిణమున పల్లవులు, చాళుక్యులు, పాండ్యులు-సామ్రాజ్యతృష్ణతో ఓరుగంటిపై దొంగచూపులు చూడడమారంభించారు. అందరూ సమయంకోసమే చూస్తున్నారు.

రుద్రమ్మ బుద్ధిశాలిని. వారిఆశలు వారిపెదిమలు దాటక పూర్వమే ఆమెగ్రహించింది. నూత్నపద్ధతులపై ఓరుగంటికోటను బాగుచేయించి, ఉక్కుకోటచేసింది. సేనను పునర్నిర్మించింది. మంత్రి శివదేవయ్య బుద్ధిబలము, సేనాని జన్నిగదేవసాహిణి భుజబలము తనకుతోడుగా ఆమె తనకోటను దేవతలెత్తివచ్చినా జయింపరాని దానినిగా చేసికొని కూర్చున్నది.

తమ పౌరుషాహంకారమున మత్తులై, రుద్రమ్మ శక్తిని గ్రహింపక అబలయను దుర్భావముతో చోళులు, పల్లవులు, పాండ్యులు, కాంచీపుర విజయగోపాలుడు, సామంత మండలేశ్వరులైన రాజేంద్రచోళుడు, పెమ్మయ, పండ్రాజు, వల్లభరాజు, కొమ్మరాజు- అందరూ కలిసి ఒక్కపెట్టున పగసాధింప బూనుకొని, తిరుగుబాటుచేశారు. రుద్రమ్మ విజృంభించింది. తన సేనానులందరకు కార్యక్రమములు నిర్ణయించి చెప్పింది.

సేనానులలో అంబయదేవమహారాజు దక్షిణ దేశమునందలి తిరుగుబాటు దారులనందరను అణచి, కొందరిని నాశనముచేసి, కొందరిని తిరిగి కాకతీయ సింహాసనమునకు దాసులనుచేసి, రాజ్య దక్షిణ భాగమందంతటా శాంతి నెలకొల్పాడు. పోతనాయుడు, మారయనాయుడు అనే సేనాపతులుపోయి కలకవల్లభుని తిరుగుబాటు నణచి, తిరిగి అతనిని మండలేశ్వరునిచేశారు. ఉత్తరదిశను కూడ శాంతిస్థాపింపబడింది.

ఇట్లు పొగరణచబడిన వీరులందరు దురభిమానులైతిరిగి రుద్రమ్మను సర్వనాశము చేయుటకు కుట్రపన్ని పోయి, దేవగిరి మహాదేవరాజును రుద్రమ పైకి పురికొల్పారు.

సమయం కనిపెట్టి, రుద్రమ్మ ఓరుగంటి, పద్మాక్షీ దేవికి పెద్ద ఉత్సవంచేయిస్తూ ఉండగా మహాదేవరాజు ఓరుగంటిపై దండెత్తివచ్చాడు. భయంకరమైన యుద్ధంజరిగింది. నాగన్న, రుద్రమనాయుడు, అనే ఇద్దరుసేనానుల సహాయంతో రుద్రమదేవి ప్రళయ రుద్రాంబయై విజృంభించింది. 15 దినములు మహాయుద్ధంచేసింది. చివరకు ఆంధ్రవీరుల ప్రతాపాగ్నిలో చేతులు కాలుచుకొని యాదవులు వెనుకమొగము పెట్టారు. రుద్రమ వారి నంతతో విడిచిపుచ్చలేదు. దేవగిరి వరకు తరిమికొట్టినది. మహాదేవరాజు బుద్ధితెచ్చుకొని ఆమెకుమ్రొక్కి, శరణువేడి, అపరాధమునకు మిక్కిలిగ ద్రవ్యాన్నిసమర్పించి, సంధిచేసుకున్నాడు.

రుద్రాంబ మహాదేవరాజు రాజ్యపు పొలిమేరలలో విజయస్తంభములు నాటించి, రుద్రమదేవమహారాజు అనేపేరుతో శాసనాలు వ్రాయించింది. శాంతియుతమైన మిగిలిన ఆమె రాజ్యకాలంలో ప్రజోపయోగార్థములైన ఎన్నోపనులుచేసి, రాజకార్యనిపుణతలోను, రణరంగవిహారములలోను ఆమె కామెయే సాటియనిపించుకొని - ఆంధ్రజాతికి గర్వకారణమైన చరిత్రను సమకూర్చి కవుల కంఠములలో శాశ్వతత్వము పొందింది.

ఇట్టి రాజకార్య నిర్వహణదక్షయని పేరెన్నికగన్న మరియొక ఆంధ్ర స్త్రీ రుద్రమ్మ చెల్లెలు? ఆమెతో పుట్టి పెరిగి విద్యావివేకములునేర్చి, ధరణికోటకురాణియైన....

గణపమ్మ

అక్క రుద్రమ ఓరుగల్లులో పరిపాలనము సాగించుచుండగా ధరణికోట బేతరాజును, పరిణయమైన గణపమ్మ, భర్తచనిపోవుటచేతను, బిడ్డలు లేకపోవుట చేతను తానే ధరణికోట ప్రభ్వీత్వమును వహించి రాజనీతి వైశారద్యానికి నిదర్శనమైన పాలనము సాగించినట్లు అనేక శాసనములలో ప్రస్తుతింపబడింది. ఆమె చేసిన దానములకు లెక్కలేదు. ఆమె ఆరువేల గ్రామములకు రాణి. రాజ్యక్షేమార్థియై ఒకసారి అరువది గ్రామములపై పన్నును తీసివేసి వారి అపారకృతజ్ఞతకు పాత్రయై పురుష మహా చక్రవర్తులలో కూడ అసామాన్యమైన రాజనీతిని ప్రకటించింది. తన భర్త బేతరాజునకును, తన తండ్రి గణపతి దేవునకును సుగతులు కలుగుటకై వారి పేర ఈశ్వరాలయములు కట్టించింది. వారి పోషణకు గ్రామాలు వ్రాసి యిచ్చినది. పతిపేర నిర్మించిన బేతేశ్వరాలయగోపురముపై స్వర్ణకలశ ప్రతిష్ఠ చేయించింది.

లెక్కలేనన్ని శాసనములు ఆమె ప్రజాహిత పాలనా నైపుణ్యమును వేనోళ్లచాటుతున్నాయి. అంతే కాదు ఆమెను "అపర పార్వతియైన ఆమె మహాత్మ్యమును ఉచిత రీతిని కీర్తించుట ఎవరి తరము?" అని ఆమెను శ్లాఘించినది ఎనమదల శాసనము.

రాజ్యపాలనా నిర్వహణములో రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శించి, ప్రజాహిత పాలనముచేసి, చరిత్ర ప్రసిద్ధయైన మరియొక ధీరాంగన:

మంగమ్మ

ఈమె రాజనీతిజ్ఞయే కాదు. పూర్వాచారోల్లంఘనము మహాపరాధంగా పరిగణింపబడి దారుణ సంఘ బహిష్కారముతో శిక్షింపబడే రోజులలో ఆమె నాటి హైందవ ప్రజచేత అతి పవిత్రకర్మగా భావింప బడుతూ ఉండిన సహగమన ఆచారాన్నే ఉల్లంఘించిన సాహసురాలు, సంస్కరణ ప్రియ.

మంగమ్మ చంద్రగిరివాసుడు లింగమనాయకుని కూతురు. మధురనాయక రాజు చొక్కనాధనాయని వివాహ మాడింది. క్రీశ.1682 వ సంవత్సరమున ఆయన చనిపోయాడు. ఆనాటి ఆచారానుసారం ఆమె సహగమనం చెయ్యాలి. ఆమె పతిభక్తిలో ఇతరులకు తీసిపోవునదికాదు. కాని సహగమనము దురాచారమని, సంఘ సంస్కర్తలు తరువాత సుమారు 200 సంవత్సరములకు గ్రహించిన విషయమును ఆమె ఆనాడే గ్రహించింది. ప్రజాభిప్రాయానికి ఎదురీదింది. చచ్చినవారితో చచ్చుట ఆమెకు మనస్కరించలేదు. ఆమె సహగమనం చేయలేదు.

చొక్కనాథుని తరువాత అతని కుమారుడు రాజై కొలది కాలానికే మరణించాడు. కోడలు సహగమనం చేయడానికి మంగమ్మ అంగీకరింపలేదు. కోడలప్పుడు గర్భవతి. ఆమెకు పూర్వాచారమును ఉల్లంఘించుట ఇష్టములేదు. సహగమనము చేయక తప్పదన్నది. కష్టముమీద ప్రసవమయ్యే వరకు ఆపగలిగింది మంగమ్మ. ఆమె కోరినట్లు మనుమడే కలిగాడు. ఆ పసికందునే సింహాసన మెక్కించింది మంగమ్మ. తాను పరిపాలనము సాగించింది.

ఔరంగజేబు సేనలు దక్షిణ హిందూ దేశమును తుడిచి పెడుతున్నాయి. మైసూరు మొదలగు పెద్ద రాజ్యాలనే లొంగదీశారు. తంజావూరు, మహారాష్ట్ర ప్రభువులు కూడా కడకులొంగి కప్పము కట్టుట కొప్పుకొన్నారు.

తానా మహాసేనతో తలపడి నాశనమగుట రాజనీతి కాదని నిర్ణయించినది మంగమ్మ. తొలుతనే సంధిచేసుకొన్నది. అంతేకాదు. ధనలోభులైన తురక సరదార్లకు మేత పెట్టి తన రాజ్యమును విస్తరింపజేసుకొన్నది. ఎన్నో యుద్ధములు తాను స్వయముగ నడిపించింది. తిరువాన్కూరు రాజుతో, తంజావూరి మహారాష్ట్ర ప్రభువుతో, మైసూరు పాలకునితో గొప్ప యుద్ధములు నడిపి ఆమె రణచాతుర్యమువలన అన్నింట తానే జయమందినది.

ఆమె చేసిన అపారదానముల గురించి, కట్టించిన దేవాలయముల గురించి, దేవాలయములకు ఆమె యిచ్చిన భూములను గురించి, ఎన్నో కథలను నేటికిని ఆ ప్రాంతములవారు చెప్పుకొంటున్నారు. ఆమె కట్టించిన సత్రములు కొన్ని నేటికిని చెక్కు చెదరక ఆమె పేరు ప్రసిద్ధములై, రామేశ్వర యాత్రికులకు ఉపయోగపడుతున్నాయి.

తమిళము ప్రధానభాషయైన రాష్ట్రానికి పాలకురాలై, ప్రజాక్షేమ కాంక్షియై, వారి కృతజ్ఞతకు పాత్రయైన ఈ ఆంధ్రరమణి ఆంధ్రభాషాభిమానము మరియొక మరువరాని విశేషము. ఆమె వ్రాయించిన శాసనములన్నీ తెలుగులోనే ఉన్నవి. ఆమె పాలనమున రాజభాషయే తెలుగట!

ఇన్ని రీతుల నామె ఆంధ్రులకు ఆదర్శప్రాయయై శాశ్వతముగ వారి కృతజ్ఞతకు పాత్రురాలైనది.

ఇట్టి ఉజ్జ్వల చారిత్ర – చాణక్య రాజనీతిని ప్రకటించి ప్రపంచ స్త్రీ చరిత్రలోనే అనుపమానమైన రాజ మంత్రాంగము నెరపిన మహా శక్తి స్వరూపిణి పలనాటి

నాయకురాలు

ఈమె చరిత్ర ప్రసిద్ధి పొందినపేరు నాగమ్మ. ఈమె చరిత్ర విచిత్రమైనది. ఈమె తల్లి దండ్రులెవరో తెలియదు. రామిరెడ్డి అనే ఒక నిరుపేద రైతు చేనుకు పోతూఉండగా దారిలో కంచెలో దొరికినదట. ఆ శిశువు దొరికిన కొలది కాలానికే అతని కొకపెద్ద ధనపుపాతు దొరికినది.

శిశువుకు నాగమ్మ అని నామకరణం చేసి, అల్లారుముద్దుగా పెంచి, పెద్దయింటి కుఱ్ఱవానికి ఇచ్చి పెళ్ళిచేశాడు రెడ్డి. తరువాత కొంత కాలానికి భర్త, పెంపుడు తండ్రి రామిరెడ్డి కూడా చనిపోవడం వల్ల ఇరువైపులనుండి వచ్చిన ఆస్తితో నాగమ్మ పలనాటి సీమలో సాటిలేని ఐశ్వర్యవంతురాలు అయినది.

ఆమె మహాశక్తి. ఆమెశక్తి ఆమెను ఊరికే కూరుచుండ నీయలేదు. పలనాటి ప్రభువు నలగామరాజు వేటకుపోయి నడివేసవి మిడి యెండలో అలసి పోయి ఉండగా ఈమె ఆ ప్రభువునకు, అతని సేనకు భోజనభాజనాలతో అపూర్వమైన ఆతిథ్యమిచ్చి, అతని కృతజ్ఞతను సంపాదించింది. ఆమె తనకు చేసిన మహోపకారానికి బ్రహ్మానందపడి నలగామరాజు ఆమెకు ఏమికావాలో కోరుకోమనగా – కొలది కాలము పలనాటి ప్రభుత్వాన్ని తనకు అప్పగించమని కోరింది. తాను పాలించిన ఆ కొలది కాలములోనే ప్రభువు ధనాగారాల నన్నింటినీ ధనంతో నింపివేసి, మరొక పర్యాయం ప్రభువు కృతజ్ఞతను సంపాదించింది. అప్పుడు మంత్రిగా పనిచేస్తున్న బ్రహ్మానాయుణ్ణి పదవినుండి తొలగింపజేసి ఆ పదవిని తానాక్రమించు కొన్నది. రాజ కార్య నిర్వహణములో సాటిలేని ప్రజ్ఞను ప్రదర్శించింది. ప్రజలామెను నాయకురాలు అని కీర్తించారు.

నలగామ రాజునకు సవతి తమ్ములు ఇద్దరున్నారు. వారిద్దరివల్ల ఎప్పటికైనా నలగామరాజుకు కీడు సంభవింపవచ్చునని వారిని చంపడానికి ప్రయత్నం చేసింది. బ్రహ్మనాయుడీ సంగతి గ్రహించి మలిదేవరాజులకు పలనాటి సీమలో కొంత రాజ్యమియ్య వలసినదిగా నలగామరాజును ప్రార్థించి, ఒప్పించి – పెద, చిన్నమలి దేవులనిద్దరిని తీసుకొనిపోయి, మాచెర్లను రాజధానిగా చేసుకొని, తాను వారి రక్షకుడుగా పరిపాలన సాగించడమారంభించాడు. నానాటికి అతని కీర్తి వైభవాల ప్రస్తుతి పెరిగిపోవడ మారంభమైనది. నాయకురాలికీ వార్తలు చేరినాయి. ఇది సహించి యూరకొనుట తనకు, తన ప్రభువునకు క్షేమము కాదనుకొన్నది.

మాచర్లను దోచుకొని రావలసిందిగా కొందరిని పంపించినది. కానీ అది లాభింపలేదు. బ్రహ్మనాయుడు గురుజాలకు వచ్చినప్పుడు అతనినే చంపింప నిశ్చయించుకొని, దారిలో పెద్దగొయ్యి త్రవ్వించి, దానిని గడ్డి గాదములతో కప్పించింది. అదికూడ లాభకారికాలేదు. చివరకు భోజనములో విషము పెట్టించినది. దైవవశాత్తు అది కూడ సఫలంకాలేదు.

నాగమ్మకు కోపం హెచ్చింది. బ్రహ్మనాయని కోడిపందానికి పురి కొల్పింది. ఓడి పోయినవాడు రాజ్యాన్ని విడిచిపోయి మండాది అడవులలో ఏడు సంవత్సరాలు ఉండాలి అని షరతు. బ్రహ్మనాయని కోడిదే పైచేయి అవడంచూచి, మాయచేసి, అతనికోడిని చంపించింది పందెపు షరతుప్రకారం బ్రహ్మనాయుడు మలి దేవులతో మాచర్లను విడిచి, కృష్ణానదిని దాటి వెళ్లిపోయాడు. ఆ మండాది అడవులలోనే మండాది అనే పెద్దపట్టణం ఒకటి కట్టించి, మరల మాచర్లలో లాగానే అక్కడా మహావైభవంతో వెలిగిపోతున్నాడు బ్రహ్మనాయుడు. నాగమ్మ వేగుల వాండ్రీసంగతి ఆమెకు చిత్ర చిత్రాలుగా వర్ణించి చెప్పారు.

మండాదిలోని మలిదేవుల పశువుల మందలను నాశనంచేసి రమ్మని కొందరు బోయవాళ్లను పంపింది. వాళ్లుపోయి కొంత చీకాకుచేసి మలిదేవుల సేనాని లంకన్నను చంపారు; కాని కడకు బ్రహ్మనాయని సేవకుడు కన్నమనాయని ధాటికి ఓర్వలేక పారిపోయి వచ్చారు.

నాగమ్మ ఇంకా ఏమిచేస్తుందో అని భయపడి బ్రహ్మనాయుడు మలి దేవాదులతో మండాది విడిచిపెట్టి శ్రీశైలంపోయి అక్కడి ప్రభువువద్ద తన పచ్చల బాకును కుదవబెట్టి ధూపాటి సీమను కౌలుకు తీసుకున్నాడు. వీరమేడపిని రాజధానిగా చేసుకొని కొన్నాళ్లు కాలక్షేపం చేశారు.

అలా నానాకష్టాలతో మలిదేవాదులు అరణ్య వాసములో ఏడు సంవత్సరాలు వెళ్లబుచ్చారు. పందెపు షరతుప్రకారం కాలం గడిచింది. కనుక తిరిగి మాచర్లను మలిదేవాదుల కిచ్చి వేయవలసిందని అలరాజు అనే వానిచేత రాయబారం పంపాడు బ్రహ్మనాయుడు. రాయబారం పొసగలేదు. విషప్రయోగం చేసి అలరాజును చంపించింది నాగమ్మ. వీరమేడపి వారికి కోపము నెత్తికెక్కింది. యుద్ధ సన్నాహాలు చేశారు. నాగమ్మ అంతకు పూర్వమే సర్వ సన్నాహములు పూర్తిచేసింది. ఇరువాగుల సేనలు కారెమపూడి అనే చోట తలపడ్డాయి. భయంకరమైన యుద్ధం సాగింది. రెండు పక్షములవారికి అపారమైన సేన నష్టమైనది. నలగామరాజు పక్షాన నరసింహరాజు మొదలగు మహావీరులు మరణించారు. రెండవ పక్షమున మలిదేవాదులు, బ్రహ్మనాయని కుమారుడు బాలచంద్రుడు మొదలగు వీరులు మరణించారు.

స్త్రీ శక్తి విజృంభించింది. నాగమ్మ స్వయంగా సేనాధిపత్యం వహించింది. స్వయముగ కత్తిబూని, గుర్రమునెక్కి యుద్ధరంగానికి ఉరికింది. వ్యూహాలపై వ్యూహాలు పన్నింది. శత్రువులను చెండాడింది. అబల మహాబలయై స్త్రీలలోకూడ ఎంతటి శక్తిమంతులు పుట్టుట కవకాశ మున్నదో ప్రపంచ చరిత్రకు తన జీవిత నిదర్శనంతో ఋజువు చేసింది.

కాని దురదృష్టముచే, దైవప్రాతి కూల్యముచే చివరకు శత్రువులకు ఖైదీగా చిక్కింది. విధి తప్పి కలిగిన ఆమె ఓటమి ఆమె అసామాన్య ప్రజ్ఞకు మచ్చ అనవచ్చునా? దీనివలన మంత్రిణిగా, యుద్ధరంగ మహాకాళిగా ఆమె ప్రదర్శించిన ధీశక్తి, శౌర్య సాహసములు కుంటుపడిన వనుట యుక్తమా?

ప్రపంచస్త్రీ చరిత్రలో నాయకురాలి వంటివారు ఎందరు కనిపిస్తున్నారు?

ఆమె ఆంధ్రపురంధ్రీ చరిత్రాకాశంలో మహోజ్జ్వలతార. ఇట్లు తమ ప్రశస్త జీవితములచే ఆంధ్రులకు స్మరణీయులైన ఇతర వీరాంగనలు ఎందరో ఉన్నారు.

కోరాడ రామకృష్ణయ్య

వారధి చూపిన వసుధ : నౌకలు -నావికులు

వారధి చూపిన వసుధ – నిజమే. ఏమంటే మనము నివసించే యీ భూమి వారధి చూపినది కాదూ మరీ – అనగా సముద్రములో నుండి బయలుపడినదే గదా. ఉపనిషత్తుల్లో చెప్పినట్లు సృష్టిక్రమాన్ని బట్టి చూచినా “ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నే రాపః– అద్భ్యః పృథివీ” అన్నట్లు ఉదకము నుండే ఈ భూమిపుట్టినట్లు తెలుస్తోంది. ఇక పురాణగాథలను బట్టిచూస్తే, ఒకప్పుడు ప్రపంచకమంతాజలమయమై ఉన్నదనీ, ఆ చీకటిలో జలమధ్యమున విష్ణుమూర్తి వటపత్ర శాయియై ఉంటాడనీ, సృష్టి సమయంలో భూమి బరువై సముద్రంలో నుంటే ఆ భూమిని పైకెత్తి ఫణిరాజు పడగలపై నిలిపినాడని ఒక గాథ కానవస్తుంది. దీన్ని బట్టి వసుధ, వారధి లో నుండియే పైకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడు భూగోళముపైనే కొంతజలభాగము కొంత భూభాగముగా ఉన్నదని మనం తెలుసుకుంటున్నాము. సముద్రములో నుండి ఏ భూభాగము ఎప్పుడెల్లా పైకి వచ్చినదో ఇప్పుడు మనం చెప్పలేము. కాని, సముద్రముల మధ్యనున్న ఆయా భూభాగములలో నివసించిన మానవుడు సముద్రముల నెట్లు దాటి ఇతర భూభాగముల నెప్పుడెల్లా తెలుసుకొనగలిగినాడు, అనేదే మనమిప్పుడు పరిశీలించవలసిన విషయం. కాబట్టి వారధి చూపిన వసుధ అంటే ఈ విధంగానే మనమిప్పుడు అర్థం చేసుకోవాలి.

ఒక్కొక్క భూభాగాన్ని చుట్టి ఉన్న వారధిని తరించడానికి మానవుడు చేసిన ప్రయత్నాలేమిటి, ఇప్పుడు మనకు తెలిసిన భూభాగాలు ఖండాలు ప్రాచీనులకు తెలుసునా, భూమినంతా ఒక్కసారి చుట్టి వచ్చుటకు ఇప్పటి ఎయిరోప్లేనుల వంటివి వెనుకటి కాలంలో లేవేమో, ఈ భూభాగాల నెప్పుడెవరెల్లా కనిపెట్టినారు – అని విచారిస్తే – రామాయణంలో పుష్పక విమానాన్ని గూర్చి వింటామేకాని, అట్టివి సామాన్య మానవుడికాలంలో ఈ కాలంలో వలె అందుబాటులో నున్నవో లేవో చెప్పలేము. కాని అతి ప్రాచీన కాలము నుండి మానవుడు సముద్రములను దాటి యితర భూభాగములను కనిపెట్టి వానితో వాణిజ్య వ్యాపారములను సలిపి, వాని నాక్రమించుటకు గూడ యత్నించినది నౌకయానము మూలముగానే యనుట నిశ్చయము. అతని ధైర్యసాహసములే ఇందాతనికి చాల తోడ్పడినవి.

తక్కిన పెక్కు సాంస్కృతిక విషయములలో వలెనే ఈ నౌకాయాన విషయములో కూడ భారతీయుల చరిత్రయే అత్యద్భుతమైనది. కాని ఇటీవలి కాలములో మనము దాన్ని మరచిపోవడము చేత, ఇతరులు కొందరు దాన్ని మరుగుపరుపయత్నించడంచేత, పోర్చ్యుగల్, స్పెయిన్, ఇంగ్లండు, మొదలగు పాశ్చాత్యదేశాల వారగు వాస్గోడి గామా, డ్రెక్ మొదలగు వారు క్రొత్త దేశాలను కనిపెట్టి భూమిచుట్టూ తిరిగి వచ్చినారన్న విషయాలను తెలుసుకొంటున్నామేగాని, ప్రాచీన కాలంనుండి నిర్వహింపబడుచున్న

భారతీయ నౌకా నిర్మాణ పద్ధతులను గూర్చిగాని, భారతీయ నావికుల సాగరోత్తర సాహస నైపుణ్య లక్షణములను గూర్చిగాని మనము గుర్తెరిగిన వారము కాలేము.

ఆయా కాలములలో స్వదేశీయులు - విదేశీయులు చేసిన రచనలను బట్టి ప్రాచీన భారతీయ శిల్పములను బట్టి నాణెములను బట్టి భారతీయ నౌకానిర్మాణ నావికా వ్యాపారముల మహత్తర చరిత్రను సమకూర్చి రచించిన మహనీయుడు రాధాకుముద్ ముఖర్జీయను వంగ దేశీయపండితుడు. హిందువుల నౌకాయాన చరిత్రను దెలుపు విషయములనేకములు ప్రాచీన హైందవ సారస్వతమున గలవని బుహలర్ పండితుడు కూడా తెలిపియున్నాడు.

భారతీయుల యీ నౌకాయాన చరిత్ర ఋగ్వేదకాలము నుండియే ప్రారంభమగుచున్నదని చెప్పవచ్చును. ఏలయనగా ఋగ్వేదమునందే, వరుణునకు నౌకలు పోవు సాగరమార్గములన్నియు దెలియు ననియు, నా కాలమున ధనాశాప్రేరితులైన వణిజులు దూరదేశములతో వాణిజ్యములకై సముద్రము నలుమూలలకు నౌకలను పంపుదురనియు, దెలుపబడియున్నది. ఇంతేకాదు, తుగ్రుడను రాజర్షి భుజ్యుడను తన కుమారుని, దూర ద్వీపములందు గల శత్రువులపై నౌకలతో దండయాత్ర పంపినపుడు, ఆ భుజ్యుని నౌకలు తుపానుచే సముద్ర మధ్యమున భగ్నముకాగా, శతారిత్రములు 'నూరు' తెడ్లు గల ఓడలలో అశ్వినీ దేవతలు వచ్చి అతనిని గాపాడినట్లు ఋగ్వేదము 1 మ 116వ సూ.లో చెప్పబడియున్నది. ఇది ఋగ్వేద కాలము నాటి కథ.

రామాయణము - కిష్కింధకాండలో సీతాన్వేషణమునకై సుగ్రీవుడు కపివరులను బంపునపుడు "సముద్రమవగాఢాంశ్చపర్వతాన్ పత్తనానిచ" అని సముద్రములోని ద్వీప పర్వత పట్టణములనెగిరే దారులను, 'భూమిశ్చకోషకారాణాం' కోషకారుల భూమిని కూడా వెతకమన్నాడు. అనగా కౌశేయములు పట్టుదారము పురుగుల నుత్పత్తిచేసే భూమిని అనగా చీనాదేశమును గూడా వెదకి రమ్మని పంపినట్లు అగపడుచున్నది. "చీనాంశుక మివ కేతోః" అని కాళిదాసు నాటికి చినాంశుకము సుప్రసిద్ధమేగదా! సప్తరాజ్యోపశోభిత మగు యవద్వీపము, సువర్ణ రూప్యక ద్వీపము కూడా రామాయణమున పేర్కొనబడినది. మహాభారతంలో ఒక చమత్కారమైన సందర్భం ఉంది. ప్రాణాపాయము నుండి తప్పించుకొనిన పాండవులు రహస్యముగా విదురుడు పంపిన జనులు కొందరు గంగానదీతీరమున నిర్మించిన ఒక ఓడలో తప్పించుకొని పారిపోయినట్లు తెలుస్తుంది. వాళ్ళు చూపించిన ఓడ

పార్థానాం దర్శయా మాస
మనోమారుతగామినీమ్,
సర్వవాత సహాం నావం
యంత్రయుక్తాం పతా నికినీమ్
శివే భాగీరథీతేరే
నరైర్విశ్రంశిభిః కృతామ్" (ఆది.)

మనోవాయు వేగంగలదట. సర్వవాత సహమైనదట- ఇంకా విశేషం ఏమంటే యన్త్రయుక్తమట కూడాను. అంటే (మోటార్ ఎక్విప్‌మెంట్) వంటి దేమైన నుండెనేమో ఆ రోజుల్లో కూడా.

అయితే మరికొంత కాలానికి బోధాయనాపస్తంబాది సూత్రకారులు బ్రాహ్మణులకు సముద్రయానాన్ని నిషేధించారు. మనువు సముద్రయానం చేసిన బ్రాహ్మణుడు శ్రాద్ధ భోజనానికి పనికిరాడన్నాడు. ఇక బౌద్ధయుగంలో జాతకకథలను బట్టి, సింహళ గాథలను బట్టి క్రీస్తుకు పూర్వము 500 సంవత్సరాల ప్రాంతంలో విజయుడను వంగ దేశపురాజ కుమారుడు దేశము నుండి బహిష్కృతుడై 700 మంది అనుచరులతో అనేక నావలలో బయలుదేరి వెళ్లి సింహళమున రాజ్యస్థాపకుడైనట్లు, ఆ కాలంలో తామ్రలిప్తి సింహళము మధ్య అనవరతము ఓడలలో రాకపోకలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. కళింగ దేశము నందలి దంతపురమునుండి బుద్ధుని దంతమును తీసికొని సింహళమునకు పోవుచున్న దంతకుమారుని ఓడలు కృష్ణా ముఖద్వారమున వజ్రాల దిన్నె యొద్ద మెట్ట ఎక్కగా, తెలుగుదేశంలోని నాగరాజొకడాతనికి స్వాగతమిచ్చి ఆదరించి మరల నోడల నెక్కించి పంపినట్లు, అమరావతీ శిల్ప చిత్రములలో నొక దానిని బట్టి తెలుస్తుంది. అప్పటి ఓడలు 300 మంది వర్తకులు తమ సామానుతో సుఖముగా ప్రయాణము చేయుటకు దగినవిగా నుండేవట. ఆ కాలమున పారసీకపు రాజధాని బాబిలానుతో వ్యాపారము జరుగుచుండెడిదని గ్రీసు ఈజిప్టు, రోం, అస్సీరియా మొదలగు యూరప్ ఆఫ్రికాలోని దేశములకు నెమళ్లు, సుగంధ ద్రవ్యములు, మణులు, ముత్యములు, కాశ్మీరశాలువులు, మస్లిన్‌లు, రవసెల్లాలు మొదలైన వస్తువలను భారతదేశము ఎగుమతి చేసి అపార ధనమును సంపాదించుటచేత సుభిక్షమై మిక్కిలి ధనవంతమైయుండెడిదని తెలుస్తుంది. ఇండియా మజ్లిన్‌లకై రోందేశపు స్త్రీలు చాల మక్కువపడేవారట. ఇండియానుంచి వచ్చు విలాసవస్తువులకై ఖర్చుపెట్టి ఏటా ఎంతో సొమ్ముకోలుపోవుచున్నదని ప్లినీ అను యాత్రికుడు చాల దుఃఖపడుచు వ్రాసినాడు.

బైబిల్ గ్రంథమును బట్టి క్రీ.పూ. 1000 సంవత్సరముల నాడే ఇండియానుండి గట్టి కలప, ఏనుగు దంతములు, సుగంధ ద్రవ్యములు, నెమళ్లు, వస్త్రములు ఈజిప్టు వర్తకులచే కొని పోవబడుచుండెడివని తెలుపబడినది. ఇవి దక్షిణదేశమునుండియే పోవుచుండెననుటకు ఆ హీబ్రూ భాషలోని అహలిం, తూకి అనునవి తమిళమునందలిఅగిల్, తోకై అను పదముల వికారముగుటయే ప్రబల నిదర్శనముగా కనబడుతుంది. దీనిని బట్టి అతిప్రాచీనకాలమునుండి భారతీయ వాణిజ్యమును నడిపిన వారిలో దక్షిణదేశమందలి ద్రావిడ జాతులందరును ప్రాముఖ్యము వహించినట్లు తెలియుచున్నది. క్రీస్తుకు పూర్వము 7వ శతాబ్ది కాలంలో చైనాకు పోయి అచ్చట లాంగ్‌గా అను వలస నేర్పరచిన హిందువులు పెక్కు ఓడలలో వచ్చినారని ఆ ఓడల ముఖముల ముందరి భాగములు పక్షులు, జంతువుల ముఖములవలె నుండెడివని చైనా దేశపురచనలను

బట్టి తెలుస్తుంది. క్రీ.త.బోధధర్మ అను దక్షిణ దేశపు రాజకుమారుడు 3000 బౌద్ధభిక్షువులతో చైనా దేశములో కాంటన్ పట్టణమును చేరినాడట మత ప్రచారము కొరకు. అక్కడి నుండి జపాన్ కూడ వెళ్లినాడని, మరియొకడు బోధిసేన అనునతడచ్చటివారికి సంస్కృతం నేర్పినాడని తెలుస్తుంది. క్రీస్తు శకారంభమున ఆంధ్రసామ్రాజ్యములోనే కంటకోసల, కూడూరు రేవుల నుండి ఆంధ్రదేశీయులు బర్మా సుమత్రా జావా కాంబోడియా మొదలగు ద్వీపములలో అధినివేశరాజ్యముల నేర్పరచు కొనుటయేగాక అక్కడ బౌద్ధ బ్రాహ్మణ మతములను హైందవ నాగరికతను చిత్రకళలను విస్తరింపజేసిరి.

ఇట్లు దక్షిణ బర్మా దేశమునకు తొలుతపోయి యాక్రమించిన తెలుగు వారచ్చట 'మన్' జాతిస్త్రీలను వివాహమాడి యొక సామ్రాజ్యమును స్థాపించుటచే, నారాజ్యపు జనులందరికి 'తెలైంగు'లను పేరు కలిగినదని బర్మా చరిత్ర కారుడగు 'పెయిర్' అను నతడు తెలుపుచున్నాడు. ఈ తలైంగు రాజ్యము సుమారు క్రీ.శ.12వ శతాబ్ది వరకు నుండెనట. కళింగ దేశమునుండి బౌద్ధభిక్షువులు మతప్రచారమున కచ్చటి కంతవరకు బోవుచునేయుండిరట. దీనిని బట్టి కృష్ణా గోదావరీ తీరములందలి తెలుగువారే క్రీస్తుకు పూర్వమున సముద్రమును దాటి దక్షిణ బర్మాలో నెలకొనిన వారని యేర్పడు చున్నది.

హిందూ దేశీములు అతి చిరకాలమునుండి అపారమైన విదేశముల వాణిజ్యములు జరుపుతున్నట్లు తెలియవచ్చుచున్నది గాని, ఆ కాలంలో నౌకా నిర్మాణము గూర్చిన గ్రంథములు విశేషముగ కానరావు. కాని ఇటీవల భోజనరపతిచే రచియింపబడినదిగా చెప్పబడు 'యుక్తి కల్పతరువు' అను గ్రంథమొకటి మాత్రము బయలుపడినది. అందు రత్న అశ్వజగ పరీక్షాది విషయములతోపాటు నౌకా నిర్మాణమును గూర్చి కూడ కొంత కానవస్తుంది. నౌకను నిర్మించడానికి ఉపయోగపడు కలప బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్ర జాతులకు జెందినదిగా విభజించి– అందు బ్రహ్మ జాతిది తేలికగను మృదువు గను, క్షత్రియ జాతిది తేలికగను దృఢముగను ఉండుటచే నిదేయే ప్రశస్తమని అగాధసముద్రములందు ప్రయాణమునకనువై సుఖసంపదల నిస్తుందని చెప్పబడింది. చెక్కల నతికించుటకు ఇనుపమేకులు వాడకూడదంటాడు. నదులపై నడచునవి సామాన్యములు– సాగరమున నడుచునవి, విశేషములు అని విభాగము చేసి వాటి పరిమాణములు వాని భేదములు పేర్లు, బంగారు, వెండి రాగితో అలంకరణము – వానికి వేసే రంగులు, వాని అగ్ర భాగములందు చెక్కవలసిన సింహ, గజ, వ్యాఘ్ర, పక్షి, భేకాకృతులు– పక్షిమందిరములు– అగ్రమందిరములు, మధ్య మందిరములను భేదములను గూర్చి తెలిపియున్నాడు. సర్వమందిరములు రాజుల ధనమును, అశ్వములను, అవరోధజనమును తీసికొని వెళ్ళుటకట – మధ్యమందిరములు వర్షాకాలమునను, రాజులు విలాసార్థముగ ప్రయాణముచేయుటకట, అగ్రమందిరము నౌకా యుద్ధములందుపయోగపడునట.

మౌర్యుల కాలములో నౌకా నిర్మాణము ప్రభుత్వముచే నడపబడునొక పెద్ద పరిశ్రమగా నుండెడిది. చంద్రగుప్తుని యుద్ధకార్యాలయంలోని ఆరు విభాగములలో నౌకాధికారవర్గము (Board of Admirality) ఒకటైయున్నట్లు కౌటిల్యుని అర్థశాస్త్రమువలన తెలుస్తుంది. అందునా వాధ్యక్ష పదవి చాలా బాధ్యతలతో గూడినదిగా కనబడుతుంది. అలెగ్జాండర్ యొక్క అపార సైన్యము దేశీయులు సమకూర్చిన రెండు మూడు వేల నావల మీదనే సింధునదిని దాటిందని చెపుతారు.

ఆంధ్రరాజుల నాణెముల మీద ముద్రితములైయుండిన రెండు కొయ్యలు గల పెద్ద ఓడలే గౌతమిపుత్ర యజ్ఞశ్రీ మొదలగు వారి కాలమున జరుగు విదేశీయ వ్యాపారము, సముద్రములపై వారికిగల యాధిపత్యమును వ్యక్తముచేయుచున్నవి. ఇటీవల మార్కోపోలో హిందూ మహాసముద్రమునంతను విహరించు నౌకల నిర్మాణాదికమును గూర్చి చెప్పుచు వాటిని దేవదారు కఱ్ఱతో కట్టేవారని, అడుగు భాగమున రెండేసి చొప్పున మేకులతో బిగించేవారని, సందులలో జనప నారదూర్చి, ఒక చెట్టు నూనె సున్నము కలిపి కీలులాగు తయారుచేసి దానిపై పూసే వారని, అవి చాలా పెద్దవిగాను విశాలముగాను ఉండేవని వాటిని నడుపుటకు రెండుమూడు వందల నావికులుండి తెరచాపలు తెడ్లు వీనితో నడుపుచు, వెంట రెండు మూడు చిన్న యోడలనేగాక, పార్శ్యములయందు పదిపండ్రెండు చిన్న నావలను వ్రేలాడగట్టి తీసుకొని పోవుచుండెడివారని, ఉపరిభాగము అనగా (డెక్)కు క్రింది అంతస్తునందు ఇరువది గదుల వరకు వర్తకుల యుపయోగము కొరకును, ఇంకను అడుగు భాగము కూడ దెబ్బతగిలినను నీరు చొరకుండ చిన్న గదులుగ చేసి చెక్కలను బిగించేవారని – వివరించి తెలిపినాడు. ఫిరోజిషా టుగ్‌లక్– 'భట్టి రాజ్యంపై దండయాత్ర సలిపినపుడు 90 వేల అశ్వసైన్యాన్ని 480 గజములజిరి సుమారు 5000 ఓడలలో సింధు నదిమీద పంపినాడట.

రాజరాజనరేంద్రుని కాలములోను, కులోత్తుంగుని కాలంలోను విదేశీ వాణిజ్యము బాగా పెంపొందింది. కుళోత్తుంగుడు చీనాచక్రవర్తి దగ్గిరకు రాయబారము పంపినట్లు, రాజేంద్రచోళుడు సింహళం మొదలగు ద్వీపాలను జయించి, లాకెడివ్, మూల్‌డివ్ ద్వీపాల వారితో నౌకాయుద్ధాలు చేసి విజయము గాంచినట్లు తెలుస్తుంది. వంగదేశ కావ్యాలు కొన్నింటిలో సముద్రవ్యాపారాన్ని గూర్చి తెలిపేవి కలవు. అందు తెలుపబడిన నౌకల పేర్లు గంగాప్రసాద్, సాగరఫేన, హంసవర, రాజవల్లభ అనునవి. ధనపతి సింహళము వెళ్లేటప్పుడు 7 నౌకలతో వెళ్లినాడట. అందు మధుక అనునది చాలా పెద్దది. అందలి గదులు బంగారంతో మలామాచేయబడినవట– తక్కిన వానిలో కొన్ని 'దుర్గావర', సింహముఖి, చంద్రపాన అని పేళ్లు గలవి. తెలుగు దేశములో మోటుపల్లి క్రీస్తు శకారంభకాలం నుండి గొప్ప రేవు పట్టణమని ప్రసిద్ధిగాంచినది. కాకతి గణపతి దేవుడచ్చటికి వచ్చు నావికుల కభయ శాసనము వ్రాయించి కొన్ని శుల్కములను తగ్గించి యచ్చటి వ్యాపారం వృద్ధి అగునట్లు చేసినాడు.

రెడ్డి రాజుల కాలంలో ఎఱ్ఱాప్రగడ మల్లారెడ్డిని గూర్చి ఇట్లు చెప్పినారు:

'బాహాదర్పమునంబ్రతీపధరణీ
పాలాలివలింద్రోలి, యు

త్సాహోదగ్రుడు మోటుపల్లి గొని
    సప్తద్వీప సద్వస్తుసం
దోహంబుల్ దనకిచ్చునెచ్చెలి
    సముద్రుంప్రీతి గావించుచున్
మహాత్మ్యంబు వహించె మల్లరథినీ
    నాథుండు గాఢోద్ధతిన్"

ఆ కాలంలోని ఆంధ్ర సాహిత్యంలో మన దృష్టిపథానికి తప్పకవచ్చేది, కుమారగిరిరెడ్డి సుగంధ భాండాగారాధ్యక్షుడు అవచితిప్పయ్య సెట్టి. అతని విదేశవ్యాపారమును వర్ణించిన శ్రీనాథుడు

"తరుణాసీర తవాయి గోవరమణా
    స్థానంబులన్ జందనా
గరుకర్పూర హిమాంబు కుంకుమ రజః
    కస్తూరికా ద్రవ్యముల్
శరధిం గప్పలి జోగులన్ విరివిగా
    సామాన్ల దెప్పించు నే
ర్పరియే వైశ్యకులోత్తముం డవచి
    తిప్పండల్పుడే యిమ్మహిన్"

ఇందులో కప్పలి– జోగులు– అని రెండు విధాల ఓడలను తెలిపినాడు.

తరువాత గోల్కొండనవాబుల కాలంలో ప్రాచీనంలో మైసోలియా అని ప్రసిద్ధి చెందిన కృష్ణా ముఖ ద్వారంలోని మచిలీబందరు మరల ప్రసిద్ధిలోకి వచ్చింది. 17వ శతాబ్దిలో వచ్చిన ఫ్రాంసు దేశయాత్రికుడు టెవెర్నియరను నాతడు బంగాళాఖాతములోనింత ప్రఖ్యాతి గల రేవులేదని, సముద్రపుదరినుండుటచే ఓడల రాకపోకలకు చాలవీలుగా నుండెడిదని, ఇచ్చటి ఓడలు చీనా మక్కా హోర్మజు పట్టణములకు మడగాస్కర్, సుమత్రా, మైనిల్లా దీవులకు బోవు చుండెడివని చెప్పినాడు. ఇతరులు కూడ దీనిని గొప్ప నౌకాశ్రయమని, వర్తక స్థానమని చెప్పినారు. గోల్కొండ నవాబులకిది పెద్ద వ్యాపార స్థానముగా నుండెడిది. వారితరదేశముల నుండి, ద్వీపముల నుండి ప్రత్యేక నౌకలలో ఏనుగులను దెచ్చుకొనుచుండెడివారట. ఒక్కొక్క ఓడలో 25 ఏనుగుల వరకు వచ్చెడివట. వెయ్యి టన్నుల బరువు గల ఓడలుండేవట వారికి. ఈ బందరు నగరములో 'మసూలా' అను ఓడలు తేలికగా నుండి చాల బరువును తీసుకొనిపోయేవి. ఒంటి తెరచాప వేసుకొని తెడ్లతో కళాసులు నడుపుచుండెడివారట. కెటమరాన్ అనుపడవలు కూడ నిచ్చట నుపయోగములో నుండేవి.

బందరు తరువాత పెద్ద నిర్మాణమున చిరకాలము నుండి ముఖ్యస్థానముగా నుండెడిది నరసాపురం. ఇక్కడ నౌకానిర్మాణమునకు దగిన మంచి కఱ్ఱ గోదావరి వరదలలో కొట్టుకొని వచ్చినది లభించేది. నిపుణులైన పనివారు ఉండే వారు. ఇచ్చట గోదావరి చాలా లోతుగా నుండుట చేత ఆకాలపు బ్రిటిషు నౌకాదళమంతా నిలవడానికి తగినంత విశాలముగా ఉండేదని మారిస్ దొరగారు వ్రాసారు. 17వ శతాబ్దిలో బ్రిటిష్ వారు కూడా వారి పెద్ద ఓడల నిచ్చటనే కట్టించుకొనేవారట. నక్షత్రములనుబట్టి ఓడలు చక్కగా నడపగలిగిన నావికులు కూడా నరసాపురంలో వుండేవారట.

గోదావరీ తీరమునందలి కోరంగి, తాళ్లరేవు గొప్ప నౌకాశ్రయములు. ఆల్బట్రస్– అను బ్రిటిషు వారి యుద్ధ నౌక ఇచ్చట మరమ్మతు చేయబడినదట. విశాఖ పట్టణం కళింగపట్టణములు నౌకా నిర్మాణమున కాశ్రయములు. సహజనౌకాశ్రయ మగుట విశాఖ పట్టణమీకాలమునందు మరలపూర్వపుటౌన్నత్యమును బొందగలుచున్నది.

క్రీ.శ.4వ శతాబ్దిలో చైనా యాత్రికుడు జావా సంపూర్ణముగా హిందూ జనులచే నిండి యున్నదని, తాను జావానుండి సింహళము అక్కడ నుండి చైనాకు బోవునపుడు బ్రాహ్మణమతస్థులగు నావికులచే నడుపబడిన ఓడలలో వెళ్ళినట్లు చెప్పినాడు. 14వ శతాబ్దిలో ప్రయర్ ఒడొరిక్ అనునాతడు గుజరాత్‌లోని రాజపుత్ర నావికులు సముద్రంలో 700 జనముగల నౌకలో ప్రయాణము చేస్తూ, వారానౌకను నడుపుటలో చూపిన నైపుణ్యమును చాల మెచ్చుకున్నాడు. సోమనాథ్ నుండి చైనాకు పోయే నౌకలను రాజపుత్ర నావికులే నడుపుతూ ఉండేవారట. ఒక్కొక ఓడ కలాసులు వందల కొలది ఉండేవారు. ఓడకు ప్రధానాధికారికి "నఖూదా" అనిపేరు. సరంగు –ఎగుమతి దిగుమతులను చూసేవాడు. ఇంకా నీళ్లు తోడేవారు లెక్కలు వ్రాసేందుకు మరికొందరు. ఈ రీతిగా వారిధిలోని ద్వీపాంతరాలతోను ఖండాంతరాలతోను వ్యాపారం చేసిన మన నౌకల యొక్క నావికుల యొక్క చరిత్ర మత్యద్భుతము.

నార్ల వెంకటేశ్వరరావు

భారతీయ శిల్పానికి మణిమకుటమైన ఆంధ్ర బౌద్ధుల కళాసృష్టి

స్వతంత్ర భారతదేశంలో కల్లా, అతి శైశవప్రాయంలో ఉన్నదైన ఈ ఆంధ్రరాష్ట్రం, సాక్షాత్తూ బుద్ధ భగవానుని పాదచిహ్నాలకు, ఈ నేల, నోచుకోకపోయినా, బౌద్ధ శిల్పం, బౌద్ధ చిత్రకళలు ముఖ్యంగా శిల్పం మహోన్నత స్థాయి నందుకొన్న దేశమై, తక్కిన భారతరాష్ట్రాల కన్నా మిన్నయై వెలసింది. ఆంధ్రులు అశోకునికి చాల పూర్వమే బౌద్ధ మతాన్ని స్వీకరించారు. ప్రొఫెసర్ కె.ఆర్.సుబ్రహ్మణ్యం, విశిష్టంగా రచించిన "ఆంధ్రలో బౌద్ధ శిథిలాలు" అన్న ప్రత్యేక వ్యాస సంపుటిలో, "ఆంధ్రుల బౌద్ధ స్వీకరణం అశోకుని పూర్వకాలం నాటిదని నిస్సందేహంగా చెప్పవచ్చును" అని నుడివారు.

ఆంధ్రులు అతి ఉద్రేక స్వభావులు, అతి శీఘ్రంగా అతి తీవ్రమైన ఉద్రేకాలకు పాల్పడుతారని ఈ నాటికి కూడా పేరు పడేఉన్నారు. వాళ్ళకు ప్రేమకల్గితే అతి ప్రేమ, ద్వేషం కల్గితే అతి ద్వేషంగా అలవి కాకుండా ఉద్ధోలగంగా ఉంటుంది. కాని మొత్తంమీద చూసుకొంటే, ఆంధ్రుడు, దయా, దాక్షిణ్యం, అపరిమిత మైత్రీస్వభావం, సహజంగా అతిథి పూజనం కలవాడు. ఒక్కొక్కప్పుడు అతి తిక్కగా, చంచలంగా కనబడ్డాకూడా, స్నేహధర్మం వాళ్ళలో ఉన్నంత మరెచ్చటా ఉండదు. అందుకనే ఏ క్రొత్త అభ్యుదయ భావమైనా, క్రొత్త నూతనాదర్శమైనా, వాళ్ళ నిట్టే అతి స్వాభావికంగా ఆకర్షిస్తుంది. అలాంటి తత్వమున్న మనుష్యులవటం చేతనే, విశ్వమానవ సౌభ్రాత్రాన్ని, జీవకారుణ్యాన్ని, విశ్వప్రేమ ఆదర్శాన్ని, మూఢాచార నిరసనాన్ని మానవుని పరమోత్కృష్ట స్వభావం ఏది ఉందో దాన్ని ప్రేరేపించే, ప్రచార ప్రబోధాలు గల బౌద్ధ ధర్మం వాళ్ళనిట్టే ఆకర్షించి, బౌద్ధునికి సుస్వాగత మిచ్చేటట్లు చేసి ఉంటుంది.

ఏమాత్రం భావుకత గలవారైనా, మధ్యయుగాల మసక చీకటులు చీల్చుకొంటూ చూపుసారిస్తే, ఆజానుబాహులు, తప్తకాంచనవర్ణులు, సుందర దీర్ఘకాయులూ అయిన పూర్వాంధ్ర పురుషులు కోటానుకోట్ల బౌద్ధ ఆరామాలకు పోయి, నవనవోన్మేష భక్తికుసుమాలతో పూజలు చేస్తున్న దృశ్యం కన్నులకు కట్టుతుంది. గోదావరి, కృష్ణ, వంశధారాది జీవస్రోతస్వినీపరివృత సస్యశ్యామల ధాత్రీతలమంతటా కొండలూ, కోనలూ, కూడ "బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి (బుద్ధుడే నాకు శరణు, ధర్మమే నాకు శరణు, సంఘమే నాకు శరణు) అన్న గీతాలాపం ప్రతిధ్వనిస్తుంటాయి. ఇది కేవలం నా భావోన్మత్తతకాదు. ఆంధ్ర దేశమంతటా విరజిమ్మబడినట్లున్న త్రింశత్రయ స్థూపాలు ఈ నా ఊహకు సాక్ష్యం పలుకుతూ నిలుస్తాయి. ఆంధ్రదేశమంతటా విస్తరించుకొని, ఉత్తరాన శాలిహుండం నుంచి దక్షిణాన చినగంజాం దాకా, తూర్పున

ఘంటశాల నుంచి పడమట గుత్తి వరకు విరజిమ్మబడ్డట్లున్న స్తూపాలన్నీ ఇదే చెప్తాయి. మిస్టర్ లాంగ్ హార్ట్స్ చెప్పినట్లు "దక్షిణాన ఉన్న మరే ఇతర దేవాలయాది శిల్ప ప్రతిష్ఠల కన్న కూడా ఈ బౌద్ధస్థలాలు అత్యధిక శిల్ప ప్రావీణ్య విశేషం గలవి."

ఈ పూర్వస్థలాలు మళ్ళీ త్రవ్వి కనుగొని మన దృష్టికి తెచ్చినందుకు, పురాతత్వ పరిశోధక ప్రథమాచార్యులనదగు సివిల్, మిలటరీ, ఉద్యోగులు, పరిశోధకులెందరికో, ముఖ్యంగా మెకంజీ, ఎల్లియట్, బర్గెస్, సూయెల్, రీ, లాంగ్ హార్ట్స్, రామచంద్రనుల వంటి వైతాళికసములైన పరిశోధకులుకెంతో అచ్చి ఉన్నాము.

ఆంధ్రలో బౌద్ధ శిధిలాలున్న స్థలాల నన్నింటిని చూశానని నేను చెప్పుకోవటం లేదు. కాని అమరావతి, నాగార్జునకొండ, జగ్గయ్యపేట, ఘంటశాల, భట్టిప్రోలులలో బౌద్ధ విశేషాలను సందర్శించే భాగ్యం మాత్రం నాకు కల్గింది. వీనిలో కూడా మొదటి రెండూ ప్రపంచ ఖ్యాతి గడించిన స్థలాలు. రెండూ కూడా దక్షిణ దేశపు నదులలో కెల్లా ద్వితీయ స్థానం ఆక్రమించే కృష్ణానదీ తీరాన గుంటూరు మండలంలోనే ఉన్నాయి. ఈనాడు అమరావతి పాడుబడిన పల్లె అయి శతాబ్దాలుగా అక్కడ విలసిల్లిన విశ్వవిద్యాలయమంటూ ఏదీ లేకపోయినా, నాగార్జున కొండ నిర్జల ప్రదేశంగా మిగిలిపోయి ఒకనాటి ప్రఖ్యాత విద్యాకేంద్రం ఏదీ ఇప్పుడు లేకపోయినా, ఆ ప్రదేశాలను దర్శించిన ఎవరికైనా ఈనాటికీ, కృష్ణానదీ స్వచ్ఛజలాల అలల తళుకులలో మిశ్రమమయి, బౌద్ధధర్మంలోని, శాంతగంభీర అనిర్వచనీయానందాలు పరిసరాల నంతటినీ నింపినట్లు స్ఫురిస్తూనే ఉంటుంది. శిల్పశాస్త్ర నిష్ణాతుడనుగాని సామాన్యుడనగుటచే సాధికారంగా చెప్పలేకపోవచ్చునేమోగాని దేశాటనంలో సర్వ భారతదేశంలోని ప్రతి పెద్ద, చిన్న పూర్వయుగ శిల్ప విశేషాలను పరికించినవాడను కాబట్టి, తత్తవాచికంగా నేను ఈ అభిప్రాయం చెప్పడానికి కూడా సాహసిస్తున్నాను. ఎన్నో శతాబ్దాల కాలగర్భంలో చివికిపోయి, విగ్రహధ్వంసకుల చేతుల్లో విరిగిపోయి, పాడుపడిపోయినా కూడా, ఈనాటికీ అమరావతి, నాగార్జున కొండలలో లభించిన శిల్పావశేషాలు సునిశిత సౌందర్య మహిమలోగాని ఆధ్యాత్మిక విలాస విశేషంలోగాని, భావగంభీర్య భంగిమలోగాని మరివేటికి తీసిపోవని మాత్రం గట్టిగా చెప్పగలను.

అమరావతికి, కేవలం ఆంధ్ర చరిత్రలోనేకాక, భారతీయ, ప్రపంచ బౌద్ధచరిత్రలో కూడా విశిష్ఠ స్థానమున్నదన్న విషయం మీరందరెరిగినదే. శాతవాహన రాజధానియైన ధాన్యకటకానికి అరమైలు మాత్రపు దూరంలో వున్న ఈ ప్రఖ్యాత నగరం, మహాయాన బౌద్ధ సిద్ధాంతానికి ఆటపట్టయిన కేంద్రం. కాని అంతకన్నా కూడా అక్కడ ఉన్న మహాస్తూపం వల్లనే ఈ పురం ఇతోధికమైన ప్రఖ్యాతిలోకి వచ్చింది. ఈ స్తూపం ఎత్తు నూరు అడుగులు. భూచక్రవ్యాసం నూట అరవై రెండు అడుగుల ఏడంగుళాలు (దీనితో పోల్చి చూచుకొంటే, భట్టి ప్రోలు స్తూపం నూట నలభై ఎనిమిది అడుగులు– ఘంటసాల, నూట ఇరవై రెండడుగులు– నాగార్జున కొండలో ముఖ్యస్తూపం నూటారు అడుగులు) "అమరావతి మూల చైత్యం క్రీ.పూ. 200 నాటిది. కొన్ని (రిలీఫ్) రాతిపలక చెక్కడాలు క్రీ.పూ. 1,2 శతాబ్దాల నాటివి. బందేకట్టు పలకలు, చుట్టూ రాతి కటకటాలు, పిట్టగోడ క్రీ.శ. రెండవ శతాబ్ది నాటివి. అధవా క్రీ.శ.250 తర్వాత నాటివి మాత్రం కావు" అని డాక్టర్ ఆనందకుమారస్వామి అభిప్రాయపడ్డారు. అమరావతి స్తూపానికి మహదాలంకారమైన ఈ గోడని గురించి జేమ్సు ఫెర్గుసన్ ఇలా అన్నారు. "చారిత్రకంగా బర్హూత్ స్తూపం చుట్టూ ఉన్న పిట్టగోడ, భారతదేశ శిథిలాలన్నిటిలోకి ప్రముఖమైన దయినప్పటికీ, శిల్ప వైదగ్ధ్యంలోగాని, వైశద్యంలో గాని అమరావతి స్తూపపు పిట్టగోడకు ఎంతమాత్రమూ దీటురాదు. నిజానికి అమరావతిలోని ఈ పిట్టగోడ, భారతదేశంలోని పూర్వ శిల్ప విశేషాలన్నిటిలోకి కూడా గొప్పదని చెప్పవచ్చును. అసలు బర్హూత్‌లోని పిట్టగోడ కిది రెండున్నర రెట్లు పొడవు వుంది. బయటి ప్రాకార వ్యాసం 195 అడుగులు. లోపలి ప్రాకార వ్యాసం 165 అడుగులు ఇదే బర్హూత్‌లో ఉన్నదానికి దాదాపు రెండు రెట్లుంది. ఈ రెండు పిట్టగోడల మధ్య, ఉత్సవ మార్గముంది. అంతకు పూర్వపు కట్టడాలలో ఈ మార్గం టోపీ పైనే ఉండేది. ప్రాకారపు గోడ బయటి ఎత్తు 14 అడుగులు. లోతట్టు ఇదే ఇంతకు రెండడుగులు తక్కువ ఉంటోంది. ఇక లోపలిగోడ ఎత్తు ఆరడుగులు మాత్రమే".

భారతీయ పూర్వ శిల్పకళా, సౌందర్య విలాసాలను బైటి ప్రపంచానికి చాటిచెప్పి, ప్రపంచ దృష్టిని ఆకర్షింపజేయుటకు బాధ్యులైనవారు ముఖ్యంగా ఈ ఫెర్గూసన్ పండితుడు. ఇ.బి.హావెల్, డాక్టర్ ఎ.కె.కుమారస్వామిగారలే!

అమరావతీ స్తూప తదితర శిల్ప విశేషాలను నేనంతగా చెప్పనక్కరలేదు. ఈ స్తూపం నమూనాను ప్లాస్టర్‌లో తయారు చేయించి మిస్టర్ పెర్సీ బ్రౌను, మద్రాసు మ్యూజియంలో నెలకొల్పి వుంచారు. కాని ఒక్క విషయం చెప్పాలనుకొంటాను. ఈ ప్రాకారం ఒక్కటే దాదాపు 17,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి అంతటా రిలీఫ్ చెక్కడాలతో నిండి ఉంది.

ఈ రిలీఫ్ చెక్కడపు చిత్రాలు కూడా, మన దౌర్భాగ్యం చేత ఇప్పటికి చాలా నష్టమయిపోయాయి. 18వ శతాబ్దంలో కర్నల్ మెకంజి అమరావతీ స్తూపాన్ని దర్శించేటప్పటికే ఎన్నో పాలరాతి చెక్కడాలు జీర్ణమయి పోయాయి. అప్పటి పాలకులు 1796లో తమ స్థావరాన్ని అమరావతికి మార్చుకొని అక్కడి పాలరాళ్ళన్నీ త్రవ్వి సున్నపుబట్టిల కెక్కించారు. అమరావతిలోని ధూళి కూడా చరిత్ర సంప్రదాయాలతో నుతికెక్కి ఉంటుంది. అలాంటి మహోత్కృష్ట శిల్పవిశేషాలున్న శిలలు సున్నానికి కూడా లేకుండాపోయాయి. తర్వాత పాపపరిహారార్థం అన్నట్లు అక్కడ అమరేశ్వరాలయం చుట్టూ కొత్త ఊరు కట్టించ ప్రయత్నించారు. ఈ ధ్వంస కాండను తప్పించుకొని కూడా చెదరుగా కొన్ని పాలరాతి చెక్కడాలు దొరికాయి. వాట్లను, లండను, పారిస్, కలకత్తా, మద్రాసు మ్యూజియములకు తరలించారు. ఇప్పుడు అసలు చోట ఏ కొద్దిరాళ్ళు మాత్రమే మిగిలి ఉన్నాయి. 125 దాకా పాలరాతి చెక్కడాలు సర్‌వాల్టర్ ఎలియట్ వల్ల లండన్ తరలించబడ్డాయి. వీట్లను అందుకనే "ఎలియట్ మార్బుల్సు" అంటారు.

ఎల్గిన్ పాలరాతితోనూ, అసిరియన్ ప్రాచీన ఫలక శిల్పాలతోనూ సరి సమానంగా పోటీపడుతూ లండన్‌లో ఒకమూల అతి ప్రశాంతమైన ఒక సందులో ప్రాచీన ప్రపంచ శిల్పకళా విశేషసర్వస్వానికి కాణాచియైన ఒక పురావస్తుశాలలో ఈ అమరావతీ శిల్పాలు, తమ లాలిత్యాన్ని,

రాజసాన్నీ, శక్తినీ, వేదనా, తైక్ష్ణ్యాన్నీ వెలివర్చుకొంటూ, నేను లండన్‌లో తిరిగినన్నాళ్లు నా కంటబడ్డాయి. ఇంగ్లీషు ఛానల్ దాటి పారిస్ నగరం చేరినప్పటికి మళ్ళీ "మ్యూజీగుయ్‌మెట్" మందిరంలో మరో మూడో నాలుగో అమరావతి పాలరాతి శిల్ప ఫలకాలు కనబడ్డాయి. ఈ మధ్య కలకత్తా ఇండియన్ మ్యూజియంలో మరో పద్నాల్గింటిని లెక్కపెట్టాను. ఇక మద్రాసు మ్యూజియంలో, అమరావతి శిల్పంలో చిత్ర శిల్ప నిధులు చిన్నా, పెద్దా అన్నీ కలుపుకొని దాదాపు మూడువందల పైచిలుకు వున్నాయని నేను వేరే చెప్పనక్కరలేదు. ఆంధ్రశిల్పుల అమూల్యరత్న సంపదలు ఇన్నిచోట్ల యిలా విరజిమ్మపడ్డాయని నాకు కొంచెం విచారం కల్గినా, వున్నచోట్ల మాత్రం ప్రతి చోటా ఇవి చాలా జాగ్రత్తగా భద్రపరుచబడుతున్నాయని, చక్కగా ప్రతిష్ఠితం చేయబడ్డాయని ఒప్పుకోక తప్పదు. ఒక్కచోట తప్ప! వాటి జన్మస్థలంలో తప్ప! రెండేళ్ళ క్రితం నేను అమరావతిని రెండవసారి సందర్శించినప్పుడు అక్కడ మిగిలిన కొద్ది పాలరాతి శిల్పఫలకాలను ఒక పాత కొట్టంలో గుట్టగా పోసి వుంచటం చూశాను. వీటిల్లో ఏ ఒక్క చిన్న రాతిముక్కైనా సరే, దాని అందం చందం చూస్తే ఒక్కొక్కటి ఒక్కొక్క రాజమందిరం కట్టి దాచి వుంచటానికి అర్హతే!

అమరావతిలోని శిల్పం అంతా ఎక్కువగా రిలీఫ్ శిల్పం. అంటే రాతిపలక మీదే ఉబ్బెత్తుగా చెక్కిన చిత్రాలు తప్ప పూర్ణవిగ్రహ రూపంలో వున్నవి తక్కువ. డాక్టర్ కుమారస్వామి చెప్పినట్లు "ఈచిత్రాలు మంచి ఉధృతంలో కదులుతూన్నట్లు, చైతన్యంతో ఒక్కొక్కప్పుడు, భక్త్యావేశాన్ని రూపిస్తూ మరొకచో, హాస్యజనకంగా వుంటూ, సర్వత్రా చికిలి మెరురంగు నగిషిపని మెరిపిస్తూ, అతి లాలసాయుతంగా వుంటాయి". చిత్రంలోని ప్రతి చిన్న అలంకరణ విశేషంకూడా అత్యాకర్షణీయంగా నిరూపించబడి, అలంకార చిత్రణంలో విశిష్టాతివిశిష్టాలు కనిపిస్తాయి. నిజానికి అమరావతి శిల్పం ఆంధ్రుల ప్రతిభా సంపత్తి నుండి ఉద్భవించిన మహోత్కృష్ట ఫలం.

"అమరావతి శిల్పాలు భారతీయ శిల్ప పరమావధిని సూచిస్తాయి" అంటూ సాధికారంగా ఫెర్గుసన్ పండితుడు అభిప్రాయం ఇచ్చాడు. హేవెల్ యిలా అన్నాడు. "అమరావతి పాలరాళ్ళ పైని రమణీయమైన చెక్కడాలలో, జంతు జీవన సౌందర్యం, అత్యద్భుత సౌందర్యాన్నొలికించే పరిసరపు నగిషీ పనితో మిళితమై సుందరాతిసుందరంగా కనబడుతుంది. అమరావతి శిల్పాలలో, మానవరూపం, చిత్ర విచిత్ర భంగిమలలో, సజీవ చైతన్యాన్ని ప్రతిబింబిస్తూ, అత్యంత నైపుణ్యంతోనూ, అతి స్వతంత్ర ప్రజ్ఞతోనూ చెక్కబడింది"అని కూడా ఆయన అన్నాడు.

విస్తృత భావ స్వాతంత్ర్యం, ప్రతి చిన్న రేఖా, వంపు, నిమ్నోన్నతాలన్నీ వేనోళ్ళ భావాన్ని చాటే ప్రజ్ఞ. ఇవి ముఖ్యంగా అమరావతీ శిల్పంలోని అపూర్వ లక్షణాలు. అంతకన్నా ముఖ్యంగా గమనించవలసింది, ఈ శిల్పం ఈ గడ్డపైన పుట్టిన దేశీయ శిల్పం. అక్కడి ప్రజలలోని అంతః శక్తి వల్ల ఉత్పన్న మయింది. అంతర్వాణి పిలుపుకు జాగృతమయి, ఒక ఆశయ సిద్ధితో హృదయార్పణ మొనర్చుకొన్నది. గాంధార, గ్రీకు, రోమన్, శిల్ప రీతులకు ఇతః పూర్వం భారతీయ శిల్పాలపై ఏ మాత్రమో ప్రభావం ఉండి ఉన్నా, క్రీ.శ. ప్రారంభ కాలం నాటికి కృష్ణాతీరాన ఈ శిల్పకళ ఉద్భవించే నాటికి వాట్ల ప్రభావం చాలా సన్నగించి పోయింది. "అమరావతీ శిల్పాలు, బారహత్, ఎల్లోరా శిల్పాలలాగే నిజానికి భారత 'దేశీయ' శిల్పశైలులుగానే గోచరిస్తాయి. మౌర్యశిల్పం, పూర్వసాంప్రదాయ విధానాలు చెడ గొట్టుకోకుండా తెచ్చుకోడానికి తడుము లాడిన కాలాన్ననుసరించి వచ్చినవిగను కొంత మౌర్యశిల్పానికి అనుయాయులవటం కూడా కల్గింది. కొన్ని కథా వస్తువులు, శిల్పాలంకార విశేషాలు, వాయువ్య దిశదైన గాంధార శిల్పాన్నుంచి సన్నగా జాలువారి దిగి రానేవచ్చాయి. కాని ఈ దేశీయ శిల్పం వాట్లను తనలో అంతర్భాగాలుగా జీర్ణింప చేసుకొంది" అని డాక్టర్ మార్షల్ చెప్పిన మాట చాల నిజమైన మాట.

నేను, ఇతరుల నుంచి ఎరువు తెచ్చుకొని, జీర్ణం చేసుకొన్న విషయం చెప్పుకోటానికి సిగ్గుపడే రకం మనిషిని కాకపోయినా, అమరావతిలోని బుద్ధుని విగ్రహం శైలిలో, బాహ్య శిల్పవిధాన ప్రభావాలు స్వల్పాతి స్వల్పమని, పురావస్తు పరిశోధక శ్రేష్ఠులే అభిప్రాయం వెలువర్చారు. "బ్రిటిష్ మ్యూజియంలో అమరావతి శిల్పాలు" అన్న గ్రంథంలో మి॥డగ్లస్ బారెట్ ఇలా వ్రాశాడు. "అమరావతి విగ్రహాలు, మధ్య కాలపువుగాని, చివరి కాలపువుగాని చూసుకొంటే, మధుర వాట్లతో పోలినవి బహు స్వల్పంగా ఉంటాయి... నిజానికి అమరావతి విగ్రహాలలోనే ఎక్కువ సహజత్వం ఉట్టిపడుతూంటుంది. ఉత్తరాది విగ్రహాలలోకన్నా వీనిలో అలౌకిక విగ్రహ దేవత్వం చాలా తక్కువ. నిజానికి తలపై ముంగురులు, ఉష్ణీషం, ప్రభాచక్రం, ఇవి ఈ శిల్ప మధ్యకాలంలో అతిగా చెక్కబడిన సన్యాసుల విగ్రహాలకు అమర్చి చూచుకో గలిగితే, అమరావతి బుద్ధుని స్వరూపం ఇట్లే గోచరిస్తుంది. ఈ భిక్షుకులకు బోడి తలలున్నాయి. భుజాలు రెంటిని కప్పిన కాషాయాంబరం అతి సహజంగా జీరాడుతుంది."

"అమరావతిలో బుద్ధుని విగ్రహం బ్రహ్మ పదార్థ ధ్యానరతుడయిన వేదాంతి స్వరూపాన్ని కాక, తక్కిన భారతీయ మతాలలో మాదిరిగానే, భక్తితత్పరుడయిన సామాన్య సన్యాసి రూపాన్ని వెలువరిస్తుంది" అని కూడా బారెట్ అంటాడు. ఒకవేళ ఆంధ్రశిల్పి, మధుర నుంచి బుద్ధుని రూపకల్పన భావాన్నే కాక కొంత చిత్రశైలిని కూడా స్వీకరించాడని మనం ఒప్పుకొన్నా, తన సృష్టిలో, ఆంధ్రజీవితాన్ని, ఆంధ్రచైతన్యాన్ని పరిసరాలను ప్రకోపింపజేసి అన్నిటినీ జీర్ణింపజేసుకున్న నూత్న శిల్ప సృష్టి ఒనర్చాడని నేను అంటాను.

కొన్ని అమరావతి శిల్పాలు ద్రష్టతో గాఢమైన భావచైతన్యం కల్గిస్తాయి. స్వవిషయమే చెప్పుకోవలసివస్తే, మద్రాసు మ్యూజియంలో భద్రపరుచబడిన, నలుగురు భక్తురాంఢ్ర శిల్పం నన్నెంతో ఉత్తేజపరిచి, నా హృదయాంతరాలనే కదిలించి వేసింది.

మద్రాసు మ్యూజియంలోని మరొక అమరావతి శిల్పం చిత్రంలోని అద్భుత ఘటనా విశేషం చేత నన్నాకర్షించింది. ఆ చిత్రంలో, మదగజం "నలగిరి"ని బుద్ధుడు లొంగదీయటం చిత్రించబడినది. కరుణాసముద్రుడయిన ఆ ప్రభువు మ్రోల ఆ ఏనుగులో కలిగిన అద్భుత పరివర్తనాన్ని ఆ శిల్పఖండం అత్యద్భుతంగా చాటి చెపుతూంటుంది.

ఆంధ్రలో తక్కిన బౌద్ధ కళాక్షేత్రాల విషయానికి మరలే లోపుగా, అమరావతి పాలరాతి శిల్పాల విషయంలో మరికొన్ని మాటలు నివేదించుకొనేందుకు అనుమతి వేడుతున్నాను. అమరావతి శిల్పాలు మొదట్లో పల్చని సున్నపు పూత, పై రంగులు వేయబడి రంగురంగులుగా

ఉండి ఉండేవి అని సర్వసామాన్యాభిప్రాయం ఒకటుంది. అదే నిజమయి ఉంటే ఈ పాలరాతి చెక్కడపు చిత్రాలు కూడా, అజంతా, బాగ్‌లలోని త్రివర్ణ చిత్రాలతో తులతూగుతూ ఉండి ఉండేవి అని మనం నమ్మకంగా చెప్పుకోవచ్చును. "అమరావతిలోని చిత్రకళా వైదగ్ధ్యం, విస్తృత సంపదలకు, ప్రపంచంలో ఎక్కడైనా ఏ మాత్రమైనా పోలిక అంటూ ఉంటే, మళ్ళీ అజంతా, బాగ్ చిత్రాలలో మాత్రమే కనబడుతుంది" అని డాక్టర్ బర్గెస్ అన్నాడు. అమరావతి స్తూప గోళం కట్టిన పాలరాళ్ళూ, చుట్టూ ఉత్సవమార్గ ప్రాకారమూ, వాటి నావరించియున్న అలంకరణ చిత్రాలూ సరిగ్గా అర్థం చేసుకోటానికి అజంతా, ఫ్రిస్కో చిత్రాలతో కూడా కలుపుకొని సమన్వయ పరచుకొని పరీక్ష చేసుకొంటేనేగాని, వాట్ల విశిష్టాలే గోచరించవు. అజంతా చిత్రకారులూ, అమరావతీ శిల్పులూ, చిత్రలేఖనం శిల్పం అన్న రెండు విడి కళలలో ప్రతిభ ప్రదర్శించిన ఒకే ఒక శిల్పులేమో అన్న నా ఊహ తొందరపాటైతే మన్నించగోర్తాను.

నాగార్జున కొండ లేక శ్రీ పర్వతం (పూర్వపు పేరు), పాలరాతి చెక్కడాలు కూడా ఇంతటి విశిష్టత కలవే. ఈ శ్రీపర్వతం నీడలో పూర్వం విజయపురి అన్న చిన్న పట్టణం ఇక్ష్వాకు వంశీయుల రాజధానిగా విలసిల్లింది. శాతవాహనుల తర్వాత ఇక్ష్వాకుల వేంగీ సామ్రాజ్యం పాలించిననాడు చుట్టూ మూడు పచ్చపచ్చని పర్వతాలు, ఒకవైపు కృష్ణా తరంగిణీ, కలిగి బహు రమణీయంగా ఉండే ఈ శ్రీ పర్వతపు కోన మహాయాన బౌద్ధమత స్థావరంగా ఉంటూ అమరావతి తర్వాత అమరావతి అంతటి మహోత్కృష్ట బౌద్ధ విద్యాకేంద్రంగా ఉండేది. ఇక్కడ పరిపాలనలు చేసిన రాజులు ఎక్కువగా హిందువులే అయినా, వాళ్ళ రాణులు ఎక్కువగా బౌద్ధాన్ని అభిమానించేవారు. నాగార్జునకొండలో దొరికిన శిలా శాసనాలను పరికిస్తే బౌద్ధాన్ని అభిమానించిన మహారాణి, ప్రప్రథమురాలు ఛాంతిశ్రీ, రెండవ రాణి అడవి ఛాంతిశ్రీ, మనకు తెలిసిన మూడవ మహారాణి అని తెలుస్తుంది. బౌద్ధాన్నభిమానించిన ఆమె పేరు భులచ్ఛాంతిశ్రీ, ఇక్ష్వాకులకు సంబంధీకురాలు కాకపోయినా, ఉపాసిక బోధిశ్రీ కూడ కషాయ వస్త్రాలు ధరించిన మహాధనికురాలని రాణి వాసపు వారికన్న మిన్న అయిన స్థితిలోనే ఉండేదని నేననుకొంటాను. ఆమె పుట్టు పూర్వోత్తరాల విషయం చాలా సందేహాలున్నాయి. ఆమె సింహళంలోని గోవా గ్రామంలో పుట్టిందని మహావంశంలో పేర్కొనబడింది. కాని ఈమె ఆంధ్రదేశంలో నాగార్జున కొండ వద్దనే కాక తదితర ప్రదేశాల బౌద్ధారామాలకు కూడా అతి విరాళంగా దానాలు, ధర్మాలు చేసిందని చెప్పటానికి సందేహంలేదు. శ్రీ కె.గోపాలచారి వ్రాసిన ఆంధ్రుల ప్రాచీన చరిత్ర ప్రకారం బోధిసిరి విజయపురి వద్ద రెండు చైత్యగ్రామాలు కట్టించడానికి సహాయపడింది. (ఒకటి విహారం ప్రక్కనున్న దిగువ ధమ్మగిరి వద్దనున్నది. సింహళ పీఠాధిపతులకు చెందినట్లుగానే కట్టబడింది. రెండవది, కులహ విహారం వద్ద కట్టించింది.) సింహళ విహారంలో బోధివృక్షానికి ప్రాకారం కట్టించింది. ధమ్మగిరిలో ఒక గది కట్టించింది. మహా విహారంలో మంటపస్తంభం కట్టించింది. దేవగిరిలో ప్రార్థనా మందిరం కట్టించింది. పునాసియల్‌లో చెరువూ, చుట్టూ వసారా, మంటపమూ కట్టించింది. కంటకశిలలో మహాచైత్యానికి ప్రాగ్ద్వారం వద్ద రాతి మంటపం కట్టించింది. హిరుణాధువలో మూడు ఆరామ గదులు, పాపిలవద్ద ఏడు గదులు, విహురవద్ద రాతి మంటపం కట్టించింది. బోధిసిరి వితరణం చవిచూసిన ఈ పేర్లున్న గ్రామాలు స్థలాలు ఏవేవో అని ఇప్పుడు మనం ఆశ్చర్య పడనవసరం లేదు. బౌద్ధ ధర్మంపట్ల ఈ మహాస్త్రీలకు ఇంతటి భక్తి ప్రపత్తులుండేవని, హృదయపూర్వకంగా తమ ధనకనక సర్వస్వాలను, విజయపురివద్ద అసంఖ్యాకులైన చైత్యాలు స్థూపాలు, విహారాలు నిర్మించటానికి వెచ్చించారనీ తెలిస్తే చాలు.

ఇక్ష్వాకుల రాజధాని అయిన ఈ విజయపురి మహావైభవంతో వెలిగిపోయి ఉండాలి. సుదూర దేశాలనుంచి, వర్తక వ్యాపారాలకు కేవలం వణిజులే కాకుండా, బౌద్ధధర్మజిజ్ఞాసులు, విద్యార్థులు, గురువులు కూడా ఎంతో మంది ఇక్కడికి వచ్చేవారు. విజయపురి ప్రపంచ ప్రఖ్యాతి విజ్ఞాన కేంద్రంగా ఇక్ష్వాకుల పూర్వకాలంలోనే పేరు గడించుకొనే ఉండి ఉండాలి. మధ్య మార్గదర్శకుడై "మాధ్యమిక" సిద్ధాంతాన్ని బౌద్ధంలో ప్రవేశ పెట్టిన నాగార్జునాచార్యుడు, మహావేదాంతి, తన చివరి రోజుల్లో చాలాకాలం శ్రీ పర్వతం వద్దనే గడిపాడని టిబెటన్ చరిత్రలున్నాయి. కాని విజయపురి చరిత్రవల్ల సమ్మోహితుడైన ముఖ్యవిషయమైన ఆంధ్రా బౌద్ధశిల్ప విషయాలను వదిలి శాఖాచంక్రమణం చేయుట నాకు తగదు.

అయితే అమరావతి పాలరాతి శిల్పాలలాగా, నాగార్జునకొండ శిల్పాలు అంత విస్తృతంగా తరలింపబడిపోలేదు. కాదంటే ఏ నాలుగో అయిదో పారిస్‌లో మ్యూజీగయ్‌మెట్‌లో భద్రపరచబడి, ఆంధ్రుల బౌద్ధ శిల్ప ప్రతిభను జగమంతటికీ చాటుతున్నాయి. నాగార్జునకొండ శిల్పాలన్నిటినీ తవ్వి వేయడం కూడా పూర్తికాలేదని చెప్పటం ఇక్కడ నేను విస్మరించరాదు. ఇంకా తవ్వితే ఇంకా ఎన్నో పురాతన శిల్పాలు, శిథిలాలు, వస్తు విశేషాలు గృహాలు అక్కడ బైలుపడే అవకాశం చాలా ఉంది. ఈ తవ్వడపు పనికూడా జరుగుతోందని కాని, పురాతత్వ పరిశోధన బుద్ధితోకాక, నాగార్జున సాగర నిర్మాణార్థమై జరుగుతోందని చెప్పటానికి విచారిస్తున్నాను. ఈ ప్రదేశం అంతా నాగార్జున సాగర్ అడుగున మునిగిపోతుంది. ఒక పవిత్ర చారిత్రక పూర్వవైభవ చిహ్న శిథిలం ఇల్లానకినమైన జలప్రణాళికలో జలాంతర్గతమై పోతుందన్నందుకు కూడా, నా మటుకు నేను పెద్దగా ఆక్రోశించను. కారణం ఈ మహానాగార్జున సాగరం, కోటాను కోట్ల ఎకరాల భూమిని పండించి కాటకంతో కుమిలిపోతూన్న దేశాన్ని సుభిక్ష మొనరింపబోతోంది. ఆ మహా బౌద్ధాచార్యులూకూడా, విశాలహృదయంతో ఈ ప్రణాళికను దీవిస్తాడనే నేను తప్పక నమ్ముతున్నాను.

నాగార్జునాచార్యుని కాలంలోనూ తర్వాత కొన్ని శతాబ్దాల వరకూ కూడా, విజయపురి ప్రపంచ విద్యార్థుల విద్యాదాహాన్ని తీర్చే విశ్వ విద్యాలయంగా నిలిచింది. "కాశ్మీర్, గాంధారా, చీన, చిలాట, తోసలి, అపరంత, వంగ, వారణాసి, యవన, పాలూర, దమిళ, తంబపణ్ణి" దేశాలనుంచి విద్యార్థులు తండోపతండాలుగా వేదాంత విద్య నేర్చుకోటానికై వచ్చేవారు. ఇక మీద, పూర్వవైభవానికి ఛాయామాత్రంగా నిలవటం కాక, దాహంతో తపిస్తున్న పరిసర క్షేత్రాలన్నిటికి జలం అందించే జలనిధిగా నిలచి అనేక గృహాలకు ఆనందం చేకూర్చిపెడుతుంది. ఈ గృహాలు ఇప్పుడు దారిద్రంతో అంధమయమై నాగరిక జీవన సౌకర్యాలు లేక కుమిలిపోతున్నాయి. నాగార్జునాచార్యుడు జీవిత ధర్మసందేశాన్ని ఇచ్చాడుగాని శ్మశాన వైరాగ్యం బోధించినవాడు కాదు. మానవ మస్తిష్కాలలోని చీకటి గుహల్లోకి వెలుగును ప్రసరింపజేసి, అజ్ఞానాన్ని, ఆవేదనని పారద్రోలటమే

అతని ఆశయం. కాబట్టి, దుర్భర దారిద్ర్యమూ కోరుకొన్నదికాక నెత్తిపై రుద్దిన దారిద్ర్యం, జీవితాలను చేరపట్టిస్తుందనీ, సామాన్య జీవిత విజ్ఞానాన్నే అందచేయలేనప్పుడు ఒక ఆత్మవికాసాన్నే అసలు అందచేయలేదని చెప్పే వారిలో నాగార్జునాచార్యుడే ముందు ఉండి తీరుతాడు. అందుకని తప్పకుండా, ఈ కోన, సాగరంగా మారి, జీవనదాతగా మారుతుందంటే, అతని ప్రబోధానికి సాంప్రదాయానికీ అనుగుణంగా ఉన్న మహత్కార్యమే అని అతని ఆత్మ సంతోషించి తీరుతుందనీ ఏ మాత్రం విచారించదనీ నేను భావిస్తున్నాను.

ఇంతటితో ఈ విషయం వదిలేద్దాం. కాక నేను చెప్పవలసిందేమిటంటే నాగార్జుకొండ త్రవ్వకంలో బైలుపడిన శిల్పవిశేషాలను, ఎక్కడో ఒకచోట జాతీయసంపదగా మాత్రం భద్రపరుచబడతాయని :

ఈ మధ్య భారత ప్రభుత్వం పంపిన ఒక కమిటీ వారు, శ్రీ పర్వత శిఖరమే ఇల్లాంటి మందిరానికి బాగుంటుందని నిర్ణయించినట్లు వార్త తెలుస్తోంది. నాగార్జున కొండ అడుగునా ప్రక్కలా అంతటా ఏర్పడబోయే నాగార్జున సాగరంలో మునిగిపోయినా, పర్వతాగ్రం మాత్రం నీటి మట్టానికి చాలా పై వుంటుందట. నాకు కూడా ఈ అభిప్రాయం బాగుంది. ఇలాగే చేస్తారని ఆశిస్తున్నాను. కాక ఒకవేళ ఇతర అడ్డంకులు వేటివల్లనైనా ఇది వీలుగాకపోతే, మరో కొత్త స్థలం నిర్దేశించినా ఫరవాలేదు. ఎందుకంటే అదే మళ్ళీ ఇంకొక నాగార్జునకొండగానే వెలుస్తుంది. కారణం నాగార్జునుని కీర్తిప్రతిష్ఠలు, ధర్మ సందేశం, అంతగా అక్కడి శిథిలాల ప్రతి చిన్నరాతిముక్కలోనూ, చెక్కడం విశేషంలోనూ అలుముకొని పోయివున్నాయి.

నేను క్రిందటిసారి అక్కడికి వెళ్ళినప్పుడు, నాగార్జున కొండ శిల్పాలలోని ఒక చిత్రం నన్ను యెంత గాఢంగా ఆకర్షించిందంటారు! ఆ చిత్రంలో కపిలవస్తు రాజమందిరంలో దుఃఖతరంగం పొర్లుతూన్న దృశ్యం కనబడుతుంది. రాకుమారుడు సిద్ధార్థుడు అన్వేషియై మహాభినిష్క్రమణమొనర్చాడు. సారథియైన ఛన్నుడీవార్తను మందిరంలో వినిపించాడు– శుద్ధోదన మహారాజు క్రుంగిపోయి తల వాల్చుకొని సింహాసనంపై దాదాపు మూర్ఛపోయిన స్థితిలో ఉన్నాడు. ఛన్నుడు శోకమూర్తియై అతని పాదాలవద్ద మోకరిల్లి ఉన్నాడు. రాజపరిచారకుల మొగాలు విషాదాక్రాంతలై వివిధ భావాల ప్రతిబింబిస్తూ అతి నిపుణంగ చెక్కబడ్డాయి. అన్నిటినీ మించిన చిత్రవిశేషం రాజకుమారుని దిగివిడిచి వచ్చిన అశ్వరాజం కంటకము కంట నీరెట్టి వాపోతుంటుంది. ఒక నిముషమాత్రంసేపు, ఆ రాయి రాయే కన్నీటితో కరిగిపోతుందా అన్న విభ్రమావస్థలో పడిపోయాను నేను. నాగార్జున కొండ శిల్ప ప్రభావం అంతటిది. కంటకం వస్తు సమీకరణ మాత్రం కాని చిత్ర విశేష సంపద, బుడిబుడి శోకాల్నిగాక గాఢ వేదనను ప్రేరేపించే సుమనస్కత, చేతిశాస్త్రపు చిలుక పలుకులుకాక, జీవితార్థ ప్రబోధ కలిగి ఈ శిల్పం అతి విశిష్టశ్రేణికి చెందుతుంది. అక్కడ మిగిలిన చిన్నరాతి బొమ్మ ముక్క కూడా ఉత్తేజిత శక్తిగలదని, చేతివ్రేళ్ళు మాత్రమే మిగిలిన ఒక రాతిబొమ్మ ముక్కను చూసి నేను గ్రహించాను. అది చూడగానే బుద్ధ విగ్రహంలోని భద్రఖండం అని నాకనిపించింది. ధర్మచక్రాన్ని సాగించిన ఆ చేతివ్రేళ్ళ మార్దవం, చక్కదనం, శక్తి, చైతన్యాలను, గుర్తింపలేని వాళ్ళెవరుంటారు?

అమరావతి– నాగార్జునకొండ శిల్పాలు, ఆంధ్రదేశంలో బౌద్ధశిల్పానికి రెండు మహోన్నత శిఖరాలవటం చేతనే ఇంత విరివిగా వాట్లను గురించి చెప్పుకొచ్చాను. ఇంతకన్న తక్కువ ప్రముఖ్యంగలవైన గోలి, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, ఘంటశాల, గుంటుపల్లి, గరికపాడు, శాలిహుండం, రామతీర్థం ఇత్యాది స్థలాలోని శిథిలాలు కూడా వాటి పద్ధతిని అవి కొన్ని ప్రత్యేకతలు కలవే. వీటిల్లో కొన్ని స్తూపాలు నాగార్జునకొండ, అమరావతిల కన్న కూడా ప్రాచీనమైనవే. కాని విదేశ ప్రభుత్వోద్యోగుల కళాధ్వంసక స్వభావాల వల్లనూ, స్వార్థ పరత్వాల వల్లనూ ఈ చోటులలో యెక్కువగా శిల్ప విశేషాలు మిగలలేదు. కాని మిగిలిన కొద్ది రాళ్ళమీది చిత్రాలు కొన్ని కూడా, అమరావతి– నాగార్జునకొండ శిల్ప స్వర్ణయుగానికి ప్రాతిపదికలుగానే స్ఫురిస్తాయి. జగ్గయ్యపేటలో పూర్తి శిథిలావస్థలో ఉన్న స్తూప కుడ్య చిత్రశకలాలు కూడా, సౌందర్యఖనులుగానే ఉంటాయి. ఈ మధ్య నేనీ ప్రదేశానికి వెళ్ళాను. బొమ్మలన్నీ ముక్కలు ముక్కలై వున్నాయి. మిగిలిన ఒక బుద్ధ విగ్రహం మద్రాసు మ్యూజియంలో వుంది. ఇది నిజంగా ప్రత్యేక విశేషమే. కేవలం పాడయిపోకుండా మిగిలిందనే కాదు. తక్కిన శిల్పరీతులకు ఈ విగ్రహ శిల్పానికి కాలంలోనూ, శైలిలోనూ కూడా చాలా అంతరం కనబడుతుది. విగ్రహం దిగువ పద్మంలో ఒక శాసనం చెక్కి వుంది. ఈ అక్షరాలు ఆరవ శతాబ్దం నాటి అక్షరాలు. **శాసన సారాంశం :** యీ విగ్రహం నాగార్జునాచార్యుని శిష్యుడైన జయప్రభాచార్యుల ఆధ్వర్యంలో నిర్మింపబడిందని. అమరావతి స్తూప ప్రథమ దశాకాలం క్రీ.పూ. 200 నాటికి వెళ్తుంది. తక్కిన శిల్పాలు కూడా ఆ కాలానికే చెందుతాయి. ఇది చాలా తర్వాత కాలం నాటిదని నిర్ణయింపబడింది.

జగ్గయ్యపేట పాలరాతి శిల్పాలలో కల్లా అతి ముఖ్యమైనది, ఒక చక్రవర్తిని చూపించే చెక్కడపు చిత్రం. చక్రవర్తి చుట్టూ రాణి, యువరాజు, మంత్రి, పట్టపుటేనుగు, గుర్రం, చక్రం, అన్న సప్తరత్నాలూ చెక్కబడి ఉంటాయి. ఈ లాంఛనాలు ఇతన్ని మహారాజాధిరాజుగా, చక్రవర్తిగా ప్రకటిస్తాయి. ఈ బొమ్మలో గమనించదగ్గ విషయాలు; చక్రవర్తి మీద నలుచదరపు నాణాలు ఆకాశం నుంచి జల్లబడుతూంటాయి. మానవుల అలంకారాలు వాళ్ళ సుదీర్ఘ స్వరూపాలుగూడా, మరుగుజ్జ రూపాన్ని చెక్కే గాంధారశిల్ప రీతికి చాలా వ్యత్యాసంగా ఉంటాయి. ఈ మార్పే మానవస్వరూపాన్ని అమరావతి శిల్పాలలో అతి అందమైన దేశాంగాలతో తీర్చి దిద్దేందుకు మూలకమయిందనవచ్చు. జగ్గయ్యపేటలో దొరికిన మరొక శిథిల విశేషం పుణ్యశాల. ఒక రెండంతస్తుల ఆరామ స్వరూపం చెక్కబడి ఉంది.

గుంటూరు జిల్లా, రేపల్లె తాలూకాలోని భట్టిప్రోలు గ్రామం నా చిన్ననాడెప్పుడో చూచాను. అందుచేత అక్కడి స్తూపవిషయాలు నాకంతగా జ్ఞాపకంలేవు. కాని కృష్ణాజిల్లా పురావస్తు పరిశోధన సాగించిన అలెగ్జాండరీ గారి వాక్యాలు ఉటంకిస్తాను. "1820 నాటికి భట్టిప్రోలు స్తూపం ఇటుకలు, పాలరాళ్ళు అన్నీ కూడా కొల్లగొట్టేశారు. ఇటుకలు పెద్దసైజున చాలా మంచివై ఉండటం చేత రోడ్ల నిర్మాణంకు వినియోగించారు. పాలరాళ్ళు కృష్ణ కాల్వకు లాకులు కట్టు అందులో వాడుకొన్నారు. అయితే ఈ రాళ్ళ మీద ఏమన్నా చెక్కడాలుండేవా అని కొంత సందేహం

లేకపోలేదు. దీనికన్నా, భట్టిప్రోలు ముందు సందర్శించిన రాబర్టు సూవెల్ వీట్ల మీద చెక్కడాలున్నాయనే అభిప్రాయపడ్డాడు. 1878లో మద్రాసు ప్రభుత్వానికి పంపిన నివేదికలో ఈయన ఇలా తెల్పాడు. "అవి నిజంగా చెక్కడాలున్న రాళ్ళే అన్న విషయం వెల్లటూరు లాకు గోడలలోను, నేల చప్టాకు విరివిగా వాడిన ఆ పాలరాళ్ళను బట్టి తెలుస్తుంది. కొన్నిటిమీద అమరావతి పద్ధతిలో బొమ్మలో చెక్కినట్లున్నాయి. కాని అంత అందపు చెక్కడాలు కావు" నేను కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తాను. గుంటూరు జిల్లాలో పల్నాడులో దొరికే పాలరాయినే ఈ స్థూపంలో విరివిగా వాడారు. ఈ రాయి సహజంగా అందంగాని, నునుపుగాని, వర్ణవైవిధ్యంగాని కలది కాదు. బండగా మొద్దుగా ఉంటుంది. ఈనాడు సిమెంటు పరిశ్రమలో దీన్ని వాడుతున్నారు. ఇలాంటి బండరాయిలో జీవంపోసి, సుందరాతి సుందరంగా మలచి, ప్రజాబాహుళ్యానికి అమర సందేశం అందించిన ఆంధ్రశిల్పుల హస్తకౌశల మెంతదో! ఇంత బండరాయి కనకనే శిల్ప విశేషానికి తప్ప, శిల్పి చేతిలో మలచబడి బొమ్మ చెక్కబడి ఉంటే తప్ప, ఈ పల్నాటి రాతిని, భట్టిప్రోలులో గాని, తదితర స్థూపాలలోగాని స్థూప నిర్మాణంలో వాడిఉండరని, అధమం, ఏ స్వల్ప శిల్ప విశేషమో, పద్మమో, ధర్మచక్రమో, పడగ విప్పిన పామో, బోధి లేక శ్రీపాదవృక్షమో లేకుండా ఉండి ఉండదని నా నమ్మకం. ఏదైతేనేం భట్టిప్రోలులో స్థూపం ఘంటశాల, నాగార్జునకొండల వాటి మాదిరిగా కాక గట్టి ఇటుక రాళ్ళతో కట్టబడినదైనప్పటికీ, ఈనాడు పూర్తిగా అందుబాటు లేకుండా శిథిలమయి పోయింది.

గుడివాడ బౌద్ధ స్థూపానికి కూడా సరిగ్గా ఇదే గతి పట్టినట్టు తోస్తుంది. "బెజవాడ బందరు మధ్య రాజబాట వెయ్యటానికి 1840లో ఒక యిటుకల గుట్ట నేలమట్ట మొనర్చబడింది"ఈ కళా ధ్వంసకత్వాన్ని నిందిస్తూ రీ యిల్లా వ్రాశాడు. "ఈ కట్టడాలన్నీ కూడా రోడ్లు వెయ్యటానికి తదితర నిత్యనిర్మాణాల కోసమని ధ్వంసం చెయ్యబడటం బహుశోచనీయం. ఒక ప్రాచీన నాగరికతకు మహోత్కృష్ట చిహ్నాలైనప్పటికీ కూడా వాటి ప్రాచీనత వాటిని రక్షించలేకపోయింది. ఈ పరిస్థితులలో ధ్వంసకుల చేతిలో పడక మిగిలిన శిథిలాలనే పోగుచేసుకొని కూర్చుకొన ప్రయత్నించవలసి వచ్చింది. చాలా చోట్ల వట్టి గుట్టల్లా కనబడుతున్న ఈ శిథిలాలనుంచే ఆనాటి బౌద్ధశిల్ప వైదగ్ధ్యాన్ని మించిన రీతులు, ఆ తర్వాత కాలంలో ఎప్పుడూ కూడా భారతదేశ శిల్ప చరిత్రలోనే కనబడలేదని తెలుసుకోగలిగాము. తర్వాత వచ్చిన ద్రవిడ దేవాలయ శిల్పాలలోవలె కాక, బౌద్ధ ఆలయాలు మహోన్నత శిల్పపు చెక్కడాలు కలిగి ఉండటమేకాక ఆ ఆలయ నిర్మాణమే మహోత్కృష్ట శిల్ప సూత్రాలపై నిర్మితమై ఉండేది."

ఇక్కడ ఇంతగా 'రీ' గారి నుంచి ఉటంకించటానికి ఒక్కటే కారణం ఉంది. "దక్షిణాత్య బౌద్ధ శిల్పాలు కృష్ణా (ఇప్పటి గుంటూరు కూడా) జిల్లాలోని భట్టిప్రోలు, ఘంటశాల, గుడివాడ మొదలైన పురాతన స్థూపాలు" అన్న పేరుతో 1894లో రీ ప్రచురించిన నివేదిక ఈనాడు ఎక్కడా దొరికేటట్టులేదు. నాకు మాత్రం అదృష్టవశాత్తూ ఒక ప్రతి ఈ మధ్యనే పూనాలో లభించింది. ఇల్లాంటి ఉద్గ్రంథ భాగాలను విస్తృతంగా ఉటంకించాలన్న కుతూహలాన్ని అణుచుకోవటం కొంత కష్టమైనా, ఈ కొద్ది విషయాలు మాత్రమే చెప్పి వదిలేస్తాను. భట్టిప్రోలు వద్ద బౌద్ధ పవిత్రాస్థికలున్న రెండు పాత్రలను రీ సంపాదించగలిగాడు. గుడివాడ దిబ్బ నుంచి, ఒక గుట్ట ప్రశస్తమైన ప్రాచీన నాణాలు సంపాదించగలిగాడు. అక్కడ దొరికిన వాట్లలో ఒక విచిత్రమైన నాణెం కూడా ఉంది. "ఒకటి గ్రీచుదో, రోమ్‌దో, తెడ్లపడవ, పైతట్టు అర్ధచంద్రాకారంగా ఉండి రెండు తెరచాప కొయ్యలున్న పడవ బొమ్మ ఉన్న నాణెం" దొరికింది. ఇలాంటి వాట్లను త్రవ్వితీసి వెలవర్చిన 'రీ' గారు మన కృతజ్ఞతాభివందనముల కెంతయూ పాత్రుడు. ఘంటశాలలో పాలరాతి బొమ్మలను తవ్వితీశే అవకాశం వీరికి కల్గనందుకు విచారించవలసిందే. అది ఎట్లా జరిగిందోకూడా ముందు చెప్తాను.

భట్టిప్రోలు, గుడివాడలలో శిల్ప విశిష్టత లేమన్నా ఉండిఉన్నాయా అన్నది సందేహాస్పదమైన విషయమే అయినా ఘంటశాల విషయంలో ఈ అనుమానం అక్కరలేదు. ఘంటశాల మచిలీపట్టణానికి పడమరగా పదహారుమైళ్ళ దూరంలో ఉన్న గ్రామం. కొద్ది ఏళ్ళక్రితం నేనీ ఊరు వచ్చినప్పుడు, స్థూప ప్రాకారంలో రాళ్ళు ఇంకా కొన్ని నిలిచి ఉన్నవి చూశాను. వాట్లమీద సునిశితంగా చెక్కిన ధర్మచక్ర చిత్రాలున్నాయి. ఘంటశాల అసలు పేరు కంటకశైలమని చెప్తారు. నిజానికి 'టోలెమి' కూడా దీన్ని 'కొంటోకొస్సిల' అని పేర్కొన్నాడు. బుద్ధదేవుని అశ్వరాజమైన "కంటకం" పేర ఇది కట్టబడిందని అనుకొంటున్నారు. కంటక చిత్రం ఉన్న కుడ్యశిల్ప భాగం, ఘంటశాల నుంచి తెచ్చినది మద్రాసు మ్యూజియంలో భద్రపరుచబడి ఉంది. ఘంటశాల శిలలు మరికొన్ని పారిస్‌లో మ్యూజీగయ్‌మెట్‌లో వున్నాయి. 1954లో నేను పారిస్ వెళ్ళినప్పుడు ఈ శిథిలాలు చూశాను. ఒక పాలరాతి చెక్కడలంలో మూడంతస్థుల మందిరమూ భక్తులూ చెక్కబడ్డారు. మరొక చెక్కడంలో పుత్రజనన వార్తవిని ఆనంద పరవశుడైన శుద్ధోదనుడు చిత్రించబడ్డాడు. మూడవ దానిలో భార్యపుత్రులను విడనాడి బైలుదేరటానికి నిశ్చయించుకొన్న సిద్ధార్థుని బొమ్మ చెక్కి వుంది.

బ్రిటిష్ మ్యూజియం ప్రాచ్యవస్తుశాఖ అసిస్టెంటు కీపర్ అయిన డగ్లస్ బారెట్‌గారి అభిప్రాయం ప్రకారం, ఘంటశాల శిల్పాలలో కల్లా ముఖ్యమైన చెక్కడం బోస్టన్‌లో ఉంది. ఆ రాతిపలకకు రెండువైపులా చిత్రాలు చెక్కి వున్నాయి. "ఒక వైపున అమరావతి రాళ్ళలో మాదిరిదైన ఒక స్థూపం సంపూర్ణ చిత్రం చెక్కబడి ఉంది. రెండవ వైపు, నిరంజన నదీతీరాన బుద్ధుని విగ్రహం చెక్కబడి ఉంది. ఎడమ మూలపైగా స్తంభం ముక్క కనబడుతుంది." రెండు వైపుల చెక్కబడి వుండటమే ఈ శిల ప్రాముఖ్యమూ, నాకు తెలియదు. కాని ఘంటశాల వద్ద స్థూపం చాలా పెద్దదై ఉండటమే కాకుండా, ఆంధ్రలో కెల్లా చాలా ప్రముఖమైనదని కూడా నేను నమ్ముతున్నాను. ఘంటశాల శిల్పరీతులు అమరావతీ శిల్పరీతితో తులతూగుతూ ఉంటవి. ఘంటశాలలో దొరికిన బుద్ధ విగ్రహం శిరస్సు, కొన్ని విధాలలో చూస్తే అమరావతీ నాగార్జునకొండ విగ్రహాల కన్నా చాలా శిల్ప విశిష్టత కలదని నా అభిప్రాయము. ఈ ముఖంలో ఎక్కువ ప్రశాంతత ఎక్కువ గాంభీర్యం ద్యోతక మౌతున్నాయి. పెదవుల చిరునవ్వు, రేయి తొలిజామున ఆకాశంలో మిలమిలలాడూ నిశీథాన్ని మరింత రమణీయంగా తోపింపచేసే, నెలవంక రూపంలో వుంటుంది.

ఘంటశాల శిల్పాలు మనకు శాశ్వతంగా కాకుండా పోవటం చాలా విషాదకరమైన విషయం. ఈ పల్లెలో 1890లో పరిశోధన సాగించిన రీ, ముఖ్యస్తూపం పైననే తన దృష్టిని కేంద్రీకరించాడు. ఈ పాడుబడిన దిబ్బనే స్థానికులు 'లంజదిబ్బ' అని పిలుస్తారు. ఒక్క ఘంటశాలలోనే కాదు గుడివాడ, భట్టిప్రోలు, చినగంజాం, మరికొన్ని స్థలాల్లోకూడా, ఈ శిథిల ప్రదేశాలను లంజదిబ్బలనీ, భోగమాళ్ళ దిబ్బలనీ పిలవటం శోచనీయమైన విషయమే. ఇలా పిలువబడనిది నా ఎరుకలో ఒక్క అమరావతి స్తూపం మాత్రమే.

స్థానికంగా దానికి దీపాలదిబ్బని పేరుంది. కాని ఈ దీపాల సందర్భం కూడా గౌరవనీయంగా వచ్చినట్లు కనిపించదు. బౌద్ధ స్థలాల దిబ్బ లెక్కడెక్కడున్నాయో అక్కడి దిబ్బమీద లంజె దీపంతో సంజ్ఞ చేసేదని కథ చెప్పుకొంటారు. చివరి దశలో బౌద్ధ అనుయాయులు ఎంత హీన స్థితిలోకి దిగజారారో! వజ్రమాన సహజమాన కాలాలలో తాంత్రిక మతాలతో బౌద్ధం దిగజారుటచే ఈ పేరు వచ్చినదని అనుకోవచ్చు. లేదా హైందవమత తీవ్రవాదులు బౌద్ధారామాలను అణగద్రొక్కటంతో ఈ చెడ్డపేరులు కల్పించైనా వుండవచ్చును. నేను ఈ రెండవ అభిప్రాయాన్ని నమ్ముతున్నాను.

కాని అసలు విషయం వదిలి వెళ్తున్నట్టున్నాను. అంటే ఘంటశాల వద్ద, రీ త్రవ్వితీసిన పురావస్తువుల విషయం. ముఖ్య స్థూపం యొక్క వైశాల్యం ఆయన్నాకర్షించింది. అందులోనే ఎక్కువ పరిశోధనలు కావించాడు. అందులో పాలరాతి చెక్కడాలు దొరకలేదు. ఆస్థినిక్షేపపాత్ర స్థూప పునాదులు మాత్రం బైటపడ్డాయి. అసలిందులో పాలరాతి శిల్పాలు ఉండి ఉండకపోవచ్చును. నిజానికి ఘంటశాల శిల్పాలన్నీ, కోటదిబ్బలో వున్నాయి. రీ ఇది కూడా ఉల్లేఖించే వుంటాడు. ఇదేకాక పొలిమేర దిబ్బ అనే మూడవ దిబ్బ కూడా ఆ ప్రక్కలనే వుంది. కోట దిబ్బ విషయం రీ ఇలా వ్రాశాడు. దక్షిణాన ఊరిపొలిమేర సమీపంలో ఒక చిన్న చెరువుగట్టు నానుకొని ఒక చిన్న దిబ్బ ఉంది. ఇటు నుంచి అటు 70 అడుగుల వ్యాసం వుండి దాదాపు గుండ్రంగా వుంటుంది. ఇటుక రాతి పునాది గోడలు అక్కడక్కడ కనబడతాయి. రబ్బేసంతటా అలముకొని వుంది. ఇది కూడా ఒక స్థూప శిథిలం అయి వుండవచ్చును.

రీ గారు ఒక పెద్ద పరిశోధన చెయ్యగల అస్కారాన్ని ఇక్కడ చెయిజార్చుకున్నారు. తర్వాత 1920లో ఒక రైతు పొలం దున్నుకొంటూ, ఈ కోట దిబ్బ అంచున దున్నుతూంటే దాదాపు 60 శిల్పశిలలు బైటపడ్డాయి. ప్రతి ఒక్కటి శాక్యముని జీవితాన్నో, జాతకకథలనో వర్ణించే చెక్కడపు పనితో నిండి ఉంది. ఆ ఊరి పెద్దలు కొందరు నాకు చెప్పిన కథ ప్రకారం, కొన్నాళ్ళు ఈ రాతి ఫలకాలు గుట్టగా ఒక చెట్టు క్రింద పడేసి వుంచారట. పుదుచ్చేరి నుంచి యం.జి.జోలియస్‌డూ బ్రెయిల్ గారి ఏజెంటు ఒకడు వచ్చి చూచి గప్‌చిప్‌గా ఈ రాళ్ళ మొత్తం అంతా 5000 రూపాయలకు కొనుక్కుపోయాడు. ఈ విధంగా ఘంటశాల శిల్పనిధులు శాశ్వతంగా మన చెయ్యిజారిపోయి పారిస్ మ్యూజిగుయ్‌మెట్ చేరాయి.

ఆంధ్రలో తక్కిన బౌద్ధస్థలాలను సందర్శించనందువల్ల వాట్లను గురించి స్వంత అభిప్రాయాలను వెల్లడించలేను. అయితే ఈ మధ్యనే శాలిహుండం వద్ద మళ్ళీ త్రవ్వకపు పరిశోధనలు సాగిస్తున్నారనీ, వంశధార దక్షిణపు ఒడ్డున శ్రీకాకుళంలో కూడా పురాశిథిల పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పవలసి ఉంటుంది. ఇక్కడ కొన్ని ముఖ్యమైన వస్తువులు దొరికాయని క్రొత్త క్రొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయనీ కూడా తెలిసింది. అనేక స్థలాలలో మట్టి దిబ్బల అడుగున మాటుపడిపోయి ఆంధ్రలో కాషాయవస్త్రం కలాధేయమై వెలసిన నాటి శిల్ప విశేషాలు శిథిల వస్తువులు మగ్గిపోయి వున్నాయనే, నేను విశ్వసిస్తున్నాను.

నేను జన్మచే గాని, సిద్ధాంత స్వీకృతివల్లగాని బౌద్ధుడను కాను. కాని ఆంధ్రలోని బౌద్ధ శిల్ప కళావిశేషాన్ని చూచి, దేశకాల పాత్రాలకు చివరికి ఆ మతానికి కూడా సంకుచితంకాని, నైసర్గిక భారతీయ శిల్పకళా విశేషానికి, వైదగ్ధ్యానికి గర్వపడుతున్నాను. ఒక్క భారతదేశానికే కాక సర్వ ప్రపంచానికి కూడా, ఇది ప్రాచీన దత్తమయిన మహా నిక్షేపమని ఒప్పుకోక తప్పదు. ఈ కళ, జాతి, దేశ, కాల పాత్ర అవధులను అతిక్రమించి విస్తరించింది. క్రైస్తవ శకోదయ కాలంలో కృష్ణానదీ తీరాన ఉద్భవించిన ఈ మహాశిల్పకళ 2000 ఏళ్ళ క్రిందట ఆసియా ఖండంనంతనూ విమోహిత మొనర్చి ఉర్రూతలూగించినట్లుగానే ఈనాటికీ మనని ఆకర్షించి, తన ప్రభావంలో మనలను ముంచెత్తుతుంది.

అమరావతి కేంద్రంగా, ఈ జ్యోతిర్మాల దూరదూరాలకు తన వెలుగును ప్రసరింపచేసింది. సముద్రాలను తరించి, సౌత్ ఈస్ట్ ఏషియా శిల్పులపై తన ప్రభావం ప్రకటించింది. డాక్టర్ రెజినాల్డు లీమే రచించిన "ఆగ్నేయ ఆసియా సంస్కృతి" అన్న గ్రంథంలో ఇలా వ్రాయబడి ఉంది. "అమరావతి శిల్ప ప్రభావం, సింహళం, మధ్య దక్షిణాసియాలలో విస్తరించి దక్షిణాన సుమత్రా వరకూ కూడా వ్యాపించింది.

ఈ మధ్య వెలువడిన "భారతీయ కళా శిల్పం" అన్న గ్రంథంలో కూడా మిస్టర్ బెంజమిన్ రౌలండు ఈ అమరావతీ శిల్ప ప్రభావాన్నే వర్ణించాడు. "ఆంధ్ర సామ్రాజ్య ప్రభావం సాంస్కృతిక, వాణిజ్య, మత, సంబంధ బాంధవ్యాల వల్ల, చాలా విస్తృత భూఖండంలో వ్యాపించింది. అమరావతి శిల్పరీతి సింహళంలో వ్యాపించటమే కాకుండా, రెండు మూడు శతాబ్దాలనాటి బుద్ధవిగ్రహాల ఆంధ్ర శిల్పశైలి, చంపా (నేటి ఇండోచైనా)లో డోంగ్ దువాంగ్, సెలిబీస్‌లోని పెంపగా వరకూ కూడా విస్తరించుకొని వచ్చింది. ఈ డోంగ్ దువాంగ్ మండలానికి కూడా అమరావతి పేరుండటము కేవలం కాకతాళీయమే అంటారా?

నిజానికి అమరావతి, నాగార్జునకొండ, సాంస్కృతిక యుగం భారతీయ కళలో ఒక స్వర్ణయుగం. దాని ప్రభ, ఏ ఒక్క కుడ్య శిల్ప శకలం మిగిలి ఉన్నా అది కుల, మత, వర్ణ విచక్షణలు, దురాగతాలు, క్రౌర్యాలు లేక, ద్వేష సంఘర్షణల కతీతమైన ఒక పరమాదర్శయుతమైన సంఘ నిర్మాణానికి మనను ప్రేరేపిస్తూ, ప్రబోధకంగా మిగిలి ఉంటుంది.

(బుద్ధ జయంతి మహోత్సవ సంచికలోని ఆంగ్ల వ్యాసానికి తెలుగు అనువాదం)

వేలూరి శివరామశాస్త్రి

కట్టడాలు

భరతఖండంలో తూరుపునుండి పడమటివరకూ, ఉత్తరమునుండి దక్షిణము వరకూ ఉన్న కట్టడాలలో అక్కడక్కడా సౌందర్యం కొద్దిగానూ, గొప్పగానూ వెదజల్లినట్లు కనబడుతూఉంది. ఇవి సంఖ్యలో తక్కువే అయినా గుణంలో మాత్రం ఎక్కువే.

ఆరిపోని ఏరులూ, ఎత్తయిన కొండలూ దివ్య శిల్పానికి నిలయాలు. వానిలో అందం ఎక్కడ ఉందో అది కనిపెట్టి ఆతావున శిల్పాన్ని పొందుపరచడమనేది చాలా విశేషం.

వైదిక వాఙ్మయంలో గ్రామాలూ–నగరాలూ, ఉద్యానాలూ–అరణ్యాలూ, ఇండ్లూ–వాకిండ్లూ కనబడతై. ఆసియా ఖండంలోగాని, భరతవర్షంలోగాని మనిషి ఎప్పుడు ఇల్లుకట్టాడో ఎవరూ చెప్పలేరు. మనిషి ఎప్పుడు పుట్టాడో చెప్పడం ఎలాటిదో ఎప్పుడు కట్టాడో చెప్పడం కూడా అలాటిదే. దానికి చేసే ప్రయత్నం కాకదంతపరీక్ష. "అగ్న్యాధానంకోసరం ప్రాగ్వంశం అనే శాల కృత్తికలలో కట్టవలెను; ఇప్పుడివిగో కృత్తికలు! కృత్తికలే తూర్పునుండి జాఱిపోవు. మిగిలినవన్నీ జాఱిపోవును" అని శతపథ బ్రాహ్మణంలో (2–1–2) ఉన్నది. లెక్కవేసి చూస్తే ఆకాలం నేటికి 4846 ఏండ్ల కీవలకాదు. కాబట్టి సంసారం అనాది అనేమాట ఈ విషయంలో కూడా ఇంచుమించు నిజం.

ఎవడయినా ఒక అడవిలో కాపురం చేయదలచు కొంటే ముందు అడవిజంతువుల బాధా, అటుతరువాత దొంగల బాధా కలుగకుండా చూచుకుని ఇల్లుకట్టుకుంటాడు. అటువంటి యిండ్లు మన్యాలలో కానవస్తవి. అటుతరువాతగాని గాలికీ, నీటికీ అనుకూల్యం ఆలోచించడు. తురుష్కదండయాత్రలకూ, మరాటీదండులకూ భయపడుతూవున్న గ్రామాలు బళ్లారి మొదలయిన జిల్లాలో చూస్తాము.

డబ్బులేనివాళ్ల యిళ్లు ఎంతసేపూ వాళ్ళ వాళ్ల ఉపయోగానికి మాత్రమే కట్టబడతై. ఆ యిండ్లలో బొమ్మలూ, ముగ్గులూ మొదలైన శిల్పాలుండవని కాదు. శిల్ప ప్రధానంగా ఆ యిండ్లు ఉండవు. మరి ఉపయోగ ప్రధానంగా ఉంటవి. కొంచెం స్థితిపరుల యిండ్లు కూడా అంతేకాని వారివారి ధనధాన్యాలకూ, బంటుబైదకూ ఉపయోగింపగల వైశాల్యమూ, గాలివీలూ, నీటి వసతీ ఈ మొదలగువానిని చూపెట్టుకొని అవి వుంటవి. ఇక జమీందారులూ, మొఖాసాదారులూ, ధనికులూ కట్టిన యిండ్లలో కొంతకొంత శిల్పం నేటికి కనబడుతుంది.

క్రీస్తువెనుక రెండో మూడో శతాబ్దులు మొదలు కొని నేటివరకూ ఈ గడ్డమీద అడుగుపెట్టిన యవనులూ, పల్లవులూ, వలందులూ, బుడతకీచులూ, పరాసులూ, ఇస్లామీయులూ, బ్రిటిషువారూ ఈ మొదలయినవారి ధర్మాన పోయినదిపోగా మిగిలిన భారత శిల్పమూ, వాండ్లశిల్పమూ

తిలతండులన్యాయంగా కనబడుతుంది. ఇప్పుడు అక్కడక్కడ పడిపోయిన సామంతరాజుల కోటలూ, మహారాజుల దుర్గాలూ, మహంజోదరో హరప్పాపూడికలూ ఈ మొదలయిన వానివల్ల కొంత కొంత ప్రాచీనశిల్పం తెలియవస్తూంది.

తొమ్మిది రకాల కోటలు :

సార్వభౌముడూ, మహారాజూ, నరేంద్రుడూ, పాంచికుడూ, పట్టధరుడూ, మండలేశుడూ, పట్టభాజుడూ, ప్రాహారకుడూ, అస్త్రగ్రాహుడూ అని రాజులు తొమ్మిది విధాలు. ఈ తొమ్మండుగురు రాజుల ఉనికికీ అనువగునట్లు కట్టే కోటలకు ఒకటి మొదలుచేసి ఏడువరకూ ప్రాకారాలు ఉండవలెను. ఆయాయా రాజుల అధికారోపయోగాలననుసరించి యీ ప్రాకార కల్పన. ఈ ప్రాకారాంతర్భాగాలలో కొన్నిటికి అంతర్మండలమనీ, అంతనిహారమనీ, మధ్యమహారమనీ, ప్రాకారమనీ, మహామర్యాద అనీ ఈ రీతిగా ఇంకా కొన్ని పేళ్లు. ఈ మండలాలకన్నిటికీ కట్టే గోపురాలకు, లేక సింహద్వారాలకు ద్వారశోభ అనీ, ద్వారశాల అనీ, ద్వారప్రసాదమనీ, ద్వారహర్మ్యమనీ, మహాగోపురమనీ పేళ్లు (ద్వారశోభ నేటికీ కనబడుతూ వుంది).

కోటల నిర్మాణం :

పై కోటలూ, మండలాలూ, శాలలూ, నిలువులూ ఇవన్నీ ఆయా తరగతికి చెందిన రాచవారికి సంబంధించినవి. స్థలనిర్వచనమూ, స్థలశుద్ధీ చేసికొన్నాక నడుమ బ్రహ్మపీఠమున్నూ, దాని మీద ప్రధాన రాజగృహమున్నూ కట్టాలి. దానికి నాలుగువయిపులా రాణివాసపు కట్టడాలున్నూ, ఆపై మండలంలో రాజకుమారులూ, రాజపురోహితులూ, మంత్రులూ ఉండదగిన మేడలున్నూ కట్టాలి. దానితరువాత మండలంలో రాజపరిషత్తూ, తత్సభ్యులూ, పనిబాగులవాండ్లూ ఉండటానికి ఇండ్లు కట్టాలి. నాలుగవ మండలంలో యుద్ధ కార్యాదులను నిర్వహించడానికి తగిన మేడలుండాలి. ఇవికాక వంటయిండ్లు, భోజనశాలలు, దుస్తులు మార్చుకునే యిండ్లు, కేళాకూళులు, తోటలు, పొదరిండ్లు, అవుతుఖానాలు, దావాఖానాలు, రంగమండపాలు, ఆస్థాన మండపాలు, పడకటిండ్లు ఇత్యాదులు వీలును బట్టి కట్టుకోవాలి.

జంతువుల కేర్పాటు :

సింహద్వారం దాపల పులులు మొదలయిన జంతువులకునూ, అంగజాలెలు ఉండేచోట నెమళ్లకున్నూ, దానిపక్కన మేకలకున్నూ, సత్యకప్రకోష్ఠంలో కోతులకున్నూ, సోమప్రకోష్ఠంలో, అనగా ఉత్తరం నుంచి ఈశానకోణంవరకూ ఉన్న స్థలంలో గుర్రాల కున్నూ, దక్షిణమునుంచి ఆగ్నేయకోణంవరకూ ఉన్న స్థలంలో ఏనుగులకున్నూ (నేటికిన్నీ మిగిలిఉన్న శ్రీ కృష్ణదేవరాయల గజశాల ఈరీతిగా ఉందో లేదో నాకు తెలియదు), అక్కడినుండి నైరృతి కోణం వరకూ కోళ్లకున్నూ, వాయుకోణం మొదలుకొని ముఖ్య ప్రకోష్ఠాంతంవరకూ ఉన్న ప్రదేశంలో లేళ్లకున్నూ, మిగిలిన పశువులకున్నూ ఏర్పాటు చేయడం మంచిది.

కృత్రిమ యుద్ధశాల :

కృత్రిమ యుద్ధం జరపడానికి ద్వారం పక్క పెద్ద మంచె కట్టాలి (భాగవతంలో దశమస్కంధం 42,43 అధ్యాయాలు చూచేది). ద్వారానికి దాదాపుగా అందరకూ కనబడేటట్టు మధ్యస్థానం ఉండాలి. ప్రాకారానికి దవ్వుగా భృశ, లేక అంతరిక్ష ప్రకోష్ఠంలో చెరసాలలు కట్టాలి. బహిర్మండలానికి దూరంగా రుద్రభూమి ఉండాలి. అక్కడ శీతలాదేవి, శ్మశానకాళి మొదలయిన దేవతలకు ఆలయాలు కట్టాలి. క్రీస్తు వెనుక రెండో శతాబ్దిలో ఉన్న విట్రూవియస్ అనే ఇటలీ శిల్పాచార్యుడు గ్రామనగర బహిర్భాగంలో సిరిస్‌కు చర్చి కట్టమన్నాడు. దానికీ దీనికి పోలిక గమనించేది. ఈ విషయమంతా మానసారం 40వ అధ్యాయంలోది.

తెలుగు దేశంలోని కోటలు :

తెలుగుదేశంలో పాతకోటలు చాలా చాలా కనబడతాయి. ఉదా: నూజివీడు సంస్థానం పద్దెనిమిది పరగణాలలోనూ, గురజ జమీలోనూ, వెంకటగిరి యిలాకా ప్రదేశాలలోనూ, వాసిరెడ్డివారి రాజ్యంలోనూ పాడు పడిన కోటలు ఎన్నో. పాడుపడిన ఈ కోటల చరిత్రే ఆంధ్రదేశ చరిత్ర అని చెప్పవచ్చు. ఈ కోటలకు చుట్టూ ఒక ప్రహరీ గోడ ఉంటుంది. కొన్నింటికి నాలుగుమూలలా బురుజులు కనబడతై. నాచూచినవానిలో పాలవంచ మొదలయిన విట్టివి. సూరారమూ, కోటపాడూ మొదలయిన వానికి ఉన్నవో లేవో నిర్ధాఅణ చేయలేం. కోటపక్క పేట వుంటుంది. పేట అనగా శాఖానగరమని అనుకుంటాను. కోటలో మంచినీళ్లకు బావి ఉంటుంది. కోటకు దాపుగానో, దవ్వుగానో పెద్ద చెరువు. అందులోంచి కోటలోని బావికి గుప్తమైన తూము. కోటలో కత్తులబావిగాని, బావులుగాని ఉంటవి. గర్తారుడి మసీదూ, బోగందాని దిబ్బా, ఏదో ఒక దేవాళయమూ (బౌద్ధవిహారమో, సమాధో కొన్నిచోట్ల) ఉండడం మామూలు.

గొల్లభామ రహస్యభంగం :

ఇంతంత కోటలు ఎల్లా లొంగిపోయాయి అని ఆశ్చర్యపోతాం. తురకలు ఎన్నాళ్లు ముట్టడిచేసినా ఈ కోటలు లొంగిపోలేదట. ఒకనాడు వాళ్లకు చల్ల అమ్ముకుని ఆదారిని ఇంటికిపోయే గొల్లది కనబడ్డది. ఆపళంగా వాళ్ళదాన్ని పట్టుకునేసరికి అది వాళ్లకు దాసూళ్లూ దణ్ణాలూ పెట్టి, నన్నువిడిస్తే కోట పట్టుకునే ఉపాయం చెబుతానన్నది. వాండ్లు సరే ననగా ఆ గొల్లది తూముదగ్గరకు వాళ్లను తీసుకుపోయి ఆకో అలమో

వేసింది. అది గిర్రున తిరుగుతూ కోటదారిని బడిపోయి మునిగింది. అప్పుడు వాళ్లు విషం తెచ్చి అక్కడ కలపగా ఆనీరు తాగి కోటలోవాళ్లందరూ చచ్చారట. ఈ కథ ప్రతికోటదగ్గరా వింటాము.

తెలంగానాలో చిన్న చిన్న కోటలన్నిటికీ ఒక ప్రాకారమే కనబడుతుంది. ఏకశిలానగరమూ అంతే (చూ: క్రీడాభిరామము). అద్దంకి, చందవోలు, కొండవీడు మొదలయినవానినన్నిటినీ సమగ్రంగా పరిశీలిస్తేనే కానీ ఈ కోటలన్నీ అర్థశాస్త్రవిభాగానికే చెందుతవో, లేక మానసారం ప్రాకారమే ఉన్నవో, లేక మత్స్యాది పురాణాల ప్రాకారమే ఉన్నాయో, మరి మయ శిల్పమూ, కామికాగమమూ వీనిలో చేరుతవో, లేక స్వయంసృష్టో నిర్ణయించలేము. వీనిసంగతే ఇంత అయోమయంగా వుంటే సాతవాహనుని కోటల మాట?

విహారాలు :

నగరానికి అట్టే దూరంగాగాని, దాపుగా గాని ఉండకూడదు. ఇందువల్ల ఉపయోగమేమిటయ్యా అంటే కావలసివచ్చినప్పుడు నగరంలోవారికిన్నీ, విహారంలోవారికిన్నీ రాకపోకలకు వీలు. నగరంలోని ధ్వని అందాకా రాదు. నిర్మానుష్యంగా ఉన్నప్పటికీ జంతుబాధకుగాని, చోరబాధకుగాని నగరం నుండి వెంటనే సాయం వస్తుంది.

ఆశ్రమాలు :

బౌద్ధుల ఆశ్రమాలలో పడకటిల్లు, గురాలసాల, గోపురశాల, నేలమాళిగె (హఠయోగులుకూడా ఇటువంటి భూగృహాన్ని కట్టించుకుంటారు. వేసవిలో ధ్యానానికి), ఉపాసనామందిరము, భోజనాగారము, ద్రవ్యాగారము, భ్రమణాగారము, విపణి, ఉచ్చకక్షము, మహాసనము, ఉష్ణగృహము, పురీషగృహము, కూపగృహము, శీతోష్ణస్నానాలకు యంత్రగృహము, పుష్కరిణి, మండలం మొదలయినవి ఉన్నవి. దీని వివరాలు మహావగ్గం (3–5–9)లో చూచేది.

ఇండ్లు :

నడిమిరకం డబ్బుకలవారి యిండ్లను గురించి శిల్పశాస్త్రానికి సంబంధించిన వాస్తుశాస్త్రము, వాస్తుప్రబంధము, శిల్పశాస్త్రసారసంగ్రహము మొదలయిన చిన్న చిన్న పుస్తకాలేకాక పురాణాలూ, ఆగమాలూ వివరించినవి. వీనినన్నిటిని పర్యాలోచనచేసి చూస్తే సంపన్న గృహస్థుల యిండ్లకు ఐదు మొదలుకొని పదహారు కక్ష్యలు ఉన్నట్లు చెప్పవచ్చును. 1.ఈశాన్యంగా దేవగృహం, 2.తూరుపు– సర్వవస్తుగృహం, 3.స్నానగృహం, 4.చల్లగది. ఆగ్నేయంగా, 5.వంటయిల్లు. దక్షిణాన, 6.వృతసగృహం, 7. శైలగృహం, 8.పురీషగృహం, నైరృతిదిక్కున 9.శాస్త్రగృహం, (2) పడమట, 10. చదువుల గది, 11. భోజనాలగది, 12. ఏడుపులగది, వాయవ్యాన, 13. ధాన్యపుకొట్టు, 14. పడకటిల్లు, 15. ధనాగారం, 16. మందులగది.

కొన్నికొన్ని గ్రంథాలలో దిగ్భేదంచేత కక్ష్యాభేదం కనిపిస్తుంది.

మత్స్యపురాణం తొమ్మిది కక్ష్యలు చెబుతుంది. వాయువ్యంగా కర్మశాల అంటూ ఒక కొత్తగదికి అమరిక ఉంది. 256 అధ్యాయం చూచేది.

పట్నాలలో స్థలసంకోచం ఉంటుంది. కాబట్టి ఏకసాల, ద్విసాల, త్రిసాల, చతుస్సాలలనే కట్టడాలను అగ్నిపురాణం చెబుతుంది. 106 అధ్యాయం చూడవలెను.

ఊరు :

అసలు ఊరు ఎక్కడ కట్టాలి? అది ఎలా కడితే బావుంటుంది?

చిన్నప్పుడు చదువుకొన్న సుమతి శతకంలో–

క. అప్పిచ్చువాఁడు వైద్యుఁడు
ఎప్పుడు నెడతెగకపాఱు నేఱును ద్విజుఁడన్
జొప్పడిన యూర నుండుము
చొప్పడఁబోకున్న యూర నుండకు సుమతీ.

అని ఉంది. ఈ పద్యానికి చాణక్యుని అర్థశాస్త్రం మూలం. ఆ మూలంలో ఒక రాజుమాట ఎక్కువ ఉన్నది. బహుశా రక్షణకోసం ఈ యేర్పాటనితోస్తుంది.

ఏఱుపక్క ఊరుండాలి అని నియమం పెట్టుకుంటే మన భరతఖండపు తొమ్మిదిలక్షల ఊళ్లల్లో ఎన్ని ఊరేగుతవో, వెజ్జూ ఒజ్జా లేకపోతే ఎన్ని తగ్గుతవో చాలా సులభమయిన లెక్కలో చెప్పేయవచ్చు.

ఆంధ్రదేశంలో కృష్ణాతీరం మొదలుకొని చెన్నపట్నందాకా ఉండే గ్రామాలలో వైష్ణవ గ్రామాలు చాలా అందంగా ఉంటాయి. ఇది ఆంధ్రవిష్ణువుకు కాపురమయిన శ్రీకాకుళపు ఒరవడో, శ్రీరంగపు ఒరవడో, మరే ఒరవడో నేను చెప్పలేను. సువర్ణముఖి ఒడ్డునా, పెన్న ఒడ్డునా కొన్ని గ్రామటికలు మనోహరంగా ఉంటవి. కోనసీమలో గంగలకుర్రు, వ్యాఘ్రేశ్వరం, ముంగండ మొదలయిన గ్రామాలకు పోకచెట్లూ, కొబ్బరి

చెట్లూ, అరటిచెట్లూ, శీతోష్ణస్థితీ – ఇవి అందం తెచ్చిపెట్టినవి. మెట్టదేశంలో కొండలపక్క గ్రామాలు సహజసుందరాలు. మొత్తంమీద అవీ ఇవీ మునిపల్లెలవలె ఉంటవి.

నూజివీటి సంస్థానంలో చెప్పదగిన ఊరు ఆకిరిపల్లి. సూత్రపట్టినట్లున్న నాలుగు చచ్చౌకపు వీధులూ, నాలుగువీధుల కూడలిలో నాలుగు మండపాలూ, పెద్ద కోనేరూ, దానినడుమ మండపమూ, శోభనాచలమూ, దానిమీద స్వామి, నలుమూలలా చిన్న చిన్న గుట్టలూ మావితోటలూ కల యీ వూరు ఆకిరిపల్లి కాదు మరి అందాలపల్లి. శోభనాచలస్వామివారి భక్తులు అప్పారాయల సృష్టి యీ అందాలపల్లి. ఈ సృష్టి సగంతో ఆగిపోయింది. ఇంత అందాలపల్లికి ఎంత పెద్దకోనేరున్నా నీటి వసతి చిల్లి.

మనదేశంలో బస్తీలలో బాగుండేది కాకినాడ అంటారు.

చరకుడు :

వైద్యాచార్యుడు చరకుని మతంలో రాతి యిండ్లూ, పెంకుటిండ్లూ పనికిరావు. ఇది బహుశా సాధారణనిధి అయి వుంటుంది.కోటలు పూరిండ్లు కావుకదా. అలాగే బస్తీలలో కొన్ని కొన్ని యిండ్లు పర్ణశాలలు కావడానికి వీలులేదు.

ఊరికి మనిషితోపాటే ఆయుర్దాయం. నూరేండ్లు నిండగానే ఆ యూరు తగులబెట్టి వేయడమున్నూ, దాదాపుగా మరోవూరు కట్టుకోవడమున్నూ, మళ్లా నూరేండ్లు నిండాక వెనుకటిచోట మళ్లా కట్టుకోవడమున్నూ ఈయన అభిమతమని ఊహించవచ్చు. ఇందువల్ల విషూచి, మశూచి మొదలయిన అంటు తెవుళ్లకు ఉద్రేకం ఉండదు. భూమియొక్క గుణం ముక్కిపోదు. జనపదోధ్వంసనీయాధ్యాయాదులు చూచేది.

ప్రాచీన సంప్రదాయం :

ఆర్యులు పామీరు కొండలలోంచి దిగివచ్చి తమవిజ్ఞానాన్ని భరతఖండంలో నింపారనే మాట నమ్మినా నమ్మకపోయినా కాలవిజ్ఞానం మాత్రం బహు బహు పురాతనం. మన తెలుగునాటి యిండ్లు ధ్రువాన్ని చూడటం ప్రాచీన సంప్రదాయంలో ప్రధానాంశం. తరువాత బొడ్డురాయి. ఆగ్నేయకోణంలో వంటిల్లూ, దక్షిణాన పడకటిల్లూ నేటికీ అనుస్యూత మవుతున్నవి. ఇంకా సోమవీధులూ, సూర్యవీధులూ తీర్చి కట్టిన నల్లిండ్లూ మేలిండ్లూ ఆర్యశిల్పవిశేషాలు. మృచ్ఛకటికంలో చెప్పబడిన చారుదత్తుని నాలుగిండ్ల భవంతీ, పది ప్రకోష్ఠాలు కల వసంతసేన భవనమూ ఆ శిల్ప విశేషాలలో ఆలోచింపదగిన విశేషాలు.

అది గొప్పయౌనాకో : యపుదు వెన్నెముకను
 దాన మిచ్చె దధీచి మౌని యతఁడు;
అది యేమిఘనత : కాయము కోసి యిచ్చెను
 శిబిచక్రవర్తి ప్రసిద్ధుఁడతఁడు
అది యొక లెక్కయా : యడుగులు మూడుగా
 ధర నిచ్చె బలియు వదాన్యు డతఁడు :
అది లెస్సయా : మేన నవఘళించిన సొమ్ము
 లడుగ నిచ్చెను కర్ణుఁడగునె దాత
యనుచు స్వర్గపురీ రథ్యలందు సురలు
పొట్టి శ్రీరాములు యుదంతమును దలంచి
యక్కజంపడి తలయూచి యాడుభాష
లందగించెను మేఘగర్జాంతరముల :

- సామవేదం జానకిరామశర్మ

మల్లంపల్లి సోమశేఖరశర్మ

నన్నయకు పూర్వము ఆంధ్ర భాష

పూర్వపు తెలుగు శాసనములు

మన వాఙ్మయచరిత్రమున మొట్టమొదటి ప్రకరణమే సమస్యాబహుళమయిన పెద్దఘట్టము. మనభాష పుట్టు పూర్వోత్తరము లింకను దురవబోధములుగనే యున్నవి. అసలు మనభాష పేర్లనుగురించియే ఇంకను ఎన్నో తికమకలు పడుచున్నాము. వానిని గురించి యింతవరకు ఒక నిశ్చితమైన సిద్ధాంతమే కుదరలేదు.

ఆంధ్రము : తెలుగు

ఆంధ్రము, తెలుగు అను రెండుపదములను మన భాషకు పర్యాయపదములుగా వాడుచున్నాము. ఒకటేభాష కింతటి పరస్పరభిన్నములైన యివి పర్యాయపదములుగ నేర్పడుట ఇట్లు సంభవించినదను ప్రశ్న ప్రప్రథమముననే కలుగుచున్నది. తెలుగేమిటి, ఆంధ్రమేమిటి అను జిజ్ఞాస పెక్కు వాదములకు కారణమయినది. నిర్ణయమునకు తోడ్పడు నికరములయిన యాధారములు లేకపోవుటవలన యుక్తికి బలము దొరకి వాదములు బహుళములయినవి. ఎన్నో విధముల ఎందరో యీవాదమును పరిష్కరించినారు. కాని ఏ పరిష్కారమునకును ఇంతవరకు సర్వజనాంగీకారము లభింపలేదు; లభించుటయు కష్టమే. ఈ పదములకు గల భేదమును పురస్కరించుకొని అసలు తెలుగువారు వేరు, ఆంధ్రులు వేరు అను వాదములును పుట్టినవి. ఆంధ్రులు అసలు ఇచ్చటివారు కారని, ఇతర ప్రాంతములనుండి యిచ్చటికి వచ్చినారని, ఇచట మొదటినుండి నివసించుచున్న జనులు తెలుగువారని, ఇది అసలు తెలుగుదేశమని, ఆంధ్రులిచటికి వచ్చి తెలుగులతో కలిసిపోయి ఆ రెండు తెగలవారికి గల భేదమంతరించిన పిదప ఆంధ్ర, తెలుగు పదములు పర్యాయపదములుగా నేర్పడినవని కొందరివాదము. ఇప్పటి రాయలసీమ అసలు తెలుగుదేశమని, సముద్రతీరస్థదేశము ఆంధ్రమని మరికొందరియభిప్రాయము. ఇట్లే వాదములలో ఇంకను భేదములున్నవి. వాటినన్నిటిని ఇచట నుటంకించుట యనవసరము.

ప్రజల ప్రమాణములుగ ఎన్నదగిన శాసనములను బరిశీలించినచో ప్రాచీన కాలమున ఆంధ్రులు ఆంధ్రులుగనే వ్యవహరింపబడినట్లు తెలియగలదు. పురాణములు సయితము ఆంధ్రులను ఆంధ్రులనియే వ్యవహరించియున్నవి. క్రీస్తుశకము అయిదారు శతాబ్దులనాటినుండి ఆంధ్రపదమును, అంతకుపూర్వము అంధపదమును శాసనములందు గానవచ్చును. అంధపదము క్రీస్తుశకము మొదటి శతాబ్దులలోని ప్రాకృత శాసనములలో గానవచ్చును. ప్రాకృతమున ఆంధ్ర అంధయైనది. ప్రాచీన బౌద్ధత్రిపీటిక వాఙ్మయమునందును, ప్రాచీన జైనవాఙ్మయమునందును ఆంధ్రులు అంధులని అంధకులని వ్యవహరింపబడియున్నారు. తెలుగు పదము శాసనములలో పది, పదునొకండవశతాబ్దుల నుంచి కాని

కానరాదు. తెలుగు, తెలుంగు, తిలంగ, తిలింగ రూపములతో శాసన వాఙ్మయమున అది కనబడుచున్నది. అప్పటికే తెలుగు, ఆంధ్రములు దేశనామములుగను, జాతివాచకములుగను పర్యాయపదములయినవి. పది, పదునొకండవ శతాబ్దులకు పూర్వము పురాణములందు కాని, శాసనములందుకాని, జైన వాఙ్మయములందుకాని, దేశనామముగగాని, జాతివాచకముగగాని తెలుగుపదమే కానరాదు. దీని ననుసరించి తెలుగుజాతి వేరుగ నొకటియుండెననుటకుగాని, తెలుగుదేశము వేరొకటి యుండెననుటకుగాని ఆధారములు లేవు.

ఆంధ్రపదము జాతివాచకమని పురాణములను బట్టియు, బౌద్ధ, జైన వాఙ్మయమునుబట్టియు స్పష్టమగుచున్నది. ఆంధ్రజాతి బహుపురాతనమయినదని ఐతరేయ బ్రాహ్మణమునుబట్టి మనకు దెలియుచున్నది. ఈ బ్రాహ్మణమునాటికి ఆంధ్రులు ఆర్యావర్త సీమావధులందు నివసించుచుండిరి. వీరొకప్పుడు ఇప్పటి సంయుక్త రాష్ట్రములందుండినట్లు అనుమానింప నవకాశముకలదు. అంధవన మనుపేర నొకవనము ఉత్తర కోసలమున నుండినట్లు విదేశబౌద్ధయాత్రికుల గ్రంథముల వలన తెలియుచున్నది. ఇది బౌద్ధ వాఙ్మయమున ప్రసిద్ధమైన జేతవనమునకు వాయవ్యదిశ నుండెను. ఇక్ష్వాకు వంశజుల కాణాచియైన ఉత్తరకోసలమునకు బుద్ధునికాలమున శ్రావస్తి రాజధాని, అంధవన, జేతవనములు రెండును ఆ నగరము పరిసరములందలివే. ఆంధ్రుల ననుసరించియే ఆ వనమునకు అంధవన మనుపేరు కలిగినదని నాయూహ. ఆంధ్రజనపదము నంటియున్న యరణ్యప్రదేశము అంధవన మనుపేర వ్యవహరింపబడియుండును. శ్రావస్తికిని, ఆంధ్రులకును కొంత సంబంధ ముండినట్లు అంధవనము ననుసరించియేకాక పురాణప్రమాణము ననుసరించియు సంశయింపదగియున్నది. శ్రావస్తీనగర నిర్మాతయైన శ్రావస్త, లేక శ్రావస్తక మహారాజు ఇక్ష్వాకువంశజుడయిన వికుక్షికి ఆఱవతరమువాడని, అతని తండ్రిపేరు ఆంధ్రుడని వాయుపురాణము తెలుపుచున్నది. (వాయు పు, అ, ౮౮ ౨౪౨౯ విష్ణు పుర ౪౨౧). కాని మత్స్య, బ్రాహ్మణపురాణములు అతడు యువనాశ్వతనూజుడని, ఆంధ్రమహీపతి మనుమడని చెప్పుచున్నవి. వాయుపురాణోక్త ఆంధ్రుడే యీ ఆర్ధ్రుడు. ఇతనినే భాగవతపురాణము, పొరపాటున కావచ్చును, చంద్రుడని పేర్కొనుచున్నవి. ఈ శ్రావస్తి సంయుక్తరాష్ట్రములందలి ఆయోధ్య (Oudh) జిల్లాయందుండెను.

దక్షిణకోసలము కళింగదేశము పొరుగుననున్నది. ఇక్ష్వాకువంశజులు కొందరు దక్షిణమునకు వలసవచ్చి యిచ్చట స్థిరనివాసము కుదుర్చుకొనుటచేతనే దక్షిణ కోసల మిచట ఏర్పడుట సంభవించియుండును.

ఇక్ష్వాకులకును ఆంధ్రదేశమునకును సంబంధము కలదనుటను నాగార్జునునికొండ, జగ్గయ్యపేట శాసనములు రూఢిపరుచుచున్నవి. వీనిననుసరించి చూడగా ఆంధ్రులు ఉత్తరకురు భూములనుండి క్రమముగా దక్షిణమునకు వచ్చి కృష్ణా గోదావరీ తీరప్రదేశములను తమ జన్మదేశములుగా జేసికొనిరని విదితము కాగలదు. ఆంధ్రులు ఇక్ష్వాకువంశజులయినను, విశ్వామిత్ర సంతతి వారయినను ఉత్తర దేశమునుండి దక్షిణమునకు వచ్చిన యార్యజాతివారనుట స్పష్టము. ఇచ్చటికి వచ్చినపిదప ఆంధ్రులకు ఇరుగుపొరుగుల నుండు జాతులవారితో సంపర్కము హెచ్చినది: ప్రాంతీయభాషా సంసర్గమున వారి భాషయు చాల మార్పుచెందినది. ఉత్తర దేశస్థ ఆర్య జనపదములతో సంబంధము తెగిపోయినది. కాగా, ఆంధ్రులలో దాక్షిణాత్యభాషాచార సంప్రదాయములు వెలసి బలపడినవి. ఆంధ్రులు చివరకు పంచద్రావిడులలోనివారయినారు. ఆంధ్రులిచ్చటికి వచ్చినపిదప దాక్షిణాత్యభాషల సంసర్గ, సంమిశ్రణమున పరిణతి చెందిన వారి భాషయే తెలుగైనదని నాయూహ. ఆంధ్రము జాతి వాచకమని, తెలుగువారి భాషా సంకేతమని నాతలంపు. ఈ కారణముననే కావచ్చును దాక్షిణాత్య భాషలలోని కెల్ల తెలుగే పరిపూర్ణత నందుటకు కట్టకడపటిదయినది. తెలుగు రూపొంది కావ్యత్వసిద్ధి నందుటకు చాల కాలము పట్టుటకును ఇదియే హేతువైయుండవచ్చును. క్రమాభివృద్ధి పరిణామములనొంది తెలుగు చక్కగ పరిణతి చెందునాటికి ఆంధ్ర, తెలుగు పదములు జాతికిని భాషకునుగూడ పర్యాయవాచకములుగ రూఢములయినవి. తెలుగుపదము శాసనములందుకాని, పురాణములందుకాని క్రీస్తుశకము పదిశతాబ్దులవరకు కానరాక పోవుట ననుసరించి యీయూహయందు కొంత సత్యముండవచ్చు ననిపించుచున్నది. కాని యిది రాయిగ్రుద్దినట్లు చెప్పదగిన సిద్ధాంతము కాదనియు, ఊహమాత్రమే యనియు, ప్రస్తుతము మనకు దొరికిన యాకరములననుసరించి యిట్లూహింపననువైనదనియు జ్ఞాపకముంచుకోవలసియున్నది.

ఇక తెలుగు ప్రాచీన స్వరూపమెట్లుండెనన్నది విచారింపవలసియున్నది. నన్నయభట్టారకుని నాటి నుండి మన తెలుగుభాష ఎట్టెట్లు మార్పుచెందుచు వచ్చినదియు, ఏయేరీతుల వృద్ధిచెందినదియు దెలిసికొనుటకు గ్రంథజాలము, కావలసినంత యున్నది. నన్నయ భట్టారకునికి పూర్వము, అనగా పదునొకండవ శతాబ్దికి మునుపు తెలుగుభాష తీర్పుతీరువ లెట్లుండినదియు తెలిసికొనుటకు గ్రంథములు లేవు. అందువలన మనకు శాసనములే శరణ్యము.

ప్రాచీన శాసనములు : తెలుగు

శాసనములను గురించి ముఖ్యముగా జ్ఞాపకముంచుకొనవలసిన విషయములు ఒకటి రెండు కలవు. శాసనములలోని భాష కడుపరిమితమయినది. పరిమిత ప్రయోజనమును కలది. చేసిన భూదానమును కాని, మరొయొక దానమునుకాని తెలుపుటకే శాసనములు పుట్టినవి. అందువలన ఆయక్కర కెంతభాష యవసరమో అంతవరకే శాసనములందు దొరకును. దానాను పాలనాదులవలన గలుగు మంచి చెడ్డలు కూడ శాసనములందు వివరింపబడుటవలన దానమును దెలుపుట కవసరమైనవేకాక ఈ సంబంధమైనవి కూడ మరికొన్ని పదములు దొరుకును. ఎన్ని దొరికినను అవి లెక్క పెట్టదగినవేకాని అపరిగణనీయములు కావు.

నన్నయకు పూర్వపుకాలమును స్థూలముగ రెండు విభాగములు చేయవచ్చును. క్రీస్తుశకారంభము నాలుగవ శతాబ్దినుండి పదునొకండువరకు సంస్కృత శాసనకాలము. అటుతరువాతది శిలా శాసనకాలము; శిలా శాసనములన్నియు శిలలమీద చెక్కినవి; సంస్కృత భాషా శాసనములన్నియు తామ్ర ఫలకముల పై చెక్కినవి. సంస్కృత తామ్ర శాసనయుగమయిన పిదప ఒక విధముగ శిలా శాసనయుగమని నుడువవచ్చును. అట్లని

తామ్రశాసనయుగమున శిలాశాసనములసలే లేవని యూహింపరాదు; ఉన్నవికాని తామ్రశాసనములవలె విరివిగా గానరావు. శిలాశాసనములు కొలదిగా దొరికినను అవి మన కెక్కువ యుపకారకములు. మన దేశమున దొరికిన ఈ శిలా శాసనములలోని భాష తెలుగు.

తామ్రశాసనములు తెలుగు శిలాశాసనములకు ముందునుండియునున్నవి. వానిలో ఎక్కడ ఏ తెలుగు పదమయినను కనబడుట సంభవించినయెడల మనకు పెన్నిధి దొరికినట్లే. తామ్రశాసనయుగమున ఆంధ్ర దేశము ఒక్కొక్క శతాబ్ది గడిచినకొద్ది తెలుగుమీరినది. తెలుగుకు రూపురేఖలమరి అది క్రమముగా ప్రబలమయినది. ఈ ప్రాబల్యముననే శిలాశాసనములు సొంతముగ తెలుగుననే వెలసినవి. తెలుగునకు దేశమున క్రమముగా దొరకుచువచ్చిన యాదరాభిమానముల వలన ఒక్కొక్క శతాబ్ది గడిచినకొద్ది ఏ రూపముననో ఒక రూపమున తెలుగుపదములు తామ్రశాసనములలో గూడ దూరినవి.

తామ్రశాసనములలో మొట్ట మొదట దానమిచ్చిన గ్రామనామము మాత్రమే తెలుగునకు సంకేతముగ నుండుచువచ్చెను. అటుతరువాత కొంత కాలమునకు దానమిచ్చిన గ్రామమునకు సీమావధులు (సరిహద్దులు) పేర్కొనబడుచు వచ్చుటచేత మరికొన్ని ఆంధ్రపదములు తామ్రశాసనములలో నుదాహృతములయినవి. ఇట్లు దానమిచ్చిన భూమికిగాని, గ్రామమునకుగాని సరిహద్దులను దెలుపుట ఆచారముకాగా నా డాంధ్రదేశమున వ్యవహారమునందుండిన క్షేత్రనామములు, గ్రామనామములు తామ్రశాసనములలోనికెక్కినవి. ఇదయినను సంస్కృత వేషమును ధరించియే; సంస్కృత వర్ణక్రమముననే. ఉదాహరణమునకు చూడుడు. "ముణ్డూర గ్రామే"; 'కుమ్బురాఞ్చెరువే'; 'ప్రాలూర గ్రామే'; 'గొల్లతెంకిః' ; 'చెఱకుమడ్లుళ్చ; 'పోతురాయుః' ; సంస్కృత వర్ణక్రమముననుసరించి, విభక్తి ప్రత్యయమో, విభక్తి రూపమో, విసర్గయో తగిలించుకొన్నచో ఊరిపేరులను, క్షేత్రము పేరులను సంస్కృత తామ్రశాసనములలోని కెక్కుటకు యోగ్యతగడించుకొన్నవన్నమాటే.

దేశమున తెలుగు ఎన్నికకాంచిన కొద్ది తామ్రశాసనములయందవి యున్నవియున్నయట్లు సంస్కృత ప్రత్యయముల తగులుబడి లేకయే నిలబడుటకు బలము కలిగినది.

పైని చెప్పిన విషయముల ననుసరించి మనకు ప్రాచీన శాసనములలోగానవచ్చు మొదటి తెలుగు పేరులు గ్రామ నామములవేయని తెలియగలదు. తామ్రశాసనములలోను, శిలాశాసనములలోను గానవచ్చు తెలుగును బట్టి మనము తెలుగుభాష ప్రాచీన స్వరూపమును దెలిసికొనవలసియుండును.

శాసనములలోగానవచ్చిన మొట్టమొదటి తెలుగు పదము 'నాగబు.' ఇది అమరావతీ స్తూపశాసనములలో కానవచ్చినది. అందువలన ఏ మూడవ, నాలుగవ శతాబ్దినాటిదో కావచ్చును. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు దీనిని భారతిలో ప్రకటించినారు. మహానాగప్రతిమ క్రింద ఈ శాసనమును జెక్కియుందురని వారన్నారు. కావచ్చును. ఇప్పుడా నాగ ప్రతిమ శిథిలమగుటచేతనో, త్రవ్వినపుడు పగిలిపోవుటచేతనో ఈ 'నాగబు' శాసనమొకటియే మనకు దక్కినది. 'నాగలు' అనగా 'నాగcబు-నాగము' అన్నమాట. ఈ శాసనము ననుసరించి క్రీస్తుశకము మూడవ శతాబ్దినాటికే తెలుగునకు ఒకరూప మేర్పడెనని యూహింపవచ్చును.

గ్రామనామ వాచకములు :

ప్రాచీన తామ్రశాసనములలో ఆంధ్రదేశ గ్రామములనేకము లుదాహృతములయినవి. అప్పటి యూరిపేళ్లననుసరించి మన ప్రాచీన భాషాస్వరూపము కొంతబోధపడగలదు. అదియునుగాక ఆ పూర్వపుపేరు లిపుడెట్లు మారినవో తెలిసినచో భాషమారుచు వచ్చుటలో నేసూత్రముల ననుసరించినదియు గొంత తెలియగలదు. సాధారణముగ మన గ్రామనామములు పఱ్ఱు, కుఱ్ఱు, దొఱ్ఱు, ప్రోలు, వాడ, వాటి కొలను, చెఱువు, పల్లి, పూండి మొదలైన వాటితో నంతమైనవి. పేర్ల చివర సాధారణముగ నివి కనబడును. చూడుడు; ఉదాహరణము.

పొంబఱ్ఱు	దొంతికుఱ్ఱు	తాండివాడ
కొంబఱ్ఱు	మండదొఱ్ఱు	కాకండివాడ
నిడుంబఱ్ఱు	మ్రోంతుకూరు	గుద్దవాడి
మొనంబఱ్ఱు	శాంతలూరు	ద్రోణవాడి
దిగుంబఱ్ఱు	క్రానూరు	ఒడ్డవాడి
కలుచువుంబఱ్ఱు	మల్లప్రోలు	కోరుకొలను
పొలకుంబఱ్ఱు	కొల్లిప్రోలు	మాంగొలను
పసపుంబఱ్ఱు	చెంబ్రోలు	రాంగొలను
కలుచెఱువుల	చెఱకుంబల్లి	
రొంపిచెఱువుల	పెసరుంబల్లి	
మహాదేవిచెఱువుల	నారికెడంబల్లి	
జక్కన చెఱువుల	పెనుంబూండి	
పోకన చెఱువుల	వడ్లంబూండి	

ఈ పై ప్రత్యయములలో పఱ్ఱు పఱితిగను, కుఱ్ఱు కుఱితిగను, దొఱ్ఱు దొఱితిగను కూడ వ్యవహరింపబడుటకలదు. ప్రోలన్న పట్టణము. వాడ, వాటి- నివాసప్రదేశము. వాటి వాడుకలో వాడియైనది. వాడిలోని 'డి' 'ది'గ నుచ్చరించుటయు, వ్రాయుటయు కడ గలదు. అందువలన

'వాడి' 'వాది' యైనది. పూండియున్నది శివారు గ్రామము. పూర్వము బ్రాహ్మణుల కగ్రహారము దానమిచ్చునపుడు గ్రామ గ్రాసముగనొక చిన్నపల్లె నిచ్చుటకూడ ఆచారము; ఏలన, బ్రాహ్మణులు వ్యవసాయము చేయుట ధర్మశాస్త్రములననుసరించి కూడదు గనుక వ్యవసాయము చేయు రైతాంగముండుట కీగ్రామ గ్రాసము నిచ్చువారు. గ్రామ గ్రాసపు పల్లెకే పూండియన్న నామము తొలుదొల్త చెల్లుచువచ్చినది. కాని కాలక్రమమున దాని విశిష్టత పోయి సామాన్య గ్రామ వాచకమైనది. గ్రామగ్రాసపు బల్లెలు పదునాలుగవశతాబ్దిని కూడ నుండెననుటకు,

"మూఁడు గ్రామ గ్రాసములతోడఁ గూడంగ

మోపూరు పాలించె ములికినాట"

అని క్రీడాభిరామమున వినుకొండ వల్లభరాయడు

పై గ్రామనామములను పరిశీలించినచో కను, పెను, మొన, నిడు, దగ్గు, దిగు, పాము, కోము – వీనికి పఱ్ఱును, చెఱకు, పెసరు, పసపులకు పల్లియును, పెను, వడ్లపదములకు పూండిని చేర్చిన పైరూపము లేర్పడిన వనుట స్పష్టమగును. వానికి సరియైన యిప్పటిరూపములు దిగువ నిచ్చుచున్నాను.

కనుం	+	పఱ్ఱు	=	కనుంబఱ్ఱు	=	కనుమఱ్ఱు		
పెనుం	+	పఱ్ఱు	=	పెనుంబఱ్ఱు	=	పెనుమఱ్ఱు		
మొనం	+	పఱ్ఱు	=	మొనంబఱ్ఱు	=	మొనమఱ్ఱు		
నిడుం	+	పఱ్ఱు	=	నిడుంబఱ్ఱు	=	నిడుమఱ్ఱు		
దగ్గుం	+	పఱ్ఱు	=	దగ్గుంబఱ్ఱు	=	దగ్గుమఱ్ఱు		
దిగుం	+	పఱ్ఱు	=	దిగుంబఱ్ఱు	=	దిగుమఱ్ఱు		
పాము	+	పఱ్ఱు	=	పాంబఱ్ఱు	=	పామఱ్ఱు		
కోము	+	పఱ్ఱు	=	కోంబఱ్ఱు	=	కోమఱ్ఱు		
చెఱకు	+	పల్లి	=	చెఱకుంబల్లి	=	చెఱకుమల్లి	=	చెఱకుమల్లి
పెసరు	+	పల్లి	=	పెసరుంబల్లి	=	పెసరుమల్లి	=	పెసరుమల్లి
పసపు	+	పఱ్రు	=	పసపుంబఱ్రు	=	పసుంఱ్ఱు	=	పసుమఱ్ఱు
పసు + పఱ్రు = పసపుంబఱ్రు			=	పసుంఱ్ఱు	=	పసుమఱ్ఱు		
కలుచువు + పఱ్ఱు = కలుచువుంబఱ్ఱు =				కల్చుంబఱ్ఱు	=	కంచుమఱ్ఱు		

మన గ్రామనామములలోని కొలను, చెఱవుల పదములిపుడు కొల్లు, చెర్లలుగా మారినవి.

కోరుకొలను = కోరుకొల్లు

మాంగొలను = మాంగొల్లు

రాంగొలను = రాంగొల్లు = రాగోలు

కలుచెఱువుల = కలుచెర్ల

రొంపిచెఱువులు= రొంపిచెర్ల

మహాదేవి చెఱువుల = మాదేవిచెర్ల = మాచెర్ల

జక్కనచెఱువుల = జక్కంచెర్ల

పోకనచెఱువుల = పోకంచెర్ల

ఇట్లే మల్ల + ప్రోలు = మల్లప్రోలు= మల్లవోలు

బిక్కి + ప్రోలు = బిక్కిప్రోలు = బిక్కివోలు = బిక్కవోలు

చేం + ప్రోలు = చేంబ్రోలు = చేబోలు

మావుండూరు మాముదూరు; మావిండిపల్లి మామిడిపల్లి అయినది.

తామర + వాడ = తామరవాడ = తామరాడ

ద్రోణ + వాడి = ద్రోణవాది = ద్రోణాది

ఒడ్డ + వాడి = ఒడ్డవాది = ఒడ్డాదియైనది.

ఈ పై మార్పుల ననుసరించి మనము కొన్ని సూత్రములను గమనింపవచ్చును. ఆగమముగావచ్చిన అనుస్వారమునకు పరమైన పఱ్ఱు, పల్లి, పూండులు ప్రాచీనాంధ్రమున బఱ్ఱు, పల్లి, బూండిగా వ్యవహరింపబడి నేడు మఱ్ఱు, మల్లి– మిల్లి, మూండి మూడిగా మారినవని నిశ్చయింపవచ్చును. ఈ సూత్రము ననుసరించి అర్వాచీన రూపములకు ప్రాచీన రూపములకు ఆర్వాచీనరూపములును కనుగొనవచ్చును. ఇట్లే ప్రాచీనాంధ్రమున అనుస్వారపూర్వక 'డి' వర్ణము నేడు 'ణి' – 'ని' గా మారినది. ఉదా: కాకాండి – కాకాణి – కాకాని; కాకండివాడ– కాకణివాడ– కాకణాడ– కాకనాడ. పండిదం = పణిదం; కొండికి – కొణికి.

అరియేడు, ఇడియూరు, ఎలియేరు– ఈ ప్రాచీనాంధ్రమునందలి రూపములు ఆర్వాచీనాంధ్రమున ఆరేడు, ఈడూరు, ఏలేరుగా మారినవి. ఈ యుదాహరణముల ననుసరించి ప్రాచీనాంధ్రస్వరూపము కొంత గోచరింపగలదు.

మనుష్య నామములు :

ఇక మనుష్యులపేర్లు చూతము. దోచిశర్మ, అగ్గిశర్మ, కుండిశర్మ, సన్నిశర్మ, కాటిశర్మ మొదలయిన ఇకారాంత పదములన్నియు శర్మపదము వాడని సందర్భములందు దోచియ, అగ్గియ, కుండియ, నన్నియ, కాటియ అని యకారాంతములుగా వ్యవహరింపబడెను. 'ఇయ'తో అంతములయిన ఇట్టి పదములు దోచె, అగ్గె, కాటె, కుండె, నన్నె అను రూపాంతరములను బొందుచువచ్చినవి. ఇట్టి రూపములను పదవ, పదునొకండవ శతాబ్దినాటి శాసనములో ఎన్నిటినైన చూడవచ్చును. ఉదా: ప్రోలె–ప్రోలియ; కేతె–కేతియ; బాదె–బాదియ మొదలైనవి. 'ఇయ' కాలక్రమమున 'అయ'గా మారగా నేటి దోచయ, అగ్గయ, కుండయ, నన్నయ, కాటయరూపములు సిద్ధించినవి.

నన్నయకు పూర్వము కానవచ్చు శాసనములలో మనము ప్రధానముగ గమనింపవలసినవి మూడు పదములు కలవు. 1.భోజక, 2.రట్టకుడి, 3.గామకుడి.

1. భోజకులనగా ఊరిపెద్దలు : గ్రామ ప్రముఖులు ఛైల్డర్స్ పాలీ నిఘంటువునందు భోజక పదమునకు Village Headman అని యర్థము చెప్పబడినది. గ్రామ భోజకులు రాజాధికార పురుషులలో ఒకరు. శాసనములందు గ్రామ భోజకులు పేర్కొనబడినారు. భోజ, భోజక పదములు రెండును ఏకార్థ ప్రతిపాదకములు. భోజశబ్ద వికృతి బోయ. పూర్వము బ్రాహ్మణులు గ్రామ భోజకులుగ నుండినట్లు శాసనములవలన మనకు దెలియగలదు. ఉదా: ముదుగొన్డబోయ దుగ్గశమ్మన్ ; ఇట్లే చేయూర్బోయ; పొన్నకూర్బోయ; రాంపుర్బోయ మొదలగునవి. బోయ, భోజ, భోజక పదములు నేడు బ్రాహ్మణులకు చెల్లుట కానరాదు. కాని నేడు వ్యవహారముననున్న ఋుగత, భుక్త పదములు భోజక శబ్ద భవములుకాని, తత్సంబంధులుకాని యైయుండునని నా యుద్దేశము. ప్రాచీనాంధ్ర శాసనములలో కానవచ్చు 'బోండు' పదము 'బోయండు' అనుదాని రూపాంతరము. ప్రథమ ఏకవచన రూపము బోండు, బోఁడు, బోడు, బహువచనరూపము బోలు. ఉదా: 'బోలు నల్వురాయుతోలు'. బోలు పదము గౌరవ వాచకముగ ప్రయోగించుటయు కలదు. ఉదా: 'బాదెబోల పన్నస', 'బోని యన్నది ద్వితీయ, షష్ఠి ఏకవచన రూపము. ఉదా: 'మండెబోనిచేను.'

2. ఇప్పటి రెడ్డి పదమునకు ప్రాథమిక రూపము రట్టకుడి. రట్టకుడి రట్టోడి, రడ్డోడి, రద్దోడి, రట్టడి, రడ్డి అని పరిణామమున రూపాంతరములను పొంది తుద కిపుడు రెడ్డి అయినది. రాష్ట్ర కూటయనునది రట్టకుడి పదము యొక్క సంస్కృత రూపము. అదికూడ రాష్ట్రోడ, రాష్ట్రౌడ, రాఠోడ, రాథ యని రూపాంతరములను పొందినది. రట్టకుడి, రాష్ట్రకూటపదములు పొందిన రూపాంతరములనన్నిటిని మనము ప్రాచీన శాసనముల లోను, తరువాత వాఙ్మయమునను చూడగలము.

3. రట్టకుడి వంటిదే గామకుడి. గామకుడి సంస్కృతమున గ్రామకూటయైనది. గ్రామప్రముఖులని ఆ పదమున కర్థము. గామకుడి (గ్రామకూట) గామొడ, గాముండ, గావుండ, గౌండ అయి నేడు గౌడు అయినది. ఉచ్చారణ సౌకర్యము ననుసరించి పదము అనేక వికృతులను పొందుననుట కివి ఉదాహరణములు. ఎన్ని రూపాంతరములను పొందినను ఒక పద్ధతికి, ఒక సూత్రమునకు కట్టువడియే అది మారుచుండునన్న విషయము మనము గమనింపవలసియుండును.

ఇతర విశేషములు :

తెలుగుమాటల కాదినుండియు సంస్కృత వర్ణక్రమపద్ధతియే యేర్పడినదని యిదివరలో చెప్పియున్నాను. ఈ కారణమున నన్నయకాలమునకు చాల పూర్వమునకు బోయినకొలది తెలుగుపదములలో అనుస్వారము కానబడదు. అనుస్వారమునకు బదులు వర్గాంత్యను నాసికములే వాడుకయందుండెను. కాలక్రమమున అనునాసికము లోపింపగా దాని స్థానమున అనుస్వారము వచ్చినది. అర్థానుస్వార మసలు లేదు. దేశికవితనుగాని, మార్గకవితనుగాని సందర్భానుసారముగ అనుస్వారము నూది, తేల్చి పలుకువారు. ఊది పలికినది (సిద్ధము) పూర్ణానుస్వారమును, తేల్చి పలికినది (సాధ్యము) అర్థానుస్వారముగను పరిణమించెను.

కడు ప్రాచీన కాలమునకు బోయిన కొలది తెలుగుపదములు పరుషబహుళములుగ నుండినట్లు కాన్పట్టును ఉదా:– అకున్– (అగును), కరుసు; కర్త.

కొను, తిను మొదలయిన తెలుగుపదములు ప్రాచీన కాలమున ణజంతములుగ గనబడును; ఉదా: పణి, కొణు.

తెలుగుపదములలోని క, చ, ట, త ప లకు పూర్వము రేపసంశ్లేషమయిన అది లోపించి, పరవర్ణము ద్విత్వముంజెందును. ఉదా: వర్చు– వచ్చు; పెర్గడ– పెగ్గడ; ఉర్పుటూరు– ఉప్పుటూరు; అర్కు– అక్కు.

పరస్థరేపము వ్యతిపాతవిధినొంది ప్రథమాక్షర సంయోగము చెందుటయు కలదు. ఉదా: పఱికి–పర్కి, ప్రక్కి; పుఱోలు–ప్రోలు; పెర్గడ– ప్రెగ్గడ; పఱం తూరు– ప్రాంతూరు–పాతూరు.

పూర్వపు తెలుగు శాసనములను బరిశీలించినచో నముచ్చయ ప్రత్యయ మిప్పటివలె 'ను'గా గాక ఆఱవమునందువలె 'ఉమ్'గ నుండినట్లు తెలియగలదు. వాడుకయం దిది 'ఉము' గను, 'నుము'గను ప్రయుక్తమయినది. ఉదా: వేగుద్భుము వేసెఱువుళుము; 'మాత్పిడుగునుము, చోటియరట్టగుద్యాకునుము, ఉత్తమాదిత్యరట్టగుద్యాకునుము,

రాజులయొక్క యనునర్థమున పూర్వపు తెలుగున షష్ఠి విభక్తి 'కు' ప్రత్యయము ప్రయుక్తమగుచువచ్చినది. 'కు' కు పూర్వపు అచ్చు దీర్ఘమగుటయు కలదు. ఉదా: "జయసింహవల్లభమహారాజులకు ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబుళ్", "శ్రీ విష్ణువర్ధన మహారాజులాకు ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబుళ్", "మహారాజాధిరాజ పరమేశ్వర భటారళాకు విజయరాజ్య సంవత్సరంబుళ్", "పొర్ముఖ

రామపుణ్యకుమార ప్రిథివీవల్లభచోలు మహారాజులాకు ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబుళ్". ఇవి ఏకవచనరూపములు. ఈ బహువచనరూపము గమనింపదగినది. "తోంటళాయు పడువారంబు"– (తోంటళు+అయు+పడువారంబు). "యొక్క" అనుష్ఠార్థమున అరవమున "ఉడయ", వచ్చును. ఉదా: ఎన్నుడయ; అవరుడయ. ప్రాచీన కన్నడమున నిది "అయ", 'అ'గా మారినది. ఉదా: 'ఎన్నయ' (నాయొక్క); 'ఎన్న' (నా), ప్రాచీన కన్నడమునందలి "అయ" ప్రత్యయమే "తోంటళాయు పడువారంబు" లోని "అయ", "అ", "అయ" ప్రత్యయములు రెంటిని ప్రాచీనాంధ్రమున జూడగలము. "అ" ప్రత్యయమున కుదాహరణములు: మాటలు+అ+పొందిక=మాటల పొందిక (మాటల యొక్క పొందిక). ఇట్లే పదముల కూర్పు, తమ్ముల ప్రేమ మొదలైనవి.

కడు ప్రాచీనకాలమున షష్ఠీ విభక్తి ప్రత్యయమయిన 'కు' పరంబగునపుడు అకారాంత పదముల మీది తుదియచ్చును, నగాగమముమీది తుది అకారమును దీర్ఘమగుచుండెను. ఉదా: "నిష్టసోముళాకు", "ఉబిలీశ్వర భటారళాకు", "చోటియరట్టగుడ్యాకు", "విన్నశర్మళాకు", "పళ్లెయారియనంబునాకు", "గంగ రాజ్యంబునాకు", "నమూద్రరంబునాకు", "వసంతీశ్వరంబునాకు" మొదలైనవి.

షష్ఠీవిభక్తి రూపములందలి యీ దీర్ఘములు కడు ప్రాచీన శాసనములందు మాత్రమే కానవచ్చును. కాలము గడిచినకొద్ది ఈ దీర్ఘములు హ్రస్వములై "రాజులకు", "గంగరాజ్యంబునకు", "ఉబిలీశ్వర భటారళకు" అను అర్వాచీనరూపములు ఏర్పడినవి. స్థూలదృష్టిని శాసన ప్రాచీనతను గుర్తించుట కీ రూపములు కొంతవఱకు తోడ్పడగలవు. దీర్ఘరూపములు ఆఱవ, ఏడవ శతాబ్దులనాటి శాసనములలో కనబడును. ఎనిమిదవ శతాబ్ది యీ రూపములకు మార్పుకాలము. అందువలన నాటి శాసనములలో ఉభయరూపములను గాంచగలము.

చతుర్థి, షష్ఠీ, విభక్తులు రెంటను 'కు' ప్రత్యయమే వచ్చును.

ఇప్పటి తృతీయావిభక్తి ప్రత్యయము 'తోడ' ప్రాచీనరూపము 'తోఱ' ఉదా: "రామనిభుతోఱ". 'తోడు' తోడిదే యీ 'తోఱ'. ఇది సహార్థమున తొలుదొల్త ప్రయుక్తమయి తుదకు తృతీయావిభక్తి ప్రత్యయముగ రూఢమయినది. చూడు డీ యుదాహరణము: "నల్వురాయుతోఱ"; (నల్వురు+అయు+తోఱ).

ఇక ద్వితీయా విభక్తి రూపమున 'దీని గుఱించి కొంత చెప్పవలసియున్నది. నన్నయకాలమున నుండి ఒక్కొక్క శతాబ్ది వెనుకకు పూర్వపు తెలుగు శాసనములను బరిశీలించుచు పోగా 'దీని' రూపమున మార్పులు కనబడును. 'దీని' అన్నది కొంత పూర్వము నకు బోయినయెడల 'దేని' గాను, ఇంకను పూర్వమునకుపోయిన యెడల 'తేని'గాను పరిణమించును. ఇట్లగుట, 'దీని' ప్రాచీన ప్రాథమిక రూపము 'తేని'. ఈ యుదాహరణములు చూడుడు.

'దీని తెఱిఇచ్చినవారు'	'దేనిం గాచినవారు'
'దీని రక్షిఇచ్చినవారు'	'దేనికి సక్కి' (దేనికి సాక్షి)
'దీనిఱచ్చినవాని'	'దేనికి వక్రంబువచ్చు వాన్డు'
'దీనికి వక్రంబువచ్చినవారు'	'దేని నిల్పినవానికి'

'దీనికి అడ్డమయినవారు' 'దేని అచ్చువాన్డు'

'తేని అచ్చినవారికి'
'తేని అచ్చినవాన్డు'
'తేని అచ్చువారు'

స్థూలదృష్టిని ఈ రూపముల యునికిని బట్టికూడ మనము తెలుగుశాసనములు ప్రాచీనతను గుర్తింపవచ్చును. నేను చూచినంతవఱకు, నాకు తెలిసినంత వరకు క్రీస్తుశకము ఏడవ శతాబ్దికి పూర్వమే శాసనములలో "తేని" దొరకును.

తొలుదొలుత తెలుగుపదములు సాధారణముగ పరుషాన్వితములుగ నుండెననుట కిదియొక దృష్టాంతము. ఇట్లే నేటి 'గరుసు'– "ఏకభోగంబుగాగ నేలేరు గరుసు కడలి సీమయు గౌతమీ గంగమేర"– ఈ "గరుసు"ప్రాచీన కాలమున 'కరుసే' ఉదా: 'పుల కరుసు.'

'దీని' ప్రాచీన రూపమయిన 'దేని' (దేన్) అన్నది 'దే+ని' (దే+న్) అనుదాని సమాహారము. మన 'దేన్' రూపము ప్రాచీన కన్నడమున 'ఇదాన్' అయినది. ప్రాచీన కన్నడ శాసనములను జూచిన నిది తేటపడగలదు. ఉదా: 'ఇదాన్ అఱివోన్', 'ఇదా నఱిదోన్', 'ఇదాన్', 'దే న్' అను రూపములలోని "ఆ" "ఏ"ల భేదము కన్నడులకు, మనకు ప్రాచీన కాలముననుండియు సంప్రదాయ సిద్ధముగ వచ్చుచున్నదే. ఈ విషయము అరవము, కన్నడము, తెలుగు భాషలయందలి సర్వనామములను పరిశోధించి స్వర్గీయ శ్రీ కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు పంతులుగారు ఇదివరకు నిరూపించియే యున్నారు. (చూడుడు : లక్ష్మణరాయ వ్యాసావళి : ద్రావిడ భాషల యందలి సర్వనామములు) పోలికకు 'నేను' విభక్తులు చూడుడు.

తెలుగు	అరవము	ప్రాచీన కన్నడము
నేను, ఏను	యాన్	ఆన్
నన్ను	ఎన్నై	ఎన్నం
నాకు	ఎన్నుడయ	ఎన్న, ఎన్నయ
నాకై	ఎనక్కు	ఎనగె

ఈ యుదాహరణములనుబట్టి 'ఆ న్', 'ఏ న్' సంప్రదాయములన్న దానిలోని యర్థము గ్రహింపవచ్చును. ప్రథమా విభక్తియందు తెలుగువారికి 'ఏ న్', 'నే న్', రూపములు రాగా కన్నడులకు, ఆరవలకు 'ఆ న్', 'యా న్' రూపములు వచ్చినవి. కన్నడులు 'ఆ న్' సంప్రదాయమువారు,

తెలుగులు 'ఏ ఁ' సంప్రదాయమువారు. ఈ సంప్రదాయమే 'దీని' తెలుగు, కన్నడ ప్రాచీన రూపములందు పొడకట్టుచున్నది. పూర్వపు తెలుగు శాసనములందు 'తేని' దొరికినట్లే ప్రాచీన కన్నడ శాసనములయందు 'ఇతాన్' రూపము కనబడవచ్చును.

'తేని'లోని 'త'యును, అతను, ఇతను, ఎతనులలోని 'త'యును ఏకైక శబ్దములు. అతను, ఇతను, ఎతను, అతడు, ఇతడు, ఎతడు, అది, ఇది, ఎది రూపములలో 'తను', 'తడు', 'ది'లు సామాన్యములు కాగా అ, ఇ, ఎ లు విశిష్టములైనవి. ఇవి నిర్దేశక ప్రత్యయములు, వస్తువు ఫలానది అని నిరూపించి చూపునవి. అతను, ఇతను, ఎతను రూపములు పరిచ్ఛేదమిది: అ+త+ను; ఇ+త+ను; ఎ+త+ను. ఇట్లే అ+త+డు; ఇ+త+డు; ఎ+త+డు. అది, ఇది, ఎదిలలోని 'ది'కిని, 'త'కును పైకి పోలికలేనట్టు కనిపించుచున్నను ఉన్నదను విషయము 'తేని' రూపమే స్పష్టపఱుచుచున్నది. 'ఇది' యొక్క ద్వితీయరూపము 'దీని'. 'దీని' ప్రాథమిక రూపము 'తేని'. ఈ రూపమెట్లు కలిగినది ఇక తేల్చవలసియున్నది.

అది, ఇది, ఎది అనువాని విభక్తి రూపములు చూచినచో ద్వితీయారూపములకు మిగిలిన విభక్తి ప్రత్యయములు చేర్చినయెడల మిగిలిన విభక్తి రూపములేర్పడుచున్నవని తెలియగలదు.

ప్ర.	అది	ఇది	ఎది
ద్వి.	దాని	దీని	దేని
తృ.	దానిచే	దీనిచే	దేనిచే
చ.ష.	దానికి	దీనికి	దేనికి
పం.	దానివలన	దీనివలన	దేనివలన
స.	దానియందు	దీనియందు	దేనియందు

'ఇది' ద్వితీయారూపము 'దేని'గ నుండినట్లు శాసనముల వలన దెలియవచ్చుటచేత మనము 'దాని' 'దేని' రూపనిష్పత్తిని గుఱించియే యరయవలసియుండును. 'దేని' ప్రాచీన రూపము 'తేని' యని శాసన ప్రమాణముండుటచేత 'దాని' ప్రాచీనరూపము 'తాని' యైయుండవలెను. ఇది కూడ ఎప్పుడో ఎక్కడో దొరకవచ్చునేమో. నిర్దేశార్థక ప్రత్యయములయిన అ, ఇ, ఎలు తాని, తేనిలో కూడ నుండియుండవలెను. అవి లేని యెడల వస్తునిర్దేశముకాదు గనుక.

'తాని' 'తేని' లలోని 'ని' ద్వితీయ విభక్తి ప్రత్యయము. ఇది పోగా మిగిలినది 'తా', 'తే'లు అతడు, ఇతడు, ఎతడు, అతను, ఇతను, ఎతను లలోని ప్రధాన శబ్దము 'త' యని ఇదివరకు తెలిపినాను. అదియే యీ రూపములందును ప్రధానమైనది. చూడదు:

త+అ=తా (జలజ+అక్షి= జలజాక్షి వలె)

త+ఇ=తే (తరుణ+ఇందు=తరుణేందువలె)

అందువలన ద్వితీయావిభక్తి రూపములివి :

త+అ+ఁ= తా ఁ – తాని.

త+ఇ+ఁ= తే ఁ – తేని.

ఇది 'తేని' రూపనిష్పత్తి.

'తేని'ని గుఱించి శ్రీ గిడుగు వేంకట రామమూర్తి పంతులుగారి సంపుటమున వ్రాసినది అవిచార మూలకము.

పూర్వపు తెలుగు శాసనములయందలి సమాన పద్ధతి ఈ క్రింది ఉదాహరణములననుసరించి చక్కగ తెలియగలదు. ఉదా:

'ఈందని చెఱువు'	'అశ్వమేధంబున ఫలంబు'
'వేల్పుజేని తూర్పునపన్నస'	'ఉత్తరంబునపులొంబున'
'కోఱబోయు తటాకము'	'తూర్పునదిశ'
'కల్వకురి ఎవ్వోకచేనిసీమ'	'తూర్పునకోటి'
'నొఱంబితోటి కయ్యంబు'	'నిట్టసోముళపడసిన'
'ఉత్తమగండనియిచ్చిన'	'రాచమానంబున'
'పుల్గొట్టునగాణంబు'	'పోర్ముఖరామ'

'మండయూరి పొలగరుసున యిసుపకట్టలచెఱవు నడిమిదూబ (ఇసుపకట్ట)

వాక్యరచన :

ప్రాచీనాంధ్ర శాసనములను జూచినచో పూర్వపు తెలుగున వాక్యనిర్మాణమున కొన్ని వింత తీరులు కనబడును. నేటి వాక్యనిర్మాణపద్ధతికి భిన్నముగ గనిపించు నుదాహరణములు కొన్నిటిని శాసనముల నుండి గ్రహించి యీ దిగువ నిచ్చుచున్నాను.

(౧) "దుజయరాజుల ముతురాజులు నవప్రియముత్తురాజులు వల్లవ దుకరజులు సాక్షికను ఇచ్చిన పన్నస కొట్టంబునపొఱకు కుణ్డికాడ్లులో ఇచ్చిన పన్నస ఇరువది యాడినాల్కు మఱుత్తుఌ నేల."

దుకరాజు, సాక్షికను, నాల్కురూపములు గమనింపదగినవి. ఆడి ధాన్యవిశేషము. ఆళ్లు, బహువచన రూపము. మఱత్తు అన్నది ఎకరములవంటి మానవిశేషము. 'ఇరువది'కి 'నాల్కు'కు నడుమ 'ఆడి' వచ్చినది. ఇప్పుడు మన మిట్లనము.

(౨) "పుద్దణకాలు ఇచ్చిన పన్నస పెన్వాతె ఇశతేనిక్"
(౩) "తిరువుళ కయ్యంబునం బొడిచిపడియె ఔొఝ్కుళకు."
(౪) "కుఝ్హమదు వేళువాన్ఱు గగుడ్ల కాడమ్మ శ్రీ మెట్టి సోరమడిని కయ్యంబునం బొడిచిపడియె విన్ఠి నాయకున్ఱు"
(౫) "ఎరిగల్ల దుగరాజుల్ ఇచ్చిన పన్నస కొచ్చియ పాఱ రేవసర్మారికి్"

ప్రాకృత రూపములు :

పూర్వపు తెలుగు పదములలో ప్రాకృత సంప్రదాయము ఎక్కువగ గనబడును చూడుడు :
సక్కి బదర గద్దె; గద్దిన ఆణతి
గోయిద బోయకట్టంబులు దమ్ముపులు
బెజెయిత్త బెజెయరాజు బెజెయేశ్వరంబు
చంద్రాయిత్తకాలము పరియారువు కంద
(స్కంద) అగరము (అగ్రహారము;
వహిండి (పసిడి) – పయిండి – పయిడి– పైడి;
(నాహిందు – నాయిందు – నాఇందు– నేడు)

కొన్ని వర్ణపద విశేషములు :

ప్రాచీనాంధ్రమున వింతవర్ణములు రెండు కలవు. అందొకటి అడ్డుగీటులేని బండిఅను పోలిన (ఱ) వర్ణము. దీనిని 'ఝ' యందురు. ఇది ప్రాచీనాంధ్రముననే కలదు. నన్నయ తరువాతి కాలమున ఱ, ల, హ, ష, గ మారి, మన భాషలో లోపించి పోయినది. ఈ వర్ణముతో గూడిన పదములనేకములు కలవు. ఉదా :

పొగఱు   ఏఱువేలు   తోఱ
పఱుమటి   లేట్టికోఱు   పుఱోలి
అఱిసిన   కొఱొచ్చు   కొఱుల్చు మొ॥

వీనిలో "కొఱొచ్చు" పదము రూపాంతరము 'క్ఱోచు' ఈ పదమునందలి 'ఱ' వర్ణము తరువాత 'ఱ'గ మారినది. అప్పుడివి 'కొఱొచ్చు', 'క్ఱోచు'– 'కొఱొచ్చు', 'క్రోచు' యగును. దీర్ఘము హ్రస్వము కాగా 'క్రొచ్చు'యైనది. 'క్రొచ్చు', 'గ్రొచ్చు' అయినది.

"గ్రొచ్చి కోరాడి త్రవ్విరి కుతలమెల్ల" – భాగవతము.

'క్రొచ్చు', 'గ్రొచ్చు'ల ప్రేరణరూపము, 'క్రొప్పించు', 'గ్రొప్పించు'.

"పెంచెం జట్టలనెల్లఁ బేర్మివెలయం బెట్టించె సత్రంబుగ
ట్టించెం భక్తి శివాలయంబు లిలఁబ్రొ ఢిం దాల్చి యొప్పంగఁ గ్రొప్పించెం బూర్ణతటాకముల్....."

రెండవ వింతవర్ణము 'వాన్ఱు'లోని 'ఱ'. ఇది కేవలము 'ఱ' కాదు. నాలుక మడతవేసి పలికినప్పటి 'ఱ' రూపము. ఇది సగము 'ట'గను, సగము 'ఱ'గను పలుకును. ఇది ప్రాచీనాంధ్రశాసనములలో 'వాన్ఱు', 'మగన్ఱు', 'మూన్ఱు', 'విన్ఠి నాయకున్ఱు' అనుపదాదులలో గనబడును. ఈ 'న్ఱు' చివరికి 'ండు'గా మారినదందురు. 'వాన్ఱు' అనుదాని కిప్పుడు 'వాడు', 'మూన్ఱు' అనుదానికి 'మూడు' అని ఈ విధముగ ఆ పదముల పరిణామమును దెలిసికొనవచ్చును. దీనినిగురించి ముందు విపులముగా భారతిలో వ్రాసెదను. ఈ వింతవర్ణము 'ఈఱ్లు' అనుదానిలో కూడ గనబడును. 'ఈఱ్లు' అఉన్నది 'ఈఱు' రూపాంతరమని నేను భావించుచున్నాను. 'ఱు' బహువచన ప్రత్యయము. 'పాఱ' లోని 'ఱ'యును బహువచన ప్రత్యయమే అందురు. 'పాఱ' అనగా బ్రాహ్మణులు: దీని ఏకవచనము 'పాడు'. చూడు డీ యుదాహఱణము:

"దేని నిల్పినవానికి వేగుఱ్ఱుము వేసెఱువుళువేవాన్ఱూఱ్ఱు నిల్పిన పుణ్యంబు."

'వే'యన వేయి. 'వేవాన్ఱూఱ్ఱు' = వేయి పాండూడ్ఱు– వేయిపాండూళ్లు – వేయిపాఁడూళ్లు అనగా వేయి బ్రాహ్మణాగ్రహారములు. పాఁడు అనగా బ్రాహ్మణా గ్రహారమని ప్రప్రథమమున గుర్తించినవాడు, 'వేవాన్ఱూఱ్ఱు' అనగా వేయి బ్రాహ్మణాగ్రహారములని చెప్పినవారు పూజ్యశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు. 'పాఱ' వంటిదే 'చూపఱ'. చూపఱయన చూచు వారు అని అర్థము.

'ఇఝ్ల' అనుదానిలోకూడ నీ వర్ణము వచ్చును. 'ఇట్ల' అగునేమోయని నేనూహించుచున్నాను. 'ఇఝ్ల కాన్పు వెఱుఝ్గువారు', ఇఝ్లకావెఱుగువారు' అను వాక్యము కడు ప్రాచీన శాసనములు కొన్నిట గానవచ్చును. ఇది యానాటి నుడికారపు పొందికయేమో 'ఇట్లనియే యెఱగువారు' అని దాని యర్థమై యుండునని నా యూహ.

పూర్వపు తెలుగు :

నా కింతవరకు లభించిన మొట్టమొదటి సంపూర్ణాంధ్రభాషా శాసనము ఆఱవ శతాబ్దినాటిది. దీనిని నేనిదివరలో స్వర్గీయ శ్రీ గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారి 'కమ్మెమొరేషన్' సంపుటములో ప్రకటించినారు. దానిని మరల ఈ క్రింద నిచ్చుచున్నాను.

"స్వస్తి ।* శ్రీ సోఅమహారాజు ల్లొళన ఇన్పుటోలి అణపోతులు రేవణకాలు పుద్దణకాలు ఇచ్చిన పన్నస పెన్వాతిఇశెతేనికిన్ ।* తేని ఱిచ్చిన వాన్టు పఞ్చమహాపాతకున్టకున్ ॥*"

మఱియొక శాసనము :

"మణయ శమ్మణ గణయ శమ్మణ వృద్ధ శమ్మణ ఇమువ్వర ఒకాదుబోళచేత శవణ గోణిరి ॥* ఇఙ్ల కావెఱుగువారు ॥* సమితిబోళుము విసబోళుము పణ్టిముకునరట్టొఞ్లు పుణ్యసాఞ్లు వన్టిబోళుము ఇన్దొఱు దినికి సక్షి ॥* అఱుగరాలన్వారు విషయబోళ కొణిరి ॥*

క్రిందిగీటుమీది యక్షరములలోని 'ఱ' వింత యక్షరముగ చెప్పబడిన 'ఱ'. ఇది తరువాతి కాలమున 'ద'గ మారినది.

ముగింపు :

నన్నయకు పూర్వము తెలుగు ఎట్లుండెడిది అను విషయమును దెలిసికొనుటకు ఈ వ్యాసము ఒక దిఙ్మాత్ర సూచన. నన్నయకు పూర్వపు తెలుగు శాసనములను మననము చేసి మథించి తీయవలసిన అమూల్య రత్నాదికము లెన్నో యున్నవి. ఇప్పటికి ప్రకటితము లయిన నన్నయకు పూర్వపు తెలుగు శాసనములు చాలకొద్ది. రాయలసీమలోను, నెల్లూరు మండలములోను పర్యటనముచేసి సేకరింపవలసినవి చాలాకలవు. ఈ శాసనములన్నిటిని అవలోకనముచేసి, చక్కగ పరిశోధక దృష్టితోచదివి మననము చేసినచో నన్నయకు పూర్వము తెలుగు స్వరూపమును బాగుగ తెలిసికొనుట కవకాశము కలుగునని నా విశ్వాసము. అంత సమగ్రమయినది కాకపోయినను ఆభాష కొక వ్యాకరణము వ్రాయుటకు వీలగునని నాయభిప్రాయము.

చెప్పవలసిన విశేషము లింకను అనేకములున్నను గ్రంథవిస్తరభీతిచేత ఈ వ్యాసము నింతటితో ముగించుచున్నాను.

(ఆంధ్ర పత్రిక – వృష సంవత్సరాది సంచిక)

తేనెల తేట మాటలతో
దేశమాతనే కొలిచెదమా
భావం భాగ్యం కూర్చుకొని – ఇక
జీవనయానం చేయుదమా

సాగర మేఖల చుట్టుకొని – సుర
గంగ చీరగా మలచుకొని
గీతాగానం పాడుకొనే – మన
దేవికి యివ్వాలి హారతులు.... ।తే।

గంగా జటాధర భావనతో – హిమ
శైల రూపమే నిలబడగా
గలగల పారే నదులన్నీ – ఒక
బృందగానమే చేస్తుంటే.... ।తే।

ఎందరొ వీరుల త్యాగఫలం – మన
నేటి స్వేచ్ఛకే మూలబలం
వారందరినీ తలచుకొని – మన
మానస వీధిని నిలుపుకొని... ।తే।

– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

పరాంకుశం దామోదరస్వామి

భాగ్యనగరాయణం

(హైదరాబాద్ – సికిందరాబాదు నగరాలలో చాలాకాలం క్రితం వెలసిన పేటలు, వీధులు, వాడల పేర్లు – పుట్టుపూర్వోత్తరాలకు అద్దంపట్టే వ్యాసపరంపర ఇది.)

పేరులో ఏముంది? అని ఒక కవి నిరాశ, నిరాసక్తత వ్యక్తం చేశాడు.

మరో కవి – పేరులోనే ఉంది పెన్నిధి అంటాడు.

ఇక ప్రాచీన భాషా పండితులు – దేవుళ్ళ పేరలకు అక్షరానికి ఒక అర్థాన్ని చెప్పి, క్రొత్త అర్థాలు కల్పించారు.

ఏ భాషలోనైనా సరే – పేర్లకు అందమైన, భావస్ఫోరకమైన అర్థాలు ఉంటాయి. అవి ప్రాచీన సంఘటనల గురించి చెబుతాయి. గత చరిత్ర వైభవాన్ని స్ఫురింప జేస్తాయి. కొన్ని పేర్లు గమ్మత్తుగా, మత్తుగా ఉంటాయి. ఎన్నో ఉపాఖ్యానాలు స్ఫురణకు వస్తాయి. చారిత్రక, సామాజికపరమైన విశేషాలు అవగతమవుతాయి.

జంటనగరాల రాజధానిలో గల పేటలు, వీధులు, వాడల పేర్లను, వాటి అర్థాలను తెలుసుకొన్నప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. నవ్వు వస్తుంది. ఎన్నెన్నో ఊహలు వస్తాయి. వాటిపై వ్యాఖ్యలు చేయాలనిపిస్తుంది.

ప్రియురాలి గోరింటాకు

"ప్రియురాలి గోరింటాకు" అన్నప్పుడు రసికుని మనసు రాగరంజితం అవుతుంది. ప్రియురాలు క్రొత్త పెళ్ళి కూతురువలె చేసుకొనే అలంకరణతోబాటు అరచేతులకు, పాదాలకు 'గోరింటాకు' చిత్ర విచిత్రంగా అలరుకుంటే మరింత ఆకర్షణీయంగా ఉండదూ?

అయితే, "ప్రియురాలి గోరింటాకు" అనే అర్థం వచ్చే విధంగా ఉర్దూలో "మెహబూబ్‌కీ మెహిందీ' ' అని 'వేశ్యావాటిక'కు పేరు పెట్టడంలో ఎంతో ఔచిత్యం ఉంది. రసికత ఉంది. నర్మగర్భితం ఉంది. ఇప్పుడా వీధి – ఆ వీధిగా లేదు. పేరు మాత్రం చిరస్థాయి అయింది. మూసీనదికి దక్షిణ గట్టుపై పాతబస్తీలో హైకోర్టు భవనాలకు వెనుకవైపున ఉంది. ఆ పేటకు ముందు ఖాళీగా ఉన్న మైదానంలో ప్రస్తుతం స్టేడియం నిర్మాణం జరిగింది. ఇప్పుడు మీకు 'మెహబూబ్‌కీ మెహందీ' చిరునామా

తెలిసిందనుకుంటాను?

అక్కడ 20–25 సంవత్సరాల క్రితం వరకు స్త్రీల ముషాయిరాలు, గానా బజానాలు, నృత్య వినోదాలు జోరుగా సాగేవి. ఇప్పుడు వాటి స్థాయి తగ్గి, చౌకబారు అయ్యింది.

నగరంలో బస్తీల పేర్లు వీధుల పేర్లు తెలుసుకోవాలన్న ఉత్సాహం కలుగుతున్నది కదూ? ఓపిక ఉంటే కాలినడకన నడుస్తూ సాగుతుండండి. పోనీ ఓపిక లేదంటారా – ఓ రిక్షా మాట్లాడుకొని ప్రయాణం చేయండి. ఆ రిక్షా వ్యక్తి కాస్త వృద్ధుడు, పాతబస్తీ వాడయితే సరేసరి. వచ్చీరానీ తెలుగులోనో, ఉర్దూలోనో, అడుగడుగున తగిలే వాటిపేర్లు చెబుతాడు. అయితే కొన్ని పేర్ల అర్థాలకొరకు హైదరాబాద్ పాత చరిత్ర తిరగ వెయ్యవలసిందే. రాజవంశీకుల పేర్లు తెలుసుకోవాలి. కాస్త ఉర్దూ కూడా వచ్చి ఉంటే మంచిదే.

దుల్హాఖాన్ నవాబ్‌కీదేవ్‌డి

దుల్హాఖాన్ నవాబ్‌కి దేవ్‌డి (పెళ్ళి కొడుకు ఖాన్ నవాబ్ భవంతి), కోకాకి తట్టి, చార్ కందీల్ (నాలుగు లాంతర్లు), దూద్‌బౌలి (పాలబావి), జీరా (నీటి ఊట), లాల్ దర్వాజా (ఎర్రని తలుపు), ఫీల్‌ఖానా (గజశాల), కబూతర్ ఖానా (పావురాల గూడు), తోప్‌ఖానా (తోపులబట్టి) వంటి పేర్లు గల వీధులు ఎన్నెన్నో మనకు ఎదురవుతాయి. కొన్ని పల్లెటూర్లలో పక్షులు వాలడానికి ఎత్తైన గడనుపాతి, దానిపై చతురస్రాకారపు వెదురు తడకను అమరుస్తారు. అలాంటిదే పాతబస్తీలో ఉండేదేమో? దానిని ఉర్దూలో "కోకాకీతట్టి" అంటారు. ఇప్పుడా ప్రాంతానికి ఆ పేరు స్థిరపడినప్పటికీ ఇపుడా గడ కనిపించదు. పక్షులూ రావు.

నిజాం రాజవంశానికి చెందిన ఖాన్‌నవాబ్ వివాహ సందర్భంగా ఆయనను పెళ్ళికొడుకును చేశారు. ఆ సంఘటన జ్ఞాపక చిహ్నంగా ఒక భవనం నిర్మించారు. దాన్ని 'దుల్హేఖాన్ నవాబ్‌కీ దేవిడి' అన్నారు. ఇప్పుడా ప్రాంతానికి ఆ పేరు స్థిరపడిపోయింది.

(1–7–1987)

లక్‌డీకాపూల్

జంటనగరాలలో బస్తీల పేర్లకు మన ఊహలు జోడించి ఆలోచిస్తే జనాభాలోని కులాలను, మతాలను ఇతరత్రా ఎన్నో వర్గాలుగా విభజించవచ్చును. రాజవంశీకుల పేర్లు కూడా ఉండటం గమనించవచ్చు.

మొగల్‌పూర, డబీర్‌పూర, కాచీగూడ, కవాడిగూడ, గౌలిగూడ, బోయిగూడ, బ్రహ్మన్‌వాడి, కోమటివాడి, కుమ్మరివాడి, బీదర్‌వాడి, ఇరానీగల్లి, జౌహర్‌గల్లి వంటివి ఉన్నాయి.

కొన్ని పేర్లు మానసిక స్వభావాన్ని చెప్పగా, మరికొన్ని వారాలను స్ఫురణకు తెస్తాయి.

చెంచల్‌గూడా అంటే – తుంటరివారి పేట అని అర్థం చెప్పుకుందామా? వాస్తవానికి ఇప్పటికీ ఆ ప్రాంతం "రౌడీమూక"కు ప్రసిద్ధి అంటే, అక్కడి వారు బాధపడకుండా, క్షమిస్తారని ఆశిస్తాను. ఇక దోమల్‌గూడా దోమల కేంద్రమని అర్థం. ఒకప్పుడు అక్కడ దోమలు విపరీతంగా ఉండేవేమో?! ఎందుకంటే, టాంక్‌బండ్ దిగువన 30 సంవత్సరాల క్రితం వరకు చిత్తడి నేలగా ఉండేది. అప్పుడు దోమలు విపరీతంగా ఉండేవి. అందుకే దానికాపేరు వచ్చిందని సరిపెట్టుకోవచ్చును. ఇప్పుడంటారా – నగరమంతా "దోమల్‌గూడా"యే!

ఇక వారాల పేర్లతో – మంగల్‌హాట్ (మంగళవారం బజారు), జుమ్మెరాత్ బజార్ (గురువారం బజారు), ఇత్వార్‌చౌక్ (ఆదివారం సంత) ఉండనే ఉన్నాయి.

వీటిలో గూడ, పేట, పురా, పల్లె వంటి పదాలు చేరినందువల్ల "హైదరాబాదు" నగరంగా ఏర్పడక ముందు, అవన్నీ చిన్న చిన్న గ్రామాలుగా ఉండేవని అవగతం చేసుకోవచ్చును. క్రమంగా అవన్నీ కలిసిపోయి, నగరంగా ఏర్పడిన తరువాత వాటి స్వంత పేర్లతోనే – బస్తీలుగా మారాయని చెప్పవచ్చును.

మరికొన్ని పేర్లను పరిశీలించినప్పుడు, వాటి భౌతిక పరిస్థితులను అవగతం చేస్తాయి.

చార్‌కమాన్ (నాలుగు ప్రవేశ ద్వారాలు), పత్తర్‌గట్టి (రాతి నిర్మాణం) గోల్‌నాకా (గుండ్రని పోలీస్ స్టేషన్), బడేచౌడీ (విశాలమైన కూడలి), కవేలీ కమాన్ (గూనపెంకుల ప్రవేశద్వారం) లోహేకాపూల్ (ఉక్కు వంతెన) లక్డికాపూల్ (కర్రవంతెన) వంటివి ఈ వర్గంలో చేరుతాయి.

అయితే ఇప్పుడు అక్కడకు పోయి చూస్తే అవి కనిపించకపోవచ్చు. కనిపించినా వాటి స్వరూప స్వభావాలలో మార్పులు రావచ్చును.

ఇప్పుడు 'బడీ చౌడీ'ని సందర్శిస్తే క్రిక్కిరిసిగా, రోడ్లు ఇరుకుగా కన్పిస్తాయి. గూనపెంకులతో ద్వారం లేదు. ఒకప్పుడు కర్రతో ఆ వంతెనను నిర్మించడం వల్ల అప్పుడు దానిని లక్డీకాపూల్ అన్నారు. ఇప్పుడు సిమెంటు, సున్నం, రాళ్ళతో వంతెన నిర్మించారు,. వాటి పూర్వ స్వభావం మారినప్పటికీ, అప్పటి పేర్లే స్థిరపడినాయి. ఈ మార్పును గమనిస్తే – కాసేపు నవ్వుకోవచ్చును.

సంఖ్యామానంతో కూడిన వీధుల పేర్లు కూడా ఉన్నాయి.

ఫస్ట్‌లాన్సర్, సెకండ్‌లాన్సర్, తీన్‌గుడి (మూడు గుళ్ళు), చార్మినార్ (నాలుగు మినార్లు), చార్‌కమాన్ (నాలుగు ద్వారాలు), పంచ్‌మహల్ (అయిదు మహళ్లు), ఛట్టాబజారు (ఆరుబజారులు), బారాహ్‌గల్లి (పన్నెండువీధులు) బారాదరీ (పన్నెండు తలుపులు) వంటివి ఉన్నాయి. ఒకప్పుడు ఆ సంఖ్యలో అవి ఉన్నా ఇప్పుడు ఆ ప్రాంతాలు ఆ పేర్లతో స్థిరపడినాయి.

చోర్‌బజార్, దూద్‌బౌలి

హైదరాబాదు నగరంలో గత వైభవాన్ని గుర్తుకు తెచ్చే పచ్చపచ్చని తోటల పేర్లు, హరివిల్లులోని రంగులను స్ఫురింపచేసే ప్రాంతాలు కూడా ఉన్నాయి. హరిబౌలి (పచ్చని బావి), రంగేళీ కిటికీ (రంగు రంగుల గవాక్షం), లాల్‌బంగ్లా (ఎరుపు భవనం), ఎర్రగడ్డ (ఎర్రని మెట్టభూమి), లాల్‌టేక్డి (ఎరుపుమిట్ట), నల్లకుంట (నలుపుకుంట), కాలీపత్థర్ (నల్లనిరాయి), కాలీ కమాన్ (నల్లని ద్వారము) వంటివి.

మరికొన్ని పేర్లు హాస్యాన్ని చిందిస్తాయి. నవ్వులు పుట్టిస్తాయి.

ఫుగట్‌నగర్ (ఉర్దూలో "ఫుగట్" అంటే "ఉచితంగా" అని అర్థం. ఉచితనగర్ అని ఆ ప్రాంతం పేరు). చోర్‌బజార్ (దొంగల వీధి అని అర్థం). మోతీనాలా (ముత్యాల కాలువ).

హైదరాబాదు విమానాశ్రయం ఉన్న ప్రాంతాన్ని "బేగంపేట" అంటారు. చాలా సుప్రసిద్ధమైనదే కాకుండా, పెద్దపెద్ద ఆధునిక భవనాలతో సంపన్నంగా కనిపిస్తుందిప్పుడు.

ఉర్దూలో 'బేగం' అంటే 'భార్య' అని అర్థం. 'పేట' తెలుగు పదాన్ని ఉర్దూలో 'పేట్' అంటే 'బొజ్జ' అని అర్థంగా మారుతుంది. ఇప్పుడు 'బేగంపేట' అంటే 'భార్యబొజ్జ' అన్న అర్థాన్ని కల్పించుకొంటే హాస్యంగా ఉండదూ? అదే విధంగా అమీర్ అంటే ధనవంతుడు. 'అమీర్‌పేట' అంటే 'ధనవంతుని బొజ్జ' అన్నప్పుడు నవ్వురాదూ?!

మరికొన్ని పేర్లు విచిత్రంగా ఉంటాయి. దూద్‌బౌలి (పాలబావి) ప్రాంతం ఉంది. అక్కడి బావిలో పాలు ఉండకపోవచ్చును. కాని, పాలలాంటి తియ్యనైన నీరు అందులో ఉండవచ్చును. అందుకే ఆ ప్రాంతానికి 'దూద్‌బౌలి' అని పేరు వచ్చింది. ఇప్పుడా బావిలోని నీరు రుచి చూస్తానంటారా? నాచుతో, చెత్తా చెదారంతో ఉంటాయి. 'పుత్లీబౌలి' కూడా ఒక ప్రాంతం పేరు. ఆ బావికి 'పుత్లీ' బొమ్మల అలంకరణ ఆదిలో ఉండి ఉండవచ్చును. కాని ఇప్పుడది లేకపోయినా, ఆ ప్రాంతానికి ఆ పేరే స్థిరపడి పోయింది. అదేవిధంగా "గచ్చిబౌలి" గచ్చీ అంటే సున్నం – సున్నపు బావి అని అర్థం, పిసల్‌బండ (జారుడురాయి) వంటివి విచిత్రమైన పేర్లు ఉన్నాయి. ఒక సినిమా కవి, సినిమా పాట ఒక దానిలో 'పిసల్‌బండ' అన్నదానికి విచిత్రమైన అర్థం కల్పించి ఆ పాట వింటేనే వెర్రెక్కించాడు. గోడే–కి–కబర్ (గుర్రపు సమాధి) కూడా ఒక వీధికి పేరే! ఎవరో ఒక సైనికుడు తన గుర్రం చనిపోతే ప్రేమతో సమాధి కట్టించాడు. ఇప్పుడా సమాధి ఉంది. పేరు శాశ్వతమైంది. మచిలీకమాన్ (చేపల ద్వారం) రేన్ బజార్(రాత్రి వీధి) వంటి వీధుల పేర్ల వెనుక కథలు, గాథలు ఉంటాయి.

నగరంలో మరికొన్ని వీధులు పేర్లు వాటి పరిసరాలను, వాతావరణాన్ని కూడా తెలియచెబుతాయా అనిపిస్తుంది. గంధీబౌలి (మురికిబావి) కాలాడేరా (నల్లని గుడారం) చిక్కడపల్లి (మురికిపల్లె), ధూల్‌పేట్ (ధూళిపేట) దోమల్‌గూడా (దోమల గూడెం) కడలీబజార్ (చేదు వీధి) వీటిల్లో చిక్కడపల్లి సుప్రసిద్ధమైంది. ఒకానొకప్పుడు అక్కడంతా బురదమయంగా ఉండేదేమో? అందుకే ఆ పేరు వచ్చింది. ధూల్‌పేట ప్రస్తుతం సారా ఉత్పత్తికి ప్రసిద్ధమైంది. లోధీ అను తెగ వారు ఇంటింటికీ సారా బట్టీలు పెట్టుకొని రహస్యంగా అమ్ముతుంటారు. పోలీసు వారి పరిభాషలో దీనిని 'గుడుంబా నగర్' అంటారు. హైదరాబాద్ గుడుంబాకు ఇతర రాష్ట్రాలలో కూడా మంచి పేరుంది. మోటారు ట్యూబులలో సారా నింపి రవాణా చేసే ఈ వ్యాపారం "మూడు పెగ్గులు ఆరు సీసాలు"గా వర్ధిల్లుతున్నది. ఇక కడలీలేన్ – ఈ వీధిలోనికి వెళ్ళినవారు మోసాలకు గురై చేదు అనుభవాలతో వచ్చే వారు కాబోలు – అందుకే దానికా పేరు వచ్చింది.

ఎర్రగడ్డ అంటే ఎర్రని మిట్ట అని అర్థం. చిరకాలంగా అక్కడ మానసిక వ్యాధుల చికిత్స ఆసుపత్రి ఉంది. నగరంలో పాత వాసనలు గలవారు, ఎవరితోనైనా మాట్లాడుతూ, మాటల సందర్భంలో "పిచ్చిపట్టిందా" అనడానికి బదులు "ఎర్రగడ్డ నుంచి వొచ్చినావ్" అనడం ఆనవాయితి.

కవితా వైభవం చిందే పేర్లు

భాగ్యనగరంలో మరికొన్ని ప్రాంతాల పేర్లు ఊహాతీతంగా, కవితా వైభవంతో వుండటం కూడా విశేషమే!

'మురాద్‌నగర్' అంటే కోరికల నగరం అని అర్థం. 'దారుస్సలాం' అంటే 'ప్రశాంత గృహం' అని భావం. ఇప్పుడది ఇత్తెహాదుల్ ముసల్మీన్ పార్టీ ప్రధాన కేంద్ర కార్యాలయం. "ఆరామ్ ఘర్" విశ్రాంతి భవనం అని, "ఫలక్‌నుమా" అంటే "ఆకాశదర్శనం" అని అర్థం. 'ఫలక్‌నుమా ప్యాలెస్" ఇప్పటికీ సుప్రసిద్ధమైనదే. రాజవంశీకుల వస్తువులు అక్కడ ప్రక్షిప్తమై ఉన్నాయి.

హైదరాబాద్ నగరంపై 'పోలీసు చర్య' తరువాత, తొలిసారిగా ఇక్కడకు వచ్చిన అప్పటి భారత ఉపప్రధాని సర్దార్ వల్లభభాయి పటేల్ విడిది ఇక్కడే ఏర్పాటు చేశాడు అప్పటి నిజాం నవాబు – ఉస్మాన్ ఆలీఖాన్ ఆ విడిదిని ఏర్పాటు చేయటం పటేల్ పట్ల నిజాం నవాబుకు గల భయం, భక్తి వెల్లడి చేస్తుందని అనుకొనేవారు.

ఇక దిల్‌సుఖ్‌నగర్, మనస్సుకు సుఖాన్ని కల్పించే నగరమని అర్థం. శాంతి నగర్ కూడా అలాంటిదే! ఉస్మానియా విశ్వవిద్యాలయం సమీపంలో 'విద్యానగర్' ఉంది. అప్పటి అధ్యాపకులు ఆ ప్రాంతంలో ఇళ్ళు కట్టుకొని 'విద్యానగర్' అని పేరు పెట్టుకొన్నారు. వాస్తవానికి ఆ ప్రాంతం 'అడిక్‌మెట్.' తెలుగులో 'అధికమెట్ట'. ఉర్దూలో ఆ విధంగా మారిపోయింది! "జహనుమా" అంటే "ప్రపంచ దర్శనం" అని అర్థం. ఆ పేరుతో గల ప్యాలెస్ చరిత్ర ప్రసిద్ధమైంది.

బైబుల్ కథకు చెందిన 'ఈడెన్ గార్డెన్' కూడా వుంది, 'కింగ్ కోఠీ'కి పోయే మార్గంలో కుడివైపుగా ఉన్న వీధికి ఆ పేరు వుంది. ఆకాశ

హర్మ్యాలు అని అర్థం ఇచ్చే 'ఆస్మాన్ మహల్', గగన్ మహల్ పేర్లతో వీధులు వుండనే వున్నాయి.

రోడ్డు రవాణా సంస్థ వారి సెంట్రల్ బస్ స్టేషన్‌కు సమీపంలోనే మూసీ నదికి మధ్యలో విశాలమైన 'ద్వీపం' వుంది. దానినే 'ఇమ్లీబన్' అంటారు. అంటే 'చింతతోపు' అని అర్థం. ఇప్పుడా చింతచెట్లూ లేవు. తోపు లేదు. చిత్తడిగా చెట్లు మాత్రం పెరిగాయి. ఆ స్థలంలో రవాణా సంస్థవారు దాదాపు 15 కోట్ల రూపాయలు వెచ్చించి ఆధునిక సౌకర్యాలతో 'బస్‌స్టేషన్' భవనాలు నిర్మించనున్నారు. అయినా 'ఇమ్లీబన్' అనే పేరు శాశ్వతంగా ఉంటుందని ఆశిద్దాం! ఉప్పుగ్రామంగా స్ఫురింపజేసే 'ఉప్పుగూడా' ఉంది. బిరియాని (మాంసం, మసాలాలు వేసి, వండిన అన్నం) పేరుతో 'బిరియాని పాల్‌కిటేక్డి' అన్న వీధి కూడా వుంది. ఒక వీధికి 'చక్నావాడి' అన్న పేరు కూడా వుంది. 'చక్నా' అంటే "మేక ప్రేవులతో చేసే వంటక" విశేషం. అదేవిధంగా షక్కర్ బుండా (చక్కెర గడ్డ) అన్న 'తీయటి' పేరు కూడా వుంది. 'మిస్రిగంజ్' – కలకండ మార్కెట్ కూడా వుంది. పాలకేంద్రం అర్థంతో 'దూద్‌ఖానా' వుంది. జామతోట పేరు 'జామ్‌బాగ్' వుంది. మొజాంజాహి మార్కెటుకు ఎదురుగా నిన్న మొన్నటి వరకు పండ్ల టోకు వ్యాపారం జరిగిన ప్రాంతమే 'జాంబాగ్'.

ఒకప్పుడు అక్కడ సీతాఫలాలు విరివిగా అమ్మేవారేమో – ఆ ప్రాంతాన్ని 'సీతాఫల్‌మండి' అన్నారు. దాల్ (పప్పు) మండి, సబ్జి మండి (కూరగాయల మార్కెటు), పాన్‌మండి (తమలపాకుల మార్కెటు), ఘాఁస్ మండి (గడ్డి మార్కెటు) కూడా వున్నాయి.

'మూసారాంబాగ్' అన్న పేట కూడా నగరంలో వుంది. ఎవరీ మూసారాం అని చరిత్ర పుటలు తిరగవేయగా ఆ పేరు అసలు స్వరూపం తెలిసి నవ్వాల, ఏడ్వాలో అర్థం కాలేదు. ఫ్రెంచి సైనికాధికారి "మన్సూర్ రేమండ్" సమాధి వున్న తోటకే ప్రస్తుతం మూసారాంబాగ్ పేరు! అదే విధంగా సైనిక శిబిరాలు వుండే బ్యారెక్స్ 'బారకాసు' అయ్యింది.

క్వారెంటైన్–కోరంటీగా మారింది. శంకరమఠానికి పోవటానికి ముందు మురికి కాలువపైగల వంతెన దాటగానే ఎడమవైపు ప్రభుత్వ ఆసుపత్రి వుంది. మొన్నటివరకు 'ప్రభుత్వ జ్వర చికిత్సాలయం' అనేవారు. అదే గతంలో 'క్వారంటైన్'. నగరంలో ప్లేగువంటి అంటువ్యాధులు వచ్చిన వారికి ఊరికి దూరంగా అప్పటి కాలంలో ఈ ఆసుపత్రిని నిర్మించారు. ఆ ప్రాంతమే 'కోరంటీ'గా మారిపోయింది. ఇప్పుడా ప్రాంతం జనంతో క్రిక్కిరిసి పోయింది.

ప్రజల ఉచ్చారణా దోషం వల్ల నిజనామం మరుగున పడిపోయి, మరో రూపంలో పేరు నిలిచిన వీధులు కూడా వున్నాయి. 'నాలుగు వైపులా జలాశయం' అన్న అర్థాన్ని యిచ్చే 'చార్–సు–హౌజ్' తుదకు 'గుల్జార్ హౌజ్' అయింది.

గతంలో ఎప్పుడో అక్కడ జలాశయం ఉండేది. అక్కడి నుంచి నాలుగు మార్గాలు వుండటం వల్ల ఆ పేరు వచ్చింది. 'సు–కా' అన్న పార్శీ పదానికి 'నాలుగు వైపులా' అన్న అర్థం వుంది. అది తుదకు 'సూఖా' అన్న ఉర్దూ పదంగా మారింది. 'సూఖా' అంటే 'ఎండిపోయిన' అన్న అర్థంలో ఎండిపోయిన జలాశయం అయ్యింది. కాలక్రమేణా అక్కడే తిరిగి జలాశయం ఏర్పాటుచేసి దానికి 'గుల్జార్‌హౌస్' – గులాబీల వనంగా తీర్చిదిద్దారు. ఇప్పుడా వనం లేదు. నీరు ఎగజిమ్మే విధంగా గొట్టాలు అమర్చారు. గులాబీవనం లేక పోయినా ఇప్పుడా పేరు నిలిచిపోయింది. ఆ పరిసరాలలో మాత్రం పూలదండలు అమ్ముతుంటారు.

కుతుబ్‌షాహి వంశంలోని చివరి రాజు అబుల్‌హసన్ తానీషాకాలంలో అబ్దుల్ రజాక్ లారీ అన్న సైన్యాధికారి వుండేవాడు. అసమాన ధైర్య శౌర్యవంతుడు అయిన ఆయన గృహం అక్కడ వుండటంవల్ల తొలుత ఆ ప్రాంతానికి 'లారీ బజార్' అన్న పేరు స్థిరపడింది. తుదకు అది ప్రజల నోళ్ళలో నాని, లాడ్ (ముద్దు మురిపాల) బజారు అయ్యింది.

మాసాబ్‌టాంక్ అయిన 'మాసాహిబా'

రాజధాని నగరంలో ప్రాచీన వీధులు, ప్రాంతాల పేర్లు రాజులు, రాణులు, రాజకుమారులు, రాజవంశీకులు, పుర ప్రముఖుల పేర్లతో జోడించి వున్నాయి.

హైదరాబాద్ నగరం పేరే అలాంటి వాటిల్లో ఒకటి! ఖులీఖుతుబ్‌షా యువరాజుగా వున్నప్పుడు "భాగ్‌మతి" అన్న యువతిని ప్రేమించాడు. ఆమె నివాస గ్రామం పేరు 'చిచిలం'. ప్రస్తుత చార్మినార్ సమీప పరిసరాలలో ఆ గ్రామం వుండేది. ప్రేయసీ ప్రియులు తరుచుగా, ప్రస్తుతం చార్మినార్ నిలిచి వున్న స్థలంలోనే కలుసుకొనే వారని చారిత్రక పరిశోధకుల ఊహ! ఆ తరువాత 'ఖులీ' ఆమెను పెళ్లి చేసుకొని 'హైదర్ మహల్' అని నామకరణం చేశాడు. ఆమె పేరటనే 'హైదరాబాదు' అయ్యింది. 'ఆబాద్' అంటే జన సంచారం అని అర్థం.

అదేవిధంగా ఆసఫ్‌జాహి వంశం పేరట 'ఆసిఫ్‌నగర' పేరు వచ్చింది. అఫ్జల్‌గంజ్, మెహబూబ్‌గంజ్, ఉస్మాన్‌గంజ్, మోజంజాహి మార్కెట్, ఆజంజహీ రోడ్, సికిందరాబాదు వంటి పేర్లు రాజవంశీకుల పేర్లతో ముడిపడి వున్నాయి.

ఈ ప్రాంతాన్ని ఖుతుబ్‌షాహి వంశస్తులు పరిపాలించారు అనటానికి గుర్తుగా "ఖుత్బీగూడా" కూడా నిలిచి ఉంది.

ఆరవ మహ్మద్ ఖులీఖుత్‌బ్‌షా తల్లి ఖానూమా ఆగా పేరిట "మా–సాహిబా–తాలాబ్" నిర్మాణం జరిగింది. 'మా సాహిబా' అంటే 'అమ్మగారు' అని అర్థం. ఆమెను ప్రజలందరూ 'మా సాహిబా' అనేవారు! ఆమె పేరిట వెలసిన తటాకం తుదకు 'మాసాబ్‌టాంక్' అయ్యింది. ఇప్పుడక్కడ తటాకమే కాదు, తామర తంపరవలె ఇళ్ళు లేచాయి. అయినా ఆ పేరే నిలిచిపోయింది. ఇక ఆయన భార్య 'హయాత్ బక్షీ బేగం' పేరిట 'హయాత్‌నగర్', కూతురు ఖూరున్నిసాబేగం పేరిట 'ఖైరతాబాద్' నిర్మాణం జరిగింది. తానీషా వద్ద మంత్రులుగా ఉన్న అక్కన్న – మాదన్నల పేరిట అక్కన్నపేట, మాదన్నపేటలు ఇప్పటికీ సుస్థిరంగా వున్నాయి.

అబ్దుల్లా ఖుతుబ్‌షా, నవాబ్ సికిందర్‌ఝాల వద్ద ప్రధాన మంత్రులుగా వున్నవారి పేరిట 'మీరాలం చెరువు', 'మీర్‌జుమ్లా చెరువు' నిర్మితమయ్యాయి.

మీరాలం చెరువు ఒకప్పుడు ఆ ప్రాంత ప్రజలకు మంచినీటి వసతిగా వుండేది. ఇప్పుడు ఆ ప్రక్కనే గల 'నెహ్రూ జూపార్క్'లోని జంతువుల మంచినీటి అవసరాలను తీరుస్తున్నది. చెరువుకై నిర్మించిన 'ఆనకట్ట' గోడలు 'తరంగా' వలె వుండటం ఆ కాలంనాటి ఇంజనీరింగ్ ప్రతిభకు మచ్చుతునకగా చెప్పుకుంటారు.

నవాబ్ సికిందర్‌ఝా పేరిట 'సికిందరాబాద్' వెలసింది.

ఆరవ నిజాం నవాబు నసీరుద్దౌలా వద్ద ప్రధానమంత్రిగా ఉన్నరాజా చందూలాల్ పేరిట 'చందూలాల్ బేలా' – వీధి ఇప్పటికీ వుంది.

ఇది పేర్ల పట్టీ

ప్రస్తుతం ప్యాలెస్ టాకీస్ ఉన్న ఆవరణలో 'ఆబిడ్స్' అనేవాడు ఒక దుకాణం పెట్టాడు. అది సంపన్న కుటుంబాలకు 'షాపింగ్' సెంటరుగా అభివృద్ధి చెందింది. చివరకు ఆయన పేరిటనే 'ఆబిడ్స్ షాప్' అయింది. ఇప్పుడా ప్రాంతానికి ఆ పేరే నిలిచిపోయింది. ఇప్పటికి ఆ ప్రాంత సంపన్నులకు 'షాపింగ్ సెంటర్'గా వుండటం విశేషం. అదేవిధంగా అటు బ్రిటిష్ వారికి, ఇటు నిజాం నవాబులకు నమ్మకంగా ఉంటూ వర్తక వ్యాపారాలు చేసుకొంటూ 1927లో మృతి చెందిన 'రాయ్ సాహెబ్ రాందయాల్ ఘాన్సీ' పేరిట 'ఘాన్సీ బజార్' ఇప్పటికి వుంది.

సాలార్‌జంగ్ వద్ద విశ్వాసపాత్రుడు, స్వామిభక్తి పరాయణుడు అయిన 'సిద్దంబర్' అనే ఆఫ్రికా జాతీయుడు నౌకరుగా వుండేవాడు. ఆయన మృతి చెందిన తరువాత జ్ఞాపక చిహ్నంగా 'సిద్దంబర్ బజారు' వెలిసింది.

ఇప్పుడు ఉస్మానియా మహిళా కళాశాలగా వున్న భవనం–రెసిడెన్సీ– ఒకప్పుడు ఇంగ్లీషు వారికి స్థావరం. దాని ప్రక్కనే ఇంగ్లీషు సైన్యాలు వుండేవి. అదే ఇప్పుడు 'ట్రూప్ బజార్'. రెసిడెన్సీకి, ఆబిడ్స్‌కు మధ్య వున్న ప్రాంతం అది. అదేవిధంగా కింగ్ కోఠీ, సుల్తాన్‌బజారు అన్న పేర్లు వచ్చాయి. ఇప్పుడు 'కోఠీ' అన్న ప్రాంతమే అప్పటి 'రెసిడెన్సీ'. దీనిని ఉర్దూలో 'కోఠీ' అంటారు. మొన్నమొన్నటి వరకు ఆ ప్రాంతాన్ని రెసిడెన్సీ అని కూడా పిలిచేవారు.

నిజాం నవాబుల కాలంలో ఇంగ్లీషు వారికన్నా ముందు ఫ్రెంచివారి ఆధిపత్యం వుండేది. వారు తోపులు, తుపాకులు ఉత్పత్తి చేయటానికై ఒక కర్మాగారం నెలకొల్పారు. అదే ఇప్పుడు 'గన్‌ఫౌండ్రీ' అయ్యింది. ఇప్పటికి దానిని ఉర్దూలో 'తోప్‌కా సాంచా' అనీ తెలుగులో 'తోపులబట్టి' అనటం సర్వ సామాన్యం. ఇప్పటికీ ఆ కర్మాగారం ఆవరణను చారిత్రక ప్రాధాన్యతగల కట్టడంగా భద్రపరిచారు.

ఖుత్‌బ్‌షాహీల కాలంలో వర్తకులు గుంపులు గుంపులుగా వచ్చి విడిది చేసే చోటు ఇప్పటికీ 'కార్వాన్' అనే అంటారు. అదేకాలంలో వివిధ ప్రాంతాల నుంచి గుర్రాలపై తపాలా తీసుకవచ్చి ఒకచోట పంపిణీకి 'కేంద్రం' ఏర్పరుచుకొన్నారు. అదే 'తప్పాచబూతరా'. చబూతరా అంటే 'అరుగు.' ఇప్పుడక్కడ తపాలా చేరవేయడం లేదు అరుగూ లేదు. కాని ఆ ప్రాంతానికి ఆపేరే స్థిరపడింది.

అనాథ బాలబాలికల సంక్షేమ కేంద్రం భవనాన్ని సుల్తాన్ అబ్దుల్లా నిర్మించాడు. అది 'గోషా మహల్'. ఇప్పటికి ఆ ప్రాంతాన్ని ఆ పేరుతోనే పిలుస్తున్నారు.

గోలకొండ కోటపై ఔరంగజేబు దాడి చేసినప్పుడు తన సైన్యాన్ని నిలిపిన చోటును ఇప్పటికీ 'ఫతే మైదాన్' గానే పిలుస్తున్నారు. దానిచుట్టూ 'లాల్‌బహదూర్ స్టేడియం' నిర్మించారు. అది క్రికెట్ ఆటస్థలంగాను, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యాలయంగానూ ఉపయోగపడుతున్నది.

మొదటి ప్రపంచయుద్ధంలో ఇంగ్లీషు వారు సాధించిన విజయానికి చిహ్నంగా 'విక్టరీ ప్లే గ్రౌండ్' వెలసింది. చాదర్‌ఘాట్ వంతెన దాటి సిటీబస్ స్టేషన్‌కు పోయే మార్గంలో అది వుంది. ఆ గ్రౌండ్స్ క్రమంగా తగ్గిపోతున్నప్పటికీ, 'విజయస్తంభం' ఇప్పటికీ నిలిచివుంది.

ప్రాంతాల పేరు మన చరిత్ర సమకాలీన పరిస్థితులు, వివరాలు తెలుపుతాయి. అవి ఆ ప్రాత ప్రజల కష్టసుఖాలతో, సంతోష, దుఃఖాలతో పాలు పంచుకుంటాయి.

1956లో భాషా ప్రాంతాలు ఏర్పడి, ఆంధ్రప్రదేశ్‌కు రాజధానీ నగరంగా 'హైదరాబాద్' మారింది. అప్పటినుండి క్రమంగా జనాభా పెరిగి అందుకు అనుగుణంగా క్రొత్త క్రొత్త కాలనీలు వెలుస్తున్నాయి. వాటికి ఆధునికమైన పేర్లు వస్తున్నాయి. పాతపేర్లు గల ప్రాంతాలలోనే క్రొత్త కాలనీలు వెలసి, క్రొత్త పేర్లు పెట్టుకొంటున్నాయి. ఆ పేర్లలో ఆధునిక సంస్కృతీ, వికాసాలు కనిపిస్తాయి. ఆధునికుల ఆలోచనా ధోరణులు ప్రస్ఫుటమౌతాయి. వారి భావనాపటిమను వ్యక్తం చేస్తాయి. వాటిల్లో దేశ నాయకుల పేర్లు, మానవ స్వభావాలతో కూడిన పేర్లు దేవళం పేర్లు కూడా వున్నాయి. అవన్నీ ఎన్నో ఎన్నెన్నో!

నిర్మాణాలు - వాటి వెనుక గాథలు

పిల్లి తల ఏల?

సుప్రసిద్ధ నిర్మాణాల వెనుక చారిత్రిక సంఘటనో, రాజకీయ ప్రాధాన్యాన్నో, సామాజిక పరిస్థితినో తెలియజేసే గాథ లేక గాథలు ఉంటాయి. అదే విధంగా మొహ్మద్ ఖులీ కుతుబ్‌షా 1591లో నిర్మించిన 'చార్మినార్' కట్టడం నేపథ్యంలో ఎన్నో గాథలు ప్రచారంలో ఉన్నాయి.

ప్రతి నిర్మాణంలోనూ – ఆచార్యత్వం వహించిన ప్రధాన శిల్పాచార్యుడు లేదా వాస్తుశిల్పి రహస్యంగానో, అందరికీ తెలిసే విధంగానో ఎక్కడో ఒక చోట ఏదో ఒక చిన్న వంక, లేదా నిశితంగా పరిశీలించినప్పుడు గాని తెలుసుకోలేని శిల్ప సూక్ష్మాన్ని నిబద్ధం కావిస్తాడు.

అదే విధంగా హైదరాబాద్‌లోని 'చార్మినార్'ను చూసివచ్చిన వారు దాని నిర్మాణంలో వైచిత్ర్యాన్ని గురించి, చారిత్రక విశేషాలను గురించి చకచకా చెబుతారు. చార్మినార్ లోపల అడుగు పెట్టగానే నాలుగు ఆర్చీలు కనిపిస్తాయి. వాటిపైన నగిషీలు, వాటిపైన పువ్వులు కనిపిస్తాయి. ఒకచోట మాత్రం పుష్పానికి బదులు 'పిల్లి తల' వుండటం విశేషం! ఈ విశేషాన్ని గురించి రచయితలుగాని పురావస్తు శాస్త్రజ్ఞులు గాని ఎక్కడా ప్రస్తావించకపోవడం విశేషం! చిరకాలంగా వుంటున్న 'హైదరాబాదీయులు' – అందులో వృద్ధులకు ఈ విశేషం తెలుసు. దాన్ని గురించి జనశృతి వుంది.

అసలు చార్మినార్ నిర్మాణానికి కారణమేమిటి? హైదరాబాద్ నగర నిర్మాత, కుతుబ్‌షాహి వంశంలో అయిదవ రాజు సుల్తాన్ మొహమ్మద్ ఖులీ కుతుబ్‌షా – చార్మినార్‌ను తొలుత నిర్మించి, దాని కేంద్రంగా హైదరాబాద్ నగరాన్ని నిర్మించాలనుకొన్నాడట! అది ఒక గాథ!

ఈ చార్మినార్ ఉన్నచోటనే ఖులీకుతుబ్‌షా – యువరాజుగా ఉన్నప్పుడు తన ప్రియురాలు 'భాగమతి'ని తరచుగా కలుసుకునేవాడట! ఆ సమాగమ చిహ్నంగానే, తాను రాజైన తర్వాత 'చార్మినార్' నిర్మించాడని ప్రతీతి! అందుకే ఆ నిర్మాణంలో హిందూ, ముస్లిం వాస్తుశిల్ప సంప్రదాయాలు రెండూ ఇమిడి ఉన్నాయంటారు.

మరి ఆ 'పిల్లి తల' చిహ్నమేమిటి?! హైదరాబాద్ నగరంలో – అతి ప్రాచీనకాలం నుంచి ప్రతి ఏటా మహమ్మారిగా 'ప్లేగు' వ్యాధి సోకి, వేలాదిమంది చనిపోయేవారు. ప్లేగుకు మూలకారణం ఎలుకలు. ఎలుకలకు శత్రువు పిల్లి. అదీ దాని రహస్యం. ప్లేగువ్యాధి నివారణ చిహ్నంగా 'చార్మినార్'ను నిర్మించారేమో? అందుకే ఖులీ కుతుబ్‌షా హైదరాబాద్ నగరాన్ని మూసీనది ఒడ్డున నిర్మిస్తూ "మూసీలో ఎల్లప్పుడూ కదలాడే చేపలవలె తాను నిర్మిస్తున్న నగరంలో క్రిక్కిరిసిపోయేవిధంగా అన్ని వర్గాల, అన్ని మతాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలి" అంటూ 'దక్కనీ ఉర్దూ'లో కవిత్వం కూడా వ్రాసాడు. బహుశా ప్లేగు వ్యాధి వల్ల ప్రతి ఏటా వేలమంది చనిపోవటం చూసిన 'ఖులీ'కి మనసులో ఈ భావం కలగడం సహజమే!

కింగ్ కోఠీ భవనాలు

దాదాపు 150 సంవత్సరాల క్రితం నిర్మించిన కింగ్ కోఠీ భవనాలలో ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ (1911–48) అంతిమ శ్వాస విడిచే వరకు వుండేవాడు. హైదరాబాద్ సంస్థానంపై 1948 సెప్టెంబర్ నెలలో 'పోలీస్ చర్య' అనంతరం ఆయన రాజ్యభ్రష్టుడయ్యాడు. రాజరికం అంతరించింది.

అయితే, ఉస్మాన్ అలీ ఖాన్ నేటి గవర్నర్ హోదాలో 'రాజప్రముఖ్' అన్న పదవిని కొంతకాలం పాటు నిర్వహించాడు. ఆయన 1967 ఫిబ్రవరి 24వ తేదీన మృతి చెందాడు.

కింగ్ కోఠీ భవనాలు నిజానికి నిజాంలు నిర్మించినవి కావు. ఆయన ఆస్థానంలో వున్న 'జమాదర్ కమాల్ ఖాన్' తన కోసం నిర్మించుకొన్నాడు. ఆ భవనాలను చూసిన ఏడవ నిజాం కన్నుకుట్టి, నజరానా పేరుతో స్వాధీనం చేసుకొన్నాడని చెబుతారు.

ఆ భవనాల ప్రవేశం ఉక్కు తలుపుల పైన, అక్కడక్కడ గోడలపైన 'కమాల్‌ఖాన్' పేరు ఇంగ్లీషు పొడి అక్షరాలు 'KK' అని అలంకరణగా చిత్రించాడు. అయితే, ఏడవ నిజాం దానిని స్వాధీనం చేసుకొన్నప్పటికీ 'KK' అక్షరాలను తుడిచివేయలేకపోయాడు. అందుకే ఆ అక్షరాలను అనుగుణంగా 'కింగ్ కోఠీ' అని నామకరణం చేశాడు.

ఇప్పటికీ ప్రవేశ ద్వారం కాన్వాస్ వస్త్రంతో మూయబడి వుంటుంది. నిజాం నవాబు నివసించినప్పుడు కూడా అదే విధంగా వుంది.

ఈ భవనాలలో ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిని నెలకొల్పారు.

ఆ కాలంలో ప్రముఖులే భవనంలోకి అడుగుపెట్టడం మహా గౌరవంగా, మహద్భాగ్యంగా వుండేది. ఇప్పుడు మాన్యులు, సామాన్యులు రోగగ్రస్తులుగా ప్రవేశించవచ్చును. స్వస్థులై బయటకు రావచ్చును.

రాజరిక పాలన అంతానికి, ప్రజాస్వామిక వ్యవస్థకు చిహ్నంగా ఈ ఆసుపత్రి భవనాలను పేర్కొనవచ్చును.

మీర్ ఉస్మాన్ కట్టిన మార్కెట్

ఆసఫ్‌జాహి వంశంలో చివరివాడైన ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నిర్మించిన భవనాలలో బహుశః చిట్టచివరి భవనాలలో మోజం జాహి మార్కెట్ ఒకటి.

ఏడవ నిజాం రెండవ కుమారుడు నవాబ్ మోజంజాహి బహదూర్ పేరట నిర్మించిన ఈ భవనానికి 1935లో ప్రారంభోత్సవం చేశాడు.

భవనం యావత్తు గ్రెనైట్ రాయితో ఎంతో చక్కని పథకంతో నిర్మించిన ఈ మార్కెటు ప్రవేశ ద్వారం పైన ఎత్తుగా, పైన అర్ధచంద్రాకారంలో టవర్ వుంది. దానికి నలువైపులా గడియారాలు వుండేవి. ఇప్పుడు ఒకటే వుంది. అది కూడా పనిచేయటం లేదు.

కేవలం పండ్లు, కూరగాయల టోకు వ్యాపార నిర్వహణకు ఈ మార్కెట్ నిర్మాణం జరిగింది. కాని ఇప్పుడు కొన్ని మాత్రమే పండ్ల దుకాణాలున్నాయి. కూరగాయల దుకాణాలు అసలే లేవు. వాటి స్థానాలలో మాంసం, చేపల దుకాణాలు, తదితర దుకాణాలు వెలిసాయి.

ఆబిడ్స్ నుంచి అఫ్జల్‌గంజ్‌కు పోయే మార్గంలో వున్న ఈ మార్కెట్ పరిసరాలు, రోడ్లు ఎప్పుడూ రద్దీగానే వుంటాయి.

ఖిల్వత్ మహల్... షాదీ ఖానా ...తోషాఖానా

లాడ్ బజారుకు కాస్తముందుగా, నైరుతీ దిశగా విశాలమైన ఆవరణలో నిజాం నవాబులు నిర్మించిన ఖిల్వత్‌మహల్, మరికొన్ని భవనాల సముదాయం ఉంది. సముదాయం విస్తీర్ణం రెండు లక్షల 90 వేల చదరపు గజాలు వుంటుంది. ఇందులో చౌమహల్లా, ఖిల్వత్ ముబారక్, రంగ్ మహల్, రోషన్ బంగ్లా, అఫ్జల్ మహల్, తినియాత్ మహల్, చాందినీ బేగం–కి–హవేలీ, బక్షి బేగం–కి–హవేలీ, మోతీ బంగ్లా, షాదీఖానా, తోషాఖానా మొదలైనవి ఉన్నాయి.

అసఫ్‌జాహీ వంశీకులలో ఒకడైన నిజాం సలాబత్ జంగ్ 1750లో చౌమహల్లాను నిర్మించాడు. టెహ్రాన్ నగరంలోని 'షా' రాజభవనానికి ప్రతికృతిగా ఈ భవనం ఉంది.

ఈ సముదాయంలోని భవనాలలో ఒక్కొక్క దానిని ఒక్కొక్క రీతిలో ఉపయోగించేవారు. వీటిల్లో ఉత్తరం వైపున వున్నది దర్బార్‌హాల్. ప్రభుత్వ ఆధ్వర్యాన బ్రిటిష్ వైస్రాయిల విందులు, వినోదాలకు వినియోగించేవారు. ఇక పోతే దక్షిణానగల భవనంలో మంత్రులు, తదితర ప్రముఖులతో చర్చలు, సంప్రదింపులకు ఉపయోగించేవారు. పశ్చిమానగల భవనం నిజాం నవాబుల స్వంత ఆస్తుల నిర్వహణా కార్యాలయంగా వుండేది.

ఇక మిగతా భవనాలు – ఆయా పేర్లుగల రాణుల నివాసాలు. వీటిలో 'షాదీఖానా' వివాహ మందిరం. ఇక 'తోషాఖానా' అంటే వంటశాలల భవనం.

నాటి రాజుల ఫర్మానాల కొండ...

హైదరాబాదు నగరంలో – బషీర్‌బాగ్, టాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం, సచివాలయం, లక్డీకాపూల్, శాసనసభా భవనాలు, నాంపల్లి, నిజాం కళాశాలల మధ్య చుట్టూ గీత గీస్తే – ఒక అందమైన ప్రదేశాన్ని గుర్తించవచ్చు. ఆ ప్రదేశంలో ఒకవైపు విశాలమైన ఫతే మైదానం కనిపిస్తుంది. దానిని ఆనుకొని చక్కని రోడ్డు – ఆ తరువాత రెండు ఎత్తైన కొండలు, ఆ రెండింటి మధ్య కడిగిన ముత్యంలా శాసన సభా భవనం – చూడముచ్చటగా ఉంటుంది.

ఆ రెండు కొండలలో ఒకదానికి ప్రాచీన నామం కాలా పహాడ్. ఇప్పుడది నీలాద్రి. దానిపై చలువ రాళ్ళతో చేసిన వెంకటేశ్వర మందిరం ఉంది. అదే బిర్లామందిరం. రెండవ కొండ నౌబత్ పహాడ్. ఇప్పుడు దానిపై నక్షత్ర వేధశాల వుంది. అదే బిర్లా ప్లానిటోరియం! ఈ రెండు కొండలూ – వాటిపై వున్న ఆధ్యాత్మిక, వైజ్ఞానిక చిహ్నాలు – ప్రాచీనాధునిక వైభవాలు – ఆకర్షణీయాలు!

ప్రస్తుతాంశం నౌబత్ పహాడ్ కథ :

సుమారు అయిదు వందల సంవత్సరాల నుంచి ఆ కొండలు, పరిసర ప్రాంతాలు కుతుబ్‌షాహి వంశీయులకు విహార కేంద్రంగా ఉంటూ వచ్చాయి. అది ఇటీవలి కాలం వరకు కూడా ఉపయోగపడింది. ఇప్పుడు పరిసరాలన్నీ కొత్త బస్తీలతో జనాభాతో కిక్కిరిసి పోయాయి.

కుతుబ్ షాహీల విహార కేంద్రమే కాకుండా రాజుగారి ఫర్మానాలు – ఉత్తర్వులు – తొలి పర్యాయం ఆ కొండపై నిలబడి చదివే వారట! అది చదవడానికి ముందు 'నౌబత్' అంటే 'నగారా' మ్రోగించేవారు. అక్కడికి విహారార్థం వచ్చిన రాజవంశీయులకు, రాజ బంధువులకు, ఉన్నతోద్యోగులకు ఆ ఉత్తర్వులు తొలుత తెలిసే అవకాశం కలిగేది.

ఆ కొండపై నిరంతరం ఒక పెద్ద నగారా ఉండేదన్నమాట! అందుకే ఆ కొండకు 'నౌబత్ పహాడ్' అన్న పేరు స్థిరపడింది. అక్కడనుంచి ఫర్మానా జారీ చేసే పద్ధతి అసఫ్‌జా (నిజాంలు) వంశీకుల వరకు కొనసాగింది.

అది 1687వ సంవత్సరం సెప్టెంబరు నెల 21వ తేదీ – ఔరంగజేబు అపారమైన సైన్యంతో గోల్కొండ కోట ముట్టడికి వచ్చాడు. అప్పుడు తన సైన్యం విడిదికి స్కంధావారాలు ఈ పరిసరాలలోనే నెలకొల్పాడు. అదే ఇప్పటి "ఫతేమైదానం". ఫతేహ్ అంటే సైన్యం. ఔరంగజేబు దాడి 1693 వరకు కొనసాగింది.అప్పుడు – ఔరంగజేబు – తన సైనికులను మేల్కొల్పటానికి లేదా – హెచ్చరికలు చేయడానికి ఈ నౌబత్ పహాడ్‌నే ఉపయోగించుకున్నాడు. అక్కడ నగారా మ్రోగించి ఉత్తర్వులు జారీ చేయించేవాడట! తన సైన్యాన్ని ఢిల్లీకి ఉపసంహరించుకుంటూ దక్కన్‌కు (దక్షిణాపథానికి) సుబేదారుగా 'ముబారక్‌ఖాన్'ను నియమిస్తూ, 1693 జూన్ 21వ తేదీన ఔరంగజేబు ఒక ఫర్మానా జారీ చేశాడు. ఈ ఫర్మానా ప్రస్తుతం బ్రిటిష్ మ్యూజియంలో ఉన్నది.

ఇది గత కాలం కథ.

ఇప్పటి కాలంలో – ఇరవై ఏళ్ళ క్రితం నగర పాలక సంస్థ వారు ఆ కొండను పూల మొక్కలతో తోటలతో, తిరిగి అభివృద్ధిపరచి నగరవాసులకు విహార కేంద్రంగా తీర్చిదిద్దారు. అప్పుడు దానిపై సుప్రసిద్ధ పారిశ్రామికవేత్త కమల్‌నయన్ బజాజ్ ఒక టెలిస్కోపు ఏర్పాటు చేశారు. సాయంత్రం పూట సూర్యస్తమయం, ఆ తరువాత గ్రహాలను చూపించేవారు. 1972 వరకు అక్కడ ఆ టెలిస్కోపు ఉండేది. ఆ తరువాత ఆ కొండను బిర్లా చారిటరీ ట్రస్టు వారికి ప్రభుత్వం అప్పగించింది. వారు అక్కడ అత్యంత ఆధునికమైన ప్లానిటోరియం భవనాన్ని నిర్మించారు. దాని చుట్టూ తోటలను పెంచుతున్నారు.

అప్పుడు ఇది 'అసఫియా'

భారతదేశంలో అతి ప్రాచీనమైన లిఖిత ప్రతులు గల లైబ్రరీలలో ఇది ఒకటి. బహుశః అందమైన భవనాలలో ఒకటి కూడా!

ఈ గ్రంథాలయంలో ఐదు, ఆరు శతాబ్దాలనాటి వ్రాతప్రతులు వున్నాయి. ఇక్కడగల కొన్ని ప్రతులు-ప్రపంచంలోని ఏ గ్రంథాలయాలలో కూడ లేవు.

మూసీనదికి ఎడమ గట్టున 1936లో ఈ భవనం నిర్మించారు. అప్పుడు దానిని 'అసఫియా లైబ్రరీ' అనేవారు. ఆ తరువాత 'హైదరాబాదు స్టేట్ లైబ్రరీ' అయ్యింది. ఇప్పుడు 'స్టేట్ సెంట్రల్ లైబ్రరీ'గా మారింది.

నిజాం ప్రభుత్వంలో విద్యాశాఖ డైరెక్టర్‌గా పనిచేసిన 'నవాబ్ ఇమాద్-ఉల్-ముల్క్', 1891 ఫిబ్రవరిలో ఈ లైబ్రరీని ప్రారంభించారు.

ప్రస్తుతం ఆబిడ్స్‌లోని జనరల్ పోస్టాఫీసు ఉన్న నూతన భవనాలు - గతంలో ప్రాచీన భవనాలను పడగొట్టి నిర్మించినవి. ఆ ప్రాచీన భవనాలలోనే తొలుత ఈ లైబ్రరీ వుండేది. స్థలం చాలకపోవడం వల్ల, ప్రస్తుత భవనాన్ని నిర్మించి, 1936లో లైబ్రరీని తరలించారు.

ఇక్కడ అతి పురాతనమైన లిఖిత పుస్తకాలు, అచ్చు పుస్తకాలు వున్నాయి. ఇప్పటికీ పరిశోధకులు, విద్యార్థులు అక్కడికి వెళ్ళి 'రిఫరెన్సు' పుస్తకాలు చూస్తుంటారు. బాలసాహిత్యానికి ప్రత్యేక విభాగం వుంది.

ఈ గ్రంథాలయం 'ప్రాచీనాధునిక విజ్ఞానధార'గా అభివృద్ధి చెందవలసి వున్నది

జూబ్లీహాల్ గురించి....

చివరి నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ రాజ్యాభిషేక రజతోత్సవాలు జరుపుకున్న స్మృతి చిహ్నంగా 1937లో జూబ్లీహాల్ నిర్మించారు.

ఇప్పటి పబ్లిక్ గార్డెన్స్‌లో - ఒకప్పుడు సుందరంగా, పచ్చని పూదోటల మధ్య ఆ భవనాన్ని నిర్మించారు. ఇదే స్థలంలో ఆరవ, ఏడవ నిజాం నవాబుల దర్బారు హాలు - అతి సాధారణమైన భవనం ఉండేదట. అది 1834లో నిర్మించారట. ఆ భవనాన్ని కూలగొట్టి - ఇండో - పర్షియన్ వాస్తు శైలిలో "జూబ్లీ హాల్"ను నిర్మించారు.

నిజాం నవాబు పట్టాభిషేక రజతోత్సవాల ముగింపు ఈ భవనంలోనే జరిగిందట.

ఈ భవనం నాలుగువైపుల ప్రవేశద్వారాలతో అండాకృతిలో ఉంటుంది. ప్రధాన ప్రవేశ ద్వారం నుంచి లోపలికి అడుగిడుతూనే విశాలమైన దీర్ఘచతురస్రాకారంలో హాలు ఉంటుంది. అందులో చక్కని ఆధునికమైన సోఫా సెట్లతో తివాచీలతో అలంకరించి వుంటుంది. ఆ హాలు దాటి ముందుకు పోతే, మొదటి దానికన్నా పెద్దదిగాను, విశాలమైన దీర్ఘచతురస్రాకారపు హాలు వుంది. అక్కడే ఒక వేదిక వంటిది వుంది. నిజాం నవాబు అక్కడ సింహాసనంపై కూర్చొని అమీర్లు, సర్దారులు, నవాబులు, జాగీర్దార్లకు దర్శనం ఇచ్చేవాడట! ఈ హాలు నుంచి కుడివైపుకు గల ద్వారం నుంచి ముందుకు సాగితే, విశాల మైన పచ్చిక మైదానం, చుట్టూ భవనం కనిపిస్తుంది. పచ్చిక మైదానంలో ఒక వైపు చిన్న నిర్మాణం ఉంది. రజతోత్సవం సందర్భంగా పైన పేర్కొన్న వారు వచ్చి ఇచ్చే నజరానాలు (కానుకలు) ఇక్కడ స్వీకరించేవాడట.

హైదరాబాదుపై పోలీసు చర్య జరిగేవరకు - బ్రిటిష్ ఉన్నతాధికారులు, వారి భార్యలకు అది వినోద కేంద్రంగా పనికివచ్చింది. ప్రధాన హాలులో 'బాల్ రూం డాన్సులు' జరిగేవట! వేదిక పైన బ్యాండుమేళం ఉండేది! అక్కడే విందులు కూడా జరిగేవి.

పోలీసు చర్య తరువాత ఆ భవనం ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత శాసనమండలి సమావేశ మందిరంగాను, దాని కార్యాలయంగా కొంత భాగం, మిగిలిన భాగం ప్రభుత్వ ఉన్నతాధికార సమావేశాలకు, ప్రభుత్వ ప్రముఖులకు ఏర్పాటు చేసే విందులకు వినియోగపడుతున్నది.

ప్రధాన హాలులో ప్రభుత్వ ఆధ్వర్యాన సదస్సులు, చర్చాగోష్ఠులు జరుగుతుంటాయి. అందులో అతి సౌకర్యంగా 500 మంది కూర్చోవచ్చు.

"ప్రేమ వారధి", ఆ తర్వాత వంతెనలు

పశ్చిమం నుంచి తూర్పు దిశగా ప్రవహిస్తూ హైదరాబాద్ నగరాన్ని ఉత్తర దక్షిణంగా చీలుస్తూ ప్రవహించేది నది - మూసీనది!

ఇప్పుడది పెద్ద మురుగు కాలువగా, దోమల ఉత్పత్తి కేంద్రంగా ఉన్నప్పటికీ, ఒకప్పుడది పెద్ద నది! వర్షాకాలంలో ఎన్నో పర్యాయాలు మూసీ నదికి వరదలు వచ్చి, హైదరాబాదు నగరాన్ని ముంచెత్తింది. ఎన్నో బాధలకు గురి చేసింది!

అలాంటి మూసీనదిపై - హైదరాబాదు నగరంలోనే అయిదు వంతెనలు ఉన్నాయి!

అవి పురానాపూల్, చాదర్‌ఘాట్, నయాపూల్, ముసల్లంజంగ్‌పూల్, సాలార్‌జంగ్ వంతెన! వీటిల్లో మొదటి దానిని కుతుబ్‌షాహీల పరిపాలనా కాలంలో నిర్మించగా, తరువాత మూడింటిని నిజాం పరిపాలనలో నిర్మించారు. ఇక చివరి వంతెనను ఇటీవలి కాలంలో - అనగా డాక్టర్‌ఎం. చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో (1979)లో నిర్మించారు.! వీటిల్లో అతి ప్రాచీనమైన పురానాపూల్ కేవలం నిర్మాణం కాదు. అది ఒక 'ప్రేమ వారధి'. హైదరాబాదు నగర నిర్మాత, కుతుబ్ షాహీ వంశ రాజులలో అయిదవ వాడు సుల్తాన్ మొహమ్మద్ ఖులీఖుత్‌బ్‌షా సాగించిన ప్రేమ పురాణానికి అది ఆనవాలు.

మొహమ్మద్ ఖులీ యువరాజుగా వున్నప్పుడు మూసీ నదికి దక్షిణంగా వున్న 'చిచిలం' అనే గ్రామంలో నివసించే భాగమతి అనే పడతిని ప్రేమించాడట. ఆయన ప్రతిరోజు సంకేత స్థలానికి రావటానికి గుర్రంపై మూసీనదిని దాటే వాడు. ఇప్పుడున్న చార్మినార్, అప్పటి వారి సంకేత స్థలం.

అది వర్షాకాలం – మూసీనది పరవళ్ళు త్రొక్కుతున్నది. పైగా రాత్రి సమయంలో ఖులీ తన ప్రేయసిని కలుసుకోవాలి. మనస్సు తహ తహలాడుతున్నది! మూసీ పరవళ్ళు లెక్క చేయలేదు. గుర్రాన్ని మూసీలోకి ఉరికించాడు. అడ్డంగా పడి మూసీ దక్షిణ తీరానికి చేరి, ప్రేయసి ముందు మోకరిల్లాడు! అది ఆయన సాహసం! భాగమతి పట్ల ఆయనకున్న ప్రేమ, వ్యామోహం అలాంటివి.

ఈ విషయం ఖులీ తండ్రి ఇబ్రహీం ఖులీ ఖుతుబ్‌షాకు (1530–1580) తెలిసింది. భావి మహారాజు అలాంటి సాహసం చేయటం ఉచితం కాదని గ్రహించి, 1578లో మూసీ నదిపై ఈ తొలి వంతెనను నిర్మించాడు. ఈ వంతెనకు 22 ఆర్చీలు వున్నాయి. 600 అడుగుల పొడుగు, 35 అడుగుల వెడల్పు వుంది. నది ఒడ్డుపై 54 అడుగుల ఎత్తున వంతెన నిర్మాణం జరిగింది. ఫ్రెంచ్ యాత్రికుడు తావెర్నియర్ 1676లో హైదరాబాదును సందర్శించినప్పుడు, ఈ వంతెనను చూసి 'ప్రేమ వారధి'గా అభివర్ణించాడు. పారిస్‌లోని 'పోంట్‌నెఫ్' వంతెనకన్నా అందంగా, కనుల విందుగా ఈ వంతెన వున్నదని ఆయన పేర్కొన్నాడు.

ఇప్పుడా అందమేమోగాని, పెరిగిన రద్దీ వల్ల ఇరుకుగా వుంది. పాతబస్తీకి ఇది ఇప్పటికీ ప్రధానమైన రహదారి. వంతెన దృఢంగా వున్నప్పటికీ పునరుద్ధరణ లేకపోవడం వల్ల – తన పురాతనత్వాన్ని నిలుపుకొని వుంది!

రెండవ వంతెన ముసల్లంజంగ్ పూల్ కూడా ప్రాచీనమైనదే! ఇప్పుడు దానిని 'ముస్లిం జంగ్ పూల్' అని హాయిగా అనేస్తున్నారు. 'ముసల్లంజంగ్' అనే వ్యక్తి పేరిట వంతెన నిర్మించినప్పటికీ దానిని ఎవరు, ఎప్పుడు నిర్మించారో వెలుగులోకిరాలేదు.

పురానాపూల్ తరువాత దాదాపు 350 సంవత్సరాలకు – ప్రస్తుతం చాదర్‌ఘాట్ బ్రిడ్జిగా మనం పిలుస్తున్న "ఆలిఫెంట్" బ్రిడ్జిని నిర్మించారు.

ఆసఫ్ జాహి (నిజాం) వంశపాలకులలో నాల్గవవాడు నసీరుద్దౌలా (1829–1854) ఆదేశం మేరకు 1831లో కల్నల్ జె. అలిఫెంట్ అనే బ్రిటిష్ ఇంజనీరు నిర్మించాడు. ఆ వంతెనకు ఇంజనీరు పేరే పెట్టారు అయితే జనం మాత్రం దానిని 'చాదర్‌ఘాట్ వంతెన' అనే అంటున్నారు. ప్రవహిస్తున్న నదిని ఎత్తు నుంచి కిందికి చూడటాన్ని తెలుగులో 'అలుగు' అంటారు. ఉరుదూలో 'చాదర్ ఘాట్' అంటారు. వంతెనకు పడమర దిశన మూసీ నదిలో ప్రవాహం ఉన్నప్పుడు చూస్తే నీరు ఎత్తు నుంచి క్రిందికి దూకినట్లు రెండు గట్లను ఒరుసుకుంటూ – తెల్లనితెర కట్టినట్లుంటుంది. – అదే చాదర్‌ఘాట్. ఆ ప్రాంతానికి ఆ వంతెనకు ఆ పేరే స్థిరపడింది.

మూసీ నదికి దక్షిణాన విజయవాడ మార్గంలో కొత్త కాలువలు, పేటలు వెలిశాయి. జనాభా పెరిగింది. వారి అవసరాలన్నీ మూసీకి ఉత్తరానగల కొత్త బస్తీతోనే ముడిపడి ఉన్నాయి. పాఠశాలలు, ప్రైవేటు – ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక వాటికలు అన్నీ అటువైపుగానే ఉన్నాయి. అందువల్ల విధిగా చాదర్‌ఘాట్ వంతెనను దాటవలసిందే! ఉదయం 8–30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ వంతెన మీదుగా వాహనాలు అసంఖ్యాకంగా పోతుంటాయి. జనం రాకపోకలూ అలాగే ఉంటాయి. ట్రాఫిక్ అంచనాల ప్రకారం ఈ వంతెనపై ఉన్నంత రద్దీ – నగరంలోని ఏ ప్రధానమైన రోడ్డుపైన లేదట. ఈ వంతెనను ఇటీవలి కాలంలో వెడల్పు కూడా చేశారు! అయినా పెరిగిన ట్రాఫిక్‌కు ఇది చాలడం లేదు.

అసఫ్ జాహి (నిజాం) వంశస్తులలో అయిదవవాడు అఫ్జలుద్దౌలా (1857 – 1869) ఆదేశంపై 1880లో 'అఫ్జల్ వంతెన'ను నిర్మించారు. అయితే కొంచెం పేరు మార్పుతో ప్రస్తుతం దానిని 'అఫ్జల్‌గంజ్ వంతెన' లేదా 'నయాపూల్' అంటారు. దీని నిర్మాణం జరిగి 107 సంవత్సరాలు అయినా, అది ఇంకా కొత్త వంతెనే! బహుశః దాని నిర్మాణం జరిగిన నాటికే మూసీ నదిపై మూడు వంతెనలు ఉండటం వల్లనే ఇది 'నయాపూల్' అయి ఉండవచ్చు. అది ఇప్పటికీ అదే పేరుతో ప్రసిద్ధమైంది.

బ్రిటిష్ ఇంజనీరు జి. డబ్ల్యు. మార్రైట్ పర్యవేక్షణలో ఈ వంతెన నిర్మాణం జరిగింది.

1908 సెప్టెంబర్ 28వ తేదీన మూసీ నదికి వరదలు వచ్చాయి. ఆ వరదలలో ఈ వంతెనలో దక్షిణభాగం కొట్టుకుపోయింది. ఆ తరువాత వెంటనే తిరిగి నిర్మించారు. వంతెనకు ఉత్తరం వైపు ప్రవేశ ద్వారం ఉండేది. హైదరాబాదుపై పోలీసు చర్య అనంతరం దానిని కూలగొట్టారు. ఇటీవలి కాలంలో వంతెనను వెడల్పు చేశారు. అయినా జనం రద్దీ అలాగే కనిపిస్తున్నది.

ఇక ఆధునిక కాలంలో, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నయాపూల్, చాదర్‌ఘాట్ వంతెనలకు మధ్యన రద్దీని తగ్గించాలనే ఉద్దేశంతో సెంట్రల్ బస్ స్టేషన్ వద్ద మరొక వంతెనను నిర్మించారు. ఆ వంతెన మూసీనది మధ్యనగల "ఇమ్లీబన్" లంకను కూడా తాకుతూ పోతుంది. ఆ వంతెనకు ఒక వైపు పూలతోటలను పెంచుతున్నారు. ఆ వంతెనకు సాలార్‌జంగ్ పేరు పెట్టారు. కాని, ఆ పేరు ఇంకా స్థిరపడలేదు. ఆ ప్రాంతం గౌలీగూడా కావడం వల్ల – గౌలీగూడ వంతెన అని పిలుస్తున్నారు. ముందు ముందు దాని పేరు ఏ విధంగా స్థిరపడుతుందో చూడాలి!

ఉస్మానియా విశ్వవిద్యాలయం

విశ్వవిద్యాలయం స్థాయి వరకు ప్రాంతీయ బాషలోనే బోధన చేయాలన్న లక్ష్యంతో దేశంలోనే మొట్టమొదటగా అవతరించిన విశ్వవిద్యాలయం – ఉస్మానియా విశ్వవిద్యాలయం!

ఈ ఆలోచన 1873 నాటిది. అప్పటి విద్యావేత్తలు రఫత్‌యార్‌జంగ్, జమాలుద్దీన్ అఫ్ఘాని అనువారు అంకురార్పణ చేశారు. ఆ తరువాత అఫ్ఘాని పారీస్ వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. ఆయన అక్కడ బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుడు మిస్టర్ బ్లంట్ అనే వ్యక్తిని కలుసుకొని, భారతదేశం వెళ్ళినప్పుడు హైదరాబాద్‌కు కూడా వెళ్ళి, పరిపాలకులను కలుసుకొని ప్రాంతీయ బోధనా భాషగా విశ్వవిద్యాలయం నెలకొల్పటంలోని అవసరాన్ని

నచ్చచెప్పవలసిందిగా కోరాడు. అది 1882వ సంవత్సరం. బ్లంట్ ఇక్కడికి వచ్చి రెండవ సాలార్ జంగ్‌ను కలుసుకొని ఆ విషయాలు చర్చించగా, ప్రతిపాదనలు ఇవ్వవలసిందిగా రెండవ సాలార్‌జంగ్ కోరాడట! తదనుగుణంగా 1883 జనవరి 25వ తేదీన బ్లంట్ తన ప్రతిపాదనలను ఆరవ నిజాం నవాబు మీర్ మహబూబ్ అలీ ఖాన్‌కు అందించాడు!

ఆ విషయం అంతటితో ఆగిపోయింది. మధ్య మధ్య చర్చలు జరుగుతూనే ఉన్నాయి.

ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ పరిపాలనా బాధ్యతలు స్వీకరించాడు. విశ్వవిద్యాలయం నెలకొల్పడం పట్ల ఉత్సాహం చూపాడు. సర్ అక్బర్ హైదర్ మరో ప్రతిపాదనను 1917లో చేశాడు. దానిని నిజాం అంగీకరించాడు. 'ఉస్మానియా విశ్వవిద్యాలయం' ఆవిర్భవిస్తున్నట్లు 1918లో లాంఛనంగా ఒక ఫర్మానా జారీ చేశారు. ఆ తరువాత 1919 ఆగస్టు 7వ తేదీన తొలి ఫర్మానాను స్థిరీకరిస్తూ రెండవ ఫర్మానా జారీ అయ్యింది!

విశ్వవిద్యాలయ భవనాలు నెలకొల్పటానికి అధికమెట్ట (ప్రస్తుతం అదే అడిక్‌మెట్ అయ్యింది)లో 1400 ఎకరాల స్థలం ఎంపిక అయ్యింది.

విశ్వవిద్యాలయ ప్రధాన భవనం, తదితర నిర్మాణాలు – ఎలా వుండాలి? ఎలాంటి వాస్తుశిల్ప సంప్రదాయం అనుసరించాలి? అన్న నిర్ణయం తీసుకోడానికి ప్రపంచ వ్యాప్తంగా గల సుప్రసిద్ధ విశ్వవిద్యాలయ భవనాల వాస్తు రీతిని క్షుణ్ణంగా పరిశీలించారు. నగరానికి చెందిన ఇద్దరు ఇంజనీర్లు నవాబ్‌జేన్ యార్‌జంగ్, సయ్యద్ అలీరజాలు. ఇంగ్లండ్, ఫ్రాన్సు, టర్కీ, జపాన్, అమెరికాలో వారు పర్యటన జరిపి, అక్కడి విశ్వవిద్యాలయ భవనాల కళా రీతులను పరిశీలించారు. వారు తిరిగి వస్తుండగా బెల్జియంకు చెందిన సుప్రసిద్ధ వాస్తు శిల్పి జస్పర్ అనే వ్యక్తిని ఈజిప్టులో కలుసుకొన్నారు. ఆయన అక్కడ ఒక విశ్వవిద్యాలయ భవనానికి రూపకల్పన చేస్తున్నాడు. హైదరాబాదు ఇంజనీర్లు 1931లో తిరిగి వచ్చి, జస్పర్‌ను ఆహ్వానించవలసిందిగా నిజాం నవాబుకు సిఫార్సు చేశారు.

1933లో జస్పర్ హైదరాబాదుకు వచ్చి భారతీయ వాస్తు కళారీతులను ఆకళింపు చేసుకోటానికి ఢిల్లీలో కొన్ని ప్రాచీన ఆధునిక భవనాలు పరిశీలించాడు. బీదర్, గోల్కొండ, చార్మినార్, ఎల్లోరా, అజంతాలను సందర్శించాడు. అప్పటికే హైదరాబాదులో వున్న అనేక భవనాలను చూశాడు. అనూచానంగా వస్తున్న హిందూ వాస్తు రీతి, మధ్యయుగాల ముస్లిం, అరబ్, మూరిష్ గోతిక్ వాస్తు రీతులు మేళవింపుతో విశ్వవిద్యాలయ ప్రధాన భవనానికి రూపకల్పన చేశాడు. ఆ తరువాతనే అది ఉస్మాన్‌షాహి వాస్తు శైలికి ఉదాహరణగా నిలిచింది.

1933 జులైలో ఏడవ నిజాం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశాడు. దీని నిర్మాణానికి దాదాపు 35వేల మంది కార్మికులు పనిచేశారు. దాదాపు కోటిన్నర రూపాయల ఖర్చుతో 1939లో ప్రధాన భవనం పూర్తయింది. అదే సంవత్సరం నిజాం నవాబు భవనానికి ప్రారంభోత్సవం కూడా చేశాడు.

ఆ తరువాత క్రమేణా రెండు వసతి గృహాలు, లా కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ నిర్మించారు. వీటికై సాలీనా 15 లక్షల రూపాయల వంతున దాదాపు నాలుగు సంవత్సరాలపాటు కేటాయించారు. క్రమంగా వివిధ భవనాలు, పూల తోటలు అభివృద్ధి చేశారు. విశ్వవిద్యాలయాల స్వర్ణోత్సవాలకు గుర్తుగా 1968లో 'టాగోర్ ఆడిటోరియం' నిర్మాణం జరిగింది.

ప్రస్తుతం ఆ ప్రాంతం అంతా పూల తోటలతో, చెట్లతో, వివిధ భవనాలతో 'విద్యానగరంగా' విలసిల్లుతున్నది.

ఆనాడు 'దఫ్తర్ - ఎ - మాల్'

హైదరాబాద్ నగరంలో 'చార్మినార్'కు చుట్టూ అనేక రాజప్రాసాదాలు వున్నాయి. వాటిల్లో కొన్ని రాజ వంశీకులవి, మరికొన్ని రాజ ప్రముఖులవి! వాటిలో మాల్వాలా భవనం ఒకటి.

'చార్మినార్'కు తూర్పున వంద గజాల దూరంలో ప్రధాన వీధిలోనే ఈ భవనం వుంది. అయితే, భవనం ముందు చిన్న చిన్న కట్టడాలు, దుకాణాలు ఇటీవలి కాలంలో వెలిసాయి.

రాజా రాంప్రసాద్ లాల్ బహదూర్ అనే ఉన్నతాధికారి 1845లో ఈ భవనాన్ని నిర్మించాడు. ఈయన తాత ముత్తాతలు నిజాం నవాబుల ఆస్థానంలో రెవెన్యూ రికార్డుల నిర్వహణాధికారులుగా వుండేవారు.

ఈ భవనం వాస్తు శిల్ప రమణీయంగా వుంది. మీర్ ఆలం దివాన్‌ఖానా, బ్రిటిష్ రెసిడెన్సీ భవన నిర్మాణ ఛాయలు ఇందులో కనిపిస్తాయి. భవనం 'ఆర్చీ'లు లక్కపూత పూసిన కర్రతో నిర్మించారు.

తొలుత ఈ భవనం "దఫ్తర్–ఎ–మాల్" (రెవెన్యూ కార్యాలయం) అనే వారు. ఆ తరువాత రాజా శివరాజ్ బహదూర్ భవనాన్ని విస్తరింపజేసి మాల్‌వాలా (రెవెన్యూకు చెందిన వారి) భవనంగా నామకరణం చేశారు.

ప్రస్తుతం ఈ భవనంలో ప్రభుత్వ కార్యాలయాలు రెండున్నాయి. అందులోనే ఒక భాగం 'వివాహశాల'గా ఉపయోగపడుతున్నది.

హవేలీకి కహానీ ...

ఖుతుబ్‌షాహి వంశపతనానికి, ఆసఫ్‌జాహి వంశ ఆవిర్భావానికి సంబంధించిన సంధికాలాన్ని ముడివేసే భవనం – పురానీ హవేలీ అంటే సరిపోతుందేమో?

పురానీ హవేలీ అంటే 'పాత భవనం' అని అర్థం. హైదరాబాదు నగర నిర్మాత మహ్మద్ ఖులీకుతుబ్‌షా నగర నిర్మాణానికి పతాక రచన చేసినప్పుడు విశాలమైన స్థలాన్ని తన ప్రధానమంత్రి (పేష్వా) మీర్ మోమిన్ భవన నిర్మాణానికై కేటాయించాడు. ఖుతుబ్‌షాహీలకు మీర్‌మోమిన్ అత్యంత గౌరవ పాత్రుడు.

1687లో గోలకొండ పతనం అయింది. కుతుబ్‌షాహి వంశం అంతరించి, ఔరంగజేబు తరపున దక్కన్‌కు గవర్నర్‌గా వున్న నిజాం–ఉల్–ముల్క్ స్వాతంత్ర్యం ప్రకటించి, ఆసఫ్‌జాహీ వంశం పేరుతో రాజ్యపాలన ప్రారంభించాడు. ఆ తరువాత ఈ వంశాన్నే 'నిజాంలు' అన్నారు.

పురానీ హవేలీ ఆవరణ మీర్ వంశీయుడు రుక్నుద్దౌలా ఆధీనంలో వుండేది. రెండవ నిజాం – నిజాం అలీఖాన్ (1761–1803) 1777లో ఆ భూభాగాన్ని స్వాధీనం చేసుకొని తన కుమారుడు సికిందర్ జా (1803 – 1829) నివాసం కోసం ఈ భవనాన్ని నిర్మించాడు. దీనిని తొలుత 'హవేలీ ఖదీమ్' అనే వారు. సికిందర్ జా 1803లో రాజైన తర్వాత తన నివాసాన్ని చార్మినార్‌కు సమీపంలో 'మోతీగల్లీ'లో ఖిల్వత్ ముబారక్ భవనానికి మార్చుకున్నాడు. దానివల్ల పురానీ హవేలీని చాలా కాలం వరకు 'ఖాళీ'గా ఉంచారు. దాని ప్రాభవం తగ్గనారంభించింది. అయితే సికిందర్‌జా ప్రధాన భవనాన్ని విస్తరిస్తూ కొన్ని నిర్మాణాలు చేశాడు.

అయిదవ నిజాం అఫ్జలుద్దౌలా (1857–1868) ఈ భవనంలోనే జన్మించి, బాల్యం ఆటపాటలతో గడిపాడు. ఆరవ నిజాం నవాబు మీర్ మహబూబ్ అలీఖాన్ (1869–1911) కూడా పురానీ హవేలీలోనే జన్మించాడు. జీవితంలో అధికభాగం ఇక్కడే గడపడంతో అది మరింత వైభవంగా వెలిగింది. ఏడవ నిజాం – నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఇక్కడే జన్మించాడు. తండ్రీ కొడుకులు భవనాన్ని మరింత విస్తరింప జేశారు.

ఆ తరువాత ఏడవ నిజాం 'కింగ్‌కోఠి' భవనాలకు తన నివాసాన్ని మార్చుకొన్నాడు. అయితే ఆ భవనంలోనే వుంటున్న తన తల్లిని ఆమె చనిపోయే వరకు దర్శించటానికి ప్రతిరోజూ ఆ భవనానికి వెళ్ళేవాడు.

పురానీ హవేలీ ప్రధాన భవనంలో 18వ శతాబ్దపు బ్రిటీష్ వాస్తు సాంప్రదాయం కనిపిస్తుంది. లోపలి అలంకరణలు, ఫర్నీచర్ పాశ్చాత్య రీతిలో ఉన్నాయి. మీర్ మహబూబ్ ఆలీఖాన్ తన దుస్తులకై 240 అడుగుల పొడవున కర్రతో 'వార్డ్‌రోబ్' నిర్మించాడు. అది ఇప్పటికీ వుంది. ఈ 'కర్రవార్డ్‌రోబ్' ప్రపంచంలోనే పొడవైనదని ప్రసిద్ధికెక్కింది.

ఏడవ నిజాం మనుమడు నవాబు ముఖుర్రమ్ జా బహదూర్ 1971లో ఈ భవనాన్ని "విద్యా విషయక ముకర్రమ్ జా ట్రస్ట్"కు అప్పగించాడు.

(ఈ నేల – ఈగాలి నుండి)

తెలుగు వలరాణి భాగ్యమ్మ తేజమలర,
గోలుకొండావనీపతి కుతుబుషాహ
భాగ్యమాపేర నిర్మించ భాగ్యపురిని
అదియె హైదరాబాదయ్యె హైదరాఖ్య !

హైదరబాదు భాగ్యపురమందు నవాబులు వైభవోద్ధతిన్
మేదుర పాలనన్ సలిపి మిక్కుట బంగరు వజ్రరత్నముల్
గాదెల నింపి సౌధములఁగట్టిరి, ఇప్పుడదాంధ్రప్రదేశపున్
మేదుర ముఖ్యపట్నమయి మెప్పుల కుప్పయి వెల్గుచుండెగా.

- విశ్వనాథ సత్యనారాయణ

మండలి వెంకట కృష్ణారావు

తెలుగు తేజము

తెలుగువారు ఎప్పటివారు? ఎక్కడివారు? ఎటువంటివారు? ఆలోచిస్తూంటే ఒళ్లు జలదరిస్తుంది. నేను తెలుగువాణ్ణి అనుకొన్నప్పుడు ఒళ్లు పరవశిస్తుంది. నాది తెలుగుగడ్డ అనుకోగానే ఏదో దివ్యలోకంలో వున్న అనుభూతి కలుగుతుంది. అందుచేతనే కాబోలు శ్రీమదప్పయ్య దీక్షితులవారు అన్నారు, కాదు సగర్వంగా అన్నారు.

"ఆంధ్రత్వ మాంధ్ర భాషాచ నాల్పస్య తపసః ఫలమ్"

నిజమే, ఎంతో తపస్సు చేసుకొంటేనే కాని, ఈ పవిత్ర భూమిలో జన్మించటం సంభవించే విషయం కాదు.

పదహారణాల పరమసత్యం !

తెలుగువారు ఎప్పటివారు? తెలుగువారు 2,500 సంవత్సరాల చరిత్ర కలవారు. ఎక్కడివారు? ఉత్తర దక్షిణ భారతాలకు నడిబొడ్డున కీలక స్థానంలో ఉన్నారు. ఎటువంటివారు? భారతదేశాన్ని ఒకప్పుడు ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలినవారు. ఇప్పుడు ఏలగల సమర్థులు. అయితే తెలుగవారి ఈ విశిష్టత ఏమిటో కొంచెం పర్యాలోచన చేద్దాం.

తెలుగువారి చరిత్ర 2,500 సంవత్సరాల నాటిది అనుకొన్నాం కదా! అంటే తెలుగుజాతి చరిత్రకు ఎక్కినది అప్పటినుంచే అన్నమాట. అంతకు ముందు ఇంకా ఎంత చరిత్రవుందో మనకు ఖచ్చితంగా తెలియదు. చరిత్రకెక్కిన తొలి తెలుగు చక్రవర్తులు శాతవాహనులు. వీరిని పురాణాలలో ఆంధ్రులనీ శాసనాలలో శాతవాహనులని అన్నారు. శాతవాహన సామ్రాజ్యం గూర్చి మెగస్తనీసు ఈ విధంగా అన్నాడు. (మౌర్య సామ్రాజ్య స్థాపకుడైన చంద్రగుప్తుని ఆస్థానం సందర్శించిన గ్రీసు దేశపు రాయబారి ఈ మెగస్తనీసు) "మౌర్య చక్రవర్తులతో అన్ని విధాలా సమానమైవారు ఆంధ్ర చక్రవర్తులు. వారికి చుట్టూ ప్రాకారాలు ఉన్న ముప్పై నగరాలు ఉన్నవి. నూరువేల పదాతి దళం, రెండువేల అశ్విక దళం, వెయ్యి గజదళం ఉంది" ఇది క్రీస్తుపూర్వం మూడు, నాలుగు శతాబ్దాలనాటి మాట; తెల్లవాళ్లు చెబితేనే మనకు మరింత నమ్మకంకదా? మరి తెలుగు వారి ఆనాటి విశిష్టతను గూర్చి ఇంతకంటె సాక్ష్యం అక్కరలేదనుకొంటాను.

ఇంకా, చారిత్రకంగా, సాంఘికంగా, భాషాపరంగా, ఆర్థికంగా మన విశిష్టతలేమిటో సంక్షిప్తంగా వివరించే ప్రయత్నం చేస్తాను.

శాతవాహన చక్రవర్తులను గూర్చి ఇంతకుముందే పేర్కొన్నాను. నేటి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తెలుగు భాగాలు అన్నీ మొట్టమొదటి సారిగా ఒకే పరిపాలన క్రిందకు వచ్చినది శాతవాహనుల కాలంలోనే.

అంతేకాదు, ఆరవ శాతవాహన చక్రవర్తి అయిన శాతకర్ణి దక్షిణావని కంతటికే ప్రభువు (దక్షిణాపథపతి) కాగా, 15వ చక్రవర్తి అయిన పులోమావి మగధ సామ్రాజ్యాన్ని కూడా జయించి ఉత్తర దక్షిణ భారతాలకు చక్రవర్తి అయినాడు. శాతవాహనుల అనంతరం తెలుగు దేశం విచ్ఛిన్నమై అనేకులపాలన క్రిందికి వచ్చింది. మళ్ళీ తెలుగు భూభాగాలన్నింటిని ఏకంచేసిన ఖ్యాతి కాకతీయ గణపతి దేవునకు లభించింది. తరువాత మళ్ళీ విచ్ఛిన్నమైంది తెలగుదేశం. అప్పుడు గోల్కొండ నవాబులైన కుతుబ్ షాహీల పరిపాలనలో తెలుగు భూభాగాలన్నీ ఒక పరిపాలనలోకి వచ్చాయి. ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో మరల విడిపోయాయి. చివరకు తెలుగు భూభాగాలన్నీ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మాహుతితో ఏకమై ఆంధ్రప్రదేశ్ అవతరించింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారకులైన తెలుగువారంతా ఆంధ్రప్రదేశ్‌తో ఏకం కాగలిగినారు. నేడు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగువారు సుమారు ఐదుకోట్లు ఉన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో, విదేశాలలో తెలుగువారు సుమారు ఇంకో కోటి వున్నారు.

మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు సాధించిన ఘన విజయం వల్ల ప్రపంచంలోని తెలుగువారంతా ఏకం కావడం అందరకూ తెలిసిన సత్యమే.

మన చుట్టు తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నవి. ఇన్ని రాష్ట్రాల మధ్య ఉండికూడా, సుమారు 600 మైళ్ళ పొడవు గల సముద్రతీరంవున్న రాష్ట్రం భారతదేశంలో ఇంకోటి లేదంటే అతిశయోక్తికాజాలదు. ఇన్ని రాష్ట్రాలమధ్య ఉండడంచేత వారి ప్రభావం మనమీద, మన ప్రభావం వారిమీద వుండడం సహజం. తక్కిన వారిమాట ఎలాఉన్నా మనం మాత్రం వారందరితో సఖ్యంగా ఉంటూ వారిమధ్య కూడా పరస్పరం సదవగాహన ఏర్పడటానికి తోడుపడుతున్నాం. ఇది తెలుగువారి సహ జీవనానికి మంచి నిదర్శనం. తెలుగుదేశం దక్షిణ భారత దేశంలోనే కాక మొత్తం భారత దేశానికి కీలక స్థానంలోవుంది. మరి తెలుగుదేశపు రాజధాని హైదరాబాద్ భారతదేశానికి రెండవరాజధాని కావటం ఇందుకు తార్కాణం. రాజకీయ నాయకత్వంలో, అఖిల భారతస్థాయిలో తెలుగువారి శక్తి సామర్థ్యాలను ప్రత్యేకంగా వివరించి చెప్పవలసిన అవసరం లేదనుకొంటాను.

తెలుగుదేశం సాంఘికంగా ఎంతో అభివృద్ధి సాధించింది. సహజీవనం విషయంలో తెలుగుదేశం భారతదేశానికి అంతటికీ మార్గదర్శకమైంది. విభిన్న మతాలకు, విభిన్న సంస్కృతులకు తెలుగుదేశం సంగమస్థానం. మహమ్మదీయ దండయాత్రల ప్రవాహం దక్షిణ భారతదేశం చేరుకోకుండా చెలియలి కట్టగా నిలిచిన విజయనగర సామ్రాజ్యపు రాజధాని నగరంలోనే మహమ్మదీయ సోదరుల సౌకర్యం కోసం మసీదులు వెలసినవంటే ఇంక మతసహనానికి వేరే తార్కాణం ఇంకేంకావాలి? కొత్తదనంలో ఏమాత్రం మంచి కనిపించినా స్వీకరించి సొంతం చేసుకునే గుణం తెలుగువారికి వెన్నతోపెట్టిన సుగుణం. కావుననే బౌద్ధం, జైనం మొదలైన మతాలు ఆనాడు తెలుగుదేశంలో ప్రాబల్యం సంపాదించుకొన్నవి. రాజు ఒక మతాన్ని అభిమానిస్తే రాణి ఇంకో మతాన్ని అభిమానించినప్పటికీ సామరస్యంతో సంసారం చేసుకొంటూ, రెండు మతాలను సమానంగా ఆదరించి, పోషించిన ఘట్టాలు తెలుగుదేశ చరిత్రలో ఎన్నో వున్నాయి.

సంఘసంస్కరణోద్యమాలు ఉత్తరభారతదేశంలో ఇంకా ఉపన్యాసాల స్థాయిలోనేవున్న సమయంలో తెలుగుదేశంలో కందుకూరి ప్రభృతులు ఆచరణలో పెట్టినారు. గాంధీ మహాత్ముడు హరిజనోద్ధరణోద్యమాన్ని చేపట్టడానికి చాలా ముందే అంటే 1909లోనే చిలకమర్తి రాజమహేంద్రవరంలో హరిజనుల కోసం పాఠశాలను నెలకొల్పినారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో తెలుగువారు చేసిన త్యాగాలు దేశంలో మరెవరిత్యాగాలకు తీసిపోవు. ఆంధ్రకేసరులకు, ఆంధ్రరత్నలకు, దేశభక్తులకు, విశ్వదాతలకు, అమరజీవులకు, ఆంధ్రపితామహులకు పెట్టినిల్లు తెలుగుదేశం. దేశశ్రేయస్సుకోసం తుపాకిగుండుకు రొమ్ముఎదురొడ్డిన ఆంధ్రకేసరి, ప్రాణాలనే త్యాగంచేసిన అల్లూరి సీతారామరాజు, ఆత్మాహుతిచేసుకొన్న అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రభృతులు తెలుగుమాత ముద్దుబిడ్డలు. భాషాప్రయుక్తరాష్ట్రాల ఉద్యమ నాయకులు తెలుగువారే అన్న విషయం ఇంతకు ముందే పేర్కొన్నాను. త్రికరణశుద్ధిగా పనిచేస్తున్న సంఘ సేవకులకు, సంఘ సేవికలకు తెలుగుదేశంలో ఏనాడు లోటులేదు. అంతర్జాతీయ ఖ్యాతివహించిన దుర్గాబాయమ్మ పేరు ఈ సందర్భంలో తప్పక చెప్పుకోవాలి. స్త్రీల విద్యావిషయంలో కూడా తెలుగుదేశం చాలా ముందంజ వేసినదని చెప్పక తప్పదు.

భాషా పరంగా చెప్పవలసినది చాలా వుంది. ఒకప్పుడు భారతదేశంలో వ్యవహార భాషగావుండి నేటికి సంస్కృతి భాషగా నిలిచివున్న సంస్కృత భాషకు తెలుగువారు ఎంతో సేవచేసినారు. ఎందరో తెలుగురాజులు సంస్కృతభాషలో కావ్యాలు, లక్షణ గ్రంథాలు వ్రాసినారు. విద్యానాథుని ప్రతాపరుద్రీయం, మల్లినాథసూరి కావ్యవ్యాఖ్యానాలు, అన్నంభట్టు తర్కశాస్త్రం నేటికీ భారతదేశమంతటా పఠన–పాఠన వ్యవహారంలో వున్నవి. ఢిల్లీ పాదుషాకు గౌరవపాత్రుడైన జగన్నాథపండితరాయలు తెలుగువాడు. నిర్దుష్టమైన ఉచ్ఛారణతో వేదపఠనం నేటికి ఒక్క తెలుగుదేశంలోనే వినిపిస్తుంది. వేదాలకు వ్యాఖ్యలు వెలయించిన సామాన్యాచార్యుడు తెలుగువాడు. తెలుగువాడైన వల్లభాచార్యులవారు ఉత్తర భారతంలో ఆచార్యపీఠం వహించారు. ఇంక తెలుగుభాష విషయం చూద్దాం. తెలుగులో వెయ్యిసంవత్సరాల ప్రౌఢసాహిత్యంవుంది. ఉత్తర భారతదేశ భాషలలో సాహిత్యలతలు ఇంకా మొగ్గతొడగకముందే తెలుగు సాహిత్యం పుష్పఫలభరితమైంది. “ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్”గా పేరుపొందిన మధురభాష తెలుగు. ఏ భాషాపదాన్ని అయినా, స్వీకరించి, సొంతంచేసుకోగల శక్తి తెలుగు భాషకు వున్నంతగా మరే ఏ భాషకూ లేదు. అంతేకాదు, వ్రాసినట్లుగా పలకడానికి, పలికినట్లుగా వ్రాయడానికి అనువైన భాష తెలుగు. ఏ భాషకైనా తెలుగు సన్నిహితం కాగలదు. అందుచేతనే భారతదేశంలో సంధాన భాషగా రూపొందించడానికి అర్హత ఒక్క తెలుగు భాషకే వున్నదని ప్రొఫెసర్ జె.బి.ఎస్.హాల్డేన్ అన్నాడు.

ఇప్పుడు తెలుగులో లేని సాహిత్య ప్రక్రియలేదు. తెలుగులో వ్యక్తం చేయలేని భావం అంటూ లేదు. విశ్వవిద్యాలయ విద్యామాధ్యమంకాగల స్వీయ శక్తిని తెలుగుభాష ఇటీవల నిరూపించుకొన్నది. ఈ విషయంలో చాలా భారతీయ భాషలు ఇంకా వెనుకబడివున్న విషయం అందరకూ తెలిసిందే.

ఇంక కళల విషయంలో ప్రపంచంలోని ఏ దేశానికీ తెలుగుదేశం తీసిపోదు. కర్ణాటక సంగీతం నేర్చినవారు ఏ భాషవారైనా, ఏ ప్రాంతంవారైనా– కృతకృత్యులు కావాలంటే ఈనాటికీ త్యాగరాజస్వామివారి తెలుగు కృతులను సాధనచేయక తప్పదు. చిరకాలంగా వస్తున్న భరత మహర్షి నాట్యసంప్రదాయాన్ని యథా తథంగా కాపాడుకొంటూ వస్తున్న కూచిపూడి సంప్రదాయం మనకందరకూ ఆనందదాయకమైనది. అంతేకాదు, అభినయదర్పణకర్త శంకేశ్వరుడు తెలుగువాడు. అది మరికొన్ని నృత్య, నాట్యసంప్రదాయాలకు మార్గదర్శకుడైన సత్యం మనకు గర్వకారణంకూడా. జగత్ప్రసిద్ధిపొందిన అజంతా గుహలలో, కనీసం నాలుగు అయినా, తెలుగు శిల్పుల హస్తకౌశలానికి నిదర్శనాలని విజ్ఞులందరూ అంగీకరించిన విషయమే.

ఇంక ఆర్థిక రంగానికి వద్దాము. బహుశః తెలుగుదేశంలో ఉన్నన్ని వనరులు ఇంక ఏ రాష్ట్రంలోనూ లేవేమో? దేశాన్ని సస్యశ్యామలం చేయగలిగిన ఎన్నో జీవనదులకు తెలుగుదేశం ఆలవాలం. ఇంక భూమి అనేక విధాలుగా వుంది. ప్రతిచోటా ఏదో ఒక పంట పుష్కలంగా పండుతుంది. తెలుగుదేశం భారతదేశపు ధాన్యాగారంగా పేరొందింది. నిజానికి తెలుగుదేశం భారతదేశానికి "అన్నపూర్ణ". ఇంతకుముందే పేర్కొనట్టుగా తెలుగుదేశానికి 600 మైళ్లుపొడవు గల సముద్రతీరం ఉంది. ప్రపంచంలో "సహజమైన హార్బర్లు" చాలా అరుదు అంటారు మరి అటువంటిది తెలుగుదేశంలో విశాఖపట్టణంలో ఉంది. దీని పురస్కరించుకొని ఎన్నో భారీపరిశ్రమలు నెలకొన్నాయి. ఇంకా నెలకొంటున్నాయి. మనకున్న అటవీ సంపదకూడ చాల అమూల్యమైనది.

అంతేకాదు, మనకున్న ఖనిజ సంపదకు విలువకట్టే షరాబులు ప్రపంచంలోనే లేరు అనడం అతిశయోక్తికాదు, బొగ్గు, ఇనుము, మాంగనీసు, బరైటిజ్, రాగి, సీసం, గ్రానైట్, మైకా, బాక్సైట్ వంటి ఖనిజాలు తెలుగుదేశంలో ఏదో ఒక చోట వున్నాయి. అంతేకాదు, పుష్కలంగా ఉన్నాయి. ఇంక విస్తృతంగా దొరికే సున్నపురాయివంటి వాటిని గూర్చి ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరం లేదు. పెట్రోలు, నాచురల్ గ్యాస్ బాగాదొరికే అవకాశాలు ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్నవి.

విద్యారంగంలోకూడా తెలుగుదేశం ఇటీవల చాలా ప్రగతిని సాధించింది. ముఖ్యంగా వెనుకబడిన జాతులవారి విషయంలో మన ప్రభుత్వం చాలా కృషిచేస్తున్నది. సమసమాజస్థాపనే మన లక్ష్యం.

ఏవిధంగా చూసినా మన ఆంధ్రప్రదేశ్ ఆనాడూ ఈనాడు కూడా– ఉత్తర–దక్షిణ భారతాలమధ్య కీలకస్థానంలో ఉంది. ఉన్న వనరులను, వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోగలిగితే మనం ఇంకా ఎంతో అభివృద్ధి సాధించి, భారతదేశానికి మార్గదర్శకులమేకాక, గర్వకారణం కూడా కాగలము. (1979)

(తెలుగు తేజము105 నుండి)

గోదావరీ పావనోదార వాఃపూర
    మఖిల భారతము మా దన్న నాడు
తుంగభద్రా సముత్తుంగ రావముగోడ
    కవుల గానము శ్రుతి గలయునాడు
పెన్నానదీ సముత్పన్న కైరవ దళ
    శ్రేణిలో తెన్గు వాసించునాడు
కృష్ణా తరంగ నిర్ణిద్ర గానముతోడ
    శిల్పమ్ము తొలిపూజ సేయునాడు

అక్షరజ్ఞాన మెఱుగదో యాంధ్రజాతి
విమల కృష్ణానదీ సైకతములయందు
కోకిలపు బాట పిచ్చుక గూండ్లు కట్టి
నేర్చుకొన్నది పూర్ణిమా నిశలయందు

– విశ్వనాథ సత్యనారాయణ

డా॥ మోటూరి సత్యనారాయణ

తెలుగు వారి వ్యక్తిత్వం

భారతదేశం జనాభా లెక్కల ప్రకారము ప్రతి భాషా రాజ్యంలోని అల్పసంఖ్యాకుల అంకెలు చూస్తే తెలుగువారి సంఖ్య ఎక్కువగా కనబడుచున్నది. ఇదే సంఖ్య ఇతర భాషలవారికి ఎవరికీ లేదు. లక్షలాదిగా జనం తెలుగు మాట్లాడే వారు ఇతర రాష్ట్రాలకు తరలిపోయి వందలకొలది సంవత్సరాలుగ నివసిస్తూ తెలుగువారుగానే ఉండిపోయారు. ఇంతేకాదు తెలుగువేషభాషలు, ఆచారవ్యవహారాలు, కులమత సంప్రదాయాలు కూడా మరువలేదు. ఆ ప్రాంతాలకు వెళ్లిన ప్రతి తెలుగు వ్యక్తిలోను తెలుగుదనము ఉట్టిపడడమేగాక తెలుగు అభిమానముకూడా కనబడుతున్నది. ఈ తెనుగుదనము స్త్రీలలో నిలచిపోవడం సహజం. పురుషులలోకూడా నిలచిపోయినదంటే వారికి తమ భాషా సంస్కృతుల మీద ఏదో ఒక గాఢమైన అభిమానం తరతరాలనుండి వస్తూ వారిలో అది అంతర్లీనమై ఉండియుండవలెను. దీనికి ప్రధానమైన కారణాలు మనము వెదకి తెలుసుకోవాలంటే పాతకాలంనాటి చరిత్రనంతా పరిశోధిస్తేనే కాని బోధపడదు. తెలుగువారి ప్రత్యేక వ్యక్తిత్వం దానికి ఆపాదింపబడే వర్ఛస్సుకు కారణం వారి భౌతిక రూపమా, బుద్ధికుశలతా, పాండిత్య ప్రకర్షయా, ఆవేశపూర్ణమైన శౌర్యప్రతాపాలా, వ్యవహార దక్షతయా, సౌహార్ధంతో కూడిన శాలీనతా?

ఈ గుణాలన్నిటితో సమ్మిళితమైన ఒక పరిపక్వ వ్యక్తిత్వమా? – వీటి పరిశీలనకు తెలుగుభూగోళాన్ని ఒకసారి పరిశీలించడం అవసరం. తెలుగు ఎల్లలతో పరిబద్ధమైన తెలుగు భూభాగాలలో నివసించే ప్రజల పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకోవలసి వుంటుంది. భాషా సంప్రదాయాలలోను, సాహిత్యంలోను సంబద్ధమైన సంప్రదాయాలలో లోతుకుదిగి వాటి పాతచరిత్ర ఒకసారి తిరగతోడవలసి వుంటుంది. అత్యధికమైన ప్రజానీకాన్ని ఇతర ప్రాంతాలనుంచి ఆకర్షించి వారిని నూటికి నూరుపాళ్ళను తన స్వంతంగా చేసికొనిన ప్రదేశమేదైన ఉందంటే అదికూడ తెలుగు ప్రదేశమే అని చెప్పాలి. క్రీస్తుశకం ప్రథమాబ్దాల నుంచి దశాబ్దాలవరకు పూర్వకళింగ దేశంలోని ఒక ప్రాంతంనుండి వేలకువేలుగా తెలుగుదేశమునకు వచ్చి మనదేశమునందలి అనేక భాగాల్లో పాతుకొనిపోయిన కాళింగులంతా నూటికి నూరుపాళ్ళు తైలంగులుగా మారిపోయారు. భారతదేశపు పూర్వోత్తర భాగం నుంచి తండోపతండాలుగా వచ్చిన హైహయ క్షత్రియులు, రాష్ట్రకూటులు తదితరులు వారి స్వరూపాలనే మార్చుకొని తెలుగు వారై పోయారు. పశ్చిమాంధ్ర పరిసరాలలో గోదావరినదీ తీరంలో ప్రప్రథమంగా ప్రతిష్ఠానపురంలో తమ సామ్రాజ్యాన్ని స్థాపించు కొన్న ఆంధ్ర సామ్రాజ్యాధిపతులు ఆంధ్రదేశంలో నివాసమేర్పరచుకొని తమ స్వస్థలమైన నేటి మహారాష్ట్ర భూభాగానికే స్వస్తి చెప్పారు. విజయనగర రాజ్యకాలంలో ప్రస్తుత కన్నడదేశం నలుమూలలనుండి తెగలు తెగలుగా వచ్చిన కన్నడులు తెలుగుదేశం నలుమూలలవ్యాపించి

తాము జీర్ణించుకొన్న తెలుగుతనాన్ని వ్యాపింప చేస్తున్నారు. క్రీస్తుశకపు ప్రథమ దశాబ్దంలో లక్షలాదిగా ద్రావిడ దేశం నుండి వచ్చిన ద్రావిడులు తాము నూటికి నూరుపాళ్ళు తెలుగువారుగ పరిగణింపబడుతున్నారు. ఒరియా, హిందీ, మరాఠీ, కన్నడ, తమిళ – ఈ అయిదు భాషల ప్రాంతాలతోను పరివేష్టితమైన తెలుగుదేశం తన ప్రస్తుత సంపన్న సాహిత్య సంప్రాప్తి దశకు చేరుకొనడానికి ఈ భాషలు మాట్లాడేవారి ప్రాకృతికసంపన్నతను తన భాషాసంప్రదాయా లలో పొందుపరచు కొన్నది. మహమ్మదీయులతోపాటు వచ్చిన ఉర్దూ, హిందూస్థానీని, గోసాయిలు, సాధువులు కొని తెచ్చిన హిందీభాషా సంప్రదాయాలని తెలుగుదేశం తన సంప్రదాయాలలో ఇముడ్చుకొని వాటికి క్రొత్త రూపాలను దిద్దింది. ప్రపంచ ప్రఖ్యాతిని పొందిన గోదావరినదీతీరం లోని సంస్కృతపాండిత్య ప్రకర్ష నేటికికూడా ఆనాటి మహాపట్టణాల లోనే కాకుండా సంస్కృత భాషకు అటపట్టు అయిన వారణాసి పట్టణములో కూడా ప్రశంసింపబడుతూ, నలుమూలల నుండి జ్ఞాన, విజ్ఞానాన్ని, సత్సంప్రదాయాలను సంగ్రహించి, సంస్కరించి, తాము ఆత్మగతం చేసుకొన్న ఆ జ్ఞానాన్ని సరిక్రొత్తదనముతో దేశం నలుమూలల వ్యాపింపచేసిన ఘనత తెలుగు వారికి ఉన్నంత మరెవరికి లేదనే చెప్పాలి.

'తెలుగు' అనే శబ్దం వాడుకకు, గొప్పతనానికి ఆపాదింపబడిన వైభవాన్ని చూస్తే గర్వపడవలసిన తార్కాణాలు యెన్నో కనపడగలవు. 'తెలంగ' అంటే పంజాబ్‌లో మంచి కుస్తీపట్టగల వస్తాద్ అని అర్థం. తెలంగ అంటే ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రాంతాలలో పోలీసు సిపాయి అని అర్థం. తెలంగ అంటే మధ్యభారతదేశంలోను, రాజస్థాన్, గుజరాత్ ప్రాంతంలోను, సంస్కృతంలో మహాపండితుడని అర్థం. తెలంగ్ అంటే మహారాష్ట్రంలో చాలమందికి జ్యోతిషాచార్యుడని భావం. ఇవి తెలుగు వారి శౌర్య ప్రతాపాలకి, పాండిత్యప్రశస్తికీ నిదర్శనాలు. ఉత్తర, దక్షిణ దేశాలకి మధ్య అయిన ఈ భూభాగం కాలాంతరంగా జ్ఞాన మతాలకు, జ్ఞానసార ప్రచారానికి ఆటపట్టుగ పేరు పొందింది. ఈ భూభాగంలో ఏదో గొప్పతనం లేకపోతే హిమపర్వతసానుప్రాంతాలలో నుండి వచ్చిన బుద్ధమతం, తెలుగుకొంద్ర వికసించి వ్యాపించి ఉండేదా! శ్రీలంకలో వ్యాపించిన బౌద్ధమతానికి కారకులైన బుద్ధఘోషుడు గుంటూరు జిల్లానుంచి వెళ్ళిన తెలుగుపండితుడని చరిత్రకారులు నిరూపించారు. ప్రపంచ మంతట వ్యాపించి ఉత్తమోత్తమముగ పరిగణింపబడిన మహాయాన సంప్రదాయం నాగార్జునుని ద్వారా తెలుగుగడ్డ మీదనే ఉద్భవించిందని ప్రపంచ మంతటికి తెలుసు. ఈ నాగార్జునుడే ఆదిశంకరుని అద్వైత సిద్ధాంతానికి ప్రేరణాదాయి అని పేరు పొందినారు, ఎన్నో కాలాలపాటు జైన మతాన్ని అనుసరించి జీర్ణించుకొని తమ స్వసంప్రదాయాలలో తెలుగుజాతి ఇముడ్చుకున్నట్లు వందలకొలది తార్కాణాలు ఉన్నాయి. రెండు వేల సంవత్సరాల క్రిందట పునాదులువేసుకున్న తెలుగు సంస్కృతి సౌధం యొక్క నాలుగుస్థంభాలు ఇప్పటికికూడా ఇతర ప్రాంతాలలో ప్రతిరూపాలను సృష్టించుకుంటున్నాయి.

తెలుగు శబ్దంలోనుంచి పుట్టిన సంగీత మాధుర్యం కర్ణాటక సంగీతంగా పేరొందింది. త్యాగరాజుయొక్క ముఖతః అది తెలుగు వారి సొత్తుగా, మహదైశ్వర్యంగా విరాజిల్లుతూ ఉంది. వర్ణాన్ని పురస్క రించుకొని సర్వోత్కృష్టమైన చిత్రాలుగా సృష్టించబడిన కళాఖండాలు అజంతా, అమరావతులలోని కళాసృష్టితో తెలుగుదేశానికి శాశ్వత కీర్తిని సంపాదించి పెడుతున్నాయి. రాళ్లమీద మలచిన శిల్పకళను తెలుగువారు స్వస్వరూప చిహ్నంగా అమర్చుకుంటే వారి రెండువేల సంవత్సరాలనాటి ఆరంభ వ్యక్తిత్వానికి, నేటి వ్యక్తిత్వానికి భేదం కనపడదు. శిల్పం, చిత్రకళ, సంగీతం, సాహిత్యం, సంస్కృతి సౌధానికి నాలుగు స్తంభాలు. తెలుగు సాహిత్యం ఈనాటి ఏ సాహిత్యానికి తీసిపోదని చెప్పటానికీ ఉదాహరణలు అక్కరలేదు. తెలుగు సాహిత్యం యెంత పరిపుష్టమైనదో అంత పరిపక్వమైనది కూడా. తెలుగు భాష యొక్క వికాసం యెంత ప్రణాళికాబద్ధమైనదో సాహిత్యం కూడా అంత క్రమిక వికాసంతో ప్రణాళికా బద్ధమైనదని చెప్పవచ్చును. తెలుగు సమాజాన్ని సంస్కారవంతంగా తయారుచేయడానికి మహా భారత గ్రంథ నిర్మాణం చేసిన తిక్కనకవిగారి పూర్వకాల సాంస్కృతిక సంపదను ఇంతవరకు ఎవరు తరచి చూచారు? అదేమి విశేషమో భారతదేశంలోని అన్ని భాషల సాహిత్యాలలో రామాయణానికి ప్రఖ్యాతి. తెలుగువారికి మహాభారతం అంటే పరమ ప్రీతి. తిక్కన మహాభారతం ధర్మన్యాయ బోధలతో నిండిన ఒక సమాజ విజ్ఞాన సర్వస్వంగా పరిగణింపబడడమే దీనికి కారణం. పోతన భాగవతం తిక్కన నేర్పించిన సమాజ కర్తవ్యబోధ, తద్వారా ఉద్భవించే శౌర్యపరాక్రమాలకు విరుగుడు నేర్పిస్తూ, మనుష్యుని దైవసాన్నిధ్యానికి చేర్చేభక్తి పారంపర్యాన్ని, మనుష్య జీవితంతో జోడించి ఆముష్మిక మార్గాలను వేసే సామగ్రిని సమకూరుస్తూ ఉంది. ఈ భక్తి సంప్రదాయాలయొక్క అతికి, విరుగుడే వేమన సాహిత్యం. ఈ ముగ్గురు తెలుగుదేశపు మూలలనుండి తమ స్వశక్తి దీప్తమైన సాహిత్య ప్రకాశపు పుంజాలతో తెలుగువారి జీవితానికి రాచబాటలను వేశారు. ఈ త్రిమూర్తులు తెలుగు వారందరికి సంస్కృతి నిష్ఠను సంపాదించడానికి ఆరాధ్యదేవతలుగా పరిగణింపబడాలి. మానసిక దైవిక శక్తులు పెంపొందడం ఎంత అవసరమో అనాసక్తి పూరితమైన నిర్వికారమైన జీవిత సాధనకూడా అంత అవసరమని, ఒకరిని ఒకరు సంప్రదించుకొని తెలుగువారికి ఇచ్చిపోయారో అన్నట్టు ఈ త్రిమూర్తుల సాహిత్య ప్రసాదమనే పెన్నిధిని తెలుగు వారు స్వీకరించాలి. ఏకాంగమైన వ్యక్తిత్వం పరిశుద్ధమైనప్పటికి సర్వాంగీణం కాకపోతే సమాజంలో ప్రతిభాహీనమవడమేగాక ప్రయోజన హీనం కూడా అవుతుంది. తెలుగువారి వ్యక్తిత్వం చిరకాలం నుండి సర్వాంగీణంగా వికసించడం వల్ల వారి వ్యక్తిత్వంలో ఒక వైశిష్ట్యం, ప్రత్యేకత కనపడుతుంది. వారికి పరంపరాగతంగా వచ్చిన ఆదర్శం, సర్వవిజ్ఞానాన్ని తమ దేశంలో వెదజల్లడమూ, దానిని పెంచి పెద్దదానిని చేసి, తత్ఫలితాన్ని లోకానికి అందజేయడమూ, అనాదిగా వస్తున్నది. ఇదే మనకు భవిష్యత్తునకు కూడా అవిచ్ఛిన్న మైన పరంపరగా ఏర్పడవలె.

(తెలుగు వాణి – ప్రపంచ తెలుగు మహాసభల సంచిక – 1975)

శ్రీమతి ఇల్లిందల సరస్వతీ దేవి

తెలుగు మహిళ

జాతి సంస్కృతినీ నాగరికతనూ ప్రజల వేషభాషలను బట్టీ ఆచారవ్యవహారాలనుబట్టీ గుర్తించవచ్చు. వాకిట్లో ముగ్గూ, గడపలకు పసుపుకుంకుమలతో బొట్లూ, మామిడాకు బంతిపూలతో గుమ్మాలకు తోరణాలూ కనబడితే ఆ ఇల్లు పదహారణాల తెలుగువారి ఇల్లని ఏ విదేశీయుడైనా చెప్పగలుగుతాడు. ఆ ఇంటికి ఆ అలంకరణతో తెలుగువారి ముద్ర పడుతుంది. ఆధునిక నాగరికతలో మునిగి తేలుతున్నా, దేశాంతరములో ఉన్నా తమ సంస్కృతినీ నాగరికతనూ సామాన్యంగా ఎవరూ విస్మరించరు. అందులో స్త్రీలు ఏ మాత్రము విస్మరించలేరు.

ఫ్రెంచి రచయిత అయిన లూయీ జాకారియట్ భారతదేశాన్ని గురించి వ్రాస్తూ " స్త్రీలకు సంఘంలోనూ కుటుంబంలోనూ అత్యున్నతమైన స్థానము కల్పించిన భారతీయుల నాగరికతా సంస్కృతి యూదుల నాగరికతా సంస్కృతులకంటె ప్రాచీనమైనవి" అని స్పష్టం చేశాడు. భారతదేశము పరాయి పరిపాలన క్రింద చాలాకాలము ఉండటంచేత నాగరికతా సంస్కృతి వికాసము కొంత తగ్గినా చెక్కు చెదరలేదు. మహమ్మదీయుల పరిపాలనలో అణగారిపోయినా, ఆంగ్లేయుల పరిపాలనలో విద్యావిషయికమైన మార్పు కలగటం చేత ఆంగ్లభాష నభ్యసించిన యువకులు చాలామంది తమ నాగరికతనూ సంస్కృతినీ అంతగా ఆదరించలేదు. అయినా నాగరికతా సంస్కృతీ స్థిరంగా దేశంలో నిలిచే ఉన్నాయి.

మన జాతి సంస్కృతినీ నాగరికతనూ ఎటువంటి విపత్కరమయిన పరిస్థితులలోకూడా కాపాడింది ఎవరోకాదు–మన స్త్రీలు. వారు పదిభాషలు నేర్చిగాని, యూనివర్సిటీ డిగ్రీలు సంపాదించిగాని ఎరుగరు. కొందరు పాఠశాల ముఖమైనా చూడనివారు. ఈనాటి దృష్టిలో విద్యాగంధ మెరుగని స్త్రీలు – వీధి వాకిలి దాటి ఎరుగని స్త్రీలు – పరంపరాగతమైన సదాచారాలనూ అనుశ్రుతంగా వస్తున్న అలవాట్లనూ పట్టుదలతో దీక్షతో ఆచరిస్తున్నందువల్లనే మనజాతి సంస్కృతీ నాగరికతా సంరక్షింపబడ్డాయి; ఇదీ మా సంస్కృతీ ఇదీ మా నాగరికతా అని ఈనాడు సగర్వంగా చెప్పుకోగలుగుతున్నాము, అని గొప్ప మతప్రచారకుడూ సంఘసేవా పరాయణుడూ అయిన స్వామి వివేకానంద విదేశాలలో చాటి చెప్పాడు.

ఆధునిక కాలములో సాంఘికజీవనములో ఎన్ని మార్పులు వచ్చినా ప్రాచీనాదర్శాలు ఎంత నశించిపోయినా ఒక ఆదర్శము మాత్రము ఇంకా నిలిచిఉన్నది. వేయిమందిలో ఒక స్త్రీ అయినా తనపరిమితులలోనే పైకి కనబడకుండా నాగరికతనూ సంస్కృతినీ మతవిశ్వాసాలనూ మొలకలెత్తించి పోషిస్తూ వాటితో సంబంధ సామరస్యాలను విడనాడకుండా ప్రతినిత్యమూ ఆ వెలుగులో తన భర్తను పిల్లలనూ నడిపిస్తుంది. గృహసీమకు రాణిఅయిన గృహిణి అడుగుజాడలతో పురుషుడు నడుస్తున్నాడు.

మహాత్మాగాంధీ ఒక సభలో “ ప్రపంచమంతా అనుకున్నట్టుగా భారతనారి శారీరకముగా అబల-సుకుమారి, కాని నైతికంగా సబల భుజబలమే బలముగా ఈ లోకము నమ్మినట్లయితే భారతనారి ఆ పశుబలము లేని అబల. ఆ బలాన్నే నైతికదృష్టితో చూచినట్లయితే స్త్రీ బలవంతురాలు. అహింసా సిద్ధాన్తమే మానవజాతిని ఉద్ధరించగలిగితే మనజాతి భవిష్యత్తు స్త్రీ జాతిచేతిలో ఉన్నది. మన స్త్రీలలో ఉన్న మాతృప్రేమా, తాగ్యశక్తీ, ధైర్యమూ పాపభీతి గొప్ప ప్రభావము కలవి. స్త్రీలు ఆచారాలనూ సాంప్రదాయాలనూ సులభంగా త్యజించలేరు. కనుకనే ఔదార్యాన్నీ పవిత్రతనూ కూడా వదలుకోలేకుండా ఉన్నారు” అని ఉపన్యసించారు.

మన స్త్రీలలో పరంపరాగతమైన నైతిక బలోద్వేగమూ దీక్షా జీవించి ఉన్నాయి. కష్టాలను ఓరిమితో సహించిన సీతమ్మా, యముడితో పోరాడి పతిప్రాణాలను దక్కించుకున్న సావిత్రీ, ఘోరమైన తపస్సుచేసి పరమశివుడిలో అర్ధభాగాన్ని పొందగలిగిన పార్వతి, త్రిమూర్తులను పసిపాపలనుగాచేసి తన శీలాన్ని కాపాడుకున్న అనసూయా, సూర్యచంద్రాదుల గతులను అరికట్టిన సుమతీ మన స్త్రీలకు ఆదర్శమూర్తులు. ఆ కథలలోని చారిత్రక సత్యాన్ని పరిశోధన చేయటానికి స్త్రీలు పూనుకోలేదు. కనుకనే సంఘములో రామయ్యల సంఖ్య నానాటికి తగ్గిపోతున్నప్పటికీ సీతమ్మలకు కొదువలేకుండా ఉన్నది. వివాహమనే పవిత్రవంతమైన సంస్థ ఈనాటికీ చెక్కు చెదరకుండా నిలిచి ఉన్నది.

స్త్రీలు తమ ఆదర్శాలను సాధించటానికి పట్టుదలతో భక్తి శ్రద్ధలతో దీక్షతో నోములో వ్రతాలో ఆచరించి ఒక విశిష్టమైన శారీరక మానసిక క్రమశిక్షణను అలవరచుకున్నారు. నోములూ వ్రతాలూ స్త్రీల జీవితంలో పరమపవిత్రమైన కార్యాలు – అతిముఖ్యమైన ఘట్టాలు, ఉపవాసాలు వాటిలో ఒక భాగము.

స్త్రీలకు ఐదవతనమే ప్రాణము. దీనికొరకు ఆమె నోచేనోములు లెక్కలేనన్ని. మ్రొక్కుబడులు అసంఖ్యాకము. పెనిమిటికి ఆయురారోగ్యాలూ సకలైశ్వర్యాలూ కలగాలి. తమకు సకల సంపదలతో పాటు సత్సంతానముకూడా కలగాలి. ఈ నోములూ వ్రతాలద్వారా స్త్రీలు అపేక్షించేది తమ కుటుంబ సుఖమొక్కటే కాదు – సంఘములో అందరి సుఖసంతోషాలనూ కోరుకుంటారు. ఎదటిమేలు ఓర్వటానికి ఎదటివారు సుఖపడటానికీ ఎన్నో మార్గాలు నోములూ వ్రతాలద్వారా అన్వేషిస్తారు; ఒకమాటలో చెప్పాలంటే వారు కోరుకునేది సర్వేజనాః స్సుఖినోభవంతు. ఈ విశాల విశ్వానికంతకూ జనని కాగల విశాల దృక్పథాన్ని సాధించగలగాలనీ, ప్రజలనందరినీ ఒక త్రాటిమీద నడిపించాలనీ ప్రగాఢమైన వాంఛ. వ్రతాలన్నీ – మన మీజన్మలో మంచిపనులు చేస్తే వచ్చే జన్మలో కష్టనష్టాలుండవనీ, సకలైశ్వర్యాలూ కలుగుతాయన్న దృఢవిశ్వాసంతో ఆచరిస్తారు స్త్రీలు. ఇటువంటి వ్రతాలలో ఉత్తమమైన వ్రతమాచరించి పార్వతీదేవి ఈశ్వరుడిలో అర్ధభాగానికి అధికారిణి అయిందన్న పురాణగాథపట్ల ప్రగాఢమైన విశ్వాసమూ భక్తిశ్రద్ధలూ స్త్రీలకు ఉన్నాయి. ఆ పార్వతీదేవి పట్టిన నోము జగమంతా పట్టి కార్యసాధన చేయాలన్న పట్టుదలలుకూడా ఉన్నాయి. ఆవేశమూ ఆశలూ ఉన్నాయి.

హిందువుల పండుగలలో కొన్ని దైవాంశగల మహాపురుషుల జన్మదినాలకు సంబంధించినవీ, కొన్ని మతసంబంధమైనవీ, మరికొన్ని ఋతుసంబంధమైనవీను. వీటన్నిటికీ యథోచితమైన ప్రాముఖ్యము నిస్తారు స్త్రీలు. వారి జీవితాలలో మతమూ సంప్రదాయమూ అడుగడుగునా పెనవేసుకుపోయాయి. అదే జీవితము – అదే వారి ధ్యేయము.

ఉగాదికి తీపి పులుపు చేదు రుచులతో పచ్చడిచేసి జీవితము కష్టసుఖాల కలయిక అని తెలియజెప్పుతారు స్త్రీలు. నూతన సంవత్సరంనాడు ఏ చెడుపనీ ఏ పొరబాటు పనీ చేసినా సంవత్సరం పొడుగునా ఫలితమిట్లాగే ఉంటుందని సూచన చేస్తారు. ఉగాదినాడు నూతన వస్త్రాలు ధరించితే సంవత్సరం పొడుగునా కొత్తబట్టలు లభిస్తాయని ఆశలు కల్పిస్తారు.

వినాయక చవితికి పిల్లలతో విఘ్నేశ్వర పూజ చేయించి జీవితములో ఏ మంచిపనికీ విఘ్నము కలగకుండా ఆ దేవుని ప్రార్థిస్తారు. ఎటువంటి అపవాదులూ రాకుండా చవితిచంద్రుడి దర్శనము చేసుకుంటారు.

శ్రావణమాసము స్త్రీలకు మంగళకరమైన మాసము. మంగళ గౌరీవ్రతమూ వరలక్ష్మీవ్రతములతో సందడిగా ఉంటుంది. కథ లోపమయినా భక్తిలోపం లేకుండా వ్రతమాచరిస్తారు.

నాగులచవితినాడు తలారా స్నానముచేసి చిమ్మిలీ చలిమిడీ ఆవుపాలూ పుట్టలోని నాగులయ్యకు సమర్పించి సంతానము లేక పోతే సంతానము కలగాలనీ, ఉంటే వృద్ధిలోకి రావాలనీ కోరుకుంటారు.

ఆశ్వీజ కార్తీక మాసాలలో వచ్చేవి దసరా దీపావళీ పండుగలు. దసరాపండుగకు ముందు దేవీనవరాత్రిళ్ళూ దుర్గపూజలూ దీక్షతో భక్తితో చేస్తారు. దీపావళి నరకాసుర వధానంతరం ప్రజలు జరుపుకున్న ఉత్సవాలు, ఆశ్వీజమాసం మొదలుకొని దీపావళి వరకూ పార్వతీదేవి ఘోరమైన తపస్సుచేసి పరమశివుడిని మెప్పించి ఆయనలోని అర్ధభాగాన్ని పొందిందన్న పురాణగాథ ఒకటిఉన్నది. ఈ రెండు పండుగలూ ఘనంగా జరుగుతాయి తెలుగువారి ఇళ్లల్లో.

సంక్రాంతి ఋతుసంబంధమైన పండుగ. పంటలు ఇళ్లకు చేరే కాలము. ఈ పండుగ జ్యోతిశ్శాస్త్రజ్ఞుల దృష్టిలో ఒక విధంగానూ, కర్మకాండలపట్ల విశ్వాసంగలవారి కొకవిధంగానూ, గృహిణుల కొకవిధంగానూ ప్రాముఖ్యత కలది. తెలుగువారికిది అల్లుళ్ల పండుగ. పండిన పంటలో కొంత ఖర్చుచేసి అల్లుళ్లకూ కూతుళ్లకూ తప్పకుండా నూతన వస్త్రాలిచ్చే పండుగ. భోగినాడు పిల్లలకు రేగిపళ్ళూ చెరుకుముక్కలూ తలమీదపోసి భోగిపీడ పోగొట్టుకునే పండుగ, పండుగనాడు గృహస్థుల పితృదేవతల సంతృప్తి కొరకు దాన ధర్మాలు చెయ్యాలి.

ధనుర్మాసంలో ఇల్లూవాకిళ్లూ బూజులు దులుపుకొని వెల్లవేయించుకొని, జేగురుమట్టితో సుద్దతో కుడ్యాలంకారాలు చేసుకొని, గుమ్మాలకు పసుపు రాచి కుంకుమబొట్లు పెట్టి మామిడాకులతో బంతిపూలతో తోరణాలు కట్టి, ఆరోగ్యకారి అయిన ఉత్తరాయణాన్ని మకరసంక్రమణమందు ఆహ్వానిస్తారు. ఈ పండుగకు రకరకాల ముగ్గులతో వాకిళ్ల నలంకరిస్తారు. గొబ్బిపూజ-గోవర్ధన పర్వతాలు, గోవూ గోపాలకృష్ణుడూ వీటి చిహ్నంగా

గొబ్బిళ్లను ముగ్గుల మధ్య ఉంచి పూలతో పూజిస్తారు. కన్యలు తమకు సుందరుడూ అనుకూలుడూ అయిన పెనిమిటి లభించాలని, ఆరోగ్యప్రదమైన మకర సంక్రమణం రాగానే దక్షిణాయనమందలి అనారోగ్య ప్రకృతిని రథమెక్కించి సాగనంపుతున్నట్లుగా భోగీ, సంక్రమణమూ కనుమూ గతించిన తరువాత ముక్కనుమునాడు రథము ముగ్గులేస్తారు. సంక్రాంతికి స్త్రీలు తమ కళానైపుణ్యాన్నంతా ముగ్గుల ద్వారా ప్రదర్శిస్తారు.

సంక్రాంతి వెంటనే వచ్చేది రథసప్తమి. ఆరోజు కూడా పద్మము చిత్రించి సూర్యారాధన చేస్తారు. గోమయంతో చేసిన పిడకలమీద ఆవుపాలు పొంగించి సూర్యభగవానుడికి నైవేద్యము పెడతారు.

ఇలా సంవత్సరం పొడుగునా పెద్దవీ చిన్నవీ పండుగలు వస్తూనే ఉంటాయి. వాటికి తగిన ప్రాముఖ్యత వాటికీ ఉండనే ఉన్నది. ఈ ప్రాముఖ్యతను విస్మరించకుండా ఆచారాన్ని చెక్కుచెదరనీయకుండా కాపాడుతారు తెనుగువారింటి ఆడబడుచులు.

శ్రుతిస్మృతుల కాలంలో సకలవిద్యలూ పురుషులతోబాటు సమానంగా ఆర్జించి సంఘంలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించగలిగిన స్త్రీల పరిస్థితి క్రమంగా దిగజారిపోయినది. దేశంలో కలిగిన రాజకీయమైన మార్పులవల్లనే. దిగజారిపోయిన పరిస్థితులలో కూడా స్త్రీలు తమ కర్తవ్యాన్ని విస్మరించకుండా పరంపరాగతంగా వస్తున్న ఆచార వ్యవహారాలను అనుసరించారు. ప్రాచీనులు అధిక విద్యావతులు కాని స్త్రీలకు విధ్యుక్త ధర్మాలనూ లౌకికజ్ఞానాన్నీ, పురాణ పరిచయాన్నీ, చారిత్రాత్మక విశేషాలనూ, వేదాంత తత్త్వాలనూ, వైద్యవిషయాలనూ, పరంపరాగతమైన ఆచార వ్యవహారాలనూ– ఒకటేమిటి – సకల శాస్త్రాలనూ పాటలద్వారా బోధచేశారు. అక్షరజ్ఞానం లేనివారికీ, పుస్తకం చేతబట్టే తీరికలేనివారికీ ఈ పాటల రూపాన చక్కని విజ్ఞానబోధ జరిగింది. ఈ పాటలే వారికి విద్యాపీఠాలు. ఈ పాటలలోని సాంఘిక జీవనము అతిసహజమైనది. ఇవి సాంఘిక జీవితానికీ కుటుంబజీవితానికీ ప్రతిబింబాలు. ఆంధ్రుల నాగరికతకూ సంస్కృతికీ ఈ పాటలు మూలాధారాలు. వీటిలో గృహిణి ఆశలూ, ఆశయాలూ, జీవితానందమూ, వాటికి సంబంధించిన వాతావరణమూ తప్ప మరొకటిలేదు. స్త్రీలు గృహకృత్యాలు నెరవేర్చుకుంటూ ఈ పాటల ద్వారా తమ విద్యుక్తధర్మాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ పారమార్థిక చింతననుకూడా సాధించారు. పెద్దలపట్ల వినయవిధేయతలూ, భక్తిగౌరవాలూ, పిన్నలపట్ల వాత్సల్యమూ, పేదలపట్ల దయాదాక్షిణ్యాలూ, బంధుప్రీతి, అతిథిఅభ్యాగతుల సత్కారమూ ఇటువంటివన్నీ గృహవాతావరణములో అబ్బిన సుగుణాలే. గృహమొక రాజ్యముగా పరిపాలిస్తున్న స్త్రీ మాతృమూర్తిగా ఒక సామ్రాజ్ఞిగా నిండు మనసుతో గంభీరంగా నిబ్బరంతో ఎన్ని కష్టాలు వచ్చి మీదపడినా తన ఆదర్శాలను విడనాడకుండా తన సంతతికి కూడా బోధిస్తుంది. తెలుగువారి జీవనసరళిలో నాగరితా సంస్కృతులు అంతర్వాహినులై నశింపెరుగకుండా ప్రవహించటానికి మర్రిఊడల వంటి ప్రయత్నాలు చేస్తుంది.

తెలుగువారి వంటకాలూ, రుచులూ, అలవాట్లూ, నమ్మకాలూ, ఆచారాలూ, మర్యాదలూ మన్ననలూ ఆశీస్సులూ ఆశలూ ఆశయాలూ – అన్నిటికీ అన్నీ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. వీటన్నిటికీ మూలము – ప్రాణం – జీవగఱ్ఱ స్త్రీ ఆమే జాతికి జ్ఞానజ్యోతి.

(తెలుగు వాణి – ప్రపంచ తెలుగు మహాసభల సంచిక – 1975)

మాధవస్వాముల మహిమ వర్ణించిన
కనకధారల నెయ్యమును భజించి
సాయణాచార్య భాష్యార్థ చర్చలొనర్చు
కోవిదులకు జోడుకోడెలగుచు
రసిక శేఖరుడైన రాయల ఆస్థాన
సాహిత్య రసముల చవుల గఱచి
జలకేళి సవరించు సత్యావరూధునీ
గిరికల తనురేఖ లొరసి మెఱసి
వాలి సుగ్రీవ పృథు భుజాస్ఫాలనలకు
ప్రతినదించిన తుంగభద్రాతరంగ
చాలన ఘుమంఘుమల కాంధ్రశారదా వి
పంచి పులకించి మము బలత్కరించుగాత !

- కాటూరి

విశ్వనాథ సత్యనారాయణ

సాహిత్యంలో అభివ్యక్తమైన సంస్కృతి

సంస్కృతి అనే పదం కొన్ని సందర్భాలలో అవగాహనకు అతీతంగా వుంటుంది. మనకేదో అర్థమవుతుంది. కాని అదేమిటో మనకు స్పష్టంగా తెలియదు. సామాజిక సంస్కృతి, జాతి సంస్కృతి, ఆత్మ సంస్కారం అనేవి దానిని వ్యక్తీకరించే కొన్ని పదాలు. ఆయా సందర్భాలలో ఈ పదం ఉపయోగించినా, మనకు అర్థమయ్యేది అస్పష్టమే. అయినా, ఆ పదం మనకు అర్థమైనట్లే కనిపిస్తుంది. సాంఘిక నియమాలకు, లేక రాజకీయాలు, సాహిత్యం ఇతర విషయాల గురించి వ్యక్తి యొక్క భావనకు అది భిన్నమైనది. అది మానవ హృదయాలపై గత కాలపు ప్రభావాలకు సంబంధించినది. గత కాలపు నాగరికతల సంస్కృతి గురించి మనం ప్రస్తావిస్తాము. ప్రతి తాత్వికరతి దాని అనుయాయుల మనస్సులపై దాని ముద్ర వదులుతుంది. ఆ ప్రభావాన్నే సంస్కృతిగా పేర్కొనవచ్చు. తెలుగు సాహిత్యం అధ్యయనం చేసినప్పుడు దానిలో జీవనం సాగించి నప్పుడు, నిమగ్నమైనప్పుడు, దానిలోని భావాలు, వాటి వ్యక్తీకరణ సౌందర్యాస్వాదనకు తగిన ప్రత్యేకమైన మనో ప్రవృత్తి అభివ్యక్తి ఏర్పడుతుంది. దానిలోనే నీవు జీవిస్తావు, నీవు ఆవిధంగా జీవుస్తున్న దానిలోని ఠీవి సొంపు, సౌందర్యం వల్ల ఉత్తేజం పొందుతావు.

తెలుగు సాహిత్యం ఈ లక్షణాలన్నిటికి భాండారం వంటిది. సొంపు, సంగీత మాధుర్యం అనేవి తెలుగు భాష ప్రధాన లక్షణాలు. సాహిత్యం ఎప్పుడు ఆ భాషలోని విశిష్ట లక్షణాలకు పెంపొందుతుంది. నన్నయ్య కాలం నుండి నేటి దాకా తెలుగు సాహిత్యం రాజమండ్రి నుండి హైదరాబాద్ వరకు పయనించింది. ఏ కవీ కూడా తాను జీవిస్తున్న సమాజపు ప్రభావాన్నీ లేక రాజకీయ భావనా సరళి ప్రభావాన్నుండి తప్పించుకో జాలడు. తూర్పు చాళుక్యుల కాలంతో తెలుగు సాహిత్యం ప్రారంభమైనది. తెలుగు సాహిత్యానికి బీజాంకురాలు కన్నడ సాహిత్యంలో ఉన్నాయని చరిత్ర కారులు చెబుతారు. నన్నయకు ముందే కన్నడ సాహిత్యంలో మహాకవులు ఉన్నారు. నన్నయ నారాయణ భట్టు కన్నడ కవి 'పంప' నుండి ఎంతో విస్తృతంగా అనుకరించినట్లు చెప్పబడుతున్నది. నన్నయ ఉపయోగించిన ఛందోరీతులు అంతకు ముందు కావ్య రచనకు యత్నించని తెలుగు కవులు ప్రయోగించినవి.

పంప కాని నన్నయ కాని తమ ఛందో రీతులను సృష్టించ లేదు. సంస్కృత భాష నుండే, దేశి కవితా సంప్రదాయాల నుండి వారి కవి సంక్రమించినవి. భారత దేశంలో ఇతర భాషలలోని మహా కవులందరి వలెనే నన్నయ కూడా సంస్కృత సంప్రదాయపు అడుగు జాడలను అనుసరించాడు. తూర్పు చాళుక్య సామ్రాట్టులు సంస్కృత భాషా సంస్కృతికి చెందిన వారు. వారి అధికార భాష సంస్కృతం.

వాల్మీకి రామాయణాన్ని చదవడం కన్నా పాడుకోవడమే ఎక్కువని తరుచు చెబుతుంటారు. వాద

మనేది “శృతి” అంటే వినబడినది. అందుచేత ప్రతి సాహిత్యానికి మూలాధారం సంగీతం లోనే ఉన్నదని చెప్పవచ్చు. దానిని ఆలాపనగా చదివి ఉండి తీరాలి. శాస్త్రీయ సంగీతానికి ఆత్మ వంటిదైన లయ సాహిత్య పటనంతో ప్రవేశించి ఉండాలి. సంస్కృతంతో సహా ఏ భాషలోనైనా చందో రీతులన్ని లయబద్ధమైనవి. సాహిత్యం ఎన్నడూ మవులికంగా సంగీతా న్నుండి విడివడ లేదు. కవిత్వంలో పరుసాలను ఉపయోగించ రాదనే వరకు కొందరు ఆధునిక విమర్శకులు పోయారు. ప్రాచీన సంస్కృత భాషావేత్తలు విధించిన సూత్రాలంటే వారికే మాత్రం లక్ష్యం లేదు. కవిత్వ భాష మధురంగా, కోకిల పాటగా, ప్రియ వధువు భాషలో ఉండాలని వారు వాదిస్తారు. సంగీతం కేవలం సెలయేట మృదురవళి కాదు, ఆకుల గలగలకాదు. గంబీరమైన వాటిలో సైతం సంగీతం ఉన్నది. గ్రహాల సంగీతాన్ని వ్యక్తం చేయడంలో సంగీత మనే పదానికి అర్థం ధ్వనుల మేళనం. సంగీతం వస్తు ధర్మం తెలుగు సాహిత్యంలోని ప్రాచీన సాహిత్యం ఈవిధమైన ధ్వనుల మేళనం సాధించిందే కాని, ఆధునిక విమర్శకులు వాదిస్తున్నట్లుగా కలరవాలు కాదు.

తెలుగు సాహిత్యంలో మహనీయుల సంఖ్య తక్కువేమీ కాదు. వారిలో ప్రతి ఒక్కరికీ వారి సొంతశైలి ఉన్నది. అందులో ప్రతి ఒక్కటి అద్భుతమైనది. ఇంగ్లీషు సాహిత్యంలో మిల్టన్ గురించి కార్లయిల్ అభివర్ణించినట్లుగా కొందరు దివ్య సంగీతం సృష్టించారు. వారు కవితా గానం చేసిన శైలి యొక్క వైభవం వల్లనే ప్రాచీన రచయితలు అంతటి ఔన్నత్యాన్ని సాధించారు. నన్నయ శైలి పరమోత్కృష్టమైనది. అందులో విశిష్టత ఉన్నది. ఆయన ఎవరికీ అందని ఎత్తుకు పోయాడు. ఆయన సంగీతం, తెలుగుజాతికి జీవం పోసింది. తిక్కన మరో వీణ చేపట్టాడు. తెలుగువారి మహోన్నత కవులలో ఆయనది తదుపరి స్థానం. విశ్వాంతరాళ మహోన్నత స్థాయి నుండి ఆయన దిగి వచ్చి సామాన్యునికి అవగతమైన సరళిలో గానం చేశాడు. తెలుగును ఆయన తన ఇష్టానుసారం వంచి, మెళికలు తిప్పాడు. తెలుగు ఛందో రీతులలో ఆయన అసంఖ్యాకంగా కొత్త పోకడలు కల్పించాడు. మరో ఒకరిద్దరిని మినహాయిస్తే తెలుగు కవులంతా ఈ ఇద్దరు మహా కవుల అడుగు జాడల్లోనే నడిచారు.

17వ శతాబ్దంలో తెలుగు వారు దాదాపుగా దక్షిణ భారత మంతటికీ అధిపతులైనారు. తంజావూరులో, మధురలో తెలుగు రాజ్యాల రాజధానులు వెలసినాయి. దక్షిణదేశపు అంచున తెలుగు సాహిత్య వాహిని వెల్లువై ప్రవహించింది. తంజావూరు, మధుర, నాయక రాజులు, స్వయంగా గొప్ప కవులు. వారి పాలనలో తెలుగు సాహిత్యం కొత్త పోకడను సంతరించుకొన్నదని చెప్పక తప్పదు. తెలుగ భాష సంగీతం, లయకు సంబంధించినంత వరకు ఆ దక్షిణ శైలి అందచందాలలో మహోన్నత స్థాయినందుకొన్న దనడం నిర్వివాదాంశం. సాహిత్యంలోనేకాక, తదితర లలిత కళలు సైతం నాయకరాజుల పాలనలో అత్యద్భుతంగా పరిణతి చెందాయి.

కొత్త స్వరం

ఆసేతు హిమాచల పర్యంతం ఉన్న సంస్కృతు లన్నిటికిని మూలం సంస్కృత సంప్రదాయంలోనే ఉన్నది. ఈ దేశంలో ఏ సాహిత్యం స్వతంత్రంగా అభివృద్ధి చెందలేక పోయింది. తెలుగు సాహిత్యం సంస్కృత సాహిత్యపు ముద్దు బిడ్డవంటిది. తెలుగు సాహిత్యపు తొలి మహోపాధ్యాయులు సంస్కృత భాషను తెలుగు భాషకు మాతృకగా అంగీకరించారు. దేశంలోని ఇతర ప్రాంతాలలోని భాషలపై సంస్కృత ప్రభావము అంతగా ఉన్నట్లు కనిపించదు. కాని తెలుగు సాహిత్యం మాత్రం, సంస్కృత సాహిత్య రూపాలను యథాతథంగా స్వీకరించింది.

సాహిత్యం ప్రధానంగా భావవ్యక్తీకరణకు సంబంధించిన సంగీతమని చెబితే, సంగీతం, స్వరలయబద్ధమైనదని ఒప్పుకొంటే, సంస్కృత సాహిత్యం అడుగుజాడల్లో నడిచినందుకై తెలుగు సాహిత్యాన్ని తప్పు పట్టనవసరం లేదు. ప్రాచీన సంస్కృత సాహిత్యం శిఖరిణి, పృధ్వి వంటి ఛందో రూపాలను ప్రధానంగా ఎంచుకొన్నది. తెలుగు సాహిత్యం దీనికి భిన్నంగా మత్తేభం, చంపకమాల, ఉత్పలమాల ప్రధాన వృత్తాలుగా ఎంచుకొన్నది. సంస్కృత వృత్తాలకు వీటి వ్యత్యాసం వాటి నడకలోనే ఉన్నది. సంస్కృతవృత్త లక్షణమైన దీర్ఘ సమాసాలను, తెలుగు సాహిత్యం స్వీకరించగా ఒక కొత్త తరహా స్వరం, గమము సమకూడింది. అదే విధంగా నూతనమైన తెలుగు సాహిత్యం అవతరించి నప్పుడు అనేకమైన వినూత్న శోభలు ఏర్పడినవి.

మరో విషయాన్ని విస్మరించ రాదు. ఏ సాహిత్యమైనా ఆ భాష మాట్లాడే ప్రజల జీవితం, సంప్రదాయాలు, సహజమైన పోకడల వ్యక్తీకరణ మినహా మరేమీ కాదు. పద్యంలో ప్రాస, యతి, మొదలైన స్వల్ప అంశాలు ఆ జాతి ఆత్మ వ్యక్తీకరణలు మినహా మరేమీ కాదు. మానవాళి భూ మండలంపై వివిధ ప్రాంతాలలో నివసిస్తున్నది. వివిధ నదులు ప్రవహిస్తున్నాయి. ఎక్కడికక్కడ నేల ఒక్కొక్క తరహాకు చెందినవి. శీతోష్ణ స్థితులలో కూడా వైవిధ్యం ఉన్నది. ఇవన్నీ కూడా మానవ జీవితంపై ఏదో విధంగా ప్రభావం చూపుతాయి. ఇక్కడ తెలుగుదేశంలో కృష్ణా, గోదావరి నదులు ప్రధానమైనవి. అవి ప్రవహించే నేల స్వభావాన్ని బట్టి ఈ మహానదుల జిల్లాలకు వాటి వాటి ప్రత్యేక లక్షణాలున్నాయి. అన్నం, తదితర ఆహార పదార్థాలు వాటిని భుజించే వ్యక్తుల నాడులలో కొన్ని ప్రత్యేక లక్షణాలు కన్పిస్తాయి. ఆ ప్రత్యేక జాతి శరీరావయవాలు, కంఠం వారు భుజించే ఆహారం ప్రభావానికి అనుగుణంగా మారుతాయి. ఆ విధంగా భారతావనిలో ఆంధ్రదేశమనబడే ప్రాంతంలో నివసించే ప్రజలకు ప్రత్యేకంగా వారి స్వంత లక్షణాలున్నాయి. వారి సంప్రదాయాలు, అలవాట్లు, ఇతరుల వాటికన్నా కొంత భిన్నంగా ఉన్నాయి. కంఠ స్వరపేటిక చాలా సున్నితమైనది. అన్ని ధ్వనులను వారు స్పష్టంగా పలుక గలరు. సంస్కృతాన్ని తెలుగు వారు చదివినప్పుడు ఇతర ప్రాంతాల నివాసులు వారిని ప్రశంసిస్తారు. అచ్చులు, హల్లులను తెలుగు ప్రజలు విస్పష్టంగా నిర్దిష్టమైన ధ్వనులతో ఉచ్ఛరిస్తారు. అటువంటి కంఠ స్వరం కల ప్రజలు తమ సాహిత్య గతమైన సంగీతాన్ని స్పష్టత, ధ్వని మాధుర్యంతో గరిష్ట స్థాయికి పెంపొందించుకోగలరు. తెలుగు సాహిత్యాలు, ఈ ధ్వని సౌందర్యానికి, లయకు ప్రతిబింబం.

వాగ్గేయకారుల పాత్ర

సాహిత్యంలోనే కాక ఇతర కళలలో కూడా తెలుగు సంస్కృతి విశిష్టత మహోన్నతమైనదే. శిల్పం, చిత్రకళ మినహా, సంగీతం, నృత్యం, దేశి నాటకం వంటి కళలన్నీ కూడా భాష ద్వారా వ్యక్తీకరణకు అతీతమైనవి కాదు. భాష అనేది ఎప్పుడూ ఈ కళలకు సాధనంగానే ఉంటుంది. త్యాగరాజు, అన్నమయ్య, క్షేత్రయ్య వంటి స్వర కర్తలు, మహాకవులుగా ఖ్యాతి గాంచారు. ఈ దేశ సంస్కృతికీ సంగీతం ఎంతగానో దోహదం చేసింది. ఈ సంగీత స్వరకర్తలు తెలుగు సాహిత్యం సంస్కృతి సుసంపన్నం కావడానికి ఎంతగానో దోహదం చేసినట్టు చెప్పడం జరుగుతున్నది. సామాన్య ప్రజల నుండి, నానుడి నుండి, సామెతల నుండి, వారి నిత్య జీవితంలో వేళ్లు పాతుకు పోయిన మాట విరుపుల నుండే ఈ వాగ్గేయ కారులు వాటిని సేకరించుకొన్నందునే ఈ మహా కళాకారుల కీర్తనలు అద్భుతమైనవిగా రూపొందినవి. ఇవి వాటిని సామాన్యుల హృదయాలకు సన్నిహితం చేసినవి. త్యాగరాజు తెలుగు జాతి ఉదాత్త, ఆధ్యాత్మిక ప్రవృత్తులను స్వీకరిస్తే, క్షేత్రయ్య తెలుగు వారి శృంగార, సౌందర్యారాధనా ప్రవృత్తులను ప్రతిబింబించాడు. సంగీత, నాట్య రంగాలలో ప్రస్తుతం తమిళనాడు, సాధించిన మహోన్నత స్థాయి తెలుగు సంస్కృతి ప్రభావం ఫలితమేనని చెప్పవచ్చు. తెలుగు వారు రెండు శతాబ్దాల క్రితం తమిళ దేశాన్ని పరిపాలించారు. తెలుగు సంస్కృతి వారి కళలపై చెరగని ముద్ర వేసింది. త్యాగరాజు తెలుగు జాతికి చెందినవాడు. ఆయన మాతృ భాష తెలుగు. ఆయన తెలుగు బ్రాహ్మణ వంశంలో జన్మించాడు.

భారతావని అంతటా కళలన్నిటికీ సంగీతంలో మూలం ఒకటే. సామవేదం దానికి నాంది. ఆది షండచ విభక్తికలపై ఆధార పడినది. తదుపరి వేదాలలో సైతం ఆది సప్త విభక్తికమైనది. ఈ సప్త "స్వరాలు" పైన భారతీయ సంగీతమంతా రూపొందింది. అయితే ఈ స్వరాలు వేర్వేరు రీతుల్లో ఉచ్చరింప బడినవి. మరీ స్పష్టంగా చెప్పాలంటే వేర్వేరు రాష్ట్రాలకు చెందిన గాయకుల కంఠాలలో అవి వేర్వేరు రూపాలు ధరించాయి. మానవుడు భుజించే ఆహారం, అతని మాండలికాలు, యాసలు, ఆయా ప్రాంతాలకు చెందిన వారు అచ్చులు హల్లులను ఉచ్చరించే రీతిని రూపొందించాయి. ఉత్తరాదిన ఈ స్వరాలు తివిర స్వరాలుగా విభజించబడినవి. ఉత్తర ప్రాంతం ముస్లిమ్ సంపర్క ప్రభావానికి ఎక్కువగా లోనైనది. దక్షిణ ప్రాంతంలో అవి తక్కువ. హిందూస్థానీ , కర్నాటక సంగీత సంప్రదాయాలు భిన్నమైనవిగా కనిపించవచ్చు. అయినా అవి రెండూ ఒక కుదుటి నుండే పెరిగినవి. వాటి రెండింటికి ప్రమాణం ఒకటే, స్వరాలు కూడా ఒకటే. అయితే వారు గానం చేసేరీతి భిన్నంగా ఉంటుంది. హిందూస్థానీ సంగీతా చార్యులలో తాన్సేన్ ప్రథముడైతే, కర్నాటక సంగీతానికి త్యాగరాజు ఆద్యుడు. వారిలో అనేకమైన రీతులుండవచ్చు, కాని అవన్నీ త్యాగరాజునే ఒక సంగీత విద్వాంసుని చుట్టూ భ్రమిస్తూంటాయి.

అదేవిధంగా భరతముని నాట్య శాస్త్రం నుండి అనేక నృత్య సంప్రదాయాలు ఆవిర్భవించాయి. భరతుని నాట్యం కూచిపూడి, శైలిలో పరాకాష్ట నందుకొన్నదనేది సర్వజనామోదం పొందింది. స్వతంత్రంగా అభివృద్ధి చెందినట్టు చెప్పుకునే నాట్యకళా కేంద్రాలు కొన్ని తమిళనాడులో ఉండవచ్చు. అయితే తమిళనాడుకు చెందిన వీధి నాటకం, తదితర కళారూపాలు, వాటికి అంకురం తెలుగు సంస్కృతి ప్రభావంతోనే ఉన్నట్లు రుజువు అవుతుంది.

భక్తి మార్గం

సంగీతంలో, నాట్యంలోని భాష, కవిత్వాంశాలను గురించి చెప్పడం ఈ వ్యాసం ప్రధానోద్దేశం. సంగీత కృతులలోని సాహిత్యం సంగతి అటుండనిచ్చి, నృత్య రూపాలు ప్రధానంగా దాని లోని శృంగారాంశాన్ని ప్రదర్శిస్తాయి. భాను మిశ్ర రసమంజరి కర్త. దానిల విభిన్నరకాల నాయికలను వర్ణించాడు. నాట్య సాహిత్యానికి అది మూలాధారంగా పేర్కొనవచ్చు. దాదాపుగా ఈ నృత్యాలన్నీ మానవుని మనసులో హృదయంలోని శృంగారావస్థను చిత్రించేవే. ప్రణయ భావనకు చెందిన గాఢమైన, మధురానుభూతులను వాడు కోవడం జరిగింది. భావాలు, అభినివేశాలు అనేకం. నృత్యాలలో ఈ శృంగారావస్థను, వైభవోపేతంగా చిత్రించడం జరిగింది. మిగిలినచోట్లవలెనే తెలుగు దేశంలో కూడా ఈ శృంగారావస్థను ఒక భక్తి భావనకు చెందినదిగా చిత్రించే ధోరణి ఉన్నది. కృష్ణాజిల్లాలో చిన్న గ్రామమైన మొవ్వలోని గోపాలుని పరంగా క్షేత్రయ్య వలె భగవంతుని సంబోధనలో కీర్తన రచించిన వారు పలువురున్నారు. కొన్ని సందర్భాలలో అది అశ్లీలంగా, జుగుప్సాకరంగా సైతం ఉంటుంది. అయినా దానిలో అంతర్గత వాహినిగా భగవద్భక్తి భావన ఉంటుందని చెప్పక తప్పదు. సంస్కృతంలో జయదేవుడు రచించిన గీతగోవిందం గురించి కూడా అదే వర్తిస్తుంది. సాంఖ్య వేదాంతంలో కన్నా, సృష్టి గురించి తాత్విక వేదాంత వివరణలలో దీని సిద్ధాంత మూలం ఉన్నదనవచ్చు. వేద సంసర్గలతో సాంఖ్య వేదాంతం మెరుగుపడినది. అచేతన ప్రకృతి సచేతనమైనవి. ఈ రెండింటి సంగమపు ఉదాత్త సృష్టే మహత్తరమైన శక్తి ఆరాధన. నాట్యాలు ప్రధానంగా శారీరికమైన స్త్రీ పురుష ప్రేమను చిత్రిస్తాయి. అందులో సర్వదా పురుషుడు కృష్ణావతారం ధరించిన విష్ణు భగవానుడు, స్త్రీ గోపిక. ఆ స్త్రీ నిజంగా స్త్రీ కానవసరం లేదు. పురుష భక్తుడే తరుచు గోపిక అవుతాడు. అయితే శృంగార జీవిత వివిధావస్థలను, సంయోగం వల్ల కలిగే సుఖాన్ని, వియోగం వల్ల కలిగే దుఃఖాన్ని ఈ నృత్యాలు చూపుతాయి. ఈ ప్రణయ భావనను అత్యంత సుందరంగా, సున్నితంగా, వైభవోపేతంగా చిత్రించడంలో తెలుగు సాహిత్యం అత్యంత సంపన్నమైనదిగా చెప్పవచ్చు.

దీనిలోను, తదితర రూపాల కవిత్వంలో శ్రీకృష్ణ భగవానుడు ప్రధాన పాత్ర కావడంతో సాహిత్యంలోకి గ్రామీణ జీవిత వర్ణనలు అపారంగా ప్రవేశించాయి. గోపాలకుల వర్గానికి శ్రీకృష్ణుడు ప్రభువు. ఆయన పొలాల్లో అడవుల్లో సంచరించాడు. ఆవుల మందలకు కాపరిగ ఉన్నాడు. సాయంత్రం వాటిని ఇళ్లకు తోలాడు. ప్రతి ఆవు దాని యజమాని ఇంటికి సురక్షితంగా చేరేట్లు చూశాడు. మేతకై తిరుగుతున్న ఆవుల గిట్టలురేపిన

ధూళి భగవానుని దేహాన్ని అలముకొన్నది. ఆయన ఒక కొత్త దేవుడుగా, ఒక కొత్త వ్యక్తిగా కనిపించాడు. అట్లా సకలావస్థలలోను ఆయనను గురించి గానం చేసిన కవులకు, భక్తులకు ఆయన ప్రేమ పాత్రుడు. ఈ రకమైన కవిత్వం గోపిక వివిధాను భూతులు వర్ణనలతో సంపన్నమైనది. భగవానుడి పట్ల గోపికలు ఈ ప్రేమ కామోద్వేగంగా, లైంగికంగా అన్వయం చెప్పే ధోరణీ విదేశీయులలో ఉన్నది. శ్రీకృష్ణుడు అవినీతి పరుడని, అట్టి వ్యక్తిని సర్వోన్నత దైవం స్థాయికి తీసుకుపోవడం దారుణమని వారు వాదిస్తారు. దాని మర్మం వేరే ఉన్నది. ఆవుల మందలను కాచినప్పుడు శ్రీకృష్ణుని వయసు 10 సంవత్సరాలకు మించిలేదు. గోపికలు ఆయన కన్నా వయసులో ఎంతో పెద్దవారైన గృహిణులు. వారు యవ్వనంలో ఉన్నారు. శ్రీకృష్ణుడు పసివాడు. వారిమధ్య లైంగిక సంబంధం గురించి మాట్లాడటం నిజాన్ని తారుమారు చేయడమే కాక లోకజ్ఞానానికి సైతం విరద్ధం. తమకు గల మహోన్నత జ్ఞానం వల్ల ఆయనను భగవానుడుగా గుర్తించిన గోపికలు ప్రదర్శించిన సంపూర్ణమైన నిస్సంశయమైన భక్తి భావన మినహా మరేమీ కాదు.

శతకాలు

గ్రామీణ జీవన శోభ ఈ గీతాల లోనే కాక, తెలుగు సాహితీ రూపమైన శతకాలలో సైతం వర్ణితమైనది. శతకం అంటే నూరు పద్యాలతో కూడిన చిన్న పుస్తకం. భారత దేశంలోను, ఇతరత్రాను ఏ ప్రాంతం లోని భాషలోను ఇట్టి సాహిత్య రూపము కనిపించదు. ఇది తెలుగు భాషలోనే జనించింది. తెలుగు వారి మేధస్సపంద దాని మూలం. స్వల్ప విషయాలపై రచించబడిన చిన్న పుస్తకాలు ఇతర భాషలలో ఉండవచ్చు. కాని ఈ రకమైన కవితారూపం ఎక్కడా కనిపించదు. శతకం శక్తి ప్రధానమైనది, తరచుగా కవితావేశ భరిత గానం కావచ్చు. ఈ కవితా రీతి పాఠకుని హృదయాన్ని తేలికగా ఆకట్టుకోవడానికి ఉద్దేశించినట్లు కనిపిస్తుంది. చిన్న కావ్యాలలోనేకాక ప్రాచీన గ్రంథాలలో సైతం అది విస్తృతంగా కనిపిస్తుంది. ఎంతసేపు ఉదాత్త భావనలనే పట్టుకొని వేలాడుతాము. ఎల్లప్పుడు కొంత క్రిందికి వచ్చి సరళమైన మృదువైన, వ్యక్తి గతాంశాలతో వినోదించ వలసే వస్తుంది. పోతన రచించిన భాగవతంలో సుదీర్ఘమైన సౌందర్యవర్ణనలున్నాయి. అందులో ప్రత్యేకించి శ్రీకృష్ణుని జీవిత వృత్తాంతాన్ని వర్ణించే, దశమ స్కంధం ప్రత్యేకించి పేర్కొన దగినది. శ్రీకృష్ణుని జీవిత కథా రచనలో ఈ విధమైన ప్రకృతి సౌందర్య వర్ణనలు అనివార్యం. తెలుగు సాహిత్యంలో కవులందరికిని శ్రీకృష్ణుడే ప్రధాన ఇతివృత్తం. భారత దేశంలోని మహాకవులందరు, తాము స్వయంగా ఊహించి కవితా భావనలేవీ సమకూర్చ వలసిన అవసరములేని ఇతివృత్తం గనకనే శ్రీకృష్ణ స్తవంతో తమ కవిత్వం ఆరంభించారు. భక్తి భావన, సౌందర్య, వర్ణన, గ్రామీణ జీవితం గురించిన అభిప్రాయాలు మొదలగూ గల అన్ని రకాల భావనలను వ్యక్తం చేయడానికి శతకం అనువైన రూపం సమాజంపై విమర్శ, మానవుని నీతి బోధ, మానవుల్లోను సమాజంలోను గల లోపాలను చెండాడడం శతకాలలో ప్రధానాంశాలుగా ఉన్నాయి. ఒక నిరంకుశుని బంధాలలో చిక్కుపడిన జన సమూహానికి సహాయం చేయవలసిందని దైవాన్ని ప్రార్థిస్తు రాసిన శతకాలు కొన్ని ఉన్నాయి. వాటి వల్ల వెంటనే ఫలితం చేకూరినట్లు చెప్పబడుతున్నది. అటువంటి మహామాన్విత సంఘటనల వల్లనే కొన్ని శతకాలు విఖ్యాతమైనాయి.

వందలాదిగా శతకాలున్నా తెలుగు సాహిత్యంలో రెండు మూడు శ్రేష్ఠమైనవి ఉన్నాయి. అందులో ఒకటి ధూర్జటి రచించిన కాళహస్తీశ్వర శతకం. అది స్వరమాధుర్యానికి ప్రసిద్ధం. మరొకటి కాసుల పురుషోత్తం రచించిన ఆంధ్ర నాయక శతకం. ఈ రెండవ దానితో తెలుగు భాష నిజమైన విశిష్టతకు లక్షణమైన ప్రత్యేక శైలిలో భావాల వ్యక్తీకరణ మహోన్నత స్థాయి నందుకొన్నది. ఏ భాషలోను ఇతరులను తీవ్రంగా నిందించడం, అన్యాపదేశంగా అపహాస్యం చేయడం, గ్రామ్యంలో వ్యాఖ్యానాలు చేయడానికి అవకాశం లేదన జాలము. ఇతరులను గురించి చెడుగా మాట్లాడటం, ఇతరుల చర్యల్లో తప్పులు వెదకటం మానవస్వభావంలో భాగం. తమ లోపాలను గురించి తెలుసుకొనకుండా, ఇతరుల లోపాలను గురించి మాట్లాడరాదని చెప్పినప్పుడు జీసస్ క్రైస్ట్ బహుశా ఈ విషయాన్నే దృష్టిలో ఉంచుకొని ఉంటాడు. మానవ స్వభావంలోని ఈ లోపాన్ని దైవ భక్తి వైపు మళ్లించడానికి వినియోగించు కోవడం లోనే కాసుల పురుషోత్తం ఘనత వున్నది. మరెవ్వరూ అట్టి యత్నం ఎన్నడూ చేయలేదు. ఆయన చేసిన యత్నం అత్యద్భుతం. మాటలు విరుపులో ఆయన అఖండుడుగా కనిపిస్తాడు. అట్టి పదజాలం తెలుగు భాషలో అపారంగా ఉన్నది. ఆంధ్ర మహా కవిత్రయంలో ఒకరైన తిక్కన్న కన్న గొప్ప కవిగా కొందరు చెబుతున్న నాచన సోమన్న, తెలుగుభాషకు సహజ సిద్ధమైన "వ్యంగ్యోక్తుల" ప్రయోగంలో విశిష్టత ప్రదర్శించాడు. తెలుగువారు ప్రత్యేకత గల ఒక జాతి, శారీరకంగా చురుకైన వారు, దేహంలోని ప్రతి అవయవాన్ని కదిలించుతూ, తరుచుగా ముఖ కవళికలు మార్చగల సమర్థులు. నడుస్తున్నప్పుడు నాట్యం చేస్తున్నట్టుగా చేతులు ఊపుతారు. శారీరరకమైన ఈ లక్షణాలన్నీ వారి చురుకైన ఆత్మ బహిర్గత లక్షణమే. ఈ చురుకు దనం వారి భాషను ఇతరులపై నర్మోక్తు లాడడంలో సంపన్నం చేసింది. తెలుగు సాహిత్యంలోని ఈ పోకడను చూపిన రచయితలే నిజమైన తెలుగు కవులు. తిక్కన తెలుగు సాహిత్యమంతటిలో మేటి కవిగా సర్వులు అంగీకరించారు, ఆయన పద్య రచన తెలుగు జాతికి చెందిన ఈ స్వభావానికి దర్పణం వంటిది.

సమన్వయమై మేళనం

ఈ పరిశీలన వల్ల తెలుగు ప్రజలు తమ స్వభావంతో స్థిరత్వం లేనివారుగా కనిపిస్తారు. వారు చపలత్వం కలవారనిపించుకొనవచ్చు. కాని అది నిజం కాదు. వారు ఉచ్చనీచాల విచిత్రమైన కలయిక. ఆరెండు వారిలో సమన్వయమైనవి. తెలుగు సాహిత్యంలో మరోరూప మైన ఉదాహరణ ఈ విషయాన్నే రుజువు పరుస్తుంది. ఈ ఉదాహరణమనేది పరిమాణంలో శతకం కన్నా చాలా చిన్నది. దాని సరళి పూర్తిగా భక్తిపరమైనది. భగవానుని విష్ణువైనా, శివుడైనా వారిద్దరి అసంఖ్యాకం సప్త రీతులలో కవి స్తోత్రం చేశాడు. సంస్కృతభాష, తెలుగు భాష విభక్తి

ప్రత్యాయాల విషయంలో సుసంపన్నమైనవి. మిగిలిన భాషలు ఇతర పదాల సహాయంతో వ్యక్తం చేస్తే ఈ రెండు భాషలు విభక్తుల సహాయంతో వ్యక్తం చేయగలవు. మరి ఈ విభక్తులెందుకు? అవి వాక్య నిర్మాణంలో పదాల క్రమ నిర్దేశానికి సంబంధించినవి. విభక్తిరహిత భాషలలో ఈ పద క్రమం చాలా ముఖ్యమైనది. ఈ భాషలో దానిని కారక అంటారు. నామవాచకానికి క్రియలకు గల సంబంధం రీత్యా వాక్యాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పడ్డ వ్యాకరణ యుక్తమైన వాక్యనిర్మాణాన్నే కారక అంటారు. ప్రతి నామ వాచకం ఏవో విభక్తి ప్రత్యయం కలపడంతో క్రియ యొక్క అర్థాన్ని మారుస్తుంది. నామవాచకానికి, క్రియకు మధ్య ఎనిమిదవ సంబంధం అనేది లేదు. ఉదాహరణ కావ్యం భగవంతుడిని ఈ ఏడు విభక్తుల రూపంలో స్తోత్రం చేస్తుంది. మరో వ్యక్తి సంబోధించడానికి ఉపకరించే పదమే సమబుద్ధి. మిగిలిన ఆరు విభక్తి రూపాలకు విధంగా మరో వ్యక్తిని సంబోధించడడముతో ప్రమేయము లేదు. అందులో ఒకటి కర్తకు సంబంధించినది. మరొకటి కర్మకు సంబంధించినది. మూడవది ఆ పనికి ఉపకరించే సాధనానికి సంబంధించినది. నాలుగవది ఎవరి కోసం ఆపని చేస్తున్నారో వారి పేర్కొనడానికి ఉపకరించేది. ఈ విభక్తులన్నిటిలోను భగంతుని సంబోధించడం జరుగుతుంది. సాహిత్యాన్ని సృష్టించిన మేధా సంపన్నులైన తెలుగు రచయితలు మానవానుభూతి యొక్క సర్వస్వాన్ని సాక్షత్కరింప చేసుకొన్నా, మహత్తరమైన నిరాకార స్థితిలో లీనం కావాలని కాంక్షించిన మహర్షులు. అటువంటి సాహితీ రూపాలను కొనుగొన్న సాహిత్యం, అట్టి సాహితీ రూపాలతో తన్మయత్వం చెందేజాతి ప్రజలను తేలికగా భావించడానికి వీలులేదు. వారు భగవత్సాక్షాత్కారము పొంది, దేనిని పట్టించుకోనట్లుగా బయటికి కనబడుతు నియమబద్ధ జీవనము సాగించారు. తెలుగు స్వభావాన్ని చరిత్ర ఆది నుండి గమనించవచ్చు. అది వీరోచితమైన జాతి. అయినా మౌలికంగా శాంతి కాముకమైనది. ఈ విధమైన చాంచల్యానికి అడుగున సృష్టి యొక్క నిజమైన విలువల మవులికమైన అవగాహన ఉన్నది.

నృత్యసాహిత్యాల మేళనము

కాలం మారింది. దేశ స్వరూపం ఏదో భిన్నమైనదిగా కనిపిస్తున్నది. దృక్పథాలు మారినవి, సమాజం, విద్య, రాజకీయాలు, సాహిత్యం నూతనాకృతికి పరిణతి చెందినట్లుగా కనిపిస్తున్నాయి. విద్య అనేది నేటికాలంలో పూర్తిగా పాండిత్యం అయినది. దానికొక పద్ధతి ఏర్పడినది. ప్రాచీన భారత దేశంలో అలాగలేదు. ప్రాచీన భారతావనిలో అదిక సంఖ్యాకులు విద్యావిహీనులని చెప్పడం వాస్తవాన్ని సరిగా అర్థం చేసుకొనక పోవడమే అవుతుంది. ప్రజానీకానికి విద్య పుస్తకాల విద్యగాకాక, సంచార భిక్షువులు, నాటకాలు తదితర కళా ప్రదర్శకుల ద్వారా గరపబడుతుండేది. ప్రాచీన కాలంలో ఇవే విస్తృత ప్రచార సాధనాలుగా ఉండేవి. ఈ రకమైన నాగరికత వ్యాప్తమై ఉన్న రోజుల్లో మహత్తరమైన నృత్య నాటకం ఆవిర్భవించింది. దానిలో నృత్య, సాహిత్యాల సుందర మైన సంలీనం జరిగింది. దానిపేరు యక్షగానం. ప్రాచీన భారత దేశంలో అటువంటి రూపాలు అనేకం ఉండేవి. అయితే ఈ రెండు కళల సమగ్ర వ్యక్తీకరణ కనుక యక్షగానం అత్యధిక ప్రాధాన్యం పొందింది. అది ఎంతో చిత్రమైనది, ప్రాచీన సంస్కృత అలంకార శాస్త్ర గ్రంథాలలోని భరతముని శాస్త్రీయ గ్రంథంలోని నిగూడాంశాల సమ్మేళనం. కూచిపూడి నృత్య ఆద్యుడైన సిద్ధప్ప ఈ మహత్తర రూపాన్ని సృష్టించారు. అది 16వ శతాబ్దంలో ఆవిర్భవించింది. తాళాలలోని వివిధ పోకడలు పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులలోని వివిధ రాగాలు అన్నిటి మేళనంగా యక్షగానం రూపొందింది. ఇది రస సిద్ధాంతానికి అత్యదిక ప్రాధాన్యం ఇచ్చిన రూపం. సంగీత శాస్త్రవిద్వాంసుడు, ఒక ప్రత్యేక సరళిలో పాడే రాగాన్ని యక్షగానంలో సామాన్యుని సాధారణ అనుభూతికి తగినట్టు మార్చడం జరుగుతుంది. సామాన్యుల హృదయంలోనికి సూటిగా పోయేటట్లుగా దానిని మలచడం జరుగుతుంది. తాళం, రాగం, పదం, అభినయం అన్నీ ఒక్కటే. అవన్నీ కూడా నిరాకారమైనా భావన ఒక వ్యక్తీకరణ. వ్యక్తం కాక ముందు దానికి రూపంలేదు. ఈ మహత్తర సత్యం ఆధారంగానే, మన ప్రాచీన కళలు నిర్మితమైనవి. కూచిపూడి కళా సంప్రదాయం ఈ సందేశాన్ని భారత దేశమంతటికి చాటి చెప్పింది. తమిళనాడులో వేళ్లు పాతుకుపోయింది. దానిలో పాటలు తెనుగు భాషలో ఉన్నాయన్న కారణంగా తమిళనాడులోని కొందరు సంగీత కళాకారులు, ఇటీవల దానిని వ్యతిరేకిస్తూ వచ్చారు. తెలుగు భాషలోను, తెనుగుదేశపు నృత్యాలలోను తెలుగువారి వీధినాటకల్లోను, తమ హృదయాలలోని నిజమైన మాధుర్యం, సరళత్వాలకు ప్రతిబింబం ప్రజలకు కనిపించింది. కనుకనే దక్షిణాపథమంతటా తెనుగు సంస్కృతి చెరగని ముద్ర వదిలింది. నేటికి కూడా తమిళనాడులో బిచ్చగాళ్లు తెలుగు పాటలు పాడుతూనే బిచ్చం అడుక్కుంటారు. మధుర, తంజావూరు నాయకరాజుల పాలనలోనే తెలుగు యక్షగానం మహోన్నత స్థాయినందుకొన్నది. ఆ రోజులలో ప్రతి ఒక్కరూ సాహితీవేత్త. వారి ఆస్థానాలు కవి, పండితులకు నిలయాలుగా ఉండేవి. వారు సంస్కృతంలో, తమ గ్రాంధిక శైలిలో రచనలు చేశారు. అయినా వారిలో ఎవరూ ఈ రూపాన్ని పట్టి చూడకుండా వదలలేదు. ప్రతి కవీ ఒక యక్షగాన ప్రబంధాన్ని రచించారు. తెలుగు సాహిత్యంలో ఈ రూపాన్ని అత్యంత ప్రతిభతో రచించినవారు శ్రీ విజయరాఘవ నాయకుని పట్టమహిషి రంగాజమ్మ, ఆమె అపార మేధా సంపదగల బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఖ్యాతి గాంచారు. నాట్యకళ ఆమెకు కరతలామలకం. ఆమె అత్యున్నత స్థాయికి చెందిన రచయిత్రి. రాజు ఆమెకు జరిపించిన కనకాభిషేకం వల్లనే, ఆమె ఆధిక్యత విదితమవుతుంది. ఒక సాహితీ వేత్తకు కనకాభిషేకమంటే ఆ వ్యక్తిని సరస్వతీదేవి అవతారంగా భావించినట్టే విదితమవుతుంది. సరస్వతీదేవికి సయితం ఇది అసాధారణమైన గౌరవం. తెనుగు సాహిత్యంలో కనకాభిషేకం గౌరవం పొందిన ఇద్దరు కవుల జీవిత కాలంలో సహస్రాబ్దాల వ్యవధి ఉన్నది. అందులో ఒకరు శ్రీనాధుడు. ఆయన పద్యాల అంతర్గత సంగీతాన్ని గ్రీక్ గాథలకు చెందిన ఆఫ్సియన్ తంత్రీవాద్యంతో పోల్చవచ్చు. ఆ పిమ్మట ఆ మహత్తర గౌరవం పొందినది రంగాజమ్మ. ఆమె విద్వాంసురాలు. కవయిత్రి నాటక రచయిత్రి. నర్తకిగా ఈ కళలన్నిటికి, సంగమస్థానమైన కళాకారిణిగా, శ్రీనాధునికన్న ఆమె అధికురాలు. తెలుగు సాహిత్యవియన్మండలంలో మహాప్రకాశభరితమైన గ్రహ సముదాయంవలె నిలిచే శ్రీనాధుని ఆధిక్యతను

కించపరచడం ఉద్దేశం కాదు. సాంప్రదాయక తెలుగు సాహిత్యాన్ని మాత్రమే ప్రమాణంగా తీసుకుంటే, రంగాజమ్మ ఆయన సరస నిలువజాలదు. ఆమాటకొస్తే ఆయన సరసన నిలువగలవారెవ్వరూలేరు. ఆయన వాణి మాధుర్యం అసమానమైనది. అది తెలుగు జాతి వారి కంఠస్వరాలలో సహజమాధుర్యం.

దాని సౌందర్యాలు, నాజూకులు, అసంఖ్యాకమైన మలుపులు, భావ వ్యక్తీకరణలు దేశీ నృత్య వివిధ పద్ధతులను ప్రవేశపెట్టడం వల్ల యక్షగానం నూత్న సృష్టి అయినది. అది జాతి జీవనాన్ని మార్చినది. ప్రజలు ఉదాత్త భావాలతో కళాత్మకమైన అలవాట్లతో జీవనము గడిపేట్టు చేసింది. వారు యక్షగానాల పరిభాషలో సంభాషించారు. వారి ఊహలు యక్షగాన పథాన్ని అనుసరించాయి. యక్షగానాలు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేశాయి, పాండిత్యాన్ని అది లేనివారికి కల్పించింది. దాని ద్వారా నిఘంటువులు, శాస్త్రాలు, ఆధ్యాత్మిక తత్వరహస్యాలు ప్రజలకు సంక్రమించాయి. అమూల్యమైన జ్ఞానాన్ని వారు అన్వేషించుకోవలసిన శ్రమ తప్పింది. ఈ యక్షగానాల రూపంలో సరస్వతి వారి గుడిసెల చీకటి కోణాలను సందర్శించి తన వెలుగుతో నింపింది. సామాన్యుల హృదయాల్లో సంస్కృతి మవులికాంశాలు ప్రతిష్ఠితమైనవి. యక్షగానంలో, ప్రస్తావితంగాని శాస్త్రవిజ్ఞానమంటూ లేదు. వేదాల పరమార్థాన్నే కాక భౌతిక శాస్త్ర పరిజ్ఞానాన్ని సైతం ప్రజలకు లభింపచేసింది. ఇంతటి మహత్తర కళారూపం త్వరితగతిన అంతరించి పోతుండటం శోచనీయం. ఈ దేశంలో అంతరించి పోతున్న కళలను పునరుద్ధరించడానికి యత్నం అంటూ జరిగితే అందులో యక్షగానానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంగ్లీషు సాహిత్యంలో తల మునకలైన ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకులకు దేశీయ సాంస్కృతిక రూపాలను ఇంగ్లాండులోని రూపాలతో పోల్చడం పరిపాటి అయినది. ఇంగ్లీషు సాహిత్య చరిత్రలోని గూడాంశ భరితమైన నాటకాలు, మహిమాన్విత సంఘటనలను చూపే నాటకాలు మొదలైన వాటిని పేర్కొంటుంది. ఆధునిక నాటకానికి యక్షగానం నాందిగా ఈ విమర్శకులు పేర్కొంటుంటారు. ఆధునిక నాటకం రెండు విధాలు. ప్రాచీన సాంస్కృతిక నాటకాలు, కొత్త షేక్స్‌పియరియన్ తరహావి. ఏవిధంగా చూపినా ఈ నాటకానికి యక్షగానం మూలం అని చెప్పటానికి వీలులేదు. దాని పుట్టు పూర్వోత్తరాలు కేవలం స్థానికమైనవి.

ఈ యక్షగానమనేది ప్రాచీన తెనుగుజాతి జీవనదిలో ప్రధానమైనదిగా ఉంటూ వచ్చిందనటానికి ప్రాచీన కాలపు మహాకవులనేకులు దీనినుండి కథావస్తువులను భావాలను స్వీకరించినారన్నదే నిదర్శనం. యక్షగానం తెనుగు ప్రజల వాస్తవిక జీవనాన్ని చిత్రించింది. ప్రాచీన రచయితలు దాని ప్రభావం నుంచి తప్పించుకోలేక పోయారు. కవితా వర్ణనలు, గ్రామీణ జీవన వర్ణనలు జీవితంలో సంభవించిన సంఘటనలు ప్రాచీన కవుల మహా కావ్యాలలో చోటు చేసుకున్నాయి. శ్రీనాథుడు, పింగళి సూరన్న ఈ మహా నిక్షేపం నుండి ఎంతో స్వీకరించారు.

మహాకవులలో పరిమిత ఆవేశాలు భావాలు కనిపించ జొచ్చాయి. ఏవో కొన్ని వేల గ్రామాలలో కూడిన ప్రాచీన రాజ్యాలు సమగ్ర వ్యవస్థగా ఉంటుండేవి. వారి సంస్కృతికి, భావనకు, మనుగడకు ఆ రాజ్యపు రాజధాని, రాజు నివాసం కేంద్రంగా ఉంటుండేవి. కోట శత్రు వశమయ్యే వరకు శత్రువు దేశాన్ని జయించినట్టుగా భావించేవారు కాదు. ఆ విధంగా రాజనగరు ఆ ప్రజా సముదాయపు సంస్కృతికి భాండాగారంగా ఉండేది. ఆ రోజుల్లో ఈ రాజ్యాలు అన్నీ ఒకే తరహాగా ఉండేవి. నాటి రాజధానులన్నీ ఒకే నమూనాలో ఉండేవి. కవి తన కథాకథనానికి ఉపక్రమించి నపుడు కథా నాయకుడు నివసించే పురవర్ణనతో ప్రారంభించేవాడు. పట్టణాన్ని, దాని కోటగోడలను, సౌధాలను, వీధులను, వివిధ వృత్తుల ప్రజలను వర్ణించేవాడు. ప్రతి కావ్యారంభ భాగం ఆ ప్రాంతపు సంస్కృతికి దర్పణం వంటిది. అత్యున్నతులు, అత్యల్పులను ఒకే శ్రద్ధతో వర్ణించడం జరిగేది. మహా కావ్యాలలో సైతం క్రింది వర్గాల వారిని ఉపేక్షించ లేదనడానికి నిదర్శనాలున్నాయి. ఈ భాషలో పాండిత్యం ఆర్జించదలచుకొన్న ప్రతి విద్యార్థి అధ్యయనం చేయవలసిన పంచ కావ్యాలలో ఒకటైన, సామ్రాట్టు అయిన శ్రీకృష్ణ దేవరాయలు రచించిన ఆముక్త మాల్యద మానవాళిలోని అట్టడుగు వర్గానికి చెందిన ప్రజల ఇళ్ళు, నిత్య జీవితాల, భావాల వర్ణనలతో నిండి ఉన్నది. ప్రాచీన కావ్యాలలో కథా సంవిధానంలో దేని దారి దానికున్నవి. ఆ కవులలో ప్రతిఒక్కరూ తమ ఇష్టానుసారం ఈ కళకు మార్గాన్ని కల్పించుకొన్నారు. ఈ విషయాలలో ఆది కవి నన్నయ్య, తెలుగు కావ్య సాహిత్యానికి నాంది పలికిన పెద్దన మహోన్నతులు, కథాకథనం కళతో వారు మహోన్నత స్థాయి నందుకొన్నారు. ఈ గొప్ప కళలో వారు వాల్మీకి స్థాయికి సైతం చేరుకొన్నారా అనిపిస్తుంది. శ్రీకృష్ణ దేవరాయలు కథ చెప్పడంలో వినూత్నమైన, ఆసక్తి దాయకమైన రీతిని సృష్టించారు. మహా కావ్యమైన ఆముక్త మాల్యదలో నుండి కొన్ని ఉదాహరణలు చూపడం ఆవశ్యకం. ఇళ్ల ద్వారాలపై అలంకరణగా వ్రాసిన చిత్రాలకు సైతం ఆ సామ్రాట్టు తన వర్ణనలలో వదలలేదు. ద్వారాల కిరువైపులా విష్ణు భగవానునికి చేతుల్లా ఉండే శంఖ, చక్రాల చిత్రాలు ఉండేవి. కవులు సాధారణంగా వర్ణించే విపణి వీధి, పూలు, తదితర విలాస వస్తువుల అంగళ్లు కల వీధి. ఆనాటి ప్రజల సంస్కృతి, నాగరికత, సౌందర్యానికి ప్రాచీన మహా కావ్యాలలో పూవులకు ఇచ్చిన ప్రాధాన్యమే నిదర్శనం. జీవితంలోని ముఖ్యమైన ఏ దశను, పదార్థాన్ని వర్ణించకుండా ప్రాచీన కావ్యాలు వదలలేదు. ప్రాచీన తెలుగు కవులలో మొదటి వాడైన నన్నయ సైతం పశుగణాల వర్ణన సందర్భంలో పరవశం చెందక పోలేదు. తెలుగు భాషకు చెందిన స్వంత ఛందో రూపమైన సీస పద్యాలలో ఆయన దానిని వర్ణించాడు. పశుగణాలలో వివిధ జాతులను, వాటి తీరును, వాటి రంకెలను, వాటి రంగులను ఆయన విపులంగా వర్ణించాడు. ఆ పశువుల రంకెలు వినిపిస్తాయి. వాటి తలలపై గల కొమ్ములు కనిపిస్తాయి. ఇదంతా ఆయన ఒక్క పద్యంలో సాధించాడు. నన్నయ అంటే అదీ; ఇదీ సాహిత్యం వెనుక ఉన్న రహస్యం. ప్రజల సంస్కృతి మహా కవుల రచనలు ఒకే మనుగడకు రెండు రూపాల వ్యక్తీకరణలు.

(తెనుగు సంస్కృతీ తరంగాలు నుండి)

మరుపూరు కోదండరామిరెడ్డి

తెలుగునాట కనిపించే తెనుగుదనము

ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రులు పేర్కొనబడినారంటే, నామటుకు నేను హర్షింపలేకున్నాను; ఎందుకంటే– మనజాతిని పుళిందాది అరణ్యకజాతుల క్రింద చేర్చిపెట్టినారు. ఇక మహాపండితుడు– కాంచీపురవాసి–అప్పయ్య దీక్షితులు అన్నమాటకే ఒళ్ళుపులకరించి, మనసు పరవశిస్తుంది. ఓం నమశ్శివాయ మంత్రంతో అక్షరాభ్యాసం చేయించే తెనుగు జాతిలో తాను పుట్టలేకపోయినందులకు ఆ ద్రావిడ పుత్రుడు వాపోయినాడు. కాని, యీ గుంట ఓనమాలను మరచి కిండర్ గార్టన్ విధానానికి దిగిన ఆంధ్రత్వాన్ని ప్రగతి అనాలనో పెడమొగమనాలనో తెలియకున్నది. మంచి చెడ్డలు పడుగు పేకలవంటివిగదా! మన పెద్దలు మనకు సంక్రమింపజేసిన లగ్గుకుపొంగి ఎగ్గుకు క్రుంగకుండా భావికర్తవ్యలగ్నమానసులమై దీక్ష బూనుదాము.

తెనుగుదనం :- ఇప్పటి తెనుగుదనం – అనే శీర్షిక సాపేక్షికము. కాబట్టి వెనుకటి తెనుగుదనం ఎట్లా విప్పారినదో తెలిసికొంటేనేగాని, నేటి రేపటి తెనుగుదనాన్ని ఆకళించుకొని ఊహించుకోలేము.

మనం ఆంధ్రులమో తెనుగువారమో అనే వివాదం అటుండనిచ్చి, ఆ జమిలి పేరున వ్యవహరింపబడే మన పాతచరిత్ర గర్వకారణం! భావి కార్యోపదేష్ట! అనక తప్పదు. ప్రాచీన సంస్కృతినందు పునః ప్రతిష్ఠ చేయాలనేవాదం, దేశకాలానుకూలంగా ఇమిడేదిగాదు. అయినా, దానిని పూర్తిగా విస్మరించిన జాతి ఎముకల గూటిని పట్టుకొని ప్రాకులాడినట్లుండును. గతాన్ని స్మరించి, వర్తమానాన్ని అనుసరించి, భవిష్యత్తును ఊహించి పురోగమించే జాతే ఆధునిక ప్రపంచమున మని మన్నింపబడగలదు.

ప్రాక్తన్న ఔన్నత్యం :- ఓరుగల్లు పతనానంతరం హిందూధర్మ పునరుత్థానానికి మూల పురుషుడు– విద్యారణ్య స్వాములవారు మరల మన కీర్తిధ్వజమెత్తినారు. వేదభాష్యం తమ్ముడు – సాయణునిచే వ్రాయించినాడు. మల్లినాథుడు ఉత్తరాది కావ్యాలన్నిటికి వ్యాఖ్యానాలు వ్రాసినాడు. జగన్నాథ పండితరాయలు ఢిల్లీ ఎఱ్ఱకోటలో తెనుగు తులిపితనాన్ని యవనసుందరి అంకపీఠాన నెలకొల్పి ఆంధ్రపాండితిని మెరపించినాడు. నింబాల్కర్ వల్లభాచార్యులు ఆంధ్ర ఆధ్యాత్మిక పీయూషమును పరరాష్ట్ర భక్తులకు పంచిపెట్టినారు. అంతకుముందే గదా బౌద్ధవేదాంత విజ్ఞానము, శిల్పకళలు తెనుగునాటిని ఉజ్జీవింపజేసి యుండినది. విజయపురిలో నాగార్జునుడు ఆంధ్రుల కీర్తిని అస్తమించని దినమణి అయినాడు.

తమిళాంధ్ర పరస్పర ప్రభావము:- చుట్టు ప్రక్కలవారితో నూరి కలిపినట్లుకలసిపోయ్యే అపూర్వ గుణము తెనుగువారిసొత్తు. మహామహుడు–రాజేంద్రచోళచక్రవర్తి రాజనరేంద్రునికి పిల్లనిచ్చిన మామ అయినాడు. నరేంద్రుని కొడుకు– రాజేంద్రుడు, మేనమామ–దేవేంద్రచోళునికి అల్లుడై, ఉభయకులోత్తుంగ చోళుడై, తెనుగు అరవజాతులను ఒకటిగా కలిపివేసి, జాతీయ సమైక్యత అనే నేటి నినాదానికి బీజావాహం చేసినాడు. తంజావూరులోను మధురలోను నాయక రాజులు, తమిళనాటి నడిబొడ్డులో తెనుగుసీమను నెలకొల్పి, ఆంధ్రకీర్తి లక్ష్మికి కల్యాణమండపాలు నిర్మించినారు. త్యాగరాజు తన మధుర వాణితో అరవజాతిని పాటకులుగా, గేయకారులుగా దిద్దినాడు.

ఈ సంప్రదాయం ఇంతటితో నిలిచిపోలేదు. ఈ శతాబ్దంలో దక్షిణాపథంలో పెనవేసి తీగబారి పూచిన ఉద్యమాలకు ఆంధ్రులే నాయకులైనారు.

ఆర్.ఎస్.ఎస్. సంస్థాపకులు, నాగపూరు డాక్టర్ హెడ్గవర్ ఆంధ్రుడు. తమిళనాడులో విపరీత కులాభిమానమును భావావేశమునురేకెత్తించి, ప్రజలకు "స్వయం మర్యాదను" గరపిన ఇ.వి.రామస్వామి నాయకర్ తెనుగు బలిజబిడ్డ. ఆయన శిష్యుడు– మహావక్త అన్నాదురై డి.ఎం.కె.నిర్మించినాడు; ఈయన తెనుగు బంగారమ్మ గారాబుపట్టి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయిన కన్నెంవారు ఆంధ్రుడు. బ్రహ్మసమాజ స్థాపకుడు – కందుకూరు వీరేశలింగం వంగదేశంలో కేశవచంద్రసేనుడంతటి వాడని లెక్కబడినాడు. మాంట్‌ఫర్డ్ సంస్కరణాల అనుగుణంగా ఏర్పడిన ప్రథమ దేశీయ ద్వంద్వ ప్రభుత్వమున మంత్రి అయినది కదలూరు సుబ్బరాయలురెడ్డి. జస్టిస్ పక్షమును స్థాపించి, నాయకుడైనది – ఆంధ్రదేవాంగ కులదీపకుడు పిట్టి త్యాగరాయశెట్టి. అద్భుత మేధాసంపన్నుడు కోయంబత్తూరు జి.డి.నాయుడు, ఆంధ్రదేశమునుండి వలసబోయినవాడు.

కాంగ్రెసు జెండా పెళపెళలాడకముందు, మదరాసు రాష్ట్రంలో రాజ్యతంత్రమునడిపినది ఆంధ్రనాయకులు :పానగల్లురాజ, బొబ్బిలిరాజ, పాత్రో, వేంకటరెడ్డి నాయుడు, మునిస్వామినాయుడు, కాంగ్రెస్ రాజ్యంలో ముఖ్యమంత్రులైన ఓమండూరు పెద్దరామస్వామిరెడ్డి, కుమారస్వామిరాజ తమిళతల్లిస్తన్యం ద్రావి, కన్నతల్లిని పెంపుడు తల్లిని మరువని తెనుగుతల్లి అనుగు బిడ్డలు. రాష్ట్రపతులు రాధాకృష్ణన్, గిరి; తెనుగు వాసనలు గలిగిన జాకిర్ హుస్సేనులు రాచరికాల నెరపినా అధికారం మాత్రం అరవలచేతులలోనే ఇరుక్కొనిపోయి ఉండినది.

వార్తా పత్రికారంగము:- చిఱ్ఱాపూరు యజ్ఞేశ్వరదత్త చింతామణి అలహాబాదులో, కోటంరాజు పున్నయ్య కరాచిలో, భోగరాజు పట్టాభి సీతారామయ్య బందరులో, భైరవరపు హనుమంతరావు బొంబాయిలో, ఖాసా సుబ్బరావు మదరాసులో, లంకా సుందరం ఢిల్లీలో, రామరావు లక్నోలో, ఇప్పుడు ఢిల్లీలో గునుపాటి కేశవరామరెడ్డి (జి.కె.రెడ్డి) జర్నలిజానికే ప్రతిష్ఠను గూర్చి మన పేరు నిల్పినారు. ఆంధ్రకేసరి 'స్వరాజ్యను' స్థాపించినారు.

1920లో అమానుషమైన రౌలట్ చట్టాన్ని ప్రతిఘటిస్తూ, బయ్యా నరసింహేశ్వరశర్మ సర్ బిరుదమును, కేంద్రమంత్రి పదవిని విసర్జించి గర్జిస్తూ బయటకు నడచినారు.

ఆంధ్రుల దేశభక్తి :- జాతీయత, దేశభక్తి పరాయణత, ఆంధ్రులకు ప్రాణవాయువులు, బెంగాలీల ఉత్సాహశక్తికి తీసిపోమని జాతీయోద్యమం ప్రారంభించినారు. జాతీయత పుణ్యఆంధ్ర రోదసిని దట్టంగా అలముకొనినది. కోపల్లె హనుమంతరావు బందరులో ఆంధ్రజాతీయ కళాశాలను స్థాపించి, ఠాకూరు శాంతినికేతనానికి ఒక ప్రతిరూపాన్ని నిర్మించినారు. మహారాష్ట్రుల క్రియాశక్తిని అలవరచుకొని, జాతీయ పునర్నిర్మాణమునకు పూనుకొన్నది – ఆంధ్రజాతి. భారతదేశంలో భాషాప్రయుక్త రాష్ట్రవాదానికి ఏరువాక సాగించినాడు – తెనుగుబిడ్డ. లోకమాన్య తిలకు హిందూ ధర్మబుద్ధికి ముగ్ధులై, ఆయన గావించిన స్వరాజ్య శంఖారావానికి చకితులై, పులకితగాత్రులై, పావనగోదావరీ కృష్ణ పినాకినీ నదీజలాలను జాతీయ నినాదాలతో తరంగితము చేసినారు. గాంధీ మహాత్ముని త్యాగోద్యమ భానుడు, దివ్యదీధితులతో పరిత్యాగ లాంఛనమైన గైరికవర్ణంలో ఉదయించినాడు. తెనుగునాట నాలుగు చెరగులు దేశారాధన తత్పరములై, ప్రజలు కార్యదీక్షా కంకణమును ధరించి, స్వాతంత్ర్య సమరంలో ముందుకునడచినారు. అఖిలభారత స్థాయినందు కొనిన ఎందరో ప్రజానాయకులను పెంచి పెద్దజేసినది– ఆంధ్రమాత.

ఆంధ్రప్రజావళి ఉత్సాహం పున్నమనాటి వారాసివలె ఉప్పొంగినది. వేలువేలుగా జయిళ్ళనునింపినారు. ఆత్మ రక్తదానంతో మాతృదేవి పూజావితర్దిని అలికి, కీర్తిముత్యాలతో ముగ్గులుబెట్టినారు.

జాతీయ వాఙ్మయం, పద్యాలతో గేయాలతో నిండుదనంతో, చవిసారంతో ఆంధ్రజాతికి నూతనాలంకారములను సంతన పరచినది. గీతావళి ప్రజను ఉత్తేజ పరచినది. కవులు, గాయకులు, నటకులు, ఆ ఉత్సాహ మధుమాసంలో శుకపికకూజితాలను ఆలపించినారు. ఇట్లా ఆంధ్రుల యశస్సు పిండార బోసినట్లు ఆంధ్రదేశమును వెలిగించి, పక్క రాష్ట్రాలకు డాలుకొట్టినది.

ఇదీ, స్వాతంత్ర్యానికి ముందు, ఆంధ్రజాతి కీర్తిమండిత చరిత్ర!

స్వాతంత్ర్యానంతరం :- ఇక స్వరాజ్యం వచ్చిన తరువాత, స్వదేశపాలనలో వెలసిన తెనుగు దనాన్ని అరసి, భావికర్తవ్యాన్ని ఊహించుకొందాం.

బలుపో, వాపో ఆంధ్రజాతి అన్ని రంగాలలో అభివృద్ధిచెందినట్లే కనబడుచున్నది. నవ్యవికాసాన్ని జూపింది. దేశీయ విదేశీయ వాసనలను అభిరుచులను కలగలుపుగ అలవరచుకున్నది. కాని, నా జాతిది "ఇదీ" అని చూపగలిగిన ప్రత్యేకత ఏదీ కనిపించదు. అంతర్జాతీయ ఆధునికత ఎట్లా ఆక్షేపనీయాలుగావో అట్లే జాతీయతను విడనాడుట మాత్రం ఆక్షేపనీయం కాగలదు. ప్రపంచపు దూరభారాలు సంకుచితములైపోయిన

యీ అంతర్జాతీయ యుగంలో, మడి కట్టుకొని కూర్చుండుట వాంఛనీయం కాదుగాని, మన ప్రత్యేకత విశిష్టత లవలేశం గూడా లేకపోవుట గూఢ వాంఛనీయంకాదు. కొత్తపాతల సమన్వయం, దేశవిదేశీయాల సామరస్యములే యీనాటి అవసరాలు. ఆ దృష్టితో చూచినచో తెనుగుదనానికి ఎక్కువపాళ్ళు కల్తీ జరిగినది.

ఆనాడు త్యాగాగ్ని గుండంలో దూకిన వీర దేశభక్తులు నేడు దేశజాతి ప్రగతులను జూచి నిరాశోపహతులగు దుస్థితి ఆంధ్రులకొక్కరికేదాపురించినది గాదు That white cap is full of black lies-అని, డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి అనాడు పలికిన పలుకు ఈనాడు దేశ వ్యాప్తంగా అన్వయించుకోవలసి ఉన్నది. అయితే మాత్రం ఆంధ్రుల కిది ఒక ఊరటా? వీటిని కోల్పోయిన జాతి, పోటీలుపడే ప్రపంచంలో నిలిచిమనలేదు. నేడు ధరలతో బాటు పెరిగినది అవినీతి ఒక్కటేనని అంటే అది స్వజాతిదూషణ మనిపించుకోదు. ఇది అభివృద్ధికి మార్గమైన ఆత్మవిమర్శనం అవుతుంది. "ఆంధ్రదేశపు మట్టి అది మాకు కనకంబు" అనిన గీతలయొక్క పరిశుద్ధ తత్త్వం మన భావనలలో లుప్తమైపోయి, చివరకు దేశమంటే ఒట్టి మట్టే అయినది. ఆబాలగోపాలాన్ని ఉఱ్ఱూతలూపించిన ఆనాటి ఆంధ్రావేశం ఆవిరైపోయింది. ఆవేశంతోపాటు ఆదర్శంలేని భూతలవాసులమైనాము. ఆంధ్రాభిమానము సమగ్ర జాతీయతా భావవిచ్ఛేదకమని, అంతర్జాతీయతకు శత్రువని తులనాడ సాగినాము; కానీ జాతీయతే నేటి ప్రపంచ రాజకీయాలకు ఆయువుపట్టని, కీలకమని తెలిసిగూడ తెలియనట్లు నటించే ఉదారతా వేషధారులమై ఉన్నాము. గగన విహారం చాలించి, భూసంచారం గావించిననేగాని, యీ సంకుల భావసమ్మర్దంలో నేడు ఏజాతిగాని రెక్కొనలేదు.

దుస్తులు - అలంకారాదులు :- ఆనాడు ఆంధ్రుడు, ఆ పల్నాటి ఖద్దరుతో పేటంచు కట్టుపంచ, పై పంచతో భారతదేశ సభలలో ఏరివేసినట్లుకనబడేవాడు. ఇప్పుడు ఆ వల్లెవాటు అంగవస్త్రాన్ని, నలమహారాజు అంగవస్త్రాన్ని వలె ఏ పావురమో ఎగరదన్నుకొని పోయింది.

అరువుదెచ్చుకొన్న అమెరికాస్లాకు, బిగువు గొట్టపు ప్యాంట్లతో చిన్నపెద్ద ఒకటే అయినారు. దర్శనీయమైన ఆ అలంకారమును త్యజించి, ఒకే అచ్చులో బోసిన రూపాంతరాన్ని పొందినారు– యీతరమువారు. పురుషాంతర వ్యత్యాసం అనవచ్చునుగాని, మనది అనే పొడఅయినా లేకపోవుట ఏమంత మేలుకాదేమో! జపానువారివలె ప్రత్యేకమైన కార్యాలపట్టునైనా అలంకరణంలో ఆంధ్రత్వమును నిలుపుకొనుట అనంత భిన్నత్వంలో ఏకత్వమును సాధించుకొనులేకాగలదేమో! నెల్లూరి వారికి ధోవతిపోయి అరవల అడ్డకట్టు (దట్టి) ఫ్యాషన్అయింది; నెఱజాణల అభిరుచే దెబ్బదినిపోయింది.

స్త్రీలు మాత్రం సభ్యతను గోల్పోవని చీర రవికలతో ఉన్నారు. "చీరే శృంగారమంద్రు" అనిన సుమతి శతకపద్యం విదేశాలకు గూడ ప్రాకుతున్న కారణమేమో యీ అభిమాన హేతువు! అందరు అధునాతన భారతీయ నారీమణులకువలెనే మనవారికీ, కచభారం కుచభారం కృత్రిమాలైనవి; అసలు పోయిన నకిలీరాజ్యంగదా ఇది! యువతీ జనంలో కొందరు కాశ్మీరం మొదలు కనడా వరకుగల వస్త్రాలంకారవిధానమును అనుకరించి, ఒక సంకర నాగరకతను సృష్టిస్తున్నారు. ఇది ఇంగ్లీషు బ్యాండులో త్యాగరాజు కీర్తన వాయించినట్లుంటున్నది.

తిండిలో అరవల అలవాట్లు :– ఉత్తరాది పూరి, మైసూరు వారి పాకు ఎప్పుడో తెనుగువారి వంటయిల్లుచేరి యుండినవిగాని, ఇప్పుడు అరవల ఇడ్లి సాంబారురసం, కేరళుల కొబ్బెరచమురు ఆవియల్ పెద్దయెత్తున దండయాత్ర చేసి, ఆవకాయను, గోంగూరను ఒక మూలకు నెట్టినవి ఆహారంలో మిగిలిఉన్న ఆంధ్రత్వం ఇదే.

ఆంధ్రభాష : ఆంధ్రభాష ఎదిగినది. విదేశపదాలను సొంతంచేసుకొనే ప్రతిభ యీ భాషకు, వాటినన్నిటిని శుద్ధంగా వ్రాయగలిగిన యీ లిపికి గలవు కాని, ఎయిర్–చాంబర్ మొదలగు అపభ్రంశాలను దూరనివ్వడం స్ఫోటకపు మచ్చలకు ముఖం మురిసిపోయినట్లుంటుంది. ఇప్పుడు పత్రికలను రేడియోను ఒకే ప్రాంతంవారు చేజిక్కించుకొని, జీవంతో తొణికే వివిధ ప్రాంతీయభాషలను అనాగరకమని తోసిపుచ్చుట సరస్వతీదేవికి దాపురించిన మహామారులలో ఒకటి. ఇదే అభ్యుదయం అభివృద్ధికానేరదు. అన్యప్రాంత భాష అర్థంగాక ఎగతాళి చేయడం మొరటుదనం. భాష–వ్యవహారికమే గానీయండి, తప్పులు తడకగా స్పెలింగు తప్పులతో అపశబ్దాలతో వ్రాయడమే ఫ్యాషన్ అయితే ఆ జాతికి మోక్షముండబోదు. ఇంగ్లీషులో తప్పు స్పెలింగులున్నవా? దానిలో గ్రాంథికానికి గ్రామ్యానికి అంత వ్యత్యాస మున్నదా? వారి శ్లాంగ్ గూడ మనవారి శిష్ట వ్యావహారికంకంటె పై స్థాయిలో లేదా? ఈ దుర్గుణం అరవలకున్నదా? కన్నడులకున్నదా? ఏ ఇతర భారతీయ భాషకైనా ఉన్నదా. అయితే ఈ తెగులు తెనుగు ఒక్కదానికే చుట్టుకోనేల?

భాష వివిధత్వ రామణీయకతకు ఒక దృష్టాంతంగా గోజాతి రమ్యతను పరికించండి; మనదేశంలో రాష్ట్ర రాష్ట్రానికి జిల్లా జిల్లాకు ఆవులు ఎద్దులు ఆకారంలో వర్ణంలో భేదించి, కొమ్ముమూటంలో– మలుగుల తీరులో– మూపురాల పొంకంలో కన్నుల పండువుగా, ఎంత చూచినా చూపుకు వెగటులేకుండా కనబడును. ఇక యూరపు దేశంలో అన ఇన దేశాల పశువులు ఒకే మోస్తారు బుంగకొమ్ములతో–చదరమైన వెన్నుతో – బట్టవన్నెలతో సొంపులేక కనుచాలకుండును. ఇట్లే ఒకే ప్రాంతీయ భాషానిరంకుశము వివిధ ప్రాంతాల భాషను నిర్జీవంగా చేయును.

కవిత్వము నవ్యమార్గాల ద్రొక్కినది! నవ్యరీతులను చేపట్టినది! నిజమే! ఇది కాల స్వభావం. భాషా చరిత్రలో ఇట్టి కుదిలింపులు బెదరింపులు సంభవించుచునే ఉన్నవిగాని, కాల ప్రవాహంలో కొట్టుకొని పోకుండా నిలిచి సాగివస్తున్నది– అధిక సంఖ్యాకులకు ఆమోదమైన భాషే!

అభ్యుదయ కవిత్వము విప్లవ కవిత్వము ఒక భాషాయానంలో అప్పుడప్పుడు కలిగే ఒడుదుడుకులే! నిరాశోపహతులు దేవుని దయ్యాన్ని అందరిని అశ్లీలంగా తిట్టడం అభివృద్ధిని చేకూర్చడం కానేరదు. సమబుద్ధితో వర్తమానస్థితిని వదలక భవిష్యత్తులోనికి జాతిని నడపించగలిగిన

కవిత్వమే అప్పటమైనది. క్రిందామీదా పడినా, కాలక్రమేణా ఆంధ్రభాష ఒక విశిష్ట స్పష్టరూపాన్ని పొందగలదు. నేటిరూపం మన భాషా వికాసంలో పేరీపేరని స్థితి.

పూర్వం ద్విపద కవిత్వం-దేశికవిత్వం వంటిదే నేటి గద్యకవిత్వం. సర్వజనామోదకరమైన విలువలను బట్టి నిలువగలిగినదే నిగ్గయిన కవిత్వం, పదికాలాలపాటు నిలువగలిగినది గూడ అదే!

ఆంధ్రుల ఆవేశం :- ఆంధ్రులకు ఆవేశానికి తగిన ఆచరణశక్తి తక్కువ. సోడాబుడ్డి కొట్టగానే బుస్సని చల్లారిపోవునట్లు ఆంధ్రుని ఉత్సాహానికి ఆటుపోటులు ఎక్కువ. భాషావికాసానికి తగినట్లుగా నిలువగలిగిన కవిత్వం తెనుగున ఇంకా పుట్టలేదేమో అని అనిపిస్తున్నది. ఇది ఒక ప్రయోగస్థితి (ఎక్స్పెరిమెంటల్ స్టేజ్) పొరుగున ఉండే తమిళులు, భాషారంగమున సాధించిన ప్రగతిని గమనించండి: ఎన్ని దినపత్రికలున్నవో అన్నీ లక్ష సర్కులేషన్ దాటుకున్నవి. “కుముదం” అనే వారపత్రిక ఇంచుమించు ప్రతి సంచికకు నాలుగు లక్షల ప్రతులను అచ్చువేసి అమ్ముతున్నదంటే; మనసును దెచ్చుకోండి అరవల భాషాభిమానము – పఠనాశక్తి! అందగత్తెల వన్నెచిన్నెల బొమ్మలు వేసినా (కవర్ గర్ల్సు) మన వారపత్రికలన్నీ గలసి ఒక కుముదానికీ ఎంతో కీతగానున్నవి. అసలు తెనుగువారి దంతా చేబదులు చదువు. యోగ్యమైన పుస్తకముకొనే అలవాటు అంతగా లేనప్పుడు పత్రిక కొనబోతాడా వీరాంధ్రుడు! ఒకే ఒక దినపత్రిక ఊరంతా పేటంతా సర్కులేట్ అవుతుంది. మనవారికి వార్తలు గూడ, ఆవకాయవలెనే ఎంత పాతబడితే అంత మేలైనట్లున్నది.

సినిమాలు - నాటకాలు :- ఇప్పుడు తెనుగుదనం బొత్తుగా కనిపించకుండా పోయింది– నాటక సినిమా రంగాలలోనే. గ్రామీణులను ఇంపుతో సొక్కించిన యక్షగాన రూపమైన వీధిభాగవతము, పామరపండిత జనరంజకమైన తోలుబొమ్మలాట (లెదర్ టాకీస్ అందామా?) పరుగెత్తిపోయి గుహలలో దాగుకొన్నవి. మహారాష్ట్రులు, “తమాషా” అనే యిట్టి నాట్యవిధానాన్ని, తమ పెద్దలు సంక్రమింపజేసిన కాణాచిగా కాపాడుకొనుచున్నారు. జంగం కథలు బుఱ్ఱకథలనే నామాంతరంలో రాజకీయాలకు పనికివస్తున్నవి. ఆనాడు ఆంధ్రనాటకరంగం దక్షిణా పథమంతటిలో నటన కళావైదుష్యంచేత అగ్రగణ్యంగా ఉండినది. బళ్ళారి రాఘవ, నెల్లూరు నాగరాజరావు, కందాడై శ్రీనివాసన్ (దొరసామయ్యంగార్), డి.వి.సుబ్బారావు, పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి, యడవల్లి సూర్యనారాయణ మొదలగు మహానటులు; ఆంధ్రనాటక వియత్తలాన్ని వెలిగించిన ఉజ్జ్వలతారలు. ఇప్పుడు నాటక ప్రయోగాలకే కరువైనది. ఉన్నా సంగీతం గాడిద గాంధర్వమైనది. పద్యంలో మూడుమాటలుచెప్పి ముప్పైమూర సంగీతం. కొండవీడు చేంతాడువలె లాగిలాగి విసుగెత్తిస్తున్నారు. ఎవరు పాడినా ఒకే రాగం ఒకేస్థాయి ఒకే మూర్ఛన! కర్ణకఠోరతే శ్రోతలకు కర్ణామృతము.

ఇక, సినిమారంగం నాటకరంగాన్ని చెడగొట్టి తానూచెడి, విదేశ అనుకరణాలైన బొంబాయి ఫిలిములకు నిర్జీవ ప్రతిబింబాలై తెనుగుదనాన్ని ఆ వాతావరణాన్ని, అచ్చపు గ్రామీణతను నిర్వాసమంపినవి. ఫిలిములకు డబ్బు రావచ్చు. తారలు మెరయవచ్చుకాని, తెనుగు వెండితెర సత్తుతెర అయినది. పూర్వం ఉండిన ఏకొద్ది ఆంధ్రత్వం కూడా మలమలమాడిపోయినది. గుఱ్ఱం+అశ్వం=గుశ్వమన్నట్లు, పరదేశ పరరాష్ట్రసభ్యతలను పిసికి ముద్ద జేసినట్లు ఒక రసాభావస్థితి ఏర్పడి ఉన్నది. సత్యజిత్‌రాయి, వనకుదురు శాంతారం (తెనుగు వాడా.) సృష్టులను కల్పించలేకపోవచ్చుగాని, వ్యక్తిత్వం గల ఆంధ్రులు వికారపు పేర్లతో చిత్రాల నిర్మించి, పామరజన రంజకానికినా కాసులకుగా, కళను బలిపెట్టినారు. మహాశక్తివంతమైన యీ ప్రచారక సాధనం అరచదువు ఆంధ్రులను చాలా మందిని చెడగొట్టుచున్నదనే వారు చాలామందిగలరు. ఇక వీటి సంగీతం– అనంతకోటి కంఠాలకు ఒకే గొంతై సంగీతలక్ష్మిని కొరత వేసినది. ఇవి ఆదర్శ ప్రాయమైన ఆనందాన్ని గూర్చే దెప్పుడో!

స్థానిక దురభిమానం :- ఆంధ్రులకు అవగుణమో ఆరిష్టమో అనదగినది. స్థానిక దురభిమానం! కృష్ణ పెన్నారు ప్రాజెక్టు సర్కారులవారు వారు వద్దు, నాగార్జున సాగర్ కావాలంటారు; గోదావరి వారు ఇది వద్దు రామపాద సాగరం గావాలంటారు; ఇక నెల్లూరు వారు ఇవి రెండు వద్దు సోమశిల కావాలంటారు. దీనివల్ల అది ఇదీ అన్నీ ఊడ్చుకొని పోతున్నవి. ఇక తమిళులు చూడండి– అది కావాల ఇదీ కావాల అని అందరూ ఐక్యకంఠంగా బలికి, అన్ని సాధించుకొంటున్నారు. దీనికి తోడు మాట సాగిన అధికారులు అరవలకు గుట్టుగా పనులు సరిజేసి పెట్టుతున్నారు. కాబట్టి తమిళులు అన్ని పరిశ్రమలు అన్ని ప్రాజెక్టులు దక్కించుకొని బాగుపడుతున్నారు. ఇక తెనుగువారు ఐక్యతలేకుండా అన్నీ చెడగొట్టు కొనుచున్నారు. ఆంధ్రులు ఆవేశమూర్తులేగాని కార్యశూరులు గారు. ఆంధ్ర అన్నపూర్ణ! నిజమే– మానవునికి అన్న మొక్కటే గాదు జీవితావసర వస్తువు.

భాషాప్రయుక్త రాష్ట్రసాధన : ఆంధ్రుల చరిత్రలో అన్నిటికంటే విషాదకరాంశము– యీ మధ్య విలయతాండవంచేసిన భాతృహంత కోద్యమము! ముక్కోటి ఆంధ్రులు ఒకపంచన కుదుట పడాలని ముక్తకంఠంతో అరవై ఏండ్లుగా ఆందోళన చేసినాము. భాషారాష్ట్రోద్యమానికి ధ్వజారోహణం గావించినాము. ఈ వాదాన్ని భారతదేశానికంతా నేర్పినాము. ఆంధ్రనగరి అని పేర్గాంచిన ఓరుగంటి సామ్రాజ్య ధవళాతపత్ర ఛాయలక్రింద శాంతి సౌభాగ్యాలనుభవించి 600 ఏండ్ల తర్వాత, మరల యీనాడు నాలుగుకోట్ల ఆంధ్రులందరము ఒక రాష్ట్రంగా ఒక ప్రభుత్వం క్రింద ఏర్పడినాము. పొట్టి శ్రీరాములబోటి ఆత్మబలిదాతల అకళంక పవిత్రరక్తం యీ ఐక్యతను పునీతం చేసినది. భాషారాష్ట్ర విభజన సంకుచితభావమని, భారత సమైక్యతకు భంగమని మృషాజాతీయ వాదులు కేకలిడినా, ఇది మానవ ప్రవృత్తిని భాషాభిమానము అభేద్య అదృశ్యబంధమని ఇప్పుడు

దేశదేశాలు చాటుచున్నవి. ఐర్లండు స్కాట్ల్యాండు, వేల్సు తమ తమ కెల్టిక్ భాషలను పునరుద్ధరించుకొనినవి. మతముకంటే భాషే గట్టిదనీ బంగ్లాదేశ స్వాతంత్ర్యసమరం చాటింది.

తెలంగాణాలో రక్తబుతువు :- కాని, హైదరాబాదునగర వీధులలో యీ మధ్య ఆంధ్రసోదరుల స్వజన రక్తంతో వసంత మాడిన దారుణ పైశాచిక దృశ్యం, ఆడవారి పరువును గోడల మీదికి ఎక్కించిన అనాగరికబుద్ధితోడి, ఆంధ్రుని ద్వేషించి అన్యుల కౌగలించుకొనిన విపరీత ప్రవృత్తి–ఆంధ్రులకేకాదు మానవజాతి వినీతసభ్యతకే మాయని కళంకము.

దుష్టరాజకీయ శక్తులు కానీయండి, ఆంధ్రేతరుల లాభాపేక్ష కానీయండి తెలంగాణ వేర్పాటు పోరాటంవల్ల ప్రపంచంలో ఆంధ్రజాతి కీర్తి దూషితమైనది. ఈ ద్వేషానలం ఇంతటితో చల్లారిపోవుట భావిసంతతి అదృష్టం. ఆ ఆక్రోశంవల్ల బావుకొన్నది ఏమీ లేదు– మిగిలినదంతా అపకీర్తియే.

ఈ దురంతాన్ని క్షణికంగా, తేలిపొయ్యే తొలకరి మబ్బుగా విస్మరించి, ఆంధ్ర గౌరవమును మరల నిలబెట్టుకొందుముగాక!

తెలుగుదేశమే నాది
తెలుగు బిడ్డనే నేను
తెలుగు పేరు వింటేనే మురిసిపోతాను
తెలుగుభాష అంటే మైమరచిపోతాను ॥తెలుగు॥

* * *

నన్నయ భట్టిక్కడనే పుట్టినాడు
తిక్కనకవి గంట మిచట పట్టినాడు
పోతన్నలు, శ్రీనాథులు, రామరాజ భూషణలు
తెలుగుభాషకే వన్నె దిద్దినారూ
తెలుగుజాతి నాల్కలపై నిలిచినారు ॥తెలుగు॥

* * *

ఆట వెలదులను ముద్దులమూటగట్టె వేమన్న
భావి కాలగతుల తెలియబల్కెను వీరబ్రహ్మం
కర్నాటక గానానికె కళదెచ్చెను త్యాగరాజు
ఇంతటి విజ్ఞానధనులు ఎవరున్నారు
వెదకిచూచినాగాని కానరారూ. ॥తెలుగు॥

* * *

బరిపై తొడగొట్టి, కత్తి బట్టెను నాయకురాలు,
పురుష వేషమున శత్రుల నురుమాడెను రుద్రమ్మ,
మొల్లలు మల్లమదేవులు,
మహిళలకే మణిపూసలు,
తెలుగుగడ్డకే, పేరు దెచ్చినారు
స్త్రీ జాతికి గౌరవమ్ము నిచ్చినారు ॥తెలుగు॥

* * *

ఓరుగల్లు నేలిన శూరుడు ప్రతాపరుద్రుడు
పౌరుషమ్ము చిందించిన బాలచంద్రుడు
రాచకొండ వెలమ దొరలు,
కొండవీటి రెడ్డి విభులు,
మన ప్రతాపమునకు బలే మచ్చుతునకలు
వేడినెత్రు పారించిన వీరపుత్రులు ॥తెలుగు॥

కలియుగ భీముడని బిరుదు
గొన్న "కోడెరామమూర్తి"
అద్భుతమేధావిగ పే
రందిన "విశ్వేశ్వరయ్య"
జగము మెచ్చు "రాధాకృష్ణ"
త్యాగమూర్తి "ప్రకాశం"
"సత్యసాయి బాబాలు"
మనవాళ్లంటే చాలు ॥తెలుగు॥

* * *

సింహాచలమప్పనా, శ్రీశైలం మల్లనా,
యాదగిరి నరసింహా, ఏడుకొండల వెంకన్నా!
వీరంతా తెలుగువారి కిలవేలుపులు,
మహిమలు జూపించునట్టి మనదేవుళ్ళూ!

* * *

కృష్ణా, గోదావరులు కేరింతలు గొడుతున్నవి,
తుంగభద్ర మంజీరలు అంగలువేస్తున్నవి,
నిత్యము ప్రహించుచున్న
నిర్మలమగు జీవనదులు,
బంగారపు పంటలు పండిస్తువున్నవీ
కరవు రక్కసిని దూరం తరుముతున్నవీ.॥తెలుగు॥

* * *

తెలుగువాడు ఏడనున్న, తెలుగువాడు
తెలుగుభాషనే సొంపుగా పలుకుతాడు
మరచిపోని అతని కట్టు,
మారిపోని అతని బొట్టు,
తలచుకొన్న రోమరోమం పులకరిస్తుందీ,
అభిమానం పొంగిపొరలి, ఉరకలేస్తుందీ ॥తెలుగు॥

– కొసరాజు

రావూరు వెంకట సత్యనారాయణరావు

తెలుగు పండుగలు

తెలుగు పండుగలు వెలుగు మజిలీలు

పండుగ అనగానే మనస్సులో ఏదో వెలుగు నిండినట్లు తోస్తుంది. పెద్దలు నిర్ణయించిన పండుగలు కొన్ని ప్రతి సంవత్సరం పసిడి వలయాలుగా అవతరిస్తూవుంటాయి. నిజానికి మనస్సుకు ఆనందరసానుభూతి అందిన సమయాలను కూడా మనం పండుగలుగా భావించి సంబరాలు పడుతూ వుండటం సహజం.

నిజానికి మానవ జీవితం ఒక పెద్ద పండుగ. మనం జరుపుకొనే పండుగలన్నీ ఆ పండుగలలో పండుగలు. మానవులంతా పెదవులమీద చిరునవ్వులతో, ఆధ్యాత్మిక స్పందనతో, అమృత భావనతో జీవించాలని భగవంతుని ఆశయంగా వర్ణింపబడింది. మానవహృదయం-సహనం, సంస్కృతి, త్యాగం, రాగం, భోగం, దానం, వినయం, విజ్ఞానం మొదలైనవాటికి నిలయమని సృష్టికర్త భావన. ఇన్నింటిలో కూడిన మానవజీవితం నిత్యకల్యాణంగా భాసించడానికేమి అభ్యంతరం వుంటుంది? ఈ దివ్య సంపదలతో మానవుడు పురోగమించి మానవాతీతుడు కావాలని భగవంతుని సంకల్పం.

అంతటి పరిపూర్ణతను, ప్రాభవాన్ని నిలుపుకోవడానికి తగినశక్తి మానవులలో లోపిస్తోంది. మరి సంతోషభావన కల్పించడానికి మార్గమేమిటి? భక్తి భావనలో తన్మయత్వం చెందే అవకాశాలున్నాయి. ప్రతి మానవుడూ ఇహాన్ని మరచి పరలోకంలోకి తొంగిచూచి మోక్షానుభూతిని పొందడానికి భక్తి ఏకైక లక్ష్యం. దీనిని నిత్యసాధనగా నియమించుకోగలస్థితి ఏ కొద్దిమందికి మాత్రమే సాధ్యం. తక్కినవారు సంసార బాధ్యతలోపడి కొట్టుకుపోతూవుంటారు. వీరికి తమ్ము తాముగుర్తుంచుకునే అవకాశాలే తక్కువ. అలాటి ప్రజానీకానికి పెద్దలు నిర్ణయించిన పండుగలు ఎంతో దోహదం చేస్తాయి.

నిత్యం తమంత తాముగా పొందలేని ఆనందాన్ని భక్తిపారవశ్యాన్ని పండుగలు అందిస్తూ వుంటాయి. ఏ ఒకటి రెండో తప్ప తక్కినపండుగలన్ని మత సంబంధమైనవే ! అంటే భగవంతుని లీలలతో హేలలతో ముడి పడినవే. అందువల్ల పండుగలు మానవుని నిత్యయాత్రలో రవంతసేపు నిలిచి, భగవంతుని కొలిచి, ఐహికాన్ని గెలిచి, తోటివారిని ఆనందముతో పిలిచి, శాంతినీ తృప్తినీ సంతరించుకోగల తీర్థయాత్రల వంటివి.

ఉగాది పొద్దులు : వెన్నెలు హద్దులు

మనకు మొదటగా వచ్చే పండుగ ఉగాది. 'ఉగాది నాడు మూగ పెదవులు కూడా కదులుతాయి'

అనేది సామెత. అలాటి సమయంలో మామూలు హృదయాలు ఆనందంతో గంతులు వెయ్యడంలో ఆశ్చర్యం లేదు. ఎండలో పయనించే పాంథుడు ఒక మజిలీ చేరి, మామిడితోపులో చల్లటి నీడలో నిలబడి, వికసిత కుసుమాలను, వీచీలహరులకు, పిక సంతతి కూజితాలను విని ఆనందంలో మునిగి ముకుళిత హస్తాలతో పరమ పురుషుని ప్రార్థించినట్లుగా జీవనయాత్ర కొనసాగిస్తున్న బాటసారులను ఉగాది ఒక చక్కటి పర్వదినం– పసిడి స్వప్నాల ఊయల– భవిష్యత్తుకు కర్పూర నీరాజనం, గతించిన జీవితాన్ని తాత్కాలికంగా మరచి, ఆనందంతో మరొక వత్సరంలో అడుగు పెట్టిన సంబరంలో తీయటి కలలతో, తరితీపివెన్నెల చూపులతో, పకపకలాడే నరుల వదనాలలో ఎన్ని నవ్య భావనలు తొంగిచూస్తాయో ఎలా వర్ణించడం ! ఉగాదులు వస్తూనే ఉంటాయి; మనస్సులను ఊరిస్తూనే వుంటాయి. పేరులు మారినా అవి వెన్నెల వలయాలుగా మానవ జీవితాల చుట్టూ పరిభ్రమిస్తూ భ్రమర గీతాలాలపిస్తూనే వుంటాయి; రామచిలుక పచ్చటి రెక్క విసిరినట్లు సొగసుగా అవి వ్యజనసేవ చేస్తూనే వుంటాయి. ఉగాదులు ఆబాలగోపాలానికి ఏదో 'ఆదిని' కల్పిస్తూనే వుంటాయి.

వేపలు పూస్తాయి; వేడుక కల్పిస్తాయి. ఋతు లక్ష్మికి పట్టిన పైడిగొడుగులుగా నిలుస్తాయి. నూతన వత్సరానికి నరులకన్న తరువులే ఎక్కువగా పులకించి స్వాగతవాక్యాలు పలుకుతాయి. మామిడి చెట్లుపై కొమ్మ కొమ్మనూ పిందెలు నిండి 'కొమ్మ కొమ్మకూ కోటిలింగాలు' అన్న సామెతను సార్థకం చెయ్యడానికి పూనుకొంటాయి. వేపలు, మామిళ్లు–చేదువగరులకు ప్రతీకలు. ఈ రెండింటిలో రవంత తీపి రంగరించి ఉగాది పచ్చడి చేసి సేవిస్తారు. దీనిలో ఎంతో వేదాంత భావన నిండివుంది.

బ్రతుకు చేదు వగరులతో నిండి ఉంటుంది; వాటిని తప్పించుకోవడం అసాధ్యం. కనుక భక్తి అనే తీపిని అందులో రంగరించుకోవడం ఒక్కటే మార్గం. అప్పుడే ఆ వగరును, చేదును అనుభవించగలుగుతాం– అనే భావం ఈ ఉగాది పచ్చడిలో దాగి వుంటుంది. ఇతర పండుగల సందర్భంలో ఎలా వున్నా ఉగాదినాడు తప్పకుండా అందరూ కొత్త ఉడుపులు ధరిస్తారు. జీవితాన్ని వేడుకగా గడపడానికి ప్రయత్నిస్తారు. కూతుండ్రను, అల్లుండ్రను ఆహ్వానిస్తారు. వారిని యథోచితరీతిని సత్కరిస్తారు. తమ మనస్సునూ, గృహాన్ని వెన్నెల మందిరంగా చేసుకోవడానికి పూనుకొంటారు. "పండుగనాడు ఎలా గడిపితే సంవత్సరమంతా అలా గడుస్తుంది" అనే విశ్వాసం ఒకటి కల్పించుకొంటారు. ఇలా జరిగినా, మానినా–సంవత్సరమంతా యీ రీతిగా గడపాలనే ఆకాంక్ష అందరిలో బయలు దేరుతుంది.

"ఈ ఉగాదికి సేసి
కెంత ఉత్సాహమో
చెప్పమంటే రావు
సేసి చేసిన పనులు"

ఇలాంటి సే సమ్మలు ప్రతి ఇంటా వెలుస్తారు; ప్రతి కంటా మెరుస్తారు. జీవన శోభ ఎన్నో రీతులుగా వెల్లివిరుస్తుంది ఉగాది ప్రొద్దుల్లో. ఈ పండుగ ప్రొద్దుల్లో నిండు మనస్సును ప్రదర్శించకలిగిన గృహస్థు "బ్రతుకంతా ఉగాదిగా మార్చవా భగవాన్" అని లోలోపల నమస్కరిస్తాడాయనకు. నూతన సంవత్సరారంభంలో బ్రతుకును సింహావలోకనం చేసుకొని, భవిష్యత్తును గురించి బంగారు కలలు కంటూ ముందడుగు వేస్తాడు మానవుడు. కాని కొద్ది అడుగుల తర్వాతనే బ్రతుకొక ఉగాది కనుక ప్రతిరోజూ ఉగాదిగా మార్చుకోవాలనే సత్యాన్ని మరచిపోతాడు. మళ్లా ఉగాది వచ్చి జ్ఞాపకం చేసేదాకా అంతే !

రాముణ్ణి దగ్గిర చేశాడు గోపన్న

ఇలా కొన్ని అడుగులు ముందుకు వేయగానే– ఎదురుగా వచ్చినిలుస్తుంది శ్రీరామనవమి. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, అయోధ్యరాముడు మళ్లా మనకు జ్ఞాపకం చేస్తాడు – మానవ జీవితం ఆధ్యాత్మిక వలయాలలో ఎలా చుట్టుకు పోయేదీ ! మానవుడై జన్మించిన ఆ సాకేత ప్రభువు కల్యాణం. ప్రతి వారి చెవుల్లో సీతారాముల కీర్తనలు ఎవరూ పాడకుండానే వినిపిస్తాయి. ఆయన లీలలు కనులర మూసుకుంటేనే కనిపిస్తాయి. రాముడు వైదేహి సహితుడవుతున్నప్పుడు పుడమి పులకరిస్తుంది. గగనం రవంత మెరుగుపడుతుంది. మేఘమాలలు ముత్యాల జల్లులు కురిపిస్తాయి.

అందరికి రాముడు ఇష్టదైవం. తెలుగు వారికి మరింత దగ్గిరవాణ్ణి చేశాడు గోపన్న. భద్రాచలం ఆయనగారికి స్థిరనివాసం చేశాడు. ప్రతినిత్యం గోదావరిని రామనామస్తోత్రం చెయ్యమనికోరాడు. తను రామచంద్రుణ్ణి ప్రార్థించి పునీతుడయ్యాడు. ఆయన చరిత్ర రామభక్తులందరికీ మహాకావ్యం. కోదండపాణి కోటి సూర్యుల కాంతితో ప్రకాశిస్తున్నట్లు దర్శనమిస్తాడు. రామదాసు కీర్తనలో రామయ్య అందరికి తండ్రి, సీతమ్మ తల్లి... ప్రతివారికి పితృమాతృ దేవతల దర్శనం ప్రతినిత్యం కావచ్చు. కాని అందరూ సీతారాముల దర్శనం కోసం ప్రాకులాడుతూ వుంటారు; ప్రార్థనలు జరుపుతూవుంటారు. ఊరూరా కల్యాణం జరుగుతుంది. అందరి తలలపై తలంబ్రాలు వెదజల్లబడతాయి. అందరి హృదయాలూ భక్తిభావముతో పల్లవిస్తాయి.

"రామయ్య రామా
నవనీరద శ్యామా ॥రా॥
మునివేళ్లను ఎగిరి ఎగిరి
ఎదురు చూచినది శబరి.
నీ అరికాళ్లను తుడిచి తుడిచి
పడవ నెక్కించెను గుహుడు ॥రా॥

ఆంధ్రదేశంలో ఊరూరా ఒక శబరి; ప్రతిగృహంలో గుహుడు వున్నారంటే ఆశ్చర్యం లేదు. శ్రీరామనవమి జీవితానికి క్రొత్తశక్తిని, అనుపమ భక్తిని ప్రసాదించే పండుగ.

రాముణ్ణి తలచిన తర్వాత పవన తనయుణ్ణి స్మరించకుండా ఎలా వుండగలం? అయోధ్య రాముడెక్కడ వుంటాడో అంజనీసుతుడు అక్కడ వుంటాడంటారు. అలాంటి మహనీయుని జయంతి తర్వాత జరుపుకొంటాం. మనం చేసుకొన్న రామనామ ప్రభావాన్ని ఆంజనేయస్తోత్రంతో మరింత బలపరుచుకొని మధుర భావనలో మునిగిపోయే అవకాశం మనకు లభిస్తుంది. "శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం" అని స్మరించి పులకరించడం భక్తులకు పరిపాటి. జై హనుమాన్ జీవనగతుల్ని సరిదిద్ది ధైర్యాన్ని, శక్తిని ప్రసాదించే దివ్యమూర్తి ! సంజీవిని తేగల సమర్థుడు. ఆయన స్మరణ పవిత్ర దీక్ష; శ్రీరామ రక్ష కూడా!

గ్రీష్మాతపంలో నుంచి బయటపడతాం. తొలకరి జల్లులు వెలగల ముత్యాలుగా కురుస్తాయి. మనస్సులు సేదతీరుతాయి. స్వేదం అంతరించి మోదం అవతరిస్తుంది. రైతులు ఏరువాక సాగుతారు. ప్రతి గొంతులో కోయిల పాటలు వినిపిస్తాయి. నారుమళ్లలో విత్తులు జల్లుతారు. క్రొత్త పంటకు నాందిగీతాలు పాడుతారు. చేతివెంట ఎదుగుతుంది నారు. రైతుల కళ్లల్లో జ్యోతులు వెలుగుతాయి. పంటలక్ష్మి ప్రయాణానికి సిద్ధమవుతుంది. కాళ్లకు పారాణి దిద్దుకొంటూనో, కళ్లకు కాటుక దిద్దుకొంటూనో ! ఎలాటి మహోత్సవం ! ఎలాటి పండుగ! మత సంబంధం కాకపోయినా మనుగడ సంబంధమైన పండుగ ఇది.

శ్రావణంలో ఇంటింటా తోరణాలు

ఆషాఢ మేఘాలు అల్లనల్లన ప్రాకిపోతాయి. చల్లటి పిల్ల తెమ్మెరలు వీస్తూవుంటాయి. భూమాత పచ్చని పూల తివాసీగా మారిపోతుంది. మనస్సుల్లో ఆహ్లాదం పిల్లనగ్రోవిగా వినిపిస్తుంది. సంసారాలు చల్లగా సాగిపోతుంటాయి. మగువల పండుగ వస్తుంది. శ్రావణంలో ఇంటింటా తోరణాలు వెలుస్తాయి. మనస్సుల్లో పన్నీటి జల్లులు కురుస్తాయి. అతివలు వరలక్ష్మీ వ్రతం ఆరంభిస్తారు. క్రొత్తగా పెళ్లి అయినవారు వ్రతం పడతారు. మంగళవారాలు, శుక్రవారాలు ఇంటింటా వరలక్ష్మి పూజలు జరుగుతాయి. అతివలలో తేజస్సు తొంగిచూస్తుంది. వ్రతాలు వాటినంటి పేరంటాలు; చక్కగా అలంకరించుకొని మహాలక్ష్మి దూతలలాగానే పకపకలాడుతూ పండుగ చేసుకొంటారు; మంగళహారతులు పాడతారు. మానవ జీవితాభ్యుదయానికి, జాతీయ సుసంపదకూ, సుభిక్షానికి, శాంతికీ ఈ వ్రత మహిమ ఎంతో వుపకరిస్తుంది.

నిత్యకల్యాణం పచ్చతోరణంగా గృహాలు భాసించాలనీ, వదనాలు వికసించాలనీ కోరుతూ వుంటాం. అలాటి సంపదలు శ్రావణమాసంలో ద్యోతకమవుతాయి. వీధిలో ముసిముసి నవ్వులతో ముత్తైదువల ఊరేగింపులు – ప్రతి ఇంట దేవి విగ్రహాలు – మంగళ గీతాలు – నిత్యం దివ్యనీరాజనాలు. ఎంత గొప్ప పండుగ! వారు చేసిన వ్రతాలు సిద్ధించాలి. జాతీయ జీవనం శుభప్రదంగా వర్ధిల్లుతుంది. అతివలు అపరదేవతామూర్తులుగా ప్రత్యక్షమౌతారు. వారి పకపకలు ఎంతో నిండుగా వినిపించి పండుగచేస్తాయి. శ్రావణం నిండైన పండుగ. మా ఇంట్లో ఒక ముసలమ్మ అనేది– "నాలుగు శ్రావణాలొక్కసారి వరుసగా వస్తే చూడాలని వుంది. దానితో భూమి పవిత్రమైపోతుంది. స్త్రీ జన్మ స్థారకమైపోతుంది" అని. అలా రావడానికి ఎక్కడ వీలుంటుంది! తక్కిన పండుగలు తమ వంతు ఆనందాన్ని అందించడానికి తొందరపడవూ?

పరవశంతో ప్రమదలు హృదయాల నిండివున్న తరుణంలో అందులో వయస్సు వచ్చిన వారినందరినీ యశోదలుగా మార్చాలని కృష్ణాష్టమి పరుగున వస్తుంది. చల్లటివేళ నల్లనయ్య పుట్టాడు. తాను నల్లనై ఇతరుల హృదయాలలోని నల్లతనాన్ని రూపుమాపడానికి వస్తాడాయన. ఆ కంసారి కారు చీకట్లను వేణు నాదంలో వెన్నెల జల్లులు కురిపిస్తాడు.

జన్మాష్టమి ఎంత వినోదమైన పండుగ ! ఎంత వేదాంతపరమైన మహోత్సవం ! అందరి హృదయాలలో కృష్ణలీలలు తొంగిచూస్తాయి. అందరి చెవులవద్ద తువ్వాయిల మెడలో గంటలు వినిపిస్తాయి. కనిపించని కేకి పింఛం పిల్లలతలలపైన వూగుతుంది. భక్తిరసభావం అందరిలో తూగిసాగిపోతుంది. అన్ని దిక్కులకూ పరమపురుషుని జన్మదినం. భగవద్గీతను బోధించిన రథ సారథి బోధనామృతం పండిన హృదయాలలో భక్తిరసం పిండిపోస్తుంది. కృష్ణ పరమాత్మను తలచి, కొలిచి, మనసార పిలిచి తన్మయత్వం చెందని జీవి ఎక్కడ ఉంటాడు?

బ్రతుకులు పురివిప్పిన నెమళ్లు

అంతులేని ఆనందం, స్వాంతాన్ని కుమ్మరించే పాటలు. ప్రతి ఇంటా వెన్న ముద్దల పంపిళ్లు. పంటలు పండబోతుండగా వాటి వంకనుంచి దృష్టిని మరలించి భక్తిరసాన్ని పండించు కొమ్మని హెచ్చరిస్తుంది కృష్ణాష్టమి. కరువార స్మరించుకొమ్మంటుంది. పురుషులందరూ నందులై పరవశంలో చిందులు త్రొక్కమంటుంది. విశ్వరూపుణ్ణి తలచి, తల పాదాల మీద వాల్చి మొక్కమంటుంది కృష్ణాష్టమి.

ఇంతలో వస్తుంది వినాయక చవితి. మనస్సులు స్థిరపడి, మధుర భావనలు ఉప్పొంగి, ఆధ్యాత్మిక చింతనాయత్త చిత్తులైన మానవులు శివకుమారుని పూజించడానికి పూనుకొంటారు. ఎట్టి విఘ్నాలు లేకుండా కాపాడలవలసిందిగా ఆయన్ని ప్రార్థిస్తారు. ఉండ్రాళ్ల నైవేద్యం పెట్టి 'తుండము నేకదంతమును'... అని పద్యాలు పఠిస్తూ ఆయన ప్రాపకాన్ని అర్థిస్తారు. ఆ బొజ్జ గణపయ్యను ఆదిలో సేవించి అన్ని విధాలా శుభాలు పొందడానికి ప్రయత్నిస్తారు. వినాయక చవితి... ఎంతో భక్తితోచేసే పండుగ. బ్రతుకు వెంట ఆ ఏక దంతుడు నడిచి భోగభాగ్యాలు, సుఖశాంతులు కల్పించగలడని విశ్వాసం. ఆదిలో ఆయన్ని తలవని పూజలేదు. క్రతువులేదు. కార్యక్రమంలేదు. అయినా చవితినాడు ఆయన్ని మనసారా కొలిచి, కొంత తృప్తినీ, శాంతినీ పొందుతారు అందరు గృహస్థులూ.

పంచాంగాలు సంవత్సరాన్ని ఎలా సూచించినా ప్రజానీకానికి పంటలతో నూతన సంవత్సరం ఆరంభమవుతుంది. అంటే సిరి నవ్వుతూ ఇంట్లో, వంట్లో సాక్షాత్కరించడమే నూతన జీవితారంభం– అదే క్రొత్త సంవత్సరం. ఆ పండుగ రాబోతున్న సమయంలో పంటపొలాలు

పొట్టలమీదవున్న తరుణంలో – జరుగుతుంది వినాయకపూజ. కొందరీ ముక్కంటి ముద్దుబిడ్డడిని పంట దైవంగా కూడా భావించి పూజిస్తారు. వినాయకచతుర్థి వినూత్నశక్తి కల్పిస్తుంది.

నవరాత్రులలో నరులు కిన్నెరలు :

విఘ్న రాజును కొలచిన బలంతో వేల్పుటమ్మలను కొలిచే అవకాశం లభిస్తుంది. అల్లన అడుగు పెడతాయి నవరాత్రులు–శుభరాత్రులు. పరమ పవిత్రమూర్తి దుర్గను, వెన్నెలకీరీటధారి వాణిని– అర్చించి, కృతార్థులయ్యే పుణ్యఘడియలు. తొమ్మిది రోజులు ఈ వేల్పుటమ్మల పాదాలమీద గుండెలు క్రుమ్మరించి, తాము నిమిత్తమాత్రులై జగన్మాత కరుణను అర్థించే అమర ఘడియలివి. ఎక్కడ చూచినా దుర్గపూజలు. ఎక్కడ చూచినా పసుపు కుంకుమల రాసులు, పూల గుట్టలు. స్తోత్రవాక్యాలు, మంగళహారతులు, జేగంటలు, భక్తిరసపూరిత హృదయాలతో ఆధ్యాత్మిక స్పందనలు. ఈ నవరాత్రులలో నరులు కిన్నెరలుగా మారి గానాలు వొలికిస్తూ వుంటారు. మహాదేవి, వాగ్దేవి అందరి హృదయాలలో అడుగుపెట్టి ఆశీస్సులందిస్తుంది. ఎలాటి పండగ! బ్రతుకులు పండగా, ఎదలు నిండగా నిలిచే పండగ.

ఈ నవరాత్రులలో జైత్రయాత్రకు సంబంధించిన వేడుకలు చాలా వుంటాయి. పాండవులకు సంబంధించిన పురాణగాథను పురస్కరించుకొని, పిల్లలు విల్లంబులతో కోతి బొమ్మలతో పద్యాలు, పాటలు పాడుకొంటూ బయలుదేరడం ఒక చక్కని దృశ్యం. ప్రతి పాఠశాలలో గురువులు దసరా పాటలు నేర్పుతారు పిల్లలకు. నవరాత్రులలో చక్కటి దుస్తులు ధరించి, విల్లంబుల వగైరాలు తీసుకొని అందరి ఇండ్లకూ వెళ్లి, పాటలుపాడి, బుక్కాయి చల్లి గురువుకు కానుకలు సంపాదించి యివ్వడం–పప్పుబెల్లాలతో తాము తృప్తిచెందడం ఆచారం. ఎక్కడ చూచినా, “జయాభిజైభవా దిగ్విజైభవా” అని నినాదాలు. “ధరసింహాసనమై నభంబు గొడుగై”లాంటి పద్యపఠనలు వినిపించి మనసుల్ని ఎంతో మురిపిస్తాయి. విజయదశమి జీవిత విలసనానికి, వైలక్ష్యానికి చిహ్నంగా నిలుస్తుంది. దసరా అశేష ప్రజానీకాన్ని అనందపరిచే పండుగ.

ఈ ఆనందాన్ని నెమరువేసుకొంటుండగా దర్శనమిస్తుంది దీపావళి. నరకాసురవధను పురస్కరించుకొని ఏర్పడిన చతుర్దశి. ఆ మరునాడు దివ్వెల, వెలుగు రవ్వల పండగ, అలుముకొన్న చీకట్లను అసుర సంహారంతో పటాపంచలు చెయ్యడం, తిరిగి వెలుగు తొంగి చూడడం, లోకకల్యాణ ప్రదమైన ఆ శుభ సమయంలో ఆనందాతి రేకంతో అందరూ ఆ విశ్వపురుషునికి నివాళులందించడం ఈ పండుగలోని ప్రత్యేకత.

మానవుడు వెలుగును– ఆధ్యాత్మిక, అధిభౌతిక సంపదలకు చెందినది– సంతరించుకోవడం కోసం ప్రాకులాడుతూ వుంటాడు. ప్రాపంచిక రీతులలోనుంచి, గతులనుంచి తప్పించుకొని, తపస్సిద్ధి సంపన్నుడుకావడానికి ప్రయత్నిస్తూ వుంటాడు. విజ్ఞాన తేజః పుంజంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ వుంటాడు. ఆలాటిస్థితికి ప్రతీక దీపావళి. దివ్వెనుచూస్తే మనస్సులో ఏదో మువ్వల మ్రోత వినిపిస్తుంది. అది అద్భుతమైన స్పందన. అలాటి వెలుగును కనులారా దర్శించి, మనస్సులో వెలుగుతో కలబోయడం కోసమే దీపావళి. అది ఆత్మలో ఆనందంతో అందించే నివాళి. అనతి కాలంలో ప్రకృతి అందించబోయే సంపద లందుకోవడానికి ప్రజలు దీపావళి శోభను వెంటపెట్టుకొని వెళ్లడంలో ఎంత పండగ వుంది?

సూర్యభగవానుడు ఉత్తరాయణంలో ప్రవేశిస్తాడు. ప్రకృతి పచ్చి బాలింతరాలుగా నిలిచి ఉంటుంది. కాని నిండు గర్వం ఆమె నేత్రాలలో తొంగిచూస్తుంది. అంతులేని పంటలు. ఆనందంతో వికసించిన ప్రజల వదనాలు. పచ్చతోరణాలతో పకపకలతో నిండిన సదనాలు. ఇంతటి సౌభాగ్యాన్ని వెంటబెట్టుకు వస్తుంది సంక్రాంతి. సిరి ఎల్లతావుల్లో లాస్యంచేస్తూ వుంటుంది. పౌష్యలక్ష్మి పేదతనాన్ని ఛేదిస్తుంది. సంవత్సరం పొడవునా చేసిన ప్రార్థనలు, పూజలు ఫలించి బ్రతుకును బంగారు స్వప్నంగా మార్చే పండగ సంక్రాంతి.

మనస్సులు త్యాగం వైపు తూగుతాయి. హస్తాలు దానంకోసం సాగుతాయి. ఇంట్లో అందరూ నూతన వస్త్రాలు ధరించి, నిండు మనస్సుతో పండుగ చేసుకుంటారు. ఒక విధంగా సంక్రాంతి ఆట విడుపు. స్వేచ్ఛగా ఆడిపాడి అనందించే పుణ్యదినాలు. కుదించుకొన్న రెక్కల్ని విదిలించి, వినూత్నశోభతో విహరించే ప్రొద్దులు, ఏదో తెలియని అనుభూతి, తెలిసిన ఆనందం మేళవించి మానవ జీవితాలు మధురగీతంగా మార్చే పండుగ సంక్రాంతి. సంక్రాంతి వేడుకలు ఎన్నో వున్నాయి. సంబరాలూ, సరసాలూ ఎన్నో వున్నాయి. సంతోష తరంగాలపై మనస్సులు తేలిపోతుండగా ప్రజలు భగవంతుని స్మరించి మరో మజిలీకి ప్రయాణమవుతారు. కాలచక్రం గిర్రున తిరిగిపోతుంది. ఎన్ని సంక్రాంతులో ! ఎన్ని ఉగాదులో ! అన్నిటిలో దైవత్వాన్ని దర్శించి మానవుడు శక్తిని సమకూర్చుకొంటూ వుంటాడు.

దివ్య దంపతుల చూపుల పందిళ్లు

ఈ పండుగలలో శివరాత్రి గురించి వివరించ లేదింతవరకు. భారతజాతీయ జీవనానికి శివరాత్రికీ ఎంతో అవినాభావ సంపదవుంది. నిజం చెప్పాలంటే – ఇది పరమశివుడు పాలించే సీమ. కైలాస శిఖరం నుంచి ఆ పన్నగధారి నేత్రాల నుంచి వెలువడే చల్లటి చూపులు ప్రాకి, ప్రాకి, కన్యాకుమారి నుంచి కదలివచ్చే కాత్యాయని చూపులతో కలసి చల్లని పందిరులల్లుకొంటాయి. ఆ నీడలోనే భారతజాతి నిండు గర్వంతో జీవిస్తుంది. నదులన్నీ నంది దేవుని మెడలో గంటలవలె కెరటాల చప్పుళ్లు వినిపిస్తాయి. ప్రతి అణువు శివోహం– అంటూ అహరహం స్మరించి తరించాలని ప్రాకులాడుతూ వుంటుంది. ఆ శబ్దాలు ప్రతి హృదయంలో స్పందిస్తాయి. పరమేశ్వరుని కృపకోసం ఎదురుచూస్తూ ఉంటాయి. నిజానికి సంవత్సరానికి ఒకమాటు వస్తుంది శివరాత్రి. కాని ప్రతి నిత్యం మనకు శివరాత్రే.

మనం తెలుగువారం. ఇది త్రిలింగదేశం. మూడు తావుల్లో వెలిసిన ముక్కంటి స్వరూపాలను స్మరిస్తూ తెలుగు ప్రజలు జీవితాలను గడుపుతూ వుంటారు. మహేశ్వరి మనలను సదా దీవిస్తూ వుంటుంది. చల్లని తెల్లటి ప్రాలేయ శృంగాలను విడిచి భక్తజన పరిపాలనకై ఆమిత్తిగొంగ తెలుగు దేశంలో వెలశాడు. అది తన సామ్రాజ్యంగా భావించి దీవిస్తున్నాడు. ఆ చంద్రశేఖరుని దయనుకోరేవారికి శివరాత్రి ఎలాటి పండుగ ! ఎదలు నిండిన వెలుగు ఆ విశ్వేశ్వరుడు, సకల సంపదలను సమకూర్చే దాత ఆ సర్వేశ్వరుడు, జీవితాలలో తుషార బిందువులు వెదజల్లే కరుణామయుడు ఆ వృషభవాహనుడు. తెలుగువారికి శివరాత్రి గొప్ప మహోత్సవం. అది నిత్యోత్సవం కూడా.

సుందర నందన వనాలు పండుగలు

ఇక్కడ పేర్కొన్న పండుగలు కాక ఇంకెన్నో పండుగలున్నాయి మనకు. ఆ పుణ్యఘడియలన్నిటిలో పరమాత్మ చింతనా, ఆధ్యాత్మిక బోధనా మనకు అందుతూ వుంటుంది. నిజానికి పండుగలలో మానవుడు మధుర భావన లందుకోవడానికి ప్రయత్నిస్తాడు. హృదయాన్ని మహతిగా మార్చుకోవడానికి పూనుకొంటాడు. భక్తుడైన నరుడు పండుగలలోగల శక్తిని సంపాదించి మానవాతీతుడు కావటానికి ప్రయత్నిస్తాడు.

కాలవాహిని వొడ్డులలో దూరదూరంగా ధర్మపరంగా, కాలానుసారంగా వెలయించిన సుందర నందన వనాలు పండుగలు. హృదయాలకు స్పందన కల్పించే ఆనందడోలికలు పండుగలు. ఆధ్యాత్మిక బోధన కల్పించే అద్భుత విహారాలు కూడా.

మనకు ఎన్నో జయంతులున్నాయి– నృసింహ జయంతి, హనుమజ్జయంతి, కూర్మజయంతి, శ్రీ కృష్ణజయంతి, మత్స్య జయంతి, పరశురామ జయంతి, యాజ్ఞవల్క్య జయంతి, వీటితోపాటు ఈనాడు గాంధీ జయంతి, నెహ్రూ జయంతి కూడా పండుగ స్థానాలు ఆక్రమించినాయి. వీటన్నిటినీ పండుగలుగా గడిపేవారు ఎంతమందోవున్నారు.

మ్రొక్కినరోజు చక్కని పండుగ

స్త్రీలకు ఎన్నో వ్రతాలున్నాయి. సావిత్రివ్రతం, నటసావిత్రివ్రతం, మంగళ గౌరీవ్రతం, అనంతవ్రతం– ఇలాటి వ్రతాలెన్నో జరుపుతుంటారు మహిళలు. 'వ్రతమే వనితల జీవితం' అనే సామెత వుంది. సంసారమనే మహాక్రతువు నిర్వహించడానికి దైవబలం కావాలి. ఆ బలం వ్రతాల ద్వారా సమకూర్చుకోవాలి – అనే భావం వుంది. ముత్తైదు జీవితం వ్రతాలతో పునీతమవుతుంది. సంతానంకోసం, సౌభాగ్యం కోసం, సంపదకోసం – నాతి కనిపించిన చెట్టుకల్లా మ్రొక్కుతుంది, పుట్టకల్లా మ్రొక్కుతుంది. రాతికి మ్రొక్కుతుంది, జ్యోతికి మ్రొక్కుతుంది. అదే ఆమెకు జీవిత పరమార్థం. మనసారా దేవతా శక్తులకు మ్రొక్కినరోజల్లా చక్కని పండుగ పడతికి.

పండుగలతోపాటు పర్వదినాలు చాలా వుంటాయి. ఆ రోజుకూడా మనస్సులు దేవతాయత్తమైపోతాయి. ఆయా కార్యక్రమాలలో మునిగి ముచ్చట పడుతూ వుంటారు ప్రజలు. కొన్ని పర్వదినాలలో సముద్రస్నానాలు, కొన్నిటిలో నదీస్నానాలు, కొన్నిటిలో ఆలయదర్శనం, కొన్ని పర్వదినాలలో పుట్టలకు చెట్లకు పూజలు జరుపుతూ తమ హృదయాలను ఆయా దేవతలకు అంకితం చేస్తారు. నాగులచవితి మనకు ఎంతో ముఖ్యమైన పండుగ. పన్నగ ప్రభువుకు పుట్టలవద్ద పూజలు చేయడం, ముగ్గులు పెట్టి జ్యోతులు వెలిగించడం, పాటలు పాడడం, ప్రసాదాలు నైవేద్యం పెట్టడం, పాలు పుట్టలో పోసి "ఆరగించు స్వామీ! దయవుంచు స్వామీ" అని ప్రార్థించడం – ఎంతో చక్కటి పండుగ. పరమపురుషునికి పాన్పుగా అమరిన ఆదిశేషుని అర్చించడంలో ఎంతో భక్తి దాగి వుంటుంది.

జల దేవతలు- కుల దేవతలు

ఏటా సముద్రస్నానాలు వస్తాయి. అందులో కొన్ని మహా పర్వదినాలు. ఆనాడు ప్రజలు తండోపతండాలుగా సముద్రతీరానికి చేరి, అక్కడొక చిన్న గ్రామాన్ని సృష్టించి ఆ కడలి గర్జనలు వింటూ, కెరటాల ఉయ్యాలలమీద పండ్లు, పువ్వులు విరజిమ్మి, మంత్రోక్తంగా స్నానాలు చేసి, దక్షిణలు, దానాలు సమర్పించి, దగ్గరలోవున్న ఆలయానికి చేరి ఆ కొలనులో తిరిగి స్నానంచేసి దేవుని అర్చించి, అద్భుతశక్తిని సంతరించుకోవడం పరిపాటి. అర్ధోదయ, మహోదయ సమయాలలో ప్రజలు మరింత భక్తిగా సముద్రస్నానాలు చేస్తారు.

నదులలో స్నానాలు చేయడం మన ఆచారాలలో ముఖ్యమైనది. నదీ తీరాలలో అందువల్లనో ఏమో అనేక దేవాలయాలు వెలసినాయి. అవన్నీ పుణ్యతీర్థాలుగా అవతరించినాయి. నదీమతల్లిని అర్చించి, దేవాలయాలలో పూజలు జరిపి, మనస్సును భక్తిపథంలో పరుగులు తీయించడంకన్న పండుగ ఏం వుంది ! పుష్కర సమయంలో పితృ దేవతల నర్చించడం ఆచారం. నదిలో పిండాలు వేయడం, ఫలపుష్పాలు విరజిమ్మడం వంటి కార్యక్రమాలు మంత్రోక్తంగా జరుపుకొంటూ వుంటారు. ఇవి హృదయాలను స్నిగ్ధం చేసే పండుగలు. ఒక్కొక్కప్పుడు సాగర సంగమాలలో స్నానాలు చేస్తూవుంటారు. అది మరింత పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తారు.

చాలామంది కులదేవతారాధన అతిముఖ్యమైన పండుగ. ఇళ్లలో ఏ శుభకార్యాలు చేసినా కులదేవతలకు ముందుగా మ్రొక్కాలి. ఆయా దేవతల ననుసరించి ఆరాధనలు వేరు వేరుగా వుంటాయి. వారిని సంతృప్తిపరచడం ద్వారా స్వాంతాలను సరిదిద్దుకొంటూ వుంటారు. ఆపద సమయాలలో ఆ దేవతలకు మ్రొక్కుకోవడం – వారి దయవల్ల అవి తొలగిపోవడం సంభవిస్తుంది. ఆపదలు తొలగడం కంటె పండుగ ఏం వుంటుంది! అందువల్ల ఆ దేవతల్ని మ్రొక్కులు తీర్చుకోవడంలో ముమ్మరమైన భక్తి భావన గోచరిస్తుంది.

వీరుగాక ప్రతిచోటా గ్రామదేవతలుంటారు. ఈ దేవతల పండుగలు ఒక్క గ్రామాలలోనే కాకుండా పట్టణాలలో, నగరాలలో కూడా జరుగుతూ వుంటాయి. ఈ పండుగలలో కొన్ని ప్రాచీన సంప్రదాయాలుంటాయి. వీటిద్వారా ఎంతో శాంతి లభిస్తుంది సామాన్య ప్రజానీకానికి.

మనస్సులు నిండితే కలకాలం పండుగ

"మనస్సులు నిండుగావుంటే పండుగలకు కరువేమిటి?" అనే సామెత వుంది. కనక మనస్సులను పండించుకోవడానికి అలంబనగా కొన్ని పండుగలను గృహస్థులు ఏర్పాటు చేసుకొన్నారు. పెళ్లిళ్లు, ఉపనయనాలు వగైరాలు ఎంతో గొప్పగా చేయడం అలవాటు. పురుళ్లు, బారసాలలు,

సీమంతాలు ఆనందంతో చేసే పండుగలు. పుత్రోత్సవం గొప్ప పండుగ అంటారు. అలాగే పుత్రికా జననాలు, వారికి నామకరణాలు– జీవిత మహోత్సవాలుగా జరుపుకొంటారు.

పిల్లలపరంగా చేసే పండుగలెన్నోవున్నాయి. అడుగులకు అరిసెలు, పలుకులకు చిలకలు, గడపదాటితే గారెలు– తర్వాత కేశఖండన, అక్షరాభ్యాసం– ఇవన్నీ, నలుగురు సంతానంగల సంసారాల్లో ఇలాటి నవ్వుల పండుగలెన్నో తొంగిచూచి, గుండెల్లో నవ్వులు గిలకరిస్తాయి.

మనసు ఉయ్యాలా - మమత ఉయ్యాలా

ఆడపిల్లలకు ప్రత్యేకించి అట్ల తద్దెలు, ఉండ్రాళ్ల తద్దెలు ఏర్పాటుచేశారు. ఆ రోజు తెల్లవారుఝాముున లేవడం స్నానాలు చేసి, చక్కగా అలంకరించుకొని తెల్లవారకముందే విందులు కుడిచి వినూత్న భావాలు సంతరించుకొని ఎంతో స్వేచ్ఛతో సంచరించడం, సంతోషాన్ని పంచుకోవడం జరుగుతూవుంటుంది. ఊగే మనస్సులకు దోహదంగా వుయ్యాలలూగుతూ వుంటారు. చెరువుగట్టునో, ఊరి మధ్యతోటలోనో ఉమ్మడి ఉయ్యాలవేసి కన్నెమిన్నలందరూ చేరి కాటుక కంటిచూపులు కలబోసుకుంటూ మనస్సుల్ని వడబోసుకుంటూ ఉయ్యాలలూగడం ఎంతో హృద్యమైన పండుగ. జీవితమంతా అలా సీతాకోకచిలకల్లాగా విహరిస్తే ఎంతబాగుండును– అనిపిస్తుంది. అది అలవిగానిపని గనుక అలా అప్పుడప్పుడు మారిపోయేందుకు పండుగలేర్పడ్డాయి. తోటివారితో కలిసినప్పుడు మనస్సులు ఉయ్యాలలూగుతాయి. మమతలూ ఉయ్యాలలూగుతాయి. దానికి ప్రతీకవారు ఊగే ఉయ్యాల.

పండుగలూ, వ్రతాలూ ఆధ్యాత్మిక జీవనానికి అమరించిన పసిడినిచ్చెనలు. జీవులు ప్రతి నిత్యం యిలాటి నిచ్చెనలెక్కి పై పైకి ప్రాకిపోవడానికి ఆశిస్తూవుంటారు. నిత్యజీవితంలో అలాటి ఆశయాలు సిద్ధించే అవకాశాలు తక్కువ. పండుగలు ఆ దివ్య జీవనాన్ని జ్ఞాపకం చేస్తాయి; తగినంత జ్ఞానబోధచేస్తాయి.

పండుగ అనగానే గృహాన్ని, దేహాల్ని చక్కగా అలంకరించుకొనే అవకాశం ఏర్పడుతుంది. ఆనాడు దేవతలు నట్టింట అడుగుపెడతారని అభిప్రాయం. గృహాలు అలంకరించివుంటే వారు ఆనందించి కొంచెం నిలబడి తీరుబడిగా దీవించివెడతారని విశ్వాసం.

ఇంటింటా చిలకల గుంపులు

పండుగ సందర్భాలలో, ఇదివరకే చెప్పినట్లు, గృహాలు ఎంతో చక్కగా అలంకరించబడతాయి. 'నిత్యకల్యాణం పచ్చతోరణం" అనే సామెతకు ఉదాహరణగా నిలుస్తాయి. గృహంలో వారు చిలకల గుంపులాగా ఎగిరిపోతూవుంటారు. ఆటలు, పాటలు, విందులు, వేళాకోళాలు, విహారాలు, సహకారభావనలు ఎన్నో తొంగిచూస్తూ వుంటాయి ప్రతి గృహంలో.

అన్ని పండుగలు అలాగే వున్నా సంక్రాంతి పండుగలో ప్రత్యేకత వుంది. పంటల కాలంలో వచ్చే పండుగ గనుక మనస్సులు ఎంతో ఆనందంగా ఉండటం సహజం. ఆ సంబరంలో ఇంటిని అలంకరించడంలో ఎంతో నేర్పూ తీర్పూ కనిపిస్తుంది. ఇళ్లకు ఎన్నాళ్లు ముందుగానో వెల్లవేస్తారు. మసిపట్టిన వంటిళ్లను కూడా గీకిగీకి సున్నంవేసి వెలుగులోకి తెస్తారు. ఇళ్ల ప్రహరీలకు కూడా వెల్లవేయడం, లేదా చిలును కొట్టడం జరుగుతుంది. అంతేకాదు పశువుల కొట్టాలను, ధాన్యపు గిడ్డంగులను కొందరు కోళ్ల గుడిసెలను కూడా చిలునుకొడతారు. అంటే ఇంట్లో ఏ భాగం కూడా మామూలుగా వుండకూడదని వారి అభిప్రాయం.

గుమ్మాలకు, కిటికీలకు, కొన్ని సందర్భాలలో దూలాలకూ జేగుర్లు పూస్తారు. గడపలకు, పసుపు కుంకుమలు పెడతారు. వాకిళ్లలో రంగవల్లులు అలంకరిస్తారు.

ధనుర్మాసం నెలరోజులు నడుస్తుంది. ఆ నెలరోజులూ ముంగిట రంగవల్లులు అలంకరిస్తారు. వాటిలో గొబ్బెమ్మలు, వాటిలో రకరకాల పువ్వులు వాటిని ముగ్గులలో చేర్చి సంతోషంతో గంతులు వేసే ఆడపిల్లల ముసిముసినవ్వులు. భోగి పండుగనాడు అభ్యంగన స్నానాలు క్రొత్త దుస్తులు, వంటి నిండా నగలు, అవి అందించే నవ్వులు. ఈ అన్నిటిలో అమరులుగా మారిపోతారు ప్రతి ఇంట్లో సభ్యులు.

ప్రతి ఇంటికి ఆడపడుచులూ అల్లుళ్లూ ఆహ్వానింపబడతారు. అల్లుళ్లకు రాజసత్కారాలు, కూతుళ్లకు చనువుతో నిండిన సత్కారాలు, బావమరదళ్ల సరసాలు, ముసలిదంపతుల చమత్కార సంభాషణలు. అసలు ప్రతివారూ ఆనందంతో గంతులు వేస్తూవుంటారు. అనుకోని హాస్యాలు వెల్లివిరుస్తాయి అందరి పెదవులనుంచీ. రకరకాల పిండివంటలూ, వడ్డనలలో కూడా ఎంతో అలంకారం అందం, వయ్యారం "నవ్వులతో బువ్వలు" అనే పల్లెటూరి సామెత సార్థక మవుతుంది పండుగ రోజుల్లో.

పూలదీవులు-పుష్పాడి నావలు

మరో విశేషమేమంటే– పండుగ దినాల్లో తాము ఆరగించి ఆనందించడంతోనే తృప్తిపడకుండా –ఇతరులకు కూడా దానధర్మాలు చెయ్యడం జరగుతుంది. తెల్లవారిలేచినప్పటినుంచి అనేక మంది భిక్షుకులు వస్తారు వాకిట్లోకి. కొందరు చక్కని పాటలు పాడతారు. కొందరు దీవన లందిస్తారు. కొందరు ఇంటిని ఆలయంగా, ఇంట్లోవాళ్లను దేవతలుగా పోల్చి పొగిడిపోతూ వుంటారు. ఎక్కడ చూచినా సిరి, చిరునవ్వులు.

నిజానికి పండుగలు పూలదీవులు– ఆ సంబరాన్ని అందుకొనే ప్రజలు పుష్పాడి నావలు.

(తెలుగు వాణి నుండి)

మండలి వెంకట కృష్ణారావు

తెలుగువారు : సహనం-సహజీవనం

కాశ్మీరంనుంచి కన్యాకుమారి దాకా ఉన్న భారతదేశం మొత్త ఒక పూల తోట. రంగురంగులపూలు, పెద్దవీ, చిన్నవీ రకరకాల తావులు విరజిమ్మేవి ఈ తోటకు శోభనిస్తున్నాయి. మొత్తం దృశ్యంలోనూ సౌరభంలోను వ్యవస్థలోనూ కలిసి మెలిసిఉండి పరిపూర్ణతను ఇస్తున్న అన్ని జాతులలోను ఏ జాతికి ఆ జాతికి ప్రత్యేకత ఉంది, అట్లా ఉన్న విశిష్టత, వైవిధ్యం సమగ్రతకు దోహదం చేసేవే కాని భంగంకలిగించేవి కావు. అందుచేత ఏదో ఒక రకం పూలనుగూర్చి వాటి తావిని గూర్చి, వాటి రామణీయకతను గూర్చి ప్రశంసాపూర్వకంగా చెప్పుకోవటం తప్పుకాదు.

అనాదికాలంనుంచి తెలుగువారికి భారతేతిహాసంలో ఒక ప్రత్యేకత ఉంది. భౌగోళికంగా ఉత్తర దక్షిణాపథాలకు మధ్యస్థంగా ఉన్నందున తెలుగువారిలో ఆ రెండు ప్రాంతాల సంస్కృతులు, నాగరికతలు చక్కగా మేళనం పొందినాయి. ఉభయదృక్పథాలపట్ల సానుభూతి, సదవగాహనగల తెలుగువారు ఆ విధంగా దేశసమైక్యతలో ప్రధానపాత్ర వహించగలిగారు.

తెలుగువారి విశిష్టతనుగురించి చెప్పుకొనేటప్పుడు మొట్టమొదటగా చెప్పుకోవలసిన విశేషం వాళ్ళ స్వేచ్ఛాప్రయత్నం. తమ స్వేచ్ఛకు మరొకరు అడ్డుతగిలితే సహించలేని వాళ్ళు కనకనే ఇతరుల స్వేచ్ఛకూ వారు అడ్డురారు. ఆ కారణంగా ఎటువంటి వాతావరణంలోనైనా, పరిసరాలలోనైనా తెలుగువాళ్ళు ఇమిడిపోగలరు. తెలుగువాళ్ళు ఏ ఇతర రాష్ట్రంలోగాని, ఏ ఇతర దేశంలోగాని నివసించవలసి వచ్చినా, అక్కడిపరిస్థితులలో ప్రతికూలత అన్నది లేకుండా చక్కని సహజీవనం సాగిస్తూ ఉండడం ఈనాడు మనం గమనించవచ్చు. అది అనాది నుంచీ వస్తున్నదే. గోదావరీ తీరవాసులయిన తెలుగువారు సముద్రాలు దాటి విదేశాలకు– ముఖ్యంగా ఆగ్నేయ ఆసియా దేశాలకువెళ్ళి రాజ్యాలు స్థాపించారు. ఈ దేశం నుంచి తీసుకొని వెళ్ళిన ఆధ్యాత్మిక, శిల్పాదిశాస్త్ర విజ్ఞానం అక్కడ పంచిపెట్టారు. స్థానిక జీవన విధానంలో ఎంతో పరిణతి తెచ్చారు. చివరకు ఆ ప్రజలతో మమైకంగా కలసిపోయినారు. తెలుగువారి వలస రాజ్యాల స్థాపనవల్ల స్థానికులకు ప్రయోజనం చేకూరిందేగాని కించిత్తు కూడా నష్టం వాటిల్లలేదు. అట్లాగే విజయనగర సామ్రాజ్యం తరువాత మధుర, తంజావూరు మొదలయిన దక్షిణ ప్రాంతాలకు తరలివెళ్ళిన తెలుగువారు గాని, నూరు, నూటయాభై సంవత్సరాల వెనక మారిషస్, దక్షిణ ఆఫ్రికా, మలేసియా మొదలయిన దేశాలకు వెళ్ళి అక్కడి జీవితంలో భాగస్వాములై స్థిరపడిపోయిన తెలుగువారుగాని ఆయా దేశ–రాష్ట్రాల జీవితంలో పడుగు పేకలుగా అల్లుకొని పోయినవారే. వారు నడిపింది, నడిపేది కేవలం శాంతియుత సహజీవనం మాత్రమేకాదు, ప్రయోజనాత్మకమైన సహజీవనం.

తెలుగువారిలో కనబడే మరొక చారిత్రక లక్షణం దృఢ స్వభావం ఇందులో ఎన్నో గుణాలు కలసి

ఉన్నాయి. ఏ పనిగానీ అరకొరలుగా చేయక పోవటం, తాము అనుభవించినా, మరొకరికి పెట్టినా అరమరికలు లేకపోవటం, సాహసం కష్టసహిష్ణుత ఇవన్నీ కలసి ఏర్పడినదే ఆ స్వభావదార్ఢ్యం. ఏదో చిన్న చిన్న లోపాలు ఉండవని కాదు. తెలుగువారికి రామాయణం మీదకంటె భారతం మీదనే మక్కువ ఎక్కువ అన్నమాట అందరికీ తెలిసిందే. తెలుగుదనం మూర్తీభవించిన తిక్కన మహాకవి భారతపాత్రల నన్నిటినీ తెలుగు జనంగానే తీర్చిదిద్దినట్లు విమర్శకులు చెబుతూ వుంటారు. కనుక ఒక విధంగా భారత పాత్రలను చూస్తే తెలుగువారి విశిష్టత అర్థం అవుతుంది. ఆవేశం ఉంది; ఆలోచనా వుంది; పరాక్రమం ఉంది; శాంతమూ ఉంది. మంచితనానికి ఎంతగా ప్రాణమిస్తారో కల్లా కపటాలను అంతగా ఏవగించుకుంటారు.

తెలుగువారిలో ఆచార్యమౌర్ఖ్యంలేదు. మంచిది ఏదివచ్చినా, కొత్తదైనా పాతదైనా ఆదరిస్తారు. వేదమతాన్ని ఆదరించినట్లే, జైన బౌద్ధధర్మాలను ఆదరించారు. ప్రాచీన రాజకుటుంబాలలో రాజు వైదికధర్మాన్ని ఆదరిస్తే రాణి బౌద్ధరామాలను సేవించిన సందర్భాలు ఎన్నో; శైవ, వైష్ణవసంప్రదాయాలను సమానంగా తెలుగుదేశం ఆదరించింది. హరిహరాద్వైత్వాన్ని ప్రబోధించింది. మన సహనానికి మారు పేరు తెలుగు సంస్కృతి. మతాతీతమైన లౌకిక సంప్రదాయాన్నే తెలుగు రాజరికాలు ఆదినుంచీ అనుసరించాయి. శ్రీ కృష్ణదేవరాయల పాలనలో సైన్యంలో ఉన్న మహమ్మదీయుల కోసం మసీదు నిర్మాణం జరిగింది.

విద్యలు, విజ్ఞానం మాట వచ్చినా తెలుగువారిది వీర సంప్రదాయమే. ఆచార్య నాగార్జునులు విద్యారణ్య స్వాములు యావద్భారతానికే విజ్ఞానభిక్షపెట్టిన మహనీయులు. భారత సంస్కృతికే మూలాధారమైన సంస్కృత భాషకు తెలుగువారు చేసిన సేవ అపారం. కత్తిపట్టి కదనరంగంలోదూకి పాటలీపుత్రం దాకా తెలుగు బావుటా ప్రభలు వ్యాపింప జేస్తే శిల్ప, చిత్రకళలలో, వేద వేదాంగ విజ్ఞానంలో తెలుగుకీర్తిని దేశాంతరాల దాకా పాకించారు. అమరావతీ, నాగార్జున కొండ విద్యాకేంద్రాలు విదేశీయులను సైతం ఆకర్షించినవి.

తెలుగువారి రాజనీతి కూడా అపారమైనది. ఆత్మగౌరవం కోసం, పట్టుదలల కోసం రాజ్యస్థాపనచేసి చిన్న చిన్న రాజ్యాలను ఎంతగట్టిగా పరిపాలించారో, అంత సులువుగానూ, దేశ శ్రేయస్సు దృష్ట్యా ఒకే ఒక్క సార్వభౌమాధికారాన్ని ఆమోదించి కలిసి పోగలిగారు. "ధర్మాన్ని మనం రక్షిస్తే, ధర్మం మనలను రక్షిస్తుంది" అనే సిద్ధాంతమే తెలుగు రాజ్యాలను, సామ్రాజ్యాలను నడిపిన మూల తంత్రం. సాహిత్యాన్ని, భాషను లలితకళలను పోషించటమే రాజ్యాన్ని పాలించటంకన్నా గొప్ప విషయం అన్న సూత్రాన్ని వారు దృఢంగా అనుసరించారు.

తెలుగు జన సామాన్యానికి పాపభీతి, దైవభక్తి ఎక్కువ. అనురక్తి ఎంత ఎక్కువో విరక్తి అంత ఎక్కువే. ఎంతటి ఆవేశపరులో అంతటి అల్పసంతోషులు. తెలుగువారి మనస్సుల్లో వికాసమూ ఎక్కువే. వైశాల్యం ఎక్కువే. ఇతరులలో దోషం కొంచెం కన్పించినా ఎట్లా తెగనాడగలడో, తనలో దోషం ఉన్నా అట్లా ఒప్పుకోగలడు తెలుగు మనస్వి.

తెలుగుతల్లి తన బిడ్డలకు ఎంతో అమూల్యమైన సిరిసంపదలను ప్రసాదించింది. పుష్కలమైన జలం, జవసత్వాలున్న సారవంతమైన భూములు ఇచ్చింది. తెలుగువాడు కష్టించి పనిచేయడం నేర్చినవాడు, జన్మతః కృషీవలుడు, ధీరోదాత్తత, ధీరలాలిత్యం కలిసి రంగరించిన మూర్తి. సౌమనస్యం, సౌజన్యం ఉన్నవాడు. అనుభవించటం నేర్చినా ఆతిథ్య ధర్మం మరవనివాడు. తెలుగువాడిచేయి భారీచేయి. తెలుగువాడి అంతరంగం అమృతం. ఆ తీరు ఒక్కొక్కప్పుడు వేడిగా, వాడిగా ఉన్నదనిపించినా మనసు మాత్రం సుతిమెత్తనిది.

తెలుగు సంస్కృతి చరిత్ర 25 వందల సంవత్సరాలది. ఇందులో నొచ్చుకోదగిన ఘట్టాలు మృగ్యాలు. మెచ్చుకోవలసినవి, తలఎత్తుకొని 'ఇది నా తెలుగుతనం' అని సగర్వంగా చెప్పుకోవలసినవి అసంఖ్యాకమైనవి.

తెలుగువాడుగా పుట్టటం, తెలుగు మాట్లాడటం మనకు సిద్ధించిన అపురూప వరాలు. ఆ భావంతో తెలుగుతల్లి సేవకు మనం అంకితం కావాలి, 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అని పాడుకుంటూ, ఆ పాడుకొనే వేళ మనమంతా ఒక్కొక్కరం ఆ దండలోని మల్లెపువ్వులు కావాలని ఆకాంక్షిస్తూ, ప్రతి తెలుగు ఉగాదికీ పండుగలు చేసుకొందాం (1976).

(తెలుగు తేజం)

వంశీన్ వంచి మృణాళమున్ మెలిచి పక్వద్రాక్ష నెండించి వా
గంశల్ మార్దవ మాధురీ సుభగ విన్యాసంబు జిల్కన్, దశ
త్రింశల్లక్ష జనప్రసన్న రసనా దేవాలయాభ్యంతర
ప్రాంశు ప్రార్థన గీతమైన తెనుగుంబల్కున్ ప్రశంసించెదన్

– రాయప్రోలు సుబ్బారావు

త్రిపురనేని గోపీచంద్

ఆంధ్రుల జాడ్యం

ఆంధ్రులకు తమను నిందించుకోవటం, ఇతరులను పొగడటం అనే నూతన జాడ్యం ఒకటి అంకురించింది. ఆవడ దగ్గరనుంచీ ఏ అరవవాడో చెయ్యాలి, మనం తినాలి అనే స్థితిలోకి దిగింది మన సంగతి. ఈ దారి పరకాయ ప్రవేశానికి తీసుకొని పోతుంది అని ఎవ్వరైనా గొణిగితే, రాష్ట్రాభిమానం 'దురాభిమానం' అనే అంతర్జాతీయ మొహాలు వేస్తున్నాం. అంతర్జాతీయతను- దుర్బలత్వాన్నీ, సోమరితనాన్నీ నిస్సహాయతనూ కప్పిపుచ్చే ముసుగుగా వాడుకొంటున్నాం.

మనలో ఫలానివాడు ఎవర్నయినా విమర్శిస్తే, వెంటనే ఒక మూలనుంచీ ఒక పెద్దమనిషి లేచి, "ఎంతపని చేశాడు! ఎంత ఘోరం చేశాడు!" అని ముక్కుమీద వేలు వేసుకోవటమో, వీడి విమర్శలను ఖండ ఖండాలుగా చేస్తానని కలం తీసుకోవటమో చేస్తాడు. ఒక ప్రక్క ఫలాని వాణ్ణి యీ విధంగా విమర్శిస్తూనే మరొక ప్రక్క ఆ ఫలానివాడు ఎవ్వర్నో విమర్శించినందుకు కారాలు - లేకపోతే మిరియాలు- నూరుతాడు. అతన్ని విమర్శించటానికి తనకెంత హక్కువుందో, ఇతరులను విమర్శించటానికి అతడికీ అంత హక్కు వుందని ఆలోచించడు.

ప్రతి ఆంధ్రుడూ యీ పని చేస్తూనే వుంటాడు. ఒకడు కలంతో విమర్శిస్తే, ఒకడు నోటితో విమర్శిస్తాడు. ఒకడు కరము మంచిగా విమర్శిస్తే, ఒకడు 'బేవారసు'గా విమర్శిస్తాడు. ఒకడు దేశ శ్రేయస్సుకు విమర్శిస్తే, ఒకడు ఉదర ప్రక్షాళనకు విమర్శిస్తాడు. ఇక్కడ గుణం ప్రధానం గనక - రసం కాదు- ప్రతి ఆంధ్రుడూ యీ పని యేదో ఒక విధంగా చేస్తూనే ఉంటాడు.

ఈ విమర్శక గుణం ఆంధ్రులకు పట్టుబడటానికి కారణమేమిటి? ఇతర దేశాల్లో యింతగాలేని యీ మర్యాద మనకు ఏ ఊదరవల్ల వచ్చింది.

ఆంధ్రుల్లో ఉద్రేకం, ఓర్వలేనితనం ఎక్కువని కొందరంటారు. అందువల్లనే బహునాయకత్వంలో ఏదో మోసిపోతుందని గోలపెడతారు. పైకి వెళ్ళేవాణ్ణి కిందకు గుంజే ఆచారమేగాని, చేతికి అందినవరకు ఊతం యివ్వరని విచారపడతారు. ప్రతి ఆంధ్రుడూ ఇలాగే మాట్లాడతాడు. ఇక యీ గుంజేవాడెవ్వడో? "................" కాబోలు !

ఇంతకూ మనలో వున్న దుర్గుణం ఏమిటి? ఆ దుర్గుణానికి దోహదమిస్తున్న పరిస్థితులు ఏవి? అని యెవ్వరూ ఆలోచించడం లేదు. ఎవ్వరికి వాళ్లు వేదకాలంనాటి ముత్తయిదులమేననీ, ఎవ్వడో ఒకడు ఇదంతా చేసి మన దేశాన్ని మురికి గుంటలోకి లాగుతున్నాడనీ - అన్నట్లు నటిస్తున్నాం.

ఈ పై లక్షణాలన్నిటికీ విమర్శకజ్ఞానమే మూలకారణమనుకుంటాను. మనకీ లక్షణం ఏ గాలికి వచ్చింది?

మనదేశంలో బలమైన మధ్యతరగతి ఉండటమే దీనికి కారణం. ఈ మధ్యతరగతి ఉండటం వల్ల మేధశ్శక్తిలో కూడా క్రమేణా సమానత్వం కొంతవరకు ఏర్పడుతుంది.

దీనివల్ల విమర్శక జ్ఞానం అలవడుతుంది. విమర్శించడానికి దుర్బలులనూ, అనారోగ్యులనూ, ఈర్ష్య ప్రేరేపిస్తే శక్తిమంతులను సంఘ శ్రేయస్సు ప్రేరేపిస్తుంది.

ఒక సంఘానికిగానీ, ఒక దేశానికిగానీ, విమర్శలేకపోతే జీవమే లేనట్లు. అటువంటి గుణం మనకున్నప్పుడు సిగ్గుపడటం ఎందుకు? విచారపడటం ఎందుకు? "ఆ శక్తిని దుర్వినియోగం చేస్తున్నాం; మన తెలివితేటలు తప్పుదారిని పడుతున్నాయి" అంటారా? అయితే మంచి దారిలోకి తిప్పటానికి ప్రయత్నించాలిగాని హేళనలతో, చీవాట్లతో, విసుగుదలతో ఆ గుణాన్ని చంపటానికి ప్రయత్నించగూడదు.

బహు నాయకత్వం ఉండటం వల్ల మన దేశానికి తీరని నష్టం ఏమీ లేదు. ఉన్నా మధ్యతరగతి మన దేశంలో ఉన్నంత కాలం– ఇది ఇప్పట్లో పోదు1 తప్పనిసరి అవుతుంది. ఈ విషయాన్ని రగడలోకి దింపి, నేరాన్ని ఎవ్వరి మీదోమోపి, పెదవి విరుపులతో కాలం వృథాపుచ్చేదానికన్నా, "ఆత్మ" పరీక్ష చేసుకొని, మన కౌశలాన్ని సత్క్రమ మార్గాలలో పెట్టుకోటానికి, మన దృష్టిని దోషభూయిష్టం చేసుకోకుండా ఉండటానికి ప్రయత్నించటం శరీరానికీ, దేశానికీ మంచిది.

(1ఆంధ్రదేశంలో రైతువారీ పద్ధతి ఆచరణలో వుండటం వల్ల మధ్యతరగతి ఏర్పడింది. ప్రజాస్వామిక విప్లవం జరిగితే గాని, ఈ కేపిటలిజం వృద్ధి చెందితేగాని యీ తరగతి పోదు. ఈ విషయం మనల్ని మనం విమర్శించుకునే ముందు జ్ఞాపకం ఉంచుకోవాలి.)

కదలవోయ్ ఆంధ్ర కుమారా!
నిద్రవదలవోయ్ నవయుగం
నిర్మింప సాగవోయ్
కదలవోయ్ ఆంధ్రకుమారా!
అదిగదిగో రేయిపోయి
వేగుచుక్క వెలిగెనోయ్
సుదూరాన విశాలాంధ్ర
విజయవాణి పిలిచెనోయ్ ॥క॥

ధనగర్వం తగదనీ
కుటిలత్వం చెరుపనీ
జనులంతా ఒకటనీ
జగమంతా చాటవోయ్ ॥క॥

వరద లెన్ని వచ్చినా
కరువు లెంత హెచ్చినా
నిలిచి నిగ్రహించవోయ్
నీధైర్యం విడువకోయ్ ॥క॥

కారుమొగిలు బారుకొసల
కాంతిరేఖ చూడవోయ్
కలహాలను విస్మరించి
శాంతిగీతి పాడవోయ్ ॥క॥

– 'శ్రీశ్రీ'

శ్రీ శ్రీ

తెలుగుతనం

తెలుగు విమర్శకుడికి తిట్టడంలో ఉన్న ప్రజ్ఞ మెచ్చుకోవడంలో లేదు. వేలెడంతేసి వాడు జానెడంతేసి వాణ్ణి చూసి, మూరడంతేసి వాళ్ళున్నారు లేవోయ్ అంటాడు. తెలుగు విమర్శకుడనేమిటి? తెలుగువాడన్న ప్రతీవాడికీ ఉన్న గుణమే అది. సినిమాకు వెళ్ళి ఈసడిస్తాడు. విందుకు వెళ్లి వెక్కిరిస్తాడు. కావ్యం చదివి కరవ్వొస్తాడు.

తెలుగులో సరియైన విమర్శ ప్రామాణ్యాలు లేకపోవడమే ఇందుకు కారణమనుకుంటాను. గొర్రెల్ని తినేవాడెప్పుడూ ఉంటూనే ఉంటాడు. కాని కోళ్ళని తినేవాణ్ణి మెచ్చుకోనక్కరలేదన్నదే ఇతని వాదం అనవచ్చును. తెలుగు వాళ్ళలో పైకి వచ్చిన వాళ్ళంతా పైకి పోయిన వాళ్ళే.

అయితే తెలుగువాడిలో ఒక దుర్మార్గం మాత్రం లేదు. ఏదో ఒక కసి మనస్సులో పెట్టుకొని ఎవరినీ ఇతగాడు తిట్టడు. కేవలం ఈ పనిని నిష్కామకర్మగానే నిర్వహిస్తాడు. దుమ్మెత్తి పొయ్యడం తెలుగువాడికి (ఇంగ్లీషులో చెప్పాలంటే) "ద్వితీయ ప్రకృతి".

ఫలానా కవి చాలా మంచి పద్యాలు రాస్తాడని నువ్వంటే, వెంటనే మన తెలుగువాడు పోనిద్దూ, వాడూ ఒక కవేనా అంటాడు. జాగ్రత్తగా గమనించాలి. ఈ మన తెలుగువాడు ఏదో ఒక ఆఫీసులో పనిచేసుకుంటూ ఉంటాడు. కవిత్వం జోలికెప్పుడూ వెళ్ళిన పాపాన పోయి ఉండడు. కాని తన అమూల్యాభిప్రాయాన్ని మాత్రం జంకూ గొంకూ లేకుండా వెల్లడించి తీరుతాడు.

నాకు తీరుబాటంటూ లేకపోతోంది గాని లేకపోతేనా దాని తాతలాంటి కావ్యం రాసి పారేద్దును అనే అభిప్రాయం అతని మనస్సులో ఎక్కడో అట్టడుగున పొడుస్తూనే ఉంటుంది. కాని ఆ మాట మాత్రం ఎప్పుడు పైకి అనడు. అలాగే మన ఆంధ్రుడు తనకు తీరుబాటంటూ దొరికితే ఎన్నో చలన చిత్రాలు తయారు చేసేవాడు. అనవసరంగా గుజరాతీ వాళ్ళతో పోటీ ఎందుకని పరిశ్రమ జోలికి పోలేదు. లేకపోతేనా? తాను ప్రారంభించినవే కదా పరిశ్రమలన్నీ – తీరుబాటు లేక ఆంధ్రేతరులకు అప్పగించేశాడు గాని.

ఇదో చిత్రం. తెలుగువాడు తానే అన్ని ఉద్యమాలనూ ప్రారంభించానని చాటుకుంటాడు. ప్రారంభం తనదయితే చాలు, అది తక్షణం ఆగిపోయినా బెంగలేదు మనవాడికి. మొదటి చలన చిత్రం, మొట్ట మొదటి ప్రత్యేక రాష్ట్రాందోళన, ప్రజల భాష కోసం మొదట ఘోష పెట్టడం, ప్రప్రథమంలో సూటు తొడిగిన ఆంధ్రుడు– ముమ్ముందుగా ఆటంబాంబును నేనే కనిపెట్టానని నేడో రేపో ఎవడైనా ఆంధ్రుడు స్టేట్‌మెంట్ ఇస్తే నాకేమీ ఆశ్చర్యమనిపించదు.

స్పర్థకు బదులు సహకారం, అహంకారానికి బదులు ఆత్మనిగ్రహం, వైముఖ్యానికి బదులు సాముఖ్యం ఇవీ మనకు కావలసినవి. ఆంధ్రదేశంలోని అగ్రనాయకులలో వీటిని సకృత్తుగా చూశాము. యువకుల తరంలోనైనా ఇవి సమృద్ధిగా వికసిస్తే ఆంధ్రదేశంలో ప్రజాజీవితం ఫలిస్తుందని చెప్పుకోవచ్చు.

డాక్టర్ పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి

ఆంధ్ర దార్శనికులు

భారతీయ దర్శనములు అతిప్రాచీన కాలములోనే బయలుదేరినవి. వైదిక సూక్తాలలో కన్పించే తత్త్వజిజ్ఞాస ఉపనిషత్తులనాటికి సరియైన మార్గమును చేబట్టినది. ఈ రోజులలో వేదాంతదర్శనముతోబాటు సాంఖ్య, యోగములు, పూర్వ మీమాంసకూడ తలలెత్తి నట్టున్నది. ఇంతేగాక తర్వాతవచ్చిన బౌద్ధులు ప్రవచించిన అనాత్మతా వాదముకూడా కఠాది ఉపనిషత్తులలో చూచాయగా ప్రస్తుతించబడినది. ఈ ఉపనిషత్తులలో ప్రస్ఫుటంగా కనిపించే వేదాంత సంప్రదాయం కొంత కాలానికి ఏమైనదోగాని, గౌడ పాదాచార్యుల కాలందాకా మళ్ళీకన్పించదు. ఎవరో వృత్తి కారాదులువచ్చి బ్రహ్మసూత్రాలను వ్యాఖ్యానించారని తెలుస్తుందిగాని, వారంతా గౌడ పాదుల సమకాలికులే అయి ఉంటారు. ఉపనిషత్తులలో ప్రధానమైనవి వచ్చిన తర్వాత, గౌడ పాదుల కారికలు వచ్చేదాకా బ్రహ్మమీమాంసా చరిత్ర ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం కావాలి.

క్రీ.పూ. 630లో జన్మించి క్రీ.పూ. 550లో నిర్వాణమునందిన గౌతమబుద్ధునితో బౌద్ధమతమువచ్చింది. మొట్ట మొదటి బౌద్ధులు అనాత్మవాదులు. జీవుడు లేడనిచెప్పేపుద్గల నైరాత్మ్యవాదము వీరిది. వీరు హీనయానికులని, సర్వాస్తివాదులని తర్వాత పిలువబడినారు. బుద్ధ నిర్వాణమైన నూరేండ్లకు ఆంధ్రదేశంలో, ముఖ్యంగా ధాన్యకటక ప్రాంతంలో, మహాసంఘికులనేవారు బయలుదేరినారు. వీరు మహాయాన బౌద్ధమతమునకు దారితీశారు. ఈ ఆంధ్ర మహాసంఘికులవద్ద మొట్ట మొదటి ప్రజ్ఞాపారమితా సూత్రములు బయలు దేరినవి. ఇవి మహాపద్మనందుని కాలానికే వీరివద్ద ఉన్నవని, బోట దేశీయుడగు తారానాథుడన్నాడు. పైగా అష్టసాహస్రికా ప్రజ్ఞాపారమితలో ఈ మహాయాన సూత్రములు దక్షిణ దేశములోనే ఉద్భవించగలవనికూడా చెప్పబడినది. మన పూర్వులైన ఆంధ్రులు, మహాసంఘికులనే పేరుతో మహాయానబౌద్ధమును లేవదీయుటయేగాక, మహాయాన దర్శనానికిచెందిన సూత్రాలనుగూడా రచించినారని దీనివలన స్పష్టమౌతున్నది. ఉపనిషత్తులతర్వాత తీవ్రమైన దర్శనజిజ్ఞాస, తత్త్వాన్వేషణ ఆంధ్రదేశములోనే తలయెత్తినది.

మహాయానికుల ప్రమాణ గ్రంథాలను ప్రజ్ఞాపారమితలని అంటారు. జ్ఞానముయొక్క లోతుకుకొనిపోయి, జ్ఞానస్వభావమును తెలిపి, జ్ఞానానుభూతిని తెచ్చేది ప్రజ్ఞాపారమిత. జ్ఞానమే తత్త్వము. మిగిలినదంతా కేవలము ప్రతిభాసించే వ్యవహారసత్యము. ఈ వ్యవహారికసత్యము సాపేక్షికము, అన్యాశ్రితమునగుటచేత, దీనిని స్వస్వభావశూన్యమన్నారు. దానితో సాపేక్షికమైన జగమంతా శూన్యమైనది. జగమునకు ఆధారభూతాలైన ధర్మాలన్నీ శూన్యంకావటంచేత, వీరు ధర్మనైరాత్మ్యవాదాన్ని ప్రవచించినారు. జీవనైరాత్మ్యము, ధర్మనైరాత్మ్యము అనేవి రెండూ కూడా యాజ్ఞవల్క్యుని వాక్కులలో

ఉపనిషత్కాలానికే మనకు కన్పించుచున్నవి. ఉపనిషత్తులలో "ద్వేవిద్యే" అని పరాపర విద్యలు చెప్పబడినవి. ఛాందోగ్యములో పరిణామవాదము, బృహదారణ్యకములో వివర్తవాదము కన్పించుతవి. రెండు విధాల సత్యాలున్నవని, బ్రహ్మాత్మీభావమే పరమ పురుషార్థమని ఉపనిషత్తులన్నవి. ఇట్లే పారమితలలో రెండు సత్యాలున్నవని, శూన్యావగతియే లక్ష్యమని, ప్రజ్ఞాపారమితాచర్య ద్వారా నిర్వాణము సంప్రాప్తమగునని చెప్పబడినది. దీనినిబట్టి వేదాంత సంప్రదాయము మహా సంఘికులచే పారమితా రూపంలో ఆంధ్రదేశములో పునరుజ్జీవితమైనదని తేలుచున్నది.

మహాయాన బౌద్ధులు, అద్వైత వేదాంతులు శత్రువులుగా ఎప్పుడూ ఒకరినొకరు భావించలేదు. పైగా ఉపనిషత్సంప్రదాయము తెలిసి కొనజాలనివారు మాత్రము అద్వైతులను ప్రచ్ఛన్నబౌద్ధులని దూషించితిమనుకున్నారు. వాస్తవంగా అద్వైతులకు, మహాయానబౌద్ధులకు ఒకేఒక అధారమున్నది. మహాయానికులు విజ్ఞానాస్తిత్వ వాదమును, శూన్యవాదమును లేవదీసినారు. విజ్ఞానము క్షణికమని, విజ్ఞానమే సత్యమని, బాహ్య జగత్తును ఆలంబనముగా విజ్ఞానము గ్రహించనక్కరలేదని చెప్పువారు విజ్ఞానవాదులు. వీరే యోగాచారులు. విజ్ఞానము క్షణికము కాదని చెప్పువారు అద్వైత వేదాంతులు. వ్యావహారిక జగము సాపేక్షికమని, స్వభావశూన్యమని, తత్త్వము నిష్ప్రపంచము, అనిర్వాచ్యము, నిర్వికారమునని చెప్పు శూన్య వాదులు మధ్యమకులు. ఈ రెండు బౌద్ధవాదములు అద్వయవాదములే. ఈ రెంటికి సమన్వయము కుదర్చనెంచినవారిలో ప్రప్రథముడుగా గౌడపాదుని గ్రహించవీలున్నది.

ఆంధ్రదేశమున బయలు దేరిన మహాసంఘికులకు కేంద్రస్థానము ధాన్యకటకము, నాగార్జున కొండ ప్రాంతము. ఈ ప్రాంతములో జన్మించి, మహాచార్యుడైన బోధిసత్త్వ నాగార్జునుడు, ఆయన శిష్యుడు ఆర్యదేవుడు ఆంధ్రులే. నాగార్జునుని గురువగు సరహ లేక సరోరుహ భద్రుడు ధాన్యకటకములోనుండి సుఖావతియను దివ్యభూమిని దివ్యదృష్టితో దర్శించినాడట! తర్వాతి రోజులలో ఆచార్య భావవివేకుడనే మధ్యమకదార్శనికుడు ధాన్యకటకములో నివసించినాడు. ఇచట గల అసురప్రాసాదమనే గుహలో మైత్రేయుడనే బోధిసత్త్వుని పునరాగమనానికై నిరీక్షిస్తూ ఉన్నాడని యువాన్‌చ్వాంగ్ కూడా విన్నాడు. మైత్రేయుడుకూడా ఇచటివాడేనని తేలుతుంది. మైత్రేయుడే తర్వాత శంకర భగవత్పాదుల అవతారం దాల్చివచ్చినాడని భోట దేశీయుల సంప్రదాయములో కన్పిస్తుంది.

భావవివేకుని సమకాలికుడగు బుద్ధపాలిత అనే మధ్యమకదార్శనికుడుగూడా ఆంధ్రుడే. ఈయన మన భద్రాచలంప్రాంతం వాడు. అక్కడ ఉన్న సమతటమనే నగరానికి చెందినవాడు ఆచార్య చంద్రకీర్తి. అంటే మధ్యమకవాదంలో కన్పించే ప్రధాన ఆచార్యులందరూ ఆంధ్రులేనని స్పష్టమౌతున్నది.

యోగాచార మతానికి చెందిన మైత్రేయుడు ధాన్యకటకానికి రాగలడనే ఆశయమున్న భావవివేకుడు దాంధ్రుడన్నాము. మైత్రేయుని శిష్యుడు అసంగుడు. ఈయనను అజితుడని, అచింతుడనికూడా పిలిచేవారు. ఈయన నిర్మించినది అచింతపురీవిహారము. దీనినే అజంతా అని నేడు పిలుస్తున్నాము. యోగాచారులలో మహాతార్కికుడు దిఙ్నాగుడు. ఈ దిఙ్నాగుడే జన్మించకపోతే మనతర్కశాస్త్రమే వృద్ధిపొందేదికాదు. ఈయన సింహపురి అనబడిన నెల్లూరులో జన్మించి, వేంగీవద్ద ఉన్న కొండపై నివసించి, అక్కడ తన ప్రమాణ సముచ్చయమును రచించినాడు. ఈయన శిష్యులలో శంకరస్వామి, ఈశ్వర సేనుడు కన్పిస్తారు. కొన్ని ఆధారాలనుబట్టి కుమారిలభట్టు ఈయన వద్ద తర్కశాస్త్రమును అభ్యసించినట్లు చెప్పటానికి వీలున్నది.

ప్రసిద్ధ మీమాంసకుడైన కూమారిలభట్టు ఆంధ్రుడు. మహానదీతీరంలో ఆంధ్రదేశములో జయమంగళమనే గ్రామంలో ఆయన జన్మించి నాడు. ఈయన మేనల్లుడైన ధర్మకీర్తి త్రిమలయమని పిలువబడు శ్రీశైలమునకు చెందినవాడు. ధర్మకీర్తి తార్కికచక్రవర్తి. యోగాచారమును తర్కసహాయముతో సుప్రతిష్ఠితము చేసినాడు. ఈయన వాదన్యాయంలో తెలుగు పదాలు కన్పించుచున్నవి. ప్రసిద్ధ వైయాకరణి, విజ్ఞానవాదియైన జినేంద్రబోధికూడా దిఙ్నాగుడు జన్మించినచోటనే పుట్టినాడని, వేంగిలో నివసించినాడని భోటదేశపు చరిత్రకారులన్నారు.

ఈ వాదాలతోబాటు ధాన్యకటకందగ్గరనే బౌద్ధులలో వజ్రయానం బయలుదేరింది. జ్ఞానోదయమైన పదహారవయేట బుద్ధుడు ధాన్యకటకానికి వచ్చినాడని, అప్పుడాయన అచట వజ్రయానమును లేవదీసి మూడవధర్మచక్రమును ప్రవర్తింపజేసినాడని భోటసంప్రదాయము. ఉద్యానము, ఒడ్డియానము, ఒడియానము, ఒర్గ్యానము, ఉర్గ్యానము, ఉద్యానము అని పలుపలు విధాలుగా పిలువబడ్డ దేశానికి ముఖ్యపట్టణము దాన్యకటకమని, ఇది వజ్రయానికులకు ప్రధానక్షేత్రమని భోటదేశీయుల వ్రాతలున్నవి. ఈ వజ్రయానికు లొకానొకప్పుడున్న ప్రదేశాన్ని నేడు వజ్రాలదిన్నె అని అంటున్నాము. వజ్రమంటే శూన్యత అని అర్థము. ఈ వజ్రమును సాధించినవారు తాంత్రికబౌద్ధులు. వీరి దేవతలలో ఛిన్నమస్తా, చండీ, తారా, సర్వమంగళా మొదలైన తాంత్రిక శక్తిరూపాలు కన్పించుచున్నవి.

బెజవాడలోనున్న కనకదుర్గ ఒకానొకప్పుడు మంజుశ్రీ అనే బోధిసత్త్వుడుగా పూజింపబడిన విగ్రహము. ఇచట తపస్సుచేసిన అర్జునుడే నాగార్జునుడు. నేటి మంగళగిరి మరియొక తాంత్రికశాక్తికి ఆవాసమిచ్చినది. భ్రామరీ శక్తిని శ్రీశైలంలో వీరే నెలకొల్పినారు. తిరుపతిలో సర్వమంగళను కొండక్రింద, బాలా అని పిలువబడే మంజుశ్రీని కొండమీద ప్రతిష్ఠించిన వారు వజ్రయానికులే. ఈ వజ్రయానికులలో మహాచార్యులైన పద్మవజ్ర, అనంగవజ్ర, ఇంద్రవజ్ర, ఇంద్రభూతి మొదలైనవారంతా ధాన్యకటకమువారే. ఇంద్రభూతి ధాన్యకటకాన్ని పాలించినరాజు. ఈయన కుమారుడైన పద్మ సంభవుడు, తన బావమరిదియైన శాంతరక్షితునితో కలసి భోటదేశానికిపోయి, అక్కడ బౌద్ధమతాన్ని లేవదీసినారు. టిబెట్ అనబడే భోటదేశంలో నేడు కన్పించే బౌద్ధమతము ఎనిమిదవ శతాబ్దంలో ఆంధ్రుల ద్వారా వచ్చినమతమే.

తాంత్రిక మధ్యమక సిద్ధాంతాలు రెండు కలసి మెలసి ఆంధ్రదేశంలో వ్యాపించినవి. తర్వాతి రోజులలో ఆంధ్రములో వచ్చిన అద్వైత వేదాంతులు అద్వైతముతోబాటు శాక్తాన్ని కూడా తమ వెంటబెట్టుకొన్నారు. పైగా ఒకనాడు మధ్యమకులకు చెందిన భూముల అద్వైత పీఠాధిపతులకు సంక్రమించినవి. నాగార్జున కొండ ప్రాంతము, శ్రీశైలము పుష్పగిరి పీఠానికి చెందినవి. విద్యారణ్యుడు సహితము శాక్తుడు,

అద్వైతి కూడాను. ఈ విద్యారణ్య సంప్రదాయానికి చెందిన పీఠాధిపతుల కందరకు అద్వైత వేదాంత సంప్రదాయము, శాక్త సంప్రదాయము కూడా రాసాగినవి. మద్గురువర్యులు బ్రహ్మీభూతులునైన శ్రీ జగద్గురు శ్రీ కల్యాణానంద భారతీ మాంతాచార్య మహాస్వాములు ఈ రెండు సంప్రదాయాలను సమన్వయపరచటానికి చేసిన సఫలమైన కృషి అందరకు తెలిసినదే.

ఈ విధంగా మధ్యమక వాదం బాగా ఆంధ్రదేశంలో పాతుకొని పోవటం చేతనే ఆంధ్రదేశంలో అద్వైతమున భామతీ ప్రస్థానానికి ఎక్కువపేరు రాలేదు. ప్రముఖులైన ఆంధ్రదేశపు అద్వైతులందరు వివరణ ప్రస్థానానికి చెందినవారే. మధ్యమక వాదాన్ని ప్రధానంగా గ్రహించి విజ్ఞానాద్వైతమును ప్రపంచించే దర్శనముగా వివరణ ప్రస్థానం కల్పిస్తుంది. ఇట్టి దర్శనానికి ఆంధ్రదేశమే పుట్టిల్లు కావటం చేత అమలానంద, విద్యారణ్య, భారతీతీర్థ, అఖండానంద, అనుభవానంద, చిత్సుఖాది మహాచార్యులు, అద్వైత ప్రబోధకులు ఆంధ్రదేశంలో బయలుదేరినారు. ఇట్టి ఉపనిషత్తులలో కన్పించే అద్వైత వేదాంతానికి, మహాయాన బౌద్ధ మతానికి చక్కని సమన్వయమును కుదర్చవలెనని యత్నించిన ప్రముఖ భారతీయులు, దార్శనికాగ్రేసరులైన శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులుకూడ ఆంధ్రులే కావటంలో సృష్టి వైచిత్ర్యం కన్పిస్తుంది.

(ఆంధ్రప్రదేశ్ అవతరణ సంచిక)

ఏ దేశమేగినా, ఎందుకాలిడిన
ఏ పీఠ మెక్కినా, యెవరెదురయిన
పొగడరా, నీ తల్లి భూమి భారతిని,
నిలుపరా, నీ జాతి నిండు గౌరవము!

నీ పూర్వ పుణ్యమో, ఏ యోగబలమో,
జనియించినాడ వీ స్వర్గ ఖండమున
ఏ మంచి పూవులన్ ప్రేమించినావొ
నినుమోచె, ఈ తల్లికనక గర్భమున!

లేదురా యిటువంటి భూదేవి యెందు,
లేరురా, మనవంటి పౌరు లింకెందు!

సూర్యుని వెలుతురు సోకునందాక,
ఓడల జెండాలు అడునందాక,
నరుడు ప్రాణాలతో నడుచునందాక,
అందాక గల ఈ యనంత భూతలని
మన భూమి వంటి చల్లని భూమి లేదు,

పాడరా నీ తెన్గు బాలగీతములు,
పాడరా నీ వీర భావ భారతము!

తమ తపస్సుల ఋషుల్ ధారబోయంగ
శౌర్యహారము రాజచంద్రు లర్పింప,
రాగదుగ్ధము భక్త రత్నముల్ పిదుక
భావ సూత్రము కవి ప్రభువు లల్లంగ,
దిక్కుల కెగదన్ను తేజమ్ము వెలుగ
జగముల నుగించు మగతనంబెగయ,
రాళ్ళతేనియలూరు రాగాలు సాగ
సౌందర్యమెగబోయు సాహిత్యమలర,
వెలిగిన దీ దివ్య విశ్వము పుత్ర!

అవమానమేలరా, అనుమాన మేల,
భరత పుత్రుండ నంచు భక్తితో బలుక!

– రాయప్రోలు సుబ్బారావు

కుందూరి ఈశ్వరదత్

నవీనాంధ్ర నిర్మాతలు

దాదాభాయి నౌరోజీ నాయకత్వంలో సంపూర్ణ స్వరాజ్యం తన ధ్యేయంగా కాంగ్రెసు సంస్థ ప్రకటించిన నలభై సంవత్సరాల తర్వాత భారత దేశం 1947లో స్వాతంత్ర్యం పొందింది. 1913లో బాపట్లలో శ్రీ బి.యన్. శర్మ అధ్యక్షతన ఆంధ్రపతాకం ఎగురవేసిన నలభై సంవత్సరాల తర్వాత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్ర ప్రాతిపదికపై ప్రథమ ప్రత్యేక రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం యేర్పడింది. ఆంధ్ర ప్రజల చిరకాల వాంఛితం, దీర్ఘ పోరాట ఫలితం అయిన ఆంధ్రరాష్ట్రం 1953లో సిద్ధించింది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆత్మాహుతి చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు తరువాత యితరులు ఆంధ్ర రాజకీయాలలో అగ్రస్థానం పొందటం జరిగింది. నేటి ఆంధ్రప్రదేశ్ కన్నా పురాతనమైనది ఆధునిక ఆంధ్రదేశం. సిద్ధాంత రీత్యా చూస్తే ఆంధ్ర దేశం యింతకంటే గొప్పది, ప్రాముఖ్యత కలది అని చెప్పాలి. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణాన్ని తీర్చి దిద్దిన వారి వలెగాక, ఆధునిక ఆంధ్ర నిర్మాతలు రాజకీయాలకు మాత్రమే పరిమితం కాలేదు. వారు తమ జీవితంలో అనేక రంగాలలో ఆసక్తి కనబర్చి, నిర్మానాత్మక భావుకలుగా పేరు పొందారు. నిజానికి తమ మాటల చేత, చేతలచేత అనేక తరాల ప్రజలను ప్రభావితులను చేసినవారే యీ నిర్మాతల ఉన్నత శ్రేణిలో చేరుతారు.

వీరేశలింగం, వెంకటరత్నం

'భారతదేశ' నవ చైతన్యానికి మూలపురుషుడైన శ్రీ రామమమోహనరాయి దేశానికి ఎటువంటి వాడో, శ్రీకందుకూరి వీరేశలింగం ఆంధ్రదేశానికి అటు వంటివాడు. ఆయన రాజకీయాలతో ఎట్టి సంబంధం పెట్టుకోలేదు, కానీ, ఆయన కాలంలో గాని, ఆయన తర్వాత గాని, ఆయన లాగ సాహిత్యంలో, సాంఘిక సేవలో కొత్త పుంతలు త్రొక్కిన రాజకీయ వాదులెవరూ లేరు. సాహిత్యంలోనూ, సంఘ సంస్కరణలోనూ ప్రజలలో కలిగిన జాగృతికి ఆంధ్ర దేశం ఆయనకు ఋణపడి వున్నది. సాహిత్య వేత్తగా ఆయన తన కలాన్ని కార్యాచరణకు ఆయుధంగా మలచుకొన్నాడు. సాంఘిక సంస్కర్తగా, స్త్రీ జాతి సముద్ధరణకు, వితంతువుల పునరుజ్జీవనానికి, హరిజనుల సంక్షేమానికి ప్రజల అంతరాత్మలను మేలుకొలిపాడు. తన పోరాటాలలో తన అంతరాత్మ, దృఢ నిశ్చయం చూపిన బాటలో నడవడం తప్ప యేయితర సహాయాన్ని ఆర్థించని శ్రీ వీరేశలింగం ఆంధ్రదేశంలో నవశకానికి నాంది పలికి, తన జీవిత కాలాన్ని ఒక నవయుగ నిర్మాణానికి అంకితం చేశాడు.

శ్రీ వీరేశలింగానికి సన్నిహితుడై, ఆయన తర్వాత అంతఖ్యాతిని పొందిన వ్యక్తి శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు. "నాయుడుగారు"గా పది మందికీ పరిచయమైన ఆయన ఆంధ్రదేశంలో

సాంఘిక సమానసత్వానికీ, ఉదారభావాలకూ దారి చూపాడు. శ్రీ వీరేశలింగం తెలుగు పండితుడుగా భావించి ఆంగ్ల భాషలో గోల్డ్‌స్మిత్‌వలె తెలుగులో అందమైన రచనలు చేశాడు గాని ఆయనలో వాగ్ధోరణి లేదు. శ్రీ వెంకట రత్నం నాయుడు ఇంగ్లీషులో మహాపండితుడు. విక్టోరియా రాణి కాలానికి చెందిన గొప్ప వక్తల కోవకు చెందినవాడు. లలిత పదజాలంతో శ్రోతలను ముగ్ధులను చేసేవాడు. ఆకారంలోను, ఉపన్యాస పటనంలో, మానవతా దృక్పథంలో డాక్టర్ జాన్సన్‌ను గుర్తుకు తెచ్చేవాడు. విద్యావేత్తగా, సాంఘిక సంస్కర్తగా జీవిత మంతా కృషి చేసి మద్రాసు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్ష పదవిని పొందగలిగాడు. కొంతకాలం మద్రాసు రాష్ట్ర విధాన పరిషత్తు సభ్యుడుగా కూడా పని చేశాడు. సాంఘిక సేవకి అంకితమైన జీవితం ఆయనది. తన ఉపన్యాస చతురతతోనూ, తన వ్యక్తిగత ఉదాహరణలతోనూ, తనతరం ప్రజల నైతిక విలువలను పెంచిన వ్యక్తిగా ఆయన తన పేరును చరిత్రలో శాశ్వతం చేసుకొన్నాడు.

ఒక పరిశీలకుడు అన్నట్లుగా, 'దక్షిణభారతం లోని మనకు వెలుతురు పంచి యిచ్చిన విజ్ఞానమనే సూర్యునికి శ్రీ వీరేశలింగం, శ్రీ వెంకటరత్నం రెండు నక్షత్రాలుగా ప్రకాశించారు. వీరేశలింగం వీరుడైతే, వెంకటరత్నం మహాజ్ఞాని. ఒకరు సత్ప్రవర్తన అనే ఆశయంతోనూ కృషిపట్ల ఆసక్తితోనూ పనిచేస్తే, రెండవ వారు జ్ఞానభావం ఆదర్శంగానూ, మానవసేవ పట్ల ఆసక్తితోనూ కృషి చేశారు. ఒకరు తోటి మానవుల లోని శక్తులను జాగృతం చేశారు. మరొకరు వారి భావాలకు రూపకల్పన చేశారు. దక్షిణ భారతాన్ని ప్రభావితం చేసిన, భవిష్యత్తులో ప్రభావితం చేయగల ధ్రువతారలువారు.'

సుబ్బారావు పంతులు, రామచంద్రరావు

శ్రీ న్యాయపతి సుబ్బారావు కన్న పితృపాదులు ఆంధ్ర ప్రజలకు మరొకరు లేరు. న్యాయవాదులుగా ప్రసిద్ధి చెందిన ఆంధ్రులలో ఆయన మొదటి వాడు. "హిందూ" పత్రికను స్థాపించిన నలుగురు ప్రముఖులలో ఆయన ఒకడు. అప్పుడు ఆయన వయసు 22 సంవత్సరాలు. ప్రముఖ కాంగ్రెసువాదిగా, 1898లో మద్రాసు కాంగ్రెసు మహాసభ ఆహ్వాన సంఘ అధ్యక్షుడుగా, 1913 నుండి 1917 వరకూ కాంగ్రెసు సాధారణ కార్యదర్శిగా ఆయన పని చేశాడు గాని కాంగ్రెసు అధ్యక్షుడయ్యే అదృష్టం ఆయనకు కలగలేదు. మాంట్‌ఫర్డ్ శకానికి ముందు శాసన సభ్యుడుగా పేరు గడించిన సుబ్బారావు పంతులు, ఇంపీరియల్ శాసన సభలో అతి ప్రముఖ స్థానాన్ని పొందాడు. ఆంధ్ర ఉద్యమ ప్రారంభకులలో ఆయన ఒకడు. చెప్పుకోదగిన అనుభవం, నిశిత పరిశీలనా శక్తి, అద్భుతమైన తెలివి తేటలు కలిగిన ఆయన వయసు మళ్లే కొలది విప్లవ బావాలను పెంచుకొని, మారుతున్న కాలం కంటె ముందర మార్పును కోరుతూ "ఆంధ్రభీష్మ"గా చరిత్రలో తనకొక స్థానాన్ని యేర్పరచు కొన్నాడు.

శ్రీ సుబ్బారావు సమకాలికులలో ఆంధ్ర రాజకీయాలలో ఎక్కువ గౌరవాన్ని పొందిన వ్యక్తి శ్రీ మోచర్ల రామచంద్రరావు, తనకు తగిన గుర్తింపు లభించక పోయినా, తన బదులు శ్రీ బి.యన్. శర్మ, శ్రీ కూర్మా వెంకటరెడ్డి ఆ గుర్తింపును పొందినా, ఆయన వ్యక్తిగత గౌరవంగాని, ప్రతిష్ఠ గాని యేమాత్రం తరిగిపోలేదు. లోపం చూపటానికి వీలులేని మర్యాదతో, గౌరవంతో జీవించిన ఆయనకు వ్యక్తిగతంగా గాని, రాజకీయాల్లోగాని శత్రువులు లేరు, విజ్ఞానంలో ఆయనకు ఆయనేసాటి. దక్షిణ భారతంలో ఇంత నేర్పు కలిగిన శాసన సభ్యుడు, కమిటీ సభ్యుడు, భారతదేశం మొత్తంలో ప్రభుత్వ నియమ నిబంధనలు యింత క్షుణ్ణంగా అర్థం చేసుకొన్న రాజకీయ వాది మరొకరులేరు. పరస్పర విరుద్ధమైన బావాలు కలిగిన మాలవీయా, జిన్నా వంటి ప్రముఖ రాజకీయ వేత్తలు ఆయన మాటకు సమానమైన విలువ యిచ్చేవారు. తన సమకాలికులలో పరిపూర్ణమైన విజ్ఞానిగా, ప్రత్యేక వ్యక్తిత్వం కలవాడుగా ఆయన ఆంధ్ర ప్రజలకు ఎల్లప్పుడూ జ్ఞాపకం వుంటాడు.

పానగల్ రాజా

దక్షిణ భారత దేశంలో ప్రారంభమైన జస్టీస్ పార్టీ వుద్యమం జాతీయ వుద్యమంపై కొన్ని చెడు ప్రభావాలను కలగచేసినా, చరిత్రలో దానికి వున్న స్థానాన్ని కాదనలేము. జస్టిస్ పార్టీ స్థాపకుడు శ్రీ త్యాగరాయ చెట్టి. దానిలో ప్రముఖుడు శ్రీ కూర్మా వెంకట రెడ్డి. కాని వీరిరువురూ పానగల్ రాజాకు గల స్థానాన్ని పొందలేక పోయారు. దౌత్యం నెరపటంలో పానగల్ రాజా సిద్ధహస్తుడు. ఆయన రాజనీతిజ్ఞతలో అద్భుతాలు సాధించాడు. మాంట్‌ఫర్డ్ సంస్కరణల ఫలితంగా పదవికి వచ్చిన ముఖ్య మంత్రులలో ఆయన గణనీయమైన వ్యక్తి. పంజాబు ముఖ్యమంత్రి ఫజల్ హుస్సేన్ మాత్రమే ఆయనతో పోల్చటానికి అర్హుడు. పానగల్ రాజా తన వ్యతిరేకతను ముఖ్యంగా అగ్రవర్ణాలపై ప్రదర్శించినా, బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా భారత ఉద్యమాన్ని నిరంతరం సమర్థిస్తూనే వచ్చాడు. దక్షిణ భారత దేశంలో 97 శాతం ప్రజలు తమ అధిక సంఖ్యాబలాన్ని గుర్తుకు తెచ్చుకొని పరిపాలనా విషయాలలో అంత వరకు వున్న అగ్రవర్ణ ఆధిక్యతను సవాల్ చేయ గలగటానికి పానగల్ రాజా మద్రాసు రాజకీయాలలో పొందిన అగ్రస్థానమే చాలా వరకు కారణమని చెప్పవచ్చు.

హనుమంతరావు, గోపాల కృష్ణయ్య

తమ కాలంలో ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేసిన ఆంధ్రదేశపు ఆదర్శవాదులలో అగ్రగణ్యులు శ్రీ హనుమంతరావు, శ్రీ గోపాల కృష్ణయ్య. అద్భుతమైన ప్రజ్ఞాపాటవాలు కలిగిన వీరిద్దరు తమ జీవితాలను ప్రజల సేవకే అంకితభావం చేవారు. దురదృష్టవశాన వీరిద్దరూ చిన్న వయసులోనే కీర్తి శేషులయ్యారు. వారు గొప్ప విద్యావేత్తలు తమ జీవితమంతా విజ్ఞాన వ్యాప్తికే వినియోగించారు. కాని వీరిరువురు పరస్పర విరుద్ధమైన వ్యక్తిత్వాలు కలవారు.

అతి సామాన్య జీవితం గడపిన శ్రీ కోపల్లె హనుమంతరావు, నిగర్వి దైవ భక్తుడు, ప్రవక్త, భవిష్యత్తు గూర్చి కలలు కనే వ్యక్తి అనటం అతిశయోక్తి కాదు. గొప్ప సంస్కృతి, అకలంక శీలమూ కలిగిన శ్రీ హనుమంతరావు ఆంధ్ర పునరుజ్జీవనానికి అవతార మూర్తి అని చెప్పవచ్చు.

జాతీయ విద్యకు నాంది పలికిన ఆయన మచిలీపట్నంలో ఆంధ్ర జాతీయ కళాశాల స్థాపకుడుగా, ప్రథమ ప్రధానాచార్యుడుగా ప్రసిద్ది పొందారు.

శ్రీ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య సామాన్య ప్రజలలో తన ఉపన్యాస చాతుర్యంతో ఉద్రేకాన్ని కలిగించి వారిని విప్లవోన్ముఖులను చేయగల విప్లవవాది. బలమైన శరీరం, ఆకర్షనీయమైన ఆకారం కలిగినవాడు. మన చరిత్ర పుటలలో అతి ప్రజాదరణ పొందిన రామదండు ఉద్యమానికి అద్భుతమైన చిహ్నంగా నిలిచాడు. ఆయన ముఖంలోని వర్చస్సు చూపులలో మెరిసే వెలుగు, గంభీరమైన గొంతు. ఆయన ఉపన్యాసాన్ని వినే శ్రోతలలో ఉద్రేకాన్ని కలిగించేవి. ఏ త్యాగానికైనా సిద్ధమయ్యేట్లు చేయగలిగేవి. పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని చేరుకోక ముందే ఆయన, తనువు చాలించాడు. అప్పటి నుండి ఆయన ఆంధ్రదేశపు పురాణ పురుషులలో ఒకడు అయ్యాడు.

శ్రీ హనుమంతరావు, శ్రీ గోపాలకృష్ణయ్య ఆంధ్రదేశం చేరుకొన్న అత్యున్నత స్థితికి ప్రతినిధులు. ఒకరు ఆదర్శ భావాన్ని ప్రస్ఫుటం చేయగా, రెండవ వారు ఆంధ్రులు ఉద్రేక స్వభావానికి ప్రాతినిధ్యం వహించారు.

వెంకటప్పయ్య, నాగేశ్వరరావు

ఈ యిద్దరికన్నా ఉన్నతుడు, శ్రీ సుబ్బారావు పంతులు. తర్వాత పితృపాదుడు శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులు. 1920లో శ్రీ సుబ్బారావు పంతులు, శ్రీరామచంద్రరావు కాంగ్రెసు నుండి విడిపోయిన తర్వాత, శ్రీ బి.యన్. శర్మ సినిమాల్లో వైస్రాయి కార్యవర్గంలో సభ్యుడుగా పదవిని చేపట్టిన తరుణంలో, శ్రీ పట్టాభి సీతారామయ్య గాంధీ వాదాన్ని నిశితంగా పరిశీలిస్తున్న కాలంలో, శ్రీ ప్రకాశం రాజకీయాల్లో తగిన స్థానాన్ని సంపాదించినప్పుడు, భారత జాతీయ జెండాను ఆంధ్ర దేశంలో ఎగురవేసిన ఘనత శ్రీ కొండా వెంకటప్పయ్యకు లభించింది. ఆంధ్ర దేశంలో అతి ప్రముఖ గాంధీవాది ఆయన. విదేశ న్యాయ స్థానాలను బహిష్కరించమని గాంధీజీ పిలుపు యివ్వక ముందే న్యాయవాద వృత్తిని వదిలేసి రాజకీయాల్లో పాల్గొన్న మహాత్యాగి ఉత్తమ పౌరుడు ఆయన. కృష్ణాపత్రిక స్థాపకుడు. కాని నిర్మాణ కృషిలో ఘన విజయాలను సాధించ లేక పోయాడు. ఆయనలో వున్న ఉద్రేక స్వభావం దీనికి ప్రతిబంధకమైంది. కాని ఆయనంత నిజాయితీ పరులు మరొకరు లేరు. ఆంధ్ర దేశంలో ఆయనకన్న గాంధీజీకి ప్రియతముడైన, ఆయనచేత గౌరవింపబడిన నాయకుడు మరొకరు లేరు.

ప్రజల ఆదరాభిమానాలను, కృతజ్ఞతలను అపారంగా పొందిన ఆంధ్ర నాయకుడు దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు. స్వయం కృషితో పైకి వచ్చి, సంపదవల్ల గర్వాని పొందక, తన దాతృత్వం వల్ల శ్రీ నాగేశ్వరరావుగారు ఆంధ్ర దేశంలో ఆబాల గోపాలానికి పరిచితమైన వ్యక్తి. ఆయనలో యిమిడివున్న సంస్కృతి, విశాల దృక్పథం వివిధ మతాల, వర్గాల వ్యక్తులను ఆయనవైపు ఆకర్షించేవి. ధనికులకు మిత్రుడైనా, బీదలకు కూడా బాసటగా నిలిచాడు. ఆంధ్రుల కళా, సాహిత్యాలు ఆయనకు ఎంతో రుణపడి ఉన్నాయి. అసంఖ్యాకమైన సంస్థలు, వ్యక్తులు నిరంతరం ఆయన సహాయాన్ని మార్గదర్శకత్వాన్ని పొందగలిగారు. గాంధీజీపట్ల, కాంగ్రెసు సంస్థ పట్ల ఆయన ప్రదర్శించిన అచంచలమైన విశ్వాసం అనేక రాజకీయ కార్యకర్తల పట్ల చూపిన స్నేహ వాత్సల్యాలు లేకపోతే ఆంధ్రదేశ స్వరాజ్య సమరంలో అంత ఘనతర పాత్రలను వహించి వుండేది కాదు. అంత నిర్మాణాత్మక కృషిని సాధించగలిగేది కాదు. ప్రజల శ్రేయస్సు కోసం అపూర్వ దానాలు చేసిన వ్యక్తిగా ఆయన స్మృతి ఆంధ్ర ప్రజల హృదయాలలో స్థిరస్థానాన్ని కలిగి వుంటుంది.

పట్టాభి, ప్రకాశం

ఆంధ్ర కాంగ్రెసులో శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య, శ్రీ టంగుటూరి ప్రకాశం వంటి అతిరథులు వేరే లేరు. వారి ఆశయాలు, ఆసక్తులు ఒకటే అయినా వారిద్దరూ రాజకీయ స్నేహితులకన్నా రాజకీయ విరోధులే అధికం కావటం విచిత్రమైన విషయం. ఈ యిద్దరిలో ప్రకాశం వయసులోనూ, పట్టాభి రాజకీయాలలోనూ ఒకరి కంటె ఒకరు పెద్దలు.

ప్రకాశం రాజకీయాలలో అడుగు పెట్టేనాటికే, భారత దేశాన్ని భాషా ప్రాతిపదికపై పునర్నిర్మాణం చేసే విషయంలో పట్టాభి ఆంధ్రుల ప్రత్యేక రాష్ట్ర వాంఛను స్పష్టంగా వివరించగలిగాడు. డాక్టరు బీసెంటుతో 1917లో జరిగిన చరిత్రాత్మక ఒప్పందం ద్వారా మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్ర దేశం విడి పోవటానికి ఆయన పునాది వేశాడు. అతిత్వరితంగా ఆలోచింపగల మేథాశక్తి, అనర్గళంగా వుపన్యసించగల వాక్శుద్ధి ఆయన సొత్తు. సంస్థలను అతివేగంగా వుత్పత్తి చేసే ఆవిరి యంత్రం లాంటిది ఆయన మేధస్సు. ఉల్లాసం కలిగించే సంభాషణతో, వాగ్వివాదాలలో ప్రత్యర్థులను నోరుమూయించే వాక్పటిమతో, తుపాన్ వలె శ్రోతల మనసులను అల్లకల్లోలం చేసే ఉపన్యాస శక్తితో పట్టాభి కాంగ్రెసు వాదులలో తనకొక ప్రత్యేక స్థానాన్ని కల్పించుకొన్నాడు. ఆంగ్ల వారపత్రికను నిర్వహించటం నుంచి వ్యాపార బ్యాంకు నడపటం వరకు యితరుల సహాయం లేకుండా ఒంటరిగా కృషి చేయగల శక్తి సామర్థ్యాలు కలవాడు. అద్భుత జ్ఞాపక శక్తి కలిగి విషయాలన్నిటినీ ఒక్కతృటిలో వివరించ గలిగేవాడు. 'కోమటి సూత్రకారునికి బ్రాహ్మణ భాష్యకారుడు' అని ఆయన పేరు గడించాడు. కాంగ్రెసు సంస్థ చరిత్రకారుడుగా, స్వేచ్ఛా భారతంలో మొదటి కాంగ్రెసు మహాసభ అధ్యక్షుడుగా, స్వదేశ సంస్థానాలలో జాగృతిని కల్పించి అక్కడి ప్రజా మండలుల్లో కాంగ్రెసు పతాకాన్ని ఆవిష్కరించిన కొద్దిమంది కాంగ్రెసు కార్యకర్తలలో ప్రథముడుగా ఖ్యాతి పొందాడు. కాంగ్రెసు వారిలో పదవిపట్ల అయిష్టత చూపిన నిస్వార్థుడు. చివరిలో గవర్నరు పదవి ఆయనను వరించింది. ఆయన ప్రతిభకు తగిన గుర్తింపు రాకపోయినా ఆయన ప్రతిష్ట యిసుమంతైనా తగ్గిపోలేదు.

రాజకీయాలలో ఆలస్యంగా ప్రవేశించినా అతి త్వరితంగా అగ్రస్థానాన్ని పొందాడు, ప్రకాశం. మద్రాసు న్యాయ వాదులలో అగ్రణ్యుడైన శ్రీ అల్లాడి కుప్ప స్వామి అంత న్యాయశాస్త్ర దిట్టకాడు, తను స్థాపించిన 'స్వరాజ్య' పత్రికను తన రక్త మాంసాలతో పోషించి పది సంవత్సరాలు దాని సంపాదకుడుగా వున్నా, శ్రీ చింతామణి వలె పత్రికాధిపతిగా పేరు పొందలేదు. శ్రీ మోతీలాల్ కాలంలో కేంద్ర శాసన సభలో సభ్యుడుగా పని చేసినా శ్రీ మోచర్ల రామచంద్రరావు వలె గొప్ప శాసన కర్త కాలేదు. మద్రాసు ముఖ్య మంత్రిగా రాజాజీతో సరితూగలేదు. రాజకీయ

నీతులు బాగా తెలిసినవాడూ కాదు, చెప్పుకో తగినంత విజ్ఞానమున్న వాడూ కాదు, కాని యీ లోపాలు, యితర అపజయాలు ఆయన సహజంగా కలిగివున్న గొప్ప తనానికి అడ్డురాలేక పోయాయి. వ్యక్తిగత త్యాగాలలో ఆయనతో పోల్చదగిన వాడు శ్రీ చిత్తరంజన్‌దాసు ఒక్కరే, ధైర్యంలో ఆయనను స్వామి శ్రద్ధానందతో పోల్చవచ్చు. సంఘర్షణలలో, పోరాటాలలో తలవంచని ప్రకాశం సుభాష్‌చంద్రబోసుకు దీటైనవాడు. ఆయన సింహ హృదయుడు ఉత్తుంగ శృంగాలను చేరుకోగల వ్యక్తిత్వం ఆయనది. ఆ విధంగా ప్రకాశం ఆంధ్ర రాష్ట్రపు మొదటి ముఖ్యమంత్రి కావటం అనివార్యమైన విషయమే. దాదాపు నలభై సంవత్సరాల కాలం ప్రకాశం ఆంధ్రదేశంలో పోటీలేని నాయకుడుగా వెలుగొందాడు. కాంగ్రెస్ సంస్థను గజ గజ లాడించిన వీరుడుగా ఆంధ్ర ప్రజల మనసులలో శాశ్వత స్థానాన్ని పొందగలిగాడు ప్రకాశం.

కట్టమంచి రామలింగారెడ్డి

ఆంధ్ర దేశ చరిత్రలో శ్రీ కట్టమంచి రామలింగా రెడ్డి వలె ప్రముఖ ప్రజ్ఞాశాలి, యితరులను ఆకర్షించ గలిగిన వ్యక్తి మరొకరు లేరనటం అతిశయోక్తి కాదు. రాజకీయాలలో నలుగురితోబాటు, నడిచే వ్యక్తి కాకపోవటం వల్ల, విద్యారంగంలో నియంతలాగా ప్రవర్తించటం వల్ల, ప్రజలలో ఉత్సాహాన్ని కలిగించ లేక పోయాడు, ప్రజలకు ఆప్తుడు కాలేకపోయాడు, ఐనప్పటికి సంభాషణలో ఆయనకున్న చాతుర్యానికి, వాగ్వివాదాలలో ఆయన ప్రదర్శించిన పటిమకూ ఆయనతో ఎవ్వరినీ పోల్చలేము. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చదివే రోజుల్లోనే ఆయన గోపాల కృష్ణ గోఖలే దృష్టిని ఆకర్షించాడు. సర్ జాన్ స్క్వైర్ శ్రీరామలింగారెడ్డిని "బర్మ్‌మాశయుని విజ్ఞానం, ఉపన్యాసధోరణి" గల వ్యక్తిగా అభివర్ణించాడు. ఆయన శాపం పొందిన విజ్ఞాని, గణనీయమైన విజయాలు సాధించినా, అవి ఆయనలో నిబిడీకృతమైన ప్రజ్ఞాపాటవాలకు తగినవి కావనే చెప్పాలి. తన స్వతంత్ర భావాలతో, విమర్శనా దృష్టిలో మేధావులలో ఆలోచనా శక్తిని రేకెత్తించ గలిగాడు. తెలుగులో గొప్ప పండితుడుగా, విమర్శకుడుగా పేరు పొందాడు. ఆంగ్ల భాషను పార్లమెంటరీ పద్ధతిలో మాట్లాడటంలో ఆయనతో పోల్చదగినవారు బహుకొద్దిమంది మాత్రమే. హాస్య సంభాషణలో, కొత్త పదజాలాన్ని సృష్టించటంలో శ్రీ రామలింగారెడ్డి సిద్ధహస్తుడు.

చింతామణి, రాఘవేంద్రరావు, పున్నయ్య

ఆంధ్రదేశం వెలుపల యితర రాష్ట్రాలలో కీర్తి ప్రతిష్ఠలు గడించిన వారిని గూర్చి కూడా తెలుసుకోవటం అప్రస్తుతం కాదు. వారిలో ఆంధ్ర వైతాళికులుగా ఎంచ దగినవారు అప్పటి సంయుక్త పరగణాలలో ప్రసిద్ధి గాంచిన శ్రీ సి.వై. చింతామణి, అప్పటి మధ్య పరగణాలలో జీవించిన శ్రీ ఈ. రాఘవేంద్రరావు., సింధురాష్ట్ర వాసియైన శ్రీ కె. పున్నయ్య ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తారు.

శ్రీ చింతామణి అలహాబాద్‌లోని 'లీడర్' పత్రికకు సంపాదకుడుగా 30 సంవత్సరాలు పనిచేసి, లిబరల్‌గా నాయకులలో ఉద్దండుడని పేరు పొందాడు. ఆయన విజ్ఞాన ఖని. అత్యద్భుతమైన జ్ఞాపక శక్తి కలవాడు. ఆయనలో సేవాభావం అకలంకమైనది. ఆయనలో వున్న స్వతంత్ర ఆలోచనాధోరణి ఎంత బలమైనదో గ్రహించిన శామ్యూల్ హోర్, చింతామణి కన్నా యేయితర కాంగ్రెసువాదియైనా, రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావడం తనకిష్టమని అన్నాడు. మాంటుఫర్డ్ సంస్కరణల కాలంలో సంయుక్త పరగణాలలో మంత్రిగా శ్రీ చింతామణి చరిత్ర సృష్టించాడు. పదవిలో వున్నా, లేకపోయినా, బ్రిటిషు ప్రభుత్వం ఆయనంటే భయపడేది. మాలవ్యా మినహాయిస్తే, సంయుక్త పరగనాలలో ప్రజల రాజకీయ జాగృతికి శ్రీ చింతామణి వలె సేవ చేసినవారు మరొకరు లేరని చెప్పవచ్చు.

శ్రీ రాఘవేంద్రరావు వృత్తి రీత్యా బారిష్టరు, కాని రాజకీయాలు ఆయన జీవితంలో అంతర్భాగం అయినవి. అప్పటి మధ్య పరగణాలలో రాజకీయాలకు కేంద్ర స్థానమైన వాడు. ఆయన కాంగ్రెసులో వున్నా వెలుపలవున్నా ఆయన నాయకత్వానికి ఎప్పుడు లోటు కలుగలేదు. కాంగ్రెసు వాదిగా మంత్రి పదవిని అధిష్టించి, కాంగ్రెసుకు అయిష్టుడుగా మారిన తర్వాత గవర్నరు పదవిని చేపట్టగలిగాడు. గవర్నరు భవనంపై బ్రిటిషు జెండా ఎగురుతున్నా గాంధి టోపీని ధరించటం మానని మొదటి భారతీయ గవర్నరుగా చరిత్రలో నిలిచిపోగల వ్యక్తి శ్రీ రాఘవేంద్రరావు, వైస్రాయి కార్య నిర్వాహక సంఘంలో సభ్యుడుగా సర్ స్టాఫర్డు క్రిప్స్‌తో వాదించి నెగ్గిన ఘనుడు. చిన్న వయసులో మరణించిన శ్రీ రాఘవేంద్రరావు సంయుక్త పరగణాలలో శ్రీ చింతామణి పొందినంత ఖ్యాతిని పొందగలిగాడు.

కోటం రాజు సోదరులలో పెద్దవాడైన శ్రీ పున్నయ్య వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో సింధు రాష్ట్ర నిర్మాతలలో ఒకరుగా పేరు పొందాడు. కరాచీలో పత్రికాధిపతిగా పేరుపొంది, దేశవిభజన ఫలితంగా దేశానికి దూరమైన ప్రముఖులలో ఒకరు, శ్రీ పున్నయ్య.

సర్వేపల్లి రాధాకృష్ణన్

ఆంధ్రదేశ నిర్మాతలలో తనకొక ప్రత్యేక స్థానాన్ని, కీర్తి ప్రతిష్ఠలను సంపాదించుకొన్న మహనీయుడు శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్. దూర ప్రాంతాలలోని విశ్వవిద్యాలయాలకు, విదేశ రాజధాని నగరాలకు విద్యాజ్యోతిని అందజేసిన విద్యావేత్తగా, ప్రాక్పశ్చిమాల వేదాంతాన్ని పరస్పరం అర్థం చేసుకొనేట్లు విడమర్చి చెప్పగల తత్వవేత్తగా, శ్రోతలను పరవశుల్ని చేయగల ఉపన్యాసకుడుగా, ప్రపంచ దేశాల ప్రభుత్వాధినేతల ప్రశంసల నందుకొన్న రాజకీయ వేత్తగా, మాధుర్యానికి, విజ్ఞానానికి ప్రతీకగా నిలిచిన మనీషిగా శ్రీ రాధాకృష్ణన్‌ను ఆంధ్ర ప్రజలు గుర్తుంచుకొంటారు.

(తెనుగు సంస్కృతీ తరంగాలు నుండి)

డాక్టర్ కె.సి. వరదాచారి

మతం

భారత దేశం అనేక మతాల కూడలి. ఈ దేశంలో చాలా మతాలు పుట్టి పెరిగాయి. ఇతర దేశాల నుండి కూడా చాలా మతాలు ఇక్కడకు వచ్చి స్థావరం ఏర్పరచుకున్నాయి. ఈ నాటి భారతదేశాన్ని సర్వమత నివాస స్థానంగా చెప్పవచ్చు. తత్ఫలితంగా మత సహనం, పరస్పర గౌరవాదరణలే కాకుండా పరస్పర ఘర్షణలు, కొంత అయోమయ స్థితి కూడా ఏర్పడ్డాయి.

దాదాపుగా రాష్ట్రాలన్నింటి పరిస్థితి యిట్లాగే వుంది. ప్రతి చోట వివిధ మతాల ప్రభావాలు పడ్డాయి. ఆ మతాల్లో కొన్ని చాలా పాతవి, కొన్ని సహేతుకమైనవి, కొన్ని ఆధ్యాత్మిక భావన ప్రధానంగా వున్నవి, తక్కినవి సరికొత్తవి.

ఆంధ్ర దేశంలో వున్న పరిస్థితి కూడా అందుకు భిన్నం కాదు. ఇక్కడ వున్న మతాలు చాలా వరకు తమ నిజ స్వభావాలను కోల్పోతున్న స్థితిలోగాని, పరస్పరం సమ్మేళన మవుతున్న స్థితిలో గాని వున్నాయి.

ఆంధ్ర రాజుల్లో మొదటివారు ఆంధ్ర విష్ణు వంశానికి చెందిన వారంటారు. కృష్ణభక్తి సంప్రదాయం ఆవిధంగా మొదలై కాలక్రమేణా వృద్ధి చెందివుండవచ్చు. శ్రీకాకుళం వద్ద కృష్ణానదీ తీరాన విష్ణుమూర్తి దేవాలయం వున్నది. ఆంధ్ర విష్ణు రాజవంశీయులకు శ్రీకాకుళం ముఖ్య పట్టణంగా వున్నదని తోస్తుంది. ఆకాలంలో దేవాలయాలు మత కేంద్రాలై విగ్రహారాధనకు ప్రాముఖ్యం ఏర్పడిందని విశదమవుతున్నది. దీనికి మూలం శ్రీకృష్ణుడు ఆరంభించిన సత్వత (పంచరాత్ర) మతమనే చెప్పాలి. ఈ మత ప్రసక్తి మహాభారతంలోను, ఇతర ఆగమాల్లోను వున్నది.

వేద, ఆగమ విధానాలు దక్షిణ దేశంలో పాండ్యరాజు ఏలిన ప్రదేశానికి, ఆంధ్రరాజ్యం కింద వున్న ఇతర రాష్ట్రాలకు విస్తరించాయి. ఆంధ్ర సామ్రాజ్యారంభదశల్లో ఆంధ్రులకున్న వేద సంప్రదాయం, కృష్ణ భక్తి సంప్రదాయం ఆనాటికి అభివృద్ధి చెందిన మతసద్భావాన్ని తెలుపుతాయి. అందుచేతనే దక్షిణ భారతంలో మతోద్యమాలు వేద, ఆగమ సంబంధిత మతాలకు ఋణపడి వున్నాయి. ఆళ్వార్లు వున్న కాలాన్ని ఇదమిద్ధంగా నిర్ణయించలేము. అయితే ఆధునిక చరిత్రకారులు ఈ సంప్రదాయం రెండో శతాబ్దానికి తొమ్మిదో శతాబ్దానికి మధ్యకాలంలో ప్రబలి వున్నదని చెపుతున్నారు. నిజానికి ఆగమాల ప్రాభవం అంతకుముందు కాలానికి చెందినదే.

మూడు సంప్రదాయాలు

కృష్ణ సంప్రదాయారంభ దశలోగాని, దానితో పాటుగాని మహా భారతంలో పేర్కొన్న శైవ ఆగమ

సంప్రదాయం కూడా అమలులోకి వచ్చింది. అట్లా ప్రాచీనకాలం నుండి వైష్ణవ, శైవ ఆగమ సంప్రదాయాలు, వేద సంబంధమైన శ్రౌతస్మార్త సంప్రదాయం ప్రబలినాయి. దేవాలయాల్లో ఆరాధన వైఖానస సంప్రదాయాను సారం జరిగినట్లు పురాతన గ్రంథాల్లో కనిపిస్తుంది. వేద ఋషుల్లో వైఖానస ఋషి పుంగవుడు కనుక వేదకాలంలోనే ఈ సంప్రదాయం వున్నదని తెలుస్తున్నది.

ఆంధ్ర భూభాగం అనేక సార్లు దండయాత్రలకు లోనుకావటం, తిరిగి ఆంధ్ర రాజులు పరిసర ప్రాంతాలమీద దండెత్తి ఉత్తరాన మగధ, కళింగ, నాసిక, మాల్య ప్రాంతాలవరకు తమ సామ్రాజ్యాన్ని విస్తరింపజేయటం జరిగింది. ఆవిధంగా వారి సామ్రాజ్యంలో ఆయా ప్రాంతాల ప్రజల మతం, సంస్కృతి, సంప్రదాయాల ప్రభావం ప్రబలటానికి అవకాశం ఏర్పడింది.

ఉత్తర భారతంలో వున్న బౌద్ధమతం తూర్పు సముద్ర తీరం వెంబడి వున్న ఆంధ్ర ప్రాంతానికి వ్యాపించింది. అట్లాగే పశ్చిమ ప్రాంతం ఆగమ సంప్రదాయాన్ని తీసికొనివచ్చి వుంటుంది. తన జన్మస్థానంలో ప్రాముఖ్యం కోల్పోయిన బౌద్ధమతం కృష్ణాతీరంలో ఆగమ విధాన ప్రభావితమై మహాయాన బౌద్ధమతంగా రూపొంది అభివృద్ధి పొందింది. బహు విశాలమైన ఆధ్యాత్మిక జీవనం ప్రాతిపదికగా బౌద్ధమత ఉద్యమానికి రూపురేఖలు దిద్దిన మహావ్యక్తి నాగార్జునుడు.

వేద మతాభివృద్ధి

ఆంధ్రదేశంలో బౌద్ధమతారంభ దశనుండి ఆ మతం క్షీణించి పోయే వరకు అంటే సుమారు అయిదు వందల సంవత్సరాల కాలంలో శ్రౌతం, స్మార్తం, ధర్మశాస్త్రాలు, కల్పశాస్త్రం మొదలైన వేదమత సంప్రదాయాలు క్రమేపీ వ్యాపించాయి. సాంఘిక కర్మ విభజన ప్రకారం ఏర్పడ్డ కులవ్యవస్థ కూడా కొనసాగింది. ఒక విధంగా కులతత్వం లేని బౌద్ధ జైన సంప్రదాయాల వంటి పంచరాత్ర (సత్వత), వైఖానస పాశుపత మొదలైన ఆగమ సంప్రదాయాలు కూడా అమలులో వుండేవి. ప్రజలు తత్సంబంధమైన పురాణాల అధ్యయనం కూడా చేసేవారు. ఇవి కొంతవరకే మత సంబంధమైనవి; చాలావరకు యోగసంబంధమైనవి. వేద మతంలో నిర్దేశించిన తారతమ్యాలు నిషేధాలు లేకుండా ఇవి అందరికి ఉద్దేశించ బడినాయి.

ప్రస్తుతం వున్న సంకీర్ణ మత వ్యవస్థను తెలుసుకోటానికి వివిధ మతాలనుగురించి క్లుప్తంగా అవగాహన చేసుకొనటం అవసరం. వేద మతం మూడు తరహాల దేవుళ్లను గుర్తించింది. (1) భూతలానికి చెందినవారు – వీరిలో ముఖ్యుడు అగ్ని, (2) ఆకాశానికి చెందినవారు–వీరిలో ముఖ్యుడు వాయువు; (3) స్వర్గానికి చెందిన వారు – వీరిలో ముఖ్యుడు ఇంద్రుడు. ఈ మూడు లోకాల్లోను ఇతర దేవుళ్లు కూడా వున్నారు. వారు సుమారుగా 33,000 వరకూ ఉన్నారు. ఈ మూడుంటికీ పైన రుద్రుడు, వరుణుడు, విష్ణువు మొదలైన ఇతర దేవుళ్లున్నారు. తరువాతి కాలంలో పురాణాలలో త్రివిక్రముడైన విష్ణుమూర్తిని అతిప్రధాన దైవంగా పరిగణించటం జరిగింది. పరబ్రహ్మమును దేవుళ్ళందరినీ మించిన ఏకైక దైవంగా పరిగణించారు. ఆయనను అనేక నామాలతో స్తుతించారు ఋషులు. ఏకం సతు విప్రాః బహుధావంతి. సర్వేశ్వరుడైన దైవం ఒక్కడే, ఆయనే పరబ్రహ్మ. ఆ పరబ్రహ్మలోనే సర్వం ఉన్నది. దేవతలందరకు ఆత్మగాను, సృష్టికంతటికీ భౌతికంగా ఆత్మపరంగా మూలమైనది ఒకే ఉనికి ఉందని, అదే పురుషోత్తముడని చెప్పే ఉపనిషత్తులు ఏకేశ్వరోపాసన, అద్వైతభావనలను ఉపదేశిస్తున్నాయి. సృష్టించబడిన సకల జీవరాశి, తక్కువ స్థాయికి చెందిన శక్తులు – ఇవన్నీ తమ మనుగడకు ఆ ఏకేశ్వరుని ఇచ్ఛాశక్తి పైనే ఆధారపడ్డాయి. సర్వస్వతంత్రుడొక్కడే, తక్కిన వన్నీ ఆయనమీదే ఆధారపడి వున్నాయి. పరమాత్మ ఉనికే నిజమైనది; దానికి ఇతరమైన దేనికీ స్వతంత్ర ప్రతిపత్తిలేదు. ఇవన్నీ పరమాత్మను గురించివున్న భావనలు. వీటికి విస్తృతమైన వ్యాఖ్యానాలు చేసినవారు ఏడవ శతాబ్దంలో శంకరాచార్యులు, పదకొండవ శతాబ్దంలో రామానుజాచార్యులు, పదమూడవ శతాబ్దంలో మధ్వాచార్యులు.

పురాణ గాథలు

ఆంధ్రలో బౌద్ధమతం క్షీణించి వేదమతం తిరిగి తలెత్తిన కాలంలో పురాణ గాథలు ప్రజల్లో అన్ని వర్గాల్లోనూ బహుళ ప్రచారంపొందినై. సాంఘిక వ్యవస్థలో లోపాలున్నప్పటికీ చాతుర్వర్ణాలు కొన్ని మార్పులతో కొనసాగాయి. మానవశక్తికి మించిన సాంఘిక రాజకీయ సమస్యలు కారణంగా ధర్మ సంకరమై నశించి సామాజిక వ్యవస్థ అధోగతికి పతనమై పోతుందని భగవద్గీత చెపుతుంది. ఒక క్రమబద్ధమైన సమాజ వ్యవస్థ ఏర్పడటానికి సురక్షితమైన కర్మలను కొన్నింటిని నిర్దేశించటం అవసరమని పదేపదే చెప్పటం జరిగింది. ఇది లోప భూయిష్టమైనప్పుడల్లా కర్మాచారణ సవ్యంగా వుండదు; చైతన్యవంతమైన సుస్థిరత్వం పోతుంది. ఆ విధంగా యుగధర్మం మారిపోతుంది. ఆంధ్రదేశంలో బౌద్ధ మత ప్రాభవం క్షీణించిన తరువాత హిందూమత పూర్వవైభవం పునరుజ్జీవితమయింది. అది సుమారుగా 500 ఏళ్లు కొనసాగింది.

సమర్పణ

పురాతన కాలం నుండి ప్రచారంలోకి వచ్చిన ఇంకో వేద ఆగమం వైఖానస ఆగమం. ఈ ఆగమ ద్రష్టలు అగ్నిదేవుని ఆరాధించినవారు. పంచరాత్ర సంప్రదాయంలో మాదిరిగానే వీరు భగవానుని అయిదు అంశల భావనను ప్రచారం చేశారు. వీరు కూడా వైష్ణవులే. వీరు వేదాలలో చెప్పిన పరమపురుషుడైన విష్ణువు ఒక్కడే దైవమని ఉద్ఘాటించారు. ఈ విష్ణువే పురుష, సత్య, అచ్యుత, అనిరుద్ధ రూపాలు వహించాడు. అయితే పంచరాత్ర ఆగమం మాదిరిగా ఈ వైఖానస వేదాంతభావన సంపూర్ణ వికాసం పొందలేదు. మన వేదాంత సంప్రదాయాల్లో సంపూర్ణ పరిణతి

పొందినవాటిలో పంచరాత్ర వేదాంత భావన ఒకటి. దివ్యావిష్కరణ ద్వారా, హేతుపూర్వకంగా, నైతికంగా, మానసికంగా మానవుడు భగవంతునితో సంబంధం పెట్టుకునే మార్గాలను పంచరాత్ర విశదీకరించింది. పంచ రాత్రలోని ఒక మూలభావనను వివరించటం అవసరం. రాత్రమంటే చీకటి–అంటే అజ్ఞానం. మానవుడికున్న అజ్ఞానాలు అయిదు–ఒకటి పరబ్రహ్మం గురించినది, రెండోది జగతు సృష్టిని గురించినది, మూడోది ఆత్మను గురించినది, నాల్గోది మతాచార్యులు, ఉపదేశకులను గురించినది, ఆయిదోది పరమేశ్వరుని అనంత అవ్యాజ కరుణను గురించినది. ఈ అయిదు అజ్ఞానాలను పోగొట్టే వాడు పరమేశ్వరుడు.

శైవమత శాస్త్రం పరమ పురుషుని అయిదు అంశల పరస్పర సంబంధాలను ఆవిష్కరించే సత్‌సంభావనను కూడా అభివృద్ధి పరచింది. జగన్నాథుడుగా, ఈశ్వరుడుగా, అంతరంగ ప్రభువుగా, ధ్యానోచిత విగ్రహుడుగా, భక్తజన రక్షకుడుగా పరమాత్మ అయిదు అంశలను భావించారు. ఈ పంచరూపాలూ ఆరాధించ తగినవే. వాటికి శరణాగతులైన వారికి బాధల నుండి విముక్తి కలుగుతుంది. రక్షణ దొరుకుతుంది. ఆత్మ, ప్రకృతి – వీటి అనిర్వచనీయ ఏకత్వమే పరమేశ్వరుని ఆరవ అంశగా పేర్కొన్నారు.

పంచరాత్ర భావన ప్రకారం మూర్త అంశలు, (అంటే స్వరూపం కలవి) రెండు, అమూర్త అంశలు (అంటే స్వరూపంలేనివి, కనబడనవి) మూడు, దేవాలయాల్లో అమూర్త అంశల రూపకల్పన కూడా జరిగింది. దేవతలకు మాత్రమే కనబడే అమూర్త అంశను ఒక ప్రత్యేక రూపం కలదిగా ద్రష్టలు వర్ణించారు. ఆ ప్రత్యేక రూపాన్ని గర్భగుడిలో మూల స్థానంగాను, జగచ్చక్రంలో మూడు రకాల ప్రయోజనాలున్న అమూర్త అంశలను కొన్ని రూపాలలోను, ఒక అమూర్త అంశను హృదయాంతర్గత తేజస్సుగాను దర్శించారు. ఈశ్వరస్సర్వ భూతాని హృద్దేశేతిష్ఠతి – అని భగవద్గీతలో అంతర్యామిని ఈశ్వరుని సమానంగా భావన చేయటం జరిగింది. అంతర్యామి సర్వభూతాల హృదయాంతర్గతుడూ ఈశ్వర రూపంలో వున్నాడనే భావనకు అవకాశం కల్గింది. బగవంతుడు రూపధారణ చేసి భూమి మీద అవతరించాడనటానికి దశావతారాలను పేర్కొనవచ్చు. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, కలి అన్నవి బాగా ప్రసిద్ధమైనవి. తరువాత బుద్ధుడిని కూడా ఈ అవతారాల్లో చేర్చారు. ఇది నిశ్చయంగా 13వ శతాబ్దంలోగాని, 14వ శతాబ్దంలోగాని జరిగి వుంటుందని చెప్పవచ్చు. విగ్రహ ప్రాతినిధ్యం కల్పించిన రూపాలు ముఖ్యంగా మానసిక స్థాయికి పై నుండే స్థాయికి సంబంధించినవి. అవి వెంగడం, తిరుపతి, కంచి, శ్రీరంగం వంటి ప్రదేశాల్లోని దేవాలయాల్లో వున్నాయి. శైవ సంప్రదాయం ప్రకారం అయిదు మూర్తులు పంచ భూతాలకు చెందినవి – అవి పృథ్వీలింగం, ఆపఃలింగం, తేజోలింగం, వాయులింగం, ఆకాశలింగం, అవతారరూపాలను ఎక్కువగా పూజకు ఉపయోగిస్తారు. యోగాభ్యాసంలో నరసింహావతారం ముఖ్యమైనది. శ్రీరామ, శ్రీకృష్ణుల మహత్కార్యాలు, వారి సుందర విగ్రహాలు భక్తుడు పదేపదే మననం చేసుకొనేందుకు వీలుగా వుండటంచేత ఆ అవతారాల ఆరాధన ప్రసిద్ధి పొందింది.

బేరావిధానం–భగవంతుని అయిదు అంశల ఐక్యభావాన్ని నిరంతరం అనుభవించేందుకు దేవాలయంలో వివిధ రూపాలు వెలిశాయి. ఆవిధంగా తిరుపతి వెంకటేశ్వర దేవాలయంలో వున్న మూలబేరా, కౌతుకబేరా, బలిబేరా, ఉత్సవబేరా, ఉగ్రబేరా అద్వితీయుడైన భగవానుని అయిదు అంశలకు రూప కల్పలనలుగా కనిపిస్తాయి. నిజానికి ఈ అయిదూ విభిన్నాలు కావు; అన్నింటి మూలాధారం ఒక్కటే. ఈ సందర్భంలో ఈశావాశ్యోపనిషత్తులో వున్న శాంతి శ్లోకం సదా మననం చేసుకోవాలి –

పూర్ణం అదః పూర్ణమిదం పూర్ణాత్
పూర్ణశ్య పూర్ణం అదయా పూర్ణం ఏవవిశిష్యతే॥

అది పూర్ణం, ఆఇదీ పూర్ణమే. ఆ పూర్ణం నుండి ఈ పూర్ణం తీసుకున్నప్పుడు దాని నుండి ఈ పూర్ణం వచ్చినప్పుడు పూర్ణమే మిగులుతుంది.

దేవుళ్లకు కల్పించిన ఆధిక్యతలు

మూడు రకాల ఆగమాల ప్రభావాలు ప్రబలంగా వున్నప్పటికీ పురాణాల్లో చెప్పిన ఒకానొక సంధాన సూత్రం వుండనే వున్నది. ఆదిలో వేదపరంగా భగవంతుడొక్కడే అని నమ్ముతూ క్రమేపీ ఇతర దైవాల ఉనికిని నిరశించని భావన ప్రవర్తిల్లి వుండవచ్చు. దేవుళ్లు వారివారి లోకాల్లో అధికులు. వారు తమ లోకాల్లో పరమ పురుషుని ప్రతినిధులుగా వుండి ఆయన ఇచ్చకు అనుగుణంగా వర్తిస్తూండవచ్చు. ఆయా సీమలకు తగిన పేర్లతో వాటి వివిధాంశల ద్వారా ఒక్కడే అయిన పరమేశ్వరుని పూజించేవారు. కాని తరువాత కాలంలో అందునా ముఖ్యంగా పురాణాలు ప్రబలిన దశలో క్రమేపీ పరమేశ్వరుని వివిధ అంశలకు వేర్వేరు ఆధిక్యతలను ఏర్పరచటం జరిగింది. అది ఘర్షణలకు దారితీసింది.

ఉపనిషత్తులో ఒక ఉదంతం వున్నది. ఒకసారి దేహంలోని వివిదేంద్రియాలకు ప్రాణానికి పోటీపడిందిట. ప్రతి ఇంద్రియం తానుచేసే పనే ప్రధానమైందని ఆపని జరగని పక్షంలో తక్కిన పనులు సాగవని ఘంటాపథంగా చెప్పినాయిట. అయితే ప్రాణం మాత్రం నెమ్మదిగా దేహాన్నే వదిలేసిందట. అప్పుడు తక్కిన ఇంద్రియాలు తమ నిష్ప్రయోజనాన్ని తెలుసుకోగల్గాయి. ఆ విధంగా అవి అన్నింటికీ మూలం ప్రాణశక్తి అని గ్రహించాయట. ఈ కల్పిత గాథ దేవుళ్లలో ఎవరు అధికుడనే విచారణకు బాగా అన్వయించవచ్చు. కస్మై దేవాయ హవిషావిదేమా తక్కువ స్థాయిలో వున్న దేహేంద్రియాల ఆధిక్యతలో తారతమ్యాల వాదనకు అవకాశం వుండవచ్చుకాని సర్వోత్తమశక్తి తెరవెనుకకు పోయి తన ఉనికిని ఆవశ్యకతను నిర్ధారణ చేసినప్పుడు ఈ చిన్న దేవుళ్లందరూ తమ తమ స్థాయిలను గ్రహించుతారు. కేనోపనిషత్తుఓ ముఖ్య దేవతలైన అగ్ని, వాయువు, ఇంద్రుడు మూల పురుసుడైన యక్షుని గురించిన ఉదంతం ఈ అంశానికి మంచి ఉదాహరణ.

దక్షిణ దేశంలో క్రీస్తు తరువాత మొదటి వెయ్యి సంవత్సరాలలో అదేవిధంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆధిక్యతను గురించిన తారతమ్యం, తత్సంబంధమైన వివాదం ఎక్కువగా వుండేది. విభిన్న శాఖలు గూడా చీలిపోయి వుండేవి. త్రిమూర్తులలో ప్రతి ఒక్కరి ఆధిక్యతను గురించి

పౌరాణిక గాథలు ఎన్నో వుండేవి. మళ్లీ ఆపురాణాల్లోనే వారి ఆధిక్యతలను సమన్వయ పరిచిన సందర్భాలు గూడా వుండేవి.

అయితే వేదాంత జ్ఞానం ఈ విభిన్న భావాలను మేళవించటానికి తోడ్పడింది. పరమమై ఏది వున్నదో దాని వ్యూహాలుగా, శక్తులుగా ఈ త్రిమూర్తులను పరిగణించారు. ఇవన్నీ నిజానికి ఒకటిగావున్న ఆ పరమమే. వానినే మహావిష్ణు, మహాశివుడు, బ్రహ్మము మొదలైన పేర్లతో పిలిచారు.

దక్షిణ భారత చరిత్రలో చాళుక్యుల పరిపాలనా కాలం ద్రావిడ భాషల పరిపూర్ణ వికాసం పొందిన కాలం. అందులో తూర్పు చాళుక్య రాజులున్న కాలం చాలా ముఖ్యమైనది. ఆ వంశీయుల్లో ప్రధానుడు రాజరాజనరేంద్రుడు. ఆ కాలంలోనే నన్నయ భట్టారకుడు మహా భారతాన్ని తెలుగులో రచించాడు. వ్యాస విరచిత భారతానికి ఇది చాలా సన్నిహితంగా వుంటుంది. ఆ మధ్య భండార్కర్ ప్రాచ్య పరిశోధనా సంస్థ వారు సవిమర్శకమైన మహా భారతాన్ని ప్రచురించినప్పుడు సంస్కృత భారతంలో కాలక్రమేణా అదనంగా చేర్చిన భాగాలను వదలివేసి శుద్ధ ప్రతిని నిర్ణయించటానికి నన్నయ భారతాన్ని ఆధారంగా తీసుకున్నారు. అయితే నన్నయ భారతం సంస్కృత భారతానికి కేవలం అనువాదం మాత్రమే అని భావించరాదు. తెలుగు భారతంలో మహోత్కృష్టమైన కవితా సంపద ఉంది.

నన్నయభట్టు మహాభారత ప్రాశస్త్యాన్ని కథా ప్రస్తావనలో "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మ విదులు వేదాంత మనియు, నీతి విచక్షణుల్ నీతి శాస్త్రమంబని, కవి వృషభులు మహాకావ్యమనియు లాక్షిణీకులు సర్వ లక్ష్య సంగ్రహమని, యైతిహాసికు లితి హాసమనియు, బరప పౌరాణికుల్ బహు పురాణ సముచ్చయంబని మహి గొనియాడుచుండ" వేదవ్యాసుడు భారతాన్ని పేర్కొన్నాడు. మహాభారత గ్రంథం భారతీయ ధర్మాన్ని ప్రవచిస్తోంది. అది యిచ్చే సందేశం మహోన్నతం, పరిపూర్ణం. హైందవ సంస్కృతికి భారత గ్రంథం దర్పణం. ఆంధ్రుల మత, సంస్కృతులు దానివలన పరిపుష్టమైనాయి. భారతాన్ని హైందవ సంస్కృతికి పునాదిగాను, సంపూర్ణ వ్యక్తీకరణగాను నన్నయ పరిగణిస్తే, తిక్కనకు మహాభారతంలో హరిహరరూపంలో పరమాత్మ సాక్షాత్కారమయింది. తిక్కన సోమయజ్ఞం చేసిన సోమయాజి వేదపరమైన క్రతువులు ఆ కాలంలో మరుగున పడిపోలేదు. అయితే నన్నయ కాలానికి తిక్కన కాలానికి మధ్య కాలంలో శైవ మతం విజృంభించింది. అది వీరశైవంగా పైబడి శివుడొక్కడే దైవమనే భావం, మార్మిక పద్ధతిలో ఆరాధన బహుళ ప్రచారంలోకి వచ్చాయి. ఇంకో ప్రక్కన విష్ణువొక్కడే దైవమనే వీరవైష్ణవ మతం వృద్ధి పొందటం ఈ పరిణామానికి కారణమై వుండవచ్చు. విభిన్న దృక్పథాలతో ఈ రెండు మతాలు విపరీతంగా పెరిగిపోయి నప్పుడు ఈ రెంటినీ సమన్వయ పరిచే ఒక భావన, భగవంతుని స్వరూప స్వభావాలను గురించిన ఒక నిర్ణీత దృక్పథం అవసరమని తిక్కన సోమయాజి గ్రహించాడు. ఈ భావన ఆయనకు మహాభారతంలో దర్శన మయింది. అదే హరి-హర స్వరూపం. విపరీతంగా, ఆత్మహత్యా సదృశ్యంగా తయారై వెర్రితలలు వేస్తున్న శైవమత విధానాల నిరోధానికి ఈ విశిష్టమైన భావన దోహదమయింది. అప్పటికే ఉత్తరాన విదేశీయుల శతఘ్నుల తాకిడికి సోమనాథ దేవాలయం, ఇతర వైష్ణవ దేవాలయాలు కూలిపోతున్నాయ్. దక్షిణ దేశానికి కూడా దండయాత్రల ప్రమాదం వ్యాపించుతోంది. మూల సత్యం ఒక్కటే అయినా మార్మికమైన అనుభవాలు మతపరంగా రెండు విరుద్ధ శక్తుల ప్రాబల్యానికి దారితీసిన ఆ విపరీత స్థితిలో వాటి సమన్వయానికి తిక్కన సోమయాజి హరిహర దర్శనం సహాయ పడింది.

ఈ హరిహర భావన కూడా అద్వైత సిద్ధాంత పరమైన బ్రహ్మ-ఈశ్వర సంబంధాన్ని పురుష ప్రకృతి సంబంధాన్ని మౌలికంగా వ్యక్తీకరించే శివశక్తి, అర్థనారి, శ్రీనివాస భావనలవంటిదే. ఆ కాలంలో మత సంబంధమైన దర్శనాలు, అనుభవాల విషయంలో అనేక క్లిష్ట సమస్యలు తలెత్తినాయి. ఈ మత విధానాల్లో ప్రతి అనుభవం అతి ప్రధానం. అయితే అవి క్రమంగా ఉద్రేక భావాలకులోనై దివ్య స్థాయికి చేర్చే సామర్థ్యాన్ని కోల్పోయాయి. ప్రతి మత వాది తాను ఋషుల స్థాయికి చేరినట్లూ, ఆరాధ్యుడైనట్లు క్రాంతి దర్శి అయినట్లు భావించడం మొదలు పెట్టారు.

వైష్ణవ మతం

ఆంధ్రదేశానికి దక్షిణ సరిహద్దుగాను, తమిళనాడుకు ఉత్తర సరిహద్దుగాను ఉన్న ప్రాంతంలో రామానుజాచార్యులు ఉన్నందువలన శ్రీ వైష్ణవం ఆంధ్రదేశ వాతావరణానికి సంబంధించినదిగా పరిగణించవచ్చు. ఆంధ్రదేశంలో వైష్ణవ మతం 12వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం వరకూ ప్రబలంగా ఉన్నది. అప్పటికే వైష్ణవ మతాచార్యులు మతపరంగా, యోగ పరంగా, దేవాలయ వ్యవస్థాపనలోను సమాజాభ్యున్నతిలోను ఆంధ్ర, తమిళ సంస్కృతుల సమన్వయానికి కృషిచేస్తున్నారు. 15, 16 శతాబ్దాలలో కర్నూలు జిల్లా, నంద్యాలలోని అహోబిల నరసింహస్వామి దివ్యాదేశానుసారంగా శఠకోపాచార్యులు అహోబిల మఠం స్థాపించి ఆ మత సిద్ధాంతానికి తోడ్పడ్డారు. అది శ్రీ వైష్ణవ మత యోగ సంప్రదాయాల పునరుద్ధరణకు దోవతీసింది. నేరుగా ఆత్మసాక్షాత్కారం కోసమే శ్రీ వైష్ణవ మతం అవిరళ కృషి సల్పినప్పటికి అది తరువాతి కాలంలో పిడి వాదంగా తయారైంది. అయితే ఆదిలో ఉన్న పద్ధతులను అనుసరించదలిచేవారు మాత్రం తమ యిళ్లలోనే విగ్రహాలనారాధించి తరించేవారు. ఆవిధంగా శ్రీ వైష్ణవుల సంప్రదాయ కుటుంబాలలో ధ్యానయోగ అనుభవం నిరంతరం ఉండేది. సాధారణంగా మత ధర్మాలను సాంఘిక ధర్మాలను పాటిస్తూనే యోగానుభూతుల్లో నిష్ణాతులయ్యేవారు.

అదేవిధంగా శైవ సంప్రదాయ కుటుంబాలలో ఆగమాల ప్రకారం తమ యిళ్లలోనే ఆరాధనా క్రమం జరుపుతున్నా శైవ లేక శాస్త్రపరమైన యోగానుభూతుల కోసం సాధన చేసేవారు.

ఈ రెండు సంప్రదాయాల్లోను ద్రష్టలైన కవి వరేణ్యుల ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరిపుష్టం చేసినందువల్ల అవి ఇతర మతాల తాకిడికి తట్టుకోగల్గాయి. అంతేకాక వాటిలో చాలా వరకు తమలోకి కల్పుకోగల్గాయి.

మధ్వాచార్యుల వైష్ణవమత సంప్రదాయ ప్రభావం ఆంధ్ర దేశం మీద కూడా పడింది. ద్వైత మత భావాలు ప్రసరించాయి. ప్రముఖ

కన్నడ వాసుల వినమ్ర భక్తి భావ తరంగాలు ఆంధ్ర సీమను కూడా చేరాయి. అదే సమయంలో అంటే 14వ శతాబ్దంలోనే ఎంతో ఉధృతంగా చొచ్చుకొని వచ్చిన ఇస్లాంమత ప్రభావం కూడా దీనికి తీసికట్టే అని చెప్పవచ్చు.

అది నుండి ప్రజానీకంలో మత పరమైన జీవితం కొన్ని పద్ధతుల్లో నడిచింది. అభివృద్ధి చెందింది. కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకూ దేశమంతటా అనేక పుణ్యక్షేత్రాలు వెలిసివున్నాయి. హిందువైన ప్రతి వ్యక్తి తన జీవితంలో ఒక్కసారన్నా ఈ క్షేత్రాలన్నీ దర్శించాలి. కొన్ని వైదిక కర్మలను ఆరంభించటానికి వివాహాలకు ఇతర సంస్కారాలకు తప్పకుండా వెళ్లవలసిన దేవాలయాలు కొన్ని వున్నాయి. ఆ విధంగా ఉత్తర దేశానికి గాని, దక్షిణ దేశానికి గాని వెళ్లవలసిన వారు ఆంధ్రదేశం ద్వారా పోవాల్సి ఉండేది. త్రోవలో అక్కడక్కడ ఉన్న పవిత్ర దేవాలయాలను దర్శించటం జరిగేది. శ్రీశైలం, అహోబిలం, కాళహస్తి, తిరుపతి, మంగళగిరి, శ్రీకూర్మం వంటి పుణ్యక్షేత్రాలకు యాత్రికులు నిరంతరం వెడుతూ వుంటారు.

బలరాముడు, అర్జునుడు, ఏఏ పుణ్య క్షేత్రాలు సేవించారో మహాభారత గ్రంథంలో వ్రాసి ఉంది. రామాయణ గ్రంథంలో శ్రీరామచంద్రుడు, సంచరించటంవల్ల పవిత్రతను పొందిన స్థలాలు, ఇతర పుణ్యక్షేత్రాలు పేర్కొనబడినాయి. కొందరు భక్త శిఖామణులు తమకు భగవద్దర్శనమైన స్థలాల్లో నిర్మించిన ఆలయాలు గూడా తీర్థ యాత్రాస్థలాలుగా పరిణమించాయి. ప్రజానీకం భక్తితో ఒక పుణ్య తీర్థం నుండి ఇంకొక దానికి పోతూ కానుకలు సమర్పిస్తూ అక్కడ ఉండే యోగిపుంగవుల ఆశీర్వాదాలు పొందుతారు. అంతేకాక ఈ పవిత్రస్థలాలు యోగసాధనా కేంద్రాలుగాను, వేదాంత జ్ఞాన కేంద్రాలుగాను ఉండేవి. అక్కడికి ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జన కోసం చాలామంది వెళ్లేవారు. అన్ని తరగతుల ప్రజలు, దేవాలయాల దగ్గర జరిగే ఉత్సవాలకు, జాతర్లకు వెళ్లి భక్త్యావేశాలు పొందేవారు.

మత సమన్వయం

వివిధ మత భావనలు గల సద్గుణ సంపన్నులు తరుచుగా కలుసుకుని చర్చించి పరస్పరావగాహన చేసుకొనటం వలన మతవ్యవస్థలలో సహనం సమన్వయం సాధ్యమయింది. ప్రకృతి సకల జీవరాశి ఒకే ఒకడైన పరమాత్ముని రూపాలే అన్న మౌలిక జిజ్ఞాసను వైష్ణవ, శైవ మతవాదులు అంగీకరించారు. వారే విశిష్టాద్వైతులు. ఈ ప్రపంచం అసత్యం అనే అద్వైత సిద్ధాంతం, ఈ ప్రపంచం అంతా నిజమైనదే అనే ద్వైత సిద్ధాంతం. వీటి మధ్య ఉన్న వ్యతిరేకభావం పోయి, ఈ జగత్తంతా పరమేశ్వరుని ఇచ్ఛకు, సౌందర్యానికి, కటాక్షానికి రూప కల్పనే అనే భావం ఏర్పడింది. వ్యక్తిగతంగా గూడా అంతా మాయ అనే స్థాయికి దిగిపోకుండా ఆత్మగతుడు పరిపూర్ణుడైన భగవంతునికి తాము బాధ్యులం అని భావించారు. ఈ రెండు పరిణామాల వలన మాయా వాదంలోనూ, బౌద్ధ మతంలోనూ వున్న విచ్ఛిన్న కరమైన మత భావనలు పటిష్టం కావడానికి వీలుకల్గింది. ఈ సమన్వయ కారులు ప్రధానంగా ధ్యానయోగులు.

సాంస్కృతికంగా మతపరంగా చరిత్రలో విజయనగర సామ్రాజ్యం చాలా ముఖ్యమైనది. ఆ రాజుల కాలంలోనే అనేకమంది తాతాచార్యులు ప్రముఖులయ్యారు. శ్రీకృష్ణదేవరాయలు తిరుపతి దేవునికొలిచిన భక్త శిఖామణి. ఆళ్వారులను దృష్టిలో ఉంచుకొని ఆయన ఆముక్తమాల్యద అనే ఉద్గ్రంథాన్ని రచించాడు. రాయల ఆస్థానంలో ప్రతిభావంతులు ఉండేవారు. ఆయన పరిపాలనా కాలంలో పురాణ గాథలు, మహాభారత గాథలు ఆధారంగా తీసుకుని తెలుగులో స్వంత రచనలకు అనువాద సాహిత్యానికి మంచి ప్రోత్సాహం లభించింది.

భక్తాగ్రేసరుడైన బమ్మెర పోతన తన భక్తి భావలహరిని కవితా స్రవంతిగా ప్రవహింపచేసి, తెలుగువారి హృదయాల మీద చెరగని ముద్రవేశారు. ఆయన వ్రాసిన మహా భాగవతం భక్తిరస పూర్ణమైన మహోత్కృష్ట గ్రంథం. పోతన ఒంటిమిట్ట గ్రామానికి చెందిన వాడైనా ఆయన భక్తి ప్రపత్తులు నలుమూలలా వ్యాపించాయి. మహావిష్ణువు దశావతారాలను భక్తి భావపూరిత కవితా ధారలతో సమదర్శనం చేసికొన్నవాడు పోతన. భక్తుని అనుభవాన్ని ఆత్మసాక్షాత్కారాన్ని మేళవించిన కవి శ్రేష్టుడాయన.

నన్నయ, తిక్కన, ఎర్రాప్రెగడలు రచించిన మహాభారతం, పోతన వ్రాసిన భాగవతం పండితులకే కాక పామరులకు కూడా పఠనీయాలూ శిరోధార్యాలయిన గ్రంథాలని చెప్పవచ్చును. ఎందరోకవులు వాల్మీకి రామాయణాన్ని అనువదించారు. భక్తి భావాన్ని ఆచరణలో పెట్టిన వావిలకొలను సుబ్బారావు గారు సంస్కృత రామాయణానికి చక్కటి అనువాదం చేశారు. ఈ దేశంలో రామాయణగాథ తెలియని వారు లేరు. మతపరమైన కవిత్వం ఇంతగా ప్రభవిల్లిన కాలం ఆంధ్రుల మూడు శతాబ్దాల కవిత్వ చరిత్రలో మరొకటి లేదు.

భవిష్యద్దర్శనం చేయగల యోగులు

అనేక ఏళ్ల తర్వాత గాని తిరుమల తిరుపతి దేవస్థానం వారి కృషి ఫలితంగా తాళ్లపాక అన్నమాచార్య కీర్తనలు ప్రచురితమై వెలుగులోనికి రాలేదు.

క్రిందటి శతాబ్దంలో తరిగొండ వెంగమాంబ అనే భక్తురాలు, యోగిని వ్రాసిన భక్తి పూరిత కవితలు ఇటీవలి కాలంలో పండితుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

వీరబ్రహ్మాయోగికి భవిష్యద్దర్శన శక్తి అపారంగా ఉందని భావిస్తారు. ఆయన తనను వీరశైవ వీరవైష్ణవ అనే కంటే భగవంతుని సృష్టి చేసే అంశమే చెందిన వీర బ్రహ్మము అనటమే ఉత్తమంగా భావించాడు. ఆయన యోగసిద్ధి పొందిన మహానుభావుడు.

మామూలు మత ప్రచారకుల వలె కాక వారి దృక్పథం యోగ సంబంధమై ఉండేది. నారాయణవనంలో ఉండే స్వామి స్వంత జీవితంలోని దివ్య చైతన్యానుభూతిని పొందాడు. మత ప్రచారకులుగా ఉంటూ, వినయ శీలురైన యోగులెందరో ఉండేవారు. ఏర్పేడులోని ఆశ్రమాన్ని

మళయాళస్వామి నడిపేవారు. అదేవిధంగా పుట్టపర్తి సాయిబాబా వున్నారు. ఆయన షిర్డీ సాయిబాబా అవతారమని విశ్వసించే వారెందరో వున్నారు. వీరంతా యోగులు. మత పరమైన అభిప్రాయాలు తరచుగా వారు వెలిబుచ్చినా అవి ఒకే విధానానికి కొన్ని మూఢనమ్మకాలకు పరిమితమై వుండవు. ఒక క్రమబద్ధమైన సాంఘిక విధానంలో వుండే కఠిన నియమాలకు కట్టుబడకుండా మతాన్ని సజీవశక్తిగా చేసినవారు ఊరూరా తిరిగే జంగాలు, సన్యాసులు, హరిదాసులు, ఇతర భాగవతోత్తములు. ఇతర మతాల తాకిడికి ఉధృతంగా ఉండి మత సంస్థలకు ముప్పు వాటిల్లిన కాలంలో వాటి ప్రభావం నుండి ప్రజా చైతన్యాన్ని కాపాడిన ఘనత వీరికే దక్కుతుంది.

మహ్మదీయ దండయాత్రల వల్ల సువ్యవస్థితమైన మతసంస్థలకు గట్టి దెబ్బతలిగింది. క్రీ.శ. 1500 నాటికి వాటి ప్రభావం తీవ్రతరమయింది. విగ్రహారాధనకు వ్యతిరేకులైన ఇస్లాంమతస్థులు విపరీతంగా విధ్వంసకాండ జరిపారు. బలవంతంగా ఎందరినో ఇస్లాం మతంలోకి మార్చిన ఉదంతాలు కోకొల్లలు. అయితే హిందూ మహమ్మదీయ సామరస్యాన్ని వాంఛించిన మహనీయులు రెండు మతాల్లోనూ బయలుదేరారు. మూఢంగా సంకుచితత్వంగా ఉండే మనస్తత్వం భగవదారాధికులను వేరుచేస్తుందనీ, మహ్మదీయుల్లో సూఫీలు హిందువుల్లో యోగులు రెండు మతాల మౌలిక సత్యాల సాదృశ్యాన్ని అవగాహన చేసుకున్నారు. బాహ్యంగా వైరుధ్యం వున్నా ఆంతర్యంలో క్రమేపి ఐక్యభావన పెరిగింది.

మతానికుండే ఆదర్శాలే ప్రాతిపదికగా పరిపూర్ణమైన మతం ఒకదానిని స్థాపించాలనే అక్బరు చక్రవర్తి మహదాశయం దురదృష్టవశాత్తు వేళ్లు తన్నుకోలేదు. ప్రజల్లో అటువంటి విశాల దృక్పథం ఉన్న మతానికి అంగీకరించే వారున్నా దానికి ఎక్కువ ఆదరణ లభించలేదు. ఈ సందర్భంలో కబీరువంటి వారు గణనీయులు. అయితే అటువంటి భావ ప్రచారకులు ఆంధ్రదేశంలో తక్కువగా ఉండేవారు.

అయిదుసార్లు భగవత్ప్రార్థన చేయటం అంతా పరమేశ్వరార్పణంగా భావించటం ఇవి క్రమబద్ధమైన జీవన విధానాలు. వీటిలో ఒక ఆకర్షణ వుంది. పంచరాత్ర భావనకు దీనికి పోలికలున్నాయి. అయితే యోగసంబంధమైన ప్రతీకలున్న విధానం జీవితానికి దగ్గిరగా వుంటుంది.

క్రైస్తవమతం

అయితే మత సంబంధమైన సంస్థల నిర్వాహణలలో బేధాభిప్రాయాలు, ఘర్షణలు, యోగ సంబంధమైన నూతన విషయాల అవగాహనను దూరం చేస్తుంటాయి. దాదాపుగా ఇస్లాం మతంతో బాటుగా అంటే క్రీ.శ. 1600 నాటికి క్రైస్తవ మతశక్తి భారత దేశంలోనికి ప్రవేశించింది. రెండు దశాబ్దాల కాలంలో క్రైస్తవ మతం ఈ దేశంలో సర్వాధిపత్యాన్ని సంపాదించింది. ప్రతి నగరంలో గ్రామంలో దేవాలయాలు మసీదులతో పాటు చర్చీలు కూడా వెలిశాయి. క్రైస్తవ మతబోధలు చేసే విద్యాలయాలు కూడా అవతరించాయి. వీలైనంత అధిక సంఖ్యలో హిందువులను క్రైస్తవ మతంలోనికి మార్చటం కూడా ఈ సంస్థల ధ్యేయంగా ఉండేది. ఈ మత ప్రభావం హిందూసమాజం మీద రెండు విధాలు – (1) ప్రపంచమతాల అధ్యయనానికి ప్రోత్సాహం, (2) మేధావులు ఇంకా స్వతంత్రంగా ఆలోచించటానికి దోహదం కల్గింది. (3) హిందువులలో భగవత్ కటాక్షానికి తగనివారుగా పరిగణించబడిన నిమ్న జాతీయులు, అణగారియున్నవారు, నిర్లక్ష్యం చేయబడినవారు క్రైస్తవమతం స్వీకరించేందుకు దోహదం లభించింది.

కాని దీనిలో సంస్థల పరమైన మతానికే ప్రాధాన్యం ఈయటం జరిగింది. అయితే కొందరు క్రైస్తవు మతస్థులు మతపరంగాను, యోగవిధానం దృష్ట్యాను హిందూమతంలో అతి విస్తృతమైన అనుభవజ్ఞత వుందని గ్రహించారు. పాశ్చాత్య పండితులు హిందూమతంలో ఆధ్యాత్మిక జీవనానికి ఆధారాలైన యోగభావనలున్నాయని తెలుసుకున్నారు. మానవుడికి ఆధ్యాత్మిక అనుభవం సిద్ధించటమే హిందూమతపరమాదర్శం. అది అతనికి హేతుబద్ధంగాను, ఆచరణసాధ్యంగాను కనిపిస్తుంది. అది తన జీవాత్మకు సంబంధించినదిగా పరిగణిస్తాడు. పరమ శుభ ప్రదమైనదిగా భావిస్తాడు.

ఇస్లాం, క్రైస్తవ మతాల్లో వున్న అంతస్సంఘర్షణలు హిందూమతంలోని వివిధ కులాల మధ్య తీవ్ర విభేదాల మాదిరిగానే కనిపించాయి. ఆ రెండు మతాల్లో కూడా శాఖోప శాఖలున్నాయి. అంతర్వైరుధ్యంలోగాని, మధ్యవర్తిత్వం లేకుండా సరాసరి దివ్యానుభవం పొందాలనే తపనలోగాని, అన్ని మతాలు ఒకే రకమైన సమస్యలు ఎదుర్కొన్నాయి.

ఆ పరిస్థితుల్లో ఆధునిక విజ్ఞాన సాంకేతిక శాస్త్రాల ప్రభావం కూడా ఎక్కువైంది. శాస్త్రీయ సాంకేతిక విజ్ఞానం వృద్ధి పొందినంత వేగంగా ఏమతం అభివృద్ధి పొందలేదు. భౌతికవాదం, ఆర్థిక సమానత్వం, విప్లవం ఈనాడు మత వ్యవస్థను సవాలు చేస్తున్నాయి. విజ్ఞానశాస్త్రం హేతువాదం మీద ఆధారపడుతున్నదేగాని దివ్యావతరణపైన అతి మానసిక భావనలపైన ఆధారపడటం లేదని నిర్ధారిస్తున్నారు. ఆలయం, చర్చి, మసీదు వీటిలో ఉన్నారనే దేవుళ్లను పూజించటం కంటే ఒక యంత్రాన్నో స్పుట్నిక్‌నో ఆరాధించే భౌతిక వాదులు పెట్టే పరీక్షకు సర్వ మతాలు గురైనాయి.

విజ్ఞాన శాస్త్రం చేయలేని పని ఒకటి మతం చేయగలదు. తనను తాను తెలుసుకుని భగవంతుడిని తెలుసుకోవాలనే మానవ జిజ్ఞాసను మాత్రం విజ్ఞాన శాస్త్ర పరిశోధనా ఫలితాలు ఎంతో మహోన్నతాలైనా సంతృప్తి పరచలేవు. మతంలో నైతిక సూత్రాలకు ప్రాధాన్యమిచ్చి, మతానికి విజ్ఞాన శాస్త్రానికి ధ్యేయం భగవంతుడేనని సత్యాహింసలు భగవంతుని అంశాలని ఆచరణ ద్వారా చూపించిన వ్యక్తి మహాత్మాగాంధి. నిజానికి సత్యాహింసల ప్రసక్తి లేని మతసిద్ధాంతం ఏదీ లేదు. ఈ రెంటిలోను తగినంత శ్రద్ధాసక్తులు చూపని కారణంగానే మత వ్యవస్థలు పతనమయ్యాయి. మానవ స్వభావానికి భగవంతుడి సర్వ శక్తిత్వానికి దివ్యవైభవానికి దేనికైనా ఎదురు తిరగవచ్చు నేమోగాని, సత్యాహింసలకు మాత్రం కాదు. అటువంటి చైతన్య వంతమైన మత సిద్ధాంతాన్ని ప్రభావితం చేశాడు మహాత్ముడు. దేవుడొక్కడే, ఆయనకున్న పేర్లు అనేకం. ప్రపంచాన్ని ఉద్ధరించడానికి రక్షించడానికి భగవంతుడు మళ్లీ మళ్లీ అవతారాలెత్తుతాడు – ఈ నిరంతర సత్యాన్నే ఉపనిషత్తులు, భగవద్గీత,

కొరాను, న్యూటెస్ట్ మెంట్స్, ధర్మపదం చాటిచెపుతున్నాయని గాంధీజీ గ్రహించారు. దైవమే సత్యం, సత్యమే దైవం, మనిషి సాధన చేసిన తన పనులలో ఆలోచనలలో ప్రార్థనల్లో పరమేశ్వరుని దర్శించాలి అని బోధించారాయన.

సకల ప్రజానీకం ఈ సందేశంతో ప్రభావితులైనారు. ఉత్సాహ పూరితులయ్యారు. భారతీయులు భయాందోళనకు దురాశలకు దూరమయ్యారు.

మతానికి సామాజిక ప్రయోజనం ప్రధానమే కాని, సాంఘిక సిద్ధాంతాలు ఎక్కువగా వ్యక్తుల ఉద్రేక స్వభావం మీద ఆధారపడి ఉంటాయి. మతానికి యోగవిధానానికి సాంఘిక రాజకీయ ప్రయోజనాలకు మించిన పరమాదర్శం ఒకటున్నది. దేవాలయాలు నగరం మధ్యలో ఉండటం వల్ల కళలు, శాస్త్రాలు అభివృద్ధి చెంది సమాజంలోని వివిధ వర్గాల మధ్య సామరస్యానికి వీలుకల్గింది. మధ్యయుగంలో వెలిసిన చర్చీలు, మసీదులు కూడా ఇదే ప్రయోజనాన్ని సాధించాయి.

ఆధునిక యుగంలో విజ్ఞాన శాస్త్ర ప్రగతి వలన ప్రపంచం అంతకంతకు చిన్నదవుతున్నది. ప్రపంచం అంతా ఒక్కటే, మానవాళి అంతా ఒక్కటే. అనే భావాలు బలపడుతున్నాయి. ప్రపంచాని కంతటికి ఒకే మతం ఉండాలనే భావనలు కూడా స్థిరపడుతోంది. ఇంతవరకూ వచ్చిన మతాలు సర్వ ప్రపంచానికి పనికి వచ్చే అర్హతలు ఎన్నిటిని చూపించినా అవి కలకాలం నిలిచేవిగాను ఆచరణ యోగ్యంగానూ లేవు. శరీరం అన్ని స్థాయిల్లోనూ మానవుడు అనుభవించగల్గి తీరుతాడు. అది సిద్ధించినప్పుడు, ఈ నేలమీద భగవంతుని రాజ్యమే అవతరిస్తుంది. ఇది కొంతవరకు మనం కలలు కనే రామరాజ్యం వంటిదని భావించవచ్చు.

ఒక పరిధిలో మాత్రం తిరిగే మతాలకు ఈ శతాబ్దంలో స్థానం లేకుండా పోతున్నది. లేదా అవి విచ్ఛిన్నమైనా అవుతున్నాయి. ఒకవిధంగా అవి సువిశాల ప్రపంచానికి తమ ద్వారాలను తెరిస్తే గాని మనం మనలేని స్థితి ఏర్పడింది. తరతరాలుగా పేరుకున్న చెత్తా చెదారం ఊడ్చేయడం జరుగుతుంది. విశ్వ శ్రేయస్సును ఆశించే కొత్త కాంతి రేఖలు ప్రసరిస్తున్నాయి. తోటి మానవుల పట్ల దేవుని సమక్షంలోనూ స్వేచ్ఛా సౌహార్దం, సమత సంపూర్ణంగా సిద్ధించాలనే ఆదర్శాలు బలపడుతున్నాయి. అంతేకాక ఆధ్యాత్మిక పరిణామంలో ప్రతి వ్యక్తి ఉన్నత స్థాయిని చేరుకోవాలనే ఆకాంక్ష కూడా పెరుగుతోంది. మన విద్యా విధానం గడచిన కాలంలో ఉన్న మహోన్నత జ్ఞాన సంపదను సద్వినియోగం చేసుకునేదిగాను మానవ శ్రేయస్సు కోసం దివ్యత్వం వైపుకు పయనించేదిగాను రూపొందాలని ఆశించుదాం.

(తెనుగు సంస్కృతీ తరంగాలు నుండి)

పరిపూర్ణ పావనాం భస్తరంగోద్వేగ
        గౌతమీ గంభీర గమనమునకు
ఆలంపురీ నందనారామ విభ్రాజి
        మల్గోల ఫలరాజ మధుర రుచికి
ఆంధ్రీకుమారీ సమాయుక్త పరిపూత
        తుంగా పయస్సు మాధుర్యమునకు
ఖండ శర్కర, జాతి, ఖర్జూర గోక్షీర
        ద్రాక్షాదియుత రామ రసమునకును
అమృత నిష్యంది వల్లకీహ్లాదమునకు
రాగిణీ దివ్య సమ్మోహ రాగమునకు
తేనె తేటల నవకంపు సోనలకును
సాటియగును మా తెనుగు భాషామతల్లి

– సురవరం ప్రతాపరెడ్డి

భావరాజు వెంకటకృష్ణారావు

ఆంధ్రదేశపు దేవాలయములు జాతీయ జీవనము పై వాని ప్రభావము

ఆంధ్రదేశమునందు ప్రసిద్ధికెక్కిన, కడు ప్రాచీనములయిన దేవాలయములు అనేకములు కలవు. వాటినన్నింటిని వరుసగా పేర్కొనుట కష్టము. ప్రాచీనములయిన వెన్నో నశించి పోయినవి. మిగిలినవాటిలో చాలాభాగము పూజాపునస్కార ములు లేకయో, పాడుపడియో నామమాత్రా వశిష్టములై యున్నవి. ప్రసిద్ధము లయినవి యింకను కొన్ని, తొల్లిటి వైభవసంపదలు లేకపోయినను, నేటికిని పుణ్యక్షేత్రములుగా అలరారుచున్నవి.

ఆంధ్రదేశమును స్థూలముగ మూడుభాగములు, లేక నాలుగు ఖండములుగా విభజించి, యీ దేవాలయములను ఒకసారి, శ్రీనాథకవి భీమేశ్వర పురాణమునందు వ్యాసమునీంద్రునకు భీమమండల స్థితి పుణ్య క్షేత్రములను జూపించినట్లు, చూపింప ప్రయత్నింతును. ఉత్తరమున ఈశాన్యముగా విశాఖపట్టణ మండలము వ్యాపించి యున్నది. నేటి విశాఖపట్టణపు జిల్లా పూర్వ మొకనాడు కళింగదేశమను పేరుతో అఖండవైభవముతో వర్తకలక్ష్మికి ఆటపట్టయి అలరారెను. కళింగము చాలాకాలము క్రిందటనే అంధ్ర దేశాంతర్గతమైపోయెను. ఇంచుమించుగా వేయేండ్లనుండి కళింగమునకు పూర్వపు ప్రత్యేక స్థితిలేదు. కళింగమున పుణ్యక్షేత్రములనదగిన దేవాలయములు శ్రీ కూర్మము, అరసవిల్లి, ముఖలింగము, సింహాచలము, యలమంచిలి మొదలయిన గ్రామములందు గలవు. శ్రీ కూర్మమున కూర్మనాథుని గుడిగలదు. శ్రీ మన్మహావిష్ణువుయొక్క రెండవ అవతారము. కూర్మనాథుడు నిజమునకు అతి ప్రాచీన కాలమందు, అనగా క్రీస్తుశతాబ్ద కాలము లెక్కించుటకు, కొంచెము పూర్వమో, లేక తరువాతనో, ఒక శివాలయమై యుండినట్లు తోచును. అది వైష్ణవాలయముగా మారిన నాడు శ్రీ కూర్మనాథక్షేత్ర మహాత్మ్యమొకటి వెలసి అది బ్రహ్మాండ పురాణము లోనికో, వర్తపురాణములోనికో ప్రాకినది. ఇచ్చట దేవాలయపు శిల్పము రమణీయమైనది. బ్రహ్మకై ఇచ్చట ఊరిచివర పాతాళ గర్భమున నొక శివాలయమున్నది. ఈ రెండు దేవళములగోడు ఎరిగించు వారింత వఱకు అవతరించలేదు. శ్రీ కూర్మనాథుని దేవాలయము 12 13,14,15 శతాబ్దములందు అత్యంత వైభవమును అనుభవించెను. అది ఒడ్డెగజపతిరాజులు దర్పముతో, ప్రతాపముతో వర్ధిల్లిన కాలము. అచ్చటి శిలాశాసనము చాలాకాలము నాటి మత సాంఘిక, రాజకీయార్థిక పరిస్థితులను దెలుపుచున్నవి. శ్రీ కూర్మము సముద్రపు టొడ్డున నొక మైలుదూరమున నున్నది.

వంశధార నదియొడ్డున –దక్షిణపుటొడ్డున వెలసియున్నది మధుకేశ్వరాలయము. దానికే నేటి వ్యవహారమందున్న పేరు ముఖలింగేశ్వరాలయము. శ్రీ కూర్మనాథుని గుడిని బట్టి ఆ చెంత లేచిన

గ్రామమునకు శ్రీ కూర్మమని యెట్లుపేరు వచ్చెనో, అట్లే, ముఖలింగమునకు గూడ గుడిని బట్టి పేరువచ్చెను. నిజమున కీ మహాదేవుడు ముఖలింగేశ్వరుడని పిలువబడగూడదు. కాని ప్రాకృత భాషోచ్చారణములో "మధూకలింగ" అను సంస్కృతనామము "ముఖలింగ" మైనది. ముఖలింగము ఒకప్పుడు కళింగ గాంగుల రాజధానియై బరగి కళింగ నగరమను పేరుతో ప్రసిద్ధికెక్కెను. కళింగనగరము చెంత ప్రవహించు వంశ ధారనది వెయేండ్లకు పూర్వము రెండుపాయలుగా చీలిపోయి, కొంతదవ్వు ఆ రీతిగా ప్రవహించి, తిరిగి ఏకమై పోయెను. కళింగ నగరములోని 'నగరు' రాజుండు కోట, అంతఃపురము, నగరము, నకరము అను పేరుతో వంశధారపోసిన లంకలో నుండెను.

సింహగిరి, సింహాచలము, సింహాద్రి అను మొదలయిన పేళ్లతో కళింగ భూమియందేగాక, ఆంధ్రదేశమంతటను ప్రఖ్యాతి జెందినది. ఆ కొండపై వెలసిన వరాహమూర్తి, శ్రీ మన్మహావిష్ణువు యొక్క మూడవ అవతారము. అచ్చటి దేవునకు శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి యని శ్రీ వైష్ణవులు పెట్టిన అర్వాచీనపు పేరు. ప్రాచీనమైన నామము 'నరహరి'యని శాసనములందు గలదు. విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయ మహారాయలు కళింగము మీదికి దండెత్తివచ్చి గజపతి నోడించినపిమ్మట సింహగిరికి వేంచేసి, ఆ దేవదేవునికి అనేకదానములు సమర్పించెను. అది జరిగినది క్రీ.శ. 1516 సంవత్సరము ఆగష్టు మాసము. ఆ మహారాయలు సింహాద్రిని దర్శించుట కది రెండవసారి. ఆ చక్రవర్తి వేయించిన శాసనమందు స్వామిపేరు సింహాద్రినాథుడనియే యున్నది. సింహగిరిమీదనున్న దేవాలయపు శిల్పము, వాస్తువు బహు రమణీయమైనవి. ప్రత్యేక విశిష్టత కలిగినవి. దేవాలయమునం దొక స్థంభమున్నది. దానికి కోడెదూడలను తెచ్చికట్టి స్వామికి మ్రొక్కుబడి గలవారు సమర్పింతురు. ఆ చెంతనే మరియొక రాతి స్తంభమున్నది. సంతానము లేని పుణ్యస్త్రీలు దానిని కౌగిలించుకొనిన సంతానమును బడయుదురట ! సింహాద్రినాథునకు కళింగప్రజలు వాడుకొనుపేరు "అప్పన్న" లేక, సింహాద్రి అప్పన్న. అప్పన్న క్రమ క్రమముగా అప్పల నరసింహమైనది. అసలు మూర్తి వరాహరూప మని స్థలజ్ఞుల మాట – ఆ స్వామికి చందనయాత్ర యను పేరుతో బ్రహ్మోత్సవము వైశాఖ పూర్ణిమకు జరుగును. అచ్చటి స్థల పురాణమును బట్టి, అక్కడనున్న వరాహమూర్తిని – స్త్రీ రూపముగా నొకప్పుడు బౌద్ధులు ఆరాధించినట్లును, ఆ స్త్రీ రూపము వజ్రవారాహి యనియు ఊహింపవచ్చును. బౌద్ధధర్మమును నాశనము జేసినవారు వారాహి లేక వజ్రవారాహి క్షేత్రమును వైష్ణవ దివ్యక్షేత్రముగా మార్చి, "వజ్రవారాహి' ' శక్తిని ఆది వరాహమూర్తినిగా మార్చియుందు రని ఊహింపవచ్చును. "అప్పన్న" అను పేరుగూడ బౌద్ధము సూచించుచున్నది. ఏమి జరిగెనో అతి ప్రాచీన కాల మందిచ్చట, తెలిసికొనుట కాధారములు లేవు. నేడున్న దేవాలయపు పునాదులలో ప్రాచీన చరిత్రయంతయు లీనమై యుండనోపు. స్థల పురాణముకూడ శ్రీ వైష్ణవుల చేతులలో బడి ఆనవాలు పట్టుటకు వీలులేనంతగా మారిపోయినట్లు అనిపించును.

పంచధారల ధర్మలింగేశ్వరస్వామిగుడి యలమంచిలిలో నున్న ప్రాచీనమును చాళుక్యుల నాటిదియగు దేవాలయమును దిమిలి, నగ్నేశ్వరస్వామి గుడియు ఇత్యాదులు అనేకములు గలవు. యలమంచిలి దేవాలయము ప్రాచీన చాళుక్యశిల్పమును చూపుచున్నది.

ఉభయగోదావరి మండలములలో అతి ప్రాచీనములయిన దేవాలయములు ఎన్నేని గలవు. ఆంధ్రభూమిలో పంచారామములని ప్రసిద్ధిగాంచిన వానిలో దక్షారామ, కుమారారామా, క్షీరరామ, భీమాపురము, అను నాలుగు శివక్షేత్రములు గలవు. దక్షారామ భీమనాథుడు నగ్నపాశుపతమూర్తి. ఒకనాడు భీమనాథేశ్వరునిగుడి పాశుపతశైవ ఆగమమునకును, పాశుపతదీక్ష గొన్న శివయోగులకును ఆటపట్టు. భీమనాథుడు ఆంధ్రదేశమును ఆరువందల సంవత్సరములు అవిచ్ఛిన్నముగ క్రీ. 624 మొదలుకొని ఇంచుమించుగా 1190 వఱకు పరిపాలించిన చాళుక్యరాజ వంశమునకు కులదైవతము. ఆంధ్రదేశమునకు త్రిలింగదేశమని నామాంతరము కలిగించిన విఖ్యాత త్రిలింగము లలో నొకటి యీ ద్రాక్షారామ భీమనాథేశ్వరలింగము. వేంగీ చాళుక్యులకు మాత్రమే గాక ఆదికాలమున ఆంధ్రధరణి నేలిన శాతవాహనులకు కూడ భీమేశ్వరమహాదేవుడు కులదైవముగా నుండినట్లు ఊహించుట కవకాశములు గలవు. దాక్షారామముకంటె ఎక్కువ ప్రసిద్ధిగలది యచ్చటి సప్తగోదావరము. "ఆంధ్రభూభువన మధ్యము పుండరీకంబు సప్తగోదావరజలము తేనె" అని ప్రసిద్ధి. నేడు సప్తగోదావరము ఒక చిన్న మురికిగుంటగా పాడుపడి యున్నది. అక్కడ కుమారారామము సామర్లకోట చెంతనున్నది. కొమ్మర అనే గ్రామముచెంత నుండుటచేత కొమ్మరారామము సంస్కృతమున కుమారారామమయ్యెను. అచ్చట నున్న భీమేశ్వరునకు కుమారభీమేశ్వరుడని ఆదిలో పేరుండినను, చాళుక్యయుగమున చాళుక్య భీమేశ్వరుడని ప్రతినామము కల్గెను. దానికి కారణము గలదు. కొమ్మర చెంతనే మొదటి చాళుక్యభీముడు (క్రీ.శ. 892–922) తనపేరట చాళుక్య భీమవరమని యొక నగరమును నిర్మించెను. కొమ్మెర చాళుక్య భీమవరములో కలిసిపోయెను. కొమ్మెర భీమేశ్వరుడు అంతటనుండి చాళుక్య భీమేశ్వరుడయినాడు. చాళుక్య భీమునిగుడి చాల ప్రాచీనమైన కట్టడము. అచ్చట ఱాతితో నిర్మించబడిన ఉయ్యాల మంటపము గలదు. చూడదగిన విశేషమది. చాళుక్యుల నాటి శిల్పము అచ్చట చూడవచ్చును. గుడిముంగిట ఎత్తైన ఒంటి ఱాతి ధ్వజస్థంభమొకటి గలదు. కుమార భీముని గుడిముంగిటనే ప్రవహించును ఏలేటిపాయ కొమరేరు. చాళుక్య భీమవరమునకు పశ్చిమముగా విష్ణ్వాలయమొకటి రాజనారాయణస్వామి రమ్యమైన దేవళము ఒకటియు కలదు.

గోదావరీమహానది సాగరసంగమమగుచోట అంతర్వేది మహాపుణ్యక్షేత్రము. అంతర్వేదిలక్ష్మీనృసింహదేవుని భవనము చాల ప్రాచీనమైనది. అచ్చటి శిల్పపు చిత్రములను అజ్ఞానవశమున ఏటేటసున్నపు పూతలతో మరగుపరిచినారు. క్షీరారామము నేటి పాలకొల్లు. అచ్చట పూర్వముండిన రమణీయమైన కొలను పాలవంటి నీరుగల తటాకము నేడు కానరాదు. ఈ తటాకమును పురస్కరించుకొనియే యచ్చట వెలసిన మహాదేవునికి క్షీరారామేశ్వరుడని పేరు వచ్చెను. ఈ కాలమున మనవారా ప్రాచీనమైన నామమును మరచిపోయి రామేశ్వరుడను పేరుతో వ్యవహరించుచున్నారు. పాలకొలను నేడు మునిసిపాలిటివారి అధీనమందుండి, పూర్వపు వైభవమునకు ఎగ్గు దలచుచున్నది. పవిత్రమైన ప్రాచీనములను రూపుమాపుటలో సంస్కార శూన్యులయిన మనవారిది అందెవేసిన చేయి. దైవభక్తిలేదు. అందమైనవానిని జూచి ఆనందించెడి సంస్కారము లేదు. అన్నిటి కంటె సొంతలాభం కొఱకు దేవుళ్ళాడటము ముందు తలపు. గుణుపూడి భీమవరము నందు నాల్గవ ఆరామమున్నది. ఆ యూరికి ఆదిలో చిన్న

డాకరేవు యని పేరుండినట్లు ఊహింపవచ్చును. డాకరేమి యనునది దాక్షా రామమునకు పూర్వపు పేరుకావచ్చును. అయిదవ ఆరామము కృష్ణకు దక్షిణపుటొడ్డుననున్న అమరావతి. అచ్చట వేంచేసియుండు వేలుపునకు అమరేశ్వర మహాదేవుడని పేరు. అమరేశ్వరమహాదేవుని గుడి పూర్వమొకప్పుడు బౌద్ధస్తూపముగా నుండిన దిబ్బపై గట్టబడినట్లుతోచును. అమరేశ్వరుని గుడి కృష్ణయొడ్డుననే యున్నది. దాక్షారామభీమలింగమువలె, కుమారారామ చాళుక్యభీమనాథుని లింగమువలె, అమరేశ్వరమహాలింగము కూడ భయంకరమై గన్ప ట్టును. ఒకానొకప్పుడు బౌద్ధస్తూపముల కెదురుగ, నాల్గుదిక్కు లందును, నిలువబెట్టబడియుండిన స్తంభములలో నొకదాని నూడబెరికి ఈ మహాలింగములుగా నమర్చియుందురని యూహింపవచ్చును.

గోదావరి మండలమున పేర్కొనవలసిన దేవాలయములలో భద్రాచల శ్రీ రామచంద్రుని భవనము చాలా ముఖ్యమైనది. అదివఱకు ఏదో ఒక విధముగా నుండిన ప్రాచీన కట్టడమును త్రోసివైచి, కంచెర్ల గోపన్నగారు నేటికిని నిలిచియున్న ప్రసిద్ధ దేవాలయమును గోల్కొండ సుల్తానుల ధనముతో కట్టించినారు. అనధికారముగ గోల్కొండ ధనమును వెచ్చబెట్టినందులకు పండ్రెండేండ్లు కారాగారమున బందిగా కాలము గడపినాడు, నేడున్న దేవాలయము శిలామంటపములు, అంతరాళ, రంగ, భోగమంటపములు ఇంచుమించుగా 250 ఏండ్ల క్రింద కట్టబడెను. భద్రాచలయాత్ర చాల రమణీయమైనది. గోదావరి మీద నూరు మైళ్లు పడవలో ప్రయాణము చేయవలయును. ఆ ప్రయాణమందు గోదావరి పాపికొండలు చొచ్చుకొని అతివయ్యారముగ, కారు మేఘములవలె నుండి, ఉవ్వెత్తుగ వందలకొలది అడుగులు పైకిలేచు కొండల నడుమ మెరుపు తీగవలె, తెల్లత్రాచువలె ప్రవహించును. గోదావరిమీద భద్రాచలము పోవునపుడు, రాజమహేంద్రమున కిరువది మైళ్ళదూరమున నందీశ్వరము, పట్టిసము అను పేరుగల రెండు గుట్టలు, నదీగర్భమున గాన్పించును. – గోదావరిలో ఎంత పొంగువచ్చినను ఈ కొండలు మునిగిపోవు. పట్టిసపు కొండపై వీరభద్రుడు (లింగాకారము) వేంచేసియున్నాడు. దక్షాధ్వర ధ్వంసానంతరము శివుడు తన పట్టిసమును గోదావరి లోనికి విసరి పారవైచినాడు. ఆ పట్టిసమే నేడు కొండగామారి వీరభద్రునికి నిలయమై అలరారుచున్నది.

పశ్చిమ గోదావరి జిల్లా, అనగా గోదావరి దక్షిణపుటొడ్డున నున్న భూమండలము. నేటి నిడదవోలు, తణుకు, భీమవరం తాలూకాలు. ఒకనాడు ఈ ప్రాంతమందు ఆదిమవాసులు నివసించుచుండిరి. శివ పురాణాంతర్గమైన త్రిపురాసుర సంహారకథ ఇక్కడ జరిగినట్లు స్థలపురాణములవలన తెలియుచున్నది. నేడీ ప్రాంతమున నున్న దేవాలయములన్నియు తొల్లిటి కళ దక్కియు న్నవి. తణుకు తాలూకాలో నత్తా రామేశ్వరము రేలంగిలో తాటకేశ్వరుని గుడి, అచ్చటనే శ్మశానవాటిక చెంతనున్న చిత్ర విచిత్రమైన రూపకల్పన గలదియు, ఆ మూడవనేత్రము కలదియు ఒకచేయి గరుత్మంతునిమీదను, కాళ్లుపాదములు లేనిదియు లక్ష్మీనరసింహస్వామిపేరు గల చిత్ర విగ్రహముగల విష్ణ్వాలయము గ్రామదేవత మంటాలమ్మ(మంత్రాలమ్మ కావలయును) గుడి, అవి యన్నియు దర్శనీయములైన స్థలములు, మంత్రాలమ్మ గుడిచెంత ఒకప్పుడు బౌద్ధవిహారమును, స్తూపమును ఉండెను. మంత్రాలమ్మ బౌద్ధుల తాంత్రిక శక్తులలో నొకతె. ఆమె రూపమును నేడు గుర్తింప వీలు గాకున్నది. బౌద్ధధర్మము విలసిల్లి యున్న కాలమునాటి విచారణీయాంశములు అనేకములు ఇచ్చట ద్యోతక మగుచుండును.

పశ్చిమగోదావరీ మండలమున ద్వారకాతిరుమల, లేక చిన్న తిరుపతి అను ప్రసిద్ధక్షేత్రమున్నది. పెద్ద తిరుపతికి పోలేని వారు ఈ చిన్న తిరుపతికి వచ్చి మొక్కుబడులు చెల్లించుకొందురు. ఈ క్షేత్రము అంత ప్రాచీనమైనదికాదు. అయినను ప్రసిద్ధి ఎక్కువ. ఉభయగోదావరులవారికిని ఆ క్షేత్రముపై ప్రీతి, భక్తి మెండు. చిన్న తిరుపతికి భీమడోలు రైలు స్టేషనుదగ్గర దిగి బండి చేసికొని పోవలయును. పిఠాపురమును, సర్పవరమును ఈ సందర్భమున స్మరింపదగినవి. పిఠాపురమున హుంకారశక్తి పురూహితిక యున్నది. ఆ దేవతకీనాడు పూజపురస్కారములు సరిగా లేవు. ఆ దేవికి ఆవాహన లేదు. విసర్జనయు లేదు. ఆదేవి అష్టాదశపీఠశక్తి రూపిణుల నొక్కతె. ఆంధ్రదేశమున అష్టాదశశక్తులలో నాలుగు శక్తిపీఠములు గలవు. ఇన్ని యెక్క దేశఖండమున మరి యొక్కడను గానరావు. పీఠికాపుర హుంకారశక్తి, లేక పురుహూతికా, దక్షవాటి మాణిక్యేశ్వరి, బెజవాడ కనకదుర్గ, శ్రీశైల భ్రమరాంబిక యివి నాలుగును మహాశక్తి పీఠములు. మొదటి దేవతకు తప్ప, మిగిలిన మూడింటికి నేటివఱకు ఘనముగ పూజలు జరుగుచున్నవి.

కృష్ణామండలములో చాలా ప్రశస్తిగల దేవాలయములు పెక్కు గలవు. శ్రీకాకుళమునందు ఆంధ్రవల్లభుడని, తెనుంగురాయడని రెండుపేర్లతో వెలసియున్నాడు శ్రీ మహావిష్ణువు. ఆ దేవుని యానతి చొప్పుననే రచించినాడాముక్తమాల్యదను మహారాయలు శ్రీ కృష్ణదేవ రాయలు. ఆ దేవాలయము మిక్కిలి రమణీయమైనది. ఆంధ్రుల దౌర్భాగ్యవశమున ఆ దేవాలయము నానాటికి క్షీణదశకు వచ్చుచున్నది. శ్రీమంతుడయ్యును ఆ దేవాలయ ధర్మకర్త దానిని సరిగా పాలింపకున్నాడు. దేవాలయముచుట్టును రెండు గజముల మట్టి నెలవేసికొన్నది. దేవాలయము మట్టిలోనికి కూరుకొని పోవుచున్నది. దవన పున్నమికి ఇక్కడ గొప్ప తిరునాళ్ళు జరుగును. శ్రీకాకుళమునకు ఇరువదిమైళ్ళ దూరమున పెదకళ్ళేపల్లి యున్నది. ఆ గ్రామము సముద్రమునకు సమీపముగ నున్నను, కృష్ణానది యా ప్రాంతమునందే సముద్రములో గలియుచున్నను, అతి చిత్రముగ నాయూరిచెంత నుత్తరవాహినియై ప్రవహించుచున్నది. పెదకళ్ళేపల్లి (పెద–కడలి–పల్లి అనగా సముద్రపు టొడ్డున నున్న గ్రామము) యందు దుర్గా నాగేశ్వరుని గుడి యున్నది. నాగేశ్వర శివుడావిర్భవించని ప్రాతఃకాలమున నిచ్చట బౌద్ధధర్మము విలసిల్లి యుండవలయును. దానికి తార్కాణములు గానుపించును. అది యటుండనిండు. అక్కడనున్న దేవాలయము కాకతీయుల కాలమున జీర్ణము కాగా, పునరుద్ధారణము నొందినది. ప్రాత క్రొత్త దేవళములు రెండింటి శిల్పవాస్తువిచ్చట గాననగును. ఆ దేవాలయాల విమానపు బయట గోడలో వినాయకుని విగ్రహ మొకటి గలదు. అచ్చటి వినాయకునికి అయిదుముఖము లున్నవి. ఆ దివితాలూకాలోనే, నంగెగెడ్డ అను ఊరు గలదు. అది యొకప్పుడు పెద్ద రేవుపట్టణము, కృష్ణపాయ యొకటి ఆయూరుచెంతనే, ఒరసికొనుచు ప్రవహించు చుండెను. లోతుగా నుండిన ఆ కృష్ణాస్రవంతి మూన్నూరేండ్లవరకు మంచి స్థితిలోనుండి సముద్రగాములయిన పెద్దజోగులకు కలములకూ రాను పోవను వీలుగా నుండెను. ఆనంగెగెడ్డలో

జీర్ణమయి, శిథిలమయి, రూపుగూడ తొలగిపోవుచున్న నరేంద్రేశ్వర శివాలయము గలదు. ఆ దేవాలయము ఎర్రజాతితో మలచబడిన ఱాళ్లపేర్పుతో కట్టబడినది. అందు చాళుక్యశిల్పమును చక్కగా చూడవచ్చును. చాళుక్య చక్రవర్తులలో నరేంద్రమృగరాజను బిరుదు గల రెండవ విజయాదిత్యుడు కట్టించిన 108 శివాయతనములలో నిది యొకటి గావచ్చును. అధికారు లీభవనమును గాపాడకున్నారు. ఎంత శోచనీయము !

ప్రాచీనమైన శివక్షేత్రములలో నొక్కటి బెజవాడ మల్లీశ్వరుని ప్రాసాదము. పూర్వపు దేవాలయము, చాళుక్యులనాటి దేవాలయము నేడు గానరాదు. ఆనాటి మల్లేశ్వరస్వామికి ఉమామహేశ్వరుడని ప్రతినామముండెను. ఉమామహేశ్వరుని గుడియుండిన చోట నేడు జమ్మిదొడ్డియున్నది. ఆనాటి దేవాలయమునకు చెందిన భోగ మంటప భాగమొకటి శిథిలావస్థయందుండియు, చెన్నుదొఱగియు, రమ్యమైన శిల్పచిత్రములతో ప్రకాశించుచున్నది.

కృష్ణామండలములో పేర్కొనదగిన వైష్ణవక్షేత్రము శోభనాచల వ్యాఘ్రనరసింహస్వామిది. అది బెజవాడకు 24 మైళ్లదూరమున నున్న ఆకిరి (ఆగిరి) పల్లెవద్దనున్న క్రోడాకృతిగనున్న చిన్న కొండ. దానిపై నున్న ఒక గుహలో వెలిసినాడు ఆ దైవతము. ఆ ప్రాంత మంతయు ప్రాచీన కాలమునాటి బౌద్ధశేషములను స్ఫురింప జేయు చుండును. నూజవీడు జమీందారుల వైభవము సన్నగిల్లిన కారణమున శోభనాచల స్వామికూడ చెన్నుదొలగియున్నాడు.

కృష్ణానది కెగువన ముక్త్యాల సంస్థానమున వేదాద్రి యున్నది. అచ్చట లక్ష్మీనరసింహస్వామి యను పేరుతో శ్రీమన్మహావిష్ణువు అవతరించియున్నాడు. కృష్ణాస్రవంతిని ఆనుకొనియున్న గుట్టపైనున్నది దేవళము, ఆగుట్టకే వేదాద్రియని పేరు. ఏ కాలమందునుగూడ ప్రాలేయభానుని కిరణములు స్వామి పాదారవిందములపై ప్రసరించుచుండును. ఆ కొండపై, దేవాలయమునుండి కృష్ణలోనికి పోవుటకు నిర్మింపబడిన మెట్లపై నిలువబడి కనుచూపుమేర కాన్పించు ప్రదేశమును గాంచునపు డారమణీయత ఒడలుప్పొంగజేయును. కుడివైపున పాలేరు కృష్ణానదిని కలియుచోట రావిరేల గ్రామము గలదు. అచ్చట 1500 సంవత్సరములనాడు విష్ణుకుండిన చక్రవర్తు లారాధించిన త్ర్యంబకస్వామి త్రైలోక్యనాథుని గుడి గలదు. నేడాశివాలయ మాపేరుతో లేదు. ఆ ప్రాచీనభవనము కూడ కృష్ణానదీగర్భమునందు అణగిపోయెను. ఎదురుగా కృష్ణకావలగట్టున, కొండపై, ముక్త్యాల కెదురుగా భార్గవక్షేత్రములు గలదు. అది నిజాం రాష్ట్రములో చేరియున్నది. శ్రీనాథుడు వర్ణించిన వేదాద్రి యీ వేదాద్రిమాత్రము గాదు. అది గోదావరియొడ్డున రాజమహేంద్రవరమున నున్నది. ఆ వేదాద్రి నృసింహుని ప్రతిమ ప్రాయశః ఉత్సవమూర్తి కావచ్చును. నేటికిని వేణుగోపాలస్వామివారి యాలయమున నచ్చట పూజింప బడుచున్నది.

కీసర నదియొడ్డున, వేదాద్రికి 20 మైళ్ల దూరమున పెనుగంచి ప్రోలు గలదు. ఆ యూరినందు ఒక కమ్మయువతి భర్తతో సహగమనము చేసి, సతియై దేవతయై వెలసెనట. ఆమెపేరు తిరుపతమ్మ. ఆమెకొక గుడి కట్టిరి. ఏటియొడ్డున ఒక విశాలమైన ప్రదేశమందు తిరుపతమ్మ పేరంటాలును బ్రాహ్మణుడు మొదలుకొని హరిజనుడు వఱకును భక్తిగౌరవములతో గొలిచెదరు. భర్త కుష్ఠరోగి; అరణ్యమున పశువులను మేపుకొనుచుండగా పెద్దపులి యాతనిపై బడి సంహరించెను. అది జరిగిన మూడు నాలుగు దినముల కాతని కాలి చెప్పులును, చేతికర్రయు ఆనవాలుగా దొరికెను. ఆతని శకలముపై సహగమన మొనర్చెను. ఆ యువతి తిరుపతమ్మ.

గుంటూరు జిల్లాలోని కోటప్ప కొండమీదనున్న త్రికోటీశ్వర మహాదేవుని, మంగళగిరి పానకాలరాయని, అమరావతియందున్న అమరేశ్వరుని పేరును ఎరుగని ఆంధ్రులుండరు. త్రికోటీశ్వర శివుడు, పంచారామ క్షేత్రములందువలె దక్షిణామూర్తి. ఆ మహాదేవుడు ఇంకను పార్వతీ వల్లభుడు కాలేదు. దక్షాధ్వర ధ్వంస కాలమున శివపత్ని దక్షాయణి సతీత్వము నొందెను. కావున పంచారామములందును, కోటప్ప కొండయందును వెలసిన శివలింగములకు శివరాత్రినాడుగాని, మరియెన్నడు గాని కళ్యాణోత్సవము లేదు. పంచారామ శివులకును తెలివిమాలిన పూజారులు ప్రక్కను పార్వతి ప్రతిమను ప్రతిష్ఠించి పూజాదు లొనర్చుచున్నారు. అట్టిపని శైవాగమములకు విరుద్ధమైన యాచారము. దేశమునకు అనర్థదాయకము. ప్రజలకు పీడాకరము. ఇతర తావులందెట్లున్నను కోటప్పకొండ మీది త్రికోటీశ్వర శివునకు కల్యాణోత్సవమును దీక్షగా జరుపరు. ఆ దేవుని మహిమకు అచ్చెరువంది, సాళువ తిమ్మరుసు మహాప్రధాని, కోటప్పకొండకు ఎదురుగా నున్న కొండకావూరు గ్రామమును సర్వకర పరిహారముగా ఆ దేవుని త్రికాల పూజలకు, ఇతర ఉత్సవాలకు దేవమాన్యముగా ధారవోసెను. కాని ఈనాడు ఆ గ్రామము త్రికోటీశ్వర మహాదేవునికి జెల్లుట లేదు.

మంగళగిరి నృసింహునికి పానకము ఇష్టమైన పదార్థము. దేవునికి రూపము లేదు. చిన్నది యొక బిలద్వారమున్నది. దానికే ప్రతిమా ముఖమును అలంకరింతురు. పానకాల రాయని మహిమయు, చిదంబర రహస్యమును నొక్కపోలిక నున్నవి. ఎందుచేతనో ఏ మహిమ కారణముననో నివేదనకు, స్వామివారి ఆరగింపుకు తెచ్చిన పానకములో సగము ఆ దేవుని నోటిలో బోయుసరికి ఒక శబ్దము వినబడును. శాస్త్రజ్ఞులు, నాస్తికులు అయినవారు కొందరు మంగళగిరి అగ్నిపర్వతమనియు, దాని గర్భగోళమందు గంధకమున్నదనియు, అది పాతాళముననున్న అగ్ని వేడిమికి కరగి పొంగి పైకి ప్రవహించకుండ ప్రాజ్ఞులయిన పూర్వులు–స్మృతికి అందని ప్రాచీన కాలమున దివ్యక్షేత్రముగా నొనరించి గంధకమునకు విరుగుడు అయిన బెల్లపు పానకమును నివేదించి, ఆరగింపు చేయుచుందురనియు పలుకుచుందురు. మంగళగిరి కొండమీద ప్రాచీన చిహ్నములు కొన్ని గలవు. బౌద్ధయుగమునాటి గుహలు ఆ కొండమీద కూడ నుండెను. వాటిని వైష్ణవాచారమును ప్రబలముగ దేశమునందు విస్తరింపజేయు తలంపుతో, ఆ స్మృతికి అందని కాలమున మొదలంట భేదించివైచిరి. వాటిమీదనుండిన శాసనములు గూడ నాశనమైపోయి యుండవచ్చును. చేజెర్ల కపోతీశ్వరాలయము చూడదగినది. ఆ దేవాలయముకూడ చాలా ప్రాచీనమైనది. ఇంచుమించుగా 1500 సం.ల నాడు కట్టబడిన దాభవనము. బౌద్ధోపాసకుల చైత్యగృహముగానుండిన భవనము కొద్దిమార్పుతో శివాలయముగా మారిపోయెను. ఎన్ని ఘటముల నీరు తెచ్చి అభిషేకించినను, ఒక్క చుక్కయిన నిలవక, భూగర్భములోనికి పోవును. ఆ శివలింగములకు రెండు రంధ్రములున్నవి. ఒక రంధ్రములోనుండి ఎటకు బోవునో తెలియరాదు.

బాపట్లకు బూర్వపుపేరు ప్రేంపల్లి. భావనారాయణ స్వామియను పేరు వెలసిన శ్రీ మహావిష్ణువునకు ప్రసిద్ధమైన దేవళమున్నది ఆయూరను. భావనారాయణ స్వామి ప్రఖ్యాతివల్ల ప్రేంపల్లి భావనారాయణ స్వామిపట్టణ మయ్యెను. భావనారాయణ పట్టణము భా పట్టణమై, చివరకు నలుగురి నోటిలో పడి బాపట్ల యయ్యెను. బాపట్ల వ్యవహారములోనికి వచ్చిన తరువాత ప్రేంపల్లిని జనులు మరచిపోయిరి. భావనారాయణుని గుడి చాలా ప్రాచీనమైనది. భావనారాయణుని పేరుతో విష్ణ్వాలయములు – ఒకటి పొన్నూరునందును, మరియొకటి గంజామునందుగూడ గలవు. పెదచెఱకూఱు, కొణిదెన (కొట్యదొన, మాచర్ల మొదలయిన తావులందుగూడ ప్రాచీన దేవాలయములు) గలవు. మొదటి రెండూళ్ళయందును శివాలయములు అచ్చట ఒక కాలమున రాజధాని చేసికొని ఏలిన తెనుగు చోడవంశములకు – కులదైవతములకు నిలయములు. అవి చూడదగినవి. నాచెర్ల చెన్నకేశవునికి ప్రసిద్ధి. ఆ దైవతము పల్నాటికి ఇలవేల్పు. చెన్ననిగుడి ప్రాచీన శిల్పముతో చెలువారుచుండును. పల్నాటి వీరుల కథను సాక్షీభూతుడై తిలకించినాడాదైవము.

అమరావతికంటెను మిక్కిలి ప్రాచీన తరమైనది చేబ్రోలున నున్న మహాసేనుని రమ్యభవనము. కాని యా దేవళముయొక్క గోడెరిగించువారు లేరు. చేబ్రోలుకు పూర్వపు పేరు తాంబ్ర (తామ్ర) పురి. తామ్రపురియే కాలక్రమమున ప్రాకృతమున 'చేంబ్రోలు 1) అయినది. పల్లవుల రాజ్యాధికారము కృష్ణ దక్షిణపుటొడ్డువఱకు వ్యాపించిన, క్రీ.శ. 3, 4, 5, 6 శతాబ్దముల కాలమున పల్లవ రాజ ప్రతినిధికి తఱచుగా యువ మహారాజునకు తాంబ్రపురి స్థానము ఉపరాజధానిగా నుండెను. అన్ని స్థానములందున్న మహాసేనుని గుడికంటెను తాంబ్రపురిస్థానమునందు వేంచేసియున్న మహాసేనుని ప్రసిద్ధి ఎక్కువ.

ఒకనాడు వేయేండ్లకు పూర్వము వరకు ఆంధ్రదేశమున మహాసేనునికి పూజలు అతివైభవముగా సాగుచుండెను. చరిత్రకు అందని మిక్కిలి ప్రాచీనకాలమునుండి మహాసేనుడు, కార్తికేయుడు, కుమారస్వామి, షణ్ముఖుడు, స్కందుడు ఇత్యాదిపేళ్లతో శివకుమారుడు బాలదైవతము పూజలందుచుండెను. శాతవాహనులలో చాలమందికి, పల్లవరాజులకు కొందరికి "స్కంద" శబ్దముతో చేరిన స్కందస్వాతి, స్కందస్థంభి, శివస్కందనాగ, స్కందవర్మ ఇత్యాదిగాగల పేర్లుండెను. స్కందుపేరిట అనేక నగరములు, పట్టణములు వెలిసెను. అట్టివే కాందాళి (స్కందవల్లి), కందుకూరు (స్కందకూర), కందనోలు (కర్నూలు= స్కందప్రోలు) మొదలయినవి చాళుక్యులు, వారి పూర్వులు కదంబులు, ఇక్ష్వాకులు, శాతవాహనులు అందరును మహాసేనుని పూజలు చేసినవారలే. చాళుక్యులు తాము 'స్వామి మహాసేన పాదానుధ్యాతుల'మని, 'కార్తికేయ పరిరక్షితులమని చెప్పుకొనిరి'.

కర్నూలు జిల్లాలో ప్రసిద్ధమయిన దివ్యస్థలములు చాలగలవు. వాటి అన్నింటిలోను గొప్పది జగత్ప్రఖ్యాతిగాంచినది శ్రీ శైలము. అది నందికొట్కూరు తాలూకాలో ఉత్తరమున కృష్ణానది యొడ్డున నున్న మహానగరము. దానికే శ్రీ పర్వతమని, శ్రీగిరియని, శ్రీ శైలమని పెక్కు పేళ్ళు గలవు. అచ్చట కృష్ణకు పాతాళగంగ అని ప్రఖ్యాతనామము. శ్రీ పర్వతమన్న పేరు బౌద్ధులకు ప్రియమైన నామమగుటవలన బ్రాహ్మణ ధర్మావలంబకులు ఆ పర్వతమునకు శ్రీశైలమని రూఢిచేసిరి. ఆంధ్ర కర్ణాటక మహారాష్ట్రులకు ముప్వరకును శ్రీశైల మల్లికార్జునదేవుడు ప్రధాన దైవము. అందువలననో, మరి యే కారణముననో, శ్రీ శైలము పేరు తలచకుండ వారు సంధ్యావందనము వల్లించరు. ఔత్తరాహులకు మేరువువలె, దాక్షిణాత్యులకు అందు ముఖ్యముగ ఆంధ్రకర్ణాటక మహారాష్ట్రులకు వారి వేశవ దేశము వారున్న స్థానమును నిర్దేశించుటకు శ్రీ శైలమును శ్రీశైలస్య 'ఈశాన్య'మని, ఆగ్నేయమని, పశ్చిమమని, వాయవ్యమని పేర్కొనుచుందురు. శ్రీశైలము ప్రధాన క్షేత్రము. నాల్గు దిక్కులందు, దానికి ద్వారములని పేరువడిన సుప్రసిద్ధ శైవక్షేత్రములు గలవు. అవి తూర్పున త్రిపురాంతకము; దక్షిణమున సిద్ధవటము; ఉత్తరమున అలంపురము; పశ్చిమమున మహానందీశ్వరములు. శ్రీ శైలశివుడు పార్వతీ వల్లభుడు, సాంబుడు. శ్రీశైలదేవాలయ శిల్పము చాల రమణీయమైనది. చాళుక్యులనాటి దేవాలయ భవనము నేడుకానరాదు. విజయనగరశోభతో వెలుగొందు శిల్పము, వాస్తు మాత్రమే నేడు మనము చూచెదము. త్రిపురాంతకము నందలి త్రిపురాంతక శివాలయము అతిరమణీయమైన ప్రాచీన శిల్ప చిత్రములతో వెలుగొందుచుండును. దేవాలయము గాయత్రీ మంటపాకారముపై నిర్మింపబడియున్నది. అచ్చటి కనతిదూరమున కదంబవన వాటిక యున్నది. చెంతనున్న పెద్దచెరువునకు గట్టుమీద కదంబవృక్షములు గలవు. కదంబవనవాసిని యగు అంబ లలిత అను పేరుతో అచ్చట వెలసియున్నది. శ్రీవిద్యోపాసకులు అచ్చటి కదంబవనవాసిని చెంత తపమాచరించి సిద్ధిపొందుదురు. సాధారణముగా, ఏడాదికి సగము కాలము ఆ కదంబవనవాసిని గుడి నీటిలోనుండును. అచ్చట ఒక ఱాతితొట్టి గలదు. పశుబలి వేసిన తరువాత దానిని రక్తముతో నింపుదురు. దుర్గాష్టమినాడు ఆ జగజ్జననికి బలివేసిన పశువుల రక్తము ఆ తొట్టియందిట్టె ఇంకి పోవును. ఇతర రోజులందు అట్లు జరుగదు. అచ్చటి అంబ అతి భయంకర రూపిణి. భక్తులు సయితము కన్నెత్తి యాశక్తిని చూడవెఱతురు.

మహానందీ క్షేత్రము చూడ మిక్కిలి రమ్యమైనది. అది గాజులపల్లి స్టేషనుకు 4 మైళ్లదూరమున అడవి మధ్యన నున్నది. ఎక్కడనో కంటికి కానరాని చోట ఒక నీటిదొన ఉన్నది. అందుండి నీరు క్రమముగా వచ్చి, మహానందీశ్వర శివలింగముయొక్క అడుగుభాగమునుండి ప్రవహించుచు, గుడికెదురుగా నున్న శిలా నిర్మిత కుంటలో పడును. ఆ నీరు అతి నిర్మలమైయుండును. నీటి మట్టమున పడిన చిన్న నల్లపూసయైనను, సూదియైనను ఆ నీటి యందు స్పష్టముగా కనిపించును, ఆ నీరు అద్దమువలె నుండును. గుండ్లకమ్మనది మహానందీశ్వరమునకు తూర్పుగా నున్న కొండలలో జనించును. అచ్చటి కొండలు సుమారు 3000 అడుగులు ఎత్తుండును. గుండ్లకమ్మ ఉద్భవించిన తావున గుండ్ల బ్రహ్మేశ్వరము గలదు. చూడదగిన ప్రకృతి సౌందర్యము కలదచట.

కర్నూలు మండలములో పేరెన్నికగన్న విష్ణు క్షేత్రము అహోబలము. అదికూడ చాల ప్రాచీనమైన క్షేత్రము. కొండదిగువను అహోబలము, కొండమీదన ఎగువ అహోబలమును గలవు. అహోబలమును కొందరు అహోబిలము అని వ్యవహరింతురు. అది ప్రమాదజనితము. అహోబలము

గనుకనే తెనుగునోటను ఓబలమయినది. ఓబయ్య, ఓబలయ్య, ఓబల ఇత్యాదులు వాడుకలోనికి వచ్చియున్నవి. అచ్చట ప్రహ్లాదునికి శ్రీ మహావిష్ణువు నరహరి రూపమున దర్శనమిచ్చి రక్షించెనని స్థానికులు తెలుపుదురు. చూడదగినది రమ్యమైన శిల్పమున్నది. దిగువ అహోబలమునందు ఎగువ అహోబలము మహాత్మ్యముతో కూడినది. దిగువ అహోబలమునకు 4 మైళ్ల దూరమున నున్నది. ఆ కొండచెంతనే వడిగా ప్రవహించు వాగునకు భవనాశి అని పేరు. నృసింహుడు చెంచులక్ష్మిని వలచి పెండ్లియాడిన కతన చెంచుజాతికి అహోబలస్వామి కులదైవమయినాడు. ఎగువ అహోబలమునందు ప్రకృతిచేత నేర్పడిన యొక గుహయందు స్వామి వెలసినారు. చెంతనే వసించియుండును చెంచులక్ష్మి. అందులకు ఆదిలక్ష్మి భర్తపై కినిసి, మోముకొండ కొనమీద నివాస మేర్పరచుకొన్నది. మోముకొండ భీతికొలుపు పెద్దకొండ. అక్కడ కొంత దరిని, అడుగు వెడల్పుగూడ లేని స్థలమందు అటుప్రక్క పాతాళమును చూపించు గోడవంటి కొండ భాగము చెంత, ఉక్కుస్తంభము గలదు. బిడ్డలు లేని పుణ్యాంగనలు ఈ కంబమునకు ప్రదక్షిణము చేసి ఆలింగనము చేసికొందురు. మహాలక్ష్మి అనుగ్రహించి బిడ్డలను ప్రసాదించునని భక్తులు విశ్వాసముతో ప్రాణములకైన వెఱవక సాహసించి అటకు పోవుదురు. అహోబలము హిరణ్యకశిపుని పట్నముగా నూహించుకొనవచ్చును. అహోబలప్రాంతమునకు హిరణ్యరాష్ట్రమని పూర్వకాలమునుండియు పేరు. హిరణ్యరాష్ట్రము నేలిన ఆదిమ నివాసుల రాజులు హిరణ్యాక్ష హిరణ్యకశిపులు. ఈ విధముగా ఊహలు తీగెలుగా తీసి ఎంతేని వ్రాయవచ్చును.

కడప జిల్లాలో ప్రఖ్యాతములయిన దేవాలయములు ఎక్కువగానరావు. రాయచోటి వీరభద్రేశ్వరస్వామి, పుష్పగిరి చెన్నకేశవుడు, నందలూరు సౌమ్యనాథేశ్వరశివుడు – ఈ మూడు ప్రాచీనములు. రాయచోటి వీరభద్రుడు మహామహిమ గలవాడట: ఆతని సన్నిధిని తేళ్ళు త్రొక్కిననుకూడ కుట్టవట ! పుష్పగిరి కొండ దరిని, పెన్న యొద్దున అతి రమణీయమైన శిల్ప సౌందర్యముతో విరాజిల్లు చెన్నకేశవుని గుడిని ఎంత చూచినను తనివితీరదు. ఆ దేవుడు మాత్రము విభవము ఏమాత్రమఉరి లేక అల్లాడుచున్నాడు. అర్చనాదులు చేయుటకు అవసరమైన పంచపాత్రము, ఉద్ధరిణె, హరివాణములు ఇవి కూడ నుండకుండ దొంగలెత్తుకొనిపోవుచుందురు. నందలూరి సౌమ్యనాథేశ్వరుని గుడి చాలా ప్రాచీనమైనది. పూజాపునస్కరములు కూడ జరగని పేదస్థితిలో నున్నది ఆ గుడి.

చిత్తూరులో ప్రసిద్ధక్షేత్రములున్నవి. అందొకటి తిరుపతి. జగమెరిగిన తిరుపతిని గురించి తెలుపుట అనవసరము. ఆంధ్రులకు మేటివేల్పు తిరుపతి వేంకటరమణుడు. ఏడుకొండలవాడు. వడ్డికాసులవాడు. భక్తులు మ్రొక్కిన మ్రొక్కులు చెల్లింపనిచో విడువని వాడు. కృష్ణరాయలీ దేవదేవుడిని దర్శనార్థము అరు యాత్రలు చేసెను. ఆ రాజశేఖరుడు సమర్పించిన దానములన్నియు చూచినచో తిరుపతిదేవుని ఐశ్వర్యము లెక్కపెట్టుటకు వీలుకాదు. ఆ రాజచంద్రుడేగాదు, వరుసగా విజయనగర చక్రవర్తులందరును సమర్పించిన దానములకు మితిలేదు. ఆ ఐశ్వర్యములోనొక శాతంశమే నేడు మిగిలియున్నది.

తిరుపతికి అనతి దూరముననున్నది శ్రీకాళహస్తి. సువర్ణముఖినదియొద్దున, కాళహస్తీశ్వరుని గుడి తిరుపతికంటె ప్రాచీనమైనది. కాని నేడున్న భవనము మాత్రముకాదు. ఒక నాటు కోటిచెట్టి ధర్మమాయని యీ నూతన భవనము వెలసినది. పంచభూతాత్మకములయిన అయిదు శైవక్షేత్రములలో నిది యొకటి. ఇచ్చట నున్నది వాయులింగము. నిత్యము పచ్చకప్పురము కలిసిన ఉదకముతో శివలింగమున కభిషేకము గావింతురు. శివలింగమునకు కుడిప్రక్కనున్న అఖండదివియలలో నొక్కటి మాత్రము, ఏ గాలియు వీచకపోయినను ఎప్పుడు నిరంతరము అల్లలనాడుచునుండును. అదియే ఇచ్చటి చిత్రము. కృష్ణరాయలు కట్టించిన నూరుకాళ్ళమంటపము, అక్కన్న మాదన్నగార్ల మంటపము ఇచ్చట చూడదగినవి. కాళహస్తీశ్వరుడు కవిధూర్జటికిష్టదైవము. కాళహస్తీశ్వరుని శివశక్తిపేరు జా క్షనప్రసూనాంబిక. శ్రీశైలముందఉద భ్రమరాంబిపీఠమున్నట్లు ఇక్కడ శ్రీ చక్రము లేదు. ఈ దేవత అష్టాదశశక్తులలో చేరలేదు. కాళహస్తికి 15 మైళ్ళదూరమున సువర్ణముఖియొద్దునే గుడిమల్లమను గ్రామమున్నది. ఒకప్పుడది నగరము. మహా బలి వంశజులైన రాజవంశమునకు రాజధాని. అచ్చట పరశు రామే శ్వరుని గుడియున్నది. చాల ప్రాచీనమయిన, అచ్చటి పరశురామేశ్వరశివలింగము పురుషచిహ్నాకారముగ నుండును. అట్టి శివలింగములు తఱచుగా గానరావు. అట్టివాటని వ్రేళ్లమీద లెక్కింపవచ్చును. అచ్చట గర్భగుడియాకారము గూడ బౌద్ధగృహమును తలపునకు దెచ్చును.

కడప, చిత్తూరు జిల్లాలకు అంటి తూర్పుననున్న నెల్లూరు జిల్లాయందు పేర్కొనదగిన దేవాలయములు కొద్దిగా నున్నవి. నెల్లూరుచెంత పెన్ననది యొకప్పుడు రెండు పాయలుగా చీలి కొంత దవ్వు ప్రవహించిన తరువాత మరల కలసి యేకస్రవంతిగా పారెను. అపుడొకలంక ఏర్పడెను. ఇపుడా లంక పూడిపోయినది. ఆ లంక యుండిన కాలమున, అక్కడ నున్న రాతిగుట్టమీద పన్నగ శయను డైన విష్ణువు రంగనాయకస్వామియను పేరుతో వెలసెను. నదియెక్కడ రెండుపాయలు చీలి, లంకపోసి, మరల ఏకమయి ఒక్కటిగా ప్రవహించునో, అచ్చటనెల్ల రంగనాయకు డవతరించును. నెల్లూరి శ్రీ రంగనాయకస్వామి చాలా ప్రసిద్ధిగల దైవము. గుడిగూడ చాలా మనోహరముగ నుండును. "పెన్నదాటితే పెరుమాళ్ళసేవ"యను నుడి తల్పగిరిశయనుడైన యీ రంగనాథుని గూర్చి పలికిన ట్లూహింపవచ్చును.

కందుకూరులో నేడు స్కందుని దేవాలయము కానరాదు; ఎచ్చట నుండెనో కూడ ఎఱుగరాదు. కాని కందుకూరు జనార్దనుని దేవాలయము చాలా ప్రఖ్యాతిగాంచెను. బహుసుందరమైన జనార్దనుని గుడిప్రాచీనమైనది. ఎంత దేవభోగమున్నను స్వామికి నిత్యము పూజలు జరుగుటే కష్టముగ నున్నది. కవి యెవ్వడో, అజ్ఞాతుడు చాటువుగా, భక్తిపరవశుడై కుందుకూరి జనార్దనుని పేరట శృంగారభావములను గూర్చి, నాయికారూపమున ఒక అష్టకమును పాడి మొఱపెట్టుకొన్నాడు. అతి మనోహరముగ నుండును ఆ కందుకూరి జనార్దనాష్టకము.

అనంతపురం జిల్లాఓ ప్రఖ్యాతిగన్న దేవాలయములు మూడింటిని యుదాహరింపవచ్చును. తాడిపర్తి రామేశ్వర శివాల యము మొదటిది. ఆ దేవాలయశిల్పమును గూర్చి, దాని సౌందర్యమును వర్ణించుచు ఎంతేని వ్రాయవచ్చును. అంత అందమైన దేవాలయము ఆంధ్రదేశములోనే

లేదన్నచో అతిశయోక్తి కాజాలదు. ఆ దేవాలయము శిథిలావస్థలోనికి వచ్చుచున్నది. దానిని రక్షించు దాత లేదు. అచ్చట ఆ దేవల మున్నతావునందు పెన్న ఉత్తరవాహినియై ప్రవహించును. దేవాలయము పశ్చిమ ముఖమైయున్నది. తాడిపర్తి రామేశ్వర శివుని క్షేత్రము ఆ కారణ మున కాశికి తుల్యమైనదని ఆగమవేత్తల అభిప్రాయము.

సౌందర్యఖనియై, శిల్పచిత్రములతో, వర్ణచిత్రములతో అలరారు దేవాలయము లేపాక్షియందున్నది. లేపాక్షిగుడి వీరభద్రునిది. కాని యా దేవాలయముందు వీరభద్రుని గర్భగుడి కిరు పార్శ్వములందును రెండు చిన్న దేవాయతనములు గలవు. వాటిలో ఒక వంక పాపవినాశదేవరశివలింగమును, మరి యొకవైపు రఘునాయకుని ప్రతిమయు గలవు. రంగమంటపమున నల్లరాతిపై చెక్కిన విగ్రహములు అతి మనోహరములు. లేపాక్షిగుడిలో ఒక వింత గలదు. అందొక మంటపమందు అన్ని స్తంభములతోపాటు శిల్పపు పనితో అలరారుచు అన్నింటివలెగాక పైనుండి క్రిందికి వ్రేలాడు స్తంభమొకటి గలదు. ఆ స్తంభముయొక్క అడుగుభాగమునుండి ఒక కాగితమునుగాని, చేతిరుమాలును గాని పఱచి తీయవచ్చును. లేపాక్షి గుడిలో అచ్చుత దేవరాయలనాటి చిత్తరువులు, మంటపముయొక్క పై భాగమున గానవచ్చును. ఆ చిత్తరువులందును దేవాలయ ప్రాసాదము చుట్టును, రాతిబొమ్మలందును శివపురాణ కథలు, శివలీలలు, ముద్దులు మూటగట్టు సౌందర్యముతో శిల్పి రచించినాడు. అత్యద్భుతముగ రాతిలో గండరించినాడు. ఆ దేవాలయమందే పూర్తిగా నిర్మితముగాని కళ్యాణమంటపమున్నది. దాని సౌందర్యముకూడ వర్ణనాతీతము.

అనంతపురము జిల్లాలో మిక్కిలి ప్రఖ్యాతిగల విష్ణుక్షేత్రము కదిరి; లక్ష్మీనరసింహస్వామిది. అదియు ప్రాచీనవిజయనగర శిల్పము అచ్చట గాననగును. బహుఅరిది అయిపోయిన ఒక పాటలీవృక్షము ఆ దేవాలయమునందున్నది. ఆ చెట్టు పువ్వులు ఏ నెలలో పూచినను వాటి వాసన ఆరునెలలవఱకు అట్లే నిలచియుండును. మన యంధ్ర దేశపు దౌర్భాగ్యము కతన అట్టి పాటలీవృక్షము లెన్నో దోహదము లేక నశించిపోయినవి. కదిరి దేవాలయమందు చాళుక్యుల నాటి ప్రాచీనశిల్పము గానవచ్చును.

విజయనగర చక్రవర్తు కులదైవము హంపీ విరూపాక్ష శివలింగము. ఆ దేవాలయము తుంగభద్రాతటమందు ప్రాచీన విజయనగర ప్రాకారమందున్నది. విరూపాక్షుని దేవేరి పంపాదేవి పార్వతి అంశను వెలసిన దేవత. కాని విరూపాక్ష సన్నిధిని పరాశక్తి భువనేశ్వరి గలదు. భువనేశ్వరీ మంటపము నల్లరాతియందు మలచబడిన బహుసున్నితమైన శిల్పచాతుర్యముతో సౌందర్యము వెదజల్లుచుండును. విద్యారణ్యమాధవులు ఆరాధించిన పరాశక్తి యీ భువనేశ్వరియే. ఈ శాంకరీ శక్తి అష్టాదశపీఠములలో నొక్కటి. హంపీ క్షేత్రము కిష్కింధరాజ్యములోనిది. అది వాలిసుగ్రీవుల రాజ్యసీమ. విరూ పాక్షస్వామిసన్నిధిని కృష్ణరాయలు పట్టాభిషిక్తుడైనాడు. విరూపాక్ష శివుని తిరునాళ్లు జరుగుచుండిన దినములలో ఆ మహోత్సవ మును తిలకించుటకు కృష్ణరాయలు వచ్చుచుండెడి వాడట. ఆ మహారాయలు వేంచేసియుండు శిల్పమంటపమును స్థలజ్ఞులు నేటికిని విరూపాక్ష దేవాలయమున కెదురుగానున్న రాజవీధి యందు చూపుచుందురు.

ఇంతవఱకు పూర్వాంధ్రదేశములోని దేవాలయములనే అంతరిక్షమార్గమున బోవుచు చూచినట్లు చూచితిమి. పశ్చిమాంధ్ర మందు, తెలంగాణమునందెన్ని గలవో వాటినన్నింటిని తిలకించి వచ్చుటకు అవకాశము లేదు. కాని మూడు నాల్గింటిని మాత్రము చూచిరావలయును. అట్టివాటిలోమొదటిదికాళేశ్వరము. అది త్రిలింగములలో నొక్కటి. కొందరు తెలియనివారు, దక్షారామ, శ్రీశైల, కాళహస్తీశ్వరలింగములని వాదింతురు. అప్పకవి చెప్పనే చెప్పినాడు. త్రిలింగము లెవ్వియో– శ్రీ శైలదక్షారామ కాళేశ్వరములని. కాళేశ్వరమహాలింగము గోదావరిలో మిన్నేరు సంగమించుస్థలమున నున్నది. అది కరీంనగరు జిల్లాలో, మహాదేవపురం తాలుకాయందున్నది. రెండవది వరంగల్లు జిల్లా పాకాలచెఱువు ఒడ్డున ఉన్న రామప్పదేవాలయము. కాకతీయుల నాటి అప్రతిమాన శిల్పముతో జీవ ముట్టిపడునట్టి నల్లరాతి గండారపు బొమ్మలతో అత్యంతరమణీయముగ నుండును ఆ భవనము. మూడవది సహస్రస్తంభదేవాలయము. ఓరుగంటికి సమీపమున నున్న అనుమ కొండయుందున్నది. కాకతీయశిల్పకళా వైభవమును జాటుచున్నది ఆ వేయిస్తభాలగుడి.

ఈ మహాంధ్రభూమిని ఏవంవిధములయిన దేవాలయములు ఎన్నెన్నోగలవు. దేశమంతటను ఇన్ని దేవాలయములు నిర్మింపబడుటకు గారణమేమి? ప్రజల జీవనమునందు దేవాలయమునకు స్థాన మెట్టిది? దేవాలయముల వలన ప్రయోజనమేమి? దేవాలయముల ప్రభావ మెట్టిది? అను ప్రశ్నలనేకములు మనల నపుడప్పుడు ఆలోచనలకు దింపు చుండును. ఒకసారి దేవళములయొక్క చరిత్రను పరికించి, స్రవించిపోయిన కాలమును సింహావలోకనము చేయగలిగినచో, అనేకవిచారణీయంశములు బుద్ధికి గోచరించుచుండును.

దేవాలయ ప్రతిష్ఠ సప్తసంతానములలో నొకటి. ప్రాచీన కాలమునుండియు ప్రాజ్ఞులయిన శ్రీమంతులు తమ పుణ్యముకొఱకో, తమ తండ్రులు ప్రభువులు మిత్రులైనవారి పుణ్యముకొఱకో సప్తసంతానములను నెలకొల్పుచుండిరి. దేవాల య ప్రతిష్ఠకు ధర్మము, నీతి, ఆస్తికత యివిమాత్రమే జనులందు వ్యాపింపజేయుట గాదు మొదటి యుద్దేశము. సప్తసంతానములు అన్నియు కూడ నొక మహత్తమమైన ఉత్తమ ఉద్దేశముతో సంకల్పింపబడెను. సప్తసంతానము లనగా, తటాకము (త్రవ్వించుట), నిధి(పాతిపెట్టుట), అగ్రహారము (దానము చేయుట), దేవాలయము (ప్రతిష్ఠించుట), వనము (వేయించుట), ప్రబంధము (కృతిని స్వీరకించుటగాని, రచించుటగాని), పుత్రుడు అనునవి. ఇవన్నియు ఒకానొక సత్ప్రయోజనమును సాధించుటకు ఏర్పడెను.

ఆంధ్రదేశమున దేవాలయ నిర్మాణము, ప్రతిష్ఠ ఎప్పుడు ప్రారంభమయ్యెనో యథార్థముగ తూచి చెప్పుటకు వీలుపడదు. పల్లవమహారాజుల దానశాసనపములలో, ఆ నాటికే ప్రతిష్ఠింపబడిన దేవాలయములు రెండు పేర్కొనబడినవి. అంతమాత్రమున దేశమందు ఆ రెండే దేవాలయములుండెనని యూహింపరాదు. కృష్ణానది యొడ్డున, ఎక్కడో, దాలూరను గ్రామమందు శ్రీమన్నారాయణునికి కూళిమహాతారకమని పేరుతో నొక దేవాలయముండెనట. ఈ దేవకులమును పేర్కొన్న దానశాసనము క్రీ.శ.290 ఆ ప్రాంతమునాటిది నెల్లూరు జిల్లా కందుకూరున,

విష్ణువర్మ సేనాపతి నిర్మించిన విష్ణుహారదేవరగుడి యొకటి క్రీ.శ.350 నాటిది రెండవది. కళింగభూమియందు టెక్కలి, శ్రీకాకుళం ప్రాంతములందున్న రోహణకి (నేటికోణన్కి) గ్రామమున ఒక విష్ణ్వాలయము శ్రీమన్నారాయణునకు ఉండెనని తెలియుచున్నది. ఆ దేవుని హస్తివర్మ మహారాజు, సప్తార్ణవశయను డనియు, సప్తసామోపగీతుడనియు, సప్తలోకైకనాథుడనియు, రణభీతోదయప్రతినామదనియు స్తుతించినాడు. హస్తివర్మ క్రీ.శ. 9 వ శతాబ్దము చివర రాజ్యము చేసినాడు. కావున రోణంకి దేవాలయము క్రీ.శ 575 నాటిదై యుండవచ్చును. చాళుక్య నృపాలశేఖరుడు రెండవ విజయాదిత్యుడు, రాష్ట్రకూటరాజులతో 108 యుద్ధములు చేసి ఆయా యుద్ధములు జరిగిన చోటులందు 107 శివాలయములను తొమ్మిదవ శతాబ్దాదిని నరేంద్రేశ్వర మహాదేవుడను పేరుతో నిర్మించెను. అతని వంశజుడు మొదటి చాళుక్యభీముడు, శత్రువులను గెలుచుటకు యుద్ధములుచేసి పిమ్మట చాళుక్యభీమవరమను నగరమును నిర్మించి యందొక శివాలయమును నిర్మించెను. అదియే కుమారారామము గావచ్చును. ఆ రాజచంద్రుని వంశజుడగు రెండవ అమ్మరాజు బెజవాడనగరమందు 'అప్మద్దేశ సంతత్యాయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధ్యర్థం' అని ఉమామహేశ్వరాలయమును గట్టించి నాలుగు గ్రామములు దేవభోగముగా దానము చేసెను. కాకతీయచక్రవర్తులు, వారి సేనానులు, వారి బంధువులు, రెడ్డినరపాలురు, విజయనగర చక్రవర్తులు ఎందరెందరో, అనేక స్థలములందు దేవాలయములను ప్రతిష్ఠించిరి. కృష్ణరాయలు యుద్ధానంతరమందు దక్షిణదేశమందు అనేకదేవాలయములకు గాలిగోపురములు కట్టించెను. జీర్ణములయిన వానిని పునరుద్ధ రించెను.

దీనినంతయు పరిశీలింపగా, దేవాలయములకు ప్రజాజీవితముతో విశేషమయిన సంబంధముండవలయునని తోచును. నిజమునకు దేవాలయ మొక విశేష విశిష్ట ప్రయోజనము గల మహాసంస్థ. నేటి దేవాలయమునకు పూర్వపు ప్రతిష్ఠలో నొక శతాంశమయినను లేదు. అయినను దేవాలయముయొక్క ప్రయోజనము పూర్తిగా నశించిపోలేదు. అది యింకను నివురుగప్పిన నిప్పువలె అణగియున్నది. సింహావలోకనము చేసి నపుడు పూర్వపు ప్రయోజనమంతయు తెలియవచ్చును.

ఆదికాలమునుండి నేటివఱకు దేవాలయము, శివకేశవులలో నెవ్వరిదైనను, మరి యే యితరదైవముదైనను ధర్మ – లేక మత – సంస్థగా నున్నది. మహాయాన బౌద్ధమునందు విహారమువలె, హిందూధర్మమునందు దేవాలయము పుణ్యమార్జించుటకు, అరిషడ్వర్గమును జయించుటకు, జనులందు ధర్మము, నీతి, ఆస్తిక బుద్ధి ఇత్యాదులు వ్యాపించుటకు సాధనమయ్యెను. రాజులు, రాజవంశములు, రాజ్యములు సముద్రపు కెరటములవలె ఉదయించి, లేచి, విరిగి సమసిపోయినను, దేశభాష కాలములతో సంబంధము లేక దేవాలయము ఒక్కటిమాత్రము ఆసేతుహిమాచల పర్యంతము విస్తరించియున్న భారతభూమిని పుట్టిన ప్రజను ఏకీభావమునకు తెచ్చినది. ఉత్తరమున బుట్టినవారు రామేశ్వరయాత్ర చేయకుండ, పూర్ణయాత్ర చేయజాలరు. దాక్షిణాత్యులు కాశీరామేశ్వరయాత్రలు రెండును చేయవలయును. సర్వసమత్వము, ఏకోఈశ్వర తత్వమును బోధించునది దేవాలయము. "సర్వ జగన్నాథ" మని మనకు లోకోక్తి యున్నది. శివరూపముగాని, విష్ణురూపముగాని యొక్కటే యని మనకు అందరికిని తెలియును. అజ్ఞానవశమున నేమి, అహంకారముననేమి, సంస్కారమువలన నేమి, సంస్కార సంబంధమువలన నేమి ఈశ్వరతత్త్వమును జనులు బహు విధములయిన పేర్లతో, రూపకల్పనలతో ఆరాధించుచున్నారు. అయినను దేవాలయము ఒక విధముగా నరుని చిత్తమును దేవునియందు ఏరుపమైన నేమి, యే పేరయిన నేమి – ఏకాగ్రత తీసుకొని వచ్చుచున్నది. దేవాలయమునందు దేవుని (ప్రతిమ) సన్నిధియందు, జాతి, మత, లింగభేదము లేకుండ ఎల్లరును సమానులనుభావము ఏర్పడుచున్నది. మొఱ పెట్టుకొనుటకు, మొఱాలకించుటకును అందరికిని దేవాలయము, అందులో వేంచేసియుండు ఈశ్వరాంశయే ప్రాణ ప్రతిష్ఠ చేయబడిన ప్రతిమ సాధనమగుచున్నది. జనులందు దేవాలయ మీ విధముగా ఐక్యము సమకూర్చుచున్నది. ఇందులకు ప్రసిద్ధమయిన ఉదాహరణ మొకటి గలదు. ఆంధ్రదేశమునందే కాదు, భారతభూమిని జన్మించిన ప్రతి హిందూ భారతీయుడును తిరుపతి క్షేత్రమును కాశీరామేశ్వరాదులకంటె, జనులకోర్కెల దీర్చు పరదైవతమని ఆరాధించుచున్నారు. ఔత్తరాహులు తిరుపతిదేవుని బాలాజీ అని, గోవిందుడని ద్వివిధముగా వారివారి చిత్తసంస్కారమునుబట్టి కొలుచుచున్నారు. శ్రీ వైష్ణవులు శ్రీనివాసుడని ఆరాధించుచున్నారు. ఆంధ్ర, ద్రావిడ, కర్ణాట, మహారాష్ట్రులు, శ్రీ వెంకటేశ్వరుడని స్మరించుచు ఉపాసించుచున్నారు. కాశీరామేశ్వరములవలె, పూరి జగన్నాథమువలె, తిరుపతి వెంకటేశ్వరస్వామికూడ హైందవజాతికి మత విషయకముగా ఐక్యము చేకూర్చుచున్నాడు.

దేవాలయముపై జనులకు ఆదికాలమునుండి ఒక విధమైన ప్రీతి, భక్తి, గౌరవము అప్రయత్నముగ నేర్పడియేను, దేవాలయ మందరికిని ఉపయుక్తమయిన సంస్థ అయ్యెను. ఆపత్సమయమందు రాజునకు సయితము దేవలము కోటకంటె యెక్కువ పదిలముగా నుండెను. అందువలననే కాబోలు "ఇంటికంటె గుడి పదిల"మను ఆర్యోక్తి కలిగెను. జాతికి కావలసిన వన్నియు సమకూర్చుటకును దేవాలయము సాధనమయ్యెను. అన్నిశక్తులు, అన్ని పరిశ్రమలు, వ్యవసాయము, పశుసంరక్షణ, పాడిపంటలు వేయేల, ఒక దేశము, ఒకమండలము, ఒకనాడు, ఒకరాష్ట్రము అన్నింటియొక్క సంపదలు ఐశ్వర్యము, భాగ్యము అన్నియుకూడ ఒక దేవాలయమునందు కేంద్రీకరింపబడుట సంభవించెను.

మన పూర్వులు దేవాలయమునకు కొన్ని నియమము లేర్పరచి, ప్రజాహితకరములైన మూలసూత్రములమీద దాని నొక సంస్థగా నిర్మాణము గావించిరి. దేవాలయములను ప్రతిష్ఠించుట యొకటి; నిర్మితములైన దేవాలయములు స్థిరరూపకముగా నుండు టకు గావించు సాధనములు రెండవది. దేవాలయములందు అఖండవత్తితో దీపములు పెట్టించుట అఖండమైన పుణ్య కార్యముగా ప్రజలు భావించి తద్దీపారాధన ఆచంద్రతారార్కముగా సాగుచుండుటకు కొన్ని నిబంధనలనేర్పరిచిరి. ఈ ధర్మము కెవ్వరేని విఘ్నము చేసినవారు గంగకఱత వేయి కపిల వధియించినవాడు – వారణాసి వ్రచ్చినవాడు, పెద్దకొడుకు కపాలమునందు గుడిచినవాడు. అని కొన్ని స్థలములందు శాపములు వెట్టిరి. ఈ ధర్మమునకు "శ్రీవైష్ణవరక్ష" యని కొన్ని స్థలములందు శాసించిరి. అఖండవత్తి దానము చేయుట ఎంతటి ఘనకార్యమో, అది యే కారణమున పుణ్యకార్యముగ దాతలెంచుచుండిరో ఒక్కింత పరికించినచో బోధముకాగలదు. అహోరాత్రములు ఎడతెఱపి లేకుండ అఖండదీపము వెలుగుచుండుటకు ప్రత్తి, ప్రమిదెలు మాట అటుంచినను, అందులకు కావలసిన నేయి సమర్పించుటకు 25 ఆవులుండవలయును. గొఱియలు,

మేకలు అయినచో 50 ఉండవలయును. ఒక గుడియందు నూరు అఖండదీపములు వెలుగుటకు కనీసము 2500 ఆవులుగాని, 5000 గొఱియలుగాని ఉండవలెను. ఆ గోవులను మేపుటకు, కాచుటకు, వాటిని యెదలో పొర్లుటకు గావలసిన ఆబోతులను పెంచుటకు, మేపుటకు, పాలుతీయుటకు, కాచుటకు, వెన్నతీయుటకు, నేయిగాచుటకు ఇత్యాదిగా గల పనులెన్నింటికో, ఎందరో కావలయును. వారందరికిని జీవనోపాధి యేర్పడును. నూరు అఖండదీపములు పెట్టుచుండు దేవళమున్నచోట 2500 గోవులున్నచోట పాడితో పంటలుగూడ సమృద్ధిని మీరియుండ వలెను. నవధాన్యములు పండు భూములుండును. పండిన దానిలో మంచిదానినే పుణ్యముకొరకు గృహమేధి దేవున కర్పించునుకదా. ప్రతి దేవాలయమునందును శైవ వైఖానసాగమముల ననుసరించి పూజలు, నివేదనలు జరుగవలెను. కనీసము మూడువేళలందు దేవునికి పూజలు జరుగవలెను. ప్రసిద్ధ శైవక్షేత్రములందు ఆరు వేళల పూజలమరుచుండును. ప్రతి దేవాలయమునకును ఆగమపద్ధతుల ననుసరించి నిత్యోత్సవ, రారోత్స, పక్షోత్సవ, మాసోత్సవ, అయనోత్సవ, వర్షోత్సవ, బ్రహ్మోత్సవములు జరుగవలెను. ఆయా యుత్సవాదులకు అనగా తిరునాళ్లకు ఎన్నెన్నో పరికరములు, వస్తువులు, పరివారజనము, పారిశ్రామిక జనము కావలయును, దేవాలయము ఆ రీతిగా ఎందరెందరికో జీవనోపాధి కల్పించుచుండును. దేవాలయమునకు ఏటేట పోయిన తావులు బాగుచేయవలయును. దానికెంతో వ్యయమగును. ఆ వ్యయమును భరించుటకు పూర్వము దాతలు భూములను త్రవ్వించి చెఱువులను, తోటలను వనములను సుంకములలో భాగమును ఎన్నెన్నో దానము చేయుచుండిరి. వీనినన్నింటిని సరిగా పాలించుటకు కార్యజ్ఞులు, కార్యకర్తలు, పారుపత్తెమువారు, కారెవారు, పంచాణమువారు మొదలయినవారెందరికో జీవనోపాధి కలుగుచుండును. తిరునాళ్లలో దేవాలయప్రాంతమంతయు నొక పెద్ద బజారు. అక్కడ అన్ని వస్తువులు విరివిగా దొరకును. వ్యాపారము చేసికొను వర్తకులకు అనుకూలమైన స్థలమది. సమయమది. వాడవాడలనుండి, దేశదేశములనుండి సరకులు వివిధములు అచ్చటికి చేరును. ఆ విధముగా దేవాలయము వాణిజ్యము సాగుటకు కారణభూతమగుచుండును. దేవాలయ సందర్భమున పాటు ప్రజకు అంతయు జీవాధారమైయుండును. వారికి సంపదల నిచ్చును. విజ్ఞానమిచ్చును. జనులకు రాకపోకలు కల్గును. తిరునాళ్లలో బ్రహ్మోత్సవములలో, వర్షోత్సవములలో, పూర్వము కొన్ని దేవళములందు కసవుచిమ్ము దాసదాసీ జనము నకు మొదలుకొని పారుపత్తెము వహించు స్థానికులవరకు, దేవాల యముతో సంబంధముగల ఎల్లరకును వస్త్రములనొసగి బహూక రించు ఆచారముండెను. అట్టి యాచారము కారణముగ, ప్రత్తి పండించువారికి ఏకులు వడుకువారికి నూలు తీయువారికి, బట్టలు నేయువారికి, రాట్నములు మగ్గములు, ఆసులు, కండెలు మొదలగు వానిని చేయు వడ్రం గులకు, ఇతరపనిముట్లతో పని చేయువారికి, సాలెవారికి, ఎందరెం దరికో చేతినిండ యేటికేడాది పొడుగునను పనులు కలిగి, కఱవు లేక, లేమి యెఱుగక జీవనము గడుపగలుగుచుందురు.

దేవాలయములు విద్వజ్జనుల కాస్పదములు విద్యల కాటపట్టు. ప్రాచీనకాలమున దేవాలయములు ఒక విధముగా విద్యాస్థానములై యొప్పుచుండెను. వేదము, వేదాంగములు, ఇతిహాసపురాణములు, షడ్దర్శనములు, అలంకార, వ్యాకరణ, రూపావతారములు, సాహిత్యము మొదలయిన విద్యలన్నియు దేవాలయ మంటపములందు ఉపవిష్టులయి విద్వాంసులు విద్యార్థులకు ఉచితముగ బోధసేయుచుండిరి. మహాత్ములైన ప్రభువులు తమ విభూతికొఱకు, దేశకల్యాణాభివృద్ధికొఱకు, విద్యాభివృద్ధికొఱకు విద్యాస్థానములయిన దేవాయతనములకు భూరిగా భూదానములు చేసి, సత్రములునిల్పి, అగ్రహారములిచ్చి, విద్యార్థులకు, గురువులకు గూడ ఉచిత భోజన మజ్జనాదివసతులు కల్పించుచుండిరి. అట్టి విద్యాస్థానములు ఆంధ్రదేశమునందెన్నో పూర్వము వర్ధిల్లియుండెను. శాసనములను పరిశీలించిన వారికి శ్రీ కూర్మము, సింహాచలయు, దక్షారామాది పంచారామములు, శ్రీకాకుళము శ్రీశైలము మొదలయిన వన్నియు విఖ్యాతిగన్న విద్యాస్థానములే ! యని తెలియును. పేరెన్నికగన్న శివాలయములచెంత శైవమఠములుండెను. అందు శివయోగులు శివదీక్ష గైకొని, శివదీక్ష నొసగుచు, శిష్యగణమును యవిద్యాపారంగతులను చేయుచుండిరి. అట్టి ప్రసిద్ధమఠములు పూర్వోదాహృతములయిన సంచారామ, శ్రీశైలములందును, బెజవాడ ఉమామహేశ్వరాలయమునందును ఉండెను.

సమస్తవిద్యలతోపాటు సంగీతసాహిత్యములు గూడ దేవాలయముల ప్రాపున పరిపూర్ణతను బొందకల్గెను. మేళతాళములవారు, నట్టువలు, గాయకులు, కవులు అనేకులు దేవాలయముల నాశ్రయించి తమ తమ విద్యలనైపుణ్యమును భగవద్భక్తితో భగవదర్పణము జేయుచుండిరి. మేళగాంఢ్రను, బాజాభజంత్రీలవారిని, నట్టువలను, గాయకులను, మాన్యము లిచ్చి, కట్టడులనిచ్చి అనేకవిధములుగా పోషించి వర్ధిల్లజేసినది దేవాలయము.

వీటిఅన్నింటికంటెను ఎక్కువ విశేషము మరియొకటి గలదు. దేవాలయము ప్రజాహితజీవనమునకు అవసరమగు వైద్యమునకూడ ఎక్కువగా తోడ్పడుచుండెను. కొన్ని దేవాలయములు ఆరోగ్యశాలలను పోషించుచుండెను. వైద్యులకు, వారికి కావలసిన మూలికలను ధాతువులను, ఇతర పరికరములను నిత్యము, నిరంతరము సేకరించి సంపాదించి తెచ్చియిచ్చుటకు కొన్ని దేవాలయములందు ఏర్పాటులుండెను. ఆ కారణముననే గాబోలు యాభైయేండ్ల వఱకు దేవాలయా ర్చకులు, పూజారులు, వైఖానసులు, ఆదిశైవులుకూడా ఇంతో, ఎంతో, ఆయుర్వేదవైద్యులైయుండి, ఆ గ్రామములోని జనుల ఆరోగ్యమునకు పాటుపడుచుండిరి. ఆచార్యులు గారే సాధార ణముగా గ్రామానికి వైద్యుడు. శివార్చకులు సాధారణముగా మంత్రవైద్యము చేయుటకూడ మనపూర్వులందరు నెఱిగిన విషయము.

దేవాలయము పూర్వోక్తముగా ప్రజాజీవనముపై తన ప్రభావమును ప్రసరింపజేసెను. దేవాలయము లేని యూరు ఏ సదుపాయములు లేకుండెను. దేవాలయము ఉన్న గ్రామమునందు ప్రజలకు ధర్మమన్న భీతి, గౌరవము, నీతిపై అభిమానము, సత్యముపై ఆసక్తి మున్నగునవి వర్ధిల్లుచుండెను. దేవాలయము “అష్టాదశ వర్ణములు” వారికిని, జాతివివక్ష లేకుండ ఐక్యము చేకూర్చుచుండెను. వ్యవసాయమునకు, పశువృద్ధికి,

పాడిపంట లకు, ధనధాన్యకనకవస్తుసామగ్రికి, దేవాలయము ప్రాణాధారము. జనులు నీటికై బాధపడకుండ, చెఱవులుంచుటకు దేవాలయము కారణము. వ్యవసాయమునకు అవసరమైన నీటికి చెఱవులాధారము. చెఱువులు, కోనేళ్ళు (కొలను) దేవాలయము తోపాటు వెలయుచుండెను. దేవాలయము సాధారణముగా నీరు సమృద్ధిగానుండు స్థలములందు, ఎప్పుడు నెడతెగక పారెడు ఏటి యొడ్డున నిర్మింపబడుచుండెను. వెనుక సుమతిశతకకారుడు "అప్పిచ్చువాడు వైద్యుడు" అన్న పద్యమును చెప్పినాడు. ఆ కవి యన్నట్లు, అప్పిచ్చువాడు, వైద్యుడు, ఎప్పుడు నెడతెగక పారెడు ఏరును, ద్విజుడు – మొదలయినవి ప్రజాహితజీవనకు గావలసిన పరికరములన్నియు, వెదకుకొననక్కర లేకుండ దేవాలయమున్న చోట లభించును.

దేవాలయములను మంచి స్థితియందుంచుట మన పాలకుల కర్తవ్యము. దేవాలయము ఒక్క వర్ణమువారి లాభముకొరకే ఏర్పడినదని భావించు ఈ దుష్కాలమున దేవాలయము దౌర్భాగ్యస్థితికి వచ్చుచున్నది. దేవాలయము పూర్వపుస్థితినుండి జారినది. జారిన దుస్థితి నుండి దేవాలయ మును ఉద్ధరించగల దక్షుడీ కాలమున కానరాడు. దేవాలయము ఉద్ధరింపబడునన్న ఆసకూడ వ్యర్థమైనదే. కులకక్షలు, కులద్వేషములు, కులాభిమానములు దేవాలయముల పతనస్థితికి కారణములైనవి. ఒకనాడు జాతీయైక్యతకు, ప్రజాసౌఖ్యమునకు, జాతి కల్యాణమునకు, భగవద్భక్తి కుదురుకొనుటకు, ధర్మసంచయము పెంపొందుటకు, ప్రజాహితజీవనము సకల సంపదలతో తెలతూగరుచుండుటకును కారణవమైన దేవాలయము నేటికాలమున ఈ దుస్థితికి వచ్చినది. ఒకనాడు దేశమునకు భాగ్యవైభవములను సమకూర్చిన దేవాలయము, మరికొన్ని యేండ్లకు ప్రదర్శనయోగ్యమైన ప్రచీనవస్తుసంపదగా మారి, ప్రాణము గోల్పోయి, జీవనచ్ఛవముగా మారి చివరకు బౌద్ధస్తూపమువలెనే అంతర్హితమగును.

(భారతి – రజతోత్సవ సంచిక)

తేనెకన్న మధురం రా, తెలుగు, ఆ
తెలుగుదనం మాకంటి వెలుగు.

తెలుగుగడ్డ పోతుగడ్డ ఎంత పచ్చన, మా
తెలుగు గుండెలో స్నేహము ఎంత వెచ్చన !
మన పొలాల శాంతిపులుగు ఎంత తెల్లన, మన
తరతరాల కథను పాడు గుండె ఝల్లన ॥తేనె॥

పాటుపడిన వాళ్లకే లోటు లేదని
చాటి చెప్పు తల్లికదా తెలుగుతల్లి
లలితకళలు సంగీతం సాహిత్యం
తెలుగుతల్లి జీవితాన దినకృత్యాలు ॥తేనె॥

గత చరిత్ర ఘన చరిత్ర ఎంత ఖ్యాతి!
గర్వించదగ్గ జాతి తెలుగుజాతి !
అయినా గతంకన్న భవిషత్తు ఆశాజనకం
ఆ భావికొరకు ధరించాలి దీక్షాతిలకం ॥తేనె॥

– ఆరుద్ర

డాక్టర్ అడపా రామకృష్ణారావు

తెలుగు జాతిని తీర్చిదిద్దిన సాహిత్యం

"చారిత్రక విభాత సంధ్యల
మానవ కథ వికాసమెట్టిది?
ఏ దేశం ఏ కాలంలో
సాధించినదే పరమార్థం ?

ఏ శిల్పం ? ఏ సాహిత్యం?
ఏ శాస్త్రం ? ఏ గాంధర్వం?
ఏ వెల్గుల కీ ప్రస్థానం ?
ఏ స్వప్నం ? ఏ దిగ్విజయం ?"

అని ప్రశ్నించారు; "దేశ చరిత్రలు" అనే ప్రసిద్ధ గీతంలో శ్రీశ్రీ. వివిధ కళలు వెల్లివిరిసి మానసికాధ్యాత్మిక వికాసం పొందిన జాతిని సాంస్కృతికంగా సంపన్నమైన జాతిగా మనం పరిగణిస్తాము. నాగరికత వేరు. సంస్కృతివేరు నాగరికత భౌతిక జీవితానికి సంబంధించినది. సుఖ జీవితాని కనుకూలించే సౌకర్యాలతో కూడిన భవనాలు, రాజమార్గాలూ, అన్నవస్త్రాల సమృద్ధీ ఒక జాతి నాగరికతకు కొలబద్దలు కాగా, వ్యక్తుల ఆంతరంగిక స్ఫూర్తికి దోహదకారులైన వివిధ శాస్త్రాలూ, కళలూ ఆ జాతి సంస్కృతికి ప్రధాన చిహ్నాలవుతాయి.

సంగీతం, సాహిత్యం, నృత్యం, శిల్పం, చిత్రలేఖనం వంటి వివిధ కళలను తెలుగుజాతి చారిత్రక విభాతవేళనుంచీ ఆరాధిస్తున్నదని భావించడానికి తగిన ఆధారాలు మనకు లభ్యమవుతున్నాయి. బౌద్ధయుగం నాటి నుంచీ తెలుగుదేశాన్ని సౌందర్యశోభితం చేసిన రమణీయ శిల్పాలూ, కాల ప్రభావానికి లోనైపోయినవి పోగా నాటి ప్రాభవానికి చిహ్నాలుగా నేటికీ నిలిచి ఉన్నకుడ్యచిత్రాలూ, ఈ చిత్రాలను గురించి క్రీడాభిరామం వంటి కావ్యాలలో కనిపించే వర్ణనలూ, దేవాలయ శిఖరాలపై నల్లని శిలలలో మలచిన సుందర నాట్య భంగిమలూ, కూచిపూడి నృత్య ఫణితీ, త్యాగరాజస్వామివంటి మహనీయులు పరమార్థ సాధనకు చక్కని రాజమార్గంగా చేపట్టిన కర్నాటక సంగీతమూ ఇందుకు నిదర్శనాలు.

ఇక సాహిత్యం సంగతి. నన్నయగారి భారతాంధ్రీకరణంతో ఆరంభమైన తెలుగు సాహిత్యం దాదాపు వేయి సంవత్సరాల చరిత్రతో అఖండ గౌతమివలె అవిచ్ఛిన్నంగా సాగుతూన్నది. ఇతర భాషలలోవలెనే తెలుగులోకూడా సాహిత్యం ఒకవంక జాతి జీవితంలో విధిగా ఎదురయ్యే ఒడిదుడుకులను

గ్రంథస్థంచేస్తూ తెలుగు ప్రజల ఆశలను, అపేక్షలను, వారి సుఖస్వప్నాలను, పీడకలలను, జీవిత విధానాన్ని ప్రతిఫలింపజేస్తూ మరొక వంక వారి ఎదుట ఉన్నతాదర్శాలను నిలుపుతూ, వైయక్తికం గాను సమిష్టిగానూ జీవితంలో సాధించవలసిన లక్ష్యాలనుగూర్చి ప్రబోధిస్తూ జాతీయజీవితాన్ని తీర్చిదిద్దుతున్నది. సాహిత్యం ప్రజలలో భావసంచలనం కలిగిస్తూనూ ఉన్నది. అందువల్ల జాతి జీవిత యాత్రలో ఎదురయ్యే మలుపులను, పురోగతిని వర్ణిస్తూనూ ఉన్నదన్నమాట.

నన్నయగారి భారతాంధ్రీకరణం క్రీ.శ. 11వ శతాబ్దిలో జరిగింది. అక్షరరమ్యత, కథన శిల్పం, ధారాశుద్ధి పరిణతరూపంలో కనిపించే నన్నయ కవిత తెలుగుభాషలోని ప్రథమ సృజనాత్మక రచన అయి ఉండదనీ, అంతకుముందు తగినంత దేశిసాహిత్యం వ్యాప్తిలో ఉండి ఉంటుందనీ విమర్శకుల ఊహ. ఏ భాషలోనైనా ఛందోబద్ధమైన పద్యకవిత వెలయడానికి ముందు కొంత గేయవాఙ్మయం ప్రచారంలో ఉండడం సహజం. ఆదిమ మానవుడు ప్రకృతి చిద్విలాసాన్ని దర్శించి ఆనందంతో చిందులువేస్తూ తన భావోద్వేగాన్ని ప్రకటిస్తూ, పాడే పాటలే కవిత్వపు ప్రథమరూపం. తెలగు భాషలోకూడా ఈ విధంగా భారతావతారణానికి ముందు కొంత దేశ కవిత వ్యాప్తిలో ఉండిఉంటుంది.

పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో తుమ్మెద పదములు, ప్రభాత పదములు, పర్వత పదములు, ఆనంద పదములు, నివాళి పదములు, గొబ్బిపదములు, వెన్నెల పదములు మొదలగు వివిధ జాతుల పదాలను పేర్కొన్నసంగతి ఈ సందర్భాన స్మరించదగినవి. ఇవి తెలుగునాట నన్నయకు పూర్వంనుంచి వ్యాప్తిలో ఉండి ఉండాలి. పల్లెపట్టులో గ్రామీణులు పనిపాటలు చేసుకుంటున్నప్పుడు శ్రమ తోచకుండా ఉండడానికీ. ఉత్సవ వేళలలో ఆనందాతిరేకంతోనూ గానం చేస్తూ ఉండిన గీతాలివి. కష్ట నివారణకో, ఉల్లాసానికో ఉదయించిన కవిత్వం జానపదగేయ సాహిత్యం, లభ్యమవుతున్న జానపద వాఙ్మయాన్ని పరిశీలిస్తే, ఈ పాటలను, కథలను కూర్చిన పల్లెప్రజలు కథ అయోధ్యకు సంబంధించినదైనా, ఇంద్రప్రస్థానికి చెందినదైనా, పాత్రలకు పూర్తిగా తెలుగుదనాన్ని ఆరోపించి, మన గ్రామీణ జీవితంలోని సహజ సరళ రీతిని కథ నడిపి, కథలను నిజంగా "ఆంధ్రీకరించా"రని అర్థమవుతుంది. రామాయణ, భాగవత కథలు, వీరగాథలు, శృంగార హాస్యగీతాలు, శ్రామిక గేయాలు అన్నీ తెలుగు ప్రజల అభిరుచులను, ఆశయాలను, విశ్వాసాలను, నిత్యజీవితంలోని కష్టసుఖాలను అద్దంపట్టి చూపుతున్నవి. వాల్మీకి మహర్షి వర్ణనలో కనిపించని ఘట్టాలు కొన్ని రంగనాథ రామాయణంలో చోటుచేసుకోవడానికి గాని గోపికలు యశోదకు కృష్ణుని కొంటె పనులను వర్ణించే సందర్భంలో మూలంలో లేని దుడుకు చేష్టలు తెలుగు భాగవతములో విస్తరించడానికి గాని ఈ జానపద గేయాల ప్రభావమే కారణమని అభిజ్ఞుల అభిప్రాయం.

ప్రజా జీవితాన్ని యథాతథంగా ప్రతిబింబిపజేయడమే నాటక కళ లక్ష్యమని ...to hold, as't were, the mirrot up to nature - to show virtue her own feature, scorn her own image, and the very age and body of the time his form and pressure" హామ్లెట్‌తో చెప్పిస్తాడు షేక్స్పియర్. నాటక వాఙ్మయం మాత్రమే కాదు, సాంఘిక చైతన్యం గల రచయితలు సృష్టించే ఏ సాహిత్య ప్రక్రియయైనా సమకాలిక సమాజ స్థితిగతులను వర్ణించడమూ, వాటిపట్ల రచయిత దృక్పథాన్ని ప్రకటించడమూ జరుగుతుంది. తెలుగు సాహిత్యంలో కూడా ఈ విధంగా మన సాంఘిక జీవితాన్ని ప్రజాభిరుచిని వ్యక్తం చేసే కావ్యాలు కొన్ని కనిపిస్తాయి. ఇవి సాహిత్యవేత్తల దృష్టిలో ఉత్తమ స్థాయికి చెందిన గ్రంథాలే కానక్కరలేదు. ఈ సందర్భంలో కవికర్ణరసాయనం లోని "కేళీనటదేహ కేకీ కేకా రవోన్మేషంబు చెవులు తేనియలు చిలుక" వంటి వర్షర్తు వర్ణనలు మనకు ఏ మాత్రం సహాయపడవనీ, "గొంగడి ముసుగుతో గొల్లలు చట్రాతి పైని బందారాకు పరచి కొనగ" అనే శుక సప్తతిలోని వర్షర్తు వర్ణన ఎంతగానో పనికి వస్తుందని, ఆ విధంగానే మనుచరిత్రలో "తత నితంబాభోగ ధవళాంకుశములోని యంగదట్టపు కావి రంగు వలన" అనే వర్ణన మనకు సరిగా అర్థమే కాదని, "చలువ దువ్వలువ కుచ్చెలయందు ముతెత్మఉల్ పదనఖ ప్రభకు సలాము చేయ" అనే శుకసప్తతిలోని వర్ణన మనకు ఆ యువతి విలాసాన్ని కండ్లకు కట్టినట్లు చూపుతుందని ప్రఖ్యాత పరిశోధకులు సురవరం ప్రతాపరెడ్డి గారు వ్రాసిన మాట దృష్టిలో ఉంచుకోవాలి. ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనకు శ్రీకారం చుట్టినవారు రెడ్డిగారు.

తెలుగు ప్రజల సామాజిక జీవితానికి దర్పణం పట్టిన కావ్యాలలో పాల్కురికి సోమనాథుని బసవ పురాణమూ, పండితారాధ్య చరిత్రమూ, శ్రీనాథుని క్రీడాభిరామమూ, పల్నాటి వీరచరిత్రమూ, కొరవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశిక, గౌరన హరిశ్చంద్రోపాఖ్యానము, కృష్ణదేవరాయల ఆముక్తమాల్యద, రామకృష్ణకవి పాండురంగ మహాత్మ్యమూ, తాళ్లపాక తిరువెంగళనాథుని పరమయోగి విలాసమూ, సారంగు తమ్మయ్య వైజయంతీ విలాసమూ, కదిరీపతి శుకసప్తతీ, వేంకటనాథకవి పంచతంత్రమూ, వేమనగారి పద్యాలూ, చంద్రశేఖర శతకం వంటి కొన్ని శతకాలూ ముఖ్యంగా పేర్కొనదగినవి. తూర్పు చాళుక్యయుగం నుంచి 19వ శతాబ్దపు చివరి వరకు మన సాంఘిక జీవితంలో కనిపించే ముఖ్య విశేషాలను ప్రతాపరెడ్డి గారు తమ గ్రంథంలో వర్ణించారు. అంతకుముందు తెలుగు నాటి సాంఘిక స్థితిగతులను గురించిన వర్ణన శాతవాహన సంచికలో కనిపిస్తుంది.

ఇతర దేశస్థుల కంటె భారతీయులు మొదట తమనిత్య జీవితంలో మతానికి ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇస్తారు. కాగా సాంఘిక జీవితంలో కూడా మత ప్రసక్తి ఎక్కువగా కనిపిస్తుంది. బౌద్ధ జైనమతాలు కొన్నాళ్లు విజృంభించిన తరువాత తిరిగి ఆర్ష ధర్మానికి ఆధిక్యం రావడం, కాకతీయ యుగంలో జైన, శైవ, వైష్ణవ మతాల ప్రాబల్యం కోసం పరస్పర పోరాటం కనిపిస్తుంది. కర్నాటకరాజ్యం నుండి బసవేశ్వరుని వీరశైవపుగాలి తెలుగుదేశం మీదికి వీచింది. ప్రతాపరుద్రుడొకనాడు హరుని గొల్వ స్వయంభూ దేవాలయానికి వెళ్ళి, అక్కడ శివ భక్తులు బసవపురాణము పాడించి వినడం గమనించి ఆ సంభ్రమమేమని ఆ పురాణంబు విధ మెట్లో యయని ప్రశ్నించగా పాలకురికి సోమపతితుడీ నడు.........పెనచె మధ్య వళ్ళు పెట్టి ద్విపద అప్రయాణం..........యనాద్యంబు పదమని ధూర్తవిప్రుడొకడు..........జుతో చెప్పినట్లు పిడపర్తి సోమనాథుడు వ్రాశాడు.........తాల పట్టుదల ఎట్లాఉన్నా, వీరశైవులూ, వైష్ణవులు ....భేదాల నిర్మూలనానికి కొంత వరకు కారకులయ్యారు. పల్నాటి వీరచరిత్రలో వివిధ వర్ణాలకు చెందిన వైష్ణవుల ఏకపంక్తిభోజన ప్రసక్తి ఉన్నది.

శైవ, వైష్ణవుల మధ్య రగులుకొన్న ద్వేషాగ్నిని చల్లార్చి సామరస్యం కుదర్చడానికి హరిహర నాథ మూర్తి కల్పన ఆవశ్యకమైంది. "శ్రీయన గౌరినా బరగు చెల్వకు చిత్తము పల్లవింప భద్రా యత మూర్తియై హరిహరంబగు రూపము దాల్చిన" దైవాన్ని తిక్కన ప్రస్తుతించడం గమనించదగినది. ఈ మత ద్వేషాలను పురస్కరించుకొనియే నాచన సోమనాథుడు, "పరివారాస్పద వాద మోద మదిరా పానంబుచే మత్తులైహరిమేలంచు హరుండు మేలనుచు నాహా కొందరీపొందెరుంగరు" అని వ్రాయవలసివచ్చింది.

ఆంధ్రనగరమని పేరొందిన ఓరుగంటిలో శిల్పచిత్రలేఖనాది కళలకు సమున్నత స్థానం లభించింది. రామప్ప దేవాలయ మండపముపై కోణాలలో నాట్యకత్తెల సుందర విగ్రహాలు వెలసినవి. ఆ కాలంలోనే ప్రజలు ఇండ్ల గోడలపై చిత్రాలు వ్రాయిస్తు ఉన్నట్లు. మాచల్దేవి చిత్రశాలలో పురాణ కథలలోని శృంగార ఘట్టాలు చిత్రితమైవున్నట్లు క్రీడాభిరామం వల్ల తెలుస్తుంది. ఆ కావ్యమే మాచల్దేవి చరిత్రను ఆమె జీవిత కాలంలోనే "ఆడుదురు నాటకంబుగా నవనిలోన" అని తెలియజేస్తున్నది. అటువంటి నాటకాలతోపాటు తోలుబొమ్మలాటలు కూడా వ్యాప్తిలో ఉండేవి.

రెడ్డిరాజుల కాలంలో తెలుగువారు సముద్రవ్యాపారం విరివిగా సాగించినట్లు, మోటుపల్లి అప్పుడు ప్రసిద్ధమైన ఓడరేవుగా ఉన్నట్లు తెలుస్తున్నది. శ్రీనాథుడు హరవిలాస కావ్యపీఠికలో "తరుణా సీరి తవాయి గోవ రమణా స్థానంబులం జందనా గరు కర్పూర హిమంబు కుంకుమ రజః కస్తూరి కాద్రవ్యముల్ శరధిన్ కప్పలి, జోంగు, వల్లి, వలికా సమ్మన్ల దెప్పించు నేర్పరియై వైశ్యకులోత్తముండవచి తిమ్మం డల్పుడే యిమ్మహిన్" అని వర్ణించిన పద్యం నాటి మన సముద్ర వ్యాపార విధానాన్ని కొంత చిత్రిస్తున్నది. కర్పూర వసంతోత్సవాలకు సుగంధ భాండాగారాధ్య క్షులుండడం నాటి ప్రభువుల వైభవాన్ని సూచిస్తుంది. కవిత్వానికీ, ఇతరుల కళలకూ రాజాదరణ విశేషంగా లభించింది. అందుకే కొండవీటిలో ఏ మూల చూచినా విభూతి భస్మాంచితులై కవియశః ప్రార్థులైన వ్యక్తులు తిరుగుతూ ఉండడం చూచి శ్రీనాథుడు "కొండ వీటిలో గాడిద నీవునం గవివి కావుగదా! యను మానమయ్యెడిన్" అని పరిహసించడం జరిగింది. ఇక సంగీత నాట్యశాస్త్రాలకు సంబంధించి కొన్ని గ్రంథాలను నాటి రాజులే రచించారు. కుమార గిరి వ్రాసిన వసంత రాజీయంలోని లక్షణాల కుదాహరణంగా లకుమాదేవి నాట్యం చేస్తూ ఉండేదని ప్రతీతి.

అటుపైన విజయనగర సామ్రాజ్యమేర్పడిన యుగం తెలుగు ప్రజలకే కాదు, దక్షిణ దేశమంతటికి వైభవోపేతమైన కాలమే.

"ప్రతివర్ష వసంతోత్సవ
కుతుకా గత సుకవి నికర గుంభిత కావ్య
స్మృతి రోమాంచ విశంకిత
చతురాంతఃపుర వధూ ప్రసాదన"

రసికుడై, స్వయంగా "ఆముక్తమాల్యద" వంటి ప్రౌఢ కావ్యాన్ని రచించగల దక్షుడైన కృష్ణదేవరాయలవంటి ప్రభువు పాలనలో సాహిత్యంతోపాటు సంగీత, నాట్య, శిల్ప చిత్రలేఖనం వంటి కళలన్నీ వర్ధిల్లినవి. రాయలు వర్ణించిన విష్ణుచిత్తుని గార్హస్థ్య జీవిత చిత్రం "నా స్య పూపో నా స్త్యోధన సౌష్టవంచ కృపయా భోక్తవ్య"మను పల్కులవల్ల కొంత. రామకృష్ణ కవి వర్ణించిన నిగమశర్మ కథ వల్ల కొంత నాటి మధ్య తరగతి ప్రజల జీవిత విధానం మనకర్థమౌతుంది. నాటి సాంఘిక చరిత్రను గ్రహించడానికి ప్రతాపరెడ్డిగారి రచనతోపాటు శ్రీ రాళ్లపల్లి అనంతశర్మగారి వ్యాసాలు కూడా ఉపయోగపడతాయి.

క్రమంగా ఆ వైభవం అంతరించింది. అస్తమించిన విజయనగరౌన్నత్యాన్ని తలచుకొని "శిలలు ద్రవించి యేడ్చినవి, జీర్ణములైనవి. తుగభద్రలోగుడి గోపురంబులు" అని. "ఈ జీర్ణకుగ్రామమేమి చూపించును తెనుగు రారాజు పండిన యశస్సు" అని ఆర్ద్ర హృదయుడైన తెలుగుకవి– కొడాలి సుబ్బారావు గారు – అశ్రుగీతిని రచించవలసి వచ్చింది. తెలుగు జాతి పరదేశీయుల పాలనకు గురికావడం, తన ప్రాభవాన్ని పోగొట్టుకుని వివిధ రంగాలలో క్షీణదశ ననుభవించడం. తరువాత జాతీయోద్యమం తలఎత్తడంవల్ల కొంతకు కొంత గతవైభవాన్ని తిరిగి సాధించడానికి ఈ జాతి నడుము కట్టడం, ఇది ఇటీవలి చరిత్ర. ఈ కాలంలోనే కవిత్వపు సరసను నవ వాఙ్మయం కూడా విస్తరించడంవల్ల ఈ చరిత్రకూడా తెలుగు సాహిత్యంలో వివిధ రచనలలో పద్యకావ్యాలలో, నవలలలో, కథలలో, నాటకాలలో– ప్రతిఫలిస్తున్నది.

తెలగు జాతి సాంఘిక జీవితాన్ని ప్రతిబింబింపజేసిన రచనల ప్రస్తావన జరిగింది. ఈ రచనలో కొన్ని కావ్యశిల్పానికి ప్రత్యేకంగా పేరుపొందినవి కాకపోయినా, చారిత్రకంగా ఎంతో విలువ గలవి. ఇక కావ్యగుణంవల్ల తెలుగువారి హృదయాలనాకర్షించి, జాతి జీవన విధానాన్ని మలవడానికి కారకమైన కావ్యాలనుకూడా గమనించవలసి ఉంది. తెలుగుజాతిని తీర్చిదిద్దిన సాహిత్యాన్ని గురించి తలచుకున్నప్పుడు మొట్టమొదట స్ఫురించేది భారత, భాగవతాలు, తరతరాలుగా తెలుగు ప్రజలు ఈ రెండు గ్రంథాలపై చూపిన ఆదరాభిమానాలను మరే గ్రంథాలపట్ల చూపినట్లులేదు. ఎందుచేతనంటే ఇతర భారతీయ భాషలలో విశేషాభిమాన పాత్రమైన కావ్యం రామాయణమే కాని భారతం కాని, భాగవతంకాని కావు. సంస్కృతంలో వాల్మీకి కవి గానం చేసిన ఆది కావ్యమైన రామాయణం సంగతి అటుండగా, ఉత్తర భారతంలో వందల ఏండ్లుగా నిత్యపారాయణ గ్రంథంగా మన్నన కెక్కినది తులసిదాసగోస్వామి విరచితమైన రామచరితమానస కావ్యమే. వంగదేశంలో కృత్తివాసరామాయణమూ, తరువాత కృష్ణదాసగోస్వామి రచించిన శ్రీ చైతన్య చరితామృతమూ విశేషాదర పాత్రమైన గ్రంథాలు. తమిళంలో కంబరామాయణానికి కూడా అటువంటి పూజ్యస్థానమే లభించింది. తెలుగులో కంటే ముందుగానే కన్నడం వంటి ఇతర భారతీయ భాషలలో భారతాన్ని అనువదించడం జరిగినా, తెలుగు వారికి భారతంపట్ల మక్కువ మరెవ్వరికీ లేనట్లు తోస్తుంది. రాజరాజ నరేంద్రునితోపాటు తెలుగువారు కూడా "భారత శ్రవణాసక్తిని" పెంపొందించుకొన్నట్లున్నది.

తెలుగువారు విశేషించి రామభక్తిపరులు. రామాలయంలేని ఊళ్లు తెలుగునాట చాలా అరుదు. సీతా రామలక్ష్మణులు వనవాస కాలంలో

కొంతకాలం ఈ ప్రాంతంలో గోదావరీ తీరాన నివసించారని, భద్రగిరిపై వారు తమ అడుగు దమ్ములు మోపారని, దగ్గరనే పర్ణశాల కట్టుకున్నారని, మనస్సుపడి సీతమ్మ అక్కడ సమృద్ధిగా లభించే ఇప్పపువ్వులు తినేదని, వినుకొండ వద్దనే రాముడు సీతాపహరణ వార్త విన్నాడని కథలు, గాథలు అల్లుకుని ఈ రామ ప్రభువుతో ఆత్మీయతేర్పరచుకొన్న జాతి ఇది. "తక్కువేమి మనకు రాముండొక్కరుండు వరకు" అని భద్రాచల రామదాసు, "నిధి చాల సుఖమా? రాముని సన్నిధిసేవ సుఖమా?" అని త్యాగరాజు రామ భక్తి సామ్రాజ్యాన్ని గురించి గానం చేసిన జాతి.

అయినా తెలుగు భాషలో "తింటే గారెలు తినాలి వింటే భారతం వినాలి" అనేమాట పుట్టింది. తెలుగులో వెలసిన ఏ రామకథాకావ్యానికీలేని ఆదరం భారతానికి లభించింది. ఇందుకు భారతాంధ్రీకరణంలో కవిత్రయం చూపిన ప్రతిభ ఒక కారణం. కేవలం భక్తి ప్రబోధకమైన కథకంటె కొంత తాత్త్విక జిజ్ఞాసకు చోటున్న రచనపట్ల వీరికిగల శ్రద్ధ మరొక కారణం కావచ్చును.

తిక్కనగారి కవిత తెలుగుజాతిని విశేషంగా ఆకట్టుకున్నదని ముఖ్యంగా విరాటోద్యోగపర్వాలు, కురుక్షేత్ర సంగ్రామ వర్ణన వారిపై చెరగని ముద్రేశాయని చెప్పుకోవచ్చు. భారతంలోని పద్యాలు సులభంగా కంఠస్థం చేయడానికి వీలిచ్చేవికావు. కాని, కథమాత్రం సుపరిచితమైనది. స్మరణీయమైనది.

పోతనగారి భాగవతం ఇంతకంటే భిన్నమైనది. ఇది భక్తిప్రధానమైన రచన. పద్యాలు రసగుళికలు. విశేషించి ప్రయత్నమక్కరలేకుండానే ధారణకు నిలిచే గుణం ఆ పద్యాల నడకలో ఉంది. ప్రహ్లాద చరిత్ర, వామనచరిత్ర, గజేంద్రమోక్షము, రుక్మిణీ కల్యాణం, నరకాసుర వధ, కుచేలోపాఖ్యానంవంటి ఘట్టాలు మూలానికి పదింతలు పెరిగి తెలుగువారికి అత్యంత పరిచితాలయినవి. "మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు," "కమలాక్షునర్చించు కరములు కరములు, శ్రీ నాథు వర్ణించు జిహ్వ జిహ్వ" "వ్యాప్తింజెందక వగవక ప్రాప్తంబగు లేశమైన పదివేలనుచుంధృప్తిం చెందని మనుజుడు సప్తద్వీపములనైన చక్కంబగునే?" "అలవైకుంఠపురంబులో నగరిలో నా మూల," "సిరికిజెప్పడు శంఖచక్రయుగ ముంజేదోయి సంధింపడు" "ఘనుడా భూసురుడేగెనో, నడుమ మార్గాశ్రాంతుడై చిక్కెనో" – ఈ విధంగా వందల కొలది పద్యాలు తెలుగు భాగవతంలోనివి "లోకుల రసనలె యాకులుగా నుండునట్టి యవిపోకవితల్" అనే పరీక్షకు నిలువజాలినవి కనిపిస్తాయి. భారతంకంటే కూడా భాగవతం అధికప్రచారం పొందడానికి ఒక కారణం భారతం నిర్దేశించే కర్మ యోగం కంటే భాగవతం బోధించే భక్తియోగం సుకరమైనది కావడం. భారతంలో సందర్భంనుంచి వేరుచేసి పఠించడానికి అనుకూలించే పద్యాలు అరుదు. కాని భాగవతంలోని పద్యాలలో గీతిగుణం పుష్కలంగా ఉండడం కూడా జనాదరణానికి ఒక కారణం. ముఖ్యంగా అనుప్రాసాలంకారం శ్రోతల నిట్టె ఆకర్షిస్తుంది.

"బలదైత్యేంద్ర కరద్వయీకృతజల క్షాళనా వ్యాప్తికై
జలజాతాక్షుడు సాచె సుర్వ సుమనస్సం ప్రార్థిత శ్రీదమున్
కవితా నమ్రమరమాలలాట పదవీ కస్తూరి కాశాదమున్
నలినా మోదము రత్ననూపురిత నానా వేదమున్ పాదమున్"
పోతనగారు నిజదారసుతోదర పోషణార్థమై హాలి కులుగానే ఉండి
"ఫల రసాదుల కురియవే పాదపములు
స్వాదు జలముల నుండవే సకల నదులు
పొసగ బిచ్చంపు వెట్టరే పుణ్యసతులు
దనమదాంధుల కొలువేల తాపసులకు"

అని గ్రంథంలో తాము చేసిన బోధ స్వయంగా పాటించడం కూడా తెలుగువారికి ఆయనపై ఆయన రచనపై పూజ్యభావం కలుగడానికొక కారణం కావచ్చును.

తెలుగుజాతి ఆలోచనా సరణిని చక్కదిద్దడానికి కవితను ఉపకరణంగా చేసుకొన్న తత్త్వవేత్త వేమన. ఆయన జీవితాన్ని గురించి జనశ్రుతిలో వినవచ్చే గాథలే తప్ప నిశ్చయంగా మనకేమీ తెలియదు. ఐతే జీవితంలో ఏవో ఒడుదుడుకులకులోనై విరక్తుడై సాధనచేసి యోగియై సమకాలీన సమాజంలోని మూఢాచారాలను విమర్శించి, పరిహసించి, ప్రజల దృష్టిని అంతరంగంలో వెలిగే పరబ్రహ్మం వైపు మరల్చడానికి కృషిచేసిన మహనీయుడనీ మాత్రం ఆయన రచనను బట్టి ఊహించవచ్చును. ఐతే ఆయన పేర నేడు వ్యాప్తిలో ఉన్న వేలకొలది పద్యాలలో నిజంగా ఆయన రచించినవేవో, ఇతరులు చేర్చినవేవో నిర్ణయించడం కష్టం. ఆయన పద్యాలలో ముఖ్యంగా సాంఘిక దురాచారఖండనం, నిరర్థక మత సంప్రదాయ విమర్శ, నీతిబోధ కనిపిస్తాయి.

"ఓగు నోగు మెచ్చు, నొనరంగ నజ్ఞాని
భావమిచ్చి మెచ్చు పరమలుబ్ధు,
పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా
విశ్వదాభిరామ వినురవేమ"

అని ప్రశ్నిస్తాడు. యజ్ఞ యాగాదులే పరమార్థ సాధకాలని నమ్మేవారినీ, మోక్షప్రాప్తికి శాకాహార భక్షణమొక సోపానమని విశ్వసించే వారినీ.

"సకల యజ్ఞములకు, సకల తీర్థంబుల
తలలు గొరుగకున్న ఫలము లేదు.
మంత్ర జలముకంటె మంగలి జలమెచ్చు" అనీ

ఆకులెల్ల దిన్న మేకపోతుల కెల్ల,
గాకపోయె నయ్యె కాయసిద్ధి,
లోకులెల్ల వెఱ్ఱి పోకిళ్లపోదురు.... అనీ

పరిహసిస్తాడు. నిర్గుణ నిరాకార పరబ్రహ్మన్నే కాని అవతారాలను ఆదరించడు గనుక

కనక మృగము భువిని కలదు లేదనకయే
తరుణి విడిచి పోయె దాశరథియు,
తెలివి లేనివాడు దేవుడెట్లాయెరా అనీ,
రాతి ప్రతిమ దెచ్చి రాజసంబున నుంచి
పూజసేయు నరుడు బుద్ధిమాలి,
భావమందు పరము భావింపనేరడో అనీ అడుగుతాడు, ఆచారాలకే ప్రాధాన్యమిచ్చే వారిని
జనన మరణములను సంధ్య త్రాడును లేదు
సంధ్య త్రాడు లేదు జనని కెపుడు
తల్లి శూద్రురాలు తానెట్లు బాపడు అని హేళన చేస్తాడు.
తిరుమలకనుబోవ తురక దాసరీగాడు
కాశిబోవ లంజ గరిత గాదు
కుక్క సింహమగునె గోదావరికి బోవ అని హెచ్చరిస్తాడు.

ఈ విధంగా వేమన నిరర్థకంగా మతధర్మం పాటించినంతమాత్రాననే సాటి జీవులపట్ల దాక్షిణ్య బుద్ధి ముఖ్యమని ప్రబోధించును.

వేమన కవితకు చాలాకాలం వరకు పండిత సదస్సులలో గుర్తింపు లభించని మాట వాస్తవమే గాని, ఆయన పద్యాలు ప్రజలలో చిరకాలంగా బహుళ వ్యాప్తిలో ఉంటూ వచ్చాయి. నిత్యజీవితంలోని సులభ గ్రాహ్యమైన పోలికలతో, సరళ సహజ మైన వ్యావహారిక భాషలో విషయం స్పష్టంగా బోధకావడానికి వీలుగా సూటిగా చెప్పడమూ, అపారమైన మానవతా దృష్టి, సంఘ సంస్కరణాభిలాషా ఇందుకు కొన్ని కారణాలు. స్వతంత్రంగా యోచించి లక్ష్యం నిర్ణయించుకోవలసినదని తెలుగు వారికి బోధించిన తత్త్వవేత్త వేమన.

పాశ్చాత్యులు మనదేశానికి వ్యాపారం చెయ్యడానికి వచ్చి, వారిలో ఇంగ్లీషు వారిక్కడ ప్రభుత్వాధికారాన్ని వశం చేసుకొని, తమ ఆధిపత్యాన్ని సాగించి తమ విద్యాసంస్కృతులను మన దేశస్థులకు బోధించడం మొదలు పెట్టిన తరువాత, మన దేశంలోని ఇతర ప్రాంతాలలోని వారి వలెనే తెలుగు యువకులు కూడా పాశ్చాత్య సంస్కృతి ప్రభావానికి లోనయ్యారు. పాశ్చాత్య భాషాసాహిత్యాధ్యయనాలవల్ల వీరి జీవిత దృక్పథంలో మార్పు రావడం, వీరిలో సంఘ సంస్కరణాసక్తీ, జాతీయతా భావవికాసమూ, స్వాతంత్ర్య ప్రీతి చిగుళ్లెత్తడం జరిగింది. అందుకు ఫలితంగానే 19వ శతాబ్దంలో ఇతర ప్రాంతాలవలె తెలుగుదేశంలో కూడా సంఘ సంస్కరణోద్యమాలనేకం సాగాయి. సనాతనాచార పరుల నిరసనను లెక్కచేయక యత్నకార్య సాఫల్యం పొందాయి కూడా. తరువాత 20వ శతాబ్దంలో క్రమంగా రగులుకొని పెనుమంటగా మారిన జాతీయోద్యమం కూడా ఈ విధంగా పాశ్చాత్య సాహిత్య పరిచయంవల్ల వృద్ధి పొందినదే. తెలుగులో స్మరణీయమైన దేశ భక్తి కవిత ఆవిర్భవించడానికి ఈ ఉద్యమం కారణం. గాంధీజీ అహింసా సిద్ధాంతానికిచ్చిన ప్రాధాన్యం తెలుగువారి దృష్టిని బుద్ధదేవుని "చల్లని చూపు, తీయని మనస్సు, దయామృతసార వాహినుల్ వెల్లువ లైన చిత్తము" మీదికి మరల్చాయి.

కార్ల్‌మార్క్సు వర్గకలహ సిద్ధాంతమూ, మొదట సిగ్మండ్ ఫ్రాయిడ్, తరువాత యాడ్లర్, యుంగ్ వంటి అనుయాయులూ ప్రతిపాదించిన మనస్తత్త్వశాస్త్ర సిద్ధాంతాలూ ఈ శతాబ్దంలో తెలుగు వారిపై కొంత ప్రభావాన్ని చూపాయి కాని ఇది విద్యావంతులలో కొద్దిమందికి మాత్రమే పరిమితమైనది.

ప్రపంచంలో ఏ దిక్కునుంచి ఏ గాలి వీచినా ముందుగా తెలుగువారు ఊగిపోతారని, అంటే వారిలో ఆవేశపు పాలు ఎక్కువ అని, అంధానుకరణం కూడా ఎక్కువ అని ఒక విమర్శ దేశంలో ఉన్నది. తండ్రి తాతలనాటి సంప్రదాయాలనే మూర్ఖంగా అనుసరించాలనే తత్త్వం వారిలో లేకపోవడం, ఏదైనా మార్పంటే వారు వెనుకంజ వేయకపోవడం వాస్తవమే. సంకుచిత బుద్ధితో దేశకాల పాత్రలను గమనించకుండా సంప్రదాయాన్ని అంటిపట్టుకొని ఉండడం కంటె, మార్పును ఆహ్వానించే ఉదారదృష్టి నలవరచుకోవడం ఆవశ్యం అభిలషించదగినదే. ఐతే "నవీన మిత్యేవన సాధు సర్వం" అని మనం గ్రహించడం కూడా అవసరమే. ఆవేశం లేని జాతి, అడుగడుగున లాభనష్టాలను లెక్కించుకుంటూ ముందుకు నడక సాగించని జాతి, ఎన్నటికీ నిత్యాభ్యుదయ పథాన పయనించలేదు. ఆవేశం కొంత అవసరమే. ఐతే ఆ ఆవేశానికి ఆలోచనను కూడా జోడించి తమ కర్తవ్యాన్ని నిర్ణయించుకోగలిగిననాడు, తెలుగు ప్రజలు తమ జాతీయ జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలనందుకోగలుగుతారు. తెలుగుజాతిని ప్రభావితం చేసిన సాహిత్యం ఈ సత్యాన్నే వారికి తరచుగా జ్ఞప్తిచేస్తున్నది.

(తెలుగు వాణి నుండి)

డా. బి. రామరాజు

తెలుగు జానపద గేయాలు

ఇతర భాషలలోని జానపద గేయాల లాగే తెలుగు జానపద గేయాలు కూడా విలక్షణమైన సాహిత్య సాంస్కృతిక విలువ సంతరించుకున్నాయి. ప్రజల నోటినుండి అప్రయత్నంగా వెలువడిన ఈ గేయాలలో చక్కటి శిల్పం కానవస్తుంది. ఈ గేయ సంపదను భద్రపరచి విశ్లేషించి, పరిశీలించడం ఎతైనా అవసరం. అనాది నుంచి సజీవమైన జాను తెలుగు సారస్వతంగా వుంటున్నప్పటికీ పండితులు వీటి అధ్యయనం పట్ల ఎక్కువ ఆసక్తి ప్రదర్శించలేదు. తెలుగు భాషా సంస్కృతుల చరిత్ర ఎంత ప్రాచీనమైనదో తెలుగు జానపద గేయ చరిత్ర కూడా అంత ప్రాచీనమైనట్టిది.

ఈ జాతీయ కవిత ప్రజలకు అత్యంత సన్నిహితం కావడం చేత తెలుగులోని శిష్ట సాహిత్యం కంటే జానపదగేయాలే తెలుగువారి సంస్కృతికి ఉత్తమ దర్పణంగా ఉన్నాయి.

వాస్తవానికి జానపదగేయాలు శక్తిని, చైతన్య స్ఫూర్తిని తెనుగు ప్రజల జీవన స్రవంతి నుంచే పరిగ్రహించాయి. అందువల్ల మతపరమైన ఉద్యమాలు, వీరకృత్యాలు, మహాపురుషుల గాథలు, ఆచార వ్యవహారాలు సంప్రదాయాలు, విశ్వాసాలు, వినోద సాధనాలు ప్రణయ వియోగాలు, సౌందర్యం, సంపద, విషాదవృత్తంతాలు, ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు ప్రజల జీవితం యావత్తూ జానపద గేయాలలో మధుర మంజుల శృతిలో ప్రతిధ్వనిస్తుంది. తెలుగువారి దైనందిన జీవితంలో కవితా సౌరభం గుభాళిస్తుంది. మనోల్లాసానికి, ఆనందానికి మాత్రమే కాక ఈ గేయాలను పడవనడిపేవారు, కుప్ప నూర్చేవారు, పొలందున్నేవారు, బరువులు మోసేవారు, కాయకష్టంచేసే ఇతర ప్రజలు శ్రమ పోగొట్టుకునే నిమిత్తం పాడుకుంటారు. వీటిలో సరళమైన బావాలు, ఇతివృత్తం వుంటాయి. ఇందలి కవితను ఆస్వాదించేందుకు కేవలం మేధస్సుకంటే మృదు హృదయం అవసరం. తెలుగు జానపద కవిత ఎంత సంపన్నమైనదో ఎంత వైవిధ్యం కలదో ఈ వ్యాసంలో చూపేందుకు ప్రయత్నించడం జరిగింది.

కావ్యాలలో ప్రస్తావన

దేశమందలి ఇతర ప్రాంతాలలో మాదిరే తెలుగు సీమలోని జానపద వాఙ్మయం మిక్కిలి సంపన్నమైనది. చిరకాలం నుండి గేయ సాహిత్యం తెలుగునాట వృద్ధి చెందుతూ వస్తున్నది. శిష్ట కవులు తమ కావ్యాలలో సమకాలీన గేయ రీతులను గురించి చేసిన ప్రస్తావనలే ఇందుకు నిదర్శనం. ప్రాచీన శిష్ట కవులలో ఒకడైన నన్నెచోడుడు తన 'కుమారసంభవం' కావ్యంలో 'ఆలతులు, గౌడుగీతాలు, రోకటి పాటలు, అంకమాలికలు, ఉయ్యాలపాటలు' మున్నగు జానపద గేయ రీతులను పేర్కొన్నారు.

.... వేడ్కసలుపుచు, నాలతులొాగి జేసి పాడి రభినవనీలన్ (4-112)

..... గౌడుగీతములు పాడుచు బొల్పొగ గ్రాలియాడుచున్ (6-45)

.......రోకcటగొని దంచుచున్ శబర కామని వెక్కులు రాగముల్ రసోత్కటముగ బాడె ... (6-47)

తన కవిత ద్వారా శైవమతప్రచారం చేసిన ప్రజాకవి పాల్కురికి సోమనాథుడు శైవభక్తులు పాడే గీతాలే తన కవిత్వానికి ఆధారాలని చెప్పాడు. "ఆతతత బసవ పురాతన భక్త గీతార్థ సమితియె మాతృక గాగ" (బసవ పురాణం వేటూరి ప్రభాకర శాస్త్రి పరిష్కృతము పుట 124)

సోమనాథుడు పెక్కు రకాల పదాలను పేర్కొన్నాడు.

పదములు తుమ్మెద పదముల్ ప్రభాత, పదములు, పర్వతపదములా

నంద పదములుశంకరపదములు నివాళి, పదములు వాల్ శు పదములు

గొబ్బి పదములు వెన్నెల పదములు సంజ్య వర్ణన మరి గణ వర్ణన పదము

లర్ణన ఘోష ఘూరిల్లుచునుండ, బాడుచున్నాడుచు బరమ హరమున, ఊడి, సద్భక్త సంకులమ్గుదేర

(పండితారాధ్య చరిత్రము చిలుకూరి నారాయణరావు పరిష్కృతము పుట : 513)

నేటికి కూడ జాజర పాటలు నాచన సోమనాథుడు పేర్కొన చంధస్సు తోను శైలితోను గానం చేయబడుతున్నాయి. ఈనాటికీ ప్రచారంలో ఉన్న అతి ప్రాచీన గేయరీతి 'తమ్మెద పాటలు' వీటి కర్త పాల్కురికి సోమనాథుని తరువాతి కాలంనాటి వాడైన ఏగంటి లక్ష్మయ్య. 'క్రీడాభిరామములో మంచనశర్మ, భట్టిశెట్టి అను యిరువురు మిత్రులు కాకతీయ పాలననాడు ఓరుగల్లు పట్టణం సందర్శించినప్పుడు వారక్కడ వివిధ వర్గాల ప్రజలు పెక్కు రీతులలో జానపద గీతాలాలపించగా విని ఆనందించినట్లు వర్ణించబడింది.

పద కవితా పితామహుడైన తాళ్లపాక అన్నమాచార్యులవారు, తమకాలమందు ప్రచారంలో వున్న జానపద గేయ రీతులన్నిటికి సరిపోయే టట్లు వెంకటేశ్వర స్వామి వారిపై కీర్తనలు వ్రాశాడు. వారి మనుమడు చిన తిరుమలాచార్యులు. ఆయన స్వయంగా పదాలు వ్రాయడమే కాక 'సంకీర్త లక్షణము' కూడా రచించాడు. దీనిలో ఏలలు, గొబ్బిళ్ళు, చందమామ పదాలు, అర్ధచంద్రికలు మొదలగు గేయాలు లక్షణాలు వివరింపబడ్డాయి.

కటకంపై దిగ్విజయం నిమిత్తం బయలు దేరనున్న శ్రీకృష్ణ దేవరాయలు ఒక రజకుడు పాడిన గేయం వలన అపరిమితేజోజిత్తుడైనట్లు ఒక ఐతిహ్యం వున్నది:

'కొండవీడు మందేరా - కొండపల్లి మందేరా

కాడను వాడుండె -కటకం దాకమందేరా!

రాయలవారు తమ 'ఆముక్త మాల్యద' కావ్యంలో బావులనుంచి నీరు చేదుకునేటప్పుడు కర్షకులు పాడే పాటలను వర్ణించారు. 'నంధుయంత్రనతి కృత్రోద్గీత గేయేఘముల్' (2-55)

కందుకూరి రుద్రకవి తన 'సుగ్రీవవిజయ' యక్షగానంలో పెక్కు పదకవితలను తెలిపాడు.

తెలుగు కావ్యాలందు ప్రస్తావించబడిన వివిధమైన ఈ జానపద గేయాలన్నీ మార్పు చెంది అయినా నేడు నిలిచివున్నాయని యిదమిద్ధంగా చెప్పజాల. గతంలో సాహిత్యాభిమానులు వీటి పట్ల శ్రద్ధ వహించక పోవడంచేతనే వేలకొలది ప్రాచీన జానపద గేయాలు ఎన్నో కాలగర్భంలో కలిసిపోయాయి. అయితే ఇటీవల ముద్రణ యంత్రం వచ్చాక ఇందులో కొన్నింటిని భద్రపరచుకోవడానికి వీలుపడింది. పాశ్చాత్య దేశాలలో జరిగినట్లు మనజానపద గేయాలను శాస్త్రీయ పద్ధతులలో సేకరించి వాటిని స్వర సహితంగా ప్రచురంచేందుకు ఇంతవరకు సరియైన ప్రయత్నం జరుగలేదు. గడచిన శతాబ్దిలో సి.పి. బ్రౌన్, జె.ఏ. బాయిల్ అనే ఆంగ్లేయులు పెక్కు తెలుగు జానపదగేయాలను సేకరించి భద్రపరచి తెలుగు సాహిత్యానికి మహోపకారం చేశారు.

తెలుగు జానపదగేయాల ఔన్నత్యాన్ని తెలుసుకోవాలంటే వాటిని ఈ క్రింది విధంగా విభజించి పరిశీలించడం సముచితం.

పౌరాణిక గేయాలు

శిష్ట సాహిత్యంలో మాదిరే జానపద గేయాలకు కూడా పురాణేతిహాసాల నుంచి కథావస్తువు స్వీకరించారు. రామాయణాదులను అనువాదాలలో మూలంలో లేని గాథలు ఎన్నో కానవస్తున్నాయి. చిరకాలంగా జానపదులలో ప్రచారమందుండటం చేత మూల భిన్నమైన గాధలను పండితులు స్వీకరించి వుండవచ్చు. జానపదగేయాలలో దాదాపు ప్రసిద్ధ పౌరాణిక గాధలన్నీ వున్నాయి. పౌరాణిక గాధల పైన మన గ్రామీణులు గొప్పభక్తి, ప్రేమాభిమానాలు చూపుతారు. పురాణాలలోని అమూల్యమైన ఉపదేశాలను విద్యావంతులు వాటిని చదువుకుని అర్థం చేసుకుంటారు. కాగా పామరులు వాటిని జానపదగేయాల ద్వారా గ్రహిస్తారు. పామరులు ఈ ఉపదేశాలను అర్థంచేసుకునే విధంగా జానపద గేయాలలో పొందుపరచారు. వారి వారి చిత్తవృత్తులు, అభిరుచుల ప్రకారం ఆయా కథలలో ఎన్నెన్నో వింత వింత మార్పులు, తొలగింపులు జరిగాయి. రామాయణ, మహాభారత, భాగవతాది పురాణాలు వారి వారి అభిష్టానుగుణంగా రూపుధరించాయి. శిష్ట సాహిత్యంలో మాదిరే, ఇతర గాధల కంటే రామాయణ సంబంధమైన జానపదగేయాలే అధికంగా వున్నాయి. వాల్మీకి రామాయణ మూలంలో లేకుండి బాస్కరరామాయణంలోను, రంగనాథ రామాయణంలోనూ వున్న కథలు జానపద గేయాలందు కానవస్తాయి.

కూచకొండ రామాయణం, ధర్మపురి రామాయణం, శారదా రామాయణం, రామ కథా సుధార్ణవం, మోక్షగుండ రామాయణం, సంక్షేప రామాయణం, గుత్తెలదీవి రామాయణం, చిట్టి రామాయణం, శ్రీరామ దండకములు, రామాయణ గొబ్బిపాటలు, శ్రీరామ జావిలి, అడవి, శాంతపెండ్లి, గోవిందనామాలు మొదలైనవన్నీ పూర్తి రామాయణ గాథలే. శాంతాకల్యాణం, పుత్రకామేష్టి, కౌసల్య బైకలు, శ్రీరాముల ఉగ్గుపాట, రాఘవకల్యాణం, రాములవారి అలుక, సుందరకాడ పదము, ఋషుల ఆశ్రమం, సుగ్రీవవిజయం, కోవెల రాయభారం, అంగదరాయభారం, లక్ష్మణమూర్ఛ, లంకాయాగం, గుహభరతుల అగ్నిప్రవేశం, శ్రీరామపట్టాభిషేకం, లక్ష్మణదేవర నవ్వు, ఊర్మిళాదేవినిద్ర, కుశలాయకం, కుశలవ కుచ్చలకథ, కుశలవ యుద్ధం, పాతాళహోమం, శతకంటరామాయణం తదితరములు రామాయణంలోని కొన్ని ఘట్టాలను వివరిస్తున్నాయి. తెలుగు వారికి ముఖ్యంగా స్త్రీలకు సీతమ్మ ఆరాధ్య దైవతం. సీత పుట్టుక, సీతాకళ్యాణం, సీతనత్తవారింటికంపుట, సీతసమర్త, సీతశుభగోష్టి, సీతగడియ, సీతవామనగుంటలు, సీతమ్మవారి అలుక, సీతవసంతం, సీత దాగిలిమూతలు, సీతసురటి, సీతముద్రికలు, సీత ఆనవాలు, సీత అగ్నిప్రవేశం, సీతవేవిళ్లు, సీతచెర, మాయలేడిపాట మున్నగునవి సీతాదేవిని గురించిన పాటలు.

రామాయణం తర్వాత భారత సంబంధమైన పాటలు అధిక సంఖ్యలో ఉన్నాయి. నలచరిత్ర, దేవయానిచరిత్ర, సుభద్రాకల్యాణం, సుభద్రసారె, ధర్మరాజు జూదం, ద్రౌపతివల్వలు, పండుపాట, విరాటపర్వం, పద్మవ్యూహం, విశ్వరూపం, భగవద్గీత, సావిత్రిపాట, శశిరేఖా పరిణయం, గయోపాఖ్యానం, పరాశరమత్స్యంధీ సంవాదం మొదలైనవి బహుళ ప్రచారం పొందిన భారత కథలు. విరాట, కర్ణ, శల్య పర్వముల పాటలు, ఉత్తర దక్షిణ గోగ్రహణ పాటలు, ఇవి పెద్ద పదములు.

బాగవతసంబంధమైన పదములు కూడా బహుళంగా వున్నాయి. జానపదులకు శ్రీకృష్ణుని కథలపై అభిమానం మెండు. పామర జన హృదయ సీమలందు శ్రీకృష్ణ పరమాత్ముని పాదపద్మాలు అతిసుందరంగా ముద్రితములయ్యాయి. గోకులంలోన స్త్రీలు భక్తి శృంగారాలను మేళవించి శ్రీకృష్ణుని ఆరాధించారు. లీలాశకుడు, జయదేవుడు వంటి భక్త కవులకు సాహితీ స్ఫూర్తినిచ్చింది. గోపస్త్రీలభక్తి శృంగారాలే. ఈ జానపదులకు భక్తి ఆత్మ, శృంగారం శరీరం వంటిది. వీరు కృష్ణతత్వాన్ని మనసారా సేవించారు. భక్తి శృంగారాలే కాకుండా శ్రీకృష్ణుని చిలిపి చేష్టలు జానపదులను మరింత పరవశులను గావించాయి. ప్రహ్లాదచరిత్ర, వామనవిజయం, వామనచరిత్ర, అంబరీషోపాఖ్యానం, గజేంద్ర మోక్షం, శ్రీకృష్ణజననం, కాళిందిమడుగు, శ్రీకృష్ణుని చల్దులు, బాలకృష్ణలీలలు, గుమ్మడుపాట, యశోదకొంగపాట, జలక్రీడలు, రుక్మిణి కల్యాణం, చిలుకరాయభారం, సత్యభామ సరసం, రుక్మిణిదేవి ముచ్చట, రుక్మిణిదేవి సీమంతం, పారుదాతపల్లవి, ఉషాస్వప్నం, కుచలోపాఖ్యానం, భ్రమరగీతలు మొదలైనవి భాగవత సంబంధమైన గీతాలు. సత్య హరిశ్చంద్రపాట, అనసూయపాట, గోవుపాట, దత్తాత్రేయ జననం, దక్షయజ్ఞం, గంగావివాహం, గంగాగౌరి సంవాదం, లక్ష్మీ పార్వతుల సంవాదం, త్రిపురాసుర సంహారం, సవతుల కయ్యం, ఈశ్వర భృంగివాదం, మేనకా పార్వతీసంవాదం, సురాభాండీశ్వరం, మార్కండేయజననం, సిరియాళరాజు చరిత్ర, భల్లాణ రాయచరిత్ర, కొమిరెల్లి మల్లన్న కథ, వరదరాజుపెండ్లి పాట, ఆండాల్ చరిత్ర, శ్రీరంగమహాత్యం, తారుమంతంకీపాట, దశావతారములపాట, లక్ష్మీదేవి స్వగతాలు, వెంకటేశ్వర్ల వేట, చెంచితకథ ఏకాదశిమహాత్యం, వరాహవతార చరిత్ర, మున్నగునవి ఇతర పురాణాలకు మతపరమైన కథలకు స్థానిక గాథలకు సంబంధించినట్టివి. జానపదులు ఈ గాథలలోని పాత్రలతో అవినాభావసంబంధం ఏర్పరచుకోవడం గమనించవచ్చు. ఈ గేయాలను సంస్కృతం లేదా తెలుగు మాతృకతో పోల్చి చూసినట్లయితే జానపదుల చిత్తవృత్తులు పౌరాణిక వ్యక్తులపట్ల వారికి గల ప్రేమాభిమానాలు వెల్లడవుతాయి.

చారిత్రక గేయాలు

జానపదగేయ వాఙ్మయంలో చారిత్రక గేయాలకు విశిష్ట స్థానం ఉంది. ఇతివృత్తం, శైలి, కథా కథన విధానాలలో తక్కిన వాటికంటే ఇవి భిన్నంగా వుంటాయి. వీటిలో వీరరసం ప్రధానంగా వుంటుంది. అందుచేత ఈ గేయాలను వీరగీతాలని వ్యవహరిస్తారు. వీరరస ప్రధానమైన సంఘటన జరిగిన వెంటనే చారిత్రక లేదా వీరగీతం ఉద్భవిస్తుంది. అటువంటి సన్నివేశాన్ని కన్నులారా చూసినప్పుడు చెవులారా విన్నప్పుడు జానపదుడు ఉద్వేగంతో దానిని గానం చేసి వినిపిస్తాడు. ఆపాట క్రమక్రమంగా పాకిపోతుంది. ఈ విధంగా విస్తరించడంలో పాటలోని వస్తువు కాలక్రమంలో మార్పు చెందుతుంది. పాతసన్నివేశాలలో క్రొత్త సన్నివేశాలు కలిసి పోయి, ఆ పాటలో ఊహింపరాని మార్పులు ఏర్పడతాయి. పాత పాటలందలి పేర్లు కొత్తవాటిలోనో, కొత్తపాటలందలిపేర్లు పాతవాటిలోనో ప్రవేశిస్తాయి. ఇదే విధంగా గ్రామాలపేర్లు, వ్యక్తుల పేర్లు, యుద్ధతంత్రాలు, ఆయుధాలు, కాలబద్ధంకాని విషయాలు ఒకదానిలో ఒకటి కలిసి పోతాయి. ఉద్భవించిన వెంటనే లిఖితమైవున్న చారిత్రక గీతాలలో మాత్రం సిసలైన చరిత్ర లభిస్తుంది. కేవలం మౌఖిక ప్రవాహమందున్న గీతాలనుంచి చారిత్రక సత్యాలను గుర్తించడం కష్టసాధ్యం. ఇటువంటి గీతాలు రానురాను పూర్తిగా మారిపోయి, గుర్తించడానికి వీలుకాక అస్పష్ట చారిత్రకాలుగా పరిణమించి మరికొన్ని దినాలను పుక్కిటి పురాణాలుగా, కల్పితగాథలుగా మారి పోతాయి. ఇట్టి గీతాలు ప్రతి భాషలోనూ వున్నాయి.

వీరగీతాల ధ్యేయం వేరు. ఇతర జానపద గేయాల ధ్యేయం వేరు. వీరగీతాలు కేవలం వినోదానికి, ఉల్లాసానికి మాత్రమే కాదు. అవి వీరత్వాన్ని దేశభక్తిని ఉద్బోదించి ఉద్దీపింప చేస్తాయి. తెలుగు నాడు తొలినుండి వీరసీమగా వాసికెక్కింది. ఈ సీమలో ఎందరో వీరాధివీరులు జన్మించారు. ఇచ్చట పుట్టిన చిగురు కొమ్మైనా చేవ గలదే. ఈ పోతుగడ్డపై బ్రహ్మనాయుడు, ఖడ్గతిక్కన వంటి మహా యోధులు, బాలచంద్రుడు, కుమార రాముడు వంటి సాహస మూర్తులు రుద్రమదేవి, మాంచాల, పార్వతిదేవి, రాశిశంకరమ్మ వంటి వీరనారీమణులు ప్రభవించారు. తెలుగువారికి వీరాభినివేశం మెండు. అందుచేతనే వీరోత్సవాలు, వీరపూజలు, తెలుగు నాట పాదుకొన్నాయి. కారెంపూడి తిరునాళ్ళలో పల్నాటి

వీరారాధన, నెల్లూరు గంగజాతరులు తెలుగు ప్రజల పవిత్ర వీరపూజ సంప్రదాయాన్ని వెల్లడిస్తాయి. తెలుగు దేశం అంతటా కానవచ్చే 'వీరగల్లు' శాసనాలు ఇష్ట వీరపూజకు ప్రబల నిదర్శనాలు.

మియాసాబ్ కథ, సోమనాద్రి కథ, రామేశ్వరరావు కథ, రాణిశంకరమ్మ కథ, సలై వెంకటరెడ్డి కథ, సదాశివరెడ్డి కథ, పర్వతాలమల్లారెడ్డి కథ, సర్వాయి పాపని కథ, బల్లూరి కొండ్రాయుని కథ, కుమార రాముని కథ, తెలంగానాలో బహుళ ప్రచారం పొందిన వీర గీతాలు. పల్నాటి వీరులకథలు, కాటమరాజుకథ, దేశింగురాజుకథ, బొబ్బిలికథ, పెద్దాపురం కోడిపందేల కథ, అల్లూరి సీతారామరాజుకథ, మొదలైనవి ఆంధ్రప్రాంతమంతటా ప్రచారం పొందినాయి. బంగారుతిమ్మరాజు కథ, ఆరెమరాటీల కథ, బళ్లారి కొండలరాయుని కథ, అస్పష్ట చారిత్రక గీతాలని చెప్పవచ్చును. మహాభారత కాలంనుంచి సమర్ధ నీతి ప్రకారం ద్వంద్వ యుద్ధం జరిగినప్పుడు ఒకవీరునితో శత్రుదళం నుంచి ఒక్కడు మాత్రమే తలపడాలి. అలాకాక ఒక వీరునిపై పెక్కుమంది తలపడి అతనిని పరిమార్చినట్లయితే ప్రజల దృష్టిలో అది వీర మరణం అవుతుంది. కాలక్రమలో అతనిని జానపదులు దైవసమానుడుగా భావిస్తారు. అంతటితో వీరపూజ ప్రారంభమవుతుంది. హైదరాబాదు విమోచనోద్యమంలో అసువులు బాసిన వీరుల గాథలు ఆంధ్రదేశమంతటా ప్రచారంలోకి వస్తున్నాయి.

పారమార్థిక గేయాలు

భక్తి కర్మజ్ఞానమార్గాలు మూడు మోక్షసాధనాలని భారతీయుల విశ్వాసం. ఈ మూడింటిలో భక్తి మార్గం అత్యంత సులభమైనట్టిది. తెలుగునాట శైవ వైష్ణవాది కీర్తనలు వేల సంఖ్యలో ప్రజాబాహుళ్యంలో అధిక ప్రచారం పొందాయి. అదృష్టవశాత్తూ అతి ప్రాచీనమైన భక్తిగీతాలు కొన్ని మనకు లభ్యమవుతున్నాయి. ఈ భక్తి గీతాలు పాడుకుంటూ జంగంవారు, హరిదాసులు, తమజీవనాన్ని సాగించుకుంటున్నారు. అదే వారి జీవనోపాధి. భద్రాచలరామదాసు కీర్తనలు, తూము నరసంహదాసు కీర్తనలు, పరాంకుశదాసు, ప్రకాశదాసు, వెంకటదాసు కీర్తనలు, తెలుగు సీమఅంతటా వినవస్తాయి. పదములు, దరువులు, మేలుకొలుపులు, భూపాళములు, లాలిపాటలు, జోలపాటలు, మంగళహారతులు స్తోత్రములు, తారావళులు, నామావళులు కూడ కీర్తనల క్రిందికే వస్తాయి.

భారతదేశం తత్వవేత్తలకు పుట్టినిల్లు. పండితులే కాక పామరులు సైతం వేదాంత సత్యాలను పాడుకుంటారు. వాటిగురించి చర్చించు కుంటారు, వీటిని 'తత్వాలు' అని అంటాం. ఈ తత్వాలు ఎక్కువ భాగం అద్వైత సిద్ధాంతబోధకాలు. సంఘ వ్యవస్థలోని కులబేధాలను ఎక్కువ తక్కువలను ఈ గీతాలలో ఖండించారు. తత్వాలు కొన్ని మర్మకవిత్వమయంగా వుంటాయి. ఏగంటివారి తత్వాలు పోతులూరి వీర బ్రహ్మంగారి కాలజ్ఞానతత్వాలు, సిద్ధప్పపాటలు, లింగమూర్తి పాటలు, ఆత్మ బోధామృతత్వాలు, సీతపాట, రామ రామ శతకము, నారాయణ శతకము, కందార్ధ దరువులు, శ్రీరామగీత, గురుగీత, తారకామృతసారము, రాజయోగిపాటలు మొదలైనవి వేదాంత సంబంధమైన గీతాలు. వైదిక నియమనిష్టలు, యజ్ఞయాగాదికర్మలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేవు. కాని కర్మమార్గం ద్వారా, మోక్షసాధనపట్ల వారికి విశ్వాసమున్నది. ఈకర్మ సంబంధమైన నోములు, వ్రతాలరూపంలోను పాటలు స్త్రీలపై ఎక్కువ ప్రచారంలో వున్నాయి. చిలుక ముగ్గూ పాట, నిత్యానందము పాట, దీపధానం పాట, మోచేటి పద్మము, నోముపాట, కృత్తిదీపాలపాట, పెండ్లిగుమ్మడిపాట, వరలక్ష్మిపాట, శ్రావణశుక్రవారపు పాట, తులసీపాట, లక్షవత్తులపాట, కామేశ్వరీపాట మొదలైనవి నోముల పాటలు. బొడ్డెమ్మ పాట, బతకమ్మపాట, తెలంగాణాలో బహుళ ప్రచారం పొందినట్టివి.

స్త్రీల పాటలు

గృహజీవనంలో స్త్రీకి పురుషునకంటే ఎక్కువ ప్రాధాన్యత వున్నది. కాబట్టి సంసార విషయాలకు సంబంధించిన కవితకు ఆలంబనం స్త్రీలే. వీటిని స్త్రీల పాటలు అనవచ్చు. భారత స్త్రీకి మాతృత్వం అతి పవిత్రమైనది. గొడ్రాలిని సమాజం కూడ చిన్న చూపు చూస్తుంది. ఇట్టి యితి వృత్తాలతో ఉత్తమమైన కవితలు వెలువడ్డాయి. వీటిలో వాస్తవికతపాలు ఎక్కువ. శిశుజననం పురస్కరించుకొని అనేక రకాల పాటలు పాడతారు. లాలిపాటలు, జోలపాటలు పాడి నిద్రపుచ్చుతారు. తల్లి తన కుమారుణ్ణి, రాముడిగానో, కృష్ణుడుగానో, తన కుమార్తెను సీతగానో, రుక్మిణిగానో, గౌరిగానో తలచుకొని, ఈ పాటలు పాడుతూ ఆనంద తన్మయత్వం చెందుతుంది.

స్త్రీ జీవితంలో వివాహం అతి ముఖ్యమైన ఘట్టం. పెండ్లికి సంబంధించిన వివిధ ఆచార వ్యవహారాలు సంప్రదాయాలు, లాంఛనాలు పరిహాసాలు వర్ణిస్తూ, పెక్కు జానపదగేయాలు ఉద్భవించాయి. ఇవి పెండ్లి పాటలు, ఇవి కట్నములతో ప్రారంభమై అప్పగింతలతో ముగుస్తాయి. కట్నముల పాటలు, నలుగు పాటలు, అలుక పాటలు, తలుపుదగ్గర పాటలు, బంతుల పాటలు, బువ్వము పాటలు, వధూవరుల పాటలు, ముఖము కడుగుపాటలు, కట్నాలపాటలు, మిధున విడెముల పాటలు, అవిరేణిపాటలు, ఉయ్యాలవారి పాటలు, అప్పగింత పాటలు వంటివన్నీ పెండ్లి పాటలే. ప్రేమ వివాహాలు అధికంగా సాగుతున్న ఈ రోజుల్లో ఈ పాటలు శీఘ్రగతితో మరుగున పడుతున్నాయి. గృహజీవనం సక్రమంగా జరిగి ఏ యిబ్బంది ఉండదు. యిందుకు భిన్నంగా ఉన్నట్లయితే భర్త, అత్తగారు, ఆడపడుచులు పెట్టే బాధలతో ఇల్లాలి జీవితం నరక ప్రాయమవుతుంది. దీనిన వర్ణించే పాటలున్నాయి. ఈ పాటలన్నిటిలో తెలుగువారి సాంఘిక, సాంస్కృతిక జీవనం పూర్తిగా ఆవిష్కృతమవుతుంది. సీతసమర్త, సీతగడియ, సీతమ్మవారి వసంతం, సీతవామనగుంటలు, సుభద్రసారె, రుక్మిణిదేవి సీమంతం, కౌసల్య బారసాల మొదలైనవి అతి రమణీయములు.

శ్రామిక గేయాలు

కవిత్వం కేవలం ఉల్లాసం కలిగించేందుకే కాక కష్టనివారణ కోసం కూడా ఉదయిస్తుంది. స్త్రీ పురుషులు కాయకష్టం చేస్తున్నపుడు శ్రమ కనపడకుండా వుండేందుకు అలసట చెందకుండా వుండేందుకు అప్రయత్నంగా వారి నోట నుండి కూనిరాగాలు మాటలు వెలువడతాయి. సామూహిక కర్తృత్వంలో ఇటువంటి రాగాలు మాటలు జానపద గేయాలుగా పరిణమించి క్రమంగా వ్యాప్తి చెందుతాయి. పిండి విసురుతున్నప్పుడు, ఇల్లు అలుకుతున్నుపడు ధాన్యం దంచుతున్నప్పుడు, నాగలిదున్నుతున్నప్పుడు, నాట్లు వేస్తున్నప్పుడు, పొలానికి నీరు పెడుతున్నప్పుడు, విత్తనాలు జల్లుతున్నప్పుడు, పంట నూరుస్తున్నప్పుడు పడవలాగుతున్నప్పుడు, రాళ్లు కొడుతున్నప్పుడు, బరువులు మోస్తున్నప్పుడు, రోడ్డురోలరు లాగుతున్నప్పుడు, ఇంటికప్పులు వేస్తున్నప్పుడు, పల్లకిమోస్తున్నప్పుడు రకరకాల పాటలు పాడతారు. ఈ పాటలు పాడుతూ పనిచేయడం వల్ల హృదయంలోనూ, మనస్సులోనూ ఉండే బాధ తొలగిపోవడమే కాక, శారీరక శ్రమ కూడా తెలియదు. శ్రామిక గీతాలకు వస్తువేదైనా వుండవచ్చు. వృత్తికి సంబంధించినపాటలు, శృంగార పాటలు శ్రామికులు పాడుకుంటారు. శ్రామిక గేయాలన్నీ సాధారణంగా వారి పనిపాట్లకు అనుగుణమై ఉంటాయి. శ్రామికుల శరీరభాగాల కదలికలో ఉచ్ఛ్వాస నిశ్వాసాలో ఈ గీతాలకు తాళ లయలు సమకూరుతాయి. ఈ పాటలలోని సంగీతమే కాక శరీర సుఖానికి సంబంధించిన ఊహలుకూడ శ్రామికులకు ఉత్సాహం కలుగచేస్తాయి. శ్రామికులు జీవితంలో వేషభూషణాల ఆడంబరానికి అవకాశం తక్కువ. ఆహార పానాల సౌఖ్యం కూడ తక్కువే. కాబట్టి, వారి పాటలలో లైంగిక సుఖానికి ప్రముఖ స్థానం వుంటుంది. ఫ్రాయిడు మహాశయుడు తనని 'లిబిడో' సిద్ధాంతంలో దీనిని గురించి చెప్పాడు. శ్రామికుల పాటలందే సిద్ధాంతగానికి పెక్కు ఉదాహరణలు కనిపిస్తాయి. ఎక్కువ కాయకష్టంచేసే శ్రామికులు ముఖ్యంగా బరువులు మోసేవారు పాడే పాటలలో ఎన్నో బూతులు దొర్లుతాయి.

పిల్లల పాటలు

జానపదగేయాలందు పిల్లల పాటల దొక ప్రత్యేక శాఖ. పసిపిల్లల లేత హృదయం ఎంత నిష్కపటమో నిర్మలమో, స్వచ్ఛమో, మార్దవమో వారి పాటలు కూడా అంత నిష్కపటంగాను, నిర్మలంగాను, స్వచ్ఛంగాను, మార్దవంగాను వుంటాయి. ఈ గేయాలు రెండు విధాలు పిల్లల కోసం పెద్దలు రచించి తరతరాల నుండి వస్తున్నవి ఒక రకం. పిల్లలు వ్రాసి ఒక తరం నుండి మరోతరానికి అందినవి రెండవ రకం. పెద్దలు వ్రాసిన వాటిల్లో పిల్లలను లాలించేందుకు వ్రాసినవి 'లాలిపాటలు నిద్రపుచ్చేందుకు వాస్రినవి' జోల పాటలు. ఈ లాలిపాటలు, జోలపాటలు లోని భావాలు పిల్లలకు అర్ధం కావు. వాటిలోని సంగీతం, లయ పిల్లలను లాలిస్తాయి. నిద్రపుచ్చుతాయి. పెద్దలు వ్రాసిన పాటలు, పిల్లలు మెట్లవలె క్రమక్రమంగా పెరిగి పిల్లలు తాము తల్లిదండ్రుల వల్లనో ఇతరుల వల్లనో విన్న పాటలు స్వయంగా పాడేటంత వరకు సాగి ఆగిపోతాయి. ఈ పాటలు పిల్లలకు మొదట నాదామృతం గ్రోలటం నేర్పుతాయి. తర్వాత అనుకరించి చేతులు తిప్పటం చివరకు లయానుగుణంగా చేతులు చరచటం నేర్పుతాయి. మొదటి దశలో ఆకర్షణ, రెండవ దశలో ఉత్సాహం, మూడవ దశలో అభ్యాసం కనిపిస్తాయి.

పిల్లలు పాడే పాటలలో కొన్ని తమ సొంత రచనలు, మరికొన్ని పెద్దల రచనలకు తమ కవిత్వం కలిపి కూర్చినట్టివి వుంటాయి. అనుకరణలో పిల్లలు పెద్దల రచనల లోని ధ్వనులను, మాటలని గ్రహిస్తారు. వాటిలో అర్ధం వుండదు. వాటిని 'అర్ధం లేని పాటలు' వ్యవహరిస్తారు. బాలబాలికలు ఆటలలో పాడేపాటలు ఇట్టి కోవకు చెందినట్టివి. చెమ్మచెక్క, బిత్తి, కోతి కొమ్మచ్చి, గుడుగుడుగుంచం, బుజబుజ రేకులు, గొబ్బిళ్లు, చిట్టిచిట్టి చిర్ర ఇందుకు కొన్ని ఉదాహరణలు. పిల్లల ఆటలందు పాడే అర్ధంలేని పాటలు కొన్నింటిలో పాముకాటు, మంధత్వం, నపుంసకత్వం, ఎముకలు విరుగుల మొదలైన వాటికి చికిత్సలు తెలుపబడటం ఆశ్చర్యం కలిగించక మానదు.

శృంగార గేయాలు

శిష్ట సాహిత్యంలో మాదిరే జానపద సాహిత్యంలో కూడ శృంగార రచనలు విస్తారంగా వున్నాయి. ఆయా జానపదాలు అభిరుచులను బట్టి ఈ గేయాలలో శృంగార భావాలు పొందుపరచారు. వీటిలో ఉన్నత ప్రమాణాలలో వుండే శిల్పం, అలంకారాల కోసం వెతకడం సమజంసంకాదు. శిష్ట సాహిత్యంలో సీతారాముల ప్రణయం ఉదాత్త రీతిలో వర్ణితమై వుంటుంది. జానపద గేయాలలో మాత్రం సీతారాముల శృంగారం కూడ పామర భావసమన్వితం గానే వుంటుంది. ఈ భావాలు పాత్రలకు గాక గేయకర్తలకు ఆపాదించవలసి వుంటుంది. కొన్ని గేయాలలో జానపదాలు ప్రేమకలాపాలు, సాంఘిక నియమోల్లంఘనలు, పరస్పరాకర్షణలు కానవస్తాయి. అయితే కొన్నింటిలో ధర్మవలంభనాలైన ప్రేమ శృంగారాలతో నిండిన గేయాలు కూడా వున్నాయి. జానపద గేయాలలో జీవితం యధాతధంగా చిత్రించబడుతుంది. ఔచిత్య పోషణోద్ధశలతో పాత్రలకు మెరుగు పెట్టే పద్ధతి వాటిలో కానరాదు. జీవితంలో, ఎంత వైవిధ్యం ప్రత్యక్షమవుతుందో, జానపద గేయాలందు కూడా అంత వైవిధ్యం ప్రత్యక్షమవుతుంది. అందుచేతనే ఉదాత్త, అనుదాత్తలు, సభ్య శృంగారం, రసాభాస శృంగారం, నీచశృంగారం, మొదలైనవి ఒకదానితో ఒకటి భుజములోరసికొని పోతూవుంటాయి. అయినప్పటికి ధర్మవలంభనగల ప్రేమ శృంగారాలతో భాసిల్లే గేయాలు కూడ అనేకం ఉన్నాయి.

సేతగడియ, ఊర్మిళాదేవి నిద్ర, సీతమ్మ వారి అలుక, సీతాదేవి వేవిళ్లు, సీతాదేవి ఆనవాలు మొదలైనవి ఉదాత్త ప్రేమను చిత్రించిన గేయాలకు చక్కటి ఉదాహరణలు. సుభద్రాకల్యాణం, నల చరిత్ర పదము, శశిరేఖా పరిణయము, గోపికా స్త్రీల జల క్రీడలు, ఉషా స్వప్నం, రుక్మిణీదేవి ముచ్చట, చిలుక రాయభారం, సత్యభామా సరసం, పారిజాత పల్లవి, భ్రమర గీతాలు మున్నగువాటిలో ఉత్తమ శృంగార భావాలు వర్ధిలములయ్యాయి. లక్ష్మమ్మ కథ వంటి కరుణ రస ప్రధాన గీతాలలో ఉత్తమ యిల్లాంద్ర పవిత్ర ప్రేమ వెల్లడవుతుంది. గంగా వివాహం,

కొమిరెల్లి మల్లన్నకథ, వరద రాజు పెండ్లి పాట, అండాళ్లు చరిత్ర, చెంచిత కథలలో చక్కటి శృంగారభావాలు ద్యోతకమవుతాయి. చల్మోహనరంగ పాట, వెంకయ్య చంద్రమ్మ పాట, నారాయణమ్మ పాట, సిరిసిరిమువ్వ పాట, కాముని పదాలు, జాజర ఆపటలు, గోంగూర పాట మొదలైనవి సాధారణ జానపదులు ప్రేమ గీతాలకు మచ్చు తునకలు.

అద్భుతరస గేయాలు

పిల్లలమాదిరే జానపదులకు అద్భుత రసాభినివేశం అధికం. అద్భుత కథలలో కానవచ్చే మానవాతీత శక్తి పట్ల వారికి భక్తి భావం మెండు. ఈ కథలలో కష్టాలు ఎదురైనపుడు దివ్యశక్తులు అవతరించి వాటిని తొలగించి నట్లే తమకు కూడ అటువంటి దివ్యశక్తులు తోడ్పడగలని వారి నమ్మకం. బాలనాగమ్మ కథ, గాంధారి కథ, పసల బాలరాజు కథ, ధార్మంగద పాము పట్ల చాల ప్రచారం పొందాయి. సత్యం, రుజు వర్తనం చివరకు జయించగలవని ఈ పాటలు చాటి చెబుతాయి.

కరుణరస గేయాలు

జానపదుల శృంగారం తరువాత కరుణాద్భుతాలు. రెండింటికి సమాన ప్రాధాన్యత ఇచ్చారు. నిత్యం జీవితంలో సుఖం కంటే దుఃఖమే ఎక్కువగా తారసిల్లుతుంది. అందుచేత కరుణరస ప్రధానమైన సన్నివేశాలను చిత్రించే జానపద గేయాలు బహుళంగా వున్నాయి. ఆదర్శ జీవిత చిత్రణకు దుఃఖాన్ని అధిగమించే గుణం వీరిలో అంతగాలేదు. జానపద గేయాలలో ఔచితిదృష్టి తక్కువ. పాటలలో దుఃఖాన్ని అణచి పాత్రలకు ఆదర్శ రూపం ఇచ్చే ప్రయత్నం జరుగదు. జాతి వంశం తరువాత జానపదుల దృష్టిని ఆకర్షించేది వ్యక్తులు. వారు ఉత్తమ వ్యక్తుల శౌర్యం చూసి ఉత్సాహం, వారి దుర్మరణానికి జాలి చూపుతారు. కరుణరస భరితమైన పాటలలో మిక్కిలి ప్రాచీనమైనది కన్యకామ్మవారి కథ. త్యాగమూర్తి అయిన కన్యక వైశ్యుల కిలవేల్పయి వారి పూజలందుకుంటున్నది. పేరంటాండ్ల పాటలలో భర్తతో సహగమనం చేసిన పతివ్రతల కథలుంటాయి. బ్రిటిషు ప్రభుత్వం సతి సహగమనాన్ని నిషేధించింది. భర్తతోపాటు చితిలో ఆహుతి అయిన పతివ్రతలను అలౌకిక శక్తి సంపన్నులుగా పరిగణించి వారిని ఆరాధించే పద్ధతి ఆంధ్ర దేశమంతటా వాడుకలో వున్నది. కామమ్మ కథ, లక్ష్మమ్మ కథ, సన్యాసమ్మ కథ, మండపేట పాపమ్మ కథ, ఎరుకమ్మ కథ, తిరుపతమ్మ కథ, వీరరాజమ్మ కథ మొదలైనవి భర్తల చితులపై ఆహుతి అయిన పుణ్య స్త్రీల కథలను వివరిస్తున్నాయి. ఎరుకల నాంచారమ్మ కథ, రాములమ్మ పాట, సరోజనమ్మ పాట, మూసీ పొంగే పాట మున్నగువని తెలంగాణాలో ప్రచారంలో వున్న కరుణ రస గేయాలు.

తెలుగు జానపద గేయాలలో అధిక ప్రచారం పొందిన వాటి సంగ్రహ చరిత్ర ఇది. ఆముద్రితమైన ఈ గేయాలు అసంఖ్యాకంగా వున్నాయి. వాటిని భద్రపరచేందుకు తగు శ్రద్ధ వహించక పోయినట్లయితే నాగరికత పల్లెసీమలకు విస్తరించిన కొలది ఇవి క్రమంగా అంతరించి పోతాయి. వాటికి సాహితీ పరమైన విలువ మాత్రమే కాక సాంఘిక, సాంస్కృతిక, భాషా విషయక ప్రాధాన్యత కూడ వున్నది. నిఘంటువులలో లేని ఎన్నో అందమైన నుడికారాలు, పదాలు, ప్రయోగాలు వాటిలో కనుపిస్తాయి. రమణీయమైన స్థానిక గాథలు వాటిలో అభినర్పితాలయ్యాయి. ప్రతిభ గల కవులు వాటిని చక్కటి కావ్యాల్లోను మలచవచ్చును. వివిధ ప్రణాళికల ద్వారాను, బహుళార్ధ సాధకమైన ప్రాజక్టుల ద్వారాను భారత దేశానికి కొత్త రూపురేఖలు తీర్చిదిద్దేందుకు బృహత్తర కృషి జరుగుతున్నది. ఇటువంటి తరుణంలో జానపద గేయాలు నిరక్షరాస్యులైన ప్రజలలో ప్రచారానికి అత్యుత్తమ సాధనం కాగలవు. ఈ రకంలో వంగీయులు, హిందీవారు ఎక్కువ పురోగతి సాధించారు. వారు తమ జానపద గేయాలను జాగ్రత్తగా భద్రపరచుకున్నారు. వాటిని ఉత్తమంగా వినియోగించుకుంటున్నారు. తెలుగువారు కూడ వారిని అనుసరించ గలరని నా విశ్వాసం.

(తెనుగు సంస్కృతీ తరంగాలు నుండి)

నన్నపార్యుని మురళి – నాదమైనది గీతి
తిక్కన్న నవసృష్టి – తేజమైనది గీతి
శంభుదాసుని హృదయ – సారమైనది గీతి
ఆరాధన మొనర్తు – నాంధ్ర సుందర గీతి,

– బెళ్ళూరి శ్రీనివాసమూర్తి

న్యాయపతి రాఘవరావు

బాలవాఙ్మయం

తెనుగు బాలసాహిత్యం యొక్క పూర్వచరిత్రను గురించి నేను ఇప్పుడు ఇక్కడ విపులంగా చెప్పదలచుకోలేదు. ఎందుకంటే, అసలు పూర్వచరిత్ర అంటే ఏమీ అట్టేలేదు గనుక.

నన్నయ తిక్కనాది కవుల రోజుల్లో తెనుగు భాషలో గొప్ప కావ్యాలు రచింపబడినవేగాని బాలల కొరకు ప్రత్యేకంగా వ్రాయబడిన రచనలేవీ కనబడవు. కాని అంతకు పూర్వమే, ఈ రచనలన్నిటికీ పూర్వమే, బాలవాఙ్మయం పుట్టిందని నా మనవి. ఆంధ్రావనిలో తెనుగు బాలల పుట్టుకతోనే బాలవాఙ్మయం కూడా పుట్టిందని చెప్పవచ్చును. ఏ తల్లో తన ముద్దు బిడ్డను ఉయ్యాలలో ఊపుతూ, కూనిరాగాలు తీస్తూ– "లాలి బంగారుబొమ్మ– లాలి మాయమ్మా" అంటూ ఒక జోలపాట అప్రయత్నంగా పాడి వుంటుంది.

ఏడుస్తూవున్న పాపాయిని ఎత్తుకొని ఒక తల్లి– "ఏడవకు ఏడవకు వెర్రినా తండ్రీ ఏడుస్తె నీకళ్ళ నీలాలు కారూ" అనిన్నీ, ఇంకా ఏడుపు మానకుంటే, ఆకాశం వేపు చూపి

చందమామా రావే– రావే చందమామా
చందమామా రావే– జాబిల్లిరావే
కొండెక్కి రావే– కోటిపూలు తేవే
బండెక్కి రావే– బంతిపూలు తేవే"

అంటూ లాలనగా ఒక గేయాన్ని పాడి ఉంటుంది.

ఈ విధంగా లాలిపాటలను, జోలపాటలను మన తెలుగు తల్లులే కవితను అల్లి మొట్టమొదటి బాలవాఙ్మయాన్ని సృష్టించారేమో!

బాలలు పెరగ్గానే వారి వయస్సుకి అనుగుణంగా ఆటపాటలు కూడా మనకి తరతరాలుగా వచ్చాయి.

"చమ్మచక్క– చారడేసి మొగ్గ
అట్టుపోయంగ– ఆరగించంగ"– ఇంకా
"విశాఖపట్నం వీశెడు బెల్లం
నీకో పదలం నాకో పదలం
పదలం పదలం పదలం
కళింగపట్నం కాసుల పేరూ

నీకో పేరూ నాకో పేరూ
పేరూ పేరూ పేరూ
భీమునిపట్నం బిందెల జోడూ
నీకో జోడూ నాకో జోడూ
జోడూ జోడూ జోడూ"

ఇలాగ ఆడపిల్లలు ఆ రోజుల్లో పాడుకుంటూ, ఆడుకుంటూఉండేవారు.

కొంతకాలానికి మొగలాయి రాజ్యం వచ్చిన తరువాత మనకి రూపాయ్‌లూ, సిపాయ్‌లూ వచ్చాక.

గూట్లో రూపాయ్- నీ మొగుడు సిపాయ్
సిపాయ్ సిపాయ్ సిపాయ్- వంటి పాటలు వచ్చాయి.

తమాషాగా హాస్యానికి -

"బావా బావా పన్నీరు
బావను పట్టుకు తన్నేరు
నులకా మంచం వేశారు
నూరు గుద్దులు గుద్దేరు.

ఇటువంటి రసవంతమయిన పాటలు మన బాలవాఙ్మయానికి అముద్రితంగా వచ్చాయి. ఈ సాహిత్యం ఫలనావారు రచియించారని నిదర్శనాలు కనబడవు. కాని కవితా దృష్టితో చూస్తే ప్రతి ఆటపాటలోనూ, పల్లెపదంలోనూ తెలుగు భాషలోని తియ్యదనాన్నీ, యతిప్రాసల అందాన్ని ఈ గేయరచనలో చూడగలుగుతున్నాం. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు యీ పాత పాటలను కొన్ని సేకరించి తమ "బాల భాష"లో ఉపోద్ఘాతముగా ఇలా వ్రాస్తున్నారు.

"ఉన్నత కవితా వాహినికి బాలవాఙ్మయము ఆటపట్టని చెప్పవచ్చును..."

"ఆంధ్రభాషకు సహజాలంకారమైన యతిప్రాసములు, సంగీతచ్ఛాయ, బాలరచనములందు గానవచ్చుచున్నవి. అట్టి రచనములను బాలకులు పాలమీగడ చవితో జదువగలరు. ఈ ఇంపు నెరుగకపోవుటచే నిప్పటి బాల పాఠ్య గ్రంథ రచనలు-

"ఇదిగో ఆవు; ఇది మంచి ఆవు; ఇది పాలు ఇచ్చును. దీని పాలు తెల్లగా నుండును. ఆవుకు నాలుగు కాళ్ళు ఉండును" ఇత్యాది పొల్లు మాటలతో పాఠము లల్లి బాలకుల విసిగించుచున్నారు."

శ్రీ వేటూరివారి వ్యాఖ్య ముమ్మాటికీ నిజమనిపిస్తోంది. మహమ్మదీయ యుగంలో ప్రారంభమయిన చీకటి బ్రిటిషు యుగంలో బాగా నలుదిశలా వ్యాపించింది. మన బాలలు ఆనాటి అవసరాలను బట్టి-

"ఇదిగో ఆవు; దీనికి నాలుగు కాళ్ళు వున్నవి; దీని పాలు తెల్లగా వుండును." అని నేర్చుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనినే "వాచక సాహిత్య యుగం" అని చెప్పవచ్చును.

ఈ కాలంలో గేయరూపంలో వచ్చిన "శతక సాహిత్యం" తప్పిస్తే బాలల కొరకు ఇతర రచనలు కనిపించవు. ఈ శతకాలనే బాలలు కంఠస్థము చేస్తూ వుండేవారు. 1847లో "పెద్దబాలశిక్ష" ప్రచురించబడకవుంటే మన బాలలు అసలు దిక్కులపేర్లూ, నక్షత్రాల పేర్లు, ఇంకా ఎన్నో విజ్ఞాన విషయాలు మరచిపోయి దిక్కులు చూచేవారేమో!

ప్రథమ తెలుగు బాలల విజ్ఞాన సరస్వము "పెద్దబాలశిక్ష". దాని తరువాత ఒక 100 సంవత్సరాలకు 1946లో మాగంటి బాపినీడు గారి "తెలుగుతల్లి", ఆ తరువాత మరో పదేళ్ళకు మహమ్మద్ ఖాసింఖాన్‌గారి "బాల విజ్ఞాన సర్వస్వము" ప్రచురింపబడినది.

శ్రీ చింతా దీక్షితులుగారు "తెలుగుతల్లి"కి వ్రాసిన తొలిపలుకులు ఇక్కడ అప్రస్తుతము కాదు. వారు ఇలా వ్రాశారు.

"తెలుగు పిల్లల్లారా! ఇంతవరకు (1946) మీరు చదువుకోవడానికి సరియైన పుస్తకాలు అట్టే తెనుగులో లేవు. మీరు చదువుతున్న వాచకాలు మీ పుస్తకాలు అనుకుంటారేమో! కావుసుమండీ! అవి గవర్నమెంటువారి కోసం అదో భాషలో వ్రాసిన పుస్తకాలు. పాపం మీచేత బలవంతంగా చదివిస్తున్నారు. వాటిలో ఏ కొద్దిగానో మంచివి కూడా వుండవచ్చు. మీ కోసం మొన్న మొన్నటి వరకూ ఒక పత్రికకూడా లేదు.."అంటూ వ్రాశారు.

బాల సాహిత్యానికి పిల్లల పత్రికలు చేసిన సేవ తరువాత ప్రస్తావిస్తాను. అంతకు పూర్వమే, అంటే మొట్టమొదటి పిల్లల పత్రిక 1945లో ప్రచురించబడకపూర్వమే, కొందరు కవులు బాలలకోసం గేయాలు రచించారు.

వేంకట పార్వతీశకవులు 'బాలగీతాలు' వ్రాసి ప్రకటించారు. కవి కొండలవారు "చిట్టికైత", "చదువుల దుత్త" మొదలుగాగల గేయ రచనల సంపుటి ప్రకటించారు. టేకుమళ్ళ కామేశ్వరరావుగారు "మిణుగురు పురుగులు", "పాలపిట్ట"లో మంచి గేయాలు వ్రాశాదు. గిడుగు సీతాపతిగారు బాలలకోసం రైలుబండి పాట, 'ఈగ-సాలీడు', 'చిలుకమ్మ పెళ్ళి' మొదలగు గేయాలూ, గేయకథలు వ్రాసి వాచకాల్లో ప్రచురించారు. వీరి గేయాలు బాలలు ఇష్టంగా పాడుకుంటున్నారు.

ఉదాహరణకు : 'ఈగా-సాలీడు' సంవాదం యీ విధంగా సాగింది.

సాలీడు :

ఈగమ్మ ఈగమ్మ ఇంట్లోకి వస్తావా
ఈ ఇంటి చిత్రాలూ ఎచటైనా జూచావా
సుడిమేడ మెట్టెక్కి చుట్టూ తిరుగుతూ వచ్చి
సొగసైన గదిలోని చోద్యాలు చూస్తావా?

అప్పుడు ఈగ :

అబ్బబ్బ ! నే రాను ! అబ్బబ్బ నే రాను
సాలెపురుగుల మేడ-చాప చంపెడు మేడ
ఎగిరి వెళ్ళిన వారు- దిగలేదు నీ మేడ
మేడ నెక్కగ నేల-చావు కోరడమేల?"

ఇలాగ నడుస్తుంది.

అసలు బాలల మనస్తత్వాలు పూర్తిగా గ్రహించి బాలలకు అందుబాటులో వుండే సాహిత్యాన్ని సృషించినవారు శ్రీ చింతా దీక్షితులు గారు. వారు బాలలో నొకబాలయై లక్క పిడతలతో ఆడారు; కథలు అల్లి చెప్పారు. వారి 'సూరీ-సీతీ-వెంకీ' ప్రతి ఇంట్లోనూ ఉన్నారని పిస్తుంది. తెనుగులో మొట్టమొదటి బాలల నవల 'లీలాసుందరి' దీక్షితులుగారే రచించారు. వారి 'లక్క పిడతల'లోని పాటలు చాల మంది బాలలు ఇంటింటా పాడుకుంటారు. ఎంతటి పెద్ద విషయాన్నియైనా బాలలకు తేలికగా అందజేయగలమని నిరూపించడానికి వారి 'హనుమంతుని తోక' ఒక నిదర్శనము. ఈ గేయంలో వారు రామాయణ కథనంతా ఎంతో రసవంతంగా చిత్రించారు. వీరి రచనలు కూడా చాలా కాలం వరకూ వాచకపుస్తకాలలోనూ, 'భారతి' 'గృహలక్ష్మి' పత్రికల్లోనూ ప్రచురితమగుతూ వచ్చాయి.

బాల సాహిత్యం-పత్రికలు

బాల సాహిత్య ప్రచారానికి ఎక్కువగా సహకరించినవి పత్రికలు. 1884లో మదరాసు నుండి వెలువడిన 'జనవినోదిని' అనే పత్రికలో Some amusing rhymes of Ditties for girls అని పూర్వకాలపు ఆటలు ప్రచురించారు. ఈ శతాబ్దం ప్రారంభంలో బాల వాఙ్మయానికి కొద్దో గొప్పో దోహదం ఇచ్చిన పత్రికలు 'గృహలక్ష్మి' 'భారతి'. కాని 1945లో 'బాల' పత్రిక వచ్చేవరకూ పిల్లలకోసం ప్రత్యేకంగా ప్రచురింపబడిన పత్రిక అంటూ లేదు. 'బాల' బాల ప్రపంచంలో ఒక నూతన చైతన్యం కలిగించిందని చెప్పక తప్పదు. 'బాల' తెలుగు బాలలో నొక బాలయై వాళ్ళతో నేస్తం కట్టింది; కొత్త కథలు చెప్పింది; పాటలు పాడించింది; నాటకాలు ఆడింది; బొమ్మలతో కథలు చెప్పింది; వింతలూ, వినోదాలు, విజ్ఞాన విషయాలూ చేకూర్చింది. పొడుపు కథలూ, చిక్కు ప్రశ్నలూ వేసింది. 'బాల' బాల సాహిత్యంలో నూతన పోకడలకు దారి చూపింది.

'బాల'పుట్టిన తరువాత బాలకు ఎందరో చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ పుట్టారు. 'చందమామ', 'బాబు', పాపాయి, బాలవినోదం, బాలబంధు, పొట్టిబావ, తాత, జాబిల్లి, బాలప్రభ, బాలమిత్ర, బొమ్మరిల్లు, బాలానందం- ఇలాగ ఒక డజనుకుపైగా మనకి పిల్లల పత్రికలు వచ్చాయి. ఒక్కొక్క పత్రిక ఒక్కొక్క విధంగా సేవచేస్తూ వచ్చింది. చాలా పత్రికలకు బాలారిష్టాలు తప్పలేదు. కాని బాల సాహిత్యాన్ని కంటికి మెదదుగా ఇంపుగా బాలల చేతులలో పెట్టి, బాల సాహిత్యంలో అభిరుచిని కలుగజేసినవి 'బాల', చందమామ అని చెప్పాలి. అయితే పాశ్చాత్య దేశాలలో ప్రచురింపబడుచున్న పిల్లల పత్రికలను చూస్తే మనం ఇంకా ఎంత వెనుకబడి వున్నామో తెలుస్తుంది. రంగులూ హంగులూ అటుంచి అసలు పిల్లల పత్రికలలో మనం వాడుతున్న భాషకూడా ఎంతవరకు పిల్లలకు అర్థం అవుతుందో కూడా చూడాలి.

బాల పత్రికల సంపాదకులకు, రచయితలకు ఒక చిన్న ఉదాహరణ. ఒక పిల్లల పత్రికలో ప్రచురితమైన యీ వాక్యాలు చూడండి:

"ప్రపంచ విజేతగా సుప్రతిష్ఠితుడౌదామన్న కాంక్షతో పురగోమించిన గ్రీకు దేశాధిపతి అలెగ్జాండరు భారతభూమిలో పురుషోత్తమునితో ప్రతిఘటించి, పరాజితుడై తిరోగమించాడు."

ఇది చదువుతూ వుంటే, క్లాసులో వాచక పుస్తకం చదువుతున్నట్టుంది గాని, పిల్లల పత్రిక చదువుతున్నట్లు లేదు.

ఏది ఎలా వున్నా, మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పిల్లల పత్రికలు వెలువడ్డాక బాల సాహిత్యానికి మంచి రోజులు వచ్చాయనే చెప్పాలి. పాత బాల పత్రికలు తిరగేస్తే అందులో చింతా దీక్షితులు, పాలంకి రామచంద్రమూర్తి, అడపా రామకృష్ణరావు, కవికొండల వెంకటరావు, వేలూరి శివరామశాస్త్రి, రజని, శ్రీవాస్తవ, జనమంచి, శ్రీశ్రీ, ఆరుద్ర, వసంతరావు వెంకటరావు, ముళ్ళపూడి వెంకటరమణ మున్నగు వారి రచనలు; బాపూ, బుజ్జాయి, వడ్డాది పాపయ్య మున్నగు చిత్రకారుల బొమ్మలు కనబడతాయి. పిల్లల పత్రికలను బాలలు ఎంతో ఉత్సాహంతో చదవడంచూచి, ఇదివరలో బాలసాహిత్యాన్ని ప్రచురించుటకు భయపడ్డ పుస్తక వ్యాపారస్తులు ముందుకువచ్చి రచయితలను ప్రోత్సహించి రకరకాల పుస్తకాలను ప్రచురించారు.

బాలగేయాలు, గేయకథలు, బాల రామాయణాలు, బాలభారతాలు, బాల భాగవతాలు, బాల కాశీమజిలీ కథలు, బాలకృష్ణలీలలు, బాల హితోపదేశ కథలు, బాలప్రపంచ కథలు, బాల నాటికలు, బొమ్మల కథలు, విజ్ఞాన కథలు, జీవిత కథలు బాల ప్రపంచంలో వెల్లివిరిశాయి.

గేయ రచనలు

బాలలకోసం చక్కని గేయరచనలు వ్రాసిన వారిలో వేంకట పార్వతీశ కవులు, గిడుగు వేంకట సీతాపతి, చింతా దీక్షితులు, రజనీ కాంతారావు, బి.వి.నరసింహారావు, దాశరథి, నారాయణరెడ్డి, రాఘవ రావు, కవిరావు, అలపర్తి వెంకటసుబ్బారావు, నార్ల చిరంజీవి, ముళ్ళపూడి వెంకటరమణ, వేజండ్ల సాంబశివరావు, పైడిపాటి సుబ్బరామయ్య, ఎల్లోరా మున్నగువారి పేర్లు చప్పున స్ఫురిస్తాయి.

ఈ గేయ రచనలు పరిశీలించి చూస్తే వృత్తాలు, తేటగీతలు, ఆట వెలదుల రూపంతో వచ్చినవి బాలలను ఎక్కువగా ఆకర్షించినట్లు కనబడదు. తాళ లయబద్ధంగా పాడుకునేందుకు వీలుగా వున్న గేయాలూ, గేయకథలు బాలల మన్ననలను పొందగలిగాయి. జేజి మామయ్య (రజని) వ్రాసిన ఈ పాట వినండి :

"ఆటలు ఆడి పాటలు పాడి – అలసి వచ్చానే
తియ్యాతియ్యని తాయిలమేదో – తెచ్చి పెట్టమా

* * *

కుక్కాపిల్లా తోకాడిస్తూ గుమ్మా మెక్కింది
పిల్లీ పిల్లా కళ్ళూమూసీ పీటా ఎక్కింది
కడుపూలోని కాకిపిల్లా గంతూలేస్తోంది
తియ్యాతియ్యని తాయిలమేదో తెచ్చీ పెట్టమా"

ఇటువంటి గేయాలన్నీ చేర్చి రజనీకాంతరావుగారు ఒక చక్కని బాల గేయాలసంపుటి ప్రకటించారు.

బి.వి.నరసింహారవుగారి 'పాలబడి పాటలు', 'బాలరసాలు'లో తియ్యని నిమ్మ తొనలు బోలెడు దొరకుతాయి.

"జూలుగుర్ర మొక్కటుంది
చాలు నా కిం కేమి వద్దు
జీనువేసి కళ్ళెముంచి
నేను స్వారి చేతు దాని" – ఇదొకటి.
"పాపా పాపా నాన్నొస్తారు
పళ్ళూ బిళ్ళలు కొని తెస్తారు
అల్లరి మానితే అన్నీ నీకే
అల్లరి చేస్తే అన్నీ నాకే" – ఇదొకటి

ఇటువంటివి నరసింహారావుగారు ఎన్నో గేయాలు వ్రాసి బాల సాహిత్యానికి ఎంతో సేవ చేశారు.

గేయ కథలు

గేయాలన్నా గేయ కథలు బాలలకు ఇష్టం. బాలగేయ కథలను వ్రాసిన వారిలో కవిరావు, అలపర్తి, ముళ్ళపూడి మొదలగు వారి రచనలు వ్యాప్తంగా వున్నవి. కవిరావు గారి బొమ్మరిల్లు, ఇతర గేయ కథల సంపుటములను చక్కగా అచ్చొత్తించి అందజేశారు. వీరు రవీంద్రుని గేయాలను కూడా అనువదించి 'నెలవంక'ను ప్రచురించారు.

గేయకథలను వ్రాసిన వారిలో చాలామంది వాడుకలో వున్న నీతి కథలను, యుక్తి కథలను కథా వస్తువుగా తీసికొని గేయ రూపంలో వ్రాశారు.

కొందరి రచనలలో అక్కడక్కడ బాలలు చదువకూడని కథలూ, నీతులూ కూడా పొరపాటున ప్రచురింపబడుతున్నాయి. బాల సాహిత్యంలో కథా వస్తువు చాలా ముఖ్యమైనది. ఒకానొక గేయ కథలో యీ నీతిని ప్రబోధిస్తూ పడింది.

"నీకు తోచిన రంగు– నీవు యక యున్న
మాటిమాటికి రంగు మార్చుచుండక యున్న
జగతిలో నీవింక జీవించుటే సున్న."

కథా వస్తువు ఎటువంటిదైనా, అంటే ఎంతక్లిష్టమైనదైనా, బాలలకు అర్థమయ్యేటట్లు చెప్పవచ్చును అని నిరూపించడానికి వసంతరావు వెంకటరావు గారు స్పుట్నిక్ వంటి గేయం చంద్రుని గురించి వ్రాశారు. ఈ సైన్సు పాట వినండి :

చందమామ చందమామ చందమామ
మందగమన మెందుకోయి చందమామ
భూగోళము నుండి పుట్టి
భూమిచుట్టు తిరుగుచుండి

భూగోళపు చీకట్లను
పోగొట్టగ వెన్నెలిచ్చు ॥చం॥
నీలో గాలైన లేదు
నీలో నీరైన లేదు
నీలో తిండైన లేదు
నీలో నిప్పయిన లేదు
నీ లోకంలో బ్రతుకుట
కాధారం బేమి లేదు
తీరా నిను చేరిన ఏ
తీరున జీవింపగలమొ ॥చం॥
అగ్గిపుల్ల వెలిగించిన
భగ్గున మంటలు రావట
ఎంత గొంతు చించుకున్న
సుంతయు వినిపించదట ॥చం॥

కృష్ణశాస్త్రి, దాశరథి, నారాయణరెడ్డి, శ్రీశ్రీగారు కూడా బాలలకు గేయాలూ, గేయ కథలూ వ్రాశారు. కొన్ని మచ్చుతునకలు అప్రస్తుతము కాదనుకుంటాను.

కృష్ణశాస్త్రి గారు వినాయకుడి మీద వ్రాసిన పాట :

బలే ఎలకు సవారీ– ఎలా ఎక్కుతావు
చలో అంటు ప్రతీ ఇంట ఎలా తిరుగుతావు
ఎదీ మాకు చూపించు– ఏనుగు మొగము
ఎదీ చంద్రవంక వంటి ఏకదంతము
ఇదే వచ్చె నీ గుర్రం – ఎలా ఎక్కుతానో
కదల్నీని బొజ్జ నీవు – కదం తొక్కుతావో
తినాలంటె కజాయాలు – తియ్యని అప్పాలు
బనాయించి పోవచ్చు – పంచదార పాలు
క్షణం వుండు మా ఇంట్లో అదే కోటివేలు
ధనాలొద్దు, వరాలొద్దు, దయవుంటే చాలు.
సరేగాని, వినాయకా – చదువు సంధ్యలుంటాయ్
మరీ మరీ పనులుంటై – మంచి ఆటలుంటాయ్
మరోసారి మనవులివే – మాకు అడ్డురాకు
భరాయించుకోలేము– పసివాళ్ళం బాబు.
ఫలం ఇచ్చుకుంటాము– పత్తి రించుకుంటాము
తలోపూలు కాళ్ళకాడ – దాఖలు చేస్తామూ
అలాకాదు తెమ్మంటే– అమ్మనడిగి తెస్తాం
పొలోమంటు పరిగెత్తి– బోలెడు ఉండ్రాళ్లు.

శ్రీశ్రీ గారి “కప్పవైద్యుడు”గేయం :

అనగా అనగా ఒక కప్ప
అది తానొక గొప్ప
వైద్యుడని భావించింది
వైద్యం చేస్తానని చాటించింది
అడవికి వెళ్ళిం దాకప్ప
అమాంతంగా ఒక గొప్ప
వైద్యుడైనట్టు తన మెప్పు
చాటింది బెక బెక డప్పు

ఇలాగ ఆ కథ అంత్యానుప్రాసతో సాగుతుంది.

తెలంగాణా రచయితల సంఘం వారు ప్రచురించిన 'చిరుగజ్జెలు' అనే పుస్తకంలో నారాయణరెడ్డిగారి "తోటతల్లి" గేయ నాటిక ఇలా నడిచింది :

అదుగదులో తోట తల్లి
మనపాలిటి పాలవెల్లి
రమ్మని పిలిచెను గదరా
రామూసోమూ పదరా–

రాము: తమ్ములార మనమంతా
తప్పక వెళ్ళాలిరా
ఆటలతో పాటలతో
పూటలు గడపాలిరా

సోము: ముందు ముందుగా దాగుడు
మూతలె ఆడాలిరా
పిమ్మట పాటాలతో తల
దిమ్మును వీడాలిరా !

ఇలా నడిచింది కథ.

దాశరథి గారి 'వెన్నెల మడుగులు' ఇలా ప్రారంభమవుతుంది :

మడుగులు మడుగులు – వెన్నెల మడుగులు
మెత్తని చుక్కలు ఎత్తిన గొడుగులు
కలువ పూవులకు విలువలు గూర్చిన
కర్పూరంతో కలసిన తొడుగులు–
జలధరం అనే రౌడి కుఱ్ఱాడు ప్రవేశించి–
అరే పిల్లలూ! ఇరే పిల్లలూ
ఒహో పిల్లలూ ఆహా పిల్లలూ
కన్నులు గానక వెన్నెలతోటి
ఎన్నినాళ్ళుగా ఆడేస్తున్నా రొహో...!
ఇదీ వరస.

కథలూ - నవలలూ - నాటికలూ

బాల వాఙ్మయంలో గేయాలకంటే కథల పుస్తకాలే ఎక్కువగా ప్రచురింపబడినాయి. ఈ కథలలో అనువాదాలు ఎక్కువ. సొంత రచనలు తక్కువ. కాశీ మజిలీలు, పేదరాశి పెద్దమ్మ కథలేకాక, విజ్ఞాన కథలు, సంస్కృత సాహిత్య కథలు, విదేశ కథల అనువాదాలు, షేక్‌స్పియర్ నాటక కథలు, భారత భాగవత రామాయణ కథలు, శరత్ కథలు, బైబిలు కథలు, పంచతంత్ర కథలు, మహాపురుషుల జీవిత కథలు ఇలా ఎన్నో రకాల శీర్షికలతో కథలు ప్రచురింపబడినాయి.

ఈ కథలు ప్రచురించడంలో ఎక్కువగా తెలంగాణాలో ఆంధ్ర సారస్వత పరిషత్తువారూ, కోస్తా జిల్లాలలో ఆదర్శ గ్రంథ మండలి, దేశి కవితా మండలి, సకల సాహితీ, బాలసాహితీ, బాల విజ్ఞాన విపంచిలాంటి సంస్థలు పాల్గొన్నాయి. రాయలసీమలో రాయలు కంపెనీ, బాల సరస్వతీ బుక్‌డిపోవారు కూడా బాల సాహిత్యాన్ని ప్రచురించారు. విశాలాంధ్ర, నవోదయ, దాచేపల్లి, కాళహస్తి, ఉమా పబ్లికేషన్సు మొదలగు సంస్థలు కూడా బాల సాహిత్య ప్రచురణకు పూనుకున్నాయి.

పాశ్చాత్య దేశాల్లో పిల్లల పుస్తకాలు రంగు రంగుల బొమ్మలతో, చక్కని అచ్చుతో ప్రచురిస్తారు. బొమ్మలతో కూర్చబడిన కథల పుస్తకాలు బాలలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. ఈ బొమ్మల కథల పుస్తకాలు మన తెలుగు సాహిత్యంలో చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. బుజ్జాయి పబ్లికేషన్సు వారు యీ పనికి పూనుకొని కొన్ని పుస్తకాలు ప్రచురించారు. చక్కని రేఖా చిత్రాలు వ్రాసే యువకులు మనకి ఇంకా కావాలి.

ఆంధ్ర వారపత్రికలో పడిన నరసింహమూర్తిగారు బొమ్మల పంచతంత్ర కథలవంటి పుస్తకాలు కూడా కావాలి. యువ చిత్రకారుడు 'బాపూ' కూడా బొమ్మల కథలను కొన్ని సృష్టించాడు. బాలలకు శాస్త్ర విజ్ఞాన విషయాలు సులభంగా బోధపడేటట్టు వాడుక భాషలో ఇటీవలనే విస్సా అప్పారావు గారు ఖగోళ విజ్ఞానం గురించి 'ఆకాశం' అనే చక్కని పుస్తకం ప్రచురించారు. వేమరాజు భానుమూర్తి గారు కూడా సైన్సు కథలు బోలెడు ప్రచురించారు.

నవలలు

బాల సాహిత్యంలో నవలా రచన కూడా ఆధునిక సాహిత్యంలో ఒక విభాగంగా వెలిసింది.

చింతా దీక్షితులు గారితో ప్రారంభమైన బాల నవలా రచన కె.సభా, పాలంకి రామచంద్రమూర్తి, నార్ల చిరంజీవి, శ్రీవాత్సవ, రావి కొండలరావు, కనకమేడల మొదలగు వారిచేతుల్లో పెరుగుతూ వచ్చింది, చింతా దీక్షితులు గారి 'లీలా సుందరి', 'శంపాలత' 'గోపి–మోహినీ', కే.సభా గారి 'చంద్రం', 'మత్స్యకన్యలు', చిరంజీవి గారి 'మందార మూల, పాలంకి వారి 'చిఱుకప్ప', రావి వారి 'దాసు', కనకమేడల వారి 'అన్నదమ్ములు', శ్రీవాత్సవ వారి 'జల్తారు జాబిల్లి' పిల్లల్ని ఎక్కువగా ఆకర్షించినట్లు తెలుస్తోంది.

నాటికలు

తెలుగు బాలల కొరకు నాటకములు, నాటికలు వ్రాసినవారు బహుతక్కువ. ఆకాశవాణి వివిధ కేంద్రాలలో పిల్లల కార్యక్రమములలో ప్రసార నిమిత్తము రేడియో అన్నయ్య, అక్కయ్యలు, సుభ, శ్రీవాత్సవ, పాలంకి, ఏడిద మొదలగువారు రచించిన రేడియో నాటికలే చాలా వరకు రంగస్థలముపై ప్రదర్శనకు అనుగుణ్యంగా మార్పులుచేసి ప్రచురణమైనాయి.

బాల సాహిత్య ప్రసారానికి ఆకాశవాణి మదరాసు, హైదరాబాదు, విజయవాడ కేంద్రాలు ఎంతో దోహదమిస్తున్నాయి. బాల గేయాలూ, గేయ కథలూ, రూపకాలూ, రేడియో విజ్ఞాన యాత్రలు వ్రాయించి బాల వాఙ్మయంలో బాలలకు అభిరుచిని కలుగజేస్తున్నాయి. అంతే కాకుండా బాల జానపద గేయాలను, పాత కథలనూ, పాటలను సేకరించి, టేపు రికార్డు చేసి రేడియో గ్రంథాలయాన్ని సృష్టిస్తున్నాయి. అముద్రిత రేడియో నాటికలు వందల కొలది రేడియో కేంద్రాలలో ఉన్నాయి.

బాలల కొరకు రేడియో నాటికలేకాక విడిగా రంగస్థల నాటికలు కొన్ని కె.సభా గారు, ఇల్లిందల సరస్వతీదేవి గారు వ్రాసి ప్రచురించారు. కృష్ణకవి గారు బాలకృష్ణుని లీలలు నాటికలుగా వ్రాశారేగాని అవి చదువుకునేందుకే బాగున్నాయి.

ఇప్పటివరకు ప్రచురింపబడిన నాటికలు 12,13 ఏళ్ళ వయస్సు పైబడ్డ బాలబాలికల కొరకే అనిపిస్తుంది. చిన్నారి బాలలకు ప్రదర్శనయోగ్యంగా Ballet వంటి 'మూకీ'లు మనకి ఇంకా కావాలి. రామాయణం, మహాభారతం మొదలయిన కథలను చక్కని గేయ నాటికలుగా చిన్నారి పిల్లలచేత వేయించవచ్చును. అంతేకాదు. పంచతంత్రములోని హితోపదేశ కథలు చిట్టి బాలలకు వేషాలు వేయించి ప్రదర్శించవచ్చును. అట్టి నాటికలలో చెప్పుకోతగినవి 'పిల్లి మెడలో గంట', 'ఆపాయంలో ఉపాయం'.

బాలసాహిత్యం- ప్రభుత్వం

'నేటి బాలలే రేపటి పౌరులు' అని గుర్తించి మన ప్రభుత్వం బాల సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర స్థాయిలోనూ, తెలుగు భాషా సమితి ద్వారానూ కొన్ని బహుమతులను ఏటేటా ఇస్తోంది. "బాల రచయితల కార్ఖానా" అని ఒక బడినిపెట్టి రచనలను పురుగొల్పింది. కాని యీ ప్రయత్నాలు చాలవు. బాలసాహిత్యం ఎక్కువగా, రసవంతంగా సర్వాంగ సుందరంగా వెలువడాలంటే దానికి ఒక సమగ్ర పథకం కావాలి.

(అ.భా. తెలుగు రచయితల మహాసభల సంచిక)

నాగార్జునాద్రి నున్నని పాలరాలపై
శ్రీలు చిందించె మా శిల్పచాల
విద్యానగర మంజులోద్యాన వీధుల
నవ్యతల్ నెరపె మా కావ్యకన్య
త్యాగరాయల ప్రేమరాగడోలికలతో
కమ్మగానూగె మా గానలక్ష్మి
ఏకశిలాపురీ ప్రాకార శిఖరాల
విహరించె మా వీర విజయరాజ్ఞి

దిక్కు దిక్కుల కీర్తి చంద్రికలు నింపి
వెలుఁగులు వెలార్చుకొనియె మా తెలుగుతల్లి
నా పురా వైభవానంద నందనమున
నవ్వుకొన్న వినవ వసంతమ్ము లెన్నొ ॥

– కరుణశ్రీ

తాపీ ధర్మారావు

పత్రికా రచన

ఈ పత్రికల విషయం ఆలోచిస్తే నాకు సాక్షాత్తు భగవత్ స్వరూపంగా కనిపిస్తుంది. ఎందుచేతనంటే ఆనాది మానవుడికి భగవంతుడన్న దృష్టే ఉండకపోయినా క్రమంగా చెట్టూ చేమ, నిప్పూ, గాలి, సూర్యుడూ చంద్రుడు ఇలాంటివన్నీ భగవత్ రూపాలయాయి. తరువాత రానురాను సర్వాంతర్యామి, సర్వశక్తి సర్వజ్ఞుడయి కూర్చున్నాడు. అలాగే మన పత్రిక సంగతి కూడా. మొట్టమొదట పత్రికల బుద్ధేలేదు. తరువాత ఏదయినా ఎవరైనా వ్రాసినది పత్రికన్నారు. అది దినదినాభివృద్ధి పొందుతూ ఈనాడు ప్రపంచంలో ఒక మహాశక్తి మంతమయిన సంస్థగా నిలిచింది. అంతేకాదు. భగవద్గీతలోని విశ్వరూప సందర్భంలో ధార్తరాష్ట్రులను గురించి చెప్పినట్టు.

వక్త్రాణితేత్వరమణా విశంతి
దంష్ట్రా కరాలాని భయానకాని
కేచిద్విలగ్నా దశనాంతరేషు
సంధృశ్యంతే చూర్ణితైరుత్తమాంగైః.

అనేకుల తలలు ఈ పత్రికల కోరల సందులలో పడి పిప్పి పిప్పి అయి పోతుంటాయి.

ఆరంభంలో ఈ పత్రికలు మత విషయాలను ప్రచారంలో పెట్టడానికి కొందరు ఆరంభించారు. కొందరు సంఘ సంస్కరణ కోసం పత్రికలు ప్రచురించారు. మరికొందరు సాహిత్యాది విషయాలను గురించి వాదోపవాదాల కొరకు పత్రికలను నెలకొల్పారు. ఆనాడా పత్రికలు సంపాదకుల ఉత్సాహము మీద ఆధారపడి, స్వల్ప ప్రచారముతో కొన్నాళ్లుసాగి అస్తమిస్తుండేవి. సంపాదకుడే యజమాని. అతనిచేయి నడిచినంతకాలమే ఆ పత్రికకు ఆయుస్సు. ముద్రణా యంత్రాలు, సాధారణ విద్యావ్యాప్తి కలిగినప్పుడు వార్తలు ప్రచురించడానికి అవకాశమూ, అవసరమూ ఏర్పడ్డాయి. గ్రామాలనుండి ఇలాంటి వార్తలు పంపించేవారు విలేఖరులు. ఆరంభ దశలో ఈ విలేఖరులు జీతం భత్యం కోరకుండా కేవలం వారి వారి ఉబలాటం ఆధారం చేసుకొని వార్తలు పంపేవారు. జీతం భత్యంలేకపోయినా ఈ విలేఖరికి ఆ గ్రామంలో ఒక పలుకుబడీ, కొంత ప్రాధాన్యమూ సంక్రమించేవి. అంతేకాదు, అప్పుడప్పుడు ఈ విలేఖరి విమర్శగాని నేరారోపణగాని వ్యక్తుల మీద పడేటప్పుడు విలేఖరికి దేహశుద్ధికావడమో, న్యాయస్థానాలలో దావాలు జరగడమో జరుగుతూ ఉండేవి. ఇంగ్లండులో పత్రికల ఆరంభ దశలో ఒక వ్యక్తి మీద ఘాటుగా విమర్శన వ్రాసినందుకు ఒక సంపాదకుడిని ఆఫీసులో పట్టపగలు పట్టుకొని ఆ వ్యక్తి ప్రాణాలు తీశాడు. ఇటువంటి దారుణాలు జరగనీయకుండా ఉండటానికి ప్రభుత్వాలు శాసనాలు చేయక తప్పదు.

ఆ దినాలలో పత్రికా సంపాదకుడికిగాని, ఈ విలేఖరికిగాని ప్రత్యేకమయిన అర్హతలూ యోగ్యతలూ ఏవీ ఉండేవికావు. కేవలం ఉబలాటం మీదనూ, చేతిలోని తడిమీదనూ మాత్రమే సాగేది. "అయ్యకు ఆస్తీలేదు, అమ్మకు గర్వమూ"లేదన్నట్టు, ఈ పత్రికల వారికి జనసామాన్యములో పెద్ద గౌరవంకూడా ఉండేదికాదు. మొదటి ప్రపంచ యుద్ధం అయిపోయినంత వరకూ పత్రికా రచనా నిర్వహణలో శిక్షణ ఇవ్వడానికి విద్యాలయాలు బయలుదేరలేదు. ఆ రోజులలో వాళ్ళకుండే చిత్రమయిన భావంచూడండి. కుక్క మనిషిని కరిస్తే అది పత్రికలకు వార్తకాదు. మనిషి కుక్కను కరిస్తే అది వార్త అనుకొనేవారు. ఈ సూత్రం కొంతకు కొంత ఇప్పుడు గూడా కనబడుతుంది లెండి. ఒక ఆవుకి మేకదూడ పుట్టిందని ఒక విలేఖరి వార్త పంపుతాడు; దానిని పత్రికా కార్యాలయంవారు పెద్ద అక్షరాలతో చుట్టూచట్రం కట్టి మహా వార్తగా ప్రకటిస్తూ ఉండడం కనబడుతుంది.

ఇంత అల్ప ప్రారంభంతో బయలుదేరిన ఈ పత్రికల విషయం ఇప్పుడుచూస్తే బ్రహ్మాండమంతా నిండిపోయి కనబడుతుంది. వామనుడిలాగ ఈ సంస్థ–

ఇంతింతై వటు డింతయై మరియు తానింతై నభోవీధిపై
నంతై, తోయదమండలాగ్రమున కల్లంతై, ప్రభారాశిపై
నంతై, చంద్రునికంతయై, ధ్రువునిపైనంతై, మహర్వాటిపై
నంతై, సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై

అన్నట్లు పెరిగిపోయింది. ఒక వార్తా పత్రిక నిర్వహణ చూస్తే సంపాదకులు, సహాయ సంపాదకులు, వార్తా సంపాదకులు, స్థానిక వార్తల వారు ఉపసంపాదకులు, ఆటలు, న్యాయస్థానాలు, సినిమా, నాటకాలు చూస్తూ ఉండే సంపాదకులు, ఆదివారం పత్రికల కథలవారూ, స్త్రీల విషయాలు వ్రాసేవారు, అచ్చు ప్రూఫులు దిద్దేవారు, చదివేవారు ఎందరో ఉంటారు. వీరుకాక వార్తలను సంగ్రహించి గ్రామాల నుండి పంపుతూ ఉండేవారు ఇంతకు పదిరెట్లుంటారు. కార్యాలయంలో మేనేజర్లు, గుమాస్తాలు, చందాదారులవారు, ప్రకటనలవారు... వీరందరూ పాత్రికేయులే. ఈ పాత్రికేయులు నిరంతరం పాటుపడుతూ తమ హక్కులకోసం, తమ సౌకర్యాలకోసం సంతతాందోళన సాగించి అనేకం సాధించారు. తపాలా, తంతి వార్తా సంస్థలు వీరికి సదుపాయాలిచ్చాయి. రైల్వేవారు తోడ్పడతారు. మహాసభలకూ, శాసన న్యాయస్థానాలకు వీరు స్వేచ్ఛగా వెళ్ళవచ్చును. వీరు పోవని విశేషలూ, వీరు పత్రికలకు పంపించని సంఘటనూ సాధారణంగా ఉండవు. ఈ విధంగా పాత్రికేయులు తమ ఆవశ్యకతను రూఢి చేసుకున్నారు.

పత్రికలు కేవలం వార్తా ప్రచారానికే కాదు, సహేతుకమయిన విమర్శన వ్యాఖ్యానాలకు గూడా ఉపయోగిస్తారు. సమర్థులయిన సంపాదకుల చేతులలో ఈ విమర్శనలు బలీయముగా ఉంటాయి. అధికారులు గూడా వాటిని ఈసడించలేరు. ప్రభుత్వాలు వాటికి తలఒగ్గవలసి వస్తుంది. పత్రికల అభిప్రాయాలు సాధారణంగా ప్రజాభిప్రాయాలన్న ముఖ్య సూత్రమే దీనికి కారణము. ముక్కున గుద్దినట్టు ప్రజాభిప్రాయం ప్రకటన అవుతూ వుంటే ఎంత శక్తి మంతమయిన ప్రభుత్వమయిన దానిని లెక్కచేయకుండా ఉండలేదు.

ఇటువంటి బలమూ, ప్రాభవమూ కలిగివుండడం చేత ఈ పత్రికా సంస్థను తమ చేతులలో ఉంచుకోవడానికి ధనికులు పూనుకున్నారు. ఇన్నాళ్ళూ సర్వతంత్ర స్వతంత్రుడుగా ఉండిన సంపాదకుడు ఈ పెట్టుబడిదారుకి పరతంత్రుడయ్యాడు. దీనితో కళగా ఆరంభమయి ప్రజాక్షేమంకోసమూ, సత్యప్రచారము కోసమూ బయలుదేరిన ఈ పత్రికా సంస్థ అధికారాపేక్షగలవారి చేతులలోనూ, స్వప్రయోజన బద్ధుల యాజమాన్యాన్నీ ఒక వ్యాపారముగా పరిణమించింది. తమకు విరుద్ధంగా ఉండిన పత్రికలను హతమార్చకపోతే తమ స్వలాభ నిరంకుశత్వానికి వీలు వుండదు క దా! అందుచేత ఆ సంస్థలను కొనివేయడమో, అనేక నామాలతో గొలుసు పత్రికలను స్థాపించడమో చేసి తమ అభిప్రాయాన్నే ప్రజాభిప్రాయంగా చెలామణి చేయడానికి పూనుకున్నారు. తక్కిన చిన్న పత్రికలు నిలువడానికి నీడలేకుండా చేయడానికి ప్రయత్నిస్తారు. అధికారులు గూడా వీరి ధాకకుతాళలేక వీరు నంది అంటే నంది అని పంది అంటే పంది అని అనకతప్పదు. పత్రికలను గురించి ఏదయినా శాసనము చేయవలసి వచ్చినపుడు పాలకులు గూడా ఈ పత్రికా సమ్రాట్టుల సదుపాయ సౌకర్యాలను దృష్టిలోనుంచుకోక తప్పదు. తెగబడి ఏదయినా చేయడానికి సాహసించరు. ఇలాంటి ప్రయత్నమే ఒకటి ఇప్పుడు "పుటలను బట్టి ధర" అన్న విషయములో కనబడుతోంది. ఏది ఏమయినా ప్రజా పరిపాలన జరుగుతూ వున్న మనదేశంలో ప్రజాభిప్రాయానికి జీవగర్రగా ఉన్న పత్రికాలోకం గుత్తదారుల ఏలుబడిలోకి పోవడం చాల విచారకరమని వేరుగ చెప్పనక్కరలేదు. ఈ గుత్త వ్యాపారంతో ప్రజాస్వామ్యపు కూకటులే నాశనమవుతుందనటం అతిశయోక్తికాదు. ఇందరము కాంక్షిస్తున్న ప్రజాస్వామ్యానికి బదులు వ్యక్తి స్వామ్యం ఏర్పడి నిరంకుశత్వానికి దారిచేస్తుంది. ఈ ప్రమాదము నుంచి పత్రికా సంస్థలనూ, ప్రజాసామాన్యాన్ని కాపాడడం ఎలాగో ఆలోచించాలి. ధైర్యంగా నిలబడి ఆనాడు నక్కీరుడు చెప్పినట్టు "నెత్తి కన్ను చూపించినా తప్పు తప్పే" అని అనగలిగిన సంపాదకవర్గం రావాలి. ధనాశతో సత్యాన్నీ, న్యాయాన్నీ మంట గలపడానికి అంగీకరించని యువక సంపాదకులు అవసరం. అందుకు తగినట్టు యువకులనూ న్యాయబద్ధులనూ పురికొల్పి తగిన ప్రచారం జరగాలి. అవసరమయితే ఈ వ్యక్తి స్వామ్య పత్రికలను బహిష్కరించేలాగ జనసామాన్యంలో ఉత్సాహం కలిగించాలి. లేకుంటే మన ప్రజాస్వామ్యమన్నది నేతిబీరకాయే అవుతుంది.

ఇంక భాషను గురించి ఒక్కమాట. పత్రికలు ముఖ్యముగా ప్రజాసామాన్యం కోసం అన్నమాట మరచిపోకుండా ఉంటే ఏ భాషలో ఏ స్థాయిలో వ్రాయాలో చెప్పనక్కరలేదు. మనదేశంలో చదువు వచ్చిన వారు తక్కువ. వారికి వార్తా పత్రికల ఉపయోగం అందాలంటే ఒకడు చదువుతుంటే వారు విననైనా వినాలి, లేదా ఎవ్వరయినా వారికి చెప్పాలి. కాబట్టి రచయిత తన పాండిత్యం చూపడం కాదు కావలసింది. పాఠకుడు అసందిగ్ధంగా గ్రహించాలి. కాబట్టి నిత్య పరిచయమైన వ్యావహారికమే శరణ్యము కావాలి. వార్తలూ, వాటిలోని విశేషాలు

చెప్పుతున్నాముగాని, పాఠ్యపుస్తకంలోని పాఠం చెప్పడంలేదని జ్ఞప్తిలోనుంచుకోవాలి. సుబోధంగా ఉండడం ప్రథమావశ్యకత. తరువాతనే శైలి, పదగుంభన మొదలైనవి.

ఈ దృష్టితో మన సంపాదకులు వ్రాస్తూ ఉంటే కొందరు పండితులు వార్తా పత్రికల ముఖ్యసూత్రం అవగాహన చేసికోలేక ఈ పాత్రికేయుల భాషను పాడుచేస్తున్నారని ఒక నింద వారి నెత్తిమీద వేశారు. ఇది అనాలోచితమయిన నింద. సత్యం దీనికి ప్రత్యక్ష విరుద్ధం. పండితులు మనుకుంటున్నవారు పాడుచేసిన తెలుగు భాషను ఈ పాత్రికేయులు బాగుచేస్తున్నారన్నది అసలు నిజము. తెలుగు గడ్డను పుట్టి, తెలుగు మాతృభాషగా గలవారికి సులభంగా బోధపడని దానిని తెలుగనడం విపరీతం. అటువంటి వ్రాతలవల్ల విసిగి దూరదూరంగా తొలగిపోతూన్న తెలుగు ప్రజలను భాషా రచనలకు సుముఖులుగ చేస్తున్నవారు పాత్రికేయులు. వారికి ధన్యవాదాలు.

రేడియోలు, టెలివిజనులు వచ్చాయి వార్తా ప్రసారము విఘడియలమీద సాగుతూంటుంది. వీటివల్ల పత్రికల ఆవశ్యకత కొంత తగ్గవచ్చును. కాని ఈ రేడియోలు ప్రభుత్వ ఆధీనంలో నున్నంతకాలము వార్తలయందలి మంచి చెడ్డల విమర్శనానికి ఆ రేడియోలు ఉపకరించవు. కాబట్టి పత్రికలు నిలవాలంటే కేవలం వార్తమీదనేగాక, అభిప్రాయ ప్రకటననాదుల మీద ఎక్కువగా ఆధారపడవలసి ఉంటుంది. ఇంతేకాదు, మన రేడియోలు నిజమయిన ప్రజాస్వామ్య పద్ధతుల మీద ఉపకరించాలంటే ప్రభుత్వం స్వపక్షం అన్న సంకుచిత బుద్ధిని విడిచి పెట్టాలి. అన్ని పక్షవాదనలకు సమమయిన అవకాశం ఇవ్వాలి.

శాతవాహనుల వంశాన పుట్టినవాడు
కాకతీయుల పోతుగడ్డ మెట్టినవాడు
పల్లెలోనే కాదు ఢిల్లీలో సైతమ్ము
పెద్ద గద్దెల నేలి పేరుకెక్కినవాడు

    ఎవడయ్య ఎవడువాడు, ఇం
    కెవడయ్య తెలుగువాడు

పంచెకట్టుటలో ప్రపంచాన మొనగాడు
కండువా లేనిదే గడపదాటనివాడు
పంచభక్ష్యాలు తన కంచానవడ్డించ
గోంగూర కోసమై గుటక లేసేవాడు

    ఎవడయ్య ఎవడువాడు, ఇం
    కెవడయ్య తెలుగువాడు

తల్లిబాసకు వేరు ఇల్లుకావలెనంచు
రైళ్ళ పడగొట్టి మారాము చేసెను నాడు
ఏకభాషకు రెండు ఇళ్ళు కావలెనంచు
అఖిల భారతమునే అదరగొట్టెను నేడు

    ఎవడయ్య ఎవడువాడు, ఇం
    కెవడయ్య తెలుగువాడు

తెలుగు బాసను జుంటితేనె యని తెగపొగడి
పొరిగింటి పులుపుపై మరులు పెంచినవాడు
దేశ భాషలలోన తెలుగు లెస్సని చాటి
మల్లెలకు బదులు లిల్లీలు వలచినవాడు

    ఎవడయ్య ఎవడువాడు, ఇం
    కెవడయ్య తెలుగువాడు

ఒకచేత మజ్జిగను ఒడిసి పట్టినవాడు
ఒక చేత మధుపాత్ర వొదిలి పెట్టనివాడు
ఒక ముహూర్తాన ఇంచుక బుర్రగోకుకొని
చల్ల పంచినచేత కల్లు వంచినవాడు

    ఎవడయ్య ఎవడువాడు, ఇం
    కెవడయ్య తెలుగువాడు

నేల నల్దెసల దేరాలు నాటినవాడు
అన్ని మాసలలోన అట్టె ఒదిగినవాడు
"ఏదేశమేగినా ఎందు కా లిడినా"
ఆవకాయ వియోగ మసలె సైపనివాడు

    ఎవడయ్య ఎవడువాడు, ఇం
    కెవడయ్య తెలుగువాడు

మంచిమన సెదురైన మాల లిచ్చేవాడు
భాయి భాయీ అన్న చేయి కలిపేవాడు
తిక్కరేగిందంటె డొక్క చీల్చేవాడు
చిక్కు లెరుగనివాడు చిత్తానపసివాడు

    ఎవడయ్య ఎవడువాడు, ఇం
    కెవడయ్య తెలుగువాడు.

– డా॥ సి. నారాయణరెడ్డి

సి.వి.హెచ్. రావు

ఆంధ్రలో పత్రికా రచన

ఏదైనా ఒక జాతి లేదా ప్రజల రాజకీయ సాంస్కృతిక స్థాయిని కొలవడానికి నమ్మకమైన గీటు రాయి అక్కడి పత్రికా రంగమే. ఆధునిక యుగంలో పత్రికా రంగం ప్రజాజీవిత స్థాయిని దాదాపు ప్రతిబింబిస్తుంది. జాతీయతాచైతన్యాన్ని పత్రికా రంగం ప్రతిబింబిస్తుంది. మిగతా వ్యవస్థలలో కన్నా ప్రజాస్వామిక వ్యవస్థలో, జాతీయ చైతన్యాన్ని పత్రికా రంగం చాలా బలీయంగా వాస్తవంగా చిత్రిస్తుంది. ఈ దృష్ట్యా పరిశీలించి నప్పుడు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తన పత్రికా రంగం చరిత్ర గురించి గర్వించ వచ్చు. ఆంధ్ర పత్రికా రంగం పెరుగుతూ వున్న రాజకీయ, సాంస్కృతిక, సాంఘిక చైతన్యాన్ని సదా ప్రతిబింబిస్తూ వున్నది.

19వ శతాబ్దం చివరి భాగంలో – 80వ పడి తొలి రోజుల్లో 'హితవాద' అనే వార పత్రిక ప్రచురణతో ఆంధ్ర దేశంలో తెలుగు పత్రికా రచనకు నాంది జరిగిందని చారిత్రాత్మకంగా చెప్పుకోవచ్చు. అయితే పోతపోసిన తెలుగు అక్షరాలలో కంపోజుచేసి, ముద్రణా యంత్రం మీద అచ్చయిన మొట్ట మొదటి తెలుగు పత్రిక, శ్రీరావు బహదుర్ కందుకూరి వీరేశలింగం సంపాదకత్వాన ప్రారంభమై 1885లో అచ్చయిన 'వివేక వర్ధని'. రావు బహదుర్ శ్రీ వీరేశ లింగం పంతులు గారు ఆంధ్ర దేశంలో సాంఘిక సంస్కరణలకూ, సాహిత్య పునరుజ్జీవనానికీ వైతాళికుడే కాక తెలుగు పత్రికా రచనకు కూడా ఆది పురుషులైన సంగతి జగద్విదితం. 'వివేకవర్ధని' పత్రిక ఆయనకు అత్యంత ప్రీతిపాత్రములైన ఈ లక్ష్యాలనూ, ఆశయాలనూ ప్రచారం చేయడానికీ, అభివృద్ధి పరచడానికీ వినియోగపడటం సహజం.

ద్వివిధ ప్రగతి

ఆరు దశాబ్దాలు వెను తిరిగి చూచి పరిశీలించినపుడు ఆంధ్రపత్రికారంగంలో రెండు రకాలైన ప్రగతి ధోరణులను మనం గమనించవచ్చు. తెలుగులో పోతపోసిన టైపులు రావడంతోబాటు అనేక తెలుగు పత్రికలు ఆవిష్కరింపబడ్డాయి. సరిగా అదే సమయంలో తెలుగు సాహిత్యంలో పునర్వికాస ఉద్యమం ప్రారంభమైంది. ఇంతవరకు ముద్రణలోని అనేక సాహితీ ప్రక్రియలు, గ్రంథాల రూపంలో అచ్చులో రావడానికి 'తెలుగు టైపులు' ఉపకరించాయి. ఒక్కమాటలో చెప్పాలంటే 19వ శతాబ్దపు చివరి దశాబ్దం తెలుగు సాహిత్యానికి స్వర్ణ యుగం అని చెప్పవచ్చు. ఆ కాలంలో సాహిత్య దిగ్గజాలు అపూర్వమైన సాహిత్య సృష్టిని చేయడంతోబాటు, అత్యంత ఉత్సాహంతోనూ, విజ్ఞాన విపులీకరణలతోనూ ఇతరుల గ్రంథాలను, వ్యంగ్యం ఉట్టిపడగా విమర్శలు చేశారు. ఈ విమర్శలలో పాండితీ ప్రతిభలు

విపులంగా బయట పడ్డాయి. ఈ సాంస్కృతిక పునరుజ్జీవనంలో పత్రికలు అమోఘమైన సాధనాలుగా ఉపకరించాయి. అంతేకాదు సాంఘిక జీవిత ప్రక్షాళనకూ, వరకట్నం, బాల వితంతువులు, అస్పృశ్యత, సిద్ధాంత విహీనమైన మూఢ నమ్మకాలు, అధికారుల లంచగొండితనం మొదలైన, ఆనాడు సంఘంలో ప్రబలంగా ఉండిన సాంఘిక అక్రమాలపై దాడి చెయ్యడానికి కూడా ఈ పత్రికలు బాగా ఉపయోగ పడ్డాయి. ఈ పత్రికలు అదే సమయంలో రాజకీయ సంస్కరణలను కూడా ప్రచారం చేశాయి. 1886లో స్థాపితమైన భారత జాతీయ కాంగ్రెసు రాజకీయ సంస్కరణలకు పునాదులు వేసింది.

భారత జాతీయ కాంగ్రెసు సిద్ధాంతాలు పెంపొందించిన జాతీయతా దృక్పథం వేళ్లు తన్నుకొన్న దేశ భక్తుల హృదయావేశాల ప్రతి ఫలంగా ఆనాడే ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి కూడా సహజంగానే అంకురార్పణ జగింది. ఆ దశాబ్దాలలో వచ్చిన పత్రికలన్నీ ఆంధ్ర ఉద్యమ ప్రచారానికీ, ఆ భావనను పెంపొందించడానిక దోహదం చేసినవే. సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాలు జాతీయ పునర్వికాస ఉద్యమానికి దారులు వేశాయి. తెలుగు పత్రికలు సాంఘిక, సాంస్కృతిక పునర్వికాసంతోబాటు జాతీయ పునర్వికాసానికి కూడా తమ వంతు దోహదాన్ని చెయ్యడంలో ఎవరికీ తీసిపోలేదు.

పత్రికలను ప్రారంభించిన వారు, లేదా ప్రారంభించిన పత్రికలను వాడుకొని తమ రచనలను పత్రికా ముఖంగా ప్రాచుర్యంలో పెట్టిన వారిలో శ్రీ కందుకూరి వీరేశలింగంతోబాటు 20వ శతాబ్దపు తొలి దశాబ్దంలో రంగంలో ఉన్నవారిలో పేర్కొనదగిన వారు శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహం, శ్రీ ఏ.పి. పార్థసారథి నాయుడు, శ్రీ పి. ఆనందాచార్యులు, శ్రీ కె.ఆర్.వి. క్రిష్ణారావు వీరు సంబంధం పెట్టుకున్న పత్రికల్లో పేర్కొనదగినవి. 'మనోరమ', 'ఆంధ్ర ప్రకాశిక', 'కల్పవల్లి', 'సరస్వతి'.

మార్గదర్శకత్వం

వీటిలో శ్రీ పార్థసారథి నాయుడు సంపాద కత్వాన వెలువడిన 'ఆంధ్ర ప్రకాశిక'ను ఆంధ్రలో రాజకీయ పత్రికా రచనా రంగంలో మార్గదర్శకత్వం వహించిన పత్రికగా పేర్కొనవచ్చు. తెలుగులో తొలి సారిగా ప్రారంభించిన అనేక పత్రికలకు లభించని అవకాశం – మంచి అదృష్టం. దీనికి లభించి వరుసగా 25 సంవత్సరాలపాటు నిరంతరంగా వచ్చిన ప్రతిష్ట ఈ పత్రికకే దక్కింది. కొంత కాలం దినపత్రికగా కూడా వచ్చి ఆ తర్వాత వారపత్రికగా మారింది. భారత జాతీయతా భావ ప్రచారానికి అవిరళంగా ఆ రోజుల్లో కృషి చేసిన మరో పత్రిక శశిలేఖ.

19వ శతాబ్దపు చివరి రోజుల్లో మూడు విభిన్న –పరస్పర సంబంధమైన కారణాలతో ప్రారంభమైన విభిన్నమైన మూడుపాయలు పరస్పరం సంలీనమై ఆంధ్రలో తెలుగు పత్రికా రంగాన్ని శక్తివంతంగా ఆవిష్కరించడానికి దోహదం చేశాయి. ఈ మూడు పాయలు – 1. సాంఘిక సంస్కరణ, సాంఘిక అక్రమాల నిర్మూలన, 2. సాహితీ సంస్కరణ, సాహిత్య విమర్శ అభివృద్ధి, 3. జాతీయ ఉద్యమం – ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం ఇందులో అంతర్గతమైన భాగంగానే ఆ రోజుల్లో ఉండేది.

ఆ రోజుల్లో సంపాదకులు గానీ, ప్రచురణ కర్తలు గానీ, ఈనాటి నిర్వచనాలు ప్రమాణాల ప్రకారం చూస్తే పత్రికా రచయితలుగా కాక, ప్రధానంగా పండితులూ, రాజకీయ వాదులుగా ఉండేవారు. వారికి పత్రికా రచన వృత్తిగా కాక, సాధనంగా ప్రవృత్తిగా మాత్రమే వుండేది. ముద్రణా పద్ధతులను, మనకు తెలిసినట్లుగా, ఆనాడు ప్రాధాన్యత ఇచ్చి ప్రదర్శించడానికి ప్రయత్నాలు జరగలేదు.

20వ శతాబ్దపు మొదటి దశాబ్దంలో వందేమాతరం ఉద్యమం రూపంలో రాజకీయ జాగృతి దేశమంతటా, ముఖ్యంగా ఆంధ్రదేశంలో బాగా వ్యాప్తమైన కొద్ది ఆంధ్ర పత్రికా రంగంలో రాజకీయ అంశాలకు ప్రాధాన్యత పెరిగింది. శతాబ్దం మలుపు తిరుగుతున్న సమయంలో 1902లో మచిలీపట్నం నుంచి, దేవభక్త శ్రీ కొండా వెంకటప్పయ్య, శ్రీ దాసు నారాయణ రావుల సంయుక్త కృషితో "కృష్ణాపత్రిక" అనే వార పత్రిక ప్రారంభం అయింది. 1906లో ఈ పత్రిక సంపాదకత్వపు బాధ్యతను సమర్థుడైన తెలుగు రచయిత శ్రీ ముట్నూరి కృష్ణారావు స్వీకరించారు. శ్రీ కృష్ణారావు గారిది బలమైన కలం. రాజకీయ, సాంఘిక సంస్కరణల గురించి ఆయన అభిప్రాయాలు చాలా ప్రగతి శీలమైనవి. ఆంధ్రుల రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక సంస్కరణాభిలాషకు స్వంతంగా వాణినీ, భాషనూ, వ్యాఖ్యానాలనూ ఆయన సమకూర్చి పెట్టారు. ఈ పత్రికకు సంపాదకత్వం వహించిన ఇతర ప్రముఖులు శ్రీ కే. రామకోటేశ్వరరావు, చివరి రోజుల్లో శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు. వీరందరూ శ్రీ కృష్ణారావుగారు నెలకొల్పిన ఉన్నత ప్రమాణాలను కాపాడారు. తర్వాత ఈ పత్రికను శ్రీ ఎం.ఎస్. శర్మ తీసుకొని, ప్రచురణను హైదరాబాదు నగరానికి మార్చారు. దాదాపు 60 సంవత్సరాల పాటు నిరాటంకంగా ప్రచురితమవుతూ వచ్చిన ప్రతిష్ట ఈ పత్రిక విషయంలో ప్రత్యేకంగా చెప్పుకోదగిన విశిష్టత.

గాంధీజీ నాయకత్వాన ప్రారంభమైన స్వాతంత్ర్య పోరాటం తెలుగు పత్రికా రంగానికి ప్రేరణను కలిగించి, సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాల ప్రచారానికై తెలుగులో అనేక పత్రికలు ప్రారంభం అయ్యాయి. ఈ పత్రికలలో పేర్కొనదగినవి 'కాంగ్రెసు'. ఇది మొదలు శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకత్వాన సీతానగరం ఆశ్రమం నుండి వెలువడి ఆ తర్వాత రాజమండ్రికి మారింది. శ్రీ అన్నపూర్ణయ్య అరెస్టయినప్పుడు దీని సంపాదకత్వాన్ని శ్రీ క్రొవ్విడి లింగరాజు చేపట్టారు. తర్వాత ఆ స్థానాన్ని శ్రీ కె. రామ చంద్రరావు స్వీకరించారు. ఆయనకు శ్రీ ఎం. శిరామకృష్ణయ్య సహకరించారు. గాంధీజీ బోధనలైన, 'స్వరాజ్యం' 'శాసనోల్లంఘనం, సందేశాలను ప్రచారం చెయ్యడంలోనూ, ఆంధ్ర ప్రజలలో, దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చెయ్యాలనీ, బాధలు అనుభవించాలనీ జాగృతి చైతన్యాలను కలిగించడం లోనూ, ఎదురైన ఇబ్బందులనూ, బాధ్యతలనూ ఆ రోజుల్లో 'కాంగ్రెసు', 'కృష్ణా పత్రిక'లు సరిసమానంగా పంచుకున్నాయని చెప్పవచ్చు. ఈ రంగంలో తమ తమ

వంతుల పాత్ర వహించిన మిగతా పత్రికలు 'ప్రజామిత్ర', 'ప్రజాబంధు', 'ఆనందవాణి', 'ఆంధ్రజ్యోతి' మొదలైనవి. ఇవన్నీ మద్రాసు నగరం నుంచే వెలువడ్డాయి.

మొదటి తెలుగు దినపత్రిక

కొంత కాలం దినపత్రికగా కూడా వచ్చిన 'ఆంధ్రప్రకాశిక'ను వదలి వేసినట్లయితే, 'దినపత్రిక'గా మొట్టమొదటి సారిగా అచ్చయిన తొలి తెలుగు దినపతిక్ర 'ఆంధ్రపత్రిక'. 1913లో లాంఛన ప్రాయంగా ప్రారంభమైన ఆంధ్రరాష్ట్ర ఉద్యమం సాధించిన ప్రయోజనాలలో ఒకటిగా, 1908 నుండి బొంబాయిలో ప్రచురిస్తూ వుండిన "ఆంధ్రపత్రిక" వారపత్రికను శ్రీకాశీనాథుని నాగేశ్వరరావు గారు మద్రాసుకు తరలించి అదే పేరుతో దినపత్రికగా మద్రాసు నుంచి వెలువరించడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆంధ్రపత్రిక నిరంతర ప్రగతినిసాధిస్తూ, ఆంధ్రరాష్ట్ర ఉద్యమానికి బలీయమైన సాధణంగా ఉపయోగపడటంతో బాటు గాంధీజీ నాయకత్వాన సాగిన స్వాతంత్ర్య ఉద్యమాన్ని సైతం గట్టిగా బలపరుస్తూ దినదినాభివృద్ధి చెందింది. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరావు తర్వాత శ్రీ శివలెంక శంభుప్రసాద్, ఆయన తదనంతరం శ్రీ ఎస్. రాధాకృష్ణ ఈ పత్రికకు సంపాదకత్వం వహించారు.

1930లో తెలుగులో దినపత్రికా రంగం బాగా బలాన్ని పుంజుకున్నది. మద్రాసులో 'ఆంధ్రప్రభ' దినపత్రికను నెలకొల్పడం అప్పుడే జరిగింది. 'జనవాణి' పేరుతో శ్రీ తాపీ ధర్మారావు సంపాదకత్వాన మరో దినపత్రిక 1936లో మద్రాసు నుండి ప్రారంభమై 18 సంవత్సరాలు కొనసాగింది. ప్రారంభంలో కొన్ని సంవత్సరాల పాటు 'ఆంధ్రప్రభ' శ్రీ న్యాయపతి నారాయణ మూర్తి సంపాదకత్వాన వెలువడింది. ఆ తర్వాత 18 సంవత్సరాల పాటు శ్రీ నార్ల వెంకటేశ్వరరావు దీనికి సంపాదకత్వం వహించారు. శ్రీ నార్ల సంపాదకత్వాన ఈ పత్రిక విస్తృతమైన సర్క్యులేషన్‌నూ, అపూర్వమైన ప్రాభవాన్నీ సంపాదించింది. తర్వాత శ్రీ నీలంరాజు వెంకట శేషయ్య దీనికి సంపాదకత్వం వహించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈనాడు దిన, వార పత్రికలలోనూ, వార్తా సంస్థలలోనూ, రాష్ట్ర ప్రభుత్వ ప్రచార విభాగాలలోను ప్రధాన పదవులలో వున్న అనేకమంది పత్రికా రచయితలు 'ఆంధ్ర పత్రిక'లోనూ, 'ఆంధ్రప్రభ'లోనూ మొదట పని నేర్చుకొన్నవారే.

1940 చివరిలో విజయవాడ నుంచి రెండు తెలుగు దిన పత్రికలు 'జన్మభూమి', 'ప్రజాశక్తి' ప్రారంభమై కొద్ది సంవత్సరములు మాత్రమే నడచి మూతపడ్డాయి. 1950 తొలి రోజుల్లో మద్రాసు నుండి మరో రెండు తెలుగు దిన పత్రికలు ప్రారంభమైనాయి. ప్రజాపార్టీకి మద్దతుగా శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు ప్రారంభించిన 'ప్రజా పత్రిక' ఒకటి, రాయలసీమ ప్రయోజనాల పరిరక్షణకోసం ప్రారంభమైన 'విజయవాణి' రెండవది. అయితే యీ రెండూ అనతి కాలమే జీవించ గలిగాయి. ఆంధ్రలో కమ్యూనిస్టుపార్టీ కార్యకలాపాలను, పోరాటాలను సమర్ధించటానికి 1952లో విజయవాడలో ప్రారంభమైన 'విశాలాంధ్ర' తెలుగు దిన పత్రిక నిరంతరాయంగా వస్తూ వున్నది. తెలుగు దినపత్రికా రంగంలో ఇటీవలే అడుగుపెట్టిన రెండు దిన పత్రికలు శ్రీ నార్ల వెంకటేశ్వరరావు సంపాదకత్వాన విజయవాడ నుండి వస్తున్న 'ఆంధ్రజ్యోతి' రాజమండ్రి నుండి స్థానిక సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ నిరంతరంగా వస్తున్న చిన్న దిన పత్రిక 'సమాచారం'.

వార, మాస పత్రికలు

దిన పత్రికలనూ, అతి స్వల్పకాలం చుక్కల్లా మెరిసి తర్వాత అంతరించిన అనేక పత్రికలనూ వదలిపెడితే, గత రెండు దశాబ్దాలలో ఆంధ్ర దేశంలో వార, మాస ఇత్యాది పత్రికా ప్రచురణ రంగంలో అపూర్వమైన ప్రగతి సాధన జరిగిందని చెప్పవచ్చు. అనేక జిల్లా ముఖ్యపట్టణాలలో అనేక రాజకీయ వార పత్రికలు వెలసి క్రమంగా సుస్థిరమైన పునాదులను ఏర్పరచుకున్నాయి. వీటిలో చెప్పుకోదగినవి నెల్లూరు నుండి 'జమీన్ రైతు', గుంటూరు నుండి 'గుంటూరు పత్రిక', విజయవాడ నుండి 'ములుకోల', 'విజయవాణి', 'వాహిని' పత్రికలు, కాకినాడ నుండి 'ముందడుగు' , విశాఖపట్నం నుండి 'విశాఖ పత్రిక', మచిలీపట్నం నుంచి ప్రస్తుతం హైదరాబాదుకు మారింది 'చుక్కాని' పక్ష పత్రిక.

'ఆంధ్ర పత్రిక', 'ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రికలు ప్రజా బాహుళ్యంలో అత్యధిక సర్క్యులేషను, ఆదరణ పొందిన పత్రికలుగా సాహిత్య సంచికలుగా ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్నాయి. ఇందులో మొదట పేర్కొన్న 'ఆంధ్రపత్రిక' చాలా కాలం క్రిందటి నుంచీ వస్తున్నది. రెండవది ప్రారంభమై రెండు దశాబ్దాలు కాలేదు. గత ఏడెనిమిది సంవత్సరాలుగా ఈ రెండు పత్రికలూ చాలా అభివృద్ధిని సాధించాయి. అనేకమంది కథానికా రచయితలకూ ఇతర తెలుగు సాహిత్య ప్రక్రియలకూ ఎనలేని ప్రోత్సాహం కలుగ జేస్తున్నాయి. ఈ పత్రికలు ఏటా రెండుసార్లు కొన్ని సందర్భాలలో ఇంకా ఎక్కువసార్లు నిర్వహిస్తున్న తెలుగు కథానికా రచన పోటీలు ఆంధ్ర దేశంలోని తెలుగు కథానికా రచయితల, నవలా రచయితల అపూర్వ ప్రతిభను బయటికి తెస్తూ వున్నాయి. ఆడా-మగా రచయితలు అనేకమంది ఈ పోటీలు వెలుగులోనికి తీసుకొని వచ్చాయి.

గత రెండు దశాబ్దాలుగా తెలుగు పత్రికా రంగంలో వైవిధ్యం కూడా విస్తారంగా పెంపొందింది. ప్రజలలోని ప్రత్యేక వర్గాలకై -విడి విడిగా కృషి చేసే, వార, పక్ష, మాస పత్రికలు మనకు వున్నాయి. ప్రత్యేకించబడిన ఈ రంగాలలో బాలిక, మహిళలకు, సినిమాలకు, సాహితీ విమర్శకులకు ప్రత్యేకించబడిన పత్రిక లున్నాయి. వీటిలో బహుళ ప్రచారం పొందినవి 'చందమామ' చిన్నపిల్లల మాస పత్రిక, 'యువ' యువతరం మాస పత్రిక, 'గృహలక్ష్మి', 'ఆంధ్రమహిళ' మహిళల మాస పత్రికలు. 'కిన్నెర' 'సినిమా' పత్రికలు కొంతకాలం వచ్చి ఆగిపోయాయి. మాస పత్రికలలో శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు స్థాపించి, సంపాదకత్వం వహించిన 'భారతి'కి విశిష్టమైన స్థానం వున్నది. అపూర్వమైన దాతృత్వమూ అమోఘమైన పత్రికా రచనా ప్రతిభ గల పంతులుగారి సంపాదకత్వాన ఈ పత్రిక బలమైన ఆర్థిక పునాదుల మీద దీని ఏర్పాటు జరిగింది.

అనేకమంది ప్రముఖులైన తెలుగు రచయితలు, పండితులు, ప్రముఖులు కానివారి ఉత్తమ రచనలు కూడా కవుల రచనలను ప్రచురించడం ద్వారా, పరిశోధనా, విమర్శ వ్యాసాల ప్రచురణ ద్వారా మూడు దశాబ్దాలకు పైగా ఈ పత్రిక ఆంధ్రదేశ సంస్కృతీ సాహిత్యాలకు ఎనలేని సేవ చేస్తూ వున్నది. 20వ శతాబ్దపు రెండవ దశాబ్దంలో ప్రారంభమై మూడవ దశాబ్దం వరకూ కొనసాగిన మరో సాహిత్య మాస పత్రిక శ్రీ కౌతా శ్రీరామమూర్తి సంపాదకత్వాన మచిలీ పట్నం నుంచి వెలువడిన 'శారద' ఇందులో అచ్చయిన రచనలన్నీ ఉన్నత సాహిత్య ప్రమాణాలతో విరాజిల్లాయి. తెలుగు కవిత్వం గురించీ, భాష గురించీ విభిన్న దృక్పథాల నుంచి సాగే విమర్శకులకు ఈ పత్రికలో ఎక్కువ స్థానం కేటాయించేశారు.

ఆంగ్ల పత్రికలు

ఆంధ్ర దేశంలో ఆంగ్ల భాషా పత్రికా రచనకు సుదీర్ఘమైన చరిత్ర సంప్రదాయాలు వున్నాయి. అయితే ఇంగ్లీషు భాషతో ప్రారంభించిన అనేక పత్రికలు వార్తాపత్రికలు శైశవావస్థలోనే సమసి పోవటం విషాదకరమైన పరిస్థితేనని ఒప్పుకొనక తప్పదు. శ్రీ తుంగతుర్తి శ్రీరాములు సంపాదకత్వాన రాజమండ్రి నుంచి ప్రచురితమైన 'కార్లేలియన్' వార పత్రిక ఆంగ్లభాషలో మన మొట్టమొదటి వార పత్రిక. ఈ వర్గంలో బాగా ప్రాముఖ్యత వహించిన పత్రిక డాక్టర్ పట్టాభి సీతారామయ్య సంపాదకత్వాన మచిలీపట్నం నుండి అచ్చయిన 'జన్మభూమి'. 1921 నుండి 1931 దాకా ఇది వచ్చింది. సహాయ నిరాకరణ శాసనోల్లంఘన వంటి కాంగ్రెసు కార్యక్రమాలకూ, గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలకూ అధికార ప్రకటనా వివరణా పత్రంగా ఈ పత్రికకు అఖిల భారత ఖ్యాతి లభించింది. తరువాత 'కాంగ్రెసు చరిత్ర' రచించిన డాక్టర్ పట్టాభి 'కోమటి సూత్రకారునికి బ్రాహ్మణ వ్యాఖ్యాత"గా గాంధీజీ ప్రశంసల నందుకున్న డాక్టర్ పట్టాభి ఈ పత్రికను అనేక ఆర్థిక ఇబ్బందులకు లోనౌతూకూడా దశాబ్దం పాటు నడిపించారు. ఇది బ్రతికినంత కాలం దీనికి సంపాదకత్వం వహించిన వ్యక్తి యొక్క మేధా, వైజ్ఞానిక శక్తికి ప్రతీకగా కొనసాగిందనడంలో సందేహం లేదు.

మేధావులను బాగా ఆకర్షించిన మరో ఆంగ్ల వార పత్రిక శ్రీ ఖాసా సుబ్బారావు సంపాదకత్వాన మద్రాసు నుండి వెలువడిన "స్వతంత్ర' ' విజ్ఞానప్రదమూ, సాహసోపేతమైన ఆయన సంపాదకీయాలు 'సాకా' అనే కలం పేరుతో ఆయన ప్రత్యేక శీర్షికల క్రింద రచించిన వ్యాఖ్యానాలు పత్రికకు ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించి పెట్టాయి.

ఇతర ఇంగ్లీషు పత్రికలలో పేర్కొనదగిన మరో పత్రిక శ్రీ కే. రామకోటేశ్వరరావు, స్థాపించి సంపాదకత్వం వహించిన 'త్రివేణి. కొన్నాళ్లు మాస పత్రికగానూ, మరి కొన్నాళ్లు రెండు నెలల కొకసారి చొప్పున, తర్వాత త్రైమాసికంగానూ ఇది కొనసాగింది. సంపాదకుడుగా శ్రీ రామకోటేశ్వరరావు ప్రత్యక్షంగా దాని ప్రచురణను చూచినప్పుడూ, ఆయన దూరంగా వుండి, ఆయన ఇతర మిత్రులు దాన్ని ఎడిట్ చేసినప్పుడు కూడా శ్రీ రామకోటేశ్వరరావు ప్రత్యేకతను ఈ పత్రిక నిరంతరం ప్రతిబింబించింది. దాదాపు మూడు దశాబ్దాలపాటు ఆంధ్ర దేశ సాహితీ సంస్కృతుల పునర్వికాసానికీ, ఇతర భాషా రచయితల రచనలను ప్రచురించడం ద్వారా అంతర్ రాష్ట్ర సామర్థ్యాన్ని పెంపొందించడానికి త్రివేణి పత్రిక ద్వారా శ్రీ రామకోటేశ్వరరావు కొనసాగించిన కృషి అనన్య సామాన్యమైనది.

1920లో గాంధీజీ ప్రారంభించిన స్వతంత్ర పోరాటం తెలుగు పత్రికా రంగానికి ఎలా క్రొత్త ఊపు నిచ్చిందో అలాగే తెలుగులో తెలుగువారి పెట్టుబడితో తెలుగువారి యాజమాన్యంలో మొట్టమొదటిసారిగా ఒక ఇంగ్లీషు దిన పత్రిక స్థాపనకు కూడా ఈ కాలం (1922) ఊపు నిచ్చింది. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రధాన సంపాదకులుగా ఈ దిన పత్రిక స్వరాజ్య ఉద్యమానికీ, జాతీయ స్వాతంత్ర్య సంగ్రామాలకూ అధిక ప్రాధాన్యత నిచ్చి అత్యంత దోహదం చేసింది. దక్షిణాదిలోనూ, తదితర చోట్ల ఇంగ్లీషు పత్రికా రంగంలతో ప్రముఖ సంపాదకీయ స్థానాలను తర్వాత తర్వాత ఆక్రమించుకొన్న అనేకమంది ఆంధ్ర జర్నలిస్టులు ఏ కొంతకాలమైనా 'స్వరాజ్య'తో సంబంధం కలిగి ఉన్నవారే.

తెలుగు పెట్టుబడితో, తెలుగు పారిశ్రామికోత్సాహంతో స్థాపించిన మరో ఇంగ్లీషు దిన పత్రిక 1948లో స్థాపించిన 'ఇండియన్ రిపబ్లిక్' డాక్టర్ పట్టాభి సీతారామయ్య అధ్యక్షులుగా ఏర్పడిన ఒక డైరెక్టర్ల బోర్డు యాజమాన్యం కింద ఈ వ్యాస రచయిత సంపాదకుడుగా అనేక ఆశలతో ప్రాంరభమైన ఈ దిన పత్రిక ఆంధ్రుల వాణిగా ముఖ్యంగా ఆంధ్రరాష్ట్రం కోర్కెకు సారధిగా ప్రకాశించింది. రెండున్నర సంవత్సరాల తర్వాత పత్రిక యాజమాన్యం మారింది. తర్వాత మరో రెండు సంవత్సరాలు చివరి శ్వాసతో జీవించి చివరికి 1953లో మూతపడింది. ఇది మూత పడటంతో తెలుగు పెట్టుబడితో, తెలుగు పారిశ్రామికోత్సాహంతో ఇంగ్లీషు దిన పత్రికారంగం నిర్వహణపట్ల ఉత్సాహం సన్నగిల్లినట్లయింది. నా ఈ అభిప్రాయం తప్పని ఋజువు కావాలని కోరిక.

స్వతంత్రం వచ్చిన తరువాత

ఈ వ్యాసంలో ఆంధ్ర ప్రాంతంలోనూ, 1953లో ఆంధ్ర రాష్ట్రం విడిపోయేదాకా మద్రాసులోనూ తెలుగు పత్రికా రంగం అభివృద్ధినీ, ప్రగతినీ గురించి సంక్షిప్తంగా వివరించడానికి ప్రయత్నించాను. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రుల రాజకీయ కేంద్రమూ, జర్నలిస్టు కేంద్రమూ మద్రాసునగరమే. స్వతంత్రం వచ్చేనాటికి, అంతకు క్రితం ఆరు లేదా ఏడు దశాబ్దాలవరకే ఈ సమీక్ష పరిమితమైంది. ఆ తర్వాత, ముఖ్యంగా 1956లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అవతరించిన తర్వాత తెలంగాణాలోకూడా పత్రికా రంగంలో జరిగిన కృషి, ప్రగతి రాష్ట్ర పత్రికా రంగం ప్రగతిలో అంతర్గతభాగం కాక మానదు.

ఆంధ్ర ప్రాంతం వరకు తీసుకున్నప్పటికీ ఈ సమీక్ష సమగ్రమైంది కాదు. ఈ దశాబ్దంలో ఆంధ్ర ప్రాంతంలో వారపత్రిక లైతేనేమి, పక్ష పత్రికలైతేనేమి తెలుగు పత్రికా రంగంలో విరివిగా పంట పండింది. అయితే చాలావరకు ఇవి కోతకు వచ్చేదాకా ఎదగక పోవచ్చు. అనేక పత్రికలు ఆర్థిక వనరులు లేక మధ్యలోనే ఆగిపోయాయి. వ్యాపార ప్రకటనల ద్వారానూ, సహాయం లేక, కొని చదివే పాఠకులు లేక అనేక పత్రికలు నడుమనే ఆగిపోయాయి. ఈ పత్రికల పేర్లన్నింటినీ కూడా ఈ సమీక్ష వ్యాసంలో పేర్కొనటం జరుగలేదు.

తెలంగాణాకు సంబంధించినంతవరకు ఆ ప్రాంతం పత్రికా రంగాన్ని సమీక్షించే ప్రయత్నం నేనిక్కడ చెయ్యలేదు. దానికి కారణాలు తెలిసినవే. అయితే దీన్ని ముగించేముందు యధాలాపంగా కొంత వివరిస్తాను. ఆంధ్ర ప్రదేశ్ అవతరణకు ముందు గానే శ్రీ ఎన్. నరోత్తమరెడ్డి నిర్వహణ కింద ఆయన సంపాదకత్వాన వెలువడిన గోల్కొండ పత్రిక తెలంగాణా ప్రాంతం వెలుపల కూడా బహుళ ప్రచారం పొందిన పత్రిక, గత నాలుగు సంవత్సరాలలో తెలంగాణా పత్రికా ఆకాశంలో నాలుగు దిన పత్రికలు ఉదయించి వాటిలో రెండు – 'ఆంధ్రభూమి', 'ఆంధ్ర జనత' బలం పుంజుకొని స్థిరపడ్డాయి. ఆంధ్ర భూమికి మొదట శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు సంపాదకత్వం వహించారు. ఆ తర్వాత శ్రీ గోరాశాస్త్రి ఆ సంపాదకత్వ బాధ్యతను స్వీకరించి నిర్వహిస్తున్నారు. 'ఆంధ్రజనత'కు శ్రీ కె.యస్. సుబ్రహ్మణ్యం మొదటి నుంచీ, దానిని కాంగ్రెసు సంస్థవారు తీసుకొనేదాకా సంపాదకులుగా వున్నారు. మిగతా రెండు దిన పత్రికలు, 'ప్రజా ప్రభ', 'ఆంధ్రరత్న' అతి స్వల్పకాలం మాత్రమే అచ్చయి మూత పడ్డాయి.

ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలలో గత దశాబ్దంలో అనేక వార పత్రికలు వచ్చాయి. వాటిలో విజయవాడనుండి 'జాగృతి', 'ధర్మభూమి' ఇంగ్లీషు పత్రికా రంగంలో ఇటీవలి కాలంవరకు బాగా ఎడిట్ అయి మంచి సర్కులేషన్‌తో వచ్చిన 'హైద్రాబాద్ బుల్‌టిన్' పత్రిక ఆంధ్రప్రదేశ్ అవతరణకు ముందే మూతపడింది. హైదరాబాద్‌లో మిగిలిన రెండు ఇంగ్లీషు దిన పత్రికలు 'దక్కన్ క్రానికల్', 'డైలీ న్యూస్' ఇందులో మొదటిది విజయవంతంగా కొంత కాలంగా బహుళ ప్రచారంలో వున్నది. రాష్ట్రం రెండవ ప్రాంతీయ భాష అయిన ఉర్దూలో వస్తున్న దిన పత్రికలలో సర్క్యులేషన్ దృష్ట్యానూ ప్రతిష్ట దృష్ట్యానూ చెప్పుకోదగిన రెండు పత్రికలు 'డైలీ సియాసత్', 'డైలీ మిలాప్' రెండోదానికి హిందీ ఎడిషన్ కూడా ఉన్నది. తెలుగు పత్రికారంగం విషయంలో నైతేనేమీ, ఇంగ్లీషు పత్రికారంగం విషయంలో నైతేనేమి తెలంగాణ ప్రాంతం ఇప్పటికీ కొత్త మాగాణమే. హైదరాబాదు నగరం నుంచి ఇంకా అనేక దిన పత్రికలు రావటానికి అవకాశం వున్నది. అయితే కొంతవరకు సాహసోపేతమైన ఈ వాణిజ్య రంగంలో పెట్టుబడి పెట్టేవారూ, సమర్థులైన సంపాదక మండలీ, జర్నలిస్టులూ ముందుకు వచ్చి ప్రారంభ సాహసాలకు తయారు కావాలి.

ఆంధ్ర ప్రదేశ ప్రభుత్వం కూడా నాలుగు భాషల్లో 'ఆంధ్ర ప్రదేశ్' మాస పత్రికను ప్రచురించడం ద్వారా అభినందనీయమైన చొరవను ప్రదర్శిస్తూ వున్నది. ఇటీవల కొంత కాలం వరకూ కేవలం అధికార గెజెటు నమూనాగా, అధికార ప్రభుత్వ ప్రకటనల జాబితాగా మాత్రమే వుండిన ఈ పత్రిక క్రమంగా పాఠకులు ఆందరిచే మంచి పత్రికగా త్వరలోనే రూపు దిద్దుకున్నది.

నేనీ వ్యాసం ప్రారంభంలో పత్రికా ప్రపంచం యొక్క ప్రమాణాలు, ఏ దేశ ప్రజలకైనా, దేశానికైనా, సమాజానికైనా, రాజకీయ సాంఘిక చైతన్య ప్రమాణాల్ని కొలవడానికి నమ్మదగిన గీటురాయి అని ప్రతిపాదించాను. పత్రికా రంగంలో ఆంధ్ర దేశం చెప్పుకోదగినంత అభివృద్ధినీ, ప్రగతినీ సాధించినట్లు పై సమీక్షలో మనం గమనించాం. ఏ ప్రాంతంలోని పత్రికా రంగం ప్రగతిగానీ, ప్రమాణాలుగానీ, ఆ ప్రాంతపు రాజకీయ ఆర్థిక, సాంఘిక ప్రగతి ప్రమాణాలకన్నా భిన్నంగా వుండలేదన్న ప్రతిపాదనతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

ఆంధ్రప్రదేశ్ ప్రజలలో ఇంతకన్నా విస్తృతమైన, విశాల ప్రాతిపదికపై సాంఘిక రాజకీయ చైతన్యం అవసరం అనేది నిర్వివాదాంశం. అయితే పరిమిత పెట్టుబడి ముద్రణా సౌకర్యాలలేమి, పారిశ్రామికంగా విస్తరించే వాణిజ్య వర్గాల సహకార లోపం వంటి పరిమితులనూ నిర్బంధాలను అధిగమించి స్వచ్ఛమైన స్వేచ్ఛాయుతమైన పత్రికారంగం అభివృద్ధి చెందినట్లయితే అవసరమైన చైతన్యం కూడా పెరుగుతుందనడంలో సందేహం లేదు.

(తెనుగు సంస్కృతీ తరంగాలు నుండి)

ముట్నూరి కృష్ణారావు

పత్రికాసన్మానము

ఈ సన్మానము, దీర్ఘకాలము నుండి పనిచేయుచున్న వనుకారణమున కృష్ణాంధ్రపత్రికల పేరున జరుపబడుచున్నను, తెలుగు పత్రికలన్నిటి శ్రేయమునుద్దేశించి సంకల్పింపబడిన దని కార్యదర్శులు చెప్పినందున నా యనంగీకారము నుపసంహరించుకొంటిని. ఇంతకు నీ సన్మానము కేవలము అభిమాన పూర్వకమైనదే కాని తెలుగు పత్రికల యభివృద్ధికి సంతృప్తి చెంది చేయబడుచున్నది కాదనుట నిస్సంశయము. తెలుగు పత్రికలలో గొంత వఱకు ఆంధ్ర పత్రిక తప్ప. యింక నేవియు జీవకళకలిగి ప్రవర్ధమానములుగ లేవని చెప్పుట యనవసరము. తెలుగు పత్రికల హైన్యస్థితికి ప్రజలు బాధ్యులు కారని మాత్రము చెప్పవలసియున్నది. విద్యావంతులను, సంస్కారులును పత్రికా నిర్వహణమునకు బూనుకొనక పోవుటచేతనే పత్రికలకు దేశములో దగిన వ్యాప్తికాని పలుకుబడిగాని, లేకున్నవనుట నిజము. వైద్యశాస్త్రమునందు సుశిక్షితులైన గాని డాక్టర్లు ప్రాక్టీసు చేయుటకు యోగ్యత కలుగదు. న్యాయవాదులు వారి శాస్త్రమునందు కొంత పాండిత్యమున తర్ఫీయతును బొందినగాని వారికి పట్టాలు పుట్టవు. టీచర్లకు ఎల్.టీ. శిక్షణము విధింపబడినది. కాని ఎడిటర్లగుటకు నెట్టి శిక్షణము అవసరములేదు. ఒక అచ్చుకూటము, ఒక బేలు కాగితము, ఒక ఊటకలము సమకూడిన చాలును. పత్రికాధిపత్యము సిద్ధించును. పత్రికా నిర్వహణము చాల బాధ్యతతో గూడిన కార్యము. భాషా పటుత్వము, రచనా కౌశలము, భావోద్రేకము ఉన్న చాలవు. క్రమానుగతములైన సంప్రదాయములను, ధారావాహికములైన మరియాదలను గుర్తించగల చరిత్రజ్ఞానము, ప్రజల నిజమనోరథములను నిగూఢ చిత్తవృత్తులను బరీక్షింపగల భావనాశక్తి, ప్రపంచ పరిణామరీతులను బరికింపగల విశాలదృష్టి, దేశ భవితవ్యము నుపలక్షింపగల గంభీర విశ్వాసము, పత్రికాధిపతులు అలవరచుకొన దగిన లక్షణములు. వీనియన్నిటికంటెను గావలసినది నిర్మలమైన సత్యనిరతి. ఈ లక్షణములు పత్రికా నిర్వాహకులలో జాలవఱకు లేకుండుట చేతనే, తెలుగు పత్రికలు పొంద దగినంత గౌరవము బొందుట లేదని చెప్పినందుకు సోదర పత్రికాధిపతులు మన్నించెదరు గాక!

పత్రికల యుపకృతితోబాటు, అపకృతిని గూడ దలచుకొనినప్పుడు పత్రికావ్యాప్తి తగినంతగ లేకపోయినదని చింతించుట కవకాశముండదు. ఇక్కాలమున ప్రజావబోధనమునకును ప్రపంచ పరిజ్ఞానమునకును, సామాన్య విద్యావ్యాపనమునకును, పత్రిక యొక సాధన మనుటకు సందియము లేదు. కాని ఛాయాతప న్యాయముగ, నీ మేళ్ల నంటి కొన్ని కీళ్లు కూడ గలవు. పత్రికా పఠనము మూలమున జ్ఞానప్రదమైన ఉద్గ్రంథావలోకనము క్రమముగ మరుగగుచున్నదని విజ్ఞులకు దెలియని విషయము కాదు. ప్రజలలో గ్రంథావలోకనమే చాల యరుదు. అక్షరాస్యులేకొలది నిమిషములైనను

మేధావులును, జ్ఞానసంపన్నులును రచించిన ఉత్తమ గ్రంథములను బఠింపక తాత్కాలిక వినోదమును గల్పించు పత్రికలను జదువు అభ్యాసమొకటి దేశమునందు వ్యాపించుచున్నది. కొందరు యువకులు బలము, పుష్టి, నిచ్చు భోజనమును మాని జిహ్వాచాపల్యమును బురికొల్పు కాఫీహోటల్సునే శరణ్యముగ జేసుకొని అజీర్ణవ్యాధులకు లోనగుచున్నట్లు, ఆత్మోన్నతికిని, చిత్త సంస్కారమునకును తోడ్పడు ఉద్గ్రంథ పఠనమునకు బ్రత్యామ్నయముగ బుద్ధి చాపల్య కరములగు పత్రికలను పారాయణము చేయుచుండుటచే చిత్త విభ్రమణములకు లోనగుట సంభవించుచున్నది. పత్రికా పఠనము ప్రజలలో గొంత ప్రబోధమునకు సాయపడుచున్నను, స్వతంత్ర చింతనా పటిమను బురికొల్ప జాలక పరప్రత్యయనేయ బుద్ధిని బలపరచుటకే యెక్కువగనుపకరించుచున్నది కూడ గొంచెము బరిశీలించిన తెలియగలదు. పత్రికల యభిప్రాయములు సహితము భ్రమ ప్రమాదములతో గూడిన వ్యక్తి గతాశయములేయని దెలిసికొనుటకు బదులు, అవి శిరసావహింపదగినప్రమాణ వాక్యములుగ జన సామాన్యము స్వీకరించుటకు దగు సందర్భములు కల్పింపబడుచున్నవి. పత్రికలు ప్రజాభిప్రాయ వ్యక్తీకరణమునకు బూనుకొనుచున్నట్లొక యపోహ వ్యాపించి యున్నది. ప్రజాభిప్రాయమనునది బాహ్యముగ స్పష్టముగ నిర్ణీతమైయుండు భావముకాదు. పత్రికాధిపతి తనయొక్కయో, తన పక్షము యొక్కయో, తాత్కాలిక నిర్ణయము సర్వజనామోదము బడయునట్లు చేయుటకు దాని ప్రాశస్త్యమును స్వతంత్ర యుక్తులతో నిరూపించుటకు బదులు, దానిని ప్రజలపై రుద్ధి, వారు నమ్ముచున్న సిద్ధాంతమదియేయను వ్యామోహమును గల్పించుట పత్రికా రచనా నైపుణ్యముగ నెంచబడుచున్నది. అర్చకుడు తన చేతితో చేసిన పసుపుముద్దను విఘ్నేశ్వరునిగ భావించి ధూపదీప నైవేద్యము లొసగునట్లు, పత్రికాధిపతులు స్వకీయాభిప్రాయములను ప్రజాభిప్రాయముగ బ్రతిష్ఠించి పత్రికలలో నూరేగించుట ప్రచారక ధర్మముగ విశ్వసింప బడుచున్నది. ఇది పత్రిక లవలంబించుచున్న "మెస్మరిజము" పద్ధతి. ఈ మెస్మరిజము మూలమున పత్రికా పాఠకులలో స్వతంత్రాలోచనా శక్తి కుంటువడక తప్పదు.

ఇంతియ కాదు. పత్రికలు సర్వసామాన్యముగ దేశములోని ఆయా పక్షముల నాశ్రయించుకొనియే ప్రవర్తిల్లుచున్న వనుట లోకవేద్యము. ఒక పక్షమునకే సంబంధించిన పత్రికయందు స్వపక్షమును బలపరచుటకై న్యాయవాదుల వలె సత్యమును మరుగుపరచి అబద్ధమును స్ఫురింపజేయు పద్ధతి యెక్కువగనో తక్కువగనో పత్రికాధిపతి యొక్క రచనా చమత్కృతిని బట్టి సహజముగ ప్రయోగ్య మగుచున్నది. ఈ పద్ధతిలో అర్ధోక్తులు, అతిశయోక్తులు, కొన్ని సందర్భములలో అసత్యోక్తులు కూడ ప్రయోగింపబడుటచే సత్యహాని కలుగకుండ నుండజాలదు. పత్రికా ప్రపంచమంతయు వెదకిజూచిన గాంధీమహాత్ముని ఒక "యంగు ఇండియా" తప్ప యీ రాజనీతి నుండి తప్పించుకొన గలిగిన పత్రిక యింకొకటి కలదాయని సంశయింప వలసి వచ్చుచున్నది. పాశ్చాత్య దేశములలోని పత్రికా రాజములు మితిమీరి రాజ్య దురహంకారములను, జాతి ద్వేషములను బురికొల్పి గత యూరపియన్లు మహా సంగ్రామమునకు గారణ భూతములయ్యెనని ఒక యాధునిక చరిత్రకారుడు వాక్రుచ్చినప్పుడు పత్రికల యపకృతి యెట్టిదో యూహించుకొనవచ్చును. మన దేశమునందు రాజకీయ పక్ష భేదములు కేవలము రాజకీయముగ నుండక, కుల కక్షలుగను, మత కలహములుగను, బరినమించుటకు గొంతవఱకు దేశపరిస్థితులు కారణము లైనను, పత్రికలకు గూడ నీ దుస్థితికి బాధ్యత కలదని ఒప్పుకొనక తప్పదు. ఉత్తర హిందూస్థానములో ఉర్దూ హిందీ పత్రికలే హిందూ మహ్మదీయ కలహములకు హేతుభూతములని గవర్నమెంటువారు ప్రకటించిన విషయములో గొంత సత్యము కలదు. మన ప్రాంతములలో కుల వైషమ్యములకు పత్రిక లెంతవఱకు గారణములో యోజించిన, పత్రికా ప్రచార మీ దేశమునకు గూడ నెందుకు సంక్రమించినదా యని దేశ శ్రేయోభిలాషులు సంతాపపడ వలసి యుందురు.

యూరపు అమెరికాలలో వలె పత్రికా ప్రకటన మీ దేశములో నింకను వర్తక వ్యాపారముగ బరిణమించి యుండలేదు. పత్రికా ప్రకటనము పెద్ద మూలధనముతో వ్యాపారసరళిని నడపిన, పత్రికకు స్థిరత్వము లేదు. కాని ఆ పద్ధతివలన పత్రికా స్వాతంత్ర్యమును భంగకరములగు సందర్భములెన్నియో సంఘటించును. పత్రికలు ధనికులకు, షావుకారులకు, పెట్టుబడిదారులకు, అమ్ముడుపోయిన యెడల నవి యెంతవరకు ప్రజోపయోగకరములగుటకు అవకాశము కలదో యోజింపుడు, పత్రికా సంపాదకుడు తన శుద్ధాంతఃకరణ ప్రవృత్తిని బట్టి వాఖ్యానము చేయుటకు వీలుండదు. పత్రిక యాజమానులను, రాజపోషకులను రంజింపజేయు ఇచ్చకపు వ్రాతలను వ్రాయవలసి యుండును. ఇటీవల స్వదేశ సంస్థానాధీశుల చేతులలో బడిన పత్రికలు కొన్ని తమ తొల్లింటి స్వాతంత్ర్యమును గోలుపోయి, కూలికెట్టి వ్రాతలను బ్రకటించుచున్నవియు లోకమెరుగనిది కాదు. వంగదేశములో కొన్ని బంగాళీ పత్రికలు గవర్నమెంటు సబ్సిడీకి లోబడి యాత్మగౌరవమును నష్ట మొనర్చుకొనినవి. వివిధ సంఘములవారు వారి వారి ప్రత్యేక ప్రయోజనముల కొఱకు వేరు వేరు పత్రికలను బెట్టుకొనిన బెట్టుకొందురు గాక! కాని బయట ప్రజల పేరున నడుపునట్లు ప్రకటించుచు, రహస్యముగ ఏ ధనాఢ్యులకో, ఏ జమీందారులకో ఏ సంస్థానాధీశులకో అమ్ముడుపోవుట మాత్రము విచారకరము. అట్టి పరిస్థితులీదేశమును గూడ క్రమముగ సంక్రమింప నారంభించుటచే నీ విషయమును సూచించవలసి వచ్చుచున్నది. స్వతంత్రులైన పత్రికాధిపతుల చేతులలోనున్నప్పుడే, స్వాతంత్ర్య భంగకరములగు సందర్భము లెన్నియో సంఘటించుచుండును. ఒకమారు పత్రికా కార్యాలయమునకు వచ్చి అక్కడకు జేరు ఉత్తర ప్రత్యుత్తరములను బరీక్షించిన వీని యాంతర్యము తెలియగలదు. "నా లేఖను బ్రకటించనందున నా పేరును చందాదారుల పట్టికనుండి కొట్టివేయుడు" అను ఉత్తరములు చాల తరచుగ వచ్చుచుండును. "మా సంఘమునకు బ్రతికూలములైన జాబులను ప్రకటించుచున్నందున మా సాంఘికులచే మీ పత్రికను బహిష్కరింపజేసెద" యని బెదరించుచు వ్రాయువారు కలరు. ధనాధిక్యత చేతనో, స్వసంఘాభిమానము చేతనో పలుకుబడి గల ఒక ప్రముఖుని చర్యలను ఖండించవలసిన అవసరమున్నను, అట్లు చేసిన పత్రికకు బ్రజలలో బలుకుబడిపోయి, చందాదారులు తగ్గెదరేమో యని బెదురు ఒకవైపు, ఏ విలేఖకుని వ్యాసమో ప్రకటనార్హము గాకపోయినను దానిని ముద్రించకపోయిన వాని యాదరణ పోవునేయో యను జంకు ఇంకొక ప్రక్క, లోపల నిష్టము లేకపోయినను బయటకు ఒక యధికారినో, ఒక ప్రముఖునో, ఒక ధనికునో, బ్రశంసించుచు వ్రాసి మెప్పు బడయవలయునను స్తోత్రాభిలాష యింకొక దిక్కున, ఎంత రోషముతో, ఎంత మోటుగ దిట్టుచు వ్రాసిన ప్రజలు తమ ధైర్య సాహసములను అంత మెచ్చుకొనెదరను కీర్తి కాంక్ష ఇంకొక చక్కని స్వాభిమానము చేతనో,

స్వపక్షమును సమర్థించుటయందో, విపక్షమును ఖండించుటలోనే కేవలం మనాలోచితముగ శమ దమములను వీడి భావోద్రేకమునకు లోనగు చిత్తవికారము ఒక వంకను, పత్రికాధిపతులను బాధించుచుండు విషయములని వారిలో గొంతమందికైనను అనుభవైక వేద్యములు.

ఇదంతయు నిట్లుండ, పత్రికలలోని అడ్వర్టయిజుమెంటులు కూడ బత్రికాధిపతులను బాధించు విషయములలో నొకటి. పత్రికలు ఏ యర్థాకలితోనైన బ్రతుకుటకు ప్రకటనలే ఆధారములను సంగతి యెల్లరెరిగిన విషయము. వర్తక వ్యాపారములందు బ్రకటనము నవీన విధానములలో నొకటి. ప్రజల దృష్టి నెటులైన నాకర్షించి తమ వస్తువులను గొనునట్లు చేయుటయే వారి లక్ష్యము. ఇందునిమిత్తము ప్రకటనదారులు తమ వస్తువుల ప్రాశస్త్యమును వర్ణించుటకు గావ్యచతురత నంతను జూపెదరు. ఎట్టి యతిశయోక్తులను వ్రాయుటకైనను జంకరు. కృత్రిమమైన యోగ్యతాపత్రములను బ్రకటించుటకు వెనుదీయరు. ముఖ్యముగ నీ దేశములోనే పరిశ్రమయు అభివృద్ధిలో లేకపోయినను ఔషధముల వ్యాపార మతిశయించినది వీనిలో నేవి మోసమో, ఏవి గుణము గలవియో, పత్రికాధిపతులు విచక్షణ చేయలేరు. కాని ఈ ప్రకటనలు చాలవరకు కేవలము ప్రజలను భ్రమింపజేయుటకు అతిశయోక్తులతో వర్ణింపబడునను సంగతి తెలియనిది కాదు. కొన్ని సందర్భములలో వీని భాష జుగుప్సాకరముగ నుండుటయే కద్దు. కవులు గ్రంథకర్తల వంటి సంస్కారులే యెట్టి మోమోటమియులేక తమ రచనలను గూర్చి అతిశయోక్తులతో వర్ణించి ప్రకటించుకొనుచున్నప్పుడు ఔషధాలవారు దేవాదిదేవుల పేర్లతో, పురాణేతిహాసాలంకారములతో, చిత్ర విచిత్ర రీతుల వర్ణించి, ప్రజల విశ్వాసము నాకర్షింప గడంగుటలో నాశ్చర్యము లేదు. గాంధీ మహాత్ముని "యంగు ఇండియా"లో వలె నీ యడ్వర్టయిజుమెంటులను బూర్తిగ విసర్జించుటయే సర్వోత్తమమైన పద్ధతి. కాని యీ పద్ధతి నవలంబించిన పత్రికలన్నియు మూలబడక తప్పవు. ఈ ప్రకటనలలోనే గ్రంథములు పఠనార్హములో, ఏ కంపెనీలు మోసములో, ఏ మందులు కృత్రిమములో, విచక్షణ చేయుట కష్టసాధ్యము. ఇట్లనుటచే నీ విషయములో బత్రికాధిపతుల కెట్టి బాధ్యతయు లేదని కాదు. పత్రికల యపకృతులలో, అడ్వర్టయిజుమెంటుల బాధ యొకటి యని సూచించుటకే యీ విసయము తెలుపబడినది. ఇక రవీంద్రుని వంటి రసభోగి పత్రికలు క్రీగంటనైన జూడదనిన ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

యీ యపచారము లని వార్యములు కావు. పత్రికాధిపతులు తమ బాధ్యతను గుర్తించినకొలదీ అధికారులను, సంస్కారులును, పత్రికా నిర్వహణమునకు బూనుకొనినకొలదీ దేశములోని రాజకీయ సాంఘిక పరిస్థితులు పరిష్కృతములై ప్రజాశక్తి జాగరిత మైనకొలదీ పత్రికల పలుకుబడి, వశీకరణశక్తి, స్వాతంత్ర్య దీప్తి హెచ్చునేకానీ తగ్గనేరదు. ప్రస్తుతము దేశమునందు ప్రతికూల పరిస్థితులధికముగ నున్నందున తక్కిన సంస్థల వలెనే పత్రికా సంస్థయు గొంత వికృత రూపమును దాల్చియున్నది. స్వాతంత్ర్యమే పత్రికలకు బ్రాణము. స్వాతంత్ర్య సంస్థాపనమే పత్రికల లక్ష్యము. ప్రతి వ్యక్తియందు, ప్రతి సంఘమునందు, ప్రతిజాతియందు స్వాతంత్ర్య బీజములను వెదజల్ల నారంభించినపుడు, ఆరంభ దశలో సమన్వయము కుదరక దేశసంక్షోభము కలుగుట సహజము. దేశమునందు నిద్రాణములై యున్న శక్తులొక్కమారుగ విజృంభించుటతోడనే ప్రతి వ్యక్తియు తన హక్కులను బ్రతిష్ఠింపగోరును. ప్రతి సంఘము ఉన్నత స్థానము నాక్రమింపజూచును. ప్రతి జాతియు తన సంపూర్ణశక్తిని బ్రకటింప నభిలషించును. అంతట ప్రాత బాటలకు కట్టుబడిన పూర్వాచార పరాయణులీ సంచలనమును జూచి భీతిల్లుట సహజము. వారి నిరోధమే కులకక్షలకు సంఘ వైషమ్యములకు గారణమగును. ప్రభుత్వాధికారులును ఆగ్రహ వివశులై కఠిన శాసనములకు గడంగెదరు. దీనికి ఫలితముగ రాజద్రోహము, విప్లవకరములైన ఉద్యమములును, బయల్వెడలును. వెనుకటి పూజలు, విధేయతలు, గౌరవములు నిలువనేరవు. క్రొత్త భావములు ఝంఝామారుతముల వలె వీచి భయంకర రూపము దాల్చును. ప్రాత కట్టడములు కూలిపోవును. వెనుకటి యధికారములు భగ్నము లగును. ఎక్కడ జూచినను అశాంతి, అసంతృప్తి, అసహనము, వ్యాకులత, ఉద్వేగము బహిర్గతము లగును. సంఘములో నెక్కడను స్థిరత్వమును స్థిమితతయునున్నట్లు కన్పడదు. ఏ ప్రతిఘాతమునకో నిద్రాభంగము చెంది బెదిరిన మనుజుడు ఇటు అటు పరుగిడునట్లు సంఘ మొక్కమారుగ జాగరిత మగుటచే అధికార ధిక్కారము, శాసనాతిక్రమము, విద్రోహము, విద్వేషము, మొదలగు సంక్షోభ తరంగములు బయల్వెడలుట సహజము. ప్రాత క్రొత్తల కలయిక, తూర్పు పడమరల రాపిడి, వ్యష్టి సమిష్టుల సంఘర్షణ, పాలక పాల్యుల వైరుధ్యము, దేశమున అపూర్వమైన అల్లకల్లోలమును గలిగించుచున్నవి. దేశ మంతయు నడుగంట గదలిపోవుచున్నది. భరతఖండములో గదలని ప్రాంతము లేదు. పరివర్తనము నొందని జీవన ప్రకరణము లేదు. సర్వవిషయముల యందును తీక్ష్ణప్రచండ సమస్య లెదుర్కొనుచున్నవి. ఆత్మవిస్మృతి పొందిన దేశమగుటచే నీ సమస్య లత్యంత గహనము లగుచున్నవి. ఒక వైపున దేశముయొక్క చిరంతన సభ్యతాస్వరూపము నన్వేషించవలసియున్నది. ఇంకొక ప్రక్కను భారత జాతీయసమ్మేళనము నిరూపించి, తత్సిద్ధికి సాధన విధానములను గనుగొనవలసియున్నది. అనైక్యము నుండి యైక్యము, వైష్యమముల నుండి సామరస్యము, ఆశక్తత నుండి సంఘటనాశక్తి, అంధత్వము నుండి జ్ఞాన ప్రతిభ, అభివ్యక్తము సేయుట యెట్లు? రవీంద్రుని వంటి కవిపుంగవులు, అరవిందుని వంటి జ్ఞానయోగులు, గాంధి మహాత్ముని వంటి కర్మవీరులు, జగదీశచంద్ర బోసుని వంటి ప్రకృతివైజ్ఞానికులు ఈ జాతీయ సాగర మథనమునకు బూనుకొనినారు. భారత సామ్రాజ్య లక్ష్మీ రేపో మాపో తన నిండు కళలతో బ్రత్యక్ష మగుచున్నది! ఆ మహోదయము ఒక్క భారతవర్షమునకే కాక జగత్తున కంతకును గల్యాణ దాయకమై వెలయగలదు. ఇది కవుల వాసంతిక స్వప్నము కాదు. పత్రికల అతిశయోక్తికాదు. ఇది కేవలము ప్రకృతి పొందుచున్న నూతన విలసనము. ఈశ్వర విధానోద్దిష్టమైన విశ్వ పరిణామము. కానియెడల నీ కదలికకు, ఈ కలహములకు, ఈ విద్రోహములకు, ఈ యావేదనలకు, అర్థము లేదు, ప్రయోజనము లేదు, సాఫల్యము లేదు. ఉషఃకాలము మందు చీకట్లు దట్టమగును. వర్షపాతము ముందు కుసుమదళములు వాడి రాలిపోవును. శిశూదయము ముందు తల్లి ప్రసనవేదన నొందును. అట్లే నూతన భారత జాతీయావతరణముకై నేడు దేశములోని ప్రతి సంఘము ఆవేదన నొందుచున్నది. ఆ యావేదనయే రాజ్యాంగమునందు స్వరాజ్యాందోళనము. ఆ యావేదనయే సంఘమునందు వర్ణవైషమ్యము. ఆ యావేదనమే మతముల యంతఃకలహము. ఆ యా వేదనమే పత్రికల పకృతి. వసంతఋతు సమాగమున చెట్ల యాకులు రాలిపోవునట్టే యపచారము లన్నియు

రాలిపోగలవు. ఆత్మజ్ఞాన విలసితమైన సృజనశక్తి భరితమైన, వివిధ కళాలంకృతమైన, సర్వాంగ సుందరమైన, జగత్కల్యాణదాయకమైన, ఏక భారత జాతీయ సంస్థాపనమను ఆతీతధ్యేయమే సన్నిహిత క్లిష్ట పరిస్థితులను వ్యక్తమగుచున్న ప్రతి స్పర్ధయందును, ప్రతి యపచారమునందును, ప్రతి తిరుగుబాటునందును, అంతర్గతముగ, అట్టడుగున, స్పందించుచున్న ప్రాణశక్తియని హృదయస్థము చేసికొనిన, నీ వార్తాపత్రిక లీ సంకటావస్థనుండి బయల్పడి, ప్రజావళిని ఆనంద వారధినోలలోడించు భారత జాతీయ కల్యాణ మహోత్సవాహ్వాన పత్రికలై వెలయగలవు. ఈ సన్మానము తెలుగు పత్రికల కట్టి యాశీర్వాద బలము నొసగు గాక !

సీ॥ మ్రోగుచున్నది విశ్వమోహన లోక క
 ళ్యాణ తంత్రీముక్త గానరవము
కదలుచున్నది దేశగర్భ గర్భిత జీవ
 నోదార ఖనులెల్ల పాదు కదలి
ధ్వనియించె గగనంబు ధాత్రీజన స్వర్ణ
 యుగ సమాహ్వాన యోగ మనుచు
ఓలగం బున్నవి ఉర్వి నేలెడు తప
 శ్శక్తి సంతతు లెల్ల సంభ్రమమున
ఈ లయాకృతిలోన దా నే మహస్సు
వెడలునో చూడగల్గు సంవిత్త్వ గరిమ
తెచ్చుకో లేరు కాబోలు తెలుగువారు
అలముకొన్నట్టి యోగ మాయాత్మఁజేసి !

– 'కృష్ణా పత్రిక', సెప్టెంబర్ 7వ తేదీ, 1929 సం॥

బుచ్చిబాబు

నవ్యత

ఆధునిక రచయితంటే ఎవరు?

తనచుట్టూవున్న జీవితాన్ని గురించి పట్టించుకొనేవాడే ఆధునిక రచయిత. వెనుకటి తరంలో గొప్ప కళాఖండాలుండొచ్చు. కాని వాటిలో విషయం సమకాలిక సమాజానికి అతకదు. కాబట్టి సాంప్రదాయంపై తిరుగుబాటు చెయ్యడం 'నవ్యత' ప్రధాన సూత్రం.

వెనుకటి తరంవారిపై తిరుగుబాటు రెండు విధాలుగా జరుగుతుంది. ఒకటి సాంప్రదాయాన్ని పూర్తిగా ఖండించి నిర్మూలం చెయ్యడం. రెండోది దాని జోలికి పోక వ్యక్తిగతంగా క్రొత్త విలువలు సాధించి ప్రచారం చెయ్యడం. మన దేశ సాహిత్యంలో ఆధునిక తత్వం ఒక ఉద్యమంగా కొనసాగడానికి రెండు కారణాలున్నాయి. పాశ్చాత్య విద్యా ప్రభావము, దేశస్వాతంత్ర్య ఉద్యమం. ఈ రెంటితోనూ ముడిపడి, 'గండుపడి నీరు భూభాగమంతా పొర్లి ప్రవహించినట్లు' సాహిత్యం ఒక్కసారిగా చెలరేగి, మార్గం తెలీకుండా, ఇప్పటికీ ప్రవహిస్తూనే వుండనొచ్చు. గిడుగు రామమూర్తి, గురజాడ, వీరేశలింగం– వీరిని ఆధునిక ఉద్యమ వ్యవస్థాపకులుగా పరిగణిస్తున్నాము. సంఘ సంస్కారం వీరి ఆశయం. రచనకి ప్రయోజనం వుండాలని వీరి సిద్ధాంతం. సాహిత్యం ఏ కొద్దిమంది పండితులలో, రసికులలో, రహస్యంగా ఆస్వాదించేదిగా తయారవక, సామాన్యులందరికీ సుబోధకమై వారి నిత్యజీవితాలను సరిదిద్దుకొనేందుకు ఉపకరించాలి అన్నది వీరు సాధించిన ప్రయోజనం. మొదటి యుద్ధానంతరం ఈ సామాజిక దృక్పథం కూడా పాతదైపోయింది. సమాజాన్నుండి రచయితల దృష్టి వ్యక్తులపైకి మరలింది. వెనుకటివారికి, ఆధునికులకు ఉన్నపేచీ ఏమిటో శ్రీశ్రీగారి 'వ్యత్యాసాలు!' అన్న గేయంలో వివరించారు. అందులోంచి కొన్ని ఉదహరిస్తాను.

"వడ్డించిన విస్తరి మీ జీవితం
మా వంట మేమే వండుకోవాలి
ఒక్కొక్కమారు విస్తరే దొరకదు మాకు."

* * *

"మాకు గోడలు లేవు
పడగొట్టడం మా పని."

* * *

"అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం"

* * *

"అభిప్రాయాల కోసం
బాధలు లెక్కపెట్టనివారు
మాలోకి వస్తారు."

* * *

అభిప్రాయాలు ప్రచారం చెయ్యడం, వాటిని జీవితంలో సాధించుకునేందుకు బాధలుపడగలగడం- ఇది ఆధునికతత్వ సారాంశం.

ఈ నవ్యత రెండు విధాలుగా ఉంది. ఒకటి వస్తువులో నవ్యత. రెండవది రచనా విధానంలో. వీటి స్వరూపం ఎట్లాంటిదో చూద్దాం.

ముందు శైలిలో నవ్యత. అందరికి అర్థమయ్యేలాగు వ్యవహారికంలో రచన సాగాలి. మధ్యతరగతివారి వ్యవహారికంలో ఇంగ్లీషుపదాలు, భావాల కూర్పు, వాక్య నిర్మాణం కలిసిపోయి ఉన్నాయి. చాలామంది రచయితలు మధ్యతరగతి వారు కావడంవల్ల తెలుగు నుడికారము, జాతీయ రచనాతీరు కుంటుబడ్డాయని ఒప్పుకోక తప్పదు. కవిత్వంలో భావానికనువైన భాష నడక వెదకాలిగాని, భాషలో మెళుకువలను ప్రదర్శించేటందుకు భావాన్ని ఎన్నుకోవడం నేటి కవి హర్షించడు. అలంకారికులు, పండితులు శాసించినట్లు కాకుండా, తన భావానికి, అందలి ఉద్వేగానికి అనువైన పదాలు, క్రమము అలవరచుకుంటాడు.

పదేపదే వాడడంవల్ల చాల ఉపమానాలు విశిష్టతను కోల్పోతాయి. కోకిల, వెన్నెల, వసంతం, చందమామ, వీటిచుట్టూ నిర్మాణమైన ఉపమానాలు పారిశ్రామికయుగంలో వారికి దిగ్భ్రమ కలుగచెయ్యవు. అసలు నేటి బస్తీలలోనివారు చందమామని ఎరుగరు. గ్రహణంనాడే చంద్రుణ్ణిచూడడం; ఆ రోజున ఎల్లాగు కనపడదు. యుగయుగాల సంస్కృతిని జీర్ణించుకున్న నేటి మానవుడిని కదపడానికి వింతపోకడలు పోవల్సివస్తుంది. పదాలు, సాంకేతికాలు, విభిన్నమైన ఉపమానాలు- వాటితో కసరత్తు చేయాల్సివస్తోంది అతను. "ఆరుబైటకూర్చో" అన్నదాన్ని - నేటికవి "6' అంకెవేసి - దానిప్రక్క బైటకూర్చో అన్నమాటలు వ్రాసి తనభావాన్ని వ్యక్త చేస్తున్నాడు. ఇది చూడండి.

"నీ ముఖం మీద చీకటి,
సముద్రపు అలలు,
ఉపరిభాగం మీద
కాంతుల నృత్యం
నత్తగువ్వల
చిత్తుగువ్వల గడియారం ముల్లు
పిడుగుల జడి
అడుగుల సడి
నీ చుట్టుకమ్మిన నేను
నేనులో కలిసిన నువ్వు"

ఆలోచిస్తే ఈ గేయంలో అర్థం దొరక్కపోదు. అర్థం అవకముందే ఆస్వాదింపబడాలి అని "హెర్‌బెర్ట్ రెడ్" సూత్రాన్ని అనుసరించారో అన్నట్లు, ఆధునిక కవిత్వం ఒక మానసికస్థితిని నెలకొల్పడానికి యత్నిస్తోంది. రెండో ప్రపంచయుద్ధానంతరం శైలిలోనేకాక కావ్యవస్తువులోకూడ మార్పువచ్చింది. జాతీయతత్వం, కళారాధన నేడు శంకింపబడుతున్నాయి. మత విభేదాలు, ఆర్థిక వ్యత్యాసాలు, పోటీతత్వం, ఇవన్నీ సాహితీపరుల విమర్శకు గురవుతున్నాయి. ఈ బాధలు పడలేక పాతికేళ్ళక్రితం కవిదూరంగా ఏ మూలకోపోయి ఒంటిగా కూర్చొని దుఃఖిస్తానంటే నేటికవి అందరం కలిసి నడివీధిలో ఏడుద్దాం రండి అంటాడు.

అదీ తేడా !

ఆధునిక విజ్ఞానశాస్త్ర పరిశోధన మరికొన్ని మార్పులను తెచ్చిపడేస్తోంది. ఏటమ్, స్పుట్‌నిక్, ఆపరేషన్ బల్ల, ఆదిమానవుడిలోని సహజ శక్తులు, మానవుడి మనస్సులో దాగిన కోర్కెలనబడే అధోలోకం. గుంపు సంస్కృతి- ఇవన్నీ కావ్యవస్తువై కావ్యంలో ఇమడక, గద్య కవితగా, స్వేచ్ఛాకవిత్వంగా రూపొందుతున్నాయి.

ఉన్న పరిస్థితులను అంగీకరించి వాటిల్లో ఒదిగి వుండడం మన సాంప్రదాయం కాదు. ఈ గిరులన్నీ మనం గీసుకున్నవే. కాబట్టి మార్చుకుందాం అన్నది పాశ్చాత్య పద్ధతి. నవలల్లో, కథల్లో స్త్రీ పురుషుల ఆకర్షణ కథావస్తువుగదా. ఇరవైయేళ్ళక్రితం కథల్లో ఆదర్శతత్వంవుండేది. ఒకడు ఒకామెను ప్రేమిస్తాడు. కాని కుటుంబ పరిస్థితులు అడ్డుతగిలి వారు వివాహం చేసుకోలేదు.

వారు వివాహం చేసికోలేదు. అప్పుడేం జరుగుతుంది? నాయకుడు నిట్టూర్చి, మనం మనస్సులో ప్రేమించుకుంటూ దూరంగా ఉండిపోదాము అని ప్రమాణాలు చేస్తారు. కథ ముగుస్తుంది. ఇప్పుడు కథలో వారిద్దరూ పెద్దవాళ్ళని ఒప్పించడానికి యత్నాలు చేస్తారు. అవి ఫలించకపోతే లేచిపోతారు. లేచిపోవాలి. అదీ మార్పు. అలాగే పాతివ్రత్య చిత్రణం కూడా సాగింది. భార్యని శంకిస్తాడు. నలుగురు చివాట్లు పెడతారు. చివరికి ఏం తేలుతుంది? ఆవిడ అట్లాంటి పనులు చెయ్యలేదనీ, భర్త అజ్ఞానం వల్ల అల్లా అనుమానంపడ్డాడనీ నలుగురూ నచ్చచెప్పి అతన్ని చివాట్లు పెడతారు.

ఇప్పటి కథలలో– ఆమె నిజంగా చెడిపోయినప్పుడు ఏం జరుగుతుంది? అన్న ప్రశ్న, దాని సమాధానం వస్తువుగా వుంటోంది. అసలక్కడి నించే కథ ప్రారంభం.

కథానికలో కథ ముఖ్యం కాదు. ఒక మానసిక వ్యవస్థ చిత్రణ ఆదర్శంగా చేసికోవు. కాథెరిన్ మాన్స్‌ఫీల్డ్ మొదలైనవారి 'మానసిక చిత్రణ' కథలవల్ల కథాస్వరూపం మారింది. వాతావరణం సృష్టించడం రెండోది. వాడే భాషలో కొంత కరుకుదనం వచ్చింది. ఉన్నదున్నట్లు, 'కుండ బ్రద్దలు కొట్టినట్లు సంభాషణలు కూర్చబడతాయి. గంద్రగోళాన్ని సూచించేందుకు వాక్యాలు టెలిగ్రామ్ భాషలో, పత్రికలో శీర్షికలా కర్త క్రియ కర్మలలో కొన్ని లోపించుతూ నడవడం ఉంటుంది. తాత్విక పరామర్శ చింతన సాంగించేటప్పుడు, చైతన్య ధోరణిలో పుల్‌స్టాప్, కామా లేకుండా ప్రవాహంవలె సాగిపోతుంది. వేగం, తొందర, సంక్షిప్తత ఆధునిక యుగ లక్షణాలుగా అంగీకరించినవాడు మరీ క్లుప్తంగా కల్పికను అల్లడం జరుగుతోంది. ఇంక వస్తువులో ఆధునికత్వం తెచ్చిన మార్పు చూద్దాం.

ఇంచుమించు నేటి రచనంతా సామాన్య మానవుడిని ఉద్దేశించి వ్రాయబడుతోంది అనవచ్చు. చరిత్ర, సామాజిక వ్యవస్థ, మతాలు, ఇవన్నీ అతనికి అపచారం చేశాయి గావున, అతన్ని ఉద్ధరించాలని రచయిత సంకల్పం. వీరి కృషికి అంతర్జాతీయ సంస్థ, యునెస్కోవారి ప్రచారం కొంత దోహదం ఇస్తున్నాయి. రాజకీయ తత్వాలను పరిశీలించి చాలా మంది ప్రజాస్వామ్యాన్నే ఆమోదించారనుకుందాం. అయినా దానిపట్ల కూడా కొంత అసంతృప్తి లేకపోలేదు.

గుంపులకు కళని అందం చెయ్యాలన్న ఉబలాటం. పారిశ్రామిక నాగరికతలో లోపించిన మానవతత్వం, మతంలోని అసహనం– వాటిని విమర్శిస్తున్నారు. ఇవి సాహిత్యంలో ప్రబలంగా కనబడతాయి. నాగరికతలోని కుళ్ళు, మర్యాదస్తుల మనిపించుకునేవారిలో దగా, మోసం– ఇవన్నీ బైటపెట్టడం వస్తువుగా వుంటూ వుంది. ఈ దగాలోంచి, కుళ్ళులోంచి, నాగరికతలోంచి ఏ మారుమూలకో పారిపోవడం సోమర్‌సెట్‌మామ్ నవలల్లో చూస్తాం. దేన్నో వెదుకుతూ నాగరికతలోంచి పారిపోవడం పద్మరాజు, కుటుంబరావు కథల్లో చూస్తాము. సెక్స్ విషయంలో నాగరికుడు దగా పోతున్నాడు. స్వేచ్ఛకి, పరిపూర్ణ ఆనందానికి కృత్రిమ సాంప్రదాయాలు అంతరాయాలుగా వున్నాయి. సెక్సు జీవితంలో అసంతృప్తి వ్యక్తిని పూర్తిగా పాడుచేసి, ఇతర రంగాలలో అతని ప్రవర్తనని కలుషితం చేస్తోంది. కావున దానిపట్ల స్వేచ్ఛచాలా అవసరమని డి.హెచ్.లారెన్సు, జాయిస్ కేరీ, మొరెవియా మొదలైన నవలాకారులు ప్రబోధిస్తారు. మనవారిలో ఈ విషయం గురించి ప్రతిభతో వ్రాసిన రచయిత వెంకటచలం గారు. సెక్సు విషయంలో సంతృప్తి చెందినవాడి వ్యక్తిత్వం వికసిస్తుంది. అలాంటి వ్యక్తి సహజంగా మంచివాడై ఉంటాడు. మంచి పనులు చేస్తాడు. అదీ వారి సిద్ధాంతం. "ఏ అవయవానికి ఎక్కువగా పని కల్పించి పాడుచెయ్యడం, అల్లాగే మంచితనాన్ని గూడా తీవ్రమైన పరీక్షకు గురిచెయ్యకూడదు" అన్నది ఆధునిక నిర్వచనం. మరికొన్ని ఆధునిక రచయితల నిర్వచనాలు చూడండి. "ఎవరైనా సంతోషంగా వుంటే వారేదో అపచారం చేసినట్లు భావిస్తుంది మన సంఘం."

అల్లాగే మరొకటి : "నీతికి, జీవితాన్ని అనుభవించలేక పోవడానికి ఏదో సంబంధం వుంది."

"దాంపత్యం అనే గొలుసు బరువైంది. దాన్ని ఇద్దరు మొయ్యాలి. అప్పుడప్పుడు ముగ్గురు మొయ్యాలి." "ప్రతి యోగికీ భావికాలమున్నట్లే ప్రతి పాపికీ భవిష్యత్ కూడా వుంది." "నేటి సమాజంలో రెండు రకాల నీతులున్నాయి. ఒకటి బోధిస్తాం కాని ఆచరించం. రెండోది ఆచరిస్తాం కాని పైకి చెప్పం." ఈ విధంగా, సమాజం ఆమోదించిన నీతికంటే వ్యక్తిగతంగా సాధించిన విలువలే ముఖ్యమన్నది ఆ తత్వం. పెద్ద మనుషులు ప్రపంచమంతటా వొకటే– పోరంబోకులలోనే వైవిధ్యం చూస్తామంటాడు 'షా'. ఈలాంటి దృక్పథం ఫలితం ఏమిటంటే– నేటి సాహిత్యంలో కాంతాన్ని మినహాయిస్తే, ఆదర్శ పాత్రలు లేవేమో అనిపిస్తుంది. ఉన్నా గుర్తుకురాదు. అసలు పూర్తిగా మంచివారంటూ లేరని గుర్తించడమే ఆధునికతత్వం. మనుషుల్లో కాస్త మంచి, కాస్త చెడు కలిసుంటాయి. చెడుకి కారణం కొంత వరకూ సాంఘిక పరిస్థితులు. వాటిని మారిస్తే వ్యక్తులు సత్ప్రవర్తన అలవరచుకుంటారు. నవలల్లో, కథల్లో ఈ యత్నం, దాని ఫలితాలు చూస్తాము. సమాజంలో పాతుకుపోయిన నైతిక సాంప్రదాయానికి, వ్యక్తిలో తపనకుఉన్న సంఘర్షణ, దాని ప్రయోజనం చిత్రించి సాధించిన రచయితలలో– రాజమన్నారు గారు, నార్ల వెంకటేశ్వరరావు గారు, గోపీచంద్ గారు, ఆరుద్రగారు, ఆత్రేయగారు, యగ్గన్న శాస్త్రిగారు ముఖ్యులైన కొందరు.

మనకి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ఆధునిక ఉద్యమం వత్తిడి, వడి తగ్గాయనిపిస్తుంది. విజ్ఞానశాస్త్రం ప్రధాన సమస్యను పరిష్కరించలేదనీ, థర్మోడైనమిక్స్ రోంద్– సూత్రం, సృష్టి రహస్యం మానవ పరిశోధనకి అతీతమైవుందనీ, పరిశోధనికి లొంగని ఆ 'మాయ'నే 'పరమాత్మ' అందామనీ ఐన్‌స్టీన్ వంటి శాస్త్రవేత్తలు అన్నాక కొందరు వెనక్కి మళ్లుతున్నారు. స్పెండర్, హాక్సిలే, ఈషర్‌వుడ్– ఇల్లా ఏదో తత్వాన్ని తిలకించడంలోకి జారుకున్నవారే. సమాజంలో వ్యక్తులకంటె కూడా మంచిగా ఉండటానికి యత్నించడం దుర్నీతేనంటాడు తత్వజ్ఞుడు క్రోచి. యుగ యుగాలకి కాస్త చరిత్ర తయారవుతుంది. యుగ యుగాల చరిత్ర కాస్త సంప్రదాయాన్ని నెలకొల్పుతుంది. దాన్ని త్రోసివెయ్యలేం. డాక్టరు రాధాకృష్ణన్ గారు ఇల్లా వ్రాశారు ఒకచోట.

"వ్యక్తి వికాసం అభివృద్ధి అంటే శరీర వాంఛలు తీర్చుకోవడమనే అనుకుంటున్నాము. పాపం దుర్నీతి, చెడుగు ఆనాదినుంచి వున్నవే. ఎటొచ్చీ ఆధునికులు వాటిని ఆమోదించి మెచ్చుకుంటున్నారు. వాంఛ ఉత్తమ తత్వంగా చలామణి అవుతోంది–" అని నిజంగా ఆలోచిస్తే సాహిత్యంలో వొక విధంగా నవ్యత అనేది ఉండదు. మానవుడి కోర్కెలు, వాంఛలు, ఆశలు– వీటితో సాహిత్యానికి నిమిత్తం వుంది. ఈ కోర్కెలు, వాంఛలు, ఆశలు ఎప్పుడూ మారవు. జననం, బాల్యంలో ఉత్సాహం, యౌవ్వనంలో ప్రేమ, నడి వయస్సులో కీర్తికాంక్ష. వార్థక్యంలో మృత్యువంటే భయం, ఆకలిదప్పులు, ఇల్లు, అనువైన వృత్తి, భార్యా, పిల్లలు, సంసారం– వాటినిఅల్లుకొని వున్న వాంఛలు, కోర్కెలు, ఉద్రేకాలు– వీటిల్లో ఏ మార్పు వుండదు. వాటిని చిత్రించే పద్ధతిలో మార్పుంటుంది. అదే నవ్యత. అంతే!

(అ.భా. తెలుగు మహాసభల సంచిక)

రాచకొండ విశ్వనాథశాస్త్రి

తెలుగు కథానిక

కథలు చెప్పుకోడం ఆదినుంచీ ఉంది. కథల గురించి అంతా చెప్పాలంటే అది చాల పెద్దకథే అవుతుంది. ప్రతి జాతిలోనూ, భాషలోనూ కథలు పెద్దవీ ఉన్నాయి, చిన్నవీ ఉన్నాయి. విశ్వసాహిత్యాన్ని అలా విడిచి పెట్టేసి ఒక్క తెలుగు సాహిత్యంలోని, అందులోనూ నవ్యాంధ్ర సాహిత్యంలోని కథానిక విభాగం గురించి మాత్రమే వ్రాయాలన్నా కూడా అదేం చిన్న కథ కానేరదు. పూర్తి వివరాలతో వ్రాయాలంటే అది చిన్న వ్యాసంలో ఇమడదు. కొద్దిలో చెప్పాలంటే చాల భోగట్టా విడిచిపెట్టవలసి ఉంటుంది. అలా విడిచిపెడుతూన్నందుకు నన్నందరూ క్షమించవలసి ఉంటుంది.

లోగడ శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు కథానికల గురించి వ్రాస్తూ "కథానిక అంటే అభినవ సాహిత్య సంసారానికి ఆత్మబంధువైన చిన్న కథకు పురాణ భారత సాహిత్యవేత్తలు పెట్టిన ముద్దుపేరు అన్నారు. అయిదు రకాలైన గద్య కావ్యాల్లో ఒకటిగా చెప్పబడిన కథానిక (లేక చిన్న కథ)కి అగ్ని పురాణంలో చెప్పిన లక్షణాలేమిటో కూడా శ్రీ శాస్త్రిగారు ఈ విధంగా వివరించారు.

"1. కథ సుదూరంగా సాగిపోక పొందికగా ఉండాలి. 2.పెద్ద సమాసాలు, వర్ణనలతోను కథా శరీరం బిగిసిపోకూడదు." ఇవి బాహ్యలక్షణాలు.

అభ్యంతర లక్షణాలు మూడు. "1.పఠితను భయం సంభ్రమాశ్చర్యాలలో ముంచే విచిత్ర సంఘటనలుండాలి. 2.కథాగర్భంలో... కరుణ సన్నివేశం కూర్చాలి. 3.పాఠకుడు అనుకోని క్రొత్త మళుపులతో కథ తమాషాగా ముగిసిపోవాలి."

ప్రతి కథానికలోనూ పైన చెప్పిన అన్ని లక్షణాలూ ఉండకపోయినా, ముఖ్యమైనవి కొన్ని ప్రతి కథలోను కనిపిస్తాయి.

పూర్వంనుంచీ భారతీయ సాహిత్యంలో చిన్నకథలనేకం ఉన్నాయి. అందుకు ఉదాహరణగా పంచతంత్రం, హితోపదేశం, విక్రమార్కుని కథలు మొదలైనవి తీసికోవచ్చు. దగ్గర్లో మనకి పన్నెండు రాజుల కథలు, తెనాలి రామలింగని కథలు, శుకసప్తతి కథలు, మొదలైనవి ఉన్నాయి. చెప్పిన లక్షణాలన్నీ లేకపోయినప్పటికీ ఇవి కథానికలని చెప్పకతప్పదు.

ఇందువల్ల మనకి తెలిసిందేమంటే కథానిక లేక చిన్నకథ పడవల్లో ప్రయాణంచేసి మన రేవుల్లో పాశ్చాత్యులతోపాటు దిగిన వస్తువుకాదు. కథానిక మనకి పూర్వంనుంచీ ఉంది. అయితే పాశ్చాత్యుల 'షార్ట్‌స్టోరీ' ప్రభావం మనమీద బాగాపడింది. అదెలానూ తప్పదు. కాంతి ఎక్కడున్నా అన్ని దిక్కులా పరిగెడుతుంది. పంచతంత్రం కథలు మనదేశంలో పాతుకుపోయి ఉండిపోలేదు. హిమాలయాన్ని దాటి

చాలచోట్ల సంచారంచేశాయి; చేస్తున్నాయి. అరేబియన్ నైట్సు కథలు అరేబియా దేశపు వేడిలో మాడిపోలేదు. ఎన్నోచోట్ల అవి ఇప్పటికీ పచ్చగా ఉన్నాయి.

మనిషికి ఊహ ఉంది. అందుచేత ప్రతి జాతిలోనూ– 'సాహిత్యం' అంటే ఏమిటో ఎరగనివాళ్ళలోనూ, లిపిలేని భాషలో బతికేవారిలోనూ కూడా – చిన్నకథలెన్నో ఉన్నాయి. ఇటీవల డా॥భద్రిరాజు కృష్ణమూర్తిగారు కొండజాతులవారి చిన్న కథలుకొన్ని సేకరించారు. కరుణ, హాస్య రసాలతో కూడుకొని ఆ కథలు కూడా కొన్ని అద్భుతంగా ఉన్నాయి. చెప్పే విధానంలో కూడా ఎంతో నేర్పరితనం కనిపిస్తుంది. పల్లె ప్రజలలో గేయరూపంలో ఉన్న ఎన్నో కథలు డా॥బి.రామరాజు గారు చేసిన కృషివల్ల అందరికీ ఇటీవల తెలియవచ్చాయి. వీటిని గురించి శ్రీ తూమాటి దోణప్పగారు కూడా ప్రశంసనీయమైన కృషి చేస్తున్నారు.

తెలుగు ప్రజలలో ఎన్నో కథలున్నప్పటికీ పుస్తక రూపంలో, మొదట్లో చాలమటుకు అనువాదాలే వెలువడ్డాయి. క్రీ.శ. 1811లో "చార్‌దర్వేష్" అనే పేరుతో తెలుగున అచ్చయిన కథలు ఆంగ్లంనుంచి అనువదింపబడిన కథలు. విశాఖపట్టణంలోని గొడే నారాయణ గజపతి రాయణింవారు, ఎర్రమిల్లి మల్లిఖార్జునుడనే వారిచేత తర్జుమా చేయించినారు. ప్రజలకి అర్థమయ్యే భాషలోకి అవి తర్జుమా చేయబడ్డాయి. క్రీ.శ.1919లో "విక్రమార్కుని కథలు" "పంచతంత్ర కథలు" రావిపాటి గురుమూర్తిశాస్త్రిగారు వ్రాశారు. అవేకాకుండా కాంభోజరాజు కథలు, తెనాలి రామలింగని కథలు, శుకసప్తతి కథలు, పలుకని పద్మాక్షి కథలు మొదలైనవి కూడా అచ్చవడంలో కథా సాహిత్యం వర్ధిల్లింది.

అప్పటివరకూ సంస్కృత భాషలోని మార్గాలనే అనుసరిస్తూన్న తెలుగువారికి, ఆంగ్లభాషలోని మార్గాలని కందుకూరి వీరేశలింగం గారు తొలిసారిగా పరిచయం చేశారు. వారావిధంగా చేసిన కృషివల్ల గిడుగు రామమూర్తి గారి వ్యావహారిక భాషావాదం ప్రజామోదాన్ని పొందడం వల్ల తెలుగు భాష పుష్టిచెందింది. కొత్త రచయితలు ముందుకొచ్చారు. ముద్రణా యంత్రాలూ, పత్రికలూ నెలకొనడంతో కథానికారచన విస్తృతమైంది. "ఆంధ్రపత్రిక" మరిన్నీ "భారతి" "దేశసేవ" "కృష్ణాపత్రిక" "శారద" "గృహలక్ష్మి" వంటి పత్రికలద్వారా వాటి స్థాపకులు తెలుగు భాషకి, తెలుగు ప్రజకీ సేవచేయడమే కాకుండా తెలుగు కథానిక రచనకి ఎక్కువ అవకాశం కూడా ఇచ్చారు.

"చిన్నకథ" వృద్ధిలోకి రావడానికి వివిధ సాహిత్య, సంస్థలు కూడా ఎంతో కృషిచేశాయి. సాహితీ సమితి, ఆంధ్రసారస్వత పరిషత్తు కవితా సమితి, నవ్యసాహిత్య పరిషత్తు, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణా రచయితల సంఘం, విశాఖ రచయితల సంఘం, నవ్యసాహితీ సమితి ఇటువంటివి ఎన్నో సంస్థలు ప్రముఖ రచయితలెందరో ముందుకు రావడానికి దోహదం చేశాయి.

ప్రచురణ సంస్థలు కూడా కథానికని మిక్కిలిగా ఆదరిస్తున్నాయి వావిళ్ళవారు, కొండపల్లివారు, యువ ప్రచురణలవారు, దేశి కవితామండలివారు, విశాలాంధ్ర ప్రచురణలవారు, ఇటువంటి వెన్నో సంస్థలవారు కథానికల నెన్నిటినో ప్రచురించి రచయితల్ని ప్రోత్సహిస్తున్నారు.

ప్రస్తుతం 'కథానిక' తెలుగు సాహిత్యంలో చోటు చేసుకొని ఇంకా చోటు కావాలంటోంది. ఈ అమ్మాయికి ఎంత చోటు కావాలన్నా ఇవ్వడానికి ఎవరికీ కూడా అభ్యంతరం ఉన్నట్టు కనిపించదు.

ప్రథమంగా తెలుగున స్వతంత్రంగా కథానికా రచన సాగించిన గౌరవం గురజాడ అప్పారావుగారిది. ఆయన వ్రాసిన కథలు కొద్దివే అయినప్పటికీ అవి కొద్దిగా కావు. సాహిత్యానికి సాంఘిక ప్రయోజనం ఉన్నదనే విషయం గుర్తించిన ఆయన, కథానికా రచన వాడుక భాషలోనే సాగించారు. చారిత్రక కథానికలు రచించిన మాడపాటి హనుమంతరావు గారు; యువకథలు, ఉత్సాహానికి కారకులైన సురవరం ప్రతాపరెడ్డి గారు కూడా చిన్న కథని పోషించారు.

ప్రప్రథమంగా 'డిటెక్టివ్ కథలు' వ్రాసిన చింతా భీమశంకరం గారు; టాల్‌స్టాయ్ కథలనువదించిన కొడవగంటి వెంకట సుబ్బయ్యగారు; ఇప్పటికీ తెలుగువారి ఇళ్ళలో ఆడుకొంటూన్న సూరీ–సీతీ–వెంకీ గురించీ, ఇప్పుడు ప్రతి పట్టణంలోనూ కనిపించే 'పటీరావు" గురించి కథలు చెప్పిన చింతా దీక్షితులుగారు; కథా రచనలో ప్రత్యేకతనీ పండిత సంస్కారాన్నీ ప్రదర్శించిన వేలూరి శివరామశాస్త్రిగారు; గృహస్థ జీవితంలోని ఆనందాన్ని కాంతం కథల ద్వారా వెదజల్లిన మునిమాణిక్యం నరసింహారావు గారు, తెలుగు కథకి ఒక స్థిర రూపం ఏర్పరిచారు.

హాస్య ధోరణిలో కథలు చెప్పిన మొక్కపాటి నరసింహాశాస్త్రిగారు, వ్యంగ్య ధోరణిలో భమిడిపాటి కామేశ్వరరావు గారు చిన్న కథలకి చురుకుతనం తెచ్చారు. ఒక తరగతికి చెందిన తెలుగువారి కష్టసుఖాల్నీ, వారి ఆచార వ్యవహారాలనీ ప్రతిబింబింపచేస్తూ ఒక విశిష్టమైన శైలిలో కథలు చెప్పినవారు శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. కథకులూ, చిత్రకారులూ అయిన వారు అడవి బాపిరాజు గారు. ఇతివృత్తం తీసుకోడంలో, భాషని కావలసినట్టు వాడుకోడంలో, శిల్పాన్ని మలచడంలో అసమాన ప్రతిభ ప్రదర్శించిన వారు మల్లాది రామకృష్ణశాస్త్రిగారు. తెన్నేటి సూరిగారు, నోరి నరసింహ శాస్త్రిగారు, జలసూత్రం రుక్మిణీ నాథశాస్త్రిగారు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు, చాగంటి సోమయాజులు గారు కూడా ఆధునిక పద్ధతులలో ఉత్తమ పద్ధతులలో కథలు చెప్పి తెలుగు కథానికకి అలంకారాలు సమకూర్చారు. పల్లెసీమల వాతావరణాన్ని తమ కథలలో మనోహరంగా చిత్రించిన కందుకూరి అనంతం (కరుణకుమార)గారు, సాంఘిక సమస్యల నితివృత్తంగా తీసికొని కథలు వ్రాసిన శ్రీనివాస శిరోమణి గారు పాశ్చాత్య నాగరికత సోకని అమాయక జీవుల గురించి కథలు చెప్పిన కవికొండల వెంకటరావు గారు, శ్రామికుల గురించి, వారు వాడుకొనే భాషలో కథలుచెప్పిన మాగోఖలే గారు కూడా కథానికా రచనలో శ్లాఘనీయమైన కృషిచేయడమే కాకుండా, తెలుగు కథానిక చాలా దూరాలు వెళ్ళగలదని తమ రచనవల్ల నిరూపించారు. 1930–40 మధ్య కాలంలో పూడిపెద్ది వెంకటరమణయ్యగారు, తాతా కృష్ణమూర్తిగారు హాస్యరచన ప్రధానమైన కథలెన్నో చెప్పారు. వీరితోపాటు బొడ్డు బాపిరాజుగారు, కోటమర్తి చినరఘుపతిరావుగారు, ఇరువంటి విష్ణురావుగారు విరివిగా కథానికా రచన చేసి ఈ సాహిత్య ప్రక్రియని ప్రజలకి దగ్గరగా తీసుకువచ్చారు. బోయి భీమన్నగారు కొన్ని చక్కని స్కెచెస్ వ్రాశారు. అటు తరువాత రచయితలలో ధనికొండ హనుమంతరావుగారు, పన్యాల రంగనాథరావుగారు, కందుకూరి లింగరాజుగారు,

రావూరి భరద్వాజ గారు ఇంకా ఎంతో మంది తమ కథానికలలో వస్తువైవిధ్యాన్ని, శిల్ప నైపుణ్యాన్ని ప్రదర్శించి యువకులలో కథలు వ్రాసే ఉత్సాహం కలిగించారు.

గుడిపాటి వెంకటచలం గారు తెలుగు కథకులలో ముఖ్యులు. దేశంలో ఈయన ఎక్కువగా సంచలనం కలిగించారు. చాల మంది 'చలం భక్తులు'గా మారారు. వ్యతిరేకులుగా ఎంతో మంది ఎదురునిల్చున్నారు. మధ్యతరగతి వారి జీవితంలోని దౌర్భల్యాన్ని, కౌటిల్యాన్ని, కాలుష్యాన్ని వస్తువుగా తీసుకొని ఎత్తి పొడిచి విడలాగి కడిగి పారవేయడానికి ఈయన ప్రయత్నం చేశారు. ఒక లక్ష్యం ముందుంచుకొని రచన సాగించినవారిలో ఈయన ముఖ్యులు.

కొడవటిగంటి కుటుంబరావుగారు కథానికా రచనలో సిద్ధహస్తులు. కథలవల్ల సాధించగలిగిన సాంఘిక ప్రయోజనం ఉన్నదని విశ్వసించే కొద్దిమంది రచయితలలో ఈయనొకరు. నూతన సమాజ స్థాపన గురించి రచయితలు కూడా పాటుపడవచ్చుననీ, పాటుపడాలనీ కూడా వీరు నమ్మినట్లు వీరి రచనలవల్ల తెలుస్తూంది. పాత్రల స్వభావచిత్రణ అద్భుతంగా చేయడమే కాకుండా, ఏయే శక్తుల ప్రభావంవల్ల ఆ పాత్రలు ఆయా విధాల ఉంటాయో చెప్పడానికి కూడా వీరు ప్రయత్నం చేస్తారు. తెలుగు కథకులకి వీరు మార్గదర్శకులు.

నూతన భావాలలో, నూతన విషయాలలో నిండిన గోపీచంద్‌గారి కథలు వ్యక్తిలోనూ సంఘంలోనూ కూడా మార్పురావాలనే కథకుడి ఉద్దేశాన్ని తెలియజేస్తాయి. తెలుగు కథని కొత్త దారులంట నడిపించడంవల్ల ఈ తరంవారికి గోపీచంద్‌గారు మార్గదర్శకులయ్యారు.

పాలగుమ్మి పద్మరాజుగారు తెలుగు కథానికా రచయితలలో నూతనోత్సాహం రగుల్కొల్పారు. వీరి 'గాలివాన' కథ అంతర్జాతీయ కథానికల పోటీలో బహుమతి పొందడం తెలుగు రచయితలందరికీ-యువ రచయితలకీ ముఖ్యంగా- సంతోషం, ఉత్సాహం కలుగజేసింది. కథానికా రచనలో ఈయన శిల్పానికి ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు.

శివరాజు వెంకట సుబ్బారావు గారు (బుచ్చిబాబు) తెలుగు యువ కథకులలో ముఖ్యులు. మనుష్యుల స్వభావాల గురించి అతి సహజంగా చెప్పడంలో ఈయనకి ప్రత్యేకమైన నేర్పరితనం ఉంది. కథని చెప్పే వీరి తీరులో కూడా గడుసుతనం కనిపిస్తుంది. పాశ్చాత్య సాహిత్యాలలో ఉన్న కొత్త పద్ధతులకొన్నిటిని తెలుగులోకి తెచ్చి ఆవిధంగా కూడా వీరు తెలుగు భాషకి సేవచేశారు.

తెలుగు సాహిత్యంలో 'కథానిక' లేక 'చిన్నకథ'కి ప్రత్యేకమైన స్థానమే కాకుండా ఒక గౌరవమైన స్థానం లభించినదని చెప్పడానికి నిదర్శనం ఏమిటంటే పండితులే కాక, మహాకవులే కాక, కవి సమ్రాటులు కూడా కథానికా రచన చేయడమే నిదర్శనం. డా॥జి.వి.కృష్ణారావుగారు డా॥ఎస్.వి.జోగారావుగారు, కోర్లపాటి శ్రీరామమూర్తిగారు కూడా రమ్యమైన కథానికలు రచించి ఈ సాహిత్య ప్రక్రియకి గౌరవం తెచ్చారు. శ్రీరంగం శ్రీనివాసరావు గారు కొన్ని చిన్న కథలు, దాదాపు స్కెచెస్ వంటివి, కొత్త పద్ధతులలో చెప్పారు. నిత్యజీవితంలో వీరి 'కోనేటిరావు' చాల చోట్ల కనిపిస్తాడు. విశ్వనాథ సత్యనారాయణ గారు కథానికలు ఎక్కువ వ్రాయకపోయినప్పటికీ ఆ వ్రాసినవి ప్రాక్పశ్చిమ సాహిత్య రీతుల సమన్వయం చేసుకొని ఇంపుగా వ్రాశారు.

తెలుగు 'కథానిక' చరిత్ర చూచినట్లయితే తెలుగు కథకుల సంఖ్య మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఎక్కువైనట్టుగా తెలుస్తుంది. స్వాతంత్ర్యోద్యమం, గాంధీ మహాత్మ్యం దేశంలో గొప్ప చైతన్య కలిగించి మార్పు తీసుకువచ్చాయి. తెలుగు కథానికా సాహిత్యం ఆ ఉద్యమానికి ఆ చైతన్యానికి ఫలితంగా పెరిగి ఉండవచ్చు. కాని స్వాతంత్ర్యోదమానికి తెలుగు కథకులు చెప్పకోతగ్గంతగా, ప్రత్యక్షంగా సహాయం చేయలేదనే చెప్పాలి. ఈరోజు కూడా తెలుగు ప్రజల జీవితం గురించి తెలుసుకోవాలన్నా, వారి చైతన్యాన్ని ఉత్సాహాన్ని గమనించాలన్నా, వారి దారిద్ర్యాన్ని దుఃఖాన్నీ, వారి సంపదనీ సుఖాన్నీ చూడాలన్నా తెలుగు ప్రజలలోకి వెళ్ళి చూసి తెలిసికోవలసిందేగాని తెలుగు కథలు చదివితే మటుకు భోగట్టా తెలియదు.

తెలుగు వారిలో భారతీయులందరల్లో లాగే నూటికి తొంభై మంది రైతుపనో, కూలిపనో చేసుకు జీవిస్తున్నారు. తెలుగు కథల ద్వారా ఏమి తెలిసినప్పటికీ ఆ ప్రజల జీవితంలోని కష్టసుఖాలు గాని, ఆశలుగాని, ఆశయాలుగాని తెలియవు. 15.08.1947 తేదీకి ముందు తెలుగువారు గడిపిన జీవితానికీ, ఇప్పటివారి జీవితానికీ మధ్య ఎంతో తేడా ఉన్నదనే విషయం తెలిసిన వారికి తెలుస్తుంది. పల్లెలలో, పట్టణాలలో, వాడవాడలా, దేశంనలుమూలలా ప్రజలు మేల్కొని మసలుతున్నారు గాని, నూతన సమాజ నిర్మాణానికి తొందరపడుతున్నారని గాని, వారి ఉత్సాహానికి మేరలేదనిగాని, వారి శక్తి సాధింపజాలనిది ఉండదని గాని మనకి తెలుగు కథలు చదివితే తెలియదు. ప్రజల్లోకి ఈ చైతన్యానికి తెలుగు కథలు కారణాలు కావు; ప్రతిబింబాలూ కావు.

అయితే ప్రతిభగల రచయితలు చాలమంది నేడు కథానికా రచన చేస్తున్నారు. వీరి రచనల్లో వస్తువైవిధ్యం, ఎక్కువగా లేకపోయినా కొంతగా వుంది. ప్రేయసీ ప్రియుల సంకేత స్థలాల్లోనూ, పడకటింటి తెరల మధ్యను పెద్దవాళ్ళ నాలుగిళ్ళ వాకిళ్ళలోను చాలాకాలం నలిగిపోయిన 'తెలుగుకథ' ఇప్పుడిప్పుడే బైటపడి లోకాన్ని చూస్తోంది. అమరేంద్ర, హితశ్రీ, ముళ్ళపూడి, పోతుకూచి, మురయా మధురాంతకం, బలివాడ, కాశీపట్నం, అంగర, నార్ల, అవసరాల, మునిపల్లె, ముద్దం శెట్టి, సహజానంద, సింగరాజు, సురమౌళి, పూసపాటి, బొమ్మరెడ్డిపల్లి, పాలంకి, శిష్లా, దండమూడి, చందూరి, పంతులు, నది, సి.రామచంద్ర అవధాని, చిదంబరం, తిలక్, జ్యేష్ఠ, వాకాటి, కావూరి మొదలైనవారెందరో మంచి పద్ధతుల్లో, కొత్త ఇతివృత్తాలలో కథలు వ్రాస్తున్నారు. తెలుగు జీవితాన్ని చిత్రించడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నారు.

నేటి కథానిక గురించి చెప్పుకోవలసిన మరొక ముఖ్య విషయం ఏమిటంటే, పూర్వంకంటె ఆడవారు ఇప్పుడు ఎక్కువగా కథలు వ్రాయడం. కనుపర్తి వరలక్ష్మమ్మగారు, పులపర్తి కమలావతీ దేవి గారు, స్థానాపతి రుక్మిణమ్మగారు, ఇంకా మరికొందరు లోగడ చక్కని కథలు వ్రాసిన ఆడవారి ప్రజ్ఞ నిరూపించారు. ఇప్పుడు కొమ్మూరి పద్మావతీ దేవీగారు, సారిస్‌గారు, నాయని కృష్ణకుమారిగారు, అబ్బూరి ఛాయాదేవి గారు,

తురగా జానకీ రాణి గారు, ఇల్లిందల సరస్వతీదేవి గారు, పి.సరళాదేవి గారు, యద్దనపూడి సులోచనా రాణి గారు, కె.రామలక్ష్మిగారు, భానుమతీ రామకృష్ణగారు, మందరపు లలిత పద్మగారలు, నిడదవోలు మాలతి గారు, చాగంటి తులసిగారు, ఎమ్.పార్వతిగారు, వీరంతా సరళమైన శైలిలో అందమైన కథలు, అందరూ చదువుకోదగ్గవి చెప్తున్నారు. వారు చెప్పే కథలు కరుణరసభరితాలై ఉంటున్నాయి. వారు చెప్పే కథలు నాజూకైన హాస్యంతో నిండి ఉంటున్నాయి. వారు తీసుకొనే ఇతివృత్తాలు జీవితానికి సంబంధించినవిగా ఉంటున్నాయి వారు వాడే భాషలో తెలుగు నుడికారం తప్పక ఉంటోంది.

ఆంగ్లం నుండి కథలు ఎక్కువగా వచ్చాయి తెలుగులోకి. ఆంగ్లం ద్వారా మిగతా పాశ్చాత్య భాషల్లోని కథలు కూడా వస్తున్నాయి. కాని "రెండో తరహా" పాశ్చాత్య కథకుల ప్రభావం తెలుగు రచయితలమీద ఎక్కువగా ఉంటోంది. గాలిపోగుచేసి గారడీ చేసే రచయితల్ని చూసి మనం ముగ్ధులమైపోయి వారిని అనుకరించవలసిన అవసరం లేదు. జీవితం గురించి స్పష్టమైన, నిశ్చితమైన అభిప్రాయాలు కలిగినట్టివారు, అద్భుత విధానాలలో కథానిక రచన చేసినవారు, విశ్వసాహిత్యంలో చిరస్థాయిగా నిలవగల్గినవారు పాశ్చాత్య రచయితలు ఎందరో ఉన్నారు. వారి ప్రభావం తెలుగు రచయితలపై లేదు. వారు జీవితాన్ని తరచి చూచినట్టుగా వారి రచనలవల్ల తెలుస్తుంది. జీవితం గురించి మనలో చాలా మంది కథలు చదివి మాత్రమే తెలుసుకొంటున్నట్లుగా ఉంది. హిందీ కథలూ, బెంగాలీ కథలు కూడా తెలుగులో కనపడతాయి. బెంగాలీలోంచి కథా ప్రవాహమే దిగిపోయింది. చక్రపాణిగారు, బొందల పాణివారు, మద్దిపట్లవారు సవ్యమైన పద్ధతులలో అనువాద రచన చేస్తున్నారు. మనవారు బెంగాలీని, ముఖ్యంగా శరశ్చంద్ర చటర్జీగారిని ఎక్కువగా ఆదరించారు. శరత్‌గారి ప్రభావం నుండి తెలుగు కథ ఇప్పుడిప్పుడే తేరుకొంటోంది. దేశభాషల్లోని ఇతర భాషల్ని తెలుగువారు ఎందుచేతనో కాని కొంచెం దూరంగా ఉంచుకున్నారు. డిటెక్టివ్ కథలతో పాటు తెలుగు కథలు వ్రాసేవారి సంఖ్యా, చదివేవారి సంఖ్యా కూడా పెరుగుతోంది. కాని తెలుగు కథల్ని విమర్శించేవారు శ్రీ వాత్సవ గారు, ఆచంట జానకీరాం గారు, సాళ్వకృష్ణమూర్తిగారు– ఇలా కొద్దిమంది మాత్రం కనిపిస్తున్నారు. కథలలోని లోటుపాట్లని కూడా వారు చూపించినట్లయితే కథకులకి వారి విమర్శ ఉపయోగకరంగా ఉండగలదు. అందువల్ల తెలుగు కథానిక ఎక్కువ బాగుపడనూ గలదు.

ప్రస్తుతం ఖచ్చితంగా చెప్పగలిగే విషయం ఏమిటంటే తెలుగు సాహిత్య వీధిలో కథానిక లేక చిన్న కథకి దిట్టమైన పునాదులు పడ్డాయి. ఆ పునాదుల మీద మన రచయితలు గట్టిమేడ కట్టగలరని ఆశించడానికి అవకాశాలున్నాయి. సామగ్రి అంతా సిద్ధంగా ఉంది. శక్తి సామర్థ్యాలు గల పనివారు కలాలు సర్దుకొని కార్యరంగంలోకి ఉరికి ఉత్సాహంతో పనిచేస్తున్నారు. యువ రచయితలు అనతికాలంలో అతి సుందరమైన, అద్భుతమైన కథానికా సౌధాన్ని నిర్మించగలరని మనం తప్పక ఆశించవచ్చు.

(అఖిల భారత తెలుగు రచయితల మహాసభల సంచిక)

అమరేంద్ర

అనువాద సాహిత్యం

ఆంధ్రసాహిత్యంలో అనువాదాల కథ చెప్పాలంటే దానికి అంతుకనబడదు. అది కావ్యాలతో మొదలైన అనువాద ప్రక్రియ ఈనాటికీ బహుముఖాలుగా కొనసాగుతూ సాహిత్య క్షేత్రాన్ని సస్యశ్యామలంచేస్తున్నది. “అసలు ఆంధ్ర సాహిత్యమంతా అనువాద సాహిత్యమే” అంటూ ఈసడింపుతో పెదవి విరిచేవాళ్ళు కొందరు లేకపోలేదు. కాని ఆంధ్ర సాహిత్య సౌధం సంస్కృతం నుంచి వచ్చిన చక్కటి అనువాదాల పునాదులమీదనే పదిలంగా నిలబడి అంతస్తులు పెంచుకుంటూ వచ్చిందని నిశ్చయంగా చెప్పవచ్చు.

“వ్యాస రచిత భారతామ్నాయ మాంధ్ర భాషగ నొనర్చి” కవిత్రయం ఒక గొప్ప మార్గాన్ని ఏర్పరిచారు. ఆంధ్రకవిత్వ విశారదుడూ, విద్యాదయితుడూ, మహితాత్ముడూ అయిన నన్నయ దక్షతతో శ్రీకారం చుట్టాడు. “తద్రచనయకా” పూరించాడు ఎర్రన. ఉభయ కవిమిత్రుడు బుధారాధన విరాజి తిక్కన సోమయాజి అలతి అలతి పలుకులతో చేవ కల తెలుగులో మూలానికి మెరుగుదిద్దే అనువాదాన్ని కొనసాగించాడు. ఈ మహనీయుల కృషి విశేషం వల్ల ఆది కావ్యమే మహాకావ్యమై ఆంధ్రుల పాలిటి కల్పవృక్షమై అలరారింది. తన పురాకృత విశేషం వల్లనే భాగవతం మిగిలిందని పొంగిపోయాడు పోతన. భక్తి పారవశ్యంతో మందార మకరంద మాధుర్యంతో తెలుగు నాలుకల మీద కలకాలం నాట్యం చేయగల అద్భుతమైన అనువాదాన్ని ప్రసాదించాడు. బాల రసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకని మనుజేశ్వరాధముల కమ్మక పంట వలంతి అల్లుడై తన నోట భాగవతాన్ని పలికించిన శ్రీరామచంద్రునికి అంకితం చేసి ఆంధ్రకవుల ఆత్మగౌరవాన్ని ఆకాశం ఎత్తున నిలబెట్టాడు. పండిత ప్రకాండులకి సైతం ఆయఃపిండంగా తోచిన కాశీ ఖండాన్ని, విద్వేషధంగా కనబడిన నైషధాన్ని తెనిగించి తన విశిష్ట వ్యక్తిత్వాన్ని వాటిమీద ముద్రించాడు ప్రౌఢ కవితాసనాథుడు శ్రీనాథుడు. ఈ కోవకి చెందిందే రంగనాథ రామాయణం. వాల్మీకి హృదయాన్ని తేటగా సూటిగా వెల్లడించిన రచన ఇది.

ఈ శతాబ్దంలో కూడా ఎన్నో ప్రశంసనీయమైన అనువాదాలు వెలువడినాయి. అన్నిటినీ పేర్కొనటం కంటే మైలురాళ్ళుగా నిలిచిన కొన్నిటిని గురించి ముచ్చటిస్తాను. కందుకూరి వీరేశలింగంగారు కాళిదాసు శాకుంతలాన్ని, వడ్డాది సుబ్బరాయ కవిగారు వేణీ సంహారాన్ని సమర్థంగా తెలిగించి నాటక రంగానికి మహోపకారం చేశారు. తిరుపతి వేంకటకవులు బుద్ధ చరిత్ర తెనిగించి కరుణా భరణుడి త్యాగగాథని ఆంధ్రసాహితికి ఆభరణంగా సమకూర్చారు. రామకృష్ణ కవులు విశ్వ గుణాధర్శమూ, శ్రీ పూర్ణ ప్రజ్ఞాచార్యులవారి భాసనాటకాలూ, కాదంబరీ పండితులచేత సెబాస్ అనిపించుకున్నాయి. నవ్యాంధ్ర సాహిత్య సామ్రాజ్య పట్టాభిషిక్తులైన శివశంకర స్వామిగారు తెలుగులో అందించిన కథా సరిత్సాగరం

మళ్లీ మళ్లీ చదవాలనిపించే కమ్మటి రచన. మిన్నికంటి గురునాథశర్మగారు భాగవతం అనే పేరుతో భాగవతంలోని ఏకాదశ ద్వాదశ స్కంధాలు చక్కగా తెనిగించి గొప్ప కొరతని తీర్చారు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు విక్రమాంకదేవ చరిత్రని అనువదించారు. అలంకార శాస్త్రానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు కొందరు పండిత ప్రముఖులు తెనిగించారు. వేదం వెంకటరాయశాస్త్రిగారు సాహిత్య దర్పణాన్నీ, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు కావ్యమీమాంసనీ, జమ్మలమడక మాధవరామ శర్మగారు సమరస గంగాధరాన్ని, వేదాల తిరువేంగళాచార్యుల వారు ధ్వన్యాలోకాన్ని, చలంచర్ల రంగాచార్యులు గారు ప్రతాపరుద్రీయాన్నీ ఆంధ్రీకరించి విజ్ఞుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారూ, మాధవరామశర్మ గారూ భరతముని ప్రణీతమైన నాట్యవేదాన్ని తెనిగించి భారతీయ నాట్య విజ్ఞానాన్ని తెలుగు చదువరులకి అందుబాటులోకి తెచ్చారు.

తెలుగు వచన రచనని ఒక ప్రౌఢమైన మార్గంలో నడిపించాలని చిన్నయసూరి నీతి చంద్రికలోని మిత్రలాభం మిత్రభేదం కథలు తెలిగించాడు. వచన రచనలో చిన్నయసూరి కావ్యరచనలో నన్నయభట్టు ఆక్రమించేటంతటి విశిష్ట స్థానాన్ని అలంకరిస్తాడని ఈ అనువాదాన్ని చదివి ఆనందించిన సహృదయ విమర్శకులు కట్టమంచి రామలింగారెడ్డి గారు ఎన్నోసార్లు అన్నారు. ఇప్పటికీ సంస్కృత కావ్యాలనీ నాటకాలనీ మళ్ళీ మళ్ళీ అనువదించే ప్రయత్నాలు సాగుతూనే వున్నాయి. కుమారసంభవం, ఋతుసంహారం, మేఘ సందేశం వంటి రసవత్కావ్యాలని ఎందరు ఇది వరకు తెలుగు చేశారో, ఇక ముందు చేయబోతున్నారో చెప్పడం సాధ్యంకాదు. గీర్వాణ భాషలో మహామనీషుల కావ్యామృతాన్ని పానంచేసిన ప్రతి హృదయమూ ఆ మాధుర్యాన్ని తన మాతృభాషలో నింపుకోవాలనీ, ఆ భావనా వైభవంతో తన తెలుగుతనపు సొపు పెంపు చేసుకోవాలనీ ఉవ్విళ్ళూరుతుంది. విద్వాన్ విశ్వం కాదంబరి వచనానువాదం పత్రికాముఖాన వరసగా వెలువడి పలువురు పాఠకులని అలరించింది. వింజమూరి శివరామరావు గారు, అక్కిరాజు వెంకటేశ్వర శర్మగారు ఆమరుకాన్ని తెలుగుచేసి ముక్తకాల సోయగాన్ని చదువరులకి అందించారు.

ప్రాచీన సంస్కృతికి కాణాచియైన గీర్వాణ భాషనుంచి ఎన్ని ప్రశస్తమైన అనువాదాలు వెలువడినయ్యో లెక్కకట్టలేం. ఆధునిక యుగంలో సమస్త విజ్ఞానానికీ సరస సాహిత్య వైభవానికీ నిధానమైన ఆంగ్లభాష నుంచి కూడా ఎన్నో గొప్ప గ్రంథాలని తెలుగు చేసుకున్నాం. ఆంగ్లభాష సహాయంతో విశ్వసాహిత్య సౌరభాన్ని ఆఘ్రాణించగలిగాం. నవయుగ వైతాళికుడైన కందుకూరి వీరేశలింగం గారు ఆలివర్ గోల్డు స్మిత్ రచించిన వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డు, గలివర్స్ ట్రావెల్స్ గ్రంథాల లోని విశేషాన్ని రాజశేఖర చరిత్ర, సత్యరాజా పూర్వదేశ యాత్రలు వంటి రచనల్లో ప్రాతిపదికలుగా స్వీకరించారు. వారి సమకాలిక పండితుడు వావిలాల వాసుదేవశాస్త్రిగారు షేక్స్పియర్ రచించిన సీజర్ నాటకాన్ని పద్యరూపంలో తెలుగు చేశారు. హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావుగారు ఫ్రెంచి హాస్య రచయిత మోలియర్ నాటకాలని కొన్నిటిని అనువదించారు. కొన్నిటిని అనుకరించారు. ఎడిసన్ రచించిన స్పెక్టేటరు వ్యాసాల ధోరణిలో పానుగంటి సాక్షి వ్యాసాలలో సమకాలీన సమాజాన్ని చిత్రించారు.

ఆంగ్లకవి శేఖరుడైన షెల్లీ, కీట్సు, వర్డ్సువర్తు, బైరన్ ప్రభృతుల రచనలవల్ల ఉత్తేజం పొంది కొందరు తెలుగు కవులు కంఠాలు విప్పారు. కాని ఎవరూ యథాతథంగా మాతృకలని అనువదించడానికి పూనుకున్నట్లు కనబడదు. బెంగాలీ భాషలో మాదిరిగా ఆంగ్ల కావ్యాలకి సమగ్ర సుందరమైన అనువాదాలూ ఇంతవరకూ తెలుగులో రాలేదు.

కాని ఆంగ్లం నుంచి నవలలూ కథలూ, నాటకాలూ కొల్లలుగా తెలుగులోకి వచ్చాయి. నార్లవారు తెనిగించిన రష్యన్ కథలు సొంత రచనలా అనిపించేటంత సాఫీగా సాగిపోయాయి. చార్లెసు డికెన్సు రచించిన డేవిడ్ కాపర్ ఫీల్డు, రెండు మహానగరాలు, మార్క్ ట్వెయిన్ రాసిన రాజూ పేదా, హకల్ బెరిఫెన్, విక్టర్ హ్యూగోవి రచించిన బీదలపాట్లు, ఘంటారావం స్టీవెన్సన్ సృష్టించిన కాంచన ద్వీపం పత్రికలలో వెలువడి పాఠకులని బాగా ఆకర్షించాయి. విశ్వసాహిత్యంలో ఉన్నత శిఖరాలుగా నిలిచిన డొస్టోవిస్కీ, గోర్కీ, టాల్‌స్టాయ్, రోమారోలా సోమర సెట్‌మామ్, టర్జినీవ్, మాంసాసా, ఛేకోవ్ ప్రభృతుల నవలలూ ఇటీవల ఎన్నో వెలుగులోకి వచ్చాయి. నాటక రచనల్లో విప్లవం తెచ్చిన ఇబ్సెన్ బెర్నార్డుషాల కృతులు కూడా కొన్ని తెలుగు జేశారు. ఈ అనువాదాలు మానవ వాదాన్ని, కరుణారసాన్నీ, కష్టజీవుల పట్ల సానుభూతినీ స్వాతంత్ర్య పిపాసనీ, సమతాదృష్టినీ, ప్రబోధించగల భావ సౌరభాన్ని తెలుగు సీమలో వెదజల్లుతున్నాయి. నన్నుముట్టుకోకు అనే సంకుచిత వైఖరికి స్వస్తిచెప్పి ఏ తావున గొప్ప భావం దొరికినా దాన్ని మనదిగా చేసుకుని మన పలుకుల్లో మలుచుకోవడం వల్ల విశాలమైన సీమలో విహరించి నిర్మలమైన వాతావరణంలో జీవించడం నేర్చుకో గలుగుతాం. సూర్యుని ఉజ్వల భావాలు కూడా ఈనాడు మానవులందరికీ వుమ్మడి ఆస్తి వంటివి. ఈ భావాలు మన భాషలోనికి రావటానికి ఆంగ్ల సారస్వతం ఒక మహా గవాక్షంలాగా వినియోగపడుతుంది. నీదీ నాదీ అనుకోటంమాని అంతా మనది అనుకునే కాలం వచ్చింది.

ఇటీవల కేంద్ర సాహిత్య ఎకాడమీవారి ఆధ్వర్యాన కొన్ని విశ్వవిఖ్యాత గ్రంథాలని అనువదించడం జరిగింది. షేక్స్పియర్ కవిశేఖరుని విషాదాంత నాటకాలు నాలుగింటినీ నలుగురు తెలుగు చేశారు. అవి ప్రచురణకోసం ఎదురు చూస్తున్నాయి. ఇంకా కొన్ని గ్రీకు నాటకాలూ ఉత్తమ గ్రంథాలూ ఎకాడమీవారి అనువాద ప్రణాళికలో వున్నాయి.

అటు తరువాత చెప్పుకోదగినవి బెంగాలీ భాషలోంచి వచ్చిన అనువాదాలు. ఆంగ్ల సంస్కృతితో అన్ని భాషలకంటే ముందుగా గాఢంగా వంగభాషకి సంపర్కం ఏర్పడింది. ఆంగ్ల విద్యతోపాటు అపూర్వమైన ఆధ్యాత్మిక సాంఘిక రాజకీయ ఉద్యమాలు వంగ భూమిలో తలలెత్తాయి. అందువల్ల అన్ని రంగాలతోపాటు సాహిత్య రంగంలోకూడా వంగదేశం ముందు నడిచింది. "Bengal thinks today what India thinks tomorrow" అన్న వాక్యం నేటికీ అక్షరాలా నిజం. నవలా రచనకి పునాది వేసినవారు వంగదేశీయులే. వాల్టర్ స్కాట్ కల్పనాత్మక చరిత్రాత్మక నవల చదివి బంకించంద్ర చటర్జీ కపాల కుండలం, ఆనందమఠం, విషవృక్షం, కృష్ణకాంతుని మరణశాసన, దుర్గేశనందిని వంటి నవలలు రాసి దారులు వేశారు. ఆ దారుల్లో ముందుకి సాగి రవీంద్రుడు నౌకాభంగం, గోరా, వినోదిని వంటి నవలలు రచించాడు. నవలా చక్రవర్తి

శరత్‌చంద్రపథేర్ దాబీ, పల్లీ సమాజ్, శ్రీకాంత, చంద్రహీన్, దేవదాస్, పరిణీత, బడదీది వంటి అద్భుత నవలలు సృష్టిచేశాడు. ఈ ముగ్గురి నవలలూ భారతదేశాన్నంతటినీ ఒక్క ఊపు ఊపినాయి. అటు తరువాతనే తక్కిన దేశ భాషల్లో స్వతంత్ర నవలా రచన చేయాలనే ఉత్సాహం బయలు దేరింది.

మన అదృష్టవశాన వెంకట పార్వతీశ్వర కవులు, శివశంకర స్వామి, చక్రపాణి, వేలూరి శివరామ శాస్త్రివంటి సమర్థులైన అనువాదకులు లభించి వంగభాషలోంచి ఎన్నో నవలా రత్నాలని తెలుగులోకి చక్కగా నడిపించుకు వచ్చారు. ఈ కథల్లోని పాత్రలు మన వాళ్ళేమోఅన్న భ్రాంతి కలిగేటంత సహజంగా సజీవంగా సన్నిహితంగా బెంగాలీ నవలలు కనిపిస్తాయి. తరువాత తరంలో మద్దిపట్ల సూరిగారు ఈనాటి నవలా రచయితలైన విభూతిభూషణ్, ప్రబోధ్ సన్యాల్, తారాశంకర్, మాణిక్ బంద్యోపాధ్యాయ ప్రభృతులని తెలుగు చదువరులకి సుపరిచితులని చేశారు. పరశురామ్, బనఫూల్, రవీంద్రనాథ్ మైత్రా వంటి సుకుమార హాస్య రచయితలని చక్రపాణిగారు చాలా యేళ్ళ క్రిందటే తెనిగించి గిలిగింతలు పెట్టారు.

నోబల్ బహుమానం పొందిన తరువాత రవీంద్ర కవీంద్రుడు దేశీయులందరి దృష్టిని బాగా ఆకర్షించాడు. ఆయన కథానికలూ, వ్యాసాలూ, ఖండకావ్యాలూ, నాటకాలూ చాలా మంది రచయితలు తెలుగులో అందించటానికి ప్రయత్నం చేశారు. తొలుత ఆదిపూడి సోమనాథరావుగారు గీతాంజలినీ, ముట్నూరి కృష్ణారావుగారు రవీంద్రుని సారస్వత విమర్శనలనీ తెనుగు చేశారు. రవీంద్ర ప్రభావితులైన దేవులపల్లి, రాయప్రోలు, మల్లవరపు కవివరేణ్యులు గురుదేవుని భావసౌరభాన్నీ సరస సమాన రచనా విన్యాసాన్నీ ఎన్నో తావులతో అనుసరించారు. శివరామ శాస్త్రిగారు 'కథలూగాథలూ' అనే పేరుతో 'కథా ఓ కాహినీ' కావ్యాన్నీ ప్రౌఢ శైలిలో ఆంధ్రీకరించారు. సోభనాదేవీ వైకుంఠరావులు కథాగుచ్ఛం, పోస్టాఫీస్, ప్రాయశ్చిత్తం, రాజర్షి తెలుగు చేయగా వావిళ్ళవారు ప్రచురించారు. ఇటీవల రవీంద్ర గ్రంథమాల పేరుతో విజయవాడనుంచి ఒక సంస్థ కథలూ, నవలలూ సరళమైన తెలుగులో ప్రచురిస్తున్నది. ఇంతవరకూ ఆంగ్లంలోకి రాని "చోఖేర్ బాలీ" అనే అద్భుత నవలని "కంటి మెరమెర" అనే పేరుతో అనువదించారు. ఒక వితంతువు హృదయంలో తీరని కోరికలు వేసే వెర్రితలలనీ, వాటివల్ల ఇతరుల జీవితాలలో కలిగే ఉపద్రవాలనీ చిత్రించే ఈ నవలకి చక్కటి అనువాదం వచ్చింది.

రవీంద్రుని అనువాదకులలో అమాత్య శేఖరులు బెజవాడ గోపాలరెడ్డిగారు విశిష్టస్థానం సంపాదించుకున్నారు. బిసర్జన్, సన్యాసి, చింత్ర వంటి నాటకాలూ, ఊర్వశీ, శివాజీ, వర్షామంగళ్, కాళిదాసు వంటి ఖండికలూ మూలంలోవున్న శబ్ద సౌందర్యాన్ని ధ్వనించే విధంగా అనువాదం చేశారు. విశాలాంధ్ర నాయకమణులలో ఒకరైన గోపాలరెడ్డిగారు విశ్వకవి శిష్యాగ్రణి కావటంవల్ల రవీంద్రుని భావాల ప్రచారానికి విశేషంగా కృషిచేస్తున్నారు. ఇటీవల చలంగారు గీతాంజలిని తమ సుకుమారమైన వచనశైలిలో వెలువరించారు. గోరా, నౌకాభంగం వంటి నవలలకి ప్రామాణికమైన అనువాదాలు చేసి కవిరాజహంసలు వేంకట పార్వతీశ్వర కవులు మనకి ఎనలేని సేవచేశారు.

జాతీయ భాషగా రూపొందకపూర్వమే హిందీ సాహిత్యం మన వారిని బాగా ఆకర్షించింది. ఆంధ్రపితామహులు మాడపాటి హనుమంతరావుగారు ప్రేమ్‌చంద్ రచనని ఆంధ్రీకరించి మార్గదర్శకులయ్యారు. సేవాసదన్, గబన్, నిర్మలవంటి నవలలూ అసంఖ్యాకమైన కథలూ తెలుగులోకి వచ్చేశాయి. సుదర్శన్, ఇలాచంద్రజోషి వంటి నవలా రచయితలూ, నిరాలా, దినకర్, మైథిలీశరణ్, మహాదేవీవర్మా, సుమిత్రా నందన్ పంత్ వంటి కవి సత్తములూ తెలుగువారికి బాగా సన్నిహితులైపోయారు. జయశంకర్ ప్రసాద్ గారి కామాయినీ కావ్యం తెలుగులో రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. "వోల్గాసే గంగా" అనే చారిత్రక గ్రంథాన్ని అల్లూరి సత్యనారాయణ రాజుగారు సరళంగా తెలిగించారు. తమిళ ప్రాంతంలోలాగా హిందీపట్ల వైముఖ్యం లేకపోవటం తెలుగువారి విశాల హృదయానికి తార్కాణం. అందువల్లనే ఇతర భాషలలోంచి గొప్ప గ్రంథాలని తెచ్చుకుంటూ, మన సాహిత్య వైభవాన్ని అన్యప్రాంతీయులకి రుచి చూపిస్తూ సాహిత్య రంగంలో ఇచ్చి పుచ్చుకునే సరస వ్యాపారాన్ని నిరాటంకంగా కొనసాగించగలుగుతున్నారు.

ఇవే కాకుండా పాలీ భాషలోంచి బౌద్ధ వాఙ్మయాన్ని తెలిగించి దుగ్గిరాల బలరామ కృష్ణయ్యగారు బౌద్ధ వాఙ్మయబ్రహ్మ అనిపించుకున్నారు. పర్షియన్ భాషనుంచి ఉమర్ ఖయాం రుబాయీలని దువ్వూరి రామిరెడ్డి గారు పల్లవ కోమలమైన తెలుగులో "పానశాల"ల ప్రతిష్ఠించి కవికోకిలగా కలరుతారు వినిపించారు.

ఇట్లా ఎంతైన చెప్పుకోవచ్చు కాని అసలు అనువాదాలు అవసరమా? అవి స్వతంత్ర రచనా వికాసానికి అవరోధాలు కావా అనే ప్రశ్న ఒకటి వుంది. విశ్వసాహిత్య భాండాగారంలోంచి బదులు చెప్పుకోవటంవల్ల భావనా సామగ్రిలో వైవిధ్యం పెంపొందుతుంది. భాషకీ జిగీ జీవమూ బిగువూ పెంపొందుతాయి. ఒక మంచి అనువాదం కూడ స్వతంత్ర రచనకంటె ఎక్కువ ప్రసరించగలదు. ఎడ్వర్ ఫిడ్జ్ గెరాల్డ్ ఇంగ్లీషులో ఒమార్ ఖయాం రుబాయీలని వెలువరించి ప్రపంచమంతటినీ ఆకర్షించగలిగాడు. తూర్పు పడమరల మధ్య గొప్ప వంతెన వేశాడు.

ఇది సామాన్యమైన పనికాదు. రెండు భాషలలోనూ అనువాదకుడికి సమానమైన పాండిత్యం వుండాలి. నుడికారపు మెలకువలన్నీ తెలిసివుండాలి. మూలంలోని భావస్ఫూర్తిని పూర్తిగా గ్రహించగల సహృదయం కావాలి. తను రూపొందించే భాషమీద సంపూర్ణమైన అధికారం సంపాదించినవాడై వుండాలి. ఈ లక్షణాలన్నీ ఒనకూడినప్పుడే అనువాదం సహజంగా, సజీవంగా, సరసంగా వుంటుంది. మక్కికి మక్కీగా చేసే అనువాదాలు కృత్రిమంగా వుంటాయి. "నున్నగా గొరుగబడిన గడ్డము గలవాడును" లాంటి అనువాదాలు హాస్యాస్పదాలు. అల్లాగని మూలాన్ని వదిలేసి సొంత పైత్యాన్ని జతచేసిన అనువాదకుడు కూడని సాహసంచేసి అసలు రచయితకి ద్రోహంచేసిన వాడవుతాడు. ఈ రెండు ప్రమాదాలనీ తప్పుకుంటూ రెంటికీ మధ్యగా తిన్ననైనదారి వేసుకోవాలి. వాక్య నిర్మాణం, అన్వయం, జాతీయతగా అన్నీ ఒప్పారే తెలుగులో రచన నడిస్తే సొంత రచన అంత బలంగా అనువాదం కూడా చదువరుని ముందుకి తీసుకుపోగలుగుతుంది.

అసలు కొన్ని భావాలు కొన్ని భాషల్లోనే బాగా ఒదుగుతాయి. వాటిని అంత సహజంగా పలికించాలంటే రెండో భాషకి కూడ అంత పాటవం వుండాలి. పిల్లలు ఊదే ఆణాకానీ నోటీ హార్మోనియంతో త్యాగరాజకృతి పలికించగలమా? అల్లాగే అన్ని భావాలనీ ఒకే రకంగా పలికించగల శక్తి బాగా పరిణతి పొందిన భాషలకే వుంటుంది. ఆ శక్తి భాషా స్వరూపంమీద ఆధారపడి వుంటుంది. జర్మన్ భాషలోకి షేక్స్పియరు నాటకాలు జయప్రదంగా అనువదించారు. ఇంగ్లీషు జర్మన్ భాషలు ఒకే కుటుంబంలో పుట్టిన అక్కా చెల్లెళ్ళు కనుక అనువాదం తేలికగా జరిగింది. అవే నాటకాలు గొప్పవంతులు నిర్వహించినా ఫ్రెంచి భాషలోకి అంత సుఖంగా, సహజంగా దిగుమతి కాలేదు. ఇది షేక్స్పియర్ లోపంకాదు. భాషా స్వభావంలో వున్న వ్యత్యాసమే దీనికి కారణం. అనువాదకులు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకుని మనకి అనుగుణమైన గ్రంథాలనే ఎన్నుకోటం మంచిది. కొన్ని విజాతీయమైన ఆచార వ్యవహారాలు Thanks, good morning లాంటి మాటలు తలకిందులుగా తపస్సు చేసినా తెలుగులో సహజంగా చెప్పలేం. అల్లాగే మన సంక్రాంతి గొబ్బెమ్మలూ, పేరంటాలు, కోలాటాలు, కోడిపందేలు ఇతరులు తమ భాషల్లోకి తర్జుమా చెయ్యలేరు. అందుకే కార్డినల్ క్యూమన్ మహాశయుడు “ఏ భాషలోకి మార్చినా ఏ మాత్రం దెబ్బతినని గ్రంథం మార్చడానికి ఏ మాత్రం ఇబ్బంది పెట్టని గ్రంథం ఒక్కటే వుంది. అది ఎక్కాల పుస్తకం” అని చమత్కారంగా అన్నాడు.

ఏమైనప్పటికీ మూలం మల్లెపువ్వు; అనువాదం అత్తరు. సువాసన వుండవచ్చుకాని పుష్పానికున్న మెత్తదనం, అందం ఎక్కడినుంచి వస్తాయి. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు అన్నట్లు అనువాదం అనేది ఒక ఉజ్వల వజ్రాన్ని ఫోటో తీయటం వంటిది. సూచనామాత్రంగా వజ్రపు రూపం స్ఫురిస్తుంది కాని దాని నిగనిగలూ ధగధగలూ కళ్ళారా చూడవలసిందేకాని బొమ్మలో కనిపించవు. అసలు చూడకపోటం కంటె బొమ్మనైనా చూసి సంతోషపడడం మంచిదికదా?

తెలుగులోంచి హిందీ ఇంగ్లీషు భాషల్లోకి అనువాదం చేసి మనల్ని గురించి ఇతరులకి గొంతెత్తి చెప్పుకోవలసిన అవసరం చాలా ఉంది.

(అఖిల భారత తెలుగు రచయితల మహాసభల సంచిక)

డా॥ చల్లా రాధాకృష్ణ శర్మ

తమిళవాఙ్మయములో ఆంధ్రప్రశంస

దక్షిణాపథమున వ్యవహృతములగుచున్న తెలుగు, తమిళము, కన్నడము మొదలగు నాగరక భాషలు ద్రావిడ భాషా కుటుంబమునకు చెందినవని భాషాతత్త్వ శాస్త్రజ్ఞులు పలువురు విశ్వసించుచున్నారు. ఈ భాషలు చాల ప్రాచీనములనుట నిర్వివాదాంశము. కాని తమిళభాషా వాఙ్మయములు బహు ప్రాచీనములనియు, క్రీస్తునకు పూర్వమే తమిళమున పెక్కు రసవత్కావ్యములు వెలువడెననియు తమిళ పండితుల అభిప్రాయము. ఈ అభిప్రాయమునందలి సత్యాసత్యములెట్లున్నను, తమిళభాషా సాహిత్యములు మాత్రము బహు ప్రాచీనములని భావించవచ్చును. తెలుగు కన్నడములందు లభించిన ప్రాచీన సాహిత్యము తమిళ సాహిత్య మంత ప్రాచీనము కాకపోయినను, తెలుగు, కన్నడ భాషలు మాత్రము తమిళమువలె ప్రాచీనములని నుడువదగును. తమిళ కన్నడములందు జైన బౌద్ధులు సృష్టించిన సాహిత్యము లభించినది. తెలుగున మాత్రము వారు సృష్టించిన వాఙ్మయము నేటికిని లభ్యము కాలేదు. దేశభాషలను ఆదరించి, వానిలోనే రచన లొనర్చిన జైన బౌద్ధులు తెలుగునందును రచన చేసియుందురనుటకు జైన బౌద్ధ కవి కర్తృకములుగా భావింపబడు కావ్యములందలి కొన్ని పద్యములైనను ఉపలబ్ధమగుటయే ప్రబలకారణమనవచ్చును. నిజమునకు తమిళమున వెలసిన తొలి రచనలలో ముక్కాలు మువ్వీసము జైన బౌద్ధులు సంతరించిన రచనలే గలవు. తమిళ పంచ కావ్యములని పేరు పెంపులు గడించిన సిలప్పదిగారము, మణిమేకలై, జీవకచింతామణి మున్నగు మహాకావ్యములు జైన బౌద్ధ కవి కర్తృకములే! తొలి నాళ్లలో తమిళ సాహిత్యమును పరిపుష్టము చేసిన చిరయశస్సు వారికే లభించుచున్నది. కాని ఒక్క తెలుగు భాషలో మాత్రము ఎందువలననో జైన బౌద్ధులు సంతరించిన కావ్యములు కాలగర్భమున కలసిపోయినవి. కనుక లభించిన సాహిత్యమును పురస్కరించుకొని తెలుగు కన్నడములు తమిళమువలె బహు ప్రాచీనములు కావని తలచుట సాహసమే కాగలదు. అతి ప్రాచీనమగు తమిళ సాహిత్యములో ఆంధ్ర ప్రశంస కనబడుచున్న కారణముగ, తెలుగు బహు ప్రాచీనమగు భాష అని సాధికారముగ నుడువదగును.

క్రీస్తుశకము పదునొకండవ శతాబ్దమున వెలుగులోనికి వచ్చిన కలింగత్తుప్పరణి అను నొక చారిత్రక కావ్యమున తత్కర్త యగు జయంగొండార్ కన్నడ భాషను గురించి యిట్లనెను :

"మళలైక్కుఱు మొళిత్ సిలవడుగం పల తమిళుం కుళతిత్తరు కరునాడియర్..." తొక్కు పలుకుల కన్నడ భాషలో కొన్ని వడుగు మాటలును (తెలుగు మాటలు), పలు తమిళ శబ్దములను కానవచ్చుచున్నవని పై పంక్తులలో వ్యక్తము చేయబడినది. అనగా పెక్కు తమిళ శబ్దములయు, కొన్ని తెలుగు మాటలయు కలయికవలన కన్నడ మేర్పడెనని ఆ కవి అభిప్రాయము. ఈ వాదమును

కన్నడిగులు అంగీకరించరు. అయినను ఈ సందర్భమున సుప్రసిద్ధ పరిశోధక విద్వాంసులగు ము. రాఘవయ్యంగారు తెలుగు, కన్నడములను గురించి వెలిబుచ్చిన అభిప్రాయము నిట నుదాహరించుచున్నాను : "…. అది (కన్నడము) తెలుగు తమిళ భాషలలోని శబ్దముల కలయికవలన ఏర్పడిన భాష అని ప్రాచీన తమిళ పండితుల అభిప్రాయము… ఈ విషయములను పురస్కరించుకొని చూడగా తెలుగునకు తమిళమున కున్నంత ప్రాచీనత గలదని తెలియుచున్నది…" కనుక తెలుగు, కన్నడములు తొలుత కలసి యుండెడివనియు, కాలక్రమమున అవి విడిపోయి వేర్వేరు భాషలయ్యెననియు భావించుట సమంజసము కాదేమో! ఈ విషయమున పర్యాప్తమగు పరిశీలన మొనర్పవలసిన అవసరమెంతేనీ గలదు. ఏది యెట్లున్నను ప్రాచీన తమిళ విద్వాంసులమతము ననుసరించి తెలుగు, తమిళమువలె, బహు ప్రాచీనమగు భాష అనదగును.

ఇక తమిళ వాఙ్మయమునందు తెలుగును గురించియు, తెలుగులను గురించియు చెప్పబడిన విషయములను రేఖా మాత్రముగ పరిశీలింతము.

తెలుగువారు తమిళభాషను అరవ మనియు, తమిళులను అరవలనియు పేర్కొనుచున్నట్లుగా, తమిళులు ప్రాచీన కాలమున తెలుగును వడుగు అనియు, తెలుగువారిని వడుగులనియు వ్యవహరించిరి. తమిళ వాఙ్మయమున తొలియుగముగా సంభావింపబడుచున్న సంగ (ఘ) కాలముననే వడుగుశబ్దము ప్రచారమున నుండినట్లు తెలియుచున్నది. కనుక వడుగు శబ్దము చాల ప్రాచీనమయినది. తరువాతి కాలముననే తమిళులు తెలుగువారిని తెలుంగర్ అనియు, తెలుగును తెలుంగు అనియు పేర్కొనిరి. నేటికిని బలిజకులస్థులను తమిళులు వడుగులను పేరున వ్యవహరించుచున్నట్లు తెలియుచున్నది. ఇది గమనింపదగు నంశము.

సంగకాలమున సంతరింపబడిన కావ్యములగు అగనానూఱు, పుఱనానూఱు మొదలగు వానిలో వడుగుశబ్దము తొమ్మిది చోట్ల ప్రయుక్తమైనది. వడుగులు తమిళములకు భిన్నమగు భాషను మాటాడువారనియు, బలసంపన్నులనియు పేర్కొన బడెను. సంగకాలపు గ్రంథములలో తెలుగు సేనానాయకుల పేళ్లు కొన్ని పేర్కొనబడినవి.

కొన్నిచోట్ల వడుగు శబ్దము తెలుగు, కన్నడములను సూచించు సమిష్టినామముగా వాడబడినను, కాలక్రమమున వడుగుశబ్దము తెలుగును, తెలుగువారిని సూచించుటకే వాడబడెను.

ప్రాచీన కాలమున తమిళము వ్యవహృత మగుచున్న దేశమును పండ్రెండు భాగములుగ విభజించిరి. తమిళనాడునకు ఉత్తర సరిహద్దుగా తెలుగునాడు ఉండెనని తమిళ విద్వాంసు లెల్లరు నంగీకరించిన విషయమే. తమిళమున తొలి లాక్షణికుడగు తొల్కాప్పియనార్ సమకాలికుడగు పనంపారనార్ 'వడవేంగడం తెన్ కుమరి యా యిద్దై త్తమిళ్ కూఱు నల్లులగం' అని పేర్కొనెను. ఉత్తరమున నున్న వేంకట శైలమునకును, దక్షిణమున నున్న కన్యాకుమారికిని నడుమగల ప్రదేశమున తమిళము మాటాడబడుచుండెనని పనంపారనార్ మాటలవలన స్పష్టమగుచున్నది. తరువాతి తమిళ పండితులెల్లరు నిటులనే నుడివిరి.

కంబకవి చక్రవర్తి 'వడకలై, తెన్‌కలై వడుగు కన్నడం…' అనియు, కాక్కైపాడినియార్ అను ప్రాచీనకవి 'వడదిశైమరుంగిన్ వడుగువరంబాగ' (తెలుగునాడే తమిళ దేశపు ఉత్తరపుటెల్ల) అనియు, సిలప్పదిగార కావ్యకర్తయగు ఇళంగో పూజ్యపాదులు, 'కొంగణర్, కలింగర్ కొడుం కరునాడర్' అనియు పేర్కొనిరి.

మైసూరు రాజ్యపుటుత్తర భాగమును, బళ్లారి అనంతపురం జిల్లాలను బడగనాడను పేరున తమిళులు వ్యవహరించుచుండిరని తెలియుచున్నది. తరువాతి కాలమున ఈ బడగనాడు వడుగునాడుగా మారియుండనోపును. ఆంధ్రదేశపుటుత్తర భాగమును తెలుగునాడనియు, దాని దక్షిణ భాగమును వడుగునాడనియు ప్రాచీన తమిళులు వ్యవహరించినట్లు కీర్తి శేషులు ము.రాఘవయ్యంగారు విశ్వసించుచున్నారు.

తమిళులు, తెలుగువారిని వడుగులని పేర్కొనినట్లే, తెలుగు వారును తమిళులను అరువులని (అరవలు) పేర్కొనుచుండిరి. వడుగు శబ్దము తెలుగువారి కందరకు వర్తింపనట్లే, ఈ అరువ శబ్దము కూడా తమిళుల కెల్లరకు వర్తించదు. కోయంబత్తూరు జిల్లాకు అరువనాడను వ్యవహార నామముండెనని విదితమగుచున్నది. ఆచారక్కొవై అనునొక తమిళ గ్రంథమునందీ అరువనాటివారు, వడుగులు, కర్ణాటకులు ఇంకను మరికొన్ని దేశములందు నివసించువారు పరిహసింపబడిరి. వీరి ఆచార వ్యవహారములు తమిళుల ఆచార వ్యవహారములకు విభిన్నముగ నుండుటచే తమిళులు వీరిని పరిహసించిరి. కనుక అతి ప్రాచీన కాలమున వడుగులును, అరువనాటి వారును ఆచార వ్యవహారములందు దగ్గరి చుట్టరికము కలిగియుండిరనియు, కనుకనే వారు సన్నిహితులై మెలగుచుండిరనియు మనము ఊహింపవచ్చును. నిజమునకు తెలుగువారును, తమిళులును తొలుత స్నేహభావమున సంచరించుచుండిరి.

పై విషయాదికరమును పరిశీలించిన ఈ క్రింది విషయము సుస్పష్టము కాగలదు. వడుగు అనుమాట చాల ప్రాచీనమైనదనియు, తొలుత అది బళ్లారి, అనంతపురము మండలములందు నివసించు తెలుగువారిని సూచించుటకే వాడబడినను, కాలక్రమమున అది తెలుగు వారినందరను సూచించుశబ్దముగా ప్రయుక్తమయ్యెననియు, అటుపిమ్మట తెలుగులలోని బలిజ కులస్థులను మాత్రమే సూచించుటకుపయోగింపబడుచున్నదనియు నుడువదగును. అంతేకాక ఆంధ్రులను, కన్నడిగులను వడుగర్ అను పేరున తొలుదొలుత వ్యవహరింపబడినను, పిమ్మట వడుగుశబ్దము ఒక తెలుగువారికే పరిమితమయ్యెననియు పేర్కొనవలసియున్నది. అందువలన వడుగు, తెలుగు– ఈ రెండు మాటలును తమిళుల దృష్టిలో సమానార్థకములనియే భావించవచ్చును. కాని తెలుగువారు తమ్మువడుగులని వ్యవహరించుకొనినట్లు మాత్రము తెలియవచ్చుటలేదు.

తెలుగువారగు నాయకరాజులు తమిళనాడును కైవసమొనర్చుకొని దొరతనము సాగించిన కాలములో తమిళ దేశమున తెలుగు శబ్దమునకు ప్రచుర ప్రచార మేర్పడెను. ఆ నాళ్లలో తెలుగు భాషకు రాజగౌరవము కూడ లభ్యమయ్యెను. ఈ నాయకరాజుల కాలమున తమిళనాడున తెలుగు మాటకును తెలుగు పాటకును ఒక క్రొత్త చెలువము, నొక క్రొత్త సోయగము చేకూరినది. తత్ఫలితముగా తమిళులు పలువురు

తెలుగు నభ్యసించిరి. తెలుగున రచనలు చేయసాగిరి. తెలుగు కావ్యములను తమిళము చేసికొనిరి. ఈ అనువాద భాగ్యమునకు నోచుకొనిన వానిలో రామరాజ భూషణుని వసు చరిత్రము, వేమన పద్యములు మున్నగునవి ముఖ్యములు.

ఆధునిక తమిళ సాహిత్య వీధులను సువిశాల మొనర్చిన మహాకవి సుబ్రహ్మణ్యభారతి తెలుగును గానానుకూలమైన భాష అనియు, సుందరమైన భాష అనియు ప్రశంసించెను. విరియగాచిన వెన్నెలరాత్రిలో చేరదేశపు చెలులతో కూడి సుందరాంధ్ర పదమును పాడుచు సింధునదిలో పడవ నడుపుచు కాలము గడపవలెనని భారతి ఆశించెను. ఆంధ్ర మహాసభ అను వ్యాసములో భారతి తెలుగువారి రాజనీతిజ్ఞతను, కొండా వేంకటప్పగారి ప్రతిభను కొనియాడెను. మరి యొక వ్యాసరాజమున మహాభక్తుడు, మహాకవియు నైన పోతనామాత్యుని, రాల్గరగించు గాంధర్వమున రామచంద్రుని సందర్శించిన త్యాగరాజును భారతి సంస్తుతించెను. చంద్రిక అను నవలికలో కందుకూరి వీరేశలింగము పంతులును సుబ్రహ్మణ్య భారతి బహుధా ప్రశంసించెను.

ఇటుల తమిళ వాఙ్మయములో తెలుగు భాషయు, తెలుగు జాతియు ప్రశంసింపబడుట గమనింపదగు విషయము. తమిళ కావ్యములను సునిశితముగ పరిశీలించిన ఇంకను మరికొన్ని అంశములు బయల్పడుననుటలో సందేహములేదు. భావైక్యమును సాధింప నభిలషించుచున్న, యీ దినములలో తెలుగుతోబుట్టు భాషలను, ముఖ్యముగా తమిళ భాషను, అధ్యయనము చేయవలసిన అవసరము ఎంతేని గలదనుట చర్విత చర్వణమే కాగలదు.

ఈ యింద్రకీలాద్రి నింద్రజుఁడభవుతోఁ
 బోరి పాశుపతంబు పొసగనందె
నీ పుణ్యగరిమయందు నీశుందు భూమీ
 సురున కర్థి సాయుజ్య మెనయనిచ్చె
నీ పట్టణంబున నెలమి మాధవవర్మ
 ఘనముగా గురియించెఁ గనకవర్ష
మీ క్షేత్రమున శమీవృక్షంబునను వహ్నిఁ
 బటుచేల చేగట్టెఁ బండితయ్య

భవ్య కృష్ణానదీ తటప్రాప్త భోగ
దక్ష సన్మోక్ష లక్ష్మీప్రధాన మనగ
చెలగె మల్లేశ లింగసంస్థితిని రూఢి
పుణ్యనిలయంబు బెజవాడపురవరంబు

క్రొత్త బియ్యము కాయగూడ లొబ్బట్లు
 సైతంపుబూరెలు పంచదారయామ
వడలు నల్లంబు మీగడలు తియ్యని
 పెర్వు కమ్మని చిరుపాలు గసగసాలు
చిరుసెనగలపప్పు తరచు వీద్యంబులు
 కంబళ్ళు దుప్పట్లు కంచుకములు
హింగు జీరకములు నెనసిన మిరియంబు
 మదము గొల్పెడునెయ్యి మాటదురుసు

లనుసరణశీల మొప్ప గంధాక్షతములు
నంద మింపొందుశిఖలు నొయ్యారినడలు
గలుగు కాంతలు పురుషులు గలిగి సిరులఁ
జెలగు సయ్యాంధ్రదేశంబు చెలవుగాంచి

– వేటూరి ప్రభాకరశాస్త్రి

శ్రీ రంగం శ్రీనివాసరావు

నేటి తెనుగు కవిత : కొత్తపోకడలు

రష్యన్ వైమానికుల నిర్విరామగమనం, పికార్డ్ మహాకాశయాత్ర, ఐన్‌స్టైన్‌రెలె టివిటీ సిద్ధాంతం, ఫ్రాయిడ్ మనస్తత్వ పరిశోధనలు, గాంధీ అహింస, స్పెయిన్‌లో, చీనాలో స్వాతంత్ర్యసమరం – ఆధునిక జీవితం ఎన్ని దిక్కులనుండి ముసురుకొని వస్తున్నది! నీమెదడు కేంద్రంగా వివిధపరిధులలో విస్తరిల్లిన సుడులు కావూ ఇవి? నీటిలో విసరిన రాయిచుట్టూ వలయాలుగా బయలుదేరే కెరటాలు. ఇదే ఆవర్తం (Vortex) శిల్పంలో ఇటువంటి సుడిగుండాలను స్ఫురింపజెయ్యడమే ఆవర్తవాదం (Vorticism).

కళా ప్రపంచంలో ఇటువంటి విప్లవాన్నే ఇటలీనుండి సినార్ మారినెట్టి (Signor F.T. Marinetti), భావికళ (Futurism) అనే పేరుతో బోధించాడు. అవి యూరప్‌లో మహాసంగ్రామం తీవ్రంగా సాగుతున్న రోజులు. దేశదేశాలమధ్య చెలరేగిన ద్వేషాగ్నికి పవిత్రమైన వస్తువేదీ కనిపించలేదు. గ్రంథాలయాలు, వైద్యశాలలు, విజ్ఞానపరిశోధనాలయాలు, చిత్రవస్తుశాలలు, మానవ నాగరికతా చిహ్నాలన్నీ ఈ దావానలంలో దగ్ధపటలం అయిపోతున్నవి. మారినెట్టీ సాహిత్యాన్ని నాశనం చెయ్యడానికి నిశ్చయించాడు. ఈ శిథిలాలనుండి నూతన శిల్పం బయలుదేరుతుందనీ, అదే భావికళ (Futurist art) అనీ ఉద్ఘాటించాడు. ఇతడాదినాలలో ప్రకటించిన కరపత్రాలు, చేసిన ఉపన్యాసాలు లెక్కకు మిక్కిలిగా ఉంటాయి. ఐతిహాసికులను, ప్రేమగీత రచయితలను, విశ్వవిద్యాలయ పండితులను, విమర్శకులను, వ్యాకరణాలను, నిఘంటువులను, నాటకశాలలను, శిల్పాలయాలను నిర్మూలించమన్నాడు. లెంపకాయలను, పిల్లిమొగ్గలను ప్రశంసించాడు. నూతనసృష్టి చెయ్యడానికి నూతన విధానం కావాలి. యంత్రాలనుండి, చలనచిత్రాలనుండి, వార్తాపత్రికల శీర్షికలనుండి, కావ్యవస్తువులును స్వీకరించమన్నాడు. ధ్వనులే సంగీతం, మాటలే కవిత్వం, రంగులే శిల్పచిత్రాలు అన్నాడు. ఇతడు వ్రాసిన "ట్రిపోలీయుద్ధం" కేవలం ధ్వన్యనుకరణలతో నిండి ఉంటుంది.

ఈ సమయంలోనే ఫ్రాన్సులో క్యూబిజం (Cubism) జర్మనీలో ఎక్స్‌ప్రెషనిజం (Expressionism) అమెరికాలో ఇమేజిజం (Imagism) బయలుదేరాయి. భూగోళం మూలమూలలనుండి ఉద్యమాలు, కార్యక్రమాలు, ప్రయోగాలు చెలరేగినవి.

మోటార్‌కారు, గ్రామఫోను, సినీమా, రేడియో, వాయువిమానంవంటి నవీన యంత్రయుగం – క్యూబిజం, ఫ్యూచరిజం, ఎక్స్‌ప్రెషనిజం వంటి ఉద్యమాలను ప్రసవించింది.

అనేక విధాల క్షణక్షణ పరిణామంపొందుతున్న ప్రపంచానికి కళాకారులే పురోగాములు. వీరి దూరదృష్టిలో ప్రజ్వరిల్లిన ఆదర్శలోకమే కాలక్రమాన భౌతిక లోకంలో రూపుకడుతుంది. నిజమైన తిరుగుబాటు కళాప్రపంచంలోనే వస్తుంది. రాజకీయవాదులు తర్వాత వీటినే ప్రచారం చేసి నూతన రాజ్యం స్థాపించామంటారు.

సంప్రదాయాలను ధ్వంసం చేయడం కళాశాలికొక క్రీడ కాదు. ఎంతో అవసరం కలిగి, వీటి వినాశనంవల్లనే లోకాన్ని ముందుకు తీసుకువెళ్లవలసి ఉంటుందన్నప్పుడే అతడిందుకు ఉద్యమిస్తాడు. తన ప్రజ్ఞాతిశయంవల్ల నూతన సంప్రదాయాలను విధిస్తాడు.

కూబిస్టు చిత్రకారులు సంప్రదాయాలు ధ్వంసించడంలోని రహస్యం ఇదే : సమకాలికుల అభిరుచిమీద తిరుగబాటులేవనెత్తి తమ బాహ్యేంద్రియాలకు, అంతరింద్రియాలకు గోచరించిన పరమసత్యాలను అపూర్వపద్ధతులలో ప్రదర్శించారు. క్యూబిజం సాహిత్యంలోనికి కూడా ప్రవేశించి రచనా విధానాలను సమూలంగా ఉగ్రూతలూపివేసింది. ఈ రచయితలు అన్వయం, అలంకారం, వ్యాకరణం, ఛందస్సు అన్నింటినీ అధిగమించి క్రొత్తక్రొత్తగమనాలు, లయలు, సంగతులు నిరూపించారు.

యుద్ధంరోజులలోనూ, యుద్ధం గడిచిన క్రొత్తదినాలలోను బయలుదేరిన ఉద్యమం డాడాయిజమ్ (Dadasim). ఇది కేవలం విధ్వంసనమే, నిరసమే, నిరాకారణమే పనిగా కలది. ఏది వ్రాసినా నిష్ఫలం అనీ, మాటలకు అర్థం లేదనీ, ఏ మాటనైనా, ఏ అర్థంలోనైనా ఉపయోగించవచ్చుననీ ఈ వర్గం వారు బోధిస్తారు. ఏదో ఒక అక్షరం తీసుకొని దానితో ప్రారంభించే మాటలతో ఒక రంగవల్లిక తయారు చెయ్యడం. ఒకొక్క మాటనుండి ఎన్నో విధాల ఎన్నో అర్థాలు సాధించడం, వార్తాపత్రికలలో మాటలు కత్తిరించి తిరిగి వాటిని ఇష్టం వచ్చినక్రమంలో పేర్చి పద్యం అల్లడం! సాహిత్యంలో అరాజకత్వానికి ఇది పరమావధి అనవచ్చును.

ఈ యువకోద్యమాన్ని ఫ్రాన్సులోని పెద్దలలో ప్రముఖులనేకులు ఆదరించారు. కరడుగట్టిన అలవాట్లను కరగగొట్టే మందుగాను, కవితాసామగ్రిని ఏరుకొనడానికి శిల్పికి దొరికిన నూతన స్వాతంత్ర్యంగాను దీనిని అంగీకరించారు.

కాని సంహారమే ప్రధానంగా గల డాడా, నూతన సృష్టి ఏదీ చెయ్యలేకపోయింది. ఇది ఆరిపోతూన్న సమయంలో దీనిలో నుండి క్రమశిక్షణతో, సుతీక్ష్ణ తేజస్సుతో బయలుదేరిన మహోద్యమమే సర్‌రియలిజం. డాడావల్ల విడుదలపొందిన పదజాలం ఈ ఉద్యమంలో మళ్లీ ప్రాణప్రతిష్ఠ పొందినవి. దీనికితోడు ఫ్రాయిడ్ సాగించిన మనస్తత్వ పరిశోధనలు సర్‌రియలిజముకు అమూల్యమైన తోడ్పాటు కలిగించాయి. ఈ ఉద్యమప్రవక్త ఆంద్రేబ్రెటన్ (Andre Breton) మనో విజ్ఞానంలో కృషి చేసిఉండడం ఒక విశేషం. ఇతని రచనలు, వివరణలు, వ్యాఖ్యానాలవల్ల సర్ రియలిజమ్ అమోఘబలం సంపాదించింది. అపస్మారక మనస్సు నుండి స్వప్నలోక రహస్యాలను సంగ్రహించడానికి చేసే ప్రయత్నమని సర్‌రియలిజమును నిర్వచించవచ్చును. ఒక్క కవిత్వంలోనే కాదు శిల్పం, చిత్రలేఖనం, చలనచిత్రాలు, జీవితవ్యాపారాలన్నింటిలోనూ దీనిని వర్తింపజేయవచ్చును. దాలీ (Dali) బొమ్మలు, ఎల్వార్ (Eluard)గీతాలు, మాన్‌రే (Man Ray) ఫోటో గ్రాఫులు, బ్యూన్వెల్ (Bunuel)చలన చిత్రాలు, ఆంద్రేబ్రెటన్ విమర్శలు- కవనం ఈ ఉద్యమానికి శిఖరమైనవి.

కాని దీని నొక "విదేశ సరుకు"గా పరిగణించి తిరస్కరించడానికి వీలులేదు. రాజకీయాలలో నానాజాతి సమితి ఎటువంటిదో కళాప్రపంచంలో సర్‌రియలిజమ్ (Surrealism) అట్టిదని చెప్పాలి. ఇది ప్రపంచమంతటా అనేక శాఖోపశాఖలతో వర్ధిల్లుతున్నది. 1924లో మొటమొదట ప్రారంభమయినప్పటినుండి ఇది నేటిదాకా ఆవ్యాహతంగా సాగిపోతున్నది.

౨

నేడు వివిధదేశాల సాహిత్య క్షేత్రాలలో విజృంభిస్తూన్న ఇన్ని యిన్ని నవీనోద్యమాలు, ఇన్ని యిన్ని భావపరిణామాలు భారతదేశంలోనూ, ఆంధ్రభూమిలోను తమ ప్రతిధ్వనులను ప్రసరిస్తున్నవి.

ఆధునికాంధ్రకవుల రచనలను సరిగా అర్థం చేసుకోవడానికి వాటి వెనుక బాసటగా నిలిచిన ఇతర దేశాల సాహిత్య వ్యవసాయాలను గమనించక తప్పదు. నేటి రచనలను విశ్వపర్యాప్తమైన విశాల జీవితంలో సమన్వయించి నిజమైన కవిత్వ మేదో, కేవలం నర్జీవ శుష్కానుకరణం ఏదో గుర్తించాలి.

ఇకటి మాత్రం నిశ్చయం. నేటి కవులు అసమర్థతవల్ల పూర్వసంప్రదాయాలను నిరసించలేదు. ఒక అశాంతి, అసంతృప్తి ప్రబలి అంచులను దాటే ప్రయత్నాలతో నానాముఖాల వీరు పరుగెత్తుత్తున్నారు. తాము నిరాకరించి వెనుకవదలిన సంప్రదాయల నిజస్థితి, అంతస్తత్వం వీరికి తెలియనిది కాదు. వాడుకభాష బోధించిన గిడుగు రామమూర్తి పండితునికంటె గ్రాంథికాంధ్రాన్ని చకుళితం చేసుకొన్నవారులేరు. ముందు కాలపు అవసరాలనుగుర్తించి ఇతడు, శృంఖలాలను తెగగొట్టివేశాడు. ఆమార్గంనుండి గురజాడ అప్పారావు ప్రవేశించి వాడుక భాషకు కావ్యగౌరవం ఆపాదించాడు. ఆధునికోద్యమానికి మూలవిరాట్టుగా ఇతనికి నవీన కవులు నివాళి ఇస్తారు. గద్యంలో ఇతని నాయకత్వం అందుకొని అనేకులు ప్రథమ శ్రేణిలోనికి రాగల గ్రంథాలు వ్రాశారుకాని పద్యంలో వాడుకభాష విజృంభించడానికి ఒక పురుషాంతరం పట్టింది. ఈ లోపున అచంచలంగా వాడుకభాషలో కవనం చెప్పినవాడు బసవరాజు అప్పారావు మాత్రమే. ఈ శ్రేణిలోనికే యెంకిపాటలు కూడా వస్తాయి. కాని యెంకిపాటలచుట్టూ సాహిత్యం ఏదీ పెరగలేదు. అందుకు కారణం సంఘంలో రావలసిన తిరుగుబాటు ఇంకా రాకపోవడమే.

ఇప్పుడిప్పుడు నవీనులు గ్రాంథికాంధ్రం వదలి వాడుకభాష స్వీకరించినట్లే పురాతన ఛందస్సులు వదలి ముత్యాలసరాలు, ద్విపదలు, రగడలు, మొదలైన గేయచ్ఛందస్సులతో రచనలు సాగిస్తున్నారు. గేయాల లోని వాడుకభాష జీవితానికి సన్నిహితంగా వచ్చి ప్రాచీనరీతులలోని కృత్రిమత్వాన్ని కలయించి నవీనరీతుల స్వచ్ఛందగమనాలను ప్రదర్శిస్తున్నది.

అక్కరలు, ద్విపదలు, ముత్యాలసరాలు మాత్రమేకాక, భుజంగప్రయాతం వంటి వృత్తాన్ని 20 ఏళ్ల క్రిందటనే అబ్బూరి రామకృష్ణరావుగారు తమ ఊహాగానంలో ఉపయోగించారు. అంతేకాక ఆయన ఆ ఛందస్సులో స్వతంత్రించి నాలుగుకంటె ఎక్కువ పాదాలను, రెండేసి పాదాలకే ప్రాసలనూ పాటించి దీని గేయగుణం ఇనుమడింపచేశాడు. ఇది ఊహాగానంలోని "సాధుగీతి."

లతాంతార్ద్ర రాగంబులన్ బాడుతేటుల్
వసంతమ్ము కాంతి ప్రవాహమ్ములందున్
నిసర్గాప్తశోభావినీతిం బ్రియమ్మై
కనుల్గట్టు చందాన కాన్పించు పూవుల్
కనుంగొన్నచో వేడికన్నీళ్ళు రాలున్.

అలంకె రమ్ములేని ఆపూల ముగ్గో
క్షుత్లన్ లీనమైపోయెదో సాధుగీతి !

గేయాలలో మహాకావ్య లక్షణాలు చూపించినవారు విశ్వనాథ (కిన్నెరసాని పాటలు), నండూరి (యెంకిపాటలు), కవి కొండల (శివరాత్రిప్రభ), కృష్ణశాస్త్రి (ఏ గేయమైనా సరే). గీతపద్యం మీద సంపూర్ణ ప్రభుత్వం గల కృష్ణశాస్త్రి ఇటీవల వాడుకభాషలో ఈ ఛందస్సును అత్యద్భుతంగా మలచి చూపించాడు.

బసవరాజు అప్పారావు గేయాలు ఏ సాహిత్యానికైనా శిరోధార్యమైనవి. ఇటివలి కొన్ని టాకీలద్వారా వీటికి ప్రచారం వచ్చి ప్రజాబాహుళ్యం అంతటిలోకి వ్యాపించి నిజమైన కవిత్వం ప్రజాహృదయంలోనికి సూటిగా ఏ విధంగా చొరబడగలదో విశదం చేశాయి.

దువ్వూరి రామిరెడ్డిగారు ఆధునికోద్యమంలో కుడిప్రక్కను నిలుస్తారేమోగాని వీరు రససంపన్నమైన గేయాలు రచించి పరిపక్వమైన కళాభిరుచి ప్రదర్శించారు. వీరి బాష్పదౌత్యం చదివినవారు మరచిపోలేరు. చదవని వారు చదివితీరాలి.

జీవనగంగా హరిత తటంబున
చింతావటతరుమూలమునన్
ఏల యధోముఖివై గడతెంచెద
విచ్ఛిధయౌవన వనులన్.

అని యిది ప్రారంభ మవుతుంది.

గ్రాంథిక భాషను విసర్జించినట్లే ఈ గేయాలనుకూడా మనకవులు ఎప్పుడు పరిత్యజిస్తారో? సాహిత్యపరిణామం గుర్తిస్తే ఇందుకు ఎంతో కాలం పట్టదని చెప్పవచ్చును. వచనపదాలలోనికి ఒక్క ముద్దుకృష్ణ మాత్రమే సాహసించాడు. అడివి బాపిరాజుగారు సాహసించబోయి సందేహిస్తున్నారు. మల్లవరపు విశ్వేశ్వరరావు 'స్త్రీ' అనే కావ్యంలోను, "చెప్పండి జవాబు"లోను వచనపు విరుపులతో రసవత్కావ్యం ఎలా సృష్టించవచ్చునో ప్రదర్శించాడు.

నిస్సందేహంగా ఇకముందు పదిసంవత్సరాలూ వచనగమకాలలో క్రొత్త పరిశోధనలకు వినియుక్తం కాబోతున్నవి. జ్వాల, ఉదయినివంటి పత్రికలు (ఇవి ఆగిపోవడం తాత్కాలికమే అని ఆశించాలి) ఇట్టి అన్వేషణలకు కర్మాగారాలుగా పనిచేశాయి. ఖండాంతరకవులు ఈ మార్గంలో పోయిన పోకడలు మొట్టమొదట వివరించాను. ఈ కార్యబాధ్యత వహించిన కవులు అక్కడక్కడ మాత్రమే తెలుగుదేశంలో కనబడుతున్నారు. దురదృష్టవశాత్తూ వీరిని నిరోధిస్తూ బలిష్ఠమైన ఛాందసాలు పనిచేస్తున్నవి. నవ్యసాహిత్యంలోని మితవాద సంస్థలనుకూడా సహించలేని హ్రస్వదృక్కులు అనేకులు కనబడుతున్నాయి. తీవ్రవాదులు ఏకీభవించడం లేదన్నమాటకూడా వాస్తవమే. భావకవులలో అతివాదాభిప్రాయాలతో సానుభూతి కలవారందరూ ఈ క్రొత్త వాహినులకు తమబలం ఇచ్చి శ్రేణి తీరుస్తారని ఆశించవచ్చును.

వచనగీతం అంటే చేతికి వచ్చిన వ్రాత కాదు. వ్యర్థపదాలు లేకుండా వచనం రాయడమే ఎంతో చిక్కు. అటువంటప్పుడు సమగ్ర సౌందర్యం గల వచనగీతం వ్రాయడమే మరీ కష్టం. పద్యరచనలో ఛందస్త్రీరాలు కవులను కాపాడి నడిపిస్తాయి. వచనగీతంలో బైటినుండి ఇట్టి సహాయం రాదు. కవి తన అంతర్జగత్తులో నుండి మాత్రమే వల్లికలు కల్పించుకోవాలి. వచనగీతం తన రూపం తానే నిరూపించుకొంటుంది. అయితే దీని ప్రాశస్త్యం నిర్ణయించడానికి ఉపయోగించవలసిన ప్రామాణ్యాలేవి? స్థూలదృష్టికి ఇట్టి వేవీ లేవని తోచవచ్చును. కాని ఇవికూడా సంగీతప్రధానమైనవే. ప్రాచీనచ్ఛందస్సులలో ప్రాచీన సంగీతం గోచరించినట్లే నవీన కల్పనలలో నవీన శ్రావ్యతలు గోచరిస్తాయి. క్రొత్తసంగీతం లోహ విహంగాల, పారిశ్రామికయంత్రాల, ధూమ నౌకల, విద్యుచ్ఛకటాల వివిధ విచిత్రఘోషలలో నుండి బయలు దేరుతున్నట్లు నవీన గీతాలు కవియొక్క రసాత్మనుండి అనేక ధోరణులలో ప్రవహిస్తాయి. ఇందుకు కారణం ఈ కాలపు పారిశ్రామిక యుగధర్మమే. వీటివల్లనే క్రొత్తకవిత్వం ప్రోక్తమవుతుంది. వచనగీతానికి ప్రాణపదమైన లక్షణం గమనవైవిధ్యం. ఇది సంభాషణలోని యాసలూ, కాకువులూ, ఉచ్చారణ విశేషాలమీద ఆధారపడి ఉంటుంది. శైలికి, రీతికి, సంబంధించిన సమస్యలెన్నో దీని నుండి బయలుదేరుతాయి. ఒక్కొక్క కవి తన సామర్థ్యంతో ఒక్కొక్క ప్రత్యేకగుణం ప్రదర్శిస్తాడు.

ఇంతవరకు నేను నవకవిత బహిరాకృతిమాత్రమే చర్చించాను. ఇకమీద నేటి కవులు స్వీకరించిన కావ్యవస్తువులను గురించి కొంత చెప్పవలసివుంది. నవీన కవుల దృక్పథం విస్తరిల్లిందని అన్నాను. వీరు ఆకాశాలలోనికి వెళ్లి నక్షత్రపథాలలో విహరించినట్లే భూమికికూడా చేరువగా వచ్చి ఇదివరకు కవులు ప్రవేశించని చీకటి కోణాలలోనికి కాంతికిరణాలు పంపిస్తున్నారు. నగర జీవితం, పారిశ్రామిక పరిస్థితుల హృదయవిదారక దృశ్యాలు, పతనోన్ముఖమైన ప్రాత సంఘపు వికిర నృత్యం, తమ కావ్యవస్తువులుగా చేసుకొన్నారు. ఈ మార్గంలో వీరికి రష్యన్ ఫ్యూచరిజమ్ (Russian Futurism) ఆదర్శమవుతున్నది. మాయకొవస్కి (Mayakovsky), పాస్టెర్నాక్ (Pasternak), మొదలైన కవుల రచనలు పీడితలోకంతో వీరికి సానుక్రోశం కలిగించాయి. కుబేరవైభవం ప్రక్కనే కుచేలదారిద్ర్యం కనబడడానికి వీరు నిర్ఘాంత పోతున్నారు. ఒక్కసారి తమచుట్టూచూస్తే సంఘదూషితులైన ప్రవాస జీవితులు, దరిద్ర భిక్షువులు జీవనోపాధికి శరీరకష్టం తప్ప వేరే ఆధారం లేని కష్టజీవులు కానవస్తున్నారు. తమ కవితలో ఈ దారుణదృశ్యాలు ప్రదర్శించి లోకం కళ్లు తెరవడానికి నేటికవులు యత్నిస్తున్నారు.

కాని ఈ వివిధ విభ్రమాలకు కళవళపాటు పొంది నీ పాతకాలపు వ్యక్తి ఇదంతా తన కర్థం కాదంటాడు. ఇందులో ఆశ్చర్యమేమీలేదు. ఆధునికకవిత్వం అర్థం కాలేదంటే ఇతనికి ఆధునిక జీవితమే అర్థం కాలేదన్నమాట. ఇతడు కళ్లు మూసుకొన్నాడు! వెనుకపడిపోయాడు! అసలితని ప్రపంచమే శిథిలమైపోయింది. ఇతనిని ఉన్నచోటనే వదలిపెట్టి నూతన జీవితం హూటాహూటిగా తరుముకు వస్తున్నది. నవకవులు దీనినే ఆహ్వానిస్తున్నారు. దీనినే ఆరాధిస్తున్నారు.

శ్రీ శ్రీ

20వ శతాబ్దపు తెలుగు సాహిత్యం

తెలుగు సాహిత్య చరిత్రలో 19వ శతాబ్దాన్ని ఒక అంధయుగంగా పేర్కొంటారు. మొత్తం భారతదేశంతో పాటు తెలుగునాడు కూడా బానిసతనంతో మ్రగ్గి, చైతన్య రహితమై, నిద్రాణమై నీరసించిపోయింది. తమ నౌకాబలంతో, రవి అస్తమించని సామ్రాజ్యాన్ని నిర్మించిన బ్రిటీషువారు భారతదేశంలో శాశ్వతంగా తిష్టవేసినట్టు కనబడ్డారు. రాజభాష అయిన ఇంగ్లీషుకు గల పలుకుబడీ, ప్రాచుర్యమూ మరే ప్రాంతీయ భాషలకూ లేకపోయింది. తెలుగులో సరిగా ఉత్తరమైనా రాయలేని విద్యాధికులు అలా రాయకపోవడమే ఒక గౌరవంగా భావించే హీనస్థితికి మన మాతృభాష దిగజారింది. అట్టి పరిస్థితులలో ఆశాజ్యోతిని వెలిగించిన మహనీయుడు కందుకూరి వీరేశలింగం. 20వ శతాబ్దపు తెలుగు సాహిత్యం ఈయనతోనే ప్రారంభమైందని చెప్పవచ్చు.

కందుకూరి వీరేశలింగం ఏక వ్యక్తి విశ్వవిద్యాలయం, "క్రియాసిద్ధిః సత్త్వే భవతి మహతాం నోపకరణే" అన్న సూక్తికి ఆయనే గొప్ప ఉదాహరణ. ఇతరుల నుండి ఏ విధమైన సాహాయ్యమూ లేకపోగా, అడుగడుగునా అభివృద్ధి నిరోధకులయిన ఛాందసుల ఆటంకాలనెదుర్కొంటూ బహుముఖాలుగా భాషాసేవనూ, సంఘ సంస్కరణనూ సాగించిన సాహిత్య వీరుడు వీరేశలింగం. సంఘ సంస్కారానికి సాహిత్యాన్నొక అమోఘమైన ఆయుధంగా చేపట్టి తన దూరదృష్టికి స్పష్టంగా కనబడుతున్న సత్యాలను మూఢ విశ్వాసాలతో కళ్ళు మూసుకొని పోయిన వాళ్ళందరికీ కనబడే విధంగా కలాన్ని కదను తొక్కించాడు.

కందుకూరి రచనలు తెలుగు సాహిత్యంలో సంస్కార ధోరణులు ప్రవేశపెడితే విప్లవాత్మకమయిన మార్పులు తీసుకువచ్చిన ఖ్యాతి మహాకవి గురజాడ అప్పారావుది. 1909లో 'కన్యాశుల్కం' ద్వితీయ ముద్రణ వెలువడినప్పుడు అది ప్రపంచములోని పరమోత్కృష్ట గ్రంథాలలో ఒకటి అని గుర్తించగలిగిన వారు చాలా కొద్దిమంది. కాని యావద్భారత దేశంలోను శూద్రకుని "మృచ్ఛకటికం" తర్వాత కన్యాశుల్కం వంటి నాటకం ఇంకోకటి వెలువడనే లేదు. సమకాలిక జీవిత వాస్తవికతను ఇంత సమగ్రంగా ప్రతిబింబించిన రచన ఏ భారతీయ భాషలోను ఇంకోకటి లేదు. పాశ్చాత్య నాటక రచయితలలో ఇబ్సెన్‌కు గల ప్రత్యేక స్థానం ప్రాచ్య నాటక కవులలో గురజాడదే అనక తప్పదు.

ఆధునికాంధ్ర కవిత్వానికి మూల పురుషుడు మహాకవి గురజాడ. ఆయన "ముత్యాలసరాలు" తెలుగు కవిత్వంలో ఒక విప్లవాన్ని ప్రారంభించాయి. సమాస భూయిష్టమైన సంస్కృత ఛందస్సులలో వ్రాసినదే మహాకవిత్వం కాదనీ, జాతి సంపద అయిన జానపద గేయాలలోనే అపారమైన కవితాశక్తిని ప్రదర్శించే అవకాశముందనీ మొట్టమొదటి సారిగా నిరూపించిన గురజాడ. ఆయన వ్రాసిన 'దేశభక్తి' గీతం ఒక్క

తెలుగువారికే కాదు సమస్త మానవ సమాజానికి జాతీయ గీతం కాగల అర్హతగలది. గాంధీ మహాత్ముడు డ్రాయింగురూము రాజకీయాలను ప్రజాయత్తం చేసినట్లే గురజాడ మహాకవి పండితులు తమ గుత్తసొత్తుగా భావించే కవితా శక్తిని ప్రజలందరూ పొదుకొనే జీవితావసర వస్తువుగా రూపొందించారు. గాంధీజీ నిత్య జీవితంలో నిరాడంబరతను స్వీకరించినట్లే గురజాడ కవితాశిల్పంలో వ్యర్థాలంకారాలనూ, వాచాలత్వాన్నీ కరచరణాలు కట్టి పడవేసే కట్టుబాట్లనూ తొలగించాడు.

కందుకూరి గురజాడలతో పాటు గిడుగు రామమూర్తి పేరు కూడా చెప్పినట్టయితే 20వ శతాబ్దపు తెలుగు సాహిత్య చరిత్రను తీర్చిదిద్దిన మూర్తిత్రయం పూర్తి అవుతుంది. అయితే ఈ మొదటి ఇద్దరివలె గిడుగు రామమూర్తి సృజనాత్మకమయిన సాహిత్య రచన ఏదీ సాగించలేదు. ఆయన సాధించిన మహత్కార్యం యేదంటే పాత సాహిత్యాన్ని మూలమట్టంగా పెకలించి వేసి కొత్త సాహిత్యాన్నికి ప్రవర్తించి ప్రవర్ధిల్లజేయడమే. గిడుగువారు వాడుక భాషను చేపట్టిన మొదటి రోజులలో ఆంధ్ర పండితలోకమంతా ఆయనను యెదిరించి నిలిచింది. ఈ కొత్త ఉద్యమంలో తెలుగు భాష ధ్వంసమయిపోతుందని గగ్గోలు లేవదీసింది. రామమూర్తిగారి వాదనలోని సహేతుకతను అంగీకరించి ఆనాటి మదరాసు విశ్వవిద్యాలయం వాడుక తెలుగును బోధనాభాషకావించడానికి సముఖత ప్రదర్శించగా ఈ ఛాందస పండితలోకం ససేమిరా అని పట్టుపట్టి గ్రాంథికభాషను తొలగించనీయకుండా చేసింది. నాటికీ, నేటికీ తెలుగు భాష బోధించే యే విశ్వవిద్యాలయం కూడా (మద్రాసు, ఆంధ్ర, వేంకటేశ్వర, ఉస్మానియా) వాడుక భాషను గుర్తించనే లేదు.

విశ్వవిద్యాలయాలన్నీ కరడుగట్టిన చాందసానికి ప్రాతినిధ్యం వహించినప్పటికీ తెలుగు ప్రజానీకం మాత్రం వ్యావహారికోద్యమాన్ని హృదయపూర్వకంగా ఆదరించింది. తాను లేవదీసిన తిరుగుబాటును తన జీవితంలోనే విజయం పొందడం చూడగలిగారు గిడుగు రామమూర్తిగారు. చనిపోవడానికి కొద్దిరోజుల ముందు ఆయన తెలుగు పత్రికా ప్రపంచానికిచ్చిన కడపటి సందేశం చిరస్మరణీయమైనది. మీరే ప్రజల విశ్వవిద్యాలయాలు. మీది ప్రజల భాష. కృతకగ్రాంథికాన్ని భాషా పరిశోధకులకు వదలివెయ్యండి. సజీవమైన వాడుక భాషలో ప్రజాసామాన్యానికి వెలుగునూ, విజ్ఞానాన్నీ పంచిపెట్టండి అన్నారాయన. పత్రికాలోకం వారి సందేశాన్ని శిరసావహించింది. ఒక్క పత్రికా రచయితలే కాదు కలం పట్టి రచన సాగిస్తున్న సాహిత్య లోకమూ వ్యావహారిక భాషలోనే గ్రంథాలు వ్రాయసాగింది. రేడియోలు, సినిమాలు వాడుకభాషను చేపట్టాయి. ఏ కట్టుబాట్లకూ లొంగని కవిత్వంతో సహా (కనీసం కొందరు ప్రముఖ యువ కవుల కవిత్వం) వాడుక భాషలోనే సాగుతోంది. ప్రభుత్వ వ్యవహారాలన్నీ ప్రాంతీయ భాషలలోనే సాగగల రోజులు వచ్చినప్పుడు సుబోధకమైన వాడుకభాషకే గౌరవం లభించగలదని ఆశించడానికి అవకాశాలు కనబడుతున్నాయి.

కందుకూరి, గురజాడ, గిడుగు –20వ శతాబ్దంలో ఆంధ్రసాహిత్య పురోగమనానికి విశాలమయిన రాచబాటలు వేసిన ఆది పురుషులు వీరు. అయితే వారి తర్వాత ముఖ్యంగా ఇంకొక ముగ్గురిని కూడా పేర్కొన వలసి ఉంది. వారిలో మొదటివాడు కొమర్రాజు. సాహిత్యం సర్వతోముఖంగా సాగించాలంటే ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని మాతృభాషలో ప్రజానీకానికి అందజేయవలసిన ఆవశ్యకత వుందని గుర్తించిన కొమర్రాజు లక్ష్మణరావు ఈ లక్ష్యం సాధించే ఉద్దేశ్యంతో విజ్ఞాన చంద్రికా గ్రంథమాల స్థాపించారు. తెలుగులో సైన్సు గ్రంథాలు లేని కొరతను తీర్చడానికి జరిగిన తొలి ప్రయత్నమే విజ్ఞాన చంద్రిక. తాను స్వయంగా కొన్ని శాస్త్ర గ్రంథాలు వ్రాసిన్నీ, తదితర శాస్త్రాలలో నిష్ణాతులయిన ప్రముఖుల చేత మరికొన్నిటిని వ్రాయించిన్నీ తెలుగు దేశమంతటా విజ్ఞాన చంద్రికలను వెల్లివిరియించాడు కొమర్రాజు.

ఉత్తమ శ్రేణికి చెందిన నాటకాలలో ఒకటైన “ప్రతాపరుద్రీయం” రచించి వేదం వెంకటరాయశాస్త్రి పాత్రోచిక భాష అనే పేరిట తనకు తెలియకుండానే తాను విరోధిస్తున్న వ్యావహారిక భాషోద్యమానికి పటిష్టత చేకూర్చాడు. సంస్కృత సాహిత్యములోని పరమోత్కృష్ట కావ్యాలనూ, తెలుగులోని గొప్ప ప్రబంధాలనూ సవ్యాఖ్యానంగా ప్రకటించి ప్రాచీన సాంప్రదాయాలకు చెందిన ఉత్తమ విమర్శన ధోరణులను తెలుగువారికి అందజేశాడు. చిరకాలం మద్రాసు క్రైస్తవ కళాశాలలో ఆంధ్రభాషాధ్యాపకుడుగా పనిచేసి తన తర్వాతతరం యువకులకు తెలుగుపట్ల గాఢాభినివేశం కలుగజేశాడు.

దివాకర్ల తిరుపతి శాస్త్రితో కలిసి అష్టావధాన శతావధానాలతో సాహిత్య జీవితం ప్రారంభించిన చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి కవిత్వం కోసమే ఉదయించి కవిత్వం కోసమే జీవించాడు. ఈయన పద్యాలు వ్యాకరణరీత్యా గ్రాంథిక భాషలో సాగినప్పటికి అన్వయ క్లిష్టత లేని సారళ్యంతో వాడుకభాషకు అతి సమీపంగా ఉంటాయి. రంగస్థలం మీద వీరి పాండవ నాటకాలు రక్తి కట్టడానికి వీరి కవిత్వంలోని ఈ సుగుణమే ఒక గొప్ప కారణం. మొట్టమొదట వ్యతిరేకించినప్పటికి గిడుగువారి వాదాన్ని క్రమేణా అంగీకరించి, చక్కని వాడుకభాషలో ఈయన సాగించిన రచన మధురాతి మధురముగా ఉంటుంది.

ఇరవయ్యో శతాబ్దపు రెండో దశాబ్దంలో (1910–20) మొదటి ప్రపంచ సంగ్రామం, రష్యను మహావిప్లవం సంభవించి మానవజీవితంలో ఇదివరకు కనివినియెరుగని బ్రహ్మాండమయిన మార్పులు తీసుకువచ్చాయి. ప్రపంచ ప్రజలందరూ, ముఖ్యంగా సామ్రాజ్యవాద దేశాల ఏలుబడి క్రింద సంవత్సరాల తరబడి బానిసతనంలో అలమటిస్తున్న ప్రజలందరూ తీవ్రమయిన జాతీయాభినివేశంతో, తిరుగులేని స్వాతంత్ర్య కాంక్షతో నూతన చైతన్యం ప్రదర్శించసాగారు. భారతదేశంలో ఈ చైతన్యం గాంధీమహాత్ముని సత్యాగ్రహోద్యమంగా రూపొందింది. ఆ రోజులలోనే మొట్టమొదటి తెలుగు దినపత్రిక ఆంధ్రపత్రిక ఉదయించింది.

ఆంధ్రపత్రికను స్థాపించిన కాశీనాధుని నాగేశ్వరరావు తీవ్రమైన జాతీయవాది. గాంధీజి సాగించిన సత్యాగ్రహ సమరాలన్నింటిలోనూ పాల్గొని పలుసార్లు కారాగృహవాస శిక్షణ అనుభవించాడు. బొంబాయిలో ప్రారంభించబడిన తన దినపత్రికను మద్రాసుకు మార్చిన తర్వాత ప్రతి సంవత్సరం వెలువడే ‘ఉగాది సంచిక’ల తోను, సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన సాహిత్య మానపత్రికగా భారతిని వెలువరించడంతో ఆయన

చిరస్మరణీయమైన భాషాసేవ చేశాడు. భారతి కంటె ఒకటి రెండు నెలలు ముందుగా వెలువడిన శారద అనే మాసపత్రిక సాహిత్యంలో ఉన్నత ప్రమాణాలు ప్రదర్శించినప్పటికీ ఆర్థికపుష్టిలోపించడంవల్ల ఎంతో కాలం సాగజాలకపోయింది.

ఆంధ్రపత్రిక ఆవతరణకు పూర్వం తెలుగునాట విరివిగా గ్రంథమాలలు విస్తరిల్లి ఉండేవి. విజ్ఞానచంద్రికా గ్రంథమాల వీటి అన్నిటికి తలమానికమని చెప్పవచ్చు. ఇదిగాక వేగుజుక్క, ఆంధ్రప్రచారిణి మొదలగు గ్రంథమాలలు విశేషంగా నవలలను ప్రకటిస్తూ ఉండేవి. ఈ నవలలు చాలామట్టుకు బెంగాలీ, మరాఠీ భాషల నుంచి అనువాదాలు. స్వతంత్ర రచనలు బహుస్వల్పం. నాటికీ నేటికి తెలుగులో స్వతంత్ర నవలారచన నీరసంగా సాగుతుండడం శోచనీయం. కవితలో అగ్రశ్రేణిన నిలిచిన తెలుగు సాహిత్యం నవలల్లో వెనుకబడిపోయింది. ఇందుకు కొంత ఓదార్పుగా తెలుగులో కథానికరచన గురజాడతో ప్రారంభమై ఈనాడు అత్యుత్తమయిన అంతర్జాతీయ ప్రమాణాలను సంతృప్తిపరచగల జవసత్వాలను ప్రదర్శించగలుగుతోంది.

జాతీయోద్యమానికి అనుబంధంగా ప్రారంభమైన గ్రంథాలయోద్యమాన్ని జాతీయోద్యమంతో సరిసమానంగా అభివృద్ధి చెందిన నాటకరంగాన్ని సమీక్షించడానికి ప్రత్యేకవ్యాసాలు అవసరం. అలాగే ఈ శతాబ్దపు నాలుగవ దశాబ్దంలో (1930–40) ప్రారంభమై నేటి వరకు అప్రతిహతంగా సాగుతున్న సినీమా, రేడియో శాఖలను కూడా ఈ చిన్న వ్యాసంలో సమీక్షించడం సాధ్యపడదు.

1918లో మొదటి ప్రపంచయుద్ధం ముగిసింది. యుద్ధానంతరం భారతదేశానికి స్వరాజ్యం సిద్ధించగలదని మితవాద రాజకీయ నాయకులు కన్న కలలన్నీ గాలి మేడలయిపోయాయి. దానితో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించాడు. విజయగర్వంతో మదించిపోయిన బ్రిటీష్ ప్రభుత్వం భారత ప్రజానీకం మీద నిర్దాక్షిణ్యమైన హింసాకాండ అమలుపరచసాగింది. సహజంగా ఉద్రేకపూరితులైన తెలుగు ప్రజలు స్వలాభాపేక్ష అన్నమాట లేక అశేష త్యాగాలు చేసి గాంధీ ఉద్యమానికి అండగా నిలిచారు. విభజించి పాలించడంలో స్థిత ప్రజ్ఞులయిన బ్రిటిష్‌వారు తెలుగు జమీందారులను, తదితర ఫ్యూడల్ భూస్వాములను, తమ అడుగులకు మడుగులొత్తే ప్రభుత్వోద్యోగులను తెలుగు ప్రజల మీదకు ఉసికొల్పారు. ఆ రోజుల్లోనే మా కొద్దీ తెల్ల దొరతనము అనే పాట ఆంధ్రదేశం నలుమూలలా మారుమ్రోగింది. వంద ఉపన్యాసాలకన్న ఎక్కువగా ఒక పాటలోనే ప్రజా హృదయం ప్రతిబింబించిదనడం అతిశయోక్తి కాదు. సాహిత్యాన్ని ప్రచారసాధనంగా చెయ్యరాదనే ఛాందసులకు తిరుగులేని జవాబుగా ఈ పాట నిలిచింది.

అల్లకల్లోలమయిన రాజకీయ వాతావరణంతో నిండిన ఈ దశాబ్దం (1920–30)లో తెలుగుదేశ మంతటా సాహిత్య సంఘాలూ, సాహిత్య పత్రికలూ వెల్లివిరిశాయి. శారద, భారతి, మాసపత్రికల గురించి ఇదివరకే చెప్పబడింది. కళ, సాహితి, సఖి, జయంతి మొదలయినవి మరికొన్ని ఉత్కృష్ట సాహిత్య పత్రికలు. వీటిలో సాహితి, సఖి అనే పత్రికలు సాహితీ సమితి ఆధ్వర్యంలో వెలవడ్డాయి. శ్రీ శివశంకరశాస్త్రి సభాపతిత్వం క్రింద సాహితి సమితి నూతన సారస్వత చరిత్ర సృష్టించింది. భావ కవిత్వం అని పిలువబడే లిరికల్ పొయెట్రీ విశేషంగా రచించిన కవులనేకులు సాహితి సమితి సభ్యులు.

భావకవిత్వానికి మూలవిరాట్టుగా రాయప్రోలు సుబ్బారావును విమర్శకులంతా పేర్కొంటారు. 'తృణ కంకణం', 'జడకుచ్చులు', స్వప్నకుమారకం వంటి కావ్యగ్రంథాలను క్రితం దశాబ్దంలో ఆయన వెలువరించాడు. లలిత పదజాలంతో సున్నితమైన పద్యరచనా ధోరణిని ప్రదర్శించే కావ్యాలు ఉత్తరోత్తర భావకవులకు ప్రోద్బలమిచ్చాయి. అయితే యించుమించు రాయప్రోలుకు సమకాలికంగానే అబ్బూరి రామకృష్ణారావు రచించిన 'ఊహాగానం' కూడా భావకవులందరి మీదా తన ప్రభావాన్ని ప్రసరింపజేసింది.

భావకవిత్వం అనగానే కృష్ణశాస్త్రి పేరే అందరికీ మున్ముందుగా స్ఫురిస్తుంది. ఆయన వ్రాసిన కృష్ణపక్షము, ఊర్వశి–ప్రవాసము అనే కావ్యాలు యెందరో యువకవులను ఉత్తేజపరిచాయి. 'నేటికాలపు కవిత్వం' అనే గ్రంథములో భావ కవిత్వాన్ని దుయ్యబట్టిన అక్కిరాజు ఉమాకాంతం కృష్ణశాస్త్రిని విమర్శించడానికే యెక్కువ పుటలు ప్రత్యేకించాడు. మహాపండితుడయిన ఉమాకాంతం విమర్శనకు అనాడెవరూ సూటిగా జవాబు చెప్పలేకపోయారు. కథకచక్రవర్తీ, గురజాడ భక్తుడూ అయిన చింతా దీక్షితులు మాత్రం కృష్ణాపత్రికలో "కొన్ని సందేహాలు" అనే శీర్షిక క్రింద ఉమాకాంత పండితుణ్ణి వ్యంగ్యంగా మందలించాడు.

సాహితీ సమితి సభ్యులలో ఒకడయిన నందూరి సుబ్బారావు 'యెంకి పాటలు' రచించి తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానాన్ని అందుకున్నాడు. గీతాలనూ, వృత్తాలను నిరాకరించి జానపద గేయాలలో పాటక జనుల భాషలో 'యెంకిపాటలు' రచించడమే నందూరి లోని ప్రత్యేకత. సాహిత్య క్షేత్రంలో ఈ గేయాలు ఒక సరికొత్త పంట పండించాయి. తెలుగుజాతి ఎన్నడూ మరచిపోలేని అపూర్వ వ్యక్తులు యెంకి, నాయుడు బావలు. వారి అకళంక ప్రేమ జీవితమే 'యెంకి పాట'లలో ప్రధాన కావ్యవస్తువు.

గురజాడ అడుగుజాడలలో నడచి గేయచ్ఛందస్సులలో కవిత చెప్పిన బసవరాజు అప్పారావు ఏ సారస్వత సంఘంలోనూ సభ్యుడుకాదు. రాయప్రోలు, అబ్బూరి తరానికి చెందిన బసవరాజు రచనలు తర్వాతి తరం కవులకు విశేషంగా ప్రోద్బలం కలిగించాయి.

కొంతకాలం సాహితీ సమితి సభ్యుడుగా ఉండి, గిరికుమారుని ప్రేమగీతాలు మొదలయిన భావకవితా రచనతోను, ఆంధ్ర పౌరుషము, ఆంధ్రప్రశస్తి వంటి దేశభక్తి ప్రేరకాలయిన ఖండ కావ్య సంపుటాలతోను విశ్వనాథ సత్యనారాయణ, మొదటి శ్రేణి కవులలో ఒకడుగా ప్రసిద్ధి చెందాడు. "జయంతి" పత్రిక యీయన సంపాదకత్వం కిందనే వెలువడింది. అందులో ధారావాహికంగా "కిన్నెరసాని పాటలు" ప్రచురితమైనాయి. ప్రస్తుతం యీయన వాల్మీకి రామాయణాన్ని తెలిగిస్తున్నాడు.

కృష్ణశాస్త్రి, వేదుల, నాయని, నందూరి మొదలగు కవులతో బాటు సాహితీ సమితిలో చింతాదీక్షితులు, మొక్కపాటి నరసింహశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు మొదలగు కథకులూ, నవలా రచయితలూ మూడవ శతాబ్దంలో ప్రసిద్ధికి వచ్చారు. వీరందరూ తమ రచనలలో

సున్నితమైన హాస్యరసాన్ని ప్రదర్శించారు. మొక్కపాటి వారి "బారిష్టరు పార్వతీశం",ముని మాణిక్యం వారి "కాంతం కథలు" తెలుగువారి ఆదరాభిమానాలను చూరగొన్నవి.

చింతా దీక్షితులు కథానికా రచయితగా, కవిగా, బాలసాహిత్య నిర్మాతగా తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం అలంకరించాడు.

ఏ సాహిత్య సమాజంతోనూ సంబంధం పెట్టుకోకుండా ఆంధ్రజాతికి తన రచనలతో విస్మయాందోళనలలో ముంచెత్తినవాడు గుడిపాటి వెంకటచలం. స్త్రీ పురుషలైంగిక సంబంధాలను తన కథలలో బాహాటంగా నిర్భయంగా చర్చించి సంఘంలో స్త్రీల నికృష్టస్థితిని పదునైన శైలితో బహిరంగపరిచాడు. ఈయన చేతిలో కథానికారచన ఒక విశిష్టతను సాధించింది. తెలుగు భాషలోని కొద్దిపాటి నవలా రచయితలలో ఈయన ఒకడు. సావిత్రి, చిత్రాంగి, శశాంక మొదలగు నాటకాలలో గుడిపాటి ప్రత్యేక ప్రతిభను ప్రదర్శించాడు.

ఈ కాలంలో వెలువడ్డ నవలల్లో విశ్వనాథ వారి ఏకవీర, ఉన్నవ వారి మాలపల్లి ఉత్తమ రచనలు.

కిందటి దశాబ్దంలో ప్రారంభమయిన అశాంతి ఈ దశాబ్దంలో తీవ్రరూపం దాల్చింది. ప్రపంచమంతటా ఆర్థిక సంక్షోభం చెలరేగి, పెట్టుబడిదారీ విధానం నేలమట్టంగా కదలిపోయింది. సామ్రాజ్యవాద దేశాలు ఏళ్ళతరబడి సాగించిన సోవియట్ వ్యతిరేక ప్రచారంలోని నిస్సారత బయటపడి ఒక వ్యక్తిని మరొక వ్యక్తి పీడించని సామ్యవాదమే మానవజాతికి శరణ్యమని క్రమక్రమంగా ఋజువవుతోంది. సోవియట్ రష్యాలో సామ్యవాదం నూతన విజయాలను సాధిస్తూ ఉంటే దానిని యెదుర్కొనడానికి ఇటలీలో ఫాసిజము జర్మనీలో నాజీజమూ తలెత్తి రెండవ ప్రపంచ యుద్ధానికి విషబీజాలు నాటసాగాయి. దానిని నాందీప్రాయంగా చెలరేగిన స్పెయిన్ అంతర్యుద్ధంలో ఫాసిజం తన నగ్న స్వరూపాన్ని బహిరంగంగా ప్రదర్శించింది.

భారతదేశంలో దారిద్ర్యం, నిరుద్యోగం, పాలకుల పరపీడన దుర్భరస్థితిగతులకు దారితీశాయి. మధ్య తరగతి కుటుంబాలు విచ్ఛిన్నమయిపోయాయి. కర్షక కార్మిక వర్గాలు ఆకలి మంటలతో అల్లాడిపోయాయి. సంపూర్ణ స్వాతంత్రమే భారత ప్రజల లక్ష్యమని తీర్మానించి కాంగ్రెసు సంస్థ సత్యాగ్రహోద్యమాన్ని తీవ్రతరం చేసింది.

ఈ పరిస్థితులలో తెలుగు సాహిత్యం మీద అంతర్జాతీయ సాహిత్యోద్యమాలు తమ ప్రభావాన్ని ప్రసరింపజేశాయి. భావ కవిత్వంలో అసంతృప్తి చెందిన యువకవులు తమ చుట్టూ ఉన్న పరిస్థితులను ప్రస్ఫుటంగా ప్రదర్శించగల నూతన విధానాలను వెదుకసాగారు. 'కళకోసమే కళ' అనే వాదాన్ని నిరాకరించి 'ప్రజల కోసమే కళ' అనే సూత్రాన్ని చేపట్టారు. సోవియట్ సాహిత్యం, ముఖ్యంగా మాక్సిం గోర్కీ రచనలూ, మాయకోవస్కీ కవిత్వమూ వీరి నెక్కువగా ఆకర్షించాయి.

సాహితీ సమితి, యువకవి మండలి, కవితాసమితి మొదలయిన సారస్వత సంఘాలలోని ప్రముఖ సభ్యులంతా కలిసి నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను రూపొందించారు. ఈ పరిషత్తు ప్రథమ సమావేశం 'అభినవాంధ్ర కవి పండిత సభ' అనే పేరుతో మొట్టమొదటి సారిగా బరంపురంలో జరిగింది. కొంపెల్ల జనార్ధనరావు సంపాదకత్వం కింద ఒక సాహిత్య త్రైమాస పత్రిక నడపాలని నిర్ణయం జరిగింది. కాని నవ్య సాహిత్య పరిషత్తుకి చెందిన పెద్దలతో అభిప్రాయ భేదాలు కల్గి జనార్ధనరావు సొంతంగా 'ఉదయిని' అనే పత్రిక స్థాపించాడు. నవ్య సాహిత్య పరిషత్తు ఆధ్వర్యం క్రింద 'ప్రతిభ' అనే పత్రిక వెలువడుతూ వచ్చింది. 'జ్వాల' అనే పేరుతో ముద్దుకృష్ణ ఒక మాసపత్రికను నడిపించారు. ఈ పత్రికలలోను, తదితర పత్రికలలోను వెలువడిన శ్రీశ్రీ గేయాలు పదేళ్ళ తరువాత (1950లో) 'మహాప్రస్థానం' అనే గ్రంథంగా ప్రకటితమయ్యాయి.

ఈ దశాబ్దంలోనే కొడవటిగంటి కుటుంబరావు కథానికలు పుంఖానుపుంఖంగా వెలువడసాగాయి. రష్యన్ సాహిత్యంలో ఛెకోవ్ కథలకున్న స్థానం తెలుగులో కొడవటిగంటి కథలకుందని ఈ తొలి రచనలోనే నిరూపితమయింది.

1935-36 ప్రాంతాలలో అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం ఢిల్లీలో సమావేశమయింది. తర్వాత అచిరకాలంలోనే అఖిలభారత సంస్థకు అన్ని ప్రాంతీయ దేశాలలో అనుబంధ సంస్థలు బయలుదేరాయి. తెలుగులో అభ్యుదయ రచయితల సంఘం తాపీ ధర్మారావు అధ్యక్షతన మొట్టమొదటి సారిగా సమావేశమయింది. తర్వాత అఖిల భారత సంస్థ అంతరించిపోయినప్పటికి ప్రాంతీయ భాషలలో ఈ సంఘాలు దినదినాభివృద్ధి పొందసాగాయి. తెలుగు రచయితల్లోని అగ్రగాములందరూ అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యులయ్యారు.

రెండవ ప్రపంచ మహాసంగ్రామం 1939లో పోలెండ్ మీద హిట్లర్ దురాక్రమణతో ప్రారంభమయింది. భారత ప్రజల అభీష్టానికి విరుద్ధంగా బ్రిటీష్ వారు ఇండియాను కూడా యుద్ధంలోకి దించారు. ఈ యుద్ధకాలంలో జాతీయోద్యమంతోపాటు ఆంధ్రరాష్ట్రోద్యమం కూడా తీవ్రరూపం దాల్చింది. 1947లో ఇండియాకు స్వరాజ్యం వచ్చినప్పుడే ఆంధ్ర రాష్ట్రం కూడా ఏర్పడుతుందని తెలుగు ప్రజలు పెట్టుకున్న ఆశలు అడియాసలైపోయాయి.

1940-50లో ఆంధ్రసాహిత్య చరిత్ర అభ్యుదయ రచయితల చరిత్ర అంటే అతిశయోక్తికాదు. ఒకనాడు సాహితీ సమితి ఆంధ్రదేశంలో ఆర్జించిన పలుకుబడి కన్నామిన్నగా ఈ దశాబ్దంలో అభ్యుదయోద్యమం తెలుగునాట ప్రతిష్ఠ సంపాదించింది. తెలుగు భాషకంతకూ ప్రాతినిధ్యం వహిస్తున్నదనుకొన్న నవ్య సాహిత్య పరిషత్తుకు చెందిన కార్యదర్శి అభ్యుదయ రచయితల సంఘం వార్షిక సభలలో ఒకదానికి అధ్యక్షత వహించాడు. భావకవిత్వపు దిగ్గంతులలో ఒకడైన కృష్ణశాస్త్రి యింకొక వార్షిక సభకు అధ్యక్షత వహించాడు. కందుకూరి, గిడుగు, గురజాడల ఉత్తమ సంప్రదాయాల వారసత్వం అభ్యుదయ రచయితల సంఘానికే సహజంగా సంక్రమించింది.

తదితర సాహిత్య సంస్థలన్నీ కేవలం సాహిత్యానికే పరిమితమై పనిచేయడం పరిపాటి. అయితే అభ్యుదయ రచయితల సంఘం చిత్రకారులతో, గాయకులతో, నటీనటులతో సన్నిహిత సంబంధం పెట్టుకొని కళలన్నిటికీ పురోగమన ద్వారాలు తెరిచింది. ముఖ్యంగా అభ్యుదయ రచయితల సహకారంతో ప్రజానాట్యమండలి తెలుగు నాటకరంగంలో విప్లవాత్మకమైన ఘన విజయాలు సాధించింది. సుంకర, వాసిరెడ్డి రచించిన

“ముందడుగు’, ‘మా భూమి’ అనే నాటకాలు తెలుగు దేశమంతటా ప్రదర్శించబడి ప్రేక్షకుల మన్ననలను పొందాయి.

మాధవరెడ్డి గోఖలేవంటి చిత్రకారులు తొలినుంచీ అభ్యుదయోద్యమంలో సన్నిహిత సంబంధం వున్నవారు. గోఖలే చిత్రకారుడే కాక గొప్ప కథానికా రచయిత. ఇతని మూగజీవాలు కథానికా రచనలో ఒక కొత్త పద్ధతికి దారితీసిన గ్రంథం.

అభ్యుదయోద్యమచ్ఛాయలలోనే ఆరుద్ర, అనిసెట్టి, రమణారెడ్డి సోమసుందర్ మొదలగు యువకవులు తమ రచనలు సాగించారు.

తెలంగాణాలోను, రాయలసీమలోను నూతన సంచలనం బయలు దేరింది. తెలంగాణాకు చెందిన కాళోజి, దాశరథి యవదాంధ్ర కవులు.

ప్రస్తుతం సాగుతున్న ఈ ఆరవ దశాబ్దంలో ప్రముఖ సంఘటన విశాలాంధ్ర నిర్మాణం. ఆంధ్రుల చిరకాల జాతీయవాంఛ యీ దశాబ్దంలో నెరవేరింది. జాతీయోద్యమ విస్తరణకు ‘మా కొద్దీ తెల్లదొరతనము’ అనే పాట తోడ్పడిన దానికంటే యెక్కువగా విశాలాంధ్ర స్థాపనకు ‘చేయెత్తి జైకొట్టు తెలుగోడా’ అనే పాట తోడ్పడింది. ‘విశాలాంధ్ర ప్రజారాజ్యం’ అనే గ్రంథం ముక్కోటి ఆంధ్రుల జాతీయ వాంఛను సుస్పష్టంగా ప్రతిపాదించింది.

అయితే దురదృష్టవశాత్తు ఎవరయితే ఆంధ్రరాష్ట్రం అనవసరమని అర్జీలు పంపించారో వారికే పరిపాలనాధికారం చేపట్టింది. 1955 ఎన్నికలలో రాజకీయ సంఘర్షణతోబాటు తీవ్రమైన సాహిత్య సంఘర్షణ కూడా చెలరేగింది. అవకాశవాదులు, పాలకపార్టీ భక్తులు, కరడు కట్టిన అభివృద్ధి నిరోధకులు ప్రజాస్వామ్య రక్షణకు తామే రక్షకభటులైనట్లుగా దినపత్రికలను వ్యాసపరంపరలతో ముంచెత్తారు. ఒక్క ‘విశాలాంధ్ర’ పత్రికమాత్రం అభ్యుదయ శక్తులకు అండగా నిలిచింది. ఎన్నికలలో గెలవవలసిన కుతంత్రాలు నవలంబించడం చేతకాక పోవడం వల్ల అభ్యుదయ శక్తులకు తాత్కాలికంగా పరాజయం సంభవించింది. దానితో సాహిత్య లోకమే స్తంభించి పోయింది. ఈనాడు వెలువడుతున్న డిటెక్టివ్ నవలలూ, సెక్సు సాహిత్యమూ నీరస స్థితికి తార్కాణాలుగా నిలిచి ప్రజల అభిరుచులను పెడదారులు పట్టిస్తున్నాయి.

ఈ వాతావరణంలో ఆంధ్ర ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీకి అనుబంధంగా తెలుగు అకాడమీ స్థాపించింది. సంగీత నాటక అకాడమీకి కూడా ఒక తెలుగు శాఖను ఏర్పరచి సంచాలక సభ్యవర్గాన్ని నామినేట్ చేసింది. కొత్తగా స్థాపించబడిన ఈ సంస్థలు ఏయే ఘనకార్యాలను సాధిస్తాయో ఇక ముందు చూడవలసిఉంది.

సోవియట్ నాయకులైన బుల్గానిన్, కృశ్చేవ్‌ల భారతదేశ పర్యటన యావత్ప్రపంచ దృష్టినీ ఆకర్షించింది. లక్షలాది భారత ప్రజలు సమధికోత్సాహంతో వారికి స్వాగతమిచ్చారు.

1957లో ఆసియా–ఆఫ్రికా రచయితల మహాసభ ఢిల్లీలో జరిగింది. ఈ మహాసభ ద్వితీయ సమావేశం 58లో టాష్కెంట్‌లో జరిగింది. ఆసియా ఆఫ్రికా ఖండాలలో వెల్లివిరుస్తున్న నూతన చైతన్యానికి నిదర్శనంగా ఈ సభలు జేగీయమానంగా జరిగాయి.

ఆంధ్రదేశంలో అభ్యుదయోద్యమం అన్ని దిక్కుల నుండి ఎదుర్కొంటూన్న ప్రతీపధక్తుల ధాటికి తట్టుకుంటూ, నిస్పృహకూ, నిరాశకూ తావీయకుండా తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంది. అభ్యుదయ మాసపత్రిక ఎన్ని అవాంతరాలు మీద పడినా ప్రతి నెలా వెలువడుతోంది. జాతి పురోగమనానికి తోడ్పడే అమూల్య గ్రంథాలు నెన్నింటినో విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రకటిస్తోంది. వీటిలో ముఖ్యంగా పేర్కొనవలసినవి గురజాడ రచనల సంపూర్ణ సంపుటాలూ, గిడుగు వారి ప్రధాన రచనలు.

తెలుగును యావద్భారత జాతీయ భాషగా చేసుకోవడం అన్ని విధాలా సమంజసమైనదని జె.బి.యస్. హాల్డేన్ వంటి వైజ్ఞానిక ప్రముఖుడు సూచించాడు. ఒకప్పుడు సంస్కృత భాషనంతటినీ తనలో జీర్ణించుకోగలిగిన జీవద్భాష తెలుగు. అలాగే ఈనాడు ఇంగ్లీషు, ఫ్రెంచి, రష్యన్ మున్నగు ప్రపంచభాషల విజ్ఞాన సంపదను స్వాయత్తం చేసుకోగలగిన శక్తి తెలుగు భాషకి వుంది. ఆంధ్ర ప్రభుత్వమూ, విశ్వవిద్యాలయాలూ, సాహిత్య సంస్థలూ అన్నీ కలిపి కృషి చేస్తే అచిరకాలంలోనే తెలుగుకి అంతర్జాతీయ విఖ్యాతిగల అవకాశాలు లేకపోలేదు.

గుంటూరు శేషేంద్ర శర్మ

ప్రజానీకం ఆదివ్యాధులకు పరమౌషధం పుస్తక పఠనం

పాత మిత్రుల్ని కలుసుకుంటే "యిప్పుడేం చదువుతన్నా"రని అడగడం నా కలవాటు. కొందరు, "ఏమిటో తీరక ఉండడం లేదు," అంటారు. "కాదు కోరిక ఉండడం లేదను, సరిపోతుం"దని నేను విమర్శించేవాడ్ని. నిజంగా తీరికలేదనే సమాధానంలో అర్థంలేదు. తీరికలేదని తిండి మానెయ్యరేం? మరి చదవడం కూడా అట్లాంటిదేగా? అసలు ప్రతి యింట్లోనూ వంటగది ఉన్నట్లే పుస్తకాల గదొకటి ప్రత్యేకంగా ఉండాలి. మనిషి అయినవాడికి కడుపుకు మేత ఒకటే చాలదు. మెదడుకు కూడా మేత కావాలి. లేకపోతే ఆకారానికే మనిషిగా ఉంటాడు, రెండు కాళ్ళూ వగైరా అవయవాలున్నాయి కనుక. అయితే అవయవాలుండడమే లక్షణంగా తీసుకుంటే పశువులతో ఆ పోటీలో నెగ్గలేము. ఎందుచేతనంటే మనకు రెండుకాళ్ళే అయితే వాటికి నాలుగున్నాయి. అందుచేత వాటికే అధిక్యం లభిస్తుంది ఆ పోటీలో.

ప్రతి యింట్లో ఒక పుస్తకాల గది ఉండాలి. అందులో పుస్తకాలన్నీ బీరువాల్లోనో లేక అలమారుల్లోనో అమర్చబడి ఉండాలి. రెండు మూడు కుర్చీలు, ఒక టేబీలు, కొన్ని తెల్లకాగితాలు, కలము, ఒక గ్లోబు, గోడలకు కొన్ని ఆత్మను ఉత్తేజపరచే మహనీయుల చిత్రపటాలు– ఇవన్నీ ఉన్న పుస్తకాల గది నా ప్రాణానికి ఒక దేవాలయంతో సమానం. ఇట్లాంటి గదులు యింటింటా దేవుడి గదుల్లాగా వెలిస్తే, వాటి మీద శ్రద్ధాసక్తులు ప్రజల్లో ప్రబలితే దేశంలో ఎంత మార్పు వస్తుంది! – నేను విద్యావంతుల యిళ్ళను గురించే ఆలోచిస్తున్నాను. – విద్యావంతుల్లోనే పుస్తకాలు చదివే అలవాటు లేదు. అదే నరకంగా ఉంది. విద్యావంతుల్లో ఏ రెండు పర్సెంటో మాత్రమే పుస్తకాల మీద ఆసక్తి చూపిస్తున్నారు. అందులోనూ రచయితలయితే తోటి రచయితల పుస్తకాలు అసలు చదవరు. ఎంత సేపూ వారి గొడవ యితరులు వినాలన్న దుగ్ధ తప్పితే యితరుల భావాలేమిటో తెలుసుకుందామన్న యిచ్ఛ లేనేలేదు. దీన్ని కొంత వరకు దోషంగానే పరిగణించాలి.

కొందరి యిళ్ళల్లో కనుపించే పుస్తకాల ప్రీతి ఎంతో ముచ్చటగా ఉంటుంది. అంతెందుకు మా యింటో సంగతి కూడా నాకు సంతృప్తికరమే కాకుండా సంతోషకరంగానూ ఉత్తేజకరంగానూ ఉంటుంది. మా తండ్రిగారు ఎన్నో పుస్తకాలు సమీకరించి పెట్టారు. నాకు బాగా జ్ఞాపకం– నా బాల్యంనుంచీ ఇంటినిండా పుస్తకాలు. చిన్నవాడ్నిగా. నేనాపుస్తకాల్లో ఆడుకుంటూ వుండేవాడ్ని. తర్వాత ఆ పుస్తకాలను అలమారుల్లో ఒక గదిలో అమర్చాడు మా తండ్రి. కొన్ని సంస్కృత పుస్తకాలు, కాదంబరీ, కిరాతార్జునీయం, శాకుంతలం, మేఘసందేశం, రఘువంశం, కుమార సంభవం, కువలయానందం, చంద్రాలోకం, ఇట్లా ఎన్నో – అవి నాగరలిపిలో ఉండటం చేత నాకు తెలిసేవిగావు. అందులో చాలా పుస్తకాలు మళ్ళీ తెలుగు లిపిలో కూడా ఉన్నాయి. ఆప్టే నిఘంటువొకటి నాగరలిపిలో ఉంది. అమరం,

ఆంధ్రవాచస్పత్యం, యిత్యాది నిఘంటువులు, తెలుగులో పురాణాలు, ప్రబంధాలు, వేదం వేంకటరాయశాస్త్రి గారి అనువాదాలు నాటకాలు వ్యాఖ్యానాలు, ఆధునిక కావ్యాలు, తెలుగు లిపిలో టీకతో వేదాలు ఉపనిషత్తులు, పంచదశి, విచారసాగరం లాంటి వేదాంత గ్రంథాలు, మంత్రశాస్త్ర గ్రంథాలు – ఇట్లా ఏవేవో నేను ఏడెనిమిదేళ్ళ వయస్సు వాడ్నయిన తర్వాత శాస్త్రిగారి కథా సరిత్సాగరం ఒంటరిగా మా మిద్దె మెట్లమీద కూర్చుని తదేకాసక్తితో చదవడం బాగా జ్ఞాపకముంది. ఆ తర్వాత వారి నాటకాలు, తర్వాత కావ్యాలు, పురాణాలు, యిట్లా నాకు వయసు పెరిగేకొద్దీ, దానితోపాటు విజ్ఞాన పిపాస పెరిగే కొద్దీ యింట్లో ఉన్న పుస్తకాలన్నీ చదవడం మొదలుపెట్టాను. బయట తర్దుఫారం, ఫోర్తుఫారం చదువుతూ ఉన్నా యింట్లో ఆపారంగా విజ్ఞాన సేకరణ చేసేవాడ్ని. ఇంట్లో సేకరించే విజ్ఞానం ముందు స్కూల్లో చెప్పే చదువులు హాస్యాస్పదంగా కనుపించేవి. పైగా ఆ మేష్టార్లూ, వాళ్ళ పోజులు, వాళ్ళ అహంకార స్వరూపాలూ దుర్భరంగా కూడా తోచేవి. బయట లోకంలో ఎక్కడ తిరిగినా, ఏమి చేసినా, యింటికి వచ్చేసరికి పుస్తక ప్రపంచం ఆకర్షించేది. ఒక విశిష్ట వాతావరణాన్ని సమకూర్చేది. మనస్సుకు ఒక సమున్నత స్థాయిని ఆవహింపజేసేది. ఇదే వాస్తవంగా నిత్యజీవితంలో చూపే నా ఔదార్యానికి నిర్లిప్తతకు, సౌజన్యానికి కారణం అవుతుంది.

నా తండ్రినాకెన్నో యిచ్చాడు– శరీరం యిచ్చాడు, రూపం యిచ్చాడు, గుణాలిచ్చాడు, పెంచాడు, పెద్దవాడ్ని చేశాడు, కానీ ఆయన యిచ్చిన యీ పుస్తకాలగది, ఈ గ్రంథసామ్రాజ్యం వాటన్నిటికంటె విలువయిందిగా భావిస్తాను. అది నన్ను ప్రజ్ఞావంతుడ్ని చేసింది, అమృతత్వం మీద ఆసక్తి రేకెత్తించింది, నన్ను మనిషిగా చేసింది. ఈ సామ్రాజ్యం నా పిల్లలకు వాళ్ళ పిల్లలకు, అట్లా తరతరాల వారికి అందాలనీ, తరతరాన అది విస్తరించాలనీ, మా సంతతివారికి మహోన్నతకీర్తి సంతరించాలనీ ఆశిస్తాను. ఆయన ఆర్జించిన యిల్లూ వాకిలీ భూమి బుట్రా లాంటి ఆస్తికి వారసుడ్నయినందుకుగాదు, ఆయన ఆర్జించి యిచ్చిన ఈ పుస్తక సామ్రాజ్యానికి వారసుడ్నయినందుకు నేను గర్విస్తున్నాను. దాన్ని పవిత్రంగా ప్రీతి పాత్రంగా చూచుకుంటాను. అందుచేతనే నేను పెద్దవాడ్నయిన తర్వాత ఎన్నో పుస్తకాలను కొన్నాను. ఇంగ్లీషు వాఙ్మయంలో సైన్సు, ఫిలాసఫీ, సాహిత్యం, చరిత్ర యిత్యాది శాఖల్లో అనేక పుస్తకాలు తెచ్చి, ఆధునిక వైజ్ఞానిక సంపత్తిని చేర్చి నా పిత్రార్జితమైన సామ్రాజ్యపు సరిహద్దులు విస్తృతం చేశాను. పూర్వ రాజులు రాజ్యాలను పెంచినట్లు మనం మన పుస్తక రాజ్యాలు కూడా పెంచాలి. నేను నన్ను గురించి తృప్తిపడే దేదైనా ఉంటే దాన్ని నా కీపుస్తకాలే యిచ్చాయి. మా యింట్లో ఈ పుస్తకాలే లేకపోయి ఉంటే జీవితంలో నా పంథా ఏమయి ఉండేదో, అని నా కాశ్చర్యం కలుగుతూ ఉంటుంది. పరిసరాల ప్రభావం ఎంతో బలీయమయింది. నాకు బాల్యంలో ఆ వాతావరణం లేకపోతే విజ్ఞాన పిపాస, రచనా వ్యాసంగం, ఉన్నత వస్తుప్రీతి ఇట్లాంటివన్నీ ఉండేవా అనే అనుమానం వస్తుంది. బహుశా జీవితం అన్యథానడిచి ఉండేదేమో. లోకంలో పుడుతూ చస్తూ ఉండే కోటానుకోట్ల మానవుల్లో ఒకణ్నిగా మాత్రమే ఉండేవాడ్నేమో ఇప్పుడు మహా మెరుపునని చెప్పడంకాదు. అనాదిగా మహనీయులు, విద్య మానవుడికి ఏదో ఒక విశేషాన్నీ యిస్తుందంటూ వచ్చారే అది నాకు కొద్దో గొప్పో లభించిందని చెప్పడం మాత్రమే. విద్య ఏమి ఇవ్వదు. పుస్తకాలు చదివినా నా కేమీ రాలేదు అని చెపితే, పుస్తకాలు యిళ్ళలో ఉండనక్కరలేదు. వాటిని భోగిమంటల్లో పారెయ్యండి అని చెప్పడం అవుతుంది. ఆ మాట ఎవ్వరూ ఒప్పుకోరు. పుస్తకాలు కాస్తో కూస్తో ప్రతివాడికీ ఒక విలువైన విషయాన్ని యిస్తాయనేదే సర్వజనాభిప్రాయం. అదే నా అనుభవం అని చెపుతున్నాను.

అసలు పుస్తకాలేమిటి? ఎవడు పుస్తకాలు వ్రాస్తాడు? అందరూ పుస్తకాలు వ్రాయవచ్చుగాక, అవన్నీ పుస్తకాలు అనిపించుకోవు. అందరూ మానవులు కావచ్చుగాక, చరిత్రకెక్కేది కొందరేగా? అట్లాగే పుస్తకాలనిపించుకునే అర్హత ఉన్నవాటిని గురించే యిప్పుడు మన ప్రసక్తి. ఆ పుస్తకాలు వ్రాసేవారంతా మహనీయులే. మామూలు మనిషి మహనీయుడెట్లా అవుతాడు? నానా విధాలుగా ప్రకాశించే వాడి ఔన్నత్యమూ, ఔజ్జ్వల్యమూ దానికి కారణం. అది వాడి భావంలో ఆవిర్భవిస్తుంది. మాటలుగా, చేతలుగా వ్యక్తం అవుతుంది. చేతలు లోకాన్ని ముందుకు నడుపుతాయి. మాటలు వాఙ్మయంగా రూపొంది తరతరాలకు వెలుతురు నిస్తాయి. అట్లా వెలుతురు నిచ్చి లోకాన్ని ముందుకు తీసుకుపోయే మానవాత్మలు ఈ పుస్తకాల్లో నివసిస్తుంటాయి. అవి మహోజ్జ్వలమైనవి. ఆ ఆత్మలు సభ తీర్చిన పవిత్రమందిరమే నేను ప్రేమించే పుస్తకాల గది. రోజూ ఒక గంటసేపు ఆ ఆత్మల సభలో కూర్చొని వస్తూవుంటే, ఆ గాలి, ఆ పరిమళం పీలుస్తూ ఉంటే ఎంతో ఉత్తేజకరంగా ఉంటుంది. అది చాలు మన జీవితానికి. అక్కడి నుండే మన దృష్టి, మన భావాలు, మన కార్యాలు ప్రారంభమవుతాయి. నిజమయిన మనుష్యులమవుతాము. (ఇక్కడ “ఆత్మ” పారిభాషిక పదం కాదు)

కొందరు ఉత్తములైన తండ్రులు గతించిన వెంటనే వారు ఆర్జించిన పుస్తకాలను వారి సుపుత్రులు క్రమంగా అమ్మివేయడం వారు నిర్మించిపోయిన గ్రంథసామ్రాజ్యాన్ని చిన్నాభిన్నం చేయడం చూస్తే చాలా విషాదకరంగా ఉంటుంది. తండ్రిమీద గౌరవంతోగానీ, స్మృతి చిహ్నాలుగా గాని ఉంచుకోరు. అమ్మివేసి ఆ డబ్బు తిందామనే వారి ఆతురత. కొన్ని రాజ్యాలు కూడా ఇట్లాగే ధ్వంసం అయిపోయాయి.

పుస్తక సామ్రాజ్యాన్ని నిర్వహించి కొనసాగించడం కొంత బాధ్యతాయుతమైనపని. శ్రద్ధాసక్తులు, దూరదృష్టి లేకపోతే విచ్ఛిన్నమయిపోయే అవకాశాలు చాలా ఉన్నాయి. రాజ్యాలకు మాదిరే దీనికి కూడ చాలామంది శత్రువులున్నారు. కీటక పాఠకులు– అసలు పాఠకులు పుస్తకాలను మెదడుతో మేస్తే యీ పాఠకులు నోటితోనే మేస్తాయి. వీటికి పుస్తకాలు లడ్డూ జాంగ్రీల్లాగా కనిపిస్తాయేమో, నిరంతర గ్రంథ భక్షణాయత్త చిత్తంబున సంచరించుచుండును. అందుచేత పుస్తకీయులు ఈ గ్రంథ కబంధులనుంచి పుస్తకాలను రక్షించే ఉపాయాలెన్ని ఉన్నాయో అన్నీ అన్వేషించి అమలు జరపాలి. ఎప్పుడూ పుస్తకాలు శుభ్రంగా వుండాలి. వాటికి ఆతపస్నానం ఆప్యాయంగా ఉంటుంది. అందుచేత అప్పుడప్పుడూ ఎండలో ఉంచడం మంచిది. తర్వాత రెండో రకపు శత్రువులు పుస్తకాలు అరువుతీసి కెళ్ళేవారు. ఇది ఒక విచిత్ర జాతి. ఇందులో మంచివాళ్ళనుంచి దొంగల వరకూ ఉన్నారు. సద్దుదేశంతో తీసుకెళ్ళే వాళ్ళు ఆ పుస్తకాలు మరెక్కడా దొరక్క పోవడం చేత తీసుకెళ్ళుతారు. కాని జాగ్రత్తగా వాడుకొని మళ్ళీ యిచ్చి వేయడం వాళ్ళకు చేతకాకపోతే అది క్షంతవ్యం కాదు. ఇట్లాంటి మంచివాళ్ళే ఎవరో నా “అప్పకవీయం” కొట్టేశారు అంటే – గతంగతః, అరువు తెచ్చిన పుస్తకాల మీద ఏదో వ్రాయడం, పేజీల గుర్తుకోసం “కుక్క చెవులు పెట్టడం’

' ఇత్యాది బాధ్యతారహితమైన పనులు చేయడం గర్హనీయము. ఇక పోతే – పుస్తకాలను చూచిన దగ్గర నుంచీ వాటిని ఏదో విధంగా తీసుకువెళ్ళాలనీ, తీసుకెళ్ళిన దగ్గర నుంచి తమదిగా చేసుకోవాలనీ బాధపడే జాతి ఉందే, అది చాలా ప్రమాదకరమయింది. వాళ్ళకూ పుస్తకాలకూ "లౌ ఎట్ ఫస్ట్ సైట్", దాని గుణ గణాలు అక్కరలేదు. పుస్తకం చూడడానికి నగదుగా ఉంటే చాలు. భర్తృహరి "ఆదర్శనే దర్శమాత్ర కామా' ' అంటూ చెప్పాడే ఆ శ్లోకంలో వర్ణించిన మనః ప్రవృత్తికీ వీరి మనః ప్రవృత్తికీ అట్టే తేడా ఏమీ కనిపించదు. వీరు అద్వైతవాదులే– ఈ జాతివారు నిజంగా పుస్తకాలు చదవాలన్న యిచ్చ ఉన్నవారు గానీ, చదవవలసిన అవసరాన్ని గుర్తించిన వారు గానీ కారు. వాళ్ళకు పుస్తకం హస్తభూషణం. మామూలు ప్రపంచంలో దొంగలున్నట్టే వాఙ్మయ ప్రపంచంలో వీరూ ఉన్నారు. వీరి బారినుండి పుస్తకాలను రక్షించడం చాలా కష్టమైనపని. వీళ్ళు మామూలుగానే ఆఫీసర్లుగా గానీ, వినోదపరులుగా గానీ ఉంటారు. ఆఫీసర్లు మామూలుగా విద్యావిరోధులుగా ఉంటారు. వాళ్ళకు చదువుకున్న వాళ్ళంటే భయమూ, బాధా. పుస్తకాలు చదివేవాళ్ళనిపించుకోవాలనే పోజుకోసం పుస్తకాలడుగుతారు. ఆఫీసర్లు కనుక మెహమాటంలో యిస్తారు. ఆఫీసర్లు కనుకనే వారు ఇవ్వరు మామూలు ప్రకారం. ఇత్యాది వర్గాలను దృష్టిలో ఉంచుకునే "పుస్తకం వనితా విత్తం" అనే సామెత చెప్పారు పెద్దలు.

కొందరు పుస్తకాలను డ్రాయింగు రూములో అలంకరణగా అమర్చిపెడతారు. ఇది నాకు నచ్చదు. కనీసం పుస్తకాలను అలంకరణగానైనా భావించడం కొంతవరకూ ఉత్తమ అభిరుచే అయినా అవి కేవలం అలంకరణ ప్రాయంగా ఉండిపోవడం అభిలషణీయంకాదు. పుస్తకాలను ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన గది ఉంచడం మంచిది. ఎవరొచ్చినా, అందులో కూర్చొనడంగానీ, అన్ని పనులూ అందులో చేసుకోవడం గానీ, పనికిరాదు. ఏదో ఒక నిర్ణీతకాలంలో అక్కడ కొంతసేపు చదువుతూ ఆలోచిస్తూ గడపడానికే ఆ గదిని వినియోగించుకోవాలి. దేవుని గదిలో అన్ని పనులూ చేస్తామా? అట్లాగే యిదీను. అంతేగాని పుస్తకాలను పదిమంది చూడాలని డ్రాయింగు రూములో పెట్టడం సరి అయిన పద్ధతికాదు. పుస్తకాలున్నాయని పదిమందికి తెలియవలసిన అవసరంగానీ, తెలపాలనే కాంక్షగానీ, మనకు ఉండనక్కరలేదు. పుస్తకాల గదిలోకి వెళ్ళేటప్పుడు నిర్మలమైన మనస్సుతో వెళ్ళాలి. ఆసక్తితో చదవాలి. చదివిన దాన్ని గురించి కావలసినంతసేపు ఆలోచించాలి. చదవడం ఎంత అవసరమో, చదివినదాన్ని గురించి ఆలోచించడం కూడా అంత అవసరమే. లేకపోతే ఆ చదువు నిరర్థకం అవుతుంది. జీర్ణంకాదు. అడపా దడపా పేజీలు త్రిప్పి పుస్తకం అవతల పారెయ్యడం రచయితను అవమానపరచడమే అవుతుంది. ఆత్మవిద్రోహకరం కూడాను. చదువులో ఆలోచనా భాగము ప్రధానమని తాత్పర్యం.

చిత్రమేమిటంటే గత పదేళ్ళలో ప్రజల్లో చదివే అలవాటు క్షీణించింది. అయితే దినపత్రికలు, వారపత్రికలు ఎక్కువ అమ్ముడు పోతున్నట్లున్నాయి. ఇదంతా చదివే అలవాటేనా, ఇదంతా ఉపయోగించే చదివేనా? అనే ప్రశ్న చాలామందిని బాధిస్తూ ఉంది. పత్రికల్లో రచనలు చాలావరకు సామాన్య ప్రజల అభిరుచులను అనుసరిస్తూ తయారవుతున్నాయని బుధజనాభిప్రాయం. బహుశా వ్యాపారం కోసం కావచ్చు. కాని ప్రజల పురోగమనానికేది మంచిదో అది రచయితలు వ్రాయడం లేదన్న అసంతృప్తి ఒకటి ఉంది. ప్రజాభిరుచులను అనుసరించడమే కళా ప్రపంచమంతటా ద్యోతకమవుతూ ఉంది. ఈ విధమైన రచనలు రైల్లో పోతూనో, కాఫీ త్రాగుతూనో, బజారు సెంటర్లో నిల్చునో చదివి "పారెయ్యడం" అధికమయింది. ఈ గుణం కలరా వ్యాపించినట్లు ప్రజల్లో వ్యాపించిందేగానీ, కావలసినంతగా మేలు చేయడం లేదనేదిమాత్రం సుస్పష్టం. అయితే దీనికి పత్రికలు వగైరా ప్రచురణయంత్రాంగమే కాకుండా ప్రజల నిత్య జీవితంలో వచ్చిన మార్పులు కూడా కొంత కారణం. అదే ప్రబలమైన కారణమన్నా ఒప్పుకోవచ్చు. జీవితం ఒక సుడిగుండం అయిపోయింది.. అందులోనుండి బయటకు వచ్చి ఉన్నత లక్ష్యాలను చూచే అవకాశమే పోతూఉంది. అందుచేత ఈనాడు జరిగే నానావిధ విస్తృతమైన మానవ కృషిలో ప్రధానంగా జరుగవలసింది ఈ సుడి గుండాన్ని విచ్ఛేదం చేయడం. ఈ సుడిగుండం విచ్ఛేదం కావాలి. దాస్యంపోవాలి. ఆత్మగౌరవం రావాలి. లోకం సుభిక్షం కావాలి. అది ప్రధానమైన కర్తవ్యం. మూడు వంతులు రచనలన్నీ వాటికోసం వినియోగం కావాలి. లోకం సుభిక్షం అయితే అన్ని బాధలూ సర్దుకుంటాయనుకుంటాను. కొందరు యీ అభిప్రాయంతో ఏకీభవించక పోవచ్చు. కానీ నష్టమేమీ లేదు.

కాని దేశంలో వాతావరణం ఎట్లా ఉన్నా చదవడం అడుగంటాలని ఎక్కడా లేదు. మందు తాగే ఓపికకూడా లేనంతగా రోగి క్షీణించవచ్చు. కానీ ఆ స్థితిలో మందు మరింత అవసరము. అట్లాగే ఈ స్థితిలోనే లోకానికి రచనలు కావాలి. బాధల్లో చికాకుల్లో సైతం ఒక నిమిషంసేపైనా చదవడమో, ఆలోచించడమో మంచిది. శంకరాచార్యులు మడుగులో స్నానం చేస్తూ మకరగ్రస్తుడై మృత్యుముఖంలో ఉన్నప్పుడు కూడా ఆత్మాభ్యుదయానికి అవసరమైనదాన్ని ఉపేక్షించలేదు. కష్టాల్లోనే ఎందరో కవులు, కళాకారులూ, రాజ్యభారధురంధురులు, మహత్కార్యాలు చేశారు. నెపోలియన్ యుద్ధశిబిరాల్లోనే శాస్త్రజ్ఞులు, కవులు, వేదాంతులతో వ్యాసంగం చేసేవాడట. యుద్ధ మధ్యంలో విశ్వవిద్యాలయాలకు వెళ్ళి తనికీ చేసేవాడట. అట్లాగే రోమన్ సైన్యాధిపతి మార్కస్ అరీలియస్ యుద్ధరంగంలో రచనలు చేసేవాడట. అంతెందుకు మన కాటయవేమారెడ్డి, మహాశూరుడు. రెడ్డి రాజ్యాన్ని సింహాచల పర్యంతం విస్తరింపజేసిన విజేత– కాళిదాస నాటక త్రయానికి సముజ్జ్వలమైన వ్యాఖ్యలు వ్రాశాడు. దక్షిణాపథాన్నంతా ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన శ్రీ కృష్ణదేవరాయల జీవితం ఎంత కార్యభార బంధురమోగదా! కానీ సాహిత్యంలో ఎన్ని మహత్కార్యాలు చేయలేదు. స్వయంగా కవియై, పండితుడై, సాహిత్యకల్పద్రుమమై తెలుగు సరస్వతికి స్వర్ణయుగాన్ని ఆవిష్కరించలేదా? పోతన కష్టాల్లోనేగదా కవితామధువు వర్షించాడు. అందుచేత కష్టాల్లో చదువులు అసాధ్యం అనలేము. అసలు కష్టాల్లోనే చదువులు కావాలి. కష్టాలనుంచి గట్టెక్కించడానికే చదువులు కావాలి. అంధకారాన్ని పారద్రోలడానికే చదువులు కావాలి. చదువులు జ్ఞాన జ్యోతులు. అందుచేత ఎట్టి పరిస్థితుల్లో కూడా చదివే అలవాటు పోగొట్టుకోకూడదు.

ఇప్పుడు ఉద్యోగస్థులు చదవడం లేదు. వ్యాపారస్తులు చదవడం లేదు. రాజకీయాలవాళ్ళు చదవడం లేదు. ఏదో రాజ్యాంగమంతా తమ భుజస్కంధాల మీదనే ఉన్నట్లు పోజుపెట్టి ఉద్యోగస్థులు గంతులు వేయడంతప్ప, విద్యా సంస్కారాలు కోల్పోయి, వినయ విధేయతలు విడనాడి,

అజ్ఞానంలో, అహంకారంలో ఎంత అధోగతికి జారిపోతున్నారు (రాజకీయవాదులు ఉద్యోగస్థుల సజాతీయులు). ఈ పరిస్థితి దేశానికెంత అనర్థకరం!

"ఒక శాస్త్రప్రవణత్వమా మధుర కార్యోల్లాస రాసిక్యమా, నకలామ్నాయ పురాణ లక్షిత మహత్సంస్కార సౌరభ్యమా, అకలం కోజ్జ్వల శేముషీ విభవమూ, ఔదార్యమూ, వీర్యమూ, యికనేమున్నది. ఏమి చూచుకొని మీకి సర్వగర్వ క్రియల్" అని వారిని ప్రశ్నించాలి. ధనం సంపాదించడంతో, అధికారం సంపాదించడంతో జన్మచరితార్థమయిందనుకోవడం వట్టి భ్రమ, ఆత్మవంచన. ధనంకానీ అధికారం కానీ కేవలం సత్కార్య సాధనకు పరికరాలని వాళ్ళు తెలుసుకోవాలి. ఆ తెలివి పుస్తకాలే యిస్తాయి. కనుక చదవాలి. లేకపోతే ఒక విధమైన వృత్తి మౌఢ్యం దృష్టినంతా ఆక్రమించి పారమార్థిక దృష్టినశించి మనుష్యులు పశువులవుతారు. అదేమంత మంచిదికాదుగా? వ్యాపారస్థుల్లో, వ్యవసాయదారుల్లో ఎందరు విద్యావంతులు లేరు? కానీ వాళ్ళు పుస్తకాలు చదవరు. నేను చదువుకుంటా ఉంటే ఒక విచిత్రజీవి అడిగాడు కదా, 'ఎందుకండీ ఈ అర్థరాత్రివేళ యింతింత పుస్తకాలు చదువుతారు? పుణ్యమా పురుషార్థమా? బియ్యే ప్యాసయినారు– యింకా ఎంతకాలమండీ చదవడం? –' ఈ డైలాగు, ఏ నాటకంలోనో వినియోగించుకుందామనిపిస్తుంది జ్ఞాపకం వచ్చినప్పుడల్లా. అయితే ఒక డైలాగు దొరికిందని నాటక మెక్కడ రాయను? లాడం దొరికిందని గుర్రాన్ని కొందామనుకున్నట్లు. చదవడంలో లాభ నష్టాల దృష్టికి తావులేదు. చదవడంచేత కలెక్టరవుతానా తాసిల్దారవుతానా, లేక లక్షరూపాయలైనా వస్తాయా అని వితర్కించడం మూఢత్వం. ఈ దృక్పథం మనకు ఇంగ్లీషువారు పెట్టినభిక్ష. అది యిప్పటికీ, వదలడం లేదు మనల్ని. మనము అమాయకత్వానికి ప్రశాంతతకూ నిలయాలనుకునే గ్రామసీమల్లో కూడా చదువుకున్న విలువ యింతే! పట్నవాసాల్లో అంతకంటె తక్కువేమీ కాదు.

ఈనాడు చదువులకు మంచి పనులకు ధనికుల దృష్టిలో, ధనికులను అనుకరించేవారి దృష్టిలో కించిత్తు విలువ కూడా లేదు. వాళ్ళు ఎంతసేపూ ఎదటివాడ్ని రూపాయల దృష్టిలోనే విలువ కడతారు. అందుచేతనే సాహిత్య సభల్లో, కళారంగాల్లో వాళ్ళదే ఆధిపత్యం. ఈ రంగాలతో వాళ్ళకు సంబంధ మేమిటో తేలీదు. సాహిత్య సభలో ఒక సాహిత్య సామ్రాట్టు ఉంటాడు, కానీ అగ్రాసనంలో ఎవరో ఒక ధనికుడో లేక అధికారో ఉంటాడు. ఇది చూడడానికి దుర్భరంగా ఉంటుంది. (అధికారి అంటే రాజకీయాల వాళ్ళు కూడా, అయితే అధికారి అనే పదంలో సవర్ణ దీర్ఘసంధి ఉందనుకుని విడదీయకండి) విజ్ఞానులకు ప్రథమస్థానం లేకపోవడం పుస్తకాలు చదవడం, ఆలోచించడం అనే అలవాటు ప్రజల్లో నశించడంచేతనే. పూర్వం మనదేశంలో అగ్రస్థానం విజ్ఞానులకే ఉండేదని మన వాఙ్మయం యావత్తూ సాక్ష్యం చెపుతుంది. మన ఆచార వ్యవహారాలు, మన కథలు గాథలు సూచిస్తాయి. అయితే ఆనాడు మనదేశంలో ప్రజలంతా చదివేవాళ్ళా అనే ప్రశ్న వస్తుంది – ఆ అలవాటు ఉండేదో లేదో ఈ సందర్భంలో నిర్ణయించనక్కరలేదు. కానీ ఒక్కటి మాత్రం స్పష్టం. పుస్తకాలు చదవడంవల్ల ఏది లభిస్తుందో అది హరికథలు, పురాణ శ్రవణాలు, యిత్యాది వివిధ విధానాల ద్వారా ప్రజల్లో వ్యాపింపజేశారు. ఆనాడు వారు నమ్మిన విజ్ఞానాన్ని వారు అక్షరాస్యులకే పరిమితం కానీకుండా యావత్ప్రజానీకానికీ పంచిపెట్టడం అతి ప్రశంసనీయమైన కృషి. ఇతర దేశాల్లో కూడా అట్లాంటిది కనుపించదు. ఇంగ్లీషువారు వచ్చిన తర్వాత బహిః ప్రపంచంతో కొంతకాలం తెగిపోయిన సంబంధం పునరుజ్జీవితం అవడములాంటి కొన్ని లాభాలున్నప్పటికీ, అఖండంగా మనదేశంలో కొనసాగుతూ వచ్చిన దేశీయ వైజ్ఞానిక కృషి విధానాలు విచ్ఛిన్నం అయిపోయి, కేవలం యిప్పుడు అన్యవిధానాల మీదనే ఆధారపడుతున్నాము. బహిః ప్రపంచానుభవాలను మనం తెలుసుకుని వినియోగించుకోవడం తప్పునిగానీ, లేక విజ్ఞానానికి దేశమూ జాతీ అనే హద్దులుండాలనిగానీ నా అభిప్రాయం ఎంతమాత్రమూ కాదు. కాని స్వదేశీయ విధానం శాశ్వతంగా విచ్ఛిన్నం అయిపోయి తద్వారా అన్యవిధానమే శరణ్యం కావడంతో, మనదేశంలో స్వయంకృషి నశించింది. మనం కేవలం అనుకరణ జాతి మాత్రమే అయ్యాము. ఇంగ్లీషువారు వచ్చిన తర్వాత మనకు కలిగిన అతిశోచనీయమైన నష్టం యిది. పుస్తకాలు చదవడం అనే పద్ధతి కాకపోయినా మరోవిధంగానైనా విద్యల పరమార్థం పూర్వం ప్రజలందరికీ అందజేయడానికి కృషి జరిగేది. ఈనాడది పుస్తకాలు చదవడం ద్వారానే లభిస్తుంది.

ఈ విధానంచేత (పూర్వంకంటె) యిప్పుడు విజ్ఞాన లాభం అక్షరాస్యుల పరిమితవర్గానికే సాధ్యమవుతూ ఉంది. కానీ యీ సందర్భంలో గుర్తించవలసిందేమిటంటే, ఈ పరిమితవర్గంలో కూడా చదివే అలవాటు పోయిందనీ, తద్వారా దేశంలో ధనమూ, అధికారము విలువైనవనే భ్రమ వ్యాపించడం, విజ్ఞానానికి విజ్ఞానులకు స్థానం లభించకపోవడం తటస్థించిందనేది సత్యం. అతి ప్రమాదకరమైన ఈ నష్టంనుంచి ప్రజల్ని రక్షించాలంటే పుస్తకాలు చదివే అలవాటు పెంపొందించాలి.

ఈ రోజుల్లో విజ్ఞానుల అంతరాత్మ ఆక్రందన లోకానికి శాపమై తగలక తప్పదు. పూర్వం కూడా యిట్లాంటి అంధయుగాలు లోకాన్ని ఆవరించకపోలేదు. ఇట్లాంటి పరిస్థితుల్లోనే కుట్టికవి కేరళ దేశంలో "మహిషశతకం" వ్రాశాడు. ఆ శతకానికి ఆనాడెంత ఆవశ్యకం ఉందో ఈనాడూ అంత ఉంది. ఎవరన్నా మహనీయులు దాన్ని తెనిగించి పుణ్యం కట్టుకుంటే లోకం వారికి శాశ్వతంగా ఋణపడిఉంటుంది.

ఈనాడెవరైనా దీనిని తెనిగింప బూనుకుంటే చక్కటి ధారాశుద్ధి లక్ష్యంగా పెట్టుకోవాలి. భర్తృహరి సుభాషితాలకు గాను ఏనుగు లక్ష్మణకవి పుట్టినట్లు దీనికి ఎవరో మహనీయుడు వస్తాడనే శిష్ట జనుల ఆశ. ధారాశుద్ధి లేకపోతే పుస్తకానికి బహుళవ్యాప్తి సిద్ధించదు. అందుచేత తెనిగించడంలో ఉన్న ఉద్దేశ్యం సఫలం కాదు.

లోకంలో ఉన్న ఈ బాధలూ ఈ వ్యాధులూ నివారణ కావాలంటే, అందరూ, అంటే ధనికులు, అధికారులు కూడా, మనం కూడా చదవాలా అనే ధీమా వదిలిపెట్టి, చదివే అలవాటు కలిగించుకోవాలి. ఎన్ని పనులున్నా, ఎన్ని బాధ్యతలున్నా, రాత్రి పడుకోబోయేటప్పుడయినా సరే, ఒక గంట సేపు మంచి పుస్తకం చదివితే చాలు. మానసికారోగ్యానికి చాలా మంచిది.

శ్రీ మదాచార్య రఘునాథ చక్రవర్తి

రాష్ట్రాభిమానము మన కవులు - కావ్యాలు

కం॥ తమ దేహమునందభిమా-నములేని
జనంబు జగతి నశియించుగతిన్
తమ దేశమునందభిమాన-నము లేనిజ
నమ్ము జగతి నశియించు వెసన్॥

అని మంగినపూడి వెంకటశర్మగారు వ్రాసుకొన్నారు. "శరీర మాద్యంఖలు ధర్మసాధనమ్" అని చెప్పబడినందున ముందు మన శరీరము స్వస్థముగా ఉంటే మనం స్వధర్మ నిర్వహణకు సమర్థుల మవుతాము. ధర్మనిర్వహణ అంటే మన బాధ్యతలను నెరవేర్చుటయే.

"ఇంటగెలిచి రచ్చ గెలువు" మన్న సామెతకూడా మన స్వవిషయాన్ని చక్కబెట్టుకొని పై విషయాలకు పూనుకోవాలె అనే అర్థాన్ని ఇస్తుంది. రాజనీతిలో కూడా అహిభయమును అనగా స్వపక్షమునుంచి పుట్టే ఉపద్రవాలను తొలగించుకొని శత్రువుల నుంచి వచ్చే ఉపద్రవాలను నివారించుకోవాలె అని చెప్పబడియున్నది. కాబట్టి మనదేశము శాంతి స్వాస్థ్యములతో అలరారుతుండటము మొట్టమొదటి అక్కర. ఆ తరువాత అంతర్జాతీయములు - మొదటి మెట్టులో భారత జాతీయైక్యము రెండవ మెట్టులో రాష్ట్రీయైక్యము. మూడవ మెట్టులో మన గ్రామైక్యము చిట్టచివరి మెట్టులో మన వసతి.

ఇపుడు అంతర్జాతీయముగా భరత ఖండ స్థాయి మనకు గర్వకారణము. తర్వాత జాతీయముగా మన అనగా "ఆంధ్రప్రదేశ్" అని ఇప్పుడు వ్యవహరింపబడుతున్న మన ప్రాంతము యొక్క స్థాయి మనకు గర్వకారణము.

అంతర్జాతీయ సంస్థలో భారత దేశానికి ప్రాతినిధ్యం లేకపోతే ఏ విధమైన న్యూనత కలుగుతుందో జాతీయ సంస్థలో మనకు, మన భాషకు స్థానము లేకపోతే మనకు ఆ న్యూనత కలుగుతుంది. ఇది సంకుచితత్వము కాదు. సోదర రాష్ట్రములతో పాటు మనమున్నూ హృష్ట పుష్టులమై జాతీయైక్యమునకు పాటు పడతాము.

'జననీ జన్మభూమిశ్చ'

"జననీ జన్మభూమిశ్చ - స్వర్గాదపిగరీయసీ" అని ఒక సూక్తి కలదు. ఏ రాష్ట్రవాసికి ఆ రాష్ట్రము ఆనందదాయకమే. ఏ రాష్ట్ర వాసిగాని ఇట్టి యానందమును అనుభవించ కూడ దనటము అన్యాయమే. ఇచట ఆనంద హేతువులు అనేకముంటవి. ఒకటి స్థానబలము - దీని వలన నిర్భయముగా ఆనందమును అనుభవింపవచ్చును. రెండు - మన శీతోష్ణస్థితిగతుల ననుసరించిగాని, మన నాగరకత

ననుసరించిగాని, మన సంస్కృతిని అనుసరించిగాని వస్త్రధారణ. మూడు మన విద్యావైదుష్యములను, మన భావసందపను, మన కళాకౌశలమును వ్యక్తీకరించుకొనుటకు అనువగు భాష, కావున భాషారాష్ట్ర నిర్మాణము నిరాక్షేపణీయమే.

రాష్ట్ర నిర్మాణమునకు భాషను మాత్రమే ప్రమాణముగా తీసుకొనరాదని చెప్పబడినప్పటికిని రాష్ట్రమునకు నామకరణము భాష ననుసరించియే జరుగుచున్నది. ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయమే. ఆదిలో మన భరత ఖండము ఛప్పన్న దేశములతో ఒప్పియుండేది. తర్వాత 600లకు పైబడి స్వతంత్ర సంస్థానములతో శోభిల్లు చుండింది. ఛప్పన్న దేశములకు సాధారణ భాష సంస్కృతము. 600 సంస్థానములకు సాధారణ భాష ఆంగ్లము.

నేడు హిందీ భాషకు ఆ స్థానము మన రాజ్యాంగముచే కల్పించబడ్డది. అప్పుడును ఇప్పుడును రాష్ట్రాభిమానులును మన ప్రాంతీయ భాషకు ప్రథమ స్థానమిచ్చి జాతీయ భాషకు ద్వితీయ స్థానమును అనుమతించారు.

ప్రథమమో, ద్వితీయమో ఏదో స్థానము లభించినదనే అవకాశాన్ని పురస్కరించుకొని "భిక్షుపాద ప్రసారణ న్యాయము" చొప్పున ఆక్రమణకు పూనుకొనే యెడల మనము సహించలేము. ఆ యాక్రమణ నయాన, భయాన కూడ జరుగవచ్చును. మన వ్యక్తిత్వమే తొలగిపోయే పరిస్థితి వస్తే మాత్రము నయము, భయము రెండూ పటాపంచలవుతవి.

మనకు గల అమూల్యమైన సాహిత్యము వేదవాఙ్మయము. వైదికయుగముయొక్క చివరిదశలో అనగా పురాణ యుగము యొక్క ప్రారంభ దశలో రామాయణము అవతరించినది. అది ఆదికావ్యమని పేర్కొనబడ్డది. దానిని వ్యాప్తికి రాకుండా చేయటానికి ఆనాటి వైదికులు పూనుకున్నారు. అందుకుగాను. "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" అని అగ్ని పురాణములో ఒక మాట విసిరారు. అయినా వారి అభిమతము నెరవేరలేదు. దానికి ఇక ఆమోద ముద్రవేయుటకో అన్నట్లు తాము చేసిన నిషేధము అసత్కావ్య విషయమనీ రామాయణము అట్టిది కాదనీ అనగా "వేద వేద్యేపరేపుంసి– జాతే దశరాధాత్మజే! వేదః ప్రాచేత సాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా'. అనగా వేదవేద్యుడైన పరమపురుషుడు రాముడై యవతరించినందున వేదమే రామాయణమై వెలిసింది అన్నారు. ఇది కూడా శ్రుతివలెనే కుశలవులకు ఉపదేశింపబడి ప్రచారము పొందింది. తర్వాత "భాషాగానం నకర్తవ్యమ్" అన్నారు. భాష అనగా లౌకికమైన సంస్కృతభాష. ఛందస్సు అనగా వైదిక వాఙ్మయము. చేస్తే సామగానమే చేయాలిగాని సంస్కృత గేయ వాఙ్మయాన్ని పాడుకోరాదన్నారు. ఆ కట్టుబాటు కూడా నిలవలేదు. అప్పుడు భగవద్విషయమైన గేయమైతే దోషము లేదని దానికీ పరిహారోక్తి కల్పించారు.

ప్రాంతీయ భాషలపై ఆంక్ష

ఈ విధముగా రాను రాను ప్రాంతీయ భాషాభిమానులు కూడ తమ తమ మాతృ భాషలయందు అభిమానము వహించి తమ మత ధర్మములను వాటి ద్వారా ప్రచారం చేసుకోవాలని సంకల్పించారు. అప్పుడు సంస్కృత భాషాభిమానులు ప్రాంతీయ భాషలపై ఆంక్ష విధించారు. శేషధర్మములో – శేషధర్మములంటే శ్రీ మహాభారతములో పేర్కొనబడిన తర్వాత శేషించి యుండిన ధర్మములన్నమాట. ఈ గ్రంథము ప్రక్షిప్తమని వినికిడి. "కర్ణాట ద్రావిడైర్యాని – రచితా న్యాంధ్రభాషయా! వచాంసియే ప్రశృణ్వంతి– తేవైనిరయ గామినః" అనగా కర్ణాట, ద్రావిడ, ఆంధ్ర భాషలలో ప్రణీతములైన గ్రంథములను వినేవారు నరకానికి పోతారు అని భయపెట్టారు. ఇదికాక "భాషయారచితంశాస్త్రం– స్త్రీ ముఖాత్తు శ్రుణోతియః। శూద్రే భ్యోయే చశృణ్వంతి – తేవైనిరయగామినః"॥ అని కూడా వక్కాణించారు. ఇక్కడ "భాష" అనగా హిందీభాష అని చెప్పవచ్చును. ఏమంటే "భాషా టీకాసమేతా" అని కేటలాగులలో పేర్కొన్నప్పుడు హిందీ అని అర్థమే. లేదా దేశభాషలలో ప్రణీతములైనవి అని కూడా తలచవచ్చును. అట్టి శాస్త్రములను స్త్రీలవలన, శూద్రులవలన వినేవారు కూడా నరకానికి పోతారు అని శపించారు. అంటే స్త్రీలకు శూద్రులకు అక్షరజ్ఞానం లేకుండా చేయాలని వారు సంకల్పించారు. ఇట్టి రచనలవల్ల శేషించినది వర్గద్వేషమే.

అటువంటి విషమ సమయాన కర్ణాటకంలోను, ద్రావిడంలోను పట్టుదలతో గ్రంథ రచనలు ప్రారంభమైనవి. ఆ గ్రంథములకు ప్రజాదరణము కూడ లభించింది. అప్పుడు నన్నయ భట్టారకుడు తన రాష్ట్రాభిమానాన్ని పురస్కరించుకొని ఆంధ్రమున భారతానువాదానికి పూనుకున్నాడు. రాజరాజనరేంద్రుడు ముఖ్యముగా దీనికి ప్రోత్సాహమిచ్చాడు.

ఇప్పట్టున నన్నయ్య భట్టారకుడు ఆంధ్ర శబ్దచింతామణిలో "స్వస్థాన వేషభాషా– భిమతాస్సంతో రసప్రలుబ్ధధియః। లోకేబహుమన్యంతే – వైకృత కావ్యాని చాన్య దపహాయ॥" లోకమున స్వస్థానము, స్వవేషము, స్వభాష అభిమతముగా గలట్టియు, రస లుబ్ధబుద్ధులును అగు సత్పురుషులు అన్యము విడచి వైకృత కావ్యములను అనగా ప్రాంతీయ భాషలలోని కావ్యములను గౌరవిస్తారు అని నిర్ధారణ చేశాడు.

రాజరాజనరేంద్రుడు "తెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్" అని కోరినట్లు చెప్పి (ఇది నన్నయ వ్రాసిన పద్యమే అనుకోండి) "నన్నయభట్టు తెనుంగునన్ మహా భారత సంహితారచన బంధురుడయ్యె జగద్ధితమ్ముగన్" అని ప్రతిజ్ఞ చేసి భారతాంధ్రీకరణకు పూనుకున్నాడు. ఇక్కడ జగత్ అనగా ఆంధ్రలోకము అని యర్థము.

మన భాష పాశ్చాత్యులకు అచ్చెరువు గొల్పినది. మన స్థానము కూడ అట్టిదే – "Rome was not built in a day" అని పాశ్చాత్యుల సామెత. ఇప్పట్టున మన సామెత "ఓరుగల్లు ఒక దినమున కట్టబడినది కాదు" అని. కృష్ణదేవరాయల రాజధానియగు విజయనగరము పెద్దదయినను ఓరుగల్లే ఆ పొగడ్త నందు కొన్నది. మన వేషముగూడ ప్రశస్తమైనదే – ఆంధ్ర స్త్రీ వేషము కవితకు ఒరవడియైనది–

శ్లో॥ నోఘూర్జరీస్తన ఇవాతిత రాం నిగూఢః, నోద్రావిడీస్తన ఇవాతి తరాం ప్రకాశః

అరోగిరా మపిహితః పిహితశ్చ కించిత్, సౌభాగ్యమేతి చతురాంధ్ర వధూకుచాభమ్॥

చం॥ ఘనతర ఘూర్జరీకుచయుగ క్రియ గూఢము కాక, ద్రావిడీ
స్తనగతి తేటకాక అరచాటగు నాంధ్రవధూటి చొక్కపున్
జనుగవ వోలె గూఢమయి చాటుతనంబును లేనిరీతి చె
ప్పినదివో కవిత్వమనిపించు నగించును కాక యుండినన్॥
శ్లో॥ .... తత్రాప్యల్లల దంశుకాంత రలసత్ కాంతాకుచాంతోపమ
వ్యంగ్యంయత్ తదహోకవిత్వ మితరద్ వాగ్దేవతోపద్రవః॥
అన్న విజ్ఞుల సూక్తికి ఉదాహరణము ఆంధ్ర స్త్రీవేషము.

రాష్ట్రాభిమానము

తిక్కన సోమయాజి భారత రచనకు పూనుకుని విరాటపర్వ ప్రారంభమున "ఆంధ్రకవిత్వ విశారదుండు విద్యాదయితుండొనర్చె మహితాత్ముడు నన్నయభట్టు దక్షతన్" (విద్యాదయితుడనగా వాగనుశాసనుడని యర్థము) అని నన్నయభట్టు రాష్ట్రాభిమానమును పొగడి, తన కర్తవ్యమును కూడ ఉపన్యసించుకొన్నాడు. "పదునేనింటఁదెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునన్ – దుదిముట్టంగ రచించు టొప్పు బుధ సంతోషంబు నిండారగన్" బుధులనగా స్వస్థాన, వేష, భాషాభిమానులు.

భగవానుడగు "హరిహర" నాధుడున్నూ తన రాష్ట్రాభిమానమును పురుషార్థముగా అభినందించినట్లు చెప్పుకొన్నాడు.

"తెనుగుబాస వినిర్మింప దివురు టరయ
భవ్యపురుషార్థ తరుపక్వ ఫలము కాదే" అని హరిహరనాధుడన్నాడు.

సంస్కృత భారతము వేదవ్యాసునిచే నారాయణాంకితము చేయబడినది. ఇది వైశంపాయనునిచే జనమేజయునకు వినిపించబడినది కాబట్టి వైశంపాయన భారతము అనబడుతుంది. ఏతావతా ఆవిష్కరించినవాడు జనమేజయుడు. వేదవ్యాసుడు ప్రతిపర్వము చివరను

"కాయేనవాచా మనసేంద్రియైర్వా ।
బుద్ధ్యాత్మ నావాప్రకృతే స్స్వభావాత్,
కరోమియద్యత్ సకలంపరస్మై,
నారాయణాయేతి సమర్పయామి॥
యదక్షర పదభ్రష్టం।
మాత్రాహీనంతు యద్భవేత్
తత్సర్వం క్షమ్యతాందేవ
నారాయణ! నమోస్తుతే" అని ప్రార్థించాడు.

ఆ భగవంతుడే తెలుగు భారతమును ఆలకించుటకు ఆశించి తిక్కనను ఆజ్ఞాపించాడు. తిక్కనయు "కూర్చుట జాతిరత్నమునకున్ కనకంబునకున్ దగు" అని ఆంధ్రభాషాకావ్యమును రత్నోపహారము చేసెను. తిక్కన స్వధర్మ నిర్వహణమునకు ద్యుక్తుడై 'వ॥ ఇది అనన్య సామాన్యాకారంబగు ధర్మప్రకారంబు" అని, "ఉ॥ కావున భారతామృతము కర్ణపుటంబుల నారగ్రోలి యాంధ్రావళి మోదముం బొరయు నట్లుగ' '... కృతకృత్యుడైనాడు. ఇది హరిహరనాధునకు అంకితమైనను ఆవిష్కరించిన ప్రభువు కాకతీయగణపతిదేవ చక్రవర్తి; స్థలము ఆంధ్ర నగరమైన ఓరుగల్లు. ఇక్కడ కూడ కొంత రచన జరిగినది.

ఈ పేర్కొనబడిన కవిబ్రహ్మ లిరువురును తమ విద్యావ్యాసంగము అంతా సంస్కృతంలోనే చేశారు. సంస్కృతంలో గ్రంథ రచన చేయగల సమర్థులు అయి కూడా ఆంధ్రోజ్జీవనార్థమే తెనుఁగు రచనకు పూనుకున్నారు.

ఓరుగల్లు వర్ణన

ఆంధ్రుడైన విద్యానాథ విద్వత్కవి మన ఆంధ్రప్రశస్తి భరతఖండమందంతటను వ్యాపించుటకై "ప్రతాపరుద్ర యశోభూషణ"మను తన కృతిని సంస్కృతముననే వెలయించాడు. తన వాగ్వైభవమును ఆంధ్ర మాతృకీర్త్యారాధనమునకే వినియోగించి కృతకృత్యుడైనాడు. "నీరాజ యంత్యంధ్రపురీరమణ్యః" 'ఆంధ్ర క్షమాభృద్భటాః' అని తన గ్రంథములో వర్ణించియున్నాడు. "ఆంధ్రపురి"యనగా ఓరుగల్లు. అంధ్ర క్షమాభృత్ అంటే ఓరుగంటి ప్రతాపరుద్రుడు. సంస్కృతమున "అంధ్ర" అనే వాడబడుచున్నది. తెలుగులో ఆంధ్ర అనే పదము వాడుకలో నున్నది. అంటే తెలుగు గ్రంథములలో ఆంధ్రదేశమునకు కేంద్రము ఓరుగల్లు.

వినుకొండ వల్లభామాత్యుడు క్రీడాభిరామములో "ఉడునీధిన్ పోయిన ఏనుగుల ఆట కట్టించటానికి తయారు చేయబడిన సంకెళ్ళు" అని – అల్లసాని పెద్దన్న సంస్కృతములో రచన చేయగలిగియుండిన్నీ ఈ విధముగ ఆంధ్రాభిమానాన్ని ప్రకటించాడు. "సింధూరం రవిమిందు మానన మసౌ ధమ్మిల్ల రాహున్వయమ్" అనేది అల్లసాని పెద్దన్న శిఖరావలంబియగు నాంధ్రోర్వీశు మోసాలపై" అని వర్ణించాడు. ఆంధ్రోర్వీశుడు ఓరుగంటి ప్రతాపరుద్రుడు.

సీ॥ "సప్త పాతాళ విష్టపమహా ప్రస్థాన- ఘంటాపథంబైన గనపఖ"

అని ఆంధ్రమహానగరమును నోరార అభివర్ణించి ధన్యుడైనాడు.

ఇట్టి వర్ణన రాజమహేంద్రవరమునకుగాని, హంపీ విజయనగరమునకు గాని లేదు. ఈ మహానుభావుడే దేశ భాషలందు తెలుగులెస్స అని ప్రశంసించియున్నాడు.

శ్రీనాధుడు విశేషించి తెనుగుదేశమును, తెలుగు ప్రజలను, తెలుగువారి ఆచారములను, తెలుగువారి వేషభాషలను తన పర్యటనలలో వర్ణించి తెలుగు సంస్కృతికి అమరత్వమును చేకూర్చినాడు. తన రచనల గూర్చి శ్రీనాధుడు, "ప్రౌఢిబరికింప సంస్కృత భాషయంద్రు - పల్కు నుడికారమున తెన్గుబాసయంద్రు" అని వ్యక్తము చేసుకొన్నాడు.

కాసుల పురుషోత్తమకవి "శ్రీకాకుళాంధ్రదేవ!" అని తన కృతిపతియగు ఆంధ్రవిష్ణువును భగవదవతారముగానే అభివర్ణించాడు. ఈ సంకల్పమునకు ఆ ప్రభువునందు గల ఆంధ్రత్వమే హేతువు.

అల్లసాని పెద్దన ఆంధ్రకవితాపితామహుడుగా పేరొందినాడు. ఎఱ్ఱన ప్రబంధపరమేశ్వరుడుగా కొని యాడబడినను, పెద్దన తెన్గున స్వతంత్ర ప్రబంధమును నిర్మించినందున ప్రబంధసృష్టికి మార్గదర్శకుడై ప్రసిద్ధిజెందాడు. పెద్దన తరములో కూడా సంస్కృతభాషాభిమానులు ఆంధ్రమును హేళన జేస్తూ ఉండేవారు. "ఆంధ్రభాషామయం కావ్యమయోమయ విభూషణమ్" అంటే, తెనుగుకావ్యము "ఇనుప నగ" (లోకులకు ఎబ్బెరికంగా ఉండే దన్నమాట) అందుకు పెద్దన్న "సంస్కృతారణ్యసంచారి విద్వన్మత్తేభ శృంఖలమ్" అని జవాబు యిచ్చాడు. దాని భావమేమిటంటే, "ఇది మరెందుకూ కాదు. సంస్కృతమనే అరణ్యమునందు సంచరించే విద్వాంసులనే మదపుటేనుగులను బంధించే గొలుసులే సుమా" అని వాళ్ళ నోళ్ళు మూయించాడు.

ఇప్పుడు ముఖ్యంగా పేర్కొన దగినవాడు శ్రీకృష్ణదేవరాయలు. ఏమంటే, కవులు ధనాశతో ప్రభు చిత్తానుసారం రచన చేస్తారు అని ఒక అనాలోచితమైన మాట అనవచ్చు. కాని ప్రభువులకు ఇది వర్తించదుగదా! కృష్ణదేవరాయలు ఆంధ్రభాషామాధుర్యమునకు మురిసిపోయి తెనుగున ఆముక్తమాల్యదను రచించి, తెలుగుల దేవుడు ఏడుకొండలవాడికి అంకితము చేశాడు.

ఇన్ని విధములుగా మన పూర్వకవులు ఆంధ్రాభిమానమును పదేపదే ఉద్ఘాటిస్తున్నప్పటికిని ఆంధ్రమునెడ నిరాదరణనే కనబరచిన ఒకానొక వ్యక్తినిగూర్చి

ఉ॥ ఆంధ్రున కాంధ్రదేశమున నాంధ్రవధూమణియందు పుట్టి తా
నాంధ్రుల సొమ్మునం బెరిగి యాంధ్రవధూటిని పెండ్లియై సదా
యాంధ్రమె వాడుచున్ దుదకు నాంగ్లము నాంధ్రులవద్ద నేర్చి య
య్యాంధ్రుల జూచి యేహ్యపడు నాంధ్రు డొకానొకడేమి నైజమో॥ అని మంగిపూడి వేంకటశర్మగారు అన్నారు.

ఆధునిక యుగం

ఆధునికులలో మంగిపూడి వేంకటశర్మగారి తరములోనే కందుకూరి వీరేశలింగం పంతులుగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు అత్యంత భాషాసేవను, సంఘసంస్కరణమును చేశారు. గిడుగు వేంకటరామమూర్తి గారు, గురజాడ అప్పారావుగారు శిష్టవ్యావహారిక మనదగిన సజీవ భాషకు దోహదం చేశారు. ఇందు రామమూర్తి గారు ఒరిస్సా రాష్ట్ర నిర్మాణమైనప్పుడు తమ ఆస్తిని పరిత్యజించి ఆంధ్ర భూభాగపు గాలియే తమకు ఆరోగ్యకరమని అభిమానించినవారు. వీరి స్వస్థాన వేషభాషాభిమాన మెంతటిదో ఊహించండి. ముట్నూరి కృష్ణారావుగారు ఆంధ్రునికి ముఖ్యలక్షణము తలపాగ అనగా ఉష్ణీషము - అది అపరిహార్యమని విశ్వసించి ఆదరించారు. సంపాదకీయము అంటే ఎట్లుండవలెనో వారు పెట్టినదే నేటికీ పత్రికా ప్రపంచమునకు ఒరవడి భిక్ష.

పానుగంటివారు తెలుగుగడ్డను పుట్టి తెలుగురాదన్నవారిని ఏవిధముగా ఎత్తిపొడిచారో సాక్షియే సాక్షి.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు మన పట్టణములకు, వాటిలోని వీధులకు, ఉద్యానము (పార్కు)లకు మన ఆంధ్ర ప్రభువుల పేర్లిడక ఔత్తరాహుల నామములను వాడుటనుగాని, కథావస్తువుగా మన ఆంధ్ర ప్రభువుల చరిత్రలు గ్రహించక అన్యప్రాంత చరిత్రలను చేకొనటాన్ని గాని ఎంత తీవ్రముగా నిరసించారో ప్రబుద్ధాంధ్ర పాఠకులకు విదితచరమే.

త్రిపురనేని రామస్వామి చౌదరి గారు మన దక్షిణాపథమునందెంతటి ప్రగాఢాభిమానమును ఉద్ఘాటించిరో వారి సూతపురాణమే చెపుతుంది.

తదుపరి రాయప్రోలు సుబ్బారావుగారిని పేర్కొనాలి. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు "ఇమ్ముగఁగాకుళమ్ము మొదలీ వరకుంగల యాంధ్ర పూర్వరాజ్యమ్ముల పేరుజెప్పిన హృదంతరమేలొ చలించిపోవు" అన్నారు. అంటే పూర్వాంధ్ర రాజ్యముల చరిత్రవారిని ఊపివేస్తున్నదన్నారు. ఆంధ్ర ప్రశస్తియని ఒక ప్రత్యేక గ్రంథమును వెలయించటము, దానిని అట్టి ఆంధ్రాభిమానులైన మల్లంపల్లి సోమశేఖరశర్మగారికే అంకితం చేయటం రాష్ట్రాభిమానపు పరాకాష్ఠనందు కొన్నవి.

పుట్టపర్తి నారాయణాచార్యులు గారు, దూపాటి రమణాచార్యులు గారు ఎన్నెని విధముల ఆంధ్రాభిమానమును ప్రకటించారో వివరింపశక్యము కాదు. సురవరము ప్రతాపరెడ్డిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రి గారు చేసిన భాషాసేవ, సంస్కృతి ప్రబోధము వెలయిడరానిది. నవీనులలో అభ్యుదయ కవులుకూడ గురుతర పాత్ర వహించిరి. శ్రీశ్రీ వద్ద నుంచి ఇది ఉద్బుద్ధమైనవి. తెలంగాణా మహాకవి దాశరథి గారిని ఇచట ప్రత్యేకించి పేర్కొనవలసియున్నది. ఈ ప్రజాస్వామ్య శకములో ప్రతి మనుజుడు కళ్ళువిప్పునట్లు చేసిన రచన వారిది. మహాంధ్ర నిర్మాణమునకు వారి వాక్కు నాందీవాచకము. "మహాంధ్రోదయము"లో

సీ॥ నాతల్లి కృష్ణవేణమ్మ కన్నీరొత్తి
కొనుచు నాపైప్రేమమినుమడించె
గోదావరమ్మ సమ్మోదమ్ముతో
నాకు ముఖమార్జనకు జలమ్ముల నొసంగె
తుంగమ్మ తన పైటకొంగుతో
నామోము తుడిచి నిద్దుర చిన్నెలదచివేసె
పెన్నమ్మ తనపయః పీయూషము
నొసంగి ఆకలిమంట చల్లారగొట్టె
తే.గీ. మూడు చెరగుల నేలల మూడు కోట్లు
ముడివడినయట్లు కన్నుల ముందుతోచె
అందలమునెక్కి, యావజ్జనాళి మెచ్చ
సుందర రోషస్సు వచ్చె వసుంధరకును॥
ఉ॥ ప్రాణములొడ్డి, ఘోర నిబిడాటవులన్ పడగొట్టి మంచిమా
గాణములన్ సృజింప। నెముకల్ నుసిజేసి పొలాలు దున్ని, బో
షాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే, తెలం
గాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికమ్ము దక్కునే।
సి. నారాయణరెడ్డిగారి నాగార్జునసాగరం ఇప్పట్టున పేర్కొనదగినది. ప్రతి తరమునకు రాష్ట్రాభిమానులుండనేయున్నారు. వ్యాసవిస్తరభీతిని ప్రాచీన, అర్వాచీనులలో అనేకమహామహులను పేర్కొనజాలక పోయినాను.
శా॥ ఆశావిశ్రుతమీ త్రిలింగమహి దాక్షారామ కాళేశ్వర
శ్రీశైలేశ కృపాకటాక్షముల వాసింగాంచె నేడా త్రిమూ
ర్త్యా శీరభ్యుదయోపలబ్ధిని స్వధర్మార్ధనపాయంబుగా
నాశాస్యంబుల గాంత్రుగావుత విశాలాంధ్రిక రాష్ట్ర ప్రజల్

– గోలకొండ పత్రిక, 1.11.1956

డా॥ దాశరథి

తెలంగాణంలో కవితామహోద్యమం

గతాన్ని మరచిపోవడం కొందరికి ఎంత సులభమో, మరికొందరికి అంతకష్ట సాధ్యం. గతాన్ని మరవలేనివాళ్ళలో నేనొకణ్ణి. చలనచిత్రంవలె గతాన్ని నామనోనేత్రం ముందు పలుమారులు ఆడించుకుంటూ దానిలోని దుఃఖాలకు కన్నీరు కారుస్తూ, సుఖాలకు చిరునవ్వు నవ్వుతూ కాలం గడుపుతుంటాను. ఆత్మీయులైన వాళ్లకు ఆ చలన చిత్రంలోని సొగసులు విడమరచి చెప్పి ఆనందిస్తాను. ఏ ప్రాంతంలో సారస్వత వికాసం వుండదో ఆ ప్రాంతం వట్టి ఎడారి వంటిది. తెలంగాణంలో సారస్వత వికాసానికి, ప్రజా జాగృతికి కవితామహోద్యమం ఎంతగానో తోడ్పడింది.

శతాబ్దాలనుంచి కవితామృతవర్షంలో తడిసి, పచ్చబారి, చిగిర్చి, పూచి, ఫలించిన నేల తెలంగాణము. పోతన, పాల్కురికి, పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు, మల్లినాథసూరి, అనంతుడు, విద్యానాథుడు పుట్టిపెరిగిన మాగాణము, మన తెలంగాణము. ఆంధ్ర భారతికి శిరోభూషణాలైన గ్రంథాలు వెలసిన నెలవు. ఈ ప్రాంతంలో ఏనాడూ ఆంధ్ర కవితా స్రవంతి ఎండిపోలేదు. అది జీవనదివలె తరతరాలుగా ప్రవహిస్తూనేవుంది. అయితే భయంకర గ్రీష్మాలతాపం అప్పుడప్పుడూ తప్పలేదు.

నాటి హైదరాబాదు రాష్ట్రపరిపాలకులు ఆంధ్రమాత నోటికి తాళంవేసి, పరభాషా దాస్యం చేయించారు. ఈ దాస్యం ఇతర ప్రాంతాలలో కంటే చాలా ఎక్కువగా తెలంగాణంలోనే భరించవలసి వచ్చింది. ఈ ఒత్తిడి ఒకందుకు మేలే అయింది. రాజకీయంగా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవాలనే కాంక్ష భాషా స్వాతంత్ర్యానికి కూడా దారి తీసింది. తెలంగాణం దుస్థితిలో వుంటే కొందరు జాలిపడడానికి బదులు, హేళన చేయడానికి పూనుకున్నారు. తెలంగాణంలో ఎవ్వరూ తెలుగు మాట్లాడరనీ, తెలుగువారంతా ఉరుదులోనే వ్రాస్తారనీ, తెలంగాణంలో కవులేలేరని కొందరు అంటూవుండేవారు. ఒకవైపు మత పక్షపాతంగల కరకు రాచరికపు ఉక్కు పాదాలక్రింద నలిగిపోతున్న వాళ్లను తమ సోదరులు అనే ఈ మాటలు మరీ బాధపెట్టినవి. ఈ బాధా పర్యవసానమే తెలంగాణంలోని రాజకీయ సాహిత్యోద్యమాలకు వెన్నుముకయని స్వర్గీయ శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు గోలకొండ కవుల సంచికను ప్రకటించడం. తెలంగాణంలోని నలుమూలలలోవున్న మూడువందల యాభైనలుగురు కవుల రచనలను సంపుటీకరించి 1934లో శ్రీ ప్రతాపరెడ్డిగారు "గోలకొండ కవుల సంచిక"గా ప్రకటించినారు.

ఈ సంచికకు అనుబంధంగా నూటా ఎనభైముగ్గురు ప్రాచీన తెలంగాణా కవుల పట్టికనుకూడా చేర్చాడు. ఈ సంచికగూర్చి శేషాద్రిరమణ కవులలో ఒకరైన దూపాటి వెంకటరమణాచార్యులు గారు ఇలా వ్రాశారు.

"కాకతీయ నృపాల ఖడ్గధారాంచల

తరళీ కృతంబులౌ తమ్మిపూలు
రెడ్డి భూపతి శౌర్య రేఖా తపోత్తప్త
లలిత పత్రంబులౌ కలువపూలు
పద్మనాయక వీరబాహార్గళోన్ముక్త
గంధ బంధురములు కలువపూలు
యవన సోదరకళా ప్రవిలంబి విచికిల
పల్ల వావృతములు మల్లెపూలు
కలవు గోల్కొండరాజ్య సత్కవివతంస
పద్య సంచికలో వీని బ్రస్తుతించి
భారతీ కంఠమున కూర్చు భాగ్యరేఖ
అలవడె ప్రతాపరెడ్డి కత్యనఘమతికి.

ఈ సంచికను శ్రీ ప్రతాపరెడ్డిగారు : "ఇది యపర పారిజాతంబు, సదయహృదయ సంతతానంద సంధాన సాధనంబు" అని వర్ణించారు.

ఈ బృహత్సంచికను ప్రకటించడానికి ప్రతాపరెడ్డిగారు ఎంత శ్రమపడ్డారో ఊహించలేం. తెలుగులో అంతపెద్ద కవితా సంపుటి (ఆన్‌తాలజీ) ఈ నాటికీ వచ్చివుండలేదనడం అతిశయోక్తికాదు. అయితే ఈ సంచికలోని వారంతా కవులా అంటే కాకపోవచ్చు. కాని, వెల్లాల సదాశివశాస్త్రి, ఒద్దిరాజు సీతారామచంద్రరావు మొదలైనవారి ప్రౌఢ కావ్యఖండాలు దీనిలో చాలా వున్నాయి.

"ద్రాఘిష్ఠాసితరుక్సముజ్వల దదభ్రప్రావృడ భ్రోద్భవ
వ్యాఘోష ప్రతిమానకక్ఖటరవ ప్రాధ్మాన నిధ్యావశ
ఖౌఘోచ్ఛ్రాయ సమాన ఘుర్ఘరిత ధాగోత్ఖాత బంహిష్ఠని
ర్మోఘస్థేమ కవిత్వం" దగ్గరినుంచి

"లలితారావల సచ్చలత్ప్రమదరోలంబావృతానూన మంజులతాంతోపచితప్రతీన రసవస్తు స్వాదునీకార నిశ్చల సుస్వాదుపదప్రయోగ మహిమా సందీపితామేయ నిస్తుల సారల్యకవిత్వం" దాకా చెప్పగలవారెందరో ఈ సంచికలో కనపడతారు.

ఆంధ్రప్రాంతానికి, తెలంగాణానికీ తేడా ఏమిటంటే– అవధానయుగం గడచి, భావకవితాయుగం ఆంగ్ల కవితా ప్రభావంతో ఆంధ్రలో ప్రారంభం అయినట్లు తెలంగాణంలో కాలేదు. ఇక్కడి రచయితలపై ఇంగ్లీషు కవితా ప్రభావం తక్కువ. ఉరుదూ, పారసీక కవితలు ఇక్కడి కవులలో నూతనోత్తేజాన్ని కలిగించలేదు. ఆంధ్రప్రాంతంలోని భావకవిత్వోద్యమంవలె నూతనోద్యమాన్ని ప్రారంభింపజేయలేదు. ప్రాచీన సంస్కృతాంధ్రకావ్యాల పరిధుల్లోనే ఇక్కడి కవులు ఉండిపోయినారు. ఇంతలో దేశం నలుమూలలా స్వాతంత్ర్యోద్యమం వచ్చింది. ఈ ఉద్యమ ప్రభావం సంస్థానాలపై కూడా పడింది. స్వాతంత్ర్యోద్యమానికి అంతర్వాహికగా భాషాభిమానం పెచ్చుపెరిగింది. తెలంగాణంలోని సాహితీపరులకు ఆంధ్ర ప్రాంతపు కవులతో పరిచయం హెచ్చింది. అయితే ఆంధ్రప్రాంతంలో కవితాకృషి వ్యక్తులను ఆశ్రయించి జరిగింది. తెలంగాణంలో అలాగాక, ఉద్యమంగా వ్యాపించింది.

ఈ ఉద్యమం స్వాతంత్ర్య వాంఛగా పరిణమించి తమ ఉనికికే భంగం కలుగజేస్తుందేమో అని భయంతో ఆనాటి పరిపాలకులు సారస్వత సభలను కూడా జరుపుకోనీయకుండా ఆటంకాలు కలిగించేవారు. క్షుబ్ధ హృదయాలలో బయల్వెడలిన కవితాజ్వాల ఈ ఆటంకాల ఆజ్యానికి మరీ పెచ్చురేగింది. ఎటుచూచినా సభలే, సమావేశాలే, కావ్యగానాలే, గోలకొండ పత్రికా కార్యాలయం నుండి హనుమకొండ వేయి స్తంభాలగుడిలో దాకా అంతటా కవితా గోష్ఠులే. సోదరాంధ్రులతో పరీరంభానికి ఎక్కడలేని తహతహ! మాతృభాషా వికాసం కోసం ఎనలేనికృషి!

దశమాంధ్ర మహాసభా సందర్భంలో యావత్తు తెలంగాణమునకు ఒక సారస్వత సంస్థ ఆవశ్యకతను గుర్తించిన సాహిత్యకులు ఆంధ్రసారస్వత పరిషత్తును స్థాపించారు. దీనికి మొదటి అధ్యక్షులు శ్రీ ప్రతాపరెడ్డిగారే. శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారి పారసీ కవితానువాదాలు, స్వతంత్రరచనలు తెలంగాణంలో రాజకీయవాదులకు సైతం కవితపై గల ఆసక్తిని చెప్పక చెప్పుతవి. సారస్వత పరిషత్తు 1943లో ఏర్పడింది. అప్పటినుండి ఇంచుమించు ఏటేటా జిల్లా ప్రాంతాలలో వార్షికోత్సవాలు, సాహిత్యోత్సవాలు జరుపుతూ యువకవులను, రచయితలను ఈ సంస్థ ఎంతగానో ప్రోత్సహించింది. నల్లగొండ ప్రాంతంలో "సాహితీ మేఖల" అనే సంస్థ ఏర్పడి చాలామంది కవులను సృష్టించింది. హైదరాబాదులో ఏర్పడిన 'సాధన సమితి' అనే సంస్థ చాలామంది కవులకు ప్రోత్సాహమిచ్చింది. ఈ సంస్థలు ఎన్నో చక్కని కావ్యాలను ప్రకటించాయి.

కవి అగ్ని పర్వతంవంటివాడు. పైకి సాధారణంగానే కనిపించినా, అతనిలో ఎంతో క్షోభుంటుంది. అది ఏ క్షణాన పైకుబికి, శిఖరం పగుల్చుకొని లోకంమీదపడుతుందో చెప్పలేం. పదాలను గుణించుకుంటూ, గుణాలను గుణించుకుంటూ, నిఘంటువులువల్లించుకుంటూ అతడు సిద్ధంకాడు. అతడు అకస్మాత్తుగా లోకంమీద దూకుతాడు. కవితాజ్వాలలతో లోకంలో చైత్రమాసపు అరణ్యంవలె మోదుగులు పూయిస్తాయి. కవి ఏనాడూ సంకుచిత మనస్కుడుకాడు. అలా అయిన వాడు అతడు కవేకాడు. కవికోరేది స్వసుఖంకాదు, పర సుఖం; కవికోరేది సంకుచితత్వం కాదు, విశాలత్వం; కవికి భయం లేదు; పిరికివాడు కవికాడు. తానుభావించింది చెప్పంది ఊరుకోడు. హృదయంలోనుంచి ఉప్పొంగివచ్చిన వెచ్చనిభావాలు భాషా రూపంలో బయలువెడలితే, కవిత అవుతుంది. ఆ కవిత అశేష జనాన్ని కదిలిస్తుంది. స్తబ్ధహృదయాలలో అగ్నిని రగుల్చుతుంది. తరతరాలుగా మనం మన భుజాలమీద మోస్తున్న గుడ్డిరాచరికపు బరువును నేలకుతోయించుతుంది. మృత్యువుకు జడియనిది

కవితయే. అట్టి కవితా మహావజ్రకవచంగల వీరుడు కవి. అతనికి తిరుగులేదు. తెలంగాణంలో అట్టికవులు అనేకులు వెలసినారు. నైజాం పరిపాలన వర్ధిలాలన్న ప్రతికనీ మతపాక్షిగ రాజ్యం అంతమొందడాన్ని కోరినవాడే. వందలఏండ్లనాడు విడిపోయిన అన్నదమ్ములు కలసి పోవాలని పలికినవాడే.

తెలంగాణంలో స్వాతంత్ర్యోద్యమంలో కవిత్వోద్యమం కూడా విజృంభించింది. గ్రంథాలయవార్షికోత్సవ సందర్భాలలో కవితాపఠనం ఉండవలసిందే. పాఠశాలా వార్షికోత్సవంలో కావ్యగానం జరుగవలసిందే. పండుగనాడు కవులగోష్ఠి ఏర్పడవలసిందే. రాజకీయ మహాసభల్లో కవులు పద్యాలు మార్మోగవలసిందే. కవిత్వం వినరానిచోటు తెలంగాణంలో ఉండేదికాదు. “గుడిలో, బడిలో, బందిఖానలో, గుడిసెకొంపలో, గోపురాగ్రమున” అంతట కవితా ప్రతిధ్వానమే.

నాకు తేదీలు సంవత్సరాలు జ్ఞాపకంలేవు. కాని కొన్నేళ్ళ క్రితం ఓరుగల్లుకోటలో సారస్వత సభలు జరిగాయి. కాకతీయరాజుల కాలంలో అనేకవైభవాలనుభవించి నేడు అత్యంత శిథిలావస్థలోవున్న కోటలోని విగ్రహాలు తెలుగువాడి గుండెల్లో ఉడుకురక్తాన్ని పరుగులెత్తిస్తాయి. కోటలో సభలు జరిపారు. సభలకుగాను పెద్ద పెద్ద పందిళ్ళువేశారు. మతోన్మాదులు వాటిని తగులబెట్టారు. తెల్లారి అవే పందిళ్ళలో సాహిత్యసభ. ప్రతాపరెడ్డిగారే అధ్యక్షులు. కవులు గొంతెత్తి పద్యాలు చదివారు. హృదయాలలో పట్టుదలలు హెచ్చినవి. దేశదాస్య విముక్తికి ముష్ఠిబంధం బిగించి జనం ముందుకు సాగారు. ప్రజాహృదయాలలో తెగువను, చైతన్యాన్ని కలిగించింది ఆనాటికవిత.

కవిత చంపకమాలలో చెప్పినా, ఛందస్సేలేని వచనంలో చెప్పినా ఒకటే. చెప్పేవాని శక్తినిబట్టి అది రాణిస్తుంది. శక్తి ఉన్న వాడు గద్యంవ్రాసినా పద్యంకంటే పట్టుగా వుంటుంది. అశక్తుడు రాసిన పద్యం చక్రాలూడిన బండిలా కదలదు. భావన, శేముషి రెండు సమానంగా కలగలిపి కవితగా ప్రవహిస్తే అది ప్రతివాణ్ణి తలములకలుగా ముంచేస్తుంది. ఇంద్రధనస్సులా ఆలోచన రంగు రంగులుగా, వంపుగా, వయ్యారంగా విరిసి దానివెనక భాష ఆకాశంలా ఆలంబనం చేస్తే కవితాసౌందర్యం కమ్ముకొస్తుంది. ప్రతివాడు నేను ఈమార్గానికి ప్రారంభకుణ్ణి అని విఱ్ఱవీగుతాడు. ఈ ప్రక్రియకు ఆది ఎక్కడ అంతెక్కడ?

ఆకాశానికి కొస ఏమిటి మొదలేమిటి? నేను కొత్త చందస్సును సృష్టించానంటాడొకడు. అవును అవునని అతని అనుయాయులు తాళాలు కొడతారు. ఏదికొత్త? ఆ ఛందస్సు ఏ చతురశ్రంలోకో త్రిశంలోకో దిగుతుంది. నేను వచనపద్యానికి నాంది చేశానంటాడు మరొకాయన. నీవు కాదంటుంది ‘కాదంబరి’. నువు కాదంటుంది ‘మనుచరిత్ర’లోని గద్యం. వాల్మీకినాటి అనుష్టుప్పే కాళిదాసూ వాడుకున్నాడు. అయితే కాళిదాసుకువన్నె తగ్గిందా? ప్రతివాడూ కొత్తవృత్తం సృష్టించుకోవాలని తహతహ పడడం అజ్ఞానం. ఉన్న వృత్తాలతో మహా ప్రబంధాలు రాశారు, శ్రీనాథుడు, తెలంగాణంలోని కవులు. ఈ రభసలో పడక, పెద్దలు వేసిన దారిని తిరస్కరించకుండా అందులోనే నడిచారు. అయితే ఎవడి శక్తికొలది వాడినడక. నాకు విమానం చేతికిచ్చి నడపమంటే నేనేం నడుపుతాను? అలాగే చేత గానివాళ్ళు చతికిలపడ్డారు. చేతనైనవాళ్ళు సాగిపోయారు.

ప్రతివాడికి ఏదో ధ్యేయం వుంటుంది. ఆ ధ్యేయాన్ని సాధించడానికి పడే ఆవేదన అతని రచనలో కనిపిస్తుంది. నాకు రెండు కోర్కెలుండేవి. వాటిని లక్ష్యాలే అనండి, ధ్యేయాలే అనండి మీ ఇష్టం. మొదటిది: హైదరాబాదులో రాచరికం అంతం కావడం, రెండవది: విశాలాంధ్ర ఏర్పడడం. ఈ రెండు కోరికలూ నా జన్మలో తీరవని కొన్నాళ్ళు నిరాశపడ్డాను.అయితే అనుకున్న దానికంటే పదింతలు ముందు ఈ రెండూ ఫలించాయి. ఈ రెంటినిగూర్చే నేను రాసిందంతాను. నేను ఉద్యమోపజీవిని. నాకు ఆరాటపెట్టే సమస్య ఏదో వెంటవుండాలి. ఆ సమస్య నా వ్యక్తిగతమైనది కాగూడదు. అది పదిమంది సమస్యా అయివుండాలి. ఆ సమస్య పదే పదే నా గుండెలోని గాయాన్ని కెలుకుతూ, అనారోగ్యపరుస్తూ, దుఃఖపెడుతూ, ఉద్వేగం పెంచుతూ, పొంగిస్తూ, క్రుంగదీస్తూ ఉండాలి. అప్పుడే ఏమైనా రాయగలను. పందొమ్మిదివందల నలభై అయిదు నుంచి పందొమ్మిదివందల యాభై ఆరుదాకా పుష్కలంగా నాకు సామగ్రి దొరికింది. ఇప్పుడు విశాలాంధ్ర వచ్చింది. ఆనందాతిరేకంలో గొంతు మూగపడద్ది. ఇప్పుడు అగ్నిపర్వతం చల్లబడివుంది. కొన్నాళ్ళు ‘లావా’ పొంగి రాదు మరి!

ఆనాడు నాతోపాటు ‘లావా’ కురిసిన మిత్రులు అనేకులు నాటి కవిత్వోద్యమానికి చేయూత నిచ్చారు. మిత్రుడు అదూరి ఆయోధ్యరామకవి హృద్రోగంతో కాలధర్మం చెందాడు. చందాల రామకవి కానరావడం లేదు.

సాహితీ మేఖలాసభ్యులు నల్లగొండ ప్రాంతంలో కలిగించిన సంచలనం మరువరానిది. సభలు, సమావేశాలు, ఉత్సవాలు, ఊరేగింపులు, సన్మానాలు, సత్కారాలు– ఇల్లు వాకిలీ మరచి నెలల తరబడి కవులు ఆ ప్రాంతాలలోనే గోష్ఠులు జరుపుతూ కాలక్షేపం చేసేవారు. అన్ని రకాల కవులూ ఒకరి నొకరు ఆదరించుకోవడం, ఒకరి రచనను విని ఒకరు ఆనందించడం వుండేది. ఒకళ్ళు అగ్ని కురిపిస్తే, ఒకరు వెన్నెల విరియించేవారు. ఒకరిది గంగా ప్రవాహం అయితే, ఒకరిది సెలయేరు. ఒకరు ఝంఝూమారుతం అయితే, ఒకరు మలయానిలం. ఒకరు ఇంద్రకార్ముకాన్ని గూర్చి వ్రాస్తే. ఒకరు కార్మికుణ్ణిగురించి వ్రాసేవారు.

ఈనాడు కవితాసన్యాసంజేసిన చాలామంది ఆనాడు వ్రాసేవారు. దేవులపల్లి రామానుజరావు చక్కనికవి. అందుకు ఆయన పచ్చతోరణమే సాక్షి. సిరిప్రగడ భార్గవరావు కమ్మని పద్యాలువ్రాసి శ్రావ్యంగా చదివేవాడున్నూ. ధవళా శ్రీనివాసరావు ఇటీవల వినపడకున్నా చాలా రాశాడు. పులిజాల హనుమంతరావు ఎక్కువగాకున్నా కొంత రాశాడు. గడియారం రామకృష్ణ శర్మ కంఠంఎత్తి కావ్యం ఆలపిస్తే, వేలాది సభాసదులు మంత్రముగ్ధులై వినేవారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు వార్షికోత్సవాలు తెలంగాణం నలుమూలలోని కవులనూ ఒక్కచోటికి చేర్చేవి. ఆ రెండు మూడు రోజులూ భువనవిజయోత్సవాలనిపించేవి. వితరణశీలులైన భాషాభిమానులు వందలాది సారస్వత సేవకులకు భోజనాలు ఏర్పాటుచేయడం, నిద్రలు లేకుండా తెల్లవార్లూ కవితా పఠనం జరుగుతూవుండడం ఒకనాటికీ మరువరానివి.

జైల్లో సైతం వందలాది జనం ఒక్కచోటచేరి పద్యాలు చదివించుకుని వినేవారు. నిజామాబాదు జైల్లో తెలంగాణోపాఖ్యానం రాశాను. అగ్నిధార, రుద్రవీణ చాలా భాగం అక్కడ రాసినవే. ఎత్తైన కొండమీద జైలు. జైలులోనుంచి చూస్తే ఎఱ్ఱగా పూచిన మోదుగులతో అలంకరించిన అడవి. అడవికి మధ్యగా నిజాంసాగర్ కాలువ. కాలువగట్లమీద అమాయకంగా ఆడుకునే మేకలూ, మేకలకాపరులూ, నాచుట్టూ ఖైదీలు. అభం శుభం ఎరుగని పల్లెజనం. దయా దాక్షిణ్యాలు లేకుండా గుంపులు గుంపులుగా పల్లెజనాన్ని పట్టుకువచ్చి బంధించారు. తమ కుటుంబాల కోసం వారుపడే ఆరాటం! ఎటుచూచినా నిరాశ! ఇవాళటి ఖైదీలం రేపు రాజులం. ఎంత నమ్మకం!

పోలీసుచర్య తరువాత రాజకీయబాధలు లేవు. విశాలాంధ్రోద్యమం ఉధృతం హెచ్చింది. హైదరాబాదు రాష్ట్రంలో సాహిత్య సభలమీద నిషేధాల బాధలేదు. అడ్డుతొలగిన నదివలె కవితా ప్రవాహం పరవళ్లు తొక్కింది. ఆంధ్రప్రాంతం నుంచి కవులనేకులు వచ్చి ఇక్కడి సాహిత్యోత్సవాలలో పాల్గొన్నారు. ఇక్కడి నుంచి కవులు ఆంధ్రదేశం నలుమూలలా సంచారం చేశారు.

ఇక్కడ కవిసమ్మేళనాల పద్ధతేవేరు. కవిసమ్మేళనం అనగానే రాత్రి అయినా, పగలైనా, ఉదయమైనా, సాయంత్రమైనా వేలాది జనం రావలసిందే. ఎంతమంది కవులున్నా వారందరూ కావ్యగానం చేసేదాక వినవలసిందే. వానమామలై వరదాచార్యులు తన శ్రావ్య గంభీర కంఠంలో పోతన కావ్యంలోనుండో తన 'మణిమాల'లో నుండో పద్యాలు చదువుతుంటే, జనం తలలూపుతారు. "కాళోజీకవి కైతలు వినియు కదలకుందురింకెన్నాళ్లు?" అంటూ కాళోజీ నారాయణరావు తన గొడవను వల్లించడం, భాగి నారాయణమూర్తి గేయాలు, వెల్దుర్తి మాణిక్యరావు బాలకవిత, లక్ష్మణశాస్త్రి జటిల పద్యాలు, పల్లా దుర్గయ్య చల్లని నడక, కవిసమ్మేళనానికి వన్నె చేకూరుస్తాయి. పొట్లపల్లి రామారావు తన "చీమలబారు", "కాలిబాట" చదువుతుంటే అతని భావన మనను ఆకాశాలకు ఎత్తుకపోతుంది. ఇక నారాయణరెడ్డి గొంతెత్తితే విద్యార్థులనుండి విద్యాధికులదాకా శిరఃకంపం చేయంది తప్పదు. విత్తానికి కాకున్నా, విజ్ఞానవినోదాలకు కవిగోష్ఠులు బాగుంటాయి. ఇటీవల బాగా రాస్తున్న సంపత్కుమార, సుప్రసన్న, మాదిరాజు రంగారావు, జె.బాపురెడ్డి చక్కగా కావ్యగానం చేయగలరు. ఖమ్మంమెట్టు ప్రాంతంలో ఊటుకూరు రంగారావు, కవిరాజమూర్తి ప్రభృతులు. నల్లగొండ ప్రాంతంలో మదోజు సత్యనారాయణ, ధవళా శ్రీనివాసరావు మున్నగువారు, ఓరుగల్లులో బొల్లేటి నృసింహశర్మ పొట్లపల్లి రామారావు, గద్వాలలో గొట్టుముక్కల కృష్ణమూర్తి మున్నగువారు నిర్విరామంగా కవితారచన చేస్తూనే వున్నారు. పుస్తకాలు ప్రచురించబడుతున్నవి.

తెలంగాణా రచయితల సంఘం 1951లో స్థాపించబడింది. ఈ సంస్థ కవితా వ్యాసంగాన్ని తెలంగాణంలో వృద్ధి పరచడంలో చాలా తోడ్పడిందని చెప్పవచ్చు.

కవిత్వం ఒకరికోసం రాయబడేది కాదనుకుంటాను. అది వసంతోదయంతో ఆమ్రతరుశాఖవలెను, శరదాగమనంతో వెన్నెల వలెనూ వెలుస్తుంది. నాగరిక జాతిలో ఉత్తమకవిత ఉద్భవిస్తుంది. అయితే కవితకు కూడా ఉచ్ఛదశ, క్షీణదశ ఉంటాయి. ఆంధ్రకవితా చరిత్రలో రాయలకాలం ఉచ్ఛదశ అయితే, తంజావూరు రాజుల కాలం కొంత క్షీణదశే. వసంత శిశిరాలవలె ఈ ఉచ్చనీచాలు తప్పదు. ఈ శిశిరవసంతాలు ప్రతి జాతి సాహిత్యంలోనేగాక, ప్రతి కవి జీవితంలోనూ వస్తాయి. ఒక కవి కొంత కాలం రాస్తాడు. కొంత కాలం రాయలేడు. రాసినా, మహోత్కృష్టంగా వుండదు ఆ రచన. అయితే మనం అనుకోకుండా ఒకొక్కడు ఒక ఉత్తమ కవిగా రూపొందుతాడు. అతని రచనలో ఎక్కడలేని వన్నెచిన్నెలు కనిపిస్తాయి. అతడు చేసిన సృష్టి మనసాహిత్యానికి పుష్టిని కలిగిస్తుంది. మనకు నచ్చని సాహిత్యం ఉద్భవిస్తున్నదని కొత్తవారిని తిరస్కరించడం పెద్దవారికి తగదు. పేరు ప్రతిష్ఠలు కేవలం రచనా పాటవంవలనేరావు. అనేక కారణాలుగా వస్తాయి. అవి చాలా కాలం నిలువక పోవచ్చు. ప్రజాదరణ పొందిన ప్రతీదీ ఉత్తమ రచన అనలేను. ప్రజలు ఆకళించుకోలేని గంభీర రచనలకు ఆదరణ లేక పోయినంతమాత్రాన విలువతగ్గదు. సృష్ట్యాదినుండీ ఎడతెగకుండా ప్రవహిస్తున్న ఈ కవితావాహిని మనం చంద్రమండలానికి ప్రయాణం కట్టినంతమాత్రాన ఇంకిపోవలసిన అగత్యం లేదు. "కవిత లేనినాడు యువతశూన్యంబౌను; యువత లేనినాడు నవతసున్న; నవతలేనినాడు నాగరికత లేదు; నాగరికత లేక నాడు లేదు."

(ఆంధ్ర వారపత్రిక 14-1-59)

డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు

నవీన వాఙ్మయము - యెంకిపాటలు

ప్రపంచమునందలి ప్రతి వస్తువునకు పరివర్తనము సహజగుణము. దేశచరిత్రములేగాక వాఙ్మయ చరిత్రములు గూడ సంఘము యొక్క వ్యవస్థాభేదములవల్లను, కాలములయొక్క మార్పులవల్లను, పరివర్తన మొందుచుండును. 'ఉత్క్రాంతి' తత్వము వాఙ్మయ చరిత్రమునకును సంబంధించును. ఆంధ్ర వాఙ్మయ చరిత్రమున మొదటినుండి నిప్పటి వరకును పరిశీలించితిమేని కాలముయొక్క ధర్మము ననుసరించి భాషయు వాఙ్మయమును ఎట్టిమార్పులు నొందెనో తెలియనగును.

ప్రస్తుత యుగమును Democratic age అనగా సామాన్య ప్రజలయుగమని పేర్కొనుట వినియున్నాము. ఈ పేరు పరిపూర్ణముగా సార్థకము గానప్పటికిని సామాన్య ప్రజాయత్త లక్షణములు లోకమందలి ప్రతి జాతి యొక్క జీవనమందును కాన్పించుచున్నవి. జాతీయ జీవనముయొక్క విషయేతరములందు గన్పించు నీ లక్షణములే వాఙ్మయమున గూడ బొడగట్టుచున్నవి. "వాఙ్మయము సాంఘిక జీవనము యొక్క ప్రతిబింబమని" మాథ్యూ ఆర్నాల్డు (Mathew Arnold) అను ఆంగ్లేయ మహాకవి వచించినటుల సంఘము యొక్క జీవనమందు మార్పులు గలుగుటవల్ల వాఙ్మయ నిర్మాణ పద్ధతులందుగూడ మార్పులుగలుగుట సహజము. నవీనపద్ధతుల నవలంబించు వాఙ్మయ నిర్మాతలు సంఘ సంస్కారులవలెనే సక్రమ పద్ధతుల నవలంబించలేదను యపవాదులకు గూడ పాత్రులగుచుందురు. మార్పులు జేయునవసరమే లేదని ప్రాతత్రోవల వదలజాలని మూఢ విశ్వాసములు గలవారు వాఙ్మయ చరిత్రములందు గూడ పెక్కండ్రు జూపట్టెదరు. కాని కాలప్రవాహమున కట్టుపడి కట్టగట్ట నెవరితరము? అందులో కేవలం భావనా మాత్రసంవేద్యములును మృదుమధుర రసార్థములునునగు కవితా ప్రవాహముల దారి నడ్డగించువారెవరు? అడ్డగించినను గడ్డిపుల్లవలె త్రోసివేసి యా ప్రవాహములు విచ్చలవిడిగా రసానుభవ లాలసులగు సహృదయుల యంతరంగ సీమల బారుచు భావాంకురముల నుదయింపజేయుచునే యుండును. పద్యకావ్యములేగాని గద్యకావ్యములే గాని ప్రబంధములే గాని యితర నిర్మాణములేగాని సారస్వతమున వివిధపద్ధతుల పరిణమించినపుడు శోకించు వారెవరు? వాఙ్మయోద్యాన లక్ష్మికిని సర్వవిధపరిమళ ప్రసూన రాజములలంకారములే! అట్లు గావనితలంచుట తప్పు. త్రసరేణువు మొదలు బ్రహ్మాండమువరకు ననంతకోటి రూపాంతరముల గన్పరచు నాసచ్చిదానంద స్వరూపమువలె తత్స్ఫూర్తి లేశముగల మనుజుని మానసిక వ్యాపారములు ప్రపంచము యొక్క వివిధావస్థల ననుసరించి యనేక విధముల వ్యక్తమగుచుండును. అట్లు గాగూడదని వాదించిన మానునా? భాష మనుజుని యొక్క విచారభావనా ప్రపంచముల బయలుపెట్టు సంజ్ఞ,

వాఙ్మయము సక్రమ పద్ధతులపైన నిర్మింపబడిన విజ్ఞానసౌధము. అది యెల్లప్పటికిని నిర్మింపబడుచు ఒకప్పుడు పరిపూర్ణతనొందని నిర్మాణ రాజము. అట్టిదాని స్వరూపమును సంకుచిత పరచుట కెవరితరము ?

కవి ఆవేశపూరితుడు. భావనా ప్రపంచమున విచ్చలవిడిగా దిరుగాడి ఆనందరస ప్రపూర్ణతచే మత్తిల్లినవాడు. అట్టివానికి తన రసానుభవమును వెల్లడించుటయే ముఖ్యముగాని, యే భాషయందు యేఛందస్సునందు యెన్ని పదములందు వ్యక్తపరుచుట' యనునది ముఖ్యముగాదు. ఇట్టిరసానుభవజనితోన్మాదము ముందు యేకట్టుబాటులును యేనిబంధనలును పనికిరావు. ఈ తత్వము ననుసరించి కేవల భావనాత్మకమును రసాత్మకమును నగు కళలు సృష్టించుటయే నవీన యుగము నందలి కళాధర్మము. దీనినే Romanticism అని పేర్కొనెదరు. దీనినే స్వర్ణయుగమని కొనియాడెదరు. నేటి నవలలు, ఖండ కావ్యములు, భావ గీతములు, చిన్న కథలు, ముచ్చటలు, మొదలగునవి నవీన కళా ధర్మము ననుసరించిన పద్ధతులు. ఆంగ్లేయ నాగకరికతతో గలిగిన సంబంధమును, ఆంగ్లేయ భాషాభ్యసనమును చాల వరకీ పరివర్తనమునకు కారణములనుట నిర్వివాదాంశము. ఆంధ్ర వాఙ్మయమున నవీన కళా ధర్మముల మొట్టమొదట సూచించినవారు కీ॥శే॥రా॥బ॥కం॥ వీరేశలింగం పంతులుగారే యని చెప్పవచ్చును. కొంతవడి పురాతన పద్ధతుల నవలంబించు పండితుల సంతుష్టి చూపినను ఆంధ్రుల యొక్క ఆధునిక సంస్కారమువలన నవీన పద్ధతులతి తీవ్రముగ ప్రబలి పరిపూర్ణ వికాసను నొందుచున్నయవి. షేక్స్పియర్, కీట్సు, షెల్లీ, బ్రౌనింగ్ మొదలగు ఆంగ్లేయ మహాకవుల ననుసరించి ఖండ కావ్యములు భావగీతములు వ్రాయుట ప్రస్తుతకాలమున విరివిగా గానవచ్చును. సంస్కృత భాషా సంస్కారముగల యాంధ్రభాష ఈ నవీన కావ్యరచనల కమితముగా ననుగుణ్యమైయున్నదని చెప్పవచ్చును. శ్రీయుతులు తిరుపతి వేంకటేశ్వర కవులును పూర్వాచార పరాయణులయ్యు వాఙ్మయమున నవీన సంప్రదాయముల ననుసరించుటకు ముందంజవేసి అనేక ఖండ కావ్యాదుల రచించియున్నారు. శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారును, దువ్వూరి రామిరెడ్డిగారును, అధికార్ల సూర్యనారాయణరావుగారును, నండూరి వెం॥ సుబ్బారావుగారును, మొదలగు యభినవ కవులు నవీన లావణ్యముల వెదజల్లుచు భావ ప్రపంచమున నవీన విలాసముల మూర్తీభవింపజేయుచున్నారు. ఈ క్రొత్త మార్గములన్నియు యాంధ్రభాషా యోషామణికి భూషణములై యలరారుచున్నవి.

(గోలకొండ పత్రిక 10 మే నెల 1926)

నవీనకళల యొక్క ముఖ్యగుణములు మూడు. వాఙ్మయము సంఘము యొక్క ప్రతిబింబమను నార్యోక్తినిబట్టి సార్వజనీనత గలుగవలయును. ఉత్తమజాతియందుద్భవించిన నాయికా నాయకుల ప్రణయ కథలేకాని పౌరాణిక గాథలేకాని "కేవల కల్పనాకథ" లైనను సంఘము యొక్క సర్వసామాన్య జనులకు సంబంధించక ప్రత్యేక జాతి వర్ణముల యొక్క ప్రత్యేకావస్థలను చిత్రించుట మధ్యయుగపు కవుల యలవాటు. అట్లుగాకుండ సర్వజన సామాన్యగ్రాహ్యమగు భాషయందు జనసామాన్యమునకు సంబంధించునట్టి విషయములను సంఘములోని వివిధావస్థలను చిత్రించుట నవీన వాఙ్మయ గుణములలో నొకటి. అట్లగుట వాఙ్మయము సంఘము యొక్క పరిపూర్ణ ప్రతిబింబమగుచు సార్వజనీనమగును. రెండవ గుణము సత్యానుకరణము. ప్రతి నాయకుని అఖిల సుగుణగణవిరాజితుడగు నుత్తమనాయకునిగా, ప్రతి నాయికను ఆదర్శప్రాయమగు విదుషీమణిగా చిత్రించుట కవి సంప్రదాయము. సామాన్య పాత్రముల చిత్రించునపుడు గూడ మానుష స్వభావ సహజములగు లోపము లేమియు లేకుండ కేవల సుగుణప్రాధాన్యముగ చిత్రించుట మధ్య కాలపు కవుల యలవాటు. అట్లు గాకుండ కావ్యచిత్రములు ప్రకృతి యందలి రూపముల యొక్క సత్యానుకరణములుగా నుండుటయే కళ యొక్క రెండవ గుణము. ఈ రెండు గుణములను సంఘమునకును, వాఙ్మయమునకును, పరస్పర సమన్వయము గలుగజేయును. ప్రచలిత వాఙ్మయమునందలి నవలలు చిన్న కథలు దిలకించి అందలి పాత్రములు సంఘమునందు ప్రస్తుత కాలమున జీవించునున్నయనేక గుణదోష సహితులగు వ్యక్తులుగాని సంఘము యొక్క ప్రస్తుత స్థితికి దూరముగా నున్న సీతారామచంద్రులు లేక శకుంతలా దుష్యంతులు, లేక సావిత్రీ సత్యవంతులు కారని తెలియనగును. జీవితోపవనమందు అంకురించి పుష్పించి పరిమళించి పడిపోవు రోజా మల్లె మొదలగు సామాన్య పుష్పములుకాని అందరాని నందనవనమందుండు మందారకుసుమములుగావు. నవీన కళ యొక్క మూడవ ధర్మము స్వతంత్ర నిర్మాణములు గావించుట. క్రొత్తశైలి క్రొత్త ఫక్కి క్రొత్త త్రోవలు క్రొత్త నడక యతిప్రాసాదినిబంధనలకు లోబడి భావసంకుచిత మొనరింపకపోవుట Bland Verse వ్రాయుట పామరజనులనుభవింపజాలు రచనలు రచించుట నవీనకళా స్వాతంత్ర్యము యొక్క నిదర్శనములు; సార్వజనీన (Universality) సత్యానుకరణము (Realism) స్వతంత్రత (Freedom) యీ మూడు ముఖ్యగుణములని తెలియదగినది.

ఈతత్వముల దృష్టియందుంచినచో ప్రచలిత వాఙ్మయము ఆంధ్రభాషను క్షీణదశకు దెచ్చుననియు ఆంధ్రసారస్వతమునకనర్థ మాపాదించుననియు యనుమానపడు కొందరి పండితుల యభిప్రాయము సత్యముగాదని తెల్లమగును; ఇంతవరకు జరిగిన వాదప్రతివాదములను పరిశీలించినచో ముఖ్యవాదము కేవల భాషాసమస్యయేయని గమనింపనగును. కాని నవీనకళాధర్మముల విషయమేగాని ఆధునిక వాఙ్మయ తత్వముల విషయమేకాని వాద ప్రతివాదములులేవు. యెంకిపాటలు మున్నగు కావ్యములందుపయోగింపబడిన భాష నింద్యగ్రామ్యమనియు యిట్టిభాషను వాఙ్మయమునందు వాడుట యనర్థకమనియు పలువురు విమర్శించినారు. కాని భాషాతత్వములపై నెమ్మదిగా యోచించినచో గ్రాంథిక గ్రామ్యభాషలను విభాగము బొత్తిగానెగిరిపోవును. భాషయనేక శతాబ్దములనుండి రూపాంతరములనొందుచు ప్రతిదినము అతిస్వల్పముగానైన మార్పుల నొందుచునేయుండును. ఆంగ్లేయ మహాకవియగు (Chaucer) చాసర్‌నాటి భాషనిపుడెవడైన తెలిసికొనునా; (Shakespeare) షేక్స్పియర్ భాషకును టెన్నిసన్ భాషకును గల భేదము మనకు దెలియదా! (Tennyson) టెన్నిసన్ భాషకును ఇప్పటి భాషకును గల సంబంధము తెలిసికొందుముగదా! ఇట్లే ఆంధ్ర కన్నడభాషల పరస్పర సంబంధములు మనకు విశదముగా దెలిసినచో, ఆంధ్రభాషా చరిత్రమును సమగ్రముగా విమర్శించినచో భాషయందలి మార్పులను కనుగొందుము. శబ్దానుశాసనుని నాటి భాషలో నెన్నిపదములు వాడుకలో నున్నవియో, యెన్ని దుర్గ్రాహ్యములగుటయే గాక అపశబ్దాది దోషములవల్ల రూపాంతరములనొంది ఆ రూపాంతరములే యిపుడా పదముల

నిజస్వరూపములని వాడుకలో నున్నవియో కొంచెము పండితులందురు యోచింతురుగాక! భాషయొక్క జీవితము నందొక చమత్కారమేమన, దోషములైనను రూఢివల్ల భూషణములై మారును; తప్పులైనను తరతరముల వాడుకవల్ల ఒప్పులైపోవును. ఇట్టిస్థితిలో యేపదము గ్రామ్యమో యేపదము గ్రాంథికమో స్థిరపరచుట మిగుల దుష్కరము. ఐనను భాషాభిజ్ఞులు తమకుగల జ్ఞానపరిమితిని బట్టి కొన్ని కట్టుబాటులు పెట్టుకొనకతీరదు.

వాడుకభాష (Colloquial language) ను గ్రంథములందు వాడుటచే సుగ్రాహ్యమగుటయేగాక భాషయందొకశక్తి (force) గలుగును. చదువరుల బుద్ధికి తీవ్రమైన చాలన మొసంగుటయేగాక వారి తార్కిక భావనాశక్తులకు మహత్తరమైన యుత్తేజము గలుగజేయును. సంఘదురాచారముల వెల్లడిచేసి వాఙ్మయముద్వారా కొంత సదాచార ప్రచారము జేయుట యాదర్శముగాగల ప్రతి సాంఘిక పద వాఙ్మయ నిర్మాత తప్పక వాడుకభాషయందే వ్రాయవలయును. లేనిచో చెవిటి వాని ముందర శంఖాదినట్లు నిరర్థకముగానుండును. వాడుకభాషను వాఙ్మయము నందుపయోగించుట తప్పుకానేరదు, సంఘములోని వివిధ తెగలయొక్క వాడుకభాష పలువిధములుగా నుండకపోవును. అట్లుండుటచే పాత్రౌచిత్యమునుబట్టి యేవిధమైన వాడుకభాష నుపయోగించవలయునో ఆవిధమైన వాడుకభాష నుపయోగించినయెడల చాలును ఇంతమాత్రమున పండితులందరు ఆంధ్రభాషానిర్మల సరసీజల మపవిత్రమగునని భయంపడ నక్కరలేదు. నండూరి వేంకటసుబ్బారావుగారు నాయుడుబావ యెంకియొక్క ముగ్ధప్రణయగాథలను వారి వాడుకభాష యందు పాడినందున అంతకంటే మంచిదైన వాడుకభాషనేగాని లేక కేవలపండితుల గ్రాంధికభాషనేగాని ఉపయోగించువారు నాయుడుబావ ననుకరింపబోరు. ఆభాషలోనే గాని నిజముగా నంత ఆకర్షణశక్తియు లేదు. పండితవీరులందరు వజ్రాయుధముల ధరించి రణరంగములోనికి దుముకుటయు మరియితరులును తమ తమ కత్తులను నూరుటయు చాల యసమంజసమని తలంచెదను.

(22 మే నెల – 1926 గోలకొండ)

భావ ప్రధానములగు కావ్యములను ఛందోనిబంధనలచే వ్యాకరణలాక్షిణిక శృంఖలములచే గట్టి వేసినచో నా కావ్యములందు Spontaneity గలుగనేరదు. నిర్మాత తన రచనా నైపుణ్యతకేగాని లేక పాండిత్య ప్రకర్షాపేక్షకుగాని భావమునించుకైన బలియివ్వవలసివచ్చును. భాషాకోవిదుడగు ప్రౌఢకవి భావమును భాషను రెంటిని సమన్వయింపజేయును; గాని అదియును ప్రయత్నపూర్వకముగా నిర్మింపబడినదా! అప్రయత్నముగా భావతరంగములు పొంగి పైకుబికి వెల్లివిరిసినట్లుగా నుండు యావేశపూరిత కళగాదు. చిరకాలాధ్యయనమున పాండిత్యమలవడి శ్రావ్యశారీరము గానమొనరించు సంగీత శాస్త్ర విశారదుని గానామృతముగాని కేవల రసానుభవజనితోన్మత్తతచే సంస్కార కష్టములేకుండ యవ్యక్తమధురముగా పంచమ స్వరమున వెలువరించు కోకిల పాటల సుధాలహరులగావు. షెల్లీ (Shelley) మహాకవి పేర్కొన్న Unpremeditated art కాదు. ఆంధ్ర సారస్వతమునందు రెండు విధముల కావ్యములును గలవు. మొదటి తెగకు జేరిన ప్రబంధ రాజములనేకము లున్నటులు భక్తి భరితములును తత్వజ్ఞాన బోధకములు నగు గేయములు కీర్తనలు పాటలు అనేకములుగలవు. ప్రసిద్ధిగాంచినవారి యందు ముఖ్యముగా, త్యాగరాజు, రామదాసు, వేంకటదాసు, వరదరాజు, తాడంకివారు, ఏగంటివారు, మొదలగు మహాకవుల కీర్తనలు పాటలు ఆంధ్రుల హృదయంబుల నెప్పటికిని భక్తిరస ప్రపూర్ణముగా నొనరించుచుండును. అట్టి పామరుల శృంగారభావముల ప్రదర్శించుచు వారి నానందమున నోల లాడించు యేలపాటలనేకములుగలవు. వాఙ్మయచరిత్రముల నించుక పరిశీలించినచో శృంగార వీర రసాత్మకములగు నీలాటిపాటలే మొట్టమొదట మనుజుని భావప్రపంచమునుండి భాషారూపమును దాల్చినవని తెలియనగును. మొదలుభాష, తర్వాత వ్యాకరణము, మొదలు కవిత్వము తరువాత లక్షణము పుట్టినవని తెలియనగును. నన్నయకు పూర్వము నన్నెచోడునికి పూర్వము ఏ భాషయుండినదో ఆంధ్రకవిత్వమే రూపమున నుండినదో ఇదమిత్థమని చెప్పజాలకున్నను భాషోత్క్రాంతి తత్వముల ననుసరించి పైవిధములగు పాటలు ద్విపదలు మున్నగునవి సంస్కృతభాషా సంపర్క విహీనమగు కేవల ప్రాకృత తెలుగునందుండిన నుండవచ్చునని యూహింపవచ్చును. మధ్యయుగమున నాగరికత కొన్ని జాతులయందు కేంద్రీకరించి నాగరికులు పామరులను భేదము విస్పష్టమును తీవ్రమునైనందున ప్రబంధమునకును పాటలకును గల భేదము వ్యత్యాసము అతితీవ్రమై లాక్షణికుల ననుసరించిన పండితుల ప్రబంధములు కవిత్వమును పేరునకు దగువనియు తదితరములగు గేయములు పాటలు ఆ పేరునకు దగవనియు అందులోను గ్రామ్యభాష నుపయోగించిన యెడల బొత్తిగా దగవను నభిప్రాయము ప్రబలినది. కాని కవిత్వము లాక్షికుల సొమ్మా? పండితుల సొమ్మా? ఒక భాష సొమ్మా? ఈ భాషలో వ్రాసినది కవిత్వము తదితరముగాదు" అని శాసించువారు తమ వాఙ్మయ చరిత్ర జ్ఞానాభావమును వెల్లడిజేయుదురేగాని మరేమియులేదు. ఏ భాషలో వ్రాసిన నాభాష మాటాడువారును, ఆభాష తెలిసిన వారును దానిని జదివి అందుగల రసము ననుభవింతురు. లాక్షణికుల నియమములు, అలంకారికుల విభాగములు వారి వారికే దెలియునుగాని రసాత్మకమగు కవితను జదివి యానందించు శక్తి భాషాజ్ఞానముగల ప్రతి మనుజుని కుండవచ్చును. అలంకార లక్షణశాస్త్ర గ్రంథకీటకము లనందగు మహాపండితులందరు రసవత్కవిత్వము జెప్పగలరా? కవిత్వ మందలి ప్రధానాంశము భాష. అలంకారము, లక్షణము, మున్నగువాటి నతిక్రమించినదియు, వాటికంటే సహస్రాంశముల ముఖ్యమైనదియు, అనిర్వాచ్యమైనదియు నొక శక్తి, ఆశక్తి గలవాడే కవిగాని తదితరులుగానేరరు. కవిని విమర్శించు నెడ ముఖ్యముగా జూడవలసినదేమన ఆ ప్రధానాంశమించుకయైన గలదాలేదా యనునది. అది రసానుభవైక వేద్యము. గులాబీ పువ్వును రెక్క రెక్కగా విడదీసి వేసినచో పనికిరాని చెత్తయగును. సంపూర్ణరూపమున నదియే మన చక్షుర్ఘ్రాణేంద్రియముల కానందమొసంగును. సమస్తవర్ణ సమాకీర్ణమగు ఇంద్రధనువు యొక్క స్వరూపము Physical Laboratory యందు విడదీసిచూచిన పరిణామ మందును, కీట్సు లేక షెల్లీ మహాకవి యొక్క సరసచిత్ర వర్ణనము యొక్క పరిణామ మందునుగల భేదమును కొంచము యోచింపవలయును. రసికులుగానట్టి వారికినిలేక లాక్షణిక శృంఖలాబద్ధులై యీ యభిప్రాయములు నచ్చని వారికిని ఈ భేదము గోచరింపదు గాబోలు ! కవులకు గులాబీ పువ్వు యొక్క వృక్షశాస్త్రాత్మక

పరిజ్ఞానము లేక పోవచ్చును గాని చదువరులను భావనాత్మకమగు నానందమయ ప్రపంచమున విహరింపజేయు శక్తి మాత్ర ముండవచ్చును. ఈ రెండవదే కవిత్వ మందలి ప్రధానాంశము. దీని నిజ స్వరూపమును గనుగొని యానందింపగోరు విమర్శకుడు కవి ఏ వాతావరణమునందు ఏ పరిస్థితులయందు దన మనోభావములకై యిట్టి పరిణామముల గాంచగల్గెనో వాని యందు లేశమాత్రమైన సానుభూతిగలిగి ఈ ప్రపంచమున నించుకయైనదిరుగాడి, ఆ మాధుర్యము నించుకయైన చవిగ్రోలి యుండవలయును. వేయేల కవియొక్క అనుభవమందు నించుకైన పాల్గొన లేనిది విమర్శకుడు కాజాలడు. అట్లెవరేని విమర్శించిన యెడల ప్రస్తుతము వెలువడునట్టి యప్రస్తుత విమర్శనములే బైలుదేరుచుండును.

యెంకిపాటలను గురించి విమర్శించునపుడు పైసంగతులను జ్ఞాపకమునందుంచుకొనిన విమర్శసులభమగును. జరిగినవాద ప్రతివాదములనుండి, ప్రతి విమర్శనలనుండి తేలునవి ముఖ్యముగా రెండే యంశములు – భాష, పాత్రములు. ఈ రెండును గ్రామ్యములనియు రసవంతమగు కవితా సామగ్రిగావనియు ఒక తెగవారి యభిప్రాయము. రెండవ తెగవారు పురాణ లాక్షణిక గ్రంథ భండారముల నుండియే యెంకి నాయుడు బావల ప్రేమపాటలు సలక్షణములను నాధారమును దీసి సమాధానముజెప్ప ప్రయత్నించుచున్నారు. ఈ వ్యాసకర్త పై రెండు తెగలకు జేరినవాడు గాడని తెలిసియే యుండవచ్చును. లక్షణ గ్రంథములలో నేయాధారమును యెంకినాయుడుబావల పాటలకు దొరకకపోవచ్చును. లేవని బ్రా॥ శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రులవారు నొక్కి చెప్పినందున నమ్మవలసినదే. లేకపోవునుగాక ! లక్షణ గ్రంథములు అనాగరికుల దంపతులను, యువతీ యువకులను శృంగార భావచేష్టావిహీనులగుటకు నోరుమూసి త్రాళ్ళచేబిగించి కట్టివేయనిగాక ! వారం తటితో నూరకుందురా? పండిత శాసనములకంటే ప్రకృతియొక్క శాసనముల నుల్లంఘనీయములు గదా! మడిదున్నుకొనువారు నిస్సంశయముగా అనాగరికులే ! అచ్చుజాతివారమని గర్వించు వారియెదుట నిశ్శంకముగా నికృష్టజాతివారే ! కాని కాపుదంపతుల కల్లకథలలో కపటహీనమగు కబుర్లలో, నావికయువతుల మోటు సల్లాపములలో, మోహపు పాటలలో రసమేలేదా? (Romance) బొత్తిగా లేదందురా? వివిధ సాంఘిక పరిస్థితుల సమ్మేళనముచేతను సంఘవిభజనచే గలిగిన ప్రత్యేకాచారముల చేతను ఏదో విధముగ సంస్కరింపబడి నాగరికులమనుకొను యువతీయువకులు మాత్రమే శృంగార రసమున కాలంబన విభావ సామగ్రి యగుదురా? తదితరమగు ప్రపంచమును కవి యొక్క భావనా వాతావరణము నుండి తొలగింపవలసినదేనా? అట్లేల చేయవలయునో తెలియకున్నది. పామరులగువారు తమ భావములను కృత్రిమచ్ఛాదనములచేతను తెచ్చికోలుముసుంగులచేతను కట్టివేయజాలక విస్పష్టముగా వెలిబుచ్చెదరనియా? లక్షణ గ్రంథముల యుత్తరు విదియే యైనచో ప్రస్తుతయుగపు కవితా గ్రంథములతో వాటి యాధారములతో నేమిపని లేదనియే నానమ్మకము ! రసపరిప్లుతమగు భావ ప్రపంచమందు (Monopoly system) సామ్రాజ్యాభిమానము (Imperialism) ధనత్వము (Capitalism) మొదలగునవి లేవు. కవి యొక్క నిరంకుశమగు (Republic) నందు వాటికి తావులేదు. ఉండగూడదు. అట్లే భాషవిషయమునను దెలిసికొనదగినది. ఈ పాటలలో వాడినభాష సాధారణభాష గాదనియు ఉత్తర సర్కారుల యాసభాషయనియు నాగరికులగు రసికులానందింపజాలరనియు వాదింతురేమో? ఆభాష తెలిసినవారు మాట్లాడువారు అందరు ఆ పాటలలోగల స్వారస్యమును తెలిసికొనగలుగుదురు. కేవల విదేశీయమగు శాకుంతలము జర్మనీ కాళిదాసుడగు గెథె మహాకవి నానంద మధుమత్తతచే నృత్యము గావింపజేసినదే! కావ్యములో రసమేకలదేని భాషయు పాత్రములు తదనుభవనమున కడ్డుపడునా? భాషయపరిచితమైనను పాత్రములనాగరికులైనను రసపోషణము పాత్రౌచిత్యము ముఖ్యముగా గ్రహణీయములు, విమర్శనయందు చర్చనీయాంశమిదియే !

(గోలకొండ పత్రిక 17 జులై 1926)

యెంకి నాయుడు బావలెవరు! 'యెంకి స్వీయయా పరకీయయా'యను ప్రశ్న కొందరు విమర్శకులను బాధించినది. కొందరు యెంకి పరమ పతివ్రతయు మహాసాధ్వియునగు ఇల్లాలనియు, మరికొందరు నవయౌవనుండగు నాయుడు బావను మోహింపజేసిన శూద్ర విలాసినీ రమణియనియు అభిప్రాయపడియున్నారు. శ్రీయుత బి॥ అప్పారావు గారు ఈ పాటల యందు 'స్వీయ' యగు యెంకి యొకతె 'పరకీయ' యగు యెంకి యొకతె, ఇట్లిద్దరు నాయికలుగలరని తమ ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక వ్యాసమునందు సెలవిచ్చిరి. పాటలయందు మాత్రము యెంకి యీమూడు విధముల యభిప్రాయములకువీలగునట్లు చిత్రింపబడియున్నది. కవియొక్క Characterisation పద్ధతిని బాగా కనిపెట్టనందున ఈ త్రివిధాభిప్రాయములు బయలుపడియున్నవి. కాని నవీన వాఙ్మయము యొక్క Realistic గతులను గమనించి యుండినచో, యెంకి లోపములులేని మహా సాధ్వీలలామయగు నిల్లాలుగాదనియు వివర్ణయగు శూద్రవిలాసినియు కాదనియు ఈరెండు విధములగు రెండు ప్రత్యేక వ్యక్తులును లేవనియు దెలిసియుండును 'యెంకి' సాధారణముగ సంఘమందు గన్పడు యిల్లాలు, ఇట్టి 'యెంకి' యొక్క Character ఏ యేవిధముగ చిత్రింపబడినదో గమనించవలయును. 'గుండెగొంతుకలోన' అను మొదటిపాటలో మోహావేశితుడగు నాయుడుబావ 'యెల్లి మాటాడిస్తే యిసిరికొడ్తాది' 'యాడుండవంటాది యిలుదూరిపోతాది' అని వాపోవుచున్నాడు. 'మందో మాకోపెట్టి మరిగింది నాదీ' అని కూడా అనుచున్నాడు. రెండవ పాటలో నాయుడు మనన జేయు 'యెంకి' జాములేతరియేల జడుపుగిడుపూమానిచెట్టు పుట్టాదాటిచేను'లోకి పరుగెత్తడము, 'నీలిసీరా గట్టి నీటుగా' చొరవను యెదురుగా బోయిన నాయుడుబావ 'కంటికాపడగానె' 'కాలు కదపలేకపోవడము' 'తెల్లారబోతుంటే సెందురిణ్ణి తిట్టడము' 'సూరియుణ్ణి తిట్టడము మొదలగు చేష్టలు జేయుచున్నది. అట్లే దొడ్డితోవకళ్ళె తొంగి సూడంగానే' 'తోటకాడేవుండు తొరగొస్తు' ననడము; 'కోడిగూసే సరికి కొంపకెల్లాలి నీ కోసరమె చెపుతాను కోపమొద్దనడము; యెంత సేపున్నాను యిడిసి పెట్టాలేవు తగువోళ్ళలో మనకి తలవొంపు' లనడనము; 'యెంకి' యభిసారికయనియు యిల్లాలు కాక పోవచ్చుననియును సందేహము కలిగించవచ్చును. కాని మోహపరవశయగు గడుసరియైన యిల్లాలు కాగూడదా? వయస్కయును ఒకపుడు విముఖయగుచు Coquetry జేయుచు మరొకపుడు తానే మోహావేశితయై

విరహితయగుచు నాయకు ననుసరించు ఇల్లాలుకాకూడదా! గడుసరి యిల్లాం(డకు 'మందోమాకో పెట్టి మరిగించు కోవడము' అసహజముగాదు! కావున ఇంత మాత్రమున ఇల్లాలుకాదని ఇదమిద్ధమని పల్కవీలులేదు. ఈ యిల్లాలి ప్రేమ మాత్రము విచిత్ర ప్రేమగాదనియు సంస్కరింపబడ లేదనియు విస్పష్టము. 'సత్తెకాలపు నాయెంకి' అను పాటలో నాయికా నాయకుల సమావేశము సుందరముగా వర్ణింపబడినది. విముఖియగు నాయిక స్వాధీనయగుటయేగాక పవిత్ర ప్రేమ యొక్క నిరాడంబర స్వరూపమును వెలిబుచ్చుచున్నది. అట్టె 'యేటిదరి నాయెంకి' అనే పాటలో 'యేటనరుగుల' నైనను 'సెంద్రవొంకలోను' ప్రణయాందోళనము చేయుచున్నది యెంకి. ఇట్లు కుపితయు విముఖియునగు యెంకి సౌమ్యయు స్వాధీనయునై నాయికా నాయకులనేక సారులీ పరిస్థితుల మార్పుల నొందుచున్నారు. ఐనను Coquetry చాపల్యము బొత్తిగాబోలేదు. ఈ యెంకికి 'రావొద్దె రావొద్దె' అను పాటతో fare well చెప్పి వేసిన పిదప కవి కుమారుడు తననాయికను గృహిణీ పవిత్ర ప్రేమ వాహిని యందు నోలలాడించుట కుద్యుక్తుడైనట్లు గన్పడును. 'నన్నిడిసి పెట్టెళ్ళినాడే నారాజు' అను పాటలో యెంకి 'సల్లన్ని యెన్నెట్లొ సాపేసి కూకుంది' 'ఉలికులికి పడుతూ' వున్నది. ఇట్లే యెంకి "కళ్ళెత్తితేసాలు కనకాభిసేకాలు' రాసోరింటికైన రంగు తెచ్చేపిల్ల' అని గుణగణంబుల వర్ణించుచును తాను 'పిచ్చియై కొట్లాడుతూంటె' యిరుగమ్మ లక్కలతో యెకసక్కె మాడుతూ 'సెమ్మ సెక్కాడుతూ వున్నాదని' 'జాలిగుండెల' యెంకి యని 'నమలి మింగిన యెంకి' నా వొంకింకరాదోయి రాదోయి' యని నిరాశా పూర్ణహృదయుడై విలపించుచున్నాడు. ఇట్లు వా పోయినను 'సీకు సింతా లేక' సోకల్లె పడుకుంటుంది' యెంకి 'తోట పూసంటె' 'సీకాకుపడుతు విలపిస్తాడు నాయుడు బావ. ఇక ముందో నామాటె మాటంట 'నా పాటె పాటంట' యెనక జల్మములోన యెవరమో, నంటి ! సిగ్గొచ్చి నవ్వింది సిలక 'యెన్నాళ్ళొమనకోలె యీ సుకము' లంటీ! కంటనీ రెట్టింది' అనిమౌగ్ధ్యము చాటించుచు 'సాలు సాలు' అనే పాటలోదన ప్రణయ సాఫల్య సంతృప్తిని గనుబరచుచున్నాడు నాయుడు బావ. అట్లే 'దూరాన నారాజుకే రాయడౌనో' యని తులిసెమ్మ వొరిగినదని తొలి పూస పెరిగిందని చీకాకు పడుచున్నటులు "ఉత్తమా యిల్లాలినోయి ! నన్ను సురుపెడితే దోసమోయి!" అని తనను ప్రార్థించినటులను ప్రియురాలి గుణ గణముల యెడల శిరఃకంపము జేయుచు పంటసేలకే పయనం సాగేలా, మొదలగు తర్వాతి పాటలన్ని పాడియున్నాడు. ఆకటి గుండెల యెంకి'లో మందు బెట్టి మరిగించుకున్న యెంకిలో 'ఈకనుపాపలో నీడ సూసుకుంటా సుక్కెట్టుకునే యెంకిలో దాని నీడనే తొక్కుకొని సులువుగా! కొండ నెక్కగల ప్రాభవముగలిగిన యెంకిలో భేదములేకపోలేదు. 'యెంకి' యొక్క స్వరూప స్వభావములు నాయుడు గారి తాత్కాలిక మనోగతులపై నాధారపడి అవి మారినపుడెల్ల యెంకి వర్ణనలు మారుచుండును. సౌమ్యమైనదాని నొకరీతిని విముఖయై కుపితయైన దానినొక తీరున నాయకుడు దన ప్రణయ వర్ణన గావించి నందున ఈ యెంకి వేరు ఆ యెంకి వేరనియు రెండు వ్యక్తులనియు నూహింప వీలులేదు. మొదటి పాటలందు మోహపరవశుండుగు నాయకుడు దనవిరహ వేదనా భరంబున ప్రణయిని యొక్క వింత చేష్టలనించుక నతిశయోక్తి గావర్ణించి యుండుట మిగుల సహజము. అట్టి తరుణముననే 'మందో మాకో పెట్టి మరిగించు కొన్నదని' నిందా రోపణముచేయుట గూడ సహజ వికారమే! కావున కేవల మాయాధారములపై యెంకి పరకీయ యనిగాని లేక రెండు వ్యక్తులని గాని వాదించుట తగదు. ఒకప్పుడభిసారికయు ఒకప్పుడు స్వాధీనయు ఒకప్పుడు విముఖియు' ఒకప్పుడు చపలయు, ఒకప్పుడు రూపపూరితయు పరుషయునగు యెంకి కవికుమారుని భావనా ప్రపంచమున ప్రణయాధారమగు నొకటేవ్యక్తి.

యెంకి స్వీయయో, పరకీయయో నిజముగా కవి హృదయమునకెరుక ఆపరమాత్మునకెరుక! కాని పాటలను జదివిన మాత్రమున పరకీయయని చెప్పుటకు వీలులేదు. ఉత్తమా యిల్లాలినోయి' అనుపాట యందు నాయకుడు కలలో గన్పడి నందున ఉలికి పడినటులను పొరుగమ్మలక్కలు 'యీబూతిపెట్టినటులు' యీపుతట్టినటులు చెప్పుచు, 'పాట నుండె యెంకి సబకు రాజేశావా? పదిమంది నోళ్ళలో పడమంటురాశాద?' అని విలపించుచున్నది. ఒకవేళ పరకీయయేయైనచో ఇంతటి మోహావేశమునగూడ 'ఉత్తమా యిల్లాలి' నోయి అని ఉత్తమత్వము అపవిత్రత నారోపించుకొనుటకు అసాధారణయగు గడుసరియై యుండవలయును. కాని ఇతర గీతములన్ని 'యెంకి' సరళముగ్ధ స్వభావయుక్తి ప్రపూర్ణ హృదయ యనియు చాటుచున్నయవి. 'ఆ కాలపు' నాయెంకి, ముత్యాల పేరు, 'అనాటి నావోడు' మొదలగు పాటలను జదివినచో, చీమసిటుకుమనడంతో మనసు చెదరిపోవడము. కాకమ్మచేతైన కబురంపడమ్మా' యనివా పోవడము 'భావమౌగ్ధ్యమును వెల్లడించుచున్నది. 'యెంకితో భద్రాద్రి' 'యెంకితో తిరుపతి' 'ముందుగతి' పిల్లోడు మొదలగునవి నాయికా నాయకులు దంపతులనియు భక్తిభరితులై 'ఆవుల్ని దూడల్ని అత్తోరి కాడుంచి' 'మూటా ముళ్ళెగట్టి ముసిలోళ్ళతోసెప్పి' 'కొండమెట్లన్నీని కొంగట్టుకెక్కాలె' అని సవిలాసముగా పంతములాడుచు తీర్థయాత్రా పరులగుచున్నారనియు 'సంకలో పిల్లోడు సంబ్రాలుపడుతుంటే 'సుఖముగా జీవితయాత్ర గడుపుచున్నారనియు చాటుచున్నవి. కావున ఒక్కొక్కపాటను విడదీసిచూచి యెంకి కనర్థమాపాదింపక అన్ని చిత్రముల సమన్వయము గావించినచో నాయికా నాయకులను రూపులును ననుకూలురును నగు కృషికదంపతులనియు మొదట యౌవన చాపల్యంబున నొకరి నొకరు నేమరించుచు ప్రణయకోపాది నవయౌవన సహజ వికారము జూపుచు ఒకరి వెంట నొకరు 'సేనులో' సెట్టు పుట్టదాటి 'ఏతాముకాడ' 'అడవిలో' దిరుగుచు బాహ్య సౌందర్యలోలురై భ్రమసిన వారయ్యును, రాను రాను భావములు పరిపక్వదశనొంది ఉత్తమ దంపతుల పవిత్ర ప్రేమ యొక్క లౌకికానుభవమును బొందుచు చిన్న బిడ్డనుగని శుభములు గన్నవారని తెలియుచున్నది.

శ్రీయుత బసవరాజు వేంకటప్పారావుగారు యెంకి పాటలకుగల గొప్ప యభ్యంతరము నొకదానిని సూచించినారు. కవి తన స్వకీయమైన వాడుకభాషయందువలె ఇతరమగు భాషయందు తన భావములనందముగాను అప్రయత్నముగాను వెల్లడి గావింపజాలడని వారిమతము. ఇది సత్యమే ! కేవల Lyrical కావ్యము కవి తన స్వంతభాషయందే వ్రాయవలయును, వ్రాసితీరును. ఈ పాటలు పాటకజనులయొక్క Lyrics భావములు యెంకి నాయుడుబావలవి. ఇవి వ్రాసినకవి Robert Burns వలె పాటకజనులందు లీనమైనవాడు గాకపోయినను, అయినంతవరకు తనను ఆ కృషీవల దంపతుల పరిస్థితులందు భావించుకొని యున్నాడు. 'కవిబ్రహ్మ తాను సృష్టించుపాత్రల స్వభావము' నకనువైన భాషనే

ప్రయోగిస్తాడు" అని పంతులవారు వ్రాసినట్లు పాత్రలకు సహజమగు నీభాష నుపయోగింపవలసి వచ్చినది. కాపుదంపతుల 'గోషా' లేకుండా కవి తన స్వంతభావములను ఉత్తమ పురుషకావ్యములుగా బాడునపుడు ఈ భాష నుపయోగించిన యెడల అది తప్పేయగును. కావున కవి తన స్వకీయ జీవితానుభవముల నైనప్పటికి ఏ కారణముననైననేమి ఇతర పాత్రముల ద్వారా పాడదలచినప్పుడు ఆపాత్రలకనువగు భాషను వాడకతప్పదు. అట్టిస్థితిలో కొన్ని సందర్భములలో భాషకంటే భావములు సున్నితముగానుండి అనౌచిత్యమునకు తావొసంగును. ఇటీవలి పాటలలో 'గోవుమాలచ్చిమి', 'పడవ' 'ముత్యాల పేరు' 'సుక్క' మొదలగు కొన్నిటిలో కొన్ని భావములు మిక్కిలి సున్నితములై సామాన్య కృషీవలులకును వారి భాషలకును సహజమగు భావముగాక సంస్కారులకు సహజమగు భావములున్నవి. కనుకనే వీటియందు భాష భావము పాత్రములు ఈ మూడు ఒకటొకటికి కలియుట లేదు. Forcedness కావచ్చును. సప్రయత్నముగా కవి తనభావములను యెంకి నాయుడుబావల కారోపించినాడని స్పష్టమగును. అందువల్ల నిజముగా కొన్ని సందర్భములలో మాత్రము భావములను బట్టిజూడ భాషకు అంత Inevitability కాన్పించదు. ఈ సహజమగు Disadvantage కవిగారికిగూడ గోచరించి యుండును. 'ఉత్తమాటలునీవి పొమ్మందిరా' యెంకి కొత్తపాటలు పాడుకొమ్మందిరా' అను కడపటి గీతమున నీయనుమానము ధ్వనించుచున్నదేమో!

మొత్తముమీద తాత్కాలికముగా వెలువడిన ఖండనములు విమర్శనములు ప్రతివిమర్శనములు మున్నగునవి ఈపాట యొక్క నిజ స్వరూప సారస్యముల నించుకైన తగ్గించలేవు. సహృదయులగు పాఠకులు వాటియందుగల మనోహరత్వము ననుభవింపకపోరు. కొన్ని కొన్ని తావుల భావౌచితికి భంగము కలిగినను మొత్తము మీద పాటలు సుందరముగా నున్నవి. కవిత్వము సరస శబ్దకల్పనము, భావసౌకుమార్యము, ధ్వనిప్రాధాన్యము, మొదలగు ముఖ్యగుణములచే విరాజిల్లుచున్నయది. సామాన్యమైన పాత్ర లందలి భావనీచత్వము మచ్చునకు గానరాదు, శృంగార ప్రబంధ సహజమగు ఏవగింపు గలుగజేయు వర్ణనములులేక సరస సల్లాపములు నిర్దుష్టముగానున్నయవి. శైలికేవలము పాటల శైలిగాక నవీనగతులచే లలితమై యొప్పుచున్నది. వేయేల ఆంధ్రవాణి పదతలంబున కవికుమారుదర్పించిన ఈ నవీన కుసుమమంజరులు రమణీయముగా నున్నవి. నవీనవిలాసముల గూర్చినట్టి కవితా గుచ్ఛములనేకములు వెలువడుచుండుగాత యని పరమేశ్వరుని ప్రార్థించుచు మిగుల విస్తరించిన నీ వ్యాసమును ముగించుచున్నాను.

(గోలకొండ పత్రిక 18 ఆగస్టు 1926)

నండూరి నారాయణరావు

తెలంగాణాలో సాంస్కృతిక, సారస్వత రాజకీయోద్యమాలకు పట్టుగొమ్మలైన సంస్థలు

ఒకప్పుడు డా॥భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు తెలుంగాణాను గూర్చి ముచ్చటిస్తూ అది రావణాసురుడు పరిపాలించే లంక అన్న భావాన్ని వెలిబుచ్చారన్న విషయం అందరికీ తెలిసినదే. నిజం విచారిస్తే ఆ రోజులలో హైద్రాబాదు రాష్ట్రంలో అంతర్భాగమైన తెలంగాణా గడ్డనుగూర్చి, దానిపై జరిగే పరిపాలననుగూర్చి ఇతరుల అభిప్రాయాలు పై విధంగా వుండటాన్ని బట్టి తెలంగాణాలోని ప్రజల పరిస్థితి ఎంత వెనుకబడి ఉన్నదో, వారి పట్ల ఇతరుల అభిప్రాయాలు ఏవిధంగా వుండినవో వ్యక్తం అవుతుంది. క్లుప్తంగా వివరించాలంటే కీ.శే. కొడాలి సుబ్బారావుగారు హంపీ క్షేత్రంలో "శిలలు ద్రవించి యేడ్చినవి జీర్ణములైనవి తుంగభద్రలోపల, గుడిగోపురంబులు సభాస్థలులైనవి కొండముచ్చు గుంపులకు చరిత్రలో మునిగిపోయినదాంధ్రవసుంధరాధిపోజ్జ్వల విజయ ప్రతాపరభసం బొకస్వప్నకథా విశేషమై", అన్న పద్యము తెలంగాణా పరిస్థితికి కూడా అన్వయిస్తుందని చెప్పవచ్చు. తెలంగాణాలో ఏ ప్రాంతంలోనైనా గుట్ట, పుట్ట, రాయి, రప్ప దేనిని పరిశోధించినా వానిలో నిద్రాణమైవున్న ప్రాచీన చారిత్రక, సాంస్కృతిక, వైజ్ఞానిక, వైభవం వెల్లడి అవుతుంది. ఆంధ్రరాజులకు పుట్టినిల్లయి, ఆంధ్రవీరులకు విహార రంగమై, ఆంధ్ర కవీంద్రులకు పంటభూమై, ఆంధ్రశిల్పులకు ప్రదర్శనాలయమై, కృష్ణ గోదావరి, తుంగభద్ర పుణ్యనదుల జలములచే పూరితమై, శుద్ధ ఆంధ్ర భూభాగం అనదగు హైద్రాబాదులోని, తెలంగాణా రాష్ట్రంలో కొంత కాలం క్రిందట తెలుగుభాష, సంస్కృతి, సాంఘిక జీవనాచారాలు పూర్తిగా నాశనమైపోయినాయి. ప్రజలు పరభాష, పర సంస్కృతి, పర సాంఘిక ఆచారాలకు లోనైపోయినారన్న విషయం వేరుగా చెప్పవలసిన అవసరం లేదు. అట్టి పరిస్థితులలో తెలంగాణాలో తెలుగుభాషా, సంస్కృతులను పునరుజ్జీవింపజేసి ప్రజలలో నవచైతన్యాన్ని కలిగించి నేడు వైభవవోపేతంగా ఉద్భవిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగంగా విలీనమవడానికి దోహదము చేసిన సాహిత్య, సాంఘిక, సాంస్కృతిక సంస్థల సేవలను ఉగ్గడించడం విధాయకమే కదా! వీనిలో ముఖ్యంగా పేర్కొనబడిన సంస్థలు నాలుగు. 1.శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయం, 2.లక్ష్మణరాయ పరిశోధక మండలి, 3.ఆంధ్రబాలికల పాఠశాల, 4.ఆంధ్ర సారస్వత పరిషత్తు. ఆనాడు ఈ సంస్థలు ఉద్భవించి యధాశక్తి సేవచేయకపోతే ఈనాడు హైద్రాబాద్ నగరం ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యపట్టణం అయ్యేదికాదు. తెలంగాణాలో రాజకీయోద్యమానికి తావు వుండేదికాదు. ఈ సాహిత్య సాంస్కృతిక సంస్థలు ప్రజలను మేలుకొల్పి వారిలో నవచైతన్యాన్ని పూరించబట్టే తరువాత ఈ గడ్డపై అనేక రాజకీయ సంస్థలు బయలుదేరి అనేక పోరాటాలు నడిపి, రాజకీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించి, ప్రజా సౌమనస్యాన్ని నెలకొల్పగలిగాయి. తెలంగాణ తెలుగు గడ్డగా నిలిచి ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో విలీనమవుతోంది.

గ్రంథాలయోద్యమం :

అఖిలాంధ్ర దేశంలో ఓం ప్రథమంగా స్థాపించబడిన అచ్చ తెలుగు గ్రంథాలయం హైదరాబాదు నగరంలో సుల్తాన్‌బజారులో నున్న శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయం. దీనికిముందు ఆంధ్రదేశంలో ఒకటి రెండు గ్రంథాలయాలు వున్నట్లు తెలుస్తున్నది. కాని అవి పూర్తిగా ఆంధ్ర గ్రంథాలయాలు కాకపోవడం నుంచి యావదాంధ్రులకు మొట్టమొదటి గ్రంథాలయమన్న కీర్తి దీనికేదక్కింది. ఇంతే కాదు, ఈ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం హైదరాబాదులో గ్రంథాలయోద్యమానికి మాతృదేవత అంటే అతిశయోక్తి కాజాలదు. ఈ గ్రంథాలయం నెలకొన్నప్పటి పరిస్థితిని తలచుకుంటే చాలా విచిత్రంగా కనిపిస్తుంది. ఎముకలు కుళ్ళిన వృద్ధులు ఇదొక సంస్కారోద్యమమని హడలిపోయినారు. పూర్వాచారపరాయణులకు ఇది సొక్కలేదు. ఉర్దూభాష వ్యామోహంలో చిక్కుకున్న యువకులకు ఇది ఏవగింపు అయింది. అట్టి పరిస్థితుల్లో 101 సెప్టెంబరు 1వ తేదీన ఈ గ్రంథాలయం అవతరించింది. ఈ గ్రంథాలయ స్థాపన ప్రజల్లో గ్రంథాలయోద్యమం పట్ల ఎక్కువ ఉత్సుకతను కల్గించింది. ఓరుగల్లులో 'రాజరాజ నరేంద్ర గ్రంథాలయం', నల్గొండ జిల్లాలో ఆంధ్ర విజ్ఞాన్న ప్రకాశినీ గ్రంథాలయం మొదలైన అనేక గ్రంథాలయాలు ఉద్భవించినవి. గ్రంథాలయోద్యమం బ్రహ్మాండంగా కొనసాగినది. ఈ ఉద్యమం లక్ష్యాలు రెండు. ఒకటి ప్రజల్లో వైజ్ఞానికంగానూ, సాంస్కృతికంగానూ చైతన్యాన్ని కల్గించడం. రెండవది ప్రాథమిక స్వత్వాల కోసం ప్రభుత్వంతో పోరాటాన్ని సాగించడం.

1924లో సూర్యాపేటలో (నల్గొండ జిల్లా) ఆంధ్ర విజ్ఞాన ప్రకాశిని గ్రంథాలయం యాజమాన్యంక్రింద గ్రంథాలయోద్యమ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయబడింది. ఆ రోజుల్లో నల్గురు తెలుగు వాళ్లు ఒకచోట కూర్చుని పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటున్నారంటే ప్రభుత్వం వెయ్యి కళ్ళతో పరీక్షిస్తూండేది. ఏ గడపకు తోరణం కట్టినా ఆ యింటికి ఆదర్య ప్రభువులు ప్రత్యక్షమై దక్షిణతాంబూలాదులను బలవంతంగా వసూలు చేస్తుండేవారన్న సంగతి విడమర్చి చెప్పవలసిన అవసరం లేదు. అట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం గ్రంథాలయోద్యమ కార్యకర్తలతో సమావేశం జరుగబోతోందంటే సహిస్తుందా? వెంటనే ఈ సమావేశం జరగటానికి వీల్లేదని తాఖీదులు జారీ చేసింది. సమావేశకర్తలు విస్తుపోయినారు. గ్రంథాలయోద్యమానికి, ప్రభుత్వానికీ మధ్య సంఘర్షణ ఏర్పడింది. సమావేశకర్తలు ప్రభుత్వపు తాఖీదులను సవాలుచేస్తూ హైకోర్టులో దావావేసినారు. హైకోర్టు వారు ప్రజల ప్రభుత్వం ఉభయుల వాదనలు విచారించి, ప్రభుత్వం, ప్రజలు ఏర్పాటు చేసే వైజ్ఞానిక, సాంస్కృతిక సమావేశాలను గూర్చి, అవి ముగియకమునుపే ఒక నిర్ణయానికి రావడం అశాస్త్రీయమనీ, సమావేశం ముగిసిన తరువాత దాని కార్యక్రమాలను బట్టి దానికి రాజకీయాలతో సంబంధంవున్నదా లేదా అని నిర్ధారణ చేసుకోవాలనీ తీర్పు ఇచ్చింది. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఈ సమావేశము ఆరంభంలో దానిని నిషేధించడం అక్రమమని శాసించింది. దీనితో తెలంగాణాలో వైజ్ఞానిక, సాంఘిక, సాంస్కృతిక సమావేశాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలకు స్వేచ్ఛవుందని గుర్తించడం జరిగింది. ప్రజల ప్రాథమిక స్వత్వాలను ప్రభుత్వం అరికట్టరాదని గ్రంథాలయోద్యమ కార్యకర్తలు న్యాయస్థానాల ద్వారా వెల్లడించడం జరిగింది. స్టేట్ కాంగ్రెస్ పుట్టే వరకు పనిచేసిన ఆంధ్ర మహాసభ ఈ ప్రాథమిక స్వత్వాలను కొంతవరకు వినియోగించుకున్నదని చెప్పవచ్చును. ఆంధ్ర మహా సభ ఆరంభంలో అది రాజకీయ సంస్థయని తెలిస్తే ప్రభుత్వం పురిటి మంచంలోనే గొంతుక పిసుకుతుందనే భయంతో, ఒక నియమావళిని తయారు చేసుకోకుండా, ఆదేదో గ్రంథాలయాలమామ్లా సంస్థ యన్నట్లు నటించి కొంత స్తోమతను చేకూర్చుకొని అదనుకనిపెట్టి ఆంధ్రమహాసభగా అవతరించిందని ప్రజలు విశ్వసిస్తారు. ఇది నిజమే అయితే గ్రంథాలయోద్యమం హైదరాబాదులో రాజకీయోద్యమానికి పునాదులు వేసిందని చెప్పవచ్చు. ఆరంభంలో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం కీ.శే. శ్రీ రావిచెట్టు రంగారావుగారి భవనంలో ఉండింది. దీనికి సొంత భవనం లేకుండినది. అప్పుడు ఈ గ్రంథాలయానికి అనుబంధ సంస్థగా ఒక పాఠశాల, ఆంధ్ర భాషోజ్జీవనీ నాటక సంఘం వ్యవహరిస్తుండినవి. అర్బతునాట్ కంపెనీ దినాలవల్ల, మూసీనది ప్రళయంపట్ల పాఠశాల ఎత్తివేయవలసివచ్చింది. నాటక సంఘం ఎక్కువ వృద్ధిలోనికి వచ్చినట్లగుపించదు. ఏది ఎలా అయినా 1915 సెప్టెంబరు మూడవ తేదీన రెసిడెన్సీ మార్కెటురోడ్డుపైన మందిరమునకు పూర్వముగల ఇంటిని, స్థలాన్నీ 2,700 రూపాయలకు ఖరీదుచేయడం జరిగినది. తరువాత గ్రంథాలయ నిర్వాహకుల యొక్కయు, ముఖ్యముగా ఆంధ్రపితామహులకృషి యొక్కయు ఫలితంగా 1921లో ఈ గ్రంథాయలానికి సర్వాంగ సుందరమైన నేటి భవన రాజము నిర్మింపబడినది.

అప్పటినుండి శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం కవి పండితుల సన్మానములకు, ఉపన్యాస సభలకు, జయంత్యుత్సవాలకు, గ్రంథాలయసమావేశాలకు, ఇతర సాంఘిక, సాంస్కృతిక, వైజ్ఞానిక సమ్మేళనాలకు హైదరాబాదులో ప్రధానరంగ స్థలమైనది.

విజ్ఞాన వ్యాప్తికి, గ్రంథసేకరణ, గ్రంథ పఠనావకాశములేగాక తెలుగు భాషా, సంస్కృతుల సంరక్షణాభివృద్ధికై కృషి సల్పిన మహనీయులను సంస్మరించి, యువకుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించడం అత్యంతావశ్యకమై యుండుటవల్ల అది గ్రంథాలయాల విధుల్లో ఒకటిగా పరిగణింపబడినది. శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ప్రతి ఏడు ఆంధ్రభోజుని నామాంకితముగ స్థాపితమైన నిలయంలో ఆ మహనీయుని జయంత్యుత్సవము జరుపుచుండెడిది. ఈ ఉత్సవ ప్రభావం కొన్ని ఇతర సమాజములపై పడుట వల్ల అవి కూడా క్రమేణా ఈ ఉత్సవాన్ని వైభవోపేతంగా జరుపుచుండెడివి. తరువాత తిక్కన, నన్నయ, వీరేశలింగం, లక్ష్మణరావు వర్ధంతులు కూడా అమల్లోనికి వచ్చినవి. తదాది తెలుగు ప్రజల్లో భాషా పోషకుల సంస్మరణ మొలకెత్తినది. దీని ఫలితంగా అప్పటివరకు మాతృభాషను నిర్లక్ష్యంచేసిన తెలుగు ప్రజలు తెలుగు భాషలో తియ్యదనాన్ని ఆస్వాదించడం మొదలుపెట్టినారు.

వివిధ సాహిత్య సాంస్కృతిక రంగాల్లో పాండిత్యాన్ని గడించుకొన్న మహనీయులకు సన్మానసభలను ఏర్పాటుచేసి ప్రజలకు వారి దర్శన భాగ్యమును లభింపజేయుటయేగాక, వారి వాగమృతధారను గ్రోలుటకు అవకాశమును ఈ గ్రంథాలయం చేకూర్చి పెట్టినది. సన్మానితులలలో "ఆంధ్రనాటక పితామహులు" కీ.శే.ధర్మవరం కృష్ణమాచార్యులుగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు, చెల్లపిళ్ళ వెంకటశాస్త్రిగారు, 'జగదేకవీర' కోడి రామమూర్తిగారు, 'దేశోద్ధారక' కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు, పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు, 'గాన విద్యాప్రవీణులగు'

మాస్టర్ మనోహర బార్వేగారు గణనీయులు. 1923లో కోడి రామమూర్తిగారికి 'జగదేకవీర' అను బిరుదమును తెలంగాణా ప్రజలు ఈ గ్రంథాలయంలోనే ప్రసాదించిరి. వీనినిబట్టి ఆనాడే ఈ గ్రంథాలయం ద్వారా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశాలాంధ్ర నిర్మాణ బీజములు నాటబడినవని చెప్పవచ్చు. అప్పుడు, ఇప్పుడు ఈ గ్రంథాలయంలో వివిధ విషయాలపై వేల సంఖ్యలో ఉపన్యాస సభలు ఏర్పాటు చేయబడుచున్నవి. వీటివల్ల ప్రజల్లో విజ్ఞాన సాంస్కృతిక, సాంఘిక జీవిత విధానాలు బ్రహ్మాండంగా ప్రచారమగుచున్నవన్న అది కాచివడపోసిన సత్యమే.

ఆంధ్రసోదరీ సమాజం వారు ప్రతి వారం ఈ భవనంలో సభలు, సమావేశాలు జరుపుకొనుచుండెడివారు, ఈ నిలయంలో స్త్రీలు పెద్ద సంఖ్యలో సభ్యురాండ్రుగాచేరి సభలయందును, సమావేశములందును పాల్గొనుచుండెడివారు. స్త్రీలలో వైజ్ఞానిక, సాంస్కృతిక చైతన్యాన్ని కలిగించుటలో ఈ గ్రంథాలయం చక్కటి పాత్రను నిర్వహించగలిగింది.

దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, దివాన్‌బహదూరు నెమలి పట్టాభిరామయ్య, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు, చిలుకూరి నారాయణరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, డా॥ అచ్చమాంబ, అయ్యంకి వెంకటరమణయ్య మొదలైన ప్రముఖులు ఈ గ్రంథాలయమునకు విచ్చేసి ప్రజలకు రాజకీయమిళితమైన విజ్ఞాన, సాంస్కృతిక సందేశములనొసగిరి.

55 ఏండ్ల క్రింద ఆంధ్రభాష నికృష్టస్థితికిని ఇప్పటి సౌభాగ్యస్థితికిని మూలకందమైన ఈ భాషానిలయం జన్మసార్థకమైనది. ఆంధ్ర మాతను మనసార ప్రేమించి ఆరాధించి ఆంధ్రభాషకు చక్కని దోహద మొసగినది.

చారిత్రక పరిశోధన :

హైద్రాబాదు రాష్ట్రం దక్షిణాపథంలో ప్రాచీన మధ్యయుగ చరిత్రకు ఆయువుపట్టువన్న విషయం సర్వవిదితమే. ఈనాడు తెలంగాణాలో జీర్ణావశేషాలైవున్న గుళ్ళు, గోపురాలు, కోటలు, శాసనాలు, తాళపత్ర గ్రంథాలు, ప్రాచీన ఆంధ్రరాజుల వైభవాన్ని, శౌర్యపరాక్రమాలను, వైదుష్యాన్ని, ఆనాటి సాంఘిక, సాంస్కృతిక, జీవనాన్ని వేయినోళ్ళ చాటుతూ ఉన్నవి. వీనిని పరిశోధించి వానిలో నిద్రాణమైవున్న చారిత్రక, ప్రాశస్త్యాన్ని విప్పిచెప్పినప్పుడే ప్రజలలో ఉత్సాహం, ఉద్రేకం, ఉద్వేగం, రేకిత్తి స్వాతంత్ర్య సముపార్జనకై బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమాలు జనింపగలవని వేరుగా నొక్కి చెప్పవలసిన అవసరం లేదు. మామూలుగా చారిత్రక చిహ్నాలను పెళ్లగించి ప్రాశస్త్యాన్ని వెల్లడించడం ప్రభుత్వ ఆర్కశాఖవిధి అయి ఉన్న నిజాం రాష్ట్రంలో ఆర్కశాఖ యీ పనిని చేస్తూ ఉండేది. కాని ఆ శాఖ ఆరోజులలో ఎక్కువగా క్రొత్త చరిత్రను సృష్టించడానికై కృషిచేస్తూ వుండడంవల్ల సిసలైన ప్రాచీన చిహ్నాలకు దక్షత యోగ్యత ఎక్కువగా లభ్యమయ్యెడిదికాదు. తత్ఫలితంగా తెలంగాణాలో వున్న చారిత్రక చిహ్నాలు క్రమక్రమంగా జీర్ణమైపోవడం ప్రారంభించినవి. వీనితో పాటు ప్రజలలో భాషా సంస్కృతులు, సంప్రదాయాలు అడుగంటి పోయి పెడదార్లు పట్టినవి. 1922లో ఆంధ్రజన సంఘము ఈ రహస్యాన్ని గుర్తించి నిజాంరాష్ట్ర ఆంధ్రప్రాంతంలో అముద్రిత గ్రంథాలను, శాసనాలను, తాళపత్ర గ్రంథాలను సేకరించడానికి తీర్మానించి ఒక ప్రత్యేక సంఘాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో కీ.శే.కొమరరాజు లక్ష్మణరావు గారు సభ్యులుగావుండి ప్రముఖ పాత్రను వహించారు. తరువాత యీ సంఘం ఒక పరిశోధక శాఖగా రూపొందింది. 1923లో శ్రీ లక్ష్మణరావుగారు దివంగతులైన తరువాత ఈ సంఘానికి ఆయన స్మారక చిహ్నంగా లక్ష్మణరావు పరిశోధక మండలి అని పేరు పెట్టడం జరిగినది. ఇటువంటి సంఘం ఆంధ్ర దేశంలో ఇంకొకటి లేదంటే అతిశయోక్తి కాదు. ఈ పరిశోధక మండలి తెలంగాణాలో చారిత్రక పరిశోధక కార్యక్రమాన్ని నిర్వర్తించింది. 1931లో పరిశోధక మండలి ఆంధ్ర జన సంఘంలో ఏ విధమైన సంబంధం లేకుండా ఒక ప్రత్యేక సంస్థగా రూపొందింది. ఇప్పటి వరకు ఈ మండలి తెలంగాణాలో 123 శాసనములను పరిశోధించి తెలంగాణా శాసనములు అనుగ్రంథమును ప్రకటించింది. ఇది ఒక అపూర్వమైన గ్రంథ రాజం. ఇందులో 57 కాకతీయ శాసనాలు, 42 చాళుక్య శాసనాలు, 24 ఇతర శాసనాలు, తెలుగులోను, ఇంగ్లీషులోను వివరింపబడి వున్నవి.

ఈ మండలి కార్యకర్తలు సేకరించిన తాటాకులమీదను, పీచుకాగితముల మీదను వ్రాయబడిన కొన్ని లిఖిత గ్రంథాలు అనేక అపూర్వ విషయాలను వెల్లడించుచున్నవి. ఈ గ్రంథములవల్ల హైద్రాబాదులో కొందరు కొత్త కవులపేర్లు బైటబడినవి. వీనిలో 'తాలాంకనందయనీ పరిణయము', 'శ్రీకృష్ణాశాతానదీయము', 'చిలువపడగరేని సేరణము (అచ్చతెలుగు)', 'మధురవాణి విలాసం' అను ఆంధ్ర ప్రబంధములకు విమర్శనాత్మకమైన వర్ణనములు వ్రాయబడివున్నవి. ఇవికాక మండలి కార్యకర్తలు అనేక ప్రాచీన నాణెములను సేకరించివున్నారు. వీనిలో పరిశోధించి వివరములు కనుగొనవలసివున్నది. విజయనగర సామ్రాజ్యపు కడపటిరాజగు రామరాయల పటంపూనాలో భారత ఇతిహాస పరిశోధక మండలివారి గ్రంథాలయంలో ఒక పారశీక పుస్తకంలో వున్నదన్న విషయాన్ని పరిశోధించి గ్రహించి ఆ గ్రంథము హైద్రాబాదుకు తెప్పించబడింది. ఈ పుస్తకము సచిత్రమై, పద్యాత్మకమైన చిన్న గ్రంథము. ఇందులో 'రామరాయలు యుద్ధమునకు వెడలుట అను పటము కలదు' దానిలో నుంచి రాయల పటం రంగులలో ప్రతి వ్రాయించి శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో ప్రతిష్టించడం జరిగింది. ఈ మండలివారు తెలంగాణాలో అనేక శాసనాలను సేకరించి పరిశోధించి వివరములను తయారుచేసి వుంచినారు. కాని సరియైన ఆర్థిక దోహదం లేకపోవడం చేత అవి ఇంకను అముద్రితములుగానే నిలిచివున్నవి. ఇవి ప్రకటితమైనచో ప్రాచీనాంధ్ర వైభవానికి చెందిన అనేక అమూల్యమైన విషయాలు వెల్లడికాగలవు.

తెలంగాణా శాసనముల సంపుటి ప్రచురణ సమయంలో ప్రభుత్వం అప్రత్యక్షంగా కొన్ని ఇబ్బందులు కలిగించినది. కాని ఏ పరిస్థితులలోకూడా మండలి కార్యకర్తలు ఆత్మ గౌరవాన్ని కోల్పోవక, పోతన జన్మించిన గడ్డకు చెందినవారు కాబట్టి ఆయన భాగవతాన్ని పరరాజులకు అంకితము చేయడానికి ఏ విధంగా యీయకొనలేదో, అదేవిధంగా ఈ శాసన సంపుటినిగూడా లక్ష్మణరాయ పరిశోధక మండలి కార్యకర్తలు పర ప్రభుత్వాలకు ఒప్పగించకుండా కష్టనష్టాలను భరించి సొంతంగా ప్రచురించి సిసలైన చారిత్రక వివరాలను ప్రజలకు అందజేసి పుణ్యం గట్టుకొన్నారు. ఇప్పుడు అముద్రిత గ్రంథముగానున్న రెండవ సంపుటి శాసనాలు ప్రాచీన ఆంధ్ర రాజుల వారసులైన ఆంధ్రులు నిర్వహిస్తున్న ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వంలో ఎట్టి ఇబ్బందులు లేకుండా ప్రజలకు అందగలదని ఆశించడం ధర్మమే కదా!

విద్యావ్యాప్తి :

ఇరవైఐదేండ్ల క్రితం హైదరాబాదు రాష్ట్రంలో స్త్రీలకు విద్యా సౌకర్యాలు పూర్తిగా మృగ్యమైపోయినవి. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో పేరుకు మాత్రం మాతృభాషలు బోధనా భాషలుగా ఉండేవి గాని, ఆ పాఠశాలల్లోని పరిస్థితులు దక్షిణాఫ్రికాలో వర్ణభేద విధానం కంటే అధ్వానంగా వుండేవంటే అతిశయోక్తి కాజాలదు. స్త్రీలలో నిరక్షరాస్యత దినదిన ప్రవర్థమానమై పోయినది. రాష్ట్రం మొత్తం జనాభాలో 100కి 50 మంది విద్యావిహీనులై పోయినారు. రణరంగంలోనూ, ప్రజాహిత పరిపాలనలోనూ దక్షురాలనిపించుకొని, మార్కోపోలో మొదలైన విదేశ యాత్రికుల మన్ననలను పొందిన రుద్రమాంబను గన్న తెలంగాణా గడ్డ నిర్వీర్యమై పోయినది. స్వాతంత్ర్య సిద్ధికై సంకుల సమరంలో చచ్చినా బ్రతికినా స్వర్గంబు మనదేనని వెన్నుచరచి పురుషుల్లో దేశభక్తిని, ధీరత్వాన్నీ, ఉద్రేకాన్ని, ఉద్వేగాన్ని పురిగొల్పి, కడకు తన పసుపు కుంకుమలను కూడా త్యాగం చేయగల్గిన వీరమాతలు లేకుండా పోయినారు. జాత్యభివృద్ధి తిరోగమించినది.

ఇట్టి పరిస్థితులలో 1926లో హైదరాబాదులో సంఘ సంస్కార మహాసభ జరిగినది. ఈ సమావేశం దేశాభ్యున్నతికి స్త్రీ విద్య అత్యంత ఆవశ్యకమని గుర్తించినది. బాలికలకు వారి మాతృభాషలద్వారా ఉన్నత విద్య నభ్యసించడానికై ఉన్నత పాఠశాలలను స్థాపించాలని తీర్మానించినది. ఇదొక చారిత్రాత్మక మైన తీర్మానం. దీనితో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య స్త్రీల విద్యావిషయంలో సంఘర్షణ ఏర్పడినది.

సంఘ సంస్కార మహాసభ నియమించిన ఉపసంఘం 1928 జూన్ 8వ తేదీన హైదరాబాదులో తెలుగు, మహారాష్ట్ర భాషల్లో బాలికల విద్యాభ్యాసానికై ఉన్నత పాఠశాలలను స్థాపించడానికై పూనుకొనినది. నిజాం ప్రభుత్వం తన పాలిత ప్రాంతాల్లో ఇట్టి పాఠశాలలను నెలకొల్పడానికి అవకాశాలు లేకుండా చేసినది. అప్పుడు హైదరాబాదు నగరం పూర్తిగా నిజాం ఆధీనంలో ఉన్నప్పటికీ రెసిడెన్సీ బజారు (నేటి సుల్తాను బజారు) బ్రిటీషు ప్రభుత్వ ప్రతినిధి అధికారావరణలో ఉండేది. ఆ ప్రాంతంలో నిజాం సర్కారు ఖానూనులు చలామణీ అయ్యేవికావు. అందువల్ల ఈ పాఠశాల ఆ ప్రాంతంలో పై తేదీనాడు స్థాపించబడినది. ఆరంభంలో ఈ పాఠశాలలో తెలుగు, మహారాష్ట్ర భాషల్లో బాలికలకు విద్య గరపబడుచుండెడిది. ముఖ్యంగా మూడేండ్లు నడిచిన తరువాత ఆంధ్రమహాసభ కేంద్ర సంఘం వారు ఈ పాఠశాల నిర్వహణ బాధ్యతను తమ చేతుల్లోకి తీసుకొని పూర్తిగా దీన్ని తెలుగు పాఠశాలగా రూపొందించినారు. అప్పటిలో హైదరాబాదులో తెలుగు బాలికలకు మాతృభాషలో విద్యాభ్యాసానికై ఒక పాఠశాల ఏర్పడినది.

పాఠశాల క్రమక్రమాభివృద్ధినొంది స్థిరపడింది. బాలికలు తరగతి తరువాత తరగతి చొప్పున విద్యనభ్యసించి 10వ తరగతికి వచ్చినారు. పాఠశాలలో జరుగుచుండెడి పరీక్షలకు అధికారముద్ర పడవలసిన అవసరం ఏర్పడినది. లేనిచో ఆ చదువుకు గణ్యత, చలామణి వుండదు గదా! అందువల్ల పాఠశాల నిర్వాహకులు స్థానిక ఉస్మానియా విశ్వవిద్యాలయం వారిని అడుగగా ఉర్దూతప్ప మరే భాషను ప్రధాన భాషగా గుర్తించబోమని నిష్కర్షగా నిరాకరించినారు. సోదర ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు ఆదరిస్తారని గంపెడంత ఆశలో అప్పటి ఉపాధ్యక్షులైన శ్రీ సి.ఆర్.రెడ్డిగారిని అర్థించగా వారు స్వదేశ సంస్థానములతో ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు సంబంధము లేదని తొంటిచెయ్యి చూపించినారు. నాగపూరు విశ్వవిద్యాలయంవారు తమ వద్ద తెలుగు భాషకు ఏర్పాటు లేదని మనస్సు నొచ్చుకున్నారు. విఫలమనోరథులైన పాఠశాల నిర్వాహకులు అయోమయావస్థలో పడిపోయినారు. పునహాలోని శ్రీమతి నాతీబాయి దామోదర్ ధాకర్సే భారతమహిళా విశ్వవిద్యాలయము వారిని ఆశ్రయించగా వారు అత్యంత సానుభూతితో ఈ పాఠశాలను తమ విశ్వవిద్యాలయమునకు అనుబంధ సంస్థగా చేర్చుకొనుటకు అంగీకరించినారు. అప్పటినుంచి ఈ పాఠశాలలో విద్యావిధానము మహిళా విశ్వవిద్యాలయ ప్రణాళికల ననుసరించి ఆంధ్రభాషలో బాలికలకు విద్యగరపుటేర్పాట్లు జరిగినవి.

1933 నుండి 1945 వరకు బాలికలు ఈ విశ్వవిద్యాలయం పరీక్షలకు కూర్చొండెడివారు. కొందరు స్త్రీలు ఈ పాఠశాల ద్వారా ప్రయివేటుగా పై విశ్వవిద్యాలయం పరీక్ష ఇచ్చుచుండెడివారు. అట్టి వారిలో నేటి విద్యాశాఖ ఉపమంత్రిణి శ్రీమతి సంగెం లక్ష్మి బాయిగారొకరు. మోడైపోయిన తెలంగాణా గడ్డపై రెండు చినుకులు పడడంతో పునఃచిగురించింది. పరిపాలనా నిర్వహణలోనూ, రాజకీయాల్లోనూ పురుషులకు చేదోడు వాదోడుగా వ్యవహరింపగలిగిన స్త్రీలను ఈ పాఠశాల తయారు చేయగలిగింది.

శ్రీమతి నాతీబాయి దామోదర్ ధాకర్సే భారత మహిళా విశ్వవిద్యాలయం ప్రభుత్వముద్రను పొందిన వ్యవస్థ కాకపోవడం నుంచి ఈ పాఠశాల పరీక్షల సమస్య తాత్కాలికంగా ఒక దోవలో పడినప్పటికి అపరిష్కృతంగానే నిలిచిపోయింది. పరీక్షలకు ప్రభుత్వ గణ్యత లేకపోవడం నుంచి విద్యార్థినులలో కొంత అసంతృప్తి జనించింది. అప్పుడు ఆంధ్రపితామహులు, ఈ పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు అయిన శ్రీ మాడపాటి హనుమంతరావుగారు తిరిగి ఆంధ్ర విశ్వవిద్యాలయము వారితో ఉత్తర ప్రత్యుత్తరములు సాగించిరి. శ్రీ హన్మంతరావుగారి కృషి ఫలితంగా అప్పటి ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్న శ్రీ లక్కరాజు సుబ్బారావుగారు సిండికేటు వారిని ఒప్పించి 1945లో యీ పాఠశాల విద్యార్థినులను ఆంధ్ర విశ్వవిద్యాలయంవారి మెట్రిక్యులేషన్ పరీక్షకు ప్రయివేటుగా కూర్చోడానికి అవకాశాన్ని కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆనాటితో స్త్రీల విద్యావిషయంలో అఖిలాంధ్ర నిర్మాణానికి అంకురార్పణం జరిగింది. 1945నుంచి 1948 వరకు ఈ పాఠశాల విద్యార్థినులు ఆంధ్రవిశ్వవిద్యాలయం మెట్రిక్యులేషన్ పరీక్ష ప్యాసై ఉన్నతవిద్య నభ్యసిస్తూ వచ్చినారు.

1948 పోలీసు చర్యానంతరం ఆంధ్ర సారస్వత పరిషత్తువారి కృషి ఫలితంగా హైద్రాబాద్ హెచ్.ఎస్.సి. బోర్డువారు మాతృభాషను సెకండరీ పాఠశాలల్లో బోధనా భాషగా నిర్భంధించడంవల్ల ఈ పాఠశాల ప్రభుత్వంచే గుర్తించబడింది. దానితో విద్యార్థినులు చదువుకున్నచోటనే పరీక్షలిచ్చి ఉన్నత విద్యనభ్యసించడానికి సుకరమైన మార్గం ఏర్పడింది. ఇప్పటికి వందల వేల సంఖ్యలో తెలంగాణాలోని బాలబాలికలు ఈ పాఠశాల ద్వారా విద్యాధనాన్ని ఆర్జించుకొని అనేక రంగాలలో పనిచేస్తున్నారు.

సారస్వతోద్యమం :

1942లో నిజాం ప్రభుత్వం హైదరాబాదులో తెలుగు భాషకు నామరూపాలు లేకుండా చేసి, బలవంతంగా ఉర్దూ భాషను

ప్రజలనెత్తినరుద్దాలని దృఢనిశ్చయం గావించినది. తన కార్యక్రమాన్ని అవిచ్ఛిన్నంగా కొనసాగించడానికై తాను ఆడిన ఆటకు పాడిన పాటకు ప్రక్కతాళం వేసే నామమాత్రమైన సంస్థలను సృష్టించి ధనం గుప్పి, వానిద్వారా తెలుగుభాష వినాశనానికి ఒక బ్రహ్మాండమైన ఉద్యమాన్ని లేవదీసింది. ఈ దారుణ విధానాన్ని చూచి, భాషామతల్లికి జరుగుతున్న అన్యాయాన్ని భరింపలేక హృదయాలు మండిన కొంత మంది యువరచయితలు ఒక సారస్వత సంస్థను నెలకొల్పి ప్రభుత్వ కుయత్నాలను భగ్నమొనరించి ప్రజల్లో భాషా ప్రచారం గావించి, తెలంగాణాలో మారుమూలపడియున్న రచయితలను ఉద్ధరించి, క్రొత్త రచయితలను సృష్టించాలనే సంకల్పంతో పెద్దలనాశ్రయించి వారి సహాయ, సహకారాలతో 1943 మే 26వ తేదీన 'నిజాం రాష్ట్రాంధ్ర సారస్వత పరిషత్తు'ను స్థాపించినారు.

దీని ఆదర్శాలు : 1. రాష్ట్రాంధ్రుల్లో మాతృభాషా వికాసం పెంపొందించుట. 2.ఆంధ్రభాషాభివృద్ధికై సర్వవిధముల కృషిచేయుట.

సాధనాలు : 1. రాష్ట్రమండలి వివిధ ప్రాంతాల్లో వివిధ వాఙ్మయ శాఖలతో గూడిన సమావేశములు జరిపి, ప్రబోధము కల్గించుట. 2. పాఠ్యప్రణాళికను సిద్ధపరచి, పరీక్షలు జరుపుట. 3. రాష్ట్రమందుగల సారస్వత సంస్థలను, సారస్వతోపాసకులను ప్రోత్సహించుట. 4. ఉత్తమ గ్రంథములకు పారితోషికములనిచ్చియు, రచయితలకు సన్మానములు జరిపియు ఇతర విధముల వారిని ప్రోత్సహించియు, సాహిత్య ప్రకృతి విజ్ఞాన, సాంఘిక శాస్త్రములపై గ్రంథములను వ్రాయించి ప్రకటించుట.

ఆరంభంలో పరిషత్తు కార్యకర్తలు పెట్టెపెట్టున వాడ వాడలా ఇంటింటా తెలుగు ప్రజలను మేల్కొల్పి, 'నీవు తెలుగు బిడ్డవు', 'నీ భాష తెలుగు', 'నీ మాతృభాషను నిర్లక్ష్యం చేస్తే నీకు భవిష్యత్తులేదు' అని ప్రబోధం చేసినారు.

పల్లెల్లోవుండే పాఠశాలలు మొదలుకొని, నగరంలోవున్న విశ్వవిద్యాలయం వరకు అన్ని విద్యాలయాలు ఉర్దూమయం అయిపోవడం నుంచి విజ్ఞానార్జనకు వీలులేక సతమతమౌతున్న తెలుగు ప్రజలకు కొంత అవకాశం కల్పించడానికై పరిషత్తు ప్రవేశిక, మాధ్యమిక, ఉన్నత తరగతులకు మూడు విధములైన పరీక్షలను ఏర్పాటు చేసినది.

ఓరుగల్లులో జరిగిన ద్వితీయ వార్షిక సమావేశంలో తీర్మానించిన ప్రకారం ఓరుగల్లు కోటలో కవి సమ్మేళనం జరుపగా, దీనికి విఘాతము కలిగించుటకు దుండగులు చేసిన కుటిల ప్రయత్నాలు అందరికీ తెలిసినవే. 1944–45 సంవత్సరం పరిషత్తుకు పరీక్షా సమయమైనది. కార్యకర్తలపై పోలీసు వారంట్లు జారీచేయబడుటయే గాకుండా, కార్యదర్శిపై గుండాలు దౌర్జన్యం కూడా జరిపినారు. పరిషత్తు కార్యకలాపాలకు అవరోధం కల్పించి, భయభ్రాంతులను కల్గించబడినవి. పరిషత్తు నాల్గవ వార్షికోత్సవం మహబూబునగరంలో (పాలమూరు) జరిగినది. ఈ ఉత్సవాలు యువకులను ఎక్కువగా ఆకర్షించినవి. అప్పుడే మతోన్మాద పూరితములైన రాజకీయ కల్లోలములు ఆరంభమైనవి. వార్షికోత్సవములు జరుగుచుండగనే మహబూబునగరం చుట్టుపట్ల అసహ్యకరమైన సంఘటనలు జరిగినవి. సారస్వత ప్రచారమునకు రాష్ట్రంలో అవకాశం లేకుండా పోయినది.

పోలీసుచర్య ముగియువరకు పరిషత్తు దినదినగండం వెయ్యేళ్ళాయుస్సు అన్నట్లుగా బ్రతికి బయటపడి ప్రభుత్వ ప్రయత్నాలకు అవరోధాలను కల్పించి, తెలంగాణా ప్రజలను పరభాష, పరసంస్కృతులకు ఆహుతి కాకుండా సంరక్షించి రాష్ట్ర రాజకీయోద్యమానికి వైజ్ఞానికంగానూ, సాంస్కృతికంగాను తయారుచేసి పుణ్యం కట్టుకున్నది.

పోలీసు చర్యానంతరం స్వేచ్ఛాపూరితమైన వాతావరణంలో ఉడుకు రక్తం ఉప్పొంగే యువకుల నాయకత్వాన పరిషత్తు కార్యకలాపాలు ద్విగుణీ కృతోత్సాహంతో నిర్మాణాత్మకమైన కార్యక్రమం వైపు మళ్ళినవి. పరిషత్తు ఆంధ్ర సారస్వత పరిషత్తుగా రూపొందినది. దీనితో హైదరాబాదు సాహిత్య రంగంలో విశాలాంధ్ర నిర్మాణానికి నాందీప్రస్తావన జరిగింది. పరిషత్తుకు తెలంగాణా జిల్లాల్లోనేగాక మద్రాసు రాష్ట్రంలో ఉండిన అన్ని ఆంధ్ర ప్రాంతాల్లోనూ, బొంబై నగరంలోనూ కూడా అనేక శాఖలు అవతరించినవి. పరిషత్తుకు ఒడుదుడుకులు లేని స్థిరమైన ఆర్థిక స్తోమత చేకూరినది. హైద్రాబాదు ప్రభుత్వం ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించడానికి అనుమతించినది. పరిషత్తు తెలంగాణాలో 64 వయోజన పాఠశాలలను నడుపుచున్నది. కాలరీ కార్మికులకై కొత్తగూడెం, ఇల్లందు, సాస్తి, బెల్లంపల్లి మున్నగు బొగ్గుగనుల ప్రాంతాల్లో 16 వయోజన పాఠశాలలు తెరువబడినవి. యువక కార్యకర్తలకు వయోజన విద్యా శిక్షణ గరపడానికై ప్రతి జిల్లాలోనూ వయోజన శిక్షణ కేంద్రాలను నడుపవలెనని పరిషత్తు ఒక సమగ్రమైన పథకాన్ని సిద్ధంచేసింది. ఈ కార్యకలాపాలలో ఒక భాగంగా 1951 ఫిబ్రవరి 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు పరిషత్తు రాష్ట్రమంతటా వయోజన విద్యా సప్తాహములను జరిపి వయోజనులలో విజ్ఞాన తృష్ణను జనింపజేసింది.

ఉస్మానియా విశ్వ విద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దానిని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చడాన్ని పరిషత్తు పూర్తిగా వ్యతిరేకించినది. ఈనాడు తెలంగాణాలో సుమారు 150 మందికవులు, 100 మంది కథకులు, 25 మంది పత్రికారచయితలు, 10 మంది చరిత్ర పరిశోధకులు, శాస్త్రజ్ఞులు, 200 మందికిపైగా ఇతర రచయితలుద్భవించారు.

తెలంగాణాలో చారిత్రక సాంఘిక, సాంస్కృతిక, సారస్వత ఉద్యమాలకు ఆయువుపట్టులైన శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయం, లక్ష్మణరాయ పరిశోధక మండలి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర బాలికల పాఠశాల విశాలాంధ్ర ముఖ్య పట్టణమైన హైదరాబాదు నగరంలో నెలకొల్పబడి వుండటం ఆంధ్రుల అదృష్టమని చెప్పకతప్పదు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రముఖ పాత్ర నిర్వహించిన ఈ సంస్థలను భద్రపరచి పోషించి, ఉన్నతస్థితికి గొనిపోవలసిన బాధ్యత యీనాడు కేవలం తెలంగాణీయుల పైననేగాక అఖిలాంధ్ర పజానీకంపైన ఉన్నదని గుర్తించాలి. వీటిని నీటముంచినా పాలముంచినా వారిదే భారం.

(గోలకొండ పత్రిక 1-11-1956)

డా॥ తిరుమల రామచంద్ర

తెలుగు ప్రాకృతాల సంబంధం

ప్రాకృతం అనగానే అటు పశ్చిమోత్తరాన ఉత్తర ధ్రువ సమీపంలోని నార్వే స్వీడన్‌ల నుంచి, ఈశాన్య పూర్వాన వాల్డివాస్టోక్‌వరకు, ఇటు దక్షిణ పశ్చిమాన యూరప్‌నుండి ఆసియా దేశాల మీదుగా ఆగ్నేయాసియాలోని ఇండోచైనా-ఇండోనేషియాల వరకు ఒకప్పుడు వ్యాపించిన గొప్ప భాష సాక్షాత్కరిస్తుంది. ఆ భాషలో నేటి స్లావ్ భాషల పూర్వ స్వరూపాలు మొదటి దశకాగా, ఆగ్నేయాసియా దేశాల భాషల పూర్వ స్వరూపాలు చివరి దశ. ఇది ప్రజల భాష, ప్రజల నిత్యవ్యవహార భాష, ప్రజల ప్రేమ భాష, ప్రజల కష్టసుఖాల భాష. ఇదే ప్రాకృతులు - ప్రాకృతుల భాష- ప్రాకృత భాష.

సంస్కృతం అపభ్రష్టమై ప్రకృతమైందని ప్రాచీన భారతీయ విద్వాంసులు పలువురు, ఆధునికులు కొందరు భావించడంవల్ల అపసిద్ధాంతాలు పుట్టాయి. మానవ జాతి తొలిచ్ఛంద రూపమైన ఋగ్వేదంలో ప్రాకృత భాషా రూపాలు కానరావడంవల్ల ఋగ్వేద భాష కన్నా నాతి భిన్నమూ అపరిష్కృతమూ అయిన భాష ఒకటి ఉండి ఉంటుందని, అదే ప్రాకృతమని, లేక ప్రాకృతమూలమని భావించవచ్చు. ఆ ప్రాకృత భాషా పదరూపాలను కొన్నిటిని తెలియజేయడం అప్రస్తుతం కాదు.

వైదిక భాషలో నేటి ప్రాకృత భాషా పదాలు, స్వరూపాలు కనిపించడం ఎవరికైనా ఆశ్చర్యకరమే. ప్రాకృత ప్రత్యయాలు వైదిక సంస్కృతంలో ఎలా మిగిలి పోయాయో చూస్తే, ప్రాకృత భాషలకు వైదిక భాషకూ మూల మనదగిన భాష ఇంకొకటి ఉండాలని అనుమానించవలసి వస్తుంది. అటువంటి స్వరూపాలు కొన్ని ఇవి.

ప్రాకృత పదాలలో పదాది ఋకారం లుప్త మవుతుంది : బృంద-బంద; మృగ-మగ, మిగ, ముగ, మొగ. ఋకారానికి ఉ ఆదేశమౌతుంది. పృధ్వీ-పృహక, వైదిక సాహిత్యంలో ఇలాంటి ఋలుప్త రూపాలు కనిపిస్తాయి. కృత-బుధ (ఋ :1.46.4)

ప్రాకృత పదాలలో సంయుక్తాక్షరాలు దీర్ఘాలవుతాయి: దుర్లభ-దూలభ; విశ్రమ-విశామ; స్పర్శ-పాస. వైదిక భాషలోనికి ఇలాటి వైరూప్యం కనిపిస్తుంది: దుర్లభ-దూలభ (ఋ. 4.9.8); దుర్నాశ-దుణాశ (శు.య.ప్రాతి3.45)

ప్రాకృతంలో అంతిమ వ్యంజనలోపం కనిపిస్తుంది: తావత్-తావ; యావత్-యావ, వైదిక భాషలోనికి ఇలాటిది ఉన్నది : పశ్చాత్-పశ్చా (అథర్వ సంహిత. 10.4.11); ఉచ్చాత్-ఇచ్చా (తైత్తి.సంహి. 2.3.14); నీచాత్-నీచా(తైత్తి.సంహి. 1.2.14)

సంయుక్తాక్షరాలలో రేఫయకారాలలోపం ప్రాకృతంలో ఉంది: ప్రగల్భ-పగల్భ; శ్యామా-సామా; వైదికభాషలలోను ఈ లోపం కనిపిస్తుంది: అప్రగల్భ-అపగల్భ (తైత్తి.సం. 4.5.61); త్ర్యచ-త్రిచ (శతపథబ్రా. 1.3.3.33).

సంయుక్త పదాలలో పూర్వదీర్ఘవర్ణం ప్రాకృతంలో హ్రస్వంగా మారుతుంది: పాత్ర-పత్త; రాత్రి-రత్తి; సాధ్య-సజ్జ. ఈపద్ధతి వైదిక భాషలోను ఉంది: రోదసీప్రా-రోదసిప్ర (ఋ. 10. 88. 10); అమాత్ర-అమత్ర(ఋ. 3. 66. 4).

ప్రాకృతంలో దకారం డకారంగా మారుతుంది : దణ్డ-డణ్డ; దంస-డంస; దోలా-డోలా; వైదిక భాషలోను ఈ మార్పు అక్కడక్కడ కనిపిస్తుంది: దుర్దభ-దూడభ (వాజసనేయసం. 3. 36); పురోదాస-పురోడాశ (శుక్లయుజు. ప్రాతి. 3. 44)

ప్రాకృతంలో ధ హ గా మారుతుంది: బధిర-బహిర; వ్యాధ-వాహ. వైదిక భాషలోను ఇది క్వాచిత్కంగా ఉంది: ప్రతిసంధాయ-ప్రతిసంహాయ (గోపథబ్రహ్మ 2. 4)

ప్రాకృతంలో సంయుక్త వ్యంజనాలలో స్వరం ప్రవేశించి ఉచ్చారణ సౌలభ్యం కలిగిస్తుంది: క్లిష్ట-కిలిట్ఠ; స్వ-సువ; తన్వీ-తణువీ. వైదిక భాషలోను ఈ పద్ధతి ఉంది: సహస్ర్య-సహస్త్రియః; స్వర్గ- సువర్గ (తైత్తిరీ. సం. 4. 2. 3); తన్వః-తనువః; స్వః-సువః (తై. ఆ. 7. 22. 1; 6. 2. 7)

ప్రాకృతంలో అకారంతపుంలింగ ప్రథమై కవచనం ఓ కావడం సహజంగా కనిపిస్తుంది: దేవో; జిణో; సో. వైదిక భాషలోను ఈ ఓ ప్రయోగం కనిపిస్తుంది: సంవత్సరో అజాయత (ఋ. సం. 10. 190. 2); సోచిత్ (ఋ. సం. 1. 191-10, 11)

ప్రాకృతంలో తృతీయాబహువచనానికి ఇహి చేరుతుంది: దేవేహి; గంభేరేహి, జ్యేట్ఠేహి. వైదిక భాషలోను ఇలాటి రూపాలున్నాయి: అనురూపదేవేభిః; జ్యేష్ఠేభిః, గంభీరేభిః; భద్రంకర్ణేభిః.

ప్రాకృతంలో చతుర్థీ విభక్తికి షష్ఠీ విభక్తి రావడం తరచుగా కనిపిస్తుంది: వైదిక భాషలోను ఇలాటిది ఉన్నట్టు పాణిని సూత్రమే సాక్షి. చతుర్థ్యర్థే బహుళం ఛందసి (అష్టా. 2. 3. 62).

ప్రాకృతంలో పంచమీ విభక్తి ఏకవచనంలో చివరిహల్లు లోపిస్తుంది: దేవాత్-దేవా; ఉచ్చాత్ -ఉచ్చా; జిత్-జిణా. వైదిక భాషలోను ఇలాంటిలోపం కనిపిస్తుంది. ఉచ్చా; నీచా; పశ్చా

ప్రాకృతంలో ద్వివచనం లేదు. దానికి మారు బహువచన ప్రయోగమే ఉంది. దేవా; హరీ. వైదిక భాషలోను కొన్నిచోట్ల ద్వివచనానికి మారు బహువచనమే కనిపిస్తుంది. ఇంద్రావరుణౌ-ఇంద్రావరుణా; మిత్రావరుణా-మిత్రావరుణౌ; దివిస్పృశావశ్వినౌ-దివిస్పృశావశ్వినా.

పై పరిశీలననుబట్టి ప్రాకృతం వ్యాప్తంగా ఉన్నదని, అదే సంస్కరింపబడి సంస్కృతమైందని ఊహించడానికి అవకాశం ఉంది. ప్రాకృతం విశాల ప్రాంతంలో విస్తరించిన భాష. పశ్చిమాన స్లావ్ భాషలలోను, తక్కిన భాషలలోను, మధ్య ఆసియాలోని భాషలలోను చూళికా ప్రాకృతమని చెప్పిన భాషలలోను సంస్కృతంతో గల సామ్యం ఆశ్చర్యం కలిగిస్తుందని డాక్టర్ వి. రాఘవన్ తమ పాశ్చాత్య పర్యటనానంతరం వ్రాసిన వ్యాసాలలో వివరించారు. ఆ భాషలలో స్త్రీలు మాట్లాడుతున్నప్పుడు ప్రాకృతం వింటునట్టు ఉండేదని ఆయన అన్నారు. ఆధునిక ఈరానీ, ఆఫ్ఘానీ, హిమాలయ పశ్చిమాగ్ర ప్రాంత భాషలు మాట్లాడినా, జావాసుమత్రాభాషలు విన్నా, నాకు ప్రాకృతంగానే తోస్తుంది.

దీనిని బట్టి సంస్కృత ప్రాకృతాలకు ఏ విధంగాను జన్య జనక సంబంధం లేదని, రెండూ ఒక పూవు రెండు రేకులని -కాదు-కాదు- ఒక రేకు రెండు పార్శ్వాలని, ఒక కత్తి రెండు వాదరలని అనవచ్చు. ఛందోబద్ధమయిన భాష కొంతకు కొంత పరిష్కృతమూ, ప్రయత్నసాధితమూ, సుందరమూ కావడం వల్ల ఋగ్వేద సంస్కృతం పై వర్గా భాష అయి, క్రింది వర్గాల భాష-సామాన్య వ్యవహారభాష- దానికి కొంత భిన్నంగా ఉన్నా, చాల సన్నిహితంగా ఉండేదని ఊహించవచ్చు. ఈ సంస్కృతీకరణం వేదప్రాదుర్భావానికి ముందు ప్రారంభమయి ఉంటుంది. ఈ సంస్కృతీకరణం మన పూర్వులు ఆరునెలల ఉషఃకాంతిలోను వసిస్తున్నప్పుడు, జ్వలనుడే ఆయుధంగా, రక్షకుడుగా పర్యటిస్తున్న కాలంలోను ప్రారంభమై ఉంటుంది. కాలక్రమాన ఆ పదాలు కలుషితం కాకుండా వేదానికి కట్టుబాట్లు- ప్రాతి శాఖ్యలు, నిరుక్తాది నిఘంటువులు పుట్టాయి. శిష్టులు భాష సంస్కృతమో, సంస్కృత తుల్యమో అయింది. జన సామాన్య భాష ప్రాకృతమే. బుద్ధుని కాలపు భాష చూచినా బుద్ధుని జాతక కథల భాష, ఉపదేశ సంగ్రహమైన ధమ్మపదంలోని పాళీ అనబడే ప్రాకృతం భేదం చూసినా, సంస్కృత ప్రాకృతాల సన్నిహితత్వం తెలుస్తుంది. ధమ్మపదాన్ని కొద్దిగా సంస్కరిస్తే సంస్కృతమౌతుంది.

బాలస్త్రీ మంద మూర్ఖాణాం నృణాం చారిత్రకాంక్షిభిః

అనుగ్రహార్థం తత్వజ్ఞైః సిద్ధాంతః ప్రాకృతేకృతః

బాల స్త్రీ మంద మూర్ఖులు కూడా సచ్చీలురు కావాలనే కోరికతో తత్వజ్ఞులైన పెద్దలు తమ సిద్ధాంతాలను ప్రాకృతభాషలో చెప్పారు అని హేమచంద్రాచార్యులు తన కావ్యానుశాసనంలో ఒక ప్రాచీన శ్లోకాన్ని ఉదహరించారు. అందువలననే తథాగతుడు, మహావీరుడు తమ ఉపదేశాలను పై వారి భాష అయిన సంస్కృతానికి పోక ప్రజాసామాన్య శీలరక్షణ కోసం వారి భాషలోనే ఉపదేశించారు.

ప్రాకృతాన్ని సంస్కరిస్తే ఎంత సులభంగా సంస్కృతమౌతుంది కింది ఉదాహరణలు తెలుపుతాయి.

అభిత్థరేత కల్లాణే పాపా చిత్తం నివారత్

తందంహి కరోతి పుఞ్ఞం పాపస్సిరమతేమనో (ధమ్మపదం)

దీని సంస్కృతాచ్ఛాయ ఇది :

అభిత్వరేతకల్యాణే పాపాత్ చిత్తం నివారయేత్

తంద్రాం హి కుర్వతః పుణ్యం పాపే రమతే మనః

సత్కార్యాచరణ విషయంలో త్వరపడాలి. పాపం నుంచి మనస్సును మరలించుకోవాలి. ఈ విషయంలో ఆలసించేవాడికి పుణ్యం నష్టమైపోగా మనస్సు పాపంలో లగ్నమవుతుంది. అని దీని అర్థం.

ఈ విధంగానే జైనాగమ సాహిత్యంలో ప్రాచీనతమమైన ఆయారాంగసుత్తంలోని కొన్ని వాక్యాలు గమనించండి.

ణత్థికాలస్సణాగమోసవ్వే పాణా వియా ఊయా సుహసాయా । దుక్ఖపడికూలా । అప్పియవహా। పియజీవిణీ । జీవిఉకామా। సవ్వేసింజీవియం పియం।

దీని సంస్కృతచ్ఛాయ ఇది:

నాస్తికాలస్య అనాగమః సర్వే ప్రాణాః ప్రియాతురాః సుఖసాధాః, దుఃఖిప్రతికూలాః, అప్రియవహాః, ప్రియజీవినోః జీవితు కామాః సర్వేషాం జీవితం ప్రియమ్.

విధి తప్పుతుందనలేము. ప్రాణులన్నీ సంతోషమే కోరతాయి. సుఖంకోసం ప్రయత్నిస్తాయి. దుఃఖాన్ని ఇష్టపడవు. అప్రియాన్ని ఇష్టపడవు. జీవితాన్ని ఇష్టపడతాయి. జీవింపగోరతాయి. ఎందుకంటే, అందరికి జీవితం ప్రియమైంది గనుక – అని దీని అర్థం.

పై ఉదాహరణను బట్టి అస్తవ్యస్తంగా, లోకంలో వివిధ రూపాలలో ఉన్న ప్రాకృతాన్ని సంస్కరించి సంస్కృతంగా రూపొందించారనడం స్పష్టం. నేటి ఉత్తర ధ్రువ ప్రాంతాల భాషలను సంస్కరించినా ఒక మాదిరి సంస్కృతాలవుతాయి.

ఈ విస్తృత భాష జైన బౌద్ధ ప్రచార ప్రాబల్యంలో వివిధ రీతుల విస్తరించింది. బౌద్ధ త్రిపిటకాల భాషను పాలీ అన్నారు. పాలీ అంటే పర్యాయం, మూల పాఠం, బుద్ధ వచనం అని బుద్ధఘోషుడు నిర్వచించాడు. కాని, బుద్ధుడు మగధరాజధాని అయిన పాటలీపుత్ర పరిసర వ్యవహార భాషలో ఉపదేశించాడు గనుక పాటలీ పాలీ అయి ఉండాలి. పాలీ ప్రభావంనట్టే మైథిలీ భోజపురి భాషలలో చూడవచ్చు.

ఈ భాషకు ప్రాకృతమనే వ్యవహారం ఎప్పుడు వచ్చిందో చెప్పలేము. ఇది ఆయా ప్రాంతాలను బట్టి వివిధ రూపాలు పొంది వివిధ నామధేయాలు పొందింది. మధ్య ఆసియాలోని ఖోటాన్ మొదలైన దేశాల భాషల సంబంధంతో చూళిక అయింది; గాంధార బెలుచిస్థాన్‌లలో పైశాచి అయింది. మగధ సామ్రాజ్యంలో మాగధి అయింది; నేటి మహారాష్ట్రం–గుజరాత–రాజస్థాన–ఉత్తరప్రదేశ్‌లలో విస్తృత ప్రాంతాలు, ఆంధ్ర కర్నాటకలలోని ఉత్తర ప్రాంతాలు కలిసిన విశాల రాష్ట్రంలో – మహారాష్ట్రంలో – మహారాష్ట్రి అయింది.

ఈ మార్పులను గుర్తించి ఆయా ప్రాంతాల భాష పాత్రోచితమనే దృష్టిగల భరతాచార్యుడు ప్రాకృతభాషలను తొలిసారిగా పేర్కొన్నాడు. ఇతడు ప్రాకృతభాషలను మాగధీ, అవంతికా, ప్రాచ్యా, శౌరసేనీ, అర్థమాగధీ, బాహ్లీకా, దాక్షిణాత్య అని ఏడుగా వింగడించాడు. ప్రాకృతమంటే, ప్రకృతులు–ప్రజలభాష ప్రాకృతం అని అతని ఉద్దేశమై ఉంటుంది. కాని అతడు తద్భవతత్సమాది విభజన చేయలేదు. తర్వాత రెండవ శతాబ్ది వాడైన చండుడు తన ప్రాకృతలక్షణమ్ అనే వ్యాకరణంలోను భరతునిలాగే ప్రాకృతోత్పత్తిని గురించి చర్చించలేదు. కాని, వర్ణాగమ వర్ణలోపాలు సూచించడంవల్ల సంస్కృతమే మూలమని ఇతడు భావించినట్టు తోస్తుంది.

ప్రాచీనులలో 7వ శతాబ్దివాడైన రాజశేఖరుడు ప్రాకృతం నుంచే సంస్కృతం పుట్టిందన్నాడు. అతడు ఒక పాత్రతో ఇట్లా చెప్పించాడు.

యద్యోనిః కిల సంస్కృతస్యసుదృశాం
జిహ్వాను యన్మోదతే
యత్రశ్రోత్రపథామతారిణి కటుః
భాషాక్షరాణాం రసః
గద్యం చూర్ణపదం పదం రతిపతేః
తత్ ప్రాకృతం యద్వచః
తాన్ లాటాన్ లలితాంగి పశ్య నుదతీ
దృష్టేః నిమేష వ్రతమ్.

ఓ లలితాంగీ, కళ్లు రెప్పార్పకుండా లాటదేశీయులనుచూడు. వారి భాష ప్రాకృతం. అది సంస్కృత భాషకు మూలమైనది. ఎప్పుడూ మహిళల నాలుకపై నాట్యమాడేది. ఈ భాష రతిపతికి స్థానమైనది. అని లాటదేశీయులు భాషను పొగిడాడు. ఈ లాటులు లట్వియా వారేమోనని నా అనుమానం. అలాగే 9వ శతాబ్దివాడైన వాక్పతి రాజు తన గౌడవహో కావ్యంలో ప్రాకృత్యాన్ని తొలి భాషగా ఇట్లా పేర్కొన్నాడు.

సయలా ఓ ఇయం వాఆ విసంతి విత్తోయవాయావో
ఏంతి సముద్దంచియ ణేంతి సజలావోచ్చయ జలాఇ

అన్ని భాషలూ ప్రాకృత భాషలో ప్రవేశిస్తాయి. దాని నుంచే అన్ని భాషలూ పుట్టాయి. నీళ్ళు సముద్రంలో చేరతాయి. సముద్రం నుంచి ఆవిరై మళ్ళీ నీళ్ళవుతాయి.

వివిధ వ్యవహారా వల్ల, జైన బౌద్ధ మత ప్రచారం వల్ల ప్రాకృతానికి ప్రజలలో ఆదరణ కలిగి విశేష సంబంధం ఏర్పడడం వల్ల స్థానిక భాషల పదాలు కూడా ప్రాకృతంలో చేరుతూ వచ్చాయి; దక్షిణా పథంలోనూ చేరాయి. వాటిని తెలుసుకోడం అవసరమైంది. ఏది ప్రాకృతమో, ఏది స్థానికమో– దేశ్యమో విడదీయలేనంతగా ప్రాకృతం విస్తరించింది. దానివల్ల అర్థ నిర్ణయంలోను సంశయం ఏర్పడింది. ఈ నిర్ణయం కోసం తత్సమ, తద్భవ, దేశ్య అనే విభజన ఏర్పడింది. ఈ విభజనను తొలిసారిగా చేసిన వాడు ఆచార్య హేమచంద్రుడు– సిద్ధహేమచంద్ర శబ్దానుశాసనంలో ప్రాకృతకావ్య వ్యాఖ్యాతలు కులబాలదేవ, అభిమానచిహ్న, గోపాల, దేవరాజ, ద్రోణ, ధణపాల, పాదవిప్తాచార్య, రాహులక, శ్రీలంకాదులు ప్రాకృత భాషా పదాలు కాని వాటిని "ఇది దేశీ" అని సూచించారు. కొందరు దేశీపదకోశాధికారం వ్రాశారు. అవి సరిగాలేవని ఆచార్య హేమచంద్రుడు దేశీ నామమాలా అనే నిఘంటువునే కూర్చాడు.

దేశీదుస్సందర్భా
ప్రాయస్సందర్భితాపి దుర్బోదా
ఆచార్యహేమ చంద్రః
తత్తాం సంధృభతి విభజతి చ

దేశీ పదాలను అన్వయించడం కష్టం. అన్వయించినా అర్థం చేసుకోవడం మరొక కష్టం. అలాటి వాటిని ఆచార్య హేమచంద్రుడు అన్వయించి సుబోధం చేస్తాడు– అని ఈ నిఘంటు ప్రారంభంలోనే ఆచార్య హేమచంద్రుడు ప్రతిజ్ఞ చేశాడు. హేమచంద్రుని అనుసరించే 12–13 శతాబ్ది వాడైన త్రివిక్రముడు తన ప్రాకృత శబ్దాను శాసన వృత్తి పీఠికలో ఆ పద్ధతినే తత్సమ, తద్భవ, దేశి అని భాషను విశ్లేషించాడు.

కన్నడ లక్షణ గ్రంథాలు తెలుగు లక్షణ గ్రంథాల కన్నా ముందుగా వెలిశాయి. 9వ శతాబ్దం వాడైన నృపతుంగుడు తన కవిరాజ మార్గంలో తత్సమ దేశ్యాలు చెప్పకపోయినా తద్భవ పరిచ్ఛేదంలో సమ సంస్కృత కావ్యాలని, దేశికావ్యాలని విడదీశాడు. సమసంస్కృత పదాలకు దేశి పదాలకు సమానం చెల్లదన్నాడు.

ప్రాకృత వ్యాకరణాలను, కన్నడ వ్యాకరణాలను అనుసరించే తెలుగు వ్యాకర్తలు భాషను తత్సమ, తద్భవ, దేశ్యమని విభజించారు. ఈ విభజనను తొలిసారిగా చేసినవాడు ఆంధ్ర భాషా భూష ఈ కర్త కేతన. ఇతడు ఈ మూడింటినే కాక అచ్చ తెలుగు, గ్రామ్యం అని మరి రెండు విభాగాలు చేశాడు. తత్సమం తప్ప తక్కిన నాలుగు అచ్చ తెనుగే అన్నాడు– పంచపాండవులంటే మంచంకోళ్లలాగ అనే సామెతగా. అచ్చతెనుగు అనే పదాన్ని తనకు దాదాపు సమకాలికుడైన కన్నడవైయాకరణుడు కేశిరాజు రచించిన శబ్దమణిదర్పణంలోని అపభ్రంశ ప్రకరణంలో వాడిన అచ్చగన్నడమనే పదం నుంచి సృష్టించుకొని ఉంటాడు. ఇతడు కన్నడ ప్రాకృతాలు బాగా వచ్చిన వాడు. కర్నాటక భాషా భూషణాన్ని అనుసరించే ఆంధ్ర భాషాభూషణం రచించాడు.

ఏతావతా దాదాపు బుద్ధుని కాలం నుంచే బౌద్ధం వ్యాపించిన తెలుగు దేశంలో, పల్లవుల సామ్రాజ్యం చివరి వరకు ప్రాకృతం శాసన భాషగా ఉన్న తెలుగు దేశంలో తెలుగుపై ప్రాకృత ప్రభావం ఎక్కువగానే పడి ఉంటుంది. అలాగే దేశీయాలయిన తెలుగు పదాలు ప్రాకృతంలో చేరడం సహజం. ఈ ఆదాన ప్రదానాలు తెలిపే పదాలను వాటిలోనూ మొదట పాలీ ప్రాకృతం నుంచి చేరిన పదాలను క్రింద ఇవ్వడం జరిగింది. వీటిని రైస్‌డేవిస్ పాలీ–సంస్కృత నిఘంటువునుంచి మిత్రులు శ్రీ చీమకుర్తి శేషగిరిరావుగారు ఏరి, తెలుగు గోష్ఠిలో చదివారు. వాటిపై విశేషంగా చర్చ జరిగింది.

పాలీ	తెలుగు
అంస	అంచు
అక్కడ	అక్కసు
అచ్చి (కాంతి)	అచ్చిరావడం
అచ్చిబంధ	అచ్చుకట్టు
అచ్చరిఓ	అచ్చెరువు
అజ్జోస	అడియాస
అన్న (జ్ఞానం)	అన్నెం
అనయ	అనయం
అంబిల	అంబలి
అమ్మా	అమ్మ
అయ్యా	అయ్య
అరే (సంబోధన)	అరే
అలగ్గ	అలగా
అబద్ధ (అనృతం)	అబద్ధం
అబోభతరిక	ఎబ్బెరికం
అబ్బు	అబ్బో
ఆగం	ఆగం
ఆణత్తి	అనతి
ఆదా	ఆదా
ఆదేయ్య	ఆదుకొను
ఆరకత్త	ఆరికట్టు
ఆస	ఆస
ఇంగిత	ఇంగితం
ఇంఘాల	ఇంగలం
ఇచ్చక (కరిక)	ఇచ్చకం
ఉగ్గి (తమింగు)	ఉగ్గు
ఉక్క	ఉక్క
ఉగ్గహ	ఉగ్గడించు
ఉణ్ణి	ఉన్ని
ఉదీరణ	వదరు
ఉస్సావ (కారు)	ఉచ్చ
ఉద్ధార	ఉద్దర
ఉవ్వత్తి (ఉత్పాతం)	ఉప్పత్తిపిడుగు (శాసనాలలో)
ఉవజ్ఞ	ఒజ్జ
ఎత్తావత్తా	ఏతావతా
ఏధ	ఎదుగు
ఏన	ఈయన
ఏసిన	ఏచి
ఓకర	ఒయ్యారం
ఓడ్డెతి	ఒడ్డుట
ఓడ్డ	ఒడుపు
ఓడ్డి	వద్ద, యొద్ద, ఒడ్డు
ఓర	ఓర
ఓరట	ఊరట
ఓసరణ	ఓసరిల్లు

ఓహరణ	ఓహిరిసాహిరి
కంస	కంచు–కంచం
కట్ట	కట్టె
కత్తరి	కత్తెర
కబ్బ	కబ్బం
కంబలిఅ	కంబళి
కరకర	కరకర
కమ్మార	కమ్మరి
కసంబు	కసవు
కాచ	గాజు
కిచ్చ	కించ, క్రించు
కిటిక	కిటికి
కుంచిక	కుంచకీలు
కుటిక	గుడిసె
కుటవ	గూడు
కుడడ్డ	గోడ
కుణి	కునియు, గునియు (వరిగు)
కుండ	కుండ
కుసి (భిక్షువుల చీవరంపై అడ్డుకట్ట)	కుసి (మంచపు)
కూర	కూర, కూడు
కోణ	కొన
కొట్టణ	కొట్టుట (కొట్నాలు)
కొంత	కొంటె
కొంట	కుంటి
కజ్జక	కజ్జం, కజ్జికాయ
ఖంబ	కంబం
ఖిట్ట	కిట్టెం, చిట్టెం
ఖార	కారం
ఖీల	చీల
ఖుడ్డక	కొండిక
గద్ద	గద్ద
గారవ	గారవ
గుల	గుల, గుల్ల
గేందుక	చెండు
గేరుక (రంగు)	జేగురు
గోన	గోద, గొడ్డు
చాగ	చాగం
చిక్కల్ల (బురద)	చిక్కన
చిత్త	చిత్త (నక్షత్రం)
ఛ్లిక	చిలుకకొయ్య
చీర	చీర
చున్నం	సున్నం
చొక్క	చొక్కమైన (చొక్కటం)
ఛక్కా	చక్కా (ఆరు)
చిద్ద (చినిగిన)	చెడ్డ

జూత	జూదం
తక్కర (దొగ)	టక్కరి
తట్టుక	తట్ట
తట	తట్టు (ఆతట్టు)
తట్టిక	తడిక, తడక
తలీయ	తదియ
తంతి	తంతి
తరీ	తరి (నౌక)
తన్వా	తనువు, తనియించు
తాంబ (తామ్రం)	తాంబణం
తరచ్ఛ (చిరత)	త్రచ్చు
తాళ (తాళంచెవి)	తాళం (చెవి)
తాపిత	తాపించిన
తిట్ట(గట్టి)	దిట్టం
తిన్న	తిన్నవి
తిప్ప	తిప్పలు
తీరణ	తీర్చు
తీరేది	తీర్చుచున్న
తేమన	తేమ
ధారవ (నిలుచు)	తావరం, తావలం
థిర	తిరం
దత్తి (దానం	దత్తి
దద్దు	దద్దుర్లు
దప్ప (లావు)	దుప్పం
దుట్ట	తుట్ట (పురుగు)
దుపట్ట	దుప్పటి
ధమ్మ	ధమ్మం
ధోవతి	దోవతి
ధారణి	ధారుణి
నంగల	నాగేలు, నాగలి
నవక	నవకం
నావా	నావ
నామ	నామం
నిక్కిన్న (వ్యాపించిన)	నిక్కిన
నిక్కుహ	నిక్కువం
నిజ	నిజం
నిచ్చ	నిచ్చలు
నిట్ఠ	నిట్టనిలువు
నిభ	నిభాయించు
నిసభ (నాయకుడు, రాజకుమారుడు)	నిసబు (శ్రేష్ఠ)
నేఉణ్ణ	నేర్పు
పకటి	పగిది
పకతిక, పక్క	పక్క, ప్రక్క
పజ్జ (దారి)	పజ్జ
పతిన్నా	ప్రతిన

పన్న, పన్ను	పన్నుగడ
పణ్ణ (దానం)	పణ్ణన
పణ్ణసన్న (సరిహద్దు సూచించే ఆకుముడి)	పణ్ణస (శాస)
పంత (ఎల్ల)	పొంత
పంతి	బంతి
పయుత (పెరిగినది)	పయ్యెద (?)
పయుగ్గ	పగులు
పలఘు	పలుగు
పసు	పసులు
పల్లల (చిన్నసరస్సు)	పల్లం
పాలి (ఉచితం)	పాడి
పిల్లక	పిల్ల
పుణ్ణ	పున్నెం
పున్నమ	పున్నమ
పుఢవి	పుడమి
పూగ	పోక
పూగ	ప్రోగు, పోగు
పేటక (పిటకసంబంధి)	పెటకం
పేల (ముద్ద)	పెళ్ల
పేలిక	పేళ్లగంప
పోసీత	ప్రోచు
ఫణక	పడగ
ఫరతి	పారు
బిల	బిళ్ల
బుజ్ఝాన (గుర్తించు)	బుజ్జగించు
బొంది	బొంది
భక్కిన్ (తిననిచ్చు)	బొక్కు
భణతి	బాణి
భము	(కను) బొమ్మ
మంకు (చిక్కులోపడ్డ)	మంకు (పట్టు)
మంతణ	మంతనం
మచ్ఛర	మచ్చరం
మర్యాదా	మర్యాద
మరుమ	మొరం, మురస
మల్లక	మల్ల (మట్టికంచం)
మసి	మసి
మస్సు (అమస్సు)	మీసం (మీసంలేనిది)
మానిక	మానిక (నాలుగు ద్రోణాలు)
మాయ (మోసం)	మాయ
మిగ	మైకం
మిల్హ, మయిల	మైల
రక్కస	రక్కసి, రాకాసి, రక్కసుడు
రచ్చ (దారి)	రచ్చ (బండ)
రిత్త	రిత్త
లంచ	లంచం
లహు	లగువు
వంక	వంక, వంకర
వచ్చ (మలం)	ఉచ్చ
వత్తిక	వత్తి
వడ్డి (పెరుగుట)	వడ్డి
వణ్ణ	వన్నె
వణ్ణియ	వన్నె
వత్థ	బట్ట
వద్ధ	బద్దె
వసభ	బసవ
వాట	వాడ, వాటా
వాల (క్రూరమైన)	వాలు (మెకం)
వికట	(అకటా) వికటం
విన్నాణ	విన్నాణం
విలుగ్గ (విరిగిన)	విరుగు
విలార (బిడాల)	ఇలారం (ఇల్లు, ఇలారం)
విసుక	విసుగు
వేత్త	బెత్తం
వేలా	వేళా
వేర	వేరం
వోకర	ఓకరింపు
సంగతి(సంఘటనప్రమాదం)	సంగతి
సంథన	సంతనసేయు
సంబళ (బీద)	సంబళం
సంబుక	చెంబు
సంభార (అవసరవస్తువులు)	సంభారం
సక్క	చక్క (బరచు)
సక్కలి	చక్కిలం
సచ్చ	సచ్చం
సజ్జ (ఆసనం)	సజ్జ
సన్న	సన్న
సన్వ (సుకుమార)	సన్నని
సత్తు	సత్తుపిండి
సద్ధ	సద్దు
సుక్క	చుక్క (నక్షత్రం)
సున్న	సున్న
సొంది (సహజసంభాషణ)	సొదె
సుంక	సుంక

పైన పేర్కొన్న పదాలలో ఆదాన ప్రదానాలు ఎట్లాజరిగాయో చెప్పలేము. ఈ విధంగానే తెలుగు పదాలు ప్రాకృతాలలో చేరి, తద్వారా సంస్కృతంలోను ప్రవేశించాయి. ఇట్లా తెలుగు పదాలు శాతవాహనుల కాలంలో ప్రాకృత భాషా వ్యవహారంలోను, సాహిత్యంలోను చేరాయి. ప్రాకృత సంస్కృత శాసనాలలో తెలుగు ఊళ్లయిన వేంపూరు మొదలైన వాటి పేళ్లు, దానగ్రహీతల పేళ్ళు కనిపిస్తాయి. ప్రస్తుతం మనకు లభిస్తున్న అతి ప్రాచీన తెలుగు పదాలు శాతవాహన చక్రవర్తుల

ద్విభాషా నాణేలలోనివి. ఈ నాణేల ఒకవైపు ప్రాకృతంలోను, మరొకవైపు తెలుగులోను చక్రవర్తుల పేర్లున్నాయి. వీటిని సుప్రసిద్ధ పురాతత్త్వ శాస్త్రజ్ఞులు శ్రీ ఇంగువ కార్తికేయ శర్మగారు స్పష్టంగా చదివి ఎపి గ్రాఫికా ఇండికా 4లో ప్రచురించారు. ఈ నాణేలు ఫలమావి, శాతకర్ణి, యజ్ఞ శ్రీశాతకర్ణి చక్రవర్తులవి చెరి ఒకటి. మొదటిది: 'అరహణకు వాహిట్టి మాకనకు తిరుపులమావికు' దీని అర్థం అరసుడైన వాసిష్ఠీ కుమారుడైన శ్రీ పులమావియొక్క రెండవది : "అరహణకు వాహిటి. మాకనకు తిరుహాతకణికు." దీని అర్థం అరసుడైన వాసిష్ఠీపుత్రుడైన శ్రీ శాతకర్ణి యొక్క మూడవది : అరహణకు గోతమిపుతకు తిరుయనహాతకణికు" దీని అర్థం అరసుడైన గౌతమీపుత్ర శ్రీయజ్ఞశాతకర్ణి యొక్క.

తత్సమీకరణం కూడా ఆ కాలంలోనే ప్రారంభమయింది. నాగబు అనే పదం గల ఒక బ్రాహ్మీశాసనం మద్రాసు మ్యూజియం ఆవరణలో ఉన్న దానిని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు గుర్తించి వివరించారు. దీనిని ఈ వ్యాసకర్త మన లిపి పుట్టుపూర్వోత్తరాలలో గ్రహించడం జరిగింది. ఇది నాగబుదస అనే పేరులోని భాగమని, నాగశబ్దానికి 'బు' ప్రత్యయం చేరిన తత్సమపదం కాదని శ్రీ కార్తికేయ శర్మగారు విమర్శించారుగాని, ఈ నాగబు అనే అక్షరాలున్న ఫలకం పక్కన విరిగినా, దస అనే అక్షరాలు ఉన్నవని చెప్పదగినంత ముక్క విరగలేదు. శిల్ప అక్షరాలను బట్టి శిలా ఫలకంపై పొందికగా చెక్కుతాడుగాని, ఐదక్షరాల పేరును ఫలకం మధ్యనుంచి ప్రారంభించి చెక్కడు. కనుక నాగబు అనే మూడక్షరాలకు సరిపోయినంత మాత్రం గ్రహించి అటు ఇటు సమానంగా స్థలం వదిలినట్టు స్పష్టం.

ప్రాకృతం కొన్ని శతాబ్దాలు తెలుగునాట శాసన భాష గనుక స్థానిక తెలుగు పదాలు కూడా ప్రాకృతంలో చేరాయని ఇదివరకే చర్చించాము. శాతవాహన చక్రవర్తి అయిన హాలుడు సేకరించి కూర్చిన గాథా సప్త శతిలో ప్రాకృత వేషంలో ఉన్న తెలుగు పదాలు చాలా ఉన్నాయి. అట్లాంటి వాటిని దాదాపు 40 దాకా ఈ వ్యాసకర్త నాలుగు దశాబ్దాల క్రితమే తొలిసారిగా భారతిలో ప్రచురించి తర్వాత మరికొన్ని వ్యాసాలతో కలిపి పుస్తకరూపంలోను ప్రచురించడం జరిగింది. వాటిని ఇక్కడ ఉట్టంకించడం అవసరమని పొందుపరుచడం జరిగింది.

పాలీ	**తెలుగు**
అత్తా	మేనత్త, అత్త
వాలుంకి	వాలుగ
పీలుఅ	పిల్ల, పిలక
పోట్టం	పొట్ట
కిలించిఅ	క్రించు, కిలించల్
అద్దాఏ	అద్దంలో
భోండి	పంది
సరఅం	చెఱకు
తుప్ప	నేయి (తువ్వాయి తురువు)
ఫలహి	పత్తి
వేంట	వెంటు
సిప్పర	చిప్పరగడ్డి
తాలూర	తలారు (సుడి)
మడహసరిఆ	మడవ
ఓ!	ఓ!
ఓడ	ఓడు, అవిటి
సాఉలీ	శాలువ
మఇ	మైల
పాణ	పాణిని
తీరే(న)	తీరదు
కుసుంభ	కుసుమపూవు
ణడిజజి	నలియు
పక్కల	మొక్కలీడు
చటుఅం	చట్టువం
దోరో	దారం
ఉడే	వీడు
అవ్వో!	అవ్వో! అమ్మో!!
బిసణేమి	విసరివేస్తున్నాను
దే	అదో!
పేచిరీ	పేచీకోరు, పెచ్చారి
ఉప్పంగ	ఉప్పొంగు
అత్థక్క !	అమ్మక్క !
పలాల	పులు
అలాహి	ఒల్ల
ఉఅ, ఉలహ	ఓయి! (చూడు)
కే	కై (చతుర్థిని!)
సురసురంతీ	సురసురమని
థరహరంతి	థరథరమని
సణిఅం	సన్నగా
దుక్కధుక	తుకతుకలాడుతున్నది
పుప్పలవా	పిడకల నిప్పు
చోజ్జం	చోద్యం

ఇట్లాగే 8వ శతాబ్దిదైన వజ్జాలగ్గమనే సంకలనంలోను చాల తెలుగు పదాలు కనిపిస్తాయి. జయవల్లభుడనే శ్వేతాంబరజైన కవి దీనిని సంకలనం చేశాడు. దీనిలో 24 తెలుగు పదాలు ప్రాకృత వేషంలో ఉన్నాయి.

ప్రాకృతం	**తెలుగు**
వింతర	వింతయిన
ఆవట్టఏ	వట్టిపోతున్నది
ఓ! (సంబోధనం)	ఓ
కసరక్కా	కసురుకాయ
తలినేహి	తలిరులచేత
విసూరణం	ఉస్సురను
దే !	అదో ! అదిగో !
నడిజ్జసు	నలియు
సాహేఇ	చాటుతున్నది
(సుణ) హిర్లియా	(కుక్క) పిల్ల
చంపిఊణ	చొనుపు (అదుము)
థుక్కడియా	తుకతుకలాడు

గగ్గర	గగ్గర (ధ్వని)	డలియా	దొర్లు
తువణి (మెతుకు)	తరవాణి	కరడియా	కర
(మెతుకు)		(మురికి)చేయు	
వేలియా	వెలయాలు	పదోహడ	పెరడు
ఉబ్బేయి	ఉబ్బుతున్నది	జూరేఇ	జురజుర-
కాణా	కాననివాడు	చురచుర మంటున్నది	

ఈ అదాన ప్రదానాలను బట్టే డాక్టర్ చిలుకూరు నారాయణ రావుగారు తెలుగు మూలం ప్రాకృత సంస్కృతాలని అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయం కొత్తదేమీకాదు. మన ప్రాచీన వైయాకరణులందరూ తల్లి సంస్కృతంబు ఎల్లభాషలకును అన్నవారే. చిలుకూరి నారాయణ రావు గారు ఈ వ్యాసకర్తను చూసినప్పుడెల్లా ద్రావిడ భాషావాద సన్నిపాతజ్వరితుడు అని హాస్యం చేసేవారు. ఆయనతోను, తర్వాత సంస్కృత ప్రాకృతాంధ్ర మహా విద్వాంసులు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారితోను జరిపిన అనేక చర్చల వల్ల ప్రాకృతతెలుగులకు జన్యజనక సంబంధం వంటి సన్నిహితత్వం ఉన్నదనిపిస్తుంది. చిలుకూరి నారాయణరావుగారు తమ ఆంధ్రభాషా చరిత్రలో చాలా తెలుగు పదాలకు సంస్కృత ప్రాకృత వ్యుత్పత్తి సాధించారు. దానిని అంతగా తీసివేయడానికి వీలులేదు.

కన్నడంలోను ఈ వాదం పాతకాలం నుంచి ఉంది. 13వ శతాబ్దంలో ఉన్నకర్నాటక వైయాకరణుడు చెన్న వీరకవి కాశకృష్ణధాతుపాఠానికి వ్యాఖ్య వ్రాస్తూ చాల వైకృతపదాలకు- కన్నడ తెలుగు తమిళాల ఉమ్మడి పదాలన దగిన వానికి - కాశకృష్ణధాతువులతో వ్యుత్పత్తి సాధించాడు. ఇది కన్నడ వ్యాఖ్య. దీనిని యుధిష్ఠిర మీమాంసకులనే పండితులు సంస్కృతీకరించాడు. వాటిలో కొన్ని మాటలను క్రింద పేర్కొనడం జరిగింది.

ఆట=అటగతౌ. భ్రమతి. క్రీడయతీతి ఆటః =క్రీడనమ్ ఈటె=ఏటతి. తాడయతి. ఈటగతౌ. ఈటిః=అస్త్రవిశేషః చేట=చిలప్రేష్యే, మానేచ. చేటతి. శూర్వేణ నిష్పవన క్రియాం కరోతి. చేటః=శూర్వే.

ఏట=ఇటగతే. ఏటతి. ప్రక్షిపతి. ఏటః=ప్రక్షేపణమ్ చాకలి=చకతృప్తౌ, శీతీభావేచ. చకయతి, చకతి. శీతీభవతి. చాకలః=రజకః, చాకలి=రజకే

చాప=చపనాంత్వనే, చపతి, సంతుష్టోభవతి. చాపా=కటమ్ గూడెం, గూడు=గూడనివాసే, గూడతి, నివసతి. గూడుః=గూడెం=నివాసస్థానం.

పండుః=పడిగతౌ, పండతే, ప్రసరతి. పండుః=ఫలమ్, పిల్ల=పిల్లచలనే, పిల్లతి, వివదతే. పిల్లః=వత్సః, పిల్లా=వత్సా మంట=మటిదాహే, మంటతి, జ్వలతి. మంటః=జ్వలనమ్.

ఆవు=అనరక్షణపాలనే, ఆవతి, పాలయతి. ఆవుః=గౌః, గరిక=గృసేచనే, ఘరతి, ఘర్షయతి. గరికా=దూర్వా

ముల్లు=ముల్లధారణే, ఘర్షణేచ, ముల్లతే, ముల్లుః=కంటకమ్, త్రాసు=త్రసిఉద్వేగే, త్రస్యతి, ఉద్విజతి. త్రాసుః=తులా, పోర, పోరి=పురఅగ్రగమనే, పురతి అగ్రేగచ్ఛతి. పోరః=పుత్రః, పోరీ=పుత్రీ

వాన=వనసంసక్తే, వనతి, విస్తృతోభవతి. వనం, జలం, వానః=వర్షా

బిల్లు(విల్లు)=బిల్లగతౌ, బిల్లతి, ఇషుంప్రక్షిపతి, బిల్లుః=ధనుః, నాయి=నయరక్షణేచారణేచ, నయతే, రక్షతి, నాయి=శునీ, అంచు=అంచుగతి పూజనేమోః, అంచతి, అంచుః=తటమ్, గాజు=గజశబ్దౌ, గజతి, గాజుః=కంకణమ్.

పిట్ట=పిట్ట చలనే, పిట్టతి చలతి, పిట్టః=పక్షి, గోడ=గోదృబంధనే, గోద్రతి బంధయతి, గోడః=భిత్తిః

దండ=హింసాగత్యోః, దండయతి. దండా=మాలా, జాణ=జణశబ్దే, జణతి, జాణాతి, జాణః=బుద్ధిమాన్, సాని=షణుదానే, సనతి, సనుతే, దదాతి, సాని=మాతా

ఈ విధంగా చాలా పదాలకు ఇతడు వ్యుత్పత్తి సాధించాడు. ఈ ఆదాన ప్రదానాలు ఎక్కువగా ఉన్నందునే చిలుకూరి నారాయణరావుగారు తెలుగుకు మూలం ప్రాకృతసంస్కృతాలని విశ్వసించడంలో తప్పుకనిపించదు.

తెలుగు కన్నడాలలో ప్రవేశించిన తద్భవ పదాలు పరిశీలిస్తే నూటికి నూరుపాళ్ళు ప్రాకృతభవాలో ప్రాకృతసమాలో అయి ఉన్నవి గాని సంస్కృతభవాలు కావని చెప్పవచ్చు. ప్రాచీనుల ప్రకారం సంస్కృతభవాలైనప్పుడు ప్రాకృత పదాలే అవుతాయి. కనుక సరాసరి తెలుగులో చేరే ప్రసక్తేలేదు. సరాసరిగా చేరనవి తత్సమాలు మాత్రమే. కన్నడ వైయాకరణులు, కేతన మొదలైన తెలుగు వైయాకరణులు అవ్యయాలను, సంస్కృతసిద్ధ రూపాలను తెలుగులో సరాసరిగా వాడగూడదని చెప్పారుగాని, కేరళ భాషలో సంస్కృత విభక్తి ప్రత్యయాలు ప్రయోగించి రచించిన కావ్యాలు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణ : రామః రావణనె కొన్ను. రామన్ రావణం హత్వా సీతయై గ్రహిచ్చు. మనకు కూడా మల్లినాథ సూరి చెప్పినట్లు వ్యవహారంలో ఉన్న కొన్ని శ్లోకాలు ఇలాటివి లేకపోలేదు. మల్లినాథుడు సర్వజ్ఞసింగభూపాలుని ఆస్థానానికి ఎలాటి ఆడంబరమూలేకుండా పోతుండగా ఎవరో ఆక్షేపించగా, సమాధానం ఇట్లా ఇచ్చాడు.

కిం దారుణా వంకరటింకరేణ
కిం వాససా చీకిరిబాకిరేణ,
సర్వజ్ఞభూపాల వినోదార్థం
వైదుష్య మేకం విదుషాం సహాయః

దీనిలో తెలుగు పదాలకు సంస్కృత విభక్తి ప్రత్యయాలు వాడగా, సంస్కృతక్రియాపదాలు వాడిన శ్లోకాలు కూడా కనిపిస్తాయి.

తిండికైతే బహుమంది వసంతి

తండులాలు సుతరాము న సంతి,

కుండలెల్ల నడిమింట లుఠంతి

ముండలాః కొడుకులెల్ల హసంతి.

ఇంతకూ ప్రాకృతం ఉత్తరార్థ గోళమంతా ఒకప్పుడు వ్యాపించి ప్రవహిస్తూ వచ్చి, మధ్య ఆసియాలో భూటాన్ ప్రాంతం భాషలతో కలిసి చూళిక అయి, మరికొంత దక్షిణంగా, ఆగ్నేయంగా ప్రవహించి పైశాచిగా పేరుపొంది, ఒక పాయతో మగధ ప్రాంతాన్ని ముంచెత్తి మాగధి అయి, మరొక పాయతో విశాల రాష్ట్రం – మహారాష్ట్రం అంతటా వ్యాపించి మహారాష్ట్రి అయి, సింధునుంచి మరొక పాయగా సముద్రతీరం వెంబడి వెళ్లి శౌరసేని అయి, కలగాపులగమై అపభ్రంశమై చివరకు ఎన్నో రూపాలు పొంది, సారస్వతంలో సంస్కృతంలానే పుస్తకాల మరుగున దాగిపోయింది.

బౌద్ధమతానికి ఆటపట్టుగా ఉండే నాగార్జున కొండ, మహేంద్రగిరి మొదలు మహాబలిపురంవరకు, ఇటు అమరావతి మొదలు కొండాపురం వరకు బౌద్ధరామాలు విస్తృతంగా ఉన్న తెలుగు దేశంలో తెలుగుపై ప్రాకృత ప్రభావం పడటం సహజం. కాని, తెలుగు భాషలో ప్రాకృత పదాలు మిగిలి పోయాయిగాని, సాహిత్యం విషయంలో తెలుగువారికి కన్నడులకున్నంత ఔదార్యం లేకపోయింది. జైన బౌద్ధాలు ఎంతో సాహిత్యాన్ని సృష్టించి ఉంటాయి గదా! ఆ మతాలపై ద్వేషంతో ఇతర మతాలవారు ఆ సాహిత్యాలను నామరూపాలు లేకుండా చేసి ఉంటారు. గొప్ప సిద్ధాంతాలతో, ఆదర్శాలతో అవతరించిన ఆరామాలను లజ్జదిబ్బలన్నవారు ఆసాహిత్యాలను ఏమైనా చేసి ఉండరా? అంతే కాక ఆ శతాబ్దాలలో ఎడతెరపి లేకుండా జరిగిన యుద్ధాలు, బౌద్ధులు హీనయానం నుంచి మహాయానానికి, తత్ఫలితంగా ప్రాకృతం నుంచి సంస్కృతానికి మారడమూ ప్రాకృత ప్రాధాన్యాన్ని తగ్గించి సంస్కృత సాహిత్య ప్రాధాన్యాన్ని హెచ్చించడం వల్ల ప్రాకృత సాహిత్యం తెలుగునాట క్షీణించి నశించిందేమో !

నన్నయకు వంద సంవత్సరాల ముందు తెలుగుదేశంలో ఉన్న మహాకవులు పంప జినవల్లభులు ఆత్మరక్షణ కోసం మత రక్షణకోసం తెలుగునాడును వదలకపోయినా తెలుగునాడును పాలించే కన్నడరాజులను ఆశ్రయించారంటే, వారికి సమకాలికుడైన మల్లియరేచన కవిజనాశ్రయంలో సగం చచ్చి మిగిలాడంటే, మతమాత్సర్యం ఎంత ప్రబలమైందో చెప్పనక్కరలేదు. కన్నడులు మతమాత్సర్యం ఉన్నా సాహిత్యాన్ని సంస్కృతిస్థావరాలైన దేవాలయాలను ధ్వంసం చేసేందుకు సంస్కారులు కాలేదు, కనుకనే సాహిత్యాన్ని చెక్కు చెదరకుండా దక్కించుకొన్నారు. మనకు అలాటి ఔదార్యం లేనందున మన సాహిత్యంపై ప్రాకృత సాహిత్య ప్రభావం అంతగా పడలేదని అనాలి. ప్రాకృతాలను చదువుకొన్నవారూ నాటకాలలోని ప్రాకృత సంభాషణలు అధ్యయనం వరకే తమ పరిధిని ఏర్పరచుకొన్నారని తోస్తుంది. బౌద్ధజైన సాహిత్యాలను చూచినట్లు కనిపించదు.

మన కవులందరు నన్నయ మొదలు చిన్నయవరకు ప్రాకృతవేత్తలే అప్పకవి

సంస్కృతము ప్రాకృతంబును శౌరసేని

జగతిపై మాగధియు పైశాచికయును

జూళికయు నపభ్రంశమును సొరిదినాంధ్ర

భాషయును నివి చనునష్టభాషలనగ

అని అష్టభాషలను పేర్కొన్నాడు. నిజానికి ఇవన్నీ ప్రాకృతాలే కాని ప్రాకృతంబును అని విడిగా చెప్పడం గతానుగతికమని తోస్తుంది. ఇతని కన్నా ముందు తాళ్లపాక అన్నమాచార్యుల మనుమడు చినతిరుమలాచార్యుడు (1537) అష్టభాషాదండకంలో చూళికాప భ్రంశాలకు బదులుగా ప్రాచీ, అవంతీ, అని ఆంధ్రభాషకు బదులుగా సార్వదేశి అని ప్రయోగించాడు. నన్నయ తనను ఉభయ భాషా ప్రవీణుడనని చెప్పుకొన్నాడు. ఈయన మిత్రుడూ, భారతాంధ్రీకరణంలో తోడ్పడ్డాడనే ప్రథ ఉన్నవాడు అయన నారాయణభట్టు (1063)

యస్సంస్కృత కర్నాటక

ప్రాకృత పైశాచికాంధ్ర భాషాను,

కవిరాజశేఖరఇతి

ప్రథితః సుకవిత్వ విభవేన

అని నన్నయతోనే నందంపూడి శాసనంలో ప్రశస్తి పొందాడు. ఇక నవీన గుణసనాథుడైన నాచనసోమన "అష్టభాషాకవిత్వ శ్రీవాణీవిజితం సంపదే" అని బుక్కరాయలతో పెంచుకులదిన్నె శాసనంలో ప్రశంసితుడయ్యాడు. బాలభారత కర్తదోనూరు కోనేరుకవి (1547) తన కృతిపీఠికలో తనను "భాసుర సంస్కృత ప్రాకృతాదిక శాస్త్ర భాషా కవిత్వ సౌభాగ్య నిపుణుడను, విను తాష్ట భాషా కవిత్వ ప్రచండుడను" అని చెప్పుకున్నాడు. ధరణిదేవుల రామమంత్రి (15వ శ.) దశావతార చరిత్రలో సంస్కృత ప్రాకృతాద్యష్టభాషా కవిత్వ తత్త్వ సంవేది (1.16) అని చెప్పుకొని ఒక సీసాన్ని రచించాడు. ఆ భాషలలో కొఱవి గోపరాజు (15శ) సింహాసన ద్వాత్రింశకలో తాను అష్టభాష విదుడనని చెప్పుకోవడమే కాక ప్రాకృత పద ప్రయోగంతో ఒక సీసాన్ని రచించాడు. (2.46) గణపవరపు వేంకటకవి (1620–60) ప్రబంధ రాజవేంకటేశ్వర విజయవిలాసంలో షడ్విధ ప్రాకృతాలు వాడుతూ ఒక సీసపద్యం చెప్పాడు (876) రంగాజమ్మ (1633–73) మన్నారుదాస విలాసంలో షడ్విధ ప్రాకృతాలలో ఆరు పద్యాలు రచిండమే కాక "అతులితాష్టభాషా కవితాస్వరం కష మనీషా విశేష విశారదను" అని చెప్పుకొంది. భాస్కర రామాయణ కవులలో ఒకడైన మల్లికార్జునభట్టు అష్టభాషాకవీంద్రుడు. వైకృత చంద్రికాకర్త మంచళ్ల వాసుదేవ కవి అష్టభాషా కవిత్వ సామ్రాజ్య పట్టభద్రుడు. ఆంధ్రపాణిని

బిరుదాంచితుడు. నివర్తిశేషసుమతి అష్టభాషాకవితా కోవిదుడు. మహావైయాకరణుడు, సుశ్రుత శారీరాన్ని తెలగు చేసిన రాజవైద్యుడు ఆయిన ఎలకూచిబాలసరస్వతి సకల భాషా కవిగా తనను చెప్పుకోవడం వల్ల ప్రాకృతజ్ఞుడై ఉంటాడని మనం భావించవచ్చు. ఆంధ్రకౌముదీకారుడు మండలక్ష్మీ నరసింహాచార్యుడు అష్టభాషాసరస్వతి. సురపురాధీశుడైన రాఘవ సామనాయకుని ఆస్థానంలో ఉన్న విద్వత్కవి కిరీటం వేంకటాచార్యులు ప్రాకృతధురంధరులే. గద్వాల సంస్థాన కవీశ్వరుడు, యథాశ్లోకతాత్పర్య రామాయణం రచనకు ఆధ్వర్యవం వహించి కిష్కిందకాండను రచించిన కామసముద్రం అప్పలాచార్యులు "మాగదే భాండీర మాళవీప్రభృతి సత్ప్రాకృతమ్ముల ప్రబంధములు గొన్ని" రచించారు. ఈయన తండ్రి కామసముద్రం కృష్ణమాచార్యులు యథాశ్లోక తాత్పర్య రామాయణం సుందరకాండ రచించిన తిరుమల కృష్ణమాచార్యులు ప్రాకృత కవితా దురంధరులే. వనపర్తి రాజు బహిరగోపాలరావుకు 'అష్టభాషా' అని బిరుదు ఉండేది.

ఇక శ్రీనాథుని గురించి చెప్పనక్కరలేదు. "శాలివాహన సప్తశంనుడివితి" అని చెప్పుకొన్నాడు. ఇది అతని ప్రాకృతవేదిత్వానికి పెట్టిన సాక్ష్యం. దగ్గుపల్లి దుగ్గన నాసికేతో పాఖ్యానంలో శ్రీనాథుని గురించి "సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్య భాషా, పరిజ్ఞాన పాటవంబు" అని ప్రశంసించడంవల్ల ప్రాకృత భేదాలు అతనికి కరతలామలకాలని చెప్పవచ్చు.

ఈ విధంగా మన కవులు చాలా వరకు అందరూ, ప్రాకృతజ్ఞులే కాని ప్రాకృతంలో ప్రభావితమైన రచన ఏదీ కనిపించదు. "భాసుర భారతార్థముల భంగులెరుంగ నేరమిన్ గాసట బీసటల్ చదివి గాథలు త్రవ్వు తెలుంగు వారికిన్" భారతం ప్రసాదించాడు నన్నయ అని నృసింహ పురాణంలో ఎఱ్ఱాప్రగడ చెప్పిన పద్యంలోని గాసట బీసటలు గథాసప్తశతి, బేతాళ పంచవింశతి అని ఒకమారు, కాశ్యపభట్టు, విశ్వనాథభట్టు అని మరొకమారు శ్రీనిడుదవోలు వేంకటరావుగారు పేర్కొన్నారు. ఈ రూపాలు ప్రాకృతభాషాసంప్రదాయం ప్రకారం సాధువులని మహావైయాకరణులు శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు సమర్థించినా, గాథాసప్తశతి చెత్త చెదారం కాదే! నన్నయకు ముందు తర్వాత అలంకారికులందరూ రసగుళికలని ప్రశంసించి లక్ష్యాలుగా ఉదహరించిన గాథాసప్తశతిలోని గాథాలను ఎఱ్ఱన ఈసడించి ఉండడం ప్రాకృతం మహాయాన బౌద్ధం వల్లనే పాఠప్రవచనాలనుంచి తొలగిపోయి ఉంటుంది. ఇక శివకవులు ప్రజాకవులన్న మాట నిజమే. కాని, వారు జైన బౌద్ధులకు బద్ధద్వేషులు. కనుక ప్రాకృతాన్ని సుతారమూ చూడనైనా చూడలేదు. ఈ విధంగా ప్రాకృత సంబంధం సాహిత్య మూలంగా విచ్ఛినమై పోయి ఉండాలి.

మనకు పూర్వం విరివిగా ఉండి, మధ్యన విచ్ఛినమైపోయిన ప్రాకృత సాహిత్య సంబంధం శ్రీనాథుని శాతవాహన సప్తశతి అనువాదంతో పునరుజ్జీవితమయిందనవచ్చు. "శాలివాహన సప్తశతి నొడివితిని" అన్న శ్రీనాథుని మాటలనుబట్టే గాథాసప్తశతి పూర్తిగా అనూదితమై ఉంటుంది. శ్రీనాథునికి ప్రాకృత సాహిత్యం గురించి బాగా తెలుసు. దండి దశకుమార చరిత్రను అనువదించిన కేతనకు "సాగరసూక్తిరత్నానాం సేతుబంధాది యన్మయం" అని దండి పొగడిన ప్రవరసేనుని సేతుబంధం తెలియకుండా ఉంటుందా? కనుక శ్రీనాథునికి తెలియకపోవడమనే ప్రసక్తేలేదు. అటువంటి మహాకావ్యానువాదానికి అతడు ఎందుకు పూనుకోలేదు? శ్రీనాథుడి సప్తశతిలోను ఐదు పద్యాలు దొరకడం మన అదృష్టం. తక్కినవి ఖిలమై పోవడం మన దురదృష్టం.

ఇక ప్రాకృతవైయాకరణులను చూద్దామా అంటే, వారి రచనల ప్రభావం తెలుగు సాహిత్యంపై ఏమీ ఉన్నట్టు కానము. 12-13 శతాబ్దివాడైన త్రివిక్రముడు, సంస్కృత వ్యాకరణ గ్రంథాలలో భట్టోజీదీక్షితుల సిద్ధాంత కౌముదిలాగా ప్రాకృతానికి షడ్భాషాచంద్రిక ప్రసాదించిన లక్ష్మీధరుడు (16 శ) ప్రాకృత మణిదీపం వెలిగించిన అపరశంకరులు అప్పయదీక్షితులు (16-17 శ) మరికొందరు ప్రాకృత వ్యాకర్తలు తెలుగువారైనా, తమ ప్రాకృత రచనలతో తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేయలేదు.

గుణాఢ్యుడు పైశాచీ ప్రాకృతంలో రచించిన బృహత్కథ ప్రపంచ కథా సాహిత్యంలోనే మొట్ట మొదటిది, గుణాఢ్యునికి సంబంధించిన కథలే నిజమైతే, ఇతడు మనకు చాల సన్నిహితుడు. గాథలు తవ్వే తెలుగువారు ఈ కథలను పూర్తిగా స్వాయత్తం చేసుకోవలసింది. కాని అట్లాజరగలేదు. ఈ బృహత్కథ సంస్కృతానుసరణలన్నీ మనకు కాశ్మీర కవులవే లభించాయి. బృహత్కథను బుధస్వామి (9 శ.) బృహత్కథాసంగ్రహమనేపేర, తర్వాత క్షేమేంద్రుడు (10. శ) బృహత్కథా మంజరి అని, అతనికి కనిష్ఠ సమ కాలికుడైన సోమదేవసూరి కథాసరిత్సాగరమని సంస్కృతీకరించారు. వీళ్లందరూ తాము మూలాతిక్రమణ చేయలేదని, సంకోచవ్యాకోచాలు మాత్రమే చేశామని చెప్పుకొన్నారు. కాని ఈ అనువాదాలలో పదవ శతాబ్దం వరకు (రచయితల కాలం వరకు) ఉన్న సంస్కృత కావ్యేతివృత్తాలు కనిపించడంవల్ల పండితులకు బృహత్కథ పరిమాణ ప్రామాణికతలను గురించి సందేహాలు కలిగాయి. ఇది తమిళంలోని 'పెరుందగై' కు సంస్కృతీకరణమేమో అని శ్రీ వేదం వెంకట రాయశాస్త్రి (ఎం.ఎ) అభిప్రాయం. ఇతరోపజ్ఞమైన కథలూ దీనిలో చేరాయని ఆయన అభిప్రాయం.

ఈ బృహత్కథా ప్రభావం సంస్కృతానుసరణ మూలంగా తెలుగు సాహిత్యంపై బాగానే పడింది. శ్రీనాథునికి కనిష్ఠ సమకాలికుడైన జక్కనకు ప్రాకృతం గురించి బాగా తెలుసు. దీనికి అతని విక్రమార్కచరిత్ర అవతారికే సాక్షి. ఇతని విక్రమార్క చరిత్ర సంస్కృత విక్రమార్క చరిత్రకు అనువాదం కాదు. సంస్కృత విక్రమార్క చరిత్రలోని కొన్ని కథలు జక్కన రచనలో కనిపించినా, దీనిలోని చాల కథలు సంస్కృత రచనలో లేవు. సంస్కృత రచనలోని కథలెన్నో జక్కన రచనలో లేవు. జక్కన రచనలోని కొన్ని కథలకు మూలాలు బృహత్కథామంజరి, కథాసరిత్సాగరాలలో కనిపిస్తాయి. అలాగే తెలుగు బేతాళ పంచవింశతిలోని కొన్ని కథలకు మూలాలు బృహత్కథామంజరి, కథాసరిత్సాగరాలలో కనిపిస్తాయి. అందువల్ల పరోక్షంగా దీనిని ప్రాకృత ప్రభావమనవచ్చు. డాక్టర్ నీరజా చక్రవర్తి ఈ విషయాన్ని బాగా విశ్లేషించారు.

పెద్దనామాత్యుని మనుచరిత్రేతివృత్తం మక్కికి మక్కే బృహత్కథా మంజరి కథా సరిత్సాగరాలలో ఉన్నా, అతడు తాను ఇతివృత్తాన్ని మార్కండేయపురాణం నుంచి గ్రహించానని కంఠోక్తిగా చెప్పడం వల్ల, అతని మాటను నమ్మకతప్పదు. నిరంకుశోపాఖ్యానం ఇతివృత్తం

బృహత్కథలోదే. రుద్ర కవికి తెలిసిన బృహత్కథామంజరి, కథాసరిత్సాగరాలు పెద్దనామాత్యుడికి తెలిసి ఉండకపోవు గదా. మన కవుల దృష్టి పురాణాలపై ప్రసరించినట్టుగా బృహత్కథా మంజరి, కథాసరిత్సారాగాలపై పడలేదు. ఎందుకో !

కదిరీపతి రచించిన శుకసప్తశతి కూడా కర్ణాకర్ణికగా విన్న కథల గుచ్ఛమే, కాని సంస్కృత శుకసప్తశతి అనబడే దాని అనువాదం కాదు. సంస్కృతంలో ప్రచురించిన శుక సప్తశతిలో ప్రారంభంలో ఒక ఆర్య తరువాత దానిని వివరిస్తూ వచనంలో కథలున్నాయి. దాని పద్ధతే వేరు. తెలుగు శుక సప్తశతిలోని కొన్ని కథల మూలాలు బృహత్కథా మంజరి, కథాసరిత్సారాగాలలో కనిపిస్తాయి. కనుక ప్రాకృత ప్రభావం పరోక్షంగా ఉంది.

నన్నయకు వంద సంవత్సరాల ముందు కూడా తెలుగునాట ఒకవైపు బౌద్ధం, మరొక వైపు జైనం జనాదరణం పొందుతూనే ఉన్నాయి. కాని, ఆ మతాలు క్షీణదశలో ఉన్నాయనవచ్చు. పొరుగున ఉన్న కన్నడ తమిళదేశాలలో జైన బౌద్ధాలు క్షీణించి శైవ వైష్ణవ మతాలు ప్రబలుతున్నాయి. తమిళంలో భారతం అదివరకే వెలసింది కావ్యంగా. రాజరాజనరేంద్రుని శ్వశుర గృహం తమిళనాడే గనుక భారతం తమిళంలో వెలసిందని అతడు ఎరుగును. కన్నడ భారతమైన విక్రమార్జున విజయం సంగతి కూడా రాజరాజనరేంద్రునికి తెలుసు. నన్నయ విక్రమార్జున విజయమనే కన్నడ భారతాన్ని చదివాడనడానికి ఆయన భారతంలోనే అంతస్సాక్ష్యాలున్నాయి. నన్నయకు కన్నడం, ప్రాకృతం అభిలషణీయాలైనా మతం అడ్డువచ్చింది. వైదిక ధర్మపునః ప్రతిష్ఠాపన దృష్టిలో భారత రచన అవసరమైంది. కనుక తాను వ్యాసభారతాన్ని కట్టుదిట్టంగా అనువదించదలుచుకొన్న పద్ధతిని ముందుగానే స్పష్టంగా చెప్పుకొన్నాడు. భారతానువాదమంతా ఆయన చేతి మీదుగానే జరిగిఉంటే ఎట్లా ఉండేదో! (పరిహారాలు లేక వ్యాసభారతం యథాతథంగా అవతరించి ఉండేది) తర్వాత దానిని అనువదించిన తిక్కన ఎర్రనలు కావ్యదృష్టి కలవారయినా, ప్రధానంగా నన్నయ మార్గాన్ని విడనాడలేదు. గనుక ప్రాకృత ప్రభావం మతం అడ్డురావడం వల్ల పడలేదు.

కాని తెలుగు రామాయణంపై ప్రాకృత ప్రభావం బాగానే పడింది. రామాయణమంటే వాల్మీకి రామాయణం. ఎవరు ఏమి చెప్పినా, ప్రక్షిప్తాలు చాలా ఉన్నాయని ఒప్పుకున్నా, రామాయణ ప్రధాన కథ వాల్మీకి ఉపజ్ఞం. ఇది బుద్ధునికి ముందే రచితమై ఉండాలి. అట్లాకాకపోతే బుద్ధుడు తాను ఇక్ష్వాకు వంశం వాడినని, పదే పదే చెప్పుకోవడం, తానే ఒక జన్మలో రాముడిననడం జరుగదు. రామకథ బుద్ధునికి, మహావీరునికి ముందే జనంలో బాగా వ్యాప్తిలో ఉన్నందున ఈ రెండు మతాలవారు తమ మతాలు ప్రాచీన సాంప్రదాయిక ఇతిహాస పురాణాలకు భిన్నమైనవి కావని జనాన్ని నమ్మించడానికి నానా యాతనా పడ్డారు, నానా ప్రచార పద్ధతులతో. పూర్వమూ, సమకాలంలోను ఉన్న వైదిక మత గ్రంథాలను మార్చి తమవిగా వ్రాసుకోడం, తామే నిజం వ్రాస్తున్నామనడం జైన బౌద్ధాలకు పరిపాటి. జనంలో ప్రచారంలోఉన్న వాటిని కొద్ది కొద్దిగా మారుస్తుంటే జనం అంతగా పట్టించుకోలేదు. క్రమంగా ఆకృష్టమౌతుంది. ఇదీ జైన బౌద్ధుల ప్రచారపద్ధతి. ఇది ఒక రకంగా స్లోపాయిజనింగ్.

రామాయణం విషయంలో ఇలాటి మహా ప్రయత్నాలు జైనంలో మూడు జరిగాయి. 1. విమలసూరి పరంపర, 2.సంఘదాస పరంపర, 3.గుణభద్ర పరంపర. వీటిలో విమలసూరిపరంపరే ఎక్కువ వ్యాప్తి చెందింది. లోకప్రియమైన రామకథను జైన ధర్మపు మూసలో పోయడానికి తొలిసారిగా ప్రయత్నించినవాడు విమలసూరి. ఇతనిని తర్వాతి ప్రాకృత సంస్కృతజైన కవులు అనుసరించారు.

విమలసూరి క్రీస్తు శకం మొదటి శతాబ్దంలో ఉన్నవాడు (72). ఇతని రామాయణ భాషను బట్టి ఇతడు క్రీస్తు శకం మూడవ శతాబ్దం వాడు కావచ్చునని కొందరివాదం. ఈ రామయణాన్ని ఇతడు జైన మత ప్రచారం కోసమే రచించాడు. "సింహాన్ని జింక చంపింది. కుక్క ఏనుగును తరిమింది. ఇలాటి విపరీతమైన, అసంభవమైన మాటలతో నిండిన రామాయణాన్ని కవులు రచించారు. ఇదంతా అబద్ధం, ఉపపత్తి విరుద్ధం. ఇలాటి మాటలను పండితులు విశ్వసించరాదు. పూర్వ గ్రంథాలలో ఉన్నదాన్ని. ఆచార్య పరంపరగా వచ్చిన దాన్ని నేను అనుపూర్విగా చెబుతాను" అని ఇతడు తన గ్రంథం అవతారికలో చెప్పుకున్నాడు. ఇతని మూల రామాయణం ఏదో?

ఈయన రామాయణం పేరు 'పఉమచరిఉ' - అంటే పద్మచరితం. రాముని ముఖం వికసించిన పద్మం వంటిది. కళ్లు పద్మాలవంటివి. ఇతని శరీరకాంతి పద్మ సదృశం. కనుక అతనికి తండ్రి పద్మ అని పేరు పెట్టాడు. పద్మ-పదుమ-పఉపఉమ అయింది. రాక్షసులు మాంసభక్షకులు కారు. వీరు తమ పుణ్యంతో ద్వీపాలను రక్షిస్తారు గనుక వీరికి ఈ పేరు వచ్చింది. వానరులు కామరూప కామ గమనాలుగల విద్యాధరులు. వీరూ మానవులే. అపూర్వ విద్యలు సాధించారు. వానరులు తమ ఇండ్లపై వానరచిహ్నాలు ఉంచుకోడంవల్ల వానరులయ్యారు. భరత శత్రుఘ్నులు కైకేయి కుమారులు.

తక్కిన రెండు జైన సంప్రదాయాల ప్రకారం సీత రావణ మండోదరుల కుమార్తె. హనుమంతుడు రావణుని చెల్లెలయిన చంద్రప్రభకు కుమార్తె అనంగ కుసుమను పెళ్లాడతాడు. ఈమె కాక అతనికి వందమంది భార్యలున్నారు.

'పఉమచరిత'లోని వారంతా జైనులే. సీత తన శిరోజాలు లుంచనం చేసి (పీకివేసుకొని) జైనదీక్ష స్వీకరిస్తుంది. రావణుని రాముడు చంపడు, లక్ష్మణుడు అతని ఆజ్ఞతో చంపుతాడు. రాముడు శుద్ధసత్త్వం చెడ్డపనులు చేయడు. రావణుని వంటి జైన సాధకుణ్ని చంపడంవల్ల లక్ష్మణుడు సరాసరి నరకానికి పోతాడు. రాముడు తపస్సుచేసి నిర్వాణం పొందుతాడు. ఈ కావ్యంలోని ప్రతిపాత్ర ప్రసక్తి ఉన్నా లేకపోయినా, జినధర్మం ఉపదేశిస్తుంది.

విమలసూరి, సంఘదాస, గుణభద్రాచార్యుల పరంపరల్లో పెక్కు ప్రాకృత సంస్కృత రామాయణాలు వచ్చాయి. తర్వాతికాలంలో, వాటిలో విచిత్రమైన ఉపాఖ్యానాలు చాలా ఉన్నాయి. వీటి ప్రభావం తెలుగు రామాయణాలపై పడింది. కనుకనే, మన రామాయణాలు 'పెక్కింటిలో అవాల్మీకియమైన పెక్కు కథలు కనిపిస్తాయి.

ఈ అవాల్మీకీయ రామాయణ ప్రచారాన్ని అరికట్టడానికే భాసకాళిదాస ప్రవరసేనులు రామకథను కావ్యనాటకాదులుగా సంస్కృత ప్రాకృతాలలో రచించారని నా విశ్వాసం.

సాహిత్య శాస్త్ర దృష్టితో ప్రవరసేనుని సేతుబంధంలోని అవతారికా పద్ధతి, అశ్వాసవిభజన సరాసరిగానో, కన్నడ సాహిత్యం ద్వారానో తెలుగు కావ్యాలలో ప్రవేశించింది. ప్రాచీన సంస్కృతకావ్యాలలో ఆ అవతారికా పద్ధతి లేదు. ప్రాకృత కావ్యాలయిన సేతుబంధ, గౌడవహోలలో ఈ అవతారికా పద్ధతి ఉంది. దీనిలో ఇష్టదేవతాస్తుతి సుకవిప్రశంస, కుకవినింద, గ్రంథకర్తృ వంశాదికం ముఖ్యాంశాలు. ప్రాకృత కవులకు అవతారిక అవసరమైంది. ప్రాచీన కథలను ఇతరులు మెలిపెట్టి వికృతం చేసి ప్రదర్శిస్తున్నప్పుడు పరోక్షంగా వారిని మందలించడం, ఆ కథలను సరిగా చెప్పినవారిని ప్రశంసించడం ప్రజలను హెచ్చరించడం అవసరమైంది. కాళిదాసు ఒక్క రఘువంశంలో మాత్రం అవతారిక వంటిది చెప్పే మందః కవిశః ప్రార్థనవంటి శ్లోకాలతో విమలసూరిని హెచ్చరించాడు కుమారసంభవం బుద్ధుని మారవిజయగాథకు సమాధానమని నా విశ్వాసం. సేతుబంధం స్కందగుప్తుని ద్రౌహిత్రుడు, కాళిదాసు శిష్యుడు, వాకాట రాజు అయిన ప్రవరసేనుడు రచించడం వల్ల, స్వతః కళావిలసితం కావడం వల్ల దండ్యాదులు ప్రశంసించడం వల్ల చాలా వ్యాప్తి చెందింది.

పందొమ్మిదో శతాబ్ది ఉత్తరార్ధంలోను, 20వ శతాబ్దిలలోను ప్రాకృతంపై తెలుగువారికి మక్కువ ఎక్కువయింది. శఠగోపసహస్రాది బహుగ్రంథకర్తలు, విద్వత్కవులు శ్రీ మేడేపల్లి వేంకట రమణాచార్యులుగారు ప్రాకృత భాషా చరిత్ర వ్రాయడమే కాక సేతుబంధాన్నిఅనువదించారు. అప్పటికి చక్కగా పరిష్కృతమైన సేతుబంధ ప్రతి లభించలేదు గనుక దానిలోని దోషాలు అనువాదం లోను వచ్చాయి. ఉదాహరణకు

"చాపతుల్యాకృతి వహించు సంద్రమునకు
సంహితశరోపమము పార్శ్వ సంఘటితము
గుణమువలెనున్న వింధ్యాద్రి కుధరవరము
జూచె రాఘవు దత్తరి చూడ్కులలర"

సముద్రం వంపుగా ఉన్న విల్లులాగా ఉంది. దాని రెండు కొనలకు కట్టిన నారిలాగ ఉంది. వింధ్య పర్వతం వింధ్య నుంచి పారే సెలయేళ్ళు సంధించిన బాణాలలాగ ఉన్నాయి అని కవి ఉద్దేశం (మూ. 1.54) పై అనువాదంలో పై నుంచి పారుతున్న సెలయేళ్లు బాణాలలాగ ఉన్నాయనే భావం పోయింది. శ్రీ ఆచార్యులుగారి మూలమేదో ! దీనిని ప్రాకృతసాహిత్య పాథోనిధులు శ్రీ అవధానం చంద్రశేఖర శర్మగారు ఇట్లా అనువదించారు.

"అంబుధి దంబుమీరిన శరాముగా, నుభయాంతసంగియై
సంబిన తద్భరంబు సయిపందగి నిస్సరదాపగా ప్రవా
హంబులు సంహితాంబకములై తనరన్ పరిశుద్ధ మౌర్వికా
భం బగు వింధ్యమున్ ధరణిపాల వరేణ్యుడు గాంచె ముందటన్ (1-50)

గాథాసప్తశతిని శ్రీనాథుని తర్వాత అనువదించడానికి యత్నించిన వారు గురువర్యులు వేటూరి ప్రభాకరులు. శ్రీయుతులు తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి, దిగుమర్తి సీతారామస్వామి గార్లు. వీరు కొన్ని గాథలను మాత్రం అనువదించారు. దీనిని పూర్తిగా అనువదించిన వారు శ్రీయుతులు రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, ఘట్టిలక్ష్మీ నరసింహ శాస్త్రిగారలు. ఈ రెండు అనువాదాలలో శ్రీ రాళ్లపల్లి వారిది చాల సహృదయాదరం పొందింది. వీరి అనువాదం ఎలాటి వ్యర్థపదాలూ లేక మూలాతిశాయిగాను ఉంది. ఉదాహరణకు :

పుట్టంతేణ విహ అఏణ
మామి కహ ణివ్వరిజ్జ ఏతమ్మి,
అద్దా ఏ పడి బింబం వ్వ
జమ్మి దుఃఖం ణ సంకమీఇ (3.4)
స్ఫుటతాపి హృదయేన
మాతులాని కథంనివేద్యతే తస్మిన్
ఆదర్శే ప్రతిబింబమివ
యస్మిన్ దుఃఖం ససంక్రామతి
ఆ. అద్దమందు నీడ అంటునట్లెవ్వని
యాత్మ నొరుల వగపులంటుకొనవొ
యట్టి వానితోడ నెట్లు చెప్పుదు నత్త
మనము వ్రక్కలైన మానెగాని.

ఈ వ్యాసకర్త గథాసప్తశతిలో తెలుగు పదాలు అనే పేర ప్రాకృత సాహిత్యానికి సంబంధించిన వివిధ వ్యాసాల సంకలనం ప్రచురించడం జరిగింది. గాథాసప్తశతి గాథల భావాలను కథలుగా అల్లి "పల్లకి" వారపత్రికలో సంవత్సరం పాటు (1985-86) ప్రచురించడం జరిగింది. అవి చాలా జనాదరం పొందాయి. మహాయాన బౌద్ధుల ప్రప్రథమ ప్రామాణిక బుద్ధ చరిత్రమైన "లలిత విస్తర మహాపురాణం"ను ఈ వ్యాసకర్తా, శ్రీ బులుసు వేంకటరమణయ్య గారు అనువదించి మొదట ఆంధ్రప్రభ ఆదివారం వివిధ వ్యాసానుబంధంలోను, తర్వాత పుస్తకరూపంగాను ప్రచురించడం జరిగింది. లలిత విస్తరం సంస్కృత ప్రాకృతాలు పడుగుపేకగా ఉన్న రచన. లలిత విస్తరంలో విపులను గురించి ఉందని, మరొకటి ఉందని చరిత్రకారులు, పురాతత్త్వ వేత్తలు చెప్పడమే కాని, దానిని ఎవరూ వివరించలేదు. శ్రీ ద్విజేంద్రలాల్‌మైత్ర దాని సారాంశాన్ని ఆంగ్లంలో ప్రచురించారు. పైన పేర్కొన్న ఇద్దరూ దానిని తొలిసారిగా యథాతథంగా అనువదించాము. ఈ అనువాదమే భారత భాషలలో తొలి

అనువాదమై ఉండవచ్చు.

ఈ వ్యాసకర్త క్షేమేంద్రుడు రచించిన అవదాన కల్పలతను, బృహత్కథా మంజరిని వచనంలో అనువదించడం జరిగింది. వీటి మూలం ప్రాకృతం గనుక పరోక్షంగా ప్రాకృతసేవ చేసినట్లే. మహుకుడనే కవి హరమేఖల అనే ఐదు పరిచ్ఛేదాల వైద్య గ్రంథాన్ని ప్రాకృతంలో రచించాడు. ఇతడు చిత్రకూటంలో క్రీస్తుశకం 920 ప్రాంతంలో ఉన్నవాడు. దీనిని తొలిసారిగా సాంబశివశాస్త్రి అనే విద్వాంసులు తిరువాన్కూరు సంస్కృత గ్రంథమాలలో దేవనాగరిలో ముద్రించారు. దీనిలో నేటికీ సకల జనులకు ఉపయోగపడే యోగాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. ఐదవ పరిచ్ఛేదం పూర్తిగా సుగంధ ద్రవ్య యోగాలకు సంబంధించింది. దీనిలోని యోగాలను ఎవరైనా ప్రయోగాత్మకంగా పరిశీలించి సిద్ధపరిస్తే, లాభం పొందవచ్చు. కృత్రిమకస్తూరీ కరణం, సుగంధాంతర కరణం మున్నగువానిని సాధించి, గొప్ప ధనవంతులు కండి అని గ్రంథకర్త అనేకసార్లు గ్రంథంలో చెప్పాడు. ఏ మందులు సంస్థలో, కాస్మెటిక్ సంస్థలో పూనుకుంటే చాలా ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా దోమలు, నల్లులు, ఈగలు, ఎలుకలు మొదలైన వాటినివారణ యోగాలు చాలా ప్రయోజనకరాలు. దీనిని ఈ వ్యాసకర్త అనువదించడం జరిగింది. ప్రసిద్ధవైద్యులు, ఆయుర్వేద మహోపాధ్యాయులు డాక్టర్ వేటూరి శంకర శాస్త్రిగారూ ప్రచురించారు.

బుద్ధ జాతక కథలను శ్రీ శివ శంకరశాస్త్రిగారు వచనంలోను, సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు పద్యంలోను అనుసరించారు. పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు గిడుగు రామమూర్తి పంతులుగారి సప్తతిపూర్తి సంచికలో "ప్రాకృత సాహిత్యము- ప్రజాసేవానూ" అనే గొప్ప వ్యాసం, పుస్తకమంత పెద్దది వ్రాశారు. శ్రీ పరవస్తు రామానుజస్వామిగారు హేమచంద్రాచార్యుని దేశినామమాలను సంస్కరించి ప్రచురించడమే కాక, ప్రాకృత భాషపై అనేక వ్యాసాలు వ్రాశారు. బౌద్ధ వాఙ్మయ బ్రహ్మగా విఖ్యాతులైన శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు బౌద్ధ సాహిత్యంపై అనేక గ్రంథాలు రచించారు. రాజా శ్రీ వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వర ప్రసాద్ బహద్దర్‌గారు ధమ్మపదం అనువదించడమేకాక బౌద్ధం గురించి ప్రాకృత సాహిత్యాన్ని గురించి అనేక వ్యాసాలు వ్రాశారు. శ్రీ అవధానం చంద్రశేఖర శర్మగారు సేతుబంధకావ్యాన్ని గొప్పగా అనువదించి ప్రచురించారు. ఆచార్య డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడు గారు ఇటీవల ధమ్మపదం అనువదించారు. డాక్టర్ కొరిడె కమలమ్మ 'ప్రాకృత సాహిత్యంలో ప్రజాజీవితం' అనే సిద్ధాంత వ్యాసం ఆంగ్లంలో ప్రచురించడమే కాక, వజ్జాలగ్గం అనువదించి ప్రాకృత కవితా మాధుర్యాన్ని సామాన్య ప్రజలకూ అందజేశారు. శ్రీ చీమకుర్తి శేషగిరిరావుగారు తెలుగు భాషపై పాలీ ప్రాకృత ప్రభావం గురించి పుస్తకం ప్రచురించారు. శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు గారు బహుభాషాకోవిదులు, ప్రాకృతంలో గొప్ప పరిశ్రమ చేసిన విద్వాంసులు, ప్రాకృత భాషా, సాహిత్యాలపై పెక్కు అపూర్వ వ్యాసాలు వ్రాశారు.

ఇట్లా ఎంతో పోగా కొంతయినా మిగిలిన ప్రాకృత సాహిత్య ప్రభావం తెలుగుపై కొద్దిగా పడినప్పటికీ ప్రాకృత భాషా ప్రభావం పూర్తిగా ఉంది. ప్రాకృతాలు తెలుగులో రంగరించుకొనిపోయాయి. నేటి భాషావేత్తలు ఈ విషయంలో నిష్పాక్షికంగా పరిశోధన జరుపవలసిన అవసరం ఉంది.

అధోజ్ఞాపికలు :

1. ప్రాకృత సాహిత్యకా ఇతిహాస్- డాక్టర్ జగదీశ చంద్రజైన్ : పుట 5; పాఇఅసద్ద మహణ్ణవో పీఠిక.
2. డాక్టర్ వి.రాఘవన్ వ్యాసాలు - హిందూ
3. ధమ్మపదం - వాసవగ్గో : 1
4. ప్రాకృత సాహిత్యకా ఇతిహాస్ - పుట. 16
5. ఆచార్య బాగ్యేచూళికా ప్రాకృతంపై వ్యాసం
6. జయశంకర్ ప్రసాద్ అజాత శత్రు నాటక పీఠిక
7. భరతనాట్యశాస్త్రం
8. చండుని ప్రాకృత వ్యాకరణం
9. సిద్ధహేమచంద్రశబ్దానుశాసనం
10. దేశినామమాలా -1
11. కవిరాజమార్గం- పరి. 8; పద్యం . 58
12. శబ్దమణిదర్పణం- పుట. 12
13. సాహితీ సుగతుని స్వగతం - తిరుమల రామచంద్ర
14. శ్రీ చీమకుర్తి శేషగిరిరావు తెలుగు గోష్ఠి వ్యాసం- జనవరి 1989
15. పి గ్రాఫికా ఇండికా- డా.కార్తికేయ శర్మ గారి వ్యాసం
16. మనలిపి పుట్టు పూర్వోత్తరాలు- తిరుమల రామచంద్ర
17. గాథాసప్తశతిలో తెలుగు పదాలు - తిరుమల రామచంద్ర
18. వజ్జాలగ్గలో తెలుగు పదాలు - తిరుమల రామచంద్ర : భారతి, మే.1980.
19. కౌశకృష్ణ ధాతుపాఠవ్యాఖ్య

20. ఆంధ్రభాషాచరిత్ర–డాక్టర్ చిలుకూరి నారాయణరావు
21. గంగాధర శాసనం - డాక్టర్ వేలటూరి వేంకటరమణయ్య.
22. మల్లియరేచన మొదటి తెలుగు కవి- డాక్టర్ పి.వి.పరబ్రహ్మశాస్త్రిగారి తెలుగు గోష్ఠి వ్యాసం.
23. తెలుగుపై ప్రాకృత ప్రభావం - డాక్టర్ రవ్వాశ్రీహరి వ్యాసం.
24. నందంపూడి శాసనం- శ్లోకం 25
25. శ్రీ వేదం వేంకట రాయశాస్త్రిగారి వ్యాసం- భారతి, 1960.
26. జక్కన విక్రమార్క చరిత్ర- ఒక పరిశీలన : డాక్టర్ నీరజాచక్రవర్తి.
27. ప్రాకృత సాహిత్యంలో రామకథ- తిరుమల రామచంద్ర : భారతి, జూన్, జూలై ఆగస్ట్, 1978.
28. పఉమచరిఉ- 2.116,117
29. హరమేఖల- గోపాలాచార్లు, లక్ష్మీపతిమెమోరియల్‌ట్రస్ట్, గాంధీనగర్, హైదరాబాదు-380 (1990 మార్చిలో బెంగళూరులో జరిగిన అఖిల భారత తెలుగు మహాసభలో చదివిన పరిశోధన వ్యాసం)

(తెలుగు - వసంబరు 1990)

వీరగంధము దెచ్చినారము
వీరు డెవ్వడొ తెల్పుడీ!
పూసిపోదుము మెడను వైతుము
పూలదండలు భక్తితో !

తెలుగు బావుట కన్ను చెదరగ
కొండవీటను నెగిరినప్పుడు
తెలుగు వారల కత్తిదెబ్బలు
గండికోటనుకాచినప్పుడు

తెలుగు వారల వేడినెత్తురు
తుంగభద్రను గలిసినప్పుడు
దూరమందున నున్న సహ్యజ
కత్తినెత్తురు కడిగినప్పుడు

ఇట్టి సందియ మెన్న డేనియు
బుట్టలేదు రవంతయున్
ఇట్టి ప్రశ్నల నడుగువారలు
లేకపోయిరి సుంతయున్
నడుముగట్టిన తెలుగు బాలుడు
వెనుక తిరుగం డెన్నడున్
బాసయిచ్చిన తెలుగు బాలుడు
పారిపోవం డెన్నడున్

ఓరుగంటిని దండువిడిసిన
దేవగిరి యాదవ నృపాలుని
ఓరగంటను గాంచి యప్పుడె
దేవగిరి దర్వాజ వఱకున్

తఱిమి తోల్కొని పోవబోవగ
పూరిమేయగ, నభయ మిచ్చిన
తెలుగుదొరసానైన రుద్రమ
దేవికీర్తిని లోక మెఱుగదె

తెలుగువారల యాదుబిడ్డల
తెగువ బిగువులు తెలుసుకొనుమా
వీరరసమే వెల్లివిరియగ
వెనుక తగ్గని పల్లెనాటన్

కాలిబంటుల కాలిక్రిందను
నలిగిపోయిన దండుబాటల్
అరులమూకను జెరల బెట్టిన
అరిదియగు మాచెఱల కోటన్
పేరుగ్రుచ్చియు బిలిచి యదుగుము
తెలియవచ్చును తెలుగు వ్రేటున్
ప్రాతకతలన్ బాడకుండిన
దెలుగుబిడ్డా! పరువు దక్కునె?
ఢిల్లీ సులతాన్ ఫౌజుదారులు
ముట్టడింపగ మూడుమాఱులు
తురక కత్తులు దాకినంతనె

చుంయి చుంయిన గంటునెత్తురు
పొంగి పొరలగ వోరుగంటను
ద్రోలివేయవె ఢిల్లీదాకను
తెలుగు కత్తులు తురకబిడ్డల
దెంపుపెంపున నెల్లదాటగ

పెద్దవారల బిలిచి యదుగుము
తెలియబరుతురు తెలుగుధాక

రెడ్డి దొరలునుకమ్మ దొరలును
వెలమదొరలును కాపుదొరలును
రాచదొరలును మొక్కవోవని
పౌరుషంబుల బోరు సలిపియు

గౌతమీనది కృష్ణవేణిని
తుంగభద్రను సహ్యజానది
నెత్తు రొలికిరి, కాలవశమున
గత్తి గడిగిరి, మూలబెట్టిరి.

ఇంతమాత్రనె మఱచి పోకుము
తాతతండ్రుల వన్నె చిన్నెలు !

మఱచిపోకుము మఱచిపోకుము
మన్నె దొరలను తెల్గునాటను
మఱవకుండగ మూడు ప్రొద్దుల
బాడుచుండుము వారి పాటను

తేటమాటల దెలియజెప్పుము
దిక్కు లన్నియు మారుమ్రోగిన
తెలుగు వారల పేరుపెంపును
దెలియకుండగ నుండబోకుము

తెలుగు బాలుడ! యింపునింపుము
తెలుగు బాలుడ! పేరు పెంపుము!!

- త్రిపురనేని రామస్వామి చౌదరి

భమిడిపాటి కామేశ్వరరావు

"మన" తెలుగు

(6–8– 1938 తారీఖున తెలుగుదేశంలో ప్రసిద్ధి చెందిన రాజమండ్రీ గౌతమీ గ్రంథాలయపు 10వ వార్షికోత్సవ సందర్భంలో ఆంధ్రవిశ్వకళాపరిషత్తు యొక్క ఆధ్వర్య ప్రతినిధిగా రెండవసారి ఉంటూ దేశ దేశాంతరాల్లో ప్రఖ్యాతులైన శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారి ఆధ్యక్షతకింద జరిగిన సభలో ఈ ప్రసంగం చాలావరకు అయింది. ప్రసంగం 'మన తెలుగు' యొక్క స్థితిగతులగురించి. 'మన' అనేమాట మనభాషలోనే ఉందిట. మనమతంలాగే మనభాషకూడా చాలా సమిష్టికుటుంబం. చెప్పేదాల్లో తెలుగుభాషయొక్క విశేషాలుగనక మీకు స్ఫురణకొస్తే అవి 'మన' తెలుగువే అనిన్నీ, లోపాలుగాని కనపడితే అవి 'నా' తెలుగువనిన్నీ అనుకోండి. ఇది నాహృదయంలో ఉండడంచేత మీ సెలవు ప్రకారం పైకి నేను చెప్పుగుంటూన్న బాధేకాని ఉపదేశం అనిమాత్రం మీరు ఎంచకండి. ఉపదేశం చెయ్యడానికి నాకు అర్హత లేదు. అసలు దేశంలో బలం ఉంటేగాని ఉపదేశం లోనూ బలం ఉండదు.)

భాష అంటే సంస్కారంపొందిన ధ్వని. భాషలు ధ్వనులు. భాషలగురించి చెలరేగే వాదప్రతివాదం కోలాహలం. ఒకదేశాన్నించి మరోదేశానికి మానవులు ఏవర్తకం నెపం మీదో ప్రయాణాలు మాననంతకాలం భాషలకి సంపర్కం మానదు. సరిహద్దుల్లో బహు భాషాసంపర్కం తప్పదు. సంపర్కం ఉండడంతోటే సంబంధం, సాంగత్యం, సాంకర్యం, సంఘట్టన మొదలైనవాటిల్లో ఏదేనా ఏర్పడచ్చు. కొత్తమనుషుల్ని మననెత్తి నెక్కించుగోడానికి మనం ఒప్పుకుని వాళ్ల భాష మనననెత్తిమీదిది కాదనుకోడం అజ్ఞానం. ఇట్లాంటిసందర్భాల్లో మెత్తమెత్తనివాళ్లని గట్టివాళ్లు కంఠం నొక్కి దవడశుద్ధి చేస్తుంటారు. ఆ మెత్తవాళ్లు ఒకొక్క చెంపకాయే శాస్త్రప్రకారం తింటూ, 'ఈ మాటు కొట్టుమరి చూస్తానూ!' అంటూండడం, ఇల్లా కోరినప్పుడు ఊరుకుంటే బాగుంటుందా అని చెప్పేసి గట్టివాళ్లు వెనకటికంటె ముదకరకం చెంపకాయి వీళ్లని లాగుతూండడం కద్దు. ఆ మెత్తని వాళ్లు తమ స్థితిని పట్టిగెల్లి తమ ప్రారబ్ధకర్మానికి ముడెట్టుకుని నిశ్శబ్దంగా ఆగట్టివాళ్లని చావతిట్టుగుంటూండడం. తెలుగు సంగతికూడా అల్లా అయిపోయింది. దేశీ యాంధ్రం అనేది తెలుగువాళ్లల్లో లక్షకోడికి తెలియొచ్చు. అట్లాంటి తెలుగులో రొండుమూడు గ్రంథాలూ ఎరుగుదుం, సజీవులై ఉన్న వాళ్లల్లో ఇద్దరుముగ్గురుపైగా రచయితల్నీ ఎరుగుదుం. కాని, నూటికి నూరుమంది పైచిలుకు మాట్టాడే తెలుగు కలగాపులగమే. ఈపులగంలో సంస్కృతం, పార్సీ, ఇంగ్లీషు మాత్రం జోరుగా పడ్డాయి. తెలుగుయొక్క మెత్తదనంవల్లే ఇన్నిన్ని భాషలపదాలూ బానిసల్లాగా హృదయంనాటేలాగ తెలుగులో గుచ్చుకుపోయి ఉన్నాయి. తెలుగు శరీరంలో వాటిని నిల్చి ఉండనిస్తే అవి సెలలువేసి ప్రాణం తీసేస్తాయని కొందరూ, లేక వాటిని పైకి లాగిపారేస్తే వెంటనే ప్రాణపోకట అని కొందరూ ! అప్పట్లో సంస్కృతానికున్న మన్ననబట్టీ, సంస్కృతాన్ని

పరిపూర్ణంగా తెలుగులిపిలో రాయడానికుండే వీలును బట్టీ, తెలుగువాళ్లకి ఇహపరసాధనాలైన శాస్త్రాలు సంస్కృతంలో ఉండబట్టీ, ఎన్నో సంస్కృతపదాలు ఆపళంగానే తెలుగై పోయాయి. తెలుగులోంచి వాటిని ఇప్పుడు తీసెయ్యడం ఎల్లా? తురక రాజ్యకాలంలో వేషం, అలంకారం, ఆభరణాలు, కచేరీలు, కౌలుఖత్తుల లాంటి వాటికి సంబంధించిన పదాలు వందలాదిగా తెలుగై పోయాయి. వాటిని ఇప్పుడు చెడనాడుకోడం ఎల్లా? అట్లానే కుంపినీ రాజ్యం జోరబడ్డదిలగాయతు ఇంగ్లీషువాళ్లు ఏదో జీవితావసరం అనిపించే నూతన సౌకర్యం -- స్టీమరు, రోడ్డు, పోస్టు, టెలిగ్రాఫు, ఎలెట్రీ (అనేచాలామంది తెలుగువాళ్లు అనగ్రు,) నీళ్లపైపు, కాఫీహోటలు, మిల్లులు, సైకిల్, మోటారు, ఎయిరోప్లేను, గ్రామొఫోను, సినీమా, టాకీ, రేడియో, (ఇకముందు టెలివిజన్, యాథర్‌ప్లేన్) లాంటిది తెచ్చి తెలుగువాళ్లల్లో పారేస్తూండడం, ఒకొక్కక్కపట్టు ఓపాతిగేసి ఇంగ్లీషు మాటలు మనకళ్లముందు తెలుగై పోతూండడం ఎరుగుదుం. వీటిని ఇప్పుడు అప్రయత్నంగా బర్లోకెళ్లి ఇంగ్లీషు చదివి ఉండని తెలుగువాళ్లంతాకూడా వాడతారు. తెలుగు సంభాషణలోకి ఆరీతిగా ఎక్కి ఖైటాయించిన ఇంగ్లీషుమాటల్ని ఇప్పుడెల్లా తీసెయ్యడం ? మచ్చ మాయడం అంటే మాటలే! ఏకర్మంవల్లో ఒకే మహాప్రవాహంలో మనుష్యులు పడ్డప్పుడు, వాలుకేసి మొఖం పెట్టినవాళ్లనీ ఎదరకేసి మొఖంపెట్టి గుంజుకేనేవాళ్లనీ ఉభయుల్నీ కూడా ఆ ప్రవాహం వాలుకేసే ఈడ్చుకుపోయి గిరవటెడుతుంది. ఎటొచ్చీ వాలుకేసి తిరిగిన వాళ్లు కాస్త సజావుగా వెడతారు. ఎదరకేసి తిరిగిన వాళ్లు వెల్లగిత్తులా పడతారు........

ఆ మీదట ఒకటి జరిగింది. కేవలం తెలుగుకాకుండా మరొకభాషగాని విషయంగాని బాగా తెలిసి ఉంటేతప్ప ఉద్యోగం డబ్బూలేని ఒక తెలుగువాణ్ణి ఆంధ్రేతరులూ ఆంధ్రులూకూడా ఒక పండితమాత్రుణ్ణిగా నేనా కట్టడం మానేశారు. లోకంలో చాలామంది గొప్పవాళ్లకి తెలుగు రాకపోబట్టి, తమరికిగూడా తెలుగురాకుండాపోయి రాదని తమరు చెబుతూంటేగాని తెలుగువాళ్లల్లో గొప్ప సంపాదించడానికి వీల్లేదని కొందరు తెలుగువాళ్లకి నమ్మకం కలిగిందా అనిపిస్తుంది. కాలక్రమాన్ని 'విద్య' అన్నా, 'చదువు' అన్నా, 'పాండిత్యం' అన్నా ఆదిని సంస్కృతంలోనే అనిన్నీ పదపడి ఇప్పట్లో ఇంగ్లీషులోనే అనిన్నీ అనుకునేటంత వ్యామోహం తెలుగువాళ్లల్లో ప్రబలింది. పురాతన విజ్ఞానం ధరించినదవడంచేత సంస్కృతానికి జ్ఞానులు మొదటిలోటు ఇచ్చారు. పిదప వచ్చిన రాజకీయ పరివర్తనంవల్ల పార్సీకి మోజు ఉండేది. "దేవతాభాషల తీరు లేమియుగావు, పారసీక్తులు ప్రణుతికెక్కు" అని తిమ్మకవి దుఃఖించాడు. దరిమిలాని ఇంగ్లీషు వెలిసింది. మొదట్లో గుమాస్తాగిరీ విషయంలో అవసరమై, నేటివరకూ అది అల్లానే ఉండగా, అక్కణ్ణించి, లోకంతో వ్యవహరించే విషయంలో, నవీనవిజ్ఞానాభివృద్ధి గమనించే విషయంలో, నవ్యప్రపంచరాజకీయ పరిస్థితి గుర్తెరిగేవిషయంలో, వేదశాస్త్రాల్లో ఏముందో చెప్పిన దొర్లపుస్తకాలు చదువుకోడం విషయంలో, నూతన శాస్త్రపరిశోధనలవల్ల తేలిన సారాంశాల ప్రయోగం వల్ల మానవులయొక్క ఐహికసౌఖ్యాభివృద్ధికి తోడ్పడే అపూర్వసాధనోపాయాలు అవగాహన చేసుకుని లాభం తియ్యడం విషయంలో, ఇంగ్లీషు ప్రాణావసరం అయిపోయిందని చాలామంది ఒప్పుగుంటారు. అందుకని, దేశావసరమూ అయిన పూర్వపు సంగతులు యావత్తూ సంస్కృతంలో ఉండడంవల్ల అవి నేర్చుగోడానికి తెలుగు అక్కర్లేనట్టే, నేటిప్రపంచం తెలుసుగోడానికి తెలుగు అక్కర్లేదు కాదు ---ఎంతమాత్రం చాలదు. ఇంగ్లీషుంటే, అందుకూ మరోఅందుకూ మరోఅందుకూ కూడా నయం. ఒకవేళ నేటి సజీవప్రపంచాన్ని గురించి రాసిన గ్రంథాలు తెలుగువి ఉన్నా, అందులో కొత్తవి అని పామరులు అనుకునేసంగతులు ఇంగ్లీషులోంచో మరో పరభాషలోంచో చెప్పో, టైములేక చెప్పకో అనువదించి, కుదించి, దించి, అనుసరించి, అనుకరించి తంటాలు పడ్డ బాపతు పోదూ అని నిరసన. 'తెలుగులో అపూర్వమేధావంతులు చేసిన స్వతంత్రరచన మనం నేర్చుగుని మన్నించతగ్గదిలేదు'అని ప్రతీ గొప్ప తెలుగువాడికీ విశ్వాసం. తాను తక్కిన తెలుగు మూకకంటె గొప్పవాడవడంచేతనే అల్లాంటి విశ్వాసం కుదుర్చుకోగలిగానని వాడిఊహ. సనాతనత్వం, దేవత్వం, సర్వతోముఖత్వం కలిగి ఉండడంవల్ల సంస్కృతాన్ని వదలలేని తెలుగువాళ్లున్నారు. సంస్కృతం నేర్చి ఆ భాషలో కావ్యాలు రాస్తే తీరిపోనా, అట్లా ఎంచేతో చెయ్యక, తెలుగులో గ్రంథాలు రాస్తూ నల్లేరుమీద బండి అన్నట్టు అసలే నామరూపాలు లేకుండా అణగారిపోతూన్న తెలుగుమీదికి సంస్కృతరథం తోలుకొచ్చి తెలుగువాళ్లని పచ్చడిచేసే తెలుగువాళ్లూ ఉన్నారు. దర్జా, హోదా, దబాయింపు, ఉద్యోగార్జన, గొప్పవాళ్లతో సహవాసం తద్వారా స్వలాభంలాంటివాటికి వీలుండడంవల్ల బొట్లేరు ఇంగ్లీషుముక్కలు వదల్లేని తెలుగువాళ్లున్నారు. దర్జా కోసం ఓ జిల్లా బోర్డుమెంబరు (ఆయన్ని బోర్డునెంబరు అంటేగాని ఆయనకి కోపంవచ్చేది.!) "నేను మొన్న మెడ్రాసు వెళ్లినప్పుడు ఆంజినీలు హోటల్లో భోంచేశాను. అక్కడ లిఫ్టన్ అరణ్యమెంటు బాగుంది" అన్నాడు. తరవాత వాకబుచేస్తే ---అంజనీలంటే డి యాంజిలిస్‌ట, లిఫ్టన్ అంటే లెట్రిన్‌ట. పల్లెటూళ్లల్లో పోతూ ఇంగ్లీషు మాట్టాడి అక్కడి 'బైతు'ల చేత దణ్ణాలెట్టించుకుని చాకిరీ చెయించుగునే తెలుగువాళ్ళున్నారు కారునడిపే వాళ్ళు తమరికి పది పన్నెండు వర్ణక్రమం తెలియని ఇంగ్లీషుమాటలు వచ్చుననేగా మనుష్యుల్నీ పశువుల్నీ సమంగా దబాయించడం ! ఎండి శుష్కించిపోయిన పురాతనపు ఇంగ్లీషుసరుకు-- రెండుమూడువందలఏళ్లనాటిది--- ఏటి కెదురీది పిక్కవేసి నేర్చి ఉద్యోగాలుచేసే అస్మదాదుల్ని తమరు ఎరగనే ఎరుగుదురు. గౌరవానికి లోటనేభయంచేత తెలుగుయాసతో ఇంగ్లీషు మాట్టాడే జనాన్ని కూడా ఎరుగుదుం "దేర్‌ఫోరూ, ఐ వెన్టూ ! వాట్ ! దెన్నోస్లీ ఐ వెన్టూ ! యూ నీ డ్నాటు క్రై య్యూ ఐ సెడ్డు" మాదిరిగా. ఇంగ్లీషుముష్టి బాగా కిడుతుందని గావును కొందరు ఈ మధ్య ఇంగ్లీషులో ఎత్తుతున్నారు. అక్కణ్ణించి, తెలుగులో క్రియలేకపోబట్టి, క్రియలన్నీ, ఇంగ్లీషులోనే జరిపే తెలుగువాళ్లు లేస్తోచ్చారు--- మాట్టాడ్డం, నడవడం, కోప్పడ్డం, తినడం, ఏడవడం, పశ్యన్ వగైరా అన్నీ. పెళ్లానికి ఇంగ్లీషు రాదు, వదిలెయ్ ! తల్లి దండ్రులకి ఇంగ్లీషు రాదు, పాతెయ్ ! భంట్రోతుల్ని ? ఇంగ్లీషు రాకపోతే తీసెచ్. తెలుగువాళ్లల్లో విద్యాధికులైన గొప్పవాళ్లతో ప్రసంగిస్తే ఈ కింద యిచ్చిన నమోనా సమాధానాలు లాంటివి వినిపిస్తాయి :

ప్రశ్న---- సంస్కృతంమాట ఏమిటి ?

జవాబు ---- బతికున్నవాళ్ల కెందుకూ! ఒకవేళ చచ్చి స్వర్గానికెడితే దేవుడితో సంభాషించచ్చు !

ప్ర ---- ఇంగ్లీషు?

జ ---- అల్లా అన్నారు, ఆల్‌రైట్! బానిసలమైన మనమే కాదు, కొమ్ములు తిరిగిన వాళ్ళుకూడా ఇది నేర్చుగుంటున్నారు. ఇంగ్లీషుని ప్రపంచభాష చెయ్యడానికి ఇంగ్లండువాళ్లు వీరకంకణం కట్టి, 850 పదాలు ఇంగ్లీషుని జల్లించి తీసి, వాట్లతోనే వెనకటి ఇంగ్లీషు గ్రంథాలన్నీ పిరాయించి రాస్తున్నారు. ఎంతనయం ?

ప్ర ---- హిందీ ?

జ ---- అచ్చా ! అందులో హుషార్, మజా ఉన్నాయి, అయితేం ? లిపి నాకు రాదు.

ప్ర ---- పోనీ తెలుగు ?

జ ---- ఛీ ! తెలుగేమిటీ చప్పగా ! నా బోటి గాడికేమి టుంటుంది అందులో ! స్టేల్ !

ప్ర ---- తెలుగుపుస్తకాలు ?

జ ---- తర్జుమా, తత్సంబంధం, తస్కరణం, నామనస్సుకి విందుగాగాని, ఆహారంగాగాని, పథ్యంగాగాని, ఆఖరికి చిరితిండిగా గాని ఉండేదేనా లేదు.

ప్ర ----తెలుగులో పాత రచన?

జ ----మురుగు ! విజ్ఞానం శూన్యం. పైగా అదంతా అదివరకే సంస్కృతంలో అంతకంటె రమ్యంగా ఉండేసిన బాపతుట!

ప్ర ---- తెలుగులో కొత్త రచన ?

జ ---- అగమ్యం, సంకరం, అసభ్యం, నీరసం,

ప్ర ---- చదివి చూశావా ?

జ ---- కిట్టదు. అందుకనే చదవను. చదవకుండా చెప్పడం మాత్రం కళ కాదా ?

ప్ర ---- తెలుగులో పాత చిత్రకళ?

జ --- అంతా ఇంగ్లీషు. అందులో పురాణ స్త్రీలుకూడా ధొరసాన్లులానే ఉంటారు.

ప్ర ---- కొత్త చిత్రకళ ?

జ ----బాబూ ఇది బెంగాలీఫక్కీ. అన్నీ "భావబొమ్మలు."

ప్ర --- తెలుగులో పాతపాటలు ?

జ --- ఇప్పటి మూర్ఖులూ వెనకటి స్త్రీలూ వినడానికోసం.

ప్ర ----కొత్తపాటలు ?

జ ---- గంధర్వ, వ్యాస్, ---ఇమిటేషన్, ఒక్క త్యాగయ్యవినా --అతడేనా అరవదేశంలో ఉన్నాడుగనక. అతడికేనా తెలుగు బాగారాదు.

ప్ర ---- తెలుగు ఫిల్ములు ?

జ ---- మంచిది ఒక్కటీ లేదు. నిశ్శబ్దంగా ఉండే సినీమాలోకి వెళ్లిన తెలుగునటుడు లేదు. ఇప్పుడు సశబ్దంగా ఉండే టాకీలో ముందు బుక్కై తరవాత తుక్కుగాని తెలుగుజనుడు లేడు.

ప్ర --- తెలుగు పత్రికలు ?

జ --- కొన్ని ఇంగ్లీషువాటికి పుత్రికలు. కొన్ని ఆమ్రేడితాలు. కొన్ని ప్రచారమాత్రాలు.

ప్ర ---- తెలుగు యంత్రపరిశ్రమలు ?

జ ---- పేపరుమిల్లు, బట్టలమిల్లు వగైరా. కొన్నింటిలో తెలుగులేదు, తక్కిన వాటిలో పరిశ్రమే లేదు.

ప్ర ---- తెలుగువాళ్ల విదేశవర్తకం ?

జ ---- అది సాగుతూండేది. అన్యభాషాపరిచయంవల్లే. తెలుగువల్ల కాదు.

ప్ర ---- తెలుగు పరపతి సంఘాలు?

జ ---- కొన్ని పరపతి సంఘాలు, కొన్ని తిరుపతి సంఘాలు.

ప్ర ---- తెలుగు ప్రజల ధనాలయాలు?

జ ---- కొన్న సుప్రజాలయాలు, కొన్ని స్వప్రజాలయాలు, కొన్ని లయాలు.

ప్ర ---- తెలుగులో భీమాలు ?

జ ---- కొన్ని హేమాలు, కొన్ని కామాలు.

ప్ర ---- తెలుగు నాయకులు?

జ ---- కొందరే, చాలామంది వినాయకులు.

ప్ర ---- తెలుగు విశ్వవిద్యాలయం ?

జ ---- అదంతా తెలుగుది కాదు.

ప్ర ---- అయితే?

జ ---- అప్పుడూ మజా! అదీ మెడ్రాస్ ఇమిటేషన్ !

పరీక్షల కార్ఖానా !

ప్ర ---- కొత్తశాఖలున్నాయే !

జ ---- ఇంకా ఉండాలి. తెలుగవాలి.

ప్ర ---- డబ్బుండాలిగదా. అంతా తెలుగైతే అన్య దేశాల్లో మనపట్టాలు సాగవేమో!

జ ---- అన్యదేశాలు వెళ్లనేవద్దు !

ప్ర ---- పోనీ తెలుగురాష్ట్రం ?

జ ---- అట్టెట్టె ! ఆగాలి ! సౌరాష్ట్రం!

విచారిస్తే సంస్కృతం దేవలోకభాష. ఇంగ్లీషు భూలోకభాష. ఉర్దూ యోధలోకభాష. 'ఉర్దూ' అంటే యోధులు విడిసే స్థలం అని అర్థం. యుద్ధానికి పురికొల్పేసమయంలో వివిధ భాషల యోధులకీ ఉర్దూ భాషలోనే హెచ్చరికోపన్యాసం ఇస్తూంటారని చెబుతారు. మరి తెలుగో! ఇది ప్రస్తుతం గొప్ప తెలుగువాళ్లపట్ల పనికిమాలిందిలాగ ఉన్న భాష. మహా అంటే దీన్ని గానభాష అనచ్చు. అందుకనే అరవలు తెలుగుకీర్తన్లూ జావళీలూ నేర్చి తెలుగువాళ్లకి శ్రవణానందం చేసి సొమ్ము చేసుకుంటారు. వీటివల్ల వాళ్లకొచ్చే ఆదాయం చూస్తే 'అరవలు తెలుగుపాటలు అర్థం చేసుగోలేరు' అని విచారించేవాళ్లు అర్థంచూడకుండా పోతున్నారన్నమాట. ఈ మధ్య తెలుగువాళ్లు అరవల్లిన ఏదో అన్నారని అరవలంతా ఏకమై --- ఎందెందులో ఎవరెవరు ఏకమైనా అసలు మెచ్చతగ్గదే ! ముందుముందు తమరు చేసే పాటకచేరీల్లో త్యాగయ్యకీర్తన్లు పాడడం మానెయ్యదల్చుకున్నారని వదంతి. అదే నిజమైతే, వాళ్లు త్యజించేది త్యాగయ్యని గనక అందరూ సరిగ్గా (త్యాగయ్య – త్యాగయ్యర్ – త్యాగయ్యేస్ట్ సూత్రప్రకారం) త్యాగయ్యర్లు అయి ఊరుకుంటారు.

ఏతావాతా, తెలుగులో విద్య నేర్చినవాడికీ తక్కిన తెలుగువాడికీ మానసికంగా చాలా దూరం అయిపోయింది. కేవల తెలుగువాడికి ఉండే భావాలూ, అభిప్రాయాలూ అసలైన భావాలూ అభిప్రాయాలే కావని విద్యాధికుడైన తెలుగువాడు అనుకునే కర్మం తెలుగుదేశానికి పట్టింది. అందుకని అభిప్రాయాలుగల తెలుగువాడూ అంటే మానసికంగా ఇంగ్లీషుభాషలోనో, సంస్కృత భాషలోనో, ఉర్దూభాషలోనో, తెలుగుతప్ప మరొకభాషలో ఆలోచన కానిచ్చుగునే తెలుగువాడు అని తెలుస్తోంది. కాబట్టి తెలుగు విద్యాధికుడికి స్వంతానికి తెలుగు అవసరం లేదు. స్నేహితులు కలిసినప్పుడు గొప్ప తెలుగువాళ్లు తెలుగులో మాట్టాడుకోరు. ఫక్తు ఇంగ్లీషు చేతకాక -- పరభాష పరభాషేమరీ -- అందులోనూ మాట్టాడుకోలేరు. అది యిదీ ఏదీకాని "ఎంగిలీషు"లో ముచ్చటించుకుంటారు. కొందరు గాంభీర్యంకోసం; కొందరు వ్యవహారంలో కోపంవచ్చి; కొందరు తీరా తెలుగైతే ప్రతీవీథెంట వెళ్లేవాడూ 'ఇదిట్రా ! అబ్బాయి తెలివీ ! అని తన సంగతి కనిపెట్టేస్తాడేమోఅని; కొందరికి అలవాటు, కొందికి నైసర్గికం; కొందరు తమ అన్యభాషాభావానికి తెలుగులో -- తన తెలుగులో -- పదాలు అసలేలేక; కొందరు వాళీఅవడం చేత; కొందరు తమరికి వచ్చినా మెచ్చేవాళ్లు లేరనే దుద్దకొద్దీ! బజారు చెయ్యడానికి గొప్పతెలుగువాడు వెళ్లనేవెళ్లడు గనక తెలుగు అక్కర్లేదు. వెళ్లినా ఓ యాభై తెలుగు మాటలు ఎక్కీ తొక్కీనూ! గొప్ప తెలుగువాడు తెలుగు టాకీ బాగుండదని ముందే తెలుసుగుని దానికి వెళ్లడు. అందుకని టాకీ వాషయంలో 'హిందీ'గాని, 'ఇంగ్లీషు'గాని రావాలి, చాలు. అరవం వచ్చినా చాలు. అరవ త్యాగరాజు ఫిల్ముకి తెలుగుదేశంలోనే డబ్బు ఎక్కువ వచ్చిందని ఆ ఫిల్మువారు అన్నారన్నారు. కాఫ్యాలయానికి వెడితే ఉప్మా సాంబార్‌లాంటి అరవం, అరకప్ అరప్లేట్‌లాంటి ఇంగ్లీషు చాలు తెలుగు అక్కర్లేదు. కోర్టుల్లో కొంతవరకు సంభాషణ తెలుగుని జరుగుతుందిగాని, అది ఆంగ్లంలోపెడితేగాని తెలుగు ఫిర్యాదీ హృదయబాధ న్యాయమూర్తిగారితల కెక్కదు. ధర్మశాస్త్రం అటు సంస్కృతంలోనూ ఇటు ఇంగ్లీషు లోనూ ఉంది. ఇదమిత్థం అని న్యాయం తేల్చడానికి తెలుగువాళ్లకి తెలుగు అవసరం లేదు. అందుకనే న్యాయం తేల్చలేరు. ఓపట్టాన్ని తేల్తాండదు. ఆస్పత్రుల్లో సంస్కకృతం, ఇంగ్లీషుకాక మందుపేరు గూఢంగా ఉండాలని ల్యాటిన్‌కుడానూ. రోగాలకి తప్ప తెలుగు లేదు. సభల్లో, ఈ మధ్య ఒక్కరవ్వ మరీ తరుచుగా, ఉపన్యాసాలన్నీ తెలుగులోనే ఉండాలని మహచెడ్డపట్టదుతున్నారు. కాని ఆ పట్టట్టేవాళ్లల్లో కొందరు ఇంగ్లీషులోనే మాట్లాడుతూ "టెలుగు ఓన్లీ టెలుగు, యూ మస్ట్ ! మస్ట్ !" అని కేకవేసే తెలుగువాళ్లు ఉంటూంటారు. ఇక బళ్లల్లో తెలుగు ! బడి అంటే ఇంగ్లీషు బడి. గుమాస్తాల్ని తయారుచేసే నిమిత్తం ప్రభుత్వం వాళ్ళు తమరిభాష నేర్పేబళ్ళు. పఠించే విషయాల్లో తెలుగు ఒక విషయం. వాళ్ల ధర్మమా అని, ఆ విషయాల్లో ఏ రొండో భాషగానో తెలుగుని ఉంచారుగనక గాని, లేకపోతే చాలామంది తెలుగువాళ్ళు తెలుగు అక్షరాలేనా చూడకుండా పెరిగిఉండేవాళ్లు. వెనక బళ్లల్లో తెలుగుతప్ప కడం విషయాలన్నీ ఇంగ్లీషునే. కొంతకాలానికి బళ్లు తెలుగుమీరాయి. ఇప్పుడు తెలుగు మరోమెట్టు దాకా నిర్బంధించారు. అయినా తెలుగుస్థితి అల్లానే ఉంది. అక్కడ తెలుగుస్థితి మచ్చుచూస్తే దేశంలో తెలుగు యొక్కస్థితి సరిగా బోధపడుతుంది. ఆ స్థితీ, అందుకు పుణ్యంకట్టుగున్నవాళ్లూ, వాళ్లవాటాలూ: అదోపెద్దగాథ.

ఇంత అధ్వాన్నంగా తెలుగుస్థితి ఉంటూండగా కొంతకాలంనించి హిందీ గురించి హంగామా జరుగుతోంది. ఇన్నికోట్ల తెలుగుజనంలోనూ – స్త్రీ పురుష బాల వృద్ధ పండిత పామరుల్లోనూ-- ఎన్నిలక్షలమంది ఎవరెవరు హిందీలో ఏ మాత్రం పాండిత్యం ఎన్నేళ్లల్లో నేర్చి అందులో ఎంతమంది పరిపాలక వర్గంలో ఉద్యోగాలు సంపాదించి తెలుగుదేశాన్నీ, దాంతోపాటు తక్కిన హిందూదేశాన్ని ఎన్ని అంగుళాలు పైకి లేవదీస్తారూ అనేది చూడవలసిన విషయం. కొన్ని వందల ఏళ్లనుంచి తెలుగువాళ్లకి ఇంగ్లీషే రాజభాష. పొట్ట కోసం కొందరు తెలుగువాళ్లు పుస్తకమాత్రం అయిన పాత ఇంగ్లీషు చేర్చారు. ఈ పాత దినుసేనా తెలిసినవాళ్లు ఇప్పటికీ మొత్తంమీద వెయ్యోవంతు ఉండరు. గట్టుమీద ఈతనేర్చుకున్నట్టు తెలుగుదేశంలో ఉండి ఇంగ్లీషు చదవడానికి ఇన్నేసేళ్లు పడుతోందిగాని, అక్కడికే వేళ్లేస్తే ఓరొండు మూడు మాసాల్లో కావలిసినవన్ని ఇంగ్లీషు చిదుగులు నొల్లుకురావచ్చు. గొప్పవాడవాలనే ఆశతో తెలుగువాడు ఆస్తేనా అమ్మి నేటివరకూ దొరికినంత ఇంగ్లీషే చదువుకుంటున్నాడు.

తెలుగువాళ్లల్లో ప్రతీవాడూ ఇంగ్లీషు చదవాలనిగాని, చదివితే తమరికి ఉద్ధరింపనిగాని, చదవకపోతే తమరికి అరిష్టం అనిగాని, ఇంగ్లీషువాళ్లు చెప్పలేదు, ఏడవాలేదు. ఇంగ్లీషు సారస్వత చరిత్రలో ఇంగ్లీషుపండితులైన తెలుగువాళ్ల పేర్లు ఎక్కుతాయని నమ్మడానికి వీలు కనిపించదు. తెలుగుతండ్రులే కోరుకుని, తమసంతానం పాలితులైన తెలుగువాళ్లల్లో చిక్కడిపోకుండా పాలకులైన ఇంగ్లీషు వాళ్లవర్గంలో జేరితే లాభమై గొప్పాకదా అని వాళ్లకి ఇంగ్లీషు చెప్పించారు. అట్లాంటివాళ్లకి కూడా ఇంకా బాగా మొహంమొత్తలేదు. అలానే హిందీనూ. చావగొట్టి ఏదీ చదివించలేం. చావగొట్టినా తల్లిభాష రాని వాళ్లకి చచ్చినా పరభాష రాదు. అందుకని, ఏమీ అక్కర్లేదు, మీదపెడితేసరి, తప్పకుండా వస్తుంది. రావడమేకాదు, ఇది మాభాషే మేం వదలం అంటారు. కాని, ఒక బరువు ఇంకా మీద ఉండగానే మరోటిపెట్టడం అధర్మం. అయితే , చిన్నప్పణ్ణించీ తెలుగువాడికి హిందీలాంటిది చెప్పకపోతే వాడు తల్లి భాషలో కాస్త కుదురుకుంటాడుగనక, తరవాత తరవాత ఇంకోభాషలోకి సత్వం చంపుకుని మారడు. అందుకని, ఉగ్గుపాలతోటే తెలుగు వాడికి పరభాష చెబితే, పరభాష తనదే అనుకోడం తన తల్లిభాషని నిరసించడం, పరమతం పరజ్ఞానం వగైరా బాగున్నాయనుకోడం తన అసలుమతం అసలుజ్ఞానం నాసిరకం అనుకోడం, పరదేశం తనదనుకోవడం తనదేశం మట్టి అనుకోడం వాడికి సహజం అయిపోయి, వాడు మరి తెలుగు తెలుగంటూ ఏడవడు. ఇంగ్లీషు భాష విషయంలో ఇల్లా అయింది! మరోదానికి ఇల్లానే జరగవచ్చు ! అక్షరాస్యులైన తెలుగుజనంలో చాలామంది 'హ'గుణింతం, 'త'వత్తూ తెలియక 'హ' 'త' శ్రేణిలో చేరినవాళ్లం ఉంటూంటే 'హిందీ' వచ్చి వీళ్లనోటపడి ఏమి హింస పడుతుందో గదా అని దిగులు. హిందీ ఒక విధమైన ప్రాకృతం -- వ్యావహారిక సంస్కృతం, సంస్కృతానికి ఛాయ. అల్లాంటప్పుడు ఛాయని పట్టుకుని దేవులాడ్డం ఎందుకు? దేశభాషల కన్నింటికీ తల్లివేరైన ఆ అసలు వస్తువు సంస్కృతమే అన్ని చోట్లా నిర్బంధంగా చదివిస్తే నలి వొదిలిపోతుంది అని కొందరి నమ్మకం. సంస్కృతమేవస్తే హిందీ, మందీ, ఉన్నదీ, లేందీ అన్నీ కూడా వచ్చేస్తాయని, "అమరోక్తులు సకలభూములందును వెలయున్" అంటాడు అప్పకవి. కాని, సంస్కృతానికి ఒక ఆక్షేపణ ఉండోచ్చు. అది ప్రస్తుత రాజకీయాధికారం ఉన్నవాళ్లకి వచ్చునో రాదోట. అయితే మాత్రం? రాజకీయావసరాల్ని బట్టి కొన్ని ఇతరభాషలు నేర్చి తీరవలిసినట్టే, ప్రజలభాషకూడా పరిపాలకులు నేర్చాలి. అంతేగాని పరిపాలకుడి భాష ప్రజల్లో ప్రతివాడికీ యుగం తిరిగినా రాదు. రానక్కర్లేదు. కాబట్టి ఇతరభాషల గురించి భయపడడం అనవసరం. ఏ స్థానం తెలుగుకిచ్చి తెలుగుయొక్క అపరిమితమైన వాడకం తెలుగువాళ్లందరికీ తప్పనిసరిఅయే సందర్భాలు ఏవేవి కలిగిస్తే యుక్తమో మొదట చూసుగోడం తెలుగువాళ్లధర్మం. అప్పుడు తెలుగులోనే వివిధ సంస్థల నిమిత్తం వివిధ పరిభాషలు ఏర్పడాలి. తెలుగు మతగ్రంథాల్లో పరిభాషా, తెలుగు జ్యోతిషాది గ్రంథాల్లో పరిభాషా, తెలుగు న్యాయస్థానాల్లో పరిభాషా, తెలుగు రాజకీయంలో పరిభాషా, తెలుగు పాఠశాలల్లో పరిభాషా – ఈ రీతిగా. అక్కణ్ణించి ఇన్నిన్ని శాఖల్లోనూ వాడుతూండే వెలుగూ, నిత్యకృత్యాలకి ఉపచరించే పామరుల తెలుగూ వ్యత్యాసంగా ఉండడం, పారిభాషిక పదాల్లోంచి కొన్నొచ్చి సంభాషణలో పడడం, సంభాషణలోంచి కొన్న పదాలు వెళ్లి ప్రత్యేకస్పష్టార్థాల్తో పారిభాషిక పదాలుగా వెలవడం, ఇల్లా ఇచ్చిపుచ్చుగోడాలు జరగడం, ఉభయతారకంగా అది పరిణమించడం, తెలుగు దేశం యొక్క జ్ఞానం క్రమంగా ఒక్కొక్క పైమెట్టే ఎక్కడం సంభవించవచ్చు. అందుకని ముందు నా తెలుగుకి, నాభాషకి నేను నాహృదయంలో ఉచిత స్థానం ఇస్తాను. నేను తెలుగుని గౌరవిస్తాను, మన్నిస్తాను, ఆరాధించి సేవిస్తాను.

చ. నిను సేవింపగ నాపద ల్పొడమనీ
 నిత్యోత్సవం బబ్బనీ
 జనమాత్రుం డననీ మహాత్ము డననీ,
 సంసారమోహంబు పై
 కొననీ, జ్ఞానము గల్గనీ, గ్రహగతుల్
 గుందింపనీ, మేలు వ
 చ్చిన రానీ యవి నాకు భూషణములో
 శ్రీ కాళహస్తీశ్వరా.

అని ధూర్జటిదీక్ష తెచ్చుకొని 'శ్రీ యంధ్రభాషేశ్వరీ' అనుకుంటాను. నేను తెలుగువాడతాను, ఉపయోగిస్తాను, పలుకుతాను. ప్రాణహాని వగైరా తెచ్చే వ్యవహారాటంకం కలిగేటప్పుడు రెండోపక్షంగా ఇతర భాషలు -- వాట్లకి తలవంపులు రానీకుండా-- నేరుస్తాను. అందానికీ, అలంకారానికీ కూడా వాటిని తెచ్చుకుంటాను, నా యిష్టం అయితే. అయితేనేం? నాతెలుగు నా తల్లి భాష, నా తల్లి హృదయం, నాతల్లి మనస్సు, నాతల్లి. నా తల్లిని నేను మన్నించడంవల్ల నాకు లాభమా, నష్టమా నేను తర్కించను. నేను జంతువుల్లో జమ అయిపోకుండా ప్రప్రథమంలో నాజిహ్వలో ప్రవేశించి, నాముఖతా పైకొచ్చి, తద్వారా నాజన్మ సార్థకపరిచిన ఏ తెలుగుభాష అయితే ఉందో, ఆ తెలుగుతల్లిని నేను-- ఈ జన్మ ఎల్లానూ చాలదు పరభాషాదత్తం అయిందిగనక,-- ఎన్ని జన్మలెత్తిసేవిస్తే ఆవిడ ఋణం తీరుతుందోకదా అని ఆదుర్దాపడుతూంటానుగాని, దీన్ని సేవిస్తూకూచుంటే నాకు కిట్టుతుందా కిట్టదా అనిబేరం చేస్తూ అహోరించను. గొప్పవాళ్ళైన నా తెలుగువాళ్లెవళ్లేనా నా తెలుగు వినిసించుగోకపోతే నేను బాధపడను. ఎప్పటి కేనా తెలుగుకి అర్హత, అవసరం, గణ్యత, గౌరవం వస్తాయని విశ్వసిస్తాను. తెలుగున ఆలోచించి, తెలుగు జనాన్ని జ్ఞాపకం ఉంచుగుని తెలుగుహృదయంనించి అభిప్రాయం తెలుగులో చెబితే తెలుగుజనం ఆలకించి తీరతారు అనే ధైర్యంతో ఉంటాను. అప్పుడు వాళ్లకి కూడా నాకు కలిగిన చిత్తవృత్తి లాంటిది కలిగితీరుతుందని భావిస్తాను. స్వతంత్రరచన తెలుగులో లేదని చెప్పేవాళ్లు అంతమాట అనవలిసిన అర్హులు కారని తలుస్తాను. సంస్కృతవిజ్ఞానసారం ఆంధ్ర భారత స్రవంతిద్వారా పూర్వమే మనకి అందచేసిన నన్నయ్య తిక్కనాదుల్ని జ్ఞప్తికి

తెచ్చుగుని, భగవంతుణ్ణి ప్రత్యక్షంగా చూసి మరీ మాట్లాడాడా అనిపించే పోతన్నని తల్చుగుని, సంస్కృతవాణితో చెట్టాపట్టాలు పట్టించి తెలుగుతల్లిని యావత్తు తెలుగునాటా దిగ్విజయంగా ఊరేగింపించిన శ్రీనాథుణ్ణి స్మరించి, మూడువరస జన్మల్లో ఒకే పాత్రయొక్క అనుభవాలు రాయగలిగిన సూరన్నని, బ్రహ్మ సరస్వతుల పవిత్రశృంగారచేష్టలు వర్ణించి ఎక్కడికి పూర్తయిన చేష్టలు అక్కడికి గుచ్చెత్తి బ్రహ్మచేత చిలక్కి కథగా చెప్పించి సరస్వతి చేత కథకి అర్థం చెప్పించి కవిబ్రహ్మ సంకల్పించింది అక్షరాలా భూమిమీద జరుగుతుందని చూపించిన సూరన్నని, చలవ – వెన్నెల – అందం – సౌరభం – కోమలత– మధురత్వం అనేవి తెలుగుతల్లికి లక్షణాలని ఇన్ని లక్షణాలూగల మాటల్లో అనేసిన సూరన్నని, ముందుకి ఒక భాషలోనూ వెనక్కి మరోభాషలోనూ ఏకకాలమందే నడవగలిగిన సూరన్నని, నవ్యశాస్త్రపరిజ్ఞాతలు ఇంతవరకు ఇంకా కనిపెట్టలేకుండా ఉన్న అద్భుతాలు వెనకే ఊహించేసిన సూరన్నని మరీమరీ స్మరించి, అతిసులువుగా అపార ఐహికాముష్మికజ్ఞానం ఆటవెలది ముఖతా పలికింపించిన వేమన్నని నెమరికి తెచ్చుగుని, తెలుగుయొక్క గౌరవ ప్రతిష్ఠలు ఎక్కడ తగ్గిపోతాయో –– అన్యభాషాహతం అయి తెలుగు తనస్వత్వాన్ని ఎక్కడ పోగొట్టుకుంటుందో – తెలుగులో కామధేనువుల్లాంటి పదాలు ఎక్కడ వట్టిపోతాయో – ఏ చిన్న తెలుగుపదం ఎక్కడ ఉండడంవల్ల జీవిస్తుందో – ఏ పదాలు ఏ క్రమంలో సర్దుకొని కూర్చినవాణ్నీ నేర్చినవాణ్ణీకూడా ఉభయులూ అనుకోని భావందగ్గిరికి ఎగరదీసుకుపోగలవో – రకరకాల నవీనవిజ్ఞానాన్ని తెలుగులో ఎల్లా పాకించడమో, తెలుగుజిహ్వ పెట్టిపుట్టడాన్ని ఏమేమిటి అనేసి సఫలం చేసుగోవాలో – అంటూ తెలుగుగురించి తెగతాపత్రయ పడిపోతూ ఇహంలో మెప్పుమాటగాని డబ్బుమాటగాని పరంలో మోక్షాశగాని తెలుగువల్ల ఉండవు అని అనుభవంలో తెలిసీకూడా, కాళ్లట్టుగు ఈడ్చేస్తున్నా చూరట్టుగు వేళ్లాడుతూ, తెలుగులోనే జీవిస్తూ, తెలుగే వాడుతూ, తమరి చిత్తవృత్తులకీ తెలుక్కీ తాదాత్మ్యం ఆరోపించుగుని తెలుగులోనే ఆలోచిస్తూ తమరి హృదయనాళాలమీది నొక్కులు తెలుగువల్లే కలిగాయి అనుకుని తమరి పెదిమిలు తెలుగు అనడానికే దేవుడు చేశాడనుకుని, తెలుగు భాషా సంప్రదాయాన్ని ఇన్నాళ్లనించీ నిలబట్టుగుంటూవచ్చిన తెలుగు అధ్యాపకులందరికీ తెలుగుపండితులందరికీ తెలుగురచయితలందరికీ – అంతకంటె ముందు ఇతరులై పుట్టి నా సోదరులైన బ్రౌన్, గెలెటీవంటివాళ్లకీ – నమస్కారంచేసి, ఒక్కక్షణం ఆగి, వెనక్కిచూచి, మరీ ప్రత్యేకంగా,

తెలు గదేల యన్న దేశంబు దెలు గేను
దెలుగువల్లభుండ, దెలు గొకండ
యెల్లనృపులు గొలువ యెఱుగవే బాసాడి
దేశభాషలందు దెలుగులెస్స

అనే మృదువైన మాటలు గంభీరమైన భావంతో అనగలిగిన “ సాహితీ సమరాంగణ సార్వభౌము” డైన శ్రీకృష్ణదేవరాయల్ని సవినయంగా తల్చుకుని, ఎంతచెడ్డా నేటి వరకూ తెలుగుని యథాశక్తిగా నేర్చినా నేర్చకపోయినా పోషించుగొస్తూన్న తెలుగురాజుల్ని మెచ్చుగుని,

తెలుగుదేశం స్వతంత్రం అయి దేశంలో ఉండే గొప్ప సంస్థల్లో తెలుగు విస్తరించి, తెలుగువాళ్లల్లో గొప్పవాళ్లు తెలుగుని లేవనెత్తి, దాన్ని మొదట విధిగా హృదయంలోనూ, వీలైతే కంఠంలోనూ, ఆధమం శిరస్సుమీదా పెట్టుగున్నప్పుడే తెలుగుయొక్క ప్రతిభా, తెలుగుయొక్క వ్యక్తిత్వం, తెలుగుయొక్క జీవం సిద్ధిస్తాయని ఆశిస్తాను.

మునుమార్గ కవిత లోకం
బున వెలయగ దేశి కవితఁ బుట్టించి తెనుం
గును నిల్పి రంధ్రవిషయం
బున జన చాళుక్యరాజు మొదలగు పలువుర్

– నన్నె చోడకవి

వేటూరి ప్రభాకర శాస్త్రి

భాషావికాసము

భాషావికాసము మానవవికాసము ననుసరించి ఉంటుంది. మానవ హృదయము అంటే మానవ భావములు సున్నితమైన కొద్దీ మానవశరీరము సున్నితమవుతుంది. ఆ రెంటినీ అనుసరించి భాషకూడా సున్నితమవుతుంది.

మానవ హృదయములూ, శరీరములూ ఏదో అభూతపూర్వము కనుక అనిర్వచనీయమైన పరమార్థమునకు అభిముఖములై సాగుతూ పరిపక్వతకు వస్తూ ఉన్నవి. అట్లే భాషలుకూడాను.

మానవ హృదయమునకు, అంటే మానవ భావమునకు మానవ శరీరమునకు, మానవ భాషకు పరిపూర్ణతాశాశ్వతతాస్థితులు ఇంతవరకు ఏర్పడలేదు.

మానవుడు పుట్టింది మొదలుకొని గిట్టేదాకా స్థలస్థలమూ, క్షణక్షణమూ –అంటే ప్రతికాలవేశంలోనూ, ప్రతి దేశ లేశంలోనూ కూడా స్వరూప స్వభావాలలో మార్పు చెందుతూనే ఉన్నాడు. అలాగే ప్రతీ దేశలేశంలోనూ, ప్రతి కాలలేశంలోనూ కూడా ప్రతి మానవ ముఖయంత్రంలోనూ భాష విభిన్న లక్షణాలతో కొంత కొంత రాలిపోతూ మఱి ఎంతో విజృంభిస్తూ పెంపొందుతూ ఉన్నది.

వృక్ష విజృంభణము వంటిదే మానవతా విజృంభణమూ, వారి భాషన విజృంభణమూనూ, శబ్దశాస్త్రవేత్తలు వృక్షశాస్త్రవేత్తలవలె దొరికే ప్రతి శబ్దమునూ శ్రమించి, దాని పుట్టుపూర్వోత్తరాలు, ఇప్పటివరకు అది చెందిన పరివర్తనాలు, అర్థంలోనూ, రూపంలోనూ కూడా గుర్తించి, నిరూపించి ప్రకటిస్తారు. భావికాలంలో అవీమారిపోగలవు. ఆ మార్పులను భావికాలంవారు పరిగణించి ప్రకటించగలరు. దాని స్వరూప స్వభావాలను, ఉపయోగాలను గుర్తించడము, వానిని ప్రకటించడము మాత్రమే వారిపనిగాని, వానిని వేనిని గాని తార్మారు చేయడంగాని, చంపడం గాని, పుట్టించడంగాని వారిపనిగాదు... శాస్త్రకారులిట్లా ఉంటూ ఉంటే ప్రజలు ఆయాశబ్దరూపాలకు వైరస్య సారస్యాల వల్ల సౌకర్యాసౌకర్యాలవల్ల కాలక్రమాన కుంపుపెంపులు జరిగిస్తూ ఉంటారు.

మానవవర్గం అన్యోన్యాశ్రమంతోనే ఆదికాలంనుండీ అభివృద్ధి చెందుతుంది. ఇప్పుడు మరీ ప్రపంచ ప్రజలు అందరూ కలగాపులగంగా ఐక్యం అయిపోతున్నారు. రైళ్ల వల్లా, స్టీమర్ల వల్లా, విమానాల వల్లా, రేడియోలవల్లా దూరదేశాలకు కడు చేరికకు వచ్చినవి. మునుపు సంబంధంలేని దేశాలతో ఇప్పుడు అనుబంధాలు అధికమవుతున్నవి. హృదయాలు విశాలాలు కావడంచేతా, ప్రజానుబంధాలు విశాలాలుకావడంచేతా, ఒక భాషే మాట్లాడే ప్రజలలో సంబంధాలు సాన్నిహిత్యం చెందడంతోపాటు ఇతర భాషలవారితో కూడా వ్యవహార బాంధవ్యాది సంబంధాలు జరుగుతూ ఉండడంచేతా, విభిన్న భాషలకు కూడా సాన్నిహిత్యం ఏర్పడుతోంది.

అవి గర్హ్యములని నిందిస్తూ కూర్చునేవారు కూర్చుంటున్నారు. కానీ సాగిపోయేవి సాగిపోతున్నవి. పరిపూర్ణంగా పర్యాలోకించి, పర్యవలోకించి చూస్తే ప్రపంచజాతులన్నీ ప్రపంచభావాలన్నీ కూడా ఏకీభావం పొందవలసిన స్థితిలోకి దూకుతున్నట్టున్నవి. క్రమ పరిమాణాలలో అది సిద్ధిస్తుందో, సిద్ధించదో కాని, అది యెట్లా ఉన్నా సద్యః భాషల సాంగత్యం, సాంకర్యం అనివార్యమే అనక తప్పదు.

అసలు నిజానికి భాష అభివృద్ధికి, వికాసానికి ఈ సాంకర్యం అత్యావశ్యకమేమో అనికూడా అనిపిస్తుంది. నేడు ప్రపంచభాషలలో కల్లా ఇంగ్లీషు బహుదేశ బహు ప్రజారూఢమై ఉన్నదనీ, పద సంఖ్యను బట్టి కూడా అత్యాధిక్యమును చెంది ఉన్నదనీ అందరూ అంగీకరిస్తారు. ఆ భాష అట్టిది కావడానికి అది ప్రపంచభాషలలోనుండి ఆవశ్యక పదజాలమును, భావబంధములను గ్రహించినది కావడం ముఖ్య హేతువనవచ్చును. చాండికూట్ (పందికొక్కు) మాంగో (మాంగాయ్) ఇత్యాది పదాలెన్నో తెలుగు నుండి కూడా ఇంగ్లీషులోకి చేరినవి. ఇంగ్లీషువారు అట్లా చేర్చుకోవడం తమ భాషకు వికాసహేతువనుకొంటోంటే మనవారు అంటే ఆంధ్ర ద్రావిడాదులు, మతీ ద్రవిడులు.... కొందరు... ఇతర భాషల పదాలను వాడుకొంటూ మనవారు మన భాషను పాడుచేస్తున్నారంటున్నారు.

ఈ వింత వార్త మీరంతా వినే ఉంటారు. యు.పి.లో కాబోలు ప్రజలు తమ భాషలో ఇంగ్లీషు పదాలు వాడకూడదనీ, అట్లా ఎవరైనా వాడితే వాడినపుడల్లా పదానికి ఒక అణాచొప్పున జరిమానా చెల్లించవలసి ఉంటుందని శాసనం చేశారట. అట్లావాడినందుకు కొన్ని అణాలు ఎవరికో శిక్ష విధించినారట కూడా. ఇది చాలా విడ్డూరంగా ఉన్నది. ఇంగ్లీషు వారిమీదా, వారి భాషమీదా, వారి నాగరికత మీద స్వరాజ్య సంపాదన ప్రయత్నారంభకాలంలో రేగిన విద్వేషవృక్షపుపంటలే యిటువంటిపనులు.

ఇంతకంటే విడ్డూర మేమిటంటే మనవారే కొందరు ఇంగ్లీషు పదాలను, అంకెలను వాడకపోవడంతోపాటు అరవవారివలె భాషలో సంస్కృత సమ సంస్కృతభవ పదాలను కూడా వాడకుండా మడిగట్టుకోవాలని చూస్తున్నారు. ఇవి నిర్వాహం చెందే సంకల్పాలు కావు. ఏమంటే భాష అనేది ఎప్పుడు కానీ సాంకర్యం లేకుండా స్వయము తనకుతానై ఎక్కడా వెలయడం ఎప్పుడూ జరుగలేదు. అది అలా వెలయజాలదు. అనేక కుటుంబాల సాంకర్యంచే మానవజాతి ఏర్పడ్డట్టే, అనేక భాషా కుటుంబాల సాంకర్యంచే భాషాజాతులేర్పడ్డవి. ఇప్పుడు తెలుగని వ్యవహరింపబడే భాష ఎన్ని సాంకర్యాలతోనో వెలసినది. ఈనాడు కూడా తెలుగులో ఎన్నో ఇంగ్లీషు, బెంగాలి, హింది వాక్యనిర్మాణ రీతులు, శబ్దప్రయోగములు చొరబారినవి. వీనిని విధ్వంసపరువ నక్కరలేదు. విధ్వంసపరుపరాదు. అలా విధ్వంసపరుప సాధ్యమూ కాదు కూడాను. ఆరంభదశలో అట్టివి కొన్ని ఎరుగని వారికి ఎబ్బెట్టుగా తోస్తవి కాని పరిపాటిమీద పరుసుకుపోతవి.

అతడు గ్రంథమును వ్రాసినాడు... అనుట తెలుగుపలుకుబడి కాదు. కమ్మ వ్రాసినాడు. జాబు వ్రాసినాడు అనుటేకాని గ్రంథము వ్రాసినాడు అనుట ప్రాచీనుల పలుకుబడి కాదు. వ్రాయుట లిపికారునిపని. అందు రచనా చమత్కృతి లేదు. గ్రంథము రచించినాడు. కబ్బము కట్టినాడు, కబ్బము చెప్పినాడు అనుట పాత్ర తెలుగు పలుకుబడి, అయినా నేడు అనేకులు గ్రంథము వ్రాసినాడు అని వ్రాయుచున్నారు. ఇది ఇంగ్లీషు పలుకుబడి. తెలుగులో రూఢి కెక్కినది. ఇక తొలగింప కుదురదు. తొలగింప నక్కరలేదు.

గ్రామాధికారిని కరణమని పిలుతురు అనుట తెలుగు పలుకుబడి కాదు. కరణమందురు. కరణమని పేర్కొందురు. అనుట తెలుగు పలుకుబడి. కరణమని పిలుతురు అనుట ఇంగ్లీషు పలుకుబడికి తెలుగు. భాషలో రూఢమైనది. ఇక తొలగింప సాధ్యముకాదు. రూఢికెక్కిన తరువాత తప్పుగా భావించడం తొలగిపోతుంది. ఇట్టి వాని నెన్నింటినో చూపవచ్చును.

పూర్వము సంస్కృతసమ సంస్కృతభవ ప్రాకృత భవములు తెలుగులో చేరినట్టే నేడు తురష్కసమ తురష్కభవ ఆంగ్లసమ ఆంగ్లభవ పదములూ చేరినవి. రైళ్ళను, రోడ్లను, సైకిళ్ళను, కలెక్టర్లను, తాలూకాలను, జిల్లాలను ఇక తొలగింపజాలము. వీటిని పుస్తకాలలో అనుకరణచిహ్నాలతో ఇంకా ఎన్నాళ్ళని బహిష్కారంతో ఉంచడం? ఈ బహిష్కారం తొలగిపోక తప్పదు.

అట్లే మాండలికి ప్రయోగ వైవిధ్యాలను కూడా ఇక దిగదొక్కజాలము. ఆయా ప్రయోగాలలో ఇక మాధుర్యమున్నది. ఆయా రూపములను అక్కడక్కడి ప్రజలు స్వస్థాన వేష భాషాభిమానులయి ఆదరిస్తారు. ఆయాదరణమును ఇతరు లెవరూ కాదు కూడదని గర్హింపరాదు. గర్హింపబోయినా సాగదు.

విశాఖ జిల్లావారు వెళ్ళిపోయి వచ్చాచు, 'ఎల్ పో యొచ్చాడు' అంటారు, అది వారి నాలుకమీద తేలికగా తేలియాడే తేటపలుకు. నైజాంవారు 'వాడువచ్చినదు' 'వాడువచ్చిండు' అంటారు. – మధ్యాంధ్రదేశం వారు 'వాడు వచ్చి వేసినాడు' 'వాడు వచ్చేశాడు' అంటారు. మదరాసువారు 'వాడుపోయి విడిచినాడు' 'వాడు పూడ్చినాడు' అంటారు. ఈ ప్రయోగాలన్నీ గ్రాహ్యాలే. అచ్చమయిన తెలుగు ఫలానా జిల్లాదే. ఆ జిల్లా ప్రయోగాలే గ్రాహ్యాలు. ఇతరములన్నీ పరిత్యాజ్యాలు అని యెవరూ యెవరినీ గర్హింప జాలరు. గర్హించకూడదు.

ఇట్లా అన్ని జిల్లాల భాషలను ఆదరించేటట్టయితే అవ్యవస్థగా భాష చెడిపోతుందేమోనని భయపడుతున్నారు కొందరు. ఆయా పదాలు ప్రయోగించే ప్రజలు చెడిపోయే వారయితే ఆయా పదాలు చెడిపోతవి. ఆ భాషా చెడిపోతుంది. ఆయా ప్రజలు సంఘంలో అభ్యుదయం చెందేవారయితే వారి పదప్రయోగాలూ భాషా సంఘంలో అభ్యుదయం చెందేవే అవుతవి.

ఆంధ్రులు అనేకజిల్లాలో వెల్లివిరిసి వేరు వేరు స్వరూపస్వభావాలతో పెంపొందుతూ వైవిధ్యంలో ఐకవిధ్యం వెలయించుకొంటూ వస్తున్నట్లే బహుమండలాల్లో బహుముఖాల వేర్వాసి పెంపొందుతూ ఉన్న భాషకూడా తన వైవిధ్యంలోనుండి ఆంధ్రతారూపమైన యైకవిధ్యాన్ని వెలయించుకొంటూనే ఉంటుంది.

"రాజనుమతోధర్మః" అన్నట్టు ఇంతదాకా విద్యాశాలల్లో ఇంగ్లీషు ప్రధాన భాషగా ఉంటూ వచ్చింది. ఇకమీదట దేశభాషలకే ప్రాధాన్యం ఏర్పడనున్నది. సర్వశాస్త్రాలూ దేశ భాషలలోనే వెలయనున్నవి. కాని ఇందులో చిక్కయిన వింత విషయం ఒకటి ఉన్నది.

ఆయా శాస్త్ర పారిభాషిక పదాలన్నీ ఇది వరకు ఇంగ్లీషులోనే ఉంటూ వచ్చినవి. ఇక విద్యావ్యవహారాలన్నీ దేశభాషలోనే ఉండవలెనంటే భారతదేశానికంతా ఏకవిధంగా ఉండుటట్లు విద్యాశాఖవారు వాటిని సరిక్రొత్తగా సృష్టించడం గాని, ఇంత బాధెందుకు? ఆంగ్ల పద బహిష్కార మెందుకు? ప్రాచీనులు జ్యోతిశ్శాస్త్రంలో హోరా ద్రేక్కణీయాది పదాలను గ్రీకులనుండి గ్రహించినట్లు నేటి వారుకూడా ప్రపంచ సామాన్య వ్యవహారంలో ఉన్న ఇంగ్లీషు పదాలనే వాడుకోవడం మంచిదని తలిస్తే వాటినే అంగీకరించడంగానీ చెయ్యవలసి ఉంటుంది. రెండో పద్ధతే మంచిదని నా ఉద్దేశము. దీని వల్ల ప్రపంచైక భాషా వ్యవహార నిర్మాణంలో శాస్త్రపారిభాషిక పదాల వరకైనా ఐకవిధ్యం అనువు పడుతుంది. మన విజ్ఞానంలోనే సర్వప్రపంచవిజ్ఞానాలూ అంతర్భవిస్తవి. ఆవిర్భవిస్తవి.

భారతీయ విజ్ఞానంనుండే సర్వదేశాలవారి విజ్ఞానాలూ పుట్టినవి అని తృప్తిపడి కూర్చుండే వారు కొందరున్నారు. అట్టివారు మామిడి టెంకను చేతిలో నుంచుకుని దీనిలోనే మామిడి పిందెల, కాయల, పండ్లరుచులన్నీ చూస్తామనీ, మామిడిచిగుళ్ళతోడి కొమ్మలనీడ అనుభవిస్తామనీ సంతోషిస్తూ కూర్చుండేవారి సగోత్రులు. నిజంగా మన విజ్ఞానంనుండే ప్రపంచ విజ్ఞానమంతా వెల్లివిరిసినా మనమిప్పుడు ఆమాటే పారాయణచేస్తూ కూర్చుంటే లాభంలేదు.

సర్వభారతభాషలూ సంస్కృతంలోనుండే పుట్టినవనే వాదం ఉన్నది. అది చాలావరకు సత్యమే కాని దానిని బట్టి సంస్కృతం ఒకటే నమ్ముకుని నేటి ప్రధానవ్యవహారాలన్నీ దేశభాషలను విడచిపెట్టి దానిలోనే సాగించబూనితే భారతదేశవ్యవహారతంత్రం ఏది కాని కడతేరబోదు.

అమితవిజ్ఞానానికి అటపట్టయిన సంస్కృతం మన దేశభాష లన్నింటిలోనూ అనుగతమై జీర్ణించి వస్తూ ఉన్నది. అది భారతీయుల శరీరాలలో, రక్తకణాలలో అణువణువునా అనుగతమైఉన్నది. శరీరికి శరీరానికి ఎంత సంబంధం ఉన్నదో సంస్కృతానికి మన దేశ భాషలకు అంత సంబంధం ఉన్నది. తెలుగు భాషలో నూటికి ఎనభైవంతున సంస్కృత పదాలున్నవి. మన భావ బంధమంతా సంస్కృత భావబంధంతో అంటి పట్టుకొని ఉన్నవి. మన పేళ్లలో, ఊళ్లల్లో, నదులలో, నాళ్ళల్లో, గుళ్ళల్లో ఆచార వ్యవహారాలలో సర్వత్ర సంస్కృత వికాసం పొర్లి పొఋతున్నది. దేశభాషల పెంపు సంస్కృతపు పెంపేకాని వేరేకాదు. సంస్కృతంలో సంస్కృతమే ఉంది. కాని మనదేశ భాషలలో సంస్కృత మంతా ఇమిడి ఉన్నది. ప్రాకృతాలన్నీ ఇంకా ఇప్పటిదాకా మన దేశంలో చెల్లుబడి కలిగి అధికారించిన తురుష్కాది భాషలలోని ఆవశ్యక పదజాల మంతా పొర్లు వారుతున్నది. తల్లిభాష అయిన సంస్కృతానికి ఈ వికాసం లేదుగదా.. కాని ఆ తల్లి చలువే ఈ దేశభాష కింత వికాసం కలిగించింది. దేశ ప్రజలు దేశభాషలలో సర్వవ్యవహారాలూ సాగించ కలిగినా రంటే దేశభాషావికాసం దేదీప్యమానంగా వెలుగొందుతుందన్నమాట కాదా?

సంస్కృత ప్రాకృతాది భారతీయ ప్రాచీన భాషలలోని గ్రంథాలింకా దేశభాషలలోనికి రానివి ఉంటే అవి సప్రయోజనాలు అయితే ఇక మీద కూడా తెచ్చుకోవచ్చును. ఇంగ్లీషు మొదలగు విదేశ భాషల విజ్ఞాన వికాసము నంతా మన భాషలలోనికి తెచ్చుకోవచ్చును. దేశ పాలకులు తలచుకొంటే కొదవేముంటుంది? విద్యాశాలలో విద్యాబోధన దేశ భాషలలో సాగించడం, ప్రజా పాలనతంత్ర మంతా దేశభాషలలో సాగించడం ఎంత శీఘ్రంగా సాగుతుందో అంత శీఘ్రంగా దేశ భాషా వికాసం కలుగుతుంది. (ఆల్ ఇండియా రేడియో మద్రాసు కేంద్రం వారి సౌజన్యంతో)

మల్లంపల్లి సోమశేఖర శర్మ

ప్రాచీనాంధ్ర భాషా స్వరూపము

నన్నపార్యునకు బూర్వ మాంధ్రభాషా స్వరూప మెట్లుండెడిదో తెలిసికొనుట కాధారములంతగఁగానరావు. నన్నపార్యుఁడు రచియించిన యాంధ్రమహాభారతమే యింతవఱకుఁదెలుఁగుఁన గానవచ్చు గ్రంథము లలోమొట్ట మొదటిదిగనున్నది.

పూర్వచాళుక్యుల కాలముననే యాంధ్రభాష తీగెసాగి మొగ్గ తొడిగినది. చాళుక్యులే మనతెనుఁగు బాసకుఁ గైదండయొసంగి యాదరించి యున్నారు. ఈ విషయము నన్నెచోడుని కుమార సంభవము నందలి యీ క్రింది పద్యమువలన బోధపడగలదు.

> "మునుమార్గ కవితలోకం
> బున వెలయఁగ దేశికవితఁబుట్టించి తెనుం
> గు నిలిపి రంధ్ర విషయము
> బునఁజన్మజాళుక్యరాజు మొదలుగఁబలువుర్" ॥

ఈ విషయమే పూర్వచాళుక్యశాసనములను బరిశోధించినను దేటబడగలదు. పూర్వ చాళుక్యుల పరిపాలనమున నాంధ్రభాషాలతిక క్రొంజివురుపట్టిన నవ్యవిలాసముతో బ్రవర్ధిల్లెను. అంతవఱకు సంస్కృత భాషయె యెక్కువగౌరవము నందుచు వచ్చెను. వైదిక మతోద్ధారణముతో సంస్కృత భాషయు బైకివచ్చెను. భాషాపరిస్థితినరసిన మనదేశమున మతమును గూర్చి ప్రవచింపవచ్చును. బ్రాహ్మణమతమున కాయువు పట్టువుగనున్న వాఙ్మయమంతయు సంస్కృతభాషలో నున్నయది. బౌద్ధ మతమునకు మూలాధారమైన గ్రంథజాలమంతయు ప్రాకృతభాషలో నున్నయది. అందువలన బ్రాకృతముయొక్క యుచ్ఛ, బౌద్ధమతము యొక్కయుచ్ఛ, బ్రాహ్మణమతముయొక్కయభివృద్ధి, సంస్కృతభాషయొక్క యభివృద్ధి, తెలుగునాటిని బాలించిన మొదటి ప్రభువులైన యాంధ్ర రాజు లును, వారితరువాత వచ్చిన మొదటి పల్లవ ప్రభువులును బౌద్ధమతావ లంబకులు. ఆ కాలమున బ్రాకృతమె రాజాదరణ పాత్రమైన రాజభాషగ నుండెను. అందువలన నాంధ్రరాజుల కాలమునను, మొదటిపల్లవరాజుల కాలమునను ఆంధ్రభాషాస్వరూపమును దెలిసికొనుటకు సాధ్యముకాదు. కాని యాకాలమున మనయాంధ్రము దానికి ద్వితీయ ప్రకృతియనబడు ప్రాకృతమునుండి పదములను సంగ్రహించు చుండెనని విశ్వసింపవచ్చును. ఆంధ్రరాజుల కాలమునాటి శాసనమునొక చూసినచో నాకాలపు భాషాస్వరూపము బోధపడగలదు.

గౌతమీపుత్రశాతకర్ణి యాంధ్రరాజులలో జాలగొప్పవాడు, సుప్రసిద్ధుడు. ఈతడు క్రీస్తుశకము మొదటిశతాబ్దిలో నుండినవాడు. ఈతని శాసనములు కొన్ని నాసికాత్రియంబకమునొద్దగల

కొండగుహలలో గానవచ్చుచున్నవి. ఆ గుహలయందు బౌద్ధభిక్షువులుండువారు. బౌద్ధభిక్షువులకు జేసిన దానధర్మములను గుఱించిన యాంధ్రరాజుల శాసనములందుగలవు. ఆ గుహలలోని గౌతమీపుత్త్రశాతకర్ణి శాసనములోని కొంతభాగము నీక్రింద పొందుపఱుచుచున్నదను.

"సిద్ధం సెనాయెవెంజయంతియెవిజయఖధా వాణా గోవధనస బెకొకటక స్వామి గౌతమి వుకోసికోదకణి ఆవపయతిగోవధనె ఆరుచవిఋపాలితగామె అపరకఖడియె యఖెటం అజకొలకియం ఉనభదతెన భూతం నివతనసతాని బెదించి ఎత అంహఖెత నివతణ సతాని..."

బ్రాహ్మణమతమును మఱల నుద్ధరించిన వాడు కడపటి పల్లవరాజులు. పల్లవుల రాజ్యాంత్యకాలమున కుమారిలభట్టు, శంకరాచార్యులు మొదలగు సంస్కర్తలవలనను, మతబోధకులవలనను మఱల వైదికమతము విజృంభించెను. ఆంధ్రదేశమున బూర్వచాళుక్యులు వైదికధర్మమునకు బట్టుగొమ్మయై నిలువంబడినవారు. అందువలననే యంధ్రరాజుల యొక్కయు, మొదటిపల్లవరాజులయొక్కయు శాసనములు ప్రాకృతభాషలోనుండ గడపటి పల్లవప్రభువులకొక్కయు జాళుక్యరాజుల యొక్కయు శాసనములు సంస్కృత భాషను గానవచ్చుచున్నవి. పల్లవుల దానశాసనములలో గ్రామావధులను కూడ సంస్కృతముననే లిఖించి యున్నారు. గ్రామావధులను దేశభాషలలో వ్రాయుట చాళుక్యుల కాలమునుండి ప్రారంభమయ్యెను. గ్రామావధులేకాదు; చాళుక్యరాజుల శాసనములలో గొన్ని పరిపూర్తిగ దేశభాషనే లిఖింపబడియున్నవి. దేశ భాషయైన యంధ్రమున వ్రాయంబడిన యతిప్రాచీన శాసనములు క్రీస్తుశక మేడవ శతాబ్దినుండి కానవచ్చుచున్నవి. కడపమండలయునందలి చోడరాజుల శాసనములు కొన్నియు, అనంతపురమండలయునందలి పశ్చిమ చాళుక్యరాజులయొక్కయు, వారికి సామంతులుగనుండిన బాణరాజుల యొక్కయు శాసనములు కొన్నియు, నెల్లూరు మండలమునందలి పూర్వచాళుక్యుల శాసనములు కొన్నియు ఆంధ్రభాషయందు వ్రాయబడియున్నవి.

అయినను దేశభాషయైన యాంధ్రమునకు బ్రాముఖ్యత మన రాజ రాజనరేంద్రుని నాటినుండియే వచ్చినదనవచ్చును. రాజరాజనరేంద్రుని నాటినుండి కానవచ్చు శాసనములలో జాలభాగము తెలుగు శాసనములే. రానురాను తెలుగుబాసనుబోషించుటయు దెలుగున శాసనములు వ్రాయించుటయు నొక యాచారమయ్యెను. ఇది పూర్వచాళుక్యరాజైన మన రాజరాజు నాటినుండియే ప్రారంభమయ్యెను.

రాజరాజు తన శాసనములను దేశభాషలో వేయింపకపోయినను తెలుగు కవులనాదరించి, తెలుగున గ్రంథములను రచియింపజేసెను. ఈతడు నన్నయభట్టు విరచితమైనయాంధ్ర మహాభారతమున "విద్యానిధి" యనియు, "గవీంద్ర సమాజనురక్షాజ" మనియు, "గావ్యగీతప్రియు" డనియు బేర్కొనబడియుండెను. ఈతని విద్యామండపంబున గవితల్లజులెందఱో యుండినట్లూహింపనగును. ఇందులకు దార్కాణముగ మహాభారతాంధ్రీ కరణమున నన్నయభట్టునకు దోడయిన వాఙ్మయధురంధరుడగు నారాయణ భట్టును బేర్కొనవచ్చును. ఇంకను మనకు దెలియరాని కవిపుంగవులాతని యాస్థానసీమనెందఱుం డిరో !

భారతమును దెనిగింపవలసినదని నన్నియభట్టునడుగుట ననుసరించియే రాజరాజునకు దెనుగు బాసమీది యభిమానమును

దెలిసికొనవచ్చును. ఈ యభిమానమున రాజరాజు తెలుగుబాసకు జేసినయుపకార మెంతయైనగలదు. ఈ మహారాజు ప్రాపకమును బడసియే నన్నయభట్టు తెలుగుముద్దియను మోహనమూర్తిగ దిద్దెను. ఆంధ్రభాషాప్రధాన సంస్కర్తలలో నన్నయభట్టు ఒకడనిన నదిసత్యమునకు దూరముకానేరదు. కాని యప్పటికినిప్పటికి నెంతయోకాలము గడుచుట చేత ఆ మహామహుడాంధ్రభాషకు జేసిన మహోపకారమును బూర్తిగ గుర్తింపరాకయున్నారము. సంస్కృతపదములు విపులముగ నాంధ్రభాషలో బ్రవేశించుటకును అదివఱకుండిన తెలుగు పదములకు సలక్షణమూన రూపమును, సలక్షణమైన యర్థమును వచ్చుట కును నన్నియభట్టూ కారణభూతుడు. నన్నయభట్టునకు బూర్వముండిన తెలుగునకును, నన్న యభట్టు నాటి తెలుగునకును ఇంచుక వ్యత్యాసము కలదు. భాషావిషయమునగాక, యిక నక్షరముల విషయమున జూచినను జాల మార్పు కానవచ్చుచున్నది. రాజరాజనరేంద్రుని నాటి తెలుగులిపిని పరిశోధకులు "సంధికలపులిపి" యని పేరు వెట్టియున్నారు. అనగా నదివఱకుండిన లిపికి రూపము మాఱి క్రొత్తరూపము వచ్చుచునుండిన కాలమది. రాజరాజనరేంద్రుని కోఱుమిల్లి, నందమపూడి శాసనములలోని లిపిని అంతకుబూర్వపు శాసనములలోని లిపిని బరిశోధించిన నిందలి యాధార్థ్యము వెల్లడికాగలదు. 'సంధికాలపులిపి'కిని, అంతకుబూర్వపు లిపికిని విస్పష్టముగ గానవచ్చు వ్యత్యాసమిది. నన్నయభట్టు కాలమునకు బూర్వము తెలుగువర్ణములకు "దలకట్టు"లు సంస్కృతాక్షరములకు వలె నెత్తిమీద జిన్న యడ్డుగీటుగనుండెడివి. నన్నయభట్టు కాలమునాడు "తలకట్టు"లకా రూపముమాఱి యీనాటి "తలకట్టు"ల రూపములు ప్రాదుర్భావమయ్యెను. తెలుగువర్ణముల తలకట్టులందువలన సంధికాలము నాటివలె నంతకు బూర్వమంత సుస్పష్టముగ గానరావు. ఇంకను వర్ణముల విషయమునగూడ "సంధికాలము" న గొన్ని మార్పులు జరిగెను. ఆంధ్రలిపిని ఆంధ్రభాషను గూడ నన్నియభట్టు చాల సంస్కరించి సలక్షణమైనదిగదిద్దెను. కనుకనే రాజరాజనరేంద్రుడాతనికి "విపులశబ్ద శాసను"డను బిరుదు పేరొసంగెను.

ఇట్టి సంస్కర్తను ఇట్టి విపులశబ్దశాసన బిరుదాంకితుని రాజరాజు భారతాంధ్రీకరణమునకు నియోగించెను. రాజరాజ నరేంద్రునియోగమున "విద్యాదయితు"డయి నన్నియభట్టు మహాభారతమున నాది, సభా పర్వము లును, అరణ్యపర్వమునందలి మొదటిమూడాశ్వాసములును, నాల్గవ యాశ్వాసము నందలి కొంతభాగమును రచియించెను. నన్నియభట్ట కృతపర్వములందలి భాష సంస్కృతపదభూయిష్టమై యున్నది. ఇతని కవిత్వము నందు రెండువంతులు సంస్కృతపదములును ఒకవంతు తెలుగుపదములు నుండునని శ్రీ వీరేశలింగముపంతులుగారు వ్రాసియున్నారు.

"ఉభయభాషా కావ్యరచనాభిశోభితు"లై నన్నియభట్టువంటి యాంధ్రకములు సంస్కృత పద వ్యామోహమును నడవంజాలక యచ్చతెలుగు నవలంద్రోసివైచి "తెలుఁగు" అంతములతో గాలక్రమమమున నాంధ్రకావ్యము .... సంస్కృతగ్రంథములను రచియించుచువచ్చిరి.

ఈరీతిని వారు తెలుగురచనలో సంస్కృతపదములను బహుళముగ బ్రయోగించి యచ్చతెలుగు నుపేక్షించుచు వచ్చినందువలన గొన్ని కొన్ని దేశ్యశబ్దములు రూపుమాసినవి. మఱికొన్ని రూపుమాఱినవి. వేఱొక కొన్నింటియర్థ మీనాటి మనకు దురవగాహ మగుచున్నవి. తుదకు గోలకొండ

నవాబైన ఇబ్రహీం కుతుబుశహా కాలమునందుండిన పొన్నికంటి తెలగ నార్యుడు కృతిభర్తతన్ను గూర్చి యిట్టుసంబోధించెనని తన యయాతి చరిత్రమున జెప్పియున్నాడు.

అచ్చతెలుంగు బద్దె యొకటైనను గబ్బములోన నుండినన్ । హెచ్చుని యాడుచుందురది యెన్నుచు నేర్చిన బొత్తమెల్లని । టచ్చ తెనుంగుననొ్నడువ నందుల చంద మెఱుంగు వారునిన్ । మెచ్చరొ యబ్బురంబనరొ మేలనరో కొనియాడరో నినున్ ॥

ఇబ్రహీంకుతుబుశహా క్రీ.శ 1550 వ సంవత్సరమున సింహాసన మెక్కెను. అప్పటికిగూడ అనగా క్రీ.శ పదునాఱవ శతాబ్దినాటికిగూడ అచ్చ తెనుగుపదములను గూర్చి పద్యమల్లుటయన్న నంత యబ్బురముగ నుండెడిది. ఈ విషయమున, అనగా నచ్చ తెనుగుపదమున నెక్కువ వాడుట విషయమునదిక్కన సోమయాజియే మేలు. ఆ కవివరుడు తెలుగున కందము తెచ్చుటకు మాత్రమే సంస్కృతపదములను బ్రయోగించియుండెను. అదియునుంగాక యాతడు తనకాలమున వాడుకలోనుండిన యచ్చతెనుగుపదములనే గైకొని వానికి లక్షణము దిద్దెను. ఆతని ఈ క్రింది పద్యము చూచినచో ఈ విషయము తేటపడగలదు.

చం॥ పలుకుల పొందులేక రసభంగముసేయుచు బ్రాతపద్దబమా ।
టలందమనేర్పు జూపియొకటన్ హృదయం బలరింపలేకయే ।
పొలమునుగాని యట్టిక్రమము దమమెచ్చుగ లోకమెల్లన ।
వ్వల బొరయం జరించుటకవుల్ ధరి దుర్విటులట్లు చూడగన్ ॥

నిర్వచనోత్తరరామాయణము ఆ ౧ పర్

తిక్కనసోమయాజి నన్నియభట్టు ప్రయోగమున దిద్దని తెలుగుసుద్దులను గొన్నింటిని బ్రయోగించి యున్నాడు. నన్నియభట్టునాటిగాని, తిక్కనసోమయాజినాటిగాని తెలుగుపదములను గుఱించి తెలిసికొనుటకు గ్రంధాధారమేకలదు.

నన్నియభట్టునకు బూర్వమాంధ్రభాషా స్వరూపమును దెలిసికొనుటకు గ్రంథములేవియు గానరానందున బూర్వపు శాసనములే ప్రధానాధారములై యున్నవి. శాసనములలోని భాషకును, గ్రంథములందలి భాషకు నించుక వ్యత్యాసముండుట సహజము. శాసనములలోని భాష వ్యావహారిక భాష. గ్రంథములయందలిది కవిశంఖమునబడి ప్రపూతమైన భాష. వ్యాకరణ సూత్రనిబద్ధమైన సలక్షణభాష. అయినను గొన్నికొన్ని శాసనములలో లక్షణమైన శైలిని బద్యములే కానంబడుచున్నవి. శాసనములలో బద్యములను రచియించుట నన్నపార్యునికి బూర్వమరుదుకాని నన్నియభట్టు తరువాత సాధారణమయ్యెను. పూర్వపు శాసనములలో బనపతియొక్క దీర్ఘాసిశాసనమునందును, రేవల్దేవియొక్క ద్రాక్షారామశాసనమునందును, యుద్ధమల్లుని బెజవాడశాసనమునందును, యబద్యములుకలవు. నన్నియభట్టునాటి తెలుగు వర్ణక్రమము దెలుపుటకై దీర్ఘాసి శాసనమునందలలి పద్యమునిట నుదాహరించుచున్నాను.

సీ॥ శ్రీ శకునేణ్డులు భూసతిపై శైల
నన్దాబ్జభవసంఖ్యనొన్దవేంగి
దేశంబుగిమిడియగోనల గిట్రిసిగి
దేశంబు మఱీయొద్ద దేశమనగ
జనిన భూపాలురననినొచ్చె చలమత్తిన్
గణ్డణ్డై నెగడిన మణ్డలికుణ్డు
భూసురవంశుణ్డు వాసవ నిభభోగి
బణవతి సౌజన్య గుణయుతుణ్డు
దీర్ఘాఞసి భగవతిదేవి దేవాలయ
మున ముందటంగడు ఘనతరముగ
మణ్డపమెత్తించె భణ్డన విజయుణ్డు
గణ్ణగోపాలుణ్డ ఖణ్డవత్తిఞ
దీవియవెట్టె నద్దేవికినవ్వెల
దనమనోవల్లభి వనజనేత్రి
దీవియవెట్టె బ్రద్మావతియును (నాక్షోణీనశశులుగల యంతకునుముదమున
గగనభూమిచంద్రఖరకరోదకశిఖి
మారుతాత్మ మూత్తిన్ మహిషమధన
యిష్టపూత్తఞ)ఫలములెల్ల కాలంబును
మెచ్చుతోడ దమకు నిచ్చుచుణ్డు.

పైనుదాహరించిన పద్యములుగల శాసనములలో యుద్ధమల్లుని బెజవాడ శాసనము ప్రాచీనమైనది. శ్రీయుత జయంతిరామయ్య పంతులుగారు దీనిని ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికయందు బ్రకటించి, యా శాసనకాలమును గుఱించియు, భాషనుగూర్చియు, నింక నితర విషయములం గుఱించియు జక్కగ జర్చించి వివరించి యున్నారు. ఈ యుద్ధమల్లుడు క్రీ.శ 927 మొదలు 934 వఱకు రాజ్యమేలెను........

◆ రాజరాజనరేంద్రుడు క్రీ.శ 1022 మొదలు 1063 వఱకు రాజ్యమేలినవాడు. * యుద్ధమల్లుని శాసనము రాజరాజనరేంద్రుని యానతిని నన్నయభట్టు రచియించిన భారతమునకు రమారమి నూఱు సంవత్సరములకు బూర్వపుది. ముద్ధమల్లుని శాసనమునందలి పద్యములు మధ్యాక్కరలు. భారతము పుట్టుటకు నూఱు సంవత్సరములకు బూర్వము తెలుగుబాస తీరెట్లుండెనో, వర్ణక్రమ మెట్లుండెనో తెలుపుట కా శాసనములోని యొక్క మధ్యాక్కఱను మాత్రమిటనుదాహరించుచున్నాను.

పరగంగ బెజవాడం గొమరస్వామికిభక్తుడైగుడియు । నిరుపమమతినృప ధాముణ్డెత్తి(ం)చ్చె నెగిదీచ్చె౯ మఠంబు గొరగల్గా కొరులిన్దువిడిసి బృందంబుగొనియుండువారు రిగాకయబ్బారనాసి వచ్చిన పాపంబుగొణ్ణు.

నన్నయభట్టునకు బూర్వ మీవిధమున నున్న శాసనభాష ననుసరించియే మనము నన్నయభట్టునకు బూర్వ మాంధ్రభాషా స్వరూపమును గనుగొనవలసియుండును.

ప్రాచీన శాసనభాష వ్యావహారిక భాషయే యైనను బూర్వపు తెలుంగు పదములలో గొన్ని యప్పటికి మన మానవులు పల్కుటకు వీలు లేనంతగ మార్పుజెందినవి. అట్టి పదములుకూడ అప్పుడు వ్యవహారమున రూఢమగుటచేత గాలక్రమమున గవిప్రయోగమున కెక్కుచు వచ్చెను. దానం జేసి యిప్పటికి మార్పుజెందినట్టియు, బూర్వపు శాసనము లందు గానవచ్చు నట్టియు పదములు కొన్ని పూర్వపు రూపములతోనే కవుల గ్రంథములయందును జూపట్టుచున్నవి. ఎట్లన "ప్రువ్వులు" అను శబ్దము కలదు. ఇది పంద్రెండవ శతాబ్దిశాసనములయందు గానవచ్చుచు న్నది.(తోంకప్రువ్వలు1 అట్లే "రట్టోడి" 2. "రట్టడు" 3 రట్టళ్ళు అను పదములుకూడ బది, పంద్రెందు శతాబ్దములనాటి శాసనములలో జూపట్టుచున్నవి. ఈ పదములప్పటి వ్యవహారమున రూఢమగుటచేత బూర్వపు గ్రంథములందును యివి గానవచ్చుచున్నవి.

"ప్రువ్వులు"---

"ఇవ్వసుమతిం గడుగమ్మని
పువ్వులలోబుట్టినట్టి ప్రువ్వులగొఱయే"
శివతత్త్వసారము, ప ౧౯౬

"పుట్టవని చచ్చిచావని
పుట్టెడుప్రువ్వులు విధమునం బురహరుభక్తిన్ "
శివతత్త్వసారము, ప ౧౯౯

"రట్టళ్ళు"---

పూజింపుడు పూజింపుడు
పూజింపుడు శివునిభక్తి బూజింపుడు మీ
రోజసెడి నడవకుండుడు
రాజులు రట్టళ్ళునగుట రావెల్లిటికిన్ ॥"
శివతత్త్వసారము, ప ౨౦౦

పైని చెప్పినయట్టి పదముల కిటీవల రూపముమాఱినది. "రట్టోడి" "రట్టడి" యను పదమిప్పుడు "రెడ్డి"యైనది. "ప్రువ్వును" అనుపదమిపుడు "పురుగు"లయినది.

ఇనుపయెడ్లు, పన్నన, పంగము- ఈ మొదలగు పదముల కిప్పుదర్థము తెలియరాకయున్నది. దేశభాషాకవులు గ్రాంధిక భాషకును వ్యావహారికభాషకును నాటికినాడు ఎడమెక్కువచేయుచు వచ్చుటయే యీ యనర్థమునకు గారణము.

ఇఁక బ్రాచీనాంధ్ర శాసనములను బరిశోధించుటవలన దెలియనగు విషయములను గూర్చి యించుక వ్రాసెదను. ప్రాచీన శాసనములయందు "ఱ" అను నక్షరమొకటి కాన్పించుచున్నది. ఇది యిప్పటి "క్ష", "న" ల కంటె విలక్షణమైన ధ్వనికలదనియు, నిది తమిళభాషలో నిప్పటికిగలదనియు తద్జ్ఞులు చెప్పుదురు. పంద్రెండవ శతాబ్ది కిటీవలి శాసనములో నిది కానరాదు. ప్రాచీన కాలమునకు బోనుపోను ఒక్కొక శాసనమున నిది యనేకస్థలములం దనేకపర్యాయములు కాన్పింపగలదు. ప్రాచీన శాసనములలో నీ క్రింది పదములయం దీయక్షరము కానవచ్చుచున్నది.

"నియ్యెట్టు ఱ"- (యుద్ధమల్లుని బెజవాడ శాసనము)
"య ఱిపుట"- (పై శాసనము ఆం.సా.వప. సం౯ సం౨)
"అచ్చువానఱ"-(EP. COL 364 of 1920)
"తాఱుగుమ్మిసీమ"- (EP. Ind.vol V.P31)
"పఱుమటికట్ట"- (EP. Ind Vol.VI Page 34)
"ఱుల్లసీమ"- (Ibid)
"చో అమహారాజు"- EP. Ind. Vol IX Page 345)

◆=* *ఆంధ్రకవుల చరిత్ర, మొదటి సంపుటము పుట, 30*

(1) Net. Ins, U 48 page 1993 (2) Ep. Col. 6750 of 1917 (3) Ep. Col. 362 of 1905

"ఏఱువేల" – (Ibid)
"కఱపత్తి"– (EP. Ind. Vol VI Page 347)
"తాంకఱపొలము"– (Ibid)
"కొఱ్చుంకొనుఱ"– (EP. Ind. Vol IX Page 98)

ఈ పైవానిని దిఙ్మాత్రముగ సూచించియున్నాను. ఈ "ఱ" అను అక్షరము పూర్వము మనతెలుగుభాషలో నుండెడిదని యాంధ్రలోకమునకు మొట్టమొదటిమాఱు వెల్లడించినవారు మాననీయులైన శ్రీ యుతకొమఱ్ఱాజు లక్ష్మణరావుపంతులుగారు. ఈ యక్షరమును గుఱించి వారాంధ్రసాహిత్య పరిషత్పత్రికకొక వ్యాసమును వ్రాసియున్నారు.(చూడు. అం.సా.ప.ప.సం ౮ సం ౪. పుట ౨౫౬) ఈ యక్షరమునకు అరవములో రూపము వేఱు. దీనిని గుఱించి శ్రీయుత లక్ష్మణరావుపంతులు గారిట్లు వ్రాసియున్నారు.

"దీనిని వేఱువేఱు దేశముల అఱవవారు వేఱువేఱు విధముల నుచ్చరించుచుందురు. కొన్ని స్థలము గొంచెము హెచ్చుతక్కువగ "ష"వలెను, కొన్నిచోట్ల "ద"వలెను, మఱికొన్ని తావుల "ళ"వలెను, ఉచ్చరింపబడును. ఈ యుచ్చారణమును, అక్షరమును మలయాళమునందుగలవు. కాని కన్నడమునందును, తెలుగులోను ఇప్పుడులేవు. కన్నడమునందలి వాఙ్మయమును జూడగా ౧౩ వ శతాబ్దమువఱకును ఈ వర్ణమును, దీనికి "ఱ" అను ప్రత్యేకాక్షరమును ఆ భాషయందు నుండినట్లు స్పష్టపడుచున్నది. ఇది మనబండిఱలోని అడ్డుగీటు తీసివేన ఱ అనునక్షరమెట్లుండునో, లేక వ్రాయునెడ మనముప్రాసెడి "ఱ" జుట్టులేనియెడ నెట్లుండునో అట్లుండును. ....అరవమున ఈ యక్షరముచే జూపబడు నుచ్చారణ గలశబ్దములు, కన్నడముననిప్పుడు "ళ"కారములోను, తెనుగున "ద"కారము తోను ఉచ్చరింపబడుచున్నవి. ఇది "ద"కారమునకు భిన్నమైన యక్షరము. ఆ యక్షరముచే భిన్నమైన వర్ణోచ్చారణమె సూచింపబడుచుండెనని యూహింపవలెను.

ఈ "ఱ" యిటీవల "ద"గ మాఱినట్టు మనము నిశ్చయింపవచ్చును. ఎట్లన, ఏఱువేలమాఏడువేల; పఱుమటికట్ట--పదుమటికట్ట: ఱ చ్చు వానుఱ--దచ్చువానుఱ; చోఱమహారాజు--- చోడ మహారాజు, (చోఱులకు చోళులనియు వ్యవహార రూఢికలదు) కాలక్రమమున నీయక్షరము మన భాషలో నంతరించి పోయెను.

ప్రాచీన శాసనములయందు శకటరేఫము చాలచోట్ల బ్రయోగింపబడుచు వచ్చెను. మన శకటరేఫము కొఱ్ఱపఱ్ఱు, మల్కపఱ్ఱు, మ్రోంతికుత్తి ; పొంకుంబఱ్ఱు, కొల్లికుఱ్ఱు – ఈ మొదలగు సంజ్ఞావాచకములయందేకాక "చామితేనిగుంట", "పోతుఱాయి"; "చాకిచెఱువు;" "గంగకఱుత," "జమ్మికోఱడు" "అవుఱుగుంట" "ఉప్పుటేఱు"-- ఇట్టి సామాన్యపదములందును శకటరేఫమధిక నియమముతో బ్రయోగింపబడినట్టు కాననగును. వంగుత్తి, కఱపత్తి, మ్రోంతుకత్తి, గుండికత్తి-- ఔపవిభక్తిక ప్రత్యయమగు "తి" చేర్చిన మీదట నగు ఈ రూపములును శాసనములయందు గానవచ్చుచున్నవి. ఇప్పుడు కుత్తి, పత్తిలలో నిప్పుడు బండి ఱ వ్రాయవలెనను నియమము తగ్గినది. నేఁటి తేటతెలుగున బండిఱాకు సాధుత్వమబ్బుచున్నది.

ప్రాచీన కాలమునందలి శాసనములలో శకటరేఫప్రయోగ మెంత యధికనియమముతో బాటింపబడుచుండెనో యంత నియమముతో అను నాసికాక్షరములుకూడ పూర్వపు తెలుగుపదములలో బ్రయోగింపబడుచు వచ్చెను. ప్రాచీన పదజాలమును బరికించినచో నివియొక నియతితో వాడబడుండినట్లు తెలియగలదు. ప్రాచీనాంధ్రశాసనమును బరీక్షించినచో అనుస్వారము అరుదుగను, అనునాసికములు బహుళముగను గాననగును. పూర్వకాలపు తెలుగుపదములయందలి హలంతరూపములైన అనునాసికములేనేటి తెలుగుపదములలో అనుస్వార, అర్ధానుస్వారములుగ మాఱెనని తలంపవచ్చును.

హలంత రూపములైన అనునాసికములు గల తెలుగు పదముల లోని యనునాసికమును, దానికి బరమైనవర్గాక్షరము ననుసరించి నిర్ణయింప వచ్చును. పరమైన యక్షరమేవర్గములోనిదైనను యాయక్షరమునకు బూర్వ ముండు హలంతరూపానునాసిక మావర్గము లోనిదై యుండును.

ఉదా: దఙ్కలపూణ్డి
జరిపిఞ్చువారు
మణ్ణలికుణ్డు
నన్దగిరి
సమ్పున్నుణ్డు

ఈ విషయమును మనము జ్ఞాపకము పెట్టుకొనినచో బ్రాచీన శాసనములందున్న రీతిని గ్రమముదప్పక పూర్వపు వర్ణక్రమముతో వ్రాయ గలుగుదుము. ఈ యనునాసిక వర్ణక్రమము సంస్కృతభాషయొక్క యొత్తిడి యెంతవరకు దగిలినదో పైవిషయముననుసరించి గమనింపవచ్చును. కాని ప్రాచీనశాసనములను బరీక్షించినచో నీయనునాసిక నియమము అంత నిత్యముగ గాన్పింపకపోయినను, అనుస్వారమునకు బదులుగ అనునాసికమే బహుళముగ వాడుకలోనుండినట్లు తేటపడగలదు.

కాలము గడచినకొలది దెలుగుబాసలో నీయను నాసికములు మార్పుజెందినవి. క్రీస్తుశకము పంద్రెండు, పదమూడు శతాబ్దములలో నీమార్పు సంభవించెను. తెలుగు వర్ణక్రమ పరిణామమున నిది రెండవ దశయనవచ్చును. ఈ దశలో గలిగిన మార్పులేవనగా: అనునాసికములు అఱసున్నలయ్యెను. అఱసున్నలకు బరమైన యక్షరములకు జడ్డలువచ్చెను.

ఇందులకు దార్కాణముగ నాకాలమునాటి శాసనములను గాంచవచ్చును. ఓపిలిసిద్ధి కొణిదెన శాసనమును శ్రీయుత జయంతి రామయ్య పంతులుగారు ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో బ్రకటించి యున్నారు. (ఆం.సా.ప.ప సం ౧౮, సం ౫ , ౬ పుట ౩౬౦) ఈ శాసనము

గద్యపద్యరూపకముగ నున్నది. ఇది పదుమూడవ శతాబ్దినాటిది. అందుండి యొకటి రెండు పద్యముల నిట నుదాహరించుచున్నాను.

"ఉ॥ ఆతరిదాల్పునాభిదలితాబ్జమునందుదయించె బ్రహ్మసం ।
ప్రీతిగ నావిరించికిమరీచి జనించె మరీచి కన్యయ ।
ఖ్యాతండు పుట్టెం గస్యవుండు గస్యపుండను మునికుద్భవించెలో కాతతరమ్యమూర్తిఱ గమలాప్తుండునూయ్యుఱండుపంశకర్తఱయై॥"

"కం॥ దండిజగదొబ్బ గద్దండు
గండ్డరగండ్డండు వీరఖణిబిజ్జనయు
ద్దండ్డుండుదాం బదుమువ్వర
గద్దండను ధారనిలిపెం గటకములోనను"॥

ఈ పై పద్యములను బరీక్షించినచో అనునాసికములు నెఱసున్నలగుటయు, నెఱసున్నలకు బరమైన యక్షరములకు జడ్డలు వచ్చుటయు నటుండగా నింకొక విశేష విషయముకూడ బోధపడగలదు. గురువునంటి యుందు నిండుసున్నలకు బరమైన యక్షరములకే జడ్డలువచ్చెను. ఇప్పుడఱసున్నలుగ నుండవలసిన స్థలములలో బూర్వము నిండసున్నలెయుండినను, వానికి బరమైన యక్షరములకు మాత్రము జడ్డలురాలేదు. ఇది గమనింపదగిన విషయము. దీనిననుసరించి యిట్లని యూహింపవచ్చును. పంద్రెండు పదుమూడు శతాబ్దములలో బద్యములలో లఘుస్థానముననుండిన నిండుసున్నలకు బరమైన యక్షరములకుగాక గురుస్థానమున నుండిన నిండుసున్నలకు బరమైన యక్షరములకు మాత్రమే జడ్డలు వచ్చుచుండెను.ఇటీవల బదునెనిమిది, పందొమ్మిది శతాబ్దములవఱకు గూడ నిదియే యాచారముగ నుండినట్లు ఒకటి రెండు శతాబ్దములక్రిందటి తాళపత్రగ్రంథముల నరసిన దెలియగలదు.

ప్రాచీన శాసనములలో నిండుసున్నయే గాని అఱసున్నయే కానబడదు. ఇప్పుడఱసున్నయున్న పదములను గొన్నిటిని నెఱసున్నతోనే పూర్వకవులు కొన్నికొన్ని చోట్ల ప్రాసస్థానములనే వాడియున్నారు.

"ఉ॥ వీంగున పారసత్వగుణ విస్ఫురణం బరమేశ్వరోరు ।
వామాంగమునందు మున్నుదయమై నియమస్థితి గొల్చి
తద్ధయుంలొంగిన పేర్మితో నఖిలలోకములుం దగఁగాఁచుచున్నవే ।
దాంగుననంతు విష్ణుఁగమలాధిపు సంస్తుతిదేల్చి సమ్మతిన్॥"
నన్నెచోడుని కుమారసంభవము ఆ ౧ . ప ౪.

కం॥ వీండేమిసేయుఁబంచిని
వాండుండఁగ నిక్కమునకు వధ్యుఁడుగానా
ఖండలుఁడుగాక యేలిన
వాండుండగనేమిసేయుఁ బరికరమనిలోన్॥
నన్నెచోడుని కుమారసంభవము ఆ ౧౦ . ప ౫౨.

ప్రాచీన శాసనములను బరికించినచో నన్నియభట్టు కాలమునాడును, అంతకు బూర్వమును పురుషనామమునల్నియు నిప్పటికి విలక్షణమైన రూపమును గలిగియుండెను.

ఉదా:- రావియ; పేరియ; నన్నియ; వజ్జియ; పంకియ; కొండియ - ఇత్యాదులు చూడనగును ప్రాచీన నామములు.

"కొండియగుంట" (ఆం.సా.ప.ప.సం. ౧ సం. ౧ పుట ర౫)
"దామపియ" EP. Ind. Vol V. Page 139
"పన్దిపెద్దెరి" EP. Ind. Vol XII. Page 61
"పంకియ" Nel. Ins. P. 22 Page 1179
"కొల్లియ" Nel. Ins. P. 22 Page 1179
"వజ్జియ" EP Ind Vol IX, Page 4

ఈ పై విషయము నరసినచో మనపేళ్ల కెందును గీర్వాణసంస్కారము తగులలేదని తెలియనగును.

పూర్వపు శాసనములందలి భాష వ్యావహారిక భాషయేయైనను అందు మనమీనాడు పాటించు సంధిసూత్రములును గానంబడుచున్నవి. కాని శాసనములలో దఱుచుగ విసంధులే కలవు. ప్రాముఖ్యముగ నీ క్రిందిసంధులవంటివి మాత్రము ప్రాచీన శాసనములలో మనము గమనింపవచ్చును.

ఉదా : ముచ్చింతల (మూడు + చింత) EP. Ind. Vol. V P 70
పెందెరువు (పెద్ద+తెరువు) = EP. Ind. Vol. V P 70
పెంజెఱువు (పెద్ద+చెరువు) = EP. Ind. Vol. VI P 34
ముయ్యెల్ల (మూఁడు+ఎల్ల)-ఆం.సా.ప. సం౧ సం౧ పుట౪౫)

పూర్వపు శాసనముల ననుసరించి యికనేకవచన బహువచనరూపములను, వాని మార్పులను వ్రాసెదను. పూర్వము బహువచన ప్రత్యయ మిప్పటివలె "ల" కారముగ నుండక "ళ" కారముగ నుండినట్లుకాన్పించుచున్నది.

ఉదా : "సంవత్సరంబుళ్" – EP. Col364 of 920

"శివాప్పరాజుల్" – (Nel Ins. P 2 Page 1152

"భటారళు" EP. Col Nos 359, 361 of 1920

"కొడుకళ్" – EP. Ind Vol XI p 337

"ఊరిస్వాళ్" – I am Sans Ins (Kol O.P.) no 22

"గవిలళు"

ఇది యటుండి గొన్ని పదములకు బహువచనరూప మేర్పడిన విధము శాసనముల వలన విస్పష్టముగ దెలియగలదు. గుడి, మడి, అమృతపడి – వీనికి బహువచన రూపములు పంద్రెండె పదుమూడు శతాబ్దముల నాటి శాసనములలో నీరీతిని గానవచ్చుచున్నవి.

ఏకవచనము – గుడి బహువచనము–గుడ్లు

ఏకవచనము – గుడి బహువచనము–మడ్లు

ఏకవచనము – అమృతవడి బహువచనము–అమృతపడ్లు

గుడ్లెత్తించి గుడ్లసమీపము – (Nel. Ins. R 36 Page 1249)

దీపగుడ్లు – Nel. Ins. O 40 Page 967)

పరిమడ్లకు – Nel. Ins O 139 Page 1129

మామిడ్లు – Nel. Ins U 75 Page 1032

అమతపడ్లు– Nel. Ins. D 40 Page 345

ఊరి పేళ్లయందును ఇట్టి రూపములు గానవచ్చును.

ఉదా :– తాడ్లతేవ (ఆం. సా. ప. ప. సం ౧ సం. ౧ పుట ౪౫)

కోఅడ్లమడుగు – Nel Ins D 43 Page 347

తాడ్లూరిపుర – Nel Ins D2+Page 321

నిత్య బహువచనపదములందును ఈ రూపము కానవచ్చును.

ఉదా :– పెరుమాడ్లు – Nel InsO989, Page 106

దేవడ్లకు – Upparapalli : Ins. of Kakati Gana-(pati devar)

(దేవడ్లకు అంగభోగ రంగభోగ ధూపదీపనైవేద్యతాంబూలాలకు)

ఊరికి బహువచనరూపమైన ఊళ్ళయందును గొన్ని శాసనములలో నీ పై రూపము చూపట్టుచున్నది.

"కోట ఊడ్లలోన " - Ep. COl 360 of 1915

" రట్టడి ", " రట్టోడి " అను పదములకు " రట్టడ్లు ", "రట్టోడ్లు " అను రూపములును శాసనములందు గన్పట్టును.

ఈ పై నిచ్చిన యుదాహరణముల నరసి చూడ డుమంతైక వచనమునకు బహువచన ప్రత్యయము చేర్చగా బైని చూపిన రూపములేర్పడియెనని తెలియగలదు. ఆ డు వర్ణకము బహువచన ప్రత్యయముతో గలిసినప్పుడు "ళ" క్రింద మాఱి అమృతపళ్ళు, మామిళ్ళు, వరిమళ్ళు, గుళ్ళు, కోఅళ్ళు, ఊళ్ళు, పెరుమాళ్ళు, ఈ మొదలగు నిప్పటి రూపములు కలిగినవి. సంజ్ఞావాచకములైన గ్రామ నామములలో గూడ నిట్టి మార్పేకలిగెను. అందువలననే నేడు పూర్వపు తాడ్లతేవ–తాళ్ళతేవగను, పూర్వపు కోఅడ్లమడుగు, కోఅళ్ళమడుగుగను మాఱిపోయెను.

కాని "ఊరు" శబ్ద బహువచన మేర్పడిన రీతికిని పై పదములు బహువచన మేర్పడిన రీతికి నించుక వ్యత్యాసము కలదు. బహువచనప్రత్యయము పూర్వము "ళు" అందువలన 'ఊఱ్' + ళు. రేఫము సంయుక్తముకాగా "ఊఱ్ళు" అయ్యెను. అదియే తుదకు "ఊళ్ళు" క్రిందకు మాఱెను. ఇట్లే అఱ్+కిలి = అర్కిలి– అక్కిలి; పెఱ్+నిధి=పెఱ్నిధి–పెన్నిధి; ఇర్+మడి=ఇర్మడి–ఇమ్మడ్డి.

ఊరు పయిరీతిని "ఊళ్ళు" "ఊడ్లు" అను రూపమెట్టు కలిగినెనని సందేహము కలుగుచున్నది. "ఊరు" అను పదమునకు "ఊడు" రూపమున్నదిగాని "ఊడ్లు"కాదు. ఇందుల కొక విధముగ బ్రత్యుత్తర మీయవచ్చును. ఈ క్రింది తెలుగు పదములు ప్రాచీన శాసనములలో నేకవచనముగ గాన్పించుచున్నవి. "అచ్చువాన్టు Ep. Col No. 361 of 1920

"గోత్రున్టు" Ep. Ind; Vol XI; page 345

"శత్యదితున్టు" (సత్యాదిత్యున్టు)

"వేవాన్టు"

"బాది (రా) (జె) న్వాన్టు"

"మూన్టు"

"తానుమూన్టు"

"మగన్టు"

ఇవియన్నియు నన్నియభట్టునకు రెండు మూడువందలయేండ్లకు బూర్వపు శాసనములలో నున్నవి. ఈ పై పదములలోని శకటరేఫము ప్రథమైకవచన ప్రత్యయము. ఇదియే కాలక్రమమున "దు" వర్ణకముగ మాఱెను. అప్పుడు పై పదముల రూపములిట్లుండును. –అచ్చువాన్డు; గోత్రున్డు; సత్యాదిత్యున్డు; పైని అనునాసికముల సందర్భమున జెప్పిన విషయముల ననుసరించి ఈ పై పదములు అచ్చువాణ్డు; గోత్రుణ్డు; సత్యాదిత్యుణ్డు; మూణ్డు; – ఈ విధముగ మాఱుచున్నవి. పంద్రెండు, పదుమూడు శతాబ్దములనాటి తెలుగు వర్ణక్రమముననుసరించి పై పదములు గోత్రుండ్డు మూండ్డు, రాజన్వాండ్డు......... ఈ విధముగ మాఱగా నేటి కవిగోత్రుఁడు, మూఁడు, రాజన్వాఁడు, సత్యాదిత్యుఁడు – అను రూపములదో మనకు గోచరించుచున్నవి.

అట్లే "ఊరు"అను శబ్దమునకు బ్రాచీనకాలమున "ఊనుఱ" అను రూపముండియుండెను. అదియే "ఊన్డు" ఊణ్డు అని మాఱి తుదకు "ఊఁడు" అయియుండును. అందువలననే మనకు "ఊడ్లు" అను రూపము కానంబడుచున్నది.

ఇప్పుడు "ఊరు" యొక్క బహువచనరూపము "ఊళులు" అని యుండుట ననుసరించియు, "ఊఁడు" రూపము పూర్వముండి యుండెననియు, ఇప్పుడాప్రథమైకవచనరూపము ఊఁడు" జారిపోయెననియు, "ఊళులు" అని దాని బహువచనరూపము మాత్రము మిగిలెననియు నుడువవగును.

ఇక నన్నియభట్టునకు బూర్వముడిన భాసనములవలన దెలియవచ్చు శబ్దజాలమును గుఱించి వ్రాసెదను. గవర్నమెంటువారు నకళ్ళు తీయించిన తెనుగు వారి పురాతన శాసనము లింకను బ్రకటింపబడియుండలేదు. ఆంధ్రదేశమునందు దొరతనమువారు తీయించిన శాసనపుబ్రతులన్నియు బ్రకటింపబడుచో ఆంధ్రభాషకును ఆంధ్ర చారిత్రమునకును మహోపకారము జరుగగలదు. ఇప్పుడు వాడుకలో లేనట్టియు, యీనాటి యాంధ్రులెఱుంగనట్టియు విస్మరించినట్టియు శబ్దజాల యెంతయో వెల్లడిలోనికి వచ్చును. ఆంధ్రదేశమునందలి శాసనములన్నియు బ్రకటింపబడినగాని, ప్రాచీనాంధ్ర భాషా స్వరూపమును దెలిసికొనుట కష్టము. అన్ని శాసనములును బ్రకటితములగుచో నూతనాంశము అనేకములు బైలువెడలవచ్చును. చారిత్రక విషయక మెట్లున్నను అవి ప్రకటింబడునెడల భాషకు గ్రొత్తరక్తము పట్టి క్రొంగొత్తువిలాసము వచ్చుననుటకు సందియములేదు. ఇప్పటివఱకు బ్రచురింపబడిన శాసనాధారముల ననుసరించి నన్నియభట్టునకు బూర్వమందుండిన తెలుగుపదములను జూతము.

నన్నియభట్టునకు బూర్వముండిన శాసనములలో బ్రకటింపబడినవి చాలకొలదిగ నున్నవి. వానిలోనైనను జాలశాసనములు మధ్యమధ్య శిథిలమై చాల దుస్థితియందున్నవి. అందువలన గొన్ని గొన్ని శబ్దములలో గొంతకొంత భాగముపోవుటచేత, ఆయా శబ్దముల స్వరూపమును దెలిసికొన వీలులేకున్నయది. తెలిసికొనవీలయిన శబ్దములు చాలతక్కువగ నున్నవి. వానినే యీ క్రింద బొందుపఱుచుచున్నాడను.

శబ్దము	వివరము
1. వక్రంబు	అడ్డు,ఆటంకము "ఈధర్మమునకు వక్రంబు వచ్చువారు"
2. స్తితి(స్థితి)	వృత్తి. "బేడ కోరులేకుండంబడసిన స్థితి"
3. పన్నస	ఇది కన్నడపదముగ కన్పట్టుచున్నది. డాక్టరు కిట్టెల్‌గారి కన్నడ నిఘంటువులో "పణ్ణను" "పణ్య" యను పదములు కలవు. అందు
4. పన్నాస	"పణ్ణెయ" యనగా "సూరి" "పెద్దపొలము" అని యర్థము వ్రాయబడినది. ఉల్లాల్ నరసింగరావుగారి "కిసంవార్ గ్లాసరీ" అను నిఘంటువులో (మంగుళూరు ౧౮౯౧. ౧౮౯౫ .) "పూర్వము రాజుల యధీనములోనుండి, తిరిగి వారెప్పుడడిగిన నప్పుడు మఱలనిచ్చివేయు పద్ధతులమీద కౌలుకిచ్చు భూమి" అను పథ౯ములో "పణ్య"యను పదమునిచ్చియున్నారు. వీని ననుసరించిచూడ పూర్వపు తెలుగుశాసనములలోగానవచ్చు 'పన్నస' 'పన్నాస' యను పదములును, కన్నడములోని "పణ్య" "పణ్నెయ" శబ్దములును నరసింగరావుగారి నిఘంటువులోని "పణ్య" అనుపదమును సమానార్థ బోధనములని నిశ్చయింపవలసియున్నది. అంతియుగాక యరవమున "వ్యవసాయము"అని యర్థమిచ్చు "పణ్ణై" యను పదముకూడ కలదు. ఇవియన్నియు నొకేశబ్దముయొక్క మాఱు రూపములనియు, "భూమిభోగము"లలో (Land Tenures) నరసింగరావుగారు చెప్పినట్టు పన్నస" "పన్నాస" యనునది యెకటి యనియు నాయభిప్రాయము. ఇందుకు దార్కాణముగ సత్యాశ్రయమహారాజు కుమారుడును కీర్తివర్మ మనుమడునైన ఆదిత్యవర్మ శాసనమును* జూపవచ్చును. ఇందు రేవశమ౯ అగ్నిశమ౯యను నిరువురు బ్రాహ్మణులకు ఆదిత్యవర్మ మణ్డకల్లు, పాల్గిఱెయను గ్రామములను "ఉఇచ్చనున్న పన్నాస" యను వృత్తిగ నిచ్చెనని తెలుపంబడియున్నది.

1. *Nel. Ins. P2, Page 1152.*
Nel. Ins. D2 page 287
Nel. Ins. O 48, page 977
T.m. Sans. Ins (Kal C.P. gr.No. 22
2. ఆం.సొ.ప.వ.వం2–1అరపుట 399

2. *Nel. Ins. O 39, page 896*
Nel. Ins. P 22, Page 1179
Tam. Sans Ins (Kal C.p. Gr) No. 22
Nel. Ins. p. Page 1152
Ep. nd Vol V. Page 13
Ep. Ind Vol VII page 61.

* *Madras Museum, C.P. grants of western Chalukyas, no 1, Sewell's List of inscriptions, no 95*

5 దత్తి — ఈయబడినది; దానము. "ఉబిలీశ్వర భట్టారళకు ఇచ్చినదత్తి;" "గణపతిదేవమహారాజు విధించిన దత్తి "దేవదత్తి" (దేవభోగము) "దత్తి" పదమునకు "దత్తిడి"యనియు రూపాంతరము కలదు.* కాని యియ్యది అసాధువయియుండును. దానంజేసియై యుండవచ్చును. ఈ దూపము శాసనములలో నంతగగానరాదు. "దత్తి" పదమునకు "దత్తులు" అని బహువచన రూపముకలదు. ("ఇటు సప్తసంతానంబులు, దేవబ్రాహ్మణదత్తులు") ఆం.సా.ప.ప సం ౫ . సం ౧౬. పుట ౩౬౧ .

6. మఱుతుధ్లు — ఇది కన్నడ "మత్తురు" శబ్దముయొక్క యసాధురూపమని శబ్దశాస్త్రజ్ఞులు చెప్పుదురు.

7. మఱుత్రు — "మత్తరు" అనగా నొకానొకభూమి కొలమానము. మనమిప్పుడీ ప్రాంతముల పుట్లలెఖ్కనెట్లు భూమిపరిమాణమును గనగొందుమో పూర్వము "మత్తరు"– "మఱుతు"ల లెక్కను భూమిపరిమాణమును గనుగొనువారు "మఱుత్రు" యొక్క బహువచన రూపము "మఱుతుఢ్లు" ఈ పదము పంద్రెండవ శతాబ్దినాటికి "మఱ్ఱులు"గ మాఱినది. కాకతీయులకామునను, అటుపిమ్మటను నీరునేల (పల్లవునేల) మఱ్ఱులలెక్కలను, వెలిచేను (మెట్టనేల) పుట్ల లెక్కను గొలుచువారు. గణపతిదేవుని పాఖాలశాసనము ననుసరించి ఒక మఱుతునేల యొక్క నివర్తనమునకు సమానమని తెలియుచున్నది. చూడుడు.

"శ్రీమత్కాకతిరాజవంశభజన ఖ్యాతాత్మవంశక్రమః శ్లాఘాసంతతి శాసనం కవీయతాం యశ్చక్రవర్తీ౯వ్యధాత్తస్మై శ్రీజగళదాముమ్మ డిరదాదప్యాంపురిప్రోన్నతిమ్ సౌధం పంచనివర్తనానిచ సదాశ్లిష్టాని సస్యశ్రీయా" 41వ శ్లోకము.

"ఈ శాసనముచెప్పిన కవిచక్రవర్తినొలుకు ముమ్మడయంగారు ఇచ్చిన వ్రిత్తి అయిదు మఱులు" – పాఖాలశాసనము.

నివర్తనమునుగుఱించి కాకతీయ సామంతుడయిన సారంగధరుని సారంగపురముశాసనముననిట్లు చెప్పబడియున్నది.

"దశహ స్తేనదండేన త్రిశద్దండానివర్తనం"

పదిహస్తములదండముతో ముప్పదిదండములయిన నొకనివర్తనమగునని తెలియుచున్నది.◆

8 రట్టడి, రట్టడ్లు — (రూపవికాసమును జూడుడు)

ఒడ్డు, గట్టు, తీరము "గంగకఱుకగవిలంజంపినపాపానంబోదురు"

9 కఱుక — అరవములోని "కత్తై" అనుశబ్దమును తెలుగులోని 'కఱుత' అనుశబ్దమును సమానార్థకములు. ఇయ్యది కులోత్తుంగచోడుడు వీరచోడుడు మొదలగువారి కాలమునుండి తెలుగు శాసనములలో గానవచ్చుచున్నది. "వారణాసిన్దచ్చువారు" "గంగకఱుత" – వీని లోని "వారణాసి" "గంగకఱుత" ఇయ్యవి క్రీస్తుశకము పదునొకండవ శతాబ్దినుండి శాసనములందు గానవచ్చుచున్న పదములు. వారణాసి యనునది ఏడవ శతాబ్దినాటి తెలుగు శాసనములలో గానరాదు. బ్రాహ్మణమతము పునరుద్ధరింపబడిన నాటినుండియు గంగకును, వారణాసికిని బ్రాముఖ్యతయు, బవిత్రతయు వచ్చినట్లూహింపనగును, పదనొకండవ శతాబ్దమున "కఱుత"కు "గట్టు" అనునర్థము రూఢముగ నుండెను. "ఏంటి కత్తిపుట్ట" 1 కాలము గడచిన కొలది "కఱుత"లోని బండిఱ సాధువయ్యెను. పంద్రెండవశతాబ్ది కీవలి శాసనములలో "కఱ్త" "కర్త" యనియు రూపాంతరములు కన్పట్టును. ఈ పదము శాసనములలో బదునేడవ శతాబ్దివఱకుగాన వచ్చుచున్నవి.

10 యుయ్యలికుట్రుగుట్ట — మూడు ఎల్లలగుట్ట : మూడు సరిహద్దులు కలిసినచోటనున్న సాధురూపము: ముయ్యెల్లగుట్ట, ఆ సాధువు ముయ్యలికుట్రు.

11 పోలగరుసు, 12 చేని గరుసు — పొలముసీపమః చేని సరిహద్దు అని నాయభిప్రాయము. కాని శ్రీయుత జయంతి రామయ్య పంతులు గారు "పొలగరు" సనగా "పొలిమేర" యనియు, "పొలి" శబ్దము "పొల" యని ఆకారంతముగ లిఖింపబడినదనియు, ఇది 'బలి' శబ్దభవముగ గ్రహింపబడుచున్నదనియు, వ్రాసియున్నారు. "పొలగరు" సన "పొలముసీమ"యే సరియైనదని నామతము. "సీమ" అను నర్థములో నీపదమును శ్రీనాథుడుపయోగించియున్నాడు.

"ఏకభోగంబుగాగ నేలేఱుగరుసు
కదలిసీమంబు గౌతమీగంగా మేర
కప్పూరపుగ్రోవి కాశ్మీర ఖండమవధి
యేలె విశ్వకుటుంబి భీమేశ్వరుండు"

భీమఖండము .ఆఆ. 5. ప. 88

కాని యీ శబ్దమును తిక్కనసోమయాజి మఱియొక యర్థము నగూడ బ్రయోగించియున్నాడు.

---

* Nel. Ins. D 13, page 297

5. Nel. Ins, O 51, page 980
 Nel. Ins. P 2, page 1182,
 Nel. Ins. D 2, page 287

6. Ep. col Nos 459, 364 fo 1228

7. Ep. Ind. Vol X1, Page 345

8. Nel Ins. O 51, page 970

9. Nel Ins. Vol. I C. p. grant No. 17, page 137

10. Ep. Ind. Vol. VI, Page 34 ఆం.పా.ప.ప. సం 1 నలగ. పుట 45

11. Ep.Ind Vol. XI, Page 345 ఆం.పా.ప.ప.సం. 1 స 1 = పుట 45

12. Ep.Ind Vol. V, Page 139 *ఆం.పా.ప.ప.సం. 1, పుట 5వ

◆ కాని శుక్రనీతి సారమిందులకు వ్యతిరేకముగ౦ దెలుపుచున్నది. అందిట్లున్నది

" చతుః కరాత్మకోదణ్డోలఘుః పఞ్చకరాత్మకః। తదణ్డలంపఞ్చయవైమా నవం మానమేనతత్॥"

– అ ౧ శ్లో॥ ౧౬ వ

"పఞ్చవింశతిభిర్దణ్డైరుభయోస్తు నివర్త్తనమ్॥

– ఆ ౧ శ్లో॥ ౨౦౦

పై శ్లోకమునుసరించి నాఱుగురకములు లేక అయిదుకరములనియు, ప్రజాపతి మనువులుభయుల మత ప్రకారము ఇరువదియైదు దండములొక నివర్తనమనియు౦ దేఱుచున్నది.

I EP. Ind. Vol. V page 70

"గురునకు నాకును బాండవు
లరయగఁగూరిమికిఁ(బాతమగుదురమైనన్
దూరమునఁజుట్టతికంబను
గరుసిడి కొనుటేలగలుగు గౌరవనాథా!"
మోమోటమి యను నర్థమున నీ "గరుసు"" పదము (ప్రయోగింపబడియున్నది.

13 సిఱువుళు చెఱువులు "వేసిఱువుళువేవాన్టు"
14 వేవాన్టు వేయువాడు "వేయిబౌఱువులు వేయువాడు"
15 గవిలః గవిలళుకపిలః పల్లావులు
16 కోట్టము దుర్గపురము
17 దమ్మువులు ధర్మువులు : ధర్మములు
18 బారనాసి వారణాసి: (ఇది సాధారణముగ అన్ని శాసనములలోను కాననగు భారనాశి)
19 (ప్రతిరవలు ఆటంకము : అడ్డవిఘాతము.
20 వెమ్బొడుచు వెంబడించు, వెంటాడించు
21 వడ్డవారము శు(క్రవారము అలంపక్షే(త్రము (అర్థమూహింపబదినది)
22 కోడు ఊరిదరినీటిపల్లము.
23. అచ్చువాన్టు నాశనము చేయువాడు, వధించువాడు "బారణాసి దచ్చువారు"
24 దచ్చినవారు చూచుడు–దచ్చినవారు
25 (ప్రచ్చినవారు * "దయ్యుధాతువునకు క్త్వార్థకరూపము "ఇయ్యెట్టుదస్సి"
26 దస్సి ఇచ్చట సకర్మకముగ (ప్రయోగింపబడినది. ఇయ్యెట్టుదస్సి యనంగా నీయొట్టునుక్షీణింపజేసి; పాటింపకయని యర్థము"
"శైవమతానలంబకులగు భిక్షకులు"
27 గొరగలు సీ॥ గొరగయై మైలారుగొనియాడు నొక వేళ
28 గొరవళు నొసటి పై బండారుపసుపుదాల్చి " – కాళీఖండము ఆ. 7
29 నెగిదీర్దెన్ "నెగయందీర్చె; నెగయు, ఎగయు, తీర్చు=ఏర్పఱుచు, కట్టించెనని భావము"
30 బృందంబుగొని "కూడికొని, సమావేశమై"
అఱిసిన "అడిచిన; పగులగొట్టిన, అరవములో అడి=కొట్టు"
అఱివుట "నాశనము చేయుట"
తానపతులు "స్థానికులు ః ధర్మకర్తలు"
మొగమాడుపు "మొగనుండు మాడువు. మొగయనంగా న(గ్రభాగము. ముఖ
"శబ్దభవము. మాడువు–మేడ; హర్మ్యము."*
వేరఱు "గొప్ప ధర్మము" [1]

ఈ పై పదములన్నియు నన్నయభట్టుకాలమునాటి శానములనుండియు, నంతకుబూర్వపు శాసనములనుండియు నేర్చినవి. అందు ముఖ్యముగ 1.వ(క్రంబు, 2.స్థితి, 3.నన్నస, 4.దత్తి, 5.అచ్చువాన్టు– (ప్రచ్చువారు– ఇవి (ప్రత్యేకముగ జాళుక్యుల కాలమున అందు నన్నయభట్టునకు బూర్వము వ్యవహారములోనుండిన శబ్దములు. వీనిలో నేవియోయొకటి రెండుతక్క మిగిలినవి నన్నియభట్టు తరువాత శాసనములందు గానరావు.

13. *Ep.Ind Vol. XI, Page 325*
14. *I bid*
15. *Nel. Ins. P2 Page 1152*
16. *Nel. Ins. O3 Page 896*
23. *Ep. Col 361 of 1920*
24. *Nel. Ins. O 48, Page 977*
25. *Nel. Ins O 142, Page 1133*
Nel. Ins. O 50, Page 979
Nel. Ins. P 22, Page 1179
17. *Nel. Ins. O 3 page 896*
19. *Nel. Ins. P 1 page 1151*
20. *Ep. Col. 359 of 1920*
21. *Nel. Ins. U 48 page 1398*
27. ఆం.సా.ప.స. సం 6 సం. 2 పుట 64
28. (అదే సంచిక)
28. *Nel. Ins. P 2 page 1152*
26. ఆం.సా.ప.ప. సం6, సం2, పుట 64

* ఈ గుర్తు మొదలు * ఈ గుర్తువఱకు గల పదములు యద్దమల్లుని బెజవాడ శాసనములలోనివి. ఆపదములకు శ్రీయుక జయంతి రామయ్య పంతులుగా కొనసంగినయర్థమునే యిట పొందుపఱచియున్నాను.
1. ఆం.పా.ప.ప.పం.ర. పుట 267

పై పదములలో "గంగకఱుత", "వారణాసి" యను పదములు శాసనములలో దఱచు ప్రయోగింపబడినవిధము చూడగా మహాభారతాదులు తెలుగులోనికి వచ్చిన కొలది గంగానదికిని, వారణాసికిని పవిత్రత వచ్చుటయు, హెచ్చుటయుగూడ గాననగును. బ్రాహ్మణమతమును సమర్థించి, పోషించునిమిత్తమును దానిని జనసామాన్యమున విరివిగ వ్యాపింపజేయునిమిత్తమును, బండితులును, కవులును, ఉత్తమమతగ్రంథములకు వ్యాఖ్యలు వ్రాసిపెట్టియు బురాణములను దేశభాషలలోని కనువదించినట్టియు మేలి కాలమది. అందువలననే స్వమత సంరక్షణము కొఱకు దగినయుపపత్తులను, ఆధారములను బలపఱచుకొనిన పిదపగాని యాంధ్రమున స్వతంత్రగ్రంథములు బైలు వెడలవయ్యెను.

ప్రాచీన శాసనములను బరిశోధింపగా గానవచ్చు తెలుగు పదములలో రూపవికాసమునకు గమనింపదగిన యొకపదముకలదు. "రెడ్డి" పదరూప వికాసము. అది యిప్పుడు "రెడ్డి" యను పేర బరగుచున్నది. ఈ పదము మొదట నేవిధమున నుండెనో, యది యేయే విధముల మార్పుజెంది తుదకిప్పటి రూపమున నిలిచెనో సంపూర్ణముగ బ్రాచీన శాసనాధారమున దెలియవచ్చుచున్నది.

శాసనములలో నీ రెడ్డి పదము రూపాంతరముతో నన్నియభట్టునకు నాలుగైదు వంద యేడ్లకుబూర్వమే కానవచ్చుచున్నది. అప్పుడీశబ్దమ యొక్క రూపము "రట్టగుడి!"

ఉదా:– అరవ మహేంద్ర రట్టగుడి–

Ep. Col. No.98 of 1917

పల్లవరట్టగుడి–

Ep. Col. No.400of 1904

చల్కిరట్టగుడి

Ep. Col. No.400 of 1904

ఇట్లే "దగ్గరట్టగుడి", చోఱియరట్టగుట్టు, అను నామములును బూర్వపు శాసనములో జూడవచ్చుచున్నది. "రట్టగుడి" అనుపదమునకు బహువచనరూపము "రట్టగుడ్లు" లేక "రట్టగుళ్లు".

ఉదా:– మల్పిడుగు రట్టగుడ్లు–

Ep. Col. No.7384 of 1904

కురుమారి రట్టగుళ్లు

Ep. Col. No.337 of 1905

"రట్టగుడి", "రట్టగుట్టు" అను పదములలో "రట్ట" అనుపదమును "గుడి" "గుట్టు" అను పదములు జేరియున్నవి. ఈ "రట్ట" "గుట్టు" పదములకు అర్థమేమి? ఇందును గూర్చి విచారింతము. "రట్ట" అనునది యొక తెగయొక్క పేరని నాయభిప్రాయము. "రట్టు"లగు తెగవారి ననుసరించియే "రట్లపాడి", "ఇరట్టమండలము", "రట్టరాజ్యము" అను నామములేర్పడినవి. ఇయ్యవి ప్రాచీన శాసనములందు బొడకట్టుచున్నయవి. "రట్టు"లందు దేశమని వానికర్థము. పైనామముల ననుసరించియే రట్టు లనునది యొక తెగ యనవచ్చును. "ఒకానొకరాజు రట్టులపక్షమున నొకరిమీదకు యుద్ధమునక వెళ్ళె"నని యొకానొక శాసనమునగలదు.

Ep. Col. No.562 of 1915

దీని ననుసరించియు "రట్టు"లు ప్రత్యేక ముగ నొక తెగవారని నిశ్చయింపవచ్చును. ఈ "రట్ట" తెగకు చిహ్నముగ నీపదము పేళ్ల చివర చాల పూర్వకాలమునుండియు నందువచ్చినట్లు శాసనమువలన దేటపడ గలదు.

ఉదా :– నివరథుడు : అతని తండ్రి దెసరథుడు

Ep. Col. No.754 of 1916

బ్రొలమరట్టోటి

Ep. Col. No.675 of 1917

ముప్పిరటి

Ep. Col. No.673 of 1917

రట్టులనుబట్టియె "రాట్ట" మనుపేరువచ్చెను. "కమ్మకరాట్టము" – ఈ రాట్టమె సంస్కృతమున "రాష్ట్రము"గ మాఱెను (కమ్మ రాష్ట్రము)

అట్లే "కుట్టు" అనునదిగూడ ఒక తెగ యొక్క పేరని నాయభిప్రాయము. "కుట్టు" అను నొక తెగయుండెననియు, శాతవాహన వంశము రాజకీయముగ బతనము నొందిన తరువాత ఆంధ్రసామ్రాజ్యములో జాల భాగము "కుట్టు" తెగవారి వశమయ్యెననియు, వారు మహారథులవలెనే శాతకర్ణులను బిరుదములను దమ నామముల చివరనుంచుకొనుచు వచ్చిరనియు డుబ్రెయిల్ దొరగారు వ్రాయుచున్నారు (Ancient History of the Daccan by G..J.Dubreuil, Page 48)

ఉదా:– విష్ణు కడకుటు శతకర్ణి! "రట్ట" పదమువలెనే "కుట్టు" పదము క్రీస్తుశకము మూడు నాలుగు శతాబ్దములలోనెగాక యిటీవలి కాలమునగూడ పేళ్ళ చివరనుండుచువచ్చెననుటకీ క్రింది నిదర్శనములను చూపవచ్చును.

* "ఘటు", రూపాంతరము. సం॥

"సిరగుట్టి"

Ep. Col. No.735 of 1917

"అయ్యకుట్టి"

Ep. Col. No.753 of 1917

కాలముగడచినగొలది "రట్ట" పదము "రట్టి" అయినయట్లే "కుట్టు" పదము "కుట్టి" యయినది. 'కుటు' పదము క్రమక్రమముగ 'కుట్టు" "కుట్టి" "కుడి"గా మారెనని యూహింపవచ్చును. ఈ "రట్ట" "కుట్టు" తెగలయన్యోన్య సంబంధమే "రట్టగుడి"యను పదమేర్పడుటకు గారణభూతమైయుండును ఇంకను బరిశోధనమువలన దేలవలసిన విషయమిది.* ఈ రట్టకుడు "రట్టగుడి" అనుపదమే సంస్కృతమున "రాష్ట్రకూట" పదమయ్యెను. ఇయ్యది పూర్వాచాళక్య శాసనములందుగాననగును. "గుద్రహారవిషయనివాసినో రాష్ట్రకూటప్రముఖాన్ కుటుంబినస్సర్వాన్సమాహూయ" పూర్వచాళుక్య శాసనములందలి రాష్ట్రకూటపదముకంటె "రట్టకుడు" అనుపదమె పురాతనమైనదిగ గానవచ్చుచున్నది. ఏలయన "విషయనివాసి నో రాష్ట్ర కూటప్రముఖాన్" అని పూర్వచాళుక్యులు దేశీయులను సంబోధించుట రెండవ విజయాదిత్యుని కాలము (కీ.శ. 799–843) నుండి యో. లేక (నాల్గవ) విష్ణువర్ధనుని కాలము (క్రీ.శ. 764–799) నుండియో ప్రారంభమైన యట్లూహించవచ్చును. అనగా రమారమి యేడవశతాబ్ది మధ్యకాలమునుండి యారంభమయ్యెను. (రెండవ) విజయాదిత్యుని శాసనములలో గొన్నిటిలో "విషయే నామగ్రామస్యకూటక ప్రముఖాన్" అనియు, "మఱికొన్నిటిలో... విషయని వాసినో రాష్ట్రకూటప్రముఖః" అనియు గలదు. (ప్రథమ) విష్ణువర్ధనుని (క్రీ.శ. 615–633) చీపురుపల్లి శాసనమున నిట్లని కలదు. "దిమిల విషయోకల్వకొండగ్రామాధివాసినః కుటుంబినః" ... ఈ పై బ్రమాణములవలన రాష్ట్రకూట పదముకంటె రట్టకుడు పదమే పురాతనమైనదని నాయభిప్రాయము. రట్టులే రఠులు రథులు అయిరి. వీరిని బట్టినే రట్టరాజ్యము నకు మహారాష్ట్రమను పేరు గలిగెను. (మహారఠులదేశము) ఈ రట్ట రఠు అనుపదమే రాథోడు పదమయ్యె నని కొందఱిమతము. "రాథోడు" అనునది రాజపుత్రస్థానమందలి రాజవంశములలో నొకదానికి బేరు. ఈ "రట్టకుడు" "రట్టగుడి" అను జాతిపదము నామముల చివరగడప, అనంతపురము ఈ మండలము నందలి ప్రాచీన శాసనములలో గానవచ్చుచున్నది. ఉదా:–మాఱ్పిడుగు రట్టగుడి. "మాఱ్పిడుగు" అను నది యొకానొకని నామము. "పిడుగు" అంత ముసగలపేళ్ళు పల్లవుల కాలమున బెక్కులు గానవచ్చుచున్నవి.

ఉదా:– కడుంబిడుగు

South, Ind. Ins. Part 1 P 63

పెరుంబిడుగు

Ibid Vol 1 P 155

విడెల్విడుగు

శ్రీ కంఠచోళుని పూర్వుల పేళ్ళలో "అగ్రణిపిడుగు" అను పేరు కానవచ్చుచున్నది. "రట్టకుడి" యనునది రాష్ట్రకూటరూపముతో బూర్వచాళుక్యుల శాసనములలో నెనిమిదవ శతాబ్దినుండి విశేషముగగానవచ్చుచున్నది. ఈ రాష్ట్రకూటులు కుటుంబినులనిశాసనములననుసరించి తెలియుచున్నది. కుటుంబిను అనగా వ్యవసాయదారుని యర్థము. తమిళమున "కుడి" యున పదమునుండి "కుటుంబి"యనునది పుట్టెనని శబ్దశాస్త్రజ్ఞులు చెప్పుదురు.

"రట్టగుడి" అనుపదమే రానురాను ప్రాచీనశాసనములలో "రట్టడి" "రట్టోడి"గా మాఱినట్టు కాన్పించును. కాలక్రమమున "రట్టగుడి" లోని "గు" లోపింప మిగిలినది. కాలము గడచినకొలది రూపాంతరములను బొందుచు వచ్చెను. ఇయ్యది ఏయే రూపాంతరములను బొందినదియు, ఆ రూపాంతరము లేయే శాసనములందుగానవచ్చునదియు నీ క్రింద వివరించెదను.

రట్టోడి.

Nel. Ins. K. 67 Page 606

Ep. Ind. Vol V Page 139

రట్టొడ్లు, రట్టొడ్లు

Ep. Col. Nos 363, 364 of 1905

అం. సా. వ. ప. సం. 2 సం4 పుట 399

రద్దోడి, రాద్దోడి, రాదోడ్లు

* రట్టగుడియను పదమునకుఁ గొంద ఱింకొకరీతియర్థము చెప్పుదురు. "కుడు" యనునది "మాట" అను పద్యమునకు రూపాంతరమనియు, "కూట" అనునది శ్రేష్ఠవాచకమనియు, నందువలన "కుడు" శబ్దము కూడ శ్రేష్ఠవాచకముగనే గ్రహింపనగుననియు, గ్రామమునకు బెద్దను గ్రామాధికారి, గ్రామాధిపతి యనునట్లై "రట్టు" లకు బెద్దను "రట్టగుడి" యందురనియు 'రట్టగుడి' యనునది గ్రామాధికారి పదమువలెనే యొకయధికా రస్వమనియు, నది యేవంశమువారి కాలమున వచ్చిన నావంశనామము కూడ నా పదమునకుఁబూర్వ నుండెడిదనియు జెప్పుచు నిందుల కుదాహరణముగ 'సల్కిరట్టగుడి' 'చోళరట్టగుడి' అను పదములను జూపుదురు. కాని '...ళరట్ట" 'సల్కిరట్ట" యనఁగా చోళమండలమునందలి రట్టులు చాళుక్యమండలమునందలి రట్టులు అనునట్లు చోళమండలమునందలిరట్టగుడి చాళుక్యమండలమునందలి రట్టగుడి యని నా యభిప్రాయప్రకారమర్థము చెప్పుటకును అవకాశము కలదు. అది యటుండ 'కుడు' అను పదము శ్రేష్ఠవాచకమనియే యర్థము చెప్పినను, 'రట్టకుడు" పదమే రాష్ట్రకూట పదమయ్యెనని యొప్పుకొనినను ఒక బాధ కలదు. 'రాష్ట్రకూట ప్రముఖయను దానిలో 'కూట' యనునది ప్రముఖత్వమును సూచించుచుండ, అనవసరముగ ప్రముఖపదము మఱల రాష్ట్రకూటపదమున కంటగట్టుట అంతయుక్తి యుక్తముగ గనబడదు.

Nel. Ins. P 22 Page 1179
రట్టయ
Nel. Ins. P 38 Page 1201
రడ్డి
Ibid A 24 Page 230.
Ibid 0 79 Page 1045.
Ibid K 31 Page 724.
Ibid K 22 Page 716.
రెడ్డి
Nel. Ins. O 67 Page 1009
Nel. Ins. O 58 Page 994

పదమూడవ శతాబ్దినాటికి బూర్వపు "రట్టగుడి" శబ్దము రెడ్డియయ్యెను. పదమూడు, పదునాలుగవ శతాబ్దులనాటి శాసనములు బొడగాంచిన నీ విషయముతెటడగలదు.

నన్నపార్యునకు బూర్వముండిన తెనుగు పదములను గుఱించి చెప్పియున్నను ప్రాచీన శాసనములలోనిప్పటికి విశేష ప్రయోగములు లక్షణములైన కొన్నియపూర్వ ప్రయోగములు కానవచ్చుచున్నవి. "ఆచంద్రార్కము" అనునర్థమున "చంద్రాయత్త కాలం" (Nel. Ins. P 2 Page 152)అనియు, "సాక్షులు" అనుటకు "సాక్షి మంతులు" (Nel. Ins. P 22 Page 1179) అనియూ బూర్వపు శాసనములలో గలదు. వేఱొక శాసనమున "కశ్యవగోత్రుడైన రేవశర్మకు" అనుటకు బదులు "రేవశర్మ కశ్యపగోత్రునికి" అని కలదు. (Ep. Ind. Vol. IX P 47) ధర్మవారము అనుటకు "ధర్మపురము" "ధర్ము‌పురము" అని ప్రయోగముకలదు. (Nel. Ins. O 39 Page 966, Ep. Ind. Vol. IX Page 47.)

ఈ విధమైన సంగతులను గుఱించి గ్రంథవిస్తరభీతిచే నింతకంటె విపులముగ వ్రాయలేదు. ఇక నొక్కవిషయమును జెప్పిముగించెదను.

ప్రాచీన శాసన భాష సర్వసాధారణముగ దెలియుచునేయున్నది. కొన్ని కొన్ని శాసనములలోని తెలుగు పదములిప్పటికి రూపుమాసిపోయినను, మఱికొన్నిటికర్థములు మాఱినను, ఇకగొన్నిటికి రూపములు మాఱినను తెలుగుబాసలోనున్న పురాతనపు శాసనములు కొంచెముకష్టముమీద మనకు వాని భావమైనబోధపడకపోదు. కాని యట్లు భావమైనబోధపడదని యొక తెలుగు శాసనము కలదు. అది తామ్రశాసనము. అందలి లిపి తెలుగు. అందలి భాషకొంత సంస్కృతము, కొంత తెలుగు. అది విష్ణువర్ధనుని శాసనమైనయట్లు సంస్కృత భాషలోని విషయమును జదివిన బోధపడగలదు. కాని పూర్వచాళుక్యులలో ఏడెనమండ్రు విష్ణువర్ధనులు కలరు. ఈ దానశాసనమునందెలుపబడిన విష్ణువర్ధనుడెన్నవయాతడొ తెలియరాదు. ఆ శాసనము ననుసరించి యట్లు తెలిసికొనుటకు ఆధారములు కానరావు. ఆ శాసనము "అహదనకరము" అను గ్రామమున దొరికినదని సర్ వాల్టరు ఇల్లిటుగారు వ్రాసియున్నారు. ఇప్పుడారాగిశాసనము లండనులోని "బ్రిటిషు మ్యూజియములో"నున్నది. శాసనపు లిపి బరిశోధించిన అది నాలుగవ విష్ణువర్ధన్నుని కాలమునాటిదో, లేక యైదవ విష్ణువర్ధనుని కాలమునాటితో యైయుండునని లిపి పరిశోధకులు తేల్చియున్నారు. అక్షరములు సుందరముగను, స్ఫుటముగను నున్నవి. ఆ శాసనము "తమిళ, సంస్కృత శాసనములు" అను బర్గెసు గారిచే సంపాదితమైన శాసనగ్రంథమునందును, ఎపిగ్రాఫియా ఇండికాలోనుకూడ గలదు. దానిని సంపూర్ణ వివరములతో ప్రచురించినవారు తెలుగు భాగము తెలియక విడిచిపెట్టియున్నారు. ఈ శాసనపత్రికను ఈ నడుమ మాననీయులైన శ్రీయుత లక్ష్మణరావు పంతులుగారు తెప్పించి తెలుగు భాగమునకర్థముతీయుటకై ప్రయత్నించుచున్నారు. చరిత్ర ప్రియులయొక్కయు, భాషాప్రియుల యొక్కయు పరిశోధన నిమిత్తమాశాసనము నందలి తెలుగు భాగమునీ క్రింద బొందు పఱచియింతటితో నీవ్యాసమును ముగించుచున్నాను. మూడవ రేకులో 19పంక్తి నుండి తెలుగు భాగము ప్రారంభమగుచున్నది. ఎడమ ప్రక్కన వేసినయంకెలు శాసనము నందలి పంక్తులసంఖ్యను దెలుపును. నేనీ శాసనమును బర్గెన్ గారి "తమిళ, సంస్కృత శాసనములు" అను శాసనమునందలి ప్రతి ప్రకారము వ్రాయుచున్నాను.

మూడవరేకు మొదటిప్రక్క

17. విదితమస్తు వోస్మాభిః స్వస్తిప్రిధీచి వలవపట్టనబున ఊరి

18. వారుకరిగళ్ళవడ వరికి ఊరిస్వాముళ్ ఇచ్చినస్తితి రెండువాడల రట్టనావురకు

19. అరియుడగు తెఱెయు సిద్ధాయబు దన్డున సపరాధబున సవ్వన్ బాధ...

20. రియారువు ఊరుదాయసెసి ఇచ్చిదినికి పక్రబుంళెదు వచ్చినవారుగళరెని ఉరిస్తితి

21. దప్పినవారు దినికి వక్రబుంవచ్చిన గచ్చురు రెన్డువడల ఎలెముపరు లెములవె

22. సినదియు చన్ను విరిపయి నాదువరుగల్గిన ఎలెములచేసిన సెయుదునను

మూడవ రేకు – రెండవ ప్రక్క

23. మహనబియళ్ సరాలోక మహసద్ధవుల్ విరావవహనబియల్ గజ్జుబుసె

24. అనదుపుళ్ శమస్తభువన శ్రీయకనదిరజు బద్రపెరెయ ఊరిపనిన ప్రసివర
25. పయ్యోతి మహనబిళ్ వయ్యోతిమహభిళ్ పనికొళుదె నెరక పఇచ్చనప్రసి
26. పయ్యోతి మహనబియాళ్ సకలకొన్దుళ్ స్వలొక్రుయ మహసద్ధవళ్
27. పెర్ధాళ్ నెరవద్య నుహనద్ధర్వాల్ పనీన్ది మథ్లు వెటన్దలచరువయ్య విష్ణువర్ధాను
28. హసద్ధవళ్ పసుక్షెవుల కొన్దుకళ్ అచ్చుకుట్టువనియు కొన్దుకళ్ గజబుంసెద్రుల
29. నదువుల్ ప్రిధిమి మహర్ధావళ్ ప్రిధిమి మహర్ధావళ్ వెటండళ్ పొసిక : ధిఅము కొళనదుపు విష్ణువర్ధన నాలుగవరేకు మొదటిప్రక్క
30. మహసద్ధవల కొంధుకలు నిరవద్య ప్రిధిని కనది రజుళ్గునవన మహనభియుళ్
31. ముద్దఇచ్చకొళ్ రమిస్వరాప్రిధివి మహసద్ధకావళ్ అవయజనువ కాలకొన్దుకళ్ కొరిన్ధికొళ్
32. కరిగలప్రిధివి మహనద్ధవళ కొన్దుకళ్ సన్ధి మహనవిలనదువు శ్రీమహ
33. సద్ధవళసకాలొక్రుయ్యప్రిధివి మహసర్ధావళ దివ్కరయ్య వఇచ్చ
34. కొళ్ శ్రీజష్టి పెన్దట్టట్టి కన్ధాన్దు

ఇది యసంపూర్తిగ నున్నదని బర్గెస్‌గారు వ్రాసియున్నారు. ప్రాచీన ఆంధ్రశాసనములలో బొత్తిగందెలియరాకుండ నున్నది ఈ యొక్క శాసనమే. శ్రీయుత లక్ష్మణరావు పంతులుగారి కృషిఫలించి ఆంధ్రభాషా లోకమునకు మేలుకలుగు గాతమని కోరుచున్నాను.

ఎంత చక్కనిదోయి! ఈ తెలుగు తోట
ఎంత పరిమళమోయి! ఈ తోట పూలు
ఏ నందనము నుండి
యీ నారు తెచ్చిరో!
ఏ స్వర్ణదీ జలము
లీ మదుల కెత్తిరో!
ఇంత వింతల జాతు లీ తోటలో పెరుగు!
ఈ తోట యేపులో నింత నవకము విరియు!
ఏ యమృత హస్తాల
ఏ సురలు సాకిరో
ఏ యచ్చరలమురుపు
లీ తీరు దిద్దెనో!

ఈ పూల పాలలో నింత తీయందనము!
ఈ లతల పోకిళ్ల కింత ఒయ్యారమ్ము!
ఏ మహత్తర శక్తు
లీ తోటలో గలవొ !
ఏ దివ్య తేజమున
కీ పూలలో నెలవొ
ఈ తోటపై గాలి యింతమెయి సోకెనా!
ఈ నీరసిలు బ్రదుకేయింత చివురింపనా!
జవరాలి వలపు వలె
రవి బింబ దీప్తివలె
హిమన గోన్నతివోలె
ఋషివాక్కు మహిమవలె
నా యెదందను రేపు నా తెలుగు తోటలో
పాడుకొన నిండోయి! పలవింపనిండోయి!

– కందుకూరి వీరభద్రరావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శ్వేత పత్రం (1968)

అధికార భాషగా తెలుగు - పూర్వచరిత్ర - దాని పూర్వ సంపద

గతంలో తెలుగుభాష ఏయే అధికార కార్యాల నిమిత్తమై ఏయే కాలాలలో ఉపయోగింపబడిందీ అనే అంశం పరిశీలించడం సందర్భోచితంగా వుండగలదు. ఇందుకు తెలుగు వాఙ్మయ చరిత్రను, దేశంలో తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలందు ఆయా సామ్రాజ్యాలలో ఆ భాషయొక్క ఉపయోగాన్ని సంక్షిప్తంగా పరిశీలించవలసి వున్నది.

క్రీస్తుశకం ప్రారంభంలోనే తెలుగు ఒక భాషగా వున్నదని చూపడానికి ఆధారం వున్నప్పటికినీ, ఇది పాలన, న్యాయస్థానాల భాషగా వాడుకలో వున్నదని స్పష్టపడటంలేదు. భరతముని నాట్య శాస్త్రంలో వివరించినవాటిని బట్టి ప్రాకృత భాషలు కాకుండా, మాట్లాడే ఇతర భాషలు వున్నట్లుగా తెలియవస్తుంది. రాజులకు, బ్రాహ్మణులకు, ఇతర పండితులకు నాటకంలో సంస్కృతం ఉపయోగించాలని భరతముని నిర్ణయించారు. స్త్రీలు, పిల్లలు ఇత్యాదులకు ప్రాకృత భాషల ఉపయోగం అనుమతించడం జరిగింది. ఇతర సందర్భాలలో, 'దేశభాష' ఉపయోగాన్ని ఆయన అనుమతించారు.

క్రీ.పూ. రెండవ శతాబ్దిలోనే 'దేశభాషలు'వున్నట్లుగా అనేక ప్రాచీన గ్రంథాల ఆధారాన్నిబట్టి మనకు తేటతెల్లమవుతుంది. ఈ భాషల యథార్థ స్వరూపం సుబోధకం కావడం లేదు. హాలుని 'గాథాసప్తశతి' ఆంధ్రభాషా స్వరూపాన్ని కొంతవరకు సూచిస్తుంది. అత్త, పాడి, పిల్ల, పొట్ట, బోంది– పంది. కుడకుండ, బోల (వెళ్లుట) వంటి మాటలు, తమ ప్రాచీన రూపంలో తెలుగుగా అగుపించే కొన్ని మాటలు అందులో ఉన్నాయి.

ఏకైక ఉదాహరణ అయినప్పటికీ అమరావతి శిల్పాలకు చెందిన ఒక రాతి మీద చెక్కబడిన 'నాగబు' (సర్పం) అనే మాటవల్ల ఈ విషయమై స్పష్టమైన ఆధారం దొరికింది. దీనిలో అమహత్ పదం 'నాగ' యొక్క ప్రథమావిభక్తి ప్రత్యయం 'బు' ఇప్పుడు మనం యీ సందర్భంలో 'ము' ప్రత్యయాన్ని వాడుతున్నాం. 'బు' అనే ప్రత్యయం 'ము' యొక్క ప్రాచీన రూపం. నాసికతో ఉచ్చరించినప్పుడు ఈ ప్రత్యయం 'ంబు' అవుతుంది. కలిసినప్పుడు 'మ్ము'గా మారుతుంది. ఉదాహరణకు వనము అనేది వనంబు, వనమ్ము అను రూపాంతరాలు పొందుతుంది. ఆ విధంగా 'నాగబు' అనే మాటను కనుగొనడం ద్వారా ఎంతో సమాచారం చేకూరింది. తెలుగు భాష తన 'అమహత్ వర్గం' పదాల యొక్క ప్రథమావిభక్తి ప్రత్యయంతో క్రీస్తుశకం ప్రారంభంలోనే ఈ చిన్నమాట ద్వారా అస్తిత్వం ఏర్పరచుకొన్నది. సహజంగా యితర విభక్తి పదాలుకూడా వుండి వుండాలి. అయితే వాటి ప్రయోగము గురించి ఆ తరువాతి కాలానికి చెందిన ఆధారాలు వెలుగులోనికి రావాలి.

ఆ తరువాతి దశలో మనకు కనుపించే తెలుగు మాటలు– ప్రాకృత శాసనాలలోని గ్రామాల పేర్లు,

ఎల్లలు, కొన్ని సందర్భాలలో వ్యక్తుల పేర్లు, దాదాపు 450 సంవత్సరాలు తెలుగుదేశాన్ని పరిపాలించిన శాతవాహనులు ప్రాకృతంలో మాత్రమే తమ శాసనాలన్నింటిని వేయించారు. ఇందుకు రెండు లేక మూడు కారణాలున్నాయి :-

1. గోదావరి - కృష్ణ ప్రాంతాలకు తరలివచ్చి, అచ్చట స్థిరపడిపోయిన శాతవాహనులు ఆర్యవంశానికి చెందినవారు. సహజంగా వారు ప్రాకృత భాషలలో ఒక భాషను తెలుగుదేశంలోనికి తీసుకొనివచ్చి అనంతరం దానిని తమ శాసనాలలో ఉపయోగించి వుంటారు.

2. బౌద్ధమతం, జైనమతం దేశంలో ప్రబలినప్పటినుండి ప్రజలు మాట్లాడే భాషలు మునుపటికంటే అధికమైన ప్రతిపత్తిని పొందాయి. సంస్కృతభాషకంటె పాలి, ప్రాకృత భాషలు ఎక్కువ ఆధిక్యత సంతరించుకున్నాయి. ఆ భాషలు సంస్కృతంతో పోటీపడి, సాంస్కృతిక, తాత్త్విక రంగాలలో ఉపయోగించే భాషగాను చివరకు పరిపాలన కార్యాలకు ఉపయోగించే భాషగాను కూడ సంస్కృతాన్ని వైదొలగించి ఆ స్థానం ఆక్రమించడానికి ప్రయత్నించాయి. మౌర్యుల కాలంనాటికి యీ మార్పు పూర్తి అయినట్లు తెలియవస్తుంది.

3. అశోకుడు తన శాసనాలను ప్రాచీన ప్రాకృత భాషలో వేయించాడు. ఈ ధర్మ శాసనాలు క్రీస్తుశకానికి ఎంతో కాలం ముందుగా ఆంధ్రదేశంలో సహా భారతభూమి అంతటా వేయబడినాయి. ఆంధ్రులు అత్యంత భక్త్యుత్సాహాలతో బౌద్ధమతాన్ని స్వీకరించారు. బౌద్ధమతంతోనే పాలిభాష వచ్చింది. భట్టిప్రోలు, నాగార్జునకొండ, అమరావతి శాసనాలన్నీ ప్రాకృతంలో లేక పాలి రూపంలో వున్నాయి.

అయితే వింధ్య పర్వతాలకు దక్షిణముగా వ్యాపించిన ఇతర ద్రావిడ భాషలతో అధిక సంబంధంగల తమ దేశభాషకే సామాన్య ప్రజలు అంటిపెట్టుకొని వున్నట్లుగా కనబడుతుంది. కాబట్టి రాజులు పండితులకు దానం చేసిన గ్రామాలను, భూములను సరిహద్దులను పేర్కొనవలసి వచ్చినప్పుడు, ప్రాకృతం లేక సంస్కృత శాసనాలలో తెలుగు మూల పదాలను ఉపయోగించడం అవసరమని వారు భావించారు. విరిపర (అనంతరం యిది విప్పరాల, విప్పర్రు, ఇత్యాదిగా మారింది), చిన్నపుర; ప్రాలూరు; ముందూరు; కంబురంచెరువు; రేగోన్రం; లెందులూరు మొదలైనవి ఈ శాసనాలలో పేర్కొనబడిన గ్రామాలపేర్లలో కొన్ని. కంబురం చెరువు క్రమంగా కమ్మారి చెరువుగా రూపాంతరం పొందింది. రేగొన్రం అనంతరం రేగొండ అయింది. లెందులూరు ఏలూరు దగ్గర యిప్పటి దెందులూరుగా మారింది. ఈ ప్రాచీన శాసనాలలో గ్రామాల పేర్ల చివర పర్రు, పట్టు, పాడు, పాక, పూరు, చెరువు, పుండి లేక పూడి వంటివి వుండేవి. నేటికికూడ గ్రామాల పేర్ల చివరలు ఈ విధంగానే వున్నాయి. ఇవి తెలుగు పదాలు అనడానికి ఎట్టి సందేహంగాని లేదు.

దీనినిబట్టి రెండువేల సంవత్సరాలకు పూర్వమే తెలుగుభాష వర్ధిల్లినట్లు, వాడుకలోనికి వచ్చినట్లు విదితమవుతుంది. నేడు ఈ భాషలో కనుపించే విలక్షణ గుణాలు చాలవరకు ఆనాడుకూడ వున్నాయి. అంకెలుకూడా అక్కడక్కడ కనబడుతున్నాయి. శకటరేఫ ఆ రోజులలో యథేచ్ఛగా ఉపయోగించబడేది. అయినప్పటికీ ఆ తొలి శతాబ్దాలలో ఆంధ్రరాజులు తెలుగును తమ ప్రభుత్వ కార్యాలకు ఉపయోగించలేదు. ఆందుకుగల కారణాలు ఇప్పుడు తెలుసుకోబూనటం కేవలం ఊహాగానమే అవుతుంది. వారి దేశభక్తిని మనం శంకించడానికి వీలులేదు. అయితే తెలుగు భాషను ఆ విధంగా ఉపయోగించడానికి కేంద్రీయమైన అధికారవర్గం, సుస్థిరమైన ప్రభుత్వం, సుదీర్ఘమైన కాలవ్యవధి, విశాలమైన రాజ్యభాగం అవసరమైవుండి వుంటుంది. శాతవాహనుల పతనానంతరం ఈ లక్షణాలలో ఏది కూడా తెలుగుదేశానికి లేకపోయింది. ఇక్ష్వాకులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు మున్నగువారి చిన్న చిన్న రాజ్యాలు స్వల్పకాలంపాటు పరిమిత రాజ్య భాగంలో వర్ధిల్లినాయి. జాతీయ భాషను రూపొందించడం వంటి ప్రయోగాన్ని జరపడానికి వారికి లభ్యమైన సాధన సంపత్తులుగాని, వారి పాలనాకాల వ్యవధులుగాని తగినంతగా లేవు. తీరప్రాంతం- తరచు తెలంగాణా, రాయలసీమ అని యిప్పుడు మనం పిలిచే ప్రాంతాలకు భిన్నమైన పాలనక్రిందవుంది. అనంతరం ఈ ప్రాంతాలు తరచు వాకాటకులు, పశ్చిమ చాళుక్యులు, రాష్ట్రకూటుల క్రింద వుండేవి.

సుమారు క్రీ.శ.6వ శతాబ్ది చివరి పాదంలో ఆంధ్రరాజులు తెలుగు భాషలో తమ రాజ శాసనాలను జారీ చేయాలని భావించారు. రేనాడు తెలుగు చోళులు అని పిలువబడే రాజవంశీయులు తెలుగు భాషలో తమ ఆదేశాలను ప్రప్రథమంగా జారీచేశారు. రాయలసీమలోని నేటి కడప, చిత్తూరు జిల్లాలే రేనాడు. అప్పటిలో పరాక్రమంతో విరాజిల్లుతున్న బాదామి చాళుక్యులకు రేనాటి చోళులు సామంతులుగా వున్నట్లు తెలుస్తున్నది. ఈ శాసనాల్లో ధనంజయ, చోళమహారాజ, పుణ్యకుమార, సత్యాదిత్య అను పేర్లు కనబడుతున్నాయి. ఈ శాసనాలు వచనంలో సంగ్రహంగా వ్రాయబడ్డాయి. భాష ప్రాచీన రూపంలో వున్నది. నేడు దానిని అర్థం చేసుకోవడం కష్టం. అయినప్పటికిని అది తెలుగు భాషయే.

చరిత్రలో ప్రప్రథమంగా తెలుగు భాషకు అధికార భాషాప్రతిపత్తిని కల్పించి, దాని అభివృద్ధికి దోహదం చేసిన ఘనత క్రీ.శ.625 నుండి 1070 వరకు సుమారు నాలుగు శతాబ్దాలకు పైగా తెలుగుదేశాన్ని పరిపాలించిన తూర్పు చాళుక్య వంశానికి చెందిన రాజులకు దక్కుతుంది. 'కుమారసంభవ' కృతికర్తనన్నెచోడకవి తెలుగు దేశలో తెలుగు భాషకు పట్టము కట్టినందుకు చాళుక్యులను ప్రశంసించాడు. సాహిత్య క్షేత్రంలో తెలుగు భాషకు వారు చేసిన సేవలను గురించి ఆయన ప్రస్తావించాడు. వారు తెలుగు భాషా ప్రతిపత్తిని ఇనుమడింపజేశారనడంలో ఆయన పొరపాటు పడలేదు. సాహసోపేతమైన ఈచర్య తీసుకోవడానికి వారిని ప్రోత్సాహపరచిన అంశమేదో తెలుసుకోవడం ఆసక్తిదాయకం కాగలదు. తూర్పు చాళుక్యులు బాదామి చాళుక్యులలో ఒక శాఖ. రెండవ పులకేశి విష్ణుకుండినులనుండి తెలుగు దేశాన్ని జయించిన తరువాత ఆయన తన సోదరుడైన కుబ్జ విష్ణువర్ధనుని వేంగి దేశానికి అధిపతిగా చేశాడు.

కన్నడ దేశమందు కన్నడ భాషలో రాజశాసనాలను వేసే పద్ధతి అప్పటికే వాడుకలో వున్నది. ప్రప్రథమ కన్నడ శాసనం క్రీ.శ. 5వ శతాబ్దిలోని హల్మిడి లేఖ్యము అని చెప్పబడుతున్నది. నాటి నుండి కన్నడ రాజులు ఆ భాషపట్ల ఆదరణ చూపుతూ వచ్చారు. తెలుగు దేశంలో బాదామి చాళుక్యులు తమ పరిపాలన నెలకొల్పినప్పుడు, సహజంగా వారు యీ సంస్కరణను తెలుగు దేశంలోకూడా ప్రవేశపెట్టారు. తూర్పు చాళుక్యుల ప్రథమ తెలుగు శాసనం, ఈ వంశ స్థాపకుడైన కుబ్జ విష్ణువర్ధనుని కుమారుడు జయసింహ వల్లభుని పరిపాలనా రాజ్య కాలం

అంటే క్రీ.శ.641–673 నాటిది. జయసింహుని విప్పర్తి లేఖ్యము క్రీ.శ. 7వ శతాబ్దం మధ్య కాలంనాటిది కావచ్చును. రేనాటి చోళుల తెలుగు శాసనాల్లో ఒకటి ఇదేకాలానికి చెందివుండటం గమనించదగ్గ విశేషం. పుణ్యకుమారుని పట్టమహిషి వసంతపోరిచే వేయించబడిన యీ రాతి శాసనం కడప జిల్లాలోని రామేశ్వరంలో కనగొనబడింది.

రాజ శాసములలో ఉపయోగించే భాషగా తెలుగు సముచిత స్థానం పొందినప్పటికిని అది సంస్కృత భాషను త్రోసిరాజనలేదు. రాజులు తమ శాసనాల నిమిత్తం సంస్కృత భాషనుకూడా ఉపయోగించేవారు. రాజులకు, ప్రజలకు వైదిక ధర్మంపట్లగల గౌరవభావమే ఇందుకు కారణం. తూర్పు చాళుక్యులు పాలించిన నాలుగు శతాబ్దాల కాలంలో తెలుగు భాష గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఈ శాసనాలు కొంతకాలం సులభమైన వచనంలోను, కొంతకాలం అలంకార సహితమైన వచనంలోను వేయబడ్డాయి. తరువాత సౌందర్య విలసితమూ, చమత్కార పూరితమూ అయిన పద్య రచన ప్రవేశ పెట్టబడింది. ఈ పద్య రచన నన్నయభట్టు యొక్క ఆంధ్ర మహాభారతంలోని మహత్తరమైన కవితయందు పరాకాష్ఠ నందుకొన్నది.

తెలుగు రాజభాషా ప్రతిపత్తిని పొందినట్లు తెలియపరచే తెలుగు శాసనాలు తెలంగాణాలో కూడా మనకు కనుపిస్తాయి. మొదటి చాళుక్య భీముని కొరవి శాసనం (క్రీ.శ.892–921) ఆసక్తి జనకంగా వుంటుంది. ఇందులో చక్కటి వచనం ఉంది. కొరవి మానుకోట ప్రాంతంలో వున్నది. అదే విధంగా చక్కటి కవిత్వంగల శాసనాలనుకూడ మనం చూస్తాం. ఈ సందర్భాలలో ధైర్యసాహసాలు, రాజ్యతంత్రంలో నైపుణ్యతగల విరియాల కామసాని అనే మహిళామణియొక్క గూడూరు శాసనాన్ని (క్రీ.శ. 1000) పేర్కొన్న వచ్చును. వరంగల్లు నేలిన కాకతీయులు తెలుగు పతాకాన్ని యింకా ముందుకు తీసుకొనిపోయి, దాన్ని రెడ్డి రాజులకును, విజయనగరాధీశులకును అందించారు. రాజుల ఆదరాభిమానాలు చూరగొనడం కోసం తెలుగు భాష సంస్కృతంతో పోటీ పడవలసి వచ్చిన మాట వాస్తవం. పెక్కు శాసనాలు సంస్కృతంలో వేయించబడినాయి. అయినప్పటికీ సంస్కృత లేఖ్యములలో సయితం గ్రామాలు, వాటి సరిహద్దులు తెలుగు వాక్యాలలోను, పదాలలోను సూచించవలసి వచ్చింది.

ఏడవ శతాబ్దం మధ్యకాలం నుండి తెలుగు పాలనా భాష అయినదని మనం భావించవచ్చు. వేంగి, రాజమహేంద్రవరముల నేలిన తూర్పు చాళుక్యులు యీ మహత్కార్యానికి వైతాళికులు. రాజ సభలలో సంస్కృతానికి కూడా గౌరవ స్థానం వుండేది. పరిపాలనా భాష తెలుగు అయినప్పుడు న్యాయస్థానాలు తమ పనిని తెలుగులో నిర్వహించడం సహజం. ఒక సత్యాన్ని బట్టి ఈ అభిప్రాయం బలపడుతుంది. కవి తిక్కన సోమయాజి పట్ల అభిమానం గల ఆయన సమకాలికుడు అయిన కేతన కవి (క్రీ.శ. 13వ శతాబ్దంలో) విజ్ఞానేశ్వరీయమును తెలుగు పద్యాల్లోనికి అనువదించాడు. సాధారణంగా కవులు సంస్కృతపురాణాలను, కావ్యాలను, నాటకాలను తెలుగులోనికి అనువదించే వారు. కాని ధర్మశాస్త్రం వంటి సాంకేతిక గ్రంథాలను మాత్రం కాదు. ధర్మ శాస్త్ర గ్రంథాన్ని అనువదించాల్సిన అవసరం వున్నదని కేతన భావించాడంటే అట్టి గ్రంథాన్ని ప్రజల భాషలోనికి అనువదించవలసిన అవసరం వున్నదని తెలియవస్తుంది. ఉజ్జ్వల కాలంలో న్యాయస్థానాలందు ఇది ఉపయోగింపబడి వుండవచ్చు.

తెలుగు భాష సంస్కృతం సహాయంతో విజయనగర సామ్రాజ్యం పతన మగువరకును అధికార భాషగా కొనసాగివుండేది. “రాయవాచకము” అనే తెలుగు గ్రంథంవల్ల యీ భావన బలపడుతుంది. ఇది విజయనగర ఆస్థాన జీవితానికి సంబంధించి స్థానాపతి విశ్వనాథ నాయకుడు పంపిన నివేదిక రూపంలో వున్నది. ఈ నాయకుడు విజయనగరంలో మధుర సామ్రాజ్యం యొక్క ప్రతినిధిగా వున్నట్లు తెలుస్తుంది. విజయనగర రాజులు ఇతర రాజుల ఆస్థానాలకు తమ రాయబారులను పంపివుంటారు. ఆ రాయబారులు కేంద్రమునకు తమ నివేదికలను తెలుగులో పంపివుండి వుంటారు. కైఫీయతులు– అనగా సంఘటనకు, స్థలములకు సంబంధించిన స్థానిక వివరణలు– తెలుగులో వుండేవి. ఇది తెలుగు అధికార భాషగా వున్నట్లు తెలియజేస్తుంది. అధికారుల పేర్లు తెలుగు లోను, సంస్కృతంలోను వుండేవి. కవిలె సంప్రతి (అకౌంటెంట్లు), రాయసము (రాజువద్ద హాజరుగా వుండి ఆయన ఆదేశాలను వ్రాసియుంచు అధికారి) సుంకరులు (సుంకములను వసూలు చేయు అధికారులు), అక్కు–కావలి కాండ్రు, వెలికావలి వాండ్రు, తలారి (వివిధ పోలీసు అధికారులు) ఇంకా అనేకమంది యితరుల పేర్లు శాసనములనుండి తెలియవస్తున్నవి. మడికి సింగన విరచిత ‘సకల నీతి సమ్మతము’ వంటి నీతి గ్రంథాలు రెవిన్యూ లెక్కలకు సంబంధించిన అనేక వివరాలను తెలియజేస్తాయి. గ్రామ అకౌంటెంటు, అధికారి అయిన కరణం స్థానిక పరిపాలనలో కీలక పాత్ర వహిస్తాడు.

ముస్లిముల రాకతో వారి రాజ్యములందు పర్షియను అధికార భాష అయింది. వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు నడపడం కోసమై తెలుగు రాజులు తమవద్ద పర్షియను, అరబికు భాషలు తెలిసిన ఒక మంత్రిని లేక అధికారిని నియమించుకునేవారు. శ్రీనాథకవి, పెదకోమటి వేమారెడ్డి మంత్రియైన తన పోషకుడు మామిడి సింగన్న ముస్లిము రాజుల ఆస్థానములలో తన వక్తృత్వ నైపుణ్యాన్ని ప్రదర్శించేవాడని వర్ణించాడు. దీన్నిబట్టి ఆయన ముస్లిము రాజుల ఆస్థానాలందు అనర్గళంగా ప్రసంగించగల సమర్థుడని తెలుస్తుంది. అదే విధంగా వీరభద్రారెడ్డి మంత్రియగు బెండపూడి అన్న మంత్రికి అరబ్బీ, పార్శీ, తదితరమైన భాషలు తెలుసునని వేరొక చోట కవి పేర్కొంటాడు. ఆయన ఈ భాషలలో ఉపన్యసించడంలోను, వ్రాయడంలోను కూడా దిట్ట. ముస్లిము రాజులు సయితం ప్రాథమిక గ్రామ లెక్కలను తెలుగులో వ్రాయనిచ్చెడివారు. ప్రభుత్వానికి సంబంధించిన పై స్థాయిలందు మొదట పర్షియను అటు తరువాత ఉర్దూ ప్రాధ్యానత వహించసాగాయి.

బ్రిటిషు పాలనా కాలంలో పర్షియను స్థానే ఇంగ్లీషు అధికార భాష అయింది. క్రమంగా అది పరిపాలనా, న్యాయ స్థానాల భాషగాను, విద్యాబోధనా భాషగాను స్థిరపడిపోయింది. మన దేశ చరిత్రలో హిందూ ముస్లిముల పరిపాలనా కాలాల్లో విద్యారంగంపై ప్రభుత్వ నియంత్రణ వుండేదికాదు గనుక, విద్యాబోధన భాషగా పర్షియను వుండాలనే నిబంధనలేదు. ఇంగ్లీషు యీ రంగంలో సయితం పటిష్ఠవంతమైన మార్గాలు ఏర్పాటు చేసుకున్నది. బ్రిటీషు పాలకులు కూడా దిగువ న్యాయస్థానాల్లో తెలుగును ఉపయోగించడానికి అనుమతించేవారు. గ్రామ రికార్డులు తెలుగులోనే కొనసాగినాయి.

ఆ విధంగా పరిపాలన, న్యాయపాలన భాషగా తెలుగు గతంలో చిత్రమైన చరిత్ర కలిగి వుండేది. సుమారు వెయ్యి సంవత్సరాలు అంటే తూర్పుచాళుక్యుల పరిపాలన ప్రారంభమైన క్రీ.శ. 650 నుండి విజయనగర సామ్రాజ్యం అంతమైన 17వ శతాబ్దం వరకు తెలుగు అధికార భాషా స్థానాన్ని పొందినదని చెప్పవచ్చును.

పరిపాలనా అవసరాల నిమిత్తమై ఆయా కాలాలలో తెలుగు భాషా ఉపయోగాన్ని గురించిన చరిత్రను యీ క్రింద పట్టిక సంగ్రహంగా తెలియజేస్తుంది.

రాజవంశం	**పరిపాలించినప్రాంతం**	**పరిపాలనాకాలం**	**అధికారపత్రాలలో వాడినభాషలు**
శుంగులు, శాతవాహనులు	దక్షినాపథం	300 క్రీ.పూ-300 క్రీ.శ	ప్రాకృతం
ఇక్ష్వాకులు	ఆంధ్రతీర ప్రాంతం	220-320 క్రీ.శ.	ప్రాకృతం, సంస్కృతం
శాలంకాయనులు	వేంగీ మండలం (ఉత్తర ఆంధ్ర తీర ప్రాంతం)	250-360 క్రీ.శ.	సంస్కృతం
పల్లవులు	కోస్తా ప్రాంతం, తెలంగాణా.	320-600 క్రీ.శ.	సంస్కృతం
విష్ణుకుండినులు	తీరప్రాంతం	450-630 క్రీ.శ.	సంస్కృతం
వేంగీచాళుక్యులు, బాదామీ చాళుక్యులు	పశ్చిమాంధ్రం	500-800 క్రీ.శ.	సంస్కృతం తెలుగు
రేనాటి తెలుగు చోళులు	కడప రాయలసీమ	700-900 క్రీ.శ.	తెలుగు
చాళుక్య చోళులు	తీరప్రాంతం	1000-1200 క్రీ.శ.	తెలుగు, సంస్కృతం
కాకతీయులు	తెలంగాణా, తీరప్రాంతం	1100-1330	తెలుగు, సంస్కృతం
వెలనాటి చోదులు దుర్జయులు	కృష్ణా, గుంటూరు జిల్లాలు		తెలుగు, సంస్కృతం
రెడ్డి రాజులు	తీరప్రాంతం	1330-1450	తెలుగు, సంస్కృతం
రేచర్ల వెలిమలు	తెలంగాణా	1330-1458	తెలుగు
విజయనగర రాజులు	రాయలసీయ, కొంత కోస్తాప్రాంతం	1336-1780	సంస్కృతం, తెలుగు తమిళం, కన్నడం
బహ్మనీ	తెలంగాణా	1336-1578	పర్షియన్, అరబిక్
గణపతులు	కోస్తా జిల్లాలు	1458-1518	సంస్కృతం, తెలుగు
కుతుబ్‌షాహి సుల్తానులు	తెలంగాణా, ఉత్తర తీర ప్రాంతం	1518-1700	తెలుగు, పర్షియస్ అరబిక్
ఆంగ్ల ప్రభుత్వం	యావదాంధ్రం	1830-	ఆంగ్లం, ఉర్దూ, తెలుగు

(తెలుగు రాజులు వేయించిన తెలుగు శాసనాలలోని న్యాయ సంబంధమైన, పరిపాలనా సంబంధమైన పదాలు ఈ దిగువ ఇవ్వబడినాయి)

కొన్ని రకాల పన్నుల పేరు :-	అరి, సుంకం, పన్ను
అంగడిసుంకం (షాప్ ట్యాక్స్)	శక 1170
అడ్డగడ్డ సుంకం (మార్కెట్ ట్యాక్స్)	శక 1488
అడ్డపట్ట సుంకం (సేల్స్ ట్యాక్స్ లివిడ్ ఆన్ ది ఎంటైర్ మార్కెట్)	శక 1067
అమ్ముబడి సుంకం (సేల్స్ ట్యాక్స్)	శక 1002
అవనాయం (ఎ కైన్డ్ ఆఫ్ ట్యాక్స్)	శక 1230
ఇల్లరి (హౌస్ ట్యాక్స్)	శక 1236
దగు (బ్రోకరేజ్)	శక 7వ శతాబ్దం
ఉప్పు సుంకం (సాల్ట్ ట్యాక్స్)	శక 1218
ఎడ సుంకం 'పూజాద్రవ్యములతో పాటు ఇచ్చేది'	శక 1170
చూపుటోయము	శక 1456
నగరిపాలు 'పన్నులో రాజుగారి నగరుకు ఇచ్చే భాగం'	శక 1481
నగరి కట్నం 'రాజుకు ఇచ్చే భాగం'	శక 1315
దశబంధం 'ఆదాయంలో పదోవంతు పన్ను'	శక 1613

ఉద్యోగులు - ఉద్యోగాలు :

అయిగాండ్లు - గ్రామ అధికార్లు	శక 1542
కొట్టరి, కొట్టారి (స్టోర్ కీపర్) ధాన్యపు కొట్టు అధికారి	శక 1089
గాముండి (విలేజ్ హెడ్) గ్రామాధికారి	క్రీ.శ. 8వ శతాబ్దం
తీర్పరి (జడ్జ్)	శక 1158
దండనాయకులు (సి-ఇన్-సి)	శక 1019
దండాధికారి (మెజిస్ట్రేట్)	
పంచకరణాధిపతి (హెడ్ ఆఫ్ ఫైవ్ డిపార్ట్‌మెంట్స్)	శక 1130
ముద్రకర్త (........)	శక 1558
ముద్రాధారి	శక 1205
నియోగం (ఉద్యోగం)	శక 1082

రెవెన్యూ పదాలు :

కారుకూన (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్)	
అచ్చుపొడిచిన భూమి - హద్దులు నిర్ణయించిన నేల	శక 1109
అడ్డలి - తాకట్టు	శక 1242
అమరం- సామంతుల కిచ్చిన భూమి	శక 1291
అమరకం (లీజ్)	శక 1291
అరిగాపు (ట్యాక్స్ పేయర్)	శక 1037
ఒళ బండారం (స్టేట్ ట్రెజరీ)	శక 1357
ఖండిక- పన్ను లేకుండా ఇచ్చిన భూమి	శక 1218
నీరు నేల- మాగాణి భూమి	శక 1037
నీళ్ళ పుల్లరి (ఇరిగేషన్ ట్యాక్స్)	శక 1509
ఊడ్పునేల (ల్యాండ్ ఫర్ ట్రాన్స్‌ప్లాంటేషన్)	శక 1064

నాణెములు - కొలతలు :

అణా	నెల్లూరు శాసనాలు :	ఒంగోలు నెం.5
డబ్బు		
పైకం అరపైకం	శక 1442	
కాణి-భూమి కొలత		
కుంచం, కుంట	శక 1024	
కుచ్చెల	శక 1327	
కేసరి గద్య	ఒక రకం నాణెం 13వ శతాబ్దం	
కేసరి మాడ	ఒక రకం నాణెం 13వ శతాబ్దం	
గరుడ మానిక	శక 1176	
గోకన గద్య	శక 1126. 1127	
చనెల- వరహా	శక 16వ శతాబ్దం	
చామెర మాడ	శక 1053	
కాని	శక 1069	
దుగ్గాని-రెండు దమ్మిళ్ళు	దుగ+కాని-శక 1222	

ఇతర పదాలు :

ఉగ్రాణం (స్టోర్ హౌస్)	శక 1478
ఫింద్రు- కాయధాన్యాలు	క్రీ.శ. 12వ శతాబ్దం
ఘడియారం	శక 1427
దివాణము (ప్యాలస్)	శక 1524
దివాణం వారు పరిపాలకులు	

సుల్తానుల పరిపాలనా కాలం (క్రీ.శ. 16-18 శతాబ్దాల)లో అసంఖ్యాకమైన పర్షియను, అరబికు పదాలు- ప్రత్యేకించి భూమిశిస్తు నిర్వహణకు సంబంధించినవి- వాడకంలోనికి వచ్చాయి.

శిస్తు, తాఖీదు, ఇలాకా, ఖరీదు, ఖర్చు, ఖరారు, కౌలువంటి పదాలు తెలుగు భాషలో భాగమైపోయాయి. వాటి వాడకం శాశ్వతమై పోయింది.

డాక్టర్ దివాకర్ల వేంకటావధాని

తెలుగు - దాని పుట్టుపూర్వోత్తరాలు

ఆంధ్రము, తెలుగు, తెనుంగు అను పదములు ఇప్పుడు జాతి దేశ భాషాపరములై పర్యాయపదములుగా వాడబడుచున్నవి. వీనిలో మిక్కిలి ప్రాచీనమైనది ఆంధ్రపదము. ఇది మొదట ఆంధ్ర అను రూపముతో వాడబడి తరువాత క్రమముగా ఆంధ్ర అను రూపమును బొందినది. ప్రాచీన శాసనములందును తాళపత్ర గ్రంథములందును ఆంధ్ర అను రూపమే కనిపించును. ఇది మొదట ఋగ్వేదమునకు చెందిన ఐతరేయ బ్రాహ్మణములో జాతి పరముగా వాడబడినది. విశ్వామిత్రుడు తన యాజ్ఞ నతిక్రమించిన యేబది మంది కుమారులను తత్సంతతివారార్యభూముల సరిహద్దులలో నివసించునట్లు శాసించెననియు, వారే ఆంధ్రులు, పుంద్రులు, శబరులు, పుళిందులు, మూతిబులు అను నామములతో నార్యసీమల కావల (ఉదంత్యాః) నివసించిరనియు నందు చెప్పబడినది. సంస్కృత రామాయణ భారతములందు ఆంధ్రుల ప్రశంసకలదు. మౌర్య చంద్రగుప్తుని ఆస్థానమునకు రాయబారిగా వచ్చిన మెగస్తనీసప్పుడాంధ్రులుబలవిషయమున మౌర్యుల తరువాత నెన్నదగియుండిరని చెప్పియున్నాడు. అశోకుని శాసనములందును, బౌద్ధ జాతకములందును ఆంధ్రులనామము కనబడుచున్నది. శ్రీకృష్ణుడు చాణూరుడను నాంధ్ర మల్లుని సంహరించినట్లు భాగవత హరివంశములు చెప్పుచున్నవి. ప్లినీ యను చరిత్రకారుడు (క్రీ.శ.77) ఆంధ్ర జాతిని బేర్కొని తద్బలసంపదలను వర్ణించియున్నాడు. క్రీ.శ. 6వ శతాబ్దియందలి మౌఖరి వంశజుల యొక్క శాసములో నాంధ్రపదము జాతి పరముగా వాడబడినది. ఈ విధముగా నాంధ్రజాతిని బేర్కొన్న శాసనములింకను బెక్కుగలవు.

12వ శతాబ్దిలో ఆంధ్రదేశపు టెల్లలు

క్రీస్తుపూర్వ మాంధ్రపదమునకు దేశపరముగా వ్యవహారముండినట్లు కానరాదు. శాతవాహనరాజు లాంధ్రులయ్యు తాము పాలించిన దేశమాంధ్రమని యెచ్చటను బేర్కొని యుండలేదు. క్రీ.శ. 151వ సంవత్సరమునందలి రుద్రదాముని జూనాగడ్ శాసనములో "దక్షిణాపథపతేః శాతకర్ణేః" అను పదములున్నవి. ఇందు శాతకర్ణి పాలించిన దాంధ్రదేశమని కాక దక్షిణాపథమని చెప్పబడియున్నది. పల్లవరాజైన శివస్కందవర్మ క్రీ.శ.234వ సంవత్సరమున వేయించిన మైదవోలు తామ్ర శాసనములో 'ఆంధాపథీయోగామో విఱిపఅమ్' అనునెడ నాంధ్రపథ ప్రశంస కలదు. ఆంధ్రపదము దేశపరముగా వాడబడినందుకు మొదటి శాసనాధారమిదియే. క్రీ.శ. 340వ సంవత్సరమున మల్లదేవవర్మ వేయించిన దానశాసనములో 'ఆంధ్రమండలే ద్వాదశగ్రామ సంపాదిత సప్తార్ధలక్ష విషయాధిపతేః' అను చోట నాంధ్రమండలము పేర్కొనబడినది. క్రీ.శ. 7వ శతాబ్దిలో భారతదేశమున సంచరించిన చైనా

యాత్రికుడగు హ్యూన్‌త్స్యాంగ్ వ్రాతలం దాంధ్రదేశ ప్రసక్తి కూడా కొంతగలదు. క్రీ.శ.12వ శతాబ్దిలో సముద్రతీర స్థాంధ్రదేశమును బాలించిన వెలనాటి దుర్జయులు వేయించిన యొక శాసనములో నాంధ్రవిషయము "పూర్వాంభోనిధి కాళహస్తిశిఖరి శ్రీ మన్మహేంద్రాచల శ్రీశైల ములచే" వలయీకృతమని యప్పటి యాంధ్రదేశపుటెల్లలు చెప్పబడినవి. తరువాత నాంధ్రదేశమనుమాట శాసనములందేకాక గ్రంథములందును పలుచోట్ల వాడబడినది.

ఆంధ్రం - తెలుగు - తెనుగు

ఆంధ్రపదమును భాషాపరముగా వాడినవారిలో నన్నయభట్టే ప్రథముడని తోచుచున్నది. నందంపూడి శాసనమున నతడు నారాయణభట్టును వర్ణించుచు 'యస్సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్ర భాషా సుకవి రాజశేఖర ఇతి ప్రథిత స్సుకవిత్వ విభవేన' అని యాతడాంధ్ర భాషలోగూడ మహాకవియని చెప్పియుండెను. ఔత్తరాహులగు నాంధ్రులు దక్షిణమునందలి కృష్ణా గోదావరీ మధ్యప్రదేశము నాక్రమించి యంతకుబూర్వమునుండియు నట నివసించుచుండిన దేశీయులతో గలసి, వారి భాషనవలంబించి దానికిని, వారికిని, ఆ దేశమునకు గూడ నాంధ్రయను తమ నామము నొసంగియుందురు. జాతి సంస్కృతి ప్రాభవములలో దమ కలవడిన ప్రాధాన్యమునుబట్టి వారట్లుచేయుట కవకాశము కలిగియుండును. ఆంధ్రులును తెలుగుదేశమున మొదటి నుండియు నివసించుచుండిన తెలగు వారునుగలసి యాంధ్రులైరనియు, నాంధ్రభాష మాత్రమట్లు రెండు భాష కలయికచే నేర్పబడినది కాదనియు, తెలుగే ఆంధ్రులీదేశము నాక్రమించుకొన్న పిమ్మట నాంధ్రమని పిలువబడెననియు విమర్శకుల యభిప్రాయము.

ఆంధ్రమునకు బర్యాయముగా వాడబడుచున్న తెలుగు, తెనుగు శబ్దములు రెంటిలో నొకటి మఱియొక దాని నుండి యేర్పడిన రూపాంతరమేయని చెప్పవచ్చును. నన్నయ మహాభారవతారికలో "తెనుగున రచియించిన మధిక ధీయుక్తి మెయిన్" అనియు "తెనుంగున్ మహా భారత సంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగన్" అనియు తెనుగు శబ్దమునే వాడియున్నాడు. ఇందు మొదటిది నకారము ప్రాసముగా గల కందపద్యమునందలి భాగము. తిక్కనయు 'తెనుఁగు భాషవినిర్మింపఁ దివురుటరయ' అని తెనుగు శబ్దమునే వాడెను. తిక్కనకు బూర్వుడైన పాల్కురికి సోమనాధుడును, మిత్రుడైన కేతనయు, అర్వాచీనుడైన, (1650) బాల సరస్వతియు తెలుగు శబ్దమును ప్రాస ఘటితముగా వాడియుండిరి. క్రీ.శ.1012వ సంవత్సరమునందలి యొక శాసనమున 'తెలింగకులకాల' 'తెలింగర్' అను పదములు కానవచ్చు చున్నవి. ఇంద్రవర్మపుర్లీ తామ్ర శాసనమున (1027) తిరిలింగ వాస్తవ్యాయ అని తిరిలింగ పదము వాడబడినది. ఈ శబ్దము దేశవాచియనియు, త్రిలింగ శబ్దభవమనియు శాసన సంపాదకులు తెల్పియున్నారు. తరువాత తెలింగ, తిలింగ, తైలంగ శబ్దములు పెక్కు శాసనములలో గానపించుచున్నవి. దీనిని బట్టి క్రీ.శ. 10,11 శతాబ్దులలో తెలుగు శబ్దము వాడుకలోనుండినట్లు స్పష్టమగుచున్నది. నన్నయ తిక్కనలు తెనుగు శబ్దమునేగాక ఆంధ్రశబ్దమును గూడ వాడియుండుటయు, క్రీ.శ.10వ శతాబ్దియందలి శాసనములలోనేకాక సోమనాధకేతనల గ్రంథములందును తెలుగు శబ్దము వాడబడియుండుటయుజూడ నంతకుబూర్వమునుండియు నామూడు శబ్దములు సమానార్థకములుగా వ్యవహరింప బడుచుండెనని వ్యక్తమగుచున్నది.

శబ్దాల పౌర్వాపర్యం

తెలుగు, తెనుగు శబ్దముల పౌర్వాపర్యమును గూర్చి వాదోపవాదములున్నవి. టోలెమీ (క్రీ.శ.150) త్రిగ్లిప్టాన్ (Triglypton) త్రిలింగాన్ (Trilingan) అను పదములను వాడియుండెను. టిబెట్టు దేశీయుడైన తారానాధుడను గ్రంథకర్త తెలుగు దేశమును త్రిళింగమనియు, కలింగపురము రాజధానిగాగల కళింగ మా దేశమునందలి యొక భాగమనియు దెల్పియున్నట్లు కాల్డ్వెల్‌గారు తమ ద్రావిడ భాషా వ్యాకరణమున వ్రాసియున్నారు. 'త్రిలింగరూపే న్యవసన్ త్రిద్వా రేషుగణైర్వృతః' అను బ్రహ్మాండ పురాణశోక్లమున త్రిలింగ పదము వాడబడినది. దీనిని బట్టి క్రీస్తు శకారంభము నుండియు త్రిలింగపదము వ్యవహార మందుండినట్లూహింపవచ్చును. కీ.శే. కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు వ్యాసావళిలో తెలుగు శబ్దమే ప్రాచీన మనియు, దానిని బట్టియే త్రిలింగ శబ్దము కృతకముగా సృజింపబడిన దనియు నొక యభిప్రాయమును వ్యక్తముచేసి యున్నారు. ముడియనూరు, కొలను, చేంబ్రోలు మొదలగు నామములు సంస్కృతీకరింపబడి వరుసగా చూడా గ్రామము, కమలా, కరనగరము, తామ్రపురి అని పేర్కొనబడి యుండుట సుప్రసిద్ధమే. లకార నకారము లేక స్థానజన్యములగుటచే (దంత్యములు) పరస్పరము మార్పుచెందుట వలన తరువాత తెలుగు తెనుగుగా రూపాంతరము నొందియుండవచ్చును. నన్నయ భారతమున తెనుగు శబ్దమే మొదట గ్రంథస్థమై కానవచ్చుచుండుటచే నదియే ప్రాచీనతర రూపమనియు నందుండి తరువాత తెలుగు శబ్దమేర్పడెననియుంగొందఱి యభిప్రాయము. మునుగు, మునగ, పనవు, సెనగ శబ్దములు వాడుకలో వరుసగా ములుగు, ములగ, పలవు, సెలగ అను రూపములుగా మార్పుచెందుట యీ అభిప్రాయమును బలపరుచుచున్నది. కాని టోలేమీ గారి త్రిలింగాన్ రూపము నంగీకరించు పక్షమున త్రిలింగ తెలుగు శబ్దములే ప్రాచీన తరములని చెప్పవలసివచ్చును.

ఆంధ్ర, తెలుగు , తెనుగు శబ్దములకు పలువురు పలు వ్యుత్పత్తులు చెప్పియున్నారు. 'ఆంధాన్‌రాతి ఇతి ఆంధ్రః ఆంధ్రఏవ ఆంధ్రః' అని ఆంధ్ర శబ్దమునకు కొందఱర్థము చెప్పుచున్నారు. అంధులను (కు) ఇచ్చు వాడని దాని కర్థము, బౌద్ధ జాతకములలో అంధులను భిక్షుల ప్రశంసకలదు. అందుచే అంధ – ఆంధ్ర శబ్దములకేదో సంబంధమున్నట్లు తోచును. కాని యీ సంబంధ మెట్టిదో నిశ్చితముగా చెప్పజాలము. మగధ దేశము నేలిన బలిరాజు కుమారులార్వురిలో నొకడైన యాంధ్రుడును తత్సోదరులును తమ తమ పేర్లతో నాఱువిషయముల నేర్పఱిచిన వృత్తాంతము భాగవతములో నున్నది. ఆంధ్రులేర్పఱిచిన విషయమాంధ్రము; తద్విషయవాసులాంధ్రులు.

త్రిలింగభూమి

తెలుగు శబ్దము త్రిలింగ శబ్దభావమని పలువురి తలంపు. శ్రీశైల, కాళేశ్వర, ద్రాక్షారామక్షేత్రము లందలి లింగములకు త్రిలింగములని పేరనియు, నా త్రిలింగములుండుటచే నాంధ్రదేశము త్రిలింగాఖ్యమయ్యె ననియు, దాని తద్భవము తెలుగనియు, దానినే తరువాత వారందఱు తెనుగని రనియు అప్పకవి (1650) తెల్పియున్నాడు. క్రీ.శ. 14వ శతాబ్దికి చెందిన విన్నకోట పెద్దనయు తన కావ్యాలంకార చూడామణిలో నిట్లే చెప్పియున్నాడు. కాకతీయుల కాలముననుండిన ప్రతాప రుద్రీయకర్త విద్యానాథుడు "యైర్లింగై స్త్రీ భిరేష యాతిమహతీం ఖ్యాతిం త్రిలింగాఖ్యయా" అని త్రిలింగ శబ్దమునకు వ్యుత్పత్తి నొసంగి యున్నాడు. క్రీ.శ. 1166లోని వెలనాటి వీరరాజేంద్రుని శాసనమున నాంధ్రదేశమునకు తూర్పు సముద్రము, కాళహస్తి, శ్రీశైలము, మహేంద్రాచలము ఎల్లలుగా చెప్పబడినవి. త్రిలింగ శబ్దమునుండి తెలుగు శబ్దమేర్పడుట కెట్టి యాక్షేపమునులేదు.

త్రికళింగ జన్యమా?

కీ.శే. చిలుకూరి వీరభద్రరావుగారును, శ్రీ కల్లూరి వేంకట నారాయణరావు గారు తెళుగన్నద పదమే తెలుగయ్యెనని తెల్పియున్నారు. కాంబెల్ దొరయును మఱి కొందఱును తెలుగు శబ్దమును త్రికళింగ శబ్దము నుండి వ్యుత్పన్నము కావించియున్నారు. గోదావరీమహానదులకు మధ్యనున్న దేశము పూర్వము కళింగ సంజ్ఞితమై యుండెను. పాండురంగ మహాత్మ్యమున పిఠాపురము కళింగ దేశాభరణమని వర్ణింపబడినది. ఈ కళింగ మొకప్పుడు ఉత్తర కళింగము (ఉత్క ళింగము) మధ్య కళింగము (మధు కళింగము) దక్షిణ కళింగము అను మూడు భాగములుగా నుండెను. అందుచే దీనికి త్రికళింగనామము సార్థకమయ్యెను. "త్రికళింగాధిపతేః త్రికళింగ మండల పతేః" అను శాసన ప్రయోగము లిందుకు నిదర్శనములు. త్రికళింగ– తిఅలింగ– తెలింగ– తెలుగు అని త్రికళింగ శబ్దము నుండి తెలుగు శబ్దమును పరిణమింప జేయవచ్చును.

కళింగులకును తెలింగులకును చిరకాలము నుండి సన్నిహితసంబంధమున్నది. కళింగ పదమునకు జలమయ ప్రదేశమను నర్థమున్నది. సాగరతీర ప్రదేశమగుటచే దానికి ఆ పేరు వచ్చియుండును. జలతీరమున నుండిన వారు కళింగులు కాగా (స్థల) తలమున (పీఠభూమి యందు) ఉండినవారు తలింగులు లేక తిలింగులు అయియుందురు. అదేక్రమముగా తెలుగు అను రూపము పొంది యుండును.

తెలుగు పదమునకు తేట (తెళి) యగునది అని కొందఱర్థము చెప్పుదురు. కన్నడమున తెలుగు తేటె అను సామెత యున్నది. "సరసాస్తిల వద్గావో యత్రసంతి సువర్ణాస్రశః – సదేశ స్తిలగుర్నామ" అని ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము తెల్పుచున్నది. తేల్ నది ప్రాంతమున చాలా కాలముండిన వారగుటచే తెలుగు వారి కాపేరు కలిగినదని కొందఱి యభిప్రాయము. కాని వారచ్చట నివసించినారనుటకు నామ సామ్యము తప్ప మరే యాధారమును కనిపించుటలేదు.

త్రిలింగ శబ్దము నుండి తెలుగు శబ్దము పుట్టినట్లే త్రినగ శబ్దము నుండి తెనుగు శబ్దమేర్పడినదని కొందఱి అభిప్రాయము. తెనుగు శబ్దమునగల అర్ధబిందువునకు మూలము. త్రినగ శబ్దమున లేని కతమున నా రెంటికిని జన్యజనక భావము నంగీకరింప వీలులేదని కొందఱందురు. ప్రకృతి యను స్వారరహితమైనను వికృతిలో నదికానిపించుననుటకు వేసంగి (వైశాఖ) మున్నగు శబ్దములు నిదర్శనములు. కాని త్రినగ శబ్దమునకు ప్రాచీన వ్యవహారమంతగాగనిపించదు. తేనె యగుభాష తెనుగని గ్రియర్సన్ గారు తెల్పియున్నారు. పండిత మండలిలో గూడ నీవ్యుత్పత్తి ప్రచారముననున్నది. తేనె వలె తియ్యగా నుండు భాష యగుటయే యీవ్యుత్పత్తికి కారణము. తెనుగులోని 'తెన్' దక్షిణ దిగ్వాచి యనియు దక్షిణా పథముననున్న ప్రజల కందుచే తెనుగు వారనియు, దేశ మునకు తెనుగు దేశమనియు, బేరులేర్పడెననియు గొందఱు చెప్పుదురు. దిక్కులను బట్టి దేశములను సంజ్ఞలేర్పడుచుండుట సహజమే. ద్రావిడభాషలందు – దక్షిణమునకు 'తెన్' అని పేరు – తెనుగున తెమ్మెర మున్నగు సమస్త పదములందలి యిప్పటికిని వాడబడుచునేయున్నది. తెనుగు దేశమునకు దక్షిణాపథమను వ్యవహారము శాసనములలో గనవచ్చుచున్నది. మనమిప్పుడు తమిళులను దక్షిణాది వారని పేర్కొనుచుందుము. ఆంధ్రులు ఉత్తరము నుండి వచ్చిన వారగుటచే తెనుగు దేశము నందలి జనులను దక్షిణపు వారని పిల్చి యుందురనియు, నది సామాన్య సంజ్ఞగా పరిణమించి తెనుగు వారను పర్యాయపదమేర్పడుటకు దావొసంగెననియు నూహింపవచ్చును. ఈ విధముగా తెనుగు శబ్దము 'తెన్' అను దక్షిణ దిగ్వాచకమునుండి యేర్పడినదనుట సమంజసముగానే యున్నది.

ప్రథమ శతాబ్దిలో ప్రత్యేకత సంతరించుకున్న భాష

తెలుగు సంస్కృత ప్రాకృత జన్యమని యొక వాదమును, ద్రావిడ భాషా కుటుంబమునకు జెందినదని మరియొక వాదమును గలవు. పూర్వాంధ్రకవులు పలువురు తెలుగు సంస్కృత జన్యమనియే భావించినట్లు కనిపించును. 'ఆద్య ప్రకృతిః ప్రకృతిశ్చాద్యే ఏషా భవేత్ తయోర్వికృతిః" అను నాంధ్రశబ్దచింతామణి సూత్రమును 'జనని సంస్కృతంబు సర్వభాషలకును' అను క్రీడాభిరామ పద్యమునందలి భాగమును ఇందుకు తార్కాణములు. ఆధునికులలో డా॥చిలుకూరి నారాయణరావు గారు మున్నగు భాషాతత్త్వ వేత్తలీవాదమునే విశ్వసించి బలపరిచియున్నారు. డా॥కాల్డ్‌వెల్ మున్నగు వారీ వాదము నంగీకరింపక తెనుగు, తమిళము, కన్నడము, మళయాళము మున్నగు దాక్షిణాత్య భాషలు సోదర భాషలనియు, నివి యన్నియు నాది ద్రావిడ భాషయొక్క మాండలికములై క్రమముగా భిన్న భిన్న భాషలుగా బరిణమించినవనియు, నందుచే ద్రావిడ భాషా కుటుంబమునకు జెందినవనియు ప్రతిపాదించియున్నారు. ఆధునిక భాషాతత్త్వవేత్తలలో పలువురీ వాదమునే యంగీకరించుచున్నారు. తెలుగు భాష క్రీస్తుశకము ప్రథమశతాబ్దిలో సోదర భాషల నుండి విడివడి, ప్రత్యేక పరిణామమును గాంచి, సంస్కృతము నుండి పెక్కు పదములను కావ్య లక్షణములను గ్రహించి, "దేశభాషలందు తెలుగులెస్స" యను ప్రశస్తిని బడసియున్నది.

(అఖిల భారత తెలుగు సాంస్కృతికోత్సవాల సంచిక)

కొమఱ్ఱాజు లక్ష్మణరావు

ద్రావిడ భాషలలో అఱవము పురాతనమైనదా?

తెనుగు అఱవమునుండి పుట్టినదా?

- కానేకాదు, కానేకాదు, కానేకాదు -

ద్రావిడ భాషలలో మిక్కిలి పురాతనమైనది యేది? ఈ ప్రశ్నయే విచిత్రమైనది. ఒక మూలపురుషుని సంతతివారైన పదికుటుంబములవారిలో ఎవరి కుటుంబము ఆధునికము అని అడిగిన నేమైన అర్థము కలదా? అన్ని కుటుంబములవారిలోను మూలపురుషుని రక్తముండుటచే నన్ని కుటుంబములును మూలపురుషుడెంత పురాతనుడో అంత పురాతనములని చెప్పవలెను. అంతియగాని ఒక కుటుంబముకంటె వేఱొక కుటుంబము పురాతనమనుటకు వీలులేదు. అట్లే యొక కుటుంబమందలి భాషలను గుఱించియు నెఱుంగునది. ఒక నదీప్రవాహము రెండు పాయలుగా చీలినప్పుడందలి యొక పాయ మాత్రము మూలనదియనియు, రెండవది కాదనియు జెప్పవచ్చునా? ఒకదానికి మూలనదీనామ ముండుటయు, రెండవదానికి వేఱునామముండుటయు వ్యావహారికముకాని పారమార్థికము కాదు. కావున నిప్పుడు వాడుకలోనున్న ద్రావిడ భాషలన్నియు మూల ద్రావిడభాష యెంత పురాతనమో అంత పురాతనములే. ఒక దానికంటె మఱియొకటి ప్రాతదియనుటకు వీలులేదు. అట్లే అన్నియు మూలభాషనుండి పుట్టినవియే. పైతృకముపై నన్నిటికిని సమానమైన హక్కుండును. కావున అఱవభాష పురాతనమైనదనియు, నితర భాషలు దానికంటె నిటీవలివనియు జెప్పుట సరికాదు.

అఱవభాష యితర భాషలకంటె మూలద్రావిడ భాషలకు నెక్కుడు సంబంధము కలదియనియు, మూల భాషా స్వరూపమిందు నెక్కుడు కనబడుచున్న దనియు కాల్డ్‌వెల్ మొదలయినవారు మొదట వ్రాసిరి. కాని యిటీవలి శాస్త్రశోధకులామతము నంగీకరింపలేదు. ఇందున గుఱించి హిందూ దేశమందలి లింగ్విష్టిక్ సర్వేకు నాయకుడైన గ్రియర్‌సన్ ఇట్లు వ్రాసియున్నాడు.

“అన్ని ద్రావిడ భాషలకు జననియైన మూలద్రావిడభాష యొక్క పూర్వ స్వరూపము నందలి చాలయంశములను పోనీక పట్టుకొని వచ్చిన భాష అఱవమని సాధారణముగనందురు. ఈ మాట నిజముకాదని కాన్పించినపట్ల ఈ గ్రంథముయొక్క ఆయా పుటలలో చూపబడును. తెలుగు మొదలయిన యితర ద్రావిడ భాషలలో నఱవమునందు కంటె నెక్కుడు పురాతనములైన పూర్వకాలపు విశేషరూపములు కలవు. ఆ భాష లింకను అధిక పురాతనకాలమందలి మూల ద్రావిడ భాషాభివృద్ధియొక్క స్థితిని దెల్పును. కావున నఱవ మితర భాషలవలెనె యొక ఉపభాషయనియు, ఇతర భాషలకంటెను తాను ముసలిదాననుటకు దానికి హక్కు లేదనియుజెప్పవలెను”.

1. "Tamil has usually been considered to be the Dravidian language which has preserved most traces of the original form of speech from which all other Dravidian dialects are derived. Some points will be drawn attention to in the ensuing pages where this does not appear to be the case, and in many peculiartities other Dravidian languages such as Telugu have preserved older forms and represent a more ancient state of developement. It world therefore be more correct to describe Tamil as a dialect like the other ones, without any special claim to antiquity."

- Linguistic Survery of India, Vol IV, P.283

ఇట్లన్ని ద్రావిడ భాషలలోను మూల భాషలయందుగల పురాతన రూపములు గలవు. కొన్నిటియందుగొన్ని విశేషములు గలవు. మఱికొన్నిటియందు మఱికొన్ని విశేషములుకలవు. కొన్ని పురాతనరూపములు కొన్ని భాషలలో మిగిలియున్నవి; మఱికొన్ని మఱికొన్ని భాషలలో మిగిలియున్నవి. ఇంతియ భేదము. అఱవ భాషలో లేనట్టివియు, నాంధ్రభాషయందున్నట్టివియనగుకొన్ని పురాతనరూపములచ్చటచ్చటజూపెదనని గ్రియర్సన్ చెప్పెను గాని, తరువాత నెచ్చటను జూపినవాడు కాడు. కావున నట్టివి నేను కొన్ని చూపెదను. ఈ క్రింది శబ్దములను జూడుడు:

తెలుగు	**అఱవము**	**కన్నడము**
మ్రాను	మఱమ్	మర
వ్రేలు	విరల్	
ప్రొద్దు	పొదుదు	పొద్దు
వ్రత్తు	ఉరత్తు	
త్రిప్పు	తిరుప్పు	తిరుపు
ప్రత్తి	పరుత్తి	
వ్యాజ్యెయు	వియాజ్జియం	
ప్రోలు	పొధ	పొడల్
క్రొత్తళము	కొత్తళై	కొత్తళ
త్రుళ్లు	తుళ్లు	తుళ్లు
త్రుప్పు	తురు	
మ్రోగు	ముఱుంగు	
క్రుంగు	కురుంగు	
క్రంగు	కరంగు	
ప్రబ్బు	పరవు	పర్బు
గ్రుడ్డి	కురుడ్	
క్రొవ్వు	కొడుప్పు	

ఈ పట్టికలో నీయబడిన శబ్దములు తెలుగున సంయుక్తాక్షరయుతములుగను, అఱవమున సంయుక్తాక్షరములు విడిపోయినవిగనుయున్నవి. సంయుక్తాక్షరములుగల శబ్దములు మొదటివిగ నుండుననియు, తరువాత నందుండి వికృతిశబ్దములు పుట్టునప్పుడు ఉచ్చారణ సౌకర్యార్థమై సంయుక్తాక్షరములు విడదీయబడుననియు నందఱకుదెలిసిన విషయమే. ప్రాకృత వ్యాకరణములజూచిన ఈ విషయము స్పష్టపడగలదు. కావున, సంయుక్తాక్షరములతోగూడు కొనిన శబ్దమొకటియు, అందలి యక్షరములు విడిపోయి అయిన యదే యర్థమిచ్చు శబ్ద మొకటియు నుండెనేని మొదటిది ప్రకృతి యనియు, అనగా మూలశబ్దమనియు, రెండవది వికృతియనియు మనము నిశ్చయింపవచ్చును. మ్రాన్ శబ్దమందలి మకార రకారము లుచ్చారణ సౌకర్యార్థము చీలి అఱవము కన్నడములందలి 'మఱ'మయ్యె ననుకొనుట సహజముకాని, అఱవమునందలి మకార అకారములు కలసి తెలుగున 'మ్రా'నయ్యె ననుకొనుట స్వభావ విరుద్ధము. వికృతి యెప్పుడును శబ్దోచ్చారణమును సులభము చేయునేకాని కఠిన పఱచదు. ఇట్లే 'వ్రెల్' మొదటి రూపము. 'విరల్' అందుండి పుట్టిన తద్భవము. ఈ పట్టికయందలి తెలుగు పదముల రూపములు మూల ద్రావిడ భాషలోనివియనియు, ఇతర భాషలలోని రూపములు వాని నుండి పుట్టినవనియు మనము నిశ్చయపఱుచుకొనవచ్చును. తాత్పర్యమేమనదెనుగు మొదలైన భాషలలోగూడ అఱవమునందు కంటెగొన్ని పురాతన శబ్దములు కలవు. తెనుగునగూడ వ్యావహారిక భాషలలో నీ సంయుక్తాక్షరములలోనుండి రేఫము జారినది. వ్యవహారమందు మాను, వేలు, పొద్దు, వత్తు, తిప్పు, పత్తి అను రూపములే గానవచ్చుచున్నవి. కావున రేఫయుక్త రూపములు మిక్కిలి పురాతనములనుటకు సందేహములేదు.

ఇంక గొన్ని శబ్దములంజూడనగును. తెనుగు 'గ్రుడ్డి' అఱవమున 'కురుడ్'. గ్రుడ్డి, గురుడి, కురుడ్ అని మారుట సహజము గాని, దానికి దలక్రిందుగ మారుట స్వాభావికముకాదు. తెలుగు-ప్రా; అఱవము-పఱ (ఉదా: ప్రాయిల్లు, పఱయిల్). ఇచ్చట ప్రా, పర, పఱ అని మారియుండవలెను. తెలుగు - క్రీ, అఱవము- కీఱ్ (ఉదా: క్రీగాలు, కీఱ్క్కాల్). క్రీ, కీర్, కీఱ్ అని మారియుండవలెను. అకారము రకారముగను, రకారము అకారముగను మారుట ద్రావిడ భాషలలో గలదు.

ద్రావిడ భాషలలో 'ఱ' - శకటరేఫ ముండుట అందఱకు దెలియును. దీని విశేష మేమన బూర్వము దీనికి స్వతంత్రోచ్చారణ ముండి,

యది క్రమముగ నశించి, రేఫయొక్క యచ్చారణమును, దీని యుచ్చారణమును సమములయినవి. ఉచ్చారణలోపించిన కొలదిని పూర్వము 'ఱ' బండి రాగ బల్కబడిన శబ్దములు క్రమముగ రేఫయుతములుగ బల్కబడజొచ్చె. ఒక భాషలో గొన్ని శబ్దములు 'ఱ' యుత ములుగును, మఱియొక భాషలో 'ర'యుతములుగును ఉన్నయెడల బండి ఱ యుత రూపములు పురాతనములని నిశ్చయింపవచ్చును. ఈక్రింది శబ్దములు తెలుగున 'ఱ'తోను, అఱవమున 'ర'తోను వ్రాయబడును. కావున తెనుగు రూపములు అఱవరూపములకంటె నెక్కుడు పురాతనములని చెప్పవలెను.

తెలుగు	**అఱవము**
వఱకు	వరై
తీఱు (ముగియు)	తీర్
ఎఱుపు	ఎరువై
తేఱు	తేర్
తెఱవ	తెరివై

ఈక్రింది శబ్దముల రూపములజూడనగును :

తెలుగు	**అఱవము**
రెప్ప	ఇరప్పై
రెక్క	ఇరగు
ఱెక్క	ఇఱక్కై
రేయి	ఇరవు
రోలు	ఉరల్
రేకు	ఇరెక్కు
ఱేడు	ఇఱైయ్

రకార లకారములతో ప్రారంభమైన యక్షరములను ఉచ్చరింపలేక యఱవవారు వానికి బూర్వమొక యచ్చును చేర్చుకొని పల్కుదురన్నమాట అందఱకు విశదమే. ఉదా: రామ :ఇరామన్, లోక : ఇలోకం, లోహ : ఉలోహం, ఇత్యాది. అట్లే పైని ఉదహరించిన శబ్దములలో రకారముతో బ్రారంభమగు రూపము మొదటిది యనియు, అచ్చుచేర్చబడిన రూపము తరువాతది యనియు మన మూహించవలెను. అట్లుగాక ఇరప్పై అను రూపములే మొదటివి యనియు, వానిలోని మొదటి యచ్చులు కప్పగంతువేసి రకారమందలి అచ్చులోగలిసి రెప్పమొదలైన రూపములు సిద్ధించెననియు చెప్పు లాక్షణికులు కొందఱు కలరు. కాని యది స్వభావ విరుద్ధమని నాతాత్పర్యము. 'ఇరవు' నుండి 'రేయి' అయిన దనినయెడల 'ఇరాత్రి' నుండి సంస్కృత మందలి 'రాత్రి' పుట్టినదని యేల చెప్పరాదు? అచ్చు పూర్వమందుగల రేఫ ముచ్చారణకు సులభము. అట్టి సులభశబ్దమును కఠినశబ్దముగా మార్చుట యస్వాభావికము. కావున నిందలి తెలుగు రూపములు పురాతనము లనియు, నఱవ రూపములు ఆధునికములనియు జెప్పవలెను.

ఈ విధముగనే సంయుక్తాక్షరములులేని కొన్ని శబ్దములయొక్క నేటి తెలుగురూపములు నేటి అఱవ రూపములకంటె బురాతనపువియైనట్లు కానవచ్చుచున్నది. ఉదాహరణమునకై నాల్క (నాలుక) శబ్దము దీసి కొనుడు. అఱవమునన్నాక్కు (నాక్కు) అందురు. కాని మిక్కిలి పురాతనకాలపు అఱవమునందు 'నాల్కు' అన్న రూపముండెను. కరికాలచోళుని వర్ణించిన పొమనర్ అత్తుపడై అనుకావ్యమున ఈ శబ్దము కలదు.[1] ఇందు వలన ఈ రూపమే మూలద్రావిడ భాషయందు నుండెననియు, ఆంధ్ర తమిళ భాషలు విడిన తరువాత గొంతకాలమారూపము తమిళ భాషలో నుండెను కాని తరువాత మాఱినదనియు, ఆంధ్రభాషమాత్రమారూపమునే పోకుండబట్టుకొని వచ్చుచున్నదనియు దెలియుచున్నది.

ఇట్లే కొన్ని శబ్దముల మూలార్థములు తెనుగున నిలిచియున్నవి. ఇతర భాషలలో మాఱినవి. 'మగడు' శబ్దము తీసికొండు. దీనికి బూర్వపుటర్థము మగవాడు, పురుషుడు, మనుష్యుడు. ఈ యర్థము దీనికి దెనుగున గొంతవఱకు నున్నది. తిక్కన కాలమువఱకు బాగుగనుండెను. కాని అఱవమునను, కన్నడమునను ఈ రూపమునకు కుమారుడన్నయర్థము కలిగినది. కాని మూలార్థము దీనికి దెనుగులో నున్నదియే యనుటకు బ్రాతయఱవమునందు నీపద మీయర్థమునందున్నది. ఇదియుగాక ద్రావిడభాషలలో మనుష్యుడన్న యర్థము గల పదమింకొకటి లేదు.

ఇన్దు, అన్దు మొదలయినవి తెలుగులో స్థలవాచకములు. కన్నడమున గాలవాచకములు. తెలుగులోనువలె నివి మొదట స్థలవాచకములుగనే ఉండెననుటకు దృష్టాంతము పురాతనపు అఱవమున 'ఇన్దు' అనగా ఇక్కడ అను అర్థముననే వాడబడియున్నది.

ఇట్లే యితర భాషలలో లోపించిన కొన్ని వ్యాకరణరూపములు కూడా నాంధ్ర మున గానవచ్చుచున్నవి. తెనుగున తధర్మమునందు నుత్తమపురుషబహువచనము 'పోదుము' అని కలదు. ఇప్పటి అఱవమున ఈ రూపము కనబడదు. కాని పురాతన గ్రంథములలో అఱవమున 'పోదుమ్' అన్న రూపము అఱుదుగ గానవచ్చెడిని.[2] ఇందువల్ల మన మేమి గ్రహింపవచ్చును? పూర్వద్రావిడమునందలి రూపము తెలుగున ఉండిపోయినది. అఱవమునమాఱిపోయినది.

---

1. Purnalingam pillai's Tamisl Literature, P.30.
2. Beschi's Shen-Tamil grammar

అఱవమునుండి తెనుగు పుట్టినదా?

కొంద అఱవమునుండి తెనుగు పుట్టినదని చెప్పెదరు. అఱవమునకు, తెనుగునకును సంబంధముకలదని యా చెప్పువారి భావమని మన మిందుకు నర్థముచేసికొనవలెను. ఈ యర్థమునందు నఱవమునుండి తెనుగు పుట్టినదన్నను, తెనుగునుండి అఱవముపుట్టినదన్నను ఒక్కటియే. కాని యిప్పుడున్న అఱవమునుండి యిప్పటి తెనుగు పుట్టినదన్న నమ్మదగినమాట కాదు. ఇప్పుడు వాడుకలోనున్న యే రెండు భాషలును ఒక దానిలో నుండి మఱియొకటి పుట్టియుండుట యసంభవము. అవి మొదటి నుండియు వేఱువేఱుగ నైనను ఉండవలయును. లేదా మఱియొక భాష నుండి యైనను పుట్టియుండవలెను. వ్యవహారమునందున్న భాష యెప్పుడును మాఱుచుండును. రెండువేల యేనూతేండ్లక్రింద నఱవమును, ఆంధ్రమును చీలిన వనుకొందము. అప్పటిమూలభాషయేదియో దానిని అఱవము అని అనవలయునా? ఆంధ్రము అనగూడదా? అది రెండిటికి సమానమేకావున నిప్పటి అఱవమునుండి యిప్పటి తెనుగు పుట్టినదనుట తప్పు. అప్పటి అఱవము ఇప్పటి అఱవము కాదు. అప్పటి తెనుగు ఇప్పటి తెనుగు కాదు. కొంతవఱకు గాకపోలేదు. కావున నఱవము నందలి 'నీన్దు'లో నుండి 'ఈదు' పుట్టిన దనగనే అఱవమునుండి తెనుగు పుట్టినదని అనుకొననక్కఱలేదు. మూలద్రావిడభాషలోని నీన్దు ధాతువు నఱవమట్లే ఉంచుకొనె ననియు, తెనుగు 'ఈదు'గా మార్చుకొనెననియు నర్థము చేసికొనవలెను.

(ఆంధ్ర పత్రిక - వృష సంవత్సరాది సంచిక)

తెనుఁగుతల్లీ ! నీకు జోహారు
దేశమాతా ! నీకు జేజేలు

నినుఁజూచి నినుఁబాడి నినుఁగొల్చు వేళ నా
కను లాణిముత్యాల గనులుగా నగు నహో!

తెనుఁగుతల్లీ ! నీకు జోహారు
దేశమాతా! నీకు జేజేలు

నీపాలు జుంటి తేనియల తేటలో గోస్త
నీ పక్వరసమో సుధా పురమో యౌట
నాపల్కు లీ తీయనకు నోఁచి విశ్వ వా
ణీ ప్రపంచ ప్రశంసాపూరితము లాయె ॥తెనుగు॥

కుటిలశా తవ కోటిగుండెలో నిదురించి
యిటు సేతు వటు గంగ యెల్లగా జగమేలె
నటరాజ కంధరా నైల్యమ్ము నడఁగించు
పటుకీర్తి పెంచె నీపట్టి యెంతటి వాఁడొ! ॥తెనుఁగు॥

ఎల్లోర కొండ నీ యల్లారుగీమటె
కొల్లూరి కోహినూరు కొప్పులోఁ బూవటే
కొల్లారు గనులు నీ కోశంబటే పండ్లు
పుల్లనై పోవు నీ భోగమ్ము కన్నచో ॥తెనుఁగు॥

గౌతమీ కృష్ణానదీ తుంగభద్రాది
పూత స్రవంతికా పుంజము నీముద్దుఁ
గూఁతులై నీచేను నీతోట పండింప
నీ తనూజులు పైఁడి పాంతఱల్ కప్పిరే! ॥తెనుఁగు॥

ఏ పుణ్య లేశమ్ము నాపాలి దాయెనో
నాపూజ కేలోకనాధుండు పొంగెనో
నీ పావనోదర శ్రీపరంపరలలో
నీ పదార్చకులలో నేను నొక్కఁడనైతి ॥తెనుఁగు॥

– తుమ్మల సీతారామమూర్తి చౌదరి

సురవరం ప్రతాపరెడ్డి

లలిత కళలు - మానవ జీవితము

కళయననేమి? దాని వలన గల ప్రయోజనమెట్టిది? కళకు నాగరికతకు, కళకు సంస్కృతికి గల సంబంధమెంతవరకు? కళ అవసరమా లేక అనవసరమా? అది యుపకారియా యపకారియా? దాని ముఖ్యలక్షణములెవ్వి? అన్న ప్రశ్న పరంపరలు మనలనెదుర్కొనుచుండును.

కళను నిర్వచించుట సులభము కాదు. కళావేత్తలు కళాసాధకులు, ఎవరికి తోచినట్లు వారు నిర్వచించినారు. కళయొక్క స్థూల స్వరూపము జనులకందరికిని తెలియును. కళయన కాంతియనియు, సౌందర్యమనియు, అద్భుతసృష్టి యనియు, జనులెరుగుదురు. సుందర స్త్రీ పురుషుల ముఖాలపై కళలుట్టి పడునందురు. సుందర చిత్రమును చదువురాని వారును ముచ్చటగా చూచి దానిని తమకు నచ్చినట్లుగా వర్ణింతురు. పనితనపు దంతపు బొమ్మను జూచి శిల్పి చాతుర్యమునకచ్చెరు వొందుదురు. స్త్రీలు మంచి రంగులును, అంచులును పనితనమును గల చీరలనే కోరుదురు. బాలికలు రమణీయములగు ముగ్గులను తీర్చుచుందురు. దసరా దీపావళి పండుగలలో బచ్చెన బొమ్మలను లోహ విగ్రహములను చక్కగా నమర్చి బంధు స్నేహితులకు పేరంటాలని చెప్పి వేడుకలు చేసుకొందురు. ఇట్టివన్నియు కళలే. ఇది జనసామాన్యపు మాట. విద్వాంసులును, పండితులును, సంగీతము, శిల్పము, కవిత, నృత్యము, వాద్యము, మున్నగు విద్యలను కళలందురు.

ప్రపంచంలో నందరును కళలు ప్రయోజనకరములనియు, లాభకరము లనియు తలపరు, కళల వలన కడుపు నిండునా? యని బీదలును, స్వార్థులును, పలువురు వ్యాపారులును, విపరీత సిద్ధాంతమును వాదించుచుందురు. అందుచేతనే అట్టివారి పక్షాన మాఘుడిట్లు వకాలతు చేసెను.

“బుభుక్షితై ర్వ్యాకరణం నభుజ్యతే
నపీయతే కావ్యరసః పిపాసితైః
నవిద్యయా కేనచిదుద్ధృతం కులం
హిరణ్యమేవార్జయ; నష్ఫలాః కలాః!

‘ఆకలిగొన్నవాడు వ్యాకరణము భక్షించునా? దప్పిగొన్నవాడు కావ్యరసం త్రాగునా? విద్యచేత నెవ్వరైన తన కులమునుద్ధరించుకొన్నారా? నహి! నహి! కావున ధనమునే ఆర్జించుము. కళలన్నియు నిష్ఫలములే’ అని మాఘుడనెను. ఇది నాటి లౌకాయతిక చార్వాక మతాలకును నేటి మెటీరియలిస్టు కమ్యూనిస్టు సోషలిస్టు మతాలకును సబ్రహ్మచారియగు భావము. పై శ్లోకమునుద్ధరించి యుదాహరించిన ఔచిత్య విచార చర్చాధీరుడగు క్షేమేంద్రుడు వానినిట్లు ఖండించెను.

"ఇత్యుక్తే సర్వమేత, ద్దారిద్ర్యదైన్యవిద్రుత ధైర్యకాతర
తయాతత్త్వ విరహితం విపరీతముపన్యస్తమ నౌ
చిత్యం సుయుక్తమేవ విద్యానామేవ సర్వసంపత్
ప్రసవిన్తీనాం కులోద్ధరణ క్షమత్వం నాన్యస్య"

'ఇది దారిద్రదైన్య బాధచే చెప్పిన విపరీత భావము. విద్యల (కళల) వలన సర్వ సంపత్తులుద్భవించుటయేకాక లోకోద్ధరణము కూడ కలుగును' అని దాని భావము. ఈ ఖండనములో క్షేమేంద్రుడు తనకు నచ్చిన కళా నిర్వచనము చేసినాడు. కళలు సర్వ సంపత్తులనిచ్చుననియు, లోకోద్ధరణమునకు పనికి వచ్చుననియు నీతడు తేల్చెను.

కొన్ని పురాణాలలోను, కొన్ని ధర్మశాస్త్రములలోను కళాగర్హణము కానవచ్చుట ఒక విచిత్ర విషయము. మహాభారతములో శ్రాద్ధాది కర్మలకు అపాంక్తేయులగు బ్రాహ్మణులెవ్వరో యట్లు తెలిపినారు.

సీ॥ జూదరి, గరదుండు, వేదంబు సదువని
వాడు, వడ్డికినిచ్చువాడు, గాయ
కుండు ....
...... శిల్పకృతుల బ్రతుకు
వారు పంక్తి దూషకులంద్రు పౌరవేంద్ర (అను. ౩-౧౭౫)

సంస్కృత భారతమూలములో గాయకులు శిల్పులనేకాక మరికొందరిని గూడ నపాంక్తేయుల పంక్తిలో నెట్టివేసినారు. వారెవరనగా - "సాముద్రికః, కుశీలవః, దేవలకః, నక్షత్రైర్యశ్చబేవతి, నర్తకః" (అను. ౯౦ అధ్యాయం) ఇటులే భారతమందు మరికొన్ని తావులందును, పలు పురాణాలలోను సంగీతము, నృత్యము, శిల్పము, కుశీలవత్వము, మున్నగు కళలపై ఆంక్ష పెట్టిరి. ధర్మశాస్త్రములలో నిటులే కళలకు నైచ్యతనాపాదించిరి. మనువిట్లు శాసించెను.

"నే హేతార్థాన్ ప్రసంగే న విరుద్ధే న కర్మణా"(౪-౧౫) దీనిపై కుల్లూక భట్టీయమిట్లన్నది "ప్రసజ్యతేయ్తరపురుషః నప్రసంగః గీతావాదిత్రాదిస్తే వార ఆథన్నార్జయేత్" (గీతావాక్యముచే ద్రవ్యమార్జింపవలదు) ఇట్టి భావములే మరికొన్ని స్మృతులందును కానవచ్చును. ధర్మశాస్త్రములలోను, నలభారతము లోను, నర్తకాదులు అపాంక్తేయులగుచో భారతమందే అర్జునుడు ఉత్తరకు నృత్యమునేల నేర్పెను. తానేల నేర్చెను? పాణిని నట ధాతువునిచ్చెను. శైలూష శబ్దమును వాడెను. బ్రాహ్మణులకే సంగీత నృత్యశిల్పములు నిషిద్ధములనిన ఆనాడీ విద్యలు బ్రాహ్మణేతరులవని చెప్పవలయును. బహుశ అదే భావము పై పురాణ శాస్త్రకారులదైయందును.

మనుస్మృతిలో పలుతావులలో బ్రాహ్మణులును క్షత్రియులును కళలను సాధించరాదను నాంక్ష కలదు.

న నృత్యేదథవా, గాయేన్నవాదిత్రాణి వాదయేత్
నాస్ఫోటేన్నచ క్ష్వేడేన్నచ రక్తో విరావయేత్ (4-64-మను.)

బ్రాహ్మణుడు నాట్యమాడరాదు. పాట పాడరాదు. వాద్యముల వాయించరాదు. భుజమప్పళింపరాదు! దగ్గరాదు!! రక్తితో పెద్దగా నరువరాదు!!! మరియు నీక్రిందివారి యన్నమును బ్రాహ్మణుడు భుజింపరాదు.

"స్తేనగాయన యోశ్చాన్నం ...." మను. ౪-౨౧౦
"శైలేషతున్నవాయన్నం ....." ౪-౨౧౪
"రంగావతారకస్య చ ......" ౪-౨౧౪

దొంగలు, గాయకులు, శైలూషులు, నావికులు, నాటకములందలి నటకులు - వీరి యన్నము నీచాన్నమట!

రాజులకు నిర్ణయించిన నిషప్త్రధాలలో "తౌర్యత్రికం వృథాట్యా చ" (మను.౭-౪౭) మృదంగాది వాద్యములు చేరినవి. ఇట్టి బహు నిదర్శనములను బట్టి చూడ లలితకళలకు మొదట మొదట ఆర్యులలో గౌరవస్థానములేకుండెనా యను సంశయము కలుగక మానదు.

శిల్పము, చిత్రకళ, ఆర్యులలో తక్కువయనియు, దాక్షిణాత్య ద్రావిడ జాతులలోనే యవి ప్రాముఖ్యమందియుండెననియు మూర్తి పూజావిధానమును ద్రావిడుల సంబంధముచే నార్యులు స్వీకరించిరనియు. మూర్తులను శిలలందు లోహములందు తీర్చి వాటికి సుందరాలయములను నిర్మించినది ద్రావిడులే యనియు పలువురి పరిశోధకులయభిప్రాయము. డాక్టర్ ఆర్. శ్యామశాస్త్రిగారి అభిలషితార్థ చింతామణికుత్తమ పీఠిక వ్రాసిరి. వారందిట్లు తెలిపిరి. "విగ్రహారాధనము ద్రావిడ సంప్రదాయమే! యాస్కుడికి చాలా యనంతరము మౌర్య చక్రవర్తుల కాలములో దానినార్యులు స్వీకరించిరి. నృత్యము శూద్రుల వృత్తిగా (ద్రావిడవృత్తిగా) నుండెను. వైదిక సంప్రదాయమున యజ్ఞ సమాప్తి కాలమందు దాసీలు అనగా శూద్ర స్త్రీలు యాజ్ఞికుల ప్రీత్యర్థము నృత్యము సేయ నియుక్తలగుచుండిరి. దీనిని బట్టి ద్రావిడులలో నీకళ పరమావధి పొందియుండెనని యూహింపవలెను. ఈ భావమును బలపరుచునట్టి తప్త ముద్రానిషేధ విచారమను యీ క్రింది శ్లోకము గమనార్హమైనది.

"శంఖ చక్రాద్యంకనం చ నృత్తగీతాదికం తథా
ఏకజాతే రయం ధర్మః నజాతుస్యాత్ ద్విజన్మనః"

శంఖ చక్రాది ముద్రలను భుజములపై కాల్చుకొనుట, నృత్యముచేయుట, గానము చేయుట మున్నగునవి శూద్ర ధర్మములేకాని అవెన్నటికిని

ద్విజుల ధర్మాలు కానేరవు. అని దాని యభిప్రాయము......... రేఖలు చిత్తరువులు వంశపరంపరగా శూద్ర శిల్పులచే వృద్ధి నొందెననియు వారి నైపుణ్యమును, కుశలతను, నాధారముగా చేసుకొని తర్వాతి కాలములో గ్రంథకారులు శాస్త్రములు వ్రాసిరని నిరభ్యంతరముగా చెప్పవచ్చును.. .... బొంబాయి, హైద్రాబాదు, మైసూరు రాష్ట్రములలోను దక్షిణమందును వెలసినట్టి సుందర శిల్పములన్నియు ద్రావిడ శిల్పములే!"

పై శ్యామశాస్త్రిగారి వాదమును బట్టి మన్వాది స్మృతులందు, భారతాది పురాణములందు లలితకళలపై ఆంక్షలేల పెట్టిరో మనమిప్పుడు సరిగా గ్రహింపగలుగుతున్నాము. బౌద్ధుల తర్వాత ద్రావిడులు వారిని జూచి ప్రాచీన కాలమందుండిన కళలకు స్థానమిచ్చిరి. .... కార్మిక శాస్త్రములు ... (అస్పష్టము) ... కొల్లలుగా చేసిరి. ఒక్కొక్క శాస్త్రకారుడు తాను చర్చించు శాస్త్రమును ప్రత్యేక దృష్టితో నిరూపించెను. శిల్పమును చిత్రలేఖనమును విష్ణుధర్మోత్తరమను పురాణము విశేషముగా చర్చించినది. ఆ గ్రంథము గుప్త చక్రవర్తుల కాలమందో అటు తర్వాతనో యేర్పడినట్టిదనవచ్చును. క్రీ.శ. ౧౨౦౦ ప్రాంతమువాడగు పశ్చిమ చాళుక్య రాజు సోమేశ్వరుడు తన అభిలషితార్థ చింతామణిలో ఇతర కళలతోపాటు చిత్రకళలను గూర్చి విపులముగా చర్చించెను. వాత్స్యాయనుడు తన కామసూత్రములలో చతుష్షష్టి కళలను వివరించెను. అగ్నిపురాణమందును కళా చర్చ కలదు. వాత్స్యాయనుడు క్రీస్తు శకారంభ కాలమువాడు. అగ్ని పురాణము తదనంతరముదే! విష్ణు ధర్మోత్తరమందు చిత్రకళా చర్చాంతమందిట్లు వ్రాసినారు.

తరంగాగ్ని శిఖాధూమం
వైజయంత్య స్వరాదికః
వాయుగత్యా లిఖేద్యస్తు
విజ్ఞేయోత్తమ చిత్రవిత్
కలానాం ప్రవరం చిత్రం
ధర్మ కామార్థ మోక్షదం
మాంగల్యం ప్రథమంచై తత్
గృహేయత్ర ప్రతిష్ఠితం

అలలు, అగ్ని శిఖలు, ధూమము, వాయుగతి మొదలగునవి చిత్రించువాడే యుత్తమ చిత్రకారుడనియు కళలన్నిటిలో చిత్రకళే శ్రేష్టమనియు, చతుర్వర్గములను సమకూర్చునదనియు, మంగళ ప్రదమనియు, ప్రతి గృహమందుండదగిన దనియు పై పురాణము నిర్ణయము.

వాత్స్యాయనుడు "అభ్యాస ప్రయోజ్యాంశ్చ చతుష్షష్టి కాన్ యోగాన్ కన్యారహస్యేకాకిన్యభ్యసేత్ ౧-౩-౧౪" అని వ్రాసెను. అందు గీతము, నృత్యము, వాద్యము, లిపి, జ్ఞానము మున్నగునవి చేరినవి. మరొకచో వాత్స్యాయనుడు కళల వలన సౌభాగ్యముదయించునని యిట్లు వ్రాసెను.

కళానాంగ్రహణాదేవ సౌభాగ్యయుపజాయతే
దేశకాలౌత్వవేక్ష్యాస్యాంప్రయోగస్సంభవేన్నవా

కామసూత్ర ప్రవర్తకుడు కాన వాత్స్యాయనుడు కళలను కామశాస్త్ర దృష్టితో నిర్వచించెను. 'భరతుడు నాట్యశాస్త్ర ప్రచారకుడగుటచే తత్సంబంధి విషయాలకే కళా స్థానమిచ్చెను. అతడిట్లనెను.

నతత్ జ్ఞానం నతత్ శిల్పం
నసావిద్యా నసా కళా
నాసౌ యోగోనతత్కర్మ
నాట్యేఽస్మిన్ యన్న దృశ్యతే
నాట్యములో జ్ఞానము, శిల్పము, విద్య, కళ, యోగము, కర్మ లేనిచో వాని
సర్వశాస్త్రాణి శిల్పాని కర్మాణి వివిధానిచ
అస్మిన్నాట్యే సమేతాని తస్మాదేతం మయాకృతం (౧-౧౧౭-౧౮)
సర్వశాస్త్ర శిల్ప కర్మలు నాట్యములో పెంపొందియున్నవని భరతుడనెను.
ఛాందోగ్యోపనిషత్తులో అష్టాదశ విద్యలనిట్లు తెలిపినారు.

"ఋగ్వేదం భగవోధ్యేయ .... పిత్ర్యం, రాశిం, దైవం, నిధిం వాకో వాక్యం, ఏకాయనం, దేవవిద్యా, బ్రహ్మవిద్యాం, భూతవిద్యాం, క్షత్రవిద్యాం, నక్షత్ర విద్యాం, సర్పదేవజన విద్యాం, ఏతద్భగవోఽధ్యామి(౭-౨). నాలుగు వేదములు, శ్రాద్ధకల్పము, గణితము, ఉత్పాత జ్ఞానము, నిధి శాస్త్రము, తర్క శాస్త్రము (ఏకాయనం) నిరుక్తము (దేవవిద్య). బ్రహ్మవిద్య, తంత్రశాస్త్రము (భూతవిద్య), ధనుర్వేదము, క్షుత్రవిద్య, జ్యోతిషము, సర్పవిద్య, దేవజన విద్య – అనగా నృత్యం గీతవాద శిల్పాది విద్యలు (అని శంకర భాష్యము) ఇవన్నియు నేర్చినానని నారదుడు సనత్కుమారునితో ననెను. దేవజన విద్య నారదునంతవాడే సాధించెననిన అట్టి సాధకులను అపాంక్తేయులని పురాణాలనుట చిత్రము!

కాళిదాసు పలుమారు కళలను గూర్చి ప్రస్తావించెను. రఘువంశమందిట్లు వ్రాసెను.

"గృహిణీ సచివస్సఖీమిథః
ప్రియశిష్యా లలితే కళావిధౌ
కరుణా విముఖేనమృత్యునా
హరతా త్వాం బత, కిం నమేహృదం – రఘువంశం (౧వ సర్గ)

ఈ శ్లోకమునుదాహరించి ఇంగ్లీషులోని ఫైన్ ఆర్ట్సు (Fine arts) సరియగు "లలిత కళలు" అను పదమును మొదట తెనుగున సృష్టించినవారు, నిండు పాండిత్యముచే, అసాధారణ విమర్శనా పటిమచే, ఉత్తమవచన శైలిచే నాంధ్ర భారతిని అద్వితీయముగా నారాధించిన శ్రీ కొమర్రాజు వెంకట లక్ష్మణ రాయ పూజ్య పాదులు. ఇదే విషయమును గూర్చి వారు "కళ" పత్రికలో (దుందుభి కార్తీక సంచికలో) ఇట్లు వ్రాసిరి. "చిత్ర విద్య, సంగీతము, కవిత్వము, నాట్యము, శిల్పము అను వానిని కవికుల గురువైన కాళిదాసుడు లలిత కళలన్నందున మనమా పేరునే నిలుపుదము" పై శ్లోకమునకు మల్లినాథీయమందిట్లున్నది "లలితే సుకుమారే కళానాం గీతాదీనా విధౌ అనుష్టాన విషయేప్రియశిష్యా". కవికుల గురువు "లలిత కళలు" అన్న పదమునే కాక "రూపము" అను పదమునకు గూడ సాంకేతికార్థమునిచ్చి పోయెను. కుమార సంభవములో (౫-౩౬) ఇట్లు సెలవిచ్చినారు.

యదుచ్యతే పార్వతీ పాపవృత్తయే
నరూప మిత్యవ్యభిచారి తద్వచః।
తథాపి తే శీల ఉదార దర్శనే
తపస్వినామ ప్యుపదేశతాంగతః।

"పార్వతీ! సౌందర్యము (రూపము) పాపవృత్తి హేతువు కానేరదన్న నానుడి. పరమ సత్యము" అని శివుడనెను. అనగా సురూపమే సువృత్తము. సౌందర్యమే ఆర్జవము అని కాళిదాసు భావము. "యత్రాకృతిః ... స్తత్రగుణాః" అని మల్లినాథీయము. ఆంగ్లకవి కీట్సు (Keats) "a thing of beauty is a joy for ever" సౌందర్యమే నిత్యానందం అనెను. దానినే మన ప్రాచీనులు "దినే దినే యన్నవతాయా... తదేవ రూపం రమణీ తాయాః" అనిరి. కుమార సంభవము లోని పై భావము రూప నిష్పత్తి కీట్సు ఆ భావము కన్న మరి పదిమెట్లు పైకి పోయినది,

"చిత్రే (చిత్తే?) నివేశ్య పరికల్పితసత్త్వ యోగాత్
రూపోచ్చయేన మనసా విధినా కృతాను"
అని శకుంతలను వర్ణించిన కవిలోకమూర్ధన్యుడు మరొకమారు రూప శబ్దమునకు రూపమిచ్చెను.
మరొకమారా కవికులగురువే యిట్లనెను.

చిత్రద్విపాః పద్మవనావతీర్ణాః
కరేణుభిర్దత్త మృణాలంభంగాః
నఖాం కుశాఘాత విభిన్నకుంభాః
సంరబ్ధ సింహప్రహృతం వహంతి – (రఘు. ౧౬ సర్గ)

పెంటియేనుగులు తమ ప్రియులగు యూథపతులకు పద్మములనూడబెరికి అందించినట్లు గోడలపై వ్రాసిన చిత్తరువులను జూచి సింహములు వాటిని సజీవ ద్విపములని భ్రమించి వాటి కుంభస్థలములను పంజాతో చీల్చినవట! ఇట్టి భిత్తికా చిత్రములు మన చిన్నతనము నాటివరకాంధ్రదేశమందందు నిలచియుండెను. హిందువులు చేసిన కళా చర్చలలో కొన్ని యిచ్చట యెత్తి చూపనైనవి. ఇక యితర దేశాలలో అందు ముఖ్యముగా యూరోపు ఖండములోని కళలను గురించి సంగ్రహముగా తెలుసుకొందుము –

క్రీస్తునకు పూర్వము 3000 ఏండ్లకు ముందే ఈజిప్టు దేశమందు శిల్ప కళ వృద్ధియయ్యెను. అచ్చటి పిరమిడ్లును ప్రాచీన దేవతా విగ్రహములును అద్భుతమైనవిగా భావింపబడినవి. ఆ విగ్రహములు భక్తులను భయపెట్టునవిగా నుండెనేకాని వాటిలో జీవకళలేకుండెను. అసీరియనులును గ్రీకులును వారి తర్వాత శిల్పమును వృద్ధి చేసినట్టి వారు. అసీరియాలో రెక్కలు గల భయంకర జంతువులను "చెరుబిం" అను వాటిని సృష్టించిరి. అవే హిందువుల శరభములయ్యెను. నేటికిని దాక్షిణాత్య దేవాలయ స్తంభములపై నా విచిత్రజంతువులు కాననగును. అసీరియా ప్రాంతపు శకులే భారతదేశములో కొంత భాగమును జయించి పాలించినప్పుడు పచ్చి శృంగారము, ఉద్రేకపరచు (sensuous) విగ్రహాలను ప్రవేశపెట్టిరి. నేటికిని మన దేవాలయములలోని గోపురాదులందు కొన్ని తావులలో బూతు బొమ్మలు గోచరించును. అవి వారి ప్రసాదమే! గ్రీసు దేశము వారును అలెగ్జాండరు కాలములో రెండు శతాబ్దముల వరకు మనకు ఎన్నో కొత్త పద్ధతులనేర్పిరి. విగ్రహాల నగ్నతను శరీరాంగముల సౌందర్యమును వారినుండియే మనవారు నేర్చుకొనిరి. దానికి గాంధార శిల్పమని పేరు, మన ఆంధ్రదేశమందును శాలివాహన చక్రవర్తుల కాలముననను వారి యనంతరమందును గ్రీకు శిల్ప ప్రభావము కొంత వరకు గోచరించును. అమరావతి శిల్పములందది కాననగును. గ్రీకు నగ్న శిల్పము కొంత వరకు తెనుగువారిలో కూడ ప్రతిబింబించెను. గ్రీకులను రోమనులు పూర్తిగా అనుకరించిరి. చీనా దేశముకూడ ప్రాచీనమునుండి శిల్పకళకు ప్రఖ్యాతి వహించెను. బౌద్ధమతముతో పాటు భారతీయ బౌద్ధులు తమ శిల్పములను కూడ చీనాలో ప్రవేశపెట్టిరి. చీనా వారిలో క్రమ క్రమంగా పింగాణి శిల్పము ప్రత్యేక లక్షణముగా పరిణమించెను.

గ్రీకుశిల్పమును గూర్చి మరికొంత తెలుపుట యవసరము. తామస్ క్రేవన్ (Craven) గారి యభిప్రాయము సంగ్రహముగా

నీవిధముగానున్నది. "క్రీ.పూ. 3000 ఏండ్ల నాడే గ్రీకులు తెల్లని శిలలలో నగ్న విగ్రహాలను తీర్చిరి. రాగితో దేవతా విగ్రహములను చేసిరి. వారు శిలాశిల్పములో (Sculpture) పారమందిరి. స్పార్టా స్వర్ణకారులు చేసిన యాభరణముల వంటివీనాటి యంత్రయుగమందును జేయజాలకున్నాము. ౨౦౦౦ ఏండ్ల క్రిందట ఏతెన్సు లోహకారులు (bronze) కంచుతో చేసిన శిరస్త్రాణములను (helmets) మొన్నటి రెండవ ప్రపంచ యుద్ధమందు జర్మనులు అనుకరించి తమ భటులకిచ్చిరి.

"పర్రేషియన్ (Parrhsius) అను గ్రీకు చిత్రకారుడు ఒలింపిక్ పందెగాండ్లురుకుడు పందెమందురికి నట్లును వారి ముఖమునుండి చెమటబొట్లు కారుచుండినట్లుగా చిత్రింపింపగా స్పార్టా జనులాపటమందు చెమట బొట్లు నిజముగా కారుచున్నవాయని తాకి చూచి వెరగందిరి. అతన్ని మించవలెనని జ్యూక్సిస్ (Zeuxis) అను యవనుడు ద్రాక్షాఫల స్తబకములను చిత్రింపగా పిట్టలా పటముపై వాలి ద్రాక్ష గుత్తులను పొడవబోయెను".

ఈ సంఘటనము వంటిదానినే శ్రీకొమర్రాజు పూజ్యపాదులిట్లు ప్రచలితమైన కథనుదాహరించిరి. "నలుగురు చిత్రకారులు పోటీకి నాలుగు పటములు చిత్రించిరి. వానిని రాజు చూడవచ్చెను. మొదటివాడు గులాబి పుష్పముల చిత్రించెను. వానిని నిజమైనవిగా భ్రమించి తుమ్మెదలు రసపానముకై వానిపై వాలెను. రెండవవాడు ద్రాక్షపండ్ల గుత్తిని చిత్రించెను. పక్షులు వానిపై కూర్చుని తినబోయెను. మూడవవాడు కుక్క ప్రతిమను చేసెను. దానిని జూచి మరొక కుక్క మొరుగుచుండెను. రాజు నాల్గవవానిని జూచి నీ చిత్రపటమేదియని యడుగగా దేవర వారే తెర తొలగించి చూడవచ్చుననెను. రాజు తెర కదిలింప బోతూ అది తెర కాదనియు తెర వలె వ్రాసిన పటమనియు తెలిసికొనెను. మొదటివాడు కీటకములను వంచించెను. పక్షులు రెండవవాడును, మృగములను మూడవవాడేమార్చెను. మానవుడనైన నన్నే భ్రమింపజేసితివి కావున నీ నల్గురిలో శ్రేష్ఠుడవని రాజు చెప్పెనట". గ్రీకులో శిల్పుల గురించి యనేకాద్భుత కథలు వ్యాపించి శిల్పుల ప్రభావమునకు తార్కాణంగా శ్రీ కొమర్రాజు గారు మరొక యంశమునిట్లు తెలిపిరి. "సైప్రస్ దేశములో పిగ్మేరియస్ అను నిపుణుండుండెను. అతడతి సుందరమైన స్త్రీ విగ్రహము సృష్టించెను. దాని చక్కదనమున కాతడే యాశ్చర్యపడి దానిని మోహించెను. అందుకాతడా విగ్రహమునకు ప్రాణము బోయవలసినదిగా వీనస్ రతీ దేవిని గోరెను. వీనస్ ఆ విగ్రహమునకు బ్రాణము పోయగా దానిని పెండ్లి యాడెనట" అందు చిత్రకారుని పేరు పిగ్మాలియన్ (Pygmalion) అతడు నిర్మించిన విగ్రహము పేరు (Galatia) గలాటియా.

యూరోపు ఖండము వారికి చిత్ర విద్యలో గ్రీకులు రోమనులు గురువులు. క్రీ.శ. ౧౫౦౦ నుండి యూరోపులో చిత్రకళ విజృంభించుతూ వచ్చెను. అంతకు ముందు వారి చర్చీలలో క్రైస్తవ మత రూపకములు గాతిక్ శిల్పమను పేర ప్రసిద్ధముగా నుండెను. ఆధునిక చిత్రకళలకు మూల పురుషుడు క్రీ.శ. ౧౫౦౦ ప్రాంతమందు ఫ్లోరెన్సులో పుట్టి పెరిగిన లియొనార్డో డా వించీ (Leonardo da Vinci) అను బహుముఖ విజ్ఞాన సంపన్నుడు. అతని (The Last Supper) జీససు తుది యారగింపు అను పటము ప్రపంచ పటములలో నతి ప్రసిద్ధి గాంచినది. అతని రేఖలను తప్పు పట్టినవారింతవరకు లేరు. "సుందర వస్తువులన్నియు – కళలలో తప్పు అంతటను నశించును" అని యతని భావము. అతని ప్రకృతి దృశ్యములు యూరోపులో మొదటిసారి గణనకెక్కినట్టివి. అతని "మోనాలిసా" అను చిత్రము పరిపూర్ణ కళాసమన్వయ మయినది. ఇటలీలో ౧౪౮౩ నుండి ౧౫౨౦ వరకుండిన రాఫేల్ (Raphael) కూడ చాలా ప్రఖ్యాతి గాంచిన చిత్రకారుడు. కొందరు చిత్రకళా విమర్శకులు యూరోపు కళా విధానములను pre-Raphaeliatic ప్రాక్ రాఫీల్ కాలమనియు పశ్చాద్రాఫీలీ కాలమనియు విభజించుట చేతనే అతని ప్రఖ్యాతి వెల్లడియగును. వీనస్ (గ్రీకువారి రతీదేవి) యొక్కయు ఆమె కుమారుడగు మదనుని యొక్కయు వాని భార్య (Reyche) వి ప్రఖ్యాత చిత్రములుగా ప్రసిద్ధిగాంచెను. అదే కాలములో జర్మనీలో హోల్బిన్ స్వరూప పటములకు (portrait painting) అది గురువయ్యెను. తర్వాత హోగర్తు వచ్చెను. "నా పటమే నా రంగస్థలము. నా చిత్రిత రూపులే నా నాటక పాత్రధారులు" అని యనెడివాడు. తర్వాత టర్నర్ అను నాంగ్లేయుడు "స్వాభావిక చిత్ర విద్యా గురువు (Father of Impresessionism)" అని ఫ్రెంచి కళాకారులచే స్తుతింపబడెను. అమెరికా కీర్తి తెచ్చిన చిత్రకారుడు ఔడ్ బెన్. ఫ్రెంచి వాడగు టౌలూస్ ప్రకటన చిత్రాలకు ప్రథమాచార్యుడు. హాలెండుకు కీర్తి దెచ్చిన వాన్ గోఘ్ (Van Gogh) "ఒక యుద్దేశము – ఒక సందేశము కలదే కళ. అది ప్రపంచ కళ్యాణమునకు తోడ్పడవలెను" అని చాటెను. కేజాన్ అను ఫ్రెంచి చిత్రకారుడు ఆధునికత్వ కళ కాచార్యుడు (father of modernism in art). ఆధునిక యూరోపు కళలు అను పుస్తకమున పై విషయాలను తెలిపిన క్రేవర్ పండితుడు పీఠికలోనిట్లు వ్రాసెను. "ఒక్కొక్క శిల్పికొక్కరుచి. (స్పెయిన్) రూబెన్సుకు నగ్న చిత్రాలపై ప్రీతి. కేజాన్‌కు స్త్రీలన్న భీతి. అతడు వృక్ష ప్రపంచాన్నే (Vegetable Kingdom) కామించెను. టర్నరుకు సాగరమే ప్రీతి. డెలాక్రోయాకు యుద్ధ రంగమనిని యుత్సాహము". ఫ్లోరెన్సులోని టిటియన్ చిత్రకారుడిట్లనియుండెను. "ప్రకృతియే కళాచార్యులకాచార్యత్వము వహించునట్టిది. ఆమె కుంచిక సమ్మోహనకరమైనది. ఆమె లేఖిని అద్భుతమైనది".

యూరోపు ఖండమందు క్రీ.శ. ౧౬౦౦ నుండి ౧౯౦౦ వరకేర్పడిన పరంపరాభావములను టాల్‌స్టాయి మహితాత్ముడు ౧౪ సంవత్సరములు గాఢ పరిశోధనలు చేసి "What is art" కళయననేమి యను సుగ్రంథందు చాలా చక్కగా వివరించినారు. వారి యభిప్రాయ సారాంశమిది.

"బౌంగార్టన్ (౧౭౧౪–౬౨) అను జర్మనువాడు ప్రారంభించిన వాదమును ఈస్తటిక్ వాదమందురు. ఆర్కిక విజ్ఞానోద్దేశమే సత్యగుణము. ఈస్తటిక్ విజ్ఞానోద్దేశము రమణీయత. రమణీయత ఇంద్రియోపజ్ఞము. సత్యము తర్కోపజ్ఞము. ఉత్తమత్వమునీత్యుపజ్ఞము. ఈ విధముగా కళకు సౌందర్యము, సత్యము, ఉత్తమత్వము ప్రధాన లక్షణములు. Art for arts sake కళ కళ కొరకే అన్న సిద్ధాంతము వీరిది. దీనిని జర్మనీ, ఫ్రాన్సు, ఇంగ్లండ్, ఇటలీ, హాలెండు కళోపాసకులు కించిద్భేదములతో అనుసరించిరి. వీరి సిద్ధాంతానుసారుము సుందర ప్రకృతి దృశ్యములు,

పూలు, పండ్లు, నగ్న స్త్రీ పురుషులు, కళాస్థానములు. మరికొందరు టెండెన్షస్ సిద్ధాంతులు. వారి భావమేమన మంచి కళ ముఖ్యమైనదిగను, మానవులకవసరమగునదిగను, నైతికమైనదిగను, బోధకమైనదిగను నుండవలెను. మరికొందరు రియలిస్టిక్ వాదులు. యథార్థ విషయములను ఉన్నదున్నటుల్లగా నిరూపించుటయే యుత్తమ కళయని వీరి వాదము. (ఉన్నదున్నట్లు వర్ణించుటను గురించి మన తెలుగు కథ యొకటి యీ సందర్భమున జ్ఞాపకమునకు వస్తున్నది. తిరుమల దేవరాయలొకనాడు తన యాస్థాన కవులతోనిట్లనెనట. కవులకుత్ప్రేక్షాతిశయోక్తులపై ప్రీతి మెండు. ఉన్నదున్నట్లు వర్ణించుటే లెస్స. అందుపై తెనాలి రామలింగడిట్లాశువుగా కవన మల్లెనట.

అన్నాతి గూడి హరుడగు

అన్నాతిని గూడకున్న నసురగురుండౌ

అన్నా! తిరుమలరాయా!

కన్నొక్కటి లేదు కాని కంతుడు కాడే.

ఇందు చక్కని హాస్యమున్నది కాని ఇది బాధాకరమగునట్టిది. "నబ్రూయాత్ సత్యమప్రియం" అన్నారు పెద్దలు. తిరుమలరాయల యాస్థాన కవిగా రామలింగడుండినది అసంభవమే. తళ్లికోట యుద్ధములో చావు తప్పి కన్ను లొట్ట పోయెనన్న సామెతకు లక్ష్యభూతుడైన తిరుమలరాయల కన్నొకటి యెగిరి పోయియుండెను.

పై మూడు సిద్ధాంతాలలో సౌందర్యము, ఆనందము, ఉపయుక్తము, అను గుణములు కళలలో కలవందురుకదా. పిరమిడ్లు, కోటలు, మహా భవనములు, ప్రార్థనాలయములు, కట్టినప్పుడెందరు బందీలు, బానిసలు, వెట్టివారు అరగడుపులతో చెమట బొట్లతో, కశాఘాతబులతో, కన్నీటి ధారలతో కట్టిరో ఆ దృశ్యములనెవరు గమనింతురు? పిరమిడ్లలో మిశ్రదేశ రాజ్ఞీ రాజులతో పాటెన్ని వేల బీదలు బలవంతముగా పూడ్వబడిరో? కోట బురుజుల క్రింద యెందరు బలిపశువులైరో? ఎన్ని లక్షలమంది వధయైన తర్వాత జితులైన వారి రక్తముచే చెమటచే కన్నీటిచే ఎన్ని మినార్ జయస్తంభములు నిర్మింప బడెనో? ఎన్ని సంవత్సరాలకెందరు "ముసలమ్మలు" ఆహుతియైరో? ఎన్ని వేల మిందూ శిల్ప బాలకులనెందరు గజినీలు గోరీలు తైమూరులు బానిసలుగా కొనిపోగా గజినీ, సమర్ఖండ్, బాగ్దాద్ వంటి నగరాలలోని మట్టిలో మట్టియై యెందరు మాయమైపోయిరో? అట్టి కళల నేమనవలెను. అవన్నియు బానిస కళలు కావా? ఆ గోముఖ వ్యాఘ్రాయుత శిల్పముల వెనుకను, అడుగున దాగి పోయిన పైశాచికములను తలచుకొనిన అవి మన కానందము నీయజాలినవగునా?

యూరోపులోని పైని తెలిపిన సిద్ధాంతత్రయమును గురించి పాశ్చాత్య విద్వాంసులు బహు గ్రంథములు రచించిరి. టాల్‌స్టాయ్ గురుపాదులీ మతములనన్నింటిని ఖండించెను. కేవల సౌందర్యమునకు ప్రాధాన్యమిచ్చిన ఈస్తటిక్కులు (శృంగారవాదులు) నగ్నదృశ్యములను మెచ్చుకొనిరి. కాని యందు నీతి బాహ్యతయు మానవపతనమును కలదని టాల్‌స్టాయి ఖండించి ప్రతి కళావస్తువు మానవుని యాధ్యాత్మిక వికాసమునకు తోడ్పడునా? లేదా? యని పరికించవలెనని వారనిరి. మంచి కళ యగునా? కాదా? యని నిర్ణయమునకు మూడు లక్షణములను గమనింపవలెను. (౧) అందు నవ్యత కలదా? అది కేవలము శూన్య నవ్యత కాక మానవ కల్యాణమున కుపకరింపలెను.

౨) అందలి విషయములు సూటిగా సులభముగా గ్రాహ్యములగునవిగానుండ వలెను.

౩) కళా రచన రచయిత భావానుభవముతో కూడినవిగా నుండవలెను. తనలో నుత్తేజములేకయే రచించినది శోభింపదు. రచయితలో ప్రామాణికత యుండవలెను.

మహానుభావుడగు టాల్‌స్టాయిని విమర్శించు నధికారము మనకు లేదు. కాని వారు నగ్న దృశ్యములను గురించి నిరసించిన విషయమునకు కొంత సమన్వయమవసరమున్నది. నగ్నతలో సౌందర్యమును సాధించు వారి దృక్పథముల గూడ మనమర్థము చేసుకొనవలయును. ఆటవికులందరును నగ్నులే. వారిప్పుడిప్పుడు నాగరికుల సంపర్కముచే కౌపీన ధారణము వరకు వచ్చినారు. ఇప్పుడు నాగరికులు నగ్నులగుచో సంఘము వారిని నిరోధించును. వారిని పిచ్చివారినిగా నీతిబాహ్యులనుగా నపరాధులనుగా పరిగణించి ఉన్మాద శాలక, కారాగారమునకో పంపివేయును. మన దేశమందు జైనులమూలమున నగ్నతకు గౌరవము కలిగెను. జైనులలో స్త్రీకి నగ్నత లేకుండెను. కాని ద్రావిడాచారమున నుండి హిందూ మతములోనికి జొరబడిన శక్తి రూపిణీ దేవతలు (దేవర్లు) నగ్నదేవతలే. "క్రీడా…కటిరమండల కల దేవీశంభళీ వ్రాతముకై" …. సర్వసంగ పరిత్యాగులై తత్వోపదేశకులైన వారు నగ్నులుగా తిరిగిన వారికి హిందూ సంఘమందు గౌరవము కలదు. దిగంబరజైనులకు "కరతలభిక్ష స్తరుతలవాసః" వారి చేతులందాహారముంచి తినిపించి పాద సేవచేసి పోవుచుందురు. పాశ్చాత్య దేశములలో నగ్న సిద్ధాంతము ౩౫ ఏండ్ల నుండి వృద్ధిగాంచినది. మొదట జర్మనీలో 'నక్ట్‌కుటీర్' (Nuckt Kultur నక్ట్-నగ్న) అనునది ప్రారంభమయ్యెను. తర్వాత ఫ్రాన్స్‌లో ౧౯౩౨ ఏండ్ల ప్రాంతమందు నూడిజం (Nudism) ఉద్యమ మంకురించెను. మారిస్ ఫార్మెలీ "నేటి జీవితములో నగ్నత్వము" అను సచిత్ర గ్రంథమును ౧౯౩౧ లో ప్రకటించెను. యూరోపులోని కొన్ని దేశాలలో నగ్న సంఘముల చరిత్రను ప్రకటించి నగ్నతయే ఆర్థికముగా, నైతికముగా, శారీరకముగా, మానసిక రామణీయతగా, ఉత్తమమైనదని యతడు నిరూపించెను. స్త్రీ పురుష సంపూర్ణ సౌందర్యము, ఆరోగ్యము, నగ్నతవల్లనే సిద్ధించుననియు, నగ్నత నెంత మూసుకొనిన నంత వికారమగుననియు, స్త్రీ పురుషులకు దాచుకొని భాగాలను పరస్పరము చూచుకొనవలసిన కామము కలుగుననియు, నీతడు వాదించెను. పొట్టలు కలవారు జారిన యవయవములు కలవారు, వంకర టింకర యంగములు కలవారు తమ వికారములను బట్టలలో దాచుకొందురనెను. పై గ్రంథానికి కామశాస్త్రమందు సమగ్ర పరిశోధన చేసిన హావలాక్ ఎల్లిస్ గారు పీఠికను వ్రాసి నగ్న సిద్ధాంతమును మెచ్చుకొనిరి.

నగ్నతలోనిన్ని సుగుణములుండిన టాల్‌స్టాయి ప్రభృతులేల యేవగించు కొనిరి. కారణమేమనగా నగ్నత్వము ప్రదర్శనమునకు వినియోగింపరాదు. హిందూ సాధువు నగ్నుడై తిరిగిన నతని యాధ్యాత్మిక శక్తికి మెచ్చుకొందురు కానీ యతని లింగాద్యములపై ధ్యానముంచరు. కాళీ వీరభద్రాది నగ్నదేవతలను జూచినప్పుడు భయభక్తులు కలవారగుదురు కాని కామమోహితులు కారు. నగ్న యువతీ పటములు, బంధనములు, నగ్న కృత్యములు, మానవులలోని నీచ భావములనుత్తేజింపజేసి కామాదులకు సిమెంటు రోడ్లవలె సులభముగా దారితీయును. కావున నగ్నత భిన్నాభిన్న దృష్టులలో భిన్న భిన్న భావముల్పాదించును.

శృంగారవాదులు (ఈస్తటిక్కులు) శృంగారమే కళయనియు, నాశృంగార మానంద దాయకముగా నుండవలెననియు వాదించిరి. కాని మన ప్రాచీనులు విజ్ఞానమానందో బ్రహ్మయనిరి. నిత్యనవ్యత కలదే రమణీయమనిరి. ఆనందము మాత్రమే కళ కాజాలదు. శ్రీ కొమర్రాజు వారిట్లనిరి "ఆనందము సవ్యాజముగా నుండగూడదు. ఆ యానందమునకు స్వలాభమునకు సంంధముండ కూడదు. "నీకు కుమారుడు పుట్టెను. నీకు ధనమిత్తును అనిన మాటలు వినగానే ఆనంద మిచ్చును. కాని యది సవ్యాజము". ఆహారము జీవకోటికానందమిచ్చును. అది కళకాదు. అది జీవయాత్ర కవసరమైనది. కేవలానందము కళ యొక్క ముఖ్య లక్షణము కానేరదు.

శ్రామిక వర్గము వారి కళాసృష్టి ఉన్నతము కాకపోయినను వారి యానందము కొర కేర్పడిన కళలు జనసామాన్యమునాకర్షింప జాలినవి కావు. శుభకార్యాలలో పల్లెపాటలు, కథలు, వారికి తగినట్టివే వ్యాప్తినొందెను. ధనిక వర్గము వారి కళలు మాత్రము వారికే యర్థము కానివయ్యెను. అప్పుడట్టి రచనలకు యీస్టిండియా కంపెనీ వారు ఒక సాంకేతిక పదమును సృష్టించిరి. మన తెలుగువారిలో కాకతీయుల నుండి తంజావూరు రాజుల పతనము వరకు ఆస్థాన కవి పండితుల సంప్రదాయము వెలసెను. జనులలో మాత్రము ద్విపదులు, ధవళాలు, గవ్వాలు వంటి పాటలు, ఒగ్గు కథలు వ్యాప్తి నొందెను. ఆధునిక కాలమందు యూరోపు మిస్టిక్ మంత్రిమండలి వారినేకాక మన కొందరి రచయితలను వశీకరించుకొన్నది.

"నిజమైన కళకు అలంకారము లవసరపడవు. భర్తను నిండు మనస్సుతో ప్రేమించు భార్య కాభరణములు ప్రధానములు కావు కదా" యని టాల్‌స్టాయ్ వ్రాసెను. ఆభరములు లేని మునికన్యక దుష్యంతు నాకర్షింప నాతడిట్లనెను.

సరసిజ మనువిద్ధంశైవలేనాపిరమ్యం
మలినమపి హిమాంశో ర్లక్ష్మ లక్ష్మీం తనోతి
ఇయమధిక మనోజ్ఞా వల్కలేనాపి రమ్యం (తన్వీ)
కిమివహి మధురాణాం మండనం నాకృతీనాం?

మన రాజుల భార్యలు ఏడు వారాల సొమ్ములు కలిగి యుండిరి. కానీ వారి జాడ వారితోనే మాసిపోయెను. మనకు జ్ఞాపకముందు వారు సీత, గార్గి, మైత్రేయి, లోపాముద్ర, అనసూయ, అరుంధతి, చంద్రమతి, పన్నా, పద్మిని, సంయుక్త వంటివారే!

కళకు సార్వజనీనత యుండవలయుననుటకు ప్రాచ్య పాశ్చాత్య కళావేత్తలు పలువురంగీకరించినవారు కారు. కాని, యది సమర్థనీయము కాదు. భారతరామాయణములను చదువురానివారే ఎక్కువగా నానందింతురు. ఇలియడు పురాణమును గ్రీకులట్లే విందురు. నార్వే జనులు తమ ప్రాచీనుల (సాగా) వీరకథల ముచ్చట గావింతురు. రోమనులు తమ ఓవిడు నటులే విందురు. ప్రతి దేశమందు నిదే పద్ధతి కలదు.

కళకు నీతికి సంబంధమును ముడిపెట్టరాదని కొందరు యూరోపు పండితులు వ్రాసినారు. అట్టి వారికి బూతుబొమ్మలు, బూతు కవిత, పచ్చి శృంగారము, నీతికి దూరమగు విషయములు కళలై మెరయును. మనలో కొన్ని మారులు గొప్పవారికి పచ్చి శృంగారముపై మనసు పోయినదేలనో యేమో? కాళిదాసే కుమారసంభవములో జగన్మాతాపితల సంభోగమును వర్ణించెను. సంస్కృతమందలి కొన్ని చంపువులు, ప్రహసనములు, భాణములు కొన్ని కావ్యాలు, అసభ్య వర్ణనలు చేసెను. శ్రీనాథుని వంటివాడు శృంగార నైషధ హరవిలాసదులలోను, చాటువు లందును, మర్యాదాతిక్రమణ మొనరించెను. కవి చౌడప్ప శతకము వంటివింకెన్నియో కలవు. అట్టివన్నింటిని మనలో పలువురదేపనిగా సేకరింతురు. అదొక పిచ్చియానందము. అయితే మన వాగనుశాసనుడు "విశ్వశ్రేయఃకావ్యం" అనెను. ఇంతవరకు చర్చించిన దానివలన కళానిర్వచనమొక స్థాయిలో లేక బహుముఖములుగా నిర్వచింప దగినదని విశదమైనది.

పరమతములను ఖండించి తన మతమును స్థాపించిన టాల్‌స్టాయ్ నిర్వచనమేమో తెలిసికొనుటకు ముందు కళలన నెవ్వియో యెరుగవలెను. మానవకల్యాణమునకుపరించు రసానుభూతి కల రసవత్తర విషయము లన్నియు కళలని స్థూలముగా చెప్పవచ్చును.

టాల్‌స్టాయ్ యిట్లనెను "ఒక పిల్లవాడు అడవికి వెళ్ళగా నచ్చట యొక తోడేలు వానిపై కురికి వచ్చుటయు, ప్రాణభీతిచే వాడురికి యురికి మిట్టలెక్కి పొదలు దూరి చెట్లనెగబ్రాకి బాధపడి తుదకెట్లో తప్పించుకుని వచ్చుటయు, వచ్చి యా యనుభూతినంతయు మరల యనుభవించి శ్రోతలనా యనుభవములను అనుభవించునట్లు చిత్రించుటయు, ఆ సన్నివేశమంతయు కళయగును. ఒకనికట్టి సంఘటన సంభవింపకున్నను ఊహచే దానినుభవించి శ్రోతలకు పరిశీలకులకు పాఠకులకు సత్యమైనదిగా భ్రమింపజేసి మెప్పించినచో నదియు కళయగును....."

కళలలో కథలు, పాటలు, కవిత్వము, నృత్యము, నాటకములు, శిల్పములు, చిత్రలేఖనము, పగటివేషములు, సంగీతము, వాద్యములు చేరును. వీటిలో చిత్రవిద్య, సంగీతము, కవిత్వము, నృత్యము, శిల్పము అనువాటిని Fine arts – లలిత కళలు అందురు.

టాల్‌స్టాయ్ కళలకు తన నిర్వచనమిట్లు చేసెను. "An activity by means of which one man having experienced a feeling intentionally transmits to others". "కళ ఒక అనుభూతి. దాని ననుభవించిన వ్యక్తి ఉద్దేశ.పూర్వకముగా నితరుల యనుభవమునకై యందించును". ఆధునిక ఆంగ్ల కవికులగురువగు బెర్నార్డ్‌షా పై నిర్వచనమును మనసారా మెచ్చుకుని ఇట్లనిరి. "This is

simple truth - ఇది కేవల సత్యము. The moment it is uttered, whoever is really conservant with art, recognises in it the voice of the master" – కళయననేమో యెరిగినవారు పై నిర్వచనము విన్న క్షణమున పై ఋషి వాక్యమును గుర్తించుతున్నారు" . టాల్‌స్టాయి కూడా దానినే మరొక విధముగా నిట్లు తెలిపినాడు. "కళావేత్త ఏ స్వానుభవమును నితరులకందించునో అది దాని శక్తిని బట్టి హెచ్చు తగ్గులుగా నుండును. అది బలీయముగాను లేక నీరసముగాను బహిష్ఠముగాను లేక అలిష్టముగాను అత్యుత్తమముగాను లేక అతి దుష్టముగాను నుండవచ్చును. నాటకములందు ప్రదర్శించు దేశభక్తి, దేవభక్తి, దేశాభిమానములు నవలలోని ప్రియుల యానంద పారవశ్యము, చిత్రపటములలోని శృంగార చేష్టాకర్షణము, విజయధాటీ సమారంభ విజృంభణము, గర్భనృత్యాదులందలి యుల్లాసము, వినోద కథలందలి హాస్యము, సంధ్యాకాలపు ప్రకృతి శాంతి, లాలిపాటల వలన కలుగు సుఖనిద్ర, సుందర సృష్టిని తిలకించినప్పటి యద్ధావాగ్విభవము – ఇవన్నియు కళలే. ఒకడొక భావమును నుభవించి దానిపై సంచాలనము, రేఖలు, రంగులు, ధ్వనులు, శబ్దరూపములు – వీటి ద్వారా ప్రకటించి ఇతరులలోనట్టి భావమునే అట్టి రసాస్వాదనమునే ఉత్పాదించిన వారగుచో అదియే కళాసంవిధానము". దానినే టాల్‌స్టామ్ మహానుభావుడు యిట్లు వివరించాడు.

తాత్త్వికులు (metaphysicians) చెప్పునట్టియొక యనిర్వచనీయమగు సద్భావ స్ఫోరకము లేక దేవుడు కళకాదు. శృంగారవాదులు చెప్పినట్లు మానవునిలో నుబికి వచ్చు పటుత్వ సంపద (energy) యొక్క ప్రకాశము బాహ్య సంజ్ఞలచే మానవుని విభావానుభావములు (లోపల) వ్యక్తీకరించుట మాత్రమే కళకాదు. ఇంపగు వస్తు నిర్మాణము కళకాదు. కేవల (above all) ఆనందము కళకాదు. అయిన కళయనిన యేమి; మరల మొదటికే వచ్చినాము. "It is a means of union among manking -joing them together in the same feelings and indespensable for the life and progress towards the well being of infividuality of humnity" - సమాన భావములకు లోనై మానవులు సన్నిహితమగునట్లు చేసి లోక సంగ్రహమునకు మానవ కల్యాణమునకును నవినాభావ సంబంధము కలదై యుండునదే కళ. ఉపకరించుదియు, ఆ విధమైన మానవ సంబంధములను స్థాపించ గలుగునదియే కళ. "భగవద్గీత"లో లోక సంగ్రహం' బంధమని కలదు. "సర్వాదిద్వాంస్థథా సక్తశ్చికీర్షుర్లోక సంగ్రహం" – 3-25. "లోక సంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి" –3-20 గీత బోధించెను. మానవైక్యతను మన ప్రాచీనాచార్యులు తమ శిష్యులకిట్లు బోధించుచుండిరి.

"సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై

తేజస్వినా వధీతమస్తు, మా విద్విషావహై".

కళా విలాసములు కలిగియు హానికరములగు కళలనిట్లు టాల్‌స్టాయ్ నిరూపించెను. "త్రుప్పు పట్టి చెత్తయైన ప్రాత సాంప్రదాయక భావముల ప్రచారము, కేవల స్వదేశోత్కర్ష స్ఫోరకము, ఉద్వేజకర శృంగారము, దంభము, ఉబ్బు, జాతీయ వీరుల మెచ్చుకోలులోని తబ్బిబ్బు, బూతు, కేవల స్వజాతిప్రేమ యిట్టివన్నియు దుష్ట, నష్టకారి కళలుగా పరిగణింపబడి ప్రజాభిప్రాయముచే నిరసింపబడును". ఇంత దూరము చర్చించిన తరువాత కళాలక్షణము లేవియో మరల సూటిగా టూకిగా చెప్పవలెననిన (1) రసానుభూతి; (2) మానవ కల్యాణము; (3) సార్వజనీనత – అనునవే కళల లక్షణములనవెను.

నికోలస్ రోరిఖ్ (Nicholas Roerich) అను జగత్ ప్రసిద్ధ రష్యా చిత్రకారుడు లోక సంగ్రహార్థమై శాంతి సంఘమును స్థాపించెను. దేవతాత్మకమగు నగాధిరాజముచే నాకృష్టుడై యందే తుది జీవితమంతయు గడిపి ఇటీవలనే నిర్యాణమందెను. అతడు కల్చర్ (సంస్కృతి)ను గురించి యుద్గ్రంథమును రచించి యందిట్లు వ్రాసెను.

"సంస్కృతి యెక్కడ కలదో యక్కడ శాంతి యుండును – Culture is the accumulation of the loftiest benefaction, the loftiest beauty, and the loftiest knowledge అత్యుదాత్త పరోపకారత, అతి రమణీయత, విజ్ఞాన వైదుష్యము వీని సంధానమే సంస్కృతి' ' – "సంస్కృతి జోతిష్మతీ పరిపూజనము. సంస్కృతి మానవ ప్రేమ. ఉల్లాసరహిత భూమి యందు సంస్కృతీలత పుష్పించదు". ఈ భావము మన ప్రాచీన ఋషుల భావానుకరణము.

"అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతంగమయ" అని పెద్దలు ప్రార్థించిరి. హిందూ దార్శనికులు "సత్యం, శివం, సుందరం" అనిన యమృత పదములకే టాల్‌స్టాయ్, రోరిక్ శ్వేతర్షులు అంతదూరము భాష్యము వ్రాసిరనవచ్చును.

హిందూస్థానమందు శిల్పములు బుద్ధుని యనంతరమువే లభిస్తున్నవి. బౌద్ధ చైత్యములు, విహారములు దేశమందు క్రీ.పూ. 400 ఏండ్ల తర్వాతనే విరివియైనవి. మన దేశమందు బౌద్ధ, జైన, హిందూ, ద్రావిడ శిల్పములని నాలుగు ప్రాచీన విభాగములు కలవు. బౌద్ధ శిల్పములలో ఎల్లోరా, అజంటా లోనివి విఖ్యాతి గాంచినవి. తర్వాత అమరావతివి ప్రసిద్ధి గాంచినవి. దాక్షిణాత్య శిల్పములలో తమిళాంధ్ర కర్ణాటులవి ముఖ్యమైనవి. చిత్రలేఖనములో అతి ప్రాచీనమైనవి అజంటా కుడ్య చిత్రములు. తర్వాత చాళుక్య, కాకతీయ, విజయనగర చిత్రకళలు ముఖ్యమైనట్టివి. ముసల్మాను సుల్తానులు ఢిల్లీలో స్థిరపడిన తర్వాత అక్బరు కాలమునుండి ఔరంగజేబు వరకు మొగల్ చిత్రములు, మొగల్ శిల్పములు అనుపేర ప్రసిద్ధికెక్కెను.

మొగల్ చిత్రములు ఈరానీ పద్ధతిననుకరించెను. నిర్మాణ శిల్పము హిందూ శిల్పమునాశ్రయించి తగు మార్పులనొందెను. ఢిల్లీ సుల్తానుల దేవిడీలు, దర్బారులు, విహారవనములు, నమాజు మసీదులు, గోరీ మఖ్బారాలు కొంత విశిష్టత కలిగి యుండెను. జగత్ప్రసిద్ధ తాజ్‌మహల్ శిల్పము కేవలము ముసల్మాను శిల్పము కాదు. దాని గుంబదులలో నితర గుంబదులన్నింటిలో వలె గ్రీవము, పద్మము, కలశము, శిఖరము

అను హిందూ వాస్తు శాస్త్ర నియమములే కలవని ఇ.బి. హెవల్ గారు తమ ఇండియన్ ఆర్కిటెక్చర్ గ్రంథములో చాలా చక్కగా నిరూపించినారు. ముసల్మాను శిల్పములకు గుంబదులు, మీనారులు, కమానులు ముఖ్యమైనట్టివి. వారికి మానవాకృతులు నిషిద్ధములు కాన వారెక్కువగా లతలను, జాలవల్లికలను తీర్చుటలో తమ పనితనమును వెల్లడించుకొనిరి.

అక్బరు నుండి ఔరంగజేబు మృతి వరకు చిత్రలేఖనము చాలా వృద్ధి నొందెను. ఆనాటి దర్బారీ చిత్రకారులలో ముఖ్యులు బాల్చందు (1635), బిషన్‌దాస్ 91590), ఫర్రుఖ్ బేగ్ (1610), ఆలం (1650), మనోహర్ (1600), శివదాస్ (1623), పదార్థ్ (1620), ఇనాయత్ (1607), ఉస్తాద్ మన్సూర్ (1650), సహీషాబానూ (స్త్రీ–1650?), మీర్ హాసిం (1650?), ఫార్సీ లిపిని వ్రాయుట కూడ ముఖ్య కళగా పరిగణించిరి. పై కాలమందే యిదియు పరిణతినొందెను. క్రమక్రమముగా మొగల్ స్కూల్ నుండి కాంగడా కళయు, రాజస్థాన్ కళయు, దక్కనీ (గోల్కొండ) కళయు, గుజరాతీ కళయు నేర్పడెను.

ఇది కళలను గూర్చిన చర్చా లేశము. ఇక ఆంధ్రులలో కళలెట్లు విజృంభించినవో యెట్లు క్షీణించినవో సంగ్రహముగా తెలుసుకొందము.

కళలు - ఆంధ్రులు

హిందువులు తమ కళా లక్షణములను తమ నిత్య జీవితములో మేళవించిరి. ఇంటి గోడలపై చిత్తరువులు వ్రాయించిరి. చిత్రరేఖలు లేని బోడి చెంబులను వాడకుండిరి. అంచులు లేని చీరలను, ధోవతులను కట్టకుండిరి. కడపల లంకరింపబడని గృహములు లేకుండెను. సుందర రేఖలతో నింటిముంగిళ్ళలో ముగ్గులు తీర్చుచుండిరి. బొమ్మలతో పిల్లలాడు కొనుచుండిరి. బచ్చని కోళ్ల మంచాలు, సన్నని పనితనముగల ద్వారబంధాలు బహుళముగా నుండెను. స్త్రీలయలంకరణములు, ప్రసాధన క్రియలు, కళలలో భాగము గావింపబడెను. అడకొత్తులు, చేతికర్రలు, దంతపు పెట్టెలు, తాంబూల జాలములు, వివిధ లోహ విగ్రహములు, జలతారు (జర్‌తార్) బంగారు వెండితీగ పడుగు నేతలలోని పనితనము, కళలతో నిండినవై నిత్య జీవితముతో సమ్మిళితములై యుండెను. ఈ లక్షణములన్నియు తెనుగువారియందును ఉండెను. ప్రధానమగు లలిత కళలలో అనగా కవిత్వము, సంగీతము, నృత్యము, శిల్పములు – వీటిలో తెనుగు వారెంత సాధించిరో తెలుసుకొందము.

కవిత్వము : బ్రహ్మ సృష్టిని మించిన సృష్టి కవిదని మమ్మటాచార్య పాదులు సెలవిచ్చిరి. శక్తి, నిపుణత, అభ్యాసము అను మూడు గుణములు కావ్య హేతువులనిరి. ఈ నియమములు కళలన్నింటికిని వర్తించునని యెరుగవలెను. రసానుభూతినిచ్చు కవితయే యుత్తమ కవితయని సాహిత్యశాస్త్ర ముఖ్యాచార్యులు నిర్ణయించిరి. కళలన్నింటికి ఇవియు ప్రధాన లక్షణమని తెలుసుకొన్నాము.

ఈ సందర్భములో ఒక ముఖ్య విషయమును గురించి మనమాలోచింపవలెను. మతమునకు నిబంధనకారులుపకారులా యనిన నా యభిప్రాయములో అపకారులే. మరి కళల విషయమునను నిబంధనకారులు బయలుదేరి గ్రంథములు వ్రాసిరి. వారి వలన ఉపకారమయ్యెనా అపకారమయ్యెనా అనునది చర్చనీయము. సంస్కృతము జీవభాషగా నుండినప్పుడు పాణిని దాని కష్ట దిగ్బంధనముగా నష్టాధ్యాయిని బిగించెను. వారి తర్వాత భాషలో మార్పులు వచ్చినందున వరరుచి, పతంజలి మహర్షులు వార్తికేష్టులను చేర్పవలసి వచ్చినది. అంతటితో సంస్కృతము మాట్లాడు భాషగా నుండక ఆగిపోయెను అని కొందరు పండితులు వాదించినారు. తెనుగున నన్నయకు పూర్వపు పద్యాలు శాసనాలలో లభించినవి. అందలి భాష అత్యధికముగా దేశీ భాష, మరియు నన్నయకు పూర్వము ద్విపద భేదములగు పాటలు, వెన్నెల, వాలేశు, తుమ్మెద, యుయ్యెల, పర్వత, వంకర, నివాళి మున్నగు పాటలుండెను. వాగనుశాసనుడు తెనుగును సంస్కృతమునకు లంకె పెట్టగా తటాలు గొప్ప మార్పు జరిగెను. సంస్కృతమర్యాదలు, సంస్కృత పదాలు, భావములు, ఛందస్సు తెలుగులోనికి వచ్చెను. తమిళమునకు తెనుగునకు ఇదే భేదము కానవచ్చును. తమిళములో అచ్చముగా తమిళమున పండితులని పించుకున్నవారే కవిత్వము వ్రాసిరి. ఆ కవిత జన సామాన్యము నాకర్షింప లేదు. జనులు సుద్దులను, జంగము (తంగాళ) కథలను, ఏల పాటలను, సూళ్లను, ధవళాలను, యక్షగానాలను ఆశ్రయించిరి. అందు కూడ మనోహర కవిత కలదు. వాటిని రచించిన వారెవరో కాని వారే నిజమగు నిష్కామ కర్మము నాచరించినవారు వరూధిని, గిరిక, చూడకుదుత్తమ్మ, ప్రభావతి, కలభాషిణి యెవ్వరో యేమో జనసామాన్యమునకు తెలియదు. వారికి బాలనాగమ్మ, నాగమ్మ, పల్నాటి వీరులు, సమనాద్రి, సదాశివరెడ్డి, తాంద్రపాపారాయుడు, అలుగురాజు, ఆరె వీరులు, బాగా తెలిసినవారు.

ఇట్లుండ అప్పకవ్యాదుల నిబంధనలు కూడ బయలుదేరెను. అష్టాదశ వర్ణనలుండి తీరవలెననిరి. ఎవరుబట్టితే వారు గంటము పట్టగూడదనిరి. బ్రాహ్మణుడే కవిత వ్రాయవలెననియు, శూద్రుని కవిత యెంతమంచిదైనను కాకజుష్టంబైన హవ్యంబువోలె గ్రామ్యంబు కాదనియు అప్పకవి శాసించెను. అప్పకవి దెబ్బలను తప్పించుకున్న కదిరీపతి, రఘునాథరాయలు, చేమకూరు, రుద్రకవి, వేమన వంటివారు కొందరే ప్రశస్తమగు కవిత్వమును వ్రాయగలిగిరి. కవిత్వమందెట్లో శిల్పములందును నటులే. శిల్పకారులకు స్వేచ్ఛను, స్వబుద్ధిని ఇయ్యక శాస్త్రకారులు తమ యిచ్చను, తమ బుద్ధిని ప్రసాదించిరి. అందుచేత విగ్రహాలకు శాస్త్రముల కొలతలే ముఖ్యమయ్యెను. ఇండ్లకు శాస్త్రముల యాజ్ఞలే వేదవాక్కులయ్యెను. శిల్ప శాస్త్రములలో నుత్తమత్వము కానరాదు. పైగా శిల్పులకు క్షీణదశను ప్రసాదించి పోయెను.

కవితకుకాని, శిల్పములకుకాని, సంగీతమునకుగాని ఆదిలో శాస్త్రములు లేకుండెను. కొందరు మహాపురుషులు సర్వజనాహ్లాదకరముగా చేసిన రచనలను దృష్టిలో నుంచుకుని కొందరు శాస్త్రకారులు బయలుదేరి ఇదిట్లు అదిట్లు ఉండవలెనని శాసించిరి. ఆ శాసకుల తర్వాత వచ్చిన వారిలో చాలామంది వారి నిబంధనలకు లోనై సంచిలోని సామానుల వలె కళలకు సంబంధించిన వస్తువులను సిద్ధము చేసిరి. అది క్షీణ దశకు సూచన. కొందరు శాస్త్రకారుల ధిక్కరించి తమ స్వేచ్ఛను ప్రకటించుకొనిరి. వారు ధన్యులైరి.

శిల్పములను గురించిన వాస్తుశాస్త్రములు తర్వాతి శిల్పులలోని స్వతంత్ర బుద్ధిని చంపివేసెను. ఈ విషయము నేపర్స్ బ్రౌన్ గారు తమ ఇండియన్ ఆర్కిటెక్సర్‌లోనిట్లు తెలిపినారు.

"The silpa sastras that compiled with the best of intentions cast their shadow over the arts, so that they never fully recovered either elasticity and natural charms - .....".

"That it also affected literature is proved by the production of the Alankara and there are indications that similar regulations were planned for the guidance of several of the arts. It has been found that any discipline, operated by a fixed set of rules is apt to emerge only during periods of intellectual stagnation of any such system is bound to impai spontaneity of expession. The silpas fall into this category with the result that they stifled initiation and stuck at the very root of inspiration only the genious of the Indian workman could rise above it....". (p. 75)

తెనుగు కవితలో అప్పకవి కాలము నుండి క్రీ.శ. 1900 వరకు అంధకారము ప్రవేశించెను. కవిబ్రహ్మ "నేనుభయకావ్య ప్రౌఢిఁబాటించు శిల్పమునన్ బారగుడన్" అని చెప్పెను. కవిత్వము శిల్పమనెను. తాను కళావిదుడనని చెప్పుకొనెను. ఆ భావము అప్పకవితో నెగిరిపోయెను. అతని యాజ్ఞలకు బద్ధమైన కవిత ఇటుక బట్టీ నుండి దిగిన ఒకే నమూన యిటికెల వలె పద్యాలు శబ్దాలంకారాలతో సిద్ధమయ్యెను. ద్వ్యర్థి, త్ర్యర్థి, చతురర్థి, బహ్వర్థి పద్యాలను, నాగచక్ర ఖడ్గాది బంధములను, ఏకాక్షర, ద్వ్యక్షర, త్ర్యక్షర పద్యములను రచించుటయు కవిత్వమని భ్రాంతిపడినవారి సంఖ్యయే యెక్కువయ్యెను.

ఈ శతాబ్దములో ఇంగ్లీషు భాషా ప్రభావముచే మన కవితలో నూతన చైనత్యము కలిగెను. కతలు, పాటలు, నాటకములు, నవలలు, చరిత్ర రచన, విమర్శ, పరిశోధన, భూగోళము, సైన్సులు అన్నియు విజృంభించుచూ వచ్చినవి. మోటు యక్షగానాలు పోయినవి. ఉత్తమ నాటకాలు వచ్చినవి. శబ్దములతో గరడీ సాములు చేయు స్వాములు మాయమగుచున్నారు. ఈ కాలములో, పూర్వకాలపు పాండిత్య శౌండీర్యముతో కూడిన పటిష్ఠ కవిత్వము లేదని కొందరు విచారపడుతున్నారు. లేకపోవచ్చును. తెనుగునకు దీర్ఘ సంస్కృత సామాసాలు ముఖ్యము కావు. ఈనాడు వాఙ్మయమందు నూతన జీవకళ కానవచ్చుచున్నది. నీరాజనము చేయుచున్నది. పాతవాటిని ఖాతరు (అస్పష్టము).

అయితే ఒక్క విషయమును గూర్చి పూని చెప్పవలసి యున్నది. మనలో బాల బాలికల పాటలు చాలా కలవు. ఇద్దరు ముగ్గురు చాలా కొద్ది పాటలను కూర్చి ప్రకటించిరి. అదేవిధముగా స్త్రీల పాటలు కొల్లలుగా కలవు. మంజువాణివారు కొన్ని ప్రకటించిరి. సికింద్రాబాదులో కొన్ని పాటలు చాలా తప్పులతో ప్రకటించినారు అంతే. పల్లెపాటలు ప్రతి ప్రాంతమందు విరివిగా కలవు. ఆ ప్రాంతాలలోని గొప్ప సంఘటనలను పాటలుగా అజ్ఞాత కవులల్లుట, వాటిని చదువురాని పల్లెపడుచులు జ్ఞాపకముంచుకుని పాడుట పరిపాటియైనది. ఇదంతయు వేదోత్పత్తి యొక్కయు, దాని పాతకుల యొక్కయు పోలిక కలిగినట్టిది. కలుపు తీయునప్పుడు, మోటకొట్టునప్పుడు, కోలంట్లు వేసినప్పుడు, చేలు కోసినప్పుడు, కల్లపు బంతులాడునప్పుడు, బండ్లు తోలునప్పుడు, బరువులు మోసినప్పుడు, విసిరినప్పుడు, దంచినప్పుడు, కూలినాలి చేసి వెన్నెలలో విశ్రాంతి కొనినప్పుడు, వేడుకలప్పుడు – ఇట్టి బహు సన్నివేశములందు పల్లెపల్లెలో పాటలు పాడుదురుగదా! వీటిని సమకూర్చుట ఒకరిచేనగు పనియా? ప్రతి మండలము వారును దీనికై శ్రమించిన మన జానపద గీతములకు వికాసమును, ప్రాచరమును కలుగును. హిందీ, మరాఠీ, కన్నడీ, గుజరాతీ – బాషలలో నిట్టిపని బాగా జరిగినది. మనమే వెనుక బడినాము.

సంగీతము : భారతీయ భాషలన్నిటిలో సంగీతమునకు తగినట్టి శ్రావ్యమైన భాష అంధ్రము. ఇది మాతృభాషాభిమానముతో చెప్పిన మాట కాదు. ఆనాటి ప్రముఖులన్న మాటల అర్థమునే చెపుతున్నాను. "ఆంధ్రత్వ మాంధ్ర భాసాచనాల్పస్య తపసః ఫలం" అని తమిళ అప్పయ్య దీక్షితులు, "దేశభాషలందు తెలుగు లెస్స" అనిన తుళువాన్వయుడు, "ప్రాచ్య ఇటాలియన్" అని యొక యాంగ్లేయుడును, "అరవం అరుసు, కన్నడి బిరుసు, తెనుగు సరసు" అని యొక మహారాష్ట్రుడును ప్రశంసించి యుండిరి. ఆంధ్ర "సారస్వత సారస్య విచారస్తుతమతి "మల్కిభరాముడు' ' పెక్కు కృతుల్ చమత్కృతులు పెంపుగ నందితిగాని నీదు సత్కృతి కన్యపై గల మమత్వము వర్తిలదందు" అని గంగాధర కవి కృతి నందెను. "అచ్చ తెనుగు గబ్బమున్న యెడల మంచి వెలయు" అనెను అమీరు భాను. కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు త్యాగరాయకృతులు కొన్ని చయైనను నేర్వక గణన కెక్కిన గాయకుడు కాడని యందరెరిగిన సంగతియే. మహారాష్ట్రుడగు చిదంబర కవి తన యంగదరాయబార కావ్యమునందు ఆంధ్ర భాషా మాధుర్యమే తానా భాషలో వ్రాయుటకు కారణమయ్యెనని చెప్పెనని శతక వాఙ్మయమదు శ్రీ వంగూరి సుబ్బారావుగారు వ్రాసిరి.

సంగీతములో కవితలో వలెనే దేశీమార్గ విభేధ ద్వయము కలదు. దేవీ గానమందు పాల్కురికి సోముడు పేర్కొనిన వెన్నెల, తుమ్మెద మొదలగు పాటలును, అప్పకవి ఛందస్సులో చేరిన సువ్వాలు, ధవళాలును, క్షేత్రయ్య, సారంగపాణి పదాలును, ఏల పాటలును, సుద్దులును, ద్విపదలును, ఇట్టివన్నియు చేరిన వనుకొందును. తెలుగువారి సంగీతములో వీర, భక్తి, శృంగారములనునవి కలవు. పల్నాటి వీరులపాటలు, సుద్దులు, (తందాన పాటలు) వీర సంబంధమైనవి. త్యాగరాజు కీర్తనలు, ముద్దుళని యిష్టపదులు, నారాయణతీర్థుల కృష్ణ లీలా తరంగిణి, వీరబ్రహ్మం, యాగంటయ్య, శిద్ధప్ప మొదలగు భక్తుల తత్త్వాలు, హరకథలు, రామదాసాది చరిత్రలు, భక్తికి సంబంధించినవి. క్షేత్రయ్య పదములు, జావళీలు, శృంగారమునకు సంబంధించినవి.

విజయనగర చక్రవర్తుల ఆకలములో తంజావూరు నాయకరాజుల కాలములో ఆంధ్రుల గానవిద్య మహోన్నతస్థితికి వచ్చెను. ఆంధ్రరాగిణి యొకటి యేర్పడెను. సంగీత శాస్త్రమందు రచనలు జరిగెను. తంజావూరు రునాథ రాయలు "రఘునాథ మేళ" అను క్రొత్త వాద్యమును కనిపెట్టెను. సంగీత సాహిత్య విద్యా రహస్య నిధిని అని రామరాజ భూషణుడు చెప్పికొనెను. జనులలో 'జతిగ్రామ' విధానమను గానముఖ ప్రీతిమెండుగా కాకతీయుల కాలమందుండెనేమో. క్రీడాభిరామ మిట్లన్నది.

"ద్రుత తాళంబున వీరగుంభితక ధుం ధుం ధుం కిటాత్కార సం

గతి వాయింపుచు నాంతరాళిక యతి గ్రామాభిరామంబుగా" నొకతె పాడెనట. తెనుగు సంగీత విద్వాంసులు పరరాజాస్థానములలో విద్వాంసులై యుండిరి. వితలుడను నాంధ్రుడు సంగీత రత్నాకర భాష్యమును రచించెను. అతని తండ్రి 27 రాగ ద్రుతులలో ప్రవీణుడగుటచే గుజరాతులోని మాండ్వీ సుల్తానగు గయాసుద్దీన్ మహమ్మద్ వెయ్యి తులముల బంగారుతో బహూకరించెను. ఆర్యులలో వేద ద్రష్టలు వేదగానమును ప్రచారము చేసిరి. మొత్తము భారతీయులలో నాంధ్రులే నేటికిని ఉత్కృష్టముగా వేదగానము చేయువారు. అందువారిని మించినవారు లేరు. ఇన్ని సులక్షణములుండినను తమిళులలో గానవిద్య వ్యాపించిన రీతినాంధ్రులలో వ్యాపించలేదనియే చెప్పవలెను.

నాట్యము : భరతుడు నాట్యమున కొక శాస్త్రమును వ్రాసెను. అందిట్లు నుడివినాడు. "నానాశీలః ప్రకృతయః శీలేనాట్యం ప్రతిష్ఠితం / తస్మాల్లోక ప్రమాణం హి జ్ఞేయం నాట్యం ప్రయోక్తృభిః" - ఎన్ని శాస్త్రాలు చెప్పినను అనుభవస్థుడగు నటకుడు లోక వృత్తములనే బాగుగా గమనించి అభినయాదులు నేర్చుకొనవలెనని భరతుడనెను. (25వ అధ్యాయము) ఇది చాల ముఖ్యమైన విషయము.

కవితలో వలె, సంగీతములో వలె నృత్యములోను దేశిమార్గ విధానము లుండెను. ఆర్యులు ప్రవేశపెట్టిన నృత్యము లెట్టివో సరిగా చెప్పజాలము. భరతుని శాస్త్రీములో దేశి నృత్యాలు లేవనజాలము. అవే యెక్కువయేమో? దానినొక శాస్త్ర పద్ధతిగా సమకూర్చి యుండును. ఆదిమ నివాసులలో గర్భ నృత్యము వంటి వెక్కువ. సంస్కృతములో నాటకములు మంచి పరిణామము నొందినవి. అవి మన తెనుగున మన కాలములోనే కానవచ్చినవి. విలక్షణముగా నాటకములన్నియు యక్షగానములే. సుమిత్రా, జావా ద్వీపములకు వలసపోయినపుడు యక్షగానములను ప్రవేశ పెట్టినట్లున్నది. యక్షగానాలను గురించి సలక్షణముగా ప్రత్యేక గ్రంథమును వ్రాయుట చాలా అవసరము. ఇప్పటికిని వాటి యవశేషములందందు పల్లెలలో మిగిలినవి. అచిర కాములోనవి పూర్తిగా మాయమై పోగలవు. యక్షగానాలకు అప్పకవి లక్షణమును వ్రాసెను. అనగా అతనికి ముందు నుండియే అవి ప్రచారమందుండెను. 1250 నాటి వాడగు పాల్కురికి సోమనాథుని కన్న ముందే యుండినట్లు "అటుగాక సాంగ భాషాంగ క్రియాంగ, పలు నాటకంబుల నటియించువారు" (పండితారాధ్య చరిత్ర) అనుదాని వలన స్పష్టము. తంజావూరి నాయక రాజుల కాలమున యక్షగానాలకు పరిపూర్ణ పరిపాక దశ. సంస్కృత నాటకములను అనుకరించుట గాని, లేక అనువదించుట కాని మన కాలము వరకు లేకపోవుట మనలోని విచిత్రములలో నొకటియై యున్నది. అభినయముతో కూడిన నృత్యము విశేషముగా అనార్యులందే జన్మించి శోభించినట్లు నిదర్శనములు కానవచ్చును. మళయాళీల కథాకళి, గుజరాతీల లంబాడీల గర్భనృత్యము విశేషముగా అనార్యులందే జన్మించి శోభించినట్లు నిదర్శనములు కానవచ్చును. మళయాలీల కథాకళి, గుజరాతీల లంబాడీల గర్భ నృత్యము, అస్సాంలోని మణిపురీ నృత్య విధానము. ఆంధ్రులలోని కూచిపూడి నృత్యము ముఖ్యముగా నీ సందర్భమున పేర్కొనదగినవి. తెలుగు దేశమందు బహు ప్రాంతములలో నొక విధమగు పల్లెటూరి స్త్రీలలో గర్భ ౹నృత్యముకలదు. తెలంగాణాలో దానిని బతుకమ్మ ఆట అందురు. రాయలసీమలో బొడ్డెమ్మ అందురు. ఒక స్త్రీ తట్టనిండుగా (బొడ్డెగా) చెండు పూల (బంతిపూల)ను గోపురాకారముగా పేర్చి పట్టుకొని కూర్చొనగా నామెచుట్టు పాటలు పాడుచు వంగుచు లేయుచు చప్పట్లు చరచుచు చుట్టును అందెలు వేయుచు తిరుగుదురు. మన వాఙ్మయములో పాల్కురికి సోమనాథుని కాలము నుండి గొండలి నృత్యము పేర్కొనబడినది.

"కోలాటమును బాత్రగొండి పేరణియు

కేళిక జోకయు లీలనటింప" (బసవ పురానం, 22వ పేజీ).

అని యితడు వర్ణించెను. శ్రీమానవల్లి రామకృష్ణ కవిచరణులిట్లు వ్రాసిరి. "జాయ సేనాని యొ్క నృత్తరత్నావళిలో 'చాళుక్య భూలోకమల్ల సోమేశ్వరుడు' దానిని ప్రచారము చేసెను".

తన రాజ్యములో దానికి ప్రచారము కల్పించగా దానికి గోండికలు, గొండిలి, గొండ్లి అని క్రమముగా పేర్లేర్పడెను. శ్రీనాథుడు క్రీడాభిరామములోను పెదవాటి ఎర్రనార్యుడు మల్హణచరిత్రలోను నృత్య భేదములను వర్ణించినారు. జాయసేనాని నృత్యభంగిమలను రామప్ప గుళ్ళలోని శిల్పములు నిరూపించిన వందురు. ఆ రెంటిని అనంతరము వారు పాటింపకుండుట విచారకరము. అభినయ దర్పణమును వ్రాసినాడు గూడా ఆంధ్రుడే. దానిన బంగాలీలు మెచ్చుకుని ప్రకటించిరి. మనలో పగటి వేషాలు (బహురూపులు) ప్రాచీనమైనవి. అందు హాస్యము, నృత్యము, ఏకాంకికా నాటకము అన్నియు సమ్మిళితములైనవి. మన పగటి వేషముల వలె మళయాళములో చాక్యార్లు అనువారు భావాభినయముతో నాటకాలాడెడివారు. ఈనాడు ఇంగ్లీషు ద్వారా యూరోపులోని ఉదాత్త నాటకముల పరిచయము వలన మనలో కొన్ని మంచి నాటకములు వెలువడినవి. కూచిపూడి నృత్యమునకు మనము బాగా దోహదమీయవలెను.

శిల్పములు : భారతదేశ శిల్పములలో అమరావతీ శిల్పములకు విశిష్ట స్థానము కలదు. ప్రాచ్య పాశ్చాత్య శిల్ప కళావేత్తలు దానిని పరి పరి విధముల మెచ్చుకొనినారు. క్రీస్తు శకము ఆరవ శతాబ్దము వరకు బౌద్ధ శిల్పములను, పిమ్మట పల్లవ శిల్పము (600-900), తర్వాత చోళశిల్పము (900-1150), తదనంతరము చాళుక్య శిల్పమును క్రీ.శ. 1150 నుడి కాకతీయ శిల్పము, 1350 నుండి 1565 వరకు

విజయనగర శిల్పము, 1600 నుండి 1700 వరకు తంజావూరి, మధుర నాయక రాజ్య శిల్పము ఆంధ్రులలో వెలసెను. ప్రతి కాలము నందును శిల్పములలో భేదము కలుగుచు వచ్చెను. బౌద్ధము, జైనము, శైవము, వైష్ణవము, ఒక్కొక్క కాలమందు విజృంభించి యణగుచు వచ్చెను. వివిధ సంప్రదాయములను, గ్రీకు రోము సంప్రదాయములను, ఈజిప్టు అస్సీరియా సంప్రదాయములనేగాక, విజయనగర, తంజావూరి కాలాలలో మొగల్ శిల్పమును కూడ ఆంధ్రులు తమ ఆదికళతో సమ్మేళనము చేసిరి. ఉండవెల్లి వంటి గుహా శిల్పములు, ఎల్లోరా అనుకరణములు. ఒరంగల్, రామప్ప గుడుల శిల్పము మరొక ప్రత్యేకత కలది. అలంపురీ శిల్పము తృతీయం పంథలోనిదని జేముస ఎల్.కుజిన్సుగారు చాలా మెచ్చుకొనిరి. వేములవాడలో మొదట జైన దేవాలయములుండెను. వాటిని శైవాలయములుగా మార్చిరి. కొలనుపాకలో ఇప్పటికిని జైన శిల్పములే కలవు. రామప్ప గుడుల గోపురాల యిటుకలు చాల పెద్దవిగా కానవచ్చు చున్నవి. శిల్పకారులు వంశ పరంపరగా తమ విద్యను వృద్ధి చేయుచు వచ్చిరి. వారిని గూర్చిన చర్చ తిరువెంగళనాథుని పరమ యోగి విలాసములో పలుమారు వచ్చినది. ఆంధ్ర దేశమందంతటను అడుగడునకు సుందర శిల్పములు కలవు. ఓరుగల్లు, విజయ నగరము తురకల చేత పూర్ణముగా ధ్వంసముగాకుండిన ఆ వైభమెట్లుండెడిదో? శిథిలాలయములను గురించి తెలుపుచు వ్రాయుట యవసరము. శాలివాహనుల కాలము నుండి తంజావూరి పతనము వరకు మన శిల్ప నిర్మాణ చరిత్రను విపులముగా సచిత్రముగా వ్రాయించి ప్రకటించుట యుత్తమ కృషి.

తంజావూరి పతనముతో ఆంధ్రుల శిల్పమాగిపోయెను. ఆంధ్ర శిల్పకారులు నిరాశ్రయులై పోయిరి. ఈ నాటుకోటు చెట్లు (చెట్టియార్‌లు) పుణ్యమా అని తమిళనాట ప్రాచీన శిల్పి కుటుంబాలవారు ఇంకనూ హతశేషము వలె మిగిలి యున్నారు. తెనుగు దేశములో దేవాలయ నిర్మాణములు చేయువారు మన శిల్ప కళను వెదకియుద్ధరింతురుగాక.

తెనుగువారిలో చిత్రకార విద్య పరమావధి పొంది యుండెను. చిత్రములో చిత్రమేమన మనలో ప్రాచీన చిత్రములు మాయమైనవి.

"కోలదాపున ద్రిక్కటి గూడియున్న
గచ్చు చేసిన చిత్రంపు గద్దె పలక
వ్రాసినారదె చూడరా వైశ్యరాజ
శీల బ్రహ్మాది వీరనాసీర చరిత. (క్రీడాభిరామం).

అదెక్కడ చూడవలెను. మాచల్దేవి – ప్రతాపరుద్ర ధరణీశోపాత్త గోష్ఠీపారీణ – "చిత్రశాలా ప్రవేశంబు చేయుచున్న యది పుణ్యాహవాచన కాలంబు" అదెందు గలదు? బోగమువారిండ్లలోను, సాధారణుల యిండ్లలోను గచ్చు గోడలపై శ్రీరామ శ్రీకృష్ణాదుల రూపులు రంగు రంగులతో తీర్చుచుండిరని పల్నాటివీర చరిత్రయు తెలిపినది. విజయనగర రాజుల మేడలలో గోడలపై రాజుల చిత్రములు సీజవులైన వారిని పూర్తిగా పోలినవై అద్భుతమైనవి నుండెనని ఈరానీ, పోర్చుగీసు రాయబారులు చూచి మెచ్చుకొనిరి. అవన్నియు నెక్కడ గలవు. ఓరుగంటి పతనముతో, విజయనగర పతనముతో అన్నియు ధ్వంసమయ్యెను. లేపాక్షి దేవాలయములోని చిత్రములు ఆనాటి ఆంధ్ర స్త్రీ పురుషుల వేషభూషలను సుందరముగా నిరూపించినవి. గద్వాలలో 250 ఏండ్ల క్రిందట దేవాలయ భిత్తిపై కొన్ని చిత్తరువులు వ్రాసినవి ఇప్పటికిని కాననగును. కాని లేపాక్షిలో వలెనే గద్వాలలో సున్నపు రంగుచే కొన్ని చిత్రములు రూపు మాపినవి. హైద్రాబాదులో రెండవ నిజాము కాలములో వెంకటప్పయ్య అను నాంధ్రుడు నిజామలీ దర్బారును రంగులతో బంగారు వెండి నీరుతో అతి సుందరముగా చిత్రించినది సాలార్జంగు వద్ద కలదు. గద్వాలలో 250 ఏండ్ల క్రిందట ఉద్యోగ పర్వమును సచిత్రముగా వ్రాసిరి. చిత్తరువులతో కూడిన ఆ గ్రంథమిప్పుడు హైద్రాబాదు రెడ్డి హాస్టలులో కలదు. గద్వాలలో 'చిత్తారు' వారి వంశాలున్నవి. కర్నూలులో పూర్వపు విజయనగర సామంతుల తర్వాత కర్నూలు నవాబుల నాశ్రయించి జీవించిన చిత్రకారుల కుటుంబాల వీధినిప్పుడు "చిత్తరుగేరి" యందురు. వారి కళ యిప్పుడు వీధి పేరునందు మాత్రమే కలదు.

అదేవిధముగా తూర్పు జిల్లాలలో జమీందారుల వద్ద విజయనగర సామ్రాజ్య చిత్రకారుల వంశము వారు మిగిలి వారి చిత్తరువులు వ్రాసి యిచ్చి యుందురు. అది నిజమగునో కాదో? జమీందారులు తమ వద్ద నుండిన చిత్తరువులు ప్రాచీనములందురు. ఇతర శిల్ప వస్తువులను ప్రదర్శించి వివరించి ననే కాని మనకు తెలియ రానేరదు. విజయనగర పతనానంతరము కళలన్నియు క్షీణించి క్షీణించి యదృశ్యమై పోయెను. అ వినాశ సౌలభ్యమునకు మనము బాగుగా తోడ్పడినాము. అమరావతి చలువరాళ్ళను సున్నానికి కాల్చినాము. గోపురములందలి యిటికెలను పాలమూరు జిల్లాలోని గంగాపురములో వలె ఇండ్లకు వాడినాము. ప్రాత దేవాలయములను దేవరకొండలో వలె మరుగుదొడ్లను (పాయిఖానాలను)గా చేసినాము. పడిపోయిన దేవాలయముల రాళ్ళను, అందలి శాసనములను గద్వాలలోని పూడూరులో వలె బావుల మెట్లకును, చెరువు తూములకును వాడినాము. మనకు రాను రాను సున్నము, ఎర్రమన్ను రెండే రంగులు చేజిక్కెను. వాటితో విగ్రహాలు కల స్తంభాలపై గోడలపై చిత్తరువులు కల గోడలపై పట్టెలు కొట్టినాము. అలంపూరు, బూదుపూరు (పాలమూరు జిల్లా) వేములవాడ, కర్నూలు, ఓరుగల్లు వంటి స్థలాలలో కొన్ని దేవాలయములు, మసీదులుగా మారెను. ఈ విధముగా మన శిల్ప సంపద నాశనమై, ధూళియై, పూడినదై భస్మమై పోయినది.

ఇంగ్లీషువారి సంబంధము వలన మరల మనలో చిత్రకళ నూతన తేజస్సుతో విజృంబించినది. నవీన చిత్రకారులకు ప్రోత్సాహము కలిగించి వృద్ధికి తేవలసిన బాధ్యత పత్రికలపైనను, ధనికులపైనను, విద్వాంసులపైనను కలదు. ఇది మనలోని పిపాసకు సంగ్రహ నివేదిక.

(సురవరం దస్తూరి నుండి)

అడవి బాపిరాజు

శిల్పము - చిత్రలేఖనము

పూర్వకాలమునుంచీ ఆంధ్రులు లలితకళలన్నిటిలోను మహోన్నత స్థానము వహించి, ఇతర దేశాలవారికి మార్గదర్శకులై వుండే వారు. కవిత్వంలో, శిల్పంలో, చిత్రలేఖనంలో, సంగీతంలో, నాట్యంలో, ఆలయ నిర్మాణంలో, ఇతర కళావస్తు నిర్మాణ పరిశ్రమలోను – పురాతనాంధ్రచరిత్ర కాలంనుంచీ మొన్నమొన్నటి వరకు తమ ప్రత్యేకత, ప్రతిభ, ప్రజ్ఞ వ్యుత్పన్నత ప్రదర్శించినారు.

ఆంధ్రులు మహా సామ్రాజ్యాలను నిర్మించారు. పరిసర రాజ్యాలపై ఛత్రాధిపత్యము వహించారు. పూర్వ పశ్చిమ సముద్రతరంగాలలో వీరి జయభేరీలు మ్రోగినవి. శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, చాళుక్యులు, కాకతీయులు, విద్యానగరేంద్రులు ఒకరితర్వాత ఒకరు శ్వేతాంధ్రఛ్ఛత్రాన్ని ముడవకుండా, దాని అలంకార రత్నకాంతులను దశ దిశలకు వ్యాపింపజేశారు. ఆ సామ్రాజ్యాల కాలాలలో శిల్పాది లలితకళలు మహోన్నత శిఖరాలపై కుబికిపోయినవి.

మన శిల్పములుగల స్థలములు, పరిచయము

పూర్వాంధ్ర శిల్పుల ఈ శిల్ప చిత్రలేఖన ప్రతిభ కన్నులార దర్శించి, వెనకటి మన ఔన్నత్యానికి ఉప్పొంగి, ముందు రాబోవు మన శిల్పకృషికి ఉత్సాహవంతులై నూత్న దీక్షోన్ముఖులు కావాలంటే ప్రతి ఆంధ్రుడు అజంతా, ఎల్లోరా, నాసిక, కార్లేకన్హేరీ గుహలు, కోనూరు, కొలనుపాక, ఒరంగల్లు, పాలంపేట, విజయవాడ, అల్లూరు, గరికపాడు, ఘంటశాల, అమరావతి, నాగార్జునకొండ, మాచెర్ల, చేజెర్ల, చేబ్రోలు, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, గోలి, రామిరెడ్డిపాలెం, వేంగి, ఆరుగొలను, గుంటుపల్లి, రాజమహేంద్రవరం, భీమవరము, ద్రాక్షారామము, శాలిహుండము, రామతీర్థము, సంఘారామము, విజయనగరము, సింహాచలము, ముఖలింగము, పూరి, కోణార్క, జగన్నాథము, బాపట్ల, కొండవీడు, నెల్లూరు, కాళహస్తి, తిరుపతి కొండ, చెన్నపట్టణము, తాడిపత్రి, గుత్తి, హంపి, పెనుగొండ, లేపాక్షి, కంచి, మహాబలిపురము, పక్షితీర్థము, తంజావూరు, తిరుచునాపల్లి, మధుర, రామేశ్వరము మొదలగు ప్రదేశాలకు వెళ్ళవలెను.

కళ-మన దృష్టి

కళాతత్వ విచారణ పాశ్చాత్యులు ఒక రకంగాను, మనవారు ఒక రకంగాను చేసియున్నారు. జర్మను పండితులు మొట్ట మొదటగా పాశ్చాత్యభావాలలో భారతీయ భావాలను జొనిపి, సౌదర్యతత్త్వ, కళాతత్త్వ విచారణలో క్రొత్త పంథాలు త్రొక్కారు. క్షణమాత్రం వాటి అన్నింటిమీద దృష్టిని త్రిప్పుదాము. శుక్రాచార్యులు వారు,

"ధ్యాన యోగస్య సంసిద్ధే ప్రతిమా లక్షణం స్మృతమ్,
ప్రతిమా కారక మర్త్యో యథాధ్యాన రతో భవేత్,
తథానాన్యేణ మార్గేణ ప్రత్యక్షేణాపివా ఖలు
దేవానాం ప్రతిబింబాని కుర్యాచ్ఛ్రేయ స్కరాణి చ,
స్వర్యాణి మనవాదీనా మస్వర్గ్యాణ్య శుభానిచ
అపిశ్రేయస్కరం నృణాందేవలంబిన్దులక్షణం
సలక్షణం మర్త్యబింబం నహి శ్రేయస్కరం సదా".
అని భారతీయ శిల్పం యొక్క ఆశయం అగ్ని పురాణంలో చెప్పారు.
"ధర్మార్థ కామమోక్షేషు వైచక్షణ్యం కళాసుచ" అని చెప్పియున్నారు.
"చిన్మయ స్యాఽ ద్వితీయస్య నిష్కలస్యాశరీరిణః
ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా" అనిన్నీ;

"సాధకానాం హితార్థాయా బ్రహ్మణోరూపకల్పనా" అనిన్నీ కులార్ణవతంత్రమందు చెప్పియున్నారు. ఏ శిల్పకారుడైనా కళ–భగవదన్వేషణార్థం, ధర్మార్థ కామమోక్షాది చతుర్విధ పురుషార్థం అని, స్పష్టంగా చెప్పాడు.

భగవంతుడే సత్యం, శివం, సుందరం అయినట్టివాడు. కాబట్టి ఆ సత్యాన్ని, ఆ శివస్వరూపాన్ని, ఆ సౌందర్యతత్వాన్ని భావించడం, రూపించడం కళాలక్షణం, శిల్పలక్షణం.

ఈ కళాస్వరూపాలు సంగీతము, కవిత్వము, చిత్రలేఖనము, శిల్పము, నృత్యము, ఆలయ నిర్మాణము కదా! ఈ విద్యలు పూర్వకర్మ సముపార్జిత శక్తివల్ల జనించినవి. అందరికి భగవంతుని ఛాయయైన ప్రకృతినిచూసి ఆనందించే లక్షణం ఉంది. ఆ ప్రకృతి భౌతిక రూపంగా, మనోమయ రూపంగా, బుద్ధిపూర్వకంగా ప్రత్యక్ష మవుతూ ఉంటుంది. అలాంటి అప్పుడు, ఆ ప్రకృతిలో తన మనస్సుకిగాని, హృదయానికిగాని, బుద్ధికిగాని, ఆత్మకుగానీ ఆనందం కలిగించితే ఒక దృశ్యం, ఒక రూపం, ఒక జీవితం, ఒక భావము కళాశక్తి గలిగిన రసజ్ఞునికి గోచరించినపుడు అతనిలో వుండే కళాశక్తి పైకి ఒక స్వరూపంగా జన్మించాలని ఆవేదన పొందడంచేత, కళాస్వరూపం ఉద్భవిస్తూన్నది. ఆ కళాస్వరూపంలో ఉన్న ముఖ్యలక్షణం ఆనందం. ఆ సృష్టి భాషాస్వరూపమైతే కవిత్వము, వర్ణస్వరూపమైతే చిత్రలేఖనము, మూర్తిస్వరూపమైతే శిల్పము, అంగవిక్షేపస్వరూపమైతే నృత్యము, భవన స్వరూపమైతే ఆలయము అగును.

కళాతత్త్వ విచారణచేస్తూ పాశ్చాత్యులు రెండు మార్గాలు త్రొక్కారు. ఒకటి గ్రీకుపంథా, రెండవది జర్మనుపంథా. సోక్రటిస్, ప్లాటో, అరిస్టాటిల్, ప్లాటినస్ మొదలైన వార్లంతా నీతివాదమార్గాన్నే వెళ్ళారు. చాలా కాలంవరకు ఆ నీతివాదమే కళాతత్త్వజ్ఞులు ప్రకటించారు. కానీ కళాస్రష్టలు మాత్రం, ఈతత్త్వ విచారణతో అవసరం లేకుండా భౌతికము, మనోమయము అయిన సౌందర్యాన్ని గ్రీకు, ఇటలీ దేశములలో సృష్టించి, లోకమున కనుగ్రహించారు. ఫ్రెంచి దేశస్థుడైన మకెట్ శిల్పి, జపాన్ చిత్రలేఖన సౌదర్యం దర్శించి "అనుభావ చిత్రలేఖన సంప్రదాయం (Impressionism) సృష్టించేవరకు పాశ్చాత్య శిల్పులందరూ గ్రీకు శిల్పులనే అనుగమించారు" అన్నాడు.

భారతీయ సంప్రదాయ ప్రపంచమును సందర్శించి ఆనందించిన జర్మన్ పండితులు కళా తత్త్వ విచారణలో రెండవమార్గం త్రొక్కినారు. అది భారతీయవాదానికి దూరపుబిడ్డ. ఈవాదంలో ముఖ్యుడైన హెగెల్ చెప్పిన మాటలు మనవి చేసుకొంటాను.

"Art is that in which the absolute, is immediately present to sensuous perception... The beautiful is the shining of the idea through a sensuous medium ... The form of the beautiful is the unit of the manifold.... The beauty of nature is the immediate unity of notion and realit, but in art it is that where there is the highest revelation of the beautiful".

"అనంతత్త్వము యొక్క భౌతికమూర్తి సందర్శనమే కళ.... జ్ఞానేంద్రియముల ద్వారా భాసించు భావమే సౌందర్యము.... అనేకత్త్వము యొక్క ఏకదేశిత్వమే సౌందర్య స్వరూపము. సత్స్వరూపము యొక్క మనోమయావతరామే ప్రకృతి సౌందర్యము; కళయందే సౌందర్యము యొక్క పరమ సందర్శనము కలుగుచున్నది".

భారతీయ శిల్పాన్ని సందర్శించి, ఆ ఆశయము శిల్పము యొక్క పరమోద్దేశములని లోకానికి వెల్లడించి చెప్పిన పాశ్చాత్య సౌందర్య తత్త్వజ్ఞుల మాటలను స్మరించటం నావిధియై యున్నది.

ఎరిక్ జీవ్ గారు "In all Indian art there is a recognition of the fact that art is primarily prohec - that is a translation into material form of the inspiration man receives from God" అన్నారు.

"కళ యొక్క మూలసూత్రం ప్రవచన స్వరూపమన్న సత్యమునే ఆదర్శముగా ఉంచుకొనినట్లు భారతీయ శిల్పమునందు మనకు ద్యోతకమగుతున్నది. భగవంతుని నుండి మనుష్యుడు పొందు ఆవేశము యొక్క భౌతికానువాదమే కళ".

ప్రఖ్యాత ఫ్రెంచి శిల్పకారుడైన రోడిన్, నటరాజమూర్తిని దర్శించి నప్పుడు :

"Full blown in life, the river of life, the air, the sun, the sensibility to be in an overflow-that is how it appears to us-the art of India".

"జీవిత మహాప్రవాహంలో జన్మించి, కాంతిలో విలసిల్లి, దెసలవ్యాపించి, జీవితాన్ని అధిగమించిన శక్తిని అలవరించి – ప్రఫుల్లమైనది భారతీయ శిల్పం" అన్నాడు.

"గ్రీకు శిల్పము, మనుష్యుని యొక్క ఉచ్ఛ స్థితియే భగవంతునిగా సంభావించినది. కానీ, హైందవభావనము దీనికి విపరీతముగా నడిచినది.

అది, భగవంతుని మనుష్యుని యొక్క పరిపూర్ణత్వముగా భావించలేదు; కాని పరిపూర్ణముగాని భగవంతునిగ మనుష్యుని ఎంచినది. అనగా నియమింతుడైన భగవంతుడని తాత్పర్యము".

శాతవాహన శిల్పము

శాతవాహనుల కాలమునకు ముందు ఉండే శిల్పము ఎక్కువగ దొరకలేదు. చంద్రగుప్తుడు రాజ్యం చేసేనాటికే ఆంధ్రులు అత్యున్నతమయిన స్థితిలో ఉన్నారని మెగస్తనీసు వ్రాసినాడుగదా! అప్పటికే ఆంధ్రుల శిల్ప చమత్కృతి విజృంభించి ఉండవలెను. లేనియెడల, హఠాత్తుగా శాతావహనుల శిల్పము అంత స్వల్పకాలములో వృద్ధిపొందియుండదు.

శాతవాహన శిల్పము నానాటికీ విజృంభించి, ఆంధ్రులు బౌద్ధమతము స్వీకరించే టప్పటికీ, మంచి ఉన్నత స్థితిలోనికి వచ్చినది.

కొందరు – శాతవాహన చక్రవర్తులు గాంధార దేశములో రాజ్య మేర్పరచుకొన్న యవన రాజుల శిల్పుల్ని తీసుకొనివచ్చి, వారిచేత శిల్పం చెక్కించిన్నీ, వారి పాదాలవ్రాల ఆంధ్ర శిల్పులకు శిక్షణ కల్పించిన్నీ, ఆంధ్ర శిల్పమంతా అల్లించారని వాదిస్తారు. ఈ వాదన పరిశీలనా శక్తి లేనివాళ్లకు రుచించవచ్చు నేమో!

గాంధార శిల్పానికిన్నీ ఆంధ్ర శిల్పానికిన్నీ సంబంధము ఏమి ఉన్నది? గాంధార శిల్పం వృద్ధిపొందిన రోజుల్లోనే, సమకాలికంగా ఉత్తర హిందూస్థానములో ప్రుల్లమైయున్న భారతీయ శిల్ప విన్యాసము గాంధార విన్యాసమునకు సంపూర్ణముగా దూరమైయున్నది. మూర్తి విన్యాసములో, అలంకార శిల్ప రచనలో, శిల్ప సమయ గాంభీర్యతలో, గాంధార శిల్పము భారతీయ శిల్పమును ఏమాత్రము చేరలేదు.

గాంధార శిల్పమునకు చాలాకాలము పూర్వముననే ఉన్న శిల్పమును తెలియజేసే ఒక నటియొక్క విగ్రహము పాటలీపుత్రములో త్రవ్వినప్పుడు దొరికినది. దీనిని గురించి డాక్టరు స్పూనరీగారు : "పాట్నా మ్యూజియములోని ముఖ్యమైననిధి" అన్నారు. ఈ శిల్పము పోలికలే అన్నిట గలిగినది శాతవాహన శిల్పము. గాంధార శిల్పము భారతీయ శిల్పమునకేమీ సహాయము చేయలేదు గానీ భారతీయ శిల్పమునుండి గాంధార శిల్పము ఎన్నియో శిల్పరీతుల నలవరచుకొన్నది. దీనిని గురించే నివేదితాదేవి 1910 సం॥లో 'మాడరన్ రివ్యూ'లో చాలా వ్యాసముల రచించినది. అందులో ఒక వాక్యమును మాత్రము ఉదహరిస్తాను.

"While Gandhara Art made no contribution whatever to the Indian ideal of Buddha hood, it captured Buddha, Magadha has produced symbols whose dignity gandhara was never able to approach".

"గాంధార శిల్పము బుద్ధత్వ ఆవయవమునకు ఏమీ నివేదించలేకపోయినా, బుద్ధుని మాత్రము సంగ్రహించినది. మగధ సంప్రదాయాలలో జనించిన శిల్ప సమయాలను గాంధార శిల్పమెన్నటికిని గ్రాహ్యము చేసికొనలేకపోయినది".

పలనాడులో దొరుకు పాలరాతివంటి ఒక విధమైన తెల్లని రాతితో ఈ శిల్ప సంపద మూర్తీభవించినది. మూర్తివిన్యాస లాలిత్యము జీవితాన్ని శిల్పరూపంగా సర్వరసపూరితమై ఒప్పేటట్టు చేసే ఓజస్సు, సంయుక్త శిల్పాలను గూర్చి నేర్పు ఆంధ్రదేశమదంతటను వర్షము కురిపించినారు.

అమరావతిలో అశోక చక్రవర్తి కాలంలో నిర్మింపబడిన స్తూపం నానాటికీ వృద్ధిపొంది, వాసిష్ఠీపుత్ర పులుమావి శాతవాహనుని కాలం నాటికి ఉత్తమ స్థితికి వచ్చింది.

శాతవాహనుల బౌద్ధశిల్ప చరిత్ర రెండు భాగములుగా విభజించవలసి ఉంటుంది. ప్రథమచరిత్ర, క్రీస్తుకు పూర్వకాలం నాటిది. ద్వితీయ యుగము, క్రీస్తు వెనుక రెండవ శాబ్దం వరకు విజృంభించినది. రూపకల్పనలో, శిల్ప విన్యాసంలో, ఈ రెండుకాలాల శిల్ప విన్యాసమునకు తేడాలు కన్పిస్తవి.

ఈ మొదటి యుగమందలి శిల్పము అమరావతి, జగ్గయ్యపేట, కార్లీ, నాసిక మొదలగు స్థలములలో కనబడుతుంది. ఈ కాలమందలి శిల్పంలో ఆభరణములు తక్కువ; ఆడంబరములేదు.

రెండవయుగమైన క్రీస్తుతర్వాత శకముల నాటిస్థితి, మనకు జగ్గయ్యపేట, కార్లీ, నాసిక, గుంటుపల్లి మొదలయిన శిల్పాలలో కనపడుతుంది. ఈ శిల్పంలో మొదటి యుగంలోని శక్తి యున్నది. అప్పుడప్పుడే విగ్రహాలకు సౌకుమార్యత ఏర్పడుతున్నది. విగ్రహాలు పెద్దవి. ఏకతల శిల్పము, ఆ శిల్పంలో లోతు తక్కువతో చెక్కడము. ఈ శిల్పము అజంతా ప్రథమ చిత్రలేఖనమువలెనే ఉంటుంది. ఆభరనాలు, శిల్ప భంగులు, తలకట్టులు ఎన్నో పోలిక లున్నవి.

పిమ్మట కొంతకాలమునకు, శాతవాహన శిల్పం, అమరావతి నాసికలలో సువ్యక్తమై యున్నది. ఈ యుగము, క్రీస్తు యుగపు ద్వితీయ శతాబ్దమునాటిది. ఈ శిల్పములో నాగార్జునాచార్యుల మహాశక్తి గోచరిస్తూ ఉంటుంది. పందొమ్మిదవ శతాబ్దాంతాన త్రవ్వితే దొరికినవి. అమరావతీ మమాచైతన్యంలోని శిల్పం కొంచెం ఇంచుమించుగా ఈ కాలంనాటిది. ఈ శిల్పంలో బుద్ధదేవుని జాతక గాథలన్ని శిల్పించినారు. ఈ కాలపు శిల్పము, విన్యాసలాలిత్యము, విన్నాణము, గంభీరశక్తి పూర్ణముగా విదజల్లింది.

ఏ మతవిషయిక భావమైనా సర్వ జీవిత సంబంధమైనదని, ఆంధ్రులు తమ శిల్పమందు చూపినారు. శాంతభూయిష్ఠమైన యోగభావముగాని, చలనభూయిష్ఠమైన సాధారణజీవితభావముగాని, ఆంధ్రులు అత్యంత నిపుణతతో మూర్తీభవింపజేసినారు,. బాహ్యప్రకృత్యను కరణవాదులు లోపమెంచజాలని బాహ్య స్వరూపసౌందర్యముచే, ఆశయ స్వరూపమైన శిల్పసత్యమునకు పరిచర్య చేయించినారు. జంతువులను శిల్పంచడములోనేమి, మానవజీవితములోని రసవత్తర ఘట్టములను శిల్పించడములో నేమి ఆంధ్రశిల్పులు తమ చాతుర్యాన్ని విరజిమ్మినారు. ఆనంద కుమారస్వామిగారు ఈ సందర్భములో "The memory picture or rather a synthetic image based on past experience is from first to last the essential foundation of Inidan Art; we cannot recognise here any such innate striving towards realism as that which becomes apparent soon after the primitive developments in Greek and Christian Art. The Indian method is

always one of visualisation, unconscious in primitive, systematised in the Nature art. Indian art is alwas a language employing symbols valid only by tradition and convention" అన్నారు.

"స్మృతి చిత్రము, అనగా జీవితమును పరిశీలించిన పూర్వజ్ఞానము ననుసరించి మూర్తికల్పన జేసుకొనుట, అనాదినుండియు భారతీయ శిల్పమునకు ముఖ్య సూత్రమైన పునాది. భారతీయ శిల్పములో బాహ్యప్రకృత్యను కరణానికి ప్రయత్నము లేదు. అట్టి ప్రయత్నము గ్రీకు పాశ్చాత్య క్రైస్తవ శిల్పములలో నున్నది. భారత శిల్పము ఎప్పుడును సర్వానుభూతి సంగ్రహదృష్టి స్వరూపము. ఈ దృష్టి ప్రథమంలో ఉద్భవించి, సహజంగా రానురాను అత్యంత సమగ్రమైన శాస్త్రస్వరూపము దాల్చినది. భారత శిల్పముయొక్క ముఖ్య పరిభాష శిల్పమయమే".

ఈ విషయము దేనికి చెప్పవలసి వచ్చినదంటే, పాశ్చాత్యులలో చాలామందిన్నీ, ఆంగ్లమానస పుత్రత్వము సంపాదించుకొన్న మనలో కొందరున్నూ, ఆంధ్రశాతవాహన శిల్పము – Realistic - అనగా బాహ్యప్రకృత్యనుకరణ భూయిష్ఠమై ఉండేదనన్ని, నానాటికి ఆంధ్ర శిల్పులు ఇతర భారత శిల్పులతోపాటు మతావేశములోపడి శిల్పసతాయన్ని కూలద్రోసి, శిల్పమును సమయభూయిష్ఠము చేసినారనిన్నీ అంటూ ఉంటారు. వారికి భారత శిల్పసత్యము గోచరింపలేదని మాత్రం మనవి చేస్తున్నాను. భారత శిల్పసత్యమైన శిల్పసమయప్రజ్ఞకు దూరమును, అపశ్రుతియుగాని బాహ్యసౌందర్యమును ఆంధ్రశిల్పులు మూర్తీభవింపజేసినారు, అంతే. ఆంధ్రదేశములో బౌద్ధమతము విజృంభింపని కాలములోగాని నిండివున్న కాలములోగాని, మరల పౌరాణికయుగము పునర్జన్మ పొందిన కాలములోగాని, ఆంధ్ర శిల్పులు ఈ సంప్రదాయమును ఎప్పుడున్నూ మరచిపోలేదు.

సాంచీస్తూపము, స్తూపముచుట్టూ ఉన్న ద్వారములు ఆంధ్రశిల్పులు నిర్మించినవే. నాసికలోని గుహలు, అజంతాలోని మొదటి గుహలు, ఔరంగాబాదులోని గుహలు పూర్వ శాతవాహనులు నిర్మించినవే. ఆదిదినాలలో వారు బుద్ధుని జీవితము ఏ ఛత్రరూపంగానో, చక్రరూపంగానో, పాదచిహ్నరూపంగానో చిత్రించేవారు. తరువాత తరువాత, బుద్ధుని యొక్క మూర్తిని విన్యాసము చేయ ప్రారంభించినారు. స్తూపముచుట్టూ రాతికంచెలు, ద్వారములు ముద్దులు మూటకట్టునట్లు సృష్టించినారు. ఈ రాతికంచెలలోని ఫలకములలోను, స్తంభములలోను బౌద్ధగాథలు, సాధారణ మానవ జీవిత సంబంధమైన దృశ్యములు, శిల్ప నృత్యమైన (Decorative Art) అలంకార శిల్పము, గుజ్జు బాలురు, యక్షులు, నాగములు, ఱెక్కలున్న గుఱ్ఱములు, జానపద జీవిత దృశ్యములు, రాజ సభలు, వనవిహారాలు మొదలగు అద్భుత శిల్పవిషయాలను అల్లివేశారు. పోయిన శిల్పములుపోగా, మిగిలిన ఆంధ్రశాతవాహన శిల్పములు లండను, బెర్లిను, మదరాసు, కలకత్తా, బోస్టర్ మొదలగు మ్యూజియముల నలంకరించుచున్నవి.

ఇక్ష్వాకులు మొదలగువారి శిల్పము

ఆంధ్ర శాతవాహన సామ్రాజ్యము విచ్ఛిన్న మైన తరువాత, నాగార్జున కొండలో శ్రీ పర్వత విజయపురము రాజధానిగా ఏలిన ఇక్ష్వాకులు సామ్రాట్టులైనారు. నాగార్జునకొండ అనగానే ఆంధ్ర చరిత్రలో మహాద్భుత పురుషుడైన నాగార్జునుడు మన కళ్ల ఎదుట మూర్తీభవిస్తాడు. ఇతడు బుద్ధుని తర్వాత బుద్ధునియంత జ్ఞాని. నాడు ప్రపంచమున వెలిగిన పరంజ్యోతి. ఇతడు స్థాపించిన సంఘారామ మహావిద్యాపరిషత్తు సర్వకళలను దేశములకు వెదజల్లినది. ఈతడు నిర్మాణం చేయించిన శిల్పములు విదేశముల లోను వన్నెకెక్కినవి. నేటి నాగార్జునకొండలో ఇటీవల బయల్వెడలిన శిల్పము శాతవాహన శిల్పానికి అనుగు బిడ్డ. వీరిశిల్పము విన్యాసములో, లాలిత్యములో, గంభీరతలో శాతవాహన శిల్పానికి వన్నెలు తీర్చినది. స్తూపము చుట్టూ అతికించిన తెల్లని పాలరాతిమీద చెక్కిన ఈ శిల్పము, బౌద్ధ జాతక గాథలను ప్రత్యక్షం చేస్తూ ఉంది. సంఘజీవితములో అలంకార శిల్పము, నాట్యశిల్పము దివ్యప్రపంచమై భాసించినవి.

ఇక్ష్వాకుల రాజ్యమైన వెనుక, వేంగీలోని సాలంకాయనులు, బృహత్పాలాయనులు, కృష్ణా జిల్లాలోని విష్ణుకుండినులు ఒకరితర్వాత నొకరు మహారాజులైనారు. వీరి కాలంనాటి శిల్పము ఇంకా బయల్పడలేదు.

పల్లవ శిల్పము

పల్లవులు ఆంధ్రులన్న విషయము ఎవరూ అనుమానించదగినదిగాదు. పలనాడు లేక పల్లవనాడుకు చెందినవారు. తమ రాజ్యమును విస్తరింపజేసుకొని నెల్లూరు, కాంచీపురముల దాటి – శాతవాహనరాజ్యం క్షీణించినప్పుడు – కాంచీపురములో స్వతంత్రులై చక్రవర్తులైరి. క్రీ.వె. నాలుగయిదు శతాబ్దములలోనే వీరు, ఆంధ్ర శాతవాహన శిల్పానికి ప్రేమ పుత్రికయైన శిల్పాన్ని, మహాబలిపురంలో మూర్తీభవింప జేసినారు.

త్రిలోచనపల్లవుడు ప్రథమ పల్లవ రాజులలో ఒకడు. పల్లవబొగ్గ, క్రీ.శ. 100 సం॥న వీరికి ఒక ప్రధానస్థలముగా ఉన్నట్లు మహావంశములో చెప్పబడియున్నది. వీరి సామ్రాజ్యము ఒంగోలునుంచి కాంచీపురము వరకు కాంచీ పురమునుండి పుదక్కో వరకూ విస్తరించి యున్నది.

నాడు – కాకుల కలకలము. తూర్పున ఉషాకన్య చిరునవ్వుల కాంతులు ప్రసరిస్తున్నది. మందమలయానిలాలు, సముద్రఘోష. వెనుక ప్రక్కనే పక్షితీర్థపు కొండలు. "బలి యిక్కడ పరిపాలించాడా? నిశాంభాసురుని ఓడించిన ఆంధ్ర విష్ణు సార్వభౌముడు బలి భక్తిని సంపాదించుకొన్నాడా? సామంతుడై, స్వామిభక్తి యున్నప్పటికీ, ఏనాటికైనా తన సామ్రాజ్యానికి, ముప్పు తీసుకొస్తాడని దూరానున్న బలిద్వీపాలకు తరిమేశాడా, ఆంధ్రవిష్ణువు?" అని ఊహించుకుంటూ నేను బలేశ్వరమునకు వెళ్లేటప్పటికి భళ్లున తెల్లవారింది. శిథిలాలయాలు, జీర్ణ శిల్ప సంపద, పాడుపడిన గోపురాలు సందర్శించి నప్పుడు, యెవ్వడో రాక్షసుడు తన కర్కశ హస్తముతో జీవితాన్ని పిండివేసినట్టుగా వుంటుంది. దీనిలోని చక్కని దేవాలయము – సగము సముద్రములో స్నానము చేస్తూ క్షణంలో మాయమై పోవుటకు సిద్ధంగా వుండి నట్లు –జూచి ఒక నిట్టూర్పు విడిచి, అలాగే ఉండి పోయాను!

ఆంధ్ర శాతవాహన సామ్రాజ్యముయొక్క చిట్టచివరలో, ఆంధ్రశాతవాహనశిల్పం తన తేజాన్ని చాలావరకు కోల్పోయింది. అలాంటి సమయంలో మహాబలిపురంలో పల్లవులు నూత్నశక్తిని ఉద్దీపనమొనర్చి, ఆంధ్ర శిల్పంలో ఒక నూతనశకము ప్రారంభించారు. మహా బలిపుర శిల్పాన్ని గురించి ఆనందకుమారస్వామి గారు ఇట్లు వచించారు.

"సంచలనశక్తివంతమై, స్వేచ్ఛాపూర్వకమైన విన్యాసము కలిగియున్నది. వీరపురుషుని సింహ మధ్యము, విశాల భుజస్కంధము, స్త్రీ మూర్తుల ఘనకుచాలతో ఈ శిల్పము లాలిత్య భూయిష్ఠమై, విచిత్రమైన సున్నితాన్ని కలిగి యున్నది".

ఆంధ్ర శిల్పులు నాశికగుహల నిర్మించిన శక్తితో మహాబలిపుర ప్రాంతాల గుహలను దొలిచినారు. ఆ గుహలలో శిల్పము సంకల్పించినారు. ఒకేరాతిని రథస్వరూపమైన దేవాలయముక్రింద చెక్కినారు. కొండ ప్రక్కన రాతిపైన శిల్ప సంపదను వెదజల్లినారు. కోతులు, గొడుగు పట్టుకొని వెళ్ళు పురోహితుడు, వృద్ధ తపస్వి మొదలైన వెన్నియో శిల్పించినారు. రానురాను సముద్రతీరమున కనపడిన గుడివంటి గుళ్ళను నిర్మించినారు. అవి కట్టడపు గుళ్ళు!

మొదటి మహేంద్రవర్మ; మొదటి, రెండవ నరసింహవర్మల కాలములలో మహాబలి పురశిల్పము రూపము తాల్చినది. ఇవి రాతి రథములు, పూర్వకాలపు చైత్యాలు, విహారాలలోనుంచి ఉద్భవించిన దేవాలయ స్వరూపాలు.

గాంగ శిల్పము

విష్ణుకుండినుల కాలంలోనే తూర్పుతీరంలో నేటి గోదావరి, విశాఖపట్నం, గంజాం జిల్లాలు కళింగరాజ్యమని పేరు పొందినవి. ఆ కళింగ దేశమును గాంగవంశజులు, సాలంకాయన విష్ణుకుండినులతో సమకాలికులై స్థాపించినారు. శాతవాహనుల కాలంలోనే ఖారవేలాది కళింగరాజులు ప్రసిద్ధికెక్కిరి గదా! ఈ కళింగదేశ శిల్పులే రానురాను ముఖలింగం దగ్గరను, శాలిహుండాం దగ్గరను, రామతీర్థములోను శిల్ప నిర్మాణము కావించిరి. ఈ ప్రథమ గాంగశిల్పము ఇప్పటికిన్నీ శక్తి సమన్వితమై కనిపించుచున్నది.

ఆంధ్ర చాళుక్య శిల్పము

చాళుక్యులు ఘూర్జర దేశాన్నుంచి వచ్చిన క్షత్రియులమని చెప్పుకొంటారు. వారు ప్రథమంలో వాతాపీనగరంలో రాజ్యస్థాపనం జేసారు. శాతవాహనులలో కొందరు పడమటి తీరంలో చాలా కాలము విజృంభించే యుండిరి. ఈ ఆంధ్ర శాతవాహనుల పశ్చిమ రాజ్యాలలో అజంతా, ఎల్లోరా మొదలైన ప్రదేశాలు ఇమిడి ఉండేవి. పూర్వకాలపు ఓజస్సు కోల్పోయినా, ఈ రాజ్యాలలోని శిల్పులు ఎల్లోరా పర్వతములోని పెద్ద గుహలను నిర్మించారు; అజంతా గుహలను నిర్మించారు. బలహీనులైన ఈ శాతవాహనుల నోడించి, ఉత్తరాన్నుంచి వచ్చిన చాళుక్యులు రాజ్యము స్థాపించారు. వీరు వచ్చి, విజృంభించుచున్న తమ నూత్న శక్తితో, వాతాపి నగర గుహల్లో శిల్ప సంపదను వెదజల్లింప జేసినారు.

ఈ చాళుక్యుల ఉధృతము నానాటికి అధికమై దక్షిణానికి హర్షుని రాకుండాచేసింది. వీరు తమ రాజ్యాన్ని విస్తరించుకొని తూర్పుతీర రాజ్యాన్ని నెగ్గి, వేంగీపల్లవుల నాక్రమించారు. (పశ్చిమ చాళుక్యుల వేంగిరాజ ప్రతినిధి కుబ్జవిష్ణువర్ధనుడు) వీరు స్వతంత్రించి తూర్పు చాళుక్యులై, సంపూర్ణాంధ్రత్వములో స్నాతులై ఆంధ్ర చాళుక్యులైనారు. వీరు నానాటికీ విజృంభించి పల్లవ రాజ్యము సంపూర్ణముగా ఆక్రమించుకొని, పల్లవ రాజులను నాశనం చేశారు. చోళులతో వియ్యాలంది, తమ చక్రవర్తినే (రాజరాజకులోత్తుంగచోళుని) అచట చక్రవర్తిగా చేసారు.

కులోత్తుంగచోళదేవుని మూలంగా చాళుక్య చోళరాజ్యములు రెండున్నూ ఏకమయినట్లే, ఈ రెండు రాజ్యములందలి నాగరికత, సంస్కృతి, కళ కొంతవరకు ఏకమయినవి. కుంభకోణము, చిదంబరము, తిరువన్నామలై మొదలగు స్థలము లందలి శిల్పములో ఆంధ్రశిల్ప ప్రభావము కనబడుతున్నది.

ఈ చాళుక్యులు ప్రథమంలో జైన మతావలంబకులై, తరువాత శైవమతదీక్ష వహించారు. కాబట్టి ఆంధ్రదేశంలో మొదట జైన శిల్పం తీసుకొని వచ్చినవారు వీరే. బసవేశ్వరుని శకమైన వెనుక చాళుక్యులందరు జైన మతావలంబదీక్షులు. అక్కడనుంచి రాజమహేంద్రవరం, ద్రాక్షారమము, సింహాచలం, భీమవరం, సామర్లకోట ఇంకా అనేక గ్రామాలలో వీరు శైవమతావేశులై శిల్పం వెదజల్లినారు. సముద్రతీరాలలో అనేక చిన్న గుళ్ళు చాళుక్యుల కాలములో వెలసినవే. ఒక్క ప్రదేశంలోను చాళుక్యుల శిల్ప సంపద పిండుకట్టలేదు. కొంత మహాబలిపురము లోనున్న శక్తియు, కొంత లాలిత్యమును సమ్మిళితము జేసి – అప్పుడే ఉద్భవించిన అనేక శిల్ప గ్రంథాల ననుసరించి – చాళుక్య శిల్పము వెలిసింది. ఈనాటికిని ఈ తూర్పుతీర జిల్లాలోని హీనస్థితికి వెళ్లిన చాళుక్య సంప్రదాయములోని ఆంధ్ర శిల్పులు, మూర్తికల్పన చేస్తున్నారు. రాజమహేంద్రవరం మ్యూజియములోను, మార్కండేయస్వామి గుడిలోను, బిక్కవలు, సింహాచలము గుళ్ళలోను, భీమవరపు భీమేశ్వరస్వామి, కోవెలలోను, ఆంధ్రజాతీయ కళాశాలలను, బెజవాడ, మద్రాసు మ్యూజియములలోను, ఆంధ్ర చాళుక్య శిల్పము యొక్క ఉచ్ఛస్థితిలో రూపము పొందిన విగ్రహాలు కనపడుతవి.

రెండవ కళింగ గాంగులు - వారి శిల్పము

ముఖలింగం రాజధానిగా రాజ్యమేలిన తరువాత గాంగులు, చాళుక్యులతో పాటు తమ శిల్ప చమత్కృతిని జగన్నాథంలోను, కొనారకాలోను, ముఖలింగంలోను పరమాద్భుతమైన స్వరూపాలతో ప్రత్యక్షం చేసినారు. కొనారకాలో సూర్యదేవాలయము నిర్మించిన ఆంధ్ర శిల్పులు, మహాబలిపురంలని శిల్పులకు సంపూర్ణంగా ఆత్మపుత్రులే! దేవాలయము అంతా ఒక మహారథం క్రింద చిత్రింపబడివున్నది. రథంలాగే గుర్రాలు జవము, తేజస్సు గలిగినటువంటి మూర్తులు. కొనారక సూర్యరథ దేవాలయాన్ని నిర్మించినది నరసింహగాంగుడు. భువనేశ్వరములో ఈ గాంగవంశమువారు నిర్మించిన దేవాలయములు పరమలాలిత్యాన్ని చేకూర్చుచున్నవి.

ఆంధ్రలో వలసరాజ్యముల శిల్ప ప్రతిభ

బర్మాకు, బలిద్వీపానికీ, జవద్వీపానికీ, కాంభోజదేశానికీ ఆంధ్రులు వలసపోయి రాజ్యాలు ఏర్పరచినట్లు, చరిత్రవల్ల ప్రస్ఫుటమౌతున్నది. జావాలోని బరోబదూరులో కలిసిన శిల్పము, అమరావతిలని ఆంధ్ర శాతవాహన శిల్పాన్ని అన్ని విధాలా పోలి వున్నది. శ్రీకాకుళాన్నుంచి, మోటుపల్లినుంచి ఆంధ్రుల నావలు శ్వేతహంసలలా తెరచాప లెత్తుకొని – ఆంధ్ర శాతవాహనుల నాటి నుంచి – రోమక, పారశీక, అయిగుప్తాది దేశాలతోను; సువర్ణ, బలి, జావా మొదలైన ద్వీపాలకు వర్తకమునకై వెళ్లేవి. ఈ తూర్పుద్వీపాలలో వలసరాజ్యాలు ఏర్పరచారు. బరోబదూరులోని జ్ఞానబుద్ధుడు, ప్రజాపరిమితాదేవి, అలంకార శిల్పము, సాంఘిక శిల్పము అన్నీ ధాన్యకటక నగరంలోని నాగార్జునకొండ శిల్పాన్ని పోలి వున్నవి. చివరకు బలిద్వీపము, జవద్వీపముల లోని ఆచార వ్యవహారాదులు, శిల్పము, నృత్యము చాళుక్యుల, కాకతీయుల కాలంనాటివి.

కాంబోడియా దేశంలో, ఆంధ్ర బ్రాహ్మణుడు ఆదేశపు రాజకుమార్తెను వివాహమాడి, అక్కడి రాజ్యవంశానికి ప్రధానపురుషుడైనాడు. ఆంధ్ర శిల్పులున్నూ, వారి శిష్యులైన ఆదేశవాసులున్ను, అంగకరువాటులో ప్రత్యక్షమవుతూవున్న ఆ దేశశిల్పాన్ని జీవింపచేశారు.

కాకతీయ శిల్పము

పాలంపేట, హనుమకొండలలోని శిల్పము రసప్రవాహంలో ముంచెత్తుతుంది. నాట్యము, నృత్యము, తాండవము, లాస్యము, ఉదయసంధ్యా ణృత్యము, సాయంసంధ్యా నృత్యము, మూడు జగాల పథాలలో ఒక అడుగు అటు ఒక అడుగు ఇటుగా సర్వకళా జనకుడయిన పరమేశ్వరుడు, భౌమ్యాచార–ఆకాశాచార సర్వతాళములు, సర్వకరణాంగ విక్షేపణలు, అభినయ విలాసాలు, చిదానందలయములను ఆత్మపంథాలలో మూర్తీభవింపగలిగిన మాయా శిల్పాన్ని కల్గించగల్గారంటే, కాకతీయుల శిల్పశక్తి వర్ణింపలేము! పాలంపేటలోని నృత్యమూర్తులు, ఓరుగల్లులోని నృత్యమూర్తులు, ఉన్నత శిల్పాలు – రాజపుత్ర చిత్రలేఖన సూక్ష్మాన్ని సంపూర్ణంగా మరపించే సూక్ష్మశిల్పము. విశ్వమంతా నృత్యగాంధర్వమై సాక్షాత్కరిస్తుంది. నందులు, ఏనుగులు, హంసలు, మృదంగవాద్యములు ఆ చుట్టుపట్ల ప్రత్యక్షములై ఉన్నవి. కాకతీయ శిల్పచమత్కృతి అంతా లాలిత్యభూయిష్టమై కైశికీవృత్తి స్వరూపమై వున్నది. కాకతీయ దేవాలయ స్వరూపాలు ఆకైశికీ వృత్తినే పుణికి పుచ్చుకొన్నవి. వృత్తరూపమయిన అలంకార శిల్పము ఈ గుళ్లలోని గర్భాలయ ద్వారాలలో నిర్మితములైనవి. స్తంభాలున్నూ, చాళుక్య స్థంభాలకన్న శేముషీత్వము సంపాదించుకొన్నవి. కాకతి చక్రవర్తుల శిల్పవైభవము కాకతిదేశమంతా పంటలు పండినది!

రాయలయుగ శిల్ప విన్నాణము

రసజ్ఞులగు మీరందరూ, హంపిని ఒక మాటు సందర్శించవలసినదిగా వినయపూర్వకంగా వేడు కొంటున్నాను. ఆ తుంగభద్రాతీరాన మను చరిత్రను, ఆముక్తమాల్యదను సంస్మరింప జేసేటట్టి ఒరనుండి పెరికిన ఖడ్గపు తళతళలు, శత్రురాజులు తమ కిరీటాలుతీసి రాయలసార్వభౌముని పాదాల సమర్పించునట్టి దృశ్యము, కళ్ల యెదుట నాట్య మాడింపజేసేటట్టి ఉత్కృష్ట శిల్పసంపద విరిగి శకలాలై, కొన్ని యోజనాల స్థలమున పడివున్న దంటే యేరసజ్ఞుని ఆత్మ, హృదయము, దేహము, గడ్డకట్టి ఆ నల్లరాళ్లతోపాటు రాయియై పడిపోదు!

ఓ విజయనగర సామ్రాజ్యమా! నీతోపాటు రాయల ఔన్నత్యముయొక్క ఆఖరి వెలుగు ఆరి పోయినది. ఉత్తమ శిల్పము భూగర్భమున ఒలికి పోయినది. ఆంధ్ర మహోదారహృదయము దివ్యమైన ఒక్క హారతి కర్పూరపు వెలుగు వెలిగి, ఆత్మార్పణ చేసికొన్నది!

ఎల్లోరాను మరపించే గంభీరత, ఒరంగల్లు శిల్పాన్ని మరపించే లాలిత్యము, శాతవాహన కళావైభవాన్ని మరపించే కళాచమత్కృతి, రాయలశకవైశాల్యములో తాండవించి పోయినవి. మహాబలిపురములో ఉన్న ఏకశిలా దేవాలయ సృష్టి విరూపాక్షుని రథమందు వెలుగై, తళుకై వెలిగింది. హనుమకొండలో ఉన్న సహస్రమండపము హంపిలో ఎక్కువ తేజస్సుత పునర్జన్మమెత్తినది. ఆ స్తంభములు గాన మొనరిస్తవట!

అదే ఆ కృష్ణదేవుడు తులాభారము తూగినట్టి తులాస్తంభ నిర్మాణము! ఆ మహారాజులు జలక్రీడలాడు స్నాన కమలాకరం! అదే, సార్వభౌముల మహాభవనము! ఇక్కడ ఏనుగులశాల రాళ్ళుపరచియుండి, నేటికిని చెక్కుచెదరదు. విజయనగర రాజవీధిని నడచి గణేశుని గుడి, పంపాపతిగుడి దర్శించితీరవలె. హజార రాముని గుడిల చక్రవర్తుల సింహాసన శిలావేదికపైన ప్రత్యక్షమయ్యే శిల్పసంపదను ఎంత వర్ణించినా తీరదు. ఈ సందర్భములో ఆ శిల్పమునుగురించి వ్రాసిన మేజర్ ఎన్.డబుల్యూ. వాక్‌స్టాఫ్ మాటలు జ్ఞప్తికి వస్తున్నవి.

“నిధులు కట్టినశిల్ప సంపద .... వస్తు విన్యాసరచనలో, ఆత్మ విశ్వాసములో, శిల్ప సామర్థ్యములో విజయనగర శిల్పమునకు జోడైన శిల్పము లేదని మనము చెప్పవచ్చును”.

శ్రీకృష్ణరాయ సార్వభౌములు తన సేనా నాయకులైన తెలుగు నాయకులను రాజప్రతి నిధులుగా చాలాచోట్ల ఉంచినాడు. తంజావూరిలో, మధురలో, కేరళములో ఈ నాయకులు రాజ్యభారాలు వహించి, తమ పాలనలో ఉన్న దేశాన్ని అభ్యుదయస్థితికి తీసుకొనివచ్చి, పరిపాలన చేసేవారు.

నాయక రాజుల శిల్పము - మధుర మీనాక్షి గోపురములు

ఆ రోజుల్లోను, తర్వాత విజయనగర సామ్రాజ్యం విచ్ఛిన్నమై చక్రవర్తులు నామ మాత్రులై ఉన్న రోజుల్లోను ఈ నాయక రాజులే, మహమ్మదీయులు శిధిలం చేసిన మధుర, తంజావూరు, శ్రీరంగం, రామేశ్వరం మొదలయిన పుణ్యక్షేత్రాలలోని పవిత్ర దేవాలయాలను పునరుద్ధరణ చేయడంలో చోళ, పాండ్య శిల్పాలకు వన్నె గూర్చే అద్భుత శిల్పం, అల్లించివేశారు. విమానాలు, మండపాలు, గోపురాలు, విగ్రహాలు, తోరణాలు క్రొత్తవి అనేకం, వివిధ మూర్తి స్వరూపుడైన భగవంతునికి అర్పించారు.

ఉపసంహారము

విజయనగర సామ్రాజ్యము విజృంభించక ముందు, కాకతీయ సామ్రాజ్యము విచ్ఛిన్నమైన వెనుక, ఆంధ్రదేశమంతా రెడ్డి రాజ్యాలు ఏర్పడినవి. చాళుక్య సామ్రాజ్యము విచ్ఛిన్నమైన వెనుక ఆంధ్రదేశమంతటా ఏర్పడిన రెడ్డి రాజ్యములు, చాళుక్య కాకతీయ సామ్రాజ్యాల మధ్యకాలంలో విజృంభించిన చిన్న చిన్న రాజ్యములు అన్నియు కాకతీయ సామ్రాజ్య శిల్ప విధానాన్ననుసరించి అనేక శిల్పాలను దేవాలయములలో ప్రతిష్ఠింప జేసినారు.

కాకతీయుల శిల్పము మైసూరు రాజ్యము నందు ప్రవేశించి హాలిబేడు మొదలయిన ప్రదేశములలోని శిల్ప లాలిత్యముగా వెలసి, పుష్కలముగా విజృంభించినది.

ఆంధ్రదేశములో శిల్పము నానాటికీ క్షీణించి పోయినది. ఈనాడు శిలాశిల్పముగానీ దారుశిల్పముగానీ, లోహ శిల్పముగానీ మచ్చునకైనా కనిపించుట లేదు. చేబ్రోలులో ఒక మహమ్మదీయ శిల్పి ఉన్నాడు. అతడు ఆంధ్ర శిల్పుల వంశీకుడు. చేబ్రోలులో ఒక మండపమున్నూ, మండపము అడుగు భాగమున చుట్టూ ఎర్రరాతి మీద జంతు శిల్పములున్నూ విన్యాసం చేసినాడు. శిల్పదీక్షవహించినవారిలో ఆంధ్రులలో నారాయణరావుగారు మొదలగు ఒక రిద్దరు మాత్రమే ఉన్నారు. కానీ, ఈ శిల్పకళను పునరుద్ధరించవలసిన విధి ఆంధ్ర మహాజనులపైన లేదా?

చిత్రలేఖనము

శిల్పము వలెనే ఆంధ్ర దేశములో చిత్రలేఖనము మహోన్నత దశకు వెళ్లినదనే నిదర్శనములు అనేకములున్నవి. కవిత్వమునకు చిత్రలేఖనమునకు సాదృశ్యము అధికముగానున్నది. రామచరిత్రము రామాయణము చదివి తెలుసుకొన్నట్లే చదువు కొన్నవారికి చదువుకోని వారికి ఆహ్లాదం ఇచ్చేటట్టు రామకథ మన దేవాలయ కుడ్యములమీద చిత్రించేశారు. శిలతో, దారువుతో, లోహంతో శిల్ప విన్యాసం చెయ్యడం కష్టం; గానీ ఫలకాలపై, కుడ్యాలపై చిత్రరచన చెయ్యడం అంత కష్టంగాదు. పూర్వం రాకుమారులు, రాకుమార్తెలు చిత్రరచన చేస్తూవున్నట్టు పురాణాలు గాథలు స్పష్టంగా చెప్పుచున్నవి. వాత్స్యాయన కామసూత్రాలను, విష్ణుధర్మోత్తరములోను చిత్రలేఖనకళను గురించీ, రంగులను గురించీ, కుంచెలను గురించీ స్పష్టంగా వర్ణించినారు. శిల్పము వలెనే చిత్రలేఖనము శాశ్వతముకాదు. కాబట్టి, ఈనాడు ఆంధ్ర చిత్రకళా చరిత్ర వ్రాయడం సుగమం కాదు.

తక్కిన హిందూ దేశములోని దేవాలయములతో పాటు, ఆంధ్ర దేశములో చిత్రలేఖనము వృద్ధిపొందిన మాట నిజము. వాత్స్యాయన కామసూత్రములలో చిత్రలేఖనకు షడంగాలను వాత్స్యాయనుడు బోధించినాడు. ఆదిసూత్రకర్త నారాయణుడు, విశ్వకర్మకు చిత్ర సూత్రములను ఉపదేశించెను. చూ :-

కంll ఆ విశ్వకర్మ నిర్మిత
దేవ విమానుండు నిఖిల దివాభరణ
శ్రీవిరచన పరితోషిత
దేవుడు శిల్ప ప్రజాపతియునై నెగడెన్.

"రూపభేధ ప్రమాణాని భావ లావణ్యయో గజనమ్, సాదృశం వర్ణికాభంగ మితి చిత్రం షడంగకమ్ll" అని చెప్పబడియున్నది. కొంచెము వివరించిన, ఈ భావము రూపముయొక్క బాలమూర్తి, కుమారమూర్తి, నరమూర్తి, క్రూరమూర్తి, అసురమూర్తి, మొదలయిన తారతమ్యములను తెలియజేసేదనీ; ప్రమాణము – ఏమూర్తి కొలత ఎంత నిర్ణయించేదనీ; భావము – బహిరంతర స్వరూపములుగలిగి నవరస ప్రుష్టమై వ్యక్తీకరణము తెలియజేసేదనీ; లావణ్యయోజనము – వివిధ విగ్రహాలయొక్క వర్ణాలను కర్కశాలుగా చిత్రించాలో, లలితంగా రంగులు పూయాలో నిర్ణయించేదనీ; సాదృశ్యమనగా– సంప్రదాయ పారంపర్యా మనకు సంక్రమించిన విధానాన్ని సాదృశ్యంగా తీసుకొని ఆ ప్రకారం మూర్తివిన్యాసం చేయుటనీ; (ఉదాహరణగా ఇందుముఖి అన్నప్పుడు చంద్రుడు, ఆ సాదృశ్యాన్ని అనుసరించి ముఖం వ్రాయాలి,) సాదృశ్యం శిల్ప సమయమనిన్నీ; వవర్ణికాభంగము అంటే ఆకాశానికి ఏవర్ణమో, ఏమూర్తికి ఎట్టిరంగులు ఇవ్వాలో నిర్ణయించేదనీ – తెలుస్తుంది. చిత్రాల్లో గూడా కవిత్వంలోలాగే గర్భ చిత్రాలు, బంధ చిత్రాలు అనేక రకాలున్నవి.

క్రీ.పూ. రెండవ శతాబ్దమందలి జోగిరామ గుహలయందలి చిత్రములు; అమరావతి, ఉండవల్లి, భట్టిప్రోలు, ఘంటసాల, జగ్గయ్యపేట, చినగంజాము మొదలైన ప్రదేశములలోని బౌద్ధ స్తూపాలలోని శిల్పములు; అజంతా, కార్ల, ఎలిఫెంటా, ఎల్లోరా గుహలందలి చిత్ర శిల్పములు; మన దేవాలయ, గోపుర ప్రాకారములందలి దక్షిణ ద్రావిడ చిత్రములు – ఇవన్నియు మన చిత్ర సంపదలోని ముత్యాలరాసులు!

శాతవాహన చిత్రలేఖనము

ఆంధ్ర శాతవాహన కాలంలో చిత్రలేఖనము హిమాలయపు గౌరీశంకరశృంగస్థానము వరకు వెళ్లినది. ఆంధ్ర శాతవాహనులు అంతరించే వరకు, అజంతాగుహలు నిర్మించి, చిత్రించినది ఆంధ్రులే! అజంతాలో పదియవ గుహలో, ప్రాచీన ఆంధ్రశాతవాహనుల సభాశిల్పి ఆగుహనిర్మించి, శిల్పించినట్లు శాసనమున్నది.

అజంతా చిత్రలేఖనము - కూల్డ్రేగారి ప్రశంస

నా గురువుగారును, రాజమండ్రి ఆర్ట్సు కాలేజి పూర్వపు ప్రిన్సిపాలు నగు కూల్డ్రే దొరగారు అజంతా చిత్రలేఖనముల గురించి వ్రాసిన వాక్యములు జ్ఞాపకమునకు వచ్చుచున్నవి. "The colour scheme at once temperate, rich and bold, conveys the notion of dew freshness in a hot and somber field". – "వర్ణికాభంగము మితమై, శోభావంతమై, శక్తిపూర్ణమై, ఉష్ణబూమికపైని తురిషారార్ద్రకోమలత్వానుభూతి నిచ్చుచున్నది".

"The olden painting, therefore, at Ajanta, represents no primitive beginning but an art of some maturity, not the first efforts of individuals groping in the darkness of inexperience but the finished work of a school of artists trained in a high art manifesting great and ancient traditions". అనగా :

"అజంతాలోని తొలి చిత్రలేఖనము భారతీయ శిల్పము యొక్క ప్రాథమిక దశకాదు; ఆ శిల్పపు పరిణితదశ, అదీ, అనుభాంధకారములో ప్రాకులాడు వ్యక్తుల ప్రాథమిక ప్రయత్నము కాదు; మహోత్కృష్ట మైనటువంటి పురాతన సంప్రదాయసిద్ధమైన ఉత్తమకళా నిష్ణాతులగు శిల్పుల పరిపూర్ణ శిల్పరచన" అని అన్నారు పెర్సి బ్రౌనుగారు.

బొంబాయిలో శిల్పాచార్యులుగా ఉండి అజంతాశిల్పాలన్నిటికి ప్రతిరూపములు తీసి, అజంతాను గురించి యుద్గ్రంథము రచించిన గ్రిఫిత్ గారిలా అన్నారు.

"The artists, who painted there were giants in execution".

పల్లవ చిత్రలేఖనం - క్రొత్తరీతి

పల్లవరాజైన మొదటి మహేంద్రవర్మ కాలములో చిత్రలేఖనము ఉచ్ఛస్థితికి వచ్చినది. ఆ చిత్రలేఖన నాటిగుళ్ల నిండా యుండేది. కాలగర్భమున జీర్ణమైన భాగములుపోను, శీతన్నవాసాల గుహలలోను, పుదుక్కోట సంస్థానములోను, పల్లవ చిత్రలేఖన కీర్తి చిహ్నములుగా నిలిచిన భాగములు చూడవచ్చును. శీతన్నవాసాలలోని చిత్ర లేఖనము, అజంతాచిత్రలేఖన సంప్రదాయాన్ని పోలివుంటుంది. ఇవి జైన గుహలు. ఈ చిత్రలేఖనము కొన్ని నూతనమైన లాలిత్యాలను గూడా స్వీకరించుకొన్నది.

ఎల్లోరా చిత్రలేఖనము

ఎల్లోరా శిల్పులు, అజంతా శిల్పులకు చిత్ర లేఖనంలో కొంచెమైనా తగ్గిపోరు. కైలాసాలయము అంతా చిత్రలేఖనంతో నిండివుండేది. ఇది వరదాకా వెల్లక్రింద అణిగి వున్న ఈ చిత్రలేఖనము, నైజాము ప్రభుత్వపు పురాతన శిల్పశాఖాధ్యక్షుడయిన జనాబ్ యాజ్దా గారి కృషి వలన, (మిగిలిన ఏకొంచెమో) బయలుపడింది. ఆ చిత్ర కల్పనను నైజాము ప్రభుత్వమువారు గ్రంథరూపముగా ప్రకటించారు.

కాకతిచక్రవర్తుల చిత్రలేఖనకళ క్రీడాభిరామము మొదలైన గ్రంథాలలో అభివర్ణితమైనదిగాని ప్రత్యక్షముగా లేదు. నశించిపోయినది.

రాయల యుగ చిత్రలేఖనము

రాయల కాలమునాటికి చిత్రలేఖనము విరివిగా యుండెనని గ్రంథములు చెప్పుచున్నవి. లేపాక్షి నగరమంది దేవాలయకుడ్యములమీద, అజంతా చిత్రలేఖనా సంప్రదాయ జనితమైన చిత్రలేఖనా పద్ధతి కొంత తక్కువ స్థితికి వచ్చినను, సౌందర్య స్వరూపమును ఏమాత్రమును గోల్పోకుండ ఉన్నది. ఆ బొమ్మలు ఎక్కడను ప్రకటనగా లేదు. శ్రీ కల్లూరి సుబ్బారావుగారిని ఆ చిత్రసంపుటి ప్రకటించ గోరుతున్నాను.

ముగింపు

ఇప్పుడు అవనీంద్రనాథ్ సంప్రదాయము అనుసరించిన్నీ, బొంబాయిలోని సాల్మన్‌గారి సంప్రదాయము అనుసరించిన్నీ, ఆంధ్ర దేశంలో నవీన చిత్రకారులు, చిత్రాధిదేవతకు నతులొనర్చడానికి సంసిద్ధులయ్యారు. దామెర్ల రామారావు చిత్రలేఖనలో నూత్న శకారంభము చేయ దీక్షవహించాడు గానీ, మాయగా, అకాల మృత్యువు అతన్ని మాయం చేసింది. ప్రమోదకుమార చటోపాధ్యాయుని కడ, ఆంధ్ర జాతీయ కళాశాలలో ఒక సంప్రదాయము ప్రారంభమైనది. ఆయన పాదాలకడ కౌతా రామమోహన శాస్త్రి, ఆనందమోహన శాస్త్రి, గుఱ్ఱం మల్లయ్య, తేజోమూర్తుల కేశవ రావు, నేనూ దీక్ష వహించాము. నా శిష్యులు కొందరు సెలవుపుచ్చుకొని, ఆయాస్థలాల్లో చిత్రలేఖనం వెదజల్లుతున్నారు. మద్రాసు ప్రభుత్వ కళాశాలలో ఎస్.వి.ఎస్. రామారావు, సుబ్బారావు, నారాయణరావు, దుర్గారావు, గోఖలే మొదలైన యువకులు, అన్నపూర్ణాదేవి, లక్ష్మీదేవి మొదలగు యువతులు దేవీ ప్రసాదరాయునికడ విద్య నారంభించి, వృద్ధి చెంది పేరు ప్రతిష్టలు సంపాదించుకొంటున్నారు. దామెర్ల రామారాయని శిష్యుడును, స్నేహితుడును అయిన వరదా వెంకటరత్నం గారును, రామారాయని సహోదరి శ్రీమతి బుచ్చి కృష్ణమ్మగారును, రామారాయుని సంప్రదాయము వృద్ధిపొందిస్తున్నారు. పెనుగొండలో సి.ఎస్. వెంకట్రావుగారున్ను, భీమవరంలో అంకాల సుబ్బారావుగారున్ను, ఏలూరులో మొక్కపాటి కృష్ణమూర్తి, పిలకా నరసింహమూర్తి, సీతాదేవి గార్లున్ను కళాదేవిని పూజిస్తున్నారు. శాంతినికేతమువెళ్లి, నందలాలు కడ మోకరించి కళనభ్యసించి, శ్రీమతులు కృష్ణాబాయి, కమలాబాయి, సరోజిని మొ॥వారు చిత్రలేఖనంలో ప్రఖ్యాతి వహించియున్నారు.

గృహనిర్మాణము

ఆంధ్రదేశంలో గృహనిర్మాణము పూర్వము ఏయే పంథాలు అనుసరించిందో విస్పష్టంగా చిత్రించడానికి ఆధారములు బహుళంగా లేవు. ప్రతి యుగంలోను ఆలయ నిర్మాణము, స్తంభ నిర్మాణము ఏయే విధాలుగా మార్పు చెందుతూ వచ్చినదో ఆ పరిణామాన్ని దర్శించడానికి మిగిలినవి -- కొన్ని ఆలయములు, వాటిలోని స్తంభ నిర్మాణమే!

మన ఆలయ నిర్మాణ విధానములు - పూర్వపు దివ్య హర్మ్యములు

మనపూర్వుల దివ్యహర్మ్యములు, రాజప్రాసాదములు పురాణ, బ్రాహ్మణ, ఐతిహాసిక గాథలలో వర్ణింపబడి వున్నవి.. రామాయణములోని రావణాసురుని అంతఃపుర వర్ణననుబట్టి ఊహించినచో, ఆనాటి ప్రాసాదాలకు నేటి మన భవననిర్మాణము సరిపోలదని చెప్పవచ్చును. మోహెంజొదారో, హరప్పా, సింధునదీ ప్రాంతములో బయల్పడిన పట్టణాలను పరిశీలిస్తే మన భారతదేశములోని నిర్మాణము, వైభవము మనకు గోచరిస్తుంది!

గుహలు, విహారములు, చైత్యములు

శాతవాహనులు వారి యాజమాన్యం క్రింద, కార్లేగుహలను క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దమున నిర్మాణము చేసిరి. కార్లేగుహల తర్వాత, బాజ్ గుహలు, నాసికగుహలు, కన్హేరిగుహలు, ఔరంగాబాద్, అజంతా గుహలు నిర్మాణము కాబడినవి. ఈగుహలలో చైత్యములనీ, విహారములనీ రెండురకములు. చైత్యములు దేవాలయముల వంటివి, విహారములు బౌద్ధక్షపణకులు నివసించే గుహలు. చైత్యము శిఖర సంయుతమైన అర్ధానుస్వారంలాగు వుంటుంది. లోపలకు వెళ్లగానే గజపుష్టాకారాంతర్భాగం కనిపిస్తుంది. ముఖద్వారానికి ఎదురుగాను, గుహ అవతల చివరను, బుద్ధధర్మచిహ్నమైన స్తూపశిల్పము చేయబడి వుంటుంది. క్రమేపి ఈ రచనా విధానం అంతటా అల్లుకుపోయింది!

ఈ చైత్యగుహలే, ఇటికలతో రాళ్లతో నిర్మించిన చైత్యాలుగా మారినవి. అమరావతి, నాగార్జుకొండ, భట్టిప్రోలు, జగ్గయ్యపేట మొదలైన ప్రదేశాలలోని చైత్యములలో పూజా స్వరూపమైన స్తూపమున్నూ, రానురాను బుద్ధ విగ్రహములున్నూ గలిగి పూజనీయము లైనవి. దానితో విగ్రహపూజ ఏర్పడినది. ప్రథమాన్ని నిర్మించిన ఈ చైత్యబౌద్ధదేవాలయాన్ని, తర్వాత వచ్చిన బ్రాహ్మణ మతావలంబులు ఆ విగ్రహాన్ని తీసివేసిగాని, ఆ విగ్రహాలకే వైష్ణవ, శైవ, స్వరూపాలిచ్చిగాని, స్తూపాలకు లింగ స్వరూపాలిచ్చిగాని వీటిని హిందూదేవాలయములుగా మార్చినారు. అట్టి దేవాలయమొకటి చేజెర్లలో నున్నది.

విహారములు - నిర్మాణము

విహారములు పెద్దవి. అవి మూడు నాలుగు వందల మంది జనులుపట్టు సభామందిరములు. ఇవి సింహద్వారములు కలిగి, కుడ్యోపరిభాగములు లతావితానచిత్రసంయుతాలై వున్నవి. విహారములముందు మొగసాలయున్ను, లోపలి సింహద్వారమున కెదురుగా గర్భ గుహయున్నూ వుండును. ఆదిలో, గర్భగుహలో బుద్ధమూర్తి చిహ్నములుగాని, రానురాను విగ్రములనుగాని ప్రతిష్టించేవారు. సభకుచుట్టున్ను సన్యాసులు నివసించడానికి గదులు చెక్కి వున్నారు. వెలుగువచ్చు ఆధారమేమీ లేకుండి, చీకటి కోణములై యున్నవి. ఒక పెడ శయనించడానికి శిలావేదికలు చెక్కబడినవి.

ఈ విహార స్వరూపాలలో హిందువులు, ప్రథమ దేవాలయములను రాతిలో చెక్కినారు. హిందూ విహారములలో బౌద్ధ విహారములలో వలె భిక్షువులుండు గదులులేవు. బౌద్ధ మతమువల్ల ఆంధ్ర దేశములో మొదట ఉద్భవించిన కట్టడము స్తూపము. అశోకుడు కళింగదేశములోను, శాతవాహన ముఖ్యపట్నమైన ధాన్యకటకములోను, భట్టిప్రోలులోను స్తూపముల నిర్మించెను. జగ్గయ్యపేట స్తూపమున్నూ, గుంటపల్లి స్తూపమున్నూ క్రీ.పూ. రెండవ శతాబ్దం నాటివి. అప్పుడే తెలివాహనది గట్టున, రామ తీర్థములోను చిన్న చిన్న స్తూపముల నిర్మించిరి. ఇవి రానురాను పెద్దవి చేయబడి, ఛత్రశిఖరాలు గలిగి, వివిధ శిల్పములచే అలంకరింపబడి, పూర్వ సౌందర్యమును ప్రతిబింబింప చేయుచున్నవి. ఉత్తరహిందూ స్థానంలోని సాంచీ మొదలైన ప్రదేశములలో స్తూపములున్నవి. మన ఘంటసాల, గుడివాడలలో ఉన్న స్తూపములు రెండవ శతాబ్దము నాటివే!

అమరావతి, నాగార్జునకొండ, గుమ్మిడి మ|| స్తూపశిల్పాలు, ఆయా ప్రదేశాలలో ప్రకాశించిన స్తూప స్వరూపాలలో శిల్పము చేయబడి యున్నవి. స్తూపము కోడిగ్రుడ్డు అడుగు భాగము కొట్టివేసి బోర్లించి నట్లుండును, ఇవన్నీ పల్నాటి తెల్లపాలరాయితో కట్టిరి. స్తూపానికి నాలుగు ప్రక్కలా నాలుగు అరుగులున్నవి. ఆనాటి శిల్పులు గుహా, చైత్య శిల్పాలను సమ్మిళితం జేసి, ఉద్భవింప జేసినారు.

స్తూపాలన్నిటి చుట్టు కర్ర, పాలరాతితో చేసిన కంచెలు

స్తూపాలన్నిటి చుట్టూ, ముఖ్యంగా ఆంధ్రస్తూపాలన్నిటి చుట్టూ, మొదట కర్రతో నిర్మించి నట్టిన్ని తరువాత నల్ల రాతితో నిర్మించినట్టిన్నీ, ఆ తరువాత తరువాత పాలరాతితో నిర్మించి నట్టిన్నీ కంచెలు కట్టుచుండెడివారు. పొడుగునా నిలువుదూలాలు, మూడు అడ్డదూలాలతో ఈ కంచెలు నిర్మించినారు. ఈ తెల్లరాతి కంచెలుమీద అద్భుతమైన శిల్పము, ప్రతిభాపూరితమై ఉండేది!

పాణిద్వారములు, ఆంధ్రులు-స్తంభములు

సాంచీలోని మహాస్తూపంచుట్టున్నూ నాలుగు పాణిద్వారాలున్నవి. ఈనాలుగు శిల్పద్వారాలున్ను ప్రపంచాద్భుతమైన శిల్ప సౌందర్యాన్ని పుణికి పుచ్చుకొన్నవి. ఈ ద్వారముల నిండా మహావిన్యాసమైన శిల్పకల్పన వున్నది. ప్రథమంలో స్తంభములన్నీ దారుశిల్ప స్వరూపాలు. పూర్వకాలంనుంచీ కీర్తి స్తంభాలు, జయస్తంభాలు, సహగమన స్తంభాలు, శాసనస్తంభాలు, దీపస్తంభాలు మొ॥నవి భారతదేశమంతటా నిండివుండేవని కావ్యాది గ్రంథాలు చెప్పుతున్నవి. అయినా నేటి వరకు నిలిచివున్నవి మన దేశములో అశోకస్తంభాలే! ప్రథమంలో అశోకచక్రవర్తి, శిలాస్తంభాలేకాకుండా లోహస్తంభాలు గూడా చెక్కించినాడు. ఒక లోహతుల్య స్తంభమును పాశ్చాత్యులు బర్మింగ్‌హామ్‌కు తీసుకొని పోయి, అచ్చటి వారి మ్యూజియములో పెట్టుకొనినారు. ఇప్పుడు ఢిల్లీలో ఒక అశోకుని స్తంభము, కుతుబ్‌మీనరులోనున్నది. మన ఆంధ్ర దేశములోని స్తూపాలు చుట్టున్నూ ఆయకస్తంభాలు, ధర్మచక్రస్తంభాలు మొదలైనవి గలవు.

క్రీ.శ. 3వ శతాబ్దిలోనే, శాతవాహన శిల్పము నుంచి ఉద్భవించిన పల్లవ శిల్పము కాంచి, మహాబలిపురములలోను, నెల్లూరి జిల్లా తెరవోనలోను ఆలయశిల్పమై పరఢవిల్లినది. మహాబలిపురంలో ఉన్న రథస్వరూపాలు కొన్ని చూత్యములలాగు, కొన్ని విహారాకృతి కలిగి యున్నవి. పశ్చిమ చాళుక్యులు కట్టించిన బాదామినగరమును, అజంతా, కార్లే, నాసిక మొదలైన గుహలనుజూచి, హైందవ సంప్రదాయంతో నిర్మించారు. పల్లవాలయ శిల్పనిర్మాణము, చాళుక్య ఆలయ నిర్మాణము గమనించి రాష్ట్ర కూటులు ఎల్లోరాలో పరమాద్భుతమైన గుహలను నిర్మించారు. ఈ ఎల్లోరా గుహలోని ఆలయములు, స్తంభాలు, యాత్రిక మందిరములు, కళ్యాణమండపము మొదలైన నిర్మాణములతో – విశ్వకర్మదేవుని నిర్మాణములాగు, వికసించినవి. పాలంపేటలోని బార్హట్ గుహలు ఉన్నత కళాసంపద గలిగినవి.

కాకతీయుల వెనుక, రాయలయుగ శిల్పులు కాకతీయ శిల్పానికి వన్నెలు దిద్దే ఆలయ నిర్మాణాన్ని హంపీ, తాడిపర్తి, పెనుగొండ, లేపాక్షి, స్తూపాలదగ్గర వున్నట్టి స్తంభనిర్మాణములోను పల్లవులు, చాలుక్యులు, కాకతీయులు, రాష్ట్రకూటులు, గాంగులు, తెలుగు చోళులు, విజయ నగరం శిల్పులు – ఒకరికన్నా ఒకరు అందమైన శిల్పములను వెలయించారు. ఏక స్తంభ స్వరూపాలు కాకతీయులలోను, వివిధ స్తంభగర్భిత ఏకస్తంభములు విజయనగర శిల్పుల పనితనంలోను, రూపుగొన్నవి. విజయనగరంలోని సప్తస్వరస్తంభాలు జగత్తులోని రసజ్ఞు లందరకున్నూ అద్భుత రసాన్ని నివేదిస్తున్నవి! హంపిలోని పదమ ప్రాసాదము, ఏనుగులశాల, మహాసభావేదిక, వాని సోపాదినిర్మాణములు హైందవరాజుల రసజ్ఞతను చాటుచున్నవి. విజయనగర విజయ ద్వారాలు, గోపుద్వారాలు ఇప్పటికీ విచిత్రమై యున్నవి! సింహాచలం మొదలగు అనేకచోట్ల చేయించినారు. రాయల సామంతపాలకులైన నాయకులు మధుర, తంజనగరములలో కట్టించిన ఆలయములు, తిరుమలనాయకుడు చేయించిన మధురవిమానం, రాజమందిరములు, ద్వారములు అద్భుతము కొలుపుతూ ఉంటవి. ఈయన రాజమందిరము, ఒక్కమేకుగాని కఱ్ఱగాని ఉపయోగించని మహాభవనము. స్తంభాలు చిన్న చిన్న గోపురాలంత ఉన్నవి. ఆంధ్ర గాంగశిల్పులు ముఖలింగం, కోనార్క, భువనేశ్వరం, జగన్నాథపురం ప్రదేశములలో, చాళుక్యాది ఆలయనిర్మాణానికి సరిపోని వేరొకశిల్ప స్వరూపమైన ఆలయ నిర్మాణం నిర్మించినారు.

అజంతా బౌద్ధ గుహలలోను, అమరావతీ మొదలైనవన్నిటిని ఒక్కరాయైన పైనుండి తీసుకొని రాకుండా నిర్మింపజేసిరి. బెజవాడ, రాజమహేంద్రవరములలో చాళుక్యులు నిర్మించిన సుందరమైన దేవాలయములు వెలసినవి.

గోపురములు

దేవాలయముల ముందర ముఖ్య విమానం కన్నా గోపురాలు ప్రథమంలో నిర్మించినది కుళోత్తుంగచోళుడు. దీన్ని అనుసరించి నాయక రాజులున్నూ దక్షిణమున గోపుర నిర్మాణం చేయించిరి. చిందబర గోపురం కుళోత్తుంగుడే నిర్మింపజేసినాడు! పాలకొల్లు, మంగళగిరి, తిరుపతి, నెల్లూరులలోని ఆలయములు ఎత్తై, ఆశ్చర్యము గొలుపుతూ ఉంటవి. గాంగశిల్పులు నిర్మించిన విమానములు అంబరచుంబితాలై యున్నవి. తరువాత మన దేశమున వర్ధిల్లినది మహ్మదీయ నిర్మాణము.

గోలుకొండ, బీదరు, అహమ్మద్ నగరము, హైదరాబాదు, ఓరుగల్లు, చెన్ననగరములలో బహమనీ రాజులయొక్కయు, నైజాము, కర్నాటక నవాబుల యొక్కయు మశీదుల, మీనారుల సౌందర్యం లోచనగోచర మవుతుంది.

ఆంధ్రులు వలసపోయిన బర్మా, జావా, బోర్నియో మొదలైన ప్రదేశములలో గూడా ఆంధ్రకళా నైపుణ్యం ఆ పరిసరముల కనువైన స్వరూపం దాల్చి – ప్రతిభావంతంగా భాసిస్తున్నది!

(ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము)

గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు

సంగీతము - ప్రజల కర్తవ్యము

సంగీత మన బ్రహ్మానంద సంధాయక మగు నాద బ్రహ్మోపాసనము. "మూలాధారజ నాద మెరుగుటె ముదమగు మోక్షమురా ఓ మనసా" అని త్యాగరాజస్వామి వచియించినట్లు అట్టి నాదబ్రహ్మోపాసనమొనరించియే మతంగ భరత శుక శౌనక నారద తుంబురు ఆంజనేయాది ఋషిసత్తము లెల్లరను మోక్షసామ్రాజ్యమలంకరించినట్లు శ్రుతి స్మృతి పురాణేతిహాసాదుల వలన విదితము కాగలదు. "శిశుర్వేత్తి పశుర్వేత్తి గానరసం ఫణిః" అను నట్లు శిశు పశు ఫణ్యాదులనే గాక చేతనాచేతనములగు సమస్త భూతజాలంబుల నాకర్షింపజాలునదియు ఐహికాముష్మికములగు చతుర్విధ పురుషార్థములనొసంగ జాలునదియునగు సంగీత విద్య లోక మానవ కళ్యాణమున కెంతటి ప్రయోజనకరమైనదియో, తదానందానుభవముగల రసజ్ఞులకు వేరుగ దెలుపనవసరము లేదు. సంగీతము మానసికముగనే గాక శారీరకముగ గూడ మిగుల ప్రయోజనకారి యనియు, సంగీతమువలన శారీరక వ్యాధులు నివారణమగుననియు, సుప్రసిద్ధులగు భిషగ్వరులెల్లరును వక్కాణించియుండిరి. అట్టి ప్రయోజనములం గూర్చి గౌ॥ డాక్టర్ యు. రామారావుగారి సంపాదకత్వమున వెలవడు "ఆరోగ్య ప్రకాశిక" యను మాసపత్రిక యందు ప్రకటితములగు అపూర్వోపదేశంబులం గాంచనగును.

సమస్త జీవకోటికిని ఉచ్ఛ్వాస నిశ్వాసములకనువగు పరిశుద్ధమైన ప్రాణవాయువును, క్షుత్పిపాసాదుల నుపశమింపం జేయు ఆహార పానీయములును, ఎంతటి యావశ్యకములో మానవులు తమ జీవయాత్రను సౌఖ్యదాయకముగ గడపుటకు సంగీతముకూడ నంతటి యవసరమే; అందువలననే ప్రపంచమున గల మానవులెల్లరును తమ జీవితము యొక్క ఆశయములను సంగీతముతో సమన్వయ మొనరించుకొని శ్రేయమును గాంచ గలుగుచుండిరి.

అట్లే మన భారతీయులగు వివిధ రాష్ట్రముల వారును ఆయా రాష్ట్ర పరిస్థితులకనువగు రీతుల శాస్త్రానుభవంబుల నలవరచుకొని గాన ప్రయోజనంబుల నందు చుండుటయు, అట్టి పలువిధంబులగు భారతీయగాన పద్ధతులలో శాస్త్రబాహుళ్యమును బట్టియు విన్యాసక్రమవిస్తారంబగు ప్రస్తారమును బట్టియు అనంతంబులగు రాగ తాళాదికంబుచే మిగుల వన్నెగాంచియున్న కర్ణాటక సంగీతమను దానిని పూర్వానుశ్రుతముగ మన మలవరచుకొని గాన ప్రయోజనములనందు చుండుటయు తటస్థింపనయ్యె.

దీనికి కర్ణాటక సంగీతమను పేరెట్లు వచ్చెను? ఈ సంగీతమునకును యాంధ్రులకును గల సంబంధము ఎట్టిది? అను విషయము నించుక విచారింతము గాక;

పూర్వము మన స్వదేశ ప్రభువులగు కర్ణాటక రాజ్యాధిపతుల యేలుబడియందుండు మనదేశమునకు కర్ణాటక సామ్రాజ్యమనియు అట్టి రాజులచే మిగుల ఆదరింపబడుచుండిన మన సంగీతమునకు కర్ణాటక

సంగీతమనియు, వ్యావహారిక మగు నామంబులేర్పడి యుండుట తటస్థింపనయ్యె; పిమ్మట కాలవశమున సామ్రాజ్య పరిపాలకులు మారుటవలన సామ్రాజ్యనామము మార్పు చెందినను, స్వలాభకరమగు సామ్రాజ్యాధిపత్యమును వరించునట్లు లాభదూరమగు సంగీత విద్యా పోషకత్వమును వహించుటకు స్వార్థత్యాగముగల ప్రభువులు మాత్రమెవరును లేకుండుటం జేసి కర్ణాటక సంగీతమను పేరు మాత్రము చిరస్థాయిగ నిలచియుండెను; "దేశభాషల కెల్ల తెలుగు లెస్స" అను ప్రమాణ వచనము సంగీతము పట్టునకూడ సార్థకమై సంగీతవిద్యకు ఆంధ్రభాషచే సమకూరు నంతటి విలక్షణ ప్రతిభాప్రకాశములు మరియే ఇతర భాషవలనను కలుగజాలవనుట నిర్వివాదకరమగు సిద్ధాంతమైయుండుటం బట్టి, "స్వరాజ్యము నాజన్మహక్కు" అను లోకమాన్య తిలక్ మహాశయుని వాక్యానుసరణముగ, ఆంధ్రుల స్వీయవస్తువనందగు కర్ణాటక సంగీతమును పర్యాయనామము గల మన సంగీతమును, ఆంధ్రసంగీతమని పేర్కొనుటయే, సమంజసముగ నుండునేమో! ఎట్లైనను, ఈ కర్నాటక సంగీతమును బ్రతిష్ఠించి పెంపొందించిన వారు మాత్రము మన యాంధ్రులే యనుట నిస్సంశయము; అది, ఈ క్రింది చరిత్రాంశంబులం బట్టి తెల్లము కాగలదు.

చోళరాజ్యమునకు తంజావూరు నగరమును రాజధానిగ జేసికొని పరిపాలించిన వారిలో ప్రాథమికులు మన తెలుగు నాయకరాజులనియు, అందు చెవ్వప్ప నాయకుడు, అచ్యుతప్ప నాయకుడు, రఘునాథ నాయకుడు అనువారు క్రమముగ రాజ్యపరిపాలన మొనరించిన కాలమున తంజాపురమును మిగుల బెంపొందించి శత్రువుల కభేద్యమగు కోటకొత్తడములను, అగడ్తలను రాచనగరులను నిర్మించి, సంగీతకళాశాలలను, ధర్మసత్రములను ప్రతిష్ఠాపన మొనరించుటయే గాక, రాజమంత్రులను, బురోహితులను, విద్వాంసులను, కవులను, గాయకులను, చిత్రలేఖకులను, వేశ్యలను, వారు వీరన నేల --సర్వ రాజ్యాంగము లను ఆంధ్రదేశమునుండియే తోడ్కొని పోయిరనియు, నేడు వేలకొలది దక్షిణ దేశమున నివసించియున్న ఆంధ్రులెల్లరును అటుల దోడ్కొని పోవఁబడిన వారి వంశీకులే ననియు సంగీతమునకు "తంజావూరిపాట" అను శ్రేష్ఠవాచకమేర్పడుటకు తంజావూరి ఆంధ్రనాయక రాజులలో రఘునాథనాయకుడు కారణభూతుడనియు, సంగీత విద్యయందఖండ పాండిత్యము గల యాతడు "సంగీతసుధ" యను గొప్ప సంగీత గ్రంథమును రచించియుండెననియు, ఆనాడు మన ఆంధ్రదేశమునందు ప్రఖ్యాతి వహించిన సంగీతవిద్వాంసు లెందరో సగౌరవముగ దోడ్కొని పోవంబడియుండిరనియు, సుప్రసిద్ధులగు విమర్శకాగ్రేసర: బ్రా॥ వేటూరి ప్రభాకరశాస్త్రి (ఆంధ్ర సారస్వత పరిషద్విచక్షణ సమర్పిత ఘన బిరుదాభిరాములు) గారిచే సమకూర్చబడిన "తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర" నించుక పరికించిన తేటతెల్లమగును.

అప్పుడటుల గొంపోవబడిన యొక ఆంధ్రవిద్వాంసుని వంశమునందవతరించి సంగీతమును బునరుద్ధరించుట కీ భూలోకమున కేతెంచిన పరమశివుడో యనంబరగి శ్రీరామ తారక మహామంత్రోపాసనచే భగవద్గుణానుభవసంకీర్తనంబుల నసంఖ్యాకంబుగ నొనరించి భక్తిగానముచే మానవలోకమును తరింపజేసిన సంగీత జగద్గురుమూర్తి యగు శ్రీ త్యాగరాజ స్వామియే గదా, నేటి మన కర్ణాటక గాయకలోకమునకు సంగీత భిక్ష యొసంగిన మహానుభావుడు!

ఇటుల సర్వవిధములను మన పూర్వులగు ఆంధ్రులచే సమకూర్చబడిన మన సంగీతవిద్యాప్రాభవమును ఆధారముగ గొనియే తత్ఫలితముగ చోళదేశీయులగు నేటి తమిళసోదరులు సకల శ్రేయములను బడయగలుగుచుండిరి. వారు తమ ముఖ్యపట్టణములయందనేకముగ గానసమాజములను స్థాపించుకొనియున్నారు. దాజధాని యగు ఒక మద్రాసు పట్టణముననే తమిళుల యాధిపత్యము క్రింద స్థాపింపబడిన గానసమాజము లెన్నియోగలవు. అట్టి ప్రతి సమాజమునందును మాసమున కొకతూరి సంగీత కచ్చేరియో, లేక హరికథాకాలక్షేపమో విధిగ జరుపబడుచుండుటయే గాక శ్రీరామనవమి, గణపతిచతుర్థి, కృష్ణాష్టమి, మహర్నవమి మొదలగు ఉత్సవాదులకై ప్రత్యేకసభ లెన్నియో సమకూర్చబడు చుండును. ఆంధ్రపత్రిక యందు స్థానిక వార్తలలో నిట్టి గానసభల యొక్క ప్రకటన లేని దినమే యుండదనిన యతిశయోక్తి కాజాలదు. ఈ సభల కన్నిటికిని తరగతుల వారీగా ప్రేక్షకస్థానంబులును, తగురీతి ప్రవేశరుసుములును ఏర్పరుపబడియుండును. ఇట్టి సభల కగు ధనవ్యయమునకు వెనుదీయక ప్రేక్షకులమిత సంఖ్యాకులుగ నరుదెంచుచుందురు. ఇట్లు సంగీతము యొక్క విలువను, ఆనందమును గ్రహింపగల శక్తి నలవఱచుకొని యుండుట వలననే వారు వారమున కొకతూరి యైనను సంగీతానందము ననుభవించక యుండజాలరు. ఇటుల సంగీత విద్యాభిలాష గల జనసామాన్యము యొక్క ఆదరణ వలననే అట్టి గాన సమాజములన్నియు నిరంతరాయముగను, స్థిరముగను నిర్వహింపబడుచున్నవి. ఇటీవల చిదంబర మహాక్షేత్రమున నెలకొల్పబడిన అణ్ణామలై విశ్వవిద్యాలయమున కనుబంధముగ నొక గానకళాశాలను కూడ వారు నిర్మించుకొన గలిగిరి. ఇట్లు మన సంగీతము యొక్క విలువను దాక్షిణాత్యులు గ్రహించినట్లు మనవారింకను గ్రహింపకుండుట మిగుల శోచనీయము.

మిగుల వైశాల్యమై అధిక జనసంఖ్యగల మన యాంధ్రదేశమున కంతటికిని సంగీత విద్యాభివృద్ధికి అత్యవసరమగు గానసమాజముల విషయమున ఎన్నిసారులు లెక్కించినను స్థిరముగ నెలకొల్పబడి యున్నది కాకినాడ గానసభ యొక్కటియే గదా! అది యైనను సంవత్సరమున కొకతూరి వార్షికోత్సవముల యందు మాత్రమే గానసభల నేర్పరచుచుండెడి యాచారము కలిగియున్నది. కాని దక్షిణదేశమునందు వలె ప్రతి మాసమున నొక సంగీత కచ్చేరి జరుపుచు దేశీయులలో సంగీత విద్యాభిలాష చల్లారకుండ విద్యాంసులకును, విద్యాభిలాషులకును వెంటవెంటనే ప్రోత్సాహ మొసంగ గల గానసభ యొకటి యైనను మన దేశమున నింతవరకు స్థాపింపబడ కుండుట మిగుల శోచనీయము. ఈ కొరతను కూడ శ్రీ కాకినాడ గాన సభాకార్యనిర్వాహకులే తీర్చి సంగీత విద్యాభ్యుదయమునకు ఇంకను ఎక్కువగ తోడ్పాటొనరించుచు తమ గాన సమాజమును పరిపూర్ణ ఫలప్రదాయకముగ నొనరించి ఎల్లరకు మార్గదర్శకులగుదురు గాక; ఇంకను మన దేశమున నిట్టి గానసభలను విరివిగ నిర్మించుకొన గలిగినపుడే మన ప్రయత్నములు సార్థకములై కార్యసాఫల్యతం గాంచగలుగును.

గత రెండు మూడు వర్షములనుంచి గుంటూరు, విశాఖపట్టణము మొదలగు మరికొన్ని తావులను గూడ గానసభలను నెలకొల్పి

సంగీతప్రదర్శనములం జరుపుచున్నట్లు తెలియనగును. వీనిని గూడ పై నిబంధనలతో స్థిరముగ నెలకొల్పుటకు ఆయా సమాజములవారు ప్రయత్నించుటయేగాక, దేశమునందింకను గల ముఖ్యపట్టణములలో విరివిగ గానసభలను స్థాపించి సంగీత విద్యాభివృద్ధికి ఎక్కువగ పాటుపడవలసియుండుట దేశీయులకెల్లరకును ముఖ్యకర్తవ్యమై యున్నది.

మన యాంధ్రులకు సహజలక్షణములై యుండు ధైర్య శౌర్య మహౌదార్యములతో బాటు సంఘీభావమును, కార్యదీక్షయును కూడ గలిగియుండిన యెడల అనన్య సామాన్యములగు ఎంతటి దుర్ఘట ఘనకార్యముల నైన నవలీలగ సాధింపగలరనుట యతిశయోక్తి కానేరదు. కాని, ప్రస్తుత కాలమున నీ రెంటియందు కూడ మన మింకను ఇతరులకు వెనుకబడియుంటిమని చెప్పవలసి వచ్చినందుకు చింతించుచున్నాను. ఇది గాక మనలో జాతి మత వైషమ్యములు కూడ పెచ్చుపెరిగియున్నవి. ఇట్టి యనర్థకముల వలననే మన మేకార్యము దలపెట్టినను అది ఫలరూపము దాల్చుట కడు దుర్లభమగుచుండును. (మన ఆంధ్రవిశ్వవిద్యాలయ సమస్య యొకింత పరికించిన ఇందలి యథార్థము తేటపడగలదు) మన శ్రేయోభివృద్ధికి ప్రబలశత్రువై మన జాతీయ వికాస ఫలవృక్షమునకు వేరుపురుగైయున్న ఇట్టి జాతి మత వైషమ్యములను రూపుమాపవలసియుండుట ఎంతటి యావశ్యకమో మన పూర్వచరిత్ర యొకింత స్మరించుకొనిన స్పష్టము కాగలదు.

పూర్వకాలమున మన యాంధ్రులు ఎంతటి వైభవోపేత మగు ఔన్నత్యము నందియుండిరో ఆధునికమున మన మెంతటి హైన్యస్థితికి బాల్పడి యుంటిమో చారిత్రాత్మకముగ నించుక విచారించిన యెడల ఆశ్చర్య సంభ్రమ విషాదములకు లోనుగాక తీరదు.

పూర్వము తమ సహజ పరాక్రమ శౌర్యాదులచే గొప్ప రాజ్యసంస్థాపన మొనరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణముల నొనరించిన రాజాధిరాజులు మన ఆంధ్రులు. అట్టి భూపాలుర కండయై నిలచి తమ రాజ్య తంత్ర నైపుణ్యముచే ప్రజారంజకముగ పరిపాలించిన మహామంత్రులు మన ఆంధ్రులు; దుష్ట శత్రుసంహార సమరముల యందు అసమాన బలపరాక్రమముల బ్రకటించిన యోధానుయోధులగు రణరంగ శూరులు మన ఆంధ్రులు. సర్వమత సహకారసమ్మేళనమగు ధర్మసంస్థాపన మొనరించిన మత ప్రవక్తలు మన ఆంధ్రులు; ఈశ్వరోపాసనాపారీణులై రామాయణ భాగవత భారతాది మహోత్కృష్ట కావ్యములరచించిన వరప్రసాదులగు మహాకవులు మన ఆంధ్రులు. లక్ష్యలక్షణ సమన్వితములగు సంగీత గ్రంథముల రచించిన మహాగాయక వాగ్గేయకారకులు మన యాంధ్రులు; ఇహభోగంబులం దృజించి భక్తి పదంబు చేబట్టి దైవసాక్షాత్కారముంగాంచి పూత చారిత్రులైన మహాభక్తులు మన యాంధ్రులు; శిల్పకళాచాతుర్యమున ప్రపంచాతీతులై సృష్టికి ప్రతిసృష్టి చేయగలిగిన కళాప్రపూర్ణులు మన ఆంధ్రులు; అది ఇది యననేల? ఐహికాముష్మికపరంబులగు సమస్త విషయముల యందును మన ఆంధ్రులు మహోత్కృష్టతం గాంచి యుండి రనుట చారిత్రక సుప్రసిద్ధము.

ఇప్పటికింత అసహాయస్థితి యందుండినను కూడ నైతిక ధార్మిక పారమార్థిక విద్యావిషయక రాజకీయాది వివిధ విషయములయందును ఇతరుల కెవరికిని దీసిపోవని స్వార్థత్యాగులయిన దేశోద్ధారకులు, దేశభక్తులు, దేశబాంధవులు, దేశసేవకులు మొదలుగా గల మహాపురుషులును, మహాకవులు, మహాగాయకులు మొదలుగా గల సంగీత సాహిత్య విద్వన్మణులును పెక్కంద్రు మన యాంధ్రుల యందే గలరనుట గమనింపదగిన విషయము.

ప్రస్తుతాంశమున మన పూర్వుల ఔన్నత్యమును దలంచుకొని గర్వించుటతో గాని, ఆధునిక హైన్య పరిస్థితులను గూర్చి విచారించుటతో గాని మన కర్తవ్యము ముగియజాలదు.

ఆధునిక పరిస్థితుల కనుగుణ్యమగు పద్ధతులతో సంగీత విద్యాభివృద్ధి కవసరమగు సంస్థాపనముల నిర్మించు కొని తద్వారా కార్యసాఫల్యతం గాంచుటయే మనకు కర్తవ్యాంశమై యున్నది.

ఇప్పటికి మన దేశము నందు గానవిద్యా విషయమున ద్వివిధములైన సంస్థలు ఏర్పడియున్నవి. అందు మొదటిది ప్రతి సంవత్సరమును ఆంధ్రసభలతో బాటు జరుప నిర్ణయింపబడిన ఈ యాంధ్రగాయక మహాసభలు, రెండవది "సంగీత మపి సాహిత్యం సరస్వత్యాః కుచద్వయం" అను న్యాయముచే సంగీత సాహిత్యముల రెంటిని సమ్మేళన మొనరింప నుద్దేశ్యముతో ఆంధ్ర సారస్వత మహాసభలతో బాటు ప్రతి సంవత్సరమును జరుపుచుండుటకు ఏతత్సభవారిచే నిర్ణయింపబడి ఆచరణ పూర్వకముగ ఇటీవల విజయనగరమున సమావేశమయిన ఆంధ్ర సారస్వత మహాసభలతో బాటు జరుపబడిన ఆంధ్ర సంగీత పరిషత్సభలును, మిగుల ప్రాముఖ్యతం గాంచదగియున్నవి.

ఈ రెంటిలో గానవిద్యా విషయికమగు శాస్త్రాంశములను చర్చించి లక్ష్య లక్షణ సమన్వితములగు సంస్కారములచే సిద్ధాంతము లొనరించు చుండుటకు సంగీత పరిషత్సభలును, గాన విద్యాభివృద్ధికి ఆవశ్యకములగు మార్గములను ప్రతిష్ఠాపనములను గూర్చి యోచించి నిర్ణయించుచుండుటకు గాయక మహాసభలును, మిగుల తగియుండునని నా యభిప్రాయము.

ఈ రెండు సభలయొక్కయు తీరుమానాశయములను ఆచరణలోనికి దెచ్చుచుండుటకు రెంటికిని ప్రత్యేకములుగ స్థిరసంఘములు కూడ ఏర్పరుపబడియున్నవి. కాని,"ధనమూల మిదం జగత్" అనునట్లు వాటికి తగిన ద్రవ్యసహాయముతో కూడిన ప్రోత్సాహము లేకుండుటం జేసి స్థాయిసంఘములు నెరవేర్పందగిన నియమితములగు తమ బాధ్యతలను నిర్వహింప జాలని స్థితియందున్నవి. ఈ రెంటికిని, స్వసంఘీయులగు దేశీయ విద్యాభిమానులును విద్వాపోషకులును, విద్యాంసులును కూడ తగురీతిని తోడ్పాటొనరించుచు, గాన విద్యా విషయమున మన యాంధ్రదేశము గోల్పోయిన పూర్వపు టౌన్నత్యమును తిరిగి ప్రతిష్ఠించి నిరాదరణచే నివురుగప్పిన నిప్పువలె మన దేశీయులలో నణగి యున్న సంగీత విజ్ఞానమును ఉత్తేజవంతముగ నొనరింపవలసి యుండుట పరమధర్మమైయున్నది.

ఇట్టి సత్ప్రయత్నముల యెడ మనకు సర్వదా పరమేశ్వరుడు తోడ్పడుగాక.

శ్రీపాద పినాకపాణి

కర్ణాటక సంగీతము - ఆంధ్రులు

ప్రపంచ సంగీతమున భారతీయ సంగీతము చాల పురాతనమైనది. ఇది క్రీస్తుశకమునకు చాల శతాబ్దములకు పూర్వమే పరిణతస్థితి నందియుండినది. అప్పటికి భరత ఖండ మందంతటను ఒకే లక్ష్యలక్షణసంప్రదాయము వ్యాప్తిలో నుండెను. కాలక్రమమున ఉత్తరహిందూస్థానమున విజాతీయుల పరిపాలనము చేత కాబోలు పూర్వ సంగీత పద్ధతి మారిపోయినది. దక్షిణ హిందూదేశమున మాత్ర మీ ప్రాచీనపద్ధతి వేరునాటుకొని 'కర్ణాటక సంగీతము' అను పేరుతో అభివృద్ధి చెందుతూ వచ్చింది.

15వ శతాబ్దిలో తాళ్లపాకం చిన్నయ్య, 16వ శతాబ్దిలో పురందరదాసు మొదలైన వాగ్గేయకారులు పెక్కు కీర్తనలను రచించినను త్యాగరాజాది త్రిమూర్తుల కాలమునుండియే కర్ణాటక సంగీతమునకు నూతన శోభ ఆరంభమైనది.

త్యాగరాజు చిన్ననాటినుండియే శ్రోతలను సమ్మోహితులను జేయునట్లు గానము చేయుచుండెను. ఆనాటి తంజాపురాస్థాన గాయకమణి 'సంగీతకళానిధి' బిరుదాంకితుడు శొంఠి వెంకటరమణయ్య గారివద్ద గానవిద్య నభ్యసించెను. బాల్యము నుండియు భాగవతరామాయణాది మహాగ్రంథములను పఠించి, కృష్ణానందులు తనకుపదేశము చేసిన శ్రీరామషడక్షరిని 96 కోట్లసారులు జపించి మహాభక్తుడై శ్రీరామానుగ్రహమునకు పాత్రుడయ్యెను. నారద గురుస్వామినుండి లభించిన 'స్వరార్ణవ' మను ఉద్గ్రంథమునందలి మర్మములు జీర్ణము చేసికొని త్యాగరాజు పూర్ణ విద్యాంసుడయ్యెను.

అట్టి దైవాంశసంభూతుడైన త్యాగరాజు సంగీత లోకమునకు కొన్ని వేలకృతులను రచించి ప్రసాదించెనని విందుము. మన దురదృష్టము ఈ నాటికి సుమారు 650 రచనలు మాత్రమే వెలుగొందుచున్నవి. ఇన్ని దివ్యకీర్తనలు ప్రచారములో నుంచిన గాయకుడు వేరొకడు లేడు. అందుకు కారణము త్యాగరాజస్వామి దినచర్యయే. త్యాగయ్య కోడికూతతో లేచి మేలుకొలుపులు పాడి, కావేరిలో స్నానమాడి నిత్య కర్మానుష్ఠానమును శ్రద్ధతో నెరవేర్చుచుండెను. పిదప శ్రీరాముని కీర్తనలతోను, పూవులతోను పూజించి, భోజనానంతరము విశ్రాంతి తీసికొని మధ్యాహ్నము శిష్యులకు వరుసగా ఎవరెవరి శక్తికి తగినట్లు వారికి తన కీర్తనలను పాఠము చెప్పును. వారమునకు ఒకటి రెండుసార్లు పక్క వాద్యములతో శ్రోతలు మైమరచునట్లు పాడుచు భిక్షాటనమునకు బయలుదేరును. ఈ సమయమున లభించిన సామగ్రితోనే కుటుంబపోషణము, అతిథిపూజ, శిష్యులకు భోజనము జరిగిపోవుచుండెను. ఆయన శిష్యులనుండిగాని, శ్రీమంతులనుండిగాని ఏమియు గ్రహించలేదు. నిధికంటె రాముని సన్నిధిసేవ లోనే సుఖము కనుగొనెను. వారి శిష్యులకు గురుస్వాముల తన్మయసమాధి కీర్తనగా ప్రవహించే సమయము తెలిసేదట. ఆ సమయములో త్యాగయ్య ముఖము జేవురించి తనవు మైమరచేదట. అది

గమనించి శిష్యులు తాటాకులు, గంటములు పరుగున తెచ్చి ఆ కీర్తన స్వరసాహిత్యములను వ్రాసేవారట. భజన పూర్తి కాగానే శిష్యులందరు గుమిగూడి తమ వ్రాతలను పోల్చి, కీర్తనను తయారుచేసి విరామకాలములో ఆయనకు వినిపించేవారట. ఆయన ఆమోదించిన పిమ్మట శిష్యులందరూ గురుముఖతః కీర్తన పాఠముచేసేవారట.

ఆ విధముగా త్యాగరాజస్వామి తన గానవిద్యను శిష్యులకు నేర్పి ప్రచారము చేసెను. అందువలననే ఈ నాటికి సుమారు 650 మణులవంటి కీర్తనలైనను మనకు మిగిలియున్నవి.

సంగీత త్రిమూర్తులలో ముత్తుస్వామి దీక్షితులు రెండవవారు. ఈయన బాల్యమునుండియు భక్తుడు. సుబ్రహ్మణ్యపరాశక్తులపై భక్తి నిలిపి గానవిద్యా రూపమున ఉపాసించెను. ముత్తుస్వామి తండ్రి రామస్వామి దీక్షితుల గురువగు శ్రీ చిదంబరయోగి వారియింట సేవకై వచ్చి, ముత్తుస్వామియొక్క జ్ఞానమును, దైవభక్తిని, మనఃపరిపాకమును గుర్తించి అతనిని తనతో కాశికి గొనిపోయి అయిదేండ్లపాటు సంగీత రహస్యములను పూర్తిగా నుపదేశించి "వత్సా, నీవిక ద్రావిడదేశమునకేగి తిరుత్తణిలో సుబ్రహ్మణ్యస్వామి నుపాసింపుము. ఆ దేవుని యనుగ్రహమున నీకు గానవిద్యాభివృద్ధి యగును. మంత్రజపధ్యానములను విరాగివై యాశ్రయించి లోకోపకారముగ సంగీతవిద్యను వ్యాపింపజేయుము" అని దీవించి పంపెను. కొంత కాలము పిమ్మట సుబ్రహ్మణ్యస్వామి ఒక వృద్ధుని రూపమున వచ్చి ముత్తుస్వామినోటిలో నొక కలకండ ముక్కను వైచి యదృశ్యుడయ్యెనట. నాటినుండి షణ్ముఖుని యనుగ్రహము గురుదేవులైన చిదంబరయోగి సంగీత విద్యోపదేశమునకు తోడై ముత్తుస్వామి దీక్షితులు 'గురుగుహ' ముద్రతో 300కు పైగా నద్భుతమైన కీర్తనలను రచించి గానము చేసెను.

ముత్తుస్వామిదీక్షితులు సంగీతమును విక్రయించలేదు. "హిరణ్మయీం లక్ష్మీం సదా భజామి; హీన మానవాశ్రయం త్యజామి" అని పేదరికముననే జీవితము గడపుచు దైవార్పణముగా గానము చేసెను.

శ్యామశాస్త్రి సంగీత త్రిమూర్తులలో కడపటివాడు. తంజావూరిలో బంగారు కామాక్షి నర్చించుచు నాదేవి యనుగ్రహమున గానవిద్య నభివృద్ధిజేసి యామెను కీర్తించెను. శ్యామశాస్త్రి సహజగాయకుడు. మేనమామవద్ద సంగీతము ప్రారంభించెను. సంగీత స్వాములనే ఒక యాంధ్రసన్యాసి కాశినుండి రామేశ్వరము పోవుచు తంజావూరిలో శ్యామాశాస్త్రిని తారసిల్లి అతని మేధాశక్తిని గుర్తించి సంగీతవిద్యనాతనికి సమగ్రముగా నేర్పెను. స్వామి సంగీతనిధి. సంగీతరహస్యములను శాస్త్రికి ఉపదేశించి తాను రచించిన అమూల్యసంగీతరచనల నతనిచే పాఠము చేయించి "కామాక్షీ దేవి కటాక్షమున గొప్ప సంగీత జ్యోతిగా వెలుగుదువు" అని దీవించి వెళ్ళెను. శ్యామాశాస్త్రి అంబకృపవలన నత్యద్భుతమైన సంగీతసుధను గ్రోలుచు దేవిపై 300 కీర్తనలకు పైగా రచించెను. కామాక్షీకటాక్షమున శ్యామాశాస్త్రికి సమృద్ధిగా సంపదగలదు. నరాశ్రయములేదు. భగవదాశ్రయము, దేవీసంకీర్తనమే అతని జీవితమున ఆశయములు. "రాజుల కనకాభిషేకముపై గాక అంబగానాభిషేకసేవ చేయుట"యందే మనసు నిల్పి కామాక్షీదేవి పాదములే శరణ్యముగా శ్యామాశాస్త్రి జీవించెను.

ఈ త్రిమూర్తుల కాలములో కర్ణాటక సంగీతము వేరు నాటుకొని దేశమందంతటను వ్యాపించెను. వారు చేసినది దేవగానము అని చెప్పుట అతిశయోక్తి కాదు. ముప్వురును మహాబుద్ధిశాలురు; భగవద్భక్తిసంపన్నులు. వారికి సంగీత గురువులు మహాయోగులు. త్రిమూర్తులు ధనకాంక్షాపరులు కారు. నరస్తుతికై పాటుపడలేదు. కృష్ణార్పణముగా గానముచేయుచు శిష్య కోటికి బహు శ్రద్ధతో సంగీతరహస్యముల నుపదేశించిన మహాఋషులు దేవగానము చేసిరన్న ఎవరు సంకోచింతురు? 'దేవగానము' అనుట తప్ప వారెట్లు పాడిరో ఊహించుట కష్టము. వారి శిష్యప్రశిష్య కోటిమూలము ఈ నాటికి మన చెవిని బడు వారి కీర్తనల కల్పనాచాతుర్యమును పరిశీలించినచో త్యాగరాజు, దీక్షిత, శ్యామాశాస్త్రుల సమర్థత, ప్రావీణ్యము కొంత యర్థమగును. త్యాగరాజస్వామి వర్ణములుగాని, కీర్తనలలో చిట్టస్వరములనుగాని కల్పన చేయలేదు. వారు కీర్తనల నెట్లు పాడిరో ఊహించు అదృష్టము మనకు లేదు. "గవ్వలు గిలకరించుట్లు, మువ్వలు మోగినట్లు, లత ప్రాకినట్లు, వాన కురిసినట్లు" అని కవిత్వము చెప్పవచ్చునేగాని త్యాగరాజు అనుసరించిన గానఫణితి నేటి సంగీతలోకమునకు మిగులలేదు. ఘనరాగపంచరత్నములలో మాత్రము అయ్యగారు రచించిన ప్రకారమే స్వర సాహిత్యము లున్నవి. వారి స్వరకల్పన ఏ మార్గములుగా పరుగులెత్తినదీ పంచరత్నములను జాగ్రత్తగా పరిశోధించిన తెల్లమగును. పచ్చిమిరియం ఆదెప్పయ్య గారి "విరిబోణి" వర్ణము, పల్లవి గోపాలయ్యగారి కల్యాణి అటతాళవర్ణము, వీణకుప్పయ్యగారి ఆదితాళవర్ణములు, శ్యామాశాస్త్రులువారి కీర్తనలలోని చిట్టస్వరములు, ముత్తుస్వామి దీక్షితులవారి కీర్తనల కల్పనలు (సంప్రదాయప్రదర్శినిలో నున్న స్వరకల్పనల ననుసరించి), రామనాథపురం శ్రీనివాసఅయ్యంగారి కీర్తనలలోని చిట్టస్వరములు, మాళవిరాగములో త్యాగరాజు రచించిన చిట్ట స్వరము, మహావైద్య నాథయ్యరు రచించిన "నెనరుంచినాను" అనే కీర్తనలో తిరుక్కోడి కావల్ కృష్ణయ్యరు రచించిన కాంభోజిరాగములో ఆదితాళవర్ణము, వీణ ధనమ్మ వాయించిన ఘనరాగతాళము, గురుమూర్తిశాస్త్రిగీతములు మొదలైన సంగీత రచనలు వన్నెకెక్కినవి. వాటిని బాగుగా పాఠము చేసి వానియందున్న కల్పనామార్గములను గమనించి మనస్సున నుంచుకొని అటుపైన త్యాగరాజ పంచరత్నములను జాగ్రత్తగా పరిశోధించిన యెడల అయ్యవారి దివ్యకల్పనాచతురత, గానమహిమ బోధపడును.

త్యాగరాజు 200 రాగములకు పైగా ఉపయోగించి వాటిలో ఒక్కొక్క రాగములో పలువిధములై, భిన్నమైన మార్గములలో కీర్తనలను రచించెను. తోడి, అఠాణా, సౌరాష్ట్రశ్రీ, కల్యాణి మొదలైన రాగములలో రచనలు ఇందుకు తార్కాణము. ఆయన కల్పించిన ప్రతి కీర్తనకును ఆ రాగకీర్తనల యందు గౌరవస్థానము కలదు. కీర్తనకు సుందరరూపము, అమూల్యవ్యక్తిత్వము నొసంగిన మహాగేయకారుడు త్యాగరాజు. కర్ణాటక సంగీతమునకు కృతియే జీవము.

ముత్తుస్వామి దీక్షితులవారి కృతి వేరొకరూపము దాల్చినది. అయ్యగారి కీర్తన ద్రాక్షాపాక మనియు, వీరి కీర్తన నారికేళ పాకమనియు

గానలోకమున నొక యభిప్రాయము. వీరి ప్రస్తారము విలంబకాలమున నడచినది. వీరి కీర్తనలు నిజరూపమెట్లున్నను అస్థిపంజరములవలెనైనను 'సంప్రదాయ ప్రదర్శని'లో అచ్చుబడియున్నవి. సుమారు 300 కీర్తనలున్నవి. రవ్వలవంటివి. సాధించుట బహుకష్టము. గురు ముఖతః వర్లించి పాఠము నెరసినవారి కంఠములయందే ఇమిడియుండును. వీరి కీర్తనలను రాగస్వరూపమున పాడయత్నించినచో కర్ణాటక సంగీతమున ఉత్తమకల్పనా రీతులు గోచరించును.

శ్యామాశాస్త్రి కల్పనలు కదళీపాక మని వాడుక. వీరి కీర్తనలలోనిమిడియున్న గాన శైలి, మాధుర్యము, త్యాగరాజకీర్తనలను జ్ఞప్తికి దెచ్చును. ఈ మహాగానయోగు లిరువురును తరుచుగా వారి కల్పనలను చర్చచేసి పరస్పరాభిప్రాయములను గౌరవించి కీర్తనలను దిద్దుకొనెడివారట. అయినను శాస్త్రులవారి గానపోకడలలో విశిష్టతకు లోటు లేదు. ఆనందభైరవి, సావేరి రాగములన్న ఈయనకు ప్రీతి మెండు. ఆనందభైరవిలో 'మరి వేఱెగతి ఎవరమ్మ', 'హిమాచలతనయ', 'పాహి శ్రీ గిరిజాసుతే', 'ఓ జగదంబ' అనే కీర్తనలకు మించిన రచనలు కానరావు.

సంగీత త్రిమూర్తుల కల్పనాలతలు సంగీత ప్రపంచమునందంతటను అల్లుకొనియున్నవి. త్యాగరాజు, ముత్తుస్వామిదీక్షితులు 72 మేళకర్తలయందును, వాటి జన్యములయందును కీర్తనలను రచించిరి. శ్యామాశాస్త్రి కూడ చింతామణి, కలగడ, మాంజి వంటి అపూర్వరాగములలో కీర్తనలు కల్పించెను. వారివారి శిష్యకోటి చేసిన ప్రచారముద్వారా కర్ణాటక సంగీతము తరతరములకు వ్యాపించెను.

2

త్యాగరాజ దీక్షిత శ్యామాశాస్త్రుల తరువాత అంతటి మహాపురుషులు సంగీతలోకమున నవతరించలేదు. కర్ణాటక సంగీతపు టౌన్నత్యము కొంచెము తగ్గినది. పెక్కురు వాగ్గేయకారులు ఉద్భవించిరి. కాని నేటికి వారి పేర్లు మాత్రము మిగిలియున్నవి. వారి రచనలకు ప్రచారము జరగలేదు. పెక్కురచనలును లేవు. ఉన్న రచనలకు సాహిత్యములుమాత్రము గలవు. ధాతువులేని మాతువుల నాధారముచేసికొని ఆయా గాయకుల కల్పనా సమర్థత నూహింప జూచుట సాహసము.

కృతికల్పనలో చతురులు కాకపోయినను పల్లవియందు సమర్థులైన శేషయ్య, గోపాలయ్య, ఘనం కృష్ణయ్య మొదలైనవారు, దినములతరబడి పునరుక్తి దోషరహితముగా రాగముల నాలాపింపగల వీణ పెరుమాళ్ళయ్య, శంకరాభరణం నరసయ్య, తోడి సీతారామయ్య, చౌకం సీమవయ్య మొదలైన ఘనులుద్భవించి కర్ణాటక సంగీతపు పరువు దక్కించిరి. శరభోజిరాజు తంజావూరి నేలిన కాలమున వీరందరు వెలసిరి.

19వ శతాబ్దమున సంగీతలోకము నలంకరించిన గాయకులు తచ్చూరు సింగరాచార్యసోదరులు, మహావైద్య నాథయ్యరు, శరభశాస్త్రులు, పట్నం సుబ్రహ్మణ్య అయ్యరు, తిరుక్కోడికావల్ కృష్ణయ్యరు, మైసూరు సదాశివరావు మొదలైనవారు.

వీరిలో కొందరుమాత్రము కీర్తనలు, వర్ణములు మొదలైనవి రచించిరి కాని ఉత్తమవాగ్గేయకారుల కీర్తనలనమర్చి రసవంతముగా, సంప్రదాయబద్ధముగా పాడుటయందు వీరికి సమర్థత మెండు, త్రిమూర్తులస్తమించిన వెంటనే జన్మించియుండుటచేతను, త్రిమూర్తుల శిష్యులవద్దనే సంగీతవిద్య గురుకులవాసమ్మున అభ్యసించిన కారణముగను, అత్యుత్తమమైన సంగీతశైలినే అవలంబించి కర్ణాటక సంగీతముయొక్క ఔన్నత్యమును, విశిష్టతను నిలువబెట్టి సంగీతమునకే వారి జీవితములను ధారపోసిరి. ఉత్తమ సంగీతమును కాపాడవలసిన రీతి అదియే. 19వ శతాబ్దాంతమందును, 20వ శతాబ్ది ఆరంభమందును సంగీతవిద్యకు మహారాజపోషణ కలదు. గొప్ప విద్యాంసులకు కాని రాజగౌరవము పొందనవకాశము లేకుండెను. జనసామాన్యపు అల్పరుచులకు తలయొగ్గవలసిన అవసరము ఆ కాలపు విద్యాంసులకు లేదు. ఒక్క సంగీతముననే కాదు, ప్రతివిద్యాశాఖయందును దిగ్గజములవంటి మహాపండితులు ఉద్భవించిన కాలమది. కర్ణాటక సంగీతమునకు కూడ నా యదృష్టము పట్టినది.

1900 సం. ప్రాంతమున వెలసిన సంగీత విద్యాంసులలో ముఖ్యులు శిమిళి సుందరమయ్యరు, కోనేరిరాజపురం వైద్యనాథయ్యరు, వీణధనమ్మాళ్, రామనాథపురం శ్రీనివాసయ్యంగారు, ఫిడేలు గోవిందస్వామి పిళ్ళె, నాదస్వరం పక్కీరుపిళ్లె, కంజీవరం నైనాపిళ్లె; నామక్కల్ నరసింహయ్యంగారు మొదలైనవారు; ఆంధ్రదేశమున నందిగాన వెంకన్న, వీణా వెంకట రమణదాసు, తుమరాడ సంగమేశ్వరశాస్త్రి మొదలైన వారు. వీరికి దక్షిణదేశమందును గొప్ప ఖ్యాతి గలదు. వీణా వెంకటరమణదాసుగారు "గొప్ప రాక్షసునివలె" వీణపై పనిచేసెడివారని దక్షిణాది విద్యాంసులలో వాడుక. ఆంధ్రదేశమున మిగిలిన విద్వాంసులు కూపస్థ మండూకములవలె ఉన్నట్లు ఊహింపవలెను. వారి సంగీతములోనున్న గొప్పదనము లక్ష్యరూపమున వారి గానములోని విశేషములు దెలియుట వలనగాని, వారి సంగీతరచనల వలనగాని, వారి శిష్యులు చేసిన సంగీత ప్రచారమువలనగాని ఊహింపవలెను. ఏదియు లభ్యముకాని పక్షమున వేరొకయభిప్రాయమునకు తావేది?

కోనేరి రాజపురం వైద్యనాథయ్యరు గతించిన 50 ఏండ్లలో నుండిన విద్యాంసులలో నగ్రగణ్యుడని ఖ్యాతి. అద్భుతమైన లయజ్ఞానవేత్తలు, అపూర్వరాగముల నెడతెగక పునరుక్తిరహితముగా నాలాపింపగల గాయకులు, కీర్తనలను తమ సొమ్ముగా పాడిన సంగీత సంపన్నులు ఎందరో 30 ఏండ్లకు పూర్వముండిరి. వారందరును కోనేరిరాజపురం వైద్యనాథయ్యరుపై నత్యంత గౌరవముంచి అతని సర్వతోముఖపాండిత్యమును స్తుతించెడి వారట. వీణ ధనమ్మాళ్ 'సంగీత సరస్వతి'యని పేరుగాంచిన సంగీత మణి. జంత్రగాత్రముల–రాళ్లమాట కేమిగాని–శ్రోతల హృదయములను కరిగింపగల మహాశక్తి గలది. జన్మించినది సంగీతకుటుంబమున. ఈమెకు సంగీతవిద్య నేర్పిన వారు శ్యామా శాస్త్రి శిష్యపరంపరలోని కామాక్షి, వీణ కుప్పయ్య శిష్యుడైన ఫిడేలు పొన్నుస్వామి.(ఈమె మేనమామ) ధర్మపురి జావళీలు రచించిన సుబ్బారావు ఈమెకు స్వయముగా తన శృంగారరచనలను నేర్పెను. ఆమె కాలమున వెలసిన సంగీతవిద్వాంసులు పైన చెప్పిన దిగ్గజములు, ఇక ఆమె జ్ఞానసంపాదనకు కొఱత ఏది? 12వ యేటనుండి జీవితాంతమువరకు తన జీవితము ఉత్తమ సంగీత మునకు ధారపోసినది వీణ ధనమ్మ. గోవిందస్వామిపిళ్లె మొదలైన విద్యాంసులు కొన్నిమాసములామెగానమును విని విషయములను గ్రహించెడివాడు. సి.ఆర్. శ్రీనివాసయ్యంగార్

ధర్మాన ఆమె సంగీతములో 9 గ్రామఫోను రికార్డులు మాత్రము ఈ నాటికి మిగిలియున్నవి. ఆ రికార్డులు సహృదయతతో జాగ్రత్తగా పదేపదే వినినచో ఆమె యోగ్యత బోధపడును. గోవింద స్వామిపిళ్లెగారిని శ్రీ ద్వారం వెంటస్వామినాయుడు గారు గురుతుల్యులుగా భావించె దరు. చిన్ననాటి నుండియు పిళ్లెగారి వాద్యము విని, వారి మార్గముల ననుసరించి, జీర్ణము చేసికొని, అపారమైన స్వయం కృషి చేసి వారిని మించుదురాయని భ్రమగొలుపునట్లు ఫిడేలు వాయించు శక్తి వెంకటస్వామినాయుడు గారు సంపాదించిరి. గోవిందస్వామిపిళ్లెగారి జ్ఞానకుసుమము వికసించుచున్న కాలమందు వారి వాద్యము విని కృష్ణయ్యరుగారు కొనియాడెడి వారు. రామనాథపురం శ్రీనివాసయ్యంగారు చాలా కీర్తనలు, వర్ణములు, తిల్లానాలు, జావళీలు రచించిరి. కీర్తనలలో పరమపావన (పూరీకల్యాణి), సరగున పాలింప (కేదారగౌళ), సద్గురుస్వామి (రీతిగౌళ) మొదలైనవి సుప్రసిద్ధమైనవి. ఫెరజురాగములో వీరు రచించిన తిల్లానా అసమానమైనది. వీరి కీర్తనలలో చిట్టస్వరములను శ్యామాశాస్త్రి చిట్టస్వరములతో పోల్చవచ్చును. వారి కచ్చేరీ విన్న తరువాత వారి కంఠధ్వని కొన్ని రోజులవరకూ మరపునకు రాని కారణముచేత ఆయనకు 'పూచి' అయ్యంగార్ అని చమత్కాం నామము కలిగెను. ('పూచి' అనగా అరవభాషలో భ్రమరము.)

ఆంధ్రదేశమున 1900 ప్రాంతమున విద్వాంసులలో వీణా వెంకటరమణదాసు, తుమరాడ సంగమేశ్వర శాస్త్రి మేటి వీరులు. వీరికి వీణావాద్యమున నసమాన పాండిత్యము గలదు. దక్షిణదేశపు విద్వాంసులు సైతము వీరిని వేనోళ్ల కొనియాడెడివారట. వెంకట రమణదాసునకు తానవాద్యమందు గొప్పపేరు. వీరు వీణపై దురిత కాలమున ప్రస్తారము చేయునపుడు చేయి కనుపించేది కాదట. సంగమేశ్వరశాస్త్రిగారు ఏది వాయించినను శ్రవణా నందముగా ఉండెడిదనియు, వారి రాగప్రస్తారక్రమము అత్యద్భుత మనియు శ్రీ వెంకటస్వామినాయుడుగారు చెప్పగా వినికిడి.

3

నేటి కాలమున కర్ణాటక సంగీతపరిస్థితిని గూర్చి యోచన చేసినవారు నిట్టూర్పు విడువవలసినది. దక్షిణ దేశమునగాని, ఆంధ్రదేశమునగాని పూర్వకాలపు సంగీతయోధులతో పోల్చదగిన సంగీతజ్ఞులు అరుదు. కర్ణాటక సంగీత సంప్రదాయము హరించిపోవు సూచనలు గోచరించుచున్నవి. త్రిమూర్తులు మొదలైన మహాపురుషులు సంగీతకళను గౌరవించిన రీతి వారితోనే అంతరించినది. మహావిద్వాంసుల యుగము గడచిపోయినట్లున్నది. గాయకులలో బుద్ధిసంపన్నత గలిగినవారు లేకపోలేదు. భగవంతుడు ఒక కాలమున బుద్ధిమంతులను, వేరొక కాలమున బుద్ధిహీనులను పుట్టించడు. ఉన్నవారిలో బుద్ధిశాలులు సంగీత విద్యను గురువులకడ సమగ్రముగా నేర్చి కష్టపడి సాధకము చేసి, కర్ణాటక సంప్రదాయపుటున్నతాశయముల గౌరవమును నిలువబెట్టినవారు నేటి కాలమున మచ్చుకైన లభింపరు. గురువు శిష్యులపై వాత్సల్యము జూపి, తనవద్దనున్న విద్యారహస్యములను శిష్యులకు గఱపి ఉత్తమసంగీతము వినగల తావులను శిష్యులకు జూపి విడువవలయును. ఈ కాలపు ఫిడేలు విద్వాంసులొకరు ఒక శ్రీమంతుల బిడ్డ తమవద్దకు సంగీత విద్యాభ్యాసమునకురాగా అతనిచే 10 ఏండ్లు తనకు చాకిరీ చేయించుకొని, ఆ శిష్యుని సొమ్ముతో ఒక అమూల్యమైన ఫిడేలు కొనిపించి చివరికి 4 వర్ణముల వరకూ చెప్పి అతనిని విసర్జించెను. వేరొక గాయకుడు తన శిష్యునకు విద్య చెప్పిన 8 ఏండ్లలోను 5 ఏండ్లు నాగాలు పెట్టెనట. ఆ శిష్యునికి కడకు రాగాలాపన, స్వరకల్పన మాత్రము నేర్పి, ఒక్కకీర్తనకూడ నేర్పలేదట. లోగుట్టు పెరుమాళ్ల కెఱుక. మరొక విద్వాంసుడు సహజవిద్యాశక్తి Instinct కల్గిన తన పుత్రుని లయబ్రహ్మయనియు, తానతనికి నేర్పగల విషయములు లేవనియు అతనికి విద్య నేర్పుట మానెను. తండ్రి గతించిన పిమ్మట పుత్రునికి కచ్చేరిచేయు సమర్థత లేకపోవుట సరిగదా రేడియోలో గానము చేయుటకు కూడ మద్రాసురేడియోవారంగీకరించలేదు. ఈ కాలపు గాయకోత్తముడొకడు తమ శిష్యులు కీర్తనలు పాడునపుడు తాను నేర్పిన సంగతులుమాత్రమే పాడవలెననియు, మనోధర్మముగా సంగతులు పెంచుట కూడదనియు ఆజ్ఞవిధించెనని వినికిడి. సంప్రదాయము చెడునని కాబోలు ఆయన భావము. తాను ఆరంభమునుండియు సంప్రదాయ సిద్ధముగా సంగీతము నేర్పిన శిష్యుడు సంప్రదాయమునకు విరుద్ధముగా నెట్లు కల్పన చేయును? శిష్యుని మనోధర్మమును గురువు నిరోధించిన సంగీతమెట్లు అభివృద్ధియగును? సంగీత విద్యాధికులు శ్రమకోర్చి శక్తి వంచన లేకుండ శిష్యులకు సంగీత విద్య నేర్పవలెను. వారిచేత తగినరీతిని సాధకము చేయించుచు ఇతర సంగీత విద్వాంసుల గానములోని విశేషములను విమర్శించి ఉత్తమ గానమార్గములను శిష్యుల కుపదేశింపవలెను.

నేటికాలమున సంగీత విద్యార్థికి ఆశయములే (Ambition) వేరు. 2 ఏండ్లలో బల్లపై నెక్కి సంగీత కచ్చేరీ చేయవలెను. అందుకై పనికివచ్చు కనీసపు సామగ్రి వీలైనంత శీఘ్రముగా సంపాదింపవలెను. అంతేగాని పండితుడు, విద్వాంసుడు కావలెననియు, సంప్రదాయశుద్ధమైన సంగీతమునే అభ్యసించి ప్రచారము చేయవలెననియు కుతూహలము (Determination) గల సంగీత విద్యార్థి నేడు వేయి కొక్కడైనను లేడు. విద్వాంసుడు కాగల విద్యార్థికి సంగీతమున సరియైన రుచులు కుదరవలెను. మంచి సంగీత మేదో, ఏది కాదో తెలిసికొనగలజ్ఞానము స్వతస్సిద్ధముగా నుండవలెను. మంచి పాండిత్యము గలిగిన సుప్రసిద్ధవిద్వాంసుని వద్దజేరి అతని మనసు కరగించి సంగీతవిద్యను పూర్తిగా నభ్యసించి కనీసము 5 ఏండ్లయినను కష్టపడి శక్తివంచన లేకుండ సాధకము చేసి సంగీత విమర్శకులను, విద్వాంసులను సైతము మెప్పించగల్గిన జ్ఞానము కల్గిన తరువాతనే కచ్చేరీ చేయ సమకట్టవలెను. అట్టి సౌభాగ్యము ఆంధ్రదేశమునకు కలిగినప్పుడే అంతరింపనున్న కర్ణాటక సంగీతము తిరిగి ఉన్నతదశకు రాగలదు.

దేశకాల పరిస్థితులు సంగీతమును వృద్ధిచేయగలవు, క్షీణింపచేయనుగలవు. నేటికాలమున గానకళకు రాజాశ్రయము లేదు. ఉన్నదానితో తృప్తిపడి దైవధ్యానము చేయుచు జీవితము సంగీతమునకు ధారపోసిన సంగీతత్రిమూర్తులవంటి మహా వ్యక్తులు, భక్తులు జన్మించు భాగ్యము ఈ యుగమున కలలోని వార్త. రాజాశ్రయము లభించినచో గాయకోత్తములకు ధనార్జనపైగాక గానకళపై మనసు మరల్పి ఉత్తమరీతుల గాన సాధన చేసి సంగీతమునకై రేయి పగలు జీవితాంతము శ్రమ పడునట్టి అవకాశము లేర్పడును. సంగీత విద్యయే జీవనోపాధి యగుట కళకు నష్టము కలుగుచున్నది.

సినిమా పరిశ్రమ సంగీతాభివృద్ధికి మహావిరోధి. సంగీతము వినబడని సినీమాలను నేటికాలపు కళారసికులు భరించనేరరు. పావలా ఇచ్చి టిక్కెట్టు కొనివచ్చిన పైడితల్లికి సైతము అర్థము కావలెనన్న "చల్‌చల్‌రె నౌజవాన్" వంటి పాటలే వినబడవలెను. ప్రతి స్వరమునకు విశిష్టగమక సౌందర్యము కలిగి విరాజిల్లు విమల గాంధర్వ విద్య సామాన్య మానవునకెట్లు బోధపడును, వాని మనసు నెట్లు కరిగించును? దక్షిణదేశమున కొంతకాలము క్రిందట సినీమాలలో కూడ కర్ణాటక సంగీతమే వినబడుచుండెను. నేడు ఆంధ్రదేశమునను, తమిళదేశమునను గూడ "హిందూస్థానీ సంగీతము" అను పేరుతో ఒకరకపు ధ్వని వినబడుచున్నది. ఆ "సంగీతము" ఉత్తరదేశపు సినీమాలలో వాడుచున్న పాటల ధోరణిని తు.చ.తప్పకుండా దిగుమతి చేయుటవల్ల మనకు దాపురించినది. అది హిందూస్థానీ సంగీతము ఎంతమాత్రము కాదు, సినీమా ప్రపంచ "సంగీతము" అందు రాగపద్ధతి లేదు; సంప్రదాయము సున్న; శాస్త్రీయకట్టుదిట్టము లేదు. విషయములేని కారణమున మొదట వినినప్పుడా కర్ఫించినను, ఆ సినిమా ప్రియునకే వినగావినగా వెగటుగా గోచరించును. ఇట్టి అనాథ "సంగీతమును" వినమరిగిన సామాన్య జనులు కర్ణాటక సంగీతమును వినగలుగుట కష్టము. ఒక కళను అనుభవింపవలెనన్న అందు ఆసక్తి, కొంత ప్రవేశము ఉండవలెను. సుప్రసిద్ధకళను ప్రచారము చేయు కళోపాసకులుండ వలెను; అటుపైని కొంతకాలము ఆ కళాప్రపంచమున నీదులాడిననేగాని కళానుభవము కలుగదు.

గానకళ కీకాలమున ప్రచారము అపరిమితముగా కలదు. రేడియో, గ్రామఫోను ఇందుకు చాలా తోడ్పడినవి. పూర్వకాలమున లేని ప్రచారము సంగీతమునకు నేడు కలుగుట ఆనందదాయకమే. కాని కళాపిపాసులు కాని సామాన్యమానవులలో ప్రబల ప్రచారము గలుగుటయే సంగీతకళకు ముప్పుగా పరిణమించినది. ఉత్తమకళ అందరకును అర్థము కాదు. కవిత్వము, సంగీతము, నాట్యము, చిత్రకళ మొదలైన లలితకళలయందు శ్రేష్ఠత్వము, యోగ్యత గుర్తించుటకు తగిన సంస్కారము అత్యావశ్యకము సంస్కారము, ప్రవేశము లేనిచోట్ల కళ ఔన్నత్యమునకు గౌరవము జరుగదు. ఏ పెట్టుబడియులేని ఆసామీకి ఆనందము చేకూర్చునదే కళయై తయారగును. ఈ కాలపు సంగీత విద్వాంసులలో మేటి యనదగు గాయకులు ఒకరు ఒక సందర్భమున "ఈ నాడు కోనేరిరాజపురం వైద్యనాథ అయ్యరు జీవించివచ్చి పాడినను ఆయన గానమును మెచ్చుకొనువారీ కాలమున ఎవరున్నారు? ఈ కాలమున రసికులకు Tonal Value ముఖ్యము అని సగర్వముగా బలికెను. ఆ పలుకులు విను దురదృష్టము నాకు బట్టెను. ఆయన చెప్పిన పరిస్థితులు కడు శోచనీయమైనను ఈ కాలమున ఉండుట నిజమే. 50 ఏండ్లకు పూర్వము గాయకులకు శ్రీమంతుల యాశ్రయము కలదు. వినువారి నెల్ల మెప్పింపజేయుట వారి పనిగాదు. ఉత్తమజాతి సంగీతమునే పాడుచు ఆనాటి విద్వాంసులలో మేటి యని పేరు పొందుటయే పూర్వగాయకుల ఉన్నతాశయము. శ్రోతలు కూడ సుప్రసిద్ధకర్ణాటక గానమునే వినుటకు అలవాటు పడి అట్టి గానమునే ఎల్లప్పుడు కోరిరి. ఆ విధమున విద్వాంసులు, శ్రోతలు ఇర్వురును కర్ణాటక సంగీతపు గౌరవమును నిలువబెట్టి మన తరమునకు అందజేసిరి. ఆ సంగీత గౌరవమును కాపాడుట మన విధి.

ఆంధ్రదేశమున సంగీత మింకను బాల్యావస్థలోనున్నది. ఈ కాలమున సంగీతశ్రేష్ఠత ఎంత చెడినను దక్షిణదేశమున మాత్రము గానకళ గౌరవమును పొందుచున్నది. పూర్వకాలమునుండియు సంగీత విద్యార్థులు దక్షిణదేశముపోయి అచ్చట గొప్పవిద్వాంసులకడ విద్య నేర్చి ఆంధ్రదేశమునకు మరలివచ్చి సంగీతప్రచారము గావించుచు వచ్చిరి. తమిళదేశమున 'సంగీత విద్వాంసులు' అనదగినవారు వందలున్నారు. వీణ, ఫిడేలు, మృదంగము మొదలగు జంత్రముల యందైననేమి, గాత్ర సంగీతమందేమి తమిళ విద్వాంసులు గొప్ప ప్రజ్ఞావంతులు గలరు. మన దేశమున కర్ణాటక సంగీతపు గౌరవము కాపాడుచు మహావిద్వాంసులు శ్రీ ద్వారం వెంకట స్వామినాయుడు గారు మాత్రము హిమాలయ పర్వతము వలె నా దృష్టికి గోచరించుచున్నారు. వీణ ధనమ్మాళ్, ఫిడేలు గోవింద స్వామి పిళ్లె, కంజీవరం నైనాపిళ్లె, వీణ సంగమేశ్వర శాస్త్రి, నాద స్వరం రాజరత్నంపిళ్లె మొదలైన మహామేధావుల మెప్పు, గౌరవము బడసిన మహావిద్వాంసులు శ్రీ నాయుడుగారు.

ఆంధ్రదేశమున కర్ణాటక సంగీతపు ప్రతిభ పునరుద్ధరింపవలెననిన మన విద్యార్థులు, విద్వాంసులు మేల్కొనవలెను.

1. సంగీతనిధి అభివృద్ధిచేయవలెను. త్యాగరాజు, దీక్షితులు, శ్యామాశాస్త్రి, క్షేత్రయ్య, పట్నం సుబ్రమణ్య అయ్యరు, స్వాతి తిరునాళ్, శ్రీనివాస అయ్యంగార్ మొదలైన సుప్రసిద్ధవాగ్గేయ కారుల సంగీత రచనలను అన్నిటిని దక్షిణదేశపు విద్వాంసుల సహాయమున నేర్చుకొని, స్వరపరచి అచ్చొత్తించి శిష్యులకు నేర్పి ప్రచారము గావించవలెను. ఈ సందర్భమున ఒక హెచ్చరిక అవసరము. తమిళదేశమున సంగీత ప్రచారమునకు గావలసిన పరిస్థితులన్నియు నేడు కలవు. సంగీతసామగ్రి ఆ దేశమున దాగి యుండుటయు నిజము. ఆంధ్రదేశమున సంగీతము వృద్ధిచెందవలెనన్న తమిళసోదరులతో సఖ్యము, సంప్రతింపు పరమావశ్యకము; గత్యంతరము లేదు. ఈ విషయమును మనస్ఫూర్తిగా గుర్తించిన నాడే ఆంధ్రదేశమున సంగీత విద్యాభివృద్ధి కాగలదు.

ప్రపంచమందన్ని దేశములును సర్వమానవ సౌభ్రాత్రమునకై పాటుపడు ఈ కాలమున పొరుగు దేశముపట్ల ఈర్ష్య, అసుయాభావములు కలిగియుండుట హీనము. తమిళజాతిపై ద్వేషము ఆంధ్రులు మానవలెను.

2. నిజమైన విద్వాంసులగుటకును, సుప్రసిద్ధ కర్ణాటక సంప్రదాయము నిలువబెట్టుటకును మన విద్యార్థులు ప్రమాణము చేయవలెను. ఒక్కొక్క విద్యార్థి సుమారు 500 కీర్తనలు పూర్వపు సంప్రదాయము ననుసరించి పాఠము చేసి, పల్లవి, రాగప్రస్తారక్రమములను విద్వాంసులకడనుండి సమగ్రముగా నేర్చి, వారి మెప్పు పొందిన తర్వాతనే రంగము కెక్కి గాన విద్యా ప్రదర్శనము చేయవలెను. కచ్చేరీ చేయుట, ధనమునార్జించుట పరమావధిగా తలపరాదు.

3. విద్యనేర్చు కాలమున సంగీత విద్యార్థులకు శ్రీమంతుల దోహదము కావలెను. 10-12 సంవత్సరములు సంగీత ప్రపంచమున ఏకాగ్రతతో నీదులాడు సంగీతపిపాసికి ధనార్జన, కుటుంబపోషణ చేయుటకు అవకాశము కలుగదు. అన్యచింతన లేక గానాభ్యాసము చేయుగల్గు గాయకులకు అవకాశము, పరిస్థితులు కలుగజేయుట ధనవంతులు తలపెట్టిన జరుగని పనిగాదు; ఆంధ్రదేశమున లక్షాధికారులకు లోటులేదు.

4. ప్రతిపట్నమునందును గానసభలు నెలకొల్పవలెను. అందు పండితవిద్వాంసులకే విద్యాప్రదర్శనమునకు చోటియవలెను. శ్రోతలు ఆదిని తమ వీనులకింపైనను కాకున్నను, కొన్ని సంవత్సరములపాటు కర్ణాటక సంగీతమునకు అలవాటుపడి అందు మంచి చెడ్డలను సంగీతజ్ఞులవద్ద తెలిసికొనవలెను. రుచిమరిగినచో కర్ణాటక సంగీతము వీడుట కష్టము. అట్టి పరిస్థితులు మన దేశమున ఏర్పడిననాడే ఆంధ్రదేశమున కర్ణాటక సంగీత జ్యోతి ప్రకాశించును.

5. సంగీత విద్వాంసులకు కచ్చేరికి రూ.116/- మించి ఆశపెట్టుట మంచి యలవాటు కాదు. అంతకు మించి యిచ్చుటచేత గాయకులకు సంగీతముపై గాక ధనముపై దృష్టి మరలును. అందరిని సమానముగా సన్మానించినచో సంగీజ్ఞానమునందాధిక్యమునకే గాయకులు పాటుపడుదురు. నేటి రోజులలో గాయకమణులకంటె గాయనీమణుల ధర హెచ్చు కాదా? అట్లైనను ఖ్యాతి ఎవరికి లభించుచున్నది? గాయక శ్రేష్ఠతకును, వారి ధనార్జనకును సంబంధము లేదు. పూర్వము కోనేరి రాజపురం వైద్యనాథయ్యరు, గోవిందస్వామిపిళ్లె, దక్షిణా మూర్తిపిళ్లె, కొనుగోలు పక్కిరిపిళ్లె పాల్గొని చేసిన పాటకచ్చేరీ ఖరీదు రూ.200లు. ఈ సంగతి ఆ కచ్చేరీ నేర్పరచిన ఒక మద్రాసు గాన సభ కార్యదర్శి చెప్పగా వింటిని. ఆ మహావిద్వాంసులకు సంగీతకళయందత్యంత గౌరవము, ధనముపై క్రీగంటి దృష్టి భగవంతుడు ప్రసాదించబట్టి వారు కర్ణాటక సంగీతమునకు నూతనశోభ కల్గించిరి.

6. పేరునకు మాత్రము విద్వాంసులై, సంగీత లోకమున ముఖ్యులు, గౌరవనీయులు కాని గాయకులకు సన్మానములు చేయుట ఒక దురలవాటయిపోయెను. ఇది కేవలము ఆంధ్రదేశముననే ప్రబలముగా నున్నది. సన్మానము గావించినను గావింపకున్నను విద్యాధికునికి కొరతలేదు. మిడి మిడి జ్ఞానముగల గాయకునకుమాత్రము ఈ సన్మానము జ్ఞాన నేత్రములను పొడిచి వేయును.

7. సంగీత ప్రపంచమున విమర్శకు గౌరవమును కలుగవలెను. గానమండలి మంచి చెడ్డలను నిర్భయముగా చెప్పగల్గిన విమర్శకులకు గానసభలు చేయూత నొసగవలె. ప్రతి కళయు విమర్శకుల సహాయముననే పెంపొందును. మన దేశపు గాయకులు విద్యాసంస్కారములేని కారణమున విమర్శను సహించరు. భేదాభిప్రాయమును సహించుటకును, మన్నించుటకును గాయకలోకము అలవాటుపడవలెను.

కర్ణాటక సంగీతమున కృతులు నూటికి 90పాళ్లు ఆంధ్రభాషయందున్నది. అది మనయదృష్టము, తమ భాష కాకున్నను, తమిళ విద్వాంసులు తెలుగు భాషలోనున్న వందలకొలది కృతిరత్నములను అతి కష్టముగనేర్చి సంప్రదాయసహితముగా కాపాడియుంచిరి. అట్లు చేయుట ఆంధ్రుల విధి. మనదేశమున పైనుదహరించిన అనుకూల పరిస్థితులేర్పడినా ఆంధ్రదేశమున కర్ణాటక సంగీతపు దివ్యప్రజ్వలించును కర్ణాటక సంగీతము శిథిలమగుచున్న ఈ కాలమున ఈ మార్పులు జరుగని పక్షమున కర్ణాటక సంగీతము ఆంధ్రులకు దూరముగాక తప్పదు.

(భారతి స్వర్ణోత్సవ సంచిక)

ఒక్క సంగీతమేదో పాడునట్లు భా
షించు నప్పు విన్పించు భాష
విస్పష్టముగ నెల్ల విన్పించునట్లు స్ప
ష్టోచ్చారణంబున నొసరు భాష
రసభావముల సమర్పణ శక్తియందున
నమర భాషకును దీటైన భాష
జీవులలోనున్న చేవయంతయు చమ
త్కృతి పల్కులన్ సమర్పించు భాష
భాషలొక పది తెలిసిన ప్రభువు చూచి
భాషయన నిద్ది యని చెప్పఁబడిన భాష
తనర ఛందస్సులోని యందమ్ము నడక
తీర్చి చూపించినట్టిది తెలుగుభాష

- విశ్వనాథ సత్యనారాయణ

విద్యా సుందరి బెంగుళూరు నాగరత్నం

శ్రీ త్యాగరాజస్వామి సమాధి - పూజ

శ్రీ తిరువయ్యారులో శ్రీ త్యాగబ్రహ్మంవారి సమాధి వివరములు

స్వాములు పరమపదించుటకు ముందు, ముఖ్య శిష్యులు చేతులు జోడించుకొని "హే గురునాథా! తమ దివ్యశరీరమును, ఏ విధముగ నేర్పాటుచేయవలయునో, ఏమి యుత్తరువు?" అని అడుగగ "నా శరీరమును భావాస్వామి అగ్రహారం, కావేరి యొద్దున, నా గురువులు, శొంఠి వెంకటరమణయ్య గారి సమాధి సమీపమున తులసీబృందావన రూపముగ నెలకొల్పవలెను. అరువదేండ్లు దాటిన పిమ్మట నా శిష్యపరంపరలచే, నా ప్రభావము ప్రకాశించును" అని "పరమాత్మ వెడలే ముచ్చట" అను కీర్తనపాడుచు శ్రీ పరాభవ పుష్య బహుళ పంచమి (6-1-1847)నాడు పగలు 12 గంటలకు సిద్ధిపొంది 'నచ పునారావర్తి' పదవినలంకరించిరి. నిజ శిష్యుల కనులార మిరుమిట్లుగొలుపు అఖండ జ్యోతిని దర్శించి పావనులైరి.

ఇది ఇట్లుండ చెన్నపట్టణములో, శ్రీనివాసయ్యరు వీధిలో నా స్వగృహములో ప్రవేశించి సుమారు 40 సంవత్సరములాయెను. అప్పటినుండి నా కులదైవమగు శ్రీ వెంకటాచలపతి పూజ యథాశక్తితో జరుపుచుండగ, నా పూర్వపుణ్య వశమున ఒకానొక బ్రాహ్మణోత్తమునిద్వారా శ్రీ కామేశ్వరి దివ్యవిగ్రహము లభించినది. శ్రీదేవికి ప్రత్యేకగదిలో బ్రాహ్మణునిద్వారా పూజాదులు జరుపించుచుంటిని. వీలు ననుసరించి నేను శ్రీదేవి సహస్రనామ పారాయణాదులు చేసుకొనుచు ఆనందించుచుంటిని. ఇట్లు నడుచు చుండగ నొకప్పుడు బ్రహ్మశ్రీ- సంగీత విద్వాన్ ఉమయాల్పురము పంచాపకేశ భాగవతులు, శ్రీ త్యాగబ్రహ్మపటమొకటి ఏడు రూపాయలకు నాకొసగి, ఈ స్వాముల వారి పటము పూజవలన నీకు చాల మేలు కలుగునని చెప్పిరి. నేను అది లభించిననాటి నుండి అఖండదీపముంచి, ఒక విధమైన మూఢ భక్తితో పూజ పునస్కారములు జరుపుచుంటిని. ఈ మధ్య ఇహలోక సుఖములకు కోరి చేసుకొన్న కొన్ని సందర్భములవలన చాలద్రవ్యము వ్యయమై పోయినదిగాని ఇష్టసిద్ధి లేకపోయినది. ఈశ్వరానుగ్రహమున ఏకాకినిగానుండు భాగ్యముకలిగినది. భగవంతుడు తప్ప వేరేగతి లేదను జ్ఞానము మహద్విరక్తియు భక్తియు కలిగి, నా జీవితకాలములో ఏదైనా తగు ధర్మకైంకర్యము చేయవలెనను చింత సదా కలిగినది. ఈ విధముగ పూజాదులు ప్రారంభించిన పదమూడవ దినమున ఒకనాటి రాత్రి త్యాగరాజు పటములోనుండు రూపములాగుననే శ్రీ సద్గురు త్యాగ్రబహ్మముగారు కూర్చుండునట్లు గానే సమాధినుండి పైకివచ్చి సుందర ముఖారవిందముతో దర్శనమీయ నా కత్యాశ్చర్యకరమైన భక్తి కలిగి "నరసింహుడుదయించెను" అను సదాశివరాయల కీర్తనపాడుచు కర్పూరము వెలిగించి నమస్కరింపగ,

రెండు చేతులు పైకెత్తి ఆశీర్వదించి, అలాగే లోపలికి దిగినట్లు స్వప్నమయ్యెను. మేలు కొనగ ఏమియు తోచలేదు. ఈ స్వప్నమైన మరుదినమే తంజావూరునుండి నా ఆదిగురువులైన బ్రహ్మశ్రీ బిడారం కృష్ణప్పగారివద్దనుండి నీవు త్యాగరాజస్వాములవారి సమాధి కట్టడమతి శీఘ్రముగ ప్రారంభించిన చాల బాగుండునని వ్రాసిపంపిన జాబు చేరినది. చదివి చూడగా నా స్వప్నమునకిది దృష్టాంతమని భావించితిని. నాటి మధ్యాహ్నమే సంగీత సమాజము సెక్రటరీ, మునుస్వామినాయుడు గారి ఇంటికిపోయి వారితో స్వప్నసంగతులు చెప్పగ సావకాశముగ ఆలకించిరి. ఆ సమయమునకే సుప్రసిద్ధులైన హరికథా కాలక్షేపముచేయు బ్రహ్మశ్రీ తంజావూరు నాగరాజభాగవతులు వారి ఇంటికి వచ్చియుండిరి. వారున్నూ ఈ సంగతులు విని చాల ఆశ్చర్యపడి తిరువయ్యారులోనుండు అయ్యగారి సమాధిస్థలమును చూపెదమని చెప్పిరి. ఆనాటిరాత్రే వారిరువురితో తిరువయ్యారు చేరితిని. వెంటనే అయ్యగారి వంశీకులైన బ్రహ్మశ్రీ రాములు భాగవతులను పిలిపించి ఆ సమాధిస్థలమును దాసురాలికి చూపించిరి. దీనికిపూర్వము తిరువాయ్యు రెట్టిదో నేనెరుగను. సమాధిదృశ్యము చుట్టు ముండ్లపొదలు, వెదుళ్లు, క్రూరసర్పముల కాలవాలములైనపుట్టలు మొదలైనవాటిచే ఆవరింపబడి పగటిపూట మనుష్య సంచారమునకు దుస్సాధ్యముగనుండెను. సమాధి దగ్గరయుండు చీలిన, విరిగిపడిన ఇతర సమాధులతోను, చూడరాని, చెప్పరాని, ఆభాసములతో నిండియుండుట కనులార చూడగ నా మనస్సు చాల పరితపించినది. ఆ నిమిషమే కట్టడములకు కావలసిన సామానులు తెప్పించి పనిప్రారంభింపచేసి ఇంటికి వచ్చితిని.

కట్టడము ప్రారంభించిన తేది 27.10.1921. మూడు సంవత్సరములకు సమాధికి గర్భగృహ మంటపము తయారైనది. ఇకముందు ఏమిచేయవలెను? లింగస్థాపనమా? లేక శ్రీరామవిగ్రహములా? స్వామివలె విగ్రహస్థాపన చేయుటయా?యని యాలోచించి తిరువయ్యారులో అనేక బ్రాహ్మణోత్తములు, గొప్పవారు, స్త్రీలు అందరిని చేర్చి వారిముందర గొప్పపూజ సమాధికి జరిపి, చీటివ్రాసివుంచి, గురుస్వామిని ధ్యానించి "కలలో ఇచ్చిన దర్శనము కల్ల కాలేదుగదా! నిజముబల్కి రక్షించవలెను. దాసురాలు జీవితురాలైయుండిచూచి ఆనందించవలెను" అని అడుగగ "తనవలె విగ్రహమును స్థాపించుము" అని ఉత్తరువాయెను. సభలో గూడినవారందరు అలాగే చేయవలయునని జయఘోష యొనరించిరి. ఆ విధముగానే సమాధివద్ద సద్గురు శ్రీ త్యాగరాజస్వాముల విగ్రహమును ద్వారమువద్ద ఇరుప్రక్కల శ్రీ భోగ గణపతి, శ్రీ యోగాంజనేయ స్వాములవారి విగ్రహములను 07.01.1925వ తేది స్థాపించి మహా కుంభాభిషేకము గురుకటాక్షమహిమచే జరిపించితిని. అప్పటినుండియు నిరంతర పూజ నివేద నాదులు శాశ్వతంబుగ జరుగుటకు తగు స్థిరాస్తులేర్పరచి, వారి వంశీకులగు బ్రహ్మశ్రీ రాములు భాగవతులు వారిని నియమించితిని. అప్పటినుండి నేటివరకు వారి చేతనే పూజాదులు జరుపబడుచున్నవి. అన్నియు సద్గురు స్వాములవారి కటాక్షమే.

శ్రీ గురుస్వాములవారి ఆజ్ఞ చొప్పున 1907వ సంవత్సరమునుండి వారి ముఖ్య శిష్యులగు నరసింహ భాగవతులు, ఉమయాల్పురం కృష్ణ భాగవతులు, సుందర భాగవతులు, ఆ కాలమున సుప్రసిద్ధులైన ఇతర విద్వాంసులందరుచేరి సంవత్సరమునకొకతూరి ఆరాధన మహోత్సవమును జరుపుతూ వచ్చిరి కొన్ని సంవత్సరములకు వారిలో వారికి భిన్నాభిప్రాయములేర్పడి రెండుకక్షలుగ మారినవి. ముఖ్యమైనవారు నరసింహ భాగవతులు పరమపదించిరి. పెద్దకక్షకు ఫిడేల్‌విద్వాన్ గోవిందస్వామి పిళ్ల, మృదంగవిద్వాన్ ఆళహనంబిపిళ్ల, నాయస్థానకమును వహించిరి. చిన్న కక్షలో బ్రహ్మశ్రీ, శూల మంగళం- వైద్యనాథ భాగవతులు, బ్రహ్మశ్రీ పల్లడం- సంజీవరావుగారు, అరియక్కుడి రామానుజఅయ్యం గారలు యాజమాన్యము వహించిరి. చిన్న కక్షవారు నాలుగురోజులు ముందుగ ప్రారంభించి పంచమితో ముగింపు, పెద్దకక్షవారు పంచమి నుండి ఉత్సవము ప్రారంభించి ఐదవరోజున ముగింపు చేయించుచు వచ్చిరి. పెద్ద కక్షవారు కళ్యాణమహాలులోను మహావైభవముగ జరుపుతూ వచ్చిరి. ఆరాధనపు దినము దాసురాలి పూజ జరిగిన పిమ్మట పెద్ద కక్షవారి పూజ భజన తరువాత చిన్న కక్షవారి సమాధిపూజ జరుపుచుంటిరి.

ఇట్లుండ గురుస్వాములవారి కరుణవలన సమాధిస్థలముననే ఉత్సవము చేయవలయునని మనస్సులో తలంపు కలిగినది. కారణమేమన- ఈ రెండు కక్షలు ఉత్సవములు చేయుస్థలములకు స్త్రీలు రానేకూడదు అను కట్టుబాటు. ఇక భక్తురాండ్రగు విదుషీమణులు ఎట్లు కడతేరుదురు? గురుస్వాములీ దాసురాలుకి పూర్ణానుగ్రహము చేసియుండకొదవేమియుండునని తలచి సద్గురు స్వాములవారి యాజ్ఞతో 1927వత్సరమున ఉత్సవము పంచమి నుండి సమాధి వెనుకభాగమున ప్రారంభించితిని. "అల్పారంభః క్షేమకరః"అన్నట్లుగ శుక్లపక్ష చంద్రునివలె అభివృద్ధియై మద్రాసులో ప్రసిద్ధి చెందిన దేవదాసీమణులు పాటలు, కాలక్షేపములు, సుప్రసిద్ధ విద్వాంసుల కచ్చేరి కాలక్షేపములు జరుపుతూ తంజావూరి విద్వాంసులు, స్త్రీలు, అందరు సమాధి వెనుకభాగములో వసతిలేని స్థలములో భక్తితో నాకు తోడునీడగ సహాయమొనరించుచుండ, శ్రీ గురుస్వాముల యపారకరుణవలన సమాధికి ఎదురుగనుండు తోట, భూములు, శ్రీ తంజావూరు రాజబంధువులైన శ్రీ రాజారాం సాహేబుగారివలన లభించినది. వెంటనే గొప్ప ప్రాకారము, నాలుగు గదులు మొదలైనవి దాసురాలి స్వార్జితపైకముతో కట్టబడి పూర్తియై ఆ విశాలస్థములోనే ఆరాధనోత్సవములు మహావైభవముగ జరుగుతూ వచ్చినవి.

అంత పండ్రెండు వత్సరములు జరిగి, పదమూడవ వత్సర ప్రారంభములో గురుస్వాముల ప్రభావము వలన రెండుకక్షల విద్వాంసులకు జ్ఞానోదయమై అందరు ఒకటిగజేరి దాసురాలితో ఏకీభవించి 1940వ సంవత్సరమునుండి సమాధి కట్టడమునందుత్సవము ప్రారంభించిరి. *శ్రీ తిరువయ్యారు త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవమని సభ ఏర్పరచుకొనిరి.* అది మొదలుగ రేడియో ఫిట్టింగులతో అతి వైభవముగ లెక్కలేని పాటలు, హరికథలు, గొప్ప అన్నదానములతో జరుపుతున్నారు. ఐదుదినములుత్సవ వైభవములు, ఆరవదినము "వడాయితి" అనగ వడలు మాలవేసి శ్రీ మదాంజనేయస్వామివారిని పూజించి వెళ్ళేవారు. ఇతర ఏ విధమైన స్వాతంత్ర్యము వారలకులేదు.

మహాశయులారా! ఈ పండ్రెండు సంవత్సరములు జరిగిన ప్రతి విషయము విశ్వదాత నాగేశ్వరరావు పంతులుగారి దయవలన, ఆంధ్రపత్రికలో ప్రత్యక్షరము ప్రచురింపబడియున్నది నాచేత. అదియుగాక ఈ వైభవములను చూచి కైంకర్యమును చేసిపోయిన శ్రీ వాగ్గేయకారరత్న శ్రీ హరినాగభూషణం గారు "నా రెండవ తిరువయ్యారు యాత్ర"యను పేరుతో ఆంధ్రపత్రికలో, శ్రీ ధాతనామ సంవత్సర మాఘ శుద్ధ 12

సోమవారమునాడు ఉన్నదున్నట్లు ప్రచురించియున్నారు. మరియు గాయక సార్వభౌమ పారుపల్లి శ్రీరామకృష్ణయ్య పంతులుగారు "శ్రీ త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవములు- తిరువయ్యారు" అను పేరుతో 1936వ సంవత్సరము ఫిబ్రవరి 3వ తేది సోమవారంనాడు ఆంధ్రపత్రికలో జరిగినవి జరిగినట్లుగానే ప్రచురించియున్నారు. అనేకమార్లు కైంకర్యము లోనర్చియున్నారు. సాహిత్య విశారద విమర్శకశిరోమణి కోన వెంకటరాయశర్మ గారును ఇంక యనేక గొప్పవారు ఆంధ్రపత్రికలో ప్రచురించియున్నారు.

ముఖ్యముగ సమాధిస్థలమున శ్రమయనుకోక రాత్రింబవళ్ళు చాల శ్రమపడి దేవలోకమువలె కట్టడము తయారుచేసిన శ్రీ తిరువయ్యారు సి.వి.రాజగోపాలాచార్యులు అందరిచేత స్తోత్రార్హులై శ్రీ త్యాగరాజ నిజభక్తులని పేరుపొంది ఇప్పటికిన్నీ శ్రీ త్యాగరాజస్వాముల కైంకర్యములో మునిగి సమస్త కార్యములను నడుపుచున్నారు. వారు దాసురాలికి రెండవ గురుదైవ మనిన యతిశయోక్తికాదు. ఇంకను వ్రాయవలసిన అపరామగు రహస్యములు నా స్వీయచరిత్రలో వివరముగ అందరికి తెలియగలవు. ముఖ్యమైన సంగతి తెలుపుకొని ఇంతటితో విరమించెదను.

ఏమన, వాలాజీపేట శ్రీ వేంకటరమణ భాగవతులు, వారి కుమారులు కృష్ణస్వామి భాగవతులు, శ్రీ త్యాగరాజ స్వాములవద్ద గానమభ్యసించిన మొదటి శిష్యులు. వారి శిష్యుడు బెంగుళూరిమునిస్వామప్పగారు, చాలగురుభక్తిగలవారు. నేను మునిస్వామప్ప ముఖ్యశిష్యురాలను. నాది మూడవ శిష్యపరంపర. కావుననే దాసురాలికి ఎవరికిన్నీ దొరకని గురుస్వాములవారి కైంకర్యము లభించినది. ధన్యురాలనైతిని. జీవన్ముక్తుల యనుగ్రహముబొంది, తనువు, మనస్సు, ధనమునంతయునర్పించి సద్గురుస్వాములవారి ఆజ్ఞకు ఎదురు చూచుచున్నాను. ఇంతియెకాక చేసినకైంకర్యములను నా కనులార చూచి ఆనందించుచున్నాను. ఇంతకన్న బ్రహ్మానందము గలదా!

ఇంకను సమాధిస్థలములో కొంత బందోబస్తు, నిత్యము మతభేదము లేక శక్త్యానుసారము అన్నదానము, జరుగవలెనని ఆశకలదు. ఏ మహానుభావులకీపుణ్యమబ్బునో వారే ధన్యులు! వారే మాన్యులు. ప్రాప్తముండిన వదలదు. అన్నియు శ్రీ త్యాగబ్రహ్మస్వాములవారి అనుగ్రహము.

ఈ వ్యాసము వ్రాయమని ఆజ్ఞాపించిన త్యాగబ్రహ్మస్వామివారికి నా కృతజ్ఞతాపూర్వక భక్తివందనములు అర్పించుకొనెదను.

(నాట్యకళ)

ఇది హైదరాబాదు ఇది హైదరాబాదు
ఇది భిన్న సంస్కృతులు ఎదిగి పూచిన పాదు

ఇచట మల్కిభరాము ప్రచరిత మ్మొనరించె
తెలుగు భారతి శింజినుల మంజులస్వనము

ఇచట గోపన్న చేయించె తన బ్రతుకు వె
చ్చించి సీతమ్మకొక చింతాకు పతకమ్ము

ఇచట తెల్గులవాణి ఇచట ఉర్దూబాణి
కలిసిపోయిన విముక్తాప్రణాళములట్లు

రావోయి తమ్ముడా రమ్ము రాయలసీమ
నుండి సాగరసీమ నుండి నెల్లూరినుండి

పొగబండి డిగ్గి సూటిగపొమ్ము సంభ్రమా
త్మకము సాలార్జంగుని కళానికేతనము

ఒడలివంపుల దెల్పు తడిచీరతో నిల్చు
పడతి కన్పడ సిగ్గుపడబోకు చిత్రమది

తొలి మేలిముసుగు లోపల మెత్తగానవ్వు
జవ్వనిన్ గని చేయిసాచకుము శిల్పమది

ఒక కొన్ని దినములుత్సుకత పొంపిరిపోవ
దర్శించుమా కళాదర్శ నిలయాంతరము

అపుడు కనవయ్య జలదాంగనలతో నరా
గములాడు చార్మినారు మనోజ్ఞ శృంగముల

ఆట నుండి విశ్వవిద్యాలయమ్మున కేగ
వోయి అది ఇంద్రసభ నుండి రాలినతున్క

ఇస్లాము సంస్కృతిని హిందూ మతాత్మనొక
అద్దానజూపు హర్మ్యశ్రేణులనుగాంచి;

ఘంటాపథమ్ములను గడచి విశ్రాంతికై
సాగిపొమ్ము హుసేను సాగరతటమ్ముపై

అచట నొక గడియసేపైన కూర్చొని తాన
మాడుము సమీరశీతాంబుశీకరములన్

హైదరాబాదింక నీదే సుమా! నీవు
వలస వచ్చినవాడ వనుకోకు కలనైన

సహనమే నీకు భూషణము; దానినిదాల్చ
తెలగాణ నిన్ను గుండెలకద్దుకొనునయ్య

బాసలో నొక కొంత యాస విన్పడుగాక
వేసాన కొక కంత వింత కన్పడుగాక

అయిన నేమాయ నయ్యా తెల్గులందరికి
సంస్కృతి యొకండె పూసలలోని దారమటు.

- డా॥ సి. నారాయణరెడ్డి

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ

త్యాగరాజ కీర్తనలు

నా చిరకాల మిత్రులు శ్రీవిస్సా అప్పారావుగారు ఆంధ్రగాన కళాపరిషత్తు యాజమాన్యమున శ్రీ త్యాగరాజ కీర్తనల పాఠమును శుద్ధపరచి పాఠభేదముల నిచ్చి ఈ గొప్ప గ్రంథమును తయారు చేయుట ప్రశంసింపదగినది. వారికితోడై ఆయా కీర్తనలకు విశేషార్థములతో కూడ విపుల వ్యాఖ్యానము వ్రాసిన ఉభయ భాషా ప్రవీణులు శ్రీ కల్లూరి వీరభద్రశాస్త్రిగారి కృషి మిక్కిలి మెచ్చదగినది.

శ్రీ అప్పారావు పంతులుగారు ఈ గ్రంథమున చేర్చుటకై త్యాగరాజును గూర్చి నాలుగు వాక్యములు వ్రాయమని కోరినందుకు వారికి నేనెంతయు కృతజ్ఞుడను.

కావేరి తీరమున జన్మించి వేలకొలది తెలుగుకీర్తనలను వ్రాసిన త్యాగరాజు భారతీయ ఋషి పరంపరలోనివాడు. వాల్మీకి, వ్యాసుడు, జయదేవుడు, పోతన ఈ పరంపరకు చెందిన పూర్వులు. వీరందరును భక్తిమార్గమును బోధించినవారు.

త్యాగరాజు భక్తిమార్గమును బోధించుటకు సంగీత సాహిత్యములను రెంటినుపయోగించినాడు. త్యాగరాజకృతులు కేవలము మనస్సున కుల్లాసము కల్పించు కళావిశేషములు కావు; చిదానందము కల్పించు ఆధ్యాత్మిక సాధనములు. అందుచేత నాకు సంగీత శాస్త్ర పరిచయము తక్కువయైనను నా మిత్రులు అప్పారావు గారి కోరిక ననుసరించి త్యాగరాజు కృతులను గూర్చి ఒకటి రెండు మాటలు వ్రాయసాహసించితిని.

హిందూమతము శృతి స్మృతులలో విశేషముగ చెప్పబడిన కర్మకాండయే కాదు, అది మిక్కిలిగా ఉపనిషత్తులలో వివరింపబడిన ఆధ్యాత్మిక తత్త్వము. చిరకాలముగా మన దేశస్థులు ఆర్జించియుంచిన భౌతిక వస్తువు లెన్నియో నశించిపోయినవి; కాని మన ఋషులు సాధించిన సనాతన హిందూ ధర్మము మాత్రము నశించలేదు. ఆ హిందూ ధర్మతత్త్వము సంకుచితము కాదు. మానవులందరు దేశ కాలపాత్ర లామోదించి అవలంబించి సిద్ధి పొందుటకు వీలైన నిత్య సత్యములతో కూడుకొని యున్నది. 'నిత్య సత్యములు' అన్నాను కదా అని అది ఘనీభవించిన పాషండతత్వము లనుకొనరాదు. జిజ్ఞాస, విచారము, పరిప్రశ్న అను సాధనలమూలమున సాధకుల కది నిరంతరము క్రొత్తకళలతో బ్రహ్మానందము కల్గించుచుండును. ఈశ్వరతత్త్వము అన్నము, ప్రాణము, మనస్సు, విజ్ఞానము, ఆనందము అను సోపాన పరంపరయందు అమర్చబడియున్నదని ఉపనిషత్తులలో వివరింపబడినది. శ్రీత్యాగరాజు కీర్తనలు పైసాధనములతో నిండియున్నవి. కావున గాయకుడును శ్రోతయు తప్పని సరియైనవి. సర్వసామాన్యమైనవి యైన అన్నము, ప్రాణము అను సోపానముల నుండి గడచి క్రమముగా మనస్సు,

విజ్ఞానము అను అంతస్థుల దాటి ఆనందమందిరమున జేరుచున్నాడు.

త్యాగరాజు కీర్తనలలో విశేషములను ఇందుకుదాహరణముగా చూపవలెనంటే – అదియొక పెద్ద గ్రంథమగును. కాబట్టి ఒకటి రెండు మాత్రమే ఇక్కడ సూచించెదను.

"ఎవరని నిర్ణయించిరిరా ని

న్నెట్లారాధించిరిరా నరవరు"   ॥ఎ॥

ఈ కీర్తనయందు హిందూధర్మము ననుసరించి "దైవము" అనగా – సర్వ మతములకు సమ్మతమైన పరమాత్మతత్త్వము కాని – ఏదో ఒక రూపముచేతను, పేరు చేతను నిర్దేశింపదగినవాడు కాడు – అనే సూత్రము ప్రతిపాదింపబడియున్నది.

మరియు సనాతన హిందూధర్మమున పురుషార్థముల నాల్గింటిని సాధించుట సమగ్ర జీవితము అనిపించుకొనును. అందుకై నాలుగు ఆశ్రమములు కల్పింపబడినవి. అయితే పొరబాటున సన్యాసమొక్కటే మోక్ష సాధకము అని పామరులకొక అపోహ కలదు. దానిని ఖండించి గృహస్థాశ్రమము మోక్ష సాధనకాటంకప్రాయము కాదని నిరూపించుటకై ఈ క్రింది కీర్తనను త్యాగరాజు వ్రాసియున్నాడు.

"సంసారు లైతే నేమాయ్యా శిఖి

పింఛావతంసు డెదుటనుండగ"   ॥సం॥

ఈ కీర్తనయం దాయన అహింసాతత్వము, జ్ఞానవైరాగ్యములు, ధ్యానయోగములతో ఈశ్వరార్పణముగా కర్మఫలత్యాగము అను సంసారికి మోక్షమున కవసరమైన ఉత్తమ ధర్మములన్నియు వివరించియున్నాడు. ఈ బావములను వ్యక్తపరచుటకు వారాశ్రయించిన సంగీత కళయు చతుర్విధ పురుషార్థములు నొసంగును.

త్యాగరాజునాటికే ఈ ప్రాంతమున సారంగపాణి, క్షేత్రయ్య, తాళ్ళపాకవారు పలువురు తెలుగులో రచించిన పదములు గేయములు వ్యాప్తిలో యుండెను. అవి అన్నియు చక్కని జాతీయమగు తేట తెనుగున యున్నవి. త్యాగరాజును అట్లే తన కీర్తనలను చక్కని తేట తెలుగు భాషలో వ్రాసియున్నారు. మిగతావారికన్నను దానిని ఉదాత్తముగా నడిపించినాడని భాషావేత్తలు అందురు. ఆయన కవికన్న హెచ్చుగా సంగీతకళావేత్త; అద్భుత మైన కృతులను నిర్మించు శిల్పి. అయితే ఆ సంగీత సాహిత్యములను రెంటిని ఆయనవలె చక్కగా మేళవింప చేసినవారరుదు.

"ప్రాచ్యదేశ భాషలలో ఇటలీభాష వంటిది" అని పొగడబడినది తెలుగుభాష. అజంతములతో నిండియుండుటే దాని విశేషము. అట్టి భాష ఆయన ఉత్తమ కళాసృష్టికి అనుకూలముగా అమరినది. కావున కోరిన రసము స్ఫురింప రచింపబడిన కీర్తనలు ఏ భాషయందున్నను రసానుభూతికి ఆటంకము కలుగదు. మన రాగద్వేషములు ప్రాపంచికములు. కళ మానవుని ఉన్నతస్థాయికి గొంపోవునట్టిది. అందులోను బ్రహ్మానందదాయకమైన సంగీతకళను ఆరాధించుటలోకూడ మన రాగద్వేషములకు తావివ్వరాదు. ఈ సంగతిని ఉత్తమకళావేత్తలందరును ఇదివరకే గ్రహించియున్నారని నా అభిప్రాయము. ఇట్టి గ్రంథమును తమిళభాషలో కూడ తయారు చేయుట అవసరమని శ్రీ కంచి కామకోటి శంకరాచార్యులవారు చెప్పిన మాట యుక్తము. ఆ పనిని కూడ మదరాసు కమిటీవారు ఇప్పటికే ప్రారంభించునట్లు విని సంతోషించుచున్నాను. ఆంధ్రగాన కళాపరిషత్తువారు తమ సంగీత కళాభిమానమును ఈ విధముగా ప్రజాసేవకై ఉపయోగపరచుట మిక్కిలి కొనియాడదగిన విషయము. ఈ సంపుటీకరణమువలన వారు కర్ణాటక సంగీత సాంప్రదాయమునకు ఒనర్చిన సేవ శాశ్వతమైనది.

7-5-1948

డా. పి.యస్.ఆర్. అప్పారావు

తెలుగుదేశం నృత్య సంప్రదాయం

తెలుగుదేశంలో ప్రాచీన నృత్య సంప్రదాయం ప్రధానంగా రెండు శాఖలుగా వర్ధిల్లినది – మొదటిది నట్టువమేళ సంప్రదాయం. రెండవది నాట్యమేళ సంప్రదాయం. ఈ రెండు సంప్రదాయాలకు ఆధారాలు భరతముని నాట్యశాస్త్రం, నందికేశ్వరుని అభినయదర్పణం మొదలైన శాస్త్ర గ్రంథాలే అయినప్పటికీ ప్రదర్శన క్రమంలో భిన్నములై వేర్వేరు శాఖోపశాఖలుగా రూపొందినవి.

ఆదిమ మానవుల ఆట–పాటలలోని రాగాలు, అంగవిన్యాసాలు మాటలు నేటి లలిత కళలకు బీజరూపాలనీ, అంటే గాన–నృత్త – కవిత్వాలకు ఇవే మూలరూపాలని ఆధునిక విమర్శకుల సిద్ధాంతము. నేటికీ ఆటవికులు, గిరిజనులు, జానపదులు పండుగ పబ్బాలలో ఈ ఆటపాటలను నిర్వహించటం మనం చూడగలం, వీటిని ఆటవిక లేదా గిరిజన నృత్యాలనీ, జానపద నృత్యాలనీ పిలుస్తాము. ఇవి అన్నీ దేశి నృత్యాలు అనబడుతాయి. ఇవి సాధారణంగా బృందనృత్యాలు. దేశి సంప్రదాయం క్రమబద్ధమై గ్రంథస్థమై, శాస్త్ర సమ్మతమైనప్పుడు మార్గ సంప్రదాయం అవుతుంది. మళ్ళీ కొన్ని కొత్తదేశిపద్ధతులు తలయెత్తుతవి. అవి కూడా కొంతకాలానికి పరిణతి చెంది మార్గ సంప్రదాయం అవుతాయి. ఈ మార్గ సంప్రదాయానికి దేవాలయాలు, రాజాస్థానాలు పట్టుగొమ్మలు.

ఈ సందర్భంలో నృత్త–నృత్య–నాట్యములనే పదాలను గూర్చి తెలుసుకొనటం అవసరం.

లయకు, అంగ విన్యాసానికి ప్రాధాన్యం ఉండి, అభినయం లేనిది నృత్తము.


అభినయ ప్రధానమైనది నృత్యము (ఇందులో ప్రతిదానికి అభినయం చేయటం ఉంటుంది).

సాత్త్వికాభినయం, రసము ప్రాధాన్యం వహించినది, కథాయుతమైనది నాట్యము.

నృత్త–నృత్యాలు తాండవ – లాస్యభేదాలచేత రెండేసి విధాలు తాండవ – తాండవం ఉద్ధత నృత్తం లేదా నృత్యం, లాస్యం సుకుమార నృత్తం లేదా నృత్యం. ఇంకొక అంశం కూడా ఇప్పట్లో గమనార్హం నృత్యప్రదర్శనలో వృత్తం ఉంటుంది. నృత్త నృత్యాలు రెండూ నాట్యంలో సహకారులుగా ఉండవచ్చు. తెలుగు దేశంలోని నృత్యకళను గూర్చి వివరించేటప్పుడు ఈ పదాలు ప్రసక్తాను ప్రసక్తంగా వస్తూ ఉంటాయి.

మనకు లభ్యమైనంతలో లలిత కళల స్వరూప స్వభావాలను వివరించిన తొలి గ్రంథం, ఇంచుమించుగా క్రీస్తుశకారంభం నాటిదైన నాట్యశాస్త్రము. ఇది భరతముని ప్రణీతము. నాడు, భారత దేశంలో సువ్యవస్థితమైన నాట్యసంప్రదాయం నెలకున్న రాష్ట్రాలలో తెలుగు (ఆంధ్ర) దేశం ప్రధానమైనదని నాట్య శాస్త్రంలోని ఆధారాలను బట్టి సుస్పష్టంగా చెప్పగలము. ప్రవృత్తి, (వివిధ దేశ

తెలుగుదేశంలో నృత్యకళ



వేష-భాషా-ఆచార-వార్తల) వివరణలో (13 వ అధ్యాయం) ఆంధ్రులు దాక్షిణాత్య ప్రవృత్తికి చెందినవారనీ, దాక్షిణాత్యులు బహునృత్త-గీతవాద్య-లలితాభినయ ప్రియులనీ భరతముని పేర్కొన్నాడు. నాట్యశాస్త్రంలో ఆంధ్ర ప్రసక్తి ఇంకో రెండు చోట్ల ఉంది-నాట్యంలో ఆంధ్ర అనే భాషను ఆదేశ వాసులకు ఉపయోగించాలి, (17వ అధ్యాయం, మధ్యమగ్రామాశ్రయములైన పదకొండు జాతులలో ఆంధ్ర ఒక జాతి (నేటి రాగం) 28వ అధ్యాయం). ఈ అంశాలను క్రీస్తుశకారంభ కాలానికే ఆంధ్రులు లలితకళల విషయంలో ఎంతో అభివృద్ధిని సాధించినారన్నది పరమ సత్యమన్నమాట.

క్రీ.పూ. 231 ప్రాంతాలనుంచి సుమారు నాలుగున్నర శతాబ్దాల పాటు దక్షిణాపథంలో ఆంధ్ర చక్రవర్తుల శాతవాహన సామ్రాజ్యం కొనసాగింది. శాతవాహన అనేది వంశనామమనీ, ఆంధ్ర అనేది జాతినామమనీ, వీరి భాష తెలుగు అనీ చారిత్రకుల నిర్ణయం. మొదటి శాతకర్ణి (క్రీ.పూ. 197-179), రెండవ పులోమావి మొదలగు శాతవాహన చక్రవర్తులు దక్షిణాపథపతి బిరుదాంకితులు. శాతవాహనులలో హాలచక్రవర్తి గాథాసప్తశతి అన్నపేర నూర్ల ప్రాకృత గాథలను ఏర్చి కూర్చినాడు. ఇందులోని కొన్ని గాథలు ఇట్లా ఉన్నాయి.

పూచినజనుపచేను హరితాల (అర్దళ) మండిత ముఖం మెరసిడి నటివలె అందగించుచున్నది (1-9).

ఖలుడు భోనము (భోజనము, మద్దెలకు పెట్టేది) ఆరినంతవరకు మద్దెలవలె మధురముగా పల్కును, అ భోనము ఆరినచో వెంటనే మద్దెలవలె విరసముగా పల్కును (11-5)

మదననాటకమునకు నిబిడోపగూహనము (గట్టికౌగిలింత పూర్వరంగమైనది (IV-44).

పై ఉదాహరణలను బట్టి, క్రీస్తు శకారంభం నాటికే ఈ దేశంలో నృత్య-సంగీత-నాటకాలు బాగా ప్రచారంలో ఉన్నవని స్పష్టమవుతున్నది.

నాట్యశాస్త్రం తరువాత పేర్కొనదగిన శాస్త్రం నందికేశ్వరుని అభినయదర్పణము. దేశంలోని ముఖ్య నృత్య సంప్రదాయాలన్నింటికీ ఆధార గ్రంథమని చెప్పదగిన ఈ అభినయ దర్పనం క్రీస్తుశకం 3వ శతాబ్దిలో కానీ ఆ తరువాత కానీ రచింపబడి ఉంటుంది. భారత దేశంలోని అభినయ దర్పణం యొక్క ప్రతులన్నీ (వంగ దేశంలో లభించిన ప్రతితో సహా) తెలుగులిపిలోనే ఉండడం వల్ల అభినయదర్పణం తెలుగు గడ్డమీదనే రచింపబడిందనీ, నందికేశ్వరుడు తెలుగువాడే అనిన్నీ నిశ్చయంగా చెప్పవచ్చు.

నందికేశ్వరుని నాటి నుంచి క్రీ.శ. 11వ శతాబ్ది వరకు గల కాలంలో తెలుగు దేశంలోని నృత్య కళాభివృద్ధి గూర్చి తెలిపే సాహిత్యం లభ్యం కాలేదు. కాని, అమరావతి, నాగార్జునకొండ మొదలైన ప్రదేశాలలో లభ్యమైన బౌద్ధ శిల్పాదులు ఆంధ్రుల లలితకళా ప్రియత్వం నిరంతరంగా కొనసాగుతూ వచ్చిందనటానికి తార్కాణంగా ఉన్నవి. ఆ శిల్పాలలోని నృత్యభంగిమలు, జంత్రవాద్యాదులు నాట్య శాస్త్రానుగుణంగానే ఉండటం ఆశ్చర్యం కలిగించక మానవు.

లభ్యమైనంతలో ఆంధ్రులలో తొలితెలుగు ప్రౌఢ గ్రంథం నన్నయభట్టు రచించిన ఆంధ్రమహాభారతము. ఇది క్రీ.శ. 11వ శతాబ్ది మధ్యలో వెలసింది. నాటి నుంచి ఆంధ్రుల లలితకళాభివృద్ధికి సంబంధించిన సాక్ష్యాలు తెలుగు సాహిత్యం నుంచి పుష్కలంగా లభిస్తున్నవి. కొందరు తెలుగు పండితులు సంస్కృతంలోనే కాక తెలుగులో కూడా నృత్య శాస్త్ర గ్రంథాలు రచించి ఉండటం గమనింపదగినవి.

సూత్రధారుడు, నర్తకులు, పాటకులు, వాద్యకాండ్రు – వీరందరినీ కలిపి బృందము లేదా మేళము అంటారు. ఈ మేళం రెండు విధాలు – నట్టువ మేళం, నాట్య మేళం, ఏకపాత్ర-అందునా స్త్రీ నర్తించే బృందం నట్టువమేళం, ఇంక బహుపాత్రలు, ఒక్కొక్కప్పుడు స్త్రీ పురుషులు కలిసి కూడా నర్తించే బృందం నాట్యమేళం. ఇప్పుడింక ఆయా నృత్య సంప్రదాయాలను వివరిస్తాను.

నట్టువ మేళాలు

దేవదాసీ సంప్రదాయం

భారతదేశంలో, ప్రాచీన కాలం నుంచీ లలిత కళలన్నింటికీ దేవాలయాలే పట్టుగొమ్మలు, అట్లా, దేవాలయాల ఆదరణలో పెంపొందిన లలిత కళలలో నృత్య మొకటి. యజ్ఞం చేసే సమయంలో ఋత్విజులు, యువతులు నృత్యంచేసే ఆచారం ఉన్నట్లు ఋగ్వేదాన్ని బట్టి తెలుస్తున్నది. భగవంతుని ఆరాధించే సమయంలో కూడా నృత్యం చేయటం ప్రాచీన సాంప్రదాయమే. ఈ ఆలయ నృత్యకళలో శైవ-వైష్ణవ సంప్రదాయాలున్నవి అంటే ఆయా పూజా విధానాలను నిర్దేశించే శాస్త్రాలను అనుసరించి నృత్యాలు రూపొందించబడినవన్నమాట, ఆలయంలో స్వామి సన్నిధిని, అంటే బలిపీఠం మీద జరిగేవి. ఆరాధనా (పూజా) నృత్యాలు! ఇంక కల్యాణ మంటపంలో వేడుకగా జరిగేవి కేళికా నృత్యాలు. ఇవి రెండూ నట్టువమేళ సంప్రదాయానికి చెందినవి. ఇందులో బలిపీఠం మీద జరిగేది ప్రధానంగా నృత్తము; ఇంక కల్యాణ మంటపంలో జరిగేది ప్రధానంగా నృత్యము, ఈ నృత్త-నృత్యాలను దేవదాసీలు నిర్వహిస్తారు, అందునా, స్వామి సన్నిధిని బలిపీఠం మీద నర్తించే అర్హత అధికార ముద్రలను పొందిన దేవదాసీలకే ఉంటుంది అచ్చట నర్తించే అర్హత ఇతరులకు లేదు.

బార్బోజాకథనం

దేవదాసీలు పవిత్ర జీవనం గడిపేవారని, దేవదాసిగా నిర్దేశించబడిన వ్యక్తిని పదేండ్ల ప్రాయమప్పుడే దేవాలయానికి అర్పించే వారనీ, అప్పుడు ఆమెకు ఆ దేవునకు వివాహం మహోత్సవ పురస్సరంగా జరిగేదనీ, దేవుని సేవకు అర్పించబడినది కావటంచేత ఆమె 'దేవదాసి' అయినదనీ విజయనగర సామ్రాజ్యాన్ని సందర్శించిన బార్బోజా అనే విదేశీ యాత్రికుడు వర్ణించినాడు. తన సర్వస్వాన్ని దేవదేవుని సేవకే అంకితం చేసి తదైక్యానికి తహతహ పడి ఆయనలో లయించిన దేవదాసి (గిరిక) కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి 'వేయిపడగలు' నవలలో వర్ణితమైనది. అట్టి వారే నిజమైన దేవదాసీలు.

ఇంక ఆలయపుటావరణలో, స్వామికల్యాణ మంటపంలోకి వేంచేసి కొలువై ఉన్నప్పుడు దేవదాసీలే కాక నృత్య విద్యాపారంగతలైన వేశ్యలు (గణికలు) కూడా నృత్యం చేయవచ్చు. వినోదార్థ మేర్పడింది కాబట్టి దీనికి 'కేళిక' అన్నపేరు వచ్చింది. ఈ సందర్భంలో ఒక విషయాన్ని స్పష్టం చేయవలసి ఉన్నది. దేవుని సేవకు అంకితమైన దేవదాసీలు అస్ఖలిత బ్రహ్మచారిణులు కావటంచేత 'దేవదాసీకులం' అనేది ఏర్పడటానికి అవకాశం లేదు. కాని క్రమంగా, ఆ నిష్ఠ తగ్గినవారిలో దైవసేవ అప్రధానమై, మానవసేవ ప్రారంభమవుతుంది, తత్ఫలంగా కులం ఏర్పడటానికి అవకాశ మేర్పడుతుంది, అట్లా ఏర్పడిందే వేశ్యాకులం నాట్యశాస్త్ర కామసూత్ర – అభినయ దర్పణాదులందు దేవదాసీ ప్రశంసలేదు. కాగా ఈ వ్యవస్థ ఎప్పుడు ప్రారంభమైనదో స్పష్టంగా తెలియదు.

నట్టువమేళంలో దేవదాసీ – రాజనర్త సంప్రదాయాలు రెండూ ప్రధానం. ఇవి రెండూ ఏకపాత్రనృత్యాలే. ఈ మేళంలో సాధారణంగా అంటే సూత్రధారుడు బ్రాహ్మణుడే, వాద్యకాండ్రను, ఇతర సహాయకులను హంగుదారులు అంటారు.

నృత్య-సంగీతాలకు చాళుక్య-చోళుల కాలంలో దేవాలయాలు ఆటపట్టులైనట్లు శాసనాలవలన తెలియవస్తున్నది. నాటి దేవాలయాలలో నాట్యమండప నిర్మాణం ఒక ప్రత్యేకత. స్వామి అర్చన సమయంలో ఇతర సేవలలో గాయక-నర్తకులు శివాలయాలలో శైవకథలను విష్ణాలయాలలో వైష్ణవకథలను పాడడం, ఆడడం, ఆచారమయింది. ఈ ఆచారం వల్లనే నాట్యమండప నిర్మాణంతోపాటు గాయక-నర్తకులకు

భూవసతు లేర్పరచటం కూడా జరిగేది. శ్రీ కూర్మాది దేవాలయాలలోని ఆనాటి నట-నర్తకుల పేర్లు కూడా శాసనాలవల్ల తెలుస్తున్నవి. కొన్ని శాసనాలలో ఆయా దేవతల అంగ-రంగ భోగాల నిర్వహణ నిమిత్తం దానాదులు ఇచ్చినట్లు ఉన్నది. 'అంగభోగ' మంటే దేవుని అలంకరణ నైవేద్యాదులకు సంబంధించిన సేవ; 'రంగభోగ' మంటే ఆయా సమయాలలో నిర్వహించే నృత్య-సంగీత సేవ. గాయక-నర్తకులు ఈ రంగభోగానికి సంబంధించిన వారు. ఒకే దేవాలయంలో పలువురు సానులు (దేవదాసీలు) ఉండేవారని శాసనాలే కాక సాహిత్యం కూడా స్పష్టం చేస్తున్నది. (శ్రీనాథుని భీమేశ్వర పురాణం (vi-78), చలదవాడ మల్లన వర్ణించినట్లుగా, తెలుగు దేశంలో పూర్వ మధ్య యుగాలలో చిన్నపల్లెల్లో కూడా ఒక్క దేవాలయం అయినా ఉండేది; అందులో గాయక-నర్తకుల 'రంగభోగం' తప్పక ఉండేది.

పూజా సమయంలో నృత్యాలు దేవాలయాలలో కాక ఇండ్లలో కూడా జరిగేవి. పాల్కురికి సోమనాథుడు, తన బసవ పురాణంలో, ముగ్ధ సంగయ్య కథలో ఒక ఇంటిలో జరిగిన లింగార్చనా (శివపూజా) సమయ నృత్యము వర్ణించినాడు. రెడ్డిరాజులు ఈశ్వరుని పూజించేటప్పుడు నృత్యం నిర్వహించేబడేదని శ్రీనాథుడు వర్ణించి నాడు (కాశీఖండం-I-50) మహానవమి ఉత్సవాల సమయంలో తొమ్మిది రోజులు శ్రీకృష్ణదేవరాయల వారు ప్రతి ఉదయం దైవ దర్శనం కొరకు వచ్చేవారనీ, ఆయన దైవసన్నిధిని ఉన్నంతసేపు, ఆ తరువాత చాలసేపటి వరకు నర్తకీమణులు నృత్యం చేస్తూ ఉండేవారనీ పేయస్ అనే విదేశీ యాత్రికుడు వర్ణించినాడు.

రాజనర్తకీ సాంప్రదాయం

నృత్యం రస భావవ్యంజకమనీ, అటువంటి నృత్యాన్ని మహారాజసభలలో ప్రదర్శించవలెననీ నందికేశ్వరుడు అభినయ దర్పణంలో పేర్కొన్నాడు. అంటే ఆరాధనా సమయాలలో నృత్తము ప్రాధాన్యం వహించగా, రాజసభలలో నృత్యము (అభినయ ప్రధానమైనది) ప్రాధాన్యం వహిస్తున్నదన్నమాట. రాజాస్థానాలలోని నృత్యం రెండు విధాలు-మార్గపద్ధతి, దేశపద్ధతి. వీటిలో మార్గపద్ధతి శాస్త్రానుసారి. ఇంక దేశిపద్ధతి ఆయా సీమలకు ప్రత్యేకమైనది. విరాట రాజుపుత్రిక అయిన ఉత్తర నేర్చుకొన్నది దేశి పద్ధతి అని తిక్కన విరాట పర్వం వల్ల తెలియవస్తున్నది. ఈ దేశి నృత్యాలు నాయకరాజుల కాలంలో బాగా రాజాదరణ పొందాయి. జాయపసేనాపతి రచించిన నృత్తరత్నావళిలో దేశినృత్యాల వర్ణన ఇంచుమించుగా సగపాలు ఆక్రమించింది.

అభినయమంటే పదాలు, శ్లోకాలు మొదలగు వాటిల్లోని సాహిత్యాన్ని (అర్థాలను) సాత్త్విక ప్రధానంగా ప్రదర్శించటం. సహజ ప్రతిభ ఉండి, విశేషపరిశ్రమచేస్తేనేకాని ఇది సాధ్యం కాదు. ఇందులో ఆడటం, పాడటం ఈ రెండూ నర్తకి చేస్తుంది; తెలుగు దేశపు నృత్యకళలలోని ప్రత్యేకత ఇది. ఇటువంటి కఠిన పరిశ్రమ చేసి, సుప్రసిద్ధు లైనవారే రాజాస్థానాలలో రాజనర్తకిగా నియమించబడేవారు. దేవాలయాలలో దేవదాసీలు పలువురు ఉండవచ్చు; కాని రాజస్థానాలలో రాజనర్తకీ బిరుదుకలది సాధారణంగా, ఒక్కతే మాత్రమే ఉంటుంది. ఈమెను రాజ పాత్ర అంటారు. (ఈమెతోపాటు పలువురు ఇతర నర్తకీ మణులు కూడా ఉండవచ్చు). తెలుగు సాహిత్యంలో రాజాస్థాన నృత్య ప్రశంసలు అధికంగా ఉన్నాయి. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలోని పర్వత ప్రకరణంలో మల్లికార్జున దేవుని ఆస్థానమందలి నృత్యములు వర్ణితమైనవి. విక్రమార్క చరిత్ర షట్చక్రవర్తి చరిత్ర, సింహాసనద్వాత్రింశిక, వాల్మీకి చరిత్ర మొదలైన తెలుగు కావ్యాలలో దేవలోకంలోని దేవేంద్రుని ఆస్థాన నర్తకీమణులగు రంభోర్వశుల నృత్యములు, వారిస్పర్ధలు వర్ణితములు కాగా శ్రీనాథుని పల్నాటి వీరచరిత్రలో భూలోకంలోని రాజాస్థాన నృత్యం విపులంగా వర్ణితమైంది.

గాంధర్వ విద్యా ప్రవీణుడుగా వర్ణితుడైన చాళుక్య రాజగు గుణగ విజయాదిత్యుడు (క్రీ.శ. 848-92) చెల్లవ్వ అనే నట్టువరాలికి కొంత భూమిని దానంగా ఇచ్చినాడు. కవిగాయ కల్పతరువు బిరుదాంచితుడగు రెండవ అమ్మరాజు (క్రీ.శ. 945-70) నృత్య కళలో మిన్న అయిన చామెకాంబ యొక్క గురువు అగు అర్హనంది అనే జైనాచార్యునకు ఒక గ్రామం దానం చేసినాడు. క్రీడాభిరామంలో రెండవ ప్రతాపరుద్రుని కాలంనాటి నృత్యపారీణయగు మాచల్దేవి వర్ణితమైనది. చెల్లివ్వ, చామేకించ, మాచల్దేవి - ఈ ముప్పురుకూడా రాజనర్తకీమణులే. పల్నాటి వీర చరిత్రలో వర్ణితమైన కంజలోచన కామభూ విభుని ఆస్థాన నర్తకి. ఇంక రెడ్డిరాజుల కాలంలో ప్రసిద్ధి వహించిన రాజనర్తకి లకుమాదేవి; ఈమే కర్పూర వసంతరాయ బిరుదాంచితుడగు కుమార గిరిరెడ్డి ఆస్థాన నర్తకి, శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో నృత్య మేళమునకు రంజకం శ్రీరంగరాజు నాయకుడు; వాని కుమార్తె కుప్పాయి లేదా కుప్పాసాని నర్తకి రాయలవారు విద్వత్సభారాయ బిరుదాంకితుడు కాగా, వీరిద్దరు విద్వత్సభారాయ 'రంజక' బిరుదాంచితులు. కుప్పాసాని కుమార్తె ముద్దుకుప్పాయి అచ్యుతరాయల నగరులో నర్తకి. 6-6-1531 తేదీనాటి ఒక శాసనాన్ని బట్టి అచ్యుతరాయలీమెను తిరుపతిలోని శ్రీగోవింద రాజస్వామి వారి ఆలయంలో దేవదాసిగా నియమించినట్లు తెలుస్తున్నది. అంతే కాదు, ముద్దు కుప్పాయి వంశంలోని వారంతా వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నృత్యం చేయటానికి అధికారం పొందినట్లుగా కూడా ఈ శాసనంలో ఉన్నది.

తంజావూరు పాలకుడగు అచ్యుతప్ప నాయకుని కాలం (క్రీ.శ. 1580-1614)లో నృత్య-సంగీతాలకు పట్టుగొమ్మలైన పెక్కు తెలుగు కుటుంబాలు రాజాశ్రయాన్ని అర్థించి, తంజావూరు వలసపోయినవి. అచ్యుతప్పనాయకుడు వారినెల్ల ఆదరించి, తనపేర 'అచ్యుతాపురము'ను అగ్రహారంగా ఇచ్చినాడు. అదే, తమిళనాడులోని నేటి 'మేలట్టూరు' (మేళముల ఊరు) విజయనగర సామ్రాజ్య కాలంలో శ్రీకృష్ణదేవరాయల వారెట్లో తంజావూరు రాజ్యంలో రఘునాథ నాయకుడట్లు సాహితీ సమరాంగణ చక్రవర్తి. రఘునాథ నాయకుడు, ఆయన కుమారుడగు విజయ రాఘవ నాయకుడు స్వయంగా నృత్య-సంగీత వేత్తలేకాక కవులుకూడా, వీరి కాలం యక్షగాన-వీధి నాటకాలకు స్వర్ణయుగం, ఇరువురి

ఆస్థానంలోను పలువురు నర్తకీమణులు ఉండేవారని విజయరాఘవుడు, చెంగళ్వ కాళకవి చేసిన రచనలవల్ల తెలియవస్తున్నది. వీరంతా చేమకూర వేంకటకవి పేర్కొన్నట్లుగా 'విపులబరత కళాశాస్త్ర నిపుణులైన బిరుద పాత్రలు'. వీరిలో ముద్దు చంద్రరేఖ సుప్రసిద్ధ. క్రీ.శ. 1642 వరకు పాలించిన మూడవ వేంకటపతి రాయలు ఈమెను బహువిధ బిరుదములతో సత్కరించినాడట! ఆమె 'పేరిణీ' నృత్యమునకు పేరుపొందినది. రూపవతి, శశిరేఖ, లోకనాయిక, చంపక, కీరవాణి, మూర్తివధూటి, కోమలవల్లి, రత్నగిరి, భాగీరథి – వీరు తక్కిన నర్తకీమణులు.

దివిసీమలోని మొవ్వ వాస్తవ్యుడు, సుప్రసిద్ధ వాగ్గేయకారుడు, పదకర్త అయిన క్షేత్రయ్య (క్రీ.శ.1600–1680) విజయరాఘవుని ఆస్థానం సందర్శించి, అతనిపై కూడా పదాలు చెప్పినాడు. క్షేత్రయ్య పదాలకు నాటి నుంచి నేటివరకూ నృత్య ప్రదర్శనాలలో అధిక ప్రాధాన్యం ఉంది. క్షేత్రయ్య పదాన్ని అభినయించటం నృత్యవిద్యకు నికషోపలం అయిందన్నా అతిశయోక్తి కాజాలదు.

నేడు, 'భరతనాట్యము' అన్నపేర సుప్రసిద్ధమైన నృత్యరీతి, తంజావూరును పాళజంచిన మహారాష్ట్ర రాజగు రెండవ శరభోజీ కాలం (క్రీ.శ. 1786–1821) లో రూపొందించబడినదన్న సత్యాన్ని ఈ సందర్భంలో గుర్తుచేయటం అప్రసక్తం కాజాలదు. ఈ నృత్యరీతిని రూపొందించిన సోదరులు – పొన్నయ్య, చిన్నయ్య, వడివేలు, శివానందం, వీరు సుబ్బరాయనట్టువనారు కుమారులు.

ఇతర నృత్యాలు

రాజపుత్రికుల నృత్యాలు : రాజపాత్రలు కాదలచినవారేకాక రాజపుత్రికులు కూడా రాజనగరులో నృత్యాది లలితకళలు అభ్యసించేవారు. రాజాంతఃపురాలలో నృత్యశాలలు ప్రత్యేకంగా ఉండేవి. రాజపుత్రికలకు నృత్యం నేర్పటానికి అచార్యులు నియుక్తులయ్యేవారు. వారు పురుషులు కావచ్చు లేదా స్త్రీలు కావచ్చు. విరాటరాజు తన కుమార్తెయగు ఉత్తరను నృత్య శిక్షణ కోసం బృహన్నలకు అప్పగించిన విధానాన్ని తిక్కనసోమయాజి ఆంధ్ర మహాభారతంలోని విరాటపర్వంలో వర్ణించినాడు. పేయస్ అనే విదేశీ యాత్రికుడు శ్రీకృష్ణదేవరాయల రాచనగరులోని నృత్యశాలను స్వయంగా దర్శించి, విపులంగా వర్ణించినాడు.

ఉత్సవ నృత్యాలు : ఉత్సవ నృత్యాలలో కుమారగిరిరెడ్డి కాలంలో ప్రసిద్ధికెక్కిన వసంతోత్సవ నృత్యాలు ముఖ్యంగా పేర్కొనదగినవి. రెడ్డిరాజుల కాలంలో వసంతోత్సవాలు ప్రాధాన్యం వహించినట్లుగా, విజయనగరరాజుల కాలంలో మహార్నవమి ఉత్సవాలలోని నృత్యాలను అబ్దుల్ రజాక్ అనే పర్షియా రాయబారి విపులంగా వర్ణించి ఉన్నాడు. ఈ నృత్యాలలో వారాంగనలు ముఖ్యంగా పాల్గొనేవారు. వీటిని బృంద నృత్యాలుగా పేర్కొనవచ్చు. 30–40 సంవత్సరాల క్రిందటి వరకు తెలుగు దేశంలో వారాంగనలు శ్రీరామ నవమి మొదలగు ఉత్సవాలలో నృత్యాలు చేస్తూ ఉండేవారు. వివాహాది శుభకార్య సమయాలలో కూడా వీరి నృత్యాలు ఏర్పాటు అయ్యేవి.

గిరిజన జానపద నృత్యాలు : పండుగ పబ్బాలలో గిరిజనులు, జానపదులు బృంద నృత్యాలను నిర్వహించటం సర్వసామాన్యం. కులస్త్రీలే ఈ నృత్యాలలో పాల్గొంటారు. ఇవి 'దేశి' పద్ధతికి చెందిన నృత్యాలు.

నాట్యమేళాలు

భారత–భాగవత–రామాయణాది పురాణేతిహాసాల నుంచి కథలను స్వీకరించి, వాటితో నృత్య–సంగీతాలను మేళవించి, నాటక రూపంగా ప్రదర్శించేవారిని 'నాట్యమేళము' అంటారు. ఇవి ప్రధానంగా నృత్యనాటకాలు, వీటిని యక్షగానాలు, భాగవతాలు, వీధినాటకాలు అనటం పరిపాటి. 'యక్షగానము' అనేది తొలుత కథాగాన రూపంలో ఉండేవి. రాను రాను అందులో సంవాదాలు, వివిధ పాత్రధారణ చోటు చేసుకొనటం వల్ల అది నాటక రూపాన్ని సంతరించుకొన్నది. అందుచేత యక్షగానమన్నప్పుడు కూడా నృత్యనాటకమనే అర్థము. తొలుత భగవంతుని లీలలకు సంబంధించినవై, భగవదారాధనమే ధ్యేయంగా కలవి కావున ఈ నృత్యనాటకాలకు భాగవతములు' అనీ, వీటిని ప్రదిర్శంచేవారికి 'భాగవతులు' అనీ పేర్లు వచ్చినవి. ఇవి నాలుగు వీధులు కలిసేచోట (శృంగాటకములలో) ప్రదర్శించబడేవి. కావున వీటికి వీధినాటకములు, వీధి భాగవతములు అనే పేర్లు వచ్చాయి. పూర్వ కథాయుతములై బహునర్తకులు, తత్తదుచిత వేషధారణకలవి కావటం వల్ల ఇవి నాట్యశాఖకు చెందినవి అవుతున్నవి; వీటిని ప్రదర్శించేవారు 'నాట్యమేళము' అవుతున్నారు. నాయకరాజుల కాలంలో భాగవతాది కథలేకాక రాజసంబంధి కథలు, కల్పిత సాంఘిక కథలు కూడా ఈ నృత్య నాటకాలకు ఇతివృత్తములు కావటం గమనించవచ్చు.

కూచిపూడి నర్తకులు

నృత్య–నాట్యాలు శీలరహితుల పాలపడినప్పుడు ఆ నట–నర్తకులు నీతిబాహ్యులై సంచరించటానికి అవకాశం వుంటుంది. అటువంటి స్థితి క్రీ.శ. 12వ శతాబ్దంలో తెలుగు దేశంలో ఏర్పడిందని ఊహించటానికి అవకాశం ఉన్నది. కావుననే 13వ శతాబ్దిలో కాకతీయుల కాలంలో నృత్యకళకు రాజాస్థాన ప్రవేశ గౌరవాలు కలిగించటానికి ప్రయత్నాలు జరిగాయి. ఈ ఉద్యమానికి బ్రాహ్మణులు గురుపీఠం వహించినారు; రాజులు, రాజబంధువులు, మంత్రి–సేనానులు పట్టుగొమ్మలైనారు. కాకతీయ గణపతిదేవుని మంత్రి, గుండామాత్యుడు నృత్యగురువు; ఆయన శిష్యుడు, గణపతి దేవుని బావమరిది అయిన జాయపసేనాపతి స్వయంగా 'నృత్త రత్నావళి' అనే ఉత్తమశాస్త్ర గ్రంథాన్ని రచించినాడు. (క్రీ.శ. 1253–54) జాయప కృష్ణాజిల్లాలోని దివిసీమలోనివాడు. ఈ దివిసీమలోనిదే కూచిపూడి కాగా, కూచిపూడి నాట్యకళకు మూలపురుషుడుగా ప్రసిద్ధిపొందిన సిద్ధేంద్రయోగి ఈ 13వ శతాబ్దికికానీ, 14వ శతాబ్దికి కానీ చెందినవాడు కాగలడు.

సిద్ధేంద్రుని విశిష్ట కళాసృష్టి 'భామాకలాపము'. ఇది పారిజాతాపహరణ గాథకు సంబంధించినది. సిద్ధేంద్రుడు దీనిని కూచిపూడి బ్రాహ్మణులకు నేర్పినాడు. నాడు కూచిపూడి బ్రాహ్మణులు వేదాధ్యయనపరులు, తపస్సంపన్నులు, యజనయాజనపరతంత్రులు, సామగానమున సాటిలేని మేటులు, కూచిపూడి బాలుర సుకుమార దేహములను, కమ్మెచ్చులు తీసిన కంఠ స్వరములను సిద్ధేంద్రుడు ఆకర్షించియుండును. అంతట ఆయన పెద్దలను అంగీకరింపజేసి, వారి అనుమతితో, భగవత్సన్నిధానములో కూచిపూడి బాలురకు నృత్య శిక్షణ ఆరంభించినాడు. అదియే తెలుగు వారికి గర్వకారణమగు 'కూచిపూడి నాట్య' కళకు నాందీపూజ జరిగిన శుభముహూర్తము. ఈ కళ చిరకాలము వర్ధిల్లవలెనన్న కోరికతో సిద్ధేంద్రుడు కూచిపూడి వారి నుంచి క్రింది విధముగా వాగ్దానము పొందెనని చెప్పుదురు– ఆ గడ్డ మీద పుట్టిన ప్రతిమగబిడ్డకు సిద్ధేంద్రుని పేరు చెప్పి, ముక్కుపట్టి, కాలికి గజ్జకట్టవలె, స్త్రీలకు ఈ కళలో ప్రవేశము నిషిద్ధము. ఇంక, పురుషుడు ఏవృత్తి నవలంబించినప్పటికీ, ఒక్కసారి అయినా, ఆయూరి శ్రీరామలింగేశ్వరస్వామి వారి సన్నిధిని భామవేషము కట్టి తీరవలెను".

తరువాతి కాలంలో కూచిపూడి వారు యక్షగాన – భాగవతముల ప్రదర్శనలు కూడా చేపట్టినారు. 'గొల్ల కలాపము' అను విశిష్ట రచన కూడా వీరి ప్రదర్శనలలో ఒక భాగమైనది. గొల్ల కలాపం ఏక పాత్రహార్యం. దీనితోపాటు భామా కలాపాన్ని కూడా ఏకపాత్ర హార్యంగా ప్రదర్శించటం జరుగుతున్నది. అధునికకాలంలో స్త్రీలకు కూడా కూచిపూడి నృత్యకళలో ప్రవేశం లభించింది. నేడు ఏకపాత్ర హార్యంగానే అధికభాగం ప్రదర్శనలు జరుగుతున్నవి.

ఈ కూచిపూడి సంప్రదాయంలోని వారే కొందరు గోల్కొండ నవాబుల వలన సమ్మానితులై కర్నూలు మండలంలో స్థిరపడినారు. వీరిని 'కోటకొండ భాగవతులు' అంటారు, మరికొందరు, తంజావూరు రాజ్యానికి వలస వెళ్ళి మేలట్టూరులో స్థిరపడినారు. కూచిపూడికి అతి సన్నిహితంగా ఉన్న మొవ్వ క్షేత్రయ్య జన్మస్థలం దానికి చాల దగ్గరలో ఉన్నవి ప్రాచీనాంధ్ర రాజధాని శ్రీకాకుళము; సుప్రసిద్ధ బౌద్ధక్షేత్రం ఘంటసాల.

కూచిపూడి వారి కాణాచి అనదగిన భామాకలాపమును, దానితోపాటు గొల్లకలాపమును, యక్ష–గాన భాగవతాలను ఆర్వాచీన కాలంలో ఇతరులు కూడా నేర్చి ప్రదర్శింప సాగినారు. కాగా, తెలుగుదేశంలో అనేక నాట్య మేళాలు వెలసినవి. బహుశః మూలం ఒకటే అయినప్పటికీ, కాలక్రమాన, ఆయా ప్రదర్శన పద్ధతులలో చాలా భేదాలు చోటుచేసుకున్నవి. ఒక ప్రక్క ఈ మేళముల ప్రదర్శనలు సాగుతూంటే, ఇంకొక ప్రక్క కళావంతుల స్త్రీలు కూడా కళాప్రదర్శనలు చేపట్టినారు. కూచిపూడి బ్రాహ్మణులు కొందరు, వారి శుశ్రూష చేసిన మరికొందరు ఈ నాట్య మేళములకు, ఈ స్త్రీలకు గురువులైనారు. ఈ గురువులందరు మూర్తీభవించిన సంగీత–సాహిత్య–నృత్య విద్యలనదగినవారు; పవిత్ర జీవనులు. ఇంక శిష్యురాండ్రు నియమపూర్వకమైన జీవితం గడపుతూ నృత్యకళయే జీవిత సర్వస్వంగా జీవించినవారు. తెలుగుదేశంలోని కళావంతులు 'ఊర్వశి' సంతతికి చెందినవారనే సంప్రదాయం వుంది. మేనక, రంభ, ఊర్వశులు అప్సరసలు; ఇంద్రసభలో దేవనర్తకీమణులు. వీరిలో ఊర్వశి 'అభినయ ప్రదాయము'నకు మూలవిరాట్టుగా చెప్పబడినది. మరి తెలుగునాడులోని వేశ్యలు అభినయంలో దిట్టలు : అందుచేతనే వారు ఊర్వశి సంతతిగా ప్రసిద్ధి పొంది ఉంటారు.

ఆడుతూ పాడటం, లేదా పాడుతూ ఆడటం తెలుగు దేశంలోని నృత్య కళలోని విశిష్టత. అంతేకాదు– తెలుగు నర్తకీ, నర్తకులు నృత్య కళలోనే కాక సంగీత–సాహిత్యాలలో కూడా నిష్ణాతులు కావటం ఇంకొక విశిష్టత.

(ఆంధ్రప్రదేశ్, ఏప్రియల్ 1981)

ఆంధ్రత్వ మాంధ్ర భాషా చా
ప్యాంధ్ర దేశ స్వజన్మభూః
తత్రాపీ యాజుషీ శాఖా
నాల్పస్య తపసః ఫలమ్

– అప్పయ్య దీక్షితులు

గొర్రెపాటి వెంకట సుబ్బయ్య

ప్రాచీనాంధ్ర నాట్య కళాక్షేత్రము

సంగీతానికి విజయనగరం, సాహిత్యానికి రాజమహేంద్రవరం (కోనసీమ), ప్రఖ్యాతిగాంచినటులనే నాట్యకళకు కూచిపూడి పేరు ప్రతిష్ఠలు పొందినది.

నృత్త నాట్య నృత్యాలు పేరు చెవినిపడగానే కూచిపూడి స్మరణకు వస్తుంది. అది ఒక కళాక్షేత్రం. ఒక పుణ్యస్థలం. ఒక చారిత్రక ప్రదేశం. కూచిపూడివారి కులపతి సిద్ధేంద్రయోగి సిద్ధిపొందిన సుక్షేత్ర మది.

కూచిపూడి ఆంధ్రదేశానికేగాక యావద్భారతమునకు తలమానిక మనుట అతిశయోక్తికాదు.

ఆంధ్ర సంస్కృతికి ఉండే విశిష్ట సంపత్తిలో కూచిపూడి భరతనాట్యం అగ్రగణ్యం. భారతదేశ నాట్యకళా చరిత్రలో దాని స్థానము మహోన్నతమైనది.

కూచిపూడివారు నాలుగు వందల సంత్సరములనుండి ఈ నృత్య విద్యను అవలంబించి మన దక్షిణ దేశమంతా జైత్రయాత్ర చేశారు. వారు తిరగని ప్రాంతంలేదు. వారు గజ్జె కట్టని గ్రామములేదు. వారు పొందని ప్రశంసలేదు.

ఆంధ్రులకు ఒక మహోన్నతమైన జాతీయ నృత్యము ఉన్నదని సగర్వముగా చెప్పుకొనుటకు ఆ నటరాజారాధకులే కారకులు. వారీవిధంగా ఆంధ్రుల యశస్సును కాపాడుకొంటూ వచ్చిన కళాజీవులు.

కూచిపూడి కృష్ణామండలమందు దివి తాలూకాలో చేరిన అగ్రహారము. దీనితోపాటు ఈ పరిసర గ్రామాలుకొన్ని ఆంధ్రులకు చిరస్మరణీయములు.

మన కళాక్షేత్రమునకు అనతిదూరంలోనున్న అయ్యంకి, గ్రంథాలయోద్ధారక అయ్యంకి వెంకటరమణయ్య తాండవకృష్ణ గారలకు జన్మస్థలము. కూచిపూడికి క్రోసుదూరములో ఉన్న మొవ్వ గ్రామము సుప్రసిద్ధ పదకర్తయగు క్షేత్రయ్య ప్రభవించిన పుణ్యభూమి. దానికి దగ్గరనే ప్రాచీనాంధ్ర రాజధానియగు శ్రీకాకుళము గలదు. ఈ పుణ్యస్థలముననే కృష్ణకర్ణామృత కర్తయగు లీలాశుకుడవతరించెను. ఈ ప్రసిద్ధ స్థలమునందే గాయక సార్వభౌముడగు పారుపల్లి రామకృష్ణయ్యగారు ప్రభవించిరి. ఈ సుప్రసిద్ధ రాజధానితోనే కలిసియుండెననే ప్రతీతిగల ప్రాక్తన వైభవము గాంచిన ఘంటశాల కలదు. అది ఆనాటి బౌద్ధుల పుణ్యక్షేత్రం. సుప్రసిద్ధ సంగీత విద్వాంసులగు చల్లపల్లి సీతారామయ్య, సుబ్బయ్య, పంచనాథం, పురుషోత్తంగారలు పురుడు పోసుకొనిరి. దానికి చెందిన ఘంటశాల పాలెంగాన విద్యావిశారదుడగు గరికపర్తి కోటయ్యదేవర జన్మచే గణుతి గాంచినది. దీనికి ఆమడ దూరమున దక్షిణకాశియని ఖ్యాతిగాంచిన కళ్లేపల్లి గ్రామమున ప్రఖ్యాత గాన విద్యాపారంగతులగు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రిగారును, సుప్రసిద్ధ పరిశోధకులగు ప్రభాకర శాస్త్రిగారును ప్రభవించిరి.

కూచిపూడి మన ప్రాచీన నాట్యమునకు పుట్టిల్లు. అచటివారందరు నాట్యమే జీవనోపాధి గలవారగుటచే భరతశాస్త్రము తరతరములనుండి శిక్షణపొందుటచే సుశిక్షితులై విఖ్యాతిగాంచిరి. నందికేశ్వరుని అభినయ దర్పణము వారికి కొట్టినపిండి. అభినయములో "అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ" అను సామెత వారికి అక్షరాలా చెల్లును. అందుచేతనే కూచిపూడిలో కుక్క మొరిగినా సంగీతమే అనే సామెత వచ్చినది.

వీరు భగవత్సంబంధములగు కథలను ఆడి, పాడి ఆనందింపజేయుటచే భాగవతులైరి. కూచిపూడివారగుటచే కూచిపూడి భాగవతులని పిలువబడుచున్నారు. వీరిచే అభినయింపబడునది గాన కూచిపూడి నాట్యమనబడుచున్నది.

ఆదిలో సిద్ధేంద్రయోగిచే శిక్షణ పొందినవారు భాగవతులైరి. ఈ యింటిపేరు వారు నేడు ఎచ్చట నున్నను వారు కూచిపూడికి చెందినవారే. చతుర్వేదుల, ద్వివేదుల, అనునట్లే భాగవతులనేది కూడా పౌరుష నామము.

ఈ కూచిపూడి కళారాధకులను నాలుగు తరగతులుగా విభజింపవచ్చును. భాగవతులు, నాటకములాడువారు, అభినయ దేశికులు, పగటి వేషములు వేయువారు.

భాగవతులు :

"శృంగారలహరి శ్రితజన శుభకర"– అనునది వీరి అభిమాన కీర్తన. తరంగములు– నారాయణ తీర్థులవారిచే రచింపబడిన భాగలగోపాల గీతములు. తీర్థులవారిని కొందరు అనాంధ్రుడనుట అనాలోచితము. ఆయన అచ్చముగా ఆంధ్రుడని ఆయన గేయములే చెప్పును.

జయదేవకవి తన భాషా సాంప్రదాయాన్ననుసరించి అంత్యప్రాసను తెచ్చినట్లే, ఆంధ్ర భాషా సాంప్రదాయాన్ననుసరించి తీర్థులవారు యతిప్రాసలు తెచ్చెను. ఈయన పల్లెటూరి వాడు. ఈ తరంగములను నృత్యమాడుటయందు వీరు సిద్ధహస్తులు.

"బాలగోపాల మాముద్ధర" అని పాడుచు కృష్ణుని బాల లీలలను అభినయించి, అటు పిమ్మట నీరుతో నిండిన పళ్లెము అంచులపై నిలబడి పళ్లెములోని నీరు తొలగకుండా సప్తతాళములను నృత్యమాడుదురు.

దశావతారములు : మహావిష్ణువు జగదోద్ధారణకై ఎత్తిన పది అవతారముల వర్ణనాగీతము. దీనిని కడు నేర్పుతో సందర్భోచిత రసములతో, హృద్యమముగా అభినయింతురు.

భామకలాపము: ఇది నాట్యాచార్యుడగు సిద్ధేంద్ర యోగి విరచితము. పారిజాతాపహరణ కథ ఇందు పసందుగా కూర్చబడినది. ఇందులో నాయిక సత్యభామ గనుక భామకలాపమని పేరు వచ్చినది. ఇందులో సత్యభామ యొక్క విరహం ప్రధానం. ఈ భామ కలాపములో సత్యభామ వేషము ఒకటే ఉండును. ప్రక్కనున్న వంతపాడు బ్రాహ్మణుడు సమయానుకూలముగా చెలికత్తె మొదలగు సందర్భోచిత పాత్ర వహించును.

గొల్లకలాపము: కూచిపూడివారిలో ఒకరగు భాగవతుల రామయ్యగారిచే ఇది రచింపబడినది. దీనిలో గొల్లభామ, బ్రాహ్మణుడు రెండే పాత్రలు. నాయిక గొల్లభామ వేషము వేసుకొనును. బ్రాహ్మణుడు బ్రాహ్మణుడే గదా! వానికి వేరు వేషము ఏల? భామ వేషధారి "చల్లోయమ్మ గొల్లచల్ల" యనుచు చల్లకుండ లేకపోయినా ఉన్నట్లు అభినయించుచు అమ్మకమునకు తిరుగును.

బ్రాహ్మణుడు చల్లకొనుటకు పిలిచి మేము వేదవేదాంగములను చదువుకొన్న బ్రాహ్మణులము. మీ చల్ల మాకు పనికిరాదని అనును. అప్పుడా పడుచు బ్రాహ్మణుడన ఎవరు? ఎట్టి కర్మ లాచరింపవలెను? మొదలగు ప్రశ్నలు వేసి చమత్కారముగా వర్ణాచారములను, బ్రహ్మజ్ఞాన తత్వమును వివరించి గొల్లలు బ్రాహ్మణుల కన్న గొప్పయని నిరూపించును. బ్రాహ్మణుడుకూడా ప్రతిపదము చమత్కారము ఉట్టిపడునట్లు మాట్లాడుచు తన గొప్పదనమును గుర్తింపజేయును. పిండోత్పత్తి మొదలు మరణమువరకు గల ఆధ్యాత్మిక విషయములన్నియు ఇందు అద్భుతముగ కలవు.

గీత గోవిందము: దీనినే అష్టపదులందురు. జయదేవ మహాకవి రాధాకృష్ణుల ప్రణయగాథ అభినయమునకు అనుకూలముగా అద్భుతముగా రచించెను. ఇవి భారతదేశమంతటా ప్రచారములోనున్నవి. కూచిపూడివారు వీటిని బాగుగా అభినయించగలరు.

కృష్ణకర్ణామృతము: లీలాశుక యోగిచే శ్రీకృష్ణుని బాలక్రీడలు బహురమ్యముగా చిత్రింపబడిన సంస్కృత గ్రంథరాజము. దీనిని వీరు చక్కగా ఆడి పాడి ఆనందింపచేయగలరు.

లీలాశుకుడు ఈ కర్ణామృతమును కడుహృద్యముగను, సులభ సుందరముగను రచించెను. ఈ కర్ణామృతము నిజముగా అమృతము, సర్వజన సులభము.

క్షేత్రయ్య పదములు : మొవ్వ గోపాలస్వామి పరంగా గోపికల ప్రణయము కథావస్తువుగా తీసుకొని తేటతెలుగు మాటలతో క్షేత్రయ్య మహాకవి రచించెను. స్త్రీ స్వభావమునందలి వైవిధ్యం, అందచందాలు, అతిసుకుమారంగా ఏర్చి కూర్చాడు. తెలుగువారి జయదేవ కవియని ఖ్యాతిగాంచాడు.

ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు : వీటి సంగతి సర్వజన విదితము. వేరే వివరించనక్కరలేదు.

నాటకములాడువారు :-

నాటకములను అనగా యక్షగానములను ఆడుటకు ఆరంభించినది చింతా వెంట్రామయ్యగారు. ఈయన భరతశాస్త్రం బాగుగా నేర్చుకొని తన మేళముతో దక్షిణ దేశమునకు వెళ్లగా అక్కడ యక్షగానములను సందర్శించే అవకాశం కలిగింది. ఆ మహామహుడు స్వస్థలం చేరినపిమ్మట అనగా యిప్పటికి 80 సంవత్సరముల క్రితం ఇక్కడ వారిచే యక్షగానములను వ్రాయించి భాగవతులను చేరదీసి, ఎవరు ఏ ఏ పాత్రలకు అర్హులో నిశ్చయించి, వారికి శిక్షణ యిచ్చి, ఆ జట్టుతో ఆంధ్రదేశమంతటా సంచారం చేస్తూ నాటకములాడెడివారు. ప్రహ్లాద, ఉషాపరిణయము,

హరిశ్చంద్ర, రామనాటకం, గయోపాఖ్యానం, రుక్మిణీ కల్యాణం, రుక్మాంగద, రామ రావణ యుద్ధం, శశిరేఖా పరిణయము మొదలగు నాటకములాడెడివారు. ఆయన స్వీయ ప్రతిభావిశేషముచే సంస్థానాల్లోనూ, పల్లెల్లోనూ, నాటకాలకు వర్షాశనాలు కల్పించారు. ఈనాటివారంతా ఆయన శిష్యప్రశిష్యులే. క్షేత్రయ్య పదాలకుకూడా అభినయం కూర్చి, అధిక ప్రచారములోకి తెచ్చింది ఆ మహానుభావుడే. కూచిపూడి నాట్యకళా పితామహుడని ఆయన ప్రఖ్యాతి గాంచాడు.

ఈ నాటకములాడువారికికూడా పైన పేర్కొనిన భాగవతులచే అభినయింపబడుచున్న వన్నీకాకపోయినా కొన్నియైనా వచ్చును. అందుచేతనే వీరు సంచారమునకు వెళ్లినప్పుడు పగటిపూట కాలక్షేపమునకు వేషములు లేకుండా అష్టపదులు, కృష్ణకర్ణామృతము, తరంగములు, పాడి అభినయింతురు.

డ్రామాలు వచ్చినతర్వాత ఈ యక్షగానాలు మోటుగా భావింపబడి ఆదరాభిమానములు తగ్గుటచే కంపెనీ తెరలు, వేషాలు, కొంతవరకు డ్రామా ఫక్కీని నాటకాలు, జనాభిరుచి ననుసరించి, వేదాంతం రామకృష్ణయ్యగారు ఆడుటకు అరంభించిరి. ఆయన మైలవరం సమాజంలో మంచి పేరుగన్న నటుడు.

అభినయదేశికులు :

మన దేవాలయాలు ఒకనాడు దేవాలయములుగానే గాక, సమస్త విద్యలకు, లలిత కళలకు ఆటపట్టై ఉండెడివి. మన శిల్పము, చిత్రలేఖనము, దానిని ఆశ్రయించుకొని అభివృద్ధిగాంచినవి. మన సంగీత నాట్యాలు తద్వారా వృద్ధిగాంచినవి. త్రికాల సంధ్యలందు భగవత్సాన్నిధ్యమున నృత్యగీతాలను అభినయించి జాగరణ చేయుట దేవదాసీల కర్తవ్యము. ఈ దైవకార్యమునకుగాను, వారు ఈనాములను అనుభవించుచుండిరి. ఈనాటివారివలె వారు భోగవనితలు గారు. సమస్త విద్యలు నేర్చిన కళావంతులు. అందుచేతనే వారికి కళావంతులని పేరు ప్రసిద్ధమైనది. ఆ కళాబీజములను ఆంధ్రదేశమంతా వెదజల్లినవారు మన కూచిపూడి కులపతులే.

ఈ నాట్యాచార్యులు దేవదాసీ కన్యలకు బాల్యములోనే అభినయం నేర్పెడివారు. వారు వీరికి భామాకలాపము, గొల్లకలాపము, క్షేత్రయ్య పదములు, దశావతార వర్ణన, తరంగములు, జావళీలు మొదలగునవి నేర్పెడివారు.

వీరు సానిమేళముల వెంటకూడా అరిగెడివారు. ఈ మేళములో నాయకురాలొక్కతే అన్ని విద్యలలోను ఆరితేరినదై యుండెడిది. మిగతా అంగనలు అలంకారముతో నిలబడి, పట్టు సమయములను తప్ప, పల్లవి పాడుతూ తాళములను వేసెడివారు.

గురువు, ముందుచరణము అందించగా నాయిక అంతట పాట ఆరంభించెడిది. ఆ బ్రాహ్మణుడు ఆమెవెంట తాళము వేయుచు అంగు చేసెడివాడు. ఆ నాయిక అలసినప్పుడు ఈయన ముందుకువచ్చి నృత్యముచేసి హాస్యము చెప్పెడివాడు. ఈ హాస్యము పండిత పామర రంజకముగా ఉండెడిది.

భామకలాపములో నాయిక భామ అయితే గురువు అన్నిటాతానూ అభినయించెడివాడు. అలాగే గొల్లకలాపములో నాయిక గొల్లభామ, గురువు బ్రాహ్మణుడు. వీరుభయులు సంవాదము కడు వినోదకముగా నుండెడిది.

వీరేశలింగం మొదలగు సంస్కర్తలయొక్క ప్రభావముచే సానులు సంసారులైరి. కళలు వీరిని వీడినవి.

పగటి వేషకులు :

నాటకము లాడువారివలెనే వీరు శిక్షణ పొంది, తమ బృందముతో దేశమంతటా సంచారము చేసెడివారు.

ఒక్కొక్క వృత్తి, ఒక వంశానుగతం, కొందరు నాట్యకళను, పగటివేషములను గురుముఖమున నేర్చినవారే.

నాటకము లాడువారు తమకన్న పగటివేషములువారు తక్కువ అందురు. పగటి వేషకులు రాత్రివేషములు వేయువారి కెందునా మేము తీసిపోమందురు.

ఇతరులను అనుకరించి, వేషమువేసి మెప్పించుట తేలికైన పనికాదు. దానికి తగిన వస్త్రధారణ, వేషము, పాత్రోచిత సంభాషణ, మొదలగు సాధన సంపత్తి కావాలి. వీరు సుమారు 33 వేషములు వేయుదురు. సాధారణముగా ఒక్కొక్క గ్రామమున వారం రోజులుండుట ఆచారము. ప్రతిదినము ఉదయమున ఒక వేషము, సాయంకాలమున మరియొక వేషము వేయుట సంప్రదాయము.

వేషములు ముగిసెననుటకు అఖరున అర్ధనారీశ్వర వేషము వేయుదురు. యాచనకు బయలుదేరునప్పుడు శారద వేషము వేయుదురు.

వీరి వేషములు అత్యంత సహజముగ నుండును. సంభాషణలు కడుపుబ్బనవ్వు పుట్టించును. అందులో ముఖ్యమైనవి పేర్కొందురు.

బుడబుక్కలవేషం, కాశీ కావిళ్లవేషం, లింగబలిజవేషం, జంగము వేషము, సోమయాజి సోమిదేవి వేషం, బైరాగి బాలక వేషం, పఠాన్ వేషం, ఫకీరు వేషం, వైష్ణవస్వాముల వేషం.

వీరికిని తదితర పగటివేషకులకున్న భేదమేమిటంటే ఇతరులు వేషధారులుగాను, వీరు సహజముగాను కన్పింతురు.

వీరిట్లు సంవత్సరమునకు ఆరు మాసములు సంచారము చేసెడివారు.

భాగవతులు, నాటకము లాడెడివారుకూడా ఇంతే. ఆ ఆరు మాసములలో ఆ గ్రామములో ఒకపురుషుడుండెడివాడు కాదు. అందుచేతనే "కూచిపూడి దొంగతనానికి కర్రాచెప్పులు కావలెనా" అను సామెత పుట్టినది.

కూచిపూడివారిలో కురువృద్ధులైనవారు నలుగురు నాలుగు విద్యలందు ప్రఖ్యాతులైరి.

వెంపటి వెంకటనారాయణగారు భామకలాపములో బాగు బాగు యనిపించుకొన్న మహాభాగుడు.

చింతా వెంకట్రామయ్యగారు యక్షగానములలో అక్షయ యశస్సును సంపాదించిన నాటకపితామహుడు.

పసుమర్తి వెంకటశేషయ్యగారు పగటి వేషకులలో ప్రఖ్యాతి గాంచారు.

వేదాంతం లక్ష్మీనారాయణగారు భరతనాట్యాచార్యులుగా బహుఖ్యాతిగాంచి సన్మానము పొందినారు.

వేదాంతం జగన్నాథశర్మ, వేదాంతం రాఘవయ్య, వెంపటి సత్యనారాయణ, పసుమర్తి కృష్ణమూర్తి, లక్ష్మీకాంతం, పార్వతీశం మున్నగువారు ఈ తరములో ప్రసిద్ధులు.

మన సినిమా ప్రపంచములో అభివృద్ధికరములైన అనేక మార్పులు తెచ్చిన సుప్రసిద్ధ దర్శకులైన గూడవల్లి రామబ్రహ్మంగారు కొన ఊపిరితో ఉన్న ఈ కళను వెండితెరపై ఎక్కించి, దానియందు అభిరుచి, అభిమానం, యించుక కల్గించి విఖ్యాతుడాయెను. అందుచేతనే ఈనాడు శ్రీ వేదాంతం రాఘవయ్య, శ్రీ వెంపటి సత్యం, శ్రీ పసుమర్తి కృష్ణమూర్తి చలన చిత్రములలో నాట్యాచార్యులుగా ఖ్యాతిగాంచుచున్నారు.

మన ప్రాచీన కళలనేకం నేటి వాతావరణమును తట్టుకొనలేక శిథిలమగుచున్నట్లే నాటకాలు, సినిమాలు వచ్చిన తర్వాత కూచిపూడి నాట్యకళా ప్రాముఖ్యము విస్మరింపబడినది. పూర్వము ఆదరించిన జమీందారులు నేడు అంతరించారు. ప్రజలు అభిరుచి మారుటచే ఆదరించెడివారు, అభిమానించెడివారు నేడు అరుదైనారు. ఈ తరముతో ఈ విద్య విలుప్తమగునేమోయని శంక కలుగకమానదు.

ఇంతవరకు ఏదోవిధముగా ఈ నాట్యకళను పోషించుకుంటూ వచ్చారు మన కూచిపూడివారు. కాని నేటి కాలానుగుణ్యంగా ఈ కళను మార్చి తీసుకొనిరాగల ప్రతిభావంతుడు ఆ గడ్డపైగాని, ఆంధ్రదేశమందుగాని పుట్టలేదు. తాండవకృష్ణగారు కొన్ని ప్రదర్శనములు యిచ్చి వీనికై ప్రచారముచేయుట ప్రశంసనీయమేగాని, కాలానుగుణ్యమైన మార్పులు తేగల తాహతు ఇంకా కన్పించలేదు.

కథకళి నృత్యం కేవలం కేరళులది. ఇది సంస్కృత శబ్దమగు కథాకేళికి వికృతం. కథాకేళియనగా కథను అభినయ పూర్వకముగా ప్రదర్శించుట. ఇది కేవలం ముఖాభినయం.

ఇందులోని వికృత వేషధారణను మార్చి ఆకర్షణీయమైన ఆహార్యాన్ని ప్రవేశపెట్టి సక్రమమైన శిక్షణ పద్ధతులను తెచ్చి, ఈ పురాతన కళకు నవ్యత్వమును తెచ్చిన నాట్యాచార్యుడు గోపీనాథ్.

ఆయన నటకుడుగా, నాట్యాచార్యుడుగా అఖండ యశస్సు అందుకొన్నాడు. వివిధ ప్రదేశాలలో విద్యాలయాలు పెట్టి శిక్షణ యిచ్చుటేగాక, మద్రాసులో నట నికేతనము నెలకొల్పి బాల బాలికలకు శిక్షణ యిచ్చుచున్నాడు.

మన కూచిపూడి నాట్యం, దానికంటే ఎన్నోరెట్లు మెరుగు. అది మూకీయైతే ఇది టాకీ.

నాటక కళ, సంగీతం, నృత్యం, కలసిన కొత్తకళ ఒకటి సృష్టించాలని విశ్వకవి రవీంద్రుడు అంటూ ఉండేవాడు. ఆ త్రివేణీ సంగమమే మన కూచిపూడి భాగవతము. ఇది వరకే ఆంధ్రులు దానిలో అందెవేసిన చెయ్యి అనే సంగతి ఉత్తరాదివారికిగాని, రవీంద్రునకు గాని తెలియనే తెలియదు. ఆంధ్రేతర ప్రాంతములలో దీనికి ప్రచారము చేసినవారు లేకపోవుటే కారణము.

ఇట్టి మహోత్కృష్టమైన కళ కనుమరుగుకాకుండా ఆంధ్రదేశములోని కళాభిమానులు ఆలోచించి సజీవముగా ఉండుటకు అనువగు ఆలోచనలుచేసి ఒక నాట్యకళా క్షేత్రమును నెలకొల్పుదురుగాక.

(కిన్నెర, మార్చి 1954)

మహిమున్ వాగనుశాసనుండు సృజియింపం గుండలీంద్రుండు త
న్మహనీయ స్థితి మూలమై నిలువ శ్రీనాథుండు ప్రోవన్ మహా
మహులై సోముడు భాస్కరుండు వెలయింపన్ సొంపు వాటిల్లు నీ
బహుళాంధ్రోక్తి మయ ప్రపంచమున దత్ప్రాగల్భ్య మూహించెదన్

– రామరాజ భూషణకవి

కె.వి. గోపాలస్వామి

బొమ్మలాటలు

నేటికీ బారత దేశంలో నిలిచివున్న అత్యంత ప్రాచీనమైన కళారూపం బొమ్మలాట. ఈ కళ మిక్కిలి ప్రాచీనమైనదని, దాని జన్మస్థానం ప్రాచ్య ఖండమేనని అందరూ అంగీకరిస్తున్నారు. చైనాదేశంలో హాన్‌వంశపు రాజుల కాలం నాడు ఛాయా నాటకకళ వుండేదని ఒక గాథ చెబుతున్నది. లభిస్తున్న ప్రాచీన జపాను సాహిత్యంలో ఆట బొమ్మల ప్రస్తావన వున్నది. కాని క్రీస్తు పూర్వం 3వ శతాబ్దం నాటికే తెలుగ దేశంలో తోలుబొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు నిరూపించేందుకు తగిన ఆధారాలున్నాయి. విశిష్టమైన ఈ కళారూపాన్ని శాతవాహనులు, పల్లవులు, చాళుక్యులు, కాకతీయులు పోషించి పెంపొందించారు. విజయ నగర చక్రవర్తులు, తంజావూరు ప్రభువుల ఆదరణలో ఇది అత్యున్నత స్థితినందుకున్నది.

ఆంధ్రదేశంలో కళింగపట్నం, భీమునిపట్నం, కోరగి, మచిలీపట్నం, వాడ్రేవు, కొత్తపట్నం ప్రాచీనమైన ఓడరేవులు. ఈ రేవుల నుండి పెక్కుమంది భారతీయులు విదేశాలకు వలస వెళ్లారు. వారి ద్వారా బొమ్మలాట ఆగ్నేయాసియా దేశాలలో స్థానం కల్పించుకున్నది. అక్కడ బొమ్మలాటకు మంచి ఆదరణ లభించింది. ఉత్సవ సమయాలలో ఈ ప్రదర్శనలు జరిగేవి. తోలుబొమ్మలాట పర్షియా, టర్కీ దేశాల మీదుగా గ్రీసు చేరుకుంది. ఈ కళ గ్రీసుదేశంలో కొంత మార్పు చెంది ఉత్తరాఫ్రికాలోని ముస్లిం దేశాలకు ప్రాకింది. 17వ శతాబ్దిలో ఇటలీకి, విప్లవానికి పూర్వం ఫ్రాన్సులో వెర్సయిల్సుకు, పారిస్‌లోని పాలెరాయల్‌కు వ్యాపించింది.

వివిధ దేవాలయాలందు బొమ్మలాటలు వేర్వేరు కాలాలలో విభిన్నమైన రూపాలు ధరించాయి. బొమ్మలాటలు ఆడించే పద్ధతులలో వైవిధ్యం కానవస్తుంది. అయితే వీటన్నింటిలో సామాన్య లక్షణం ఒకటున్నది. ఏరకం బొమ్మకయినా శరీరభాగాలు అతికి వుంటాయి. వేర్వేరు పద్ధతులు ద్వారా బొమ్మల శరీర భాగాలు కదిలేటట్లు చేస్తారు. ఈ బొమ్మల చేత మనుష్యులను, జంతువులను అనుకరింపచేస్తూ వినోదం కలిగిస్తారు. ప్రతి ఆట బొమ్మకు ప్రత్యేకమైన అస్తిత్వం ఉంటుంది. అందుచేత వాటి మధ్య ఒక విధమైన ఘర్షణ ఏర్పడుతుంది. ఈ ఘర్షణను తొలగించేటప్పుడు ప్రేక్షకులకు చక్కటి వినోదం సమకూరుతుంది.

తెలుగుదేశంలో కొయ్యతోనూ, తోలుతోను, చేసిన ఆటబొమ్మలు ఉపయోగిస్తారు. కొయ్యతో చేసిన బొమ్మల ప్రదర్శనను ఆయా ప్రాంతాలలో "కొయ్యబొమ్మలాట", "కట్టెబొమ్మలాట" అని వ్యవహరిస్తారు. ఇటీవల ఆట బొమ్మలు తయారు చేయడానికి గుడ్డ ముక్కలు, ప్లాస్టర్లు, ప్లాస్టర్ వుడ్, కాగితపు గుజ్జు

కూడ ఉపయోగిస్తున్నారు. ప్రయోగాత్మకంగా బొమ్మల తయారీలో రబ్బరు, మిశ్రమ లోహాలు సయితం వాడుతున్నారు. ముఖ్యంగా త్రిపరిమాణపు బొమ్మలు చేయడానికి ఇవి ఉపయోగిస్తారు. తోలుబొమ్మలాట అనేది ఛాయా ప్రదర్శన. ఇందులో ఉపయోగించే బొమ్మలను పారదర్శకమైన తోలుతో తయారు చేస్తారు. కొన్ని యితర దేశాలలో ఛాయా ప్రదర్శనకు అట్టబొమ్మలు, రేకు బొమ్మలు ఉపయోగిస్తున్నారు. ఆంధ్రదేశంలో మాత్రం ధర్మంతో చేసిన బొమ్మలు మాత్రమే ఉపయోగిస్తున్నారు.

తొడుగు బొమ్మలు

మన దేశంలో చేతి బొమ్మలు (వీటిని తొడుగు బొమ్మలని కూడ అంటారు.) చాలా అరుదు. ఆంధ్ర ప్రాంతంలోనూ, ఒరిస్సా రాష్ట్రంలోనూ వూరారా తిరిగి బిచ్చం ఎత్తుకునే వాళ్లు ఈ బొమ్మలను ఆడిస్తారు. వీరి ప్రదర్శనలో రెండు బొమ్మలు మాత్రమే వుంటాయి. ఒక్కొక్క చేతికి ఒక్కొక్క బొమ్మను తొడుగుకుని ఆడిస్తారు. ఆ రెండు బొమ్మల మధ్య సంభాషణ నడిపిస్తారు. ఒక్కొక్కప్పుడు సంభాషణ కొంత ఆసభ్యంగా కూడా వుండటం కద్దు. ఈ బొమ్మలకు తల, మెడభాగం ఏకాండంగా వుంటాయి. మెడవరకు రంధ్రం వుంటుంది. రంధ్రం గుండా చూపుడు వ్రేలు పోనిచ్చి బొమ్మను ఆడిస్తారు. బొమ్మ తాలూకు చేతులు కొయ్యతోనే చేస్తారు. బొమ్మను ఆడించే సూత్రధారుడు తన బొటన వ్రేలు వాటిలోనికి పోనిచ్చేందుకు వీలుంటుంది. బొమ్మ తాలూకు మెడభాగానికి దిగువగా వుండే చెక్కగుండా సన్నని త్రాళ్లు పోనిచ్చి క్రిందవుండే సంచికలోకి తెస్తారు. ఈ త్రాళ్లు ఒక చివర బొమ్మ చేతులకు తగిలించి రెండవ చివర సూత్రదారుడు తన రెండు చివరి వ్రేళ్లతో సంచిలో పట్టుకుని బొమ్మను ఆడిస్తాడు. ఈ బొమ్మలలో కొన్నింటికి కావలసిన తీరుగా ముఖం, చేతులు చెక్కి రంగులు వేస్తారు. కొన్నింటికి విగ్గు, ముఖానికి కవచం వాడతారు. మెడదిగువ నుంచి దుస్తులు వేస్తారు. ఈ బొమ్మలను చేతి మేజోడు తొడుక్కున్నట్లుగా వ్రేళ్లకు తగిలించుకొని ఆడిస్తారు. బొమ్మ తాలూకు తల, చేతులు సూత్రధారుడు తన వ్రేళ్ళ సహాయంతో కదిలేటట్లు చేసి ఆడిస్తాడు. బొమ్మను ఆడించేటప్పుడు సూత్రధారుడు తన ముంజేతిని ఎప్పుడూ నిటారుగానే వుంచుతాడు. కాబట్టి బొమ్మ నిలబడినట్లు వుంటుంది.

ఒక్కొక్కప్పుడు ఒకవిధమైన రంగస్థలం లాంటిది ఏర్పాటు చేసి చేతిబొమ్మలను చట్రంతో ప్రదర్శిస్తారు. దీనికి మూడువైపుల తెర లుంటాయి. ముందు వైపు పైకీ క్రిందికి కదిలే చిన్న తెరవుంటుంది. ఈ రంగస్థలం కొంత ఎత్తుగానే వుంటుంది. దీనికి క్రింద నేల అంటూ వుండదు. సీనరీ కూడ వుండదు. బొమ్మలను క్రింద నుంచి ఆడిస్తారు. బొమ్మల ముఖాలపైకి మాత్రమే వెలుతురు పడేటట్లు చేస్తారు.

త్రాళ్ల బొమ్మలు : త్రాళ్లతో (సూత్రంతో) ఆడించే వాటిని త్రాళ్ల బొమ్మలంటారు. 'సూత్రధారుడు' అంటే సూత్రం ధరించిన వాడని అర్థం. ప్రాచీన సంస్కృత నాటకాలలో ముఖ్యనటునికి ఈ పదం వర్తింపచేసేవారు. సూత్రధారుడు నాటక దర్శకత్వాన్ని కూడా నిర్వహించేవాడు. ఆ కాలంలో మంచి ప్రచారంలో వున్న త్రాళ్ల (సూత్రం) బొమ్మలాట నుంచి 'సూత్రధారుడు' అనే మాట వచ్చి వుంటుంది.

త్రాళ్ల సహాయంతో ఆడించే బొమ్మలను కొయ్యతోనూ ఇతర పదార్థాలతోనూ చేస్తారు. వాటి ప్రదర్శనను 'బొమ్మలాట' అని వ్యవహరిస్తారు. బొమ్మలను కొయ్యతో చేసినట్లయితే బొమ్మను ఆడించడానికి వీలుగా బొమ్మ తలకు రెండు ప్రక్కలలోనూ, మెడ క్రిందనూ చిన్న రంధ్రాలు చేసి త్రాళ్లు అమరుస్తారు. బొమ్మను మెత్తటి పదార్థంతో చేసినప్పుడు ఒక చెవిలోనుంచి మరో చెవిలోనికి తీగ దూరుస్తారు. రెండు చివరలలోనూ కొక్కీలు వుంటాయి. మెడగుండా మరొక తీగను దూర్చి దానిని ఒక చివర మొదటి తీగకు చుడతారు. రెండవ చివర కొక్కెం వుంటుంది. బొమ్మ తాలూకు మొండెం ఏకాండంగానే వుంటుంది. అయితే బొమ్మ భుజాలు, పిరుదులు విడివిడి భాగాలుగా వుంటాయి. వీటికి మధ్య ఒక్కొక్కప్పుడు గుడ్డముక్కలు పెట్టి తయారు చేయడం కద్దు. ఈ బొమ్మలకు సాధారణంగా కాళ్లుగాని పాదాలుగాని అమర్చరు. బొమ్మలు చేసేందుకు ఏ వస్తువు వాడినప్పటికీ వాటి కీళ్లు కదలించడానికి వీలుగా వుంటాయి. బొమ్మ జుట్టు, ముఖం, చేతులకు రంగులు వేస్తారు. ఈ రంగులు వేసే పని శిక్షణ పొందిన కళాకారులు చేస్తారు. ఈ పని ఉప వృత్తిగా వీరికి తరతరాలుగా వస్తూ వుంటుంది. బొమ్మ తాలూకు తల నుండి ఒక త్రాడు లేక తీగ, చేతుల నుండి రెండూ త్రిభుజాకారం వుండే ఒక చట్రానికి కట్టి బొమ్మను ఆడిస్తారు. బొమ్మలను బాగా ఆడించేందుకు నేర్పరితనం, అందులో సాధన అవసరం.

ఈ త్రాళ్ల బొమ్మలకు వుపయోగించే రంగస్థలం చేతి బొమ్మలకు ఉపయోగించే దానికి కొంత భిన్నంగా వుంటుంది. బొమ్మలు ఆడించేవారు బొమ్మలకు వెనుకగా నిలబడతారు. బొమ్మల రంగస్థలం కంటే వీరు నిలబడేచోటు ఎత్తుగా వుంటుంది. రంగస్థలం ఇరువైపులా ఖాళీగానే వుంచుతారు. ఇలా వుంచడం మూలంగా బొమ్మలు, సూత్రాలు, సూత్రధారుడు అటుయిటు కదలేందుకు వీలుంటుంది. కాగడాల రంగస్థలానికి తగిన కాంతి నిస్తాయి. ఈ కాగడాలను అగ్ని ప్రమాదం జరగకుండా రంగస్థలానికి కొంతదూరంలో వుంచుతారు.

ఊచబొమ్మలు : ఊచల సహాయంతో ఆడించే బొమ్మలు గాబట్టి వీటిని 'ఊచబొమ్మలని' వ్యవహరిస్తున్నారు. ఈ రకం బొమ్మలాట పద్ధతి ఎక్కువగా బెంగాలులో ప్రచారం వున్నది. ఆంధ్ర దేశంలో కూడ ఈ ఊచబొమ్మలాట కొన్ని తావులలో కానవస్తుంది. కాన యీ పద్ధతి అంతగా ప్రచారం పొందలేదు. ఇది ఇక్కడ రూపొందినట్టిదికూడ కాదు.

చేతి బొమ్మలు చేయడానికి వుపయోగించే వస్తువులే ఊచబొమ్మలకు కూడ ఉపయోగిస్తారు. ఊచబొమ్మకు మెడవరకు రంధ్రం చేసి తల తయారు చేస్తారు. సన్నని ఊచ ఈ రంధ్రంలో అమర్చి క్రిందికి పోనిస్తారు. ఈ ఊచ బొమ్మను పట్టుకుని ఆడించేందుకు ఉపకరిస్తుంది. బొమ్మతాలూకు మొండెం, కొయ్య భుజాలు ఊచకు అమరుస్తారు. త్రాళ్ల బొమ్మకు మాదిరి చేతులు అమరుస్తారు. వీటి అరచేతులకు క్రింది నుంచి ఆడించడానికి తోడ్పడేందుకు సూత్రాలు కడతారు. ఊచ బొమ్మలకు కూడ కాళ్లూ, పాదాలు వుండవు. ఈ బొమ్మల నిర్మాణం అంత

సులభమైనది కాదు. ఊచ బొమ్మ తల గుల్లగా వుంటుంది. మెడ, భుజాలు ఏకాండంగా వుంటాయి. ఒక్కొక్కప్పుడు ఊచకు బదులు సన్నని గొట్టం ఉపయోగిస్తారు. తలకు అమర్చిన సూత్రాలు క్రిందకు వ్రేలాడుతూ వుంటాయి. ఈ సూత్రాలను లాగుతూ సూత్రధారుడు బొమ్మ తలను ఆడిస్తాడు. ఈ ఊచ బొమ్మల కదలికలు హుందాగా వుంటాయి. అయితే వీటి కదలికలు త్రాళ్ల బొమ్మలు, చేతి బొమ్మల కదలికల కంటె నెమ్మదిగా వుంటాయి.

ఊచ బొమ్మలకు వాడే రంగస్థలం చేతి బొమ్మల రంగ స్థలం మాదిరే ఏర్పాటు చేస్తారు. అయితే ఊచ బొమ్మల రంగ స్థలం క్రింది బాగంలో చెక్కలు ఏర్పాటు చేస్తారు. ఈ చెక్కలకు అక్కడక్కడా చిల్లులు పొడిచి వుంటాయి. బొమ్మలున్న ఊచలను ఈ చిల్లుల్లో గ్రుచ్చడానికి వీలుంటుంది. కొన్ని ఊచ బొమ్మలకు ఊచ చివర ఒక అంగుళం దూరంగా వుండేటట్లు రెండు గుండ్రటి బిళ్లలు అమరుస్తారు. బొమ్మను ఆడించినప్పుడు నిలబెట్టడానికి ఈ బిళ్లలు తోడ్పడతాయి. చేతి బొమ్మలకు ఏర్పాటు చేసే విధంగానే ఊచ బొమ్మలకు వెలుగు సమకూరుస్తారు.

తోలుబొమ్మలు :– తోలు బొమ్మలాటను సంస్కృతంలో 'ఛాయానాటకం' అని అంటారు. బొమ్మలను తోలుతో చేస్తారు. కాబట్టి 'తోలుబొమ్మలు' అనే పేరు వచ్చింది.

తోలు బొమ్మలను ఊచ బొమ్మలు మాదిరే క్రింది నుండి ఆడిస్తారు. వీటి ప్రదర్శనకు తెర ఉపయోగిస్తారు. గుడ్డ తెరను గట్టిగా బిగించి కడతారు. కాంతిని వెనుక వైపునుంచి ప్రసరింప చేసినప్పుడు ఇది పారదర్శకమైన తెరగా వుపయోగ పడుతుంది. బొమ్మలను తగిన ఆకారంలో చర్మం కత్తిరించి చేస్తారు. బొమ్మలను సన్నని బద్దలకు తగిలించి తెర వెనుక నుండి ఆడిస్తారు. బొమ్మ తాలూకు కదిలే శరీర భాగాలు విడి విడిగా చేసి అమరుస్తారు. కాళ్లూ, చేతులూ వంటి కదిలే భాగాలను సన్నని దారాల సమాయంతో బొమ్మ చేస్తారు. వెనుక నుంచి కాంతి పడటం చేత బొమ్మలు స్పష్టంగా కనుపిస్తాయి.

ఈ బొమ్మలకు ఆయా దేశాలలో వేర్వేరు చర్మాలు వుపయోగిస్తారు. ఆంధ్ర దేశంలో ఆయా పాత్రలను బట్టి బొమ్మలను లేడి చర్మంతోనో, మేక చర్మంతోనో చేస్తారు. ఇతర దేశాలలో వేర్వేరు జంతువుల చర్మాలు కూడ వాడుక చేస్తారు. ఆగ్నేయాసియా దస్త్రశాలలో గేదె, దున్న చర్మం, చైనాలో గాడిద చర్మం, టర్కీలో ఒంటె చర్మం ఉపయోగిస్తారు. ఆధునిక ఛాయా నాటకాలలో బొమ్మలు చేసేందుకు చర్మం బదులు అట్ట, రేకు కూడా వాడుక చేస్తున్నారు.

తోలు బొమ్మలాట ప్రక్రియ ఆంధ్రదేశంలో రెండు వేల సంవత్సరాలపై నుంచి ప్రచారంలో వున్నది. అంతేకాదు క్రీస్తు పూర్వం 3వ శతాబ్దంలో ఈ కళ ఆంధ్రదేశంలో ఉద్భవించినట్లు చెబుతున్నారు. ప్రఖ్యాత భారతీయ కళాకారుడు శ్రీ ఉదయ శంకర్ ఈ కళకు క్రొత్త రూపురేఖలు దిద్ది మరింత ప్రచారంలోకి తెచ్చాడు. ఈ కళను గురించి కొంత విపులంగా తెలుసుకోవటం అవసరం.

ఆంధ్ర దేశంలో భామా నాటక ప్రదర్శనకు వాడుక చేస్తున్న చిత్రాలను కేవలం 'తోలుబొమ్మలు' అంటే సరిపోదు. ఈ బొమ్మలు రంగులతో కూడిన పారదర్శక చిత్రాలు. వీటిని చర్మంతో తయారు చేస్తారు. చర్మాలను శుభ్రపరచి లేత పసుపు రంగు వచ్చేటట్లు, పార దర్శకమయ్యేటట్లు సాగదీస్తారు. చేతులూ, కాళ్లూ మొదలైన భాగాలు కదల్చడానికి వీలుగా వుండేటట్లు చర్మం కత్తిరించి బొమ్మ తయారు చేస్తారు. వీటి కూర్పు ఇతర దేశాలలో ఛాయా చిత్రాల కూర్పు మాదిరీ జరుగుతుంది. చర్మం కత్తిరింపు ద్వారాను, చిల్లులు పొడవడం ద్వారాను ఆయా పాత్రలు, వాటి దుస్తులు ఆభరణాది అలంకరణ రూపొందేటట్లు చేస్తారు. ఈ విధంగా చేసిన పిమ్మట బొమ్మలకు రంగులు వేస్తారు. అవి ముదురుగానే వుంటాయి. వాటిలో నలుపు, ఎరుపు, ఆకుపచ్చ ముఖ్యమైనవి. ఈ రంగుల సమ్మేళనం ద్వారా లేత ఎరుపు, నీలి ఆకుపచ్చ మొదలైన రంగులు వస్తాయి. చర్మానికి వున్న లేత పసుపు రంగు ముఖ లక్షణాలు, దుస్తులు చూపడానికి పనికి వస్తుంది.

జావా ద్వీపంలో ప్రచారంలో వున్న 'వాయాంగ్ సర్వో' ప్రదర్శనకు వాడే బొమ్మలు ఎంతో అలంకార భూషితమై వుంటాయి. ఆంధ్ర దేశంలోని బొమ్మల కత్తిరింపు, వర్ణ లేపనం అంతటి అలంకారయుతంగా లేక పోవచ్చు. అయినప్పటికీ ఆగ్నేయాసియాలోని ఇప్పుడు అనుసరిస్తున్న కత్తిరింపులకు, రంగులు వేసే పద్ధతికి ఆంధ్రదేశము మూలమని అందరూ అంగీకరిస్తున్నారు. తోలు బొమ్మలకు కళ్లు, ముక్కు, నోరు చివర తీర్చి దిద్దుతారు. దీనిని బట్టి ఆచార బద్ధమై రీతిలో బొమ్మకు ప్రాణ ప్రతిష్ట చేసేందుకు ఈ సంప్రదాయం ఏర్పడినట్లు విదితమవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో తోలు బొమ్మలు తయారు చేసేందుకు వాడే చర్మం, బొమ్మల పరిమాణం ఆయా ప్రాంతాలలో వేర్వేరుగా వుంటుంది. తెలంగాణా ప్రాంతంలో పాత్రలన్నీ 4 అడుగుల ఎత్తు గలవిగా ఉంటాయి. కాగా సర్కారు జిల్లాలలో ఈ పాత్రల ఎత్తు ఒకే రీతిగా వుండదు. కొన్ని పాత్రలు 6 అడుగుల కంటే పైగా ఎత్తు వుంటాయి. తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలందు దేవతా పాత్రలకు, రాజ పాత్రలకు లేడి చర్మం, మిగిలిన పాత్రలకు మేక చర్మం వుపయోగిస్తారు. కొన్ని సందర్భాలలో రాక్షస పాత్రలకు దున్న చర్మం వాడుతారు.

తోలు బొమ్మలు ఆడించే పద్ధతి త్రాళ్ల బొమ్మలు ఆడించే పద్ధతికి భిన్నంగా వుంటుంది. తోలు బొమ్మను మధ్య అమర్చిన సన్నని బద్ద సహాయంతో ఆడిస్తారు. ఈ బద్దను క్రింద పట్టుకుంటారు. మధ్య బద్ద బొమ్మ తల నుండి క్రింది వరకు వుంటుంది. మరో రెండు చిన్నబద్దలు చేతుల చివరి వరకు ఉంటాయి. బొమ్మతాలూకు ప్రతి కీలువద్ద కొక్కెం ఏర్పాటవుతుంది. బొమ్మను ఆడించేవారు పొడుగాటి కర్రపుల్లను ఉపయోగిస్తారు. దీని చివర శిలువ ఆకారంగా చేసి ఉంటుంది. కొక్కానికి ఈ చివర తగిలించి బొమ్మ అవయవాలు కదిలేటట్లు ఆడిస్తారు. కొన్ని సందర్భాలలో బొమ్మలను ఈత ముళ్లతో తెరకు తగిలించి వుంచుతారు. ఇందుకు అరటిదంటును వాడే పద్ధతి ఆంధ్రదేశంలో లేదు.

ఈ తోలు బొమ్మలాటను కేవలం ఒక జానపద కళగా మాత్రమే పరిగణించకూడదు. ఇది జానపదులకు ఎంతో వినోదాన్ని సమకూర్చే సాధన కూడ. ఈ ప్రదర్శన సాధారణంగా బహిరంగ ప్రదేశంలోనే జరుగుతుంది. దీనిని అందరూ ఉచితంగానే చూసేందుకు వీలుంటుంది.

ప్రదర్శన నిమిత్తం తాత్కాలిక రంగ స్థలం ఒకటి ఏర్పాటవుతుంది. ఇది పందిరి మాదిరి వుంటుంది. ఈ పందిరి వైశాల్యం వగైరాలు లభ్యమైన సామగ్రిని బట్టి వుంటాయి. పందిరి ముందు భాగంలో రెండు పల్చటి తెల్ల చీరలు తెరమాదిరి అమరుస్తారు. చీర ముతకగా వుంటే బొమ్మలు స్పష్టంగా కనిపించవు కాబట్టి పల్చటి చీరలే వాడతారు. చీరలను ఒక దానిపైన ఒకటి వుంచి లాగి, ఈత ముళ్లలో కలిపి కుట్టి పందిరి గుంజకు బిగించి కడతారు. ఈ తెర వదులుగావున్నా, ముడతలు వచ్చినా బొమ్మలు సరిగా కనుపించవు. కట్టిన చీరల పొడవును బట్టి తెర వెడలుప 12 నుంచి 16 మూరల వరకు అంటే 18 నుంచి 24 అడుగుల వరకు వుంటుంది. ఈ వెడల్పు ఎక్కువే కాబట్టి సామాన్యంగా మధ్యలో మరొక గుంజ పాతుతారు. రెడు చీరలు కలిపి కుట్టడం చేత తెర ఎత్తు 8 నుంచి 10 అడుగుల వరకు వుంటుంది. బొమ్మలు ఆడించేవారికి తెరకు క్రింది భాగంలో మోకాటి ఎత్తువరకు స్థలం కావాలి. కాబట్టి బొమ్మల ప్రదర్శనను వీలున్న తెరభాగం 10 నుండి 12 అడుగులు వుంటుంది. మోకాటి ఎత్తు వరకు తెరకు వెలుతురు చొరని ముతక గుడ్డ కడతారు. తెరవెనుక రంగ స్థలం మీద చోటు బొమ్మలు ఆడించే వారు, సంగీతం పాడేవారు, వాద్యకారులు ఇతర సహాయకులు వుండేందుకు కావలసిన స్థలాన్నిబట్టి సాధారణంగా 6 నుంచి 12 అడుగులు వుంటుంది. పందిరి పైన, రెండు ప్రక్కలు, వెనుక భాగం టార్పాలిన్‌తో గాని గోనె సంచులతో గాని మూసి వేస్తారు. కళాకారులు బయటకు వెళ్లేందుకు లోనికి వచ్చేందుకు గాను వెనుక వైపున దారి వుంటుంది. కాని సాధారణంగా కళాకారులు ఆ జరుగుతున్నంత సేపు లోపలే వుంటారు. బొమ్మలాట ప్రదర్శన విరామం లేకుండా 6-8 గంటల పాటు సాగుతుంది. కాబట్టి కళాకారులు తినుబండారాలేవైనా చేసుకోవడానికి, వారి పిల్లలను పడుకోబెట్టడానికి రంగ స్థలం లోపలే ఏర్పాటు చేయాలి. లోపల పిల్లలు ఏడ్చి మారాము పెట్టి ఆటకు అంతరాయం కలిగించినప్పుడు అత్యవసర పరిస్థితిలోను మాత్రమే కళాకారులు బయటకు వస్తారు. పందిరి వేసేందుకు గ్రామంలో సంపన్నులైన వారు సామాగ్రి సమకూరుస్తారు. గ్రామంలో వున్న పనివారు పందిరి వేయడంలో తోడ్పడతారు. చాకలి ద్వారా చీరలు, మంగలి ద్వారా దీపాలు లభిస్తాయి.

బొమ్మలు బాగా కనుపించేటట్లు చేయడం కోసం తెరను పై నుంచి క్రిందికి లోపలి వైపుగా కొంచెం ఏటవాలుగా కడతారు. తెర నేలకు ఎప్పుడూ నిటారుగా వుండకూడదు. తెర ఏటవాలుగా వుండటం చేత ఒకవేళ కళాకారుడు అశ్రద్ధగా వున్నా బొమ్మ జారి పడిపోకుండా వుంటుంది. ప్రదర్శనలో రంగుల బొమ్మలను ఉపయోగిస్తారు కాబట్టి, అవి మరింత బాగా కనుపించేందుకు వీలుగా వాటిని తెరకు బాగా దగ్గరగా వుంచుతారు.

కళాకారుని నేర్పు బొమ్మను తెరకు దగ్గరకు తీసుకు రావడంలోనూ, దానిని తెర నుంచి తొలిగించడంలోనూ వుంటుంది. బొమ్మలు పార్శ్వముఖంలో వుంటాయి. వాటి తలలు త్రిప్పడం ఆంధ్రదేశంలోని తోలుబొమ్మలాటలో కానవచ్చే విశిష్టత. జావా, చైనా, యూరపు దేశాలందలి ప్రదర్శనలలో ఈ పద్ధతి కానరాదు.

ఈ ప్రదర్శనలకు సంప్రదాయకంగా కాగడాలు గాని ఆముదపు దీపాలుగాని ఉపయోగిస్తారు. ఆముదపు దీపాల వాడుకే ఎక్కువ. ఈ దీపాలను తెరకు సరైన దూరంలో వుంచుతారు. దీపాలను మరీదూరంగా వుంచితే కళాకారులు ప్రేక్షకులకు కనుపిస్తారు. అంతేకాదు వారి నీడలు కూడ తెర మీద పడి ప్రదర్శన గందరగోళంగా తయారవుతుంది. అలాగాక దీపాలు మరీ దగ్గరగా వుంటే దీపాలకు ఎదురుగా వున్న బొమ్మలు మాత్రం బాగా కనుపించి, మిగిలినవి మసకగా కనుపించడమో, అసలే కనుపించక పోవడమో జరుగవచ్చు. అందుచేత దీపాలను కళాకారుల ఎత్తులో తెరకు వాలు నుంచి దాదాపు రెండడుగుల దూరంలో వుంచుతారు.

ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా కాగడాలు, ఆముదపు దీపాల వల్ల అగ్ని ప్రమాదం వాటిల్లే అవకాశం వున్నది. కనుక వీటి విషయంలో ఎంతో శ్రద్ధ అవసరం. ఇటువంటి ప్రమాదాలు నివారించుకునేందుకు గాను కళాకారులు ఇటీవల ఇతర విధమైన దీపాలు అమర్చుకుటున్నారు. అయితే ఇలా వుపయోగించే సందర్భంలో వారు కొన్ని అంశాలను పరిశీలించవలసి వుంటుంది. కాగడాలు, ఆముదపు దీపాలు ఇచ్చే కాంతిలో ఒక విధమైన ఎరుపు రంగు వుంటుంది. ఈ కాంతిలో ప్రదర్శించేందుకు, సంప్రదాయకమైన తోలు బొమ్మలకు రంగులు దిద్దుతారు. అందువల్ల పెట్రోమాక్సు లైటు గాని విద్యుద్దీపాలుగాని వుపయోగించేటప్పుడు ఈ అంశాన్ని గమనించాలి. ఎరుపు రంగు ట్యూబులైట్ల వల్ల సంప్రదాయకమైన దీప కాంతి లభించే అవకాశం వున్నది.

తోలు బొమ్మలాటలోను, త్రాళ్ల బొమ్మలాట లోను, వాచికం భిన్న భిన్న స్థానం వహిస్తుంది. త్రాళ్ల బొమ్మలు రాజస్థాన్‌లో మంచి ప్రచారంలో వున్నాయి. వీరు వాడే భాష విలక్షణంగా వుంటుంది. మానవులకు వినోదం కలిగించే ఉద్దేశంతో దివి నుండి భువికి దిగివచ్చిన వారా అనిపిస్తుంది. కంచు కంఠ ధ్వనితో కూడిన సంభాషణలతో శరీర చలనాలు వుంటాయి. త్రాళ్లలో బొమ్మలకు సంభాషణలు ఎక్కువగా వుండవు. అందుచేత శరీర చలనాలకు ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది. భావ ప్రకటన మాట ద్వారా కంటే అంగవిన్యాసం ద్వారా జరగాలి. తోలుబొమ్మలాటలో ఇందుకు భిన్నంగా వాచికానికి ప్రముఖ స్థానం వుంటుంది. ఆయా పాత్రలు వేర్వేరు కంఠ ధ్వనులతో పలుకుతాయి. పాటలుంటాయి. బృందగానాలుంటాయి. వాద్యసహకారం వుంటుంది, మనోభావ సూచక సంగీతం వుటుంది.

తోలు బొమ్మలు ప్రదర్శించే బృందంలో ఆరుగురు, ఇంకా ఎక్కువమంది కళాకారులుంటారు. వీరిలో కనీసం ఇద్దరైనా స్త్రీలు వుంటారు. సామాన్యంగా ఈ బృందంలో స్త్రీలు, పురుషులు సరిసమానంగా వుంటారు. బొమ్మను ఆడించే కళాకారుడు బొమ్మ అవయవాలను కదిలిస్తూ వుండాలి. తెరమీద బొమ్మ కదులుతున్నప్పుడు తాను కదులుతూ వుండాలి. అందుచేత ఒక కళాకారుడు ఒకేసారి ఒక బొమ్మను మాత్రమే ఆడించ గలుగుతాడు. అయితే యీ కళాకారుడు తమ కంఠస్వరాన్ని పెక్కు విధాల మార్చగలరు. కాని వీరు ఇండోనేషియా లోని దలాంగీ కళాకారుని నైపుణ్య స్థాయి చేరుకోలేదు. దలాంగీ కళాకారుడు 'వయాంగ్‌కువిత' ఆటలో అన్ని బొమ్మలను ఒక్కడే అతి చాకచక్యంతో ఆడిస్తాడు.

ఆంధ్రదేశంలోని తోలు బొమ్మలాటలో బొమ్మలు ఆడించేందుకు ఇద్దరు ముగ్గురు కళాకారులు, సంభాషణలు చెప్పి పాటలు పాడేందుకు కనీసం ఇద్దరు మగవాళ్లు, ఇద్దరు ఆడవాళ్లు ఇంకా ఇద్దరు వాద్యకారులు వుంటారు. వాద్య బృందంలో హార్మోనియం, మృదంగం, తాళాలు వుంటాయి. ప్రదర్శన బృందంలోని వారందరూ బృందగానంలో పాల్గొంటారు. ఇతర ధ్వనులు కలిగించేందుకు రెండు కర్ర చెక్కలు వుపయోగిస్తారు. ఈ చెక్కలు ఒకదాని మీద ఒకటి వుంచుతారు. కళాకారులు బొమ్మలను ఎంత నైపుణ్యంతో ఆడిస్తారో అంత నైపుణ్యంతో ఈ చెక్కల ద్వారా అనేక రకాల ధ్వనులను కల్పించ గలుగుతారు.

కథా వస్తువు : తోలు బొమ్మలాటలు ఇటీవలి వరకు రామాయణ, భారత, భాగవత, కథలను ప్రదర్శించేవారు. ఈ శతాబ్దిలో రెండు దశాబ్దాలలోనూ చారిత్రక గాథలను కూడ ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. స్వాతంత్ర్యానంతరం పంచవర్ష ప్రణాళికల ప్రచారం కోసం ఈ కళాకారులు సాంఘిక ఇతివృత్తాలను కూడ స్వీకరిస్తున్నారు. ఏ యితివృత్తం స్వీకరించి నప్పటికీ ప్రదర్శనా విధానం మాత్రం సక్రమంగా పాటిస్తారు. ప్రదర్శన ప్రారంభం నాటి రాగంలోను, ముగింపు సురటి రాగంలోను జరుగుతుంది. ప్రదర్శన ప్రారంభం కావడానికి ముందు విఘ్నేశ్వరుని స్తుతిస్తారు. ఇదుకు విఘ్నేశ్వరుని బొమ్మను తెర మధ్య భాగంలో వుంచుతారు. తెరమీద అలంకరణకై జంతువులు, పక్షులు, చెట్లు మొదలైన బొమ్మలను కూడ వుంచుతారు. విఘ్నేశ్వర ప్రార్థన అవంగానే వీటన్నింటినీ తొలగిస్తారు. తర్వాత సూత్రధారుని (బృందం నాయకుని) నాందీ వచనాలతో ప్రదర్శన మొదలవుతుంది. ప్రదర్శన తన కథా కథనం, సంభాషణలు, పాటలు తెలుగులో వుంటాయి. కళాకారులు తమ పాండిత్యం ప్రదర్శించేందుకై మధ్య మధ్య సంస్కృత శ్లోకాలు కూడ వినిపిస్తారు.

బొమ్మలు ఆడించే వారిలో నృత్యం వచ్చిన వారు వున్నప్పుడు తోలు బొమ్మల ప్రదర్శనలో నృత్యం కూడ చేరుస్తారు. నృత్యం చేసే బొమ్మను తెరకు దగ్గరగా వుంచాలి. దానితోపాటు బొమ్మ తల, మెడ, కాళ్లు, చేతులు, నడుం, మిక్కిలి నైపుణ్యంతో ఆడించవలసి వుంటుంది. అందుచేత బాగా శిక్షణ పొందిన ఇద్దరు కళాకారులు కలిసి ఆ బొమ్మను ఆడిస్తారు. ఈ కళాకారులు బొమ్మలను ఆడించడంలోనే కాకుండా భరత నాట్యంలో కూడ మంచి ప్రవేశం కలవారై వుంటారు. ప్రతి ప్రదర్శన చివరలో 'మంగళం' పాడతారు.

కథను బట్టి ప్రదర్శనలో ప్రధాన పాత్రలు వుంటాయి. అయితే మధ్య మధ్య రెండు హాస్య పాత్రలు ప్రవేశించి తాజా వార్తలను వ్యంగ్య వ్యాఖ్యానాలతో వినిపిస్తాయి. ఈ పాత్రలు కేతిగాడు లేక జుట్టుపోలిగాడు– (జుట్టును బట్టి యీ పేరు వచ్చింది), బంగారక్క, ఇండోనేషియాలోని వాయంగ్ కువితలో వచ్చేపా–డొగాల్, పా–డొలాంగ్ పాత్రలు, టర్కీ లోని కరజోగ్, హెడ్విగ్ వాద్ పాత్రలు ఇటువంటివే. ఈ పాత్రలు సందర్భం వున్నా లేక పోయినా రావడమే కాకుండా ఈ పాత్రలు ప్రవేశ పెట్టాలని ప్రేక్షకులు పదే పదే కోరినప్పుడు పౌరాణిక కథా సన్నివేశాల మధ్య మధ్యలో కూడ ప్రవేశ పెట్టవలసి వస్తుంది.

జీవనోపాధి నిమిత్తమో, అదనపు సంపాదన కోసమో ఈ కళను తరతరాలుగా ఆరాధించే కుటుంబాల వారు తోలుబొమ్మలాట ప్రదర్శిస్తూంటారు. కళాకారులకు చిన్న తనం నుంచి వారి కుటుంబపెద్ద బొమ్మలు తయారు చేయడం, కథ చెప్పడం, పద్యాలు ఆలపించడం, పాటలు పాడడం నేర్పుతాడు. వీరు ప్రదర్శించే ఆటల ఇతివృత్తాలకు ముద్రితగ్రంథాలు వుండవు. అందుచేత వీరు మౌఖికంగా నేర్చుకుంటారు. నిత్యం సాధన చేస్తారు. వారికి మంచి ధారణ శక్తి కళా నైపుణ్యం అలవడతాయి. ఒకే కుటుంబంలోని వారు గాని దగ్గర బంధువులుగాని ఒక బృందంగా ఏర్పడతారు.

ఈ తోలుబొమ్మలను కళాకారులు అమూల్య సంపదగా భావిస్తారు. ఈ బొమ్మలు ఒకరి నుండి ఒకరికి తరతరాలుగా సంక్రమిస్తాయి. కొన్ని సందర్భాలలో ఈ బొమ్మలను వధువుకు పెండ్లి కట్నంగా ఇస్తారు. ఈ కళాకారుల బృందం వాతావరణం బాగా వున్నప్పుడు గ్రామాలలో పర్యటించి ప్రదర్శనలిస్తారు. సామాన్యంగా వర్షాకాలంలో ప్రదర్శనలివ్వటానికి వీలుండదు. ఈ బృందం సభ్యుల మధ్య మంచి సహకారం, ఎట్టి కలతలు లేకుండా సర్దుకుపోయే గుణం వుండటం అవసరం. సాధారణంగా కుటుంబ పెద్ద బృందానికి నాయకుడుగా వుంటాడు. అతడు అందరిపట్ల దయాదరాలు, సమదృష్టి చూపుతాడు. సభ్యులందరికి అతని మాటపైన గౌరవం వుంటుంది.

తోలు బొమ్మలు ఆడించేవారు ప్రధానంగా కళాకారులు. వారికి స్థిర సంపాదన వుండదు. వీరి ప్రదర్శనలు ఉచితమైనట్టివి. అందుచేత గ్రామస్తులు ఇచ్చే విరాళాలపైన గ్రామంలోని పెద్దలు వదాన్యతపైన వారు ఆధారపడివుండ వలసి వస్తుంది. తగిన ఆదరణ లేక ఈ కళ కొంత కాలం మరుగున పడింది. దేశ స్వాతంత్ర్యానంతరం ఇతర కళా రూపాలతోపాటు ఈ కళ కూడ పునరుజ్జీవనం పొందింది. ప్రపంచమంతటా బొమ్మలాటపట్ల ఆదరణ అధికమవుతున్నది. భారత దేశంలో కూడ ఇట్టి ఆదరణ కాన వస్తున్నది. ఇతర దేశాలలో బొమ్మలాటకు సంబంధించిన అద్భుతమైన ప్రగతి జరిగింది. అయితే ఆట బొమ్మలు మరింత వాస్తవికంగా వుండాలని వారికి, అవి యథాపూర్వకంగా వుండాలనే వారికి మధ్య అభిప్రాయ భేదాలు తొలగిపోలేదు. ప్రదర్శనను ఉత్తమంగా జరిపేందుకు బొమ్మల నిర్మాణం మెరుగు పరచడం హర్షదాయకమే. కాని ఈ మార్పులు అధిక వ్యయంతో కూడుకున్నవయితే మాత్రం కష్టం. ఇందుకు ఒక మధ్యే మార్గాన్ని కనుగొనేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. తోలు బొమ్మలు తయారు చేసే పని ఇప్పుడు కళాకారుల బృందాలకు మాత్రమే పరిమితం కాలేదు. మద్రాసులోని చర్మ సంస్థ జరిపిన పరిశోధనా ఫలితంగా చర్మాలు సిద్ధం చేయటం చిల్లుల బొమ్మలకు రంగులు వేయటం కోసం అనుసరించే పద్ధతులలో మంచి అభివృద్ధి జరిగింది.

అనువాదం : గోవిందరాజులు

కె.వి. గోపాలరత్నం

క్రీడారంగంలో ఆంధ్రుల ప్రతిభ

భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌ది అగ్రస్థానం. రాష్ట్రాల పేర్లలో అక్షరక్రమంలో మొదట వుండటం కాకతాళీయమే. ఈ అగ్రస్థానం ఆంధ్రుల ప్రతిభవల్లనే లభ్యమైంది. ఈనాడు భారత రాష్ట్రపతి ఆంధ్రుడన్న విషయం అందరికీ తెలిసిందే. అంతేగాక ఒకసారి డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారు గాంధీగారితో అన్నట్లు "మీరు ఈనాడు ప్రచారం చేస్తున్న అంటరానితన నిర్మూలన, హిందీ ప్రచారం ఆంధ్రులకు కొత్తగాదు. కొన్ని శతాబ్దాల క్రితమే సంఘసంస్కరణ ఆంధ్రదేశంలో ప్రాధాన్యం వహించింది.' ' అలాగే మిగత రంగాలలో కూడా ఆంధ్ర అగ్రగామిగానే వుంది.

ప్రాచీన గ్రీస్, రోమ్ మినహాయించి, అన్ని రంగాలలో గొప్ప వ్యక్తులను తయారుచేసిన కీర్తి ఒక్క బెంగాల్‌కే చెందుతుంది. అని ఒకసారి ఎవరో అన్నారు. బెంగాలీలను పూర్తిగా అనుకరించినవారు ఆంధ్రులంటే అతిశయోక్తిలేదు. అయితే వారికీ వీరికీ ఒక్క తేడా ఉంది. మన గొప్పవారిని ఇతరులంతా గొప్పవారని గుర్తించి అందలమెక్కించేవరకు మనం వారిని ఖాతరు చేయం. అదే బెంగాలీ వాడయితే వారు అతనిలోని ఘనత కొద్ది అయినా దానిని పదింతలుగా చేసి ప్రచారం చేసి అతనికి విశ్వకీర్తి లభించేందుకు దోహదం చేస్తారు. ఈ వైఖరి ఆంధ్రుల అభ్యుదయమును కుంటుపరచినా, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటినుండి పరిస్థితి మారిపోయిందన్న విషయం సంతోషకరం. భారత రిపబ్లిక్‌లో తన విశిష్ట స్థానమాక్రమించడానికి ఆంధ్రులు కృషిచేస్తున్నారు.

ఆంధ్రుల వైఖరిలో ఈ మార్పు క్రీడారంగంలో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది. క్రీడాకారులు అనుభవించిన యిబ్బందులు తొలగిపోతున్నాయి. క్రీడాకారులకు సహాయంచేసి ప్రోత్సాహమివ్వడంలో ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు మూడు సందర్భాలలో కనబర్చిన సహృదయత ఇందుకు తార్కాణం. క్రీడారంగంలో అద్భుత విజయం సాధించిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఫుట్‌బాల్ జట్టు సభ్యులకు ఉద్యోగంలో ప్రమోషను యిచ్చి భారతదేశంలోని ఇతరులకు ఆదర్శప్రాయులైనారు. 1957లో ఢిల్లీ ఆంధ్రస్పోర్ట్సు క్లబ్ కార్యదర్శిగా వుంటున్న రోజులలో నేను మొదటగా చేసిన సూచనను ఆమోదించి ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కవున్సిల్‌ను ఏర్పాటు చేశారు. ఆ సంవత్సరమే ఆర్థిక యిబ్బందుల వలన ఆంధ్రజట్టు రంజీ క్రికెట్ పోటీలలో పాల్గొనే అవకాశంపోయే సందర్భంలో ప్రభుత్వ గ్రాంటు తక్షణం మంజూరు చేయించారు. ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు అయిన శ్రీ పి.వి. నరసింహారావు, శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, శ్రీ పి.వి.జి. రాజు గారలు సభ్యులుగా వుండటం నిజంగా క్రీడారంగానికి ఎంతో ప్రోత్సాహం లభిస్తున్నది.

ఆంధ్రక్రీడారంగమును సమీక్షిస్తున్నప్పుడు మొదటగా మనకు కన్పించేది కోడి రామమూర్తి

దివ్యమంగళ విగ్రహము. రామమూర్తిని గురించిన కథలు దేశమంతటా ప్రచారంలో వున్నాయి. ప్రపంచ వస్తాదుగా మాకు కూడా రామమూర్తి కొన్ని మెళుకువలు, కిటుకులు నేర్పాడని ప్రతీతి.

కుస్తీతో ధీటయిన బరవునెత్తడంకూడా ప్రఖ్యాత క్రీడగా పరిగణింపబడుతున్నది. ఆసియాలోకల్లా అగ్రస్థానం సంపాదించిన శ్రీ కామినేని ఈశ్వరరావు, శ్రీ దండమూడి రాజగోపాల్ గారలు ఆంధ్రులవడం నిజంగా మనకు గర్వకారణము. 1954లో ఢిల్లీలో జరిగిన జాతీయ క్రీడోత్సవంలో శ్రీ ఈశ్వరరావు అవలీలగా 320 పౌన్ల బరువునెత్తి, ఆసియా రికార్డును అధిగమించారు.

ఈశ్వరరావు, రాజగోపాల్ బరువులనెత్తి ప్రఖ్యాతివహించినట్లే, క్రికెట్‌లో దేశ ఖ్యాతిని ఆకాశానికెత్తారు, కల్నల్ సి.కె.నాయుడు. సి.కె.బంతిని కొడ్తుంటే దేవతలు సైతం ఆనందించదగిన దృశ్యం. జట్టు నాయకుడుగా, బ్యాట్స్‌మన్‌గా, బౌలర్‌గా, ఫీల్డర్‌గాను సి.కె. సర్వతోముఖ ప్రతిభ అసమానమైనది.

సి.కె.బంతిని తుక్కు తుక్కుగా కొట్టడంలో సిద్ధహస్తుడైతే, అతని తమ్ముడు సి.ఎస్. వికెట్లే పడగొట్టడంలో నిరుపమాన ప్రతిభాసంపన్నుడు. గుగ్లీ బౌలర్‌గా అతని సమానుడు లేడంటే అతిశయోక్తికాదు. బ్యాట్స్‌మన్‌గా, ఫీల్డర్‌గాను కూడా ప్రతిభా వంతుడైన సి.ఎస్. అగ్రగణ్యులైన క్రీడాకారులలో నిస్సందేహంగా ఒకరు.

ఇకను 'విజ్జీ' పేరు వినని క్రికెట్ క్రీడాభిమాని వుండడంటే అసత్యంకాదు. క్రికెట్ ఆట అంటే ప్రాణమిచ్చేవ్యక్తి విజయనగరం మహారాజకుమార్. ప్రారంభదశలో ఈ క్రీడను జాగ్రత్తగా పోషించిన వ్యక్తి వీరు. ఢిల్లీలో విల్లింగ్టన్ పెవిలియన్‌ను, రోషనారా క్లబ్‌లో ఒక క్రికెట్ ఆటస్థలమును ఏర్పాటు చేయించారంటే వీరికి క్రికెట్‌పట్ల అభిమానం ఎంతవుందో అర్థమవుతుంది. క్రికెట్ ఆడటం మానివేసినా, క్రికెట్ పట్ల ఆసక్తిమాత్రం తగ్గలేదు. ఈనాడు క్రికెట్ పోటీల సమీక్షను రేడియోద్వారా ప్రసారం చేస్తున్నారు. వేటలో వీరికి ఆసక్తి మెండు. 323 పులులను వేటాడిన వీరు ఇటీవలనే విరమించుకున్నారు.

సి.కె., విజ్జీలవలెనే భారత టెస్టు జట్లకు నాయకత్వం వహించిన ఘనత ఘులాం అహ్మద్‌కు దక్కింది. ఆఫ్‌స్పిన్ బౌలర్‌గా ప్రపంచంలో అగ్రగణ్యుడైన ఇతను, బౌలుచేసిన ప్రతిబంతీ బ్యాట్స్‌మన్‌కు భయం కలిగించిందంటే సత్యదూరం కాదు.

అలీబాబా (అబ్బాస్ అలీబేగ్ మిత్రులు పిలచేపేరు) 1959లో మాంచెస్టర్ పోటీలో ప్రశంసనీయంగా ఆడారు. టెస్ట్ క్రికెట్‌ను సెంచరీతో ప్రారంభించిన నాలుగవ భారతీయుడు ఇతను. ప్రపంచంలో ఫాస్ట్ బౌలర్లలో అగ్రగణ్యులైన లిండ్వాల్, మిల్లర్, ట్రూమన్, స్టాతమ్, టీసన్ వంటి మహామహావాళ్ళను నిర్భయంగా ఎదుర్కొని చిత్తుచేసి ఇతను బ్యాట్స్‌మన్‌గా ప్రఖ్యాతినందాడు.

అదేకోవకు చెందిన వ్యక్తి ఎం.ఎల్.జయసింహ, భారతజట్టు ప్రారంభ బ్యాట్స్‌మన్‌గా ముస్తక్ అలీ దూకుడు ఆటను మరపించే విధంగా ఆడగలవ్యక్తి ఇతను. క్రికెట్ టెస్టు (1960లో కలకత్తా) ఐదు రోజులలోను బ్యాట్‌చేసిన ఘనత ఈ యువకునకొక్కడికే దక్కింది.

ఆంధ్రవిశ్వవిద్యాలయ జట్టుకు నాయకత్వం వహించిన కె.వెంకటరమణమూర్తి, ఢిల్లీ విశ్వవిద్యాలయ జట్టుకు నాయకత్వం వహించిన వి.బాలాజీరావు ఉత్తమ ఆటగాళ్ళలోనివారే. అయినా టెస్ట్ జట్టులలో స్థానం లభించకపోవడం నిజంగా దురదృష్టమనే చెప్పాలి. వీరిద్దరు కలిసి రంజీ పోటీలలో ఉత్తర ప్రదేశ్ జట్టులో ప్రశంసనీయంగా ఆడారు.

భవిష్యత్తులో ఆంధ్రక్రికెట్ జట్టును రూపొందిస్తూ పెద్ద ఆర్భాటం లేకుండా అమూల్యమైన కృషిచేస్తున్నవ్యక్తి ఆర్.వి.ఎస్. రామారావు. ఆంధ్రదేశంలో వివిధ పట్టణాలలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ యువకులను మంచి క్రీడాకారులుగా తయారుచేస్తున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో శిక్షణ పొంది వచ్చిన వీరు సౌకర్యాలు కొరవడినా పట్టు విడవక తమ కృషిని కొనసాగిస్తున్నారు.

క్రికెట్ క్రీడలలో రాజు అంటే, రాణి అనదగిన టెన్నిస్‌లో కూడా ఆంధ్రుల ప్రతిభ అంతర్జాతీయ స్థాయినందుకున్నది. ఎల్.బ్రూక్స్ ఎడ్వర్డ్స్, మిస్.జెన్నీ శాండిసన్‌లతో జంటగా ఆడి ప్రపంచఖ్యాతినందారు శ్రీ ఎన్.కృష్ణస్వామి. డబుల్స్ పోటీలలో భారతీయులలో అగ్రగణ్యుడని వీరు ఖ్యాతినందారు.

సి.రామస్వామి 1936లో క్రికెట్ టెస్ట్ టీములో పాల్గొన్నారు. టెస్ట్‌లో పాల్గొన్నవారిలో వయోవృద్ధులు వారే. భారతదేశం తరఫున వారు క్రికెట్ టెన్నిస్‌లలో ఆడారు. వారికి విశేషంగా అభిమానం వున్న ఆట టెన్నిస్. వారు కేంబ్రిడ్జి జట్టులో సభ్యుడుగా ఆడారు. డేవిస్‌కప్ పోటీలలో వీరి ఆట ఎంతో ఉత్తమంగాఉంది.

వింబుల్డన్ పోటీలలో క్వార్టర్ ఫైనల్ వరకు వచ్చిన తొలి భారతీయుడు ఘౌస్ మహమ్మద్ ఆంధ్రుడు. చెకొస్లవాక్ ఛాంపియన్ ఆర్.మెంజిల్‌ను విస్మయ చకితులనుచేసి, ఒక సెట్‌ను సాధించగలిగిన తొలి విదేశీయుడు ఇతనే. భారత టెన్నిస్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం అది.

పి.ఎల్.నారాయణరావు, ఎం.వి.జి.అప్పారావు, విశ్వమోహన్, హరిమోహన్, టి.ఏ.రామారావు ప్రతిభ టెన్నిస్ క్రీడారంగంలో తారాపథం అందుకున్న ఆంధ్రులు.

భారతదేశంలో ఫుట్‌బాల్ ఆటగాళ్ళలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం. ఇక్కడ తయారైన అనేకులు బెంగాల్ తదితరాలకు తరలివెళ్ళి ప్రాముఖ్యంలోనికి వచ్చారు. అజీజ్, నూర్ జుల్‌ఫికర్, లతీఫ్, వరహాలు ఈ ప్రముఖులలో కొందరు మాత్రమే ఆసియాలో తన ఆధిక్యతను తిరిగి భారతదేశం సంపాదించుకోగలిగిందంటే ఈ గౌరవం అజీజ్‌కు దక్కుతుంది. జకార్తాలో జరిగిన ఈ పోటీలో ప్రతి ఎత్తును అతను జాగ్రత్తగా ఆలోచించి చక్కగా అమలు పర్చారు. బ్యాక్‌గా వుంటూవచ్చిన జర్నేయిల్‌ను ధైర్యంగా ఫార్వర్డ్‌గా మార్చి ఆడించినందున ఈ విజయం లభించిందనడం నిర్వివాదాంశం.

జయంతిరూసో అమెరికా వెళ్ళి ఎథ్లెటిక్స్ కోచ్‌గా శిక్షణ పొంది వచ్చారు. నాగభూషణం, మహ్మద్ ఖాసిం తదితరులు ఎథ్లెటిక్స్ రంగంలో ప్రకాశిస్తున్న యువ క్రీడాకారులు.

వాలీబాల్ పోటీలలో విదేశాలతో ఆడిన ఘనత సి. బుచ్చిరామయ్యకు దక్కింది. చైనాలో పర్యటించిన భారతజట్టులో ఇతను సభ్యుడు. ఇతను ఒక్క వాలీబాల్‌లోనేగాక టెన్నిస్, ఎథ్లెటిక్స్, క్రికెట్ తదితర క్రీడలలోకూడా మంచి నైపుణ్యం సంపాదించిన వ్యక్తి. ప్రఖ్యాత రష్యన్ వాలీబాల్‌కోచ్ పిమనోవ్ దగ్గర శిక్షణ పొందారు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్సులో ఎథ్లటిక్స్ కోచ్‌గా శిక్షణ పొందారు: క్రీడ లన్నింటిలో సమాన నైపుణ్యంతో చాకచక్యంతో ఆడగలిగిన సర్వతోన్ముఖ ప్రతిభావంతుడు బుచ్చిరామయ్య.

కారమ్స్, హాకీ, చెస్ వంటి ఇతర క్రీడలలో కూడా ఆంధ్ర యువకులు మంచి నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. ఈ యువకులకు మంచి సౌకర్యములు కల్పించడం అవసరం. ఆంధ్రప్రభుత్వం ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తుందనడంలో నాకెంతమాత్రం సందేహం లేదు.

(కృష్ణా పత్రిక స్వర్ణోత్సవ సంచిక)

తెలుగు నేలపైన తిరుగాడునప్పుడు
తెలుగుమాట నోట బలికినపుడు
తెలుగువారి కథలు తలపోసినప్పుడు
పొంగిపోదు గర్వమునను నేను!

తీరి బంగారు పండెడు తెలుగు నేల
తేట నీటితో ప్రవహించు తెలుగు నదులు
తెలుగు వాసిని ప్రకటించు తెలుగు గిరులు
తలచుకొన్నంత నామేను పులకరించు!

– వేదుల సత్యనారాయణ శాస్త్రి

దేవులపల్లి కృష్ణశాస్త్రి

మన ఆటలు

"ఇవేం రోజులు లెండి, చదువులూ సంధ్యలూ చట్టుబండలయాయి గదా! ఆచారాలూ అలాగే అడుగంటేయి. పోనీ బుద్ధిలేక మనిషి ఇలా మారిపోతున్నాడేమో అనుకుంటే–కాలాలూ, ఋతువులూ కూడా ఇలా కలగాపులగం అవాలా? ఈ రోజుల్లో చూస్తున్నారు – పువ్వులు బిక్క చచ్చి, విధిలేక పూస్తున్నాయి; పండ్లు మొండికెత్తి ఏవో పండుతున్నాయి. అసలు బలమైన రుచులే పోయాయంటారు. ఎలా మరిచిపోతుందో జాతి! వెనుకటి పండుగలూ పబ్బాలూ, ఆటలూ పాటలూ ఏవీ కనబడవు. పల్లెల దగ్గరనుంచీ పరదేశీవిలా ఉన్నాయి" అంటూ అక్కడక్కడ కొందరు గొణగడం ఉంది.

ఇలా బాధపడేవారు సాధారణంగా ఏభైఏళ్లుదాటినవాళ్ళు– 19వ శతాబ్దిలో పుట్టినవాళ్లు. అయితే, పాపం, వీళ్లమాటలలో కొంత సబబూ ఉంది. నిజమే. కాలమూ మారుతుంది; దేశమూ మారుతుంది; అన్నీ మారతాయి. ఈ రోజుల్లోలాగ ఎన్నో అన్య ప్రభావాలు వచ్చిపడ్డప్పుడు మరీ మారతాయి. అయితే ఇలాగ తుండూ తుపాకీతో కూడా ఊడ్చి పెట్టుకుపోవడం బాగుందా అంటే, ఏమీ బాగా లేదని బుద్ధిమంతులెవరు అనరు?

కొద్దిరోజులలో సంక్రాంతి వస్తుంది; భోగి మంటలతో, భోగి పళ్లతో, ముగ్గులతో, గొబ్బిళ్లతో, రకరకాల ఆటపాటలతో రావాలి నిజానికి. ఇప్పుడల్లా రావడం లేదు. పండుగలూ నీరసంగా కనపడుతున్నాయి. పెళ్లిళ్లూ తెల్లబోతున్నాయి.

ఆ వినోదాలు లేవు; ఆటలు లేవు. జీవితంలో రంగూ రుచీ పోయాయా, లేక, బరువులూ సమస్యలూ ఎక్కువయాయా? అయితే మరేవో ఆటలూ, వినోదాలు సాగుతూనే ఉన్నాయి అంటే, జాతీయమైనవన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆటపాటలూ అల్లాగే!

"మన ఆటలు" అనగానే ఎన్ని రకాలుగానో మనస్సు పోయింది. ఒకటి: మన తెలుగునాటిలో ఏయే కాలాలలో ఏయే ఆటలాడేవారు అన్నది. రెండు: ఆడపిల్ల లాడేవి, మగపిల్లలాడేవి. మూడు: ఇంట ఆడేవి, బయట ఆడేవి. నాలుగు:ఏయే సమయాలలో ఏయే ఆటలు ఆడుతారు చెప్మా అన్నది.

వీటిలో ఏనాటినుంచో నేటివరకూ వస్తున్న ఆటలూ కొన్ని ఉన్నాయి. పిల్లల గుజ్జనగూళ్ళూ, ఓమనగుంటలూ, బొంగరాలు వంటివి; స్త్రీల గచ్చకాయలూ, సొగటాలు వంటివీ; పురుషుల ఉప్పనపట్టెలాట– అంటే ఉప్పట్టి, గిల్లిదండ– అంటే గోటీ బిల్ల, చెడుగుడు వంటివీ; సామంతుల చతురంగమూ, పాచికలాటా వంటివీ పాల్కురికి సోమన్న, నాచన సోమన్న మొదలైన కవుల నాటి నుంచీ మన దేశంలో ఉన్నట్లు మనకి తెలుస్తుంది. పాల్కురికి సోమన్న రోజుల్లో అంటే దాదాపు వెయ్యేళ్ళ క్రితమే రంగుల రాట్నం ఉండి తీరాలి. "...రాటనముల వాలి ఆడించు నా వఁద్రంగి అతడు" అని

బసవ పురాణంలో ఉంది.

కోలాటము, గౌండ్లి, పేరణి అనే రకరకాల నృత్యాలకు సంబంధించిన ఆటలు స్త్రీలలో ఉండేవి.

మరి రెండాటలు సిసలైన తెలుగు ఆటలైపోయి, ఇప్పటికీ మిగిలిపోయినవి– ఉప్పట్టీ, గిల్లిదండా, "ఉప్పనపట్టె లాడు నెడ ఉప్పును తెత్తురుగాక యాదవుల్" అంటాడు నాచన సోముడు. గిల్లిదండ అంటే గోటీబిళ్ల. దీనిని పూర్వ 'ఘుటికా ఖేలనం' అనే వారు. ఒక చిన్నపుల్లతో, పెద్ద కర్రతో ఆడతారు. మహాభారతంలో ఉంది కౌరవ బాలురు చిన్న కర్రతో బంతిని కొట్టి ఆడినట్లు. పల్నాటి బాలచంద్రుడూ ఇవే ఆడేదు: "చిరుతలు తీరైన గొడెలతో."

ఇక నాచన సోమన రోజులలో దాదాపు ఎనిమిది వందల ఏళ్ల క్రితం నెత్తము, అంటే పాచికలాట వంటిది ఉండి తీరాలి. కృష్ణుడు రుక్మిణితో ఈ ఆట ఆడేడట. సత్యభామ సాక్షి. అంటే రిఫరీ.

"అత్తీవంచ, తిగ, దుగయు,
నత్తా, దచ్చౌక, వంచి, చౌవం, చీరై
దిత్తిగ, యిద్దుగ, బద్రలు
చిత్తంబున దలచినట్లు చేతికి దెచ్చున్."

ఈ ఆటలకు పలకా, బలపమూ కూడా ఉండాలని సోమనాథుడు వర్ణించాడు.

అప్పుడు చిన్న పిల్లలతో బాలచంద్రుడేయే ఆటలాడేవాడో తెలుసునా?

"గుమ్మడికాయలు కొంతసేపాడి
చెరకుల పందెమ్ము చెల్వొప్ప గెలిచి...
పోకలాటల చేత పుచ్చు ముప్పొద్దు
ఆడుడి ముత్యాల నమరు బంతులును
గుంతమావల వాడికొని గెల్చుకొనుము...
రూకల కుప్పలు రూఢిగ నాడు..."

వీటిలో 'గుంతమాపల' ఆట అంటే ఇప్పటి ఓమనగుంట ల్లాంటిది. బాలచంద్రుడు బొంగరాల ఆట కూడా ఆడేడు. ఆ రోజుల్లో పల్నాటి యువకులకు ముఖ్యంగా వినోదం కలిగించే ఆటలు పిగిలి ఆటలు; కోడి పందేలు.

ఇంతవరకూ చెప్పిన ఆటలన్నీ పదకొండవ శతాబ్దినుండి పదునాల్గవ శతాబ్దివరకూ తెలుగు వారికి ఎక్కువ వినోదం కలిగించినట్టు మన పూర్వకావ్యాలు చదివితే బోధపడుతుంది.

మరి తరువాతి శతాబ్దులలో కొత్త ఆటల పేర్లు వింటున్నాము.

"సరిలేని అంజి సొగటా
లరు దగు జూదంబు నెత్త మచ్చనగండ్లున్
తిర మగు నోమనగుంటలు
సరసత మెయి వాడుచున్న సతులన్ గనియెన్"

వీటిలో అంజి కొత్త ఆట. యువకులు కందుక కేళి ఆడేవారు. ఆ కందుకాలు బహుశా గుడ్డలతో గుండ్రంగా గట్టిగా కట్టినవై ఉంటాయి.

"విమల చంద్రోద యారంభ వేళయందు" పిల్లదీవాటలు అని ఆడేవారని శ్రీనాథుడు అంటాడు. ఇక పల్లెజనులను ఒక రకమైన జూదం 'లక్కిముష్టి– నక్కముష్టి' అనేది ఎక్కువగా ఆకర్షించినట్టు కనబడుతుంది. మరి చతురంగం అప్పటికి అమలులోకి వచ్చింది.

"చతురంగంబున నే నతి
చతురుడ కరి తురగ మంత్రి శకట భట ప్ర
స్థితి పరహాసము సేయుదు
క్షితి మెచ్చగ రాజు బంటుచే గట్టింతున్"–

అని "సింహాసన ద్వాత్రింశిక"లో ఉంది. ఇప్పటి కప్పుడే పులిజూదం మంచి వినోదం అయింది. ఒక జూదరి ఇలాగ బడాయి కొడతాడు ఒక కావ్యంలో–

"..........కడు మె
చ్చుగ వాడుదు పులుల మూట, జూదంబులలో
మిగులగ నేర్పరి బాగిడి
తిగుటన్ సొగటాల నే నతి ప్రౌఢుండన్"

మరి రాయలకాలంలో ముఖ్యమైన కొన్ని వినోదాలు ఇప్పుడంతరించిపోయినాయి. సిడి– సిడి మ్రాను అనే దొకటుండేది. "అంభోధరము

క్రింద నసియాడు ఐరావతియు బోలె సిడి వ్రేలె తెరవ యోర్తు” అంటాడు రామకృష్ణ కవి.

ఇప్పటికి కుస్తీలూ, బాణసంచాలూ, వసంతోత్సవాలకు సంబంధించిన ఆటలూ వచ్చేశాయి. వెన్నెల రాత్రులలో కోలాటాలు స్త్రీ జనానికి ఉత్సాహం కలిగించేవి. ఇక రాజ్యాలు జయించే తెలుగు యువకులలో కుస్తీలు, దున్నపోతుల యుద్ధాలు, కత్తిసాములూ, చేడీలూ జోరుగా సాగేవి. వీటి అన్నిటిలో మేటి అయిన రాయలవారు చదరంగంలో కూడా సమ్రాట్టే. ఈ ప్రభువు బొడ్డుచర్ల తిమ్మన్న అనే ఆయనతో చదరంగం ఆడి, కొప్పోలు అనే గ్రామం సర్వాగ్రహారంగా ధారపోసి ఇచ్చాడు.

ఇక అప్పటి బాలికలు బొమ్మల పెళ్లిళ్లు, గుజ్జన గూళ్లు, అచ్చన గుళ్లూ, పింపిళ్లూ, కుచ్చిళ్లూ, గీరనగింజలూ, ఓమనగుంటలూ, కనుమూసిగంత, నలుకంబాలాటలూ అనే ఆటలాడేవారట. వీటిలో చాలా ఆటలు ఇప్పటిదాకా ఉన్నాయి. ఇక ధూర్జటి శ్రీ కాళహస్తి మహాత్మ్యంలో తిన్నడు దాదాపు పాతిక ముప్ఫై ఏండ్ల క్రితం కూడా తెలుగు బాలురాడిన ఆటలన్నీ ఆడినట్టు కనపబడతాడు. గుడుగుడు గుంచాలూ, దాగుడుముచ్చు లాటలూ, గచ్చకాయలూ, వెన్నెల కుప్పలూ, తన్నుబిళ్లా, చెడుగుడులూ, ఉప్పన పట్టెలూ, ఇవన్నీ చెంచు కొమరులతో తిన్న డాడాడు.

నారాయణామాత్యుడు అనే కవి తన 'హంసవిశంతి'లో నాటి తెలుగునాటి ఆటలు ఒక పెద్ద సీసమాలికలో వల్లిస్తూ వస్తాడు. వాటిలో ఈ శతాబ్ది ప్రారంభానికే ఎన్ని పోయాయో, ఎన్ని ఉన్నాయో! పాతికేళ్ల క్రితానికి మరికొన్ని పోయి ఉంటాయి. ఇప్పుడు ఉప్పట్టయినా చెడుగుడైనా తెలుగువాళ్లాడుతున్నారా?

నా చిన్నతనంలోనే– దాదాపు నలభై ఏళ్ల వెనుక అనుకోండి– మా గ్రామంలో ఊరి బయట మందబయలులో యోధుల్లాంటి యువకులు రెండు కక్షలై తాచుపాముల్లాగ పాకుకుపోయే బద్దీకి ఇటూ అటూ నిలబడి, ఒక పట్టాన తెగని కూత కూస్తూ, ఒకసారి తారాజువ్వలాగ ప్రతికక్షుల్లోకి దూసుకుపోతూ, ఇంతలో మెరపులాగ బద్దీ దగ్గరికీ వస్తూ, అంతలో చిచింద్రీలాగ, ఎక్కడికో మళ్లి, ఎవరి వీపు మీదో చరుస్తూ, శత్రువులు ఒకపాటివారైతే కుమ్మి, ఇవతలికి వస్తూ, తన సాటివారైతే కిందామీదా పడుతూ, మేటివారూ, పోటరులూ అయితో లొంగిపోతూ, ఆడిన చెడుగుడుకిన్నీ, పల్నాటి పోరాటానికిన్నీ పట్టుదలలో కాని, పరాక్రమంలోగాని భేదాలు మాకేమీ కనిపించేవి కావు. మరి పుచ్చపువ్వుల్లాంటి వెన్నెల కాసే రాత్రిళ్లు కూడా ఈ ఆట ఆడేవాళ్లు.

ఇక ఉప్పట్టి అసలు తెలుగువారి ఆట. చెప్పేనుగా సోమన్న హరివంశంలో ఈ ఆట ఆడించేదని! ఈ ఆటలో మెదడూ, ఒడలూ కూడా ఎక్కువ చురుకుగా పని చెయ్యాలి. మరి తోటలలో పడి కోతికొమ్మచ్చులూ, రచ్చసావడుల ముందు గోటీబిళ్లలూ, సందు గొందులలో గోళీకాయలూ, కుండబంతులూను! అయితే అసలైన మొగ ఆట చెడుగుడు.

ఇక బాలికల ఆటలున్నాయి– వీటిలో ఆడపిల్లల వంటి మగ పిల్లలు కూడా దూరుతుంటారు– గుజ్జనగూళ్లు, గొల్ల స్తంభాలూ, వెన్నెల పువ్వొత్తులూ, దూదుంపుల్లలూ, పచ్చాకులూ, పిచ్చికగూళ్లూ, వీటి అన్నిటిలోకి సొగసైన ఆట– అందమూ, ఆనందమూ చిందేది– “బుజ బుజ రేకుల పిల్లుందా?” అనేది. దాగుడు ముచ్చీలలో ఎంత అన్యాయమైనా చేయవచ్చు. ఈ ఆట కెప్పుడూ ఒక అమాయకుడవసరం – అదే పనిగా దొంగ అవడానికి.

కాస్త కలవారి ఇళ్లల్లో ప్రత్యేకం స్త్రీ లాడేవి గచ్చకాయలూ, సొగటాలున్నూ. వీటిలో ఒక్కొక్కప్పుడు కొత్త అల్లుళ్లున్నూ, చిన్న తమ్ముళ్లునూ చేరుతుంటారు; ఓడి పోతుంటారు కూడా.

పురుషులలో చదరంగం– ఇది మేధావుల ఆట. ఈ ఆట అంటే మతిపోయే వాళ్లకి తప్ప మిగిలిన వాళ్లకి వినోదమేనా అనిపిస్తుంది. అయితే ఈ ఆటలో మహా పట్టుదల లొస్తాయి. మా గ్రామంలో ఇద్దరు పెద్దమనుష్యులను ఎరుగుదును. రోజూ జుట్టు ముళ్లూ, కట్టు పంచెలూ సడలేవరకూ పోట్లాడి, మర్నాడు మళ్లీ కలిసి చదరంగం బల్లముందు కూర్చునేవారు. ఈనాడు ఇంట్లో ఆడే ఆటల్లో పేకాట ప్రభువు. పల్లెటూళ్లల్లో, పట్టణాల్లో ప్రళయంగా రేగిపోతూ ఉంది.

ఇప్పుడు ఎందరో ఎరగనిదీ, పాతిక సంవత్సరాల క్రితం దాకా బ్రతికి ఉన్నది, సంస్థానపు టూళ్లల్లోనూ, సామంతులలోనూ సామాన్యమైనదీ, ఉల్లాసం కలిగిస్తూ హుందాగా ఉండేదీ, వినోదం మాత్రమే అయినా కించిత్తయినా పుణ్యం సంపాదించి పెట్టేది “దశావతారీ” అనే ఆట ఆడేవారం. పది అవతారాలూ పది రంగులు. అందంగా, రకరకాల రంగులలో, గుండ్రంగా ముక్కలు నూట ఇరవై. ముగ్గురు ఆడవచ్చు; నలుగురు ఆడవచ్చు. మధ్యసొగసైన ఏలూరి తివాసీ పరచి ఉండాలి. నాలుగు వైపులా నలుగురూ కూర్చుంటారు. కోరమీసాలూ, మెరిసే చూపులూ, తాంబూలపు పెదవులూ, పొందానులూ, వీలుంటే వెనకాల దిండ్లూ! ఈ ఆటలో జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉండాలి. నూట ఇరవై ముక్కలాయెను! ఏమాత్రం మరచిపోయినా ఓటమి తప్పదు. కనుక ఒడుపుగా ఉండాలి. దశావతారీలో పేకాటలో ఉండే దురుసు లేదు. ఆ రోజుల్లోనే నిదానంగా నడిచే ఆట. ఈ ఆటలో రూపాయి చప్పుళ్లకు వీలులేదు. పరశురామం, బలరామం,బుద్ధం అంటూ భగవంతుడి పేర్లే వినబడుతూంటాయి. సాధారణంగా విజయనగరం, పిఠాపురం వంటి సంస్థాన పట్టణాలలో ఎక్కువగా ఆడేవారు. ఉద్యోగులూ, కలవాళ్లు, సామంతులూ, సంస్కారులూ ఆడేవారు. నా చిన్నతనంలో కూడా దశావతారీ దస్త్రం మా ఇంట ఉన్నది పాతదైతే, పర్లాకిమిడి నుంచి తెప్పించుకొన్నాం. కొండపల్లి బొమ్మలు తయారుచేసేవాళ్లు ఎంత కళానిపుణులో, దశావతారీ తయారు చేసేవాళ్ళూ అంతే. ఇప్పుడు వాళ్లేమయ్యారో! దశావతారీ ఏమయిందో! అయితే ఏవో కొత్త ఆటలొచ్చాయి. అవీ దేశి సరుకులవుతాయేమో!

పేకాటకు దశావతారీ అన్న. గోటీబిళ్ళ ముదిరి క్రికెట్టయిందేమో! అలాగే కుండ బంతికి బేస్‌బాల్. ఇలాగే మిగిలినవన్నీను!

– రేడియో ప్రసంగం : 1952, డిసెంబరు

పిలకా లక్ష్మీనరసింహమూర్తి

నవ్యాంధ్ర చిత్రకళ

నేటి తెనుగు చిత్రకళా స్వరూపమును విశదము చేయుట ఈ వ్యాసము ఉద్దేశ్యము. పూర్వాంధ్ర శిల్పచిత్ర కళల యందలి సంప్రదాయములను దృష్టిలో ఉంచుకుని ఎవరెవరు కృషి చేస్తున్నారో తెలుసుకోవటము కూడా అవసరము.

తెనుగు చిత్రకళ అంటే తెలుగు చిత్రకారులు చిత్రించిన చిత్రములు; మలచిన శిల్పఖండములు– జానపద చిత్రములు మొదలయినవన్ని తెలుగు చిత్రకళ అని నా యుద్దేశ్యము. ఆంధ్ర చిత్రకారులెందరో ఉన్నారు. వారిలో సమగ్రమయిన దృష్టితో వేసిన చిత్రములే గణనకు వస్తాయి. ఆంధ్రచిత్రకళలో ఆంధ్రుల చరిత్ర– విజ్ఞానము– సాంఘిక జీవనము మొదలయిన విషయాలు ఎంత ఎక్కువగా చిత్రములలో ప్రతిబింబించితే అంత గొప్ప చిత్రకళగా అది వర్ధిల్లుతుంది.

నేడు దేశమంతటా వంగ చిత్రకళ అనే పేరుతో ఒకరకమయిన చిత్రములు ప్రజలు చూస్తున్నారు. ఆంధ్ర చిత్రకారులు కొందరు వంగీయులను అనుకరిస్తున్నారని కూడా అంటున్నారు. ఇవి తెలియనివాళ్ళు అనుకుంటూన్న విషయాలు. ఈ అభిప్రాయము కొందరిలో ఎలా వచ్చిందంటే, కొందరు ఆంధ్రచిత్రకారులు వంగీయుల వద్ద చిత్రకళ నేర్చుకున్నారు. ఆంధ్రదేశానికి చిత్రకళాధ్యాపకులుగా ప్రమోదకుమార చట్టోపాధ్యాయ, రమేంద్రనాథ చక్రవర్తిగారలు వచ్చారు. వీరిద్దరు ఆంధ్రజాతీయ కళాశాలలో కొంతకాలం పనిచేశారు. చిత్రకళాధ్యాపకులు వంగీయులైతే వారి శిష్యుల చిత్రములు వంగ చిత్రకళఅని, ఆంగ్లేయ చిత్రకళాధ్యాపకులైతే వారి శిష్యుల చిత్రములు ఆంగ్ల చిత్రకళ అని అంటే అది అలా అనేవారి తెలియనితనాన్ని చాటుతుంది. ఒక గురువువద్ద కొందరు చిత్రకళ నేర్చుకుంటే వారి చిత్రములలో ఆధ్యాపకుల ప్రభావము ఉండటము సహజము. బుద్ధిమంతుడైన శిష్యుని చిత్రములలో అతని వ్యక్తిత్వము ప్రస్ఫుటంగా కనిపించాలి. గురువును యావజ్జీవితము ఒక శిష్యుడు అనుకరిస్తూన్నాడంటే అది శిష్యుని దౌర్భాగ్య మనుకోవాలి.

తరువాత ఆంధ్రులు వేసే బొమ్మలలో ఆంధ్రత్వం ఉండాలంటారు. బొమ్మలు మాత్రం గ్రీకు చిత్రమువలె చిత్రించుతూ, ఆహార్య రచనలో తెలుగుకట్లు కట్టినంత మాత్రన అది ఆంధ్ర చిత్రకళ అవదు. బొమ్మలలో రావలసిన ఆంధ్రత్వము ఆంధ్రుల విజ్ఞానముతో మేళవించి చిత్రించిన చిత్రములో వస్తుంది. తరువాత అఖిలాంధ్రదేశములో ఉన్న చిత్రకారులేకాకుండా అన్యరాష్ట్రాలలో ఉన్న తెనుగు చిత్రకారుల కృషికూడా ఆంధ్రచిత్రకళగానే వ్యవహరింపబడుతుంది. తెనుగుశిల్పి ఏ గడ్డపైనిలిచి కళాతపస్సు చేసినా అది ఆంధ్రచిత్రకళ అవుతుంది. ఏ ప్రజలతో కలిసి మన చిత్రకారులు జీవించి, ఏ ప్రజల సుఖఃదుఃఖాలు – వికాసము, తనలో ఇముడ్చుకుని ఏ మహదాశయాలతో కృషిచేసినా అది ఆంధ్రచిత్రకళ అంటాను. తెనుగుచిత్రకళాధిదేవత సమగ్ర సౌందర్యమును తెనుగు శిల్పులు

పూర్వయుగములలో శిల్పించి చిత్రించారు. నేడు కూడా కృషి చేస్తున్నారు. అయితే ఆనాటి విశిష్టత వేరు. నేటి విన్నాణము వేరు. ఆనాటి జీవితము వేరు. నేటి జీవిత సంఘర్షణలు వేరు. ముఖ్యమయిన విషయము ఏమిటి అంటే నేటి చిత్రకారులకు అన్యదేశముల సంస్కృతీ సంప్రదాయములతో శిల్ప చిత్రకళలలో కలయిక ఏర్పడుచున్నది. ఆ విధముగా నవ్యాంధ్ర చిత్రకళలో ఎంతో వైవిధ్యమున్నది.

ఇంక ఆంధ్రదేశములో దాదాపు ముప్ఫై ఏళ్ళనించి చిత్రకళలో కృషి జరుగుతోంది. పలుచోట్ల లలితకళాశాలలు వెలసినవి. వాటిలో ముఖ్యమయిన వాటిని పేర్కొని వాటి కృషిని వివరించుతాను. ఒకప్పుడు దామెర్ల రామారావుగారితో మసలిన కళాచైతన్యము యువకులను ఉఱ్రూత లూగించినది. ఆ కళా తపస్వి అందుకోజూచిన మహోన్నత కళా శిఖరాలను వారి శిష్యప్రశిష్యులు కూడా అందుకోవలెనని అఱ్ఱులు చాచారు. తెనుగునాట చిత్రకళ పేరిట ఈ మహనీయుని కృషి ఆంధ్రులకు చిరస్మరణీయమైనది. ఈ ఆదర్శమూర్తి ఒసగిన కళాచైతన్యము మమ్మల్ని ఉఱ్రూతలూగించి– మా కృషికి చేయూతనిచ్చి ముందుకు నడిపించినది. కళల పేరిట తెలుగునాట వెలసిన నందనవనములో రామారాయని తపఃఫలితముగా మరికొన్ని కొత్త మొలకలు బైలుదేరినవి. కొత్తపూలు పూచి వినూత్న పరిమళములు విరబోసినవి. రాజమహేంద్రవరములో రామారాయ లలితకళాశాల వెలసినది. దీనిని దాదాపు ఇరవై ఏళ్ళనించి ఒక బక్కపలుచని మానిసి నిర్వహించుచున్నారు. ఈయన పేరు వరదా వెంకటరత్నము. ఉఫ్ అని ఊదిన కొట్టుకుపోవు శరీరదార్ఢ్యమీయనది. అచంచలమైన సంకల్ప బలముతో అదుముకొనలేని ఆవేశమూర్తి వెంకటరత్నము. ఆయన రామరాయని నెచ్చెలి– ఏకలవ్య సంప్రదాయము నెరపుకొనిన శిష్యుడు. రామరాయని స్మృతి చిహ్నముగా నెలకొల్పిన లలిత కళాపీఠమునకు అనేకమంది యువకులు చేరి కళాస్నాతకులైనారు. కాని వారిలో అనేకులు జాతీయ చిత్ర రచనా సంప్రదాయములను ఉపేక్ష చేసినవారు. ఇక్కడ వారికి పాశ్చాత్య నీరస ప్రభావము సోకి– సోష వచ్చినదని నాయూహ.

తరువాత ప్రమోద కుమార చట్టోపాధ్యాయుల కళా జిజ్ఞాస తెలుగు చిత్రకళకు ఒక కొత్త సొరు కూర్చినది. ఇచటి చిత్రకారులలో చాలామంది చక్కని సంస్కారులు. ఈ కళాపీఠముచెంత కుడా పలువురు గుమిగూడినారు. కొందరు అతిసమర్థులు. కొందరు కళాభాయీలు కలలుమాత్రమే కని సరిపుచ్చుకున్నారు. కొందరు ఛటర్జీగారి సంప్రదాయమును అందిపుచ్చుకున్నారు. స్వతంత్రత జూపినవారు అరుదు అయినా అక్కడ తయారయిన ప్రతిచిత్రము నవ్యాంధ్ర చిత్రకళలో గణనకు వస్తాయి. తెలుగునాట పాతిక ముప్ఫై ఏళ్ళనించి జరుగుతూన్న కృషిచూస్తే ఎన్ని మెరుపులు! అందులో జాతీయ కళాశాల కోస్తా చిత్రకారులను ఒక అక్కునచేర్చి చక్కని కృషి చేయించినది.

ఇటు దేవీప్రసాదు రాయచౌదరిగారి అధ్యాపకత్వములో చిత్రకళ నేర్చిన చిత్రకారులలో ఆరాధనాబలము– కళాదీక్ష అన్నింటిని మించి కొత్తదారులు తొక్కాలనే తహతహ ఉన్న చిత్రకారులు బయలుదేరారు. దేవీప్రసాదుల శిష్య ప్రశిష్యులు స్వేచ్ఛ వలచిన వాళ్ళు. స్వేచ్ఛలో కూడా నియమము అంతర్లీనమయి ఉంటుంది. కనుక వీళ్లది నియమబద్ధమయిన స్వేచ్ఛ అని నా ఊహ. కాని వీరిలో కొందరు పెరగాలనేమాట మరచిపోయి స్కూలులో నేర్చుకున్న దానితోనే కాలక్షేపము చేస్తూ ఉన్నట్లు కనపడుతుంది.

ఇంకా ఏలూరులో కొంతకాలము శ్రీమంత్రవాది వెంకటరత్నముగారు శారదానికేతనములో పనిచేసిన రోజులలో ఆంధ్రచిత్రకళ పేరిట మంచి కృషి జరిగినది. తరువాత ఆ చిత్రకారులు ఏమయినది ఎవరికీ తెలియదు.

ఈపైన చెప్పినవారే కాకుండా అవనీంద్ర, నందలాలు గారలవద్ద చిత్రకళ నేర్చుకొన్న వారు కొందరున్నారు. దాదాపు పదిహేను సంవత్సరములనించి అజ్ఞాతముగా పనిచేస్తూన్న ఆంధ్రచిత్రకళా పరిషత్తులో కొందరు వున్నారు. ఇంతమంది ఆంధ్ర చిత్రకారులలో ఎవరిని వేలుమడిచి చెప్పను? ఎవరిని కాదనను? అందరు ఆంధ్రజనని అనుగుబిడ్డలే. ఇంతమంది ఆంధ్ర సరస్వతికి వినీతాంజలులు ఘటించినవారే. అందరు ఆంధ్ర చిత్రకళకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలనే సంకల్పించినవారే. నేటి తెనుగు చిత్రకారులలో ఇన్ని రకాలవారు ఉన్నారు. నవ్యాంధ్ర చిత్రకళ పుట్టిన దెచ్చట–మెట్టిన దెచ్చట –అంటే అందరిని చూపుతాను. ఏ కొద్దిమంది కృషి అయినా గణనకు రావచ్చును కదా. ఇదే ఆంధ్ర చిత్రకళ. ఇది కాదు అన్న అవివేకము కొందరు ప్రదర్శించారు. అది దూరదృష్టిలోపించుట వల్ల సిద్ధించినది. ఈ ఆంధ్ర చిత్రకళోద్యమమునకు పెద్దలే ప్రాతిపదిక వేసినారు. యువకులు పలు విధముల కృషిచేస్తున్నారు. ఒకరు సాధించజూచిన ఆదర్శనమును వారందుకొనలేకపోవచ్చును. అందుకున్నా అది సువిశాలమైనది కాకపోవచ్చును. అది తరువాత తరములవారు ఏల సాధించకూడదు? ఆంధ్రదేశములో కొందరు చిత్రకారులు స్వేచ్ఛ వలచి రెక్కలువిప్పి నూతన పథములైనా రన్నది సత్యము. వారి కృషిఫలితము కాలమే నిర్ణయిస్తుంది. కనుక పెద్దలు కలవరపడనవసరము లేదు.

ఏ విషయములోనయినా ముందు నడిచిన వాడు ఘనుడు. వెనుకటివారిని కూడా సుగమమయిన పథమున నడిపించగలిగినవాడు నాయకుడు. మరి అంతా బలహీనులైతే వారిలో ముందు నడిచినవాడు కూడా కొంత నయమే. కాని అర్భకునిలో ముందువెనుకలు అంత గణనకురావు. లలితకళలలో ముందు నడిచినవాళ్లు నాయకులులాంటి వాళ్ళు. కాలావధులుదాటి, ప్రజలనాడులలో నవజీవనచైతన్యము కలిగించే ఉత్తమ చిత్రములు చిత్రించిననాడే వారి ఘనత, నాయకత్వము సుస్థిరమవుతాయి. అందులోను నవీన యుగములో అచ్చుయంత్రములను అంటిపెట్టుకొని వస్తూన్న కృషి ఎంత రాలిపోతుందో ఎంత ప్రజా హృదయాల్లో సుస్థిర నివాసమేర్పరచుకొని వెలుగొందుతుందో చప్పున తేల్చి చెప్పటము అంత సులువైనపనికాదు. అంతేకాక మనము యుగసంధిలో ఉన్నాము. కనుక లలితకళలలో ముందు దారి తీసినవాడల్లా ఘనుడనుకుంటే, అందరికన్న ముందువచ్చిన రాజా రవివర్మ నేటి భారతీయ చిత్రకళలలో దిట్ట అయి ఉండవలసినది. కాని అట్లు జరగలేదు. రవివర్మ పాశ్చాత్య అనుకరణవ్యామోహముతో నేటి భారతీయ చిత్రకళలో అంధయుగము ఆరంభమయినట్లు లిఖింపబడినది. తరువాత సృజనాకౌశలము ప్రధానముగా అంగీకరించిన లలితకళల విషయములో ఒకరిని అనుకరించుటము అసలే పనికిరాదు. ఒకరి ప్రభావము ఒకరిపై పనిచేయవచ్చును. ఆ ప్రభావము తెర తొలగించి నిజసందేశమును ఈయగలిగిననాడే ఏ దేశంలోనైనా లలితకళలు వర్ధిల్లుతాయి.

నేటి భారతీయ చిత్రకళలోనే, నూతన శకము ఆరంభమయి అర్ధశతాబ్దమయినా కాలేదు. పాశ్చాత్య ప్రవాహపు వెల్లువలో ఇంకా మనము కొట్టుకుపోతూనే ఉన్నాము. ఇంతవరకు జాతీయ జీవితము ఊపిరిపోసుకుని పైరుగాలిలో రవంత చిగిర్చినచో లేదో! ఆంధ్ర చిత్రకళారంగములో అవును కాదనే తర్జనబర్జనలకంటె శ్రమించి పనిచేయుటము సమంజసమని తోస్తుంది. అన్నింటికంటే ముందు కళాకారులు జాతీయతతో పనిచెయ్యాలి. ఇల్లా అంటున్నానని చిత్రకారులు కళను ప్రచారకేంద్రము చేయసంకల్పించితినని నన్ను అపార్థం చేసుకొనకుందురుగాక. ఇప్పుడు విశ్వవిశాలములైన ఆదర్శములంటూ కూర్చుని పునాదులులేని గాలిమేడలు కట్టడం భారతీయ చిత్రకళలకే దెబ్బ. సుస్థిరమైన జాతీయతపైన అంతర్జాతీయ నిలపవలెను. ఇది శిల్పచిత్రకళలలో ఆంధ్రులు చేయవలసిన ముఖ్యమయినపని. ఒక వ్యక్తి, ఒకజాతి, ఒక దేశము, ఒక ఉత్కృష్ట భావమును జీవింపజేయవలెను. ఒకగొప్ప జీవితముతో విస్మరించిన పూర్వాంధ్రప్రతిభ శిల్ప చిత్రకళలో రూపొందవలెను. ఆంధ్రుల ఔన్నత్యమును చిత్రకారులు ఇతివృత్తముగా పొదిగి ఉత్తమకళాఖండములు రచించవలెను.

ఇచ్చట ఒక మనవి. మనవాళ్ళు పూర్వాంధ్రశిల్ప- చిత్రకళా సంప్రదాయములు కూలంకషముగా వినిమయం చేసుకుంటేనే అసలైన ఆంధ్రచిత్రకళ అవతరిస్తుందని నా యుద్దేశ్యము. పూర్వము ఇవి వ్యక్తి నిత్యజీవితావసరాలు మొదలుకొని మముక్షువగు పర్యంతము స్వర్ణసోపానములు నిర్మించి అధిరోహింపచేసినవి. కొండపల్లి బొమ్మలు, బందరు కలంకారీ అద్దకములు మొదలైనవన్నీ ఆంధ్రుల అపూర్వ సంప్రదాయములు. చిత్రకళ నిత్యోపయోగమయిన వస్తువులపై విరాజిల్లిన తీరు చూపరులకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ద్వారబంధములపై దారుచిత్రములు, అలంకృతమయిన దీపపు సెమ్మాలు, కరదీపికలు, పోకచెక్కలు కత్తిరించేకత్తెరలు, అరివేణములు, కంచు, రాగి మొదలయిన లోహపాత్రలు, కొయ్యబొమ్మలు, యోధులు ధరించే కవచములు, ఆయుధములకు రత్నములు పొదిగిన పిడులు, ఒకటేమిటి జీవితమంతా కళామయం అనిపించారు పూర్వులు, అడుగడుగునకు అందాలు మలచారు. శిల్పచిత్రకళలు ఏ కొద్దిమంది విలాసపురుషుల కోసమో పుట్టలేదని, మానవ జీవితములో నిరుపేద మొదలుకొని అద్దాలమేడలో అధివసించే శ్రీమంతులవరకు వెలసి, ప్రజాదరణ అమితంగా పొందాయని చెప్పాలి. దానికి నిదర్శనము ఆనాడు వాటికుండేవిస్తృతి. ఇంకా అఖిలాంధ్రదేశములోను పల్లెపల్లెకు తిరిగితే ఎన్నో పురాతనవస్తువులు, చిత్రములు మనకు లభిస్తాయి. వీటిని నేటి ఆంధ్ర చిత్రకారులు సేకరించవచ్చును. ఇట్టి పనులకు ఆంధ్రవిశ్వవిద్యాలయము చేయూత నొసగవచ్చును. ఇలాంటిపనిని వంగదేశములో వారి విశ్వవిద్యాలయము చేపట్టి వంగచిత్రకళకు సుస్థిరమైన రూపమేర్పరచినది. ఆంధ్రదేశములో లేపాక్షి, మాచెర్ల మొదలయిన పురాప్రసిద్ధికల ఊళ్లలో పాడుపడిన దేవాలయములలో ఎన్నో అద్భుత కుడ్యచిత్రములున్నవి. అంతేగాక ప్రతిపల్లెటూరులోను సాధారణముగా రామాయలము ఉంటుంది. అక్కడ సాయంత్రమువేళ గ్రామీణులు రామభజన చేసుకుంటూ ఉంటారు. ఆ ఆలయము గోడలపైన చక్కని చిత్రములు ఆ ఊరిశిల్పులు చిత్రిస్తూ ఉంటారు. అవి ఏటేటా మారుతూ ఉంటాయి. పాతబొమ్మలు వెల్లఅడుగున కప్పబడిపోతాయి. మళ్ళీ కొత్త గాథలు భారత, భాగవత, రామాయణములనించి ముచ్చిలు చిత్రిస్తూవుంటారు. ఈ బొమ్మలకు కాలక్రమేణ రానురాను తగిన ఆదరణలేక అవి మూలపడినవి. ప్రసిద్ధ పాశ్చాత్య రచయిత అయిన ఎరిక్ గిల్ నేడు భాతరదేశములో పాశ్చాత్యచిత్రకళా వ్యామోహములతోవేసిన అనుకరణ చిత్రములకంటె ఈ గ్రామీణుల కుడ్య చిత్రములు గొప్పవని చెప్పి ఉన్నాడు. ఈ కుడ్య చిత్రములలో కూడా ఒక చక్కని సాంప్రదాయం ఉండేది. అది రానురాను స్థంభించి జీవము కోల్పోయినది. అయినప్పటికీ అవి ప్రభుత్వ లలిత కళాశాలలోకూడా మన చిత్రకారులు వేస్తూన్న చిత్రములకన్న ఎంతో బాగుంటాయి అని ఆయనే చెప్పి ఉన్నాడు. వాటిమీద గొల్లకలాపము, భామకలాపము మొదలయిన గాథలు చిత్రితమౌతూ ఉంటాయి. ఇంకా నేపథ్య చిత్రములు- పూర్వము ఎంతో వాడుకలో వుండేవి. అవి సంపన్న గృహస్తుల ఇళ్ళల్లో వుండే తెరలపైన పూర్వపు శిల్పులు చిత్రించినవి. ఒక విధముగా ప్రఖ్యాత భారతీయ చిత్రకారులైన నందలాలు బోసు ఇట్టి పురాతన సంప్రదాయములనెన్నింటినో హస్తగతము చేసుకొని గొప్ప చిత్రములను చిత్రించి ధన్యుడైనాడు. వంగదేశములో రవీంద్రకవి శాంతి నికేతనము నెలకొల్పి అచ్చటి శిల్పచిత్రకళల కోసం దేశీయ సంప్రదాయములలో గట్టివాళ్ళయిన పనివాళ్లను దేశంలో మారుమూలలనించి పిలిపించి ఆ పద్ధతులను అక్కడి చిత్రకారులకు నేర్పించారు. ఆ విధముగా తెలుగునాటవున్న చిత్రకళా సంస్థలు చేయలేకపోయినవి. కొన్ని పాశ్చాత్య వ్యామోహములో కొట్టుకొనిపోయినవి. కొన్ని వంగీయులను పిలిపించి పూర్వాంధ్ర సంప్రదాయములను విస్మరించినవి. ఇంతవరకు ఆంధ్రదేశములో లలిత కళాసంస్థలు ఆంధ్రచిత్రకళ పేరిట యథార్థమయిన కృషి జరపలేదు. ఇకముందయినా ఈ సంస్థలు మేలుకొని స్వశక్తిపై ఆధారపడి-నూతనోత్సాహముతో కృషి చేయాలి. నిజంగా ఆంధ్ర చిత్రకళాకారులలో పెద్దలలోనైతేమి; యువకులలో నయితేమీ ఎందరో ప్రతిభావంతులు ఉన్నారు. ఇంతవరకు జరిగిన కృషి కొంతవరకు మంచిదనే అనాలి. కాని ఆంధ్రచిత్రకళ అని మనము గొప్పగా చెప్పుకోతగ్గకృషి ఇంకా జరగవలసివుంది. దానికి అందరు కలిసి సమగ్రమయిన సమన్వయదృష్టితో పనిచెయ్యాలి. కొందరు యువకులు పెడదారులు తొక్కుతున్నారని పెద్దలు కంగారుపడిపోతున్నారు. అదికాదు. సజీవమైన కళలో కదలిక ఉంటుంది. అది పురోగమిస్తుంది. మార్పు ఎలాగూ వస్తుంది. వచ్చే మార్పుకు నియమాలు ఏర్పడతాయి. ఈలోగా పెద్దలు కంగారు పడకుండా వుండాలి. ఇంతవరకు గీటురాయికి ఏ బొమ్మలు ఆగుతాయో నేడే తేల్చనక్కరలేదు.

ఆంధ్రదేశములోనేకాదు - ఎక్కడయినా ఏ ఒక్క సంస్థ శాశ్వతముగా చిత్రకళ పేరిట ఉత్తమమయిన కృషి జరుపుతుందని మనము హామీ ఇవ్వలేము. కొన్ని ఆదర్శములతో కొన్ని సంస్థలు బయలుదేరుతాయి. ఆ ఆదర్శముల పొట్టి పొడవులను బట్టి వాటి కృషి, అవి బ్రతుకవలసిన కాలము నిర్ణీతమయివుంటుంది. కనుక సంస్థను నడిపే ప్రధానవ్యక్తి ఆత్మపరిశోధన చేసుకోవటము ఎంతైనా అవసరము. దానినిబట్టి కళారంగములో అత్యుత్తమమయిన కృషి జరగుతుంది. కొత్త ఆదర్శములతో బయలుదేరే సంస్థలయెడల పెద్దలు ఓర్పు కలిగి ఉండాలి. ఈ కళా స్రవంతి ఒకచోట ఆగేదికాదు. ఒకవ్యక్తి కనుసన్నలో కొంతకాలము మసిలనా-నిరంతరాన్వేషణ- కళకు కళల సహజధర్మము. ఆంధ్రచిత్రకళాకారులలో పెద్దలు చక్కని కృషిచేశారు. యువకులు ముందుకు పోతున్నారు. అసలైన ఆంధ్రచిత్రకళవారి ప్రయత్నములో, వారి కళాదీక్షలో ఫలించవలెనని పెద్దలు ఆశీర్వదించిచేయూత ఒసగడము చేయవలసిన పని. ***(కిన్నెర, డిశెంబరు 1949)***

గోపాలకృష్ణ అబ్బూరి

తూర్పు ఆశియా దేశాలకళపై ఆంధ్రుల కళ ప్రభావము

నాగరిక ప్రపంచంలో ఇచ్చిపుచ్చుకోవడం అనేది అన్ని జాతులకూ, దేశాలకూ, సర్వసామాన్యమైన విషయమే. ఇచ్చి పుచ్చుకోవడాలు తెలియని దేశంకాని, జాతికాని నాగరికం అని చెప్పుకొనడానికి తగనిది. జాత్యహంకారులు ప్రపంచంలోని అన్ని దేశాలలోను అన్ని కాలాలలోను ఉంటూనే ఉంటారు. తమ జాతి విశిష్టమైనదని, తమ నాగరికత ఇవ్వడమె గాని పుచ్చుకోవడం ఎరగదని ఈ జాత్యహంకారులు చెబుతూ వుంటారు. ఒక వేళ అలాంటి జాతిగాని దేశంగాని ఉన్నదంటె దాన్ని మనం మృతప్రాయంగానే పరిగణించాల్సి వుంటుంది. మరణం ఒకటే ఇచ్చి పుచ్చుకోవడం ఎరగనిది. ఇచ్చిపుచ్చుకోవడం జీవితానికి ప్రధాన లక్షణం.

ఆంధ్రదేశం, ప్రాచీనకాలంలోనూ, నేడు కూడా ఇచ్చిపుచ్చుకోవడంలో ఏదేశానికి తీసిపోలేదు. చరిత్రలో ఆంధ్రదేశానికి చెందిన శిల్పులు తమదేశానికి అజరామరమైన ఖ్యాతిని సంపాదించిపెట్టారు. దూర తీరాలనుంచి వచ్చిన ఎన్నో వ్యాపారనౌకలు ఆంధ్రతీరాన లంగరుదించి తమ తమ దేశాల సంస్కృతిని ఆంధ్రులకు కానుకగా చెల్లించారు. వచ్చిన కానుకలను స్వీకరించిన ఆంధ్రులు అంతటితో ఊరుకొనక తమ సంస్కృతిని విదేశతీరాలకు కొనిపోయి అక్కడి సంస్కృతులను సుసంపన్నం చేశారు. ప్రాచీన నాగరిక ప్రపంచంలో ఆంధ్ర సంస్కృతిని అందుకొనని దేశాలు చాలా అరుదు. ఇటలీ దేశంలోని సాంపె ఆంధ్రదంత శిల్పులపనితనాన్ని చవిచూసింది. పోర్చుగల్లు కలంకారీ వస్త్రాలనుంచి అలంకరణ పాఠాలను నేర్చుకుని తన చర్చీలను అలంకరించుకుంది. ఆంగ్ల భాషకు తన పదాలను ఎరువిచ్చింది ఆంధ్రదేశం. జపాను దేశానికి "షామిసెన్" వాద్యాన్ని సమర్పించింది. రోమక దేశపు బంగారం ఆంధ్ర భూమికి కాలువలై ప్రవహించింది.

ప్రాగైతిహాసిక కాలపు సింధు నాగరికత అంతరించిన తర్వాత సుదీర్ఘ అంధయుగాన్ని అనుభవించిన దేశంలో అనేకమంది మహానుభావులు జన్మించి తమ మేధాసంపత్తితో జాతి సర్వతోముఖవికాసానికి పునాదులు వేశారు. వారిలో గణనీయుడు పరమ కరుణాళువు సిద్ధార్థ గౌతముని అవతరణ యావత్ప్రపంచానికి మరపు రాని మహత్తర సంఘటన. లోకోత్తరుడైన తథా గతుని భావవీచికలలో మునిగితేలి మత్తిల్లిన శాంతి కాముకులు దేశదేశాలలో తథాగత వాణిని ప్రసారంచేశారు. నాగరికతా మార్గానికి ఎన్ని దేశాలనో మరలించారు.

ఏ సుముహూర్తాన యేపుణ్యాత్ములు భట్టిప్రోలు, జగ్గయ్యపేట, అమరావతీస్తూపాలను శంకుస్థాపన చేశారోగాని కాలక్రమేణా ఈ కేంద్రాలు బౌద్ధమతప్రసార కేంద్రాలయి విస్తరించి సర్వ ప్రపంచాన్ని విస్మయంలో ముంచే మహత్తర కళాసృష్టికి రాజధానులైనాయి. తూర్పుచంపా (నేటి వియట్నామ్)

వరకునూ, దక్షిణాన సింహళంవరకు విస్తరించిన ఈ మహాకళాసామ్రాజ్యానికి అమరావతి రాజధానియై తరించింది. ఈ కళాసామ్రాజ్య నిర్మాతల కృషిని అంచనా వెయ్యడమే ప్రస్తుత వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం.

ఆంధ్రదేశం బౌద్ధ ప్రపంచంలో చాలాకాలం ప్రముఖస్థానాన్ని ఆక్రమించి ఉన్నప్పటికీ ఇతర దేశాలపై ఆంధ్ర సంస్కృతిప్రభావం ఎంతగాను ఉన్నప్పటికీ, ఈ విషయాలను గురించి సక్రమంగానూ హేతుబద్ధంగానూ పరిశోధన జరగలేదనే చెప్పాలి. ప్రాచీనాంధ్రదేశంతో ఎన్నో దేశాలు వర్తక వాణిజ్య సంబంధాలను కలిగిఉన్న విషయం చాలామంది చరిత్రకారులు వివరంగానే ఉట్టంకించినా, సాంస్కృతిక విషయాలలో మాత్రం ఆసక్తి చూపించడంలేదు. ఒక దేశ సంస్కృతి మరొకదేశంపై తన ప్రభావాన్ని ఎంతగాఢంగా ప్రసరించినప్పటికీ రెండోదేశం తననుతాను మరచి పోగలగడం అసంభవం. ఇతర దేశ సంస్కృతిని తనలో విలీనం చేసుకొని తన స్వంత సంస్కృతిని పరిపుష్టం చేసుకోగలశక్తి ప్రతీదేశానికీ ఉన్నది. అందువల్ల ఒకదేశపు సంస్కృతీ ప్రభావం మరొక దేశంమీద స్వల్పంగా మాత్రమే ఉండగలదు. ఈ విషయాన్ని విస్మరించేవారు జాత్యహంకారులూ, సామ్రాజ్యవాదులూ అయివుంటారు. భారతదేశం నుంచి ఇండోనేషియా, బర్మా, సయాం మలయా, జావా, కంబోడియా, ప్రాచీనచంప దేశాలకు వలస పోయినవారు ఆయా ప్రాంతాలలో భారత సాంస్కృతిక ప్రభావాన్ని తెలిపే నిర్మాణాలు చేసినప్పటికీ త్వరలోనే స్థానిక సంస్కృతి, విదేశీ సంస్కృతిని తనలో విలీనంచేసుకొని నూతన సంస్కృతిని యేర్పరచుకోవడం జరిగింది. కొన్ని సందర్భాలలో భారతదేశం నుంచి శిల్పశైలులను పరిగ్రహించిన దేశాలు భారతదేశాన్ని మించిపోయే నిర్మాణాలు చెయ్యడం కూడా మనం గమనించవచ్చు. ఈ కారణాలవల్ల ప్రాచ్యదేశాల శిల్పంపై ఆంధ్రశిల్ప ప్రభావాన్ని మనం పరిశీలించేటప్పుడు ఆయాదేశాల శిల్పాలను ముమ్మూర్తులా ఆంధ్రశిల్పానుకరణలుగా పరిగణించడం అనుచితం అవుతుంది.

అశోకుని జీవితకాలంలోనే ఆంధ్రదేశానికి బౌద్ధం వచ్చి ఉండాలి. అమరావతి, భట్టిప్రోలు, జగ్గయ్యపేట స్తూపాలు అప్పుడే నిర్మితమై ఉండి ఉండాలి. ఇటీవలనే అమరావతిలో లభించిన ఆశోక శాసన శకలమూ, మౌర్యయుగానికి చెందిన ఎన్.బి.పి. పేరున వ్యవహృతమౌతున్న ఒక విధమైన నల్లని మెరుగుతీరిన మృణ్మయపాత్ర శకలాలూ ఈ విషయంలో ప్రబలమైన సాక్ష్యాధారాలు. కొందరు చరిత్రకారులు అశోకునికి పూర్వమే బౌద్ధం ఆంధ్రదేశంలో ప్రకాశించిందని వాదిస్తున్నారు. ఈ వాదానికి ముఖ్యంగా ప్రాచీన బౌద్ధగ్రంధాలలోని కొన్ని ప్రస్తావనలే ఆధారం. భట్టిప్రోలు స్తూపంలోని ధాతుక దండం మీద చెక్కిన శాసనాలు అశోకునికన్నాముందుకాలం నాటివేనని కొందరి అభిప్రాయం. ఈ శాసనాలలో ఘ, జ, మ, ల, స, అనే అక్షరాల స్వరూపం అశోక బ్రాహ్మీ అక్షరాలకు పూర్తిగా భిన్నంగా ఉన్నది. శ్రీ డగ్లస్ బారెట్ ఈ విషయంతో ఏకీభవించక, అసలు ధాతు కరండం భట్టిప్రోలులోనే నిర్మితమైందనడానికి సాక్షంలేదని అన్నారు. ఏది ఏమైనా ఆంధ్రబౌద్ధకేంద్రాలలో కొన్ని క్రీస్తుకు పూర్వపు శతాబ్దులలోనే రూపుదాల్చినవనుకోవడం అసమంజసం కాబోదు. ఈ కేంద్రాలలో అధిక ప్రాముఖ్యాన్ని పొందిన కేంద్రం అమరావతి. ఇక్కడ బౌద్ధవిద్యాకేంద్రం వివిధ దేశీయులకూ యాత్రాస్థలమైంది. ఆ కారణం వల్లనే ప్రాచ్య ప్రపంచంలో అమరావతి సుపరచితమైన విజ్ఞానకేంద్రంగానూ, శిల్పకళాకేంద్రంగానూ ప్రసిద్ధికెక్కింది.

పట్నా, పర్ఖామ్, బెస్‌నగర్ ప్రాంతాలలోలభించిన స్వల్పమైన మౌర్యకాలపు శిల్పాలలో కొద్దిగా జానపద కళారీతులు ద్యోతకమౌతాయి. అయినా ఆ శిల్పాలన్నింటిమీదా పారశీక శిల్ప ప్రభావం ముఖ్యంగా పెర్సిపోలిస్, సూసా నిర్మాణాల ప్రభావం గాఢంగా ముద్రవేసిందనే చెప్పుకోవాలి. మౌర్యుల తరువాత రాజ్యానికి వచ్చిన శుంగుల కాలంలో శిల్పం విస్తృతంగా విన్యసించబడిన మాట నిజమేకాని అది మన సంస్కృతీ లక్షణాల నుంచి విముక్తం కాలేకపోయింది. బార్‌హూత్ శిల్పాలతో పోలిస్తే సాంచీశిల్పం రానున్న స్వర్ణయుగానికి తొలి అరుణోదయ రేఖలాగా కనిపిస్తుంది. సాంచీశిల్పం శాతవాహన నిర్మాణం. ఉబ్బెత్తుశిల్పంలో కొత్తసొగసులను సంతరించుకొన్నది సాంచీశిల్పం. బృంద సమాహరణం, రూపవిన్యాసం ఇంకా ప్రాథమిక దశలోనే ఉండిపోయాయి. ఈ పరిస్థితులలో అమరావతీ శిల్పం తొలి దశలలోనే ఉజ్జ్వల రూపంతో ప్రత్యక్షం కావడం ఆశ్చర్యకరమే కాదు, చరిత్రకారులు పరిష్కరించలేని జటిల సమస్యగా రూపొందింది. అమరావతీ శిల్పాలను గురించి శాస్త్రీయంగా చర్చించిన శ్రీ డగ్లస్ చారెట్ కూడా ఈ సమస్యని ప్రస్తావించి సమాధానం చెప్పలేకపోయారు. నాకు తోచిన పరిష్కారాన్ని శిలా శిల్పాలను ఇక్కడ సూచిస్తున్నాను. నిర్మించడం ప్రారంభం కాకమునుపు బహుశా దారు శిల్పాలను ఆంధ్ర శిల్పులు నిర్మించి ఉండవచ్చు. ఈ దారు శిల్పాలు కాలక్రమాన శిథిలంకావడం చూసి శిల్పాలను గండరించడం ప్రారంభించి ఉండవచ్చు. అందువల్ల ఈనాడు మనకు లభ్యంకాని దారుశిల్పాలలో అమరావతీ శిల్పపు ప్రధమదశ పరిణతిచెంది శిలా శిల్పాల కాలంనాటిది పూర్ణవికాసంతో ప్రత్యక్షమౌతోంది. ఈ ఊహకు బలంగా రెండు అంశాలను ఉదహరిస్తాను. పాటలీపుత్రంలోని మౌర్య రాజభవనం పూర్తిగా దారువుతోనే నిర్మితమైంది. ఆ కాలాన్నే అమరావతి తొలిరూపును దిద్దుకున్నదని మనకు తెలుసు. రెండో అంశం. అమరావతీ స్తూప ప్రాకార నిర్మాణ విధానాన్ని గమనిస్తే దారుశిల్పనిర్మాణ విధానాన్ని అన్నివిధాలా పోలి ఉండడం గుర్తించవచ్చు. అందువల్ల ప్రధమంలో అమరావతీస్తూప ప్రాకారం దారువుతోనే నిర్మితమైఉండవచ్చని భావించడం అసమంజసం కాదు.

అమరావతి శిల్పాలలో కానవచ్చే చైతన్యవంతమైన జీవరూపాలు ఆ శిల్పాలకొక విశిష్టస్థానాన్ని సంపాదించి పెట్టాయి. అంతవరకు గాంధార, మధుర, సాంచీలలో గండరింపబడిన శిల్పాలకన్న అమరావతీ శిల్పాలు సాంకేతికంగా ఎక్కువ పరిణతి చెందినవి. గాంధార శిల్పాలూ, మధుర శిల్పాలలోకూడా కొంతలో కొంత మానవరూపాల కదలిక 'ధ్వని' మాత్రంగాకాక ప్రత్యక్షంగా గోచరిస్తుంది. దీన్ని అమరావతీ శిల్పులు సాధించిన తీరు నిజంగా విస్మయం కలిగించే విషయం. ఉదాహరణకు ఇద్దరు ముగ్గురు మానవమూర్తులు కలిసిఉన్న శిల్పఫలకాలలో ఒక మానవ రూపంలోని కదలికసూచితమైనప్పుడు, ఆ కదలికకు ప్రతిక్రియగా ఇతర రూపాలసంచలనాన్ని గూడా సూచించడం జరిగింది. ఇందువల్ల మొత్తం శిల్పఫలకంలో ఒక అనిర్వచనీయమైన నాటకీయత సిద్ధిస్తోంది. ఈ నాటకీయతేమొత్తం అమరావతీ శిల్పాలకు విశేషమైన కీర్తి ప్రతిష్టలను సంపాదించి పెట్టాయని నా అభిప్రాయం. ఉదాహరణకు నాగార్జున కొండలో దొరికిన ఒకశిల్ప ఫలకంలో మహాభినిష్క్రమణం తర్వాత చెన్నుడు

శుద్ధోధనుడికీవార్తను తెలియజేసే ఘట్టం విన్యసించిన తీరులో ఈ నాటకీయతా లక్షణాన్ని మనం గుర్తించవచ్చు. దుఃఖభారంతో చెన్నుడు సిద్ధార్థుని సర్వసంగపరిత్యాగాన్ని వివరించడం, అందుకు విచలితమైన శుద్ధోధనుని మనోవేదనా పూర్ణితమైన "రియాక్షన్" అప్పుడే అక్కడికి వచ్చిన యశోధర ఈ వార్తవిని భరింపరాని వేదనతో కుప్పకూలిపోవడం. ఇవన్నీ చూపరుల మనస్సులు ద్రవించేటంతటి ఆర్ద్రతతో శిల్పించిన తీరు నభూతో నభవిష్యతి. ఇలాగ ఎన్ని ఉదాహరణలైనా చూపించవచ్చు. అమరావతీ శిల్పాలలో రూపం దిద్దుకున్న మానవమూర్తులు ఆనందాతిరేకంతో శిలాఫలకాన్ని వీడి సజీవంగా మన ప్రపంచంలో అడుగు మోపబోతున్నట్లు కనిపిస్తాయి. అమరావతిశిల్పి మానవ మనస్తత్వాలలోతును బాగా తరచి చూసిన అనుభవశాలి. ఈ శిల్పాలన్నీ రంగస్థల నటుడికి, వివిధ భంగిమలలో యేయేభావాలు ప్రకటించవచ్చునో చక్కగా వివరిస్తున్నాయి.

అసలు అమరావతీ శిల్పాలలో మానవ శరీరం శాస్త్రీయంగా మలచబడిదని, ప్రాచ్య పాశ్చాత్య పండితులు అంటున్నారు. శరీరశాస్త్రంతో శిల్పికి పరిచయంబాగానే వుండవచ్చునన్న విషయంకూడా నిర్వివాదమే. అయినా అమరావతీ శిల్పి శరీర నిర్మాణ సూత్రాలకన్నా ఎక్కువగా అనుసరించినది, వెలుగునీడల ప్రవర్తనా సూత్రాలని నా ప్రగాఢ విశ్వాసం. ఈ శిల్పాలు పూర్వం స్తూపాలనంకరించి ఉండేటప్పుడు ఉదయాస్తమయాలలోని వెలుగు నీడలను ప్రతిఫలిస్తూ ఉండేవి. ఈనాడు మ్యూజియములలో వీటిని చూస్తే ఆ శిల్పాలదివ్య సౌందర్యాన్ని మనం పూర్తిగా గుర్తించలేము. సక్రమమైన వెలుగును వీటిమీద ప్రసరించిచూడాలి. అలాచేసినప్పుడు మానవ ముఖరూపాలలోని చిరునవ్వులూ, వేదనలూ గూడా దృశ్యమానం కావడం నా అనుభవంలోని విశేషం.

ఇప్పుడు చర్చించిన అమరావతీ శిల్పంలోని విశిష్ట లక్షణాలను ఇతరదేశాలలోని శిల్పాలలోనేకాదు, ఆంధ్రదేశంలోనే తరువాత కాలంలో మనకు కనపడవు. ఇతర దేశాల శిల్పాలమీద, అమరావతీ శిల్పప్రభావం కేవలం బాహిరమైనది. సాంకేతికమైనది. అందువల్ల ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొనే మనం అమరావతీ శిల్ప ప్రభావాలను అంచనా కట్టవలసి ఉంటుంది.

ప్రాచీన కాలంలో సముద్రయానం చాలా పెద్ద యెత్తున జరుగుతూండేదనే విషయం గురించి ఇది వరకే చాలామంది చరిత్రకారులు చెప్పారు. ప్రస్తుత వ్యాస విషయానికి సంబంధించినంతమటుకు స్థూలంగా ఆ విషయాన్ని వివరిస్తాను.

ప్రాచీన నావికులకు సుపరిచితమైన ప్రాచీన రోమన్‌నావికులచే "పాలూర" అని పేర్కొనబడిన రేవు చిల్కాసరస్సుకు దక్షిణపు కొనలో ఉంది. ఈ రేవును పేర్కొన్న టోలమీ గంగానది ముఖద్వారాన ఉన్నట్టు తప్పుగా పేర్కొన్నాడు. తూర్పుదేశాలవైపు ప్రయాణించేవారికి ఈ రేవు సౌకర్యంగా ఉండేది. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న సాలిహూండాం ప్రసిద్ధ బౌద్ధక్షేత్రం. సాలిహుండాం బౌద్ధ శిథిలావశేషాలున్న స్థలానికి మూడుమైళ్ళ దూరానున్న కళింగపట్నంకూడా ప్రాచీన కాలంలో పేరుపొందిన రేవు పట్టణమే. ఈ సాలిహూండాం క్రీస్తుశకం రెండోశతాబ్దానికి చెందినదిగా చరిత్రకారులు భావిస్తున్నారు. కృష్ణానదీ తీరాన ఉన్న అమరావతి మరింత ప్రాచీనమైన రేవుస్థలం కావచ్చునని రెజినాల్డు-లే-మే, అనే చరిత్రకారుడు భావించాడు. ఈ అమరావతీరేవు కేవలం వర్తక వాణిజ్యాదులకేకాక బౌద్ధ భిక్షుల రాకపోకలకు కూడా ఉపయోగపడిందనేది నిర్వివాదంశం. సాహసులైన నావికులూ, వర్తకులూ, భిక్షువులూ తమతమ అదృష్టాలను వెదుక్కొంటు ఈ రేవునుంచి క్రీస్తుశకం ఒకటో శతాబ్ది న్నుంచీ నాలుగో శతాబ్దం దాకా దూరప్రాచ్యదేశాలకు ప్రయాణం చెయ్యడం ఆశ్చర్యకరమైన విషయమేమీకాదు. సరిగా ఈ కాలంలోనే అమరావతి బౌద్ధ కేంద్రం విశ్వవిఖ్యాతమై జిజ్ఞాసువుల దృష్టి నాకర్షించి బౌద్ధమత ప్రసారకేంద్రంగా విలసిల్లడం ఈ ఊహలకు మరింత బలాన్నిస్తోంది.

అలాగే ఘంటసాల బౌద్ధకేంద్రం మాత్రమేకాక విఖ్యాతమైన రేవుకూడా. ప్రఖ్యాత కళావిమర్శకుడు ఆనంద కుమారస్వామి, చరిత్రకారుడు రెజినాల్డు-లే-మే మరొకరేవు గూడురు గోదావరీ ముఖద్వారాన ఉన్నట్టుగా వ్రాశారు. టోలమీ పేర్కొన్న "కొద్దూర" ఇదే. ఐతే శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఈ రేవునే పేర్కొంటూ ఇది బందరు దగ్గర ఉన్నదని రాశారు. ఇది ఎక్కడ ఉన్నప్పటికీ ప్రసిద్ధిపొందిన రేవుగానే మనం పరిగణించాలి.

ఘంటసాలలో బయలుపడిన ఒక ప్రాకృతశాసనంలో ఆంధ్రదేశానికి చెందిన మహానావికుడొకణ్ణి ప్రస్తావించడం జరిగింది. తూర్పుదేశాలతో జరిగిన వాణిజ్యం ఎక్కువగా ఆంధ్రుల చేతులో ఉన్నట్టున్నది. తూర్పురాజ్యాలనుంచి కొన్ని సుగంధద్రవ్యాలను ఆంధ్రభూమి దిగుమతి చేసుకొని పశ్చిమ రాజ్యాలకు వాటిని ఎగుమతి చేస్తున్నట్టుగా భావించవచ్చు. పశ్చిమ రాజ్యాలతో జరిగిన వాణిజ్యం ఎక్కువగా విదేశనావికుల హస్తగతం అయివుండవచ్చునని చరిత్రకారుల భావన. ఈ వ్యాపారం ఎంత ఉధృతంగా సాగేదో తెలుసుకోవడానికి ఆంధ్రదేశమంతటా లభించిన రోమన్‌నాణాలే తార్కాణం. ఈ నాణాలు క్రీ.శ. 14 నుండి క్రీ.శ. 217 వరకు రోమన్ సామ్రాజ్యాన్ని పాలించిన చక్రవర్తులవి.

శాతవాహనుల తర్వాత వరసగా ఆంధ్రదేశాన్ని పాలించిన ఇతర రాజవంశాలకాలంలో కూడా ఈ వ్యాపారాలు అవిచ్ఛిన్నంగా కొనసాగుతూండేవనే విషయం అసంభవంకాదు. పూర్వ చాళుక్యులలో చాళుక్యచంద్రుడు అనే బిరుదు ఉన్న శక్తివర్మ, అతని తమ్ముడికుమారుడయిన రాజరాజనరేంద్రుడి బంగారునాణాలు కొన్ని బర్మాదేశపు పశ్చిమతీరాన ఉన్న అరకాన్‌కు సమీపాన గల రామ్రీద్వీపంలో లభించినవి. ఇలాంటి నాణాలే అధిక సంఖ్యలో సయాముదేశాన కూడా లభించినవి. చాళుక్యసంప్రదాయానికి వారసులైన కాకతీయ ప్రభువులకాలంలోకూడా ఈవ్యాపారసంబంధాలు కొనసాగుతూనేవచ్చాయి. కారణాంతరాల వల్ల ఈ వ్యాపారం మందగించిన సమయంలో తిరిగి యథాస్థితిని కల్పించేందుకు కాకతిగణపతిదేవ మహారాజు ఇచ్చిన అభయశాసనం మోటుపల్లి వీరభద్రేశ్వరాలయపు స్తంభాలమీద చెక్కిఉన్నది. ఈ శాసనంలో ఎన్నో వ్యాపార వస్తువులను పేర్కొన్నారు. వాటన్నిటినీ వ్యాసవిస్తరభీతిచేత పేర్కొనక వదులుతున్నాను. అంతకుముందు కాలంలో కూడా ఈ వస్తువులే వ్యాపారంలో ప్రముఖమని మాత్రం మనం భావించవచ్చు. ఇంతటితో పూర్వరంగాన్ని ముగించి ఏయే దేశాలు మన కళాసంపదను తమలో లీనం చేసుకున్నాయో పరిశీలిద్దాం.

ఇండోనేషియా :-

ఇండోనేషియాలో నేడు వ్యవహృతమౌతున్న దేశం కొన్ని ద్వీపాల సముదాయం. వీటిలో ప్రధానమైనవి సుమత్రా, జావా, బలిద్వీపాలు. సుమాత్రాకు పూర్వనామం సువర్ణభూమి అని చరిత్రకారులు విశ్వసిస్తున్నారు. జావాకు యువ ద్వీపమని మనప్రాచీన లేఖనాలలో వ్యవహృతమైంది. చక్రవర్తి అశోకుడు సోన, ఉత్తర అన్న ఇద్దరు బౌద్ధభిక్కులను సువర్ణభూమికి మతప్రచారం నిమిత్తమై పంపినట్లు ఐతిహ్యం ఉంది. కాని మౌర్యకాలానికి చెందిన శిథిలావశేషాలేవీ ఈ ప్రాంతంలో కానరావడంలేదు. ఆంధ్రదేశంతో మంచి వ్యాపార సంబంధాలున్నప్పటికీ ఈ ప్రాంతంలోని శిల్పాలలో ఆంధ్రప్రభావం చాలా తక్కువగానే కనిపిస్తోంది. ఈ దేశం శిల్పాలలో గుప్త, పాల, ఆంధ్ర (అమరావతి) శిల్ప శైలులు కలగలిసి వొక కొత్త శైలిగా రూపొందినట్టు మనం గమనించవచ్చు. బలిద్వీపంలో పూజాతీర్థాన్ని భద్రపరచుకొనే శిలానిర్మితపాత్రలను వాడుతూండడం సామాన్యం. పెడ్‌జాంగ్ అనే ప్రాంతంలో లభించిన అలాంటి పాత్రమీది శిల్పం అమరావతి శిల్పాలను జ్ఞాపకం చేస్తుంది.

అమరావతి ప్రాకారపు ఉ........శిల్పాలమీద మకరతోరణాన్ని మోస్తున్న మానవరూపాలను పోలిన శిల్పం ఈ శిలాపాత్రమీద ఉన్నది. ఐతే అమరావతిలో మకరముఖంనుంచి వెలువడుతున్నట్టుగా చూపబడిన మాల ఈ శిల్పాలలో లేదు. మాల బదులు సర్పాన్ని శిల్పించారు.

ఈ శిల్పంలోని కథావస్తువు క్షీరసాగర మధన గాథను పోలిన గాథ అని డాక్టర్ సట్టర్ హైమ్ గుర్తించారు. ఈ పాత్రమీద ఉన్న శాసనం ప్రకారం ఇదీ 14వ శతాబ్దానికి చెందినది. అంత అర్వాచీనకాలందాకా అమరావతి శిల్పం తన ప్రభావాన్ని ఎలా ప్రసరించిందో అనూహ్యం. అమరావతి స్తూపం 12వ శతాబ్దందాకా పూజలందుకొంటూనే ఉన్నదన్న విషయం అమరావతిలోని కోట కేతరాజు శాసనంబట్టి తెలుస్తున్నది. పూర్వపు ప్రాభవాన్ని కోలుపోయినా అమరావతి బహుశా యాత్రాస్థలంగా మరికొంతకాలం కొనసాగిఉండవచ్చు.

ప్రాచీన ఇండోనేషియాలో శ్రీ విజయ సామ్రాజ్యం మహత్తరమైన కళాఖండాలను ప్రపంచానికి సమర్పించింది. శ్రీ విజయ రాజ్యాన్ని స్థాపించి పాలించినవారు శైలేంద్రవంశీయులు. వీరి పరిపాలనా కాలంలో ఎన్నో అద్భుత నిర్మాణాలు ఇండోనేషియా అంతటా తలెత్తినై. శ్రీ శైలంద్రుల రాజ్యం క్రీస్తుశకం ఏడోశతాబ్దంలో జావాలోని అధికభాగాన్ని మలయాద్వీపకల్పపు ఉభయ పార్శ్వాలవరకూ వ్యాపించింది. అసలు ఈ శైలేంద్రవంశపు ప్రాథమికదశ గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. తెలిసినంతలో వీరి మొట్టమొదటి శాసనం. క్రీ.శ.686నాటిది. వీరు మహాయాన బౌద్ధమత పోషకులు. జగత్ ప్రసిద్ధమైన బోర్ బుదూరుస్తూపాన్ని వీరిపరిపాలనా కాలంలోనే నిర్మించారు. ఎనిమిదో శతాబ్దపు రెండవ భాగంలో ఈ స్తూపం నిర్మితమైనట్లు చరిత్రకారుల భావన.

ఈ బోరోబుదూరు శిల్పాలలో గమనించతగ్గ శిల్పం సిద్ధార్థునికి సుజాత భిక్షమిస్తున్న శిల్పం. ఇందులో సుజాత రూపాన్ని శిల్పులు మలచిన తీరు అమరావతి శిల్పాలలోని స్త్రీమూర్తులను జ్ఞాపకం చేస్తుంది. కొంతలో కొంత వంగదేశం నుంచి బర్మా మలయాదేశాలద్వారా ప్రసరించిన "పాలా" శిల్పశైలీ ప్రభావం కూడా కనిపిస్తోంది. క్షీరనీరాలుగా, ఆంధ్రశైలీ వంగశీలీ బోరోబుదూరు శిల్పాలలో కలగలసిపోయింది. ఈ మిశ్రమశైలి జావాలో ఉన్న శిల్పాలన్నిటిలోనూ ప్రతిఫలిస్తోంది. నైరంజన నదిలో స్నానంచేస్తూన్న గౌతముని రూపం, ఇటు అమరావతీశైలినీ, అటు గుప్త శైలినీ గుర్తుకు తెచ్చేటట్లుగా ఉంది. దాదాపు ఇదే కాలానికి చెందిన వజ్రసత్త్వుడి ధ్యానమూర్తిసైతం ఆంధ్రశిల్పప్రభావాన్ని ఛాయామాత్రంగా సూచిస్తోంది. అమరావతి శిల్పప్రభావం ప్రాచీన సుమత్రాద్వీపాన్ని చేరి ఉండడానికి ఎన్నో అవకాశాలున్నప్పటికి ఇంత వరకు లభించిన శిల్పాధారాలలో గాఢమైన అమరావతి ప్రభావం కానరాకపోవడం ఆశ్చర్యకరమే. విడిగా శిధిలమై దొరికిన ఒక బుద్ధశీర్షం మాత్రం అమరావతి ప్రభావాన్ని ప్రతిఫలిస్తోంది. ఈ శీర్షంలో కన్ను ముక్కు తీరు నిస్సందేహంగా అమరావతీ శైలిలో ఉంది. క్రీస్తుశకం ఐదోశతాబ్దానికి చెందిన బుద్ధ ప్రతిమ సుమత్రా ద్వీపంలో పాలెంబాంగ్ ప్రాంతంలో లభించింది. ఈ ప్రతిమమీద అమరావతీ శైలీముద్ర స్పష్టంగా ఉన్నది.

బర్మా :

బర్మాలో ఆంధ్రప్రభావం చెప్పుకోదగినరీతిగా లేదు. పల్లవుల కాలంలో బౌద్ధగురువు ధర్మపాలుడి నేతృత్వంకింద కాంచీపురంలో హీనయాన బౌద్ధవిద్యాకేంద్రం ఏర్పడింది. ఈ సంఘటన బర్మాచరిత్రలో మార్పును తెచ్చింది. చరిత్ర కారుడు హార్వే తన గ్రంథంలో రాశాడు. ప్రాచీన మోన్ భాషా గ్రంథాలలో ధర్మపాలుడి ప్రస్తావనలు అధికంగా కానవస్తాయి. ఈ గ్రంథాలలో కాంచీపుర ప్రస్తావనలుగూడా ఉన్నాయి. మనకు తెలిసినంతలో మొట్టమొదటి మోన్ భాషా శాసనం పల్లవలిపిలో ఉంది. పల్లవులకు ఆంధ్రదేశంతో బాగా సంబంధముంది. పల్లవరాజు మొదటి మహేంద్రవర్మ తల్లి ఆంధ్రదేశాన్ని పాలించిన విష్ణుకుండిన వంశానికి చెందినది. పల్లవ శిల్పంమీద ఆంధ్రశిల్ప ప్రభావం బాగా ఉంది. ఆ విధంగా బర్మాలో ఆంధ్రశిల్పులు పరోక్షంగా మాత్రమే తన ప్రభావాన్ని ప్రసరించినట్టు భావించాలి. ఈ విషయంలో అసలు పరిశోధన ప్రారంభమేకానందున మనకు తెలిసిన విషయాలు ఇంత మాత్రమే.

సయాం :

సయాం దేశపు మధ్యభాగంలో ఉన్న కుగ్రామం పోంగ్‌టూక్‌లో అరటితోటల మధ్య జరిగిన త్రవ్వకాలలో ఒక దేవాలయ వేదిక బయట పడింది. ఇది 80 అడుగుల పొడవూ 47 అడుగుల వెడల్పూఉన్నది. పైకి వెళ్ళడానికి మెట్లున్నాయి. దీని నిర్మాణశైలి అమరావతి శిల్పశైలితో గాఢంగా ప్రభావితమైంది. ఈ త్రవ్వకాలలో బయల్పడిన వస్తుసముదాయంలో రెండు ముఖ్యమైన వస్తువులున్నాయి. ఒకటి గ్రీక్- రోమన్ సంస్కృతికి చెందిన కాంస్యదీపం. ఇలాంటి దీపాలు క్రీ.శ. రెండో శతాబ్దానికి చెందినవిగా చరిత్రకారుల భావన. ఈ దీపంవల్ల ఈ శిధిలాల కాలనిర్ణయంకూడా సులభమవుతుంది. రెండో వస్తువు కాంస్య బుద్ధప్రతిమ. ఇది కూడా రెండోశతాబ్దానికి చెందినది అయివుండాలి. ఈ కాంస్య బుద్ధ ప్రతిమ నిస్సందేహంగా అమరావతీ శిల్పుల నిర్మాణం. ఇంకా ఇలాంటి కాంస్య బుద్ధ ప్రతిమలు ఈశాన్య సయాం ప్రాంతాలలోనూ,

తూర్పున అన్నాంలోని డాంగ్‌డువాంగ్‌లోనూ లభించాయి. డాంగ్‌డువాంగ్ ప్రాంతాలకు ప్రాచీనకాలంలో అమరావతి అనే పేరు ఉండేది. డాంగ్‌డువాంగ్ బుద్ధప్రతిమ అక్షరాలా ఆంధ్రశిల్పం. ఇది కాంస్య విగ్రహం. అమరావతీ శిలాశిల్పాలతో పోల్చిచూస్తే కొద్దితేడాలు కానరావచ్చుగాని అమరావతి త్రవ్వకాలలో దొరికి ప్రస్తుతం మద్రాసు మ్యూజియంలో భద్రపరుచబడిన కాంస్య బుద్ధ ప్రతిమ శకలాలతో పోల్చి చూసే ఈ కాస్య ప్రతిమ అమరావతిలోనే తయారయి ఎగుమతి అయిన విగ్రహమా అనే సందేహం రావడం సహజం. ముఖ్యంగా బుద్ధుడు ధరించే వస్త్రం సంఘాతి ధటించిన తీరునూ, అందులోని మడలతనూ, కుచ్చిళ్ళనూ, శిల్పి మలచిన తీరునూ, విగ్రహ శరీర నిర్మాణం పద్ధతీ అన్నీ ముమ్మూర్తులా అమరావతీ బుద్ధుడును పోలి ఉంటాయి. ఈ విగ్రహమే కాక సయాంలో ఇతర ప్రాంతాలలో లభించిన కాంస్య విగ్రహాలు కూడా ఈ కోవకు చెందినవే. క్రమంగా సయాంలో స్థానిక శైలి ఏర్పడి అమరావతి శైలిని తనలో లీనం చేసుకొన్నప్పటికిగూడా అమరావతి శైలీ అవశేషాలు సకృత్తుగా నిలిచే ఉన్నాయి.

అమరావతీ శిల్పులు ఎక్కువ అభిమానంతో గండరించిన శిల్పం నాగరాజు ముచిలిందుడు బుద్ధునికి తన పడగలతో గొడుగుపట్టడం. అంతకు పూర్వం ఉత్తర భారతదేశంలోని బౌద్ధశిల్పాలలో ఈ కథావస్తువు దాదాపు శిల్పింపబడలేదనే భావించాలి. అందువల్ల ఈ కథావస్తువు ఆంధ్రశిల్పుల వల్లనే ప్రచారంలోకి వచ్చింది. అసలు ముచిలిందుడనే నాగరాజు ఆంధ్రదేశీయుడనీ మచిలీపట్టణం అతనిపేరుమీదనే ప్రారంభం అయిందనీ ఒక వాదం ఉన్నది. టోలెమీ పేర్కొన్న మైసోలియా అన్న పేరు మచిలీపట్టణ ప్రాచీనతనే తెలియజేస్తోందని కూడా కొందరంటున్నారు. ఏదియేమైనా సయాంలోని ముచిలింద బుద్ధప్రతిమలకు అమరావతి శిల్పమే వరవడి. అయితే కథావస్తువు, శిల్పశైలికన్నా గూడా ఎక్కువ ప్రభావాన్ని చూపిందనుకోవాలి.

సెలిబిస్ :

పశ్చిమ సెలిబిస్ ప్రాంతాలలో లభించిన మరొక కాంస్య బుద్ధప్రతిమ గూడా ఈ కాలానికి చెందినదే. ఇదిగూడా అమరావతిలో నిర్మితమై ఈ ప్రాంతాలకు ఎగుమతి చెయ్యబడి ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు. క్రీస్తుశకం ఐదో శతాబ్దానికి చెందిన బుద్ధప్రతిమలు గూడా కొన్ని కానవస్తున్నాయి. సెలిబిస్‌లోని సెంపెగా, తూర్పు జావాలోని జెంబేర్ ప్రాంతాలలో అమరావతీ శైలిముద్ర ఉన్న బుద్ధ ప్రతిమలు కొన్ని కానవచ్చాయి. ఇవి స్థానికంగానే తయారయి వుండవచ్చు.

దక్షిణ సయాంలోని తపాసా రేవుపట్టణం దగ్గరగా పన్నెండుమైళ్ల ఎగువన దట్టంగా పెరిగిన వృక్షాలమధ్య ఇరుక్కొని ఉన్న మూడు వైదిక శిల్పాలున్నాయి. వీటిని డాక్టర్ క్వారిట్స్ కనుగొన్నారు. స్థానికంగా లభ్యమైన రాతిలో భారతీయ శిల్పులు స్వహస్తాలతో గండరించిన శిల్పాలివి. ఇవి పల్లవశైలిలో చెక్కబడి ఉన్నాయి. బహుశా ఏడు ఎనిమిది శతాబ్దాలకు చెందిన శిల్పరచనలివి. వీటిలో ఒక శిల్పంమీద ఎనిమిదో శతాబ్దపు తమిళ లిపిలో శాసనంఉన్నది. ప్రస్తుతం బాంగ్‌కాక్ మ్యూజియంలో ఉన్న శ్రీ మహావిష్ణువిగ్రహం ఈ తకిపాలో దొరికనదే. విగ్రహం కంబోడియాలో దొరికిన విగ్రహంవలెనే ఉంది. ఈఈ విగ్రహాలకు స్తూపాకారపు కిరీటాలు నిస్సందేహంగా పల్లవ శిల్ప ప్రభావాన్ని సూచిస్తాయి. పల్లవ శిల్పానికి ఆంధ్ర శిల్పానికి ఉన్న సంబంధం ఇదివరలోనే ప్రస్తావించడం జరిగింది.

కంబోడియా :

కంబోడియాలోని మెకాంగు నదీతీరాన నేడు పాక్‌హిన్‌బన్ అని వ్యవహృతమౌతున్న ప్రాంతములో నాకొన్‌పానొమ్ నగరానికి ముక్దహాన్ నగరానికీ మధ్యన ఉన్న టాట్‌పానోమ్ పట్టణంలో ఈనాటికీ పూజలందుకొంటున్న దేవాలయం ఒకటి ఉన్నది. ఈ దేవాలయ ప్రాంగణంలో ఉన్న స్తూపవేదిక చతురస్రాకారపు ఇటికలతో కట్టింది ఉన్నది. ఈ వేదిక అద్భుతమైన శిల్పాలంకారాలతో అలంకరించబడింది. 1929లో చరిత్రకారుడు రెజినాల్డ్–లే–మే ఈ ప్రాంతాన్ని సందర్శించి ఛాయాచిత్రాలను తయారుచేశాడు. రెజినాల్డ్ మాటల్లో 'ఇక్కడొక పెద్ద బుద్ధ విగ్రహం పద్మాసనం వేసి కూర్చుని ధర్మచక్ర పరివర్తన చేస్తున్నట్టుగా ఉంది. అటూ ఇటూ గాలిలో తేలివస్తున్న అప్సరసలు, దిగువ భాగాన రెండు వైపులా భక్తుల శిల్పాలు ఉన్నాయి. ఈ శిల్పాన్ని చూడగానే నా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. ఈ శిల్పశైలి అమరావతిని నాకు గుర్తుచేసింది.' ఇవీ రెజినాల్డ్ మాటలు. ఈ శిల్పం క్రీస్తుశకం ఆరు, ఏడు శతాబ్దాలకు చెందివుండవచ్చని రెజినాల్డ్‌మే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఈ ప్రాంతాలను పరిపాలించిన ఖ్మేర్ రాజవంశానికి పల్లవులతో రక్తసంబంధం వుండివుండవచ్చుననడానికి ఆస్కారం ఉంది. ఈ రెండు వంశాలకు సంబంధించిన ఐతిహ్యాలలో చాలా పోలికలు కానవస్తాయి.

సింహళం :

తూర్పు ఆశియాదేశంగా సింహళదేశం పరిగణింపబడకపోయినప్పటికీ ఈ వ్యాసంలో ఆ దేశానికి గూడా ప్రముఖస్థానాన్నివ్వడం జరిగింది. ఆంధ్రశిల్ప ప్రభావం సింహళ శిల్పంమీద అధికంగా కానరావడమూ, శిల్పచరిత్రలలో ఈ అంశానికి ఇవ్వవలసినంత ప్రాముఖ్యత ఇవ్వబడకపోవడమూ, ఇందుకు కారణాలు. ఆంధ్రశిల్పకేంద్రాలకూ, సింహళ దేశానికీ భౌగోళికంగా ఎంతో దూరమున్నప్పటికీ కళాశైలీ విషయంలో ఎంతో సాదృశ్యం ఉన్నది. ప్రముఖ ఆంధ్రకళాకేంద్రమైన నాగార్జున కొండలో సింహళ బౌద్ధభిక్కులకొక ఆరామం ఉండేది. ఇది నాగార్జునకొండ శాసనాలలో "సింహళవిహార"గా పేర్కొనబడింది.

బౌద్ధమతం అశోకుని కాలంలోనే సింహళం చేరి ఉంటుంది. సింహళానికి అశోకచక్రవర్తి తన కొడుకు మహేంద్రుడినీ, కూతురు సంఘమిత్రనూ బోధివృక్షపు అంటుమొక్కతో బౌద్ధమత ప్రచారానికై పంపినట్లు ఐతిహ్యం ఉంది. ఎంత వరకు నిజమో తెలియదుగాని పద్దెనిమిది

శ్రేణుల శిల్పులనూ, చిత్రకారులనూ, హస్తకళానిపుణులను గూడా అశోకుడు పంపినట్టు బౌద్ధగ్రంథాలు చెబుతున్నాయి. అనురాధపురంలో మహేంద్రుడు మరణించేనాటికి నగరంలో ఒక చిత్రశాల యేర్పడినట్టు మహావంశమనే బౌద్ధగ్రంథం తెలియచేస్తుంది. బౌద్ధమత ప్రచారానికి శిల్పచిత్రకళలను ప్రచార సాధనాలుగా ఉపయోగించినట్టు ఎన్నో ఆధారాల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది.

అనురాధాపురం ప్రాచీన సింహళానికి రాజధాని. ఇక్కడ స్తూపాలూ, ఆరామాలూ చాలా ఉండేవి. ఒక ఆరామంలో మెట్లదగ్గర అమర్చబడిన "చంద్రశిల" ముఖ్యంగా గమనార్హమైనది. ఈ చంద్రశిల మీద ఏనుగు, గుర్రం, సింహం, వృషభం ఒకదానివెనుక ఒకటి పరుగులిడుతున్నట్టుగా చెక్కారు. ఈ చంద్రశిల అన్ని విధాలా నాగార్జునకొండలో లభ్యమైన చంద్రశిలలాగే ఉండడం అమరావతీశిల్పం, సింహళశిల్పం మీద ఎంతగాఢమైన ముద్రవేసిందో చెబుతోంది. ఇక్కడి పూర్ణకుంభం నాగార్జునకొండ పూర్ణకుంభానికి ప్రతికృతి. ద్వారపాలక విగ్రహాలు గూడా ఆంధ్రశిల్ప ప్రభావాన్ని సూచిస్తున్నాయి. రువాన్ వేలిదాగొబరపీఠంపై రెండు బ్రహ్మాండమైన విగ్రహాలు ఒకప్పుడు నిలిచిఉండేవి. వీటిలో ఒకటి చక్రవర్తిది. రెండోది బుద్ధుడిది. ఈ రెండు విగ్రహాలూ అమరావతి సాంప్రదాయానికి చెందినవని ఆనందకుమార స్వామి అన్నారు. ఇవి. క్రీ.శ. రెండో శతాబ్దానికి చెందినవని చరిత్రకారుల నిర్ణయం. సింహళదేశంలో బౌద్ధనిర్మాణాలు అధిక సంఖ్యలోనే ఉన్నాయి. ఆ నిర్మాణాలన్నిటి మీదా ఆంధ్రశిల్ప ప్రభావం బాగా గోచరిస్తుంది. అయినా ఆ నిర్మాణాల వివరాలన్నీ ప్రస్తుతం వివరించడం సాధ్యంకాదు. వ్యాసవిస్తరభీతిచేత వదలుతున్నాను. సిగీరియా వర్ణచిత్రాలను గురించి చెప్పి సింహళానికి వీడ్కోలు చెబుదాం.

దుర్గమదుర్గమైన సిగీరి క్రీస్తుశకం ఐదో శతాబ్దంలో రాజధానిగా ఉండేది. ఇక్కడి ఒక బృహత్ శిలాఖండం సింహాకారంలో ఉన్నది. నిలచి ఉంది. ఈ బృహత్ శిలాఖండంలో గుహగా ఏర్పడిన ప్రదేశములో ఇరవై ఒక్క సుందరాంగుల వర్ణచిత్రాలు గోడలమీద లిఖించి ఉన్నాయి. అజంతా చిత్రాలతో సాదృశ్యం కలిగిన ఈ చిత్రాలు మానవరూప చిత్రణలో చిత్రకారులకున్న విశేషానుభవాన్ని తెలియజేసేవి. రేఖను విసురుగా దృఢంగా గీయగలిగిన నేర్పుకలవారు ఈ చిత్రకారులు. ఈ చిత్రాలలో కుచభారంతో సింహేంద్ర మధ్యములైన సుందరాంగులు నయనానందకరంగా కానవస్తారు. సుప్రసిద్ధ కళాచరిత్రకారుడు శ్రీ బెంజమిన్‌రౌలండ్ ఈ చిత్రాలను గురించి ప్రస్తావిస్తూ "ఈ సిగీరి సుందరాంగులు అమరావతీ అందగత్తెలను పోలి ఉండడం ఆసక్తికరమైన విషయం. ఎందువల్ల నంటే అమరావతి నుంచే శిల్పశైలిని సింహళం గ్రహించింది కనుక" అన్నారు. మనం గమనించవలసిన మరొక ముఖ్యాంశం ఉంది. సిగీరి చిత్రాలు అమరావతి శిల్పాలను పోలిఉండడం నిజమేకాని సింహళ దేశీయ లక్షణాలు గూడా చిత్రాలలోలేకపోలేదు. పల్లవ చిత్రలేఖన శైలిఛాయలు గూడా నాకు ఈ చిత్రాలలో కానవస్తాయి. అయితే పల్లవ కళ ఆంధ్రకళోద్భవమనీ మళ్ళీ చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను.

ఇప్పటివరకూ స్థూలంగా ఆంధ్రశిల్ప ప్రభావం తూర్పు ఆశియా దేశాలపై ఎంత పరిమాణంలో ఉన్నదో గమనించాం. అయితే ఆంధ్రశిల్ప ప్రభావమంటే కేవలం అమరావతి శిల్ప ప్రభావమని మాత్రమేననే సంకుచితభావం ఏర్పడవచ్చు. నిజానికి మన చరిత్రకారులందరూ ఈ రకంగా భావించేవారే. అమరావతి, నాగార్జున కొండ మొదలైన ప్రాంతాలలో త్రవ్వకాలలో లభించిన మృణ్మయపాత్ర శకలాలను గురించి పేజీలకు పేజీలు రాసినవారు కాకతీయ, విజయనగర కాలాలు వచ్చేసరికి దేవాలయ వర్ణనలతో ఆగిపోతున్నారు. ఇలాగ ఎందువల్ల జరుగుతున్నదో అనూహ్యం. శాతవాహన, ఇక్ష్వాకు రాజ్యాలు కాలగర్భాన కలిసిన తర్వాతగూడా ఆంధ్రులు సముద్రాంతర వ్యాపారాన్ని వదలలేదని పూర్వోక్త ఆధారాలవల్ల వ్యక్తమే. చాళుక్యచంద్రుడు శక్తి వర్మా, రాజరాజనరేంద్రుడి నాణాలు బర్మా లోనూ, సయాంలోనూ దొరికినవని ఇది వరలో ప్రస్తావించడం జరిగింది. ఐతే ఆ యా ప్రాంతాలలో చాళుక్య ప్రభావం లేదా? ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం అంత తేలికైన వ్యవహారం కాదు. క్రీ.శ. మూడు, నాలుగు శతాబ్దాలకే దూర ప్రాచ్యంలోని వివిధ దేశాలలో కళాసంప్రదాయాలు అభివృద్ధి చెంది ఉన్నాయి. అభివృద్ధి చెందిన సంస్కృతి మీద పరదేశ సంస్కృతి గాఢమైన ముద్ర వేయడం అసంభవమే. అయినా కొంతలో కొంతైనా ఉండాలిగదా! బాగా అభివృద్ధి చెందిన కళాసంప్రదాయం అమరావతిలో ఉన్నప్పటికీ రోమనుప్రభావం అనివార్యమైంది. అటువంటప్పుడు బలీయమైన చాళుక్య సంప్రదాయం దూరప్రాచ్యదేశాలమీద ప్రభావాన్ని నెరపలేకపోయిందా? అదీకాక చాళుక్యులకు సమకాలీనులైన దూరప్రాచ్య భూములను పాలించిన రాజన్యులు వర్మ, దేవ మొదలైన నామాంతాలను ధరించారు. శైవ వైష్ణవాలు ఆయాదేశాలలో తమ ప్రాభవాన్ని కనబరిచాయి. ఈ విషయాలన్నీ విచారిస్తే ఈ రంగంలో పరిశోధన అసలు జరగలేదని, జరగవలసిన అవసరం ఎంతో ఉందని వ్యక్తంకాగలదు. పరిశోధన జరిగితే తెలియగల విశేషాలు ఎన్నో వుండగలవనే విషయాన్ని ధృవపరచగల విశేషాన్ని ఇక్కడ వివరిస్తాను. కాంబోడియాలోని అంగ్‌కోర్‌వాట్ నిర్మాణాలు పదమూడో శతాబ్దానికి చెందినవి. ఈనిర్మాణాల మీద గంగా, చాళుక్య, కాకతీయ ప్రభావాలున్నట్టుగా నాకు అనిపిస్తోంది. ఈ విషయంలో ఇంకా పరిశోధన జరుగవలసిఉంది. బిక్కవోలులో ఉన్న దేవాలయాలమీద అలంకరణలు కొన్ని అంగ్‌కోర్‌వాట్ అలంకరణలకు మాతృకలు కావచ్చు. ఇలాంటి అలంకరణా శిల్పమే సింహాచలం దేవాలయంలో కూడా చూడవచ్చు. జువాలోని చండీమెండుట్ దేవాలయాలు గుప్తశైలి దేవాలయాలకన్నా చాళుక్యశైలి దేవాలయాలను ఎక్కువగా పోలిఉన్నట్టు నేను భావిస్తున్నాను. అయితే ఈ విషయాలను కూలంకుషంగా పరిశీలించవలసిఉంది.

బలిద్వీపంలో వనయు అనే ప్రాంతంలో దొరికిన మానవశీర్షశిల్పం ఒకటున్నది. ఈ శిల్పం యొక్క కాలనిర్ణయం అసాధ్యం. ఇలాంటి శిల్పం ఇండోనేషియాలో మరెక్కడా కానరాలేదు. ఈ శీర్షం మీద స్తూపాకారపు మకుటం ఉన్నది గాని, ఆ మకుటం పల్లవశైలి మకుటం కాదు. మకుటం మధ్యన కీర్తిముఖం చెక్కబడి ఉంది. ఈ శిల్పాన్ని గురించి రాస్తూ డాక్టర్ స్టట్టర్ హైం ఇది భారత శిల్పుల నిర్మాణం కావచ్చుననే సందేహాన్ని వెలిబుచ్చారు. ఈ శీర్ష శిల్పం ఫోటోను చూడగానే నా మనోనేత్రం ముందు తళుక్కున మెరిసిన మరో శీర్ష శిల్పం కాకతీయ శిల్పం. వరంగల్లు కోటలో స్వయంభూదేవాలయ ప్రాంతంలో లభించి ప్రతాపరుద్రుడి రూప శిల్పంగా పేరుపొందిన శీర్షశిల్ప అక్షరాలా బలి శిల్పాన్ని పోలి ఉంది. బహుశా ఇది కాకతీయ శిల్ప ప్రభావానికి లోనైనది. ఈ శిల్పం ఇంకా బయల్పడవలసిన అపూర్వ విశేషాలను సూచిస్తోందని నా నమ్మకం.

వరదా వెంకటరత్నం

తెలుగు చిత్రకళ - అందలి సొగసులు

పక్షులు మధురాలాపములు చేయును. అది వాటి సహజగుణము. కాని పొట్టలు నింపుకొనుటకు మాత్రము కాదు. అలాగే గాయకులు గానము చేయుదురు. కవి కుమారులు గీతాలాపములు చేయుదురు. చిత్రకారులు చిత్తరువులు చిత్రింతురు.

ఐతే, చిత్రరచన ఒక వృత్తి అని జనసామాన్యము అనుకోవడము పరిపాటి అయిపోయినది. కాని యిది వైద్యము, న్యాయవాదము మొదలగు వృత్తులవంటిది కాదు. ఆయా చదువులు చదివి, ఆయా పరీక్షలలో ఉత్తీర్ణులై, ఆయా వృత్తులు అవలంబించి ధనము ఆర్జింపవచ్చు. పదవులు పొందవచ్చు. చిత్ర రచనకు మాత్రము ఒక చదువుతోగాని, ఒక పరీక్షలో వుత్తీర్ణం కావడం గాని నిమిత్తము లేదు. ఏ వ్యక్తి యైనా చిత్రకారుడగుటకు ఎవరూ అడ్డురాలేరు. దానికి కావలసిన కళలో స్వతస్సిద్ధమైన అభిరుచి.

అసలు కళకూడ విజ్ఞానమే! కళోపాసనవలన కూడ చదువుకున్న వ్యక్తి ఆర్జించగల మనోవికాసము జ్ఞానము. ఆనందమును, ముక్తినిగూడ ఆర్జింపవచ్చును. నిజముగ, చిత్రరచన చేస్తూన్నప్పుడు చెప్పరాని ఆనందాన్ని పొంది చిత్రకారుడు తన్మయుడగును.

కళోపాసకుడు కావడం ధనార్జనకొరకు, పదవుల కొరకు మాత్రము కాదు. కేవలము అతనికి దానియందు గల అభిరుచికి, అనురాగమునకు, భక్తికి మాత్రమే!

ఏ వ్యక్తిగాని ధనవంతుడు కావలెనని కళను అభ్యసింపడు. ఒక్కొక్కప్పుడు ఎవరికైనా ఆ యదృష్టము పట్టిన పట్టవచ్చును. ధనార్జనకొరకే చిత్రరచన అభ్యసించిన అతడు వ్యక్తిత్వాన్ని చంపుకొని ప్రజాహితమైన కృత్రిమకళను అలవర్చుకోవలసి ఉండును. అట్టి వ్యక్తి చిత్రకారుడు కానేరడు. కళావ్యాపారిగమాత్రమే గాక, కళా ద్రోహిగాగూడ కాగలడు.

కళలు మానవసంస్కృతికి నిదర్శనములు. ఏ దేశము కళలకు ఉనికిపట్టో ఆ దేశము నాగరకదేశము. ఆ దేశపు ప్రజలు విజ్ఞానవంతులు. కళలమీదనే ఆ దేశపు గౌరవసంపత్తులు ఆధారపడివుండును.

మన భారతదేశము అనాదినుండి విజ్ఞానానికి, కళలకు పేరొందిన దేశము. ఈ రెండింటికి ఒక ప్రత్యేక విశిష్టత ఉన్నది.

కళలు రెండు తరహాలు : శ్రవ్యకళలు, దృశ్య కళలు. వినికిడివల్ల హృదయానికి ఆనందాన్ని యిచ్చేవి శ్రవ్యకళలు. చూచుటవల్ల ఆనందాన్ని యిచ్చేవి దృశ్యకళలు. కవిత్వము, సంగీతము మొదలగునవి శ్రవ్యకళలు. చిత్రరచన, శిల్పము మొదలగునవి దృశ్యకళలు. ఈ రెండు విధముల కళలు మానవునికి ఆనందాన్ని, జ్ఞానాన్ని యియ్యవలెనంటే, అందు భావగర్భితమైన ఒక నిశిత సందేశము

యిమిడియుండవలెను. ఈ భావాన్ని వెలిబుచ్చడానికి కవిత్వము మొదలగువాటికి భాష సాధనము. చిత్రశిల్పకళలకు ఆకృతుల నిర్మాణము సాధనము. ఒక ప్రసంగములో భాష ఎట్లున్నా, భావము మంచిదైనచో ఆనందించవచ్చు. సుందరమైన ఆకృతుల నిర్మాణము లేనప్పుడు భావము యెంత వున్నా, పూర్తి అయిన ఆనందాన్ని యియ్యలేదు చిత్రం. వికృతములైన ఆ యాకృతులు కన్నులకు ప్రత్యక్షమై, హృదయాన్ని ఆ భావములోనికి చొరబడుటకు అడ్డుతగులును. వానిని భేదించుకొని భావములోనికి చొరవలసివుండును. కనుక, చిత్రరచనకు భావము ఎంత ప్రధానమో రూపము, తదితర హంగులు అంతకన్న ప్రధానము.

మన పూర్వులు భారత చిత్ర శిల్పకళలలో భావానికే ప్రాధాన్యము యిచ్చిరని, రూపానికి అంత ప్రాధాన్యము ఇయ్యలేదని నేటి కొందరు చిత్రకారుల, విమర్శకుల ఊహ. సుందరములైన ఆకృతులు చూపరులను ఆకర్షించి భావమును గ్రహించనీయవని వారి వాదన. ఈ ఊహావాదములు సత్యములు కావు. పూర్వులు భావప్రకటనకు ఎంత శ్రద్ధ తీసుకున్నారో అంతకంటే ఎక్కువ శ్రద్ధను సుందరమూర్తులను ఊహించి, నిర్మించి తమ చిత్రాలలో చిత్రించుటకును, శిల్పములలో చెక్కుటకును తీసుకున్నారు. కాని, వారి స్థూలదృష్టికి గోచరించిన బాహ్యస్వరూపాల్ని గాని ఈనాటి కొందరివలె వికృతాకారములనుగాని చిత్రించి వుండలేదు. సృష్టిని బాగుగ పరిశీలించిన తరువాతనే, తమ యోచనాదృష్టిలో సృష్టికి అతీతమైన సుందరరూపాల్ని కన్నారు.

ప్రపంచ విఖ్యాత చిత్రకారుడు నికొలస్‌గోరిక్ హిమాలయపర్వతములలో స్థిరనివాస మేర్పరచుకొని, హిమాచల సౌందర్యాన్ని ఉపాసించి, ఎన్నో దృశ్య చిత్రాల్ని సృష్టించాడు. ఒకప్పుడు అతడు ఎవరెస్టు శిఖరాన్ని చిత్రించినాడు. ఈ చిత్రాన్ని ఆ శిఖరపరిశోధకులు చూచి, ఆ ఎత్తున మంచుగడ్డలు ఏర్పడిన ఆకృతిలో యీతని చిత్రములో ఆ శిఖరముపైగల మంచుగడ్డల ఆకృతి చూచి విస్తుపోయినారు, అతడు దిగువ మంచుపర్వతములను చక్కగా పరిశీలించుటవలన ఆ ఎత్తు వాతావరణములో మంచు ఏ ఆకృతిలో గడ్డ కట్టగలదో యోచించగలిగినాడు.

కనుకనే, యీ విషయాన్ని బాగుగా గుర్తించిన నందలాలుగారు శాంతినికేతనకళాభవనపు విద్యార్థులచేత సృష్టి సౌందర్యమును హెచ్చుగ ఉపాసింపజేయుదురు. వీరు సృష్టిలోగల మానవాకృతులనేగాక పర్వతములు, చెట్లు, జంతువులు, పక్షులు మొదలగువాటినన్నిటిని చూచి, వాటిలో నుండు విశిష్టతను గ్రహించి, పెనిసిలుతోను, కుంచెలతోను చిన్న చిన్న స్కెచెస్‌వేసి, ప్రకృతిని ఉపాసింతురు. ఈ ప్రకృతి ఉపాసనను నందలాలుగారు నేటికిని ఏమరివుండలేదు.

శుక్రనీతి యీ విధముగ చెప్పుచున్నది:

"చిత్రకారుడు ధ్యానపటిమచే ఆకృతులను నిర్మించుకోవలెను. ఆధ్యాత్మికదృష్టిని గన్న ఆకృతులే ఉత్తమమైనవి. సత్యమైనవి. అవే అతనికి ప్రమాణములు. వాటిపైననే అతడు ఆధారపడివుండవలెను. కాని, స్థూలదృష్టికి గోచరించు బాహ్యాకృతులపై గాదు!"

పూర్వపు ప్రాక్పశ్చిమచిత్రకారుల ఆదర్శాలు ఒక్కటే. వీరును వారును తమ యోజనాదృష్టిలో సుందరమూర్తులనే కల్పించుకున్నారుగాని, అస్వాభావిక అనాకృతులను కల్పించుకోలేదు!

ఇప్పుడు మన తెలుగుదేశములో హైందవ చిత్రరచన అను పేరుతో పెక్కండ్రు చిత్రకారులు అస్వాభావిక అనాకృతులను తమ చిత్రాలలో చిత్రించుకున్నారు. కొందరు విమర్శకులు కూడా వీరిపక్షము అవలంభిస్తున్నారు. ప్రాచీనవ్యాఖ్యాత యశోధరుడు వాత్స్యాయనకామసూత్రాన్ని వ్యాఖ్యానించుచు చిత్రరచనకు పాటించవలసిన యీ ఆరు అంగములను నిర్వచించినాడు :

1. రూపభేదము, 2.ప్రమాణము, 3.భావము, 4.లావణ్యము, 5.సాదృశ్యము, 6.వర్ణ సంవిధానము.

కనుక, చిత్రరచనలో ఒక్క భావమే ప్రధానముకాదు. ఈ భావాన్ని వెలిబుచ్చుటకు సాధనములైన ఐదు అంగములకే ప్రాధాన్యము కనబడుచున్నది. అందువల్లనే, మన పూర్వ చిత్రశిల్పకారులు తక్కిన పై అంగములను ఎంతమాత్రము విస్మరించి యుండలేదు. కనుకనే అజంతాకుడ్య చిత్రాల్ని ప్రపంచమంతా విరగబడి, నివ్వెరబోయి చూచుచున్నది. దక్షిణ భారతములోని కంచు నటరాజవిగ్రహముయొక్క ఆధ్యాత్మికలావణ్యాకృతియే ప్రపంచపు గొప్పతనాన్ని చూరగొన్నది. ఈ రూపలావణ్యానికీ, శిల్పనైపుణ్యానికే బ్రిటిషువారు అమరావతీ శిల్పాల్ని తమ దేశానికి తరలించుకపోయినది. మొగలు చిత్రాలలో గల ఆడంబరము లేని హృదయాహ్లాదకరమగు వర్ణ సంవిధానము మిలమిలలాడు సన్నని కుందనపుతీగెలవంటి రేఖాసౌష్ఠవములే ప్రపంచ ఉత్తమ చిత్రరచనలో స్థానము గడించుకొన్నవి.

తెలుగు చిత్రకళ

ప్రాచీన కాలమునుండి శిల్పచిత్ర రచనలలో తెలుగువారు సిద్ధహస్తులు. క్రీస్తుపూర్వము రెండవ శతాబ్ది మొదలు క్రీ.శ. రెండవశతాబ్దివరకు, ఆ తర్వాత ఆరవ శతాబ్ది మొదలు ఏడవశతాబ్దివరకు కొన్ని తరముల శిల్పులు అజంతా చెంతనున్న కొండలపై గుహాహర్మ్యములు తొలిచినారు. ఈ గుహల నిర్మాణములోను, అందలి శిల్ప సృష్టిలోను సిద్ధహస్తులైన తెలుగు శిల్పుల ఉలులు తాండవ మాడినవి. గుహాకుడ్యము పై సిద్ధహస్తులగు తెలుగు చిత్రకారుల కుంచెలు నాట్యముచేసినవి. మానవశక్తికి అతీతమగు యీ గుహల నిర్మాణము అందలి చిత్రశిల్పకళానైపుణ్యము ప్రపంచవిఖ్యాతిని చూరగొన్నది. సుమారు యిదే కాలమున అమరావతీ స్తూపము (క్రీ.శే. 125-155లో) నిర్మింపబడినది. స్తూపము యొక్క ఫలకములపై బుద్ధభగవానుని జీవిత చరిత్రమును, జాతక కథలను సూక్ష్మముగ వుబికిన చెక్కడములలో అతి సున్నితముగ చెక్కినారు. చుట్టు గల ప్రాకారము పై చక్కని లతలు, కమలములు, కలువులు, జంతువులు యిదే పద్ధతిలో చెక్కినారు. గుంటూరు మండలములో మాచెర్లకు సమీపమున ఒక కొండపై కనిష్కుని కాలములో బౌద్ధపండితులు నాగార్జునాచార్యులవారు బౌద్ధవిశ్వవిద్యాలయమును స్థాపించిరి. ఇచ్చట స్తూపములు, సంఘారామముల వెలసి, మహోన్నతదశ ననుభవించినవి. ఇందలి శిల్పవిభవము అపూర్వము. ఇవి కొంచె మించుమించు

అమరావతికి ముందుగనే క్రీ.పూ. మొదటి శతాబ్దిలో నిర్మింపబడినవి. ఇందలి శిల్పములను అమరావతి శిల్పములవలెనే ఫలకములపై కొంచె ముబ్బెత్తుగ అట్టి గాథలనే చెక్కినారు. ఇట్టివే శిథిలావస్థలో వున్న మరికొన్ని గుహలు, స్తూపములు, విహారములు మొదలగునవి చిన్న పరిమాణములో గుంటూరు మండలములోని పలుతావులయందును, విజయవాడ చెంత కృష్ణాతటమునను, విశాఖ పట్టణము జిల్లాలో అనకాపల్లి సమీపమున బొజ్జన్న కొండలోను కాననగును. ఇవియన్నియు ఇప్పుడుకడు శిథిలావస్థలో ఉన్నవి. బొజ్జన్న కొండపై కొన్ని చక్కని శిల్పచెక్కడములు కలవు. కళింగదేశమునుండి కొందరు తెలుగు శిల్పులు వెళ్ళి సుమిత్రాదీవిలో బ్రహ్మాండమైన బౌద్ధశిల్పసృష్టిచేసినారు. ఆ తరువాత తొమ్మిదవ శతాబ్దిలో మధ్య జావాదీవిలో ముఖ్యముగ బోరోబుదూర్‌వద్ద అపూర్వ శిల్పసృష్టి చేసినారు. ఇవియు అమరావతి, నాగార్జున కొండ శిల్పములవంటివే!

శ్రీ భావరాజు వెంకటకృష్ణారావు గారు రచించిన 'ప్రాచీన ఆంధ్రరాజుల వంశముల చరిత్ర'లో చోళులు మొదట తెలుగువారే అనియు, వారి మూలస్థానము మొదట కృష్ణ తుంగభద్రలవైపున నుండిన దనియు, తరువాతి కాలములందు యీ చోళులు అరవదేశమున ప్రవేశించి, అరవచోళులుగ గూడనైరనియు, శిల్పకళానైపుణ్యము గల గొప్ప గొప్పదేవాలయాదులు ద్రావిడదేశములో నిర్మితము కాకపూర్వమే అజంతా, విజయవాడ, ఉండవల్లి, భైరవకోన మొదలగు ప్రదేశములందరి విహారములను, గుహాగృహములను, అందలి చిత్తరువులను నిర్మించిరనియు, చోళ ప్రాభవము అరవమండలములందు విస్తరించుటకు కొద్ది శతాబ్దములకు పూర్వమే యివన్నియు నిర్మితములైనవనియు వ్రాయుచున్నారు. ఇందువల్ల తంజావూరు మండలములోగల చిత్రశిల్పములలో మన ఆంధ్రచిత్రశిల్పకారుల హస్తములు మెలగివున్న వనుటలో ఎంతమాత్రము సందేహము లేదు.

హంపీ విజయనగర సామ్రాజ్యమును తెలుగు చక్రవర్తులు క్రీ.శ. 1336లో స్థాపించి, సుమారు 240 సంవత్సరములు అవిచ్ఛిన్నముగ పాలించిరి. వీరి పాలనాకాలములో శిల్పచిత్రకళలు హెచ్చుగ ప్రోత్సహింపబడినవి. ఈ శిల్పవిభవము యిప్పటికిని హంపీ విజయనగర శిథిలములలో చూడనగును. ఇందు ప్రత్యేక ఆంధ్రత్వము నిరూపిస్తున్న దనుట నిజము.

ఇప్పుడు మన ఆంధ్రదేశములో ముచ్చీలని వ్యవహరింపబడుచున్న జాతివారు ముఖ్యముగ చిత్రకళనేవృత్తిచేసుకొని 56 శతాబ్దముల నుండి కృష్ణాగోదావరి జిల్లాలలో వుంటూవున్నట్లు నిదర్శనములు కలవు. బ్రహ్మాండ పురాణములోని మౌక్తికోపాఖ్యానము వీరి జాతిని గూర్చి యిట్లు చెప్పుచున్నది.

“వీరు ఈశ్వరుని బాహువులనుండి జన్మించిరి. ముక్తఋషిసంతతివారు. శైవమతస్థులు. వీరు వివిధ శిల్పములు నేర్చి, వీరు దేవతలను రాజులను రంజింపజేయవలయును. రానురాను వీరిలో కొందరు వైష్ణవమతమునుకూడ స్వీకరించిరి. కాని, ఈ రెండు మతస్థులకు సంబంధ బాంధవ్యములున్నవి. వీరు మౌక్తిక కృషి సంతతివారగుటచేత మౌక్తికులని వాడబడెడివారు. రానురాను ముత్యమువారనియు, యిప్పుడు ముచ్చివారనియు వాడబడుచున్నారు. ఆర్యక్షత్రియులనికూడ పిలువబడుచున్నారు.”

వీరు హిందూసంస్థానములలోను, మహమ్మదీయ సంస్థానములలోను ఆస్థాన చిత్రకారులుగ నుండి, ఆస్థానాధీశులిచ్చిన మడిమాన్యములు అనుభవించుచు, ఆస్థానములకు సంబంధించిన చిత్రరచనలు చేయు చుండిరి. దేవాలయపు గోడలమీద పురాణగాథలను చిత్రించుట, దేవాలయములకు సంబంధించిన దేవతల వాహనములు మొదలగునవి నిర్మించి, రంగులతో అలకంరించుట, వానిని జాగ్రత్తపరచుట– వీరి ముఖ్యవిధి.

ఆ తరువాత సంస్థానాధీశులయొక్కయు, సామంతుల యొక్కయు రూపచిత్రాలు (తస్వీరులు) చిత్రించియు, పక్షులు, జంతువుల మొదలగువానిని చిత్రించియు, మంచములు పెట్టెలు మొదలగు సామానులకు చిత్రచిత్ర వర్ణములలో, చిత్రచిత్రలతలతో నలంకరించియు అధీశులయొక్కయు సామంతుల యొక్కయు మెప్పులను పొందుచుండెడువారు. వీరు దశావతారి ఆటకుగాను రెండంగుళముల వ్యాసము గల గుండ్రని చిన్న పేకముక్కలను తోలుతోగాని, అట్టతోగాని తయారుచేసి, వాటిపై రాజు వజీరు మొదలగు బొమ్మలను అతినైపుణ్యముగ వ్రాసెడివారు. నిజముగ యివి రాజపుత్ర, మొగలు Miniatures ను జ్ఞప్తికి దెచ్చును. వీటిని కొందరు కళాభిలాషులు యిప్పటికిని అపురూపముగ జాగ్రతపరచుకొనుచున్నారు.

వీరి చిత్రాలు లేపాక్షి వీరభద్రేశ్వరాలయము గోడలపైనను, కుంభకోణమురామస్వామిగుడిలోను, మరి కొన్ని తావులయందును చూడనగును. ఈ చిత్రాలు సుమారు 16వ శతాబ్ది ఆంధ్రచిత్రకారుల కళావైభవమును చాటగలదు. ముఖ్యముగ లేపాక్షి కుడ్యచిత్రాలలో రేఖాప్రాబల్యము గల వర్ణ సంవిధానము, ఆ కాలపు వేష భాషలు, భావ ప్రకటనలు చక్కగ వ్యక్తీకరింపబడినవి. వీరి వర్ణ సంవిధానమున అజంతా చిత్రాలలో వంటిది గాక ప్రత్యేకమైన క్రొత్తపోకడ యగుపడుచున్నది. ఈ చిత్రకారులలో కొందరు విజయనగర సామ్రాజ్య ప్రతినిధులతో తెలుగుదేశమునుండి వలస వచ్చి, దక్షిణదేశమందు తంజావూరు ప్రాంతములలో నివసించుచున్నారని, వీరు యిప్పటికిని తెనుగు మాట్లాడుదురని Castes and Tribes of India లో వ్రాయబడియున్నది.

వీరికి కావలసిన రంగులు, వార్నిషులు వీరే తయారుచేసికొనెడివారు. ఇవి స్థిరములై, ఎంతకాలమునకు ధాతువు చెడక యుండెడివి. వెండితోను, బంగారుతోను అతి అల్పమైన రేకులు తయారుచేసికొని తమ చిత్రాలపై అంటించి అలంకరించెడివారు. అప్పుడప్పుడు ఆ బంగారు అలంకారములలో విలువగల రాళ్లు పొదిగేవారు. వీరిలో కొందరు యిప్పటికిని పూర్వపు ఇనాములు అనుభవించుచు, గుళ్లను ప్రతి సంవత్సరము అలంకరించుచున్నవారున్నారు. పెద్దాపుర సంస్థానపు అంత్యదశలో సుమారు 150 సం.ల క్రిందట వీరు చిత్రించిన కొన్ని చిత్రాలు పెద్దాపురములో రాజులవద్ద చూడనగును.

కొంతకాలమునుండి తగు పోషణ, ప్రోత్సాహములేక, వీరిలోని కళ సన్నగిలిపోయినది. ఈ వంశస్థులు పెద్దాపురము, కొండపల్లి, రాజమహేంద్రవరము, ఏలూరు, తెలంగాణా మొదలగు ప్రదేశములలోయున్నారు. ప్రఖ్యాతిగాంచిన కొండపల్లి బొమ్మలు ఈ శిల్పులు తయారుచేయుచున్నవే. చక్కని ఆంధ్రత్వము ప్రతిబింబించు ఆంధ్రుల పల్లెపట్టుజీవితము యీ చిన్న కొయ్య బొమ్మలలో అతిస్వభావసిద్ధముగ మూర్తీభవిస్తున్నది.

ఇంతలో ఆంగ్లేయులు మనదేశములో కాలిడి, వారి ప్రాబల్యము నానాటికి హెచ్చి, వారి పాలన ప్రారంభమైనది. సంస్థానములన్నియు ఒక్కటొక్కటిగ క్రమముగ బ్రిటిషు రాజ్యమునకు కలుపుకోబడినవి. అంతటితో తెలుగు చిత్రకళే కాక, యావత్తు భారతకళ రాజపోషణ లేక రూపుమాసినది. ప్రజలలోకూడ కళాభిరుచి, అభిమానము, గౌరవము నశించిపోయినవి.

అంగ్ల పరిపాలన ఈ దేశములో కాలూనినకొలది రెండవరకపు ఆంగ్ల చిత్రకారులు యిచ్చటకు వచ్చి, ప్రభుత్వపు సిఫార్సులవల్ల ప్రభుత్వమునకు లోబడిన రాజుల ఆస్థానములలోచేరి, వారి రూపచిత్రములు మొదలగువానిని పాశ్చాత్యపద్ధతిలో చిత్రించి యిచ్చి హెచ్చుధనమును తీసికొనిపోవుచుండెడివారు. ఇట్టి చిత్రాలు కొన్ని సంస్థానములలో గలవు. క్రమముగ ప్రజలకు యీ రచనపై వ్యామోహము హెచ్చినది. ప్రభుత్వముకూడ పాశ్చాత్యపద్ధతిని చిత్రరచన గరపు పాఠశాలలను మదరాసు, బొంబాయి, కలకత్తా మొదలగు పెద్దపట్టణములలో స్థాపించిరి. ఆంగ్ల చిత్రకారుల వద్దనే పాశ్చాత్య చిత్రరచనను అభ్యసించిన రాజా రవివర్మనూ ...పెక్కు చిత్రాలు సృష్టించి, వాటి లిథోనకళ్లతో భారతదేశాన్ని ముంచివేసినాడు. ఇవి చౌకగను, ఆకర్షకముగను వుండుటవల్ల బీదలు, ధనికులు వీటినే తమ గృహము అలంకరించుకొనుచుండిరి. చిత్రనిర్మాణములగు దృఢమైన దేశీయ గృహోపకరణములను, జీవితావసరమగు సామానులను మోటు అని తలచి, పాశ్చాత్యదేశములనుండి దిగుమతి యగు సామానులనే వాడుచువచ్చిరి. అందువల్ల కరకళలుకూడ క్షీణించిపోయినవి.

నేటి తెలుగు చిత్రరచన

నేటి తెలుగు చిత్రరచన ముఖ్యముగ నాలుగు విధములుగ సాగుచున్నది. ఈ రచనకు నాలుగు మూల స్థానములు గలవు. మొదటిది రాజమహేంద్రవరములో శ్రీ దామెర్ల రామారావు స్థాపించిన చిత్రకళాసంస్థ. రెండవది మచిలీపట్టణమునందలి జాతీయ కళాశాలలో ఆచార్య ప్రమోదకుమారచటర్జీ గారి చేతిక్రింద తయారైనవారు. అటు తరువాత మదరాసు చిత్రకళాశాలలో ఆచార్య దేవీ ప్రసాదరాయ్‌చౌదరి గారి వద్ద విద్యనభ్యసించినవారు. ఆ పైని, శాంతినికేతనములో ఆచార్య నందలాలుగారి మ్రోల చిత్రరచన అభ్యసించినవారు. ఈ నందలాలు, ఛటర్జీ, చౌదరీ గార్లు ఆచార్య అవనీంద్రనాథ్ టాగోరుగారి మొదటి శిష్యకోటిలోనివారు.

దివంగతుడైన దామెర్ల రామారావు బొంబాయి చిత్రకళాశాలలో విద్య పూర్తికావించుకొని, రాజ మహేంద్రవరములో 1621 సంవత్సరములో చిత్రరచన ప్రారంభించునాటికి, తెలుగుదేశములో చిత్రరచన నామావశిష్టముగ నుండినది. అప్పుడు పేర్కొనదగిన చిత్రకారులెవ్వరును లేరు. పాఠశాలలలో పేరుకు మాత్రము చిత్రకళాధ్యాపకులని చెప్పదగు డ్రాయింగు మాస్టర్లు, ఏవో చిత్రాలు చూచి నకళ్లు తీయు ఉత్సాహవంతులగు యువకులు, ఫోటోలను చూచి నల్లని మసితో చౌకరకపు ఎన్‌లార్జిమెంటులు చేయువారుకూడ అతి అరుదుగ నుండిరి. అప్పుడు వీరే చాలా ప్రతిభగల చిత్రకారులుగ ఎంచబడుచుండిరి.

ఇట్టి దుర్దశలో రామారావు మొదట 1621లోనే అసలైన ఆంధ్రచిత్రరచనను ప్రారంభించి, దానిని పునరద్ధరించి, తెనుగు చిత్రరచనకు మార్గదర్శకుడైనాడనుటలో ఎంతమాత్రము అతిశయోక్తిలేదు. ఎ.ఎస్.రామ్‌గారి నాటకతెరల రచనలు చూచుటవల్ల, లేబ్రాయములోనే రామారావులో చిత్ర కళాభిరుచి నాటుకొన్నది. తరువాత ఓ.జె.కూల్డ్రేగారి సాహచర్యము, శిక్షణ రామారావుయొక్క నిజమైన చిత్రరచనకు మార్గదర్శనములైనవి.

తరువాత బొంబాయి చిత్రకళాశాలలో రెండేండ్లు శిక్షణపొంది అజంతా, ఎల్లోరా, కార్లీ, ఎలిఫెంటా మొదలగు హైందవబౌద్ధశిల్పాలు, ఢిల్లీ, ఆగ్రా మొగలు రాజపుత్ర చిత్రశిల్పాలు, దక్షిణ భారతశిల్పలోహవిగ్రహముల కళావిభవము, అప్పుడే ప్రబలుచున్న వంగచిత్రకారుల రచనలు మున్నగువాటిని ప్రత్యక్షముగ చూచి, బాగుగ అవగతము చేసుకొని, 1621 సంవత్సరములో రాజమహేంద్రవరములో నూతన విధాన భావచిత్రరచనలు ప్రారంభించినాడు.

రామారావు నిర్మించుకొన్న యీ నూతన శైలిలో ఒక ప్రత్యేకత ఉన్నది. ఈతడు ఏ కాలపు ఏ చిత్రరచనపై అయినను ఆధారపడి చిత్రరచన చేయలేదు. భారతశిల్పరచనలనుండి తనకు మంచిగా తోచిన విషయముల నన్నిటిని గ్రహించి, తన స్వంతశైలితో మేళవించి ఒక నూతనమైన రచనావిధానమును నిర్మించుకొన్నాడు. కాని రవివర్మవలె ఒక అందమైన స్త్రీ యొక్కగాని, పురుషునియొక్కగాని రూపచిత్రాన్ని పాశ్చాత్యవిధానములో చిత్రించి, ఆయా పాత్రలకు కావలసిన వేషములు వేసి, ఒక లక్ష్మి అనిగాని, ఒక శంకరుడని గాని నామకరణము చేయలేదు. నేటి కొందరు చిత్రకారులవలె వికృతరూపములు చిత్రించలేదు. ఈతని చిత్రరచనలలోని మానవాకృతులు అజంతా చిత్రములలోని మానవాకృతులకంటె ఒకింత వాస్తవికముగ నుండును. ఈ చిత్రముల కూర్పు (Composition), వ్యక్తుల భంగిమములు, ఆకృతుల నిర్మాణము, వర్ణసంవిధానము, వర్ణలేపనము, రేఖా సౌష్ఠవబింకములు, భావప్రకటనము, అలంకారములు, పరిసర ప్రదేశములు (Back Grounds) కేవలము హైందవ సంప్రదాయ సిద్ధములై జాతీయతను వ్యక్తీకరించుచు, హృదయాహ్లాదకరముగ నుండును. ఈతని సాముదాయకచిత్రాల కూర్పు ఒక ప్రత్యేకతను కలిగియుండును. ఇట్టి చిత్రాలను చిత్రించుటలో తెనుగునాటనేకాదు, యావద్భారతదేశమునందును యితడే ప్రథమ సిద్ధహస్తుడు. ఈ రచనలలో నిశితమైనట్టియు, సౌష్ఠవమైనట్టియు రేఖలకు ప్రాబల్యము కలదు.

ఈతని రచనను పెక్కుండ్రు చిత్రకారులు, విమర్శకులు, కళాభిలాషులు, Commisseurs చూచి, తలలు పంకించి మెచ్చుకున్నారు. ఆదరించినారు. ఖండాంతరములందుగూడ హెచ్చుగ ప్రశంసింపబడినవి. ఇతడు బొంబాయినుండి వచ్చి, తెనుగు దేశములో యీ విధమగు నూతన రచన ప్రారంభించి, అన్ని విధములగు కొన్ని వందల చిత్రములను రచించి సుమారు పాతికేండ్లవయస్సుననే దివంగతుడైనాడు. ఇంతవరకు జీవించియుండిన యీతని రచన ఎంతటి యౌన్నత్యదశకు వచ్చివుండెడిదో ఊహాతీతము. ఈతడు ముఖ్యముగ భావచిత్రములను, దృశ్యచిత్రాలను, కొద్ది రూపచిత్రాలను చిత్రించినాడు. ఈ అల్ప కాలములోనే ఒక చిత్రకళాసంస్థను రాజమహేంద్రవరములో ప్రారంభించి కొంతమంది చిత్రకారులను తయారుచేసినాడు నేటికిని యీ సంస్థ కొనసాగుచునే యున్నది. రామారావు జీవించియుండు కాలముననను, ఆ తరువాతను యీ సంస్థలో తయారై ప్రతిభావంతులగుచున్న చిత్రకారులు చామకూర సత్యనారాయణ గారు, వి.వి.భగీరథగారు, బుచ్చి కృష్ణమ్మగారు, సత్యవాణిగారు, వై.సుబ్బారావుగారు, ఎం.ఎస్.ప్రకాశరావుగారు, దుర్గారావుగారు, సీతారామాచార్యులుగారు, హరిశ్చంద్రశర్మ గారు, ఈదూరి రామచంద్రరావు గారు మొదలైనవారు.

తరువాత 1924 కళాస్రష్ట ప్రమోద కుమార చటర్జీ గారిని బంగాళమునుండి రావించి, మచిలీపట్నము జాతీయ కళాశాలలో కొందరు తెలుగుయువకులకు నాలుగైదేండ్లపాటు చిత్రకళలో శిక్షణ యిప్పించినారు. ఇందు ప్రతిభావంతులైన చిత్రకారులు అడివి బాపిరాజుగారు, గుర్రం మల్లయ్యగారు, రామమోహనశాస్త్రిగారు, ఆనందమోహన శాస్త్రిగారు (వీరు గతించినారు), కేశవరావుగారు మొదలగువారు.

చెన్నపురి చిత్రకళాశాలపోషణకు ఎంతో కాలము నుండి ప్రభుత్వము ఎంతో ధనము వెచ్చించుచున్నను 1928 వరకు అధమస్థితిలోనే యుండి, పేరునకు ఒక చిత్రకారునైనను తయారుచేయలేకపోయినది. 1928 లోనే ఆచార్య దేవీప్రసాదరాయ్‌చౌదరీ గారిని బంగాళమునుండి రావించి మద్రాసు చిత్రకళాశాలకు ప్రధానాధ్యాపక పదవి నిచ్చిరి. వీరి ఆధ్వర్యమున యీ కళాశాల ఎంతో ఉన్నతస్థితికి వచ్చినది. మన రాజధాని నుండేగాక, ఇతర రాష్ట్రములనుండి కూడ, ఎందరో విద్యార్థులు వచ్చి యిప్పుడు యీ కళాశాలలో రచన అభ్యసించి, ఉత్తమ చిత్రకారులైనారు. పెక్కుండ్రు మన తెలుగు యువకులు కూడ యీ కళాశాలలో శిక్షణపొందినారు. పొందుచున్నారు. వీరిలో ప్రతిభావంతులై పేర్కొనదగిన నారాయణరావు, గోఖ్లే, పిలకా నరసింహమూర్తి, రామగోపాల్ (వీరిద్దరు రామారావు కళాసంస్థలో, కొంత కాలము కళనభ్యసించి, నరసింహమూర్తిగారు నాల్గవతరగతిలోను ప్రవేశించినారు), పైడిరాజుగారు, పొడూరి రామమూర్తిగారలు.

శాంతినికేతనములో విద్యనభ్యసించిన తెలుగు వారిలో చిత్రాగారు ప్రథములు, అతిముఖ్యులు.

బొంబాయిలో కళ నభ్యసించినవారు చామకూర భాష్యకార్లరావుగారు, చావలి నాగేశ్వరరావుగారు, ఎచ్చటను కళ నభ్యసింపక తనంతట తామే చిత్రాలు తయారుచేస్తున్న చిత్రకారులు సి.ఎన్.వెంకట్రావు (వీరు గతించినారు), అంకాల వెంకట సుబ్బారావు, మొక్కపాటి కృష్ణమూర్తి (వీరు కొద్ది దినములే మద్రాసు కళాశాలలో విద్యనభ్యసించినారు), సీతాదేవి, కమలాబాయి గారలు.

వీరి అందరి రచనను వారి వారి అభిరుచులను, నైపుణ్యమును అనుసరించి ముఖ్యమైన మూడు ఉపభాగములుగా భాగించవచ్చును.

(1) భావచిత్రరచన, (2) రూపచిత్రరచన, (3) దృశ్యచిత్రరచన.

భావచిత్రరచన :

పైన పేర్కొన్న చిత్రకారులలో పెక్కుమంది భావచిత్రరచననే విరివిగ చేయుచున్నారు. వీరిలో ముఖ్యముగ పేర్కొనదగినవారు చామకూర సత్యనారాయణ. (వీరు బొంబాయికి వెళ్ళకపూర్వము చక్కని భావచిత్రాలు తయారు చేసినారు. బొంబాయి నుండి తిరిగివచ్చిన నాటినుండి రూపచిత్రాలనే చిత్రిస్తూ, అవసర సమయములందు సుద్ద రంగులలో (Pastals) భావ చిత్రాలను చిత్రిస్తూవుంటారు. ఈ విధమగు చిత్రాలను నాడు మహాత్ముడు మదరాసువచ్చినప్పుడు, యీ మధ్య ఆంధ్రమహాసభల సందర్భములో జరిగిన చిత్రకళాప్రదర్శనములోను ప్రదర్శించిరి.

దిగుమర్తి బుచ్చికృష్ణమ్మ, దామెర్ల సత్యవాణి, వై.సుబ్బారావు, ఎం.ఎస్.ప్రకాశరావు, ఈదూరి రామచంద్రరావు, అడివి బాపిరాజు, గుర్రం మల్లయ్య, కేశవరావు, కవుతాసోదరులు, నారాయణరావు, పి.నరసింహమూర్తి, గోఖ్లే, వి.ఆర్.చిత్రా, సి.ఎన్.వెంకట్రావు, అంకాల వెంకటసుబ్బారావు, ఆర్.కమలాబాయి గారలు– మహోన్నతమైన ఎవరెస్టు శిఖరాన్ని అందని భావాలు వీరి రచనలో ఉన్నవని చెప్పుట అతిశయోక్తి అగును. ఆ తారాపథాలను విహరించే భావాలు మానవమాత్రునికి గోచరము కాజాలవు. వీరు కేవలము వీరి అధ్యాపకులనే అనుసరింపక, తమ స్వకల్పితములైన రచనా విధానముతో చిత్రిస్తారు. మూర్తుల కల్పనలు, వర్ణసంవిధానములు, అలంకరణలు స్వంతమయి వారి వారి వ్యక్తిత్వము, జాతీయత–ప్రతిఫలిస్తూ వుండును. అయిన యింకను కొందరి చిత్రాలలో వంగచిత్రకళాచ్ఛాయలు అచ్చటచ్చట గోచరిస్తున్నవి. వీరు భావి ఉత్తమ తెలుగు చిత్రరచనకు పునాదులనవచ్చును.

రూపచిత్ర రచన :

ప్రస్తుతకాలమున తెనుగునాట రూపచిత్రరచనకు కొదువ లేదు. పెన్సిలుతో రెండుగీతలు గీయలేక పోయినా, ఫోటోగ్రాఫును ఆధారముచేసుకొని యింత మసిపూయగల – ప్రతీవ్యక్తీ రూపచిత్రకారుడే. తైలవర్ణము పూయగలవాడు మరీ ప్రతిభావంతులుగ నెంచబడుచున్నారు. ఈ రీతినే రూపచిత్రరచనకు నాణెము కట్టవలసి వచ్చినచో, యిప్పుడు సినిమా పరిశ్రమలో బేనర్సు తయారు చేయుకొందరు చిత్రకారులకు మరీ ఉత్తమస్థానము యియ్యవలసివుండును. వీరి చిత్రాలలో ప్రజానీకాన్ని అతిగా ఆకర్షించే ప్రకాశవంతమగు వర్ణసంవిధానము, నటీనటుల పోలికలు, టెక్నిక్ ఎంతో బాగుంటవి. వీరు చేసే పని, వారు చేసే పని మొత్తముమీద ఒక్కటే. కేన్వాసు, రంగులు, ప్రతిఫలము– వీటిలో మాత్రమే తేడా.

రామారావు ఈ రూపచిత్రాల్ని తన సొంత విధానములో మూలచిత్రాల్ని కొన్నిటిని చిత్రించి తెలుగుయువకులకు రూపచిత్రరచనలో మార్గదర్శకుడైనాడు. ఇందు ముఖ్యమైనవి : కవిసామ్రాట్ టాగూర్, భావనగరు యువరాజు, హరీంద్రనాథ చట్టోపాధ్యాయ, తన భార్య సత్యవాణి మొదలైనవి. నిజముగ, యివి ఆంధ్రరూపచిత్రాలకు మచ్చుముక్కలవంటివి.

ఇంకను పేర్కొనదగిన కొందరు చిత్రకారులున్నారు. ముఖ్యులు చామకూర భాష్యకార్లరావు, చామకూర సత్యనారాయణ, చావలి నాగేశ్వరరావు గార్లు. (వీరు తైలవర్ణ చిత్రములు చేయుదురు) కవుతా రామమోహనశాస్త్రి, కవుతా ఆనందమోహన శాస్త్రి, హెచ్.వి.రామగోపాలు, మొక్కపాటి కృష్ణమూర్తి గారలు (వీరు పెన్సిలు రేఖలలో రూపచిత్రాలు చిత్రిస్తారు).

నూనెరంగులలో రూపచిత్రాలు చేయు పై ముగ్గురూ బొంబాయి చిత్రకళాశాలలో క్రమపద్ధతిని రూపచిత్రంలో శిక్షణపొందినను, కళాశాల విడిచిన నాటినుండి ఫోటోలను ఆధారముచేసుకొనే, చిత్రాలను లిఖిస్తున్నారు. ఈ కాలములో వీరు ఎప్పుడుకాని వ్యక్తిని ఎదుట నుంచుకొని, ఒక ఒరిజినల్ చిత్రాన్ని చిత్రించినట్లు లేదు. కళకొరకై వీరు అప్పుడప్పుడు తీరికి చేసుకొని, కొన్ని ఒరిజినల్ రూపచిత్రాల్ని సృష్టించడము వారి విధి. వీరి చిత్రాలు ఫోటోలకు 'పెద్దకాపీ'లైనా, రచనలో చక్కని వర్ణభంగిమ, బింకమైన కుంచెయీడ్పులు, అనుగుణములగు పరిసర ములు (Backgrounds) అతిరమ్యముగ నుండును. ఇవి రెంబ్రాంటు, వేండైకు మొదలగు పాశ్చాత్య చిత్రకారుల రచనలను జ్ఞప్తికితెస్తవి. వీరు తెలుగు దేశములో తైలవర్ణ రూపచిత్రాలు తయారుచేసేవారిలో అగ్రగణ్యులని చెప్పుటకు ఎంతమాత్రము సందేహము వుండదు.

కవుతా రామమోహన శాస్త్రి, కవుతా ఆనంద మోహనశాస్త్రి గార్ల రేఖాచిత్రాలు పూర్వపు రాజపుత్ర, మొగలు చిత్రాలను పోలి, హృదయాహ్లాదకరముగ వుంటవి. వీరు వ్యక్తులను ఎదుటనుంచుకునే చిత్రింతురు. మొక్కపాటి కృష్ణమూర్తిగారు, రామగోపాలుగారు చక్కని రేఖామూలచిత్రాలను సృష్టించగలరు. మొక్కపాటి కృష్ణమూర్తిగారు పెన్సిలుతో కొద్ది రేఖలలో వ్యక్తిరూపాన్ని తీర్చిదిద్దగలరు. ఈ రేఖలలో మార్దవముతో కూడిన బింకము కాననగును. చీకటి వెలుతురులుకూడ అతిగ చూపరు. 1934లో రాజ మహేంద్రవరమున జరిగిన చిత్రకళా ప్రదర్శనములోనే యిట్టి చిత్రాలను కొన్నింటిని ప్రదర్శించినారు. వీరీ రచనలోనే హెచ్చు ప్రతిభావంతులైనా, భావచిత్రాలనే హెచ్చుగ చిత్రింతురు. రామగోపాలుగారు పెన్సిలు రేఖలలోను, కుంచె రేఖలలోను అతి సున్నితముగ అత్యల్ప కాలములోనే మూర్తిని చూచి దిద్దగలరు. వీరి చిత్రాలలో కూడ అతిగ అనవసరమగు రేఖలు స్వల్ప విషయములు వుండవు. ఈ చిత్రాలు మొగలు చిత్రకారుల రేఖామార్దవమును, పాశ్చాత్య చిత్రకారుల రేఖాపటిమను జ్ఞప్తికి తెస్తూ, అతిమనోహరముగనుండును. వీరి చిత్రాలలో పోలికలు, చిత్తవృత్తులు, భంగిమ అతి స్వభావసిద్ధముగ నుండును. వీరు అప్పుడప్పుడు నీటి రంగులలో కూడ రూపచిత్రరచన చేయుదురు.

దృశ్యచిత్రరచన :

ప్రత్యేకదృశ్యచిత్రరచన పూర్వకాలమునుండి మన భారతదేశములో నుండినట్లు అగుపడదు. ప్రత్యేక దృశ్య చిత్రాలనే చిత్రించడము మొదట చైనాదేశములో ప్రారంభమై జపానుకు, ఆ తర్వాత పాశ్చత్య దేశాలకు ప్రాకినది. ఇవి అజంతా మొదలగు పూర్వచిత్రశిల్పాలలో ఎచ్చటను కనిపించవు. తరువాత రాజపుత్ర, మొగలు, కాంగ్రాచిత్రకారులు యీ ప్రత్యేకదృశ్యచిత్రాలను అతిస్వల్పముగ చిత్రించినట్లు తెలియగలదు. అయినా, వీరు చిత్రించిన భావచిత్రాలలో పరిసర ప్రదేశములు (Backgrounds) కల్పించుటలో, ఉద్యానవనములు, సూర్యోదయాస్తమయములు, వెన్నెలలు, పర్వతములు, రాళ్ళు రప్పలు, చివరకు గడ్డిపోచలు, గడ్డిపువ్వులు– యిటు వంటివాటినిసైతము conventionalise చేసి అతి రమణీయముగ చిత్రించినారు. విరివిగా యీ దృశ్య చిత్రాలను చిత్రించుట మనకు పాశ్చాత్య సంపర్కముతో ప్రారంభమైనది.

ఈ ప్రత్యేకదృశ్య చిత్రరచనా విధానమును మొదట తెలుగు దేశములో రామారావు ప్రారంభించినాడు. ఈతనికి యీ రచనలలో ప్రత్యేక వ్యక్తిత్వమున్నది. ఈతడు పడమటికనుమల సౌందర్యము, అజంతా గుహల పరిసరములు, గోదావరి మండలములోని సమతల పంట ప్రదేశములు, గోదావరీ నదీ దృశాలు– ఎన్నో అతిరమ్యముగ చిత్రించినాడు.

తరువాత, ముఖ్యముగ పేర్కొనదగిన వారు చిత్రా, భగీరథి గార్లు. వీరి చిత్రాలు యీ రచన రూపంలో ఆంధ్రుల ప్రతిభనేకాక, అఖిల భారతీయుల ప్రతిభను చాటుచున్నది. వీరిరువురి రచనలలోను ప్రత్యేకవ్యక్తిత్వమున్నది. టెక్నిక్‌కూడ వేరు వేరు. ఈ రెండు రెండు భిన్నమైన రుచులు అందాలతో కూడివుండును. ఒకరు స్వచ్ఛమైన టెంపరా రంగులలోను, మరియొకరు స్వచ్ఛమైన నీటిరంగులలోను చేయుదురు. ఒకరి చిత్రాలు మంచి ముత్యములతోను, రెండవ వారివి వజ్రాలతోను పోల్చవచ్చును.

అభివృద్ధిచిహ్నములు కలిగి ప్రత్యేకతను సూచిస్తున్నవారు రామగోపాలు, పోడూరి రామమూర్తి, సీతారామాచార్యులు, హరిశ్చంద్రశర్మగారలు.

మొత్తముమీద హైందవకళ మతసంబంధమైన ఆధ్యాత్మికవిశేషముతో కూడినది. అందువల్ల యీ రచనకు అనుశ్రుతముగ వచ్చుచుండిన సాంకేతికము (Conventionality) మూలము. ఇది హైందవ, బౌద్ధ, జైన శిల్పచిత్రములలో కాననగును. మానవాకృతులు, ముఖ్యముగా దేవతల స్వరూపములు అనుశ్రుతములైన అలంకారములతో భావయుతమైన రూపములలో నిర్మించుకున్నారు. ఏ కాలమునగాని భారతభూమిలో శంకరుడు, బుద్ధుడు మొదలగు దేవతావిగ్రహములను నిర్మించినపుడు ఆయా దైవస్వరూపములకు వుండే సాంకేతికములను, భావములనే చూపుదురు. ఆయా చిత్రకారుల అభిరుచినిబట్టి, ఆయా కాలముల రచనను అనుసరించి, ఆయా ప్రదేశములననుసరించి ఆకృతుల నిర్మాణములలో ఒకింత మార్పుమాత్రమే కాననగును. ఈ హైందవ చిత్రశిల్పకళలలో అలంకరణ (Decorative Spirit) హెచ్చుగా చూడగలము.

సృష్టిలో గోచరించు వాస్తవికతను చిత్రించక, వాస్తవికత చెడని చక్కని అలంకరణయుతమైన శైలులలో చిత్రించినారు అజంతా, మొగలు, కాంగ్రా, రాజపుత్రచిత్రకారులు, హైందవచిత్రకారులు దేవతా విగ్రహములనుసైతము (స్త్రీలను, పురుషులను) అర్ధ నగ్నముగనే చిత్రించినారు.

ఆధ్యాత్మికత చింతాపరులగు బౌద్ధభిక్షులు మత ప్రచారకర్తలు వారు నివసించు విహారములు, వారి ప్రార్థనామందిరములు మొదలగు వానిలో యీ నగ్న చిత్రములను విరివిగ చిత్రించినారు. అజంతా కుడ్య చిత్రములలో పూర్తినగ్న చిత్రములనుకూడ చూడనగును. ఇట్టివి హిందూశిల్పములలోను, లోహపు పోత విగ్రహములలోను కూడ గలవు. వీరి చిత్రాలలో ఎన్నో తరహాల భంగిమలు, హస్తవిన్యాసాలు, అలంకరణములు మొదలగునవి కనపరిచినారు.

భారతచరిత్ర శిల్పనిర్మాణములో అనాదినుంచీ తెలుగువారికే అధికమైన పాలు వుండుటచేతను, తెనుగు దేశము భారతభూమిలో ఒక భాగమగుటచేతను, తెలుగు చిత్రరచన అనీ భారతచిత్రరచన అనీ, వేరు చేయుటకు వీలులేదు. అంతయు సమగ్రభారత చిత్రరచనే. కాని, దేశీయ ఆచారవ్యవహారములు, వస్త్రధారణలు, అలంకారములు, ముఖాకృతులు, దేశీయ జీవిత సంబంధమైనట్టియు, సాంఘిక మైనట్టియు చిత్రాలను చిత్రించునప్పుడు ఒకింత మార్పు మాత్రమే కాననగును.

ప్రస్తుతము తెనుగు దేశములో చిత్రకళ అత్యుత్తమస్థితికి వచ్చినదని చెప్పుటకు వీలులేదు. దేశ దౌర్భాగ్యమువలననో, మరి యే కారణము వలననో, శక్తి వంతులనుకొనువారు అకాలమరణము నొందుటో, చిత్ర రచన చేయుటకు సావకాశము లేకపోవుటో, కేవలము ధనసంపాదనకొరకు కృతమచిత్రాలను వ్యవహార సరళిలో చిత్రించుటో, బుద్ధకస్థులగుటో జరుగుచున్నది. మన తెనుగుదేశము యీ చిత్రరచనలో ఇతర రాష్ట్రములకు ఏ మాత్రము వెనుకపడకూడదు. ప్రతి తెలుగు చిత్రకారుడు భుక్తికొరకు ఎట్టి చిత్రరచన చేసినను, ఒకింత సమయము చేకూర్చుకొని, వారివారికి గల అభిరుచులలో స్వకల్పితములై వ్యక్తిత్వాన్ని వీడని భావచిత్రములను, రూపచిత్రములను, తదితరములను సృష్టించి, తెలుగుదేశపు పూర్వపుఔన్నత్యాన్ని పునరుద్ధరించడము విధి!

(భారతి రజతోత్సవ సంచిక)

తెలుగుతల్లికి మంగళమ్! మా
కల్పవల్లికి మంగళమ్!
కొలుచు మా యెద నిలుచు మా
రాజ్ఞీమతల్లికి మంగళమ్!
ప్రాతక్రొత్తల కౌగిలింతల
ప్రసవమగు బంగారుకాంతుల
భావికాల స్వర్గమమరుచు
ప్రౌఢ ప్రతిభకు మంగళమ్!
నాగరికతను వలచి మెచ్చిన
నాడు నాడులు తరలివచ్చిన
భోగభాగ్యము లందజూపే
రాగరహితకు మంగళమ్!
వేద వేదములన్ని తరచీ
వాద భేదములన్ని మరచీ
స్వాదు ధర్మ పథమ్ము పరచు
విశాలశీలకు మంగళమ్!
నాకమందిన పగటివేళ
నరకమంటిన కారురేల
ఏకగతి తెలుగమ్మ నడిపిన
ఏకయంతకు మంగళమ్!

- దేవులపల్లి కృష్ణశాస్త్రి

డా॥ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

ఇరవయవ శతాబ్దంలో తెలుగు నాటకరంగం

ఈనాడు మనకు కనిపించే ఆంధ్ర నాటక రంగం తొలిపుట్టుక ఇప్పటికి దాదాపు నూరు సంవత్సరాల క్రిందటిదని చెప్పవచ్చును. పండితులకు తప్ప పామరులకు అర్థంకాని ఆనాటి సంస్కృత నాటకాలు మినహా తేటతెలుగులో నాటకాలంటూ లేవు. ఆనాటి ప్రజాసామాన్యానికి అందుబాటులో వున్న కళారూపాలు జానపద కళారూపాలు మాత్రమే. ఆంధ్రదేశంలో ఆనాటికి చెప్పుకోదగ్గ నాటక కళాభివృద్ధి ఇంతమాత్రమే. దేశమంతా బ్రిటిష్ వాళ్ళ బానిసత్వంలో మ్రగ్గిపోతున్న రోజులవి. అంతక్రితం అభివృద్ధి పొందిన కళాసంప్రదాయమంతా ధ్వంసమైపోయింది.

ధార్వాడా నాటకాలు

1880 ప్రాంతంలో మహారాష్ట్ర ధార్వాడా కంపెనీవారు దేశసంచారం చేస్తూ ఆంధ్రదేశానికి వచ్చారు. వీరి నాటకాలంటే వాడవాడలా ప్రజలు కదలి వచ్చేవారట. విద్యాధికులూ, కవులూ, కళాపిపాసులూ ప్రదర్శనాలకు హాజరయ్యేవారు. ధార్వాడా నటుల్లో మంచి క్రమశిక్షణ, అభినయ చాతుర్యం, మంచిపాట, వేషానికి తగిన వేషధారణ. ఎన్నో అపూర్వమైన అద్భుతాలను వారు మన ప్రజలకు చూపించి ఆకర్షించారు ఆంధ్రదేశంలోని అన్ని ముఖ్యపట్టణాల్లోనూ నాటకాలను ప్రదర్శించారు. ఆంధ్ర నాటకరంగం తొలిదశలో ఎంతో ఉత్సాహాన్ని, పట్టుదలనూ కలుగజేసింది మహారాష్ట్ర ధార్వాడా కంపెనీయే. అనేకమంది విద్యావంతులనూ, కళాపిపాసులైన శ్రీమంతులనూ, జమీందారులనూ ఉత్తేజపర్చిందీ సమాజం. ఆనాడే ఆంధ్ర నాటక రంగానికి అంకురార్పణ జరిగింది. ఆనాడే ఔత్సాహిక నాటక సమాజాలు వెలిశాయి. ధార్వాడా వారి కట్టుబాటుల్ని, క్రమశిక్షణనూ, అభ్యాసాలనూ, గురుశిష్య న్యాయాలనూ నేర్చుకున్నారు.

ఈ విధంగా ధార్వాడా కళాకారులు ఆంధ్ర దేశ నాటక రంగానికి తొలి వెలుగును ప్రసాదించారు. ఆ వెలుగులో విజయనగరం, విశాఖపట్టణం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, బందరు, గుంటూరు, తెనాలి, నెల్లూరు మొదలైన చోట్ల ఔత్సాహిక నాటకరంగాలు బయలుదేరాయి. కాని వారు ప్రదర్శించటానికి నాటకాలేవీ? అభినయాన్ని గూర్చి, తెలిసిన అనుభవజ్ఞులేరీ? ఎవ్వరూలేరు. కాని కొన్ని సంస్కృత నాటకాలూ, భరతముని నాట్యశాస్త్రమూ వున్నందువల్ల వాటిద్వారా కొంత అనుభవాన్ని సంపాదించి ధార్వాడా వారి అడుగుజాడల్లో నాటకాలు ఆడడం ప్రారంభించారు.

ఈ స్థితిలో బందరులో 1880–82 ప్రాంతాల్లో జూబిలీ థియేటరును దేవరసు వెంకట సుబ్బారావు. బాలకృష్ణగార్లు స్థాపించారు. 1884లో మొగిలిగిద్దల రామానుజరావుగారు హిందీలో నాటకాలాడారు. నాదెళ్ళ పురుషోత్తంగారు డైరెక్టరు బాధ్యతలను నిర్వహించారు. ఈమని లక్ష్మణస్వామి లాంటి

ప్రసిద్ధనటులు బిపిన్ చంద్రపాల్ మన్ననలందుకున్నారు. తరువాత హిందూ థియేటరు స్థాపించబడింది. కాశీనాధుని నాగేశ్వరరావు మొదలైనవారు నాటకాలను కట్టుదిట్టంగా ప్రదర్శించారు.

తరువాత 1904లో బి.టి. రాఘవాచార్యులుగారి ఆధ్వర్యంలో జగన్మోహన నాటక సమాజం స్థాపించబడి 1910 వరకూ నాటకాలాడింది. ఈ సమాజానికి రచయితగాను, దర్శకుడుగాను, రాఘవాచార్యులుగారు పనిచేశారు. ఈ సమాజం ఆంధ్రదేశపు నాలుగు చెరగులా పర్యటించి ప్రదర్శనలిచ్చి పేరు ప్రఖ్యాతులు గడించుకున్నది. ఈ రోజులలోనే రాజమహేంద్రవరంలో నాటకోత్సాహం వెల్లివిరిసంది.

రాజమహేంద్రవరం కళాకేంద్రం

ఆంధ్రకేసరి ప్రకాశంపంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఇమ్మానేని హనుమంతరావు, కందుకూరి వీరేశలింగం, వడ్డాది సుబ్బారాయుడు మొదలైన మహామహులు 1885-90 సంవత్సరాల మధ్య హిందూ నాటక సమాజాన్ని స్థాపించారు. ఆడే ప్రతి నాటకాన్ని కన్నులపండువుగా ప్రదర్శించే వారట.

ఆ తరువాత కృత్తివెంటి నాగేశ్వరరావు, యస్. గున్నేశ్వరరావుగార్లు ఒక నాటక సమాజాన్ని స్థాపించి, కృష్ణా, గోదావరి జిల్లాలనుంచి నటులను రప్పించి ఉత్తమంగా నాటకాలను ప్రదర్శించడమేకాక వారి సమాజాన్ని చక్కని శిక్షణాలయంగా తయారు చేశారు. ఇలా కొంతకాలం గడచిన తరువాత గున్నేశ్వరరావుగారు నాటకాలను వ్యాపార సరళిలోకి దించారు. నటులకు జీతాలనిచ్చి పోషించారు. పాపట్ల కాంతయ్య గారిని రప్పించి మంచి మంచి పార్శీమట్లు పెట్టి పాటలతోనూ పద్యాలతోనూ, నాటక ప్రదర్శనాలనిచ్చారు. రంగాలంకరణ నంతనూ మార్చేశారు. మంచి సీనరీలూ, తెరలూ, చెమ్కీకోట్లూ మొదలైన హంగులతో కనులపండువుగా ప్రదర్శనలిచ్చారు. వీరి ప్రదర్శనాలలో నృత్యప్రదర్శనాలుండేవి. ఏ దర్బారో అయితే ఒక్కసారి 50 మంది పరివారం హాజరయ్యేవాళ్లు. అలా గున్నేశ్వరరావుగారు ఆదర్శంగా నాటక సమాజాన్ని నడిపారు. కిరాయి నాటకాలను, వ్యాపారదృష్టితో నాటక సమాజాన్ని నడిపిందీ గున్నేశ్వరరావుగారే.

ఆ తరువాత చింతామణి నాటక సమాజం, నేషనల్ థియేటరూ, ఎమెచ్యూర్ థియేటరూ పనిచేశాయి. వీటిలో అంకరాజు రామారావు, ఏలూరుపాటి వెంకటరత్నం గార్లు ప్రముఖనటులుగా పై కొచ్చారు. ముప్పిడి జగ్గరాజుగారు ఆడవేషాలను ధరించి ఉత్తమనటుడుగా పేరుపొందారు.

సర్కారు జిల్లాలలో ఇలా నాటకరంగం అభివృద్ధి పొందుతూవుంటే అటు బళ్ళారి కళాకారులు కదిలారు. ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావుగార్ల ఆధ్వర్యంలో సరస వినోదిని స్థాపించబడింది. ఇరువురూ - పార్శీ, ఇంగ్లీసు నాటకాలను బాగా అవగాహన చేసుకున్నవారే. వీరి తొలి నాటకం చిత్రనళీయం. ఇది కృష్ణమాచార్యులు గారి రచనే. ఆయనే దర్శకుడు. ప్రధాన పాత్రకూడా ఆయనే ధరించేవారు. అతి మనోహరంగా నాటకాలను ప్రదర్శించేవారట. వీరి సమకాలికుడు కోలాచలం శ్రీనివాసరావు గారు కూడా అసామాన్యమైన ప్రతిభాశాలి. వీరిద్దరూ బ్రతికున్నంతవరకూ బళ్ళారి నాటకరంగం దేదీప్యమానంగా వెలుగొందింది. అనంతరం కృష్ణమాచారిగారి మేనల్లుడు తాడిపత్రి రాఘవాచార్యుల గారు బళ్లారి నాటకరంగాన్ని నిర్వహించారు. రాఘవ కళాసేవను గురించి వేరొకచోట తెలుసుకుందాం. బళ్లారివారి నాటకాల ప్రభావం ఆంధ్రదేశంలో వున్న ఔత్సాహికుల్ని వుత్సాహపర్చింది.

గుంటూరు ఫస్టు కంపెనీ

గుంటూరులో 1882-84 మధ్య పోలూరు హనుమంతరావుగారు ఫస్టు కంపెనీ స్థాపించారు. ఈ సమాజంలో అద్వితీయ కళావైదుష్యాన్ని ప్రదర్శించి, నట పితామహుడుగాను నటకాగ్రేసరుడుగాను పేరు ప్రతిష్ఠలు గడించుకున్నవారు శ్రీహరిప్రసాదరావుగారు. ఈ సమాజంలోనే బలిజేపల్లి, కోపల్లె హనుమంతరావు మొదలైన సుప్రసిద్ధనటులు వుధ్భవించారు. ఆనాడు వీరు వచన నాటకాలను మానివేశారు.

తరువాత షేక్ కనకరత్నంగారి ఆధ్వర్యంలో రెండవ కంపెనీ స్థాపించబడింది. ఒక ప్రక్క హరిప్రసాదరావు, రెండవ ప్రక్క మల్లాది గోవిందశాస్త్రి కాక యడవల్లి వారి నాటకోదయం ప్రారంభమై గుంటూరు నాటక రంగం విజృంభించింది.

గురజాడ అవతరణ

1900 సంవత్సరంనాటికి తెలుగు నాటక రచన, తెలుగు నాటకరంగం పూర్ణవికాసం పొందుతూ వున్నాయి. నాటకాలన్నీ గ్రాంథిక భాషలో వుండేవి. ఈ స్థితిలో వ్యావహారిక భాషలో కూడా నాటకాన్ని ఉత్తమంగా వ్రాయవచ్చని గురజాడ కన్యాశుల్కాని రచియించి ఆంధ్ర నాటకరంగంలో ఒక నూతనోత్తేజాన్ని కలిగించారు. కన్యాశుల్కం వ్రాసేనాటికి విజయనగరంలో నాటకాలు ప్రదర్శింపబడుతూ వుండేవి. ఈ రోజుల్లోనే నర్సరావుపేటలో విక్టోరియా మెమోరియల్ థియేటర్ స్థాపించబడింది. బెల్లంకొండ సుబ్బారావు ఇందులో సభ్యులు.

విజయనగరం ఆనంద గజపతి

1890లో ఆనందగజపతి సంస్కృతభాషా నాటకాలనూ, వాటి ప్రయోగాలను పునరుద్ధరణ చేయాలనే సంకల్పంతో ఒక సమాజాన్ని స్థాపించి, దర్శకత్వం వహించి చతుర్విధాభినయాలనూ ఆయనే నేర్పేవారు. ఈ సమాజంలో కళ్ళా పాపయ్య శాస్త్రులు, చొప్పల్లి నరసింహం మొదలైన ప్రసిద్ధనటులుండేవారు. ఇంతలో ఆనందగజపతి అస్తమయంతో ఆ సమాజం అంతరించిపోగా విజయరామ డ్రమెటిక్ అకాడమీని తాతా ఉమామహేశంగారూ, రామాయణం సర్వేశ్వరశాస్త్రిగారూ వాణీ విలాససభను అనాసపరపు గోపాలరావు, చట్టి సత్యనారాయణగార్లు కలిసి అద్భుతంగా విజయనగర ఔత్సాహిక కళాకేంద్రాన్ని అభివృద్ధిలోకి తెచ్చారు.

నెల్లూరు నాటకకళ

1890–95లో నెల్లూరులో ఆంధ్రభాషాభిమాని అనే సమాజాన్ని వేదం వేంకటరాయశాస్త్రులుగారు, పూండ్ల రామకృష్ణయ్యగార్లు స్థాపించారు. సమాజ సభ్యులందరూ విద్యావంతులు నాటకశిక్షణ అంతాశాస్త్రిగారిదే. శాస్త్రిగారి శాకుంతాలన్నీ, ప్రతాపరుద్రీయాన్నీ ప్రదర్శించేవారు. వీరి ప్రదర్శనాల ముందు ఆంధ్రదేశంలో మరోసమాజం పోటీకి నిలబడేదికాదు. దీని తరువాత భాషాభిమాని నాటక సమాజం, ఆంధ్రసభ అనే సంస్థలు స్థాపించబడ్డాయి. ఆంధ్రసభవారు తూములూరు శివరామయ్య, రాయప్రోలు సుబ్రహ్మణ్యం, నేలనూతల రామకృష్ణయ్య, కాశీచెంచు మొదలైన ఉద్దండులతో మంచి క్రమశిక్షణా పద్ధతులతో నాటకాలను ప్రదర్శించారు. నెల్లూరు నాటక సమాజం అల్లూరికి ప్రాకింది. అల్లూరులో పర్వతరెడ్డి రామచంద్రారెడ్డిగారి ఆధ్వర్యంలో కృష్ణ విలాససభ స్థాపించబడింది. ముఖ్యంగా వీరు రామదాసు నాటకాన్ని ప్రదర్శించడంలో పేరు ప్రతిష్ఠలు తెచ్చుకున్నారు.

ఏలూరు మోతేవారి నాటక సమాజం

1885–90 సంవత్సరాలలో వామనభట్ట జోషీగారు హిందీ నాటకాలు ఆడుతూ వుండేవారు. జమీందార్లైన మోతే నారాయణరావుగారు, సీతారామాంజనేయ నాటక సమాజాన్ని స్థాపించి ఆంధ్రదేశంలో పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న అనేకమంది నటీనటులను సమకూర్చి, ఏలూరు, విజయవాడ నగరాలలో రంగస్థలాలను నిర్మించి కట్టుబాట్లతో నాటకాలను ప్రదర్శించారు. కవుల్ని, చిత్రకారుల్ని పోషించారు. నటుల్లో యడవల్లి, జొన్నవిత్తుల, ఉప్పులూరి, కడియాల రత్తయ్య, ఆలమూరు పట్టాభిరామయ్య, ఆరణి, పంచాంగం, కొచ్చర్లకోట, మంజులూరి, అద్దంకి మొదలైన ప్రసిద్ధనటులందరూ వృద్ధిలోకి వచ్చారు. నారాయణరావుగారు శ్రీమంతులబిడ్డ అవడంవలన ఏ స్వార్థం లేకుండా జగజ్జేగీయమానంగా సీతారామాంజనేయ సమాజాన్ని నడిపారు.

నర్సాపురం, పిఠాపురం

ఈ రోజుల్లో నర్సాపురానికి పూనా నుండి వచ్చిన సాంగ్లీ హిందీ నాటక సమాజం నర్సాపురం కళాకారులలో వుత్సాహాన్ని రేకెత్తించింది. బుద్ధిరాజు బ్రహ్మానందం హిందూనాటక సమాజాన్ని స్థాపించారు. ఈ సమాజ దర్శకుడు మొగిలగిద్దల రామారావు. వేణీ సంహారం, అభిజ్ఞాన శాకుంతలాన్ని ప్రదర్శించారు. తరువాత 1907లో వై.యన్.కె.వి. అనే పేరుతో అళహంతి తిరుమల వెంకటాచార్యులుగారు ఒక సమాజాన్ని స్థాపించారు.

ఆ రోజుల్లోనే 1900–1906లో పిఠాపురంలో రాజారావు సూర్యారావుగారు, వారి సతీమణి కోలంక చెల్లయ్యమ్మారావుగారి పోషణలో ఒక నాటక సమాజాన్ని స్థాపించి ఆంధ్రదేశపు ముఖ్యనగరాలలో నాటకాలను ప్రదర్శించారు. పానుగంటి లక్ష్మీనరసింహారావు, వెదురుమూడి శేషగిరిరావుగార్లు ఈ సమాజం నుంచే వచ్చారు. ఆనాడు నైజాంలో కూడా ప్రదర్శనలిచ్చారు.

అటు కాకినాడలో, ఇటు రాజమండ్రి, విశాఖపట్టణాలలో నాటక సమాజాలు జోరుగా వున్న రోజులలో కల్లూరు సుందరరామయ్యగారు పెద్దాపురంలో విద్యావినోదినీ సభను స్థాపించారు. వీరు అద్భుతంగా ప్రదర్శించిన నాటకం ప్రతాపరుద్రీయం.

ఆనాడు బళ్ళారి మినహా రాయలసీమలో ఎక్కువ నాటకసమాజాలు లేకపోయినా, ఒక్క చిత్తూరులో మాత్రం టి.వి. రంగాచార్యులు, కె. వరదాచారి, బి.వి. శేషాద్రి అయ్యర్ రామవిలాస సభను స్థాపించారు. వీరు ఒక్క నాటకాలనేకాక, పురాణపఠనం, ఉపన్యాసాలు, గానకచేరీలు, గ్రంథాలయం మొదలైన లలితకళలన్నింటినీ పోషించారు. చలనచిత్ర ప్రసిద్ధనటుడు నాగయ్యగారు రామవిలాససభ సభ్యులే.

మైలవరం బాలభారతి

ధార్వాడ నాటకకంపెనీ ప్రభావంతో ఆంధ్రదేశపు ముఖ్యనగరాల్లో నాటకతృష్ణ ఎలా బయలుదేరిదో, అలాగే విజయవాడలో కాశీనాధుని వీరమల్లయ్య, కారుపర్తి నాగలింగం, సుబ్బయ్యనాయుడు మొదలైనవారు అల్లా హిందూ థియేటరును స్థాపించి, బొబ్బిలి, తారాశశాంక, హరిశ్చంద్ర మొదలైన నాటకాలను ప్రదర్శించారు.

ఇంతలో మైలవరం బాలభారతి నాటక సమాజం వెలిసింది. దీనిపోషకులు సూరానేని పాపయ్యారావు బహద్దరు జమీందారుగారు. మైలవరం కంపెని పున్నమినాటి చంద్రుడులా ప్రకాశించింది. రంగాలంకరణతోనూ, సీనరీలతోనూ, రంగురంగుల ఫోకసింగులతోనూ, ప్రదర్శనలిచ్చేవారు. గున్నేశ్వరరావుగారి వ్యాపారసరళి పద్ధతులు మైలవరం కంపెనీలో ప్రవేశపెట్టారు. యడవల్లి, నిడుముక్కల, అద్దంకి, సంజీవరావు, గురజనాయుడు, పారుపల్లి మొదలైన సుప్రసిద్ధనటులందరూ, ఇందులో చేరారు. వీరంతా నెలజీతాలు తీసుకునేవారు. రానురాను సమిష్టికృషి తక్కువై ధనదాహం ఎక్కువై, నాటక సమాజాన్ని వ్యాపారకేంద్రంగా మార్చేశారు. క్రమేపీ క్షీణించిపోయింది. ఇలా అంతరించిపోయింది మైలవరం బాలభారతి.

తెనాలి రామవిలాససభ

ఈ కాలంలో తెనాలిలో శ్రీకృష్ణ హిందూ థియేటరును చల్లా ఆంజనేయులుగారు స్థాపించారు. వీరు ప్రదర్శనాలమీద వచ్చే ఆదాయంతో స్వంత హాలునుకూడా నిర్మించుకోగలిగారు.

1921 సంవత్సరంలో భాగవతుల రాజగోపాలంగారు, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామిగారు రామవిలాససభను స్థాపించారు.

ఇందులో గోవిందరాజుల, పెద్దిభొట్ల, మాధవపెద్ది, పులిపాటి, పిల్లలమఱ్ఱి, స్థానం, ముదిగొండ లింగమూర్తి మొదలైన ప్రసిద్ధనటులుద్భవించారు. వీరాడే నాటకాలు, ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం, బొబ్బిలి, రోషనార బాగా పేరు సంపాదించాయి. ఆంధ్రదేశంలో వీరు అపూర్వమైన పేరు ప్రఖ్యాతుల్ని గడించారు. అలాగే మాధవపెద్ది వెంకట్రామయ్య ఉత్తమనటుడని నిరూపించుకున్నారు.

ఈనాటికి, కాకినాడలో 1916లో యంగ్‌మెన్స్ హాపీ క్లబ్ ఏర్పడి బాగా పనిచేస్తుంది. కాళ్ళకూరివారి చింతామణి నాటకాన్ని కదు సమర్ధనీయంగా ప్రదర్శించేవారు. ఏలూరిపాటి వెంకటరత్నం, పామర్తి బుచ్చిరాజు, దేవినేని జగన్నాయకులు ముఖ్యులుగా వుండేవారు. తరువాత 1919లో ఆంధ్రసేవాసంఘం ఏర్పడింది. సింగీతం అబ్బాయి, పులవర్తి వెంకయ్య, జయంతి భావనారాయణ మొదలైన వారే కాక, కిళాంబి కృష్ణమాచార్యులు, క్రొవ్విడి విశ్వనాథం, యస్.పి. లక్ష్మణస్వామి, యస్వీ రంగారావు, ఏ.వి. సుబ్బారావు, బి.ఏ. సుబ్బారావు, అంజలీదేవి, ఆదినారాయణరావు, కస్తూరి శివరావు, లంకసత్యం మొదలైన వారందరూ ప్రసిద్ధ నటులుగా కాకినాడ నాటకరంగంలో వెలుగొందారు.

నూతన చైతన్యం

అటు విశాఖపట్టణంలో విక్రమదేవవర్మ గారి ఆధ్వర్యంలో నాటకకళ ఎంతో అభివృద్ధి పొందుతూ వుంది. ఈ విధంగా ధార్వాడ నాటక సమాజాలూ, పూనా సాంగ్లీ హిందూ నాటక సమాజం, సొహరాబ్ మోడీ హిందీ నాటక సమాజం వచ్చి వెళ్ళిన తరువాత, నాటకోత్సాహం ప్రతి మారుమూల పల్లెకూ వెళ్ళింది. ఇందుకు కారణం దేశంలో పరాయి పాలన మూలాన జాతీయోద్యమం తలెత్తింది. ప్రజలలో జాతీయ చైతన్యం, స్వాతంత్ర్య పిపాస ఎక్కువ కాసాగింది. ఇందుకు అనువుగా భారతవీరుల చరిత్రల్నీ, రసపుత్ర వీరుల జీవితాలను, మరాఠీ కథలనూ నాటకాలుగా వ్రాయమొదలుపెట్టారు. రసపుత్ర విజయం, బొబ్బిలి మొదలైనవి. 1945-46 సంవత్సరాలలో 388 తెలుగు నాటకాలు వెలువడ్డాయి. అందులో చారిత్రక నాటకాలు 38, సాంఘిక నాటకాలు 54.

సాంఘిక నాటకాల ప్రభావం

ఈ కాలంలో సాంఘిక నాటకాలు ఎక్కువ ప్రచారంలోకి వచ్చాయి. వీరేశలింగంగారు బ్రహ్మసమాజికులు. దేశంలో సంఘసంస్కరణ వాతావరణం తీసుకువచ్చారు. ఈ కాలంలో వెలువడ్డ వరవిక్రయం, చింతామణి నాటకాలు నాటక కళాభివృద్ధికి ఎంతో మహదావకాశం కలిగించాయి. తెలుగులో పత్రికలు వెలువడ్డాయి. నాటకరంగాన్ని గూర్చి కోలాచలం శ్రీనివాసరావుగారు నటీనటులకూ రచయితలకు, ప్రణాళికలను ప్రకటించారు. దీనిని ప్రాతిపదికగా తీసుకుని పురాణం సూరిశాస్త్రి, ముత్తరాజు సుబ్బారావు, శ్రీపాద కామేశ్వరరావు, పాతాళభేది సుబ్రహ్మణ్యం మొదలైన కళాకోవిదులు పత్రికాముఖంగా నాటకాల్లో పద్యాలకు, పాటలకు అవకాశం వుందా లేదా అని చర్చలు లేవదీశారు. ఈ చర్చలవల్ల నటీనటుల్లో ఒక నూతనచైతన్యం రాసాగింది.

ఈ కాలంలో గుంటూరులో బాలమిత్ర నాటక సమాజం వెలిసింది. ఇందులో అందరూ 18 సంవత్సరాలు నిండనివారే, వీరు శ్రీకృష్ణ లీలలు, ప్రమీల నాటకాలను ప్రదర్శించి, ప్రజాదరణను పొందారు.

బళ్ళారి రాఘవ

ఆనాడు బళ్లారి రాఘవ అటు బళ్లారి మొదలు ఇటు మద్రాసు వరకూ, ఇటు మద్రాసు నుండి బరంపురం వరకూ మొత్తం విశాలాంధ్ర నాటకరంగంలోనూ నూతన విప్లవాన్ని తీసుకువచ్చిన ప్రతిభాశాలి. ఆయన 1920లో తొలిసారిగా విజయవాడలో ప్రదర్శనలిచ్చారు. అంతవరకు రాఘవపేరు సర్కారాంధ్రులకు తెలియదు. ఆంధ్ర నాటక రంగంలో ఎంతోకాలం పాతుకుపోయిన పాత పద్ధతులకు స్వస్తి చెప్పారు. రచయితలకు, నటులకు క్రొత్తమార్గాన్ని ప్రసాదించారు. స్త్రీలే స్త్రీపాత్రలు ధరించాలని ఎలుగెత్తి చాటారు.

ఆయన నిర్వహించిన హిరణ్యకశివుడు, రాజరాజు, చాణక్య, రామదాసు పఠాన్, ఒథెల్లో, షైలాక్, హామ్లెట్ పాత్రలను అఖండంగా ప్రదర్శించారు. రాఘవ ప్రతిపట్టణానికి ఒక విశాలమైన నాటక రంగస్థలం కొరకు కృషి చేశారు. సా:ఘిక నాటకాలను, ఎమెచ్యూర్ నాటకాలను ప్రోత్సహించారు.

ఈ రోజుల్లోనే నటీనటులకు ఒక శిక్షణాలయాన్ని - 1924లో గూడవల్లి రామబ్రహ్మం బి.టి. రాఘవాచార్యులు, భరతమునిబృందం అనే పేరుతో ఒక నాటక పాఠశాలను స్థాపించారు. కాని అట్టేకాలం అది నిలబడలేకపోయింది.

ఆనాడు నటులందరూ ఎంతో క్రమశిక్షణతో నాటకాలను ప్రదర్శించారు. ఆనాటికి ఈనాటికీ ఈ నాటకాలు సజీవంగా శాశ్వతంగా నిలిచివున్నాయి. కాని తరువాత కాలంలో కాంట్రాక్టు నటకుల చేతుల్లోపడి ఈ నాటకాలు కొంత అపఖ్యాతి పాలైనాయి.

కళారంగానికి గ్రహణం

1920 నుంచి 30 వరకు సత్యాగ్రహపు రోజులు. 1930 నుండి 49 వరకూ ఆర్థిక మాంద్యం. నటీనటుల స్థితిగతులు, సమాజాల స్థితిగతులు దుర్భరంగా వున్నాయి. ప్రారంభదినాలలోవున్న నాటక తృష్ణ, దృష్టి క్రమేపీ చల్లపడుతూ వచ్చింది. స్వయంగా నాటక సమాజాలను పోషించే దాతలు తగ్గిపోయారు. ఈ రోజుల్లో కంట్రాక్టర్లు బయలుదేరారు.

సమిష్టి కృషి అంతరించి వ్యక్తి స్వార్థం ఎక్కువైంది. నాటకాలను రసాభాసంగా తయారుచేశారు. వన్స్‌మోర్ విధానానికి అవకాశమిచ్చారు. స్టేజీ మీద వివిధరకాల పాటలు మొదలుపెట్టారు. నాటకం సకాలానికి ప్రారంభం కావడం లేనేలేదు. రిహార్సల్సు లేకుండా నలుగురూ నాలుగు ప్రక్కల నుంచీ వచ్చి ఎవరి చిత్తం వచ్చినట్లు వారు నాలుగు పాటలు, పద్యాలు పాడి, ఎవరి కిరాయి వారు పుచ్చుకుని తెల్లవారేసరికి ఎవరికి వారే యమునా తీరే లాగా త్రోవబట్టేవారు. ఎవరికి డబ్బు ఇవ్వకపోయినా నాటకం ఆగిపోయేది. కంట్రాక్టర్లు టిక్కెట్లు అమ్మి, సొమ్ముచేసుకుని దొడ్డిదోవను పోయేవారు. ప్రేక్షకులు నటకులను తిట్టడం, తెరలు చించడం, బల్లలూ, కుర్చీలూ విరగగొట్టడంలాంటి బీభత్సానికి దారితీసింది.

ఆంధ్ర నాటక కళాపరిషత్తు

ఆంధ్రదేశంలో కంట్రాక్టు నాటకాలూ, వృత్తి నాటక సంఘాలూ ఏర్పడి, నాటకరంగం అధోగతిలో పడిపోయే రోజులలో నాటక రంగాభివృద్ధికి పాటుపడాలనే ఉద్దేశంతో, 1929లో విశ్వనాథ కవిరాజు, వనారస గోవిందరావు, కొత్తపల్లి లక్ష్మయ్యగార్ల సహకారంతో తెనాలిలో బ్రహ్మాండంగా పరిషత్తుసభలు జరిగాయి. పరిషత్తు నాటకరంగంలో ఒక నూతన సంచలనాన్ని కలిగించింది. నూతన సమాజాలకు, రచయితలకు, స్త్రీలకు, ఔత్సాహికులకు ఉత్సాహాన్నిచ్చింది. విజయవాడ, గుడివాడ, బందరు మొదలైన శాఖల్ని స్థాపించి నాటకాలను ప్రదర్శించారు. ఎంతో కాలంగా నాటక సమాజాలను పీడిస్తున్న వినోదపు పన్నును రద్దుచేయించింది పరిషత్తు. నాట్యకళ పత్రికను నడిపింది. ఎంతోమంది కళాకారులను సన్మానించింది. నాటక కళాపరిషత్తుకోసం, యం.ఆర్. అప్పారావు, కాజ వెంకట రామయ్య, పలస సూర్యచంద్రరావు, యఱ్ఱోజు మాధవాచార్యులు మొదలైన ప్రముఖులు సేవచేశారు.

ప్రజా నాట్యమండలి అవతరణ

ఆంధ్ర నాటకరంగ చరిత్రలో 1940 నుంచి 1948 వరకు ఒక నవ్యయుగం నడిచింది. అదే ప్రజా నాట్యమండలి ఉద్యమం. ఉత్సాహం కొద్దీ నిర్మించింది కాదు ప్రజా నాట్యమండలి. అది ఒక ఉద్ధృత వాతావరణంలో జన్మించింది. ఉన్నతాశయ ప్రబోధంతో దేశానికీ, ప్రజలకూ సేవచేసింది. కళ కళ కోసం కాదనీ, అది ప్రజలకోసమనీ నిరూపించి నాటకరంగంలో మహత్తర పరిణామాలను సృష్టించింది. ప్రాచీన కళారూపాలైన భాగవతాలు, బుర్రకథలు, పిచ్చిగుంటల కథలు, విచిత్ర వేషాలు మొదలైన వాటినన్నిటినీ పునరుద్ధరించింది. ముందడుగు, మాభూమి, అపనింద, పరివర్తన మొదలైన నాటకాలను ప్రదర్శించింది. ఆంధ్రదేశంలో దాదాపు కొన్ని వందలదళాలు ఈ నాటకాలను ప్రదర్శించాయి. ముఖ్యంగా జిల్లా, రాష్ట్ర దళాలు ఎంతో ఉత్తమంగా ప్రదర్శనలిచ్చాయి. ఒకేరాత్రి రెండు నాటక ప్రదర్శనలను వరుసగా ప్రదర్శించాయి. ప్రజా నాట్యమండలి మన నాటక రంగంలో ఒక నూతన శకాన్ని ప్రారంభించింది. అనేక ఔత్సాహిక నాటక సమాజాలకు, నాటకాలకు ఉత్సాహాన్నిచ్చింది. కంట్రాక్టు నాటకాల ఉద్ధృతాన్ని దెబ్బతీసి ప్రజలకు ఉత్తమ మార్గాన్ని చూపించింది. ఔత్సాహిక నాటక సమాజాలకు ఉత్సాహాన్నిచ్చే అనేక సంస్థలు బయలుదేరి పోటీలు నిర్వహిస్తున్నాయి. ఈ ప్రగతిశీల ఉద్యమంతో డాక్టరు రాజారావు, కోగంటి గోపాలకృష్ణయ్య, కోసూరి పున్నయ్య, శిరివిశెట్టి సుబ్బారావు, పట్టంశెట్టి ఉమామహేశ్వరరావు, మాచినేని, పెరుమాళ్ళు, చదలవాడ, మిక్కిలినేని, మోహన్‌దాస్, టి. చలపతిరావు మొదలైనవారందరూ దాని నిర్మాణానికి ప్రముఖంగా పనిచేశారు.

ఔత్సాహిక నాటకరంగం

ఔత్సాహిక నటులంటే కొత్తగా నాటక సమాజాలను ఉత్సాహం కొద్దీ స్థాపించి నాటకాలను ప్రదర్శించేవారని, అంటే ప్రాథమిక దశలో నున్న నటులనికూడ చెప్పుకోవచ్చు. ఔత్సాహికులకు కేవలం కళాతృష్ణ తప్ప మరే విధమైన స్వార్థతలూ వున్నాయని చెప్పలేం. అనేకమంది ఉద్యోగాలు చేసుకునేవారూ, విద్యార్థులూ, విద్యాధికులు గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ఉత్సాహవంతులైన యువకులు అనేకమంది ఈ ఔత్సాహిక నాటకోద్యమానికి కృషి చేశారు. అలా వెంకటగిరి ఆమెచ్యూర్స్, నేషనల్ ఆర్టు థియేటరు, అరుణోదయ నాట్యమండలి, ఆదర్శ నాట్యమండలి, సంస్కార నాటక కళాసమితి, ఆంధ్ర ఆర్టు థియేటరు, సరస సమాఖ్య, విద్యానగర కల్చరల్ అసోసియేషన్, రాఘవ కళానిలయం, రావూజీ నాట్యమండలి, రాఘవ కళాసమితి, ఎక్సల్షియర్ థియేటర్, నటరాజ నాట్యమండలి, తెలుగు లిటిల్ థియేటర్ మొదలైన అనేక నాటక సమాజాలు వర్ధిల్లాయి. ఈ సమాజాల్లో ఎంతోమంది నటీనటులు ఉద్భవించారు.

సురభివారు, తెలుగు నాటకరంగం

ఆంధ్ర నాటకరంగ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యం వహించేది సురభి నాటకాల చరిత్ర. ఆంధ్రదేశంలో నాట్యకళనే వృత్తిగా పెట్టుకుని కుటుంబాలతో సహా నాటక ప్రదర్శనాలనిస్తూ ఊరూరా పర్యటించే సురభి నాటకాల వారు ఆంధ్రులకు చిరకాల పరిచితులే. ఆంధ్ర నాటకరంగ చరిత్రలో వారి నాటకాలకు స్థానం వుంది. సురభి నాటక సమాజ సంస్థాపకులు వనారస గోవిందరావుగారు.

సురభివారు ఎన్నో తెలుగు నాటకాలను ప్రదర్శించారు. ముఖ్యంగా వారికొరకే కొన్ని నాటకాలను వ్రాయించుకొని ప్రదర్శించారు. వనారస గోవిందరావు, వనారస పెదరామయ్య చినరామయ్య, వెంకోజీ, అవేటి వెంకటస్వామి, పాహిబాయి, జంఝూటి వెంకూబాయి, రామాబాయి, పెద్ద సుబ్బమ్మ, చిన్న సుబ్బమ్మ, లక్ష్మీబాయి, సురభి కమలాబాయి, ఆవేటి నాగేశ్వరరావు, బాబారావు సురభి బాలసరస్వతి మొదలైన అనేకమంది నటీనటులుగా వర్ధిల్లారు. ఈనాటికి దాదాపు 30 సురభి నాటక సమాజాలు ఆంధ్రదేశంలో పక్కా రంగస్థలాన్ని ఏర్పాటు చేసుకుని, ఒక్కొక్క

కేంద్రంలో ప్రతిరోజూ ఒక నాటకం చొప్పున వరుసగా ప్రదర్శనాలను ఇస్తున్నారు. వారి నాటక ప్రదర్శనం ఒక సినిమాలాగ జరిగిపోతుంది. రంగురంగుల ఫోకసింగులైట్లు, స్ప్రింగ్‌వర్కుతో భూమిలోనుంచి లక్ష్మీదేవి ప్రసన్నం కావడం, పై నుంచి నారదుడు వైరు వర్కు ద్వారా ప్రత్యక్షమవడం, హనుమంతుడు సముద్రందాటి లంకకు వెళ్ళడం, దేవుళ్ళ ప్రత్యక్షాలూ, అదృశ్యాలూ, మొదలైన ట్రిక్కులతో ప్రజలను సమ్మోహితుల్ని చేస్తున్నారు.

థియేటర్సు ఫెడరేషన్

ఆంధ్రప్రదేశ్ నాటక సంస్థలో ఔత్సాహిక నాటకరంగాన్ని ప్రోత్సహించే మరో ప్రధానమైన సంస్థ ఆంధ్ర థియేటర్సు ఫెడరేషన్. దీనిని ప్రారంభించి విజయవాడలో ఒకసారి, రాజమండ్రిలో ఒకసారి తాత్కాలిక నాటక కళాశాలను నిర్వహించి యువనటులలో సిద్ధాంత పరిజ్ఞాన వ్యాప్తికి తోడ్పడ్డారు. ఆహార్యం అనే గ్రంథం ప్రకటించారు.

అంతకు పూర్వం 1938–39లో బందా కనకలింగేశ్వరరావుగారు ఏలూరులో పాఠశాలను నెలకొల్పి చాలామంది నటీనటులకు సిద్ధాంత పరిజ్ఞానం కలిగించారు. నటన ప్రయోగ విధానాలలో శిక్షణయిచ్చి నాటకకళకు సేవచేశారు.

లిటిల్ థియేటర్ ఉద్యమం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న లిటిల్ థియేటర్ ఉద్యమాన్ని తెలుగుదేశంలో చేపట్టిన వారు కీ॥శే॥ కొప్పరపు సుబ్బారావుగారు. వారిని బహుముఖాల వుత్సాహపర్చినవారు కూర్మా వేణుగోపాలస్వామిగారు. సుబ్బారావుగారు బహుముఖ ప్రజ్ఞావంతులు. నాటక రచయిత, ప్రయోక్త, సంగీత దర్శకులు. ఒపేరా బాణీలో ప్రప్రథమంగా అల్లీముతా రచించింది వీరే. నాటకకళ మీద ఎన్నో ఉత్తమ గ్రంథాలను సేకరించి ఉత్తమ గ్రంథాలయాన్ని నెలకొల్పారు. సాంకేతిక ప్రమాణాలకు పనికివచ్చే ఉత్తమమైన లైటింగును అమెరికా నుంచి ఆ రోజుల్లో తెప్పించారు. ప్రయోగాలు చేశారు. అనేకమంది యువ నటీనటులకు శిక్షణ యిచ్చి ఉత్తమంగా నాటకాలు ప్రదర్శించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రయోగ నాట్యశాల

ఆంధ్ర నాటకరంగంలో ఆంధ్రవిశ్వవిద్యాలయ ప్రయోగ నాట్యశాలకు ఒక ప్రత్యేకత వుంది. ఇలాంటి ఓపెన్ థియేటర్ ఈనాటికీ ఆంధ్రదేశంలో మరెక్కడా లేదని చెప్పడం అతిశయోక్తి కాదు. దీనికి ఆ రోజుల్లో లక్షా ఏభై వేల రూపాయలు ఖర్చు అయింది. ప్రతి సంవత్సరం విశ్వవిద్యాలయ విద్యార్థులు విశాలాంధ్ర వారోత్సవాలలో నాటకాలు ప్రదర్శిస్తూ వుంటారు. దీనికంతకూ మూలవిరాట్ శ్రీ కూర్మా వేణుగోపాలస్వామిగారు. ఆనాడు వీరు స్వయంగా నాటక ప్రయోగంతో ప్రదర్శనాలను పర్యవేక్షించుతూ అనేకమంది యువ నటీనటులకు శాస్త్రీయ దృక్పథం కలుగుచేశారు.

సంగీత నాటక అకాడమి

తెలుగుదేశంలో నృత్య, సంగీత, నాటక కళల పురోభివృద్ధికి కృషిచేసే నిమిత్తం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీని 1957లో నెలకొల్పింది.

భారతీయ నృత్య, సంగీత, నాటక, చలనచిత్రకళల వికాసానికి దోహదం చేస్తూ వివిధ కళల్లో శిక్షణాలయాలను స్థాపించి కృషి చేస్తూ వుంది. వివిధ రంగాలలో సమాచారాన్ని సేకరించుతూ, పరిశోధనలను ప్రోత్సహిస్తూ కళలకు సంబంధించిన గ్రంథాలయాన్ని, పరికరాల మ్యూజియం ఏర్పాటుకు కృషి చేస్తూ వుంది.

భారతీయ నృత్య, నాటక, సంగీత, చలనచిత్ర కళలను గురించిన సాహిత్యాన్ని ప్రచురించుతూ వివిధ కళారంగాలలో విశిష్ట సేవ చేసిన కళాకారులను గుర్తించి సన్మానిస్తోంది.

కళారంగంలో విశిష్ట కృషి చేస్తున్న సంస్థలను గుర్తించి వాటికి ఆర్థిక సహాయం చేస్తూ వుంది. ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి నృత్య సంగీత, నాటక చలనచిత్ర రంగాలకు చెందిన సాంస్కృతిక బృందాలను పంపిస్తూ వుంది. నిస్సహాయ స్థితిలోవున్న వృద్ధ కళాకారులకు ఆర్థిక సహాయం చేస్తూ వుంది.

నాట్య సంఘం

భారతీయ నాట్య సంఘానికి అనుబంధశాఖగా ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం ఏర్పడింది. అనేక నాటకోత్సవాలను నిర్వహించింది. రవీంద్రభారతిలో ఒక నాట్య విద్యాలయాన్ని కొన్ని సంవత్సరాలు నడిపింది. నాట్యమిత్ర అనే ఒక బులిటెన్ నడిపింది. నాటకాలను నూతన ప్రయోగంతో ప్రదర్శించింది. ఆంధ్రదేశంలో అనేకచోట్ల నాటకోత్సవాలను నిర్వహించింది. నాట్య సంఘ పురోభివృద్ధికి ఎ.ఆర్. కృష్ణ, బి. కృష్ణంరాజు, గోవిందచౌదరి, డి.కె. రావు, మామిడిపూడి ఆనందం మొదలైన ప్రముఖులెందరో కృషి చేశారు.

ఆంధ్రదేశంలో అనేక నాటకకళాపరిషత్తులు

ఆంధ్ర నాటక కళాపరిషత్తు, సంగీత నాటక అకాడమీ నిర్మించినవాటిల్లో ఈనాడు ఆంధ్రదేశంలో వెల్లువగా నాటకాల పోటీలు జరుగుతున్నాయి. సంవత్సరాల తరబడిగా ప్రతి సంవత్సరం ఒక నిర్ణీత సమయంలో అనేక పరిషత్తులు నాటకోత్సవాలను నిర్వహించాయి.

ఈ నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం, రాజమండ్రి లలితకళానికేతన్, విజయనగరం రాఘవ నాటకోత్సవ సంఘం విజయరామ డ్రమెటిక్–రామారావు నాటక కళాపరిషత్తు, రాయల నాటక కళాపరిషత్తు (ప్రొద్దుటూరు) గుంతకల్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్ గొల్లప్రోలు కొప్పవరపు సుబ్బారావు నాటక కళాపరిషత్తు, విశాఖ నాటక కళాపరిషత్తు, పాలకొల్లు నాటక కళాపరిషత్తు, గెద్దనాపల్లి పరిషత్తు, అనంతపురం లలితకళాపరిషత్తు, తిరుపతి వెంకటేశ్వర నాటక కళాపరిషత్తు, కావలి కాళిదాస కళారాధన, గూడూరు సంస్కృతీ సమ్మేళనం, విజయవాడ ఆంధ్ర నాటక కళాసమితి, మద్రాసు చెన్నపురి ఆంధ్ర మహాసభ నాటకోత్సవాలు, సత్తెనపల్లి ప్రగతి నాటక కళాపరిషత్తు, చిలకలూరిపేట కళాపరిషత్తు, నెల్లూరు నెఫ్కా, నెఫ్జా మొదలైన అనేక నాటక సంస్థలు పరిషత్తులను, భారీగా నిర్వహిస్తున్నాయి.

ముగింపు

ఏది ఏమైనా ఈనాడు ఆధునిక నాటక రంగంలో చెప్పుకోదగినంత పురోభివృద్ధి కానరావటం లేదు. అందుకు ముఖ్యకారణం సినిమా అభివృద్ధిగా చెపుతున్నారు. ఈనాడు ప్రజల వినోదానికి పట్టుకొమ్మగా నిలబడింది సినిమా ఒక్కటే. అందువల్ల నాటకరంగానికి ఆదరణ తగ్గిపోయింది. ఈనాడు నాటకాలు ప్రదర్శించుకోవడానికి ఆంధ్రదేశంలో తగిన రంగస్థలమే లేదు. అన్నీ సినిమాహాల్సుగా మారిపోయాయి. పరిషత్తులలో మినహా సాంఘిక నాటకాలకు ఆదరణ లేదు. అందువల్ల ఔత్సాహిక నాటక రంగంలో చెప్పుకోదగినంత అభివృద్ధి కనిపించడం లేదు. ఎంతోమంది రచయితలు, ఎన్నో అభ్యుదయ సాంఘిక నాటకాలనూ రచిస్తున్నారు. అనేక ఔత్సాహిక నాటక సమాజాలు, నటీనటులు వున్నారు. కావలసినంత ఉత్సాహమూ వుంది. కాని ప్రజాదరణా, ప్రభుత్వ ఆదరణా తక్కువగా వుంది. ప్రక్కనున్న తమిళ నాటకరంగంతో పోల్చినట్లైతే మనం ఎక్కడున్నామో అర్థమౌతుంది.

ఈనాటికీ ఆంధ్రదేశంలో విరివిగా పౌరాణిక పద్యనాటకాలను వృత్తినటులు ప్రదర్శిస్తూనే వున్నారు. వేలకువేలు కలెక్షన్స్ వస్తూనే వున్నాయి. కాని నాటకాలు మాత్రం పేలవంగా వుంటున్నాయి. అందుకు కారణం, పాండవోద్యోగం ప్రదర్శిస్తే, ముగ్గురు కృష్ణులు, ముగ్గురు అర్జునులు, చింతామణి ప్రదర్శిస్తే, ముగ్గురు చింతామణులు, ముగ్గురు సుబ్బిశెట్టిలు, ఈ విధంగా ప్రదర్శిస్తే తప్ప. కలెక్షన్స్ రావడం లేదు. కేవలం పద్యాలు పాడి వన్సుమోర్లతో ప్రేక్షకులను తృప్తిపరుస్తున్నారు. ఈ విధానం వృత్తినాటక సమాజాలకు చరమాంకమే.

ఈనాడు అక్కడక్కడ కొన్ని సమాజాలు కొన్ని ఉత్తమ సాంఘిక నాటకాలను సృజనాత్మకంగా ప్రదర్శిస్తున్నాయి. అందుకు ఆ సమాజాలనూ, నటులనూ అభినందించవలసిందే. ఏది ఏమైనా ఆధునిక నాటకరంగ పురోగమనంలో ఆశ కంటే నిరాశే ఎక్కువగా కనిపిస్తూ వుంది.

నా విజ్ఞప్తి

నూరు సంవత్సరాల నాటకరంగంలో ఎంతోమంది మహామహులు నాటక సమాజాలను స్థాపించారు. ఎందరో మహానటులు ఎన్నెన్నో పాత్రలు ధరించి పేరు తెచ్చుకున్నారు. ఎందరో మహానుభావులు ఈ నాటక రంగానికి సేవ చేశారు. నేను వ్రాసిన ఈ చిన్న వ్యాసంలో ఉదాహరణగా మాత్రమే కొన్ని పేర్లు ఉదాహరించాను. కావాలని ఎవ్వరినీ విస్మరించలేదు. సదభిప్రాయంతో నా యీ వ్యాసాన్ని స్వీకరిస్తారని ఆశిస్తాను.

(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటకోత్సవాల సంచిక, గాంధీ క్షేత్రం – అవనిగడ్డ, 1977)

స్థానం నరసింహారావు

ఆనాటి ప్రదర్శనాల్లో మా సమయస్ఫూర్తి

నాటక ప్రదర్శనాల్లో అప్పుడప్పుడు పొరపాటుగాని తప్పిదాలుగాని ఉత్పతిల్లుతూ ఉంటాయి. ఇవి ఆ నాటక సంఘాలవారి అతిశ్రద్ధవల్లగాని, అశ్రద్ధవల్లగాని లేక భయంవల్లగాని, ఇలాంటివే మరికొన్నింటి వల్లగాని గలుగుతూ వుంటాయి. వాటిని ఆ నాటక కథాను గుణ్యంగా నటులు సరిదిద్దుకొంటూ వుంటే, ఔచిత్యానికి భంగం గలగకుండా వుంటుంది. రసస్ఫూర్తికి దోహదమవుతూ వుంటుంది. వాటిని ఉపేక్షించడంగాని, విస్మరించడంగాని జరిగితే, అది నటుల లోకజ్ఞానానికి గొడ్డలి పెట్టులాంటిదవుతుంది. సాధ్యమైనంత వఱకు వాటిని వెంటనే సరిదిద్దుకోవలసిన బాధ్యత పాత్రధారులైన నటులపై ఎంతైనా ఆధారపడివుంటుంది.

ఇలాంటివి నా నాటక జీవితంలో రంగస్థాలాన కొన్ని జరిగాయి. వాటిని ఏ విధంగా సరిదిద్దుకోవలసి వచ్చిందో ఒకటి రెంటిని మనవిజేస్తాను పాఠకులకు.

బాపట్లలోని ప్లీడరు గుమస్తాల నాటక సంఘంలో, హరిశ్చంద్ర నాటకంలో చంద్రమతీవేషం ప్రథమంగా నేను ధరించవలసివచ్చింది ఆపద్ధర్మంగా. పోర్షన్ సరీగా రాదు. భయం ఆపాదమస్తకమూ ఆవహించింది. హరిశ్చంద్రుడు, వేటకు భార్యాసుతసమేతుడై బయలుదేరినట్లుగా రంగస్థలానికి వస్తాడు. ముందుగా అయనవచ్చాడు. వేటకు సంబంధించిన పద్యం చదివాడు. తన భార్య కొఱకు చూచాడు. అప్పుడు చంద్రమతీ వేషంలోవున్న నేను రావాలి, ఓ ప్రక్కగా ప్రేక్షకులవైపుతొంగి చూచాను. నా భయం కళ్ళకు కప్పేసింది. రాలేక నిలబడి పోయాను ఆ సైడ్ వింగులో. అప్పటికే రెండు మూడు నిమిషాల ఆలశ్యం అయింది. ముందడుగు వేయటానికి తటపటాయిస్తూన్నాను. వెనకనుండి ఆ కంపెనీ మేనేజరు కీ.శే.గంగవరపు కృష్ణయ్యగారు నన్ను ముందుకు నెట్టారు. కాలి కేదో రాయి తగిలితే ముందుకు పడబోయినట్లుగా రంగస్థలం ప్రవేశించాను. బిత్తర బోతూ నిలుచున్నాను. నా భయాన్ని గమనించిన ఆనాటి హరిశ్చంద్ర పాత్రధారి కీ.శే. చోరగుడి హనుమంతరావుగారు, పుస్తకంలో లేని తన స్వంతమాటలతో "దేవీ! ఇది మహారణ్య ప్రాంతము. రాయీ రప్పా కాలికి తగులుచుండును. ముందు మంచిదారి చూచుకొనుచు అడుగెయ్యవలసినది. అటుల బిత్తరబోయెదవేమి బేలా?" అని నా వీపు తట్టి, భయాన్ని కొంత తగ్గించాడు, ఆనాటి ఆయన సమయస్ఫూర్తి, నా ముందు నాటక జీవితంలో కొంత వరవడి దిద్దిపెట్టింది.

ఒకనాడు అనకాపల్లిలో కృష్ణతులాభారం నాటకం ప్రదర్శిస్తూన్నాం. నేను సత్యభామగానూ, శ్రీ కె.గోవిందరావు రుక్మిణిగానూ నటిస్తూవున్నాం. చివర రంగంలో త్రాసులో కూర్చున్న కృష్ణుణ్ణి, రుక్మిణివచ్చి, భక్తితో ఒక్క తులసీదళంవేసి తూస్తుంది. అది సమానంకంటె హెచ్చుగా త్రాసుతక్కెడ

పైకిలేవాలి. ఇందులకు అలవాటుపడిన ఒక పద్ధతిని ఆచరణలోపెట్టాం. అదేమంటే కృష్ణుడు కూర్చున్న త్రాసుయొక్క దండెకు చివర భాగంలో ఒక సన్నని ఇనపతీగెకట్టాం. దాన్ని రంగస్థలం పై భాగానికి తీసుకెళ్ళి, పైన ఒక కప్పీ చక్రం ద్వారా ఒక సైడ్‌వింగు ప్రక్కకుజార్చి, దాన్ని నలుగురు బలాఢ్యులు క్రిందికి గుంజితే, కృష్ణుడు కూర్చున్న ఆ తక్కెడ పైకి లేస్తుంది. దీన్ని నాటకం ప్రారంభించే ముందుగానే సరిగ్గా వున్నదో లేదో చూచుకొన్నాం. అప్పుడది బాగానేవుంది. కాని, ఆ చివర రంగంలో మాత్రం మేమనుకొన్న విధంగా జరగలేదు. ఏమైందంటే, – రుక్మిణి ఒక తులసీదళం పుచ్చుకొని భక్తి భావంతో "ఫలమొ, ఘనరసంబో పత్రమో పుష్పమో గొనుచు భక్తినిన్ను గొలుచువారికీవు వశుడవగుటయే సత్యమేని, ఈ తులసీ దళము నిన్నుతూచుగాక." అని ఒక పద్యం చదువుతుంది. చదివి కృష్ణుడు కూర్చున్న తక్కెడలోగాక, రెండవ దానిలో తులసీదళం వుంచింది. కాని, మీ ఏర్పాటు ప్రకారం కృష్ణుడున్న త్రాసుపైకి లేవలేదు. జనం గొల్లున నవ్వుతున్నారు. రంగస్థలం మీదున్న నారదుడూ, కృష్ణుడూ, రుక్మిణి, నళినీ వసంతకులూ సత్యభామతోసహా అంతా నిలువుగ్రుడ్లేసుకొని పైకి చూస్తున్నాం. కారణం తెలియక నటనలో ఆరాటపడుతూ నేనొక ప్రక్క సైడ్‌వింగ్‌వద్ద నిలబడి, ఏమి ఇట్లయిందనే భావంతో లోనికి చూచాను. క్రిందకులాగేతీగెపైనున్న కప్పీ గిలక పక్కసందులో ఇరుక్కొని పోయిందట. ఒకరు స్థంభంపైకెగబ్రాకి సరిజేస్తున్నాడట. చెవులో వూదాడు ప్రాంప్టర్. గ్రహించుకొన్నాను. అది సరిఅయ్యేటప్పటికి అయిదు నిమిషాలు పట్టేట్టుంది. ఈ ఆలశ్యాన్ని కమ్మేసేందుకు నాకో ఆలోచన తట్టింది. చప్పున రుక్మిణి వేషధారివద్దకెళ్లాను. "అక్కా! రుక్మిణీదేవి! మన భర్తకు ఇలాంటిస్థితి పట్టినదిగదా అన్న నీ ఆవేదనలో నీ ధ్యానము నిలుకడ తప్పినట్లుంది. మరల నీ మనస్సును భక్తిధ్యానమందే లగ్నంచేసుకొని, త్రాసునందు ఆ తులసీదళ ముంచుముతల్లీ!" అంటూ రహస్యంగా ఆ పద్యాన్నే మరల చదివవలసిందని చెవులో చెప్పాను. అతడు "ఫలమో ఘనరసంబో" అనే పద్యాన్ని కన్నులు మూసుకొని మరల చదవడం ప్రారంభించాడు. ఆ పద్యం పూర్తిగాకముందే పై కప్పీలో ఇరుక్కున్నతీగె సవరింపబడింది. పైకెక్కినవ్యక్తి మా సమాజంలోని వాడుగాక పోవడంవల్ల, తీగెను లాగెయ్యమని క్రిందివారికి సైగజేశాడు. వెంటనే ఆ నలుగురు బలంగా క్రిందికి గుంజేశారు. త్రాసు, ఆ పద్యం పూర్తిగాకముందే పైకిలేచిపోయింది. అసలు ఆ త్రాసులో రుక్మిణి దళం వుంచినప్పుడేగాని అది పైకి లేవగూడదు. ఇది మరొక రసాభాసం. అప్పుడు రుక్మిణి ఆ పద్యాన్నంతా చదివి, కన్నులు తెఱచి, ఆదళాన్ని అందులో వుంచబోయింది. అప్పుడుగూడా నేను మరల సమర్ధించవలసివచ్చింది. రుక్మిణి చెయ్యి పట్టుకొని ఆపేసి, "అక్కా! ఇప్పుడు నీ భక్తి, మధ్యలోనే పరాకాష్టను పొందుటచేత దళం వేయకుండానే కృష్ణుడుకూర్చున్న తక్కెడ పైకిలేచిపోయింది. ఇక ఆదళమేవేస్తే. ఇక మన కృష్ణుడుగూడా మనకందకుండా అంతరిక్షంలోనికి ఎగసిపోతాడేమో. గనుక వేయవద్దు" అని వారించాను.

మరోమాటు ఒక రసాభాసపు చిత్రం జరిగింది. కీ.శే. కొప్పరపు సుబ్బారావుగారి రోషనార నాటకాన్ని గుంటూర్లో ప్రదర్శిస్తూన్నాం. సుబ్బారావుగారుగూడా స్టేజీలోనే ఉన్నారు. ఆనాటకంలో శివాజీచే తిరస్కరింపబడిన రోషనార, శివాజీపై పగసాధించే పట్టుదలతో దక్కన్ ప్రాంతాలకు అధికారిగానున్న మోఅజీం వద్దకు పురుషవేషంలో వస్తుంది. అతని కొలువులోనే ప్రధానోద్యోగిగావున్న మీర్ జమ్లాతో తనపగను చెప్పుకొంటుంది. మొదటినుంచీ శివాజీని మోఆజీంనూ అసహ్యభావంతో చూస్తూన్న మీర్ జుమ్లా ఆమె అభిప్రాయాన్ని అనుసరిస్తాడు. రోషనార అతనితో మోఆజీం రహస్యమందిరం ప్రవేశిస్తుంది. అక్కడ మద్యం మత్తులో తూలుతూ ఇరువురు నాట్యకత్తెలతో విలాస మొందుతున్న మోఆజీంనూ ఆ నాట్యకత్తెలనూ బంధిస్తుంది. ఈ నాట్యకత్తెలనూ సూరత్‌సారాయినీ మోఆజీమును స్నేహంతో స్వాధీనం చేసుకొనే దురుద్దేశ్యంతోనే శివాజీ పంపిస్తాడు. ఇది ఆ నాటకంలోని ఒక భాగం. ఆ నాట్యకత్తెల పాటా ఆటా అయిన చాలా సేపటికిగాని రోషనార రంగస్థలం మీదకు రాకూడదు. కాని రాక తప్పిందికాదు.

ఈ నాట్యకత్తెల వేషాలను ఇరువురు పురుషులు ధరించారు. అందులో ఒకరు మాష్టర్ బసవలింగం. ఈతని నృత్యానికి ముగ్ధులుగాని ప్రేక్షకులుండేవారుకారు ఆ రోజుల్లో. ఆతని నవ్వే, రంగస్థలంలో వెన్నెల విరసినట్లుండేది. ఈ ఇరువురూ నృత్యంజేస్తున్నారు సభ్యులంతా ఆనందపరవశులై చూస్తున్నారు. ఆ సమయంలో ఒక ఘోరమైన తప్పిదం ఏర్పడింది. బసవలింగంగాక, మరో మగవాని ఆడవేషంలో పెట్టుకొన్న తలవిగ్గుకు జడబరువై వెనక్కు జారింది. అతని తల యొక్క ముందు క్రాపింగుజుట్టు ఆ విగ్గులోంచి ముందు కొచ్చేసింది. ఒక్క నిమిషంలోనే సగం క్రాపింగు బయట పడింది. ఆ నృత్యంలో అతనికది తెలియలేదు. జనమంతా పగలబడి నవ్వుతూ, ఈలలువేస్తూ, గోలజేస్తూన్నారు. సైడ్‌వింగులో ఉన్న నాకు ఆ రసాభాసం అర్థమైంది. ఛప్పున రంగస్థలానికి వచ్చేశాను. నృత్యం ఆపించాను. మీర్ జామ్లాను పిలిచాను. అతడొచ్చాడు. "చూచితివా మీర్ జామ్లా! శివాజీ ఎంతటి మోసగాడో. నిజమైన తనహిందూ స్త్రీలను నృత్యకత్తెలుగా పంపిస్తే తన జాతికి అవమానమని, మగవాళ్ళకు ఆడవేషాలు వేయించి, ఈ మోఆజీముకళ్ళకు గంతలు కట్టాల్నని పంపించినాడు. ఇదిగో చూడు వీని తలకట్టు!" అంటూ ఆ జారిపోతూన్న విగ్గుయొక్క జడపట్టుకొన్నాను. అది మొత్తమంతా వూడి చేతిలోనికి వచ్చేసింది. చీరె కట్టూ, బోడి క్రాపింగుతలతో బిత్తరబోయి నిలబడ్డాడు ఆ పురుషుడు. రెండవవాని అనగా బసవలింగం జడనుగూడా పట్టుకొని 'ఏమిరా నీవు మగవాడవేనా? అవునా కాదా?' ' అని గద్ధరించాను. ఇవన్నీ పోర్షన్‌లో లేని ముక్కలు వాని కేమి సమాధానం చెప్పాల్నో తోచలేదు. నేనే రహశ్యంగా చెప్పాను వానితో మగవాడనే అని చెప్పమని. వాడు భయపడుతూ అట్లే అన్నాడు. "భేష్! నీవు నిజము వప్పుకొన్నందున నీ జుట్టు లాగెయ్యకుండా నిన్ను క్షమించి వదిలాను. అంటూ మీర్ జుమ్లాతో వీరిరువురనూ బందిఖానాలో బంధించండి అని ఆజ్ఞ ఇచ్చి, నాటక కథలో ప్రవేశించాను. ఆ రసాభాసానికి ప్రతిగా నేను జేసిన మరింత రసాభాసం సమయస్ఫూర్తితో సమసిపోయింది. ఇలాంటివే ఎన్నో నా నాటక రంగ జీవితంలో. సెలవు.

('కృష్ణాపత్రిక' సంవత్సరాది సంచిక నుండి)

చిత్తూరు వి. నాగయ్య

ఆంధ్రదేశము - చలనచిత్ర కళ ... ఇది కళ కాదు వ్యాపారం!

1931లో ప్రారంభమైన ఆంధ్రచలనచిత్ర పరిశ్రమ నానాటికీ విస్తరిస్తోంది. 31- సంవత్సరములో ఆంధ్రప్రేక్షకులకు రెండేరెండు చిత్రాల్ని అందించిన మన పరిశ్రమ ఈనాడు సగటున సాలుకు ఇరవైచిత్రాల్ని అందిస్తోంది. నిర్మాణదృష్ట్యా అభివృద్ధి తృప్తికరంగానే కనిపిస్తోంది. కానీ-

సుప్రసిద్ధరచయిత వెండెల్ విల్కీ రచించిన "ఒకే ప్రపంచం" అన్న గ్రంథంలో "ఒక మనిషిని గూర్చి మరో మనిషి తెలుసుకున్న రోజున, ఒక దేశముయొక్క విశిష్ట సాంప్రదాయాల్ని గూర్చి మరోదేశం తెలుసుకున్న రోజున, ఒకే ప్రపంచస్థాపనకు మంగళగీతాలాలాపింపగల" వన్నాడు. ఈ విశిష్ట పరిణామం రావాలంటే ఒక ఉత్తమ సౌహార్ధసాధనం అవసరం. "చిత్రకళ" ఇందుకు సరియైన సాధనమని విశ్వమంతా అంగీకరించింది. "ఏ ప్రచారానికైనా చలన చిత్రాలు ఉత్తమమైన ఆయుధ" మన్నాడు లెనిన్.

మానవ ప్రపంచంమీద ఒక ప్రబలంగా పనిజేసే ఈ చలనచిత్రాలమీద రెండు రకాలు వాదాలున్నాయి. మొదటిది చలన చిత్ర పరిశ్రమ 'కళ' అని, రెండోది 'వ్యాపార'మనీ. 'కళ' అని వాదించే ప్రతివారూ గమనించాల్సింది 'కళ'కు కూడా 'వ్యాపారం' అవసరమేనని. విదేశాలమాట అటుంచి, మన దేశంలో -అందులో ఆంధ్రదేశంలో చిత్రపరిశ్రమ నూటికినూరుపాళ్లు వ్యాపారదృష్ట్యానే సాగుతున్నదని చెప్పటం ఏమాత్రం సాహసం కాదు. బ్రిటిష్ ఫిల్ము ఎకాడమి డైరెక్టర్ రోజర్‌మాన్వెల్ అన్నట్లు "చలనచిత్రాలవల్ల మనకు ఆదాయం రావటానికని ఆధునిక వ్యాపారలక్షణాలను అనుసరిస్తాము."

సాధారణంగా ఏ చిత్రాన్ని తీసుకున్నా డజను పాటలు, నాలుగు డాన్సులు, రెండు స్వప్నదృశ్యాలు, ఆరు హిందీ పాటల కనుకరణలు కనిపిస్తూవుంటై. ఖర్మంజాలక ఒక జానపద చిత్రం నాలుగు డబ్బులు కళ్ళజూస్తే మిగతా నిర్మాతలంతా గూడా జానపదాలమీదకే ఎగబట్టం; ఒక నర్తకికి ఒక చిత్రంలో పేరొస్తే ఆ నర్తకినే పదిమంది నిర్మాతలూ తమ చిత్రాల్లోకి తీసుకోటం; ఒక చిత్రంలో డప్పులాట ప్రచారంలోకొస్తే మిగతా నిర్మాతలంతా గూడా తమతమ చిత్రాల్లో డప్పుపాటల్ని ప్రవేశపెట్టటం మనం సర్వసాధారణంగా చూస్తున్నదే. నడివయస్సులోవున్న నాయకుడు, నాయకి లేనికథే కనిపించటంలేదు. ఇలా కొన్ని బాక్సాఫీసు సూత్రాల్ని మనసులో ఉంచుకుని ఈనాటి నిర్మాతలు చిత్రనిర్మాణాన్ని సాగిస్తున్నారు. అందువల్ల ప్రస్తుత చలనచిత్రనిర్మాణంలో వ్యాపారదృష్టే ఉంది గాని, కళాదృష్టి లేదు. కళకు, వ్యాపారానికీ చాలా దూరంవుంది. కళ ఒక సృజనాత్మకమైన శక్తి. దాన్ని వ్యాపారంతో రంగరించటం వల్ల మేలిమి బంగారానికి రాగి కలిపినట్లవుతుంది. ఇది తప్పని నావాదం కాదు. ఎందుచేతనంటే వ్యాపారదృష్టి లేకపోతే అసలు చిత్రనిర్మాణమే జరగదు. కాని-

"సినిమా ఉత్తమమైన కళాస్వరూపం" అన్నాడు కాన్‌స్టెంట్ లాంబర్టు. చలన చిత్రాల్లో వివిధ లలితకళల సమ్మిళితాన్ని చవిచూపించవచ్చు. అనేకమంది కళాకారుల అహోరాత్రుల కృషిని, సృజనాత్మకశక్తిని చలన చిత్రాల్లో చూస్తున్నాం. ఈ కళా స్రవంతిని నిర్మాతలు వ్యాపారమైదానంవైపు మళ్ళించవలసి వచ్చినప్పుడు అందులో మాలిన్యం కొంతమిళితం కాకతప్పదు. దానివల్ల 'కళ'లోని పరిశుద్ధత కొంతవరకైనా విరిగిపోకాతప్పదు. అలా పోకుండా చూడాలంటే ఆర్థిక రీత్యా దెబ్బతినవలసివస్తోంది. లక్షలు వెచ్చించే ఏ నిర్మాతా నష్టపడటానికి ఇష్టపడడు. పోనీ నష్టపడ్డ నిర్మాతకు కనీసం సానుభూతిచూపే వాడైనా లేదు. ప్రభుత్వంవారు వారి పన్నుల వసూళ్ళుకుమాత్రమే ముందంజవేస్తారు గాని, పడిపోతున్న ప్రొడ్యూసర్ని పైకి తేవటానికిగాని, సహాయపట్టానికిగాని రారు. ఇప్పుడిప్పుడు ఉత్తమ చిత్రాలని నిర్ణయింపబడిన వాటికి పథకాలంటూ పత్రాలంటూ ఇస్తున్నారు. ఈ పథకాలవల్ల, పత్రాలవల్ల నిర్మాతలకు ఆర్థికంగా వచ్చేలాభం ఏమీలేదు.

కళాపోషకులు లేనప్పుడు కళారాధకులు రాణించలేరన్న నగ్నసత్యాన్ని నేను వివరంగా చెప్పనక్కర్లేదనుకుంటా. కళాసృష్టికి ప్రభుత్వసహాయం లేకపోతే రాణింపుకు రావటం కష్టమన్న విషయంగూడా విజ్ఞు లెరిగినదే! ప్రజాబాహుళ్యం ఎప్పుడూగూడా వారి వారి అభిరుచుల్ని బట్టి, కళలను, కళారాధకులను, కళాకారులను తమశక్తికొద్దీ ప్రోత్సహిస్తుంది. ప్రజాబాహుళ్యంమీద తమ పొట్ట నింపుకోవాల్సిన కళాకారులు ప్రజానీకపు అభిరుచుల్ని గమనించి, వారిని తృప్తిపరచేందుకే కృషి చెయ్యవలసివుంటుంది. అలాచేసినప్పుడే వారు నిలబడగలుగుతారు. ప్రజాభిరుచుల్ని గాక తమ అభిరుచుల ప్రకారం నడిస్తే తమపొట్ట నింపుకోటమే కష్టం కావచ్చు. కళాకారుల అభిరుచుల ప్రకారమే వారి వారి కళావాహినిని మళ్ళించాలంటే పోషకులవసరం. పోషకులు లేనివాడు వారి కళాసృష్టి చౌకబారు విధానాలను అనుసరించక తప్పదు. అదే వ్యాపార దృష్టి. ఈనాటి మన చిత్రపరిశ్రమ నడుస్తోంది ఈ రస్తామీదనే!

ఇప్పుడు "ఆంధ్రప్రదేశ్" అవతరించింది. ముక్కోటి ఆంధ్రులు ఏళ్ళతరబడి చేసినకృషికి, చూపిన త్యాగసాహసాలకు ఫలితం దక్కింది. మనం కూడగట్టుకుంటున్న క్రొత్త సంసారం మిగతావారికి మార్గదర్శి కావాలి – ఆదర్శప్రాయంగా వుండాలి! ప్రపంచశాంతిని ఆశించే మనం, విశ్వకల్యాణానికి భావగీతికల్ని ఆలాపించే మనం, మన సంస్కృతిని, మన కళలను, మన విజ్ఞానాన్ని ప్రతిబింబించే చిత్రాల్ని మనం నిర్మించాలి! ఆంధ్రజాతీయతను విజాతీయులకు మన చిత్రాల ద్వారా తెలియజెయ్యాలి! ఆంధ్ర సంస్కృతికి, విజ్ఞానానికి మూలపురుషులైన మహామహుల జీవిత చిత్రాల్ని తెరమీద కెక్కించి ఆంధ్రుల పూర్వౌన్నత్యాన్ని జ్ఞప్తికి తేవాలి! ఆనాడే చలనచిత్రాల్ని మనం సద్వినియోగం చేసుకున్నట్లవుతుంది. ఆనాడే ఆంధ్రమాతకు చలనచిత్ర కళాజ్యోతుల్ని వెలిగించినట్లవుతుంది. ఆ శుభదినమెన్నటికో!

(ఆంధ్రప్రదేశ్ అవతరణ సంచిక)

అదెవో తెలుగు తల్లి
అందాల నిండు జాబిల్లి
ఆనందాల కల్పవల్లి
అదె నీ తెలుగుతల్లి.

పదవోయ్ తెలుగువాడా
అదె నీ తెలుగు మేడ
సంకెళ్ళు లేని నేల
సంతోష చంద్ర శాల.

కనవోయ్ తెనుంగు రేడా
అదె నీ అనుంగు నేల
అదిగో సుదూర వేల
చనవోయ్ తెలుగు వీరా!

స్వర్గాల కాంతి స్వప్నాలు
స్వప్నాల శాంతి స్వర్గాలు
నిన్నే పిలుస్తున్నాయి
నిన్నే వరిస్తున్నాయి.

ఆందోళ నాల డోల
సందేహాల హిందోళ
ఎందాక ఊగిసలాట
ఇదె నీ గులాబి తోట.

పదవోయ్ తెలుగు బాట
ఇదిగో తెలుగు కోట
పదవోయ్ నిర్భయంగా
పదవోయ్ దిగ్జయంగా
పదవోయ్ నిశ్చయంగా

– శ్రీశ్రీ

శ్రీమతి భానుమతి రామకృష్ణ

ఆనాడూ - ఈనాడూ

ఆనాడు ‘కృష్ణలీలలు’ తెలుగు చిత్రం రాబోతోందని తొలిసారి విమానంలోనుంచి కరపత్రాలు విసిరేశారు, కట్టలు కట్టలుగా ప్రతివూళ్ళోనూ– నాకప్పటికి బాగా చిన్నతనం– పెద్దవాళ్ళు చెప్పుకుంటూంటేవిన్న జ్ఞాపకంతోబాటు నాకూ కలలాగా గుర్తుంది. ఆడపిల్లల బడిలో. అప్పుడే ‘అఆ’లు దిద్దడానికి ఆరంభించేసిన నేను ఆటవిడుపు సమయంలో, తక్కిన ఆడపిల్లలందరూ బడిచుట్టూవున్న ఆవరణలో ఆడుకుంటూంటే చూచి ఆనందిస్తూ నిలబడ్డాను. గుర్రుమంటూ పెద్దమోతతో మా బడి మీదుగా పోతున్న విమానాన్ని పిల్లలందరం నోరు తెరచుకొని చూశాం. చాలా కిందుగా పోతున్న ఆ విమానంలోనుంచి తెల్లని కాగితాలు పావురాళ్ళలా ఎగుర్తూవచ్చి కొన్ని మా బడి ఆవరణలోనూ, కొన్ని చుట్టుప్రక్కల వీధుల్లోనూ పడ్డాయి. మొదట్లో ఆ కాగితాలేమిటో ఎవరికీ తెలీక ఖంగారుపడ్డారు. అమ్మలక్కల్లో అలజడి బయలుదేరింది.

“ప్లేగోస్తోందమ్మోయ్, జనాన్ని జాగర్తగా వుండమని చీటీలువ్రాసి దొరలు విమానంలోనుంచి విసిరేశారట్నే?” అన్నది ఒకావిడ.

“అదేం కాదంటమ్మోయ్.. కలరా రాబోతోందని మిషనాసుపత్రి పెద్ద డాక్టరు ఉడ్డుదొరగారు మొన్న మా ఆయనతో అన్నాడంట. ఆ సంగతే కాగితాల్లో అచ్చేసి కిరీషిస్టువాళ్ళు. విమానంలోనుంచి విసిరేశారు” అన్నది మరొకావిడ.

“అదేం కాదర్రా అంటేనూ... మీరనుకునేందతా ఒట్టిది. కాలజ్ఞానంలో పోతులూరివీరబ్రహ్మంగారు చెప్పనే చెప్పారుగా! ఆకాశంలో ఎగిరే యంత్రాలు వస్తాయనీ, అవి వచ్చినప్పట్నుంచీ, జననష్టం కలుగుతుందనీ – ఆయంత్రాలేమిటనుకున్నారూ! యీ విమానాలే. ‘అసలు విమానం ఏ వూరు’ మీదుగా వెళితే ఆ వూరుకు ఒక నష్టం కలగబోతోందన్నమాటే! మరో మాటే లేదు” అన్నది ఓ బామ్మగారు నిక్కచ్చిగా.

విమానంలో నుండి పడ్డ “కృష్ణలీలలు” సినిమా కాగితాలన్నీ పిల్లలందరం, తలా ఒకటి ఏరుకుని “కృష్ణలీలలు సినిమా వస్తోందట” అంటూ సంతోషంతో గంతులు వేయడం చూసిన బామ్మగారు ఆశ్చర్యపడిపోతూ, “ఓరి మీయింట వానగురవ సిలీమా...! యింతకూ ఆ విమానంలోంచి వేసింది సిలీమా కాగితాలా! నిశిరాత్రి నీడలు మాట్లాడతాయని కాలజ్ఞానంలో చెప్పినట్లు, యీ సిలీమావాళ్ళు గుండెలు తీసినబంట్లు లాగున్నారే? .....ఏది పిల్లలూ...... ఆ కాగితం ఓటిల్లా యివ్వండి” అని మా చేతిలోవున్న “కృష్ణలీలలు” సినిమా కాగితాన్ని అడిగి తీసుకుని తనచత్వారం కండ్లకుపని చెప్పింది బామ్మగారు.....

ఆరోజునుండీ “కృష్ణలీలలు” సినిమా ఎప్పుడొస్తుందా అని వూరంతా ఎదురుచూశారు. అప్పట్లో మా వూర్లో ఎక్కువ రోజులాడిన మొదటి తెలుగు చిత్రం “కృష్ణలీలలే” అంటూండేవాళ్ళు. పల్లెటూళ్ళనుండి జనం

గుంపులు గుంపులుగా బండ్లు కట్టుకువచ్చి ఒకే చిత్రాన్ని నాలుగయిదుసార్లు చూట్టానికి ఆరంభంచేసింది, ఆనాటి నుండేనని కూడా అంటుంటారు. తర్వాత అంతకంటే ఎక్కువ ప్రజాదరణ పొందింది, ఆబాలగోపాలాన్ని ఆకర్షించింది 'లవకుశ' చిత్రం. ఇప్పటికీ మర్చిపోలేను 'లవకుశ'చిత్రాన్ని.

నాన్న యిచ్చిన నాలుగణాలు భద్రంగా దాచుకుని నలుగురు స్నేహితురాండ్లం కలిసి నడిచి వెళ్ళేవాళ్ళం సినిమా దేరాదాకా. ఒక్కొక్కసారి బడినుండి రావడం ఆలశ్యమయితే ఆటమొదలెట్టే స్తారేమోనన్న ఆతృతకొద్దీ, పరికిణీలు పైకెట్టుకుని పరుగులంకించుకుండేవాళ్ళం. బెంచీటిక్కెట్లు కొని లోపలికెళితే, నేలటిక్కెట్లు కొన్న పల్లెటూరివాళ్లు బెంచీలనిండా నిండిపోయి వుండేవాళ్ళు ములుకర్రలతో సహా. ఇంక వాళ్ళను లేపడం బ్రహ్మతరమా! మాట్లాడకుండా వెళ్ళి నేలమీదనే ఎట్లాగొట్లా సర్దుకునేవాళ్లం.

తమలపాకుల తిమ్మలూ, సగం కాల్చేసిన చుట్టలూ, సినిమాలో సీతమ్మకష్టాలు చూళ్ళేక చీదేసిన బాపతూ అన్నీ మా పరికిణీలు శుభ్రం చేసేవి. అయితే ఏం! ఎక్కడ కూర్చున్నదీ మర్చిపోయి తన్మయులమయి చూసేవాళ్ళం. ఆనాడు లవకుశ చిత్రాన్ని నాకిప్పటికీ జ్ఞాపకముంది, ఒకటికి పదిసార్లు చూసే బస్తీజనంతో బాటు పల్లెటూళ్ల నుండి కూడా, లవకుశ చూట్టానికి జనం విపరీతంగా విరగబడుతూంటే– హాల్లో చోటు చాలక, తెరకు వెనకవైపునున్న ఖాళీస్థలంలో కూడా జనాన్ని కూర్చోబెట్టి, తెరకు రెండువైపులా లవకుశ చిత్రాన్ని చూపించారు. ఆనాడు అదొక వింతగా చూశాం. అజ్ఞానంలోనే సుఖం వుందన్నటు, ఆనాడు సినిమాలంటే ఏమిటో సినిమా 'టెక్నిక్' అంటే యేమిటో ఎవరికీ తెలీదుగనుక, సినిమా చూస్తున్నంత సేపూ యేదో పురాణం వింటున్నట్టూ, హరికథాకాలక్షేపం చేసినట్టూ ఎంతో శ్రద్ధాభక్తులతో చూసి ఆనందించేవారు ఆనాటి అమాయక ప్రజలు. అసలు ఆనాటినుండి యీనాటి దాకా వచ్చిన పౌరాణిక చిత్రాలలో లవకుశ లాంటి చక్కని చిత్రమూరాలేదనే నా అభిప్రాయం.

ఈనాడు లవకుశ కంటే టెక్నికల్‌గా యెన్నో రెట్లు అందమయిన చిత్రాలూ, గొప్ప చిత్రాలూ రావచ్చు. కాని అన్నీ వుండి అల్లునినోట్లో శని అన్నట్లుగా కథా, కమామిషూ అంటూ, వచ్చేసరికి యీనాటి చిత్రాలు వెనకటి చిత్రాలముందు నిలువలేవనే చెప్పాలి.

ఒక్క చిత్రానికి ఒక్కటే కథా

ఆనాడు నిర్మాతలు కేవలం ప్రజలను మోసంచేసే ఉదేశ్యముతో చిత్రాలు నిర్మించలేదు. ఒక కథ తీసుకుని, దాన్ని ఏవిధమయిన అపభ్రంశం పట్టించకుండా ప్రజలకు సులభముగా అర్థమయ్యేటట్లు, అరటిపండు వల్చిచేతికందించినట్లు దిద్ది ఒక్కొక్క చిత్రాన్ని ప్రజలకందించారానాటి నిర్మాతలు. ఈనాడు యిరవై కథలు కలిపి ఒక మహాగాథగా తయారుచేస్తున్నారు. అసలు కథ ఏమిటో మానవ మాత్రుడికి అర్థం కాకుండా అందంగా లేని అడవి అధికంగా అలంకారం చేసుకున్నట్లు, కథలేని ఆ గాథను హంగుల హడావిడితో భారీయెత్తున చిత్రంగా నిర్మించి, 'శాటిలైట్' ను వదలినట్లు తమ చిత్రాల్ని ప్రజలమీద వదలి, ప్రజలను గాభరాపెట్టి, హడలగొట్టి, బెదిరించి, మాయచేసి, మత్తుమందుచల్లి, డబ్బు గుంజుతున్నారా అనిపిస్తోంది. ఈనాడు తయారయ్యే కొన్ని అర్థంలేని చిత్రాలను చూస్తుంటే–

"అసలీ నాడు ఒక కథను చిత్రంగా నిర్మిస్తున్నారంటే కొందరు నవ్వుతున్నారు.

కీలకం

"ఒక కథ ఎవరి ముక్కుకు చాల్తుందండి అసలు యీనాడు ప్రజల్ని ఒక కథతో తృప్తిపరచగలమా... ఈ మధ్య ఫలనా ఫలానా చిత్రాలకు డబ్బొచ్చిందంటే ఒక కథతీస్తే వచ్చిందనుకొన్నారా అబ్బే– యిరవై ముప్పయి కథల్లోని ఘాటైన సన్నివేశాలు తీసుకొని, నవరసాల్లోనూ నానేసి, మంచి హిందీట్యూన్స్ కొన్ని మిళాయించి, హాలీవుడ్, 'ఎఫెక్ట్స్'లో కొన్ని 'డ్రీమ్‌సీన్స్' జోడించితీస్తేనే ప్రజలు కాస్త ఖంగారుపడుతూ చూస్తారు. ఎకో నారాయణా అంటూ ఒక కథతీస్తే, దానిలోవుండే లోపాలు ప్రజలుయిట్టేకనిపెట్టేసి విమర్శిస్తున్నారు. అదే యిరవై ముప్పయికథలు కలిపి తీశారనుకోండి! ఏదని విమర్శిస్తారు! చచ్చినట్లు చూస్తారు. ఈ కాలంలో కథా కాకరకాయా ఎవరిక్కావాలండీ! ఈ నా ప్రజలకు కావలసింది 'ఎంటర్‌టెయిన్‌మెంట్' – అంతే... అంటూ, మొన్న ఎవరో ఒక మహానుభావుడు చెపుతున్నాడు.

ఈనాడు ఇరవై ఐదువారాలు పోయిన చిత్రాన్ని ఇరవైసార్లు చూసిన పెద్దమనిషిని "ఏం చూశావు నాయనా!" అని అడిగితే "అదేనండీ ఆలోచిస్తున్నాను' ' అంటున్నాడు. "కథేమిటీ" అంటే కథమాత్రం అడక్కండి అంటున్నాడు. ఆనాడు యిట్లా అనే వాళ్ళా! ఎలావుంది సినిమా! అని అడగనివాడు పాపాత్ముడు– చాలా బాగుందయ్యా అంటూ కథంతా చెప్పేవాళ్ళు. అసలీనాటి చిత్రాల్లో కథంటూ వుంటేగదా చెప్పడానికి. కథ చెప్పడానికి బదులు కత్తియుద్ధాలు బాగున్నాయనీ, ఫలానావాళ్ళ డాన్సులు బాగున్నాయనీ చెప్తున్నారు. పూర్వం, ప్రజలు తెరమీద పాత్రలనుచూసి ఆనందించేవారేగాని, పాత్రధారులెవరో ఎరుగరు. అసలు పాత్రధారులెవరో తెలుసుకోవాలన్న ఆసక్తికూడా ఆనాడు ప్రజల్లో ఎక్కువగా వుండేదికాదు. వాళ్ళకు కావలసింది మంచికథ, తియ్యటి సంగీతం వుండేచిత్రం. అలాంటి చిత్రాన్ని ఎన్నిసార్లయినా చూసేవాళ్ళు. ఎంత దూరాన్నుండైనా వచ్చేవాళ్ళు.

ఈనాడు ప్రజలు తెరమీద పాత్రల్ని చూట్టంలేదు. పాత్రధారుల్ని చూస్తున్నారు. తమ అభిమాన పాత్రధారుడు ఏ చిత్రంలో నటించినా, ఏ పాత్ర ధరించినా, ఆ పాత్రధారుడి పిలకపట్టుకుని బయటికిలాగి పాత్రనుంచి వేరుచేసిచూసి ఆనందిస్తున్నారు. ఆనాడు ప్రజలు రాముణ్ణి, లక్ష్మణుణ్ణి, చూట్టానికి పరుగెత్తితే, ఈనాడు రామారావునూ, నాగేశ్వరరావును చూట్టానికి పరుగెత్తుతున్నారు.

ఆనాడు ఒక చిత్రంలో యిద్దరు ముగ్గురు నటీనటులుంటే, ఏది ఎవరిపేరో తెలీకుండానే ఒక్కొక్కళ్ళు ఆ చిత్రాన్ని,పది పదకొండుసార్లు చూసేవాళ్ళు– 'గృహలక్ష్మి'లో కన్నాంబ ఎవరో, కాంచనమాల ఎవరో నిన్న మొన్నటిదాకా చాలా మందికి తెలీదు. ఆనాడు పాత్రధారులెవరో, ఎట్లావుంటారో చూడాలన్న ఆసక్తి పసిపిల్లల్లోనే ఎక్కువగా ఉండేది.

స్టారు మావూరొచ్చింది

ఒకసారి మావూరుకు ఎవరో సినిమాస్టారు వచ్చిందని పుకారు పట్టింది. కొందరు కాంచనమాలే వచ్చిందన్నారు. కాదు కాదు కన్నాంబ అన్నారు కొందరు. వీళ్లిద్దరూ కాదు ఎవరో కొత్తస్టారట, అన్నారు మరికొందరు. అసలా సినిమా స్టారెట్లా వుంటుందో చూడాలని మా స్కూల్లో కొంతమంది పిల్లలం తీర్మానించుకున్నాం. ఆవిడ ఎక్కడ దిగిందో మెల్లిగా కూపీతీశాం. వెతకబోయిన తీగే కాలికి తగిలినట్లు, ఆ సినిమా స్టారు ఎవరో కాదు మా స్కూల్లో చదివేపిల్ల అక్కయేనన్నారు. యింకేం! రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు సంతోషించాం. స్కూలు వదిలేయగానే అందరం ఆ పిల్లచుట్టూ మూగాం. వాళ్ళక్కయ్యను చూపించమని ఎట్లా అడగాలో తేలీక కాసేపు తికమకపడి ఒకళ్ళ చెవులు ఒకళ్ళం కొరుకున్నాం. మా నవ్వులూ, గుసగుసలూ చూసి ఆ పిల్లకేదో సందేహం కలిగింది. చివరకు ధైర్యంచేసి "ఏమోయ్– మరీ – మరీ – మీ అక్కయ్య– సినిమాలో" అని మేం పూర్తి చేయకముందే ఆ పిల్ల తారాజువ్వలా లేచింది మా మీదకి– "అవునూ–మా అక్కయ్య సినిమాస్టారే! అయితే మీకేం! మిమ్మల్నేం చేసిందీ! .... సినిమాలు చూడందే .... వుండలేరుగాని, సినిమాలో వేషాలేసే వాళ్ళంటే ఎందుకమ్మా అంత ఎగతాళీ"! అంటూ ఆ పిల్ల కరవబోయింది మమ్ముల్ని.

మేం తెల్లబోయాం– సినిమాల్లో వేషాలేసే వాళ్ళంటే నీచంగా చూసే ఆ కాలంలో, వాళ్ళక్కయ్య సినిమా స్టారని మేమంతా ఆ పిల్లను ఎద్దేవా చేస్తున్నామనుకుంది పాపం – అదేం కాదని, కేవలం వాళక్కయ్య ఎట్లా వుంటుందో ఒక్కసారి చూస్తే మా జన్మ తరిస్తుందనీ, ఎంతో వినయవిధేయతలతో ప్రాధేయపడ్డాం. ఆ పిల్ల చాలాసేపు బిగువు చేసి, చివరకు ఎట్లాగయితేనేం వాళ్ళక్కయ్యను మాకు చూపించడానికి ఒప్పుకుంది– ఎప్పుడు వెళ్లి వాళ్ళక్కయ్యను చూడవచ్చునో చెప్పింది. భక్తి శ్రద్ధలతో విన్నాం కాని యింట్లో అమ్మా నాన్నా వాళ్ళకు తెలిసినా, స్కూలో అయివారమ్మలకు తెలిసినా వీపు చితక్కొడతారు. అదంతా జాగ్రత్తగా ఆలోచించి, ఆ రోజు మధ్యాహ్నం స్కూలుకు నామం వేసి బయల్దేరాం. ఆ సినిమాస్టారు చెల్లెలివెంట – ఆ పిల్ల మమ్మల్ని బయటవాకిట్లోనే వుంచి తనుమాత్రం లోపలికెళ్ళింది. మారుమూలవున్న వాళ్ల యింటిముందు కొన్ని గంటలు పడిగాపులు పడ్డాం పిల్లలందరం. చాలా సేపటికి ఆ పిల్ల బయటకొచ్చి మమ్మల్ని లోపలకు రమ్మని సౌంజ్ఞచేసింది. మేమంతా సంతోషంతో ఒక్కసారిగా లోపలికి పరుగెత్తాం ఆ పిల్ల టక్కున మాకడ్డు నిలబడి'ఉస్ మెల్లిగా శబ్దం చేస్తే అక్కయ్యకు తలనొప్పి అన్నది. మేం హడలిపోయి అడుగులో అడుగువేసుకుంటూ లోపలికెళ్ళాం. దేవలోకంలోనుంచి దిగివచ్చిన రంభలాగా ఆ సినిమాస్టారు మాకు దర్శనం యివ్వబోతోందని ఆశించి వేయికండ్లతో ఎదురుచూశాం. ఆవిడ ఏవైపునుంచి వస్తుందోనని దిక్కులు చూస్తూ నిలబడినాము.

"ఈ విడే మా అక్కయ్య" అంటూ మా ముందే నేలమీద దిండేసుకుని పడుకునివున్న నల్లటి దుక్కలాంటి ఒక ఆడమనిషిని చూపిందాపిల్ల.

కండ్లుతిరిగి మైకం వచ్చినంతపనయింది మాకు.. మా ఉత్సాహం అంతా ఒక్కసారిగా చల్లబడిపోయింది. సినిమాస్టారంటే ఎంతో అందంగా, తెల్లగా, సినిమాల్లో కనిపించినట్టే కనిపిస్తుందనుకున్నాం. మా కంటికి ఆవిడ పనిమనిషికంటే అన్యాయంగా కనిపించింది. ఒక్కక్షణం అక్కడ నిలబడలేకపోయాం. పిల్లలందరం బయటికొచ్చేస్తూంటే, ఆ సినిమాస్టార్ చెల్లెలుకూడా మా వెనకాలే వాకిటిదాకా వచ్చింది. అదిసరేగాని, ఏమోయ్ మరీ, సినిమాల్లో అందరి ముఖాలూ తెల్లగా కనిపిస్తాయే, అదేమిటీ మీ అక్కయ్యముఖం అంత నల్లగావుందీ, పాతచింతపండులాగా!" అని అడిగిందా పిల్లను మాలో ఒక గడుసుపిల్ల. "సినిమాల్లో మేకప్ వేసుకుంటారట్నోయ్.. ఆ మేకప్ వేస్తే నల్లటి వాళ్ళ ముఖాలు, తెల్లటివాళ్ళ ముఖాలూ అన్నీ ఒకటిగానే కనిపిస్తాయట సినిమాల్లో." మా అక్కయ్య చెప్పింది. అన్నదాపిల్ల

"అన్నట్టు మీ అక్కయ్యను మేం ఏ సినిమాల్లోనూ చూళ్ళేదే! ఏం వేషాలేసింది!" అంటూ ఓ చచ్చుప్రశ్న వేసింది మరోపిల్ల.

"మా అక్కయ్య పెద్ద పెద్ద ఎక్స్ట్రావేషాలేస్తుంది. మైరావణలో రాక్షసుడి భార్యగా వేసింది, మాలపిల్లలో ఒక మాలవాడి భార్యగా వేసింది, ఓయబ్బో... యింకా, చాలా వేషాలేసింది... ఆసలు మా అక్కయ్య లేని సినిమాలేదే!" అన్నదాపిల్ల.

అసలు ఎక్స్ట్రావేషాలంటే ఏమిటో ఆనాడు మాకేం తెలుసు. అవేవో చాలా పెద్దవేషాలేగాబోలనుకున్నాం. అదే యీనాటి పిల్లల్ని కదిలిస్తే! ఏది ఎలాంటి వేషమో చెప్పడమే కాకుండా, చాలా పెద్ద పెద్ద విషయాలు మాట్లాడతారు.

నాపసానిలాటి పాపలు

మొన్న ఆ మధ్య సినిమాల్లో చేరాలంటూ వచ్చిన ఒక పాపను చూశాను. ఆ పాపవెంట వాళ్ళ అవ్వగారు కూడా వచ్చింది. ఇంక ఆ పాప వయసుకుమించిన మాటలూ, చేష్టలూ చూస్తుంటే, ఆశ్చర్యంతో గుడ్లుతేలేశాను. ఆ పిల్లవయసెంతో తెలుసా అని అడిగింది నా పక్కనున్నావిడ. తెలీదన్నాను. డెబ్బై ఏండ్ల ముసల్ది ఆ పాప. అన్నదావిడ. నాకు నవ్వొచ్చింది. నిజంగానే ఆ పిల్ల అన్ని విషయాలూ, కాచివడియకట్టిన నాపసానిలాగా చేతులు త్రిప్పుతూ చెబుతోంది కబురు. అదంతా యీ రోజుచలాకీతనంకింద చలామణీ అయినా, రేపు ఆ పిల్ల భవిష్యత్తుకి ఆ చలాకీతనం హానికలగజేస్తుందనిపించింది.

ముద్దుక్కూడా హద్దుండాలి. పిల్లలు ఏ వయసుకు తగినట్టు ఆ వయసుకుంటేనే వాళ్ళ జీవితాలయొక్క పునాదులు చెక్కు చెదరకుండా వుంటాయి. ఆనాడు పసిపిల్లల్లో తెలివితేటలుంటే చదువు సంధ్యల్లో వుండేవి మిగతా విషయాల్లో వయస్సుకు తగినట్టే వుండేవాళ్ళు ఆనాటి పిల్లలు – ఈనాడు పిల్లలు పుడుతూనే సకలశాస్త్రాలూ చదివి మరీ పుడుతున్నారు. యింక వాళ్ళకు సినిమాలకోసం చలాకీతనం అంటూ నేర్పిస్తే అగ్గికి గుగ్గిలం తోడయినట్లే.

చలాకీతనం అంటే నాకు. కీ.శే. శ్రీ గూడవల్లి రామ బ్రహ్మంగారు జ్ఞాపకం వస్తారు.

ఒకరోజు కోర్టుపనిమీద చెన్నపట్నం బయలుదేరిన నాన్నవెంట నేనూ పట్నం చూస్తానంటూ బయలుదేరాను. పట్నం అంతా చూసినతర్వాత సినిమాలు తీసేచోటు చూపించమని నాన్నను వేధించడం మొదలుపెట్టాను. నాన్నకు మిత్రులు శ్రీ డా॥గోవిందరాజుల సుబ్బారావుగారు అప్పట్లో

మాలపిల్లలో వేషం వేస్తున్నారు. అయనద్వారా నాన్న నాకు మాలపిల్ల, ఆమె చెల్లెలు, కథానాయకుడూ, ముగ్గురూ కలిసి పాడుతున్నారు ఏదో పాట – నా అభిమానతార కాంచనమాలను ఆ రోజు కళ్ళారా చూశాను... ఇంక నా సంతోషం చెప్పతరంగాదు. ఊరికి వెళుతూనే, నేను సాధించిన ఘన విజయాన్ని గురించి నా స్నేహితురాండ్లందరితోనూ చెప్పదలచుకున్నాను. షూటింగ్ అయిపోయింది. నాన్ననూ, నన్నూ రామబ్రహ్మంగారికి పరిచయం చేస్తూ, ఈ పాప చాలా బాగా పాడుతుందండీ అన్నారు డా॥గోవింద రాజుల, సుబ్బారావు గారు.

"అట్లాగా ! ఏది ఒక పాట పాడమ్మా" అన్నారు రామబ్రహ్మం గారు.

పట్నం చూట్టానికి వచ్చిన నన్ను పాట పాడమంటారని నాకేం తెలుసు! పైగా నా అంతట నేను పాడితే వినాల్సిందేగాని, "ఏది ఓ పాట పాడమ్మా అంటే ఆనాటినుండి యీ నాటికి పాడలేని నేను ఆ రోజుకూడా రామబ్రహ్మంగారు పాడమనే సరికి భయంతోనూ, సిగ్గుతోనూ, బిగుసుకుపోయాను తల భూమిలోకి దించుకుని హీనస్వరంతో ఏదో పాడాను:

'ఈ పాప మాలపిల్ల చెల్లెలు వేషానికి బాగుండేది కదండీ' అన్నాడు డా॥ గో.సుబ్బారావుగారు.

'కాళింది' దొరికింది

'బాగుండేదికాని, ఈ పాపకు చలాకీతనం లేదు. ఇంత సిగ్గు భయాలుంటే యీ అమ్మాయి సినిమాలకు పనికిరాదు' అన్నారు రామబ్రహ్మంగారు. బ్రతుకు జీవుడా అనుకున్నాను. చలాకీతనం లేకపోవడం వల్ల ఆ రోజు బ్రతికి బయటపడ్డాననుకున్నానేగాని, ఆ తర్వాత 'వరవిక్రయం' అనే కథలో కాళింది అనే పిల్ల నా కోసం కాచుకూర్చొనుందని నాకేం తెలుసు. కాళింది వేషం వేయడానికి ఒకమ్మాయి కావాలంటూ కాలికి బలపం కట్టుకుని వెతుకుతున్నారు శ్రీ సి.పుల్లయ్యగారు. ఆయన కంటికి నేనే కనిపించాలా. "ఏది ఓ పాటపాడు అమ్మడూ" అన్నారు పుల్లయ్యగారు. మళ్ళీ ఎప్పట్లాగే బిగుసుకుపోయాను. ఆయన ఎదురుగా పాడే, ధైర్యంలేక గోడవైపు తిరిగి, గొర్రెలా తలవంచుకుని యిష్టంలేకుండా ఏడుపుముఖంతో ఏదో పాడాను. పుల్లయ్యగారుకూడా "ఈ అమ్మాయి సినిమాలకు పనికిరాదు" అంటారని ఆశించాను. కాని కథ అడ్డం తిరిగింది.

పుల్లయ్యగారు నవ్వుతూ, "అసలీ అమ్మాయేనండీ మా కాళిందీ" అన్నారు నాన్నతో. నాన్నకూడా ఆశ్చర్య పోయాడు. నటించే అవసరంలేకుండా అన్ని విధాలా నన్ను పోలిన కాళిందిలాంటి ....నాకు తొలిచిత్రంలోనే గనక దొరక్కపోయినట్లయితే బహుశా నాలాంటి బెదురుగొడ్డుకు సినిమాలో అసలు స్థానం వుండేది కాదు. దానికి తగినట్లు సినిమాలంటేనూ, సినిమాల్లో వేషాలేసేవాళ్ళంటేనూ నీచంగా భావించే ఆకాలంలో సినిమాల్లో నటించడం అంటే నాకు సుతారమూ ఇష్టం వుండేదికాదు. సినిమాలు చూటంవరకేగాని, అనుకరించడం తప్పుగా భావించేవాళ్లానాడు ఏ యిల్లాలైనా పొరపాటుని కాస్తఎత్తుగా బర్మాముడి వేసుకని పూలుచుట్టుకుంటే, వెంటనే 'సినిమా ఫ్యాషన్లు చేసుకుంద్రా" అంటూ ఆవిణ్ణి వెలేసినట్లు చూసేవారు.

ఒకాసారి మా వీధిలోవున్న పోస్టుమాస్టరుగారి భార్య చుక్కమ్మ.......గృహలక్ష్మిలో కన్నాంబగారు వేసుకున్నట్లు ఎత్తుగా బర్మా ముడి వేసుకుని, పూలుచుట్టుకుని మా పక్కింటికి పేరంటానికి వచ్చింది. ఆవిడతో అంతకుముందు ఎంతో ఆప్యాయంగా మాట్లాడే అమ్మలక్కలందరూ ఆవిడ బర్మాముడి చూడగానే ఠక్కున మాట్లాడటం మానేశారు. పాపం ఆవిడ చిన్నబుచ్చుకుని యింటికి వెళ్లిపోయింది. ఆవిడటువెళ్తూనే, "ఏవమ్మోయ్ వదినా! యిది విన్నావా! చుక్కమ్మ సినిమాల్లో చేరబోతోందట్నే! అంటూ ఆరంభం చేసిందో కలహకంఠి. మరీ తెలీడంలా! ఆ బర్మాముడి, ఆ వాలకం చూస్తుంటే సినిమాష్టార్టులాగా! అంటూ మూతి విరిచింది ఒకావిడ.

ఎన్నిమారినా

ఆనాటికానాడు ప్రజల్లో సినిమామోజు ఎక్కువయ్యేకొద్దీ, ఒకప్పుడు చుక్కమ్మ నన్నవాళ్ళే బర్మాముళ్లు వేసుకోవడం దగ్గర్నుంచీ చేతుల్లేని జాకెట్లతోసహా వేసుకోడం మొదలెట్టారు. అప్పట్నుంచీ ఒకళ్లను చూసి ఒకళ్లు ఫాషన్లలో సినిమాలకంటే అడ్వాన్సుగా వెళ్లడం మొదలెట్టారు. ఈనాడు సినిమా ఫ్యాషనంటూ ఏమీ మిగల్లేదు. ప్రజలు దగ్గర్నుంచే ఫాషన్లు నేర్చుకుంటున్నారు సినిమావాళ్లు. రోజులు మారాయి. ఆ నాడు ఫలానాపిల్ల సిగ్గులేకుండా సినిమాల్లో డాన్సు చేస్తోందట్నే అన్న అవ్వగార్లే యీనాడు మనవరాళ్ల భరతనాట్యానికి స్వయంగా తాళం వేస్తున్నారు. పిల్లలు సినిమాలు చూసి చెడిపోతున్నారనీ, పిల్లల్ని సినిమాల్లో చేర్చడంకంటే ఉరిపోసుకుచావడం మేలనీ, ఉపాన్యాసాలిచ్చిన పెద్దలే ఈనాడు తమ పిల్లల్ని వెంటబెట్టుకుని మా పెద్దమ్మాయి బాగా పాడుతుంది. మా చిన్నమ్మాయి బాగా డ్యాన్సు చేస్తుంది అంటూ ముందుకొస్తున్నారు. కాలం మారింది. మనుషులు మారారు. కాని, సినిమా కథలుమాత్రం మారలేదు.

మూడడుగులు ముందుకువేస్తే

"ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసినచోట్నే" అన్న సామెతగా తయారవుతున్నాయి యీ నాడు కొన్ని చిత్రాలు. ఆనాటినుండి ఈనాటిదాకా, పరమపద సోపానపటంలో నాలుగుమెట్లు పైకివెళ్ళడం, పాముకరిస్తే కిందికి జారడంలాగా వుంది చలనచిత్రపరిశ్రమ పరిస్థితి. కొన్ని ఉత్తమచిత్రాలు పరిశ్రమను నాలుగుమెట్లు పైకి తీసుకువెళితే, కొన్ని చెత్త చిత్రాలు పరిశ్రమను పదిమెట్లు క్రిందికి లాగుతున్నాయి. ఆనాడు పరిశ్రమలో అడుగుపెట్టిన వ్యక్తులందరికీ ఏదో ఒక అడ్రసు వుండేది. కొంత చదువూ సంస్కారమూ ఉండి, చలనచిత్ర నిర్మాణం ఒక కళగా భావించి, యింట్లోనుంచి డబ్బు తీసుకొచ్చి సినిమాల్లో పెట్టి చేతులు కాల్చుకున్నవాళ్ళేగాని, యీనాడులాగా కేవలం తాడూ బొంగరంలేని వ్యక్తులు ఆనాడు రాలేదు. ఒకప్పుడు ఒక చిత్రానికి కొంతయినా పెట్టుబడి పెడితేనే ప్రొడ్యూసరు కాస్తో కూస్తో 'టెక్నిక్' తెలిసి, అనుభవం వుంటే డైరెక్టరు. ఈనాడు యిట్లా చూసినవాండ్లు అట్లా ప్రొడ్యూసరూ, డైరెక్టరూ అయిపోతున్నారు. నలుగురైదుగుర్ని చంపందే డాక్టరు కాడన్న సామెతగా

నాలుగయిదు చిత్రాలు తీసిందాకా షాటు ఎట్లా తీయాలో తేలీయకుండానే డైరెక్టరుగా చెమామణీ అవుతాన్నారీనాడు కొందరు అదృష్టవంతులు. డిస్ట్రిబ్యూటర్లూ, టెక్నీషియన్లు చల్లగావున్నన్నాళ్లూ యీనాడు ఎవరైనా ప్రొడ్యూసరు కావచ్చు, ఎవరైనా డైరెక్టరు కావచ్చు.

ఒకప్పుడు ఒకళ్ళు ఒక చక్కని చిత్రాన్ని నిర్మిస్తే, ఆచిత్రాని కన్నా మిన్నగా యింకో చిత్రాన్ని నిర్మించాలనే కళాభిమానంతోనూ, ఉత్సాహంతోనూ కృషిచేశారు కొందరు. ఈనాడు అర్థంలేని చిత్రానికి అనవసరంగా డబ్బొస్తే, డబ్బు రావడానికి ఆ చిత్రంలోగల ప్రత్యేక అవలక్షణాలేమిటో కనుక్కుని, అంతకు మించిన అవలక్షణాలతో మరొక చవకబారు చిత్రాన్ని తయారు చేసి ప్రజలకందిస్తున్నారు కొందరు.

ఒకళ్లు 'సీతారామ యుద్ధం', అంటే మరొకళ్లు 'హనుమంతుడి తోక' అంటూ ఆరంభిస్తున్నారు. అసలు సీతకూ, రాముడికి యుద్ధం ఏమిటన్రా మీ పిండాకూడా! అని అడిగే దిక్కులేదు. ఒక వేళ ఎవరికి తెలీకుండా సీత, రాముడితో యుద్ధం చేసింది కాబోలు... అనుకుని మతులుపోయి చూస్తున్నారీనాడు ప్రజలుకూడా. మరి సీతారామయుద్ధం అంటూ వాళ్లెవరో తీస్తున్నారు గదా మళ్లీ హనుమంతుడి తోక అంటూ వేరే చిత్రం తయారు చేయడం ఎందుకు? అని అడిగితే అబ్బే వాళ్ళ హనుమంతుడు వేరు ఇది వేరు. మా కథలో హనుమంతుడి తోకే 'హీరో' అంటున్నారు. ఇంక కోతుల మేకప్ కోసం కొబ్బరిపీచుకు ఎక్కడలేని డిమాండు. ఆనాడు హనుమంతుడితోక నిజమైందా లేక పీచుదా అనే విషయాన్ని ప్రజలకు తెలీకుండా తీయడానికి ప్రయత్నించారు. యీ నాడు యిది ఒట్టి కొబ్బరిపీచుతోక అని నిరూపిస్తున్నారు.

ఇంతకంటే పూర్వం వచ్చిన పౌరాణిక చిత్రాలే వెయ్య రెట్లునయం అనిపించేటట్లు తీస్తున్నా రీనాడు కొన్ని పౌరాణికాలు.

దక్షిణదేశంలో నేటి చలనచిత్ర పరిశ్రమ, టెక్నికల్‌గా ఎంతో ఉన్నతస్థాయికి వెళ్ళినా, యింకా అందుకోవలసిన శిఖరాలను అందుకోలేక పోతోందనే చెప్పాలి.

హాలీవుడ్ నిర్మాతలు పదిహేను సంవత్సరాల క్రితం టెక్నికలర్ చిత్రాలు తీయడం మొదలుపెట్టారు. మనం యింకా గేవా కలర్‌లోనే వున్నాం. వాళ్లు సినిమా స్కోపులుదాటి పోతున్నారు. మనం యింకా బైస్కోపుల్లోనే వున్నాం. రోజు రోజుకూ తారాస్థాయి నందుకుంటున్న హాలీవుడ్ వాళ్ళ చిత్రాలు చూస్తుంటే మనం ఎక్కడున్నామా అనిపిస్తుంది. ఆనాడు మన్నుతిన్న కృష్ణుడినోట్లో యశోదమ్మ ప్రపంచాన్నంతా చూసినట్లు, యీనాడు హాలీవుడ్ వాళ్లు ప్రపంచాన్నంతా సినిమాస్కోపులో యిమిడ్చి చూపిస్తున్నారు.

గంగిగోవుపాలు

మనం కూడా ఆవిధంగా సినిమాస్కోపు చిత్రాలను తీయగలిగిననాడు, భారతం, రామాయణం, లాంటి గొప్ప పౌరాణిక గాథలను ఖండ ఖండాలుగానూ, పింద పిండాలుగానూ చేయకుండా యథాతథంగా తీసే అవకాశం వుంటుంది. ఈనాడు సిసిల్ బిడిమిల్ 'టెన్ కమెండ్ మెంట్స్' చిత్రం తీశాడంటే హడలిచచ్చేట్లు తీశాడు. కేవలం మానవసృష్టి, అనుకోడానికి వీల్లేనంత అంతస్తుకెళ్లి తీశాడు. అలాంటి గొప్ప గాథను ఏ విధంగా తీస్తే బాగుంటుందో, ఆ విధంగానే తీయడానికి కృషిచేసి, అదే తన జీవిత లక్ష్యంగా భావించి తీశాడామహనీయుడు. అలాంటి గొప్ప చిత్రాలను నిర్మించాలంటే మనవాళ్ళు ఆర్థికంగా నిలవలేకపోవచ్చు. కాని ఒక మంచిచిత్రాన్ని నిర్మించడానికి నలుగురయిదుగురు నిర్మాతలు కలిసి సమిష్టిగా కృషిచేయవచ్చు. ముఖ్యంగా చిత్ర నిర్మాణం కేవలం సమిష్టి కృషి మీదనే ఎక్కువగా ఆధారపడివుంటుంది. ఒక చిత్రం విజయవంతం కావాలంటే దానికి ఎంతో మంది పాటుపడాలి. అలాంటప్పుడు నలుగురు నాలుగు చెత్త చిత్రాలు తీసేబదులు, నలుగురూకలిసి ఒక మంచి చిత్రాన్ని నిర్మించగలిగిననాడు పరిశ్రమ ఎంతయినా బాగుపడుతుంది. 'గంగిగోవుపాలు గంటెడైనను చాలు' అన్నట్టు అలాంటి ఉత్తమ చిత్రాలు కొద్దిగా వచ్చినా చాలు.

ఈనాడు "నామ్‌నీశానీ" లేని నలుగురు కలిసి కంపెనీ పెట్టి ఒక చిత్రాన్ని ఆరంభించడం ఆ చిత్రం పూర్తయ్యేలోగానే నలుగురూ విడిపోయి నాలుగు కంపెనీలు లేపడం, మళ్లీ ఆ నాలుగు కంపెనీల్లోనూ ఒక్కొక్క కంపెనీకి నలుగురు భాగస్థులు చేరడం, తీసే చిత్రాలు పూర్తిగాకముందే మళ్ళీ ఆ నాలుగు కంపెనీలోని భాగస్థులూ విడిపోయి, నాలుగు నాలుగు పదహారు కంపెనీలు లేవదీయం జరుగుతోంది. ఈనాడు మదరాసులో ఏ వీధిలో చూసినా ఫిలిం కంపెనీలే! పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇలాంటి అర్థాయుషు ఫిలిం కంపెనీలు తెలుగు చిత్రపరిశ్రమలో కంటే తమిళ చిత్రపరిశ్రమలోనే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కేవలం వ్యాపారదృష్టితో బయలుదేరుతున్న ఇలాంటి కంపెనీలవల్లనే ఈనాడు పరిశ్రమ చెదలుపట్టింది.

భారతదేశంలో హిందీ చలనచిత్రపరిశ్రమ తర్వాత, చెప్పుకోదగ్గ ఉన్నతస్థాయిలో నడిచింది, తెలుగు చిత్రపరిశ్రమ ఒక్కటే. శాంతరాంలాంటి గొప్పవాళ్ళు కొందరు తీసే చిత్రాలు మినహాయించి, ఈమధ్య వచ్చే కొన్ని హిందీచిత్రాలుకూడా ఆడవాళ్ళు సిగరెటు కాల్చే చిత్రాలే.. రాను రాను కొన్ని హిందీ చిత్రాలు చూస్తుంటే చవకబారు యింగ్లీషు చిత్రాలను డబ్‌చేశారా అనిపిస్తోంది. ఆ విషయంలో దక్షిణ దేశంలో తయారయ్యే చిత్రాలే ఎన్నోరెట్లు మెరుగనిపిస్తుంది.

మొన్న ఆమధ్య మద్రాసు ఆర్థికమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యంగారుకూడా తెలుగు చిత్రలను ఎక్కువగా ప్రశంసించారు. తెలుగు చిత్రాలు ఎంతో క్లీన్‌గానూ, నీట్‌గానూ వుంటాయనీ, ఉత్తమ చిత్రాలు తీయడంలో తెలుగువారికే అగ్రతాంబూలం యివ్వాలనీ అన్నారు.

ఈ మధ్య తయారవుతున్న కొన్ని చవకబారు చిత్రాలు తప్పితే గత యిరవై సంవత్సరాల్లోనూ తెలుగు చిత్రపరిశ్రమ చెప్పుకోదగ్గ ఉన్నతస్థాయి నందుకొన్నదనే చెప్పాలి. ఆ స్థాయిని నిలబెట్టుకోవాలంటే పరిశ్రమలో వుండే కొందరు నిర్మాతలు ఉత్తమచిత్రాలే తీయడానికి కంకణం కట్టుకోవాలి. చక్కని చిత్రాలు తీస్తూ, పరిశ్రమకే గర్వకారణమైన కొన్ని సంస్థలు యీ నాడు డబ్బుకోసం కత్తియుద్ధాలు తీస్తున్నారంటే, కంచె చేను మేస్తే సామెతగా పరిశ్రమ ఎంత దిగజారి పోతోందో తెలుస్తోంది.

ఇంతటైనా పౌరాణికాలు, జానపదాలూ, మనక్కూడా సినిమాస్కోపు లొచ్చేదాకా ఆపి, ప్రజల విజ్ఞాన వికాసాలకు తోడ్పడే ఉత్తమ సాంఘిక చిత్రాలు నిర్మించగలిగితే పరిశ్రమ మరింతగా ఔన్నత్యాన్ని అందుకోగలదని నా అభిప్రాయం.

("ఆంధ్ర" వార పత్రిక స్వర్ణోత్సవ సంచిక, 14-1-1959)

మాదల వీరభద్రరావు

అరువదేండ్ల ఆంధ్రదేశపు రాజకీయోద్యమ సంగ్రహ సమీక్ష

గత 60 ఏండ్లలోను జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యం గల్గిన ప్రధాన సంఘటనలనేకం జరిగినవి. బ్రిటిష్ సామ్రాజ్యవాద దాస్య శృంఖలాలనుండి విడివడి భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. ఆంధ్రుల చిరకాలవాంఛ ఈడేరి. భాషాప్రయుక్తంగా స్వరాష్ట్రం సంపాదించుకొన్నాము. స్వరాజ్యం, స్వరాష్ట్రం ఏర్పడటంతో ప్రణాళికాబద్ధంగా దేశపునర్నిర్మాణ కార్యక్రమాలు కొనసాగించుకొంటున్నాము. నిరంకుశ నిజాం ప్రభుత్వం పడిపోయింది. ముక్కోటి ఆంధ్రులం ఒక్కటైనాము. "ఆంధ్ర ప్రదేశ్" అవతరించింది. రాష్ట్ర, దేశవ్యాప్తంగా వయోజన ఓటింగుతో రెండు సాధారణ ఎన్నికలు జరిగినవి. 3వ సారి ఎన్నికలకు సిద్ధపడుతున్నాము. రెండు ప్రణాళికలు పూర్తిఅయి, తృతీయ పంచవర్ష ప్రణాళికను రూపొందించుకొన్నాము.

ఈ మధ్యకాలంలో 1914 సం.లోను; 1939 సం. లోను రెండు ప్రపంచ యుద్ధాలు సంభవించినవి. మహాత్మాగాంధీ మున్నగు మహనీయులెందరో దివంగతులైనారు. ఆంధ్రాభ్యుదయానికి, దేశస్వాతంత్ర్యానికి కృషిచేసిన డాక్టరు పట్టాభి, ఆంధ్రకేసరి ప్రకాశం, మహర్షి బులుసు సాంబమూర్తి, దేశోద్ధారక నాగేశ్వరరావు, దేశభక్త కొండా వెంకటప్పయ్య, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన ఆంధ్రనాయకులెందరో గతించి, మరో యువక నాయకత్వం ముందుకొచ్చింది. ఎందరెందరో త్యాగశీలురైన దేశభక్తులు పునాదిరాళ్లుగా నిలిచిన వాటిపై నేడీ స్వతంత్ర భారతభవనం నిర్మించబడుతున్నది. గతాన్ని పరిశీలిస్తే సమగ్ర భారతదేశ దివ్యచరిత్రలో ఒక ముఖ్యభాగంగానే ఆంధ్రరాజకీయోద్యమ పరిణామం గూడా వుందని బోధపడుతుంది.

మన రాజకీయ, సాంఘిక పరిణామాలమీద తిలక్, గోఖలే, గాంధీజీల ప్రభావం ఎలా పనిచేసిందో, పాశ్చాత్యదేశాల్లో వచ్చిన సోషలిస్టు, నూతన ప్రజాస్వామిక విప్లవ ఫలితాలు, నవ సమాజం మీద అలా ప్రసరించి, యువ జనులలో సోషలిస్టు భావాలు వ్యాప్తి చెందినవి.

ఈ 20వ శతాబ్దంలో ప్రకృతిపై మానవుడు అత్యద్భుత విజయాలు సాధించి రోదసీకుహరంలోకి పర్యటించగల్గుతున్నాడు. వివిధ రంగాల్లో శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం ఎంతగానో అభివృద్ధి అయింది. ఇవన్నీ స్వయంగా చూడగల్గటం మనకెల్లరకూ గర్వకారణం.

ఆంధ్రజాతీయ పునరుజ్జీవనం

పర ప్రభుత్వ పరిపాలనా ఫలితంగా మన స్వాతంత్ర్యం, సారస్వతం, సంస్కృతి, అభ్యుదయం కుంటుపడినవి. మూఢ విశ్వాసాలు హెచ్చినవి. 1900 సం. ప్రారంభంలో నిద్రాణమై యున్న

ఆంధ్రజాతిని మేల్కొల్పిన నవయుగ వైతాళికులు శ్రీ కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు ప్రభృతులు. బెంగాలులో శ్రీ రాజారామమోహన్‌రాయ్‌వలె, తెలుగు దేశంలో తమ అసంఖ్యాక రచనలు, ఉపన్యాసముల ద్వారా శ్రీ వీరేశలింగంగారు స్త్రీ విద్యాభివృద్ధికి, సంఘ సంస్కరణకు పూనుకున్నారు. సనాతనాచార పరుల అంధ విశ్వాసాలను అడుగడుగునా ప్రతిఘటించిన వజ్రసంకల్పుడీయన. దేశమును ప్రేమించు మన్నా అనే ఆంధ్ర జాతీయగీతాన్ని విశాల దృక్పథంతో శ్రీ గురజాడవారు ఆంధ్రులకందించారు. వట్టి గొప్పలు చెప్పుకోక ప్రజలకింత మేలుచేయమన్నారు. స్వంతలాభము కొంతమానుక పొరుగువానికి తోడుపడమని దేశభక్తి ప్రబోధించారు. శ్రీ గిడుగు రామమూర్తిగారు వ్యవహారిక భాషావాదాన్ని ప్రచారం గావించి, భాషావిప్లవం తెచ్చినారు.

ఇదే కాలంలో హైదరాబాద్‌లో శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు "విజ్ఞాన గ్రంథమండలి" ద్వారా విజ్ఞాన దీపం వెలిగించి, అనేక చారిత్రక వైజ్ఞానిక గ్రంథములు ప్రకటించారు. దీక్షవహించి "ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము" వెలువరించిన ఘనత శ్రీ లక్ష్మణరావుగారికి దక్కింది. తెలుగు దేశంలో మత, సాంఘిక, విప్లవమును తెచ్చినవాడు శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు.

శ్రీ వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం గార్లు సర్వ సమానత్వం కాంక్షించి సంఘ సంస్కరణకోసం తమశక్తినంతా వినియోగించినవారు. కాని ఆనాటి జాతీయోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనలేదు. ఐతే తెలుగువారినుత్తేజపరచి, చైతన్యం కల్గించిన వీరందరి బహుముఖకృషి ఆంధ్రరాజకీయాలపై లేదనుకోటం పొరపాటవుతుంది.

స్వరాష్ట్ర వాంఛ

ప్రథమ భారత స్వాతంత్ర్య యుద్ధమైన తదుపరి, కొన్నాళ్ళకు జాతీయ కాంగ్రెసు సంస్థ నిర్మాణమగుచున్న రోజులవి. బ్రిటిష్ ప్రభుత్వం బెంగాలు విభజనచేయ తలపెట్టింది. దీనికి ప్రతికూలంగా శ్రీ బిపిన్ చంద్రపాల్ మొదలగువారు తీవ్రాందోళన సాగించారు. ఆ ఉద్యమ ప్రభావం ఆంధ్రులపై ప్రసరించింది. మద్రాసు రాష్ట్రంలో కలిసియున్న ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్ర వాంఛను వెలిబుచ్చసాగారు. కళాశాలలో విద్యాబోధన, కోర్టులలో న్యాయ విచారణ, శాసన సభలలోని కార్యకలాపాలు మాతృభాషలో జరగాలనేదే భాషారాష్ట్రాలు కోరేవారి లక్ష్యంగా వుండేవి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రాజెక్టుల, పరిశ్రమల నిర్మాణములోను ఉద్యోగ నియామకాల్లోను, ఆంధ్రుల కన్యాయం జరుగుచున్నదని స్పష్టపడింది. పాశ్చాత్య విద్యా సంపర్కంతో, ఉన్నత విద్యనభ్యసించి వచ్చిన విద్యాధికులైన ఆంధ్రప్రముఖులు చేసిన సమాలోచన పర్యవసానమే "ఆంధ్రమహాసభ' ' సంస్థాపన. 1913 సంవత్సరంలో ప్రథమాంధ్రమహాసభ బాపట్లలో జరగటంతో దీనికొక నిర్మాణ రూపం వచ్చింది. తదాది ఏటేటా మహాసభలు జరుపుతూ స్వరాష్ట్రవాంఛను ఎలుగెత్తి చాటసాగారు. జాతీయోద్యమం భాషారాష్ట్రవాదాన్ని బలపరచింది.

అప్పటిదాకా మితవాదుల నాయకత్వాన ప్రభుత్వమునకు వినతి పత్రాలు సమర్పించే భారత జాతీయ మహాసభ 1905వ సంవత్సరంలో "స్వరాజ్యం నా జన్మహక్కు" అనే శ్రీ తిలక్ మహాశయుడిచ్చిన శంఖారావంతో చైతన్యవంతమైనది. దేశభక్తులకు "వందేమాతరం మందే రాజ్యం' ' అనునది ముఖ్య నినాదమై నవ్యోత్సాహం కల్గించింది. స్వరాజ్యోద్యమంలో ఆంధ్రోద్యమము ప్రధాన భాగస్వామియైనది.

ఈ హోంరూలు కాలంలోనే ఆంధ్ర దేశంలో గ్రంథాలయోద్యమం ప్రారంభమైంది. 1914వ సంవత్సరం నుండి ఆంధ్రమహాసభలతోపాటు, గ్రంథాలయ సభలుకూడా జరుగుతుండేవి. గ్రామ సీమలలో విజ్ఞాన వ్యాప్తికివి ఎంతగానో తోడ్పడినవి. అఖిలభారత దేశంలోను ఆంధ్ర గ్రంథాలయోద్యమానికి ఒక విశిష్టస్థానమున్నది. బరోడా మొదలైన చోట్ల సంస్థానాధీశుని ఆర్థిక సహాయం వుండేది. కాని తెలుగు దేశంలో ప్రజల చొరవ, విద్యాధికుల స్వయంకృషి చెప్పుకోదగినవి. ఈ గ్రంథాలయాలు, వయోజన విద్యాకేంద్రాలు రాజకీయ చైతన్యం కల్గించి వివిధ ప్రజోద్యమాలకు పునాదిరాళ్ళయినవి.

1907వ సంవత్సరంలో సూరత్ కాంగ్రెస్ మహాసభలకు వెళ్ళి వచ్చిన ఆంధ్రనాయకుల్లో జాతీయకళాశాల స్థాపనోద్దేశంకల్గింది. పర్యవసానంగా 1910వ సంవత్సరములో శ్రీ కోపల్లె హనుమంతరావు, డాక్టరు పట్టాభి, ముట్నూరి కృష్ణారావుగార్ల ఆధ్వర్యంలో బందరులో జాతీయ కళాశాల ఏర్పడినది. ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రికలు ప్రారంభించారు.

బ్రిటిష్ ప్రభుత్వ దమన నీతిని తీవ్రభాషలో విమర్శిస్తూ శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు 'స్వరాజ్య' పత్రికలో ఒక వ్యాసం వ్రాశారు. అందుకు రాజద్రోహనేరం మోపి, 1908వ సంవత్సరం జులై 18వ తేదీన శ్రీ హరిసర్వోత్తమరావుగారిని, ముద్రాపకులైన శ్రీ బోడెపూడి నారాయణరావుగారిని అరెస్టు చేయటం జరిగింది. అదే రోజున పూనా నగరంలో బాలగంగాధర తిలక్ గారిని అరెస్టు చేశారు.

1909వ సంవత్సరం ఈ హోంరూలు ఉద్యమ ప్రభావం రైతు జనం మీద ఎలాపడినదో కోటప్పకొండ తిరుణాళ్ళలో జరిగిన ఒక చిన్న సంఘటన తార్కాణంగా తీసుకొనవచ్చు. పల్నాటి చిన్నప్ప రెడ్డి కోడెలు బెదిరినప్పుడు పోలీసులు వాటిని కాల్చివేసినారు. ఆ రోషావేశంలో 'వందేమాతరం' అంటూ రైతులు పోలీసులపై తిరగబడ్డారు. శ్రీ చిన్నపరెడ్డిపై తుపాకులు కాల్చి చంపినప్పుడు ఆ వీరుని గూర్చి 'సైరా చిన్నాపారెడ్డి– నీ పేరే బంగారుకడ్డీ' అని పల్లెపదాలల్లి, పల్నాటి సీమలో పాడసాగారు.

ఈ దశలోనే తెలంగాణాలో గూడ గ్రంథాలయాలు నెలకొల్పటం జరిగింది. శ్రీ రాజానాయని వెంకటరంగారావు, లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు, సోమనాథరావు, మైలవరపు నరసింహశాస్త్రిగార్లు ఆలోచించుకొని 1901 సంవత్సరంలో శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయమును స్థాపించినారు. తదాది యీ గ్రంథాలయం దినదిన ప్రవర్ధమాన మగుచున్నది. నైజాము నవాబుల పరిపాలనా కాలంలో రాజభాష ఉర్దూగావుంది. సంస్థానంలో వాక్పభాపత్రికా స్వాతంత్ర్యాదులు మృగ్యమైనవి. నిరంకుశ రాజరికం క్రింద ప్రజల సామాన్య పౌరసత్వహక్కులు సైతం హరించి వేయబడినవి. 1900సం॥ వరకు హైదరాబాద్ శాసన సభల్లో నల్గురే ఎన్నికైన సభ్యులుండేవారు. మిగతావారంతా ప్రభుత్వంచే నియమింపబడిన

జోహుకుందారులు. సంస్థాన జనాభాలో అత్యధిక సంఖ్యాకులు తెలుగువారున్నా, ఉన్నతోద్యోగాల్లో వారికి స్థానమే వుండేదికాదు. తెలుగు గ్రంథాలయం ఏర్పరచుకోవాలన్నా విద్యా సంస్థ నెలకొల్పుకోవాలన్నా వాటిని రాజద్రోహ నేరాలుగా పరిగణించేవారు. కావుననే తెలంగాణలోని ప్రతి ఒక గ్రంథాలయం వెనుక బోలెడంత రాజకీయ చరిత్ర ఇమిడి ఉంది.

నిజామాంధ్రులలో ఐక్యతకు, విద్యావ్యాప్తికి, మహిళాభ్యున్నతికి గాను కృషి చేయుటకు ఆంధ్ర సంఘ ఆవశ్యకతను క్రమేణా గుర్తించసాగారు. శ్రీ మాడపాటి హనుమంతరావు గారు ఆంధ్రోద్యమానికి వెన్నుముకగా వుండేవారు. ఆంధ్రపితామహుడనే యశస్సు సంపాదించుకొన్నారు. సారస్వతరీత్యా "ఆంధ్ర సారస్వత పరిషత్తు' మున్నగు సంస్థలు కృషిచేయుచున్నవి. ఆంధ్ర విద్యాలయములు వెలసినవి.

ఈ విధంగా తెలుగు దేశంలో ఆంధ్రపునరుజ్జీవనానికి అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు.

కాంగ్రెస్ సత్యాగ్రహాలు

ప్రథమ ప్రపంచ యుద్ధానంతరం, బ్రిటిష్ ప్రభుత్వ వైఖరికి భారతప్రజలు తీవ్ర అసంతృప్తి చెందినారు. కాంగ్రెస్, గాంధీజీ యుద్ధ ప్రయత్నాలకు సహకారం చేసినా, ఫలితం లభించలేదు. యుద్ధకాలంలో, ఆంధ్రులలో శ్రీ దర్శి చెంచయ్య ప్రభృతులను దేశరక్షణ చట్టం క్రింద అరెస్టు చేశారు. దేశంలో ఆర్థిక క్లిష్టపరిస్థితి దాపురించింది. అప్పుడే 1918 సంవత్సరములో మాంటేగుచమ్సుఫర్డు నివేదికను ప్రకటించారు. అందులో కొన్ని శాఖలను మాత్రం శాసన సభకు బాధ్యత వహించిన మంత్రులకిస్తామన్నారు. కాని ముఖ్యమైనవన్నీ బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధులగు ఎగ్జిక్యూటీవు కౌన్సిలర్ల చేతుల్లోనే వుంచారు. కాంగ్రెస్ సంస్థలోని మితవాదులకు-జాతీయవాదులకు నివేదికను గూర్చి భిన్నాభిప్రాయయము లేర్పడినవి. 'చమ్సుఫర్డు' రిపోర్టు సంస్కరణలు కొరమాలినవని, ఆంధ్రమహాసభ తీర్మానం గావించింది.

1919వ సంవత్సరంలో మాంటేగు చమ్సుఫర్డు సంస్కరణల కనుగుణ్యంగా హైదరాబాదు సంస్థానంలో రామ్ బాల్‌ముకుంద్ ఆధ్వర్యాన నిజాం ప్రభుత్వం ఒక విచారణ కమిటీని నియమించింది. కాని వారి పనినేమి ముందుకు సాగనివ్వలేదు.

దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహం సాగించి విజయులైన గాంధీజీ కాంగ్రెస్‌కు నాయకత్వం వహించారు. 1920వ సంవత్సరములో ప్రభుత్వ సహాయ నిరాకరణకు పిలుపునిచ్చారు. రౌలట్‌బిల్లు, జలియన్‌వాలాబాగ్ హత్యలతో దేశం వుడికెత్తిపోయింది. మౌలానా మహమ్మదాలీ, షౌకతాలీ నాయకత్వాన ఖిలాఫత్ ఉద్యమం సాగుతూవుంది. కాంగ్రెస్ సత్య, అహింసలతో గూడిన శాంతియుత సహాయ నిరాకరణ కొనసాగించింది.

పల్నాటి అడవి పుల్లరి సత్యాగ్రహం

ఈ సందర్భంలో ఆంధ్రదేశంలో జరిగిన పల్నాటి అడవి పుల్లరి సత్యాగ్రహం ప్రశంసార్హమైనది. మాచెర్లలో శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ, మాడభూషి నరసింహాచారిగార్లనరస్టు చేయటంతో గుంటూరు పట్టణంలో బ్రహ్మాండమైన హర్తాళ్ జరిగింది. పల్నాడు తాలూకాలో 30 గ్రామాలవారు పుల్లరి కట్టుటకు నిరాకరించగా, ప్రభుత్వం మిలటరీని పంపింది. మించాలపాడు గ్రామ వాస్తవ్యుడు శ్రీ కన్నెగంటి హనుమంతును కాల్చిచంపారు. గుంటూరు జిల్లా కలెక్టరు రూథర్‌ఫర్డు దుశ్చర్యలకు పల్నాటి ప్రజలు ఉద్రిక్తులై ప్రభుత్వంతో సహాయనిరాకరణ చేశారు.

పెదనందిపాడు సత్యాగ్రహం

బాపట్ల తాలూకాలో పెదనందిపాడు సత్యాగ్రహం శ్రీ పర్వతనేని వీరయ్యగారి ఆధ్వర్యాన సాగింది. ఆ ప్రాంత గ్రామోద్యోగులు మూకుమ్మడి రాజీనామాలిచ్చి ప్రభుత్వ పనులలో సహాయనిరాకరణ చేశారు. శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి నాయకత్వాన మునిసిపాలిటీ పన్నులివ్వతిరస్కరించారు. చీరాల, పేరాల సరిహద్దులలో కొన్నాళ్ళపాటు కొత్తగ్రామాలు నిర్మించుకొన్నారు. 'ఆంధ్రరత్న' దుగ్గిరాలను ప్రభుత్వం అరస్టుచేసింది. ప్రజలు ప్రతీకారంగా దౌర్జన్యచర్యలకుపక్రమించారని గాంధీ గారికి తెలిసి అంతటితో జిల్లాలో సహాయనిరాకరణోద్యమాన్ని ఆపు చేయమని ఆదేశించారు. శ్రీ దేశభక్త కొండా వెంకటప్పయ్య గారీ ఉద్యమాలకు అండదండగా వుండి, ఆద్యంతం నిర్వహించినారు.

పల్నాటి పుల్లరి నిరాకరణ, పెదనందిపాడు సత్యాగ్రహం, చీరాల పేరాల రామదండు 1920 సంవత్సర సహాయనిరాకరణోద్యమం లోని సువర్ణఘట్టాలు, ఈ పైన పేర్కొనిన సంఘటనలు బ్రిటిష్ పార్లమెంటులో సైతం ప్రస్తావించబడినవి.

మన్యం తిరుగుబాటు

శ్రీ అల్లూరి సీతారామరాజు నేతృత్వమున "మన్యం తిరుగుబాటు" 1922-24 సంవత్సరముల మధ్య జరిగింది. ప్రభుత్వమున కది సింహస్వప్నమైనది. కోయప్రజల దుర్భర దారిద్ర్యపరిస్థితులు, ఆర్థిక దోపిడీ, ప్రభుత్వోద్యోగుల దమననీతి ఏజన్సీ ఏరియాలో వారి నీ సాహసకార్యాలకు పురిగొల్పింది. కొన్నిచోట్ల పోలీసు స్టేషనులను కొల్లగొట్టారు. ఎట్టకేలకు 1924 మే నెలలో సీతారామరాజు బలిదానంతో మన్యవిప్లవం కౄరంగా అణచివేయబడినది. శ్రీ గంటం దొరకు తర్వాత 10 ఏండ్లు శిక్షను విధించి అండమానుదీవుల కంపారు. ఈ మన్య విప్లవం జరిగినది కొద్దికాలమైనా, ఆ వీరోచిత విప్లవ గాథలు నేటివరకూ ఆంధ్ర యువకుల నెంతో ఉత్సాహపరుస్తూ వున్నవి.

సైమన్ కమీషన్ బహిష్కరణ

1928వ సంవత్సరంలో సైమన్ కమీషన్ భారతదేశానికి వచ్చినప్పుడు కాంగ్రెస్ సంస్థ వారిని బహిష్కరించాలని నిర్ణయించింది. ఒక్కసారిగా స్వాతంత్రేచ్ఛ పెల్లుబికింది. ఎక్కడచూచినా నల్ల జెండాల ప్రదర్శనలే. శ్రీ లాలా లజపతిరాయిని పోలీసులు లాహోరులో లాఠీచార్జీచేసి, వారి

ఘోరమరణమునకు కారణభూతులైనారు. మద్రాస్ నగరంలో బాయ్‌కాట్ చేస్తున్న ప్రదర్శకులపై కాల్పులు చేశారు. నేలకొరిగిన దేశభక్తుల శవాలను సైతం చూడనివ్వలేదు. శ్రీ ప్రకాశంగారు కాల్చమని రొమ్ము యిచ్చి ముందుకు నడిచారు. "ఆంధ్రకేసరి"గా ప్రకాశం ప్రసిద్ధిగాంచారు.

"గుండెదెబ్బకు జంకపోకన్నా

చొక్కాను చింపి, గుండె దానికి పందె మిడుమన్నా!!

అనే పాట ఆనాటినుండి సత్యాగ్రహుల నుత్సాహపరుస్తూ వచ్చింది. ఇదే కాలంలో సామ్యవాద ప్రచారం చేస్తున్నారనే 'కుట్రనేరం' మోపి వివిధ ప్రాంతాల విప్లవకారుల నరెస్టుచేశారు. ఈ మీరట్ కుట్రకేసు ఇండియాలోను, ఇంగ్లండులోను గూడా గొప్ప సంచలనం గల్గించింది. ముద్దాయీ లిచ్చిన వాఙ్మూలం భారత కార్మిక, కర్షకోద్యమ చరిత్రగా తయారైనది. వీరందరికి ప్రభుత్వం దీర్ఘకాలిక శిక్షలు విధించింది.

ఈ సందర్భంలో మరొక ముఖ్యవిషయం గమనించదగినది. సైమన్ కమీషన్ ముందు వినతిపత్రాలు సమర్పించిన ఒరిస్సా వారికి ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. ఆంధ్రనాయకులు స్వరాజ్యానికే ప్రాధాన్యతనిచ్చి సైమన్ కమీషనును బహిష్కరించారు. స్వరాష్ట్ర వాంఛను తాత్కాలికంగా ఆపివుంచి అయినా స్వరాజ్యం, సమరంలో పాల్గొన్ని త్యాగాలు చేశారు.

1929వ సంవత్సరంలో ప్రభుత్వం ఆంధ్రదేశంలో రీసెటిల్‌మెంటు ప్రవేశపెట్టి, పన్నులను ఎక్కువ వేయుటకు తలపెట్టింది. గుంటూరు, కృష్ణ, గోదావరి జిల్లాల రైతాంగం రీసెటిల్‌మెంటుకు వ్యతిరేకంగా ఆందోళన చేసింది. వెంకటగిరి జమీందారి గ్రామాలలో కంచెపుల్లరి, చెరువు మరమ్మతులకై పెద్ద ప్రచారం జరిగింది. ఇవన్నీ ఆంధ్రరైతు ఉద్యమానికి పునాదులైనవి. ఆచార్య రంగా- నెల్లూరి వెంకట్రామానాయుడు గార్లు రైతుసమస్యలపట్ల ప్రత్యేక శ్రద్ధవహించేవారు.

1930-32 ఉప్పు సత్యాగ్రహోద్యమం

1929వ సంవత్సరం లాహోరు కాంగ్రెస్ మహాసభ "సంపూర్ణ స్వరాజ్యతీర్మానం" ఆమోదించింది. 1930-32 సంవత్సరాల్లో గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం ఆరంభించారు. తన సహచరులతో సబర్మతీ నుండి దండియాత్ర సాగింది. ఆంధ్రదేశ మెల్లెడలా ఉప్పుతయారుచేసి శాసనోల్లంఘనం చేశారు. ప్రభుత్వం అరెస్టులు, లాఠీచార్జీలు, కాల్పులు చేసి ఉద్యమాన్ని అణచజూచింది. కాని సత్యాగ్రహుల సంఖ్య నానాట హెచ్చుతూ వచ్చింది. దేశ భక్తులైన మహిళలు సైతం రంగంలోకి దూకి, మాతృదేశ దాస్యవిముక్తికై సర్వస్వం అర్పణజేశారు. కవుల కలాలు దేశభక్తిని రగుల్కొల్పినవి. "మా కొద్దీ తెల్లదొరతనమూ" "దండాలు దండాలు భరతమాతా", అనే గీతాలు వ్రాసి పాడినందుకు శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణగారిబోటివారి నెందరినో అరెస్టుచేశారు. "వీర గంధము తెచ్చినారము, వీరు లెవ్వరో తెల్పుడీ" అని స్త్రీ సత్యాగ్రహులు పాటలు పాడుతూవస్తుంటే, ఉత్సాహోద్రేకాలతో పల్లెప్రజలుగూడా వేలకొలది సత్యాగ్రహోద్యమంలో దూకేవారు. కాకినాడ, బందరు, పల్లెపాడు, నౌపడా మొదలగు సముద్రరేవులు ముఖ్య సత్యాగ్రహ కేంద్రములైనవి. కాకినాడలో మహర్షి బులుసు సాంబమూర్తివంటి వారు పోలీసు బూటుకాలు తన్నులకు గురికావలసివచ్చింది. ఉప్పుచేయటమే కాదు, కల్లుపాక వద్ద పికెటింగు, విదేశవస్త్ర బహిష్కరణ, ఊరూరా కాంగ్రెస్ త్రివర్ణజెండా ప్రతిష్ఠాపనలు చేసేవారు. భారత జాతీయోద్యమ సంరంభంలో ఆంధ్రదేశ సత్యాగ్రహాలు చిరస్మరణీయమైనవి. 1930-34 సంవత్సరాల్లో ఆంధ్రదేశంలో ఆర్థిక సంక్షోభం సామాన్య రైతులను దివాలాతీసేటట్లు చేసింది. రాజకీయ సంరంభానికి, ఆర్థిక సంక్షోభం తోడైనది.

గాంధీ-ఇర్విన్ ఒడంబడిక జరిగి, మహాత్మాగాంధీ రౌండు టేబుల్ కాన్ఫరెన్సుకు హాజరైనాడు. కాని సంప్రదింపులు విఫలమైనాయి. స్వతంత్రం, స్వరాష్ట్రం, రాలేదు. గాంధీజీ తిరిగి బొంబాయి రావటంతోనే అరెస్టుచేయటం జరిగింది. ఈ పోరాట విరమణ, రాజీపద్ధతులు, అతివాదయువకులలో అసంతృప్తి కల్గించినవి. సత్యాగ్రహానంతరం, గాంధీజీ నిర్మాణ కార్యక్రమానికే హెచ్చు ప్రాధాన్యత యివ్వమని ఆదేశించారు.

నిర్మాణ కార్యక్రమాలు

తదాది తెలుగుదేశంలో నిర్మాణ కార్యక్రమాలు వివిధ గాంధేయ సంస్థలచే నిర్వహింపబడుతూ వున్నవి. అనేకచోట్ల ఖాదీ భాండారాలు వెలసినవి. హిందీ పాఠశాలలు నెలకొల్పారు. హరిజనోద్ధరణకై దేవాలయ ప్రవేశములు, సహపంక్తి భోజనములు జరిగేవి. శ్రీ స్వామి సీతారాంగారి ఆధ్వర్యమున గుంటూరు జిల్లాలో వినయాశ్రమము; శ్రీ సాధు సుబ్రహ్మణ్యంగారి యాజమాన్యమున కృష్ణా జిల్లాలో కొమరవోలు గాంధీ ఆశ్రమం, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారి నాయకత్వమున సీతానగరం గౌతమీ ఆశ్రమం, కడపజిల్లాలో మైదుకూరు ఆనందాశ్రమము మున్నగునవెన్నియో స్వాతంత్ర్యోద్యమంలోను, నిర్మాణ కార్యక్రమములోను ప్రముఖపాత్ర వహించినవి. ఇవి స్వాతంత్ర్యావతరణానంతరం జాతీయాభివృద్ధి పథకాలను, శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నవి.

సోషలిస్టు ఉద్యమం

1930-32 సత్యాగ్రహోద్యమంలో జైలు కేగిన కాంగ్రెస్ వాదులలో ఉద్యమ విఫలత, భవిష్యత్కార్యక్రమాన్ని గూర్చి సమాలోచనలు జరిగినవి. గాంధీజీ నిర్ణయించిన ఖద్దరు, గ్రామ పునరుద్ధరణ, అస్పృశ్యతా నివారణ, హిందూ-మహ్మదీయ ఐక్యత మొదలగు కార్యక్రమము మాత్రమే స్వరాజ్యసాధనకు చాలదనే అసంతృప్తి యువకులలో జనించింది. అసంఖ్యాకులైన కార్మిక, కర్షకులను సంఘటిత పరిస్తేనే జాతీయ స్వాతంత్ర్యోద్యమమంలో వారిని పాల్గొనేటట్లు చేయగలమని సామ్యవాద సమాజస్థాపనే మన ధ్యేయంగా వుండాలని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నేర్పరిచారు. జైళ్ళనుంచి విడుదలకాగానే శ్రీ ఆచార్య నరేంద్రదేవ్, జయప్రకాష్ నారాయణ్, పట్వర్ధన్, మోహరాలీ, మసానీ మున్నగువారు పాట్నాలో 1935వ సంవత్సరంలో ప్రథమ పార్టీ మహాసభ జరిపారు. ఈ కాలంలోనే పండిట్ నెహ్రూ దేశ సమస్యల పరిష్కారానికి సోషలిజమే

మార్గమని కాంగ్రెస్ అధ్యక్ష పీఠాన్నుండి ఉపన్యసించారు. ఇది మితవాద నాయకుల కంతగా రుచించలేదుగాని సోషలిజం కోరే నెహ్రూ, తదితర అతివాద యువకులపాత్ర తదనంతర కాంగ్రెస్ చరిత్రలో కొంత పెరుగుతూ వచ్చింది.

ఆంధ్రదేశంలో శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య, సుందరయ్య, క్రొవ్విడి లింగరాజు, రంగశాయి, జొన్నలగడ్డ రామలింగయ్య, అల్లూరి మున్నగువారు కాంగ్రెస్ సోషలిస్టు ప్రముఖులుగా వుండేవారు. కమ్యూనిస్టుపార్టీమీద నిషేదం తొలగించేవరకు మార్క్సిస్టులకు ప్రజాసోషలిస్టుపార్టీయే బహిరంగవేదికగా వుండేది. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా "జాతీయైక్య సంఘటన" నిర్మించుటకు జాతీయ కాంగ్రెస్‌లోనే సభ్యులుగా వుండేవారు. ఐతే వర్గ సంఘాల నేర్పరుస్తూ, ప్రజా ఉద్యమాల కెక్కువ ప్రాధాన్యత యిచ్చేవారు. వివిధ సమస్యలపై కాంగ్రెస్‌లోనే అతివాద–మితవాదుల సంఘర్షణలు జరుగుతుండేవి. బెనారస్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న శ్రీ పి.వి.శివయ్య, వాశిరెడ్డి, చంద్ర రాజేశ్వరరావు ప్రభృతులు చదువు చాలించివచ్చి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీనిర్మాణానికి తోడ్పడినారు.

నవయుగానికి నాందిగా "మరో ప్రపంచం పిలిచిందీ–పదండి ముందుకు" అంటూ శ్రీశ్రీ మహాప్రస్తానం వ్రాశాడు. "స్వాతంత్ర్యం సమభావం, సౌభ్రాత్రం, సౌహార్దం, పునాదులై ఇళ్లులేచి, జనావళికి శుభంపూచి శాంతి శాంతి జయిస్తుంది" అని జగన్నాథరథ చక్రాలు రచించాడు. ఈ నవ్యకవిత నవయువకులలో నూతనోత్సాహం రగుల్కొల్పి, మార్గదర్శకమైనది.

"అన్యాయకాలంబు దాపురించిందిపుడు అందరము మేలుకోవాలండీ

మాన్యాలు, భోగాలు మనుజులందరి కబ్బు మార్గాన పోదాము రారండీ.." అనే సోషలిస్టు భావాలతో గూడిన గీతాలనేకం వెలువడినవి.

బ్రిటిష్ ప్రభుత్వం 1935వ సంవత్సరంలో నూతన రాజ్యాంగ సంస్కరణలను ప్రవేశపెట్టింది. ఈ విషయమై తీవ్రచర్చలు జరిగినవి. చివరకు జాతీయ కాంగ్రెస్ యీ కొత్త రాజ్యాంగాన్ని, ఫెడరేషనును భగ్నం చేయుటకుగాను శాసనసభా ప్రవేశం చేయాలని తీర్మానించింది. మంత్రిపదవులలో అప్పటిదాకా తిష్టవేసుకొన్న జమీందార్లకు, మహారాజాలకు ప్రతికూలంగా విజృంభించిన 1937 సంవత్సరం ఎన్నికల సంరంభం, కాంగ్రెస్ కొక ఘనవిజయం చేకూర్చింది. బొబ్బిలి జమీలో శ్రీ వి.వి.గిరిగారు అభ్యర్థిగా నిలచినచోట కాంగ్రెస్ సభ జరుగుతుంటే, ఏనుగులనుతోలి, డప్పులు కొట్టి సభను చెదరగొట్టజూచారు. ఈలాంటి దుష్కృత్యాలే వివిధ జమీందారీ ప్రాంతాలలో జరిగినవి. ఐనా,

"లాఠీలపోటులకు జైలు కష్టాలకు,

ఎదిరించి నిలుచున్న కాంగ్రెస్‌కే మీ ఓటు"

అనే పాటలతో దేశ సేవకులు బారులుదీరి ప్రచారంచేస్తూ ప్రజాదారణ పొందారు. ప్రజల స్వాతంత్రేచ్ఛ ముందు ధన, కుల, బల, రాజరికాలేమీ పనిచేయలేకపోయినవి.

"ఓటు విలువను తెలుసుకోరన్నా

ఒక పూట తిండికే ఓటు యిచ్చుట సిగ్గుచేటన్నా"

అని శ్రీ వెంకట్రామానాయుడు గీతాలు ప్రచారంలోకి వచ్చినవి. ఎన్నికలలో జస్టిసుపార్టీ, పీపుల్స్ పార్టీలు నామరూపాలు లేకుండా పోయినవి. బెంగాలు, పంజాబులలో తప్ప 9 రాష్ట్రాలలో కాంగ్రెస్ అఖండ విజయం సాధించింది. మద్రాసు రాష్ట్రంలో రాజాజీ ముఖ్యమంత్రిత్వం క్రింద ప్రథమ కాంగ్రెస్ ప్రభుత్వ మేర్పడింది. శ్రీ ప్రకాశం రెవిన్యూమంత్రి అయినారు.

త్రిపుర కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడిన సుభాస్ చంద్రబోసు, తనతోటి సహచరులు వర్కింగు కమిటీలోకి కలిసి రానందున, అధ్యక్ష పదవికి రాజీనామా యిచ్చి "ఫార్వర్డుబ్లాకు" నేర్పరిచారు. బోసు పర్యటన సందర్భంలో విశాఖపట్నం నుండి ప్రతి రైలుస్టేషనులోను ఆంధ్రులంతా అఖండ స్వాగతమిచ్చారు. ఆంధ్రలో శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్యగారు ఫార్వర్డుబ్లాకు అధ్యక్షులుగా వుండేవారు. గుంటూరుజిల్లాలో శ్రీ వావిలాల నాయకత్వమున దళంగా బయలుదేరి "జాతీయ వాంఛా ప్రచారం" మారుమూల గ్రామాలలో గూడా జరిగింది. ఫెడరేషన్‌కు ప్రతికూలంగా పోరాటం ఆరంభించాలని ప్రచారం చేశారు. కూలీసంరక్షణ సంఘాలు, ఆంధ్రపట్టణాలలో స్థాపించి, కార్మిక సంఘైక్యతకు సోషలిస్టులు కృషిచేశారు. ఇవన్నీ సోషలిస్టు ఉద్యమ వ్యాప్తికి తోడ్పడినవి.

సంస్థాన రాజకీయోద్యమం

ఇక హైదరాబాద్ సంస్థానం సంగతి పరిశీలించుదాం. 1920వ సంవత్సరంలో అఖిల భారత కాంగ్రెస్‌కు అనుబంధంగా శ్రీ వామన్ నాయక్ నిర్మాణ కార్యక్రమంలో పనిచేస్తూండేవారు. 1922వ సంవత్సరం నవంబరులో "ఆంధ్ర కేంద్ర జనసంఘం" ఏర్పడి ఆంధ్ర మహా సభగా అభివృద్ధి గాంచింది. క్రమేణా తెలంగాణాలో ఆంధ్రోద్యమమే రాజకీయోద్యమంగా పరిణతి చెందిన దనవచ్చు. 1930–32వ సంవత్సరాలలో దేశంలో జరిగిన రాజకీయోద్యమ ప్రభావాలు సంస్థాన ప్రజలమీద పడినవి. ఉప్పు సత్యాగ్రహంలో 150 మంది దేశ సేవకులు బొంబాయి, మద్రాసు, కాకినాడలకు వెళ్ళి పాల్గొన్నారు. ఈ దశలోనే ఫజులు, హమన్, పద్మజానాయుడుగార్ల నాయకత్వమున హైదరాబాద్‌లో "స్వదేశీలీగ్' ' ఏర్పడింది గాని వీరిపని సిటీ వరకే పరిమితమైనది. 1931వ సంవత్సరంలో బీరార్‌లోని అకోలాలో ప్రథమరాష్ట్ర రాజకీయ మహాసభ జరిగింది. కాని చెప్పుకోదగిన పని జరుగలేదు. 'అసఫియాఛత్రచ్ఛాయల క్రింద బాధ్యతాయుత ప్రభుత్వ మేర్పరచవలెనని' మాత్రమే అప్పట్లో నాయకులు తీర్మానిస్తూ వుండేవారు. ఆంధ్రమహాసభల్లో రాజకీయ ప్రమేయం వద్దని వాదించటం జరిగేది. తర్వాత రైతాంగ సమస్యలు, సాంఘిక సంస్కరణలు తీసుకొని పనిచేస్తుండేవారు. క్రమేణా వెట్టిచాకిరీ ముఖ్య సమస్యగా అయింది.

1937–38 సంవత్సరాల్లో పరిసర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వము లేర్పడటం, రాజకోట, ధంకనాల్, తిరువాన్కూర్; మైసూరు మున్నగు చోట్ల సంస్థాన ప్రజాఉద్యమ విజృంభన హైదరాబాద్‌లోగూడా రాజకీయ చైతన్యం కల్గించి స్వాతంత్ర్యపోరాట దీక్షను ఇనుమడింపచేసినవి. 1938

జనవరి 29వ తేదీన హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం ప్రారంభించ తీర్మానించింది. అక్టోబరు 24వ తేదీన కీ.శే.గోవిందరావు నానక్, రామకృష్ణ ధూత్, జనార్ధనరావు దేశాయి, రావి నారాయణరెడ్డి, శ్రీనివాసరావు బోరికల్ ప్రథమ దళంగా శాసనోల్లంఘనం చేశారు. రెండు నెలలలోనే 400 మంది జైలులో నిర్భంధించబడినారు. ఈనాడు ప్రముఖ కమ్యూనిష్టులుగా నున్న శ్రీ రావి నారాయణరెడ్డి, బద్దెం ఎల్లారెడి, ఆరుట్ల లక్ష్మీనరసింహ్వారెడ్డి మున్నగువారు ప్రథమ స్టేటు కాంగ్రెస్ సత్యాగ్రకగహోద్యమంలో పాల్గొనినవారే.

ఉస్మానియా యూనివర్సిటీ అధికార్లు "వందేమాతరం" గీతాన్ని పాడరాదని ఆటంకపరిచినారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు సత్యాగ్రహాన్ని ఆరంభించారు. కొందరు విద్యాలయాలు బహిష్కరించి నాగపూర్ మొదలగు చోట్లకు వెళ్ళిచేరారు. సంస్థాన ప్రజాఉద్యమం యువజన, విద్యార్థి కార్యకర్తలను సంపాదించుకొన్నది. తర్వాత మత, ధార్మిక సంస్థలుగా వుండే ఆర్యసమాజ్ హిందూ మహాసభ గూడా స్టేటులో శాసనోల్లంఘనమునకుపక్రమించినవి.

సంస్థానంలో రాజకీయోద్యమం అభివృద్ధి అవుతూవున్న కొలదీ, అప్పటిదాకా తమ మత, సాంస్కృతీ విషయాలవరకే శ్రద్ధతీసుకొనే "అంజుమాన్ ఇత్తిహాదుల్ ముస్లిమీన్" అను సంస్థ ప్రజావ్యతిరేకంగా తయారైనది. జనాభాలో 12% వున్న మహ్మదీయులకు 50% శాసన సభలో ప్రానతిధ్యం కావాలని కోరింది. నైజాం ప్రభుత్వం అండదండలతో యీ సంఘం అనేక దుర్మార్గాలకు పూనుకొన్నది. సంస్థాన సత్యాగ్రహోద్యమాలను హిందూతత్వంతో కూడుకున్నవిగా చిత్రించి ఇటు ఇత్తిహాదుల్ ముస్లిమీన్ అటు ప్రభుత్వం క్రూరనిర్భంధ విధానాలతో సత్యాగ్రహాన్ని అణచివేయ జూచినవి. ఐనా శాసనోల్లంఘనం ఎల్లెడలా వ్యాపించింది.

భువనగిరి తాలూకా కొలనుపాక, పుల్లగిల్ల మొదలగు చోట్ల ప్రజలు జాగీర్దార్లకు పన్ను నివ్వతిరస్కరించారు. ఈ దశలో శాసనోల్లంఘనంలో ఆర్యసమాజ్ పాల్గొన్నందున మతరీత్యా నష్టమని భావించి గాంధీజీ స్టేటు సత్యాగ్రహాన్ని ఆపు చేయండని సలహా పంపారు. అంతటితో అది విరమించబడినది. అప్పట్లో శ్రీ బూర్గుల రామకృష్ణారావు, మందముల నరశింగరావు, మాచిరాజు రామకోటేశ్వరరావు, కొండా వెంకట రంగారెడ్డి మొదలగు వారు ఆంధ్రమహాసభ ద్వారా కృషిచేసేవారు.

1942 ఆగష్టు ఉద్యమం - 1947 స్వాతంత్ర్య ప్రకటన

ఇంతలో 1939 సెప్టెంబరులో ద్వితీయ ప్రపంచయుద్ధం వచ్చింది. కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా యిచ్చినవి. రాజాజి ప్రభుత్వం అధికారంలో నున్న స్వల్ప కాలంలో రాజకీయ ఖైదీల విడుదల ఋణపరిష్కార చట్టం వంటి మంచి పనులు చేసినది. కొంతవరకు పౌరసత్వ హక్కులను పునరుద్ధరించింది.

ఈ కాలంలో రాష్ట్రంలో రైతు ఉద్యమం విజృంభించింది. ప్రకాశం కమిటీ ముందు సాక్ష్యమిచ్చుటకు వేలాది జమీన్ రైతులు ముందుకొచ్చినారు. శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని వాసుదేవరావు గార్లు నాయకత్వమున ఇచ్చాపురం నుండి మద్రాసు వరకు 1500 మైళ్లు చరిత్రాత్మకమైన రైతు రక్షణయాత్రాదళం కాలినడకును నడిచింది. "నీవు హలమును బట్టి నేలనుదున్నక పోతే రాజాధిరాజులకు రాలదొక గింజైన లేవోయి కర్షకా" అనే రైతు గీతాలు బాగా ప్రచారంలోకి వచ్చినవి. 1938, 39 సంవత్సరాల్లో కాశీపట్నం, మునగాల, మందసారైతు పోరాటాలుసాగినవి. చల్లపల్లి, వెంకటగిరి, మొదలగు చోట్ల జమీందారి వ్యతిరేకోద్యమం వెల్లివిరిసింది.

పట్టణాలలోగూడా కార్మికోద్యమం అభివృద్ధి కాజొచ్చింది. కాంగ్రెస్ మంత్రివర్గ హయాములో జరిగిన చీరాల, చిట్టివలస కార్మిక సమ్మెలు, పోలీసు కాల్పులు వివిధ కార్మికులలో సంఘటిత శక్తిని పెంపొందింపజేసినవి. మునిసిపల్ పాకీ పనివారు తమ జీవన పరిస్థితులను బాగుచేసుకోటానికి సమ్మె పోరాటాలు సాగించారు. యువజన, విద్యార్థి, మహిళా సభలు రాష్ట్రమంతటా జరిగినవి. ఫలితంగా మధ్యతరగతి, ప్రజానీకంలోగూడా రాజకీయ చైతన్యం, జాగృతి పెంపొందించి బుర్రకథలు, నాటికలు, విచిత్ర వేషాలు మొదలైన కళా వైజ్ఞానిక రూపాలు అనేకం ప్రదర్శించారు. వీటన్నిటి వలన కమ్యూనిష్టుపార్టీ బలపడుతూ వచ్చింది.

ఆంధ్రలో కాంగ్రెసు సోషలిస్టుపార్టీ రెండు భాగాలుగా వుండేది. శ్రీ సుందరయ్య నాయకత్వమున, ప్రధానభాగం కమ్యూనిష్టు పార్టీలోనే చేరిపోయింది. అల్లూరి ప్రభృతులు కాంగ్రెస్‌లోకి చేరారు. తర్వాతనుండి కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ నిర్మాణం, ఆంధ్ర దేశంలో దెబ్బతినిపోయిందని చెప్పవచ్చు.

ఆగష్టు ఘటనలు :

ద్వితీయ ప్రపంచ యుద్ధమును గూర్చి కాంగ్రెస్ నాయకులు చర్చలు సాగించారు. 'ఫాసిజాన్ని ప్రతిఘటించడమే కాంగ్రెస్ లక్ష్యమనీ, ఐతే అందులకవకాశం బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కల్గించడంలేదనీ, సంపూర్ణ స్వాతంత్ర్యం లేనిది భారతదేశం తన పాత్రను సమర్థవంతంగా నిర్వహించజాలదనీ – ప్రభుత్వం స్వరాజ్యం యివ్వకపోతే కాంగ్రెస్ పోరాటం ప్రారంభిస్తుందనే తీర్మానం పాసుచేశారు. అరెస్టు చేసిన తర్వాత "కరేంగే యా మరేంగే"– విజయమో– వీరస్వర్గమో తేల్చండని దేశీయులకు పిలుపిచ్చారు. వ్యక్తి సత్యాగ్రహమల్లా చరమస్థాయికి చేరుకొన్నది. అంతిమ స్వాతంత్ర్య పోరాటంగా చరిత్రలో 1942 ఆగష్టు ఉద్యమం గణుతికెక్కింది.

అమెరీ చర్చిల్ ముఠా కాంగ్రెస్ అగ్రనాయకుల నరెస్టుచేసి దేశంలో చిచ్చు రగుల్కొల్పింది. బొంబాయిలో నాయకులను అరెస్టుచేసిన వార్త తెలియగానే, ఉద్యమం కట్టలుతెగి ప్రవహించిన మహాసాగరంవలె విజృంభించినది. ఆంధ్రదేశంలో గూడా రైల్వే పట్టాలు తొలగదీయుట, శాసనోల్లంఘనం చేసి పురవీధులలో వూరేగింపులు చేయటం సర్వసాధారణమైనది. తెనాలి మొదలైన చోట్ల జనంమీద విచ్చలవిడిగా కాల్పులు చేశారు. ప్రభుత్వ నిర్బంధాలు పెచ్చుపెరిగినవి.

ఈ యుద్ధ స్వభావమును గూర్చి కమ్యూనిస్టుపార్టీ యిచ్చిన "ప్రజాయుద్ధ నినాదం", 1942–43 సంవత్సరాలలో అవలంభించిన వైఖరి. బోసు మొదలగువారిని జపాన్ పంచమాంగదళం అనుటవల్లనూ, సోదర దేశభక్తులలో తీవ్ర వ్యతిరేకతను కల్గించింది. కమ్యూనిస్టులను జాతీయోద్యమ వ్యతిరేకులుగా కాంగ్రెస్ జమ గట్టింది.

ఈ యుద్ధకాలంలో జీవితావసర వస్తువుల ధరలన్నీ చుక్కలంటినవి. సరకులు బ్లాకు మార్కెట్‌లో తప్ప దొరికేవికావు. ప్రజల బాధలు ఇనుమడించినవి. వివిధ ప్రజాసమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు పనిచేశారు. 1942–45 సంవత్సరాల్లో రాయలసీమ, విశాఖ జిల్లాలలో క్షామనివారణకు పూనుకున్నారు. 1944వ సంవత్సరంలో విజయవాడలో జరిగిన అఖిల భారతీయ రైతు మహాసభకు లక్షలాది గ్రామీణ రైతులు రావటం, రాష్ట్ర రైతులలో, స్త్రీలలో ఒక గొప్ప సంచలనం చైతన్యం కలిగించినది. మంతెనవారి పాలెం, కొత్తపట్నం రాజకీయ పాఠశాల ద్వారా తీవ్రవాద యువకులకు కమ్యూనిస్టు సిద్ధాంత పరిజ్ఞానం లభ్యమైనది. కార్యకర్తలుగా తయారై ప్రజోద్యమ నిర్మాణాలకు పూనుకున్నారు. జాతీయైక్యత అత్యంత ఆవశ్యకమనీ, కాంగ్రెస్ నాయకులను విడుదల చేయాలనీ, గాంధీ–జిన్నా సంప్రదింపులు విఫలమైనవి.

యుద్ధానంతరం విప్లవ వెల్లువ గమనార్హమైనది. కలకత్తాలో బొంబాయిలో బ్రహ్మాండమైన నావికా, వైమానిక సైన్య తిరుగుబాట్లు వారికి ప్రజల అండ, సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ నిర్మాణం యీ దశలో ముఖ్యమైనవి. దేశంలో ఇక ప్రత్యక్ష పరిపాలన సాగించుటకు వీలులేని స్థితి వచ్చినదని స్పష్టపడింది. ఇంగ్లండులో లేబర్‌పార్టీ అధికారంలోకి వచ్చింది. అట్లీ బ్రిటీష్ ప్రధాని అయినాడు. ఎట్టకేలకు 1947 ఆగష్టు 15 భారత స్వాతంత్ర్య ప్రకటన జరిగింది. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వం భారతదేశం వదలిపోయింది. పోతూ–పోతూ ఇండియా, పాకిస్థాన్ అని విభజించివేసింది. ఈ రెండింటిలో దేనిలో ఒక దానిలో చేరుటగాని లేక స్వతంత్రంగానే వుండుటగాని ఆ యా స్వదేశీ సంస్థానాధిపతులే నిర్ణయించుకోమన్నది. ఈ కృత్రిమ విభజనే, దరిమిలా జరిగిన రాజకీయ, ఆర్థిక కలహాలకు కారణభూతమైనదని చెప్పుకోవలసి వుంటుంది.

పోలీస్ యాక్షన్ : హైదరాబాద్ ఇండియన్ యూనియన్‌లో విలీనీకరణ

ఇక హైదరాబాద్ సంస్థానంలో నిజామ్ ప్రభుత్వం ఏవో బూటకపు సంస్కరణలంటూ ప్రవేశపెట్టజూచింది. ప్రజాస్వామిక సిద్ధాంతం మీద ఎన్నికలు జరపాలనీ, శాసనసభకు బాధ్యత వహించిన మంత్రులకే అధికారం అప్పగించాలనీ స్టేట్ కాంగ్రెస్ తీర్మానించింది. 1945, 46 సంవత్సరాలలో దేశముఖ్‌లకు, ప్రతికూలంగా తెలంగాణాలో జాగీర్దారీ వ్యతిరేక పోరాటం ఉధృతమైనది. జనగామ తాలూకా విసునూర్ దేశ్‌ముఖ్‌కు ప్రతికూలంగా ప్రారంభమైన స్థానిక ప్రజా పోరాటాలు, తెలుగు జిల్లాలకు వ్యాపించసాగినవి.

"మా నిజాం రాజు జన్మజన్మాల బూజు" అని నిర్భయంగా చాటి చెప్పారు. ఈ ప్రజోద్యమాలకు ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీలు నాయకత్వం వహించి నడిపినవి.

ఈ ఉద్యమం "భూమి సమస్యను" ప్ర ప్రధానమైనదిగా ముందుకు తెచ్చి దొరల భూములను వ్యవసాయ కూలీలకు పంపిణీ చేయసాగింది. ముఖ్యంగా నల్లగొండ, వరంగల్లు జిల్లాలలో వెనుకబడిన అడవి ప్రాంతాలలో గ్రామరాజ్యాలంటూ ఏర్పడినవి. న్యాయకోర్టులు నిర్మాణమైనవి. దీని నణుచుటకుగాను ఇత్తెహద్ ముస్లిమీన్ సంస్థను, రజాకారు మూకలను గ్రామములపై వుసిగొల్పింది. ప్రభుత్వ పోలీసు బలగం రజాకార్లు విచ్చల విడిగా వీరవిహారం చేశారు. వీటి నుండి రక్షణకు, వాలంటీర్లు ఆయుధాలు ధరించారు. ఈ సంఘర్షణలో ఇరువైపులా అమాయకులైన గ్రామస్థులు సైతం కొందరు కష్టనష్టాలకు గురియైనారు. ఐనా శతాబ్దాల తరబడి అజ్ఞానాంధకారంలో వుండి పోయిన ప్రజానీకంలో తమ ఉద్యమ బలంపై ఒక అచంచల విశ్వాసాన్ని రాజకీయ చైతన్యాన్ని గల్గించింది.

ఈ స్థితిలోనే 1947, 48 సంవత్సరాలలో స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం సాగించింది. కల్లుగీత చెట్లు నరకటం, కరోడ్గిరి శాసనాలను ఉల్లంఘించటం, కాంగ్రెస్‌జండా ప్రతిష్టాపనలూ స్టేటు కాంగ్రెస్ కార్యక్రమాలుగా వుండేవి. తెలంగాణాలో స్వామీరామానంద్ తీర్థ నాయకత్వమున శ్రీ జమలాపురం కేశవరావు, బొమ్మ కంటి, వి.బి.రాజు, కోదాటి నారాయణరావు, పాగా పుల్లారెడ్డి ఉద్యమ సారధ్యం వహించారు. నాయకులు పరిసర రాష్ట్రాలలో వుండి పోరాటం నిర్వహించారు. తెలంగాణా వారికి విజయవాడ, మద్రాసులు ముఖ్యరక్షణ స్థావరాలైనవి. స్టేటు కాంగ్రెసుకు ఆంధ్ర కాంగ్రెస్ సహాయపడింది. ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టుపార్టీ సర్వసహాయం లభించింది. సంస్థాన ప్రజా ఉద్యమం దినదిన ప్రవర్ధమానమైనది. ఈ కాలంలోనే కాంగ్రెస్–కమ్యూనిస్టుల మధ్యగూడ సంఘర్షణలు చెలరేగినవి.

వెనుకటి బ్రిటిష్ ప్రభుత్వ ప్రకటనను పురస్కరించుకొని నిజాం ప్రభుత్వం తన "హైదరాబాదు సంస్థానం స్వతంత్రంగానే" ఉంటుందని ప్రకటించింది. యథాతథపు ఒడంబడికలను భగ్నం చేసింది. ఆజాద్ హైదరాబాద్ కావాలంటూ ఆ నినాదావేశంతో రజాకార్లు కౄరకృత్యాలు సాగించారు. నిజాం పోలీసు బలగం ప్రజోద్యమధాటికి ఆగలేకపోయింది. శాంతిభద్రతలు నెలకొల్పుటకు 1948 సెప్టెంబర్ 12 ఇండియా ప్రభుత్వం పోలీస్ యాక్షన్ చేయ నిర్ణయించింది. నలుమూలలనుండి 18వ తేదీ భారత సైన్యాలు హైదరాబాద్ స్టేట్‌లోకి ప్రవేశించగానే, ప్రజావ్యతిరేకమైన నిజాం ప్రభుత్వం ఒక్కసారిగా కూలిపోయింది. లయకాలీ పాకిస్తాన్ పరుగెత్తాడు. అంతటితో నిజాం రాజరికం నశించి, అసఫ్‌జాహి వంశపాలన అంతరించింది. హైదరాబాద్ సంస్థాన్ ఇండియన్ యూనియన్‌లో విలీనమైనది.

నయాన, భయానకూడా సంస్థానాలన్నింటిని ఇండియన్ యూనియన్‌లో సంలీనం చేసిన సర్దార్ వల్లభాయ్‌పటేల్ రాజకీయ చతురత, ప్రతిభావిశేషాలు, శక్తిసామర్థ్యాలు ప్రశంసార్హమైనవి. మిలిటరీ ప్రభుత్వం, జాగీర్దారీ విధానాన్ని రద్దుచేసింది. సర్ఫెఖాస్‌ను తీసివేసింది. ఇవన్నీ ఒక్క కలంపోటుతో తృటికాలంలో జరిగిపోయినవి.

1948 సెప్టెంబరు 23వ తేదీన నిజాం సంస్థానాధీశుడు ఒక రేడియో ప్రసంగంలో స్టేటులోని దుష్కృత్యాలను రజాకార్లపై త్రోసివేశాడు. "Rajakars rendered me helpless and got me to reject the offers made by the Government of India from time to time" అన్నాడు. రజాకార్ల నాయకుడు కాశిం రజ్వీని స్పెషల్ ట్రిబ్యునల్ ముందు విచారించినప్పుడు అత నిలా చెప్పాడు. "నైజాం సంస్థానాధీశుని ఆదేశాలను పాటించినందులకుగాను సంస్థాన ఉదంతాలకు తాను ఎరఅవుతున్నా"నని వాఙ్మూలమిచ్చాడు. ఏమైనప్పటికీ నైజాం ప్రభుత్వమే వీటన్నిటికీ కారణమనేది నిర్వివాదం. నైజాం నవాబు జాగీర్దార్లు, పాయిగాలకు రెవెన్యూ, సివిల్, క్రిమినల్ అధికారాలిచ్చారు. సర్ఫెఖాన్ తనక్రింద వుంచుకొని, ప్రపంచంలోనే కోటీశ్వరులైనారు. నిరంకుశాధికారం చెలాయిస్తూ సంస్థానవార్తలు బయటికి పొక్కనీయలేదు. బయటనుండి సంస్థానంలోనికి ప్రజాస్వామికవాది నెవ్వరినీ రానీయకుండా అంక్షలు విధించారు. రెండువంతుల తెలుగుగడ్డను, 3వ వంతు తెలుగు ప్రజలను, నిరంకుశాధికారం క్రింద అణచివుంచారు. తెలుగువారికే తెలుగు భాష, సంస్కృతి, సాంప్రదాయాలను మరచి పొయ్యే దుస్థితికి తీసుకువచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వమునకు తాబేదారులు నిజాం నవాబులు. ఈ పైశాచిక ప్రభుత్వం నుండి బయట పడుటకే, ప్రజలు సంకులసమరం సాగించారు. విజయం పొందారు.

భూకంపం కార్యక్రమాన్ని ముందుకుతెచ్చిన తెలంగాణా భూభాగంలోనే తర్వాత శ్రీ వినోబాభావేగారి భూదాన యజ్ఞానికి ప్రారంభోత్సవం జరిగింది. భువనగిరి తాలూకా "పోచంపల్లి" గ్రామం భూదానోద్యమానికి పవిత్రజన్మభూమి అయింది.

1948–49–50 సంవత్సరాలలో ఆంధ్ర–తెలంగాణా ప్రాంతములలో ఉభయ ప్రభుత్వాలు దారుణ నిర్బంధాలు అమలుజరిపినవి. దీనికి ప్రతీకారంగా, కమ్యూనిస్టుపార్టీ అవలంభించిన 'వ్యక్తిగత హింసావాదం' ప్రజా ఉద్యమాభివృద్ధికి నష్టకరంగా పరిణమించినది. తదనంతరం కమ్యూనిస్టుపార్టీపై నిషేదం తొలగించబడడంతో చట్టబద్ధపార్టీగా 1951 సంవత్సరం సాధారణ ఎన్నికలలో పాల్గొన్నది. అంతటినుండి పార్లమెంటరీ కార్యక్రమంవైపు కమ్యూనిస్టులు దృష్టిని మరల్చినారు.

ఆంధ్రరాష్ట్రం- ఆంధ్రప్రదేశ్ అవతరణ

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆంధ్ర, తమిళ, కేరళ, కర్నాటక ప్రాంతాలు కలిసివుండేవి. భాషాప్రయుక్తంగా రాష్ట్రం పునర్విభజన కావాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకూడా తీర్మానించింది. కాని మద్రాస్ నగర విషయం సాకు చూపుతూ, వాయిదా వేస్తూ వచ్చారు. ఐతే స్వరాజ్యంలో, స్వరాష్ట్రవాంఛ నానాట పెరుగుతూ వచ్చింది. ఈ సమస్యపై జె.వి.పి.రిపోర్టు, ధార్ కమిటీ నివేదికలు సమర్పించినవి. 1952 డిశంబరు 15 నుండి శ్రీ పొట్టి శ్రీరాములు 59 రోజులు అమరణ నిరాహారదీక్ష బూని ఆంధ్ర రాష్ట్రంకోసం అసువులర్పించారు. ఈ వార్త దశదిశలు వ్యాపించి ఆంధ్రదేశమంతటా ఉద్రిక్తమైనది. అనేకచోట్ల పోలీసులు కాల్పులు చేశారు. ఎట్టకేలకు శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ ఫలితంగా 1953 అక్టోబరు 1వ తేదీ ప్రత్యేకాంధ్రరాష్ట్ర మేర్పడింది. ఆంధ్రదేశానికి నడిబొడ్డుగా, ముఖ్య రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా వున్న విజయవాడ, గుంటూరులను కాదని నాయకులు కర్నూలును రాజధానిగా వరించారు. ఆంధ్రరాష్ట్రం– విశాలాంధ్రకు నాందీ ప్రస్తావన అయింది. తదితర భాషారాష్ట్రాలకు మార్గదర్శకమైనది.

హైదరాబాద్ సంస్థానంలో ఆంధ్ర, మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలు కలగాపులగంగా కలసివుండేవి. క్రమేపి తమ తమ భాషా రాష్ట్రాలలో చేరిపోవాలనేది జాతీయ వాంఛగా పరిణమించినది. నిజాం ప్రభుత్వం పడిపోవటంతో, యావదాంధ్ర ప్రజలు ఒకటిగా వుండాలనే తెలుగువారి సహజసిద్ధమైన కోర్కె బలపడింది. ఐతే హైదరాబాద్ ఉత్తర దక్షిణదేశ సంస్కృతుల నిలయమనీ, రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయటం దేశరక్షణకే భంగకరమనీ, నెహ్రూబోటివారు సైతం పదేపదే విశాలాంధ్రావతరణకు ప్రతికూలిస్తూ వచ్చారు. "విశాలాంధ్ర" కోర్కెలోనే సామ్రాజ్యవాద ధోరణి ఇమిడివున్నదనేవారు. ప్రజాందోళనాఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఫజులాలీ కమీషన్‌ను నియమించింది. యస్.ఆర్.సి. కమీషన్ దేశపటాన్ని పునర్విభజన గావించాలని సిఫార్సు చేసింది. ఈ సందర్భంలోనే తెలంగాణాలో కొన్ని అపశృతులు వినవచ్చినవి. ముల్కీ–నాన్ ముల్కీ లంటూ గొడవ బయలుదేరింది. ప్రత్యేక తెలంగాణావాదం వెనుక నాయకుల స్వార్థరాజకీయాలు పనిచేసినవి. తెలంగాణావారికి రక్షణ కావాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల సమయస్ఫూర్తితో విశాలాంధ్రనే బలపరచి చరితార్థులైనారు. ప్రజావాంఛను గుర్తెరిగిన భారత ప్రధాని ప్రజాస్వామికవాదిగా ఎట్టకేలకు ఆంధ్ర తెలంగాణా సంలీనత కంగీకరించి తన శుభాశీస్సులందచేశాడు. ఫలితంగా 1956 నవంబర్ 1వ తేదీ "ఆంధ్రప్రదేశ్" అవతరించింది. హైదరాబాద్‌నగరం 20 తెలుగు జిల్లాల రాజధానిగా వెలుగొందుచున్నది.

జనరల్ ఎన్నికల ఫలితాలు

స్వాతంత్ర్యం వచ్చిన తదుపరి రెండు సాధారణ ఎన్నికలు జరిగినవి. 1951 సం॥లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి వయోజన ఓటింగుతో మొదటిసారిగా ఎన్నికలు జరిగినవి. దీనిలో ఆంధ్రలోని 140 స్థానాలలోను కాంగ్రెస్‌కు 40, కమ్యూనిస్టు పార్టీకి 41, కృషిక్ లోక్‌పార్టీకి 15, కె.యం.పి.కి. 20, షెడ్యూలు కాస్టు ఫెడరేషన్‌కు 1, స్వతంత్రులకు 19 సీట్లు వచ్చినవి. ఢిల్లీ పార్లమెంటుకు ఎన్నికైన 27 మందిలోను కాంగ్రెస్‌కు 7, కమ్యూనిస్టులకు 10, ప్ర.సా, 4, స్వతంత్రులకు 6 సీట్లు వచ్చినవి. ఆంధ్రలో ఎన్నికల ఫలితాలు భారతదేశంలోనే గాక ప్రపంచ ప్రజలనుకూడా ఆశ్చర్య చకితులను చేసినవి. ప్రముఖ కాంగ్రెస్ నాయకులంతా ఓడిపోయి, ముఖ్య కమ్యూనిస్టులందరూ గెలుపొందారు.

కాం(గెస్ ఓటమిని గూర్చి ఆనాడు డాక్టరు పట్టాభి ఇలా వ్యాఖ్యానించారు. "మన ఓటరు రాజకీయంగా మేజరు అయినాడు, విజయాన్ని కాం(గెస్ ఎక్కువ నమ్మకంగా వుండటంతో, వయోజనాధికారం యొక్క పస పూర్తిగా తెలుసుకోలేదన్నమాట. మన మంత్రులు గూడెములను చూచినపాపాన పోలేదు. కమ్యూనిస్టులు పాగా వేసుకున్నది ఆ గూడెములలోనే. అడుగున పడివున్న వర్గాలు నేడు చైతన్యవంతులై తమ పౌరసత్వాన్ని దృఢపరుచుకున్నారు" అన్నారు. అప్పటికి ఆంధ్రులకు రాష్ట్రం ఏర్పడలేదు. కాం(గెస్‌లోనుంచి రంగా, ప్రకాశం వర్గాలు చీలి వేరే పార్టీల నేర్పరచి పోటీచేశారు. యుద్ధకాలంలో రేషనింగు, కంట్రోళ్ళు, లంచగొండితనం, నిర్బంధ విధానం ఒకదాని కొకటి తోడై, ప్రజలను బాధలకు, హింసాకాండకు, గురిచేసినవి. కాం(గెస్ ఓడి పోయింది.

1955 సంవత్సరంలో 2వ సారి ఎన్నికలు జరిగినవి. ఐక్య కాం(గెస్‌కు 146, కమ్యూనిస్టుపార్టీకి 15, ప్ర.సో.పార్టీఇక 13, స్వతంత్రులకు 22 సీట్లు వచ్చినవి. ఐక్యకాం(గెస్ ప్రతిపక్షాలన్నింటిపైన 96 మెజారిటీ సంపాదించింది. రాష్ట్రకాం(గెస్ నాయకులందరూ గెలుపొంది, కమ్యూనిస్టుపార్టీ ముఖ్యులంతా ఓడిపోవటం యీసారి ప్రత్యేకత. ఈ ఎన్నికల వార్తలు వస్తుండగనే అఖిల భారతీయ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి అజయఘోష్ ఇలా ప్రకటించారు.

"ఆంధ్ర ఎన్నికలలో మనకు గల్గిన పరాజయ వార్తలు విస్మయకరంగాను, హృదయ విదారకంగాను వున్నవి. అంచనాలనుబట్టి ఆంధ్రలో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడుతుందని ఎదురుచూస్తున్న వారందరికి యీ పరాజయవార్తలు ఆశ్చర్యం కలుగజేశాయి." అన్నారు.

అప్పటిదాకా చీలివున్న కాం(గెస్. "ఐక్య కాం(గెస్ పక్షంగా ఏర్పడింది. ఉమ్మడిగా పోటీచేసి ప్రత్యర్థుల నోడించింది. గ్రామపంచాయితీ స్పర్థలను బాగా వుపయోగించుకున్నది. జమీందారీ, భూస్వామ్యవర్గాలను తమలోకి కూడదీసుకుంది. ఎన్నికల ఫలితాలను సూక్ష్మంగా పరిశీలిస్తే ఒక ముఖ్య విషయం బోధపడుతుంది. చెరిసగంగా ఓటర్లు కమ్యూనిస్టు–కాం(గెస్ పార్టీలలో వున్నారు. మిగిలిన 10–15 శాతం మధ్యతరగతి, రైతాంగం, ఎటు మొగ్గితే అటు విజయం చేకూరుతుంది. వెనుకటికంటె సీట్లు తగ్గినవికాని, కమ్యూనిస్టులకు ఓట్లు అధికంగానే వచ్చినవి. అసెంబ్లీలో ప్రతిపక్ష సంఖ్య సన్నగిల్లినది. ఇక కాం(గెస్ యథేచ్ఛగా తన పరిపాలన సాగించినది.

రాష్ట్ర రాజకీయ పార్టీలు

రాష్ట్రంలో సాంప్రదాయసిద్ధంగా పెద్దది కాం(గెసుపార్టీ. ప్రకాశంగారు కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ నేర్పరచారు. రంగా కృషిక్ లోక్ పార్టీని స్థాపించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 15 మందితోకూడిన లోక్‌పార్టీ కాం(గెసు ప్రభుత్వ మేర్పడుటకు కారణభూతమైనది. ప్రకాశం నాయకత్వాన కమ్యూనిస్టుపార్టీ కామన్‌లీగ్ పార్టీలతో యునైటెడ్ డెమాక్రటిక్ ఫ్రంటు ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. దాని నుండి రాజీనామా యిచ్చి ప్రకాశం ప్రథమాంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి అయినారు.

తర్వాత జరిగిన ఎన్నికలలో కాం(గెస్, లోక్, ప్రజా పార్టీలు కలిసిన ఐక్య కాం(గెస్ పార్టీ తరపున పోటీచేసి అత్యధిక సంఖ్యలో గెలుపొందారు. యునైటెడ్ కాం(గెస్‌పార్టీకి 54%, కమ్యూనిస్టు పార్టీకి 31% ఓట్లు వచ్చినవి. ఆంధ్ర–తెలంగాణాలు సంలీనమైనప్పుడు ఆంధ్ర అసెంబ్లీ సభ్యుల కాలపరిమితి పొడిగించి 1957 సంవత్సరంలో తెలంగాణాలో మాత్రమే శాసన సభా ఎన్నికలు జరిపారు. పీపుల్సు డెమాక్రటిక్ ఫ్రంట్ పేరుతో ఆనాడు కమ్యూనిస్టులు పోటీచేయుట జరిగింది. కమ్యూనిస్టుపార్టీ, వారు బలపరచిన అభ్యర్థులకు 30.75% ఓట్లూ కాం(గెస్‌కు 38.85% ఓట్లు వచ్చినవి. 1952 సంవత్సరంలో 32 సీట్లు గెలుచుకున్న తెలంగాణా కమ్యూనిస్టుపార్టీ యీ ఎన్నికలలో 22 సీట్లు గెలుచుకోగల్గింది. ప్రజాపార్టీకి ఒక సీటు, ప్ర.సో. పార్టీకి ఒక సీటు, సోషలిస్టు పార్టీకి 4 సీట్లు వచ్చినవి. కాం(గెస్ వాదులుగానేవుండి అధికార అభ్యర్థులను ఓడించి 9 మంది స్వతంత్రులుగా గెలుపొందినారు. కాం(గెస్ పార్టీ 69 సీట్లు గెలుచుకున్నది. మొత్తం మీద తెలంగాణాలోగాని, ఆంధ్రలోగాని కాం(గెస్–కమ్యూనిస్టుపార్టీలే ముఖ్య పార్టీలుగా రూపొందినవని చెప్పవచ్చును.

రాష్ట్ర లెజస్లేచరులోని పార్టీల, గ్రూపుల కలయికలు తరచు మార్పు చెందుతూవచ్చినవి. నేషనలిస్టు గ్రూపు అంటూ ఏర్పడి తర్వాత కాం(గెస్‌లో కలసిపోయినారు. 'స్వతంత్రగ్రూపు' అని కొద్దికాలం ఏర్పడి ఒక్క శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, బసవ మానయ్యగార్లు తప్ప మిగిలినవారు కాం(గెస్‌లో చేరారు. శ్రీ సంజీవ రెడ్డి గారి నాయకత్వమును ఎదిరించిన శ్రీ చెన్నారెడ్డి బొమ్మకంటి, కాకాని, లచ్చన్న, ప్రభృతులు డెమాక్రటిక్ పార్టీ అంటూ ఒక క్రొత్త పార్టీ నేర్పరిచారు. వీరు శ్రీ పి.వి.జి.రాజు గారి అధ్వర్యముననున్న సోషలిస్టు పార్టీతో గూడ మిళితమై సోషలిస్టు డెమాక్రటిక్ పార్టీ అని నామకరణము చేశారు. ఇంతలో దేశవ్యాప్తంగా రాజాజీ, రంగా, గార్ల నాయకత్వమున "స్వతంత్ర పార్టీ" స్థాపించబడినది. పూర్వపు కె.ఎల్.పి.వారు ఒకరిద్దరు నాయకులు తప్ప స్వతంత్రపార్టీలో చేరిపోవటం జరిగింది. చెన్నారెడ్డి ప్రభృతులు తిరిగి కాం(గెస్‌లో చేరారు. మరికొన్నాళ్ళకు పివి.జి.రాజుగారు నాయకత్వమున నున్న సోషలిస్టు పార్టీ సైతం కాం(గెస్‌లో సభ్యత్వాలు స్వీకరించింది. అంతటితో రాజుగారు ఆరోగ్యశాఖా మంత్రి అయినారు. ఆయా జిల్లాల్లో వ్యక్తులుగా మిగిలిన ప్రజాసోషలిస్టుపార్టీకి సంబంధించిన జి.సి.కొండయ్య, రాటకొండ మున్నగువారు కాం(గెస్‌లో ప్రవేశించారు. ఈ విధంగా కాం(గెస్–కమ్యూనిస్టు పార్టీల మధ్య రాష్ట్ర రాజకీయాలలో సోషలిస్టుపార్టీలు నామమాత్రవశిష్టమైనవి.

అస్థిరమైన రాష్ట్రమంత్రివర్గాలు

మనకు స్వతంత్ర భారతంలో రాష్ట్ర మేర్పడినప్పటినుండి 4 మంత్రివర్గాలు మారుతూ వచ్చినవి. 1950 సం॥లో ప్రకాశం మంత్రివర్గం ఏర్పడింది. 14 నెలల్లోనే మధ్యనిషేధ సమస్యపై ప్రభుత్వం 1954 నవంబరులో పడిపోయింది. గవర్నరు శ్రీ త్రివేదీ పరిపాలన కొనసాగింది.

1955 ఉపఎన్నికల ఫలితంగా శ్రీ బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రిగా 2వ సారి మంత్రివర్గ మేర్పడింది. 1956వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంలో 3వ సారి శ్రీ సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయినాడు. ఆయన 3 ఏండ్ల పరిపాలన తర్వాత అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నుకోబడటంతో, రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీ సంజీవయ్యనెన్నుకున్నారు. ఈ విధంగా తెలుగువారికి రాష్ట్రం వచ్చిన తర్వాత ఇది 4వ మంత్రివర్గం. ఇవన్నీ బయటికి ఏకగ్రీవంగా ఎన్నుకొని ఏర్పరుచుకొన్న మంత్రివర్గాలే.

రాష్ట్ర మంత్రివర్గ మార్పులు, రాజకీయ పరిస్థితులు పరిశీలించిన వారికి రాజకీయ నాయకత్వంలో స్థిరత్వం లేదని స్పష్టపడుతున్నది. ఈ మార్పులు ప్రభుత్వపక్షానికి, ప్రతిపక్షాలకు మధ్య వచ్చిన పోటా పోటీల ఫలితంగాకాదు. పాలకవర్గ పార్టీ అయిన కాంగ్రెసు లోని అంతర్గత, వ్యక్తిగత వైరుధ్యాలే మూలకారణమని గ్రహించవలసివుంది. ఎవరు, ఎప్పుడు మంత్రులవుతారో, వైదొలగుతారో తెలియని అస్థిమిత పరిస్థితిలో రాష్ట్రపాలన కొనసాగుతూ వుంది. అడుగునుండి శిఖరందాకా కుల, మత, గ్రూపు తత్వాలు ఎక్కువై సక్రమ రాజ్యాంగ నిర్వహణకు కుంటుపడ జేస్తున్నవి. రాష్ట్ర వ్యాప్తితంగా సమర్థవంతమైన ఒక ప్రతిపక్షం బలమైనది లేకుండాపోయింది. ప్రజానీకం సుపరిపాలనకై గంపెడంత ఆశతో ఎదురుచూస్తున్నది.

జాతీయ సమైక్యత

ఆంధ్ర తెలంగాణాలు చట్టరీత్యా సంలీనమైనవి. చిరకాల వాంఛితం ఈడేరింది. కాని నాయకుల హృదయాలు మాత్రం ఇంకా సన్నిహితం కాలేదేమో ననిపిస్తుంది. తెలంగాణా ప్రాంతానికి ప్లానింగులో ఎక్కువ ఖర్చుచేయటంలేదనీ, ఉద్యోగుల నియామక రేష్యో పద్ధతి 2 : 1 సక్రమంగా అమలు జరుపలేదనీ తెలంగాణా ప్రాంతీయ సంఘంవారి ఆరోపణ. దీనికి తమ సమాధానంగా ప్రభుత్వం ఒక 'వైట్‌పేపరు'ను జారీచేసింది. జాతీయ భావ సమైక్యత అత్యంత ఆవశ్యకమని నేడు ఎల్లరూ గుర్తించిన విషయమే. ఉభయ ప్రాంతాలలో అమలులోవున్న చట్టాలనుగూడా యింకా సమన్వయం చేయలేదు. వందల ఏండ్లతర్వాత మళ్ళీ యావదాంధ్రులం ఏకమై ఒక్క రాష్ట్ర ప్రభుత్వం క్రిందకు వచ్చినాము. బస్తరు, కోరాపుట్టి, గంజాం, కోలార్, బళ్ళారి సరిహద్దు సమస్యలు అలానే వున్నవి. వాటి పరిష్కారానికి పూనకోవటం లేదు. ఇంకా కోస్తా, రాయలసీమ, తెలంగాణాలంటూ వేర్వేరుగా ఆలోచించితే ప్రత్యేకధోరణులు బలపడి రాష్ట్ర సమగ్రాభివృద్ధినే కుంటుపడజేస్తవి. ఈ ప్రత్యేక ధోరణులకు ఎంత త్వరలో స్వస్తి చెప్పితే మన సర్వతోముఖాభివృద్ధికి అంత మంచిది. తెలంగాణాబోటి వెనుకబడిన ప్రాంతాలవారి అనుమానాలకు ఆస్కారం లేకుండా ప్రణాళికలఎడల శ్రద్ధ తీసికొనవలసిన బాధ్యతగూడా ప్రభుత్వాని కున్నది.

ఇత్తేహాద్ ముస్లిమీన్ సంస్థను మళ్ళీ పునరుద్ధరించడానికి ఇటీవల కొన్ని ప్రయత్నాలు జరుగుచున్నవి. మత ప్రాతిపదికమీద ప్రజలను తప్పుమార్గాల పట్టించడం ప్రజాస్వామ్యానికే హానికరమౌతుంది. అభ్యుదయాన్ని కాంక్షించేవారెల్లరూ యీ దుష్ప్రయత్నాలను నివారించవలసి వుంది.

ముగింపు

ఆంధ్రులకు స్వరాష్ట్రం ఏర్పడినప్పుడు అనేక మధుర స్వప్నాలు కన్నాము. మన ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి అవుతామనీ, మృదుమధురమైన తెలుగుభాషను, సంస్కృతిని పెంపొందించుకుంటామని ఉవ్విళ్ళూరాము. కాని నేటి ఆంధ్రప్రదేశ్ కేంద్రంచే నిర్లక్ష్యం చేయబడిన రాష్ట్రంగా వుండిపోయింది. కృష్ణా-గోదావరీ నదీజలాల పంపిణీని గూర్చి చేసుకొన్న అంతరాష్ట్రీయ ఒడంబడికలనుగూడా గౌరవించడంలేదు. చెప్పుకోదగిన భారీ పరిశ్రమలను నెలకొల్పడం లేదు. తెలుగును అధికారభాషగా అంగీకరించినా, ఆచరణలో అందుకు వలయుత్వరప్రయత్నాలేమీ చేయుటలేదు. కమిటీల నియామకాలలో కాలహరణం చేస్తున్నది.

ఇక పంచవర్ష ప్రణాళికల విషయం చూస్తే, కమ్యూనిటీ డెవలప్‌మెంటు, పంచాయితీరాజ్య నిర్మాణం, సహకారోద్యమం మున్నగు శాఖలలో ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసింది. నాగార్జున సాగర్‌లాంటి అభివృద్ధి ప్రాజెక్టులు కొనసాగుతున్నవి. కాని అట్టడుగున వున్న సామాన్య ప్రజల జీవన పరిస్థితులు బాగుపడలేదు. భూసంబంధాలలో మార్పు రాలేదు. ధరల పెరుగుదలలో మధ్యతరగతి కుటుంబాల పరిస్థితులు శోచనీయంగా వున్నవి. పన్నులభారం ఏటేటా పెరిగిపోయింది. పల్లెప్రాంతాల్లో గర్భదారిద్ర్యం విలయతాండవం చేస్తూనే వున్నది. అన్నపూర్ణగా వుండవలసిన ఆంధ్రదేశంలో అన్నమే కరువౌతున్నది.

మన ప్రాచీన అంధ్రౌన్నత్యమునకు తలపునకు వచ్చినపుడెల్లా ప్రతి ఆంధ్రుడు ఉప్పొంగిపోతుంటాడు. ప్రస్తుత పరిస్థితులు తిలకించినప్పుడు దుఃఖసముద్రంలో క్రుంగిపోతున్నాడు. సాంఘికంగా సైతం, మత, మూఢ విశ్వాసాలు, సనాతనాచార సాంప్రదాయాలు వెంటాడుతూ సాంఘికాభివృద్ధికి సంకెళ్ళు తగిలిస్తున్నవి. కులతత్త్వాలు వెర్రితలలు వేసినవి. జీవిత విధానంలో నైతిక విలువలకు స్థానమే లేకుండా పోతున్నది.

నేటి నిరాశా నిస్పృహలనుండి ఆంధ్ర జాతిని ఉత్తేజపరచి కార్యోన్ముఖులను చేయగల మహత్తర సందేశం, మహదాశయం కావాలి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్ననాటి దేశ భక్తి, త్యాగశీలత, కార్యదీక్ష జాతీయైక్యత, నేటి దేశ పునర్నిర్మాణ కార్యక్రమాలలోగూడా సాధించవలసివుంది. అఖిలాంధ్ర నూతన ప్రజాస్వామిక సుపరిపాలన కలకాలం వర్ధిల్లి దేశం పాడి పంటలతో, శుభకాంతులతో విలసిల్లుగాక! భారత రిపబ్లిక్‌లో ఆంధ్రప్రదేశ్ ఒక మణిహారంగా వెలుగొందుగాక!

(శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయము స్వర్ణోత్సవ సంచిక - 1962)

మహాత్మాగాంధీ

ఆంధ్రలో అవకాశాలు

ఒరిస్సా - ఆంధ్ర

ఈశీర్షిక కింద మహాత్మాగాంధీ 13.04.1921న ఆంధ్రదేశ సంచారం ముగించిన తరువాత 'యంగ్ ఇండియా'లో ఇట్లా వ్రాసినారు.

"1916లో నేను బెజవాడ, నెల్లూరు పట్టణాలకు పోవడం తప్ప ఆంధ్ర దేశానికిగాని, ఒరిస్సాకుగానీ పోవడం ఇదే మొదటి పర్యాయము. రాష్ట్రాలలో నేను విస్మరించరాని కొన్ని విషయాలను, నా మనస్సులో మాసిపోని కొన్ని దృశ్యాలను ఇక్కడ వ్రాయదలచుకున్నాను. ఆనాటి నా కార్యక్రమం ఎంతో సంకీర్ణమైనది కావడం చేత కొన్ని ముఖ్య ప్రదేశాలను గురించి మాత్రమే త్వరత్వరగా ఇందులో ఉదహరించదలచుకొన్నాను. ఒరిస్సాలో నేను అస్థిపంజరాలను చూడగలనని అనుకొన్నానుగాని ఇంత బహుళంగా చూస్తానని అనుకోలేదు. ఆ మార్చి 26వ తేది నేను మరువరాని రోజు. ఆనాడు పూరీ పుణ్యక్షేత్రం రోడ్డుపైన బారులు తీర్చి నిలబడివున్న స్త్రీలు, పురుషులు పిల్లలు కేవలం వట్టి బొమికలపైన చర్మం కప్పబడి ఉన్నట్లు కనబడినారు. అటువంటి వారికి స్వరాజ్యం అంటే అర్థం ఏమవుతుంది? వారు ఒకరూ, ఇద్దరూ కాదు; చాలా మంది. ఆ పస్తులు పడుకొనే వారిలో చాలా దూరం నడువగల ఎంతో శక్తిమంతులైన వారు కూడా ఉన్నారు. వారు తమకు బియ్యం పంపించిన ఒక వ్యక్తిని చూడవచ్చినారు. ఆ వ్యక్తి దగ్గర నుంచి మరికొన్ని బియ్యపు గింజలు లభించగలవని ఆశ. "అన్నం అన్న"మని వారు జాలికరంగా అరవడం మొదలు పెట్టినారు. కొందరు ధరలెప్పుడు తగ్గిపోతాయి అంటున్నారు. చాలా మందికి స్వరాజ్యం అంటే చౌకగా అన్న వస్త్రాలు లభించటమేనని వారనుకొంటూన్నట్లు నాకర్థమయింది. అయితే వస్త్రం అన్నమంత అవసరం కాదు. వారి సిగ్గుదాచుకోవడానికి ఒక చిన్న గుడ్డ పేలిక చాలు. కాని ఆహారం మట్టుకు ఉండి తీరవలె.

నేను ఐశ్వర్యవంతులుండే ప్రదేశంలో ఒక పెద్ద బంగాళాలో ఉన్నాను. అక్కడ నుంచి నేనీ స్థలానికి వెళ్ళినాను. జగన్నాథస్వామి దేవాలయం నుంచి నేను అటూ ఇటూ పోవడం జరిగింది. తోవలో నాకు తృప్తిగా భుజించిన మహంతులు, పండాలు, వందలకొద్దీ యాత్రికులూ కనబడినారు. వారు కొన్ని వందల రూపాలయలు వెచ్చించగల స్థితి గలవారు.

ఈ వ్యత్యాసం నేను చూసినప్పుడు నా విచారం మరింత తీవ్రమయింది. కొందరు మిత్రులు నన్ను ఒక అనాథశరణాలయానికి (తల్లి, దండ్రులు లేని బిడ్డల శరణాలయము) తీసుకొని వెళ్ళినారు. దానిని కరుణామయుడైన ఒక పోలీసు సూపరింటెండెంట్ స్థాపించినాడు. అక్కడ బాల బాలికలు చక్కగా ఉన్నారు. వారిలో కొందరు నూలు వడుకుతున్నారు. కొందరు చాప లల్లుతున్నారు. ఆ బక్క చిక్కిన

మనుష్యులందరూ ఇట్లా ఎందుకు చేయకూడదు? అట్లా చేస్తే వారికి ఇల్లు విడిచి పెట్టవలసిన అవసరంగాని, బిచ్చమెత్తుకొనవలసిన అవసరంగాని, గుప్పెడు మెతుకులతోనే జీవించవలసిన అవసరంగాని ఉండదు. వారు వడక గలిగినట్లైతే వారి పొట్ట వారు నింపుకోగలరు. అయితే వారికి రాట్నాలు ఎవరిస్తారు? తప్పకుండా కాంగ్రెసు కమిటీ ఇవ్వవలె. నూలు వడకటంవల్ల స్వరాజ్యం లభిస్తుంది. కాంగ్రెసు వారికి బోధించగలదు. లక్షలాది ప్రజలు అవలంభించగలవృత్తి నూలు వడకటం ఒక్కటే. చాపలల్లడం కూడా కాదు. ఎందువల్లనంటే లక్షలాది చాపలు అమ్మకం కావలె. ఆహార పదార్థాల తరువాత తేలికగా అమ్ముడుపోయే సరుకు నూలు ఒక్కటే. తరువాత నేను కాంగ్రెస్ నాయకులను కలుసుకొని ఈ కథంతా వారికి చెప్పినాను. వారిలో కొందరు నేను వర్ణించిన ఈ దృశ్యాలను నాతో కూడా కలిసి చూసినవారే. ముఖ్యంగా కాంగ్రెస్ నిధులను రాట్నాల వ్యాప్తికోసమే ఉపయోగించవలెనని వారు నాతో ఏకీభవించినారు. అందుకు కావలసిన సొమ్ము యాత్రికుల నుంచి, మహంతులనుంచి వారు తేలికగా సేకరించగలరు. ఒరిస్సా వంటి పేద రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ కమిటీ స్వయం సహాయంతో నిలబడి క్షుదార్తులైన వారికి కడుపులను నింపి స్వరాజ్యాన్ని చేరువకు తీసుకొని రాగలదు. వారికి కార్యకర్తలు కూడా ఉన్నారు. మాజీ ప్లీడరు, మాజీ యం.ఎల్.సి. అయిన పండిత గోపబంధుదాస్ అనేక సుగుణాలు కలిగిన స్వార్థరహిత నాయకుడు. ఆయన, ఆయన సహచరులు అన్నం, పప్పు తిని బ్రతుకుతున్నారు. వారికి ఈ రోజుల్లో నెయ్యి దొరకటం దుర్లభము. సహాయ నిరాకరణోద్యమం ప్రారంభింపబడిన తరువాత కాంగ్రెస్ కార్యకర్తలు అత్యల్పమైన గౌరవవేతనం పైన– అంటే నెలకు 10 రూపాయలతో జీవిస్తున్నారు.

అటువంటి శ్రద్ధా భక్తులు గల మనుష్యులతో సంవత్సరంలో స్వరాజ్యం సంపాదించగలమని నమ్మడం ఆశ్చర్యం కాదు.

పూరీకి 12 మైళ్ళ దూరంలో ఉన్న సాక్షి గోపాలంవద్ద ఉద్యానవనంలో పండిత గోప బంధుకొక పాఠశాల ఉన్నది. అది చూడదగినది. అందులోని ఉపాధ్యాయులు బాలుర మధ్యనే నొక రోజు ఆనందంగా గడిపినాను. బహిరంగ ప్రదేశంలో పిల్లలకు చదువుచెప్పటం ఒక ఉత్కృష్టమైన ప్రయోగం. ఆ పిల్లలలో కొందరు శక్తిమంతులైన పహిల్వాన్‌లు కూడ ఉన్నారు.

ఒరిస్సా కొక గొప్ప విచారం పట్టుకొన్నది. సమర్థవంతుడైన ఒక రచయిత ఒరియా ఉద్యమమనే గ్రంథంలో, ఒరిస్సా రాజకీయ కారణాలవల్ల ఛిన్నా భిన్నమయిందని వ్రాసినారు. కొంత భాగం బెంగాలుకు, మరికొంత బీహారుకు, ఇంకాకొంత మధ్యరాష్ట్రాలకు కొంత ఆంధ్రాకు పోయిందన్నారు. ఒరిస్సాకేమీ మిగలలేదన్నారు. ఒరియా మాట్లాడే ప్రజలుగల ప్రదేశమంతా ఒక రాష్ట్రంగా కాంగ్రెస్ గుర్తించింది. బీహార్, బెంగాల్, మధ్య రాష్ట్రాలకు ఆ విషయంలో తగాదాలేదు. కాని బరంపురం విషయంలో ఒరియాలకు ఆంధ్రులకు తగాదా ఉంది. వారి వివాద పరిష్కారానికి ఒక చిన్న సూత్రం నేను సూచించినాను. నేడు మనం జరుపుతూండిన పోరాటం వల్ల మనం గ్రహించవలసిన అత్యుత్తమమైన సూత్రం ఒకటి ఉన్నది. అది బలవంతులైనవారు బలహీనులకు లొంగిపోవటమే. సందేహాస్పద విషయాలలో దుర్బలులదే చివరిమాటగా ఉండవలె.

సాక్షి గోపాలంలో బహిరంగసభకు వచ్చిన వేలకొద్దీ నిరుపేదలు తమ మూటలు విప్పి స్వరాజ్య నిధికి దమ్మిడీలను పైసాలను సమర్పించిన దృశ్యాలను స్మరిస్తూ ఒరిస్సాను గురించిన అనుభవాలను ఇంతటితో ముగిస్తున్నాను. వారు ఆ పైసల నీయడానికి ఒకరినొకరు ప్రోత్సహిస్తూండడం చూసినప్పుడు నా విశ్వాసం మరింత పటుతరమయింది.

ఆంధ్రదేశం, ఉత్కళదేశంవలె లేదు. ఇది సంపూర్ణ శక్తిమంతంగా ఉన్నది. అక్కడ మాంసంలేని బొమికల పోగులు లేవు. అక్కడి ప్రజలు బలంగా, శక్తిమంతంగా, పట్టుదలగా, ఔదార్యంగా ప్రేమగా కనపడినారు. వారికి తమ రాష్ట్ర భవిష్యత్తులోను, భారత భవిష్యత్తులోనూ కూడ పూర్తి అయిన విశ్వాసమున్నది. అక్కడి స్త్రీ పురుషులందరూ బంగారు నగలతో తులతూగుతున్నారు. ఈ నగలు వారు నాకు చూపడం వారికి అపాయకరంగా పరిణమించింది. అవన్నీ తిలక్ మహారాజు జ్ఞాపకార్థం స్వరాజ్యంకోసం నాకు కావాలని నా మనస్సులో మాట వారికి దాచకుండా చెప్పేసినాను. స్త్రీలు, పురుషులూ కూడా వాటిని నాకు సంతోషంగా ఇచ్చినారు. ఆ రోజుల్లో 50 వేల రూపాయలు వచ్చినాయి. ఇంకా ఎక్కువ వాగ్దానాలు కూడా ఉన్నాయి. వారు తలుచుకొంటే కోటి రూపాయల మొత్తం వారి నగలనుంచే స్వరాజ్య నిధికి ఇవ్వగలరు.

నిష్కాపట్యంలో, సహనంలో, వినయంతోకూడిన స్వేచ్ఛతో ఆంధ్రస్త్రీలు మహారాష్ట్ర స్త్రీలను స్మరింపజేస్తున్నారని నేను వారితో అన్నాను. ఇది ఒక గొప్ప ప్రశంసావాక్యం. కలకత్తాలో చదువుకొని ఇటీవలనే వివాహితయై ఏలూరులో నివసిస్తూండిన అన్నపూర్ణాదేవి అనే బాలిక వివాహ చిహ్నాలుగా ఉండదగిన వస్తువులను తప్ప తక్కిన అన్ని ఆభరణాలను స్వరాజ్య నిధికి సమర్పించింది. ఆమె ఆపాదమస్తకం ఖద్దరు ధారిణియై కనిపించింది. ఆంధ్రదేశంలోని స్త్రీ పురుషుల ఔదార్యం నా మనస్సును ఆకర్షించింది.

సన్నని నూలు వడకడంలో పంజాబీ సోదరీమణులు ఆంధ్ర సోదరీ మణుల తరవాతి వారని చెప్పక తప్పదు. ఇంతకు పూర్వం పంజాబీ స్త్రీలకంటె మనోహరంగా వడకగలవారు లేరని భావించినాను. కాని ఆంధ్ర స్త్రీలు నూరో (100) నెంబరు నూలును కూడా వడకగలరు. వారు తమంతటతాము పత్తిని పరిశుభ్రం చేసుకొని ఏకులు తయారుచేసుకోగలరు. వారు వడికిన సన్నని నూలు నమోనాలు కొన్ని నేను తీసుకొని వచ్చినాను. అవి జపాను, ఫ్రాన్స్, లాంక్‌షైర్ నూలుతో పోటీచేసి మెరుగనిపించుకొనగలవు. ఈ కళ, స్వదేశీ ఉద్యమం వచ్చి దానిని రక్షించేముందు చావడానికి సిద్ధంగా ఉంది. మచిలీపట్టణంలో కొంతమంది స్త్రీలు వారి శక్తి సామర్థ్యాలను ప్రదర్శించి నా కృతజ్ఞతకు పాత్రులైనారు. ఆ పర్ణకుటీరంలో ఆ దృశ్యం ఆత్మానందకంగా ఉంది. వారు పత్తిని శుభ్రంచేసి ఏకులు తయారుచేసి నూలు వడికినారు. ఆ రాట్నపు నాదం నాకు విశ్వ విలీనగానంవలె వినిపించింది.

ఇక ఆత్మానందదాయకాలైన ఆ విషయాలనుంచి నేనక్కడ కనుక్కొన్న ఆత్మవినాశకరాలైన విషయాలను గురించి చెప్పవలసి ఉంది. కాకినాడలో బహిరంగ సభను ముగించుకొని రాత్రి తొమ్మిది గంటలకు నేను బంగళా చేరేసరికి కొంతమంది స్త్రీలు, బాలికలు నన్ను చూడవలెనని వేచియున్నారు. లోపల దీపం మసకమసకగా వుంది. వారి చూపులు, వారి వైఖరులు నాకు కొంత వింతగా కనిపించినాయి. ఎందువల్లనో నా

మామూలు ప్రకారం "మీరు వడుకగలరా? తిలక్ స్వరాజ్యనిధికి మీరు ఏమి ఇస్తారు? అనే మాటలు నా నోటినుంచి వెలువడలేదు. పైగా నా గృహ యజమానిని ఈ స్త్రీలు ఎవరని అడిగినాను. ఆయనకు తెలియలేదు. విచారించగా వారు సందేహిస్తూ "మేము బోగంవాండ్ల"మన్నారు. నేను పాతాళంలోకి పోతూన్నట్లు తోచింది నాకు. మా గృహ యజమాని ఆ స్త్రీలు తమ వృత్తిని ప్రారంభించే ముందు ఒక కర్మకాండ జరుగుతుందని నాతో చెప్పి నన్నోదార్చడానికి ప్రయత్నించినాడు. ఆ మాట నాకు మరింత దారుణంగా కనిపించింది. ఆ కర్మకాండ ఒక దుర్వృత్తికి గౌరవాన్ని ఆపాదిస్తున్నట్లు తోచింది. నేను గుచ్చి గుచ్చి ప్రశ్నించినాను. వారు నాదర్శనం కోసం వచ్చామని సవినయంగా అన్నారు. "మీ రింకొక వృత్తిని అవలంబిస్తారా?' అన్నాను. 'ఆ' 'అందువల్ల మాకు జీవనం గడిస్తే సరి' అన్నారు. ఇంక ఆ విషయాన్ని గురించి అప్పుడక్కడ ప్రస్తావించి ముగించడానికి నాకు గుండె లేకపోయింది. నా పురుషత్వం గురించి సిగ్గుపడినాను. మరునాడుదయం రాజమహేంద్రవరంలో ఈ విషయాన్ని గురించి మనసు విప్పి మాట్లాడినాను. ఆంధ్రలోనాకు కలిగిన అత్యంత బాధాకరమైన అనుభవమిది. ఈ పాపం ఏదో ఒక రూపంలో భారతదేశమంతటా ఉన్నదనే ఊహ. మనం ఆత్మ పరిశుద్ధతద్వారా స్వరాజ్యం సంపాదించదలచినట్లయితే స్త్రీలను మన భోగ లాలసత్వానికి ఆహుతి చేయకూడదని నా నిశ్చయము. అబలులను రక్షించవలెననే ధర్మసూత్రం ఈ సందర్భంలో మరింత అద్భుతంగా వర్తిస్తుంది. గోసంరక్షణ అని నేను చెప్పినప్పుడు స్త్రీల శీల సంరక్షణ కూడ అందులో ఇమిడి ఉన్నదని అందరూ అర్థం చేసుకోవలె. మనం మన తల్లులను, తోబుట్టువులను, కుమార్తెలను ఎట్లా గౌరవిస్తున్నామో అట్లాగే అందరు స్త్రీలను గౌరవించటం నేర్చుకోనట్లయితే ఇండియాను మనం పునరుజ్జీవింపచేయలేము. మనలోని మానవత్వాని చంపి మనలను పశువులుగా తయారు చేస్తూండిన పాపాలనుంచి మనం విముక్తులం కావలె.

మరికొన్ని సంతోషకరాలైన విషయాలు : నేను మచిలీపట్టణం సందర్శించినపుడు నాకళ్ళనుంచి సంతోషాశ్రువులు జాలువారినాయి. అది నా మౌనపు రోజు. నేను మచిలీపట్టణం చేరగానే చప్పుడూ, సందడీ, ప్రదర్శనలు లేకుండా నన్ను స్వేచ్ఛగా ఉండనీయవలసిందని డాక్టరు పట్టాభిసీతారామయ్యను నేను కోరినాను. అందువల్ల వారు ముందుగానే ప్రజల కాసంగతి తెలియజేసినారు. నేను బందరు చేరేసరికి తెల్లవారుతూ ఉన్నది. వీధులు చక్కగా అలంకరించబడిఉన్నాయి. జనం బారులు తీరి నిలబడినారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఎవరి స్థలాలలో వారు నిశ్శబ్దంగా నిలబడి ఉన్నారు. నేను జాతీయ కళాశాల ఆవరణలోకి చేరేసరికి వేణునాద సమన్వితమైన మనోహర సారంగీ వాయిద్యం ఒక ఉపనిషద్గీతంతో నాన్నాహ్వానించింది. అంతకు తప్ప వేరే శబ్దం లేదు. వారు నా పట్ల చూపిన కుసుమ కోమలమైన ఆ ప్రేమకు నేను ముగ్ధుడనైనాను. ఆ ప్రజలు కనపరిచిన క్రమశిక్షణకు నా హృదయ వీణ ప్రతినినదించించి. వారి దేశభక్తియుత భావాలకు అనుగుణంగా వారు ప్రవర్తించినారు. దైవం నాకీ దృశ్యం అనుగ్రహించినందుకు ఆయనను హర్ష మూక్తాశ్రువులతో అభిషేకించినాను.

నన్ను నామ మాత్రమైన పర్ణకుటికి కాక అక్షరాలా నిజమైన పర్ణకుటికి తీసుకువెళ్ళినారు. నేను వారి పద్ధతిని, వారి కళలను వారి పరిశ్రమలను చూసి కళాశాలోపాధ్యాయులను పరిపాలకులను అభినందించవలసి ఉన్నప్పటికీ కళాశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్తిగా తమ యావత్కాలాన్ని నూలు వడికేటందుకు, నేసేటందుకూ శ్రద్ధచూపినట్లయితే జాతీయ పరిపూర్ణత వహించినట్లు కాదని వారికి నేను చెప్పక తప్పేదికాదు. నేనీ సిద్ధాంతాన్ని విపులీకరిస్తూండగా శ్రీ ముట్నూరి కృష్ణారావు నన్ను శ్రద్ధగా వింటూ అప్పుడప్పుడు చర్చలలో పాల్గొంటున్నారు. కొంత సేపు ఇట్లా ఉన్నట్లేవుండి ఆయన "అయితే మీరు నూలు వడకడాన్ని ఒక యజ్ఞంగా భావిస్తున్నారన్నమాట" అన్నారు. అప్పుడాయన కళ్ళలో ఆధ్యాత్మిక జ్యోతి విద్యుల్లత మాదిరి ప్రకాశించింది. వెంటనే "మీరందించిన ఈ భావానికి నేను చాలా కృతజ్ఞుడను" అన్నాను. అప్పటి నుంచి నూలు వడికే సందర్భం వచ్చినప్పుడంతానేనీ ప్రయోగం (సూత్రయజ్ఞం) చేస్తూనే ఉన్నాను. నూలు వడకటం జాతీయ పరిశుద్ధతకూ, బలానికీ, అభ్యుదయానికీ కన్నులకు ప్రత్యక్షంగా కనిపించే పవిత్ర చిహ్నము. ఇది అందరూ – హిందువులు, ముస్లింలు, క్రిష్టియన్‌లు, పార్శీలు విధిగా నిర్వర్తించవలసిన ధర్మము. ఆంధ్రజాతీయ కళాశాల, ఆంధ్రులు న్యాయంగా గర్వించదగిన పురాతన సంస్థ. ఇది 1907లో బెంగాల్‌లోని రాజకీయ చైతన్యానికి అనుగుణంగా ఉద్భవించిన సంస్థ. ఇది అనేక తుపానులను తట్టుకొని నిల్వగలిగింది. నేటి నూతన చైతన్యం నుంచి ఇది మరింత పరిశుద్ధంగా, మరింత బలంగా వర్ధిల్లగలదని ఆశిస్తున్నాను. నేటి జాతీయతత్త్వానికి అనుగుణంగా అతి పవిత్రమైన కార్యకలాపాలను దేశమంతటా ప్రసరింపజేస్తూ స్వాతంత్ర్యోద్యమానికి కేంద్రంగా ఉండదగిన శక్తి ఈ సంస్థకు ఉందని నేను నిశ్చయంగా చెప్పగలను. ఆంధ్రదేశంలోని నిమ్నజాత్యోద్ధరణకు, కంకణం కట్టుకొన్న ఉత్తేజకరుడైన సంఘ సంస్కర్త ఒకరున్నారు. ఆయన గూడూరు రామచంద్రరావు. ఆయన బ్రాహ్మణుడు. పవిత్రమైన ఆయన ఆత్మ అస్పృశ్యతా పాపాన్ని సహించలేకపోయింది. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వారికి ఆయన నిరంతరం సేవ చేస్తున్నాడు. తన పెరయా సోదరుని దాస్యాన్ని సహించలేక అతనిని హిందువులతో సహాయ నిరాకరణాన్ని అవలంబించవలసిందని సంతోష పూర్వకంగా సలహాఇస్తున్నాడు. నేను కూడా ఆ దళితవర్గాలపట్ల ఉద్రేకం గానూ వున్నాను. పంచములలోని స్వార్థత్యాగియైన పవిత్రాత్ముడు లభించేటంతవరకు "కులీనుల" పట్ల అసహాయోద్యమం ప్రారంభించకూడదని నే నాయనను మందలించినాను. ఎందువల్ల నంటే సహాయ నిరాకరణకు ఆత్మపరిశుద్ధత, స్వయం సహాయము, స్వయంశక్తి అవసరాలు. అప్పుడే సహాయ నిరాకరణం సరియైన వారి సహకారం పొందగలదు.

ఆంధ్రులు నన్ను సమ్మోహితుని చేసినారు. బీహారు రాష్ట్రం చాలా కాలంనుంచి నాకు అభిమాన పాత్రమైనది. అసహాయోద్యమం పుట్టక ముందు నుంచి బీహారును గురించి నాకు విశ్వాసం కలిగింది. ఆంధ్రదేశం బీహారుతో పోటీచేయలేక పోయినా బీహారు తరువాత రెండోదిగా నిలిచి తీరుతుంది. ఆంధ్రదేశంలో తనను గురించి తాను ఆలోచించుకొనని నాయకుడున్నాడు. కష్టపడి పనిచేసే కార్యకర్తలు కూడా ఉన్నారు. తగిన శక్తి సంపదలున్నాయి. అక్కడ కవిత్వమున్నది, ధర్మమున్నది, త్యాగ బుద్ధి ఉన్నది. జాతీయ పాఠశాలలు చాలా ఉన్నాయి. చాలా మంది లాయర్లు ఉద్యమంలోకి వచ్చినారు. నూలు వడకడానికి, నేయడానికి మంచి పత్తి పండించడానికి కావలసినన్ని అవకాశాలున్నాయి. భూదేవిని సస్యశ్యామలంగా చేయడానికి బ్రహ్మాండమైన నదులు రెండున్నాయి. ఆంధ్రదేశంలో కొన్ని భాగాలు ఒకప్పుడు చాలా ప్రసిద్ధి వహించినాయి. ఆ

రాష్ట్రం తేలికగా నాయకత్వం వహించగలదు. లేదా కనీసం బీహారుతో పోటీ చేయగలదు. ప్రభుత్వం వారి చండ శాసనంప్రారంభమైనప్పుడు పెద్ద రాష్ట్రాలుగా పరిగణించబడేవి తాళలేక పోయినప్పటికీ బీహారు, ఆంధ్ర రాష్ట్రాలు మాత్రం పరిస్థితిని కాపాడగలవని నా నిశ్చితాభిప్రాయం. ఈ రెండూ ఆత్మ బలంలో సిక్కులను సైతం ఓడించగలవని నా నమ్మకము. నా అంచనా తప్పుకావచ్చు. మన మందరం తక్కిన వారికంటె మిన్నగా ఉండవలెనని ప్రయత్నించవలసి ఉంటుంది. ఈ పందెంలో పోటీ ఉత్తమమే కాదు కర్తవ్యం కూడ.

రెండు చక్కని గ్రామాలలో వాటి నాయకుడు తప్పని సరిగా శాసనోల్లంఘన ప్రయోగాలను చేయవలసి వచ్చిన పరిస్థితిని గురించి మరొక్కప్పుడు వ్రాయగలను. నెల్లూరులో హిందూ ముస్లిం సమస్యను గురించి ఇంకొక పర్యాయం వ్రాస్తాను.

శ్రీ దిగుమర్తి హనుమంతరావు ఆయన సహచరులు నడుపుతున్న వడుకునూలు, చేనేత ఆశ్రమానికి దగ్గరగా ఉన్న ఒక గ్రామంలో జరిగిన సంఘటనను గురించి కృతజ్ఞత తెలుపుతూ ఇక నీ విషయం ముగించదలచుకొన్నాను. ఆ గ్రామంలోని బ్రాహ్మణుడు నా పంచమ సహచరులతో కలసి నన్నా గ్రామానికి రావలసిందని ఆహ్వానించినారు. నేను నా పంచమ సోదరులతో ఆ గ్రామం వెళ్ళినాను. ఆ గ్రామంలోని ఆ బ్రాహ్మణ వీధిలో అంతకు పూర్వం పంచము లెవ్వరూ నడిచి ఎరుగరు".

యంగ్ ఇండియా
13.04.1921

ఆంధ్రలో అవకాశాలు

ఆంధ్రదేశానికి అంతులేనన్ని అవకాశాలున్నాయి. అక్కడ వీర్యవంతులైన మనుషులున్నారు. ఆంధ్రస్త్రీలను దక్షిణాఫ్రికాలో సైతం నేనెరుగుదును. వారు శక్తికలవారు, కష్టపడి పనిచేసేవారు. మీకు (ఆంధ్రులకు) వుండకూడనంత ఔదార్యం ఉంది. మిమ్ములను సరిగా నడిపించే వారుంటే మీరు ఎంతటి ఆశ్చర్యకరాలయిన త్యాగాలనైనా చేయగలరు. ప్రశ్నించడానికి వీలులేని ధైర్యం మీది. కాని దురదృష్టవశాత్తు జాతికి ఎంతో మంచి సేవ చేయతగిన పరిస్థితిలో ఉన్నవారు సేవచేయడంకంటె నాయకత్వం వహించడానికి ఎక్కువ అతురత చూపిస్తున్నారు. విమర్శ అవసరమైన చోట్ల విమర్శించడానికి జంకుతున్నారు. సందేహిస్తున్నారు. ప్రతి తప్పును ఏదో ఒక విధంగా కప్పి పుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ మన సామాన్య జాతీయ దౌర్బల్యంలో మీరు కూడా భాగస్వాములవుతున్నారు. ఈ క్రమ శిక్షణకు, పరీక్షణకు ఏర్పడిన ఈ సంవత్సర కాలంలో ఈ తప్పులను గురించి నేను మీకు తెలియజెప్పివాటిని మీరు మీ శక్తి కొద్దీ తొలగించుకోవలెనని ప్రబోధించకుంటే నేను మీ పట్ల అపచారం చేసినవాడనవుతాను.

యంగ్ ఇండియా
25.04.1929

పింగళి వెంకయ్య

భారతదేశానికి జాతీయజెండా... ఆంధ్ర జాతీయ కళాశాల సమర్పించినదే!

నేను 1911వ సంవత్సరములో బందరు ఆంధ్రజాతీయ కళాశాలలో పనిచేయుటకు వచ్చాను. అంతకు పూర్వము లాహోరులో శ్రీ లాలాహంసరాజ్‌గారి ఆధ్వర్యమున నడుపబడుచున్న శ్రీ దయానంద ఆంగ్లో వేదిక్ కాలేజీలో జపానుభాష అభ్యసిస్తు ఉండేవాణ్ణి. హంసరాజ్ గారు శ్రీ కోపల్లె హనుమంతరావుగారితో సమానమైన యోగ్యతగల మనిషి, అప్పటికి లాలాలజపతిరాయ్ బ్రతికి ఉన్నారు. వారి బలంవల్లనే దయానంద ఆంగ్లో వేదిక్ కాలేజి లాహోర్‌లో నడుస్తున్నది. బ్రిటిష్ ప్రభుత్వము బారి నుండి విముక్తి చెందుటకు చేసిన మహాప్రయత్నములో లాలా హంస రాజ్‌గారు జపాన్ భాషను తన సంస్థలో పిల్లలకు నేర్పించుట ఒకటి, తద్వారా జపాన్ దేశమునకు మన దేశస్థులు ఎక్కువగా పోవు ఉపాయము కల్గించవలెనని వారి ఊహ. ఆ రోజులలో జపాన్ రష్యాను ఓడించి ప్రపంచాన్ని ఊగించిన కారణంగా మన దేశం జపాన్‌తో సన్నిహిత సంబంధం ఏర్పరచుకోవలెనని దేశంలో చాలామంది యొక్క అభిలాషగా ఉండెడిది. కావుననే లాలాహంసరాజ్ గారు జపానునుండి గోటో అను గొప్ప పండితుని పిలిపించి వారిచే తమ కళాశాలలోని పిల్లలకు జపాన్ భాష బోధించు ఏర్పాట్లు చేసినారు. ప్రొఫెసర్ గోటో తాను జపానుభాష పిల్లలకు నేర్పుచూ సంస్కృతమును అభ్యసించసాగినారు. నేను గోటో గారివద్ద జపానుభాష చదువుట ప్రారంభించాను. ఆ భాష ఒక విధంగా నాకు ఆనందం కలుగజేసింది. మన భాషలోని క, చ, ట, ద, న, మ ఇల్లాంటి అక్షరములు ఆ భాషలోగూడ ఉండేవి. లిపి మాత్రం చైనావారి భాషవలె పుడకలు ప్రోగుచేసినట్లు ఉండేది.

1906లో కలకత్తాలో కాంగ్రెస్ మహాసభ జరిగెను. శ్రీ దాదాభాయి నౌరోజి దానికి అధ్యక్షతవహించెను. ఆ సభను చూడాలని నేను లాహోరు నుండి కలకత్తాకు వచ్చాను. ఆ సభకే కృష్ణాజిల్లాలో అగ్రగణ్య దేశాభిమానియగు మునగాలరాజా శ్రీ రాజానాయని రంగారావు బహద్దూరు వారు కూడ వచ్చారు. ఆయనతోపాటు ప్రస్తుతం సన్యాసిగా జీవించి ఉన్న మా పినతండ్రి గారయిన స్వామి నారాయణానందజీ గూడ వచ్చియున్నారు. రాజాగారు ఆ సభలలో నన్నుచూచి 'మీరు ఈ తరువాత ఏమిచేయతలచుకొన్నా'రని ప్రశ్నించారు. నేను "నా వద్ద ధనము లేకపోయిననూ కలకత్తానుండి అమెరికాకుపోయే ఏ స్టీమరుపైనైనా నావికుడుగాచేరి అమెరికా జేరి వ్యవసాయ శాస్త్రం చదువుటకు ప్రయత్నించుచున్నా'నని చెప్పితిని, అప్పుడు వారు కాయకష్టంతో ద్రవ్యార్జనచేసి అమెరికాలో చదువుకొనుట అత్యంత కష్టమనియు, తనతో కృష్ణాజిల్లాకు రావలసినదనియూ, కొలదికాలములోనే ద్రవ్య సహాయముచేసి అమెరికాకు పంపెదననియు, నన్ను పిలిచి ఈ జిల్లాకు తీసుకొని వచ్చారు. 1907, 8,9,10 ఈ నాలుగు సంవత్సరములునూ నేను వారి ఎస్టేటులో ఉండి, ఆ పరగణాలోని వ్యవసాయ

పద్ధతులు, భూమియొక్క స్వభావము పరిశీలించుచూ అమెరికా నుండి సన్నని నూలు వడకుటకు తగిన అనేక జాతుల ప్రత్తివిత్తనములను ఈ దేశమునకు తెప్పించి, ప్రత్తి పరిశోధనాలయమును ఒకటి ప్రారంభించితిని. ఇప్పుడు ప్రతివారికి తెలిసియున్న కంబోడియప్రత్తి ఆ వ్యవసాయ పరిశోధనాలయమునుండే బహిర్గతమయినది. ఇట్లు అచ్చట మేము చేయుచున్న పనియొక్క విలువను ఆంధ్ర జాతీయ కళాశాలవారు తెలుసుకొని నన్ను తమ కళాశాలలో చేరమని ప్రోత్సహించిరి. శ్రీ రాజాగారు ఈ కళాశాలకు అదివరకే పదివేల రూపాయలు విరాళము నిచ్చియుండిరి. రాజా గారికి కళాశాలయందు అభిమానమపారము. కావుననే నన్నుబందరు వెళ్ళి కళాశాలలో పనిచేయుమని ప్రోత్సహించిరి. నేనునూ కృష్ణాజిల్లా వాసుడనగుటచే (చల్లపల్లికి రెండు మైళ్ళ దూరములోనున్న యార్లగడ్డ మా నివాస స్థానము) కళాశాలలో పనిచేయుటకు సంతోషముతో అంగీకరించి 1911వ సంవత్సరములో అందు ప్రవేశించితిని. అప్పుడు శ్రీ కోపల్లె హనుమంతరావు గారు ప్రిన్సిపాల్‌గా ఉండిరి. వారు నాయందుచూపిన అభిమానము, ఇచ్చిన ప్రోత్సాహము ఈ జన్మకు మరువజాలను. కళాశాల ఆవరణలోనే రెండు ఎకరముల భూమిని బాగుచేసి బంగాళా దేశమునుండి కొన్ని పైర్లను తెప్పించి పరిశోధన ప్రారంభించితిని. ఈ పనిచేయుచూ, కళాశాలలో నాల్గవ ఫారంవరకు వ్యవసాయముగురించియూ, దేశచరిత్ర మొదలగు ఇతర విషయముల గూర్చియు పిల్లలకు బోధించుచుంటిని.

గాంధీ మహాత్ముడు కొన్ని సంవత్సరముల తర్వాత ప్రారంభించిన హరిజనోద్ధరణ అను విషయం మా హనుమంతరావుగారు 1911నాటికే అమలులో పెట్టినారు. కళాశాల గోడప్రక్కనే ఉన్న మాల పల్లెనుండి వచ్చిన 'లాటు' అను హరిజన వ్యక్తిచేతనే ఆయన తన దుస్తులను ఉతికి తెప్పించి ధరించుచుండెను. మాలపల్లెలో నుండి స్త్రీ పురుషులను విరివిగా కళాశాల పనులలోకి ఆకర్షించి జీవనాధారము కలిపించి కాపాడుచుండెను. హనుమంతరావుగారు శిష్టాచారసంపత్తిగల కుటుంబములోనివాడైననూ, హరిజనోద్ధరణపట్ల హృదయపూర్వకమైన ఆసక్తి కనపరచి తదనంతరము వచ్చు ఉద్యమములకు మార్గదర్శి అయ్యెను.

నన్ను దేశములో ఏ మూలనో పెరుగుచున్న పట్టుపురుగుల పెంపకము గురించి అనుభవజ్ఞానమును సంపాదించుటకు బెంగుళూరు, అలహాబాదు ప్రదర్శనములకు హనుమంతరావుగారు పంపిరి. మల్బేరియా ఆకులు, ఆముదపు ఆకులు వీటిపై పెరిగే రెండు జాతుల పట్టుపురుగులను 1912లో కళాశాలకు తెప్పించి వాటిని పెంచు మార్గములను పిల్లలకు బోధించితిని. ఆనాటికి మెకానికల్ ఇంజనీరింగు సెక్షన్ మంచి అభివృద్ధిలో నుండెను. దక్షిణాది నుండి వచ్చిన శాంతపురుషుడు శ్రీ గురు పాండ్యంపిళ్లె ఇంజనీరింగు సెక్షను నడుపుచుండెను. ఈ సెక్షన్‌లో తయారయిన విద్యార్థులు ఒరిస్సా మొదలు మదరాసు వరకును ఉద్యోగములు సంపాదించి దేశమునకు ఎంతోతోడ్పడిరి.

అన్నిటికంటె ముఖ్యముగా ఇంజన్లతో నీళ్లుతోడి వ్యవసాయమునకు ఉపయోగించు విషయములో కళాశాల ఎక్కువ శ్రద్ధ వహించెను. అందువల్లనే చవిటి పఱ్ఱలుగా, ఊసర క్షేత్రములుగా ఉన్న బందరువద్ద గుండు పాలెం, మల్లవోలు మొదలగు గ్రామములోని వందలాది ఎకరములు సారవంతములై ఎకరమునకు పుట్లు పండసాగెను. ఇట్టి నీటియంత్రముయొక్క విస్తరణకు ఈ కళాశాలయే ముఖ్యస్థానమై విరాజిల్లినది. ఈ ఇంజనీరింగు శాఖకు చెంది దేశ ప్రఖ్యాతిగాంచిన పురుషులు శ్రీ గంగిరెడ్ల కృష్ణమూర్తి గారు. వీరు సజీవులై ఉన్నారు.

కళాశాల ఆంధ్రదేశములోనిదైననూ మదరాసు రాష్ట్రములో ప్రసిద్ధి చెందిన పురుషులెందరో భూరివిరాళములిచ్చిరి. దక్షిణాది ఉత్తరాది భేదములు ఎంతమాత్రము ఆ దినములలో లేకుండెను. సర్ శంకరన్ నాయర్ మొదలయిన ప్రఖ్యాత పురుషులందరునూ ఈ కళాశాలయందు అభిమానమును చూపినవారే. బిపిన్ చంద్రపాల్ గారు 1908లో బందరు వచ్చినప్పుడు ఇట్టి కళాశాల స్థాపించుట అత్యవసరమని తలచి ప్రోత్సాహబీజమును నాటిపోయిరి. తదాది సరోజినీదేవి, ఆమె భర్త శ్రీ ముత్యాల గోవింద రాజులు నాయుడు, మహాత్మాగాంధీ, అనిబిసెంటు మొదలగు మహానుభావులెందరో ఈ కళాశాల ఆహ్వానముమీద బందరు వచ్చి కృష్ణాజిల్లానే పవిత్రము చేసిరి.

ఈ కళాశాలలో పనిచేయుచున్న దినములలోనే శ్రీ కోపల్లె హనుమంతరావుగారి ప్రోత్సాహమువల్ల 1916వ సంవత్సరములోనే నేను భరతదేశమునకు ప్రత్యేక జాతీయ పతాకావశ్యకతను గూర్చి ఒక గ్రంథమును వ్రాసి యుంటిని. ఇంగ్లీషులో దీని పేరు. "National Flag for India" దీనికి కళాశాలయందు ఎక్కువ అభిమానము చూపిన శ్రీ బయ్యా నరసింహేశ్వర శర్మగారు ఉపోద్ఘాతము వ్రాసియుండిరి. మహాత్మాగాంధీగారు బెజవాడకు వచ్చినపుడు వారితో ఈ జాతీయ పతాక విషయమై సంపూర్ణముగా చర్చలు జరిపితిని. అప్పటికి భారతదేశమునకు జాతీయ పతాకమనునదే లేదు. అప్పుడు మహాత్మాగాంధీగారు జాతీయపతాక నమూనా ఒకటి వెంటనే తయారుచేసి ఇవ్వవలసినదని బెజవాడ ఆలిండియా కాంగ్రెస్‌కమిటి మీటింగులో నన్నుకోరిరి. కొన్ని గంటల సేపులో ఆంధ్రజాతీయ కళాశాల చిత్రలేఖనాచార్యులయిన శ్రీ ఈరంకి వెంకటశాస్త్రిగారి సహాయముతో రంగులు వేయించి, "త్రివర్ణ పతాకమును" తయారు చేయించి మహాత్మాగాంధీగారికి సమర్పించితిని. ఇప్పటి జాతీయ పతాకముపై నున్న మూడురంగులునూ, ఆ నాడు నమూనా పతాకముపై మేము చిత్రించినవే. రాబోవు మరియొక కమిటీ మీటింగులో మా అభిప్రాయమును ప్రవేశపెట్టి చర్చించెదమని గాంధీగారు సెలవిచ్చిరి. పతాక మధ్యమందు ఏ చిహ్నము వేయవలెనని గాంధీగారు ఆలోచనలోపెట్టగా నేను తామర పుష్పమును ఉంచవలసినదిగా కోరియుంటిని. కాని గాంధీగారు మరి కొందరి సలహాతో ఖద్దరు ఉద్యమమునకు చిహ్నముగా రాట్నమును మూడు రంగుల జండాపై నుంచవలయునని నిర్ణయమునకు వచ్చిరి. ఆ జెండాయే కాంగ్రెస్ జెండాగా ప్రఖ్యాతి నార్జించి కొలది మార్పుతో నేటి జాతీయ జెండాగా నిలచియున్నది. ఇప్పటి జాతీయ జెండా నేను మొదట చెప్పిన మూడు రంగులతోనే ఉండి వాటిపై అశోకచక్రముతో విరాజిల్లుతున్నది. ఈ విధముగా ఆనాడు భారత జాతీయ కాంగ్రెస్‌కు, ఈనాడు భారత జాతికి జాతీయ జెండాను సమర్పించినది మన ఆంధ్ర జాతీయ కళాశాల అని మనమెల్లరునూ గర్వించవచ్చును. ఈ విషయము శ్రీ కొండా వేంకటప్పయ్య పంతులుగారు, డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య పంతులుగారు, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు మొదలగు వారందరకు తెలిసినదే.

కళాశాల స్థాపకులు శ్రీ కోపల్లె హనుమంతరావుగారు మా దివి తాలూకాలో మొదటి ఎం.ఏ. పట్టభద్రుడు. వృక్ష శాస్త్రములో ఆ పట్టమును పొందినవారు బహు అరుదు. కావుననే పరీక్షలో ఉత్తీర్ణులయిన కొలది దినములలోనే వారిని ఉదకమండలములో "Assistant Conservator of Forests"గా ప్రభుత్వమువారు నియమించిరి. అప్పటిలో ప్రభుత్వ ఉద్యోగమున్న ఎంతో గౌరవము ఉన్నప్పటికీ దేశసేవ చేయవలయునను పవిత్ర తలంపుతో హనుమంతరావుగారు ఆ పదవిని నిరాకరించి స్వార్థమన నేమో ఎరుగక అహర్నిశలు కళాశాల పురోభివృద్ధికై తపస్సుచేసి తన సర్వస్వమును దానికై ధారవోసినవారు మా హనుమంతరావు గారు.

కళాశాలలో పనిచేసిన వారిలో ప్రముఖ వ్యక్తులలో శ్రీ "ఆంధ్రరత్న" దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారొకరు. ఆయన బహు విచిత్రవ్యక్తి. నిరాడంబరజీవి. బహుముఖ ప్రజ్ఞాదురంధరుడు. చిత్రవిచిత్ర వేషధారణ చేయువాడు. పాఠములు చెప్పుటకు ఒకరోజు తురకవేషములోనూ, మరొక రోజు అవధాన్లుగారి వేషములోనూ వచ్చి అందరనూ ఆశ్చర్యానందములలో ముంచెడివాడు. ఏ శాస్త్ర మాయన బోధించిననూ, దానిద్వారా భారతదేశములో బ్రిటిష్ ప్రభుత్వమును ఏ విధముగా పడగొట్టవలయునో నూరిపోసెడివాడు. నిజంచెప్పాలంటే అసలు జాతీయ కళాశాల ప్రారంభ ప్రయోజనమే స్వాతంత్ర్యోద్యమ పురోభివృద్ధి అని గట్టిగా చెప్పవచ్చును. ఇచట ఏపని చేసిననూ అది స్వాతంత్ర్యోద్యమమును బలపరచునదిగా ఉండవలయునని నిర్వాహకులు ఆశించెడివారు. కావుననే 1910లో గుఱ్ఱపుస్వారి, శరీర వ్యాయామము మొదలగునవి విద్యార్థులకు నిర్బంధ విద్యగా ప్రవేశపెట్టిరి. నాకు కొంత ధనసహాయము చేసి తిరుచునాపల్లిలోని మిలిటరీ ట్రయినింగ్‌లో శిక్షణ పొందుటకుగాను కళాశాలవారు పంపినారు. అచ్చట పొందిన శిక్షణతో నేను తిరిగి వచ్చి దేశస్వాతంత్ర్య సంగ్రామసైనికులకు శిక్షణ ఇవ్వవలెనని వారానాడు ఆశించినారు.

నేనచట శిక్షణ పొందుచుండగా నా భార్యాపిల్లలు పోషణభారముగూడ వారే భరించినారు. అంతేగాక చైనా దేశములో విప్లవమును జయప్రదము గావించిన సన్‌యట్‌సేన్ జీవితమును తెనుగున రచించవలసినదిగా నన్ను ప్రోత్సహించినారు. ఆ పుస్తకమును చదివి భారత స్వాతంత్ర్య పిపాసులెల్లరు సన్‌యట్‌సెన్ పద్ధతులపై స్వాతంత్ర్య పోరాటమును నడువు అర్హత కలుగచేయుటకే ఈ పుస్తకరచన ఉద్దేశింపబడినది. ఈ పై వివరములనుండి మనకు భారత స్వాతంత్ర్య పోరాటములో ఆంధ్ర జాతీయ కళాశాల తీసుకున్న ప్రముఖ స్థానము వెల్లడికాగలదు. నిజమునకు ఆనాటి బ్రిటిష్ పాలకులు కళాశాల పైనను, అందలి అధ్యాపకుల, విద్యార్థులపైననూ ఎప్పుడూ ఒకకన్ను వేసియే యుండెడివారు.

నిజముగా ఆంధ్రజాతీయ కళాశాల పేరుకు ఆంధ్రుల దైననూ దేశము నలుమూలలనుండి ఉపాధ్యాయులను, విద్యార్థులను ఆకర్షించినది. పండిత హృషీకేశశర్మగారు గాంధీజీ పనుపున ఇచ్చటకువచ్చి హిందీబోధన చేసెడివారు. శ్రీ పళని వేణుపిళ్లె దక్షిణ దేశమునుండి వచ్చి గణితశాస్త్రము బోధించెడివారు. మహారాష్ట్ర బ్రాహ్మణుడైన శ్రీ పింగళి కృష్ణరావు ఇంజనీరింగు సెక్షన్‌లో పనిచేసెడివారు. ఈ విధముగా జాతి, మత భేదములు లేకుండా అన్నిచోట్లనుండి వచ్చిన ప్రముఖులెందరో ఇచట పనిచేయుచుండుట గమనార్హము. ఇట్టి పవిత్ర సంస్థను స్థాపించి కట్టుదిట్టముగా నడపిన శ్రీ కోపల్లె హనుమంతరావు గారు కడు విశాల హృదయులు. గర్వమననేమో ఎరుగక సంస్థకొఱకై ఏపనినైననూ చేయ సంకల్పింతురనుటకు ఈ క్రింది ఉదాహరణ నీయవచ్చును. 1920 ప్రాంతములో హైదరాబాదు ప్రాంతమున ప్లేగువ్యాధి విజృంభించెను. ఆ కారణముగా పరిటాలా జాగిర్దార్ ఆయన నవాబు ఖాన్ ఖాన్ బహదూర్ గారి కుమారుడు బందరుకోటకు వచ్చి అచట తాత్కాలిక నివాసము నేర్పరచుకొనిరి. విరాళముల నొసంగు ధనవంతులు ఎచటనైనా ఉన్నారని వినినంతనే పరుగిడు హనుమంతరావు గారు ఈ విషయము తెలుసుకొని నన్ను వెంటపెట్టుకొని వారి దర్శనమునకై పోయిరి. నేను ముందుగా లోపలికేగి ఆ జాగిర్దారు గారితో హనుమంతరావు గారి విద్యా సంస్కారము, హోదా, ఉర్దుభాషలో తెలియపరచినప్పటికిని, లోపలకువచ్చిన హనుమంతరావుగారిని కూర్చొనమని అయిన ఆయన మర్యాద చేయలేదు. దాదాపు అరంగటసేపు నిలబడే హనుమంతరావుగారు కళాశాలలో జరుగు కార్యక్రమమును ఆయనకు తెలియపర్చి, వచ్చి స్వయముగా కళాశాల చూడవలసినదిగా ఆహ్వానించిరి. బయటకురాగానే జాగిర్దార్‌గారి ప్రవర్తనపట్ల నేను నిరసన తెలుపగా "ఇట్లయిన మనపని సాగినట్లే, కళాశాల కొఱకు ఇట్లెన్నయిన సహించవలె"నని నవ్వుచూ హనుమంతరావుగారు సమాధానమిచ్చిరి. అట్టి దేశసేవాపరాయణుని, నిస్వార్థ సేవకుని, ఉదారచరితునిచే ప్రారంభింపబడిన ఈ కళాశాల, చిలువలుపలవలుగా పెరిగి దేశమున నఖండఖ్యాతి నార్జించవలెనని ఆశీర్వదించుచున్నాను.

(ఆంధ్ర జాతీయ కళాశాల స్వర్ణోత్సవ సంచిక)

డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య

కాంగ్రెసు ఉద్యమము

ఆంధ్రదేశమునకును కాంగ్రెసునకును గల సంబంధము మొదటి నుండియు సన్నిహితమైనది, గాఢమైనది. కాని కాంగ్రెసు పుట్టినప్పుడు, అనగా 55 ఏండ్ల క్రిందట, ఆంధ్ర దేశమునకు ప్రత్యేక వ్యక్తిత్వము ఏర్పడివుండి వుండలేదు. 1911 సంవత్సరము వరకు, ప్రత్యేక వ్యక్తిత్వము వుండవలెనన్న కోరిక ఆంధ్రులకు ఉదయించినట్లే కనిపించదు. కానీ, తత్పూర్వము బొంబాయి నుంచి, 1908 సం॥లో కీ.శే. నాగేశ్వరరావు పంతులుగారు 'ఆంధ్రపత్రిక' అను పేర వారపత్రికను బందరులో రాజకీయేతర విషయములకు సంబంధించిన 'ఆంధ్ర మహాసభ' 1908 సం॥ ఏప్రెలులో జరుగుటయు, ఆ ప్రాంతములనే గుంటూరులో 'ఆంధ్ర' అను పత్రిక, కీ.శే. జొన్నవిత్తుల గురునాథం గారి యాజమాన్యమున జరుపబడి యుండుటయు మున్నగు విషయములనుబట్టి చూడగా, లోలోన ఈవిత్తనము మొలకెత్తి యున్నదనియే చెప్పవచ్చును. అయితే, కొబ్బరి విత్తనపు కాయ కొన్నాళ్ళు నూతిలో తడిసి నాని, కొన్ని మాసములు భూమిలో క్రుళ్ళిన పిమ్మటనే మొక్క మొలిచినట్లు, 'ఆంధ్రోద్యమ' బీజము గూడా 1908 మొదలు 1911 వరకు లోలోన పక్వమై క్రమముగా వృద్ధిపొందినది. 1911వ సంవత్సరము డిసెంబరు మాసములో హార్డింజ్ ప్రభువు బెంగాలు విభజనము రద్దుచేసి, బీహారు రాష్ట్రమును భాషా ప్రయుక్తరాష్ట్ర సిద్ధాంతము మీద విడదీసి, రాజధాని స్వాతంత్ర్య నూతన శకము నొక దానిని స్థాపించెను. 1917 సం॥ ఆగస్టు మాసమున ఈ సంగతులను పొందుపరచుచు కలకత్తాలో వ్రాసిన ప్రకటన ప్రకటించినమీదటనే, ఆంధ్రుల మనమున తమకు ప్రత్యేక రాష్ట్రము కావలెనని గాఢమయిన కోరిక ఉదయించెను. 1913 సం॥లో మొదటి ఆంధ్ర మహాసభ జరిగినది. 1916 సం॥లో కాకినాడలో జరిగిన నాల్గవ ఆంధ్ర మహాసభలో గావింపబడిన తీర్మానానుసరణముగా, ఆంధ్రులకు మున్ముందుగా ప్రత్యేక కాంగ్రెస్ రాష్ట్రము కావలసినదనే కోరిక ననుసరించి, 1917 సం॥ డిసెంబరులో బిసెంటమ్మగారి అధ్యక్షత క్రింద కలకత్తాలో జరిగిన కాంగ్రెసునందు, ఆంధ్రులను దాక్షిణాత్యులనుండి విడదీసి, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘమనే సంస్థను వేరుచేసిరి. అప్పటినుండి ఆంధ్రుల వ్యక్తిత్వము కాంగ్రెస్‌లో బయటపడెను. అంతవరకు మనలను, దక్షిణాదివారిని, మళయాళీలను, కన్నడులను కలపి మద్రాసీలని కాంగ్రెసులో పిలవటము వాడుక. ఇప్పటికీ ఆ వాడుక కొంత నిలచియే యున్నది. కావున ఆంధ్రులు కాంగ్రెస్ కార్యములలో ఎంత జోక్యము కలిగించుకొని యుండినది వ్యక్తి రూపముగా కొన్ని పేర్లకు మాత్రమే ప్రాముఖ్యము నిచ్చుచు చెప్పగలమే కాని, ఆంధ్రదేశమునంతకును ఇట్టి సంబంధము వుండెనని చెప్పుటకు వీలులేదు.

కాంగ్రెస్ సంస్థ స్థాపించబడిన తర్వాత 1885 సం॥లో జరిగిన కాంగ్రెస్‌లో గౌరవార్హులైన పి.

రంగయ్యనాయుడు గారు ఒక ప్రతినిధిగా వుండివుండుట మన మెరుగుదము. అప్పటి సమావేశమునగల 72గురిలో ఒకడైనా ఆంధ్రుడు ఉండెనని వినుటకు ఎంతయు సంతోషముగా ఉన్నది. పిమ్మట అదివరకే రాజకీయవ్యవహారములలో పాల్గొనుచు పనిచేయుచున్న కీ.శే. న్యాపతి సుబ్బారావు పంతులుగారు 'హిందూ' పత్రిక స్థాపకులైన నల్గురు ఆదిపురుషులలో ఒకరైవుండి, కాంగ్రెసునందు ఉత్సాహముగా పనిచేయుచు, రానురాను ఇటుప్రక్క చెన్నపురి శాసనసభలోను అప్పుడు కలకత్తాలోవున్న కేంద్ర శాసనసభలోను సభ్యులుగావుండి, మిక్కుటముగ దేశసేవను గావించియుండిరి. వారికి పూర్వులు ఆనందాచార్యులుగారు. వారు పట్టణములో హైకోర్టు వకీలుగావుండి పేరు ప్రతిష్ఠలు, సిరిసంపదలు సంపాదించి, ప్రథమ కాంగ్రెస్ సభయందు బొంబాయిలో హాజరయిరి. 1891వ సంవత్సరమున నాగపూరులో జరిగిన ఏడవ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షులై గంభీరోపన్యాసము ఒసగి, ఆంధ్రదేశమునకును దక్షిణ భారతమునకును శాశ్వత గౌరవాన్ని కలుగజేసిరి. వీరు, ఇరవై సంవత్సరములు రాజకీయ ప్రపంచములో దక్షిణ దిశయందు ప్రకాశవంతముగా మెరసిన నక్షత్రము! సైనిక వాలంటీర్లను గూర్చి ముచ్చటించుచు నాగపూరు కాంగ్రెసులో వీరు ఈ విధముగా నుడివిరి. "మనలను సైనికులనుండి (Recruitment) తగ్గించారు. ఇతర స్థానములనుండి పిలిపించుచున్న ఆంగ్లేయులు, నీగ్రోలు, ఆర్మనియనులు, పశ్చిమాఫ్రికా మ్యొలటోలు, నామరూపములులేని ఇతరులు, కలకత్తా మురికి కాలవలలో నివసించే జనులు – వీరందరు వాలంటీర్లుగ వుండుటకు అర్హులు. వారు మన యోధులు. వారు మన యిండ్లను, సంసారములను రక్షించు భటులు. ఇట్టి విభేదములు గావించుట ఎంతయు హేయము! మనము జరుపు శాస్త్రీయమైన సంక్షోభమువలన ఇవన్నియు తొలగిపోవలెను. బ్రిటిష్ శాసనమునకిది విరుద్ధము. అన్ని శాసనములకంటె ఉన్నతమైన శాసనము – ప్రకృతి శాసనమునకు – విరుద్ధము."

ఇంక న్యాపతి సుబ్బారావుగారిని గురించి రెండు ముక్కలు చెప్పవలసి యున్నది. సుబ్బారావుగారు, మన దేశ శాసన సభలలో ఎన్నిక సభ్యులను చేర్చుట ప్రారంభించిన 1893 సం॥ నాటినుంచి, ఉత్తర జిల్లాలనుండి మూడు సారులు అనగా ఆరు సంవత్సరములు, ఆంధ్రుల తరఫున ఉభయ సభలలో సభ్యులుగా వుంటూవుండి, అటుపిమ్మట కేంద్ర శాసనసభలో సభ్యులైరి. 1888 సం॥లో అలహాబాదులో జరిగిన నాల్గవ కాంగ్రెస్ మహాసభకు హాజరై, కాంగ్రెస్ వాదిగా వుండి, గంభీరోపన్యాసముల నొసగి, ఉప్పుపన్ను, జూడిషియల్ – ఎగ్జిక్యూటివుల విభజన, ఇండియనులను కార్యనిర్వాహక సభలలో సభ్యులుగా చేర్చుట, జూరీవలన విచారణ, వకీళ్ల యొక్క హక్కులు మొ॥ వాటిని గూర్చి కాంగ్రెస్ వేదికనుండి ఉపన్యసించుచుండిరి. కేంద్ర శాసన సభలో ఉన్నప్పుడు పబ్లిక్ సర్వీస్‌ను గురించి తీర్మానము ప్రతిపాదించి, ఏతత్ ఫలితముగ ఒక కమీషన్‌ను నియమింపజేసిరి. బాంకిపూర్ కాంగ్రెస్‌నందు, ఇట్టి రాయల్ కమీషన్‌ను నియమించినందుకు వందనము లొసగుచు వాక్రుచ్చిరి. వారు ఎట్టి బిరుదములను స్వీకరింపనంగీకరించలేదు. 1898 సం॥మున చెన్నపురిలో జరిగిన కాంగ్రెస్ మహాసభకు, ఆహ్వాన సంఘాధ్యక్షులుగ ఎన్నుకోబడిరి. 1914లో కాంగ్రెస్ జనరలు కార్యదర్శిగా నియమించబడి, 1915, 1916, 1917 సం॥లలో స్వంత ఖర్చు మీద యావత్ భారతమును సంచారముచేసి ప్రబోధము చేసిరి. చివరకు, 1917 డిసెంబరు మాసమున కలకత్తాలో జరిగిన సభలో వారిని తిర్గి జనరలు సెక్రెటరీగా ఎన్నుకొనుసరికి, దానిని గౌరవముగా తిరస్కరించిరి.

కాంగ్రెస్ యొక్క ఆదిపురుషులుగ చెప్పదగినవారిలో మరొకరు దివాన్‌బహదూర్ కేశపిళ్ళెగారు. వారున్ను సుబ్బారావు పంతులుగారితోపాటు, కాంగ్రెస్ జనరలు సెక్రటరీగ వుండి, 1918 సం॥ములో తమ పదవికి రాజీనామా యివ్వడము, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘమును విడదీయబడు తీర్మానము గావింపబడు –1917సం॥లో డిసెంబరు నెలలో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్‌లో – ఏక కాలము నందు సంభవించినవి. అప్పటివరకు మన ఆంధ్రుల నుండి పంతులుగారున్ను, మోచర్ల రామచంద్రరావు పంతులుగారున్ను, శ్రీ బి.యన్. శర్మగారు తప్ప, అఖిల భారత కాంగ్రెస్ సంఘ సభ్యులుగా ఉన్నవారు తక్కువ. బందరువాసి శ్రీ లింగరాజు వెంకటసుబ్బారాయుడుగారు మరణించిన పెద్దలలో నొకరని – మూడవ కాంగ్రెస్ మద్రాసులో జరిగినప్పుడు, తమ అధ్యక్ష ప్రసంగములో శ్రీ త్యాయబ్జీగారు చెప్పిరి.

ఇంక ఆంధ్రుల యొక్క సంబంధముగూర్చి తిరిగి చెప్పెదము. అంతవరకును గాఢముగా పనిచేసినటువంటి వారు కాంగ్రెసులో మరి ఇతరులునుగలరు. శ్రీ కె.వి. రెడ్డి నాయుడుగారు, సర్ ఏ.పి. పాత్రో గార్లు, బిసెంటమ్మ గారు "హోమురూలు" ఉద్యమము సాగించిన మీదట, మొదట నాయుడుగారు పిమ్మట పాత్రోగారు విడిపోయి "సౌత్ ఇండియన్ లిబరల్ ఫెడరేషన్" అనే పేరుగల జస్టిస్ పార్టీలో చేరిరి. రామచంద్రరావుగారు లిబరల్ పార్టీలో చేరిరి. వీరేకాక ఆకాలమునందు పనిచేసినవారు ఇంకను అనేకులు కలరు. గంజాం వేంకటరత్నం పంతులుగారు, సోమంచి బీమశంకరంగారు, శ్రీ కె. శ్రీనివాసరావుగారు, జంబులింగం మొదలియారుగారు మున్నగువారందరు తమతమ కాలములలో, తమతమ శక్తికొలది కాంగ్రెస్ సేవ చేయుచుండిరి. ముఖ్యముగా ఎన్నుకొనతగిన వారు నెమలికంటి సుబ్బారావుగారనే మహావ్యక్తి ఉండెనని చెప్పెదరు.

పూర్వము కాంగ్రెస్‌లో బాగా పనిచేయుచున్నటువంటి వారిని రాజకీయ పాలనయందు గొప్ప ఉద్యోగులుగా నియమించు ఆచార ముండెడిది. ఈ ప్రకారము కొందరు హైకోర్టు జడ్జీలు అయిరి. చంద్రావర్కరు, అషతోష చౌదరి మొదలైనవారు ఇందులకు ఉదాహరణములు. చెన్నపట్నములో జస్టిస్ సుబ్రహ్మణ్య అయ్యరుగారు కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడిన పిమ్మట, ఆ పదవి నలంకరించకముందే హైకోర్టు జడ్జీగ నియమింపబడిరి. 1909లో కృష్ణసామయ్యగారు హైకోర్టు జడ్జి అయి ఆ పదవినుండి, బొబ్బిలిరాజాగారు ఖాళీచేసిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యత్వమునకు, 1910 సం॥లో నియమింపబడిరి. వీరు ఎగ్జిక్యూటివ్ సభ్యులైనప్పుడు సుందరయ్యగారు జడ్జి పదవి పొందిరి. వీరందరు కాంగ్రెస్ వాదులే! ఇట్టి పారితోషికము ఆంధ్రులలో శర్మగారికి లభించినది. ఆ రోజులలో అనగా 1916, 1917 ప్రాంతములలో కాకినాడలో జరిగిన నాల్గవ ఆంధ్ర మహాసభ అయినతరువాత, కేంద్ర శాసన సభకు యిద్దరు సభ్యులను ఎన్నుకొనవలసియుండెను. అప్పటిలో ఎన్నికలు కాంగ్రెస్ పేరను జరుపబడక పోయినప్పటికీ, కాంగ్రెస్‌లో పనిచేసినటువంటివారికి ఎక్కువ ప్రశస్తి, అవకాశము వుండి వుండెను. తరువాత 1917లో కేంద్రశాసనసభకు శ్రీనివాస శాస్త్రులుగారు, బి.ఎన్. శర్మగారు ఎన్నుకొనబడిరి. 1920 సం॥లో గవర్నమెంటు ఆఫ్ ఇండియాలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిలరు పదవి ఖాళీ వచ్చినప్పుడు శర్మగారు నియమించబడిరి. వీరి నియామకమునకు గల చరిత్ర ఆకర్షణవంతమైనది. మొదట షెమ్స్‌ఫర్డు ప్రభువు బర్ద్వాన్‌ను

నియమించి అతని పేరు సెక్రటరీ ఆఫ్ స్టేట్సు అయిన మాంటేగ్యూ వద్దకు పంపగా, ఆయన ఆ పేరును తిరస్కరించి, శాసనసభా సభ్యులలో అనుభవము గలవారి నెవరినైనా నియమించవలసినదనియు, తనను సూచించమని శాస్త్రిగారి పేరు చెప్పెదననియు వ్రాసియుండిరి. షెమ్స్ఫర్డు ప్రభువుకు శ్రీనివాసశాస్త్రి గారిపేరు నచ్చలేదు. ఎందుచేతననగా 1919 సం॥ములో అమృతసరులో జరిగిన కాంగ్రెసునందు, షెమ్సుఫర్డును వైస్రాయి పదవి నుండి తొలగింపవలసినదను తీర్మానమును శ్రీనివాసశాస్త్రిగారిని ఉపపాదింపవలసినదిగా కోరిరి. కాని వారందుకు అంగీకరింపకపోయినా ప్రతిఘటించుటకు నిలవక ఆ సమయమున అమృతసరునుండి కలకత్తాలో జరుగుచున్న లిబరల్ ఫెడరేషన్ అనే నూతన సంస్థా సమావేశమునకు వెళ్ళియుండిరి. అప్పుడు శర్మగారు ఈ తీర్మానమును అమృతసరునందు ప్రతిఘటించిరి. మాంటేగ్యు గారి ఉత్తరము వచ్చినపిమ్మట షెమ్స్ఫర్డు, శ్రీనివాసశాస్త్రి గారి పేరు ఆక్షేపణీయమనియు, సకాలములో తమకు సహాయము చేయలేదనియు, అట్లు సహాయము చేసినవారు శర్మగారనియు, వారికి శాసనసభయొక్క అనుభవము చిరకాలమునుంచి గలదనియు, వారిని నియమించవలసినదనియు వ్రాసినారు. మాంటేగ్యువారి పేరును అంగీకరించి, శర్మగారిని గవర్నమెంటు ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా ఏర్పాటు చేసిరి.

1918వ సం॥లో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘము ప్రారంభించబడిన పిమ్మట, దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు – అందుకు మూడు సంవత్సరముల పూర్వమే తమ ప్లీడరీ పనిని మానుకొని – ఆంధ్రోద్యములో నడుముకట్టి పని చేయుచుండి, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘ అధ్యక్షులుగా ఉండి చిరకాలము ఈ సభను జయప్రదముగా నడపి, ఈ రోజువరకు కాంగ్రెస్ భక్తి పరులుగను, గాంధీమతావలంబకులై అహింసాతత్వ ప్రబోధకులుగాను పనిచేయుచున్నారు. వారికి కుడి భుజముగా వున్న గొల్లపూడి సీతారామశాస్త్రి గారు 1921వ సంవత్సరమునుండి, కాంగ్రెస్‌లో కార్యదర్శిగ వుండి, నిర్మాణ కార్యక్రమ రచనయందు అత్యంత ఉత్సాహపూరితులుగా పనిచేయుచు, శాసనసభలపై దృష్టి మరల్పక 'వినయాశ్రమము'ను స్థాపించి, ఉపనిషద్వ్యాపకము కొరకు, రచనాత్మక కార్యక్రమవ్యాపకమునకు, గ్రామోద్యోగ పరిశ్రమల వ్యాపకము కొరకు తమ జీవితమును వినియోగించుచున్నారు. అటుపిమ్మట ఈ ఇరవై సంవత్సరములను కీ.శే. కా. నాగేశ్వరరావు పంతులుగారు, శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు, శ్రీ బులుసు సాంబమూర్తిగారు, డా॥ పట్టాభిగారు, గంపలగూడెం రాజావారు, అధ్యక్షులుగా వుండి రాష్ట్రీయ కాంగ్రెసు సంఘమును నడపించుచువచ్చిరి. వీరికి కార్యదర్శులుగా వున్నవారిలో జొన్నవిత్తుల గురునాథరావుగారు, విష్ణుభొట్ల సూర్యనారాయణరావుగారు, గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, అయ్యదేవర కాళేశ్వరరావుగారు, తెన్నేటి విశ్వనాథంగారు, వి.వి. గిరిగారు, గొట్టిపాటి బ్రహ్మయ్యగారు, బెజవాడ గోపాలరెడ్డిగారు, మంతెన వెంకట్రాజుగారు, చింతమనేని భావయ్యగారు, శరణు రామస్వామి చౌదరి గారు, కల్లూరి సుబ్బారావుగారు, నడింపల్లి వేంకట లక్ష్మీనరసింహారావుగారు, నీలం సంజీవరెడ్డిగారు, దండు నారాయణ రాజుగారు, కళా వెంకట్రావు గారు గలరు. బలాఫ్కాత్రయ ఉద్యమమున అనేకులు లాయర్లు, విద్యార్థులు, శాసన సభల పదవులకు రాజీనామాయిచ్చి దేశ సేవలో నిమగ్నులైరి. శాసనసభల నుండి వెంకటప్పయ్య పంతులు మొ॥వారు రాజీనామా నిచ్చిరి.

ఇంక అఖిల భారత కాంగ్రెసు వర్కింగు కమిటీలో 20 సంవత్సరముల నుంచి ఆంధ్రులు – కొంత హెచ్చు తగ్గు – అవిచ్ఛిన్నముగ సభ్యులుగావుండి పనిచేయుచుండిరి. ప్రప్రథమున శ్రీ కొండ వెంకటప్పయ్య పంతులుగారు సభ్యుడుగా ఉండిరి. పిమ్మట వారు కొంతకాలము వర్కింగు కమిటీ అధ్యక్షులుగను, కీ.శే. శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు కార్యదర్శిగను వుండిరి. పిమ్మట ప్రకాశంపంతులుగారు, డా॥ పట్టాభిగారు, సాంబమూర్తిగారు కూడ సభ్యులుగా ఉండిరి. ఈ 22 సంవత్సరముల నుండియు ఆంధ్రులు తమ కర్తవ్యమును తక్కిన రాజధానులతో పాటుగాని, అంతకంటె ముందంజవేసిగాని నెరవేర్చి, తమ భాషా ప్రాంతమున కెంతయు కీర్తి తెచ్చిరనుటకు సందేహములేదు. 1921 సం॥మున 31వ మార్చి, 1వ ఏప్రెలు తేదీలలో బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు సంఘమునందే, ఇప్పటి కాంగ్రెసుకు పునాదియని చెప్పదగిన ప్రణాళిక ఏర్పరుపబడ్డది. తదనుసరణముగ ఆంధ్రులు, కోటి రూపాయల నిధికి, మూడు లక్షల రూపాయలు వసూలు చేసి ఇవ్వగలిగిరి. ఇక ఖద్దరు విషయముల ఆంధ్రులకిది క్రొత్త విద్యకాదు. అవిచ్ఛిన్నముగ పూర్వమునుండి జరుగుతూనే వచ్చినది. తక్కిన ఖద్దరు యావత్తు పునర్నిర్మితమై – భారతదేశమునందు యే ఇతర ప్రాంతమునకు వెళ్ళినను – ఆంధ్ర ఖద్దరునే కొనవలెనను కోరికను గలుగజేసిరి.

అస్పృశ్యతా నివారణయందు ఆంధ్రులు వెనుకంజ వేయలేదు. ఈ విషయమై కీ.శే. వీరేశలింగం పంతులుగారు, ఆర్. వెంకటరత్నం నాయుడుగారు చేసిన సేవ నిదర్శనము. అస్పృశ్యులను స్పృశ్యులుగ యెంచుకొను సంస్థ చిరకాలము క్రిందట ఏర్పడినది.

జాతీయ విద్య గురించి చెప్పనక్కరలేదు. 1907 సం॥ములో స్థాపింపబడిన జాతీయ కళాశాల ఈనాటికిని జాతీయ విద్యకు పునాదిగా నిలిచివున్నది. 1907లో సూరత్ కాంగ్రెస్‌లో, జాతీయ సంస్థలను దేశమంతటా నెలకొల్పవలెనని తీర్మానింపబడియుండుటచే, బంగాళా దేశములోను ఇండియాలో ఇతర ప్రాంతములలోను అట్టివి స్థాపించబడుచుండెను.[1]

హరిజనోద్యమమునందు ఎక్కువగా పనిచేయున్న వారిలో శ్రీ బాపినీడుగారి పేరు చెప్పదగియున్నది. రామదాసు పంతులుగారు ఈ సభకు అధ్యక్షులుగా వున్నారు. మొదటిలో కీ.శే. కా. నాగేశ్వరరావు పంతులుగారు ఈ సభకు అధ్యక్షులుగా ఉండిరి.

ఆంధ్రదేశమునందు, కాంగ్రెసు ఉద్యమమునందలి నూతన శకములో దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు ఆదిపురుషులు. వారికిప్పుడు 70 సంవత్సరములు నిండినను, ఎక్కువ ఉత్సాహముతోను, శ్రమకు ఓర్చియు తమ కర్తవ్యమును నెరవేర్చుచున్నారు. 1921, 31,

1. మచిలీపట్నములో మేధావంతులును, త్యాగమూర్తియగు శ్రీ కోపల్లె హనుమంతరావు ఎమ్.ఏ., బి.యల్. గారు తమ ప్రభుత్వోద్యోగమును, తర్వాత ప్లీడరీ వృత్తినిగూడా వదలుకొని, ఆంధ్రజాతీయ కళాశాలను స్థాపించి, ధనమునకై దేశాటనముచేయమొదలిడిరి. ఆయనకు కుడిచేయిగా వారి ప్రాణమిత్రులు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు, ముట్నూరి కృష్ణరావుగారు, వల్లూరి సూర్యనారాయణరావుగారు దాని అభివవృద్ధికై పాటుబడిరి. ఆంధ్రులకేకాక, భారత జాతీయతకే ఈ కళాశాల వన్నె పెట్టినది. పాలనా చక్రం త్రిప్పుటకు తగిన సామర్థ్యం పొందిన సీతారామయ్యగారు, హనుమంతరావుగారి తర్వాత ఆ భారము తమపై వేసుకొని, జయప్రదముగా దీనిని నిర్వహించుచున్నారు. హనుమంతరావుగారి తర్వాత సీతారామయ్యగారొక్కరు ఈ సంస్థకు 40 వేల రూపాయలు సంపాదించి స్థిరాస్థికొనిరి. రాజమహేంద్రవరములోని జాతీయ పాఠశాల, ఏలూరులోని జాతీయ కళాశాల, గుంటూరులోని శారదా నికేతనము మొదలైనవి, ఇంకను ఇతర ఆశ్రమములు నేటివరకు జాతీయ విద్యకు నిలయములుగ నున్నవి. – సంపాదకుడు.

32, 40 సంవత్సరములలోని సత్యాగ్రహములందును ఆంధ్రులు తమ కర్తవ్యమును సంపూర్ణముగా నెరవేర్చారని అందరును చెప్పుకొన్న విషయము. ముఖ్యముగా 1941 సంవత్సరము సత్యాగ్రహమునందు వారియొక్క చర్యలు, కార్యక్రమములు ఎక్కువగ ప్రశంసింపబడినవి.

ఇక ముగించకముందు ఒక మాట చెప్పవలసియున్నది. ఆంధ్రులలో ఉత్సాహము మెండు. నూతన భావములను తొందరగా స్వీకరించుశక్తి వారికి విశేషము. బ్రహ్మసమాజము అనండి, ఆర్యసమాజము అనండి, భజనమందిరములనండి, సంఘసంస్కరణ మనండి, విధవావివాములనండి, యువతీ వివాహము లనండి, మద్యపాననిషేధ మనండి, సత్యాగ్రహ మనండి, శాసనసభాబహిష్కార మనండి – ఏ క్రొత్త ఉద్యమము వచ్చినను ఆంధ్రులు ముందంజవేసి పురోభివృద్ధికి తోడ్పడుచున్నారు. కాని వారియందు కొంతలోపము కనిపించుచున్నది. ఇతరులవలె ఆంధ్రులకు ఒక నాయకుని అనుసరించి వెళ్ళే స్వభావము లేదు. ఇది ఆక్షేపణీయమైనది కాదు; ఏలయన అనేకమంది, దామాషా ప్రకారము గల్గిన త్యాగబుద్ధి, కార్యదీక్ష కల్గినవారు. అందుచేత ఆంధ్రవనము ఒక పెద్ద తాళవృక్షవనము; తక్కిన పొట్టి మొక్కలతో నిండియున్న వనము గాదు. ఇది అరణ్యములోవలె దట్టముగా అలముకొనియున్న వృక్షజాలము. ఇందులోని నిమ్నోన్నతములు గుర్తించుట కష్టము. తక్కిన రాజధానులలో అట్లుగాదు. అందుచేత ఈ తారతమ్యము కనిపించు చున్నది. ఈ కారణముచేతనే ఆంధ్రులలో ప్రతి రూపాయను 16 అణాల క్రింద పంచవలెననియు ప్రతి అణాను 12 పైసల క్రింద పంచవలెననియు కోరిక పొటమరించినది. దానిని మూలధనముగా పెట్టి, దానివలన ప్రయోజనమును బాహుళ్యమున కందజేయ వలెనని కోరిక ఇతర ప్రాంతములలో విశేషముగా వున్నది. ఇందాక చెప్పినటువంటి విషయము, ఈ విషయము రెండూ కూడ ఒక్కటే. ఆంధ్రులు ఎంత త్వరగా క్రొత్త భావాలను స్వీకరింతురో అంత త్వరగా భావ విసర్జన చేయగలరు. బహిష్కారోద్యమమునందు వెంటనే రాజీనామాలు యిస్తారు. అందుకు సందేహము పొడచూపినదో, వెంటనే బహిష్కారము మానుకుంటారు. వీరి స్వభావము గడ్డివామి వంటిది. భగ్గున మండి చట్టున చల్లారుతుంది. సత్యాగ్రహమున ప్రవేశించుటయందుకూడ ఇట్టి స్వభావమునే చూపియున్నారు. వెళ్లదలచుకున్నవారంతా ఒక్కపట్టున వెళ్లడము, తరువాత దేశము గొడ్డుపోయినట్లు ఎవరూ లేక పోవడము ఇంతవరకూ సంభవించిన విషయమే! కానీ, 1941 సం॥లో అట్లుగాక కొంత క్రమబుద్ధిని కనబరచినారు. అట్లే సమాజవాదము ప్రవేశింపగానే యువకులు ఆ వాదము నందుచేరి, అచ్చట నుండి కమ్యూనిజములో చేరి, ప్రజాహితైక జీవనమును భీభత్సము గావించినారు. అహింసా తత్వమును ఎంతత్వరగా అవలంబించెదరో అంత త్వరగా విసర్జించుటకు గూడా సంసిద్ధులుగా వుందురు.

ఇంక ఆంధ్రదేశములో కాంగ్రెస్ ఉద్యమములోను, ఉప్పు సత్యాగ్రహము, సహాయ నిరాకరణోద్యమము మొదలైన అభివృద్ధికరమైన ప్రజాహితైక కార్య నిర్వహణముల లోను స్త్రీలు ప్రశంసార్హమైన పాత్ర ధరించిరి.

1930 సంవత్సరములో మూడువేలమంది ఆంధ్రులు కారా గృహవాసము స్వీకరించిరి. 1932వ సంవత్సరములో అంతకన్న బహుళముగా జైళ్లకు వెళ్లిరి. 1941 వ సంవత్సరోద్యమములో దరిదాపు రెండువేలమందికి పైగా సత్యాగ్రహము చేయ సన్నద్ధులైరి. వారిలో ఒక వెయ్యిమంది నిర్బంధింపబడి, రకరకముల శిక్షలకు గురియైరి.

తెలుగు స్త్రీలు, తమ ఉత్తరదేశ సోదరీమణులవలె ప్రతిబంధకములతో, అడ్డంకులతో నిండియుండని పథములోనే పోవుచున్నారు. పర్దాపద్ధతి వీరికిలేదు. సంఘజీవనములను దేశ విషయములలోను సత్వరముగా పాల్గొనెదరు. 1921, 30 32 స్వాతంత్ర్యోద్యమములలోను, ఇటీవలి 1941 సత్యాగ్రహోద్యమములోను, పైన చెప్పినట్లు ఆంధ్ర స్త్రీలు ప్రముఖ భూమికల ధరించిరి.

ఆదిలో రాజకీయములతో – 1921వ సంత్సరములో మహాత్ముడు సహాయ నిరాకరణోద్యమము, 'నోవోటు కాంపైన్'ల నారంభించగానే ఆంధ్రదేశపు స్త్రీలలో – అప్పుడు అమెరికాలో వ్యవసాయిక విద్యనభ్యసించుచున్న శ్రీ మాగంటి బాపినీడుగారి సతీతిలకము – శ్రీమతి అన్నపూర్ణాదేవి ముందంజవేసి ఆ ఉద్యమములో పాల్గొన్నది. ఆమె తన జీవితాన్ని సర్వస్వమును జాతీయోద్యమమున కంకితమొనర్చిన పవిత్రమూర్తి. మూడువేల రూపాయల విలువైన తన ఆభరణములను మహాత్మునికి అర్పించినది. ఆనాటి నుండి, అశేష ప్రజకు దుఃఖకారణమైన ఆమె మృతిచెందిన తుది క్షణమువరకు, సరియైన ఉనికి, నిద్రాహారముల లక్ష్యము చెయ్యక నిరంతరము దేశసేవ చేయుటలో నిమగ్నురాలై, ఉత్సాహము అభిలాష కలిగి యుండెను. ఆయాదర్శజీవి నీనాటికిని ఆంధ్రదేశపు స్త్రీలు, పురుషులు మరువరు. ఆమె జ్ఞాపకచిహ్నముగా ప్రతిసంవత్సరము సాంవత్సరీకములు జరిపి, ఉచితరీతిని సత్కరించుచుందురు.

1930 సంవత్సరములో ఇంకొక సోదరి రాజకీయరంగంలో అగ్రస్థానం అలంకరించినది; ఆమెయే దుర్గాబాయి! ఆమె ఝాన్సీరాణి లక్ష్మీబాయి లాగు, ఫ్రెంచి విజేత దేవిజోన్‌లాగు అనేకులు వెనుకడుగు వేస్తున్నప్పుడు, నాయకులను నిర్బంధించినప్పుడు, మద్రాసు నగరమున ఉద్యమ నిర్వాహకురాలై ఉద్యమమునకు ఉజ్జీవనము, ఉత్సాహము కల్పించి, అనల్పమైన కృషి చేసినది. ఆమె ధైర్యము, కార్యశూరత్వము అప్పటి మద్రాసు పోలీసుకమీషనరును నఖశిఖ పర్యంతము కంపింప జేసినవి. ఈ కోటిలో అనేకులు చెప్పదగినవారున్నప్పటికీ అందరినీ పేర్కొనుట కవకాశము లేదు.

ఆంధ్రులకు కావలసినది ఎక్కువ పట్టుదల, తదేకనిష్ఠ, సువిచారమగు ఆలోచన, అవిచ్ఛిన్నమగు యత్నము, కార్యాంతము వరకు పాటుబడుట. ఈ గుణములు ఆంధ్రులు సంపాదింప గలిగినట్లయితే, భారత దేశమునందు ప్రథమ స్థానము వారే నిర్వహింతురని చెప్పుటకు సందేహములేదు!

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ

సం॥ము	అధ్యక్షులు	కార్యదర్శి
1918	కొండా వెంకటప్పయ్య	జొన్నవిత్తుల గురునాథం
1919	కొండా వెంకటప్పయ్య	విష్ణుభొట్ల సూర్యనారాయణ

1920	కొండా వెంకటప్పయ్య	విష్ణుబొట్ల సూర్యనారాయణ
1921	కొండా వెంకటప్పయ్య	గొ. సీతారామశాస్త్రి
1922	కొండా వెంకటప్పయ్య	గొ. సీతారామశాస్త్రి
1923	కొండా వెంకటప్పయ్య	ఆ. కాళేశ్వరరావు
1923	టంగుటూరి ప్రకాశం	ఆ. కాళేశ్వరరావు
1924	కా. నాగేశ్వరరావు	ఆ. కాళేశ్వరరావు
1925	టంగుటూరి ప్రకాశం	ఆ. కాళేశ్వరరావు
1926	టంగుటూరి ప్రకాశం	ఆ. కాళేశ్వరరావు
1927	టంగుటూరి ప్రకాశం	కా. నాగేశ్వరరావు
	బు. సాంబమూర్తి (4 నెలలు)	మం. రంగయ్య నాయుడు
1929	కె. నాగేశ్వరరావు	గ. రంగయ్య నాయుడు
1930	కె. నాగేశ్వరరావు	అ. కాళేశ్వరరావు
1931	గంపల గూడెం కుమార రాజా (3 నెలలు) రాజీనామా నిచ్చిరి. సెప్టెంబరు మాసము నుండి అధ్యక్షులు లేరు.	అ. కాళేశ్వరరావు
1932	అధ్యక్షులు లేరు	అ. కాళేశ్వరరావు
1933	అధ్యక్షులు లేరు	అ. కాళేశ్వరరావు
1934	కా. నాగేశ్వరారవు (జూలై నుండి)	అ. కాళేశ్వరరావు
1935	టంగుటూరి ప్రకాశం	బు. సాంబమూర్తి
1936	టంగుటూరి ప్రకాశం	బు. సాంబమూర్తి
1937	టంగుటూరి ప్రకాశం	బు. సాంబమూర్తి
1937	భో. పట్టాభి (ఆగస్టు 17 నుండి)	గొ. బ్రహ్మయ్య
1938	భో. పట్టాభి	గొ. బ్రహ్మయ్య
1939	భో. పట్టాభి	గొ. బ్రహ్మయ్య
1940	టంగుటూరి ప్రకాశం	కళా వెంకట్రావు
1941	టంగుటూరి ప్రకాశం	కళా వెంకట్రావు
1942	టంగుటూరి ప్రకాశం	కళా వెంకట్రావు

(ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం నుండి)

కళా వెంకటరావు

రాజకీయ స్మృతులు

ఆంధ్రరాజకీయ స్మృతులమీద ఏదైనా చెప్పాలంటే Personal touch అనేది లేకుండా చెప్పడం సమంజసం కాదు. ఈ Personal touch ఇతరులను గురించా? లేక స్వంత Person గురించా అని విమర్శించడం గాని, వితర్కించడం గాని తగదు. ఒక యుగాన్ని గూర్చి ఏమైనా చెప్పాలంటే మనకు, ఆ యుగానికి వున్న సంబంధముకూడా ప్రస్ఫుటమవక తప్పదు. అందువల్ల కొంత ఆత్మకథ కూడావుంటే చదువరులు క్షమించాలి.

మా వూరు చిన్నవూరు అయినా చాలా మంది విద్యావంతులకు జన్మభూమి. నేటికీ ప్రస్ఫుటమైన స్వరంతో వేదపారాయణ వినాలంటే మా వూరికే వెళ్లాలి. శాస్త్రవిజ్ఞానంగలవారు, సంస్కృతి భాషా ప్రవీణులు, విజ్ఞానంలో యూనివర్సిటీ డాక్టర్లు, ఈ రకాల వారు చాలామంది అక్కడ వున్నారు. నా చిన్నతనంలో మా వూళ్లో బాలభారతీ గ్రంథాలయం అని వుండేది. వేసవి కాలపు సెలవుల్లో కొన్ని సంవత్సరాలు నేనేదాన్ని నిర్వహించేవాణ్ణి. నాకు చిన్నతనములో అనగా 12-16 వయస్సు మధ్య మొదటిసారిగ ఆంధ్రపత్రిక వార పత్రికను చదివిన జ్ఞాపకం. ప్రతివారం టపాలో ఎప్పుడు ఆ పత్రిక వస్తుందా అని ఎదురుచూసిన రోజులు లేకపోలేదు. 1914వ సంవత్సరంలో నేను ఫోర్తుఫారం చదువుతున్న రోజుల్లో ఆంధ్రపత్రిక దిన పత్రిక అయింది. ఆ సంవత్సరంలోనే నాకు వివాహం అయింది. మా ఇంటికి సమంగా ఎదురుగుండా మా అత్తగారిల్లు. మా మామగారు కీ.శే. దువ్వూరి వెంకటేశ్వర్లుగారు. అప్పటికే రాజకీయవేత్త. ఆనాటి జిల్లా సంఘంలో ఆక్టివ్‌గా వుండి రాజమండ్రి తాలుకాబోర్డు మెంబరుగా పనిచేసేవారు. ఆయన ఆంధ్రప్రత్రిక దిన పత్రిక తెప్పించేవారు. మొదటినుంచి నాకు రాజకీయాల్లో అభిరుచికి వారే కారణం. అందువల్ల ఆంధ్రపత్రికలో కొంత కాలము పాఠకునిగా, కొంత కాలం గౌరవ విలేఖరిగా, చాలా కాలము నుంచి పత్రికాధిపతులతో సామీప్య స్నేహితునిగా అనురాగ మేర్పడినది.

నేటికి వారపత్రిక బంగారు ఉత్సవమును చేసుకొనురోజు వచ్చుట చూచి ఎంతయు ఆనందము కలుగుచున్నది. ఈ స్వర్ణోత్సవ సందర్భంలో రాష్ట్ర రాజకీయములలో కొన్ని విశేషములనుగూర్చి వ్రాయమన్న సంపాదకుల కోర్కెను కాలవ్యవధిలేకున్నను మన్నింపక తప్పుటలేదు.

నేను కళాశాల విద్యార్థిగ నుండగ కొందరు ఆంధ్రనాయకులతో సంబంధమేర్పడినది. వారిలోకెల్ల పెద్దలు దేశభక్త వెంకటప్పయ్యపంతులుగారు. 1918-19వ సంవత్సరములో వారు శాసనసభకు స్థానిక సంస్థ పక్షాన (అప్పటి మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్) అభ్యర్థిగా నిలిచారు. ఆ సందర్భంలో మా ముక్కామలకు మా మామగార్ని చూచుటకు వచ్చారు. వారిరువురకు ఆంధ్రమహాసభలలో స్నేహము.

మా ఊరువచ్చి జబ్బుపడుటచే 15 రోజులు మాయింటివద్ద ఉండటం తటస్థించింది. వీరితోబాటు రాయసం వెంకటశివుడు గారు కూడా వచ్చిరి. వేసవి సెలవుల్లో నేను ఇంటివద్దనుండుటచే ఈ పెద్దల సన్నిహిత పరిచయభాగ్యము కలిగినది.

తర్వాత రాజకీయ జీవితములో దేశభక్తుల ప్రేమను, ఆశీర్వచనమును ఎన్నియోసార్లు సంపాదించుకొనగలిగితిని. 1916లో కాకినాడలో 4వ ఆంధ్రమహాసభ జరిగినది. నేను స్కూల్ ఫైనల్‌లో ఉండి ఆ సభను చూచుటకు వెళ్లితిని. అప్పుడే చాలామంది ఆంధ్రనాయకులను చూచుట సంభవించినది. డాక్టర్ పట్టాభిగారినీ, నాగేశ్వరరావు పంతులు గారినీ ప్రకాశం గారిని, సాంబమూర్తి గారిని దూరమునుండియే చూడగలిగితిని. తర్వాత వీరందరితో అతిసన్నిహితత్వమునకు వచ్చు భాగ్యము లభించినది.

ఇంటర్మీడియట్ బి.ఎ. తరగతులు విజయనగరం, బందరు పట్టణాల్లో చదువుకున్నాను. బందరులో బి.ఎ.సీనియర్ క్లాసులో నుండగా దేశంలో గాంధీ ఉద్యమము ప్రజ్వలిల్లసాగెను. అందులో బందరులో డా॥పట్టాభిగారు, ముట్నూరి కృష్ణారావుగారు, చెరుకువాడ నరసింహం పంతులుగారు, సహాయనిరాకరణోద్యమములో అనేకసార్లు సభలో ప్రసంగించుట వింటిని. సెప్టెంబర్ 4వ తేది 1920వ సంవత్సరమున కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభ అనంతరం చదువుమానుటకు సంకల్పం కలిగినది. కాని శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు నాగపూర్ కాంగ్రెసు అయ్యేవరకు వేచి ఉండవలసిందని సలహాయిచ్చారు. నాగపూర్ కాంగ్రెసు అయిన కొలది రోజులకే దేశంలో విద్యార్థుల సహాయనిరాకరణోద్యమము ఉద్వేగపూరితమైనది. ఇంతలో ఫిబ్రవరి 7వ తారీఖున బందరులో కృష్ణాజిల్లా విద్యార్థి మహాసభ జరిగినది. చాలా మందిమి బుట్టయ్యపేట హాలులో సమావేశమయ్యాము. ఉపన్యాసములు జోరుగా జరుగుచుండెను. గుంపునకు ఆవల, డా॥పట్టాభిగారు, కృష్ణరావు, కాళేశ్వర రావు వగైరా పెద్దలు ఒకచోట కూర్చొని ఉండిరి. అక్కడకు దగ్గరగనే నేను విద్యార్థుల గుంపులో కూర్చొంటిని. చదువును మానుమను ప్రబోధము జరుగుచుండెను గాని ఎంత ఉత్సాహము ఉన్నను వేదిక పైకి వెళ్లుటకు మేమందరము జంకుచుంటిమి. ఇంకొక ఏడు రోజులు కళాశాలలో హాజరైనచో బి.ఎ. కోర్సు పూర్తిచేసినటుల నిర్ణయమగును. ఆ ఏడురోజులు అటెండెన్సు వేయుటా, లేక సహాయ నిరాకరణ మార్గమునవలంబించుటా అని మనస్సు డోలాయమానమైనది. ఇంతట్లో పై పెద్దలు “నన్ను పిలిచి ఇదివరకే చదువు మానుదాము అనుకున్నావు గదా! ఇంకా ఆలోచిస్తున్నావా!” అని అడిగిరి. ఒక సెకను కాలంలో నిర్ణయమునకు వచ్చితిని. తిన్నగా వేదిక పైకి పోయి “నేను చదువుమానుచున్నాను” అని ప్రకటించి ఒక ఉద్రేకపూరితమైన ఉపన్యాసమును చేసితిని.

అంతకు క్రితమే రాష్ట్ర రాజకీయ విద్యార్థి సమావేశములలో తెలుగు వక్తృత్వ పోటీలలో ప్రథమ స్థానమును పొంది బంగారు పతకమును సంపాదించుకొనుటచే ఉపన్యాసం రాజకీయ పంథాలో పడినది. నా సహాధ్యాయులగు బి.ఎ. సీనియర్ విద్యార్థులు అర్గురు తక్షణమే తాము చదువుమానుచున్నట్లు ప్రకటించారు. అటుమానిన వారిలో శ్రీయుతులు భాగవతుల లక్ష్మీనారాయణ, పి.వి.కృష్ణయ్య (నెల్లూరు), జగన్నాథరావు దొర (వాలేరు), వగైరాలుండిరి. తర్వాత వీరిలో కొందరు తిరిగి కళాశాలలోజేరి పట్టభద్రులై వృత్తులలో జేరిననూ, నాకు మాత్రము అటువంటి అవకాశము లభింపలేదు; కోరిక కలుగలేదు.

బందరునుండి తిన్నగా అమలాపురం వెళ్లితిని. అప్పుడే జిల్లా కాంగ్రెసు సంఘముల ఏర్పాటు జరుగుచుండెను. సాంబమూర్తి గారు, డా॥బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యంగారు, వెన్నేటి సత్యనారాయణగారు, జోస్యుల రామచంద్రరావు గారు, మా నాయకులు, మొసలిగంటి తిరుమల రావు, మద్దూరి అన్నపూర్ణయ్య, క్రొవ్విడి లింగరాజు, పాలకోడేటి గురుమూర్తి మొదలగు మిత్రులందరూ నాకు సహాధ్యాయులు. 1921 సంవత్సరము చరిత్ర వ్రాయవలెనన్న ఒక ఉద్గ్రంథమగును. ఎప్పుడైనా స్వీయచరిత్ర వ్రాసే అవకాశం లభిస్తే ఈ వివరాలన్నిటినీ గ్రంథస్తం చేయడం సాధ్యం అవుతుందేమో! అయితే, అట్టి కోర్కెలేదు. 21వ సంవత్సరములో పదే పదే రాష్ట్ర కాంగ్రెసు సంఘ సమావేశాలు, జిల్లా కాంగ్రెసు సమావేశాలు జరిగేవి. తిరునాళ్ళలలోనున్న భక్తునివలె చాలా మంది ఉన్మాదావస్థలో ఉండేవాళ్ళు. ఈ సందర్భంలో ఒకటి రెండు ఘట్టాలు స్మృతిపథంలోకి వస్తున్నాయి.

విజయవాడలో ఎ.ఐ.సి.సి.

అది 1921వ సంవత్సరము మార్చి నెల. అఖిల భారత కాంగ్రెసు సమావేశం బెజవాడలో జరిగినది. ఆ సందర్భంలో భారతదేశంలోనున్న నాయకులు అందరూ వచ్చిరి. ఆనాడు బెజవాడలో గుమికూడిన మహోత్సాహమును తిరిగి నా రాజకీయ జీవితములో ఎన్నడునూ చూచినట్లేదు. అప్పుడునేనొక వాలంటిరును – ఎల్. పెట్రోలుకు లెఫ్టినెంటును. ఆనాడు నడిరేయి బెజవాడ రైలుస్టేషనులోని వంతెన పై నా డ్యూటి. రైలు దిగిన నాయకులను వంతెనపైనుండి భద్రముగా నేనును, నా సహాధ్యాయులును బయటకు జేర్చవలసియుండెను. ముందర రాజవీధిలో మోతీలాల్, తరువాత చిత్తరంజన్ దాస్, వీరినిచూచి హర్షామోదముతో నుండగా, వెనువెంటనే ఆలీ సోదరులు! అంతవరకు షౌక్‌తాలీవంటి ఉన్నత శరీరుని చూడలేదు. సరిగదా అట్టివ్యక్తి ఉంటాడనికూడా అనుకోలేదు. ఇంకొక ఐదు నిమిషములలో వడివడిగా నడుచుచు, నవ్వుచు, పురుషోత్తముడే వచ్చుచున్నాడా యను నటుల స్ఫురించి గాంధీజీ– ఆ సరికి వారు ఖద్దరు కుర్తాను, గాంధీటోపీని ధరించియే యుండిరి. ఆ రోజుల్లో ఇంతమంది జనము నివసించుటకు బెజవాడలో స్థలమేలేదు. వేలాదిజనము రోడ్లపైనే పాటలు పాడుకొనుచూ నిలచియుండేవారు. నా అదృష్టవశమున మరునాడు నాడ్యూటీ అఖిలభారత కాంగ్రెసు సంఘం సమావేశమగుచున్న హాలులో పడినది. అందువలన గాంధీజీని, మహా నాయకులను దగ్గిరనుంచి చూచుటకును, వారి సంభాషణలను, చర్యలను వినుటకును అవకాశము లభించెను. నాటి దృశ్యములు నా మనోవీధినుండి ఇంకనూ తొలగలేదు.

ఆ సంవత్సరము కాంగ్రెసు డిసెంబరులో అహ్మేదాబాదులో జరిగినది. నేను కాంగ్రెసుకు వెళ్లడం మా వాళ్ళకి ఇష్టంలేదు. అక్కడేదో జరిగిపోతుందని వాళ్లభయం. ఈ భయానికి ఒక కారణం ఆ వారంలోనే కాకినాడలో సైనికుల ప్రస్థానం జరగడం. జాతీయ జెండాను వారి రస్తానుండి తొలగించకుండా సాంబమూర్తి నిశ్చిలుడై నిలవడం, అరెస్టులు జరగడం, ఇవన్నీ పెద్ద వింతలుగా గ్రామాల్లో చెప్పుకోవడం. నేను నెమ్మదిగా ఒక నూరు రూపాయలను సేకరించుకొని, కొంత దూరము జట్కాపై వెళ్ళినట్లు వెళ్ళి, కాల్వపడవపైకి మారి, రాజమండ్రి మీదుగా బొంబాయివెళ్ళి అమ్మదాబాదు చేరితిని. ఖాదీ నగరములో ఆంధ్రులకొక ప్రత్యేక కానా ఉండెను. మొట్టమొదటచేరిన వాళ్ళలో నేనుండుటచే తర్వాత వచ్చిన పెద్దలనందర్నీ ఆహ్వానించుటకు అదను ఏర్పడినది. ఈ సందర్భములో ఒక వింత దృశ్యం జ్ఞాపకానికి వస్తోంది. వెంకటప్పయ్య పంతులు గారితో నాకెంతో చనువు. వారి మనస్సునుండి అస్పృశ్యతను గూర్చినభావం ఆరోజుల్లో తొలగలేదు. రాజమండ్రి నుండి హరిజన నాయకులు కుసుమ వెంకట్రామయ్యగారు కూడా వచ్చిరి. ఒకేపంక్తిలో భోజనం చెయ్యడం ఇష్టంలేదు. ఈ సంఘటనను తప్పించుకొనుటకు ముందుగనే భోజనము చెయ్యవలెనని శ్రీ వెంకటప్పయ్య పంతులుగారు భోజనశాలకు వెళ్ళిరి. పెద్దలకు కష్టమెందుకు కలుగజేయవలెనను భావముతో కుసుమ వెంకట్రామయ్యగారును అదే కాలమున భోజనశాలకు వెళ్ళిరి. ఏమి చేయవలెను? పంతులుగారు "రావోయి వెంట్రామయ్యా' ' అని ప్రక్కన కూర్చోబెట్టుకు భోజనం చేశారు.

ఈ సంఘటన చూసి మిగిలిన మేము నవ్వుకుంటూ ఆనందించితిమి.

ఆహ్మదాబాద్ కాంగ్రెసు జరిగే సమయంలోనే బ్రిటిషు ప్రభుత్వానికి, కాంగ్రెసుకు రాజీ చేయదానికని బొంబాయిలో అఖిలపక్ష సమావేశము జరుగుతున్నది. ఆ యత్నములను సమీకరిస్తూ గాంధీజీ కాంగ్రెసులో చేసిన ప్రసంగము నా చెవులలో నింకను ప్రతిధ్వనిస్తున్నది.

పన్నుల నిరాకరణ

"I am a man of peace. But I do not want the peace you find in a stone, nor the peace you find in the grave. But the peace that is embedded in the human breast——

శాసనోల్లంఘనోద్యమానికి గాంధీగారికి అన్ని అధికారాలు అప్పగించి ఇంటికి మరలితిమి. రాజమండ్రి స్టేషనులో దిగేసరికి డా॥సుబ్రహ్మణ్యంగారు రైలు ఎక్కుచుండిరి. నేను దగ్గరకు వెళ్ళి పలుకరించపోగా, పోలీసులు అడ్డగించిరి. పరిస్థితి నాకర్థము అయినది. వారివద్ద సెలవు తీసుకొని తిన్నగా పడవెక్కి మరునాటికి అమలాపురం చేరితిని. ఆ రోజుల్లో దిన పత్రికలు అమలాపురం సాయంత్రానికి పోస్టుద్వారా వచ్చేవి. వాటి రాకకోసం మేము పోస్టాఫీసుదగ్గర వేచి ఉండేవారము. పోస్టాఫీసు ఎదురుగానే తిలక్ హాలు అను నామకరణముతో మా కాంగ్రెసు ఆఫీసు ఉండేది. దాని దాపులనే మా బహిరంగ సభలు జరిగేవి. అహ్మదాబాద్‌నుండి తిరిగివచ్చి నేను సభలో ఉపన్యసించవలసి ఉండెను. ఉపన్యాసమునకు ముందుగనే 'ఆంధ్రపత్రిక' వచ్చినది. మొదటి పుటలో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘము పన్నునిరాకరణోద్యమమునకు నిశ్చయించినట్లు పెద్ద అక్షరములతో ప్రకటించబడెను. నా బహిరంగసభలో ఉపన్యసించుచు, పన్నులు ఇవ్వవద్దని ప్రబోధించితిని. ఆనాడే తన మేనమామగారింటికి వచ్చిన కీ.శే. కంపాటి లక్ష్మీనరసింహ సోమయాజులుగారు సభలోనుండి నా తర్వాత మాట్లాడుతూ నా భావములను సమర్థించిరి. సోమయాజులది మంచి కంఠం. బాగా పద్యాలు పాడువాడు. సభ అయిపోయాక అయిదుమైళ్ల దూరంలో ఉన్న మా వూరు చేరితిని. సంక్రాంతి పండగనాటి రాత్రి 12 గంటలయ్యే సరికి మా పినమామగారు జట్కాపై మావూరు వచ్చి నన్ను నిద్రలేపి, నాకు, సోమయాజులకు వారంట్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. నేనొక నిముషం ఆలోచించి అమలాపురం వచ్చేసి అక్కడే అరెస్టు అవుతానని చెప్పాను. మా తండ్రిగారి దగ్గిర, కుటుంబం దగ్గర సెలవు తీసుకొని అమలాపురం వచ్చి, ఉత్సాహంతో పాటలు పాడుకుంటూ తిరుగుతూంటే, దోవలో అరెస్టు చేసి తర్వాత ఒక సంవత్సరము కఠినశిక్ష విధించిరి.

తర్వాత రంగం రాజమండ్రి సెంట్రల్‌జెయిలు. మూడు నెలల తర్వాత మాలో చాలామందిని కడలూరు మార్చిరి. ఈ జైలు జీవితంలో అనేకమందితో స్నేహం లభించినది. ఆ స్నేహము నేటివరకు దృఢానుబంధములో మిగిలియేయున్నది. మిత్రులలో పలువురు కీర్తిశేషులైరి. మరికొందరు సజీవులై దేశసేవలో నిమగ్నమైనవారు పలువురున్నారు. ఆనాటి సహాధ్యాయులలో వెంకటప్పయ్య పంతులు, సాంబమూర్తి, డా॥సుబ్రహ్మణ్యం, తిరుపతిరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి, ...బాపిరాజు, అయ్యదేవర కాళేశ్వరరావు, అన్నాప్రగడ కామేశ్వరరావు, కల్లూరి సుబ్బారావు, ఇ.వి.రామస్వామినాయర్, డా॥పి.వరదరాజులు నాయుడు, సదాశివన్, మొదలగు వందలాది మిత్రులున్నారు. వారందరిపట్టికను వ్రాయవలెనన్న మూడు నాల్గువందల పేర్లు జ్ఞప్తికి వచ్చుచున్నవి. అది ప్రస్తుతము సాధ్యపడదుగదా!

జైళ్ళనుండి తిరిగి వచ్చుసరికి సహాయనిరాకరోణోద్యమము ఉద్రేకము తగ్గినది. అయిననూ మనస్సులో ఉత్సాహము తగ్గలేదు. 1923వ సంవత్సరములో కాకినాడలో కాంగ్రెసు మహాసభ జరిగినది. చాలామంది దేశనాయకులకు సేవచేయు భాగ్యము లభించెను. కాకినాడ కాంగ్రెసులో జరిగిన విందు మాదిరి విందు నేటికినీ ఏ కాంగ్రెసులోను లభించలేదని ఇతర రాష్ట్రములవారు చెప్పుచుందురు.

1923 ఎన్నికలు

1923వ సంవత్సరములో జరిగిన శాసనసభ ఎన్నికలలో స్వరాజ్య పక్షమువారు పాల్గొనిరి. మేముకూడా సహాయముచేసితిమి. ఆ సందర్భంలోనే శ్రీ బిక్కిన వెంకట్రత్నం గారియొక్క సన్నిహిత స్నేహము లభించెను. 1924వ సంవత్సరంలో బెల్గాం కాంగ్రెసు జరిగినది. గాంధీజీ అధ్యక్షులు. అప్పటికి స్వరాజ్యపక్షం, గాంధీజీ పక్షములమధ్య విభిన్నాభిప్రాయము లేర్పడినవి. గాంధీజీ నిత్యనైమితిక కార్యక్రమమును

స్వరాజ్యపక్షమునకు అప్పగించిరి. అందువల్ల 1926వ సంవత్సరపు శాసన సభ ఎన్నికలలో కాంగ్రెసు అధికార పక్షముగనే పాల్గొనెను. ఆంధ్రరాష్ట్రములో కాంగ్రెసునకు అఖండవిజయముచేకూరెను. ఆ ఎన్నికలో కృష్ణా గోదావరీ జిల్లాల తరపున కేంద్రశాసన సభకు శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులు గారు, మోచర్ల రామచంద్రరావుపంతులు గారు పోటీచేసిరి. ప్రకాశంపంతులుగారితో నాకు చాలా దగ్గర సంబంధమేర్పడుటకు ఈ ఎన్నిక మొదటి మెట్టు. అప్పటినుండీ నాపైన వారికి ప్రేమ విశ్వాసమూ కలిగినవి. ఆ ఎన్నికలో ఎవరికీ రానంత మెజారిటీ శ్రీ ప్రకాశం పంతులుగారికి లభించెను. మా జిల్లాలో రాష్ట్ర శాసనసభకు శ్రీయుతులు బిక్కిన వెంకట్రత్నం, కందుల వీరరాఘవస్వామి గారలు జస్టిస్‌పార్టీ నాయకులగు సర్‌కూర్మా వెంకటరెడ్డి నాయుడు గారిని ఓడించిరి. ఆంధ్రరాష్ట్రమంతటను కాంగ్రెసునకు గొప్ప విజయము లభించెను.

1927లో తాలూకాబోర్డునకు, 1928లో జిల్లా బోర్డునకును నేను కూడా ఎన్నుకొనబడితిని. ఆ రోజుల్లో కాంగ్రెసు పక్షాన్న లోకల్‌బోర్డు ఎన్నికలో పోటీ చేయడం అరుదుగా ఉండేది. 1929లో తూర్పుగోదావరిజిల్లా బోర్డు ప్రెసిడెంటు ఎన్నికకు శ్రీ మల్లిపూడి పళ్ళంరాజుగార్ని అభ్యర్థిగా నిలిపితిమి. ఆశ్చర్యకరమైన విజయము మాకు లభించెను. ఆ ఘట్టంలో మాకందరికీ స్థానిక సంస్థలలో చాలా అనుభవం లభించెను.

1928వ సంత్సరం కలకత్తా కాంగ్రెసు నాటికే దేశములో ఉద్రేకము పెరుగజొచ్చెను. కాని గాంధీజీ పట్టుదలపై బ్రిటిష్ ప్రభుత్వమునకు ఒక సంవత్సరము గడువీయబడెను. ఆ గడువు కాలములో దేశమునందంతను పూర్ణ స్వరాజ్యముకొరకు ప్రచారము జరిగెను. నాబోటి ఆనాటి యువకులందరు పూర్ణ స్వరాజ్యవాదులే.

భుజాలపై గాంధీజీ

1929లో గాంధీజీ ఆంధ్రప్రదేశములో పర్యటించెను. ఆ పర్యటనలో అమలాపురం కూడా వచ్చిరి. ఆలమూరుదగ్గిర గోదావరిని దాటునప్పుడు పడవ వడ్డునకు రాకుండుటచే గాంధీజీని నేనూ. కీ.శే.నరసింహదేవర సత్యనారాయణగారు, భుజముపైనెక్కించుకొని నీటిని దాటించి ఒడ్డున దింపితిమి. ఈ ఘట్టము జాపకమువస్తే వళ్ళు ఇంకను ఝల్లుమను చున్నది. ఆ మహాత్ముని భుజముపై నెక్కించుకొన్న భాగ్యము మరపునకు వచ్చుటెట్లు!

1929వ సంవత్సరము డిసెంబరు నెలాఖరున కాంగ్రెసు లాహోరులో జరిగెను. చాలామంది ఆంధ్రులము హాజరైతిమి. అచ్చటే శ్రీ కల్లూరి చంద్రమౌళిగారితో స్నేహము ప్రారంభమైనది. లాహోరులో జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షత క్రింద పూర్ణస్వరాజ్యము ధ్యేయముగా ప్రకటింపబడినది. డా॥సుబ్రహ్మణ్యంగారు గాంధీజీకి చాలా కావలసినవారు. వారు గాంధీజీతో మాకు ఇంటర్వ్యూ ఏర్పాటు చేసిరి. తెల్లవారుఝామున అతి శీతల సమయంలో గాంధీజీ రవీనదీ ఒడ్డున నడచుచూ ఆంధ్రప్రతినిధులతో సంభాషించెను. “ఒక మహత్తరమైన ఉద్యమము రానున్నది. మీరు తయారగుటయేగాక, దేశమును తయారు చేయండి” అని వారు చెప్పిరి. “మహాత్మాజీ ఆంధ్రదేశము తమ ఆజ్ఞలను తప్పక పాలించగలదు” అని నేనంటిని. ఆయన నవ్వి “ఆ సంగతి నాకు తెలియదా?” అని అనిరి.

లాహోరునుంచి తిరిగి వచ్చుసరికే సత్యాగ్రహసూచనలు ప్రబలినవి. 1930 జనవరి 26వ తేదీన స్వాతంత్ర్య ప్రతిజ్ఞ బహిరంగసభలలో చదవబడెను. ఫిబ్రవరి నాటికి ఉప్పుసత్యాగ్రహముమాట బయటకు వచ్చెను. మార్చిలో గాంధీజీ దండి ప్రస్థానము మొదలిడిరి. ఆ నెలాఖరుననే అహ్మదాబాదులో అఖిల భారత కాంగ్రెసు సంఘ సమావేశమును జరిగినది.

అప్పుడే జెయిలునుంచి బయటకువచ్చిన సాంబమూర్తిగారితోపాటు పలువురము అహ్మదాబాద్‌కు వెళ్లితిమి. ప్రస్థానంలోనున్న గాంధీజీని చూచుటకు బ్రోచ్‌మీదుగా జెంబూసర్‌నకు చేరితిమి. ఆనాడే మోతీలాల్‌నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ గారలు కూడా అచ్చటికి వచ్చిరి. సాయంత్రము తిరిగి గాంధీజీ బయలు దేరినప్పుడు మమ్ముల్నందర్నీ వెడలిపోవలసినదిగ చెప్పిరి. వృద్ధులగు మోతీలాల్‌గారు ముందుగనే మోటారులోనెక్కి కొంతదూరము వెళ్ళిరి. జవహర్‌లాల్ నెహ్రూగారు మాతోబాటు గాంధీజీ వెనుక నడుచుచుండిరి. కొంతదూరములోన్ను మోతీలాల్ గారి కార్ను గాంధీజీ చూచి “జవహర్, భాగో–భాగో” అనిరి. ఆయన “తిరిగి దర్శన మెప్పుడో” అని పలికి పరుగెత్తుకొని ముందుకుపోయి తండ్రిగారిని కలుసుకొనిరి. మేమున్నూ సాయంకాలము ప్రార్థన అయినతర్వాత సెలవుతీసుకొని బ్రోచీ తిరిగివచ్చితిమి.

ఉప్పు సత్యాగ్రహం

ఏప్రిల్ 5వ తారీఖున గాంధీజీ దేశమందంతటను ఉప్పును తయారుచేసే సత్యాగ్రహమును చేయవలెనను అనుజ్ఞనిచ్చిరి. ఆంధ్రరాష్ట్రంలో ప్రతి జిల్లాలోను వందలాది వాలంటీర్లనేక గ్రామముల్లో నడచి పర్యటించి సముద్ర ప్రాంతములకుచేరి ఉప్పుసత్యాగ్రహాలు చేసిరి.

మొట్టమొదట కాకినాడలో సాంబమూర్తిగారిని, వెన్నేటి సత్యనారాయణగారిని, డా॥సుబ్రహ్మణ్యంగారిని, నన్ను అరెస్టు చేసిరి. 1,2 రోజులలోగా అన్ని జిల్లాలోను ఆంధ్రనాయకులను అరెస్టుచేసి శిక్షలు వేసిరి. ఈ సందర్భంలోనే మొదటిసారిగా డా॥పట్టాభిగారు, ప్రకాశంగారు, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు మొదలగు పెద్దలు అరెస్టుఅయిరి. ఈ ఉప్పుసత్యాగ్రహ సందర్భంలో ఆంధ్రదేశంలో గొప్ప సంచలనమేర్పడి నాలుగువేలమంది జెయిలుకు వెళ్లుట తటస్థించినది. అందులో ముఖ్యముగా స్త్రీల సంఖ్య అనుకున్నదానికన్న హెచ్చుగానుండెను. అంత క్రితము దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మగారొక్కరే 1922లో జెయిలుకు వెళ్లుట తటస్థించెను. ఈ ఉద్యమంలో మల్పూరి చుక్కమ్మగారు, ఉన్నవ లక్ష్మీబాయమ్మగారు, కనకమ్మగారు వగైరా పెద్దలందరునూ జెయిలుకు వచ్చిరి. అనేక ప్రదేశములలో స్త్రీలు, పురుషులు కనపరచిన వీరత్వము ప్రభుత్వమును చకితులను చేసినది.

ఈ సందర్భములోనే శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారు, మద్రాసులో పోలీసు కమీషనరు కన్నింగ్ హాంను ఎదిరించిన ఘట్టము చరిత్ర ప్రసిద్ధమైనది. కాకినాడలో ఉప్పుమహల్ వద్ద భయంకరాచారిని హింసించిన కథకూడా ఆరోజుల్లో అందరునూ చెప్పుకొనెడివారు. ఆంధ్ర

యువకులను ప్రోత్సహించిన గేయములలో సుప్రసిద్ధమైనవి "దండాలు దండాలు భారతమాత" "మా కొద్దీ తెల్లదొరతనము", కోడేటి రంగాచార్లు గారి ఉప్పుసత్యాగ్రహం పాట. ప్రభుత్వముచే బహిష్కరింపబడిన ఈ పాటలు పిల్లలు పెద్దలు బహిరంగముగా పాడేవారు.

1931వ సంవత్సరం మార్చి నాటికి గాంధీ ఇర్విన్ ఒడంబడిక కుదురుటచే జైళ్ళనుండి అందరు విడుదల చేయబడిరి. ఆ నెలాఖరులోనే కరాచీలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ అధ్యక్షతను కాంగ్రెసు మహాసభ జరిగెను. మాలో కొందరము బొంబై నుండి కరాచీకి ఓడలో ప్రయాణము చేసితిమి. ఆ రోజుల్లో ఆంధ్రులకు శ్రీ కోటంరాజు పున్నయ్యగారు ప్రఖ్యాత పత్రికా సంపాదకులుగానుండి మాకందరకును అతిథ్యమొసంగిరి. ఉప్పుసత్యాగ్రహం జయప్రదమగుటవల్ల కారాచీలో కాంగ్రెసు ఎంతో ఉత్సాహవంతముగ జరిగెను. అచ్చటకు మాకు వచ్చిన ఒక తంతిలో వాడపల్లిలో కాల్పులు జరిగినట్లున్నూ, ఆరుగురు మరణించినట్లున్నూ, దేశమరాచకములో నున్నట్లు తక్షణము రావలసినదనిన్నీ తంతిలో ఉండెను. అది చూచుకొని నేను నామిత్రులూ పళ్లం రాజుగారు (జిల్లా బోర్డు ప్రెసిడెంటు) మండపాక రంగయ్యనాయుడు గారు లాహోరు ఢిల్లీలమీదుగా రాజమండ్రి చేరితిమి.

వాడపల్లిలో శ్రీ వెంకటేశ్వరాలయముగలదు. అచ్చట చైత్రశుద్ధ ఏకాదశికి ఉత్సవము జరుగును. ఆ సంవత్సరము రథముపై శ్రీ గాంధీజీ పటమునుంచిరి. డెప్యూటీ పోలీసు సూపరిండెంటు ముస్తఫాలీఖాన్ పటము తీసివేయమన్నా ప్రజానీకము నిరాకరించింది. ఆయన కాల్పులకు ఉత్తర్వుచేసిరి. ఆర్గురు మరణించిరి. ఆ ప్రాంతములో ప్రసిద్ధ నాయకులను నంబూరి జగ్గరాజు, నామన బాపన్న, పెనుమత్స సత్యనారాయణరావు, గారలతో సహా 36గురు ముద్దాయీలు అరెస్టుచేయబడిరి. ఏడెనిమిది వందలమంది రిజర్వు పోలీసులు గ్రామములలో తిరుగుచుండుటచే ఆ ప్రాంతము భయభ్రాంతమయ్యెను. నేను తిన్నగా ఉచ్చిలీ గ్రామంలో మకాంపెట్టి అన్ని గ్రామములు తిరిగి పోలీసుల జులుమునెదుర్కొనుటకు ప్రయత్నించితిని. తర్వాత ప్రకాశంపంతులు, పట్టాభిసీతారామయ్య, నాగేశ్వరరావు పంతులు, సాంబమూర్తి, డా॥ సుబ్రహ్మణ్యం వగైరా పెద్దలుకూడా వచ్చి తోడ్పడిరి. ఇందు విషయమై రాజమండ్రిసెషన్సుకోర్టులో అరునెలల కాలము విచారణ జరిగినది. ప్రజలు 15వేల రూపాయలు చందానిచ్చి తోడ్పడిరి. పోలీసు పక్షమున అనధికార సాక్ష్యము లభించలేదు.

శ్రీ శంకర నారాయణ అయ్యర్ అను ఆయన జడ్జి. వారు కూడ వాడపల్లివచ్చి స్థలమును పరీక్షించిరి. మాపక్షమున కీ.శే.చిత్రపు వెంకటచలం పంతులుగారు ఇతర పెద్దలు వాదించిరి. కేసులో అందరు ముద్దాయీలకు విడుదల లభ్యమయ్యెను. ఈ సందర్భంలో అరునెలల కాలము రాజమండ్రి నాళంవారి సత్రములో మకాం పెట్టవలసి వచ్చెను. ప్రజాభిప్రాయమునకు కల్గిన ఈ విజయమువల్ల ముస్తాఫాలీఖాన్‌కు మాపై చాలా కోపమువచ్చెను. అయినను సరకుచేయువారెవ్వరు? ఈయనను గురించి ఇంకా చెబుతాను.

1931 అరెస్టులు

గాంధీజీ రెండవ రౌండు టేబిల్ సమావేశంలో పాల్గొనుటకు లండనువెళ్ళి 1931 డిసెంబరు నెలాఖరుకు స్వదేశము తిరిగివచ్చి బొంబైలో రాజసన్మానము పొందెను. వారు తిరిగివచ్చుటకు పూర్వమే దేశములో తిరిగి నిర్బంధవిధానము కొనసాగించబడెను. జనవరి 4వ తేదీన మేము మద్రాసులోనుండగా గాంధీజీ అరెస్టు వార్తనుగూర్చి తెలియవచ్చింది. ఏదో టెలిగ్రాం ఇచ్చుటకు మౌంట్‌రోడ్డు పోస్టాఫీసులో కౌంటరు దగ్గర నిలబడి యుండగా, టెలిగ్రాములు తీసుకునే ఆయన నెమ్మదిగా గాంధీజీ అరెస్టును గూర్చి చెప్పిరి. మే మా సాయంకాలమే కాకినాడకు మెయిలుపెట్టెలో బయలుదేరితిమి. నిడదవోలు స్టేషను చేరుసరికి క్రితంరోజు సాయంత్రం కాకినాడలో వాలంటీర్లను లాఠీలతో కొట్టిరనియు, ఆ సందర్భములో సాంబమూర్తిగారికి దెబ్బలు తగిలి మరణించిరనియు పుకారు వచ్చెను. మాకు విచారము, ఉద్రేకము హెచ్చెను. తిన్నగా చామర్లి కోటచేరి పళ్లెంరాజుగారి కారుమీద కాకినాడకు వెళ్లితిని. పట్నములోకి వెళ్లు మార్గముననే జిల్లాబోర్డు ఆఫీసుమీద జెండా దింపించి, ఆఫీసుకు సెలవు ఇచ్చుటకు ఉత్తర్వుజారీ చేయబడెను. ఇంతలో సాంబమూర్తిగారు మరణించలేదనియు, గట్టిగా దెబ్బలుతిని ఆసుపత్రిలో అరెస్టులోనున్నారనియు, నిజవర్తమానము తెలిసి కొంత సంతోషించితిమి. కాని వారిని చూచుటకు మాకు సాధ్యపడలేదు. తక్షణమే సంప్రదించుకొంటిమి. అసలు కథ తెలియవచ్చినది. క్రితమురోజు సాయంత్రం కాకినాడలో దయానందరాజుగారి ఆధ్వర్యమున ట్రెయినింగు పొందుతున్న మిత్రులు క్యాంపును ముగించుకొని వెళ్లుటకు పైడా వెంకటాచలపతి పురమందిరమున జెండాభివందనము చేయుచుండగా డప్పుల సుబ్బారావు అను పేరుపొందిన సర్కిల్ ఇన్‌స్పెక్టరు అచ్చటకువచ్చి తీవ్రముగా లాఠీఛార్జీచేసి నటుల తెలియవచ్చినది. అందులో అప్పుడు గెడ్డం పెంచుకొని ఉన్న సాంబమూర్తిగార్ని నేలకు పడదోసి, గడ్డములాగి బూట్సుకాలుతో తన్నినట్టును, శ్రీమతి దుర్గాబాయమ్మగారు అడ్డువెళ్లి చాల దెబ్బలను తినినట్లును చెప్పిరి. అక్కడ జేరిన వాలంటీర్లను నిర్దాక్షిణ్యముగా కొట్టి రోడ్లపై పడవైచిరి. వారిని రాత్రి కొట్టుటచే సహాయపడువారు కూడా లేకపోయిరి. ఈ సంగతి మాకు తెలియగనే మోటారు బస్సులు తెచ్చి దెబ్బలుతిన్న వాలంటీర్లనందర్నూ చేర్చి వారి వారి తాలూకాలకు పంపివేసితిమి. ఆ రాత్రియే నేను, పళ్లంరాజు, డా॥సుబ్రహ్మణ్యంగారు సమావేశమై వీలయింనతవరకు మేము అరెస్టుకాకుండా చూసుకుంటూ శీఘ్రగమనముతో జిల్లాలో ఉద్యమమును పెంపొందించుటకు నిర్ణయించుకొని మర్నాడు ఉదయమున విడిపోతిమి.

పోలీసు జులుం

1932 జనవరి ఫిబ్రవరి నెలల్లో ఆంధ్ర దేశములో చెప్పలేనంత పోలీసుజులుము కొనసాగి లాఠీఛార్జీలు చెలరేగెను. ఈ నిర్బంధవిధానము ముఖ్యముగా తూర్పు గోదావరి జిల్లాలో మిన్నుముట్టెను. పైన చెప్పిన ముసఫలీఖాన్ అప్పుడు రాజమండ్రి డెప్యూటీ సూపరింటెండెంటుగా నుండెను. ఆయన చేసిన ఘాతుకకృత్యములు వర్ణింపవలసినవిగాదు. జైలుకు వెళ్ళినవారికంటె దెబ్బలుతిని క్షతగాత్రులైన వారి సంఖ్య పెచ్చుమీరెను. రాజమహేంద్రవరం పట్నములో రోడ్డుమీద సాగిల పడినవారందర్నీ సభలలో చేరిన వారందర్నీ చితుకకొట్టిరి.

అమలాపురంలో ప్రతిరోజూ కొంతమంది వాలంటీర్లను శాసనోల్లంఘనమునకు పంపించెడివారము. ఆ సందర్భములో చాలా లాఠీదెబ్బలు తిన్నవారు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగానున్న నందూరి బాపిరాజు గారు. వారిని చితుగగొట్టి అమలాపురం సబ్‌జైయిలులో పెట్టిరి. మరునాటి కార్యక్రమమును గురించి నేను ఏర్పాట్లు చేయుచుండగా డా॥సుబ్రహ్మణ్యంగారు అమలాపురం వచ్చిరి. సీతానగరం సత్యాగ్రహ ఆశ్రమము ముస్తఫాలీఖాన్ పోలీసుదళముతో ముట్టడింప వెళ్ళుచున్నారని వార్తతెలిసి మేమిద్దరము తక్షణము బయలుదేరి రాజమండ్రి చేరితిమి. వారు శ్రీనాళం చిన భీమరాజు గారింటివద్దదిగిరి. నేను తాలూకాబోర్డు ఆఫీసులోనుంటిని. రాత్రియగుసరికి సీతానగరమునుండి వచ్చిన వార్తలవల్ల అచ్చట మద్దూరి అన్నపూర్ణయ్య వగైరా మిత్రులను చాలా ఘోరముగా కొట్టిరనియు, రక్తస్రావమయ్యెననియు, ఆశ్రమము స్వాధీనము చేసుకొనబడెననియు కబురు వచ్చినది. డా॥ సుబ్రహ్మణ్యం గారు నన్ను అమలాపురం వెళ్ళిపోయి అక్కడ పని చూసుకొనవలసిన దనియు, తర్వాత కార్యక్రమమును చూసుకొని తిరిగి నన్ను కలుసుకొందుననియు చెప్పిరి. ఆ రోజుననే గోదావరి రైలు స్టేషనువద్ద వారపత్రిక చదువుకొనుచున్న వెన్నేటి సత్యనారాయణగార్ని, వారి బావమరిదిని, సామవేదం అచ్యుతరామయ్యగారిని ముస్తాఫాలీఖాన్ చితుకగొట్టెను. రెండురోజుల తర్వాత సీతానగరమునుండి తిరిగివచ్చి నాళం చిన భీమరాజుగారింటికి వెళ్ళి సుబ్రహ్మణ్యంగార్ని చినభీమరాజుగార్ని బలవంతముగా మెయిన్ బజారుకు లాగుకొని వచ్చి అక్కడ లాఠీలతో చితుకగొట్టి, అరెస్టుచేసిరి. సుబ్రహ్మణ్యంగార్కి పెద్దగాయములు తగిలెను. వారికి ఛాతిపై ఎముక విరిగెను. తర్వాత ఇందువిషయమై విచారణ జరిగి న్యా పి.వి.బాలకృష్ణయ్యర్ గారు ముస్తాఫాలీపై తీవ్రవిమర్శనాపూర్వకమైన తీర్పు ఇచ్చిరి. రెండురోజుల తర్వాత ముస్తఫాలీఖాన్ గారు అమలాపురం వస్తున్నారన్న కబురు వచ్చినది. క్రిమినల్ లా ప్రకారం అయిదుగురు ఒక చోట కూడిన గాని Unlawful Assembly గాజాలదు. నేను అప్పుడు సెంట్రల్ బ్యాంకుకు గౌరవ కార్యదర్శిని. బ్యాంకు భవనము నానుకొనే నేను నివసించే మా పినమామగారి మేడఉన్నది. నేను ఉదయముననే బ్యాంకుకు వెళ్ళి బ్యాంకుకు సెలవుయిచ్చి, బంట్రోతులను గూడా పంపించివేసి, కుర్చీలో ఒక్కడినే కూర్చొంటిని. ముస్తఫాలీఖాన్ అక్కడికి 100 గజముల దూరములో పోలీసు సిబ్బందితో నిలచియుండెను. సాయంత్రం 4 గంటలవరకు వేరొకమనిషి బ్యాంకులోకి రాలేదు.

అది వారికి నిరాశను కలిగించినది. రోడ్డుమీద ఏడెనిమిది జనము యేమి జరుగునో యని చూచుచుండిరి. నన్ను వచ్చి కొట్టుటకు ఆయనకు ధైర్యము చిక్కక, ఒక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ను పంపిరి. అప్పటికి ఆంధ్రపత్రిక వచ్చినది. కాలుమీద కాలువేసుకొని పత్రికను చదువుచుంటిని. సబ్ ఇన్‌స్పెక్టరు లోనికి వచ్చుటగూడా నేను గమనించలేదు. అతడు వచ్చి ఠపీమని ఒక చెంపకాయ కొట్టెను. నేను లేవలేదు. "I am arresting you-Come on.—— అని మరినాల్గు చెంపకాయలు తగిలించెను. నేనుకుర్చీపైనుండి లేచితిని. నేను కూర్చొన్న స్థలమునకును నా పడకగదికిని మధ్య ఖాళీస్థలము 20 గజములకంటె లేదు. ఆ గది వరండాలో నుండి జిగట విరేచనముతో బాధపడుతున్న నా భార్యయు, 80 సంవత్సరముల వయస్సు గల ఆమె నాయనమ్మయు చూచుచుండి కెవ్వుమనిరి. నేను నవ్వుతూ చేతితో సంజ్ఞచేసి రోడ్డుపైకి వచ్చితిని. ఈ సన్నివేశము నెటులో గ్రహించి రోడ్డుపైనున్న జనము వుద్రేకులైరి. 'బాబుగార్ని కొడ్తావా– నీ పని చూడు' అని కేకలు వేయసాగిరి. నేను చేతి సంజ్ఞచే వారిని సమాధానపరచి అప్పటికి అరెస్టు గాబడిన చాగంటి అచ్యుతరంగం గారితో సహా రోడ్డుమీద నడుచుచు మైలున్నర దూరములోనున్న జైయిలునకు పోతిమి. ముస్తాఫాలీఖాన్ జెయిలువద్ద నన్ను దుర్భాషలాడసాగెను. నేనును తిరగబడి కఠినముగానే సంభాషించితిని. తాలూకా ఆఫీసు మేజిస్ట్రేటు ఆఫీసులో వున్న ఉద్యోగులందరు నన్నేమి చేయునో అన్న ఆత్రుతతో కిటికీలలోనుండి చూడసాగిరి. ఏమైనను నన్ను చేయి చేసుకొనుటకు అతనికి ధైర్యము చిక్కలేదు. పిమ్మట అతను రాజమండ్రి వెళ్ళిపోయెను. మేము జెయిలుకానలోనికి చేరితిమి.

1934 ఎన్నికలు

ఇంకొక రెండు గంటలకు నన్ను కొట్టిన పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టరు నా గదివద్దకు వచ్చి "రెండుకాళ్లు పట్టుకుంటాను. నన్ను రక్షించండి" అని బ్రతిమాలసాగెను. 'ఏమిటయ్యా' అన్నాను. 'కాఫీ హోటలుకు వెళ్ళాను. అచ్చట జనం గుమిగూడి బాబుగార్ని కోడ్తావా? నీ పని పట్టేస్తాం' అని అల్లరి చేస్తున్నారు. నాకు భయంగా వుంది. మీరు రక్షించాలి అన్నాడు. 'సరే' అని అక్కడవున్న వారిలో పెద్దవారి నెవరినైనా తీసుకురమ్మని కానిస్టేబిల్‌ను పంపించి వచ్చిన వారితోటి కఠినముగా దౌర్జన్యం చేయవద్దని మందలించి పంపించి వేసితిని.

తర్వాత శిక్షపడెను. కడలూరుపోయితిమి. ఆసారి నాకు ఆరుమాసములే శిక్ష. జెయిలు నుంచి తిరిగివచ్చినతర్వాత ఇపుడు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావిపాటి రామారావునాయుడుగారికి నాకు జిల్లాబోర్డు ఎన్నికకు పోటీ జరిగి నేనే నెగ్గగలిగితిని. అప్పటినుండి వారు నేనూ మిత్రులమైతిమి.

1934వ సంవత్సరములో కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు రాష్ట్ర కాంగ్రెసు సంఘాధ్యక్షులు, అయ్యదేవర కాళేశ్వరరావుగారు ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులలో నేనొకడను. ఆ సంవత్సరమే కేంద్రశాసనసభకు ఎన్నికలు జరిగినవి. కాంగ్రెసు అభ్యర్థులందరూ విజయము పొందిరి. నాగేశ్వరరావుపంతులుగారి తరఫున నేను శ్రద్ధగా పనిచేసి వారి ప్రేమకు పాత్రుడనైతిని. వారితో పోటీచేసిన సనాతన పార్టీ అభ్యర్థికి డిపాజిట్టుకూడా పోయెను.

ఈ ఎన్నికలోనే వాణిజ్య నియోజకవర్గం తరఫున శ్రీ స్వామి వెంకటాచలం శెట్టిగారు సర్ షణ్ముగం చెట్టి గారిని ఓడించి కాంగ్రెసునకు అఖండవిజయము చేకూర్చిరి.

1935–36వ సంవత్సరములలో ఆంధ్ర కాంగ్రెసు వ్యవహారములు శ్రుతిమించిరాగమునపడెను. పెద్దనాయకులలో తీవ్ర భేదాభిప్రాయములుదయించెను. నేను, నా మిత్రులూ, అధిక సంఖ్యలో నుండి శ్రీ ప్రకాశంపంతులుగార్ని సాంబమూర్తిగారిని బలపరచెడివారము.

ఆ వివరములన్నియు ఇచ్చట వ్రాయదలచుకొనలేదు. 1937వ సంవత్సరములో రాష్ట్ర శాసన సభ ఎన్నికలు జరిగెను. ఆ ఎన్నికలలో కాంగ్రెసుకు అఖండవిజయము ప్రాప్తించెను. తూర్పుగోదావరి జిల్లాలో "పీపుల్స్‌పార్టీ" ఉద్భవించి పీఠాపురం రాజాగారికిని, పళ్ళంరాజుగారికిని, యువరాజాగారికిని నాకునూ, తీవ్రమగు పోటీ జరిగెను. మేమిర్వురమూ నెగ్గితిమి. ఈ ఎన్నికలలోనే మహారాజులు, జమీందారులు ఓడిపోయిరి.

కొంత కాలము కాంగ్రెసు మంత్రివర్గమును స్వీకరించలేదు. మంత్రివర్గమును స్వీకరించిన తర్వాత ప్రకాశం పంతులుగారు రెవెన్యూ మంత్రిగను, గిరిగారు కార్మిక శాఖ మంత్రిగను, గోపాలరెడ్డిగారు స్థానిక సంస్థల మంత్రిగను తీసుకొనబడిరి.

రాష్ట్ర కాంగ్రెసు సంఘమునకు శ్రీ పట్టాభి సీతారామయ్యగారు అధ్యక్షులుగను, గొట్టిపాటి బ్రహ్మయ్యగారు ప్రధాన కార్యదర్శిగను ఏర్పడిరి. ఈ సందర్భములోనే శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రప్రథమంగా రాష్ట్ర కాంగ్రెసు సంఘ రాజకీయములలోకి వచ్చి సంయుక్త కార్యదర్శి అయిరి. అప్పటినుండి రెండు సంవత్సరములు మేమిద్దరము రాష్ట్ర కాంగ్రెసు సంయుక్త కార్యదర్శులుగా నుండుటయూ, తర్వాత నేను ప్రధాన కార్యదర్శిని, వారు సంయుక్త కార్యదర్శులగుటయు, తర్వాత ఇద్దరమూ మంతెన వెంకట్రాజుగారితో కలసి ప్రకాశంగారి ఆధ్వర్యక్రిందను వ్యక్తి సత్యాగ్రహోద్యమము, 'క్విట్ ఇండియా' ఉద్యమము నిర్వహించుటయు జరిగినది.

1940వ సంవత్సరములో తిరిగి ప్రకాశంగారు రాష్ట్ర కాంగ్రెసు సంఘ ప్రధాన కార్యాలయము బందరునుండి చెన్నపట్నమునకు మార్చుట జరిగినది. తర్వాత తిరిగి బెజవాడకు కొనిరాబడినది. 1940 నవంబరు నెలలో వ్యష్టి సత్యాగ్రహోద్యమము మొదలిడెను. ప్రకాశంగారు మొట్టమొదటనే సత్యాగ్రహంచేసి జెయిలుకు వెళ్ళిరి. డా॥పట్టాభిగారు ఆ విధులను నిర్వర్తించెడివారు. ఆంధ్రదేశమునుండి మొదట సత్యాగ్రహాలు లిస్టులను తీసుకొని నేను వార్ధాకు పోతిని. గాంధీజీ నన్ను జెయిలుకు వెళ్ళవద్దనియు, పట్టాభిగారితో కలసి బయటి కార్యక్రమము నిర్వర్తించవలెననియు ఆజ్ఞాపించిరి. 4 నెలల కాలము అటులచేసి ఆంధ్రదేశములో ప్రతి జిల్లాయందును సత్యాగ్రహ కార్యక్రమమును అఖండముగా నిర్వర్తించితిమి.

మార్చి నెలలో పట్టాభిగారిని డిటెన్షనులో పెట్టి, నన్ను ఆరు నెలలు శిక్షించిరి. శిక్షకు 4 రోజుల పూర్వము వార్ధాలో నుంటిని. నాడక్కడ మహదేవ్‌దేశాయి గారు లేరు. నేను 1500 పేర్లుగల లిస్టును తీసుకొని వెళ్ళితిని. గాంధీజీ ఆశ్రమములో నున్న కృపాలానీగార్ని పిలచి నాలిస్టును ఆమోదించవలసిందని చెప్పిరి. కృపాలానీగారు సరే–చూచి పంపిస్తాను వెళ్ళండి అనిరి. గాంధీజీ – "That is a list from Andhra brought by Mr.Venkata Rao. You need not scrutinise it. Endorse it and give it away—— అనిరి. కృపాలానీగారు సంతకముచేసి ఇచ్చివేసిరి. ఇంతలో గాంధీజీ తపాలువచ్చెను. వారు ఉత్తరములు తిరుగవైచుకొనుచు అందులో చేరిఉన్న ఒక టెలిగ్రాంను నాకు ఇచ్చిరి. ఆ టెలిగ్రాం వారి కేరాఫ్ నాకు వచ్చెను. నేను చదువుకొని నవ్వుతూ "I will not have the pleasure of coming here for some time—— అందులో మద్రాసులో నాగదిని పోలీసులు పరిశోధించి నటులవున్నది. "You must have bribed the Police. Else how could you have stayed out for three months working as you did" అని గాంధీజీ నవ్విరి. ఇంటికి రాగానేపైన చెప్పినటుల శిక్షపడినది.

ఆలీపూర్ జెయిలునుండి డిటెయిన్‌చేసి రాయవేలూరు తీసుకొనివచ్చిరి. ఆచ్చట శ్రీ పట్టాభిగారితోను, సాంబమూర్తిగారితోను, సంజీవరెడ్డితోను కలుసుకొంటిని. కొంతకాలమునకు పెద్దలనందరునూ విడుదల చేసి నన్నూ, సంజీవరెడ్డిగారిని జెయిలులోనే వుంచిరి. జెయిలులో నేను, సంజీవరెడ్డిగారు, ఆలూరు సత్యనారాయణరాజు ఎంతో స్నేహముగా దగ్గరగా ఉండి అనేక విషయములు చర్చించుకుంటూ టెన్నిస్ ఆడుకుంటూ ఉండేవారము. సంజీవరెడ్డి గారు మంచి టెన్నిస్ ఆటగాడు. నాకు టెన్నిస్ చేతగాకపోయినప్పటికీ ఆయనతో పార్టనర్‌గా వుండి అన్ని జెయిలు టోర్నమెంటు నెగ్గేవాళ్ళము. 1942 జనవరిలో నన్నూ, మార్చిలో సంజీవరెడ్డిని విడుదల చేసిరి. అందరమూ కలిసి తిరిగి కాంగ్రెసు కార్యకలాపాలను నెరవేర్చుకొంటిమి. ఈ కాలములోనే రాజగోపాలాచారి గారికి ప్రకాశం గారికి తగవు ప్రాబల్యము చెందెను. నాల్గునెలలు తిరగకుండానే ఆగష్టు క్విట్ ఇండియా ఉద్యమము వచ్చినది. వీటిలో మేము నేరవేర్చిన పాత్రలు పెద్ద చరిత్ర కాగలదు.

ఈ తరువాత చరిత్రను గూర్చి చదువరులకు ప్రస్తుతము శ్రమనియ్యదలచుటలేదు. ఇది ఆంధ్రవారపత్రిక స్వర్ణోత్సవ సంచిక. కొలది సంవత్సరములలోనే ఆంధ్రప్రతిక వజ్రోత్సవ సంచిక కాగలదు. ఆ సందర్భములో మిగిలిన 20 సంవత్సరాల ఆంధ్రరాజకీయముల సంగ్రహ చరిత్రమును తిరిగి పాఠకులకు నివేదించగలను.

(ఆంధ్ర వారపత్రిక, 14–1–59)

'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు

ప్రజలు చేసిన అపార త్యాగ ఫలమే నేటి మన స్వరాజ్యం

యుద్ధకాండ ముగిసినది. దేశములోని ప్రజలు చేసిన త్యాగఫలితముగ విజయము లభించినది. యింగ్లీషు ప్రభుత్వము వారు దేశమును వదలిపెట్టి యీ రోజుననే తమ సమస్త సిబ్బందులతో కూడా వారి దేశమునకు పోవుటకు నిశ్చయించుకొన్నారు. పోకమునుపు బ్రిటిష్ పార్లమెంటులో యీ సంవత్సరము జూలై నెల రెండవతేదీన చట్టమును ప్యాసుచేసి వారికి యీ దేశము మీద ఉండే హక్కులన్నింటినీ యీదేశములోని ప్రజలకు చట్టరూపకముగ దఖలు పరచుటకు, యీ రోజున అనగా ఆగష్టు పదునైదవ తేది స్థిరపరచియున్నారు. ఇటువంటి విజయముకాని, దీనిని సంపాదించిన సత్యము అహింసలతో కూడు కొన్న సత్యాగ్రహ యుద్ధముకాని కోట్లకొలది ప్రజల వలన చేయబడడమునుది ప్రపంచ చరిత్రలో ఏ యుగములోనకూడ జరిగియుండలేదు. ఈ మహా సంగ్రామములో ఆంధ్రులు అన్ని విషయములలోను అగ్రస్థానము వహించి జయము చేకూర్చుటలో తోడ్పడియున్నారు.

సత్యాగ్రహమనే నూత్నాస్త్రం :

మహాత్మాగాంధీ వలన ఏర్పరుచబడిన యీ మహాయుద్ధమున సైనికులు నిర్మాణ కార్యక్రమ రూపముగ యుద్ధమును సాగించినారు. సత్యాగ్రహమనే నూతన ఆయుధముతో సర్వప్రజలు ఇరవైఐదు సంవత్సరములుగ శత్రువును చంపకుండ మరియేహాని చేయకుండ కాంగ్రెసు మహాసభయొక్క శిక్షణకు లోబడిన వారై యీ మహా యుద్ధమును నడిపియున్నారు. సత్యాగ్రహములో పాశుపతాస్త్రమువంటిది పన్నుల నిరాకరణ. దేశమంతటిలోను గుజరాతు రాష్ట్రములో ఒక చిన్న తాలూకా బార్డోలీలో యీ పాశుపతాస్త్రమును ప్రవేశపెట్టవలయునని గాంధీగారు తీర్మానించుకొన్నారు. కాని గాంధీగారి ప్రథమ శిష్యులలోనివారైన శ్రీ దేశభక్త వెంకటప్పయ్య, గొల్లపూడి సీతారామశాస్త్రులుగార్లు గుంటూరు జిల్లాలో పెదనందిపాడు ఫిర్కాలో నూరు గ్రామాలలో యీ పన్నుల నిరాకరణ సత్యాగ్రహమును ప్రవేశపెట్టినారు. కాని జిల్లాలోని ప్రజలందరు కూడ పన్నులు నిరాకరించి నాలుగు మాసముల వరకు ఒక్క రూపాయైనను పన్ను చెల్లించకుండ ఉండినారు. దాని వల్ల రెవెన్యూ డిపార్టుమెంటు ఉద్యోగస్థులకు ఎవ్వరికి కూడ జీతములనిచ్చుటకు జిల్లా కలెక్టరుకు సాధ్యము కాకపోయినది. అప్పుడు రాష్ట్ర కమిటీవారు, నిర్బంధవిధానమునకు ప్రజలు నిలువలేరని గ్రహించి పన్నులు చెల్లించవలెనని ఉత్తర్వుచేసిరి. వారం రోజులలో పన్నులు పూర్తిగ చెల్లించబడినవి. ఇటువంటి పన్నుల నిరాకరణ సత్యాగ్రహము ఇండియాలో ఇంత జయప్రదముగా ముప్పయి ఒక్క సంవత్సరములు జరిగియుండలేదు. బార్డోలీలో మాత్రము

జరిగియుండినది. ఈ గొప్ప ఆయుధమును ఉపయోగింపవలసిన అవసరము లేకుండగనే స్వతంత్ర విషయమును పొందుటకు సాధ్యమైనది. ప్రజాశక్తి యొక్క నిజస్వరూపము దీనివలననే వెల్లడిచేయబడినది.

ఆంధ్రుల అగ్రస్థానం :

ఉప్పు సత్యాగ్రహము మొదలైన యుద్ధములలో కూడ ఆంధ్రులు అగ్రస్థానము వహించి పనిచేసియున్నారు. నాగపూరులో జరిగిన జాతీయ జెండా సత్యాగ్రహములో జమ్నలాల్ బజాజ్ అరెస్టు అయిన తర్వాత ఎనభైమంది మాత్రమే జైలుకు పోయియుండిరి. ఎనభై ఒకటవ మనిషి ఆ రాష్ట్రంలోనుంచి రాలేకపోవుటచే ఆంధ్రరాష్ట్రమునుండియే ఒక కాంగ్రెసు ప్రచారకుడు కాలినడకమీదనే పోయి సత్యాగ్రహమును నడిపినాడు. వీరు చూపించిన మార్గమునే ఇతర రాష్ట్రములవారు చూపించుటచే జాతీయపతాక సంగ్రామము నిర్విఘ్నముగ సాగినది. ముప్పై ఒక్క సంవత్సరములు నిర్మాణ కార్యక్రమము ఆచరణలో పెట్టుటలోనేమి, యుద్ధరంగములలో పనిచేయుటలోనేమి ఆంధ్రులు అగ్రస్థానము పొందియున్నారు.

ఈ చరిత్ర ఇతర రాష్ట్రములలోని ప్రజల చరిత్రలతోపాటు వ్రాయబడవలసియున్నది. ఇటువంటి విజయమును సమకూర్చుటకు తోడ్పడినందుకు ఆంధ్రులందరు గర్వపడవలసియున్నది. శిక్షణ విషయంలో ఆంధ్రులు ముఖ్యస్థానము పొందియున్నారు. జైలు ప్రోగ్రాము ఏర్పడినప్పుడెల్ల ఆంధ్రులు– స్త్రీ పురుషులు –జైళ్ళను నింపింపజేసి యున్నారు. ఈ కార్యక్రమములన్నియు యింగ్లీషువారి ఎదుర్కొని మేము మీ దేశములోనుండి వెళ్లిపోతామని యింగ్లీషువారు చెప్పేవరకు చేయబడిన కార్యక్రమము.

కాంగ్రెసు ప్రభుత్వము ఏర్పడినప్పుడు కూడ ప్రజలే ప్రభుత్వము చేయుచున్నారని నిర్మాణ కార్యక్రమమున ప్రజలకు మంత్రులు దారిచూపుచు ప్రజలచే చేయించిరి. అన్ని రాష్ట్రములలోకన్న ఆంధ్రప్రజలు ప్రజాప్రభుత్వము ఎటువంటిదో గ్రహించి స్థాపించుటకు చేయవలసిన కార్యక్రమములను గ్రహించి, స్థాపించిన పిదప ప్రజల ప్రతినిధులే ప్రజలకు వ్యతిరేకముగ నడుచుకొన్నప్పుడు వారినికూడ ఎదుర్కొని వారి ప్రతినిధులకు ప్రజాశక్తి ఎటువంటిదో, ప్రజలకు వ్యతిరేకముగ వారి ప్రతినిధులు, మంత్రులు నడుచుకొనకుండఉండేలాగున, వారితప్పులను దిద్దుకొనేలాగున కాంగ్రెసు శిక్షణకు లోటుచేయకుండ వారి శక్తిని దేశములోని యితర రాష్ట్రముల వారికేగాక ప్రపంచములోని ప్రజలందరికి వెల్లడిచేసియున్నారు.

ఇంతటి మహాశక్తియుతులై జయమును చేకూర్చిన ఆంధ్రులలో కూడ ఆఖరురోజులలో బలహీనత ప్రవేశించుట రాష్ట్రము యొక్క బలమునకు క్షీణత కలిగినది. కాని యీ క్షీణతను నశింపచేసి అందరు ఏకమై ఒక దారిన నడిచేలాగు చేసేశక్తి ప్రజల చేతులలోనే ఉన్నదని వెల్లడిచేసియున్నారు. దీనికి ఫలితముగ చిరకాలము నుంచి ఆందోళన చేయబడుచున్న ఆంధ్రరాష్ట్ర సమస్యకూడ ఆంధ్రదేశములోని ప్రజలే పరిష్కారము చేసికొనుటకు శక్తి గలవారై యున్నారు. దేశనాయకులు కూడ ఆంధ్రదేశము తమిళదేశమునుండి విడిపోవుటకు అంగీకరించియున్నారు. రాబోవు ప్రజాపరిషత్తు సమావేశములో యీ విషయము పరిష్కరింపబడుటకు సిద్ధముగ ఉన్నది. దేశనాయకులు ఆంధ్ర రాష్ట్రము త్వరలో నేవచ్చునని ప్రజలకు చెప్పమని నాకు కొద్దిరోజులు క్రిందట ఢిల్లీలో చెప్పియున్నారు.

దేశ స్వాతంత్ర్యము సంపాదించబడినది. ఆంధ్రరాష్ట్రము సంపాదించినట్లే గ్రహించి ముందు కార్యమునకు ఒక్కటై యిదివరకు చేసిన తప్పులవల్ల గుణపాఠమును గ్రహించి ప్రజారాజ్యమును ఆంధ్రరాష్ట్రములో స్థాపించి ప్రజాప్రభుత్వము నడిపించుటలోకూడ అన్ని రాష్ట్రములకంటె అగ్రస్థానము వహించి ఆంధ్రులు యితర రాష్ట్రములకు మార్గదర్శకులు అగుదురుగాక! దిగ్విజయముతో పాటు కలిగిన విభజన కళంకమును త్వరలోనే తీసివేయుటకు దేశములోని కేంద్ర ప్రభుత్వమునకు తోడ్పడుదురుగాక! ఆంధ్రనాయకులు ఆంధ్రప్రజలు కులభేదములు సమత భేదములను తలయెత్తకుండ చేయుటకు యిదివరలో సర్వవిధముల ప్రయత్నము చేసియున్నారు. ఇకముందు కూడ అట్లు చేయుటకు శక్తికలిగియుండవలసిన కాలము తటస్థించినది. ఇప్పుడే అన్ని విధముల బలమును చేకూర్చుకొని కూడుగుడ్డలకు లోటులేకుండ, పేదవారు ధనవంతులు అను భేదములేకుండ సర్వప్రజలకు సౌఖ్యమునిచ్చే ప్రభుత్వమును ఆంధ్రులు స్థాపించి యితర రాష్ట్రములకు మార్గదర్శకులు అగుదురు గాక! దిగ్విజయముతోపాటు కలిగిన విభజన కళంకమును త్వరలోనే తీసివేయుటకు దేశములోని కేంద్రప్రభుత్వమునకు తోడ్పడుదురుగాక!

(ఆంధ్రపత్రిక ఆగష్టు 15, 1947)

వేముల కూర్మయ్య

మాతృదేశ దాస్యవిముక్తికై ఆంధ్రహరిజనుల శక్త్యానుసార కృషి

హరిజనులు భారతదేశములో సుమారు 7 కోట్లమంది కలరు. ఏ కొద్ది మందో క్రైస్తవ మతములో కలిసినవారు తప్ప మిగిలిన హరిజనులందరూ జాతీయోద్యమములో దుమికి భారతదేశ దాస్యవిముక్తికి వారి శక్త్యానుసారము కృషిచేసినారని చెప్పుటలో అతిశయోక్తియేమియునులేదు. భారతదేశమునందున్న హరిజన నాయకులకు మహాత్మాగాంధీగారి ఉద్యమముతో పూర్తి నమ్మకము కలిగి, వారు చెప్పినట్లు స్వదేశీ పోరాటములో దుమికినారని చెప్పుటలో ఏమియూ ఆశ్చర్యములేదు. గాంధీగారు 1921వ సం॥ వర్కింగు కమిటీలో ఖద్దరు ధారణ, అస్పృశ్యతానివారణ, హిందూ ముస్లిం సఖ్యత తీర్మానాలు చేయించిన దాదిహరిజనులకు మహాత్మునిపై, మహాత్ముని ద్వారా కాంగ్రెసు భక్తి దినదినాభివృద్ధినొందినది. 21కి పూర్వము హరిజనులలో ఏమాత్రమునూ రాజకీయ చైతన్యములేదు. భారతదేశమంతటా వ్రేళ్లమీద లెక్కపెట్టగలిగినంతమంది మాత్రమే పట్టభద్రులు కలరు. మహాత్మాగాంధీగారు హిందూమతమునకు హిందూదేశమునకు కళంకమైన అస్పృశ్యతను రూపుమాపుటకు కాంగ్రెసు సంస్థ ద్వారా 1920 నుంచి పూనుకొని హిందూ సంఘములో గొప్పమార్పును తేగల్గుటయే హరిజనులకు కాంగ్రెసుపై భక్తి ఇమిడి స్వరాజ్యమురానిది హరిజనుల దుస్థితి గూడా పోదని దృఢవిశ్వాసము కల్గియుండిరి.

1919 సంస్కరణలు :

1919 సంస్కరణల్లో గూడా హరిజనులకు ఏ విధమైనటువంటి ఎన్నిక హక్కుగాని, శాసనసభలలో ప్రత్యేస్థానములుగాని లేవు. ఈ సంస్కరణలలో గత ప్రపంచయుద్ధానికి పూర్వముగూడా 7 కోట్లుమంది హరిజనులకూ బ్రిటీషు గవర్నమెంటువారు గమనించకపోవుటచేత, వారు హరిజనులకు ఏ మాత్రము సహాయము చేయలేరను నమ్మకము కలుగుటచేత, ఏకొద్ది మంది చదువుకున్న హరిజనులు కూడా కాంగ్రెసు ననుసరించి, స్వరాజ్యము పొందిననేగాని వారి భావిభావోద్యమమునకు వీలులేదని తలంచి, హరిజన నాయకులు, హరిజనులు మొత్తం మీద 100కి 95 మంది కాంగ్రెస్‌లో చేరగల్గిరి.

ఆంధ్రదేశములో ప్రప్రథమ పంచమ మహాజనసభ 1917 సంవత్సరము బెజవాడలో గూడూరి రామచంద్రరావు పంతులుగారి ఆధ్వర్యమున కీ.శే. భాగ్యరెడ్డివర్మగారి అధ్యక్షతక్రిందను, సుదు వెంక్రటావుగారి ఆహ్వాన అధ్యక్షత క్రిందను బ్రహ్మాండముగా జరిగెను. ఆ దినమునుండియే హరిజనులలో రాజకీయ చైతన్యము కలిగెను. కీ.శే. నాగేశ్వరరావుపంతులుగారు, డా॥పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, గూడూరు రామచంద్రరావుగారలు 1917కు పూర్వమే

హరిజనులను వారి ఇండ్లలో అస్పృశ్యత పాటించక ఉంచుకొనుటవల్ల హిందూ సంఘము వారిని తాత్కాలికముగా వెలివేసినది. చివరకు వారే ఆ సంఘముచేతనే పూజింపబడిరి.

దేశోద్ధారకుని దోహదం :

1916లో కీ.శే.నాగేశ్వరరావు పంతులుగారిచే వారితల్లిగారి పేరిట స్థాపించబడిన శ్యామలా ధర్మ పాఠశాలలో హరిజనులకు ప్రవేశమును పంతులుగారిచ్చుటచేత అగ్రహారమగు ఎలకుర్రు గ్రామ వాస్తవ్యులు పాఠశాలను బహిష్కరించిరి. కాని పంతులుగారు "నా తల్లిగారి పేర స్థాపించబడిన పాఠశాలలో చదువులకు హరిజనులకు, బీదజనులకు గూడా తప్పక స్థానము ఇచ్చెదను. మీ కిష్టము లేకున్న మీరు పాఠశాలకు రాకుండా మానవచ్చు"నని చెప్పిరి. నాల్గయిదు రోజులు రాకపోయినా, మరల పిల్లలందరూ రాజొచ్చిరి. ఈ పాఠశాలలో చదువుకున్న హరిజనులు ఎంతోమంది వృద్ధిలోకి వచ్చిరి.

నేను ఆ పాఠశాలలో చదివినవాడనే. వేమూరి రాంజీరావు, నల్లపాటి హనుమంతరావు, కీ.శే. వెల్లంకి కృష్ణమూర్తి, మంగిపూడి వెంకటశర్మ, చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారల ప్రబోధమువల్ల ఆంధ్ర హరిజననాయకులు, హరిజనులు గాంధీగారు హరిజనులకు చేయుసేవ ననుసరించి కాంగ్రెసులోకి రాగల్గిరి. ముఖ్యముగ మంగిపూడి వెంకటశర్మ 'నిరుద్ధ భారతము' అను కావ్యము హరిజనులలో ఎంతో సాంఘిక రాజకీయ చైతన్యము కలుగజేసినది. తదుపరి హరిజనులలో గూడా కవులు బయలుదేరి కీ.శే. కుసుమ ధర్మన్న, సుందు వెంకయ్య మొదలైనవారు వారి పాటలు, పద్యముల ద్వారా సంఘములో ప్రబోధమును ఎంతో కలుగజేసిరి.

కాంగ్రెసు ప్రబోధం :

కీ.శే. నరాలశెట్టి దేవేంద్రుడు గారు చాలాకాలము ఆంధ్రహరిజన సంఘమునకు పెట్టనిగోడవలె నాయకులుగా ఉండిరి. ఉప్పు సత్యాగ్రహములో నాబోటికొందరు హరిజన యువకులు దిగి దేశమునకు తమ సంఘము తరపున ఎంతో సేవ చేయగల్గిరి.

హరిజనులలో కాంగ్రెసు ప్రబోధము వలన కల్గిన చైతన్యమువల్ల కొంతమంది యువకులు ఆ రోజులలో కాంగ్రెసు నాయకులు గాంధీగారు చెప్పిన సిద్ధాంతములను అమలుపరచుటలేదని అట్లు అమలు పరచుట కాంగ్రెసువారి ధర్మమని వాదోపవాదములు కాంగ్రెసు సంస్థలతోను, కాంగ్రెసు నాయకులతోనూ చేయుచుండిరి. ఈ వాదోపవాదము చెయ్యగల ధైర్యము మహాత్మాగాంధీగారే దేశమునకు భిక్షపెట్టిరి. తదుపరి హరిజనులకు 1919 చట్టము ప్రకారము ఏ విధమైనటువంటి రాజకీయ హక్కులను రాకపోవడమే గాక ఏ కొద్ది మందినో హరిజనులకు ప్రతినిధులను కాని కొద్దిమంది హరిజనులను, అగ్రజాతులవారిని ప్రతినిధులుగా గవర్నరుగారు నామినేటు చేయుచూవచ్చిరి. అందరికీ ఎన్నికలుండి హరిజనులకు మాత్రమే నామినేషను ఉండటంవల్ల జాతిని లెక్కసేయక అణగద్రొక్కబడినజాతి పురోభివృద్ధికి కంటకులుగుచున్నారని హరిజనులలో నూత్న ఆందోళనకల్గెను. ఈ ఆందోళనకు ముఖ్యముగా మహాత్మాగాంధీగారు, ఆంధ్రదేశములో శ్రీ గూడూరు రామచంద్రరావు, కీ.శే.నాగేశ్వరరావు, పట్టాభిగారు ముఖ్యముగా కారకులు. ఆంధ్రపత్రిక హరిజనాభివృద్ధికి ముఖ్యముగా, ఆ రోజులలో ఆదిమాంధ్ర మహాసభలు ఏ మూలను జర్గిననూ పెద్ద అక్షరములతో వేయుచూ ప్రతి మహాసభను గూర్చి సంపాదకీయములు వ్రాయుచుండెడివారు. ఈ సందర్భములలో కీ.శే. నాగేశ్వరరావు గారు, చల్లా శేషగిరిరావుగారు, అవటపల్లి నారాయణరావుగారలను ప్రశంసనీయులు. ఆంధ్రపత్రికద్వారానే ఆంధ్రదేశములో నేటివరకునూ హరిజననాయకులూ, హరిజన సంఘము ఎప్పుడూ కాంగ్రెసు ఆధ్వర్యముననే ఉన్నవి.

పూనా ఒడంబడిక :

రెండు రౌండు టేబిల్ సభలయందును హరిజనులతరపున దివాన్ బహదూర్ ఆర్.శ్రీనివాసన్, డా॥అంబేద్కరుగారలు నామినేటు చేయబడిరి. రెండవ రౌండు టేబిల్ సభకు మహాత్మాగాంధీగారు హాజరై హరిజనులకు ప్రత్యేకపు టెన్నికలవల్ల శాశ్వతముగా అస్పృశ్యత ఉండుననియు, ఒక్క సంయుక్త నియోజక వర్గములద్వారానే అస్పృశ్యతను బాపవచ్చుననియు చెప్పుచూ, అందుకు తన ప్రాణమునైననూ బలిఇచ్చెదనని ఆరోజున ఆ సభలో ఉద్ఘాటించిరి. బ్రిటిషుగవర్నమెంటువారు ప్రత్యేక ఎన్నికలతో హిందూదేశమునకు కమ్యూన్ అవార్డు అను పేరుతో హరిజనులకు అన్ని శాసనసభలలోను 72 స్థానములను మాత్రమే ఇచ్చిరి. మదరాసుకు 18 స్థానములు మాత్రము వచ్చెను. మహాత్మాగాంధీగారు చెప్పిన విధముగానే ప్రాయోపవేశమును ఎర్రవాడజెయిలులో ప్రారంభించి ప్రత్యేకపు టెన్నికలను రద్దుపరచగలిగిరి. ఇతర రాష్ట్రములనుండి హరిజనుల నాయకులు, అగ్రజాతి నాయకులు కీ.శే.పండిత మదనమోహన మాలవ్యాగారి అధ్యక్షతను బొంబాయిలో సమావేశమై పూనా ప్యాక్టును అమలులోకి తీసుకురాగలిగిరి. డా॥అంబేద్కరుగారు గూడా రెట్టింపు స్థానములు గాంధిగారి దయవలన హరిజనులకిచ్చుటచే పూనా ఒడంబడికకు సమ్మతించిరి.

పూనా ఒడంబడిక వలన హరిజనులకు త్రాణగల్గి అన్ని రాష్ట్రములలోనూ హరిజన శాసనసభ్యులసంఖ్య ఎక్కువ అగుటచేత రాష్ట్రప్రభుత్వములు, రాష్ట్ర నాయకులతోగూడా పూనా ఒడంబడిక శక్తిని గ్రహించి హరిజనోద్ధరణకు పూనుకొనిరి. గాంధీగారు రౌండు టేబిల్ సభకు వెళ్లేటప్పుడు నాసికలో రాజభోజగారి అధ్యక్షతను జరిపిన నల్లజెండా ప్రదర్శనమును లండనునుంచి తిరిగి వచ్చునప్పుడు అంబేద్కరుగారి అనుచరులు, ఆయన అనుచరులు బొంబైలో జరిపిన నల్లజెండా ప్రదర్శనమునూ ఎప్పటికినీ మరపురానివి. రాజభోజగారు ఇప్పటివరకును బ్రిటిషు వారికి గులాములవలె కాంగ్రెసును ఎదిరించుచూ ఈ రోజున యు.పి.గవర్నమెంటుపై సత్యాగ్రహము చేయగా అరెస్టు చేయబడి ఖైదులో ఉంచబడిరి. డా॥అంబేద్కర్

ప్రతిభావంతుడగుటవలన ప్రజాపరిషత్తు సభ్యులైనప్పటినుంచి, హరిజనుల బాగోగులు మెజారిటీ కులములవారి సహకారముపై ఆధారపడివున్నదని గ్రహించుకొని గత 15 సంవత్సరములనుండి ప్రత్యేక ఎన్నిక, ప్రత్యేక వసతి వల్లనే హరిజనులకు విమోచనము కలుగునని చెప్పుచుండిన మార్గమును మార్చుకొనుట ముదావహము. వారే తిరిగి సంయుక్త ఎన్నికల ఒప్పుకొనిరి. ఏ కొద్దిమంది హరిజననాయకులలో కాంగ్రెసు ప్రవాహమునకు, కాంగ్రెసు త్యాగమునకు వ్యతిరేకించిననూ, తిరిగి కాంగ్రెసు ప్రవాహములోనే రాగల్గిరి. మొత్తము మీద 100కి 98 మంది హరిజనులు కాంగ్రెసు ననుసరించే కాంగ్రెసు పతాకము క్రిందనే పనిచేయుచున్నారు. దీనికి తార్కాణము వ్యక్తి సత్యాగ్రహము నందునూ, 1942 ఉద్యమమునందునూ వందలకొలదీ హరిజనులు జైళ్ళకు వెళ్లుటయేగాక, పోలీసు తుపాకు గుండ్లకు కూడా ఆహుతి అయిరి.

హరిజన సేవా సంఘం :

మహాత్మాగాంధీగారు కాంగ్రెసు ద్వారా అస్పృశ్యతా నివారణకొరకు ఉపన్యాసము లిచ్చుట మాత్రముతో తృప్తిపడక అఖిల భారత హరిజన సేవా సంఘము నొకదానిని స్థాపించి దానికి థక్కరు బాబాగారిని కార్యదర్శిగా వేసి అన్ని రాష్ట్రములలోను, జిల్లాలలోను సేవాసంఘముల స్థాపించిరి. స్థాపించి, ఎన్నో ఉచిత భోజన వసతి గృహములను, విద్యార్థి వేతనములు, నీళ్లవసతి, భజన మందిరములు మొదలగు వాటికి లక్షల కొలది ఖర్చుపెట్టిన విషయము అందరికీ విశదమే. ఆంధ్రదేశములో ఆంధ్ర హరిజన సేవా సంఘము కీ.శే.నాగేశ్వరరావు పంతులుగారి అధ్యక్షత క్రింద స్థాపించబడి ఎన్నో వసతి గృహములు స్థాపించబడినవి. ఈ వసతి గృహములు స్థాపించుటకు ముఖ్యకారకులు శ్రీ బాపినీడు గారు. బాపినీడు గారునూ, నేనునూ సుమారు 30 హాస్టల్సును స్థాపించగల్గితిమి. మేము రాజీనామా నిచ్చినమీదట రాష్ట్ర హరిజన సేవా సంఘము చేయవలసినంత సేవ చేయుట లేదని చెప్పుటలో ఏ మాత్రమునూ అతిశయోక్తిలేదు.

శాసనసభలలో ప్రాతినిధ్యం :

1935వ చట్టం ప్రకారము హరిజనులకు తగిన ప్రాతినిధ్యము శాసనసభలలోను, రాగల్గినది. కాంగ్రెసు ప్రభుత్వములు జిల్లా మున్సిపాలిటీలలో హరిజనులకు వారి స్థానములను వృద్ధిచేసిరి. పూనా ఒడంబడిక ప్రకారము అన్ని కాంగ్రెసు ప్రభుత్వములును అస్పృశ్యతా నివారణ దేవాలయ ప్రవేశము, హరిజనాభివృద్ధి, విద్యాభివృద్ధి మొదలగు ప్రణాళికల తయారుచేసి ఎంతో సేవచేయగల్గుచున్నవి.

ఇందు ముఖ్యముగా చెన్నరాష్ట్ర ప్రభుత్వము హరిజనశాఖను స్థాపించి కోటి రూపాయలు ప్రత్యేకించడమేగాక, కళాశాలందునూ, హైస్కూళ్లలోనూ చదువు విద్యార్థులకు విద్యార్థివేతనములు, వసతి గృహములకు బోర్డింగు గ్రాంటులను ఇచ్చుట, బావులను త్రవ్వించుట, బంజరు భూములనిచ్చుట, ఆరోగ్యమును బాగుచేయుట మొదలగు కార్యములకు సుమారు 40 లక్షల రూపాయలు ఖర్చు చేసుకొన్నారు.

హిందూ సంఘము పేరిట, అణగద్రొక్కబడి, నీచముగా చూడబడిన హరిజనులకు అన్ని పౌరసత్వపు హక్కులు కాంగ్రెసు ప్రభుత్వములు ఇవ్వగల్గినవి. కనివిని ఎరుగని ఈ చట్టములు గాంధీగారి నాయకత్వము క్రింద కాంగ్రెసు ప్రభుత్వముల వల్ల అందరు హరిజనులూ నిమ్నజాతులు గ్రహింపగోరుచున్నారు.

మద్రాసు రాజధానిలో గత రెండు ఎన్నికల ఫలితములను చూచిన హరిజనులందరూ కాంగ్రెసు భక్తులేనని తేటతెల్లమైనది. హరిజనులు దేశదాశ్యవిముక్తికై పేదవారైననూ, విద్యాగంధము తక్కువైననూ, దేశపోరాటములో ఉడుతాభక్తిన సేవచేయుటలో ఏ ఇతర వర్గమునకును తీసిపోలేదు. 15వ తేదీ జరుగు స్వరాజ్య ఉత్సవములో హాతిజనులందరూ పాల్గొని తమ రాజ్యమును తాము బ్రిటిషువారి నుండి లాగుకొనగలిగితిమని ముఖ్యమైన పండుగ చేసుకొనవలెనని కోరుచున్నాను. రాబోవు ప్రభుత్వములు వయోజన ఓటర్ల పైననే ఆధారపబడిఉన్నవి. ఇంతకు పూర్వం హరిజనులకు ఈ ఓటులేనందున ఏ కొద్ది మంది మాత్రమో ఓటర్లుగా ఉండగల్గిరి. రాజ్యాంగ పరిషత్తు భారతదేశములో గల 21 సంవత్సరములు దాటిన యువతీ యువకులకు ఓటింగు హక్కు ప్రకటించబోవుచున్నది. అణగద్రొక్కబడిన హరిజనులు మొదలగు సంఘములవారు బీద సంఘముల వయోజన ఓటుద్వారా వారికి తగిన ప్రభుత్వములను ఏర్పరచుకొనగలరు. ప్రతి ఓటరుకూ, ప్రతి జాతీ, ప్రతి కులమూ, ఒకరి పై వారి భావిభాగ్యోదయమునకు ఆధారపడనవసరములేదు. వారి ప్రభుత్వమును వారేర్పరచుకొనుటకు హక్కును సంపాదించుకొనిరి. పేదవారి దారిద్ర్య విమోచనమునకు భారత స్వాతంత్ర్యమునకు కారకులైన గాంధీజీకి మన ధన్యవాదములు.

(ఆంధ్ర పత్రిక 15-5-1947)

“దేశభక్త” కొండా వెంకటప్పయ్య పంతులు

ఆంధ్రోద్యమము

ఐతరేయ బ్రాహ్మణములనుండియు విఖ్యాత చరిత్ర గలిగి వర్ధిల్లి, శతాబ్దముల కొలది సామ్రాజ్యాధికారము వహించి స్వాతంత్ర్యము ననుభవించి, బలపరాక్రమము లందును, రాజ్యపాలనా విధానమునందును, విద్యావిశేషములందును, కళానైపుణ్యము నందును దక్షులై ప్రసిద్ధిగాంచిన ఆంధ్రులిప్పుడు, స్వాతంత్ర్యము గోల్పోవుటయేకాక విడగొట్టబడి చెల్లాచెదరై – “కుంజర యూథంబు దోమకుత్తుకజొచ్చె” నో యనునట్లు – చెన్నరాజధానిలో అణగిమణిగి, సరియైన ఆలన పాలనలేని అంతర్భాగముగా నుండవలసి వచ్చుటయు సంభవించినది.

రమారమి 1880 ప్రాంతము నుండి ఇట్లుండ, కీ.శే. కందుకూరి వీరేశలింగం పంతులుగారి గ్రంథములును, వారిచే ప్రకటింపబడుచుండిన వివేకవర్ధని పత్రికయు, వారు సాగించిన సాంఘిక సంస్కరణ ప్రయత్నములను, బ్రహ్మసమాజము, దివ్యజ్ఞాన సమాజము మొదలగు మత సంబంధములైన సంస్థలును ప్రజల మనస్సులలో నూతన భావముల నంకురింపజేసినవి. మరియు కాంగ్రెసు మహాసభా ప్రచారములును, జిల్లా సంఘ సభలును, రాజకీయ సమస్యలను గూర్చి సంచలనము కల్పించినవి. కృష్ణాజిల్లా కాంగ్రెస్ మహాసభ ప్రప్రథమమున 1874వ సం॥లో గుంటూరులో సమావేశమైనది. ఇదియే, జిల్లా మహాసభలలో భారత దేశమంతటికిని మొదట జరిగిన సభయని చెప్పవచ్చును. ఇట్లు ఆంధ్ర దేశమున జనులలో ప్రబోధము పలువిధముల రూపమెత్తుచుండ, 1905 సం॥మున బంగాళాదేశ విభాగము అచ్చటి ప్రజలలో తీవ్రమగు సంచలనము గావించినది. ఒక్కజాతి, ఒక్కభాష, ఒక్క చరిత్ర గలిగి, విద్యావ్యాప్తి చేతను నూతనోద్యమముల ప్రబోధము చేతను ఐక్యభావమును, కార్యదీక్షయును బడసి, భారత దేశమున కంతకును మార్గదర్శకమై, సాంఘిక రాజకీయములందు మేల్బంతులను దిద్దిపెట్టుచున్న వంగదేశీయుల జాతీయ ఐక్యతకును, పురోభివృద్ధికిని భంగకరమైన రాష్ట్రవిభాగము ఆ ప్రజలలో మహత్తరమగు ఆందోళనకు కారణమయ్యెను. అందుకు ప్రతిహతముగ విదేశీవస్తు బహిష్కారమును, స్వదేశోద్యమమును సాగించి, వాటిని ఆసేతు హిమాచలమువరకు వ్యాపింపజేసి, కాంగ్రెసు మహాసభా మూలకముగా భారత దేశమంతటా తీవ్ర సంచలన ముద్భవింపజేసిరి. చేసిన విభాగమును మార్పు చేయుట లేదని ఆడంబరముగ ప్రకటించి పట్టుబట్టిన ప్రభుత్వమువారు, ఆ తీవ్రమహోద్యమము చేత తమ పట్టునువదలి ప్రజల కనుకూలమగు మార్పు గావించిరి! ఆ తరుణమున నడచిన ప్రసంగముల వలనను, రాజప్రతినిధి మొదలగువారి రాజకీయ లేఖలవలనను, భాషా సామ్యము, జాత్యైక్యత ప్రత్యేక రాష్ట్ర నిర్మాణమునకు ముఖ్యకారణములని స్పష్టీకరించబడినది. అప్పుడు రాజప్రతినిధిగానున్న హార్డింజ్ ప్రభువు బంగాళారాజ్య విభాగమును గూర్చిన వివాదమును

ప్రజాసమ్మతముగా పరిష్కరించుట యుక్తమని యోచించి, ప్రత్యేక రాష్ట్ర విభాగమున కావశ్యకమగు మూడు విధానములను నిరూపించెను. అందు పరిపాలనాయోగ్యములగు స్థానములుండవలయుననియును, అవి సమంజసములగు ప్రజల ఆశయముల సంతుష్టిపరచవలెనియును, విశాలమగు రాజనైతిక పాలక సంబంధములగు హేతువులు అందుకు కారణములై యుండవలెననియును సూచించెను.

పైన వివరించిన మూడు పరిస్థితుల ననుసరించి, వంగ భాష మాట్లాడు అయిదు జిల్లాలను ఒక్క రాజధానిగా నేర్పరచవలెనని వక్కాణించెను. మరియును అప్పటికి బంగాళారాజ్యములో చేరిన బీహారీలను గురించి ఇట్లు వివరించెను. "ఇంతవరకు బంగాళారాష్ట్రములో చేర్చబడినట్టియు హిందీ భాష మాట్లాడుచున్నట్టియు బీహారీలను విడదీసి, ప్రత్యేకపాలనలోనుంచుట అత్యంతావశ్యకమని నాకు స్పష్టమగుచున్నది. ఇంతవరకును వీరు జోడు సరిపోవని బంగాళీయులతో ఒక్కకాడిన కట్టివేయబడి యుండుట చేత వారి అభివృద్ధికి తగిన అవకాశములు లేకపోయినవి. మరియును గడచిన కొలది సంవత్సరములనుంచి, బీహారీయులలో విస్పష్టమగు తీవ్రమైన సంచలనము కలిగినది. బంగాళీయులలోనుండి విడిపోయిననేగాని, తాము అభివృద్ధికి రాజాలమను గాఢమగు విశ్వాసము వారిలో ప్రబలినది. వారి కోర్కెను తీర్చుట కావశ్యకములేనియెడల, కొలది కాలములో ఆందోళనకు కారణమగును, కాబట్టి అందుకిదియే యుక్తమగు సమయము".

ఇట్టి వ్రాతలలోని ఉత్తమాశయములు, అప్పటికే ఆంధ్ర యువకుల రక్తనాళములలో జొచ్చి, హృదయసంచలనము గావించుచున్న జాతీయోద్యమముతోపాటు, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణము గావించుట అత్యావశ్యకమను ఆశయమును ప్రబోధించినవి.

1912వ సంవత్సరమున కృష్ణాజిల్లా కాంగ్రెస్ మహాసభ, విశాలహృదయుడగు కీ.శే. శ్రీ కోవూరి చంద్రారెడ్డి గారిచే ఆహ్వానింపబడి నిడదవోలులో సమావేశమైనది. అందుచేత ఆంధ్ర దేశమునందలి ప్రముఖులగువారు ఒక్కచోట సమావేశమగుట సంభవించినది. అత్యంత వైభవము తోడను, ఉత్సాహముతోడను నడచిన ఆ సమావేశములు, వారి హృదయసీమలయందు అన్యోన్యత పురికొల్పుటకు కారణభూతములైనవి. ఆంధ్రుల ఐక్యతకును, వారి పురోభివృద్ధికిని ఒక్కొక్కతరి వారెల్ల రొక్కచోట సమావేశమగుటకు గొప్పసాధనముగ గన్పడినది. జిల్లా సభలవలననే ఆంధ్రదేశమంతటికిని ప్రతి సంవత్సరమును ఒక్కొక్క చోట, ఆంధ్ర మహాసభలు జరిపించుట యుక్తమని తోచినది. ఆంధ్ర మహాసభా సమావేశము ఆంధ్ర వ్యక్తిత్వమును దృఢపరచి, సర్వతోముఖముగా ఆంధ్రజాతినుద్ధరింపజేయుటయే ముఖ్యోద్దేశమగుటచే, ఒక్క భాష, ఒక్క చారిత్రము, ఒక్క సంస్కృతి గలిగిన ఆంధ్రు లెల్లరను ఒక్క రాష్ట్రములో ప్రత్యేకింపబడుట అత్యంతావశ్యక మను భావము తోడ్తోడన ఆంధ్రయువకుల హృదయములలో మొలకెత్తినది. అట్టి యువకులలో కీ.శే. జొన్నవిత్తుల గురునాథము, కీ.శే. చల్లా శేషగిరిరావు పేర్కొన దగినవారు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణమును గూర్చిన తీర్మానము, పైన జెప్పినట్లు నిడదవోలులో జరిగిన కృష్ణాజిల్లా మహాసభలోనే ప్రవేశపెట్టబడినదిగానీ, సకాలములో తేబడనందున సభాధ్యక్షులు దానిని సభలో విచారణకు పెట్టకయే నిరాకరించిరి.

పిమ్మట ఆ యువకులును, శ్రీ వింజమూరి భావనాచార్యులుగారు, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగారు మొదలగు పెద్దలును జేరి ఆంధ్రరాష్ట్రనిర్మాణ విషయమును చర్చించి, దాని ఆవశ్యకతను గుర్తించి, సర్వతోముఖమగు అభివృద్ధికై ఆంధ్రులలో ప్రబోధము గలిగించుటకు ఆంధ్రోద్యమమును సాగించిరి.

ఈ ప్రయత్నమునకు ప్రథమ ఫలితముగా బాపట్లలో 1913 సం॥న ప్రథమ ఆంధ్ర మహాసభ సమావేశము జరుపబడినది. అప్పుడు చెన్నరాష్ట్ర శాసనసభలో సభ్యులుగా నుండి ఘనతగాంచిన కీ.శే. బయ్యా నరసింహేశ్వరశర్మ గారు అధ్యక్షత వహించిరి. ఆంధ్రులలో ప్రముఖులగు వారనేకులు ఆసభకు విచ్చేసిరి. ఆంధ్రరాష్ట్ర నిర్మాణము గురించి తీవ్రమగు చర్చ జరిగిన పిమ్మట, సెటిల్‌మెంటు ఆఫీసరుగా నున్న దివాన్ బహదూర్ ముట్నూరి ఆదినారాయణయ్య గారిచేత ఈదిగువ నుదహరించిన తీర్మానము ప్రతిపాదింపబడి మహాసభవారిచేత అంగీకరింపబడినది.

"పరిపాలనా సౌష్ఠవము కొరకును, ప్రజాశ్రేయోభివృద్ధి నిమిత్తమును భాషలను అనుసరించి రాష్ట్ర విభాగము చేయుట ఎప్పటికైనను అవసరమనియును, కాంగ్రెస్ మహా సభ వారు కోరుచున్న అధినివేశ స్వపరిపాలనకును, రాష్ట్రీయ స్వపరిపాలనమును సహజముగను దృఢముగను నెలకొల్పుటకును భాషాప్రయుక్తరాష్ట్ర విభాగము అవసరమనియును, ఆంధ్రులలో కొందరు అభిప్రాయపడుచున్నారు. కావున ఈ రాజధానిలో తెనుగు జిల్లాల నొక ప్రత్యేక రాష్ట్రముగాజేయుటకు ప్రభుత్వము వారిని గోరవచ్చునో యను విషయమును గూర్చి, ఆంధ్రమహాసభాంగ విధానమును గూర్చి విమర్శించుటకేర్పడిన సంగమువారు ప్రజల అభిప్రాయములను నిర్ధారణజేసి, రాబోవు ఆంధ్రమహాసభవారికి నివేదించునటుల ఈ సభవారు తీర్మానించుచున్నారు".

ఈ తీరుమానము ననుసరించి, ఆంధ్ర మండలము నందంతటను ముఖ్యముగా రాయలసీమలోను నిండుగ ప్రచారము చేయబడినది. రెండవ ఆంధ్ర మహాసభ బెజవాడలో 1914 సం॥న, చాలాకాలము చెన్నరాష్ట్ర శాసనసభలోను సామ్రాజ్య శాసనసభలోను సభ్యులుగానుండి, ఆంధ్ర భీష్మయను పేరుపొందిన కీ.శే. శ్రీన్యాపతి సుబ్బారావు గారి అధ్యక్షతను అత్యుత్సాహముతో నడిచినది. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణమును గూర్చి ప్రజలలో తీవ్రమగువాంఛ పొడమినందున ఈ దిగువ నుదహరించిన తీర్మానము సభవారి చేత అత్యుల్లాసముతో అంగీకరింపబడినది.

తీర్మానము : (అ) పరిపాలనా సౌకర్యమునకును, ప్రజల పురోభివృద్ధికిని భారతదేశమును భాషలనుబట్టి రాష్ట్రములుగా విభజించుట అవసరమనియు; (ఆ) కాంగ్రెసు మహసభ వారు వ్యక్తీకరించిన స్వపరిపాలనా విధానమును, ఇండియా గవర్నమెంటువారు రాజకీయలేఖలో సూచించిన స్థానిక స్వాతంత్ర్య విధానమును సిద్ధించుటకు భాషా ప్రయుక్త రాష్ట్రములే అనుకూలములనియును; (ఇ) ఈ రాజధానిలోని తెలుగు జిల్లాలను ప్రత్యేక రాష్ట్రముగ చేయుట వాంఛనీయమనియును; (ఈ) సమితులను స్థాపించుట మొదలగు మార్గములచే, ఈ చర్చ విషయమున జనాభిప్రాయమును ఏకోన్ముఖముగావించుట యావశ్యకమనియు – ఈ సభవారు తీర్మానించుచున్నారు.

ప్రచారము చక్కగా నడుపుటకును, ఉద్యమము దేశ మందంతటను వ్యాపింప జేయుటకును, ప్రభుత్వము వారితో మహా సభవారిచేత

అప్పుడప్పుడు చేయబడుచున్న ఆంధ్ర రాష్ట్ర తీర్మానమును గూర్చియు, విద్యావ్యాపకము, ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనము మొదలగు వానిని గూర్చిన ఇతర తీర్మానములను గూర్చియు ప్రభుత్వమువారికి నివేదించి ఉత్తరప్రత్యుత్తరముల జరుపుటకు ఒక స్థాయి సంఘ మేర్పరుపబడెను. ఈ సంఘము అప్పుడప్పుడు ఆంధ్ర జిల్లాలోని ముఖ్యస్థాపనములలో సమావేశమగుచుండెను.

మూడవ ఆంధ్ర మహాసభ విశాఖపట్టణములో 1915 సం॥న కీ.శే. పానగల్ రాజా శ్రీ రామారాయణింగారి ఆధిపత్యమున జయప్రదముగ నడిచినది. వీరు కొంతకాలము సామ్రాజ్య శాసన సభ్యులుగా నుండుటయేగాక, పిమ్మట చెన్నరాష్ట్ర శాసనసభలో సభ్యులై, ప్రభుత్వ కార్యనిర్వాహక సభలో ప్రధానతను బడసిరి. 1916 సం॥న నాల్గవ ఆంధ్ర మహాసభ కాకినాడలో కీ.శే. దివాన్ బహదూర్ సర్ మోచర్ల రామచంద్రరావు పంతులుగారి అధ్యక్షత క్రింద మహోత్సాహముతో జరిగినది. మొత్తమున 1913 సం॥ మొదలు ఇంతవరకును 23 మహాసభలు ఆంధ్ర దేశమున ముఖ్యస్థానములలో సమావేశపరుపబడినవి. ఆయాసభల అధ్యక్షుల పేర్లను, అవి సమావేశములు కాబడిన పట్టణముల పేర్లను చివర జతపరచిన పట్టికయందు వివరింపబడినవి.

1938 సం॥ చెన్నపురిలో సమావేశమైన ఆంధ్ర మహాసభకు, హిందూ విశ్వవిద్యాలయోపాధ్యక్షులైన ఎస్. రాధాకృష్ణగారు అధ్యక్షత వహించిరి. చెన్నపురి ప్రధాన న్యాయ స్థానమునందు న్యాయమూర్తిగా నుండిన ముత్తా వెంకట సుబ్బారావుగారు ప్రారంభకులుగా నుండిరి.

విశాఖపట్టణమున జరిగిన మూడవ ఆంధ్ర మహాసభ తక్కిన సభలన్నింటిలోను పూర్వమువలె ఆంధ్ర రాష్ట్రము వాంఛనీయమనుటతో సరిపుచ్చక, ఆంధ్రరాష్ట్ర నిర్మాణము ఆవశ్యకముగాన ప్రభుత్వము వారు త్వరితముగా రాష్ట్ర నిర్మాణము గావింపవలసినదనియే కోరుచు, తీర్మానములు గావింపబడుచు వచ్చినవి.

1941 సం॥లో మరల విశాఖపట్టణములో సర్ విజయానంద గజపతిగారి అధ్యక్షత క్రింద నడచిన 23వ ఆంధ్ర మహాసభలో – ఇంతకాలము ఆంధ్రులు తీవ్రముగా ఆందోళన గావించుటకు మహాసభలు జరిపి, అనేక ప్రయత్నములు చేసినను ప్రభుత్వమువారు అంగీకరింపక పెడచెవిని పెట్టుచుండుటవలన, మరల శాసనసభా కార్యములు సాగినప్పుడు అందలి ఆంధ్ర శాసనసభ్యులు రాష్ట్ర నిర్మాణమునకు వలయు కృషికి ఎట్టి ఆటంకములు వచ్చినను వానిని తొలగించవలెననియు, అప్పటికిని సాధ్యముగాని యెడల ఆంధ్ర శాసన సభ్యులును తక్కిన ఆంధ్ర ప్రజలును గూడ అన్ని విధముల త్యాగముగావించి రాష్ట్రనిర్మాణము సిద్ధింపజేయవలెననియు – చేయబడిన తీర్మానము సర్వజనాంగీకారము బడసినది.

ఇట్లు 1913 సం॥ నుంచీ, ఇంతవరకును ఆంధ్రమహాసభలు సమావేశమగుచుండుటయేగాక, 1921 సం॥ములో భారతదేశ రాజ్యాంగ విధానమునందు మార్పులుజేయు సందర్భమున ఇండియాదేశ కార్యదర్శి మాటేంగ్యుగారును, చెమ్స్‌ఫర్డ్ ప్రభువుగారును చెన్నపట్టణమువచ్చినప్పుడు, భారత దేశమున భాషా ప్రయుక్తరాష్ట్ర నిర్మాణము యొక్కయు, ఆంధ్రరాష్ట్ర నిర్మాణముయొక్కయు ఆవశ్యకత నివేదించుటకు కీ.శే. శ్రీ న్యాపతి సుబ్బారావుగారి అధ్యక్షత క్రింద కొందరు ఆంధ్రప్రముఖులతో గూర్పబడిన నొక రాయబారము నడపింపబడినది. దాని ఫలితముగా ఆంధ్ర రాష్ట్ర నిర్మాణము గావింపబడకపోయినను – ఆయా రాజధానుల లోని శాసనసభలలో అధికసంఖ్యాకులగు సభ్యులచేత ప్రత్యేక రాష్ట్ర నిర్మాణము అంగీకరించుచు తీర్మానములు చేయబడినయెడల, ప్రభుత్వమువారు అంగీకరింపవచ్చునను నియమము, 1916 సం॥మున గావింపబడిన ఇండియా దేశ రాజ్యాంగ విధాన చట్టమునందు చేర్చబడినది.

ఈ అవకాశమునుబట్టి, చెన్నపురి శాసనసభలో నాలుగు సారులు ఆంధ్రరాష్ట్ర నిర్మాణము విషయము చర్చకు వేయబడి, బహుసంఖ్యాకులవలన అంగీకరింపబడెను. కాంగ్రెసు వారు ప్రభుత్వాధికారమును చేబట్టిన రోజులలో అట్టి తీర్మానము ప్రవేశపెట్టబడి సభాంగీకారము బడయుటయు, మద్రాసు గవర్నరుగారు గూడా సుముఖులై చెన్నపురము నందే ఆంధ్రరాష్ట్రమునకు, తమిళ రాష్ట్రమునకునుగూడా ప్రత్యేక రాజ్యస్థానములేర్పరచి, రెంటికినీ గవర్నరుగా నుండవచ్చునను అనుకూలాభిప్రాయమును వెల్లడించిరి. ఆ వార్త అంతటను వ్యాపించుటయు ప్రజలలో ఆంధ్రరాష్ట్రము తప్పక సిద్ధించునను ఆశ గొప్పగా కలుగుటయు నేర్పడినది. ఇండియా కార్యదర్శిగారు దానిని అంగీకరించకపోవుటతో ప్రజలయాశ నిరాశయయ్యెను.

ఇండియా కార్యదర్శిగారి ఉత్తరువు ప్రకటితముగాక పూర్వమే చెన్నపట్టణములో సమావేశమైన ఆంధ్రమహాసభకు, మద్రాసు హైకోర్టులో న్యాయమూర్తిగానుండి సుప్రసిద్ధులైన శ్రీ ముత్తా సుబ్బారావుగారు ప్రారంభకులుగా నుండిరి. తత్త్వశాస్త్ర పండితులుగా ఖ్యాతిగాంచి, దేశాంతరములందు సహితము గౌరవము బడసిన సర్ సర్వేపల్లి రాధాకృష్ణగారు అధ్యక్షతవహించిరి. (ఈ విషయముపైన తెలిపియే యుంటిమి). ఇట్టి ప్రముఖుల తోడ్పాటు గలిగియు ఆంధ్రరాష్ట్రము సిద్ధించక పోవుట శోచనీయమే!

ఆంధ్రరాష్ట్ర నిర్మాణమునకు రాయలసీమ ప్రముఖులలో కొందరి విముఖతను నివారించి, వారి సంశయములు నివర్తించుటకు 16-7-37 తేదీన చెన్నపట్టణములో తూర్పుతీర వాసులగు ఆంధ్రులపక్షమున, రాయలసీమయొక్క ఆర్థికాభివృద్ధికై తగిన అవకాశములు ముందు కల్పించుటకును, రాజధానికి తగిన స్థానమును నిర్ణయించు విషయమునకు కొన్ని షరతులతో నొక సమాఖ్య – "శ్రీబాగ్ సమాఖ్య" అను పేరుతో – ప్రకటించిరి.

మరియును ఆంధ్రరాష్ట్ర నిర్మాణావశ్యకతను ఇండియా కార్యదర్శిగారికి "రౌండు టేబుల్ కాన్ఫరెన్సు"లో నివేదించుటకు 1931-34 సంవత్సరములో జరిగిన ప్రత్యేక ఆంధ్ర మహాసభలో కీ.శే. వి.వి. జోగయ్య పంతులు గారిని రాయబారిగా నియమించిరి. మరియొకసారి శ్రీ దేశపాండ్య సుబ్బారావుగారిని కూడా అందునిమిత్తమే పంపియుండిరి. ఇంత ప్రయత్నము గావించబడినను ప్రభుత్వమువారు రాష్ట్ర నిర్మాణము అంగీకరించకపోవుటకు కారణము దురూహ్యముగా నున్నది.

ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్ర నిర్మాణముకై గావించుచున్న ఆందోళన సమంజసము, సహేతుకమనుటకు, పై నుడివిన రాజప్రతినిధి హార్డింజ్ ప్రభువు వ్రాసిన రాజకీయలేఖలోని యంశములు ప్రమాణవాక్యములుగా గమనించదగినవి. అదికాక, 1930 సం॥లో భారతదేశ నూతన రాజ్యాంగ నిర్మాణమునుగూర్చి విమర్శించుట కేర్పడిన సైమన్ కమిషన్‌వారు తమ నివేదికలో ఆంధ్రరాష్ట్రమునుగూర్చి ఈ విధమున వ్రాసియున్నారు :-

"భారతదేశములోని వివిధ రాష్ట్రములలో భాషా భేదములవలన విడిపోవలెనను అభిలాష ప్రజలలో పుట్టుటచేత కొలది సంవత్సరములనుండి ఈ భాషా భేదములు ముఖ్యమగునొక రాజకీయసమస్యగా పరిణమించినవి... పదునేడు సంవత్సరముల క్రిందట తెలుగు మాటలాడు జిల్లాలవారు గావించిన మహాసభలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రము కావలెనని కోరబడినకోర్కె ఇన్ని సంవత్సరములనుండి ఎడతెగక కోరబడుచునేయుండి, ఇప్పుడు ఒక ప్రాముఖ్యమైన రాజకీయ సమస్యగా తేలినది. కొలది సంవత్సరముల క్రిందట రెండుసారులు మదరాసు శాసనసభలో క్రమముగా చర్చించబడి, బహుసంఖ్యాకులగు సభ్యులచేత అంగీకరింపబడినది.

మరియు ఈ రాష్ట్రములోని పరివర్తనములు, భాషా సమస్యవలెనే ప్రాధాన్యతవహించి, రాజకీయములలో ప్రవేశించి, ప్రత్యేక రాజకీయ పక్షములు ఏర్పడుటకు కారణములైనవి".

ఇంకను, సైమన్ కమీషన్‌వారు తమ నివేదికలో మరియొకచోట ప్రత్యేకరాష్ట్ర నిర్మాణమునకు ఆవశ్యకమైన పరిస్థితుల ఈ క్రిందివిధముగా వివరించినారు.

"ఏకభాషను మాట్లాడు ప్రజలు నివసించు దేశభాగము ప్రత్యేక రాష్ట్రముగా చేయబడినప్పుడు, ఆ రాష్ట్ర పరిపాలనా భారమును నిర్వహించుటకు తగిన ఆధారములును అవకాశములును కలిగి, స్వయంపోషక సామర్థ్యము కలిగియుండిన యెడల, భాషాసామ్యము ప్రత్యేక రాష్ట్ర నిర్మాణమునకు తగిన కారణమే కాని, అది యొక్కటియే చాలదు. జాతి, మత సామ్యము, ఆర్థిక విషయములందు ఐక్యత, దేశమంతయు కలసి ఏకఖండముగానుండుట, పట్టణములకు తగినట్లు పల్లెలు, సముద్రతీరమునకు తగినట్లు లోపల మెరక భాగములు కలిగియుండుట, అమలులో పెట్టుటకు అన్నిటికంటె ముఖ్యముగా నుండు విషయమేమనగా ఏ భాగము నూతనముగా ప్రత్యేక రాష్ట్రము చేయబడుచున్నదో ఆ వైపు నుండియును, ఎందుండి ఈ నూతన రాష్ట్రము విడిపోవుచున్నదో ఆ వైపునుండియును సాధ్యమయినంతవరకు అత్యధికమగు అనుకూలాభిప్రాయము సమకూడుట". ఈ షరతులను నిష్పక్షపాతబుద్ధితో యోచించినయెడల, ఆంధ్రదేశమును ప్రత్యేక రాష్ట్రముగా జేయుటకు ఎట్టి ఆటంకములు లేవనియు, ఆ షరతలన్నియు ఆంధ్ర దేశమున పూర్ణముగా సిద్ధించినవనియు అంగీకరింపక తప్పదు.

ప్రత్యేక రాష్ట్రముగా నిర్మించవలెనని కోరబడు దేశము 75,050 చ.మై. వైశాల్యము కలది. అందు (1,70,00,000) ఒక కోటి డెబ్బదిలక్షల జనము రాకపోకలకు తగిన రాజమార్గములును చెన్నపట్టణమునుండి గోపాలపురము వరకును దాదాపు ఆరువందల మైళ్ల పొడవున సముద్రతీరమును, రేవు పట్టణములును గలవు. పట్టణములకును, పల్లెలకును కొదువలేదు. మదరాసు ప్రభుత్వమువారి వార్షిక మొత్తము ఆదాయములో సగభాగము తెలుగు జిల్లాల నుండి వసూలగుచున్నది. 1938 సం॥లో శాసనసభలో అడుగిడబడిన ప్రశ్నకు, ప్రభుత్వమువారిచ్చిన లెక్కలను బట్టి, ప్రతి సంవత్సరము తెలుగు జిల్లాలనుండి వచ్చెడి ఆదాయము మొత్తము, ఆ జిల్లాలకై చేయబడు వ్యయములకంటె ఒక కోటి రూపాయలు అధికముగా నున్నట్లు తేలినది. మరియు, తెలుగు జిల్లాలు మొత్తమున ఎక్కువ ఫలవంతమైన దేశము. వీని ఆదాయమును హెచ్చుచేయుటకు పలువిధములగు మార్గములు గలవు. నూతన వ్యవసాయశాస్త్ర పద్ధతులవలన భూములు ఎక్కువ ఫలప్రదము గావింపనగును. మెట్ట ప్రదేశములలో చెరువులను, బావులను ఏర్పరచి తోటలను పెంచవచ్చును. దేశము ఖనిజసమృద్ధి కలదగుటచేత పరిశ్రమలను సాగించవచ్చును. ఇట్లు దేశమునకు సంపత్తి సమకూర్చి, విద్య వ్యాపింపజేసి, వృత్తులను పోషించి, ప్రజలకు సౌఖ్య మొనగూర్చుటకు మార్గములను ఏర్పరచుచో, తక్కిన రాష్ట్రములతోపాటుగ, భారతదేశ స్వాతంత్ర్య సౌభాగ్యముల నొడగూర్చి పోషించుటకు తగిన బలిష్ఠ రాష్ట్రముగా జేసి, తగినంత పలుకుబడియు గౌరవమును సంపాదింప వచ్చును.

ఆంధ్రరాష్ట్రము ఏర్పడినప్పుడుగాని, ఆంధ్రవ్యక్తిత్వము పూర్ణముగా వికసించుటకు తగిన అవకాశము లేదు.

ఆంధ్ర జిల్లాలతో పోల్చినయెడల, మిక్కిలి చిన్న వైశాల్యముగలిగి, కొలది జనసంఖ్యగలిగి, ఆర్థిక సంపత్తిలో మిక్కిలి వెనుకబడియున్న సింధు, ఉత్కళరాష్ట్రములను నిర్మాణముచేసిన ప్రభుత్వమువారు ఆంధ్రుల ఆశయములు నెరవేర్చక ఉపేక్షజేయుట అసమంజసము, అన్యాయమని వక్కాణింపక తప్పదు.

కాంగ్రెసు మహాసభ మహాత్మాగాంధీగారి యాజమాన్యమున నడిపింపబడుకాలము ఆరంభమగుటతోడనే, భారత దేశమందలి రాష్ట్రములన్నియు భాషాప్రయుక్తములుగ విభజింపబడినవి. అంతకు ఇంచుక ముందుగ కాంగ్రెసు, ఫిర్కాలుగ ప్రత్యేకింపబడి యుండుటచేత అవియును కాంగ్రెస్ వ్యవహారముల నిమిత్తము ప్రత్యేక రాష్ట్రముగ నేర్పరుపబడినవి.

కాబట్టి మనకు ఆంధ్రరాష్ట్రము సిద్ధించుటకు, భాషాప్రయుక్తరాష్ట్ర నిర్మాణ సూత్రమును అంగీకరించి అమలులో పెట్టి వ్యవహరించుచున్న కాంగ్రెసు సహాయము మిక్కిలి ఆవశ్యకము. భారత దేశములోని రాష్ట్రము లన్నిటిలో ప్రాధాన్యతవహించి, మార్గదర్శకముగా ఉండిన బంగాళా రాష్ట్రమువారు అత్యంత తీవ్రమగు ఆందోళన గావించి, కాంగ్రెస్ మహాసభా మూలకముగా ఆసేతుహిమాచలమువరకు దానిని వ్యాపింపజేసి, రాష్ట్ర విభాగమును అనుకూలముగ మార్పించుకొనగలిగిన విషయమును గమనించి, కాంగ్రెసు మూలకముగనే కార్యసిద్ధి బడయుటకు మనము ప్రయత్నింపవలెను. అన్యథా గావించిన ప్రయత్నము సిద్ధించిన సంతోషమేగాని, అట్టి కృషికి తావు లేదనియే చెప్పవచ్చును. ప్రజలు సామాన్యముగా కాంగ్రెసు ప్రజలే యగుటచేత కాంగ్రెసు కార్యములనే బలపరచి, కాంగ్రెసువారు ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్యనుగూడ వారి బాధ్యతలలో నొకటిగా అంగీకరింపజేయుట కర్తవ్యము, ముఖ్యమార్గమునుగా నున్నది.

అట్లు జేయుటవలన కాంగ్రెసు మూలకముగా భారత దేశమునకు స్వరాజ్యము సిద్ధించినను, లేక స్వరాజ్యము విషయమై ప్రభుత్వమువారితో ఏదియైన ఒక సమాఖ్య సమకూడినను, దానితోపాటు ఆంధ్రరాష్ట్ర నిర్మాణము సిద్ధించును; ఆంధ్రుల ఆశయములు సఫలీకృతములగును.

ఆంధ్రమహాసభ సమావేశములు

సం॥ము	ప్రదేశము	అధ్యక్షులు
1913	బాపట్ల	గౌ॥ బి.ఎన్. శర్మ
1914	బెజవాడ	న్యాపతి సుబ్బారావుపంతులు
1915	విశాఖపట్నము	పానగల్లు రాజావారు
1916	కాకినాడ	మోచర్ల రామచంద్రరావు
1917	నెల్లూరు	కొండా వెంకటప్పయ్య పంతులు
1918	గుంటూరు (ప్ర.స.)	కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు
1918	కడప	నెమలి పట్టాభి రామారావు
1919	అనంతపురం	గాడిచెర్ల హరిసర్వోత్తమరావు
1920	మహానంది	ఎ. రంగనాథ మొదలియారు
1921	బరంపురం	రాజా కోటగిరి వెంకటకృష్ణారావు, జమీందారు, గంపలగూడెం
1922	చిత్తూరు	వేదం వెంకటరాయశాస్త్రి
1924	మద్రాసు	కట్టమంచి రామలింగారెడ్డి
1925	మచిలీపట్నం	సామి వెంకటాచలంశెట్టి
1926	ఏలూరు	రాజాబహుదూర్ వెంకటాద్రి అప్పారావు జమీందారు, వుయ్యూరు
1927	అనంతపురం	వొ. లక్ష్మణస్వామిరావు
1928	నంద్యాల	సర్వేపల్లి రాధాకృష్ణయ్య
1929	బెజవాడ	కె. కోటిరెడ్డి
1931	గుంటూరు	వి.వి. జోగయ్య
1931	మద్రాసు	(ప్ర.స.) కె. కోటిరెడ్డి
1932	బెజవాడ	కె.వి. రెడ్డినాయుడు
1934	విశాఖపట్నం	(ప్ర.స.) దేశపాండ్య సుబ్బారావు
1936	కాకినాడ	వేమవరపు రామదాసుపంతులు
1937	బెజవాడ	కె. కోటిరెడ్డి (రజతోత్సవ సమావేశము)
1938	మద్రాసు	సర్వేపల్లి రాధాకృష్ణయ్య
1939	గుంటూరు	ఎమ్. అనంతశయనం
1941	విశాఖపట్నము	విజయానందగజపతి

(ఆంధ్ర సరస్వము 1943 – సంపాదకుడు : మాగంటి బాపినీడు)

ఉన్నవ లక్ష్మీనారాయణ

ఆంధ్రోద్యమ ప్రారంభం

గుంటూరు యువజన సాహితీ సమితి చరిత్ర

ఆంధ్రజాతి యొక్క సర్వతోముఖ వికాసమునకై ఏర్పడిన ఉద్యమము ఆంధ్రోద్యమము. ఆంధ్ర చరిత్రలో ఇట్టి ఉద్యమములు పెక్కుసార్లు బయలుదేరి ఆంధ్రోన్నతికి తోడ్పడియుండవచ్చును. పూర్వమిట్టి యుద్యమములు లేవదీసినవారు శాతవాహనులు, నాగార్జునులు, శివదేవ గణపతిదేవ సోమనాధులు, నన్నయ, నన్నెచోడ, రాజనరేంద్ర తిక్కనలు, హరిహర బుక్క, విద్యారణ్య, తిమ్మరసు కృష్ణదేవరాయ, వీరేశలింగములు పెక్కురుండవచ్చును. నేనిప్పుడు వ్రాయదలచినది ఆ ఆంధ్రజాతి నిర్మాతల యొక్కయు వారి ఉద్యమముల యొక్కయు చరిత్రలు కావు. ఇరువదియవ శతాబ్దపు మొదటి పాదములో గుంటూరు పట్టణ (అప్పటికింకా ఊరే) మధ్య భాగమున జట్కా స్టాండుల సమీపమున నున్న చిన్న పెంకుటి గుడిసెలో మొలకెత్తి, కొమ్మలు రెమ్మలువేసి, ఇప్పటికి పండి మన కన్నులకు ప్రత్యక్షముగా నున్న ఆంధ్రోద్యమమును గూర్చియే. దీనిని గురించి నాకు జ్ఞాపకమున్నది పురిటిగది నుంచి ప్రారంభించి వ్రాయదలచినాను.

అనంగనంగా యంగ్‌మెన్స్ లిటరరీ అసోసియేషన్ అనే పేరుగల యువజన సాహితీ సంఘం గుంటూరులో కొత్తపేట, రసల్‌పేటలు కలియుచోట మునిసిపల్ జిమ్నాస్టిక్ గ్రౌండు ప్రక్కన నుండెను. అంతకుపూర్వ మది 1903-4 ప్రాంతముల ఒక నాయుడు గారి పంచ గదిలో కొందరు ఆంగ్ల విద్యార్థులు స్థాపించిన పత్రికా పఠన మందిరముగ నుండెను. తరువాత నిది గ్రంథాలయ పఠన మందరిముగా మారి, విద్యార్థులు కాని యువకులు కూడ సభ్యులయిరి. ఒక ఒంటరి పెంకుటిగదిని అద్దెకు తీసుకొని దీని నందులో చేర్చిరి. అప్పటి నుండియే దీనికి ప్రాముఖ్యత హెచ్చినది. అప్పటి విద్యార్థులు కాని యువకులలో జొన్నవిత్తుల గురునాధం, చల్లా శేషగిరిరావు, న్యాపతి నారాయణరావు, చట్టి నరసింహారావు, చట్టి దుర్గయ్య, గొల్లపూడి సీతారామశాస్త్రి, శీరము సుబ్బారావు, అస్మదాదులు నాకు జ్ఞాపకమున్న పేర్లు. నడింపల్లి నరసింహారావు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యలు విద్యార్థి సభ్యులుగ నప్పుడుండి యుందురు. వీరందరు బంగాళ రాష్ట్రములో బుట్టిన వందేమాతరోద్యమ ప్రేరితులే. తిలక్, లజపతిరాయ్, చిదంబరం పిళ్ళేలు మాకు ఇష్ట దేవతలు. కుదిరాంబోసు, కన్యాలాల్‌దత్తు, ప్రఫుల్ల చంద్రఛాకీ, అరవింద ఘోష్‌లు మా గుండెలను చలింపజేయకపోలేదు. పఠనమందిరమును, గ్రంథాలయమును వృద్ధి చేయబడినవి. వింజమూరి భావనాచార్యులు గారు మోడరన్ ఎన్‌సైక్లోపీడియాయును, దేశభక్త వెంకటప్పయ్య పంతులుగారు ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాయును గ్రంథాలయమునకు బహుమతి జేసిరి. పెక్కు ఇంగ్లీషు గ్రంథములను, తెలుగు గ్రంథములను సమకూర్చితిమి. మరాఠా మున్నగు పత్రికలను ఇతర తీవ్ర రాజకీయ వాఙ్మయమును చాలా సమకూర్చి

విద్యార్థులందరి చేతను చదివించేవారము. చర్చా సంఘము పెట్టి శని, ఆదివారములు సాంఘిక, రాజకీయ సారస్వత విషయములను చర్చించేవారము. పోలీసు నిఘా కూడా మాపై ప్రారంభమయినది.

నాటి రాజకీయాలు

అప్పటి రాజకీయస్థితి కొంత తెలిసికొనుట అవసరము. 1850 ప్రాంతమునకు ఆసేతు హిమాచల పర్యంతము ఆంగ్లేయుల పరమయినది. కంపెనీ వారీ దేశమును పాలించుచుండిరి. కంపెనీ నౌకర్లకు అధికార వాంఛ, తన్మూలమున వర్తక వ్యాపకము దప్ప మఱి యితర భావములు లేవు. తత్పూర్వపు మహమ్మదీయుల పాలనము నాటి మత నిర్బంధములు, అశాంతి మాత్రం తొలగిపోయి, దేశమంతటను శాంతి నెలకొన్నది కాని, రాజ్యచ్యుతులయిన స్వదేశ ప్రభువులు సమయము దొరికినచో కంపెనీవారిని తరిమివేయవలయునని అవకాశమునకు ఎదురుచూచుచునే యుండిరి. 1857వ సంవత్సరమున అట్టి అవకాశము కలిగినప్పుడు ఝాన్సీ లక్ష్మీభాయి, రాజకుమార్‌సింగ్, బహదూర్ షా, తాంతియాతోపి, నానాసాహెబ్ మున్నగువారు తిరుగుబాటు చేసి ఘోర సంగ్రామము జేసిరి. సంగ్రామములో కొంతకాలము త్రాసు ఎటుమొగ్గునో చెప్పుటకు వీలు లేకుండెను. సిక్కులును, నైజామువారును ఆంగ్లేయుల పక్షమున నిలిచి వారికి జయమొనగూర్చిరి. కాని ఆంగ్లేయులది శాశ్వత విజయముగ భావించలేదు ఎప్పుడు. ఏ కారణములవలన ఇట్టి విప్లవములు తిరిగి జరుగునో చెప్పలేక పాలనా విధానమును సంపూర్ణముగా మార్చివేసిరి.

ప్రజలను అణచి యుంచుటగాక వారి సమ్మతితో పాలించునట్లు ప్రకటించిరి. ఆ మార్పు నిమిత్తమై ప్రభుత్వమును కంపెనీ చేతులలో నుండి తొలగించి నిరంకుశుడుగాని ఆంగ్ల చక్రవర్తి కైవసము చేసిరి. ఆంగ్లేయుల క్షేమమునకు గాక ప్రజల క్షేమమే దృష్టియందుంచుకొని పాలనము జరుగునని విక్టోరియా రాణి వాగ్దానము నొసంగిరి. ఇంగ్లండులో వలెనే దేశీయులకు విద్యయును, ప్రజాస్వామిక పద్ధతులను అలవర్చి క్రమక్రమముగ పాలనాధికారములో సరిగ బ్రిటిషు సామ్రాజ్యములో తమ తోడి వారిని గావింతుమనిరి. వాగ్దానముల కనుగుణముగ పాలనా పద్ధతులలో మార్పులు ప్రారంభింపబడినవి. గవర్నర్లకు సలహాదార్లు నియమింపబడిరి. ఇంగ్లండులో వలెనే నిష్పక్షపాత మయిన న్యాయపాలనము సాగించుటకు సర్వ స్వాతంత్ర్యముగల ఉన్నత న్యాయస్థానములు, మండల న్యాయస్థానములు స్థాపించబడినవి. ప్రతి రాజధానిలో విశ్వవిద్యాలయములును, ప్రధాన పట్టణము లన్నింటిలో కళాశాలలును, గ్రామములలో ప్రైమరీ పాఠశాలలును స్థాపించబడినవి. స్వపరిపాలనా పద్ధతులలో ప్రజలకు శిక్షణ మొసంగుటకై రాజ ప్రతినిధిగా నియమింపబడిన రిప్పన్ ప్రభువు జిల్లా బోర్డులను మున్సిపాలిటీలను పంచాయతీ బోర్డును స్థాపించి వీటికి వోట్లతో సభ్యుల నెన్నుకొను పద్ధతి ప్రారంభించబడినది. ప్రజల యొక్క కష్టనిష్టురములను ప్రభువులకు తెలియపరచి వానిని నివారించుకొనుటకు ప్రభుత్వ సేవకులు కాని ఆంగ్ల విద్యావంతులలో రాజకీయ వేత్తలను బయలుదేరదీయుటకు బ్రాడ్లా, హ్యూము, వెడ్డర్ బరన్ మున్నగు ఆంగ్ల ప్రజా నాయకులు ఇండియాకు వచ్చి కాంగ్రెసు సంస్థను స్థాపించిరి. ఈ కడపటి సంస్థ యొక్క ప్రభావం వలన దాదాభాయి మెహతా, బెనర్జీ తిలక్, లజపతిరాయ్ మున్నగు మహానాయకులు బయలుదేరిరి. మనం అర్హతను సంపాదించుకొనిన ఎడల ఆంగ్లేయులుతప్పక స్వరాజ్య మిత్తురను విశ్వాసము దేశ మంతటను ప్రబలినది. ఉన్నతోద్యోగములును శాసన సభలకు పూర్వాధికారములను త్వరగా ఇయ్యనందున రాణి గారి వాగ్దానములు బూటకములనియు, మాటలతో వారు తమ హక్కులను వదులుకొనరనియు వాదించు శాఖ యొకటి కాంగ్రెసులో బయలుదేరినది. చట్టబద్ధమయిన పద్ధతులే అవలంబించవలయు ననువారు మితవాదులనియు, అవి ప్రయోజనము లేదనువారు అతివాదులనియు పిలువబడిరి. బంగాళా విభజనోద్యమమువలన విప్లవ వాదులు బయలుదేరిరి.

ఆంగ్ల ప్రభుత్వము వలన కొన్ని లాభములు గలిగినవి. దేశమంతయు ఒకటేయని కొన్ని శతాబ్దముల క్రింద నశించిన భారతైక్యతా భావము తిరిగి ప్రబలినది. యావద్భారతమునకు ఆంగ్లము ఒక పాలక భాషగా ఏర్పడుట వలన ఒక్క పాలక భాష అవసరమని స్పష్టమయినది. అట్టి ఏకభాష హిందీ కాదగునని నిశ్చయించుకొంటిమి. మనకు దేశభాషలను పెంపొందించు కొనవలయునను అభిమానము గలిగినది. సామాన్యజనులు ప్రజాపాలనలో పాల్గొనవలయునన్న రాష్ట్ర పాలనము ప్రదేశ భాషలలో జరుపవలయుననియు, జనసామాన్యులు తమ మాతృభాషను విడచి ఏకభాషను నేర్చుకొనుట సాధ్యము గాదనియు తేలినది. మఱియును దేశభాషలన్నియు ఉన్నతులయిన మహాకవుల రచనలు గలిగియుండుటచే వాటిని వదులుటకు ఎవరును ఇచ్చగించలేదు. కాంగ్రెస్‌లోను వృద్ధనాయకులు కొందరు మితవాదులుగనున్న యువకులందరును అతివాదపక్షములోనో, విప్లవ పక్షమునకో చేరిపోయిరి. ఆంగ్ల నాయకులను జూచియు కాంగ్రెసు నాయకులను జూచియు యువకులు బహుమంది తమ జీవితములను దేశ సేవ కర్పించుకొనుటకు నిశ్చయించుకొనిరి.

మనం తిరిగి గుంటూరు యువజన సాహితీ సంఘమునకు వస్తాము. పై జెప్పినట్టి రాజకీయ భావములన్నియు సభ్యుల హృదయాలను కలవరపరచుచునే యున్నవి. మీదు మిక్కిలి రాష్ట్ర రాజధాని అరవల భాగానికి చేరువగ నుండుటచేతను ఆంగ్ల విద్యయొక్కయు, రైళ్ళ యొక్కయు సౌకర్యములు వారి కెక్కువ గలుగుటచేతను రాష్ట్ర పాలనము పూర్తిగా వారి చేతిలో బడి ఆంధ్రులకు అర్హస్థానము వచ్చుటకు అవకాశం లేకుండుట చేతను, రాష్ట్రంలో నాలుగు ప్రదేశముల నుండి ఎన్నుకొనబడి రాష్ట్ర పాలనంలో ఇంగ్లీషుభాష రానివారు పాల్గొనుటకై సాధ్యం కాదని స్పష్టంగా కనపడుచున్నందునను, మదరాసు రాష్ట్రమును భాషావారీగా విభజనము చేయవలసియున్నదనియు, ఆంధ్రము, కర్ణాటము, మహారాష్ట్రము మాట్లాడువారలు ప్రత్యేకము వివిధ రాష్ట్రములలో చేర్చబడి దేశము నంతటిని భాషాప్రయుక్తముగ విభజించితేనే తప్ప ప్రజలకు స్వపరిపాలనములలో పాల్గొనుట సుతరాము సాధ్యమే కాదనియు స్పష్టపడినందున యువజన సంఘ సభ్యులు భాషా ప్రయుక్త రాష్ట్ర విభజనము దేశ బాహుళ్యమునకు వర్తించునట్లు ప్రచారము సాగించవలయునని తమ చర్చలలో నిశ్చయించుకొనిరి. వీరందరును భారతైక్యదృష్టి గలవారే. భారతియే దేశమాత. భాషారాష్ట్ర భాగములన్నియు భారతమాతకు పుత్రికలనియు మన మందరము భారతమాతకు పుత్రులము గాకపోయినను కనీసము మనుమలమనియు తమాషాగా అనుకుంటుండేవాండ్లము.

1911లో నేనును, గురునాథంగారును సంప్రతించి తయారు చేసిన ఆంధ్రదేశపటంలో మదరాసు రాజధానిలోని ఆంధ్ర మండలములు, మైసూరు, హైదరాబాదు సంస్థానములలోని ఆంధ్రభాగములు బేరారు. మధ్యరాష్ట్ర, ఒరిస్సాలలోని ఆంధ్రభాగములు చేర్చబడి యున్నవి. ఆ కాలమున రాజకీయవేత్తలెవరును మైసూరు, నిజాము రాష్ట్రములను విచ్ఛిత్తు చేయుట సాధ్యమని కలలో నయినా భావించి యుండరు. కాని, మా యువనజ సంఘమువారు మాత్రము బ్రిటిషు వారిని తరిమివేసి స్వాతంత్ర్యము సంపాదించుకొనగలమని, వీరిని ఈ సంస్థానము లడ్డవనియు, యావత్ భారతము విశాలమయిన రిపబ్లిక్‌గా వుంటే మధ్య గొబ్బెమ్మలలాగ సంస్థానములు దేశమునకు వికారరూపము కలిగించుననియు భావించి మొదటినుండియు విశాలాంధ్ర భావమునే గలిగియుంటిమి.

ఆంధ్రరాష్ట్రము వద్దనే వారికి వివిధ కారణములున్నవి. ఆంధ్ర నాయకులలో విశాలాంధ్ర భావము గలవారు ఒక్క కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారే. దేశభక్త వెంకటప్పయ్య పంతులుగారు జవహర్‌లాలు, రాజగోపాలాచార్యులు మున్నగువారివలె భాషా ప్రయుక్త రాష్ట్ర విభజనము భారతైక్య భావమునకు వ్యతిరేకమని తలంచేవారు. మద్రాస్ రాష్ట్ర కాంగ్రెస్ వుండగా ప్రత్యేక ఆంధ్ర మహాసభ యెందుకని వాదించేవారు. మొదట రామచంద్రరావు పంతులుగారును ఇట్టి యభిప్రాయమునే కలిగియుండిరి. బి.ఎన్. శర్మగారు విశాలాంధ్ర భావము లేకున్నను పాలనా సౌకర్యమునకు మద్రాసు రాష్ట్రమును భాషా ప్రయుక్తముగ విభజించవచ్చుననేవారు. విశాలాంధ్ర రాష్ట్రము సాధ్యమవుతుందా అని సందేహించే ఆంధ్రనాయకులు ఇప్పటికీ వున్నారు. దత్తమండలములోని వ్యతిరేకవాదుల ఆక్షేపణలు వేరు. భారతైక్య భావమునకు భిన్నమనే వాదం వారి ఆక్షేపణలలో లేదు. తమ హక్కులకు భిన్నమని వాదించేవారున్నారు. మద్రాస్ రాష్ట్రములో వారికున్న ప్రత్యేకహక్కు లేవో ఆంధ్రరాష్ట్ర మేర్పడితే వారి హక్కులేవి నశించునో ఇంతవరకు సూచించబడలేదు. తమిళ మండలముల నుంచి వచ్చు పన్నుల నుండి తీసి దత్తమండలములకు ప్రత్యేక సౌకర్యాలు కలిగిస్తామని గాని లేక ఇతర సౌకర్యములు కలిగిస్తామని గాని సి.పి. రామస్వామి అయ్యర్లుగాని, రాజగోపాలాచార్యుల వార్లు గాని చేసిన వాగ్దానములు కనిపించవు. అట్టి సౌకర్యములే అక్కడ వారికుంటే మనమూ సంతోషించవచ్చును. వారు కోరే కోర్కెలు కొన్ని విశాలాంధ్ర దృష్టికి కేవల వ్యతిరేకములు. అందుచేతనే శ్రీబాగ్ చర్చలలో కొందరము పాల్గొనలేదు. విశాలాంధ్రలో తెలంగాణము ఎప్పటికయినా చేరవచ్చునని విశ్వాసము లేని వెంకటప్పయ్య పంతులుగారు శ్రీ బాగ్ పాక్టులోని రాజధాని షరతు కంగీకరించవచ్చుగాని అట్టి విశ్వాసం గలవారు రాజధాని, హైకోర్టులను రాయలసీమవారును, సర్కారులవారును పంచుకొనుటకు అంగీకరింతురా? పరిస్థితులనుబట్టి రాజధాని షరతును మార్చుకొనవచ్చునని ఒక వాక్యము చివరనున్నప్పుడు తెలంగాణము ఒక మహాపట్టణముతో సహా విశాలాంధ్రలో చేరుటకు అవకాశము స్పష్టముగా కనపడుతున్నప్పుడు విశాలాంధ్ర క్షేమమునకు వ్యతిరేకముగా వర్తించుట ఏమి న్యాయము. విశాలాంధ్రోద్యమమును ప్రాముఖ్యమునకు దెచ్చి తత్సిద్ధికై పాటుపడుచున్న అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు, నడింపల్లి లక్ష్మీనరసింహారావు పంతులు, బి. రామకృష్ణారావు పంతులు గార్ల ప్రయత్నములు ఫలించుటకు వారికి తోడ్పడ ఆంధ్ర సోదరులను ప్రార్థించుచున్నాను.

(ఆంధ్రప్రభ,)

పొట్టి శ్రీరాములు

ఆంధ్రరాష్ట్రం

నిన్న ప్రభలో శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారి ప్రకటన చూచినప్పటి నుంచి ఆంధ్ర రాష్ట్రం నానాటికి వెనుకకు బోవుచున్నట్లు అగుపించుచున్నది. శ్రీస్వామీ సీతారాం మద్రాసు సమస్యను మధ్యవర్తి తీర్పుకు వదలమంటారు. మద్రాసులోని నాయకులు మద్రాసు లేని రాష్ట్రం అక్కరలే దంటారు. శ్రీ లక్ష్మీనారాయణ గారు భాగ్యనగరం (హైదరాబాదు) కోసం ఆందోళన చేయా లంటారు. మరి కొంత మంది ఏది యున్నా ఏది లేకపోయినా రాష్ట్రం వస్తే చాలంటారు.

అయితే ఆంధ్రులకు రాష్ట్రం న్యాయసమ్మతమని, ఎంత త్వరగా ఏర్పడిన అంత మంచిదని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, లెక్కకు రాతగిన నాయకులు అంటూనే ఉన్నారు. ఎవరూ కూడా ఏది న్యాయమో నిష్కర్షగా నిర్ణయించి సాహసముతో పని చేయుటకు వెనుకాడుతున్నారు. ప్రజలలో పోట్లాడుకొనుటకు, ద్వేషించుకొనుటకు అవకాశములను కల్పించుచున్నారు.

ప్రత్యక్షంగా పాల్గొనక పోయినా ప్రతి ఆలోచనాపరుడికీ యీ సమస్య ఆందోళన కలిగించుచున్నది. రాష్ట్రంలో ఏ పని చేయుటకూ చైతన్యం సన్నగిల్లుచున్నది. ఇతర రాష్ట్రములలో భూదానయజ్ఞం అమిత ఉత్సాహంతో జరుగుతూ ఉంటే ఆంధ్రలో అనుకునే వారే లేరు. గాంధీ, కస్తూరిబా నిధులు ఇతర చోట్ల చక్కగా పని చేస్తూ ఉంటే ఆంధ్రలో నిద్రపోతున్నవని చెప్పవచ్చు. ఆంధ్రలో ప్రొహిబిషన్‌నేరాలు చాలా ఎక్కువైనవని మంత్రులు, అధికారులు భావిస్తున్నారు. అరికట్టు వారు లేరు. ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలన్నియు స్వార్థ దృష్టితో విపరీతంగా కలుషితమై పోతున్నవి. ఇవన్నీ ఎవరికిష్టమున్నా లేకపోయినా ఒక్క కమ్యూనిస్టు పార్టీకి మాత్రం ఉపయోగపడి వారి ప్రచారం నిర్విఘ్నంగా సాగుచుండుటకు అవకాశ మిచ్చుచున్నవి.

పరిష్కారమునకు మార్గమే లేదా?

ఆంధ్ర రాష్ట్రమును గురించి బహుదీర్ఘకాలం చర్చలు జరిగినవి. 'రాష్ట్రము అవసరమా? ఏర్పాటు చేయవచ్చునా?' అనే ప్రశ్నలు ఇప్పుడు లేవు. ప్రభుత్వాలు, ప్రజలు, నాయకులు ఏకాభిప్రాయానికి (అనగా రాష్ట్రమును త్వరగా ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి) వచ్చారు. దేశం ఏకంగా ఉండాలంటే రాష్ట్రాలు సంకుచిత భావం పోగొట్టుకోవాలంటే, డిల్లీ, బొంబాయి, మద్రాసు, కలకత్తా మొదలగు ముఖ్య నగరాలు ఏ ఒక్క రాష్ట్రానికీ చెందకుండా కేంద్ర ప్రభుత్వమే పాలించాలి. ఈ నగరాల అభివృద్ధి దేశంలో నుండు అన్ని ప్రాంతాల ధనరాసులతో, రక్తముతో, బుద్ధితో జరిగినది. ఆర్థిక వ్యవస్థ మారితే యీ

నగరాలు వస్తు సంగ్రహ ఆలయాలుగా (Museums) ఉండిపోతవి. అంతవరకూ ప్రతి ఒక్కరూ ఈ నగరాలలో చేరాలనుకుంటారు. ప్రస్తుతం ప్రతి పట్నం, ప్రతి పల్లె ఈ నగరాల మీద ఒక రకంగా ఆధారపడి యున్నవి. కనుక ఎవరికీ కూడా యీ నగరాలలో నిషేధ ముండరాదు. ఇప్పుడు ఆంధ్ర రాష్ట్ర సమస్య మద్రాసు నగరానికి ముడి పెట్టబడినది. వెంటనే మద్రాసు నగర భవిష్యత్తును తేల్చిన, మిగతా నగరాల భవిష్యత్తు సకాలంలో తేలిపోగలదు. ఇప్పట్లో భాగ్య నగరానికి ఆశపడితే చేతులలోకి వచ్చేది జారి పోయినట్లగును. ఆంధ్ర రాష్ట్ర మేర్పడిన కొలది కాలంలో విశాలాంధ్ర ఏర్పాటుచేసుకోవచ్చు. ఏ రాష్ట్రమేర్పడినా ప్రజా దృష్టితో పరిపాలన జరగాలి. ఎవరో కొంతమంది రాజకీయజ్ఞులు, అధికారులు, వర్తకులు బాగుపడుటకు మాత్రం అవకాశం కలుగరాదు.

సాధించుటకు మార్గాలు :

1. విపరీతంగా ప్రస్తుతమున్న ప్రభుత్వమును తూర్పార బట్టి, ప్రజలలో ద్వేషమును రగుల్కొల్పి, పన్నులు ఎగబెట్టించి, జైళ్లు, లాఠీలు, కాల్పులకు అవకాశం కలుగుజేసి, అందరికీ విసుగు కలిగించి అశాంతితో కూడిన ఏదో ఒక పార్టీకి చెందిన రాష్ట్రమును సంపాదించుట.
2. వచ్చిన మటుకే చాలని రాజకీయ పార్టీలను కూడ గట్టుకొని, ఆశలు కల్పించి స్వార్థపరులు ఏర్పాటు చేయు రాజ్యము.
3. అందరి మేలుకై ఎవరో కొందరు నిష్కామంగా తమ జీవితాలర్పించటం.

గాంధీగారు నేర్పిన ద్వేష రహితమైన, స్వార్థము లేని త్యాగమునకు విలువ రోజులు గడచిన కొలదీ హెచ్చునేకాని తగ్గదు. వారితో పని చేసిన సహచరులే (ఇప్పుడు) అధికారములో నున్నారు. వీరిని దేశం ఇంకా పూజిస్తూనే యున్నది. వీరి సేవలు దేశానికి యింకా అవసరం అని వీరు భ్రమలో పడి Black Mailకు, స్వార్థానికి అవకాశాలిస్తూ ఉంటే దేశ క్షేమమును కోరు వారు మిన్నకుండుట కర్తవ్య భ్రష్టత కాగలదు.

ఈ రోజు (13-10-52) ఆంధ్రప్రభలో మద్రాసు ఆర్థిక మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం గారు భారతి ఉత్సవాలలో మాట్లాడుచు మద్రాసు తమిళులది అని అన్నారు. కొలది రోజుల క్రింద మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ రాజగోపాలాచారి గారు మాట్లాడుతూ అదే మాటన్నారు. అధికారంలో నుండి మద్రాసు మంత్రులు, కేంద్ర మంత్రులు ఇట్టి వ్యాఖ్యానాలను ఖండించుటకు కూడ సాహసించలేకున్నారు. దేశానికి ఆరాధ్య దేవుడు, ప్రపంచ మేధావులలో అతి ప్రాముఖ్యము వహించిన పండిత జవహరులాలు యీ సమస్యను తటస్థముగా (నిష్పక్షపాత దృష్టితో) ఆలోచించునట్లు చేయుటకు ఎందరు ఎన్ని త్యాగాలు చేసినా ఉచితమే అగును. ఏలననగా ప్రస్తుతం అధికారములో నున్న ఈ మహానాయకులు హృదయపూర్వకముగా దృష్టిని మార్పు చేసికొనినచో దేశంలో అశాంతి లేక, పార్టీ రాజకీయాలకు అవకాశం సన్నగిల్లి, ఇప్పుడు ఒకరినొకరు ద్వేషించుకొను అరవలు, తెలుగు వారు సఖ్యతతో జీవించుటకు మార్గమేర్పడును.

మద్రాసు నగరమును కేంద్రము పరిపాలించుటే ఉత్తమమైన మార్గము. ప్రస్తుతం మద్రాసులో అధికారములో నుండువారు దీనికి వ్యతిరేక అభిప్రాయము కలిగి యుండుటే కాక, బహిరంగముగా ప్రచారము చేయుచున్నారు. తగు కార్యాచరణకు కూడా ఇదివరకటి కంటె ఎక్కువగా ప్రయత్నింతురు. ఏ మాత్రం ఆలస్యం లేకుండా నిర్ణయాలు జరగాలి!

నిర్ణయాలు చేయువారు :

1. పండిత జవహరులాల్ గారు చేయవచ్చును.
2. శ్రీ రాజగోపాలాచారి గారు అభిప్రాయం మార్చుకొనవచ్చును.
3. మద్రాసు నగరంలోని ప్రజలు మదరాసు నగరం ప్రత్యేకంగా పరిపాలించబడాలని కోరవచ్చును.
4. ఆంధ్రులలో ఐకమత్యం కలిగి ఏకాభిప్రాయమునకు రావచ్చును.

మద్రాసు నగర భవిష్యత్తును గురించి ఆంధ్రులలో భేదాభిప్రాయాలు, మద్రాసు నగర ప్రజల నిర్లక్ష్యత ఉన్నప్పుడు ఒక్క జవహర్‌లాల్ గారు మాత్రమే బాధ్యత వహించాలనడం, నిర్ణయాలు చేసి అమలు పరచాలనడం సమంజసంగా లేదు. మద్రాసులో ప్లెబిసైట్ జరిపినను మద్రాసు స్వతంత్రముగా కేంద్రముచే పరిపాలించబడుటకు అనుకూలముగా నిర్ణయము జరుగదన్నంత వరకు జవహర్‌లాల్‌ను నిందించి లాభం లేదు. మద్రాసు ప్రజలలో చైతన్యం కలిగించాలి. ఉద్యమం సక్రమంగా జరుగుతుంటే జవహర్‌లాల్ గారే కాక తదితర వ్యతిరేకులు కూడా అనుకూలించగలరు.

అందరి దృష్టి యీ సమస్యపై కేంద్రీకరించి అందరికి సంతోషము చేకూర్చగల నిర్ణయానికి వచ్చునట్లు చేయుటకు ఆమరణ ఉపవాసం చేయుటకు నేను సిద్ధపడుచున్నాను. నేను ఆంధ్రుడననే కారణం చేత యీ పనికి పూనుకోడం లేదు. శాంతి మార్గమున అన్ని ప్రాంతాలు పురోగమించగలవను నమ్మకంతో మాత్రము చేయుచున్నాను. నేను జన్మించినది, చదువుకొన్నది మద్రాసు నగరములోనే, ఎవరిని వత్తిడి చేయుట నా సంకల్పము కాదు. ఈ సమస్య పరిష్కారమగు వరకు జీవించగల ననే ఆశను వదులుకొనుచున్నాను. ఎంత మంది బలి కావాలో? ఈ విషయానికి సంబంధించిన వారందరూ సంకుచిత భావములను విడచి ఆలోచించగలరనే నమ్మకంతోనే ఈ పనికి దిగుతున్నాను. ఏ రోజు ఏపని కాగలదో అంతకంటే త్వరగా ఏదియు జరుగదని నాకు తెలుసు. నేను నమ్మిన దానికై సంపూర్ణముగా కృషి చేయుటే నా కర్తవ్యము.

ఆంధ్ర రాష్ట్రము ఏర్పాటయితే కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తారను భయ ముంటే, రాష్ట్రమును ఏర్పాటు చేసి గవర్నరు పరిపాలనములో నుంచి ఎలక్షనులు జరుపవచ్చు. మద్రాసు విషయం నిర్ణయించి, నిర్ణయమును అమలు జరుపటకు కొత్త ఎలక్షనులు జరుపవచ్చు.

ఇట్లు
(సం.) పొట్టి శ్రీరాములు

15-9-52
నెల్లూరు

దీక్ష ఆరంభించడానికి ముందు 14-10-1952 తేదీన మద్రాసు పౌరులకు, ఇతరులకు శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన విజ్ఞప్తి

1. సహజంగానే నేను నిర్మాణ కార్యక్రమ కార్యకర్తను. నా జీవితం అంతా నిర్మాణ కార్యక్రమం కోసమే వినియోగించాను. 1930 మొదలు నేటి వరకు గాంధీజీ నిర్దేశించిన నిర్మాణ కార్యక్రమంలోనే నేను పాల్గొంటూ వచ్చాను. అయితే నిర్మాణ కార్యక్రమం, రాజకీయాలు పరస్పరం ఎలాంటి సంబంధం లేని విడివిడి రంగాలు కావు. ఆ కారణం చేతనే పూజ్య మహాత్మాగాంధీ తాము రాజకీయాలలో ప్రవేశిస్తున్నట్లు చెప్పారు. నిర్మాణ కార్యక్రమం కోసం ఆయన రాజకీయాలలో ప్రవేశించి, బ్రిటిష్ వారు మన దేశం విడిచి పోయేట్టు చేశారు.
2. గత రెండు సంవత్సరాలుగా ఆంధ్ర దేశంలో గాంధీ స్మారక నిధి సంచాలకుడుగా నేను పని చేస్తున్నాను. 1948 నుంచి కాంగ్రెస్ సంస్థ తరఫున ఆంధ్ర దేశంలో నిర్మాణ కార్యక్రమ సంచాలకుడుగా పని చేశాను. నిర్మాణ కార్యక్రమాన్ని అమలు జరపడానికి ప్రయత్నించడంలో నేను ఎన్నో చిక్కులు ఎదుర్కొన్నాను. ఆ సందర్భంలో తరచు నాకు 'అయ్యో! మనకు ప్రత్యేకాంధ్ర రాష్ట్రం లేకపోవడం ఎంత దురదృష్టకరం!' అనిపించేది. ప్రత్యేకాంధ్ర రాష్ట్రం లేకుండా ఈ నిర్మాణ కార్యక్రమంలో ఇంకెంత మాత్రం పురోగమించడం సాధ్యం కాదనే నిర్ణయానికి నేను వచ్చాను. దేశంలో ఇంచుమించు ప్రతి రాష్ట్రంలోనూ నిర్మాణ కార్యక్రమ కార్యకర్తలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో అసంతృప్తి చెందుతూ ఉండడం నేనెరుగుదును. అయినా తమకు తెలిసినవారూ, తమ నిర్మాణ కార్యక్రమం పట్ల సానుభూతి గల వారూ ప్రభుత్వ పదవులలో కొందరు ఉండడం వలన వారు గణనీయమైన ప్రగతి సాధించగలుగుతున్నారు. కాని, బహు భాషా రాష్ట్రమైన మద్రాసు రాష్ట్రంలో ముఖ్యంగా ఆంధ్రదేశంలో నిర్మాణ కార్యకర్తల మొర ఆలకించే వారు లేరు. అందుచేత స్వయం ప్రేరణతోనే నేను రాజకీయాలలో ప్రవేశించి నిర్మాణ కార్యక్రమం కోసం నిర్మాణాత్మకమైన రీతిలో కృషి చేయడం తప్పని సరి అయింది.
3. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇదివరకే జరిగాయి. ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు అభ్యంతరం చెప్పేవారు లేరు. పైపెచ్చు సాధ్యమైనంత త్వరగా ఆ రాష్ట్రం ఏర్పాటు కావాలనే తొందరలో కూడా ఉన్నారు. కాని మద్రాసు నగర భవిష్యత్తు ఒక సమస్య అయి కూర్చుంది. మన ప్రధాని ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు తాను చర్యలు తీసుకొనే ముందు మదరాసు నగరం భవిష్యత్తు విషయమై ఆంధ్రులు, తమిళులు ఒక ఒప్పందానికి రావాలని పట్టుబడుతున్నారు. అందుచేత ఇప్పుడు మదరాసు నగర పూర్వ చరిత్రను గురించీ, గతంలో అధికారంలో ఉన్న కొందరు ప్రముఖులు చేసిన ప్రకటనలను గురించీ ప్రస్తావించవలసి ఉంది.
4. 1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావడంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది. దాని వలన కలిగిన తత్‌క్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షత క్రింద 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది' అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంలో ఆమోదించబడింది.
5. భాషా ప్రాతిపదిక మీద భారతదేశంలోని రాష్ట్రాల పునర్విభజన మహాత్మాగాంధీ నాయకత్వం క్రింద ఒక జాతీయ కార్యక్రమంగా రూపొంది, 1920 డిసెంబరులో నాగపూర్‌లో జరిగిన కాంగ్రెసు మహాసభలో దేశంలోని రాష్ట్ర కాంగ్రెసు సంఘాల నన్నిటినీ భాషా ప్రాతిపదిక మీద తిరిగి ఏర్పాటు చేయడం జరిగింది. అలాంటి ఇతర రాష్ట్ర కాంగ్రెసు సంఘాలతో పాటు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం, తమిళనాడు రాష్ట్ర కాంగ్రెస్ సంఘం, కేరళ రాష్ట్ర కాంగ్రెసు సంఘం, కర్నాటక రాష్ట్ర కాంగ్రెసు సంఘం కూడా ఏర్పాటు అయ్యాయి. వీటిలో మొదటి రెండు రాష్ట్ర కాంగ్రెస్ సంఘాలకూ మదరాసు నగరం మీద ఉమ్మడి హక్కు కలిగించబడింది. అయితే వీటిలో ఏ రాష్ట్ర కాంగ్రెసు సంఘం అయినా తన ప్రధాన కార్యస్థానాన్ని మరొక నగరానికి తరలించుకొనే స్వేచ్ఛ కల్పించడం జరిగింది.
6. 1926లో మొట్టమొదటి సారిగా పూర్తి స్వయం పరిపాలనాధికారంతో తమిళనాడు రాష్ట్ర ఏర్పాటు చేయాలని కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లో శ్రీ శంకరన్ నాయర్ ఒక తీర్మానం ప్రతిపాదించారు. అయితే ఆయన ప్రతిపాదించిన తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో మదరాసు నగరం చేర్చబడలేదు. అలా తాను ప్రతిపాదించిన తమిళనాడు రాష్ట్రంలో మదరాసు నగరాన్ని చేర్చకపోవడానికి గల కారణాలను ఆయన తన ప్రసంగంలో వివరించారు. (చూ. పుట 560 కౌన్సిల్ ఆఫ్ స్టేట్ డిబేట్) ఆ ప్రసంగంలో ఆయన 'మదరాసు తమిళ భూభాగంలో చేరింది కాదు... మదరాసు సగం తమిళం, సగం తెలుగు నగరం' అన్నారు.
7. మదరాసు ముఖ్యమంత్రిగా ఉన్న పానగల్ రాజా మదరాసు నగరాన్ని కూమ్‌నది సరిహద్దుగా రెండు భాగాలుగా విడదీసి ఉత్తరపు భాగాన్ని ఆంధ్ర రాష్ట్రంలోనూ, దక్షిణ భాగాన్ని తమిళ రాష్ట్రంలోనూ చేర్చాలని ప్రతిపాదించారు.

8. 1927లో గౌ. శ్రీ వి. రామదాసు పంతులు ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కోసం కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లో ఒక తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ ఆ రాష్ట్రంలో ఏ యే జిల్లాలు చేరవలసిందీ సూచిస్తూ వాటిలో మదరాసు నగర ఉత్తర భాగాన్ని కూడా చేర్చారు. (చూ. పుట 156 కౌన్సిల్ ఆఫ్ స్టేట్ డిబేట్).

9. దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు 1949లో తాను తుది శ్వాస విడిచే వరకూ మదరాసు నగరం పూర్తిగా ఆంధ్రరాష్ట్రంలోనే చేరాలని వాదిస్తూ వచ్చారు.

10. వెంటనే ఆంధ్ర రాష్ట్రం స్థాపించడానికి వీలుగా ఆంధ్రులు మదరాసు నగరం మీద తమ హక్కును వదులుకోవాలని 1949 నాటి జె.వి.పి. రిపోర్టు పట్టుపట్టింది. ఆ కమిటీ నివేదికకు నిరసనగా ఆంధ్రదేశం అంతటా ఉవ్వెత్తుగా ఉద్యమం లేచి మదరాసు నగరమే ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని కావాలని ప్రకటించింది.

11. 1950లో రాష్ట్ర విభజన సంఘం నివేదికను (శ్రీ టి. ప్రకాశం తన అనంగీకార పత్రం దానికి జత పరిచారు) సమర్పించింది. యూనియన్ ప్రభుత్వ మంత్రి వర్గం 1950 జనవరిలో జరిపిన తన సమావేశంలో మదరాసు నగర ప్రతిపత్తి మొదలైన విషయాల మీద తమిళులు, తెలుగు వారు ఒక అంగీకారానికి రావడం ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి ఒక షరతుగా పేర్కొంది. ఇది చాలా అన్యాయం, అనుచితం. 1926లో మదరాసు నగరం మీద తమ హక్కును పూర్తిగా వదలుకొన్న తమిళులు ఆంధ్రులకు ఆ నగరం మీద ఎలాంటి హక్కు లేకుండా మదరాసు నగరం పూర్తిగా తమకే రావాలని వాదించి ఉండకూడదు. మదరాసు నగరాన్ని ఒక ప్రత్యేకమైన కమీషనర్ రాష్ట్రంగా ఏర్పాటు చేయడానికి కూడా తమిళులు వ్యతిరేకించారు.

12. రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రజలు నూతన ఆంధ్ర రాష్ట్రానికి మదరాసు నగరమే రాజధాని కావాలని పట్టుపట్టారు. ఆ నగరాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసినా లేదా పానగల్ రాజా, శ్రీ వి. రామదాసు పంతులు ప్రతిపాదించినట్లుగా ఆ నగరాన్ని తమిళులకు, తెనుగులకు పంచి ఇచ్చినా ఆ నగరమే ఆంధ్ర దేశ రాజధాని కావాలని వారి వాదం. వారి ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా అది అత్యవసరం.

13. సుమారు 50 ఏళ్ల క్రితం నేను ఈ మదరాసు నగరంలో జన్మించాను. నాకు 20 ఏడు వచ్చే వరకూ ఇక్కడే చదువుకున్నాను. 1934 వరకూ మా కుటుంబం మదరాసులో ఉంది. మదరాసు నగరంతో నాకు సన్నిహిత పరిచయం ఉంది. ఇక్కడి ఆంధ్రులకూ, నెల్లూరు, రాయలసీమ జిల్లాలోని ప్రజలకూ ఈ నగరం మీద ఎంతటి మమకారం ఉందో నేను స్వయంగా ఎరుగుదును. మదరాసు నగర అభివృద్ధి కోసం తాము ఎంతో కృషి చేసి ఉన్నందువల్ల పూర్తిగా అభివృద్ధి చెందిన ఆ నగరాన్ని వదలి వేరొక చోట ఆంధ్ర రాష్ట్ర రాజధానిని నెలకొల్పడం అనే ఆలోచనతో వారు సమాధాన పడలేరు. ప్రజలు వివిధ సమావేశాలలో, పరిషత్తులలో, కాన్ఫరెన్సులలో అసంఖ్యాకమైన తీర్మానాలు చేసి మదరాసు నగరం రాజధానిగా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్న తమ దృఢ సంకల్పాన్ని ప్రకటించారు.

14. ఈ అన్ని అంశాలను గమనిస్తూ కూడా కాంగ్రెసు అధ్యక్షులు, భారత ప్రధాని అయిన జవహర్‌లాల్‌జీ బాధ్యతతో తాను ఒక నిర్ణయం తీసుకోకుండా ఆంధ్రులు, తమిళులు మదరాసు నగర భవిష్యత్తు విషయమై ఒక ఒప్పందానికి రావాలని పట్టుపట్టారు. ఆయనకు ఇష్టం లేని పనిని బలవంతంగా ఆయన చేత చేయించాలని ప్రయత్నించడం వల్ల ప్రయోజనం లేదు. అందుచేత ఆయన గుర్తించక తప్పనిసరి అయే పరిస్థితులను మనం కల్పించి మొత్తం దేశం శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తానే చొరవ తీసికొని ఆయన ఈ సమస్యను పరిష్కరించేట్టు మనం చేయాలి.

15. అది రెండు విధాలుగా మనం చేయవచ్చును. ఒకటి : హింసాత్మకంగా; రెండు : అహింసాత్మకంగా. అహింసలో విశ్వాసం గల ప్రజలు నిద్రపోతూ ఏమీ చేయలేక ఊరుకుంటే ప్రజలు హింసాత్మక మార్గానికి పూనుకొని పరిస్థితులను మరింత క్లిష్టం చేయడం జరుగవచ్చును. స్వామి సీతారామ్‌ను ఆయన విధానాలతో కొందరు అంగీకరించక పోయినా – ఈ సమస్యను సజీవంగా నిలిపి ఉంచి అందరూ దానిని గూర్చి ఆలోచించేట్టు చేస్తున్నందుకు అభినందించవలసి ఉంది.

16. ఇప్పుడు మదరాసు నగర భవిష్యత్తు విషయమై అందరికీ అంగీకార్యమైన ఒక ఒప్పందాన్ని సాధించేందుకు మనం తీవ్రంగా ప్రయత్నించవలసి ఉంది. ఈ ప్రయత్నం మదరాసు నగరంలోనే జరగాలి. మదరాసు నగరంలో నివసించే పౌరులు, మదరాసుతో దగ్గరి అనుబంధం గల పౌరులు – అందరి ప్రయోజనాలను న్యాయ దృష్టి గల ఆంధ్రులను, తమిళులను సమావేశ పరచాలి. వారందరి ప్రయోజనాలకు భద్రత కలిగించాలి. వారందరికీ సంతుష్టి కలిగించాలి. మదరాసు నగరాన్ని ఆంధ్రులకు, తమిళులకు ఉమ్మడి నగరంగా ఏర్పాటు చేయడం ద్వారా ఇలాంటి ఒప్పందం సాధ్యమని నేను విశ్వసిస్తున్నాను. ఇది ఎలా సాధించాలి అనే విషయాన్ని నేను ప్రజలకే వదలి పెడుతున్నాను.

17. దీనిని సాధించడం కోసమే మదరాసులో మైలాపూరులోని శ్రీ బులుసు సాంబమూర్తి గారింట్లో 19–10–52 న నేను ఈ ఆమరణ నిరశన దీక్షను ప్రారంభించాను. మదరాసు నగర భవిష్యత్ ప్రతిపత్తి విషయమై ఆసక్తి ఉన్న ఆంధ్రులూ, తమిళులనూ ఒక ఒప్పందానికి రావలసిందనీ, ఆ విధంగా వెంటనే మదరాసు నగరం రాజధానిగా నూతన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి ప్రజాభీష్టం నెరవేరేందుకు తోడ్పడాలనీ నేను నా హృదయ పూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

'ఆంధ్ర పితామహ' మాడపాటి హనుమంతరావు

తెలంగాణా ప్రజల అభ్యుదయోపలబ్ధికై సాగిన 17 ఏండ్ల ఆంధ్రోద్యమం

తెలంగాణములోని ఆంధ్రుల ఉద్యమ చరిత్ర పదునేడు వత్సరముల కాలపరిమితి గలది. (1930 నుండి 1947 వరకు) ఈ ఆంధ్రోద్యమములో తెలంగాణా ప్రజల మహా సభలు పదమూడు జరిగినవి. ఈ మహాసభ ప్రతి సంవత్సరం జరుపవలయునని ఉద్దేశింపబడియుండినను, అట్లు జరుగలేదు. రెండవ మహాసభ తరువాత ప్రభుత్వమువారు, ఉద్యమమును సాగనీయక అడ్డంకులు కల్పించిరి. దీనివలన మూడేండ్ల వరకు కార్యకర్తలు తికమకలు పడవలసి వచ్చెను. ఆరవ ఆంధ్రమహాసభ తర్వాత హైదరాబాదులో సత్యాగ్రహోద్యమము జరిగినందున ఒక సంవత్సరకాలము మహాసభ సమావేశమునకు వీలు తప్పినది. ఈ విధముగా మొత్తము నాల్గువత్సరముల కాలము మహాసభ జరుగకుండ దాటి పోయినది.

13 సభలు

తెలంగాణములో మొదట ఎనిమిది జిల్లాలుండి, తరువాత అవి 9 జిల్లాలుగా మారినవి. ఈ తొమ్మిందిటిలో ఈ మహాసభలు ఏడింటిలో మాత్రమే జరిగినవి. రెండు జిల్లాల (ఆదిలాబాదు అత్రావుబల్దాల)లో అవి సమావేశపరుపబడలేదు – ఆదిలాబాదు జిల్లాలోని ఉత్తరభాగమున మహారాష్ట్రభాష వాడుకయందు ఉండుటవలను, ఆ ప్రాంతమున ఆంధ్రోద్యమము ఎక్కువగా వ్యాపించలేదు. అందువలన మహాసభ ఆ జిల్లాకు ఆహ్వానింపబడలేదు. అత్రాఫుబల్దాజిల్లా తెలంగాణములో చాల ముఖ్యమైనదనియు, రాజధానీ నగరమునకు సమీపమునన్నదియు అయియుండియు, నిజాముప్రభువు యొక్క స్వంతపాలనము క్రింద నుండుటచేత, అచ్చట నీ సమావేశమునకు అంగీకారము దొరకుట అసంభవమనిపించింది. అంతేకాదు, ఆ జిల్లాలో నీవిషయమైన అంగీకారము నొసగు నధికారము ప్రభువుగారికే యుండెను. వారి నీవిషయమున నడిగినచో, అసలు ఆంధ్రమహాసభయే నిషేధింపబడునను భయము వలన నట్టి అపాయకరమగు యత్నము కార్యకర్తలు చేయలేదు. మొత్తము ఈ 19 మహాసభలలో 3 నల్లగొండ జిల్లాలోను, 3 వరంగల్లు జిల్లాలోను, 2 మెదకు జిల్లాలోను, 1 కరీంనగరము జిల్లా, 1 మహబూబునగరముజిల్లా, 1 నిజామాబాదుజిల్లా, 1 బాగాతు జిల్లాలోను, 1 హైదరాబాదు నగరములోను సమావేశమైనవి.

ప్రశంసనీయములు

మహాసభలు మొత్తం పదమూడు జరిగినను, ముగ్గురు మహాశయులు రెండు రెండుమారులు మహాసభ అధ్యక్షులుగా నెన్నుకొనబడినందున మహాసభాధ్యక్షులుగా గౌరవింపబడిన మహాశయులు

పదుగురేయైరి. అట్టి ప్రత్యేక గౌరవమును పొందినవారు 1. కొండా వేంకటరంగారెడ్డిగారు, 2. శ్రీ రావి నారాయణ రెడ్డి గారు, 3. శ్రీ మందుముల నరసింగరావు గారు. వీరిలో మొదటివారు, షాదు నగరములో జరిగిన అయిదవ మహాసభకును, హైదరాబాదులో సమావేశమైన పదవ మహాసభకును అధ్యక్షత వహించియుండిరి. అట్లే రెండవవారు, చిల్కూరులో జరిగిన ఎనిమిదవ మహాసభకును, భువనగిరిలో జరిగిన పదునొకండవ మహాసభకును అధ్యక్షులైయుండిరి. ఇక మూడవవారు నిజామాబాదులో సమావేశమైన ఆరవ మహాసభ యందును, మడికొండలో జరిగిన 12వ మహాసభ యందును అధ్యక్షపీఠము నలంకరించిరి. వీరి సేవ ప్రత్యేక ప్రశంసకు పాత్రమని వేరే చెప్పవలసిన పనిలేదు.

వెనుకటినుండి వచ్చుచున్న సంప్రదాయసిద్ధమగు ఆంధ్రమహాసభను కమ్యూనిస్టు పక్షావలంబులగు నాంధ్ర కార్యకర్తలు, శ్రీ రావి నారాయణరెడ్డి గారి నాయకత్వమున వశపరచుకొనగా, అత్యంత ధైర్యసాహసములతోను, అకుంఠిత కార్యదీక్షతోను, ప్రతిపక్షాల నెదుర్కొని, అవిశ్రాంతమగు కృషిచే ప్రజాబలమును సమకూర్చి పూర్వ సంప్రదాయములతో పండ్రెండవ మహాసభను సమావేశపరచి, యుద్యమమును పునరుద్ధరించిన గౌరవము పైన పేర్కొనబడినవారిలో నిద్దరగు శ్రీ కొండా వేంకటరంగారెడ్డి, శ్రీ మందుముల నరసింగరావు గార్లకు దక్కుచున్నది. కనుక, వీరిపేర్లు తెలంగాణా ఆంధ్రోద్యమచరిత్రమున – చిరస్థాయిని గాంచుననుట నిర్వివాదాంశం. ఈ కారణమున, వీరిరువురును ఆంధ్ర మహాసభా పునఃస్థాపనాచార్యులని పేర్కొనుటకు తగి యుందురు.

రాజకీయములతో ఈ మహాసభకు సంబంధముండదని కార్యకర్తలవలన ఒప్పుకొనబడి, “మహాసభ రాజ్యాంగ విషయక పరిస్థితి నుండి పూర్తిగా తొలగుట విధాయకము” అను విస్పష్టమగు ప్రభుత్వపు షరతుతో ప్రారంభమైనట్టియు, ఎన్నియో విషయ నిర్బంధములకు లోబడి సాగింపబడు చుండునట్టియు, ఈ మహాసభలు, క్రమక్రమముగా, ఒకసారికంటె రెండవసారి ప్రభుత్వమును తీవ్రతరముగా విమర్శించుచు, ప్రభుత్వము నెడ శాసనోల్లంఘన పద్ధతి నవలంబించిన మహాశయులు అధ్యక్ష గౌరవమునొంది, తుదకు బాధ్యతాయుత ప్రభుత్వమునకు తక్కువదగునే యాదర్శమును – అంగీకరించజాలమని తీర్మానించుటయేకాక, ప్రభుత్వమువారి కారాగారములలో దీర్ఘ కాలము గడపిన నాయకుల యధ్యక్షత క్రింద నడుపబడు స్థితికి, పదునేడు సంవత్సరముల కాలములో వచ్చినది.

మహిళా మహాసభలు

ఆంధ్రోద్య మారంభమునుండి మహిళాభ్యుదయావశ్యకత కూడ దృష్టియందుంచబడెను. ఉద్యమము యొక్క మొదటిదశయందు, గ్రామములలోను, పురములలోను జరుగు ప్రతి సభకు స్త్రీలు ప్రేక్షకురాండ్రుగ వచ్చునట్లు చేయబడుచుండెను. పెద్దయెత్తున సభలు జరిగినప్పుడు, వానితోపాటు ప్రత్యేకముగా స్త్రీల సమావేశములు కూర్చబడుట విధియైపోయినది. ఉద్యమము యొక్క రెండవ దశయందును, ఆ పద్ధతియే యవలంబింపబడినందున, మొదటి ఆంధ్రమహాసభతోపాటు మొదటి మహిళా మహాసభ కూడ సమావేశ పరుపబడినది. ఇట్లే ప్రతి మహాసభతోపాటు మహిళా మహాసభయు, (ధర్మవరములో సమావేశమైన తొమ్మిదవ ఆంధ్ర మహాసభవరకు) సాగివచ్చినది. అచ్చట మహిళా మహాసభవారు తమ సభలను స్వతంత్రంగా జరుపుకొనదలచి, అట్టి తీర్మానం గావించుకొనిరి. అప్పటినుండి మహిళా మహాసభతోటి సంబంధము ఆంధ్ర మహాసభకు వదలి పోయినది.

ఆంధ్ర మహాసభతోపాటు ఆంధ్ర మహిళా మహాసభయు జరుగుచుండుట ఉభయ సమావేశములకును లాభదాయకముగా నుండెడిది. ముఖ్యముగా ఇట్టి సంబంధం మహిళలకు ఎక్కువ విజ్ఞానప్రదముగ నుండెననుట నిస్సంశయము. మహిళా మహాసభకు వచ్చిన విద్యావంతులు మహాసభలోకూడ పాల్గొనుట వారికి మంచి యనుభవము నిచ్చుచుండెను. మహా సభకు వచ్చు కార్యకర్తలు, నాయకులు తమ కుటుంబములను వెంట తెచ్చుకొన నుత్సాహపడుచు, వారికీ మహిళా సభలో దేశ సమస్యలను, ముఖ్యముగా మహిళాభ్యుదయ సమస్యలను గ్రహించు నవకాశము కల్పించుచుండిరి. ఇట్టి పద్ధతి వదలుకొనిన తరువాత జిల్లాలో జరిగిన ఆంధ్రమహాసభలు కొంతశోభను గోల్పోయినవని చెప్పుట కభ్యంతరము లేదు. ప్రథమ మహిళా సభ కధ్యక్షురాలుగా నుండిన (కీ.శే.) నడింపల్లి సుందరమ్మగారు ప్రతి మహాసభ దినములలోను. విద్యార్థినులకును, యువతులకును నాయకురాలై ప్రభాతఫేరీలు జరుపుచుండిరి. తెల్లవారుజామున ఈ ప్రబోధ గీతములు వీనులవిందుగావించు చుండినవి. వీరు హైదరాబాదు నివాసము వదలుకొని వెళ్ళునప్పుడు ఏడవ ఆంధ్రమహాసభ (మల్కాపురము)కు సేవయొనర్చి మరి వెళ్ళిరి.

ఆంధ్రమహాసభకు అనుబంధితములుగా జరిగిన తొమ్మిది మహిళా సభలకు అధ్యక్షత వహించిన మహాశయురాండ్రు మొత్తము ఎనిమిది మంది సోదరీమణులను, ఎనిమిదవ మహిళా సభకు అధ్యక్షురాలుగా నుండిన సోదరియే తొమ్మిదవ మహసభకు గూడ అగ్రాసనాధిపురాలుగా నుండుటవలన పై సంఖ్య ఏర్పడినది. వీరు :- 1) శ్రీమతి నడింపల్లి సుందరమ్మగారు (జోగిపేట), 2. శ్రీమతి టి. వరలక్ష్మమ్మ గారు (దేవరకొండ), 3. శ్రీమతి ఎల్లాప్రగడ సీతాకుమారిగారు (కమ్మంమెట్టు), 4. శ్రీమతి మాడపాటి మాణిక్యమ్మగారు, (సిరిసిల్ల), 5. శ్రీమతి బూర్గుల అనంతలక్ష్మీదేవి గారు (షాదునగరం), 6. శ్రీమతి నందగిరి ఇందిరాదేవి గారు, బి.ఏ. (నిజామాబాదు), 7. శ్రీమతి యోగ్యశీలాదేవిగారు, బి.ఏ. (మల్కాపురము), 8. శ్రీమతి రంగమ్మ ఓబులరెడ్డిగారు, (చిల్కూరు, ధర్మవరము), వీరందరును, ఆయా మహాసభల అధ్యక్షురాండ్రుగా, తమ కర్తవ్యములను ఉత్సాహముతో, తృప్తికరముగా నిర్వహించి ప్రశంసాపాత్రలై తెలంగాణములోని ఆంధ్రమహిళల యభ్యుదయమునకై సేవయొనర్చిరని వేరుగా చెప్పవలసిన పనిలేదు.

సంఘ సంస్కరణము

ఆంధ్రోద్యమ కార్యకర్తలు మొదటి నుండియు, సంఘసంస్కరణావశ్యకత నెరిగినవారైనను, ఉద్యమమునదానికి ప్రధాన స్థానము కల్పించినయెడల, విద్య తక్కువగా నున్న జన సామాన్యమునకు విద్య వచ్చియు పూర్వాచార పరాయణులుగా నుండిన ఇతరులకును, అది

రుచింపక చీలికలు కలుగునని సంశయించి, మహాసభావేదికపైన సంఘసంస్కార సమస్యల చర్చకు తావు కల్పించ దలచరైరి. మొదటి మహాసభ నాటి నుండి ఏడవ మహాసభ నాటివరకు, గడచిన కాలములో హైదరాబాదు, శాసన సభ యందు రెండు సంఘసంస్కార సంబంధమగు చిత్తు శాసనములు చర్చకు వచ్చుట సంభవించినది. వానిలో 1. హిందూ వితంతు వివాహ శాసనము, 2. బాల్యవివాహ నిషేధ శాసనము. ఈ కారణము వలన, వీనిని గురించిన చర్చ ఆ మహాసభలలో అప్పుడప్పుడు జరుగుచు, ఉభయపక్షముల – అనుకూల ప్రతికూల పక్షముల యందు ఉత్సాహమును రేకెత్తించు చుండెను. మొదటి శాసనము కొన్ని మార్పులతో అంగీకరింపబడి, రెండవ శాసనము నిరాకరింపబడిన తరువాత ఈ యుత్సాహము తగ్గినది. అంతేకాక తీవ్రములగు రాజకీయ సమస్యల చర్చ లెక్కువయైనకొలది, సంఘ సంస్కారపు ఉత్సాహము యువజనులలో సన్నగిల్లినది. అనగా అనవసర మనిపించినది. ఈ విషయమున చర్చలు, వాదవివాదములు మహాసభావేదిక పైన నుండినను లేకపోయినను, సభలకు ప్రతిసంవత్సరము వచ్చుచుండిన వందల కొలది ప్రతినిధులను, వేల కొలది ప్రేక్షకులను, ఒక్కచోటనే, సహపంక్తిగా భోజనములు చేయు పద్ధతి వాడుకలోనికి వచ్చినది. ఇట్లయ్యు శిష్టాచారులగువారికి ఎట్టి ఇబ్బందియు లేకుండ, ప్రతి ఆహ్వాన సంఘమువారు, తగిన స్థలమున వారికి భోజన సౌకర్యములు ప్రత్యేకముగా కల్పించుచునే యుండిరి. ఈ కారణమున కార్యకర్తలలోను, తదితరులలోను ఎట్టివైమనస్యమునకు తావు లేకుండ అందరును తమయిష్టానుసారము సంచరించుచుండియు, ఉద్యమ కార్యములందు కలసిమెలసి పాల్గొనుచుండిరి. ఈ విధముగా క్రియాపూర్వకమైన సామాజిక సంస్కరణము, ముఖ్యముగ భోజన ప్రతి భోజనముల విషయమున, జరుగుచు క్రమాభివృద్ధి నొందుచువచ్చినది.

ప్రథమ మహాసభకు పూర్వము – ఉద్యమము యొక్క మొదటిదశలోని తుది భాగము నుండియే, ఆంధ్రోద్యమ కార్యకర్తలు తమ సభలకు, మహాసభలకు, ప్రభుత్వమువారి కొన్ని శాఖలను – జనసామాన్య క్షేమమునకు సంబంధించిన 1. వ్యవసాయశాఖ, 2. పారిశ్రామిక శాఖ, 3. సహకార శాఖ, 4. ఆరోగ్యశాఖ, 5. పశుచికిత్సా శాఖలను ఆహ్వానించుచు, వారిని తమ ప్రతినిధులను పంపి శాఖా విషయములను ఉపన్యసింపింప వలసినదిగా గోర మొదలిడిరి. ఈ పద్ధతినవలంబించుటలో కార్యకర్తల యుద్దేశములు రెండువిధములుగా నుండెను. 1. ప్రభుత్వమువారు ప్రజలకొరకు ఆయా శాఖల ద్వారా ఏయే పనులు చేయుచున్నారో అది సామాన్యమునకు ప్రభుత్వ ప్రతినిధుల నోటనే తెలియచేసియు, ఆయా శాఖల సంబంధమైన ప్రదర్శనముల జరిపించియు, విజ్ఞానాభివృద్ధి కలిగించుట 2. తెలంగాణములో సాగుచున్న ఆంధ్రోద్యమము ప్రభుత్వమువారి సహకారమును కోరునదే కాని వారిపైన విరోధము కల్పించునది కాదని ప్రభుత్వము వారికి నమ్మకము కల్గించుట ఈ రెంటిల్లో మొదటి దానికంటే రెండవదే ఎక్కువ ప్రాధాన్యము కలదిగా నుండెనని చెప్పవచ్చును. ఎట్లయిన నేమి? ఈ పద్ధతి చాల లాభదాయకమే యైనది. మొదటి యుద్దేశము చక్కగా సాగుచునే వచ్చినది. అది చేయ గలిగినంత ప్రబోధము చేసినది. రెండవ యుద్దేశము పూర్తిగా నెరవేరలేదు. ప్రభుత్వమువారు ప్రతి మహాసభకు తమ ప్రతినిధులనంపుచు, ప్రదర్శనములు, ఉపన్యాసములు చేయించుచునే వచ్చిరి. రమ్మనలేదు. ఆయినను ఉద్యమము విషయమున అనుమానము మాత్రము వారిని వదల లేదు. ఆంధ్రోద్యమము, "నేడు కాక పోయిన కొంతకాలమునకైనను భయంకర పరిణామమును తెచ్చిపెట్టక వదల" దనియు, అయినను ఇప్పుడున్న స్థితిలో ప్రభుత్వము తమ సహకారమును నిరాకరింపగూడ" దనియు భావించుచుండిరి! అంతే గాక, అప్పటి ప్రభుత్వమునకు – ముస్లిము ప్రభుత్వమునకు పెట్టని కోటగా నుండిన "ఇత్తిహాదుల్ ముస్లిమీను సంఘము" వారి సభలలో ఆంధ్ర మహాసభ వారు ప్రభుత్వము కంటిలో దుమ్ము కొట్టుచున్నారని హెచ్చరించుచునేవచ్చిరి. ప్రభుత్వమువారు మాత్రము తొందర పడక ప్రతిమహాసభకు (బహుశః చివర సభవరకు) తమ శాఖల కార్యకర్తలనంపుచు తమ శాఖ సంబంధమైన గొప్ప గొప్ప ప్రదర్శనముల చేయించుచు, తమ శుభ సందేశములను మహాసభాధ్యక్షుల కంద జేయుచు, ప్రభుత్వ పక్షమున ప్రజలకు సమాధానముల తెల్పుచు కర్తవ్యముల నిర్వహించుచునే వచ్చిరి! వారి మానసికస్థితి ఊహించ దగినదే కాని నిర్ధారణ చేయదగినదికాదు!

ఇతర ఉద్యమముల తోడ్పాటు

ఆంధ్ర మహాసభలకు వచ్చువారి సంఖ్య వేలకొలదిగా నుండుటవలన, అట్టి సందర్భములను తమ యుద్యమ ప్రచారమున కుపయోగించుకొనుచు, ఆంధ్రోద్యమవ్యాప్తికిని తోడ్పడుచు నుండిన సంస్థలు కొన్ని మరువదగనివి కలవు. అట్టి వానిలో ముఖ్యాతిముఖ్యమును, ప్రతిమూడు సహాయమును అపరిమితముగా జేసినదియు, హైదరాబాదులోని జీవదయాజ్ఞాన ప్రచారకమండలి యనునది. ఈ మండలివారు, మహాసభల తేదీల తెలుపు ఆహ్వానము అందగానే, తను భజన మండలిని సర్వసన్నాహములతో పంపుచుండిరి. ఆ మండలివారు మహా సభా ప్రాంతపు గ్రామములోను, మార్గమధ్యమున ఊళ్ళలోను, ప్రచారము చేసికొనుచు సభ దినము నాటికి అచ్చటికి చేరుచుండిరి. సంఘ కార్యదర్శి కీ.శే. సేటు లాల్జీ – మేఘజీ గారును, వారి యనంతరము వారి పుత్రులు సేట్ ప్రేంజీలాల్జీగారును ఈ సంప్రదాయమును తుదివరకు సాగించిరి.

అనేక మహాసభలకు హరిజనోద్యమ కార్యకర్తలగు హరిజన సోదరులును వచ్చి, మహాసభల కార్యములలో ఉచిత రీతిని పాల్గొనుచు, తమ కులస్థుల సమావేశములను కూడ విడిగా సాగించుచుండిరి. రెండవ మహాసభ దేవరకొండలో జరిగినప్పుడును, ఆరవ మహాసభ నిజామాబాదులో జరిగినప్పుడును వీరు హరిజనోద్ధరణమున కత్యంత లాభదాయకమగు సేవ యొనర్చిరి. ఆంధ్రోద్యమ వ్యాప్తితోపాటు, హరిజనోద్యమ ప్రచారమునకును ఎక్కువగా తోడ్పడిన హరిజన నాయకులు. కీ.శే. శ్రీ భాగ్య రెడ్డి వర్మ, శ్రీ మల్లేశరావు, ఎ బి. చిత్తారయ, శ్రీ అరిగె రామస్వామిగార్లు ముఖ్యముగా ప్రశంసించ దగినవారు.

పద్మశాలీ యుద్యమమున అవిశ్రాంతముగ సేవ యొనర్చిన కీ.శే. శ్రీ దావతు జనార్దనస్వామి, ఆయుర్వేద వైద్యులు ద్వితీయ మహాసభ (దేవరకొండ) సందర్భమున, వ్యయముల భరించి స్వకులస్థులను వ్యాయామ విద్యా ప్రవీణులనగు చాలామంది యువకులను అచ్చటికి వెంటగొనివచ్చి సర్కసు (వ్యాయమ) ప్రదర్శనముల జరిపించిరి. పద్మశాలీయుల కాటపట్టగు దేవరకొండ యందు వీరి కార్యక్రమము గొప్ప ప్రశంసనందెను.

ఆంధ్ర మహాసభకు వచ్చు వారిలో పలువురు ఆర్యసమాజ సిద్ధాంతము లందభిమానము కలవారగుట సంభవించుచుండెను. అట్టివారు సభాదినములలో మంటపము యొక్క చుట్టు పట్టులనున్న విశాలావరణ మధ్యమున ఉదయవేళల హవన సంధ్యాదికములను, రాత్రివేళ యుపన్యాసములను జరుపుచుండుట చూడబడినది.

ఈ విధముగ ఆంధ్రులలోని ప్రతి తెగవారును ఆంధ్ర మహాసభ తమదిగా భావించుచు, ఆ దినములలో ఆనందముతో పాల్గొనుచు తమ ప్రత్యేకాభిమాన కారణములగు ప్రజాహిత విషయముల ప్రచారము చేసికొనుచు నుండిరి. దీనివలన ఎట్టియసంతుష్టికిగాని, వైమనస్యమునకుగానీ తావు కలుగకుండెను.

సమావేశ దినములలో అచ్చటికి వచ్చు బాలికలలోను, యువకులలోను, వృద్ధులగు నాయకులలోను వ్యాయామపు పోటీలను జరుపు ఉత్తమ కార్యమును, శ్రీ రావి నారాయణ రెడ్డి గారు తనదిగా భావించి, మంచి ఏర్పాటులు తన యాజమాన్యమున జరిపి, గెలుపొందిన వారికి బహుమానముల నిప్పించు పద్ధతిని నెలకొల్పిరి. కొన్ని సందర్భములలో గొప్ప గొప్ప వ్యాయామ ప్రదర్శనములు మహాసభా ప్రాంగణమున జరిగినవి. దేవరకొండ, సిరిసిల్ల, షాదునగరములలో ఇట్టి ప్రదర్శనములు పెద్దయెత్తున జరిగినట్లు, మాకు జ్ఞప్తికలదు. మొదటిచోట పద్మశాలీయ సోదరుల సదస్సు, రెండవచోట ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, మూడవచోట శ్రీ రామచంద్రగారు చేసిన బలప్రదర్శన కార్యములు గ్రామములలోని ప్రజలను ఆశ్చర్యానందములలో ముంచుచుండినవి!

ఆంధ్రోద్యమ కార్యకర్తలు ఆరంభము నుండియు గ్రామ ప్రజలలో ప్రబోధము కలిగించుట ప్రధాన కార్యముగా దృష్టియందుంచుకొనిరి. అందువలననే మహాసభా రంగములు ఎక్కువగా చిన్నయూళ్ళు లేక తాలూకాస్థలములు మాత్రమే యుండుచు వచ్చెను. పదమూడు మహా సభలలో రాజధాని నగరమునందొక సమావేశము మాత్రమే – అదియు పదియవ మహాసభ జరిగినది. తక్కిన వానిలో మహాసభా రంగమైన జిల్లా ప్రధాన స్థలము ఒక నిజామాబాదు మాత్రమే. తక్కిన పదకొండింటిలో నాల్గు మాత్రము తాలూకా ప్రధాన స్థలములు. మిగిలిన వన్ని గ్రామములే. చిన్నవగు నీ గ్రామములలో జరిగిన సభలకు నవీనకాలపు సౌకర్యములు మొ॥ తీసికొని రాబడి, ఎన్నియో విధములగు నలంకారములు కల్పింపబడుట వలన అవి గ్రామ ప్రజలందు విజ్ఞానమును పెంపొందించెను. వీనితోపాటు ప్రభుత్వమువారి వ్యవసాయ ప్రదర్శనములు, వైద్యశాఖవారి ఆరోగ్య ప్రదర్శనములు గ్రామీణ ప్రజలలో మంచి ప్రబోధము కలిగించినవి. ఇవి ప్రభుత్వమువారికి కొంత గౌరవమును కూడ తెచ్చి యుండెను. కాని సభల సమావేశపరచుట, నాయకులను అమితముగా ఇబ్బంది పరచుచుండుట తెలిసికొనిన మీద గ్రామ ప్రజలందు ప్రభుత్వము నెడ జనించు కొద్దిపాటి సద్భావము రూపుమాయుచుండెను.

ఆంధ్రోద్యమమునకు ప్రచారకులు వీరు వారని నిర్ధారణ చేయుట కష్టము. ప్రతి కార్యకర్తయు – పెద్ద వాడగుగాక, చిన్న వాడగు గాక – ప్రచారకుడే యనవలయును. అయినను, పతనముపైన దీర్ఘకాలము వరకు విరివిగా ప్రచారము సల్పిన వారు ఇద్దరు. 1. శ్రీ ఉన్నవ వెంకట రామయ్యగారు, 2. శ్రీ మంత్రి ప్రెగ్గడ వేంకటేశ్వర రావుగారు ఆంధ్రోద్యమ వ్యాప్తికి ఈ ఇరువురి సేవ నిరుపమాన మైనది.

స్టేట్ కాంగ్రెస్‌లో లీనం

కందిలో జరిగిన పదమూడవ ఆంధ్రమహాసభ తరువాత, ఈ సంబంధమైన యుద్యమ శాఖ రాజకీయ స్వరూపము గలది, స్టేటు కాంగ్రెస్ యొక్క మహోద్యమములో లీనమై పోయినదని చెప్పవచ్చును.

అయినను తెలంగాణములో ఈ కాలమున నేర్పడిన ప్రబోధము యొక్క ఫలితముగా, ఆంధ్ర సారస్వతోద్యమమనునది, పదవ ఆంధ్ర మహాసభ హైదరాబాదులో జరిగిన పిదప ఆంధ్ర మహాసభాప్రాంగణముననే, ఆ సమయముననే జన్మించి క్రమ వికాసము పొందుచున్నది. అది యొక ప్రత్యేక చరిత్రకు వలయు సాధనముల సమకూర్చుకున్నది. ఇరువది ఎనిమిది సంవత్సరముల క్రింద హైద్రాబాద్ ఆంధ్ర జన సంఘ స్థాపనతో ప్రారంభమైన ఆంధ్రోద్యమము యొక్క రాజకీయ ప్రవాహము, స్టేటు కాంగ్రెస్ మహాస్రవంతి రూపమును దాల్చి ముందునకు సాగిపోయినది. ఎట్లయినను, ఆరంభమైన ఉద్యమము పరమావధి నందక యుండజాలదను నమ్మిక ఆనాడే యున్నది. తెలంగాణ వాసుల సర్వతో ముఖాభివృద్ధికై సంకల్పింపబడిన ఆంధ్రోద్యమము, దాదాపు కోటి జన సంఖ్య గల తెలంగాణా వాసుల యభ్యుదయమును సంపూర్ణదశకు దెచ్చెట్లు దైవం వీటికి అనుగ్రహించినందులకు సహర్ష ప్రార్థన చేయుచున్నాను.

డా॥ బెజవాడ గోపాలరెడ్డి

ఆంధ్ర రాష్ట్రము మంచి చెడ్డలు - సాధకబాధకాలు

వసంతోత్సవము అరుణకిసలయములలోనే కాదు, జీర్ణపర్ణములలో కూడ. ఆరోహణమే కాదు, సంగీతము, అవరోహణము గూడా. మన సకల సమస్యలను పరిష్కరించి సకల ఆమోదములను ఆంధ్ర రాష్ట్రము యివ్వగలదని తలచుట సరిగాదు. తొలుదొలుత అనేక సమస్యలు వుత్పన్నము కాగలవు. అనేక త్యాగములు చేయవలసివుండును. నూతన దృక్పథముతో, నూతన విధానముగ వ్యక్తులు, రాజకీయ కక్షలు వర్తించిన గాని రాష్ట్ర సిద్ధి సఫలము కానేరదు.

ఇందు నిరాశపడనవసరములేదు. లేనిపోని ఆవేశములు, ఉత్సాహములు చూపినను చాలదు. ఉన్న విషయముల యదార్థరూపముగ గమనించి వాటిని తగువగు విధమున ఒనగూర్చుకున్న ఇంత సాధన, దీక్షల తర్వాత వచ్చిన ఆంధ్రరాష్ట్రము ఆంధ్రులకు ఉపయోగకారికాగలదు. లేనిపోని ఆశలు కల్పించి అన్ని ప్రాంతముల పనులను తోడనే నిర్వహించగలమని ఆశలు చూపిన ఆశలు నిరాశలై ప్రజలను నిరుత్సాహపరచగలవు. ఇప్పటి నుండియు, మనస్థితిగతుల మనము తెలిసికున్న అట్టి నిరాశకు ఆవశ్యకతవుండదని నా విశ్వాసము.

నలభై సంవత్సరముల కృషి, ఈనాడు ఫలితమునకు వచ్చుచున్నది. బహుశా యిక వద్దన్ననూ రాష్ట్రము సిద్ధించియే తీరగలదు. ఆందోళన యిట్టి తీవ్రరూపము దాల్చినపిదప అవిభక్త మద్రాసు రాష్ట్రములో వుండుట మన గౌరవమునకు, ఐక్యతకు భంగముగా వుండును. మన సందేహముల మాని, రానున్న రాష్ట్రము యొక్క స్థితిగతుల పూర్తిగా గ్రాహ్యమొనర్చుకొని, దానికి వలయు త్యాగములను, కార్యదీక్షలను చూపుట అవసరము. ఆందోళనకు సమయము తీరినిది. ఉత్సాహమునకునూ యిక అవకాశములేదు. కావలసినది కార్యతత్పరత, ఐక్యభావము, కొంతోర్పునూ కావలసియున్నవి. తొలుదొలుత అనేక అవసరమగు విషయములను నిర్వహింపలేక పోవచ్చును. దానికి సహనము, సానుభూతి లేకున్న ప్రభుత్వమునకును, ప్రజలకును వ్యత్యాసమేర్పడి, నిరుత్సాహము కలుగవచ్చును. ప్రభుత్వ వ్యతిరేకత ఆంధ్రులకు పరిపాటిగా నుండినది. రాష్ట్రములేని కారణమున మద్రాసు ప్రభుత్వమునకు రావలసిన సహకారము ఆంధ్రులనుండి రాలేదు. అట్టి మనోభావము, వైఖరి మార్చుకొని ఏ వ్యక్తులు అధికారముకు వచ్చినను, ఏ కక్ష ప్రాబల్యము వహించినను, ప్రభుత్వము యొక్క అధికారమునకును, ప్రతిష్ఠకును కొరత రాకుండునటుల ప్రజలు, నాయకులు వర్తించవలసియున్నది. ఇది నేను అన్నిటికన్న ప్రథమముగనే ఎంచుకున్నాను. ఇట్టి మనోసహకారము లభ్యమైనపుడు యితర అన్ని కితరలను మనముదాటి సుస్థిరమైన ప్రభుత్వము ఏర్పాటుజేసుకొని క్రమేణ ప్రజా సమస్యలను తీర్చుటకు సన్నద్ధులు కావచ్చును. ఇందు వార్తాపత్రికలు అగ్రస్థానమును వహింప తగియుండును. వారి

దినదిన రచనలవల్ల చదువరుల దృష్టిని, వారి సానుభూతిని ప్రభుత్వము వైపు మరల్చుచుండవచ్చును. సంపాదకులకు నా ప్రత్యేక విజ్ఞాపన ఏమన ప్రజలను ప్రభుత్వము దగ్గరకు తీసుకొనివచ్చుటకే వారు సదా ప్రయత్నించుచుండవలెను. ప్రభుత్వమునకున్న కష్టసుఖములను పూర్తిగా అర్థము జేసికొని వారి పక్షమున వాదించుట అవసరము.

రాజధాని

ఇక వున్న సమస్యలలో ప్రధానకేంద్ర స్థానము ఎచ్చట స్థాపించుట అను విషయములో ఆంధ్రులకును, తమిళులకును తీవ్ర భేదాభిప్రాయము కలిగెను. జె.వి.పి. రిపోర్టు ప్రకారము ఆంధ్రులు చెన్ననగరముపై తమ హక్కుల విడనాడిరి కాని, ఛీఫ్ కమిషనరు రాష్ట్రముగ ఆందోళన సల్పుటచే తమిళులకు ఆగ్రహము వచ్చెను. 'మీదికానపుడు మాకునూ దక్కకుండు నటుల మీరు ప్రయత్నించుచున్నారు. మీరు మేము మద్రాసును వదలిననాడు మద్రాసు యొక్క ప్రాముఖ్యత అన్నివిధముల చెడిపోవును. భారతవర్షములో ప్రముఖస్థానము వహించిన విద్యాసంస్థలు, చికిత్సా సంస్థలు ద్రవ్యములేక పాడుబడగలవు. మద్రాసులోని వ్యాపారము, పరిశ్రమ క్షీణించగలదు. అట్టి పరిస్థితి ఆంధ్రులకును మాత్రము ఏమి సంతోషము' అని తమిళుల వాదము. ఛీఫ్ కమీషనర్ రాష్ట్రము చేసినను, మద్రాసులో ఏ భాగము నందును ఆంధ్రులు అధికసంఖ్యాకులుగా లేనందున, అచ్చటి శాసనసభ ఎన్నికలలో ఆంధ్రులకు ప్రాతినిధ్యము రాదనియు, మంత్రివర్గములో ఆంధ్రులకు స్థానముండదనియు, అందుచే ఆంధ్రులు సాధింపదలచిన రక్షణ నెరవేరజాల దనియు వారి అభిమతము కాని, మద్రాసులో తొలుతనుండి ఆంధ్రులు ప్రముఖస్థానము వహించి, కొన్ని లక్షలమంది మద్రాసులో వుండుటచే మాకు ఎట్టి అధికారము లేకుండ చేసికొనుటకు మేము సమ్మతించము అని మన వాదము. ఈ ఆందోళనే తాత్కాలిక కార్యస్థానము మద్రాసులో వుంచుకొనుటకు తమిళ వ్యతిరేకతకు ఆస్పదమగుచున్నది. బహుశా ఛీఫ్ కమీషనర్ రాష్ట్రముగా మనము కోరకుండిన తాత్కాలిక కార్యస్థానమునకు వారు వ్యతిరేకులు కాకుండా వుండెడివారేమో! ఆంధ్రరాష్ట్రపు మంత్రులు మద్రాసులో కూర్చొని మద్రాసు ప్రత్యేకరాష్ట్రము కావలెనని ప్రయత్నములు, ఆందోళనలు సల్పుచుందురేమోయని తమిళుల భయం. అది లేనిపోని సంఘర్షణలకు కారణముగూడా కాగలదనియూ వారిభయము. అందుచేత తొలుతనుండియూ ప్రత్యేకస్థానమున నుండియే పరిపాలన సాగించుచుండిన అట్టి సంఘర్షణలకు అవకాశముండదని వారు చెప్పుచున్నారు.

అట్టి భయమేలేకున్న యింతతీవ్రముగ తాత్కాలిక పరిపాలనా కేంద్రముగా వుంచుకొనుటకు తమిళులు వ్యతిరేకించుటకు కారణములేదు. వారికన్ని విధములా లాభమేగాని నష్టములేదు. ఇళ్లకు అద్దెలు, హోటళ్లకు గిరాకి, టాక్సీలకు బాడుగలు మద్రాసు ప్రజలకు వచ్చుచునే వుండగలవు. అక్కడ కొనుగోలు చేయు ప్రతి వస్తువుమీదనువచ్చు అమ్మకపు పన్ను మద్రాసు ప్రభుత్వమునకే చెందుచుండును. ఆంధ్ర మంత్రులుగాని, వారిని చూడవచ్చు ప్రజలుగాని ఉపయోగించు ప్రతి పెట్రోలు గాలను మీదను అరణాలు అమ్మకపుపన్ను మద్రాసు ప్రభుత్వమునకే చెందుచుండగలదు. ఆర్థికముగ చూచిన ఎన్ని సంవత్సరములు ఆంధ్ర ప్రభుత్వ కార్యాలయములు చెన్ననగరములో వుండినను తమిళులకు నష్టములేదు. నష్టము ఆంధ్రులకే. ఆ విషయము తెలిసియు, తమిళులు ఆక్షేపణ చెప్పుచున్న వేరు ప్రబల కారణములు వుండవలసి వుండునుగదా! అని ఈనాడు కొంత భయముమీదను, ఎక్కువభాగము పట్టింపుల మీదను ఆధారపడియున్నవని నా విశ్వాసము. ఈ వారములో కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గమువారు, కేంద్రప్రభుత్వము యీ విషయమై సంప్రతింపులు, చర్చలు జరిపి ఒక నిర్ణయమునకు రాగలవని సూచింపబడుతున్నది. తమిళులు ఒత్తిడికిలోబడి తాత్కాలిక రాజధాని మద్రాసులో వుండకూడదని నిర్ణయించిన, ఆంధ్రులకు తీవ్రమైన నిరాశ ఏర్పడగలదు. నిరాశేగాదు యిబ్బందిగూడా! కాన, ఆంధ్రులకు అనుకూలముగా నిర్ణయము వచ్చిన, తమిళుల యొక్క ఆగ్రహమును చల్లార్చుకొని వారి సహకారమును మనము ఆపేక్షించవలసి యున్నది. లేకున్న తిరుగా నష్టము ఆంధ్రులచే కలుగగలదు. మద్రాసు తాత్కాలిక రాజధాని కాకున్న విశాఖపట్టణము గాని, మరే యితర పట్టణముగాని తోడనే కార్యాలయముల సదుపాయము నేర్పాటు చేయజాలవు. విశాఖ పట్టణములో నాకు తెలిసి గృహముల విషయములో చాలా ఇబ్బందులున్నవి. విశ్వవిద్యాలయోపాధ్యాయులు విద్యార్థులు పెక్కు యిక్కట్లకు గురియగుచున్నారు. అట్టి తరి ప్రభుత్వ కార్యాలయములు కొన్ని యైనను అచ్చటకు మార్చుటకు ఎటులవీలగును? అట్లే యితర పట్టణములుగూడా!

హైదరాబాదు

హైదరాబాదు తాత్కాలిక రాజధాని అగుటకు కేంద్రప్రభుత్వమువారు ఎంతవరకంగీకరించెదరో తెలియకున్నది. మనము చెన్నపట్టణము విషయమై ఎటువంటి సమస్యలను లేవదీయుచున్నామో, అట్టివే హైదరాబాదు విషయంలో మహారాష్ట్రులు, కన్నడులు, కొంతవరకు మహమ్మదీయ సోదరులు గూడా లేవదీయుచున్నారు. హైదరాబాదును ఛీఫ్ కమీషనరీ రాష్ట్రం చేయమని, లేక హైదరాబాద్‌లోని కట్టడములకు వెలలు వేసి పరిహారం కట్టించమని కోరువారు లేకపోలేదు.

తెలంగాణా జిల్లాలను ఆంధ్ర జిల్లాలతో కలుపుటకు వ్యతిరేకించువారును కొంతమంది హైదరాబాదులో వున్నారు. భిన్న, భిన్న పద్ధతులమీద ఈరెండు ప్రాంతములు అభివృద్ధి అగుచూ వచ్చినవి. అచ్చటి సమస్యలు, అచ్చటి అభివృద్ధులు, అచ్చటి రాజకీయములు కొంత వరకు వేరుగా వున్నవి. ఒక్కసారిగా యీ రెంటిని సమన్వయించి ఒకే పరిపాలన క్రిందకు తెచ్చుటవలన కొన్ని విపరీత పరిస్థితులు ఏర్పడ వచ్చునని వారి భయము. హిందీ మాట్లాడు రాష్ట్రములు పెక్కు వున్న రీతినే తెలుగు మాట్లాడు భాగములునూ రెండు పరిపాలనముల క్రింద వుండవచ్చునని వారి అభిప్రాయము. వారికి యీనాడున్న ప్రాబల్యము పోయి ఆంధ్ర జిల్లాలో వున్న ప్రాబల్యము ఎక్కువగునని వారిలో కొందరు భయపడుట సహజమే గదా! వారివారి స్వేచ్ఛను వారు సంరక్షించు కోవలెనని కోరుటయూ అస్వాభావికము గాదు. అందులో నెల్లూరు చిత్తూరులకు లేక

శ్రీకాకుళం విశాఖలకు హైదరాబాదు చాలా దూరం కాగలదని, ప్రభుత్వమునకు ప్రజలకు వుండవలసిన సన్నిహిత సంపర్కము వుండజాలదనియు ఆక్షేపణ రావచ్చును. కాని ఈ ఆక్షేపణలు సమసిపోయి తెలుగువారంతా ఒకే ఆధిపత్యము క్రిందకి వచ్చి దాదాపు మూడుకోట్లమంది ఒక రాష్ట్రముగా యేర్పడినపుడు వున్న లాభదాయకములు పెక్కుగలవు.

హిందీభాష తర్వాత, మన యూనియన్‌లో తెలుగువారు రెండవవారు కేంద్ర కార్యాలయములను కట్టుకొను అవసరము కూడా లేక హైదరాబాదు భవనములే సరిపోగలవు. అందువల్ల కొన్ని కోట్ల రూపాయల మిగులబడియు కాగలదు.

కాని నిజాముకు కేంద్ర ప్రభుత్వము వారిచ్చిన హామీలు అడ్డుపడగలవేమోనని తోచ్చుచున్నది. ప్రధాని నెహ్రూ వుపన్యాసధోరణి హైదరాబాదు విభజనకు సంపూర్ణముగ ప్రతికూలముగ నున్నది. ఆంధ్రరాష్ట్రము వచ్చిన తర్వాత హైదరాబాదు విభజన ఆందోళన ఎట్టి రూపమును దాల్చగలదో యీనాడు మనము సమగ్రముగా వూహింపలేక పోవచ్చును.

బళ్ళారి

బళ్లారి ఆంధ్రరాష్ట్ర సమస్యలలో ఒక ప్రధాన సమస్య అగుచున్నది. కాంగ్రెస్ పద్ధతి ప్రకారము, పది తాలూకాలలో ఆలూరు, ఆదోని, రాయదుర్గం మాత్రమే తెలుగు ప్రాంతమునకు జెందినది. గవర్నమెంటు దృష్ట్యా గూడా యివే నిర్వివాద తెనుగు ప్రాంతాలు. కాని బళ్లారి పట్టణములో తెలుగువారే అధికముగనున్నారు. పోయిన మునిసిపల్ ఎన్నికలలో, అంతకు ముందు జరిగిన ఎన్నికలలో గూడ ఆంధ్రకన్నడ పట్టింపులమీదనే ఎన్నికలు జరిగినవి. రెండు తూర్లూ తెలుగు వారే నెగ్గిరి. బళ్లారి తాలూకాలో నూటికి నలుబదివరకు తెలుగు వారున్నారని జనాభాలెక్కలవల్ల తెలియుచున్నది. వారందరిని విడనాడి, మూడు తాలూకాలతోనే తృప్తి పడుటకు బళ్లారి ఆంధ్రులు ఒప్పుకొనుటలేదు. బళ్లారి కన్నడులకును, బళ్లారి మహమ్మదీయులకును సంబంధబాంధవ్యములు రాయలసీమ జిల్లాలతోనే యెక్కువగనున్నవి. మైసూరుతో గాని, ధార్వారు జిల్లాతోగాని ఆర్థిక వ్యాపారాది సంబంధములు తక్కువ. బళ్ళారి జిల్లా విభజనను కన్నడులు కోరుటలేదు. వారి వుద్దేశ్యము బళ్లారి జిల్లానంతయూ ఒకటిగనే వుంచి ఆంధ్రరాష్ట్రములో చేర్చకుండా వుండవలెనని అచ్చటి తెలుగువారి అభిప్రాయము మా జిల్లా విభజన గాక ఆంధ్ర రాష్ట్రములో చేర్చవలెనని, యెక్కువ తాలూకాలలోవున్న కన్నడులు ఆంధ్రరాష్ట్రములో చేరుటకు తీవ్రమైన వ్యతిరేకతను చూపుచున్నారు. కన్నడ ప్రాబల్యంతగ్గించి తెలుగు పాఠశాలలకు వృద్ధిజేసి కన్నడులకు ఎలాటి ప్రతిష్ఠ లేకుండా చేయుదరని వారి భయం. శేషించిన మదరాసులో అది సాధ్యముగాకున్న మైసూరులో చేరవలెననే వారి తలంపు మద్రాసులో వుంచుకొనుటకు తమిళులు ఈనాడు సుముఖులుగాలేరు. దాదాపు 300 మైళ్ల దూరము ఆంధ్రభాగములలో ప్రయాణము చేసిగాని, వారు అచ్చటికి చేరజాలరు. అందువల్ల 1950లో విభజన కమిటీవారు పనిజేయుచున్నపుడు మద్రాసు ప్రభుత్వము, తమిళులు కన్నడ బళ్ళారిని వుంచుకొనుటకు సుముఖులుగా వుండిరి. కాని, యీనాడు తమకక్కర లేదనే స్పష్టముగా అభిప్రాయమును వెలిబుచ్చుచున్నారు. అందుచే యీనాడు కన్నడ బళ్లారిని మైసూరులోనైనా చేర్చుటకు సంసిద్ధముగా నున్నారు. ఏదైనను యిది పరిపాలన దృష్ట్యా చూచిన బహు కఠినమైన సమస్యగనే తేలుచున్నది.

తుంగభద్ర

హోసపేట తాలూకాలో నిర్మింపబడు తుంగభద్ర ప్రాజెక్టు బహు కఠినమైన ఆర్థిక సమస్య యగుచున్నది. ఈనాటికి దాదాపు పదిహేనుకోట్ల రూపాయలు వెచ్చింపబడినది. ఇంకనూ మూడునాలుగుకోట్లు వెచ్చించినగాని అది పూర్తిగాదు. దానిక్రింద సాగుబడియగు భూమికొద్ది ఎక్కువగా తెలుగు తాలూకాలలో వున్నది. దాదాపు 1,60,000 ఎకరాలు తెలుగు తాలూకాలలో, 1,40,000 ఎకరాలు కన్నడ తాలూకాలలో వున్నది. ప్రాజెక్టు కన్నడ తాలూకాలోనే వున్నవి. దీనికైన పదిహేనుకోట్లు ఎవరు భరించవలె? ఏ దామాషా ప్రకారము? ప్రాజెక్టు శిరోభాగము ఎవరి ఆధిపత్యం క్రింద వుండవలెను? అది కన్నడులచేతిలోనే వుండిన తెనుగు తాలూకాలలోనున్న 1,60,000 ఎకరములకు నీరు ప్రవహింపనిచ్చెదరా? అనుననియు పెద్ద సమస్యలైనవి. ఈ 15 కోట్ల ఖర్చు తమకు సంబంధములేనిదని శేషించిన మద్రాసు అనవచ్చును. అది తెనుగు జిల్లాల అప్పుమీదనే చూపవచ్చును. అది తెలుగు జిల్లాలకు న్యాయముగా వుండజాలదు. ఏదైనను ఆ ఏడు కన్నడ తాలూకాలతో గూడ ఏడుకోట్లకుపైగా అప్పుగూడా అనుసరించుచుండగలదు. ఆ తాలూకాలవల్ల వచ్చే లాభము యీ పెద్ద అప్పే! అదీగాక దానిక్రింద డెల్టా పూర్తిగా అభివృద్ధి అయిన తర్వాత గూడా వడ్డీ గూడా గిట్టదని అంచనా వేయబడుచున్నది. క్షామనివారణ యత్నం క్రింద దీనిని భావించి కేంద్ర ప్రభుత్వమువారే దీనిని భరించి, దాని లాభమునుగూడా వారే గైకొనుట వుచితమని నా అభిప్రాయము.

ఉద్యోగములు

ఉద్యోగములలోని పై అధికారుల విషయములో కొంత పేచీ రావచ్చును. తెలుగు జిల్లాలలో వున్న నాన్‌గెజిటెడ్ వుద్యోగస్తుల విషయములో ఎట్టి తొందరా వుండనవసరములేదు. ఎక్కడవార్కడనే వుండిపోవచ్చును. మద్రాసులోనున్న నాన్‌గజిటెడ్ ఉద్యోగస్తులు ఎక్కువమంది తమిళులు. మళయాళీలే వున్నారు. తెలుగువారు స్వల్పము. వారిలో ఆంధ్రేతరులు కొద్దిమందిని బలవంతముగనైన ఆంధ్రరాష్ట్రమునకు పంపెదరేమో? పెద్ద ఉద్యోగములలో, ముఖ్యముగ ఐ.సి.ఎస్. వారిలో యీ విభేదము కొంత బైటపడగలదు. గవర్నమెంటు అధిపతులు ఐ.సి.ఎస్., ఐ.ఏ.ఎస్. ఉద్యోగులకే యివ్వవలెనని కేంద్రప్రభుత్వ బదనాయమున్నది. ప్రస్తుతము మద్రాసులో పనిచేయుచున్న ఐ.సి.ఎస్. ఉద్యోగులు 46 మందిలో ముగ్గురు మాత్రమే తెలుగువారు ఓ. పుల్లారెడ్డి (హోంసెక్రటరీ), యం. తిమ్మరాజు (ఇండస్ట్రీస్ డైరెక్టరు) వి.కె. రావు (విశాఖ కలెక్టరు) ఈ

ఉద్యోగస్తుల విభజన, జనాభానుబట్టి, అనగా మదరాసు రాష్ట్రములో తెనుగువారి జనాభా నూటికి 36 కాబట్టి ఐ.సి.యస్. ఉద్యోగస్తులలో ఆ దామాషా ప్రకారము తీసుకోవలెనని మద్రాసు ప్రభుత్వము యొక్క ఉద్దేశ్యము. అనగా 16, 17 వున్నతోద్యోగులు ఆంధ్రరాష్ట్రమునకు రాగలరు. అందులో తెలుగువారు ముగ్గురే. కోరవ 13, 14 గురు ఆంధ్రేతరులుగా వుందురు, వారే గవర్నమెంటు సెక్రటరీలుగా, వివిధ శాఖల అధిపతులుగా, ముఖ్యమైన జిల్లాల కలెక్టర్లుగా వ్యవహరింపగలరు.

ఐ.ఎ.యస్.లో నేరుగా తీసికోబడ్డవారు 45 మంది కలరు. వీరిలో గూడా ఏ ఒకరో యిద్దరో తెలుగువారున్నారు. మిగత వారిలో గూడా ఆ 36 దామాషాలే, ఏ 15, 16 మందినో తీసికొని వీరినే ముఖ్యప్రదేశములలో సబ్ కలెక్టర్లుగా, డిప్టీ సెక్రటరీలు, అండర్ సెక్రటరీ లుగా తీసికోవలసి వుండును. అప్పుడు ఆంధ్ర రాష్ట్రము సిద్ధించినది అని ఉత్సాహపడు ఆంధ్రులకు అన్ని ముఖ్యమైన స్థానములు, ఆయువుపట్టులగు స్థానములు ఆంధ్రేతరులచేతులలో వున్నప్పుడు ఆంధ్ర ప్రజలకు ఎట్టి ఉత్సాహముండగలదో మీరు వూహించుకొనవచ్చును. ఆంధ్ర ఉద్యోగులుగూడా యింతకాలము సరియైన ప్రాతినిధ్యము ఆంధ్రులకు దక్కలేదు అని నిరుత్సాహపడుచుండినవారికి యిది ఎంత నిరుత్సాహకారణంగాగూడా వుండగలదో వూహించవచ్చు. ఆంధ్రరాష్ట్రము వచ్చునని, వారికి తగు స్థానములు లభించగలవని వారు ఆశించుట సహజమేగదా! ఆంధ్రుల అభిలాషలు గమనించి, సానుభూతిపూర్వకముగ పరిపాలన ఆంధ్రేతర ఉద్యోగస్తుల ద్వారా జరగదేమోనని ప్రజలు నిరుత్సాహపడవచ్చును. వారు చేయు పనులన్నియు అనుమానమున కాస్పదమగుచుండును. ఈ సమస్యలు ఎట్లు పరిష్కరించవలెనో తెలియకున్నది. ఆంధ్ర విద్యార్థులు కేవలం ఆవేశమునకు లోనుగాక, దీక్షగా పఠనములపై శ్రద్ధవహించి భారతదేశ పోటీపరీక్షలు – అనగా ఐ.ఏ.ఎస్. మున్నగు పరీక్షలలో ఉత్తీర్ణులు కావలసిన ఆవశ్యకత ఎంతేనికలదు. లేకున్న ఆంధ్రరాష్ట్రములో, ఆంధ్ర ప్రజలకు, ఆంధ్ర మంత్రులకు మధ్య ఆంధ్రేతర ఉద్యోగస్తులు ముఖ్యమగు స్థానములాక్రమించి పరిపాలన చేయుచుండగలరు. ఆంధ్రులకు ఉద్యోగములలో సరైన ప్రాతినిధ్యము రాలేదను కొరత, కొరతగనే నిల్చిపోగలదు. విద్యార్థి సంఘములు యా విషయమూ దీర్ఘముగ ఆలోచించి, ఎందులకై యీ అఖిలభారత పరీక్షలలో వారు నెగ్గలేకున్నారో దానికి కారణము అన్వేషింపవలెనని నా విన్నపము.

ఇతర శాఖలలో యింత తారతమ్యమును వుండక పోవచ్చును. ఇంచుమించు ఆంధ్రరాష్ట్రమునకు సరిపోవు ఆంధ్రోద్యోగులు వున్నారనే ఆశించవచ్చు. కాని పి.డబ్ల్యు.డిలో వేపా కృష్ణమూర్తి చనిపోయిన తర్వాత ఆలిండియా సర్వీసులో వున్న ఆంధ్రులు లేరు. సూపరింటెండింగ్ ఇంజనీర్లుగా గూడా ఒక్క ధవళేశ్వరంలో వున్న శేషావతారం తప్ప మరెవ్వరూలేరు. కాబట్టి ఈ శాఖలో సీనియారిటీనిబట్టి చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు ఆంధ్రేతరులే. తొలుదొలుత వుండగలరేమోనని భయమగుచున్నది.

ఒకవేళ ఆంధ్రేతరుల నెవ్వరినీ మనం తీసుకోకపోయిన కొంత చిక్కు గూడా వున్నది. అనుభవము గడించి, వయస్సు చేత, బుద్ధిచేత పరిపక్వం పొందిన వుద్యోగులు తెలుగువారు కారు అను నెపముచే వారిని మనము అంగీకరించకపోయిన దాని నష్టము మనకే తగులగలదు. చిన్న ఉద్యోగులకు పెద్ద పెత్తనం యివ్వవలసి వుండును. అట్టిది పరిపాలనకు మంచిదిగాదు. యుద్ధకాలములో పరిపాలన చెడిపోవుటకు యిట్టి త్వరితమైన ప్రమోషన్లే కారణము. తాసిల్దారుగా నుండవలసిన ఉద్యోగి తొందరగా పైకిపోయి కలెక్టరయినపుడు పరిపాలనా సౌష్టవములోపించును. అందువల్ల ఒక రీతిగా అనుభవపరులను భాషావిచక్షణ లేక తీసికొనుట మేలుగా నుండునేమోయని గూడా తోచుచున్నది. ఏదైననూ యీ నూతన బాధ్యత వచ్చిన తరుణములో భావిసంతతివారగు విద్యార్థులు సమీక్ష చేసికొని తమ రాష్ట్రములో పెద్ద పదవులను తామే అనుభవించవలెనను పట్టుదలతో చదివి పరీక్షలలో నెగ్గవలసియున్నది. ఐ.ఏ.యస్. తొలి నియామకాల్లో ఆంధ్ర ప్రభుత్వమునకు ఏమి సంబంధముండదు. అది కేవలం పరీక్షలలో ఉన్నతముగ వచ్చిన వారిని, యూనియన్ సర్వీసు కమిషన్ వారు దేశం మొత్తం మీద చేయు నియామకములే! ఈ విషయములో నూతనమైన దృక్పథమును అలవరచుకొని నడుచుకొనవలసివున్నది.

ఆర్థిక స్థితిగతులు

ఆర్థిక స్థితిగతుల విషయంగూడా ప్రస్తుతం ఉత్సాహజనకముగా వుండజాలదు. మూడు సంవత్సరముల క్రింద విభజన సంఘమువారు పరిశీలించినపుడు మూలధనము దాదాపు 27 కోట్ల రూపాయలు మద్రాసు ప్రభుత్వమునకుండినది. దానిలో మన దామాషా పదికోట్ల వరకు వచ్చునని అంచనావేయబడినది. ప్రస్తుతం ఆ మూలధనమంతయు తుంగభద్ర, మాచ్‌ఖండ్, భవాని మున్నగు అనేక నీటిపారుదల, విద్యుచ్ఛక్తి స్కీముల మీద అన్ని జిల్లాలో ఖర్చుపెట్టబడింది. మూలధనమంతయు ఖర్చయిపోయినది. ఈ సంవత్సరం క్షామనివారణ నిమిత్తమై వెచ్చింపబడిన 6, 7 కోట్లతో సహా పదికోట్ల రూపాయల వరకు నష్టము రాగలదని తోచుచున్నది. అంతకుముందువున్న మద్రాసు ప్రభుత్వము 45 కోట్ల అప్పులో మనజిల్లా స్కీములమీద ఖర్చుపెట్టిన మొత్తములు మనం భరించుకొనవలసి వుండును. అది 16, 17 కోట్ల అప్పు రాష్ట్రము భరించుకోవలసి వుండును. ఈ సంవత్సరం వచ్చిన నష్టములో గూడా మన దామాషా రావడం, క్షామ ప్రదేశములలో రైతులకు జీవనోపాధికి, వ్యవసాయాభివృద్ధికి ఇచ్చిన ఋణాలు దాదాపు మూడుకోట్లు మనపద్దుమీద జూపి ఆంధ్ర ప్రభుత్వమునే వసూలు జేసికోమని జెప్పగలరు. మొత్తం మీద 20, 25 కోట్ల రూపాయల అప్పుతో మనం బయటబడుచున్నాము. అసంపూర్తిగానున్న తుంగభద్ర, మాచ్‌ఖండ్ మున్నగు స్కీములకు కావలసిన ద్రవ్యమును కేంద్రప్రభుత్వ విరాళముగనో, అప్పుగనో, పన్నులరూపముగనో సేకరించి పూర్తిచేయవలసి వుండును. జమిన్దారీ నష్టపరిహారం 12.5 కోట్లలో దాదాపు 9 కోట్లు ఆంధ్రప్రభుత్వమే చెల్లించవలసియుండును. అసలు పెద్ద స్కీములకు ఖర్చుపెట్టు మొత్తములు గాక, దైనందిన పరిపాలనా విషయములో గూడా యిప్పుడున్న పరిస్థితుల ననుసరించి వుత్సాహకరముగలేదు. కాలమానము అనుకూలముగనున్న సంవత్సరములో యిప్పుడున్న పరిపాలనావిధానమును జరిపించుటకు మన ఆదాయముకన్న ఖర్చు రెండుకోట్లకుపైగా వుండగలదని మద్రాసు

ప్రభుత్వము అంచనా వేయుచున్నది. కాలమానము ఏదో ఒక జిల్లాలో సరిగాలేకుండుట మనం చూచుచునేవున్నాము. క్షామమో, తుపానో మనల్ని బాధించుచునే వుండును. ఈ రెండుకోట్లు నష్టము సంవత్సర సంవత్సరము రాగలదు. అంటే యిప్పుడున్న సంస్థలకన్న ఎక్కువ చేయకుండా, యిప్పుడున్న వాటినే నిర్వహించుకొనుటకు ప్రతి సంవత్సరం రెండు కోట్లు నష్టము రావచ్చునని అంచనా. ఇంకా ఎన్నో ప్రాథమిక పాఠశాలలు, హాస్పిటల్సు, గ్రామరహదారులు మున్నగునవి యిప్పుడు చేయలేకపోయిన ప్రజలకు ఆంధ్ర రాష్ట్రముపట్ల ఎంత నిరుత్సాహం జనించగలదో మనం ఊహించుకొనవచ్చును. మన జిల్లాలలో రాయలసీమ అయిదు జిల్లాలు, నెల్లూరు, విశాఖపట్నం, శ్రీకాకుళం – యీ ఎనిమిది జిల్లాలు నష్టపు జిల్లాలే. అనగా ఆ జిల్లాలో రాబడికన్నా, మామూలు పరిపాలనకగు ఖర్చు అధికముగ వున్నది. తూర్పుగోదావరి మిగులు కాని, తరుగుగాని లేని జిల్లా. మెట్టతాలూకాలు, ఏజన్సీ ప్రాంతము వుండుటంబట్టి, అక్కడ మిగులు ఏమి వుండుటలేదు. పశ్చిమ గోదారి, కృష్ణ, గుంటూరులు మాత్రమే మిగులు జిల్లాలు. అందువల్లనే మొత్తంమీద ఆంధ్రరాష్ట్రము ఆర్థికముగ రెండుకోట్లవరకు నష్టముగ నుండగలదని తలంపబడుచున్నది. దీనికి సదుపాయం మద్యపాన నిషేధమును రద్దుపరుచుటేనని పలువురభిప్రాయపడుచున్నారు. అనగా తిరిగి గ్రామములలో కల్లు సారాయి దుకాణాలు ప్రభుత్వమే నెలకొల్పి, యిజారుదారులలో పోటీలు కల్పించి, బీదసాదలచేత నిషా పదార్థములు త్రాగించి, వచ్చే నష్టమును పూడ్చ ప్రయత్నించుట ఎంత నైతిక పతనముగ నుండగలదో మనం చూడవచ్చును. దొంగకల్లు, దొంగసారాయి విషయం వేరు. ప్రభుత్వమే ఏర్పాటు చేయు కల్లు, సారాయి అంగడుల స్థితి వేరు. ఒకవేళ నైతిక పతనమునకు ఒప్పుకొని పెట్టినను మొదటి రెండుమూడు వత్సరములు ఎక్కువ ఆదాయము రాజాలదు. పోటీలు తీవ్రముగ వుండినపుడే ఎక్కువ ఆదాయము ప్రభుత్వమునకొచ్చును. దొంగకల్లు, దొంగసారాయి విస్తారముగ వున్న విషయము వాస్తవమే అయితే యిజారాదారులు పెద్ద మొత్తములకు పాడుటకు భయపడెదరు. మద్యపానమువల్ల వచ్చు ఆదాయము, ఆంధ్ర జిల్లాలకన్న, ఆంధ్రేతర జిల్లాలలోనే ఎక్కువ. బహుశా త్రాగుడు తెలుగువారికన్న తమిళులలోనే ఎక్కువేమోనని తోచుచున్నది. మద్రాస్ ప్రభుత్వమునకు 1945 సంవత్సరంలో 16,80,00,000 రూపాయలు ఆదాయం వచ్చిన మాట నిజమే. 1944లో 12 కోట్లే ఆదాయం. అంతకుముందు సంవత్సరం 8 కోట్లే! అందువల్ల యుద్ధకాలములో ఒక్క సంవత్సరం వచ్చిన 17 కోట్లు ఆధారంచేసికొని అంతో, అంతకన్నా అధికమో రాగలదని కొందరు దురభిప్రాయపడుచున్నారు. ఇప్పుడున్న ఆర్థిక మాంద్యము ననుసరించి చాల తక్కువగా రాగలదని మనం వూహింపవచ్చు. ఏది ఎట్లున్నను ఆంధ్ర రాష్ట్ర అవతరణ అధికార మధుపాన ప్రచారరథంలో రావడం ఉచితముగా లేదు!

ఖర్చు తగ్గింపువల్లను, రాబడి హెచ్చింపుల చేతను యీ లోటును పూడ్చుకొనవలసి వుండును. మచ్‌ఖండ్ నీటిపారుదల స్కీములు ఫలితమునకు వచ్చినపుడు మన ఆదాయము హెచ్చగలదు. ఆంధ్రదేశములో పరిశ్రమలు నామమాత్రము గనే వున్నవి. ఎక్కువ వ్యవసాయం మీద ఆధారపడింది మన ఆంధ్ర ప్రాంతము! రైతులు కొంత త్యాగమునకైననూ ఓర్చి ఆంధ్ర ఆర్థిక సౌష్ఠవమునకు సహాయ పడవలసి వుండును. అమ్మకపు పన్ను, పరిశ్రమలు, వ్యాపారం అధికమైనపుడే ఎక్కువకాగలదు. కొంతకాలమునకు గాని పరిశ్రమలు నెలకొల్పవీలుండదు. అందువల్ల యితర విధములగు పన్నులు తోడనే ఎక్కువ కాగలవని ఆశించుటకు వీలులేదు. కాని మన కష్టము మొదటి కొన్ని సంవత్సరములలో మాత్రమే వుండగలవని నా అభిప్రాయం. ఆ మొదటి సంవత్సరముల ధాకలను తాళజాలక, తర్వాత తర్వాత మన ఆర్థిక సమస్య తీరగలదనే విశ్వాసము కలదు. అందువల్ల మొదటి కొద్ది సంవత్సరములు ఎక్కువగా, జనుపయోగములగు పనులు నిర్వహించుటకు వీలులేకున్నను నిరుత్సాహ వాతావరణము ప్రబలగూడదని తొలుతనే విన్నవించితిని. మన ఆకాంక్షల పరమావధిగా ఆంధ్రరాష్ట్రం వచ్చినపుడు మొదట కొన్ని సంవత్సరములు కొన్ని త్యాగములకు సంసిద్ధపడియుండవలయును. అందువల్లనే ఉత్సాహ ఆవేశములకన్నా దీక్ష కార్యతత్పరతకావలయుననియు ప్రథమముననే విజ్ఞప్తి చేసి వున్నాను.

మద్రాసునగర భవనములు

ఈ సందర్భములో మద్రాసు నగరమును వదలిననాడు అచ్చటి సంస్థలకు తులతూగు సంస్థలను నిర్మించుకొనుటకు కొన్ని కోట్ల రూపాయలు ఆంధ్ర ప్రభుత్వమునకు కావలసియుండును. ఒక్క జనరల్ ఆస్పత్రికే కోటి రూపాయలకుపైగా వెచ్చింపబడినది. సెక్రటేరియట్ భవనము, హైకోర్టు, రెవిన్యూబోర్డు, ఇంజనీరింగు కళాశాల వగైరా ఎన్నో ప్రభుత్వ భవనములు చెన్నపట్టణములో కలవు. వాటి నన్నిటిని మద్రాసు ప్రభుత్వమునకే ఉచితముగ వదలి ఆంధ్రులు బయటికి రావలసినదేనా? అను ప్రశ్న పలువురిని బాధించుచున్నది. మొదట అయిన ఖర్చు, ప్రతి సంవత్సరము దానిమీద చేయవలసి తగ్గింపులు చూచుకొనుచూ వచ్చిన బహు స్వల్ప మొత్తములే పుస్తకములలో కన్పించును. కొన్నిటికి ఖర్చు సంపూర్ణముగా రద్దయి పోయివుండవచ్చును. దానినే బుక్ వ్యాల్యూ అని అందరు. బుక్ వ్యాల్యూ ప్రకారం నష్టపరిహారమా? లేక వాటి ప్రస్తుతపు విలువననుసరించా? లేక అట్టి సంస్థలను నిర్మించుటకు యీ నాడు ఎంత ఖర్చగును అను సూత్రముపై పరిహారమా? అను విషయమును దీర్ఘముగా విభజన సంఘమువారు 1950లో విచారించిరి. తమిళులు యీ భవనములు లాభదాయకములుగావు, కేవలం వుపయోగార్థంగా నిర్మించబడిన కట్టడములు, వాటికి నష్టపరిహారములు యిచ్చుటకు వీలులేదు. ఆంధ్రులుకోరిక బుక్ వ్యాల్యూ మీద అయిన యిచ్చుటకు సంసిద్ధమని తమిళులు వాదించియు, మరియు బీహారు నుండి ఒరిస్సా వేరుబడినప్పుడుగాని; బొంబాయి నుండి సింధు వేరుబడినప్పుడు గాని; ఎట్టి నష్టపరిహారము భవనములకుగా యివ్వబడలేవనియు వారు జెప్పిరి. బర్మా విభజన సమయమందుగూడా భవనముల నష్టపరిహారం విషయం చర్చింపబడ లేదనియు వారి వాదన. అందువల్ల ఒక కోటిరూపాయల కన్నా ఎక్కువ యిచ్చుటకు వీలులేదనియు వారు ఒక్కుమ్మడిగా వాదింపసాగిరి. సామరస్యముగ యీ విభజన కార్యకలాపము జరిపింప వలెనని ఆసక్తితో నుండిన ఆంధ్ర సభ్యులకు వేరు గత్యంతరము కాన్పించలేదు. ముందెన్నడునూ, ఎవరునూ, ఎవరికినీ, భవనములపై నష్ట పరిహారము ఇవ్వనందున చెన్ననగర విషయమై అడుగుటకు ప్రబలమైన

కారణములు కానరాలేదు. కాని ఆంధ్రులకు అది ఎంత తీరని నష్టమో, వాటికి నకలైన సంస్థలను నిర్మించుటకు ఎన్నికోట్లు కావలయునో అని వూహించినపుడు తమిళులు వాదము నైతికముగా లేదని స్పష్టమగుచున్నది. అందు విషయమే ఆనాడు ప్రకాశంగారు పేచీబెట్టి ఏకాభిప్రాయమునకు వచ్చుటకు వీలులేకుండా చేసిరి. ఆ కారణము చేతనైతేనేమి, మరి ఏ కారణము చేత నైతేనేమి ఆనాడు ఆంధ్రరాష్ట్రము సిద్ధించలేదు. ఇప్పుడు వాంఛూగారు యీవిషయమై చర్చించి ఈ భవనముల నష్టపరిహారార్థముగా 2.5 కోట్ల రూపాయలు యివ్వలసిందిగా సిఫారసు చేసిరని వార్తాపత్రికల ద్వారా తెలియుచున్నది. దానికి తమిళులు ఎంతవరకు సుముఖులో తెలియదు. నేను పోయిన వత్సరం మన సంవత్సరాది దినము ఒరిస్సా గవర్నమెంటువారు నూతనముగ భువనేశ్వరం వద్ద నిర్మిస్తున్న రాజధానిలో వుంటిని. వారి శాసనసభ, మంత్రుల భవనములు మున్నగునవి సందర్శించితిని. దాదాపు నాలుగుకోట్ల రూపాయలు అప్పటికి వారికి ఖర్చయినది. యింకనూ కట్టవలసిన భవనములు చాల వున్నవి. కట్టినవిగూడా చిన్నచిన్నవేగాని మద్రాసులోవున్న వాటితో దేనితో సరిపోల్చతగనివే! కేంద్ర ప్రభుత్వము వారికిచ్చినది రెండుకోట్లుగూడా లేదు. మిగతా వ్యయమును ఒరిస్సా ప్రభుత్వమువారే భరించు చున్నారు. హైదరాబాదు రాని పక్షమున ఆంధ్ర ప్రభుత్వ భవనములకు ఎంత ఖర్చుకాగలదో, కేంద్రప్రభుత్వమువారు ఎంత యిచ్చెదరో చూడవలసివున్నది.

ఎన్నికలు

ఆంధ్ర రాష్ట్రము వచ్చినతోడనే చేయవలసిన నిర్ణయములలో మొదటిది ఎవరు ఈ రాష్ట్ర ప్రభుత్వమును చేపట్టి నిర్వహించవలసినది? ఎవరు శాసనసభ్యులుగా వ్యవహరించెదరు? లెజెస్లేటివ్ కౌన్సిల్ వుండవలెనా, లేదా? అను విషయములే. ప్రస్తుతము ఏ పార్టీకినీ మెజారిటీలేని విషయం మనకు విదితమే. నూతన రాష్ట్రము వచ్చినపుడు, అనేక నూతన సమస్యల విషయమై ప్రజాభిప్రాయమును కనుగొనుట మంచిదని కొందరి అభిప్రాయము. అందువల్లనూ, ఏ పార్టీకి నిర్వహించగలశక్తి లేనందువల్లనూ, ఏ నవంబరులోనో, డిసంబరులోనో క్రొత్త ఎన్నికలు ఆంధ్ర జిల్లాలో జరిపి, అప్పటి పార్టీల బలాబలములను గుర్తించి, మంత్రివర్గమును యేర్పాటుచేయుట మేలనియు వారి భావము. ఆ క్రొత్తగా ఎన్నుకోబడే ప్రతినిధులే రాజధాని ఎచ్చటుండవలె, హైకోర్టు ఎచ్చట, రాయలసీమవారికెట్టి హామీలు యివ్వలెను మున్నగు విషయములన్నియూ వారే నిర్ధారణ చేయగలరు. ఎన్నికలకు ముందు రెండు మూడు మాసములు మంత్రులుగాని, శాసనసభ్యులుగాని, లేక గవర్నరు ద్వారా ప్రెసిడెంట్ పరిపాలన సాగించవలసిందని వారి అభిమతము. బెంగాలులో విభజన కాగానే పై శాసన సభ (కౌన్సిల్) రద్దయిపోయినది. అట్లానే ఆంధ్ర రాష్ట్రమునకుపై శాసనసభ అక్కరలేదని వారి అభిప్రాయము. ఈనాడు మధ్యప్రదేశ్, ఒరిస్సా, అస్సాములకు పై శాసనసభలేదు. హైదరాబాదునకును లేదు. అందువల్ల ఆంధ్ర రాష్ట్రమునకును అట్టి కౌన్సిలుతో ఉపయోగము లేదని వారి భావము దీనికి వ్యతిరేకభావముగా యిప్పటి ఆంధ్ర శాసనసభ్యులు అభిప్రాయములు వెలిబుచ్చుచున్నారు.

తిరుగా దేశములో కొన్ని లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఎన్నికలు జరుపుట అనవసరమనియు, ప్రత్యేకముగా ప్రజాభిప్రాయమును తెలుసుకోవలసిన ఆవశ్యకత లేదనియు, ఆంధ్ర రాజకీయ పార్టీలు ఐక్యభావమును కనుపరచి ప్రభుత్వ కార్యనిర్వహణ చేయగలరనియు, ప్రెసిడెంటు పరిపాలన ప్రజాస్వామిక సూత్రములకు విరుద్ధమనియు వారు అభిప్రాయపడుచున్నారు. రాజకీయ పక్షములు కొన్ని సమైక్యతకు ప్రయత్నము సల్పుచున్ననూ, ఎంత వరకు జయప్రదమగునో స్పష్టముగ తెలియకున్నది. కాంగ్రెసు, కృషిలోక్, ప్రజాసోషలిష్టు, కొందరు స్వతంత్రులు కలసినపుడు సుస్థిరమైన ప్రభుత్వమును ఏర్పాటుగావించి పరిపాలన కొనసాగించగలరు. కాని వీరు తమ కుండిన భేదభావములను విస్మరించి ఒకే ప్రణాళికపై, ఒకే నాయకత్వం క్రింద ముందుకు వచ్చెదరా లేదా అనునది సులభమైన ప్రశ్నగా కన్పించుట లేదు. ఎట్టిహామీలుగాని, షరతులు గాని లేక రావలెనని ప్రజలకోర్కెయై యున్నది. ఆ ప్రజావాంఛితము ననుసరించి వీరు అట్టి ఐక్య భావనమునకు వచ్చుట సర్వోత్కృష్టమైనపని. కాని యింతకుముందు జరిగిన విషయములు తెలిసినవారును, రాజీ ప్రయత్నములు చేసి నిరాశులైనవారునూ అట్టి సుహృద్భావము సాధ్యమా అని సందేహించుచున్నారు. త్యాగప్రధానులైన ఆంధ్రులు యీ అపూర్వ తరుణమున ఎట్టి త్యాగమైన చేసి అట్టి ఐక్యతను సాధించుట మంచిదని ఎంత నొక్కి వక్కాణించినను అతిశయోక్తికానేరదు. ఈ కఠిన పరీక్షలో ఆంధ్రులు ఉత్తీర్ణులయ్యెదరనే నా విశ్వాసము.

పై శాసనసభ లేనపుడు మంత్రులు రంగారెడ్డి, కృష్ణారావు గారలు; సభ్యులుగా వుండిన ప్రకాశం, రామకృష్ణ ప్రభృతులు శాసన సభ్యులుగా వుండజాలరు. ఆంధ్రులు ఆవేశపరులు, త్వరితగతిన నడచువారు, వుద్రేకాస్పదులు, అట్టి రాష్ట్రమున పై శాసనసభ వుండి, తీరికగా, విరామముగా వచ్చిన శాసనములను పరిశీలించునట్టి విధానము వుండుట మేలు అని కొందరి పెద్దల అభిప్రాయము. ఎన్నికలలో నిల్చుటకు యిష్టపడని పెద్దలను, నిలువలేని అనుభవజ్ఞులను, శాసనసభలోనికి తీసికొని వచ్చుటకు అవకాశం పై శాసనసభ ద్వారానే వున్నది గనుక అట్టి కౌన్సిల్ వుండుట, ముఖ్యముగా ఆంధ్రరాష్ట్రములో వుండుట అవసరమని వారివాదము. ఈ విషయముగూడా ఒక నిర్ణయమునకు త్వరలోనే రావలసియున్నది.

రాయలసీమ

రాయలసీమవారు తమ ఆర్థిక పరిస్థితిని, క్షామ పరిస్థితిని పురస్కరించుకొని కొన్ని హామీలు అడుగుచున్నారు. వారి సంశయముల నివారించుటకే శ్రీబాగ్ ఒడంబడిక వచ్చినది. సమాన ప్రాతినిధ్యము రాజ్యాంగం ప్రకారముగా యిచ్చుటకు వీలులేక పోయినను, అభివృద్ధికరములగు పనుల విషయములలోను, ఉద్యోగముల విషయములలోను, ఆంధ్రులు వుదారముగా వుండి వారిని పైకితీసికొని రావలెనని

వారు కోరుచున్నారు. ఏకారణముచేతనైన గాని వుత్తర జిల్లాలో ఆంధ్రరాష్ట్రము పట్ల వున్న వుత్సాహము, రాయలసీమ జిల్లాలో లేకపోవుటయేగాక, ఆంధ్ర యూనివర్సిటీగూడా ఈ నాటి వరకు సంబంధం లేకుండా వుంటున్నది. వారి సంశయములను దూరమొనర్చి ఆర్థికముగ పైకి తీసికొని వచ్చుట, రాజకీయముగ వెంట తీసికొని పోవుట అవసరమైన విషయమే. ఇందు సర్కారు జిల్లాలవారు ఔదార్యమును మాటలలోను, క్రియలలోను, తలంపులలోను చూపవలసియున్నది. రాయలసీమవారునూ ప్రతి చిన్న విషయమునకు పేచీ పెట్టి సర్కారు జిల్లాలవారిని సంశయించుటయో, దూషించుటయో న్యాయమగు కార్యము కాజాలదు. రాయలసీమవారు అన్యమతస్తులుకారు, అస్పృశ్యులూగారు. ఆంధ్రులలో అంతర్భాగమైన వీరులు, విద్వాంసులు ప్రకృతి కనికరములేక అప్పుడప్పుడూ కాటకమునకు పాల్పడు చున్నారే తప్ప వ్యక్తిగతముగనూ, సాముదాయకముగనూ వారు ఎవరికినీ తీసిపోరు. అందువల్ల వారునూ ఆంధ్రరాష్ట్రము యొక్క ఆర్థిక పరిస్థితులను గమనించి వారి కోర్కెలను కోరగలరనియు నేను ఆశించుచున్నాను. సర్కారు జిల్లాలకు, రాయలసీమ జిల్లాలకు సంబంధించని నెల్లూరు రెండావులదూడే అగునో, లేక రెండు ఆబోతులమధ్య చిక్కిన లేగ అగునో చూడవలసియున్నది సర్వత్రా ఉదాత్త ఉదార భావములు ప్రబలినపుడు అవిశ్వాసములు అంతరించగలవు. అన్యోన్య విశ్వాసమున, అన్యోన్య సహకారమున సంచరించవలసిన పరిస్థితుల కాలము!

చిన్న రాష్ట్రమయినపుడు కుట్రలు అధికమగును అను లోకోక్తికి విరుద్ధముగనే సహన భావమును, సౌహార్ద్రభావమును, వలసిన త్యాగభావమునూ చూపి అప్పటికప్పుడు ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కరించుకొనుచూ, తమ ప్రభుత్వమును సుస్థిరపరచుకొని స్వపరిపాలనతోపాటు, సుపరిపాలనగూడా కావించి సారస్వతమునకు, లలితకళలకును తగు ప్రోత్సాహమిచ్చి ఆంధ్రరాష్ట్రమును సముద్ధరించగలరని ఆశించుచున్నాను.

– (జమీన్ రైతు, ఉగాది కానుక, మార్చి 16, 1953)

జననం బందె నపూర్వవైఖరులతో, సంగీత సాహిత్య మం
డన ! నీ తెల్గుమిటారి చెన్నపురి వీటస్ గజ్జెమ్రోయించుచున్
దనువుప్పొంగఁబురాత నాంధ్ర విభవోద్యానంబరేకెత్త, మో
హన గానంబుల నాలపింపగదవయ్యా ! ఆంధ్ర యోధాగ్రణీ !

ఒకనాఁడాంధ్రుని కత్తి, శాత్రవ బలవ్యూహాలపై రక్తనా
టకమున్ సల్పుట విస్మరింపకుము, గాఢంబైన పాశ్చాత్య శో
భకు నీ విప్పుడు లోభివైతివి, ప్రదీ ప్తంబైన నీ ప్రజ్ఞ నూ
రక పోనీక సముద్ధరింపు కొను మాంధ్రా ! వీరయోధాగ్రణీ !

బోళావాఁడవుగాన నీదు విభవంబున్ సత్కాళా మర్మముల్
జాలాభాగము కొల్ల బెట్టితివి నీ శాస్త్ర ప్రపంచంబులో
మేనెల్లన్ గబళించినారు పరభూమిశాగ్రణుల్, నేటికిన్
బోలేదేమియు దిద్దుకొమ్ము బలగంబున్ స్వీయ విజ్ఞానమున్

తలికోట యుద్ధాన నళియ రాముని వల్ల
ప్రిదిలిపోయినది నీ వీరదట్టి
మాయనాయకురాలి మారాముడుల చేత
శమియించె నీ బాలచంద్రరేఖ
బుద్ధిమాలిన చిన్ని పొరపాటుకతమున
వితమయ్యె నీ కొండవీటి పటిమ
ఉత్సాహయుతమైన యుడుకునెత్తురు లేక
ప్రాప్తింపలేదు రాష్ట్ర ధ్వజంబు

పరుపు దూలిన నీ యనాదరణ కతన
మేటి నీ భాష పొలిమేర దాటలదు
పరుల విజ్ఞానమునకు సంబరముపడక
కడగి యెత్తుము నీ వీర కాహళంబు

చీనాపెగోడాల సిగమీది పుష్పమై
పొడవమె నీజాతి చెక్కడపు చెణుకు
ఆరవ పాటకుల తంబురకు ప్రాణమువోసి
కులికె నీ చిన్నారి తెలుఁగుబాణి
హిమవదిలరులదాక జృంభించి పగవాని
తరిమివెన్నాడె, నీ కఱకుటలుగు
మొగలు రాజుల సభా భూములనూరేగె
నీ జగన్నాథ పండితుని పలుకు

ఎందుఁ జూచిన నీ యశస్స్యందనములు
నడచిపోయిన జాడలప్పుడును గలవు
దిక్తటంబుల యలర నెత్తింపవోయి
తెలుగు మన్నీల పసుపు నిగ్గుల పతాక

తెలుగుం గేసరుల్గా మహర్షులును గాంధీ శాంతిసేనాపతుల్
గలరాంధ్రప్రముఖుల్ త్వదీయులు భుజస్కంధంబు నందింత్రు నీ
ఆలము శ్రేయములీనమోచినవి రాష్ట్రార్థంబు యత్నించి నీ
బలముంగొంచియ మాకళించుకొనరా ! ప్రఖ్యాత వీరాంధ్రుడా !

– గుఱ్ఱం జాషువ

దేవులపల్లి రామానుజరావు

విశాలాంధ్రోద్యమము ఆంధ్రావళికి మోదము - చారిత్రాత్మక ప్రకటన

భారత ప్రధాని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ 5వ మార్చి 1956 నాడు నిజామాబాదులో సుమారు రెండులక్షల ప్రజలతో కూడిన బ్రహ్మాండమైన బహిరంగసభలో విశాలాంధ్ర ఏర్పడవలెనని భారత ప్రభుత్వము చేసిన నిర్ణయమును ప్రకటించిన సందర్భము ఆంధ్రదేశ చరిత్రలో చరిత్రాత్మకమైన, మహోజ్వలమైనఘట్టము. రెండువందల సంవత్సరాల తరువాత తిరిగి తెలుగు ప్రజలందరు రాజకీయముగ ఏక కుటుంబీకులు కాగల అవకాశమునిచ్చు భారత ప్రధాని ప్రకటన ఆంధ్రావళికి మోదము చేకూర్చినది. ఈ ప్రకటన నిజామాబాదున జరుగుట యందు కూడ ఒక విధమైన ఔచిత్యము కన్పించుచున్నది. ఈ నిజామబాదులోనే పోలీసుచర్యకు చాలా సంవత్సరాల ముందు జరిగిన ఆంధ్ర మహాసభ నాలుగవ సమావేశములో ఆంధ్రోద్యమము రాజకీయోద్యమముగా రూపొందినది. పోలీసు చర్య తరువాత ఈ నిజామాబాదు పట్టణములోనే జరిగిన హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెసు మహాసభలో హైద్రాబాదు విభజన గావించి ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలను పొరుగుననున్న ఆ భాషారాష్ట్రాలతో కలిపివేయవలెనని తీర్మానించనైనది. ఆ నిజామాబాదులోనే 1956 సంవత్సరమున విశాలాంధ్ర ప్రకటన జరిగినది.

ఇంగ్లీషు సామ్రాజ్య వ్యాప్తితో భారతదేశమున రాష్ట్రాల ఏర్పాటు ప్రజల అవసరాలతో నిమిత్తము లేక పరదేశ పరిపాలకుల అవసరాలకు ఉపయోగ పడునట్లుగా జరిగింది. తత్ఫలితముగా కుతుబ్‌షాహీల పాలనమందే కాక నిజామ్‌షాహీల పాలనమందుకూడ కొంతకాలము ఏకముగా నుండిన ఆంధ్రులు మదరాసు, హైదరాబాదు రాష్ట్రాలలో చీలిపోవుట జరిగినది, సుమారు నూటయేబది సంవత్సరాలకు పైగా చీలిపోయిన తరువాత తిరిగి ఏకము కావలెనని అభిలాష 1900 సంవత్సరములో మొట్టమొదట పొడసూపినది. బ్రిటిష్ ఆంధ్రుడైన కీర్తిశేషులగు కొమర్రాజు వేంకటలక్ష్మణరావుగారు హైదరాబాదుకు వచ్చి 1900 సంవత్సరములో కృష్ణదేవరాయాంధ్రభాషా నిలయమును, 1904 సంవత్సరములో విజ్ఞానచంద్రికా గ్రంథమండలిని స్థాపించి ఉభయ ప్రాంతాలలో నున్న తెలుగువారిని వైజ్ఞానికముగ దగ్గరకు తీసికొనివచ్చిరి. ఈ వైజ్ఞానికోద్యమము క్రమక్రమముగ నాటక ప్రదర్శనాలు, అవధానాలు, పత్రికలు, వైజ్ఞానికుల పర్యటనలు మొదలైన సాంస్కృతికోద్యమాల ద్వారా వ్యాపించి, బలపడి పోలీసుచర్య జరిపిన కొన్ని సంవత్సరాలలోనే సాంస్కృతికముగ విశాలాంధ్ర స్థాపన కావించినది. (అందుచేతనే తెలంగాణా నాయకులైన శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారు 1955 జూలై నెలలో జరిగిన తెలుగుభాషా సమితి శాఖ ప్రారంభోత్సవ సమయమున సాంస్కృతికముగ విశాలాంధ్ర ఏర్పడినదని ఉద్ఘాటించిరి. రాజకీయ విశాలాంధ్రకు పూర్వమే సాంస్కృతిక విశాలాంధ్ర ఏర్పడుట సహజము, స్వాభావిక పరిణామము).

రెండు దశాబ్దాల క్రిందట భావన

రాజకీయముగ విశాలాంధ్రకూడ రెండు దశాబ్దాల క్రిందట భావించిన ఉద్యమమనియే చెప్పవచ్చును. హైదరాబాదులోని ఆంధ్రోద్యమమును గురించి ఇది విశాలాంధ్రోద్యమముగ పరిణమించ వచ్చునని అనుమానము ఇరువది సంవత్సరాల క్రిందట అప్పటి హైదరాబాదు ప్రభుత్వమునకు కలిగినది. 1936లో హైదరాబాదు ప్రభుత్వమునకు హోమ్ సెక్రటరీగా నుండి నవాబ్ అలియావర్‌జంగ్ బహద్దుర్ అప్పుడు ఆంధ్రమహాసభ అధ్యక్షులుగా నుండిన శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారితో ప్రభుత్వమునకుగల పై అనుమానమును వెల్లడించి యుండిరి. 1946వ సంవత్సరములో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారు “విశాలాంధ్రలో ప్రజారాజ్యము” అను పుస్తకమును వ్రాసి పై అనుమానము సకారణమైనదని నిరూపించియున్నారు. హైద్రాబాదులోని సాంస్కృతికోద్యమము విశాలాంధ్రమునకు పునాదులు వేసినది. దేవులపల్లి రామానుజరావు సంపాదకత్వమున 1947లో ప్రారంభమై వరంగల్లునుండి వెలువడిన “శోభ” మాస పత్రిక విశాలాంధ్ర దృక్పథముతో నడచినది.

రెండు పాయలు

ఈ శతాబ్దమున ఆంధ్రోద్యమము రెండు పాయలుగా అభివృద్ధి పొందినది. ఇందులో మొదటిది మద్రాసు రాష్ట్రములోని ఆంధ్ర రాష్ట్రోద్యమము. మనదేశమున భాషారాష్ట్రోద్యమము భారత జాతీయోద్యమమునకు అనుబంధముగ నిర్వహింపబడినది. భాషారాష్ట్రాలను భారతజాతీయ కాంగ్రెసు స్వాతంత్ర్యమునకు పూర్వమే బలపరచి తన రాష్ట్రకాంగ్రెసు సంఘాలను ఈ ప్రాతిపదికమీదనే నిర్మించినది. భారతదేశమునకు స్వాతంత్ర్యము రాకపూర్వము మద్రాసు రాష్ట్రములోని ఆంధ్రోద్యమము ఆ రాష్ట్రములోని ఆంధ్ర ప్రాంతమునకు మాత్రమే పరిమితమైన రాష్ట్రోద్యమముగ నుండెను. రెండవ పాయ హైద్రాబాదులోని ఆంధ్రోద్యమము. ఈ ఉద్యమము యొక్క లక్ష్యము పోలీసుచర్యకు పూర్వము వరకు హైదరాబాదులో బాధ్యతాయుత ప్రభుత్వస్థాపనయై యుండెను. కాని భారతదేశమునకు స్వాతంత్ర్యము ప్రాప్తించి స్వదేశ సంస్థానాలు స్వతంత్ర భారతమునందలి అంతర్భాగాలైన తరువాత ఉభయ ప్రాంతాలలోని ఆంధ్రోద్యమ దృక్పథములలో స్పష్టమైన, సహజమైన పరిణామాలు కన్పించినవి. ఈ పరిణామమే తిరిగి ఆంధ్రులందరు ఏకరాష్ట్రవాసులు కావలెనను ఉద్యమముగ రూపొందినది. ఇటువంటివే సంయుక్త మహారాష్ట్ర, ఐక్యకర్ణాటక ఉద్యమాలు. కావుననే మైసూరు హైద్రాబాదు రాష్ట్రాలు స్వతంత్రభారత యూనియన్‌లో చేరిన తరువాత 26వ నవంబరు 1949వ సంవత్సరమున విశాలాంధ్ర మహాసభ స్థాపన జరిగినది. ఈ మహాసభ తరువాత 1950 ఫిబ్రవరి 13, 14 తేదీలలో సమావేశమై విశాలాంధ్ర తన ఆదర్శముగ ప్రకటించినది. 1953 అక్టోబరు 2వ తేదీనాడు మద్రాసు రాష్ట్ర విభజన, మరియు అక్కడి తెనుగు ప్రాంతాలతో కూడిన ఆంధ్రరాష్ట్ర స్థాపన జరిగినది. ఇది విశాలాంధ్ర రాష్ట్రస్థాపనకు తొలిమెట్టు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రము కావలెననియు, మద్రాసు నుండి విడిపోవలెననియు అభిప్రాయము మొట్టమొదటిసారి 1912లో కలిగినది. తమిళులతో కూడిన మద్రాసు రాష్ట్రములో ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి సరియైన అవకాశాలు దొరకకపోవుటే ఈ అభిప్రాయానికి మూలము. ఆంధ్రరాష్ట్రోద్యమమును ప్రారంభించి దానికి నాయకత్వము వహించినది స్వర్గీయ శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులు, స్వర్గీయ శ్రీ నాగేశ్వరరావు పంతులు, స్వర్గీయ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారలతోపాటు, ప్రకాశంపంతులుగారు, బులుసు సాంబమూర్తిగారు, పట్టాభి సీతారామయ్య పంతులుగారు మొదలైన పెద్దలు. మొట్టమొదట భాషా రాష్ట్రవాదము కాంగ్రెసు వర్గాలలో కొంత అలజడిని కల్గించినది. భాషారాష్ట్రాల ఆవశ్యకతను గూర్చి ఇంగ్లీషులో ఒక ఉద్గ్రంథమును వ్రాసి భాషారాష్ట్ర వాదమును పట్టాభి సీతారామయ్యగారు సహేతుకముగ సమర్థించిరి. ఆంధ్రకాంగ్రెసు నాయకులు అఖిలభారత కాంగ్రెసుచే భాషారాష్ట్రాల సూత్రమును ఆమోదింపచేసి మద్రాసురాష్ట్రములోని ఆంధ్ర ప్రాంతానికి ప్రత్యేక కాంగ్రెసు సంఘమును సాధించిరి. తరువాత క్రమక్రమముగ ఆంధ్రరాష్ట్రోద్యమము బలపడి మనకు స్వతంత్రము వచ్చిన తరువాత ఆంధ్రరాష్ట్రము ఏర్పడినది. ఆంధ్రరాష్ట్రోద్యమమును గూర్చి ఆంధ్రదేశములో ఎటువంటి అభిప్రాయ భేదము లేకుండెను. అన్ని రాజకీయపక్షాలీ ఉద్యమమును సమర్థించినవి. మద్రాసులో జరిగిన ఇరువదవ ఆంధ్రమహాసభ సమావేశానికి ఆచార్య రాధాకృష్ణగారు అధ్యక్షత వహించిరి. తరువాత వారు ఇంగ్లాండు వెళ్ళి ఆంధ్రరాష్ట్ర స్థాపన గూర్చి సెక్రటరీ ఆఫ్–స్టేట్స్‌తో సంప్రదింపులు కూడ జరిపిరి. మొదటినుండియు ఆంధ్రోద్యమమును గూర్చి సంపూర్ణమైన సానుభూతిని కలిగి రాధాకృష్ణగారు అవసరమైనపుడు తగిన సహాయమును చేసినారు.

విమోచన ఉద్యమము

భారత దేశమునకు స్వాతంత్ర్యము వచ్చిన తరువాత హైదరాబాదు ప్రజలయొక్క విమోచనోద్యమానికి క్రొత్త బలము చేకూరినది. భారత యూనియన్‌లో ప్రవేశించుటకు హైదరాబాదు నిజామ్ నిరాకరించుటతో హైదరాబాదు ప్రజల విముక్తి ఉద్యమములో నూతనాధ్యాయము ప్రారంభమైనది. 1947లో చెలరేగిన రజాకారు అమానుష చర్యల ఫలితముగ హైదరాబాదు ప్రజలు వేల సంఖ్యలో పొరుగు రాష్ట్రాలకు తాత్కాలికముగా వలసపోయిరి. హైదరాబాదాంధ్రులు విజయవాడ, కర్నూలు ప్రాంతాలకు వెళ్ళిరి. ఈ వెళ్ళుటలో ఉభయప్రాంతాల రాజకీయ సమైక్యత యొక్క మనస్తత్వము వెల్లడియగుచున్నది. 1947 జూలైలో విజయవాడ యందు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారి యింటిలో స్వామీజీ అధ్యక్షతన ఇట్లు తాత్కాలికముగ వలసపోయిన రాజకీయ కార్యకర్తల సమావేశము జరిగి హైద్రాబాదు ప్రజల స్వాతంత్ర్య పోరాట చర్యా సంఘము స్థాపితమైనది. దీని శాఖ యొకటి కర్నూలులో స్థాపితమైనది. ఈ చర్యా సంఘము పక్షాన మాట్లాడుచు హైద్రబాదులో ప్రజలకు ఫాసిస్టు పరిపాలననుండి విముక్తి కలిగి బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపన జరుగవలెనని స్వామి రామానందతీర్థ ఉద్ఘాటించిరి. ఇదే నెలలో మద్రాసు రాష్ట్రములోని ఆంధ్ర కాంగ్రెసు సంఘమువారు హైద్రాబాదు ప్రజల సహాయ సంఘమునొక దానిని కాళేశ్వరరావుగారి అధ్యక్షతన నెలకొల్పిరి.

పోలీసు చర్య

1948 ఏప్రిల్ 26 నాడు, బొంబాయిలో రాజేంద్రబాబు గారి అధ్యక్షతన అఖిలభారత కాంగ్రెసు స్థాయీ సంఘ రహస్య సమావేశము జరిగినది. దీనికి హైద్రాబాదు కాంగ్రెసు నాయకులుకూడా వెళ్లియుండిరి. ఈ రహస్య సమావేశములో హైద్రాబాదుపై పోలీసుచర్య జరుపవలెనని వాదించిన వారిలో కాళేశ్వరరావుగారు ముఖ్యులు. ఈ సందర్భమున ఆంధ్రరాష్ట్రము కావలెనని ఆంధ్ర నాయకులు శ్రీ రాజేంద్రబాబును కోరగా వారు ఆంధ్రులకు మాత్రమే వెంటనే రాష్ట్రము నిచ్చుటకు నిర్ణయించినచో మహారాష్ట్ర, కర్ణాటకులకు కూడ ఈయవలసి యుండుననియు, యీ అన్ని సమస్యలు ఒకేసారి నిర్ణయించుట మంచిదని తెలిపిరి. మొత్తముమీద 13 సెప్టెంబరు నుండి 17 సెప్టెంబరు (1948) వరకు హైద్రాబాదుపై పోలీసు చర్య జరిగి ప్రజల విముక్తి జరిగినది. 1948 నవంబరులో హైద్రాబాదుకు కాళేశ్వరరావుగారు వచ్చి స్థానిక కాంగ్రెసు నాయకులైన స్వామీజీ మొదలైన వారితో సంప్రదించిరి. ఆ సందర్భంలో హైద్రాబాదు విభజన జరిగి విశాలాంధ్ర, ఐక్యకర్ణాటక, సంయుక్త మహారాష్ట్రాల కొరకు పనిచేయవలెనని నిర్ణయింపబడినది. 1949 ఏప్రిల్‌లో తిరిగి కాళేశ్వరరావు గారు హైదరాబాదుకు వచ్చినపుడు హైదరాబాదు తెలుగు నగరమనియు, అది తెలుగు సీమకు రాజధాని యనియు మహారాష్ట్ర నాయకులు ఒప్పుకొని ఉద్ఘాటించుట జరిగినది. ఆ సమయమున శ్రీ రామకృష్ణారావుగారిచ్చిన తేనీటి విందు సందర్భమున కూడ హైద్రాబాదు సకలాంధ్రమునకు రాజధాని యని అందరు ఒప్పుకొనుట జరిగినది. సకలాంధ్రమునకు హైద్రాబాదు రాజధానియని వ్యాపించుచున్న భావము సర్దారు పటేలుగారి దృష్టికి ఎట్టులో తీసుకొని రాబడినది, అపుడాయన ఈ విషయమై కాళేశ్వరరావుగారికి వ్రాసిన ఉత్తరములో ఇప్పుడే హైద్రాబాదు విభజనను గూర్చిన ఆందోళన చేయవద్దని హెచ్చరించిరి. తరువాత 1949 మే నెలలో డేహరాడూన్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెసు నాయకులతో మాట్లాడుచు సర్దార్ పటేల్ గారు హైద్రాబాదు విభజనను గూర్చి ఆందోళనచేయు సమయము ఆసన్నము కాలేదనియు, ఒక అయిదు సంవత్సరాల కాలమున ఈ పని జరుగుటకు తగిన వాతావరణము సృష్టింప బడగలదనియు తెలిపిరి. ఈ విధముగ, తరువాత హైదరాబాదు విభజనోద్యమమునకు తగిన వాతావరణము కల్పించబడినది. హైద్రాబాదు సకలాంధ్రమునకు రాజధానియనికూడ గుర్తించబడినది. ఇట్లు గుర్తించిన అప్పటి మద్రాసు ఆంధ్రకాంగ్రెసు నాయకులలో మొదటి వారు కాళేశ్వరరావుగారు. మద్రాసు ఆంధ్రులకు లభించదని వీరు మొదటినుండియు అభిప్రాయపడిరి. జనవరి 1950లో మద్రాసులో సమావేశమయిన ఆంధ్ర కాంగ్రెసు శాసన సభ్యులు మదరాసు ఆంధ్రుల తాత్కాలిక రాజధానియనియు, హైద్రాబాదు శాశ్వత రాజధాని యనియు నిర్ణయించుట గమనింపదగిన విశేషము. ఆంధ్రరాష్ట్ర అవతరణమునకు ఒక రోజుముందు అనగా 30వ సెప్టెంబరు 1953నాడు సమావేశమైన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సంఘమువారుకూడ కర్నూలు తాత్కాలిక రాజధాని, మరియు హైద్రాబాదు శాశ్వత రాజధానియని నిర్ణయించిరి. కమ్యూనిస్టుపార్టీవారు మొదటి నుండియు అనగా 1947వ సంవత్సరము నుండియు హైదరాబాదు సంస్థానమును విచ్ఛిన్నము గావించి, మదరాసు రాష్ట్రములోని ఆంధ్రప్రాంతమును మరియు తెలంగాణమును కలిపివేసి విశాలాంధ్రమును హైదరాబాదు రాజధానిగా యేర్పాటుచేయుట తమ ఆశయమని ఉద్ఘాటించుచు యీ ఉద్యమము జనసామాన్యములో వ్యాపించుటకు కృషి సల్పుచుండిరి.

కృత్రిమ రాష్ట్రము - ప్రజల ఆకాంక్ష

ఇంగ్లీషువారి రాజ్యవిస్తరణ ఫలితముగ ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటకములతో కూడిన యొక కృత్రిమ రాష్ట్రము ఆసఫ్జాహీ పరిపాలన క్రింద ఏర్పడినది. మధ్యయుగములో నిరంకుశ పరిపాలన క్రింద ప్రజలు నలిగిపోయినారు. పోలీసుచర్య తరువాత ఏర్పడిన ప్రజాస్వామిక వాతావరణమున హైద్రాబాదు విభజన జరిగి ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలు పొరుగు రాష్ట్రాలలోని ఆయా భాషా ప్రాంతాలతో కలిపి విశాలాంధ్ర, సంయుక్త మహారాష్ట్ర ఐక్య కర్ణాటకములు ఏర్పడవలెనని ప్రజలు ఆకాంక్షించినారు. ఈ ఆకాంక్ష పోలీసు చర్య తరువాత హైద్రాబాదు రాష్ట్రములోని అన్ని రాజకీయ పక్షాల తీర్మానాలయందు ప్రతిబింబితమైనది. సాంస్కృతిక సంస్థలు యీ అభిప్రాయాలను బలపరచినవి. పోలీసుచర్య తరువాత తూపురాన్‌లో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు 1949 ఫిబ్రవరి సమావేశములో భాషారాష్ట్రాలను బలపరచుటయే కాక అది వాస్తవముగా విశాలాంధ్ర సారస్వత సమావేశముగ జరిగినది. తరువాత పరిషత్తు సభలు యీ మార్గముననే నడచినవి. అలంపురములో రాధాకృష్ణ పండితుని ఆశీర్వచనములతో ప్రారంభమైన ఆంధ్ర సారస్వత పరిషత్ సభలు వాస్తవముగ సకలాంధ్ర సారస్వత సభలు. ఆంధ్ర సారస్వత పరిషత్తు, మరియు ఇతర సారస్వత సంస్థలు విశాలాంధ్రోద్యమమును సంపూర్ణముగ బలపరచినవి. పోలీసుచర్య జరిగిన వెంటనే కీ.శే. సర్దారు జమలాపురం కేశవరావుగారి అధ్యక్షతన ఘనపురంలో జరిగిన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సమావేశములో విశాలాంధ్ర కావలెనని ఉద్ఘాటించు తీర్మానము ఆమోదింపబడినది. ఈ తీర్మానమును అప్పటి తెలంగాణా ఏకైక దినపత్రికయగు గోలకొండ సంపాదకీయముగ బలపరిచినది. రాజకీయముగ, ఒక బహిరంగ సభలో ఇట్టి ఉద్ఘాటన జరుగుట బహుశా ఇదియే మొదటి పర్యాయమేమో! నిజామాబాదులో 1950 మార్చినెలలో శ్రీ దిగంబరరావు బిందూ అధ్యక్షతన జరిగిన హైద్రాబాదు స్టేటు కాంగ్రెసు సమావేశమున హైద్రాబాదు రాష్ట్రమును విభజించి ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలను తత్పరిసర భాషా ప్రాంతాలతో కలిపివేయవలెనని తీర్మానింపబడినది. ఈ తీర్మానమును ప్రతిపాదించిన వారు శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు. ఈ తీర్మానమునకు శ్రీయుతులు రంగారెడ్డి, చెన్నారెడ్డిగారల ఆమోదముకూడ లభించెను. 1950వ సంవత్సరమున ఫిబ్రవరి 12, 13 తేదీలలో వరంగల్లులో శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు అధ్యక్షతన జరిగిన విశాలాంధ్ర మహాసభ స్థాయీసంఘ సమావేశములో విశాలాంధ్ర తీర్మానము ఆమోదించుట జరిగినది. ఈ సమావేశములో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు పాల్గొనిరి. ఈ విశాలాంధ్ర స్థాయీ సంఘ సభ్యుల పట్టికను పరిశీలించినపుడు ఇందులో అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రతినిధులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కనిపించుచున్నారు. కాంగ్రెస్సేకాక ఇతర రాజకీయ పక్షాలుకూడ ముఖ్యముగా కమ్యూనిస్టు, సోషలిస్టు పక్షాలు విశాలాంధ్రోద్యమానికి ఎంతో బలమును చేకూర్చినవి.

కొంతకాలము పట్టినది

ఈ విధముగ ప్రారంభమైన విశాలాంధ్రోద్యమము హైద్రాబాదు నగరములో అడుగుపెట్టి, తెలుగు సీమలో వ్యాపించుటకు కొంతకాలము పట్టినది. ఉస్మానియా విశ్వవిద్యాలయమున జరిగిన మొట్టమొదటి ఆంధ్రాభ్యుదయోత్సవాల సందర్భమున శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు హైదరాబాదుకు వచ్చి విశాలాంధ్ర మహాసభను శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారి సలహాతో ప్రారంభించుటకు ప్రయత్నించిరి. ఈ సందర్భమున సుల్తాన్ బజారులోని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కార్యాలయమున ఇందుకొరకై ఒక సమావేశము జరిగియుండెను. ఆ సమావేశానికి అపుడు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకు ఉపాధ్యక్షులుగానున్న శ్రీ పల్లెర్ల హనుమంతరావుగారు అధ్యక్షత వహించిరి. సమావేశములో మాడపాటి హనుమంతరావు పంతులు, అయ్యదేవర కాళేశ్వరరావు, పి. పుల్లారెడ్డి, దేవులపల్లి రామానుజరావు, పులిజాల హనుమంతరావు, యం.యస్. రాజలింగం మొదలైనవారు పాల్గొని కొంత కాలము ఆగి ఈ ఉద్యమమును ప్రారంభింపవలెనని అభిప్రాయపడిరి.

అంకురార్పణ - ప్రజాస్వామిక వాతావరణము

ఇట్టి పరిస్థితులలో హైదరాబాదు రాష్ట్రమున జనరల్ ఎన్నికలు జరిగినవి. మొట్టమొదటసారిగా శాసనసభకు బాధ్యతవహించు ప్రభుత్వము ఏర్పడినది. కమ్యూనిష్టులు తెలంగాణ పోరాటమును విరమించి శాసనసభలో ప్రవేశించిరి. ఈ ప్రజాస్వామిక వాతావరణములో విశాలాంధ్రోద్యమ వ్యాప్తికి తగిన తరుణము ఆసన్నమైనదని ఉద్యమాభిమానులు అభిప్రాయపడిరి. ఈ అభిప్రాయముతో ఉస్మానియా విశ్వవిద్యాలయ పట్టభద్రుల కార్యాలయమున మీర్ అహమ్మదలీ ఖాన్ గారి ప్రేరణతో, మీర్ అహమదలీఖాన్, దేవులపల్లి రామానుజరావు, నందగిరి వెంకట్రావు గారలు 13వ ఆగస్టు, 1953 నాడు సమావేశమయి హైదరాబాదు నగరములో విశాలాంధ్రోద్యమమును ప్రారంభింపవలెనని నిర్ణయించి శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి (ఇపుడు కీ.శే.) గారలతో సంప్రదింపవలెనని నిశ్చయించిరి. ఈ సంప్రదింపులు 20 ఆగస్టు 1953 నాడు ఎగ్జిబిషను గ్రౌండ్సులోని ఉస్మానియా విశ్వవిద్యాలయ పట్టభద్రుల కార్యాలయములో జరిగినవి. ఈ సంప్రదింపులలో మాడపాటి హనుమంతరావు, అహమదలీఖాన్, సురవరం ప్రతాపరెడ్డి, నందగిరి వెంకట్రావు, దేవులపల్లి రామానుజరావు, పల్లెర్ల హనుమంతరావు, సర్దారుల్లా ఖాన్, భోజరాజ్ గారలు పాల్గొనియుండిరి. ఆనాడు ఈ ఎనిమిది మంది సంతకాలతో 1953 సెప్టెంబరు 14వ తేదీనాడు సాయంకాలం 5 గంటలకు పట్టభద్రుల కార్యాలయములో ఒక పెద్ద సమావేశమును పిలుచుటకు నిర్ణయించబడినది. ఆ సమావేశమునకు నగరమునుండి, జిల్లాలనుండి నూరుమందికిపైగా ప్రతినిధులు ఆహ్వానింపబడిరి. సమావేశపు నోటీసు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు ఇంగ్లీషులో వ్రాసిరి. ప్రతాపరెడ్డిగారు స్వదస్తూరితో వ్రాసిన చరిత్రాత్మకమగు ఈ నోటీసు ఈనాటికిని ఈ గ్రంథకర్త వద్ద కలదు. 14 సెప్టెంబరు 53 నాటి సమావేశమున మాడపాటి హనుమంతరావు, పల్లెర్ల హనుమంతరావు, భోజరాజు, బొజ్జం నరసింహులు, (తరువాత తెలంగాణావాది) కొమ్మవరపు సుబ్బారావు, ఆదిరాజు వీరభద్రరావు, యస్. శ్యామరావు, కమతం వెంకటరెడ్డి, మీర్ అహమ్మదలీఖాన్, దేవుపల్లి రామానుజరావు, సర్దారుల్లాఖాన్, మదూరి శంకరలింగం, రంజిత్‌సింగ్, భద్రదేవ్, నూకల నరోత్తమరెడ్డిగారలు పాల్గొనిరి. మాడపాటి హనుమంతరావుగారు ఈ సమావేశమునకు అధ్యక్షత వహించిరి. ఈ విధముగ హైద్రాబాదు నగరమున, జిల్లాలలో విశాలాంధ్రోద్యమ అభిప్రాయాలు క్రమక్రమముగ వ్యాపింపసాగినవి. విశాలాంధ్ర మహాసభను స్థాపింపవలెనను అభిప్రాయములు బలపడసాగినవి. ఇది ఇట్లుండగా మద్రాసులో ఆంధ్రరాష్ట్రముకొరకు శ్రీ పొట్టి శ్రీరాములుగారి ఆత్మార్పణము. తరువాత భారత ప్రభుత్వముచే ఆంధ్రరాష్ట్ర స్థాపన ప్రకటన జరిగినది. ఈ పరిస్థితిలో 1953 ఏప్రిల్ నెలలో విజయవాడ యందు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యనిర్వాహక వర్గ సమావేశము జరిగియుండెను. ఈ సమావేశము మిక్కిలి ముఖ్యమైనది. అప్పుడు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘానికి శ్రీ సంజీవరెడ్డిగారు అధ్యక్షులుగా నుండిరి. ఈ సందర్భమున తెలంగాణా ప్రతినిధులు కొందరు విజయవాడకు వచ్చిన బాగుండునని శ్రీకాళేశ్వరరావుగారు, శ్రీమాడపాటి హనుమంతరావు పంతులుగారికి వ్రాసిరి. మాడపాటి హనుమంతరావు గారు తమ ఆంతరంగికులను సంప్రదించి అహమ్మదలీఖాన్, దేవులపల్లి రామానుజరావులను విజయవాడకు వెళ్ళమని కోరిరి. వీరు విజయవాడకు వెళ్ళకముందు శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారిని కలుసుకొనిరి. రంగారెడ్డిగారు కొంత ముందుగనో, ఆలస్యముగనో, అనివార్యముగ విశాలాంధ్ర ఏర్పడగలదనియు, ఈ విషయమై తమను కలుసుకొనిన ముగ్గురు అనగా మాడపాటి హనుమంతరావు, అహమ్మదలీఖాన్, దేవుపల్లి రామానుజరావుగారలు పనిచేయుట తమకు సమ్మతమేనని ప్రోత్సహించిరి. విజయవాడలో ఈ ఉభయులకు ఘనస్వాగత మీయబడినది. అక్కడ ఈ ఉభయులు శ్రీ సంజీవ రెడ్డి, కాళేశ్వరరావు మొదలయిన, కాంగ్రెసు నాయకులతో సంప్రదించిరి. ఆంధ్రనాయకులు విశాలాంధ్రకు తమ సంపూర్ణ సుముఖత్వమును వెల్లడించి, విశాలాంధ్ర ఉద్యమము తెలంగాణమునుండియే సాగవలెనని అభిప్రాయపడిరి. ఆనాడు విజయవాడలో యీ విషయమై జరిగిన బహిరంగసభలో పై ఉభయులు ప్రసంగించిరి. దీనితరువాత హైద్రాబాద్ సికింద్రాబాదు మునిసిపల్ కార్పొరేషనులు హైద్రాబాదు రాష్ట్ర విభజన జరిగి హైద్రాబాదు రాజధానిగ విశాలాంధ్ర ఏర్పడ వలెనని తీర్మానించినవి. 2వ జూన్ 1953 నాడు హైద్రాబాదులో హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెసు సర్వ సభ్య సమావేశము శ్రీ రామానందతీర్థ అధ్యక్షతన జరిగినది. అందులో విశాలాంధ్ర, ఐక్యకర్ణాటక, సంయుక్త మహారాష్ట్రముల స్థాపన వాంఛించుచు తీర్మానము జరిగినది. ఈ సంఘటనలు హైదరాబాదు, సికింద్రాబాదు నగరాలలోను తెలంగాణా జిల్లాలలోను విశాలాంధ్రోద్యమ వ్యాప్తికి బలమైన ఊతమిచ్చినవి. కమ్యూనిస్టుపార్టీ విశాలాంధ్రను బలపరుచుచు ప్రకటన గావించినది. 1953 ఆగస్టు 14, 15 తేదీలలో హిమాయత్‌నగర్‌లో తెలంగాణా రైతుసంఘ కార్యాలయమున బద్దం ఎల్లారెడ్డిగారి అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభ కార్యవర్గ సమావేశములో విశాలాంధ్ర కావలెనను తీర్మానము ఆమోదింపబడినది. తరువాత కొన్ని నెలలకు ఈ ఆంధ్రమహాసభ సమావేశము ప్రతాపగిర్జి కోఠిలో జరిగినది. విశాలాంధ్రము సత్వరముగా ఏర్పడవలెనని తీర్మానింపబడినది. 1953 ఆగస్టు 24వ తేదీనాడు రెడ్డి విద్యార్థి

వసతి గృహమున విశాలాంధ్రోద్యమమును బలపరచుటకై మాడపాటి హనుమంతరావుగారి అధ్యక్షతన ఒక సమావేశము జరిగినది. ఇందులో దేవులపల్లి రామానుజరావు, వి.బి. రాజు, గురుమూర్తి, వెంకటేశం, వాసుదేవ నాయక్, అహమ్మదలీ ఖాన్, సర్దారుల్లాఖాన్, డాక్టరు రంగాచారిగార్లు విశాలాంధ్ర నిర్మాణము తొందరగా జరుగవలెనని ఉపన్యసించిరి. 1953 అక్టోబరు 2వ తేదీన ఆంధ్రరాష్ట్రస్థాపన జరిగినది. ఈ సందర్భమున కర్నూలులో జరిగిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సమావేశమున హైదరాబాదు రాజధానిగ విశాలాంధ్ర స్థాపన జరుగవలెనని తీర్మానింపబడినది. ఇది గమనించదగినది. ఆంధ్ర రాష్ట్రావతరణ ఉత్సవాలలో పాల్గొనుటకు హైద్రాబాదునుండి సుమారు రెండునూర్లమంది విశాలాంధ్రోద్యమాభిమానులు కర్నూలుకు వెళ్ళియుండిరి. 1953 అక్టోబరు ఒకటవతేదీ సాయంకాలము కర్నూలులో తెలంగాణా ప్రతినిధుల సమావేశము జరిగినది. ఆ సమావేశములో శ్రీ అనంతశయనం అయ్యంగార్, శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు మొదలైన ఆంధ్రనాయకులు పాల్గొనిరి. సమగ్రమైన చర్చలు జరిగిన పిదప తెలంగాణా ప్రతినిధులు విశాలాంధ్రకు కృషి చేయడానికి నిర్ణయించిరి.

అసమగ్ర ఆంధ్రరాష్ట్రము

రెండవ అక్టోబరు 1953 నాడు స్థాపితమైన ఆంధ్రరాష్ట్రము అసమగ్రమైనది. మద్రాసు పట్టణము సంయుక్త రాజధానిగా అంగీకరించు కృషి విఫలమైనది. కర్నూలు రాజధానిగా ఎన్నుకొనుట జరిగినది. మద్రాసు నగరమే ఆనాడు సంయుక్త రాజధానిగ ఎన్నుకొనబడి యుండినచో హైదరాబాదు రాజధానియగు సమస్యకు తీవ్ర ప్రతిబంధకము కలిగెడిదేమో! హైదరాబాదు రాజధానికాని విశాలాంధ్రకు తెలంగాణము నుండి హృదయపూర్వకమగు సానుభూతి లభించెడిది కాదేమో! మద్రాసు రాజధాని కాకపోవుటలో ప్రకృతి యొక్క ప్రభావము కన్పడుచున్నది. కర్నూలు తాత్కాలిక రాజధాని మాత్రమేననియు, ఆంధ్రరాష్ట్రము అసమగ్రమైనదనియు ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ప్రకాశం పంతులు గారు పలుమారులు ఉద్ఘాటించిరి. మొట్టమొదటి భాషారాష్ట్రముగ ఆంధ్రరాష్ట్రము ఎంత అసమగ్రముగా నయినను ఏర్పడుట హైదరాబాదు ఆంధ్రులందరికి సంతోష కారణమైనది. ఆంధ్రరాష్ట్రము తొలిమెట్టుగా వారు విశాలాంధ్ర రాష్ట్రసాధనకు ఉద్యుక్తులైరి. రెండవ అక్టోబరు 1953 నాడు హైద్రాబాదులో ఆంధ్రరాష్ట్ర అభినందన సమావేశము కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయమున జరిగినది. ఈ సమావేశమున శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ కొండా వెంకట రంగారెడ్డిగారలు ఉపన్యసించుచు విశాలాంధ్రను అభిలషించిరి. తరువాత కొంత కాలమునకు బందరులో జరిగిన ఆంధ్ర నాట్యకళాపరిషత్తు సభలను ప్రారంభించుచు శ్రీ చెన్నారెడ్డిగారు విశాలాంధ్రను సమర్థించిరి. 1953 అక్టోబరు 2వ తేదీనాడు కమ్యూనిస్టు పార్టీవారు ఆంధ్రరాష్ట్ర అవతరణ అభినందన బహిరంగ సభను హైదరాబాదు నగరమున జరిపియుండిరి. అందు విశాలాంధ్రను కోరియుండిరి. ఈ విధముగ విశాలాంధ్రోద్యమము ప్రజల ఉద్యమముగ తెలుగుసీమలో బలపడినది.

భాషారాష్ట్ర ఉద్యమము - అగ్రనాయకుల ఆగ్రహము

ఆంధ్రరాష్ట్ర స్థాపనవల్ల ఇతర భాషారాష్ట్రాలు కావలెనను వాదము మరింత బలపడినది. మహారాష్ట్రులు కర్ణాటకులు కూడ తమతమ రాష్ట్రములు కావలెనని ఆందోళన బయలు దేరదీసిరి. అందుచేత భారత ప్రభుత్వము రాష్ట్రాల పునర్నిర్మాణము కొరకు చర్య తీసుకొనక తప్పలేదు. బెంగుళూరులో జరిగిన అఖిల భారత కాంగ్రెసు స్థాయీ సంఘ సమావేశమున శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు అఖిల భారత కాంగ్రెసు వేదికనుండి మొట్టమొదటిసారిగా విశాలాంధ్ర సమస్యను గురించి ప్రస్తావించగా కాంగ్రెసు అగ్రనాయకులు ఆగ్రహించిరి. ఈ సమయమున బాబూ పురుషోత్తమదాస్ టాండన్ కాంగ్రెసుకు అధ్యక్షులుగా నుండిరి. బెంగుళూరులో కాళేశ్వరరావుగారి వాదమునకు శ్రీ నిజలింగప్ప, శ్రీరామానందతీర్థ ప్రభృతులు అనుకూలురై యుండిరి. హైదరాబాదు నానల్ నగరమున జరిగిన అఖిల భారత కాంగ్రెసు మహాసభకు వచ్చిన ప్రతినిధులను ఆహ్వానించుచు తన ఆహ్వాన సంఘాధ్యక్షోపన్యాసమున స్వామి రామానందతీర్థ భాషారాష్ట్రాల స్థాపన యొక్క ఆవశ్యకతను పునరుద్ఘాటించిరి. శ్రీ నిజలింగప్ప వంటి కర్ణాటక నాయకులు, గాడ్గిల్, హారేలవంటి మహారాష్ట్ర నాయకులు మొదటినుండియు భాషారాష్ట్రాల వాదమును బలపరచుచు ఐక్య కర్ణాటక, సంయుక్త మహారాష్ట్రముల కొరకు పనిచేయసాగిరి. నానల్ నగర సమావేశములో మొసలికంటి తిరుమలరావు, కళా వెంకట్రావుగారలు భాషారాష్ట్రాలను బలపరచుచు మాట్లాడిరి. ఆంధ్రరాష్ట్రము కావలెనని ఉద్ఘాటించుచు కళా వెంకట్రావుగారు నానల్ నగర సమావేశంలో తెలుగులో ఉపన్యసించుట గమనించదగిన విశేషము. అఖిల భారత స్థాయిలోకూడ భాషారాష్ట్రోద్యమము వ్యాప్తినందసాగినది. అఖిల భారత భాషారాష్ట్రవాదుల సమావేశము అకోలా నగరములో 1952లో జరిగినది. ఇందులో అన్ని పక్షాల వారు పాల్గొనిరి. ఈ సమావేశానికి హైదరాబాదు నుండి మీర్ అహమ్మదలీ ఖాన్ వెళ్ళి పాల్గొనిరి. హైదరాబాదు విభజన మరియు ఐక్య కర్ణాటక, సంయుక్త మహారాష్ట్ర, విశాలాంధ్ర తీర్మానము ఇందులో ఆమోదింపబడినది. ఈ భాషారాష్ట్ర మహాసభకు అధ్యక్షులు డాక్టరు లంకా సుందరంగారు. డాక్టరు లంకా సుందరంగారు బొంబాయి, హైదరాబాదు మొదలగు కొన్ని నగరాలు కేంద్ర పరిపాలిత ప్రాంతాలు కావలెనని అభిప్రాయపడిరి. ఈ అభిప్రాయము భాషా రాష్ట్రాభిమాను లెవరికిని నచ్చలేదు. అందుచేత ఈ అఖిల భారత భాషారాష్ట్రాల మహాసభ ఎక్కువగా ప్రజలను ఆకర్షించలేదు. కాని భాషా రాష్ట్రోద్యమము మాత్రము ప్రజల ఉద్యమముగా పరిణమించినది.

గొప్ప బలము

ఇట్టి పరిస్థితులలో హైదరాబాదు నగరమున విశాలాంధ్రోద్యమము వ్యాపించినది. విశాలాంధ్ర మహాసభ కార్యనిర్వాహకవర్గ సమావేశము 1953 సెప్టెంబరు 13, 14 తేదీలలో హైదరాబాదునగరమున జరిగినది. ఇది విశాలాంధ్రోద్యమానికి గొప్ప బలము కల్గించినది. ఈ సమావేశము

హైదరాబాదు నగరమునందలి లక్ష్మీపుత్రులగు కల్వ సూర్యనారాయణగారి భవనమున జరిగినది. శ్రీ బులుసు సాంబమూర్తి మొదలైన పెద్దలు ఇందులో పాల్గొనియుండిరి. ఈ విశాలాంధ్ర మహాసభ యొక్క కార్య నిర్వాహక వర్గము, మరియు స్థాయీ సంఘములో ఆంధ్ర తెలంగాణా ప్రముఖులు సభ్యులుగా చేరిరి. తెలంగాణాలోని అన్ని వర్గాల ప్రతినిధులు ఇందులో సభ్యత్వమును అంగీకరించిరి.

శ్రీ జె.వి. నర్సింగరావు, శ్రీ నరోత్తమరెడ్డిగారలు ఇందులో సభ్యులుగా నుండుటకు అంగీకరించి సమావేశాలలో పాల్గొనిరి. కమ్యూనిష్టులకు మాత్రము విశాలాంధ్ర మహాసభలో సభ్యత్వము కల్గించబడలేదు. వారు ప్రత్యేకముగ తమ ఆంధ్ర మహాసభ మరియు ఇతర సంఘాల ద్వారా విశాలాంధ్రోద్యమానికి బలము చేకూర్చిరి. ఈ విధముగా విశాలాంధ్రోద్యమము రెండు పాయలుగ పనిచేసినది. సూర్యమహలులో జరిగిన విశాలాంధ్ర మహాసభ సమావేశము హైదరాబాదు, సికింద్రాబాదు నగరాలలో నూతనోత్సాహము కలుగచేసి అనేక కార్యకర్తలను తయారు చేసినది. ఉస్మాన్‌గంజ్ వర్తకులు హైదరాబాదు, సికింద్రాబాదు మునిసిపల్ కార్పొరేషన్ల సభ్యులు ఈ ఉద్యమములో ముందుకువచ్చి పనిచేయుట గమనింపదగినది. ఈ సందర్భమున హైదరాబాదులోని ముగ్గురు వ్యక్తులను ప్రత్యేకముగ పేర్కొనవలసి యున్నది. వారిలో మొదటివారు మీర్ అహమ్మదలీఖాన్, రెండవ వారు కొత్తూరు సీతయ్య, మూడవవారు పి. పుల్లారెడ్డి. పుల్లారెడ్డి గారు విశాలాంధ్ర మహాసభ కార్యదర్శిగా పనిచేసిరి. ఈ ముగ్గురు చివరివరకు విశాలాంధ్రోద్యమ విజయము కొరకు గట్టిపట్టుదలతో అహోరాత్రములు కష్టపడి పనిచేసిరి. తరువాత విశాలాంధ్ర మహాసభయొక్క స్థాయీ సంఘ సమావేశము 14 నవంబరు 1953 నాడు, హైదరాబాదు నగరమున లింగంపల్లిలోని వైశ్యవిద్యార్థి వసతి గృహములో మిక్కిలి వైభవముగ జరిగినది. ఆంధ్ర, తెలంగాణమందలి అన్ని ప్రాంతాల నుండి ఈ మహాసభకు ప్రతినిధులు వచ్చిరి. ఆహ్వాన సంఘమునకు కొత్తూరి సీతయ్యగారు అధ్యక్షులుగ, కల్వ సూర్యనారాయణ, నూకల నరోత్తమరెడ్డి, ధరణీధరసంఘి, లక్ష్మి చంద్ ఛలాని, డి.డి. ఇటాలియా, బెలిదె జగదీశ్వరయ్య, శాంతాబాయి, డాక్టర్ రంగాచారి, సర్దారుల్లాఖాన్, బి. కిషన్‌లాల్‌గారలు ఉపాధ్యక్షులుగ, యన్. భోజరాజ్ గారు ప్రధాన కార్యదర్శిగా, కొమరగిరి నారాయణరావు, బి. రామిరెడ్డి, సుమిత్రాదేవిగారలు కార్యదర్శులుగ, ఎల్లం సత్యనారాయణగారు కోశాధ్యక్షులుగను పనిచేసిరి. అధ్యక్షత వహించిన శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు విశాలాంధ్ర యొక్క ఆవశ్యకతను గూర్చి సమగ్రమైన ఉపన్యాసమును చదివిరి. మాడపాటి హనుమంతరావుగారు ఈ సమావేశములో పాల్గొని సంపూర్ణముగ సహకరించిరి. తెలంగాణ మందలి అన్ని పక్షాలవారిందు పాల్గొనిరి. ఆంధ్రరాష్ట్ర మంత్రులైన కడప కోటిరెడ్డి, పట్టాభి రామారావు, తెన్నేటి విశ్వనాధంగారలీసభలో పాల్గొని ఉత్తేజకరమగు ఉపన్యాసముల నిచ్చిరి. హైద్రాబాదులోని ఆంధ్ర మహిళలు యీ సభలో సంపూర్ణముగ సహకరించిరి. హైద్రాబాదు మంత్రులెవరు ఇందు పాల్గొనలేదు. మొత్తము మీద సభలు చాల దిగ్విజయముగా జరిగినవి. హైద్రాబాదును సంపూర్ణ ఆంధ్ర నగరము కావించినవి. ఈ సమావేశమున శ్రీ గడియారము రామకృష్ణశర్మగారు చక్కని స్వాగత పద్యాలు వ్రాసి పఠించిరి. తరువాత శర్మగారు రెండు మూడు పర్యాయములు విశాలాంధ్రమును బలపరచుచు రసవంతమైన కవిత్వము వ్రాసిరి. ఈ పద్యాలు గోలకొండ పత్రికలో ప్రకటితమైనవి. తెలంగాణమున ప్రముఖాంధ్ర కవులు రచయితలు విశాలాంధ్రను బలపరచిరి. మూడుకోట్ల తెలుగు ప్రజలను ఒక్కటిగా ముడివేయవలెనని దాశరథి కవి వ్రాసెను. ఈయన తన కావ్యమునకు "మహాంధ్రోదయ" మని నామకరణము కావించెను. శ్రీ బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి గారు విశాలాంధ్ర కావలెనని ప్రబోధించుచు చక్కని పద్యములు వ్రాసిరి.

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘము

22వ డిశంబరు 1953 నాడు పార్లమెంటులో భారత ప్రధాని నెహ్రూ కొన్ని నెలల క్రింద తాము చేసిన వాగ్దానమును అనుసరించి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘమును ఏర్పాటు చేయు నిర్ణయమును ప్రకటించిరి. మిస్టర్ ఫజుల్ అలీ అధ్యక్షులుగా, శ్రీహృదయనాధకుంజ్రు, శ్రీ ఫణిక్కర్ గార్లు సభ్యులుగ మనదేశములోని రాష్ట్రాల పునర్నిర్మాణమును గూర్చి సమగ్రమైన విచారణ కావించి 1955 జూన్ 30వ తేదీలోగా నివేదికను సమర్పించుటకు ఈ ఉన్నతాధికార సంఘమును ఇండియా ప్రభుత్వము నియమించినది. భాష యొక్క ప్రాధాన్యముతోపాటు, భారతదేశ ఐక్యత, రక్షణ, ఆర్థిక సమస్యలు మొదలైనవానిని దృష్టిలో నుంచుకొని రాష్ట్రాల పునర్నిర్మాణమును గూర్చి విచారణ చేయుటకు ఈ సంఘము ఆదేశింపబడినది.

మొదట ప్రతిఘటన లేదు

ఉద్యమ ప్రారంభములో విశాలాంధ్రోద్యమమునకు బలమైన ప్రతిఘటన యేమియు లేకుండెను. అప్పుడు రెండే అభిప్రాయములు హైద్రాబాదులో ప్రబలముగ నుండెను. హైద్రాబాదు విభజన కాకూడదనియు, రాష్ట్రము, యధాతథముగ నుండవలెననియు ఒక అభిప్రాయము. దీనిని కొన్ని ప్రత్యేకవర్గాలు మరియు వ్యక్తులు మాత్రమే బలపరచుట జరిగినది. రాష్ట్రములోని ఏ రాజకీయ పక్షముగూడ యీ వాదనను అంగీకరించలేదు. అందుచేత ఈ వాదమునకు ప్రజాబలము లోపించినది. హైదరాబాదు విభజన జరిగి ఐక్య కర్నాటక, సంయుక్త మహారాష్ట్ర, విశాలాంధ్రములు ఏర్పడవలెననునది రెండవ వాదము. ఈ వాదమును అన్ని రాజకీయ పక్షాలు ఆమోదించినవి. అందుచేత ఈ వాదమునకు ప్రజాబలము సంపూర్ణముగ లభించినది. అప్పటివరకింకను ప్రత్యేక తెలంగాణ వాదము బయలుదేరలేదు. తరువాత తెలంగాణవాదమును సమర్థించిన అనేకులు ప్రారంభమున విశాలాంధ్రోద్యమమును బలపరచి, సమర్థించినవారగుట గమనింపదగిన విశేషము. 1954వ సంవత్సరము జనవరి 14వ తేదీ నాడు సంక్రాంతిపండుగ సందర్భమున ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యాలయ ఆవరణలో విశాలాంధ్ర మహాసభ పక్షాన ఒక తేనేటివిందు ఏర్పాటు చేయబడినది. ఆ విందులో ఆంధ్ర పితామహులతోపాటు హైద్రాబాదు ఆంధ్రప్రముఖులందరు పాల్గొనియుండిరి.

ముఖ్యులైన కొందరు ముస్లిములుకూడ ఈ విందులో పాల్గొనియుండిరి. హైకోర్టుజడ్జిగా రిటైరయిన నవాబు నాజర్ యార్ జంగ్ బహద్దర్, కార్స్ అండ్ ఇండస్ట్రీస్ సెక్రటరీగా రిటైరయిన మిస్టర్ హబీబుర్ రహిమాన్, సియాసత్ పత్రికా సంపాదకులైన మిస్టర్ ఆబిదలీఖాన్‌లు ఈ విందులో పాల్గొని విశాలాంధ్రోద్యమమునకు తమ ఆమోదమును తెలిపిరి. ఈ ముగ్గురు తుదివరకు విశాలాంధ్రోద్యమమును బలపరిచిరి. ఈ విందులో ఆంధ్రేతరులైన ప్రముఖులు కూడ చాలామంది పాల్గొనియుండిరి. కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారి సహచరులుగా పనిచేసిన శ్రీ మునగాల రాజాగారు ఈ విందులోనేకాక ఇంతకుముందు జరిగిన సభలలో కూడ పాల్గొనియుండిరి. హైద్రాబాదు పోలీసు శాఖలో గొప్ప పదవుల నలంకరించి రిటైరయిన ఆంధ్ర ప్రముఖులు శ్రీ యస్.యన్. రెడ్డిగారు విశాలాంధ్ర నామోదించిరి. వీరు విశాలాంధ్ర మహాసభ నగరశాఖ యొక్క కొన్ని సమావేశాలలో పాల్గొనియుండిరి. తరువాత వీరు ఫజుల్ అలీ కమీషను ముందు విశాలాంధ్రకు అనుకూలముగ సాక్ష్యము ఇచ్చి యుండిరి. 1954వ సంవత్సర ప్రారంభంలో హైద్రాబాదు విశాలాంధ్ర మహాసభ నగరశాఖ దేవులపల్లి రామానుజరావు అధ్యక్షుడుగను, భోజరాజ్ కార్యదర్శిగను మరియు ఇతర ప్రముఖులు సభ్యులుగను ఏర్పాటు జరిగి వార్డు కమిటీలను కూడ నెలకొల్పి పనిచేయుట ప్రారంభమైనది. విశాలాంధ్ర మహాసభ కార్యాలయము నిజామ్‌షాహి రోడ్డులో నెలకొల్పబడినది. మహాసభ కార్యదర్శి శ్రీ పుల్లారెడ్డిగారు కార్యాలయ నిర్వహణ భారము వహించిరి. కొత్తూరు సీతయ్య, మీర్ అహమ్మదలీఖానుగారలు కార్యదర్శికి పెట్టని కోటలై పనిచేసిరి. ధరణీధరసంఘి, బచ్చు గురుమూర్తి, యన్.ఆర్. వెంకటేశం, డాక్టరు రంగాచారి, నరసింహాచారి, ఎల్లం సత్యనారాయణ, ఎల్లాప్రగడ సీతాకుమారి, తెలుగు దేశము సంపాదకురాలు రాజ్యలక్ష్మిదేవి, విజయలక్ష్మిదేవి మొదలైనవారు ఉత్సాహముతో ముందుకువచ్చి పనిచేసిరి. 1954 జూన్ 14, 15 తేదీలలో తెలంగాణా ఆంధ్రమహాసభ పక్షాన ఎగ్జిబిషన్సు గ్రౌండ్సులో మహాకవి శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావుగారి అధ్యక్షతన విశాలాంధ్ర సదస్సు జరిగినది. ఇందులో కాంగ్రేసేతరులే ప్రధానముగ నుండిరి. ఆంధ్ర, తెలంగాణాలనుండి ఈ సదస్సులో వేయిమందికి పైగా ప్రతినిధులు పాల్గొనిరి. సదస్సు ప్రారంభ సమావేశమున శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు ఆశీస్సుల నిచ్చిరి. ఈ మహాసభ ఏర్పాటుచేసి విజయవంతముగా నిర్వహించుటలో తెలంగాణా కమ్యూనిస్టు నాయకులకు ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులైన శ్రీ చంద్ర రాజేశ్వరరావుగారు సహాయపడి కొన్ని రోజులు హైద్రాబాదులో నుండి పనిచేసిరి. తరువాత గూడ శ్రీ రాజేశ్వరరావుగారు తెలంగాణాలో విశాలాంధ్రోద్యమవ్యాప్తికి మంచి కృషి కావించిరి.

చాల ముఖ్యమైన వారము

1954 మే నెల చివరివారము హైద్రాబాదు చరిత్రలో చాల ముఖ్యమైనది. ఈ వారము హైద్రాబాదు ప్రజల అభిప్రాయ సేకరణ కొరకు ఫజుల్ అలీ కమీషనువారు హైద్రాబాదు వచ్చిరి. ఈ సందర్భమున ఒక ముఖ్యమైన సంఘటన గూర్చి ప్రత్యేకముగ వివరించవలసియున్నది. ఈ సంఘము యొక్క రాకకు సుమారు ఆరువారముల ముందు హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెసు కార్య నిర్వాహక వర్గము యొక్క నిర్ణయము ప్రకారము ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల డెలిగేట్ల సమావేశము విడివిడిగ జరుపబడినది. రాష్ట్ర భవిష్యత్తునుగూర్చి ఫజుల్‌అలీ కమీషనుకు ఏమి చెప్పవలెనో నిర్ణయించుటకు ఈ సమావేశాలు ఉద్దేశించబడినవి. మహారాష్ట్ర, కర్ణాటకులు సంయుక్త మహారాష్ట్ర, ఐక్య కర్ణాటకాలను బలపరచుచు తీర్మానించిరి. తెలంగాణా డెలిగేట్లలో మాత్రము అభిప్రాయభేదము కలిగెను. డాక్టరు చెన్నారెడ్డి గారు తెలంగాణా ప్రత్యేకముగ నుండవలెనను వాదమును లేవదీసి ఒక బలమైన వర్గమునకు నాయకత్వము వహించిరి. ఈ సమావేశములో తెలంగాణ రాష్ట్రమును ముప్పదిమూడు (33) మంది డెలిగేట్లు బలపరిచిరి. పదముగ్గురు (13) విశాలాంధ్రను బలపరిచిరి. నూరుమంది డెలిగేట్లలో మిగిలిన 54 గురు సమావేశములో పాల్గొనలేదు. మొత్తము మీద తెలంగాణా కాంగ్రెసు డెలిగేట్లలో రెండు అభిప్రాయాలు కలవనియు, ఆ రెండు అభిప్రాయాలను కమీషనుకు నివేదించ వలెననియు నిర్ణయించబడెను. కాంగ్రెసు నియమావళి ప్రకారము మొత్తము హైద్రాబాదు రాష్ట్రమునకు ఒకటే ప్రదేశ్ కాంగ్రెసు కలదు. విడివిడిగా మూడు ప్రాంతాల డెలిగేట్ల సమావేశమునకు అవకాశములేదు. మొట్టమొదటిసారి రాష్ట్రవిభజన మరియు అనంతర కర్తవ్యమును గూర్చిన సమస్యమీద ఈ మూడు ప్రాంతాల డెలిగేట్లు నియమావళిలో అవకాశము లేకపోయినను, విడివిడిగా సమావేశమగుట జరిగినది. ఇది సరియైన పద్ధతికాదని కొందరి అభిప్రాయము. ఇందుకు అనుగుణముగా ఆ సమావేశములో శ్రీ పుల్లారెడ్డి గారు ఆక్షేపణ తెలిపిరి. ఏమయినప్పటికిని హైద్రాబాదు ప్రదేశ్ కాంగ్రెసునందు రెండు స్పష్టమైన కక్షలు ఏర్పడినవి. ఒకటి విశాలాంధ్ర కక్ష. రెండవది తెలంగాణా కక్ష. తరువాత ఈ కక్షల ప్రభావము అడుగడుగున గోచరించినది.

అభిప్రాయ సేకరణ

ఫజల్ అలీ కమిషను ఆగమనముతో హైద్రాబాదు రాజకీయరంగమున కోలాహలము ప్రారంభమైనది. హైద్రాబాదు రాష్ట్రములోని మూడు ప్రధాన రాజకీయ పక్షాలైన ప్రదేశ్ కాంగ్రెసు, కమ్యూనిస్టు, మరియు సోషలిస్టు పార్టీలు హైద్రాబాదు విభజన జరిగి తీరవలెనని ఉద్ఘాటించినవి. కమ్యూనిస్టుపార్టీ మరియు సోషలిస్టుపార్టీలు విశాలాంధ్ర కావలెనని స్పష్టము చేసినవి. హైద్రాబాదు ప్రదేశ్ కాంగ్రెసులోని ఒక వర్గము విశాలాంధ్రము కావలెననియు, రెండవ వర్గము తెలంగాణము కావలెననియు తెలిపిరి. హైద్రాబాదు మంత్రివర్గము పక్షాన ఎటువంటి అభిప్రాయము వెల్లడిచేసినట్లు కనబడదు. వ్యక్తిగతముగా కొందరు మంత్రులు తమతమ అభిప్రాయములు తెల్పిరి. శాసన సభ్యులలో అధిక సంఖ్యాకులు విశాలాంధ్రమునే బలపరచిరి. సాంస్కృతిక సంస్థలయిన ఆంధ్ర సారస్వత పరిషత్తు, తెలంగాణా రచయితల సంఘము విశాలాంధ్రమునే బలపరచినవి. బద్దం ఎల్లారెడ్డిగారు అధ్యక్షులుగానున్న ఆంధ్రమహాసభ విశాలాంధ్రమునే బలపరచినది. హైద్రాబాదు,

సికింద్రాబాదు మునిసిపల్ కార్పొరేషనులు విశాలాంధ్రకు అనుకూలముగా సాక్ష్యము లిచ్చినవి. ఈ సందర్భమున విశాలాంధ్ర మహాసభ చాలా చురుకుగా పనిచేసినది. విశాలాంధ్ర మహాసభ పక్షాన ఒక రాయబారవర్గమును వెంట తీసికొని వెళ్లి విజ్ఞప్తి సమర్పించిరి. విశాలాంధ్ర మహాసభ నగరశాఖ పక్షాన కూడ విశాలాంధ్రకు అనుకూలముగ సాక్ష్యము నిచ్చుట జరిగినది. హైద్రాబాదు విభజన కాకూడదని తెలిపినవారు శ్రీ మందుముల నర్సింగరావు, నవాబ్ మెహిదీ నవాజ్ జంగు బహద్దుర్, పండిత వినాయకరావు, గోపాలరావు ఎక్బోటె, పండిత నరేంద్రజీ, కల్నల్ వాఘ్రే ప్రభృతులు పేర్కొనదగినవారు. ఫజుల్ అలీ నివేదిక ప్రకటనానంతరము హైద్రాబాదు విభజన తప్పనిసరి అయినప్పుడు తెలంగాణా రాష్ట్రము ఏర్పడరాదనియు విశాలంధ్రమే ఏర్పడవలెననియు వీరందరు ఉద్ఘాటించిరి. తెలంగాణా కాంగ్రెసు డెలిగేట్ల సంఖ్య నూరు. ఇందులో విశాలాంధ్రకు అనుకూలముగా సుమారు యాబదిమంది సంతకాలను సేకరించి ఒక విజ్ఞప్తిని కమీషనుకు సమర్పించుట జరిగినది. ఈ సంతకాల సేకరణకై జిల్లాలు తిరిగి కష్టపడినవారిలో బొమ్మకంటి సత్యనారాయణ రావు, పి. పుల్లారెడ్డి, వి.బి. రాజు, కొత్తూరి సీతయ్య, అహమ్మదలీఖాన్‌గారలను పేర్కొనవలసియున్నది. కమీషనువారు వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలలో పర్యటనము కావించిరి. ఈ పర్యటన సందర్భములో వారి కనేక విజ్ఞప్తులు సమర్పించబడినవి. ఈ విజ్ఞప్తులను పరిశీలించి నపుడు విశాలాంధ్రోద్యమానికి ప్రజల అభిప్రాయములానుకూలముగ నున్నవని వెల్లడియైనది. తరువాత విశాలాంధ్ర మహాసభ వైపునుండి రెండు అనుబంధ విజ్ఞప్తులు కూడ అంకెలతోసహా వివరాలను తెలుపుచు సమర్పించబడినవి. హైద్రాబాదు ముఖ్యమంత్రి శ్రీ రామకృష్ణారావుగారు వ్రాతపూర్వకముగ ఏమియును ఇచ్చినట్లు కనపడదు. అయినను వారు విశాలాంధ్రకే సుముఖులై యుండినట్లు అభిజ్ఞ వర్గాల ద్వారా తెలిసినది. అంతేకాదు విశాలాంధ్రకు అనుకూలురమని అంతకుముందే ప్రకాశం పంతులుగారికి రామకృష్ణారావుగారు తెలిపినట్లు వారి సన్నిహితవర్గాల వలన తెలిసినది. తరువాత కమీషనువారి పర్యటన ఆంధ్రరాష్ట్రములో జరిగినది. ఆంధ్రరాష్ట్రములో అన్ని రాజకీయపక్షాలవారు, అన్ని వర్గాలవారు విశాలాంధ్రను ఆమోదించిరి. జాతీయ సమరములో ఆరితేరిన వృద్ధమూర్తి త్యాగమూర్తి అయిన ప్రకాశం పంతులుగారి నాయకత్వాన ఆంధ్ర మంత్రివర్గము విశాలాంధ్రము కావలెనని ఉద్ఘాటించినది. ఆనాడు మంత్రి వర్గములో సభ్యులుగా నుండిన శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు విశాలాంధ్రము కొరకు ప్రశంసనీయమైన కృషి కావించిరి. మొదటి నుండియు శ్రీ సంజీవరెడ్డిగారు విశాలాంధ్రకు పెట్టని కోటగా నుండిరి. సంజీవరెడ్డిగారి పట్టుదల, కార్యదక్షత విశాలాంధ్ర సాధనకు మిక్కిలి ఉపకరించినవి. పదవ సెప్టెంబరు 1954 నాడు మద్రాసులో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుచు ఐక్యకర్ణాటక, సంయుక్త మహారాష్ట్రములు ఏర్పడినచో విశాలాంధ్రకూడ ఏర్పడి తీరవలెనని శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు ప్రకటించిరి. ఇది ఇంతవరకు స్పష్టముగా బహిర్గతముకాని వారి మనోగతాభిప్రాయము యొక్క స్పష్ట ప్రతిబింబముగా ప్రకాశితమైనది. కాని రామకృష్ణారావుగారు నిజామాబాదు కాంగ్రెసు సమావేశమున తీర్మానమును ప్రతిపాదించుటలోనే వారి విశాలాంధ్రము ఆమోదము ప్రకటితమైనది. అంతేకాదు, పోలీసు చర్యకు పూర్వము ముషీరాబాదులో స్వామీ రామానంద అధ్యక్షతన జరిగిన సమావేశములో బాధ్యతాయుత ప్రభుత్వస్థాపన తీర్మానమును ప్రతిపాదించుచు "హైద్రాబాదు కృత్రిమముగా యేర్పడిన రాష్ట్రము" అని రామకృష్ణారావుగారు ఉద్ఘాటించి యుండిరి. ఈ ఉద్ఘాటనకూడ హైదరాబాదు విభజనకు, విశాలాంధ్రకు వారి ఆమోదమును వెల్లడించుచున్నది. కమిషనువారు హైదరాబాదు రాష్ట్రములో పర్యటనచేసి వెళ్ళిన పిదప కాంగ్రెసులో రెండు భిన్న వర్గాలు ప్రస్ఫుటముగ బయలుదేరినవి. ప్రదేశ్ కాంగ్రెసు ప్రత్యేక తెలంగాణా వర్గమువారి అధీనమైనది. కొంతమంది తలవని తలంపుగా అంతకు ముందు విశాలాంధ్ర వాదులు అయినప్పటికిని తరువాత తెలంగాణావాదులైరి. 1954వ సంవత్సరము ఈ విధముగ గడచినది. విశాలాంధ్రోద్యమము మరింత బలపడినది విశాలాంధ్ర మహాసభ పక్షాన ఒక సుహృద్భావ రాయబారవర్గము ఏడవ ఆగస్టు 1954 నాడు హైదరాబాదు నుంచి హైదరాబాదు మేయర్ నాయకత్వమున బయలుదేరినది. కర్నూలు, గుంటూరు, విజయవాడలలో పర్యటించి వచ్చినది. ఈ రాయబారవర్గములో విశాలాంధ్రోద్యమ ప్రముఖ కార్యకర్తలు వెళ్ళిరి. వీరికి పై మూడు పట్టణాలలో ఘనమైన స్వాగత మీయబడినది. వీరికి ఈయబడిన స్వాగతములో అన్ని రాజకీయ పక్షాలవారు పాల్గొనుట గమనించదగిన విషయము. ఈ సంవత్సరము (1954) హైద్రాబాదుకు అప్పటి ఆంధ్ర ప్రభుత్వ ఆర్థికమంత్రి శ్రీ తెన్నేటి విశ్వనాధముగారు నాలుగైదుమారులు విచ్చేసి ఇక్కడి కార్యకర్తలను కలుసుకొని వారిని ప్రోత్సహించి సుహృద్భావ వాతావరణము ఏర్పడుటకు చక్కని కృషి గావించిరి. 1955వ సంవత్సర ప్రారంభంలో అప్పటి ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి మరియు కళా వెంకటరావు గారలు హైద్రాబాదుకు విచ్చేసి విశాలాంధ్ర మహాసభలోను మరియు కాంగ్రెసు కార్యాలయమైన గాంధీభవనములోను ప్రసంగించి విశాలాంధ్రోద్యమమును ప్రోత్సహించిరి. తరువాత ఆంధ్రలో ఎన్నికలు జరిగినవి. ఇక్కడివారు అక్కడికి వెళ్ళి ఎన్నికలలో పనిచేసి పరస్పర స్నేహసంబంధాలను కల్పించుకొనిరి. ఆపైన ఆంధ్రరాష్ట్రములో కొత్తమంత్రి వర్గము ఏర్పడినది. ముఖ్యమంత్రి శ్రీ గోపాలరెడ్డిగారు 1955 ఏప్రిల్ నెలలో తిరిగి హైద్రాబాదు వచ్చి విశాలాంధ్ర మహా సభలో ప్రసంగించి విశాలాంధ్రోద్యమమును ప్రోత్సహించిరి.

గోపాలరెడ్డిగారి జోస్యము

జూన్ 1955లో ఫజుల్‌అలీ కమిషను నివేదిక ప్రకటింపబడవలసి యుండెను. కాని మూడునెలలు ఆలస్యముగ ఈ నివేదిక వెలువడినది. నివేదిక వెలువడుటకు కొన్ని వారాల ముందుగా ఢిల్లీ నుండి కర్నూలు వెళ్ళుచు మార్గమధ్యమున హైద్రాబాదులో ఆగిన శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు నిజాం కళాశాల తెలుగు సమితికి ప్రారంభోత్సవము కావించుచు హైద్రాబాదు విభజన కాగలదనియు, విశాలాంధ్ర సమస్యను తెలంగాణా శాసనసభ్యుల నిర్ణయానికి వదలివేయవచ్చుననియు రాజకీయజోస్యము చెప్పిరి. ఇది రాజకీయ వర్గాలలో కొంత కలవరము కలిగించినది. మొత్తముమీద హైద్రాబాదు విభజన తప్పక జరిగి తీరగలదన్న సంగతి స్థిరపడినది.

విచిత్రమైన తీర్పు

తుదకు చాలాకాలమునుండి ఎదురుచూసిన కమీషను నివేదిక 1955 అక్టోబరు పదవతేదీనాడు ప్రకటితమయినది. కమిషను నివేదికలో తెలుగు ప్రజలు విశాలాంధ్రము కాంక్షించుచున్నారనియు, విశాలాంధ్రము వారి గమ్యస్థానమనియు ఆ గమ్యస్థానమును చేరుటకు ఎటువంటి ప్రతిబంధకాలు కల్గించరాదనియు స్పష్టీకరించిరి. కోర్టులో వాదము విన్న తరువాత న్యాయమూర్తులు తుదినిర్ణయము ప్రకటించు సందర్భమున నిర్ణయించుటకు చెప్పిన తీర్పులోని అభిప్రాయములన్నియు ఒక తీరుగను, తుట్టతుదకు డిక్రీమాత్రము మరొకవిధముగను ఇచ్చినట్లుగా వాదమంతయు విశాలాంధ్రకు అనుకూలముగ చెప్పి అయిదేండ్లవరకు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రము ఏర్పాటు చేయకూడదని, ఆ తరువాత అనగా 1961వ సంవత్సరమున ఎన్నికయిన శాసనసభలో మూడింట రెండు వంతుల సభ్యుల ఆమోదముతో విశాలాంధ్రము ఏర్పడవలెనని కమీషను వారు డిక్రీ ఇచ్చిరి. కమిషను నివేదిక ప్రకటన అయిన తరువాత వ్యక్తులు, రాజకీయ పక్షాలు తమతమ అభిప్రాయాలను ప్రకటించుట జరిగినది. ప్రత్యేక తెలంగాణావర్గాలు హర్షించుటయు, విశాలాంధ్రవర్గాలు ఆశాభంగము వెల్లడించుటయు జరిగినది. శ్రీ పుల్లారెడ్డి, దేవులపల్లి రామానుజరావు మొదలైన విశాలాంధ్రవాదులు అసంతృప్తిని ప్రకటించి తక్షణ విశాలాంధ్రస్థాపన కావలెనని ఉద్ఘాటించిరి. విశాలాంధ్ర కావలెనని మాత్రము తక్షణమే నిర్ణయించి ఆరేండ్ల తరువాత ఆ నిర్ణయమును అమలు జరుపవచ్చునని శ్రీ ఎం.ఎస్. రాజలింగంగారొక సూచన కావించిరి. (14 అక్టోబరు 1955 నాటి గోలకొండ పత్రిక చూడుడు). ఆరేండ్ల వ్యవధిని నిర్ణయించుటకు బదులుగా తెలంగాణా శాసనసభ్యులు యెపుడు ఇష్టపడిన అపుడే విశాలాంధ్ర యేర్పాటు చేయుటకు వీలు కలిగించవలెనని మాత్రము శ్రీ వల్లూరి బసవరాజుగారింకొక సూచన గావించిరి. (12 అక్టోబరు 1955 నాటి ఆంధ్రజనత చూడుడు). హైదరాబాదు విభజనకు వ్యతిరేకులయినవారు రాష్ట్రవిభజన తప్పనిసరి అయినప్పుడు ప్రత్యేక తెలంగాణము కన్న విశాలాంధ్రమే వాంఛనీయమని వ్యాఖ్యానించిరి. ఈ విధముగ విశాలాంధ్రను బలపరచు వారి సంఖ్య హెచ్చినది. ఇట్లు బలపరిచినవారిలో మందుముల నర్సింగరావు, పండిత వినాయకరావు, పండిత నరేంద్రజీ, గోపాలరావు ఎక్బోటె, నవాబ్ మెహిదీనవాజ్ జంగు మొదలైనవారు కలరు. అన్నిటికన్న విచిత్రమయిన సంఘటన యేమనగా విశాలాంధ్రోద్యమానికి మొదటినుండి పట్టుగొమ్మయై, ఆంధ్రోద్యమ రథసారథియై, ఆంధ్ర పితామహ బిరుదాంకితులై హైద్రాబాదులో ఆంధ్రత్వమునకు పర్యాయపదముగ ప్రసిద్ధిగాంచిన, పద్మభూషణ మాడపాటి హనుమంతరావు పంతులుగారు అయిదేండ్లవరకు తెలంగాణము ప్రత్యేకముగ నుండుట తమకు సమ్మతమేయని ప్రకటించిరి. ఈ విధముగ పంతులుగారు చూపిన నూతన మార్గమును ఇంతవరకు విశాలాంధ్రవాదులుగ నుండిన మరికొందరు అనుగమించిరి. తత్ఫలితముగా హైద్రాబాదు మునిసిపల్ కార్పొరేషనులో విశాలాంధ్ర అనుకూలుర సంఖ్య తగ్గినది.

ప్రస్ఫుటమైన రెండు వర్గాలు

విశాలాంధ్ర, తెలంగాణా అను రెండు వర్గాలు హైద్రాబాదు రాజకీయరంగమున ప్రస్ఫుటముగ బయలుదేరి పని చేయసాగినవి. కాంగ్రెసు, ప్రజా సోషలిస్టు పార్టీలలో యిట్టి రెండు భిన్నవర్గాలు ముందుకు వచ్చినవి. కమ్యూనిస్టుపార్టీలో ఇట్టి విభేదాలు రాలేదు. వారందరు ఒక గొంతుతో మాట్లాడిరి. భారత ప్రభుత్వము ఈ విషయమై తుది నిర్ణయము చేయవలసినదై యుండెను. అందుచేత విశాలాంధ్ర మరియు తెలంగాణ ఉభయపక్షాలు తమ తమ అభిప్రాయాల కనుకూలముగ భారత ప్రభుత్వము నిర్ణయము చేయవలసినదని అభ్యర్థనలు, విజ్ఞప్తులు మొదలైన కార్యకలాపాలు ప్రారంభించిరి. విశాలాంధ్రోద్యమము సంఘటితము కాజొచ్చెను. అక్టోబరు నెలలో విశాలాంధ్ర మహాసభ కార్యాలయమున తెలంగాణమందలి విశాలాంధ్రోద్యమ కార్యకర్తలు శ్రీ బొమ్మకంటి సత్యనారాయణరావుగారి అధ్యక్షతన సమావేశమయి విశాలాంధ్ర సాధనకై పనిచేయుటకు నిర్ణయించుకొనిరి. 1955 నవంబరు 3వ తేదీనాడు పీల్ఖానాలో గల వైశ్యభవనములో విశాలాంధ్రోద్యమ కార్యకర్తలు మీర్ అహమ్మదలీఖాన్‌గారి అధ్యక్షతన సమావేశమయి వెంటనే విశాలాంధ్ర కావలెనని తీర్మానించిరి. ఇందుకొరకయి ఢిల్లీకివెళ్ళి అక్కడి పెద్దలను కలుసుకొని తక్షణ విశాలాంధ్ర నిర్మాణావశ్యకతను తెలియచెప్పుటకు ఒక రాయబారవర్గము నియమింపబడినది. ఈ రాయబారవర్గములో మీర్ అహమ్మదలీఖాన్, బొమ్మకంటి సత్యనారాయాణరావు, పాగ పుల్లారెడ్డి, కొత్తూరి సీతయ్య, బి.వి. గురుమూర్తి, వి.బి. రాజు మొదలైనవారుండిరి. వీరు నవంబరు మొదటివారంలో ఢిల్లీకి వెళ్ళి అక్కడ ఒక వారము రోజులుండి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఉపరాష్ట్రపతి డాక్టరు రాధాకృష్ణ, దేశీయ హోమ్ వ్యవహారాల మంత్రి శ్రీ గోవింద వల్లభపంత్, కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ ధేబరు మొదలైన పెద్దలను సందర్శించి తక్షణమే విశాలాంధ్రను యేర్పరచవలసిన ఆవశ్యకతను వెల్లడించిరి. తెలంగాణ కమ్యూనిస్టుల పక్షానగూడ శ్రీ రావి నారాయణ రెడ్డిగారి నాయకత్వాన ఒక రాయబారవర్గము ఢిల్లీలోని పెద్దల సందర్శించి వెంటనే విశాలాంధ్ర ఏర్పడవలెనని వివరించిరి. ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులైన శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ చండ్ర రాజేశ్వరరావుగారలు ఢిల్లీకి వెళ్ళి తక్షణ విశాలాంధ్రకు అనుకూలముగ పనిచేసిరి.

రెండు ముఖ్య సంఘటనలు

నవంబరు నెలలో అఖిలభారత కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశము జరిగినది. ఈ సమావేశమునకు ముందు జరిగిన రెండు ముఖ్యసంఘటనలను వివరించవలసియున్నది. మొదటిది, 1955 అక్టోబరు 22వ తేదీన క్రొత్త ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశము. ఈ సమావేశానికి బయలుదేరి వెళ్ళుటకు ముందు హైద్రాబాదు ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారిని ఉభయపక్షాలు కలుసుకొని తమ తమ అభిప్రాయాలను కేంద్రప్రభుత్వానికి తెలుపవలసినదని కోరిరి. విశాలాంధ్రమహాసభ కార్యకర్తలు మహాసభ పక్షాన విజయదశమి 17 అక్టోబరు 1955నాడు రామకృష్ణారావుగారిని కలుసుకొని తమ అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వమునకు తెలుపవలసినదని కోరిరి. అందరి అభిప్రాయాలను మరియు స్థానిక పరిస్థితులను కేంద్ర ప్రభుత్వమునకు తెలియ చేయగలనని రామకృష్ణారావుగారు తెలిపియుండిరి. ముఖ్యమంత్రుల

సమావేశమున పాల్గొని హైద్రాబాదుకు తిరిగి వచ్చిన పిమ్మట కొద్దిరోజులకే రామకృష్ణారావుగారు సుదీర్ఘమైన ప్రకటన గావించుచు వెంటనే విశాలాంధ్ర ఏర్పడవలెనని 28 అక్టోబరు నాడు ప్రకటించిరి. అయిందేడ్ల వరకు తెలంగాణాను ప్రత్యేకముగా నుంచినచో యిందువల్ల పెక్కు చిక్కులు ఉత్పన్నముకాగలవని, ఈ అయిదు సంవత్సరాలలో విశాలాంధ్ర, తెలంగాణా జగడము ప్రతినిత్యము జరుగుచునే యుండగలదని, ఇది యెన్నికల సమస్యగాకూడ కాగల అవకాశము కలదనియు అందుచే తక్షణ విశాలాంధ్ర నిర్మాణము శ్రేయస్కరమనియు రామకృష్ణారావుగారు తెలిపిరి. వెంటనే విశాలాంధ్ర ఎందుకు రావలెనో ఈ ప్రకటనలో చక్కగా వివరింపబడినది. ఈ ప్రకటన యొక్క తెలుగు భాషాంతరీకరణము విశాలాంధ్ర మహాసభవారు అచ్చువేసినారు. ఈ ప్రకటన విశాలాంధ్రోద్యమానికి బలమైన ఊతయైనది. ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశము తరువాత కర్నూలు తిరిగి వెళ్ళుచు హైదరాబాదులో కొన్ని గంటలు ఆగి ఆనాడు విశాలాంధ్ర మహాసభ పక్షాన వారిని కలుసుకొనిన విశాలాంధ్ర కార్యకర్తలతో శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారు ప్రసంగించుచు ముఖ్యమంత్రుల సమావేశములో ఆంధ్ర, హైదరాబాదు ముఖ్యమంత్రులు ఉభయులు తక్షణము విశాలాంధ్ర నిర్మాణమును కోరిరనియు, రామకృష్ణారావుగారు తమ ప్రసంగమున విశాలాంధ్ర వాదమును అతి సమర్థతతో కావించిరనియు తెలిపిరి. రెండవ సంఘటన నవంబరు మొదటి వారములో ఢిల్లీలో జరిగిన ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుల సమావేశము. ఈ సమావేశానికి ముందు 1955 అక్టోబరు 31వ తేదీన తెలంగాణా కాంగ్రెసు డెలిగేట్ల సమావేశము ఏర్పాటు చేయబడెను. ఈ సమావేశములో అధిక సంఖ్యాక డెలిగేట్లు (1-11-55 నాడు ఏబదిమంది డెలిగేట్లు) కమిషను వారి నిర్ణయమును అనగా అయిదేండ్ల తెలంగాణాను బలపరిచిరి. వీరిలో శ్రీ రామకృష్ణారావుగారొకరు. ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుల సమావేశములో పాల్గొనిన హైద్రాబాదు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ జె.వి. నర్సింగరావుగారు శాశ్వత ప్రత్యేక తెలంగాణా కావలెనని కోరిరి. శ్రీ నర్సింగరావుగారు ఢిల్లీ నుండి తిరిగి వచ్చిన తరువాత శాశ్వతముగ ప్రత్యేక తెలంగాణము ఏర్పడుట తమ అభిప్రాయమని ప్రకటించిరి. చెన్నారెడ్డిగారు కూడ ఇట్టి ప్రకటననే కావించినారు. రంగారెడ్డిగారు ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి నాయకత్వము వహించిరి. ఈ విధముగ తెలంగాణా రాష్ట్ర ఉద్యమము విజృంభించుట జరిగినది. ఇట్టి పరిస్థితిలో క్రొత్తఢిల్లీలో అఖిలభారత కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశము జరిగినది. 1955 నవంబరు 9వ తేదీన వర్కింగ్ కమిటీవారు విశాలాంధ్ర ఏర్పడుట ఉచితమని తెలంగాణా ప్రజలకు సలహానిచ్చిరి. ఈ సందర్భమున అఖిలభారత కమ్యూనిస్టుపార్టీ మరియు అఖిలభారత ప్రజాసోషలిస్టుపార్టీ వారు వెంటనే విశాలాంధ్ర ఏర్పడవలెనని తీర్మానించిన సంగతి గమనించదగినది.

సంప్రదింపులు

1955 నవంబరు మొదటివారంలో ఆంధ్రముఖ్యమంత్రి శ్రీ గోపాలరెడ్డిగారు, డిప్యూటీ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు, ప్లానింగ్ మంత్రి శ్రీ కళా వెంకటరావుగారు, సహకారమంత్రి శ్రీ సంజీవయ్యగారు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుగారు హైదరాబాదుకు వచ్చి ఉభయపక్షాల వారితో సంప్రదింపులు జరిపిరి. ఆనాడు పగలు మూడుగంటలకు గాంధీభవనంలో పైన పేర్కొన్న ఆంధ్ర నాయకులతో హైదరాబాదు కాంగ్రెసు నాయకులు శ్రీ బూర్గుల రామకృష్ణారావు, శ్రీ కొండా వెంకట రంగారెడ్డి, శ్రీ చెన్నారెడ్డి, శ్రీ జె.వి. నరసింగరావుగారల సమావేశము జరిగి దీర్ఘ చర్చల తరువాత నవంబరు 23వ తేదీ 1955 నాడు కర్నూలులో తిరిగి సమావేశమగుటకు నిర్ణయించబడినది. ఈ సమావేశమున రామకృష్ణారావుగారు విశాలాంధ్రను గట్టిగ బలపరచిరి. తరువాత ప్రత్యేక తెలంగాణా నాయకులు కర్నూలు వెళ్ళుటకు ఇష్టపడలేదు. అందుచేత ఈ సమావేశము జరుగలేదు.

ఉధృత విశాలాంధ్ర ఉద్యమం

ఇది ఇట్లుండగా విశాలాంధ్రోద్యమము క్రమక్రమముగా బలపడసాగినది. విశాలాంధ్ర మహాసభ పుస్తకాలను, కరపత్రాలను ఉర్దు, తెలుగుభాషలలో ప్రకటించి, సమావేశాలను జరిపి, సదస్సులను నిర్వహించి మరియు ఇతర ప్రచార కార్యక్రమాలద్వారా అఖిల భారత కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సలహాప్రకారము విశాలాంధ్రోద్యమమును బలపరచసాగినది. జిల్లాలలో సమావేశాలను జరిపి విశాలాంధ్రోద్యమమును బలపరచినవారిలో బొమ్మకంటి సత్యనారాయణరావు, పి. పుల్లారెడ్డి, కొత్తూరి సీతయ్య, మీర్ అహమ్మదలీఖాన్, వి.బి. రాజు, పండిత నరేంద్రజీ, కొండా లక్ష్మణ్, ఎట్టం సత్యనారాయణ మొదలైనవారిని పేర్కొనవలసియున్నది. శ్రీ జనార్ధన్‌రావు దేశాయిగారు విశాలాంధ్రోద్యమమునకు తోడ్పడిరి. కమ్యూనిస్టు నాయకులు కూడ జిల్లాలలో అనేక సభలను, సదస్సులను జరిపి విశాలాంధ్రోద్యమమునకు బలమును చేకూర్చిరి. కొన్నిచోట్ల అఖిలపక్ష సమావేశాలు కూడ జరిగి విశాలాంధ్రను బలపరచుట జరిగినది. ఈ అఖిలపక్ష సమావేశాలలో చండి జగన్నాథం, కోదాటి, కొమరగిరి, కాళోజీగారలు ఉత్సాహముతో పాల్గొని పనిచేసిరి. శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు కొన్ని సమావేశాలలో పాల్గొనిరి. మహిళలు కూడ విశాలాంధ్రోద్యమములో పాల్గొని ముందుకు వచ్చిరి. ఇట్లు పని చేసిన మహిళలలో ఎల్లాప్రగడ సీతాకుమారి, సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి, విజయలక్ష్మి, రాజమణీదేవిగారలను పేర్కొనవలసియున్నది. రెండు వందలకుపైగా విశాలాంధ్ర సదస్సులు తెలంగాణమందు జరిగినవి. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, కాంగ్రెసు సంఘాలు, కార్మిక సంఘాలు విశాలాంధ్రకు ఆమోదమును కేంద్ర ప్రభుత్వమునకు తెలియచేసినవి. విద్యార్థులలో ఉభయపక్షాలు విజృంభించినవి. తాత్కాలికోద్రేకాలవల్ల అక్కడక్కడ కొద్ది దౌర్జన్యాలు కూడ జరిగినవి. వివిధ వర్గాలవారు విశాలాంధ్రను బలపరచుచు తీర్మానాలు కావించి కేంద్ర ప్రభుత్వమునకు తెలియచేసిరి. 12, నవంబరు 1955 నాడు రెండు ముఖ్యమైన సమావేశాలు జరిగినవి. ఒకటి ప్రతాపగిర్జీ కోఠీలో, రెండవది చార్‌మీనార్‌వద్ద. ఈ రెండు సమావేశాలు హైదరాబాదులోని అల్పసంఖ్యాకులైన మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాతి, ముస్లిమ్, మార్వాడి ప్రతినిధులచేత, ప్రముఖులచేత ఏర్పాటు చేయబడినవి. ఈ రెండు సమావేశాలలో విశాలాంధ్రను బలపరచుచు

చేయబడిన తీర్మానాలు కేంద్ర ప్రభుత్వానికి పంపబడినవి. 1955 నవంబరు 22వ తేదీనాడు జి. వెంకటాచలం అడ్వకేటుగారి అధ్యక్షతన హైద్రాబాదు న్యాయవాదుల సమావేశము విశాలాంధ్రమే తమ అభిమతమని ప్రకటించినది. 24 నవంబరు 1955 నాడు చార్‌మీనార్ వద్ద శ్రీ రావి నారాయణరెడ్డి గారు అధ్యక్షులుగ, శ్రీ కాళోజి నారాయణరావుగారు ప్రారంభకులుగ జరిగిన తెలంగాణా ప్రతినిధుల సమావేశములో జిల్లాలనుండి అయిదు వందలకు పైగా ప్రతినిధులు పాల్గొని వెంటనే విశాలాంధ్ర కావలెనని ప్రకటించిరి. ఇవిగాక వర్తక, వృత్తి సంఘాలు మొదలైనవి విశాలాంధ్రను బలపరచి కొన్ని వందల టెలిగ్రాములు కేంద్ర ప్రభుత్వానికి పంపినవి. ఈ ఉద్యమ నిర్వహణలో విశాలాంధ్ర మహాసభ అతి జాగ్రత్తగా, మిక్కిలి చురుకుగా పనిగావించినది. ఈ పరిస్థితులలో 22వ నవంబర్ 1955 నాడు హైద్రాబాదు శాసనసభ సమావేశము జరిగినది. ఈ సమావేశములో ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు ఆంధ్ర, తెలంగాణాల ఏకీకరణ కావలెనను తీర్మానమును ప్రతిపాదించిరి. ఈ తీర్మానమును ప్రతిపాదించుచు రామకృష్ణారావుగారు విశాలాంధ్ర ఎందుకు కావలెనో వివరించుచు సమగ్రమైన ఉపన్యాసమును కావించిరి. హైద్రాబాదు శాసనసభలో 175 మంది సభ్యులు. ఇందులో 147 మంది చర్చలలో పాల్గొనిరి. 103 గురు తక్షణ విశాలాంధ్రను కోరిరి. 28 మంది మాత్రమే ప్రత్యేక తెలంగాణమును కోరిరి. అసెంబ్లీలో చర్చలు యీ విధముగా జరుగుచుండగా శ్రీ కొండా వెంకట రంగారెడ్డి గారు ఢిల్లీకి వెళ్ళి ఒక ఆదేశమును దెచ్చిరి. ఆ ఆదేశము ఫలితముగ అంతవరకు అనుకొనినట్లుగా శాసనసభలో ఓటింగ్ జరుగక సమావేశము 4వ డిసెంబరు 55 నాటికి వాయిదాపడినది. కాని సభ్యుల అభిప్రాయాల వివరాలు మాత్రము కేంద్ర ప్రభుత్వమునకు అందచేయబడెను. శాసనసభలో ముఖ్యమంత్రిగారు 23 నవంబరు 55 నాడు చేసిన ప్రసంగము యొక్క సారాంశము తెలుగులో విశాలాంధ్ర మహాసభచే ప్రకటింపబడినది. ఇదిగాక మరికొన్ని కరపత్రాలు ప్రకటింపబడినవి. రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాదు తిరుపతి విశ్వవిద్యాలయ సెనేటుకు ప్రారంభము జరుపుచు విశాలాంధ్రను ఆశీర్వదించినారు. విజ్ఞానమూర్తులై, వేదాంతవేత్తలై సకల ప్రపంచమునకు సన్మార్గము చూపగలిగిన మహానుభావుల ఆశీర్వచనములు యీ ఉద్యమానికి లభించినవి. శ్రీ వినోబాభావె విశాలాంధ్రను ఆమోదించిరి. ఆర్థిక శాస్త్రవేత్తలు తెలంగాణము స్వయంపోషకముగాదని, విశాలాంధ్ర ఏర్పడుటలో ప్రజలకు శ్రేయస్కరమైనదని తెలిపిరి. శ్రీ ధేబరు విశాలాంధ్ర ఏర్పడవలెనని సలహానిచ్చిరి. ఈ పెద్దల ఆశీస్సులను, సలహాలను ఒకచోట క్రోఢీకరించి విశాలాంధ్ర మహాసభ పక్షాన ఒక కరపత్రము ప్రకటింపబడినది. విశాలాంధ్ర మహాసభవారు ప్రకటించిన పుస్తకాలు, కరపత్రాలను వేలసంఖ్యలో ప్రజలకు అందచేయుట జరిగినది. 'ఆంధ్ర జనత', 'తెలుగు దేశం', 'డెయిలీ న్యూస్' (ఇంగ్లీషు), 'సియాసత్', 'పయామ్' (ఉర్దూ), 'విశాలాంధ్ర', 'ఆంధ్ర ప్రభ', 'ఆంధ్ర పత్రిక', 'విజయవాణి' మొదలైన పత్రికలు విశాలాంధ్రను బలపరచినవి.

తీవ్రపరిస్థితులు

తెలంగాణములో పరిస్థితులు ఈ నాలుగయిదు నెలలు తీవ్రముగా నుండెను. నవంబరు, డిసెంబరు, జనవరి నెలలలో ఈ తీవ్రత మరీ ఎక్కువగా నుండెను. డిసెంబరు నెల రెండవ వారము నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయుటకు వెళ్ళుచు ప్రధాని నెహ్రూగారు హైద్రాబాదు విచ్చేసి ఒకరోజిచ్చట ఉండిరి. 9వ డిసెంబరు 55 నాడు ఉర్దూ హాలుకు ప్రారంభోత్సవము చేయుచు హైదరాబాదులో శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ మొదటినుండియు తాము హైద్రాబాదు విభజనకు వ్యతిరేకులమనియు, అయినను అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవముగ కోరినందున, ఫజుల్‌అలీ కమిషను వారు కూడ సిఫారసు చేసినందువలన హైద్రాబాదు విభజన అనివార్యమైనదని తెలిపిరి. తమ వ్యక్తిగత అభిప్రాయమేమై నప్పటికిని హైద్రాబాదు విభజన నిర్ణయానికి తాము బద్ధులమై యున్నట్లు ప్రధాని నెహ్రూ తెలిపిరి. ఆనాడు సాయంకాలం షామంజిల్‌లో జరిగిన కాంగ్రెసు కార్యకర్తల సమావేశములో ముచ్చటించుచు ఆరేండ్లవరకు తెలంగాణమును వేరుగానుంచుట సరిగాదనియు, ఆరేండ్లు జగడము పెట్టుకొనక ఇప్పుడే ఏదో ఒక తుది నిర్ణయము చేయవలెననియు వర్కింగ్ కమిటీ తనకు సలహా నిచ్చినదనియు స్పష్టీకరించిరి. మరుసటిరోజు నాగార్జునసాగర ప్రాజెక్టుకు శంకుస్థాపన గావించుచు కృష్ణానదీ జలాలు ఉభయ ప్రాంతాల తెలుగు ప్రజలకు అవిభాజ్యమైన ప్రేమబంధముగా నున్నవని తెలిపిరి. తెల్లవారి గుంటూరులోని రాజకీయ మహాసభలో మాట్లాడుచు ఆంధ్ర ప్రజల నుద్దేశించి "మీరందరు విశాలాంధ్రను కోరుచున్నారని నాకు తెలుసును. ఈ కోరిక సంభావ్యము" అని తెలిపిరి. ఈ ఉపన్యాసాలన్నియును ప్రధాని నెహ్రూ విశాలాంధ్రకు వ్యతిరేకులు కారని స్పష్టము చేయుచున్నవి. గుంటూరు రాజకీయ మహాసభలకు ఆంధ్రరాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారు అధ్యక్షత వహించిరి. ఈ మహాసభలో తక్షణమే విశాలాంధ్రను ఏర్పరచవలెనను తీర్మానము ఏకగ్రీవముగ అంగీకరించుట జరిగినది. ఈ తీర్మానమును గుంటూరుకు వెళ్ళి బలపరచిన హైద్రాబాదు వారిలో విశాలాంధ్ర మహాసభ కార్యదర్శి శ్రీ పుల్లారెడ్డి గారు కలరు. సుప్రసిద్ధ ఆంధ్ర నాయకులు, భారత జాతీయ కాంగ్రెసుకు అధ్యక్షులుగా పనిచేసిన మేధావులు, మధ్యప్రదేశ్ గవర్నరు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు 1955 డిసెంబరు నెలలో ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోపన్యాసము నిచ్చుటకు హైద్రాబాదుకు వచ్చిరి. ఆ సందర్భమున వారికి స్వాగతమిచ్చుటకై ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యాలయ ఆవరణలో ఒక గొప్పసభ, పరిషత్తు పక్షాన జరిగినది. ఆ సభలో ప్రసంగించుచు డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య పంతులుగారు "అతి త్వరలో మీరు, మేము అను భేదము పోయి జనవరి రెండవవారము లోగా మనము 'మనము కాగల' మని సెలవిచ్చిరి. ప్రప్రథమమున తప్పక విశాలాంధ్ర ఏర్పడగలదను అసందిగ్ధమైన ప్రకటనగా అది భావించబడినది.

వాదోపవాదాలు - ఢిల్లీ యాత్రలు

జనవరి, ఫిబ్రవరి రెండు నెలలలో విశాలాంధ్ర, తెలంగాణా వాదోపవాదాలు తీవ్రముగా చెలరేగినవి. ఢిల్లీ యాత్రలు అధిక సంఖ్యలో జరిగినవి. టెలిగ్రాములు అసంఖ్యాకముగ వెళ్ళినవి. ఫలాన తేదీన ఢిల్లీ నిర్ణయ ప్రకటన జరుగగలదని పలుమారులు ఆశింపబడినది. పలుమారులు ఆశాభంగము చెందుట కూడ జరిగినది. ఉభయపక్షాలవారు ఢిల్లీ వర్గాలు తమకే అనుకూలముగ నున్నవని పుంఖాను పుంఖముగ ప్రకటనలు

కావించుట జరిగినవి. ఒక అనిశ్చిత పరిస్థితి ఏర్పడి చాల చీకాకు కల్గించినది. జిల్లాలో, గ్రామాలలో విశాలాంధ్ర సదస్సులు జరుగుచునే యుండెను. తీర్మానాలపై తీర్మానాలు ఢిల్లీకి పంపబడుచునే యుండెను. ప్రజాభిప్రాయము విశాలాంధ్రకు అనుకూలముగా లేదని ఢిల్లీలోని ఒకరిద్దరు పెద్దలకు ప్రత్యేకముగ మౌలానా ఆజాద్ గారికి అపోహ కలదని భావించబడినది. 1956 జనవరి మూడవ వారములో ఈ అపోహలను తొలగించు ఉద్దేశ్యముతో గౌలీగూడెములోని వివేకవర్ధనీ మైదానము ప్రక్క ఒక బ్రహ్మాండమైన బహిరంగ సభ జరుపబడినది. ఈ సభలో కొన్ని వేలమంది ప్రజలు పాల్గొనిరి. సభ దిగ్విజయముగ జరిగినది. సభలో పండిత వినాయకరావు, శ్రీనివాసరావు ఎఖిలేకర్, దేవులపల్లి రామానుజరావు, గురుమూర్తి, కొండా లక్ష్మణ్, కొత్తూరి సీతయ్య, పి. పుల్లారెడ్డి, పండిత నరేంద్రజీ, యమ్.యస్. రాజలింగం, అహమ్మదలీఖాన్ మొదలైనవారు విశాలాంధ్రను బలపరచుచు ప్రసంగించిరి. ఇదేరోజు విశాలాంధ్రను బలపరచుచు కమ్యూనిస్టు నాయకులు హైద్రాబాదు నగరవీధులలో ఒక పెద్ద ఊరేగింపు తీసిరి. ఊరేగింపులో రెండువేలకు పైగా ప్రజలు పాల్గొనిరి. ఊరేగింపు రావి నారాయణరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి, రాజ బహద్దుర్‌గౌడు, మఖ్దుం మొహియొద్దీన్, వి.డి. దేశపాండే ప్రభృతుల నాయకత్వమున నగరమందంతటను తిరిగి విశాలాంధ్ర వెంటనే ఏర్పడవలెనని నినాదాలు కావించినది. ఈ సభ మరియు ఊరేగింపువలన హైద్రాబాదు నగరము విశాలాంధ్రకు అనుకూలమని ఋజువైనది.

పార్లమెంట్‌లో

1956 జనవరిలో పార్లమెంటు సమావేశము జరిగినది. ఈ పార్లమెంటు సమావేశములో రాష్ట్రాల పునర్నిర్మాణ సమస్య చర్చకు వచ్చినది. పార్లమెంటు చర్చలను సమగ్రముగ పరిశీలించినప్పుడు అధిక సంఖ్యాకుల అభిప్రాయము విశాలాంధ్రకే అనుకూలముగ నుండినట్లు స్పష్టమైనది. ఆచార్య గోగినేని రంగనాయకులుగారి ఉపన్యాసము కొంత ఆశ్చర్యమును కల్గించినది. వారు కొంతకాలము తెలంగాణము విడిగా నుండవచ్చునని రాజ్యసభలో తెలిపియుండిరి. ఆ రోజులలో ఆంధ్రరాష్ట్రమున విశాలాంధ్రము కావలెనను పట్టుదల లేదని ఢిల్లీలోని ఒకరిద్దరు పెద్దలు తలంచినట్లు భావించబడినది. ఈ వార్త తెలిసినంతనే ఆంధ్రరాష్ట్రములోని అన్ని రాజకీయ పక్షాలు వేల సంఖ్యలో విశాలాంధ్రను బలపరచుచు ఢిల్లీ పెద్దలకు టెలిగ్రాములు పంపిరి. జనవరి తుదివారములో యస్.కె. పాటిల్‌గారు హైద్రాబాదుకు వచ్చి రెండు రోజులు రిట్జు హోటలులో మకాము చేసి మూడు నాలుగు ప్రకటనలు కావించిరి. ఈ ప్రకటనలు పరస్పర విరుద్ధముగానుండి హైద్రాబాదు మరియు ఆంధ్ర రాజకీయ వర్గాలలో తీవ్ర అసంతృప్తిని కలిగించినవి. ఆంధ్ర, తెలంగాణాలలోని అన్ని వర్గాలవారి ఆమోదముతో విశాలాంధ్ర ఏర్పడవలెనని వారొక ప్రకటనలో తెలిపిరి. దానిపై వ్యాఖ్యానించుచు డాక్టరు చెన్నారెడ్డిగారు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రముకన్న తక్కువ యేమియు తమకు సమ్మతము కాదని తెలిపిరి.

ప్రతిష్టంభన

1956 జనవరి నెలలో బొంబాయిపై అఖిల భారత కాంగ్రెసు వర్కింగ్ కమిటీవారి నిర్ణయ ప్రకటన జరిగినది. మహారాష్ట్ర, గుజరాత్, బొంబాయి అను మూడు రాష్ట్రాల ఏర్పాటు జరుగవలెనని వర్కింగ్ కమిటీవారు నిర్ణయించిరి. ఈ నిర్ణయము ప్రకారము బొంబాయి నగరము గుజరాతులో గాని, మహారాష్ట్రలోగాని చేరక ప్రత్యేక రాష్ట్రముగ నుండగలదు. బొంబాయి తప్ప కడమ మహారాష్ట్ర ప్రాంతాలన్నియు కలిసి సంయుక్త మహారాష్ట్రముగా రూపొందగలవు. విదర్భ కూడ మహారాష్ట్రలో చేర్చబడినది. ప్రత్యేక విదర్భ రాష్ట్రము ఏర్పడవలెనని వాదించిన బ్రిజలాల్ బియాని ప్రభృతులు వర్కింగ్ కమిటీ నిర్ణయమును సమ్మతించి బలపరచిరి. విదర్భను ప్రత్యేకముగ నుంచుటకు వీలులేదని, దానిని మహారాష్ట్రములో చేర్చవలెనని వర్కింగ్ కమిటీ నిర్ణయించిన తరువాత ప్రత్యేక తెలంగాణా రాష్ట్రమునకు ఇక అవకాశము లేదనియు ఇక విశాలాంధ్రయే ఏర్పడగలదనియు గాఢ విశ్వాసము రాజకీయ వర్గాలలో కలిగినది. బొంబాయిపై వర్కింగ్ కమిటీ చేసిన నిర్ణయముపై ఆ నగరమున శాంతిభంగమై ఘోరదౌర్జన్యాలు జరిగినవి. ఈ దౌర్జన్యాలు దేశమున సంచలనము కలుగచేసినవి. ఒరిస్సా, బీహారు రాష్ట్రాలలో కూడా దౌర్జన్యకాండ జరిగినది. ఈ సంఘటనలపై ఆలోచించుటకు మరియు ఇతర సమస్యలను నిర్ణయించుటకు ముఖ్యమంత్రుల సమావేశము మరియు కాంగ్రెసు అగ్రనాయకుల సమావేశము జరిగినది. సరిహద్దులు మొదలైన సమస్యలపై సంఘర్షణలు, దౌర్జన్యమునకు దారి తీయుట కాంగ్రెసు అగ్రనాయకులకు ఆవేదన కల్గించినది. అపుడు చిన్న రాష్ట్రాల ఏర్పాటు సమంజసము కాదనియు పెద్దరాష్ట్రాలు ఏర్పడుట అవసరమనియు, అంతేకాక ద్విభాషా రాష్ట్రాలు, బహుభాషా రాష్ట్రాలు ఏర్పడుట సమంజసమనియు కాంగ్రెసు అగ్రనాయకులకు ఒక ఆలోచన కలిగినది. ఢిల్లీలో జనవరి తుదివారమున ముఖ్యమంత్రుల సమావేశ సందర్భమున కలుసుకొన్న బెంగాలు, బీహారు ముఖ్యమంత్రులైన బి.సి. రాయ్, శ్రీకృష్ణసిన్హాగారలు బెంగాలు, బీహారులు లీనమగుటకు ఒప్పుకొనిరి. వర్కింగ్ కమిటీవారు దీనిని హర్షించిరి. దీనిపైన దేశములో భాషారాష్ట్రాల ఏర్పాటు వెనుకపడునేమో అను అనుమానము కలిగినది. బెంగాలు, బీహారు రాష్ట్రాల విలీనీకరణకు ఉభయ రాష్ట్రాలలో తీవ్రప్రతిఘటన వచ్చినది. దేశ మందంతటను ముఖ్యులైనవారు ద్విభాషారాష్ట్రాల ఏర్పాటుపై, ప్రకటనలు చేయుట ఆరంభించిరి. హైదరాబాదు ముఖ్యమంత్రి డాక్టరు బూర్గుల రామకృష్ణారావు పంతులుగారు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలు కలిసి ఏక రాష్ట్రముగ ఏర్పడవలెనని సూచించిరి. ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ఆంధ్ర, మహారాష్ట్రములు కలిసి, ఏకరాష్ట్రముగ ఏర్పడవలెనని సలహానిచ్చిరి. అయ్యదేవర కాళేశ్వరరావు పంతులుగారు, ఒరిస్సాతో ఆంధ్ర ప్రాంతములను కలిపిన బాగుండునేమోయని సెలవిచ్చిరి. చెన్నారెడ్డిగారు ఆంధ్ర తెలంగాణా, కర్ణాటక ప్రాంతాలను ఏకరాష్ట్రముగ చేసిన బాగుండునని వెల్లడించిరి. కొండా వెంకటరంగారెడ్డి గారు ఈ సమస్యపై ఏమియు వెంటనే చెప్పుటకు వీలులేదనియు, జాగ్రత్తగా ఆలోచించవలసి యున్నదనియు ప్రకటించిరి. మొట్టమొదట విశాలాంధ్రము ఏర్పడుట అవసరమనియు, కడమసంగతులు తరువాత ఆలోచించుకొనవచ్చుననియు అసందిగ్ధముగ సంజీవరెడ్డిగారు ప్రకటించిరి. ద్విభాషారాష్ట్రముల ప్రతిపాదనను విశాలాంధ్రవాదులు హర్షించలేదు. భాషాసూత్రముపైన రాష్ట్రాలు ఏర్పాటు కావలెనని వీరు అభిప్రాయపడిరి. ఈ విషయమై సుదీర్ఘమైన ప్రకటన కావించుచు దేవులపల్లి రామానుజరావు భాషా రాష్ట్ర

ప్రాతిపదికమీదనే భాషా రాష్ట్రాలు ఏర్పడవలెనని ప్రకటించుట జరిగినది. గోలకొండ పత్రిక, ఈ సందర్భమున ఒక చక్కని సంపాదకీయమును వ్రాసినది. ఆ సంపాదకీయములో భాషారాష్ట్ర ప్రాతిపదికను బలపరచి, ఏకభాషా రాష్ట్రాలు కావలెనని ఉద్ఘాటించుట జరిగినది.

శుభాంతము

జనవరి నెలలో కేంద్ర ప్రభుత్వములోని ముఖ్యులైనవారు కొందరు హైద్రాబాదు నగరమునకు విచ్చేసిరి. రక్షణ శాఖామంత్రి డాక్టరు కైలాసనాధ్ కట్జూ, రైల్వేల మంత్రి లాల్ బహద్దుర్ శాస్త్రి, విదేశాంగ వ్యవహార శాఖలో మంత్రిగానున్న డాక్టర్ సయ్యద్ మహమ్మూద్ ఇట్లు హైద్రాబాదుకు వచ్చిన వారిలో ముఖ్యులు. వీరందరిని విశాలాంధ్ర మహాసభ పక్షాన విశాలాంధ్ర మహాసభ ప్రతినిధులు అహమ్మదలీఖాన్, కొత్తూరి సీతయ్య, పుల్లారెడ్డి, దేవులపల్లి రామానుజరావు, ఎల్లంల సత్యనారాయణ, పండిత నరేంద్రజీ, సర్దారుల్లాఖాన్, ధరణీధరసంఘి, అబిదలీఖాన్ మొదలైనవారు కలుసుకొని తక్షణ విశాలాంధ్ర స్థాపనావశ్యకతను నిరూపించుట జరిగినది. విశాలాంధ్రోద్యమానికి రామకృష్ణరావుగారు నాయకత్వము వహించిరి. ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి రంగారెడ్డిగారు నాయకులైరి. ఫిబ్రవరి నెల రెండవ వారములో అఖిలభారత కాంగ్రెసు జాతీయ మహాసభ అమృతసర్‌లో జరిగినది. ఈ సమావేశానికి హైద్రాబాదులోని ఉభయపక్షాల ప్రతినిధులు వెళ్ళిరి. కాంగ్రెసు అగ్రనాయకుల నిర్ణయము ప్రకారము దేశములో పెద్ద రాష్ట్రాల నిర్మాణము కావలెనను భావము కాంగ్రెసు వర్గాలలో క్రమక్రమముగా బలపడసాగినది. హైద్రాబాదు నాయకులను ఢిల్లీకి పిలిచి పెద్ద రాష్ట్రాల నిర్మాణావశ్యకతను తెలుపుట జరిగినది. రక్షణలతో తెలంగాణమును ఆంధ్ర ప్రాంతములో లీనము చేయుట సమంజసమని నిర్ణయించబడినది. తెలంగాణావారికి ఉద్యోగాలలోను విద్యా వైద్యాభివృద్ధి ప్రణాళికలలోను తగిన రక్షణలనిచ్చి, ఆ రక్షణల కాపాడుటకు ఒక ప్రాంతీయ కౌన్సిలును ఏర్పాటు చేయుటకు నిర్ణయము జరిగినది. ఈ వివరాలలో ముఖ్యమైన వానిని పార్లమెంటు చట్టములో పొందుపర్చుట జరిగినది. రక్షణలకు ఎవరు, ఎన్నడును వ్యతిరేకులుకారు. మొదటినుండియు తెలంగాణమునకు తగిన రక్షణలతో విశాలాంధ్రము ఏర్పడవలెనని విశాలాంధ్రవాదుల అభిప్రాయమై యుండెను. విశాలాంధ్ర మహాసభ పక్షాన ఫజల్ అలీ కమీషను కిచ్చిన నివేదికలో తెలంగాణాకు రక్షణల ఆవశ్యకతను ఉద్ఘాటించుట జరిగినది. కమీషను నివేదిక ప్రకటనకు ముందుగను మరియు తరువాతను చెన్నారెడ్డిగారు మాత్రము రక్షణలకు ఏమంత ప్రాధాన్యములేదనియు, దాని ఆవశ్యకత అంతగా లేదనియు చెప్పుట జరిగినది. మొత్తము మీద ఈ వ్యవహారము శుభాంతముగ పరిణమించినది. ఆంధ్ర నాయకులు తెలంగాణమునకు "బ్లాంక్ చెక్" ఇచ్చుటకు సిద్ధముగా నున్నట్లు ప్రకటన గావించిరి. ఇక విశాలాంధ్ర ప్రకటన మాత్రము జరుగవలసి యుండెను. ఆ ప్రకటన మార్చి మొదటివారములో నిజామాబాదు పట్టణమున భారత సేవక సమాజ్ వార్షికోత్సవాలకు అధ్యక్షత వహించిన భారతదేశము యొక్క ఉదాత్త సంస్కృతికి ఉత్తమ చిహ్నము. మరియు భారత ప్రజలకేకాక సకల ప్రపంచ ప్రజలకు ప్రేమాస్పదుడైన నాయకుడునైన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ చేయుట జరిగినది. ఈ ప్రకటనను హైద్రాబాదు మరియు ఆంధ్రరాష్ట్రములోని అన్నివర్గాలు హర్షించి సంపూర్ణముగ సమర్థించుట జరిగినది. పెద్దలైన శ్రీ కొండా వెంకట రంగారెడ్డిగారు నెహ్రూగారు ప్రకటించిన భారత ప్రభుత్వ నిర్ణయము హైద్రాబాదులోని ప్రజలందరు శిరసావహించవలసినదని ప్రకటించిరి. ఈ విధముగ మూడుకోట్ల తెలుగు ప్రజలమధ్య కృత్రిమముగ నూట ఏబది సంవత్సరాలు ఏర్పడిన అఖాతము తొలగిపోయినది; విశాలాంధ్రము వచ్చినది.

మహోజ్వల ఘట్టము

1946 నుండి 1956 వరకు హైద్రాబాదు రాజకీయ చరిత్రలో మహోజ్జ్వలమైన ఘట్టము. 1946కు ముందు హైద్రాబాదులో ప్రజాస్వామ్య వ్యతిరేకమైన మధ్యకాలపు నిరంకుశ రాజరికము అధికారములో నుండెను. ఈ ప్రభుత్వమును తొలగించి ప్రజాస్వామిక ప్రభుత్వమును స్థాపించుటకు 1946 సంవత్సరమునకు చాలాకాలము ముందునుండియే ప్రజల ఉద్యమాలు బయలుదేరి పనిచేయుచుండెను. 1946 తరువాత కాంగ్రెసు ఉద్యమము బాధ్యతాయుత పరిపాలన ఆదర్శముతో విజృంభించి పనిచేయసాగినది. 1948లో పోలీసుచర్య జరిగినది. తరువాత హైదరాబాదు విభజనోద్యమము బయలుదేరినది. 1953లో ఎన్నికలు జరిగి బాధ్యతాయుత ప్రభుత్వము ఏర్పడినది. అప్పుడు విభజనోద్యమము మరింత బలపడినది. విశాలాంధ్ర, సంయుక్త మహారాష్ట్ర, ఐక్యకర్ణాటక యుద్యమాలు తీవ్రముగ ప్రారంభమయి 1956లో పోలీసుచర్య జరిగినది. తరువాత హైద్రాబాదు విభజనోద్యమము బయలుదేరినది. 1952లో ఎన్నికలు జరిగి బాధ్యతాయుత ప్రభుత్వము ఏర్పడినది. విభజనోద్యమము మరింత బలపడినది. విశాలాంధ్ర, సంయుక్త మహారాష్ట్ర, ఐక్యకర్ణాటక ఉద్యమాలు తీవ్రముగ ప్రారంభమయి 1956లో విజయవంతముగ ముగిసినవి. ఈ విధముగ 1946 నుండి 1956 వరకు ఒక దశాబ్దమున కొన్ని శతాబ్దములలో జరుగనటువంటి మహోజ్జ్వలమైన చరిత్ర నిర్మాణము జరిగినది. ఆంధ్రదేశ చరిత్రలోనే ఇది అద్వితీయమైన ఘట్టము.

నోటు : ఆంధ్ర తెలంగాణాలతో కూడిన రాష్ట్రమునకు ఆంధ్రప్రదేశ్ అను పేరు పెట్టవలెనని ఆంధ్ర శాసనసభ హైద్రాబాదు శాసనసభ (దుర్ముఖి ఉగాదినాడు) నిర్ణయించినవి. **(తెలంగాణలో జాతీయోద్యమాలు గ్రంథం నుండి)**

అయ్యదేవర కాళేశ్వరరావు

నవ భారతంలో భాషా రాష్ట్రాల వైశిష్ట్యం

మహాత్మాగాంధిగారి నాయకత్వము క్రింద గొప్ప త్యాగములను చేసి మనము స్వరాజ్యము సంపాదించుకున్నాము. ప్రతి పురుషునికి, స్త్రీకి ఓటు హక్కుగల ప్రజారాజ్యమును సంపాదించుకున్నాము. ఆస్తి యున్నను లేకపోయినను, చదువు వచ్చినను, రాకున్నను వయస్సు వచ్చిన వారందరికి ఓటుహక్కు ఇవ్వబడినది. ఆ ఓటరులే ఈ 40 కోట్ల జనసంఖ్య గల ప్రజా రాజ్యమునకు ఏలికలు. ఆ ఓటరులు ఎన్నుకొన్న ప్రతినిధులే సార్వభౌమాధికారము గల లోకసభలోను, రాష్ట్రముల విధాన సభలోను సభ్యులై యున్నారు. ఓటరుల యొక్క మాతృ భాషలోనే శాసనములు చేయబడుట, ప్రభుత్వము నిర్వహింపబడుట, న్యాయస్థానములలో విచారణ, తీర్పులివ్వబడుట సహజమైన పునాది హక్కు. భరత వర్షము చాల పెద్ద దేశము. ఇందు కొన్ని భాషలు ముఖ్యమైనవిగనున్నవి. ఈ దేశమునకు ఇంగ్లాండు, ఫ్రాన్సు, ఈజిప్టు, టర్కీలలో వలె ఏక రాష్ట్ర విధానము పనికిరాదు. ఇందువలన మన దేశమును వివిధ రాష్ట్రములుగ చేసి రాష్ట్రములకు కొన్ని విషయములలో మాత్రం శాసన నిర్వహణ, ప్రభుత్వ పాలనాధికారములను కలగుచేసి యావత్తు దేశమునకు సంబంధించిన విషయములలో మాత్రము కేంద్రపార్లమెంటు, కేంద్ర ప్రభుత్వము అధికారములను కలిగి యుండునట్లుగ సంయుక్త ప్రభుత్వము ఏర్పాటు చేయబడినది. రష్యా, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా మొదలైన విశాలమైన దేశములలో ఇట్టి సంయుక్త ప్రభుత్వమే స్థాపింపబడియున్నది. అందువలన సరియైన ప్రజా రాజ్యము స్థాపింపవలెనన్న యుద్దేశ్యముతో రాష్ట్రములన్నిటిని ఏక భాషా రాష్ట్రములుగ ప్రజల భాషలలో స్థాపించుకున్నాము. మన రాజ్యాంగ విధానము యొక్క 8వ షెడ్యూలులో దేశములోని 14 భాషలు జాతీయ భాషలుగ అంగీకరింపబడినవి. ఇవన్నియు అనాదినుంచి మన ప్రజలచే వాడబడుచున్న మాతృభాషలు. ఈ భాషలన్నిటికి వేల సంవత్సరములుగ వాఙ్మయము కలిగి విశేషముగ వైజ్ఞానికాభివృద్ధిని పొందిన భాషలు. మన భారతదేశము యొక్క నాగరికత, ధర్మము, విజ్ఞానము యావత్తు ఈ భాషలలోనే ప్రజలలోని అడుగు భాగమునకు వ్యాపించి భారతదేశముయొక్క, ఐక్యత, సౌష్ఠవము అంతర్జాతీయ ప్రతిష్ఠ వేల సంవత్సరాలుగ స్థాపింపబడినది. అందువలన ఈ భాషలన్నిటిని అంగీకరించి వీటిని జాతీయ భాషలుగ చేసినారు.

సంస్కృతము, ఉర్దు రెండు భాషలు యావద్భారత దేశములో వ్యాపించిన భాషలు. కనుక వాటి రెంటికి ప్రత్యేక రాష్ట్రములు లేవు. వాటి మీద భాషా రాష్ట్రములు నిర్మింపబడలేదు. తక్కిన భాషలలో హిందీ భాష ప్రజల మాతృ భాషగా గల ఉత్తర ప్రదేశము, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రములు హిందీ భాష యొక్క ఏక భాషా రాష్ట్రములుగ చేయబడినవి. పంజాబు మాత్రము గురుముఖి. హిందీ

సమానముగ నున్నందున ద్విభాషారాష్ట్రముగ చేయబడినది. తక్కిన 11 దేశభాషలకు 11 రాష్ట్రములున్నవి. ఈ ఏర్పాటు సహజముగను, ప్రజా ప్రభుత్వమునకు స్థిరత్వమును, బలమును ఇచ్చునదిగను నున్నది. ఏ నాగరిక దేశములో కూడ జాతీయ ప్రభుత్వము శాసన నిర్మాణము, న్యాయస్థానముల కార్యక్రమము విదేశ భాషలలో జరుపబడుట కనివిని ఎఱుగము. మన దేశములో మాత్రమే గాక విదేశ ప్రభుత్వము క్రిందనున్న అన్ని దేశములలోను విదేశ భాష ఆయా ప్రజల మీద బలవంతముగ అంటకట్టబడి ప్రభుత్వ భాషగా చేయబడుటయే చారిత్రక విషయము. ఏ దేశమైనను స్వతంత్రమును పొందగనే తన యొక్క స్వభాషలోనే లేక స్వభాషలలోనే ప్రభుత్వ నిర్వహణము చేసుకొనుటయే ఆత్మ గౌరవకరమైన విషయము. ఆ పనినే మనము చేసుకొని యున్నాము. కనుక భాషా ప్రయుక్త రాష్ట్రములను ఖండించు వారు దేశాభిమానులని చెప్పతగిన వారు కారు. యావద్ భారత దేశమునకు కూడ మన దేశభాషలలో నెక్కువ వ్యాప్తముగ నున్న హిందీ భాషనే అధికార జాతీయ భాషగ నిర్ణయించుకొని రాజ్యాంగములో వ్రాసుకున్నాము. అంత మాత్రము చేత ప్రస్తుత ప్రపంచములో ముఖ్యముగ ప్రకృతి శాస్త్ర జ్ఞానము విశేషముగ గల యూరపు ఖండములోని భాషలను మన విద్వాంసులు నేర్చుకొన కూడదని కాని, మిగుల అభివృద్ధి చెందిన ప్రకృతి శాస్త్రజ్ఞానమును సంపాదించ కూడదని గాని అంతర్జాతీయ విషయములలో నవీన జాతులతో మనము తులతూగ కూడదని గాని ఎవరును చెప్పుట లేదు. అందువలన అంతర్జాతీయ రంగములో ప్రధాన భాషయైన ఆంగ్లమును మూడవ భాషగా అభ్యసించి తన్మూలమున ప్రకృతి శాస్త్రవైజ్ఞానికాది విశేషములను గ్రహింపవచ్చును.

హైస్కూళ్లలో మాతృభాషలో విద్య నభ్యసించిన విద్యార్థులకు కళాశాలలకు పోగానే ఆంగ్ల భాషలో యావత్తు విద్యను నేర్చుకొనుట చాల కష్టముగా నున్నది. హైస్కూళ్లలోని బోధనా భాషయే కళాశాలలో కూడ బోధనా భాషగ నుండవలెను. బోధనా భాష తెలుగు కాగానే తెలుగులో వ్యవసాయ, సాంకేతిక, ప్రకృతి శాస్త్రములు, చరిత్ర, ఆర్థిక రాజకీయ శాస్త్రము ఇంజనీరింగు మొదలైన అన్ని విషయములలోను పాఠ్యగ్రంథములు వ్రాయబడి ప్రచురించబడును. ఈ పాఠ్యగ్రంథములే గాక ఈ విషయము లన్నిటిలోను సామాన్య ప్రజల కొరకు నవీన విజ్ఞానమునిచ్చు గ్రంథములు విరివిగా వెలువడును. ఆధ్యాత్మిక గ్రంథములు తెలుగులో గాని, యితర ప్రజల భాషలలో గాని లేవనియే చెప్ప వలసి యున్నది. అమెరికాలో ఆంగ్ల భాషలో ప్రకృతి శాస్త్ర, సాంకేతిక గ్రంథములు విద్యాలయములలో పాఠ్యగ్రంథములుగాక సామాన్య జనులకొరకు సంవత్సరమునకు ఒక కోటి డెబ్బది లక్షలమ్ముడు పోవుచున్నవి. నవీన విజ్ఞానము ప్రజలలో విరివిగా వ్యాపించనిది భారత జాతి నవీన జాతిగా వృద్ధి చెందక మౌఢ్యములోనున్న జాతిగనే యుండగలదు. సర్వకళాశాలలలో నుత్తీర్ణులైన విద్యార్థులే ప్రభుత్వోద్యోగముల నాక్రమించియు న్యాయవాదులు ఉపాధ్యాయులు డాక్టర్లు మొదలగు వృత్తులలో ప్రవేశించియు, సామాన్య ప్రజలకు నాయకులగుదురు. ఆంగ్ల విద్యాధికులు ప్రజల భాషయందు నిర్లక్ష్యము చూపి ప్రజలను తమకన్న తక్కువగా చూచుటయు, సామాన్య ప్రజలు వీరిని విదేశ వ్యామోహితులని తలచుటయు తటస్థించి ఉభయులును ఐక్యత యేర్పడక అవినాభావ సంబంధము లేని రెండు వర్గములుగ చీలి యున్నారు. ఎంతటి తెలుగు పండితులైనను ఆంగ్ల విద్యాధికులచే తక్కువ వారుగ హీనముగ చూడబడుచున్నారు. ఆంగ్ల విద్యాధికులైన ఉద్యోగస్తుల వేషభాషలు, అభిరుచులు, భావములు సామాన్య ప్రజలకు సంబంధించనివై యున్నందున వారు ప్రజలలో కలసి మెలసి యుండలేక పోవుటయు, ప్రజలను తక్కువగ చూచుటయు ప్రజలు వీరి యందు భయమును అసూయను కలిగి యుండుటయు జరుగరాదు. సాధారణముగ ప్రజల దైనందిన జీవనమునకు సంబంధించిన విద్య, ఆరోగ్యము, వైద్యము, వ్యవసాయము, పశురక్షణ, సహకారము మొదలయిన శాఖలలో పని చేయు నుద్యోగులవల్ల పొందవలసిన లాభములను ప్రజలు సంపూర్ణముగా పొందుట లేదు. ఇంతేగాక ఆంగ్ల విద్య జాతీయ నాగరికతను తుడిచి వైచి పాశ్చాత్య నాగరికతను వ్యాపింప చేసినది. మన ఆధ్యాత్మిక నాగరికతను పునరుద్ధరించుటకే తాను స్వరాజ్యమును సంపాదించుచున్నానని మహాత్మ గాంధి చెప్పినాడు. మన దేశ భాషలన్నిటిలోను ఒకే భావములు, ఆదర్శములు, ఆధ్యాత్మిక నాగరికత గలదు. వాటిలోనే క్రింది నుంచి పై వరకు విద్యా విధానముల నేర్పాటు చేసి నవీన విజ్ఞానమును కూడ వాటిలోనే యిచ్చిననే గాని భారత జాతి తన యొక్క ఆధ్యాత్మిక తత్వమును ప్రపంచములో తన అగ్ర స్థానమును, నిలుపుకొనదు. జపాను అటులనే చేసినది. ఇతర జాతులను కేవలము అనుకరించు జాతి ప్రత్యేక వ్యక్తిత్వమును గోల్పోయి హీనస్థితిని చెంద గలదు. మన జాతీయ రాష్ట్ర ప్రభుత్వములు శాసనసభలు న్యాయస్థానములు, తెలుగు మొదలగు దేశ భాషలలో నిర్వహించబడుటకు ఆయా రాష్ట్రములలోని తెలుగు మొదలగు ప్రజల భాషలు బాగుగా వచ్చి నవీన విజ్ఞానమును కూడ సంపాదించిన పట్టభద్రులు కావలసి యున్నారు. కనుక వారు తెనుగు భాష మూలముననే యావత్తు విజ్ఞానమును పొందినవారుగ నుండవలెను. జపాను, చైనా, రష్యా, ఈజిప్టు, తురుష్కము, సిరాయ, ఇరాకు మొదలైన దేశములన్నిటిలోను తమతమ మాతృభాషలలోనే యావత్తు విద్యనిచ్చుచు, పరిపాలనను జరుపుకొనుచు స్వతంత్రమును కాపాడుకొని అభివృద్ధి చెందుచున్నారు. పాశ్చాత్య భాషలను ఉత్తమ ప్రకృతి శాస్త్రజ్ఞానము కొరకు మితముగ వాడుకొను చున్నారు. కమ్యూనిష్టు రష్యాలో మన భారత దేశములో వలెనే అనేక భాషలున్నవి. ఐనను ప్రతి రాష్ట్రములోను అచటి మాతృభాషలోనే విశ్వవిద్యాలయములను స్థాపించి యావత్తు విద్యను నేర్పుచు రష్యా భాషను ద్వితీయ భాషగ నేర్పుచున్నారు. రష్యా భాషకు మన దేశములోని హిందీ భాషకుగల స్థానము గలదు. భాషారాష్ట్రములుతోపాటు, విశ్వవిద్యాలయములలో మితముగ ఆంగ్లభాషను వాడుకొనుచు యావత్తు విద్యను దేశభాషలలో గరపుట, భారత జాతి ఐహికాముష్మిక నాగరికత గల గొప్ప జాతిగ మరల నభివృద్ధి చెందుటకు మిగుల ఆవశ్యమై యున్నది. దేశ భాషలకు వెనుక మాతృభాషగా సంస్కృతమున్నది గనుకను సంస్కృతములోనే మన ప్రాచీన నాగరికత యంతయు కలదు గనుకను సంస్కృత భాషా వ్యాపకము కూడ అవసరమై యున్నది. సాహిత్య గ్రంథములనే గాక ఉపనిషత్తులు భగవద్గీత, రామాయణము, భాగవతము మొదలగు ఆధ్యాత్మిక గ్రంథముల పఠనమునకు ప్రభుత్వము, ప్రజలు ప్రోత్సాహముగలుగచేసి, విదేశ పాలనము క్రింద ఆంగ్లనాగరికత, ఆంగ్ల విద్య వ్యాపించిన కాలములో మన దేశములో నేర్పడిన ఆధ్యాత్మిక నైతిక పతనమునుండి దేశమును పైకి లేవదీసి మరల గొప్ప జాతిగ గావించవలెను. అపుడే చల్లని ఆధ్యాత్మిక ధర్మ ప్రేమ

శాంతి సందేశమును భారత దేశము ప్రపంచమున కివ్వగలదు. భాషా రాష్ట్రములే ఆయా రాష్ట్రములలోని దేశభాషల సర్వతోముఖాభివృద్ధికి అవిరళ కృషిని చేయగలవు. ఈ కారణములచేతనే మనము అనేక సంవత్సరము లాందోళనము గావించి ఆంధ్ర రాష్ట్రమునే గాక విశాలాంధ్రమును కూడ సుందరమైన హైదరాబాదు నగరము రాజధానిగ అయిదు సంవత్సరాల క్రిందట నవంబరు 1 వ తేదీన స్థాపించుకొని యున్నాము. ఇందువలన ఆంధ్రుల అభివృద్ధి దినదిన ప్రవర్ధమానముగ సర్వతోముఖముగ జరుగుచున్నది. ఆంధ్రులకు ఆత్మ గౌరవము, వ్యక్తిత్వము మరల నేర్పడినవి. ఇంక మీద ఆంధ్ర భాష ప్రభుత్వ భాషగా పరిగణింపబడవలసి ఉన్నది. విశాలాంధ్రములో విశ్వవిద్యాలయములలో గూడ విద్యను ఆంధ్రభాషలో బోధింపవలసియున్నది. మనము మన దేశములోని భాషలనన్నిటిని భాషా రాష్ట్రములనన్నిటిని, వివిధ భాషలు మాటలాడు ప్రజలను గౌరవించి ప్రేమించవలెను. భారత జాతి యొక్క ఐక్యతను దృఢ పరచవలెను. ఒక భాష నుండి మంచి సంగతులను రెండవ భాషలోనికి తర్జుమా చేసుకోవలెను. భాషా రాష్ట్రముల సరిహద్దుల మార్పుల కొరకు తగువులాడుట బొత్తిగా కూడనిపని. ఉన్న రాష్ట్రములతోనే తృప్తి చెంది వివిధ రాష్ట్రముల యొక్క మొత్తము దేశము యొక్క అభివృద్ధిని శాంతముగను, స్థిరముగను సంవత్సరముల కొలది గావించుకొనుట కర్తవ్యము. సరిహద్దు సమస్యలు క్లిష్టముగానుండక మానవు. వాటి తగవులతెరువునకుపోక సరిహద్దులలోనేగాక నితర చోట్ల కూడ నివసించు అల్పసంఖ్యాకుల భాష, లిపి, వాఙ్మయము, మతముల సంరక్షణను భారత రాజ్యాంగ చట్ట ప్రకారము పొందుటకే ప్రయత్నించవలెను.

భారతదేశమునకు ధార్మిక ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సాంఘిక, ఆర్థిక నాగరికతా ఐక్యత ఎల్లప్పుడును గలదు గాని యావత్తు భారతదేశము హిమవత్పర్వతములు మొదలు కన్యాకుమారి వరకు రాజకీయ పరిపాలనా ఏకత్వమును పొందుట జరిగి 1950 నుండియే సంపూర్ణమైన ప్రజారాజ్యము ఏర్పడినది. ఈ ఐక్యతను, ఈ ప్రజా రాజ్యమును సుస్థిరముగ గావించుకొని శాశ్వతముగ కాపాడుట భారతీయులందరియొక్క పవిత్ర ధర్మము. భారతీయ నాగరికతకు అనాది నుంచియు సర్వమత సహనము, ధర్మ నిర్వహణము, గ్రామ స్వరాజ్యము, గ్రామ వ్యవసాయ గ్రామ గృహ పరిశ్రమల వికాసము ప్రధాన లక్షణములై యున్నవి. వీటిని మనము గట్టిగా పునరుద్ధరించవలెను. మన జాతీయ ప్రభుత్వము సంకల్పించిన పంచవర్ష ప్రణాళికల యొక్కయు, గ్రామ స్వరాజ్య పునరుద్ధరణ యొక్కయు, జయమునకుత్సాహముతో తోడ్పడవలెను. ఈపని యంతయు దేశభాషల ద్వారాను, భాషా రాష్ట్రముల మూలముననుమాత్రమే జయప్రదముగా జరుగగలదు. ఇపుడు మనకు ఈశాన్యమున నున్న కమ్యూనిస్టు చైనా దేశము, మనకు పెట్టని కోటగాను ఉత్తరమున నైసర్గిక సరిహద్దుగానున్న హిమవత్పర్వతములను దాటి మనదేశములో జొరబడి పన్నెండువేల చదరపు మైళ్ళ ప్రదేశమును స్వాధీన పర్చుకొని ఇంకను నలుబది వేల చదరపు మైళ్ల భూభాగము రావలెనని తగవులాడుచున్నది. ఎప్పటికైనను భారతదేశమును కబళించి యిచటి ఆధ్యాత్మిక నాగరికతను నాశనము గావించి ఈ దేశమును కమ్యూనిజములోకి కలుపుకొన వలెనని చైనా నాయకులువ్విళ్లూరు చున్నారు. మూడవ ప్రపంచ యుద్ధము కావలెనని కోరుచున్నారు. మనకు వాయువ్య మూలనున్న పాకిస్తానము మనదేశములో శాశ్వతభాగమైన కశ్మీరును కబళించుటకు అమెరికా యిచ్చిన ఆయుధములతో మన దేశము మీద దాడులు సల్పుచున్నది. మనదేశములో చైనాకు పాకిస్తానుకు స్నేహితులైన దూతలు కొంతమందికలరు. కావున మనదేశములోని ముఖ్యముగా యువకులు, యువతులు అట్టి విదేశ ఏజంట్ల నుండి జాగరూకులై యుండవలెను. అంతేగాక మనదేశము యొక్క సురక్షితమును, స్వతంత్రమును, ఐక్యతను, ప్రజారాజ్యములో మాన ప్రాణ ధనము లర్పించి కాపాడుటకు అందరు ప్రజలును ఎల్లప్పుడు తయారుగా నుండవలెను. భారత స్వాతంత్ర సమర చరిత్రలో ఆంధ్రులకెంతటి మహోన్నతమైన స్థానమున్నదో అంతటి మహోన్నత స్థానమును దేశాభివృద్ధి పురోగమన చరిత్రలోను సమైక్యతలోను స్వాతంత్ర్య పరిరక్షణలోను సైతము మనము సంపాదించవలసి ఉన్నది.

(ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక)

ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య

ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది, ఔను గాని...

మూడుకోట్ల జనంతో కూడిన విశాలాంధ్ర రాష్ట్రం అవతరించిందని ఈ రోజే ప్రతి ఆంధ్రుడు గర్విస్తున్నాడు. ఇది సహజమే. కాని ఈ గర్వించడానికి నిజమైన కారణం ఏదిగా ఉండవలెననే విషయాన్ని కొంచెం ఆలోచించి తెలుసుకొనడం అవసరం.

ప్రస్తుతం దేశంలో ఉండే గొప్ప రాష్ట్రాలలోను ఎక్కువ జనసంఖ్యగల రాష్ట్రాలలోను వివిధములగు ప్రకృతి సంపదలతో కూడిన రాష్ట్రాలలోను ఆంధ్రరాష్ట్రం ఒకటి అని గర్వించే వారున్నారు. గొప్ప ఆస్తికి వారసుడైన వాడు గర్వించడం వంటిది ఈ గర్వం.

ఆంధ్రదేశాన్ని ప్రాచీన యుగంలోను మధ్యయుగంలోను పేరు ప్రఖ్యాతులు గాంచిన మహామహులు కొందరు పాలించారు. శాతవాహన కులానికి చెందిన గౌతమీ పుత్ర శాతకర్ణి, చాళుక్య వంశంలో పుట్టిన రాజరాజ నరేంద్రుడు, కాకతీయ వంశజులైన రుద్రమదేవి ప్రతాపరుద్ర చక్రవర్తులు, విజయ నగరాధీశుడైన శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలించిన దేశము ఈ ఆంధ్రదేశము. ఈలాటి దేశానికి ప్రధాన మంత్రిగను, మంత్రివర్గంలో సభ్యత్వం కలవారుగను ఉండి పూర్వకాలపు చక్రవర్తులనుభవించిన ప్రభావమును అనుభవించుటకు అవకాశము కలగిందని గర్వించువారున్నారు. అన్ని కాలాలలోను అధికారాల వ్యామోహం కలవారుంటారు. కాని వారి ఆశయాలు సిద్ధించుటకు కావలసిన అనుకూల పరిస్థితులు అన్ని కాలాలలో ఉండవు. ఆంధ్ర రాష్ట్రమవతరించడంతో అధికార సంపాదనకు అనువైన పరిస్థితులనేకాలు ఏర్పడ్డవి. వాటిని వినియోగించుటకు సంసిద్ధులైనవారి కిది గర్వ కారణమే కదా!

రాష్ట్రాన్ని పాలించబోయేవారు అంతా మనవారే, మన కష్ట సుఖాలను బాగా గుర్తెరిగినవారే. దేశంలో సామాన్య ప్రజల ఆర్థిక స్థితి ఏమీ బాగుగా లేదని వారికి తెలుసు. ఏ కొద్దిమందో తప్ప తక్కిన వారందరూ – రైతులు, కూలిపని చేసుకొనేవారు, స్వల్ప జీతాలతో ఉద్యోగాలు చేస్తుండేవారు, తదితరులు – దారిద్ర్యబాధను అనుభవిస్తున్నారు. దీనిని తొలగించడానికి చిన్న రాష్ట్రంలో ఉండే అవకాశాలకంటే పెద్ద రాష్ట్రంలో ఎక్కువ అవకాశం ఉంది. జలాధారాలను నిర్మించి, పరిశ్రమలను స్థాపించి, రవాణా సౌకర్యాలను వృద్ధి చేసి అన్ని వర్గాలకు చెందిన ప్రజల ఆదాయాన్ని పెంచి, అందరూ సుఖపడేటట్టుగా పరిపాలన జరగగలదని గర్వించేవారున్నారు. సామాన్య జనులు గర్వించడానికి గల కారణం ఇదే.

రాష్ట్రంలో విజ్ఞానరంగంలో పనిచేసేవారు ఎందరో ఉన్నారు. కవులు, తత్త్వవేత్తలు, చిత్రకళలయందు ప్రవీణులు, విద్యాధికులు వీరుకూడా గర్విస్తున్నారు. మన భాషయందు, మన సంప్రదాయాలయందు, మన విజ్ఞాన మందు గౌరవం ఉండవలసినట్టివారు రాష్ట్రానికి అధికారులు కావడం మన అదృష్టం. వారి ఆదరణ మూలాన ఆంధ్రరాష్ట్రం విజ్ఞానరంగంలోను సాహిత్య రంగంలోను పూర్వ వైభవాన్ని తిరిగి

అనుభవించగలదని వీరి భావం. ఇదే వీరు గర్వించడానికి కారణం.

ఈ విధంగా రాష్ట్రావతరణం మూలాన, దేశం, దేశంలోని ప్రజలు సర్వతోముఖంగా, అభివృద్ధి పొందగలరనే ఆశలు అందరూ పెట్టుకొని ఉన్నారు. ఇంతవరకూ ప్రత్యేక విశాలాంధ్ర రాష్ట్రం ఒకటి లేకపోవడం వల్ల ప్రజలు వెనుకబడి ఉంటూ వచ్చారని, ఆ లోపం ఇప్పుడు తీరడం చేత నిరాటంకంగా ముందుకు వెళ్లడానికి సాధ్యం అవుతుందని ఈ సమయంలో అందరూ భావిస్తూ ఉన్నారు. ఆ కారణంచేతనే ఇది ఆంధ్రుల చరిత్రలో ఒక శుభసమయంగా పరిగణింపబడుతూ ఉంది.

కాని అక్కడక్కడ బహిరంగంగా కాక పోయినా రహస్యంగా కొందరు అనుకొనే మాటలు కూడా ఈ సమయంలో గమనించవలసిందే. మనం అనుకొన్నదంతా జరుగుతుందా? మనం స్వప్న ప్రపంచంలో నివాసం చేస్తున్నామా లేక వాస్తవ ప్రపంచంలోనా? కలలు కనడం సులభమే. అనుకొనకుండానే మనం కలలు కంటూ ఉంటాం. కాని, కలలో చూచిందంతా మనం అనుభవించడం ఎప్పుడైనా జరుగుతుందా? కృష్ణదేవరాయలు వంటి పరిపాలకులు ఎన్నటికైనా మనకు లభిస్తారా? ఇది ప్రజాస్వామ్యం కాదా? అన్న ధోరణిలో మాట్లాడేవారు లేకపోలేదు. వారి సంఖ్య తక్కువుగా ఉండవచ్చును. కాని వారి మాటలలో సత్యం కొంతవరకైనా ఉంటుందని గ్రహించడమే ప్రాజ్ఞత.

మన ఆశయాలు మనం అనుకొనినట్లు సిద్ధించవని సందేహించుటకు మన రాజకీయాలలో ప్రవేశించిన కొన్ని అవలక్షణాలు కారణం. ఏ దేశంలో కాని, ఏ కాలంలో కాని రాజకీయాలనేవి మూడు విషయాలకు సంబంధించి ఉంటవి. ఒకటి పరిపాలనాధికారంలో ఉండతగ్గవారు ఎవరు అనేది; రెండు పరిపాలనాధికారంలో ఉండేవారు తలపెట్టిన కార్యక్రమాన్ని నిర్ణయించుకొనుటలో అనుసరించ వలసిన పద్ధతి ఏలాటిది అనేది; మూడు అధికారాన్ని ఏ ఆశయాలను సాధించుటకు వినియోగించవలెను అనేది. ఈ మూడింటికి మించి రాజకీయాలేవీ ఉండవు.

ఇటీవలివరకు వంశపారంపర్యంగా అధికారంలోకి రావడమే ఉత్తమ మార్గమని అనుకొనేవారు. కాని ప్రస్తుతం ఆ పద్ధతిని ఆర్థికాదిరంగాలలో ఆమోదించే వారు కూడా రాజకీయాలలో ఆమోదించడం లేదు. ప్రజ లెన్నుకొన్నవారే అధికారంలో ఉండడం సబబు అనే సిద్ధాంతం అనేక దేశాలలో వ్యాపించింది. మన దేశంలో ఆ ప్రాతిపదిక మీదనే రాజ్యాంగ శాసనం నిర్మించబడ్డది. ప్రజల ఆమోదము పొందినవారే ముఖ్యమంత్రులు, సాధారణ మంత్రులు, శాసన నిర్మాతలు కావలసినట్లు రాజ్యాంగ శాసనం ఉద్దేశించి ఉంది. కాని జరుగుతూ ఉండేది ఏమిటి అంటే నిర్ణయాలన్నీ పలుకుబడి, ఐశ్వర్యము గల ఏ కొద్దిమందో చేస్తూ వుండడం – అందుచేత ప్రజల అభిమతం లేనివారు కూడా అధికారంలోకి రావడం సంభవిస్తున్నది. అధికారులను నిర్ణయించుకొనే తమ హక్కును ఏలాగు వినియోగించుకొనడమో తెలియని స్థితిలో ప్రజలున్నారు. అందుచేత పేరునకు మనది ప్రజాస్వామ్యమైనా రాజకీయాలన్నీ కొందరి వశంలోనే ఉంటూ ఉన్నవి.

ఈ కొందరు ఎలాటి మనోభావాలు కలవారు? ఏలాగైనా అధికారంలోకి రావడం, వచ్చిన అధికారాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవడం పరమావధిగా పెట్టుకొన్న వారు. ఇందుకుగాను వారు కులాభిమానాలను సాధనాలుగా ఉపయోగించుకొనుచున్నారు. అంతా రహస్యంగా జరుగుతుంది. బేరసారాల ద్వారా వోట్లను సంపాదించడము పరిపాటి అయింది. సామర్థ్యాన్ని బట్టి నాయకులయ్యేవారి సంఖ్య చాలా పరిమితంగా ఉన్నది. పూర్వకాలంలో రెడ్డి నాయకులయ్యేవారి సంఖ్య చాలా పరిమితంగా ఉన్నది. పూర్వకాలంలో రెడ్డి నాయకులు, వెలమ నాయకులు, కమ్మ నాయకులు రాజ్యాలకు పోటీ చేసినట్లే ఇప్పుడు కూడా అధికార పదవులను రాదలచినవారు చేస్తున్నారు. ఇవి వాస్తవిక రాజకీయాలు. ఉపన్యాస వేదికలపై మాట్లాడునప్పుడు కులతత్వాలు ప్రాంతీయాభిమానాలు ఉండరాదని అందరూ ఉగ్గడించడం మామూలు. కాని రాజకీయాలన్నిటికి ఇవే ఆధారం అయింది.

ఇట్టి సందర్భాలలో ఉన్నతాధికారానికి వచ్చినవాడు జాతీయ నాయకుడన్న భావం ఎవరిలోనూ ఉండదు. ఏదో ఒక కులానికి చెందినవాడని, బేరసారాలలో ఏలాగో అతడు గెలిచాడని అనుకొనేవారే, అందుచేత అతని యందు గౌరవ మర్యాదలతో ప్రవర్తిస్తూ ఉండే వారు చాల తక్కువ. అతడి గొప్ప ఏమిటి? నాకు మాత్రము అర్హత లేదా అన్న అభిప్రాయమే అనేకులలో వ్యాపించి ఉన్నది. అధికారంలో ఉన్నవాడిని ఎలాగైనా క్రిందికి దింపి, తానే అధికార స్థానంలోకి రావలెననే పట్టుదల ఒక్కటే నాయకులు కాగోరువారిలో కనిపించుచున్నది. అందుచేత చాలా కాలంవరకు పరిపాలన యందుండవలసిన సమర్థత గలవారు, దేశదృష్ట్యా ప్రభుత్వమును జరుప నిశ్చయించుకొన్నవారు మంత్రి స్థానములకు వచ్చుట కల్లయని తోచుచున్నది.

ఈ పరిస్థితి మరియొక విపరీతమునకు దారి తీయుచున్నది. మన రాజ్యాంగ విధానములో ప్రతి రాష్ట్రమునకు కొన్ని రంగాలలో స్వపరిపాలనాధికారము కలదు. ఆ రంగమందు రాష్ట్రములోని మంత్రివర్గమునకూ శాసనసభ వారికి ఏది ఉచితమని తోచునో దానిని కేంద్ర ప్రభుత్వము వారితో ఏలాటి ప్రసక్తి లేక చేయవచ్చును. విద్య, వ్యవసాయము, పరిశ్రమ లనేకములు, ఆరోగ్యము మొదలైనవి ఈ రంగములోనికి. కాని వాస్తవముగ జరగుచున్న దంతయు దీనికి భిన్నముగా నున్నది. రాష్ట్రములో నాయకత్వమునకై పోటీలు అత్యధికం కావడంచేత, కేంద్రమందుండు అధిష్ఠాన వర్గము అనుమతి మీదనే ఎవరు మంత్రులు కావలసినది, ఎవరు కాకూడనిదీ నిర్ణయించ బడుచున్నది. రాష్ట్రము పేరునకు మనది అయినను పరిపాలన మంతయు కేంద్ర నాయకులు చేయుట తప్పనిసరి అగుచున్నది.

ఆంధ్ర రాష్ట్రానికిన్ని, బొంబాయి, ఉత్తర ప్రదేశ్, బెంగాల్, మధ్యప్రదేశాశాలకున్నూ, ఇదే గొప్ప బేధం. స్వతహాగా సామర్థ్యముకల ఖేర్, మొరార్జీ దేశాయి, గోవింద వల్లభపంత్, సంపూర్ణానంద, బి.సి. రాయి, శుక్లా, మొదలైన వారు అచ్చట ముఖ్యమంత్రులై కేంద్రములోని అధిష్ఠాన వర్గము యొక్క జోక్యము ఏలాటిది లేక పరిపాలనం జరుపగలిగారు. వారిని కాదని, అధికారము నుండి వారిని దించివేయుటకు సాహసించిన ఉపనాయకు లెవ్వరూ అచ్చట బయలుదేరలేదు. "నా పరిపాలనా విధానమిది; నేను ప్రవేశ పెట్టదలచిన సంస్కరణము లీలాటివి. దీనికి మీరు సమ్మతించినప్పుడే నేను ప్రధానిగ నుండెదను. లేనియెడల రాజీనామా ఇచ్చుటకు సిద్ధముగా ఉన్నాను" అని వారు చెప్పగలవారు. మన ఆంధ్ర నాయకులలో అట్లు సాహసంగా చెప్పగలవారు ఏరి?

కార్యక్రమాలలోను ప్రణాళికలలోను విభేదాలు ముదిరిపోయినప్పుడు నాయకత్వమందు మార్పు వచ్చుట వాంఛనీయం. అలాగు కాక వ్యక్తిద్వేషము మూలమున నాయకులు మారుట పరిపాలన సౌష్టవమునకు విషము పెట్టునట్టిది. మన రాజకీయము లిప్పటివరకు ఇట్టి స్థితిలోనే ఉంటూ వచ్చినవి. ఇక మీదట కూడా ఇట్లే ఉండగలవన్న సూచనలు కనుపించుచున్నవి. తెలంగాణా ఆంధ్రముల మధ్య పూర్తి సామరస్యము కుదరలేదు. ఆంధ్రప్రదేశ్ పేరునకు ఒకటే అయినను, ఈ రెండింటి మధ్యన గట్టి గోడలను నిర్మించారు. దానికి అనుమతించిన కారణానే ఆంధ్రప్రదేశ్ సాధ్యమైంది. తెలంగాణములో రెడ్లు, రావుల మధ్యన విపరీత భేదమున్నది. ఆంధ్రలో రెడ్లు కమ్మల మధ్యన ఏర్పడ్డ భేదము గురించి చెప్పవలసినది లేదు.

ఈ విధముగ అధికారములోనికి వచ్చిన మంత్రివర్గమువారు – తాము రెడ్లని, రావులని, కమ్మవారని, హరిజనులనీ ఎన్నడూ మరచుట లేదు. అందరు కలిసి, పరిపాలన విషయమున ఏయే రంగములో ఏలాటి సంస్కరణములను వారు చేయదలచుచున్నారో సూచించుటకు ప్రయత్నములు జరుగుటలేదు. కేంద్రప్రభుత్వమువారి ధర్మమా అన్నట్లు మొదటి పంచవర్షప్రణాళిక రెండవ పంచవర్ష ప్రణాళిక తయారైనవి. తాము చేయవలసిన పనులు ప్రత్యేకముగ ఏవియు అవసరము లేదని, నిరంతరము ఈ ప్రణాళికల నామస్మరణము చేయుటయే తమ విద్యుక్తధర్మమన్న భావము మంత్రులలో వ్యాపించినది. కేంద్రముతో జోక్యములేక తాము నిర్వహించవలసిన కార్యకలాపము లెన్నో ఉన్న వన్న భావము వారియందిదివరకు కనుపించ లేదు. మంత్రివర్గ మంతయు సమాలోచన గావించి వ్యవసాయ రంగమందుగాని, స్థానిక స్వపరిపాలనమందుగాని, మరి ఇతర రంగము లందుగాని తాము చేయదలచుకొన్న కార్యక్రమమిట్టి దన్న నిర్ణయ మిదివరకు జరుగలేదు. మన పరిపాలన విధానమందు సమిష్టి బాధ్యత గల మంత్రివర్గము కలసి చేయవలసిన పనులనేకములున్నవి. కాని అట్టిది ఇదివరకు జరిగినట్లు లేదు. కొత్త విశాలాంధ్ర రాష్ట్రములో ఏర్పడు మంత్రివర్గము సమష్టి బాధ్యతను ఎంతవరకు నిర్వహించగలదో సందేహాస్పదముగ నున్నది.

శాసన సభలకు ఎన్నుకొనబడు సభ్యులకు ప్రజాస్వామ్య విధానమందు ప్రత్యేక బాధ్యతలు కలవు. ప్రజలను కలుసుకొని, వారి ఇబ్బందులను గ్రహించి, వాటిని తొలగించుటకు ప్రభుత్వము సహాయమును చేకూర్చుట ఈ బాధ్యతలలో ఒకటి. కాని దీనిని నిర్వహించు సభ్యులు నూటికి ఒకరు కూడా లేరు. తమ బంధువులకు, స్నేహితులకు సహాయము చేయుటయందు వారు వారికిగల అధికారమును వినియోగించుకొనుచున్నారు. శాసన సభలకు వెళ్ళి ప్రశ్నలు వేయువారు, తీర్మానములను ఉపపాదించువారు, కార్యక్రమములలో పాల్గొనువారు – చాల తక్కువగ నున్నారు. కలెక్టర్లు తహశీల్దారులు మొదలైన ఉద్యోగులు చేయవలసిన పనులలో అనవసరముగ జోక్యము కలిగించుకొని, ప్రజలందరి లాభమునకు బదులు స్వలాభమును వృద్ధి చేసుకొనువారైరి.

అధికార పదవులకు సక్రమములైనమార్గములను అనుసరించి రాకపోవుట; కుట్రల ద్వారా అధికారములో నుండువారికి పదచ్యుతి గలిగించుట; అధికారమును వట్టి ప్రజోపయోగ కార్యములకై వినియోగించవలెనో వాటికై వినియోగించకపోవుట; ఎట్టివాటికై వినియోగించరాదో వాటికై దుర్వినియోగము గావించుట – ఈలాటి అవలక్షణములన్నియు మన రాజకీయములలో కనుపించుచున్నవి. ఇంతటి కలుషితములైన రాజకీయముల ద్వారా ఎంతవరకు మనము కనుచుండు కలలు సార్థకములు కాగలవు?

ప్రజాస్వామ్య ముందు దేశములన్నిటిలో ఈలాటి లోపములున్నవనియు, ఇది మన రాజకీయము లొక్కదానికే లక్షణము కాదనియు చెప్పువారు లేకపోలేదు. అంతమాత్రముచేత అవలక్షణములు శుభలక్షణములు కాగలవా? ఇదిగాక అన్ని దేశములలో ఇవి ఇంతటి విపరీత రూపమును ధరించి ఉండుటలేదు. కొన్ని రంగములలో అవలక్షణములున్నను తక్కినవి సక్రమముగ పనిచేయుచున్నవి. మన పరిస్థితులిట్టివి కావు.

కలుషదూషితములైన రాజకీయములు నిర్మలములగుటకు సాధనములనేకములున్నవి. అధికారపక్షమువారిని చక్కగ విమర్శింపగలిగి నట్టియు ప్రజలలో పలుకుబడి సంపాదించునట్టియు ప్రతిపక్షమొకటి దేశములో ఏర్పడుట. ఇది ఒక సాధనము. ఇట్టి ప్రతిపక్షమిది వరకు మన రాష్ట్రమున ఏర్పడలేదు. ప్రస్తుత ముందు ప్రతిపక్షములు సంఖ్యాబలముగాని నిర్మాణ సౌష్టవముగాని లేనివి. అందుచేత అధికార పక్షమందుండు లోపములను సవరింపగల శక్తి వాటికి లేదు.

ఏ పక్షమునకు చెందని స్వతంత్రులు కొందరు రాజకీయములలోని లోపములను ప్రజలకు తెలియజెప్పి, ప్రజాస్వామ్యమును మార్చుట రెండవ స్థానము. శ్రీ వినోభాబావే, జయప్రకాశ నారయణ్ మొదలైనవారు చేయతగ్గ పని ఈలాటిది. కాని అలాటివారి సంఖ్య చాల తక్కువ. ఇది ఎక్కువైన యెడల ప్రజలయందును అధికార వర్గము వారి యందును ప్రశంసింపతగ్గ పరివర్తనము కలుగ గలదు.

ప్రజల దృక్పథమందు కూడ గొప్ప మార్పు రావలసి ఉన్నది. నాయకులపై ఎక్కువగ ఆధారపడక, స్వయముగ తమకున్న ఇబ్బందులను చిక్కులను అధికారులకు తెలియపరచి, అవి తొలగుటకు కావలసిన సహాయమును వారి వద్దనుండి సంపాదించుటకు అవసరమైన శక్తి వారిలో వృద్ధికావలసి యున్నది. ప్రజల యందు చైతన్య మధికమైనప్పుడే ప్రజాస్వామ్యము కాగలదు.

గనుక ఆంధ్రరాష్ట్ర మవతరించినదన్న తోడనే మనము గర్వించక, దాని పరిపాలన అభ్యదయ సాధనమునకై వినియోగించుటకు కావలసిన పరిస్థితు లేర్పడ్డప్పుడే మనము గర్వించుట ఉచితమనియు, అట్టి పరిస్థితులేర్పడుటకు మన మందరము యథాశక్తి పాటుపడవలసి యున్నదనియు గ్రహించుట అవసరము.

– (తెలుగు స్వతంత్ర, 2 నవంబరు, 1956 నుండి)

పుచ్చలపల్లి సుందరయ్య

రాష్ట్రాభ్యుదయం అంటే... !!

రాష్ట్రాభ్యుదయం అంటే, ప్రతి వ్యక్తికీ చేతినిండాపని, కడుపునిండా తిండి, వంటినిండా గుడ్డ, ఉండడానికి ఇల్లు, బాలబాలికల కందరికీ 18 ఏండ్లు వచ్చే వరకు ఉచిత విద్యతోపాటు ఏదైనా ఒక వృత్తిలో శిక్షణ, విశ్వవిద్యాలయ స్థాయిలో చదువుకోడానికి అందరికీ అవకాశాలు, ఉచిత వైద్య సదుపాయాలు, ప్రమాదాలకు, జబ్బులకు, భీమా సౌకర్యాలు, 60 ఏండ్లు దాటిన వారి కందరికి పెన్షన్లు, స్త్రీ పురుషులకు సమాన ప్రతిపత్తి, మానవునికి మానవునికి మధ్య రంగునుబట్టి, కులాన్నిబట్టి, మతాన్ని బట్టి, ధనాన్ని అధికార హోదానుబట్టి విచక్షణ చూపెట్టక అందరికీ సమాన అవకాశాలు, సమాన గౌరవం – ఇదే రాష్ట్రాభ్యుదయం.

మన ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానది మీద నాగార్జున సాగరు, శ్రీశైలం ప్రాజెక్టులు, గోదావరి నది మీద పోచంపాడు, ఇప్పూరు (రామపాదసాగరు) రిజర్వాయరు ప్రాజెక్టులు 500 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి రాబోయే పది పదిహేను సంవత్సరాలలో నిర్మించుకోవాలి. తుంగభద్ర హైలెవలు ఛానలు యీ ప్రణాళిక కాలములోనే రాయలసీమలోని కరువు నివారించడానికి పూర్తిచేసుకోవాలి. ఈ పెద్ద ప్రాజెక్టులతో సమన్వయం చేసుకుంటూ, వంశధార, లాంగల్య మొదలగు అనేక చిన్న చిన్న నదులకు, వాగులకు ఆనకట్టలు కట్టి చెరువులు నింపుకొన్నప్పుడు మరో లక్ష నూతులు ఐనా త్రవ్వి వీనికన్నిటికి విద్యుచ్ఛక్తిని సరఫరా చేసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో 2 కోట్ల ఎకరాలకు నీటి సదుపాయాలు కలుగుతాయి.

నీటి సదుపాయాలతో పాటు, ఎరువులు, పంటలకు వచ్చే తెగుళ్ళకు క్రిమి సంహారక మందులు, పశువులకు వచ్చే జబ్బులను నిర్మూలించడానికి కావలసిన మందులు, చికిత్సాకేంద్రాలు ఏర్పరచి, పాడి పంటల పెంపొందించి ప్రతి వ్యక్తికి రోజుకు శేరు ఆహార పదార్థాలు, శేరుపాలు లభ్యమయేట్లు చూడాలి.

గోదావరి లోయలో కొత్తగూడెం, బెల్లంపల్లి బొగ్గుగనుల నుండి నేడు తీస్తున్న 3 లక్షల టన్నులకు బదులు రాబోయే పదేండ్లలో 3 కోట్ల టన్నులు ఏటేటా త్రవ్వి తీయాలి. థర్మలు స్టేషనులను, హైడలు ప్రాజెక్టులను నిర్మించి 20 లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని కనీసం ఉత్పత్తిచేసి ఆంధ్రప్రదేశ్‌లో తలకొకటి 200 యూనిట్ల విద్యుచ్ఛక్తినైనా నా పదేండ్లలో సరఫరా చేయాలి.

ఆంధ్రప్రదేశ్‌లో విరివిగా దొరుకుతన్న బొగ్గ, ముడి ఇనుమును ఉపయోగించుకొని ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి. ఈ బొగ్గును వినియోగించుకొని అనేక రసాయనిక వస్తు పరిశ్రమలను అభివృద్ధిచేయాలి. మైకాబరైట్సును ఇతర లోహాలను వినియోగించుకుంటూ అనేక పరిశ్రమలను నెలకొల్పాలి. రోడ్డు, రవాణా, రైలు సౌకర్యాలు పెంపొందించాలి. ఆంధ్రప్రదేశ్ అంతా ఒకే రైలు జోనులు ఉండేటట్లు రైల్వే పునర్నిర్మాణం చేయాలి.

చేతి పరిశ్రమలకన్నిటికి సహకార సంఘాలు ఏర్పాటుచేసి వారికి కావలసిన ముడి సరుకులు తక్కువ ధరలకు సరఫరాచేసి తయారైన వస్తువులను పూర్తిగా అమ్మడానికి ఆ పరిశ్రమలలో పనిచేసేవారికి కనీస జీతాలు గ్యారంటీ చేయడానికి ప్రభుత్వం ముందుకు రావాలి.

అధికార భాషగా తెలుగు

మన తెలుగు భాష, తెలుగు సంస్కృతి అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా పరిపాలనా వ్యవహారాలన్నిటినీ అన్ని స్థాయిలలోను తెలుగు భాషలోనే రాబోయే ఐదేండ్లలో, పూర్తిగా సాగించాలి. కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో తెలుగు ద్వారానే అన్ని విషయాలు బోధించాలి. అప్పుడే మన విద్యావేత్తలకు, మన మేధావులకు, మన ప్రభుత్వానికి సామాన్య ప్రజలతో సజీవ సంబంధాలు ఏర్పడుతాయి. సామాన్య ప్రజలందరికి ఉన్నత విద్యాభ్యాసానికి, ఉన్నతాధికార నిర్వహణకు, సమాన అవకాశాలు దొరుకుతాయి. మైనారిటి భాష వారికి కూడా వారి భాషలోనే ఉన్నత విద్యాబోధన చేయాలి. హిందీని, ఇంగ్లీషును నేర్చుకోవడానికి 8వ తరగతి నుండి సెకండరీ స్కూలులోను, కళాశాలలోను, సదుపాయాలు ఏర్పాటుచేయాలి. కాని నిర్బంధంగా వీనిని నేర్పాలని, ఇంగ్లీషు లేదా హిందీద్వారా దశాబ్దాల కొలది విద్యాబోధన చేయాలనే ప్రయత్నము కొనసాగితే జాతీయైక్యతకు బదులు, జాతీయ విచ్ఛిన్నతకు దారి తీస్తుంది.

వేయిమందిఉన్న గ్రామ ప్రాంతానికి ఏడు తరగతులున్న ఒక ప్రాథమిక పాఠశాలను, పదివేల జనాభా ప్రాంతానికి ఒక హయ్యరు సెకండరీ స్కూలును, రాబోయే పదేండ్లలో ప్రభుత్వమే నిర్వహించాలి. గుంటూరు, వరంగల్, కాకినాడ, కర్నూలులలో విశ్వ విద్యాలయాలు స్థాపించాలి. ప్రతి గ్రామంలో గ్రంథాలయము, ఆటస్థలము, కళాకేంద్రం (విజ్ఞాన మందిరం) ఏర్పాటుచేయాలి.

ప్రతి గ్రామంలో, పట్టణంలో మంచినీటి బావులు, మంచినీటి పథకాలు, పరిశుభ్రతకు కావలసిన సదుపాయాలన్నీ ఏర్పాటుచేయాలి. పట్టణాలలో భూగర్భ మురుగు సదుపాయాలు నిర్మించాలి. పదేండ్లలో పదివేల జనాభా ప్రాంతానికి ఒక వైద్యశాల, ఐదుగురు డాక్టర్లతో (అందులో ఒకరు స్త్రీ డాక్టరు) పదిమంది నర్సులతోను, పదిమంది వైద్య సహాయకులతోను ఏర్పాటు చేయాలి.

కార్మికులకు, ప్రభుత్వ ఉద్యోగాలకు, దుకాణా పని వారికి కనీస వేతనము 100–150 రూపాయలు. వారానికి ఒక రోజు సెలవు. రోజుకు ఏడెనిమిది గంటలకు మించని పని ఉండాలి. ఒక సంవత్సరము పనిచేసిన వారందరి ఉద్యోగాలు ఖాయం చేయడం, సాంవత్సరిక సెలవులు, ఇంటి వసతి, ప్రమాదాలకు రోగాలకు గురిఅయినవారికి నష్టపరిహారము, వయస్సు దాటిన తరువాత పెన్షన్లు, ప్రావిడెంటు ఫండు, తదితర భీమా సౌకర్యాలు గ్యారంటీ చేయాలి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు, స్థానిక సంస్థలలోని ఉద్యోగాలకు జీతాలలో తేడా ఉండరాదు. ఒకే స్థలంలో ఒకేరకం పనిచేసే వారికి జీతాలలో, సౌకర్యాలలో తేడా ఉండకూడదు. స్త్రీ పురుషులకు సమాన జీతాలు ఉండాలి.

వీనిని సాధించాలంటే రోజు రోజుకు ఢిల్లీ ప్రభుత్వ కేంద్రంలో అన్ని అధికారాలు, అన్ని శాఖలలోను కేంద్రీకరించే ధోరణి మానివేయాలి. జనరలు విధానాలు, సమన్వయ బాధ్యత, దేశ రక్షణ, విదేశాంగ నీతి, కరెన్సీ, విదేశ వాణిజ్యము తప్ప మిగిలిన శాఖలన్నియూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పి రాష్ట్ర స్వపరిపాలనాధికారాలు విస్తృత మొనర్చాలి.

మన రాష్ట్రాలలో, పంచాయితీలు, పంచాయితీ సమితులు జిల్లా పరిషత్తులు రహస్య బ్యాలెటుతో ప్రత్యక్ష ఎన్నికలలో దామాషా ఓటింగుద్వారా, అంటే ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తే అన్ని స్థానాలు వచ్చే పద్ధతిలో ఎన్నుకోబడాలి. ఉద్యోగస్థులందరూ, మునిసిపలు కమీషనరులు, పంచాయితీ ఎక్జిక్యూటివు ఆఫీసర్లు, జిల్లా కలెక్టర్లు, యీ సంస్థలకు లోబడి పనిచేయాలి.

కేంద్ర సహాయం

ఇలాంటి ప్రణాళికలకు డబ్బుకావాలి. కేంద్ర ప్రభుత్వము, జనాభాను దృష్టిలో పెట్టుకొని ఆ దామాషాన ప్రతి ప్లానులోను ప్రతి రాష్ట్రాభివృద్ధికి, అన్ని రంగాలలో ఖర్చుపెట్టడానికి పూనుకోవాలి. వెనుకబడిన రాష్ట్రాలకు అదనంగా సహాయపడాలి.

ఈ మూడు ప్రణాళికల కాలములో మనవంతు జనాభా దృష్ట్యా 2,000 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టవలసి వుంటే ఖర్చు పెట్టింది అన్ని రంగాలలో కలుపుకున్నా 750 కోట్లకు మించదు.

ప్రణాళికల కోసం కావలసిన డబ్బును, సామాన్య ప్రజల మీద రోజు రోజు అధిక పన్నులు వేసి వసూలు చేయడంవల్ల అలజడి, అసంతృప్తి పెరిగి ప్రణాళికలకు ప్రజలతోడ్పాటు రాదు. వ్యతిరేకత వస్తుంది. ఏ ఒక్కరికి నెలకు 100 రూపాయలకు తగ్గని జీతభత్యాలు వచ్చేవరకు, ఏ వ్యక్తికి పెద్ద ఆఫీసరు కానివ్వండి, పెద్ద పరిశ్రమాధికారి కానివ్వండి, పెద్ద షావుకారు కానివ్వండి నెలకు 1,000 రూపాయలకు మించని ఆదాయము వదిలి అదనపు ఆదాయాన్నంతా ప్రభుత్వం సేకరించాలి. గ్రామ సీమలలో ప్రతి ఒక్కరికీ పని కల్పించడానికి వ్యవసాయాభివృద్ధి గావించి, కావలసిన ఆహారాన్ని తదితర ముడి సరుకులను సమృద్ధిగా తయారు చేయడానికి భూమిమీద స్వయంగా కాయకష్టముతో పనిచేసుకొనే వారికే, దున్నే వారికే భూమి ఉండేటట్లు, భూ సంస్కరణలు అమలు జరపాలి. ప్రభుత్వ అధికారములో ధనాఢ్యుల ప్రాబల్యం పోయి కష్టజీవుల ప్రాబల్యము రావాలి.

నవ సమాజ నిర్మాణం

ఆనాడే నిజమైన రాష్ట్రాభ్యుదం. భారతదేశాభ్యుదయం పూర్తిగా సాధ్యమవుతుంది. ఆనాడే ఒక మనుష్యుని శ్రమ ఫలితాన్ని మరో మానవుడు దోచుకునే నేటి విధానానికి స్వస్తిచెప్పడం జరుగుతుంది. ప్రజలందరమూ నిత్యమూ పనిచేయడానికి అలవాటు పడిపోయి సోమరితనాన్ని అసహ్యించుకుంటూ, వివిధ కళోపాసకులమయి మన విజ్ఞానాన్ని, సంస్కృతిని రోజుకు రోజుకు యావజ్జీవం అభివృద్ధి చేసుకుంటూ సుఖప్రదమైన జీవితాన్ని అనుభవిస్తాము. ఇరుగు పొరుగువారి శ్రేయస్సే మన శ్రేయస్సనీ లాభాపేక్ష గల నేటి సమాజస్థాపన, సేవాదీక్ష గల సమాజాన్ని నిర్మించుకుంటాం. ప్రతి ఒక్కరూ శక్తికొలదీ పనిచేస్తూ, కనీస అవసరాలకు కావలసినంతమట్టుకే ప్రతిఫలము తీసుకొనే మానవున్ని నూతన సమాజాన్ని సృష్టించుకుంటాం.

(ఆంధ్రప్రదేశ్ నుండి)

వారణాసి సుబ్రహ్మణ్యం

శాంత భారతంలో నిర్మాణాంధ్రం

రమారమి మూడు అర్ధశతాబ్దాల తర్వాత, మూడున్నరకోట్ల ఆంధ్ర ప్రజానీకం రాజకీయంగా నేటికి ఒక ముగ్గులోకి వచ్చినారు.

నిజాము నుంచి బ్రిటిషువారు కోస్తా జిల్లాలు కొనుక్కున్నది 1823లో రూ. 116.5 లక్షలకి యీ బేరం ఫైనలయింది.

మధ్య మధ్య ఒడుదుడుకులు వచ్చి వుండినా, కాకతీయులనాటి నుంచి గోలకొండ నవాబుల కాలము వరకున్నూ, ఆటుపోటులతో సాగుతూ వుండిన ఆంధ్ర సంస్కృతీ స్రవంతికి ఆనాటి ఆ ఒక్క కలంపోటుతోనూ, భారత రాజ్యలక్ష్మికి దూరమవుతున్న మహమ్మదీయులూ, ఆమెను చేపట్టుతున్న ఇంగ్లీషువారూ, ఒక ఆనకట్ట వేశారు. తెలుగు నేల రెండుగా చీలింది. తెలుగువారు రెండు పీలికలైనారు.

కిందటేడే యీ రోజుల్లోనే జరిగిన నాగార్జున సాగరపు శంకుస్థాపనతో ఆ కట్టకి గండి పడింది. అన్నదమ్ముల్ని అనుకోకుండానే వేరు చేసిన పొలిమేరగా చరిత్రకెక్కిన కృష్ణానది మీదుగానే, మళ్లీ తెలంగాణమూ, కోస్తా జిల్లాలూ కలిశాయి. తెనుగు బిడ్డల ఐక్యతా నాటకానికది నాంది. నేటిది భరతవాక్యం.

కోస్తా రేవుల ద్వారా గాని వర్తక వ్యాపారాలకి వీలులేదు. అందుచేతనే కాకతీయుల నాటి నుంచిన్నీ మధ్యాంధ్రం వారు తీరాన్ని వశపరుచుకోడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. దీనికి ప్రతిగా, తీరాంధ్రులున్నూ ఎదురు తిరుగుతూనే వచ్చారు. కాని, పర్వతీయులూ, సాగరులూ కలిసి కాపరం చేస్తూ వుండినప్పుడే తెనుగు నేలలో రాజనాలు పండించినారు. రత్నాలు తవ్వినారు.

ఐక్యతకి యత్నాలు - చరిత్ర

1213లో కాకతీయులు ఆంధ్ర తీరం ఆక్రమించినారు. 1325లో ముసునూరి ప్రోలయ తురకలకి యెదురు తిరిగి కోస్తాకి విముక్తి కలిగించాడు. 1337లో కాపయ నాయకుడు ఓరుగల్లు పట్టుకున్నాడు. పిమ్మట, విజయనగర సామ్రాజ్యపు పెరటిలో, ఆంధ్ర వృక్షం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా వర్ధిల్లింది. 1565లో తళ్లికోట దగ్గర ఆ చెట్టు కూలింది. అయినా 1572లో గోల్కొండ వారు తిరిగీ వీరాంధ్రం చేజిక్కించుకున్నారు. ఆ తర్వాత 1766 నుంచి 1823 వరకూ – ఆంధ్రదేశం బ్రిటిషు వారి రాజకీయ చదరంగంలో ఒక పావుగా అయింది. చూసి చూసి, వారు నిజామును త్రోసిరాజనినారు.

ఈ తెలుగు రక్తంలో ఆది నుంచీ వ్యక్తిత్వం హెచ్చుగానే ఉంటూ వచ్చింది. సమర్థుడూ, పరిపాలనా దక్షత ఉన్న వాడూ అయితే, ఆ రాజుకి లొంగే వారు. రాజపీఠంలో ఏ మాత్రం లొజ్జు ఉండినా ఎవరికి వారుగా ఆ పాలెగాళ్లు ఎదురుతిరుగుతూ ఉండేవారు.

బౌద్ధ ధర్మం, యీ గుణాన్ని చాలా వరకు పోగొట్టింది గాని, ఆపైన విజృంభించిన యితర శక్తులకు యీ శక్తి లోపించింది. అయినా, ప్రాజ్ఞులైన ప్రభువులు యీ అవలక్షణం అణిచి కలిసిరాని యీ ఆంధ్ర ప్రజానీకాన్ని ఒక బరిలో వుంచేందుకు సకల తిప్పలూ పడినారు.

కాకతి గణపతి దేవుడు తన కాలంలో తలయెత్తుతున్న రెడ్డి, కమ్మ, వెలమ విభేదాలు పెరగకుండా ఆయా శూరాంధ్రులకి సేనలో కావలసినంత కాలక్షేపం కలిగిస్తూ కలుపుకువచ్చాడు. ఆ తర్వాత, కొండవీటి రేడేమి, విజయ నగరము వారేమి, యీ ఒరవడిలోనే వ్యవహారం నడిపించారు. చివరికి గోలకొండ నవాబులు, మహమ్మదీయులు ఐక్యతకే పాపం పాటుపడ్డారు. తెనుగు గ్రంథాలు అంకితంగా తీసికొనినారు. హిందూ దేవతల ఆలయాలకి విరాళాలు అర్పించారు.

రాజకీయాలు తాత్కాలికం, ఆంధ్రైక్యతకి అంతకన్న లోతైన పునాదులు కావాలన్న విషయాన్ని మన పూర్వులు గ్రహించారు.

మతం, సారస్వతం రాజకీయాలలో ముడిపెట్టి యీ యత్నం సాగించారు.

కాకతీయుల రోజుల్లో బయలుదేరిన వీరశైవం, తెనుగు నేలకి ఎంతో చేసింది. వీరాంధ్రానికి పాలుపోసింది. కత్తిపట్టి, యిల్లూ, ఊరూ కాపాడాలంది. కమ్మని తెనుగు, ద్విపదలో వినిపించింది. శివకవులు తెనుగు గుండెని ఒక వూపు వూపినారు. కాని, సహనము లేని ఆ ఆవేశం, చివరకి పెంచడానికే ఉపకరించగలిగింది.

నెల్లూరు సీమ నుంచి వెళ్లి, ఓరుగల్లు నుంచి కవిబ్రహ్మ తిక్కన మహాభారత రచన సాగించాడు. కత్తిపట్టిన చేతితోనే కలంపట్టి (గంటమే, కాదు కాదు! అసలు వ్రాయసకాడు కుమ్మరి గురునాథుడు!) తెనుగు పొలంలో అది ఎలా కదను తొక్కుతుందో చూపించాడు.

తెనుగు పొలంలో నాగలిపట్టిన చేయి, భగవదర్పితంగా గ్రంథ నిర్మాణానికి పునాది వేయడం గూడా కాకతీయాంధ్రలోనే జరిగింది. పోతన మహాభాగవతానికున్న ప్రజాదరణ తెనుగు భాషలో మరే గ్రంథానికిన్నీ లేదు.

శివకవులు నడిపిన కవితాశ్వపు పగ్గాలు పట్టుకుని, పోతన కాలములోనే, ఆంధ్ర రాజధాని ఓరుగంటిని వీథి నాటకానికి యెక్కించి, ఆ నగర వీథుల్లోనే వినిపించిన వీరపల్నాటి గాథ ద్విపదగా పాడినవాడు శ్రీనాథ కవిసార్వభౌముడు, విద్వోషధమైన నైషధాన్నీ, ఆయఃపిండము వంటి కాశీఖండాన్ని తెనుగులోకి తెచ్చిన చేతితోనే యీ వీథినాటకం, ద్విపదా రచించడం చూస్తే శ్రీనాధుడు కేవలం ప్రభువుల మెప్పుకోసం వ్రాసిన వాడు కాదని తేలుతున్నది. అంతవాడు కూడా ప్రజారంజకత్వం ఎంత ముఖ్యమో మరువలేదు. సామ్రాజ్యపు శోభ, వీర కీర్తుల స్మరణా క్రీడాభిరామంలోనూ, పల్నాటి వీర చరిత్రలోనూ గలగల లాడించారు.

శివకవులు మతావేశానికీ దేశ రక్షణకీ ముడిపెట్టారు. తిక్కన భారత ధర్మ రక్షణ ప్రబోధించినాడు. పోతన మనుజేశ్వరాధముల కండ్లు విప్పినాడు. కులమత విచక్షణ ఎరుగని చాపకూడు గాథనీ, ఆంధ్ర రాజధాని యొక్క ప్రాముఖ్యాన్ని ప్రజా సామాన్యానికి తేటపరిచాడు శ్రీనాధుడు.

ఈ పూసలన్నీ ఒకే దారంలో గుచ్చినాడు. ఆధారం ప్రజాప్రగతి, ముందు చూపు, అలసట పోగొట్టి ఆంధ్ర భూమిని రక్షించవలసిన కర్తవ్యబోధ.

ఇది. శతాబ్దులుగా సాగిన చరిత్రలో గణపతిదేవుడు, గన్నారెడ్డి, కృష్ణరాయులు, రామలింగానాయకుడు, తానీషా, తిక్కన, శ్రీనాధుడు వంటి మహామహుల యత్నం!!!

ఆ పాలకుల్నీ కవులనీ స్మరిస్తే నేడు ఆంధ్రప్రదేశానికి కావలసిందేమిటో బోధపడుతుంది.

నాటికి నేటికీ ఎంత భేదం!!

నేడు రాజుల బాధ లేదు. పటిష్టమైన కేంద్ర ప్రభుత్వపు అండదండలున్నవి. పొరుగు కాపురపు పోరు తప్పించుకున్నాము. అందునా శతాబ్దుల క్రితంవేరైన అన్నదమ్ములందరూ ఒకే ఒకయింటి కప్పుక్రిందికి వచ్చినారు.

"మేము కేవలం రైతులం. ఈ మా నేలలో ఉన్న బంగారమల్లా రాజనాలు పండించే ఒండ్రు" అని తీరాంధ్రులు పరిశ్రమలపట్ల నిరాశ పొందనక్కర లేదు.

"చెరువుల కింది వ్యవసాయంతో యెన్నాళ్ళబ్బా యిలా వేగడం! ఈ భూమిలో ఉన్న ఖనిజ సంపత్తిపైకి లాగేందుకు ముందుగా సొమ్ము లేకపోయెను! ఇది యేమబ్బా!" అని మెరక ప్రాంతాలవారు దిగులు పడనవసరము లేదు.

నేడు కావలసింది

ఇప్పుడు కావలసింది వీరశైవం కాదు. వీరాంధ్రం అంతకన్నా కాదు. శాంత భారతంలో నిర్మాణాంధ్రం.

తెనుగునేల మళ్ళీ నిత్య కళ్యాణం పచ్చతోరణంగా అవడం ఒకటి. దీనికి కావలసిన ఐక్యత చేకూర్చుకోవడం రెండోది.

చాళుక్యుల రోజుల్లో భారత ధర్మ రక్షణ ఎట్టిదో, కాకతీయుల కాలంలో కులమత విభేదాలు కూలదోయడం ఎటువంటిదో, విజయనగరపు హయాములో మత, దేశరక్షణలు ఎట్లనో యిప్పుడు ఆంధ్ర ప్రదేశపు ఆర్థిక పునర్నిర్మాణం అంత ముఖ్యం.

కావలసినది "పొందిక". "మీరు" "మేము" అన్న భేదాలు పోవడం. ఇది ఎలా సాధించటం?

ప్రాజెక్టుల్లో కృషి

ప్రాజెక్టు ప్రాంతాలలో బోలెడంత పనికి అవకాశం ఉంది. ఒక ప్రాంతం వారు మరొక ప్రాంతానికి వెళ్ళి కార్యకలాపాలలో పాల్గొని ఎంతో సాధించవచ్చు. ఇరుగుపొరుగు ఊళ్ళమధ్య విభేదాలుండవచ్చు. దూరప్రాంతాలకి అంత ఉండదు. ఒక మండలము వారు మరొక మండలంలో నిర్మాణాత్మకమైన సేవ సాగించవచ్చు.

ముఖ్యంగా విద్యార్థులకిది ఎంతో గొప్ప అవకాశం కల్పిస్తోంది. శెలవులలో బోలెడంత పనికి వీలుంది. ఉపాధ్యాయులు పూనుకుంటే ఇదేమంత పెద్దపని కాదు. ప్రభుత్వం సాయపడడానికి కావలసినంత అవకాశం వుంది.

కోస్తావారు రాయలసీమలో రెండు మూడు బావులు, రాయలసీమ వారు తెలంగాణంలో మూడు నాలుగు పడియలు, తెలంగాణావారు తీర ప్రాంతాలలో ఏదో ఒక నిర్మాణం, సాలుకి ఒక పద్ధతి ప్రకారం పూర్తిచేస్తే తెనుగు వారిలో ఎంత చలనం కలుగుతుందో ఆలోచించుకోండి.

ఒక దేశంవారు, మరొక దేశం వెళ్ళి ఎంతో సహాయం చేస్తూండగా ఒకే భాషా ప్రాంతంలో వున్న ప్రజలు ఒక సీమ నుంచి మరొకసీమలో పరస్పర సహాయానికి ఎందుకు పూనుకోగూడదు?

"సొంతలాభం కొంత మానుకు, పొరుగు మనిషికి సాయపడవోయ్" అని పాడితే ప్రయోజనం లేదు. నడుముకట్టి, రంగంలోకి దిగిచూపాలి.

రచయితలు

రచయితలు కొండంత చేయవచ్చు. వీరి లక్ష్యం మారాలి. తిక్కన, శ్రీనాధుడు, శివకవులు యే మహావేశంతో పనిచేశారో స్మరించి, ప్రజలకోసమే నన్న భావంతో ముందుకు సాగితే బోలెడంత లాభం వుంది.

అసలు, రచనలోనే చాకచక్యం చూపవచ్చు. ఒక సీమలో రచయిత మరొకసీమ ప్రాంతీయాలు ఎందుకు వాడరాదు? ఆ విధంగా తెనుగు నుడికారపు పొలంలోని తెనుగు పంట ఎంతకమ్మనిదో, ఎన్ని రకాలుగా వుందో, చూపవచ్చునే? ప్రయత్న పూర్వకంగా యిట్టి కృషి సాగించితే ఎంతబాగు!

ఏకైకమైన ఆంధ్రసాహిత్య పరిషత్తు నేడో రేపో వెలియబోతున్నది. నేటి నవలల్లో, నాటకాల్లో తెనుగు జీవితం ప్రతిబింబించడం లేదు. కారణం రచయితలు తమ భావనా ప్రవాహంలో కొట్టుకుపోవడమే. చుట్టుపట్ల వాతావరణం నుంచి తప్పించుకునే యత్నంలో వుండడమే.

తెనుగువాడు వుట్టి పిచ్చివాడు! అమాయకుడు! ఒక కమ్మని పద్యం, కచ్చితమైన మనిషి, ఖరారైనమాట అంటే వూగిపోతాడు!!

ఇది తెలిసే, రాయలవారు కవులని గూడా యుద్ధభూమికి తీసుకెళ్ళారు.

నేడు కావలసింది కన్యాశుల్కం వంటి నవలలు, నాగార్జునసాగరం, మహేంద్రోదయంవంటి కావ్యాలు. రచయితలు ఆలోచించుకోండి...

పోయిన పెద్దల స్మరణ

ఈ తెనుగు గడ్డమీద అన్ని ప్రాంతాల్లోనూ ఎంతో సేవచేసి కీర్తికాయులైన మహానుభావులపట్ల యావదాంధ్రావనికి గౌరవం వుంది. ఇది చిరస్థాయి చేసుకోవాలి. ఈ కృషి గూడా మన ఐక్యతకి దోహదం చేయగలదు.

ఒక ప్రాంతపు యశఃకాయుణ్ణి మరొక ప్రాంతంలో గౌరవించడం ఒక పద్ధతిగా చేయవచ్చు. రాజమండ్రిలో ప్రతాపరెడ్డి గ్రంథాలయం; హైదరాబాదులో వీరేశలింగ పుస్తక భాండారం; కర్నూలులో నాగేశ్వర పుస్తకాగారం... ఎల్లా వుంటుంది? కడపలో గురజాడ నాటకమండలి విజయవాడలో బళ్ళారి నాటక నికేతనమూ స్థాపించితే?

ఆంధ్రప్రదేశ్ రాజధాని మనము చూస్తూ వుండగానే పెరుగుతుంది. అనేక కొత్త శివారులు వస్తవి. కొత్త కొత్త రోడ్లు వేతురు. పేటలు కడ్తారు. భవనాలు నిర్మించుతారు. వీటి పేర్లు పెట్టడంలో యావదాంధ్ర ప్రజానీకాన్ని మేలుకొలిపిన మహనీయుల్ని స్మరించేందుకు వీలు కలగాలి.

శివ కేశవులతో సతమతమవుతున్న మతావేశపరులకి కనువిప్పుగా తిక్కన తన కృతిని హరిహరనాధమూర్తికి అంకితము చేసినాడు.

సంస్కృతిలో ఉన్న వైవిధ్యం ప్రదర్శించాలి

చరిత్ర వల్ల కలిగిన దౌష్ట్యం ఫలితంగా తెనుగు భూమిలో సంస్కృతి విషయం కించిత్తు భిన్న భిన్నంగా వుంది.

తీరాంధ్రులు తెనుగుమీరినారు. భాషలో సంస్కృతపు పాలుహెచ్చు. కాకతీయాంధ్రుల మాటలో అరబ్బీ, పారశీకపదాలు దొర్లుతవి. వేషములో కూడా భేదం ఉంది. రాయలసీమ వారి పలుకుబడి విశిష్టమైనది.

పండుగలు చేసుకోవడంలో, ఆచారాలలో భేదాలున్నవి. ఇవి పోయేవి కావు. పోగూడదు. ఒకరినొకరు నిరసించటానికి ఉపయోగించవలసినవి కావు. పరస్పరమూ అర్థం చేసుకొనడానికి పనికివచ్చేటటువంటిది.

దేశదేశాల విద్యార్థులు ఇతరదేశాల విషయాలు గ్రహించేందుకు యాత్రలుగా వెళుతున్నారు. అట్లే తెలంగాణా, కోస్తా, రాయలసీమ వారు కనీసం సంవత్సరానికి ఒక తూరి అయినా ఏల ఇటువంటి యాత్రలు చేయరాదు?

ఇట్లు ఆయా ప్రాంతాలకి వెళ్ళే విద్యార్థి బృందాలను సత్కరించే బాధ్యతవల్ల అక్కడి ప్రాంతీయులకు వీరు బాగా అర్థమవుతారు.

మరి ఒకటి – ప్రతి ఏటా, విశ్వవిద్యాలయాలు స్నాతకోత్సవాలను జరుపుకుంటవి. విద్యాసంస్థల వార్షికోత్సవాలని అంటూ వుంటాయి. అటువంటి సందర్భాలలో ప్రతి ప్రాంతం వారున్ను రెండో ప్రాంతంవారికి సంబంధించిన విశిష్టమైన సంస్కృతీ విశేషాలు ప్రదర్శించవచ్చు. ఆ ప్రాంతం వారిని ఆహ్వానించవచ్చు.

మనమంతా ఒకటేనన్న జ్ఞానం ఉన్న మేధావులు తెనుగునాట లేరని కాదు. ఈ సత్యం జనసామాన్యంలో ప్రబలాలి. నరనరానికీ పట్టేట్లు చెయ్యాలి. ఇందుకు పూనిక కావాలి.

కలము పట్టే ప్రతి రచయితా, వేదిక ఎక్కే ప్రతి వక్తా, పదవి నిర్వహించే ప్రతిపాలకుడూ ఆంధ్ర ప్రజానీకపు సంస్కృతి స్వరూపాన్ని సాక్షాత్కరింపజేసుకొని శాంత భారతదేశంలో నిర్మాణాంధ్రావనికోసం నడుము కడితేనే యిది సాధ్యం.

(ఆంధ్రజనత, 1.11.1956)

వేదంలా గోదావరి ప్రవహిస్తోందే చెల్లీ
వెన్నెలవలె కృష్ణవేణి విహరిస్తోందేతల్లీ

విశాలాంధ్ర నలుమూలల
వైవాహిక వైభోగం
జనుల కనుల వెలగులలో
జాజులు వారెడి రాగం

గెల వేసిన అరటిచెట్లు తీసుకురానా తల్లీ
ఎల మామిడి తోరణాలు కట్టనా చెల్లీ

గడప మీద చిగురు జల్ల
గరిపొడిచెను శోభ
ముంగిట ముత్యాల నవ్య
రంగవల్లి సుప్రభ

ఏరువాక పడవలాగ ఎద ఊగిసలాడునే
జోడెద్దుల బండివలె గుండెలురికి సాగునే

కల్యాణ తిలక రేఖగ
కస్తూరి బొట్టుదిద్దవే
తెలుగు వెలది బుగ్గమీద
దిష్టి చుక్క పెట్టవే

తలంబ్రాల తనిసి నటుల ధరణితోచునే చెల్లీ
వసంతాల తడిసి నటుల సంజమొరయునే తల్లీ

జనావళికి సంతతం
సంతోష ప్రాప్తి
విశాలాంధ్ర నిండా
వైవాహిక దీప్తి

తుత్తారా మాదిరిగా తుంగభద్రవాదమే
సన్నాయికి మల్లే పెన్నానది గానమ.

– ఆరుద్ర

శ్రీమతి ఇందిరాగాంధీ

భాషా రాష్ట్రాలు హేతుబద్ధమైనవే

ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ లోక్‌సభలో 1972 డిసెంబరు 21వ తేదీన ముల్కీ నిబంధనల బిల్లును గురించి చేసిన ప్రకటన :

అధ్యక్ష మహాశయా :

నా సహచరులైన శ్రీ చవాన్ ముఖ్యమైన అంశాలన్నింటిని గురించి ప్రసంగించి సభలో ప్రశాంత వాతావరణం ఏర్పరచిన పిమ్మట, నిజానికి నేను ప్రత్యేకించి మాట్లాడవలసిన అవసరం అంతగాలేదు. కాని లోగడ సభలో ప్రసక్తికి వచ్చిన కొన్ని అంశాల విషయంలో నేను స్పష్టంగా వివరించని పక్షంలో, అపార్థాలకు తావు ఏర్పడే అవకాశం వున్నదని ప్రతిపక్షానికి చెందిన కొందరు గౌరవ సభ్యులు ముందుగానే నాతో అన్నారు. ఆ అంశాలు క్రొత్తవేమీ కావు. అయినా, నేను వాటిని గురించి ప్రకటన చేయడం మంచిదని వారు అభిప్రాయం వెలిబుచ్చారు. అందుచేత, నేను ఇపుడు ప్రసంగించవలసివచ్చింది.

పార్లమెంటులో అనేక ప్రధానాంశాలను గురించి చాలా ఆవేశపూరితములైన చర్చలు జరుగుతూ ఉంటాయి. ముల్కీ సమస్యకూడా అటువంటివాటిలో ఒకటిగా పరిణమించింది.

ప్రశాంత వాతావరణంలోనే పరిష్కారం

అనేక ఇతరదేశాలలో మాదిరే, మనదేశంలోకూడా ప్రాంతీయభావాలతో ముడిపడిన విషయాలు ప్రజలలో ఉద్రేకాలను రెచ్చగొడుతూ వుంటాయి. ప్రజలలో ప్రబలిన ఉద్రేకాలను మనం నిర్లక్ష్యం చేయడానికి వీలులేదు. అయితే ఇదివరకు శ్రీ చవాన్‌గారు చెప్పినట్లు, వాతావరణం అతి ఉద్రేకపూరితమై ఉన్న సమయంలో సమస్యలకు పరిష్కారం కనుగొనడం సాధ్యంకాదు. ప్రశాంత వాతావరణంలో హేతుబద్ధమైన విధానాలద్వారానే సమస్యలకు పరిష్కారం కనిపెట్టవలసి వుంటుంది.

సభ్యులు వెలిబుచ్చిన ఉద్రేకాల వల్లనూ, తెలంగాణా ఆంధ్ర ప్రాంతాలకు చెందిన మిత్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల వల్లనూ, ఇతర సభ్యుల మాదిరి నాపైన కూడా ఎంతో ప్రభావం పడింది. నేనూ మానసికంగా బాధపడ్డాను. ఐనా ఈ పరిస్థితిని మనం ఉద్రేకంగా కాక శాంతియుతమైన ఉమ్మడి పరిష్కార దృక్పథంతో పరిశీలించాలనిన్నీ, ఆ పరిష్కారం నేటికొరకో రేపటికొరకో కాక రాబోయే దశాబ్దాన్ని, రెండు దశాబ్దాలను, శతాబ్దాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించాలనిన్నీ వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ సభలో కొన్ని ఉద్యోగాలకూ, తదితర విషయాలకు సంబంధించి మీరు చర్చలు జరుపుతున్నారు. ప్రత్యేకంగా నాతో కూడా వాటిని గురించి చర్చించారు. అయితే, శ్రీ చవాన్‌జీ అన్నట్లు, యిది వాస్తవంగా ప్రజల జీవితాలకు సంబంధించిన సమస్యేనా? కాదు. ఈనాడు మనం తీవ్రమైన నిరుద్యోగ సమస్యను యెదుర్కొంటున్నాం. ఈ నిరుద్యోగ సమస్య దేశమంతా వ్యాపించి వుంది. మన దేశంలోనేకాదు. ప్రపంచంలో దాదాపు ప్రతి దేశంలోను ప్రస్తుతం యీ సమస్య తప్పకుండా వుంది. మన సమకాలిక సమాజంలోని లక్షణాలలో యిదీ ఒకటి. మన లోపాలనూ, యిబ్బందులనూ, కప్పిపుచ్చడానికి గాని వాటి బాధ్యత నుండి తప్పించుకోడానికి గాని నేనీమాట చెప్పడంలేదు. మనం దృఢనిశ్చయంతో యెదుర్కోవలసిన సమస్య యిది. అందువల్లనే ఈ సమస్య యింతగా ఆవరించి పెద్ద యెత్తున తయారైంది.

ప్రజలవద్దకు వెళ్ళి 'దీనివల్ల మీ ఉద్యోగావకాశాలు దెబ్బతింటున్నవి, మీ హక్కు హరించుకొని పోతున్నది" అని చెప్తే, సహజంగా వారు ఉద్రేక పూరితులవుతారు. ఎవరికైనా ఆవేశం వస్తుంది. "మనం కూచోని దీన్ని గురించి తాపీగా ఆలోచించుకుందాం. ఉద్యోగావకాశాలు, యితర అవకాశాల విషయంలో తెలంగాణా ప్రాంత ప్రజలకూ, ఆంధ్రప్రదేశ్‌లోని యితర జిల్లాల ప్రజలకూ ఎంతవరకు దీనివల్ల హాని కలుగుతున్నదో ఆలోచించుకుందాం" అని ప్రజల వద్దకు వెళ్ళి చెప్పినవారు యెంతమంది వుంటారు అనేదే నా సందేహం. కనుక ఈ సమస్యలోని బాగోగులను స్పష్టంగా, సమగ్రంగా అక్కడి ప్రజలముందు వుంచడం జరిగిందని నేను అనుకోను. అందువల్ల యిప్పుడు ప్రజల్లో వచ్చిన ఆవేశాన్ని ఆ దృష్టితో కూడా చూసి అర్థం చేసుకోవాలి.

పరిమితమైన సమస్య

ఇప్పుడు జరుగుతున్న చర్చ సోషలిజం గురించి కాదు. యావద్భారత దేశ క్షేమం గురించి కాదు. ప్రారంభంలో ప్రసంగించిన గౌరవసభ్యులు కొందరు యీ విషయాల ప్రసక్తి తెచ్చారు. ఇది చాలా పరిమితమైన సమస్య; చాలా స్వల్పమైన సమస్య. ఇది కేవలం ముల్కీ నిబంధనలు, వాటివల్ల ఏర్పడిన పరిస్థితికి మాత్రమే సంబంధించిన సమస్య. ఈ విషయంలో యేమీ జరగలేదని కొంతమంది గౌరవసభ్యులు అన్నారు. చాలా జరిగిందనే నేను సవినయంగా మనవిచేస్తున్నాను. మనకు సంతృప్తికరమైనంత కాకపోయినప్పటికీ, కొంతవరకు నిజమైన ప్రశాంత పరిస్థితి నెలకొంటూ ఉన్నది; పరిస్థితి మెరుగుపడుతూ ఉన్నది. ఎంతో మెరుగైందని నేను చెప్పడంలేదు. కాని మెరుగుపడే దిశగా పురోగమిస్తూ ఉన్నదనేది యథార్థం. అలాంటి పరిస్థితిలో అకస్మాత్తుగా ముల్కీనిబంధనలను గురించిన తీర్పు రాగానే, సర్వత్రా మళ్ళీ నిప్పు అంటుకొన్నట్లయింది. అసలు ముల్కీ నిబంధనల సమస్య ఏవిధంగా ఉద్భవించింది? ఆకాలపు స్వదేశీ సంస్థానాలలో హైదరాబాద్ సంస్థానం అన్నింటికంటే పెద్దది. ఆ సంస్థానంలో మహోన్నత సంస్కృతిగల వ్యక్తులు, కుటుంబాలు వుండినాయని ఒక గౌరవనీయ సభ్యుడు చర్చ సందర్భంగా అన్నారు. కానీ, అసంఖ్యాక సామాన్య ప్రజానీకం మాత్రం దారిద్ర్యంలో మునిగితేలుతుండేవారు. విద్య, సాంఘిక సంక్షేమ విషయాల్లో గానీ ప్రజారోగ్య విషయంలోగానీ జీవన పరిస్థితులు మెరుగుపరచడంలోగానీ ఆ సంస్థాన ప్రజలకు ఏవిధమైన అవకాశాలూ వుండేవికావు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిన సందర్భంలోనే, ప్రజలందరూ కలిసిమెలసి జీవించడానికి కొన్ని తాత్కాలికపుటేర్పాట్లు అవసరమనే విషయం ప్రజల్లో అన్నివర్గాలవారూ గుర్తించారు. ఆనాడు ప్రజానాయకులు ఏకగ్రీవంగా నిర్ణయించుకుని ఒక పెద్దమనుషుల ఒప్పందం కుదుర్చుకున్నారు. దానిని మనం అందరం అంగీకరించాము.

వెనుకబడిన ప్రాంతాలు

ఏలాంటి ఒప్పందాలు చేసుకున్నప్పటికీ, అభిప్రాయభేదాలు, అసమానత్వాలు అంటూ వుండనేవుంటాయి. ఒక కుటుంబంలోనే యిలాంటివి వుండడం మనందరికీ తెలిసిన విషయమే. వెనుకబడిన ప్రాంతాలు లేని రాష్ట్రం మన భారతదేశంలో లేదు. అయితే కొంతవరకు అభివృద్ధి చెందిన ప్రాంతాలు అన్ని రాష్ట్రాలలోనే కాదు, ఒకే ప్రాంతంలోనే యిలాంటివి కొన్ని వున్నాయి. ఆంధ్రప్రాంతంలోనే, రాయలసీమ, శ్రీకాకుళం మున్నగు కొన్ని వెనుకబడిన ప్రాంతాలు వున్నాయని చాలామంది సభ్యులు చెప్పారు. తెలంగాణా వెనుకబడిన ప్రాంతమే. అయితే, అందులోకూడ అభివృద్ధిచెందిన కొన్ని ప్రాంతాలు వున్నాయి.

ఒక ప్రాంతానికంటే మరొకప్రాంతం వెనుకబడివున్నదనే కారణంపైన తీవ్రమైన, తిరుగులేని నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదు. ఇలాచేస్తే దీనికి అంతు ఏమిటి? ఒకరిని చూసి మరొకరు ఇలా చేసే అవకాశం వున్నదని నేను భయపడడం లేదు. అసలు విషయం యిదికాదు. ఏ ప్రమాణాన్ని బట్టి జరగాలి? ప్రతి జిల్లా దేనికదే వేర్పాటుకావాలా? ఉత్తరప్రదేశ్‌ను విభజించవలసిందిగా కొందరు చెప్పారు. విభజన ఎక్కడెక్కడ జరగాలి? ఎన్ని ప్రాంతాలుగా విభజించాలి? ఒకటా, రెండా, మూడా, నాలుగా? ఎన్ని? వెనుకటి చిన్న చిన్న రాష్ట్రాలు, సంస్థానాలు ఇప్పుడు ఏర్పడాలంటారా? తిరిగి అప్పటి పరిస్థితులు నెలకొనాలా? కాబట్టి దీనికి ఒకచోట అంతు అంటూ ఉండాలి. కేవలం వెనుకబడిన ప్రాంతంగా వున్నదనే కారణంపైననో మరో కారణంపైననో ఏదో ఒక చర్య తీసుకోవాలని చెప్పడం సమంజసం కాదు. ఆర్థికంగా వెనుకబడినతనం పోవాలంటే శ్రీ చవాన్ చెప్పినట్లు, జాతి యావత్తూ కష్టించి పనిచేయడం, శాయశక్తులా కృషి చేయడం ఎంతైనా అవసరం.

ఏదో ఒక ప్రాంతంగానీ ఏదో ఒక వర్గంగానీ ప్రత్యేకమైన ఇబ్బందులకు గురిఅవుతూ వున్నట్లయితే, ఆ ప్రాంతంపట్ల, ఆ వర్గంపట్ల ఎప్పుడూ సానుభూతి సదవగాహన వుండనే వుంటుంది. అంతేకాని, వెనుకబడినతనం పేరుతో స్వార్థ ప్రయోజనాలు పెంపొందించుకోవడానికి వీలులేదు. వాస్తవానికి యిది అన్ని చోట్ల వుండే సమస్యే. పేదరికమనే విస్తృత సమస్యలో ఇది ఒకభాగం. దీనిని సత్వరం పరిష్కరించడం కష్టసాధ్యమని నేను భావిస్తున్నాను.

అభివృద్ధి జరుగుతున్న తొలిదశలో అవసరమైన వనరులు సమకూర్చడం సులభం కాదు. మొత్తంమీద అభివృద్ధి స్థాయి చాల తక్కువగా వుండడమే ఇందుకు కారణం. అటువంటి సందర్భంలో మరొక సమస్య తలెత్తినట్లయితే పరిస్థితి మరింత క్లిష్టమౌతుంది. మూడవ, నాల్గవ ప్రణాళికలలో ఈ విషయమై తగు కృషి జరిగింది. జాతీయ అభివృద్ధి మండలి చేసిన సిఫారసుల ప్రకారం, ఆర్థిక సహాయంచేసే పబ్లికు సంస్థల ద్వారా 225 జిల్లాలను కొన్ని రాయితీలపై ఆర్థిక సహాయం సమకూర్చడానికి ఎంచుకున్న సంగతి సభవారికి విదితమే. ఈ జిల్లాల్లో ఆంధ్ర ప్రాంతంలోని జిల్లాలూ, తెలంగాణా ప్రాంతంలోని జిల్లాలు కూడా వున్నాయి.

సరియైన దృక్పథం

ఐదవ ప్రణాళికలో కనీస అవసరాలను సమకూర్చే భారీ కార్యక్రమాన్ని చేపట్టాలని మన సంకల్పం. ఈ కార్యక్రమ వివరాలను గురించి నేను ఇప్పుడు చర్చించదలచలేదు. వీటిలో కొన్ని విషయాలు మీకు యిదివరకే తెలుసు. మరికొన్ని మీకు త్వరలోనే తెలియగలవు. సరియైన పరిష్కారానికి ఇదొకటే మార్గం. చారిత్రక కారణాలవల్లకానీ లేక యితర కారణాలవల్లకానీ, కొన్ని ప్రాంతాలలో మార్పుకు దోహదం చేసే చర్యలు తీసుకోవడం అవసరంకావచ్చు. అయితే, ఈ సమస్యనూ, దాని పరిష్కార అవకాశాలనూ మనం సరియైన దృక్పథంలో పరిశీలించాలి. ముల్కీ నిబంధనలను రద్దుచేయడానికి సంకల్పించిన 1957వ సంవత్సరపు ప్రభుత్వోద్యోగాల (నివాసార్హత) చట్టంలోని 2వ విభాగం చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు యిచ్చింది. ఈలోగా అనేక సంఘటనలు జరుగుతూనే వున్నాయి. ముల్కీ నిబంధనలే చెల్లవనే తీర్పుకూడా వచ్చింది. ఆ విధంగా పరిస్థితి నిలకడగా లేకుండా మారుతూవచ్చింది. దీనివల్ల పరిస్థితి మరింత జటిలమైపోయింది. అన్ని స్థాయిలలోని రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలకూ ముల్కీ నిబంధనలు వర్తింపజేసే ప్రాతిపదికతో పరిపాలనా నిర్వహణ జరగడం సాధ్యంకాదు. కొన్ని ఉద్యోగాలలో లోగడ జరిగిన నియామకాలను చెల్లుబడిచేయడం కూడా అవసరమౌతుంది. ప్రతిపక్షానికి చెందిన మిత్రుడు ఈ విషయంలో ఆదుర్దా వ్యక్తం చేశారు. నియామకాలను తిరగదోడి ఉద్యోగాలలో తిరిగి చేర్చుకోవడం అవుతుందని ఆయన భావించారు. ఇది సరికాదని నేను స్పష్టం చేయదలచాను. దీని వివరాల జోలికి నేను వెళ్లదలచుకోలేదు. అయితే, ఆయన ఆందోళనచెందనవసరం లేదు. ప్రభుత్వోద్యోగాలకు సంబంధించి లోగడ తెలంగాణా ప్రజలకు ఇచ్చిన హామీలను వారి ప్రస్తుత అవసరాలను మనం పరిశీలించవలసివుంది. ఇచ్చిన హామీలను పాటించక పోవడమనేదేలేదు. వారి సమస్యలపట్ల మనకు అత్యంత శ్రద్ధ ఉన్నట్లు మరొకసారి గౌరవనీయ సభ్యులకు హామీ యిస్తున్నాను. అయితే ఆ సమస్యల పరిష్కారానికి ఇది మార్గం కాదు. లోగడ నేను చెప్పినట్లు, వేరుపడిపోతామని చెప్పడం యీ సమస్యకు తుది పరిష్కారం కాజాలదు. ఇది ఇతర రాష్ట్రాలకేకాకుండా ఆ ప్రాంతానికి ఆ రాష్ట్రానికి సంబంధించి మరొక బృహత్ సమస్యకు నాంది అవుతుంది.

సమైక్య రాష్ట్రం

1972 నవంబరు 27వ తేదీన ప్రకటించిన నిర్ణయాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనాయకుల అభ్యర్థనను పురస్కరించుకొని జరిగినట్టివి. కేంద్రమే ఒక నిర్ణయం తీసుకోవాలని వారంతట వారు కోరారు. ఈ బిల్లుపై పెక్కుమంది సభ్యులు వివిధ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కొంతమంది దీనిపై ప్రజాభిప్రాయము సేకరించాలని, మరికొంతమంది దీనిని సుప్రీం కోర్టుకు నివేదించాలని కూడా అభిప్రాయపడ్డారు. ఎందుకింత తొందర? అని కూడా సభ్యులు ప్రశ్నించారు. రాష్ట్ర పరిపాలనా నిర్వహణ తక్షణ ప్రయోజనాల దృష్ట్యానే యీ సత్వర చర్య అవసరమయింది. ఇక ఏ మాత్రం ఆలస్యం జరిగినా, తీవ్రమైన పరిస్థితులు ఏర్పడగలవనే విషయం తెలిసినదే. సమైక్య రాష్ట్రం కొనసాగాలని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. ఒకవేళ రెండు రాష్ట్రాలు వుండి వున్నప్పటికీ, ఈ బిల్లుకు సంబంధించి పరిస్థితి మారబోదు. ఎందుచేతనంటే బిల్లు ప్రధానంగా జంట నగరాలకూ, మిగలిన తెలంగాణా ప్రాంతానికీ సంబంధించిన సమస్యలకు చెందినటువంటిది. ఆ ప్రజలు ఆ ప్రాంతములోనే ఉండటం మూలాన ఇతర చర్యలు ఏవి తీసుకున్నప్పటికీ ఆ సమస్య తొలగిపోదు. దురదృష్టవశాత్తు గౌరవనీయ సభ్యుల ప్రసంగాలలో కొంతవరకు కోపతాపాలు వ్యక్తమయినాయి. మనకు యెన్ని రాష్ట్రాలు వున్నాయి? అనేది కాదు సమస్య. ఎన్ని రాష్ట్రాలు వున్నా, యిరుగుపొరుగు ప్రాంతాలవారుగానే ఉండాలి, పరస్పరం అనేక సమస్యలను చక్కబెట్టుకోవలసి వుంటుంది. ఈ విషయాలన్నిటిని గురించి క్షుణ్ణంగా ఆలోచించనటువంటివారు వేర్పాటువల్ల ఆ ప్రజలతో ప్రమేయం లేకుండా పోయిందని ఈ సమస్యలనుంచి తప్పించుకున్నామని భావించవచ్చు. జరిగిన అనుభవాలనుబట్టి చూస్తే యిది సత్యదూరమనే విషయం తెలుస్తుంది.

రక్షణలు

ప్రభుత్వోద్యోగాలకు ఏ విధమైన నివాసార్హత విధించినా, అది మన రాజ్యాంగంలో పొందుపరచుకున్న సామాన్య పౌరసత్వ లక్ష్యానికి విరుద్ధమౌతుందనే గాఢమైన భావన దేశంలో వుంది. అయితే మన రాజ్యాంగ నిర్మాతలు కొన్ని ప్రత్యేక యిబ్బందులకు గురి అవుతున్న ప్రజలకు వుండిన రక్షణలను ఒకేసారని రద్దు చేయడానికి వీలులేదనే విషయాన్ని గుర్తించారు. రాజ్యాంగపు 35వ అనుచ్ఛేదం ఉద్దేశాలలో ఇది కూడా ఒకటి. అమూల్యమైన రక్షణగా భావించబడుతూ ప్రజల హృదయాలతో ముడివడిపోయిన ముల్కీ నిబంధనలను ఈ అనుచ్ఛేదం సజీవంగా ఉంచింది. తెలంగాణా ప్రాంతం ఆంధ్రతో సంలీనమైనపుడు కొన్ని విషయాలలో ఈ రక్షణ కొనసాగించబడుతుందని ఆంధ్రప్రాంతం వారు హామీలు యిచ్చారు. తరువాత ఇంతకాలంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ప్రభుత్వాలు, ముల్కీ నిబంధనలను గురించి న్యాయస్థానాలు ఏవిధమైన తీర్పులు యిస్తూ వచ్చినప్పటికీ, ఈ సూత్రం అంగీకరిస్తూ వచ్చాయి. కొందరు ఈ యదార్థాన్ని విస్మరించివుండవచ్చు. ప్రస్తుత బిల్లు కొన్ని

విషయాలలో ముల్కీ నిబంధనలను కొనసాగించడానికీ, వాటిని దశలవారిగా రద్దుపరచడానికీ ఉద్దేశించినటువంటిది. బిల్లులో తెలిపిన గడువులను పొడిగించమని సభవారిని మళ్ళీకోరే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేస్తున్నాను. ఇదివరకు నేను చెప్పినట్లు, ఒక రాష్ట్రపు మనుగడలో ఐదేండ్లు, ఎనిమిదేండ్ల వ్యవధి అతిస్వల్పమైనట్టిది. రాష్ట్ర రాజధాని ఉభయప్రాంతాలకు చెందినట్టిదనే విషయాన్ని గుర్తించి, జంటనగరాలలో, మిగిలిన తెలంగాణా ప్రాంతానికంటే ముందుగానే ముల్కీ నిబంధనలు రద్దు కావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంతవరకుగల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో యితర ప్రాంతాలకు చెందిన పౌరులకు కూడా రాజధానిలో ఉద్యోగావకాశాలు కల్పించబడుతున్నాయి. విద్యా సౌకర్యాలు విస్తృతపరచ బడుతున్నాయి.

దీనివల్ల తెలంగాణా మిత్రులలో కొన్ని భయసందేహాలు తలయెత్తే అవకాశం వుంది. సుప్రీం కోర్టు కొట్టివేసిన ప్రభుత్వోద్యోగాల చట్టంలో ఐచ్ఛికంగా అంగీకరించబడి పొందుపరచబడిన రక్షణలను యథాతథంగా వుంచడమేకాకుండా, ప్రస్తుతం తలపెట్టిన బిల్లు అంతకుమించి కొంత పురోగమించడానికి కూడా ఉద్దేశించబడినదని నేను వారికి హామీ యిస్తున్నాను.

సర్వీసుల ప్రాంతీయకరణ

మన నిర్ణయాలలో పేర్కొన్న అయిదు అంశాలలో మూడు అంశాలు యీ బిల్లులో చేర్చబడినాయి. మిగిలిన రెండు అంశాలను గురించి శాసనం చేయవలసిన అవసరం లేదు. ప్రతిపక్షాల వారి నుండి దీన్ని గురించి విమర్శ వచ్చినందువల్ల యీ విషయం స్పష్టం చేయవలసి వచ్చింది. సర్వీసుల ప్రాంతీయకరణ పథకం విషయంలో యిప్పటికే చాలవరకు పని జరిగింది. త్వరలోనే యీ పథకానికి తుదిరూపం యివ్వబడుతుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తమ సర్వీసు నిబంధనలలో తగు సవరణలు చేసి, ఈ పథకాన్ని అమలు పరుస్తుంది. మరొక నిర్ణయం హైదరాబాదు – సికిందరాబాదు జంటనగరాలలోని విద్యావకాశాల విస్తరణకు సంబంధించినది. కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ ఈ విషయం గురించి అప్పుడే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపింది. ఈ చర్చల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలను తయారు చేస్తున్నది. వీటిని సక్రమంగా అమలు పరచడానికి అవసరమైన యంత్రాంగాన్ని యేర్పాటు చేయడం జరుగుతుంది.

ఈ సమస్యా పరిష్కారానికి ప్రయత్నాలు జరుపుతుండగా, కొన్ని యితర విషయాలు వ్యక్తం చేయబడినాయి. తెలంగాణా ప్రాంతానికి ప్రాంతీయ సంఘం కొనసాగడమన్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్యతకు భంగకరంగా వుందని తెలియజేయబడింది. తెలంగాణాకు ప్రత్యేక బడ్జెటు వుండడం గురించి శ్రీ రఘురామయ్య తదితరులు ప్రస్తావించారు. రాష్ట్రంలో తెలంగాణా ఒక్కటే వెనుకబడిన ప్రాంతం కాదనే అంశం కూడా ప్రస్తావించబడింది.

ప్రాంతీయ సంఘం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిన సందర్భంలో, తెలంగాణా ప్రాంత ప్రయోజనాలను కాపాడే విషయంలో వారికి చేసిన వాగ్దానాలు సక్రమంగా అమలు జరుగుతాయనే విశ్వాసం కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర శాసనమండలి ఈ ప్రాంతీయ సంఘాన్ని ఏర్పాటు చేసిందని మీకందరికి తెలిసిన విషయమే. తెలంగాణా అభివృద్ధి కార్యక్రమంలో ఆ ప్రాంత ప్రజలు సన్నిహితంగా పాల్గొనడానికి యిది అవకాశం కల్పించింది.

శ్రీ రఘురామయ్య చెప్పినట్లు బడ్జెటు వాస్తవానికి విడిగా లేదు. వేరువేరుగా రెండు పత్రాలు వున్నప్పటికీ, అవి ఒకే బడ్జెటులో భాగంగా వున్నాయి. అయితే లెక్కలు కట్టి గుణింతాలుచేసి చెప్పడం ప్రధానమైన సమస్య కాదు. మొత్తంమీద ఉన్న ఆర్థిక పరిస్థితే ముఖ్యమైన సమస్య. రాష్ట్ర సమగ్ర సమైక్యతకు అడ్డుగోడలుగా నిలిచివున్న ప్రతిబంధకాలన్నింటినీ తొలగించాలని కోరుతున్నవారి మనోభావాలను నేను అవగాహన చేసుకోగలను. ఈ అడ్డుగోడలన్నీ తొలగిపోయి, ఇలాంటి ప్రత్యేకమైన ఏర్పాట్లకు అవసరం లేని శుభదినం కోసం నేను ఎదురుచూస్తున్నాను. ఆర్థిక వ్యత్యాసాలు అంతరించి పోవడంతో, క్రమేణా ఇట్టి పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఏర్పాట్లు కేవలం తాత్కాలికమైనట్టివిగా పరిణామకాలీనమైట్టిగా మన రాజ్యాంగం భావిస్తున్నదనే విషయం సభవారి దృష్టికి తెస్తున్నాను. అయితే ఈ లోపుగా రాష్ట్రంలో వెనుకబడిన ఇతర ప్రాంతాల అభివృద్ధికై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈ ప్రాంతాలు సత్వరంగా అభివృద్ధి చెందడం చాలా అవసరం. ఈ సందర్భంలో కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు జరగాలని చేసిన సూచనలు కూడ పరిశీలనలో ఉన్నాయి. ప్రజల అభీష్టమే అయినట్లయితే అట్టి ప్రాంతాలకు ఒకటి రెండు ప్రాంతీయ సంఘాలు లేదా అభివృద్ధి మండలులు ఏర్పాటు చేయడానికి మేము పూర్తిగా అంగీకరించడానికి సిద్ధంగా వున్నాము. రాష్ట్ర నాయకులతో సంప్రదించిన పిమ్మట దీని వివరాలు రూపొందించవచ్చు.

ఉభయ ప్రాంతాలకు న్యాయం చేకూర్చే విధంగా, వివిధ పద్దుల క్రింద ఆదాయ వ్యయాలను కేటాయించడంలో ఇప్పుడు అనుసరిస్తున్న పద్ధతులను ఇంకా మెరుగుపరచవచ్చనే అభిప్రాయం కూడా వున్నది. దీన్ని కూడా పరిశీలించవచ్చును. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సహాయం అవసరమైనట్లయితే తగిన సహాయం చేయడానికి ప్రయత్నిస్తాం. చాలినంతగా వనరులను సమకూర్చడమన్నదే ముఖ్య విషయం. శ్రీ చవాన్ దేశం మొత్తానికి ఏ మేరకు వనరులు సమకూర్చగలరనే విషయం పైన అది ఆధారపడి వుంది. అవసరమైన వనరులు చిటికలో సమకూర్చి పెట్టడానికి ఆయన వద్ద మంత్ర తంత్రాలు యేవీ లేవు గదా!

ఇందుకు రాష్ట్రం యావత్తు వనరులనూ సమీకరించవలసి వుంటుంది. అభివృద్ధి విషయంలో అసమానత తొలగించడానికి సాధారణంగా ఈ విధానమే అనుసరింపబడుతున్నది. ఇందుకొరకు కేంద్ర ప్రభుత్వం చేతనైనంత సహాయం తప్పకుండా చేస్తుందని నేను భావిస్తున్నాను.

శ్రీ ఫ్రాంక్ ఆంథోని అల్పసంఖ్యాక వర్గాలు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు గురించీ వారికి రిజర్వేషనులను గురించీ మాట్లాడారు. ఎన్ని రిజర్వేషనులు చేసినా కూడా యెంత చేయాలని ఆశించామో, అంత జరుగలేదనేది సత్యమే. ఇంకా యెన్నో ప్రతిబంధకాలు వుండనే వున్నాయి.

జాతీయ దృక్పథం

పార్లమెంటు జాతి అభీష్టాన్నీ, సంకల్పాన్నీ ప్రతిబింబింపచేస్తుంది. ఒకానొక పరిస్థితిలో మంచి చెడుగులను పరిశీలించడమే కాకుండా, జాతీయ దృక్పథంతో సమస్యలను పరిశీలించడం కూడా పార్లమెంటు కర్తవ్యమై వుంది. శ్రీ చవాన్ ఈ విషయాన్ని నొక్కి చెప్పారు. నేను కూడా దీన్ని మరొకసారి చెప్పదలచాను. ఇక్కడ వున్న మనందరమూ ఆయా నియోజకవర్గాల నుంచి ఎన్నిక అయ్యాం. అయితే అలా ఎన్నికై ఈ సభకు వచ్చినపుడు కేవలం ఏదో ఒక చిన్న ప్రాంతానికి ప్రతినిధులమని గాక, యావద్భారత దేశానికి, సమస్త భారతీయులకు ప్రతినిధులమనే విషయం గమనించాలి. కనుక ప్రతి విషయం ఈ దృక్పథంతోనే పరిశీలించవలసి వుంటుంది.

తెనుగుజాతి ప్రాచీన సంస్కృతి

భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగంలోని ప్రప్రథమ అనుచ్ఛేదం ఉద్ఘాటిస్తున్నది. ప్రతి రాష్ట్రానికి చిరంతనమైన సాంస్కృతిక చారిత్రిక సంప్రదాయం వుంది. ప్రతి రాష్ట్రమూ ప్రత్యేక రీతిలో రాజకీయంగా అస్థిత్వాన్ని సంతరించుకొన్నది. ఆంధ్రప్రదేశ్ వేలాది సంవత్సరాలుగా ఉత్కృష్టమైన సంస్కృతి గల సీమగా పేరుపొందింది. ప్రాచీనకాలపు బౌద్ధగ్రంథాలలో ఆంధ్రుల ప్రస్తావన వుంది. ఆంధ్రప్రదేశ్‌లో యిప్పుడున్న ప్రాంతాలన్నీ గతంలో ఒకప్పుడు చాలాకాలంవరకు ఒకే పరిపాలన క్రింద ఉన్నాయి. కాబట్టి ఒకే పరిపాలన క్రింద లేని ఏదో ఒక కాలాన్ని మాత్రమే పరిశీలిస్తే ఉపయోగం లేదు.

విశాలాంధ్ర

తెలుగు ప్రజల ఈ సుదీర్ఘమైన చరిత్ర తమకు సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కావాలని దశాబ్దాల తరబడి తపించి పోరాటం సాగించడానికి వారిని ఉత్తేజపరిచింది. ఈ సందర్భంలో నా స్వానుభవాన్ని గురించి మీకు చెప్పదలచాను. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం నివేదిక ప్రకటించబడడానికి పూర్వం దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంతాలలో నేను పర్యటించడం తటస్థించింది. అప్పుడు ప్రజలందరూ ముక్తకంఠంతో "విశాలాంధ్ర" కాంక్షిస్తూ చేసిన నినాదాలు యిప్పటికీ నా చెవుల్లో మారుమ్రోగుతూ వున్నాయి. హైదరాబాదు రాష్ట్రాన్ని యథాతథంగా వుంచాలనే కొందరి ప్రతిపాదన వీగిపోయి యావత్తు తెలుగు ప్రజల అభీష్టమే నెరవేరింది. శ్రీ ఫ్రాంక్ ఆంథోని దీర్ఘోపన్యాసం చేశారు. ఇంతకుముందు కొన్ని సందర్భాలలో, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులోగల పెద్ద లోపాలను గురించి ఆయన మాట్లాడారు. మన జాతీయ జీవితంలో భాగంగా కొన్ని విషయాలున్నాయి. జాతీయోద్యమంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల సమస్య ఒక భాగంగా వుండిన విషయం వాస్తవమే. దీని నుంచి తప్పించుకొనే ప్రశ్నలేదు. అప్పుడున్న పక్షాలలో ప్రతిదానికి అప్పటి రాష్ట్రాలు విభిన్నంగా ఉండినప్పటికి భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదిక పైననే ప్రాంతీయ విభాగాలు ఏర్పటయ్యాయి.

భాషారాష్ట్రాలు హేతుబద్ధమైనవే

మన రాష్ట్రాలు హేతుబద్ధమైన పద్ధతిపైనే ఏర్పాటు అయ్యాయి. క్షణికోద్రేకాలకులోనై, హేతువాదం పునాదులను కదలించకుండా మనం జాగ్రత్త పడాలి. మొట్టమొదలు నేను చెప్పినట్లు ప్రజల మనోభావాలను కూడా మనం గమనించాలి. అయితే ప్రభుత్వం ఆవేశాలకు ప్రభావితం కావడం తప్పు. ప్రజలకు ఏది యెక్కువ శ్రేయస్కరమో మనం గమనించాలి. మన ప్రయోజనాలకుగాని లేక భారతదేశంలోని యితర భాగం ప్రయోజనాలకుగాని తెలంగాణా ప్రజల శ్రేయస్సును త్యాగం చేయాలని చెప్పడం లేదు. అయితే ఆ ప్రాంత ప్రజల శ్రేయస్సును ప్రభుత్వం ప్రశాంతంగా ఆలోచించి, వారికి ఏది శ్రేయస్కరంగా వుంటుందో పరిశీలించాలి.

తెలుగు ప్రజలు యధార్థవాదులని పేరెన్నికగన్నారు. దేశసేవాపరాయణత్వంలో సాటిలేని వారని కూడా కీర్తి ప్రతిష్ఠలు గడించారు. కోస్తా ప్రాంతంలోకాని, రాయలసీమలోకాని, తెలంగాణా ప్రాంతంలోకాని నివసించే తెలుగు ప్రజల్లో ఏ ఒక్కరు కూడా చివరకు ఆగ్రహావేశంతోనైనా, నిరాశతోనైనా, తమ రాష్ట్ర ప్రయోజనాలకూ, దేశ ప్రయోజనాలకూ భంగకరమైన చర్య ఏదీ తీసుకోరనే విషయంలో నాకు అచంచలమైన విశ్వాసం వుంది. ఇక్కడవున్న మిత్రుల ఉద్రేకాలను నేను అర్థం చేసుకోగలను. అక్కడ వస్తున్న పరిణామాలు, జరుగుతున్న విషాద సంఘటనలు బాధాకరమైనట్టివి. ప్రాణాలు కోల్పోయినవారి తల్లిదండ్రులకు వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నాను. ఈ విషయాన్ని మనం విశాలదృక్పథంతో అర్థం చేసుకోవలసిన అవసరం వున్నది. అయితే ఈ బిల్లు ఆ విశాలదృక్పథం గుర్తించి ప్రస్తావించడం లేదు. ఇది కేవలం పరిమిత లక్ష్యం గల బిల్లు. కాని గౌరవనీయ సభ్యులు యితర విషయాలను గురించి ప్రసంగించినందువల్ల నేను కూడా వాటిని గురించి ప్రస్తావించవలసివచ్చింది.

(ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ, యాత్రిక శాఖ, హైదరాబాదు, 1972)

చండ్ర రాజేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్‌ను విభజించినట్లయితే దేశమంతా విచ్ఛిన్నం కాగల ప్రమాదం

వేర్పాటువాద ఉద్యమంలో గల ప్రమాదాలు

ఆంధ్రప్రదేశ్‌లో వేర్పాటు ఉద్యమ సంక్షోభం ఫలితంగా ఉత్పన్నమైన ప్రమాదకర పరిణామాలు రోజు రోజుకీ స్పష్టం అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సంభవిస్తున్న పరిణామాలపట్ల మన దేశంలోని ప్రాంతీయ దురహంకార శక్తులు, అభివృద్ధి నిరోధక వర్గాలు సంతోషం వ్యక్తం చేయడమే కాకుండా, మరింత బిగ్గరగా అరుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను వెంటనే విభజించవలసిందిగా వారు కోరుతున్నారు. రాష్ట్ర విభజనకు అంగీకరించనివారు కూడా కొందరు వున్నారు. కాని, ప్రస్తుత తీవ్ర పరిస్థితుల్లో మార్గాంతరం లేదనే దృష్టితో వారు తమ అభిప్రాయాన్ని మార్చుకుని రాష్ట్ర విభజనను బలపరుస్తున్నారు.

జనసంఘం రాష్ట్ర విభజనను కోరుతూ బయటపడింది. ప్రత్యేక తెలంగాణా ఆందోళన సందర్భంగా 1969లో జనసంఘ్ "రాష్ట్రాల పునర్విభజనకు రెండవ కమిషన్" ఏర్పాటు చెయ్యవలసిందిగా యిచ్చిన పాత నినాదాన్నే ముందుకు తెచ్చింది.

దేశాన్ని సంక్షోభంలో ముంచే యత్నం

ప్రస్తుతం వున్న రాష్ట్రాలన్నింటినీ విభజించి, దేశాన్ని సంక్షోభంలో ముంచెత్తడమే వివాదంలోని అంతరార్థం. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును ప్రశ్నిస్తూను, ప్రజాతంత్ర పద్ధతులలో ఏర్పడిన ఆ రాష్ట్రాలను తిరిగి విభజించవలసిందిగా కోరుతూను, బడా పెట్టుబడిదారీ పత్రికలలో వ్యాసాలను ప్రకటిస్తున్నారు. అయితే యీ విధంగా వ్యాసాలు ప్రచురించడం కొత్తేమీ కాదు. భాషా సంబంధమైన, ప్రాంతీయమైన వివాదాలు ఏర్పడినప్పుడల్లా యీ సమస్యను లేవనెత్తి, భాషాప్రయుక్త రాష్ట్రాల స్థానంలో ఉమ్మడి రాష్ట్రాలను ఏర్పాటుచేయటం పరిష్కారమార్గమని తెలియజేస్తున్నారు. మౌలికమైన యీ సమస్యను వివరించడానికి ముందు, ఆంధ్రప్రదేశ్ విభజన బలపరుస్తూ చేస్తున్న కొన్ని వాదనలకు సమాధానం చెప్పవలసి వుంది.

కొన్ని కుంటి వాదనలు

పాత పంజాబు రాష్ట్రాన్ని పంజాబు, హర్యానా రాష్ట్రాలుగా విభజించిన దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌ను విభజించడానికి అభ్యంతరం ఎందుకని కొందరు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా అస్సాం రాష్ట్రం నుండి కచార్ ప్రాంతాన్ని విభజించడం న్యాయమని భావించినప్పుడు, ఆంధ్ర ప్రాంతాన్ని ఎందుకు విభజించరాదని మరికొందరి వాదన. పై రాష్ట్రాల విభజనలో భాషాపరమైన సమస్య ఇమిడి ఉన్న

దృష్ట్యా, వాటి విభజన సమంజసమే కాని, ఆంధ్రప్రదేశ్ విషయంలో మాత్రం ఆ సమస్య ఏమీ లేదు. ఉభయ ప్రాంతాల ప్రజలు ఒకే భాష మాట్లాడుతున్నారు. ఉభయ ప్రాంతాలలోను ఒకే సంస్కృతి వుంది. పాత పంజాబు రాష్ట్రంలో పంజాబీ, హిందీ రెండు భాషలు మాట్లాడే రెండు ప్రత్యేక ప్రాంతాలలో వున్న ప్రజలు భాషా ప్రాతిపదికపై రాష్ట్రాన్ని విభజించవలసిందిగా డిమాండ్ చేయడంతో పంజాబు, హర్యానాలుగా విభజించబడింది.

మన దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు క్రమంలో రాష్ట్ర విభజన చిట్టచివరిది. భాషాప్రయుక్త రాష్ట్రాల సిద్ధాంతానికి అనుగుణంగానే యీ ఏర్పాటు జరిగింది.

కచార్ సమస్య

కచార్ ప్రాంత విషయం. ఈ ప్రాంతంలో అత్యధిక సంఖ్యాక ప్రజలు బెంగాలీ భాష మాట్లాడేవారు. అయితే, కొన్ని చారిత్రక కారణాలవల్ల యీ ప్రాంతాన్ని అస్సాం రాష్ట్రంతో కలిపివుంచడం జరిగింది.

కొన్ని జిల్లాల్లోని తెలుగు మాట్లాడే ప్రజలు, అదే విధంగా కర్ణాటకలోని కొన్ని తహశీల్స్‌లో తెలుగు మాట్లాడే ప్రజలవలనే, వారు అస్సాంలోనే వుండేందుకు అంగీకరిస్తే, అందుకు బాధపడనవసరం లేదు. కాని కచార్ ప్రాంత ప్రజలు విభజన కోరితే, అందుకు అభ్యంతరం చెప్పనవసరం లేదు.

ఆదివాసి ప్రజలు, వారు నివసించే ప్రాంతాల సమస్యకు, భాషాప్రయుక్త రాష్ట్రాల సమస్యకు మధ్య మౌలికమైన భేదం వుంది. అయితే ఆ సమస్యని యిదే వ్యాసంలో స్థూలంగా వివరించడం సాధ్యంకాదు. ఈ సమస్యను ప్రత్యేక వ్యాసంలో వేరేగా వివరించవలసిన ఆవశ్యకత వుంది.

ఒకే భాషకు రెండు మూడు రాష్ట్రాలా?

ఆంధ్రప్రదేశ్ విభజనను బలపరుస్తూ మరో వాదన కూడా లేవనెత్తబడుతూంది. "హిందీ మాట్లాడే ప్రజలకు కొన్ని రాష్ట్రాలు వుండగా, తెలుగు మాట్లాడే ప్రజలకు రెండు, మూడు రాష్ట్రాలు ఎందుకు వుండరా"దని ప్రశ్నిస్తున్నారు. సిద్ధాంత ప్రాతిపదికపై ఆ విధంగా రాష్ట్రాన్ని విభజించడం అవసరమా? తెలుగు ప్రజలకు, మన దేశ ప్రయోజనాలకు ఆ విధంగా విభజించడం లాభకరమా అనేది ప్రశ్న.

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలను పెంపొందించి ఆర్థిక స్తంభనను సృష్టించాయి. పర్యవసానంగానే విస్తృతస్థాయిలో నిస్పృహ ఏర్పడింది. ప్రాంతీయ అసమానతలు ప్రాంతీయ విభేదాలను సృష్టించిపెట్టాయి. కాంగ్రెస్ అధికారం కోసం ఏర్పడిన ముఠాలు, తదితర అభివృద్ధి నిరోధక శక్తులు ప్రాంతీయ ఉన్మాదాన్ని రెచ్చగొట్టాయి. ప్రత్యేకవాదుల డిమాండ్‌కు యిదే మూలకారణం.

సమన్వయపూర్వక అభివృద్ధిలోనే తెలుగు ప్రజల ప్రయోజనాలు యీడేరతాయి. రాష్ట్రం అంతా ఒకే ప్రభుత్వం క్రింద ఉన్నప్పుడే అది సాధ్యం.

విభజనవల్ల అనేక కొత్త సమస్యలు

ఆంధ్రప్రదేశ్‌ను ముక్కలుగా విభజించడం వల్ల ప్రస్తుత సమస్యలు పరిష్కారం కాకపోగా, అనేక చిక్కు సమస్యలు ఏర్పడుతాయని, తద్వారా జాత్యహంకార, అభివృద్ధి నిరోధక శక్తులు వివిధ ప్రాంతాల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టేందుకు మరింత అవకాశం కలుగుతుందని మా దృఢమైన అభిప్రాయం. పర్యవసానంగా, ఐక్య రాష్ట్రంలో మాత్రమే సాధ్యమయ్యే సమన్వయపూర్వక, సమగ్రాభివృద్ధి పూర్తిగా నాశనమైపోతుంది. అందుచేత, తెలుగు ప్రజల ఐక్య రాష్ట్రాన్ని పరిరక్షించేందుకై మేం నిర్ద్వంద్వంగా పోరాడుతున్నాం.

దేశమంతా వేర్పాటు ఉద్యమాలు తలెత్తే ప్రమాదం

ఈ విచ్ఛిన్న వాదననే యితర భాషాప్రయుక్త రాష్ట్రాలకు కూడా వర్తింప చేసినట్లయితే వచ్చే దశాబ్దం వరకు మన దేశం యావత్తూ యీ వేర్పాటు వివాదాలకు సంబంధించిన ఊబిలోనే కూరుకుపోతుంది. ప్రస్తుతం వున్న రాష్ట్రాలు విచ్ఛిన్నం అయిపోతాయి. హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలు కూడా యీ వివాదాలకు లోనుగాకుండా వుండలేవు. అవి యింకా ముక్క చెక్కలైపోతాయి. ఈ అభివృద్ధి నిరోధక క్రమంలో వర్తమాన సమస్యలు – పేదరికం, నిరుద్యోగం, పెరిగిపోతున్న ధరల నుండి ప్రజల దృష్టిని మళ్ళిస్తారు. పర్యవసానంగా దేశ ఆర్థికాభివృద్ధి కార్యక్రమానికి స్వస్తి చెబుతారు. మన దేశాన్ని వెనుకబడిన దేశంగానే వుంచాలని కోరుకుంటున్న అమెరికా సామ్రాజ్య వాదులకు, తమ దొంగడబ్బును రక్షించుకోవాలని కోరుకొనే భారత ప్రజల రక్తాన్ని త్రాగే బడా పెట్టుబడిదారులకు, మన దేశ అభివృద్ధిని అరికట్టాలని, గత మూడు సంవత్సరాలుగా సాధించిన అభివృద్ధిని తిప్పికొట్టాలని వాంఛించే అభివృద్ధి నిరోధక శక్తులకు యిది సంతోషం కలగజేస్తుంది.

శ్రీ బి.వి. సుబ్బారెడ్డి బెదిరింపులు

"గతంలో ఎన్నడూ జరగని విప్లవం" అంటూను, "ప్రత్యేక ఆంధ్రను ఏర్పాటు చెయ్యకపోతే దేశం ఉత్తర–దక్షిణ ప్రాంతంగా రెండు భాగాలుగా విడిపోతుందని, ఆ విధంగా దక్షిణ భారతంపై ఉత్తర ప్రాంతం వారి పెత్తనాన్ని తొలగించుకుంటామ"ని ప్రత్యేకాంధ్ర ఉద్యమ అగ్రనాయకుడు శ్రీ బి.వి. సుబ్బారెడ్డి తరచుగా చేస్తున్న బెదిరింపులను మనం జ్ఞాపకం చేసుకోవాలి.

(ఆంధ్ర ప్రాంత లాయర్ల సమావేశానికి ముందు, జనవరి 24వ తేదీన కాకినాడలో బి.వి. సుబ్బారెడ్డి యిచ్చిన ప్రసంగం జనవరి 25వ తేదీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ ఎడిషన్ నుండి) ఈ దురహంకారపూరిత బెదిరింపులు డి.ఎం.కె. నాయకుల ప్రసంగాలకు ఎంతో సన్నిహితంగా వున్నాయి. ఇటీవల తీవ్రమైన సంక్షోభంలో పడిన తర్వాత, యిప్పుడు డి.ఎం.కె. నాయకత్వం తమ వేర్పాటు డిమాండును అస్పష్టంగా తెలియజేసింది.

డి.ఎం.కె. అడుగుజాడలు

జనవరి మొదటివారంలో పుదుక్కోటలో జరిగిన డి.ఎం.కె. జనరల్ కౌన్సిల్ సమావేశం చేసిన తీర్మానంలో "తమిళనాడుకు పూర్తి స్వపరిపాలన హక్కు యివ్వాలని, కేంద్రంలో సంయుక్త ప్రభుత్వం వుండాల"ని తెలియజేసింది.

"కేంద్రంలో సంయుక్త ప్రభుత్వం" అంటే, కేంద్రంలోని రాజకీయ పార్టీల మిశ్రమ ప్రభుత్వం కాదనీ, రాష్ట్రాల ప్రతినిధుల ప్రభుత్వమని శ్రీ కరుణానిధి ఆ తీర్మానాన్ని వివరించారు.

ప్రమాదకరమైన ఈ ఉద్దేశం యొక్క వివరాలను తెలుసుకోవడానికి, ఇందుకోసమై డి.ఎం.కె. ప్రభుత్వం నియమించిన రాజమన్నారు కమిటీ తయారు చేసిన నివేదికను చదవవలసిన అవసరం వుంది. దీనికి స్పష్టమైన అర్థం ఏమిటంటే, యితర దేశాలతో ప్రత్యేక సంబంధాలు పెట్టుకోడానికి హక్కులతో సహా రాష్ట్రాల ఫెడరేషన్ కాకుండా, కాన్‌ఫెడరేషన్ ఏర్పాటు చెయ్యాలని. మహత్తరమైన మన దేశాన్ని ముక్కచెక్కలు చెయ్యడానికి సామ్రాజ్యవాదులు యింతకంటే ఎక్కువ ఏం కోరుకుంటారు?

ఆంధ్రలో వేర్పాటువాదులెవరు?

అయితే, మన దేశ ఐక్యతకు ప్రమాదం ప్రస్తుతం ఏమీ లేదు కాని, యీ ప్రసంగాలను తేలికగా త్రోసిపుచ్చటం అంటే, అది మన దేశానికి ప్రమాదకరమే. ఇంకా ఇతర ప్రాంతీయ దురహంకార శక్తులు అదనుకోసం వేచివున్నాయి. సకాలంలో ఆ శక్తులను దెబ్బతీయకపోతే, మన దేశ ఐక్యతను కాపాడుకోగల పరిస్థితి వుండదు.

"ప్రజలు వేరుపడిపోతామని కోరినప్పుడు ఎందుకు విభజన చేయరు?" అని ఆంధ్రప్రదేశ్‌లోని వేర్పాటు ఆందోళన సందర్భంగా మరొక ప్రశ్న అడుగుతున్నారు. మధ్యతరగతులకు చెందిన అత్యధిక సంఖ్యాకులు, విద్యార్థులు, యన్.జి.ఓ.లు, తదితరులు, ప్రత్యేకించి ఆంధ్రప్రాంతంలోని నాలుగు సంపన్న జిల్లాల్లోని ఒక వర్గం రైతులు, తాము ఊహించుకున్న భయాందోళనలతో ఆందోళనలో కలిశారు.

వేర్పాటుకు శ్రామికవర్గాలు అనుకూలం కాదు

అయితే, యీ ప్రాంత జనాభాలోని అత్యధిక సంఖ్యాకులైన 50 శాతం మంది ప్రజలు వ్యవసాయ కార్మికులు, కార్మికులు, రైతాంగంలోని అత్యధిక సంఖ్యాకులు, జనాభాలోని యితర పేద వర్గాల విషయం ఏమిటి? భూస్వాములు, రైస్ మిల్లర్లు, గుత్త వ్యాపారస్తులు, ప్రైవేటు బస్సు యజమానులు, ప్రజల రక్తాన్ని పీల్చే తదితరులు యీ వేర్పాటు ఉద్యమానికి నాయకత్వం వహించి, ప్రభుత్వం కొద్ది ప్రమాణంలో చేసిన అభివృద్ధికర చర్యలను విచ్ఛిన్నం చేయడానికి కొనసాగిస్తున్న చర్యలను వారు గమనిస్తూనే వున్నారు. తమకు అవకాశం లభించినపుడల్లా వారు తమ వాంఛలను వ్యక్తం చేస్తూనే వున్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఏర్పాటు చేయబడిన ప్రదర్శనలు, ఊరేగింపులలో వారు వందల, వేల సంఖ్యలో పాల్గొంటూనే వున్నారు. వారు పూర్తిగా తమ సంఖ్యకు అనుగుణంగా బయటకు రాలేకపోవడానికి కారణం, అభివృద్ధి నిరోధక పార్టీలు జిల్లా పరిపాలనాధికారులు పూర్తి మద్దతులతో సమష్టిగా జరిపిన ఎదురుదాడివల్ల గుక్కతిప్పుకోలేకుండా పోతున్నారు.

మెజారిటీ శాసనసభ్యులు సమైక్యత కొరకే

ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుల విషయం తీసుకొనేటట్లయితే, నిర్ధాయకమైన మెజారిటీ సమైక్య రాష్ట్రాన్నే బలపరుస్తున్నారు. బలపరచవలసిందిగా దౌర్జన్యాలకు వేర్పాటువాదానికి గురిచేయబడిన అనేకమంది శాసనసభ్యులు మామూలు పరిస్థితులు ఏర్పడితే, సమైక్య రాష్ట్రానికి అనుకూలంగా తాము మాట్లాడగలమని కాంగ్రెస్ హైకమాండ్‌కు తెలియజేశారు.

ప్రజల భవిష్యత్తును నిర్ణయించేందుకు అటువంటి దురహంకార, విచ్ఛిన్నకర ఆందోళనలను జరపడమే ముఖ్యమైనట్లయితే, దేశంలో అనేక ప్రాంతాల్లో వాటిని తిప్పికొట్టేందుకు తగినంత అవకాశం వుంది. ప్రజల హీనపరిస్థితిని అవకాశంగా తీసుకొని వారి అసంతృప్తిని ప్రక్కదోవలు పట్టించడానికి ఏదో ఒక చిన్న అంశాన్ని కూడా కొండంతలు చేయవచ్చును. తద్వారా వారి అసంతృప్తిని జాత్యహంకార, విచ్ఛిన్న మార్గాలను పట్టించ వచ్చును. అభివృద్ధి నిరోధక స్వార్థపరశక్తులు, అభివృద్ధి నిరోధక పార్టీలు, ఉన్నతశ్రేణి నిరంకుశోద్యోగులు, నిరాశావాదులైన కాంగ్రెస్ నాయకులు కలిసి దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఇటువంటి తీవ్ర పరిస్థితిని సృష్టించవచ్చును. వీరిని విప్లవ మార్గంలోకి తీసుకుపోతున్నామనే సాకుతో మావోయిస్టు ఉగ్రవాదులు తాము వున్నచోటల్లా, తమ సహాయం అందచేయవచ్చును కూడా. ఆంధ్రప్రదేశ్‌లో సరిగా యిదే జరిగింది. కొన్ని వందల రాష్ట్ర ప్రభుత్వోద్యాగాలకు సంబంధించిన వివాదాన్ని యీ స్థాయికి తీసుకువచ్చి యించుమించు విచ్ఛిన్నానికి సంసిద్ధమైపోయారు.

సవాలును ఎదుర్కోవాలి

అభివృద్ధి నిరోధక శక్తులు, జాతీయ దురహంకార శక్తులు, అవకాశవాదులు కలసికట్టుగా జరుపుచున్న ఎదురుదాడి సవాలును రాజకీయంగాను, ఆచరణరీత్యాను కూడా ఎదుర్కోవలసిన అవసరం వుంది. సాధ్యం కాదనే సాకుతో, సాచివేతతో ఈ ప్రతీపశక్తులకు లొంగిపోరాదు.

జాతీయ స్థాయిలో, అదుపుతప్పిన స్థితికి వచ్చిన తరువాత విచారించి లాభం లేదు.

జనసంఘ్, తదితరులు లేవదీసే మౌలిక ప్రశ్నను యిప్పుడు పరిశీలించుదాము. జనసంఘ్ ఇపుడు ఆంధ్రప్రదేశ్ విభజనను గట్టిగా కోరుతోంది. అందుకు తలక్రిందులుగా ప్రయత్నిస్తూంది. రాష్ట్రాల పునర్విభజన ద్వితీయ కమిషన్‌ను నియమించాలని కోరుతుంది. జనసంఘ్ ఎల్లప్పుడు భాషా రాష్ట్రాలను వ్యతిరేకించుతూనే వచ్చింది. ఇటీవల పంజాబ్, హర్యానాలను ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పరచినప్పుడు దానిని వ్యతిరేకించింది. భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన దేశ ఐక్యతను బలహీనపరుస్తుందని జనసంఘ్ దృఢాభిప్రాయం. మన దేశానికి యూనిటరీ స్టేట్స్ (కేంద్రీకృత రాజ్యాంగం) వుండాలని జనసంఘ్ అధికార విధానం ప్రకటించుతుంది. దేశాన్ని భాషాప్రయుక్తంగా కాక పరిపాలనా ఆర్థిక వివరాల దృష్ట్యా నాల్గయిదు ప్రాంతాలుగా విడదీయాలట.

జనసంఘ్ విచ్ఛిన్నకర విధానాలు

కాని యిప్పుడు జనసంఘ్ చెబుతున్నదేమిటి? ప్రాంతీయతత్వాలు, ద్వేషాలు పెరిగిపోయిన నేటి వాతావరణాన్ని తన కనుకూలంగా వినియోగించుకోడానికిగాను ఒకే భాషా ప్రాంతంలోని వారిని ఒకరిపై ఒకరిని ఉసికొల్పుతూ, ఆయా భాషా రాష్ట్రాలను విచ్ఛిన్నం చేయడానికి తయారైంది. మరి తాను మొదటినుండి చెబుతూ వచ్చిన సిద్ధాంతానికి యిప్పుడు చెబుతున్నదానికి ఏ విధంగా లంకె కుదుర్చుతుందో తెలియదు.

చిన్న రాష్ట్రాల అధికారాలు తగ్గించి వాటిని నిర్వీర్యం చేసి, ప్రస్తుతం వున్న జోనల్ కౌన్సిళ్లను నిజమైన రాజకీయాధికారం చెలాయించే విధంగా ఏర్పరచడానికి జనసంఘ్ ప్రయత్నించవచ్చు.

కేంద్ర ప్రభుత్వంలో ఒకప్పుడు ఉన్నతాధికార పదవిలో వున్న శ్రీ హెచ్.వి.ఆర్. అయ్యంగార్ జనవరి 26వ తేదీన హిందూ పత్రికలో, ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంపై వ్రాసిన వ్యాసంలో సరిగ్గా జనసంఘ్‌లాగే తెలియజేశారు.

మాజీ ఐ.పి.ఎస్. పగటికలలు

భారతదేశంలోని రాష్ట్రాల మధ్య సరిహద్దులకు, భాషా ప్రాతిపదికపై కాకుండా మరింత హేతుబద్ధమైన ప్రాతిపదికపై పునర్నిర్ణయించేందుకు యిది సమయం అవునా కాదా ... గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుని, చరిత్ర గమనాన్ని సరైన విధంగా తిప్పడంలోనే వుంది అని ఆయన అన్నారు.

సర్వే సర్వత్రా గౌరవ ప్రతిష్టలు పొందిన గత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటుచేసే విషయంలో ఊగిసలాటకు లోనైందుకుగాను ఆయనకు "హామ్లెట్" అనీ, "పరస్పర విరుద్ధభావాల మధ్య దిక్కుతోచనివాడు" అని, యీయన నిందించాడు. ఈ ఐ.పి.యస్. నిరంకుశోద్యోగి, యావజ్జీవిత కాలమూ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గులాంగా వంగి వంగి సలాములు చేస్తూ పనిచేసిన బాపతు. ఈ పెద్దమనిషి గతాన్ని ఒకసారి గుర్తుచేసుకుని, ఆనాడు దేశంలో వివిధ భాషలు మాట్లాడే ప్రజలను కృత్రిమంగా కొన్ని రాష్ట్రాలలో కట్టివేసి వుంచి వారి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాభివృద్ధులను నిరోధించిన విషయం జ్ఞాపకం తెచ్చుకోవడం మంచిది. ఆ రోజులు ఎన్నటికీ తిరిగిరావు. ఈ కరుడుగట్టిన ఐ.పి.యస్. ఉద్యోగి కలలుగన్న విధంగా కడకు దేవుడు దిగివచ్చినా నేటి చరిత్ర గమనాన్ని అడ్డుకొట్టలేడు.

ఒకవేళ దురదృష్టవశాత్తు ప్రస్తుత రాష్ట్రాల విభజనే మళ్ళీ జరిగితే, అవి చిన్న రాష్ట్రాలుగానే వుంటాయే తప్ప ఉమ్మడి రాష్ట్రాలుగా తిరిగి ఎన్నటికీ కాజాలవు.

జాతీయ పోరాటంలో భాగం - భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన

మొదట కొంత తటపటాయింపులకు లోనైనప్పటికీ 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత శ్రీ నెహ్రూ ఒక నిజమైన ప్రజాతంత్రవాదిగా రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌ని నియమించడంలో తన ఔన్నత్యాన్ని ప్రదర్శించి 1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడేట్లు తోడ్పడ్డారు.

భాషా రాష్ట్రాలకు సంబంధించిన మరో విషయాన్ని ఇక్కడ ప్రస్తావించవలసి వుంది. భాషా రాష్ట్రాల కోర్కెలో యిమిడివున్న ప్రధానాంశాలు అత్యున్నత స్థాయిలో మాతృభాషలోనే విద్యాబోధన, ప్రాంతీయ భాషల్లోనే పరిపాలనా వ్యవహారాలు సాగించాలన్నవే. దీనితోపాటు మనదేశ ప్రజలలో దేశ సగభాగం మాట్లాడే హిందీని ఇంగ్లీషు స్థానంలో క్రమంగా మన దేశ సంధాన భాషగా ప్రవేశపెట్టాలని కూడా ఆశించడం జరిగింది. ప్రపంచంలోని ఒక ప్రధాన భాషగా ఇంగ్లీషు మన దేశంలో కొనసాగవచ్చు.

కాని 25 సంవత్సరాల స్వాతంత్ర్యం అనంతరం కూడా ఈ ముఖ్య అంశాలు యింకా అమలుజరగలేదు. దీనికి కారణం కాంగ్రెసులో వున్నవారితో సహా అభివృద్ధి నిరోధక, జాతీయ దురహంకార శక్తులే. వీరు ప్రజల అనుమానాలను రెచ్చగొట్టిన ఫలితంగా ప్రాంతీయ భాషలను యూనివర్సిటీల్లో బోధనా భాషలుగా ప్రవేశపెట్టడానికి వ్యతిరేకంగాను, హిందీకి వ్యతిరేకంగాను సమ్మెలు, సంఘర్షణలు, కొట్లాటలె జరిగాయి.

భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఎవరైతే వ్యతిరేకంగా ఉన్నారో ఆ శక్తులే యూనివర్సిటీలలో పరిపాలనలో ఇంగ్లీషు బోధనా భాషగా శాశ్వతంగా వుంచాలని గట్టిగా వాదించుతున్న శక్తులు. ఈ విషయంలో జనసంఘం అభిప్రాయం భిన్నంగా వుంది. ప్రాంతీయ భాషలు మట్టికొట్టుకుపోయినా సరే – కేంద్రంలోను, రాష్ట్రాలలో కూడా ఇంగ్లీషు స్థానంలో హిందీని పరిపాలనా భాషగా వెంటనే ప్రవేశపెట్టాలనీ, యూనివర్సిటీలో బోధనా భాషగా కూడా హిందీని ప్రవేశపెట్టాలని జనసంఘ్ వాదించుతోంది.

కర్తవ్యం

తాత్కాలిక అడ్డంకులు వచ్చినప్పటికీ ప్రాంతీయ భాషలకు రాష్ట్రాలలో వాటి సముచిత స్థానం అనగా పరిపాలనా భాషలుగా, బోధనా భాషలుగా అవి పొంది తీరాలి. దేశ సంధాన భాషగా హిందీ వుండాలి. మన దేశ ప్రజాతంత్ర పురోగమనానికి మన మహా దేశ ప్రజాసంస్కృతి మహోజ్వలంగా వికసించడానికి యిది ఎంతో అవసరం.

నేడు ఆంధ్రప్రదేశ్‌లో బయలుదేరిన వేర్పాటు ఉద్యమం ఒక్క ఆంధ్రప్రదేశ్ సరిహద్దులకే పరిమితమైన విషయం కాదు. ఆంధ్రప్రదేశ్ గనుక చీల్చబడినట్లయితే యిది ఒక గొలుసుకట్టు పరిణామంగా తయారై, ఇతర రాష్ట్రాలలో కూడా ఇదేరకం వేర్పాటు ఉద్యమాలు వ్యాపించుతాయి. అందుచేత దేశంలో వున్న ప్రజాతంత్ర శక్తులన్నీ ఎట్టి ఆలస్యం లేకుండా ముందుగానే మేల్కొనడం అవసరం.

(31-1-1973, విశాలాంధ్ర)

తెనుగుల వేషభాషలొక
తీరువి, వారి పరస్పరార్థవ
ర్తనముల వొక్క తీరువి వె
తల్ మురిపెమ్ముల వొక్క తీరులౌ
ర నరనరమ్ములన్ తరత
రమ్ములనుండి అనాది నైజమున్
ఘనముగ దాచుకున్నది, ఆ
ఖండముగా మహదాంధ్రి రెండునై.

పరిణతమైన సాంస్కృతిక
భారతమందు కళాపురోగతుల్
జరిగెడివేళ మా తెనుగు
చక్కదనా ఒయరి జాణవి
బ్బరపునడల గతమ్మునకు భావికి
వన్నెలు దిద్దగావలెన్

గురుతర కార్యభారమున
గ్రుంగెడి తిల్లికెదింగినట్టి కూ
తురువలె, నితనౌపనుల
తోడ్పడి మక్కువ నందగావలెన్

– అనుముల కృష్ణమూర్తి

కోదాటి నారాయణరావు

ఆంధ్రప్రదేశ్‌లో 20వ శతాబ్దంలో సాంఘిక పరిణామం

రాజా రామమోహనరాయలతో 19వ శతాబ్దపు మొదటి పాదంలో ఆరంభమైన ఆధునికయుగ సంఘసంస్కారోద్యమం 20వ శతాబ్దారంభం నాటికి వ్రేళ్ళుబోసుకొని ప్రాచీన సాంప్రదాయకత అనే జంఝూమారుతానికి తట్టుకోగలిగింది. వ్యక్తిగతంగా ఎందరో మహానుభావుల కృషి ఈ పరిణామానికి దోహదం చేసింది. అయినప్పటికి వ్యవస్థాపూర్వకంగా కృషి చేసిన మొదటి సంస్థ బ్రహ్మసమాజమేనని చెప్పవచ్చు. ఈ సంస్థకృషి సంఘంలో ద్విముఖంగా పరివర్తనను తీసుకు వచ్చింది. పారిశ్రామిక విప్లవం కారణంగా పాశ్చాత్యదేశంలో విలసిల్లిన నవ నాగరికతతో ఆకర్షితులై హిందూధర్మంలోని సంప్రదాయబద్ధతకు తట్టుకోలేకనో 19వ శతాబ్దపు ఉత్తరభాగంలో అనేకమంది విద్యావంతులు – చివరకు కులీనులు అనుకునేవారున్నూ క్రైస్తవమతం స్వీకరించడం మొదలుపెట్టారు. అట్టివారు అసలు క్రైస్తవ మిషనరీల కంటే ప్రమాదకరమైన దాడిని హిందూ ధర్మంపై చేసేవారు. బెంగాలులో తోరూదత్తాతో ఆరంభమైన క్రైస్తవ మత స్వీకారం బెంగాలుతో మాత్రమే ఆగిపోలేదు. దేశంలోని అన్ని ప్రాంతాలలోనికి ఎగబ్రాకింది. ఆంధ్రదేశంలోనూ అనేక మంది శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబీకులు క్రైస్తవమతంలో చేరిపోయారు. కాథలిక్ మిషనరీలు వేలాది రెడ్డి, కమ్మ కుటుంబాలకు క్రైస్తవ దీక్షనిచ్చారు. ఈ విధమైన మతాంతర స్వీకారాన్ని బ్రహ్మసమాజం కొంతవరకు ఆపగలిగింది. ఇట్లే పాశ్చాత్య ఆచారవ్యవహారాలను అనుకరించడానికి బ్రహ్మసమాజ ప్రవర్తన దోహదమిచ్చింది. ఇందువల్ల హిందూమతానికంటె ఆచారరీత్యా బ్రహ్మసమాజం క్రైస్తవమతానికే సన్నిహితమైనదనే ప్రవాదం కలిగింది. బ్రహ్మసమాజానికి జన్మస్థానమైన వంగదేశంలో సామాజికులలో వివిధ విషయాలపై భేదాభిప్రాయాలు కలిగి ఆ కారణంగా అనతి కాలంలోనే సమాజంలో చీలికలు వచ్చి అనేక శాఖలుగా విడిపోయింది. బ్రహ్మసమాజపు ప్రాతిపదికపైననే మహారాష్ట్ర దేశంలో మహాదేవ గోవింద రానడే ఆధ్వర్యంలో ప్రార్థనా సమాజం ఏర్పడింది. ఈ సమాజం పరిశుద్ధాస్తికత విషయంలో బ్రహ్మసమాజపు మూల సిద్ధాంతాన్ని ఇంకా ముందుకు కొనిపోయింది. ఆంధ్రదేశానికి సంబంధించినంత మట్టుకు ఈ ఉద్యమం రఘుపతి వెంకటరత్నం నాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులుగార్ల నాయకత్వంలో వ్యాపించింది. రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు పరిశుద్ధ అస్తికతకూ, భక్తికీ ప్రాధాన్యత నిచ్చారు. వీరేశలింగం పంతులుగారు సాంఘిక సంస్కరణకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. వీరి ఉభయుల కృషివల్ల ఆంధ్రదేశంలో ముఖ్యనాయకులందరి పైననూ బ్రహ్మమత ప్రభావము చాలాపడి సంఘసంస్కరణోద్యమము త్వరితగతిని పురోగమించడానికి కారణభూతమయింది. కాకినాడ, రాజమహేంద్రవరము, బందరు ఆనాడు బ్రహ్మమతకేంద్రాలుగా విలసిల్లినవి. హైదరాబాదు నగరంలోనూ

బ్రహ్మసమాజం కొంత వ్యాప్తి చెందింది. కాని దీని ప్రభావము ప్రజానీకంపై చాలా అల్పంగా పడింది. అది ఉన్నత విద్యావంతులైన కొన్ని కుటుంబాలమేరకే ఉండిపోయింది. మొత్తంమీద ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజోద్యమం ఫలితంగా స్త్రీవిద్య, బాల్యవివాహనిషేధమూ వితంతూద్వాహములు ప్రచారమైనవి. అస్పృస్యతా నివారణకై కొంత ప్రయత్నం జరిగిందికాని చెప్పుకోదగిన స్థాయినందుకోలేదు. స్త్రీలు ఆంగ్ల విద్యను అభ్యసించడమూ భోజన భాజనాలలో వర్ణవివక్షతలను వదలివేయడం ప్రచారంలోకి వచ్చాయి. బ్రహ్మసమాజ ప్రభావం సంఘసంస్కరణోద్యమానికి చాలా దోహదం చేసినప్పటికీ ప్రత్యక్షంగా సమాజం ప్రజలలో వ్యాపించలేదు. ఏదో విద్యావంతులైన కొన్ని కుటుంబాలలో అది పరిమితమయిపోయింది.

బ్రాహ్మ మత ప్రభావం హిందూధర్మంలో చాలా పరివర్తనకు కారణమైంది. బాహ్యాడంబరాలకు మూఢాచారాలకు ప్రాముఖ్యత తగ్గిపోయింది. ఉపనిషత్తుల అధ్యయనంలో శ్రద్ధ హెచ్చింది. పాండిత్య ప్రకర్షకూ, వాదోపవాదాలకూ దారితీసే ధర్మసూత్రాలకు క్లిష్ట వ్యాఖ్యానాలను వదలివేసి సరళమైన సూటి నిర్వచనాలను ఇచ్చే అలవాటు పండితులలో రాజొచ్చింది. విమర్శనాదృష్టి హెచ్చింది. ప్రచారము వ్యాప్తిచెందింది. సరళమైన భక్తిగీతాల రచనతో ఆరంభమై సాహిత్యంలో భావకవిత్వయుగానికి ఈ సమాజ ప్రభావం దారితీసింది.

భారతదేశంలో తూర్పు చివరను 19వ శతాబ్దపు పూర్వ భాగంలో బ్రహ్మసమాజోద్యమం మొదలైనది. పడమర చివరను అదే శతాబ్దపు ఉత్తరభాగంలో ఆరంభమైనది, ఆర్యసమాజోద్యమము. ఈ ఉద్యమమున్నూ స్త్రీ విద్యా, బాల్యవివాహ నిషేధమూ వితంతూద్వాహమూ, అస్పృశ్యతానివారణా మొదలైన సాంఘిక సంస్కరణలను తీవ్రంగా ప్రచారం చేసింది. అయితే బ్రాహ్మమతం లాగ పాశ్చాత్య ఆచారాలను అనుకరించ యత్నించలేదు. పైగా కాలానుగుణమైన కొద్ది మార్పులతో వైదిక సాంప్రదాయ పునరుద్ధరణకు కృషి చేసింది. ఆర్యసమాజమూ మతాంతరులను ఆర్యసమాజం ద్వారా హిందూధర్మంలో చేర్చుకోవడానికి అవకాశం కల్పించి కృషిచేసింది. ఈ ఆచారమే 'శుద్ధి ఉద్యమము" అనే పేరుతో ప్రఖ్యాతి వెలసింది. దీనిమూలంగా బలవంతంగా మతాంతరులైన హిందువులు మాతృదేశంలో తిరిగి ప్రవేశించడానికి అవకాశం లభించింది. సనాతన ధర్మపరాయణులున్నూ ఈ శుద్ధి ఉద్యమమువల్ల ప్రభావితులైనారు. శంకరాచార్యుల పీఠంవారొకరు పాశ్చాత్య వనితకు హిందూదీక్ష నివ్వడం జగద్విదితమే. ఆర్య సమాజం ప్రచారం చేసిన సాంఘిక సంస్కరణలు వ్యాప్తిచెందినప్పటికీ శుద్ధి ఉద్యమము రాజకీయ కారణాలవల్ల ముందుకు సాగిపోలేదు. ఆర్యసమాజ ఉద్యమ ప్రచారమూలంగా అస్పృశ్యతా నివారణ కొంత వ్రేళ్ళుపోసుకొన్నది. బాల్యవివాహ నిషేధమూ, వితంతూద్వాహాలూ ప్రచారమైనవి. సంస్కృతాధ్యయం పట్లా శృతి, స్మృతుల అధ్యయనంపట్లా శ్రద్ధ హెచ్చింది. హిందీవ్యాప్తికీన్నీ ఈ ఉద్యమమం తోడ్పడింది. హిందూ సంఘటనకూ జాతీయోద్యమానికీ పరోక్షంగా ఆర్యసమాజం దోహద మిచ్చింది. అయితే ఆర్యసమాజవ్యాప్తి తెలంగాణంలో ముఖ్యంగా నగర పరిసరాలలో ఎక్కువగా జరిగింది. ఆంధ్రదేశంలో దీని ప్రభావం చాలా తక్కువ.

మూడవ సంస్థ దివ్యజ్ఞాన సమాజము. ఈ ఉద్యమం పాశ్చాత్య దేశాలలో జన్మమెత్తి నప్పటికీ భారతదేశానికి దత్తపుత్రిక అయింది. ఇది సంఘసంస్కారానికి సహాయపడినప్పటికీ అధ్యాత్మిక సామరస్యతకూ హిందూవేదాంత ప్రాశస్త్యానికీ ఎక్కువ ప్రాముఖ్యమిచ్చింది. పాశ్చాత్య వ్యామోహాని కిది అడ్డు పెట్టక నిలిచిందని చెప్పవచ్చు. మేధావి వర్గంలో ఈ సమాజం వ్యాప్తి చెందింది. హైదరాబాదు సహా చాలా ముఖ్యపట్టణాలలో ఈ సమాజ శాఖ లేర్పడ్డవి. దివ్యజ్ఞాన సమాజము ఆంధ్రదేశానికి చేసిన మహోపకారాలలో మదనపల్లిలో నెలకొల్పిన జాతీయ విద్యాలయమూ అడయారులో నెలకొల్పిన కళాక్షేత్రమూ గణనీయమైనవి. వీటన్నిటితోపాటు రామకృష్ణ పరమహంస ప్రచారంలోనికి తెచ్చిన అద్వైతమతానికి కాలానుగుణ్యంగా రూపురేఖలు దిద్ది ప్రచారం చేసి వివేకానందస్వామి, స్వామిరామతీర్థ ఉద్బోధనలు, దేశంలో సంఘసంస్కరణకు చాలా ఉపకరించినవి.

రాజారామమోహనరాయలూ, ఈశ్వరచంద్రవిద్యాసాగరులు, హిందూసంఘానికీ నూతన దృక్పథాన్ని కలిగించడానికి చేసిన కృషిని బోలినకృషి 19వ వతాబ్దపు ఉత్తరభాగంలో సర్ సయ్యద్ అహమ్మదూ – ఆయన అనుచరులూ ముస్లిం సంఘములో చేశారు. వారి కృషికి ఒక రూపకల్పన అలీఘర్ విశ్వవిద్యాలయం. వారి కృషి ఫలితంగా పారిశ్రామిక విప్లవం మూలంగా పాశ్చత్య దేశంలో వ్యాప్తమైన నాగరికత భారతీయ ముస్లిములలో వ్యాపింప జొచ్చింది. దానివల్ల ముస్లిములలో పాశ్చాత్య విద్యావ్యాప్తి, మూఢాచారాల నిరసనా, ప్రబల జొచ్చినవి. దీని ప్రభావం హైదరాబాదు నగరంలోని ఉన్నత ముస్లిం కుటుంబాలపైన చాలా పడింది. తెలంగాణా ముస్లిం ప్రజానీకంలో ఈ సంస్కరణోద్యమం మందకొడిగానే చొచ్చుకుపోయింది. ఇతర ఆంధ్రదేశంలో ఈ ఉద్యమం వల్ల ముస్లిం సంఘంపై పడ్డ ప్రభావం చాలా అల్పమైనది.

ఇవన్నీ ఒక ఎత్తూ – రాజకీయాందోళనలు సంఘంలో తెచ్చిన పరివర్తన మరియొక ఎత్తు. పైన ఉదహరించిన సాంఘిక ఉద్యమాలూ – వ్యక్తుల కృషీ క్షేత్రాన్ని తయారు చేసి బీజావాపన చేయగా ఈ ఆందోళనలు మొక్కలను ఏపుగా పెంచి పెద్దచేసినవి. వందేమాతర ఆందోళనా, స్వదేశీ ఉద్యమమూ, జాతీయవిద్య, పరిశ్రమలూ, కళలూ మొదలైన వానిపట్ల మధ్యతరగతి ప్రజలకు అభిలాషను పెంపొందించింది. త్వరితగతిని ప్రగతిమార్గంలో పురోగమిస్తే గాని పాశ్చాత్యుల పోటీకి తట్టుకోలేమన్న భావం ప్రబలజొచ్చింది. ఈ భావన విద్యారంగంలోనూ ఆర్థికరంగంలోనూ మాత్రమే కాక సామాజిక రంగంలో ఎంతో అభ్యుదయాన్ని కలగజేసింది. పాశ్చాత్య దేశాలకు రాకపోకలు ఎక్కువైనవి. రష్యాపైన సాధించిన గెలుపుమూలంగా భారత ప్రజానీకానికి జపాను మార్గదర్శకమైంది. ఆత్మ విశ్వాసం రేకెత్తింది. ఈ అభ్యుదయాభిలాష కారణంగా సంఘ సంస్కారోద్యమం త్వరత్వరగా ముందుకు సాగింది. అయితే సాంప్రదాయవాదుల నిరోధం లేకుండా నల్లేరుపై బండివలె ఈ ఉద్యమం సాగిపోయిందని అనుకోరాదు. వందేమాతర ఉద్యమం ప్రభావం ఆంధ్రదేశం పైనా విశేషంగా పడింది. ఆంధ్రదేశంలో ఏర్పడ్డ జిల్లా మహా సభలూ ఈ ఉద్యమ ఫలితమేనని చెప్పవచ్చు. ఈ జిల్లా మహా సభలలో రాజకీయ సభలతో పాటు సంఘసంస్కారసభలుకూడా జరిగేవి. ఈ సభల కారణంగా సంఘసంస్కరణాభిలాషులు తరచు కలుసుకొని సాధక బాధకాలను చర్చించుకొని ఉద్యమాన్ని ముందుకు తీసుకపోయే అవకాశం కలిగింది.

ఆంధ్రదేశంలో తలయెత్తిన వివిధ కులసంఘాలు సంఘ సంస్కారోద్యమానికి చేసిన దోహదం కూడా తక్కువ మదింపు చేయవలసిందికాదు. వివిధ కుల సంఘాలు ఆయా కులాలలో ఆత్మగౌరవాన్ని రేకెత్తించినవి. విద్యాభిలాషను తీవ్రతరం చేసినవి. వీ టన్నిటి ప్రభావాన్ని యావత్తు సమాజంమీద సంస్కరణ దృష్ట్యా చూస్తే అనల్పమైన మేలే కలిగింది. దీంతోపాటే చినచిన్న విషయాలపై పట్టింపు కులద్వేషాలను రెచ్చకొట్టడము మొదలైన దుష్ఫలితాలు సంఘంలో కలిగి కొంత దుష్పరిణామాన్ని కలుగజేసినవి. కుల ఆచారాల విషయంలో కోర్టులకు వెళ్ళడం ఆ విషయాలను యూరోపియన్ జడ్జీలు పరిష్కరించడం ఈనాడు చూస్తే హాస్యాస్పదంగా కనుపిస్తుంది. ఈ సందర్భంలోనే జస్టిస్ పార్టీ ఏర్పాటువల్ల బ్రాహ్మణేతర సంఘాలలో కలిగిన చైతన్యాన్ని ప్రశంసించవలసి వుంది. దూరదృష్టితోనూ, రాజకీయంగానూ ఆలోచిస్తే జస్టిస్ పార్టీవల్ల కీడు కలిగినా సంఘసంస్కరణ పురోగమించడానికి ఈ పార్టీ కొంత దోహదం చేసిందని చెప్పక తప్పదు.

మొదటి ప్రపంచ యుద్ధం తన దుష్ప్రభావంతోపాటు సంఘసంస్కరణ విషయంలో త్వరిత పురోగమనానికి దోహదం కూడా చేసింది. సంఘంలో వెనుకబడ్డ జాతులవారు, నిమ్నజాతుల వారు సైనికులుగా చేరి ఇతరదేశాలు తిరగడం జరిగింది. కూపస్థ మండూకాలుగా ఉన్న వీరికి దేశాటన నూతన దృక్పథాన్ని కలిగించింది. ఈ జాతులకు సామాన్యంగా ఉండేదానికన్నా సంఘంలో స్థాయీ పలుకుబడీ హెచ్చింది. సైన్యంలో చేరి తిరిగివచ్చిన తర్వాత వారి ఆర్థికస్థితిలోనూ మార్పువచ్చింది. కొందరికి రావలసిన దానికంటె చాలా పెద్ద ఉద్యోగాలుకూడా దొరకడం సంభవించింది. ఇవన్నీ సంఘసంస్కారోద్యమానికి పరోక్షంగా దోహదం చేసినవి. పారిశ్రామికరంగం ఆర్థికవ్యవస్థలో ప్రాధాన్యత గడించడం ఆరంభించింది. అందువల్ల యాంత్రిక నాగరికతా ప్రభావం సంఘంపై త్వరత్వరగా వ్యాపింపజొచ్చింది. ఇందువల్ల సమాజ వ్యవస్థలోని మూలమట్టమే కదలసాగింది.

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసీముగియక మునుపే మహాత్మా గాంధీ నాయకత్వంలో సహాయనిరాకరణోద్యమం దేశాన్ని కదలించివేసింది. అప్పటినుండి రెండు పురుషాంతరాలకు పైగా గాంధీజీ నాయకత్వంలో కాంగ్రెస్ స్వాతంత్ర్య సంగ్రామాన్ని సాగించింది. నిర్మాణ కార్యక్రమం, గాంధీజీ ఉద్యమానికి మూలాధారం. ఆ నిర్మాణ కార్యక్రమం కేవల రాజకీయ ఉద్యమంతో సంతృప్తి పడక సర్వతోముఖమైన దేశ పునర్నిర్మాణానికి సంకల్పించబడింది. ఇందువల్ల అస్పృశ్యతా నివారణా, జాతీయవిద్యా, స్త్రీవిద్యా మొదలైన అనేక ఉద్యమాలు స్వాతంత్ర్యోద్యమంలోని అంతర్భాగాలుగా తలెత్తినవి. ఖద్దరువంటి పరిశ్రమద్వారా మూలనవున్న ముసలమ్మలు సైతం ఉద్యమంలోకి లాగబడ్డారు. బ్రహ్మాండమైన ప్రచారం మూలంగా సంఘంలో అపారమైన కదలిక ఒక్కుమ్మడిగా కలిగింది. జాతి, మత, లింగభేదం లేకుండా ప్రజానీకమంతా ఉద్యమంలో ఆహుతైనారు.

ఈ ఆందోళనంతా సంఘసంస్కరణను ముందుకు పరుగులు తీయించిందే. మూకుమ్మడిగా కారాగార ప్రవేశం జరగడం వల్ల జాతిమత భేదాలు భోజన భాజనాదులలో అవలంబించే కట్టుబాట్లు అంతర్ధానమై పోయినవి. ఈ యావద్భారతంలోని యీ పరిస్థితిలే ఆంధ్రదేశంలోకూడా ఈపరిస్థితే తగినంత ఉన్నత స్థాయిలో కొనసాగింది. ఈ ఉద్యమంలో పురుషులతోపాటు స్త్రీలు కూడా నాయకత్వం వహించి దేశాన్ని ముందుకు నడిపి ప్రతిష్ఠ కలిగించారు. అట్టివారిలో దువ్వూరి సుబ్బమ్మ, మాగంటి అన్నపూర్ణాదేవి, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, పోణకా కనకమ్మ, మూల్పూరి సుక్కమ్మ, గుమ్మడిదల దుర్గాబాయమ్మ మొదలైనవా రనేకులు ప్రఖ్యాతి గడించారు. పల్నాడు వంటి వెనుకబడ్డ ప్రాంతాల్లో పన్నుల నిరాకరణోద్యమం సాగిందంటే ప్రజాసామాన్యంలో కలిగిన సంచలనానికీ వికాసానికీ వేరే నిదర్శన మవసరంలేదు. ఈ సందర్భంలో గాంధీజీ నాయకత్వంలో సాగిన హరిజనోద్యమ ప్రభావం ప్రత్యేకంగా ప్రశంసనీయమైంది. ఎన్నోతరాలకుగాని సంఘంలో కలగని పరివర్తన ఈ ఉద్యమం మూలంగా ఒక దశాబ్దంలో జరిగింది.

తెలంగానాలో 1922 నుండి ఆరంభమైన ఆంధ్రోద్యమంలో సంఘసంస్కారోద్యమం ఒక ప్రత్యేక భాగం, స్వపంక్తి భోజనాలు సభలలో ఏర్పాటు చేయబడే వితంతూద్వాహాలు, రజస్వలానంతర వివాహాలూ అస్పృశ్యతానివారణ, స్త్రీ విద్యా మొదలైన సంఘసంస్కరణ విషయాలపై ఆంధ్రమహాసభల వేదికలపైన చర్చలు జరిగి అనుకూలమైన తీర్మానాలు జరిగాయి. ఈ ఉద్యమం ఈ విధంగా ఆరంభం నుండే తెలంగాణాలో సంఘసంస్కరణోద్యమానికి గట్టి పునాదులు వేసింది. ఇందుకు ఆంధ్ర పితామహులు వంద్యులు.

1930 వ సంవత్సరంలో గాంధీజీ యాజమాన్యంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో అసంఖ్యాకమైన యువప్రజానీకం చేరింది. అప్పటి నుండీ దేశంలో వామపక్ష ఉద్యమాలు తలెత్తినవి. వీరు కర్షక, కార్మిక ఉద్యమాలను సృష్టించి నడిపించారు. వివిధ శ్రామిక వర్గాలలో వర్గచైతన్నాన్ని కలిగించి పోరాటాలనూ సమ్మెలనూ నిర్వహించారు. వీటివల్ల ప్రాచీన సంఘవ్యవస్థ పగుళ్లుపాయ ఆరంభించింది. నాయకత్వం కొద్దిమంది విద్యావంతులైన వారి చేతులలో నుండి జారిపోయింది. కులీనులతోపాటు, ఆస్థిపాస్తుల స్థానమున్నూ ఉన్నత స్థాయినుండి దిగజారజొచ్చింది.

ఈ సందర్భంలో సంఘంలో కలుగుతున్న మార్పుల కనుగుణ్యంగా ప్రభుత్వ శాసనాలు ఏర్పరచడంవల్లకూడా సంఘ సంస్కరణకి కొంత ప్రోత్సాహం కలిగింది. ఈ విషయం తేలికగా చూడవలసిందికాదు. "పబ్లిక్ పాలిసీ" సంఘ సంస్కరణకు అనుకూలంగా ఉండడం ఎంతైనా ప్రోత్సాహానికి కారణమైనదని చెప్పవచ్చు.

1938 లో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. మొదటి ప్రపంచయుద్ధానికీ దీనికీ స్థాయిలో చాలా తేడావుంది. మానవుని నిత్యజీవితంపైన ఈ యుద్ధం మొదటి ప్రపంచ యుద్ధానికన్నా అనేక రెట్లుఎక్కువ ప్రభావాన్ని వేసింది. కాంగ్రెస్ యుద్ధవ్యతిరేక విధానం కమ్యూనిస్టుపార్టీ యుద్ధానుకూల విధానమూ పోటీపడి ప్రజాసామాన్యంలో చాలా లోతుకు వెళ్ళాయి. నాయకత్వపు పెనుగులాటలో సామాన్యపు ప్రజానీకాన్ని కూడగట్టుకరావల్సిన అవసరం ఏర్పడింది. శ్రామిక వర్గాల ప్రాధాన్యత హెచ్చింది. స్త్రీలూ, వెనుకబడ్డ తరగతులవారు ఉద్యోగాలలోప్రవేశించనారంభించారు. వెనుకబడ్డ తరగతులలో అభ్యుదయకాంక్ష వాయువేగంగా హెచ్చసాగింది.

స్వాతంత్ర్యానంతరం

భారతదేశం 1947లో స్వాతంత్ర్యం గడించింది. భారత ప్రజానీకం నూతన నిర్మాణానికి పూనుకొన్నారు. కాలగమనంతో పాతబడిపోయిన సాంఘిక వ్యవస్థ పెల్లలు పెల్లలుగా పడిపోతున్నది. ఇంకా నూతన సాంఘిక వ్యవస్థ స్వరూపం స్పష్టంగా కనిపించనప్పటికీ రూపురేఖలు కనిపిస్తూనే ఉన్నవి. ప్రణాళికలపై ప్రణాళికలు వేస్తున్నారు. కమ్యూనిటీ డెవలప్‌మెంటుకై కృషి జరుగుతున్నది. వీటన్నిటి ఫలితంగా గ్రామగ్రామాన విద్యాలయాలు నెలకొల్పుతున్నారు. పురుషులతో పాటు స్త్రీలుకూడా అన్ని రంగాలలో ముందుకు వస్తున్నారు. వ్యవసాయరంగంతో ఆరంభమైన విప్లవం అనతికాలంలోనే పారిశ్రామిక విప్లవానికి దారితీసింది. మనం వద్దన్నా కద్దన్నా పాశ్చాత్యనాగరికత పరుగులతో వచ్చి మనమీద దుమికి పడుతున్నది. ప్రాచీన భారత సాంప్రదాయంలోని శేషంకూడా కరగిపోతున్నది.

నేడు 20వ శతాబ్దారంభంలోవున్న సాంఘిక సమస్యలేమీ లేవు. స్త్రీకి విద్య కావాలా లేదా అనే మీమాంస కీనాడు తావులేదు. ఎక్కడో తప్ప రజస్వలాత్పూర్వ వివాహాలు అగ్రవర్ణాలలో జరగడంలేదు. వితంతు వివాహాలకెవ్వరూ అభ్యంతరం పెట్టరు, వరుడు దొరకని ఇబ్బంది తప్పితే. అస్పృశ్యత త్వరితగతిని అదృశ్యమై పోతూవున్నది. రాజకీయ ప్రయోజనాలకు తప్పితే వర్ణవ్యవస్థ ఎందుకూ కొరగాకుండా పోయింది. అంతర్వర్ణ వివాహాలు విరివిగా జరుగుతూ ఉన్నవి. రిజిస్ట్రేషను వివాహాలు ప్రాముఖ్యం వహిస్తున్నవి. స్త్రీలలోనూ పురుషులలోనూ స్వతంత్ర జీవనేచ్ఛ బాగా వ్యాపిస్తూన్నది.

ఈ పురోగమనంలో అన్నీ సత్ఫలితాలే కలుగుతున్నాయని చెప్పడానికి వీలులేదు. పాతసమస్యలు సమసిపోయినా అనేక నూతన సమస్యలు తలఎత్తినవి. జీవితంలోని అనేక అంశాలకు సంబంధించిన విలువలు తారుమారవుతూన్నవి. యంత్రిక నాగరికత మూలంగా పాశ్చాత్యదేశంలో ఏర్పడ్డ సత్ఫలితాలూ దుష్ఫలితాలూ కూడా మనదేశంలో వ్యాపిస్తున్నవి. పారిశ్రామిక విప్లవం తరువాత వచ్చిన చెడుగులకు నివారణోపాయాలను సాకల్యంగా ఆలోచించిన వారిలో గాంధీజీ అగ్రగణ్యుడు. ఆయన స్థూలంగానూ, సూక్ష్మంగానూ ఈ దుష్ఫలితాలను నివారించగల సాధనోపాయాలను సూచించారు. అయితే ఆయన తరువాత వాటిని ముందుకు సాగించగల సమర్థుడైన నాయకుడు ఎవరూ కనిపించడంలేదు. నెహ్రూజీ గాంధీజీకి రాజకీయవారసుడుగా మాత్రమే కనిపిస్తున్నాడు. ఈనాడు మనముందున్నదిఒకే ఒక సమస్య. పారిశ్రామిక విప్లవంమూలంగా పాశ్చాత్యదేశాలలోని సాంఘిక వ్యవస్థలో కలిగిన మంచిని మాత్రమే ఇముడ్చుకొని చెడ్డను పరిహరించగలుగుతామా? లేక లోకంతో పాటు కాలప్రవాహంలో కొట్టుకుపోతామా? అనేది మాత్రమే. మొదటిది చేతగాక రెండవమార్గాన్నే అనుసరిస్తే భారతీయ సంస్కృతీ ప్రాశస్త్యాన్ని ఇప్పటివలెనే ఎలుగెత్తి ప్రవచిస్తే లోకం మనను పరిహసిస్తుంది.

(శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయ స్వర్ణోత్సవ సంచిక - 1962)

"రాయిగ్రుద్దును" నీపురాశిల సంపత్తి
నమరావతీ స్తూప సముదయంబు;
"చదివించు" నీ మహాసామ్రాజ్య కథల నాం
ధ్రక్ష్మాపతుల జయస్తంభలిపులు;
"గళమెత్తిపాడు" నీగాన సౌభాగ్యమ్ము
రమణీయముగ త్యాగరాయకృతులు;
"వేనోళ్ళచాటు" నీవీర మాతృత్వమ్ము
పలనాటి వీరుల పంబకథలు;

"పల్లెవేయును" నీ వైభవ ప్రశస్తి
హోరుమంచును నేడు మా ఓడరేవు
బ్రతికి చెడియున్న నీ పూర్వ భాగ్యరేఖ
చెదిరిపోలేదు తల్లి ! మా స్మృతిపథాల

- జంధ్యాల పాపయ్యశాస్త్రి

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

జాతీయ సమగ్రత - విద్య

మిత్రులారా!

ఆంధ్రజాతీయ కళాశాల స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నందుకు ఎంతగానో సంతోషిస్తున్నాను. ఈ రోజున జాతీయ సమగ్రత గురించి చాలామంది మాట్లాడుతున్నారు. ఆంధ్రజాతీయ కళాశాల గురించి మీలో కొంతమంది విభిన్నంగా ఊహించవచ్చు. జాతీయ సమగ్రతకు భిన్నంగా మరో విధంగా భావించవచ్చు. ఈ రకమైన ఆలోచనలు పక్కన పెట్టినప్పుడు శ్రీ బిపిన్ చంద్రపాల్ ప్రోత్సాహం కారణంగా ఈ సంస్థ ఏర్పాటైనట్లు మీరు గ్రహించగలరు. రాజ్యాంగానికి రూపకల్పన చేసిన వారిలో ముఖ్యులైన శివస్వామి అయ్యర్, సి.పి.రామస్వామి అయ్యర్ వంటి దక్షిణాదికి చెందిన ప్రముఖులు ఈ కళాశాల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. చిత్రకళ విభాగాన్ని అభివృద్ధి చేసిన బెంగాలీ చిత్రకారులు ఈ సంస్థలో పనిచేస్తున్నట్లు మీకు తెలుసు. ఆంధ్రప్రాంతానికి చెందినట్లుగా కనిపించినప్పటికీ ఇది బహుముఖంగా విశ్వవ్యాప్తంగా కీర్తి గడించింది. అందువల్ల జాతీయ సమగ్రతకు ఇది అసలైన ఉదాహరణ.

తర్వాత ఇటువంటి సందర్భంలో ఈ సంస్థ అభివృద్ధికి ఎంతగానో కృషిచేసిన వారందరినీ మీరు గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది. త్రిమూర్తులుగా పేర్కొనవలసిన కోపల్లె హనుమంతరావు, పట్టాభి సీతారామయ్య, మట్నూరి కృష్ణారావులు, ఈ కళాశాలకు ప్రిన్సిపాల్స్‌గా పనిచేసిన వారు, ఇంకా ఇతరులు ఈ సంస్థ అభివృద్ధికి బహుముఖంగా కృషిచేశారు. వారందరూ నాకు తెలుసు. ఈ సంస్థ ప్రిన్సిపాల్స్‌గా పనిచేసి ప్రసిద్ధి చెందిన వారు కూడా నాకు తెలుసు. ముగ్గురు వ్యవస్థాపకులు కూడా నాకు వ్యక్తిగతంగా తెలుసు. కోపల్లె హనుమంతరావు వ్యవస్థాపక ప్రిన్సిపాల్. ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఎంతగానో ప్రోత్సహించారు. మీ అందరికీ తెలిసిన పట్టాభి సీతారామయ్యగారు జాతీయోద్యమంలో ప్రముఖపాత్ర వహించారు. స్వాతంత్ర్య పోరాటం జరిగే కాలంలోనూ స్వాతంత్ర్యానంతరం కూడా మనదేశానికి ఎంతోసేవ చేశారు. ముట్నూరి కృష్ణారావుగారు తన ఆధ్యాత్మిక దృక్పథంతో తెలుగు భాష అభివృద్ధికీ ఔన్నత్యానికీ ఎంతగానో కృషిచేశారు. ఈ సంస్థతో ఎంతో అనుబంధం కలిగిన ఈ ముగ్గురు వ్యక్తుల్ని తప్పనిసరిగా గుర్తుచేసుకోవాలి. ఈ రోజున మీరు సన్మానిస్తున్న నలుగురు ప్రిన్సిపాల్స్ ఈ సంస్థకు సేవ చేయడం ద్వారా తమ దేశానికి సేవ చేస్తున్నట్టుగా భావించవచ్చు.

జాతీయస్థాయిలో విద్యావ్యవస్థ గురించి కొంతమంది వ్యక్తులు మాట్లాడుతున్నప్పుడు నేనెప్పుడూ బాధపడుతుంటాను. విద్య అనేది జాతీయ స్థాయిలో జరగాలని నేను భావిస్తాను. ఆంధ్ర ఫిజిక్స్ అని,

తమిళ్ కెమిస్ట్రీ అని, గుజరాతీ కామర్స్ అని లేదా మహారాష్ట్రకు చెందిన మరొకటని ఎక్కడా లేదు. విజ్ఞాన శాస్త్రాలు విశ్వవ్యాప్తమైనవి. మనం ఒక అణు రియాక్టర్‌ను నిర్మించాలనుకున్నట్లయితే అది ఇండియాలోగానీ ప్రపంచంలో మరోచోటగానీ అదే శాస్త్ర పరిజ్ఞానం, అదే ఇంజనీరింగ్ నైపుణ్యం, అవే సాంకేతిక పద్ధతులు మనకు అవసరం. వీటి గురించి ఆలోచించినప్పుడు మన దేశంలోని సంస్థల్లో బోధించే శాస్త్ర విషయాలకు, వేరేచోట బోధించే శాస్త్ర విషయాలకు మధ్యతేడా ఏమీలేదు. అయితే జాతీయత అనేది ఒక ఉపదేశం, ఒక దృక్పథం, ఇంకా భావనలు, ప్రేరణలు మన విద్యార్థులకు కలిగించడానికి గల మార్గం. వీటిలోనే జాతీయతా భావం ఇమిడి ఉంటుంది. మనదేశం విషయానికి వద్దాం. ప్రెసిడెంటుగారు తమ ప్రారంభోపన్యాసాన్ని **అసతోమా సద్గమయా తమసోమా జ్యోతిర్గమయా, మృత్యోర్మా అమృతంగమయా** అనే పదాలతో ముగించారు. అది ఉపదేశమిస్తుంది. మన దేశానికి, ఇతర దేశాలకు మధ్యగల వ్యత్యాసాన్ని ప్రత్యేక దృక్పథంతో మన విద్యార్థులకు బోధించాల్సి ఉంది. ఇతర దేశాలకు గల ఆదర్శాలు అక్కడి ప్రజలను ఉత్తమ పౌరులుగా రూపొందిస్తాయి. మంచి నాగరికత గల వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయి. దేశభక్తిని, నియమిత క్రమశిక్షణను, విధేయతను పెంపొందిస్తాయి. ఇవన్నీ ఇతర దేశాల్లో బోధించే సుగుణాలు. ఇక్కడ మనం చెప్పాల్సింది మనం నివసిస్తున్న ఈ ప్రపంచంలో ఏది లేదో, ఏది అవసరమో తెలుసుకోవడం గురించి ఎలా వాటిని పొందాలో కాలాన్ని ఎలా అధిగమించాలో ,అదే సమయంలో మన జీవన విధానాన్ని ఎలా మార్చుకోవాలో తెలియజేయడం గురించి ఈ ప్రపంచం **'అసత్', 'తమస్', 'మృత్యు'** – అసత్యం, అంధకారం, చావుకు లోబడి పోవడం. ఇవన్నీ లేదా ఏదయినా సరే ఈ 'సంసార మాయ'ను ఎలా అధిగమించాలనేదే ప్రశ్న. ఈ సమాజ ప్రాకృతిక ప్రపంచాన్నంతటినీ ఉత్తేజ పరిచేది, సుసంపన్నం చేసేది, జ్ఞానాన్ని పెంపొందించేది, సన్మార్గంలో నడిపించేదీ అయిన పరమోన్నత అస్తిత్వ పదార్థం ఉన్నదనేదే దీనికి సమాధానం. అదే మనకు ప్రత్యేక దృక్పథాన్నిస్తుంది.

బుద్ధ భగవానుడు తాను మృత్యువును, వార్ధక్యాన్ని, రోగగ్రస్థులను చూశానని చెప్పాడు. అభౌతికానంద తేజోమయుడైన సన్యాసి ఒకరిని చూసి బుద్ధుడు 'ఎవరు నీవ'ని అడగగా ఆయన ఇలా అన్నాడు.

"హే నరపుంగవా! 'జన్మ మృత్యు భీతహి', 'శ్రమనహ,
పరివ్రాజితోస్మి, 'మోక్ష హేతొహో',

"హే నరపుంగవా" – ఓ మానవోత్తముడా; "జన్మ మృత్యు భీతహ" – జననానికీ మరణానికీ చిహ్నమైన కాల చక్ర భ్రమణ వలయానికి భయపడి; నేను ఋషిగా మారాను – నేను తపస్విగా మారాను – "పరివ్రాజతోస్మి" నేను పరివ్రాజకుడనయ్యాను; "మోక్షహేతొహో" అందువల్ల కాల నియంతృత్వం నుంచి నేను తప్పించుకోగలను. ఆ సన్యాసి బుద్ధుడికిచ్చిన సమాధానమిది. క్రైస్తవ మత గ్రంథాన్ని పరిశీలిస్తే "మృత్యువు నుంచి సమస్త ప్రజలనూ ఎవరు రక్షిస్తారు?" అనిపిస్తుంది. "ఇక్కడ నేను మృత్యువనే వస్త్రంతో కప్పబడ్డాను". "దాన్నుంచి తప్పించుకునే మార్గమేదైనా ఉందా?" అనేదే అసలు ప్రశ్న. దీనికి సమాధానమివ్వబడింది. "సమాధి ఖాళీగా ఉంది. ఆయన పునరుత్థానం చెందారు." అంటే అంతా మృత్యుమయమే కాదు. హేండోలిన్ యొక్క మెసయ్య ఇలా చెప్పాడు, "క్రిములు నా శరీరాన్ని నాశనం చేసినాగానీ నేను బలంగానే దేవుణ్ణి అన్వేషిస్తాను. ఈ శరీరం నశించవచ్చుగానీ, ఈ ప్రాపంచిక విషయాలన్నిటినీ ప్రేరేపించే ఒక అదృశ్య యదార్థ శక్తి ఉంది. అది నాకు తెలుసు." అది క్రైస్తవం కావచ్చు లేదా ఇస్లాం కావచ్చు, హిందూ మతం కావచ్చు లేదా బౌద్ధమతం కావచ్చు; ఈ సమాధానం ఇమిడి ఉన్న మార్గమదే. ప్రపంచానికి గల లోటు మనిషికున్న భావన మాత్రమే! యథార్థమే దాన్ననుసరించిన విషయం! మనం కాలాన్నుంచి తప్పించుకోవాలని కోరుకోం. మనం కాలాన్ని మార్చాలని కోరుకుంటాం. ఆ పరమ యథార్థ పదార్థాన్ని మనం పొందాలని కోరుకుంటే ఈ ప్రాపంచిక జీవన విధానం మారిపోతుంది. మత విశ్వాసం ముసుగులో మూఢనమ్మకం మీద మనమెప్పుడూ ఆధారపడకూడదు.

మనం హేతువాద మార్గాలలో పయనించాలి.

తపమంటే ఆలోచన అని పాణిని నిర్వచనం. లోచనం అంటే మీ మొదటి చూపు; ఆలోచన ఉంటే మీ రెండవ చూపు. మీరు దాన్ని చూడండి. ఇక్కడేమయినా ఉందేమో కనుగొనడానికి ప్రయత్నించండి. మీరు పొందిన మొదటి అనుభూతి, లేదా సాధారణ దృష్టి పరమోన్నతమయినదేనా? లేదా దానికంటే ఉత్కృష్టమైనది ఇంకా ఏదయినా ఉందా? అని పరిశీలించండి. దానికి సమాధానం పరమోన్నత సత్యం ఉందని వస్తుంది. ద్రవ్యరాశి, కాంతి, మనసు, జ్ఞానమనే దశల ద్వారా ప్రయాణిస్తే మీరు ఆనందమనే స్వేచ్ఛాలోకానికి చేరుకుంటారు. ఆత్మ అనేది ఉత్కృష్టమైన వాస్తవికత. మనిషి చేయాల్సింది విజ్ఞాన దశ నుంచి ఆనందమనే దశకు చేరుకోవడమే. జ్ఞాన సముపార్జన దశలో అతడు అనేక సందేహాలతో కలత చెందుతాడు. వైమనస్యంతో విడిపోతాడు. ఈ జీవితమేమిటనేదాన్ని అతడు అర్థం చేసుకోలేడు. అతడు సందిగ్ధంలో పడతాడు. బాధాకర పరిస్థితిలో విపరీత భావాలుగల వ్యక్తిగా మారతాడు. అదే అతడి స్థితి. ఆత్మానందం పొందే స్థాయికి మనిషి చేరగలిగితే అప్పుడతడు ఈ విధంగా చెప్పగలడు, "నేను ప్రపంచాన్ని జయించాను. ఎటువంటి కష్టాలు నన్నిక బాధించవు." అయితే మనకు మనమే మతపరమైన ఆలోచనలతో గడుపుతున్నాం. మనం కపట మతాభిమాన పూరితులం. మనం మతాలకు వెళ్తాం. మంత్రాలు చదువుతాం, చర్చిలకు, ఆలయాలకు, మసీదులకు హాజరవుతాం. కానీ, మనం పరిపూర్ణ మానవులుగా మారడానికి ఇవేమీ ఉపకరించవు.

జ్ఞానంతో దేవుడంటే ఏమిటో గ్రహించడానికీ ఆచరణాత్మకంగా పరమాత్మ వాస్తవ రూపాన్ని తెలుసుకోవడానికీ మధ్య వ్యత్యాసముంది. **'వాక్యార్థ జ్ఞాన మాత్రత్ న అమృతమ్'** – కేవలం వాక్యార్థాలను గ్రహించడం, వాటిని అర్థం చేసుకోవడం ద్వారానే పారమార్థిక సత్య స్వరూపం అంటే ఏమిటో మీరెప్పుడూ గ్రహించలేరు. జీవాత్మను గురించి తెలుసుకోవడానికి శ్రమతో కూడిన ప్రయత్నం అవసరం. మీ జీవాత్మ ఉన్నత స్థానానికి చేరుకుని స్థిరపడాలంటే... ఒక రకమైన వాస్తవ చిత్త స్థయిరాన్ని, ఆత్మానంద, హృదయ, మానసికానంద సంపదలు పొందాలంటే... మీ అహాన్ని చిత్రవధ చేసే పద్ధతిలో ముందుకు సాగాలి. అలజడులు, ఆందోళనలు, వైషమ్యాలు ఎన్నింటిని ఎదుర్కోవలసి వచ్చినప్పటికీ భద్రత

గల భవిష్యత్తులో మీరు నిలబడగలరు. అందువల్ల ఇంకా కొంత విషయ పరిజ్ఞానం పొందాల్సిన అవసరం ఉంది.

నిజమైన మతాభిమానంగల వ్యక్తి దేవుడి గురించి వాదించదు. అయితే యథార్థాన్ని గ్రహించి, తన వ్యక్తిత్వాన్ని నిలుపుకునేవాడే పరిపూర్ణ మానవుడు. ఋగ్వేదంలో ఇలా ఉంది – **'సదా పశ్యంతి సూరయః; తత్ విష్ణో పరమం పదం; దైవీవ చక్షుర తతమ్'** సాధుపుంగవులు సర్వోన్నతమైన దైవ సన్నిధికోసం ఎదురు చూస్తారు. 'పశ్యంతి' అనే మాట వాడారు. అంటే అది పూర్తిగా దేవుడి గురించి మాట్లాడమని కాదు; దేవుడికి ఎదురుపడడం, దేవుడితో అంతరంగికంగా మాట్లాడడం, అప్యాయతతో భాషించడం.

'వేదాహమేతమ్ పురుషమ్ మహాంతమ్;

ఆదిత్య వర్ణమ్ తమసాః పరస్తత్; అహం వేద.'

పరమోన్నత సత్యమంటే నాకు తెలుసు. నాతో నువ్వు వాదానికి దిగకు. ఒకవేళ అదొక వాదమయితే నువ్వు పడగొట్టగలవు. అయితే ఒకవేళ ఎవరయినా తన అహంతో పోరాడి వ్యక్తిత్వపు ఔన్నత్యాన్ని ముఖాముఖిగా చూసి తెలుసుకున్నది పరమోన్నత సత్యమని మీకు చెప్పినట్లయితే అదొక రకమైన కృష్ణార్జున సంవాదం లాంటిది. నరనారాయణులైన కృష్ణుడికి అర్జునుడికీ మధ్య– అంటే జీవాత్మకూ పరమాత్మకూ మధ్యగల సన్నిహిత సంబంధం. అంతరార్థం అదే! ఈ రకమైన పరమోన్నత సత్యాన్ని గ్రహించడం పైనే గట్టి ప్రయత్నం చేసినప్పుడు అటువంటి మనిషి మాత్రమే అసలైన మతాభిమానంగల వ్యక్తిగా పరిగణించబడగలడు. అంతేగాని, ఆచారాలతో, విధి విధానాలను పాటిస్తూ ధర్మనిష్ఠనూ, దైవభక్తినీ ప్రదర్శించేవారుగానీ సిద్ధాంతపరమైన విషయాలకు అనుగుణంగా వ్యవహరించే వారుగానీ కాదు. వారు అసలైన మతాభిమానంగల ప్రజలు కాదు. నిజమైన మతాభిమానం గల వ్యక్తి తన హృదయంలో భావనలు పొందాలి; తన వ్యక్తిత్వంలో భావనలు కలిగి ఉండాలి. అప్పుడే అతడు దైవత్వానికి దగ్గరవుతాడు. ఆ రకమైన వ్యక్తిగత అనుభవం లేనట్లయితే, అతడు అసలైన మతాభిమానం గలవాడు కాదు. మనం ఆ రకమైన విషయ పరిజ్ఞానం పొందిన వెంటనే మరొక పరిస్థితి తోడవుతుంది. మీకు అనుభవమైన విషయాన్ని మాటల్లో వివరించలేరు. మీరు ఎటువంటి నిర్వచనాలు ఇవ్వలేరు. మనం ప్రతి నిర్వచనాన్ని ప్రతి దైవత్వ భావాన్నీ గౌరవించాలి. ఆయన మరల **'మనసాసహ'** గురించి మీకు తెలిపారు. **'యతోవచో నివర్తంతి అప్రాప్య మనసాసహ'** – పరమోన్నత సత్యాన్ని ఎవరైనా సరే ఇంద్రియాల చేత, బుద్ధిచేత దర్శించలేరు.

బుద్ధభగవానుడు **'అనక్షరస్య ధర్మస్య సృతిర్కదేశ నాచిక పరధర్మం'** లేదా మాటలతో వివరించ శక్యంకాని సత్యాన్ని గురించి మనకు తెలిపాడు. గ్రంథాలెక్కడున్నాయి? ఉపదేశాలేవి? అందువల్ల మనం పరమోన్నత శక్తి గురించి చెప్పే ప్రతి వర్ణననూ గౌరవించాలి. దేవుడిని నిర్వచించే విషయాల గురించి మనం వాదులాడకూడదు. ఆ విషయాల గురించి మీరెలా మాట్లాడతారని ఉపనిషత్తు అంటుంది. అనేకమంది ప్రజలు దీన్ని వివిధ రకాలుగా రూపుదిద్దుతారు.

ఆ సర్వోన్నతుడు **'సదా జననమ్ హృదయే సన్నివిష్టా'–** ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లోనే ఉంటాడు; అయితే ఆయన ప్రతిరూపాలు **'హృద, మానిష, మానస'** – హృదయం, జ్ఞానం, మనసులచేత రూపుదిద్దబడతాయి. అవి వివిధ రకాలుగా ఉంటాయి. ఎందుకంటే మనం దేవుడికి సంబంధించిన ప్రతి వర్ణననీ అనుమతిస్తాం. "మీరు దైవనామాన్ని ఈ విధంగా ఆమోదించండి" అని మనం ఎప్పుడూ చెప్పలేదు. పరమోత్తమమైన లోకోక్తి మనకిలా తెలుపుతుంది. "మనం శైవులం. శైవమతానికి సంబంధించిన మంత్రం అంటే పంచాక్షరిని జపిస్తున్నాం. అయితే నా హృదయం గోపికల ప్రియుడి వెంట పరిగెడుతుంది." దీనికి సమాధానం ఇలా చెప్పారు – **మహేశ్వరోవ జనార్దనోవ న వస్తు భేద ప్రతిపత్తిరస్తి** – ఆయనను మహేశ్వరుడనీ లేదా జనార్దనుడనీ మీరు ఏ విధంగా పిలిచనప్పటికీ పరమోన్నత సత్యాన్ని అనుసరించి అసలైన భేదం ఏదీ లేదు.

మొదటిగా నేనొక విషయాన్ని గుర్తు చేయదలిచాను. జ్ఞాన సముపార్జనతో వివేకం గల స్థాయి నుంచి ఆధ్యాత్మిక స్థాయికి ఎదిగినప్పుడే మనిషికి పరిపూర్ణత కలుగుతుంది. పూర్తిగా మాటల వల్లనే ఇది విస్పష్టం కాదు. మీ స్వభావాన్ని పూర్తిగా మార్చుకున్నప్పుడు, స్వార్థాన్ని విడనాడినప్పుడు, సత్ప్రవర్తన కలిగినప్పుడు ఇది స్పష్టంగా తెలుస్తుంది. ఆ పరమోన్నత సత్యాన్ని ఏ విధంగానైనా వర్ణించవచ్చు. అందువల్ల ప్రతి ఒక్కరికీ వారి పద్ధతిలోనే బోధించడానికి ప్రయత్నించండి! నా మిత్రుడు శ్రీ వరదాచారి తానొక విశిష్టాద్వైతుడనంటారు. **'ఖండన ఖండ ఖాద్య'** గ్రంథకర్త వంటి గొప్ప అద్వైతుడు **'ఈశ్వరానుగ్రహ దేవపుంసం అద్వైత వసన'** అనే పదాలతో ప్రారంభించారు. అద్వైత వసనం ఈశ్వరానుగ్రహం నుంచి వస్తుంది (చప్పట్లు). మరో విధంగా చెప్పాలంటే, వ్యక్తిత్వ దైవత్వ సత్యాన్ని అద్వైతం గుర్తిస్తుంది. పరమోన్నతుడి అనుగ్రహం వల్లనే మనిషికి అద్వైతం వైపు మొగ్గు చూపాలనిపిస్తుంది. అంటే పరమేశ్వరుడి గురించిన భావనను అద్వైతం ఎప్పుడూ తిరస్కరించదు. ఆయనంటారు, "ఈశ్వరుడి అనుగ్రహం వల్లనే నేను అద్వైతం వైపు మొగ్గు చూపగలిగాను. అద్వైత వసనం ఈశ్వరానుగ్రహం వల్లనే కలుగుతుంది." అందువల్ల దైవనామాల గురించి వాదనకు న్యాయం చేకూర్చలేం.

మనది సెక్యులర్ వ్యవస్థ అనుకున్నప్పుడు దానర్థం మనకు కనీసం మతమంటే ఏమిటో తెలియదని కాదు. మనం మతాన్ని నమ్ముతాం. పరమోన్నతుడున్నాడనే సత్యాన్ని విశ్వసిస్తాం. దీనంతటికీ అర్థమేమిటంటే మనదేశాన్ని ఏ ప్రత్యేక మతంతోనూ గుర్తించకపోవడమే. అయితే ప్రతి మతాన్నీ, పరమోన్నతుడి వైపు మొగ్గు చూపే ప్రతి గౌరవనీయమైన ప్రయత్నాన్నీ మనం గౌరవిస్తాం, ఆదరిస్తాం కూడా! ఉపనిషత్తులు చెప్పేదీ, భగవద్గీత మనకు తెలియజేసేదీ, ఇంకా కబీర్, నానక్, గాంధీ, రామకృష్ణ, మీ మిత్రుడు... ఇక్కడ మీ పక్కన ఉన్న కాశీ కృష్ణాచార్య వివరించేదీ అదే! వారంతా చెప్పేది పరమోన్నత శక్తిపట్ల మన హృదయాల్లో భావనలు పెంచుకోవాల్సిన అవసరం గురించి! మీరు దానికి ఏ పేరు పెట్టినా ఫరవాలేదు. నేను సరిగ్గా చెప్పానా? (నవ్వులు) (సరే! సరే!) అందువల్ల మనం జాతీయ విద్య గురించి మాట్లాడుతున్నప్పుడు ఆ విద్యను ఒక ప్రత్యేక పద్ధతిలో అందించాల్సి ఉంటుంది. అంతా ఈ ప్రపంచమే కాదని భావించే విధంగా అందరినీ మీరు తయారు చేయాలి. అయితే, మనం ఈప్రపంచాన్ని నిర్లక్ష్యం చెయ్యాలని దానర్థం కాదు – **వివేకీ సర్వదా ముక్తహ కుర్వతో నాస్తి కర్తృ అలేపవాదా మశ్రిత్య శ్రీకృష్ణ జనకౌ**

యథా! కృష్ణుడు, జనకుడు పరమోన్నత శక్తిపై తమ చైతన్యాన్ని కేంద్రీకరించి ఈ ప్రపంచాన్ని మార్చిన విధంగా, మనం కూడా ఆ పరమోన్నత శక్తి గురించి చైతన్యాన్ని మనలో కలిగించుకుని ఈ ప్రపంచాన్ని మార్చడానికి ప్రయత్నించాలి. మీరేం చేసినాగానీ, శాశ్వతమైన పూర్వరంగంతో స్థిరమైన పద్ధతిలో చేయాలి. జాతీయ విద్యా విషయంలో ఈ దేశానికి సంబంధించిన ప్రత్యేక లక్షణాలు ప్రతిబింబించాలి. మొహంజాదారో, హరప్పాల కాలం నుంచి ఈ రోజు వరకు ఈ లక్షణాలు కొనసాగుతున్నాయి. భౌతికశాస్త్రం జాతీయ విద్యకాదు. రసాయన శాస్త్రం కూడా జాతీయ విద్యకాదు. అయితే మనం మన పిల్లలకు నేర్పే ఈ ప్రత్యేక విద్యా విధానం జాతీయత కలిగినది. దురదృష్టవశాత్తూ ఈ రోజున మన యువతీ యువకులు విద్యా సంస్థల నుంచి వారి మనస్సులలో అన్ని రకాల సమాచారాన్నీ నింపుకొని బయటకు వస్తున్నారు. లోపలి దిగంబరత్వంతో బాధపడుతున్నారు. అప్పుడప్పుడు బాధల్లోనూ, సమస్యల్లోనూ పడిపోతున్నారు. అందువల్లనే మానసిక రోగులుగా మారుతున్నారు. నరాల జబ్బులు పెరిగపోయాయి. చాలామంది ప్రజలు సర్దుబాట్లతోనే జీవిస్తున్నారు. ఇందుకు కారణాలను పరిశీలిస్తే ఖాళీ హృదయాలతోనే బాధపడడం అతి ముఖ్యమైన కాణం.

భారత జాతీయోద్యమానికి పునాది వేసిన మహానుభావుల ఆధ్వర్యంలో 50 సంవత్సరాల క్రితం ఈ సంస్థ ప్రారంభమైంది. వాళ్ళందరూ వెలుగులోకి రాకపోవచ్చు. వాళ్ళందరూ వేదికల పైకి రాకపోవచ్చు. తమ పద్ధతిలోనే వారు స్వాతంత్ర్య సముపార్జనకు కృషిచేశారు. ఎన్నో విరాళాలు అందజేశారు. వారి ఆదర్శాలను గుర్తుచేసుకొని, వారి కృషిని గ్రహించడం మనకెంతో అవసరం. వాటిని మన నిత్యజీవితంలో అనుసరించడానికి ప్రయత్నించాలి. ఈ ఉత్సవాలు ఆ రకమైన ప్రేరణను మీలో కలిగించగలిగితే... ధైర్య సాహసాలతో ప్రాణాలొడ్డిన వారి గొప్పతనాన్ని గురించి మీకు నమ్మకం కలిగించగలిగితే... **వీరభోగ్య వసుంధర –** ఈ ప్రపంచం ధైర్య సాహసాలు గల వ్యక్తుల వల్ల ఆనందకరంగా మారుతుంది. వారి త్యాగనిరతి భరతభూమి ఔన్నత్యాన్ని పెంచి, వారి గొప్పతనం, వారి గొప్ప ఆదర్శాలు మనకు గుర్తుండిపోతాయి. ఆ గొప్ప వ్యక్తుల త్యాగాలు, సంయమనంతోనే ఈ ప్రపంచం నిండి ఉందని గుర్తుచేసుకోవాలి. వాటిని మనం పాటించడానికి ప్రయత్నించాలి. మీరు శత వార్షిక ఉత్సవాలు నిర్వహించేటప్పుడు ఈ సంస్థ కొత్త విషయాల్ని అమలు చేసినప్పుడు ఎంతో ఎదుగుదల ప్రదర్శితమవుతుంది. మృత శరీరాలు ఏ మాత్రం మారవు. జీవమున్న ప్రతి వాటిలోనూ మార్పు కనిపిస్తుంది. ఎంతో మంది గొప్పవ్యక్తుల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సంస్థ, త్యాగనిరతి గల వ్యక్తులు పనిచేసిన ఈ సంస్థకు గొప్ప భవిష్యత్తు ఉందని నమ్మకంగా చెప్పవచ్చు. శత వార్షికోత్సవాలలో మనలో చాలామంది ఉండకపోవచ్చు. కానీ ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతాయి.

అందరికీ ధన్యవాదాలు!

(మచిలీపట్నం ఆంధ్ర జాతీయ కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా
1961 ఆగష్టు 3వ తేదీన అప్పటి భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన అధ్యక్షోపన్యాసం)

వానమామలై వరదాచార్యులు

తెలుగుఁబడి

బడి యొక గుడియే. గుడియు నొక బడియే. జిజ్ఞాసువులకు నాత్మహిత చింతన గలవారికి బడియే గుడివలె సేవ్యమైయొప్పుననుటలో నతిశయోక్తిలేదు. గురుదేవుడే దేవుడై పూజార్హుడగు ననుటలో సందేహించవలసినపనిలేదు. గుడిలో జ్యోతిని వెలిగించెదరు. బడిలో జ్ఞానజ్యోతిని వెలుగించెదరు. గుడిలో గుగ్గిలముతోనో, కుసుమములతోడనో సువాసనలు గుబాళించును. బడిలోని వాతావరణము సద్విషయ వాసనలు గ్రమ్ముచుండును. గుడిలో గంగానీరము, బడిలో విజ్ఞానసారము ప్రసాదించెదరు. ఈ రెండును పదములనుండియే యుద్భవమొందునది. గుడిలో దేవుని పదములు శిరోధార్యములు. బడిలో భాషాయోషా పదములు తల ధరించవలెను. అవి పరమార్థమును కృపచేయును. ఇవి శాస్త్రార్థమును ప్రసాదించును. గుడిలోని దేవుడు మౌని, బడిలోని దేవుడు జ్ఞానియై మనమడుగు ప్రశ్నములకుత్తరములచెప్పుచు మాటాడును. మన యజ్ఞానమును వేటాడును. బడిలో వివేకము రావలెను. గుడిలో దేవునిలో సమైక్యముగావలెను. దేవునికన్నులలో సూర్యచంద్రులు ప్రకాశించెదరు. గురుదేవుని దయాదృష్టిలో వివేక దివాకరులు కళానిధులు వికాసముజెందెదరు. వీరు స్వయముగా ప్రకాశించి ప్రపంచమును ప్రకాశింపజేయుదురు. ఇది గుడికిని, బడికిని నలరారు అవినాభావ సంబంధము.

గుడికి పళ్లెము, బడికి పలకా

గుడికి పూజా పళ్ళెరములు, బడికి పలకా బలపములు కొనిచనవలసియుండును. పలకలు విద్యార్థుల మేధస్సులనెడి రత్నాలను పలకలుగా తీర్చి దిద్దగలుగు శాణఫలకములు. బలపములు వృక్షాదన కల్పములై విద్యార్థుల చేతనములనుత్తమ శిల్పములుగా మలచగలవు.

గుడికి పత్రపుష్ప ఫలతోయములగొని చని దేవుని కర్పించవలసియుండును. బడికిగూడ జిహ్వాపత్రమును మనస్సుమమును జ్ఞాననేత్రముతో పాటు మూడు కన్నులుగల శిరోనారికేళమును కొంత జీవనమును గురుదేవున కర్పించవలసియుండును. అపుడే జ్ఞానసంపద లభించును. దేవుఁడు కార్యసిద్ధినిచ్చును. గురుదేవుడు సకల శాస్త్రములు సాధించగలిగిన బుద్ధిని కృపచేయును. ఇది బడిలో సంప్రప్తమగు ప్రయోజనము. ఇంతటి ప్రయోజనములు సిద్ధించుట చేతనే గురువును దేవుడని భారతీయుడు సేవించినాడు. గురువును బ్రహ్మయని విష్ణువనియు, శివుడనియు భావించి పూజించినాడు. "ఆచార్య దేవోభవ" అన్నాడు. ఆనాడు బడినే గురుకులమన్నాము.

ఆనాటి గ్రామములు గణములని వ్యవహరింపబడుచుండెడిది. ఒక్కొక గణమునకు నొక్కొక గురుకులముండెడిది. ఉపనీతులైన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యాది వటువులు తామీ గురుకులముల విద్య

నభ్యసించుటకై వచ్చువారు. వారికి ఉపనయన సంస్కారము జరుగు వయస్సు "గర్భాష్టమే ప్రకుర్వీత, బ్రాహ్మణస్యోపనాయనమ్ గర్భాదేకాదశోరాజ్ఞో గర్భాత్తుత్వాదకేవిశః" అని చెప్పబడినది. అది వారికి విద్యారంభవయస్సు. బుద్ధున కైదవయేటనే ఉపనయనమైనట్లు జాతక కథలవలన తెలియుచున్నది. విద్యారంభమునకు పర్వదినములు గ్రహణకాలములు, నదీపుష్కరదినములు శుభములుగానెంచెడివారు.

కుటీరములు-వృక్షచ్ఛాయలు

ఆదిలో ఋషులు తమ యాశ్రమ కుటీరములలో మరియు నదీతీరముయందు వృక్షచ్ఛాయలలో గురుసన్నిధిలో శాస్త్రములనభ్యసించుచుండెడివారు. ఆనాడు బ్రహ్మవిద్యయే విద్యగా పరిగణింపబడెడిది. వేదాధ్యయనము సాంగోపాంగముగా నేర్పెడివారు. తదితర శాస్త్రములను నభ్యసింపబడుచుండెడివి. ఆనాటి విద్యార్థి బ్రహ్మచర్యాశ్రమవాసియై యా విధులను పాటించుచు విద్యనభ్యసించువాడు. రాజకుమారుడైన విద్యార్థియైనను "చరేద్భైక్షం యధావిధి"యని మనుశాసనానుసారము భిక్షాన్నమునుదిని ఆశ్రమ నియమముల పాలించుచు విద్యనేర్వవలసినదే. భిక్షాటన పద్ధతిచే విద్యార్థికి వినయసంపత్తి, సహనము, సమదృష్టి యలవడుట సహజము. విద్యార్థి వైవాహిక సుఖములకాసించరాదు. విద్యార్థులందరికి నొక నిర్ణీతమగు వేషముండును. ఒక కౌపీనము దానిపై మోకాలివరకు వ్రేలు అడ్డకట్టుకునున్న ఒక ధోవతియను నొక అంగవస్త్రము నడుమునకు పటకావంటి యొక మేఖలయు, కరమున నొక పాలాశ దండమును గోష్పాద పరిమిత శిఖయు గలిగియుండవలెను.

విద్యార్థి బ్రాహ్మీ ముహూర్తములోనే నిద్రమేల్కొని కాలకృత్యములు దీర్చికొని స్నాన సంధ్యానుష్ఠానముల నిర్వర్తించుకొని శుచిగా నుండవలెను. గురుసేవ నొనర్చుటలో నితడు దేహకష్టమున కలవాటుపడియుండును. ఇతడు సమస్త శాస్త్రములకును సాధకమైన శిక్షా వ్యాకరణాదుల ప్రథమమున నభ్యసించును. ఆనాడు విద్యాభ్యాసములో వ్రాతపద్ధతి చాల తక్కువ.

పువ్వులు లేకుండ ఫలములు...

సకలశాస్త్రములు కంఠస్థములై యుండవలసినదే. ఈ శాస్త్రముల గురుముఖముగా శ్రవణముచేసి మననముతో దానిని తనదిగా చేసికొని విద్యార్థి పుస్తక విద్యపై యాధారపడియుండక మస్తక విద్యయే గ్రంథముగా భాసించువాడు. ఈ చదువు ఏ మఱ్ఱివృక్షములక్రిందనో ఏ రావిచెట్ల నీడలోనో చెప్పెడివారు. ఈ వృక్షములు పూలు పూయకుండనే ఫలదశకు ప్రాప్తించు స్వభావము గలవి. ఇట్లే విద్యార్థికూడా త్వరితముగా ఫలదశను పొందవలెననియో, లేక వాసనా భరితమైన పూవువంటి కామనాన్వితమైన మనస్సుతో సంబంధమువీడి నిష్కామ కర్మఫలసిద్ధిని బొంది ప్రజాసేవ చేయుటకు వారి విద్య అవసరబడవలెననియో వీరి యాశయమై యుండును.

ఆనాటి గురుకులములకు, కులపతులు మహర్షులు. వీరు తపస్సిద్ధి వడసినవారు. చిత్తసంయమనము గల్గినవారు. ఆచార్య చర్యల ననుసరించు పిల్లలకు తామవి మార్గదర్శకములై యొప్పెడివి. ఆనాడీ గురుకులములలో స్త్రీలు కూడ నధ్యయనమొనర్చువారు. గార్గి, మైత్రేయి, మొదలగువారలిందుకు తార్కాణము.

స్త్రీలు బ్రహ్మవిద్యా పారంగతులై విద్వత్పరిషత్తులలో పాల్గొనుచుండెడి వారు. గార్గియను స్త్రీ ఒకానొకప్పుడు విద్వత్ పరిషత్తున కధ్యక్షస్థానము నలంకరించినట్లు తెలియుచున్నది.

ఆర్యులు చీలిపోయి యందొక శాఖ భారతదేశమునకు వచ్చినట్లు చెప్పబడుచున్నవి. ఆర్యుల యాగమనమునకు పూర్వమే భారతదేశములో నగరములున్నట్లు సింధులోయలో "మొహంజోదారో" "హరప్ప" మొదలగు పట్టణములే నిదర్శనము. మన దేశమున నాగరికత ఆర్యులకు పూర్వమేయున్నట్లు తెలియవచ్చును. రాజ్యములు రాజ్యాంగము, వర్తకము మొదలగునవప్పటినుండియే యేర్పడి దేశము సిరి సంపదలతో తులదూగుచున్నట్టు విదితమగుచున్నది. పై జెప్పిన గ్రామ గురుకులములేకాక నగరములోగూడ గురుకులము లారంభమై రాజుల పోషణలో నడుచుట జరిగినది.

నలంద, తక్షశిల

కొన్ని గురుకులములపై మహాగురుకుల ముండెడిది. ఇది యిప్పటి మన విశ్వవిద్యాలయమువంటిది. నలందా, తక్షశిల మొదలగునవీ కోవకు చెందినవే. ఇట్టి గురుకులములలో తక్షశిలయతి ప్రాచీనమైనది. ఇది భారత యుద్ధానంతరము స్థాపించబడినదనియు ఇందు జనమేజయుడు తాను "ఉపాంసువిద్య"ను నేర్చుకొన్నట్లు చెప్పుదురు. ఈ విశ్వవిద్యాలయములో సాంగోపాంగముగా వేదముల నభ్యసింపజేయుటేగాక రాజనీతి, దండనీతి, అర్థశాస్త్రము, ఆయుర్వేదము, గాంధర్వము, ధనుర్వేదము, గణితము మొదలగునవి నేర్పబడుచుండెడివి.

ఇవి చతుర్దశ విద్యలుగా విభజింపబడినవి. తక్షశిల మొదలగు నున్నత విద్యాలయములు ఉన్నత విద్యా పరిసమాప్తికి పనికివచ్చెడివి. విద్యాలయములో చేరుటకు వచ్చెడివారు "ఆచార్యభాగము" అని సహస్రనిష్క సంఖ్యావేతనము మొదటనే చెల్లించెడివారు. బీద విద్యార్థులు ధర్మాంతేవాసులుగా జేరువారు. వేతనము చెల్లించినవారు "ఆచార్య భాగధేయకులు" అనబడెడివారు.

పదివేల విద్యార్థులు

ఈ విద్యాలయములో సుమారొక్కొక్కశీయధ్యాపకుడు తాను 500 మంది విద్యార్థులకు పాఠము చెప్పువాడు. బీహారు రాష్ట్రములోని మోంగీరు జిల్లాకు చెందిన నలందా విశ్వవిద్యాలయములో 10,000 మంది విద్యార్థులుండేవారని 1500 మంది అధ్యాపకులు 1500 గదులలో వారికి

సకలశాస్త్ర పాఠములు చెప్పువారని తెలియవచ్చుచున్నది. వీరికి ఉచిత విద్య, ఉచిత భోజన వసతులు, ఉచిత వస్త్రములేర్పాటు గావించెడివారు. వీరు సుమారు పదిలేక పన్నెండు సంవత్సరములుండి యున్నతవిద్య పూర్తిజేసికొని ఇండ్లకేగువారు.

వీరిలో సర్వప్రథముడుగా నుత్తీర్ణుడైన విద్యార్థి నిలువెత్తు చిత్రమును విద్యాలయములోని యొక నిర్ణీత భిత్తికపై చిత్రించి యుంచెడివారు. ఉత్తీర్ణులైన వారికి రాగిరేకులపై చెక్కించి మహోపాధ్యాయ వ్యాకరణరత్న ఇత్యాది బిరుదములు యోగ్యతాపత్ర రూపములో నిచ్చేడివారు. దీనిని గుప్తవంశ రాజులు నందరాజులు పోషించెడివారని ప్రతీతి.

వేంగి విశ్వవిద్యాలయము

ఇట్టిదే యాంధ్రదేశములోని వేంగి విశ్వవిద్యాలయము. ఈ విశ్వవిద్యాలయములో విదేశములనుండి విద్యార్థులు వచ్చి చదువుచుండెడివారు. హ్యూంసాంగ్ అను చైనా యాత్రికుడును నలందా విశ్వ విద్యాలయములో కొన్ని సంవత్సరములు విద్యనభ్యసించినట్లు తెలియవచ్చును. పాణినివంటి మహామనీషులిందు శాస్త్రాభ్యాసమొనర్చినారందురు. గ్రామ విద్యాపీఠములలో సాహిత్యము చదివి అభిమాన శాస్త్రమును నేర్చుకొనుటకునై యీ విశ్వవిద్యాలయము కేగుచోముందు ప్రవేశ పరీక్ష దీసికొనెడివారు. ఆ పరీక్షలో నూటికి పదిమంది విద్యార్థులే ఉత్తీర్ణులగువారు. ఇందు వారు 12 సంవత్సరములు నిరంతరదీక్షతో చదివి ఉత్తీర్ణతనొంది స్నాతకులై కాశ్యాది పుణ్యక్షేత్రములకేగి లోకానుభవమునుగూడ సంపాదించెడివారు.

వీటిక్రింద పనిచేయునవి ఘటికాస్థానము లనబడెడివి. ఈ ఘటికలలో నుత్తీర్ణుడైనవాడు ఘటికుడని యనిపించుకొనును. ఘటికా విద్యాపీఠమునందలి ప్రధానాచార్యుని ఘటికా సామాన్యుడందురు. ఇందలి ఆచార్యులందరు ఋషితుల్యులును సధర్ములునై యుండెడివారు. ఈ విశ్వ విద్యాలయ ఘటికాదుల వర్ణనమును చైనా యాత్రికుడు వివరముగా తెలియపరచినాడు. ఈ విద్యాపీఠములు పండితుల కానాటి రాజులు అగ్రహారము లిచ్చెడివారు. అవి విద్యార్థులకును నధ్యాపకులకును భోజనవసతి సౌకర్యము లొనగూర్చెడివి. అవి లేని గురువులకు 1000 పైడి టంకాలు రాజకుమారులు మొదలగు ధనిక విద్యార్థులిచ్చువారని పైన నొకచో వివరింపబడినది. ఇవి యానాటి విశ్వవిద్యాలయముల మరియు ఘటికల సామాన్య స్వరూపము. ఆనాటి మన ధాన్యకటక విశ్వవిద్యాలయము దేశములో నాంధ్ర సంస్కృతి వికాసముల దశదిశల విస్తరింపజేసినది.

ఫారసీ- ఉర్దూ భాషలు

తదుపరి మొగలులు ఆర్యావర్తమును పరిపాలించుచు సుమారు ఐదు వందల సంవత్సరములు తమ సంస్కృతిని భాషను విస్తరింపజేసినారు. ఆనాడు ఉత్తర హిందూదేశములో ఫారసీ రాజభాషగా నుండుటచే మేధావులైనవారు రాజకీయ కార్యకలాప నిర్వహణార్థము తాము ఆ భాషను అభ్యసించ మొదలిడిరి. ఉత్తర భారతమున రాజధానియగు ఢిల్లీ పరిసర ప్రాంతములలోని ప్రజాసామాన్య భాష హిందీ మొగలాయిల (లష్కర్) సైనికులకు తప్పనిసరిగా నేర్వదగిన దగుట వారా భాషను తమ ఫారసీ అరబీ పదములతోనింపి తమ లిపిలోనే వ్రాయుట దానికి ఉర్దూ అనగా లష్కరీ భాషయని నామకరణమిడి వాగ్వ్యవహారమునందుంచిరి.

అది రానురాను అధికారభాషగా మారుటకు సదవకాశమును పొందెను. మొగలాయి చక్రవర్తులలో నొకడగు ఔరంగజేబు కాలములో దక్షిణ భారతమందలి యాంధ్రదేశమంతా నతని యేలుబడిలోనకు వచ్చినది. అతనిచే రాజ ప్రతినిధులుగా నియమింపబడిన యూసఫ్‌జాహీ వంశీయులు రాను రాను స్వతంత్ర రాజ్యప్రతిపత్తిని ప్రకటించుకొని క్రమముగా నుర్దూ రాజభాషగా నొనరించుటయు సంభవించినది.

ఆంధ్రదేశములోని తెనుగునకు వీధి బడులే గతియైనవి. అచ్చట తెనుగు తెలిసిన నొక యుపాధ్యాయుడు మాత్రము తానాంధ్రభాషను బోధించుచుండెడి వాడు. దీనికి తెనుగుభాషపై ప్రభుత్వాదరము సన్నగిలుటే ప్రబలకారణము.

ప్రతి గ్రామమునకు నొక వీధిబడి యుండెడిది. గ్రామాధికారులు వానిని పర్యవేక్షించుచు వాని నిర్వహణమునకు తోడ్పడుచుండెడివారు. ఉపాధ్యాయుడు తాను ప్రతి బాలునివద్ద నేదో కొంత ధనమును భృతిరూపముగా గ్రహించుచుండెను. ఆనాడు అగ్రకులజులనిపించుకొను బ్రాహ్మణులు పండితులవద్ద వేదశాస్త్రములనభ్యసించుచునే యుండిరి. ఆదిలోనే యమరము శబ్దధాతు సమాసములు కావ్యపాఠములు చదువుచు అష్టాధ్యయిలోని సూత్రముల కంఠస్థ మొనర్చుచు సంస్కృతములో పాండిత్యమును సంపాదించెడివారు. ఇక తదితర నాగరికత జాతులవారు వీధిబడిలో నాంధ్రభాషతోనే యోనమాలతో విద్యను ప్రారంభించువారు.

ఓనమాలు- ఓంనమశ్శివాయ

తెనుగు నక్షరములకు ఓనమాలని నామకరణ మొనర్చుట ఓం నమశ్శివాయ అని పంచాక్షరీ మంత్రముతో ప్రారంభించుటే యనవచ్చును. ఆ యక్షరములు త్రిలింగదేశమునకు జెందిన తెలుగుభాష వగుటచే కాబోలు నట్టి శివమంత్ర ప్రార్థనతో ప్రారంభించబడెడివి. ఇంచుమించు నా యక్షర నిర్మాణముగూడ లింగరూపమగు సున్నాలతో నిర్మింపబడుచున్నది. శివునికి తలపైగల నెలవంక వంటి యరసున్నలతో నాయక్షరములన్నియు నేర్పడినట్లు దోచుచున్నవి. గుణితములోగూడ తలకట్టు, గుడి, దీర్ఘము, కొమ్ము, సుడి మొదలగునవి శివ చిహ్నములకు సంబంధించినవనవచ్చును. "పార్వతి తలకట్టు పరమేశు నెత్తిపై పడగనెత్తిన నాగుగుడిద సర్ప శృంగీశ్వరుని కొమ్ము గంగమ్మ సుళ్లును తిర్యక్ త్రిశూలము దీర్ఘమిడగ" అనినట్లు బాసించును. ఇందులకే వీనిని ఓనమాలు అనగా అన్నియు శివరూపాలేయగుట త్రిలింగ భాషగా

వ్యవహరింపబడుట సహజ మనిపించును.

ఇట్టి యోనమాలతో ప్రారంభింపబడి, క, ఖా ల గుణితము, ఒంట్లు, ఎక్కములు, బొట్లెరుసు, గిద్దెలెరుసు మొదలగు నిత్యావసర గణితములును నేర్పబడుచుండెడివి. గుణితము సరిగా వచ్చినవెంటనే నీతిదాయకములగు సుమతి పద్యములు, కృష్ణ శతకములోని భక్తి ప్రేరకములగు కంద పద్యములు, వేమన పద్యములు చిన్న పద్యములని నేర్పుచుండెడివారు. పిదప నరసింహ శతకము, దాశరథి శతకము, భాస్కర శతకము, కాళహస్తీశ్వర శతకములోని భక్తి నీతి ప్రబోధకములగు వృత్తములు సీసద్యముల పెద్ద పద్యములని నేర్పుచుండెడివారు. ఈ పద్యపఠనము లైనపిదప భారతములోని ఉద్యోగపర్వము, భాగవతములో దశమస్కంధముతో ప్రహ్లాద చరిత్ర, గజేంద్రమోక్షము మొదలగునవి చదివించువారు. వీటి యర్థగ్రహణమునకు అమరము, ఆంధ్రనామ సంగ్రహము వల్లింపజేసెడివారు. ఉన్నత జాతులనబడు బ్రాహ్మణులలో మాత్రము తర్కవ్యాకరణాది శాస్త్రాలు, పంచకావ్యములు, నాటకములు సంస్కృతములో నభ్యసింపబడుచుండెడివి.

ఇది ఆనాటి వీధి బడుల స్వరూపము. వారు కొయ్యపలకలపై ఇటుకపొడి మట్టిని పోసి పుడుకలనుపయోగించి గుణితము నేర్పెడివారు. పద్యములు మొదలుగునవి వ్రాయునపుడు పాలరాతి బలపములనుపయోగించి "కొయ్య పలకలపై చిక్కుడాకు బొగ్గుతోరుద్ది ఎండించి" వ్రాసెడివారు. ఆ పలకలపై చుట్టు తీగలాకుల చిత్తరువులు వ్రాసి యలంకరించెడునట్లు ఆనాటి పంతుళ్లు పిల్లలనాదేశించి వారికి కళాభిరుచి గలిగించువారు.

పిల్లలు తెల్లవారిలేచి కాలకృత్యములు తీర్చికొని వేళదప్పక బడికిపోవుచుండెడివారు. బడికి అందరికన్న మొదలరుదెంచిన బాలుని 'సిరి' అని బిరుదిడి పంక్తిలో మొదట గూర్చొనబెట్టెడివాడు పంతులు. రెండవవాడుగా వచ్చిన వానికి 'చుక్క' యని బిరుదిడి సిరియగు బాలునిచెంత గూర్చొన నియోగించువాడు. తక్కిన బాలుర వరుసగా "దెబ్బ, రెండు దెబ్బలు" అని బెత్తముతో అరచేయిపై శిక్షించి వరుసగా కూర్చొనజేసెడివారు. ఈ భయముతో పిల్లలు వేళదప్పక బడికేగువారు. ఆమావాస్య, పౌర్ణిమ, చతుర్దశి, అష్టమి మొదలగు దినములలో ననధ్యయనములని సెలవు లిచ్చెడివారు. దసరా మొదలగు పండుగదినములలో పిల్లలతో పంతులుగూడ గ్రామాధికారులవద్దకేగి విల్లునమ్ములు బట్టుకొని వీరులవలె నలంకరించుకొనియున్న పిల్లలతో పాటలు పాడించి గురుదక్షిణలను పొందువారు.

ఇంక నాంగ్లేయుల పరిపాలనము వచ్చినది. బడుల స్వరూపస్వభావములు మారినవి. మెకాలే విద్యా విధానము కొంత యుపకారముతో నపకారముగూడ జేసినదనుటలో నతిశయోక్తిలేదు. భౌతికరసాయనికాది శాస్త్రపరిచయములు ఉన్నతవిద్యలో దేశచరిత్ర, భూగోళము, గణితము మొదలగువానితోపాటు ఆటల పోటీలు మొదలగువానితో శరీరదార్ఢ్యముగూడ కలిగించుటకు యోగ్యమైనదిగా నుండినది.

వేషభాషలందు చులకన

కాని యిది మన సంస్కారమునకు తీరని యపకారము గావించినదనుట సత్యదూరముగాదు. మన ఆచార విచారములపట్ల యనాదరభావమును, అశ్రద్ధను గలిగించినదనవచ్చును. మన వేషభాషలపట్ల చులకదనమును గలిగించినది. మనను వారి గుమస్తాలుగా తయారుచేయుటలో నది కృతకృత్యమైనది. మనను స్వతంత్ర పౌరులుగా స్వతంత్ర వృత్తితో జీవించగల ధీరులుగా చేయుటకది ప్రతికూలించినది. మనలో దాస్యభావము స్వభావముగా మారునట్లొనర్చినది. దైవభక్తిని మాతృభాషారక్తిని ఉపాధ్యాయునిపై గౌరవమును సన్నగింపజేసినది. ఉపాధ్యాయుడన నానాటికి మన విద్యార్థులకు విద్యనేర్పుటకునై యేర్పరచిన యొక కూలివాడుగా దోచుచున్నదన్నందులకు నేటి విద్యార్థుల మనఃప్రవృత్తియే యద్దముగా నున్నది. ఆనాటి పవిత్ర విశ్వవిద్యాలయాల ఖ్యాతి వాని ఔన్నత్యము చరిత్రలోమాత్రమే మిగిలిపోయింది. మనదేశపు విశ్వవిద్యాలయాలలో బౌద్ధారామాలు గొప్ప విద్యాపీఠాలై యెందరో విదేశీయుల నాకర్షించినవి. అందు ధ్యానకటక విద్యాపీఠము చాల గొప్ప కీర్తివహించినది. ఆనాటి విద్యార్థులకు గురువు దేవుడైన నేటి విద్యార్థులకు గురువన నొక కూలివాడో లేక వినోదమృగమోయైనట్లు కొన్నిచోట్ల కనబడుచున్నది. ఇది మన దురదృష్టము.

నేటి పిల్లలలో 'సహవిద్య' స్త్రీ పురుషులనొక్కచో చేర్చి విద్యాభ్యాసము చేయనియోగించుట కొంత ప్రమాదమనియు తెలియవచ్చుచున్నది. ఉపాధ్యాయులు పిల్లలపై ప్రభావమువేసి వారి నడుపులో బెట్టదగిన విద్య, ప్రతిభ, సుగుణ సంపద గలవారగుటగూడ యవసరమే. తలిదండ్రులు పిల్లల ప్రవర్తనమును నిరంతరము గమనించక అలక్ష్యముచేయుట క్షమించరానిది. పిల్లవానికి మొదటి గురువులు తల్లిదండ్రులే యనియు వారు బాలునికి దైవసములుగా సేవ్యులు గావలెననియు మన సంస్కృతి నిర్వచించినది. తల్లిదండ్రుల చర్యలే పిల్లలకు నాదర్శములై యుండునను మాట మరువరానిది. అట్లే స్నేహితులు హితము గోరువారై యుండుట అత్యవసరము. విద్యార్థిదశలో పిల్లలు తమ స్నేహితుల మాటకు సలహాకు మిక్కిలి విలువనిచ్చి పాలించుట మనకు క్రొత్తకాదు. పిల్లలు స్నేహితుల నెన్నుకొనుటలో విచక్షణ ప్రదర్శించుటుచితము.

ఆధునిక యుగములో లైంగిక విజ్ఞాన పరిచయమనుపేరిట బూతుకథల సాహిత్యముగా రూపొందించి పిల్లల కందుబాటులోనుంచుట విచారకరము. పిల్లలు అనుభవహీనులగుట నదే సాహిత్యము వినోదకరమగుటచే యభిరుచిగల్గి చదువుచు బడిచదువునకును స్వస్తిచెప్పి తమ భవిష్యత్తు చెరుపుకొనుట చాల వరకు మనము చూచుచునేయున్నాము. నేటి విద్యార్థులు రేపటి పౌరులు. దేశ భవిష్యత్తు దిద్ది తీర్చగల వారసులు. అట్లగుట వారి యోగక్షేమముల మదినెంచి ప్రస్తుత విద్యావిషయిక లోపముల నేరుచు నీతి నిజాయితీ వర్తనముతోపాటు వినయగుణభూషితులు పిల్లలగునట్లు చూచుట మనవిధి. నేటి తెనుగుబడి యిట్లుండవలెను.

(తెలుగు వీణ)

కామఋషి సత్యనారాయణవర్మ

ఆంధ్రదేశంలోని అద్దకపు పరిశ్రమ చిత్రవిచిత్రమైన శిల్పవిన్యాస వైఖరులు

చతుష్షష్టికళలలో "దశనవసనాంగరాగము' ఒక కళగా వాత్స్యాయనునిచే రచింపబడినది. అనగా దంతములకు, బట్టలకు, అవయవములకు రంగులు వేయుట. సౌందర్యదోహదక్రియలుగా పళ్లకు లత్తుక రుద్ది దంత పంక్తిని రాగరంజితము చేయుట దశనరాగము. పెదవులు, గోళ్లు, కనుబొమ్మలు మొదలైన అవయవములకు రంగులువేసికొనుట అంగరాగము. వస్త్రములపై చిత్ర విచిత్రములైన రూపములను రంగులతో అద్దుట వసనరాగము. ఈ విధమైన కళలు అనాదిగా భారతదేశములో వ్యాప్తిలోనుంటున్నవి. వీనిలో వసనరాగకళ ఏవిధముగా అభివృద్ధిచెందినది, అందలి శిల్పరచనావిధానమెట్టిది-అని తెలిసికొనుట విజ్ఞానపిపాస గలవారికి అవసరము గదా! కళ ఒక విధమైన అవ్యాజానందానుభూతిని కలుగజేయును. శరీరమును కప్పి లజ్జావిముక్తి కలుగజేయుట, శీతోష్ణాదికాలధర్మములనుండి రక్షించుట మొదలైనవి ఆదిలో వస్త్రనిర్మాణ ఆవశ్యకతకు కారణములై యుండవచ్చును. కాని మానసిక ఆనందము కొఱకు అలంకరణములయెడల, రంగులయెడల అభిరుచి మానవుడు అనాగరకస్థితిలో నున్న నాటి నుండి యుండియున్నట్లు అనేకదర్శనములవల్ల రూఢమగుచున్నది. రంగులు కేవలము వినోదజనకములు మాత్రమేగాక మానసికమైన శాంత వీర ఆనందాదిసోద్దీపకములై ఒకానొక అనుభూతికి కారణములగుచున్నవి. కనుక ఈ విధమైన అభిరుచియే అనేకకళలు లోకములో వ్యాప్తిపొందుటకు కారణభూతమైనది. ముఖ్యముగా ఈ వసనరాగకళలో అనేక ఉపకళలు మిళితమై యుండుటవలన దీనికొక ప్రత్యేకత గలదు.

వస్త్రములకుగాని, నేతకుపయోగించునూలుకుగాని రంగువేయుపరిశ్రమకే అద్దకమని వ్యవహరిస్తున్నాము. ఇవిగాక ఉన్ని, పట్టు, నార, చాపలు నేయుటకుపయోగించు గడ్డి, తోళ్ళు, కాగితములు మొదలైనవానికి రంగులు వేయుటకూడ ఈ అద్దకపు పరిశ్రమయొక్క శాఖలుగానే పరిగణింపవచ్చును. నూలుకుగాని, బట్టకుగాని ప్రత్యేకముగా రంగులు వేయుటయేగాక వివిధరకములైన రంగులుగల ప్రత్తిని పండించుటలోను, దానికి తగు దోహదక్రియలు చేయుటలోను ప్రాచీనులు నిపుణులైయున్నట్లు వృక్షాయుర్వేద విజ్ఞానమువల్ల తెలియవస్తూంది. నవీనులుకూడ ఈ విధమైన రంగుగల ప్రత్తిని పండించుటకై పరిశోధనలు జరుపుతున్నట్లు తెలియుచున్నది. మన దేశంలో తయారైన అద్దకపు బట్టలు ఆంగ్లేయవర్తక సంఘమువారు మన దేశమునకు రాకపూర్వమునుండి, డచ్చి, పోర్చుగీసు వర్తకుల ద్వారా మలయాళరాష్ట్ర తీరమందలి కాలికట్ రేవుగుండా విదేశీయులకు ఎగుమతి చేయబడుచుండెడివి. విదేశీయులు ఈ అద్దకపు బట్టలను కాలికట్ రేవునుండి దిగుమతియగుచుండుటవలన 'క్యాలికో' అని పిలచెడివారు. ఆ పేరే కాలక్రమాన 'క్యాలికో' అద్దకమని, కలంకారీ అద్దకమని వ్యవహరింపబడుచున్నది.

మన రాష్ట్రంలో కృష్ణాజిల్లాలోని బందరు, పాలకొల్లు, కాకినాడ దగ్గరగల గొల్లపాలెం, తంజావూరు జిల్లాలోని నాగూరు, కుంభకోణము, మధుర, కాళహస్తి, సేలం మొదలైన పట్టణాలు ఈ కలంకారీ అద్దకపు పరిశ్రమకు పేరుపొందినవి.

ఈ పట్టణాలలో ఈ పరిశ్రమలో నిపుణులైన వారు నేటికిని గలరు. వంగదేశంలోని ఢక్కా నూలు, పట్టువస్త్రముల కలంకారీ అద్దకమునకు, పంజాబు కాశ్మీరములు ఉన్ని అద్దకమునకు ప్రపంచవిఖ్యాతి పొందినవి. మన దేశంలో ఈ అద్దకము వృత్తిగా చేసే వారు వేరు వేరు రాష్ట్రాలలో, వేరు వేరు పేర్లతో వ్యవహరింపబడుచున్నారు. ఆంధ్రదేశంలో కొండపల్లి, బందరులలోను, గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాలలోను ఈ పని చేసే చిత్రకారుల వంశస్థులున్నారు. కొండపల్లి బందరు పట్టణాలలో ఉంటున్న ఆర్యక్షత్రియులనే చిత్రకారులు ఈ కలంకారీ అద్దకమునకు సంబంధించిన దిమ్మలను, అచ్చులను చెక్కుటలోను, కల్పనాచిత్రములు రచించి 'సూదినీలను' తయారుచేయుటలోను మంచి నైపుణ్యము సంపాదించిన వారుండేవారు. రాను రాను అవలంబన లేక నశించిన ఇతర వృత్తులు, కళలతోబాటు వీరిలోకూడా ఈ కళ జీర్ణించిపోవుచున్నది. రంగరేజులు, జీనిగరులు అనే వర్ణస్థులలో అద్దకమునందు ప్రావీణ్యము సంపాదించిన వారు గలరు. ఆంధ్రదేశమందలి కొన్ని పట్టణాలలో ఉనుపుల వాండ్రు అనేవారు ఈ అద్దకమే వృత్తిగా జీవించుచున్నారు. వారు నివసించు ప్రాంతమునకు ఉనుపులవీథి అనే పేరు నేటికి గలదు. బౌద్ధశకము నాటికే బందరు కలంకారీ అద్దకము ప్రశస్తిపొందినది. సాలీనిగూడువంటి సన్నని ఉల్లిపొరమల్లులకు, చిత్ర విచిత్రములైన అద్దకములు గల రవసెల్లాలకు ఆంధ్రదేశము పేరుపొందినట్లు మార్కోపోలో వర్ణించి యున్నాడు. 1886 లో లండను నగరమందు జరిగిన బ్రిటిష్ పారిశ్రామిక ప్రదర్శనమునందు బందరు, కాళహస్తి, పాలకొల్లులో తయారయిన కలంకారీ అద్దకపు బట్టలు అధిక వెలలకు అమ్ముడుపోయినవి. ఇట్టివి ఆంధ్రకళా కౌశలమునకు ప్రత్యక్ష ప్రమాణములు.

అనేక రంగులలో కల్పనాచిత్రములను అద్దుటయే కలంకారీ అద్దకమునందుగల విశేషము. బట్టలకు ఒకే వైపున అద్దకము వేయుట, ఒకే చిత్రము రెండు వైపుల వేయుట, లేదా వేరే వేరు చిత్రములనద్దుట, బట్ట అంతా తెల్లగానుండి బొమ్మలుమాత్రమే రంగు గలిగి యుండుట, లేదా రంగు బట్టలమీద తెల్లని బొమ్మలు గలిగియుండుట, అద్దిన రూపము వివిధ రంగులలోనుండుట మొదలైన పద్ధతులు ఈ అద్దకమునందు గలవు. ఒకేబట్టమీద ఇరువది రంగుల వరకు అద్దుటకూడ గలదు. సర్వసామాన్యముగా చేయు అద్దకముకన్న ఈ కలంకారీ అద్దకము చాలా విలక్షణమైనది. ఒక బట్టమీద అనేక చిత్రములుండి అనేకరంగులు గలిగి ఒకదానితోనొకటి కలిసిపోకుండా దేనికది స్పష్టముగా నుండవలెనన్న అట్టి విధానములో కొన్ని మెలకువలు తెలిసికొని యుండవలసియున్నది. బట్టను చలువచేసి రంగువేయుటకు సిద్ధపరచుట, రంగులు తయారుచేసి కావలసిన రంగులను మిశ్రమముచేయుట, అద్దుటకు వీలుగ రంగులను కలుపుట, అద్దకమునకుపయోగించు అచ్చులు, దిమ్మలు మొదలగువానిని ఉపయోగించు విధానము, లేదా ఆయా ఆకృతులను బట్టలమీద చిత్రించు పద్ధతులు మొదలగునవి నిర్వహించుటకు శిక్షణ. శాస్త్రపరిజ్ఞానము, అనుభవము ఉన్నగాని వీలుపడదు. అంతకు మించి మంచి చిత్రకళాపరిజ్ఞానమున్నగాని ఈ కళ యందలి సౌలభ్యము కరతలామలకము గాదు. వీటికి తోడు క్రియాపథమునందు గమనించి నేర్చుకొనవలసిన ప్రక్రియలు అనేకములుగా ఉన్నవి.

రంగులు :

రంగులు తయారుచేయుటకుపయోగపడు మూలద్రవ్యములు వృక్ష సంబంధమైనవి కొన్ని ఖనిజ సంబంధమైనవి కొన్ని గలవు. పండ్లు, పువ్వులు, ఆకులు, వేళ్లు, గింజలు, బెరడు, చెక్క మొదలైన వృక్ష సంబంధమైన భాగములు రంగులు తయారు చేయుటకు మూలపదార్థములుగా ఉపయోగించుచున్నవి. క్రిమికీటకాదులగూడులకు సంబంధించిన లక్క, మట్టి వంటి పదార్థములుగూడ రంగులుగా వాడబడుచున్నవి. నీలిమందు నీలిరంగు వేయుటకు, లక్క పట్టుబట్టలకు ఎఱుపురంగు వేయుటకు, చిరివేరు సున్నము కలిపి ఎఱ్ఱరంగుకు, కుసుంబాపువ్వువంటి ఎరుపుగులాబీ రంగులు, కపిల గౌరవర్ణములు వేయుటకు 'కాచు' అనబడే చెట్టుబెరడుతాలూకు సత్తు, రేవలచిన్ని దానిమ్మతొక్కలు గలసి పసుపురంగుకు, చిరివేరు, లేదా మోదుగపువ్వు, పటిక కలిపి పసుపుఛాయకు, కరక్కాయలు, అన్నభేది కలిపి నల్లరంగు వేయుటకు ఈ విధముగా ముడిపదార్థములు కషాయములుగా చేసి రంగులుగా ఉపయోగించుచున్నారు. జాభరాగింజలు కషాయవస్త్రములకు, పసుపు మొదలగునవి కూడా వాడబడుచున్నవి. ఇంగిలీకము, జేగురు, గంగసింధూరము మొదలగు ఖనిజ పదార్థములు కోడుగుడ్డుసొనతో రంగరించి నూరి రంగులుగా వాడుచున్నారు. ఇటువంటి ప్రాచీన విధానములుగాక ఆధునిక శాస్త్రపరిశోధనల వలన అనేక రసాయనిక సమ్మేళనములద్వారా కల్పితమైన రంగులు తయారగుచున్నవి. ఈ రంగులలో ఎండ, వాన, గాలీ వీట్లకు వివర్ణముగాకుండా నిలిచేవానికి పక్కారంగులని, నిలవక వెలిసిపోయేవానికి పచ్చిరంగులని అంటారు. ఈ విధమైన రంగులను చేయుటలోను, వానిని కలుపుటలోను అద్దువానికి మంచి పరిజ్ఞానముండుట అవసరము.

చలువచేయుట :

కలంకారీ అద్దకమునకు బట్టను చలువచేసి సిద్ధపరుచుటలో ప్రత్యేకశ్రద్ధ తీసుకొనవలసియున్నది. చలువచేయుట ఒక ప్రత్యేక కళగా చాలకాలమునుండి మన దేశములో అభివృద్ధిపొందినది. బట్టయందలి మాలిన్యమును పోగొట్టుట చలువచేయుటలో గల ముఖ్య ప్రయోజనము. బట్టయందు ఏ మాత్రము మాలిన్యమున్నను అద్దకములో రంగులు పాడగును. చలువ చేయుటకుపయోగించు వస్తువులలో చాకలి చౌడు, సున్నము, కుంకుడుకాయలు, పులిమజ్జిగ, గేదెపేడ, సోడాపొడి, ముండ్లతోటకూర, తెల్లగజ్జేరు, ఉత్తరేణి మొదలగు శాఖపదార్థముల బూడిద ముఖ్యముగా వాడుదురు. చాకళ్లు నిత్యకృత్యములో చౌడు, సున్నము మాత్రమే ఉపయోగించుచున్నారు. కోరాబట్టను నీటిలో ముందుగా ఉతికి చౌడు, సున్నము కలిపిన బానయందుంచి నీటిలో ఉడకబెట్టుదురు. బాగా ఉడికినపిమ్మట బట్టను మంచినీటిలో జాడించి యిసుకపై గాని,

గడ్డిమీదగాని ఎండవేయుదురు. అప్పుడప్పుడు నీరు చల్లుచు ఆరనిచ్చెదరు. ఇట్లు నాలుగైదు సారులు ఉడుకబెట్టినగాని బట్టలు పూర్తిగా తెల్లబడవు. కలంకారీ అద్దకమునకుపయోగించు బట్టలను చలువచేయుటలో గేదెపేడను విస్తారముగా వాడుదురు. గేదెపేడలో ఒకటి రెండు రోజులు నాననిచ్చి మంచినీటిలో శుభ్రముచేసి, గడ్డిమీద ఎండవేయుదురు. ఎండచేతను, గాలిచేతను అప్పుడప్పుడు చల్లిన నీటిచేతను బట్టి క్రమక్రమముగా తెల్లబడును. బాగుగా చలువయగుటకు రమారమి ఒక నెలరోజులు పట్టును. పాశ్చాత్యులు మనవలె ముడిపదార్థములుగాక ద్రావకములను రసాయన సమ్మేళనమువల్ల యేర్పడిన క్షారద్రవ్యములను చలువచేయుటకుపయోగింతురు. ఉడుకబెట్టుట, పిండుట, ఆరవేయుట మొదలగు ప్రక్రియలన్నియు నియమిత కాలములో యంత్రసహాయమున చేయుదురు.

చలువ అనంతరము నేతలోవచ్చిన హెచ్చుతగ్గును సరిచేసి, బట్టలు ముడతలుపడకుండక రోలరులకు చుట్టబెట్టుదురు. ఎఱుపు, గులాబీరంగులు వేయుటకు బట్టను నూనెలో నాన్పుటకూడా అవసరము. దాని వలన తక్కినరంగులకు తేటదనము వచ్చును. రంగులు కలుపుటలోను, వేయుటలోను శాస్త్రజ్ఞానముకన్న అనుభవమే ఎక్కువ సహాయపడును. కలంకారీ అద్దకమునకు సాదా అద్దకమునకువలె రంగులు కషాయస్థితిలో నుండరాదు. దిమ్మలను రంగులో ముంచి బట్టలపైన అద్దుటకు వీలుగ తుమ్మగోధుమవలె జిగురు గలిగి అంటుకొనుటకు వీలుగా రంగులను తయారుచేయవలెను. గంజి, మైదాపిండి, తుమ్మజిగురు, జిగటమట్టి, సర్వీసు, బెల్లపునీరు, గ్లిసరిను, కోడిగుడ్లసొన మొదలగునవి రంగులను చిక్కపరచుటకు జిగురుగా ఉపయోగపడుచున్నవి. రంగుల స్వభావమునుబట్టి జిగురులు మారుచుండును. అద్దకము పూర్తియైనపిమ్మట బట్టను ఉతికినవెంటనే జిగురు శీఘ్రముగా వదలిపోవును. లేనిచో రంగులకాంతి తగ్గిపోవును. గనుక రంగులకు పరస్పరానురాగము సమకూర్చుటలోను, జిగురులు పాకముపట్టుటలోను చాల జాగ్రత్త తీసుకోవలసియున్నది.

అద్దకము :

చిరకాలమునుండి బట్టపై కుంచెలతో బొమ్మలు వ్రాయుట, దిమ్మలతో అద్దుట, కట్లద్దకము, తళుకద్దకము అని నాలుగు పద్ధతులు వాడుకలో నుంటున్నవి. ఈ విధానములనవలంబించుటకు ముందుగా అద్దకము వేయవలసిన బట్టను, వగరుగాని, పులుపుగాని యుండి, ఏ మాత్రము రంగు లీయని పదార్థములలో ఉడుకబెట్టెదరు. దీనికే 'కసటు' వేయుట అని పేరు. ఈ విధమైన ఉపాధులుగా పనికివచ్చే వస్తువులలో పటిక, కరక్కాయ చాల ముఖ్యమయినవి. జెముడుకాడలు, ఉత్తరేణి, గల్జేరు, పొగాకుకాడలు మున్నగువానిని కాల్చివేసిన బూడిద (క్షారపదార్థము) నీళ్లలో కలిపి దానిని ఉపాధిద్రవ్యములుగా ఉపయోగించుటకూడ అలవాటులో నున్నది. ఎఱ్ఱరంగు వేయుటకు ముందుగా గొఱ్ఱెపెంటలో గుడ్డను నానబెట్టుట ఒక అనాదిప్రసిద్ధమైన ప్రక్రియావిశేషము. ఇవిగాక ఆధునికులు రసాయనసమ్మేళనముద్వారా చేయు పద్ధతులను గూడ నవలంబించుచున్నారు. ముడిపదార్థములనుపయోగించుటలో వస్తువు సులభముగా దొరకుట, ఖర్చుతగ్గుట మొదలగు సౌకర్యములున్నను, కొంత కాలహరణమగుచున్నది. నవీన విధానములలో ఎక్కువ పని తక్కువ కాలములో చేయుట, సులువుగా చేయుట మొదలగు వీళ్లు కలిగియున్నప్పటికి ఖర్చు ఎక్కువగుట, ఆ పద్ధతులు భారీ పరిశ్రమలునడుపుటకే సహకరించుచుండుట గలదు.

కుంచె అద్దకము :

కుంచెఅద్దకమునకు మొదట బట్టను కరక్కాయ నీళ్లలో నాననిచ్చి అనంతరము పాలలో 5, 6 గంటల కాలము ఉడికించి రెండు రోజులపాటు ఆరనిచ్చెదరు. అనంతరము ఆ బట్టను ఇసుకపైన ఎండలో నారవేసి కరుగబెట్టిన మైనముతో, కుంచెలతో బొమ్మలను వ్రాయుదురు. మైనమారినతరువాత బట్టను రంగుకషాయములో ముంచెదరు. బట్టకు రంగు చక్కగా పట్టినతరువాత వేడినీటిలో దానినుంచి మైనమును తీసివేయుదురు. అప్పుడు రంగు బట్టమీద తెలుపు అద్దకమగును. ఈ విధంగానే ఒక రంగుమీద మరియొక రంగు అద్దుటకు కూడ వీలున్నది. దిమ్మలతో నద్దు పద్ధతికన్న ఇది కొంచెము కష్టమైనది. మంచి చిత్రకళా పరిజ్ఞానమున్న వారుకుంచెలతో చిత్రమును వ్రాసినపుడు అచ్చులవల్ల పడు ముద్రలకన్న మిక్కిలి సుందరముగానుండును. ఈ విధానములో పనితనము ప్రదర్శించుటకు అవకాశము గలదు. ఒక బట్ట తయారగుటకు 2, 3 నెలలు పట్టును. కుంభకోణము, కాళహస్తి, బందరు, పాలకొల్లుపట్టణములో పవిత్రమైన బట్టలకు కలంకారీపని చేయుటకు కుంచెలనే ఉపయోగించేవారు. చెట్లు, పక్షులు, నెమళ్లు కూర్చున్నట్లు, ఎగురుచున్నట్లు, నదీ ప్రవాహపు గట్టున చెట్లు, అడవిమృగముల విహారములు బందరు చిత్రములలో ప్రధానమైనవిగా పరిగణించవచ్చును. కాళహస్తి, పాలకొల్లు వితానములకు తెలుపు మీద పసుపునీలిరంగు లద్ది వానిపైన భారత, రామాయణ గాథలను చిత్రించుట ఒక ప్రత్యేకత. కథల మధ్య ప్రకృతి సౌందర్యద్యోతకములైన వృక్షములు, నదులు చిత్రించుటగూడ గలదు. మిక్కిలి సున్నితమైన లతాచిత్రములను 'సూదినీల'ను ఉపయోగించి వ్రాయుదురు. అనగా ఒక కాగితముపై రచింపబడిన లతాచిత్రముగాని, మరి ఏదైన గాని తీసుకొని దాని ఆకృతి ప్రకారము దగ్గర దగ్గరగా సూదితో చిల్లులు పొడిచి దానిని కావలసినచోట బట్టమీద జాగ్రత్తగా నమర్చి పైన మెత్తని బొగ్గుపొడిని చల్లి, వ్రేలితో సున్నితముగ కాగితము కదలకుండ పట్టుకొని అంతట వ్రాసిన ఆ చిల్లులగుండా బట్టమీద వలసిన రూపముయొక్క ఆకృతిపడును. దానినాధారముగ జేసికొని మైనపు వత్తి కరిగించి పై విధముగా కుంచెతో వ్రాయుదురు. బందరు కలంకారీ అద్దకములన్నీ చాలవఱకు ఈ విధాన ప్రకారమే చేయుచుండెడివారు.

దిమ్మలతో అద్దుట :

ఈ విధానమునకు ముందు అచ్చులు తయారగుట ముఖ్యము. జిగిగలిగిన టేకుకొయ్యతో ఈ అచ్చులు చెక్కెదరు. కావలసినబొమ్మను ముందుగా కాగితముపై వ్రాసి దానిని కత్తిరించి ఈ దిమ్మలపై అంటించెదరు. పిమ్మట దానిని చెక్కెదరు. చెక్కుటలో కావలసిన చిత్రముయొక్క

ఆకృతి ఎత్తుగాను (గట్టువలె), తక్కిన పరస్థలము పల్లముగాను దొలిచివేసెదరు. సాధారణముగా దిమ్మలపొడవు మూడునాలుగంగుళములుండును. దిమ్మను ఒక అంగుళములోతు వరకు చెక్కెదరు. చిత్తరవు పెద్దదైనపుడు రెండు, మూడు దిమ్మలు చేర్చి ఒక దానిగా బిగించెదరు. ఇట్టి దిమ్మలు మూడు సంవత్సరముల వఱకూ ఉపయోగించుటకు వీలుగానుండును. నాజూకు గల లతాచిత్రములు మొదలగునవి చెక్కుటకు వీలుగా నుండనందున, రాగి, సీసము మొదలగు దిమ్మలపై చెక్కించి వాటిని కొయ్యదిమ్మలపై నతికించి ఉపయోగించెదరు. పోతపోసిన దిమ్మలుకూడ ఉపయోగించుచున్నారు. చెక్కడముయొక్క నేర్పుపైనే అద్దకము యొక్క ప్రాశస్త్యము ఆధారపడి యున్నది.

బట్టను ముందుగా గేదెపేడలో నానబెట్టి, నీరు చల్లుచు నేలమీద ఆరవేయుదురు. తరువాత ఆ మురికిబట్టను ఒకటి రెండు రోజులు కరక్కాయనీటిలో నాననిచ్చెదరు. బొమ్మలయొక్క అంచులు నల్లగా ఉండ వలసినపుడు ఇనుపత్రుప్పు, బెల్లము, పులిసినకల్లు మరగనిచ్చి ఆ మిశ్రమద్రవ్యమును ఒక పళ్లెములో నుంచి, మెత్తని కంబళీముక్కను అందులోముంచి యుంచెదరు. దిమ్మలను ఈ కంబళి ముక్కపైన నొక్కిన పిమ్మట బట్టమీద అద్దెదరు. అపుడు తెలుపుమీద నల్లని అంచులుగల బొమ్మలు అద్దకమగును. ఈ విధముగా ఎఱుపు మొదలగు రంగులలో నద్దుటకు ప్రత్యేక విధానములు గలవు. సాపుచేయుటకు అద్దకమైన బట్టలను సున్నము, చౌడు, సబ్బు కలిపిన నీటిలో ఉడుకవేయుదురు. ఇది పురాతనమైన విధానము. అచ్చులతో బట్టలనద్దుటకు ఒక యెత్తయిన బల్ల, దానిపై ఒక చదరమైన ఊయి, దానిపైన మెత్తని కంబళీ ముడుతలు లేకుండ పఱచి, బల్లకు యిరువైపులా కప్పీలు బిగించి దానిపైన బట్టను మెల్లగా లాగుటకు ఏర్పాటు చేయవలెను. అద్దకము చేయువాడు బల్లకు ఎడమవైపున గల కప్పీలమీదుగా బట్టనులాగి ముడుతలు లేకుండ బల్లమీద పరచును. ఒక రూళ్లకఱ్ఱతో, సరిచూసి అద్దకపు దిమ్మలనద్దవలసిన స్థలములను గుర్తుపెట్టును. అచ్చును రంగులోనద్ది గుర్తులున్నచోట పెట్టినొక్కి రంగులు చక్కగా అంటుటకై కొయ్యసుత్తులతో జాగ్రత్తగా కొట్టును. రెండవసారి మఱల అద్దునపుడు రెండు అచ్చులమధ్య సందులేకుండా సరిగా అంచులను గమనించి మొదటి అచ్చుతో సంబంధించియుండునట్లు సరిచూచి మరీ అద్దవలసియుండును. ఈ విధముగా అద్ది, ఒక ప్రక్కగా జారవిడిచిన ఆ భాగము ఆరుచుండగా తక్కిన భాగము అద్దకమునకై సిద్ధపరచెదరు. రెండు మూడు రంగులద్దవలసినపుడు మొదట అద్దిన రంగు పూర్తిగా ఆరనిచ్చి పిమ్మట రెండవరంగుతో అద్దుదురు. ఏకకాలమునందు రెండుమూడురంగులను అద్దుటలో ప్రావీణ్యము సంపాదించినవారుకూడా గలరు. దిమ్మలయొక్క వివిధ భాగములను వేరు వేరు రంగులోనద్ది ఏకకాలమున ఆరురంగులవరకు అద్దవచ్చును. ఇవిగాక యంత్ర సహాయమునను, రసాయనిక పద్ధతులలోను అద్దకము చేయువిధానములు అనేకము వాడుకలోనికి వచ్చినవి.

కట్ల అద్దకము :

ఇది బట్టలకు అచ్చటచట ముళ్లువేసి అద్దకము చేయుపద్ధతి. మన రాజధానిలో గువ్వకన్నుచీరలు, చుక్కల చీరలు, రుమాళ్లు ఈ పద్ధతి ప్రకారము అద్దెడివారు. తెల్లచీరమీద నూలుదారముతో కావలసిన చోట ముళ్లువేసి చీరకు రంగు వేయుదురు. ముళ్లు వేయుటకుపయోగించు దారమునకు రంగు అంటకుండ మైనపుపూత పూయబడియుండును. రంగు ఆరిన పిమ్మట ఆ ముళ్లు విప్పినచో అచ్చట రంగుపట్టక తెల్లగానుండును. ఈ ముళ్లు వేయుటయే ప్రత్యేకము పనిగా చేయువారుందురు. రంగులు వేయువారు వేరుగా ఉందురు. ఉత్తరహిందూస్థానమున ఈ ప్రకారమద్దిన బట్టలకు మిక్కిలి విలువగలదు. వీటిని 'చునారీ' అని పిలిచెదరు. పండుగదినములలో సామంతులు మహారాజులకు నజరాణాలుగను, మహారాజులు తాబేదారులకు బహుమతులుగను ఈ 'చునారీ'లను ఇచ్చుట ఒక ఆచారము. ఒంటిచుక్కబట్టకు 'ఏక్‌బందీ' (ఒక్క ముడి) అని, నాలుగు చుక్కల బట్టకు 'చౌబందీ'లని పేర్లుగలవు. మనుష్యులు, మృగములు, ఈటెలు, బల్లెములు మొదలగు వేటసంబంధమైన పరికరముల చిత్రములు గలవానికి 'షి కారీ' 'చునారీ'లని పేరు.

తళుకు అద్దకము :

ఇది ఒక చిత్రమైన అద్దకపు విధానము. హైదరాబాదు, జయపూర్, నాసిక్, అహమ్మదాబాదులలో ఈ పద్ధతి ప్రచారములో ఉన్నది. మహమ్మదీయులు ఈ బట్టలనెక్కువగా వాడుదురు. గోదావరీ జిల్లాలో కొన్ని గ్రామములలోకూడ ఈ విధానము ప్రకారము అద్దకము చేయువారు కలరు. మొదట బట్టను జిగురు వస్తువులలో ముంచి ఆరకముందు తళుకువస్తువులను జల్లుదురు. ఆరినతరువాత అవి బట్టల కంటుకొని ఉతికినను రాలిపోకుండ నుండును. అభ్రకపురేకులు, డాకు రేకులు తళుకు నిచ్చుటకుపయోగించెదరు.

ధనవంతులు బంగారు 'వర్కు'లనబడే కుందనపురేకులతో ఈ తళుకుపని చేయించుకొందురు. బందరు కొండపల్లి గ్రామములోని ఆర్యక్షత్రియుల కుటుంబములలో ఈ బంగారు రేకు గృహపరిశ్రమగా తయారుచేసి వాటిని ఈ అద్దకము చేయువారికి సప్లయిచేసెడివారు. ఈ తళుకద్దకము జాగ్రత్తగా చేసిన ఆ తళుకు బట్టలనుతికినను రాలిపోకుండ ఉండును.

వాయువర్ణ చిత్రణము :

ఇది యొక నవీనయంత్రపరికరముద్వారా అద్దు విధానము. నూనెరంగులు వేయుటకు, గోడలపై రంగులు వేయుటకు, బట్టలపై రంగులు వేయుటకు కూడా ఈ యంత్రమును ఉపయోగపడుచున్నది. ఈ యంత్రముపయోగించుటలో రంగులు వేయుటకు కుంచెలనుపయోగింపనక్కరలేదు. రంగులు పలుచగా గలిపి వాని తుంపరలను వస్తువుమీద చల్లటమే ఈ యంత్రము చేయుపని. ఈ యంత్రముతో వేసిన రంగులు చక్కగా వస్తువులకంటుకొని, బొమ్మలు మిక్కిలి దీప్తిమంతములుగా నుండును. రంగునీరు వత్తిడిగల గాలిచే ఊదబడి రంగులు

తుంపరలుగానగును. ఏదైన ఒక చిత్రము యొక్క ఆకృతిని అట్టతో కత్తిరించి అది ఉచితస్థలమున అమర్చి ఆపైన ఈ యంత్రముచే రంగుతుంపరలను బట్టి అనంతరము ఆ చిత్రముల అట్టలను తీసివేసిన తెల్లని అద్దకము పడును. గుమ్మములకు అడ్డుగా కట్టు తెరలు, టేబిలుగుడ్డలు మొదలగువానిపైన తాజమహాలు వంటి భవనముల చిత్రములు, ప్రకృతి చిత్రములు, మహాత్ముని రూపచిత్రములు మొదలగునవి పెద్ద సైజులలో ఈ పద్ధతిలోనే నేడు తయారగుచున్నవి. ఇవిగాక నవీన యంత్ర సాధనములవలన నూత్న విధానములద్వారా అనేక పద్ధతులలో అద్దకముచేయుచున్నారు. వాటి వివరణలన్నియు చేర్చిన ఒక ప్రత్యేక గ్రంథమగును. ఈ వ్యాసమునందు స్థాలీపులాకముగా చెప్పుకొన్న వసనరాగకళయందు పారిశ్రామికుడు క్రియాపథమునందు తెలిసికొనవలసిన ప్రక్రియావిశేషములు, పారిశ్రామికధర్మములు అనేకముగానున్నవి.

వర్తమానము- కర్తవ్యము :

మన దేశమునందు రంగులకు పనికివచ్చు ముడి పదార్థములు విరివిగా దొరుకును. అందుచేత వ్యవసాయమువలెనే బట్టల అద్దకముగూడ ఒక ప్రత్యేక వృత్తిగా అభివృద్ధిపొంది అనేకులకు వృత్తియై జీవనోపాధిగా ఉంటున్నది. నేటికి వంశపారంపర్యముగా ఈ వృత్తినవలంబించుచున్నవారు గలరు. నేత యంత్రములు వచ్చి చేతి మగ్గములను నాశనము గావించినట్లే విదేశీయ కల్పితపు రంగులు వచ్చి దేశీయకళలను, రంగుల పరిశ్రమను రూపుమాపినది. ఆంగ్లేయుల పరిశ్రమాభివృద్ధికై బుద్ధి పూర్వకముగా కొల్లగొట్టబడిన భారతకళలలో నిదియొకటి. నేటికి కొన్ని రాజమందిరములలోను, వీథి భాగవత ప్రదర్శనములలో వేయు తెరలమీదను, తోలు బొమ్మలలోను ఈ కళానైపుణ్యము గాంచనగును. వీథి భాగవత ప్రదర్శనములలో అనేక పౌరాణిక పురుషుల విగ్రహములతో చిత్రించబడిన కలంకారీ అద్దకపు తెర ప్రేక్షకులకు ఆకర్షకమైయుండును. కాంతివంతములైన రంగులతో తోలుబొమ్మలు తెరపై గాంచినపుడుగూడ ప్రజానీకము ఒక విధమైన అనుభూతిని పొందుచున్నారు. విగ్రహరచనలోను, పురాణపురుషుల ఆకృతులకు సంబంధించిన హైందవసంప్రదాయములకును ఈ ప్రాచీన చిత్రములే ప్రమాణములుగా గ్రహింపదగియున్నవి. పాశ్చాత్యవిద్యావ్యామోహము చేత మొఱటుదేరిన హృదయములకు సహితము ఈ దృశ్యములను గాంచినపుడు ఆయా కళాకోవిదుల పరిశ్రమ గోచరము కాగలదు. వలసపోయిన భారతీయ సంస్కృతికి చిహ్నములుగా నేటికి ఇవి శిథిలావస్థలోనైనను మిగిలియుండుట మన యదృష్టము. ఈ కళా ఖండములను ఏ చిత్రవస్తుప్రదర్శనశాలలోనో చూచి ఆనందించవలసిన దుర్గతి పట్టినది. ఏదైన ఒక శాస్త్రమునందు పాండిత్యము సంపాదించుకొని సరస్వతీ కటాక్షమునకు పాత్రుడైన పండితుని దుశ్శాలువలచే సన్మానించుట నేటికి ఒక ఆచారముగ వచ్చుచున్నది. అనగా కొందరు చిత్రకారులయొక్క, శిల్పులయొక్క కళాకౌశలమును ఆ పండితునకు కానుకగా నర్పించి సంతృప్తిపడుచున్నామన్నమాట. ఈ విధముగా అనేకవిధముల భారతదేశములో ఒకప్పుడు వన్నె గాంచిన కళను తిరిగి పునరుద్ధరింపవలసియున్నది. రంగులకు పనికి వచ్చు ముడిపదార్థములతో పరిశోధనలను గావించి రంగులను తయారుచేయుట, దిమ్మలు, అచ్చులు చెక్కుట రంగులువేయుట మొదలైనవి ప్రత్యేకముగా నభివృద్ధికాదగిన పరిశ్రమలు. విద్యాబోధనలో వృత్తి విద్యలకు ప్రాధాన్యము కావలెనన్న ఆశయమునకు విద్యావిధానములో ఈ కళలను కేంద్రముగా నుంచి విద్య గఱపిన ఉపయోగకారి కాగలదు. వంశపారంపర్యముగ వచ్చు క్రియా సౌలభ్యములను పోగొట్టుకొనకుండ కాపాడుటకు పారిశ్రామికుల క్రియావిధానములను గ్రంథస్థము చేయవలసియున్నది. ప్రాచీన ఆధునాతన విధానములకు ప్రాక్ ప్రతీచీపద్ధతులకు పొత్తు కలిపి నూత్న విధానముల నన్వేషించి కళయందలి సౌలభ్యమును అభివృద్ధిచేయవలసియున్నది. నేడు ప్రభుత్వమును, యువలోకమును ఎదుర్కొనుచున్న నిరుద్యోగ సమస్యాపరిష్కారమునకు ఇట్టి కళలకు తగిన ప్రోత్సాహమిచ్చి కర్మాగారములను నిర్మించుటద్వారా కొంత సహాయకారి కాగలదు. నేటి స్వతంత్ర భారతనౌకకు కర్ణధారులైన నాయకులు జాతియొక్క కళావిలసనమునకు, ప్రతిభకు, సంస్కృతికి చిహ్నములై అనాదిగా వచ్చుచున్న ఈ పరిశ్రమకు తగిన చేయూతనిచ్చి పోషింతురుగాక!

('భారతి' 1949 రజతోత్సవ సంచిక)

డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు

ఆంధ్రాబ్యాంకు లిమిటెడ్ పుట్టు పూర్వోత్తరాలు

ఆంధ్రదేశంలో ఒక కమర్షియల్ బ్యాంకు సంస్థను స్థాపించవలెననే ఉద్దేశం మొట్టమొదట నాకు 1923సం. సెప్టెంబరు మాసంలో కలిగింది. అప్పుడు ఢిల్లీలో జరుగనున్న అఖిల భారత కాంగ్రెసు ప్రత్యేక మహాసభకు వెళ్లాలని వేసుకున్న కార్యక్రమం ఏదో కారణంవల్ల ఆగిపోవడం వల్ల నాకు పదిహేను రోజులు ఖాళీ చిక్కింది. తలవని తలంపుగా చిక్కిన ఆ పక్షపు దినాల వ్యవధిని అట్టి వ్యాపార సంస్థను స్థాపించే ప్రయత్నానికి వినియోగం చేయాలని కుతూహలం కలిగింది. ఆ ప్రకారమే బందరు పట్నంలోని కొందరు మిత్రులను ఒక సాయంకాలం సమావేశ పరిచాను. ఆ మొదటి సమావేశంలో కూడిన వారిలో ఎవరుగాని తగినంత పెద్ద మొత్తములు విరాళములుగా వేయుటకు సాహసింపక పోవుట వల్ల కొంత నిరుత్సాహం కలిగింది. మొత్తం మీద విరాళాలన్నీ కలిసి రూ.10,000 మాత్రమే అవడంవల్ల ఇంక ఆ విషయం లాభంలేదని నిస్పృహచెంది, అప్పటికి ఆ ప్రయత్నం విరమించుకున్నాను. కాని మూడు నాలుగు రోజుల తర్వాత మా యింటికి చేరువలో నివసించే శ్రీ నంబూరి వెంకట సుబ్బారావు గారు నా దగ్గరకు వచ్చి నా ప్రయత్నం ఎంతవరకు కొనసాగిందని కుశల ప్రశ్నవేశారు. బ్యాంకు పుట్టిన పిమ్మట వీరు 10 సంవత్సరాలు గౌరవ కార్యదర్శిగా పనిచేసినారు. నేను తలపెట్టిన సంస్థ పట్నంలోని వ్యాపారస్థుల ప్రయోజనం నిమిత్తం ఉద్దేశింపబడినదనీ, అట్టిచోట స్థానిక వ్యాపారస్థులు ఏదో ఒక కారణంవలన సంస్థ స్థాపనకు ఉత్సాహం చూపకుండుట వలన ఆ ప్రయత్నం నేను విరమించు కొనదలచుచున్నాననీ అప్పుడు వారితో నేను అన్నాను. అంతట శ్రీ వెంకట సుబ్బారావుగారు వెంటనే తాము రూ.3000స్వయంగా చందావేసి, నాతో కలసి ఇతర మిత్రులను కలుసుకునేందుకు బయలుదేరారు. ఆ ఉదయం 10.30 గంటలు అయ్యేసరికి మరి ఇరువురు మిత్రులు వేసిన చందాతో కలిసి మొత్తం రూ.10,500 తేలింది. ఈ లోపుగా ఒక చిన్న సంఘటన జరిగింది. పట్నంలోని వ్యాపారస్తులందరిలోకి జ్ఞానవంతులైన శ్రీ యు.గోపాలరత్నంగారు తాము రు.3000 ఇష్టపూర్వకంగా చందా వేస్తూ, నన్ను కూడా ఈ సంస్థలో భాగస్వామిగా ఉండవలసిందని పట్టుపట్టారు. ఈ సంస్థ కేవలం వ్యాపారస్థుల సంస్థగానే ఉండవలెననీ, నేను దాని నిర్వహణల్లో స్వయంగా చేయి పెట్టరాదనీ అంతవరకు నా ఉద్దేశం. అయినప్పటికి శ్రీ గోపాలరత్నం గారిని తృప్తిపరిచే నిమిత్తం నేను పేరునకు రు.1000 మాత్రం చందా వేశాను. అయితే వారి మనస్సులో ఉన్న లోతైన ఉద్దేశం అప్పుడు నాకు స్ఫురించలేదు. ఈ సంఘటన యొక్క సార్థకత తరువాత మీకే గోచరించగలదు.

ఇక ఆరోజు మొదలుకొని మా ప్రయత్నం చాలా వేగంగా రూపందాల్చడం మొదలు పెట్టింది. ఒక పక్షం రోజులలోగా మేము అనుకున్న చందా మొత్తం కంటె రూ.18,000 ఎక్కువ కాగితం మీద

పడింది. ఈ లోపున నేను సంస్థ నియమావళి, మెమోరాండం వ్రాసి సిద్ధపరిచాను. మాట ఒసగిన చందాదారుల నందరినీ సమకూర్చి అవి చదివి వినిపించడం అయింది. అవి అచ్చొత్తించడం నెమ్మదిగా తర్వాత జరగడం వలన ఈ లోపున వాటాదారులంతా ముందుగా నియమావళిని బాగా పరిశీలించుకుని తెలుసుకొనడానికి బాగా అవకాశం ఏర్పడింది. ఆ సమావేశంలో కూడినవారి ఉత్సాహం అతిశయించి ఇంకా ఇంకా వాటాలు వేస్తామని చాలామంది ముందుకు రాసాగారు. ఆ ఉత్సాహాన్ని అరికట్టడమే అప్పుడు కష్టమై పోయింది. చివరికి వచ్చేసరికి ఈ ఉత్సాహపరులలో కొందరు వాగ్దానం ప్రకారం పూర్తి వాటా చందాలను రొఖ్ఖ పూర్వకంగా చెల్లించడం జరుగకపోవచ్చునని నాకు అనుమానం లేకపోలేదు. అందువల్ల అదనపు చందాలు వేసేవారిని కూడా అప్పటికి వెయ్యనిచ్చాను. వారిలో కొందరు నేను సందేహించిన ప్రకారం తాము చెప్పిన పూర్తి వాటా మొత్తాలు తుదిని చెల్లించలేకపోయారు. చివరకు 1923 సం. నవంబరు 20వ తేదీన బ్యాంకు రిజిస్టరు అయింది.

దానితో మా చిక్కులు కూడా ప్రారంభమయ్యాయి. బందరులోని ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి యొక్క ఏజంటైన ఒక తెల్ల దొర రహస్యంగా ఊరిలోని వ్యాపారస్థులను మా సంస్థతో ఏ విధమైన సంబంధంగాని పెట్టుకోవద్దని వెనక్కి లాగుతున్నట్లు అప్పుడు మాకు మొదటిసారి తెలియవచ్చింది. సాధారణంగా ఇటువంటి సంస్థకు డైరెక్టర్లు కావాలని ఉత్సాహంగా రావలసిన వారంతా వెనకకు తగ్గడం మొదలు పెట్టారు. ఎవరుగాని మా సంస్థలో వాటాదారుగా గాని డైరెక్టరుగాగాని ఉండరాదని ఆ దొరగారి కోరిక. ఏదో విధంగా ఈ చిక్కు దాటగానే మేనేజింగు డైరెక్టరు ఎన్నిక సందర్భాన్ని అసలు చిక్కు బయలుదేరింది. శ్రీ గోపాలరత్నం గారి మనస్సులో ఆదినుంచీ వున్న రహస్యమైన ఉద్దేశం అప్పుడు బయటపడింది. వారి ప్రోద్బలం వల్ల నేను మేనేజింగు డైరెక్టరు పదవిలో బలత్కారంగా బంధించడం జరిగిపోయింది. ఇక మిగిలినపని పోగైన డబ్బును వ్యాపారస్థుల సౌకర్యం నిమిత్తం ఉద్దేశింపబడినది అయినప్పటికి వ్యాపారస్థులు తక్షణం బ్యాంకునించి అప్పులు తీసుకోడానికి సిద్ధంగా లేరు. ఏదో ఒక విధంగా స్థానిక వర్తకులకు రూ.30,000 దాకా అప్పులు ఒసగగలిగాము. ఆ సమయానికి నేను కాకినాడలో జరుగనున్న కాంగ్రెస్ మహాసభకు పోదలచివున్నందున, ఆ సభా స్థలంలో మా బ్యాంకు బ్రాంచీ ఒకటి ఏర్పరచాలని కూడా అనుకున్నాను. అయితే అక్కడి కొన్ని పరిస్థితులవలన అట్టి ఏర్పాటు అనవసరమయింది.

క్రమేపి ఈ సంస్థ బహుత్వరితంగా పెరిగి బలపడసాగింది. ఈ వరలో ఇంపీరియల్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో మాత్రమే సంబంధం పెట్టుకున్న రాజభక్తులైన వ్యాపారస్థులు కూడా ఇప్పుడు ఆ బ్యాంకు బాకీలను తీర్చుకొనే నిమిత్తం మా బ్యాంకులో అప్పులు తీసుకొనడం ప్రారంభించి ప్రోత్సాహమొసగడం మొదలు పెట్టారు. 1926 సంవత్సరంలో ఇంపీరియల్ బ్యాంకు వారు వసూలు చేసుకోలేని ఒక బాకీ మొత్తం రు.1,25,000వారికి వసూలు అయ్యేలాగున నేను సహకరించడం జరిగింది.

అంతవరకు నేను కాంగ్రెస్ వాదినని అనుమానంగా చూస్తున్నప్పటికి, నా వల్ల ఆ విషయంలో పొందిన సహాయానికి ప్రతిఫలంగా నాకు అవసరం కలిగినప్పుడు తాను ఏ విధమైన సహకారంగాని చూపగలనని ఆ బ్యాంకు మేనేజర్ వ్యక్తం చేశాడు. నేను ఆయనతో నాకు వ్యక్తి పరంగా సహాయం ఏమీ అవసరంలేదనీ, వీలైతే నేను తలపెట్టిన బ్యాంకునకు ఏవిధమైన సెక్యూరిటీ అవసరమైతే అది తీసికొని తమ బ్యాంకు నుంచి రూ.50,000 ఓవరు డ్రాఫ్టు ఒసగవలసినదనీ మాత్రం కోరాను. ఆ విషయం కాగితంమీద పెట్టి ఇచ్చిన యెడల దానిని తను హెడ్ ఆఫీసుకు పంపుతానని ఆయన చెప్పారు. నేనా విధంగా చేశాను. కాని హెడ్ ఆఫీసువారు నేను కోరినది వీలుకాదని తెలుపుతూ జవాబిచ్చారు. ఈ నిశ్చయానికి బాధ్యత హెడ్ ఆఫీసు వారే తీసుకుని వున్నందున ఆ హెడ్ ఆఫీసు ఏజెంటును నేను మద్రాసుపోయి స్వయంగా కలుసుకోవడానికి నిశ్చయించుకున్నాను. అప్పుడు మద్రాసు ప్రభుత్వంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిలు మెంబరైన సర్. సి.పి.రామస్వామయ్యరు వద్దనుంచి పరిచయ లేఖలు తీసికొని అక్కడి ఏజెంటును కలుసుకునేందుకు వెళ్లాను. ఆ కార్యదర్శి 25 నిమిషాలవరకు నన్ను లోపలికి పిలవకుండా కూర్చోపెట్టి, ఈ లోపున బహుశా నేను వచ్చిన సందర్భాన్ని గురించి వారికి అవసరమైన వివరాలు అన్నీ గమనికలోకి తెచ్చుకొని, అప్పుడు నాకు రమ్మని కబురు చేశారు. నేను వచ్చిన పని చెప్పిన వెంటనే ఆయన ఖరాఖండీగా నన్ను "మీరు నాన్ కోవాపరేటరు" కాదా? అని ప్రశ్నించారు. "నిజమే. ఆపాదమస్తకమూ నేను అట్లాంటి వాడ్నే" అని నేను జవాబిచ్చాను. "అయితే మీరు మా ఓవర్ డ్రాఫ్టు అప్లికేషన్ నిరాకరించడానికి అదేనా కారణం?" అని కూడా అడిగేశాను. నేను ఈ బ్యాంకుకు మేనేజింగు డైరెక్టరు కావడం బలాత్కార పరిస్థితుల వల్ల అవసరమైందనిన్నీ, దానికి వారి బ్రాంచి ఏజెంటుయొక్క చర్యయే కారణమనిన్నీ కూడా విశదీకరించాను. మొదట్లో వారి బ్రాంచి ఏజెంటు ఏ విధంగా ఊరిలోని వ్యాపారస్థులను మా బ్యాంకిలోవాటాలు తీసుకొనడానికి గాని, తీసికొన్న వారిని డైరెక్టర్ల బోర్డులో చేరడానికి గాని, అట్లు చేరినవారిని మేనేజింగు డైరెక్టరు కావడానికి గాని ఆటంకపరుస్తూ వచ్చినదీ చెప్పి, అందువల్ల నేను మేనేజింగు డైరెక్టరుగా వుండడం తప్పనిసరి అయినందుకు వారి ఏజెంటు చర్యలే కారణమని నిరూపించాను. బందరులో ఇంపీరియల్ బ్యాంకు బ్రాంచికి అప్పట్లో ఏజెంటైన గోర్డన్ దొర మాకు సహకరించేందుకు సంసిద్ధంగా ఉన్నాడనీ, మా బ్యాంకుకి చెందివున్న ప్రోనోటును, డైరెక్టర్ల స్వంత ఆస్తులను తాకట్టుగా ఒసగగలమనీ చెప్పి సెంట్రలు గవర్నమెంటు సభలో సర్ బేసిల్ బ్లాకెట్ ప్రకటన ప్రకారం ఇంపీరియల్ బ్యాంకు బ్యాంకర్ల బ్యాంకిగా ఉపకరించి దేశీయ బ్యాంకునకు సహకరించడం విద్యుక్త ధర్మమని కూడా నచ్చచెప్పాను. అంతేకాక వెంటనే నా మేనేజింగు డైరెక్టరు పదవికి రాజీనామా వ్రాసి యిచ్చి మిగత 15 మంది డైరెక్టర్లు రాజభక్తులే అని తెలుపుతూ వారిని గూర్చిన వివరాలుకూడా నివేదించుకున్నాను. రావుబహదూరు శెడింబి హనుమంతరావు గారు 22 సంవత్సరాలు పబ్లిక్ ప్రాసిక్యూటరుపని చేసినవారు. రావు సాహెబ్ టి.పేరయ్య నాయుడుగారు రిటైర్డు ఎక్జిక్యూటివ్ ఇంజినీరు. మిగతావారు లాయరుగాని, విదేశీ వ్యాపారం చేసే వ్యాపారస్థులుగాని, రిటైర్డు ఆఫీసర్లుగాని అయి వున్నారు. యోగ్యత గల ఇందరిలోను పాపిని నేను ఒక్కడనే కనుక, ఇక మేము కోరే ఓవర్ డ్రాఫ్టు అనుకూలించవలసిందని కోరాను. "అబ్బే, అల్లా అనకండి" అన్నాడాయన. "అది మీరన్న మాటేనండి" అన్నాను నేను. దానితో కొంతసేపు ఆవులించి, అర్జీ పంపుకోండి అన్నాడు. ఆ ప్రకారమే నేను బందరు స్థానిక ఏజెంటు ద్వారా

ఈ రెండో అప్లికేషను పంపించాను. కాని ఇదికూడా చల్లగా నిరాకరిస్తూ జవాబు వచ్చింది. అప్పటినుంచి మేము స్వయం సహాయం మీదనే ఆధారపడవలసి వచ్చింది. కాని మా బ్యాంకు మాత్రం నెమ్మదిగా ప్రవర్ధమానం అవుతూనే వచ్చింది. మాకు కావలసి వచ్చిన ఆ ఓవర్‌డ్రాఫ్ట్ గవర్నమెంటు ప్రోనోట్లు హామీ మీద చివరికి ఇంపీరియల్ బ్యాంకు వారి వద్దనే సంపాదించాము. ఆ బ్యాంకు ప్రాధమిక నియమావళి ప్రకారం ఈ పద్ధతిని మాకు సహకరించక తప్పింది కాదు.

ఆనాడు ఆ విధంగా అల్పమైన రూపంతో ప్రారంభమైన ఈ సంస్థాంకురము ఈనాడు ఈ విధంగా అనేక శాఖాపుష్ప ఫలభరితమైన వృక్షంగా పెంపొందడం చాలా ముదావహమైన విషయం. ఇప్పుడు ఈ సంస్థ యొక్క వ్యాపారం ఏడు అంకెల పరిమాణానికి పెరిగింది. నమ్మకమైన న్యాయమైన వ్యాపార సూత్రాలను అనుసరించడం ద్వారా ప్రజాభిమానాన్ని ఆదరణనూ చూరగొని, సేవాదీక్షతో ముందుకు సాగిన యెడల, ఈ బ్యాంకు తప్పక సత్వరం భావిలో ఇండియా మొత్తాన చెప్పదగ్గ అయిదారు బ్యాంకులలో ఒకటిగా పేరుపొంది నిలువగలదని నా దృఢ విశ్వాసము.

ఆంధ్రుల కేమి యీ యరవలకేమి చ
క్కని యొరవడియె, త్యాగయ్యగీతి
పండితులకు నేమి-పామరులకు నేమి
వెన్నబెట్టినది పోతన్న పలుకు

పిన్న వారలకేమి పెద్దలకేమి తా
పాల ద్రావినది గోపన్న భక్తి
వీరులకేమి తాబీరులకేమి, ర
క్త మయమ్ము ఖడ్గ తిక్కన్న పోటు

ఆలమున గృహమందు నిత్యము జపించు
మంత్రరాజమ్ము. మేటి తిమ్మరుసు యుక్తి
జన్మతోగల్గినట్టి, మా స్వంతధనము
లాంధ్రమాతా ! నమస్కారమమ్మునీకు !

ఆవలింపఁగ బ్రేవులవలీల నమలు గం
డర గండడైన 'పట్టాభి'చురుకు
కుప్పించి యెగసి డీకొను సింహరాజమ్ము
సమరదుందిభి 'ప్రకాశమ్ము'ములుకు

అడిగిన యంత సర్వార్పణ జేసెడి
త్యాగియౌ 'వేంకటప్పయ్య' పలుకు
గిరిగీచి వైరులనరికట్టి నిల్పు వీ
రాధి వీరుడు "వరహగిరి"చళుకు
సౌఖ్యమెఋగక స్వీయదేశంపు సేవ
మునుగు రాజర్షియౌ, సాంబమూర్తి తళుకు
భాగ్యమై వెలయ నీకు లోపమ్ముగలదె !
యాంధ్రమాతా ! నమస్కారమమ్మ నీకు

– గురజాడ రాఘవశర్మ

డా॥ మర్రి చెన్నారెడ్డి

ఇతర రాష్ట్రాలలో తెలుగువారు - విద్యా సాంస్కృతిక సమస్యలు

సభాధ్యక్షులు మిత్రులు శ్రీ మండలి కృష్ణారావు గారు ! వేదిక పయిన ఆసీనులయిన పెద్దలు! ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన మహాశయులు! సోదర సోదరీమణులారా!

నేను వారం రోజులకి పూర్వం హైదరాబాదు వచ్చినప్పుడు శ్రీ వెంకట కృష్ణారావు గారు ఈ సంస్థ సమావేశం గూర్చి సెలవిచ్చి దీనికి ప్రారంభోత్సవం చెయ్యవలసినదిగా చెప్పినారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారందరితోనూ, ఈసమస్యపై బాగా అభిరుచి చూపిస్తూ ప్రధానమైన పాత్ర వహించే ఇక్కడి ప్రజలతోనూ కలుసుకునేటటువంటి మహా అవకాశంగా భావిస్తూ నేను ఈ సదస్సులో పాల్గొనటానికి అంగీకరించాను. మీ అందరి ఉపన్యాసాలు విన్న తరువాత నేను ప్రారంభోపన్యాసం చేస్తున్నాను– ఇది నిజంగా చాలా సబబుగా కనబడుతూ ఉంది. లేకపోతే. నేనేదో చెప్పేసిపోతే అది రిలవెంటు కన్న ఇర్రెలవెంట్‌గానే ఉండిపోయేది. మీరెట్లా ఆలోచన చేస్తున్నారో, మీకుండేటువంటి భావాలు, మీకుండేటువంటి అనుభవాలు దృష్టిలో పెట్టుకుని మీరు చెప్పిన మాటలపైన నేనేమైనా సలహా చెప్పగలిగితే, నా ప్రారంభోపన్యాసం కేవలం లాంఛనప్రాయంగా ఉండే ఉపన్యాసం కాకుండా ఉపయోగకరంగా ఉంటుందని, ఈ సంస్థద్వారా మనం తెలుగుతనాన్ని ఇక్కడనే కాకుండా ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వెళ్ళిపోయిన తెలుగువారిలో నిలిపి తద్వారా వారుగూడా మేం ఆంధ్రులం అని చెప్పేటటువంటి భావన ఆనందం వారికి కలగజేస్తూ ఉండడం సాధ్యమౌతుందని నా విశ్వాసం. నిజానికి ఇది వరకు జరిపినటువంటి తెలుగు ప్రపంచ మహాసభలు చాలా పెద్ద ఎత్తునే జరిగాయి. కాని అవి ఒక ఉత్సవాల కిందనే ఉండి పోయినాయని చెప్పే మాటకూడా నిజం. కాని ఒక్కొక్కసారి కాదు చాలాసార్లు – అటువంటి ఒక ఉద్రేక పూరితమయిన వాతావరణం నిర్మాణంచేసి, అందులోనుంచి ఒక సూక్ష్మమైన కార్యక్రమం. స్థిరమైన ధోరణి ఏర్పాటుచేసుకోవటానికి సాధ్యమౌతుంది. ఆ పెద్ద ఎత్తున చేసిన మహాసభల వల్ల ప్రభావం ఇక్కడికన్న ఇతర రాష్ట్రాలలో ఉండే ఆంధ్రులపైన, ఇతర దేశాల్లో ఉండే ఆంధ్రులపైన బాగా పడటానికి వీలవుతుంది. మమ్ముగుర్తుపట్టేవారున్నారు; మా గురించి ఆలోచించేవారున్నారు; మా కేమయిన కష్టసుఖాలు ఉంటే ఆదుకొనేవారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఉండే ప్రజలు. కేవలం వారి హద్దువరకే పరిమితమై, వారి సమస్యల వరకే ఆలోచించుకొనేటువంటిది కాకుండా మా మంచి చెడ్డలు వీలయినంతవరకు వారుకూడా చూస్తారు. ఆలోచిస్తారు అని చెప్పేటువంటి ధైర్యం వారికి కలిగింది. అందుకనే ఇప్పుడు కృష్ణారావుగారు చెప్పినట్లు సింహళంలో అక్కడుండేటువంటి మహాసభలవారికి, భయపడుతూ ఉండేటువంటి వారికి కూడా మనమంతా కలిసి ఉందామని చెప్పేటటువంటి ధైర్యం కలగటానికి ఆస్కారమైంది. ఆ రూపంగానే మిగత అన్ని రాష్ట్రాలలో మనదేశంలో ఉండేవారికి అటువంటి ఉత్సాహమైన వాతావరణం కలిగి వారికి ఈ రంగంలో ఈ దృక్పథంలో ముందుకు పోవటానికి దోహద మిచ్చిందని చెప్పినా అతిశయోక్తికాదు.

నేనా నాడుకూడా ఆ మహాసభలో మాట్లాడుతూ ఒక మాట చెప్పాను: మీరీ మహాసభ లీవిధంగా చేసినంత మాత్రాన లాభముండదు. దీని తరువాత స్థిరంగా ఉండి ప్రత్యేకించి ఇతర రాష్ట్రాల్లో ఉండే ఆంధ్రులకు, ఇతర దేశాల్లో ఉండే ఆంధ్రులకు మనమేంచెయ్యగలుగుతామని చెప్పేటటువంటి స్పష్టమైన కార్యక్రమం, నిర్దిష్టమైన కార్యక్రమం పెట్టుకోవటం అవసరం. అప్పుడుగాని ఈ మహాసభలవల్ల ఉపయోగం కలగదు" అని. మహాసభలవల్ల వాతావరణం, వాయుమండలం నిర్మాణ మౌతుందని మాత్రం ఎవరూ కాదనలేరు. కాని ఆ వాయు మండలానికి, వాతావరణానికి ఒక సరియైన స్వరూప మిచ్చేందుకు ముందుకు రావలసి ఉంది. స్థిరంగా పనిచేసేందుకు కార్యక్రమం ఏర్పాటు చేసుకునేది ఇటువంటి సంస్థ ద్వారానే సాధ్యమౌతుంది. ఆనాడు నేను చెప్పినటువంటి మాటల్లో నాకుండేటువంటి ఆలోచనలన్నీ కూడా ఈనాడు ఈ సంస్థద్వారా, సంస్థ కార్యక్రమాల ద్వారా రూపం తాలుస్తున్నందుకు నాకు ప్రత్యేకంగా సంతోషంగా ఉంది.

మేము ఢిల్లీకి పోతుంటాం : అప్పుడప్పుడు కొన్ని రాష్ట్రాలకు పోతుంటాం; తిరిగి వస్తుంటాం, ఈ రకంగా అక్కడి సమస్యల గురించి స్వయంగా చూసే అవకాశం దొరికింది. ఈపూట నేను మీరందరున్నారని చెప్పటంకాదు, నిజంగా ఆంధ్రత్వం ఉందంటే, ఆంధ్రత్వం యొక్క స్వరూపం చూడాలంటే వలసబోయిన ఆంధ్రుల్లోనే చూడ గలుగుతాం గాని ఇక్కడ కాదు. ఇక్కడుండేవాళ్లు సంసారపక్షంలో పడి సాధారణ మానవుల్లాగా ఉండి అవస్థలు పడుతూ పడుతూ ఎప్పుడో ఒకసారి ఆంధ్రత్వం జ్ఞాపకమొస్తుంది– ఉగాది పచ్చడిలా. మీకు అట్లాకాదు: దూరంగా ఉన్నప్పుడు నిజంగా మనసు ఎంత లాగుతుందో! అనుక్షణం మీరు ఆంధ్రత్వాన్ని అనుభవిస్తూ, మూర్తిభవిస్తూ ఉంటారు. ఇంత అవకాశం ఉన్నప్పుడు, ఆ హృదయాల్లో ప్రతిబింబించే ఆంధ్రత్వానికి ఆకారమే ఇవ్వలేకపోతే అది వారి తప్పుకాదు. మన తప్పని ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్ర రాష్ట్రంలో ఉండే ప్రజలు, పెద్దలు ఎంత తొందరగా గుర్తిస్తే అంత మంచిది అని నేను అనుకుంటూ ఉంటాను.

నేనామధ్యన ఉత్తర ప్రదేశ్‌లో ఏ పట్టణానికి వెళ్ళినా, ఆ పట్టణాలలో తెలుగు మాట్లాడేవారు కొద్ది సంఖ్యలోనైనా మేమంతా తెలుగువాళ్ళమని చెప్పి ముందుకు వస్తూవుంటే సంతోషంగా ఆనందంగా కనబడుతూ ఉంటుంది. లక్నోలో ఉదాహరణకు సుమారు అయిదు వందల కుటుంబాలు ఉన్నాయి. వారూ మేమూ కలిసి రాజభవన్‌లో పండుగ చేసుకొనే ఆచారం ఒకటి ఉన్నది. కాని అది సరిపోదు. నిలవ నీడలేదు. ఉండటానికి చోటులేదు. కలిసి ఎక్కడైనా పని చేసుకొందామంటే అవకాశాలు లేవు. ఈనాడు ఆంధ్రులు ఎక్కడున్నా– అయిదు లక్షలు, పదిలక్షలు పెంచినామంటున్నారు కృష్ణారావుగారు. నేను బయటినుంచి బాధ్యతలేకుండా చెబుతున్నానని కృష్ణారావుగారు అనుకోకూడదు; వెంగళ్రావుగారు అనుకోకూడదు. నేను ఏమంటానంటే, ఇక్కడ ఉండే ఆంధ్రత్వాన్ని దేశమంతా నిలపాలె. ప్రపంచమంతటా నిలుపుకోవాలె. కనీసం కోటితో మొదలు పెట్టాలని అంటున్నాను. ఎంత పెరుగుతుందో! దీంతో ఎంత గాఢమైన పిపాస ఉంటుందో దాన్ని పూర్తి చేసేటటువంటి పుణ్యమైన పని మనం చెయ్యాల్సిన అవసరం ఉంది. ఇది ఏరకంగా చేయగలుగుతాం?

ఇప్పుడు మన వామనమూర్తిగారన్నారు– ఎక్కడి వారక్కడ కలిసిపోవాలని చెప్పేసి. అది చాలా అవసరం. అది ఎవ్వరూ కాదనలేరు. కాని కలిసిపోతూ కలిసిపోతూ కొంత మిగిలిపోవాలి.

నేను వేరే రాష్ట్రాలమీద చెప్పటం ఉద్దేశం కాదుగాని, నిజంగా ఇప్పుడు కొంతమంది పెద్దలు మాట్లాడినట్టు మైనారిటీస్ కిందో బయటివారికిందో చూసేటి అలవాటు లేదనిమాత్రం ఎవరూ చెప్పలేరు. ఇది చాలా దురదృష్టకరమైన విషయం. చాలా ముఖ్యమైన సందర్భాలలో మంచిగా అనుభవముండి, అక్కడనే ఉండి ఎన్నో సంవత్సరాలనుంచి పనిచేస్తూ, ప్రావీణ్యం సంపాదించినటువంటి వాళ్ళనుకూడా ఎప్పుడైనా ఒక పెద్ద బాధ్యత వచ్చేటటువంటి పద్ధతిలో వచ్చేసరికి ఇక్కడివాడవుకావు అని చెప్పేటువంటి దౌర్భాగ్యపు పరిస్థితులు లేకపోలేదు. ఇది పోవాలి. కొన్ని రాష్ట్రాలలో ఆంధ్రులంటేనే కష్టపడి, ఇతర భాషలవారంటే కష్టపడి సినిమాలు రాకూడదు, పత్రికలు రాగూడదు అని ఉద్యమాలు లేవదీసింది మనం మర్చిపోలేము. ఇంత సహనం లేకుండా ఉండి దేశమంతటా ఇంటెగ్రేషన్ సాధిస్తామని చెప్పే మొనగాళ్లను నేను సవాలు చేస్తున్నాను.

ఈ అసహన భావం పోగొట్టటానికి ఆంధ్రులు అన్నిరకాలుగా ముందుకు పోవటానికి తయారు కావాలంటే ఒక పెద్ద కార్యక్రమాన్ని రూపొందించాలి. ఇదేదో ఆంధ్రుల పనిమాత్రమేకాదు. ఇది నిజంగా భారతదేశ మంతటిది. మన భారతదేశ నాయకత్వంది. శ్రీమతి ఇందిరా గాంధిగారు ఈనాడు దేశమంతా ఒకటిగా ఉండాలనిచెప్పి అనేకమయిన కష్టసాధ్యమైన ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్థికంగా ముందుకుపోయి, క్రమశిక్షణ సాధించి, కష్టపడి పనిచేసి అన్నీ చేకూరిన తరువాత దేశంలో ఆ విధమైన సహనం లేకపోతే ఎంతగా భారతదేశపు నాయకత్వం బాధపడవలసి ఉంటుందో అది మనం గుర్తు పెట్టుకోవాలి. మనం నాందిగా ముందుకు పోయినా నా సలహా ఏమంటే ఒకసారి ముఖ్యమంత్రులంతా సమావేశం కావాలె. ప్రధానమంత్రి అధ్యక్షత వహించాలె. ఈ విషయం చర్చించాలె. ఏ ప్రాంతంలో ఎక్కడివారున్నా వారుకూడా ఒక లైటుగా కనబడాలె. ఆంధ్రలో ఉండే తమిళులకు, ఆంధ్రలో కర్నాటకులకు, ఆంధ్రలో ఉండే గుజరాతీ వారికి మీరిక్కడికి వచ్చి మీ దేశానికి దూరంగా ఉన్నందుకు కొదువలేకుండా మీకు సరి మర్యాదిస్తాం, సౌకర్యాలు కలగజేస్తాం; ఉదాహరణకు గుజరాతీలో మాట్లాడుకొనటానికి, గుజరాతీ పత్రికలు చదువుకొనటానికి, గుజరాతీ కళావినోద కార్యక్రమాల్లో పాల్గొనడానికి, చూడడానికి అవకాశాలు ఇక్కడ కల్పిస్తున్నాం. అట్లా ఆ రాష్ట్ర ప్రజ, ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు రావాలె. అందుకనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రధానమంత్రి ఇంటెగ్రేషన్ ప్రోగ్రాముగా పెట్టుకునేటువంటి ఒక మహత్తరమైన కార్యక్రమంగా ఉండాలె. ఈ సంస్థ చేసేటువంటి ప్రయత్నం దానికి నాంది కావాలె. దానికి మార్గం చూపించేటువంటిది కావాలె. ఇది కేవలం ఆంధ్రులకు కొంత డబ్బిచ్చి, కొన్ని సౌకర్యాలు కలగజేసే కార్యక్రమం మాత్రమే కాదు. ఇది మనం ఆపాలజిటెక్‌గా చేసే కార్యక్రమం కూడా కాదు. ఇది కేవలం ఆంధ్రభాషకు సంబంధించింది మాత్రమే కాదు. ఇది మొత్తం దేశంయొక్క ఇంటెగ్రేషన్‌కు సంబంధించినది.

కొన్నిచోట్ల అక్కడుండే సంస్థలు వారు కొంత డబ్బు సేకరించుకొనేటువంటి స్తోమత ఉన్నవారు. ఆ స్తోమత లేనటువంటిచోట అక్కడుండేటువంటి రాష్ట్ర ప్రభుత్వం సహాయంచేయాలె. తెలుగు గడ్డకు మన ఇలవెలుపు శ్రీ వేంకటేశ్వర స్వాములవారున్నారు. కాబట్టి వారి డబ్బునుగూడా బయటపెడితే తప్పులేదు. వారి డబ్బును కేవలం మన ఆంధ్రప్రాంతపు జిల్లాలోనే ఖర్చుపెడతామని చెప్పటం ఒకనాడు కాకపోతే

ఒకనాడు ప్రమాదానికి దారి తీస్తుందనేటువంటి భయం గలవారిలో నేనొక్కణ్ణి. ఎంతో సువిశాలంగా పోయి మన ఇలవేలుపు భారతదేశానికి ఇలవేలుపు కావాలని చెప్పేటువంటి ఆకాంక్షతో, విశాలమైన భావాలతో పెద్ద ఎత్తున చేయాలె. ఆ పెద్దఎత్తున చేసేటప్పుడు మెల్లగా ఎక్కడెక్కడ ఆంధ్రులుంటే అక్కడ మొదలుచేసి వారిని భాగస్వాములు చేసేటువంటి పని మనం గట్టిగా చూసుకోవాలె. ఇది దయా ధర్మాలపయిన, విచక్షణపయిన వ్యక్తుల కాంటాక్టులపైన ఉండగూడదు. మనం విధిగా ఒక బ్లూ ప్రింటు తయారు చేసుకోవాలె. ఒక ఫైవియర్ ప్లాన్ వంటిది తయారు చేసుకోవాలె. ఇది ప్లానింగు కమీషన్ వారి ప్లానుతో సింక్రనైజు కావాల్సిన అగత్యంలేదు. మనం ఇక్కడ ఫైవ్ఇయర్ ప్లాను పెట్టుకొని “ఇదిగో ఇంత దబ్బు మేమిస్తాం, కేంద్రం చేత ఇంత ఇప్పిస్తాం” అని చెప్పగలగాలె. నిజానికి కేంద్రమేకాదు, ఆ రాష్ట్ర ప్రభుత్వాలుకూడా ఇవ్వాలె.

ప్రతిరాష్ట్రంలో అన్ని రాష్ట్రాలకు చెందిన భవనాలు ఉండి దీపాలు వెలుగుతూ, ఆశాకిరణాలు ప్రసరింపజేస్తూ ఉండాలె. ఉద్యోగరీత్యా మరో రాష్ట్రానికి వెళ్ళినవాడికి తన ఒరిజినాలిటీ, తన మాతృత్వాన్ని, భ్రాతృత్వాన్నీ, సంస్కృతిని కాపాడుకొనేటువంటి అవకాశం ఉండాలి. నిజంగా కూడా చెప్పాలంటే మనం మనుషులంగా బతికేది కేవలం బట్టా తిండి కొరకే కాదు. అయితే బట్టా తిండి లేనంతవరకు వాని కొరకు మనం తాపత్రయపడేది చాలా అవసరం. దొరకకుండా ఉండే వాళ్ళకొరకు కృషిచేయటం కూడా చాలా అవసరం. కాని దాంతోనే మానవజీవితం, మానవత్వం పూర్తికాదు. ఇంతకుమించి పోవలసిన పని చాలా ఉంటుంది. ఇందులో ఈ భాషకు సంబంధించిన, సంస్కృతికి సంబంధించిన విషయం తృప్తిగా ఉండి నిండుగా వికసింప జేయటానికి దోహదం చేసేది. ఇది సంపూర్ణమైన మానవ వికాసానికి తోడుపడేది. అందుకు మనం చేసేది ఆధ్యాత్మిక సేవే; మానవసేవే; సేవగా మనం కార్యక్రమం రూపొందించాలి.

ఈ మూడు రోజులు సదస్సుల్లో మీరు చర్చలు చేస్తూ ఉన్నారు. చాలామంది అనుభవంగల పెద్దలు ఇక్కడ ఉన్నారు. వారందరూ వివరంగా ఇక్కడ చర్చలు చేస్తూన్నారు. ఇది ఒక్క కార్యక్రమంతో పూర్తిఅయ్యేది కాదు. చర్చించుకుంటూ ఉంటే అవసరంకొద్దీ ఒకటొకటీ చేర్చుకోవచ్చు; తీర్చుకోవచ్చు. మీరిక్కడ రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలిస్తే, నేనక్కడ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి కూడా సలహా ఇస్తాను. మీరీవిధంగా ముందుకు పోగలిగితే, మొత్తం భారతదేశంలో ఇది ఒక ప్రధానమైన కార్యక్రమంగా రూపొందించటానికి ఈ తెలుగు సంస్థవారు ముందుకువచ్చి చేస్తున్న కృషి నాంది అయితే నేను మీ అందరితోపాటు మహాసంతోషిస్తాను.

మద్రాసు నుంచి వచ్చిన ప్రొఫెసరుగారు హిందీకంటె తెలుగు మాతృభాషగా మాట్లాడేవారే ఎక్కువమందని అన్నారు. వారు చూపించదలచుకున్న టెక్నికల్ సైంటిఫిక్ డిఫరెన్స్‌ను సర్వసామాన్యంగా జనసామాన్యం పాటించదు. కాబట్టి మనకా గొడవ వద్దు. ఉత్తరప్రదేశ్‌లో హిందీకి సంబంధించిన అనేక సమావేశాల్లో నేను పాల్గొన్నాను. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశం స్వతంత్రం కాగానే పదిహేను సంవత్సరాల్లో ఇంగ్లీషును వదిలేసి కేవలం హిందీతోనే పనిచెయ్యలేదు; మహా అన్యాయం చేశాడు అని తీవ్రంగా చెప్పేవారు కొందరున్నారు. మీకేమయినా హిందీ పిచ్చి ఉంటే ఉండవచ్చు బాబూ! జవహర్ లాల్ గారికి ఉన్నది మాత్రం హిందీ పిచ్చికాదు దేశపిచ్చి అని నేను చెప్పాను. దేశాన్ని కాపాడకుండా హిందీని కాపాడే మనిషి అయితే అట్టా హిందీని కాపాడే మనిషిని మేము లెక్కచేసేవాళ్ళము కాము అని హిందీ పరిషత్తులో చెప్పాను.

లక్నోలో తెలుగు, కన్నడము, మలయాళము, తమిళ భాషలను సాయంత్రంపూట చదువుచెప్పే మోతీలాల్ ఇన్‌స్టిట్యూట్ ఉన్నది. హైదరాబాదు రేడియోలో హిందీ నేర్పే పాఠాల మాదిరిగానే అక్కడ రేడియోలో తెలుగుభాష నేర్పే పాఠాలువస్తూ ఉంటాయి. దీనివల్ల ప్రయోజనం లేదు. హింది సాహిత్యం దక్షిణాన్ని ఎంతవరకు గుర్తుపెట్టింది అని నేను సవాలు చేశాను. ఎంత సేపూ గంగా, యమునా, ఎంత సేపు తులసీదాస్ అని అంటారే కాని ఒక్కసారి గోదావరీ, కృష్ణ అనరే, ఒక్క పుస్తకంలో తులసిని గురించి తప్ప పోతన గురించి రాయరే! ఈ విధంగా మీరు చేసినంత కాలం ఈ దేశంలో మీ హిందీ బహుజనసంఖ్యనుబట్టి దేశభాషగా చేస్తే చెయ్యవచ్చుగాని దక్షిణాన ఉండేవారి హృదయాల్లో మీరు లీనం కావటానికి మాత్రం అవకాశం కల్పించలేరు అని చెప్పాను. ఈ కాంప్లెక్సు మీ రున్నంతకాలం దక్షిణాదిలో మీ హిందీకి వ్యతిరేకత ఉంటుందని అంటున్నాను. కాని ఆ వ్యతిరేకతకు కారణం మీరుకాని దక్షిణాదివారు కారని చెప్తున్నాను, అన్నాను. మీ పండితులు ఇక్కడికి రావాలె. ఇక్కడ సాహిత్యంలో, భాషలో ఉండే విషయాలు గ్రహించాలె. అట్లాగే ఇక్కడి పండితులు అక్కడికి పోయి ఆ భాషలో ఉండేటటువంటి విషయాలు తెలుగులోకి రాయాలి. అప్పుడు సరియైన ఇంటెగ్రేషన్ అవుతుంది.

మనం దక్షిణాదిలో సాధారణంగా త్రీ లాంగ్వేజి ఫార్ములా పెట్టుకుంటాము. అక్కడ ఉత్తరంలో కూడా త్రీ లాంగ్వేజీ ఫార్ములా ఉండాలె. హిందీ, ఇంగ్లీషు, వన్ ఆఫ్ ది సదరన్ లాంగ్వేజెస్ అని చెప్పి ఇక్కడ చెపుతూ ఉంటారు. ఇది న్యాయమయిన మాట కాదు. లాంగ్వేజి సాధారణంగా ఎవరికి వారికి సంబంధించి కావాలని నేర్చుకోవాల్సింది కాని కంపల్సరీగా మూడు లాంగ్వేజీలు కచ్చపట్టి చదువుకోమని చెప్పడం ధర్మంకాదు.

ఉత్తర దక్షిణాలలో ఒక రకమయిన ఇంటిగ్రేషన్ కావాలంటే దక్షిణంలో ఉండే సాహిత్యవేత్తలకి అక్కడి రాష్ట్రాల యూనివర్సిటీలలో అనరరీ డిగ్రీస్ ఇప్పిస్తే బాగుంటుందని ఒక నిర్ణయం చేశాము. అట్లాగే జరిగించాలని నేను దక్షిణాది యూనివర్సిటీలను కూడా కోరుతున్నాను. ఈ విధంగా ఇతర రాష్ట్రాల్లోని పెద్దలను కూడా మనం గౌరవించుకోవాలి.

ఈ సంస్థవారు కూడా అన్నారు. తాము తెలుగుకు ప్రాధాన్యత ఇస్తూ కూడా ఇంటిగ్రేషన్‌కు గట్టిగా ప్రయత్నిస్తామని, అది చాలా చక్కని మాట. మేము తెలుగుతో తాపత్రయపడి భారతదేశమనే చిత్రాన్ని సర్వాంగ సుందరంగా చేయడానికి చేసే కృషిగా ఇది వికసిస్తుందని చెప్పేటువంటి విశ్వాసంతో ఈ సంస్థ ముందుకు పోవాలని చెప్పి కోరుతూ, వేరే రాష్ట్రాల నుంచి వచ్చిన మిత్రులకు నేను గూడా స్వాగతం చెబుతూ, ఈ అవకాశం కలగజేసిన మిత్రులు కృష్ణారావుగారికి వారి సహచరులకు కృతజ్ఞతలు చెప్తూ ఈ సభా కార్యక్రమం బాగా పెద్దఎత్తున పెరగాలని చెప్పి, ఈ దేశం లోను దేశం వెలుపల చాలా ప్రభావ వంతంగా ఉండాలని నేను భగవంతుని ప్రార్థిస్తూ సెలవుతీసుకుంటున్నాను. జై హింద్.

కె.ఎస్.కోదండరామయ్య

ఇతర రాష్ట్రాలలో తెలుగువారు - పాఠశాలలు

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, భాషా ప్రాతిపదికమీద రాష్ట్రాలేర్పడి తద్వారా తెలుగువారికి సువిశాలమైన ఒక స్వంత రాష్ట్రం లభించి, అందు పటిష్ఠమైన పరిపాలన ఏర్పడి, తెలుగు భాషకు అన్ని రంగాలలోను ప్రాముఖ్యత కలిగి, ఆంధ్ర భాషాసాహిత్య సంస్కృతులు సర్వతోముఖ వికాసము గాంచుచుండు ఈ సమయమున, ఇరుగు పొరుగు రాష్ట్రాలలోను, సుదూర రాష్ట్రాల లోను నివసించుచుండు లక్షలాది తెలుగు ప్రజకు మాతృభాష నేర్చుకొనుటకు, దాని అభివృద్ధి పరచుకొని తమ సాహిత్య సంపదను రక్షించుకొనుటకును, ఆయా ప్రాంతాలలో తెలుగు వెలుగును విరజిమ్ము తెలుగుకీర్తి పతాకమును వెలియించుటకును మరియు మాతృరాష్ట్రంతో సాహిత్య, సాంస్కృతిక సంబంధములను నిలబెట్టుకొని, దానిని సుస్థిర మొనర్చుకొనుటకును, తగు ప్రయత్నములు గావించవలసిన సమయాసన్నమైనది, మరియు ఆవశ్యకత ఏర్పడినది. ఇంతేగాక, ఆయా ప్రాంతాలలో నుండు తెలుగువారు సయితము తమ మాతృ భాషాభిమానమును, మాతృ రాష్ట్రాభిమానమును విడనాడక, తమ భాషను అభ్యసించుటకు, కృతనిశ్చయులైయున్నారు. మరియు తదాశయ సిద్ధికోసం, ఆంధ్రప్రభుత్వంవైపు తమచూడ్కులనిగుడించి, గంపెడాసతో నున్నారు.

ఇట్లుండగా, ఆంధ్ర ప్రభుత్వంవారి దూరదృష్టి, నిరుపమానమైన భాషాభిమానము, చల్లని చూపుల కారణమున గత సంవత్సరం ఉగాది పండుగ సందర్భముగ మహావైభవముగాను, వితరణగాను, ఆదర్శప్రాయంగాను ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినవి. ఈ మహాసభలు రాష్ట్ర-రాష్ట్రేతర, ఖండ-ఖండాతరములందు ఆంధ్రులను ప్రప్రథమంగా ఒక వేదికమీదికి తెచ్చి, వారికి పరస్పర పరిచయం కలిగించి, సన్నిహితత్వం గలుగజేసినవి. ఆ సమయమున పరిపాలనా దక్షులగు ముఖ్యమంత్రిగారును, వారికి కుడిభుజమైయుండు విద్యామంత్రిగారును, తక్కిన మంత్రులును సమావేశమున కేతెంచియుండిన రాష్ట్రేతర ప్రతినిధులకు సకల సౌకర్యములను సమకూర్చి, అఖండ దృష్టితోజూచి, గౌరవించి, ఆదరించి, యెక్కడనున్నను తెలుగువారందరు ఒక్కటేయనియు, ఆంధ్ర ప్రభుత్వము వారినందరిని సమదృష్టితో జూచి, వారివారి అవసరములను గమనించి, తగురీతి వారికి తోడ్పడగలదని అభయ మొసగినారు. ఈలాగు లభించిన గౌరవము ఆదరవులు తర తరాలనుండి నిరుత్సాహముతో మోడువారియుండిన తెలుగు ప్రతినిధుల హృదయాలలో నొక నూతనోత్సాహమును క్రొంగొత్తబలమును రేకెత్తించి, వారిలో ఆంధ్ర భాషాభిమానమును పరవళ్లు త్రొక్కించినవి. ప్రపంచ తెలుగు మహాసభల దిగ్విజయము ఫలితముగాను, ఆంధ్ర విద్యామంత్రిగారి యెడతెగని కృషి, ముఖ్యమంత్రిగారి సముఖత కారణంగా "అంతర్జాతీయ తెలుగు సంస్థ" ఏర్పడి, తెలుగు భాషాభివృద్ధికి పథకాలు వేయతొడగింది. ఇది ఇతర

రాష్ట్రాలలోని తెలుగువారికి ఆంధ్ర ప్రభుత్వం తోడ్పడుటకు చక్కని తరుణము. అందులకవసరమైన ప్రయత్నము, తత్పరత నెలకొనింది. రంగము సన్నద్ధమయ్యింది. ఇతర రాష్ట్రాలలోనుండు తెలుగువారికి మాతృభాష నేర్చుకొనుటకు చేయవలసిన కార్యక్రమములో మొట్ట మొదటిది, ఆయా ప్రాంతములలో తెలుగువారెక్కువగనుండు చోట్లలో పాఠశాల లేర్పరచుట; ఆ విషయమును గురించి ఇచ్చట వ్రాయుచున్నాను. రాష్ట్రేతరాంధ్ర ప్రాంతములలో తరతరాల తెలుగువారి భాషా సాహిత్యముల చరిత్ర, ఆవశ్యకతలు, పరిస్థితులు భిన్నరీతులుగనున్నవి. ఆంధ్రప్రదేశ్‌కు ఇరుగు పొరుగుననుండు రాష్ట్రములు, ముఖ్యముగ తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రములలో నొకవిధముగను; వీని కావలనుండు రాష్ట్రములలో నొకవిధముగను నున్నవి. ఈ రెండు ప్రాంతములలో మొదటివాని యందు, అనగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రములలో తెలుగువారు శతాబ్దాల తరబడి నివసించుచూ, అచ్చట వ్యవసాయ, వాణిజ్యాది వృత్తులకొనసాగించుతు, తమ భాషను, తమ సంస్కృతిని నెలకొల్పి, అచ్చట తెలుగుముద్రనువేసి, ఆ ప్రాంతాలను తమవిగా జేసికొని, లక్షలాదిగా నుండువారు అచ్చటి తరతరాల చరిత్రను, శాసనాదులను, భాష తీరు తెన్నులను నిష్పక్షపాత దృష్టితో జూచిన ప్రస్తుత మచ్చట అధిక సంఖ్యాకులుగనుండి, ఆయా రాష్ట్రములు తమ భాషా రాష్ట్రాలని చెప్పుకొనువారికంటెను, తెలుగువారా ప్రాంతాలలో శతాబ్దాలకు మునుపే నివాసము లేర్పరచుకొని యున్నారనుట విశదమగును. కారణాంతరములచే ఆ ప్రాంతాలలో తెలుగు భాషకు ఆధిక్యము తగ్గి, ప్రోత్సాహము సన్నగిల్లి, తుదకు ఆ భాషాభ్యాసమునకు వసతులు తగ్గిపోతూ వచ్చినందున, ఆ తెలుగు వారు తమ మాతృభాషకు దూరమైపోవలసియుండు దుస్థితి ఏర్పడినది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో నేడు సయితం ఆంధ్ర రాష్ట్రంలో లభించని, ఆపూర్వమైన ప్రాచీన సాహిత్య గ్రంథములు లభించుచున్నవి. అందువలన ఈ రాష్ట్రాలలో తెలుగుభాష కేర్పడియుండు దుస్థితిని తొలగించి, అనుకూల పరిస్థితులేర్పరచి, మరల తెలుగువారు తమ మాతృభాషను నేర్చుకొని, తమ సాహిత్యమును వికాసపరచుకొనుటకు తగు వసతుల నేర్పరచి యివ్వవలసియున్నది. ప్రస్తుతము కూడ, తమిళనాడులో దాదాపు 50-60 లక్షల తెలుగువారును, కర్ణాటక రాష్ట్రంలో సుమారు 35 లక్షల తెలుగువారును మొత్తము దాదాపు ఒక కోటిమంది యున్నారు.

ఇక రెండవ విభాగమున మహారాష్ట్రము, ఉత్తరప్రదేశము, హరియానా, కలకత్తా, ఢిల్లీ మొదలగు ప్రాంతములందును, వీని యందుండు తెలుగువారు ఇటీవల కొన్ని దశాబ్దముల నుండి, ఉద్యోగములకై వలసపోయి నివసించుచున్నావారు. వారికిని అచ్చట తెనుగు నేర్చుకొనుటకు వసతుల నేర్పరచి యివ్వవలసి యున్నది. ఇట్లు ఇతర రాష్ట్రములలో నుండు తెలుగువారికి విద్యాభ్యాస సౌకర్యములు సమకూర్చి యిచ్చి, ఆ తెలుగువారు తెలుగువారుగ నుండునట్లును, వారి నైతిక, ఆర్థిక, భాష, సాహిత్య బలములు ఆంధ్రరాష్ట్రానికి లభించునట్లు చేయవలసియుండు ఈ కార్యమొక బృహత్కార్యము: ఆచరించవలసిన కార్యము. ఇట్లు చేసినపుడే స్వతంత్ర భారతములో ఆరుకోట్ల సంఖ్యాబలము గలవారని సర్వరంగముల ప్రాముఖ్యత నొసగబడ తగినవారని ఏర్పడును. ఇక ఇరుగు పొరుగు రాష్ట్రాలగు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో తెలుగును పునరుద్ధరించ వలసిన విషయమును, ముఖ్యముగ నచ్చట యేర్పరచవలసియుండు తెలుగు పాఠశాలలను గురించి విశదపరచెదను. తమిళనాడులో జరుగవలసిన తెలుగు విద్యాసౌకర్యములను గురించి చాలా కాలమునకు ముందే ఈ ప్రాంతాలలో సంచరించిన దేశభక్తులగు కీ.శే.మాగంటి బాపినీడు గారును, మద్దూరి అన్నపూర్ణయ్యగారును నొక్కి వక్కాణించి యున్నారు. వీరిలో శ్రీ అన్నపూర్ణయ్యగారు సుమారు నలుబది సంవత్సరములకు పూర్వమే రామనాథపురం జిల్లా యందుండు తెలుగుపురమును రాజపాళెములో నొక పుస్తక భాండాగారమునకు ప్రారంభోత్సవము సల్పిన సమయమందు "ఆంధ్రదేశ మందున్న తమిళులకన్న తమిళ దేశమందాంధ్రులెక్కువగ నున్నారు. వీరి పూర్వులు విజయనగర సామ్రాజ్య కాలమందును, ఆంధ్రనాయకులు తంజావూరు, మధురలను పాలించునపుడును దక్షిణదేశమునకు వచ్చి స్థిరనివాసముల నేర్పరచుకొనినారు. లక్షలకొలది ఆంధ్రులు తమిళజిల్లాల్లో నున్నారు. వీరందరును తామాంధ్రుల మనియు, వారి మాతృభాష ఆంధ్రమనియు గుర్తెరిగి ఆంధ్ర వ్యక్తిత్వమును గాపాడుకొనుటకు, వారలకు ఆంధ్రభాషాధ్యయనము, పుస్తక భాండాగారము లత్యంతావశ్యకములు. ఆంధ్రనాయకులీవిషయమును గ్రహించి ఆంధ్రుల ప్రతిష్ఠ గాపాడవలసియున్నారు".

తమిళనాడు

తెలుగు భాషకు సంబంధించిన వరకు, తమిళనాటిలో రెండు రకములగు పరిస్థితులున్నవి. 1.ఆ రాష్ట్రములో ఉత్తరము వైపుగల జిల్లాలు, ఇందు మద్రాసునగరము; 2.చెంగల్పట్టుజిల్లా, 3.ఉత్తరార్కుటుజిల్లా, 4.ధర్మపురిజిల్లాలున్నవి. ఇక రెండవ రకమున 1.దక్షిణ అర్కాడు, 2.తిరుచునాపల్లి, 3.మధుర, 4.రామనాధపురము, 5.తిరునల్వేలి, 6.కోయంబత్తూరు, 7.సేలం జిల్లాలు కలవు. మొదటి విభాగములో తెలుగు పాఠశాలలు పెక్కు గలవు. ప్రాథమిక పాఠశాలలోను, ఉన్నత పాఠశాలలోను, కళాశాలలోను తెలుగును బోధించుటకు ఏర్పాట్లు కొంతవరకు గలవు. ఆంధ్రజిల్లాలు, సంశ్లిష్ట మద్రాసు రాష్ట్రమును వీడి, వేరె అయినప్పుడుండిన పాఠశాలలో కొన్ని తగ్గినవి; గాని, మిగతవి కొనసాగుచున్నవి: తెలుగుకు ప్రోత్సాహము సన్నగిలిపోతూ వున్నది. ప్రజలలో విద్యాసక్తి, తమ పిల్లలకు విద్య నేర్పించ వలయునను కుతూహలము హెచ్చినందున, నేడు తెలుగు పాఠశాలల సంఖ్య చాలా ఎక్కువ గావలసియున్నది. ఈ ప్రభుత్వమువారు తెలుగు భాషాభివృద్ధికి న్యాయముగా యివ్వవలసిన గౌరవము, వసతులు ఇవ్వకున్నారు. అందువలన, పాఠశాలలో తెలుగు పిల్లల సంఖ్య తగ్గుచున్నది. ముఖ్యముగా నీ ప్రాంతమునందు ప్రాథమిక పాఠశాలలలో తెలుగు బోధన ఎక్కువగా జరుగుటకు ఏర్పాట్లు కావలసియున్నది. మద్రాసు నగరమందు తెలుగునేర్పు ప్రాథమిక పాఠశాలలు చాలా వరకు తగ్గిపోయినవి. గాన, తెలుగు తరగతులు రద్దయినచోట్ల మరల ఏర్పరచుటయు, క్రొత్తగా తరగతుల ప్రారంభించుటయు, తెలుగు నేర్పుటకు ప్రయివేటు పాఠశాలల నేర్పరచుటయు జరుగవలసియున్నది. ప్రాథమిక పాఠశాలలలో తెలుగు బోధింపని యెడల, మధ్యమ పాఠశాలలకు, ఉన్నత పాఠశాలలు పిల్లలుచాలక, తెలుగు తరగతులు రద్దుచేయవలసిన అవసరమేర్పడును.

అలాగే తక్కిన, చెంగల్పట్టు, ఉత్తరార్కాడు, ధర్మపురి జిల్లాలలో పెక్కు గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలలో తెలుగు నేర్పుటకు వసతులున్నవి. కాని యింకను ఎక్కువగా యివ్వవలసియున్నది. కొన్నిచోట్ల ప్రయివేటు పాఠశాల లేర్పరచి తెలుగును బోధించవలసియున్నది. ఈ జిల్లాలలోను, మద్రాసు నగరమందును తెలుగుభాష సజీవంగానుండి, వృద్ధిగాంచుచున్నది. తెలుగు పండితులు, కవులు, పత్రికాకారులు ఎక్కువగా నున్నారు. వీరిసంఖ్య తగ్గిపోకవుండుటకై, తెలుగుభాషా వికాసము యిచ్చట చక్కగ జరుగవలసియున్నది.

ఇక, దక్షిణ జిల్లాలలో కొంతకాలమునుండి తెలుగును పాఠశాలలో బోధించు వసతులు పూర్తిగా తొలగింప బడినవి. అందువలన తెలుగు తల్లిదండ్రులు, వాంఛించినను, ప్రభుత్వంవారు తెలుగు తరగతుల నేర్పరచలేదు. అయినను, తెలుగునేర్చి, చదువను వ్రాయను తెలిసినవారు యిక్కడ సయితము కలరు. కాని, యువతరములో యీ పరిస్థితి లేకున్నది. ఉత్తర జిల్లాలలో కంటే యీ జిల్లాలలో తెలుగుభాషకు గొప్ప అన్యాయము, మహాపచారము గలిగినవి. కావున యీ ప్రాంతములలో నెక్కువశ్రమపట్టుదలతో మరల తెలుగుబోధన ఏర్పరచుటకు ప్రయత్నములు గావించవలసియున్నది.

విద్యాభ్యాసమునకు వసతులు గల్పించి యివ్వవలసిన విధములు

తమిళనాడులోని ప్రభుత్వ పాఠశాలలలో నెచ్చటెచ్చట తెలుగును బోధించుటకు తరగతుల్లేవో ఆయా స్థలములందు వసతుల నేర్పరచి యివ్వవలయును. భాషారాష్ట్రము లేర్పడిన పిదప తెలుగువారు పెక్కు లక్షలమంది యున్నను, అల్పసంఖ్యాకులుగ గణింపబడియున్నారు. ఈ రాష్ట్రములో ప్రధానభాషయైన తమిళమునకు పిదప ద్వితీయస్థానమన్ని తాలూకాలయందును, అన్ని జిల్లాలయందును తెలుగుదే. ఇటీవల విద్యావ్యాప్తి విరివిగా జరుగవలసియున్నందున, ప్రతి జిల్లాయందును ఇంచుమించుగా అన్ని గ్రామములందును పాఠశాల లేర్పరుచబడినవి. గావున, తెలుగువారు తగినంత సంఖ్యగల గ్రామాలలోని పాఠశాలలలో తెలుగు లేనిచోట మరల తెలుగు బోధనకు వసతులు కల్పించి యివ్వవలయును. కేంద్ర ప్రభుత్వంవారు, అల్ప సంఖ్యాకుల పిల్లలకు విద్యాసౌకర్యములు గలుగజేయుటకై కొన్ని రక్షణలను గల్పించి, వానిని చట్టబద్ధమొనర్చియున్నారు. ఆ నిధుల ననుసరించి, తెలుగువారికి ప్రాథమిక పాఠశాలలో మాతృభాషను బోధించుటకు వసతులు కల్పించి యివ్వవలసిన బాధ్యత తమిళనాడు ప్రభుత్వముమీద నున్నది.. కాని, ప్రభుత్వమువారు వారే ముందంజవేసి చేయరు. కావున, ఆ ప్రభుత్వము గమనమును తెచ్చి, వత్తిడి గావించినయెడల పెక్కు ప్రాథమిక పాఠశాలలో తెలుగు బోధించుటకు వసతులు ఏర్పరచవచ్చును. ఇది యొక మార్గము. ఇక మరియొక మార్గమున్నది. మైనారిటీ భాషలవారు, తామే పాఠశాలల నేర్పరచుకొని, తమ మాతృభాషను బోధించవచ్చును. ఇలాంటి సంస్థలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయము చేయగలవు. ఇది చట్టబద్ధమైనది. "All minorities, whether based on religion or language shall have the right to establish and administer educational institution of their choice — అని యున్నది. ఆంధ్ర ప్రభుత్వమువారే ఈ తమిళనాడులో ప్రత్యక్షముగ పాఠశాలల నేర్పరచుట వీలుకాదు. పెక్కు రాజకీయ ఆటంకములు గలవు. కావున, ఈ రాష్ట్రమందుండు ఆంధ్ర సంఘములవారు (Andhra Cultutal Institutions) ఈ కార్యమును జేకొని, తమ ఆధ్వర్యం క్రింద తెలుగు పాఠశాలలు నేర్పరచవచ్చును. క్రిష్టియనులీ విధి (rule) సహాయమున లెక్కలేనన్ని ప్రయివేటు పాఠశాలల నేర్పరచి యున్నారు. వారికి ఇతర దేశములనుండి ఆర్థిక సహాయము లభించుచున్నది. మరియు ఆయా రాష్ట్ర ప్రభుత్వంవారు తగినంత గ్రాంట్ల నొసగుచున్నారు. ఈ పద్ధతిని తెలుగువారు అవలంభించవలయును. ఉదాహరణమునకు, మద్రాసు నగరమందున్న (1) చెన్నపురి ఆంధ్ర మహాసభవారు. 2.కళాసాగర్ వారు, 3. కళావాహినీ వారు మొదలగువారీ విధముగ తెలుగు పాఠశాలలను ఏర్పరచవచ్చును.

మద్రాసులోనుండు శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవాలయ సంస్థ వారు (ఎస్.కె.పి.డి)ను, విల్లివాకంలోని తెలుగు సంస్థవారును ఈలాటి పాఠశాలలను నిర్వహించుచున్నారు. వారికి ఆంధ్ర ప్రభుత్వమువారు తగినరీతి ఆర్థిక సహాయ మొసగవలసియున్నది. మద్రాసు నగరంలో వలెనే, తక్కిన జిల్లాల్లో సయితం తెలుగు భాషా రక్షణకు, సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తూవుండు సంస్థలు గలవు. వాటి ఆధ్వర్యంక్రింద పాఠశాలలు నేర్పరచుట చేయవచ్చును.

ఇంతేగాక ప్రతి పెద్ద పట్టణమునందును తెలుగు వైశ్యకులమువారు, కన్యకాపరమేశ్వరీ ఆలయములలో, కొన్ని చోట్ల ప్రయివేటుగా తెలుగు పాఠశాలలను నిర్వహించుచున్నారు. కొన్ని చోట్లలో పాఠశాలలు లేకపోయినను, పాఠశాల కొరకు డబ్బును ప్రోగుచేసి యుంచియున్నారు. ఆయా స్థానిక వైశ్యమండలివారిని ప్రోత్సహించి, మరియు వారికి ఆంధ్రప్రభుత్వం తోడ్పడి పాఠశాలల నేర్పరచవచ్చును.

ఇక దక్షిణ జిల్లాలలో, తెలుగుబోధన బొత్తిగా లేనందున యిచ్చట తీవ్రంగా కార్యక్రమములను కొనసాగించవలసియున్నది. ముఖ్యముగా ప్రభుత్వ పాఠశాలలలో తెలుగు తరగతుల స్థాపించుటకు ప్రభుత్వంపై వత్తిడి తేవలసియుంది. వీనికితోడుగ యింతకు ముందు జెప్పినరీతి తెలుగు సంస్థలద్వారా కొన్ని స్థలములందు పాఠశాల నేర్పరచవచ్చును. ఉదాహరణమునకు రాజపాళెం ఉన్నత పాఠశాలలు, 1968లో ప్రభుత్వంవారు తెలుగు బోధనను తొలగించారు. కాని ధర్మపురిజిల్లా, హోసూరులో నుండు "దక్షిణాంధ్ర భాషారక్షణ సమాజము" వారి తీవ్రకృషి ద్వారా మరల తెలుగును నేర్పుట ప్రారంభం చేయబడింది. సుమారు 2 వందల విద్యార్థులు తెలుగు నేర్చుకొనుచున్నారు.

మరియొక విషయమేమనగా, ఈ జిల్లాలోని పాఠశాలలో ప్రతిదాని యందును సుమారు 3వ వంతు తెలుగు మాతృభాషగా గల విద్యార్థులున్నారు. అందువలన అల్ప సంఖ్యాకులకు కల్పించబడియుండు రక్షణలను సులభముగా నేర్పరచవచ్చును.

స్థానిక తెలుగు ప్రాంతాలు

కేంద్ర ప్రభుత్వంవారు భాషాల్పసంఖ్యాకులకు కల్పించి ఇచ్చియుండు రక్షణలలో "స్థానిక భాషాల్ప సంఖ్యాకుల ప్రాంతాలు" (Local linguistic minority language areas) అనునది ఒకటి ఈ సూత్రాన్ని అనుసరించి తమిళనాడులోని ఇరువది తాలూకాలు "స్థానిక తెలుగు ప్రాంతాలు"గా ప్రభుత్వం గుర్తించింది (Local Telugu areas). ఈ తెలుగు ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలలో తెలుగు బోధనకు వసతులు కల్పించి యివ్వవలసియున్నది. ఇది తమిళ ప్రభుత్వం చేయాలి. అందువలన వారిమీద వత్తిడి తీసుకొనిరావలసిన ఆవశ్యకత యేర్పడింది.

ఈ విధముగా తమిళనాడులో తెలుగు పునర్వికాసముగాంచి, తగిన స్థానమును, గౌరవము గడించుటకు మంచి అవకాశమున్నది. ఈ అవకాశమును క్షుణ్ణంగా గ్రహించి, తగిన చర్యలను సత్వరముగా గైకొనవలసిన బాధ్యత ఆంధ్ర ప్రభుత్వమువారిమీద గలదు.

కర్ణాటక రాష్ట్రములో తెలుగు పాఠశాలల ఆవశ్యకత

తెలుగు భాషా పరిస్థితి కర్ణాటక రాష్ట్రములో మరొక విధముగ నున్నది. మొట్టమొదట ఈ రాష్ట్రములో నుండు వివిధ భాగములందుగల తెలుగు భాషా స్వరూపమునుగురించి తెలిసికొనవలయును. ఈ రాష్ట్రములో నాలుగు భిన్న భిన్న భౌగోళిక, భాషాభాగములు గలవు. 1.పాతమైసూరు సంస్థానము, 2.బొంబాయి రాష్ట్రము నుండి వచ్చిన ప్రాంతము, 3.హైదరాబాదు సంస్థానమునుండి వచ్చిన ప్రాంతములు, 4.మద్రాసు నుండి వచ్చినవి. వీనిలో తెలుగు భాషా పరిస్థితి వేర్వేరుగా నున్నది. ఈ పరిస్థితులను గ్రహించినపుడే అచ్చట తెలుగు పాఠశాలలు నేర్పరచవలసిన విషయము స్పష్టముగా తెలియును.

1. మొదటిభాగం- మైసూరు సంస్థానం : ఈ సంస్థానములో తూర్పువైపుగల ఆంధ్రరాష్ట్రాన్ని ఆనుకొనియుండు నాలుగు జిల్లాలు ప్రాచీన కాలమునుండి తెలుగువారెక్కువగనుండి, తమవిగా జేసికొని యుండిన ప్రాంతాలు. ఇవి 1.కోలారు జిల్లా, 2.బెంగుళూరు జిల్లా, 3.తుమ్‌కూరు జిల్లా, 4.చిత్రదుర్గం జిల్లా. వీనిలో కోలారు నూటికి నూరుపాళ్లు తెలుగు ప్రాంతం. ఈ ప్రాంతంలో తెలుగువారు మౌర్య, శాతవాహన చక్రవర్తుల పరిపాలనా కాలమునుండి అధిక సంఖ్యాకులుగా నున్నారని ఆ దేశ చరిత్ర గ్రంథములనుండి తెలియుచున్నది. విజయనగర సామ్రాజ్యపాలనా కాలమునుండి ఈ ప్రాంతంలో తెలుగు పరిపాలనా భాషగా ఏర్పడి, ఇంచుమించుగా 19వ శతాబ్దం కడపటి భాగం వరకు సాగింది. అవల కన్నడ భాషాధిక్యం హెచ్చి, వ్యాప్తి గావించినందున తెలుగుభాష అజ్ఞాతవాసం చేయవలసిన దుస్థితి ఏర్పడింది. తెలుగు పాఠశాలల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. ప్రస్తుతం బెంగుళూరులో ప్రభుత్వపువారి కొన్ని ఉన్నత పాఠశాలలలోను, కొన్ని కళాశాలలలోను తెలుగు బోధింపబడుతూవుంది. ప్రాథమిక పాఠశాలలలో బొత్తిగా తగ్గిపోయింది. కాని, కొన్ని ప్రయివేటు పాఠశాలలలో, తెలుగు ప్రాథమిక పాఠశాలలలో నేర్పుతున్నారు. కాన, ఈ నాల్గు జిల్లాలలోను తెలుగు బోధనకు విస్తారమగు ఏర్పాట్ల అవసరము చాలాగలదు. తమిళనాడు విషయమున జెప్పిన విధముగనే యిచ్చటగూడ, అల్పసంఖ్యాకుల రక్షణలను అమలు చేయించుటద్వారాను, ప్రయివేటు సంస్థలద్వారాను తెలుగు బోధనకు ఏర్పాట్లు చేయవచ్చును.

2. మద్రాసునుండి వచ్చిన బళ్లారి ప్రాంతం : 1953లో బళ్లారిని కర్నాటకమునకు ఇచ్చారు. తర తరాల నుంచి తెలుగు పట్టణముగ, తెలుగు సాహిత్యరంగముగ నుండిన బళ్లారిలో క్రమముగా తెలుగు పాఠశాలలు తగ్గింపబడి, దానికి అన్యాయం జరుగుతూ వుంది. ఇచ్చట యింకను తెలుగు పాఠశాలలున్నవి. తెలుగు సజీవంగానున్నది. ఇచట మరల తెలుగు పాఠశాలలను హెచ్చించి, వసతులు గల్పించిన, మరల దీనికి సత్వర పునర్వికాసము గలుగును.

3. హైదరాబాదునుండి వచ్చిన ప్రాంతము: హైదరాబాదు నుండి మైసూరుకు వచ్చిన 1.రాయచూరు, 2.బీదరు, 3.గుల్బర్గ జిల్లాలలో, రాయచూరు జిల్లాయందు రైల్వేలైనుకు తూర్పున, ఆంధ్ర సరిహద్దువరకుగల ప్రాంతం అంతా తెలుగువారత్యధికముగ నుండు ప్రాంతము. ఇచ్చట తెలుగువారు సరాసరి శాతము 60కి పైనే యుంటుంది. ఇచ్చట తెలుగు తెలిసినవారు అత్యధిక సంఖ్యాకులున్నారు. కాని ఇచ్చట తెలుగు బోధించు పాఠశాలల సంఖ్య తక్కువ; కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంవారు తెలుగు బోధనకు వసతులను క్రమక్రమముగా తగ్గించివేస్తున్నారు. అందువలన ఈ తాలూకాలో తెలుగును బోధించుటకు తగినన్ని పాఠశాలలనేర్పరచి యివ్వవలసియున్నది. ఈ జిల్లా తర్వాత, గుల్బర్గా మరియు బీదరు జిల్లాలలో ఆంధ్రరాష్ట్రమును ఆనుకొనియుండు ప్రాంతంలో పెక్కు తెలుగు గ్రామాలున్నవి. అచ్చటకూడ మరల తెలుగును చెప్పించుటకు వసతులు కల్పించియివ్వవలసియున్నది.

ఇట్లు తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాలలో నుండు దాదాపు ఒక కోటి తెలుగువారికి మాతృభాషను నేర్చుకొనుటకు చాలినన్ని వసతుల నేర్పరచి యివ్వవలసియున్నది. పై రెండు రాష్ట్రాలలోను, ఆయా ముఖ్య భాషలైన తమిళము, మరియు కన్నడ భాషల తర్వాత సంఖ్యాబలము, ప్రాచీనత, తగినంత సంస్కృతి బలముగలది తెలుగుభాష యొక్కటియే.

ఈలాగే బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, హరియానా మొదలగు ప్రాంతములందు తెలుగు భాషను ప్రోత్సహించుటకు ఇంచుమించుగ ఇట్టిచర్యలే గైకొనవలసియున్నది. ఈ రెండు ప్రాంతాల (తమిళ-కర్ణాటక రాష్ట్రాలు మరియు బొంబాయి-కలకత్తా మొదలగు ప్రాంతాలు) మధ్యగల ప్రబలమైన వ్యత్యాసమేమనగా, దక్షిణ రాష్ట్రాలలో తెలుగు విజయనగర సామ్రాజ్యపాలనా కాలమునుండి ఇంచుమించుగ 19వ శతాబ్దం వరకు, ప్రభుత్వ భాషగానుండి ఈ ప్రాంతంలో ఆధిక్యం, గౌరవం గడించి ఇటీవలనే క్షీణించుతూ వచ్చింది. మద్రాసు రాష్ట్రంనుండి 1953లో ఆంధ్ర జిల్లాలు వేరైన పిదప మరింత త్వరగా తగ్గుతూ వచ్చింది. అందువలన యీ రెండు రాష్ట్రాలలో కొంత ప్రయత్నం మీద తెలుగును పునరుద్ధరింపవచ్చును.

ఉత్తర జిల్లాలలోని తెలుగువారు చాలవరకు ఉద్యోగ రీత్యా వలసవెళ్ళి నివసించు చున్నవారయినందున, యెట్టెచ్చట తెలుగువారెక్కువగ నున్నారో, ఆయాచోట్ల మరల వసతులు కల్పించి యివ్వవలసి యున్నది.

ఈ తెలుగుభాషా పునరుద్ధరణ– మరియు పునర్వికాసకార్యం ఒక మహత్తరమైనది. ఒక మహా బృహత్కార్యం. ఈ కార్యమును నిర్వహించుటకు "అంతర్జాతీయ తెలుగు సంస్థ" (International Telugu Institute) ఆధ్వర్యముక్రింద "అన్యరాష్ట్ర ఆంధ్ర విద్యారక్షణ" లేక "రాష్ట్రేతరాంధ్ర విద్యారక్షణ సంఘము" (Outside Andhra Education Society) అను శాఖను అన్ని హంగులతో నేర్పరచి, భాషాభిమానము, విద్యాపరిణతి, అనుభవము, ఆయా భాషల మరియు ప్రాంతాల పరిచయముగలవారిని కొందరిని నియమించి, ఈ కార్యక్రమమునకు వలయు చక్కని పథకమును రూపొందించి, దానిని అమలు పరచుటకు తగు చర్యలు గైకొనవలయును. ఆలస్యము లేక చేయవలసిన ముఖ్య కర్తవ్యమిది.

ఇటీవల నొకచోట, గౌరవ విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు చెప్పియుండినట్లు, ఒక జనాంగమును పరస్పరము సన్నిహితమొనర్చి, బంధించు(unifying) అంశములు రెండు. ఒకటి భాష. రెండవది సంస్కృతి. వీనిలో కారణాంతరముల వలన మొదటిదగు భాష బలహీనమైనను, రెండవది అనగా సంస్కృతి బలవత్తరముగ నుండును. అందువలన ఒక దానిలోని లోపమును బలహీనతను రెండవది సరిబుచ్చుచున్నది. రాష్ట్రేతరాంధ్రు లెచ్చట నున్నను, ఈ రెండు అంశములను పోగొట్టుకొనలేదు. కారణాంతరములచే భాషకు అన్యాయము జరిగి, వికాసము తగ్గియున్నను, సంస్కృతి పటిష్ఠముగా నున్నందున, ఆ ప్రాంతాలలో మరల తెలుగు భాషను ఉద్ధరించి, దానికితగిన స్థానమును సమకూర్చుటసాధ్యము. శ్రీ మండలివారి చక్కని మాటలతో ఈ వ్యాసమును ముగించు తున్నాను. "ప్రపంచ తెలుగు మహాసభల కారణంగా ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో నివసిస్తున్న తెలుగువారంతా తెలుగుదేశానికి సన్నిహితులైనారు. తెలుగుదేశముతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకొని తమ భాషా సంస్కృతులను పరిరక్షించుకోవాలన్న ప్రగాఢవాంఛ వారిలో ప్రబలింది... హైదరాబాదులో 1974వ ఉగాదినుంచి వారం రోజులపాటు జయప్రదంగా జరిగిన అఖిల భారత తెలుగు సాంస్కృతికోత్సవాల అనుభవాన్నిబట్టి భాషకంటె కూడ సంస్కృతి ఎక్కువ బలవత్తరమైనదన్న సత్యం స్పష్టమైంది. అందుచేత తెలుగు ప్రజలలో సాంస్కృతికమైన చైతన్యం తీసుకురావటానికి శ్రీ వెంగళరావుగారు గట్టిగా పూనుకున్నారు."

అర్థవంతమైన, మరియు ఆదర్శప్రాయమైన, మరియు స్తుత్యమైన ఈ అభయమును, ఈ హామీని ఆంధ్రప్రభుత్వం సత్వరంగాను, పటిష్ఠంగాను అమలు పరిస్తే రాష్ట్రేతరాంధ్రుల చిరకాలవాంఛ నిజమైన ఆవశ్యకత, మధుర స్వప్నాలు తప్పక సిద్ధించును.

(ఇతర రాష్ట్రాలలో తెలుగువారు – విద్యాసాంస్కృతిక సమస్యలు సదస్సు ప్రసంగ వ్యాసం)

తెలుఁగు రాజుల పతాకల నీడలో జనుల్
సుఖనిద్రగన్న రోజులు దలంచి
తెలుఁగు శిల్పుల కళావిలసనమ్ములకు ది
గ్దేశముల్ కైసాచు దినములరసి
తెలుఁగు సంస్కృతి కెడందలు పల్లవింప దీ
పులు గడించిన నేరుపుల నెఱింగి
తెలుఁగు యోగుల యుపదేశము ల్విని ఖండ
ఖండము ల్తరియించు గాథలెన్ని

తెలుఁగు టిల్లాండ్ర మేలైన చెలువములకు
జగము కైవార మొనరించు చరితదడవి
తెలుఁగుల గురుత్వ మహిమ బుద్ధిందలంచి
తెలుఁగు తల్లికి జేజేలు సలుపవోయి

– కొండూరు వీరరాఘవాచార్యులు

సోమన సోమయ్య

మారిషస్‌లో తెలుగుభాషా బోధన

ఈ రోజున మా మధ్యలోకి మీరాకవల్ల మాకు ఎనలేని సంతోషం కలుగుతుంది. మా యీ చిన్న దేశంలో ఈ కొద్ది రోజులు హాయిగా గడుపుతారని మా శుభవాంఛలు. అప్పుడు శ్రీరామచంద్రుడు పద్నాలుగు సంవత్సరాలు వనవాసం పూర్తిచేసి, ఆయోధ్యా నగరికి తిరిగి వస్తున్నప్పుడు అక్కడ ప్రజలు అనుభవించిన ఆనందమే, ఈనాడు మేం కూడా మీ రాకతో అదే ఆనందం అనుభవిస్తున్నాం.

పూర్వకాలపు బోధనకీ, ఆధునిక కాలపు బోధనకీ చాలా తేడా వుంది. ఉదాహరణంగా సుమారు అరవై సంవత్సరాల క్రింద సాయంత్రపు బడుల్లో ఇప్పుడు మాదిరిగా బడులు, దేవాలయాలు విడిగా లేవు. ఆ సమయాన దేవాలయం ఒక మూల బడి నడిపేవారు. బడులు దర్భగడ్డితోనైనా, చెరకు ఆకులతోనైనా కప్పియుండేవి. మా బడి విషయం అంటే నేలపై ఇసకను వేసి, వాటిపై చేతి వేలితో రాసేవారు. అవి ఎలా మొదలుపెట్టేవారంటే ఓ నమః శివాయః సిద్ధం నమః అనే అక్షరాలు రాయిస్తూ గురువుగారు చదివించేవారు. ఈ అక్షరాలు బోధించే ముందు, సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ అనే సరస్వతీ ప్రార్థన చేసేవాళ్ళు. అప్పుడు గురువుగారు మామూలుగా "అయ్యోరు" అనే పేరుతో ప్రసిద్ధులు. ఈతనే ఆ దేవాలయానికి అర్చకుడు కూడాను. ఈతన్ని పూజారి అంటారు. మామూలుగా గురువుగారు సోమవారం నుంచి గురువారం దాకా విద్యార్థులకి పాఠాలు చెప్పేవారు. అంటే వారానికి నాలుగు రోజులు మాత్రం బడి చదువు ఉండేది. శుక్రవారం నాడు నైవేద్యంతో సహా వచ్చి దేవాలయంలో అర్చన జరిగేది. సభాసదస్యులు అందరును కూడి రామ భజనలు, కీర్తనలు పాడేవారు బడిపిల్లలు కూడా ఆ భజనలు, కీర్తనలు అనుసరించేవాళ్ళు. ఇంకను ఆ ఓనమాలు చదివిన తర్వాత, అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ మొదలైనవి తర్వాత క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ మొదలైనవి. ఆ తర్వాత గురువుగారు విద్యార్థులకి గుణింతాలు చదివించేవారు. చదవగలిగిన తర్వాత ఒక విద్యార్థి ముందు చెప్పేవాడు. పిమ్మట తక్కిన విద్యార్థులు అనుసరించేవాళ్ళు. అది ఎలాచెప్పేవారు అంటే క, కకు దీర్ఘమిస్తే కా, క గుడిస్తే కి, గుడి దీర్ఘమిస్తే కీ, కక్కొమిస్తే కు, కొమ్ముదీర్ఘమిస్తే కూ మొదలైనవి. ఇది చిన్న గుణితంలో ప్రసిద్ధిగా ఉండేది. ఆ తర్వాత పెద్ద గుణింతాలు వస్తాయి. కక్కావతిస్తే క్క, కకు తావత్తిస్తే క్త, కక్నావతిస్తే క్న, కక్మావత్తిస్తే క్మ, కక్యావతిస్తే క్య, కక్రావతిస్తే క్ర, కక్లావతిస్తే క్ల, కక్వావతిస్తే క్వ మొదలైనవి.

ఈ పెద్ద గుణింతం తర్వాత పెద్దబాల శిక్షలో చదివేవారు. ఆ సమయంలో మారిషస్ దేశంలో ఇప్పుడు మాదిరిగా కొత్త కొత్త పుస్తకాలు లేవు. మా తాతముత్తాతలు నూట యాభై సంవత్సరాల కింద

ఈ మోరిషన్ దేశానికి వస్తునప్పుడు తమ వెంట తెచ్చిన కొన్ని పాత పుస్తకాలు మాత్రమే ఆ పుస్తకాలలో పెద్దబాలశిక్ష, బాల రామాయణం, పాత కుశనాయకము, కామమ్మ కథ, బాలనాగమ్మ కథ, బొబ్బిలి కథ, రామదాసు చరిత్రము, యద్ల రామదాసు చరిత్రము, తారకామృతసారము, నృసింహ శతకము, ఇంకా కొన్ని నాటకాల పుస్తకాలు– వాటిలో, రామ నాటకము, లవకుశ, రుక్మిణీ కల్యాణం, ప్రహ్లాద నాటకం, గంగా వివాహము మొదలైనవి. మొత్తం మీద రామ భజన మరీ నాటకాల పుస్తకాలే ఎక్కువగా ఉండవచ్చు తమ తీరిక సమయాన మన పెద్దలు గుంపులుగా కూడి కాకమ్మ కథ, బొబ్బిలి కథ లేదా బాల నాగమ్మ కథ చెప్పి సంతోషించేవారు. శనివారం సాయంత్రం వేళ స్వేచ్ఛగా ఉండేవారు. కాబట్టి ఆ అవకాశం పురస్కరించుకుని అప్పుడప్పుడు రామ భజనం చేసేవాళ్ళు లేదా నాటకం ప్రదర్శించేవాళ్ళు. దీన్ని నాల్గో అని చెప్పేవారు. మామూలుగా ఆదివారం నాడు ఒక పెళ్ళి కార్యక్రమం ఉంటే, శనివారం రాత్రిపూట రామ భజనం చేసేవాళ్ళు లేదా నాటకం ప్రదర్శించేవారు. ఆ నాటకం ఆచార్యుని 'వత్యారే' అనేవారు. ఈ రామ భజనం లేదా నాటకం పెద్ద పందిరి కట్టి దాంట్లో ఈ కార్యక్రమం జరిగేవి. తర్వాత గంగమ్మ పూజ కూడా ఆదివారంనాడే చేసేవారు. ఈ సందర్భంలో కూడా శనివారం రాత్రిపూట నాటకం ప్రదర్శించేవారు. ఈ గంగమ్మ పూజ 'అమ్మోరు' పండుగతో ప్రసిద్ధం. ఈ పండగలో ఇతర ప్రాంతాల నుంచి తమ తమ చుట్టాల్ని ఆహ్వానించేవారు. ఈ పండగలో ఇతరులు కూడా పాల్గొనేవారు. ఎంతో వేడుకతో ఈ కార్యం జరిగేది. ఈ చెప్పిన రామ భజనలూ, నాటకాలూ, పండుగలూ మా పిల్లలను బాగా ఆకర్షించేవి. ఇలా మన భాషా సంస్కృతి ప్రభావం కూడా వాళ్ళ మీద పడింది. దీనితో మన తెలుగు భాషనీ, సంస్కృతినీ కాపాడుతూ సుమారు 1940 దాకా వచ్చారు మన పూర్వీకులు. ఈ సమయం దాకా సుమారు 50–60 మన తెలుగువాళ్ళు తమ మాతృభాష మాట్లాడేవారు. మొత్తం మీద సుమారు నూరు సంవత్సరం దాకా మన తెలుగువాళ్ళతో తమ భాష మాట్లాడేవారి సంఖ్య 50–60 ఇక మన తెలుగు భాషా బోధన పరిశీలిద్దాం. 1930 నుంచి 1945 దాక తెలుగు భాష బోధించేవారి సంఖ్య తగ్గిపోయింది. తెలుగు పాఠాలు చెప్పేవారు చాలా తక్కువ మంది ఉన్నారు. కారణమేమిటో అది చెప్పటం చాల కష్టం. ఈ తెలుగు భాష బోధించే వాళ్ళలో కొంత మందిని ఇక్కడ పేర్కొంటాను. శ్రీ పిచ్చయ్య గారు Goodlands నివాసి, అప్పల స్వామిగారు Quartier Militaire నివాసి, శ్రీ అప్పన్న మరియు కన్నయ్య గారు Mon Loiser నివాసులు, దానయ్య గారు Bel Etang నివాసి, జగన్న మరియు సన్యాసి గారు Belle Vue Maurel నివాసులు, శ్రీ రామమూర్తి అప్పన్న Nahebourg నివాసి, శ్రీ గుణయ్య ఒత్తుగారు La Clemence నివాసి ఇంకా కొందరున్నారు. ఈ 1945 నుంచి మన తెలుగు భాషా సంస్కృతికి ఒక విధంగా అనారోగ్యం సంభవించింది. ఉదాహరణంగా కొందరి ఇంట్లో అమ్మాయిలు, అబ్బాయిలతో తెలుగు భాషలో మాట్లాడుతుంటే పిల్లకి ఈ తెలుగు భాష అర్థమయ్యేది కాని ఏదో కారణంగా వీళ్ళు బిహారి భాషలో జవాబిచ్చేవారు. దీనికి పెక్కు కారణాలుండవచ్చు. మన తెలుగు వారి సంఖ్య చాలా తక్కువ. వీరు నివసించే చోట్ల నలుదిక్కుల బిహారీ భాష మాట్లాడేవారి సంఖ్య ఎక్కువ. దారిలో ఇతర భాషలతో సహా బిహారి భాషయే ఎక్కువ వినబడేది. మన తెలుగు బందుగును, తమలో తెలుగు భాష పలికేటపుడు, బిహారి సోదరులు, "ఏమండో మీరు, ఒండో మొండో అని పలుకుతున్నారే, మమ్ము తిడుతున్నారేమో" అని పరిహాసం చేసేవాళ్ళు. బహుశః ఇదే కారణంగా లేదా మన వాళ్లకి సిగ్గుతనం వల్లనో మన తెలుగు భాష పట్ల ప్రోత్సాహం ఇచ్చేది ఎవరు? సహాయకులు ఎవరు లేరు. సొంతంగా ప్రయత్నం చేయాలి.

మా తాత ముత్తాతల స్వర్ణభూమియైన ఆంధ్రప్రదేశం నుంచి మన పూర్వీకులు మమ్ము మరచిపోయారు. అప్పుడు తల్లిదండ్రుల్ని కోల్పోయిన బిడ్డలవలే మేమున్నాం.

సౌభాగ్యవశాత్తున కొందరు మహానుభావులు, ఆంధ్రప్రదేశం నుంచీ మద్రాసు నుంచీ తెలుగు పుస్తకాలు తెప్పించనారంభించారు. అది కూడా ఆరు నెలల తర్వాత లేదా సంవత్సరం తర్వాత ఆ పుస్తకాలు లభించేవిగాని ఈ పుస్తకాలు తెప్పించే వారి సంఖ్య చాలా తక్కువ. 1940–1945 మధ్య తెలుగు భాషా ప్రచారకులలో స్వర్గీయ పండిత గున్నయ్య ఒత్తుగారు ముఖ్యులు. 1947వ సంవత్సరంలో ఈయన తెలుగు భాష బాగా నేర్చుకొనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశానికి వెళ్ళారు. అక్కడ విశాఖపట్నంలో ఉండి, సంస్కృతం, తెలుగు, హిందీ నేర్చుకుని 14 సంవత్సరాల తర్వాత 'విద్యాభూషణ' సంపాదించుకుని మారిషస్ దేశానికి మరలివచ్చారు. ఈయన అనుపస్థితిలో స్వర్గీయ పండిత రామమూర్తి అప్పన్నగారు వీలయినంత తెలుగు భాష ప్రచారం చేశారు. అంటే అప్పుడు మా మారిషస్ దేశంలో తెలుగు భాష ప్రచారకులు లేనట్లే. స్పష్టంగావించడానికి నా సొంత కథ ఇక్కడ చెప్పాలి. శ్రీ గున్నయ్య గురువుగారి దగ్గర నాలుగు నెలలు మాత్రం తెలుగుభాష నేర్చుకున్నాను. ఈయన ఆంధ్ర ప్రదేశానికి వెళ్ళిన తర్వాత నాకు తెలుగు భాష చెప్పేవారు లేరు. నిరుత్సాహపడి నాలుగు సంవత్సరాలు తెలుగు పుస్తకాలు ముట్టలేదు. అప్పుడు ఒక బిహారి భాష మాట్లాడే మిత్రుడితో సహా కొంత హిందీ భాష నేర్చుకున్నాను. ఆ తర్వాత ఏదో హిందీ–తెలుగు ట్రాన్సలేషన్ పుస్తకం నాకు అందింది. దాని మూలంగా కొంత తెలుగు భాష నేర్చుకోగలిగాను. దీనితోనే నేను సంతోషించాను. గాని గురువు లేని చదువు ఎలా ఉంటుందో ఇది ఆలోచింపదగిన విషయం. 1947 సం॥న Mauritius Andhra Maha Sabha వారు ఆంధ్రప్రదేశం నుంచి తెలుగు పుస్తకాలు తెప్పించసాగారు. అన్ని ప్రాంతాల్లో వీలయినంత సాయంత్రపు తెలుగుబడులు తెరిచారు. ఆ బడుల్లో తెలుగు భాష బోధన ఆరంభించారు. అంత చక్కగా భాషాజ్ఞానం లేనప్పటికి వీలయినంత ప్రయత్నం చేశారు మన ఉపాధ్యాయులు. దీనితో మాకు కొంచెం ప్రోత్సాహం కలిగినట్టు అయింది.

ఆ సమయంలో మన తెలుగు పుస్తకాలే మా ప్రచారకులు, మా ఆధారం అది లేకపోతే మన తెలుగు తల్లి వ్యాధిగా అయిపోయింది అనాలి.

1958 సంవత్సరమున ఆగష్టు నెల మా మారిషస్ ప్రభుత్వం వారు నలుగురు ఉపాధ్యయుల్ని ఎన్నుకున్నారు. వీళ్ళకి 1 సెప్టెంబర్ 58 ఇప్పించి 1958 నుంచి ప్రాథమిక బడుల్లో తెలుగు భాషా బోధన మొదలు పెట్టారు. అప్పటి నుంచి మన తెలుగు భాషా సంస్కృతి గురించి ఒక కొత్తపుట్టుక అయిందని చెప్పాలి. మా మారిషస్ ప్రభుత్వంవారు ఈ భాష మొదలు పెట్టకుంటే అప్పుడే ఇది పోయివుండేది. దీని గురించి

మా మారిషస్ ప్రభుత్వంవారికి మా కృతజ్ఞతలు తెలుపడమే మా కర్తవ్యం. ఈ మన తెలుగు భాషా బోధన గురించి నియుక్తి గావింపబడిన పేర్లు ఇవి : Sri Lingah Ramaswamy, Sri Erabadhoo Elliah, Sri Encahsnmy, Sri Somanah Somah ఈ నలుగురు ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా బోధనకు ఆది గురువులు.

ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా బోధన మొదలైనదిగాని, పాఠ్యప్రణాళిక లేదు. చెట్లు లేని చోట ఆముదపుచెట్టే మేలు అన్నట్టు, అప్పుడు శ్రీ Sanassee Gooriah గారు తెలుగు భాష Supervisor గా ఉన్నారు. ఈతని కోరిక ప్రకారంగా శ్రీ సోమయ్యగారు మొట్టమొదట, తనకున్న తెలివితో పాఠ్య ప్రణాళిక తయారుచేశారు. మా Mauritius ప్రభుత్వం ఆశీర్వాదంవల్ల ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు భాషాబోధన మొదలయినది. దీనితోబాటు మన తెలుగులకి చాలా ప్రోత్సాహం కలిగింది. రొట్టె కొరకో, భాషా సంస్కృతి ప్రవృత్తి కొరకో, విద్యార్థులు తెలుగుభాష నేర్చుకోవడానికి మళ్ల మొదలుపెట్టారు. అదే సందర్భాన శ్రీ గున్నయ్య గురువుగారు డిసెంబర్ 1960 సం.వ. మా మారిషస్ దేశానికి మరలివచ్చారుకదూ, ఈయన రాకతో మన తెలుగువాళ్లలో ఒకరకంగా మెళకువ వచ్చింది. శ్రీ గున్నయ్య గురువు ఆదేశ ప్రకారంగా మొట్టమొదటి సారిగా ఉగాది పండుగ Rivierdu Rempart గ్రామంలో ఎంతో వేడుకతో జరిగింది. తర్వాత ఆంధ్ర అవతరణ ఉత్సవం జరిగింది. మన తెలుగువారికి కూడ పండుగలు ఉత్సవాలు ఉన్నాయని తెలిసిన మాకు ఎంతో గౌరవం కలిగింది. ప్రాణం కోల్పోతున్న వారి ఒంట్లో ప్రాణం పోసినట్లయింది. అప్పటినుంచి అంటే 1962 నుంచి ప్రతి సంవత్సరం ఉగాది పండుగ ఆంధ్రఅవతరణ ఉత్సవం జరుపుకొంటాం ఇవే మాకు సంపద. భారత ప్రభుత్వం ఆశీర్వాదంవల్ల, ఆంధ్రప్రదేశ్ అనుగ్రహం వల్ల 1965వ సంవత్సరమున Dr.V.Ananda Murthy గారు Itec expert మా మారిషస్ దేశానికి వచ్చారు. ఈయన మారిషన్ తెలుగువాళ్ళ భాషా పరిస్థితి బాగా పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల గురించి పాఠ్యపుస్తకాలు రాస్తూ, Training College లో విద్యార్థులకి పాఠాలు చెబుతూ ఉన్నారు. వీటితో సహా శనివారం రోజుల్లో కోరిన ఇతర ఉపాధ్యాయులకి కూడా పాఠాలు చెప్పేవారు. ఈయన నిర్విరామ కృషి గురించి డా॥ ఆనంద మూర్తి గురువుగారిని మేం మరువలేం. ఈయన ప్రోత్సాహం వల్లనే కొందరు మిత్రులు జి.సి.ఇ. పరీక్షలో పాల్గొని ఉత్తీర్ణులయ్యారు. దీని గురించి మాకు ఇంకా ప్రోత్సాహం కలిగింది. ఇట్లాంటి విద్వాంసులు, భాషాభిమాని మా మధ్యలోకి వస్తే మన తెలుగు భాష ఈ దేశంలో తప్పకుండా ప్రగతి చేస్తుందనీ, మన తెలుగు తల్లికి మల్లెపూ దండ అందుతుందని చెప్పగలము.

డా॥ ఆనందమూర్తి గురువుగారు సెకండరీలో ప్రాథమిక పాఠశాల గురించి పాఠాలు చెప్తుంటే వాటిని టైపు చేసేవారు. ఎవరు లేరు కాబట్టి ఈయన కోరిక ప్రకారంగా శ్రీ సామయ్యగారిని ఎం.జి.ఐ.కి రప్పించి టైపు చేయమన్నారు. కొన్ని నెలల తర్వాత డా॥ఆనందమూర్తి గురువుగారు సెకండరీ స్కూలులో తెలుగుభాష బోధన గురించి వాళ్ళకిచెబితే 'సరే' అని ఒప్పుకొని, వెంటనే వీళ్ళు తెలుగుభాష బోధన గురించి సోమయ్యగారిని నియమించారు. ఇలా సోమయ్యగారు మొట్టమొదట తెలుగుటైపిస్టుగా మారి మొట్టమొదట కళాశాల ఉపాధ్యాయుడుగా 1978లో నియమింపబడ్డారు.

1982వ సంవత్సరమున డా॥ఆనందమూర్తి గురువుగారు ఆంధ్రప్రదేశానికి తిరిగి వెళ్ళిపోయారు. అప్పుడు మాకు మార్గదర్శకులు ఎవరూలేరు. మార్షిస్ తెలుగుభాష మళ్ళీ అంధకారంలో పడినట్లయింది. ప్రాథమిక మరీ కళాశాల గురించి పాఠపుస్తకాలు రాసే తగిన విద్వాంసులు లేరు. ఇది మాకు చాలా నిరుత్సాహం కలిగిస్తుంది. మా మార్షిస్ ప్రభుత్వం వారి ప్రోత్సాహం లేకపోతే ఓ 50 సంవత్సరాల అవధిలో మా మారిషస్ దేశంలో తెలుగు భాష పోతుందని అనుమానంగా ఉంది. దీనితో మన తెలుగు తల్లికి మల్లెపూదండ బదులుగా తగినచోటే ఉండకపోవచ్చని నాకు తోస్తుంది.

మా తాతముత్తాతల స్వర్ణ భూమియైన ఆంధ్రప్రదేశం నుంచి వచ్చిన మా పెద్దలతో ఒక మనవి :

మా మారిషస్ దేశానికి అప్పుడప్పుడు తగిన విద్వాంసుని పంపిస్తే, కావలసిన పాఠ్యపుస్తకాలు తయారుచేస్తూ, కోరిన విద్యార్థుల కోసం డిప్లమా కోర్సు నడుపుతూంటే మాకు ఎంతో లాభం కలుగుతుందని మా నమ్మకం. ఎమ్.జి.ఐ వారు ఇప్పుడే సి.సి.ఇ. అడ్వాన్స్ కోర్సు ఏర్పాటు చేశారు.మరి ఈ 1990వ సంవత్సరము మొట్ట మొదటిసారిగా విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ తెలుగు ఇన్‌స్టిట్యూట్ వాళ్ళు 1977లో 5గురి మారిషన్ విద్యార్థులకోసం కోర్సు ఏర్పాటు చేశారు. దాని తర్వాత 13 సంవత్సరాలు దాటింది. ఏం కోర్సు జరుగలేదు. దీనిబదులుగ ఆ మాదిరికోర్సు మా మారిషస్ దేశంలో ఏర్పాటుచేస్తే 5గురికి బదులుగా 30, 40 మందికి లాభం కలుగవచ్చు. ఆఖరిలో మా పూర్వీకులు ఈ దేశానికి వచ్చి 150 సంవత్సరాలు అయింది. 150 సంవత్సరాలు అంటే 150 రోజులు కావు. ఎంతో కష్టంతో మన తెలుగుభాష ఈ ఆధునిక పరిస్థితిలోవుంది. నేను చెప్పినదాంట్లో బహుశః చాలా తప్పులుండవచ్చు. భాష తేడా ఉండవచ్చు. మీరు పెద్దలు. మా ఉద్దేశ్యము గ్రహించండి. దీనితో పాటు నేను సెలవు తీసుకొంటున్నాను.

జై మారిషస్ దేశం, జై భారతదేశం, జై ఆంధ్రప్రదేశం, జై మన తెలుగుతల్లికి

(తృతీయ ప్రపంచ తెలుగు మహాసభలలో చదివిన ప్రసంగ వ్యాసం, గాంధీక్షేత్రం మాసపత్రిక)

వెన్నెలకంటి రాఘవయ్య

ఆదివాసీలను ఏ దృష్టితో చూడాలి ?

ఆంధ్రరాష్ట్ర ఆదిమజాతి సేవక్‌సంఘ్-నెల్లూరు

దాదాపు 2 కోట్ల ఆదివాసీల అభివృద్ధిని ఒక దశాబ్దం వెనక్కుపోయి అధ్యయనంచేస్తే, ఈ విధంగా కృషి చేసేవాళ్లందరూ, కొంత నిదానంగా ఆలోచించి ఆదివాసీల అభివృద్ధికి ఏ విధంగా తోడ్పడాలో గమనించాలి. ప్రజలు, ప్రభుత్వం ఆదివాసీ సమస్యలపై ఆసక్తి చూపాలి. వాళ్లను గూర్చి అధ్యయనం చెయ్యాల్సిన అవకాశమేకాక, దేశంలో ప్రతి ప్రాంతంలో కూడా ఆదివాసీలకోసం కృషి చెయ్యాలనే అభిప్రాయం ఏర్పడింది.

ఆదివాసీ అంటే విపరీతమైన కరుణ ఏర్పడి, భౌతిక, మానసిక పరమైన ఇబ్బందులేమిటో, వీలైనంత వరకు అతని బాధలను పోగొట్టడానికి కృషి చెయ్యాలి. వాళ్ళు సాధించిన విజయాలను ఎంతో మంది ఉన్నత స్థాయికి చెందిన పండితుల కృషి ఫలితమే. భారత దేశీయులేకాక, విదేశీయులు కూడా వాళ్ళవాళ్ళ అనుభవాలను పదిలపర్చుకొని చేసిన ప్రయత్నానికి మనం కృతజ్ఞతలు తెల్పాలి. ఆ అనుభవాలు చదవదగ్గవి, ఆకర్షణీయమైనవేకాక, మనకు ఉపకరించేవి కూడా.

మనం గ్రంథాలను విజ్ఞాన శాస్త్రపరంగా ఆశించలేం. ఎవరైతే ఈ విషయంలో ఆసక్తి చూపగలరో వాళ్ళే ఆదివాసీ వాఙ్మయాన్ని గూర్చి దేశం మొత్తంమీద ఉన్న ఆదివాసీల గూర్చి అధ్యయనం చేయగల్గారు.

షెడ్యూల్డ్ జాతిగూర్చి, వాళ్ల పుట్టుపూర్వోత్తరాలగూర్చి, శాస్త్రీయంగా ఒక గ్రంథం రాయాలంటే ఎన్నో వైజ్ఞానిక పదజాలం, మామూలు పాఠకుని దృష్టిని మరలుస్తాయి. సంప్రదాయబద్ధమైన, ప్రామాణికమైన గ్రంథాలు రావాల్సిన అవసరం ఉంది. దాన్నెవరూ కాదనలేరు. వాళ్ల పుట్టుపూర్వోత్తరాలను గూర్చిన గ్రంథాలు వెలువడాలి. వాటికంటే వాళ్లపై ప్రాథమిక పుస్తకాలు రావడం ఎంతోఅవసరం. చారిత్రక, సాంస్కృతిక, సామాజిక నేపథ్యం ఆదివాసీల గూర్చి చాలా అవసరం.

ఆదివాసీల అభివృద్ధిని జాగ్రత్తగా కాపాడుతూ, వాళ్లపై గిరిజనేతరులు చూపే ఆదరణ, ఆసక్తులను తెలుసుకోవాలంటే ఆదివాసీల సంక్షేమ సంఘాలు అంటే "భారతీయ ఆదిమజాతి సంఘ్" వంటి సంస్థలు ఎంతో కృషి చేస్తున్నా అభివృద్ధి జరగాల్సినంత జరగటం లేదు. వీళ్లకోసం ఎంతో మంది సంఘ సేవకులు, ప్రభుత్వ విభాగాలు మంచి కృషిచేస్తున్నా, ఆదివాసీల్లో చొరవకాని, తమంతట తాము పురోభివృద్ధిచెందాలనే కాంక్ష లేకపోవటంతో అనుకున్న ఫలితం చేకూరటంలేదు. దీనికి ఎన్నో కారణాలున్నాయి. ఎన్నో కారణాలున్నా, ఆదివాసీల సమస్యలను సంఘసేవకులుగాని, ప్రభుత్వ

శాఖావిభాగంకాని సక్రమంగా అర్థం చేసుకోనందువల్ల, వాళ్ల పాటికి వాళ్లు ఆదివాసీల ఎడల పొరబాట్లు కూడా చేయవచ్చు. దాన్ని మనం గమనించాలి.

అయితే ఏమిటి సరైన దృక్పథం? దీన్ని ఏ విధంగా నిర్ణయించాలి? ఇటువంటి ప్రశ్నలు తలెత్తుతాయి.

భారతదేశం లాంటి విశాలదేశంలో ఎన్నో ఆదివాసీ తెగలు వివిధ స్థాయిల్లో ఎదుగును సాధించి, విభిన్నమైన సాంస్కృతిక జీవితాన్ని అనుసరిస్తూ ఉంటాయి. వీళ్లకోసం ఒకే రకమైన, ఒకే పద్ధతికి చెందిన విధాననిర్ణయం దృక్పథం ఉండటం కష్టం. పాలకులకు ఆ రకంగా ఉండటం ఇష్టం. అట్లే, ఏ రాష్ట్రానికి చెందిన విధాన నిర్ణయాన్ని ఏర్పర్చుకొనటం కూడా సాధ్యపడదు. దానికి తోడు మార్గదర్శకత్వాన్ని చూపే నిపుణులు కొద్ది మందిగా ఉండి, సమస్యలు మరీ ఎక్కువైనప్పుడు ఇది చాలా కష్టం.
అఖిల భారత సిద్ధాంతం వీలైనంత వరకు తయారుచేసుకొని, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విభిన్నమైన విధానాలను ఆయా రాష్ట్రాలను బట్టి అక్కడ ఉండే ఆదివాసీలను బట్టి అనుసరించాలి. ఈ అడుగు కేంద్ర ప్రభుత్వానికే సాధ్యం. అవసరమైనవనరులు, సాధనసంపత్తి, యంత్రాంగంతో ఆ భావాన్ని అమలు జరపగలశక్తి ఉంటుంది. మానవ శాస్త్రవేత్తలు, పాలకులు, సామాజిక కార్యకర్తలతో ఒక స్టాండింగ్ కమిటీని వేసుకొని, భారతప్రభుత్వం ఐదు సంవత్సరాలకు, ప్రణాళికలను, కార్యక్రమాలను తయారుచేసుకొని, అమలు జరపాలి. విదేశాలైన అమెరికా, లాటిన్ అమెరికా, సోవియట్ రష్యాల్లో కూడా ఆదివాసీలు ఉండటమేకాక ఎన్నో చిక్కుముళ్లతో కూడిన సమస్యలను ఎదుర్కొంటున్నారు. కాబట్టి వాళ్లనుంచి నిపుణ సలహాలను పొందవచ్చు. స్టాండింగ్ కమిటీ ఆదివాసీలను గూర్చిన అధ్యయనాలను, పర్యటనలను, సమావేశాలను లేక యితరత్రా పద్ధతులతో ప్రభుత్వం కనుక ఆ కమిటీకి అధికారాన్ని యిస్తే ఆదివాసీల సంక్షేమంకోసం కాలానుగుణ్యంగా శాసనసంబంధమైన, అమలు జరపగల సూచనలను ఇస్తుంటే, ప్రభుత్వానికీ, ఆదివాసీలకు మధ్య అది వారధిలా పని చేయాలి. సంప్రదించినప్పుడు ఇటువంటి కమిటీ కేంద్రప్రభుత్వానికీ, రాష్ట్రప్రభుత్వాలకు ఆదివాసీల విద్య, రవాణా సౌకర్యాలు, సంరక్షణ, వ్యవసాయం, ఆహారం, పోషకత, పండ్లను నిల్వఉంచటం, వలసలు, ఉపాధి ఇతరత్రా ఎన్నో విషయాలపై సలహాలివ్వవచ్చు. ఒక ఆదివాసీ తెగకు అవసరమైన అంశం ఇంకో ఆదివాసీకి అవసరం కాకపోవచ్చు.

నిరాడంబర జీవులైన ఆదివాసీల పట్ల ఒక్కతప్పు చేసినా, వారికిష్టం లేని ఒక పదప్రయోగం చేసినా, ఆలోచనారాహిత్యంతో ఒక హాస్యాన్ని వాడినా, అవిషయం, వాస్తవికమైనా ఆటవిక జీవులను దూరం చేస్తుంది. ఇది దృష్టిలో పెట్టుకొని అవసరమైన ప్రక్రియను అనుసరించాలి. ఖాసీలు, ఎఱుకల, లేక తోడాలు లేక రాజకీయ చైతన్యంగల బీహారు, ఈశాన్య సరిహద్దుల్లో నివసించే ఆదివాసీల పట్ల వ్యవహరించేటప్పుడు ఎంతో జాగ్రత్త అవసరం. కొన్ని ఆదివాసీజాతులను చూచి, అటువంటి భయాందోళనలను చెందాల్సిన అవసరంలేదు.

ఆ రకంగా సంప్రదాయబద్ధమైన తల నరకటం అనేది, నాగాల కుడిచేయి తన దగ్గరున్న కొయ్యసాధనం పైకి పోతుంది. అట్లే సూక్ష్మంగా తిట్టిన తిట్టు యానాదిలో ఏ మాత్రం మార్పు తీసుకొని రాదు. సంతాలులు, గోండ్లు, యానాదులు, ఉరియన్లు ముఖ్యంగా ఎలుకల వేట అంటే ఆనందిస్తారు. చెంచులు, రెన్గ్మనాగాలు, బీర్‌హార్స్ కోతిని తింటారు. అప్పుడప్పుడు తటస్థపడే ఆదివాసీల ఆహారానికి చెందిన ఈ విషయాలు కొత్తగా వచ్చేవ్యక్తిని కొంత తికమకలు పెట్టవచ్చు. అట్లే అమాయకంగా, ఆశ్చర్యంతో జాన్‌సర్ బావర్లతో బహుభర్తృత్వాన్ని గూర్చిన ప్రసక్తిని తేవటం సమంజసం కాదు. బోండోగంటలు, వాళ్ల పూర్తిగా గొరుగుకున్న తలలు సౌందర్యానికి నిదర్శనంగా చెప్పుకొటంకాని, అట్లే అస్సాంలోని ఆదివాసీ స్త్రీలుకాని, దక్షిణ భారతదేశంలోని ఆదివాసీ స్త్రీలు రవికలు ధరించకుండా, అర్ధనగ్నంగా ఉండటం– ఇలాంటివాటిపై మనం దృష్టిపెట్టుకోకూడదు. కొత్తవాళ్లతో ఆదివాసీలు మనస్సు విప్పి మాట్లాడరు. వాళ్లను ఎగతాళి చేసినా, వాళ్లను గూర్చి ఎవరిష్టం వచ్చినట్లు మాట్లాడుకున్నా వాళ్ళు సహించరు. ప్రజలదృష్టి నాకర్షించాలనికాని, గిరిజనేతరులను కలుసుకోవాలని కాని వాంఛించరు. ఇతరులతో సంపర్కం వాళ్లకంత సంతోషాన్ని కల్గించదుకూడా. కొత్తవాళ్లను అనుమానిస్తారు కూడా. వాళ్లను ఎవ్వరూ పట్టించుకోకుంటే నిర్లక్ష్యం చేస్తే సంతోషిస్తారు కూడా. అంతేకాని ఆధునిక విలువలతో వాళ్లను బేరీజు వేయటం వాళ్లు సహించరు. ఈ దోపిడీలకు అతీతంగా, వనరులకు దూరంగా, ఎవ్వరూ రాలేనటువంటి దూరపు కొండచరియల్లో దట్టమైన అడవుల్లో ఉంటూ తమకు తోచిన జీవితాన్ని గడుపుతారు. ఆ ఆటవిక సంపద ఎంత దట్టంగా ఉంటుందంటే, ఆ చెట్లు ఎక్కడానికి కానీ, చొచ్చుకొని లోపలికి పోవటానికి కూడా వీలుండని పరిస్థితి అది.

సంస్కర్త ఆదివాసీల జీవితాన్ని ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా తీర్చి దిద్దాలనీ, మానవ శాస్త్రవేత్త ఆదివాసీల జీవితంలో నెలకొన్న శాంతిని, ఉన్నదాంతో సంతృప్తి చెందే మనస్తత్వాన్ని, ఆ చెట్లను తొలగించి, కొండలను తొలచి, వీలైనంత వరకు ఆదివాసీల జీవితాన్ని మలచడానికి ప్రయత్నించడాన్ని గమనిస్తే, ఇది అంత సులభమైన పనికాదు. అందులో దేశానికి వీళ్లపట్ల సరైన విధాన నిర్ణయం లేదు. ఎప్పుడైతే వీళ్లపట్ల దేశం సరైన విధాన నిర్ణయాన్ని అనుసరించలేదో, అందులోను వాళ్ళ అభిప్రాయాలను తెలుసుకోడానికి అవకాశంలేదో, పైగా వాళ్ల సంఖ్య వేళ్లతో లెక్కించడానికి అనుగుణ్యంగా ఉంటుంది. అందుకే ఆదివాసీలను సాధారణంగా స్పృశించడానికి వీలుండదు. ఎక్కడో ఒకటో అరో వాళ్లకోరికలు పైకి లేస్తుంటాయి. జార్కండ్ స్వతంత్రం కోసమో, నాగాలకు స్వతంత్రరాజ్యం కావాలనో అనే మాటలు అప్పుడప్పుడు వినిపిస్తాయి.

వీళ్లను సమర్థిస్తూ, పాఠ్యపుస్తక రచయితలు రాసే రాతలుకాని, సమయం లేని రాజకీయ నాయకుల జోక్యంకాని, వాళ్ల సమస్యలు ఏ విధంగా తీర్చాలన్న సంఘ సేవకుల తపన గాని అలాగే కొనసాగుతూనే ఉంటుంది. ఆదివాసీలు ఏ విధంగా జీవిస్తున్నారో వాళ్లను అట్లే వదిలి పెట్ట డమూ, వాళ్లు చేస్తున్న పోడు వ్యవసాయాన్ని కొనసాగించటమూ, ధరిత్రీ మాతను ఆరాధిస్తూ, ఆమెను దున్నటానికి యిష్టపడకపోవటం, లేక వాళ్ల ఆర్థిక పరిస్థితిని యథాతథంగా ఉంచటం, లేకుంటే ప్రేమలు, గవ్వల ఆభరణాలను ధరిస్తూ, ఆకులతో దొన్నెలను తయారుచేసుకుంటూ, నెమలి ఈకలను ధరిస్తూ ఉంటే, యుద్ధంలో చేసే నృత్యాలవంటి నృత్యాలను తమ ఆనందంకోసం చేసుకుంటుంటే, జంతుబలులను ఇస్తుంటే

చూస్తూ ఆధునిక సౌకర్యాలను వాళ్లకు అందజేయ్యాలని చూడాల్నా – అందులోను వ్యవసాయ పరికరాలను, నిత్యజీవితానికి ఉపయోగపడే యంత్రాలను వాళ్ల జీవితాల్లో ప్రవేశపెట్టాలన్నా – ఏమీ తెలియని పరిస్థితి. ఆదివాసీల అవసరాలు చాలకొద్ది, మనకు అందుబాట్లో లేనివి. ఉన్నదాంట్లో తృప్తి పడే ఆర్థిక విధానం వాళ్లది. తాను పండించేది కేవలం తినడానికే కాని, అమ్మడానికి కాదు. వ్యవసాయాన్ని అభివృద్ధి పర్చాలనికాని, ఉన్నదాన్ని మెరుగుపర్చుకోవాలన్న దృష్టి వాళ్ళల్లో లేదు. ఆరోజుకారోజు కష్టపడి దైనందిన కూలీలాగా సంపాదించాలనీ, గంటలకొద్దీ పనిచెయ్యాలన్న తపన అతనికుండదు. తనకిష్టం వచ్చినప్పుడు పని చేస్తూ చెట్లనీడల్లో విశ్రాంతి తీసుకుంటూ ఉండటం యిష్టం. దీన్ని మనం సోమరితనంగా భావించరాదు. ఆదివాసీల ఆర్థిక విధానాన్ని, దాని నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి.

విద్యావంతుడైన ఆధునిక వ్యక్తి గ్రామీణ భారతదేశానికి సులభ సాధ్యమైన, యాంత్రిక రవాణా సౌకర్యాలతో, వాళ్లకు కంకర రోడ్లను వేయించాలనీ, పెట్టుబడిదారులు, దళారులు పెడ్తున్న వేలకొద్దీ తలనొప్పులను భరిస్తూన్నప్పుడు, యిటువంటి పరిస్థితులకు ఆటవిక మానవులను గురిచేస్తే తట్టుకోగలడా? అతను మానవపుట్టుకలోనే తేడాలున్నాయని, వర్ణవ్యవస్థ సరైంది కాదో తెలియదు. అది మేధావులు నిర్ణయించాల్సింది. మనిషికీ మనిషికీ ఉన్న వ్యత్యాసాలే జాతీయ సమగ్రతను దెబ్బతీస్తున్నది. పుట్టుక బట్టి ప్రత్యేక అవకాశాలను ఇవ్వాలి అనటం (ఇప్పుడు జరుగుతున్న దక్షిణ భారత హరిజనుల్లోలాగే) అట్లే వెనకబడ్డ జాతుల, ముఖ్యంగా వాళ్ల ఉద్యోగ భర్తీలు, సీట్లకేటాయింపులు, విద్యాఅవకాశాలను కల్గించటం, ఆర్థిక పరిస్థితులను కల్పించటం, ఇవన్నీకులాన్ని బట్టీ, పుట్టుకను బట్టీ ఏర్పర్చాలనుకోటం శాస్త్రీయదృక్పథం కాదు. ఒక ప్రదేశం వెనకబడిఉంటే దాన్ని ప్రత్యేక అవకాశాలిచ్చి యితర ప్రాంతాలతో సరిసమానంగా చేయాలనుకోటం సమంజసమే. గొంతులో వెలగకాయ పడే విషయం ఏమిటంటే, ఆర్థికంగా మాకీ వసతులు చేకూర్చండి అనటం, మాలో బహుభర్తృత్వం ఉంది. మాజుట్టు ఉల్లులాగాఉంది. ముక్కులు విశాలంగా ఉన్నాయి, ముక్కులు అణచుకొని ఉన్నాయి. మాతలలు విశాలంగా ఉన్నాయి. కాళ్లు కురచగా ఉన్నాయి కాబట్టి మాకు ప్రత్యేక అవకాశాలు కావాలనటం సరికాదు. ఎన్నో మిలియనుల ప్రజలున్నప్పుడు ఇవన్నీ తప్పవు. దారిద్ర్యం, అవకాశాలు కొరవడటం, దాని మూలంగా ఎన్నో బాధలు ఏర్పడటం, ఇవన్నీ యింతమంది ప్రజలున్న దేశంలో సహజమే. వీటి దృష్టితోనే దేశాన్ని అభివృద్ధిపర్చాల్సి ఉంది. ఇది ఒక్క ఆదివాసీలకు సంబంధించిన సమస్యేకాదు. ఒక పాటకు వాళ్ల పొలాల్ని భక్షించటంకాదు. ఆ భూస్వామి అదే భూమిలో బానిసను చేయటం, బీహార్‌లో, పశ్చిమ బెంగాల్‌లో సంతాలులనుగాని, ఆంధ్రప్రాంతంలోగాని, ముంబాయిలో వర్ళీపై ఆధారపడే ఆదివాసీలను అట్లే చేశారు. వీళ్లు మాత్రమేమిటి? ఆదివాసీలు ఎక్కడెక్కడ ఉన్నారో పునరావాసం సంకీర్ణమైంది. కారణం ఆ భూమిపై ఏర్పడే చట్టాలు అలాంటివి. ఆదివాసీని ప్రకృతిగతమైన ప్రదేశాలనుంచి తొలగించి, నగరాల్లో మురికివాడల్లో, డబ్బే ప్రధానమైన ప్రాంతాల్లో, పోటీ జీవితాన్ని ఏర్పాటుచేస్తే, తనంతతాను నిర్జీవం కావటానికి ఇది ఒక చక్కటి మార్గం. ఈ పరిస్థితుల్లో అతనికి రోడ్డు ఇవ్వాలా? అతను కావాలని కోరినప్పుడు నిరాకరించాలా? నీవు ఇవ్వకూడదనుకుంటే ఇంకెన్నాళ్లు ?

ఈ సంవత్సరం మొదట్లో ఒక ముఖ్యమంత్రి ఆదివాసీల సమక్షంలో కొన్ని కోట్ల రూపాయలతో రైల్వేవాళ్ల నివాసప్రాంతంలో ఏర్పరుస్తున్నానని డాంబికంగా చెప్పాడు. ఎంతో ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో చేసిన ప్రకటన ఎవ్వరినీ సంతృప్తినివ్వలేదు. వాళ్ల గ్రామాల్లో మట్టిగోడలతో నిర్మించుకున్న ఇళ్ల మధ్య కావాల్సింది రైల్వేకాదు. అది వాళ్ల కంత ముఖ్యమా ? రైల్వేముఖ్యమా? ఇంటి పరిస్థితులను మెరుగుపరచడం ముఖ్యమా?

ఆంధ్ర దేశంలోని కోయలకు పోడు వ్యవసాయం ముఖ్యమైంది. అది లేకుంటే అతడు బతకలేదు. కొండప్రాంతాల్లో రిజర్వాయర్లో ఏర్పర్చడానికి వీల్లేని ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధి అంతసులభంకాదు. పైగా పోడు అనేది ప్రాచీన సంస్కృతి నుంచి అనూచానంగా వస్తున్న ప్రక్రియ. గాంధీగారి తమపై తాము ఆధారపడటం లేక ధరిత్రీమాతకు సంబంధించిన మత సంబంధిత విషయం. తాను ఆమెను ఆరాధిస్తూ, తనకు తోచిన నైవేద్యాలను పెడ్తూ, ఎంతో భక్తి ప్రపత్తులతో పూజించే ఆమెకన్నా, ట్రాక్టరు కాని యితరయంత్రాలు కాని అతనికి ప్రత్యామ్నాయం కాదు. అటువంటప్పుడు ఆదివాసీ తనకున్నదాంట్లో సంతృప్తిచెంది, కుటుంబ వ్యవహారాలను ఉన్నదాంట్లో సర్దుకుంటూ, తనకున్న పరిస్థితివల్ల ఎక్కువ కొనగల్గిన పరిస్థితిలేని పరిస్థితుల్లో మనం అతనిపై కొత్తవి, ఖరీదైన, అతని స్వభావ వ్యతిరేకమైన, అతని జీవన విధానానికి అనుగుణ్యంకాని, యిష్టం లేనివాటిని అతనిపై రుద్దటం ఎందుకు? మనం నాగలి వ్యవసాయాన్ని అతను బాగుపడాలని, అతనికి యిష్టం లేకుండా ప్రవేశపెట్టి అతనికి వ్యతిరేకంగా, ప్రాచీన అలవాట్లకు విరుద్ధంగా, అతనికున్న సాధారణ అలవాట్ల బదులు పోటీ మార్కెటింగు విధానాన్ని సులభంగా డబ్బు చేసుకొనే మనస్తత్వాన్ని, ఎగుమతికోసం పాకులాడ్డాన్ని కల్గించటం ఎంతవరకు సమంజసం. ఆ భూమిలో ఉండే మట్టినిబట్టి వాతావరణం, ఇవన్నీ అతని ఆర్థిక పరిస్థితిపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయి. అంతకంటే అతని మానసిక స్థితిపై ఇంకా ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయి. ఇటువంటి అంశాలను శాస్త్ర పరంగా, అధ్యయనం, పరిశోధనల మూలంగా విజ్ఞానశాస్త్రవేత్త, మానవ శాస్త్రవేత్త మనం తప్పుచేయకుండా మనల్ని సరైన తోవకు తీసుకెళ్లాలి. సంఘసేవకుడు ఉత్సాహంతో, తనే అమాయకత్వంతోను, అసమర్థతతోను ఆపనిని చేయలేడు.

ఎందుకు సంఘసేవకుడు కాని, సంస్కర్తగాని ఆదివాసీల పని చేస్తున్నప్పుడు, ఆదివాసీల జీవన విధానం ప్రాచీనమైంది. పురోభివృద్ధికి అనుగుణంగా లేదు అనుకోవాలి ? స్థానికంగా లభ్యంకాని వస్తువులు, తన యిరుగుపొరుగు ప్రాంతంలో తయారయ్యేవి సరదాగా వారంవారం జరిగే సంతలకు వెళ్లి, తెచ్చుకుంటారు. అక్కడ స్నేహితులను, బంధువర్గాన్ని కలుసుకుంటాడు. ఎన్నో నూతన పరిచయాలను చేసుకుంటాడు. ఆనందంగా తిరుగుతాడు. ఎన్నో విషయాలను చూస్తాడు, నేర్చుకుంటాడు, నవ్వుకుంటాడు. కేరింతుల కొడ్తాడు. నృత్యం చేస్తాడు. రోజంతా తన్నుతాను మరచిపోయి హాయిగా గడుపుతాడు. ఎన్నో మైళ్లు నడచి, తనవస్తువులను ఇచ్చి వినిమయంలో కొని జీవితావసరాలను తెచ్చుకున్నట్లు భావిస్తాడు. గ్రామాల్లో సంతలను రద్దుచేసి, సహకార సంఘాలను ఏర్పరిస్తే, అప్పుడు ఆదివాసీకి సరైన విశ్రాంతి దినం లభిస్తుందా? రోజంతా నడచి, రోజు తాను చేసిన పనికి సంతోషపడినప్పుడు, అతడు చేస్తున్న పనులు ఆర్థికంగా వ్యతిరేకమని చెప్పటానికి మనమెవ్వరు?

గోండు సంస్కృతిలో ఎన్నో గొప్ప అంశాలున్నాయి. 'సంగతో' ఇద్దరి మధ్య ఏర్పడే సంబంధం చాలా కీలకమైంది. అదే వాళ్లను కష్ట సుఖాల్లో ఒకరి కొకరు సహకరించడానికి తోడ్పడుతుంది. అందరూ కలసి భూమిని పొందటం, దాన్ని అందరూ పంచుకోటం, పునర్విభజన చేసుకోటం, గ్రామపంచాయతీ సభ్యుల నియంత్రణ, గ్రామంలో ఉండే స్వయం పోషకత్వం. గ్రామంలో ఆఓనాగాలు గ్రామాన్ని పరిరక్షించే విధానం, కోన్యక్ నాగాల మొరాంగ్, వాళ్ల విందు వినోదాలు వాళ్ల ఆటల్లో పాటించే దృఢమైన పద్ధతులు, నిబంధనలు, చెంచుల జీవితంలోని కన్వెన్షన్లు, ఎఱుకుల వారి కుల పంచాయతీలు, తోడాల పాలసంబంధిత పద్ధతులు, రేపటిగూర్చిన ఆలోచన లేని యానాదుల నిరాడంబరత అతని శవనృత్యాలు, మరణం అప్పుడు కన్నీరు కార్చకూడదనే మనస్తత్వం మిస్మీల పుట్టుకతో వచ్చిన సమానత్వ భావన ఓరానుల యుద్ధప్రాతిపదికన చేసే అత్యద్భుత నృత్యాలు ఇవన్నీ గత జీవితపు నాగరకతా చిహ్నాలు. ఒకప్పుడు మనల్ని ఇవన్నీ దూరం చేసి ఆధునిక జీవితంవైపు మరలిస్తున్న మన సంస్కృతీ చిహ్నాలు. ఇవన్నీ భౌతిక జీవితలక్షణాలే. వాళ్లు వాళ్ల ఔన్నత్యాన్ని నాగరకతను ఆటవిక సంపదలో, ఎంతో ఎత్తుకు ఎదిగిన పర్వతాల ఎత్తుల్లో దాచుకున్నారు. యుగాలు అంతరించి, మనకోరికలు పెరిగినందువల్ల, విదేశీబానిసత్వ శృంఖాల్లో పడ్డ మన నాగరకత, మన గొప్పతనం పోయిన గొప్పతనాన్ని మరచి పోవడానికి దోహదం చేసింది. మనం అర్థంచేసుకోలేని విషయాలను మనం విస్మరించరాదు.

ప్రాచీన మానవుని గూర్చి తెల్పడానికి మానవ శాస్త్రమార్గదర్శకుడ నవడం నా ఉద్దేశంకాదు. నాకు వాళ్లను గూర్చి తెలుసు. వాళ్లు సరైన మార్గదర్శకత్వాన్ని ఇస్తారని కాదు. తను చూచిన దానిలో ఒక కొత్త భావాన్ని రూపొందించుకుంటాడు. ఆ తేడాలు రావటానికి భౌతిక సంబంధిత, ఆహార సంబంధిత, నేలలో ఉండే తేడాలని నమ్మక, రూపురేఖల్లో, అలవాట్లలో మార్పులున్నాయని అంటాడు. మనిషి పుట్టుకకు ఈ భేదాలను ముడిపెడ్తాడు. మనిషి జీవితంలో ప్రధానమైన అంశాలను మరచిపోయి మనిషి జీవితానికి వర్ణవిషయాలు ప్రధానమని తన మేధోబలంతో చెప్తాడు. ఈ రకంగా మానవుని విభజిస్తే జాతీయ ఐకమత్యం, పుట్టుకకు ప్రాధాన్యత నివ్వటం ఇవన్నీ ప్రాధాన్యతను పుంజుకుంటాయి.

ఈ ఉద్దేశంతో ఆలోచిస్తే అధ్యయనం, పరిశోధనల మూలంగా ఏర్పర్చుకున్న సరైన నేపథ్యం తనను గూర్చి ఏమీ చెప్పుకోలేని ఆదివాసీలను గూర్చి లేక ప్రజల్లో ఇతర వర్గాలను గూర్చి తెల్పలేం. అటువంటి దృక్పథంతో చూడటం ఆదివాసీకి ఉపయోగంలేదు. అత్యుత్సాహంతో శాస్త్రజ్ఞుడు తాననుకున్న వాటిలో ఎంతో పరిజ్ఞానం ఉండవచ్చు. అతని సంఘసేవకుడే కావచ్చు. రాజకీయ నాయకుడే కావచ్చు. ఈ మధ్య ఆదివాసీ పట్ల విపరీతమైన ఆసక్తి చూపుతున్నారు. వీళ్లు చూపుతున్న ఆసక్తిని, వెచ్చిస్తున్న కాలాన్ని గమనించి, వాస్తవానికి అంతటి ఆసక్తి చూపుతున్నారన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోనవసరం లేదు. ఆదివాసీల అధ్యయనంలో నూతన దృక్పథం అవసరం. అర్థంచేసుకోవాలి. పాలకులకు ఇది చాలకష్టం. క్షేత్ర పరిశోధకులు ఎంతో ఓర్పుతో, నేర్పుతో అర్థం చేసుకోవాలి. మన అసమర్థతతో మనం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉంటాం. మనుగడ కోసం పోరాటం చేయటంలో నిమగ్నమైన ప్రాచీన సంస్కృతికి, ఆధునిక విధానాలకు, కార్యక్రమాలకు ఎంతో తేడా ఉంది. కొన్ని ప్రాంతాలను షెడ్యూలుగా ప్రకటించి వాటిలో పాలనను నియంత్రించటం, శాసనాలు చేయటంలో దేశం సంతృప్తి పడ్తుంది. విదేశీ ప్రభుత్వాలు పాలకులు ఇంతవరకు అప్పుడప్పుడు ఈ సమస్యను గూర్చి ఆలోచించి, కొంత పరిష్కారమార్గాలను అవలంబించారు. మనది నూతన గణతంత్రరాజ్యాంగం కావటంతో, ఆదివాసీ సమస్యలకు పరిష్కారాలను కనిపెట్టలేకున్నాం.

అంతిమ నిర్ణయాలను తీసుకునేవరకు మనం మధ్యేమార్గాన్ని అనుసరిస్తాం. ప్రత్యేకతను నిలపాలనా? లేక యితరులు భావించినట్లు అందరితో కలిపి ఆదివాసుల సమస్యను పరిష్కరించాలా? రెండింటిలో కొంత వాస్తవికత లేకపోలేదు.

ప్రాచీన ఆదివాసీలను గూర్చి ఆలోచించినప్పుడు మనకు కావాల్సింది తాత్కాలిక స్థలమార్పా? లేక ఆ స్థితిని ఏ విధంగా కోల్పోయారన్నదికాదు. వాళ్ల సాంస్కృతిక, మానసిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, ఆ చట్రం ప్రకారం పని చేయాలి. వీళ్లను పాత జీవితాలకు స్వస్తి పలికి, కొత్త జీవితాలను యెంపిక చేసుకోమనటం అంత సులభంకాదు. కొత్తగూడెంలో బొగ్గుగనుల్లో పనిచేసే కోయలుకాని, టాటానగర్ స్టీల్ పనుల్లో పనిచేసే ముండాలుకాని, త్వరిత గతిని కొత్తజీవితానికి అలవాటుపడ్డారు. అయితే, అంతకు ముందున్న సంతృప్తికర జీవితాలకు దూరమయ్యారు. వాళ్ల జీవితాల్లో కొత్తగా వచ్చిన ఎగుడుదిగుళ్లు, ఆధునిక యంత్రాంగం శబ్దాలు వాళ్లను పూర్తిగా మార్చివేశాయి. కొత్త పరిశ్రమలను నెలకొల్పేటప్పుడు, ప్రణాళికల్లో ఏ మాత్రం ముందు దృష్టిలేకపోయింది. ఆ ప్రణాళిక అమల్లో ప్రజలను వాళ్ల ప్రదేశాలనుంచి బహిష్కృతం చేశారు. టాటానగర్ కొంత ఆలోచించినా, పొరబాటున కూడా చోటా నాగపూర్‌లో ఉండే సంప్రదాయ కుటీర పరిశ్రమలను ఆ ప్రజలు వదలి వెయ్యాలని ఏనాడు ఆలోచించలేదు. ఆనాటినుండి గోండులు, ముండాలు వాళ్ల సంతోషాన్ని వదలుకొని యంత్రసాధనాలు చేయటంలో నిమగ్నులైనారు. వడ్లు దంచటం లేకుంటే యానాది ఆంధ్రదేశంలో సంతృప్తి నొందేవాడుకాదు. ఉన్న, చౌకగా లభించే, ప్రజలకు అవసరమయ్యే వాటిని నాశనం చేసి, వాళ్లకు కొత్తగా నేర్పించి, వాళ్ల వృత్తులనుంచి మళ్ళించటం శ్రేయస్కరం కాదు. యాంత్రిక సంబంధిత పరిశ్రమల మూలంగా, దేశంలో ఉండే జీవన విధానం కాని, ఆలోచనా దృష్టిగాని, ఆర్థిక ప్రణాళికగాని కొరవడ్డమేకాక అవి దేశానికి ఉపయోగం కారు. అంతకన్నా ఆకర్షణీయం కాదు.

వన్యజాతి 1956, సంపుటి-4
సంఖ్య- 1 నుండి అనుసృజన, వకుళాభరణం. లలిత

ఆచార్య ఎన్.జి. రంగా

ఆరు దశాబ్దాల కిసాన్ రాజ్యం

బౌద్ధమత పతన వ్యవస్థ నుండి, కళచూర్య వంశానికి చెందిన మహారాష్ట్ర ప్రధాన మంత్రి బసవుని వీరశైవ మత విజృంభణ వరకు, బ్రాహ్మణ కల్పితమైన చతుర్వర్గాలలోని పై రెండు కులాల "పవిత్ర హక్కు" పలుకుబడి భారత ప్రజల మీద సవారి చేసింది. విదేశ విజేతలు – వారి అనుచరులు, మరికొందరు బలీయమైన భారతవీరులు, బ్రాహ్మణ గురువు మన్ననలను సంపాదించారు. తద్వారా పురాతన రాజుల వ్యవస్థకు, హోదాకు తుల్యమైన విధంగా వివిధ ప్రాంతాల్లో పరిపాలకులుగా రాజులుగా క్షత్రియులనే పేరుతో వారిచేత ఆమోదముద్ర వేయించుకుని నిలబడ్డారు.

కాని బ్రాహ్మణ్యం సృష్టించిన పురాతన కుల అంతస్థులను వీరశైవం సవాలు చేస్తూ ముందుకొచ్చిన ఫలితంగా ప్రజానీకం కోల్పోయిన కొంత రాజ్యాంగ పెత్తనం, కనీసం దేశంలోని కొన్ని భాగాలలోనైనా, పునః ప్రతిష్టించుకునే అవకాశం కల్గింది. అయినప్పటికి గొప్ప వీరత్వం, సహనం కలిగిన రైతాంగ బృందాలలో నాయకులు అనేక స్థానిక రాజ్యాంగ యంత్రాలలో రాజులవద్ద ప్రధాన మంత్రులుగానున్నూ, సమర్థులైన సర్వసేనాధిపతులుగానున్నూ మాత్రమే వుండ గలిగారు. ఎప్పుడైనా ప్రస్తుతం వున్న రాజ్యాంగ భాగానికి వెలుపల మరో రాజ్యాంగ భాగాన్ని సంపాదించాలన్నా, కలుపుకోవాలన్నా, రాజ కుటుంబాల కలతల వలన గానీ, లేక ప్రజాందోళనల ఫలితంగా కాని వచ్చిన తిరుగుబాట్ల ఆసరాగా, వెనుక పోగొట్టుకున్న భాగాన్ని కలుపుకోవాలన్నా, సాధారణంగా రైతాంగ వంశాలకు ప్రధాన నాయకులుగా నున్న వారిచేత గానీ లేక తిరుగుబాట్ల నాయకులచేత గానీ ఆ కార్యక్రమం జరిపింపబడేది. ఇంతేగాక, ఈ ముఠా నాయకుల చేత చుట్టుపట్లనున్న తదితర రాజ్య భాగాల్ని ఆక్రమించుకుంటే, అది తమ హక్కు భుక్తమైనట్లు ఇతరులు గుర్తించే కార్యక్రమం కూడ జరిపించబడేది.

అయితే పదకొండవ శతాబ్దంలో రెండు క్షత్రియ కులాల మధ్య ఆధిక్యత కోసం, ఆంధ్ర దేశంలోని పల్నాటిలో యుద్ధం జరిగింది. ఆంధ్ర రైతాంగ వర్గాలు కేవలం సైనిక నాయకత్వంలోనే కాక, రాజ్యాంగ నిపుణత విషయంలో కూడ వారికున్న శక్తి సామర్థ్యాలు ఎలా వ్యక్తమైనవో ఈ యుద్ధం చక్కగా రుజువు చేసి చూపించింది. మొత్తం దక్షిణ భారత దేశంతో పరిపాలించే టటువంటి రాజులు – వారి సైన్యాలు, ఈ యుద్ధంలో పాల్గొన్నాయ్. ఉభయ పక్షాలలోనూ వున్న సైనిక నాయకులు యధార్థానికి రెడ్డి నాయుడు అనే రెండు పరస్పర వ్యతిరేక రైతాంగ కులాలకు చెందిన వారు. ఈ యుద్ధ అంత్యం క్షత్రియ పాలనకు స్వస్థివచనం పాడింది. అంతేకాక దేశంలో సమాజంలో రైతాంగ ఆధిక్యతకూ, ఆత్మవిశ్వాసానికి హేతుభూతమైంది కూడ. ఒక పక్షానికి చెందిన ప్రధానమంత్రి బ్రహ్మనాయుడు వీరవైష్ణవీయ మతస్థుడు.

ఆయన దాన్ని ప్రోత్సాహపర్చి, రైతాంగంలో కుల తత్వాన్ని రద్దుపర్చి, అంటరాని తనాన్ని రూపుమాపాడు. అంతేగాక కన్నమ నాయుడు అనే హరిజన వీరుణ్ణి సర్వ సేనాధిపతిగా చేసి ఆ యుద్ధంలో విజయాన్ని సాధించాడు. మరో పక్షానికి రెడ్డి యువతి అయిన రైతు నాగమ్మ ప్రధాన మంత్రిణిగా ఉంది. యుద్ధంలో ధైర్యంగా పోరాడి తానే స్వయంగా సైన్యాన్ని రణరంగానికి నడిపి ఆ వీరోచితమైన పోరాటంలో తుదకు మరణించింది. ఆ విధంగా ఆమె తదనంతరం తరతరాల వరకు రైతాంగ మహిళలకు యుద్ధం – కళ– రాజ్యంగ నైపుతణ్యతలంటే, ఏమిటో తెల్సుకుని అనుసరించ దగిన చక్కని పునాదులు వేసింది.

ఈ విధంగా తాము పరిపాలించే దానికి హక్కులేదని, పవిత్ర హక్కు ప్రకారంగా క్షత్రియులు మాత్రమే పరిపాలించాలనీ, రాజుల్ని బ్రాహ్మణులు మాత్రమే నడపాలనీ ప్రచారం చేసిన తప్పుడు అభిప్రాయాలనుంచి వారు తమంతట తాముగానె బైటపడటమే కాకుండా, తమ శక్తిసామర్థ్యాలని గురించి, పోరాట దక్షతను గురించి, పునః పరిశీలించుకుని హక్కులనేవి తమ శక్తిసామర్థ్యాలను బట్టి ఉద్భవిస్తాయని గ్రహించి వాటిమీదే సాధన గూడ ఆధారపడి వుంటుందే కాని శాస్త్రాలుద్ఘోషించే పవిత్ర హక్కుల ద్వారా మాత్రం కాదని గ్రహించినందు వలన, ఆంధ్ర రైతాంగ జనాలకు, అధికారానికి, అభ్యుదయానికి సంబంధించినంత వరకు ఒక మహత్తర నూతనాధ్యాయం ప్రారంభమైంది.

వరంగల్ కాకతీయ వంశావళి ప్రారంభంతో పల్నాటి యుద్ధాలంత మొందినయ్. కాకతీయ వంశం రైతాంగ నిజస్వరూపం. వారి మంత్రులూ ప్రధాన మంత్రులూ, సైన్యాధిపతులు మొదలైన వారంతా రైతులే! స్థానిక బ్రాహ్మణ గురువుల అభిమానం పొంది తమకు తాము క్షత్రియులమనే ఆమోదముద్ర వేయించుకునే విషయంలో వారెప్పుడూ అవ్యక్తంగా అర్రులు చాచుకుని చూడలేదు. వారికున్న రాజ్యాంగ నైపుణ్యతతో ఆయుధబలంతో ఆత్మ విశ్వాసంతో దక్షిణ భారత దేశాన్నంతా తమ అదుపాజ్ఞల్లో పెట్టుకునే నిమిత్తం ముక్కుకు సూటిగా పోగలిగిన స్తోమత వారికుంది. దాదాపు మూడు వందల సంవత్సరాలపాటు ఉత్తర భారతదేశాన్నుంచి దండయాత్రలు చేస్తున్న విదేశీయ మహమ్మదీయుల బారినుండి గోదావరికి దక్షిణ భాగాన వున్న ప్రాంతాన్నంతటినీ, రక్షించే విషయంలో శాంతి భద్రతల్ని నెలకొల్పే విషయంలో విజేతలయ్యారు. ఈ మహత్తర కాలంలోనే రైతాంగ బృందాలు ప్రఖ్యాతి వహించిన రుద్రమదేవిని తమ రాణిగా అంగీకరించి కిరీటం పెట్టారు. ఆమె 50 సంవత్సరాల పాలన దేశ సౌభాగ్యాన్ని గొప్పతనాన్ని ఎలా ప్రజలమన్ననల పొంది ప్రతిబింబింప చేసి, చీనా వరకు వాణిజ్యాన్ని విస్తరింప చేసిందో, దక్షిణ భారత దేశానికి 'మార్కొపోలో' వచ్చి చూచి వ్రాసిన వ్రాతలు మనకు ఆధారాలుగా వుండి చూపిస్తున్నాయ్. ఆమె రాజ్యాంగ నైపుణ్యత అసమాన్యమైంది. ఆమె తన నలుగురు కూతుళ్ళను నాలుగు ప్రముఖ రైతాంగ కులాల్లోని మేధావంతులైన యువకులకిచ్చి తద్వారా అన్ని వర్గాల వారిని దేశ గౌరవానికి దేశావసరాలకు వినయ విధేయతలు చూపించేట్లుగా చేయగలిగింది. రణరంగంలోని ఆమె శక్తి సామర్థ్యాలు వర్ణనాతీతమని ఆమె నాయకత్వం ఋజువు చేసింది. ప్రజల మాతృభాష అయిన తెలుగు, గద్య విధానంలోని వాడుక భాష, పరిపాలకులచేత, సైనికాధికారులచేత, నాయకులచేత విపరీతంగా ప్రోత్సహించబడింది. అసంఖ్యాకమైన బ్రాహ్మణేతర రైతాంగ రచయితలు ఆస్థానంలో వుండే వారు. ఆ విధంగా మరోమారు సాంఘిక రాజకీయ జీవితాలకు సంబంధించిన మహోన్నత ఆశయాలను తీర్చిదిద్దే మహత్తర పాత్ర గ్రహించే దానికి, అసంఖ్యాక ప్రజానీకానికి అవకాశం లభించింది.

దురదృష్టవశాత్తు రైతాంగ వర్గాల్లో ఒకర్ని చూస్తే ఒకరికి అసూయ అభివృద్ధయింది. తమలోతామే పోరాడుకోవటం ప్రారంభించారు. ప్రస్తుత దౌలతాబాద్‌గా వ్యవహరింపబడనున్న ఆనాటి దేవగిరి–మధ్య భారత్‌లని ఇతర రైతాంగ వర్గాలకు అంతఃకలహాలతో కాకతీయ రాజధాని పతనమైంది. తమలో తమకున్న అభిప్రాయ భేదాలు, అంతఃకలహాలతో పాటు దేవగిరి కాకతీయ రాజ్యానికి చుట్టుపట్ల నున్న దేశాలతో ఏర్పడిన తగాదాలు తోడైనందున, ఢిల్లీ ముస్లిం పరిపాలకులు రైతాంగంలో అనైక్యత తేవటానికి, రాజకీయ సైనిక స్థయిర్యాన్ని బల్లాలతో పొడువటానికి అవకాశం కల్గింది.

ఆంధ్ర రైతాంగం, వారి సైన్యం, వారి రాజకీయ నాయకులు ఉత్తర భారత సుల్తానుల దండయాత్రల్ని తీవ్రంగా ఎదుర్కొన్నారు. వారి వీరోచితమైన మహా నాయకుడు ప్రతాపరుద్రుడు రెండుసార్లు ఉత్తర భారత ముస్లిం ఆక్రమణదారుల దండయాత్రల ఉధృతాన్ని, తీవ్రంగా ఎదుర్కోగలిగిన సామర్థ్యాన్ని నిర్మాణయుత పద్ధతుల్లో ఆ తుది దశలో సాధించాడు. ఒక్కమారు కూడ ఆ దండయాత్రికులు గోదావరి పరిసరాల్ని తాకలేక పోయారు.

మూడవమారు విజృంభించిన బలవత్తరమైన శత్రువుల ఆక్రమణ ధాటికి, అంతఃకలహాలతో అంతరంగిక వైషమ్యాలతో ఆ నాటికానాటికి తీసికట్టయి బలహీనపడిన రైతాంగ రక్షణ దళాలు, పటాపంచలైనయ్. ఈ విధంగా మూడు శతాబ్దాల పాటు ఒకే పరిపాలకుల వంశవృక్షం అభివృద్ధికరమైన పరిపాలనని దక్షిణ భారత దేశంలో విస్తృత ప్రదేశంలో సాగించిన రైతాంగ నాయకత్వం తాత్కాలికంగా ఆగిపోయింది.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం, ఒక వంద సంవత్సరాల పాటు రైతు కులాలలో ఒకరైన రెడ్లు మహా నది నుంచి పెన్న వరకు వున్న మొత్తం తూర్పు కోస్తా ప్రాంతాన్ని పరిపాలించారు. స్థానిక వ్యాపారం, పరిశ్రమ విదేశ వాణిజ్యం, నావికాబలం ఈ మొదలైన కాకతీయ సాంప్రదాయాల్ని అభివృద్ధి చేస్తూ విదేశాలతో సత్సంబంధాల్ని కూడా అభివృద్ధి చేశారు. వారు అభ్యుదయ తెలుగు రచననుకూడా ప్రోత్సహించారు. కాకతీయుల మాదిరిగా కాక బ్రాహ్మణుల్ని మంత్రి వర్గాల్లోనికి ఆహ్వానించి పరిపాలనలో భాగస్వామ్యాన్నిచ్చారు. అయితే ఇతర రైతాంగ పాలనా వంశాలతో నిరంతరం యుద్ధాలు చేస్తున్న కారణాన, తుదకు వారుకూడ దేశం మీద తమకున్న పెత్తనాన్ని వదులుకోవాల్సి వచ్చింది. మహమ్మదీయ విజేతల చేతుల్లో దేశం పడింది.

దక్షిణ భారత పీఠభూమికి హృదయ మనదగినది హంపిపట్టణం. ఇది తుంగభద్రా నదికి ఒడ్డున వుంది. గొప్ప బ్రాహ్మణ రాజకీయ దురంధరుడైన విద్యారణ్య స్వామి ప్రోత్సాహం వలన, మరో రైతు వంశీకులైన బోయీలు ఈ పట్టణాన్ని కేంద్రంగా జేసుకొని రాజ్యాన్ని స్థాపించారు. కాకతీయ–రెడ్డి సామ్రాజ్యాల్లో తలలెత్తిన అంతరంగిక నిరంతర పోరాటాలు తిరిగి ఇక్కడ రేకెత్తకుండా చేయాలని విద్యారణ్యుడు సంకల్పించాడు. అందుకని ఇంతకు ముందెన్నడూ అధికారాన్ని చేపట్టని బోయీలకు నాయకత్వ అవకాశాల్ని కల్పించాడు. అయినా ఇతర రైతాంగ కులాల సహకారాన్ని, దేశాన్ని రక్షించే విషయంలో రక్షక దళాల్ని నడిపే విషయంలో ఆహ్వానించాడేకాని వారిని రాజకీయ భాగస్వామ్యులుగా రాకుండా, తన నైపుణ్యతనంతా వినియోగించి చేయగలిగాడు. ఈ విధంగా తుంగభద్రకు దిగువన వున్నటువంటి దక్షిణాపథాన్నంతటినీ నిర్విఘ్నంగా పరిపాలించిన విజయనగర సామ్రాజ్యాన్ని అవతరింపజేశాడు. రైతాంగ వంశాలు ఈ మూడు శతాబ్దాల వ్యవధిలో కేవలం ఆయుధ సంపత్తిలోను రాజ్యాంగ నైపుణ్యతలోనేగాక, నిర్మాణాత్మక కృషి సాధన వలన కూడ తమ ప్రత్యేకతను ప్రపంచానికి వ్యక్తపరచుకున్నారు. వారు తమిళనాడు ప్రాంతానికి కూడా వెళ్ళి, చిట్టి అడవుల్ని నరికి వేసి పర్వత ఆటవిక ప్రదేశాల్ని సాగులాయికీ అయిన భూములుగా మార్చి వందలాది గ్రామాల్ని నిర్మించి అభివృద్ధి లేకున్న ఆ ప్రాంతాన్ని ఒక ప్రత్యేక వలస ప్రదేశంగా చేశారు. కరువు నివారణకు ప్రధానమైన వ్యవసాయాభివృద్ధి విలువెంతో గ్రహించి, వందలాది చెరువుల్ని వేలాది బావుల్ని త్రవ్వించి గొప్పనీటి వనరులను (రిజర్వాయర్లను) ఏర్పాటు చేశారు, వారు పురాతన ఆనకట్టల్ని బాగుచేయించటమే కాకుండా నూతన ఆనకట్టల్ని నిర్మించారుకూడ. ఆధునిక శాస్త్రయుక్తంగా సర్‌ఆర్థర్ కాటన్ వ్యవసాయానుకూలమైన నిర్మాణాల్ని సాధించిన పంథాలోనే వారు వ్యవసాయ ప్రాజెక్టులను శాస్త్రీయంగా అభివృద్ధి చేశారు. అయితే వారందరు కూడ ఒక బ్రహ్మాండమైన పొరపాటు చేశారు. అదే దినదినం పైబడి వస్తున్న ఉత్తరాది మహమ్మదీయుల విధిలేని వత్తిడిని ఎదుర్కొనేటందుకు వెనుకటి గ్రామ ప్రజాపాలన పద్ధతిలోని కేంద్రీకృత సైనిక క్రమశిక్షణని అలక్ష్యం చేయటం–లేక నిరుత్సాహ పర్చటం. ఒకసారి గ్రామీణ ప్రజాపరిపాలనా జీవితం ఎప్పుడు పతనమైందో అప్పుడే వారి ఘనకార్యాల సాధన పతనమైంది. విజ్ఞానం వట్టిపోయింది. సుస్థిర పునాదులతో నిజంగా నిలబడి వున్న చైతన్య జీవితం నశించింది.

తమ ఆరు శతాబ్దాల పరిపాలనలో, రాజకీయ నాయకత్వంలో, సాంఘిక–ఆర్థిక రంగాలలో ఏ విధంగా ప్రవర్ధమానమయ్యే క్రమబద్ధమైన నిర్మాణశక్తి ఇమిడి వుందో, ఎంతటి సాహిత్య పిపాసవుందో, లలితకళల మీద ఎంతటి శ్రద్ధ వుందో, ఆధునిక నవనాగరిక రాజ్యాంగంగా మార్చే సత్తా ఎంతటిదో వ్యక్తం చేసుకోగలిగారు. అదే సందర్భంలో భూమితో, వ్యవసాయంతో, తదితర రైతాంగ వ్యవహారాలతో, వృత్తి విద్యలతో ఎంతటి నిరంతర సంబంధం ఏర్పరచుకోవాల్నో అంతా పెంచుకున్నారు. తమ సామ్రాజ్యాల పతనానంతరం, అభివృద్ధికరమైన పారంపర్య అనుకరణతో కూడిన, వ్యవసాయ పద్ధతులతో కొన్ని సారవంతమైన ప్రదేశాలలో, వ్యవసాయం చేసుకునేదానికి తిరిగి తయారుకావటం వారికి అంత కష్టమనించలేదు.

ఈ ఆరు శతాబ్దాల పర్యంతరం తమ నాయకులు పల్నాటిలో, దాని యుద్ధ భూమిలో చూపించిన అద్భుత వీరత్వ పంథాలో, రైతాంగవంశాలు, వివిధ యుద్ధాల్లో తమ వీరుల ప్రత్యేకమైన వీరోచిత పాత్రల్ని స్మరించుకుని, ఆ భక్తి ప్రపత్తుల్ని వీర పూజ ద్వారా వ్యక్తం చేసుకుంటూ వచ్చారు. ఈ వీరపూజ వారిలో, పూర్వుల్లోని ఆత్మ విశ్వాసాన్ని వీరోచిత గుణగణాల్ని జొప్పించగల్గింది. అంతేకాక బ్రాహ్మణుల చేత, పరిపాలకులుగా ప్రత్యేకింపచేయబడిన క్షత్రియుల వలె తమలో గూడ తమ పూర్వుల ధోరణిలో క్షాత్రాన్ని బహూకరించింది. ఆ పూజా సాంప్రదాయాలు ఈనాటికీ దక్షిణ భారత రైతాంగంలో ప్రతిబింబిస్తూనే వున్నయ్. అంతేకాదు, ఆ ఆత్మ విశ్వాస అనుకరణ కూడ స్థిరపడి వుంది. ఆనాటి ఆరు శతాబ్దాల దక్షిణ భారత పరిపాలనా సాంప్రదాయాలు ఇప్పటికీ రైతాంగ జనాల్ని పురిగొల్పుతున్నాయి. తిరిగి కోల్పోయిన రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించుకునేదానికి జరుపవలసిన మరో పోరాటం నిమిత్తం ఆ ఘట్టాలు ప్రోత్సహిస్తున్నాయ్.

(ఆచార్య రంగా రచనలు నుండి)

డాక్టర్ కె.ఎల్. రావు

నాగార్జున సాగరం

స్వాతంత్ర్యానంతరం అహారోత్పత్తిని అధికం చెయ్యాలనే చిత్తశుద్ధివల్ల ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం అనివార్యమయింది. కరువులకు కూడా కరువులేదు ఇండియాలో. విపరీత జననష్టం తప్పడంలేదు. 19వ శతాబ్దపు బ్రిటీషు ఇంజినీర్లలో గొప్పవాడయిన సర్ ఆర్థర్ కాటన్ మొదటగా నీటిపారుదల ఆవశ్యకతను పదే పదే నొక్కి చెప్పాడు. ఆయన ఇలా అన్నాడు.

"నీరు భారతదేశపు అతిగొప్ప సంపద అనడానికి తిరుగులేదనే నిర్ణయానికి వచ్చాం. దీనిని పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ప్రాజెక్టులు ఒక్కోదానిపై అరమిలియను ఖర్చుపెడితే నూటికి నూరుశాతం సత్ఫలితాలిచ్చి ప్రకృతి ప్రసాదించే సంపదలతో తలమానికమై... దాని పన్నుల రాబడి మొత్తంకంటే రెండున్నర రెట్లు ఆదాయం అర్జిస్తుంది."

గోదావరి ఆనకట్టకై ఇసుకమీద పునాది వేయడానికి వినువయిన పద్ధతులను ఉటంకిస్తూ ఇలా అన్నాడు : మామూలు కంటె ఎక్కువ ఖర్చుతో బ్లాక్‌ను దింపడం జరిగింది. లూజుగా వుండే ఇసుకతో కష్టమైన, ఖరీదయిన పునాది కంటె స్థానికులు (భారతీయులు) మనకు నేర్పిన సులువైన పద్ధతి పటిష్టమైనదేగాక చౌక కూడా. దేశావసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా డబ్బు ఖర్చుపెడితే భారతదేశం సంపదలో, పురోగతిలో అమోఘమైన ముందంజ వేయగలదు. గోదావరి మీదుగా సాగినట్లే భారతదేశమంతటా ఇదేమార్పురాగలదు. స్వాతంత్ర్యం నిర్మించేవరకు నీటిపారుదల విస్తరణ పథకాలు ఇండియాలో నత్తనడక నడిచేవి. ఆహారధాన్యాల వుత్పత్తిని అధికం చేయవలసిన అవసరాన్ని గుర్తించి భారీ ప్రాజెక్టులను చేపట్టి పెద్ద ఎత్తున ఫలితాలను సాధించాలనే ఆతురత చూపారు. దురదృష్టవశాత్తూ ఈ వుత్సాహం తగ్గిపోయింది. హరితవిప్లవం మోజులో పడి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు, ఫెర్టిలైజర్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఇది మిథ్యగానే మిగిలిపోయింది. పొరపాటు విధానాల వల్ల అహారోత్పత్తిలో స్వయం సమృద్ధి గిరిగీసుకున్నట్టుగా ఆ యేడు కాయేడు తగ్గిపోయింది.

వరి, గోధుమ అధిక మొత్తాలలో పండించే లక్ష్యంతో బాక్రాల, హీరాకుడ్, తదితర భారీ ప్రాజెక్టులను స్వరాజ్యం రాగానే ప్రారంభించారు. కృష్ణా, గోదావరుల్లో ముఖ్యంగా మొదటిది దేశంలోని విస్తారమైన మెట్టభూముల ప్రాంతాలగుండా ప్రవహిస్తోంది. అప్పటి రాష్ట్రాలయిన మద్రాసు, బొంబాయి, సంస్థానాలయిన మైసూరు, హైదరాబాద్ గుండా కృష్ణానది ప్రవహించడం వల్ల విభిన్న రాష్ట్రాల మధ్య నీటిని పంచడానికి ఓ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయడం జరిగింది.

సదస్సులో పాల్గొన్న ప్రతినిధుల సంతృప్తి మేరకు ఓ ఒప్పందం కుదిరింది. మైసూరు మాత్రం ఒప్పుకోలేదు. తనకు కేటాయించిన దానికంటె ఎక్కువ నీరు కావాలని అది పట్టుబట్టింది. మైసూరు,

బొంబాయి రాష్ట్రాలకు నీటిపారుదల పటిమ తెలియదని, అప్పుడు అమల్లోవున్న పథకాలు కొద్ది నీటిని మాత్రమే వాడుకుంటున్నాయన్న విషయం సుస్పష్టం. అప్పటినుండి కృష్ణాజలాలకై అన్ని రాష్ట్రాలనుండి డిమాండ్లు పెరుగుతూ రావడంతో వివాదాన్ని ట్రిబ్యునల్‌కు నివేదించడం జరిగింది.

1951 కాన్ఫరెన్స్ ముగియగానే తన ప్రాజెక్టులను పూర్తిచేయడానికి మద్రాసు సత్వరచర్యలు తీసుకున్నది. వాటిలో కృష్ణా–పెన్నార్ ప్రధానమైనది. ఈ ప్రాజెక్టు పై సమగ్ర పరిశీలన జరిగింది. అంచనాలు తయారయ్యాయి. మంజూరుకోసం ఎదురుచూస్తున్నారు. ఇంతలో కొంతమంది ఆంధ్రనాయకులు, ముఖ్యంగా వ్యవసాయ కుటుంబాలకు చెందినవారు ఎప్పుడో 1903లోనే రూపొందించిన పులిచింతల ప్రాజెక్టు క్రింద సాగుబడి నీరు మిగలదని భయపడ్డారు. అంతకుముందు కృష్ణానదిపై పులిచింతల ప్రాజెక్టు ముందుగా ఆరంభించాలా లేక కావేరీపై మెట్టూరు డామ్ ముందు చేబట్టాలా అనే అంశంపై తీవ్ర చర్చ జరిగింది. మద్రాసు గవర్నమెంటు మెట్టూరుకు ముందు ప్రాధాన్యం యిచ్చి దానిని మంజూరు చేయించి 1927–34లో పని ప్రారంభించింది. ప్రస్తుత కావేరీ డెల్టాకు మెట్టూరు ప్రాజెక్టునుండి నిల్వనీరు సరఫరా చేయవలసి వుంది. దానితోపాటు తంజావూరు జిల్లాలోని పట్టుకూట తదిరత తాలూకాలలోని 1.2లక్షల హెక్టార్లలోని దాహంగొన్న భూమి దప్పిక తీర్చాలి. ఈ ప్రాజెక్టులవల్ల ఆ ప్రాంతాలు బాగా లాభించాయి. తమిళనాడులో ఆహారోత్పత్తి ఎక్కువయ్యిందంటే ఈ భారీ ప్రాజెక్టు చలవే.

పాలనాధికారులకు దూరదృష్టి వుంటే స్వరాజ్యం రాకముందే పులిచింత ప్రాజెక్టు ఆరంభించి పని ముగిస్తే బాగుండేది. తరువాత కృష్ణా, పెన్నార్ ప్రాజెక్టు ఎట్టి అభ్యంతరాలు లేకుండా మంజూరు చేయాల్సింది. కాని అలా జరగలేదు. పులిచింతల ప్రాజెక్టంటే మద్రాసు ప్రభుత్వానికి సవతి ప్రేమ. ఆంధ్రనుండి ప్రజాందోళన ఎక్కువయిన కొద్దీ మద్రాసు గవర్నమెంటు మరీ మొండిగా మారి దానిని అణగద్రొక్కాలని చూసింది. పులిచింతల ప్రాజెక్టు కావాలని ప్రముఖ నాయకుడు మోటూరి సత్యనారాయణ, పి.జి.ఆర్.ప్రసాద్, ముక్కామల రాజా ఆందోళన నడిపారు. పులిచింతల కోసం ఆందోళన సాగించినందుకు వారు నష్టపోయారు. అపుడు నేను కేంద్రంలో డిజైన్లకు డైరెక్టరుగా వుండేవాణ్ని.

కృష్ణానదిపై ప్రాజెక్టుల సమాచారం, ముఖ్యంగా పులిచింత వివరాలు వెంటనే కావాలని ఆంధ్రప్రదేశ్‌నుండి మిత్రులు వుత్సాహం చూపేవారు. ఆందోళన కేంద్రం దృష్టికి వచ్చింది. సత్వరమే కృష్ణానదిపై చేపట్టవలసిన ప్రాజక్టులను పరిశీలించి సిఫారసు చేయవలసిందిగా ప్లానింగ్ కమీషన్ ఒక కమిటీని వేసింది. ఆ కమిటీలో మోతీరాం, గార్గ్ సభ్యులుగా వున్నారు. ఇద్దరూ అనుభవమున్న ఢిల్లీ ఇంజినీర్లే. డాక్టర్ ఎ.ఎన్.ఖోస్లా అధ్యక్షులు. డాక్టర్ ఖోస్లా ఆ సమయంలో సెంట్రల్ వాటర్ అండ్ పవర్ కమీషన్‌కు అధ్యక్షులు. భారత ప్రభుత్వ వర్క్స్, మైన్స్ అండ్ పవర్ మంత్రిత్వశాఖ అడిషనల్ సెక్రటరీ (తరువాత దానిని మినిస్ట్రీ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ అని పిలిచేవాళ్లు).

ఇంతలో మద్రాసు చీఫ్ ఇంజినీర్ తదితర అధికార్లు బాహాటంగానే శత్రువులయ్యారు. మద్రాసు పి.డబ్ల్యు.డి.లోని సీనియర్ ఇంజినీర్లల్లో చాలామంది నా మిత్రులు, కొంతమంది సహాధ్యాయులు, మరికొంతమంది సహోద్యోగులు. అయినా కోపం కట్టలు తెంచుకుంది. నాకు కనీస మర్యాద కూడా చూపలేదు. పులిచింతల ప్రాజెక్టు ఆందోళనకు నేనే కారణమని వారు భావించారు. ఒకసారి డెప్యూటీ చీఫ్ ఇంజినీర్ (మద్రాసు పి.డబ్ల్యు.డి) ఢిల్లీ వచ్చి నాతోపాటు వున్నాడు. వాళ్ల చీఫ్ ఇంజినీర్ అడగ్గా హోటల్లో వున్నానని చెప్పాడు.

కృష్ణా బేసిన్ అభివృద్ధి గురించి అధ్యయనం చెయ్యడం నా హాబీ. మహారాష్ట్ర ప్రాంతంలోని కృష్ణాబేసిన్ గురించి నాకెక్కువ తెలియదు. నేను చూడనూలేదు. తుంగభద్ర డామ్ ప్రాజెక్టు డిజైన్ తయారు చేయబట్టి హైదరాబాద్‌లోని ప్రాజెక్టుల గురించి నాకు తెలుసు. తుంగభద్ర డామ్ ప్రాజెక్టు మద్రాసు, హైదరాబాద్‌ల ఉమ్మడి ప్రాజెక్టు. అప్పర్ కృష్ణా వంటి అనేక ప్రాజెక్టులను విఖ్యాత హైదరాబాద్ ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ పరిశీలించాడు. దిగువ కృష్ణా బేసిన్‌లో పులిచింతల ప్రాజెక్టు ఒక్కటే బ్రిటిష్ ఇంజినీర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. విజయవాడలోని ఆనకట్ట, డెల్టా క్రింద వున్న కాలువలు నాకు సుపరిచితాలే. నీటిమట్టం తగ్గినప్పుడు కూడా డెల్టా ప్రాంతానికి నిరవధికంగా నీరు వదలడానికనువుగా కృష్ణపై స్టోరేజ్ డామ్ కావాలని సర్ ఆర్థర్ కాటన్ భావించాడని కూడా తెలుసు. హైదరాబాద్ సంస్థానంలో లోవర్ కృష్ణా ప్రాజెక్టు లేక నంది కొండ ప్రాజెక్టు విషయంలో హైదరాబాద్ ఇంజినీర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. లాభాలు తక్కువని దానికి వారు అనుకూలంగా లేరు. కేవలం రెండు లక్షల హెక్టార్లు మాత్రమే ఎడమవైపు సాగు క్రిందికి వస్తుంది. విశాలమయిన నదీలోయపై భారీ డామ్ కట్టబూనడం ఒప్పించడం కష్టమైన పని. మద్రాసు రాష్ట్ర భూభాగంలోని ఏరియా అతి తక్కువ కావడంతో, ఆ ప్రభుత్వం పాల్గొనలేదు ప్రాజెక్టులో. ఫలితంగా ప్రాజెక్టు బుట్ట దాఖలయింది. కృష్ణా, పెన్నార్ ప్రాజెక్టు ఒక్కటే పరిశీలించవలసి వుంది. ఆంధ్రకు ఒరిగేది తక్కువే. కృష్ణా జలాల వినియోగంలో పులిచింతల ప్రాజెక్టును ఎక్కడా పొందుపరచకుండా మద్రాసు చీఫ్ ఇంజినీర్ మొండిగా వ్యవహరించాడు.

డాక్టర్ శాలేజ్ క్రింద అప్రెంటిస్ చేసిన కారణంగా రివర్ బేసిన్ల సమగ్ర అధ్యయనం విలువ గుర్తించాను. మిగతా ప్రాజెక్టుల డిజైన్ పనిలో మునిగివుండడం వలన కృష్ణపై సాయంత్రం 6 దాటిన తరువాతే ఏ ఆటంకమూ లేకుండా అధ్యయనం చేసేవాణ్ని. జె.ఎం.అగర్వాల్ అనే డ్రాఫ్ట్స్‌మన్ నాకు తోడ్పడేవాడు. మిగతా డ్రాఫ్ట్స్‌మెన్ కంటే మంచితనమూ, తెలివితేటలూ ఆ అధికారిలో చూశాను. తనకిచ్చిన సూచలను వెంటనే గ్రహించి తనకిచ్చిన పనినంతా పూర్తిచేసేవాడు. తరచుగా 8 దాటిన తరువాత కూడా కూర్చునేవాణ్ని. బికనీర్ హౌస్‌లో ఏడు దాటితే మాజీ మహారాజుల ప్రియురాంద్రదెయ్యాలు తిరుగుతాయని నా ప్యూను ఏడు దాటిన తరువాల అక్కడ వుండవద్దని సలహా యిచ్చాడు. అతనిని మాత్రం ఏడుగంటలకు పంపివేసి కృష్ణాబేసిన్‌పై నిరాటంకంగా సమగ్రమైన అధ్యయనం చేసేవాణ్ని.

కృష్ణపై డామ్స్ కట్టడానికి అనువైన తావులు వెదకడం కష్టమైన పని. బాగా సమయం వినియోగించాలి. ఇరిగేషన్‌కై విస్తారమైన ఏరియా కావాలి. పురోగతి మందకొడిగా వుండేది. తరచు నిరాశ ఎదురయ్యేది. నదికి ఎడమవైపున నందికొండ డామ్ దగ్గర బాగా ప్రయోజనకరంగా వుంటుంది. కాలువను మునేరునదిని దాటి తమ్మిలేరు వరకో లేదా ఇంకా పైవరకో విస్తరించవచ్చు. ఆ కాలువ క్రింద సాగవ్వవలసిన భూమి ఎంత వుంది. కాని కుడిప్రక్కన కెనాల్ ఎలైన్‌మెంట్ తూర్పు కనుమల వరకూ వుంది. నదికి సమానాంతరాలుగా తూర్పు కనుమలు పులిచింతల

వరకు వున్నయి. సాగవ్వవలసిన భూమి అతి తక్కువ. బొత్తిగా సన్నని ముక్క. ఓ సాయంకాలం రైట్‌బ్యాంక్ కెనాల్ ఎలైన్‌మెంట్ పరిశీలనగా చూడగా కొండకు నకిరేకల్ వద్ద ఖాళీ కనిపించింది. ఆ ఖాళీ గుండా నదిని మళ్లిస్తే, అంతదూరం పోగలిగితే, నీటికై అలమటించే విస్తారమైన ప్రాంతాన్ని మద్రాసు సరిహద్దుల వరకు సేద్యం క్రిందకి తీసుకురావచ్చు. నమ్మలేనంతగా తోచి ఆ రోజు పెందరాళే యింటికెళ్లాను.

మరునాడు మామూలు దినచర్య ముగించుకుని సాయంత్రం కృష్ణా బేసిన్ అధ్యయనానికి వెళ్లాను. మరింత పరిశీలనగా చూడగా గత సాయంత్రం కలిగిన ఆలోచన ఆచరణ సాధ్యమే. అగర్వాల్ కూడా ప్లానులు జాగ్రత్తగా పరిశీలించి రైట్ బ్యాంక్ కెనాల్ ఎలైన్‌మెంట్ నకిరేకల్ ఖాళీ ద్వారా మళ్లించడానికి ఎత్తూ, పరిసరాలు బాగా సరిపోతాయన్నాడు. నా అధ్యయనం ద్వారా బయల్పడిన అద్భుత ఫలితానికి ఎంతో ఆనందించాను. ఈ ప్రాజెక్టు మిలియన్ల హెక్టార్ల కొలదీ భూమిని తడిపి సర్ ఆర్థర్ కాటన్ మదిలో రూపం దాల్చినట్లుగా పేదరికం, కరువుతో నిండిన కోస్తా ప్రాంతాల ఆంధ్రులకు సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుంది. కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాలలో సర్ ఆర్థర్ కాటన్ ఇరిగేషన్ సౌకర్యాలు కల్పించిన తావుల్లో తప్పితే తక్కిన ఆంధ్ర కోస్తా ప్రాంతాలు ఫలసాయం లేనివే. తూర్పు కనుమల ద్వారా అంతంతమాత్రం నీటితో జాలువారే కోస్తా నదులు ఇరిగేషన్‌కు చాలినంత నీటిని చేరవేయని కారణంగా పొదిలి, దర్శి, ఉదయగిరి వంటి కోస్తా ప్రాంతాలు దేశంలో కెల్లా ఎక్కువ కరువుకు గురవుతాయి. మరునాడు శ్రీ గార్గ్‌ను కలిసి నా అధ్యయన ఫలితాలు, ముఖ్యంగా రైట్ బ్యాంక్ కెనాల్‌కు సంబంధించినవి వివరించాను. ఉద్దేశం ఎంత గొప్పదనే విషయం ముఖ్యం కాదనీ, చాల సందర్భాలలో పరిసరాలు కాగితాలు (టోపోషీట్స్) సరిగ్గా వుండని కారణంగా ఆయా ప్రాంతాలకు వెళ్లి ప్రత్యక్షంగా చూసి ఎంతవరకు ఆచరణ సాధ్యమో తెలుసుకోవాలని హెచ్చరించాడు.

తరువాత కొద్దిరోజులకే మద్రాసు యూనివర్సిటీ ఎగ్జామినర్స్ బోర్డు సభ్యునిగా మద్రాసు వెళ్లవలసి వచ్చింది. అక్కడ నా పని ముగించుకుని రైల్లో గుంటూరు వెళ్లాను. ముందుగా అనుకున్న ప్రకారం ముక్త్యాల రాజా నన్ను గుంటూరులో కలుసుకున్నారు. ఇద్దరం నకిరేకల్ వెళ్లాం. నిశితంగా పరిశీలిస్తూ ఆ ఉదయం కొన్ని గంటలు అక్కడ గడిపాను. ఆ ప్రాంత సరిహద్దులు పరిశీలించి కనుమ ఎలైన్‌మెంట్‌కు చాల బాగా సరిపోతుందనీ, లాభసాటిగా వుంటుందనీ సంతృప్తిచెందాను. అంతంత మంచి వీలున్న తావులు ప్రపంచంలోనే అరుదుగా వుంటాయి. నీరుండాలే గానీ గ్రావిటీ ఫ్లో ద్వారా లక్షలాది హెక్టార్లకు నీరందించవచ్చు. పరిసరాలను చూసి కాగితాలన్నీ ఖచ్చితంగానే వున్నాయని నిర్ధారణకు వచ్చిన తరువాత డామ్ కట్టబోయే స్థలానికి వెళ్లి అదెంత సబబయిన తావో చూడాలనుకున్నాను.

ఏ ప్రాజెక్టయినా స్వయంగా పరిశీలించకుండా ప్రతిపాదించడమో, ఆమోదించడమో నాకలవాటు లేదు. ఎంతో అధికమొత్తాలు ఖర్చు పెట్టిన తరువాత ఆ ప్రాంతం అనుకూలమైనది కాదనడం సబబు కాదు. ఇన్‌స్పెక్షన్ చేసిన అనేక సందర్భాలలో కూడా ఆ పని ఆలస్యంగానే చేశాననీ, ముందే నన్ను సంప్రదించి వుంటే ఎంతో ధనం ఆదా అయ్యేదని తెలుసుకున్నాను. చంబల్ నది డామ్‌సైట్ దీనికొక ఉదాహరణ. కనుమ మధ్యగల స్థలం ఖరారు చేశారు. త్రవ్వకం మొదలయ్యింది. అంతవరకు జరిగిన పనికి కొన్ని లక్షల రూపాయలు ఖర్చు చేశారు. డామ్‌కి డిజైన్లు తయారుచెయ్యమని అడిగిన మీదటే నేనా తావుకి వెళ్లాను. రాతిని పరీక్షించగా పనికిరాదని తేలింది. దానిలో తేలిగ్గా విరిగిపోయే గుణముంది. పైకి మాత్రమే నునుపుంది. అది పనికిరాదని వేరొక తావు కోసం వెదక ప్రారంభించాను.

కనుమల నదీగర్భం ప్రక్కగా నడవగా త్రవ్విన తావుకంటే ఎంతో మేలైన స్థలం కనబడింది. సహచరులకీ విషయం తెలపగా మెదలకుండా వూరుకోమనీ, డాక్టర్ ఖోస్లా నా సలహాను వినడనీ అన్నారు. అయినా నేను పట్టుబట్టి ఇన్‌స్పెక్షన్ నోట్ తయారు చేసి డాక్టర్ ఖోస్లాకు పంపించాను. ఆయన మొదట చూడగానే బాగా ఆందోళన చెందినా నైపుణ్యంగల ఇంజినీరు కావడంతో నా నోట్ క్షుణ్ణంగా చదివి స్థలం మార్చమనిఆదేశాలిచ్చాడు.

తమ తమ తావుల్లో పనిచేసే ఇంజినీర్లు అక్కడున్న ప్రదేశానికి అలవాటు పడిపోవడంతో ఆ ప్రాంతంలో వున్న లోటుపాట్లు కనుగొనలేరనీ, బయటి ప్రాంతాలనుండి వచ్చినవారయితే యిట్టే పట్టేయగలరని నేనెన్నో అనుభవాల ద్వారా కనిపెట్టాను.

నందికొండ డామ్ సైట్ చూడాలని ఆతురత చెందాను. రాజా సాహెబ్ వెంటనే ఒప్పుకున్నారు. కార్లో మాచర్ల వెళ్లాం. తెలంగాణా సాయుధపోరాటకాలమది. ఆ ప్రాంతంలో కమ్యూనిష్టుల కార్యకలాపాలు మంచి ఉధృతంగా వున్నాయి. మాచర్లలో నెలకొల్పిన స్పెషల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది నేను కృష్ణానదికిరువైపులా అడవుల్లో వున్న కమ్యూనిష్టుల రహస్య స్థావరాలను చూడాలనుకుంటున్నానని భావించారు. మా సంభాషణంతా విన్న యువక ఉపాధ్యాయుడు గుర్రం మల్లయ్య మాకు గైడ్‌గా వుంటానని ముందుకొచ్చాడు. అతనితో కలిసి బయలదేరాం. కొంతదూరం జీప్‌లో, మరికొంత దూరం గుట్టలపై నడుస్తూ బాగా యిబ్బందిపడ్డాం. ప్రయాణం మెల్లగా సాగింది. సైట్ దిగువ ప్రాంతానికి పది కిలోమీటర్లలో వున్న ఎత్తిపోతల వద్దకు చేరేసరికి రాజాసాహెబ్‌కు దాహం వేసింది. నదిఒడ్డుకి 100 మీటర్ల లోతున వున్న నీళ్లు తెమ్మని డ్రయివరుకు చెప్పారు ఆయన. డ్రయివరు దిగి ఆకు దోనెతో నీళ్లు తెచ్చాడు. అప్పటికే నీళ్లన్నీ కారిపోవడంతో దప్పిక తీర్చుకోవడానికి ఆకులనే నాకారాయన. అయినా నాతోపాటు ముందుకు సాగారు. ఈ సంఘటన ఈనాటికీ నాకు గుర్తుంది. అందుకే 1972 లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎన్నికల్లో అయనను కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టమని పట్టుబట్టాను. అప్పటికే ఆయన జగ్గయ్యపేట పంచాయితీ సమితి అధ్యక్షుడిగా రోడ్లు వేయించడం వంటి ఇతర సౌకర్యాలు కల్పించారు. అయన అన్నివిధాలా తగిన అభ్యర్థి. నేనంత పట్టుబట్టినా ఆయనను కాదని మరొకరిని కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపిక చేశారు. రాజా సాహెబ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకి ఎంతో సహాయం చేసిన మిత్రునికి నేనేమీ సహాయం చెయ్యలేకపోయాను. సరికదా క్రమశిక్షణగల కాంగ్రెసువాదిగా ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేయవలసి వచ్చింది.

అయినా రాజాసాహెబ్ గెలిచారు. తరువాత కాంగ్రెసులో చేరారు. ఎన్నికయిన ఏడాది తరువాత చనిపోయారు. తరువాత జరిగిన బై ఎలెక్షనులో ఆయన సతీమణి కాంగ్రెసు అభ్యర్థిగా ఎంపిక కాగా ఆమె తరఫున ప్రచారం చేస్తూ రాజాసాహెబ్ నిస్వార్థసేవల్ని ప్రశంసించాను.

ప్రతిపాదించిన సైట్‌కు చేరిన మీదట ఈ మూలనుండి అవతలి తీరం దాకా వ్యాపించి ఉన్న గ్రానైట్ బండ కనబడింది. చాల సంబరపడ్డాను. అప్పటికే చీకటిపడడంవల్ల, రాత్రికి అక్కడ వుండడం క్షేమం కానందున మాచర్లవచ్చి అక్కడినుండి విజయవాడ చేరుకున్నాం. విజయవాడ సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను కలుసుకుని ఆయనతో విషయం చర్చించి అదనపు సమాచారం వుంటే ఇమ్మన్నాను. కాని నన్ను చూసి ఆయనకు బాగా భయమేసింది. స్టేట్ చీఫ్ ఇంజినీర్ ఈ ప్రాజెక్టును వ్యతిరేకించడంవల్ల ఈ విషయమై చర్చించలేనన్నాడు.

ఢిల్లీ తిరిగి వచ్చాక నకిరేకల్‌లో వున్న కనుమ నిజమైనదేనని గార్గ్‌తో చెప్పాను. ఆహారధాన్యాల వుత్పత్తి ద్వారా జాతికి వుపకరించే మరో భారీ ప్రాజెక్టు కనుగొనినందుకు ఆయన అమితానందం పొందారు.

ప్రాజెక్టు సైట్ ఎడమ తీరంవైపు కూడా దగ్గరగా పరీక్షించాలని నాకు ఆతురతగా వుంది. ఆ కారణంగా అప్పటి హైదరాబాద్ స్టేట్ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావును ఢిల్లీ వచ్చిన సందర్భంలో ఓసారి కలిశాను. ప్రాజెక్టు వివరాలన్నీ తెలుసుకుని ఆయన ఎంతో ఆనందించారు. అప్పటి ఇరిగేషన్ మినిస్టర్ డాక్టర్ మెల్కొటేగారిని అవసరమయిన సహాయం అందించమని కోరారు. హైదరాబాదునుండి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఆధ్వర్యాన ఓ పోలీసు బృందం నా వెంట వచ్చింది. చీఫ్ ఇంజినీర్ పి.పాపయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ జాఫర్ అలీ కూడా నా వెంట వచ్చారు. చివరలో కొన్ని కిలోమీటర్ల దూరం వరకు రోడ్డు లేదు. జీపుల మీదా స్టేషన్ వేగన్లమీద ప్రయాణం చేశాం. సైట్‌కు చేరగానే మేము దిగేలోపలే పోలీసులు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. నదీగర్భాన్ని, అబుట్‌మెంటునీ పరీక్షించాను. రాతిని కూడ పరీక్షించి కొన్ని రాళ్లను లేబరేటరీ టెస్టు కోసం తెచ్చాను. ఇన్‌స్పెక్షన్‌వల్ల సైట్ కండిషన్లు అద్భుతంగా వున్నాయని తేలింది. 80 కిలోమీటర్ల ఎగువ ప్రవాహం కనుమగుండా ప్రవహించినా కోత తక్కువగా వుంది. స్టోరేజి స్తోమత (బాక్రాతో సరితూగే) అద్భుతంగా వుంది. ధీటులేని కరకట్ట వుంది. నిజానికి ప్రపంచంలోని వుత్తమమైనవాటిల్లో నాగార్జునసాగర్ ఒకటి.

తరువాత అజ్ఞాతవాసంలో వున్న కమ్యూనిస్టు పార్టీ నాయకుని నుంచి నాకో లేఖ వచ్చింది. నాకు పోలీసు ఎస్కార్టు అవసరం లేదని, లేకున్నా వాళ్లెవరూ నాకూ, ఇతర ఇంజినీర్లకూ హాని చేయరని అందులో వుంది. వాళ్ల రహస్యస్థావరాల వరకు రోడ్డు వేసే కార్యక్రమం చేబడితే తప్ప. డాములూ, ఇరిగేషన్ ప్రాజెక్టులూ చూసే ఇంజినీర్లకెపుడూ స్వాగతమేనని వుంది దానిలో. చైనాలోని యుయాన్‌త్సాంగ్ నదీ సమీపంలోని స్టోరేజ్ డామ్ సైట్ చూడడానికి డాక్టర్ శాలేజ్ వెళ్ళినప్పుడు కూడా కమ్యూనిస్టులు సరిగ్గా ఇలానే చెప్పారు. నదుల అభివృద్ధి కృషిలో నిమగ్నమయిన ఇంజినీర్లకు తామేమాత్రం హాని చేయబోని కారణంగా ఆయన ఎస్కార్ట్ లేకుండా స్వేచ్ఛగా తిరగవచ్చని కమ్యూనిష్టులు ఆయనకు కబురుపంపారు.

ప్రాజెక్టు సైట్ కనుక్కోవడం, మంజూరుకై చేయవలసిన భగీరథ ప్రయత్నంలో ఓ చిన్నభాగమే. డాక్టర్ ఖోస్లా కమిటీ కృష్ణానదిని, వివిధ ప్రాజెక్టు సైట్స్‌నూ సందర్శించాలని కార్యక్రమం రూపొందించుకున్నారు. మద్రాసు గవర్నమెంటు కార్యక్రమం రూపొందించింది కాబట్టి సహజంగానే దానిలో నాగార్జుసాగర్ ప్రాజెక్టు సైట్ చేర్చలేదు. ఈలోగా ఈ ప్రాజెక్టు గురించి అందరికీ తెలిసిపోవడం జరిగింది. హైదరాబాద్ ప్రభుత్వం దీనినెలాగైనా ముందుకు నెట్టాలని ప్రయత్నిస్తోంది. ఇప్పటికే గార్గ్‌కి ఈ ప్రాజెక్టు వివరాలన్నీ అవగతమయ్యాయి. దీనివల్ల ఎనలేని లాభాలు సమకూరుతాయని ఆయన నమ్మాడు. ఆయనీ విషయం డాక్టర్ ఖోస్లాకు వివరించగా వాళ్లు తమ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు సైట్ సందర్శించడానికి చేర్చుకున్నారు. రెండు సాకులతో మద్రాసు చీఫ్ ఇంజినీరు దీనికి అభ్యంతరం చెప్పాడు. ప్లానింగ్ కమిషన్‌కు దీనిని సాధికారికంగా నివేదించలేదనీ, తనముందు పెట్టిన రిపోర్టును మాత్రమే కమిటీ పరిశీలించాలనీ, రోడ్డులేని కారణంగా ప్రాజెక్టు సైట్‌కు వెళ్ళే మార్గమే లేదనేది రెండవ కారణం. బృందం బయలుదేరడానికి నాలుగు రోజుల ముందర మాత్రమే నాకీ విషయం తెలిసింది. నా మిత్రుడు సత్యనారాయణకూ, రాజా సాహెబ్‌కు రాశాను. వెంటనే చెట్లు కొట్టించి, రాళ్ళూరప్పలూ తొలగించి జీపు వెళ్ళే మార్గాన్ని తయారించడానికి రాజాసాహెబ్ వెంటనే ఒప్పుకున్నారు. నాలుగు రోజుల్లో 20 కిలోమీటర్ల మార్గం తయారయింది. బృందం గుంటూరు చేరగానే కమిటీ సైట్‌ను సందర్శించడానికనువైన మార్గం తయారయిందని డాక్టర్ ఖోస్లాకు వర్తమానం అందింది. రివర్ వేలీ డెవలప్‌మెంట్‌పై అమితాభిలాషగల డాక్టర్ ఖోస్లా తన వెంట వస్తున్న మద్రాసు చీఫ్ ఇంజినీరుకు సైట్ సందర్శించాలని తెలియజేశాడు. చీఫ్ ఇంజినీర్ మళ్లీ తన మొండివాదనను ఏకరువు బెట్టి సైట్‌కు వెళ్లకుండా డామ్‌సైట్‌కు 150 కిలోమీటర్ల దూరంలో వున్న గుంటూరులోనే వుండిపోయారు. డాక్టర్ ఖోస్లా తన బృందంతో సైట్‌కు వెళ్ళి చూసి చాల సంతృప్తిచెందాడని తెలిసింది. అంతకుముందు బాక్రాడామ్ నిర్మాణంలో నాసిరకం రాతివల్ల ఆయన ఎంతో ప్రయాసపడ్డాడు. 25 కిలోమీటర్ల పొడవు వున్న హీరాకుడ్ డామ్‌సైట్ ఏమంత ఆకర్షణీయంగా లేదు. సట్లేజ్‌కంటే మూడు రెట్లు ఎక్కువ ఎత్తిపోతల స్తోమతుతో, మహానదితో తులతూగేలా కృష్ణానదిపై గల డామ్‌సైట్ అద్భుతమని రాతితో, లోయ వెడల్పు లేకుండా వుంది. అత్యంత అనుకూల పరిస్థితులు వున్న కారణంగా అనుకున్న తావులోనే డామ్ నిర్మించాలని కమిటీ నిర్ణయం తీసుకుంది.

ఆయా రాష్ట్రాల రాజధానులూ, వివిధ స్థలాలూ సందర్శించి కమిటీ నివేదిక సమర్పించింది. కొంతకాలం వరకు దీనిని రహస్యంగా వుంచారు. నందికొండ సైట్ ముందుగా చేబట్టి అది పూర్తయిన తరువాతనే కృష్ణా పెన్నార్ చేబట్టాలని కమిటీ సిఫారసు చేసినట్లు వదంతులు వ్యాపించాయి. అప్పటి మద్రాసు ముఖ్యమంత్రి సి.రాజగోపాలాచారి నివేదిక ప్రతిని చూడగానే రహస్యంగా తమిళ ప్రాంతాలకు నీరు లేదు : ఆంధ్ర ప్రాంతాలకు డబ్బులేదని వ్యాఖ్యానించాడట.

దీనితోనే ఆగిపోలేదు. నందికొండ ప్రాజెక్టును తిరగదోడి సుదీర్ఘ శల్యపరీక్షచేశారు అప్పటి ఆర్థిక మంత్రి టి.టి.కృష్ణమాచారి రూ. 88.5కోట్ల ప్రాజెక్టు అంచనాలపై వ్యాఖ్యానిస్తూ “ఈ స్కీముల కిందయ్యే ఖర్చు వడ్డీతో సహా తీర్చే పాలసీ విధానాన్ని ప్లానింగ్ కమీషన్ విశదీకరించాల్సి

వుంది. ఈ అంకెలను పరిశీలిస్తే కనీసం వడ్డీ కూడ చెల్లించే అవకాశాలు కూడ మృగ్యం అన్నారు. మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులపై అయ్యే ఖర్చులపై ఆర్థిక లాభాలూ, అంచనాలలో పెరుగుదలా విడివిడిగా పరిశీలిస్తూ ఈ లోపల నందికొండ ప్రాజెక్టు మంజూరు చేయవలసిందిగా ప్లానింగ్ కమీషన్ తెలియజేసింది. "మేజర్ ప్రాజెక్టులపై అయ్యే ఖర్చుపై ఆర్థిక లాభాలూ, అంచనాల పెరుగుదలకు సంబంధించిన ప్లానింగ్ కమిషన్ వివరణ వచ్చేవరకు వేచి వుండాలని నా అభిమతం" అని ఆర్థిక మంత్రి దానిపై రిమార్కులు రాశాడు. ఆర్థికమంత్రి కోరినట్లు మరిన్ని వివరణలు, విశదీకరణలు లేకుండానే అదృష్టవశాత్తూ ప్లానింగ్ కమిషన్ ప్రాజెక్టు మంజూరు చేసింది. ఏ ఇరిగేషన్ ప్రాజెక్టూ వడ్డీ చెల్లించదు.

రెండువేల సంవత్సరాల నాటి బౌద్ధుని శిష్యుడయిన నాగార్జునుని అవశేషాలకు ముప్పు వాటిల్లుతుందనే భయంతో పార్లమెంటులోని కొంతమంది ఆంధ్రసభ్యులు భయాందోళనలు వ్యక్తం చెయ్యడంతో మరో అవరోధం ఏర్పడింది. డామ్ ఎగువభాగానికి పది కిలోమీటర్ల దూరంలో క్రీ.పూ. రెండవ శతాబ్దంలో నాగార్జునుడు విశ్వవిద్యాలయం స్థాపించాడు. ఈ స్థలంలో దొరికిన బుద్ధభగవానుని దంతాన్ని పరిశీలించి ఇప్పటికీ సారనాథ్‌లోనే వుంచారు. అందాల పాలరాతిమెట్లు ఇప్పటికీ చెక్కు చెదరకుండా వుండటం మరో విశేషం. శతాబ్దాల అనంతరం కూడా నది ఆ మెట్లను ఆలింగనం చేస్తూ వుండడం గమనించదగ్గ విషయం. ఈ విషయం పండిత నెహ్రూ దృష్టికి రాగా ప్రభుత్వం అవశేషాలను భద్రంగా ఓ కొండపైకి తరలిస్తుందనీ, అవశేషాలు మునిగిపోతాయనే భయంతో విలువైన ప్రాజెక్టును ఆపడం మంచిది కాదని లోక్‌సభలో గట్టి హామీ ఇచ్చారు.

1961లో ఢిల్లీలో ఏర్పాటయిన ఎగ్జిబిషన్‌లో ప్రధానమంత్రికి స్వాగతం చెప్పే అవకాశం నాకు కలిగింది. ఆయన ఇంగ్లాండుకు చెందిన ప్రిన్స్ ఫిలిప్‌తో కలిసి వచ్చాడు. ఎగ్జిబిషన్ అంతా తిరిగి చూస్తూ నాగార్జున ప్రాజెక్టు మోడల్ దగ్గర ఆగిపోయారు. ప్రాజెక్టు విలక్షణ ప్రత్యేకతలను గురించి నేను వివరిస్తూ వుండగా ప్రాజెక్టును బుట్టదాఖలు చేయకుండా తాను రక్షించాననే విషయం చెప్పలేదేమని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన 1963లో సైట్‌ను సందర్శించినప్పుడు జరుగుతున్న ప్రగతి పట్ల ఆయనెంతో హర్షం ప్రకటించారు. ఆయన దర్శనం కోసం వచ్చిన వేలాది అభిమానులలో ఒకరు 'ఇది మీరు వెలిగించిన దీపమే' అని వ్యాఖ్యానించినప్పుడు ఆయన మరింతగా సంతోషించారు. తన భూములు సారవంతమవుతాయనే ఆనందాతిరేకంతో పండిత నెహ్రూకు కృతజ్ఞతతో రైతు కవితాత్మకంగా చెప్పిన వైనాన్ని ఆయన చాలాకాలంవరకు మరచిపోలేదు.

నాగార్జున అవశేషాలన్నిటినీ సరస్సు మధ్యనున్న ఓ కొండపైకి తరలించారు. ఇక్కడ శిలావిగ్రహాలను భద్రపరచడానికీ, వాటిపై అధ్యయనం చెయ్యడానికీ అద్భుతమైన ఏర్పాట్లు చేశారు. కొద్ది పడవ ప్రయాణంతో ఈ దీవికి చేరుకోవాలి. ప్రాచీన నాగార్జున విశ్వవిద్యాలయంతో వున్న సంపర్కం కారణంగా ఈ ప్రాజెక్టుకు నందికొండకు బదులుగా నాగార్జునసాగర్ పేరు పెట్టారు.

ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఎంతోమంది ఇంజినీర్లు ఎంతో శ్రమించారు. వారందరికీ యావత్తు జాతీ రుణపడి వుంది. ముగ్గురు దిగ్గజాల పేర్లు ఉటంకిస్తాను. జాఫర్ అలీ పునాది నుండి క్రెస్ట్ లెవెల్ వరకు డామ్‌ను నిర్మించారు. ఆయన ప్రముఖంగా పేర్కొనదగినవాడు. శాంతస్వభావి. ఆయన చిరాకు పడడం నేనెప్పుడూ చూడలేదు. ఆయన సిబ్బందిలో ఎం గోపాలరావనే సమర్థవంతుడైన ఇంజినీరు వుండేవాడు. ఆయన అసిస్టెంట్ ఇంజినీరుగా డామ్‌సైటుకు రోడ్లు నిర్మించడం, చెట్లు నాటించడం చూశాను. గోపాలరావు దృఢసంకల్పం గల ఇంజినీరు. కంట్రాక్టర్లయినా, వర్కర్లయినా నిర్మాణంలో వున్నవారందరికీ ఆయన మిత్రుడూ. మందకొడిగా వున్న పని ముందుంజ వేయవలసిన చోటల్లా ఆయన అవసరం పడేది. ఆదిలో కష్టతరమైన కాలువ త్రవ్వకం పనిలో మరో ప్రముఖ ఇంజినీరు జి.ఎ.నరసింహారావు మంచి స్ఫూర్తినిచ్చాడు.

(ఆత్మకథ నుండి)

ఇదే ఇదే నాగార్జున సాగరము
ఆంధ్రావని సిరుల నింపు అమృత సరోవరము

నంది కొండపై దండల అండ నిలిచి కృష్ణవేణి
సాదరముగ తనరూపుననంతరించు నిలయము

భారతీయ మేధావుల ప్రజ్ఞకు తార్కాణము
వేలాది శ్రమజీవులు వెచ్చించిన కృషి ఫలము

ప్రళయ జలధినైనా బంధింప జాలు నీ డ్యాము
కొండల్లో బంగారపు కొండై నిలిచిన గోము

ఆరు కోట్ల ఆంధ్రులకు అందించును విద్యుత్తును
ఊరూరున వెండివెల్గు వెల్లువలై విరిసిల్లును

నాగార్జున కొండపైన జేరిన బౌద్ధారామం
భాసిల్లెను సిద్ధార్థుని భవ్య తపోవనం

సృష్టిలోని అందాలను
సేకరించి పేర్చినారు
భూతలమున స్వర్గమ్మును
పొందించిరి తెలుగువారు

– ధర్మపురి సత్యనారాయణ

యన్. టి. రామారావు

ఆకాంక్ష

శాతవాహనుల నాడే అలల తలదన్ని వెలిగింది తెలుగు తేజం. కాకతీయుల కరవాలాల ఖణకణలలో దిగ్దిగంతాల నినదించింది తెలుగు శౌర్యం. విజయనగర రాజవీధులలో, రతనాలు రాసులు పోసి వ్యాపారం సాగించింది తెలుగు వైభవం.

గాసట బీసటే చదివి గాథలు త్రవ్వు తెనుంగు వారికి తొలి కావ్యాన్ని అందించడానికి ఆంధ్రమహాభారత సంహిత రచన బంధురుడయినాడు ఆనాడు ఆదికవి నన్నయ్య. ఆ మహనీయుని ప్రయత్నాన్ని సాఫల్యం చేస్తూ మహాభారతాన్ని రాజనీతి శాస్త్రంగా, నవరస మధు మందాకినిగా మలచాడు కవి బ్రహ్మన్న తిక్కన. కావ్య సరస్వతిని కాసుకోసం కక్కుర్తి పడి అమ్ముకోనని బాస చేసి భగవదర్పితంగా భాగవతాన్ని తెనింగించాడు భక్త పోతన. 'దేశభాషలందు తెలుగు లెస్స'ని చాటి అపూర్వ రస బంధురకావ్యం ఆముక్త మాల్యదను అందించాడు శ్రీకృష్ణ దేవరాయలు. ఆటవెలదులలో తేట తెలుగులో అనేక జీవిత సత్యాలను ప్రకటించాడు అలనాడే మన వేమన.

త్యాగయ్య సుమధుర సంగీత వేదికా నాదాలు, క్షేత్రయ్య సులలిత మొవ్వ గోపాల శృంగార భక్తి పదాలు, అన్నమయ్య అనన్య సామాన్య భక్తి భావనా గీతికలు, అభినవ నటరాజు సిద్ధేంద్రుని అభినయ భంగిమలకు తాళం వేసిన కూచిపూడి భాగవతుల మంజుల మంజీర విన్యాసాలు, అమరావతి, లేపాక్షి, రామప్ప ఆది దేవాలయాల అద్భుత శిల్ప విన్యాసాలు, అజంతా గుహలలో అపురూప చిత్రాల నావిష్కరించిన తెలుగుచిత్రకారుల తూలికా విలాసాలు పుణికి పుచ్చుకున్న పునీతమైన జీవనగడ్డ–తెలుగునాడు.

ఆ మహత్తర సంస్కృతీ సంపదకు మనం వారసులం. తేట పదాలతో, తేనియలొలుకుతూ తియ్యదనాలు చిందే తెలుగు వెలుగులతో దశదిశలను ప్రకాశమానం చేయడానికి తెలుగు మహాసభలు దోహదం చేయగలవన్న ఆశాభావం నాకుంది. మన పూర్వ వైభవాన్ని కన్నులకు కట్టేలా ప్రదర్శించి, తెలుగు వారందరికి స్ఫూర్తి అందించిన వారందరినీ ఆత్మీయతతో, ఆప్యాయతతో, ప్రేమానుబంధంతో సమైక్యపరచి, ఒక వ్యక్తిగా, ఒక శక్తిగా రూపొందే బృహత్ ప్రయత్నంలో తెలుగు మహాసభలు విశిష్టమైన పాత్ర వహిస్తాయన్న విశ్వాసం నాకుంది.

ఈసారి తెలుగు మహాసభలను నిర్వహిస్తున్న చెన్నపట్టణంలో తెలుగు వారికి గల చిరస్మరణీయ మధురానుబంధం సర్వజన విదితమే. ఆంధ్ర కేసరి ప్రకాశం బ్రిటీషు తుపాకి గుండ్లకు రొమ్ము ఒడ్డి నిలచింది మద్రాసు నడి బొడ్డులోనే. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మ త్యాగం చేసింది చెన్నపట్టణంలోనే. తెలుగు సారస్వత సముద్రంలో నిగూఢంగా దాగి వున్న అనేక అనర్ఘ రత్నాలను వెలికి

తీసి, పదిమందికి తెలిసేలా ప్రచురించిన వావిళ్లవారి కార్యస్థానం ఈ పురమే. తెలుగు వారి స్వాతంత్ర్య సమరచరిత్రకు అద్దంపడుతూ, ఆంధ్రోద్యమ వీచికలకు ఆలంబనగా వెలిగిన ఆంధ్రపత్రిక, స్వరాజ్య వంటి అనేక పత్రికలకు పుట్టినిల్లుగా ఈ గడ్డ తెలుగు భాషా సంస్కృతీ చైతన్య స్రవంతులకు జీవగడ్డగా వెలుగొందింది. ఇట్టి పరంపరాగతమైన, ఉదాత్తమైన, ప్రేమానుబంధమైన బంధాన్ని మరింత విస్తృతపరచి, పటిష్టపరచి జాతి సమైక్యతకు బీజం వ్యాపింపజేసేలా ఈ సభలను యిట్టి చారిత్రాత్మకమైన క్షేత్రంలో నిర్వహించడం ఎంతో ప్రశంసనీయం.

ఈ మహాసభలకు తమిళనాడు ముఖ్యమంత్రి, నా ప్రియసోదరుడు శ్రీ ఎం.జి. రామచంద్రన్ గారు ముఖ్య అతిథిగా పాల్గొనడం ఎంతో ముదావహం. వారికి నా హృదయపూర్వక అభివందనాలు. తెలుగు వారికి, తమిళ సోదరీ సోదరులకు ఉభయులకు ఆనందదాయకమైన ఉమ్మడి పండుగలా ఈ సభలు జరుగుతుండడం అభినందనీయం. జాతీయ సమైక్యతకు భూమికగా, ఒక కుటుంబానికి చెందిన తెలుగు-తమిళ భాషా ప్రాంతాల మధ్య తరతరాలుగా, శతాబ్దాలుగా నెలకొన్న మధుర సాంస్కృతిక అనుబంధ బాంధవ్యాలకు చక్కని వేదికగా ఈ సభలు నిర్వహించబడుతూ వుండడం ప్రత్యేకించి అభిలషణీయం.

కృష్ణమ్మకు కావేరికి వున్న సంబంధం ఈనాటిదా? రెండూ దక్షిణ గంగలే-ఆదరి నుండి ఈ దరికి మరో గంగ-తెలుగుగంగ త్వరలోనే అవతరించి తెలుగు-తమిళ సోదరుల పవిత్ర స్నేహానుబంధాన్ని మరింత దృఢతరం చేసే రోజు సమీప భావిలోనే వున్నదని మనవి చేయడానికి ఎంతో సంతోషిస్తున్నాను.

తెలుగు-తమిళ సంస్కృతి సారస్వతానుబంధానికి నాటికి నేటికి ఏనాటికీ చెరగని మధుర స్మృతి చిహ్నాలు మధురలోని తిరుమల నాయకమహల్‌లోని వాస్తు సౌందర్యాలు, తంజావూరు సరస్వతి మహల్‌లోని తాళపత్ర గ్రంథాలు.

తమిళ సోదరీ సోదరుల గళాలలో నిత్యం వినిపించే మధుర కృతులు మన త్యాగరాజస్వామివి కావడం మనకు ఎంతో గర్వకారణం. త్యాగయ్య తెలుగుబిడ్డ అయినా తమిళనాడు ఆయన గానవీచికారోచిస్సులతో వెలిగిన గడ్డ.

తెలుగునాట సాంకేతిక విప్లవంతోపాటు సాంస్కృతిక పునరుజ్జీవనం తేవాలన్నది మా ఆశయం. ఒక్క తెలుగునాడులోనే కాదు, తెలుగు వారుండే ప్రతి ప్రాంతంలోనూ తెలుగు సంస్కృతిని సముజ్జ్వలంగా ప్రకాశింపచేయాలన్నది మా సంకల్పం. రాష్ట్రేతర ప్రాంతాలలో తెలుగు పీఠాలను నెలకొల్పే పథకంలో భాగంగా ఇటీవలే కర్ణాటక విశ్వవిద్యాలయంలో వేమన పీఠం నెలకొల్పడానికి ఆర్థిక సహాయ మంజూరు చేశామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. తెలుగు మహనీయుల పేరిట తెలుగుజాతి కలకాలం భక్తితో గౌరవించాల్సిన మహానుభావుల పేరిట, స్మరించుకోదగిన తెలుగు కళాకారుల పేరిట యిట్టి పీఠాలను మరికొన్ని విశ్వవిద్యాలయాలలో కూడా నెలకొల్పాలనే ఆలోచన వున్నది. తెలుగువారు ఎక్కడున్నా అక్కడ తెలుగు పలుకును నిల్పుకోడానికి, తెలుగుదనం పెంపొందించుకోవడానికి చేసే ప్రతి ప్రయత్నానికి మా తోడ్పాటు వుంటుంది ఎప్పుడూ.

ఏ దేశమేగినా, ఎందు కాలిడినా తెలుగుతల్లిని మరవని మనీషులు మీరని నాకు తెలుసు. తెలుగుభాషా సంస్కృతుల వికాసానికి మనం కొనసాగించే కృషి భారత జాతీయ స్రవంతిని మరింత బలీయంగా చేసేందుకు వుద్దేశించబడిందని మనవి చేస్తున్నాను. శరీరంలో ఆయా అవయవాలు పుష్టిగా, బలంగా వుంటేనే శరీరం బలంగా వుంటుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలు బలంగా, సౌభాగ్యంగా వున్నప్పుడే జాతి పరిపుష్టంగా వుంటుంది.

ఆవులు ఎన్నో రంగులలో వున్నా వాటి పాలు మాత్రం తెల్లగానే వున్నట్లు, మనం ఏ భాష మాట్లాడినా, ఏ దేవుని కొలచినా, ఏ రాష్ట్రంలో వున్నా అందరం భారతీయులమే. భాషలు భిన్నమయినా భారత జాతి ఒక్కటే.

అమరకవి గురజాడ ఆశ్వాసించినట్లు -

"దేశమనియెడి దొడ్డ వృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయ్
నరుల, చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయ్
ఆకులందున అణగిమణగి కవిత కోకిల పలుకవలెనోయ్
పలుకులను విని దేశమందభిమానములు మొలకెత్తవలెనోయ్.

(మద్రాసులో 1984 మేలో జరిగిన అఖిలభారత ద్వితీయ తెలుగు మహాసభలకు పంపిన సందేశం)

సురవరము ప్రతాపరెడ్డి

నిజాము రాజ్యములోని తెనుగువారి స్థితి

ప్రబుద్ధాంధ్ర సంపాదకులు "నిజాంరాజ్యంలోని తెనుగువారి స్థితి అని రాస్తే చాల సంతోషిస్తాను" అని నాకొక జాబు వ్రాసినారు. వారి కోరిక అనుల్లంఘనీయము. ఏదేని విషయమును గురించి వ్రాయుమనిన నాకాందోళన కలిగి యుండెడిది. వారే వస్తునిర్దేశము చేసి వ్రాసినందున శ్రమ తప్పినది. నాకును నిదే విషయమును గురించి బ్రిటీషిండియాలో నుండు ఆంధ్రసోదరులకు తెలుపుకొనవలెనని బహుకాలమునుండి కోరిక యున్నది. ఏమి గ్రహచారమో యే నిజామాంధ్రులన్న నిజాములో వలెనే బయటను నిరాదరణమే కనిపించుచున్నది. ఇచ్చట లక్షల కొలది యాంధ్రుల కుందు కష్టసుఖములను గురించి కావలసినంతగా వ్రాయువారే లేరు. మహారాష్ట్రులకుండు నభిమానములో దశాంశము కూడా నాంధ్రులలో లేదనవచ్చును. నిజాము రాష్ట్రములోని హిందువులకు అందు ముఖ్యముగా మహారాష్ట్రులకు కష్టములు కలిగిన బొంబాయి రాష్ట్రపు పత్రిక లేమి, నాయకులేమి తీవ్ర చర్యలు చేయుచుందురు, కాని మన ఆంధ్రసోదరులలో నిట్టివి కాంచుట లేదు. ఏ తాలూకా మూలయందో యేమో చిన్న సభయో జరిగిన దానికి ముఖ్యస్థానమిత్తురు. కాని అఖిల నిజాము రాష్ట్రాంధ్రులకు సంబంధించిన ప్రథమ ద్వితీయ మహాసభలు జరిగిన వాటికి దగు స్థానమిచ్చు పత్రిక లేకపోయెను. కావున మా కథ కొంతయైనను నాకు తెలిసినంత మాకు ప్రమాదము లేకుండునట్లుగా వ్రాయగలిగినంత బ్రిటిషాంధ్రసోదరులకు తెలుపుకొనిన నిక ముందైనను మమ్ము వలసపోయిన వారినిగా, లేక అనాగరికులనుగా తలపక మాయందు సానుభూతి చూపి మాకే కష్టములు వచ్చినను అవి తమ కష్టములుగా భావించి సర్వవిధముల సాయపడుదురని యాశతో వ్రాయుచున్నాను.

నిజాము రాష్ట్రముయొక్క మొత్తము వైశాల్యము 2697 చదరపు మైళ్ళు. దీనిలో ఆంధ్ర ప్రాంతము యొక్క విస్తీర్ణము 41341 చదరపు మైళ్ళు. (అనగా నిజాము రాష్ట్రములో సగము భాగము). ఈ రాష్ట్రములో 16 జిల్లాలు కలవు. అందు తెనుగు జిల్లాలు 8.

(1) వరంగల్ (ప్రాచీనపు ఓరుగల్లు)

(2) కరీంనగరు

(3) ఆదిలాబాదు

(4) అత్రాపుబల్దా (అనగా 'బల్దా' నగరము చుట్టు నుండు భాగము)

(5) మెదకు

(6) నిజామాబాదు (దీనిని పూర్వము "ఇందూరు" అనుచుండిరి)

(7) మహిబూబునగరు (దీనిని పూర్వము "పాలమూరు" అనుచుండిరి)

(8) నల్లగొండ

ఇటీవల "బాగాల్" అను జిల్లా ఒకటి ప్రత్యేకముగా విభజింపబడినది. ఇవి గాక కర్ణాటకములో చేరిన రాయచూరు జిల్లాలోని క్రింది భాగములు ఆంధ్రులవే.

(1) అలంపూరు తాలూకా (2) గద్వాల సంస్థానము

జనసంఖ్య

ఈ రాష్ట్రము యొక్క మొత్తము జన సంఖ్య	14,436,148
అందు ఆంధ్రులు	6,972,534
మహారాష్ట్రులు	3,786,838
కర్ణాటకులు	1,620,094
ఉర్దూ మాతృభాషగా గలవారు	1,507,272
మహమ్మదీయులు	1,534,666
ఇతరులు	549,410

తెలంగానా అనియు, మరట్వాడా అనియు నిజాం రాష్ట్రము రెండు భాగములుగా విభజింపబడినది. రెండవ దానిలో కర్ణాటకులును చేరియున్నారు.

విద్యా-భాష

నిజాము రాష్ట్రములో అక్షరాస్యులు 5 యేండ్లు అంతకు పైబడిన వయస్సు గల వారిలో నూటికి 5 గురు. కావున నాంధ్రులలోను నిరక్షరాస్యుల సంఖ్య అపారము. దీనికి తోడుగా నిచ్చట ప్రత్యేక పరిస్థితులు కొన్ని ఆంధ్రుల విద్యాభివృద్ధి కాటంకములు కలిగించుచున్నవి. బ్రిటిషిండియా రాజకీయభాష యగు ఇంగ్లీషును మాతృభాష యగు ఆంధ్రమును ఆంధ్రులు నేర్చికొందురు; కాని యిచ్చట బహుబాషలలో ప్రవీణత నొందవలసి యున్నది. సార్వభౌమభాష కావునను పాఠశాలలో పాఠ్యమగునట్టిది గావునను ఇంగ్లీషు తప్పనిదయ్యె. ప్రభుత్వభాష కావున ఉర్దూ నిర్బంధమయ్యె. ఉర్దూలో ప్రావీణ్యత నొందవలెనన్న అరబీ చదువకున్నను ఫార్సీ మాత్రము తప్పక చదువవలసినదే. ఇక అభిమానభాష ఆంధ్రము. అది ఐచ్ఛికము, లాభరహితము. ఎవరు చదువుదురు? కావున ఆంధ్రభాష యిచ్చట దినదినము క్షీణించుచున్నది. భాషలో ఉర్దూ సాంకర్యముండుట సహజమే. బ్రిటిషిండియాలో ఇంగ్లీషు కల్తీ యెట్లుండునో అదే విధముగా మాభాషలోను ఉర్దూ సమ్మేళనము బాగుగా కలదు. ముఖ్యముగా అపచారము చేయువారు రెడ్లు, వెలమలు, గోలకొండ వ్యాపారులు, నియోగులు, మున్నూరు కాపులు. వీరు ఈ రాష్ట్రములో గణనీయులు. అయినను వీరికి ఉర్దూ భాషయే ఉగ్గుపాలతో నేర్చు విద్య. అనేకులకు తెనుగులో మాట్లాడుట కన్న ఉర్దూలో విసరివేయుట చాల సులభము మరియు గౌరవ ప్రదమనియు తలతురు.

వేషములు

"స్వస్థానవేషభాషాభిమతా స్సంతో రసప్రలుబ్ధధియః" అన్న నన్నయ్యభట్టు వాక్యములు మా యందు నిరర్థకములే. భాషకు తోడు వేషము. బ్రిటిషిండియాలోను (ఇప్పుడు తగ్గుచున్నను) ఇంగ్లీషువేషములు యువకులలో కలవు. మా రాష్ట్ర మందును తురక వేషములు బహుళములు. ఇంగ్లీషు వేషములు వేయువారిని.

"ఏనుగు తొలు దెచ్చి ఏడాది యుతికిన
నలుపు నలుపే కాని తెలుపు కాదు"

అన్నట్లు తమ రంగును మార్చుకొనజాలనందున మన వారే యని పోల్చుకొనగలము. కాని తురకవేషములు వేసిన వారిని హిందువులని కాని ఆంధ్రులని కాని నిర్ణయించుట కెవ్వరికిని సాధ్యం కాదు. కొందరు హాజీల వలె మౌల్వీల వలె వదలు లాగులను కొందఱప్పుడే పంజాబు నుండి దిగివచ్చిన పఠానులవలె బిఱ్ఱు పైజామాలను ధరించి షేర్వానీ తుర్కీటోపీ ధరించి కల్తీ లేని ముసల్మానులవలె నుందురు. ఇంతటితో తృప్తి నొందక కొందరు (వారు రెడ్లు) గడ్డములు పెంతురు. ఆ గడ్డములను గూడ ఇరుపాయలుగా పాపట తీసిదువ్వి పెంచుచుందురు. కొందఱు (వారును రెడ్లే) మహమ్మదీయ తీర్థస్థానమగు అజమారు (షరీఫ్)కు యాత్ర 'కేగివత్తురు. రెడ్లలో వెలములలో రెండు ఉర్దూ ముక్కలడొక్క శుద్ధి యైనవా రెల్లను తురకవేషములలో నుందురు. (ఇప్పుడిప్పుడు నూటికి సగము వంతు ఈ వేషములు తగ్గిపోయినవని చెప్పగలను)

విద్యాభివృద్ధి కాటంకములు

విద్యావిషయము చెప్పుచు వేషములోనికి దిగితిని. విద్యకు ఆటంకములలో నొకటి రాజకీయ భాష యగు ఉర్దూ అని చెప్పితిని. సుమారు 12 సంవత్సరము నుండి ఉస్మానియా విద్యాపీఠము స్థాపితమైన నాటి నుండి ఉర్దూ ప్రధాన భాషయగుట జేసి యితర భాషలు మూలబడిపోయినవి. పైగా 1343 ఫసలీలో అనగా 11 ఏండ్ల క్రింద భాన్గిబదుల శాసనము బయలుదేరెను. దాని మూలమున ప్రభుత్వాజ్ఞ

లేనిది ప్రైవేటు బళ్ళు ఎవరును స్థాపించగూడదు. స్థాపించిన బలవంతముగా మూయింపబడును. ఈ పరిస్థితులను గమనించియే మహారాష్ట్రులు తమ భాషాభివృద్ధికై "వివేకవర్ధనీ పాఠశాల"ను స్థాపించినారు. ఆంధ్రుల కిట్టిది లేదు. కాని మహారాష్ట్రులే స్థాపించి వదలుకొనిన బాలికా పాఠశాలను ఆంధ్రులే యిప్పుడు నడపుతున్నారు. అందు ఇంగ్లీషు ఆంధ్రము మెట్రికువరకు చదవింతురు. ప్రకృతము 150 వరకు బాలికలు చదువుచున్నారు. విద్య యుచితము. కాని ప్రభుత్వము సహాయము సంపూర్ణముగా సున్న. ఎన్ని మారులు మొర పెట్టుకొనినను దమ్మిడీ సహాయము కూడ చేయకుండుట ఆంధ్రుల దురదృష్టమే లేకున్న బ్రిటిషిండియాలోనే కాక విదేశములందును విద్యకై వేలు కాదు కదా లక్ష లేటేట దానము చేయుచుండిన మా ప్రభుత్వము వారికి స్థానిక విద్యాసంస్థ అందుబాలికల విద్యకై యేర్పడినట్టి దానికి సహాయము చేయుమన్న ససేమిరా అని ముష్కరించుకొని కూర్చుండుట యేల? ఏది యెట్లున్నను ఈ పాఠశాలను పట్టుదలతో ప్రశంసనీయముగా చందాలెత్తి నడిపించుచున్న మాడపాటి హనుమంతరావు ప్రభృతులు ప్రశంసనీయులు.

ప్రజాహిత సంస్థలు

అంతగా పేర్కొనదగినవి లేవు. ఉన్న వానిలో నిజాం రాష్ట్రాంధ్రజనకేంద్ర సంఘము హైద్రాబాదు నగరాంధ్రజనసంఘము ముఖ్యమైనవి. మొదటి దానికి ఆది నుండియు, మాడపాటి హనుమంతరావుగారు కార్యదర్శులు. ఈ సంఘపక్షమున ననేక స్థలములలో గ్రంథాలయాది సభలు జరుపబడినవి. రెండు మహాసభలు జరిగినవి. సుమారు 20 లఘు పుస్తకములు ముద్రింపబడినవి. ఇక్కడి యాంధ్రుల పరిస్థితుల నెరుగ గోరువారు ఈ 20 గ్రంథములను పై మాడపాటి హనుమంతరావుగారి వద్ద నుండి తెప్పించికొని చూచిన విషయగ్రహణమగును. ఈ రాష్ట్రములో సుమారు వందవరకు ఆంధ్ర గ్రంథాలయములు స్థాపింపబడెను. కాని యందు సగము పైగా అంతరించినవి. (ఇది ఆంధ్రుల కుందు లక్షణమే) మిగతా సగములో కొన్ని మిణుకు మిణుకుమనుచున్నవి. దీనికి తోడు ప్రభుత్వము యొక్క అనాదరము. బరోడాలో ప్రజాస్థాపిత గ్రంథాలయములకు ప్రభుత్వ సహాయముండగా చేసి రాష్ట్ర గ్రంథాలయములపై పోలీసు వారొకకన్నుంచవలెనని ఆజ్ఞ యున్నది. ఇప్పుడున్న గ్రంథాలయములో దినదినాభివృద్ధి పొందునది క్రీ.శ. 1915లో స్థాపింపబడిన నగరమందలి శ్రీకృష్ణదేవరాయాంధ్ర గ్రంథాలయము. ఇందు సుమారు 5000 సంస్కృతాంధ్రాది గ్రంథములును అముద్రితతాళపత్ర గ్రంథములును, ఆముద్రితశాసన ప్రతిబింబములును కలవు.

రెడ్డి హాస్టల్

హైద్రాబాదు నగరమును చూడవచ్చు నాంధ్రుడు తప్పక ఈ హాస్టలును తిలకించి పోవలసినదే. ఇంతటి ప్రచండమైన ప్రజాహిత సంస్థ బ్రిటిషాంధ్ర భాగమందును లేదనవచ్చును. సుమారు మూడు లక్షల విలువగల భవనములు, సుమారు 12000 గ్రంథములు గల భాండాగారము రమారమి 150 విద్యార్థులును కల సంస్థ యిది. ఈ సంస్థ యేర్పడిన తర్వాతనే రెడ్ల వేషభాషలందు మార్పులు కలిగిన వనవచ్చును.

ఆచారములు

నిజాము రాష్ట్రములో రైళ్లు తక్కువ. అందు తెలంగాణాలో మఱీ తక్కువ. నల్లగొండ, కరీంనగరు, అత్రాపుబల్దా, జిల్లాలకు రైలు మార్గమే లేదు. తక్కిన జిల్లాలకును బాదరాయణి సంబంధముగా జిల్లాలో నొక మూలన పోవుచున్నది. విద్యావ్యాపకము సున్న. అట్టిచో జనులు పూర్వాచారపరాయణులు; మూఢవిశ్వాసములు మెండు. సనాతనులకు పెట్టని కోట. రెడ్లలో వెలములలో, గోలకొండ వ్యాపారులలో జనానా పద్ధతి మెండుగా నున్నది. రెడ్లలో మూడు తెగలు దేశముఖు (దొరల) తెగ మొదటిది. రెండవది పటేండ్ల తెగ (గ్రామమున్సిపులు) మూడవది కాపులు. ఒకరికన్న నొకరు హెచ్చని తలతురు. దేశముఖులలో పూర్ణముగా, పటేండ్లలో సంపత్తు ముదిరిన చోట గోషా పద్ధతి కలదు. వెలమలలో ధనికులందే కాక బీదసాదలందును సంపూర్ణముగా గోషా కలదు. తురకల కన్న హెచ్చుగా విపరీతపద్ధతులపై నీ "ఘోష" వీరియంద కలదు. గోలకొండ వ్యాపారులలోను "దేశపాండ్యాలు" (దొరలు) కరణములు అని రెండు శాఖలు. అందు మొదటి శాఖలో గోషా కలదు.

రెడ్లకు, గోలకొండ వ్యాపారులకును మతమందు పట్టుదల తక్కువ. ఇస్లాం మత విశ్వాసములు కొందఱికి కలవు. 9-10 ఏండ్ల క్రిందట పెద్దపల్ల జాగీర్దారులగు రాజేశ్వరరావు జీవించిన కాలములో ముసల్మాను విశ్వాసములు కలిగి చనిపోవునప్పుడు తన శవమును ముసల్మానులకిచ్చి గోరీ కట్టించుటకై యేర్పాట్లు చేసికొని చనిపోయెను. అతని యధీనములో సుమారు 200-300 గోలకొండ వ్యాపారి కుటుంబములుండెను. వారిపఇ వీరి యభిప్రాయములు చలామణి యగుచుండెను.

ఆదిహిందువుల కేలాటి సౌకర్యములు సవర్ణులు కలిగింపనందున అనేక స్థలములలో క్రైస్తవమందును మహమ్మదీయమతమందును వీరు చేరిపోవుచున్నారు. ఈ యభయమతముల పక్షము నుండి మిషనులు పని చేయుచున్నవి.

ఆంధ్ర సంస్థానములు

మారాష్ట్రములో ముఖ్యమైన యాంధ్రసంస్థానములివి.

1. గద్వాల 2. వనర్తి 3. కొల్లాపురము 4. అమరచింత 5. గోపాలుపేట 6. దోమకొండ. 7. సీర్నపల్లి 8. 9. సురపురము

ఇవి గాక దొంతి, చింబోడు వంటి చిన్న చిన్న జాగీరులు చాలగలవు. నారాయణపురము అనునొక గొప్పరెడ్డి సంస్థానముండెను. ఆరెడ్డి దొరవారు లీలావిలాసుడై ముసల్మాను స్త్రీని నికా చేసికొని ఇస్లాం మత స్వీకారమొంది సంతానహీనుడై చనిపోయెను. సంస్థానము భాల్సా (జప్తు) అయ్యెను. అయిదారు చిన్న జాగీరులు మాత్ర మతని సంబంధులైన ముసల్మాను స్త్రీల వశముననిప్పుదున్నవి.

పై ఎనిమిది సంస్థానములు ఆంధ్ర సంస్థానములు. కాని వీనిలో భాల్సా యిలాకా (అనగా నేరుగా శ్రీ నిజాం ప్రభువు పరిపాలనమందుండు భాగము) లోవలె సౌకర్యములు తక్కువ. పన్నులు హెచ్చు. విద్య భాల్సా కన్న హీనము. సంస్థానముఖ్యపట్టణమందేవో యొకటి రెండు సర్కారీ ఒళ్లు లేనే లేవనిన పొరపాటు కానేరదు, రైతులు (ఏలొకో?) సాధారణముగా నందఱును దరిద్రులే! టప్పా సౌకర్యములు భాల్సాలోనే సరిగా లేనందునను సంస్థానములకు దానితో సంబంధము లేనందునను తప్పుపట్టుట తప్పేయగును. ఇట్లుండియు గద్వాల, వనపర్తి సంస్థానములలో ప్రాచీనమునుండియు కవిపండితుల సమ్మానము జరుగుచుంటచే నిప్పటికిని నా సంస్థానములలో పండితుల సిలుకు కొంత మిగిలియున్నది. ఈ సంస్థానముల అధిపతులు మన స్ఫూర్తిగా తలపెట్టిన నిజాం రాష్ట్రాంధ్రులందఱిని నచిరకాలములోపలనే యుద్ధరించగలరు. కాని, ప్రకృతము తమ సంస్థాన ప్రజలనైననుద్ధరించిన నదియే పదివేలు.

ఆర్థికస్థితి

తెలంగానా రైతులు మరాట్వాడా రైతులకన్న బీదవారు. మరాట్వాడా భూములు సారవంతమైనవి. తెలంగానా భూములు చాలపట్టు చెలకలు (ఇసుక నేలలు) వ్యవసాయము కూడ చాల మోటుగనున్నది. కొన్ని తావుల విత్తనము భూమి దున్ని చల్లుటయో లేక చేతితో విత్తనములు నాటుటయో యైయున్నది. రైతులు విశేషముగా అప్పుల పాలై యున్నారు.

హైద్రాబాదునగరము ఆంధ్రుల స్థానమే. నగరమందు ఆంధ్రులు సుమారు రెండు లక్షలున్నారు. మహారాష్ట్రులు 30000 మాత్రమేయున్నను ఉద్యోగులు, వకీళ్ళు, ఇతర గౌరవవృత్తులు కలవారు మహారాష్ట్రులే. ఆంధ్రులలో వకీళ్ళు కూడా 30 మంది కన్న హెచ్చుగా లేరు. వారును పేరు ప్రతిష్ఠలు కలవారుకారు. ఉద్యోగములందు గొప్ప యుద్యోగులు లేనేలేరనవచ్చును.

మొత్తముపై

నిజాము రాష్ట్రాంధ్రుల స్థితి చాల హేయమైయున్నది. విద్యావ్యాపకము లేదు. గ్రామజనుల స్థితి చాల శోచనీయము. సౌకర్యములు చాల తక్కువ. విచారించువారు గాని సానుభూతి చూపువారు గాని లేరు. గష్తీ నిషాన్ 53 అనునది ప్రజల వాక్స్వాతంత్ర్యమును నిరోధించుచున్నది. ఇది చాల విపరీతమైన గష్తీ. అధ్యక్షుని పసందు, ప్రభుత్వమునకు కావలెను. పది దినములకు ముందే జిల్లా కలెక్టరు అనుమతి సభకై పొందవలెను. ఉపన్యాసకులెవరో వారేమి మాట్లాడుదురో తెలుపవలెను. రాజకీయముల వాసనయే కూడదు. రాజకీయేతరములకీ పై కట్టుబాట్లు, ఇట్లు కొన్ని యిబ్బందులున్నను మా రాష్ట్రము ఇతర దేశీయ రాష్ట్రములకన్న చాల మేలే. రైతుల కష్టములను అప్పుడప్పుడు పన్నులు మాపుచేయుచు తొలగింతురు. పత్రికలకు కొంత స్వాతంత్ర్యమున్న దనవలసినదే. ఈ రాష్ట్రములోని పత్రికలు వ్రాయునట్లు తీవ్రముగా నితర సంస్థానములలో వ్రాసిన పత్రికలు చాల కాలము జీవించి యుండవు. న్యాయమైన సత్యమైన విమర్శనమును ప్రభుత్వమువారు నిరసింపరు. ఏది యెట్లున్నను ఆంధ్రులు తమ సంఖ్యను బట్టి ప్రభుత్వోద్యోగములందు గాని, స్వతంత్రవృత్తులందుగాని, వ్యాపారవ్యవసాయములందు గాని చాల వెనుకబడి హీనస్థితియందున్నారనుట నిర్వివాదాంశము.

(ప్రబుద్ధాంధ్ర 1934 నవంబరు సంచిక)

శ్రీ కృష్ణవేణీ గరిష్ఠ పాద స్తరం
గాహత ప్రాకార మైన యదియు
బురుజుల దితిజ సమూహరక్తము గ్రోలు
నాల్కవోలు పతాక నాటి నదియు
ఆంధ్ర వీర భటాళి కాత్మ ఆర్యంబుల
యందు శాణోపలం బైన యదియు
ఘంటశాలా పురీకలిత పూర్వాంధ్ర శి
ల్పాచార్యులకు తల్లియైన యదియు

రాజరా జాంధ్రవిష్ణుని రాజధాని
కలుషముల కెల్ల పిడుగు శ్రీకాకుళంబు
కన్నులకుఁ గట్టినట్లుగఁ గానబడెదు
వేదకాలము నాటి ముత్తయిదుపట్లు.

– విశ్వనాథ సత్యనారాయణ

వావిలాల గోపాలకృష్ణయ్య

తెలుగు భాషాభివృద్ధి - కర్తవ్యం

మన రాష్ట్రం తెలుగు భాషమీదనే ఆధారపడి ఏర్పడ్డటువంటి రాష్ట్రం. దానితోటి తక్కిన రాష్ట్రాలు అన్నీ ఏర్పడ్డాయి. భాష రాష్ట్రాన్ని నడపాలి. అందుకు కొంత ప్రయత్నం ఒక ఆరు సంవత్సరాల కిందట జరిగింది. మొట్టమొదట ఆంధ్రాయూనివర్సిటీ ఏర్పడ్డప్పుడు దాంట్లో తెలుగు, ఉర్దూ, ఒరియా – వీటిని బోధన భాషలుగా, పరీక్షా భాషలుగా అమలు జరపాలని శాసనంలోనే వ్రాశారు. కాని దురదృష్టవశాత్తు ఇది జరగలేదు. దాని సీలుమీద మాత్రమే తెలుగున్నది కాని తక్కిందంతా ఇంగ్లీషే. ఆ తరవాత భాషా రాష్ట్రాలు ఏర్పడ్డ తరువాత – కొంత ప్రయత్నం జరగాలని ఆలోచన వచ్చింది. ఈ మధ్య – ఒక ఏడెనిమిది సంవత్సరాల మధ్య కొఠారీ కమీషన్ వారు మాతృభాషలోనే ప్రభుత్వం నడపాలి అనే ప్రయత్నం చేయమన్నప్పుడు మన రాష్ట్రం చాలా ముందడుగు వేసింది. కాని నాకు నచ్చ లేదు. మనం చేసిన పని చాలా తక్కువగా అగపడ్డది నేను చాలా రోజులనుకున్నాను. ఎందుకు మనం గట్టిగా పనిచేయటం లేదా అనుకొన్నాను.

కాని నా కన్ను తెరిపించినవారు ఢిల్లీలో నేషనల్ ఎడ్యుకేషన్ రీసర్చి సెంటరులో ఉన్నారు. తెలుగు టెక్స్టుబుక్ ప్రెస్ కమిటి విషయంలో మేము సభ్యులమంతా ఉన్నప్పుడు మాట్లాడ్డానికి పిలిపిస్తే వచ్చి, ఉండి ఉండి మీ తెలుగు అకాడమి ఎంత పని చేసిందండీ అన్నాడు ఆయన. అంటే ఏదో ప్రమాదం వచ్చింది కాబోలు అనుకొన్నాను. “భారతదేశంలో మాతృభాషలను పఠనీయం చేయాలని, ప్రచారం చేయాలని ప్రయత్నించిన అకాడమీలకు ఇచ్చిన డబ్బుతో పోల్చుకుంటే మీ కిచ్చిన డబ్బు లెక్కలోది కాదు, కాని మీ వాళ్ళు చేసినపని చాలా పెద్దది అందువల్ల మీ ఆఫీసుకుపోయి చూడాలని కుతూహలంగా ఉంది” అన్నాడు. ఆయన వచ్చారు, చూసిపోయారు. మళ్ళీ నేను ఢిల్లీ వెళ్ళినప్పుడుగూడా కలిస్తే పదిహేను ఇరవై నిమిషాలు మనం చేసిన పనిని ప్రశంసించారు. అంటే మనం చేసిందంతా మహత్తరమని కాదు. మనం ఇతరులకన్నా కాస్త ముందడుగు వేశాం అంతే కాదు, ఇంకో అడుగుకూడా ముందువేశాం, పాఠ్యక్రమంలో కూడా తెలుగును ఇంటర్మీడియట్‌లో ప్రారంభించినప్పుడు, ఇప్పుడు బిఏ నించి ఏ తరగతికి వెళ్ళాలనే ప్రయత్నం జరిగినప్పుడు ఒక విషాదఘట్టంలో ప్రవేశించామనే బాధ మాత్రం లేక పోలేదు. అదేమిటంటే, తెలుగులో బోధన జరగాలన్నాం కాని ఈ మధ్య ఇంగ్లీషులో బోధన కూడా ఏర్పాటు చేయాలన్నారంటే తెలుగు కోసం ఇన్నాళ్ళనుంచి చేసిన ప్రయత్నం నిలుస్తుందా అన్న అనుమానం కలిగి అధికార భాషా కమీషన్ అధ్యక్షుడుగా కూడా నేను భావించలసిన స్థితి వచ్చిందని చెప్పక తప్పదు. అందువల్ల మళ్ళీ ఆలోచిస్తున్నాం, పెద్దలకు చెబుదామని. కాని ఒక దురదృష్టం మాత్రం అగుపడుతున్నది. ఇప్పుడు అధికార భాషా కమీషన్‌గా ఊళ్ళలోకి వెళ్ళి మాత్రం టీచర్లనుంచి వచ్చినటువంటి ప్రశ్నలు

చేస్తూ, రాజకీయవేత్తల ప్రభావమూ దేశంలోని పరిస్థితులూ ఆలోచిస్తే, దేశంలోని పెద్ద ఉద్యోగాలన్నీ మనం తీసుకోకపోతే ఎట్లాగనిపిస్తున్నది. నాక్కూడా కోరిక వుంది. ఉండాలనే కోరిక హిందీయా, ఇంగ్లీషా అనేటువంటి ఊపు తగ్గి మాతృభాషను అభివృద్ధి చెయ్యాలనేటటువంటి నిర్ణయం రావటంతో ఆలోచన ఒక స్థాయికి వచ్చింది.

అట్లా జరిగిపోయినదానికి ఇప్పుడీ లెక్చరర్సూ వీళ్ళంతా ఏమంటారంటే "అయ్యో! మేం ఇంగ్లీషు లేకపోతే ఎట్లా?" అంటారు. కేంద్రంలో ఉద్యోగాలంటారా? వివిధ దేశాల్లో ఉద్యోగాలంటారా? వీటన్నిటినీ ఒక ప్రాతిపదిక మీద నడపవచ్చు. మాతృభాషలో ప్రవీణత సంపాదించిన తరువాత, అవసరపడి ఇతర రాష్ట్రాలకు కాని దేశాలకు కాని వెళ్ళేవాళ్ళను ఆర్నెల్లపాటు ప్రత్యేకమైన శిక్షణ పొంది ఆ భాషలో చదువుకొండని చెప్తే ఎప్పుడూ ఇబ్బందిరాదు. ఎమ్.ఏ. చదివిన వాళ్ళకు, ఇతరులకు నేను ఆఫీసుకు పోయినపుడు చెప్తున్నాను. "మీరెన్ని తప్పులు రాసినా ఇంగ్లీషులో ఇంకొకడు టైపు చేస్తున్నాడు కాబట్టి తప్పులేమైనావుంటే అవి మీమీద పడవు. దేవుడు కాదు మీ తప్పులనుంచి మిమ్మ కాపాడేవాడు టైపిస్ట్" అని.

తెలుగు బోధన భాషగా వచ్చిన తరువాత ఈ పరిస్థితి ఒక దారికి వచ్చింది. అయితే మనమిప్పుడు ఎక్కడున్నాం? పట్టభద్రులమైన తరవాత ఏం చేయాలనే స్థాయికి వచ్చాం. వచ్చేటప్పటికి బండి ఆపి ప్రస్తుతం ఇకముందుకు పోవద్దన్నారు యూనివర్శిటీలవారు. అందువల్ల అక్కడ ఆగిపోయింది బండి. ఇవ్వాళటి ప్రకటనను చూస్తే ప్రతి కళాశాలలోనూ, ఇంటర్మీడియట్‌లో కూడా విధిగా ఇంగ్లీషులో బోధన చేసేటువంటి సెక్షన్ ఉండాలన్నారు. ఇదేగనక జరిగితే ఈ అయిదు సంవత్సరాల నుంచి ఒక దారికి వచ్చినటువంటి మానసిక పరివర్తన వికృతరూపం ధరిస్తుందనే భయం మాత్రం కలిగి నాకు చాలా బాధగా వుంది. తెలుగు అభిమానులంతా దీన్ని నిగ్రహించాలి.

ఇప్పుడు మనమెన్నో పుస్తకాలు వేశాం. వాటిలో మనం చెప్పింది ఏమంత ఎక్కువలేదు. వాటిలోని భాషను గురించిన చర్చ వచ్చినప్పుడల్లా ఆ భాష మార్చాలండి అంటున్నారు, మారుస్తామన్నాం, భాష మార్చక తప్పదు. అవరోధం లేకుండా ముందుకు సాగే గంగా స్రవంతిలోని రాళ్ళన్నీ గుండ్రంగా, అందంగా వుండాలంటే వెంటనేకావు. ఆ ప్రవాహాన్ని కొంత దూరం పోనిస్తే అవే అరిగి అరిగి సురూపంలోకి వస్తాయి. ఈ అవకాశం కొంత ఈ అయిదు సంవత్సరాల్లో వచ్చింది. ఈ ప్రవాహం మరింత ముందుకు పోతే నా అభిప్రాయంలో తెలుగులో వజ్రాలు ఏర్పడుతాయి. ఆ విశ్వాసం నాకున్నది. కాని ఇట్లా జరగటానికి అవరోధం ఏర్పడుతున్నది. దీనికి కారణం అధ్యాపకవర్గం.

ఐ.ఎ.యస్. మనం చదవలేదని చాలామంది బాధపడుతున్నారు. నాకు అభ్యంతరం లేదు. చదవమనండి. అయితే నాసందేహమొకటి అడుగుతున్నాను. ఇంతవరకూ తెలుగు ఎక్కడా అడ్డం రాలేదు – ఐ.ఎ.యస్. చదువుకొనేవాళ్ళకు. వస్తే ఎవరికి రావాలంటే తెలుగులో ఇంటర్, బి.ఏ. ప్యాసైనవాళ్ళకు. కాని ఇంతవరకు ఉన్నవాళ్ళంతా ఇంగ్లీషు చదువుకున్నవాళ్ళే. మరి ఒక్కరే ప్యాసైనారేం ఈ సంవత్సరం? వాళ్ళయినా ఆంధ్రప్రదేశ్‌లో చదివినవాళ్ళుకాదు. కాని రోజురోజుకూ లెక్కలు తీస్తే మనకు తెలుస్తున్నదేమిటి? ఇన్నాళ్ల నుంచీ ఇంగ్లీషులో చదువుకున్నవాళ్లు ఎందుకు ఐ.ఏ.యస్. ప్యాసు కాలేదు? ఐ.ఏ.యస్. ప్యాసు కావటానికీ, సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగాలకు పోవటానికి వచ్చిన ప్రతి బంధకం తెలుగు మాత్రం కాదు. మరొకటి. అదేమిటీ అని నన్నడిగితే అది వేరే ఆలోచించవలసింది. ఇక్కడ కాదు. ఆ విషయంలో కూడా మన ఆలోచనలను ప్రభుత్వానికి చెప్పాం. కోఠారీ కమీషన్ – ఈ రాజ్యాంగంలో ఉదాహరించిన భాషలున్నాయ్. ఈ భాషల్లో ఇండియా ప్రభుత్వ సర్వీసు మొదలైన వాటిలో అన్నీ ఉండాలని చెప్పింది. భాష ఏది వుండాలని చెప్పే అధికారం పోయి చాలా రోజులయింది. మాతృభాష రావాలని వచ్చింది. దాన్ని అమలు జరపటానికి కావలసిన ప్రాతిపదికలు ఆలోచించటానికి ఈ కమీషన్ పనిచేస్తున్నది.

పండితుల దగ్గర ఒక చిక్కు వస్తున్నది. పామరుల దగ్గర నుంచి మరో చిక్కు వస్తున్నది. పండితులేమంటారంటే మైలపడిపోతాం గనక సామాన్యభాష మీరు వాడవద్దంటారు. పామరు లేమంటారు? ఈ భాష మాకు అర్థం కాదు బాబూ! ఆ ఇంగ్లీషే కానీయండి అంటారు. పరిపాలకు లేమంటారు? ఉన్న భాషను కదలించ వద్దంటారు. అసలు జనమేమంటారు. మాకేదీ అర్థం కాదంటారు. ఇప్పుడీ పరిస్థితిని విషమ సమస్య అనాలో సంధి సమస్య అనాలో నాకు తెలీలేదు. బోధపడలేదు.

అయితే ఈ కార్యక్రమంలో తెలుగు అకాడమి చాలా కృషి చేస్తున్నది. కృషి చేస్తుంటే గూడ కేంద్ర ప్రభుత్వం ఏమంటున్నదంటే 'మేము మీకిచ్చిన డబ్బు పుస్తకాలు అమ్ముకోడానికి కాదండీ మీక్కింది. మీరు రాసే వేరు పుస్తకాలకు డబ్బిస్తాం. మాకు తోచినంత సహాయం చేస్తాం.' అంటే జనానికుపయోగపడే పుస్తకాలు అమ్ముడు పోగూడదంటారు. ఎక్కువమంది జనం చదవగూడదు; పుస్తకాలు అమ్ముడుపోగూడదు. పుస్తకాలన్నీ మిగిలినవండి. ఇంకో లక్ష రూపాయలివ్వండంటే లేదంటారు. ఏమి అన్యాయమిది? ఇదొక దురదృష్టం. రెండోది పరిశోధన చెయ్యమని చెబుతున్నాం మనం. ఈ పరిశోధన ఏవైపునుంచి చెయ్యాలి? ఈ విషయం పరిశోధనకు అందలేదు!

ఇంతవరకూ తెలుగు అకాడమీ దేనిమీద బతుకుతున్నదంటే – దేనిమీద బాగా కృషి చేసిందంటే – పాఠ్యగ్రంథాలను విస్తృతంగా రాసి ప్రజల్లోకి పంపించటంమీద. అందులో వచ్చిన చిక్కును కూడా మనం పరిశీలించవలసి వుంది. ఈ పుస్తకాలు ఎవరు రాయాలి? నిష్ణాతులకిద్దామా? రాజకీయంగానా? నిష్ణాతులకిస్తే రాజకీయం అడ్డమొస్తుంది. రాజకీయంగా ఇస్తే నిష్ణాతులు అడ్డమొస్తారు. ఎవరో అంటారు ఆయన దగ్గర పలుకుబడి ఉన్నవాళ్ళ కివ్వాలి. ఇవ్వకపోతే ఆయన తల్లకిందులు చేస్తాడేమో! ఆయన రాయలేదు అందువల్ల ఎవరు రాస్తారు? ఆయనకు ఎవరో ఒకరుంటారు "రాసిపారెయ్యవోయి పీడా వదిలిపోతుం"దని చెప్పి ఎవరోరాస్తే, ఆయనపేర వేసుకుంటే, ఎవరికి చిక్కొస్తుంది? బస్సు రాకపోతే తిట్టేదెవర్ని? యజమాన్నికాదు. ఆర్.టి.సి. వాళ్ళనూ కాదు. కండక్టర్ను. అట్లాగే తెలుగు అకాడమి పుస్తకంలో ఏదైనా తప్పొస్తే అకాడమి మొత్తాన్ని తిట్టేస్తాం. రాసినవారేమైనారు? సమయమేమయింది? ఇన్ని బాధలూపడి ఇంతవరకు నెట్టుకొని వచ్చాం. మన మేమైనా సమగ్రత సాధించామని నేననుకోవటం లేదు. ప్రయత్నంలో ముందుకుపోవటానికీ సమగ్రత రావటానికీ తేడావుంది. ప్రయత్నంలో ఎంతముందుకుపోతే అంత సమగ్రత

సాధించటానికి అవకాశముంది. ప్రయత్నాలకే అడ్డంకివస్తే సమగ్రతకు సమయమే లేదు. ఎంతసేపూ బతికేదెట్లా అని ఆలోచించుకుంటూనే సమయం ఐపోతున్నది. ఇప్పుడు మన పరిస్థితి విషమ ఘట్టంలో కాదు ప్రమాద ఘట్టంలో ఉంది.

ఇప్పుడు అధికార భాషను అమలు జరపాలని ప్రభుత్వం తరఫున ఆలోచిస్తున్నాం. అందుకు మూడు ప్రధాన కారణాలున్నాయ్. మనం తెలుగులోనేమో బోధనచేశాం. వాళ్ళేమైపోవాలి? వాళ్లెందుకూ పనికిరారని అవతల అంటున్నారు. మా ప్రభుత్వం తెలుగులోనే బోధన భాషగా ఉంచిందిగనక, తెలుగు వచ్చిన వాళ్ళకే మేముద్యోగమిస్తామనే స్థితికి గవర్నమెంటు వచ్చితీరాలి. లేకపోత మాత్రం జరగదు. రెండోది ఇంగ్లీషు వృత్తి విద్యలున్నాయి. తెలుగు చదువుకున్నవాళ్ళు పరీక్షలు తెలుగులో రాస్తామంటే అవకావం ఇచ్చి తీరాలి. పబ్లిక్ సర్వీస్ కమీషన్‌లో తెలుగు రాయటానికి మనం అనుమతి ఇచ్చివున్నాం. జి.వో. ఇచ్చాం అది జరిగి పోయింది.

ఓ చిన్న సంఘటన జరిగింది. క్రిమినల్ ప్రొసీజరు కోడు కొత్తది వచ్చింది మీకు తెలుసు. అందులో హిందీవాళ్ళు ఎవ్వరికీ చెప్పకుండా ఒ పెద్ద మార్పు తెచ్చారు. మన తెలీదు. ఏమన్నారంటే కోర్టు భాష ఇదీ అని ఇదివరకు ఉండేది. ఇదివరకటి కోర్టులో ఇంగ్లీషుకాక కోర్టుభాష అని వుండేది. ఇప్పుడేం చేశారూ? ఇంగ్లీషు అనే మాట ఎత్తివేశారు. కోర్టు బాష అన్నారు అంటే ఎవరికి స్వతంత్రత ఇచ్చారు? ఒక్కొక్క రాష్ట్రానికి స్వాతంత్ర్యమిచ్చారు. మరేమైనా ఇంగ్లీషు మాత్రంలేదు. ఇంగ్లీషును ఎప్పుడైతే తీసేశారో ఉత్తర రాష్ట్రాలూ, మహారాష్ట్రానూ హిందీ అని రాసేశారు. మనకు వచ్చేటప్పటికి ఇంగ్లీషు, తెలుగు, అరవం, ఉర్దూ అన్నీ ఉన్నాయి. ఇట్లా ఎందుకు జరుగుతున్నది. ఎవరు చేస్తున్నారిది? నాకో చిన్న విషయం జ్ఞాపకమొస్తున్నది. పట్టుపురుగును పెంచటానికి ఒక జీవాన్ని పెత్తే దాన్ని తినటానికి ఎలుకలు, పక్షులు – అన్నీ తయారు ఆ విధంగానే మాతృభాషను అమలు జరపాలంటే అన్నివైపులా అందరూ విఘాతాలు తెస్తున్నారే! ఈ స్థితి ఎప్పటికి మారుతుందనే భయం పట్టుకుంటున్నది. ఉన్న పరిస్థితి మాత్రం మీముందు పెడ్తున్నాను.

ఇప్పుడందరూ బయలుదేరాలి. మాతృభాష విలవ దేశంలో బతుకుందా, చస్తుందా? దానికి బతకటానికి కావలసిన పుష్టి తీసుకొచ్చే జనం బయలుదేరాలి. పండితులతో సహా పండితులు కొంచెమైనా రాజీపడాలి ఏమనంటే, సామాన్య భాష లేకపోతే మనం బతకలేమని, జనసామాన్యం వాడే పదజాలం ఎక్కడుంది? పండితుల్లో లేదు అనలేం కాని పామరుల్లో ఇంకా బతికుంది పండితులకు తెలిసిందల్లా మన పుస్తకాల్లో వున్నంతవరకే. పుస్తకాల్లోకి రాని భాషంతాకూడా అడుగునపడి వుంది. ఆ భాషను పైకి దెస్తే ప్రతివక్కడూ సంతోషిస్తాడు అన్నట్లు, మనం ఎవర్ని అనువాదకులుగా పెడ్తున్నాం అసలు. ఇంగ్లీషు చదివి, ఇంగ్లీష్‌లో పెరిగి, ఇంగ్లీస్ వచ్చిన వారినే. ఆయనకు వచ్చింది, ఆయన చదువుకున్న భాష వరకే తక్కింది రాదు. ఆయనకు వచ్చిందేమిటి? శంకరనారాయణ డిక్షనరీ, లేకపోతే శబ్దరత్నాకరం, తరవాత సంస్కృతంలోని పదపారిజాతం, లేకపోతే హిందీలోని మరొకటి. వీటిలోంచి తేలే తెలుగేమిటి? మాకెందుకు బాబూ ఇది అంటున్నారు మళ్ళీ జనమంతా ఆప్తవర్గం ఇక్కడ కనపడ్డదిగదా అని కాస్త నా ఆవేదన చెప్పుకుంటున్నాను. ఇప్పుడేం చెయ్యాలి. నిఘంటువు తయారు చెయ్యాలి. శబ్దరత్నాకరం లేదా? వబ్దార్థ చంద్రిక లేదా? అని మీరంటారు ఇవన్నీ కాదు నేనడుగుతున్నది మాతృభాషలో సామాన్య జనం మాట్లాడుకొనే పదాలన్నీ పోగు చేసింది – కనీసం ట్వన్‌టియత్ సెంచెఈ ఇంగ్లీషు డిక్షనరీ మాదిరిది కావాలంటున్నాను. అటువంటిదివ్వాళ ఉందా? అని అడుగుతున్నాను. లేదు.

భాష సజీవమయ్యేది ఇతర భోషలతో కలిసినప్పుడేగాని ఏకంగా వుంటే కాదు అవన్నీ ఒకదానికొకటి సంబంధమున్నవే ఇవ్వాళ సంస్కృతంలో వున్న పదాలకు సమానమైన తెలుగు పదాలను మీరు ఇవ్వకపోతే మీ సంస్కృతం ఎగిరిపోతుంది. అది మాత్రం మరచిపోకండి. ఇంగ్లీషు నేర్చుకున్నవారికి చెప్తున్నాను. ఊళ్ళోకి పోతే మీ మాటలు జనం ఒప్పుకోరు – మామాటలున్నాయంటున్నారు. వారి పదాలతో సమన్వయించే మీ మాటలను వెదికి తీసుకరాండి ఇవిగో! మాకు మాండలికపదాలిన్ని వున్నయ్. ఈ పదానికాపదం సమానమని చెప్పండి. నా చిన్నతనంలో పత్రికల్లో ఆదివారం నాడు 'మాండలిక పదాలు' అని చెప్పి నాలుగు కాలాలలో పట్టికలు అచ్చయ్యేవి. అవన్నీ సేకరించాలి. నిఘంటువు విలువ ఎప్పుడుంటుందంటే మనం అర్థం తోచక, అవస్థపడిపడి తేల్చుకుందామని వెతికినప్పుడు తెలియజెస్సటంలో వుంది.

పదపరివీలన చేశారు, కరీంనగర్ జిల్లామీద. అదొక్కటే చాలదు. పాత వ్యాకరణానికీ ఇప్పటి వ్యాకరణానికీ తేడావుంది. వ్యాకరణం ఎప్పుడూ సుస్థిరంగా వుండదు. ఆ మాటంటేనేమో పండితులంతా నన్నయగారి పుస్తకం కాస్తా మింగేస్తున్నారంటున్నారు. నన్నయ్యగారి తర్వాత పదులమైళ్ళు ముందుకెళ్ళాం మనం. వీటిని సమన్వయించుకొనే భాషాతత్వవేత్త వ్యాకరణాన్ని అంతటితోనే ఆపడానికి వీల్లేదు. ఏభై సంవత్సరాల్లో కొత్తగా పదజాలం యెంతచేరింది. ఏం మార్పులు వచ్చాయ్? ఎట్లా వచ్చాయ్? ఇవన్నీ తెలుసుకోవాలి. ఎన్నివైపులు మీరు వెళ్ళినా వాక్యరచన మాత్రం ఒక్కటే వుంటుంది. । వాక్యస్వరూపం అనే చట్రం మాత్రం అట్లాగే వుంటుంది. కాకపోతే కొద్దిపాటి తేడాలుండవచ్చు. ఇవన్నీ తెలుసుకోవాలి.

దీనితో మీరు తెలుగు నిఘంటువును తయారు చెయ్యాలి. అది అన్నింటికన్నా ప్రధానమైన కార్యక్రమంగా తెలుగు అకాడమి తీసుకుంటే తప్ప ఎతలుగు బతకదు అని మాత్రం చెప్తున్నా. లేకపోతే మీ కృషే నాకంటికి కనపడదు. అది చాలా కష్టమన్నమాట. కష్టమైన పని చేసినప్పుడే విలువ వుంటుంది కాని, సులువైన పని చేసినప్పుడు ఫలితమెట్లా వస్తుంది? ఇక్కడ పని జరిగిందనే నాకు విశ్వాసముంది. బైటి వాళ్ళుకూడా పని జరిగిందనే అంటున్నారు. లోపాలుంటే సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మనందరికి వుంది. దిద్దుకుందాం. జరగవలసిన పనికి ఏ మాత్రం అడ్డం లేకుండా ముందుకు పరిగెత్తి, తప్పులన్నీ దిద్దుకుంటూనే ముందుకు వెళ్దామని ప్రయత్నిస్తే ముందుకు పోవటంతోబాటు ముందుపని కూడా చేసిన వాళ్ళమవుతాం. కాని ఉందుకు పోయినాంగనక తప్పులేమీ లేవనుకుంటే మళ్ళీ అంధకారంలో పడుతున్నామన్నమాట. సమన్వయం చేసుకుంటూ తెలుగును ముందుకు నడపాలి. అందుకు ప్రభుత్వం కూడా పూనుకుంటుందని విశ్వసిస్తాను.

కేంద్రప్రభుత్వం వారిచ్చిన కోటి రూపాయలకూ మనమేమీ నష్టం చేయలేదు. వాళ్ళ డబ్బును నిజంగా తిరిగి ఇచ్చి వేయగల స్థితిలోనే వున్నామోమోనని గూడా ఒక్కోమాటు ధైర్యం కలుగుతుంది. కేంద్రప్రభుత్వాన్ని మనం ఒకటి అడగాలి. ఇంతపనిచేశాం. పని చేసినప్పటికి మేం చేశామనిమీరెందుకు ఒప్పుకోరు? మద్రాసు పనిచేసిందంటారేమిటసలు? ఏమిటి వారు చేసింది? కొన్ని పుస్తకాలు వేశారు అమ్ముడు పోలేదు.

అవి చూపిస్తుంటారెప్పుడూ ఇన్ని పుస్తకాలు వేశామని. వాళ్ళేం చేశారంతకంటే? కాని తెలుగులోని విశేషమేమంటే ముందు పుస్తకాలు అచ్చయినయ్ దానివల్ల భాషలో మార్పు వచ్చింది.

నేను గుడివాడ సభలో చెప్పారు – ఆంధ్రా యూనివర్సిటీ కమిటీకి, తెలుగు వద్దన్న వాళ్ళెవరో తెలుసా అని విద్యార్థులను అడిగితే టీచర్సండీ అంటున్నారు. అయ్యా ఎందుకు వద్దంటున్నారంటే ప్రశ్నలు వస్తున్నాయంటారు. ఇంగ్లీష్‌లో మీరు చెప్తే ప్రశ్న అడిగిన స్టూడెంటు లేడప్పుడు. ఇంగ్లీషులో చెప్తే మీకు బాధ లేదు, వాళ్ళకూ బాధలేదు, స్టూడెంటుకు విజ్ఞానం వస్తున్నది తెలుగులో, అతనికి ప్రపంచజ్ఞానం వుంది కాబట్టి ప్రపంచ జ్ఞానం వున్నా బహిర్గతం చేయటానికి భాష లేదు. అతనికి నాతరం వాళ్ళకన్నా నేటితరం వాళ్ళకి సామాన్య విజ్ఞానం మహత్తరంగా ఉంది. అనుభవంతో చెప్పగలిగినంత భాషలేదు. వారికి అందువల్ల ఇంగ్లీష్‌లో చెప్తే భాష రాదన్నందున చెప్పవలసిన బాధ ఎవరికీ వుండదు అంటే తెలుగువల్లనే విజ్ఞానం బాగా వస్తుందన్నమాట.

నేను మనవి చేసేదేమంటే ఇవన్నీ జ్ఞాపకముంచుకోవాలి. ఇంతవరకూ చూపిన ప్రగతికి చాలా అభినందనలు. అకాడమి, తెలుగు సంస్కృతిశాఖ, మా కమీషన్ – ఈ మూడూ సమన్వితంగా నడిస్తే భాష బాగుపడుతుంది. నా సంగతి నేనాలోచిస్తే, అధికార భాషా కమీషన్‌లో అధికారముందా? లేదు భాష వుందా లేదు. ఇది కమీషనా? కాదు విడివిడిగా చూస్తే ఏదీ కాదు. మూడూ కలిస్తే మాత్రం పని జరుగుతుంది. అధికారానికి కమీషన్‌కూ మధ్యలో వున్న భాషను అమలు జరపాల్సింది అకాడమి. మీరుగనక మా నడుము నిలిపితే మేము రెండు చేతులా పని చేయగలం. అందుకోసమే – ఒకటికి పదిసార్లు చెప్తున్నా – అన్నిటికన్నా ముఖ్యంగా తెలుగు పదపారిజాతాన్ని – ఇది వరకు రాసిందాన్ని కాదు. కొత్తదాన్ని – చేపట్టమని తెలుగులో సామాన్యంగా ప్రతిగ్రామంలో వినిపించే పదాలతో నిఘంటువు తయారు చేయండి. మీరు టేపు రికార్డులు వాడ్తారో, మోనోగ్రాఫ్‌లు రాస్తారో – వివరాలు నాకక్కరలేదు. మీ కార్యక్రమం మీరు నిర్ణయించుకొండి. నాకు మాత్రం వీలయినంత త్వరలో నిఘంటువు తయారు చేసి యిచ్చే ప్రయత్నంలో వుండండి ఇంతవరకూ నానా అవస్థలుపడి తెలుగును ఒక స్థాయికి తీసుకవచ్చాం. ఇక మాత్రం బాధ్యత మీ అందరి మీదా వుంది. మేమేమో నిమిత్తమాత్రులం మీరేమో శక్తిమాత్రులు అది మరిచిపోవద్దు. అమలు పరజడానికి ప్రయత్నిస్తారా శక్తి బయలుదేరుతుంది. లేకపోతే నిమిత్తమాత్రంగా వుంటే ఆఫీసు మాత్రమే మిగుల్తుంది. నా ఆవేదిన కొంతా, ఆలోచన కొంతా, ఆక్రందన కొంతా చెప్పాను. నమస్కారం.

*(6-8-1974 వ తేదీన తెలుగు అకాడమి ఆరవ వార్షికోత్సవ సందర్భంగా, అ
ధికార భాషా కమీషన్ అధ్యక్షులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారు ప్రసంగించినారు.
ఇది దాని సంక్షిప్త రూపము – సం॥)*

"ఇప్పుడు వాడుకభాషలో పుస్తకాలూ పత్రికలూ చాలా ప్రకటిస్తూనే ఉన్నారు. సభలలో అందరూ, అధ్యక్షులు కూడా వ్యావహారిక భాషలోనే ఉపన్యసిస్తున్నారు, యథోక్తముగానే పత్రికలలో, ఆ ఉపన్యాసాలు ప్రకటిస్తున్నారు. తీర్మానములన్నీ వాడుకభాషలోని వ్రాస్తున్నారు. యూనియన్ పంచాయితీలు తాలూకా బోర్డులు జిల్లా బోర్డులు మ్యునిసిపల్ బోర్డులు మొదలయిన సంఘముల వ్యవహారము నోటనూ, కాగితముమీదనూ కూడా వాడుకభాషలోనే జరుగుతున్నది. రేపు ఆంధ్రరాష్ట్రము ఏర్పడ్డ తరవాత ప్రభుత్వ సభలోను శాసనసభలోను రాజ్యవ్యవహారము వాడుకమాటలతోనే జరుగక తప్పదు".

కీ.శే. గిడుగు వేంకట రామమూర్తి
(మిథ్యాపవాదము – 1919)

డా॥ పి.యస్.ఆర్. అప్పారావు

ప్రపంచ తెలుగు మహాసభలు - నివేదిక

(1975 ఏప్రిల్ 12 నుంచి 18 వరకు) - హైదరాబాదు

1975 ఏప్రిల్ 12వ తేదీ (ఉగాది) నుంచి 18వ తేదీ వరకు వారం రోజులపాటు హైదరాబాదులో ప్రపంచ తెలుగు మహాసభలు కనీవినీ ఊహించనంత ఘనంగా జయప్రదంగా జరిగిన విషయం అందరికీ తెలిసిందే. సదస్సులలో మహాసభలలో పాల్గొన్నవారు, సాంస్కృతిక కార్యక్రమాలను, 'తరతరాల తెలుగు జాతి' అనే సాంస్కృతిక ప్రదర్శనను తిలకించిన వారు ప్రతిరోజూ సుమారు 2 లక్షలకు పైగా ఉంటారని అంచనా.

ఈ మహాసభలను 12వ తేదీన ఉపరాష్ట్రపతి శ్రీ బి.డి. జెట్టి ప్రారంభించటం, చివరి రోజున రాష్ట్రపతి స్వయంగా విచ్చేసి స్నాతకోపన్యాసమివ్వటం, ఇంచుమించుగా ఆహ్వానింపబడిన పెద్దలందరూ విచ్చేసి ఆయా కార్యక్రమాలలో పాల్గొనటం నిజంగా మహాసభల నిర్వాహకులకు ఎంతో తృప్తిని, ఉత్సాహాన్ని కలిగించినవి. అంతేకాదు, మహాసభలకు నిండుతనం వచ్చింది. ఇప్పుడు ముందుగా వారం రోజుల కార్యక్రమాలను, తరువాత ముందు వెనుకల జరిగిన కార్యకలాపాల విశేషాలను సంక్షిప్తంగా వివరిస్తాను.

వారం రోజుల కార్యక్రమాలు

మహాసభల ప్రారంభానికి నాందిగా 12వ తేదీ ఉదయం 9 గంటలకు పతాకోత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి విచ్చేసినవారందరినీ ఉగాది పచ్చడితో ఆహ్వానించారు కార్యకర్తలు. నాగార్జున పీఠానికి వెలుపల విశాలమైన ప్రదేశంలో ముఖ్యమంత్రి, మహాసభల అధ్యక్షులు అయిన శ్రీ జలగం వెంగళరావు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. తరువాత, నాగార్జున పీఠంలో జరిగిన సభలో కేంద్రప్రభుత్వం మహాసభల సందర్భంలో విడుదలచేసిన ప్రత్యేక తపాలబిళ్ళ ఆవిష్కరించబడింది. అచ్చటినుండి ఆహ్వానితులు, అతిథులు, కార్యకర్తలు - అంతా శాతవాహన నగరానికి తరలివెళ్ళారు. అచ్చట రాష్ట్రగవర్నర్ శ్రీ యస్. ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యమంత్రి "తరతరాల తెలుగుజాతి" అనే సాంస్కృతిక ప్రదర్శనానికి ప్రారంభోత్సవం జరిపారు. రాష్ట్రమంత్రి, సాంస్కృతిక ప్రదర్శన సంఘం అధ్యక్షులు అయిన శ్రీ వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు సభాప్రారంభంలో స్వాగతం చెప్పారు.

ఆరోజు సాయంకాలం ముఖ్యమంత్రి నాయకత్వంలో, రాష్ట్రమంత్రి ఊరేగింపుసంఘం అధ్యక్షులు అయిన శ్రీ ఎల్. లక్ష్మణదాసు ఆధ్వర్యంలో ఊరేగింపు కాకతీయనగరం చేరుకోగానే 6-30 గంటలకు మంగళవాద్య పురస్సరంగా మహాసభ ప్రారంభమైంది. కుమారి టంగుటూరి సూర్యకుమారి "మా తెలుగు

తల్లికి మల్లెపూదండ" అనే గేయాన్ని గానం చేశారు. విద్యాసాంస్కృతిక మంత్రి, మహాసభల కార్యనిర్వాహకాధ్యక్షులు అయిన శ్రీ మండలి వెంకటకృష్ణారావు స్వాగతం చెప్పారు. ముఖ్యమంత్రి అధ్యక్షత వహించారు. మహాసభల ప్రారంభోత్సవానికి ప్రత్యేకంగా విచ్చేసిన భారత ఉపరాష్ట్రపతి శ్రీ బి.డి. జెట్టి తెలుగులో ప్రారంభోపన్యాసం చేశారు. ఉపరాష్ట్రపతి తెలుగులో ప్రసంగించటం అందరికీ ఎంతో ఆహ్లాదం కలిగించింది. మహాసభల సందర్భంగా ప్రచురించిన మోనోగ్రాఫ్‌లను ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమి అధ్యక్షులు డా॥ బెజవాడ గోపాలరెడ్డి, ప్రత్యేక సంచికలను (సావనీర్లను) ఉత్తరప్రదేశ్ గవర్నర్ డా॥ మర్రి చెన్నారెడ్డి ఆవిష్కరించారు. కుర్తాలం పీఠాధిపతులు శ్రీ త్రివిక్రమ రామానంద భారతీస్వామి, ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవి డా॥ విశ్వనాథ సత్యనారాయణ ఆశీస్సులు పలికారు. కేంద్ర విద్యామంత్రి ఆచార్య నూరుల్‌హసన్ మహాసభలో ప్రసంగిస్తూ మహాసభల ఆశయాలను, నిర్వహణ విధానాన్ని శ్లాఘించారు. పిమ్మట తెలుగు వెలుగులను కొందరిని ఉపరాష్ట్రపతి సన్మానించారు.

తరువాత సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభోత్సం జరిగింది. ఆర్థికమంత్రి, సమన్వయసంఘం అధ్యక్షులు అయిన శ్రీ పిడతల రంగారెడ్డి అధ్యక్షత వహించగా కేంద్రమంత్రి శ్రీ కొత్త రఘురామయ్య ప్రారంభోపన్యాసం చేశారు. రాష్ట్రమంత్రి, సాంస్కృతిక కార్యక్రమాల అధ్యక్షులు అయిన శ్రీ భాట్టం శ్రీరామమూర్తి స్వాగతం పలికారు. తరువాత ఇంచుమించుగా తెల్లవారుజామువరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినవి. రాష్ట్రమంత్రి, రవాణాసంఘం అధ్యక్షులు అయిన శ్రీ జె. చొక్కారావు కళాకారులకు ప్రశంసాపత్ర ప్రదానం చేశారు.

13వ తేదీ ఉదయం 9 గంటలకు చర్చాగోష్ఠుల ప్రారంభోత్సవం జరిగింది. అధికారభాషా సంఘం అధ్యక్షులు, చర్చాగోష్ఠుల సంఘం అధ్యక్షులు అయిన శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షత వహించగా అఖిలభారత కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ పి.వి. నరసింహారావు ప్రారంభోపన్యాసం చేశారు. ఈ ప్రారంభోత్సవ సభలోనే "అంతర్జాతీయ తెలుగు సంస్థ"ను స్థాపించవలెనని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతూ శ్రీ జె.పి.యల్.గ్విన్ ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది. తరువాత "తెలుగుభాష : నాడు, నేడు, రేపు" అనే అంశంమీద గోష్ఠి జరిగింది. ఆ మధ్యాహ్నం 2 గంటల నుండి "తెలుగు భాష"కు సంబంధించిన అంశాలపై నాలుగు గోష్ఠులు జరిగాయి – భాషా వికాసం, భాష : నేటి అవసరాలు, బోధనాభాషగా తెలుగు, అధికార భాషగా తెలుగు.

సాయంకాలం మంగళవాద్యపురస్సరంగా ప్రారంభమైన మహాసభకు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి అధ్యక్షులు శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజ్యసభ ఉపాధ్యక్షులు శ్రీ గోడే మురహరి 'తెలుగువెలుగు'లకు సన్మానం చేశారు. తరువాత తెలుగు చలనచిత్రోత్సవసభ జరిగింది. కేంద్రమంత్రి శ్రీ ఐ.కె. గుజ్రాల్ అధ్యక్షత వహించగా మహారాష్ట్ర గవర్నర్ శ్రీ అలియావర్‌జంగ్ ప్రారంభోపన్యాసం చేశారు. ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రాష్ట్రమంత్రి, చలనచిత్రోత్సవ సంఘం అధ్యక్షులు అయిన శ్రీ వి.పురుషోత్తమరెడ్డి స్వాగతం చెప్పారు. అనంతరం తెలుగు చలనచిత్ర కళాకారులచేత సాంస్కృతిక కదంబ కార్యక్రమం, తరువాత ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగినవి. రాష్ట్రమంత్రి, ఆతిథ్యసంఘం అధ్యక్షులు అయిన శ్రీ కోదాటి రాజమల్లు కళాకారులకు ప్రశంసాపత్ర ప్రదానం చేశారు.

14వ తేదీ ఉదయం చర్చాగోష్ఠి "విదేశాలలో తెలుగువారు" అనే అంశంపై జరిగింది. రాష్ట్రమంత్రి వినోదపర్యటనల సంఘం అధ్యక్షులు అయిన డా॥ సి.హెచ్ దేవానందరావు అధ్యక్షత వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి తెలుగు సాహిత్యానికి సంబంధించి నాలుగు గోష్ఠులు జరిగినవి – తెలుగు సాహిత్య వికాసం, తెలుగు సాహిత్య విలక్షణత, తెలుగులో పత్రికారచన, సాహిత్య ప్రయోజనం.

సాయంకాలం 5–30 గంటలకు మంగళవాద్య పురస్సరంగా ప్రారంభమైన మహాసభకు కేంద్రమంత్రి శ్రీ కె.వి. రఘునాథరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి తెలుగు వెలుగులకు సన్మానం చేశారు. తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగినవి. రాష్ట్రమంత్రి, హిందీ సంఘం అధ్యక్షులు అయిన శ్రీ పి. నరసారెడ్డి కళాకారులకు ప్రశంసాపత్ర ప్రదానం చేశారు.

15వ తేదీ ఉదయం "అన్య రాష్ట్రాలలో తెలుగువారు" అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. నాగపూర్ ప్రాంతీయ సంఘం అధ్యక్షులు శ్రీ యమ్.బి. నియోగి అధ్యక్షత వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి తెలుగు లోకానికి సంబంధించిన అంశాలపై నాలుగు గోష్ఠులు జరిగాయి – తెలుగు మహిళలు, తెలుగు యువకులు, తెలుగు విద్యార్థులు, తెలుగు బాలలు. రాష్ట్రమంత్రి, మహిళా సంఘం అధ్యక్షురాలు అయిన శ్రీమతి యమ్. లక్ష్మీదేవి, విద్యార్థి సంఘం అధ్యక్షులు శ్రీ ఎ. మదనమోహన్, బాలల సంఘం అధ్యక్షులు శ్రీ న్యాపతి రాఘవరావు (రేడియో అన్నయ్య) ఈ గోష్ఠులు ఏర్పాట్లలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొన్నారు.

సాయంకాలం 5–30 గంటలకు మంగళవాద్యపురస్సరంగా ప్రారంభమైన మహాసభకు కేంద్రమంత్రి శ్రీ జి. వెంకటస్వామి అధ్యక్షత వహించగా రాష్ట్రమంత్రి శ్రీ పి. బసిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసినారు. ముఖ్యమంత్రి తెలుగువెలుగులకు సన్మానం చేశారు. తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగినవి. రాష్ట్రమంత్రి, ఆరోగ్య సంఘం అధ్యక్షులు అయిన శ్రీ చల్లా సుబ్బారాయుడు కళాకారులకు ప్రశంసాపత్ర ప్రదానం చేశారు.

16వ తేదీ ఉదయం "తెలుగుతనం విశిష్టత" అనే అంశంపై చర్చా గోష్ఠి జరిగింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కార్యదర్శి, మహాసభల కోశాధికారి అయిన శ్రీ దేవులపల్లి రామానుజరావు అధ్యక్షత వహించినారు. మధ్యాహ్నం 2 గంటల నుండి చరిత్రకు సంబంధించిన నాలుగు గోష్ఠులు జరిగాయి. తెలుగు వెలుగులు, సాంఘిక జీవనం, ఆర్థిక వికాసం, స్వాతంత్ర్యోద్యమం. 4 గంటల నుండి రవీంద్రభారతిలో యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం సంస్మరణ సభ జరిగింది. కందుకూరి వీరేశలింగం రాష్ట్రస్థాయి జన్మదినోత్సవ సంఘం కార్యదర్శి శ్రీ యల్. మాలకొండయ్య స్వాగతం చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు, ఆడిటోరియం కమిటీ అధ్యక్షులు అయిన శ్రీ జె.

వీరాస్వామి అధ్యక్షత వహించగా శ్రీ వి.బి.రాజు, యమ్.పి., ముఖ్యఅతిథిగా విచ్చేసినారు. వర్ణాంతర వివాహం చేసుకొన్న నూత్న దంపతులకు అభినందనలు తెలిపారు.

సాయంకాలం 5–30 గంటలకు మంగళవాద్య పురస్సరంగా మహాసభ ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్, శ్రీ ఆర్. దశరథ రామరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసినారు. ముఖ్యమంత్రి తెలుగువెలుగులకు సన్మానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగినవి. రాష్ట్రమంత్రి, యువజన సంఘం అధ్యక్షులు అయిన శ్రీ చనుమోలు వెంకట్రావు కళాకారులకు ప్రశంసాపత్ర ప్రదానం చేశారు.

డా॥ యస్. రాధాకృష్ణన్, శ్రీ ఖండూభాయిదేశాయిగార్ల మరణం పట్ల సంతాపసూచకంగా 17వ తేదీ కార్యక్రమాలన్నీ రద్దు చేయబడినవి. ఆ సాయంకాలం కాకతీయ నగరంలో సంతాపసభ జరిగింది.

17, 18 తేదీలలో జరుగవలసిన కార్యక్రమాలన్నీ 18వ తేదీనే ఏర్పాటు అయినవి. 18వ తేదీ ఉదయం 8 గంటలకే చర్చాగోష్ఠులు ప్రారంభమైనవి. "తెలుగు – భారతీయభాషలు" అనే గోష్ఠికి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధానన్యాయమూర్తి శ్రీ గోపాలరావు ఎక్బోటే అధ్యక్షత వహించగా ఒరిస్సా గవర్నర్ శ్రీ అక్బర్ అలీఖాన్ ప్రారంభోపన్యాసం చేశారు. శ్రీ పి. నరసారెడ్డి స్వాగతం పలికారు. ఏకకాలంలో వేర్వేరు చోట్ల ఇంకా ఏడు గోష్ఠులు జరిగాయి– కళల విభాగానికి సంబంధించిన ఐదు గోష్ఠులు–నృత్య నాట్యవికాసం, శిల్పచిత్రకళాపరిణామం, సంగీత సంప్రదాయం, చలనచిత్రకళ, జానపద సాహిత్యం కళలు, వైజ్ఞానిక రంగం, సాంకేతికరంగం. తరువాత 11 గంటల నుండి డా॥ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షతలో చర్చాగోష్ఠుల ముగింపు సమావేశం జరిగింది.

మధ్యాహ్నం 2 గంటల నుండి డా॥ దివాకర్ల వెంకటావధాని అధ్యక్షతలో శ్రీ సి.వి. సుబ్బన్న శతావధాని అష్టావధాని కార్యక్రమం జరిగింది. తరువాత ఆస్థానకవి కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అధ్యక్షతలో కవిసమ్మేళనం జరిగింది.

సాయంకాలం 5 గంటలకు మంగళవాద్యపురస్సరంగా సభ ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ విధానసభలో ప్రతిపక్ష నాయకులు శ్రీవేములపల్లి శ్రీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సంఘం అధ్యక్షులు శ్రీ వీరమాచనేని వెంకటనారాయణ వేదికను అలంకరించారు. ముఖ్యమంత్రి తెలుగువెలుగులకు సన్మానం చేశారు. తరువాత స్నాతకోత్సవ సభ ముఖ్యమంత్రి అధ్యక్షతలో ప్రారంభమైంది. మహాసభలలో పాల్గొనటానికి ప్రత్యేకంగా విచ్చేసిన రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ స్నాతకోపన్యాసం చేశారు. రాష్ట్రపతి తన ఆంగ్ల ఉపన్యాసాన్ని రెండుమూడు తెలుగు వాక్యాలతో ప్రారంభించటం సమావిష్టులైన లక్షలాది ప్రజలకు ఎంతో ఆహ్లాదకారి అయింది. సతీసమేతంగా విచ్చేసిన కాశ్మీర్ ముఖ్యమంత్రి శ్రీ షేక్ అబ్దుల్లా ఈ సభలో ప్రసంగించారు. విదేశీ ప్రతినిధుల నాయకులను రాష్ట్రపతికి పరిచయం చేయటం జరిగింది. సభాప్రారంభంలో కార్యనిర్వాహకాధ్యక్షులు శ్రీ మండలి వెంకటకృష్ణారావు స్వాగతం చెప్పగా, చివర రాష్ట్రమంత్రి కాకతీయనగర సంఘం అధ్యక్షులు అయిన శ్రీ కె.వి. కేశవులు కృతజ్ఞతలు తెలియజేశారు. తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు 19వ తేదీ సూర్యోదయం వరకు కొనసాగినవి. రాష్ట్రమంత్రి శ్రీ సాగి సూర్యనారాయణరాజు, రాష్ట్రమంత్రి సావనీర్ సంఘం అధ్యక్షులు అయిన శ్రీ జి. రాజారాం కళాకారులకు ప్రశంసాపత్ర ప్రదానం చేశారు. రంగస్థలసంఘం అధ్యక్షులు శ్రీ కె.వి. గోపాలస్వామి, సమన్వయ సంఘం ఉపాధ్యక్షులు శ్రీయన్.వి.రావు మహాసభల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.

మే 11వ తేదీన మద్రాసులో జరిగిన ప్రాంతీయ సంఘం సమావేశంలో మహాసభలకు రాలేకపోయిన కొందరు తెలుగు వెలుగులకు ముఖ్యమంత్రి సన్మానం చేశారు.

మహాసభలు కాకతీయనగరంలో 18వ తేదీతో ముగిసినా, మహాసభల సాంస్కృతిక ప్రదర్శన శాతవాహన నగరంలో మే 19వ తేదీ వరకు అంటే 40 రోజులపాటు కొనసాగింది; ఇదే రోజున ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఆవుల సాంబశివరావు అధ్యక్షతలో వీడ్కోలు సమావేశం కూడా జరిగింది. ఈరోజునకూడా ముఖ్యమంత్రి మరికొందరు తెలుగువెలుగులను సన్మానించారు. సాంస్కృతిక ప్రదర్శన ప్రత్యేక సంచికను శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్య, మహాసభల సందర్భంగా గ్రంథాలయశాఖవారు ప్రచురించిన గ్రంథసూచికను ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు శ్రీ యం. ఆర్. అప్పారావు విడుదల చేశారు. ఆర్థికమంత్రి, సమన్వయసంఘం అధ్యక్షులు అయిన శ్రీ పిడతల రంగారెడ్డి మహాసభల నిర్వహణ విధానాన్ని సమీక్షించి, ముఖ్యమంత్రిని, విద్యాసాంస్కృతిక మంత్రిని అభినందించారు.

పూర్వోత్తర రంగాలలో కృషి

1. సంఘాలు : 1974 మార్చి 24వ తేదీ ఉగాది నుండి వారం రోజుల పాటు వైభవోపేతంగా జరిగిన అఖిలభారత తెలుగు సాంస్కృతిక ఉత్సవాల సమయంలో ప్రపంచ తెలుగు మహాసభలను జరుపవలెనన్న భావం బలపడింది. ఏప్రిల్ 6వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళ రావు అధ్యక్షతన ఏర్పాటు అయిన పుర ప్రముఖుల సమావేశంలో పలువురు పెద్దలు చేసిన సూచనల ఫలితంగా 1975 ఏప్రిల్ 12వ తేదీ ఉగాది నుంచి వారం రోజులపాటు హైదరాబాదులో ప్రపంచతెలుగు మహాసభలు జరుపవలెనన్న నిర్ణయం తీసుకోబడింది. ఈ మహాసభల ఆహ్వానసంఘానికి ముఖ్యమంత్రిని అధ్యక్షులుగానూ, విద్యాసాంస్కృతిక మంత్రిని కార్యనిర్వాహక అధ్యక్షులుగానూ ఎన్నుకోవటం కూడా జరిగింది. తరువాత ముఖ్యమంత్రి అధ్యక్షుడుగా ఆహ్వానసంఘాన్ని, విద్యాసాంస్కృతిక మంత్రి అధ్యక్షుడుగా కార్యనిర్వాహక సంఘాన్ని, 22 ఉపసంఘాలను, ఈ ఉపసంఘాల కార్యకలాపాల సమన్వయానికి నాటి స్పీకర్ శ్రీ పిడతల రంగారెడ్డి అధ్యక్షులుగా ఒక సమన్వయ సంఘాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పిమ్మట ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలుగువారి సహాయ సహకారాల నిమిత్తం మహాసభల అధ్యక్షులు మదరాసు, బెంగుళూరు, బొంబాయి, కలకత్తా, న్యూఢిల్లీ, నాగపూరులలో ప్రాంతీయ సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ సంఘాలు ప్రతినిధులను

ఎన్నుకొనటంలో తోడ్పడటమేకాక, ఆయా ప్రాంతాలలో ఉత్సవాలను ఏర్పాటుచేసి, ప్రత్యేక సంచికలను ప్రకటించినవి.

2. ప్రతినిధులు : ఈ మహాసభలకు 16 దేశాలనుండి 92 మంది పరిశీలకులు, ప్రతినిధులు విచ్చేసినారు. ఇందులో ఏనాడో తెలుగుదేశం నుంచి వెళ్లి ఆయా దేశాలలో స్థిరపడినవారేకాక కేవలం విదేశీయులు కూడా ఉన్నారు. విదేశాలనుంచి వచ్చిన 40 మంది ప్రతినిధులకు మాత్రమే మన రూపాయలలో రాకపోక ఖర్చులు చెల్లించటానికి భారత ప్రభుత్వం అంగీకరించింది. ఒకరు మారిషస్ నుంచి, ఇద్దరు రష్యానుంచి ఆయా ప్రభుత్వాల ఖర్చుమీదనే ప్రతినిధులుగా విచ్చేసినారు. ఏ విదేశాల నుంచి ప్రతినిధులు వచ్చినారో ఆ విదేశాల పతాకాలను మహాసభల సమయంలో కాకతీయనగరంలోను, శాతవాహన నగరంలోను ఎగరవేయటం జరిగింది. యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రతినిధి కూడా స్నాతకోత్సవ సభలో పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి 921 మంది ప్రతినిధులు, మన రాష్ట్రంలోని అన్ని జిల్లాలనుంచి 4489 మంది ప్రతినిధులు ఈ మహాసభలలో పాల్గొన్నారు. విదేశాలనుంచి వచ్చినవారికి విదేశీ పద్ధతి హోటళ్లలోనూ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి దేశీయ పద్ధతి హోటళ్లలోనూ, భోజన వసతి సౌకర్యాలు చేకూర్చబడినాయి. జిల్లాల నుంచి వచ్చిన వారికి స్థానిక పాఠశాలలోను, కళాశాలలలోను వసతి సౌకర్యం మాత్రం ఇవ్వబడింది. హోటలు ప్రొప్రయిటర్లు తమకున్న వసతిలో 25వ శాతం భోజన సౌకర్యాలతో సహా ఉచితంగా ఇవ్వటం ఒక విశేషం. మహాసభలు అయిన వెంటనే విదేశీ ప్రతినిధులను వరంగల్లు, భద్రాచలం, బెజవాడ, శ్రీకాకుళం, కూచిపూడి, అమరావతి, గుంటూరు వగైరా తీసుకొనివెళ్ళి అచ్చటి విశేషాలను సందర్శింపజేశారు కార్యనిర్వాహకాధ్యక్షులు శ్రీమండలి వెంకట కృష్ణారావుగారు. విదేశ ప్రతినిధులందరికి అన్ని జిల్లాలనుంచి తెప్పించిన మట్టి, నదీజలాల నీరు, చేనేత వస్త్రాలు, సావనీర్లు, మోనోగ్రాఫ్‌లు, బ్రీఫ్‌కేసులు, విరాళంగా వచ్చిన గ్రంథాలు, మహాసభల చిహ్నంగల నిర్మల్ ఫలకాలు బహూకరింపబడినవి.

ఆదిలో సంస్థల ప్రతినిధి రుసము రు. 25/–, పరిశీలకుని రుసుము రు. 10/– అని నిర్ణయించబడినది. తరువాత తీసుకొన్న నిర్ణయం ప్రకారం పరిశీలకుల తరగతి తీసివేసి, రు. 25/– కట్టినవారినందరినీ ప్రతినిధులుగా నమోదు చేసుకొనటం జరిగింది. ప్రతినిధులకు, పరిశీలకులకు కేంద్రప్రభుత్వం వారు రైలు కన్సెషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్‌రోడ్ రవాణా సంస్థవారు బస్ కన్సెషన్ ఇచ్చి మహాసభలకు ఎంతో తోడ్పడినారు.

3. ప్రత్యేక తపాలబిళ్ల :– కేంద్రప్రభుత్వం రైల్వే కన్సెషన్, లక్ష రూపాయల గ్రాంటు ఇవ్వడమేకాక మహాసభల సందర్భంగా ప్రత్యేకమైన తపాలబిళ్లను విడుదల చేసింది. ఇందులో 12వ శతాబ్దికి చెందిన సరస్వతీ విగ్రహంతోపాటు 'దేశభాషలందు తెలుగులెస్స', 'ఎందరో మహానుభావులు', 'పంచదారకన్న పనసతొనలకన్న కమ్మ తేనెకన్న తెలుగు మిన్న' అనే సుభాషితాలు కూడా ఉన్నాయి. ఏప్రిల్ 12వ తేదీ ఉదయం పతాకావిష్కరణ తరువాత కేంద్రమంత్రి శ్రీజగన్నాథపహాడియా అధ్యక్షతలో నాగార్జున పీఠంలో జరిగిన సభలో ఈ ప్రత్యేక తపాలబిళ్లను ముఖ్యమంత్రి విడుదల చేశారు.

4. తరతరాల తెలుగుజాతి ప్రదర్శన : శాతవాహననగరంలో జరిగిన ఈ సాంస్కృతిక ప్రదర్శన తెలుగుజాతికి దర్పణం వంటిది. 2,500 సంవత్సరాల తెలుగుజాతి చరిత్రను కళ్లకు కట్టినట్లు ఈ ప్రదర్శన చూపింది. 53 తైలవర్ణ చిత్రాలు, 247 తెలుగు వెలుగుల ఛాయాచిత్రాలు, 29 ఛార్టులు, 40 నాగార్జునకొండ చిత్రాలు, 10 దేశ పటాలు, 6 కుడ్య చిత్రాలు, 8 ప్రాచీన రాజముద్రికలు, అమరావతి స్తూప ప్రతికృతి మొదలైనవెన్నో ఈ ప్రదర్శనలో ఉన్నవి. ప్రపంచంలో జీవరాశి ప్రప్రథమంగా ఆవిర్భవించిన ప్రదేశాలలో దక్కను పీఠభూమికి ప్రముఖస్థానం ఉంది. వరంగల్ జిల్లాలో లభించిన కొన్ని కోట్ల సంవత్సరాలనాటి వృక్షకాండం ఇందుకు తార్కాణం. ఇది ఇందులో ప్రదర్శించబడటం విశేషం. సుమారు 2 లక్షల రూపాయలు విలువగల వస్తువులన్నీ ప్రదర్శనానంతరం తెలుగు భాషాసమితిలో, మహాసభల ఆఫీసు సెక్రటరీ పర్యవేక్షణక్రింద భద్రపరుపబడినవి. పబ్లిక్‌గార్డెన్స్‌లోని సరూబాగ్‌లో సాంస్కృతిక సంగ్రహాలయ నిర్మాణం పూర్తికాగానే ఈ వస్తువులన్నీ అందులోకి బదిలీచేయబడతాయి.

5. ఊరేగింపు :– జంట నగరాలలో పది చోట్ల నుంచి ఊరేగింపు ప్రారంభమై ఒకచోట కలియవలెననీ, ఊరేగింపులో కనీసం 20 టాబ్లోలు ఉండవలెననీ మొదట అనుకొనటం జరిగింది. కాని మొత్తం బడ్జెట్ సగానికి సగం తగ్గటం మూలాన టాబ్లోలు మానుకొనటం జరిగింది. మహాసంరంభంతో ఊరేగింపు 12వ తేదీ మధ్యాహ్నం ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రమంత్రులు శ్రీ ఎల్. లక్ష్మణదాసు, శ్రీ టి. అంజయ్య, శ్రీ యస్. వెంకట్రామరెడ్డి ప్రభృతుల సారథ్యంలో చార్‌మినార్ వద్ద బయలుదేరి మహాసభల ప్రారంభోత్సవ సమయానికి కాకతీయనగరం చేరుకొన్నది. మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, మహిళలు, బాలబాలికలు, యువకులు, జిల్లాలనుంచి వచ్చిన ప్రతినిధులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. మహాసభల ప్రారంభానికి ఇదిఎంతో వన్నె తేవటమేకాక ప్రజలలో ఎంతో చైతన్యం కలుగజేసింది. హెలికాప్టర్ ఆకాశంలో తిరుగుతూ ఊరేగింపుమీద పూలవర్షం కురిపించటం ఒక కమనీయ దృశ్యం.

6. తెలుగు వెలుగుల సన్మానం : మహాసభల సందర్భంగా 239 మంది తెలుగు వెలుగులు సన్మానితులైనారు. రాష్ట్రస్థాయిలోనేకాక జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో వివిధ రంగాలలో ప్రసిద్ధికెక్కిన తెలుగు పెద్దలను సన్మానించడం జరిగింది. ఇంతమంది పెద్దలను ఒక్కచోట వరుసగా చూడగలగడం నిజంగా అదృష్టం. ప్రజలు మెచ్చిన పెద్దలను, ప్రజల ప్రభుత్వం లక్షల మంది సమక్షంలో ఈవిధంగా సన్మానించడం నిజంగా ఒక అపూర్వ సంఘటన. వీరందరికీ మహాసభల చిహ్నంతో కూడిన మెమెంటోలు, శాలువలు, మోనోగ్రాఫ్‌లు, సావనీర్లు, బాపిరాజు ధర్మసంస్థవారు

ఇచ్చిన బ్రీఫ్‌కేసులు బహూకరించబడినవి.

7. మోనోగ్రాఫ్‌లు :– నాటి ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యక్షులు శ్రీ యన్. నరోత్తమరెడ్డి ఆధ్వర్యంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి అనే నాలుగు అంశాలపై 78 మోనోగ్రాఫ్‌లు ప్రచురించుటకు ఏర్పాటు జరిగింది. 67 మోనోగ్రాఫ్‌లను సాహిత్య, సంగీత నాటక, లలితకళా, సైన్సు ఆకాడమీలున్నూ, 7 మోనోగ్రాఫ్‌లను మహాసభల కార్యవర్గమున్నూ ప్రచురించినవి. ఆలస్యంగా అందిన తక్కువ మోనోగ్రాఫ్‌లు ఇంకా ముద్రణ కావలసి ఉన్నవి. ముద్రణకు కావలసిన తెల్లకాగితాన్ని అకాడమీలకు మహాసభల కార్యవర్గం ఉచితంగా ఇచ్చింది. ముద్రణ ఖర్చులు ఆకాడమీలే భరించినవి. ఆకాడమీలు మహాసభలకు ఇచ్చిన వెయ్యేసి కాపీలు ప్రతినిధులకు ఉచితంగా ఇవ్వబడినాయి.

8. ప్రత్యేక సంచికలు :– తెలుగుజాతి సమగ్ర చరిత్రను సంక్షిప్తంగా తెలియజేసే ప్రత్యేక సంచికలు (సావనీర్లు) నాలుగు–తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో ప్రచురింపబడినవి. ప్రతినిధులకు, పెద్దలకు, సంస్థలకు, గ్రంథాలయాలకు ఉచితంగా ఇవ్వబడినవి కాక తక్కినవి అమ్మకమునకు ఉన్నవి. ఇవి క్రమక్రమంగా అమ్ముడుపోగలవు.

9. సాంస్కృతిక కార్యక్రమాలు : కాకతీయ నగరంలోని శ్రీకృష్ణ దేవరాయల దర్బారులో ప్రతిరోజూ సాయంకాలం 6 గంటలు మొదలుకొని తెల్లవారుజామున 4–5 గంటల వరకు అంటే రోజూ దాదాపు పది గంటలసేపు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. రోజూ 12 నుంచి 15 చొప్పున మొత్తంమీద సుమారు 100 ప్రదర్శనలు జరిగినవి; వీటిలో రమారమి 1500 కళాకారులు పాల్గొన్నారు. వివిధ నృత్య–సంగీత–నాటకాలతోపాటు తెలుగు ప్రజల జీవితంలో అంతర్భాగంగా ఉన్న హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలు, వీథి భాగవతం, యక్షగానం, డప్పుల నృత్యం వగైరాలు ఈ ప్రదర్శనలలో చేరి ఉన్నాయి. ప్రతిరోజూ వీటిని సుమారు 2 లక్షలమంది ప్రేక్షకులు ఎంతో ఆసక్తితో తిలకించటం జరిగింది. ఈ మహాసభలవల్ల సామాన్య ప్రజలు కూడా కుమారి యామిని నృత్యం, శ్రీ ఈమని శంకరశాస్త్రి వీణావాదనం వంటి అపురూప కార్యక్రమాలను చూడటం, వినటం సంభావ్యములైనవి.

10. చర్చాగోష్ఠులు : వేలసంఖ్యలో పురుషులు అంతకంటే అధికంగా మహిళలు సదస్సులలో పాల్గొన్నారు. వివిధ రంగాలలో గణనీయమైనకృషి చేస్తున్న ఆచార్యులు, కవులు, రచయితలు, మేధావులు, కళాకారులు – దేశవిదేశాలనుంచి వచ్చినవారు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలవారు – ఎంతో ఉత్సాహంతో ఈ సదస్సులలో పాల్గొనటం ఒక విశేషం. నాగార్జున పీఠంలో రోజూ ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంకాలం 6 గంటల వరకు అంటే రోజూ 8 గంటల చొప్పున దాదాపు 40 గంటలసేపు విద్వద్గోష్ఠులు జరిగాయి. భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, వైజ్ఞానిక రంగం, సాంకేతిక రంగం మొదలైన 28 అంశాలు సమగ్రంగా చర్చించబడినవి. సుమారు 100 వ్యాసాలు సమర్పింపబడినవి. దాదాపు 1500 మంది విజ్ఞులు గోష్ఠులలో పాల్గొన్నారు. ఈ ప్రసంగ వ్యాసాలను ముద్రించి రెండు మూడు సంపుటాలుగా వెలువరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవి ముద్రణలో వేయిపుటలు ఉండవచ్చు.

11. తెలుగు చలన చిత్రోత్సవం : ఇతర రాష్ట్రాలనుండి, ఇతర దేశాల నుండి వచ్చిన ప్రతినిధులు, పరిశీలకులు తెలుగు సినీమాలను చూడటానికి ఎంతో మోజుపడతారు. అందుచేత ఏప్రిల్ 11వ తేదీనుంచి 17వ తేదీ వరకు స్కైలైన్, లిబర్టీ థియేటర్లలో మొత్తం 47 ఉత్తమ తెలుగు చిత్రాలు ప్రదర్శింపబడినవి. ప్రతినిధులు, పరిశీలకులు ఉచితంగా వీటిని తిలకించి ఎంతో ఆనందించారు.

12. సాంస్కృతిక సంవత్సరం : రాష్ట్ర ప్రభుత్వం 1975వ సంవత్సరాన్ని 'తెలుగు సాంస్కృతిక సంవత్సరం'గా ప్రకటించింది. ఆర్థికమంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రారంభోత్సవం 8–2–1975 తేదీన రవీంద్రభారతిలో జరిగింది. వివిధ ప్రాంతాల ప్రజలు సాంస్కృతిక కార్యకలాపాలలో పాలుపంచుకొనేటట్లు చేయడానికి, ప్రజలను రాబోయే ప్రపంచ తెలుగు మహాసభలకు ఉన్ముఖులుగా చేయడానికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో సాంస్కృతికోత్సవాలు, రాష్ట్ర అకాడమీల సహకారంతో, మార్చినెలలో ఏర్పాటు అయిన విషయం అందరికి తెలిసిందే. అదేవిధంగా ప్రాంతీయ సంఘాలు కూడా వివిధ రాష్ట్రాలలో సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించినవి. మహాసభలు ముగిసి, విదేశ ప్రతినిధులు రాష్ట్ర యాత్ర చేస్తూ కూచిపూడి ఏప్రిల్ 21వ తేదీన చేరినారు. ఆ రోజు మొదలుకొని మూడు రోజులపాటు కూచిపూడిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నృత్యోత్సవాలు, సిద్ధేంద్ర జయంతి ఉత్సవాలు జరిగినవి. తెలుగు సాంస్కృతిక సంవత్సరాన్ని పురస్కరించుకొని, నవంబరు 1వ తేదీ నుంచి జరిగే ప్రతి సభలోను 'వందేమాతరం' పిమ్మట 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' అనే శ్రీశంకరంబాడి సుందరాచారి గేయాన్ని పాడవలెనని ప్రభుత్వం ఆదేశించింది. ఈ పాట తెలుగువారిలో ఎంతో చైతన్యం కలిగిస్తున్నదనటంలో అతిశయోక్తిలేదు.

13. తెలుగుసినీ కళాకారుల ప్రదర్శనలు : మద్రాసులోని తెలుగు సినీ కళాకారులు మహాసభల నిధి సహాయార్థం మొత్తం 8 చోట్ల సాంస్కృతిక కదంబ ప్రదర్శనలు ఇచ్చారు. వీరు సుమారు రు. 13.76 లక్షల నికర నిధిని సమకూర్చి పెట్టడమేకాక మహాసభలను గూర్చి విశేషంగా ప్రచారం చేశారు.

ఈ సినీ కళాకారులు మహాసభల రెండవ రోజున కూడ 4 గంటల పాటు మరల ప్రదర్శనలు ఇచ్చినారు.

14. పబ్లిసిటి : మహాసభల ప్రచార విభాగం పక్షాన మహాసభల లక్ష్యాలను గూర్చి, జరుగుతున్న కృషిని గూర్చి విరివిగా వ్యాసాలు ప్రకటింపబడినాయి. 'తెలుగువాణి' అనే పేరుతో పదిరోజులకొకటి చొప్పున 8 రోనియో చేసిన సంచికలు మహాసభల సందర్భంగా తెలుగులో వెలువడినవి. రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాలలో ఉన్న పత్రికాధిపతులు, జర్నలిస్టులు మహాసభలలో పాల్గొని కార్యకర్తలకు ఎంతో చేయూత నిచ్చారు. పెక్కు పత్రికలు మహాసభల సందర్భంగా విశేష సంచికలను ప్రకటించినవి. సాంస్కృతిక సంస్థలు గ్రంథాలను ప్రచురించినవి.

15. రవాణా : రవాణా ఏర్పాట్లలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ రవాణా సంస్థ వారి సహకారాన్ని ముఖ్యంగా పేర్కొనాలి. జిల్లాలనుంచి

వచ్చిన ప్రతినిధులకు ఛార్జీలలో సగం కన్సెషన్ ఇవ్వటమేకాక వారి రాక పోకలకు విశేష సౌకర్యాలు కలిగించారు. మహాసభల సమయంలో ప్రత్యేకంగా బస్సులను నడిపి సహకరించారు. విదేశ ప్రతినిధులు, రాష్ట్రేతర ప్రతినిధులు ఈ ఏర్పాట్లను ఎంతగానో మెచ్చుకొన్నారు.

16. ఇతర ఏర్పాట్లు : మహాసంరంభంతో మహాసభలు జరిగినప్పటికీ ఎక్కడా ఎటువంటి ప్రమాదం జరుగకుండా వేయికళ్లతో పోలీసువారు జాగ్రత్తగా బందోబస్తు చేశారు. విద్యుచ్ఛక్తి అంతరాయం లేకుండా విద్యుచ్ఛక్తిశాఖవారు ఎంతో జాగ్రత్త పడినారు. మహాసభలలో పాల్గొన్నవారేకాక జంటనగరాల పౌరులంతా ఇందుకు ఎంతో సంతోషించారు. స్కౌటుశాఖవారు ప్రత్యేకంగా వందలకొలది వాలంటీర్లను ఏర్పాటు చేసి సభలు సక్రమంగా జరగటానికి తోడ్పడినారు. కాకతీయ నగరాన్ని సుందరంగా అలంకరించటానికి హేండ్లూమ్ బోర్డువారు ఎంతో సహాయం చేశారు. పి.డబ్ల్యు.డి. వారు కాకతీయనగరాన్ని తీర్చిదిద్దినారు. మునిసిపాలిటీ వారు జంటనగరాలకు పండుగశోభ కలిగించారు. నగరమంతా తోరణాలతో అలంకరింపబడింది. ఇ.సి.ఐ.యల్. వారు కాకతీయ నగరంలో వంద టెలివిజన్‌సెట్లను అమర్చి ప్రేక్షకులకు ఎంతో సదుపాయం కలుగజేవారు.

17. తెలుగుతల్లిచిత్రం : మహాసభలలో పాల్గొన్నవారు సాంస్కృతిక కార్యక్రమాలను చూశారు. విద్వద్గోష్ఠులలో పాల్గొన్నారు. ప్రదర్శనలను తిలకించారు. కాని ఇవి చూడనివారు అశేషంగా ఉన్నారు. వారందరికీ ఈ మహాసభల విశేషాలను రేఖామాత్రంగా అయినా చూపడానికి ఒక చలనచిత్రం, రంగులలోను, తెలుపు-నలుపులలోను శ్రీ పేకేటి శివరాం దర్శకత్వంలో రూపొందింపబడినవి. సెల్యులాయిడ్‌లో ఇది శాశ్వతమైన దృశ్యకావ్యంగా ఉండిపోతుంది. రంగులలో ఒక వంద 16 మి.మి. కాపీలను, ముప్పై 35. మి.మి. కాపీలను (3000 అడుగుల నిడివి గలవి) తీయించి నవంబరు 1వ తేదీన అంటే ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం రోజున రాష్ట్ర మంతటా విడుదల చేయడం జరిగింది. వీటి కాపీలను ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు కూడా పంపించే ఏర్పాట్లు జరుగగలవు. 16 మి.మి. కాపీలు కళాశాలల్లోను, పాఠశాలల్లోను, గ్రామ ప్రాంతాలలోను ప్రదర్శింపబడుతున్నాయి. 16 మి.మి. కాపీ ఖరీదు రు. 3000/-; 35 మి.మి. కాపీని ఒక వారంరోజులు ప్రదర్శించినందుకు పర్మనెంటు థియేటరు రు. 250/-, టూరింగ్ థియేటర్ రు. 100/- ఇస్తున్నవి.

18. జరుగుతున్న కృషి : మహాసభల సమయంలో వివిధ శాఖలలో పనిచేసిన సిబ్బందిని క్రమంగా తగ్గించివేసి జూలై నెల నుంచి డిసెంబరు నెల చివరివరకు నామమాత్రపు సిబ్బందితో ఆహ్వానసంఘ కార్యాలయం పనిచేసింది. కార్యాలయం రవీంద్రభారతిలో ఉండటానికి అక్టోబర్ 17వ తేదీ వరకు మాత్రమే అనుమతి ఇవ్వబడింది. అందుచేత కార్యాలయం అక్టోబరు 1వ తేదీనుంచి బర్కత్‌పురాలో ఉన్న అంతర్జాతీయ తెలుగు సంస్థ భవనంలోకి మార్చబడింది. అకౌంట్లశాఖ మాత్రం డిసెంబర్ నెల చివరివరకు కళాభవనంలోనే పనిచేసింది. అఖిల భారత పారిశ్రామిక వస్తుప్రదర్శన (1976)లో మహాసభల పక్షాన 40 రోజులపాటు ఒక చిన్న ప్రదర్శన ఏర్పాటుచేయబడింది; ఇది ప్రజలను విశేషంగా ఆకర్షించింది. ప్రస్తుతం విజయవాడలో జరుగుతున్న పారిశ్రామిక వ్యావసాయిక ప్రదర్శనలోకూడా మహాసభల ప్రదర్శన ఏర్పాటయింది. సినీ కళాకారుల ప్రదర్శనలకు, స్టిక్కర్లకు, డొనేషన్ కూపన్లకు సంబంధించి జిల్లాలనుంచి వసూళ్లు దాదాపు పూర్తి అయినవి. ప్రత్యేక సంచికలు క్రమక్రమంగా అమ్ముడు పోతున్నవి. నవంబరు 1వ తేదీనుంచి 'తెలుగుతల్లి' సినిమా కాపీలకు సంబంధించిన వసూళ్లు జరుగుతున్నవి. ఈ వసూళ్లకు ఇంకా చాలాకాలం పడుతుంది. మహాసభలకు సంబంధించిన నివేదిక రచన ఆంగ్లభాషలో పూర్తిఅయింది. ఇంక ముద్రణ కావలసిఉంది. సదస్సులలో చదువబడిన వ్యాసాలను సవరించిన పిమ్మట ముద్రణ చేపట్టవలసి ఉన్నది. నివేదికను, ఈ వ్యాసాలను ముద్రించటానికి కావలసిన పేపరు సిద్ధంగానే ఉంది.

మహాసభల ఆహ్వానసంఘ సమావేశం 1975 డిసెంబర్ 26 తేదీన జరిగింది. అందులో తీసుకొన్న నిర్ణయం ప్రకారం ఆహ్వానసంఘ కార్యాలయాన్ని డిసెంబర్ నెల చివరకు ముగింపుచేసి, మిగిలిఉన్న పనిని, మహా సభల ఫలితంగా ఏర్పడిన అంతర్జాతీయ తెలుగు సంస్థకు అప్పగించటం జరిగింది. (ఆహ్వానసంఘం నిర్ణయాలు ఈ నివేదికతో జతపర్చబడినవి-అనుబంధం-I) ఈ బాధ్యతలను స్వీకరించటానికి ఆ సంస్థ అంగీకరించింది.

ఆదాయ - వ్యయాలు

ఆడిట్ చేయబడిన ఆదాయవ్యయ పట్టికలను మహాసభల ఆహ్వానసంఘం 1975 డిసెంబర్ 26వ తేదీన ఆమోదించింది (మహాసభల ఆదాయ వ్యయాలు స్థూలంగా పట్టికరూపంలో ఈ నివేదికకు జతపర్చబడినవి-అనుబంధం-II). ప్రారంభంలో మొత్తం ఖర్చు రు. 64 లక్షలు కాగలదని అంచనా వేయబడినా తరువాత దానిని. రు. 31 లక్షలకు తగ్గించటమైనది. కాని మొత్తం అయిన ఖర్చు సుమారు రు. 40 లక్షలు.

ఆదాయం : రాష్ట్రప్రభుత్వం వారు రు. 10 లక్షలు, కేంద్రప్రభుత్వం వారు రు. ఒకలక్ష గ్రాంటుగా ఇచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు రు. ఒక లక్ష, సిరిపూర్ పేపర్ మిల్స్ వారు రు. 80 వేలు, ఆంధ్ర పేపర్ మిల్స్ వారు సుమారు రు. 90 వేలు విలువచేసే ప్రింటింగ్ పేపరు విరాళంగా ఇచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన గ్రాంటులుకాక విరాళంగా వచ్చిన మొత్తం రు. 5.52 లక్షలు. సినీ కళాకారుల ప్రదర్శనల వల్ల సుమారు రు. 16.76లక్షలు వసూలు అయినవి. ఇందులో రు. 3 లక్షలు, ఒప్పందం ప్రకారం సినీకళాకారులు ఏర్పాటుచేసుకొన్న వృద్ధకళాకారుల నిధికి విరాళంగా ఇచ్చివేయటం జరిగింది. అంటే ఈ ప్రదర్శనలవల్ల మహాసభకు నికరంగా వచ్చిన మొత్తం సుమారు 13.76 లక్షలు. ప్రకటనల వల్ల రు. 2.74 లక్షలు వసూలు అయినవి. స్టిక్కర్లవల్ల సుమారు రు. 2.88 లక్షలు వసూలు అయినవి. ప్రతినిధుల రుసుము సుమారు రు. 1.37 లక్షల వసూలు అయినవి. స్టిక్కర్ల వసూలులో 25% విద్యార్థుల సంక్షేమ నిధికి, 15% ఉపాధ్యాయుల సంక్షేమ నిధికి ఆయా సంస్థలవారు మినహాయించుకోవచ్చు. అట్లాగే డొనేషన్ కూపన్ల వసూళ్లలో 40% ప్రభుత్వం నియమించిన ఆయా జిల్లా సాంస్కృతిక

సంఘాలవారు తమ కార్యకలాపాల నిమిత్తం మినహాయించుకోవచ్చు.

సాంస్కృతిక సంగ్రహాలయం నిమిత్తం జంటనగరాల పౌరులు వసూలుచేసి యిచ్చిన సొమ్ము వేరే అకౌంటుగా ఉంది; అది పై మొత్తంలో చేరలేదు. ఇప్పటికి వారు ఇచ్చిన మొత్తం సుమారు 4.36 లక్షలు. ఇంకో రు. 64 వేలు వసూలు చేసి రు. 5 లక్షలు పూర్తి చేయడానికి మ్యూజియం కమిటీ కన్వీనరు శ్రీ టోకర్సీలాల్జీ కపాడియా వాగ్దానం చేశారు. ఈ సొమ్ము అంతా పి.డబ్ల్యు.డి. వారికి, ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి అందజేయబడుతుంది.

వ్యయం : వ్యయానికి సంబంధించిన వివరాలు దీనికి జతపర్చిన పట్టికలో ఉన్నవి. వ్యయం విషయంలో ఒక అంశం వివరించవలసి ఉన్నది. 'తెలుగుతల్లి' చిత్రం 16 మి.మి. వంద కాపీలకు సుమారు రు. 2.51 లక్షలు, 35 మి.మి. ముప్పై కాపీలకు సుమారు రు. 1.41 లక్షలు మొత్తం రు. 3.92 లక్షలు ఖర్చు అయింది. ఈ సొమ్ము తిరిగి వస్తుంది. ఆహ్వాన సంఘ కార్యాలయం నిమిత్తం రు. 23 వేలు విలువగల ఫర్నిచర్, రు. 35 వేల విలువ గల రోనియో మిషన్, ఎలక్ట్రానిక్ స్టెన్సిల్ కట్టర్ మిషన్ కూడా కొనటం జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనకు సంబంధించిన సుమారు రు. 2 లక్షలు విలువచేసే వస్తువులు భద్రంగా ఉన్నాయి. సుమారు రు. 26 వేలు విలువగల ప్రింటింగ్ పేపరు నిలువ ఉన్నది. ప్రత్యేక సంచికల అమ్మకం వల్ల సుమారు రు. 75 వేలు రాగలవని అంచనా. వీటిని అన్నింటిని ఆస్తిగా పరిగణించవలసి ఉంటుంది. ఆస్తిగా పరిగణించవలసిన ఈ ఆరు అంశాల విలువ మొత్తం సుమారు ఏడున్నర లక్షలు; ఇది మినహాయిస్తే మహాసభలకు అయిన నికర ఖర్చు సుమారు రు. 32.50 లక్షలు మాత్రమే.

ఫలితాలు

1. సమైక్యతా సద్భావాల పెంపుదల : ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తెలుగువారిలోనే కాక ప్రపంచమంతటా వ్యాపించి ఉన్న సుమారు ఆరుకోట్ల తెలుగువారిలో భావసమైక్యత సాధించటం ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించటంలోని ప్రధాన ఉద్దేశం. ఆ ఉద్దేశం సంపూర్ణంగా నెరవేరిందనటంలో ఎటువంటి సందేహం లేదు. మహాసభల ద్వారా ప్రపంచమంతటా వ్యాపించిన ఉన్న తెలుగువారు బాగా సన్నిహితులైనారు. వారిలో సదవగాహన మరింతగా పెంపొందింది. ఇది మహాసభల తొలి ఫలితం.

భావ సమైక్యతకు ఉత్తమ సాధనంగా ఈ మహాసభలు వైభవోపేతంగా జరగటం చూసిన మలేషియా ప్రతినిధులు ఉత్తేజితులై రెండవ ప్రపంచ తెలుగు మహాసభలను 1977లో కౌలాలంపూర్‌లో జరుపగలమని ప్రకటించటం తెలుగువారందరికీ ఎంతో సంతృప్తి కలిగిస్తున్నది.

2. విద్యాశాఖలో ప్రత్యేక విభాగం : సాంస్కృతికంగా, విద్యా విషయికంగా ఈ సన్నిహిత సంబంధాన్ని సుస్థిరం చేసుకోవాలని దేశ విదేశాలలోని తెలుగువారంతా ఆకాంక్షిస్తున్నారు. వారి ఆకాంక్షను గుర్తించిన రాష్ట్రప్రభుత్వం ఇందునిమిత్తం విద్యాశాఖలో ఒక ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పింది. ఇందుమూలంగా విదేశాలలోని, ఇతర రాష్ట్రాలలోని తెలుగువారి సంస్కృతీ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సహాయం లభిస్తుంది. ఈ సంవత్సరం ఇతర రాష్ట్రాలలోని తెలుగు సంస్థలకు పదిలక్షల రూపాయలకు పైగా ఆర్థిక సహాయం అందజేయబడగలదు. ఇది మహాసభల రెండవ ఫలితం.

3. అంతర్జాతీయ తెలుగు సంస్థ : ప్రపంచమంతటా వ్యాపించి ఉన్న తెలుగువారిలో సాంస్కృతిక విద్యావిషయిక సంబంధాలను పెంపొందించటానికి ఒక ప్రత్యేక సంస్థను నెలకొల్పవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ సదస్సుల ప్రారంభ సభలో ఒక తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడింది. దీనిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ తెలుగు సంస్థను నెలకొల్పింది. దీనికి సెప్టెంబర్ 8వ తేదీన రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభోత్సవం చేశారు. దీని ప్రధానాశయాలు – ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో ఉన్న తెలుగువారితో సాంస్కృతిక విద్యా విషయిక సంబంధాలను పెంపొందిచటం, తెలుగు భాషాధ్యయనానికి తెలుగులో పరిశోధనలకు జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాతి లభింపచేయటం. ఈ సంస్థ ఆవిర్భావం మహాసభల మూడవ ఫలితం.

4. తెలుగు సంస్కృతి సంగ్రహాలయం : శాతవాహన నగరంలో 40 రోజులపాటు జరిగిన 'తరతరాల తెలుగుజాతి' అనే సాంస్కృతిక ప్రదర్శనాన్ని సుస్థిరం చేయాలనే సంకల్పంతో రెవెన్యూమంత్రి శ్రీ పి. నరసారెడ్డి అధ్యక్షతలో ఒక సంఘంగా ఏర్పడిన జంటనగరాల పౌరులు సుమారు రు. 5 లక్షలు వసూలు చేయడానికి అంగీకరించారు. ఇంకొక రు. 15 లక్షలు గ్రాంటుగా ఇచ్చి, మొత్తం రు. 20 లక్షల ఖర్చుతో సాంస్కృతిక సంగ్రహాలయాన్ని నిర్మించటానికి ప్రభుత్వం అంగీకరించి ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబరు 13 వ తేదీన పబ్లిక్‌గార్డెన్స్‌లోని సరూబాగ్‌లో ఈ సంగ్రహాలయ నిర్మాణానికి రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ శంకుస్థాపన చేశారు. ఇది మహాసభల నాలుగవ ఫలితం.

పి.యస్.ఆర్. అప్పారావు
ప్రధానకార్యదర్శి

అనుబంధం -I

ఆహ్వాన సంఘం తీర్మానాలు

26-12-1975 తేదీ సాయంకాలం 6 గంటలకు రవీంద్రభారతి మొదటి అంతస్తులో ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారి అధ్యక్షతన జరిగిన ఆహ్వానసంఘం ద్వితీయ సమావేశం వివరాలు :

చర్చలు, తీర్మానాలు :

1. సభాప్రారంభంలో కోశాధికారి శ్రీదేవులపల్లి రామానుజరావు ఆ రోజు ఉదయం సంగీత నాటక అకాదమి హాలులో ఆర్థిక సంఘం అధ్యక్షులు, ఆర్థికశాఖామాత్యులు అయిన శ్రీ పిడతల రంగారెడ్డిగారి అధ్యక్షతన జరిగిన ఆర్థిక సంఘ సమావేశం వివరాలను, తీర్మానాలను ఆ సాయంకాలం రవీంద్రభారతి మొదటి అంతస్తులో కార్యనిర్వాహకాధ్యక్షులు, విద్యాసాంస్కృతిక మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి అధ్యక్షతన జరిగిన కార్యనిర్వాహక సంఘ సమావేశంలో ఆడిట్ చేయబడిన అకౌంట్స్ ఆమోదించబడిన విషయాన్ని వివరించినారు. చర్చలు, విషయ వివరణ అయిన తరువాత ఆర్థిక సంఘం తీర్మానాలు, ఆడిట్ చేయబడిన అకౌంట్స్ ఆమోదించబడినవి. శ్రీ యస్. జైపాల్‌రెడ్డి, ఎమ్.ఎల్.ఏ. గారు మాత్రం అకౌంట్స్ తనకు అప్పుడే అందినవనీ, అందుచేత వాటిని గూర్చి 'అవును-కాదు' అని చెప్పేస్థితిలో లేననీ, ఆ విషయం నోట్ చేయవలసినదిగా ఆదేశించినారు.
2. తరువాత శ్రీ మామిడిపూడి ఆనందం కార్యవర్గం ఆమోదించిన తీర్మానాన్ని అనుసరించి ఈ క్రిందివిధంగా తీర్మానం ప్రవేశపెట్టినారు –

   "హైదరాబాదులో 1975 ఏప్రిల్ 12వ తేదీనుంచి వారం రోజులపాటు ప్రపంచ తెలుగు మహాసభలు జయప్రదంగా జరిగి, తలపెట్టిన కార్యక్రమం పూర్తి అయినందున మహాసభల వివిధ సంఘాలను రద్దుచేసి, ఆహ్వానసంఘ కార్యాలయాన్ని 1975 డిసెంబర్ 31వ తేదీతో ముగింపు చేసి, మిగిలి ఉన్న పనిని, మహాసభల ఆస్తిపాస్తులను, సర్వహక్కుభుక్తాలను, అందులో పనిచేస్తున్న సిబ్బంది అంటే ముగ్గురు టైపిస్టులు, నలుగురు అటెండర్లత సహా–మహాసభల ఆశయ సాధన కోసం నెలకొల్పబడిన అంతర్జాతీయ తెలుగు సంస్థకు బదిలీ చేయుటకు, ఇందుకు అంగీకరించవలసిందిగా అంతర్జాతీయ తెలుగు సంస్థను కోరుటకు ఇందుమూలంగా తీర్మానించడమయింది'".

   ఈ తీర్మానాన్ని శ్రీ బి. కృష్ణంరాజు బలపర్చినారు. ఇంకా మిగిలి ఉన్న పనిని పూర్తి జేసి, ఫైల్స్ అప్పగించేవరకు ఒక టైపిస్ట్‌ను, ఒక అటెండర్‌ను 15 రోజులపాటు తనవద్ద పనిచేయుటకు అంగీకరించవలెనని కోశాధికారి కోరిన కోరికను అధ్యక్షుల వారు అంగీకరించినారు.

   తరువాత పై తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది.
3. అటు తరువాత శ్రీ మామిడిపూడి ఆనందం ఇంకో తీర్మానాన్ని క్రిందివిధంగా ప్రవేశపెట్టినారు.

   "1975వ సంవత్సరం ఉగాది నుంచి వారంరోజుల పాటు జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు 2,500 సంవత్సరాల తెలుగువారి చరిత్రలో మరపురాని మహోజ్జ్వల ఘట్టం. ఈ మహాసభల విజయానికి కారకులైన ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు గారిని, ఆర్థికమంత్రి శ్రీ పిడతల రంగారెడ్డిగారిని, విద్యాసాంస్కృతిక మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారిని, వారి మంత్రివర్గ సహచరులను, అధికారులను, వక్తలను, కళాకారులను, సినీ కళాకారులను, కార్యకర్తలను, ఇంకా అనేక విధాలుగా సహాయపడిన సహృదయులందరిని అభినందిస్తూ ఇందుమూలంగా తీర్మానించడమైనది".

   ఈ తీర్మానాన్ని బలపరుస్తూ శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారు ఇట్లా ప్రసంగించారు –

   "ఈ తీర్మానాన్ని బలపర్చటానికి నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఇది నిజంగా తెలుగువారి చరిత్రలో గర్వకారణమైన ఘట్టం. ఇది తెలుగుదేశంలో ఒక నవచైతన్యానికి, సమైక్యతకు కారణమైంది. ఇంతటి మహత్కార్యానికి పూనుకొన్న ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావుగారిని, సాధించిన శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారిని, కార్యకర్తలందరినీ హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను".

   హర్షధ్వానాల మధ్య ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

తరువాత కార్య నిర్వాహకాధ్యక్షులు శ్రీమండలి వెంకట కృష్ణారావుగారు ఇట్లా ప్రసంగించినారు –

"ప్రపంచ తెలుగు మహాసభల విజయం ఏ ఒక్కరిదీ కాదు; అది అందరిదీని. మహాసభలు తెలుగుదేశంలో నవచైతన్యానికి, సమైక్యతకు కారణమైనవని శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు పేర్కొన్నందుకు చాలా సంతోషం. వారం రోజులపాటు ఏ విధమైన అరమరికలు లేకుండా ప్రపంచంలోని తెలుగువారంతా కలిసి మెలసి తిరగటం ఒక అపూర్వ విషయం అనటంలో సందేహం లేదు. నిజంగా తెలుగువారిలో ఒక క్రొత్త ఉత్సాహం వెల్లివిరుస్తున్నది. దేశ విదేశాలలో ఉన్న తెలుగువారు మహా సభల సమయంలో చేసిన సూచనలను పరిశీలించి, అమలుపర్చటం కోసమే ప్రభుత్వంలో విద్యాశాఖలో ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయటం, అంతర్జాతీయ తెలుగు సంస్థను నెలకొల్పటం జరిగింది. ఇతర రాష్ట్రాలలో, విదేశాలలో ఉన్న తెలుగువారిలో కూడా మహాసభల ప్రభావం బాగా పడింది. ఉదాహరణకు శ్రీలంకలో ఉన్న తెలుగువారంతా

కలిసి ఒక తెలుగు సంఘాన్ని ఏర్పరచుకొని, తమ వ్యక్తిత్వం కోసం కృషి చేస్తున్నారు. ఇట్లాగే ఇతర దేశాలలో, ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలుగు వారు తమ సంస్కృతిని భాషను పరిరక్షించుకోవాలని తహతహ పడుతున్నారు. వీరందరికి చేయూత నివ్వటం మనందరి ధర్మం".

పిమ్మట అధ్యక్షులు, శ్రీ వెంగళరావుగారు ఇట్లా ప్రసంగించినారు –

"మహాసభల ఆస్తిపాస్తులు వగైరాలు అంతర్జాతీయ తెలుగు సంస్థకు బదిలీ చేయవలెనని ఏకగ్రీవంగా తీర్మానించినందుకు సంతోషంగా ఉంది. సహృదయులయిన వారందరి సహకారంతో ఒక మంచిపని చేశాం. ప్రతివారూ తమ సొంత పనిగా భావించి కృషి చేశారు. అందుచేత ఏవైనా చిన్నచిన్న లోపాలు ఉంటే వాటిని మర్చిపోయి, మంచినే స్వీకరించవలసిందిగా నేను అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. మహాసభల ప్రభావం మన రాష్ట్రంలో మారుమూలలకు కూడా ప్రాకింది. దేశంలో తెలుగు భాషకూ, తెలుగువారికీ మంచి గుర్తింపు వచ్చింది. ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో ఉన్న తెలుగువారు మన సంస్కృతిని, భాషను మర్చి పోకుండా మనం ఆర్థికంగా కూడా సహాయం చెయ్యాలి. ఇందుకు ఒక ప్రణాళిక రూపొందిస్తున్నాం. అయ్యే ఖర్చును మూడు భాగాలు చేసి ఒక భాగం ప్రభుత్వం భరిస్తుంది; ఒక భాగం భరించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం వారు ముందుకు వచ్చారు. ఇంక తక్కిన భాగాన్ని ఆయాచోట్ల ఉన్న తెలుగువారు భరించవలసి ఉంటుంది. మహాసభలు జయప్రదమైనంత మాత్రాన మన బాధ్యత అయిపోలేదు. దేశ విదేశాలలో ఉన్న తెలుగు వారితో విద్యా విషయకంగా, సాంస్కృతికంగా సన్నిహిత సంబంధాలు నిరంతరం నెలకొల్పుకుంటూ ఉన్నప్పుడే మనం బాధ్యతతో వ్యవహరించినట్లు అవుతుంది. ఈ కార్యక్రమాలను అంతర్జాతీయ తెలుగు సంస్థ నిర్వహిస్తుంది".

తరువాత ప్రధాన కార్యదర్శి వందన సమర్పణతో సమావేశం పూర్తి అయింది.

కడలి అంచులు దాటి కదిలింది తెలుగు
ఎదల లోతులు మీటి ఎగిసింది తెలుగు
ఇటు మలేషియ నుంచి అటు అమెరికా వరకు
పలుదిశల గొంతుకల పలికింది తెలుగు
పెనుయెడారులలోన ఇనుప దారులలోన
పలుకు పలుకున జీవమొలికింది తెలుగు.
ఎక్కడున్నా ఎన్ని చిక్కులున్నా సరే
తలయెత్తి నిలువుమని తెలిపింది తెలుగు
ఏ భాష చెణుకైన ఏ యాస చినుకైన
తనలోన కలుపుకుని తరలింది తెలుగు

ఒదిగొదిగి పోతన్న ఒరవళ్లలో సాగి
హుమ్మంటు వేమనగ ఉరిమింది తెలుగు
అభినయానికి హృదయ మర్పించుకొని కూచి
పూడియే నాడిగా ఆడింది తెలుగు
సంగీతమే జీవసంపుటిగ త్యాగయ్య
ప్రతిపదంలో కరిగి పాడింది తెలుగు
పల్లె పాటలలో ప్రబంధ వాటికలలో
కలికి ఒయ్యారాలు చిలికింది తెలుగు
స్వాతంత్ర్య సమరాన స్వచ్ఛందగతులీన
ఉగ్రనేత్రం తెరిచి ఉరికింది తెలుగు
శాంతికి కపోతమై క్రాంతి జలపాతమై
నిత్యవర్ధిష్ణువై నిలిచింది తెలుగు

– డా॥ సి. నారాయణరెడ్డి

ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్

తెలుగు జాతి పురాప్రాభవం

"చరిత్రకందని కాలం నుండి మన దేశ చరిత్ర, సంస్కృతులను రూపొందించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రముఖ పాత్ర వహించింది. ఉత్తర, దక్షిణ ప్రాంతాల నాభి స్థానంలో ఉన్న మీరు ఆటు ఆర్యుల సంస్కృతి, ఇటు ద్రావిడుల సంస్కృతులలోని ఉత్తమ సంప్రదాయాలను సమ్మిళితం చేసుకున్నారు. నిజానికి మీరు గర్వించదగిన అపూర్వమైన మీ గత చరిత్రను గూర్చి నేను వివరించి చెప్పాల్సిన అవసరం లేదు. కృష్ణా, గోదావరి, తుంగభద్ర, మూసీ, మంజీరావంటి మహానదుల తీర ప్రాంతాలలో అనేక సామ్రాజ్యాలు ఉద్భవించి, అంతరించాయి. వాటిలో శాలివాహనులు, చాళుక్యులు, కాకతీయులు, విజయనగరరాజులు, కుతుబ్‌సాహీలు, అసఫ్‌జాహీ వంశపు రాజ్యాలు మీ ప్రజల లలిత కళలు, శిల్పకళలు, భాష, సాహిత్యం, సాంస్కృతిక జీవితాలను ప్రభావితం చేసి, చెరగని ముద్రవేశాయి. అనేక మతాలు ఇక్కడ వర్థిల్లినాయి. రాష్ట్రం అంతటా ఉన్న అందమైన కోటలు, దేవాలయాలు, మసీదులు, చైత్యాలు, విహారాలు, గురుద్వారాలు, చర్చీలు మీ మత సహనాన్నీ, సమ్యక్ దృష్టినీ అద్దంపట్టి చూపుతాయి. మీ రాజధానీ నగరమైన హైదరాబాదు వైభవోపేతమైన మీ సంప్రదాయాలకు దర్పణంగా నిలుస్తుంది. వివిధ భాషలవారు, విశ్వాసాలవారు వివిధ సంప్రదాయాలుగలవారు ఇక్కడ సమైక్యతతో ప్రశాంత జీవితం గడుపుతున్నారు. సుదూర ప్రాంతాలకు మీ సంస్కృతిని విస్తరింపజేయడంలోనేగాక ప్రజలు సంతృప్తితో సౌభాగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి అనువైన పరిపాలనా విధానాలను రూపొందించడంలో కూడా చరిత్రాత్మకమైన సమయాలలో మీరు చిరస్మరణీయమైన మహోన్నత పాత్ర వహించారు. దేశంలోని యీ ప్రాంతంలో వివిధ మతాలు, భాషలుగల ప్రజలు సమైక్యతతో జీవించడానికి సంప్రదాయ, సంస్కృతుల సమ్మేళనం ఎంతగానో దోహదం చేసింది.

సాంఘిక న్యాయం

ఆధునిక యుగంలో కూడ మీ సంఘ సంస్కర్తలు, మత ప్రముఖులు తమ రచనలద్వారా, ప్రబోధాలద్వారా సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా నిరంతరం ఉద్యమాలను నిర్వహించి అన్ని మతాల ప్రజల సాంఘిక న్యాయానికి మౌలికమైన సమైక్యతనుగూర్చి నొక్కి చెప్పారు. చరిత్రాతమకమైన స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రులు గౌరవప్రదమైన ప్రత్యేకమైన పాత్ర నిర్వహించి, గమనార్హమైన త్యాగాలు చేశారు. గర్వకారణమైన ఈ చరిత్ర అంతా మీ భాషలోను, సాహిత్యంలోను, లలితకళలలోను ప్రస్ఫుటమైంది. సాంఘిక న్యాయం, కళాత్మకదృష్టిని సమ్మిళితపరచి వివిధ రూపాలలో ప్రబోధించడానికి వీలుగా మరింత పటిష్ఠం చేసే బాధ్యత తెలుగుభాష, సాహిత్య ప్రియులపై ఉంది.

మహోన్నతమైన మీ సంస్కృతికి, వారసత్వానికి మీరు గర్వపడడం సహజమే ఐనప్పటికీ మీ సాహిత్యం, సంస్కృతి చైతన్య స్రవంతిగా ప్రవహించడానికి మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త పద్ధతులను కొత్త రూపాలను సంతరించుకోవాల్సిన అవసరం. ఉంది. సాహిత్యం చాలా శక్తివంతమైన సాధనం. అది మన గతకాలవైభవాన్ని చాటిచెప్పడమే కాకుండా ప్రస్తుత కాలపు ఆశలను ఆశయాలను కూడా ప్రతిబింబింప చేయాలి. మౌలికంగా ప్రపంచమంతటా ప్రజల భావోద్రేకాలు ఒకేవిధంగా ఉంటాయి. భాషద్వారా సమగ్ర మానవత్వాన్ని చదవరులకు చవిచూపేది సాహిత్యం ఒక్కటే. అందువల్ల మీ గత వైభవానికి మీరు ఎంత గర్వపడినప్పటికీ, అన్ని ప్రాంతాల నుండి, అన్ని వైపుల నుండి వచ్చే వినూత్న భావాలను స్వీంకరించడానికి సిద్ధంగా ఉండాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. విశాల దృకపథం ఉన్నప్పుడే భాష అభివృద్ధి చెందుతుంది. చలనం ఉన్నప్పుడే పటిష్టత కలుగుతుంది. దానిని గ్రహించి యిముడ్చుకునే శక్తి ఉంటే అది మరింత వికసిస్తుంది.

కొత్త జాగృతి

విశాలమైన భారతదేశంలో అనేక వైవిధ్యాలు, జాతులు, మతాలు, కులాలు, వర్ణాలు ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే అవి మన అభివృద్ధికి ప్రతిబంధకాలు కాకూడదు. అంతేగాక అవి మన సమైక్యతను పటిష్టం చేయాలి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాష, సాహిత్యం, లలిత కళలు కొత్తజీవం పోసుకున్నాయి. వాటిలో కొత్త జాగృతి వచ్చింది. అన్ని భాషలు వాటి మార్గంలో అవి వికాసం చెందడానికి ప్రభుత్వం అన్నివిధాల ప్రోత్సహిస్తున్నది.

మన దేశంలోని ప్రముఖ భాషలలో తెలుగు ఒకటి. తెలుగువారు అనేక రాష్ట్రాలలోను, దేశాలలోను వ్యాపించి ఉన్నారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలో లక్షలాది తెలుగువారు నివసిస్తున్నారు. వారంతా ఆ యా రాష్ట్ర ప్రజలలో కలిసిమెలిసి జీవిస్తున్నారని తెలిసి నాకు చాలా సంతోషం కలిగింది. ప్రశాంత పరిస్థితులలోనే భాష, సాహిత్యం అభివృద్ధి చెందగలుగుతాయి.

నేడు మనం శాస్త్ర విజ్ఞాన యుగంలో ఉంటున్నాము. కమ్యూనికేషన్స్ రంగంలో కొత్తకొత్త సాధనాలు రావడంతో దేశాలమధ్య దూరాలు తగ్గిపోయాయి. మానవాళి పరస్పరం సన్నిహితులవుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో ఏ భాష, ఏ దేశం అందరికీ దూరంగా ఉండలేదు. మన భాషలు శాస్త్ర విజ్ఞాన పురోభివృద్ధిని మారుమూల గ్రామాలకు విస్తరింపజేయాలి. కేవలం భావ ప్రకటనకు, కవిత్వానికి పరిమితమైఉండి, సంతృప్తి చెందలేవు. సాంఘిక చైతన్యం, స్తబ్ధతగా ఉన్న జాతిని అభ్యుదయగామిగా మార్చడానికి శకిత్వంతమైన సాధనాలుగా రూపొందాలి. ఇలా చేయడానికి మన భాషలలో కొన్ని మార్పులు రావాల్సి ఉన్నాయి. అవి కొత్తకొత్త పదాలను స్వీకరించాలి. భావ ప్రకటనలతో వినూత్నపద్ధతులను, కొత్త మార్గాలను పెంపొందించుకోవాలి. సాహిత్యం యొక్క ప్రయోజనం వినోదం కలిగించడం, పునరుజ్జీవింప చేయడమేగాక ప్రజలలో మహోన్నత భావాలను రేకెత్తింపజేయాలి. నేడు రచయితలు ప్రముఖపాత్ర నిర్వహించాల్సి ఉంది. ఎందుకంటే వారు తమ రచనల ద్వారా ప్రజల ఆలోచనా సరళిని తీర్చిదిద్దడమే గాక జాతి భవిష్యత్తును నిర్దేశించగలుగుతారు. తమ ప్రయోజనాత్మకమైన రచనల ద్వారా ప్రజల వద్దకు వెళ్లి వారి జీవన విధానాలను మెరుగుపరచే ప్రయత్నాలలో వారినే క్రియాత్మక భాగస్వాములుగా చేయడమే మన ప్రధాన బాధ్యత అని నేను భావిస్తున్నాను.

దేశం నేడు గడ్డు పరిస్థితులలో ఉంది. ఇంటా, బయటా అనేక సవాళ్లను ఎదుర్కొన్నది. విచ్ఛిన్నకర శక్తులను ఎదుర్కొంటున్నది. ఈ విచ్ఛిన్నకర శక్తులను ఎదుర్కొని, ప్రజలలో జాతీయ సమైక్యతాభావన్ని పెంపొందించాలి.వ ఇజ్ఞాన ఖనులైన మీరు మనం కలలుకన్న భారతదేశాన్ని నిర్మించడంలో మీ పాత్ర మీరు వహిస్తారని నా విశ్వాసం. మీరు ఎక్కడ ఉన్నా మీ పురోగతి, సమృద్ధి, జాతి అభివృద్ధితో ముడిపడి ఉందనే విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి".

(ప్రపంచ తెలుగు మహాసభలలో 1975 ఏప్రిల్ 18న రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ చేసిన ప్రసంగం)

జలగం వెంగళరావు

తెలుగు జాతి వైభవం

ఏటేటా ఉగాది వస్తుంది. కాని ఈ యేడు వచ్చిన ఉగాదికి ఒక ప్రత్యేకత ఉన్నది. తెలుగుదేశ చరిత్రలో కనీవినీ యెరుగని రీతిని మనం హైదరాబాదులోని కాకతీయనగరంలో నేటి నుండి వారం రోజులపాటు ప్రపంచ మహాసభలు జరుపుకుంటున్నాం. ఈ సభకు మన ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచీ, భారతదేశంలోని పలు ప్రాంతాలనుంచేగాక, ప్రపంచలోని వివిధ దేశాలనుంచీ ప్రతినిధులు వచ్చారు. తెలుగువారే గాక, తెలుగు భాషపైన ఆదరాభిమానాలుగల విదేశీయులు కూడా రావడం ఈ సభలకు మరింత శోభను చూకూర్చింది. ఈ ఉగాది తెలుగువారికే గాదు, మన కన్నడ సోదరులు కూడా ఈనాడు ఉగాది పండుగ జరుపుకుంటున్నారు. మశ్చిమ చాళుక్యులు కన్నడమును తమ అధికార భాషగా చేసుకుంటే తూర్పు చాళుక్యులు తెలుగును అధికార భాషగా చేసుకున్నారు. కన్నడము, తెలుగు అక్కా చెల్లెళ్ళ వంటివి. రెండు భాషల లిపి ఎంత సన్నిహితంగా ఉంటుందో మీకు తెలియనిది కాదు. విజయనగరాధీశ్వరులైన శ్రీకృష్ణదేవరాయలవారు ఉభయ భాషలను ఆదరించారు. తూర్పు చాళుక్య రాజైన రాజరాజనరేంద్రుని ఆస్థానంలో ఎందరో కన్నడ కవులు ఉండేవారు. ఇదంతా ఎందుకు చెబుతున్నాను అంటే – మన పొరుగు రాష్ట్రమైన కర్ణాటకానికీ మనకూ కొన్ని శతాబ్దాల భాషా, సాంస్కృతిక సంబంధాలున్నాయి. తెలుగే కన్నడమూ, కన్నడమే తెలుగా అన్నంతగా అవి కలగలిసిపోతాయి.

భారత స్వాతంత్ర్య పోరాటగంలో ఆఖరు ఘట్టమైన హైదరాబాదు సంస్థాన విముక్తి పోరాటంనాడు కృత్రిమమైన రాష్ట్రాల సరిహద్దులు యేనాటికైనా తొలగిపోయి భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడాలని మేం కలలుకన్నాం. ఆ కలలు నిజమై, తెలుగు మాట్లాడే వారందరితో ఒక రాష్ట్రం – ఆంధ్రప్రదేశ్‌గా అవతరించింది. ఈ సమైక్యతకు భంగం కలిగే సంఘటనలు కొన్ని జరిగినా, అవన్నీ క్రమంగా తొలగిపోయి మనం నేడు సంఘటితంగా వున్నాం. ఈ ఐక్యతను కాపాడుకోటానికే ఈ మహాసభలు తోడ్పడగలవని నేను విశ్వసిస్తున్నాను.

చరిత్రాత్మకమైన ఈ మహసభలు మన తెలుగుజాతి ప్రాచీన వైభవాన్నీ, మన సంస్కృతినీ, సంప్రదాయాన్నీ సుమారు రెండు వేల అయిదువందల యేండ్ల మన నాగరికతనూ, మనం మరోసారి జ్ఞాపకం చేసుకోడానికీ, మన పూర్వులు మనకు ఇచ్చిన వారసత్వాన్ని అర్థం చేసుకోడానికీ తోడ్పడతాయి. రమారమి అయిదు కోట్ల తెలుగువారిలో భావసమైక్యతను సాధించడానికి భాష ఎంతైనా తోడ్పడగలదనే దృఢ విశ్వాసం కలవాణ్ణి నేను. శాతవాహనుల నాటి తెలుగుకీ ఇప్పటి తెలుగుకీ పోలికేలేదు. మన భాషలో వచ్చిన, రానున్న పరిణామాలను గురించి భాషా శాస్త్రవేత్తలు ఈ వారం రోజుల్లో జరిగే సదస్సులలో చర్చిస్తారు.

శాతవాహనుల కాలంనుండి నేటివరకు తెలుగువారి చరిత్రలె గల గొప్ప గొప్ప విశేషాలను మన

చిత్రకారులు ప్రత్యేకంగా చిత్రించారు. మన చిత్రకారుల ప్రతిభను తెలుసుకోవడానికి కూడా ఈ ప్రదర్శన ఉపయోగపడుతుంది. దీనికి శాతవాహన, విజయ నగర, కాకతీయ ద్వారాలు వున్నాయి. తెలుగు ప్రజల చరిత్రనీ, సంస్కృతినీ ఇవి కళ్ళకు కట్టినట్లు ప్రదర్శిస్తాయి. "తరతరాల తెలుగు జాతి వైభవం" అనే ప్రదర్శన, చేతిపనుల ప్రదర్శన, బాలల విభాగం. మహిళల విభాగం మొదలైనవి కూడా వున్నాయి.

ప్రపంచ తెలుగు మహాసభల లక్ష్యం ప్రపంచంలోని తెలుగు వారి ప్రతినిధుల నందరినీ ఒకరి అభిప్రాయాలు ఒకరు అర్థం చేసుకుని, స్నేహ సంబంధాలను పెంపొందించుకోవడం.

మన రాష్ట్రంలో తెలుగు భాషను తాలూకా స్థాయిలో పరిపాలనా భాషగా ప్రవేశపెట్టిన సంగతి మీకందరికీ తెలిసిందే. అంచెలంచెలుగా మన తెలుగు భాషను రాష్ట్ర స్థాయిలో ప్రవేశపెట్టడం జరుగుతోంది. బోధనా భాషగా తెలుగును ఉన్నత విద్యాస్థాయిలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులో అందించడానికి కృషి జరుగుతున్నది. సాంకేతిక పదజాలం ఆధునిక విజ్ఞాన బోధనకు కావాలి. అట్టి పదజాలాన్ని ఏర్పరుచుకోడానికి పరిశోధనలు సాగుతున్నవి. మనకు స్వాతంత్ర్యం వచ్చి రమారమి 27 సంవత్సరాలైనా మాతృభాషలకు రావలసినంత ప్రాధన్యం రాలేదు. ఆ ప్రాధాన్యం ఇవ్వాలన్నదే మా సంకల్పం.

1975వ సంవత్సరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంస్కృతిక సంవత్సరంగా పరిగణించింది. సంగీత, సాహిత్యాలు, నాటకం, నృత్యం, శిల్పం, చిత్రకళ, మన సంస్కృతికి పునాదులు. ఇవి తెలుగువారి భావసమైక్యతకు తోడ్పడగలవు. ఆధునిక కాలంలో ప్రజలమీద చలన చిత్రాల ప్రభావం యెంతగానో వుంది. మన సంస్కృతిలో ఒక భాగంగా చలన చిత్ర పరిశ్రమ స్థానం ఏర్పరచుకున్నది. ఈ ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం చేయడానికి మన తెలుగు చలనచిత్ర రంగానికి సంబంధించిన కళాకారులు-నటీనటులు, సాంకేతిక నిపుణులు, దర్శకులు, నిర్మాతలు ప్రదర్శనల ద్వారా ఎంతో తోడ్పడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాజధానియైన హైదరాబాదు నగరం తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ముఖ్య కేంద్రంగా రూపొందడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వవిధాలా సహకరించగలదని హామీ ఇస్తున్నాను. ఇంకా కొత్తస్టూడియోలు నిర్మాణం కావాలి. ఎక్కువ సంఖ్యలో చిత్రాలు ఇక్కడ నిర్మించబడాలి.

ముఖ్యోద్దేశాలు :

ప్రపంచంలోని వివిధదేశాలలో వున్న తెలుగువారు తమ మధ్య సాంస్కృతిక సంబంధాలను దృఢపరచుకోవడం, తెలుగు భాష, సాహిత్యం, కళలు మొదలగు వాటిలో అభివృద్ధిని సాధించడం, ఆధునిక అవసరాలకు తగినరీతిగా భాషను సంస్కరించుకోవడం -

తెలుగు ప్రజల జీవితానికీ, చరిత్రకీ, సాహిత్యానికీ సంబంధించన గ్రంథాలను ప్రచురించడం-

తెలుగు భాషను అధ్యాయనం చేయడానికీ, వివిధ రంగాలలో పరిశోధనలు జరుపుకోవడానికీ సౌకర్యాలు కల్పించడం-

వివిధ ప్రాంతాలలోని రచయితలు, మేధావులు, కళాకారులు పరస్పర సంబంధాలు ఏర్పరుచుకోడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించింది.

తెలుగు జాతి సమగ్ర స్వరూపాన్ని ప్రేక్షకులకు అవగతం చేయడానికి మ్యూజియం ఏర్పరుస్తున్నారు.

మన ప్రాచీన కళారూపాలైన బుఱ్ఱకథ, జముకుల కథ, జానపద గీతాలు, తోలుబోమ్మలాటలు, మున్నగువాటిని సజీవంగా వుంచడమేగాక వాటిని పునరుద్ధరించి అవి ఆధునిక జీవితానికి ఉపయోగపడేలా చేయవలసిన అవసరం కూడావుంది. చలనచిత్ర పరిశ్రమ మూఏడుపూవులు ఆరుకాయలుగటా వర్ధిల్లవలసినదేగాని మన నాటక రంగం మటుమాయం కాకుండా చూడాలి.

మన ప్రభుత్వం వ్యవసాయ రంగంతో పాటు, పారిశ్రామిక రంగాన్నివృద్ధి జేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నది. మన తెలుగుదేశం అన్నపూర్ణ. కృష్ణా, గోదావరి, పెన్నానదులు కల జాతి. ఇదే మన భాగ్యం. ఆర్థిక సమస్యలను మనం క్రమంగా, కలిసికట్టుగా పరిష్కరించుకుందాం. మనం ఆశావాదులం. మనకు ప్రకృతి సంపద చాలా వుంది. దాన్నంతటినీ సక్రమంగా వినియోగించుకోవాలి. సంకుచిత దృష్టి విడిచి విశాల దృష్టితో పురోగమించాలి. గతాన్నీ, వర్తమానాన్నీ, భవిష్యత్తునీ మనవ మరచిపోరాదు. గతం లేనిదే వర్తమానం లేదు. వర్తమానం లేనిదే భవిష్యత్తులేదు.

హిందీ భాష మాట్లాడేవారి తరువాతి సంఖ్యలో భారత దేశంలో మనదే పెద్ద రాష్ట్రం. మన సంఖ్యాబలాన్ని ప్రదర్శించుకోడానికి కాదు మనం ఈ సభలు జరుపుకుంటున్నది. మన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడానికే మనం ఈ సభలు జరుపుకుంటున్నాం.

వై విధ్యంలో ఏకత్వం సాధించడమే మన లక్ష్యం. మనను మనం అర్థం చేసుకున్ననాడు ఇతరులను మనం పరిగా తెలుసుకోగలం. మన రాష్ట్రాన్ని మనం సుసంపన్నం చేసుకోవడం ద్వారా భారతదేశాన్ని సుసంపన్నం చేయగలం. ఇవి తెలుగువారందరి సభలు. కాజకీయ, ప్రాంతీయ, విభేదాలు లుకుండా యావత్తు తెలుగుజాతి జరుపుకునే పండుగ ఇది. మనం అంతా ఒకటి అని ఒక్క గొంతుతో పలకడానికీ, హృదయాలలో సమైక్యతా బీజాలు నాటడానికీ ఏర్పరచిన ఉత్సవాలు ఇవి.

(ముఖ్యమంత్రి జలగం వెంగళరావు అధ్యక్షోపన్యాసం)

చావలి రామమూర్తి

ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన విదేశీ ప్రతినిధివర్గాల సంక్షిప్త పరిచయం

ప్రపంచ తెలుగు మహాసభలకు మన దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధి వర్గాలు, శ్రీ భవానీ శంకర్ నియోగి, శ్రీ బుఱ్ఱా వెంకటప్పయ్య, శ్రీ సోమంచి యజ్ఞన్న శాస్త్రి. శ్రీ జె.వి.సోమయాజులు న్యాయమూర్తి శ్రీ టి.వి.ఆర్. తాతాచారి వంటి ప్రవాసాంధ్ర ప్రముఖు లెందరో వచ్చారు. వారందరిని గూర్చి యిదివరకు విన్నాము కాని వారందరి మూర్తులను చూడలేదు. వారిని చూసే భాగ్యము ఈ మహాసభలు కలుగజేశాయి.

వీరేకాకా విదేశములనుండి కూడా ప్రతినిధులు వచ్చారు. మన ప్రక్క దేశమైన బర్మా నుండి ఎవ్వరూ రాలేదు. మొత్తం 17 దేశాలు, అమెరికా, ఇంగ్లాడు, ఫ్రాన్సు, రష్యా, పశ్చిమ జర్మనీ, కెనడా, శ్రీలంక, ఫీజీ, మారిషస్, దక్షిణాఫ్రికా, సింగపూరు, ఇండోనీషియా, మలేసియా, జాంబియా, ఆఫ్ఘనీస్థాన్, బంగ్లాదేశ్ లనుండి ప్రతినిధులు వచ్చారు.

రష్యానుండి వచ్చిన ప్రతినిధులలో మన తెలుగు వారే కాకా మరో ముగ్గురు, ఆదేశీయులు ఉన్నారు.

మహాసభలలో అనేక కార్యక్రమములు ఉండటము చేత అందరినీ కలియ లేక పోయాను, మొత్తం పది దేశాల వారిని మాత్రమే కలిశాను.

దక్షిణాఫ్రికా ప్రతినిధులతో

దక్షిణాఫ్రికా నుండి వచ్చిన శ్రీ పి.బి. సన్యాసి, శ్రీ వి.వి. నాయుడు గార్లను కలిశాను. వీరు ఆంధ్ర సభ అధ్యక్ష కార్యదర్శులు. వీరితో పాటు వచ్చిన శ్రీ పి.బి. అప్పన్న రెడ్డిగారిని వారి సతీమణి శ్రీమతి సీతగారిని కలిశాను. తెలుగులోనే సంభాషణ జరిగింది. దక్షిణాఫ్రికాలో మొత్తము 35 వేలమంది తెలుగు వారున్నారు. అందరూ ఇండకలలో తెలుగు మాట్లాడతారు, 'జూలూ' అనే ఆఫ్రికన్ భాష, ఇంగ్లీషు అందరికీ వస్తాయి. వివాహ సంబంధాలు అన్నీ తెలుగు వారిలో తెలుగు వారే చేసుకుంటారు. తెలుగు తనాన్ని నిలబెట్టాడానికి ప్రయత్నము ఎన్నడూ మానలేదు అన్నారు. మాకు తెలుగు పత్రికలు లేవు. తెలుగు చదవలేము. మాకు ఆకాశవాణి విజయవాడ, హైదరాబాదు కేంద్రాల కార్యక్రమాలు వినిపించవు అన్నారు. మాకు తెలుగు సినిమాలు కావాలి అని ఎంతో ఆప్యాయముగా కోరారు ఈ సోదరులు. వీరు ఇంగ్లీషు భాషలో తెలుగు పాటలు ప్రార్థనలు వ్రాసుకున్నారు.

మారిషస్ ప్రతినిధివర్గంతో

మారిషస్ నుండి 9 మంది సభులుగల ప్రతినిధి వర్గము శ్రీ యస్.ఆర్. పైడయ్యగారి అధ్యక్షత క్రింద వచ్చారు. వీరిలో శ్రీ గోరయ్య రెడ్డి (తెలుగుభాషోపన్యాసకులు) శ్రీ అప్పయ్య, శ్రీ బాపునాయి.

(వీరిరువురూ చెరుకుతోటలో పనిచేస్తారు) గార్లతో సంభాషించాను. తెలుగులోనే సంభాషణ జరిగింది. మారిషస్‌లో 50,000 పైబడి తెలుగు వారున్నారు. 75 ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు నేర్పబడుచున్నది. తెలుగు పత్రికలు వీరికిరావు. హైకమీషన్ కార్యాలయము ద్వారా అప్పుడప్పుడు "ఆంధ్రప్రదేశ్" వస్తుంది. తెలుగు వారు వారి ఇండ్లలో తెలుగులోనే మాటలాడుతారు. వారిలో వారే సంబంధాలు చేసుకుంటారు. ఇంకతప్పని సరి అయితేనే ఇతర భాషావర్గాల వారితో సంబంధాలు చేసుకుంటాయి. తెలుగు సినిమాలు ఎన్నడూ రాలేదు. ఒకసారి శ్రీమతి జమున యితర సినీకళాకారులు వచ్చారు అని ఎంతో ఆప్యాంగా సినీ కళాకారుల రాకను గుర్తుచేసుకున్నారు. ఫ్రెంచి భాషయొక్క అంశమయిన 'క్రిమోలు' అనేభాష మారెషన్‌లో మాట్లాడతారు. ఇంగ్లీషు కూడా వస్తుంది.

తెలుగు బోధనచేసే ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో మాకు కావాలి అన్నారు ఈ మిత్రులు. ఇదివరకు శ్రీ వేటూరి ఆనందమూర్తి, శ్రీ బ్రహ్మానందం వచ్చారు. వారు తిరిగి వెనక్కి వచ్చేశారు, తెలుగు చెప్పేవారెవరూ లేరు అని వీరు వాపోయారు.

అంతేకాదుఫ మాకు తెలుగు తెలిసిన 'జోషి' (పురోహితుడు) కావాలి. మేము తెలుగు పంచాంగము, తమిళ పంచాగము కూడా మద్రాసునుండి తెప్పిస్తాము అన్నారు. వీరికి తెలుగు ఉగాది, తమిళ సంవత్సరాది కూడా సెలవు దినాలే. హిందువుల పండుగలు అన్నీ వీరు జరుపుకుంటారు.

మారిషస్‌లో, తెలుగు అభివృద్ధి చెందటానికి చాలా అవకాశాలలు ఉన్నాయి. ప్రభుత్వము కూడా సంపూర్ణ సహాయము చేస్తుంది. మన తెలుగువారైన శ్రీ వీరాస్వామిగారు ప్రభుత్వముతో ఆంధ్ర మహాసభ, డా.యూజీన్ లాసెంట్ స్ట్రీట్, పోర్ట్ లూయిస్, మారిషస్.

ఆఫ్ఘనిస్థాన్ ప్రతినిధితో

ఆఫ్ఘనిస్థాన్ నుండి డాక్టరు శోంఠి కృష్ణమూర్తిగారు వచ్చారు. వీరు ఐక్యరాజ్య సమితికి చెందిన యు.యస్.డి.పి.లో పనిచేయుచున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో మొత్తము 12 తెలుగు కుటుంబాలు ఉన్నాయి. భారతీయ పాటశాలల్లో తెలుగు నేర్పరు. హిందీ నేర్పుతారు. తెలుగువారు వారి పిల్లలను ఈ పాఠశాలలకే పంపుతారు. తెలుగు వారికి ప్రత్యేకించి ఒక సంఘములేదు. తెలుగు పత్రికలు, పుస్తకాలులేవు. వీరి చిరునామా డా.శౌంఠి కృష్ణమూర్తి యస్.ఇ.సి.ఆర్.టి, యు.యస్.డి.పి, కాబూల్-5.

సింగపూర్ ప్రతినిధితో

సింగపూరునుండి శ్రీ బాని సింహాచలంగారు వచ్చారు. తెలుగు భాష, సంస్కృతి, ప్రజలు అంటే సర్వస్వము అర్పించగల తెలుగు బిడ్డడు శ్రీ సింహాచలంగారు. "సింగపూరులో మొత్తము 200 మంది తెలుగువారున్నారు. ఇక్కడ, ఇంగ్లీషు, 'చైనీలు' మలే, తమిళము అధికార భాషలు. తెలుగు వారికి ఒక సంఘములేదు. ఆ ఏర్పాటుకు కృషి జరుగుచున్నది. తెలుగు వారు మిండ్లలో తెలుగు మాటలాడతారు. వారిలో వారే సంబంధాలు చేసుకుంటారు. సింగపూరుకు హైదరాబాదు ఆకాశవాణి వినిపిస్తుంది. మాకు ఏ తెలుగు పత్రికలురావు. విశాఖపట్నం నుండి వచ్చే స్టీమర్లలో చాలామంది తెలుగుమిత్రులున్నారు. వారు పుస్తకాలు, పత్రికలు పట్టుకువచ్చి యిస్తారు" అని అన్నారు శ్రీ సింహాచలముగారు. వీరు వీరి పిల్లలను విశాఖపట్టణములో ఉంచి విద్యగరిపించుచున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము సింగపూరు ప్రభుత్వముతో మంతనాలు జరిపి, తెలుగుభాషను అచ్చట ప్రవేశపెట్టుట చాలా అవసరము, సునాయాసనము అని వీరు పేర్కొన్నారు. సింగపూరులో తెలుగువారికి తెలుగు భాషకు సముచిత స్థానాన్ని తీసుకొని రాగలను అని వీరు ఉత్సాహముగా పేర్కొన్నారు. వీరి చిరునామా శ్రీ బి.యస్. చలం, ఎడ్యుకేషన్ ఆపీసరు 174 కె. బాకలకు, మొర్సీన్ సెర్సీస్, సింగపూరు - 15.

ఫిజీ ప్రతినిధులతో

ఫిజీ దీవిలో దక్షిణ ఇండియా ఆంధ్ర సంఘము నెలకొల్పబడినది. ఇక్కడ 18,000 మంది తెలుగు వారున్నారు. ఫిజీ నుండి వచ్చిన శ్రీ దేవానందరావు గారిని, శ్రీ సోమరాజుగారిని, శ్రీ బాటగోవిందము గారిని కలిశాను. ఫిజీలో తెలుగు వారు వారి ఇండ్లలో తెలుగునే వాడతారు. తెలుగుదనాన్ని నిలబెట్టుకొనడానికి ఎంత అయినా కృషిచేస్తున్నాము అన్నారు వారు. ఇక్కడ తెలుగు వారిని యితర దక్షిణాత్యులతో కలిసి, 'మద్రాసీలు' అంటారు. హైదరాబాదు ఆకాశవాణి కేంద్రము వారికి వినిపించదు. తెలుగు సినిమాలు ఎవ్వరూ చూడలేదు. శ్రీ దేవానందరావు గారు వృత్తిరీత్యా అధ్యాపకులు నిర్వహిస్తున్నారు.

'ఆంధ్రప్రదేశ్ పత్రిక వస్తూ ఉంటుంది. అదిచూస్తే కొంత సంతృప్తి కలుగు తుంది అన్నారు వీరు. ఫిజీ భాషకు లిపిలేదు. అందుచూ వీరు రోమన్ లిపినే ఆ భాషకు వాడుతారు.

మాకు "విప్రనారాయణ" చిత్రము పంపించండి అన్నారు. శ్రీ సోమరాజుగారు.

శ్రీ దేవానందరావుగారి చిరునామా, శ్రీ దేవానందరావు పి.ఒ. బాక్కుస, నెం, 373; సామాబుల్వా సువా, ఫిజీ.

మలేసియా ప్రతినిధి వర్గంతో

మలేసియా నుండి29 మంది సభ్యులు గల ప్రతినిధి వర్గము డాక్గరు. సి. అప్పారావు. యం.ఏ.పిహెచ్‌డి. గారి నాయకత్వము క్రింద వచ్చారు. వారే మలేసియా ఆంధ్ర సంఘానికి అధ్యక్షులు, డాక్టరు రావు ఆర్థికశాస్త్రాచార్యుడు. వీరు అమెరికాలోని, 'ఓక్‌లామ్'. విశ్వవిద్యాలయములో విద్యాభ్యాసము చేశారు. సంభాషణాచతురులైన డాక్గరు రావుగారు, వారి అర్ధాంగి శ్రీమతి రాధారావుగారు, వారితో

మాట్లాడినంతసేపు ఆప్యాయత, ఆదరణ బంధుప్రీతిని వెల్లడించారు. శ్రీ రావు దంపతులు తెలుగులో మాట్లాడగలరు. శ్రీమతి రావు ఇంగ్లీషు బోధించే ఉపాధ్యాయిని.

'తెలుగు తల్లి' అనే పత్రిక మలేసియా నుండి వెలువడుచున్నది. దీని సంపాదకులు శ్రీ వి. కృష్ణమూర్తిగారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులైన శ్రీ కృష్ణమూర్తిగారు స్వచ్ఛముగా తెలుగు మాటలాడుతారు.

శ్రీ బీసెట్టి నూకయ్య, శ్రీ దాడి శ్రీరాములు, శ్రీ ఆర్.పి.రాములు గార్లను కూడా కలిశాను. వారు చాలా ఉత్సాహవంతులైన కార్యకర్తలు.

తరాలుగా వీరు భౌతికముగా మాతృ భూమికి దూరముగా ఉన్నా. మానసికముగా వీరు తల్లి ఒడిలోనే ఉన్నారు.

ఆకాశవాణి హైదరాబాదు బాగా వినిపిస్తుంది. హైకమీషను కార్యాలయము ద్వారా వారికి "ఆంధ్రప్రదేశ్" వస్తుంది.

1,50,000 మంది తెలుగువారున్న మలేసియాలో 25 తెలుగు పాఠశాలలు, 14 ఆంధ్ర సంఘము శాఖలు ఉన్నాయి.

మరే దేశభాష, రోమణ లిపి వాడతారు. మాకు విరివిగా సినిమాలు వచ్చేటట్లు మీరందరు కృషిచేయాలి అన్నారు. మలేసియా సోదరులు. ఆరు సంవత్సరాల క్రిందట "నమ్మినబంటు" సినిమా వస్తే చూచాము అన్నారు. Andhra Association Post Box No. 2 Banan Datoh, Perak, Malasiya.

ఇండోనేషియా ప్రతినిధితో

ఇండోనేషియానుండి ఏకైక ప్రతినిధి శ్రీ యం. శ్రీరాములు గారు వచ్చారు. వీరు రాణి ఇంగ్లీషు స్కూలుకు డైరెక్టరు. మరి అమ్మన్‌గుడి సంఘమునకు ప్రథమ అధ్యక్షులు. ఇండోనేషియాలో కేవలము 2,000 మంది మాత్రమే తెలుగువారు ఉన్నారు. ఒక్క సుమత్రాలోనే వీరు ఉన్నారు. జావా, బోర్నియాలలో చాలా తక్కువ మంది ఉన్నారు. ఇక్కడ తెలుగు బోధించే పాఠశాలలు లేవు. తమిళ పాఠశాలలు ఉన్నాయి. తెలుగు పుస్తకాలు, సినిమాలు మృగ్యములు, ఇండోనేషియా దేశభాష. ఇంగ్లీషు విరివిగా వాడుతారు. శ్రీ శ్రీరాములుగారు కొన్ని తెలుగు – ఇంగ్లీషు, ఇంగ్లీషు – తెలుగు బోధిని పుస్తకాలు తమతో తీసుకు వెళ్ళగలమన్నారు. ఇండోనేషియాలోగల మన రాయబారి కార్యాలయానికి వచ్చేవారు అందరూ. ఉత్తర హిందూస్థానమువారే అవటముచేత, ఎన్నడూ తెలుగు వినిపించదు అన్నారు.

ఇండోనేషియాలో, హిందువులు "ఇండియన్ హిందువులు, ఇండోనేషియా హిందువులు" అని రెండు రకాలు. ఇండియన్ హిందువుల సంఖ్య 50 వేలు. వీరు వ్యాపారముకొరకు వచ్చేవారు. ఇండోనేషియన్ హిందువులు అనగా ఆ దేశములో ఉండి పౌరులైన హిందువులు. వీరు ఒక కోటి మంది. తెలుగు వారందరూ ప్రస్తుతము ఇండోనేషియన్ హిందువులుగానే ఉన్నారు. ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామము తరువాత చాలమంది తెలుగు వారు స్వదేశమువచ్చి వేశారు. శ్రీ శ్రీరాములుగారి చిరునామా Sri M.Sree Ramulu. Director, Rani English School, Jin Brig Katamsa No. 60 B. Medam Indonesia.

శ్రీ లంక ప్రతినిధి వర్గంతో

శ్రీ లంక నుంచి వచ్చిన ప్రతినిధి వర్గానికి శ్రీ A.M. రాజు అధ్యక్షులు. శ్రీ చింతలపూడి వీర రాఘవరావుగారు కార్యదర్శి. మొత్తము 9 మంది సభ్యులు వచ్చారు. వీరందరిలో శ్రీమతి మీనాక్షి పొన్నుదొరై తెలుగు వారికి, శ్రీ లంక బ్రాడ్ కాస్టింగు కార్పోరేషన్ ద్వారా పరిచితులు, మనకు శ్రీలంక నుండి తెలుగు పాటలు వినిపించే మీనాక్షి అక్కయ్యకు తెలుగు సోదరులు, సోదరీమణులు అంటే అత్యంత ఆప్యాయత. వచ్చిన విదేశీ ప్రతినిదులందరికీ ఎక్కువ మందిని ఆకర్షించిన మీనాక్షి అక్కయ్య బళ్ళారి నివాసి. మద్రాసులో విద్యాభ్యాసముచేసి, భారత స్వతంత్ర సమరములో భాగస్వామిని అయి, శ్రీ లంక చేరినారు.

శ్రీ లంకలో మొత్తము మూడు లక్షల మంది తెలుగువారు ఉన్నారు. అంతా కొద్దిగానో గొప్పగానో తెలుగు మాట్లాడుతారు కాని, చాలామంది తెలుగు చదవలేరు. "శ్రీ లంక తెలుగు సాంస్కృతిక సభ" ద్వారా యిప్పుడు తెలుగు నేర్పుచున్నారు. మేము మాతృభూమికి దగ్గరగా ఉన్నా మాకు తెలుగు పుస్తకాలు పత్రికలు రావు అన్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ ఇంగ్లీషులోనే జరుగుచున్నాయి. గత 25 సంవత్సరములలోను "మల్లీశ్వరి" సినిమా శ్రీలంక వెళ్ళిందట! తమిళులవలె, తెలుగువారు స్థానికులతో, భాషా విషయమై ఏవిధమైన అభిప్రాయ భేదములు పెంచుకోలేదు అన్నారు శ్రీలంక సోదరులు. శ్రీమతి మీనాక్షి పొన్నుదొరై చిరునామా శ్రీలంక తెలుగు సాంస్కృతికసభ నెం. 36 గ్రీన్‌పార్కు, కొలంబో–7.

లండన్ నుంచి వచ్చిన శ్రీమతి సూర్యకుమారి

లండన్‌లో స్థిరపడిన శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి కంఠమాధుర్యము అత్యంత ప్రశంసనీయము. ఈమె శ్రీ ఎడ్విన్ అనే పాశ్చాత్యుని వివాహమాడి లండన్‌లో స్థిరపడ్డారు. శ్రీ ఎడ్విన్ చిత్రకారుడు. లండన్‌లో శ్రీమతి సూర్యకుమారి భారతీయ సాంస్కృతిక విద్యలైన నాట్యాన్ని, పాటలను, నేర్పుచున్నారు. శ్రీమతి సూర్యకుమారితో సంభాషించినప్పుడు, ఆమె విజయనగరంలో బంధువులందరిని ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకొన్నారు. మీది విజయనగరమా? అని ప్రశ్నించి సాధారణ కుశల ప్రశ్నలు వేసి ఇంగ్లాండును గురించి మీకు ప్రత్యేకముగా చెప్పవలసినది ఏమీ లేదు. మీరు పేపర్లలో చదువుతున్నారు కదా అన్నారు. మన భారతీయ సంస్కృతి పట్ల ఇంగ్లీషువారికి చాలా అభిమానం అని ముగించేశారు.

అమెరికన్ ప్రతినిధితో

అమెరికా నుండి వచ్చిన ప్రముఖులలో, విస్కాన్‌సిస్ విశ్వవిద్యాలయములో చరిత్రశాఖలో ఆచార్య పీఠమును అలరించిన ఆచార్య రాబర్టు ఎరిక్ ఫెర్కిన్‌బర్గును మాత్రమే కలిశాను. "నేను మీలాగే తెలుగు మాతృభాషగా కలవాడను" అని కొంత గర్వముతో పలికారు. వారితో సంభాషణ చాలా వరకు తెలుగులోనే జరిగింది.

రాబర్టు తండ్రిగారైన ఎరిక్ భారతదేశములో తెలుగు ప్రజల మధ్య ఇరువదిఐదు సంవత్సరములు సికింద్రాబాదు – నెల్లూరు మధ్య క్రైస్తవమత ప్రచారకుడుగా ఉన్నారు. 1930వ సంవత్సరము జూన్ నెల 8వ తేదీన రాబర్టు ఊటీలో జన్మించారు. 1942లో ద్వితియ ప్రపంచయుద్ధం వలన అమెరికా వెళ్ళు వరకు తన బాల్యమును, గుంటూరు, కర్నూలు, నల్గొండ, సూర్యాపేట, వినుకొండ నర్సారావుపేట, నెల్లూరు, సికింద్రాబాదులలో గడిపినారు, వీరు స్వీడన్ దేశస్తులు. అమెరికాలో వీరు ఎం ఏ. పట్టము పొంది, లండన్ విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి.పట్టా పొందారు. వీరి పరిశోధనకు "భారతీయులు – ఆంధ్రచరిత్ర" అభిమాన విషయముగా గైకొన్నారు. వీరు వీరి అభిమాన విషయమునే కాలిఫోర్నియా, లండన్, చికాగో విశ్వవిద్యాలయాలలో బోధించి 1962వ సంవత్సరము నుండి విస్కాన్‌సన్ విశ్వవిద్యాలయంలో చరిత్ర శాఖాచార్యులుగా ఉన్నారు.

వీరు భారతదేశాన్ని చాల పర్యాయములు సందర్శించారు. "గుంటూరు చరిత్ర 1788–1848" అనే గ్రంథాన్ని వ్రాసి ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయమువారిచే 1965 సంవత్సరమున ప్రకటింపచేశారు.

వర్తకాలమున తెలుగుదేశములో తెలుగుభాషా సాహిత్యాలలో లబ్ధ ప్రతిష్ఠులైన పలువురు ప్రముఖులతో తమకు కల పరిచయాన్ని శ్రీ రాబరు వివరించి చెప్పారు.

అమెరికాలో విస్కాను సన్ విశ్వ విశ్వవిద్యాలయములో మాత్రమే తెలుగు బోధిస్తారు. ఇక్కడైనా పట్ట పరీక్షకు (Graduation)కి 10 మంది కన్నా ఎక్కువ మంది లేరు. ఎం.ఏ. (M.A) లో తెలుగును స్వీకరించేవారు ఒకరో లేక ఇద్దరో. అందుచేత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, తెలుగు యెడల ప్రీతి కలగటానికి తగు కృషి చేయాలి అన్నారు. ఆక్సుఫర్డు, కేంబ్రిడ్జి, లండన్ విశ్వ విద్యాలయాల్లో తమిళము నేర్పుతారు, కాని తెలుగు లేదు అన్నారు శ్రీ రాబర్డు.

డాక్టరు ముజేనే రొగో హైరు అనే విద్వాంసుడు, "పల్నాటి సీమలో వ్యావహారిక భాష" అనే అంశము పై పరిశోధనచేసి, పి.హెచ్.డి. పొందారు. జానపద గేయాలు, 'రికార్డు' చేశారు. వీరే విస్కాన్ సన్ విశ్వ విద్యాలయము నుండి మొదటగా తెలుగులో పి.హెచ్.డి. పొందినవారు.

"తెలుగులో నిత్యము మాట్లాడటానికి తగిన అవకాశము లేక నేను తెలుగులో మాట్లాడటానికి కష్టపడవలసి వస్తోంది" అన్నారు శ్రీ రాబర్టు.

తెలుగు, స్వీడిష్ భాషలాగానే సంగీతానికి, గానానికీ అనువైన భాష అని తెలుగుని కొనియాడారు.

('ఆంధ్రప్రదేశ్' జులై, 1975)

యన్. శివరామమూర్తి

మొదటిసారిగా విదేశ వేదికపై వైభవోపేతంగా జరిగిన రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు

తెలుగు వెలుగులు

2500 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగుజాతి సంస్కృతి ఉత్తమమైనదిగా పేరు పొందింది. శాతవాహనులు, ఇక్ష్వాకులు, బృహత్పలాయనులు, విష్ణుకుండినులు, ఆనందగోత్రికులు, పల్లవులు, చాళుక్యరాజుల పోషణలో సొగసులు దీరి తీగెలు సాగిన తెలుగు భాషా సంస్కృతులు, సాహిత్యం ఒక విశిష్ట స్థానాన్ని అలంకరించాయి. తదనంతరం కాకతీయ ప్రభువులు, రెడ్డి రాజులు, విజయనగర సామ్రాజ్యాధిపతులు, నాయకరాజుల కాలంలో తెలుగువారి సాహిత్యం, లలిత కళలు నిత్యనూతనంగా పరిఢవిల్లాయి.

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని ఇటు ప్రాచ్యులచేత, 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని అటు పాశ్చాత్యులచేత ప్రశంసింపబడిన తెలుగు వెలుగులు ఈ దశాబ్దిలో ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణతో ప్రపంచ పరివ్యాప్తమైనాయి.

మనోజ్ఞమైన మలేసియా వేదికపై మహాసభల వేడుకలు

1975 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానీ నగరం హైదరాబాదులో చారిత్రాత్మకంగా జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై ప్రపంచం నలుమూలలా ఉన్న తెలుగు సోదరులంతా కలుసుకొనే సువర్ణావకాశం ఏర్పడింది. ఇదే వేదికపై రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు విదేశాలలో జరపాలనే ఆలోచనకు బీజావాసనం జరిగింది. అందుకు మలేసియా ఆంధ్ర సంఘంవారు ముందుకు వచ్చి రెండవ ప్రపంచ తెలుగు మహాసభలను మలేసియా రాజధానీనగరం కౌలాలంపూర్‌లో జరుపగలమని తమ హర్షామోదాలను ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారి సహాయ సహకారాలతో, అంతర్జాతీయ తెలుగుసంస్థ, మలేసియా ఆంధ్రసంఘం సన్నాహకత్వంలో మహాసభలు కార్యరూపం దాల్చి 1981 ఏప్రిల్ 14వ తేదీనుంచి 18వ తేదీవరకు మలేసియాలో నిర్వహించబడ్డాయి.

మహాసభల ప్రారంభోత్సవ సంరంభం

ఎటుచూసినా పచ్చని కంబళ్ళు పరచుకొని, మలయమారుత వీచికలతో ప్రకృతి అందాల్ని సంతరించుకొన్న మలేసియా దేశంలో రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. మలేసియా రాజధానీ నగరం కౌలాలంపూర్‌లోని పెటాలింగ్‌జయ అనే సుందర ప్రదేశం ఈ మహాసభలకు వేదికగా రూపుదిద్దుకొంది. పెటాలింగ్ జయలోని సివిక్ సెంటర్ హాలు, హోటల్ జయపురి అందమైన స్వాగత

ద్వారాలను అమర్చుకొని, దీప తోరణాలను కూర్చుకొని, తెలుగుదనం ఉట్టిపడే విధంగా సభాప్రాంగణంలో రంగవల్లులను దిద్దుకొని, దీపపు సెమ్మెల వెలుగుల్లో మహాసభల ప్రతినిధులకు మనోరంజకంగా, మనస్ఫూర్తిగా స్వాగతాన్ని పలికాయి.

1981 ఏప్రిల్ 14 వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు సివిక్ సెంటర్ హాలులో జరిగిన ఈ మహాసభలను నాటి మలేసియా ఉప ప్రధాని, నేటి మలేసియా ప్రధాని అయిన దాతో డాక్టర్ మహతీర్ బిన్ మహమ్మద్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ టి. అంజయ్య, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖామాత్యులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి, మలేసియా ఆంధ్ర సంఘం అధ్యక్షులు డాక్టర్ సి. అప్పారావు. మలేసియా కార్మిక, వినియోగ శాఖామంత్రి శ్రీ దాతో స్వామివేలు, ఇంకా మలేసియాలోని అధికార ప్రముఖులు ఆనాటి సభావేదికను అలంకరించారు. డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడిన త్యాగరాయకృతి " శ్రీ గణపతి సేవింపరారే" అనే ప్రార్థనా గీతంతో మహాసభలకు అంకురార్పణ జరిగింది.

"అందరికీ వందనాలు " అనే తేనెలొలుకు తెలుగు పలుకులతో సభా ప్రారంభకులు, నాటి మలేసియా ఉపప్రధాని తమ ఉపన్యాసాన్ని ప్రారంభించారు. వారు తమ ఉపన్యాసంలో, ఏ మాత్రం రాజకీయ ప్రమేయం లేకుండా కేవలం భాషాసాంస్కృతిక, విద్వత్ స్థాయిలో జరుగుతున్న ఈ మహాసభలు జయప్రదం కావాలని తమ శుభాకాంక్షల నందజేశారు. ప్రజలు తమ స్వీయ సంస్కృతిని పరిరక్షించుకొంటూ, ఆలోచనాసరళిని పెంపొందించుకొంటూ తాము నివసించే దేశం పట్ల బాధ్యతాయుతంగా, గర్వించే విధంగా ప్రవర్తించాలని వారు ఉద్బోధించారు. మలేసియా ఆంధ్ర సంఘం అధ్యక్షులు డాక్టర్ సి. అప్పారావు సభికులకు స్వాగతం పలికారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ టి. అంజయ్య ప్రసంగిస్తూ, రాష్ట్రేతర, విదేశాంధ్రుల భాషా సాంస్కృతికపరమైన అవసరాలు తీర్చేందుకు, వాటి పరిరక్షణకు, పటిష్ఠతకు అనివార్యమైన సహాయక చర్యలు తమ ప్రభుత్వం తీసుకొనగలదని హామీ ఇచ్చారు. తెలుగువారి మధ్య సత్సంబంధాలు పెంపొందించేందుకు శాయశక్తులా తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖా మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి, దాతో స్వామివేలు ప్రసంగించారు. భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి పంపిన మహాసభల సందేశాన్ని శ్రీ భాట్టం శ్రీరామమూర్తి చదివి వినిపించారు. మలేసియా ఆంధ్రసంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ మదిని సోమునాయుడు వందన సమర్పణ చేశారు.

రమణీయంగా రూపొందిన మహాసభల్లో కమనీయ దృశ్యాలు :

రెండువేల మంది ప్రేక్షకులు కూర్చొని సౌకర్యంగా తిలకించే అత్యధునాతనమైన, అందమైన సివిక్ సెంటర్ హాలు సమావేశ మందిరంలో ఈ ప్రారంభోత్సవం జరిగింది. ప్రారంభోత్సవం అనంతరం కుమారి శోభానాయుడు నృత్య ప్రదర్శన జరిగింది; నారాయణీయంలోని "అగ్రేపశ్యామి" కీర్తనాయుక్తమైన ఈ నర్తన అనేక మందిని ముగ్ధుల్ని చేసింది. తరువాత మలేసియా స్థానిక కళాకారులు 'మాలం మలేసియా' అనే కార్యక్రమాన్ని సమర్పించారు. ప్రతినిధులకు మలేసియా ఆంధ్ర సంఘంవారు ఆ ప్రక్కనే ఉన్న విశాలమైన హాలులో రాత్రి భోజన విందును ఏర్పాటు చేశారు.

పాలకమండలి సమావేశం :

14వ తేదీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముందుగా అంటే ఆనాటి మధ్యాహ్నం 12.00గంటల ప్రాంతంలో హోటల్ జయపురిలోని బాల్‌రూంలో అంతర్జాతీయ తెలుగు సంస్థ పాలకమండలి సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖామంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తితోపాటు ఈ కింది సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

డా॥ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ యం.గోపాలకృష్ణన్, డా॥ వావిలాల గోపాలకృష్ణయ్య, ఆచార్య జి.రాంరెడ్డి, ఆచార్య జాఫర్ నిజాం, ఆచార్య సి.నారాయణరెడ్డి, శ్రీ పి.యం. మోహన్ రావు, డా॥బోయిభీమన్న, శ్రీ జె.బాపురెడ్డి, శ్రీ మాగంటి అంకినీడు, డా॥ సి.అప్పారావు, శ్రీ మాటేటి రామప్ప: సభ్యులు – కార్యదర్శి

సభ్యులు ప్రతినిధుల ప్రయాణపు ఏర్పాట్లను గురించి, మహాసభల కార్యక్రమాల ఏర్పాట్లను గురించి చర్చించారు.

ప్రతినిధుల సమావేశం :

15–4–1981వ తేదీ ఉదయం 9.00 గంటలకు సివిక్ సెంటర్ హాలులో ప్రతినిధుల సమావేశం జరిగింది. ప్రముఖ రాజకీయవేత్త, మేధావి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖామంత్రి కే.శే.జి.రాజారాం ముఖ్యఅతిథిగా వ్యవహరించారు. వివిధ సంఘాల సభ్యులను, మలేసియా ఆంధ్ర సంఘం ఉపశాఖల అధ్యక్షులను, కార్యదర్శులను డాక్టర్ సి.అప్పారావు సభకు పరిచయం చేశారు. ఆంధ్రప్రదేశ్ మంత్రులను, న్యాయమూర్తులను, విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులను, పార్లమెంటు సభ్యులను, ఉభయ శాసనసభా సభ్యులను అంతర్జాతీయ తెలుగుసంస్థ పాలకమండలి సభ్యులను, చర్చాగోష్ఠులలో పాల్గొనే విద్వాంసులను, కవులను, కళాకారులను శ్రీ భాట్టం శ్రీరామమూర్తి సభకు పరిచయం చేశారు.

చర్చాగోష్ఠుల ప్రారంభోత్సవం- ప్రారంభోపన్యాసం :

15.04.1981వ తేదీ ఉదయం 11.00గంటలకు తేనీటి విందు తరువాత సివిక్ సెంటర్ హాలులో చర్చాగోష్ఠుల ప్రారంభోత్సవం జరిగింది.

చర్చాగోష్ఠుల సంఘం అధ్యక్షులు, మలే విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ శ్రీ ఇ.వి.గంగాధరం సభికులకు స్వాగతం పలికారు. అంతర్జాతీయ తెలుగు సంస్థ అధ్యక్షులు శ్రీ యం.వి.కృష్ణారావు ఈ మహాసభలకు హాజరు కాలేకపోయిన దురదృష్ట సంఘటనను కార్యకర్తలకు గుర్తుచేస్తూ విచారాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ఇలా అన్నారు. "..... నిన్నటి ప్రారంభోత్సవం డిప్యూటీ ప్రైమ్ మినిష్టరుగారు, మన ముఖ్యమంత్రిగార్ల రాకతోను, సాంస్కృతిక కార్యక్రమాలతోను వైభవోపేతంగా జరిగినందుకు మనమందరము కూడా హర్షాన్ని ప్రకటిస్తున్నాము. ఒక ప్రక్క నుండి మలేషియా ఆంధ్ర సంఘంవారు మరొక ప్రక్కనుండి భాట్టం శ్రీరామమూర్తిగారు, ఎం.వి.కృష్ణారావు గారు, రాలేకపోయిన తప్పులేమైనా ఉన్నట్లయితే క్షమించండి అని ప్రతినిధులకు, పదే పదే చెప్తున్నారు. ఎవరూ ఎవరినీ క్షమించనక్కరలేదు. అందరికీ ఒకటే క్షమాపణ అయిపోయింది; మళ్ళీ పదే పదే ఆ మాటలు అనవలసిన పనిలేదు. జరిగిందేదో జరిగిపోయింది. ఇక జరగబోయే కార్యక్రమాన్ని గూర్చి ఆలోచించవలసి ఉంది. ముఖ్యంగా ఆంధ్ర సంఘం యువకులందరూ ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. వారు క్షమించండి అని ఎవరికి చెప్పక్కరలేదు.

.... చెమటోడ్చి, కష్టపడి సభలకు ఇక్కడ మలేసియాలో ఏర్పాటయే ప్రయత్నాన్ని దిగ్విజయం చేసినటువంటి శ్రీ యం.వి.కృష్ణారావుగారు రావాలని కుతూహలం పడి రాలేకపోయినందుకు నాకు అమితమైన దుఃఖం కలుగుతుంది. కూడ...." అని హర్షధ్వానాల మధ్య అన్నారు.

ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి శాఖామంత్రి శ్రీ అగిశం వీరప్ప చర్చా సదస్సులను ప్రారంభిస్తూ, ఈ విధమైన మహాసభ నిర్వహణను, ఆవశ్యకతను, అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వహించవలసిన పూనికను వివరించారు. విదేశాల్లోని తెలుగువారికి తెలుగు తరగతి పుస్తకాల పంపిణీ, తెలుగు ఉపాధ్యాయుల శిక్షణా సదుపాయాల అవసరాన్ని గురించి నొక్కి చెప్పారు.

కర్ణాటక శాసన మండలి అధ్యక్షులు శ్రీమతి బసవ రాజేశ్వరి ఈ సందర్భంగా మాట్లాడుతూ కన్నడిగులు తెలుగువారి మధ్యనున్న సన్నిహిత సబంధాలను గూర్చి తెలిపారు.

ఇదే వేదికపై శ్రీ జె.బాపురెడ్డి 'నాదవేదాలు' కవితా సంపుటి ఆవిష్కరింపబడి, మలేసియా తెలుగు ప్రజలకు అంకితం చేయబడింది.

డాక్టర్ మోటూరి సత్యనారాయణ కీనోట్ అడ్రెస్‌ను డాక్టర్ సి.సత్యనారాయణ (మద్రాసు) సమర్పించారు. మౌలికమైన ఆలోచనా సరళిద్వారా సమధికోత్సాహాన్ని, చైతన్యాన్ని పెంపొందింపజేయడానికి, వర్ణ, వర్గ వివక్షత, సాంఘిక అసమానత, ప్రతికూల వాతావరణం లేని విధంగా ప్రజోపయోగమైన కార్యక్రమాలను రూపొందించుకోవడానికి ఈ చర్చా సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని డాక్టర్ మోటూరి సత్యనారాయణ తమ కీనోట్ అడ్రెస్‌లో వెల్లడించారు. చర్చా సదస్సు సంఘం అధ్యక్షులు, డాక్టర్ మోటూరి సత్యనారాయణ సభలకు హాజరు కాలేకపోవడం పట్ల సదస్సులో పాల్గొనే విద్వాంసుల సమక్షంలో తమ విచారాన్ని వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ తెలుగు సంస్థ నిర్దేశకులు శ్రీ మాటేటి రామప్ప వేయి తెలుగు వాచకాల ప్రతులను అక్కడి తెలుగు పాఠకులకు కానుకగా అందజేశారు.

రెండవ ప్రపంచ తెలుగు మహాసభల సౌహార్ద చిహ్నంగా రెండున్నర × రెండున్నర సైజులో మహాసభల చిహ్నంగల తామ్ర ఫలకాన్ని శ్రీమతి సుశీలా గంగాధరం అంతర్జాతీయ తెలుగు సంస్థవారికి కానుకగా అందించారు. సంస్థ నిర్దేశకులు శ్రీ రామప్ప దీనిని స్వీకరించారు. చర్చా సదస్సుల సమావేశ కర్తగా వ్యవహరించిన అంతర్జాతీయ తెలుగు సంస్థ ఉపనిర్దేశకులు డాక్టర్ ఎన్.శివరామమూర్తి వందన సమర్పణతో ఈ సమావేశం ముగిసింది.

చర్చా సదస్సులు :

ఎయిర్ కండిషన్డ్ చేయబడిన మూడు వేరు వేరు సమావేశ మందిరాలలో మూడు చర్చా గోష్ఠులు ఏక కాలంలో ప్రారంభించబడ్డాయి. మొదటి సదస్సు ఉదయం 8-30 నుండి 10-30 వరకు, రెండవది ఉదయం 11-00 నుంచి 12-30 వరకు. ఈ విధంగా మొత్తం మూడు రోజులు జరిగిన 18 సదస్సులలో 55 వ్యాసాలు సమర్పించబడ్డాయి. వీటిలో 10 వ్యాసాలు మలేసియా నుంచి, ఒక వ్యాసం అమెరికా నుంచి, మిగతావి భారతదేశం నుంచి వచ్చాయి. వీటి అంశాల వివరాలు కార్యక్రమాల వారీగా తెలియజేయడమయినది. సుప్రసిద్ధ విద్వాంసులు సదస్సులకు అధ్యక్షత వహించగా, ఆంధ్రప్రదేశ్ నుంచి విచ్చేసిన ప్రతినిధులలో ప్రముఖులైన వారు వీటికి ముఖ్య అతిథులుగా వ్యవహరించారు.

మొదట్లో అనుకొన్న విధంగా సదస్సులకు అధ్యక్షత వహించే నిర్ణీత విద్వాంసులలో కొందరి ప్రయాణపు ఏర్పాట్లలో ఇబ్బందులు ఏర్పడడంవల్ల వారు మహాసభలకు హాజరు కాలేకపోయారు. వారి స్థానే హాజరైన వారిలోనుంచి కొందరిని అధ్యక్షులుగా ఏర్పాటు చేయవలసి వచ్చింది. అందువల్ల చివరి నిమిషంలో చర్చా గోష్ఠుల కార్యక్రమ ప్రణాళికలో మొదట అనుకొన్న విధంగా కాకుండా అనివార్యమై స్వల్పమైన మార్పులు చేయవలసి వచ్చింది. ప్రారంభంలో ఈ సదస్సులకు ప్రేక్షకులు అతి తక్కువ సంఖ్యలో హాజరైనప్పటికీ రానురాను ప్రతినిధులంతా పెద్ద ఎత్తున వీటిల్లో పాల్గొని చర్చలను కుతూహలంగా, ఆసక్తికరంగా, విజ్ఞానదాయకంగా నడిపించారు. కొన్ని కొన్ని సదస్సులలో సమావేశ మందిరాలు క్రిక్కిరిసిన ప్రేక్షకులతో నిండిపోయి ఆ సమావేశాలకు గంభీరతను, ఉదాత్తతను చేకూర్చాయి. మలేసియా ఆంధ్ర సంఘం పక్షాన డాక్టర్ ఇ.వి. గంగాధరం, అంతర్జాతీయ తెలుగు సంస్థ పక్షాన డాక్టర్ ఎన్.శివరామమూర్తి ఈ చర్చా గోష్ఠుల నిర్వహణకు సమావేశ కర్తలుగా వ్యవహరించారు. ఈ సదస్సులకు అధ్యక్షత వహించిన వారు, ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు, పత్రాలు సమర్పించిన పండితులు, విద్వాంసులు ప్రతి ఒక్కరూ వీటి విజయానికి తమ సంపూర్ణ సహాయ సహకారాలను అందించారు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, డాక్టర్ వావిలాల గోపాలకృష్ణయ్య, శ్రీ ఎం.గోపాలకృష్ణన్, డాక్టర్ పి.ఎస్.ఆర్.అప్పారావు, శ్రీ వి.వి. మాణిక్యాలరావు వంటి మేధావులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తమ అమూల్యమైన

సలహాలతో కార్యకర్తలకు ఎంతగానో తోడ్పడ్డారు. చర్చా గోష్ఠులలో సమర్పించబడిన వ్యాసాలు అటు మలేసియాలోను, ఇటు భారతదేశంలోను చాలావరకు ముందుగానే ముద్రించబడి సదస్సుల కాలంలో అక్కడి వారికి అందజేయడం జరిగింది. ఈ సదస్సులలో చర్చనీయాంశాలను, ప్రోసీడింగులను, టేపు రికార్డు చేయడం జరిగింది; అనుకూలాన్ని బట్టి వీటిని అద్యతన భావిలో ప్రచురణ రూపంలో తీసుకురావాలని కోరిక. ఇవి మలేసియా విశ్వవిద్యాలయంలోని భారతీయ అధ్యయన శాఖకు ఎంతగానో ఉపకరిస్తాయి. ప్రస్తుతం వ్యాసాల ప్రచురణ కార్యక్రమం జరుగుతోంది. త్వరలోనే పుస్తక రూపంలో వెలువడుతాయి.

సాంస్కృతిక ప్రదర్శన ప్రారంభోత్సవం :

15వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు హోటల్ జయపురిలోని బాల్‌రూంలో సాంస్కృతిక ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. హోటల్ జయపురి సమీపంలో ఉన్న టి.డబ్ల్యు. హాలులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ టి.అంజయ్య ప్రారంభోత్సవం చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభాధ్యక్షులు శ్రీ కోన ప్రభాకర రావు ఈ సమావేశానికి అధ్యక్షత వహించగా, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖామంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి డాక్టర్ అప్పారావు, ప్రొఫెసర్ ఎం. రాధాకృష్ణ శర్మ, ఈ సందర్భంగా ప్రసంగించారు. సాంస్కృతిక ప్రదర్శన నిర్వాహకులు శ్రీ వై.ఆంజనేయులు వందన సమర్పణ చేశారు. ఈ ప్రదర్శనలో ఈ క్రింది అంశాలు ప్రకటించబడ్డాయి.

1. మొదటి ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు. లక్ష్యాలను ప్రతిబింబించే పట్టికలు– ఇవి ఆంగ్లం, తెలుగు, మలే భాషల్లో రూపొందించబడినాయి.
2. మొదటి ప్రపంచ తెలుగు మహాసభల్లోని ముఖ్యమైన రసవత్తర ఘట్టాలను ప్రతిబింబించే 100 ఫోటోలు.
3. ఫైబర్ గ్లాసుతో తయారు చేయబడిన రెండవ ప్రపంచ తెలుగు మహాసభల చిహ్నం.
4. ఆగ్నేయాసియా దేశాల చరిత్ర–సత్సంబంధాలు–ప్రత్యేకించి తెలుగుదేశం అమరావతి. నాగార్జునకొండ, చేజర్ల, జగ్గయ్యపేటలో జరిగిన నాటి వర్తక వాణిజ్యాలు, విదేశీయానాలకు సంబంధించిన 225 పోటోలు.
5. మాలేసియాలోని జాతీయ మ్యూజియం అయిన మ్యూజియం నెగారా వారిచే ఏర్పాటు చేయబడిన భుజంగలోయ త్రవ్వకాలు.
6. నేటి మన ఆంధ్రప్రదేశ్
7. తెలుగు మహనీయులు
8. మలేసియాలోని మూడు తరాల తెలుగువారు
9. తోలు బొమ్మలు.

ఈ సాంస్కృతిక ప్రదర్శనను తిలకించిన వారంతా పరవశించి తెలుగు వైభవాన్ని వేనోళ్ల పొగిడారు.

సాంస్కృతిక కార్యక్రమం-2

15వ తేదీ సాయంత్రం జరిగిన సాంస్కృతిక, చలనచిత్ర ప్రదర్శనా కార్యక్రమాలు కిక్కిరిసిన ప్రేక్షకులతో ద్విగుణీకృతమైన చైతన్యంతో, అతి సంబరంగా జరిగాయి. ప్రేక్షకులంతా అమితానందోత్సాహాలతో వీటిని తిలకించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో రెండవదిగా హోటల్ జయపురిలోని బాల్ రూంలో రాత్రి 7.45 నిమిషాలకు ప్రముఖ వైణికులు శ్రీ చిట్టిబాబు వీణా కచ్చేరి జరిగింది. ఈ మధుర సంగీత వీణానాదం ప్రేక్షకుల వీనులకు అమృతోపమానంగా తోచింది; శ్రావ్యతను చేకూర్చింది. పార్లమెంట్ సభ్యులు, మలేసియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిన శ్రీ వై.బి.డేవిడ్ ఈ కార్యక్రమానికి ప్రధాన పోషకులుగా ఉండగా, అప్పటి ఆంధ్రప్రదేశ్ హోంశాఖా మంత్రి, ఇప్పటి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖా మంత్రి శ్రీ కె.ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అదే వేదికపై తదనంతర కార్యక్రమంగా శ్రీ ఎ.ఆర్.కృష్ణబృందం వారి 'నిచ్చెనలు' నాటిక ప్రదర్శించబడింది.

సాంస్కృతిక కార్యక్రమం -3

సాంస్కృతిక కార్యక్రమాలలో మూడవ భాగంగా 15వ తేదీ రాత్రి 7.45 నిమిషాలకు సివిక్ సెంటర్ హాలులో కె.బి.కె.మోహన్‌రాజు పాడిన 'ఆంధ్రప్రశస్తి' ఆలాపనతో సాంస్కృతిక కార్యక్రమం ప్రారంభమయింది. తదనంతరం శ్రీమతి ఉమా భారతి, శ్రీ రాజారెడ్డి, శ్రీమతి రాధారెడ్డిగార్ల నృత్యప్రదర్శన జరిగింది. మలేసియా యన్.ఎల్.ఎఫ్.సి.ఎస్.లిమిటెడ్ ఛైర్మన్ శ్రీమతి తోపాన్ ఉమా సంబంధన్ ప్రధాన పోషకురాలిగా, కర్ణాటక శాసనమండలి అధ్యక్షులురాలు శ్రీమతి బసవ రాజేశ్వరి ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమం కొనసాగింది.

తెలుగు చలన చిత్రోత్సవానికి ప్రారంభోత్సవం :

15వ తేదీ రాత్రి 10.30 గంటలకు హోటల్ జయపురిలోని బాల్‌రూంలో చలన చిత్రోత్సవానికి ప్రారంభోత్సవం జరిగింది. శ్రీ డి.వి.ఎస్.రాజు దీనిని ప్రారంభించగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ టి.అంజయ్య ముఖ్య అతిథిగా వ్యవహరించారు. శ్రీ ఎం.ఎస్.రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు. తదనంతరం అశేష ప్రజానీకం ఆదరణను చూరగొని విశ్వవిఖ్యాతి నార్జించిన 'శంకరాభరణం' చలన చిత్రాన్ని ప్రదర్శించడమయినది.

చర్చాగోష్ఠులు :

16వ తేదీన నిర్వహించిబడిన చర్చాసదస్సు కార్యక్రమాలు, వాటిలో పాల్గొన్న ప్రముఖులు, విద్వాంసులు సమర్పించిన వ్యాసాంశాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి :

ఉదయం 8.30 నుంచి 10.30 వరకు హోటల్ జయపురిలోని 10వ అంతస్తులోని డి.టి.ఎస్.కె. హాలులో జరిగిన 'మతం-తత్వం' అనే ఒకటో సదస్సుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ చల్లా కొండయ్య అధ్యక్షత వహింపగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ డి.రామానుజులు నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. దీనిలో 1.వేదాలు-తెలుగుసమాజం అనే అంశంపై డాక్టర్ వల్లమూడి గోపాలకృష్ణయ్య, 2.తెలుగు సమాజంపై మహమ్మదీయ మత ప్రభావం అనే అంశంపై శ్రీ జైనుల్ అబేదీన్, 3.మలేసియాలో ఈనాటి హిందూమతం అనే అంశంపై డాక్టర్ యం.ఎస్.పొన్నయ్య (మలేసియా) వ్యాసాలు సమర్పించారు. ఆచార్య రాయప్రోలు సుబ్రహ్మణ్యం సమీక్షకులుగా ఉన్నారు.

ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు అదే వేదికపై జరిగిన 'మతం-తత్వం' రెండో సదస్సుకు ఆచార్య జి.రాంరెడ్డి అధ్యక్షత వహించగా, శ్రీ సి.హెచ్.రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా ఉన్నారు. దీనిలో 1.ఆధునిక మత సంస్కరణలు-ఆంధ్రరాష్ట్రంపై ప్రభావం- ఆచార్య వి.యం.రెడ్డి; 2.జానపద సాహిత్యంలో ప్రతిబింబించిన మతం- డాక్టర్ శ్రీమతి నాయని కృష్ణ కుమారి, 3.ఆధునిక కవిత్వంలోని అందచందాలు- డాక్టర్ అరిపిరాల విశ్వం వ్యాసపత్రాలు సమర్పించారు.

హోటల్ జయపురిలోని 21వ అంతస్తులోని హాలులో ఉదయం 8.30 గంటలనుంచి 10.30వరకు జరిగిన 'భాష' అనే అంశానికి చెందిన మూడవ సదస్సుకు డాక్టర్ ఆర్.దండాయుధం (మలేసియా) అధ్యక్షత వహించగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ మాధవరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. 1.తెలుగుభాష-ముఖ్యలక్షణాలు- ఆచార్య కోరాడ మహాదేవశాస్త్రి, 2.తెలుగు శాసనాలు-ముఖ్య లక్షణాలు- ఆచార్య జి.ఎన్.రెడ్డి, 3.తరతరాలుగా ఆంధ్రదేశంలో విద్య- డాక్టర్ దామోదర్ వ్యాసపత్రాలు సమర్పించారు.

ఉదయం 11.00 నుండి మధ్యాహ్నం 12.30 వరకు అదే వేదికపై జరిగిన 'భాష' నాలుగవ సదస్సుకు ఆచార్య ఎం.వి.రామశర్మ అధ్యక్షులుగా న్యాయమూర్తి శ్రీ కె.పున్నయ్య ముఖ్య అతిథిగా వ్యవహరించారు. దీనిలో 1.తెలుగులో అన్యదేశాలు-సాంస్కృతిక సంబంధాలు- ఆచార్య తూమాటి దోణప్ప, 2.తెలుగు సాహిత్యంపై పాశ్చాత్య సాహిత్య ప్రభావం- ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు, 3.తెలుగు భాషా సాహిత్యాలకు పాశ్చాత్యుల సేవ- ఆచార్య అడపా రామకృష్ణారావు పత్రాలు సమర్పించారు.

హోటల్ జయపురిలోని మొదటి అంతస్తు 6వ గదిలో ఉదయం 8.30 గంటల నుండి 10.30 గంటల వరకు జరిగిన 'సాహిత్యం' అనే అంశానికి చెందిన అయిదవ సదస్సుకు ఆచార్య జాఫర్ నిజాం అధ్యక్షత వహించారు. శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య ఎం.ఎల్.ఎ. ముఖ్య అతిథిగా వ్యవహరించారు. ఇందులో 1.సామాజికాలోచన-అభివృద్ధి : నవలయొక్క పాత్ర అంశంపై కుమారి వాసిరెడ్డి సీతాదేవి, 2.సామాజికాలోచన-అభివృద్ధి మార్పులకు కథానిక పాత్ర అంశంపై శ్రీ పోతుకూచి సాంబశివరావు, 3.ఆధునిక సాహిత్యంలో సమాజం అంశంపై డాక్టర్ శ్రీమతి సి.ఆనందారామం వ్యాసాలు సమర్పించారు.

ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు అదే వేదికపై 'సంస్కృతి' ఆరవ సదస్సుకు శ్రీ కె.వి.గోపాలస్వామి అధ్యక్షులుగా శ్రీ యం.వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా ఉన్నారు. ఇందులో 1.ఆచార్య యస్వీ జోగారావు 'ఆంధ్రరాష్ట్రంలో ప్రజానాటక రంగం' పై, 2.శ్రీ రాజా రామ్ దాస్ 'తెలుగు సమాజము- సినిమాలు' పై, 3. కుమారి టి.వి.రత్నం 'తెలుగునాట సాంస్కృతిక పునరుజ్జీవనం'పై వ్యాసపత్రాలు చదివి వినిపించారు.

కౌలా పెరాక్ సందర్శన :

16వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటలకు కౌలాలంపూర్ నుంచి సుమారు 100 కి.మీ. దూరంలో ఉన్న కౌలాపెరాక్ సందర్శించడం జరిగింది. తెలుగు వారు అత్యధిక సంఖ్యలో ఇక్కడ స్థిరనివాసమేర్పరచుకొని ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ టి. అంజయ్య, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి, ఇతర అధికారులు, కళాకారులు ఈ ప్రదేశాన్ని సందర్శించారు.

శ్రీ టి.అంజయ్య, శ్రీ భాట్టం శ్రీరామమూర్తి, శ్రీమతి జమున ఈ సందర్భంగా ప్రసంగించారు. ఆ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రామాయలయాన్ని కూడా వీరు సందర్శించారు.

కవి సమ్మేళనం :

16వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటలకు హోటల్ జయపురిలోని బాల్‌రూంలో కవిసమ్మేళనం ఏర్పాటు చేయడమయినది. దీనికి ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవులు డాక్టర్ దాశరథి అధ్యక్షత వహించగా, ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖామంత్రి శ్రీ ఇ. అయ్యపు రెడ్డి ముఖ్యఅతిథిగా వ్యవహరించారు. మొత్తం 21 మంది కవులు, కవయిత్రులు పాల్గొని తమ కమనీయ కవనంతో శ్రోతలకు రసానందాన్ని అందించారు. వీరిలో ముగ్గురు మారిషస్ నుంచీ, ఒకరు మలేసియా నుంచి పాల్గొన్న కవులుండటం విశేషాంశం. ఇంకా ఈ వేదికపై మారిషస్, ఫిజీనుంచి వచ్చిన సోదర ప్రతినిధులు కొందరు వారికున్న సాంస్కృతిక సమస్యల గురించి ఒకటి రెండు మాటలు మనసు విప్పి చెప్పుకున్నారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులందరినీ మలేసియా ఆంధ్రసంఘంవారు మహాసభల చిహ్నం ఉన్న పతకాలచే సత్కరించారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి, డాక్టర్ బోయి భీమన్న, డాక్టర్ కొలకలూరి ఇనాక్, డాక్టర్ అరిపిరాల విశ్వం, డాక్టర్ శ్రీమతి నాయని కృష్ణకుమారి, డాక్టర్ శ్రీమతి పి.యశోదారెడ్డి, శ్రీ జె.బాపురెడ్డి, శ్రీ

పోతుకూచి సాంబశివరావు, శ్రీ ఎల్లోరా, శ్రీమతి శారదా అశోక వర్ధన్, శ్రీమతి బి.హైమావతి, డాక్టర్ శ్రీమతి సి.ఆనందారామం, డాక్టర్ వడ్లమూడి గోపాలకృష్ణయ్య, శ్రీ ఎం.ఎస్.రెడ్డి, శ్రీ బి.ఎన్.రెడ్డి, శ్రీ హజీజ్ యాకుబీ(ఆంధ్రప్రదేశ్ ఆస్థాన ఉర్దూకవులు), శ్రీ బీసెట్టి నూకయ్య, (మలేసియా), శ్రీ నరసింహులు రామయ్య (మారిషస్), శ్రీ సీతారాముడు సన్యాసి (మారిషస్), శ్రీ బాల అచ్చన్న మారిషస్, శ్రీ అల్లం సింహాచలం– ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమం - 4

అదే రోజు రాత్రి 7.45లకు హోటల్ జయపురిలోని బాల్‌రూంలో శ్రీమతి జలజాకుమార్ నృత్య ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమంలోని నాల్గవ అంశం ప్రారంభమయింది. తదనంతరం కుమారి ఉమామహేశ్వరి హరికథా కాలక్షేపం జరిగింది.ఈ కార్యక్రమాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. శ్రీ వై.బి.వి.గోవిందరాజ్ ప్రధాన పోషకులుగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖామంత్రి శ్రీ ఎం.ఎ.అజీజ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

సాంస్కృతిక కార్యక్రమం-5

అదే సమయంలో సివిక్ సెంటర్ హాలులో డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గాత్ర కచ్చేరీతో సాంస్కృతిక కార్యక్రమంలోని 5వ భాగం ఆరంభమైంది. సెనేటర్ టాన్‌శ్రీ ఉబయదుల్లా ప్రధాన పోషకులుగా ఉన్న ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి అధ్యక్షులు శ్రీ సయ్యద్ ముకసిర్ షా ముఖ్య అతిథి.

చలనచిత్ర ప్రదర్శన :

హోటల్ జయపురిలో రాత్రి 10.15 గంటలకు 'భక్తకన్నప్ప' తెలుగు చలనచిత్రాన్ని ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వాణిజ్యపన్నుల శాఖమంత్రి శ్రీ మాణిక్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

చర్చాగోష్ఠులు :

17వ తేదీన జరిగిన చర్చాసదస్సులు ఈ క్రింది విధంగా కొనసాగాయి.

ఉదయం 8.30 గంటలనుంచి 10.30 వరకు హోటల్ జయపురిలోని 10వ అంతస్తులోని డి.టి.ఎస్.కె.హాలులో జరిగిన 'సంస్కృతి' ఏడవ సదస్సుకు శ్రీ ఎం.ఆర్.అప్పారావు (పార్లమెంటు సభ్యులు) అధ్యక్షులుగా, ఎల్.కె.మహేంద్ర ఎం.ఎల్.ఏ ముఖ్య అతిథిగా ఉన్నారు. ఇందులో 1.మానవ సమాజాభివృద్ధి కళల పాత్ర– డాక్టర్ సి.సత్యనారాయణ, 2.తిరువళ్లువారు–వేమన తులనాత్మక పరిశీలన– డాక్టర్ ఆర్.దండాయుధం (మలే విశ్వవిద్యాలయం) వ్యాసాలు సమర్పించగా, శ్రీ ఎస్.రామానాయుడు సమీక్షకులుగా ఉన్నారు.

ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు అదే వేదికపై జరిగిన 'పారిశ్రామికాభివృద్ధి' ఎనిమిదవ సదస్సులో ఆచార్య జి.ఆర్.దామోదరన్ అధ్యక్షులుగా, శ్రీ పి.నరసారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో 1.ఆంధ్రరాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి–డాక్టర్ జె.కొండలరావు, 2.తమిళనాడు సామాజిక సాంస్కృతికాభివృద్ధికి తమిళనాడు తెలుగుసేవ– ఆచార్య జి.ఆర్.దామోదరన్, 3.ఆంధ్రుల సిరిసంపదలు–నాగరికత– శ్రీ ముక్కామల నాగభూషణం వ్యాసాన్ని డాక్టర్ శివరామమూర్తి సమర్పించారు.

హోటల్ జయపురిలోని 21వ అంతస్తులో ఉదయం 8.30 నుంచి 10.30 వరకు జరిగిన 'మతం–తత్త్వం'తొమ్మిదవ సదస్సుకు శ్రీ యం.గోపాలకృష్ణన్ అధ్యక్షత వహించగా, శ్రీ గౌతు లచ్చన్న ఎం.ఎల్.ఏ. ముఖ్యఅతిథిగా వ్యవహరించారు. డాక్టర్ గొడవర్తి శ్రీరామమూర్తి సమీక్షకులుగా ఉన్నారు. దీనిలో 1.తెలుగు సమాజం మీద జైనమత ప్రభావం– ఆచార్య రాయప్రోలు సుబ్రహ్మణ్యం, 2.తెలుగు సమాజం మీద బౌద్ధ మత ప్రచారం– ఆచార్య కమలనాధన్, 3.అవర్ హెరిటేజ్ ఆఫ్ స్పిరిట్–ఆచార్య వి.మధుసూదన్ రెడ్డి వ్యాసాలు సమర్పించారు.

అదే వేదికపై ఉదయం 11.00 నుంచి 12.30 వరకు జరిగిన 'భాష' అనే అంశంపైని పదవ సదస్సుకు అధ్యక్షులుగా ఆచార్య ఎస్.సింగారవేలు (మలేసియా), శ్రీ ఎ.ఈశ్వరరెడ్డి ఎం.ఎల్.ఎ. ముఖ్య అతిథిగా హాజరయినారు. డాక్టర్ దాశరథి ఈ సదస్సుకు సమీక్షకులు. ఇందులో 1.బహుభాషాభాషిత సమాజంలో మాతృభాష యొక్క పాత్ర– తెలగవతి కనకరత్నం (మలేసియా), 2.మలయ భాషామారుతంలో తెలుగు తేనెల చినుకులు–డాక్టర్ ఈశ్వర గంగాధరం (మలేసియా) వ్యాసపాత్రాలు సమర్పించారు.

హోటల్ జయపురిలోని మొదటి అంతస్తులో 6వ నెంబరు గదిలో ఉదయం 8.30 నుండి 10.30 వరకు జరిగిన 'సాహిత్యం' 11వ సదస్సుకు డా॥వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షులుగా, శ్రీ జూపూడి యజ్ఞనారాయణ ఎం.ఎల్.ఏ. ముఖ్య అతిథిగా ఉన్నారు. డాక్టర్ ఇరివెంటి కృష్ణమూర్తి సమీక్షకులుగా వ్యవహరించారు. ఇందులో 1.జానపద విజ్ఞానము– తెలుగు సంఘం– ఆచార్య బి.రామరాజు, 2.ఆధునిక తెలుగు విమర్శ వినూత్న ప్రయోగాలు–డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం, 3.ఆంధ్రనాటక కళాపరిషత్తు పూర్వాపరాలు–ఆచార్య ఎం.ఆర్.అప్పారావు వ్యాస సమర్పణ చేశారు.

అదే వేదికపై ఉదయం 11.00 నుంచి 12.30 వరకు జరిగిన 'సంస్కృతి' పన్నెండవ సదస్సుకు శ్రీ మదిని సోమనాయుడు అధ్యక్షత వహించగా, శ్రీ ఎస్. జైపాల్‌రెడ్డి ఎం.ఎల్.ఏ. ముఖ్యఅతిథిగా విచ్చేశారు. 1.శ్రీ వి.కె.శర్మ (మలేసియా)–తెలుగు వారు – తెలుగుదనం అంశంపై,

2.ఆచార్య ఎం.డీ. ఎఫ్.నోబెర్గ్ (అమెరికా)–పూర్వ కాలం నుంచి తెలుగువారి పేర్లలో మార్పులు అంశంపై, 3.డాక్టర్ పి. యశోదారెడ్డి–శతక సాహిత్యము తెలుగు సమాజముపై ప్రభావము అనే అంశంపై వ్యాసాలు సమర్పించారు.

మలేసియా ఆంధ్ర సంఘం రజతోత్సవం :

అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.30 గంటలవరకు మలేసియా ఆంధ్ర సంఘంవారి రజతోత్సవాలు జరిగాయి. మలేసియా జనశక్తి కార్మికశాఖా ఉప ప్రధాని శ్రీ వై.బి.దాతుక్, కె.పద్మనాభన్ ఈ ఉత్సవాలకు ప్రారంభోత్సవం చేశారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతి వ్యవహారాల శాఖామంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖా మంత్రి శ్రీ ఇ.అయ్యపురెడ్డి ఈ సందర్భంగా ప్రసంగించారు. ఇదే వేదికపై మలేసియా ఆంధ్ర సంఘంలోని ఆరుగురు ప్రముఖ వ్యక్తులను సత్కరించడం జరిగింది. రజతోత్సవాల సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించడమైనది. అంతర్జాతీయ తెలుగు సంస్థ సహకారంతో ఈ ప్రత్యేక సంచిక ప్రచురణ ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది. ఈ సందర్భంగా మలేసియా ఆంధ్రసంఘం కార్యకలాపాలను సమీక్షిస్తూ, ఆ సంఘం వ్యవస్థాపకులను సంస్మరిస్తూ వారికి అంజలి ఘటించడం జరిగింది.

సాంస్కృతిక కార్యక్రమం-6

అదే రోజు రాత్రి 7.45లకు జయపురి హోటల్ బాల్‌రూంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ముందుగా కుమారి రాణి కౌసల్య నృత్య ప్రదర్శన, ఆ తరువాత ధ్వన్యనుకరణ సామ్రాట్ డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ 'మిమిక్రీ' ప్రేక్షకులను అలరించాయి. అందులోని చివరి అంశంగా మద్రాసు సినీ ఆర్టిస్ట్ అసోసియేషన్ పక్షాన 'మనస్తత్వాలు' నాటిక ప్రదర్శించడమయినది. ఇందులో శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, డా॥ప్రభాకరరెడ్డి, శ్రీ సత్యనారాయణ, శ్రీ అల్లు రామలింగయ్య, శ్రీ శరత్‌బాబు, శ్రీ సారథి, కుమారి జయచిత్ర, శ్రీమతి రమాప్రభ, కుమారి కాంచన పాల్గొన్నారు. పార్లమెంట్ సభ్యులు శ్రీ సత్యనారాయణ, శాసనమండలి సభ్యులు శ్రీ ఎం.బాలకృష్ణయ్య ముఖ్య అతిథులుగా, శ్రీ రంగస్వామి పిళ్ళే ప్రధాన పోషకులుగా ఈ కార్యక్రమానికి విచ్చేశారు.

సాంస్కృతిక కార్యక్రమం-7

అదే సమయంలో 7.45 లకు సివిక్ సెంటర్ హాలులోని సాంస్కృతిక కార్యక్రమాల్లోని మొదటి అంశంగా కుమారి శోభానాయుడు నృత్యవిన్యాసం జరిగింది. ఈ నృత్యంలోని అభినయ కౌశలం, హావభావ ప్రకటన ప్రేక్షకులను సమ్మోహన పరిచాయి. ఆ తరువాత కార్యక్రమంగా శ్రీమతి సుందరమ్మ పార్థసారథి గాత్రకచ్చేరి కొనసాగింది. ఈ అంశాలు కార్యక్రమాన్ని రక్తి కట్టించాయి. సెలాంగూర్ శాఖ సభ్యులు, స్టేట్ ఎగ్జి.క్యూటివ్ కౌన్సిల్, దాతుక్ వి.యల్.కందన్ ప్రధాన పోషకులుగా ఉన్న ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి శాఖా మంత్రి శ్రీ అగిశం వీరప్ప ముఖ్యఅతిథిగా హజరయినారు.

చలనచిత్ర ప్రదర్శన

రాత్రి 10.45 లకు హోటల్ జయపురిలోని బాల్‌రూం హాలులో 'జీవనజ్యోతి' తెలుగు చలన చిత్రాన్ని ప్రదర్శించడమైనది. ఈ కార్యక్రమానికి శ్రీ సలావుద్దీన్ ఓవైసీ ముఖ్యఅతిథిగా ఉన్నారు.

చర్చా గోష్ఠులు

17వ తేదీన ఈ క్రింది అంశాలపై ఆయా విద్వాంసులు సమర్పించిన పత్రాలపై చర్చా సదస్సులు జరిగాయి.

ఉదయం 8.30 గంటలనుంచి 10.30 వరకు హోటల్ జయపురిలోని 21వ అంతస్తులో జరిగిన 'సంస్కృతి' పదమూడవ సదస్సుకు ఆచార్య యస్. సింగారవేలు (మలేసియా) అధ్యక్షులుగా; శ్రీ యన్.దుర్గయ్య 'మలేసియా' ముఖ్య అతిథిగా వ్యవహరించారు. ఇందులో (1) 'ఆగ్నేయాసియా దేశాల్లో తెలుగు సంస్కృతి వ్యాప్తి' పై ఆచార్య శ్రీ వై. శ్రీరామమూర్తి; (2) 'సాంఘిక సంస్కరణలు–ఆంధ్రదేశంపై వాటి ప్రభావం' పై ఆచార్య సరోజినీ రేగాణి (వీరి వ్యాసాన్ని ఆచార్య ఆర్. సుబ్రహ్మణ్యంగారు చదవడం జరిగింది); (3) 'ఆంధ్రరత్న జీవిత చరిత్రలో మరుగుపడిన ఒక అధ్యాయం'పై శ్రీ దొరై రాజసింగం (మలేసియా) శ్రీ ఈశ్వర గంగాధరం (మలేసియా); (4) 'మలక్కా నుంచి లక్ష్మణ హంగ్‌తువా విజయనగరానికి రాయబారిగా రావడం' పై ఆచార్య యస్. సింగారవేలు వ్యాసపత్రాలు సమర్పించారు.

ఆదే వేదికపై ఉదయం 11.00 నుంచి 12.30 వరకు జరిగిన 'లలితకళలు' పద్నాలుగో సదస్సుకు శ్రీ జె.వి. సోమయాజులు అధ్యక్షులుగా, శ్రీమతి కస్తూరిబాయి కృష్ణంరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఇందులో (1) 'తెలుగు సినిమాపాటలు' డాక్టర్ కొలకలూరి ఇనాక్, (2) 'ఆధునిక తెలుగుకవిత్వం: ఒక పరిశీలన' శ్రీ టి. గౌరీశంకర్, (3) 'కూచిపూడి నృత్యం' శ్రీ వెంపటి చినసత్యం, (4) 'ఆంధ్ర నాటకరంగం ' శ్రీ పీసపాటి నరసింహమూర్తి వ్యాసాలు సమర్పించారు. ఈ సదస్సుకు శ్రీ జి. రామకృష్ణారావు సమీక్షకులుగా వ్యవహరించారు.

ఉదయం 8.30 నుంచి 10.30 వరకు హోటల్ జయపురి పదవ అంతస్తులోని సమావేశమందిరంలో జరిగిన 'సంస్కృతి' పదిహేనవ సదస్సుకు శ్రీ యం.వి.నారాయణరావు అధ్యక్షులుగా, శ్రీ విజయన్ (మలేసియా) ముఖ్య అతిథిగా వున్నారు. దీనిలో (1) 'మలేసియాలో వివిధ

వర్గాలలో సాంస్కృతిక సంబంధాల పాత్ర'పై శ్రీ మురుగేశు పద్మనాభన్ (మలేసియా); (2) 'మలేసియాలో తెలుగుల సంస్కృతి తీరుతెన్నులు' పై శ్రీ ఆర్.రాజు (మలేసియా); (3) 'భారతీయ సంస్కృతికి తెలుగుల సేవ'పై డాక్టర్ పి.వెంకటరాజు, (4) 'సంస్కృత సాహిత్యానికి తెలుగుల సేవ' డాక్టర్ గొడవర్తి శ్రీరామమూర్తి వ్యాసాలు సమర్పించారు. ఈ సదస్సుకు శ్రీ తిరుమల రామచంద్ర సమీక్షకులుగా ఉన్నారు.

అదే వేదికపై ఉదయం 11.00 నుండి 12.30 వరకు జరిగిన 'సాంస్కృతిక సామాజిక సమస్యలు, పదహారవ సదస్సుకు శ్రీ ఎన్.వి.రావు అధ్యక్షులుగా, డాక్టర్ డి.దయానంద ముఖ్య అతిథిగా ఉంటే, శ్రీ వేమూరి రాధాకృష్ణమూర్తి సమీక్షకులుగా వ్యవహరించారు ఇందులో (1) ' మలేసియాలో తెలుగుల-విద్య ఆర్థిక సాంస్కృతిక సమస్యలు' పై బి.ఏ. దేముడు (మలేసియా); (2) "ఆగ్నేయాసియా దేశాల్లో తెలుగు విద్య సాంస్కృతిక సమస్యలు"పై ఆచార్య డి.యన్.రావు; (3) 'దక్షిణాఫ్రికా, మారిషస్ దేశాల్లో తెలుగుల విద్యా సాంస్కృతిక సమస్యలు' పై ఆచార్య యస్.జె. జాన్ (వీరి వ్యాసాన్ని డాక్టర్ ఆనందమూర్తి చదవడం జరిగింది) వ్యాసాలు సమర్పించారు.

ఉదయం 8.30 నుంచి 10.30 వరకు హోటల్ జయపురిలోని మొదటి అంతస్తు 6వ నెంబరు సమావేశ మందిరంలో జరిగిన 'సాహిత్యం' పదిహేడవ సదస్సుకు శ్రీ మదిని సోమనాయుడు అధ్యక్షత వహించారు. శ్రీ కోదాటి నారాయణరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సదస్సులో (1) శ్రీమతి డాక్టర్ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ 'ఆంధ్ర కవయిత్రులు అంశంపై; (2) శ్రీమతి అజయ్ హమీద్ 'ఆగ్నేయాసియా దేశాల్లో బాల సాహిత్యం ' అంశంపై; (3) శ్రీమతి బి. హేమలత 'ఆంధ్రదేశంలో స్త్రీల పాత్ర' అంశంపై (వీరి వ్యాసాన్ని డాక్టర్ నళినీ కుమారిగారు చదివారు) వ్యాసాలు సమర్పించారు.

ఆదే వేదికపై ఉదయం 11.00 నుంచి 12.30 వరకు 'సాహిత్యం' విభాగానికి చెందిన పద్దెనిమిదవ సదస్సులో డాక్టర్ బోయి భీమన్న అధ్యక్షులుగా, శ్రీ శర్మ ముఖ్య అతిథిగా, శ్రీ సుబ్బన్న శతావధాని సమీక్షకులుగా వ్యవహరించారు. ఈ చర్చా గోష్ఠిలో (1) 'పోతన-తిక్కన-వేమన: తెలుగు ఆలోచన, సంస్కృతులపై వారి ప్రభావం' అంశంపై ఆచార్య గంధం అప్పారావు; (2) 'దక్షిణభారత-ఆగ్నేయాసియా కళాచరిత్ర - కొన్ని సమస్యలు'పై ఆచార్య యం.రాధాకృష్ణ శర్మ, (3) 'మలేసియాలో మూడు తరాల తెలుగువారు' పై శ్రీ ఎ. అప్పన్న వ్యాసపత్రాలను సమర్పించారు.

ప్రతినిధుల ముగింపు సమావేశం

మధ్యాహ్నం 2.00 నుంచి 4.00 వరకు హోటల్ జయపురిలోని బాల్‌రూం వేదికపై ప్రతినిధుల సమావేశం జరిగింది. మలేసియా ఆంధ్ర సంఘం వారు మహాసభలకై స్థానికంగా చేసిన ఏర్పాట్లపట్ల, అందించిన హార్దిక స్వాగతం పట్ల, చూపించిన ఆదరాభిమానాల పట్ల వివిధ దేశాలనుంచి వచ్చిన మహాసభల ప్రతినిధులు తమ సంతృప్తిని, సంతోషాన్ని వ్యక్తపరిచారు; నిర్వాహకులను అభినందించారు. అంతేకాదు మారిషస్, ఫిజీ, మలేసియాలోని తెలుగు వారి సాంస్కృతిక అవసరాలపట్ల, విద్యా విషయక సౌకర్యాలపట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపిన ఉదారతను కొనియాడారు. సాంస్కృతిక బృందాలను పంపడంలో, వృత్తి విద్యా కోర్సులలో సీట్లు కల్పించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న సహకారాన్ని గమనిస్తూ, చేయవలసిన సహాయాన్ని సూచించడం జరిగింది. వివిధ దేశాలనుంచి వచ్చిన ప్రతినిధులను వేదికపై నుంచి సభికులకు పరిచయం చేయడం అంతాకలిసి ఫోటో తీసుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రతినిధులు కూడా ఇందులో పరిచయం చేయబడ్డారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖా మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి సభను ఉద్దేశించి ప్రసంగించారు.

ముగింపు సమావేశం

18వ తేదీ సాయంకాలం 4.30 నుంచి 6.30 వరకు హోటల్ జయపురిలోని బాల్‌రూం వేదికపై మహాసభల ముగింపు సమావేశం జరిగింది. డాక్టర్ పి.పి. నారాయణ (నేషనల్ ప్లాంటేషన్, యూనియన్ ఆఫ్ మలేసియా) ముఖ్య అతిథిగా వచ్చారు. ఆయన తమ స్నాతకోపన్యాసంలో భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ వైద్య కళాశాలను స్థాపించాలని కోరారు. తద్వారా విదేశాలలో భారతీయులకు ఎంతో దోహదం కలుగుతుందన్నారు. ఇందుకు కావలసిన నిధులను విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి కూర్చుకొనవచ్చని తెలియజేశారు. దీని ద్వారా విదేశాల్లో ఉన్న భారతీయుల జీవనస్థాయిని అత్యున్నతంగా పెంచే ఒక మహాలక్ష్యాన్ని సిద్ధింప చేసుకోవచ్చునని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖామంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి ఈ సభకు అధ్యక్షత వహిచగా, ఆంధ్రప్రదేశ్ శాసన సభాధ్యక్షులు శ్రీ కోన ప్రభాకరరావు, ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖా మంత్రి శ్రీ ఇ. అయ్యపురెడ్డి ఈ సందర్భంగా ప్రసంగించారు.
మంత్రులు, న్యాయాధిపతులు, పార్లమెంట్ సభ్యులు, ఉభయ శాసనసభల సభ్యులు, అంతర్జాతీయ తెలుగు సంస్థ పాలక మండలి సభ్యులు, విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు అందరూ ఆసీనులై ఉన్న ఈ వేదిక కళకళలాడుతూ కనుల పండువు చేసింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహాయ సహకారాలతో అంతర్జాతీయ తెలుగు సంస్థ తోడ్పాటుతో మహాసభలు దిగ్విజయం చేయడంలో మలేసియా ఆంధ్రసంఘం నిర్వహించిన పాత్రను, వారి ఏర్పాట్లపట్ల కృతజ్ఞతలను తెలియపరిచారు అంతర్జాతీయ తెలుగు సంస్థ పాలకమండలి సభ్యులు డాక్టర్ సి. నారాయణరెడ్డి అనేక కరతాళ ధ్వనులమధ్య, హర్షామోదాలమధ్య వాటిని తీర్మాన రూపంలో ప్రతిపాదించారు.

ప్రతినిధుల ప్రయాణపు ఏర్పాట్లలో కొన్ని అసౌకర్యాలు కలిగినప్పటికీ మొత్తంమీద రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతంగా జరిగాయనే సంతృప్తి, సంతోషం ప్రతివారి వదనంలో కనిపించాయి. అంతర్జాతీయ తెలుగు సంస్థ అధ్యక్షులు శ్రీ మండలి వెంకటకృష్ణారావు, ఇతర ప్రముఖులు, విద్వాంసులు, కళాకారులు కొందరు రాకపోవడంపట్ల ప్రతినిధులు తమ విచారాన్ని వెల్లడించారు.

సాంస్కృతిక కార్యక్రమం -8

అదే రోజు రాత్రి 7.45 లకు హోటల్ జయపురిలోని బాల్‌రూం సమావేశ మందిరంలో శ్రీ యం. యస్. పద్మారావు వేణుగాన కచ్చేరీతో సాంస్కృతిక కార్యక్రమాల్లోని చివరి అంశం ప్రారంభమైంది, మిష్టర్ ఆంధ్ర శరీర దారుఢ్య ప్రదర్శనం, శ్రీ అమ్ముల విశ్వనాథ్ భాగవతార్ హరికథా కాలక్షేపం. శ్రీమతి సరళ హిందూస్థాని గాత్ర కచ్చేరీ తరువాతి అంశాలుగా ప్రదర్శించబడి ప్రేక్షకులను రంజింపచేశాయి. పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగంటి అంకినీడు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

సాంస్కృతిక కార్యక్రమం -9

అదే వేళలో సివిక్ సెంటర్ హాలులో శ్రీ పీసపాటి నరసింహమూర్తి, శ్రీ రామసుబ్బారెడ్డి గార్లచే 'పాండవ విజయం'లోని కొన్ని ఘట్టాలు ప్రదర్శించబడినాయి. అనంతరం శ్రీమతి జమున బృందం వారిచే 'శ్రీకృష్ణ తులాభారం ' పౌరాణిక నాటకం ప్రదర్శించబడింది. ఈ కార్యక్రమాలు ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని చేశాయి. తెలుగువెలుగులు నేల నాలుగు చెరగులా విరజిమ్మే విధంగా ఈ రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు ఒక వెన్నెల పుంతగా తెలుగు చరిత్రలో నిలిచి పోయాయనడంలో సందేహం లేదు.

అనువాదం : టి. గౌరీశంకర్

ఇలా తలంపై
తెలుగు దివ్వెలను
వెలిగించిన మన
తెలుగు సోదరులు
తెలుగుతల్లి కిట
వెలుగు పూలతో
మాలిక లిచ్చీ
మన్నన లిచ్చీ
పూజ చేయుటకు
భక్తిచూపుటకు
వచ్చినారదే! వెల్లువలాగా!
ఉగాదిపండుగ పర్వదినాన !
ప్రపంచమంతా విపంచికాగా
తెలుగు పాటలే పాడాలి !
వెలుగుబాటలే వేయాలి !
గత చరిత్రలో కానము వినము
వివిధ రాష్ట్రముల వివిధ దేశముల
వివిధ సంస్కృతుల విన్యాసంలో
తెలుగువన్నెలను తేనె రుచులనూ
తియ్యగ కలిపి, తేటగ నిలిపీ
ప్రపంచ గీతికి ప్రణవంలాగా
ప్రసాద రీతికి పరువంలాగా
తరతరాలుగా తరంగాలుగా

విలసిల్లే మన తెలుగువార లొక
వేదికపై నడయాడే ఘట్టము
గత చరిత్రలో కానము వినము !
భవిష్యత్తుకే ఇదియొక వరము !
శాతవాహనులు చళుక్యరాజులు
కాకతీయులూ కృష్ణరాయలూ
తెలుగునేల నొక గొడుగునీడలో
నిలపాలని కృషి చేసినవారే !
ఆంధ్రరాష్ట్ర సముపార్జనలోనూ
విశాలాంధ్ర నిర్మాణములోనూ
ఆంధ్రజాతిలో ఆనాదినుంచీ
అమరంగా అభివృద్ధి చెందుతూ
ఆకృతి దాల్చిన ఆశయ మదియే !
తెలుగువార మొక వెలుగువాకలా
కలసిమెలసి జీవించినప్పుడే
భారతమ్ములో ప్రతిష్ఠ నిలుచును !
భవిష్యత్తులో భాగ్యము పెరుగును !
సమైక్య శక్తికి నిదర్శనంగా
సమాన దృష్టికి దృష్టాంతంగా
తెలుగువార మొక బాటన నడిచీ
తెలుగుభాషలో రాజ్యము నడిపీ
కష్టజీవులకు కలిమిని పెంచీ
కళామతల్లికి కానుక లిచ్చీ

ఆంధ్రప్రదేశ రాష్ట్రాన్నంతా
ఆదర్శంగా అలంకరించీ
అఖిల విశ్వమున భరతఖండమున
ఆంధ్రజాతినే అమరం చేద్దాం !
ఇలాతలంలో ఏ ప్రాంతంలో
ఎక్కడనున్నా ఎన్నాళ్ళున్నా
తెలుగుభాషనూ తెలుగు సంస్కృతిని
మరువలేరు మన సోదరులెప్పుడు !
కలసియుండు మన తెలుగుజాతికై
కలతలు మానిన స్నేహరాశికై
కలలుగన్న మనజాతి జీవితము
తెలుగు మహాసభ ప్రతిబింబించును !
ప్రపంచమంతా ప్రతిధ్వనించును !
మరువలేని ఈ మధుర ఘట్టమును
చిరకాలము మనజాతి చరిత్రలో
సువర్ణ పంక్తుల నలంకరిద్దాం !
శుభోదయంగా గానంచేద్దాం !
ఎప్పుడు వచ్చే
ఉగాది కాదిది
విశ్వదృష్టికే
యుగాది ! నిజమిది !

– మండలి వెంకట కృష్ణారావు

గోవిందరాజు రామకృష్ణారావు

మారిషస్‌లో తృతీయ ప్రపంచ తెలుగు మహాసభలు

1990 డిసెంబరు 13 సాయంత్రం 5.45 గంటలకు (భారతకాలమానం 7.15 గంటలకు) ఎయిర్ మారిషస్ విమానం సర్ శివసాగర్ రాంగులాం (మారిషస్) విమానాశ్రయం నుంచి రివ్వున ఆకాశంలోకి దూసుకుపోయింది. 'ఎయిర్ షో' ప్రయాణ వివరాలు అందిస్తోంది. భూమినుంచి దాదాపు 39,000 అడుగుల ఎత్తున గంటకు 870 కిలోమీటర్ల వేగంతో హిందూ మహాసముద్రం మీద విమానం ప్రయాణిస్తోంది. భూమధ్యరేఖను దాటి ముందుకు సాగిపోతోంది.

మూడవ ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన సాంస్కృతిక ప్రతినిధివర్గంలోని కళాకారులూ, సభ్యులూ అందాలదీవి మారిషస్‌లో వారం రోజులు గడపినా వారిలో ప్రతి ఒక్కరికీ అక్కడ రెండు మూడు రోజులే వున్నట్లు అనిపించింది. చక్కటి అనుభూతులు వారి హృదయాల్లో నిలిచి పోయాయి. ఆంధ్రప్రదేశ్‌నుంచి ఈ మహాసభలకు వెళ్లిన సాంస్కృతిక ప్రతినిధి వర్గానికి తెలుగువిశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు, ప్రముఖ కవులు డా॥ సి. నారాయణరెడ్డి నాయకత్వం వహించారు. ప్రసిద్ధ చలనచిత్ర నటులు నటసామ్రాట్ డా॥ అక్కినేని నాగేశ్వరరావు గౌరవ అతిథిగా మహాసభల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సారథ్య సంఘం లైజాన్ ఆఫీసర్, సాంస్కృతిక వ్యవహారాల శాఖ డైరెక్టరు శ్రీ సి.వి. నరసింహారెడ్డి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు డా॥ఎన్. శివరామమూర్తి, విశ్వవిద్యాలయం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి శ్రీ జి. రామకృష్ణారావుకూడా ఈ ప్రతినిధి వర్గంలో వున్నారు. సాంస్కృతిక బృందాలు – కూచిపూడి నాట్యం: శ్రీ రాజారెడ్డి శ్రీమతి రాధారెడ్డి, శ్రీ సోమా దయానంద్, శ్రీ బి. భాస్కరరావు, శ్రీ అన్నాదొరై, శ్రీ ఎన్.వి.రావు, భక్తి లలిత సంగీతం: శ్రీమతి శోభారాజ్, డా॥ ఎస్. నందకుమార్, శ్రీ దత్తా, శ్రీ ప్రభాకర్, శ్రీ ఎ.ఆర్. మనోజ్ కుమార్; జాలరి నృత్యం: డా॥ డి.వై. సంపత్కుమార్, శ్రీ టి.వి.రమణ మూర్తి; మృదంగవాద్యం: డా॥యల్లా వెంకటేశ్వరరావు; మిమిక్రీ: డా॥ నేరెళ్ళ వేణుమాధవ్; నాటకరంగం: శ్రీ ఆచంట వెంకటరత్నం నాయుడు; జానపద నృత్యాలు: శ్రీ గోపాలరాజ్ భట్, శ్రీ అనిల్‌కుమార్, శ్రీ ఎ.వి. శ్రీధర్, కుమారి ఆరతి, కుమారి కీర్తి, కుమారి ప్రీతి, శ్రీమతి సుబ్బలక్ష్మి; ఒగ్గుకథ: శ్రీ మిద్దె రాములు, శ్రీ ఎ.అయిలయ్య. ఆంధ్రప్రదేశ్ మాజీ విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు, శ్రీ మండలి బుద్ధప్రసాద్, శ్రీ మండడి కృష్ణారెడ్డి, శ్రీ అశోక్‌కుమార్, డా॥ఎస్. నర్సయ్య, శ్రీ విశ్వేశ్వరయ్య, ప్రముఖ పాత్రికేయులు శ్రీ గోవాడ సత్యారావు కూడా మహాసభలకు హాజరయ్యారు.

భారత ప్రభుత్వం తరపున ప్రముఖ నటి, పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి జమున మహాసభల్లో పాల్గొన్నారు.

ప్రతినిధి వర్గం బొంబాయి నుంచి 6 గంటలు ప్రయాణం చేసి డిసెంబరు 7 ఉదయానికి మారిషస్ చేరగానే వారికి ఆత్మీయంగా స్వాగతం లభించింది. మారిషస్ ప్రభుత్వ మంత్రులూ, మారిషస్ ఆంధ్ర మహాసభ ప్రతినిధులూ, కార్యకర్తలూ ఎంతో ఆనందంతో ప్రతి ఒక్కరికీ పుష్పగుచ్ఛాలిచ్చి బంధువుల్లా అందర్నీ పలకరించారు. బొంబాయి సహారా విమానాశ్రయంలో ఎయిర్ మారిషస్ మేనేజరు శ్రీ గజాధర్ అందించిన సహాయ సహకారాలు మరువరానివి. మహాసభల నిర్వాహకుల కోరిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ నుంచి మహాసభల కోసం జరీ అంచు నేత చీరలు,. కాశ్మీరు శాలువలు, లేసు గంధపు దండలు. పెంబర్తిలో చేయించిన జ్ఞాపికలు, 'తెలుగువాణి' మహాసభల ప్రత్యేక సంచిక ప్రతులు, ప్రతినిధులకిచ్చే కాన్ఫరెన్స్‌బ్యాగ్‌లు, తెలుగుజాతి వైభవాన్ని తెలిపే 200 పైగా ఛాయా చిత్రాలు, ప్రదర్శనకు ఎంపిక చేసిన సినిమాలు మొదలైనవన్నీ విమానంలోకి తరలించడం సులభసాధ్యంకాదు. పైగా కళాకారుల వెంట వాద్యపరికరాలు, వేషధారణ వస్తువులు కూడా వున్నాయి. ఈ వస్తుసామగ్రి సేకరణలో అంతర్జాతీయ తెలుగు కేంద్రం అధికారి డా॥ టి. గౌరీశంకర్ కృషి ప్రత్యేకించి ప్రశంసాపాత్రం.

ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి వర్గానికి మారిషస్‌లో హోటల్ గోల్డ్‌క్రెస్ట్‌లో వసతి ఏర్పాటు చేశారు. ఇది దీవికి నడిబొడ్డున వుంది. ఇది పగడాల దీవి. హిందూ మహాసముద్రంలో అత్యంత కీలక స్థానంలో మెడగాస్కర్‌కి సమీపాన వున్న రమణీయమైన చిన్న దేశం. చుట్టూ హిందూ మహాసముద్రం. తీరాల్ని తాకే స్వచ్ఛజలాలు. చాలాదూరం వరకు లోతులేని బీచ్‌లు, 76 ప్రయివేటు బీచ్‌లు ఈ దీవి ప్రత్యేకత. పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షించే ప్రశాంతసీమ. చిన్న చిన్న సెలయేళ్ళు, మనోహరమైన ప్రకృతి దృశ్యాలు, చిట్టి అడవులు, సరస్సులు, జలపాతం, కనులకు విందుగొలిపే అతి ప్రాచీనమైన అగ్నిపర్వత అవశేషరూపాలు, ఎక్కడ చూసినా పచ్చగా కనిపించే చెరకుతోటలు అన్నీ అద్భుత సౌందర్య నిధానాలు. డిసెంబరు అక్కడ వేసవి. కాని ఎండలేదు. ఆహ్లాదకరమైన వాతావరణం, ఎంతగానో ఎదురు చూస్తున్న వర్షాలు అప్పుడే వచ్చాయి. అంగడినానా, మామిడిపళ్ళు, లీచిపళ్ళూ, పరవశింపచేసే ప్రాంతాలు మారిషస్‌లో ఎన్నో వున్నాయి. పాంప్లేమున్‌తోట, లేగోర్జ్, గ్రాబాస్సె, ఫ్లేన్ షాపాయ్, షామారెల్ వగైరావగైరా. ప్రతిదానిని వర్ణించడం ఈ వ్యాసంలో సాధ్యంకాదు. ఉదాహరణకు షామారెల్ గురించి తెలుసుకుందాం. ఇది బ్లాక్‌రివర్ జిల్లాలో వుంది. అంటే మారిషస్ నైరుతీ దిశగా వుందన్నమాట. బ్లాక్ రివర్ అనేది చిన్న నది. ఇందులోని నీళ్ళు నల్లగా వుంటాయి. కాని మురికినీరు కాదు. రంగుమాత్రమే కొంచెం నలుపు. మందగమనంతో సాగే బ్లాక్ రివర్ చూడడానికి ఎంతో ముచ్చటగా వుంటుంది. షామారెల్ ఒక అత్యద్భుత స్థలం. ఇది సముద్ర మట్టానికి రమారమి రెండువేల అడుగుల ఎత్తున వుంటుంది. దీని సమీపంలోనే పారాపోల్ కొండ (పితోదెలాపెచిత్ రిలియేల్ న్వార్) వుంది. అక్కడ అందమైన జలపాతం వుంది. పైనుంచి క్షీరధారలు కురుస్తున్నట్టుగా వుంటుంది. షామారెల్ విశేషమేమంటే–ఇక్కడున్న మట్టిలో ఏడురంగులు కనిపిస్తాయి. కొంతదూరంనుంచి మరొకరు చూసి చెబితే ఏడు రంగుల మట్టిని సేకరించవచ్చు. పొడిచేసి దానిని ఒక సీసాలో వేస్తే ఏడు రంగులు కనిపిస్తాయి.

ఇక చెరకుకూ, మారిషస్‌కూ అవినాభావసంబంధం వుంది. ఈనాడు ప్రపంచ దేశాల్లో మారిషస్ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది చెరకుపంట. దేశంలో అత్యధిక భాగం పొలాల్లో చెరకు పండిస్తున్నారు. మొదట డచ్‌వారు ఇక్కడ చెరకు పంటను ప్రవేశపెట్టారు. 1812లో ప్రారంభమైన చెరకుసాగు అతి శీఘ్రంగా విస్తరించింది. ఆదిలో ఈ చెరకుపంట మద్యం తయారుచేయడంకోసం ప్రారంభించారు.

అయితే మారిషస్‌కు చెరకు పంటలో అగ్రస్థానం చేకూర్చిన ఘనత ఫ్రాంకోయిస్ మాహెడి లేబర్ డొన్నాయిస్‌కు దక్కుతుంది. ఆయన ఫ్రెంచి పరిపాలనాదక్షుడు. ఫ్రెంచి – బ్రిటిష వివాదాల్లో ఈ పంట కొంతవరకు నలిగిపోయింది. అయినప్పటికీ ఈ శతాబ్ది ఆరంభం (1901) నాటికి సాగు విస్తీర్ణం (1816 లో 11,688 ఎకరాలు వుండగా) 1,32,600 ఎకరాలకు పెరిగింది. ఈ నేపథ్యంలో చూస్తే మారిషస్ దీవికి భారతీయుల రాకక్రమాధికం కావడం సుబోధకమవుతుంది. వాస్తవానికి ఈ చెరకుసాగు అభివృద్ధికోసమే భారతీయులు అధిక సంఖ్యలో మారిషస్‌కు వచ్చారు. మొదటి జట్టు 1829 ఆగస్టు 1 న చేరుకున్నట్టు ఆధారాలున్నాయి. వ్యవసాయంలో, శ్రద్ధతో శ్రమించి పనిచేయడంలో పేరుతెచ్చుకున్న తెలుగువారి రాకకు ఇదే ప్రధానకారణం. మొదటి జట్టులో ముగ్గురు తెలుగువారు 1835 లో మారిషస్ చేరుకున్నారు. వారు శ్రీయుతులు కిష్టయ్య, వెంకటపతి, అప్పయ్య. ఏటేటా వీరి సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఉదాహరణకు 1854 లో వచ్చిన తెలుగువారు 1076 మంది. 1843 వరకు స్త్రీలెవరూ రాలేదు. ఆ తర్వాత రావడం మొదలయింది. తెలుగువారు ప్రధానంగా తుని, కాకినాడ, కోరంగి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, గంజాం, బరంపురం, రాజమండ్రి, గుంటూరు, మచిలీపట్నం, హైదరాబాదు., అనంతపురం, చిత్తూరు, కడప, నెల్లూరు ప్రాంతాలనుంచి తరలి వచ్చారు. ఈనాడు మారిషస్‌లో దాదాపు 40,000 మంది తెలుగువారున్నారు. మారిషస్ దేశ జనాభా సుమారు 10,000,00.

అక్కడ అన్ని మతాలవారూ, అన్ని భాషలవారూ, అన్ని జాతులవారూ సమైక్యంగా సోదరభావంతో కలిసి మెలిసి వుంటారు. అందుకే అక్కడ శాంతియుత వాతావరణం సర్వత్రా విస్తరించి వుంది.

మారిషస్‌లో ప్రజలు ఎక్కువగా మాట్లాడు భాష క్రియోల్. దాదాపు అందరికీ ఫ్రెంచి భాష వచ్చు. ప్రతిచోట కనిపించేవి ఎక్కువగా ఫ్రెంచిలో రాసివున్న బోర్డులే. ప్రాంతాల పేర్లు అధిక భాగం ఫ్రెంచి భాషలో వుంటాయి. ఫ్రెంచి పాలన ప్రభావం ఇందుకు కారణం.

అయితే తెలుగువారు తమదైన ప్రత్యేకతనూ, భాషా సంస్కృతులనూ, ఆచార వ్యవహారాలనూ, సంప్రదాయాలనూ ఎంతో దీక్షతో చిత్తశుద్ధితో పరిరక్షించుకుంటున్నారు. ప్రాణప్రదంగా చూసుకుంటున్నారు. దాదాపు 150 తెలుగు పాఠశాలలున్నాయి. పండుగలు నిష్ఠతో జరుపుకుంటున్నారు. దేశమంతటా హిందూ దేవాలయాలుండడం విశేషం. తెలుగువారు సింహాద్రి అప్పన్న, వెంకటేశ్వర, రామ, కృష్ణ ఆలయాలు నిర్మించుకున్నారు. 'రామభజన' కార్యక్రమం అత్యంత శ్రద్ధా భక్తులతో నిర్వహిస్తారు.. అది వర్ణనకందని ఆధ్యాత్మిక కార్యక్రమం. తెలుగు ఉగాది పబ్లిక్‌కు సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించింది.

మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు ఆతిథ్యమిచ్చిన మారిషస్‌లోని తెలుగువారిని గురించిన ఈ భూమిక కార్యక్రమాలను సరిగా అవగాహన చేసుకునేందుకు దోహదం చేస్తుంది.

తమ పూర్వీకుల సీమ నుంచి వచ్చిన సోదరాంధ్రులు ఎక్కువ రోజులు తమతో గడపాలనీ, మారిషస్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొనాలనీ వారి ఆకాంక్ష. అందుకే చాలా రోజులపాటు జరిగే పెద్ద పండుగగా వాటిని తీర్చిదిద్దారు. మహాసభలు మూడు రోజులే అయినా వారం రోజులపాటు ఉత్సవాలను ఏర్పాటు చేశారు.

మహాసభలను లాంఛనంగా ప్రారంభించడానికి మూడు రోజులముందే వివాహ సరళిలో సంరంభం ఆరంభమయింది. సౌకర్యవంతమైన ఎ.సి.గదుల వసతితోపాటు రవాణా సదుపాయాలూ, భోజన సదుపాయాలూ చక్కగా అమర్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రతినిధుల కోసం ఒక కారు, మూడు వేన్లు సమకూర్చారు. ఉదయం గోల్డ్‌క్రెస్ట్‌లో బ్రేక్‌ఫాస్ట్. సెల్ఫ్ సర్వీస్ అయినా కాఫీ వగైరా బెరర్లే ఇచ్చేవారు. పీచులేని అనాస ముక్కలు అందరిని పూరించేవి. ఇడ్లీ వడా లేకపోయినా బ్రెడ్, బట్టర్, జాం, కర్రీపఫ్, కారన్ ఫ్లేక్స్, పాలూ రుచినీ పుష్టినీ ఇచ్చాయి. ఆపిల్, ఆరంజ్, మామిడిపండ్లుకూడా వుండేవి. మధ్యాహ్న భోజనం సభావేదిక ప్రాంగణంలోగానీ, మరోచోటగానీ ఏర్పాటు చేశారు. సాధారణంగా రాత్రి భోజనం చక్కటి విందే. పెద్ద హోటళ్ళలో ఏర్పాటు చేశారు. ఒకరోజు భారత హైకమీషనరు తమ గృహంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం కూరలూ, సాంబారూ వగైరాతో ప్రతినిధుల్ని అలరించింది. అలాగే ఆంధ్ర మహాసభ, తెలుగు జ్యోతి మహాసభ, ఆంధ్ర జన సహాయసంఘం మొదలైనవారూ, హ్యూమన్ సర్వీస్ ట్రస్టు ఇచ్చిన ఆతిథ్యం మరువరానిది. ప్రధానమంత్రి సర్ అనిరూద్ జగన్నాథ్, విద్యుచ్ఛక్తి మంత్రి గౌ॥శ్రీ ఉచ్చన్న, విద్యామంత్రి గౌ॥ పరుశురామన్, బెయిబేసిన్ మేయరు, ఆతిథ్యమిచ్చిన డిన్నర్లూ, గవర్నర్ జనరల్ గౌ॥సర్ వీరస్వామి రింగడు ఆతిథ్యమిచ్చిన గార్డెన్ పార్టీ ఆత్మీయతకు ప్రతీకలై, ప్రతినిధుల మనస్సుల్లో మధురోహలుగా నిలిచాయి. మహాసభలకు ప్రభుత్వ సహకారం అడుగడుగునా కనిపిస్తుంది. వాస్తవానికి మహాసభల కార్యభారాన్ని నేషనల్ ఆర్గనైజింగు కమిటీ, మారిషస్ ఆంధ్ర మహాసభ సంయుక్తంగా వహించాయి. ఈ కమిటీకి పోషకులు: సర్ వీరాస్వామి రింగడు, గవర్నరు జనరల్; గౌరవాధ్యక్షులు: సర్ అనిరూద్ జగన్నాథ్, ప్రధానమంత్రి; అధ్యక్షులు: గౌ॥శ్రీ అర్ముగం పరశురామన్, విద్య, కళల, సంస్కృతిశాఖల మంత్రి; ఉపాధ్యక్షులు: గౌ॥ఎం. ఉచ్చన్న, విద్యుచ్ఛక్తి, జలవనరులు, పోస్టల్ సర్వీసుల మంత్రి; ప్రధాన కార్యదర్శి శ్రీ పూసరాజు సూరయ్య. ఈ ప్రధాన కమిటీకి సహాయకంగా ఆహ్వానసంఘం; ఆర్థికసంఘం, ప్రచారం, ఫిల్మోత్సవం, ప్రదర్శన సంఘం, రవాణా, లైజాన్ సదుపాయాల సంఘం; సాంస్కృతిక కార్యక్రమాల సంఘం; అకడమిక్ సంఘం; మహిళా విభాగసంఘం; తెలుగు ఉపాధ్యాయుల సంఘాలున్నాయి.

ఈ సందర్భంలో మారిషస్ ఆంధ్రమహాసభ గురించి సంగ్రహంగానైనా తెలుసుకోవడం సముచితం. కారణమేమంటే – విదేశాల్లో వున్న ఆంధ్రసంఘాలకూ, భారతదేశంలో వున్న సంఘాలకూ వ్యత్యాసముంది. విదేశాల్లోని సంఘాలు తెలుగువారికి అచ్చమైన ప్రాతినిధ్య సంస్థలు. అవి వారి సర్వతోముఖ వికాసానికి కృషిచేసే వేదికలు. వాటి ఆవశ్యకత సాధారణ భాష్యానికి అందదు. ఆంధ్రులు మారిషస్ దీవికి వచ్చిన తొలినాళ్ళలో పగలంతా చెఱకు పొలాల్లో కాయకష్టం చేసిన తర్వాత అందరూ ఒక పాకతో నిర్మించుకున్న ఆరాధనాస్థలం వద్ద సమావేశమయ్యేవారు. అక్కడి వారి సమస్యలూ, కష్ట సుఖాలు చర్చకు వచ్చేవి. సంఘటిత కృషి కోసం ఒక సంఘం ఏర్పాటు చేయాలనే సంకల్పం ఏర్పడింది. 1930 నుంచి ప్రయత్నాలు సాగుతున్నా 1946 ఆగష్టు 4న పోర్టులూయిలో సంఘం అవతరించింది. ఇరవై మంది సభ్యులతో ఆరంభమైన మారిషస్ ఆంధ్ర మహాసభకు ఈనాడు దేశం నలుమూలలా 75 శాఖలున్నాయి. బహుముఖీయంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

డిసెంబరు 7 మధ్యాహ్నం విలక్షణమైన కార్యక్రమం జరిగింది. కొటెడివోర్‌లో వున్న ప్రభుత్వ పాఠశాల పేరు నారాయణస్వామి లచ్చిమినాయుడు ప్రభుత్వ పాఠశాల అని మార్చారు.

ఈ నామకారణాన్ని మూడవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రప్రథమ కార్యక్రమంగా ఏర్పాటు చేయడంలో వున్న ఔచిత్యాన్ని మంత్రి గౌ॥ శ్రీ పరశురామన్ వివరించారు. శ్రీ లచ్చిమి నాయుడు సేవలను ఆయన ప్రశంసించారు. ఒక తెలుగు ప్రముఖుని పేరు ప్రభుత్వపాఠశాలకు పెట్టి, తెలుగువారందరినీ గౌరవించి, మహా సభల పట్ల ప్రభుత్వం సమాదరభావం ప్రదర్శించింది. పచ్చటి పొలాల మధ్య వున్న ఈ పాఠశాల చాలా ప్రసిద్ధమైంది. ఇక్కడ ఉత్తీర్ణత 87.3 శాతం.

ఆనాడు సాయంత్రం వాకోస్‌లో వున్న ట్రఫాల్గర్ హాల్లో ఫిల్మోత్సవ ప్రారంభ సభ జరిగింది. ముందు కళాకారులు నృత్య ప్రదర్శనలిచ్చారు. ముగ్గురు బాలికలు చేసిన పుష్పాంజలి నృత్యం అలరించింది. మారిషస్ చలన చిత్రాభివృద్ధి సంస్థ సహకారంతో ఈ ఉత్సవం నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులూ, సాంస్కృతిక ప్రతినిధి వర్గం నాయకులూ డా॥ సి. నారాయణరెడ్డి తెలుగువారి సాంస్కృతిక వైభవంగురించీ తెలుగు సినిమాలను గురించీ వివరించారు. ప్రసిద్ధ నటులు డా॥ అక్కినేని నాగేశ్వరరావు ఉత్సవాలను ప్రారంభిస్తూ తాము నటనకు అంకిత మయ్యామనీ, జీవిత పర్యంతం నటులుగా ఉంటామనీ చెప్పారు. పార్లమెంటు సభ్యురాలు, ప్రసిద్ధ నటి శ్రీమతి జమున మాట్లాడుతూ మారిషస్‌లో చక్కని చలన చిత్రాలు నిర్మించే అవకాశాలున్నాయన్నారు. చలన చిత్రాల్లో వచ్చిన పరిణామాన్ని ఆమె తెలియజేశారు. ఆనాడు 'కలెక్టరుగారబ్బాయి' ప్రదర్శించారు. ముఖ్య భూమిక వహించిన డా॥ నాగేశ్వరరావు చెంత వుండగా ఆ చిత్రం చూడడం అందరికి మరువరాని అనుభూతి కలిగించింది. మహాసభల సందర్భంగా ప్రదర్శించిన ఇతర చిత్రాలు: అంకితం, యుద్ధభూమి, (దీనిని ఎక్కువ భాగం మారిషస్‌లో తీశారు), మంగమ్మగారి మనవడు, ఇరవయ్యో శతాబ్దం.

పోర్టులూయిలో వున్న తెలుగుజ్యోతి మహాసభలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. భజన ప్రక్రియ మారిషస్ తెలుగువారి జీవితంలో ప్రత్యేక స్థానం సమకూర్చుకుంది. దైవభక్తి ప్రతివారిలోనూ ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

ఆ రోజు సాయంత్రం మోకాలో వున్న మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన సాంస్కృతిక బృందం ప్రదర్శించిన వివిధ కళారూపాలు విశేషంగా ప్రశంసలందుకున్నాయి. సుప్రసిద్ధ నృత్య దంపతులు శ్రీ రాజారెడ్డి, శ్రీమతి రాధారెడ్డి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అద్భుతంగా వుంది. శివపార్వతులుగా వారికి వారే సాటి. సాంస్కృతిక ప్రతినిధి బృందంలోని కళాకారులందరూ ఆయా ప్రక్రియల్లో శిఖర ప్రాయులే. గాంధీ ఇన్‌స్టిట్యూట్ లోనే కాకుండా మిగిలిన రోజుల్లోకూడా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చి అందరి ఆదరాభిమానాలు చూరగొన్నారు. బ్రహ్మాండమైన రోజ్ హాల్ స్టేడియం, గవర్నర్ జనరల్ నివాస భవనం, మారిషస్ నాలుగు దిక్కులావున్న నాలుగు గ్రామాలు రాంపర్ట్, గజాధర్, మేబర్గ్, నౌలక్‌లలో మన కళాకారుల ప్రదర్శనలను మారిషస్ ప్రజలు ఎన్నటికీ మరువలేరు. గవర్నర్ జనరల్ ప్రభృతులు హాజరైన స్టేడియంలో కిక్కిరిసిన జన సందోహం సమక్షంలో సాగిన ప్రదర్శనలు చిరస్మరణీయాలు. గ్రామాల్లోని హాళ్లు నిండిపోయాయి. అందరూ చివరివరకూ వుండి ప్రతి అంశాన్ని పారవశ్యంతో తిలకించి ఆనందించారు. శోభారాజ్ భక్తి, లలిత సంగీతం, ప్రత్యేకించి అన్నమాచార్య కీర్తనలూ; డా॥యల్లా వేంకటేశ్వరరావు మృదంగలయ విన్యాసం; డా॥ డి.వై. సంపత్కుమార్ జాలరి నృత్యం; డా॥ నేరేళ్ళ వేణుమాధవ్ ధ్వన్యనుకరణ–ప్రముఖ నటుల పఠనారీతులు; శ్రీ గోపాలరాజ్‌భట్ బృందం కోయ, లంబాడా నృత్యాలు; శ్రీ ఆచంట వెంకటరత్నం నాయుడు దుర్యోధన ఏకపాత్రాభినయం; మిద్దెరాములు బృందం ఒగ్గుకథ–ఇవన్నీ మారిషస్ తెలుగువారిని రసజగత్తుల్లోకి తీసుకువెళ్ళాయి. కొన్ని ప్రదేశాల్లో మలేషియా తెలుగు కళాకారులు శ్రీ గణేషన్ కూడా మనవారితో వచ్చి ప్రదర్శన లిచ్చారు. గవర్నర్ ప్రాసాదంలో ఆరుబయలు వేదికమీద కళాకారుల ప్రదర్శన విలక్షణంగా జరిగింది. ప్రేక్షకులందరూ ఎదురుగా తోటలో నిలబడి తిలకించారు. ప్రసిద్ధ చలనచిత్ర నటి, పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి జమున సత్యభామ ఏకపాత్రాభినయం చేశారు. ఆమె ప్రదర్శించిన నటన, ఆమె పద్యపఠనం అందరినీ ముగ్ధుల్ని చేశాయి. శ్రీ సి.వి. నరసింహారెడ్డి సాంస్కృతిక కార్యక్రమాలకు వ్యాఖ్యానం చేశారు. ఉడుతాభక్తిగా ఈ రచయిత ఆయనకు సహకారం అందించారు.

డిసెంబరు 8న ప్రతినిధులకి మారిషస్‌లో వున్న దర్శనీయ స్థలాలు చూపారు. ఆనాడే కొన్ని సంఘాల వారు ప్రతినిధుల్ని సత్కరించారు. ఆ సాయంత్రం బయోవాలన్‌లో జరిగిన రామభజన ప్రతినిధులకు అద్భుతానుభూతి. పదివేలమందికి పైగా భక్తులు అఖండంగా సాయంత్రం 6 గంటలనుంచి మరునాడు ఉదయం 6 గంటలవరకు సాగింది. ఇది అత్యంత శ్రద్ధాభక్తులో ఆచరించే పూజ. మారిషస్ తెలుగువారికిది చాలా ప్రత్యేకం. పెద్ద పెద్ద దీపపు సెమ్మెల్లో వొత్తులు వేసి వెలిగించి భక్తి బృందాలు గానం చేస్తాయి. సాధారణంగా ఇది శనివారం రాత్రి జరుపుతారు. పద్యాలు, యెడ్లరామదాసు, భద్రాచల రామదాసు కీర్తనలు, త్యాగరాజ కృతులు పాడతారు. ఈ మహోత్సవంలో శ్రీమతి శోభారాజ్ పాడి వేలాది శ్రోతల్ని భక్తి రసవాహినిలో ఓలలాడించారు.

మర్నాడు సెయింట్ పెర్రీలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో సభ జరిగింది. సభకు ప్రధానమంత్రి వచ్చారు. ఆ సభలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా॥ సి. నారాయణరెడ్డి ప్రసంగిస్తూ మారిషస్ ప్రజలలో వెల్లివిరుస్తున్న సమైక్య భావాన్ని ఉగ్గడించారు. 'ఆత్మలను పలికించేదే అసలైన భాష' అనీ అలాంటి ఆత్మీయ భావం మారిషస్ అంతటా కానవస్తోందనీ అన్నారు.

మధ్యాహ్నం రోజ్‌హిల్ పట్టణంలో కనులకింపైన ఊరేగింపు జరిగింది. చినుకులు పడుతున్నా ఎవరిలోనూ ఉత్సాహం సన్నగిల్లలేదు. తెలుగుతల్లి కటౌట్‌ను అలంకరించి శకటంపైన ఉంచారు. మేయర్ శ్రీ భగవాన్ దానికి సారథ్యం వహించారు. అయిదారు వేలమంది ఇందులో ఉన్నారు. కొందరు మంత్రులు కూడా ఈ ర్యాలీలో పాల్గోవడం విశేషం. ఈ ర్యాలీ స్టేడియం వరకు సాగింది. అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

తర్వాత బ్రహ్మకుమారి రాజయోగ కేంద్రం వారు ప్రతినిధుల అభినందన సభ ఏర్పాటు చేశారు. మంత్రి శ్రీ ఉచ్చన్న, డా॥ సి. నారాయణరెడ్డి ప్రసంగించారు. మారిషస్‌లో నెలకొన్న మతసామరస్యాన్ని ఉపాధ్యక్షులు ప్రస్తుతించారు. ప్రతినిధులందరి పక్షాన ఆయన బ్రహ్మకుమారి సంస్థవారికి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీమతి శోభారాజ్ సూరదాస్ కీర్తన శ్రావ్యంగా పాడి అక్కడున్న ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పవిత్రవంతం చేశారు.

ఆ సాయంత్రం మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్‌లో మారిషస్ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కూచిపూడి సంప్రదాయంలో 'ప్రహ్లాద' ప్రదర్శించారు. మారిషస్ నిజంగా హరివిల్లు అని అనేక భాషలవారి చక్కటి కార్యక్రమాలు నిరూపించాయి. మారిషస్‌లో మాట్లాడే క్రియోల్‌కే కాక ఇంగ్లీషు, ఫ్రెంచి, అరబిక్, హిందీ, ఉర్దూ, తమిళం, తెలుగు, మరాఠీ, మాండరిన్ భాషలకు స్థానం ఉంది. సాంస్కృతిక కార్యక్రమాలు దానికి అద్దం పట్టాయి.

మారిషస్ తెలుగువారు ఎంతోకాలంగా సన్నాహాలు చేస్తూ నిరీక్షిస్తున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభోత్సవ ఆనంద ముహూర్తం వచ్చింది. మోకాలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ వారి సువిశాలమైన సభామందిరాన్ని శోభాయమానంగా అలంకరించారు. వేదికముందు తెలుగుతల్లి చిత్రాన్ని వుంచారు. 'దేశభాషలందు తెలుగు లెస్స' అన్న ఆంధ్ర మహావిష్ణు సదుక్తిని ఉల్లేఖించారు. ప్రవేశద్వారం వద్ద మామిడాకు తోరణాలు, అరటిచెట్లు పండుగ వాతావరణాన్ని స్ఫురింపజేశాయి. అతిథులకు రంగురంగుల నేతచీరలు ధరించిన యువతులు నుదుట బొట్టుపెట్టి సాదరంగా స్వాగతం పలికారు. మంగళవాద్యం వీనులవిందుగా వినిపించింది. సభావేదిక వెనక హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తయారు చేయించిన బంగారు రంగు సాటిన్ బ్యానరు ప్రేక్షకులకి ముచ్చట గొలిపింది. వేదికపైన ప్రముఖులందరూ ఆశీనులయ్యారు. గవర్నరు జనరల్, ప్రధానమంత్రి రాకకు ఎలాంటి ఆడంబరం కనిపించలేదు. అంతటా ఆత్మీయతా, ఆదరం గుబాళించాయి. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతాలాపనతో సభాకార్యక్రమం ప్రారంభమయింది. శ్రీ పూసరాజు సూరయ్య ఆహ్వానితులకు స్వాగతం పలికారు. విద్య సాంస్కృతిక వ్యవహారాలు, కళల శాఖ మంత్రి శ్రీ ఆర్ముగం పరశురామన్ మహాసభల పూర్వ రంగాన్ని, మారిషస్ దేశ వైలక్షణ్యాన్నీ వివరించారు. జ్యోతి వెలిగించి సభలను ఆరంభించి ప్రధానమంత్రి సర్ అనిరుధ్ జగన్నాథ్ మారిషస్ దేశాభ్యున్నతిలో తెలుగువారి సేవలను శ్లాఘించారు. మహాసభల

సందర్భంగా ప్రచురించిన 'తెలుగువాణి' ప్రత్యేక సంచికను ప్రధానమంత్రి ఆవిష్కరించారు. గవర్నర్ జనరల్ సర్ వీరాస్వామి రింగడు మారిషస్‌కు తెలుగువారి వలసపై ఏర్పాటు చేసిన ప్రదర్శనకు ప్రారంభోత్సవం జరిపారు. శ్రీమతి నర్సింహ ఆనందన్ రాసిన 'ది ప్రిమార్డియల్ లింక్ – తెలుగు ఎథ్నిక్ ఐడెంటిటీ ఇన్ మారిషస్' అనే ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరించారు. తమ భాషా సంస్కృతుల పరిరక్షణకోసం తెలుగువారు చేస్తున్న అవిశ్రాంత కృషిని ఆయన తమ ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇంధనం, జలవనరులు, పోస్టల్ సర్వీసుల మంత్రి శ్రీ ఎం. ఉచ్చన్న ప్రసంగిస్తూ వివిధ భాషల వారి మహాసభలకు మారిషస్ ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గౌ॥ శ్రీ కృష్ణకాంత్, అప్పటి ముఖ్యమంత్రి డా॥ ఎం. చెన్నారెడ్డి సందేశాలను ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖ డైరెక్టరు శ్రీ సి.వి.నరసింహారెడ్డి చదివి వినిపించారు.

తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా॥ సి. నారాయణరెడ్డి తమ కీలకోపన్యాసంలో తెలుగువారి ప్రాచీనతనూ, తెలుగుభాషా సంస్కృతుల వైలక్షణ్యాన్ని సోదాహరణంగా వివరించారు. 'తెలుగు అజంత భాష. ఐరోపా పండితులీ భాషను ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని ప్రశంసించారు. ప్రాచీన యుగంలో నన్నయ, తిక్కన, శ్రీనాథ, పోతన, వేమన వంటివారు, ఆధునిక కాలంలో కందుకూరి, గురజాడ, రాయప్రోలు, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, చలం, గోపీచంద్, బుచ్చిబాబు, రావిశాస్త్రి మొదలైనవారు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు' అన్నారాయన. విలక్షణమైన అవధాన ప్రక్రియను ఆయన విశదపరిచారు. తెలుగువారి సంగీత సంపద, కూచిపూడి నృత్యకళావైభవం, పేరిణి శివతాండవం, హరికథ, యక్షగానం, జానపదకళలు, నాటకరంగం, హస్తకళలు, శిల్పసంపద మొదలైన వాటి గురించి కూడా తెలియజేశారు. మారిషస్ ప్రభుత్వాన్ని అభినందిస్తూ డా॥ నారాయణరెడ్డి మహాసభల్లో ప్రతినిధులు చేసే సూచనల్ని అంతర్జాతీయ తెలుగు కేంద్రం జాగ్రత్తగా పరిశీలిస్తుందనీ, విదేశాంధ్రులకు వీలైనంత ఎక్కువ సహాయ సహకారా లందించేందుకు కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రసంగం ముగిస్తూ నిరంతర కృషి ఆవశ్యకతను గేయరూపంలో తెలియజేశారు. డా॥ నారాయణరెడ్డి ప్రసంగానికి సభికులు సుదీర్ఘ హర్షం ప్రకటించారు.

పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి జమున ఈ మహాసభలు నిర్వహిస్తున్నందుకు మారిషస్ ప్రభుత్వాన్ని అభినందించారు. పార్లమెంటు సభ్యురాలిగానే కాకుండా ఒక కళాకారిణిగా కూడా పాల్గొవడం తమకు సంతోషదాయకం అన్నారామె.

మహాసభల సందర్భంగా తెలుగుజాతి వైభవోన్నతుల్ని తెలిపే ఛాయాచిత్ర ప్రదర్శనను తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసింది. ఇరవై మూడువేల రూపాయలు విలువచేసే ఈ ఛాయాచిత్రాల్ని విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు మహాత్మాగాంధి ఇన్‌స్టిట్యూట్‌కు బహుకరించారు. వాటితో అక్కడ శాశ్వత ప్రదర్శన ఏర్పాటవుతుంది.

మాజీ మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ వివిధ దేశాల్లో తెలుగువారి మధ్య సత్సంబంధాలు వర్ధిల్లడానికి ఈ మహాసభలు దోహదం చేస్తాయని అన్నారు. స్వర్గీయ శ్రీ బి. కృష్ణంరాజు మహాసభలకు పూర్వరంగంగా చేసిన కృషిని ఆయన ప్రస్తావించారు. ప్రారంభోత్సవ సభలో ప్రముఖులకు సత్కారాలు జరిగాయి.

తెలుగు బోధనపై ఒక ప్రదర్శన, మారిషస్ తెలుగు మహిళల వంటకాలపైన ఒక ప్రదర్శన కూడా ఏర్పాటయ్యాయి.

అశోక్ బుక్ సెంటర్‌వారు గ్రంథ ప్రదర్శన విక్రయం ఏర్పాటు చేశారు.

శ్రీ ఉజ్వల కళాసమితి వ్యవస్థాపకులు శ్రీ మండడి కృష్ణారెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో సాంస్కృతిక సంస్థల కృషిపైన ఒక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

మహాసభలకు దక్షిణాఫ్రికా నుంచి శ్రీ టి.పి. నాయుడు నాయకత్వాన 52 మంది, మలేషియా నుంచి శ్రీ పాల్‌నాయుడు నాయకత్వాన 20 మంది, బోట్స్వానానుంచి ఒకరు, స్థానిక ప్రతినిధులు 300 మంది హాజరయ్యారు.

మారిషస్ ఆంధ్ర మహాసభ సభ్యులందరూ నడుంకట్టి కార్యకర్తలయ్యారు. శ్రీయుతులు పూసరాజు సూరయ్య, ఎస్.రమణ, చిన్నస్వామి, లచ్చుమయ్య, సోకప్పుడు, రామయ్య, రెడ్డి లచ్చుముడు, చల్లా రామఫణి, శ్రీమతి గీతాంజలి మొదలైన అనేకమంది ఈ మహాసభల విజయాల కోసం అహరహం శ్రమించారు.

మొదట సంకల్పించిన ప్రకారం ఉద్దండపండితులు, మేధావులు, ఆయా రంగాల్లో శిఖర ప్రాయులైనవారు సదస్సుల్లో పాలు పంచుకోవలసివుది. అయితే ఆంధ్రప్రదేశ్ నుంచి సాంస్కృతిక బృందం మాత్రమే మారిషస్ సందర్శించింది. అయినప్పటికీ మహాసభల వైభవం తగ్గకుండా వుండాలనే నిశ్చితాభిప్రాయంతో నిర్వాహకులు సదస్సును 4 సెషన్లుగా ఏర్పాటు చేశారు. అవి (1) సంస్కృతి–సమాజం(అధ్యక్షులు – శ్రీమతి ఎ. నర్సింహ ఆనందన్); (2) భాష (అధ్యక్షులు – డా॥సి. నారాయణరెడ్డి); (3) కళ – సంస్కృతి (అధ్యక్షులు – డా॥ఎన్ శివరామమూర్తి); (4) విదేశాంధ్రులు(అధ్యక్షులు– డా॥ గిరిప్రకాష్), మొత్తం పదహారుమంది పత్రాలు సమర్పించారు. ప్రత్యేకించి భాషపై సదస్సు ఆసక్తిదాయకంగా జరిగింది. శ్రీమతి నీరజ ప్రభాకర్ ఎంతో భావోద్రేకంతో ప్రసంగించారు. ఆఫ్రికాలో తెలుగు క్షీణదశకు వెల్లడయిన కొన్ని కారణాలు (1) తెలుగుకు అక్కడ అధికార ప్రతిపత్తి లేక పోవడం; (2) తెలుగువారి సంఖ్య తక్కువగా వుండడం; (3) తెలుగువారు ఇతర భాషల వారిని వివాహం చేసుకుని ఇంటిలో ఇంగ్లీషు మాట్లా డడం; (4) తెలుగు భాషా బోధనకు తగిన ఉపాధ్యాయులు లేకపోవడం; (5) ప్రభుత్వం నుంచి సకాలంలో తగిన సహాయ సహకారాలు అందకపోవడం; (6) దక్షిణాఫ్రికా బ్రాడ్‌కాస్టింగ్ కార్పోరేషన్‌లో తెలుగుకు గుర్తింపు లేకపోవడం; (7) తెలుగులో మాట్లాడడం పట్ల ఎక్కువమంది తెలుగువారు ఉత్సుకత చూపక పోవడం; (8) భారత ప్రభుత్వం విధించిన రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక బహిష్కరణ విధానం.

కొందరు వక్తలు భాషకూ, సంస్కృతికీ వున్న సంబంధాన్ని నొక్కి చెప్పారు. మొత్తంమీద అందరూ భాషను పరిరక్షించుకోవాలనే ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

డిసెంబరు 12 ఉదయం జరిగిన ప్రతినిధుల సమావేశం అత్యంత ప్రధానమైంది. దీనికి డా॥ సి. నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. మలేషియా ప్రతినిధి శ్రీ ఆర్.పి. నాయుడు మాట్లాడుతూ ఎక్కడున్నా విదేశాంధ్రుల సమస్యలు దాదాపు ఒకే రీతిగా వుంటాయి. తండ్రి పిల్లల యోగక్షేమాలు

చూడాలి. మలేషియాలో తెలుగు సంస్కృతి పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహాయ సహకారా లందించాలి అన్నారు. ఆ ప్రతినిధివర్గం కొన్న అభ్యర్థనలు చేసింది. అవి (1) ఆంధ్రప్రదేశ్‌లోని వైద్యం, ఇంజనీరింగ్ వృత్తి కోర్సుల్లో మలేషియా విద్యార్థులకు సీట్లు కేటాయించడం; (2) ఆంధ్రప్రదేశ్‌లో ట్యాన్స్ టూర్లు ఏర్పాటుచేయడం; (3) ప్రపంచ మహాసభలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యాన నిర్వహించడం; (4) రెండవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తీసిన డాక్యుమెంటరీని పంపడం; (5) తెలుగు భాష, కళలు, సంస్కృతి, వాటి ఔన్నత్యాన్ని తెలిపే వీడియో క్యాసెట్లు తయారు చేసి అందచేయడం; (6) భారతదేశం నుంచి తెలుగులో ఆకాశవాణి ప్రసారాలు చేయడం; (7) ఆంధ్రప్రదేశ్ నుంచి కవులనూ, కళాకారులనూ పంపడం; (8) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మలేషియా తెలుగు సంఘానికి తెలుగు టైపురైటర్లు, తెలుగు కంప్యూటరు పంపడం.

దక్షణాఫ్రికా ప్రతినిధి శ్రీ బి.ఎ. నాయుడు ప్రసంగిస్తూ విదేశాంధ్ర సంస్థలు అంతర్జాతీయ తెలుగు కేంద్రంతో సన్నిహిత సంబంధాలు పెంపొందించుకోవాలన్నారు. తెలుగులో బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం అవసరం. పరిస్థితులన్నీ అనుకూలిస్తే నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలకు దక్షిణాఫ్రికా ఆంధ్ర సంఘం ఆతిథ్యమిస్తుంది అని కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు.

మారిషస్ ప్రతినిధి శ్రీ రెడ్డి లచ్చుముడు ప్రసంగిస్తూ కొన్ని సూచనలు చేశారు: (1) కార్యక్రమాల వినిమయం కోసం మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్, అంతర్జాతీయ తెలుగు కేంద్రం మధ్య ఒక ఒప్పందం కుదుర్చుకోవాలి; (2) మారిషస్‌లో తెలుగువారి శ్రేయోభివృద్ధుల కోసం ప్రత్యేక కార్యాలయం ఒకటి ఏర్పాటు కావాలి; (3) తెలుగు అధ్యయనం కోసం కరెస్పాండెన్సు కోర్సు ప్రారంభించాలి; (4) పుస్తకాలు, కాసెట్లు పంపాలి; తెలుగు చలన చిత్రాలు తరచూ పంపాలి. (5) మారిషస్‌లో తెలుగు బోధనకు ఎక్కువ తోడ్పాటు అందజేయాలి; (6) మారిషస్‌లోని ఆలయాభివృద్ధికి సహకారం అందించాలి.

అధ్యక్షులు డా॥ సి. నారాయణరెడ్డి ఉపాధ్యాయుల శిక్షణకు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తుందనీ, ఆడియో – వీడియో క్యాసెట్లు తయారు చేసి వివిధ దేశాలకు పంపుతామనీ తెలియజేశారు. ప్రతినిధులు చేసిన సూచనలను పరిశీలించగలమని, అంతర్జాతీయ తెలుగు కేంద్రం ద్వారా వీలైనంతగా సహాయ సహకారాలు అందజేస్తా మనీ హామీ ఇచ్చారు.

మహాసభ దిగువ తెలిపిన తీర్మానాలను ఆమోదించింది:

(1) ఈ మహాసభలను జయప్రదంగా నిర్వహించినందుకు మారిషస్ ప్రభుత్వానికీ, నేషనల్ ఆర్గనైజింగ్ కమిటీకి, మారిషస్ ఆంధ్ర మహా సభకూ, సహాయ సహకారాలు అందించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికీ, మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్‌కూ మహాసభ కృతజ్ఞతలు అంద జేస్తోంది. (2) విదేశాంధ్రుల పిల్లల వైద్యం–ఇంజనీరింగ్ వంటి వృత్తి విద్యాకోర్సుల్లో చదువుకోవడానికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లోగడ కల్పించిన సౌకర్యాలను పునరుద్ధరించాలి. (3) పుణ్యక్షేత్రాలు దర్శించడానికి వీలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విదేశాంధ్రుల కోసం పర్యటన శాఖ ద్వారా ప్యాకేజ్‌టూర్లు ఏర్పాటు చేయాలి. (4) దక్షిణాఫ్రికాలో రాజకీయ పరిస్థితులు అనుకూలించినట్లయితే నాలుగోప్రపంచ తెలుగు మహాసభలను అక్కడ(డర్బన్) జరపాలన్న దక్షిణాఫ్రికా ప్రతినిధి వర్గం అభ్యర్థనను పరిశీలించవచ్చు. నాలుగవ మహాసభలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సన్నిహిత సహకారంతో నిర్వహించాలి. (5) విదేశాలకు ఆంధ్రప్రదేశ్‌నుంచి సాంస్కృతిక బృందాలను పంపాలి. (6) శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంలోనూ, పాఠ్యాంశాలూ బోధన ప్రణాళికలను రూపొందించడంలోనూ మారిషస్‌లోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్, తెలుగు విశ్వవిద్యాలయం మధ్య సమన్వయ పూర్వక కార్యక్రమం రూపొందాలి. ఇది తెలుగు అధ్యయనాభివృద్ధికి దోహదం చేస్తుంది. (7) విదేశాల్లో తెలుగువారికోసం తెలుగులో కరెస్పాండెన్స్ కోర్సును పునరుద్ధరించాలి. (8) ప్రపంచంలోని వివిధ దేశాల్లో తెలుగువారి అభివృద్ధికోసం 'వరల్డ్ తెలుగు ట్రస్ట్'ను ఏర్పాటు చేయాలి. దీనికి విదేశాంధ్రులూ, భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులు సమకూర్చవలసి వుంటుంది. (9) కనీసం 5 సం॥లకు ఒక సారైనా ప్రపంచ తెలుగు మహాసభలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సన్నిహిత సహకారంతో నిర్వహించాలి. (10) వివిధ దేశాల్లోని తెలుగు సంఘాలతో 'ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్' ఏర్పాటు చేయాలి. ఇది తెలుగు విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ తెలుగు కేంద్రంతో సన్నిహిత సంబంధం కలిగి వుంటుంది. (11) భాష సంస్కృతి కళలకు సంబంధించిన కోర్సుల్లో కళాశాలల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ చదువుతున్న విదేశాంధ్ర పిల్లలకు స్కాలర్‌షిప్ మంజూరు చేయవలసిందిగా మహాసభ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతుంది.

మారిషస్ మహాసభలు చేసే సూచనలగురించి ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి 'ఆ సూచనలనూ, ప్రతిపాదనలనూ వినమ్రంగా స్వీకరించి ఆచరణలో పెట్టడానికి అంకిత భావంతో కృషి చేస్తామని ప్రభుత్వం తరఫున ప్రజల తరఫున హామీ ఇస్తున్నాను' అని ప్రకటించడం అత్యంత హర్షదాయకం.

ఆయా ప్రతినిధివర్గాలు మారిషస్ ప్రభుత్వానికీ మారిషస్ ఆంధ్ర మహాసభకూ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు అందజేశాయి. ప్రముఖులకు మంత్రి శ్రీ ఉచ్చన్న మెమొంటోలు అందజేశారు.

ప్రధాన కార్యదర్శి శ్రీ పూసరాజు సూరయ్య వందన సమర్పణతో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు జయప్రదంగా ముగిసాయి.

మారిషస్ ప్రముఖులూ, కార్యకర్తలూ బరువైన హృదయాలతో వీడ్కోలు చెప్పారు. మరువరాని మధుర స్మృతులు నింపుకుని డిసెండరు 13 సాయంత్రం ప్రతినిధులు స్వదేశాలకు బయలుదేరారు.

ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక బృందాల ప్రతినిధులు అనుభూతులూ, జ్ఞాపకాలూ కోకొల్లలుగా వెంట తెచ్చుకొని బొంబాయి సహారా విమానాశ్రయం 14వ తేది తెల్లవారుజామున చేరుకున్నారు.

(తెలుగు వాణి)

డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం

ఇంట గెలిచి రచ్చ గెలువు

ప్రపంచ తెలుగు మహాసభలు కాలక్షేపం కోసం జరిగే సమావేశాలు కావు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారి సాంస్కృతిక పునరుజ్జీవనానికి తెలుగువారు నిర్మాణాత్మకంగా సాగిస్తున్న ఉద్యమమని భావించాలి. వేర్పాటు ఉద్యమాలతో రాష్ట్రంలోని భావ సమైక్యత కుంటుపడుతున్న సమయంలో, తెలుగు నాయకుల నీతి చాతుర్యంతోనూ, కేంద్ర నాయకుల దూరదృష్టితోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఐక్యతతో ముందడుగు వేసే సముచిత మార్గం ఏర్పడటం ముదావహం. రాష్ట్రదృక్పథంతోపాటు అంతర్జాతీయ దృక్పథాన్ని ఆంధ్రులకందించి విశ్వసౌభ్రాతృత్వభావాన్ని జాతికి కల్పించి తెలుగువారి సమైక్యతను పటిష్టం చేయటానికి మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు ఎంతో ఉపకరించాయి. మొదటిసారి రాష్ట్రేతర ప్రాంతాల్లోనూ, విదేశాలలోనూ నివసిస్తున్న తెలుగువారి సమస్యలను సదవగాహన దృష్టితో సమీక్షించి సాంస్కృతిక సంబంధాలను పెంచుకోవటానికి ఆలోచించే అవకాశాలను ఆ సభలు కల్పించాయి. దాని ఫలితంగా అంతర్జాతీయ తెలుగు సంస్థ స్థాపించబడింది. ప్రవాసాంధ్రులకూ, విదేశాంధ్రులకూ, రాష్ట్ర ప్రజలకూ మధ్య ఈ సంస్థ రాయబారిగా, సమన్వయ వ్యవస్థగా కృషి చేస్తోంది. దాన్ని ఆ లక్ష్యాన్ని సాధించే శక్తిమంతమైన సాధనంగా రూపొందించుకోవటం తెలుగువారి కర్తవ్యం.

మొదటి ప్రపంచ తెలుగు మహా సభలు ఆంధ్రప్రదేశ్ రాజధానిలో జరగటం సముచితం. వివిధ దేశాలనుండి, రాష్ట్రాలనుండి, ప్రాంతాలనుండి ప్రతినిధులు ఆ సభలకు వచ్చారు. వారి సమస్యలను మొదటిసారి ఒక వేదిక మీద చర్చించారు. ప్రపంచ సంబంధాలను విస్తృతం చేసుకోవటానికి ప్రాతిపదికలు వేశారు. విదేశ ప్రతినిధి వర్గాలలో సంఖ్యలో పెద్దది మలేసియా ఆంధ్రసంఘప్రతినిధివర్గం. వారు రెండవ మహాసభలను మలేషియాలో జరపండని తెలుగువారికి ఆహ్వానం అందించారు. కొన్ని కారణాలవలన సభలు ఆలస్యగా జరిగినా, ఏప్రిల్ 14 నుండి 18వ తేదీ వరకు కోలలంపూరులో రెండవ మహాసభలు విజయవంతంగా నిర్వహింపబడినాయి.

మలేసియా మహాసభలు విదేశంలో మొదటిసారిగా జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు. స్వరాష్ట్రంలో సభలు జరిపితే ఎదురయ్యే సమస్యలను తెలుసుకున్న తెలుగువారు విదేశాల్లో సభలు జరిగితే ఉత్పన్నమయ్యే సమస్యలను మొదటిసారి అర్థం చేసికొన్నారు. అంతర్జాతీయ తెలుగు సంస్థ మలేసియా ఆంధ్రసంఘంతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఆ సభలు ఎన్నో క్రొత్త అనుభవాలను వెలుగులోకి తెచ్చింది.

అయిదేళ్లుగా అంతర్జాతీయ తెలుగు సంస్థ ప్రవాసాంధ్రుల స్థితిగతులను గురించీ, విదేశాంధ్రుల సమస్యలను గురించీ యథాశక్తి సమాచారాన్ని సేకరించటమే కాకుండా, పరస్పర అవగాహనను

పెంపొందించే సదస్సులను నిర్వహించటంతోపాటు, ఆయా దేశాలలో, ఆయా ప్రాంతాలలో సాంస్కృతిక వికాసానికి అవసరమైన సహాయ సహకారాలను అందించడంలో కృషి సాగించటం మొదలు పెట్టింది.

విదేశాంధ్రుల విషయ సేకరణం ఒక యెత్తు; వారితో ప్రత్యక్ష పరిచయం కలగటం మరో యెత్తు. మలేసియాలో ఒకటిన్నర లక్షమంది తెలుగువారు నివసిస్తున్నారు. వారు ఆ దేశ పౌరులు. ఆ దేశ స్వతంత్ర ప్రతిపత్తికి అంకితమైన దేశభక్తులు. మలేసియా స్వతంత్ర దేశమైన తరువాత ఆ దేశ పౌరులు తమ దేశ ఆర్థిక, సాంస్కృతిక పునరుజ్జీవనానికి అహోరాత్రులు కృషిచేస్తున్నారు. అందులో అక్కడి తెలుగువారి పాత్ర గణనీయంగా ఉంది. మలేసియా సంస్కృతి రూపకల్పనలో తెలుగు సంస్కృతి పాత్రను ఉజ్జ్వలంగా నిర్వహింపచేయాలని అక్కడి తెలుగువారి ఆకాంక్ష. ఆ లక్ష్యాన్ని సాధించటానికి తెలుగువారి వెలుగు సహకారాన్ని మానసికంగా వారు ఆహ్వానిస్తున్నారు.

అటువంటి తరుణంలో రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు ఒక ఆశాకిరణంగా వారికి స్ఫురించాయి. తూర్పు, ఆగ్నేయ, ఆసియాదేశాలలో భారతీయులకూ, తెలుగువారికీ ఎన్నో తరాలనుండి వ్యాపార, రాజకీయ, సాంస్కృతిక, మత విషయకమైన సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. వాటి స్వరూప స్వభావాలను చారిత్రాత్మక అధ్యయనం ద్వారా శాస్త్రీయంగా రూపొందించుకొని, ఆధునిక అవసరాలకు అనుగుణంగా వాటిని పునర్నిర్మించుకొనే అవకాశాలు ఎన్నో వున్నాయి. ఆ రంగంలో తెలుగు వారు క్రొత్త బాటలను అన్వేషింపవలసి ఉంది. చారిత్రాత్మకమైన అటువంటి నవ్యాధ్యాయానికి నాంది నాలపించడానికి రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు తోడ్పడగలవని విజ్ఞులు భావించారు. మలేసియాలో సభలు జరుపుకోవటానికి సంకల్పించారు.

మలేసియా తెలుగు వారి చరిత్ర ఒక సాహసమైన పోరాటం లాంటిది. దాన్ని మూడు అంచలుగా వింగడించవచ్చు. మొదటి అధ్యాయం తెలుగు వారు కొందరు రబ్బరు తోటలలో పనిచేయటానికై మలేసియా వలసపోయిన ఉదంతం. ఎన్నో బంగారుకలలతో పోయిన ఆ కూలీలు బానిసలుగా మారిపోయిన విషాదగాథలు తెలుగు వారి హృదయాలను కరిగించివేస్తాయి. విదేశీ యజమానుల ఆధిపత్యంలో వారు ఎన్నో అగచాట్లు పడ్డారు; కొందరు తెలుగు దేశానికి తిరిగి వచ్చారు; కొందరు అక్కడనే అసువులు కోల్పోయారు. మిగిలిన వారు కాలు నిలువద్రొక్కుకొని భవిష్యత్తును నిర్మించుకోవటానికి కంకణాలు కట్టుకొన్నారు. దానితో రెండవ అధ్యాయం ప్రారంభమైంది. కార్మికులుగా ఉన్న తెలుగువారు తమ పిల్లలకు తెలుగు భాషను నేర్పించాలని ప్రయత్నించారు. ఎన్నో విపరీత పరిస్థితులను ఎదుర్కొని పాఠశాలలు స్థాపించుకొన్నారు. తెలుగు వారిని సమైక్యపరచుకోవటానికి మలేసియా ఆంధ్రసంఘాన్ని స్థాపించుకొన్నారు. తెలుగు భాషా సంస్కృతులను నిలుపుకోవటానికి అహోరాత్రులు కృషి చేశారు. క్రమంగా తెలుగు యువకులు చదువులు సాగించి ఉన్నత విద్యారంగాల్లోనూ, పారిశ్రామిక వ్యవసాయ, రాజకీయాది రంగాల్లోనూ ప్రవేశించారు. కేంద్ర ప్రభుత్వంలో కూడా కొన్ని స్థానాలు గడించుకొన్నారు. పరస్పర సహకార భావాన్ని పెంపొందించుకొని సాటి తమిళ సోదరుల్లాగా, భారతీయుల్లాగా, విదేశ సోదరుల్లాగా ముందంజవేయటానికి ఉద్యమించారు. దీనితో మూడవ అధ్యాయం ప్రారంభమైంది. మలేసియా దేశ సంస్కృతి పునర్నిర్మాణంలో తెలుగువారు తమ సంస్కృతి వ్యక్తిత్వాన్ని సముచితంగా సంరక్షించుకొని, తద్వారా దేశ సంస్కృతికి సేవ చేయాలని దృఢ సంకల్పంతో కృషి చేస్తున్నారు.

ఈ ఉద్యమం ఇరవై అయిదేళ్లుగా సాగుతోంది. లక్ష్యాలను సాధించటానికి వారికి ఎన్నో సదుపాయాలు కావాలి. పాఠశాలలు, ఉపాధ్యాయులు కావాలి; పాఠ్యపుస్తకాలు కావాలి; సాహిత్య కళారంగాలలో తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే ప్రయోగాలను ప్రబోధించే ఆచార్యులు కావాలి. విదేశాలలో చదువుకోదలచుకున్న విద్యార్థులకు భారతదేశంలోనూ, అందులోనూ ఆంధ్రదేశంలోనూ విద్యావకాశాలు కావాలి. ఇటువంటివి ఎన్నో సమస్యలు వారిని ఎదుర్కొంటున్నాయి. సహాయం కోసం భారతదేశంవైపూ ఆంధ్రప్రదేశ్ వైపూ వారు ఎదురుచూడడం సహజం. వారు ప్రధానంగా కోరేది ఆర్థిక సహాయం కాదు; హార్దికమైన సహకారభావం.

'మలేసియాలో ముస్లిములకు మసీదులున్నాయి. క్రైస్తవులకు చర్చి మందిరాలున్నాయి. బౌద్ధులకు బుద్ధమందిరాలున్నాయి. తమిళులు మురగన్ దేవాలయాలు నిర్మించుకున్నారు. తెలుగు వారిలో కూడా అన్ని మతాలవారూ ఉన్నారు. తెలుగువారి హృదయాలలో నెలవు చేసికొన్న వేంకటేశ్వరస్వామి, సీతారాములు మొదలైన దేవతలకు దేవాలయాలు నిర్మించుకోవాలని యత్నాలు చేస్తున్నారు. తెలుగుదనం జీవిత ప్రాంగణంలో తొంగిచూడాలని వారు కలలు కంటున్నారు.

మలేసియా ఆంధ్రసంఘం రజతోత్సవాలు వచ్చాయి. ఆ సందర్భంలో రెండవ ప్రపంచ తెలుగు సహాసభలు అక్కడ జరిగాయి. మలేసియాలోని తెలుగువారికి రెండు పండుగలు ఒకేసారి వచ్చినట్లయింది. ఆంధ్రప్రదేశ్ నుండి, భారతదేశం నుండి, విదేశాల నుండీ తెలుగువారు వస్తున్నారని మలేసియా నలుమూలల నుండి ఆంధ్ర సంఘశాఖల సభ్యులేకాక, ఎంతోమంది తెలుగువారు ఆ బాల గోపాలం తియ్యని తెలుగుభాషను చెవులారా విందామనీ, తెలుగు వెలుగులను కన్నులారా చూద్దామనీ సభాప్రాంగణానికి తండోపతండాలుగా వచ్చారు. మన ప్రతినిధులు ఇంగ్లీషులో మాట్లాడినా, ఉరుదులో ముచ్చటించినా, మిశ్రమభాషలో సంభాషించినా, 'అచ్చమైన' తెలుగులో మాట్లాడండి, తెలుగు తియ్యదనాన్ని మాకు రుచి చూపించండి అని మరీ మరీ కోరారు మలేసియాంధ్రులు. వారికి దేవుడనేవాడెవడైనా ఉన్నాడో లేడో తెలియదు కాని 'తెలుగుతల్లి' వారికి ఆరాధ్యదైవం. వారు వేసే ప్రతి ముందడుగూ తెలుగుతల్లి దయవలన కలిగిన అభ్యుదయంగా భావించటం చూస్తే మనకే ఎంతో ముచ్చట వేస్తుంది. మాతృభాషాభిమానం మూర్తికట్టిన బిడ్డలు మలేసియా తెలుగు ప్రజలు.

రెండవ ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలను ప్రధానంగా మూడు విధాలుగా విభజించవచ్చును. మొదటిది– సభల సాధారణ సమావేశాలు. రెండవది–చర్చా సదస్సులు, ప్రదర్శనలు. మూడవది–సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు. ప్రారంభోత్సవం, తెలుగు వెలుగుల పరిచయ కార్యక్రమం, ఆంధ్ర సంఘ రజతోత్సవ సమావేశాలు, ముగింపు సమావేశం మొదలైనవి మొదటి విభాగంలో జరిగినవి. వీటివల్ల

మలేసియా ప్రభుత్వం, తెలుగు ప్రజ సభల్లో పాల్గొన్న తెలుగువారిని పరిచయం చేసుకోవటానికీ, పరస్పరాభిప్రాయ ప్రకటనలు చేసుకోవటానికీ, పరస్పర సహకారావకాశాలను సమీక్షించుకోవటానికి వీలుకలిగింది. చర్చా సదస్సులవలన భారతదేశానికీ, ప్రత్యేకంగా తెలుగు నేలకూ తూర్పు, ఆగ్నేయాసియా దేశాలకూ ఉన్న తరతరాల సంబంధాలను సమీక్షించుకోవటానికి అవకాశం కలిగింది. నడుస్తున్న చరిత్రను, సాహిత్య సాంస్కృతిక కళారంగాల ప్రగతిని సమీక్షించుకొని భావికార్యక్రమాలను, ప్రణాళికలను రూపొందించుకోవటానికి మార్గాలు అన్వేషించటం జరిగింది. తరతరాల తెలుగు సంస్కృతిని చిత్రించే ప్రదర్శన ప్రధానంగా ఆగ్నేయాసియా దేశాలతోడి చారిత్రాత్మక సంబంధాల అధ్యయానికి ఎన్నో ఆకారాలను సేకరించి సమగ్ర చరిత్రను నిర్మించుకోవలసిన అవసరం ఉన్నదని స్పష్టం చేసింది. కవి సమ్మేళనంలో ప్రపంచ తెలుగు సోదరుల సమైక్య కంఠం వినిపిచింది. సాంస్కృతిక ప్రదర్శనాలలో మలేసియా కళారంగ విశేషాలు ఎన్నో మనవారు తెలిసికొన్నారు. తెలుగు కళాప్రదర్శనలను మలేసియా వారు ఆత్మీయతతో అనుశీలించారు. శాస్త్రీయ బాణీలలో కంటె జానపద కళాప్రక్రియల్లో పరస్పర వినిమయానికి ఎంతో అవకాశం ఉన్నదని కళాకారులు గమనించారు. అన్నింటికంటే విశేషంగా మలేసియా తెలుగువారి వ్యవహార భాషను భాషాశాస్త్ర రీత్యా విశ్లేషించి వివేచించే అకాశాలుగా భాషా సాహిత్యవేత్తలు భావించారు. ఇదంతా నిశ్శబ్దంగా తెలుగువారి హృదయాలు రికార్డు చేసికొన్న సాంస్కృతిక వికాస వీచికల ప్రకాశ ప్రసారం. దీని విలువలను నిశ్చయించుకొని, నిర్మాణాత్మకంగా ఈ అవగాహనను మలచుకోవలసిన బాధ్యత తెలుగువారి మీద ఉంది.

ప్రపంచ తెలుగు మహాసభలలో నిర్వహింపబడిన కార్యక్రమాలన్నింటినీ రికార్డు చేశారనే అనుకుంటున్నాం. మొదటి మహాసభల కార్యక్రమాలను, చర్చాసదస్సులను, నిర్ణయాలనూ ప్రచురించి ఉన్నట్లయితే ఇంకా బాగుండేది. ఇప్పటికీ మించి పోయిందేమీ లేదు. రెండు మహాసభల వివరాలను, విశేషాలను, నిర్ణయాలనూ, సూచనలనూ వివిధ రంగాలలోని విజ్ఞులవలన సేకరించి ప్రచురించటం ఉచితం. చర్చా సదస్సులన్నీ మహాసభల్లో టేప్ చేయబడినాయి, అందులో చదువబడిన వ్యాసాలు కొన్ని ముద్రింపబడినాయి. అయినా కొద్ది ప్రతులు మాత్రమే తయారు చేయబడినాయి. ముద్రితాముద్రిత పత్రాలనన్నీ కలిపి ప్రకటించటం అవసరం. ఎంతో ఉత్సాహంతో, ఎంతో వ్యయంతో మహాసభలు జరుపుకొని, వాటి వలన జాతి పొందే ఫలితాలను నిర్మాణాత్మకంగా రూపొందించుకోవటంలో నిర్లక్ష్యం చేస్తే – ఈ సభల ప్రయోజనాలను ఈనగాచి నక్కలపాలు చేసినట్లవుతుంది.

మహాసభలు ముచ్చటకోసం చేసికొనే వేడుకలు కావు. సన్మానాల కోసం జరుపుకునే సమావేశాలు కావు. చర్చలకోసం, నిర్మాణాత్మక కార్యక్రమాలను రూపొందించటంకోసం, ప్రపంచ తెలుగు సంస్కృతి పునర్వికాసంకోసం సాగించే ఉద్యమాలు. విదేశాల్లో జరుపుకునే సభల్లో ఏవో కొన్ని ఇబ్బందులు కలిగాయని మడికట్టుకుని మన రాష్ట్రంలోనే జరుపుకొందామనుకోవటం అభ్యుదయశీలం కాదు. సమస్యల సదవగాహనతో నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకొని, గడించిన అనుభవంతో చేసిన తప్పులను సరిదిద్దుకొని, అంతర్జాతీయ వికాసానికి దోహదం చేయాలే కాని, ఆవేశాలతో ఆ వ్యవస్థను పరిమితం చేయరాదు. ప్రతి మహాసభల్లోనూ తెలుగువారు ఒక నిర్దిష్టమైన ప్రయోజనం సాధించటానికి యత్నించాలి. రెండవ ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తూర్పు ఆగ్నేయ ఆసియా దేశాలలో నివసిస్తున్న తెలుగు వారి స్థితిగతులను అవగాహన చేసుకొని, పరస్పర సహకార భావాన్ని ఆలంబనంగా చేసుకొన్ని, ఆ ప్రాంతపు తెలుగువారి సాంస్కృతిక పునరుజ్జీవనానికి తెలుగువారు సామూహికంగా ఎటువంటి సంఘటిత కృషి చేయటానికి వీలున్నదో ప్రణాళికను సిద్ధం చేసికోవాలి.

'ఇంట గెలిచి రచ్చ గెలువు' అన్నది తెలుగు సామెత. ప్రపంచ తెలుగు మహాసభలు మన ఇంట్లోనే మొదలయ్యాయి. వాటి వ్యవస్థను గురించీ, సాధనను గురించీ, లక్ష్యాలను గురించీ, కార్యక్రమాలను గురించీ, నిర్దిష్టమైన అవగాహన, ముందుచూపు, ప్రణాళిక రూపకల్పనం మొదలు ఏర్పరచుకోవటం మనం ఇంటిలో సాధించే గెలుపు. విదేశాలలో కాని, వివిధ రాష్ట్రాలలోగానీ మహాసభలు జరుపుకొని, వాటి వలన విశ్వాంధ్ర సాంస్కృతిక సమైక్య భావాన్ని అంచలంచలుగా సాధించే ప్రయత్నాన్ని అర్థవంతంగా సాగించటం రచ్చలో మనం సాధించే గెలుపు. ఇల్లు చక్కబెట్టుకుంటూ ఇలాతలంవైపు చూపు సారించటానికి ప్రపంచ తెలుగు మహాసభలు ప్రయోజనాత్మకమైన ఉద్యమాలని భావించటం తెలుగు వారికి అవసరం. మూలచ్ఛేదాన్ని చేసే విమర్శకంటే ముందు చూపునిచ్చే విమర్శ భవిష్యత్తుకు వెలుగుబాట!

(ఏప్రియల్ 1981 – ఆలోచన)

దేవులపల్లి రామానుజరావు

ప్రపంచ తెలుగు మహాసభల సూత్రధారి

1975 ఏప్రిల్ 12 వ తేదీ తెలుగు సంవత్సరాది. ఈ రోజు తెలుగుదేశ చరిత్రలో యెన్నడూ మరువలేని ఉగాది. ఈ రోజు మన రాష్ట్ర రాజధానీ నగరంలో వివిధ దేశాలకు కొన్ని శతాబ్దాల నుండి వలసపోయిన తెలుగువారి ప్రతినిధులు, వివిధ రాష్ట్రాలలో యెన్నోనూర్ల సంవత్సరాల నుండి స్థిరపడిపోయిన తెలుగు ప్రజల ప్రతినిధులు మనతో కలిసి ఒకే వేదికమీద సమావేశమై తెలుగు భాషకు అంతర్జాతీయ పరిగణన రావడానికి, తెలుగు సంస్కృతి సకల ప్రపంచ స్థాయిలో పరిచయము కావడానికి నాందీ ప్రస్తావనలు గావించినారు. ఈ వేదికమీద మారిషస్, మలేసియా, శ్రీలంక, ఫిజీ, కెనడా, ఫ్రాన్స్, ఇంగ్లాండు, అమెరికా, రష్యా, జాంబియా మొదలైన దేశాలలో నివసిస్తున్న తెలుగువారి ప్రతినిధులు సుమారు 70 మందికిపైగా ఆసీనులు కాగా, రాష్ట్రేతరాంధ్ర ప్రతినిధులు కొన్ని నూర్లమంది యీ సమావేశంలో పాల్గొన్నారు. ఇది తెలుగు జాతి చరిత్రలో మహోజ్జ్వలమైన సంఘటన, తెలుగు తల్లి సందేశాన్ని ఆలకించి, తెలుగు సంస్కృతీ స్వరూపాన్ని అవగాహన చేసుకొని తమ తమ దేశాలలోని తెలుగు వారికి యీ సందేశాన్ని అందించి, యీ సంస్కృతిని పరిచయము చేయడానికి వచ్చిన ప్రతినిధులతో ప్రపంచ తెలుగు మహాసభలు వారం రోజులు వైభవంగా జరిగినవి. ఈ వారం రోజులలో ప్రతి సాయంకాలము సాంస్కృతిక ప్రదర్శనలు జరిగినవి. తెలుగు భాషా సంస్కృతులను వివరించే పుస్తకాలు 56 యీ సందర్భమున ఆవిష్కృతములైనవి. తరతరాల తెలుగు జాతి సంస్కృతిని ప్రతిబింబింప జేసే ఉత్తమ ప్రదర్శనలు యేర్పాటు చేయనైనది. ఈ విధంగా ప్రపంచ తెలుగు మహాసభలు తమిళ సభలకంటే, హిందీ సభల కంటే, విశిష్టముగ జరిగినవి. ఇంతటి ఉత్తమ స్థాయిలో యీ సభలు జరిగినవంటే ఇందుకు ఆంధ్రప్రదేశ్ విద్యా సాంస్కృతిక వ్యవహారాల మంత్రి శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారి నిరంతర కృషియే కారణమని చెప్పవచ్చును. ఈ కృషికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారి యొక్కయు, ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గము యొక్కయు సంపూర్ణ సహకారములు లభించినవి. తెలుగు ప్రజల ఆదరాభిమానాలు యిందుకు తోడ్పడినవి. ఈ సభల సందర్భమున తెలుగువాణి పేరుతో ప్రత్యేక సంచికలు తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో ప్రకటితములైనవి. ప్రజానీకానికి ప్రాతినిధ్యము వహించే ఒక గొప్ప ఊరేగింపు గూడ జరిగినది.

ప్రపంచ స్థాయిలో తెలుగు మహాసభలు జరిపించవలెననే ఆలోచనలు చాలా రోజులనుండి జరుగుతున్నవి. కాని యీ ఆలోచనలు యిటీవలి వరకు ఆచరణ రూపము దాల్చలేదు. తెలుగువారు కొన్ని శతాబ్దాల నుండి వలసవెళ్ళి ఇతర దేశాలలోను రాష్ట్రాలలోను వేలసంఖ్యలో స్థిరపడినారు. వీరందరికి తెలుగు భాషా సంస్కృతుల పైన గాఢమైన అభిమానం ఉన్నది. తెలుగు పుస్తకాలు కావలెనని, తెలుగు సినిమాలు కావలెనని, తెలుగు చెప్పే ఉపాధ్యాయులు కావలెనని మారిషస్, మలేషియా ప్రాంతాల నుండి అభ్యర్థనలు అప్పుడప్పుడు వస్తున్నవి. మనవారు విదేశాలకు వెళ్ళినప్పుడు, అక్కడి తెలుగువారు వీరిని కలుసుకొని తమ అవసరాలను వివరించడం జరుగుతున్నది. అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాలు ఇతర భారతీయ భాషలతో పాటు తెలుగు భాషాధ్యయనానికి కావలసిన యేర్పాట్లు లభింపజేస్తున్నవి. కొంతమంది తెలుగు పండితులను ఆ విశ్వవిద్యాలయాలు ఆహ్వానించి, తెలుగు బోధనా సౌకర్యాలకు అవసరమైన సహాయాన్ని పొందినవి. కొందరు ఇంగ్లీషు సివిలియన్ ఉద్యోగస్థులు తెలుగు భాషను అభ్యసించి, అందులో ప్రావీణ్యాన్ని సంపాదించి

రిటైరైన తరువాత తమదేశానికి వెళ్లిపోయిన పిమ్మట గూడ తెలుగు భాషపట్ల ఆదరాభిమానాలు కలిగి ఉన్నారు. ఈ పరిస్థితులను దృష్టియందుంచుకొన్నప్పుడు ప్రపంచ తెలుగు మహాసభల ఆవశ్యకత, సార్థకత విశదమౌతున్నది. 1975 ఏప్రిల్ నెలలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో అమెరికన్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతోపాటు, ఇంగ్లీషు సివిలియన్ ఉద్యోగి కూడ పాల్గొనడం ప్రత్యేకంగా పేర్కొనవలసిన అంశం.

సుమారు పది సంవత్సరాల నుండి తెలుగువారిలో ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ ఆవశ్యకతను గూర్చి చర్చలు జరుగుతున్నవి. మారిషస్, మలేషియా, దక్షిణాఫ్రికా నుండి అఖిల భారత తెలుగు మహాసభలలో పాల్గొనడానికి వచ్చిన ప్రతినిధులు యీ సభలను నిర్వహించవలెననే అభిలాషను వ్యక్తం చేసినారు. మారిషస్‌లోని తెలుగువారికి ఆంధ్రసారస్వత పరిషత్తుతో సాంస్కృతిక సంబంధాలు యేర్పడినవి. ఆంధ్ర సారస్వత పరిషత్తు పరీక్షలను నిర్వహించవలెనని వారు కోరడం అందుకు పరిషత్తు అంగీకరించడం జరిగినది. మారిషస్, మలేసియాలోని తెలుగువారి కోరికపై మనవారు కొందరు అక్కడికి వెళ్ళి వారి సమస్యలను అవగాహన చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభలో గూడ యీ సభల నిర్వహణ అవసరాన్ని గూర్చి ప్రస్తావనలు జరిగినవి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొన్ని సంవత్సరాల క్రిందట యీ సభల నిర్వహణకు కావలసిన సహాయాన్ని చేయడానికి నిర్ణయం తీసుకొని లాంఛనప్రాయంగా కొంత డబ్బును కేటాయించడం జరిగినది. ఈ విధంగా ప్రపంచ తెలుగు మహాసభల యేర్పాటుకు అనుకూలమైన వాతావరణం వ్యాపించినది. కాని యీ బాధ్యతను నెత్తిమీద వేసుకొని యీ సభల నిర్వహణకు కంకణం కట్టుకొని ముందుకు నడిచే వ్యక్తి ఒకరు అవసరమైనారు. ఈ వ్యక్తియే వినయభూషణుడూ, కార్యశూరుడూ, అయిన శ్రీ మండలి వేంకటకృష్ణారావుగారు అని చెప్పితే అతిశయోక్తి కాజాలదు.

1974 వ సంవత్సరం తెలుగువారి చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టము. అంతకు ముందు ఒక సంవత్సరంపాటు రాష్ట్రపతిపాలన కొనసాగిన తరువాత శ్రీ జలగం వెంగళరావు మంత్రివర్గం పదవీస్వీకారాన్ని గావించినది. ఈ మంత్రివర్గం తెలుగు ప్రజల సమైక్యతకు అధిక ప్రాధాన్యము యిచ్చినది; తెలుగు భాషను పరిపాలనా భాషగా తాలూకా స్థాయిలో ప్రవేశపెట్టినది; సత్వర భవిష్యత్తులో తెలుగును జిల్లా స్థాయిలోను రాష్ట్రస్థాయిలోను అధికార భాషగా రూపొందించవలెనని నిర్ణయించినది. అధికార భాషా సంఘ నియామకం గూడ జరిగినది. విద్యామంత్రిగా అప్పుడే పదవీస్వీకారం గావించిన శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారు సందర్భశుద్ధిని, అవసరాన్ని రెండింటిని గమనించి స్వల్ప వ్యవధిలో అఖిల భారత స్థాయిలో తెలుగు మహాసభలను నిర్వహించినారు. ఈ మహాసభలకు ప్రారంభోత్సవం 1974 తెలుగు సంవత్సరాదినాడు జరిగినది. ప్రారంభ సమావేశంలో ముఖ్యమంత్రిగారు, విద్యామంత్రిగారు 1975 సంవత్సరం ఉగాదినాడు ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించగలమని తెలుగు ప్రజలకు వాగ్దానమును చేసి ఆ వాగ్దానమును సంపూర్ణంగా నెరవేర్చుకున్నారు.

1974 మే నెలలో ముఖ్యమంత్రిగారి అధికార వసతి గృహంలో నూరు మందికి పైగా తెలుగు సంస్కృతీ పరులు సమావేశమై ఒక ఆహ్వాన సంఘాన్ని యెన్నుకున్నారు. ఈ ఆహ్వాన సంఘానికి ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారిని అధ్యక్షులుగాను, విద్యామంత్రి శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారిని కార్యనిర్వాహక అధ్యక్షులుగాను యెన్నుకోవడం జరిగినది. ఈ ఆహ్వాన సంఘానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము యొక్క సంపూర్ణ సహకారం లభించినది. తెలుగు ప్రజల పూర్తితోడ్పాటు యీ సభలకు లభ్యమైనది. ఈ విధంగా ప్రపంచ తెలుగు మహాసభలు వారం రోజులు వైభవోపేతంగా జరిగి, తెలుగు భాషా సంస్కృతులకు, జాతీయ అంతర్జాతీయ పరిగణన తీసుకొని రావలెననే ఆకాంక్ష వ్యక్తం చేయడం జరిగినది. ఈ సభల నిర్వహణ కొరకు లక్షల రూపాయల వరకు వ్యయము చేయవలెనని నిర్ణయించనైనది. ప్రపంచ స్థాయిలో జరిగే సమావేశాలకు యీ ఖర్చు యేమంత పెద్దదికాదు. ఒక ఉత్తమ సాంస్కృతిక ప్రదర్శన, 56 ప్రచురణలు, నాలుగు భాషలలో ప్రత్యేక సంచికలు, బ్రహ్మాండమైన ఊరేగింపు, వారం రోజులు సాంస్కృతిక ప్రదర్శనాలు వీటన్నిటి చిత్రీకరణ (ఫిలింతీయడం) యివన్నీ గమనించినప్పుడు సభలు చక్కగా జరిగినవని చెప్పవలసి ఉంటుంది. ఈ సభల నిర్వహణకు శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారి దీక్షా దక్షతలే ముఖ్యకారణమని చెప్పితే అత్యుక్తి కాజాలదు. సుమారు 9 నెలలపాటు శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారు అహోరాత్రములు యిందుకు కృషి చేసినారు. నిధుల సేకరణ, సాంస్కృతిక కార్యక్రమాల యేర్పాటు, ప్రచారము, కార్యాలయ నిర్వహణ – ఒకటేమిటి అన్నింటిలో వారు విశేష శ్రద్ధతీసుకొని అన్ని కార్యక్రమాలు విజయవంతంగా జరుగడానికి పూర్తి సమయాన్ని వినియోగించినారు. నిద్రాహారాల అవసరాన్ని విస్మరించి, యీ సభల నిర్వహణకు వారు కృషిచేసినారు. ఈ సభల నిర్వహణలో అప్పుడప్పుడు కొన్ని క్లిష్ట సమస్యలు ఉత్పన్నమైనవి; సభలు జరుగునో లేదో అనే సందేహాలు గూడ కొన్ని సందర్భాలలో కలిగినవి. కాని శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారు చలించలేదు; నిరాశచెందలేదు. భర్తృహరి చెప్పినట్లుగా కొందరు సంశయాత్ములు పనులను ప్రారంభించనే ప్రారంభించరు; మరికొందరు ప్రారంభించి విఘ్నాలు యెక్కువైనప్పుడు వాటిని వదులుకుంటారు. అయితే కొద్దిమంది మాత్రం విఘ్నాలు యెన్ని సంభవించినా పనులు ప్రారంభించినప్పుడు దానిని విజయవంతంగా నెరవేర్చవలెననే పట్టుదలతో పనిచేసి విజయము సాధిస్తారు. ఈ కొద్దిమందిలో చేరేవారు శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారు. ప్రపంచ తెలుగు మహాసభలు యింతటి భారీ యెత్తున నెరవేర్చినందుకు శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారికి హార్థిక అభినందనలు. భగవంతుడు వారికి దీర్ఘాయురారోగ్యములు ప్రసాదించవలెనని నా ప్రార్థన. తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి అఖిల భారతస్థాయిలోనే గాక అఖిల ప్రపంచ స్థాయిలోగూడ గౌరవప్రద సముచిత స్థానాన్ని సంపాదించడంలో వారు ఇతోధిక మహత్తర కృషి చేయగలరని నా దృఢవిశ్వాసం. ఇటువంటి కృషికి అస్మదాదుల తోడ్పాటు సర్వదా లభ్యము కాగలదు. ప్రపంచ తెలుగు మహాసభల రథానికి సారథి శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారు, రథికులు శ్రీ జలగం వెంగళరావుగారు. ప్రపంచ తెలుగు నాటకములో ప్రధాన పాత్రధారి శ్రీ వెంగళరావుగారు అయితే సూత్రధారి శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారు.

"ఏ ప్రపుల్ల పుష్పంబుల కీశ్వరునకు పూజసలిపితినో యేను పూర్వమందు
కలదయేని పునర్జన్మ కలుగు గాక మధురమధురమైన తెనుగు మాతృభాష."

అనే ఆశయంతో ఉత్తేజితులై –

వేంకట కృష్ణారావుగారు
తమ్ముడా మాయనిత్తువె తల్లి వన్నె
చెల్లెలా చిన్నబుత్తువె తల్లిచిన్నె

అని తెలుగు ప్రజలను ఉద్బోధిస్తున్నారు.

(శ్రీ మండలి వెంకట కృష్ణారావు 50వ జన్మదిన అభినందన సంచిక)

అల్లూరి సత్యనారాయణ రాజు

ధృవతారలైన ఆంధ్రవీరులు

తన ప్రాణమ్ములు రాష్ట్రపీఠికయి సంధానించి ఆంధ్రోద్యమ
స్వనితా చంచలమౌనశంఖ పరిబుద్ధ స్వచ్ఛచేతస్కుడై
తన ఆత్మాహుతి మూడుకోట్ల ప్రజ నిద్రాదూరులై కండ్లు వి
ప్పిన సూర్యోదయవేళగా మలచిమప్పెన్ దేశసాహిత్యమున్.

ప్రకాశం చరిత్రయే ఆంధ్రజాతి చరిత్ర. దీనిలో అతిశయోక్తిలేదు. త్యాగమునకు మారుపేరు ప్రకాశం గారిది. ఆంధ్ర రాజకీయ రంగమున నేటికి ధ్రువతారవలె వెల్గొందుచున్న మహామహులు శ్రీ ప్రకాశం పంతులుగారు.

ఆయన పండుబారిన శరీరము చూస్తూంటే, పండుబారినవారి రాజకీయ పరిణతి మనకు ద్యోతక మౌతుంది.

స్వతంత్ర సమరకాలమున ఆంధ్రకేసరి గర్జనలకు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో రైళ్ళుపరుగెత్తేవి. సైమన్ కమీషన్‌ను బహిష్కరించుటకు భారత జాతీయ వాదము నిశ్చయము చేసుకొన్న రోజులవి. సైమన్ కమీషన్ మదరాసు వచ్చినప్పుడు కమీషన్ ఆగమనమును వ్యతిరేకించు ప్రదర్శనములు పెద్దపెట్టున జరిగినవి. మదరాసు హైకోర్టు ఎదుట ముష్కర పోలీసుల తుపాకి గుండ్లకు తన గుండెనుచూపి ఎదురునిల్చిన అసమాన ధైర్యశాలి పంతులుగారు. ఆనాడు మదరాసు నగరమున ఆంధ్రజాతి గౌరవ ప్రతిష్ఠలను నిలబెట్టి; ఆంధ్రజాతి వీరులజాతియని ప్రకటించిన కీర్తి ఆంధ్రకేసరికి దక్కినది. మొక్కవోని ధైర్యసాహసములు నిస్వార్థ ప్రజాసేవానిరతి, త్యాగగరిమ ప్రకాశం గారికి పెట్టని సొమ్ములు.

ఆంధ్రకాంగ్రెస్ అధ్యక్షులుగను, మదరాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగను తరువాత ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగను శ్రీ ప్రకాశంగారు ఆంధ్రుల ఆదరాభిమానములను చూరగొన్న బహుముఖప్రజ్ఞాశాలి.

చిత్తరంజన్‌దాస్, లజపతిరాయ్, మోతీలాల్ నెహ్రూ మొదలగు మహానాయకుల కోవకు చెందిన మనపంతులుగారు నేటికీ ఆంధ్ర రాజకీయ రంగమున చేయుచున్న గర్జనలు చూస్తే ముచ్చట వేస్తుంది. ఆనందోత్సాహములు కలుగుతవి. 80 సంవత్సరములపై బడిన ఈ వృద్ధాప్యంలో వారిబుద్ధి పాటవం ఇనుమంతైనను సడలలేదు. వీరు స్థిరసంకల్పులు.

త్యాగులకు ఆంధ్రావనిలో కొతరలేదు. మేధావులకు తరుగులేదు. కాని ప్రజానాయకులు కాగలిగిన త్యాగులలో, మేధావులలో శ్రీ ప్రకాశం పంతులు గారు అగ్రగణ్యులు. ప్రకాశం గారు ప్రజల మనిషి. ఆయనకు స్వంత సమస్యలు లేవు. ప్రజా సమస్యలే ఆయన సమస్యలు. ఆయన ముఖాముఖిని ప్రజలతో

సమస్యలను చర్చిస్తారు. ప్రజలకు ఆయనకూ మధ్య తెరలేదు. అదే ఆయన ఉన్నతికి కారణం పరిపాలనా రంగమున ఏదేని క్లిష్టపరిస్థితి ఏర్పడితే, ఆయన చేసే మొదటిపని ఇచ్ఛాపురం నుంచి మదరాసువరకూ బహిరంగ సభలో సంచారమే!

1937వ సంవత్సరమున మదరాసు రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా జమీందారి రద్దు శాసనభను సాధించిన రైతాంగ రక్షకులు.

తరువాత ఉమ్మడి మదరాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా నున్నప్పుడు వీరు తలపెట్టిన 'ఉత్పత్తి దారులు, కొనుగోలు దారుల సంఘములు' నేడు మనం ఎంతగానో ప్రచారం చేస్తున్న సోషలిస్టు సమాజమును స్థాపించుటకు ఉద్దేశింపబడినవే! భారతదేశములో ఇట్టి నూతన కార్యవిధానమును తలపెట్టినది అప్పటి వీరి ప్రభుత్వ మొక్కటియే! కాని ఆ విధానమే పెట్టుబడి దారులకు, మిల్లు యజమానులకు, కంటకమైనది.

1953 సంవత్సరం అక్టోబరు 1వ తేదిని ఆంధ్ర ముఖ్యమంత్రిగా శ్రీ పంతులు గారు ప్రమాణ స్వీకారం చేశారు. నవ్యాంధ్ర వీరి సారధ్యమున పురోగమించుట నిజముగా ఆంధ్రుల మహాభాగ్యము.

ఒక చిత్రం. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవము రాష్ట్రములలోని నేరస్థులనందరినీ, ఉరిశిక్ష విధింపబడిన వారితో సహితంవిడుదల చేయవలెనని వీరు శాసించిరి. ఇట్టి సాహసయుత చర్యకు మరెవ్వరు పూనగలరు.

వీరిది అకుంఠిత దీక్ష. ఆంధ్రకు కర్నూలు రాజధాని కావలెననెడి నిర్ణయమును వీరు తీసుకొనిరి. ఈ సమస్యపై ప్రభుత్వమును కూలదోయుటకు జరిగిన ప్రయత్నములను అపూర్వశక్తి సామర్థ్యములతో వీరు ఎదుర్కొనిరి.

ముక్కోటి ఆంధ్రులకు పంతులు గారు ఆదర్శమూర్తి. భారత ప్రధాని పండిట్ నెహ్రూకు వీరియెడ అమిత గౌరవము. నేటి దేశ నాయకులలో కెల్లవయస్సున వీరు పెద్దలు. కాని షష్ఠిపూర్తివంటి ఉత్సవములు ఆయనకు నచ్చవు. అట్టితలంపే ఆయనకు లేదు. బహుశా ఆయన దానిని సహించరని భావించవచ్చు! ఎందువల్ల నంటే వృద్ధాప్యచ్ఛాయల్ని ఆయన తరిమికొడుతూ ఉంటారు.

దేశ స్వతంత్ర పోరాట రంగమున ప్రథమ శ్రేణికి చెందిన నాయకోత్తములు పంతులుగారు.

స్వరాష్ట్ర సాధనాయత్నములో వీరు సల్పిన కృషి అత్యంత ప్రశంసనీయము. నవ్యాంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా భాషా ప్రయుక్త రాష్ట్ర విజయ సారథులుగా పనిచేసిన కీర్తి వీరికి దక్కినది.

నేడు హైదరాబాద్ సుందరనగరమున ఆంధ్ర విజయలక్ష్మి ఆనందోత్సాహముతో వెల్లవిరియుచున్నది. భారత ప్రధాని నెహ్రూ నాయకత్వమున, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంగారి ఆశీర్వాద బలంతో ఆంధ్రజాతి నిస్సందేహముగా విజయపథమున పురోగమించి నవ సోషలిస్టు సమాజ నిర్మాణమునకు కంకణ ధారణ చేయగలదు.

అమరజీవి

3 కోట్ల ఆంధ్ర ప్రజల చిరవాంఛితమును సాధించుటకు అమరణ ప్రాయోపవేశ దీక్షబూని ప్రాణ బలిదానమునుచేసి స్వరాష్ట్రమును స్థాపించుటతో అమరత్వమును పొందిన శ్రీ పొట్టి శ్రీరాములుగారు మనకు ఆరాధ్యులు.

నేడు ఆంధ్రప్రదేశ్ వినూత్న శోభలతో అవతరించుచున్నది. ఈ ఆంధ్రజాతి చరిత్రలో మహోదయము. ఆంధ్రరాష్ట్ర సాధకులు శ్రీ పొట్టి శ్రీరాములు మనము సంస్మరించుకొనుట సహజమేగదా!

1913 సంవత్సరమున మనం స్వరాష్ట్ర నిర్మాణమును సాధించుటకు ప్రతినబూనినాము. అది బాపట్లలో ప్రథమ ఆంధ్రమహాసభ యిచ్చిన పిలుపు. 1953వ సంవత్సరము అక్టోబరు 1వ తేదీని మన వాంఛితము నెరవేరినది. 40 సంవత్సరములుగా ఆంధ్రమహాజనులు కొనసాగించిన మహత్తర కృషి ఫలించినది. శ్రీ దేశభక్త కొండ వెంకటప్పయ్య, శ్రీ జొన్న విత్తుల గురునాథం, శ్రీ న్యాయపతి సుబ్బారావు పంతులు, డా॥పట్టాభి సీతారామయ్యగారు, మొదలగు మహామహులు జరిపిన కృషి ఫలించినది. ఈ మహత్తర విజయమునకు కారణభూతులు శ్రీ పొట్టి శ్రీరాములుగారు. అందుకే ఆంధ్రరాష్ట్ర సాధకులుగా వీరిని మనం కీర్తిస్తున్నాం.

శ్రీ పొట్టి శ్రీరాములు నిరాడంబరులు, నిస్వార్థి, మహాత్మాగాంధీజీ యొక్క ముఖ్య శిష్యులు సర్వోదయ వాది.

1927వ సంవత్సరమున వీరు గాంధీజీ పిలుపు నందుకొని నిర్మాణ కార్యక్రమం రంగమున కృషి సల్పుటకు ప్రారంభించిరి. తరువాత వీరు 1938వ సంవత్సరమున వ్యక్తి సత్యాగ్రహోద్యమమున పాల్గొనిరి. తదుపరి రాజకోటలో సుమారు 2 సంవత్సరములు పనిచేసిరి. గుజరాత్‌లో గ్రామ సేవాశిబిరములో కూడా పనిచేసిరి. 4 సంవత్సరములు కొమరవోలు గాంధీ ఆశ్రమములో పనిచేసి నిర్మాణ కార్యక్రమమును జీర్ణింపజేసుకొన్న కార్యవాదులు 1942వ సంవత్సరం ఆగష్టు ఉద్యమములో కారాగార వాసము ననుభవించిన దేశభక్తులు 1943 నుండి 1944 వరకు నెల్లూరు జిల్లాలో రాట్న ప్రచారమును చేసిన నిర్మాణ కార్యకర్తలు హరిజన దేవాలయ ప్రవేశముకొరకు వారు సల్పిన కృషి అమూల్యము. హరిజన, సమస్యలపట్ల ప్రభుత్వము, ప్రజలు చూపుతున్న ఉదాసీనతను ఎదుర్కొనుటకుగాను వారు 1948వ సంవత్సమున 29 రోజులు సత్యాగ్రహమును చేసిరి. ఆ సత్యాగ్రహోద్యమ ఫలితముగా అప్పటి మదరాసు ప్రభుత్వం ప్రతినెలా ఒక దినమును హరిజనోద్ధరణకుగాను వినియోగించవలసినదిగా ప్రభుత్వోద్యోగులకు శాసించినది. తరువాత వీరు గాంధీస్మారక నిధికి ఆంధ్ర సంచాలకులుగా నియమింపబడిరి.

1947 సంవత్సరము ఆగష్టు 15వ తేదీని దేశములో పర ప్రభువుల పాలనకు స్వస్తి చెప్పాము. దేశము స్వాతంత్రమును పొందినది. స్వతంత్రమును సంపాదించిన ఆంధ్రజాతి స్వరాష్ట్రమును పొందినగాని సర్వతోముఖ వికాసమును పొందజాలదు. అందువలన శ్రీ పొట్టి శ్రీరాములు తమ దృష్టిని రాష్ట్ర సాధనకు మళ్ళించిరి. సమస్యాసాధనకు ఆత్మబలి దానమునకు కూడా ఆయన సంసిద్ధులైరి.

సామాన్యుడు తలపెట్టజాలని కఠోరదీక్ష వజ్రసంకల్పులు మాత్రమే ఆత్మబలిదానమునకు సంసిద్ధులు కాగలరు. ఏదో ఒక సమస్య కొరకు

గాక, ముక్కోటి ఆంధ్రుల చిరవాంఛితముకొరకు ఆస్థిరసంకల్పుని, మహామహుని తన కర్తవ్యపదమునుంచి ఏశక్తియు తిరోగింపజేయజాలక పోయినది.

1952 అక్టోబరు 19వ తేదీని మదరాసులో శ్రీ బులుసు సాంబమూర్తి గారి సన్నిధిని ప్రారంభమైన నిరాహారదీక్ష అమరణ దీక్షగా 58 రోజుల తరువాత ముగిసినది. డిసెంబరు 15వ తేదీ రాత్రి 11 గంటల 20 నిమిషాలకు శ్రీ రాములు గారు బలిదానమైనారు. ఆంధ్రజాతి దౌర్జన్య రాహిత్య పదమున రాష్ట్రమును సాధింపవలెనని శ్రీరాములు ప్రజానీకమునకు విజ్ఞప్తి చేసియుండెను.

ఎట్టకేలకు మన వాంఛితము నెరవేరినది. కర్నూలులో 1953 అక్టోబర్ 1వ తేదీని ఆంధ్ర విజయ పతాకాన్ని ఎగురవేసినాము. నాడు హైదరాబాద్ సుందర నగరమున ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవమును ఆనందోత్సాహములతో జరుపుకొనుట మన భాగ్యము.

స్వరాష్ట్రమును సాధించుటలో ఆత్మబలిదానమునకు దరహసిత వదనముతో పూనుకొన్న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆంధ్ర విజయలక్ష్మిని సాధించిన మహనీయవ్యక్తి ఆంధ్రులకు ఆరాధ్యుడు.

విప్లవ వీరుడు

ఆంధ్రజాతి చరిత్రలో మన్యం విప్లవం ఒక వీరరసస్ఫురిత ఘట్టం. భారతజాతికి నేతాజీబోసు– ఆంధ్రజాతికి అల్లూరి సీతారామరాజు అదే మన గర్వకారణం !

ఈ విప్లవ వీరుని జన్మస్థానం పశ్చిమగోదావరి జిల్లా మోగల్లు గ్రామము. ఈతని అసలుపేరు శ్రీరామరాజు. కాని, వాడుకలో సీతారామరాజుగా మారిపోయింది. ఆఖరుకు 'రాజు'గా వ్యాపించింది.

నిరంకుశవాదులగు బ్రిటిష్ దొరలతో రాజు సల్పిన సాయుధ పోరాటము వీరరసప్రధానమైనది. ఆ రోజులలో రాజుపేరు చెపితే, తెల్లదొరల గుండెల్లో రైళ్ళు పరుగెత్తేవి. ద్వారబంధాల చంద్రయ్య లేవతీసిన రంపపితూరి కంటె ఉన్నతస్థాయిలో రాజు సామ్రాజ్యవాదంతో పోరు సల్పాడు. అందుకే అతని పేరు తలచుకుంటే మనకు ఉత్సాహము కలుగుతుంది.

జన్మించినది బీదకుటుంబములో, విద్యాభ్యాసము విశాఖపట్నములోను, నర్సాపురంలోను, తునిలో జరిగింది; తదుపరి ఇతడు దేశాటనకు బయలుదేరెను. దేశభక్తి ఉగ్గుపాలతోనే ఉన్నది. దేశాటనలో విప్లవవీరుడగు పృథ్వీసింగ్‌తో స్నేహం కలిగినది. అక్కడనుంచి చిటగాంగ మొదలగు చోట్ల తిరిగి స్వదేశమునకు తిరిగి వచ్చివేసెను.

రాజు గొప్ప జ్యోతిషశాస్త్రజ్ఞుడు. మంత్రశాస్త్రమున ప్రవేశముగలవాడు. దేవతోపాసన కలదని ప్రతీతి ఏర్పడినది. భవిష్యత్ సంఘటనలను కూడా తెలుసుకొనగలడని ఈతనిని గురించి అనేక కథలుగలవు. ఏది ఏమైనను అపూర్వశక్తి సామర్థ్యముగల దిట్ట.

"గాం సోదర్ల"ని ప్రఖ్యాతినొందిన మల్లుదొర, గంటంసూరి అనువారు సోదరులు. వారిరువురూ శ్రీ సీతారామరాజు కుడి ఎడమ భుజములు. రాజుపేరు చెపితే మన్యం ప్రజలు ఆనందోత్సాహముతో ఎగిరిపోయేవారు. వారికి అట్టి నమ్మకం ఏర్పడింది. అందుకే రాజు విప్లవాన్ని నడుపగలిగాడు. రాజు పల్లెలలో తిరిగి పంచాయితీలను స్థాపించి ప్రజలను సమీకరించుటతో ప్రభుత్వం కదలింది. గూఢచారుల వలన, ప్రభుత్వ సిబ్బంది వలన ఎప్పటి సమాచారములు అప్పటికే ప్రభుత్వమునకు అందుతూ ఉండేవి. అప్పట్లో బాస్టియన్ అను తహసిల్‌దారు చాల దురంతకుడుగా ఉండేవాడు. అందువల్ల 1922 సెప్టెంబరు 22వ తేదీన రాజు చింతపల్లి పోలీసుస్టేషన్‌పై దాడిచేశాడు. ఆ స్టేషనులో నిర్బంధములోనున్న ఖైదీలను విడుదలచేసి, ఆయుధసామగ్రి వశపరచు కొన్నాడు. తరువాత వరుసగా కృష్ణదేవిపేట స్టేషన్, రాజవొమ్మంగ స్టేషన్‌లు దోచుకొనబడినవి. ఈ దాడులలో రాజుకు సహకారముగా సోదర్లు, కోయదొరలూను. పేరు చెప్పి ప్రతి పోలీసు స్టేషన్ రాజు దాడి చేశాడు. వాటిలో అడ్డతీగెల ముట్టడి ప్రసిద్ధమైనది. రాజు గొరిల్లా యుద్ధపద్ధతులలో బహుచతురుడు. త్రైమన్‌హోర్ అనుసేనాని రాజును పట్టుకొనుటలో విఫలుడయ్యెను. తరువాత అదే ప్రయత్నములో సాండర్సు, టాలర్డు అను ఇర్వురు సేనానులు మరణించిరి. రాజును పట్టితే బహుమానం ప్రకటించబడినది. కాని భారత స్వాతంత్ర్య సమరయోధుని ఎవరు బట్టియిస్తారు? తుదకు రూధర్ ఫర్డు కలక్టర్ మన్యం విప్లవమును అణచుటకు ప్రత్యేకింపబడుటలో రాజుపరిస్థితి చిక్కులో పడింది. ప్రథమమున మల్లుదొర, తరువాత అగ్గిరాజు పట్టుబడిరి.

తరువాత ఒక రేవులో స్నానం చేయుచుండగా ఒక బాలయోగిని పట్టుకొని తీసుకొనిపోయి కాల్చి చంపిరనియు, ఆతడే రాజు అనియు చెప్పుదురు. మరియొక వదంతి రాజే స్వయంగా కృష్ణదేవిపేట స్టేషనుకువచ్చి వశమయ్యెననియు, అప్పుడు పోలీసులు ఆ వీరుని చెట్టుకు కట్టి 1924వ సంవత్సరము మే 12వ తేదీన కాల్చి చంపివేసిరనియు చెప్పుదురు. సరిగా ఎట్టి పరిస్థితులలో విప్లవ వీరుడు సీతారామరాజు మరణించెనో మనకు తెలియదు. అది జరిగిన తరువాత కూడా అనేక సంవత్సరములు రాజు సజీవుడేయని ప్రజలు భావించుట నిజముగా సజీవుడేమో అని బ్రిటిష్ ప్రభుత్వం కలద్రొక్కుకొనుట కూడా జరిగినది.

రామరాజు చరిత్ర మనకు గర్వ కారణం. శివాజీ, నేతాజీ, మొదలగు మహావీరుల పేరు నిల్చినంతకాలం రామరాజు ముక్కోటి ఆంధ్రులకు ఆరాధ్యుడగు విప్లవవీరుడు. అందుకే అతని చరిత్ర నేడు వీరరసస్ఫురిత గాథగా గానము చేయబడుచున్నది.

దేశభక్త

అది 1911వ సంవత్సరం. దేశం యావత్తు బెంగాల్ విభజనకు ఉద్రిక్తపడుతున్న రోజులవి. ఆ వాతారణమే దేశభక్తుని రాజకీయములవైపు ఆకర్షించినది. 1915వ సంవత్సరమున వీరు న్యాయవాద వృత్తినుంచి విరమించుకొని, సేవారంగమును వరించారు. స్వరాష్ట్ర సాధనకు ప్రథమము

నుంచియు పాటుబడిన శ్రీ కొండా వెంకటప్పయ్యగారిని ఆంధ్రులు ఆంధ్రోద్యమ పితామహులుగా పూజిస్తున్నారు. 1913 సంవత్సరమున బాపట్లలో ప్రథమ ఆంధ్రమహాసభను ఏర్పరచుకొని ఆంధ్ర చరిత్రలో వీరు శాశ్వతకీర్తిని సముపార్జించుకొన్నారు. ఆ రోజులలో ఆంధ్ర రాష్ట్రోద్యమము యెడల రాయలసీమలో కొంత వ్యతిరేకత ఉండేది. దానిని తొలగించుటకు వారు అనేక పర్యాయములు రాయలసీమకు వెళ్ళి కృషి చేసిరి.

స్వరాష్ట్రాభిమానమునకు తీసిపోని దేశాభిమనముతో జాతీయోద్యమముల పాల్గొన్న మహానాయకుడు దేశభక్తుడు. 1919వ సంవత్సరమున జరిగిన జలియన్‌వాలాబాగ్ హత్యలకు జాతియావత్తు కంపించి పోయినది. ఆ హత్యాకాండవల్ల నష్టపడిన కుటుంబముల సహాయార్థము వారు విరాళములు సేకరించుట వీరి విశాల దృక్పథమునకు, దయామయ స్వభావమునకు నిదర్శనములు.

1923వ సంవత్సరములో దేశబంధు చిత్తరంజన్‌దాస్ కాంగ్రెస్ అధ్యక్షపదవికి రాజీనామా చేయుట జరిగినది. అప్పుడు వీరు కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేసి దేశ రాజకీయ రంగమున ప్రముఖ పాత్ర వహించిరి. ఒక్క ఆంధ్ర దేశమునకే కాక, భారత దేశమునకు వీరి సేవా భాగ్యము లభించినది.

మహాత్మాగాంధీజీకి వారియెడల అసమాన గౌరవముండెడిది. స్వాతంత్ర్య పోరాటములలో ఎన్నడును వెంకజ వేయని ధీరులు 1921, 1939, 1932, ఉద్యమములలో పాల్గొని జైలు శిక్షలు అనుభవించిన దేశభక్తులు. 1945–49 వరకు వ్యక్తి, సత్యాగ్రహములో పాల్గొనందులకుగాను కారాగార వాసము ననుభవించిన త్యాగధనులు 1923వ సంవత్సరమున కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభకు ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా పనిచేసిరి. 1920వ సంవత్సరమున వీరు అఖిల భారత కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులైరి. ఆంధ్ర పితామహులగు వీరు అఖిలాంధ్ర పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికైరి. శ్రీ సిడింబి హనుమంతరావుగారితో కలిసి జాతీయ కళాశాలను, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ గారితో కలసి గుంటూరు శారదా నికేతనమును స్థాపించి జాతీయ విద్యకు ప్రోత్సాహమును కలుగచేసిరి.

1937వ సంవత్సరమున మదరాసు శాసన సభకు ఎన్నుకోబడిరి. సర్కారు ఆంధ్రులను, రాయలసీమ ఆంధ్రులకు సమైక్యత పరచుటకుగాను వీరు శ్రీబాగ్ ఒడంబడికను సాధించుటలో అపూర్వ కృషిని సల్పిరి. ఆంధ్రులు కనినకలలు నిజరూపు దాల్చినవి. ముక్కోటి ఆంధ్రుల చిరమనోవాంఛితము సఫలీకృతమైనది. దేశభక్తుని కల ఫలించినది. దేశోద్ధారకుని ఆశ నిజమగు చున్నది. నేడు ఆ పవిత్రాత్ములు మన మధ్యలేరు. కాని దేశభక్తుని స్వార్థమెరుగని దేశభక్తి; దేశాభిమానమునకు తగిన త్యాగనిరతి శ్రీ వెంకటప్పయ్యగారికి ముక్కోటి ఆంధ్రుల హృదయ పీఠిని చిరస్థానమును చేకూర్చినవి. ఆ మహాపురుషునికి మన జోహార్లు.

(గోలకొండ పత్రిక - 1-11-1956)

తన గీతి యఱవజాతిని పాటకులనుగా
దిద్దివర్ధిల్లిన తెనుగు వాణి,
తన పోటులు విరోధి తండంబులకు సహిం
పనవిగా మెరసిన తెనుగుకత్తి,
తన యందములు ప్రాంతజనుల కభిరుచి వా
సన నేర్ప నలరిన తెనుగురేఖ,
తన వేణికలు వసుంధరను సస్యశ్యామ
లను చేయ జెలగిన తెలుగు భూమి

అస్మదార్ద్ర మనోవీధి నావహింప
జ్ఞప్తి కెలయించుచున్నాడ: చావలేదు,
చావలేదు, ఆంధ్రుల మహోజ్జ్వలచరిత్ర
హృదయములు చీల్చి చదువుడో సదయులార!

కృష్ణాతరంగ పంక్తిన్ ద్రొక్కి త్రుళ్ళింత
నాంధ్ర నౌకలు నాట్యమాడునాడు
ఇంటింట దేశిసాహిత్య దీపములతో
నాంధ్ర తేజస్సు రాపాడునాడు,
సుకుమార శిల్పవస్తు ప్రపంచమునందు
నాంధ్రనైపుణి పంతమాడునాడు,
సమర సేనావ్యూహ జయపతాకల క్రింద
నాంధ్ర పౌరుషము చెండాడునాడు,

చూచి, సంతోషమున తలలూచి, గర్వ
మాచి, ఆంధ్ర పుత్రీపుత్రులందగలరు
శాంతి, నందాక లేదు విశ్రాంతి మనకు,
కంకణ విసర్జనల కిది కాలమగునె!

– రాయప్రోలు సుబ్బారావు

కొడవటిగంటి కుటుంబరావు

జాత్యుద్ధరణే పరమ లక్ష్యంగా కల వీరేశలింగంగారి సాహిత్య కృషి

ఈ యుగంలో తెలుగు జాతికి పెద్దదిక్కుగా పరిగణించ వలసినవాళ్ళు ఇద్దరున్నారు. ఒకరు వీరేశలింగం పంతులుగారు, రెండోవారు గురజాడ అప్పారావు పంతులుగారు. అప్పారావు గారు మహాకవి. ప్రతి తెలుగువాడు భగవద్గీత కింద ప్రతిరోజూ పఠించవలసిన ఒక గేయం ద్వారా ఒక సమగ్ర జీవిత సందేశం యిచ్చాడు. అభ్యుదయ జీవితానికి కావలసిన నీతీ, విశ్వాసాలూ, కార్యక్రమం యావత్తూ అందులో ఉంది.

వీరేశలింగం గారు కర్మిష్ఠి. ఆయన కార్యక్రమం ఒక సందేశంతో తీరిపోయేది కాదు. జాతిని చెవులు పిండి, బుద్ధి చెప్పి, కోప్పడి, కొట్టి అడుగడుగునా విమర్శిస్తూ, మంచి మార్గాలు చూపిస్తూ నిజంగానే ఒక పెద్దదిక్కై వుండి కాపాడుతూ వచ్చారు. గారాబంతో గాని, లేని పోని మెప్పులతోగాని, లాలనతోగాని ఆయన తెలుగు జాతిని మభ్యపెట్టి "పాడు" చెయ్యలేదు. మౌఢ్యమూ, మకురుతనమూ బలిసిపోయివున్న యీ జాతి వీరేశలింగం గారి పెంపకానికి లొంగివచ్చిందిగాని, దాన్ని పట్టుకు రావటం మరొకరివల్ల సాధ్యయమ్యేదికాదు.

తన సమకాలికులలో బలవంతుల వర్గాన్ని తన రచనలద్వారా శ్లాఘించీ, రంజింపజేస్తే, సమర్థించీ, వారి ఆదరాభిమానాలు సంపాదించుకుని వారిచేత బ్రహ్మరథం పట్టించుకోవాలంటే వీరేశలింగం గారికి సాధ్యమైన పనికాదు. ఆయనకు బహుభాషా పాండిత్యమూ, వివిధ సాహిత్య సంపర్కమూ, శీఘ్ర రచనాశక్తి ఉండేవి. కాని జాతికి ఎదంగా నిలబడే స్వార్థమూ, జాతియొక్క యోగక్షేమాలను గురించి నిర్లక్ష్యమూ మాత్రమే ఆయనలో లోపించాయి. తల్లి పిల్లలకు ఎదంగా నిలబడి వారి మన్ననల కొరకు తాపత్రయం పడటం ఎంత అసాధ్యమో వీరేశలింగం గారు సాహిత్యం ద్వారా స్వార్థం చూసుకోవటం అంత అసంభవం. తన ద్వారా జాతిపైకి రావటమే ఆయన ఆత్మ విశ్వాసం. అదే ఆయనకు కీర్తీనూ.

తన తెలుగు జాతి ఏయే ప్రభావాలవల్ల బాగుపడగలుగుతుందో ఆయా ప్రభావాలన్నిటికీ వీరేశలింగం గారు గురికావటం జరిగింది. ఇందులో వింత ఏ మాత్రమూ లేదు. ఎందుచేతనంటే ఏయే ప్రభావాలవల్ల ఆయన తెలుగుజాతికి పెద్ద దిక్కుకాగలిగాడో ఆ ప్రభావాలనన్నిటినీ ఆయన తన రచనల ద్వారా జాతికి అందించాడు- సాధారణంగా ఇతర రచయితలు ఆత్మ సంతృప్తి కోసమో, కాకతాళీయంగానో కొన్ని ప్రభావాలను తమ రచనల ద్వారా ప్రపంచంమీద రుద్దేస్తారు. కొంతకాలం ఈ ప్రభావాలు సంఘానికి ఉపకరించాయా అని అంచనా కట్టుకోరు. తాము ఆ ప్రభావాల నుండి విముక్తులైనప్పటికీ, వాటితో కూడుకున్న తమ రచనలను ఖండించుకోరు. ఇక సంఘం అవసరాలనుబట్టి పని పెట్టుకుని కొత్త ప్రభావాలను తమ మీద తెచ్చి పెట్టుకోవటమనేది ఒక్క వీరేశలింగం గారికే చెల్లిపోతుంది.

మొదట్లో వీరేశలింగంగారు అప్పటి కవి పండితుల ప్రభావానికి లోనైనవారే. ప్రబంధ, చిత్ర, బంధాదికవిత్వాలు చేశారు. కాని వాటి మీద ఆయనకు త్వరలోనే విసుగుపుట్టింది. కాని, ఆయన సమకాలికుల దృష్టిలో ఆయనకు సాహిత్య పట్టభద్రత లభించివుండాలి.

వీరేశలింగంగారి ఇతర రచనల్లో వివిధ ప్రభావాలు కనిపిస్తాయి. ఇంగ్లీషులో నుంచి షేక్స్పియరు నాటకాలూ, షేక్స్పియరు నాటక కథలూ, గలివర్స్ ట్రావెల్స్ మొదలైన గ్రంథాలకు తర్జుమాలున్నాయి. వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్ నవలను అనుసరించి రాజశేఖర చరిత్రమనే నవల ఒకటున్నది. ఏసుచరిత్ర ఉన్నది. రసాత్మకంగానూ, సంస్కారదృష్టితోనూ రచించిన ప్రహసనాలున్నాయి. విద్యార్థుల ఉపయోగం కోసం వాచక పుస్తకాలున్నాయి. సంస్కృతంనుంచి తర్జుమా చేసిన శాకుంతలమూ, రత్నావళీ నాటకాలున్నాయి. సంఘాన్ని విమర్శించుతూ, ప్రజలకు ఉద్బోధచేస్తూ వ్యాసాలున్నాయి. తర్కమూ, శరీర శాస్త్రమూ మొదలైన శాస్త్ర గ్రంథాలున్నాయి. అద్భుత పరిశోధనతో గూడిన కవుల చరిత్ర ఉన్నది.

సంఘ దృష్టి తనమీదకు తిప్పుకుని తన గొప్పతనం సంఘానికి చెప్పి గొప్పవాడనిపించుకునేటందుకు తాపత్రయ పడేవాడు ఇన్ని రకాల రచనలకు పూనుకోడు. కవిత్వం రాసేవాడికి గద్యం రాద్దామంటే ఆ కాస్త కీర్తీ పోతుందేమోనని భయం. కథకుడుగా పేరు పడ్డవాడికి నాటకాలు రాయడమంటే భయం. అటువంటి పరిస్థితిలో వీరేశలింగంగారు కేవలం ఆత్మ సంతృప్తి కోసమే ఇంత సాహిత్య కృషి చేసి ఉండటం అసంభవం.

ఇందులో మరొక వింతకూడా ఉంది. సంఘ కార్యం ఏది నెత్తిన పెట్టుకున్నవాడుకూడా సాహిత్యం జోలికి రాడు. మన రాజకీయవేత్తలూ, సంస్కారులూ, నటకులూ, తదితర గౌరవనీయులూ సాధ్యమైనంతవరకు కలం పట్టరు. కీర్తికాయులై ఉండటం చేతనో ఏమో, వారికి తాముచేసే పని మీద ఉండే శ్రద్ధ ప్రయత్నఫలితాల మీద ఉండదు. తాము చేసే ప్రయత్నం సమగ్రంగా ఫలించాలంటే సాహిత్య సహాయం ఉండి తీరాలి. వీరేశలింగం గారికి ముందుగాని లేక వెనకగాని సంఘసేవ చేసినవారు తమకు సహకారిగా సాహిత్యం సృష్టించింది లేదు. అయితే వీరేశలింగం గారు ఒక్కరే ఈ పనిచేశారు. ఒక వంక వితంతు వివాహాలు చేయిస్తూ, తుచ్ఛ మూఢాచారాలను ఎదుర్కొంటూ, సంఘ విద్రోహులను ఎదిరించి శత్రువులను చేసుకుంటూ, అవసరమైనప్పుడల్లా సంఘాన్ని అంతనీ ఎదిరించి పోరుతూ, జనసామాన్యంలో వివేకాన్ని కలిగించారు.

అభ్యుదయ, మాసపత్రిక, ఏప్రిల్, 1948
పునర్ముద్రణ : విశాలాంధ్ర దినపత్రిక, 15.04.1962

తెలుగు పతాకం యెగురని దిశయే లేదు
తెలుగు దివ్వె వెలుగనట్టి నిశయే లేదు
తెలుగు పులుగు చేరలేని దేశం లేదు
తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు

వేయి స్తంభముల గుడిని వెలయించిన చేతులు
వేయి యేండ్ల మనగాథలు వినిపించే గీతలు
కాకతి రుద్రమను మరువగలుగునెవరు? సోదరీ
రాయలపౌరుషము మరువరాదెన్నడు సోదరా!

నాగార్జునాచార్య నవబోధనలలోన
నరుల నాగరకతయె నాట్యమాడేనులే
నందికొండ శిల్పాలకు నతు లొనరించాలి
సుందరమగు రామప్పకు వందే అనాలి

గోదావరి తీరంలో 'కో' అంటే చాలును
నా దేశం వైభవము నాదాలై వినపడును
కృష్ణానది తరంగాలు తృష్ణతీర్చు సుధాఝురులు
నాగార్జున సాగరాన నాట్యమాడు కురంగాలు

తిరుపతి కొండకు పోయి తిరుమలేశు పూజిస్తే
పరమభాగవతుల కిహము పరము కరతలామలకము
శ్రీశైలం మల్లన్నను సేవిస్తే చాలును
చింతలన్ని తొలగిపోయి జీవితమే విరబూయును

నన్నయ పద్యమ్మొక్కటి నాల్క మీద ఉన్న చాలు
అన్ని విద్య లొకసారే ఆకళించినట్లౌను
తిక్కన పద్యమొక్కటి చక్కగ చదివిన చాలు
తెలుగుజాతి నుడికారము తెలిసికొన్న యటౌను

పోతన పద్యమొక్కటి ప్రీతిగ చదివిన చాలను
అమృతమునే రుచిచూచిన ఆనందము కలుగును
విశ్వదాభిరాముడైన వేమన ఆటవెలదిలో
విశ్వమెల్ల ఇమిడిపోయి వేదాంతం విరియును

త్యాగరాజ కీర్తనతో తాదాత్మ్యం పొందితే
సంగీతం హృదయంలో జడివానై కురియును
కలకాలం మన ఐక్యత కాపాడాలి
తెలుగు జాతి గౌరవాన్ని నిలబెట్టాలి

– దాశరథి

దేవులపల్లి కృష్ణశాస్త్రి

ఆదర్శ గురువు 'నాయుడు గారు'

'తాను వెలుగుతుంటేనే కాని, ఒక వత్తి మరొకవత్తిని వెలిగించలేదు. అపరిమితమైన విద్యా సంపద తనమనః పేటిలో నింపుకొన్నను, తన విద్యార్థుల జీవితములను సంస్కరించి ఉత్తేజపరచలేని గురువు గురువు కాడు. ఆ ఉత్తేజ పరచడం పోయి ఊరకేసరుకు నింపడంతోనే సరిపోతే, సత్యము, నిత్య వికాసమూ నిరవధికతా పోగొట్టు కుంటుంది. మన పాఠశాలల్లో చెప్పే చదువు సాధారణంగా సరుకు నింపేదే కాని సంస్కృతీ చైతన్యమూ సంపాదించి పెట్టేదికాదు. అట్టి చదువు చెప్పే గురువు మనస్సు మ్యూజియం వంటిది– చచ్చిపోయినవీ, పాతవీ వస్తువులతో నిండి ఉంటుంది' అని రవీంద్రుడన్నాడు.

పాఠశాలల్లో గురువులందరూ గురువులుకారు. మాష్టర్లు. అంతంత చదివి అంతోయింతో అమాయకుల మనస్సులకు అంటించే వాళ్ళు. గురువు స్నేహితుడు, తండ్రి, ఋషిన్నీ. గురువులు కొద్దిమంటే ఉంటారు. గురుదేవు డే వొక్కడో వుంటాడు. నాయుడుగారు గురుదేవుడు.

నాయుడుగారంటే నాయుడుగారే. ఏభై సంవత్సరాలు తెలుగు దేశంలో నాయుడు గారంటే వొక్కరే. రఘుపతి వేంకట రత్నం నాయుడుగారు. ఏభై సంవత్సరాలు ఆంధ్రయువకులనుత్తేజపరచిన గురువొక్కడే! రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు. తెలుగునాటిలో, వివిధ రంగాల్లో ప్రముఖులై, నవ్యాంధ్ర నిర్మాతలై నిలిచిన మూడు నాలుగు తరాల పెద్దలు జీవితయాత్ర సాగిస్తూ, కృషిచేస్తూ ఒక్కసారి బలంకోసమూ వెలుగుకోసమూ 'మా నాయుడుగారు' అనేమాట ఆప్యాయంతో అనుకొని మళ్లీ ప్రయాణం సాగిస్తూంటారు.

నాయుడుగారు 1861లో పుట్టారు. 1939లో స్మరణీయులయ్యారు. పచ్చయప్ప కళాశాలలో, ఏలూరులో, సికింద్రాబాదు మహబూబ్ కాలేజీలో, బందరు నోబులు కళాశాలలో, తరువాత కాకినాడ కాలేజీలో, వేలకువేలు విద్యార్థుల్ని తయారుచేశారు. కులపతి నాయుడుగారు తరువాత మద్రాసు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఉండేవారు. అంతకాలమూ ఆంధ్ర ప్రముఖుల్లో నేటికి ముప్పాతికమంది ఆయన చరణసన్నిధాన చదువుకొన్నవారే.

ఆరోజులు కూడా అలాంటివి. అప్పుడు నవయుగోదయం. ఇక యువకుని మనస్సు శత్యాసారంకంటె స్వచ్ఛం. వాని భావన రెక్కలెప్పుడూ ముడుచుకోవు. వాని గాలిమేడలు పర్వతాలకన్న స్పష్టంగా, అచలంగా తోస్తాయి. వాని బ్రతుకు అలౌకికమైన ఏ అనుభూతికో అంగలారుస్తూ వుంటుంది. వాని దాహానికి పాలకడలే చాలనట్లుంటుంది. ఒక చేతిలో సమర్పించడానికి అమృత భాండాన్ని, రెండో చేతిలో స్వీకరించడానికి అక్షయపాత్రనూ పట్టుకొని ఆకాశలను ఆహ్వానించే పిపాసాతురుడై నాడు

పాఠశాలా ప్రాంగణంలో నిలబడ్డాడు. ఆ తరుణంలో వానికన్నా ఆతురుడై తన మనో భాండారాన్ని, హృదయ నిధానాన్నీ తెరచికొన్న గురుదేవుడు ఎదురుగా అవతరించి పిత్రాలింగనంతో స్వాగతం యిస్తే ఎలాంటి అనుభవాలు వికసిస్తాయి! ఎలాంటి సంఘటనలు ఫలిస్తాయి!

మా గురుదేవుడు, అధ్యాపకుడూ ఆచార్యుడు కూడా. నాయుడుగారు సొక్రటీసు.

కవికిలాగే అధ్యాపకుడికీ తన్మయత్వం (Emotion)భావనా (Imagination) నిండుగా ఉండాలి. నాయుడుగారి హృదయం నారదుని వీణలాంటిది. ఇంత చిరుగాలి కదిపితే ఎంతో కంపించిపోయేది. శిష్యులకూ, తనకూ ఉన్న సంబంధం అనుభవించేవారు. శిష్యుల అనుభవాలు తెలుసుకొనేవారు. ప్రతి కావ్యంలోని అనుభవాలు నందనానిలంలాగ వారి మనస్సును ఉద్రూతలూగించేది. "He is tube through which all things blow into music.—

ఇక వారి భావనాశక్తికి అవధిలేదు. ఇట్టి తన భావనాపక్షాల్ని విప్పి వైదిక యోగులనాటి భాగీరథీ తీరానికి, బదరికాశ్రమానికి ప్రయాణమై, అంతలో 'హాఫీజ్, సాదీ, రూమి'లున్న పారసీక మధువనంలో వారి షేక్‌స్పియర్, వర్డ్స్‌వర్త్, కేర్లైల్ వంటి పాశ్చాత్యుల విజ్ఞాన వీధుల్లో వారి మనస్సు విహారం చేసేది.

అనుభవించే అట్టి హృదయంతో, భావించే మనస్సుతో, ప్రబోధించే అనన్య సామాన్యమైన వాక్ ప్రతిభతో నాయుడుగారు శిష్యులతో కావ్యం పఠిస్తూంటే వారి ప్రతిభాషణమూ ప్రతి శిష్యుణ్ణీ ప్రత్యేకంగా పలకరించినట్టుండేది; ప్రతి సందేశమూ వానికే వినిపించినట్టుండేది.

నాయుడుగారు తెల్లటి దుస్తులు వేసుకొనేవారు. తెల్లచెప్పులు, తెల్లషుర్వా, తెల్లషేర్వాణి, తెల్లపగిడి, ఆ పగిడీలోనుంచి తొంగిచూచే చివరరోజుల్లో తెల్లని గిరజాలు, తెల్లని మిసాలున్నూ, చుట్టూ నల్లని కాటుక ఛాయ వుండే చల్లని చురుకైన కళ్లు, మేఘగర్జనవంటి గంభీరమైన కంఠధ్వని, నాయుడుగారు క్లాసుకుగాని మరే కార్యానికి గాని సకాలంలో వచ్చేవారు కాదు. కొన్ని గంటలు ఆలస్యమయ్యేది.

సాయంకాలం రాత్రిగా కరగిపోయే సమయం అది. పాఠశాలలో, గదిలో ఆ రోజుల్లో విద్యుద్దీపాలు లేవు. మునిమాపు చీకట్లు ముసుగులు వేసుకుని మూల మూలలనుంచి గదిలో ప్రవేశిస్తున్నాయ్. నూటయాభైమంది విద్యార్థులు కూర్చున్నారు. ఎదురుగా వేదికమీద తేజస్తంభంలాగ, పాదుషాలాగ గురుదేవుడు. భాద్రపద భాగీరథియై, అంతలో మెల్లగా కొండవాగు మొదలుపెట్టి, చల్లగా నిండునదియై, క్రమక్రమంగా గంభీరవాణి గది అంతా నిండిపోయేది. మిల్టన్స్ పారడైజులాస్ట్ రెండవ పర్వంలో Stagi on Council పాఠశాలో ఘట్టం. అంతలో చీకట్లలోనుంచి నిలబడి సేటన్ బియల్జిబబ్, మోలక్ బెలియన్– ఆ మూర్తులు మాయెదురుగా మొలిచి పలుకరించేవి. అంతేకాదు. ఈ ప్రక్కనున్న ఒక వేంకట్రావు సేటన్, ఆ ప్రక్కనున్న ఒక సుందర్రామరాజు– బీల్జిబబ్, మరొకడు మరొకడూ అయి మేము చదువుకున్నది పాఠంకాక, 'పాల్గొనేది' 'పారడైజ్ లాస్ట్ గాథ' అయ్యేది. అలాగే జూలియస్ సీజర్, ఫ్రూడ్ నావికుల గాధలూ, టెనిసన్ 'లాన్సలెట్ ఎలియన్ల' ప్రణయ గాధ.

నాయుడుగారు ఆంధ్రయువకునకు ప్రసాదించిన వరాలు రెండు. లక్ష్యశీలం, తత్వదృష్టి. జీవితాన్ని గొప్ప నక్షత్రానికి తగిలించి యాత్రసాగించడం; ప్రతి వస్తువులో ప్రతి సంఘటనలో పరమార్థం పరిశీలించి గ్రహించడానికి ప్రయత్నించటం. వారి మాట కిటికీ లాగుండేది, తెరిస్తే విశాల విశ్వం కనబడేటట్టు. "To sit beside him is to pass out spiritually into the Universe with the most accomplished of guides"

నాయుడుగారు ఒక్క ఘడియైనా కైలాస శిఖరం నుంచి దిగేటట్టు కనబడేవారు కారు. కాని నిజానికి వారు గోపురంలాంటివారు. సుస్థిర ముగా పాదాలు భూమిలో నిలబెట్టి, మనస్సు ఉన్నతమూ, ఉజ్వలమూ అయిన కాంతి సీమలో ఉంచుకొనేవారు. దీనిక్కారణం వారి అర్జవం, వారి తపస్సు, వారు అర్థశతాబ్ధి ఆమోఘంగా సాగించారు. ఏకపత్నీ వ్రతం. అయితే వారు ఏకపత్నీ వ్రతులుగా ఉండడం, అది మంచిది కనుకే కాదు, మరోలాగ వుండలేరు గనుక. గురుపత్నీ అయిన మా తల్లి యీ శరీరం విడిచి పెట్టి వారిలో నిండిపోయి నట్టయింది. Although it is not shined upon, true as a dial to the sun అన్నట్లుండేవారు. అందుచేతనే కాలేజీ మాకు గురుకులం అయిపోయింది. నాయుడుగారిలోనే గురుపత్నీ అయిన తల్లి, గురువూ కూడా మాకు కనపడేవారు. ఆయన హృదయం గోక్షీరంతో, నవనీతంతో, శర్కరతో, శరజ్జ్యోత్స్నతో చేయబడినట్టుండేది.

అందుకే నాయుడుగారి నిష్కళంకనీతి దండధరుడుకాదు. ఒక్కొక్కడి నీతి పద్ధతి చండశాసనం. మన బ్రదుకు మన యెదుటే పెకల్చి చీల్చి కుళ్ళు బయటపెడుతుంది. ఇక నాకు మిగిలినవి నిరాశ, నిస్పృహ. గురుదేవునిది నాలో నిద్రపోతూన్న అర్జవ పటిమను ఎగననదోసి, నేనెంత సచ్ఛీలుణ్ణి కాగల్నో చూపించేది. ఆయన ఆనాటి ఆంధ్రదేశానికి బహిర్వివేకం. (external conscience) పాపం అనేది దండింపదగ్గ నేరంకాదు, కుదర్చవలసిన రోగం అనేవారాయన.

అర్ద్రమూ, విశాలమూ అయిన ఆయన సౌహార్దం, అనురాగం ఆయన్ని గురుదేవుల్లో ప్రథముడిగా నిలబెట్టింది. ఈ గుణం కూడా కవికిలాగే గురువుకీ ఉండాలి. ఆయా కావ్యాల్లో వచ్చే రకరకాల మనుష్యుల్ని సానుభూతితో అర్థం చేసుకోవాలి. పాఠం చెప్పేవాడు విద్యార్థుల్లో వున్న రకరకాల ప్రకృతుల్ని కూడా ఆప్యాయంగా గ్రహించాలి. అయనకు పాపులూ పుణ్యాత్ములూ అంటూ రెండు రకాలుగా మానవులు విడదీసి లేరు. అందరూ అనంతయాత్రామార్గం చివర అమరులే!

ఈ అనురాగంతో ఒక వింత అడకువ ఆయన్ని మాకు ప్రియతముణ్ణి చేసింది. అసలు యువకుడు అహంకారి. ఎదటి వాడిలో అహంకారం ఓర్చుకోలేడు. 'అది నీకు తగదూ, నీతి పద్ధతి యిది' అంటే ఏవగించుకొంటాడు– అలాగే – 'నాకెంతో తెలుసూ, నీకంతా నేర్పుతా' అన్న అధ్యాపకుణ్ణి గౌరవించలేడు. నాకెంత తెలుసును అనిగాక, నే చెప్పేదెంత బాగుందో విను అన్నవాడు గురువు. ఒకడి పాండిత్యం తనమీద, ఎదటివాడిమీద పాషాణంలాగా కూర్చుంటుంది. మరొకడి పాండిత్యం తనకూ తన్ను సమీపించినవాడికీ ప్రభాపక్షాలు తొడుగుతుంది. నాయుడుగారు గురుదేవులు.

కనుక వారి వియోగ వేదన మాకు వరమైంది. వేదన మానవుణ్ణి తపస్విని చేస్తుంది. తపస్వి క్రొత్తలోకం సృష్టిస్తాడు. వేదనానలం ఎలాగో చల్లార్చుకుని నిద్రపోకూడదు. ఆ అగ్నిని లోపల ఇమిడించుకొని దాని తీవ్రపటిమతో ముందుకునడిచి లోకాన్ని నడిపించాలి. ఈ అగ్ని శోధన మహాపురుషులందరు అనుభవించినట్లే కనపడుతుంది. భర్తృహరి చెప్పినట్లు గురుదేవుడు–

అఘమువలన మరల్చుచు
హితార్ధకలితు జేయుచు
గోప్యంబు దాచుచు,
గుణము పోషించుచు
ఆపన్ను ని విడువక
లేవడి వేళ నిచ్చు సన్మిత్రుడై
మాతృమూర్తియై, పితృదేవుడై
ఆచార్యుడై, అదృశ్యుడై ఉన్ననూ
ఇంకనూ అమరుడై ఆంధ్ర జగత్తులో
వేంచేసియే వున్నాడు.

మహావక్త, సంఘసంస్కర్త, దీనబాంధవుడు, అకలంక హాస్యరసప్రియుడు, స్వాతంత్ర్య యోధుడు, దైవభక్తుడు, వారిగాథ రామాయణంలాగ పాడవలసింది ఎన్నో కాండలుగా విభజించి ఒక్క ప్రసంగంలో ఎలాగ? వారి ప్రియశిష్యులు ముట్నూరి కృష్ణారావుగారన్నట్లు "యెన్ని ప్రాంతాల్లోనో ఎందరి పెద్దల్నో దర్శించాం. వారిని కలుసుకొన్నప్పుడు మా నాయుడు గారిని కలుసుకున్నప్పుడు కలిగిన ఉత్తేజమూ రసానుభవమూ కలుగలేదు. నేటి మహాసంకులములో వారి దివ్యవాణి వినబడి తేనా! ఈ యుగంలో ఆంధ్రసీమలో మా నాయుడుగారివంటి మహాపురుషుడు మరొకడవతరించలేదు. నాయుడుగారంటే వారి పదవులూ, పాండిత్య ప్రకర్షా మాకు జ్ఞాపకం రాదు. కాలేజీ ప్రిన్సిపాల్, యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్, పార్టీ నాయకుడూ, ప్రభువుల సచివుడూ, డాక్టర్, సర్, ఇవేవి మాకక్కరలేదు. ఆయన అధ్యాపకుడయ్యు ఆప్తమిత్రము, అచార్యుడయ్యు అంతరంగ బంధువు. చనువు, భక్తి, స్నేహం, గౌరవం, సమ్రతా, గర్వం, ఏమిటా బాంధవ్యం? ఒళ్ళు మరిపించేదది. భక్తా, వాత్సల్యమా, సఖ్యమా? ఈ రసానుభవం వెనక ఏదో ఒక దివ్య సంబంధం మమ్మల్ని ఆవహించి ఉత్తేజితుల్ని చేసింది. అది పూజ్యతకు మించింది. అది భయాశ్చర్యాలకు పట్టుగొమ్మ. చూస్తూ చూస్తుండగానే ఏ పుష్పకమో ఎక్కించి అమరవీధుల్లో వూరేగించేవారు. వారి సన్నిధిలో యెన్ని మారులు విశ్వరూప సందర్శనం సిద్ధించలేదు? ఉచ్ప్రాపములైన భావశిఖరాలపై ఎక్కినపుడు ఆయన మమ్మల్ని వెన్నంటే ఉండి ఆ విషమసానువుల నెక్కిస్తూ దింపుతూ చేయి అందించేవారు. ఓహో ఏమి కరస్పర్శ అది? దేహాన్నంతా విద్యున్మయంచేసేది. ఆ మందహాసాల్లో చిత్తనైర్మల్యం ప్రతిబింబించేది. కేవలమూ గురుశిష్య సంబంధానికి ఎడబాటుంది. మా గురుదేవునితో మైత్రి కెడబాటేది? అది యేకాత్మత చెందించే సఖ్యము. దానికి వేళ లేదు. స్థలంలేదు. పాఠశాలల్లో, ఇవతల ఎప్పుడూ తోడు నిడగా ఉండేవారు. ఎప్పుడూ అప్రమత్తులుగా చేసేవారు. మా హృదయాల్ని ఎప్పుడు తట్టి ఎలా ప్రవేశించేవారో తెలీదు. ఆయన చికిత్సా విధానం అద్భుతం. షేక్స్పియర్ నాటక విమర్శనలో, కేర్లైర్ విమర్శల వ్యాఖ్యానాల్లో చిట్టి పొట్టి కథల్లో, పరిహాసాల్లో, మాకు తెలియకుండానే మమ్మల్ని ఎక్కడికో ఎత్తుకుపోయి, చిత్తసంస్కారం కలిగించేవారు. వేశ్యలలో మాతృరూపం వెల్లడించారు. ఆపదల్లో అనురాగం వర్షించారు. వారి వక్తృత్వానికి ఆశ్చర్యపడినమాట నిజం. వారి సంస్కారోత్సాహానికి ఉద్రేక పడేవారం నిజం. వారికి మమ్మల్ని వశుల్ని చేసింది మాత్రం వారి మాతృహృదయం.

"నేటి వారు వీరికి శిలావిగ్రహం ప్రతిష్ఠించకపోవచ్చు. ఆంధ్ర విశ్వ కళా మందిరంలో వీరి చిత్తరువు కనిపించక పోవచ్చు. కాని అఖండ వైదుష్యమూ, అమృత హృదయమూ, ఈశ్వరభక్తీ, దీనజనసేవ, సంస్కారోత్సాహమూ, ఆంధ్ర మహాజనులలో ఉన్నంతకాలమూ నాయుడుగారి దివ్యజీవనము అదృశ్యముగ, అమరజ్యోతివలె, స్వర్గవాణివలె తరతరములకూ ప్రబోధకమై వెలియగలదు."

(ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రం సౌజన్యన)

ఆరుద్ర

కాశీనాథుని నాగేశ్వరరావు సాహిత్య సేవ

ఆంధ్ర సారస్వతలోకం శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు గారికి ఏమీ ఋణపడలేదు – అనే వాక్యంతో ఈ ప్రసంగాన్ని ప్రారంభిస్తే ఇది అవిధేయతగా మాత్రం భావించవద్దని ప్రార్థన. పంతులుగారి పట్ల నాకున్న భక్తి శ్రద్ధలు ఇతరులకన్నా ఒక డిగ్రీ ఎక్కువేగాని అరవీసమైనా తక్కువ కాదు. అయినా ఆయనకు ఆంధ్ర సాహిత్యలోకం ఋణపడలేదనే నా నమ్మకం. దాతకు ఎవరూ ఋణపడరు. కృతజ్ఞులై ఉంటారు. దానంగా ఇచ్చిన వారికి ఋణపడ్డా మనుకోడం గొడ్రాలి కడుపున పుట్టా మనుకొనడమే. పంతులుగారు సాహిత్యంలో కూడా నెరదాతలు. ఆయన ఇచ్చినంత సాహిత్య సంపద ఇంకెవరూ ఆయాచితంగా ఇవ్వలేదు.

పంతులుగారి సాహిత్యదానాలు అరవై ఏళ్ళ క్రిందట మొదలైనాయి. ఏ శుభముహూర్తంలో ఆయన ఆంధ్ర వార పత్రికను బొంబాయిలో ప్రారంభించారో గాని నాటి నుండి ముప్ఫయి సంవత్సరాలపాటు ఎడతెగకుండా పంతులుగారు ఆంధ్ర వాఙ్మయాన్ని శ్రీమంతం చేశారు. కొన్ని వందలమంది ప్రముఖుల రచనలు ఆంధ్రదేశానికి ఆయన తమ పత్రికలద్వారా సమర్పించారు. గురజాడ, గిడుగు, కొమర్రాజు, చిలకమర్తి, పానుగంటి మొదలైన కాకలు తీరిన జ్ఞానవృద్ధుల రచనలు మొదలుకొని శ్రీశ్రీ. కొడవటి గంటిలాంటి కొమ్ములు తిరుగుతున్న కోడె రచయితల చెంగనాల దాకా మూడు తరాల సృజనాత్మక నిర్మాణాలు పంతులుగారు స్థాపించిన పత్రికల వల్లనే అశేష ప్రజానీకానికీ అందుబాటులోనికి వచ్చాయి. మధ్యతరంలోని మహాకవులు ఇప్పటికీ సజీవులు చాలామంది ఉన్నారు. ఎప్పటికీ సజీవంగా ఉండే కావ్యాలు కొందరు వ్రాశారు. పంతులుగారు పెట్టిన పత్రికలలో వ్రాసిన వాళ్ళ పేర్లు బేరీజు వేసినా అది ఆధునిక ఆంధ్ర వాఙ్మయ సూచిక అవుతుంది. ఆధునిక వాఙ్మయ చరిత్ర వ్రాసేవాళ్ళు పంతులుగారి పత్రికలను చూడకపోతే వాఙ్మయాన్నే చూడలేదు అనాలి. నండూరి బసవరాజు, బాపిరాజు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, నాయని, కొడాలి, రాయప్రోలు జాషువా, నోరి, వేదుల వేలూరి శివరామశాస్త్రిగారు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, భమిడిపాటి, మొక్కపాటి, మునిమాణిక్యం ఒకరేమిటి చేవగల రచయితలందరూ పంతులుగారు నెలకొలిపిన ఏదో ఒక ద్వారంగుండా సాహిత్య భవనంలోనికి ప్రవేశించినవారే.

శంఖంలో పోస్తే తీర్థం అవుతుందో లేదో గాని ఒకనాడు భారతిలో రచన అచ్చు పడడం నిజంగా పట్టాభిషేకమే. తెలుగునాడులో చెళ్ళపిళ్ళ శిష్యుణ్ణని చెప్పుకొనడం సాహిత్య ఫేషన్ అయితే, భారతిలో వ్రాశానని రొమ్ము విరుచుకొని విర్ర వీగడం కొండెక్కినంత గొప్ప. భారతి సాహిత్యశిఖరం. చాలా కాలందాకా తంబుచెట్టి వీధిలోని ఏడో నెంబరు ఇల్లు ఆంధ్ర సాహిత్యానికి రాజధాని, పెట్టనికోట. పంతులుగారు మకుటంలేని మహారాజు, మరో రాజరాజు, ఇంకో కృష్ణరాయలు. రాజరాజు నన్నయగారితో 'ఇవియేమన్ సతతంబు నాయెడ కరం బిష్టంబులై యుండు' అంటూ అయిదు విషయాలు

చెప్పుకొన్నాడు. పంతులుగారికీ సంతత దానశీలత, శశ్వత్సాధు సాంగత్యమూ లోకం చెప్పుకొనేటంత కరంబష్టాలు.

కృష్ణరాయలవారు 'దేశభాషలందు తెలుగులెస్స' అనే శ్రీనాథుని నినాదం ప్రచారం చేశారు. పంతులుగారు ఆ సంగతిని ముప్పయి సంవత్సరాలపాటు నిరూపిస్తూ వచ్చారు. ఒకరకంగా చూస్తే రాజరాజుకన్నా రాయలవారికన్నా కొన్నంతల సాహిత్యసేవ పంతులుగారే చేశారనిపిస్తుంది. వాళ్ళిద్దరూ స్వంతకీర్తి కోసం వాఙ్మయపోషణ చేస్తే పంతులుగారు ప్రజలకోసం, దేశం కోసం, విజ్ఞానాన్ని వ్యాపింపజేశారు. కర్మాచరణంలో ఉన్న అధికారంపై నమ్మకమే గాని ఆయనకు ఫలాపేక్ష ఏనాడూ లేదు.

పంతులుగారు ప్రజల కోసమే పత్రికలు పెట్టారు. ప్రజల కోసమే నడిపారు. అరవై సంవత్సరాల క్రింద ఆంధ్ర వార పత్రికను ప్రారంభిస్తూ సంపాదకీయంలో ఆయన చేసిన మొట్టమొదటి ప్రకటన చూస్తే ఈ సంగతి తేటతెల్లమవుతుంది. "ప్రజలకు విద్యాభివృద్ధియు, ప్రపంచ జ్ఞానాభివృద్ధియు గావించుటయే మా ముఖ్యాభిప్రాయము. ప్రజల యోగక్షేమాభివృద్ధికి దేశాభిమానమును స్వామి భక్తియును మిగుల సహకారులని మేముద్ఘోషించుచుందుము" అని ఆయన ఎలుగెత్తారు. ప్రజాశక్తిని గుర్తించిన మొదటి జర్నలిస్టు ఆయనే! ఆ పదాన్ని సృష్టించి విరివిగా వాడిన మొదటి రచయిత వారేనేమో ! 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అనే అభ్యుదయ నినాదం పంతులుగారి రచనలో స్పష్టంగా మారుమోగుతూ ఉంటుంది. వర్తమాన యుగమునందు ప్రజల వాఙ్మయ పోషకులు 'శ్రీమంతుల సహాయముకంటెను వర్తమాన యుగమునందు ప్రజాదరణము వాఙ్మయాభివృద్ధికి సాధనముగ నున్నది' అని పంతులుగారు మొదటనే చాటి చెప్పారు.

ఆయన ఉద్దేశంలో తెలుగు ప్రజలంటే పత్రికలు చదివే ఏ కొద్దిపాటి అక్షరాస్యులో మాత్రమే కాదు. 'రామేశ్వరమునకును కాశీ పురమునకు రంగూనుకును క్వెట్టాకును నడుమనున్న' ముఖ్య పట్టణాలలో ఉండే తెలుగు వాళ్ళందరినీ ఆయన దృష్టిలో పెట్టుకొన్నారు. "వీరల నందర నేకీభావులుగజేయుట కాంధ్రభాషకు శక్తి సామర్థ్యములుగలవు. భిన్న దేశములందుండు తెలుగువారి నేక జాతీయులనుగ జేయుటకు మాతృభాషయే తగిన బంధన సాధనము" అని పంతులుగారు తలపెట్టారు తెలుగు వాళ్ళందరినీ ఒక్క తాటిమీద నిలబెట్టారు.

వాఙ్మయ వికాసానికి ప్రజా హృదయమే సుక్షేత్రమని వారికి తెలుసు. ప్రజలకు అందని విజ్ఞానం ఎంత గొప్పదైనా అడవి కాచిన వెన్నెలే. ప్రజల వృద్ధిక్షయాలలో వాఙ్మయ వృద్ధిక్షయాలు ప్రతిబింబిస్తాయి. 'ప్రజల విజయములు ప్రజాభివృద్ధి, ప్రజా వ్యాపనము, వాఙ్మయాభివృద్ధిని; ప్రజాక్షయము, ప్రజాదౌర్బల్యము వాఙ్మయ స్తంభనమునకు గారణము లగుచుందును' అని ఆయన ఎప్పుడో గుర్తించారు. అదిమ యుగాలలో 'బ్రాహ్మణాధీనంబైన నిత్య కర్మానుష్ఠానము ప్రాణకళ గోల్పోయి ప్రజల నిత్య జీవనయాత్రకు నిరర్థకమైనదని' ఆయన స్పష్టపరిచారు. ప్రజలకు వారికి పరిచితమైన భాషలందు ధర్మోపదేశాలు చేసిన బౌద్ధ, జైన మతాల విలువను ఆయన అంచనా కట్టారు. శంకరాచార్యులు జైన బౌద్ధ మతాలను నిర్మూలంచేసినా ప్రజా సామాన్యంలో ఆ మతాలు వ్యాప్తిని పొందినవనీ, శైవము బౌద్ధంలోని మంచి గుణాలు తనలో జీర్ణించుకొని ప్రజలను ఆకట్టుకొందని పంతులుగారు స్పష్టపరిచారు. పురాణ యుగంలో పండితులు "సహజమైన సచేతనమైన దేశీయ భాషా సంప్రదాయములను ప్రజా వాంఛలను ననుసరించుటకు బదులు పురాతనమైన చిరకాల ప్రతిష్ఠితమైన సంస్కృత వాఙ్మయము ననుసరించుచు నిర్మాణ కౌశలమునకు భంగము గలుగజేసిరి" అని పంతులు గారు నేరారోపణ చేశారు. నన్నయగారి కాలం వచ్చేసరికి పండితులకును ప్రభువులకును ప్రజా సంకల్పమును ఆపుట దుష్కరమైనదని గుర్తించారు. "ప్రజాహితార్థము కాకపోయినను తమ కీర్తికొరకైనను దేశీయ వాఙ్మయ నిర్మాణమునకు బూనుకొనవలసిన యవసరము కలిగినది" అని పంతులుగారు తీర్పు చెప్పారు.

పండితాశ్రయమైన వాఙ్మయం ప్రజాపరమైనప్పుడు పంతులుగారు పరవశిస్తారు. "ప్రజా హృదయమునందు విజ్ఞానము లేక వికాసము సాధ్యము కాదని" ఆయనకు తెలుసు. ప్రజాశక్తిని సకల రంగాలలో వికసింపచేసే ఆంధ్ర సాహిత్య మహోదయం ఆయన కాంక్షించారు. ప్రజల హృదయాన్ని గ్రహించడంలో ఆయన ప్రతిభావంతులు. "ఆంధ్ర హృదయశీల మధివ్యాప్తకముగాని వ్యావర్తకము కాదు. ఉదారముగాని సంకుచితము కాదు. సరళముగాని వక్రముకాదు" అని ఉద్బోధించారు. "దేశము విశాలము, భాష మధురము, జనులుత్సాహ సంపన్నులు, ఆంధ్ర భాషయందు పత్రికా పాఠకులు (ఇరవై ఆరు) వేలమంది గలరు. వ్యాసలేఖకులనేకులు గలరు. విచారణీయంబులైన విషయంబు లనేకములు గలవు. జనాభిప్రాయముల కనుకూలముగా విషయ విమర్శనము" చేసే పత్రికలు కావాలని ఆయన సంకల్పించారు. అందుకే ఒకటి కాదు నాలుగు పత్రికలు క్రమేణాపెట్టారు. జర్నలిజానికి జనకులయ్యారు. స్వర్ణ యుగానికి నాంది పలికారు.

జర్నలిజం హడావుడిలో వ్రాసిన సాహిత్యం అని ఒక నిర్వచనముంది. పంతులుగారు జర్నలిస్టులేగాని తొందరపాటు తొట్రుపాటు లేని సాహిత్యవేత్తలు కూడా. నిశ్చలమైన విశ్వాసాలు, నిర్దుష్టమైన తాత్త్వికచింతనా ఉన్నవారు. ప్రత్యేక దార్శనిక దృక్పథం లేనివాళ్ళు యుగపురుషులు కాలేరు. కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు ఎప్పుడో చెప్పినట్టు ఆంధ్రదేశ చరిత్రలో వీరేశలింగముగారికి తరువాతది నాగేశ్వరరావు యుగమే. సంకల్ప బలము, కార్యదీక్షా, త్యాగమూ యుగపురుషులిద్దరికీ సమానమే అని కోలవెన్నువారు అన్నారు. వీరేశలింగంగారిదీ నాగేశలింగం గారిదీ విద్యాకుటుంబాలే. (పంతులుగారికి తల్లిదండ్రులు పెట్టిన పేరు నాగలింగం). కందుకూరి వారిలోనూ కాశీనాథుని వారిలోనూ కృతభర్తలూ, కృతికర్తలూ ఉన్నారు. అయితే ఈ యిద్దరూ పాతకీర్తిని చాటుకోలేదు. చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకొనే గతి వాళ్ళకు పట్టదు. వాళ్ళే మహావృక్షాలు కదా !

వీరేశలింగంగారి ఉద్యమాల సత్ఫలంలోని బీజమే నాగేశ్వరరావు గారిలో మొలకెత్తి వేళ్ళూని విస్తరించింది. వీరేశలింగంగారిలో మూడు సుగుణాలను పంతులుగారు చూశారు. స్వయం సహాయక, సత్యప్రియత్వం నిరంతర వ్యవసాయ పరాయణత్వం అనే ఆ మూడింటినీ తమ స్వంతం చేసుకొన్నారు. జీవితంలో సాధించవలసినవి ఎన్నో ఉన్నాయని గ్రహించారు. పైకి రావాలనే అంతులేని అపారమైన ఆశ, ఆకాంక్ష ఆయనకు తొలినుంచీ ఉండేవి. అక్షరజ్ఞానంలేని సంకుచిత బద్ధులైన జనులమధ్య అభివృద్ధి చెందడం కష్టం అని ఆయన పరసీమలకు వెళ్ళిపోయారు వ్యక్తి సేవ చేయడం ఇష్టం లేదు. సవ్యం సహాయంతో నిరంతర వ్యవసాయపరాయణత్వంలో ఆయన అమృతాంజనం పేరిట కల్పవృక్షాన్ని భూమికి దింపారు. దాన్ని ఆంధ్రుల పెరటి కల్పకాన్ని చేయడంలోనే ఆయన ఔదార్యం కనబడుతుంది.

రెండు చేతులా ఆర్జిస్తున్న కొద్దీ పంతులుగారిలోని మహాపురుష లక్షణాలు మొగ్గ తొడగడం ప్రారంభించాయి. స్వార్థం పోయి పరమార్థం పెరిగింది. అక్షరజ్ఞానంలేని సంకుచిత బుద్ధులైన జనులమధ్య అభివృద్ధి చెందడం కష్టమని ఆదిలో అనుకొన్నారు. తాము అభివృద్ధి చెందడం మొదలుపెట్టాక ఆ అక్షరజ్ఞానం లేనివాళ్ళూ, ఆ సంకుచిత బుద్ధులూ కూడా అభివృద్ధి చెందాలనే తహతహ పంతులుగారిలో ఇనుమడించింది. విజ్ఞాన వ్యాప్తిని ఉద్యమంగా చేపట్టారు. వాఙ్మయ విస్తరణ చేసారు. సాహిత్యాభ్యుదయం చూశారు. సారస్వత పతాకం ఎగరవేశారు.

ఇవాళ వాఙ్మయం, సాహిత్యం, సారస్వతం అనే మాటల్ని పర్యాయపదాలుగా మనం వాడుతున్నాం. అయితే పంతులుగారి ఉద్దేశంలో సాహిత్యం, సారస్వతం అనేవి రెండు విభిన్న పదాలు. ఇవాళ మనం సంస్కృతి అనే మాటను ఏ అర్థంలో వాడుతున్నామో ఆ అర్థంలో సాహిత్యం అనే పదాన్ని పంతులుగారు వాడేవారనిపిస్తుంది. ఒక పీఠికలో ఆయన 'సాహిత్యమునకు సారస్వతము మకుటము' అన్నారు. లలితకళలు, నృత్యగీత వాద్యాదులు సాహిత్యంగాలని చెప్పారు. ఇవి సాహిత్య నిర్మాణ వికాసాలకు సాధనాలైనా భావ ప్రకాశానికి భాషే మూలాధారమని చెప్పారు. సాహిత్యతత్త్వానికి తత్త్వ విచారానికి ఇదే సాధనమని చెప్పారు. మరొక వ్యాసంలో చిత్రకళను సాహిత్యంలో చేర్చారు. భావ ప్రదర్శనంలోనూ రూప నిర్మాణంలోనూ భారతీయ సంస్కారం లేని చిత్ర రచనలు సాహిత్యాభ్యుదయనమునకు నిరుపయోగం అన్నారు. ఈ మాటలవల్ల సంస్కృతిని పంతులుగారు సాహిత్యపదంలో నిర్దేశించారని వూహిస్తున్నాను.

పంతులుగారు తమ రచనలో ఎక్కడా సంస్కృతి అనే మాటను వాడినట్టు కనబడదు. సంస్కారం అనే పదం ఆ ఉద్దేశంలో వాడేవారు. ప్రాచ్య పాశ్చాత్య సంస్కారాలు రెండిటినీ ఆయన ఆకళింపు చేసుకొన్నారు. ఆర్ష విజ్ఞానాన్నీ, ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్నీ ఆయన సమన్వయం చేశారు. ఒక ప్రత్యేక దర్శనాన్ని ఆయన ప్రతిపాదించకుండానే ప్రచారం చేసారు. పంతులుగారి విశ్వాసాలనీ, ప్రవచనాలనీ క్రోడీకరించి, నాగేశ్వరదర్శనం ఏమిటో పరిశీలించకపోతే వారి సాహిత్య దృక్పథం అర్థం కాదు.

ప్రపంచంలోని ప్రతి తత్త్వవేత్తా సాహిత్య నిర్వచనాలు చేశారు. దార్శనిక పరిజ్ఞానంతోనే అలంకారికులు, రస స్వరూపాన్నీ కావ్య ప్రయోజనాన్నీ నిర్దేశిస్తారు. కాశ్మీర శైవంవల్ల ప్రభావితులైన ఆనందవర్ధనుడు, అభినవ గుప్తుడూ, భారతీయ లక్షణ గ్రంథాలను పరిపుష్టం చేశారు. ఆ ధ్వని సిద్ధాంతానే సర్వులూ ఆమోదించారు. నాగేశ్వరరావు పంతులుగారు ఈ దృక్పథంతో కాక స్వయంగా ఒక సాహిత్య దర్శనం రూపొందించుకొన్నారు.

ఆయన పుట్టింది శైవుల యింట పారాయణ చేసినది భగవద్గీత. దీక్ష పుచ్చుకొన్నది శ్రీవిద్య. పరిశీలించినవి అనేక తత్త్వాలు. వీటన్నింటినీ మేళవించారు. ఈ సమన్వయంవల్ల ఒక నూతన సిద్ధాంతం ఏర్పడుతుంది. ఇది పంతులుగారి ప్రతి చర్యలోనూ ప్రతి రచనలోనూ కనబడుతుంది. ఈ సిద్ధాంతాన్ని అర్థం చేసుకొంటేనేగాని పంతులుగారి వ్యక్తిత్వం మనకు బోధపడదు. నాగేశ్వర దర్శనాన్ని సంగ్రహంగా వివరిస్తాను.

జగత్తు శక్తిమయం, శక్తి మూడు రకాలు, అవి ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులు. ఈ శక్తి క్రియ రూపంవల్లనే జగత్తు ఏర్పడుతూంది. చిచ్ఛక్తి సర్వ వ్యాపకం. భారతీయ తత్త్వ పరిభాషలో వాడే చిచ్ఛక్తికి ఆధునికంగా వ్యాపకం. భారతీయ తత్త్వ పరిభాషలో వాడే చిచ్ఛక్తికి ఆధునికంగా రేడియో యాక్టివిటీ అనే అర్థాన్ని పంతులుగారు చెప్పారు. అహతశబ్దరూపమైన జగత్తు అనాహత శబ్దరూపమైన శక్తిమూలంగా వశమగుతుంది. పరిమితమైన శక్తిని అపరిమితము చేసి, సర్వాత్మత్వమును పరిస్ఫుటం చేయడమే సకల యోగాలకు పరమార్థం. ఆత్మను బాహ్య విషయారాధనం నుండి అంతర్ముఖం చేయడమే యోగం. యమ నియమ త్యాగాదియోగాంగాలు పదిహేను ఉన్నాయి. ఈ అంగాలతో కూడిన రాజయోగమే పూర్ణయోగం. అదే మోక్షానికి సాధనం.

మానవులు కర్మలను పరహితార్థం చేస్తేనే మోక్షం. స్వకామ్యార్థం చేస్తే బంధమే లభిస్తుంది. మోక్షం పురుషార్థాలలో ప్రధానమైంది. చతుర్విధ పురుషార్థాలకూ ధర్మం కీలకం. అర్థకామాలు ధర్మాధీనాలు, ధర్మం అర్థకామాలకు అతీతం. ధర్మానికి అర్థం నీతి. ఆత్మదృష్టితో ఏ నీతి పాలింపదగినదో అదే ధర్మం. నీతే జ్ఞాన యాత్రకు సాధనం, పురుషార్థానికి ఫలం.

జీవయాత్రకు పరమార్థం సుఖప్రాప్తి దుఃఖనివృత్తి జీవయాత్రలో వ్యక్తావ్యక్తాల పరిజ్ఞానమే మతాలకూ, ధర్మాలకూ, కర్మలకూ, సాహిత్యానికి కళలకు, శాస్త్రాలకూ పరమ ఫలం. అవ్యక్తమైన పరమాత్మకూ వ్యక్తమైన విశ్వానికీ వ్యక్తావ్యక్తమైన జీవుడిలోనే ధర్మప్రతిష్ఠ కలుగుతోంది సర్వ వ్యాపకమైన చిచ్ఛక్తి బ్రహ్మాండంలో ఉన్నట్లే పిండాండంలో కూడా ఉంటుంది. దానిని అనుభవవేద్యం చేయడమే యోగశాస్త్రాలకు మంత్రతంత్రాలకూ కావ్యకళలకు ప్రయోజనం.

విశ్వవ్యాప్తమైన రేడియోశక్తిని యంత్ర సాధనాలతో శబ్దరూపాన ప్రత్యక్షం చేసుకొనేటట్లు బ్రహ్మాండవ్యాప్తమైన చైతన్యశక్తిని మంత్రరూపంతో దేహంలో ప్రత్యక్షం చేసుకోవాలి. సాధనలకు సకల సాధనాలు ధర్మక్షేత్రమైన శరీరంలోనే ప్రత్యక్షంగా ఉన్నాయి. అఖండమైన విశ్వవ్యాప్తమైన చైతన్యశక్తిని ఆత్మయందు ఆవాహన చేసి శక్తినేకముఖం చేయడమే యోగం. కుండలినీ యోగమే ఆనందరసాన్ని కలుగజేస్తుంది.

మంత్ర తంత్ర యోగశాస్త్రాలు శ్రీ విద్యారూపంలో ఈ పరమార్థాన్ని సాధించుటకు వినియోగపడుతున్నాయి. జలయంత్రాలు, వాయు యంత్రాలు, ఆవిరి యంత్రాలు, విద్యుద్యంత్రాలు మొదలైనవి లలితాస్తోత్ర ప్రతిపాదితమైన మహాశక్తి మానవ ధర్మాభ్యుదయానికి వినియోగపడే విధాన్ని విశదం చేస్తున్నాయి. ఆదికాలంలో భయభ్రాంతులకు మూలమైన ప్రకృతి శక్తులు కాలక్రమాన వశవర్తినులై మానవ ధర్మాభ్యుదయానికి వినియోగపడుతున్నాయి.

మానవాభ్యుదయానికి మానవ విజ్ఞానం మూలధనం. సకల శాస్త్రాల విజ్ఞానము మానవాభ్యుదయానికి విశ్వకళ్యాణానికి వినియోగించుటే విజ్ఞానానికి పరమార్థం. విజ్ఞానం పశుప్రవృత్తిని మానవ ప్రవృత్తికిని, మానవ ప్రవృత్తిని దైవ ప్రవృత్తికిని, దైవ ప్రవృత్తిని బ్రహ్మ ప్రవృత్తికిని మరల్చడానికి వినియోగపడుతుంది. దుర్లభమైన బ్రహ్మాధికారం విజ్ఞాన సంపన్నులకు సాధ్యము.

బ్రహ్మవిద్యకు సాహిత్యాలూ, కళలూ కూడా సాధనాలు. చిరకాలానుగుణాలైన కావ్య సంప్రదాయ సంకేతాలు విశ్వసాహిత్య రచనకూ సందర్శనానికి రసానందానికి ప్రతిబంధకాలైనాయి. కావ్యాలు కవుల సంకల్ప సంస్కారానురూపాలు. విశ్వనిర్మాణంలో లాగే కావ్యరచనకు కూడా ఇచ్ఛాశక్తి బీజం. జ్ఞానశక్తి, క్రియాశక్తి కీలకం, సాహిత్యం అవ్యక్తానికి మవ్యక్తమైన పురుషార్థం సాపేక్షమైన సాహిత్య రసానందానుభవం నిరపేక్షమైన ఆత్మానందానుభవంలో ఐక్యం పొందుతూంది. భావ శబ్దార్థ కళల యోగానుభవమే సాహిత్యం.

సారస్వతాభ్యుదయానికి సహజమైన భావాలలాగే సహజమైన భాష మూలాధారం. అవ్యక్తమైన శక్తికి వాదము ప్రథమ వ్యక్తి స్వరూపం.

నాదం శబ్దరూపంలో బ్రహ్మాండావృతమైన భాషాధారంతో బ్రహ్మాండాన్ని గ్రాహ్యం చేస్తున్నది. జీవజాలం ఆత్మోపలబ్ధికి అణువు మొదలు మహత్తు వరకు వ్యాప్తమైన ప్రకృతి అంతా సాధనభూతముగా ఉంది. విశ్వసాహిత్యమంతా ఈ పరమ ప్రయోజనాన్ని విజ్ఞానరూపంలో సమకూర్చుతోంది.

అనంతమైన విశ్వవిజ్ఞాన సామ్రాజ్యానుభవం సకల మానవులకును సాధ్యము. సకల జనులూ సాధకులే, అర్హులే, అధికారులే. జాతిమతాది భేదాలు, వర్ణాశ్రమ భేదాలు, అవిత్యాలూ, సాపేక్షాలేగాని శాశ్వతాలు నిరపేక్షాలు కావు. ఆత్మోన్నతికి సకల మానవులూ సమానాధికారులు. అవయవాభివృద్ధిలో తప్ప స్త్రీలు పురుషుల కేగుణమునందూ తీసిపోరు.

స్త్రీ పుంసంయోగం విశ్వప్రవృత్తికి విశ్వకళ్యాణానికి మూలం. శృంగారము సృష్టి స్థితులకాధారము. ప్రేమ మూలము. హృదయావిర్భూతం. విశ్వాత్మకం, ఆనందకరం, కార్యసాధనం తహూజం. వీరంలేని శృంగారం జడప్రాయం. శాంతములేని శృంగారం కామపరాయణం. శాంత శృంగారము రసానంద పరాయణం.

రసానందం విషయాసక్తంకాక విషయాతీతంగా ఉండడమే విశ్వ శ్రేయస్సుకు సాధనం. ప్రపంచంలో శుద్ధసత్త్వము కానీ శుద్ధ చెడుగానీ లేదు. వాటి మిశ్రమాన్నే మనం చూస్తాం. ప్రపంచమే మిశ్రమం. శ్రేయస్సు కవి సంకల్పంలో ఉంది.

ఇదీ పంతులుగారి ఫిలాసఫీ. దీన్నే ఆయన ముప్ఫయి సంవత్సరాలపాటు ఆచరణలో పెట్టారు. చెయ్యకుండా ప్రచారం చేశారు. ఈ దృష్టితోనే పాత సాహిత్యాన్ని పరిశీలించారు. కొత్త సాహిత్యాన్ని ప్రోత్సహించారు. రేపుకోసం ఎదురు చూడ్డం మంచిదేగాని నిన్నలో బతకొద్దు. అందుకే పంతులుగారు ఎప్పుడూ వర్తమానం సంగతి తెలుగువాళ్లకు జ్ఞాపకం చేస్తూ ఉంటారు. ప్రాచీనతను అర్థం చేసుకొని ఆధునికంగా జీవించాలని ఆయన ఆశయం. ఆ ఆశయసిద్ధికోసమే ఆయన భారతిని స్థాపించారు. అప్పటికి మూడు పత్రికలు వారికున్నాయి. వారపత్రిక, ఉగాది సంచిక, దినపత్రికా ఉన్నా మాసపత్రికను స్థాపించడంలో ఒక కారణం ఉంది. "ప్రజాదృష్టిని నవజీవన ప్రవృత్తియందు లగ్నము చేయవలసిన యవసరము గలిగినది. ఆ యవసరము సఫలముచేయుట కాంధ్ర ప్రపంచము పూర్వాపర సంస్కారములను సమన్వయము చేయుటకు పూనుకొనుచున్నది" అని పంతులుగారు భారతి మొట్టమొదటి సంచికలోని స్వవిషయంలో చెప్పారు.

నవజీవన ప్రవృత్తిని మనసారా ఆశించడంవల్లనే పంతులుగారు యువజనులను ఉత్తేజపరిచారు. ఒక ప్రస్తావనలో ఇలా వ్రాశారు. "నిరంకుశాధికారులకు రాజకీయ స్వాతంత్ర్యము గిట్టదు. సనాతనులకు సాంఘిక సంస్కరణము పనికిరాదు. మతాచార్యులకు మతసంస్కారము పాప భూయిష్టము. ధనస్వాములకు ప్రజాస్వాతంత్ర్యము భయంకరము. సాహిత్య కళాభిమానులకు నవీన మార్గములు ద్రవకరములు. స్వాతంత్ర్యప్రియులైన వీరులు, ధీరులు, కవులు, గాయకులు, కళాభిజ్ఞులు స్వాతంత్ర్య యుగస్థాపనమునకు వారిశక్తి సామర్థ్యములను వినియోగించవలసిన యవసరము గలిగినది. ఆంధ్రదేశ భాగ్యోదయము స్వాతంత్ర్య ప్రియులైన యువజనుల మీద యాధారపడి యున్నది"

పంతులుగారు తమ ముప్ఫయి సంవత్సరాల సాహిత్య సేవలో ఎప్పటికప్పుడు ఆయాతరాలలో యువకులను ప్రోత్సహిస్తూనే వచ్చారు. రాయప్రోలు సుబ్బారావుగారు కొత్త రీతులలో కవిత్వం వ్రాస్తున్నప్పుడు 1914లో ఆనంద ఉగాది సంచిక ప్రస్తావనలో పంతులుగారు ఇలా వ్రాశారు. "నూతన భావములు వికసించుచున్నవి. నూతన భావపూరితములైన గీతములును కథలును రచింపబడుచున్నవి. నూతన శైలి సంక్షిప్తము. నూతన భావములు గంభీరములు. నూతన సంప్రదాయములపరిచితములు. నూతనా దర్శములు సదాశాభరితములు. శైలియు భావములును సంప్రదాయమును విపరీతాభిప్రాయమును గలిగించుట సహజము. కాలక్రమమున నివి పరిపాటియై భాషకు నూతనాలంకారముల సకూర్చగలవు. రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన తృణకంకణము, కష్టకమల మొదలగు రాగగీతము రసభరితములు".

ఇరవై సంవత్సరాల తరువాత శ్రీశ్రీ క్రొత్త ప్రయోగాలు ప్రారంభిస్తున్నప్పుడు భావకవులను అందరూ ఎత్తిపొడుస్తున్నప్పుడు, అక్కిరాజు ఉమాకాంతంగారు నవ్యసాహిత్యంపై విరుచుకుపడ్డప్పుడు పంతులుగారు ఒక ఉగాది సంచిక ప్రస్తావనలో ఇలా వ్రాశారు.

"గతించిన పదేండ్లయందును సారస్వతమునందు వెలసిన నవీన సాహిత్య నిర్మాణము ఖండనమండనములకు పాత్రమైనను క్రమవికాసమును పొందుచు విద్యావంతుల హృదయముల నాకర్షించుచున్నవి. దేశమంతయు రాజకీయ సాంఘిక మతాది విషయములందు స్వాతంత్ర్య ప్రాప్తికై పరితపించుచున్నప్పుడు సారస్వతమునందీ పరితాపము ప్రతిబింబించుచుండును. యువజనులు నవజీవన నిర్మాణమునకై మహాత్యాగము చేయునప్పుడు సాహిత్యరచనలందు వారి త్యాగము సహజముగ ప్రతిబింబించుచుండును. సకల నిర్మాణములకును స్వాతంత్ర్యము మూలాంకురము స్వాతంత్ర్య విలసితములైన రచనలు ప్రాచీన నవీన భేదమును సంస్కృతాంధ్ర భేదమును లేక ప్రజాదరమునుబడయుచున్నవి"

ఒక ప్రముఖ సాహిత్య పత్రికా, దాని అధిపతీ సాహిత్యంలో స్వాతంత్ర్యాన్ని ఇంతగా ప్రోత్సహించబట్టే మన ఆధునిక సాహిత్యం చైతన్యవంతమైంది. పంతులుగారి స్వాతంత్ర్యాభిమానం యతిప్రాసలు అక్కర్లేదని అంగీకరించేటంతవరకు వెళ్ళింది. ప్రమోదూత ఉగాది సంచికలలో సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు యతిప్రాసల విషయమై ఒక వ్యాసం వ్రాశారు. దానిని తమ ప్రస్తావనలో పేర్కొంటూ పంతులుగారు ఇలా అన్నారు. "కవిత్వమునకు హృదయము భావమైనప్పుడు మాటల ప్రతిబంధకమును తొలగించుటవలనను కావ్యములందు రసానందమున కభ్యంతరములు గలుగజాలవు" ఆధునికులను పంతులుగారు ఇలా వెనుకేసుకరావడం కొండంత బలాన్ని ఇచ్చింది. ఎంకి పాటల గాలిదుమారంలో 'ఆ పాటలలో భావసంపద యుండుట వలననే భారతిలో వానిని ప్రకటించితిమి...శ్రీ సుబ్బారావుగారి ప్రయత్నము శ్లాఘ్యము... విమర్శనాపాత్రమైన పాటలో అసభ్యతగాని యనౌచిత్యముగాని లేదని మా విశ్వాసము...పాఠకుల యొక్క రుచి బేధములను ప్రదర్శించునను నూహతో మాత్రమే అనుకూల ప్రతికూల విమర్శనలు రెండింటిని ప్రకటించితిమి" అని పంతులుగారు భారతిలో ప్రకటించారు.

పాఠకుల రుచినీ జనాభిప్రాయాన్నీ పంతులుగారు ఎప్పుడూ కనిపెడుతూనే ఉంటారు. సాధారణంగా పత్రికలు తమ సిద్ధాంతాలను ప్రజలమీద రుద్దడానికి ప్రయత్నిస్తాయి. పంతులుగారు దానికి వ్యతిరేకులు. పెట్టుబడిదారీ సమాజంలోని పత్రికల స్వభావాన్ని ఆయన ఇలా ఖండించారు. "సర్వత్ర ధనము రాజ్యము చేయుచున్నది. శ్రీమంతులు ముద్రాణాలయములను బెట్టి వారి వాదములను విశ్వవ్యాప్తము చేయుట సులభసాధ్యమై

యున్నది. డైలీ మెయిల్, లండన్ టైమ్సు మొదలగు పత్రికలు స్వపక్షవాదమును దినదినము లక్షలకొలది ప్రజల చిత్రములందు ప్రతిబింబింప చేయుచున్నవి. పండితులు పామరులు పత్రికాభిప్రాయములను విమర్శ లేకయే తమ అభిప్రాయములను గ్రహించుచున్నారు. శ్రీమంతులు పూనిన మార్గమును సామాన్యులును నవలంబించుచున్నారు. ముద్రణాలయమునుస్థాపించుట పత్రికలను ప్రచురించుట స్వాభిప్రాయములను వ్యాపింపచేయుట సులభమైనది. అన్నశాలయందు సిద్ధాన్నమువలె వార్తాపత్రికలందు సిద్ధభావములు సులభగ్రాహ్యములైనవి. ఏ విషయముగాని శ్రద్ధతో చదువుటకును చదివినదానిని ధ్యానమననాదులుచేసి విజ్ఞానమును బడయుటకు అవకాశములు చాలకున్నవి".

పంతులుగారు 1927లో వ్రాసిన ఈ మాటలు నలభై సంవత్సరాల తరువాత కూడా ఈనాటిస్థితిని వర్ణిస్తున్నాయి. ఆయన సిద్ధభావాలను సులభంగా గ్రహించేవారు కారు. ఏ విషయాన్నయినా శ్రద్ధగా చదివేవారు. చదివినదానిని ధ్యానమననాదులు చేసేవారు. ఈ సంగతి ఆయన రచించిన ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో స్ఫుటంగా కనబడుతుంది.

ఆ గ్రంథంలో చివర ఆయన "ఇందు క్రొత్త విషయములు లేవు. ఇంతవరకు నితర పరిశోధకులు వ్యాఖ్యాతలు తెలిపిన భావములే మరల తెలుపబడినవి" అని వినయానికి వ్రాసినా అంతవరకు లేని క్రొత్త దృక్పథంతో ఆయన ఆంధ్ర వాఙ్మయానికి భాష్యం వ్రాశారు. లేకపోతే పింగళి సూరన రాజుగారి కళాపూర్ణోదయాన్ని శ్రీవిద్యాపరంగా వ్యాఖ్యానం చేయడం ఎలా సంభవిస్తుంది?

పంతులుగారికి ఆంధ్ర సాహిత్యంలో ఇద్దరే ప్రాచీన కవులు సదారాధ్యులు. వాళ్ళు తిక్కనగారూ, పింగళి సూరనరాజుగారూను. "తిక్కనకు మించిన కవిసార్వభౌముడు ఆంధ్రదేశంబున బుట్టంబోడు" అని 1911 ఉగాది సంచికలోనే స్పష్టంగా చెప్పారు. "ఆంధ్ర సాహిత్యమును పరిస్ఫుటము చేసిన కవులందు సూరనార్యుడు పరంజ్యోతివలె ప్రకాశించుచున్నాడు" అని ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో చాటి చెప్పారు. గ్రామ్య గ్రాంథిక భాషా వివాదాలలో ఈ ఇద్దరి కవులనుంచే గుణపాఠం నేర్చుకోవాలని పంతులుగారు సూచించారు. "తిక్కయజ సూరనార్యుల రచనలందు దేశీయ పదములు కుప్పలు తెప్పలుగ వాడబడినవి. విద్వజ్జనాదరణీయముగాంచినవి. ఆ దేశీయభాష యిపుడు గ్రాంథిక భాషగా నెంచబడుచున్నది" అని జ్ఞాపకం చేశారు కల్పనాదక్షులకు భాషాప్రతిబంధక మసంభవం అని వారి నమ్మకం.

అందుకే ఏ భాషలో వ్రాసినదైనా ఆయన తొలినుంచీ భావ సంపద ఉంటే ప్రచురించేవారు. మొదటి కొద్దిరోజులలో "ఎప్పటికైనను గ్రంథరచనలకు గ్రాంథిక భాషయే శరణ్యము" అని భావించేటప్పుడు కూడా గిడుగువారి వ్యాసాలు, గురజాడరచనలు పంతులుగారు సగౌరవంగా ప్రచురించారు. గురజాడ అప్పారావుగారికి సలహాలు ఇచ్చారు. ఆయనవద్ద నుండి సూచనలు వాంఛించారు. గురజాడ వారికి తోచిన అభిరుచివున్న ఆసక్తివున్న విషయంమీద గ్రంథం వ్రాసి పంపితే కృతజ్ఞుడనని ఉత్తరం వ్రాశారు. గిడుగువారు మద్రాసు వచ్చినప్పుడల్లా సభ పెట్టించడం జరిగేదట. పండితారాధ్య చరిత్రను పరిష్కరించమని పంతులుగారు గిడుగురామమూర్తి పంతులుగారిని ప్రార్థించారు. భాషాయుద్ధాలతో రామమూర్తి పంతులుగారికి సరిపోయేది. గ్రంథపరిష్కరణమునకు తీరిక లేకపోయింది. భారాన్ని శిష్యులమీద పెట్టారు. పండితారాధ్య చరిత్ర పూర్తిగా అచ్చుపడలేదన్న విచారం పంతులుగారికి మిగిలిపోయింది. దానిని చూడకుండానే వారు పోయారు.

పండితారాధ్య చరిత్ర ఆంధ్ర గ్రంథమాలలో 30వ కుసుమం. ఈ ప్రచురణశాఖను పంతులుగారు అన్నిటికన్నా ఆలస్యంగా స్థాపించారు. అయితే గ్రంథప్రచురణ చేయాలన్న సంకల్పం వారికి సంవత్సరాది సంచికలు తెస్తున్నప్పటినుంచీ ఉంది. ప్రజలకు అందుబాటులో ఉండాలని అర్థణాకో పుస్తకం అమ్మాలని ప్రణాళిక వేసుకొన్నారు. పెద్దదయితే బేడ, అంతకు మించిన ధర ఉండకూడదనుకొన్నారు ఇతర వ్యాపకాలవల్ల ఈ గ్రంథ ప్రచురణ ఉద్యమం సాగలేదు కాబోలు సాగితే ఎన్ని గ్రంథాలు వచ్చివుండేవో.

పంతులుగారికి ఇతరుల గ్రంథాలు ప్రచురించే శ్రద్ధేగాని స్వంతంగా రచనలు చేదామనే ఉబలాటం ఎప్పుడూ లేదు. చేతకాక కాదు. అవసరమైతే ఎన్నయినా వ్రాయగలరు. 1912వ సంవత్సరంలో, పరీధావి ఉగాది సంచికలో 40 వ్యాసాలు అచ్చుబడ్డాయి. రాజ్యాంగ వ్యవహారాల గురించి ఎవ్వరూ వ్యాసాలు వ్రాసి పంపలేరు. పంతులుగారు కలం పట్టుకొని 5 వ్యాసాలు వ్రాశారు. 66 పేజీల మేటరు తయారుచేశారు. ఇంపీరియల్ గెజిటీరు, ఢిల్లీ చరిత్ర మొదలైన ఇంగ్లీషు చరిత్ర గ్రంథాల ఆధారంతో వ్రాసిన ప్రామాణిక వ్యాసాలవి. అవి పంతులుగారి పేరుమీదుగానే అచ్చుపడ్డాయి.

సాధారణంగా ఉగాది సంచికలలోనూ, భారతి సంపుటాలలోనూ వ్యాసకర్తల పేర్లలో 'కా. నాగేశ్వరరావు' అనే పేరు కనపడదు. ఉగాది సంచికల్లో ప్రస్తావన, భారతిలో ఏడాది మొదట స్వవిషయం, ప్రతి నెలా సాభిప్రాయ విశేషాలు ఆయన వ్రాసేవారు. వీటిలో ఆయనకున్న బహుముఖ ప్రజ్ఞ కనబడుతుంది. సాహిత్యం గురించి అప్పుడప్పుడు వ్రాసేవారు. ఆయన తన సేవను కేవలం సృజనాత్మక సాహిత్యానికే మీదు కట్టలేదు. వారికి కావలసినది సర్వతోముఖ వికాసం. అందుకే ఉగాది సంచికలలో పన్నెండు విభాగాలు ఉండేవి. రాజకీయం, సారస్వతం, కథలు, చరిత్ర, చిత్రకళ, సాంఘికం, వైద్యం, జ్యోతిష్యం, వేదాంతం, సంగీతం, ప్రకీర్ణం అనే ఈ పదకొండూకాక రసతరంగాలనే పద్య వ్యాసాలూ కూడా ఉండేవి. ఈ రచనలన్నింటినీ పంతులుగారు అచ్చుపడకముందు చదివేవారు. అవసరమైతే తమ ప్రస్తావనలో పేర్కొనేవారు. పనిపడితే మెత్తగా విమర్శించేవారు.

"కాకిపిల్ల కాకికి ముద్దు' అనే సామెత పంతులుగారిపట్ల వర్తించదు. తన సంపాదకత్వంలో వచ్చిన ప్రతి సంచికా గొప్పగా ఉందని సాధారణ వ్యక్తులైతే మురిసిపోవచ్చును. పంతులుగారు అలాకాదు. "సంచికయందు ప్రచురించిన వ్యాసములు సంఖ్యయందును విషయ విభాగమునందును బహుళముగా నున్నను విషయ గ్రహణమునందు సామాన్యముగా నున్నవి" అని ప్రస్తావనలో చెప్పడం పంతులుగారికే చెల్లింది. ఒక ఉగాది సంచికలో ఆయన ఒక ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజాహృదయమునందు వ్యాస రచనాభిలాష వృద్ధిపొందినట్టు జిజ్ఞాసాభిలాష వృద్ధిని పొందకుండుట శోచనీయము. ప్రజల చిత్తవృత్తి స్వల్ప విషయములందు లగ్నమగుచున్నటులు మహద్విషయములందు లగ్నము కాకున్నది" అని పంతులుగారు బాధపడ్డారు. బహుశా మన వాఙ్మయంలో ఈ లోటు తీర్చడానికే ఆయన జిజ్ఞాసాభిలాషతో కూడిన వ్యాసాల పీఠికలు స్వయంగా

వ్రాసి అటుమొగ్గారు. బావ వికాసానికి తోడ్పడే రచనలు ప్రోత్సహించేవారు.

భారతి నెలకొల్పడంలోకూడా ఈ ఆశయం కనబడుతుంది. మానవులకు భావదాస్య విమోచనం కలగందే బాహ్యదాస్య విమోచనం కలగదని వారి విశ్వాసం. అదుకే భావదాస్య విమోచనానికి భారతిని స్థాపించారు. భాష, వాఙ్మయం శాస్త్రాలు, కళలు మొదలైనవి సాదరభావంతో చర్చించడానికి అవకాశాలు కల్పిస్తామని తొలి సంచికలో ప్రకటించారు, వాఙ్మయ నిర్మాణానికి అప్పుడు చేస్తున్న ప్రయత్నాలను పరిస్ఫుటం చేస్తామన్నారు. శిల్పమునకు చిత్ర లేఖనానికి శాసనాలకు సంబంధించిన విషయాలను చిత్రాలతో ప్రచురిస్తామన్నారు. అన్నీ అన్నట్టే పదిహేనేళ్ళపాటు చేశారు. నెలకో విజ్ఞాన సర్వస్వం ప్రచురించినట్టే ఆ సంపుటాలు కనబడతాయి.

కొమర్రాజువారు తలపెట్టిన విజ్ఞాన సర్వస్వాన్ని కూడా పంతులుగారే చూడ ముచ్చటగా అందంగా అచ్చువేశారు. కొమర్రాజు వారి సాహచర్యం పంతులుగారిని ఎంతో ఉత్తేజ పరిచింది. మొదటి ఉగాది సంచికనుండీ వ్యాసాలు వ్రాయడం, ఛాయాచిత్రాలు అందజేయడం మాత్రమే కాక కార్యోపక్రమణాన్ని కూడా కొమర్రాజు వారు నిరూపించేరట. భారతి నెలకొల్పాలనే సంకల్పం కలగ్గానే పంతులుగారు కొమర్రాజువారితో సంప్రదించారు. ప్రయత్నాలు చేశారు. కొమర్రాజువారు ఆ భారాన్ని పూనుకోవడానికి అంగీకరించారు. అయితే ఆ విజ్ఞాన సంపన్నుడికి నూరేళ్ళునిండాయి. రెండేళ్ళపాటు పంతులుగారు తమ సంకల్పాన్ని రిక్తమనోరథంగానే ఉంచుకోవలసి వచ్చింది. ఈ విషయాలను భారతి తొలిసంచికలో ఎంతో కృతజ్ఞతా సూచకంగా పంతులుగారు చెప్పారు.

తమకుగాని సాహిత్యానికిగాని ఎవరైనా మేలుచేస్తే అది పంతులు గారు మరచిపోరు. పేరుపేరునా ప్రశంసిస్తారు. ఆదిలో అందరూ ఎద్దేవా చేసినా దేనిలోనైనా చేవవుంటే పంతులుగారు దానిని ప్రోత్సహిస్తారు. ప్రతి కొత్త ప్రయత్నాన్నీ ప్రజలు వింతగా చూస్తారు. ఒకప్పుడు భయపడతారు. పరిహసిస్తారు. పద్దెనిమిది సంవత్సరాలపాటు ఉగాది సంచికలు నడిపి 'ఆరంభమునందు వింతగా దోచిన యత్న మిప్పుడు సర్వసాధారణముగ నున్నది. పేరుగల పత్రికలన్నియును సంవత్సరాది సంచికలను ప్రచురించుచు కాల స్వభావమును ప్రతిబింబిస్తున్నాయి' అని పంతులుగారు వ్రాశారు. అలాగే మరోసారి 'పరిహాస పాత్రమైన స్వరాజ్యాదర్శనము రాజనీతిజ్ఞులంగీకరించిరి' అని చెప్పారు. ఇంకోసారి 'ముప్పదేండ్లకు పూర్వము పరిహాస పాత్రములైన అప్పారావుగారి ముత్యాల సరములు నేడు ప్రజాదరణమునకు పాత్రము లగుచున్నవి' అని చాటి చెప్పారు.

ఆదిలో పరిహాస పాత్రాలైనవి క్రమేణా పరిపాటి కావచ్చును. అలాగే ప్రారంభంలో ప్రశంసలను అందుకొన్నవి ఉత్తరోత్తరా నవ్వులపాలు కావచ్చును. అటువంటి సందర్భాలు వచ్చినప్పుడు పంతులుగారు విమర్శించక మానలేదు. ఆంధ్రసాహిత్య పరిషత్తు 1912లో స్థాపించినప్పుడు పంతులుగారు గొప్ప కొరత తీరిందని సంతోషించారు. 'భాషాభ్యుదయమునకై ఈ పరిషత్తు మహోపకారము చేయగలదు' అని విశ్వసించారు. ఒక పుష్కరం గడిచాక ప్రజలకూ పరిషత్తుకూ దూరం పెరిగిందని పంతులుగారు గుర్తించారు. నిఘంటు నిర్మాణ భారాన్ని పిఠాపురం మహారాజుగారు వహిస్తున్నా "మహాజనుల తోడ్పాటులేకను పని నెమ్మదిగా జరుగుతున్నది" అని సున్నితంగా మందలించారు. నిఘంటు నిర్మాణము అస్థి సంచయ సమీకరణమని కొందరు ఆక్షేపించారట. 'శూన్యావస్థయందు అస్థి సమీకరణముసయితము కార్యసిద్ధికి ప్రయోజనకరమగుచున్నది' ' అని పంతులుగారు మెత్తగా చీవాట్లు పెట్టారు. 'నిఘంటు నిర్మాణమును త్వరితగతిని జేయించుటకు మహాజనులు తోడ్పడాలని పంతులుగారు 1924లో ఆశించారు. పరమేశ్వరుణ్ణి ప్రార్థించారు. ప్రజలను దూరం చేసుకొన్న పరిషత్తుకు నిఘంటు నిర్మాణం నలభై నాలుగు సంవత్సరాలు పట్టింది. ఇంతకూ ఆఖరి సంపుటం బయటపడనేలేదు. పంతులుగారి సూచన పాటించితే బాగుండేది.

పంతులుగారిలాంటి వ్యక్తులు తమ సంపూర్ణశక్తులు సాహిత్యానికే వినియోగిస్తే ఆంధ్రభాషకు ఏనాడో నిర్దుష్టమైన నిఘంటువూ, సమగ్రమైన వ్యాకరణం లభించేవి. "ప్రజానాయకులు వారి లక్ష్యాలను తాత్కాలికమైన రాజ్యాంగ వ్యవస్థలందు మాత్రమే లగ్నం చేయక నిత్యమైన సాహిత్య కళాంగములందు సయితము లగ్నము చేయుట ప్రయోజనకరముగ నున్నది" అని ఒకసారి సాభిప్రాయ విశేషాలలో వారు వ్రాశారు. ఇది 1927లో అయితే దీనిని ఆయనే పాటించలేకపోయారు. రాజకీయాలు వారి కాలాన్ని ఆక్రమించాయి. ఆయన రాజకీయ సభలకు వెళ్ళినంతగా సాహిత్య సభలకు వెళ్లినట్టు కనబడదు.

అయినా సాహిత్యసభలు సాధించినదేమిటుంది కనుక? 1924 నాటికే సాహిత్య సభలంటే ఆయనకు మొఖం మొత్తింది. ఆ సంవత్సరం భారతిలో సాభిప్రాయ విశేషాలు వ్రాస్తూ ఆయన ఇలా చెప్పారు. "ఏడవ యాంధ్ర సారస్వత మహాసభ వైశాఖ బహుళమునందు కోవూరునందు గూడినది. మూడునాళ్ళ ముచ్చట ముగిసినది. జ్యేష్ఠ బహుళమునందు తణుకునందు సాహిత్య పరిషత్తు మహాసభ గూడనున్నది. మూడునాళ్ళ ముచ్చట తీరగలదు. సన్మాన సంఘాధ్యక్షులు, సభాధ్యక్షులు మహాసభలయందు గంభీరోపన్యాసములను చదువగలరు. పండితులు, పరిశోధకులు, కవీశ్వరులు భావభరితములైన వ్యాసములను చదువుదురు. మహాసభ తీర్మానములనుజేయును. ఉపసంఘము లేర్పడును. ఈ భాగవత మేటేటను జరుగుచుండును. ఈ మహాసభలయందు జరిగిన భాగవతయే యితర సభలయందును ఏదో విధమునను నడుచుచుండును. పని మాత్రము గనబడదు"

నలభై నాలుగు సంవత్సరాల క్రిందట పంతులుగారు వ్రాసిన ఈ మాటలు నేటికీ మన సాహిత్య సభలపట్ల వర్తిస్తాయి. ఆయన క్రియాశూన్యమైన ఉద్ఘోషలను హర్షించలేదు. మన సాహిత్యాభివృద్ధికి నిర్దుష్టమైన నిఘంటువు, సమగ్రమైన వ్యాకరణం అవసరమని ఆయన గుర్తించారు. పరిషత్తువారు నిఘంటువు నిర్మిస్తామన్నారు. సారస్వత మహాసభవారు సమగ్రమైన వ్యాకరణాన్ని నిర్మించాలని ఆరేళ్ళకు పూర్వమే–అంటే 1918లోనే–తీర్మానించారట. అది ఆచరణలో పెట్టడానికి పని జరగలేదు. నిఘంటు నిర్మాణానికయ్యే వ్యయభారాన్ని ఒక మహారాజు భరిస్తానన్నాడు. వ్యాకరణ రచనకు ఎవరూ కనబడలేదు. ఈ సంగతులు చెప్తూ పంతులుగారు "ప్రజలీ భారమును నిర్వహించుటకు దగిన ప్రయత్నములను జేసి సారస్వతాభిమానమును సార్థకము చేయుదురుగాక" అని ఆశించారు. 'నిఘంటు వ్యాకరణ కాశీనాథుని నాగేశ్వరరావు: సాహిత్య సేవమంతయును సహాయము నపేక్షించుచున్నది" అని పంతులుగారు ఆనాడే గుర్తించారు.

అలాగే గుర్తించక అయిదేళ్ళపాటు కష్టపడి ఆంధ్ర వాఙ్మయ సూచికను తయారు చేయించారు. విపులమైన పీఠికను వ్రాశారు. ఈ గ్రంథంలో కవిత్వతత్త్వ విచారణకు అవకాశం లేదంటూనే గొప్ప తత్త్వవిచారం చేశారు. ఆంధ్ర సాహిత్యంలో ఇక్ష్వాకుల కాలం నుంచి ఇప్పటిదాకా వచ్చిన పరిణామాలను మౌలికంగా గుర్తించారు. పండితాధీనము నందున్న సాహిత్యం ఎలా ప్రజాధీనం కావాలో సూచించారు. 'ప్రజా సామాన్యమునకు బరిచితమైన సాహిత్యమునకు పండితులు చూపిన నిరాదరణ, నిరసనభావాలు ఆంధ్ర వాఙ్మయ వికాసమునకభ్యంతరములుగా' ఏర్పడిన విధాలు ఆంధ్ర చరిత్ర ఎలా విశదం చేస్తుందో వివరించారు. సాధారణ వాఙ్మయ చరిత్రకారుల మనుచరిత్ర చూసి మనసుపడతారు. వసుచరిత్ర మోజులో పడిపోతారు. పంతులుగారు రొటీను సిద్ధాంతాలను ఆమోదించలేదు. వసుచరిత్ర కావ్యము పరమార్థమైన ఆత్మానందాన్ని సంకుచితం చేసిందని నిర్భయంగా చెప్పారు. తిక్కన పోతనాదులలాగ పెద్దన కావ్యనిర్మాణానికి పరమార్థాన్ని సంకల్పించలేదని చెప్పారు. భట్టుమూర్తి మీద ఒకటింపావు పేజీ మాత్రమే వ్రాశారు. పెద్దన్నగారిమీద మరొక్క పేజీ అదనంగా వ్రాశారు. పింగళి సూరపరాజుగారి మీద మాత్రం అయిదున్నర పేజీలు వ్రాశారంటే పంతులుగారి రసైకదృష్టి వ్యక్తమవుతుంది.

పంతులుగారిదృష్టి ఎప్పుడూ అభ్యుదయం పైనే ఉంటుంది. ఆయనకు పాతవాసనలు గిట్టవు. తమ పత్రికలలో ఛాందసులు వ్రాసే వ్యాసాలను ఆయన వాళ్ళపై గౌరవంకొద్దీ ప్రకటించినా విమర్శించక మానలేదు. "వ్యాసములు పాతవాసనలను వ్యక్తము చేయునటుల నవీనాశయములను వ్యక్తము చేయుటలేదు. స్వాతంత్ర్య జవసత్వములేని ప్రజలు కైలాసశిఖర సందర్శనమునుగాని, పాతాళలోక సందర్శనమునుగాని చేయజాలరు" అని నిక్కచ్చిగా చెప్పారు. స్వేచ్ఛ లేనివాడు అధఃపతనానికి కూడా నోచుకోడు.

పంతులుగారు ఆంధ్రసాహిత్యాన్ని కైలాసగిరి సానువులంత ఉన్నత ప్రదేశాలకు తీసుకెళ్ళడానికి ఎంతగా కృషిచేశారో చెప్పాలంటే ఒక చిన్న ఉపన్యాసం చాలదు. చెరువుని చేదపెట్టి తోడలేం. ఏటి కేతా మెత్తలేం. ఆయన తలపెట్టిన కృషి ఫలించిందా లేదా అని రేఖామాత్రంగా సమీక్షించాలి.

పంతులుగారు అడపాదడపా ఆత్మ విమర్శనం చేసుకుంటూ ఉంటారు. నిరాశాజనకంగా ఉంటే అది బయట పెట్టకుండా ఊరుకోరు. భారతి పెట్టిన పదేళ్ళకు ఆయన ఏం సాధించాం అని వెనుక తిరిగి చూసుకొన్నారు. "భారతికి పదవయేడు ప్రారంభమైనను ప్రత్యభిజ్ఞానము దుర్లభమైనది. అని బాధపడ్డారు "సాహిత్యోపాసకులకు కళారాధకులకు ప్రాణరహితమైన సనాతన సంస్కారము, స్వానుభవ రహితమైన పరసంస్కారము ఆత్మయోగానుభవ సిద్ధమైన పరసంస్కారము ఆత్మయోగానుభవ సిద్ధమైన నిర్మాణశక్తిని దుర్ఘటము చేసినవి. నిర్మాణము దుర్ఘటమై అనుకరనము శరణ్యమైనది. ప్రథమ సంచిక యందలి సంకల్పము వర్తమాన సమయమునందు ప్రపంచావృతమైన మహాప్రబోధ సమయమునందు క్రియారూపమును బడయక సంకల్ప మాత్రముగనే యున్నది" అని విచారించారు.

ఈ స్వవిషయం వ్రాస్తూ మొదట ఆయన భర్తృహరి సుభాషితాన్ని "తెలివి యొంత లేనియెడ దృప్తుడవై కరభంగి" అనేది ఉదహరించారు. పంతులుగారు తమ సాభిప్రాయ విశేషాల ప్రారంభంలోనూ స్వవిషయాల మొదటా కొన్ని పద్యాలను సమయోచితంగా కోట్ చేస్తారు. అందులోనే వారి విశాలనుభవం ద్యోతకమవుతుంది.

నిరాశాపూరితమైన పదో స్వవిషయంలో అంత నీరసంగా ఆయన వ్రాయడానికి నిజంగా భారతి ఏమీ సాధించలేదని అర్థం చెప్పుకోకూడదు. ఆంధ్రులేం సాధించలేకపోయారనే వ్యాఖ్యానించుకోవాలి. "ఆంధ్ర హృదయము నధిష్ఠించిన ఇచ్ఛాశక్తి జ్ఞానయోగ విలసితమై క్రియారూపమును బడయవలసిన యవసరమును సాహిత్య కళారచనలు విశదము చేయున్నవి." అని అదే స్వవిషయంలో ఆయన చెప్పారు. ఆంధ్రదేశానికి పండుగైతే ఆయన పండుగు చేసుకొంటారు. పొంగిపోతారు. ఆంధ్రదేశం, కుంగిపోతే ఆయన కుంగిపోతారు.

ఆంధ్ర సాహిత్యానికి అనుకొన్నంత సేవ చేయలేదనే చింత ఆయనకు లేకపోలేదు. మరణించడానికి ముందు ఆయన విచారంగా ఉంటే డాక్టర్లు హితబోధ చేశారు. "ఇటీవల నేను జబ్బుతో నుండగా డాక్టరు నంజప్పగారు నన్ను చూచి ఇట్లనిరి. 'నీవు విచారగ్రస్తుడవుగా కనబడుచున్నావు నీవును ఇతరులును ఏ స్వరాజ్య సంపాదనమునకై శ్రమపడితిరో ఆ సుదినము సంప్రాప్తమైనది. సత్యాగ్రహము ధర్మవిజయమును బడసినది. ఖద్దరు టోపి, త్రివర్ణ పతాకము, వందేమాతరం గీతం విజయమును పొందినవి. ఇది నీవు ఆనందింపవలసిన సమయం, నంజప్పగారి గంభీరభావములు స్వధర్మ నిర్మాణమునందలి పరమార్థమును విశదము చేసినవి. విశ్వపరిణామమునందు వ్యక్తుల ప్రాజాపత్యము నిమిత్తమాత్రము" అని సహజ ధోరణిలో పంతులు గారు ఏమాత్రం ఘనతా అంగీకరించలేదు.

అయితే అయిదేళ్లకు ముందు ప్రకటించిన నిరాశమాత్రం పోయింది. "ప్రథమ సంచికయందు సంకల్పించిన సంకల్పములు సకల రంగములందును సఫలమగుచున్నవి" అనే తృప్తిని ప్రకటించారు. రాజకీయ, సాంఘిక, సాహిత్య కళావైజ్ఞానికాది విషయములందు కలిగిన స్వాతంత్ర్యభావ ప్రవర్తనతో మానవ స్వాతంత్ర్య ప్రియులకు పరమానందమును కలుగచేయగలదు" అని పొంగిపోయారు. "ఈ మహోదయమునకు భారతియును యథాశక్తి జ్ఞానాంజలులను సమర్పించినది" అని కైమోడ్చారు

ఆంధ్ర జాతీయ మహోదయానికి వీరేశలింగముగారు వేగుచుక్క అయితే నాగేశ్వరరావు పంతులుగారు బాలభాస్కరుడు. వారి తేజఃపుంజాలు ఉగాది సంచికలలోనూ, భారతి సంపుటాలలలోనూ, ప్రకీర్ణక రచనలలోనూ నిత్యం ప్రకాశిస్తూ ఉంటాయి. నట్టింట చిన్నదీపం పెట్టినవాడి పేరే నిత్యం చెప్పుకొనే జాతి చిమ్మచీకట్లో ఇంత వెలుగుతెచ్చిపెట్టిన వారికి, ఇచ్చిపోయే వారికి జ్ఞానాంజలి ఘటించడం తప్ప ఇంకేం చేయగలదు.

(శ్రీ సాహిత్యోపన్యాసములు – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమి)

విద్వాన్ విశ్వం

కొమర్రాజు లక్ష్మణరావు భాషాసేవ

ఏడు నిలువులెత్తు ఎదిగి ఏ మూలనుంచి చూచినా కానవచ్చే మహా మూర్తులు కొందరే జన్మిస్తారు. వారు ఏ కాలంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా ఎల్లకాలం అలా మనస్సులో మెదలుతూనే ఉండే పనులేవో చేస్తారు. ఎల్లరి అభిమానాన్నీ చూఱగొంటారు.

అలాంటి మహాపురుషులలో తెనుగువాడి ఎదలో అనుదినం మెదలవలసినవాడు కొమర్రాజు లక్ష్మణరావు. మహామేధావి అన్నా, మహా పరిశోధకుడన్నా, గొప్ప చరిత్రకారుడన్నా, గొప్ప సాహిత్య ప్రచారకుడన్నా, ఏమన్నా ఏ విశేషణం కూడా ఎంత గొప్పదైనా ఆయన చేసిన భాషాసేవను పూర్తిగా వివరింపలేదు. అందువల్లనే ఏ బిరుదమూ, ఏ వివరమూ లేకుండా కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు అంటేనే చాలు మనముందుకు ఆ మహామూర్తి సాక్షాత్కరిస్తుంది. ఆ పేరుకు ముందో వెనకో ఒకమాట చేర్చడం దాని విశ్వరూపతను సంకుచిత పరచడమే అవుతుంది.

ఆయన పట్టుమని పదికాలాల పాటు మనుగడ సాగించలేదు–ఆయన 1877లో పుట్టి 1923లో తనువు చాలించాడు. ఆ నలభై ఆరేళ్ళలోనే ఆయన చేసిన పరిశోధనాదులను పరిశీలిస్తే, ఇహమతి కొన్నేళ్ళు జీవించే ఉంటే, ఆయన ఆరంభించిన పనులను పూర్తి చేసే ఉంటే తెనుగు నేటికంటే ఎంత పరిపుష్టమై, పటిష్ఠమై, సంతః ప్రదీప్తమై ఉండేదో అనిపించక మానదు. కానీ అంతటి అదృష్టం ఆంధ్రులకు పట్టలేదు. అయినా జరుగని దానితో వగవడంకన్నా, జరిగినదానికి సంతోషింతాం, సంతృప్తి చెందుదాం – అదే మంచిదేమో!

ఆయన పుట్టిన రోజులు దేశభవితవ్యం దిద్ది తీర్చబడుతున్న రోజులు; మన చరిత్ర ఒక మలుపు తిరుగుతున్న నాళ్ళవి.

ఏ జాతి చరిత్రలోనైనా ఏటా బంగారు పూలు పూయవు. ఏటా జన జీవనరంగాలలో వసంతం వెల్లి విరయదు. ఏదో ఒక కాలం ఆ జాతి చరిత్రను ప్రఫుల్లం చేస్తుంది.

మనదేశంలో ఆంగ్ల సాంస్కృతీ ప్రభావం మూడు పూవులు ఆరు కాయలుగా వికసించిన కాలమది. పరప్రభుత్వం పాదుకొని దేశీయమైన పరిపాలన పునాదులు క్రక్కదలి పోతున్నా, వారి సంస్కృతిలోని బలం, వారి సాహిత్యం లోని బలం, వారి సుశిక్షిత ఆలోచనా క్రమంలోని నైశిత్యం ఇవన్నీ మన నిలిచిన నీళ్ళలో తొఱుకేసి కదిపి వేసినవి.

తమ పీటను పదిలపఱచుకొనడం కోసమే అయినా అటునుంచి వచ్చిన దొరలలో కొందఱు మన భాషను నేర్చుకోవడం, మన సాహిత్యంలోని విశిష్టతలను గమనించడం, మనవారిలో వారికి చెందిన చదువు సాముల నియమ నిబంధనలు అమలుపరచడం – అలా కొంత మన ఆలోచనా సరళిని వారు ప్రభావితం చేయసాగినారు.

సర్ సి.పి. బ్రౌన్‌దొర (1798–1884) ఆ నాళ్ళలోనే ఆంధ్ర భాషాభివృద్ధికై చేసిన అపార కృషిని పర్యాలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

అటకమీద నిద్రపోతున్న తాటాకు ప్రతులను బూజు దులిపి నిద్రలేపిన మహానుభావు డాయన. ఒకే కావ్యానికో ప్రబంధానికో పలుప్రతులను సంపాదించి శుద్ధమైన ప్రామాణిక ప్రతులను తయారు చేయించడం, కొన్నిటికి పీఠికలు వ్రాయడం, కొన్నిటిని అనువదించడం, ఒక గొప్ప నిఘంటువును తయారు చేయడం ఇలాంటి పనుల నెన్నింటినో చేశాడు బ్రౌన్.

కాంబెల్ లాంటి వారు ఆరంభించిన వ్యాకరణాదుల ఆంగ్ల రచనలు, తులనాత్మక పరిశీలనలు ఒక కొత్త చూపును ప్రసాదించినవి.

బ్రౌన్ ఉద్యోగ జీవితం సాహిత్య సేవనంగా నూటికి నూరుపాళ్లు గడచినదేమో అనిపిస్తుంది.

మరి ఆకోవలోనే, ఆయనచే ప్రభావితులై అనేకులు మన పండితులు తమ భాషను తాము పెంపొందించుకొనే ప్రయత్నం చేశారు.

అప్పుడే మన తెనుగు పునర్వికసన మహాయుగం ఆరంభమైనది.

చిన్నయసూరివంటివారు వ్యవహారబాషా రచనలను అడుగున పడవేసి గ్రాంధికానికి పట్టం కట్టడంలో ఎంత పొరపడినా నిఘంటు నిర్మాణంలోగాని, వ్యాకరణ నిర్మితిలోగాని, విద్యాబోధనారీతులను కట్టుదిట్టం చేయడంలోగాని చూపిన అనన్యప్రతిభా సంపత్తిని మనం కాదనలేము.

ఏమైనా అన్ని రంగాలలో ఒక్క ఊపుఊపి సాంస్కృతిక పునరుజ్జీవనం రెండుచేతులా పెంపొందించిన మహానుభావులు ముగ్గురు వెనువెంటనే రావడం మన మహాభాగ్యం.

వారు పదితరాలలో, పదివందల మందితో జరిగేపనిని ఒక్క తరంలో ఒక్క చేతిమీదుగా నడుపగలిగినారు.

ఒకరు కందుకూరి వీరేశలింగంపంతులుగారు (1848–1919). ఆయన తెనుగు దృక్పథంలోనే ఓ వినూత్నమైన మార్పు తేగలిగారు. బ్రహ్మసమాజ స్థాపన ద్వారా సాంఘిక సంస్కరణలకు బీజీవాపనం చేశారు. అనేక మూఢాచారాలను వెక్కిరించి వేళాకోళం చేసి తప్పుకొనకుండా వాటి సమూల నిర్మూలనంకోసం ఎంతకైనా తెగించి పోరాడినాడు. తొలి నవల వ్రాశాడు. తొలి కవులచరిత్ర, తొలినాటకం, తొలి ఆత్మకథ ఒకటేమిటి చాల ప్రక్రియలలో తొలిసారి కలంపట్టిన అదృష్టం ఆయనకే దక్కినది. ఆయన సహస్రశీర్షుడూ సహస్ర బాహూరుపాదుడుగా మనకు కానవస్తాడు.

అలాగే సృజనాత్మక సాహిత్యంలో ఒక వినూత్న ప్రయోగం చేసి చిన్న కథకు ప్రాణంపోసి, వచన వ్యావహారిక నాటకానికి ప్రాణప్రతిష్ఠచేసి, దేశమును ప్రేమించుమనీ, మంచి పెంచుమనీ ప్రబోధించి అజరామరుడైన గురజాడ అప్పారావు (1861–1915) రెండవవారు.

ఇక తెనుగు వ్రాతలోనే విప్లవం తెచ్చి, అంతకుముందుదాకా పండితులూ వారూ వాడుతూవచ్చి, చిన్నయసూరి తర్వాత అడుగున పడిపోయిన వ్యావహారిక భాషకి సాహిత్యంలో పట్టంకట్టి వచనం విస్తరించేందుకు కృషి చేసి తన జీవితంలోనే తన ఉద్యసార్థ్యం చూచి సంతృప్తుడై ఉండి పోయిన గిడుగు రామమూర్తిపంతులు (1877–1923) మూడవవారు.

ఇలా అంత మహోన్నతులైన మహాపురుషులు అందఱు పుట్టి అనుపమాన ప్రతిభాసంపత్తితో, అనన్య నిరంతరకృషితో తెనుగు మాగాణంలో మణులను పండిస్తున్న రోజులలోనే జన్మించి అంతఎత్తూ ఎదిగిన మహనీయుడు లక్ష్మణరావుగారు.

ఆయన చేసిన బహుముఖ కృషిని, నాలుగు స్థూల రేఖలతో మీముందుంచే ప్రయత్నం చేయడమే ఇప్పటి నా ప్రసంగ లక్ష్యం.

మిగతవారిలో ఒకొక్కరు ఒక్కొక్క రంగాన్ని, లేదా కొన్ని రంగాలను ఎన్నుకొని కృషిచేశారు. ఈయనకూడా అలాగే తానూ ఒక అపూర్వ సాహిత్యవ్యాసంగ రంగంలో గజ్జకట్టి దిగినాడు.

ఆయన జీవితం గూర్చి మరొకరు ప్రసంగించడంతో నేనాయన భాషా సేవాదులనే పేర్కొని వివరించే ప్రయత్నం చేస్తాను.

ప్రధానంగా ఒక్కొక్కరి బాల్యం, వారి అప్పటి పరిసరాలూ, విద్యాభ్యాసం ఇత్యాదులు వారివారి తర్వాత కార్యసరళికి పునాదులువేస్తాయి.

లక్ష్మణరావుగారి పుట్టుక కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులో. తొలుత విద్యాభ్యాసం భువనగిరిలో, తర్వాత ఉన్నత విద్యార్జనం నాగపూరులో.

ఇదంతా ఆయనకొక విస్తృత విజ్ఞాన భూమిలోనికి ప్రవేశ మిప్పించినది. ఇటు ఆంధ్రం, అటు తెలంగాణాలలో రెండిటా సంబంధం–అందునా సన్నిహిత సంబంధం ఉన్నవారు మనకు అట్టే లేరు. ఆనాడు మఱింతగా ఎవరికి వారుగా ఉన్నారు.

ఆ రోజులలో ఆయనకు తెలంగాణాతో ఏర్పడిన బాంధవ్యం తర్వాత అక్కడి మహానేతలతో కలిసి అక్కడి సాంస్కృతిక పునరుజ్జీవనంలో గొప్పగా పనిచేసే అవకాశం కల్పించినది.

అలాగే నాగపూరులో విద్యాభ్యాసం మహారాష్ట్రం, సంస్కృతం, హిందీ మొదలైన భాషలలో పాండిత్య ప్రాగల్భ్యసముపార్జనకు దారితీసి తర్వాత ఆయన వ్యాసంగంలో అపూర్వ సముద్దీప్తికి మూలభూతమైనది.

మహారాష్ట్రంలో పాండిత్యమంటే గీర్వాణంలో పాండిత్యంకూడా అని వేరే చెప్పనవసరంలేదు. అప్పటికే ఆ భాషలో సజీవ సంచలనం బయలుదేరి ఎన్నెన్ని చర్చలకో, పరిశోధనలకో దారితీస్తూ ఉండగా రావుగారు అందులో తలమున్కలుగా దిగినారు.

ఎప్పటికైనా ఇతరభాషలతోడి పరిచయం, పాండిత్యం, సాన్నిహిత్యం ఏ భాషలో పనిచేసేవారినైనా ప్రభావితులను చేస్తుంది. వారి కృషికొక ఊపునూ తూగునూ ప్రసాదిస్తుంది.

ఆంగ్లం మొత్తంమీద భారత జీవన సరణిలోనే కొత్తతీవెలెన్నింటినో పూయించి, కొత్తవలపుల నెన్నింటినో గుబాళింపజేయగా, ఇలా పలుభాషలతోడి సంపర్కం రావుగారి దృక్పథవైశాల్యానికి ఎంతైనా తోడ్పడిందని వేరే చెప్ప వలసిన పనిలేదు.

అప్పటి మరాఠీ పత్రికలలో ఆయన ఎన్నెన్ని వ్యాసాలో వ్రాశారు; కొన్ని పద్యాలను కూడా వ్రాశారు. అప్పటి సాహిత్య సంవాద వివాదాలలో పాల్గొన్నారు. రామాయణంలోని పంచవటి ఏది అని ఆనాడు మరాఠీలో జరుగుతున్న చర్చలలో ఆయన పాల్గొని ఆ పంచవటి తెనుగునాటిలోనిదే నని నిరూపించేందుకు శతథా ప్రయత్నించారు.

అంతే ఆనాటి పరిశోధనలో ప్రధానమైనది, ఇంగ్లీషు పండితులు ఒరవడి పెట్టినది; అనేక ప్రతులను సంపాదించి, వాటిని పర్యాలోచించి, పరిశీలించి, తారతమ్య పరిశీలనంచేసి వాటిలో సాధుపాఠ నిర్ణయంచేసి ప్రామాణిక ప్రతులను ప్రచురించడం.

అలా ఆయన ఆనాడు మహారాష్ట్రంలోని మోరోపంతు కర్ణ పర్వాన్ని పరిశోధించి శుద్ధప్రతిని తయారుచేసి అక్కడివారి మన్ననలను అందుకొన్నాడు. అయితే ఆనాళ్ళలోనే ఆయన తెనుగు దేశానికి ఎంతదూరంలో ఉన్నా తన మాతృభాషను దూరం చేసుకోలేదు. అందులో తాను ముమ్ముందు చేయవలసిన కృషికి అంకురార్పణ ఆనాడే చేశారు. ఆయనా, ఆయన సోదరి భండారు అచ్చమాంబగారూ తెలుగు పత్రికలకు, ఇక్కడి వాటికి, వ్యాసాలు వ్రాస్తూ వచ్చారు. ఆతర్వాత ఆమె అబలా సచ్చరిత్ర రత్నమాల వ్రాసి ప్రచార పఱచటం తెనుగుదేశం బాగా ఎఱుగును.

అప్పటిలో 1898 లోనే రావుగారు "విశ్వముయొక్క విరాట్ స్వరూపము" అన్నదీ, "విశ్వముయొక్క బాల్యస్వరూపము" అన్నదీ రెండువ్యాసాలు వ్రాశారు.

ఈ వ్యాసాలతో ఆయన చేయదలచుకున్నదేమిటో చూచాయగా తేలిపోయింది. పాశ్చాత్య వైజ్ఞానిక ప్రకాండులు పరిశోధనలు చేసి సాధించి, ప్రచుర పరుస్తున్న విజ్ఞాన ప్రగతిని తెనుగువారికి అందివ్వాలి; తెనుగులలో ఆధునిక విజ్ఞానం వెదజల్లాలి.

ఇందుకు వాటితో శ్రీకారంచుట్టి ఆ తర్వాత అనేక రచనలలో ఆ పనిని విస్తరింపజేస్తూ వచ్చినాడాయన.

అలాగే గాసటబీసటగానున్న భారతచరిత్రను, ఆంధ్రులచరిత్రను కాస్త చిక్కుదీసి, సరిచేసి, ఒక నిర్దిష్ట, నిర్దుష్ట ప్రామాణిక చరిత్రగా రచించాలనే ఆశయం ఆయనకు అనన్యసామాన్యమూ, మౌలిక పరిశోధనా పూర్ణమూ అయిన రంగంలోనికి ప్రవేశింప జేసినది.

వీటన్నిటికి కావలసిన సాధనసంపత్తిని సంతరించు కొనడమే బ్రహ్మాండమైన పని. పైగా పరప్రభుత్వం పరిపాలిస్తున్న రోజులలో, వారి పండితులు ప్రాచ్యమంతా పాశ్చాత్య సంస్కృతి ముందు దిగుదుడుపే అన్న నమ్మకంతో, ప్రాచ్యచరిత్ర అంతా ఇటీవలికి వీలైనంత లాగివేయాలన్న దురూహతో, ఇదంతా ఏదో అటవికదశలో నున్నదన్న దుర్ భావంతో కూడా, కొందఱు తప్పుదారి పట్టిస్తున్న రోజులలో సరైన చరిత్రరచనకు ఉపక్రమించడమే భగీరథ ప్రయత్నం.

సరిగా ఈ మహాకృషిని ఆరంభిస్తున్నప్పుడు ఆయనకు అనువైన తావునకు వెళ్ళే అవకాశం చిక్కింది. ఆయన మునగాలపరగణాకు దివాన్ అయ్యారు. ఆ విధినిర్వహణలో మదరాసుకు తన నివాసం మార్చుకున్నారు.ఆరోజులలో చెన్నపట్నం తెనుగు పునర్వికాసానికి ఆటపట్టుగా ఉన్నది; అనేక పరిశోధనలకు, పండితులకు, గ్రంథాలయాలకు, ప్రదర్శనశాలలకు ఆలవాలంగా ఉన్నది.

తెనుగువారికి మఱొక నగరం అప్పటికి లేదు. ఇప్పటికీ ఉన్నదా అనేది అనుమానాస్పదమే. హైదరాబాదు ఇంకా అందుకు తగిన హంగులన్నీ సమకూర్చుకొనవలసే ఉన్నది. అయితే అదొక వివిధభాషా సంగమం కావడం ఒక విశిష్ట గుణం.

ఆనాళ్ళలో మదరాసుకూడా అటు మళయాళం, కన్నడం, తెలుగు, తమిళాలకు సంగమ స్థలంగా ఉన్నది. పైగా పాశ్చాత్య ప్రఖ్యాత తొలి నిలువరం కూడా కావడంలో విభిన్న సంస్కృతుల పరస్పర ప్రభావవిలసితమై ఉన్నది.

ఆ నగరం బ్రౌను మొదలు తర్వాతి వేటూరు ప్రభాకరశాస్త్రి గారి దాకా ఆంధ్ర చరిత్ర, సాహిత్యాది పరిశోధకుల కందరకూ ఆటపట్టయినది. అప్పుడే అక్కడ విశ్వవిద్యాలయం, చక్కటి ప్రాచీన వస్తుప్రదర్శనశాల, ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం ఇవన్నీ అమరి ఉన్నవి.

అందువల్లనే వీరేశలింగంగారికీ, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు (1867–1938) గారికి కూడా లక్ష్మణరావుగారికి వలెనే అది నిలువరము నాడే ఇవ్వగలిగినది. ఈనాటికీ అక్కడ కావలసినంత సామగ్రి, సంభారం ఇంకా ఉండనే ఉన్నది.

1901 లోనే హైదరాబాదు నగరంలో లక్ష్మణరావు పంతులుగారు గ్రంథాలయోద్యమానికి పాదుకల్పిస్తూ ఉండిన పోలీసు కమిషనర్ వెంకటరామిరెడ్డి, మునగాలరాజా నాయని వెంకటరంగారావు వగైరాలతో కలిసి పనిచేస్తూ వస్తున్న రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాథరావు, మైలవరపు నరసింహశాస్త్రి, మాడపాటి హనుమంతరావు వగైరాలతో కలిసి శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపించడంలో తెలంగాణా సాంస్కృతిక పునరుజ్జీవనానికి నారుపోసినారు.

దేవులపల్లి రామానుజరావుగారు ఒకచోట పేర్కొన్నట్లు ఆయన అక్కడి గ్రంథాలయోద్యమం ద్వార రాజకీయ సాంఘిక సాహిత్య రంగాలన్నిట ఒక కొత్త వికాసానికి ప్రేరకులైనారు.

అందువల్లనే ఏ ఇతర పండితునికీ ఆనాడు లేని ఒక విశిష్టత వీరికి చేకూరినది; సకలాంధ్ర వైతాళికుడైనా డీయన.

మదరాసులో 1906లో ఆయన విజ్ఞానచంద్రికా గ్రంథమండలిని సంస్థాపించినారు. అనేక యువకిశోరాలను చేర్చుకున్నారు; అనేక సమస్కంధులను రాబట్టుకొన్నారు. అప్పటిలో గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు మొదలు, అయ్యదేవర కాళేశ్వరరావు మొదలు అపుడప్పుడే పరిశోధనలో దిగుతున్న మల్లంపల్లి సోమశేఖర శర్మగారి వంటి ఉద్దండు లెందరెందరతోనో ఆ గ్రంథమాలకు సంబంధ బాంధవ్యాలు ఏర్పడినవి.

ఇప్పటికి మనం తీర్చుకోలేక పోతున్న దేశభాషా బాధనాదుల సమస్యలను ఏనాడో ఆయన ఊహించినాడు. ఏ సంక్లిష్టవిజ్ఞానశాఖ అయినా ఏ విషయమయినా తమ మాతృభాషలో చెప్పవీలున్నదనీ, ఇలా చెప్పినప్పుడే అది సులువుగా పరివ్యాప్తమవుతుందనీ ఆయన ఆనాడే నమ్మినాడు. కాబట్టే అందుకు పూనుకున్నాడు.

రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, వృక్షశాస్త్రం మొదలు అనేక విజ్ఞాన శాఖలపై పుస్తకాలను రచించి, రచింపజేసి అందులో క్రమంగా ప్రచురిస్తూవచ్చారు. ఆయా విషయాలలో నిష్ణాతులైన వారిని ప్రోత్సహించి వారివలన అసమానకృషి చేయించారు.

అలాగే చరిత్ర రచనకు ప్రాణంపోసిన మహనీయత ఆయనకే దక్కినది. స్వయంగా హిందూ మహాయుగం, మహమ్మదీయ మహాయుగం ఆయన రచించి ప్రచురించిన ఉద్గ్రంథాలలో కొన్ని.

అప్పటికి మూలసామగ్రిలోనికి వెళ్ళి ప్రతిదీ అక్కడొక అంశమూ, ఇక్కడొక అంశమూగా నెమకి ఏరుకొని సేకరించుకోవలసే ఉన్నది. పైగా పాశ్చాత్య చరిత్ర రచయితలు కొందఱు చరిత్రను తలక్రిందులుచేసి మసిపూసి మారేడుకాయచేసిన పట్టులూ అనేకములు. కాళిదాసాదుల కాలాన్ని ఎంత దగ్గఱకు లాగితే అంత మంచిదన్నట్లు ప్రవర్తించిన పండితులను గురించి మనకు తెలుసును. అలాగే మఱి కొందఱిటు ఏ గాథలోనో త్రవ్వి వారిని ఇంకా ఇంకా ఆవలికి ఉన్ననాటికంటే ఆవలికి కొనిపోయే ప్రయత్నం చేయడమూ మన మెఱుగుదుము.

ఈయన అలాకాక అథర్వవేదకాలం మొదలు దేనికి కాలం నిర్ణయం చేయదలచినా ఏ విధమైన జాత్యహంకారంకాని, విజాతీయనైచ్యభావంకాని లేకుండా దొరికిన సాక్ష్యంతో శాస్త్రీయంగా నిర్ణయించేందుకు శతధా సహస్రధా ప్రయత్నించాడు. ఇదెంత కష్టసాధ్యమో ఈనాడే మనకు తెలుసు. ఇక ఆనాడెంత కష్టాతి కష్టతరమో మనం ఊహించుకొన వచ్చును.

ముఖ్యంగా చరిత్రకు శాసనాదుల ఆధారం అతిప్రధానాంశము. ఆనాడు శాసనాదులను సేకరించడం అవసరమైనది. అంతేకాదు, ఆ శాసనాలేనాటివో నిర్ణయించాలి. ఆ లిపిని చదవగలగాలి. అందలి విషయాన్ని ఆనాటి మాటలను అర్థంచేసుకొని గ్రహించ గలగాలి.

అలా ఆయన ఎన్నెన్ని శాసనాలను చదివారో, ఎంత మౌలిక పరిశోధన కావించారో అనుకుంటేనే ఆశ్చర్యచకితులు మయిపోతాము.

ఆనాటి స్వచరిత్రాది రచనకు మనకు లక్ష్యం కూడా ఉన్నది. పాశ్చాత్యులు మనలో కలిగించిన న్యూనతా భావాన్ని పారద్రోలాలంటే మన పూర్వకాలం ఔన్నత్యం, మన ప్రాచీన సంస్కృతీ సభ్యతా నాగరకతాదులలోని ఉన్నతీ, అలనాటి శిల్ప చిత్ర కళాదులలోని అప్రతిమాన రసజ్ఞతా అవన్నీ తిరిగి కట్టుకొనివచ్చి తనవారిముందు నిల్పి వారిలో ఆత్మవిశ్వాసం కల్పించాలి. అట్లని అది దురహంకార దుర్విలసితం కారాదు.

ఈ కత్తిమీద సామును బహుచక్కగా నిర్వర్తించి ఆయన అటు హిందూ, మహమ్మదీయ మహాయుగములనేకాక, శివాజీచరిత్రలాంటి వాటిని ప్రచురించాడు.

ఇంతచేసినా ఆయనకు సంతృప్తి కలుగలేదు. తాను రెండు చేతులా ప్రపంచ విజ్ఞానాన్ని తెనుగువారందరకూ పంచిపెట్టాలి. అది కేవలం పొడుగు చేతుల పందేరం కాకూడదు. సర్వజన సామాన్యం అందుబాటులోనికి అది రావాలి.

అందుకాయన ఎంతగా తపించిపోయినారో, తహతహపడినారో మనం ఊహించలేము. తుదకు ఆయనకు అందుకు తగిన పథకమొకటి తట్టినది. దానిని వెనువెంటనే ఆచరణలో పెట్టినాడు,.

అదొక ఉద్యమం. అదే ఆయన ఆరంభించిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ ప్రకటన సమారంభం.

1912-13లలో ఆయన అంతదాకా ప్రపంచ మానవ మహాజ్ఞాన భాండారాన్ని సమాలోచనం చేసి దాని సారసంగ్రహాన్ని అందఱకూ పంచాలని విజ్ఞాన సర్వస్వం ఆరంభించారు.

ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా ఆదర్శంగా దానిని సంసిద్ధపఱచ సాగినాడు. తాను ప్రధాన సంపాదకుడుగానే కాదు, ప్రధాన విషయసల్లేఖకుడుగా కూడా పని చేసినాడు. ఎందఱెందఱు సముజ్జ్వలైన జగజెట్టీలో పనిచేసినా ఆయన వ్రాసినన్ని వ్యాసాలు అందులో ఇంకెవరు వ్రాసినట్టు కనిపించదు.

అంత బ్రహ్మాండమైన ప్రయత్నాన్ని ఆ నాడు ఏ అపార ధన సంచయమూ లేక, ఏ ప్రభుత్వ ఆదరాభిమానాలూ సహాయ సంపత్తీ లేకుండానే కొనసాగించిన ఆయన సాహసానికి మనం జేజేలు చెప్పాలి.

మఱొకటి. ఆయన తానే ఒక విజ్ఞాన సర్వస్వం – నడయాడు విజ్ఞాన సర్వస్వంగా మనకు కానవస్తాడు. ఆకారం వఱకే ముగిసిన ఆ విజ్ఞాన సర్వస్వంలో అథర్వవేదం, అద్వైతం, అభిజ్ఞాన శాకుంతలం, అలంకారాలు, అష్టాదశ మహాపురాణాలు, అష్టాధ్యాయ – ఇలాంటి విభిన్న మహాంశాల గూర్చి ఆయన వ్రాసిన వ్యాసపరంపరను మనం పరిశీలిస్తే ఆ విజ్ఞానఖని ఎంతలోతైనదో, ఎంత విస్తృతమైనదో, ఎంత సంపన్నమూ సమృద్ధమూ అయినదో బోధపడుతుంది. ఆ అపారజ్ఞాన సంపద మనకళ్ళకు మిఱుమిట్లు కొల్పుతుంది.

పోనీ అలాంటి విషయాలతోనే ఆయన సంతృప్తిపడినాడా లేదే! అట్టబైండు అన్న వ్యాసం చూస్తే, అది ఎంత సాంకేతికంగా, శాస్త్రీయంగా స్పష్టంగా, ఆచరణకు అనుకూలంగా వ్రాశాడో గమనిస్తే 'ఇదా విజ్ఞానమంటే' అని ముక్కున వ్రేలిడుకొని విస్తుపోయి ఓ నిశ్చయానికి వస్తాము.

ప్రధాన విషయమనీ, అప్రధాన విషయమనీ, సాహిత్యమనీ చట్టుబండలనీ లేదు, జనానికి అవసరమయ్యే సర్వవిషయ సామగ్రిలో దేనిమీదనైనా వారు వ్రాయగలరు; అందుకు తగిన సంభారాన్ని సంపాదించుకగోలరు. ఉచ్చి పచ్చిగా నాలుగవీ, నాలుగివీ కలిపి వ్రాసి ఏదో మొక్కుబడి తీర్చుకోవడం కాక ముకుబంటిగా విషయ సముద్రంలో మునిగి తేలి ముత్యాలను ఏర్చి తెచ్చి మనకు అందివ్వగల ఓరిమీ పేరిమీ కల వారాయన.

అయినా ఆ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం అప్పటిలో మూడు సంపుటాలలో ఆకారంతో ముగిసి అక్కడికే ఆగిపోయింది. ఆయన సజీవుడే అయి మఱి కొన్నాళ్ళుంటే, అది పూర్తిగా ఆవిధంగానే పూర్తి అయి ఉంటే మనం సాహిత్యపరంగా ఇంకెంతో సంపన్నులం అయి ఉండేవారం. అందుకు ఆంధ్రులు నోచుకోలేదు. ఆయన 1923లోనే పరమదించినారు. కాలమెంత క్రూరమైనదో!

దానినే తర్వాత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు మఱింత మంది పండితుల సాయంతో, అంతదాకా తెలిసిన విజ్ఞానంతో తిరిగి ఆ ఆకార పరంపరనే రెండు ముచ్చటైన సంపుటాలలో ప్రకటించినారు. తిరిగి పంతులు గారి మృతితో ఆ పని కూడా కడముట్టకనే ఆగిపోయింది. ఆ తర్వాత తెలుగు భాషా సమితి ఏర్పడింది. డాక్టర్ గోపాలరెడ్డిగారే దాని అధ్యక్షులు. వీరు అలా ఆకారాది క్రమంగా కాక, విషయానుక్రమంగా విడివిడి సంపుటాలుగా విభజించుకొని ప్రచురించ నారంభించారు; పంద్రెండు సంపుటాల దాకా వచ్చినవి.

అలాగే ఒక విజ్ఞాన సర్వస్వం సంగ్రహంగా హైదరాబాదు నుంచి వెలువడినది.

ఇతః పూర్వమే ఉర్లాం జమీందారు అయిదు సంపుటాలలో ఆంధ్ర విజ్ఞానం అని ప్రకటించినారు. ఇది 1938–41 మధ్య వెలువడినది. ఏమయినా లక్ష్మణరావుగారు ఆరంభించిన పద్ధతిలో తెలుగులో అంత భారీఎత్తున విజ్ఞాన సర్వస్వం రాలేదు.

నిజానికి భారత భాషలలో విజ్ఞాన సర్వస్వం ఆరంభించింది తెలుగు లోనే అన్నది మనం జ్ఞాపకం ఉంచుకోవలసిన అంశం. తర్వాత 1915లో మరాఠీల విజ్ఞాన సర్వస్వ ప్రకటన ఆరంభమై 21 సంపుటాలలో 1927 నాటికి పూర్తి అయింది. అలాగే బెంగాలీలో విశ్వకోశం అనే పేరిట విజ్ఞాన సర్వస్వం తర్వాత ప్రచురితమైనది. మిగత అనేక భాషలలో ఆ ప్రయత్నం అలా కొనసాగడానికి ముందే లక్ష్మణరావుగారు ఆరంభించారు. ఆయన దూరదృష్టిని అభినందించక ఉండలేము.

ఇంతకూ ఆయన మాంచి వయసులో కాలానికి బలిఅయి పోయారు కానీ కాకపోతే ఇంకెన్ని చేసేవారో. నలభైఆరేళ్ళ వయసులోనే ఆయన మృతి చెందినా ఎంత అద్భుతమైన అపారకృషి చేశారో మనం తలచుకుంటే ఒడలు గగుర్పొడుస్తుంది.

ఇలా ఇంత కృషి చేసి గతించిన ఆ మహనీయుని సంస్మృతి మనలో ఏ యింత కార్యవ్యగ్రతను ప్రబుద్ధం చేసినా అదే పదివేలు. రానున్న 1977లో ఆయన శతజయంతినాటికి ఆయన రచనలన్నిటిని సమీకరించి, సముద్ధరించి, సంపాదించి, చక్కగా ముద్రించి ప్రచురించే మహాకార్యానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు బద్ధకంకణులు కాగలరని, కావలెనని ఆశిస్తున్నాను, విశ్వసిస్తున్నాను.

ఈనాలుగు మాటలలో ఆ మహావ్యక్తికి రూపుకట్టగల శక్తి నాకు లేదు. అయినా అందుకు పూనుకున్న నా సాహసాన్ని మన్నిస్తారని నమ్ముతున్నాను.

ఈ అవకాశం కల్పించిన అకాడమీ అధ్యక్షుడు గోపాలరెడ్డి గారికి, కార్యదర్శి రామానుజరావు గారికి ఇతర కార్యకర్తలకు నా కృతజ్ఞతను తెలియజేసుకుంటున్నాను.

(తెలుగు వైతాళికులు నుండి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి)

పి.వి. నరసింహారావు

ఆంధ్ర కేసరి ఆదర్శంగా తెలుగువారికి ఒక వ్యక్తిత్వం

భారత దేశంలో యీనాడు ఆంధ్రప్రదేశ్ ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించి వున్నది. అన్ని రంగాలలో పురోగమిస్తూ, తన వ్యక్తిత్వాన్ని మరింతగా ఋజువు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూ వున్నది. అయితే, యితర రాష్ట్రాలతో పోల్చి చూస్తే, యింకా తెలుగు వారికి ఒక వ్యక్తిత్వం ఏర్పడలేదు అనిపిస్తుంది. కారణమేమంటే వీరు యితర రాష్ట్రాల్లో చాలా కాలం వరకు యితరులతో కలిసి ఉండడం, కలిసినా కలవకున్నా కలిసి ఉండవల్సిరావడం యివన్నీ చరిత్రలో జరిగినటువంటి ఘట్టాలు, కనుక తెలుగువాళ్ళకొక వ్యక్తిత్వం పునర్నిర్మించుకోవడం అవసరం. ఆ వ్యక్తిత్వం అనే దానిని మనం నిర్మించాలంటే ఒక వ్యక్తి కూడా అవసరం. ఆ వ్యక్తి చుట్టూ అది నిర్మించబడుతూ వుంటుంది. మనం చూస్తుండగానే, మనకు తెలియకుండానే అది నిర్మించబడుతూ ఉంటుంది. ఇప్పుడితర రాష్ట్రాల్లో చరిత్ర ప్రసిద్ధి పొందిన మహావ్యక్తులు ఆయా రాష్ట్రాలకొక వ్యక్తిత్వాన్ని అందించినటువంటివారు. వారిచుట్టూ, వారి గొప్పదనం చుట్టూ అల్లుకొని ఆయా రాష్ట్రాలకొక వ్యక్తిత్వం వచ్చింది. మన ప్రత్యేకత ఏమిటంటే ఎవరికీ వ్యక్తిత్వం రాకుండా చేసుకోవడం. అటువంటి ప్రత్యేకత మనకొకటుంది. ఇంతవరకూ అట్లా పనిచేసుకుంటూ వచ్చినాము. కనీసం యికమీదనైనా ఆ వ్యక్తిత్వాన్ని మన రాష్ట్రానికి, మన తెలుగువాళ్ళకు కల్పించడానికి మనం దోహదం చేస్తే తొందరగా అది నిర్మాణం అవుతుందనే ఆశగా కూడా వుంది.

ప్రకాశమానమైన ప్రకాశం

స్వాతంత్ర్య సమరంలో పాల్గొని నాయకత్వం వహించిన అందరు నాయకుల్లో ప్రకాశం పంతులుగారు తెలుగువాళ్ళకు యీ వ్యక్తిత్వాన్ని సంపాదించి పెట్టడంలో, నిర్మాణం చేయించడంలో సమర్థవంతమైనటువంటి వ్యక్తిత్వాన్ని స్వయంగా కలిగి ఉన్నారని నేను నమ్ముతున్నాను. అందుకని ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని మనం బాగా నిర్మాణం చేసుకుంటే యిది. కేవలం మన స్వార్థం కొరకు చేసుకుంటున్నదే. యిప్పుడున్నటువంటి తెలుగువాళ్లే కాకుండా రేపు రాబోయేటటువంటి తరాల తెలుగువాళ్ళు కూడా యేదో ఒక మనిషి పేరు చెప్పుకుని, ఆ మనిషికి ఉన్నటువంటి పేరు ప్రతిష్ఠలలో వీళ్ళుకూడా భాగస్వాములయేటటువంటి పరిస్థితి కల్పిస్తూ ఉన్నాయి. తెలంగాణా జిల్లాల్లో పెద్దగా ప్రకాశంగారితో స్వయంగా పరిచయాలు ఉన్నటువంటి పరిస్థితి ఏమీ లేదు. ఆదిలాబాదులో, నిజామాబాదులో, మహబూబ్‌నగర్‌లో ఊరికే పుస్తకజ్ఞానం వల్ల తెలుసుకున్నదే కానీ పత్రికల్లో చదివి తెలుసుకున్నదేగానీ, ప్రకాశం గారిని చూచినవాళ్లుగానీ, వారితో స్వయంగా పరిచయం ఉన్నటువంటివారుగానీ, వారితో హృదయ పూర్వకంగా బాగా కలిసిపోయి ఉన్నటువంటివారుగానీ చాలా అరుదు. కానీ తెలంగాణా జిల్లాల్లో ప్రకాశంగారితో స్వయంగా పరిచయం లేనటువంటి యీ వెనుకబడిన

జిల్లాల్లో కూడా ప్రకాశం గారి పేరుతో ఎంత ఉత్సాహం వచ్చినదంటే అది అందరికీ కాస్త ఆశ్చర్యాన్నే కలిగించింది. ఎల్లా వస్తుందా ఉత్సాహం? సంబంధంలేని, పరిచయములేని ఉత్సాహం. యీ తెలుగువాళ్ళంతా దౌర్భాగ్యవశాత్తు వేరు వేరు చోట్ల ఉన్నప్పటికీ, ప్రకాశం పేరు మీద వీళ్ళంతా యిప్పుడు ఉత్సాహంగా పని చేస్తున్నారు. ఎందుకిలా కలిసి పనిచేయాలంటే అదే అసలు, వీళ్ళను ఒకటిగా చేసేటటువంటి సూత్రం. మనం నిర్వచించరానటువంటిది, అనిర్వచనీయమైనటువంటిది. ఆ సూత్రం తెలుగు వాళ్ళది. ఆ ఐక్యతా సూత్రం యిప్పుడు కనబడుతూ ఉన్నది.

ప్రేరణ

ప్రకాశం గారిని స్మరించుకోవడం, ఆయనకు స్మారక చిహ్నాలు నిర్మించుకోవడం వచ్చేటటువంటి తరాలవారికి కూడా ప్రకాశం పంతులుగారి జీవిత చరిత్ర నుండి వారు ఏ ఆదర్శాల కొరకు పోరాడినారో, ఆ ఆదర్శాలతో ప్రేరణపొందే అవకాశం కల్పించడం మనందరిమీదా ఒక బాధ్యతగా ఉంది. ప్రకాశం పంతులు గారి శతజయంతి ఉత్సవాలు జరుపుకునే సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. ఆ సంఘానికి ముఖ్యమంత్రి అధ్యక్షులుగా ఉన్నారు. పెద్దలు విశ్వనాథం గారు తదితర 15, 18 మంది సభ్యులు ముఖ్యంగా ప్రకాశం పంతులుగారికి చాలా సన్నిహితులుగా వున్నటువంటివారు సభ్యులుగా వున్నారు. ఈ నాడు యీ సంఘం ద్వారా ప్రారంభించబడిన కార్యక్రమాల ఉద్దేశం ఒకటే. ప్రకాశం పంతులుగారి జీవితాన్ని ప్రజలకు అందివ్వడం భావి తరాల వారికి అందివ్వడం. స్మారక చిహ్నాలద్వారా కేవలం ఏదో ప్రకాశం పంతులుగారికి మనం ఒరగ బెడుతున్నామనే మాట కాకుండా, భావి తరాల లాభం దృష్ట్యా యీ కార్యక్రమాన్ని మనం జరపడమనేది ముఖ్యమైన ఉద్దేశం. అనేక స్మారకాలు మనం చేసుకుంటూ ఉంటాం. కాని అవి కేవలం లాంఛన ప్రాయంగా మాత్రమే వుండిపోతాయి. కాని ప్రకాశం పంతులు గారి వ్యక్తిత్వాన్ని గురించి ఆవ్యక్తిత్వానికి సంబంధించిన ఒక మహోహ. అంటే ప్రజల మనస్సుల్లో ఆయనను గురించి ఉన్నటువంటి ఒక ఉదాత్తమైన అభిప్రాయం. ప్రగాఢమైనటువంటి ఒక ప్రేమానురాగం, భక్తి, యీ అన్నింటికీ అనుగుణంగా మనం యీ కార్యక్రమాన్ని రూపొందించవలసి వుంటుంది, అని ప్రకాశం గారి శతజయంతి సంఘం వారు నిర్ణయించినారు.

ఆంధ్రులకు ఏకైక నాయకుడుగా వుండి యావద్భారత దేశంలో తెలుగువారికి ఒక వన్నె తెచ్చినటువంటి యీ మహా నాయకుణ్ణి మనం హృదయాలలో నిలుపుకోవడమే కాకుండా, మన చరిత్రలో తెలుగు వాళ్ల చరిత్రలో చిరస్థాయిగా ఆయనవల్ల మనకు రావలసినటువంటి ప్రేరణను ఎప్పుడుకూడా మాసిపోనివ్వకుండా చేయాలనేటువంటి కృతనిశ్చయం మనకు యీనాడు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో, అన్ని గ్రామాల్లో కనిపిస్తున్నది. యీ సంవత్సరం లోపల ఏ కార్యక్రమం ఎక్కడ చేసినప్పటికీ, ఏ భవనం ఎక్కడ కట్టుకున్నప్పటికి ఏ ప్రాజెక్టు ఎక్కడ నిర్మించుకున్నప్పటికి, అది ప్రకాశం పంతులుగారి పేర నిర్మించుకుందాం. దానికి ప్రకాశం గారి నామకరణం చేద్దామని ఒక నిర్ణయానికి వచ్చినాము.

ప్రకాశం గారి పేరు మీద భవనాలు కట్టుకుందాం. ఇదివరకు కట్టిన వాటికి ప్రకాశం గారి పేరు పెట్టుకుందాం. ఏదంటే అది మేము చేస్తామని ఎన్నడూ లేనంత ఉత్సాహంతో యీనాడు యీ అపరిచిత మైనటువంటి ప్రాంతాలు ముందుకొస్తున్నాయంటే, అదీ యిటీవలి చరిత్రలో జరిగిన ఘటనల తర్వాత యిది జరుగుతున్నదంటే చాలా ప్రత్యేకమైనటువంటి విషయం. ఇది కొంతవరకు తెలుగువాళ్ళ ఐక్యత కొక గ్యారంటీగా ఉంటుందని గూడా నేననుకుంటూ ఉన్నాను. అందుకని యిదంతా మనం మన చరిత్రను, మన వ్యక్తిత్వాన్ని, మన ఐక్యతను పటిష్ఠం చేసుకోవడానికి చేస్తున్న కార్యక్రమమేగాని మరొకటి కాదు.

ప్రతి గ్రామంలో ఏదో ఒక కార్యక్రమం ఏదో స్మారకం, ఏదో ఒక భవనం, ప్రకాశం గారి పేర మన రాష్ట్రంలో వుండి తీరాలని ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. దానికి ఉత్తరువులు కూడా జారీ చేస్తాము. ఈ ఒక సంవత్సరంలోపల ఏమి జరిగినప్పటికి ప్రకాశం పంతులు గారి పేర జరిగి తీరాలని అనుకున్నాము. ఏమైనా సరే, యీ ప్రేరణ ఎన్నడు కూడా మాసిపోకుండా, ప్రజలు మరచిపోకుండా, భావితరాలవారు దీన్ని గూర్చి సంపూర్ణమైనటువంటి పరిజ్ఞానం కలిగి వుండేట్లు చేయాలని నిర్ణయం చేశాము.

చరిత్ర

ప్రకాశం పంతులుగారి రచనలు జీవిత చరిత్ర అధికారికంగా రాయడమనేది కూడా జరుగవలసి ఉన్నది. ఇవికాక వారి జీవిత చరిత్ర అంటే ఆంధ్రదేశ రాజకీయ చరిత్ర అనే దృష్టితో కూడా వ్రాయించవలసిన అవసరం వున్నది. దానికి సంబంధించినటువంటి పూర్తి బోగట్టా సేకరించి, దానికి సంబంధించిన పరిజ్ఞానం వున్నటువంటి పెద్దలను అందరిని కూడా సంప్రదించి, అధికారికంగా వ్రాయించవలసిన అగత్యాన్ని కూడా గుర్తించి దానికి కావలసిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

సమగ్రమైనటువంటి, సర్వతోముఖమైనటువంటి వ్యక్తిత్వం, ఎన్ని రంగాల్లో ప్రకాశించిందో, అన్ని రంగాల్లో కూడా యింతో అంతో ఆయనకు స్మారక చిహ్నంగా, ఆయన వదలి పోయినటువంటి అడుగుజాడలు ఆ రంగాల్లో ఉంటే మంచిది. ఆ రంగాల్లో పనిచేసే వారందరు ఆయన స్మారకాన్ని అన్నిరంగాల్లో కూడా చిరస్థాయిగా ఉండేటట్లు ప్రయత్నాలు చేసుకోవాలి. ప్రకాశంగారి వ్యక్తిత్వం, మనకొక ధరావత్తుగా అమూల్యమైనటువంటి వారసత్వంగా భావించి యిది ఎక్కడా పొల్లుపోకుండా దీన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం గారి వ్యక్తిత్వం ద్వారా ఆబాల గోపాలానికి తరతరాలుగా, ఆ బ్రహ్మాండమైనటువంటి ప్రేరణ మనం కల్పించడం ఎంత వరకు సాధ్యమో దానికి కావలసిన చర్యలు తీసుకోవడానికి వెనుదీయము.

('ఆంధ్రప్రదేశ్' 1972)

డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం

'ఆంధ్ర పితామహ' పద్మభూషణ,
మాడపాటి హనుమంతరావు పంతులుగారి భాషా సేవ - దేశ సేవ

తెలుగువారు 'తాత' గౌరవాన్ని అంత తేలిగ్గా ఎవరికీ ఇవ్వరు. అలనాడు జాతినీ సాహిత్యాన్నీ సముద్ధరించిన తిక్కన సోమయాజిని 'కవిబ్రహ్మ' బిరుదంతో గౌరవించారు. ఆ తరువాత ప్రబంధ రచనా ప్రక్రియకు ప్రాణం పోసిన అల్లసాని పెద్దనను 'ఆంధ్ర కవితా పితామహు'డని ప్రశంసించారు. వీరుగాక ఒకరిద్దరు పితామహులు వినబడతారుగాని వారికి చిరకీర్తి లభించలేదు. ఏమైనా, వీరంతా సాహిత్యరంగానికి మాత్రము సంబంధించినవారే. ఈ శతాబ్దంలో జాతిపితగా భారతీయుల హృదయాల్లో సమున్నత స్థానాన్ని సంపాదించుకొన్న గాంధీమహాత్ముడు తెలుగు బిడ్డలచేత 'తాతా' అని పిలిపించుకొన్నాడు. ఆ తరువాత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 'చాచా నెహ్రూ'గా బాలల హృదయాలలో నిలిచిపోయాడు. అయితే, తెలుగు నాయకుల్లో 'ఆంధ్ర పితామహ' గౌరవాన్ని పొందిన ఏకైక నాయకులు కీ.శే. మాడపాటి హనుమంతరావు పంతులుగారు. తెలుగువారు పితామహ బిరుద గౌరవాన్ని ఒక నూత్న సృష్టి చేసిన వారికి గాని, ఒక నూత్న ప్రక్రియను ప్రవర్తింపజేసిన వారికి గాని, జాతిలో ఒక నూతనోత్తేజాన్ని కల్పించిన వైతాళికునికి గాని ఇచ్చి తమ కృతజ్ఞతను వ్యక్తం చేసుకుంటారు. అందులో మరో విశేషం కూడా ఉంది. పితామహశబ్దం మూడుతరాల ఉనికిని వ్యంజింపచేస్తుంది. తాత నుండి మనుమని దాకా మూడు తరాలు ఉంటాయి. మనుమడు చేసే గుర్తింపే తాత గౌరవం. అంటే ఏ మహాపురుషుని సేవలు ఆయన జీవితకాలంలోనే మూడు తరాల వ్యక్తుల్ని ఉత్తేజపరిచి ఒక మహాప్రయోజనం సాధింపచేస్తాయో ఆయనే పితామహ బిరుదాని కర్హుడౌతాడన్న మాట! 'ఆంధ్ర పితామహ' హనుమంతరావు పంతులుగారట్టి దేశ సేవ చేసిన మహనీయులు కాబట్టే ఆ బిరుదం ఆయనకు సార్థకమైంది. తెలంగాణంలో ప్రతి తెలుగువాడి గుండె ఆయన పేరు చెప్పగానే భక్తివినమ్రభావంతో జోహారులర్పిస్తుంది. తరతరాల తెలుగువారు చిరకాలం తలచుకొనే దేశసేవ, భాషాసేవ చేసిన మహితాత్ముడు పంతులుగారు! ఆయనకు ప్రజలు భక్తిప్రపత్తులతో ఇచ్చిన బిరుదం 'ఆంధ్ర పితామహ'; ప్రభుత్వం, వారి సేవలను గుర్తించి ఇచ్చిన బిరుదం 'పద్మభూషణ'.

"సాంస్కృతికంగా, భాషారీత్యా అణచబడిన తెలంగాణా ప్రజల్లో తెలుగు గ్రంథాలయాలు, పఠనమందిరాలు స్థాపించి, తెలుగు పత్రికలు ప్రకటించి, ఆంధ్రచరిత్ర పరిశోధన జరిపించి తెలుగు ప్రజలలో ఆంధ్రభాషపైన ఆసక్తి, వారి జాతీయ సాంస్కృతిక వికాసానికి దోహదమివ్వటం జరిగింది. ముఖ్యంగా గ్రంథాలయోద్యమము బాగా వ్యాపించింది. తెలంగాణా వివిధ ప్రాంతాలలో సభలు,

సమావేశాలు జరిపి ప్రజల్లో చైతన్యం కలుగజేయు కృషి జరిగింది. ఈ ఉద్యమాని కంతటికీ 'పద్మభూషణ' శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు వెన్నెముక వంటివారు. ఆంధ్రోద్యమాన్ని తెలంగాణంలో స్థాపించింది వారే. అందుకే వారికి 'ఆంధ్ర పితామహు' డనే పేరు వచ్చింది. వారితో ప్రస్తుతం భేదించే వారు కూడా, ఆ రోజుల్లో వారు చేసిన కృషిని ప్రశంసించకుండా ఉండలేరు"[1] అని పంతులుగారి మితవాద వైఖరిని సమర్థించని శ్రీ రావి నారాయణరెడ్డిగారు చేసిన ప్రశంస గమనింపదగినది.

పంతులుగారు తెలుగుదేశానికి అవిచ్ఛిన్నంగా అరవైయేళ్ళు సేవ చేశారు (1904 నుండి 1964 వరకు). ఈ కాలాన్ని మూడు ఘట్టాలుగా విభజింపవచ్చు. మొదటి ఘట్టం 1904 నుండి 1930 దాకా. రెండవ ఘట్టం 1930 ఉండి 1950 దాకా మూడవ ఘట్టం 1951 నుండి 1964 దాకా. 1904లో హనుమకొండలో శ్రీ రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషా నిలయం స్థాపించబడింది. ఆ గ్రంథాలయ స్థాపనానికి కృషిచేసిన పెద్దలలో పంతులుగారు ముఖ్యులు; వారి ప్రజాసేవా జీవితానికి అది ఒక మహారంభం.

ఇరువదవ శతాబ్ది ప్రారంభదశలో తెలంగాణంలోని తెలుగు ప్రజల స్థితి గతుల్ని తెలుసుకుంటే గ్రంథాలయ ప్రారంభ ప్రాముఖ్యం తేటపడుతుంది. శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి మాటల్లో – "రెండునూర్ల పాతిక సంవత్సరాల ఆసఫా జహి పరిపాలన ఫలితముగ హైదరాబాదు రాష్ట్రములో ఆంధ్రుడు తౌర చౌతన్యాన్ని తీసుకొని రావటానికి ప్రయత్నించిన ప్రముఖుల్లో అగ్రగణ్యులు శ్రీ కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావు పంతులుగారు. "హైదరాబాదు నగరమున 1901వ సంవత్సరమున స్వర్గీయ శ్రీ కొమఱ్రాజు వెంకట లక్ష్మణరావు ప్రోత్సాహముతో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయము స్థాపితమైనది. ఈ ప్రయత్నమున లక్ష్మణరావుగారి సహచరులుగా నిలచి పనిచేసినవారు శ్రీ మునగాల రాజాగారు, మరియు స్వర్గీయ రావిచెట్టు రంగారావుగారు. కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయమును తెలంగాణమందే కాక, సకలాంధ్రమందును మొట్టమొదటి గ్రంథాలయముగా పేర్కొనవచ్చును. తెలంగాణమున హనుమకొండ మొదలైన పట్టణాలలో 1901 నుండి 1910 వరకు మరికొన్ని గ్రంథాలయాలు లక్ష్మణరావుగారి ప్రోత్సాహమున స్థాపితమైనవి. ఈ కాలముననే విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని ఆంధ్ర తెలంగాణాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధముగా ఏర్పాటుగావించిన లక్ష్మణరావుగారే విశాలాంధ్ర ఉద్యమానికి కూడ పునాదులు వేసిరని చెప్పవచ్చును. హైదరాబాదులో ఆంధ్రోద్యమము ఈ విధముగా ఈ శతాబ్ద ప్రారంభమున వైజ్ఞానికోద్యమముగా పరిణమించింది, ఆనాడు గ్రంథాలయోద్యమము ద్వారా తెలంగాణమును ప్రబోధించిన వారిలో కీ.శే. ఆదిపూడి సోమనాథరావు, కీ.శే. మైలవరపు నరసింహశాస్త్రి గారలను ప్రత్యేకముగ స్మరించవలసియున్నది. శేషాద్రి రమణకవుల "నిజాంరాష్ట్ర ప్రశంస" అను ఖండకావ్యమును ప్రత్యేకముగ పేర్కొనవలసియున్నది".[2] సోమనాథరావుగారప్పటి ఆంధ్ర భాషాయోష దీనస్థితిని చిత్రించిన యీ పద్యం చూడండి.

'అచ్చ తెనుంగు కబ్బమున కాదిపదంబయి పోల్చుబాగ్యమున్
హెచ్చుగఁ గన్న దేశమిది యే దురదృష్టమొ యాంధ్రభాష నే
డిచ్చట సొంపు నింపు చెడి హీనదశార్తినిఁగుందె నక్కటా!
అచ్చవు లాంధ్రపుత్రులకు నందఱకున్ తలవంపు లౌనటుల్!

పొన్నికంటి తెలగనార్యుని అచ్చతెనుగు కావ్యం పుట్టిన తెలంగాణంలో స్వచ్ఛమైన తెలుగు పలుకుబడికి కరువై పోయినందుకు కవి విచారాన్ని వ్యక్తం చేశాడీ పద్యంలో. మైలవరపు నరసింహశాస్త్రిగారు మాతృభాషాభ్యసనాన్ని మానవద్దని తెలుగు వారికి ప్రబోధం నిర్వహించారు.

'పరభాష లభ్యసింపగ వచ్చు హెచ్చుగా
మాతృభాష నదేల మానవలెను?
ద్రవ్యంబు గడియించు వారి చూడగవచ్చు
మాతృభాష నదేల మానవలెను?
పరమర్మ భేదనోపాయంబు గనవచ్చు
మాతృబాష నదేల మానవలెను?
సత్యమార్గంబునం జరియింపగావచ్చు
మాతృభాష నదేల మానవలెను?
మానరాదని మన మభిమాన ముంచి
గారవించిన గనతల్లిగౌరవంబు
సూర్యచంద్రుల త్రోవలు సురిగెనేని
సురిగిపోవునె భువి నాంధ్రసూనులార!".

హైదరాబాదులో ప్రారంభమైన గ్రంథాలయోద్యమ ప్రభావం అప్పట్లో హనుమకొండలో ఉద్యోగం చేస్తున్న హనుమంతరావు పంతులుగారి మీద పడి, రాజరాజ నరేంద్ర గ్రంథాలయ స్థాపనకు ప్రేరేపించింది. పంతులుగారి ప్రజా జీవితానికది ప్రాతిపదికగా నిలవటమే కాకుండా

1. తెలంగాణం (వ్యాసాలు) రెండవ భాగం. సంకలనం, శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామి; వ్యాసం : 'తెలంగాణా రాజకీయోద్యమము – చరిత్ర' – పుట 16–17
2. తెలంగాణలో జాతీయోద్యమాలు. పుటలు 46–47

భావిజీవితానికి ప్రస్తావనగా పరిఢవిల్లింది. ఆదిరాజు వీరభద్రరావుగారు – పంతులుగారి హనుమకొండ నివాసకాల ప్రాముఖ్యాన్ని యిలా పేర్కొన్నారు– "అప్పుడు హనుమకొండలో ముఖ్యముగా మూడుద్యమములు ప్రజల నుగ్రాత లూగించుచుండెను. మొదటిది ఆంధ్ర భాషావికాసోద్యమము, రెండవది సంఘసంస్కరణోద్యమము. మూడవది రాజకీయోద్యమము. ఈ మూడు ఉద్యమములందును అభిమానపూరితులయి హనుమంతరావుగారు మిత్రులతో సహకరించి కృషి సల్పసాగిరి. శ్రీ హనుమంతరావుగారు తమ యుత్తర జీవితమునందు ఈ యుద్యమత్రయ సంసిద్ధి కొరకే తమ శక్తి త్రయమును వినియోగించి ధన్యజీవులయిరి".[3] పంతులుగారి ప్రజాజీవితాన్ని ప్రస్తావించవలసివచ్చినప్పుడు ఈ మూడు ఉద్యమాల త్రివేణీ సంగమం ముప్పేటగా సాగుతుందనే విషయం గమనింపదగిన అంశం.

2

పంతులుగారి ప్రజాజీవితంలో కనబడే మూడు ఘట్టాలను ఈ విధంగా భావించవచ్చు. మొదటిది వికాసదశ; రెండవది ఉద్యమదశ; మూడవది నిర్మాణదశ. ఈ విభాగం ప్రధాన వివక్షతో చేసిందే. విషయ విశ్లేషణకు తోడ్పడేది మాత్రమే. ఒక్కొక్క దశలో మిగిలిన దశలు అంగాలుగా భాసించే అవకాశం లేకపోలేదు.

వికాసదశలో ప్రధానంగా కనవచ్చే అంశాలు : గ్రంథాలయోద్యమం, రచనావ్యాసంగం, ఆంధ్ర జనసంఘ నిర్వహణం. హనుమకొండలోని రాజరాజ నరేంద్ర గ్రంథాలయం మంచి పఠనాలయంగా కూడా ప్రజల నాకర్షించింది. విలువైన గ్రంథాలతోపాటు, దినవార పక్ష మాస పత్రికలు చదువరుల అందుబాటులోకి వచ్చినవి. పఠనాసక్తి ప్రజల్ల పెరిగింది. ఉపన్యాస కార్యక్రమాలు వినోద విజ్ఞాన చర్చా కార్యక్రమాలు కూడ గ్రంథాలయంలో జరిగేవి. వంగ రాష్ట్ర విభజనవల్ల కలిగిన ఉద్యమం, బిపిన్ చంద్రపాలు ఉపన్యాసాలవల్ల కలిగిన ఆంధ్ర యువకుల్లోని ఉత్సాహం. స్వదేశోద్యమం, విదేశవస్తు బహిష్కారం, వివిధ రాజకీయార్థిక నైతిక సమస్యల సమాలోచనం, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కార్యకలాపాలు, ఈ గ్రంథాలయం ద్వారా తెలుగువారికి తెలుస్తుండేవి. హనుమంతరావు పంతులుగారు ఈ గ్రంథాలయం ద్వారా ప్రపంచ చరిత్రకు, భారతీయ సంస్కృతి వికాసానికి సంబంధించిన గ్రంథాలను ఎన్నో చదివారు. ఒక నాయకునికి కావలసిన విజ్ఞానసారం హనుమకొండలోనే హనుమంతరావుగారు సంపాదించారని చెప్పవచ్చునేమో!

1912లో పంతులుగారు హైదరాబాదుకు వచ్చిన తరువాత శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం వారి సేవలకు నోచుకున్నది. 1914–15 సంవత్సరాలలో వారాసంస్థకు కార్యదర్శిగా పనిచేసి భవన నిర్మాణానికి ధన సేకరణం చేశారు. రావిచెట్టు రంగారావుగారి ధర్మపత్ని లక్ష్మీనరసమాంబగారు పంతులుగారి ప్రోత్సాహంతో నాల్గువేల రూపాయలు విరాళమిచ్చి భవనానికి అంకురార్పణం చేశారు. ఆంధ్ర భాషా నిలయం గ్రంథాలయంగా పైకి కనపడినా అప్పటిలో ఆంధ్రులకందరికీ ఆశాకిరణం; సమావేశ మందిరం; చర్చాసదస్సు ! ఒక్కొక్కసారి రాజకీయ సమాలోచనలకు రహస్యమందిరం– అలా హైదరాబాదు రాష్ట్రాంధ్రోద్యమ చరిత్రలో ఆయువు పట్టైన పాత్రను నిర్వహించింది. ఇన్ని బహుళ ప్రయోజనాలను సాధించి, జాతి జీవితంలో భాగమైన గ్రంథాలయం తెలుగు దేశంలో అరుదంటే సత్యదూరం కాదేమో! పంతులు గారు పరమపదించేవరకూ ఆ గ్రంథాలయం వారి మాటను సుగ్రీవాజ్ఞగా తలదాల్చి నడిచింది. ఆయనకు ప్రియమైన సంస్థల్లో అది యొకటి. వీరి సహాయాన్ని పొందిన మరికొన్ని గ్రంథాలయాలు :– బాలసరస్వతీ ఆంధ్రభాషా నిలయం, వేమన ఆంధ్రభాషా నిలయం. గ్రంథాలయాలే కాక నీలగిరిపత్రిక, తెనుగు పత్రిక, మొదలైన పత్రికలు వారి అభిమానాన్ని చూరగొన్నాయి. గోలకొండ పత్రిక, సుజాతపత్రిక వీరి సహాయసహకారాల్ని, రచనల గౌరవాన్నీ పొందాయి.

పంతులుగారి సేవారంగం ఒక్క తెలుగువారికే అంకితం కాలేదు. రాష్ట్రీయులందరికీ సంబంధించిన వివిధ ఉద్యమాలతో, సంస్థలతో కూడ వారికి సంబంధం ఉండేది. 'గస్తీ నిషాన్ తిర్పన్' ప్రకటన ప్రతిఘటన సంఘానికి కార్యదర్శిగా, స్టేట్ రిఫారం అసోసియేషన్, కాంగ్రెస్ కమిటీ, హిందూ మహాసభల కార్యవర్గ సభ్యుడుగా, జీవరక్షా ప్రచారణీ సంఘం, హిందూ సంఘ సంస్కారసభ, ఆది హిందూ సేవాసమితి, ఆర్యసమాజం, బ్రహ్మసమాజం, దివ్యజ్ఞాన సమాజం మొదలైన సంస్థలకు హితవరులుగా– ఎన్నో సంస్థలకు ఎన్నో హోదాలతో, ఎంతో సహాయం చేశారు. పంతులుగారి దృక్పథంలో నిలిచింది ప్రజాచైతన్యం. సమాజంలో వివిధ సంస్థలుండవచ్చు. వాటి ధ్యేయాలూ వేరుకావచ్చు. కాని, విజ్ఞాన వికాసం, రాజకీయ స్వాతంత్ర్యం ప్రజలందరికీ కావలిసిందే. ఆ పిలుపుకు ఆ సంస్థలన్నీ వేదికలే. ఆ వేదికల మీద తన పాత్రను ఆ ప్రయోజనానికి నిపుణంగా ఉపయోగించుకొనేవారాయన. పూసలో దారంలాగా అందరి మనసుల్లో దూరేవారు. అందరినీ ఆకట్టుకునేవారు. అందువలన అందరికీ వారే నాయకుడైనారు. ఆదిరాజు వీరభద్రరావుగారు వారి సర్వసమ్మతమైన నాయకత్వాన్ని యిలా అభివర్ణించారు– 'సకల జన సమ్మతుడయిన పురుషపుంగవుడు శ్రీవారొక్కరే. కారణమేమి? శ్రీవారి నిష్కల్మషమైన చిత్తము, స్వార్థరహితమైన చింత; స్వచ్ఛమయిన ఆదర్శములు. శ్రీవారి యాదర్శములను ఒజ్జబంతిగా పెట్టుకొని పలువురు ప్రయత్నింపసాగిరి. అట్టి వారి పొరపాట్లను గణింపక ప్రోత్సాహవాక్యములే పలుకుచుండిరి![4]

పంతులుగారి గొప్పతనం తాము ప్రజాసేవకు అంకితమై అహోరాత్రాలు కృషి చేయటంలోనే లేదు. తమవలె ఉత్సాహంతో సేవారంగంలో దూకి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయే సమర్థుల్ని తయారుచేసి కార్యరంగాన్ని శక్తిమంతంగా రూపొందించటంలో కూడా ఉంది. కీ.శే. సురవరం ప్రతాపరెడ్డిగారు పంతులుగారిలో ఉన్న ఈ విశిష్ట నాయక గుణాన్ని 'ప్రబుద్ధాంధ్ర'లో యిలా కీర్తించారు– "వీరిలో ఒక గొప్ప లక్షణము

---

3. మాడపాటి హనుమంతరావు జీవితచరిత్ర, పుట 17–18
4. మాడపాటి హనుమంతరావు జీవిత చరిత్ర, పుట 32

కలదు. ప్రజాసేవకులను, వ్రాయసకాండ్రను గుర్తించుటలో వీరికి పక్షిచూపు (eagle's eye) కలదు. అట్టి వారిని జారిపోద మన్నను జారిపోనీయక తమ దృక్పథమునందే యుంచుకొని ప్రోత్సాహపరచి రంగములోనికి లాగుచుందురు. సహాయకులను, అనుయాయులను సిద్ధము చేసికొనుట నాయక లక్షణములలో ఒకటి. పంతులుగారు ప్రజా సేవలో రెండు శక్తిమంతమైన సాధనాలను గుర్తించారు. ఒకటి–కార్యకర్తలు; రెండు రచయితలు. ఒకరు పనిచేసేవారు; మరొకరు ప్రేరణ నిచ్చేవారు. ఈ రెండు తెగలవారిని ఎన్నికచేసి కార్యోన్ముఖులనుగా చేయటం వారి సూత్రధార లక్షణం. పంతులుగారిలో ఈ రెండు శక్తులూ ఉన్నాయి. వారు కలంపట్టి ప్రబోధించారు; కార్యరంగంలో దూకి తమతో పాటు వేలాది జనాన్ని నడిపించారు. ఆ రోజుల్లో తెలంగాణలో కలం పట్టిన వారందరికీ పంతులుగారు కులపతి; సేవా నిరతి కల వారందరికీ సభాపతి!

3

పంతులుగారి రచనావ్యాసంగం కూడా మొదట హనుమకొండలోనే ప్రారంభమైంది. ఉత్తమ రచయితకుండవలసిన అర్హతలన్నీ వారికున్నాయి. తెలుగు, ఉర్దూ, ఫారసి, ఇంగ్లీషు భాషల్లో రచన చేసే శక్తి ఉంది; హిందీ మహారాష్ట్ర భాషా సాహిత్యాలతో మంచి పరిచయముంది. దానికి తోడు హృద్యమైన పద్యరచన చేసే ఒడుపూ వుంది; సరళ సుందరమైన గ్రాంథికభాషలో వచన రచన చేసే నేర్పూ ఉంది. అయితే, అంతటి శక్తిని ఏ విధంగా రచనావ్యాసంగంలోకి తీసికొని రావాలి అన్నదే అప్పటికి వారికి గల ప్రశ్న. వస్తుతః పంతులు గారు భావాంబర వీథుల్లో విహరించి, స్వాప్నిక జగత్తులకు రూపకల్పనంచేసే మనః ప్రవృత్తి కలవారు కారు. వారి జీవితం సమాజ సమస్యలతో ముడిపడి పోయింది. సమాజస్పృహ లేని సాహిత్యాన్ని వారు భావించలేక పోయారు. అందులో ఒక విధంగా హనుమంతరావు పంతులుగారికి ప్రేరణ కల్పించినది. ఒకవైపు కొమఱ్ఱాజు వారి సాహిత్య దృక్పథమూ, మరొకవైపు కందుకూరి వీరేశలింగం పంతులుగారి సాహిత్యదృష్టీ అని పేర్కొనవచ్చు. కొమఱ్ఱాజు వారు చారిత్రక దృష్టితో రచనలు సాగించినవారు; వారి విజ్ఞానచంద్రికా గ్రంథమాలలో వెలువడిన ప్రచురణలూ, ముఖ్యంగా వారి హిందూ మహాయుగము, మహమ్మదీయ మహాయుగము అన్న గ్రంథాలు పంతులుగారి దృష్టిని బాగా ఆకర్షించినాయి. గత చరిత్ర వైభవం చాటే గ్రంథాలు, ఆదర్శ మహాపురుషుల జీవితచరిత్రలూ సమకాలీన సమాజానికి ఒక నూత్నోత్సాహాన్ని కల్పించగలవన్న దృక్పథం పంతులుగారికి ఏర్పడింది. మరొకవైపు – వీరేశలింగం పంతులుగారు వివిధ సారస్వత ప్రక్రియల్లో సంఘసంస్కరణ శంఖారావాన్ని పూరిస్తున్నారు. ఆ పద్ధతి పంతులుగారిని ఆకర్షించింది. వీరేశలింగంగారి రచనల్లో ఎంతో వైవిధ్యముంది. అనువాద నాటకాలు, నవలలు, ప్రహసనాలు, పత్రికా వ్యాసాలు, చర్చాగ్రంథాలు, స్వీయచరిత్ర, కవులచరిత్ర, కావ్యాలు– ఇలా ఎన్నో శాఖల్లో వారి సాహిత్యకృషి సాగింది. నవ్యసాహిత్య యుగకర్తగా వారు ప్రస్థానభేరి మ్రోగించారు. వీరేశలింగం పంతులుగారి రచనల్లో హనుమంతరావుగారికి ప్రేరణ కల్పించింది వారి పత్రికారచన, వ్యాసరచన అని చెప్పాలి. వితంతూద్వాహం. ప్రౌఢా వివాహాలు, వర్ణాంతర వివాహాలు, సర్వమానవ సౌభ్రాతృత్వం, వేశ్యానిగర్హణం, సంఘదురాచారాలు, సంఘైక్యం, మతసహనం, ఏకేశ్వరోపాసనం– మొదలైన ఎన్నో విషయాలమీద వీరేశలింగం పంతులుగారు వ్రాసిన వ్యాసగ్రంథ రచనావ్యాసంగం హనుమంతరావుగారిని ఉత్తేజపరచింది. ఆ పంతులుగారి స్త్రీజనాభ్యుదయ సేవాదృక్పథం ఈ పంతులు గారి ప్రజాసేవా రంగం మీద ప్రబల ప్రభావం వేసింది. వారి నవలా రచన ప్రక్రియ పంతులుగారిచే కథా రచనకు ప్రోత్సాహం కల్పించింది. అంతకంటే ముఖ్యమైన విషయం– సాంఘిక ప్రయోజనాన్ని సాధించవలసి వచ్చినప్పుడు పద్యంకంటె గద్యం శక్తివంతంగా పనిచేయగలదన్న దృక్పథంలో వీరేశ లింగంగారు కవితారంగంలో కంటె వచనరచనా రంగంలోనే తమకృషిని విస్తారంగా సాగించి 'గద్య తిక్కన' బిరుదాంచితులైనారు. ఈ పంతులుగారు కూడ అందులో ఆ పంతులుగారి మార్గాన్నే అనుసరించారు.

హనుమకొండలో ఉన్నప్పుడు హనుమంతరావుగారు కవిత్వాన్ని వ్రాశారు. కొన్ని ఖండకృతులను పత్రికల్లో ప్రకటించారు. రచయిత చిత్త వృత్తి రచనల్లో ప్రతిబింబిస్తుంది. శైలిలో మూర్తీభవిస్తుంది. పంతులుగారి ప్రవృత్తికి సూటిదనం, సారళ్యం సహజ లక్షణాలు, వారి కవితకు కూడ ఆ గుణాలు సంక్రమించాయి. వారి జీవితం నీతికి, సద్వర్తనకు, నిరాడంబరతకు దర్పణం లాంటిది. వారి కవితావస్తు గ్రహణంలోను, చెప్పే రీతిలోను ఆ పద్ధతి కనబడుతుంది. శృంగారం జోలికి వారెన్నడూ పోలేదు. అలంకార ఆడంబరాలను ఎన్నడూ ఆదరించలేదు. చుట్టూ ఉన్న మంచిని ప్రోగుచేసే వారి స్వభావం తమకు సన్నిహితంగా ఉన్న పారసీ ఉర్దూ సాహిత్యాల్లోని ఆణిముత్యాల్లాంటి కవితాఖండికలను అనువదించే ప్రయత్నానికి దోహదం చేసింది. అందులోనూ వారి దృష్టి సూక్తిముక్తావళి వైపే ప్రసరించింది. అట్టి అనువాద కవితలో మచ్చుకొకటి మనవిచేస్తాను.

"హీనుల మహోన్నతపదవి కెత్తుటయును
ఎత్తివారి యుపకృతి నాశించుటయును
స్వీయమాన ధనము బుగ్గి సేయుటగును
సర్వమును దనజేబులో సాకుటగును".

ఇది ఫిరదౌసీ ఫారసీ పద్యాని కనువాదం. ఇందులో – ప్రజల కోర్కెలను, శ్రేయస్సును గమనింపని నైజాం ప్రభుత్వాన్ని పరోక్షంగా అధిక్షేపంచేసిన గడుసుదనం కనపడుతుంది. హైదరాబాదు రాష్ట్రంలో తెలుగువారి దుస్థితినంతా సర్వమును తమ జేబులో సాకుచున్నట్లున్నదని వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నట్లున్నది. ప్రజల దృష్టిని ప్రభుత్వ దురంతాలవైపు మళ్లించటానికి ప్రచ్ఛన్న సాధనంగా కవిత్వాన్ని ఉపయోగించి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పారు పంతులుగారు.

పంతులుగారి కవితాఖండాల్లో అనువాదాలేకాక స్వతంత్రాలు కూడా ఉన్నాయి. వారు తుఫానుమీద వ్రాసిన కవిత పేర్కొనదగింది.

"ఫలముచేత గొన్నిటిని బల్లవసంతతిచేత గొన్నిటిన్
సలలిత సౌఖ్యదాయి యగు ఛాయను గొన్నిటి వేవిధాల నీ
యిలను ననేక ప్రాణులకహీన సుఖంబిడు వృక్షరాజమున్
బలువడి పీకివైచితె తుఫాను వినాశము చేసివైచితే"

వేరూని నిలిచిన వృక్షరాజ్యాన్ని కూకటివేళ్లలో పెరికివైచిన గాలివానను ఆధిక్షేపించే పద్యమిది. పైకి ప్రకృతి వర్ణనంలా కనపడినా ప్రతీకాత్మకంగా ప్రభుత్వపు కిరాతక చర్యల్ని గర్హించే ప్రవృత్తి ఉంది ఈ కవితలో. ఆ వృక్షరాజం తెలుగుభాషకు ప్రతీక ఆ పద్యంలోని ప్రాణులు తెలుగువారు. తెలుగు భాష అనే దొడ్డవృక్షం ఫలాలనిచ్చి కొందర్ని పోషించేదట! అంటే తెలంగాణంలో తెలుగు ప్రజలకు మాతృభాషలో చదువుకుంటే పూర్వం ఆదరగౌరవాలుండేవనీ జీవనభృతి లభించేదనీ–నైజాం ప్రభుత్వంలో ఈ గతికి దుర్గతి పట్టిందనీ భావం. చిగురాకులతో కొందరి నా వృక్షం సంతోష పెట్టేదట! చిగురాకులు తిని కొంగ్రొత్త గీతాలు పాడేవి కవి కోకిలలు. తెలుగు కవితకు ఆదరణలేదని దాని తాత్పర్యం. ఛాయ భద్రతకు ప్రతీక. భాషకు నిలువనీడ కూడా లేకుండ పోయిందని ధ్వని. వృక్ష వినాశాన్ని క్రమసుందరంగా వర్ణించటం భావ శిల్పం. ప్రతీకాత్మకంగా తెలుగుభాషకు – రాజభాష గౌరవం పోవటాన్నీ, దానిద్వారా కవితా వ్యవసాయం కుంటుపడటాన్నీ –చివరకు నిలువ నీడలేకుండా పోవటాన్నీ కరుణరస స్ఫోరకంగా పంతులుగారు వర్ణించారు. వారి శైలి ఆబాల గోపాలానికి అర్థమయ్యే సారళ్యంతోనూ, ప్రసాదమధురమైన పాకంలోనూ ఉంటుంది. మంచి కవిత అల్లగలిగి యుండి కూడా, కదనరంగంలాంటి ఆంధ్రోద్యమంలో దూకిం తరువాత, పద్యంకంటె వచనం ప్రజల సమస్యావగాహనకు బహుళంగా తోడ్పడుతుందని కావ్యరచనా వ్యాసంగాన్ని వదులుకున్నారు. పద్యగణాల కంటె ప్రజాగుణాలకు ప్రాముఖ్యమిచ్చిన ప్రజాసేవకులు శ్రీ పంతులుగారు!

4

మాడపాటి హనుమంతరావుగారి వచన రచల్ని ప్రయోజన దృష్టితో మూడు వర్గాలుగా విభజించవచ్చు. మొదటి వర్గం; అవగాహన కొఱకు వ్రాసిన గ్రంథాలు; రెండవ వర్గం : ఆలోచన రేకెత్తించేందుకు వ్రాసిన రచనలు. మూడవ వర్గం : అనురంజనం కోసం రచించిన కథలు. ఒక విధంగా చూస్తే సారస్వతానికి పైన చెప్పిన మూడు ప్రయోజనాలూ ఉన్నాయి. వాటిని మూడు ప్రక్రియల ద్వారా ప్రజలకందించటం పంతులుగారి ప్రత్యేకత.

మొదటి వర్గం :
1. బంకించందు రచించిన 'ఆనందమఠ'కు ఆంధ్రానువాదం.
2. గ్యారీబాల్డి జీవిత చరిత్ర.
3. రోమకసామ్రాజ్య చరిత్రం.
4. క్షాత్రకాలపు హింద్వార్యులు.
5. మహాభారత సమీక్షణం

రెండవ వర్గం :
1. వలస పోయిన ఆంధ్రులు వ్యాసఖండనము
2. నిజాం రాష్ట్రములో రాజ్యాంగ సంస్కరణలు,
3. వివిధాంశములపై పత్రికా వ్యాసములు.
4. ఫారసీ కవులపై వ్యాసములు.

మూడవ వర్గం :
1. 'మల్లికాగుచ్ఛము' కథల సంపుటి
2. మిగిలిన కథలు.

హనుమంతరావుగారు ఎంత సరళహృదయులో అంత స్వతంత్రులు. వారికి చర్విత చర్వణమన్న గిట్టదు. 'ఇంతవరకు తెలుగులో లేని పుస్తకములను వ్రాయవలయునే గాని ఉన్న పుస్తకములనే మరల వ్రాయుట శ్రీవారి యుద్దేశము కాదు. రామాయణమునకు నకలు రామాయణములు, భారతమునకు నకలు భారతములు, రుక్మిణీ కల్యాణమునకు నకలు రుక్మిణీ కల్యాణములు వ్రాయుట పుస్తక సంఖ్య పెరుగుటయేగాని వాఙ్మయమునకు పుష్టికాదని శ్రీవారి దృఢనమ్మకము' [5] పంతులుగారి యీ నిశ్చయం వారి గ్రంథాలు కొన్ని ప్రచురితం కాకపోవటానికీ బలమైన కారణమై తారసిల్లింది. పంతులుగారి 'ఆనందమఠ' అనువాదం ప్రచురితం కాకపూర్వమే దొరసామయ్యగారి అనువాదం వెలువడటంతో వారాగ్రంథ ప్రచురణ కార్యక్రమాన్ని చేపట్టనే లేదు. అపారదేశాభిమానంతో ఇటలీదేశవిముక్తికై పోరాడిన ధీరుడు, దేశభక్తుడు గ్యారీబాల్డీ. ఆ మహాపురుషుని చరిత్రం పంతులుగారిని ఉత్తేజపరిచింది. దాన్ని ఎంతో అభిమానంతో అనువదించారు. బందరులోని ఆంధ్ర భాషాభివర్ధనీ సంఘం వారు దాన్ని ప్రచురిస్తామని తీసికొని కొన్నాళ్లు తమవద్ద ఉంచుకొని, ఆ తరువాత కారణాంతరాలవల్ల దాని ప్రచురణ వీలుపడదని తిరిగి పంపినారట. ఆ తరువాత కొన్నేళ్లకు కోలవెన్ను రామకోటేశ్వరారావుగారు 'గ్యారిబాల్డి' జీవితం మీద వ్రాసిన గ్రంథం ప్రచురితమైంది. అంతటితో పంతులుగారు తమ గ్రంథ ప్రచురణాన్ని మానుకొన్నారు. నడిచిన బాటలో నడవటం, తోచిన బాటగా పోవటం పంతులుగారి ప్రవృత్తికి పడని అంశాలు.

రోమక సామ్రాజ్య చరిత్రనుగూర్చి ఆదిరాజు వీరభద్రరావుగారిలా వ్రాసినారు! "ఇది చరిత్ర గ్రంథము. ఇది అసంపూర్ణ గ్రంథము. రచన ధారాళముగా నున్నది. ఆంధ్రభాషలో నింతవరకు రోమక సామ్రాజ్య చరిత్ర రచితమయియుండలేదని తలంతును. కావున ఈ యుద్గ్రంథమును

5. మా.హ.జీ.చరిత్రము. పుట 63

పూర్తిచేసి ఆ మహాసామ్రాజ్య చరిత్రజ్ఞానమును ఆంధ్రుల కలవడ జేయుదురు గాక! ఇది ముద్రితమయినచో ఆంధ్ర సరస్వతికొక నూత్నాభరణముగా ప్రకాశించగలదని మేము నమ్ముచున్నాము'.

రావుబహద్దురు చింతామణిరావు వైద్యాగారు వ్రాసిన 'ఎపిక్ ఇండియా' (Epic India) అనే ఆంగ్ల గ్రంథంలోని అయిదువ్యాసాలకు అనుసరణం 'క్షాత్రకాలపు హిందూర్వ్యులు' అనే పంతులుగారి గ్రంథం[6] ఆ గ్రంథ పీఠికలో పంతులుగారిలా వ్రాసికొన్నారు – "రావుబహద్దరు వైద్యాగారు మనదేశ చరిత్రములోని హిందూ మహాయుగమున నిపుణులు. వారి రచనా విధానమును అద్వితీయమని నా విశ్వాసము. చారిత్రక వాఙ్మయము చదువు వారందరికి ఎక్కువ యుత్సాహము గొలుపునది కాదు. అట్లయ్యు కీ.శే. కొమర్రాజు లక్ష్మణరావు ఎం.ఏ., గారి వలెనే శ్రీ వైద్యాగారును చరిత్రను మనోహరముగా నొనర్చుటయందు సమర్థులు. వీరు ఆంగ్లమున రచించిన గ్రంథములలో ముఖ్యములు 'మహాభారత సమీక్షణము' (Mahabharata-a criticism), రామాయణ సమస్య (The Riddle of Ramayana), 'హిందూదేశ క్షాత్రయుగము, (Epic India), 'హిందూ మహాయుగము యొక్క మధ్యకాల చరిత్ర' (History of Medeaval Hindu India) అనునవి. ఇవి యన్నియు విజ్ఞాన ప్రదములును, మనోహరములును, పరిశోధనా పూర్వకములును నగుగ్రంథములు. ఆంధ్ర సోదరులు వీనిని పఠించినచో అనేక నవీన విషయముల నెఱుగగలరు. పైవానిలో 'మహాభారత సమీక్షణము' అను గ్రంథ మును నా వలన తెనిగింపఁబడినది. దీనిలోని కొన్ని అధ్యాయములు 'ఆంధ్ర భారతి' (మచిలీపట్నము), 'ఆంధ్రాభ్యుదయము' (హనుమకొండ), 'దేశబంధు' (వడ్డేపల్లి) మాసపత్రికలలో ప్రకటితములైనవి. తక్కిన గ్రంథములను తెనుగున వ్రాయదలచితినిగాని, అవకాశము లభింపక పోయెను... రావుబహద్దరు వైద్యాగారి గ్రంథమున క్షాత్రయుగము నాటి ఆర్యులను గూర్చి తెల్పు వ్యాసము లింకను ఎన్నియో కలవు. అవియు తెనుగున ప్రకటింపబడినచో, పేదయైయున్న ఆంధ్రచారిత్రిక వాఙ్మయమునకు కొంత పుష్టి కలుగుననుట నిశ్చయము. 'గ్రంథాలయ సర్వస్వ' ప్రకటనమాగిపోవుటతో, నాకు నీ గ్రంథ విషయముల తెనిఁగించు నుత్సాహము ఆగిపోయెను. ఇందులకు నే నెంతయు చింతిల్లు చున్నాను".

చరిత్ర అధ్యయనం గతంలోని గొప్పదనాన్నీ, సత్యాసత్యాలనూ తెలుసుకొని వర్తమాన చరిత్రను మహోజ్జ్వల భవిష్యత్తువైపు నడిపించటానికి తోడ్పడుతుంది. Miguel De Cervantes అందుకే ఇలా అన్నాడు – "For historians aught to be precise, truthful and quite unprejudiced, and neither interest nor fear, hatred nor affection, should cause them to swerve from the path of truth, whose mother is history, the rival of time, the depository of great actions the witness of what is past, the example and instruction of the present, the monitor of future". మాడపాటి హనుమంతరావుగారు స్వయంగా తానొక సమకాలీన చరిత్రను సృష్టించే చైతన్యానికి నాయకులైన వారు. వారికి సత్యాన్వేషణ దృష్టిని, గతవైభవ ప్రశస్తిని, చారిత్రక పరిశీలన దృక్పథాన్ని కల్పించింది చారిత్రక రచనలమీద ఉన్న ఆసక్తి. వారు స్వయంగా తెలంగాణా ఆంధ్రోద్యమ చరిత్రకర్తలు. ఆ విషయాన్ని ముందు పేర్కొంటాను. చారిత్రక రచనలు వారు చేయటంలో గల ప్రధాన ప్రయోజనం, వాటి పఠనం వల్ల తెలుగువారిలో వర్తమాన భవిష్యచ్చరిత్రలను నిర్మించుకొనే అవగాహన శక్తి యేర్పరచటమే. ప్రపంచ నాగరికతల చరిత్ర పఠనం వర్తమాన జీవిత వర్తనానికి చుక్కాణి వంటిదని పంతులుగారి ఉద్దేశ్యము.

పంతులుగారి అనువాద రచన చదువుతున్నప్పుడది అనువాదమని అనిపించక పంతులుగారి స్వీయరచనగా పఠితలకు భాసిస్తుంది. ఒక భాషలోని భావాన్ని పలుకుబడిని స్వాయత్తం చేసుకొని తన భాషలో భావాభివ్యక్తి చేయగల సామర్థ్యం ఉత్తమానువాదకునికుంటుంది. పంతులుగారికి బహుభాషలలో ఉన్న అధికారం, సాహిత్య రచనలో ఉన్న సామర్థ్యం. వారి అనువాదానికి దేశీయతను, స్పష్టతను, ప్రసన్నతను ప్రసాదించింది. ఉదాహరణకు కొన్ని వాక్యాలను ఉటంకిస్తాను– 'ఆ కాలపు స్త్రీలు సైతము రెండు వస్త్రములనే ధరించు చుండిరని తోచుచున్నది. అయినను వీరి వస్త్రములు పురుషుల వస్త్రములకంటె నెక్కువ పొడువుగా నుండెడివి. కట్టుకొనబడు వస్త్రము శరీరోర్ధ్వభాగమును గూడ – అనగా భుజముల వరకు – గప్పి యుంచుచుండెను. చేతులను మాత్రమే దానితో కప్పుకొనక విడిగా నుంచుచుండిరి. గుజరాతు, బంగాళము, మద్రాసు, దక్కనులలోని స్త్రీలు నేటికిని అట్లే తమ చీరెలఁ గట్టు కొనుచున్నారు. ఉత్తరీయము తలపైనఁ గప్పుకొనుచు సమయము వచ్చినప్పుడు దానిని ముసుగుగా వేసుకొనుచుండిరి. ఉత్తర హిందూస్థానమందిప్పటికిని స్త్రీలు ఉత్తరీయమును విధిగా ధరించుచుందురు. దక్షిణ హిందూదేశమందు ఇప్పుడు వాడుకలో నున్న చీరెలు పొడువుగా నుండుటవలన వేరే యుత్తరీయము అనవసరమయినది. ఉత్తర హిందూస్థానమున ఇప్పటివలెనే పూర్వమునగూడ స్త్రీలు బయటకుఁబోవునపుడు మాత్రమే యుత్తరీయమును ధరించుచుండిరి".[7]

పంతులుగారి 'క్షాత్రయుగమునాటి హిందూర్వ్యులు' అను గ్రంథంలో నాటి ఆర్యులు ధరించే ఉడుపులను గురించీ, వారి ఆహారవిహారాలను గురించీ, వివాహ పద్ధతుల గురించీ, సాధారణ రాజ్యాంగ స్థితిని గురించీ, భూగోళ శాస్త్రజ్ఞానాన్ని క్రమంగా అయిదు వ్యాసాలున్నవి. ఇవి ఒక విధంగా నాటి సాంఘిక చరిత్రాంశాలను సమీక్షించేవే. పంతులుగారిట్టి వ్యాసాలను తెలుగు లోనికి అనువదించటం వల్ల కీ.శే. సురవరం ప్రతాపరెడ్డిగారికి ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచించాలన్న ప్రేరణ కలిగి ఉండవచ్చును. అందువల్ల ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనా ప్రక్రియకు కూడా పంతులుగారు ప్రేరకులని ఊహించటం వాస్తవదూరం కాదేమో.

---

6. కృషి ప్రచారిణీ గ్రంథమాల ప్రచురణము, సంపాదకుడు : పువ్వాడ వెంకటప్పయ్య (1927)
7. క్షాత్రయుగమునాటి హిందూర్వ్యులు–పుట 5.

పంతులుగారి రచనలోని రెండోవర్గానికి చెందినవి ప్రధానంగా వ్యాసాలు. ఇవి ముఖ్యంగా సమకాలీన హైదరాబాదు రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, తెలుగువారి స్థితిగతులను, గ్రంథాలయోద్యమ వికాస విశేషాలను, స్త్రీ జనాభ్యుదయాంశాలను, ఇతర సాంఘిక సాంస్కృతికాంశాలను సమీక్షించేవిగా కనపడుతున్నవి. వారి వ్యాసరచననుగూర్చి ఆదిరాజు వీరభద్రరావుగారు వెలిబుచ్చిన అభిప్రాయం అమూల్యమైంది. "శ్రీ హనుమంతరావుగారు వ్రాసిన వ్యాసాల సంఖ్య గణనాతీతము. పత్రికా రచనయందు వారు సిద్ధహస్తులు వారు నిమ్మళముగ విషయమును ప్రతిపాదించి మెల్లగ సాగనిచ్చుచుందురు. వారి విమర్శలు నిప్పులు గ్రక్కుచుండవు. శాంతస్థాయిలో నుండి కొంత వ్యంగ్యభావ సమన్వితములయి యుండును. కఠిన వాక్యము లుండనే యుండవు. అయినను ప్రతిపక్ష వాదమును నిర్మూలనము చేయుటలో, ప్రతిపక్షి నుడికించుటలో వీరి పదజాలము శక్తిమంతములయి యుండును". పంతులుగా రేయంశమును తీసికొని రచించినా విషయప్రతిపాదనం సహేతుకంగా, ససాక్షికంగా ఉండేటట్లు చూచేవారు. వారి వకీలు వృత్తిలోని అనుభవం వాదవిషయాన్ని ప్రతిపాదించటంలోనూ, ప్రవచించటంలోనూ చక్కగా తోడుపడింది. సోపపత్తికమైన సమస్యా చర్చ ప్రజలకు విజ్ఞానాన్ని కల్పించటమే కాకుండా, వ్యాస తాత్పర్యం మీద ప్రమాణబుద్ధిని కల్పిస్తుంది. వారి వ్యాస రచనా విధానాన్ని తెలుసుకోవటాని కనువుగా ఈ క్రింది ఉదాహరణాన్ని పొందుపరుస్తున్నాను– వ్యాసం; "నిజాం రాష్ట్రంలో యాంధ్రులు".

"బ్రిటీషు హిందూదేశీయులకు లేని చిక్కొకటీ ఈ రాజ్యము వారి నెదుర్కొనుచున్నది. అదేదన, అచ్చట ఇంగ్లీషు, దానితో దేశభాష ఈ రెండే కావలసి యున్నవి. ఇచ్చట ఆ రెంటితోబాటు ఉర్దూ కూడ వచ్చిననే కాని పని సాగదు. కనుక ఇచ్చటి విద్యార్థి మాతృభాష నేర్చుకొనుటయందు కొంతకాలమును, ఉర్దూ నభ్యసించుటయందు కొంతకాలమును, ఇంగ్లీషుకొరకు మరి కొంతకాలమును గడపవలసి యున్నాడు. అనగా, అచ్చటి విద్యార్థికి ఉన్నత విద్యాభ్యసన విషయమునగల సౌకర్యము ఇచ్చటి విద్యార్థికి లేదు".

"ఇక వీరి మాతృభాషను గురించి విచారింతము. నిజాం రాజ్యమునందు తెలుగుభాష మాట్లాడువారి సంఖ్య 63,67,578. వీరిలో వెనుక జెప్పిన ప్రకారము, మరాట్వాడీ జిల్లాలోని వారికి తెలుగు నేర్చుకొను అవకాశమే లేదు. తెలుగు జిల్లాలోని వారి స్థితి వీరి స్థితికంటె కొంచెము నయముగానే యున్నను, మొత్తముమీద తృప్తికరముగ మాత్రము లేదు".

"ఆరంభవిద్య తెలుగున నేర్పు పాఠశాలలు చాల గ్రామములలో నున్నవి కాని, అంత మాత్రమున జనులకు లభించు జ్ఞానము స్వల్పము. మధ్యమ పాఠశాలలో తెలుగు రెండవభాషగా జదువుకొనుటకు మాత్రము వీలున్నది. హైదరాబాద్ కళాశాలలలో తెలుగు బోధించు నేర్పాటులు గలవు గాని దానివలన గూడ లాభము లేదు. దానికి కారణములు రెండు గలవు మొదటిది : విశ్వవిద్యాలయం వారు విధించిన క్రొత్త నియమముల స్వభావము. రెండవది : ఆ రాజ్యమువారు ఉర్దూనో, పారసీనో రెండవభాషగా తీసికొనగోరుచుండుట. మధ్యమ విద్యా పరీక్షలో తెలుగు రెండవభాషగా తీసికొనువారి సంఖ్య దినదినము సన్నగిల్లుచున్నది. ప్రాతపద్ధతిని సంస్కృతమందును, ఆంధ్రమునందును కొంత పాండిత్యము గలవారు కొందరు అక్కడక్కడ, ముఖ్యముగా వరంగల్లు, కరీంనగరము, నల్లగొండ జిల్లాలో నున్నారు, కాని, వారి కెట్టి ప్రోత్సాహమును లేక పోవుట చేతను, గ్రంథరచనచేత నిప్పటివారి నాకర్షించు యోగ్యత వారియందు లేనందువలనను, ఏ మూలనో కూర్చుండి, యక్షగానములనో, హరికథలనో, శతకములనో వ్రాసికొని బ్రతకవలసిన వారైనారు".

"ఇక ఇచ్చటి తెలుగువారు మాట్లాడు భాషను చూడుడు! ఈ సందర్భమున ఇంకొకమాట చెప్పవలసియున్నది. ఈ రాజ్యములోని తెలుగుభాషకు ఉత్తరమునను, కొంతవరకు పశ్చిమమునను మహారాష్ట్రభాషలతోను, కొంత పశ్చిమమునను, దక్షిణమునను కన్నడభాషతోను సమ్మేళనము కలుగుచున్నది. తక్కిన యన్ని భాగములలోను, అందు ముఖ్యముగా పట్టణములందు ఉర్దూ భాషా సంపర్కము వీడజాలనిదియై యున్నది. ఈ కారణముల వలన పైనజెప్పిన ప్రాంతముల వారి యాచార వ్యవహారములందు వలెనే వారి భాషయందు గూడ ఎన్నియో మార్పులు వాటిల్లినవి. ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతములందు నివసించువారు సంభాషించునపుడు మహారాష్ట్ర భాషలోని శబ్దములను, వాని యపభ్రంశ స్వరూపములును తరచుగా వచ్చుచుండును. 'ఇదేమ్రామాయ్, రొండు, దివ్వలు, ఆయె, నిశెకుపోవు, ఇదేమి దైవము, ఏనుగు సొండెము, ఏదిరా? కాకకు మావుశీ భేటీ కాలేదు? ఈ వాక్యములు వారి భాష కుదాహరణములు. ఇక మహబూబు నగరులోను, అత్రాఫుబల్దా జిల్లా యొక్క పశ్చిమ భాగములోను నివసించువారి భాష కర్ణాటకుల సంపర్కమువలన కన్నడ భాషా శబ్దములతో నిండియుండును. 'మాసణ్ణ పిల్లకు పెసరబేడలు పట్టవు. థొడ్డ పిల్ల బేకైనంత తింటది' ఇవి రెండవ వారి భాషకు దృష్టాంతములు. ఇక ఉర్దూతో సంభవించిన కలయికచేత తెలుగుభాషకు కలిగిన దురవస్థ చూచి తీరవలసినది, కాని ఇట్టిదని చెప్పుట కష్టము".

"ఈ మొకద్దమాలో చలాయించిన కార్రవాయి అంతా జాలది. సాహెబు జిలాజాయ మౌక్కాకు పోయి తనక్కీ చేసి కైఫియ్యతు రాసినాడు గదా కె, ఫరీకు దావా బిల్కూలు నాజాయజు, అయిందా యీతౌర్న కార్రవాయి చేసిన సూరతులో మాఖూలుతదారుకు చేయటం కాగలదు. ఫక్తుమర్తుంచందు 16 పర్వర్ధి సన్ లేరాసౌ బారా ఫసలి'.

"ఇది స్వల్పంగా వీరిభాష కుదాహరణము. ఇక తూర్పువైపున అదృష్టవశమున ఉత్తర సర్కారులవారి సంసర్గము భాషను కొంతవరకు బాగు చేసినది. ఈ స్థితులు గ్రామ్యభాషావాదులు గమనింపదగినవిగా నున్నవి." [8]

ఈ వ్యాసఖండోదాహరణంవల్ల పంతులుగారి రచనా విధానాన్ని గ్రహింపవచ్చు. సూటిగా, సోదాహరణంగా, సంగ్రహంగా, శక్తివంతంగా విషయాన్ని ప్రతిపాదించటం, చక్కని అవగాహనత కూడుకున్న విశ్లేషణం, ఒక అంశం నుండి మరో అంశాన్ని కమ్మచ్చు లాగినట్లు తీసి కదను

8. తెలంగానం (13 వ్యాసాలు) రెండవ భాగం–సంకలనం; వట్టికోట ఆళ్వారుస్వామి, పుటలు : 9–11

తొక్కించటం, తేటగా చెప్పినా నిండుగా సంతరించటం వ్యాసరచనలో ప్రధానాంశాలుగా గోచరిస్తున్నవి. పంతులుగారు ఉపన్యసించినా, వ్యాసం వ్రాసినా ఒకే విధంగా ఉంటుంది. రచనలోని సరళ గ్రాంధికం వారి ఉపన్యాసంలో కూడా ధారాళంగా ప్రసరిస్తుంది. వచనానికీ, వ్రాతకూ అభేద ప్రతిపత్తి కలగటం వక్తలకుండే విశిష్ట లక్షణం. నిండుకుండలా ఉండే పంతులుగారి వ్యక్తిత్వంలో యీ గుణం దండిగా ఉన్నదని వారి అభిభాషణాలు విన్న సహృదయులు సరళంగా ఊహింపగలరు. పంతులుగారి వ్యాసాలన్నీ ఒక సంపుటంలో ప్రచురింపబడితే ఇరవైయో శతాబ్ది పూర్వార్థంలోని తెలంగాన చరిత్రను రచించటానికి అపార విషయ సంపత్తి లభిస్తుంది.

సుజాత పత్రికకు పంతులుగారు పారసీక కవులను గురించి వ్రాసిన వ్యాస పరంపర చాల విలువైనది. వీరేశలింగంపంతులుగారు తెలుగుకవుల చరిత్ర వెలయిస్తే హనుమంతరావు పంతులుగారు పారసీక కవుల చరిత్రను తెలుగులో ప్రసరింపజేశారు. ఈ విధంగా పారసీక కవులను సాహిత్యాన్ని తెలుగువారికి పరిచయం చేసిన మొదటివారు పంతులుగారనే చెప్పాలి.

పంతులుగారి రచనల్లో మూడవవర్గానికి చెందినవి వారి కథలు. వీరు 1910 నుండే కృష్ణాపత్రికలో కథలను వ్రాసి ప్రచురించటం మొదలుపెట్టారు. అందువల్ల ఆంధ్రకథానికా వాఙ్మయచరిత్రలో ఆ స్రవంతికి ఆదిపురుషుల్లో ఒకరుగా వారు నిలిచారు.

తెలుగులో కథాప్రక్రియ 1910లో పుట్టిందని విమర్శకులు భావిస్తున్నారు. అంతకు పూర్వం వీరేశలింగం పంతులుగారు కథలు వ్రాసినా వాటికి ప్రక్రియా గౌరవాన్ని విమర్శకు లివ్వటం లేదు. "పంతులుగారు చేసిన రచనలు చాలా వరకు ఉపదేశాత్మకమైనవి. మన సమాజంలో పాతుకొని ఉన్న దురాచారాల్నీ, మూఢ విశ్వాసాల్నీ వెల్లడి చేయటానికి ఆయన చేపట్టిన ప్రక్రియల్లో కథకూడా ఒకటి. అయితే దాన్ని ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా స్పృహలో ఉంచుకొని పెంపొందించటం మాత్రం జరగలేదు. జొనాథన్ స్విఫ్ట్ రాసిన 'గలివర్స్ ట్రావెల్స్' ప్రేరనతో 'సత్యరాజాపూర్వ దేశయాత్రలు' రాశారాయన. అందులో గుదిగుచ్చిన కథలు ఎందరినో ఆకర్షించాయి. 'ఈసప్స్ ఫేబుల్స్'ను 'ఈసపు నీతికథలు' అన్న పేరుతో అనువదించడంకూడా జరిగింది. ఈ విధంగా పంతులుగారు రాసిన కథలు ప్రయోజన పరంగా ప్రాముఖ్యం పొందాయే తప్ప ప్రక్రియా పరంగా ప్రాధాన్యం పొందలేకపోయాయి'.[9]

తెలుగుకళా జగత్తులో వెలసిన కాశీమజిలీ కథలూ, చార్‌దర్వీసు కథలూ, తాతాచార్యుల కథలూ, పంచతంత్ర కథలూ, కథా సరిత్సాగరం కథలూ, రాజాస్థాన కథలూ ఈకోవకు చెందేవే. అయితే 1910లో గురజాడ అప్పారావు పంతులుగారు కథానికా రచనకు పూనుకోవటంతో కథావాఙ్మయ చరిత్రలో నూత్నాధ్యాయం ప్రారంభమైంది. అప్పారావుగారి కథలు ప్రక్రియకూ శిల్పానికీ, ఆధునికతకూ పేరు పొందాయి. వారు వేసిన బాట తరువాతి కథా రచయితలకు మార్గదర్శకమైంది. వారి కథా రచనా వైశిష్ట్యాన్ని వివరిస్తూ శ్రీ కె.వి. రమణారెడ్డిగారిలా వ్రాశారు. "ముందు మార్గదర్శకుడంటూ ఒక దెవ్వడూ లేకుండా, స్వయం ప్రభువులాగా అప్పారావు తెలుగు కథానికను స్వకపోల కల్పితంగా సృష్టించాడు. పుక్కిటి పురాణాల, కల్పనా కథల పై డొల్లలను తొలగించి తెలుగుకథకు తనదని చెప్పుకోదగిన మూర్తినీ, విస్ఫూర్తినీ కల్పించాడు. అరడజను కంటె లోపుగా వున్న ఈ కథలు ఒక్కొక్కటీ ఒక్కొక్క దీపస్తంభంలా నిలిచి తరువాతి కథకులకు యావన్మందికిన్నీ మార్గాన్ని గమ్యాన్నీ కాంతిమయం చేసినట్లు తెలిసివస్తుంది... ఆ కథలలో కనిపించే సమస్యలు గూడా ఇరవయ్యో శతాబ్దానికి చెందడ మనేది మరీ మరీ గమనింపదగిన విషయం. వాటికి అప్పారావు సూచించిన పరిష్కార మార్గాలు ఈనాటికీ సాహసోపేత మనిపించేంత కొత్తవి కావటం... కొత్తదనమంటే కాలపు ఇటీవలి తనమే కాదు; కొత్తదనమంటే నిజమైన తాత్పర్యం సమకాలిత్వమే ...తన కావ్య రచనలో కనిపించే సమకాలిత్వం కంటె కథానికలో కనిపించేది నిజంగా ఎక్కువ".[10] అప్పారావుగారి మొదటి కథ 'దిద్దుబాటు' 1910 ఫిబ్రవరి 'ఆంధ్ర భారతి'లో ప్రచురింపబడింది.

ఈ పూర్వరంగంతో మాడపాటి హనుమంతరావు పంతులుగారి 'హృదయశల్యం' కథ 1910లో కృష్ణాపత్రికలో ప్రకటితమైంది. ఆ తరువాత పంతులుగారు మొత్తం పదమూడు కథలు రచించారు. అందులో హృదయశల్యము, రానీసారంధా, ముసలిదాని యుసురు, నేనే, అగ్నిగుండము, నాడు నీ పంతము నేడు నా పంతము, ఆత్మార్పణము అన్న కథలు 'మల్లికా గుచ్ఛ' మనే పేరుతో కథా సంపుటిగా మచిలీపట్టణం సరస్వతీ నికేతనం హైదరాబాదులో అణా గ్రంథమాలలో పన్నెండవ కుసుమంగా ప్రచురింపబడినాయి. మిగిలిన కథలూ – 'న్యాయమా?' 'ఎవరిది తప్పు' 'ఇక కావలసిన దేమి' 'నిజమేనా' – సుజాత, భారతి, శారద మాసపత్రిక సంపుటాల్లో నిలిచి యున్నాయి. ఈ కథలో 'హృదయశల్యము' 'నేనే' అనేవి పంతులుగారి స్వకపోల కల్పితాలు. మిగిలినవి ప్రఖ్యాత నవలా రచయిత 'ప్రేమ్‌చంద్' రచించిన ఉర్దూ కథలకు అనుసరణాలు.

కథానికా రచయితగా పంతులుగారి పాత్రను పరిశీలించేటప్పుడు ఈ క్రింది విషయాలను దృష్టిలో ఉంచుకోవలసి వస్తుంది.

1. గురజాడ అప్పారావుగారి లాగా హనుమంతరావు పంతులుగారు సమకాలీన సాంఘిక సమస్యలను చిత్రించే స్పృహతో కథారచనకు పూనుకోలేదు.
2. రచనా కౌశల్యంలోనూ, ఇతివృత్త నిర్మాణంలోనూ ఉత్తర హిందూ స్థానంలో ప్రఖ్యాతి గాంచిన ప్రేమచంద్ కథలను తెలుగులోనికి తీసికొని రావడానికి ప్రయత్నం చేసిన వారిలో పంతులుగారు ప్రథములు. అందువల్ల వినోదానికి మాత్రమే కాక, ప్రక్రియా దృష్టితో పంతులు గారు కథలు వ్రాశారన్నది గమనింపదగిన అంశం.
3. పంతులుగారు సొంతంగా వ్రాసిన కథల్లో గార్హస్థ్య జీవితంలో భార్యాభర్తల మధ్య ఉండే ప్రణయాన్నే ప్రధాన వస్తువులుగా స్వీకరించారు. అనుమాన పిశాచం భర్తకు పట్టి పీడిస్తుంటే భార్యపడే వేదనను, దాని సుఖ సమాప్తిని చిత్రించే కథ 'హృదయశల్యం'. పీనాసి భర్తలో

9. కథానికా వాఙ్మయం – శ్రీ పోరంకి దక్షిణామూర్తి (ఆం.ప్ర.సా. అ. ప్రచురణ) పుట. 7–8
10. మహోదయం–పుటలు 256–257.

ప్రణయ బీజాలను మొలకెత్తించి వితరణాన్ని మేల్కొల్పి, ప్రణయ లేఖ వ్రాసిని ప్రియురాలిని నేనేనని నిరూపించే యిల్లాలి కథ 'నేను'. కాబట్టి దాంపత్య జీవిత చిత్రణం పంతులుగారి సొంత కథలో ఉన్న విశేషం.

4. ప్రేమచందు కథలో చారిత్రక వాతావరణం ఉన్న కథల్ని పంతులుగారు సగానికి పైగా ఎన్నుకున్నారు. వారి 'హృదయశల్యం' కథ గూడా కాకతిరుద్రమ కాలానికి సంబంధించిందే. దానికి కారణం వారికి చారిత్రక గాథలమీద ఉన్న ప్రీతియే ముఖ్యకారణం కావచ్చు.
5. ప్రేమచంద్ రచనలో సాంఘిక వస్తువులున్న కథలో మానవత్వానికీ, ఋజువర్తనానికీ, నీతికీ ప్రాధాన్యమున్న వానిని ఎన్నుకోవటంలో పంతులుగారి జీవిత దృక్పథం బలమైన పాత్రను నిర్వహించి ఉంటుంది.
6. పంతులుగారి కథలో ఏదో విధంగా స్త్రీలకు సంబంధించిన సమస్యలకు ప్రాధాన్యం కనపడుతుంది. స్త్రీ జనాభ్యుదయంలో వారికున్న శ్రద్ధ దానికి కారణం కావచ్చు.

పంతులుగారు సొంతంగా కల్పించిన కథలో చివరి వరకు ఉత్కంఠను పోషించే రచనాశిల్పం ప్రస్ఫుటంగా కనపడుతుంది. అది ఆయన స్వభావంలో కూడా ఉన్నదనిన్నీ, అదే వారి కథలో ప్రతిబింబించిందనీ ఊహించటానికి ఆదిరాజు వీరభద్రరావుగారి కథనం ఒకటి మనకు తోడ్పడుతుంది. అది హనుమంతరావుగారు అడ్వొకేటుగా ప్రాక్టీసు చేస్తున్న రోజులలో జరిగిన సంఘటన–

"ఒకానొక యభియోగములో హనుమంతరావుగారు ప్రతివాది పక్షమునను, మాదిరాజు రామకోటేశ్వరరావుగారు వాది పక్షమునను నిలుచుండిరి. రామకోటేశ్వరరావుగారు హనుమకొండనుండి వచ్చి హనుమంతరావుగారి యింట్లోనే బసచేసిరి. ఇద్దరు వకీళ్లును కలసి కోర్టుకు వెళ్ళిరి. కోర్టుకు వెళ్లుచు హనుమంతరావుగారు 'నీలగిరి' పత్రిక సంపుటమును వెంట దీసికొనిపోయిరి. త్రోవ పొడుగునను ఆ పత్రిక పుటలను త్రిప్పుచు ఏదో చదువుచున్నట్లు నటింప సాగిరి. 'బావా! కోర్టుకు కూడా నీలగిరి పత్రిక యెందుకయ్యా! ఇచ్చట గూడా దేశసేవ గొడవయేనా?' అని రామకోటేశ్వరరావుగారు ఉల్లసమాడిరి. హనుమంతరావుగారు చిరునవ్వు నవ్వి యూరకుండిరి. ఆనాటి వాయిదాకు ప్రతివాది సాక్షులు రాలేదు. అందుచే వాదిపక్షమున తీర్పు చెప్పవలిసనదిగా రామకోటేశ్వరరావుగారు కోర్టు నెదుట బలముగా వాదించిరి. ఆ వాదమునకు ప్రత్యుత్తరముగా హనుమంతరావుగారు లేచి 'పెను తుఫానువీచి, చెరువులు తెగి, నదులు పొంగి యంతయు జలమయ మయియున్న సమయములో, పంచభూతము లాగ్రహించి బీభత్సము చేయుచున్న సమయములో, ఏ మానవునకయినా ప్రయాణావకాశము లుండగలవా?' యని ప్రశ్నించిరి. తన కక్షిదారుడును ఈ భయంకర పరిస్థితుల మూలకముగనే రాలేకపోయెననియు, తన కక్షిదారువాదము దుర్బల మయినదికాదనియు, మరియొక వాయిదా యిప్పించవలసినదనియు కోర్టువారితో మనవి చేసిరి.' ఇది వట్టి సాకు: ఇందు సారములేదు. తుఫానుకు ప్రతివాదికి ఏమీ సంబంధం లేదు' అని రామకోటేశ్వరరావుగారు గర్జించిరి. ఆ తుఫాను వర్ణన మంతయు నీలగిరి పత్రికలో వర్ణితమై యుండెను. హనుమంతరావుగారు నీలగిరి పుటలు విప్పి, తేదీల వారీగా నున్న ఆ వర్ణ భాగమును జదివి తన కక్షిదారుడు గ్రామమును వదలుటకు ఎట్లు వీలులేకపోయెనో విశదీకరించిరి. కోర్టువారు హనుమంతరావుగారి వాదమును విశ్వసించిరి. 'బావా! ఇందుకా నీలగిరి పత్రికలను దెచ్చినది? ఎంత మోసము చేసినావయ్యా!' అని రామ కోటేశ్వరరావు గారు సరసమాడిరి".[11]

ఇది పంతులుగారి జీవితంలో ఒక సన్నివేశమైననూ చెప్పుకుంటే ఒక చక్కని చిన్న కథ. ఉత్కంఠ దీనికి ఊపిరి. అలాగే 'హృదయశల్యం' లో పురుష వేషంలో ఉన్న రుద్రమదేవి నిజరూపం కథాంతానికిగాని నాయికా నాయకులకు బోధపడదు. ఆ సత్యం తెలియటంతో ప్రతాపుని హృదయశల్యం పటాపంచలౌతుంది. కథ కంచికి జేరుతుంది. 'నేనే'లో గణపతిరావుకు ప్రణయలేఖ వ్రాసి విరహాన్ని కల్పించి, ముస్తాబు చేయించి, భార్య కనుగప్పి నాటకశాలకు పంపించి, అక్కడ మేలిముసుగులో నిలిచి అతన్ని ఆకర్షించిన యువతి, అతని భార్య హైమవతే నన్న సంగతి నాయకునితోపాటు పఠితకు కూడా చివరిదాకా తెలియదు. పంతులుగారు ఉత్కంఠ పోషణలో మొదటి కథలో కంటె రెండవ కథలోనే ఎక్కువ నేర్పును ప్రకటించారు. హృదయశల్యంలో పఠితకు నిజం తెలుసు; నాయికా నాయకులకు మాత్రం తెలియదు. 'నేనే'లో పఠితకు కూడా తెలియదు. శిల్పదష్టితో రెండవదే అగ్రశ్రేణికి చెందింది.

పంతులుగారి కథలో సామాన్యంగా కనపడే మరోగుణం పురుషపాత్రల కంటె స్త్రీ పాత్రలు శక్తిమంతంగా చిత్రింపబడటం. సంఘంలో స్త్రీలు నిర్వహింపవలసిన పాత్రలు వ్యంగ్యంగా ఈ కథల ద్వారా వారు సూచించినారేమో ననిపిస్తుంది. కథను మొదలు పెట్టేటప్పుడు ఆ కథా తత్వాన్ని వ్యంజింపజేసే ఏదో పద్యాన్నో, పద్య భాగాన్నో మొదట నిల్పటం వారికి పరిపాటి. కథా కథనంలో రచయిత కల్పించుకొని పఠితలను సంబోధించి వారిని కథాగతితో నడిపిస్తూ హెచ్చరిస్తూ ఉండటం వారి కథలో కనిపించే మరో లక్షణం. ఇటువంటిది చిలకమర్తి, వెంకట పార్వతీశ్వరకవులు మొదలైన వారి రచనలో కనపడుతుంది. ఆధునిక కథా శిల్పంలో అది ఉత్తమమైన శిల్పంగా విమర్శకులు భావింపరు. అయినా ఆంధ్ర కథా రచనం ప్రాథమిక దశల్లో ఉన్న చారిత్రకాంశాన్ని అది సూచిస్తుంది.

గురజాడ లాగా హనుమంతరావుగారు సమకాలీన సాంఘిక సమస్యలను కథలో చిత్రించక పోవటంతో వాటికి నవ్యత్వం లేదని విమర్శకులు భావించవచ్చు. కాని, సార్వకాలీనమైన విలువల్ని పోషించే స్త్రీ పాత్రలు కేంద్రంగా కథలను సృష్టించి, ప్రయోజనంతో పాటు ప్రక్రియా గౌరవానికి పంతులుగారు కృషి చేశారన్న విషయంలో ప్రతిపత్తి ఉండబోదు.

11. మా. హ. జీ. చరిత్ర పుటలు –13–14

5

1921 నవంబరు 12వ తేదీన జరిగిన ఆంధ్ర జనసంఘ స్థాపనం మాడపాటి హనుమంతరావు పంతులుగారి జీవితంలోనే కాక హైదరాబాదు రాష్ట్రాంధ్ర జన జీవితంలో కూడా ఒక పెద్ద మలుపు. హైదరాబాదులో వివిధ భాషలవారూ, వివిధ ప్రాంతాలవారూ నివసిస్తూ వివిధ సంస్కృతులకూ కూడలి స్థానంగా రూపుదిద్దారు. అందులో తెలుగువారిదే అగ్రతాంబూలం కాని, ఆనాడు హిందూ సంస్కారసభలో తెలుగువక్త మాట్లాడుతున్నప్పుడు ఇతర భాషలవారు గేలిచేయటం జరగటం తెలుగువారికి కనువిప్పయింది. అందరితో కలిసి ఉన్నా తమ వ్యక్తిత్వాన్నీ సంఘీబావాన్ని బలంగా నిర్మించుకో పోతే సాటి భాషీయులలో కూడా నవ్వులపాలు కావలసి వస్తుందని తెలుగు నాయకులు గుర్తించారు. ఆనాటి రాత్రే ఆంధ్ర జనసంఘ స్థాపనం జరిగింది. హనుమంతరావు పంతులుగారు ప్రధాన కార్యదర్శిగా ఆ సంఘ భారాన్ని భుజస్కంధాలపై ఎత్తుకున్నారు.

సంఘ స్థాపనంతో ఆంధ్రోద్యమానికి అంకురారోపణం జరిగింది. పంతులుగారి ప్రజ్ఞతో అది శాఖోపశాఖలుగా విస్తరిల్లి రాష్ట్రమంతా వ్యాపించింది. మూడు నాలుగేళ్లలోనే దాదాపు 50 ప్రాంతీయ సంఘాలు ఏర్పడినాయి. వాటిని సంఘటిత పరిచి కార్యక్రమాలను రూపొందించటానికి 1923లో హనుమకొండ సమావేశంలో 'నిజాం రాష్ట్రాంధ్ర జన కేంద్ర సంఘం' రూపొందింపబడింది. తెలుగు తేజం సాంఘిక విద్యారంగాలలోనే కాక, రాజకీయ సాంస్కృతిక కార్యరంగాలలో కూడా ఆ సంఘం ద్వారా ప్రసరించింది. 1924లో నల్లగొండ, 1925లో మధిర, 1928లో సూర్యాపేటలో కేంద్రసంఘం సమావేశాలు నిర్వహించింది. మధిర సమావేశం ప్రథమ గ్రంథాలయ సభగాను, సూర్యాపేట సమావేశం రెండవ గ్రంథాలయ సభగానూ కార్యక్రమాలను విస్తరింపచేసింది. సూర్యాపేటలో ఆంధ్ర యువక సభ, సంఘ సంస్కార సభ, ఆంధ్ర మహిళాసభ, వైశ్యయువజన సభలాంటి అనుబంధ సంస్థల నిర్మాణం సాగింది. తెలుగువారు సమైక్యంగా ఒక ఉద్యమంలో ప్రవేశించి రాజకీయంగానూ, సాంఘికంగానూ, వైజ్ఞానికంగానూ, తమ సొంత ప్రతిపత్తిని రాష్ట్రంలో నిలుపుకోవటానికి ప్రయత్నాలు ప్రతిరంగంలోనూ ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం వారికి ఈ చైతన్యం కన్నెర్ర కల్పించింది. మహారాష్ట్ర సోదరులకు, కన్నడిగులకు ఆంధ్రుల ఉద్యమ శంఖారావం మన శక్తియుక్తులను అవగాహనం చేసుకోవటానికి తోడ్పడింది. ఈ మహాచైతన్య వికాసానికి మూలస్తంభం శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు.

వివిధ సంఘాల విస్తృతిలో కార్యరంగం విశాలమైపోయింది. వాటిని ఒక వేదికమీద సంఘటితం చేయవలసిన అవకాశము ఏర్పడింది. తత్ప్రయత్నమే నిజాం రాష్ట్రాంధ్ర మహాసభ స్థాపనంగా రూపొందింది. ఆంధ్ర జన సంఘం ద్వారా జరిగిన కృషి దానికి పూర్వరంగమై ప్రవర్తిల్లింది. ఉర్దూ భాషలో మాట్లాడటమే నాగరికతగా భావించిన విద్యాధికులు తెలుగులో ఉపన్యసించటం ప్రారంభించారు. విద్యావంతులు సామాన్య ప్రజలంతా కలిసి తెలుగు భాషా వికాసానికీ, సాంఘిక చైతన్యానికీ కృషి చేస్తున్నారు. పలువురు తెలుగు పత్రికలను కొని చదవటం ప్రారంభించారు. రచయితలు, కవులు, పత్రికలకు రచనలు పంపి తమ మనోభావములను వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయోద్యమ ఫలితాలు ప్రజలలో అనతి కాలంలోనే కనిపించాయి. ఈ పూర్వరంగ ప్రవర్తనానికి సూత్రధారుడుగా పంతులుగారు చేసిన కృషి గణనీయం.

పంతులుగారి ప్రజాజీవితంలో రెండవ ఘట్టం ఉద్యమదశ. ఉద్యమమంటే ఈ అధ్యాయంలో ఆంధ్రోద్యమమే అనాలి. 1930 మార్చి మూడవ తేదీన ప్రారంభమైన ఆంధ్ర మహాసభ పదునేదు సంవత్సరాలలో 13 సభలు నిర్వహించింది.

1.	మొదటి ఆంధ్ర మహాసభ	–	జోగిపేట	–	1930
2.	రెండవ ఆంధ్ర మహాసభ	–	దేవరకొండ	–	1931
3.	మూడవ ఆంధ్ర మహాసభ	–	ఖమ్మముమెట్టు	–	1934
4.	నాల్గవ ఆంధ్ర మహాసభ	–	సిరిసిల్ల	–	1935
5.	ఐదవ ఆంధ్ర మహాసభ	–	షాదునగర్	–	1936
6.	ఆరవ ఆంధ్ర మహాసభ	–	నిజామాబాదు	–	1937
7.	ఏడవ ఆంధ్ర మహాసభ	–	మల్కాపురము	–	1940
8.	ఎనిమిదవ ఆంధ్ర మహాసభ	–	చిల్కూరు	–	1941
9.	తొమ్మిదవ ఆంధ్ర మహాసభ	–	ధర్మవరము	–	1942
10.	పదవ ఆంధ్ర మహాసభ	–	హైదరాబాదు	–	1943
11.	పదకొండవ ఆంధ్ర మహాసభ	–	భువనగిరి	–	1944
12.	పన్నెండవ ఆంధ్ర మహాసభ	–	మడికొండ	–	1945
13.	పదమూడవ ఆంధ్ర మహాసభ	–	కంది	–	1946

ఆంధ్ర మహాసభ కార్యక్రమాలు నల్లేరుపై బండిలాగా సాగినవి కావు. అడుగడుగునా ప్రభుత్వంవారు కల్పించే అడ్డంకుల్ని అధిగమిస్తూ అధిక్రమతో ఉద్యమదీక్షతో ముందుకు సాగింపబడినవే. మాడపాటి హనుమంతరావు పంతులుగారు సభకూ, ప్రభుత్వానికీ మధ్య రాయబారాలు సలిపి, అనుమానించే ప్రభుత్వానికి, సభకూ రాజకీయాలకూ సంబంధంలేదని నచ్చచెప్పి, ప్రభుత్వోన్నతాధికారుల్ని సభల కాహ్వానించటం ద్వారానూ, ప్రభుత్వ వ్యవసాయ, పశుచికిత్స, వైద్యసహకారశాఖల ప్రదర్శనలు, ఉపన్యాసాలూ, చిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయటం ద్వారానూ

వారికి విశ్వాసం కల్పించి మహాసభలు జరుపుకోవడానికి ప్రభుత్వానుమతి సంపాదిస్తూ ఉండేవారు. రెండవ మహాసభ జరిగిం తరువాత ప్రభుత్వం 'గస్తీనిసాన్ తర్పన్'ను గట్టిగా అమలు జరిపి రెండుమూడేళ్లు సభాసమావేశం కాకుండా అడ్డుకున్నది. ఆ సమయంలో పంతులుగారు సామమార్గాన్ని అనుసరించి ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు సలిపి. పోలీసుశాఖకు మహజర్లు పెట్టి ఆందోళన సలిపి, ఎట్లో అనంత ప్రయత్నం తరువాత సభాసమావేశానికి అనుమతిని సాధింపగలిగారు. అది పంతులుగారి కార్యదీక్షకును, కార్యసాధనోపాయ కుశలతకును నిదర్శనం. ఆ సన్నివేశాన్ని ఎ తిరుమల యస్. కృష్ణ శర్మగారు గోలకొండ పత్రికలో ఇట్లభివర్ణించారు.

"అదొక విషపు గడియ. హైదరాబాదు రాజకీయరంగముమీద కారు చీకటి కప్పియుండినది. ప్రజాపక్ష ఆందోళనముపై ప్రభుత్వపు అంగారదృష్టి పడి యుండినది. మొదలే మొగలాయి జనులు, అందులో పిరికి. ఈ పిచ్చుకలపై 'తిర్పస్గస్తీ' బ్రహ్మాస్త్రము ప్రయోగింపబడియుండెను. అది చాలదని సుగ్రీవాజ్ఞ యొకటి వెలువడెను. సభ చేయుటకు రూ. 2000లు జామీ నియ్యవలెను. సభ ప్రభుత్వపు మనసుకు రాకయున్న జామీను 'జప్తు'. దేశము గడగడ వడకినది. నాయకుల కంటికి పిడుగుపడెను. కమ్మిన చీకటి మూడేండ్లకుగాని తొలగలేదు. ప్రజాందోళన అక్కడక్కడ పోరాడి సోలి చల్లారినది. వెలుగు ఆశను తగ్గించు నిరాశ అది. హఠాత్తుగ పత్రికలలో జనులొక దినము చదివిరి, "ఆంధ్ర మహాసభకు అనుమతి, జామీ అక్కరలేదు" లోకుల వ్రేళ్లు ముక్కు పై కెక్కినవి. ఈ అమావాస్య చంద్రుని నమ్ముటయే కష్టమాయెను. శ్రీ హనుమంతరాయలు పట్టిన పట్టుకే ఆ కీర్తి. వారి కార్యసాధనా దీక్షాఫలమే అది. నిరంతరధారా ప్రవాహమునకు బండరాతి చట్టులూ పొడి పొడి అగును. నిజాము దేశపు రాజకీయ ప్రళయములో రావుగారు ఆంధ్ర మహాసభా వ్యవహారమును తమకడకు తీసికొనియుండుట మొగలాయి జనులకు ఒకరీతి జీవదానము, పునస్సృష్టి".[12]

చతుర్థాంధ్ర మహాసభకు మాడపాటి వారధ్యక్షులగ నుండిరి. హైదరాబాదులోని వారి నివాస గృహమైన 'ఆంధ్ర కుటీరం' నుండి సిరిసిల్ల వరకు కార్లలో జరిగిన యాత్ర చారిత్రాత్మకమైనది. అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షులకు కాంగ్రెస్ సమావేశాల సందర్భంలో జరిగే గౌరవం వంటిది పంతులు గారికి జరిగింది. ఆంధ్ర మహాసభకు వెన్నెముకవంటి వారైన వారిపై ప్రజలకు గల అవ్యాజభక్తి విశేషాలు వెల్లువగా పొంగటంలో ఆశ్చర్యం లేదు. ఆ సభలో విద్యా పునర్నిర్మాణం, నిర్బంధ ప్రారంభ విద్య, ఆంధ్ర బాలికలకు మాతృ భాషామూలమున ఉన్నత విద్య గరపటం, జాగీరు ప్రజల హక్కులు, గ్రామ పునర్నిర్మాణం, బాల్యవివాహ నిరసనం, తెలంగాణా రైతులకు సౌకర్యాలు, బలోతాదారుల కష్టాలు, స్థానిక స్వరిపాలనం, నిమ్న జాత్యుద్ధరణం మొదలైన అంశాలమీద విలువైన ఇరవై ఆరు తీర్మానాలు ఆమోదింపబడినాయి. అధ్యక్ష పీఠం నుండి మాడపాటి వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థికులు పాల్గొనే ఆంధ్ర మహాసభ కార్యక్రమాలమీద అనుమాన దృష్టిని ప్రసరించటం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. "ఈ దేశమునందు నవీనభావములు వ్యాపించుచున్నవి. ఇది తప్పదు. దేశములోని విద్యార్థికులలో ముఖ్యముగా యువజనులయందు దేశ సేవాసక్తియు, ఆత్మగౌరవభావమును ప్రబలుచున్నవి. ఇట్టి సమయమున మహోత్కృష్టమగు విజ్ఞాన వ్యాపక కార్యమున ముందడుగు వేయ యత్నించుచున్నారు. ఇట్టివారి సేవాసక్తిని అనుమాన దృష్టితో చూడకూడదు. వీరి యుత్సాహమును మెచ్చించి, వారితో పనికొనుట యుత్తమ రాజనీతి యగును. వీరియందు ద్రోహబుద్ధి లేదని నేను ఘంటాపథముగా జెప్పగలను. ఇట్టి విద్యార్థికులను ప్రభుత్వమువారు నమ్మవలయును. 'నమ్మకము లేనివారికి సఖము లే' దను సామెతగలదు. నా యీ విజ్ఞప్తి దూరాలోచనముతోను, సానుభూతితోను గైకొన బడుగాక".

ఆంధ్ర మహాసభకు నాయకులై ఉద్యమాన్ని సాగిస్తున్న మాడపాటి వారు ఆంధ్రులపాలిటి అపరగాంధీ అనిపించారు. మాడపాటి హనుమంతరావు గారి జీవితచరిత్రకు ఆంగ్ల పీఠిక వ్రాస్తూ ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు పంతులుగారి వ్యక్తిత్వంలోని విశిష్టతను విశ్లేషించి నిరూపించిన విధం పేర్కొనదగింది. ఆయన పంతులుగారిలో చూచిన ముఖ్యాంశాలు :-

1. Madapati Hanumantha rao Garu is a miniature Gandhi, in a circumscribed area. The same love of action for the upliftment of fellow women, the same patience and forbearance, the same incorruptibility in matters of Public Finance, the same shrewdness are seen in these two leaders of men"

2. "He was a doctor who knew his patient well. His prescriptions were, to all intents, most harmless. They are the least revolutionary viz. libraries, schools, free Reading rooms, guilds of merchants and farmers and finally conferences which mainly dealt with social reform".

3. "Hanmantha Rao is a wonderful type of leader. He was always on the side of conservatism. He would be the last voter on a mild resolution, praying for establishment of Responsible Government, under the Nizam. He was all moderation and patience.. We were reminded of the description by the Telugu Poet Tikkana Somayaji of the eldest Pandava borther Yudhistira in Mahabharata. He says 'The son of Dharma is all self-control. he is a mild tiger'[13] Madapati Hanumatha Rao appropriately answers to this description. Haste, bitterness, losing grip on the situation were unknown to him. This contributed to his eminent success in life".

---

12. మా. హ. జీ. చరిత్ర పుటలు -55

13. 'అసలము పుట్టె జూదమున యప్పుడ యెంతయు జిచ్చువెట్టి కాల్చిన యది నీ యుపేక్షయ; వశీకృత చిత్తుడు ధర్మనూతి మెత్తని పులి; యెల్లవారలు నధర్మమయు నవీయించబెట్టు వనంతకు న్వినడును; గాన దుం, బిదప నీకును నాకు మరల్పవచ్చునే' - ఉద్యోగపర్వము

అప్పటి నిజాం ప్రభుత్వంలో హోం సెక్రటరీగా ఉన్న నవాబ్ ఆలీ యూవర్‌జంగ్ గారు పంతులుగారితో ఆంధ్ర మహాసభ కార్యక్రమాలను సమీక్షిస్తూ 'ఆంధ్ర మహాసభ ఆంధ్ర – తెలంగాణాల ఏకీకరణానికి దోహదమౌతుందనేమోనని ప్రభుత్వం వారి అనుమానం' అన్నారట! అప్పుడు పంతులుగారు దానిని వారిముందు అంగీకరింపక పోయినా – అది కాలక్రమంగా దాచరాని సత్యమైపోయింది. అంటే విశాలాంధ్రోద్యమ బీజాలు ఆంధ్రోద్యమంలోనే ఉన్నాయని తాత్పర్యం.

ఆంధ్ర మహాసభలో ఆరవ, ఏడవ, తొమ్మిదవ సభలు రాజకీయంగా ప్రాముఖ్యాన్ని వహించాయి. 1937లో నిజామాబాదులో జరిగిన ఏడవ ఆంధ్ర మహాసభలో ఆ సంస్థ కులమత వర్గ భాషా విచక్షణలు మాని హైదరాబాదు రాష్ట్రంలో నివసిస్తున్న అన్నిభాషలవారి యొక్క అభివృద్ధికి కృషిచేయాలని సంకల్పింపబడటమే కాకుండా, బాధ్యతాయుతమైన ప్రభుత్వమే సభవారి ధ్యేయమని తీర్మానించడమైనది. మొదటి నిర్ణయం ఆంధ్ర భాషాభిమానులకు నిరాశ కల్పించింది. క్రమంగా అది 1943 నాటికి ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపనకు దారి తీసింది. రెండవ నిర్ణయం నాటి స్టేటు కాంగ్రెస్ బాధ్యతాయుతమైన ప్రభుత్వం కోసం చేస్తున్న సత్యాగ్రహానికి సన్నిహితమైంది. ఆంధ్ర మహాసభ సభ్యులైన రావి నారాయణరెడ్డి, మందుముల రామచంద్రరావు, జమలాపురం కేశవరావుగార్లు సత్యాగ్రహంలో పాల్గొని జైళ్లకు కూడా పోయారు. 1940 లో మల్కాపురంలో జరిగిన ఏడవ సభలో – హైదరాబాదు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను బహిష్కరించాలనే తీర్మానాన్ని శ్రీ రావి నారాయణరెడ్డి గారు ప్రవేశపెట్టగా మితవాదులైన మాడపాటి హనుమంతరావు, మందుముల నరసింగరావుగార్లు దాన్ని ప్రతిఘటించారు. కాని, తీర్మానం నెగ్గింది. ఆంధ్ర మహాసభలో యువతరానికి ప్రాబల్యం హెచ్చింది. ఆ వర్గానికి రావి నారాయణరెడ్డి గారు నాయకులు. 1942లో జరిగిన ధర్మవర సభల్లో మితవాదులు, జాతీయవాదులొక పక్షంగాను, కమ్యూనిస్టులు మరొక పక్షంగానూ ఏర్పడటం జరిగింది.

"భువనగిరి మహాసభలో ఆంధ్ర మహాసభ రెండు మహాసభలుగా చీలిపోయింది. ఒకటి జాతీయాంధ్రమహాసభ, రెండవది శ్రీ రావి నారాయణరెడ్డి గారి ప్రాబల్యము కలిగిన ఆంధ్ర మహాసభ. భువనగిరి మహాసభను బహిష్కరించిన ఆంధ్రనాయకులు 1945వ సంవత్సరమున మడికొండలో శ్రీ మందుముల నరసింగరావుగారి అధ్యక్షతన పంద్రెండవ మహాసభ కావించిరి. ఈ మహాసభకు శ్రీ కొండా వెంకట రంగారెడ్డి గారు పెట్టని కోటలై యుండిరి. ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు పంతులు గారి ఆశీస్సులు ఆసభకు లభించినవి. బూర్గుల రామకృష్ణరావుగారి ఆశీస్సులు ఆ సభకు లభించినవి. కీ.శే. జమలాపురం కేశవరావుగారు కూడ ఈ సభనే బలపర్చిరి. శ్రీ రావి నారాయణరెడ్డి వర్గమువారు పంద్రెండవ ఆంధ్రమహాసభను ఈ సంవత్సరమే ఖమ్మం పట్టణములో జరిపిరి. ఈ విధముగా ఆంధ్రమహాసభ రెండుగా చీలి పోయింది. తరువాత 1946లో కీ.శే. జమలాపురం కేశవరావుగారి అధ్యక్షతన పదమూడవ మహాసభ మెదకుజిల్లా యందలి కంది గ్రామమున జరిగినది. ఇదియే తుట్టతుది ఆంధ్ర మహాసభ. వైజ్ఞానికోద్యమముగా ప్రారంభమైన ఆంధ్రోద్యమము బాధ్యతాయుత ప్రభుత్వమే తన ఆదర్శముగా నిర్ణయించుకొన్న ఉద్యమముగా పర్యవసించినది. కంది మహాసభ తరువాత ఆంధ్ర మహాసభ స్టేటు కాంగ్రెసులో లీనమయి, స్టేటు కాంగ్రెస్ ఆంధ్ర ప్రాంత సంఘముగా రూపొందినది. ఈ స్టేటు కాంగ్రెస్ ఆంధ్ర ప్రాంత సంఘము యొక్క మొదటి సమావేశము 1947లో జడ్చర్లలో జరిగినది. హైదరాబాదులో పోలీసుచర్య జరిగిన తరువాత స్టేటు కాంగ్రెస్, హైదరాబాదు ప్రదేశ కాంగ్రెస్‌గా రూపొంది ప్రత్యేకముగా హైదరాబాదులో ఆంధ్ర ప్రాంతమునకు కాంగ్రెస్ కమిటి అవకాశము లేకపోయినది."[14]

ఖమ్మంలో కమ్యూనిస్టు వర్గం వారు ఆంధ్ర మహాసభను వేరే జరుపుకున్న తరువాత హనుమంతరావు పంతులుగారు ఆ సంస్థకు కొంత దూరంగా ఉన్నట్లు కనబడుతున్నది. ఈ విభేదములవల్లను, వృద్ధాప్యము వల్లను హనుమంతరావుగారు ఆంధ్ర మహాసభ సంబంధమును త్రెంపుకొని విచారపూరిత హృదయముతో, భాష్పపూరిత నయనములతో నీ విషమ పరిస్థితులను విలోకించుచుండిరి. శ్రీవారి అభిప్రాయము జాతీయవాదుల పక్షమున మ్రొగ్గుదల జూపుచున్నను, యువకుల యుత్సాహమునకు కార్యదీక్షకు లోలోన సంతసించుచుండిరి. ఇట్టి మహత్తరమయిన కార్యజాతమును సమాచరించుటకు శ్రీవారు పూనిన ఆయుధము 'ఓర్పుగుణము'. ఈ ఓర్పు గుణమొకటి యున్నచో, సవ్యముగ ప్రచారము సాగినచో, కాలమే సర్వకార్యములను చక్కబఱచునని శ్రీవారి సిద్ధాంతము". [15]

హనుమంతరావుగారి ఆంధ్రోద్యమ నిర్వహణం నిజాం రాష్ట్రంలో మహారాష్ట్ర, కర్ణాటకోద్యమాల పుట్టుకకు మార్గదర్శకమైందని మహారాష్ట్ర నాయకులైన కాశీనాథరావు వైద్యా, కర్ణాటక నాయకులై జనార్దనరావు దేశాయి గార్లు 1945లో హైదరాబాదులో పంతులుగారికి జరిగిన పౌరసన్మానంలో పేర్కొన్నారు. అది ఆంధ్రోద్యమ జయంతి సందర్భంగా జరిగిన సభ. ఒక నాడు తెలుగు వక్తను అవహేళన చేసినందుకు ప్రతిఫలంగా ఆంధ్ర మహాసభ పుట్టింది. ఆ సభ చివరకు నవ్విన నాప చేనుగా పండింది. నవ్వినవారికే నాణెమైన బాట చూపింది. ఆ బాటను చూపిన మార్గదర్శి, మహర్షి శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు. "Great men are the fuide-posts and landmarks in the State' అన్న ఎడ్మండ్ బర్క్ మాటలకు మాడపాటి వారు మంచి ఉదాహరణం!

ఆంధ్రోద్యమానికి కర్ణధారులై నడిపించటం ఎంత గొప్ప విషయమో, దాని చరిత్ర వ్రాయటం కూడా అంత గొప్ప విషయమే. మాడపాటి హనుమంతరావు పంతులుగారు తెలంగాణా ఆంధ్రోద్యమ చరిత్రను రెండు సంపుటాల్లో రచించారు. సమకాలీన ఉద్యమ చరిత్రను కన్నులకు కట్టేటట్లు చిత్రించటమే కాకుండా స్వీయాభిరుచులకు తావీయకుండా నిష్పాక్షిక దృక్పథంతో నిర్మించిన చారిత్రక సమీక్షా గ్రంథం అది. ఆంధ్రోద్యమ

14. తెలంగాణలో జాతీయోద్యమాలు. పుటల 57-58

15. మా. హ. జీ. చరిత్ర పుటలు -41

చరిత్ర లేనిదే విశాలాంధ్ర చరిత్ర సమగ్రం కాదు. అట్టి ఉద్యమ చరిత్ర రచనకు పంతులుగారి కంటే అర్హులు మరొకరు ఉండబోరు. అది ఒక విధంగా వారి జీవిత చరిత్ర అని చెప్పవచ్చు. కాని వారు రచించిన వైఖరిలో ఆత్మ ప్రత్యయం కానరాదు. తానా చరిత్రలో ఒక ప్రధాన పాత్ర నిర్వహించినా, దానికంటే అతీతంగా నిలబడి సాక్షిగా సారించిన చూపు అందులో కనపడుతుంది. సత్య కథనమే వారి లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తుంది. అట్టి దృష్టి చరిత్రకర్తకు అత్యవసరము.

"ఈ చరిత్ర గ్రంథమును పరిశీలించిన యెడల ఆంధ్ర సోదరుల వాంఛలు, దేశభక్తి, కార్యచతురత, ఉప్పొంగులు, ప్రోత్సాహ నిరుత్సాహములు మున్నగునవి ప్రస్ఫుట మగుచుండును. అంతియేకాదు. నిజాం ప్రభుత్వం వారి కుటిల రాజనీతి, నిరంకుశ పరిపాలనా విధానము, మతపక్షపాతము, ప్రజోద్యమముల యెడగల విముఖత్వము, ఇంతయేల గ్రంథకర్త నిగ్రహమువీడి చెప్పినట్లుగా, వారి 'అయోగ్యత, ప్రజల వాక్స్వాతంత్ర్యము నెడ వారి విద్వేష భావము' చక్కగా విశదము కాగలదు".

"మఱియు, ఆంధ్ర మహాసభానుబంధములుగ నుండిన పెక్కు ఉద్యమములు సభలు, ప్రచారములు ఇత్యాదులు పరిపూర్ణముగ నిందు వర్ణితమగుటచే, ఈ గ్రంథ సౌందర్యము, యోగ్యత, ప్రయోజనము విస్తరించినది. ఇట్టి ఉద్యమ చరిత్రలు తెలుగుభాషలో లేవు". అని సంపాదకులు రచించిన పీఠికలోని మాటలు ప్రత్యక్షర సత్యములు.

ఉద్యమాలు ఒక్క చేతిమీద నడవవు. కాని, ఒక కాలంలో ఒక మహా చైతన్యాన్ని సమాజంలో సృజించిన మహనీయులుంటారు. వారిలో చుక్కల్లో చంద్రుడులాగా రాణించే మహాత్ములుంటారు. వారి కార్యదీక్షా వ్రతంతోనే ఉద్యమం సత్ఫలితాలను సాధిస్తుంది. చరిత్ర పురోగమిస్తుంది. "Men make history and not the other way round. In periods where there is not leadership, society stands still. Progress occurs when courageous, skillful leaders seize the opportunity to change things for the better" అన్న హెన్రీ యస్. ట్రూమన్‌గారి మాటలిచ్చట స్మరణీయాలు.

హనుమంతరావు పంతులుగారు తెలంగాణంలో ఒక నాయక తరాన్ని సృష్టించారు. అందువల్ల కూడా వారు పితామహులైనారు. సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు. పులిజాల వెంకట రంగారావు, కొండా వెంకట రంగారెడ్డి, మందుముల నరసింగరావు, మందుముల రామచంద్రరావు, రావి నారాయణరెడ్డి, మాదిరాజు రామకోటేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి, గడ్డం రామకృష్ణారెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు గారలవంటి తెలంగాణా నాయకులు వీరి సహచరులుగా నుండి పరిణతి సాధించిన వారే. పంతులుగారికి రాజాబహద్దర్ వెంకట్రామారెడ్డిగారి వంటి పరిపాలనాదక్షుల ఆదరాభిమానాలు ఉండేవి. రాజకీయనాయకులతో పాటు ఎందరో సాహితీపరులు, సంస్థా వ్యవస్థాపకులు, సంఘసేవకులు వీరి శిక్షణలో వ్యక్తిత్వాలను సంతరించుకొన్నారు. పంతులుగారు తెలంగాణంలో ఆంధ్రోద్యమానికి నారు పోశారు, నీరు పోశారు. అది పంటకు రావటం చూశారు; ఆ పండ్లను చూచి ఆనందించారు. వారి అదృష్టాన్ని శ్రీ ఒద్దిరాజు రాఘవ రంగారావుగారిలా సంస్తుతించారు.

'పలుకగా నేరని పత్రిక బుడుతల
    'కతత' యని మాటలాడ నేర్పి,
వాక్రువ్వ నేరని పండితలోకము
    గొమ్మెక్కి 'కో' యని కూయ నేర్పి,
వ్రాయగా జంకెడి పడుచుల కలముల
    గిలుకుల దెసలంట గలువనెట్టి,
మదిలోని భావాళి మాటాలడి వెలిబుచ్చ
    విన్న పోయెడు వారి వెన్ను జఱచి
ఆంధ్ర సారస్వతము నిజామాంధ్ర సంఘ
మిటుల నెన్నిటినో గూర్చు ఘటికులందు
నొక్కురుడవయి మించితే నుక్కు మిగుల
రమ్యగుణ సాంద్ర! హనుమంత రాయచంద్ర!'

'నీవు నాటిన మొలకలు నీవు చూచు
చుండ గెలవేయ జూచు భాగ్యోదయంబె
నీకుఁగల్గె నదృష్టంబు నీదకాదె
ప్రాజ్య గుణధుర్య! హనుమంతరాయవర్య?" (షష్టిపూర్తి సంచిక)

6

హనుమంతరావు పంతులుగారు ఆంధ్రోద్యమానికే కాక తెలంగాణంలో ఆంధ్ర మహిళోద్యమానికి గూడా ఆరంభకులు. ఇందులో వీరేశలింగం పంతులు గారు వారికి ఆదర్శమూర్తులు పురుషుడు నేర్చుకొన్న చదువు సంప్రదానానికి పనికి వస్తుంది; స్త్రీ నేర్చుకున్న చదువు సంప్రదాయాన్ని సృష్టిస్తుంది. తెలంగాణంలో విద్యావ్యాప్తి కావాలని కంకణం కట్టుకుని గ్రంథాలయోద్యమాన్ని నడిపిన పంతులుగారు సమస్యలోని ప్రాణాన్ని

పట్టుకున్నారు. చదువున్న పురుషుడు సంఘసేవకు పూనుకొని జాతి వికాసానికి తోడ్పడుతుంటే, స్త్రీ అజ్ఞానాంధకారంలో మునిగి ఉన్నప్పుడు అతని కృషిలోని గొప్పతనాన్ని గుర్తించలేకపోవచ్చు; ఒక్కొక్కసారి పురుషుడికి అవరోధం కావచ్చు. స్త్రీ విద్యావతి అయ్యుంటే ఆమె తననూ, తన పురుషుణ్ణి, తన సంతానాన్ని, తనచుట్టూ ఉన్న సమాజాన్నీ వికాసవంతం చేయగలదు. స్త్రీ విజ్ఞానాన్ని వాత్సల్యంతోను, సేవను స్నేహంతోను వ్యాప్తిచేయగలదు. ఒక స్త్రీ చదువుకున్నదంటే ఒక కుటుంబం చదువుకున్నదన్నమాట! ఈ సత్యాన్ని గుర్తించిన పంతులుగారు మహిళాభ్యుదయం కూడా సాధించినప్పుడే దేశాభ్యుదయం సార్థకమౌతుందని భావించి, ఆంధ్రోద్యమ భాగంగా ఆంధ్ర మహిళోద్యమాన్ని ప్రారంభించటమే కాకుండా హైదరాబాదులో బాలికల విద్యావ్యాప్తికి అంకితమయ్యే విద్యాలయాలను స్థాపించి కృషి చేశారు. ఆంధ్ర మహిళాసభ సమావేశాలు ఆంధ్ర మహాసభ సమావేశాలలోనే జరుగుతూండేవి. స్త్రీ జన సమస్యలనిందు ప్రత్యేకంగా చర్చించి, తగిన నిర్ణయాలను తీసికొని వాటిని అమలులో పెట్టటానికి కార్యకర్తలు కృషి చేస్తుండేవారు. వారి కందరికీ గురుపీఠం మాడపాటి హనుమంతరావుగారు. స్త్రీల సమావేశాల ప్రాముఖ్యం, స్రీ విద్యావశ్యకత, విద్యాసంస్థల స్థాపనావశ్యకత, నిర్భంద ప్రారంభోచిత విద్యావసరం, స్త్రీలకు వైద్యవిద్య, రోగులకు ఉపచారాలు చేసే నేర్పు ఉండవలసిన అవసరం, ఆరోగ్యవారాలు, శిశువారాలు జరుపవలసిన ఆవశ్యకతను ఈ సభలో చర్చించి నిర్ణయాలను తీసికొనేవారు. స్త్రీలలో వెనుక బడిన ఆచారంగా ఉంటున్న పరదా పద్ధతి వల్ల కలిగే నష్టాలు చర్చించి దాన్ని మహిళా సభ ఖండించింది. కళావంతుల్లో వివాహపద్ధతిని ప్రవేశ పెట్టాలనీ, వితంతూద్వాహాలను ప్రోత్సాహించాలనీ మహిళాసభ ప్రచారం చేసింది. మహిళోద్యమంలో పాల్గొని పంతులుగారి దర్శకత్వం క్రింద దేశసేవ కావించిన మహిళామణుల్లో – శ్రీమతులు నడింపల్లి సుందరమ్మ, టి. వరలక్ష్మమ్మ, ఎల్లాప్రగడ సీతాకుమారి, మాడపాటి మాణిక్యమ్మ, బూర్గుల అనంతలక్ష్మీదేవి, నందగిరి ఇందిరాదేవి, యోగ్యశీలాదేవి, రంగమ్మ ఓబులరెడ్డిగారలను పేర్కొన వచ్చు.

ఆంధ్ర మహిళాసభ సమకాలీన సమస్యలను దృష్టిలో ఉంచుకొని సంఘ సంస్కారానికి పనిచేసే పంతులుగారు స్థాపించిన విద్యాసంస్థలు తరతరాల స్త్రీ విద్యకు జీవప్రవంతులుగా వెలుగునూ, చైతన్యాన్నీ ప్రసాదిస్తున్నాయి. పంతులు గారికి, పెంపుడు కూతురు లాంటిది పరోపకారిణీ పాఠశాల, కన్న కూతురు లాంటిది ఆంధ్ర బాలికల ఉన్నత పాఠశాల, మనుమరాలు లాంటిది రాజా బహుద్దర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల. పరోపకారిణీ పాఠశాల ప్రాథమిక విద్యకూ, ఆంధ్ర బాలికోన్నత పాఠశాల మాధ్యమిక విద్యకూ, మహిళా కళాశాల ఉన్నత విద్యకూ సోపాన క్రమాన్ని సంతరిస్తున్నవి. పంతులుగారి నిర్యాణం తర్వాత బాలికోన్నత పాఠశాల వారి పేరుమీద వెలయటం ఎంతో సముచితం. వారికా పాఠశాల పోషణ నిర్మాణంలో సహకరించిన వారిలో రాజా బహద్దర్ వెంకట రామారెడ్డి గారు ప్రముఖులు. సంస్థా నిర్వహణంలో వారికి వడ్లకొండ నరసింహారావుగారి సహకారం ఎంతో లభించింది. పంతులుగారి షష్టిపూర్త్యుత్సవాలలో వచ్చిన తులాభార ధనంతో ఏర్పడిన ఆంధ్ర సారస్వత నిక్షేపనిధుల సహాయంతో (రూ. 19వేలు) 1954లో ప్రారంభమైంది మహిళాకళాశాల, పంతులుగారి మహిళోద్యమాన్ని గురించీ, వారి వ్యక్తిత్వాన్ని గురించీ శ్రీమతి ఎల్లాప్రెగడ సీతాకుమారిగారు చేసిన ప్రశంస సంస్మరణీయమైంది.

"హనుమంతరావుగారికి సమాజాలే సంతానము. మహాసభ ఒక పుత్రుడు; మహిళాసభ ఒక పుత్రిక; సోదరీ సమాజము ఒక తోబుట్టువు; భాషానిలయము ఒక గారాబుబిడ్డ, అందరికన్న అనుంగుబిడ్డ ఆంధ్ర బాలికా పాఠశాల".

"ఒక్కమాటలో చెప్పాలంటే, వీరేశలింగం గారి తరువాత మన రాష్ట్రంలో స్త్రీ జనోద్ధరణానికి పాటుబద్ధ ప్రధానవ్యక్తి ఆంధ్ర పితామహుడే".

"హనుమంతరావు గారు ఒక మహావ్యక్తియే కాదు; ఒక మహాసంస్థ. సజీవమైన విజ్ఞాన సర్వస్వము తెలంగాణము పండించిన ముత్యాల పంట.".

"హనుమంతరావుగారి చరిత్రమే ఆంధ్రోద్యమ చరిత్ర, దాని జీవితమే పంతులుగారి జీవితము".

7

పంతులుగారి షష్టిపూర్త్యుత్సవం హైదరాబాదు నరంలో 1947 ఫిబ్రవరి 6వ తేదీన రెడ్డి హాస్టలు వసతి గృహంలో వైభవోపేతంగా నిర్వహింపబడింది. ఆ తరువాత తెలంగాణా ప్రధాన నగరాల్లో కూడా ఆ ఉత్సవాన్ని ఉత్సాహంతో ప్రజలు పండుగ్గా జరుపుకున్నారు. షష్టిపూర్తి ఉత్సవంలో పంతులు గారు తులాభారం తూగటం ఒక విశేషం. ఆ తులాభార ద్రవ్యం రూ॥ 6400-00 రాగా దానినీ, సన్మానరూపంగా వచ్చిన మొత్తాన్ని కలిపి మొత్తం 8,420రూ॥15 అణాలను ఆంధ్రభాషలో పుస్తక ప్రచురణార్థం 'ఆంధ్ర సారస్వత నిక్షేపనిధి'గా ఏర్పాటు చేయటం మరో విశేషం. స్వార్థాన్ని పరహితార్థంగా భావించే పంతులుగారి త్యాగబుద్ధికి ఆ నిక్షేపం ఒక నిదర్శనం. దాని నుండి పుట్టిందే 'ఆంధ్ర చంద్రికా గ్రంథమాల.' ఆ గ్రంథమాలలో ఖండవల్లి బాలేందుశేఖరంగారి 'విస్మృత సామ్రాజ్యములు', 'ప్రాచీన జాతులు'; ఖండవల్లి లక్ష్మీరంజనంగారి 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము'; ఆదిరాజు వీరభద్రరావుగారి 'ప్రాచీనాంధ్ర నగరములు'; మాడపాటి హనుమంతరావు పంతులుగారి 'తెలంగాణ ఆంధ్రోద్యమము' (రెండు భాగాలు); మారేమండ రామారావుగారి 'రాజకీయ పరిజ్ఞానము', బి.వి. రమణారావుగారి 'వైజ్ఞానికుల జీవితములు' ప్రచురితములైనవి. వీని స్వరూప స్వభావాలను గమనిస్తే అవి ప్రధానంగా చారిత్రక, వైజ్ఞానిక, జీవితచరిత్ర రంగాల నాశ్రయించి యున్నట్లు స్పష్టమౌతుంది. ఈ దృక్పథం లక్ష్మణరావు పంతులుగారి విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ప్రభావంవల్ల నేర్పడిందే. ఆంధ్ర మహాసభ రోజుల్లోనే ఆంధ్ర పరిశోధక సంఘం స్థాపింపబడింది. అది క్రమంగా లక్ష్మణరాయ పరిశోధకమండలిగా రూపొంది స్వతంత్ర ప్రతిపత్తితో గ్రంథప్రచురణలను నిర్వహించటం ప్రారంభించింది. ఆంధ్రేతిహాస రహస్యాల నెన్నింటినో వెలికి తీసిన శాసనాలను ప్రచురించి ఈ సంస్థ చరిత్రకు, విజ్ఞానానికీ యెనలేని సేవ చేసింది. పరిశోధక మండలి పరిశోధనపై ఊనిక ఇస్తే ఆంధ్ర చంద్రికా గ్రంథమాల ప్రజారంజకంగా చరిత్ర సాహిత్య విజ్ఞానాన్ని అందించటానికి ప్రయత్నం చేసింది. ఒకటి పరిశోధకులకూ, మరొకటి సహృదయులకూ సన్నిహితమై సాహిత్య సేవ చేశాయని చెప్పవచ్చు.

1954 నాటి ఆంధ్ర సారస్వత నిక్షేపంలో పందొమ్మిదివేల రూపాయలు నిలువ ఉంది. అప్పటి ప్రచురణ కార్యక్రమం కంటె స్త్రీల కళాశాల పోషణం ముఖ్యమని తలచి పంతులుగారా ద్రవ్యాన్ని రాజాబహద్దర్ వెంకట రామారెడ్డి మహిళాకళాశాల నిధికి విరాళంగా ఇచ్చివేశారు. బహుశః పంతులుగారు బెంజిమిన్ ఫ్రాన్క్లిన్ లాగా "An investment in knowlege pays best interest" అని భావించి ఈ రెండు నిర్ణయాలూ తీసికొని ఉంటారు.

ప్రజలు స్వయంగా చదువుకొని సమకాలీన సమస్యల పరిజ్ఞానాన్ని తెలుసుకునే నిమిత్తం హనుమంతరావుగారు 'అణా గ్రంథమాల' అనే చిత్రమైన ప్రచురణ ప్రయోగాన్ని నిర్వహించారు. చౌకధరలో, పరిచయాత్మకమైన చిన్ని పుస్తకాల ద్వారా ప్రజాజీవితానికి కావలసిన దాదాపు 25 అంశాలపై విజ్ఞానవ్యాప్తి చేశారీ గ్రంథమాల ద్వారా. నిజాం రాష్ట్రాంధ్రులు, వర్తక వ్యాపారం, వెట్టిచాకిరి, వ్యవసాయకులకు కొన్ని సూచనలు, మద్యపానము, గ్రంథాలయములు, మన వాక్స్వాతంత్ర్యము, ఋణబాధానివారణ, మన విద్యాసమస్యలు, గస్తీనిషాన్ 53 యొక్క వివరణ, జన పరిగణన వృత్తాంతములు, నిజాం రాష్ట్రాంధ్రుల అభివృద్ధి మార్గములు, మొమతర్ఫా న్యాయస్థానములు, దేశభాషలు – ఇలాంటి విషయాలపై ప్రచురణలు వచ్చాయి. అవి వేల సంఖ్యల్లో అమ్ముడు పోయేవి. ఈ గ్రంథమాల ప్రజాదరణాన్ని బహుళంగా చూరగొన్నది.

పంతులుగారు తాము నిర్వహించే దేశసేవ కార్యక్రమంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని భావించేవారు. వారి నాకర్షించి ఉత్సాహపరిచే కార్యక్రమాలను రూపొందిస్తుండేవారు. ఆంధ్ర విద్యార్థులలో వక్తృత్వ పోటీలు పెట్టడం, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పట్టభద్రులైన తెలుగు వారికి సన్మానాలు, చిత్రకారులకు ఆర్థిక సహాయం చెయ్యటం లాంటి ఎన్నో యువ జనోత్సాహ పోషకాలైన కార్యక్రమాలను చేపట్టేవారు. వారు పెద్దల్లోపెద్దలుగా పిన్నల్లో తలలో నాలుకలా వర్తించేవారు.

సమర్థులైన యువకుల్ని కార్యరంగంలోకి లాగటానికి పంతులుగా రుపయోగించే సమ్మోహనాస్త్రాలు 'లేఖలు'. పంతులుగారి లేఖల ప్రభావం ఎలాంటిదో వారి లేఖలచేత ప్రభావితులైన శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి మాటల్లో వినండి!

"ఇప్పటికి ముప్ఫై ఆరు సంత్సరాల క్రిందిమాట 1939లో నిజాం కళాశాల నుండి డిగ్రీ తీసుకొన్న తరువాత ఒకటి రెండు సంవత్సరాలు తీరికగా ఇంటిలో ఉండటం తటస్థించింది. ఆ కాలంలో న్యాయవాద వృత్తి అవలంబించవలెనా లేక వ్యవసాయము మొదలైన ఇంటి వ్యవహారాలు చూచుకొనవలెనా అని ఆలోచించుకుంటున్న రోజులు. కాలక్షేపానికి కొంత కవితా వ్యాసంగము, రచనా వ్యాసంగము చేస్తుండేవాణ్ణి. ఆ సందర్భంలో గోలకొండ పత్రికలో కొన్ని వ్యాసాలు వ్రాసి ప్రచురించే అవకాశం కలిగింది".

"నా మొట్ట మొదటి వ్యాసము పత్రికలో ప్రకటితమైంది. ఎంతో సంతోషం కలిగింది. రెండు రోజుల తర్వాత సన్నని దస్తూరితో 'మిత్రవరా!' అని సంబోధిస్తూ వ్రాసిన కార్డు ఒకటి అందింది. ఆ కార్డు హైదరాబాదు రాష్ట్రంలోని సమస్త ప్రజాహిత జీవనానికి, సాంస్కృతిక కార్యకలాపాలకు అన్నింటికీ మార్గదర్శకులైన మూలవిరాట్టు ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు పంతులుగారు వ్రాసింది. వారి ప్రశంస నన్ను పరమానంద భరితుణ్ణి చేసి, సాహిత్యరంగంలో కృషిచేయవలెననే సంకల్పము రేకెత్తించింది. నా వ్యాసాన్ని హర్షిస్తూ హైద్రాబాదు వచ్చినప్పుడు తమను తప్పక కలుసుకోవలసిందిగా పంతులుగారు నన్ను ఆ కార్డులో కోరినారు. అంతటి మహావ్యక్తి కోరికను ఆదేశంగా భావించి, తరువాత కొన్ని వారాలకు హైదరాబాదు వచ్చి, సందర్శించినాను. ఆనాడు వారు నాపట్ల చూపిన ఆదరము, నాకు ఇచ్చిన ప్రోత్సాహము నా జీవితంలో ఎన్నడూ మరువజాలను. ఆనాటి వారి ప్రోత్సాహమే తరువాత నాకాలాన్ని పూర్తిగా సాంస్కృతిక కార్యకలాపాలకు వినియోగించటానికి కారణభూతమైనది. విద్యాధిక యువకులను ప్రజాసేవవైపు ఆకర్షించడం పంతులుగారి ఆశయాలలో ఒకటి!"

"1942లో 'తెలంగాణ' దినపత్రికగా హైదరాబాదు నుండి వెలువడింది. ఆ పత్రిక సంపాదక వర్గంలో చేరవలసిందని హనుమంతరావు పంతులుగారు స్వదస్తూరితో మరొక జాబు వ్రాసినారు. కాని, నేను నాగపూరు న్యాయ కళాశాలలో చేరినందువలన ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు. అయితే హైదరాబాదుకు వచ్చిన ప్రతి సందర్భంలోనూ పంతులుగారిని సందర్శించి, వారితో కొంతకాలము గడిపి, ఉత్తేజితుణ్ణి అయ్యేవాడిని. వారి సలహాలను ఆశీర్వచనాలను పొందేవాడిని. వారు నాపట్ల చూపిన ఆదరాభిమానాలు నా ప్రజాహిత జీవనానికి మార్గదర్శకాలైనవి".

"క్రమశిక్షణ, సమయపాలన, విశేషించి సంస్థలడబ్బు వినియోగించడంలో కఠినమైన నియమాల పాటింపు [16] ప్రజాసంస్థలకు సుస్థిరమైన పునాదులను నిర్మించవలెననే దీక్షా నేను పంతులుగారి నుండి నేర్చుకున్న పాఠాలు. ఆ పాఠాలను సరిగా అభ్యసించి, అందుకు అనుగుణంగా వ్యవహరించి నందువల్లనే నేను కొద్దో గొప్పో భాష సేవ, దేశసేవ చేయగలిగాను. నా జీవితంలో ఈ మలుపుకు కారణభూతులు హనుమంతరావు పంతులుగారే!".

"ఆయన మరెందరికో మార్గదర్శకులైనారు. నాటి తెలంగాణా పరిస్థితులు తెలిసిన వారందరికీ యీ సత్యము విదితమే కదా!" [17]

పంతులుగారి దేశసేవ చరిత్రను సృష్టించగల సంస్థలను స్థాపించటంలో ఎంత కనబడుతుందో సంస్థలను స్థాపించి సంఘచైతన్యాన్ని పోషించే యువకులను ప్రోత్సహించటంలో అంత కనపడుతుందని శ్రీ రామానుజరావుగారు చెప్పిన యుదంతం సాక్ష్యం. పంతులుగారికి ప్రజా సంస్థలు స్థిర కీర్తిపతాకలు; దేశ సేవకులైన వారి అనుయాయులు జంగమ కీర్తిపతాకలు.

16. "ప్రతి చిన్న విషయములోను కట్టుబాటు; అందు ఆవంత పొరపాటును గూడ గుమ్మడికాయంతగా జూతురు. సహింపనే సహింపరు. తమ యింటి లెక్క యెట్లో ప్రజానిధి లెక్కయునట్లే. దమ్మిడీ దమ్మిడీ లెక్క పట్టవలె. ఆ లెక్క సరిగా కుదరవలె. ఏదిన్నీ వ్యర్థము పోరాదు. "ఆనెగొంది లెక్కలు వారికి సరిపడనే సరిపడవు" – శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు – గోలకొండ పత్రిక.

17. నందిని – యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ మాసపత్రిక – 1975, మే. సం. 1, సంచి. 5

8

పంతులుగారి షష్టిపూర్త్యనంతర జీవితం వారి ప్రజాసేవలో మూడవ ఘట్టం. హైదరాబాదు నగర మేయరుగా నాలుగేళ్లు. (1951–54), ఆంధ్ర ప్రదేశ శాసనమండలి అధ్యక్షులుగా ఆరేండ్లు (1958–64) పంతులుగారు ప్రజాసేవ నిర్వహించారు. పరిపాలనలో, సభామర్యాదలలో ఉత్తమ ప్రమాణాలను సృష్టించారు. కేంద్రప్రభుత్వం వారు వారి ప్రజాసేవను గుర్తించి 1955లో 'పద్మభూషణ' బిరుదాన్ని ప్రసాదించారు [18]. ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు 1956లో గౌరవ డాక్టరేట్ పట్టాన్నిచ్చి గౌరవించారు. ఈ బిరుదులు తాత కోటుకు మనుమల లంకరించిన ప్రశంసా పతకాల్లా మెరుస్తున్నాయి.

ఆంధ్ర పితామహులు కన్నకలలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రరూపంగా ఫలించాయి. తెలుగువారంతా ఏకమై నివసిస్తున్న వెలుగు గడియల్ని కళ్లారా చూచి సంతోషించారు. తన కార్యక్షేత్రమైన హైదరాబాదు నగరానికి మేయరు కావటం, ఆంధ్ర ప్రజలందరి శాసనమండలికి అధ్యక్షులు కావటం తెలుగువారు వారి పట్ల చూపిన భక్తి ప్రపత్తులకు పరమ నిదర్శనాలు.

ఈ రోజెవరైనా హైదరాబాదు నగరాన్ని దర్శిస్తే హనుమంతరావు పంతులుగారీ నగరానికిచ్చిన తెలుగుదనం ప్రస్ఫుటంగా ప్రత్యక్షమౌతుంది. వారి నివాసం 'ఆంధ్ర కుటీరం' ఆంధ్రోద్యమ చైతన్యానికి కేంద్రబిందువు. మాడపాటి హనుమంతరావు పంతులు బాలికోన్నత పాఠశాల, రా.బ.వేం.రా. రెడ్డి మహిళా కళాశాల పంతులుగారి ఆంధ్ర స్త్రీ విద్యా వికాస సేవకు శాశ్వత పతాకలు. ఉస్మానియా విశ్వవిద్యాలయం మాతృభాషాభ్యసనాభివృద్ధికి పోరాడిన వారి కార్యరంగం. ఆంధ్ర యువతీమండలి వారి ఆంధ్ర మహిళాసభ సాధించిన ప్రగతికి ప్రత్యక్ష దృష్టాంతం. శ్రీ కృష్ణదేవరాయంధ్ర భాషా నిలయం వారి ఆదర్శాలను నమ్మి భాషా సాహిత్య సేవలు చేస్తున్న తెలుగువారి ప్రౌఢ సాహిత్య సంస్థ! రెడ్డి విద్యార్థి వసతి గృహం వారితో రాజాబహద్దరు వారి కున్న చెలిమికి చిహ్నం. వారి పేర వెలసియున్న వీథి ప్రజలకు వారు చూపిన మేలిబాటకు మిగిలియున్న గుర్తు. ఆంధ్ర ప్రదేశ రాజధానిలో తెలుగు వారి సంస్థ ఎక్కడ ఉన్నా దానికీ పంతులుగారికీ ఏదో సంబంధం ఉండి ఉంటుంది. ఆ సూత్రధారు దాడించిన జాతి జీవిత నాటకంలో పాత్రలు నిర్వహించిన భూమికలు ఆ సంస్థలు! జాతికి వారిచ్చిన నిర్మాణాత్మకమైన ఉద్యమస్ఫూర్తి, జీవితంలో వారు చేసిన త్యాగ విస్ఫూర్తి, తెలుగు జీవితంలో కలకాలం వెలుగు రేకల్ని వెదజల్లుతూనే ఉంటాయి.

పంతులుగారి దేశసేవను సింహావలోకనం చేస్తే నాటి తెలంగాణ పత్రిక మాటలే నేటికీ మననోట వెలువడతాయి–

"నేటికినీ భారతీయ దేశీయ సంస్థానములలో ప్రజాస్వామ్యోద్యమములు వృద్ధి నందుటకు అనుకూలములు బొత్తిగా లేవన్నచో 1920 సంవత్సరమున హైదరాబాదు నందలి పరిస్థితి సులభముగా నూహింపవచ్చును. అట్టి పరిస్థితిలో కామధేనువు వంటి న్యాయవాది వృత్తి గల్గియు, సౌఖ్యజీవనము గడుపుటకు అన్ని వీళ్లు కల్గియు వాటి నన్నిటిని త్యాగము చేసి, ప్రభుత్వ వ్యతిరేకతను, ప్రజల యుదాసీనతను ఎదుర్కొనుచు ప్రజాసేవా కార్యమున దుమికిన శ్రీ హనుమంతరావు పంతులుగారికి ఎంత యున్నత స్థానమిచ్చినను తక్కువే".

(తెలుగు వైతాళికులు – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి)

డాక్టర్ గిడుగు వేంకట సీతాపతి

వ్యావహారిక భాషావాదము - గిడుగు రామమూర్తిగారు

వ్యావహారిక భాషావాదము ఎప్పుడు, ఎట్టి పరిస్థితులలో పుట్టి విజృంభించినదో, ఇందులో మా నాన్నగారు గిడుగు రామమూర్తి గారి కృషి ఎట్టిదో, ఎంత వరకు సఫలమైనదో ఈతరము వారికి లెస్సగా తెలియదు. ఈ వాదము పుట్టిననాటి నుండిన్ని దీని తోడి సంబంధము అంతకంతకు ఎక్కువగుతూ వచ్చినవాడను గనుక ఈ వాదము గురించి తెలియజేస్తున్నాను.

వైస్‌రాయ్ కర్జన్ ప్రభువు నియమించిన ఎడ్యుకేషనల్ కమిషన్ నివేదిక 1905లో ప్రకటితమయినది. అందులో బి.ఏ., ఎమ్.ఏ. పరీక్షలలో ఉత్తీర్ణులయినవారు తాము నేర్చుకొన్న ఆధునిక శాస్త్ర విజ్ఞానమును తమ మాతృభాషలో చెప్పలేకుండా ఉన్నారనిన్ని అందుకు కారణము తాము నేర్చుకొన్నది ఫస్టుపారం నుండిన్ని ఆంగ్ల భాష ద్వారానే అయినదనిన్ని తేలినది. దీనినిబట్టి విద్యా విధానములో మార్పులు గలిగినవి. మెట్రిక్యులేషన్ స్థానమందేర్పడిన స్కూల్ ఫైనల్ విద్యార్థులున్ను ఎఫ్.ఏ. స్థానమందేర్పడిన ఇంటర్మీడియట్ విద్యార్థులున్న మాతృభాషలో వ్యాసరచన, ఆంగ్ల భాష వచనమునకు మాతృభాషలో విధిగా అనువాదమున్ను చేయవలెనన్న నియమము ఏర్పడినది. సరిగా ఆ సమయమందే అనగా 1906లో గంజాం, విశాఖపట్టణం, గోదావరి జిల్లాలకు విద్యాశాఖోద్యోగిగా నియమితులైన జే.ఏ. యేట్సు దొర పుస్తకాలలో ఉన్న తెలుగు భాషకున్ను, వ్యవహారమందున్న తెలుగుభాషకున్ను చాలా వ్యత్యాసమున్నందుకు ఆశ్చర్యపడి, అందుకు కారణమేమని వారు పండితులను, విశాఖపట్టణం ఏ.వి.ఎన్. కాలేజ్ ప్రిన్సిపాల్‌గా నుండిన పీ.టీ. శ్రీనివాస అయ్యంగారిని ప్రశ్నించారు. "వాడుకభాష గ్రామ్యం, గ్రంథరచనకు పనికిరాదు. వాచకములలోని భాష గ్రాంథికం, సలక్షణమైన భాష' ' అని పండితులు చెప్పారు. "నేను అరవవాడను, నేనంతగా చెప్పలేను. మీరు విజయనగరం వెళ్ళినప్పుడు గురజాడ అప్పారావు గారిని, పర్లాకిమిడి వెళ్ళినప్పుడు గిడుగు రామమూర్తి గారిని కలుసుకొని సంప్రదించండి, వారు చెప్పగలరు" అని అయ్యంగారు చెప్పారు. వారి సలహాను అనుసరించి యేట్సుదొర అప్పారావు గారిని విజయనగరంలోను, రామమూర్తిగారిని – అనగా మా తండ్రి గారిని – పర్లాకిమిడిలోను 1906లో కలుసుకొని సంప్రదించారు. "పద్యాలు, పాటలు రచించినప్పుడు కొద్దిగా కావ్యభాషలోని ప్రయోగాలు రసపోషణ కోసం ప్రయోగిస్తూ ఉంటాను. కాని వచనం మాత్రం వాడుక భాషలో సాగిస్తాను. అందులోను నాటకాలకు పాత్రోచితమైన భాష రసవంతంగా ఉంటుందని నా అభిప్రాయం. అందుచేత నా కన్యాశుల్కం నాటకాన్ని పాత్రోచితమైన వాడుకభాషలో రచించాను. పండితులతో వాదం పెట్టుకొన్న ప్రయోజనం లేదని నెమ్మదిగా నా పని నేను సాగించుకొంటున్నాను. మీ స్కూళ్లలోను కాలేజీలలోను తమ రచనలను పాఠ్యగ్రంథములుగా పెట్టించుకొనదలచిన వారు పిల్లల

"బాలబోధనల"నైనా ఆ కావ్యభాషలో వ్రాయాలి, లేకపోతే మీవంటి విద్యాధికారులు సమ్మతించరు. ఇంతకూ నేనిప్పుడు ఉపాధ్యాయుడను కాను గనుక నా మాట చెల్లదు. పర్లాకిమిడిలో నా స్నేహితుడు గిడుగు రామమూర్తి ఉపాధ్యాయుడుగా ఉన్నారు. భాషాతత్త్వము చదువుకొన్నవాడు. అతని సంప్రదించండి" అన్నారు అప్పారావు గారు.

'నేను భాషాతత్త్వము కొద్దిగా చదువుకొన్నవాడనే కాని తెలుగు సాహిత్యంగాని, వ్యాకరణాలుగాని అంతగా చదువుకొన్నవాడనుకాను కవినీ కాను, గ్రంథకర్తనూ కాను. కాని పుస్తకాలలోని భాషకున్ను వాడుకలో ఉన్న భాషకున్ను మరియే యితర భాషలలోను లేనంత వ్యత్యాసం ఎక్కువగా తెలుగుభాషలో ఎందుకున్నది? అన్న ప్రశ్న గురించి నేనూ ఒకప్పుడు ఆలోచించాను గాని ఏదో ఇతర కార్యాల ఒత్తిడి ఎక్కువగా ఉండడంవల్ల నేనంత పరీక్షించలేదు. ఇప్పుడు మరీ ప్రసంగం చేశారు గనుక ఆలోచించి చెప్తాను" అన్నారు మా తండ్రి గారు.

మొదటి ఘట్టము

ఆనాటి నుండిన్ని మా తండ్రిగారు భాషాతత్త్వ గ్రంథాలు, తెలుగు వ్యాకరణాలు, కావ్యాలు తీవ్రంగా చదివి తెలుసుకొన్న విషయాలను 1909లో విశాఖపట్టణమందు యేట్సు యాజమాన్యాన జరిగిన ఉపాధ్యాయుల మహాసభలో తెలియజేశారు. ఆ విషయాలను ఇక్కడ క్లుప్తంగా తెలియజేస్తాను.

1. "కేవలం గ్రంథములందే దాని నిత్యవ్యవహారములో లేని లా గ్రీక్, సంస్కృత భాషలు మారకుండా ఉంటవి గాని నిత్యవ్యవహారములో ఉన్న జీవద్భాషలు సదా మారుతూనే ఉంటవి. మన తెలుగుభాష జీవద్భాష, అందుచేత నన్నయ కాలమున ఎట్లు అట్లే ఉండిపోలేదు. అనేక శబ్ద రూపాలలోను, కారకంలోను, నుడికారంలోను మార్పులు కలిగినవి. ప్రాచీన కావ్యాలలో ఉన్న రూపాలు కొన్ని అర్వాచీన కావ్యాలలో కనబడవు. అందులో రూపాలు కొన్ని ఇందులో కనబడతవి.
2. "మన పూర్వులు రచించిన వ్యాకరణాలు కావ్యభాషకేతర వ్యావహారిక భాషకు ఉద్దేశించినవి కావు. రానురాను రచయితలు వ్యాకరణాలలో అర్వాచీన కావ్యాలలోని క్రొత్త ప్రయోగాలు కొన్ని మాత్రమే చేర్చుకొనడం జరిగింది.
3. "సంస్కారమంటే శుద్ధి చేయడమని అర్థం చెప్పి, బట్టల విషయంలో చాకలి చేసే పని శబ్దముల విషయంలో వైయాకరణుడు చేస్తాడన్నట్లుగా కొందరు పండితులు చెప్తున్నారు. అది సరికాదు. సంస్కార శబ్దము వ్యాకరణ పరిభాషలో ఒక విశిష్టార్థము గల శబ్దము. లోకములో ఉన్న శబ్దరూపమును, ఉన్నది ఉన్నట్లు, గ్రహించి, దానికి ప్రక్రియ చెప్పవలసిన వాడే కాని ఉన్న దానికి మలిత్వము పోగొట్టి శుద్ధి చేసేవాడు కాదు వైయాకరణుడు.
4. "గ్రామ్యమనే శబ్దానికి కూడా విపరీతార్థాలు చెప్తున్నారు పండితులు. గ్రామ శబ్దము నుండి వచ్చిన ఈ మాటకు అనాగరకము, పామరము, అసభ్యము అనే అర్థాలు లోకంలో రూఢిగా ఉన్నవి. లక్షణ విరుద్ధమైన భాష 'గ్రామ్య'మని కొందరున్ను, 'చ్యుత సంస్కార'మని కొందరున్ను అన్నారు. 'గ్రామ్యములో నింద్య గ్రామ్యము, అనింద్య గ్రామ్యము కలవన్నారు కొందరు. దుష్టమైనను ఆర్యుల వ్యవహారము గ్రాహ్యమేన్నారు కొందరు వ్యాకరణ పరిభాషలో గల మాటలకు లోకంలో గల అర్థాన్ని ఆరోపింపజేసి, "గ్రామ్యభాషను గ్రంథాలలోనికి ఎక్కనీయరాదు. బహిష్కరించాలి; ఈ గ్రామ్య వాదులు మధురమైన మన తెలుగు భాషను చెడగొట్టాలని చూస్తున్నారు. మన గ్రాంథిక భాషను మనం సంరక్షించుకోవాలి" అని సభలో కేకలు వేసి, మాటలాడేవారు దురహంకారంతోను, దురభిమానంతోను మాటాడుతున్నారే కాని, తామే భాషలో మాటాడుతున్నారో చూచుకోకుండా అన్నారు. అది గ్రామ్యమా? గ్రామ్యమయితే అనింద్యమా? అని ఉద్యమయితే కావ్యాలలో ప్రయోగించవచ్చునన్నారు. వైయాకరణులు నింద్యమయితే అసభ్యమన్నమాట. అసభ్యం సభలలో మాటలాడకూడదు. గ్రాంథికవాదులు అందరూ ఇంటా బయటా సభలలోను ఎట్లు మాటాడుతున్నారో నేనున్ను అట్టే మాటాడుతున్నాను. కనుక మనం అంతా ఒకే విధమైన భాషే మాటాడుతున్నాము. మనభాష అసభ్యమైనది కాదు. నింద్యమైన గ్రామ్యం కాదు; వ్యావహారిక భాష, వాడుక భాష. కనుక మీరు ఔదార్యం గలవారయితే మమ్ము గ్రామ్యవాదులనరాదు; వ్యావహారిక భాషావాదులనాలి. మేముద్ధరింపదలచినది వ్యావహారిక భాషే కాని గ్రామ్యభాష కాదు.
5. "దేశంలో అక్షరాస్యులు నూటికి 10 కంటె ఎక్కువమంది లేరు. ఈ స్వల్ప సంఖ్యాకులైన అక్షరాస్యులతో నూటికి ఒక్కరైనా కావ్యభాషను అర్థం చేసుకోగల వారున్నారో లేదో సందేహం. ఇట్టి పరిస్థితులలో విద్యావ్యాప్తికి పూనుకోదలచిన పెద్దలు ఏ భాషలో కథలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, ప్రకటనలు మొదలయినవి రచిస్తే మంచిదో ఆలోచించాలి. కావ్యభాష అల్పప్రయోజనము, పరిమిత ప్రయోజనము కలది. కనుక, వ్యావహారిక భాషలో రచితములైన గ్రంథాల వల్లనే విద్యావ్యాప్తి ఎక్కువగా సాగగలదని నా అభిప్రాయం ఉన్నత పాఠశాలలోను, కళాశాలలలోను నన్నయ మహాభారతం మొదలుకొని నేటికాలం వరకు గల కావ్యాలను విద్యార్థుల చేత చదివించండి, వద్దన లేదు; కాని, ఆ కావ్యభాషలోనే వచన రచన నిర్బంధముగా సాగించాలన్న పట్టుదల విడిచిపెట్టండి".

ఈ విధముగా వీరి ఉపన్యాసము సాగినది. అయినా సభలో ఉన్నవారిలో ఏ యిద్దరు ముగ్గురో వీరి మాటలు అర్థం చేసుకొన్నారు. తక్కిన వారందరూ ఏదో ఘోరమైన ఆపద తెలుగు భాషకు కలుగుతూ ఉన్నదన్నట్టుగా ఆలోచించారు.

యేట్సు దొరగారు, మా తండ్రి గారి ఉపన్యాసానికి పూర్వమే కొద్దిగా తమ ఆంగ్లవాఙ్మయ విషయం తెలియజేసి, మా తండ్రిగారిని ప్రసంగించమన్నారు. దొరగారు చెప్పినదేమంటే : "మా భాషలో ప్రాచీన కావ్యాలు, మధ్యయుగ మందలి కావ్యాలు, ఆధునిక కావ్యాలు ఉన్నవి. వాడుక భాషననుసరించి కావ్యభాష కూడా మారుతూ వచ్చింది. నేటి మా వచన రచనలన్నీ నేటి శిష్టజన వ్యావహారిక భాషలోనే ఉన్నవి.

ఉన్నత శ్రేణిలో ఉన్న విద్యార్థులు ప్రాచీన కావ్యాలు చదువుకొంటారు చిన్న తరగతి పిల్లలు మాత్రం వ్యావహారిక భాషలో ఉన్న గ్రంథాలే చదువుకొంటారు. పాఠ్యగ్రంథాలు ఏ భాషలో ఉన్నా వ్యాస రచన మాత్రం ఆధునిక భాషలోనే సాగుతూ ఉంటుంది. అంతేకాదు, వ్యవహార భ్రష్టమైన ప్రాచీన రూపాలునే రచనలలో అందులోను వచన రచనలలో సాగకూడదు అన్న నియమం కూడా ఉన్నది. పద్యరచనలో మాత్రం రసపోషకములై, ప్రాచీన భాష రూపాలు కొద్దిగా ప్రయోగించడం జరుగుతూ ఉంటుంది. మీ తెలుగుభాష విషయం నాకు తెలియదు కనుక భాషా విషయం లెస్సగా కృషి చేసిన గిడుగు రామమూర్తి గారిని ప్రసంగించవలసినదిగా కోరుతున్నాను" అని చెప్పారు.

యేట్సు దొరగారి సమక్షమున జరిగిన సభలో వారి యెదుట నేమీ అనలేక ఉపాధ్యాయులు ఇతరత్ర గుసగుసలాడి, మా తండ్రిగారిని వేరే కలుసుకొని ప్రసంగించారు. వారికి సమాధానములు చెప్పి, వారిని లొంగదీసికొనుటకు మా తండ్రి గారు తాము తమ వాదమునకు అనుకూలముగా నుండే విషయాలను కావ్యాలనుండిన్ని, వ్యాకరణములనుండిన్ని ఎత్తి చూపించారు. ఏదైతే నేమి? పండితులకు వీరి వాదము నచ్చలేదు. "గ్రామ్యభాష"నే బడులలో ప్రవేశపెడితే తమ ఆధిక్యం మరి ఉండదనిన్ని, ఇంగ్లీష్ ముక్కలు నాలుగు చదువుకొన్నవారే తెలుగు పాఠాలు చెప్తారనిన్ని, తమ ఉద్యోగాలు పోతవనిన్ని భయపడ్డారు. "ప్రాచీన కావ్యాలు పాఠ్యగ్రంథాలుగా ఉంటవి; వాటిని బోధించడానికి పండితులు కావలెను. మీకేమీ భయముండనక్కరలేదు" అనే మా తండ్రిగారు ఎంత చెప్పినా, "సంఘాచారాలు మారిపోయిన్నవి; విద్యావిధానాలు మారిపోతున్నవి. అంతా మాలకూడయిపోతున్న"దన్న భయము పండితులకు విపరీతముగా పట్టుకొన్నది.

రెండవ ఘట్టము :

దీనికి తోడు మరి యొక మార్పు సరిగా ఆ సమయము వచ్చింది. 1903లో వైస్‌రాయ్‌గా ఉండిన కర్జన్ ప్రభువు ఏర్పరచిన ఒక విద్యాసంఘము వారు దేశమందలి విద్యావిధానమెట్లున్నదో పరిశీలించి ఒక నివేదికను తయారుచేసినారు. అందులో "విశ్వవిద్యాలయములు పుట్టి సుమారు 50 సంవత్సరములు అయినది. వందలకొలదిగా పట్టభద్రులు ప్రతిమండలమందు; తయారయినారు అయినా దేశమందలి అక్షరాస్యుల సంఖ్య సగటున నూటికి 10 కంటె ఎక్కువ కాలేదు. వయోజన విద్యావిధానము సాగించి ప్రజా వాఙ్మయము పుట్టిద్దామా? అనే ప్రజల తృప్తికరమైన సమాధానములు విద్యాధికులనుండి రావడం పాశ్చాత్య విద్యలనభ్యసించిన పట్టభద్రులు తాము నేర్చుకొన్న నవీన శాస్త్ర విషయములు ప్రజలకు ప్రజల భాషలో బోధన చేసిన బాగుండును. కాని, ఈ పట్టభద్రులు తాము నేర్చుకొన్నది ఆంగ్లభాష ద్వారా నేర్చుకొని ఉండడం చేత "తప్పో ఒప్పో ఆంగ్లభాషలో బోధపరచగలము కాని మా మాతృభాషలో బోధించలే"మంటున్నారు. ఇది విపరీతమైన దురవస్థ; దీనిని తొలగించుటకు ప్రభుత్వ విద్యాశాఖవారున్ను, విశ్వవిద్యాలయము వారున్ను చేయవలసిన పనులేమంటే; ప్రాథమిక పాఠశాలలోనే కాక ఉన్నత పాఠశాలలో కూడా భాషేతర విషయములన్నీ మాతృభాష ద్వారానే బోధించవలెనన్న విధానము ప్రవేశపెట్టవలెను. అంతేకాక, ఉన్నత పాఠశాలలలోను, కాలేజీలలోను మాతృభాషలో వ్యాసరచన విద్యార్థులకు అలవడవలెను," అనే సలహాలు ఆ సంఘంవారి నివేదికలో ఉండెను. వాటిని అనుసరించి మద్రాస్ రాష్ట్రములో కూడా ప్రభుత్వ విద్యాశాఖవారి యాజమాన్యమునగల ఉన్నత పాఠశాలలలోను, విశ్వవిద్యాలయం వారి యాజమాన్యమున గల కాలేజీలోను ఉండిన విద్యావిధానము మార్పు చెందినది. మెట్రిక్యులేషన్ పరీక్షకు మారుగా స్కూల్ ఫైనల్ పరీక్ష, ఎఫ్.ఏ. పరీక్షకు మారుగా ఇంటర్‌మీడియేట్ పరీక్ష 1911లో అమలులోనికి వచ్చింది. 1909 నుండిన్ని ఈ నూతన విధానమును గురించి ఆలోచనలు, చర్చలు జరుగుతూ వచ్చినవి. 1910లో యేట్సుదొరగారు విశాఖపట్టణంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సభను సమావేశపరచారు. సరిగా అప్పుడే నేను జయపురం ఉన్నత పాఠశాలలలో ప్రధానోపాధ్యాయుడుగా నియమితుడనగుట చేత నేనున్ను సమావేశంలో పాల్గొన్నాను. తక్కిన అనేక విషయములతోపాటు స్కూల్ ఫైనల్ పరీక్షకు నిర్బంధముగా పెట్టనున్న తెలుగు వ్యాసరచన ఎట్టి భాషలో నుండవలెనన్న విషయం చర్చకు వచ్చినది. "ఈ విషయం గురించి మీ సలహా ఏమి?" అని మా తండ్రిగారిని యేట్సు దొరగారు అడిగారు. వ్యాసరచన శిష్టజన వ్యవహారిక భాషలో ఉండవలెనని వీరు నొక్కి చెప్పారు. ఆ సమావేశములో పండితులు లేరు కాని తెలుగు పాండిత్యం కొద్దిగానో గొప్పగానో కల ప్రధానోపాధ్యాయులు కొందరుండిరి. యేట్సు దొరగారి సమక్షంలో అంత తీవ్రముగా ఎదిరించలేకపోయినా వారు వ్యావహారిక భాష పనికి రాదన్నారు. ఒక గంటసేపు చర్చ సాగిన తర్వాత ఒక సమాధానానికి ఇరుపక్షముల వారున్ను ఒప్పుదల కుదుర్చుకొన్నారు. పరీక్షలో విద్యార్థులు వ్యావహారిక భాషలోగాని, గ్రాంథిక భాషలోగాని తమ వ్యాసములు వ్రాయవచ్చును. అనే స్వేచ్ఛ విద్యార్థులకు కలిగించడానికి సమ్మతించారు. వ్యవహారిక భాషలో ఆదర్శప్రాయంగా ఉండే రచనను సూచించే వచన గ్రంథము ఒకటి పాఠ్యగ్రంథముగా చూపించవలసిన ఆవశ్యకత కలిగినది. అట్టి పరిస్థితిలో విశాఖపట్టణంలో కవిగాను, రచయితగాను కొంతపేరు పొందిన సెట్టి నరసింహం గారు వ్యావహారిక భాషావాదుల సలహా ప్రకారము గ్రీక్‌మిత్తులు (తాతలనాటి పాతకథలు), వసంతసేవ అనే వచన రచన గ్రంథాలు రచించారు. అందులో ఒకటి స్కూల్ ఫైనల్ పరీక్షకు పాఠ్యగ్రంథముగా విద్యాశాఖవారు నియమించారు. దానితో తెలుగు దేశమంతటా పెద్ద కలవరం పుట్టింది. వాస్తవంగా ఆ గ్రంథాలలో వాడుక భాష చాలా తక్కువ. అది వ్యావహారిక భాషలో రచితమయినదంటే నేటి రచయితలు నవ్వుతారు. ఆనాటి రాజకీయ వాతావరణంలో బ్రిటిష్ ప్రభుత్వం వారికి "వందేమాతరం" అంటే రాజద్రోహంగా తోచినట్టు ఆనాడు కొద్దిగా ప్రాచీన శబ్దరూపాలను మార్చి రచించిన ఆ పుస్తకాలు కూడా "గ్రామ్య" భాషలో రచితములైనవన్నీ అభిప్రాయం కలిగింది. పండితులకు, ఆ పుస్తకాలను, ఆ విద్యావిధానాన్ని ప్రతిఘటిస్తూ పెద్దలు అనేక స్థలములలో సభలు సమావేశపరచి, తీర్మానాలు చేసి, ప్రభుత్వానికి మహజర్లు పంపించారు. ఆ పుస్తకాలలోని భాషకంటే ఆ పుస్తకాలకు ఉపోద్ఘాతంగా వ్రాసిన పీ.టీ. శ్రీనివాస అయ్యంగారి మాటలు ఎక్కువగా బాధ కలిగించినవి. అతడు అదివరకు "భాష–చావు, బ్రతుకు అనే

పేరను జీవద్భాషలకును నిర్జీవ భాషలకును గల తారతమ్యము వివరిస్తూ ఒక పత్రికను ఇంగ్లీషు భాషలో రచించి ప్రకటించాడు. అతడు తన అభిప్రాయాలను సంగ్రహంగా ఈ ఉపోద్ఘాతంలో వెల్లడించాడు. అది ఎక్కువగా గ్రాంధికవాదుల అహంకారానికి గురి అయినది.

ఇటువంటి సభలు, తీర్మానాలు చేస్తూ మహజర్లు పంపుతూ వచ్చినా ప్రభుత్వ విద్యాశాఖాధికారులు గ్రాంథిక వాదులకు లొంగలేదు. నాలుగు సంవత్సరాలపాటు వ్యాసరచన. అంగ్లము నుండి తెలుగులోనికి అనువాదము – రెండున్ను, వ్యావహారిక భాషలో వ్రాయడానికి విద్యార్థులకు స్వేచ్ఛ కలిగించారు. వ్యావహారిక భాషలో వ్రాయడానికైనా శిక్షణ కావలెనన్న విషయం గ్రహించక కొందరున్ను, గ్రహించిన్ని అది ఎంత పాడుగా అంటే అంత రోత పుట్టించవచ్చునన్న దురుద్దేశంతో కొందరున్ను పాఠశాలలో విద్యార్థులకు రచనా విధానము బోధించక, "మీ ఇష్టం వచ్చినట్లు వ్రాయండి, మీ రెంత పచ్చిగా వ్రాస్తే అంత ఎక్కువగా మార్కులు వస్త' వని కూడా హెచ్చరించారు. విద్యార్థులు వ్రాసిన వ్రాతలను కనబరచి "చూడండి ఎంత దిక్కుమాలిన భాషలో రచనలు సాగుతున్నవో" అని ఉద్ఘోషించే దురుద్దేశముతో చేయకూడని పనులు కూడా చేశారు కొందరు.

పిఠాపురం మహారాజావారి పోషణతో 1911లో స్థాపించబడిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఈ వ్యావహారిక వాదమును పడగొట్టుటకు పూనుకొన్నది.

కర్జన్ నివేదికను అనుసరించి మద్రాసు విశ్వవిద్యాలయము వారు కూడా ఇంటర్‌మీడియేట్, బి.ఏ. పరీక్షలకు తెలుగు వ్యాసరచన గాని, సంస్కృత భాషలో ఉన్నది ఆంగ్లభాషలోనికి పరివర్తనం చేయడం గాని విద్యార్థులందరున్ను నేర్చుకోవలసిన విషయంగా నిర్ణయించారు. ఆ తెలుగు వ్యాసరచన ఎట్లుండవలెను? అందుకు ఆదర్శప్రాయంగా ఎటువంటి గ్రంథములను పాఠ్యగ్రంథములుగా నిర్ణయించవలెను? అనే విషయములు నిర్ణయించుటకు ఆ విద్యార్థులు తమ వ్యాసరచన, అనువాదము ఏ భాషలో వ్రాయవలెను? గ్రాంథికములోనా వ్యావహారికములోనా? అనే విషయమును నిర్ణయించుటకును 1913లో ఒక సలహా సంఘమును మద్రాసు విశ్వవిద్యాలయం వారు నియమించినారు. అందులో నలుగురు గ్రాంథిక భాషా పక్షము వారు, నలుగురు వ్యావహారిక పక్షము వారు, మధ్యవర్తులు ఇద్దరు ఉండిరి. ఈ మధ్యవర్తులలో తాంప్సన్‌డ్ దొర సంఘ సమావేశకర్తగాను, ప్రొఫెసర్ రంగాచార్యులు అధ్యక్షులుగాను నియమితులైనారు. చర్చలు విరివిగా సాగినవి. తుదకు వ్యావహారిక భాషావాదమునకు అనుకూలముగా తీర్మానము నెగ్గినది. వ్యావహారిక భాషా పదముల పట్టిక తయారు చేయవలసియుండినది. ఆ తీర్మానమును పడగొట్టుటకు గ్రాంథిక భాషావాదులు ఒక పన్నుగడ పన్నినారు. ఈ సలహా సంఘములో రాయలసీమ ప్రతినిధులెవరూ లేరు. అక్కడి వ్యావహారిక భాషా వదములు చేర్చవలెను గనుక రాయలసీమ ప్రతి నిధులను ఈ సంఘములో సభ్యులుగా నియమించవలెనన్న అలజడి గావించినారు. యూనివర్శిటీ వారు రాయలసీమ ప్రతినిధులను నలుగురిని చేర్చినారు. వారు ఎందుకు నియమితులయినారో ఆ పనికి పూనుకొనక నెగ్గిన తీర్మానమునకు అపార్థము కలిగించుటకు సంకల్పించినారు. ఆ తీర్మానములో "Classical Telugu Forms as well as modern Telugu forms" గ్రాహ్యములే అని ఉంటే, రెండున్ను అయిన forms మాత్రమే అన్న అర్థమారోపించి, పట్టికలు తయారుచేయ పూనుకొన్నారు. సలహా సంఘంలో ఇప్పుడు గ్రాంథిక భాషా వాదుల సంఖ్య ఎనిమిదయినది. కనుక వారన్నదే స్థిరపడినది. ఈ యపార్థము కలిగించుట వలన అనుసరించవలసిన భాష సంకుచితమైనదన్న విషయము, తమ వాదము యెదుట ఆగ్రహావేశము గల వారగుట చేత ఎవరును ఈ అంశమును గ్రహించలేదు. ఆనవుడు, నావుడు, అర్థానుసారము, శకులు రేఫము మొదలయినవి వ్యావహారిక భాషలో లేవు గనుక వాటిని విడిచిపెట్టవలెను. చేస్తాను. పోతాను, వాడయితే మొదలైనవి గ్రాంథికభాషలో లేవు గనుక వీటిని విడిచిపెట్టవలెను. అంతకంటే విపరీతమైన ఫలితమేమంటే "చెట్లు వాని శాఖలు" అనేది వాడుకలో లేదు గనుక దానిని విడిచిపెట్టుకోవలెను. "చెట్లు వాటిశాఖలు" అనేది గ్రాంథిక భాషలో లేదు గనుక దీనిని విడిచిపెట్టుకోవలెను. "వాని, వాటికి మారుగా రెంటను గల పదము లేదు గనుక "చెట్లు చెట్లశాఖలు" అని అనవలసి వస్తుందన్న విషయము ఎవరును గమనించలేదు. ఈ తీర్మానముపైని గురుజాడ అప్పారావుగారు "Minute of dissent" సమర్పించారు. "ఇక్కడ మనమేమి చెప్పినా ప్రయోజనము లేదు. తెలుగుదేశమందు సంచారము చేసి, సభలు గావించి, జనులకు ప్రబోధము కలిగించవలెను. మనవాదము నెగ్గితే ప్రభుత్వము వారున్ను యూనివర్శిటీ వారున్ను మన వాదమును అంగీకరింపక తప్పదు" అని మా నాన్నగారు తమవాదమును సభల ద్వారా ప్రసరింపజేయుటకు పూనుకొన్నారు.

మా తండ్రి గారు వ్యావహారిక భాషా రచనావశ్యకతకు సంబంధించిన కృషి తీవ్రముగా సాగించారు. ప్రాచీన కావ్యభాషా లక్షణమునకున్ను వ్యావహారిక భాషా లక్షణమునకున్ను గల తారతమ్యమును నిరూపిస్తూ ప్రాచీన శబ్దరూపములు, కారకము, నుడికారము మొదలయినవి ఎట్లు స్వభావసిద్ధముగా మారుతూ వచ్చినవో తెలియజేస్తూ "Modern Telugu Movement" అనే ఒక చిన్న గ్రంథమును 1912లో ప్రకటించి ప్రభుత్వ విద్యాశాఖ వారికిన్ని, విశ్వవిద్యాలయము వారికిన్ని పంపించారు. కావ్యభాషలో కూడా వ్యావహారిక భాషా ప్రాభవము వలన అంతకంతకు ఎక్కువగా పూర్వ వ్యాకరణాలలో చెప్పిన నియమాలకు విరుద్ధములైన ప్రయోగములు ఎట్లు వచ్చినవో చూపిస్తూ, చిన్నయసూరి కాలంలోను, అంతకు పూర్వమున్ను విద్యార్థులు చదువుకొంటూ ఉండిన పుస్తకాలు ఎట్లు వాడుక భాషలో ఉండెనో తెలియజేస్తూ "నిజమైన సంప్రదాయము' ' అనే గ్రంథమును తెలుగులో రచించారు. దీనిని 1913లో వావిళ్ల వేంకటేశ్వర్లు శాస్త్రిగారు ముద్రించి, ప్రకటించారు.

ఈలోగా 1912లో శెట్టి నరసింహంగారి పుస్తకంలోని భాషను విమర్శిస్తూ ప్రెసిడెన్సీ కాలేజి ఆంధ్రపండితులుగా నుండిన వావిలకొలను సుబ్బారావుగారు "ఆధునిక వచన రచనా సంప్రదాయ విమర్శనము" అనే పేరను ఒక చిన్న గ్రంథాన్ని ప్రకటించారు. దానిని విమర్శించి, వారి వాదాన్ని ఖండిస్తూ "సొద్దు" అనే ఒక చిన్న గ్రంథాన్ని నేను రచించి ప్రకటించాను. ఈ విధంగా పత్రికావాదాలు తీవ్రంగా సాగుతూ వచ్చినవి. కాకినాడలో గ్రాంథిక భాషా సంరక్షణ సంఘటన మేర్పడినది. "గ్రామ్య" వాదాన్ని ఖండిస్తూ కరపత్రాలు, చిన్న చిన్న గ్రంథాలు వెల్వడినవి. వ్యావహారిక భాష గ్రంథరచనకు పనికి రాదనడానికి గ్రాంథికవాదులు చెప్పే కారణాలలో ముఖ్యమైనదిగా ఒకటి చెప్తూ ఉండేవారు. మాండలిక

భేదాలవల్ల వాడుక భాష దేశమంతటా ఒకే విధంగా ఉండదు. ఒక మండలం వారి మాటలు మరియొక మండలం వారికి బోధపడవు. కోస్తా జిల్లాలవారు (పోక) చెక్కలు (కంది) పప్పు అంటారు. రాయలసీమవారు (పోక) వక్కతి (కంది) బేడలు అంటారు. బేడ అంటే రెండణాలా? అంటారు కోస్తా జిల్లాల వారు, చెక్కలు అంటే కర్ర పేళ్లా? అంటారు రాయలసీమ వారు. ఈ విధంగా మాండలిక భాషా పదములను పేర్కొని వ్యావహారిక భాషావాదాన్ని ఖండించడానికి గ్రాంథిక వాదులు చూచేవారు.

ఒకసారి ఆంధ్రసాహిత్య పరిషత్ సభలో ఈ మాటలనే కొందరు పేర్కొని, అపహాస్యం చేసినప్పుడు సభ్యులు నవ్వుతూ కరదాళధ్వనులు చేశారు. అప్పుడు మా తండ్రి గారు "సరే; కాని, ఈ మాటలు తప్పించి, వీటికి బదులుగా మరియే మాటలు వాడవలెనో చెప్పండి అనే అడిగేటప్పటికి ఒకరి మొగం ఒకరు చూచుకొని మరి మాట్లాడలేదు. మాండలిక బేధాలు వ్యావహారిక భాషలోనే కాదు గ్రాంథిక భాషలో వ్రాయదలచినా రాక తప్పవు. తిక్కన సోమయాజి మొదలుకొని నేటివరకున్ను గల ప్రసిద్ధ కవులందరున్ను తమ మండల మందలిక మాందలిక పదాలు ప్రయోగిస్తూ వచ్చారు.

క. "కేశవయాంధ్రులు నానా । దేశంబులయందు నిలిచి తెలుగులెస్సతత్త । దేశోక్తులంటబలికిన । నా శబ్దము అన్యదేశజాంధ్రములషి అని అప్పకవి మాండవీయక పదాలను నిరూపించి గ్రాహ్యములుగా చేర్చుకొన్నారు. ఆంధ్రనామ సంగ్రహంలోను, ఆంధ్రభాషా వర్ణవంలోను మాండలియక పదాలు పర్యాయపదాలుగా చేరినవి. ఇవి శబ్ద రత్నాకరములోనికి ఎక్కినవి. "....పప్పు, బేదయన సూపంబుదనరారు", "పైకము, డబ్బు, దుడ్డు", "చిల్లుగొళ్లెము", "బొంగరమనగను, బొమ్మరమ్మనగను" ఈ విధముగా ఆంధ్ర భాషా వర్ణములో పేర్కొన్నారు. శ్రీనాధుదు హరవిలాసంలో (II.31) పప్పు ప్రయోగించాడు. ఆముక్తమాల్యదలో (II.88) బేడలు ప్రయుక్తమయినది. ఆంధ్రప్రభుత్వ ఆస్థానకవి సార్వభౌములు తమ మహాభారతం ఆదిపర్వంలో (X.232) "జనంగొని" అని ప్రయోగించి, అది నిఘంటువులలో లేదు గనుక పుటయడుగున "జివ=దార్ఢ్యము (వాని కింకను జీవలేదు) ఇట్లు గోదావరి మండలమున వాడుదురు" అని తెలియజేశారు. మాటల విషయంలోనే కాదు నుడికారంలోగూడ మాండవిక భేదాలుంటవి. వాటినిగూడ కవులు తమ గ్రంథాలలో ప్రయోగించారు. వేదం వేంకటరాయశాస్త్రులవారు తమ కథా సరిద్సాగరంలో "చెప్పకాఁగానే" "చెప్పుకొనిమయిన తర్వాత" మొదలైన మాండలిక ప్రయోగాలు చేశారు. ఇది సంప్రదాయ సిద్ధమే కాని వ్యావహారిక భాషావాదులు కొత్తగా తెచ్చిపెట్టే వైపరీత్యము కాదు. ఈ విషయాన్ని సరిగా గుర్తించలేం. నేటి పెద్దలలో కొందరు ఇంకా ఈ వాదాన్ని సాగిస్తూనే ఉన్నారు. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ మొదలైన దినపత్రికలలోను, వార, మాస పత్రికలలోను, కథలలోను, నవలలోను గల భాష కేవలము వ్యావహారికభాష, దేశమందన్ని జిల్లాలవారు చదువుతున్నారు. అర్థం చేసుకొంటున్నారు. రాజకీయవేత్తలలోను, మంత్రులతోను అన్ని జిల్లాలో వారున్ను ఉన్నారు. అందరూ అన్ని జిల్లాలకునుపోయి ఉపన్యాసాలిస్తున్నారు. వారు కేవలము వ్యావహారిక భాషే మాట్లాడుతున్నారు. అందరికీ అర్థమవుతూనే ఉన్నది. కనుక, వ్యావహారిక భాషలో గ్రంథరచన సాగిస్తే మాండలిక భేదాలవల్ల కొందరికి అర్థం కాకుండా పోతుందనే ఆక్షేపానికి ఆధారం లేదు. ఎక్కడో ఒక వాక్యము ఒక మాట తమకు పరిచయంలేనిది ఉన్నా సందర్భంబట్టి అర్థమవుతూనే ఉన్నది. ఇంతకూ వ్యావహారిక భాషకున్ను గ్రాంథిక భాషకున్ను గల తేడా ఈ మాండలిక పదాలలో లేదు, శబ్ద రూపాలలో ఉన్నది. వస్తాను, చేస్తాను, ఐతే, అంటే, అదిన్నీ ఇదిన్నీ, వాడూ, వీడూ, చేసింది, నూటా ఇరవై తొమ్మిది మొదలైన శబ్దాలను తెలుగువారందరూ వాడుతున్నారు. కోస్తా జిల్లాలవారు చూచాను, చేశారు. వచ్చాము అంటే రాయలసీమ వారు చూస్తిని, చేస్తిరి, వస్తిమి అంటున్నారు. ఈ రూపాలలో కొన్నిటిని తాము వాడకపోయినా అందరికీ అర్థమవుతూనే ఉన్నవి.

వ్యావహారిక భాషా వాదులు తమ వాదం స్పష్టంగా నిరూపించారు. 1913-14లో ఎవరో కొద్దిమంది తప్ప తక్కిన వారందరూ పట్టుదల కొద్దీ వినిపించుకొనేవారు కారు. ఈ 'గ్రామ్య' వాదులు ప్రాచీన కావ్యభాష, వ్యాకరణాలు చదువుకొనే శ్రద్ధ వహించలేక ఈ 'గ్రామ్య' భాషావాదం చేస్తున్నారన్న నింద వ్యాపించింది. వ్యావహారిక భాషా ప్రయోజనం కోసం చేస్తూ ఉండిన వాదానికి ప్రాచీన కావ్యభాష రాకపోవడం కారణం కాదు, కాని అది లెస్సగా రాదన్నమాట. 1913 వరకున్ను మా తండ్రిగారి విషయంలో సైతం సత్యమే. ఈ లోపం లేకుండా నన్నయ నాట నుండి తమ కాలము వరకున్ను తెలుగు సాహిత్యంలోగల పుస్తకాలు, వ్యాకరణాలు చదివినారు. చదవడమే కాదు, శబ్దరూపాలు ఎట్లు మార్చుతూ వచ్చినవో నోట్స్ వ్రాసి పెట్టుకొన్నారు. 1913లో వీరు రచించిన "ప్రాఁదెనుంగుఁగుమ్మ" ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలో ప్రకటించడమైనది. అది చదివిన వారికి మా తండ్రి గారు ప్రాచీన కావ్యభాషను ఎంత లెస్సగా చదువుకొన్నారో బోధపడగలదు.

ఈ "ప్రాఁదెనుఁగుఁగమ్మ" రచించాలన్న బుద్ధి వీరికి పుట్టడానికి కారణం చిత్రమైనది. వీరు ఆంధ్ర సాహిత్య పరిషత్తులో సభ్యులుగా ఉంటూ, పరిషత్తు వారు తమ వాదమును అంగీకరించునట్లు చేయవలెనని ఆశపడుతూ వచ్చారు. ఆ పరిషత్పత్రికకు ఏదైనా ఒక వ్యాసము వ్రాసి పంపించవలసినదని జయంతి రామయ్య పంతులుగారు మా తండ్రి గారి పేర తరచుగా లేఖలు వ్రాస్తూ ఉండేవారు. వ్యావహారిక భాషలోనే కాని గ్రాంథిక భాషలో వ్రాయనని మా తండ్రిగారున్ను, గ్రాంథికభాషలో రచితమైనదే కాని వ్యావహారిక భాషలో రచితమైనది మా పరిషత్పత్రికలో ప్రకటించుట వీలు లేదని రామయ్య పంతులు గారున్ను పట్టు పట్టడం చేత కొంతకాలం వ్రాయడం జరగలేదు. అప్పుడు మా తండ్రిగారికి ఒక ఆలోచన తట్టింది. "గ్రాంథిక భాషలోనే రచించి పంపిస్తానుండం"దని మా తండ్రిగారు ఈ "ప్రాఁదెనుఁగుఁగమ్మ" రచించి పంపించారు. అది పరిషత్పత్రికలో ప్రకటితమైనది. వాడుకలో లేని ప్రాచీనాంధ్ర ప్రయోగాలు ఎంచి, అందులో బుద్ధి పూర్వకంగా సమకూర్చి రచించారు. అది ఒక రీతి పట్టుదలతో రచించినదే. కాని ఆదర్శప్రాయంగా ఉండాలని రచించినది కాదు. ఏ కారణంచేత వ్రాసినా, అందులోని కవిత ఎట్లున్నా నన్నయ్య నాటి ప్రాచీనాంధ్ర కావ్యభాష వీరికి చాలా చక్కగా వచ్చునన్ను నమ్మకం ఉభయవాదముల వారికిన్నీ కలిగినది.

1914లో ఆంధ్ర సాహిత్య పరిషద్వార్షికోత్సవము కాకినాడలో కిళాంబి రామానుజా చార్యుల వారి అధ్యక్షతను జరిగినవి. వీరు విజయనగరం మహారాజా వారి కాలేజీలో ప్రిన్సిపాలుగా ఉండేవారు. అప్పుడు మా తండ్రిగారు విజయనగరం రాజకుమారునకున్ను (సర్ విజయ, క్రికెట్

ఆటగాడు), అతని సోదరికిన్ని ట్యూటర్‌గా ఉండేవారు. అందుచేత గురజాడ అప్పారావు గారు, వీరూ తరచుగా రామానుజాచార్యుల వారిని కలుస్తూ ఉండేవారు. ఆంధ్రభాషా వ్యాసంగం చేస్తూ ఉండేవారు. అప్పటికింకా రామానుజాచార్యులవారు మా వాదము అంగీకరించలేదు. అందుచేత వీరిద్దరున్ను వారిని లొంగదీసుకొనడానికి ప్రయత్నిస్తూ ఉండేవారు. అదివరకప్పుడే పెద్ద పండితులని పేరు పొందిన పేరి కాశీనాథశాస్త్రి గారున్ను, మహామహోపాధ్యాయ తాతా సుబ్బరావు శాస్త్రిగారున్నూ మా వాదము అంగీకరించారు. ఆంధ్ర వ్యాకరణాలు, అందులోనూ చిన్నయసూరి 'బాలవ్యాకరణము' జిహ్వాగ్రమందున్నదని పేరుపొందిన పండితులు వఝల చినసీతారామస్వామి శాస్త్రులు గారు విజయనగరం వచ్చి స్థిరపడ్డారు. వారు రామానుజాచార్యులు గారికిన్నీ, అప్పారావు గారికిన్ని ఆంధ్రభాషా వ్యాసంగమందు సహాయకులుగా ఉండేవారు. అప్పారావు గారి ప్రోత్సాహముతో ఈ శాస్త్రిగారు వ్యావహారిక భాషావాదాన్ని అభినందిస్తూ సభలలో ఉపన్యసిస్తూ ఉండేవారు. అందుచేత, రాబోయే కాకినాడ సభకు రామనుజాచార్యులవారు అధ్యక్షులయినందుకు వీరందరున్నూ ఆనందభరితులై ఆ సభకు హాజరయినారు. ఆ సభకు నేనూ, బుర్రా శేషగిరిరావు కూడా వెళ్లాము. అక్కడ ప్రసంగించడానికి మాకెవ్వరికి పరిషత్తువారు అవకాశమివ్వలేదు. అయితే అప్పుడు కొచ్చెర్లకోట వేంకట కృష్ణారావు బహద్దరువారు మాకు ఆతిథ్యమిచ్చి, మరి మూడు దినాలు మమ్ము కాకినాడలో ఉంచి, వేరే సభలు ఏర్పాటు చేశారు. మొదటి రోజున గురజాడ అప్పారావు గారున్ను, మా తండ్రిగారున్ను ప్రసంగించారు. రెండవ రోజున వఝల చిన సీతారామస్వామి శాస్త్రులవారు తెలుగు వ్యాకరణాల ధర్మాన్ని గురించి ప్రసంగించి నేటి వ్యావహారిక భాషా లక్షణం కూడా చేర్చుకోవాలన్నారు. మూడవ రోజున బుర్రా శేషగిరిరావున్నూ, నేనున్నూ ప్రసంగించాము.

ఆ సమయంలోనే కర్జన్ ప్రభువు సలహాల ననుసరించి మదరాసు యూనివర్సిటీవారు అరవం, తెలుగు, కన్నడం, మళయాళ భాషల గురించి పరిశోధనలు సల్పగల వారిని నియమించడానికి పూనుకొని, తెలుగు భాషకు మా తండ్రి గారిని నియమించుటకు ఉద్దేశించి సెనేట్ సభ్యుల ఆమోదం కోసం తమ ఉద్దేశ్యాన్ని ప్రతిపాదించారు. వీరిని నియమించి ఉంటే, వీరి సంకల్పం వేగముగానే నెరవేరి ఉండేది. యూనివర్సిటీ వారిని వ్యావహారిక భాషావాదాన్ని అంగీకరింపజేసి యుండేవారేమో. అదికాక పోయినా తెలుగు వ్యాకరణ విషయంలోగాని తెలుగు నిఘంటువు నిర్మాణ విషయంలోగాని, నన్నయ్య భారతం సంప్రదించడంలోగాని కొంత పని సాగించియుండే వారు. కాని అది ప్రాప్తం కాలేదు. వీరు 50 ఏళ్లు దాటిన వారనిన్నీ, చిన్నవారిని నియమించిన యెడల వారిని జర్మనీ మొదలైన విదేశాలకు పంపి, భాషాతత్త్వ పరిశోధన పద్ధతులు నేర్పించడానికి అవకాశముంటుందని చెప్పి వీరిని నియమించలేదు.

1913లో మదరాసు యూనివర్సిటీవారు నియమించిన సలహా సంఘము వ్యావహారిక భాషావాదమునకు అనుకూలమైన తీర్మానాన్ని తిరస్కరించినది. ఈలోగా ఆంధ్రదేశమంతటా, శ్రీ పిఠాపురం మహారాజావారూ, ఆంధ్రసాహిత్య పరిషత్తు వారూ, పండితులూ, ఉపాధ్యాయులూ, వీరూ, వారూ అనడమెందుకు మొత్తం మీద ఆంధ్రులందరూ వ్యావహారిక భాషావాదాన్ని ప్రతిఘటిస్తూ మదరాసు యూనివర్సిటీకి, ప్రభుత్వానికి శరపరంపరలేవలె మహజర్లు పంపించారు. అందువల్ల యూనివర్సిటీ 1914లో వ్యావహారిక భాష యూనివర్సిటీ చదువులకు అగ్రాహ్యమని నిర్ణయించింది. ఈ నిర్ణయానుసారం వ్యావహారిక భాషలో వ్యాసరచన చేయవచ్చునని ఒప్పందమును విద్యాశాఖవారు సైతము (స్కూల్ ఫైనల్ విద్యార్థులకు ఇచ్చి దానిని) ఉపసంహరించుకొన్నారు. లోకం విరుద్ధంగా ఉంటే మేమేమి చేయగలమని కూడా అన్నారు.

మూడవ ఘట్టము :

ఈ వ్యావహారిక భాషా వాదమును సాగించుటకు అప్పారావుగారున్నూ మా తండ్రిగారున్నూ నిశ్చయించుకొని పని మొదలు పెట్టారు. 1915లో అప్పారావు గారు స్వర్గస్తుయినందువల్ల మా నాన్నగారొక్కరు ఈ పని సాగించుటకు పూనుకోవలసి వచ్చినది. వారికి నేనున్ను, బుర్రా శేషగిరిరావు తోడుగా నిలిచాము. మరి మూడు సంవత్సరముల తర్వాత చిలుకూరి నారాయణరావు మాలో చేరాడు.

1914 నుండి 1918 వరకు నేనూ, మా నాన్నగారు బరంపురం విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, మచిలీపట్నం, నెల్లూరు, అనంతపురం, మదరాసు మొదలైన పట్టణాలలోని కాలేజీలకు వెళ్లి, ఆయా కాలేజీల ప్రిన్సిపాల్‌లతోను, ఇతర విద్యాధికారులతోను సంప్రదించి, పండిత సంఘం సమావేశాలు కావించి మా వాదము తెలియజేశాము. మేము చెప్పిన అంశములకు తగిన సాక్ష్య సంపన్నాలుగల తాటాకు గ్రంథాలు, వ్రాత ప్రతులు, చిన్నయసూరికి పూర్వముండిన వచన గ్రంథాలు మొదలయిన రికార్డంతా ఆయా సంఘాల యెదుట పెట్టి రుజువుపరుస్తూ, ప్రసంగించేవారము. మేము చెప్పినది కాదనడానికి ఎవరికీ ధైర్యము లేకపోయినది. మా వాదము సహేతుకంగా ఉన్నదని కొందరు అంగీకరించినారు. వ్యావహారిక భాష అన్ని మండలాలలోను ఒకేరీతిలో లేదు గదా, దేనిని ప్రమాణంగా అంగీకరించవలెనన్న పాత ఆక్షేపమును సూచించారు. కొందరు, మాండలిక రూపాలు భిన్నంగా ఉన్నవన్నమాట నిజమే. ఈ చిక్కు గ్రాంథిక భాషకు కూడా తప్పదని మేము వివరించి, మాండలిక రూపాలన్నీ గ్రాహ్యములే, అగ్రాహ్యములని ఏ లక్షణకర్తా అనలేదని చెప్పాము. అంతేకాదు భాషా వర్ణము మొదలైన నిఘంటువులలోనికి ఎక్కినవని చూపించాము. ఎవరి మండలములో ఉన్న పదమువారు ప్రయోగించారు. ఇంతకూ తమ మండలములో ఉన్న శబ్దములు ఇతర మండలములలో లేవన్న సంగతి ఎవరికైనా ఎట్లు తెలియగలదని మేము వారిని అడిగితేవారు మిన్నకున్నారు.

ప్రారంభంలో ఈ ప్రచారం మా తండ్రి గారికి కొంత చికాకుగానే ఉండేది. 1915లో రాజమహేంద్రవరమందు జరిగిన ఆంధ్ర మహాసభలో వీరిని సరిగా మాట్లాడనివ్వక కొందరు అల్లరి చేశారు. ఆ సభలో ఒక్క బులుసు పాపయ్య శాస్త్రిగారు తప్ప యింకెవ్వరు వీరి పక్షమున చెయ్యి ఎత్తినవారు లేకపోయారు.

1916లో కొవ్వూరులో జరిగిన సభలో మాత్రము వీరి వాదమునకు అనుకూలముగా ఒక తీర్మానము సభా సమ్మతమైనది. ఆ సభకు కందుకూరి వీరేశలింగం పంతులుగారు కూడా వచ్చి దూరంగా కొంతసేపు నిలబడి మా నాన్నగారి ప్రసంగం విన్నారు. వీరి వాదం సహేతుకంగా ఉందని మెచ్చుకొన్నారు. అటుపిమ్మట "రామమూర్తి పంతులుగారి వాదంలో సత్యం లేకపోలేదు. ప్రాచీన లక్షణాలకు విరుద్ధమైన ప్రయోగాలు కొన్ని నేడు వాడుకలోనికి వచ్చినవి. అందు కొన్నిటిని కవులు ప్రయోగించారు. వాటిని తప్పులనుటకంటె ఒప్పులుగా గ్రహించి లక్షణాన్ని సవరించుకొన్నారు. అయితే రామమూర్తి పంతులు అంతటితో తృప్తి చెందక కవులకున్ను లోకమే ప్రమాణం గనుక కవులు ప్రయోగించినా, ప్రయోగించకపోయినా వాడుక భాష అంతా గ్రంథరచనకు అర్హమైనదే అనివాదిస్తున్నారు. అది ఎంత వరకు గ్రాహ్యమా అని ఆలోచిస్తున్నాను" అని వారు తమ మిత్రులతో అన్నారు. ఈ సంగతి తెలిసి మా తండ్రి గారు రాజమహేంద్రవరం వెళ్లి వీరేశలింగం పంతులు గారిని కలుసుకొన్నారు. ఇద్దరూ రెండు గంటలసేపు ఈ విషయమై ప్రసంగించుకొన్నారు. వ్యావహారిక భాషావాదనకు సంబంధించిన ప్రధాన విషయములన్నిటను పంతులుగారు మా తండ్రి గారితో ఏకీభవించారు. ఆ వెంటనే రాజమహేంద్రవరములో 28.2.1919వ తేదీన పంతులు గారి ఆనందాశ్రమములో ఒక విద్వత్సభ జరిగినది. దానికి పంతులు గారు అధ్యక్షత వహించారు. ఆ సభలోని వారు అప్పుడే "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజము"ను స్థాపించారు. దానికి అధ్యక్షులయినారు. మా తండ్రిగారున్ను, జయంతి గంగన్న గారున్ను కార్యదర్శులు. ఆ సమాజ ముఖ్యోద్దేశ్యములను సైతము ఆ సభవారే నిర్వచించారు. అవి, 1. వ్యావహారిక భాషకున్ను గ్రాంథిక భాషకున్ను ఇప్పుడున్న వ్యత్యాసమును సాధ్యమైనంతవరకు తగ్గించి, భాషను సులభము చేయుట. 2. జ్ఞానాభివృద్ధికై వ్రాయు గ్రంథములలో సాధ్యమైనంతవరకు వ్యవహారములోనున్న రూపములనే ఉపయోగించి, వ్యవహారములో లేనివి విడిచిపెట్టుట, 3. వ్యవహారములో ఆవశ్యకములు కాకుండ ఉపయోగించుచున్న అన్యదేశ్యపదములను విడిచి, ఆవశ్యకమైన పదములనే చేకొనుట. 4. పై ఉద్దేశ్యముల ననుసరించి గ్రంథములను వ్రాయుట.

ఈ సమాజము ఏర్పడ్డ కొద్ది కాలములోనే 27.5.1919వ తేదీ పంతులుగారు కాలధర్మమునొందుటచే సమాజమునకు కలిగిన నష్టము ఇంతింతని చెప్ప శక్యము కాదు.

అయినా వారి అధ్యక్షతను స్థాపితమైన "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజము" కొంత పని చేయకపోలేదు. ప్రారంభమందే ఏబది మంది సభ్యులుగా చేరారు. మా తండ్రిగారు "తెలుగు" మాసపత్రికను నెలకొల్పి ఒక సంవత్సరము నడిపించారు. పండ్రెండు సంచికలు వెలువడినవి. క్రమముగా సమాజమందలి సభ్యుల సంఖ్య ఎక్కువైనది. ఈ సంచికల్లో మా తండ్రి గారి వ్యాసములు, "బాలకవి శరణ్య" మండలి రెండు ప్రసంగములు, "ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజములోని ప్రసంగములు ప్రకటితమైనవి. చిన్నయసూరికి పూర్వముండిన వచన రచనా సంప్రదాయమును మా తండ్రిగారు తమ వ్యాసములలో తెలియజేసినారు. నలుగురుతో ప్రారంభమైన ఉద్యమము 1919–1920 నాటికి రెండువందలమందికిపైగా చేరినారు.

వ్యావహారిక భాషా వాదములోని ముఖ్యాంశములను మా తండ్రిగారు ఈ క్రింది విధముగా తెలియజేసినారు.

1. వ్యావహారిక భాష ముఖ్యముగా వచన రచనకే ఉద్దేశింపబడినది.

2. విశ్వవిద్యాలయములలో ప్రాచీన కావ్యభాషలో గల గ్రంథాలను పాఠ్యగ్రంథాలుగా పెట్టి కావ్యభాషను విద్యార్థులకు చెప్పవద్దనడము లేదు. కాని, ఎట్లు ఆంగ్ల విద్యార్థులు చాసర్, షేక్స్పియర్, మిల్టన్ మొదలైన కవుల గ్రంథాలను చదువుతూ ఉన్నా తమ వచన రచన వ్యావహారికి భాషలో సాగిస్తున్నారో అట్టే మన తెలుగు విషయములోను కావలెను.

3. పద్యరచన గురించి మా వాదము జోక్యము కలిగించుకొనలేదు. అయినా కవులు తమ కాలము నాటి వాడుక పదములు చేర్చుకొంటూ వచ్చినట్లు నేటి కవులున్ను తమ కాలమునాటి భాషా రూపములను ప్రయోగించుకొనవచ్చును.

1924–25లో తణుకులో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్ వార్షిక సభలోనే వ్యావహారికాంధ్ర భాషా ప్రయోజనమునంగీకరించిన తీర్మానము సభా సమ్మతమైనది. అది ఆ పరిషత్తు పెద్దలకు అనిష్టమై బాధించినందువల్ల గ్రాంథిక భాషాభిమానులే కాని వ్యావహారిక భాషాభిమానులు ఆ పరిషత్తులో ప్రవేశించడానికి ప్రబంధకములైన కొన్ని కట్టుదిట్టములు ఆ మరుచటి సంవత్సర పరిషత్తు సమావేశములో ఏర్పడినవి. అందువలన మా తండ్రిగారి తమ మతము ప్రకారము దాని ఆశయములను మార్పించుట అనిధ్యమని ఎంచి మరి దానిలో సభ్యులుగా ఉండుటకు అంగీకరించి దేశములో తమ వాదమును ప్రబలము చేయుటకు పూనుకొన్నారు. దేశములో అధిక సంఖ్యాకులు ఈ వాదమును ఒప్పుకొన్న తర్వాతగాని విశ్వవిద్యాలయములున్ను, ప్రభుత్వ విద్యాశాఖవారున్ను వ్యావహారిక భాషను గ్రహించరనిన విషయమును గుర్తించి మా తండ్రిగారు తమ ప్రచారమును సాగించారు. ఈ విషయము లెస్సగా పత్రికలలో చర్చితమైనది.

నాల్గవ ఘట్టము :

1933 డిసెంబర్ 22, 23, 24 తేదీలలో మా తండ్రి గారి సప్తతి తమ జన్మదినోత్సవములు కడు వైభవంగా రాజమహేంద్రవరములో జరిగినవి. ఈ సభలకు రాయప్రోలు సుబ్బారావు గారు అధ్యక్షత వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాలనుండి కవులు, పండితులు ఈ ఉత్సవాలకు వచ్చారు. ఈ సందర్భంలో మా తండ్రి గారు రచించిన 1. వ్యాసావళి, 2. పండిత భిషక్కుల భాషా భేషజము, 3. బాలకవి శరణ్యము, 4. గద్యచింతామణి అను నాలుగు గ్రంథాలను, మా తండ్రిగారు ఏయే శాఖలలో కృషి చేశారో వాటికి సంబంధించిన విషయాలపైని ప్రముఖ విద్యావేత్తలు రచించిన వ్యాసములు గల వ్యాస సంగ్రహాన్ని జన్మదినోత్సవ నిర్వాహక సంఘము వారు విడుదల చేశారు.

అప్పటికి కొన్ని పత్రికలు వ్యావహారిక భాషలో రచితములైన వ్యాసములు, కథలు, పద్యాలు, పాటలను ప్రకటిస్తూ వచ్చినవి. కొన్ని పత్రికలలో సంపాదకీయములు గూడ వ్యావహారిక భాషలోనే రచింపబడుచుండినవి.

1948లో ప్రభుత్వము వారిచేత ఆస్థానకవులుగా నియమితులయి, 1950లో దివంగతులైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు 1926 నుండిన్ని తమ రచనలను వాడుకభాషలోనే సాగిస్తూ వచ్చారు.

తమ జీవితకాలములోనే తమ వాదము నెగ్గినదన్న సంతోషము వారికి కలిగినది. "నా వాదము అందరూ అంగీకరించలేదనిన్ని విశ్వవిద్యాలయముల వారున్ను, ప్రభుత్వ విద్యాశాఖ వారున్ను వ్యావహారిక భాషను గ్రహించలేదనిన్ని నేనెరుగుదును. కాని వివాదము సరియైనదన్న విశ్వాసము నాకు పూర్తిగా ఉండుటకు ఎప్పటికైనను తెలుగువారందరూ నా వాదమును పూర్తిగా అంగీకరించకపోరన్న నమ్మకము నాకు కలదు" అని తమ మిత్రులతో ఆయన అంటూ,

శ్లో॥ "యేనానుకేచిదిహన ప్రథయంత్యనజ్ఞాం ।
జానంతితేకిమపి తాక్ ప్రతినైషయత్నః ।
ఉత్పత్స్యతే మమతుకోఽపి సమానధర్మః।
కాలోహ్యయం నిరవధిర్విపులాచ పృథ్వీ ॥

అనే భవభూతి శ్లోకమును ఉటంకిస్తూ ఉండేవారు.

14.1.1940వ తేదీన గూడవల్లి రామబ్రహ్మంగారు మదరాసులో తమ ప్రజామిత్ర కార్యాలయంలో మా తండ్రిగారి కోరికపైని ఒకపత్రికా గోష్ఠిని నిర్వహించారు. ఆ గోష్ఠిలో మా తండ్రిగారు తమ కడపటి సందేశాన్ని పత్రికలవారికిస్తూ "పత్రికలవారు నా వాదాన్ని బలపరచి, ప్రభుత్వము వారున్నూ, విశ్వవిద్యాలయములవారున్నూ ఆమోదించి, గ్రహించునట్లు చేయవలెను అన్నారు. 22.1.1940వ తేదీన మా తండ్రిగారు మదరాసులో నా నివాస గృహమందు దివంగతులైనారు.

మా తండ్రిగారు దివంగతులైన తర్వాత వారి కడపటి సందేశాన్ని అనుసరించి, ఏవో ఆంధ్రసాహిత్యపరిషత్ పత్రిక వంటి పత్రికలవారు తప్ప, తెలుగు పత్రికల వారందరూ తమ రచనలను వాడుక భాషలోనే సాగిస్తున్నారు. సాహితీ సమితి, నవ్యసాహిత్య పరిషత్తు వంటి సంస్థలు మా తండ్రి గారి జీవిత కాలంలోనే వ్యావహారిక భాషలో, గ్రంథ రచనలు సాగించినవి. ఇటీవల ఇంకా అనేక సంస్థలవారు వ్యావహారిక భాషలో వందలకొలదిగా గ్రంథములను ప్రకటించారు. లోకంలో వ్యావహారిక భాష గ్రంథరచనకు అర్హతమైనదన్న అభిప్రాయంమింత ఎక్కువగా వ్యాప్తి చెందియున్నా ప్రభుత్వ విద్యాశాఖ వారున్ను, విశ్వవిద్యాలయములవారున్ను వ్యావహారిక భాషకు పెట్టిన ఆంక్షను ఇంకా తొలగించలేదు. ఈ వ్యాసము 1958కి పూర్వం రచించబడినది. అందుచేత బడులలోను, కళాశాలలలోను పాఠ్యగ్రంథాలుగా పెట్టించుకొనే ఉద్దేశ్యంతో రచితములైన గ్రంథాలున్ను, 'గ్రాంథిక భాష' యెడల మక్కున గల ఏ కొలదిమందో రచిస్తూ ఉన్న గ్రంథములున్ను మాత్రమే తప్పుగానో ఒప్పుగానో కావ్యభాషా రూపాలతో రచితములగుచున్నవి. తక్కినవన్నీ వందలకొలదిగా వాడుకభాషలోనే రచితములగుతున్నవి. మాండలీక ప్రయోగాలవల్ల ఈ గ్రంథములు అర్థం కావడం లేదన్న వాదం అంతరించినది.

రెండు విషయములను మాత్రం మనం గుర్తించాలి. ఈ వ్యావహారిక భాషా వాదమంతా ముఖ్యంగా వచన రచన కోసమే పుట్టినది. చిన్నయ సూరి తన వచన రచన కావ్యభాషలో ప్రారంభించినంతవరకున్ను పూర్వం మన పెద్దలు వచన, రచనను వాడుక భాషలోనే సాగించారు. ఏయే విధములైన విషయములనుగూర్చి వాడుక భాషలో ఎన్నెన్ని గ్రంథములు రచితములైనవో మచ్చుతునకలతో మా తండ్రిగారు "గద్యచింతామణి" గ్రంథములో తెలియజేసినారు.

పద్యరచన విషయమును వ్యావహారిక భాషావాదులు ముఖ్యమైనదిగా పెట్టుకొనలేదు. అయితే దానిని గురించి కూడా మా తండ్రిగారు ఆలోచింపకపోలేదు. పద్యరచనలో కావ్యభాషలో గల కొన్ని శబ్దరూపాలను జోడిస్తే కాని పద్యం, గేయం రసవంతంగా ఉండవు అని గురజాడ అప్పారావు గారు అంటూ ఉండేవారు. ఆ భావాన్ని అనుసరించే "గుత్తునా ముత్యాల సరములు, కూర్చుకొని తేటైన మాటల, కొత్తపాతల మేలు కలయిక, కొమ్మెరుంగులు చిమ్మగా" అని తన గేయం రచించారు. అందుకు సరేనన్నారు మా తండ్రిగారు. అయితే కావ్యభాష కూడా ఎట్లు మారుతూ వచ్చిందో, కవులు తమ కాలంనాటి వ్యావహారిక భాషా శబ్ద రూపాలను కొద్దిగానైనా ఎట్లు తమ కావ్యాలలో ప్రయోగిస్తూ వచ్చారో తెలియజేస్తూ, తమ "బాలకవి శరణ్యము" అనే గ్రంథాన్ని మా తండ్రిగారు రచించారు.

ఏ గ్రంథమూ పుట్టకమునుపు అంతా ఒకే భాష ఉండేది. అందుచేత మొట్టమొదటి గ్రంథము వ్యావహారిక భాషనే ఆశ్రయించి రచితమైనది. తర్వాతి గ్రంథ రచయితలకు తమ కలవడిన వ్యావహారిక భాషతోబాటు తమకు పూర్వులయినవారు రచించిన గ్రంథములలోని భాష కూడా గ్రాహ్యమయినది. తెలుగు భాష దేశ్య, అందుచేతనే నిత్యప్రవాహినీ దేశ్యా అనే సూత్రభావాన్ని అనుసరించి నిత్యంగానే ఉంటూ, నిత్యమున్ను ప్రవాహంలోని నీళ్లు మారుతూ ఉన్నట్లే మార్పులు చెందుతూ, సాగుతూ ఉంటుంది. (శబ్ద) సిద్ధిర్లోకాద్ దృశ్యా అన్నారు. అదే తెలుగులో శబ్ద సిద్ధి లోకమువలన తెలియును అన్నారు. అనగా శబ్దరూపములు లోకంలో వాడుకను బట్టి సిద్ధిస్తూన్నవే కాని వైయాకరణుడు పుట్టించడు, పుట్టించలేడు. అని భావము. ప్రాచీన కవి ప్రయోగము శబ్ద రూపంలో గాని శబ్దార్థములో కాని లోక వ్యవహారమునకు విరుద్ధముగా ఉన్నప్పుడు దానిని ప్రయోగించకూడదన్న నియమం కొన్ని భాషలలో ఉన్నది. వేద భాషలో నుండిన కొన్ని శబ్ద రూపాలు సంస్కృత భాష నాటికి వ్యవహార భ్రష్టములైనవి. అవి "ఆర్ష" ప్రయోగాలు; వాటిని వాడకూడదని పాణిని మొదలైన సంస్కృతభాషా వైయాకరణులు నిషేధించారు. ఉదాహరణం: స్థా (=ఉండు) అనే ధాతువుకు సంబంధించిన శబ్ద రూపాలు స్థామ, స్థాతు మొదలైనవి వేదంలో ఉన్నా సంస్కృత భాషలో వాడకూడదు. వాటికి మారుగా తిష్ఠామి, తిష్ఠతు మొదలైనవి ప్రయోగించాలి. మన తెలుగు భాషలో గూడ 'ప్రాతవడ్డ మాటలు' ప్రయోగార్హములు కావన్న భావమును తిక్కన సోమయాజి కూడా తెలియజేశారు. (చూ.చ. పలుకుల పొందులేక రసభంగము సేయుచు ప్రాతవడ్డ మాటలు) ప్రయోగమూలం వ్యాకరణం' ' అనే ప్రాథమిక సూత్రాన్ననుసరించి అప్పకవి మొదలు అడిదం సూరకవి వరకున్ను గల లాక్షణికులు తమ పూర్వుల కావ్యాలలో గల

ప్రయోగాలలో ఏవైతే పూర్వ వ్యాకరణ సూత్రాలకు విరుద్ధముగా నున్నవో వాటిని గుర్తుగా పెట్టుకొని వ్యాకరణ లక్షణాలను సవరిస్తూ వచ్చారు. చిన్నయ సూరి ఈ సంప్రదాయమును గుర్తించి కూడా కవి ప్రయోగాలను లక్ష్యములుగా చూపింపక తన వ్యాకరణ రచన సాగించారు. అతని వ్యాకరణ మందున్న కొన్ని సూత్రాలు నన్నయ భాషకే వర్తిస్తవి. కొన్ని సూత్రాలు ప్రాచీన కవుల గ్రంథములకే వర్తిస్తవి. ఆ సూత్రాలను ప్రమాణంగా తీసుకొంటే మహాకవి ప్రయోగాలు కొన్ని లక్షణ విరుద్ధాలు కాక తప్పవు. తెలుగు భాషా వైయాకరణులు సంప్రదాయ సిద్ధంగా అనుసరించిన మార్గాన్ని అనుసరించిన కవుల ప్రయోగాలను సేకరించి వాటిని ఆధారంగా, పెట్టుకొని వ్యాకరణ సూత్రాలను సవరిస్తే కాక భాషకున్న నేటి శిష్టజన వ్యావహారిక భాషకున్ను గల తారతమ్య చాలా తగ్గిపోతుంది. సిద్ధిర్లోకాద్ దృశ్యా అనే ప్రాథమిక వ్యాకరణ సూత్రాన్ని అనుసరించి నేటి శిష్టజన వ్యావహారిక భాషను గ్రహిస్తే కావ్యభాష, వాడుకభాష అనేవి రెండూ ఒకే భాషగా ఐక్యమొందగలవు.

– గిడుగు వేంకట సీతాపతి

ఫలవంతమైన వ్యవహారిక భాషోద్యమం : జి.వి. రామమూర్తి

మా తాతగారు, రామమూర్తి పంతులుగారు జీవించియుండగా ఆంధ్ర, మదరాసు విశ్వవిద్యాలయాలవారు వ్యావహారిక భాషను అంగీకరించలేదు. మదరాసు యూనివర్శిటీలోని తెలుగుబోర్డు ఆఫ్ స్టడీస్‌కి 1955లో మా నాన్నగారు, సీతాపతిగారు, చైర్‌మన్‌గా ఉండినప్పుడు నేటి వ్యవహారంలో ఉన్న పూర్వకవి ప్రయోగాలను విద్యార్థులు వాడవచ్చునన్న తీర్మానాన్ని ఆమోదింపజేశారు. అయితే 1965 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని మూడు విశ్వవిద్యాలయాలవారు ఈ విషయాన్ని చర్చించనైనా లేదు. 1965లో విశ్వవిద్యాలయాల పాఠ్యగ్రంథాలలోని భాషా శైలి విషయం చర్చకు వచ్చినపుడు భద్రిరాజు కృష్ణమూర్తిగారు వ్యావహారిక భాషే అనుసరణీయమని పట్టుపట్టారు. ఈ విషయమై పింగళి లక్ష్మీకాంతం గారి అధ్యక్షతను ఒక సమావేశం జరిగింది. ఆ తర్వాత వారి అధ్యక్షతనే ఒక 'స్టయిల్ కమిటీ' ఏర్పడింది. ఈ కమిటీ తీర్మానాల దృష్ట్యా గ్విక్ గారి అధ్యక్షతను ప్రభుత్వం మరొక కమిటీని నెలకొల్పింది. ఈ కమిటీ సూచనల ననుసరించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1969లో 'తెలుగు అకాడమీ'ని స్థాపించింది. ఈ యకాడమీ ఇంటర్‌మీడియట్, బి.ఏ. తరగతుల వివిధ సాంకేతిక విషయాల పాఠ్యపుస్తకాలను వ్యావహారిక భాషలో ప్రచురించడం మొదలుపెట్టింది. పి.హెచ్‌డి. చేసే విద్యార్థులు తమ పరిశోధనా వ్యాసాలను వ్యావహారిక భాషలో వ్రాయడానికి శ్రీ వేంకటేశ్వరా యూనివర్శిటీ 1969లో అనుమతించింది. 1973లో ఆంధ్రా యూనివర్శిటీ వారు వ్యావహారిక భాషను ఆమోదించారు. 1906లో విద్యావిషయకంగా యేట్సు దొరగారి సూచనతో రామమూర్తి పంతులుగారు ప్రారంభించిన వ్యావహారికా భాషా ఉద్యమం 1973లో సంపూర్ణంగా ఫలవంతమయినదని చెప్పవచ్చును.

– జి.వి. రామమూర్తి

(అముద్రిత వ్యాసం – సంపాదన – కుర్రా జితేంద్రబాబు)

ఒక్కటేరా! తెలుగుదేశం
ఒక్కటేరా! తెలుగుభాష
ఎక్కడున్నా తెలుగులందరు
ఒక్కటేరా! ఒక్కటేరా!

ఒక్కటే గోదావరీనది
ఒక్కటే కృష్ణానది
రెండునదులూ తెలుగుజాతి
గుండెలో ఒక్కటైనవి ॥ఒక్క॥

అరకులోయల గాలికొండ
హైదరాబాద్ గోలకొండ
కలిసికట్టెను తెలుగుతల్లి
కంఠసీమను పూలదండ ॥ఒక్క॥

సాగర మ్మొక వైపున, నిజాం
సాగర మ్మొక వైపున
తెలుగుతల్లికి వీచుచల్లని
అలలవీవన లందమొప్పగ ॥ఒక్క॥

ఎదలు ఎదలు కూర్చికట్టిన
ఏకతాసేతువుల మీద
కదలివచ్చెను ప్రగతిచక్రాల్
కనుల పండువగా! ॥ఒక్క॥

పేదవోయిన తెలంగాణము
పెంపయిన సర్కారుప్రాంతము
మధ్య రాయలసీమతమ్ముల
మధ్య భేదము మాపుదాం

– జె. బాపురెడ్డి

పి.వి. నరసింహారావు

నేనెరిగిన డా. బూర్గుల రామకృష్ణారావుగారు

స్వర్గీయ డా. బూర్గుల రామకృష్ణారావు గారి 5వ వర్ధంతి సందర్భంలో వారిని గురించి వ్యాసమేదైనా యివ్వవలసిందిగా మిత్రులు కొందరు నన్ను కోరారు. డా. రామకృష్ణారావు గారి పేరు వినగానే గత స్మృతులెన్నో ముప్పిరిగొని భావోద్రేకంతో నా మనస్సు ఉక్కిరిబిక్కిరై పోతూ ఉంటుంది. నా భావాలన్నింటిని యీ వ్యాసంలో వివరించడం ఎలాగ? అవన్నీ వ్రాస్తే ఒక పెద్ద గ్రంథమే అవుతుంది. అందుకని లేఖా మాత్రంగా నా భావాలను యిక్కడ పొందుపరుస్తాను.

కీ.శే. డా. రామకృష్ణారావుగారిని గురించి చరిత్రకారులు ఏమి వ్రాస్తారో మనం తేలికగానే ఊహించుకోవచ్చు. "డాక్టరు రామకృష్ణారావుగారు ఫలాన తేదీన ఫలాన గ్రామంలో పుట్టారు. పూనాలోని ఫోర్గ్యసన్ కాలేజి నుండి పెర్షియన్ బాష ఐచ్ఛిక విషయంగా తీసుకొని పట్టభద్రులయ్యారు. పర్షియన్ ట్యూటరుగ కొంతకాలం పనిచేశారు. తరువాత న్యాయవాద పట్టా పొంది ఫలానా సంవత్సరంలో న్యాయవాదిగా నమోదు అయ్యారు. ఇన్ని సంవత్సరాలు న్యాయవాదిగా పనిచేసారు. ఇన్ని ప్రజా ఉద్యమాలలో ఇన్నిసార్లు సత్యాగ్రహం జరిపి జైలుకు వెళ్లారు. హైదరాబాదు స్టేటు కాంగ్రెసులో వారొక ప్రముఖ నాయకులు మంత్రిగాను, ముఖ్యమంత్రిగాను, రెండు రాష్ట్రాలకు గవర్నరుగాను పని చేశారు. కొంతకాలం రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. అనేక కమిటీలకు, కమీషన్లకు అధ్యక్షులుగా ఉన్నారు. గుండెపోటు వలన 1967 సెప్టెంబరు 14వ తేదీన కన్నుమూశారు" మొదలయిన అంశాలు వ్రాస్తారు. వును, చారిత్రికంగాను, కాలక్రమ ప్రకారంగాను అది అంతా నిజమే. కాని, అంతమాత్రం చేత డా. రామకృష్ణారావుగారి అసలు వ్యక్తిత్వం మనకు అవగతం కాదు.

ప్రతి మానవునిలోను సాధారణంగా ఉన్నదానికంటె ఘనంగా తనను గురించి చిత్రించుకొనే స్వభావం ఉంటూ ఉంటుంది. దానిని గురించి వాని అంతరాత్మ బోధిస్తూనే ఉంటుంది. అయినప్పటికీ తాను చిత్రించుకొన్న అకృత్రిమ ఘనతను యితరుల ముందు ప్రదర్శించి యితరులకంటె తాను అధికుడ ననిపించుకోవాలనే ఉబలాటం, పెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే వుంది. తత్ఫలితంగా ఒకరినొకరు కించపరుచుకొంటూ తమ శక్తి సామర్థ్యాలను, అమూల్య సమయాన్ని వ్యర్థపరుచుకొంటూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. కాని యిందుకు డా. రామకృష్ణారావుగారు మాత్రం అరుదుగా కనవచ్చే ఒక చక్కని మినహాయింపు అని చెప్పవచ్చు. వారెల్లప్పుడు అన్ని విషయాలు ఆఖరికి తమలోని లోపాలను కూడా ఉన్నవి ఉన్నట్లుగా చెపుతూ వుండేవారు, ఎంత ఉంటే అంతే. వీసం ఎత్తు ఎక్కువాలేదు, వీసం ఎత్తు తక్కువా లేదు.

వారి పొట్టినతనం కొంతవరకు వారిని మరుగు పరుస్తూ ఉండేదని కొంతమంది అంటారు. కాని అంతకంటె సత్యదూరమైన విషయం మరొకటి లేదని నా భావన. నిజానికి ఒడ్డూ పొడుగూ ఉన్న చాలామందికంటె కూడ వారు అతి చక్కగా గుర్తింపబడుతూ ఉండేవారు. తమ వామన రూపాన్ని

గురించి స్నేహపూరితమైన ఎన్నో పరిహాసాలను వారే స్వయంగా చక్కటి భావనిర్లిప్తతో చెప్తూ ఉండేవారు. లోగడ మన దేశంలో అమెరికా రాయబారిగా పనిచేసిన ప్రొఫెసర్ గాల్‌బ్రైత్ అసాధారణ పొడగరితనం కంటె డా. రామకృష్ణారావు గారి పొట్టితనం వారిని ఏ మాత్రం మరుగు పరచలేదు. పూర్వపు హైదరాబాదు సంస్థాన ముఖ్యమంత్రిగా ఉంటున్న రోజులలో డా. రామకృష్ణారావుగారు బేగంపేట విమానాశ్రయంలో అరేబియారాజు ఇబన్‌షాఉద్‌ను పుష్పమాలాంకృతునిగా చేసిన సందర్భంగా అతిథి అతిథేయు లిర్వురు పరస్పర సౌజన్య సౌహార్ద్రాలతో ఎటువంటి పీటు చేయవలసి వచ్చిందో ఆ వినోదకర దృశ్యం యిప్పటికీ చాలా మందికి జ్ఞాపకముండే ఉంటుంది. అలాగే ఒక విందు సదర్భంలో ప్రొ. గాల్‌బ్రైత్, డా. రామకృష్ణారావు గార్ల ఫొటో తియ్యడ ఫొటోగ్రాఫర్ల కళానైపుణ్యానికొక గీటురాయి అయి ఆ సందర్భానికొక చక్కని వినోదాన్ని చేకూర్చింది.

అవసరమైతే విరాట్ రూపం.....

వారు గుర్తించబడడానికి, గుర్తించబడకపోవడానికి వారి శరీరాకృతి కారణం కానేలేదు. అతకన్న గహరమైన దేదో వారి వ్యక్తిత్వంలో వుండి ఉండాలి. ఏదో నిత్య నైమిత్తికంగా (routine) వారు గుర్తించబడడంకాని, గుర్తించబడకపోవడం గాని జరుగలేదు. వసరం వచ్చినప్పుడు వారు అలనాటి వామనమూర్తివలె యింతింతై ముల్లోకాలు ఆక్రమించి తమ విరాట్ రూపాన్ని ప్రదర్శించేవారు. పని పూర్తి అయిన వెంటనే తిరిగి తమ వామన రూపంలో యిమిడిపోతూ ఉండేవారు, మరొక అవసరం వచ్చేవరకు. అందుచేత వారు కావాలని నిరాడంబరంగా తెరమరుగున ఉండడం జరుగలేదు. అసలు రహస్యం ఏమిటంటే చిన్న మూర్తిలో యిమిడి ఉన్న వారి బహుముఖ ప్రతిభాయుత మూర్తిమత్త్వం అవసరం వచ్చినప్పుడు తమ మహోన్నత రూపంలో ప్రదర్శితం కావడం, అవసరం తీరగానే తిరిగి స్వరూపంలో యిమిడిపోవడం అనేది వారి స్వభావంలోనే ఉంది. విచిత్రం ఏమిటంటే డా. రామకృష్ణారావుగారి వ్యక్తిత్వపు మహోన్నత శిఖరాలు దాని అగాధపు లోతులలోనే పరిలక్షితమౌతూ ఉండేవి.

న్యాయవాదిగా

న్యాయవాదిగా వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలుండేవి. వారి ప్రాక్టీసు roaring practice అని చెప్పడానికి వీలులేదు. అలా అని వారికి కేసుల కొరత ఎప్పుడూ ఉండేదికాదు. కాని వాటిలో ఎక్కువ కేసులు రాజకీయాలకు సంబంధించినట్టివి. ఫీజు లేనట్టివీను. ప్రజాహిత జీవితం కొందరు న్యాయవాదులకు ఫైలు పెరగడానికి, ధన సంపాదనకు ఉపకరిస్తే, డా. రామకృష్ణారావు గారి విషయంలో మాత్రం అది తారుమారైంది. వారి వద్దకు వచ్చే క్లయింట్లలో చాలమందికి ఒక రకమైన మిశ్రిత భావం ఉంటూ ఉండేది. డా. రామకృష్ణారావుగారి శక్తి సామర్థ్యాలు, ప్రజ్ఞా ప్రాభవాలలో సంపూర్ణ విశ్వాసానికి తోడు వారు రాజకీయ వ్యక్తతవలన కేసులమీద ఎక్కువ ధ్యానముంచలేరేమో అన్న అనుమానంకూడా ఆ క్లయింట్ల మనస్సులలో ఉండూ ఉండేది. నిజానికి రామకృష్ణారావుగారికి కేసును క్షుణ్ణంగా చదివి తయారవడానికి అవకాశమే ఉండేదికాదు. కేసు చేపట్టేటప్పుడే వారు విషయమంతా శ్రద్ధగా విని ఆ కేసు తాలూకు ఫైలు యొక్క వెనుక అస్పష్టమైన నోటుల కొన్నిరేఖామాత్రంగా వ్రాసిపెట్టుకొనే వారు అంతే. నిజానికి వాటిని కేసుకు తయారీ అనడానికి వీలు లేదు. కాని కోర్టులో ఆ రేఖామాత్రపు నోట్సే డా. రామకృష్ణారావుగారి జాజ్జ్వల్యమానమైన ప్రతిభా విశేషతంతో ఎదుటి న్యాయవాదుల వాదనా ఘాతములకు దుర్భద్యమైన కచు గోడలుగా నిలపడం నేను స్వయంగా చూచాను. న్యాయవాద వృత్తిలో నిష్ణాతమైన సునిశిత మేదా సంపత్తిని వారు ప్రదర్శిస్తున్నారా అన్నట్లుగా ఉండేది వారి అనన్యమైన వాదనా పటిమ.

ప్రోత్సాహం

సీనియర్ న్యాయవాదిగా వారిదొక ప్రత్యేక తరహా. నేను వారివద్ద అందరికంటె జూనియర్‌గా ఉండేవాడిని. కాని తల్లికి తన కడగొట్టు బిడ్డపై ఎటువంటి విశేష మమకారం ఉంటుందో అటువంటి మమకారమే డా. రామకృష్ణారావుగారికి నామీద ఉంటూ ఉండేది. చొరవతోను, నిరాఘాటంగాను, నేను వారి ఆఫీసును ఒక న్యాయవాద కాఫీ పానశాలగా పరిగణించి నాకు కావలసిన కేసులను – ముఖ్యంగా జూనియర్లకు కొరుకు పడని చిక్కు కేసులను – స్వయంగా ఏరుకొని చదువుతూ ఉండేవాడిని. నా యీ చొరవ వారి సీనియర్ గుమాస్తాకు కోపకారణమై ఆయన నామీద కారాలు మిరియాలు, నూరుచూ ఉండేవాడు. ఒకసారి రామకృష్ణారావుగారు దానిని గమనించి నా చేష్టపై తమ ఆమోద ముద్ర వెయ్యడం, అంతటితో కారాల మిరియాల ప్రకరణం ముగియడం జరిగింది. అప్పటినుండి మా యిరువురి మధ్య సీనియర్, జూనియర్ సంబంధం పోయి నిష్కాపట్యంతో కూడిన సమాన స్థాయి చర్చా సంబంధం ప్రారంభమైంది. నేను అంచనా వేసుకొన్న దానికంటే ఎక్కువగానే నాలో శక్తి సామర్థ్యాలున్నాయని, సవయంగా గుర్తించ గలిగేలా నన్ను రూపొందించిన డా. రామకృష్ణారావుగారి విశేష నైపుణ్యానికి నే నెల్లపుడూ జోహారు లర్పిస్తూనే ఉంటాను. వారు నాలో పూరించిన ఆ ఆత్మ విశ్వాసమే నాకు వాసన సభలలోను, యితర చోట్లను కూడ శ్రీరామ రక్షగా ఉంటూ వస్తూంది. ప్రాతఃస్మరణీయులైన నా సీనియర్ రామకృష్ణారావుగారి విశిష్ట వ్యక్తిత్వమట్టిది.

రాయకీయాలలో వారి సమ్యక్ దృష్టి కోణం సంకుచిత సైద్ధాంతిక అరలకు తావివ్వలేదు. వారు పుట్టింది జాగీర్‌దారీ కుటుంబంలో అయినప్పటికి వారు పూర్వపు హైదరాబాద్ సంస్థానంలో తరతరాల నుండీ వస్తూ ఉన్న జాగీర్‌దారీ వ్యవస్థను రూపుమాపడానికి వెనుకాడలేదు. వారి స్నేహ కోటిలో పెద్ద పెద్ద భూస్వాములు చాలమంది ఉండేవారు. అయినప్పటికిని వారు పూర్వపు హైదరాబాద్ రాష్ట్రంలో దున్నేవానిఇక భూమి హక్కు నిచ్చే కౌలుదారీ చట్టాన్ని తయారుచేసి, దేశంలో సమాజవాద వ్యవస్థకు మార్గదర్శకులైనారు. ఆ చట్టాన్ని అమలు పరచడానికి వారు ఎంపిక చేసిన జిల్లాల్లో ఎక్కువగా నష్టపోయిన భూఖా మందులు వారి బంధువులూ, రాజకీయ సహచరులే.

పూర్వపు హైదరాబాద్ సంస్థాన విచ్ఛిత్తి తన రాజకీయ ప్రాబల్యానికి స్వస్తివాచకం పలుకుతుందని వారికి ముందే తెలుసు. అయినప్పటికీ వారు సస్థాన విచ్ఛిత్తిని ప్రతిపాదించి, సమర్థించడమే కాకుండా తద్వారా చతుష్కోటి ఆంధ్రుల ఏకీకరణకు విశాలాంధ్రావతరణకు ప్రధాన కారకులైనారు. తనకు నష్టం యితరులకు మేలు చేకూర్చే నిర్ణయాలు తీసుకొంటూ తన రాజకీయ జీవితాన్నంతా ఆత్మ పరిత్యాగానికీ, చివరకు

సక్రియ రాజకీయాలనుండి తన నిష్క్రమణకు దారితీసే పరిస్థితులకు వీరివలె అంకితం చేసుకొనే రాజనీతి వివాలదులు బహు అరుదు. రామకృష్ణారావుగారు ఏ నిర్ణయం తీసుకొన్నా దానిని అన్ని విధాలైన జాగ్రత్తలతోను, మంచి వ్యవహార దక్షతతో తీసుకొనేవారు. ఒకసారి నిర్ణయం తీసుకొన్నారంటే ఆరునూరైనా దానిమీద స్థిరంగా నిల్చేవారు. ఇదీ డా. రామకృష్ణారావుగారి సంక్షిప్త రాజకీయ చరిత్ర.

సౌజన్యానికి మారుపేరు

వారి విశిష్ట వ్యక్తిత్వానికి సంబంధించిన మరో ముఖ్యాంశం ఉంది. గత తరంలోని అన్ని సుగుణాల మూర్తిత్వమే శ్రీరామ కృష్ణారావుగారు. శరాఫత్ అంటే సౌజన్యానికి మారుపేరే వార. మతదురాభిమాన్ని పెంపొందిస్తూ రాజ్యమేలుతున్న నాటి నిజాంకు బద్ధ వ్యతిరేకి అయినప్పటికీనీ రాష్ట్రంలోని ముసల్మానులందరికీ వారు పరమమిత్రులు, ఆప్తులూను. అతి నిరాడంబరముగా వారు మతాతీతస్థితిని పాటించేవారు. వారి డ్రాయింగు రూం ఒక సంస్కృతీ ప్రదర్శనశాలలా ఉండేది. నాటి హైదరాబాద్ ప్రభుత్వ పెద్దలు, కుచ్చుటోపీల మౌల్వీలు, గడ్డాల ముల్లాలు, త పాగాల పండితులు, మహామహోపాధ్యాయులు, గాంధీ టోపీల వారు, ఖద్దరుధారులు, అధునాతన టెరిలిన్ యువకులు – ఒకరేమిటి, అన్ని రకాలవారు, వారిని ఆహ్వానించడానికి అక్కడ హారు అయేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే డా. రామకృష్ణారావుగారు మూడు విభిన్నతరాల చివరి వారధిలా కన్పించేవారు. ఇంతటి విశాల వ్యక్తిత్వంతో వారు ఆనాటి ప్రజాజీవితాన్ని తీర్చిదిద్దారు.

నాటి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభలో శాసనసభా నాయకులుగా వారు సునిశిత మేధ, పరిమార్జిత భాష, వ్యవహార దక్షతలను మేళవించి ఏర్పరచిన ఉన్నత ప్రమాణాలను, నేటికి – ముఖ్యంగా యీ రోజులలో – ఎంతో గౌరవంతో చాలామంది స్మరించుకొంటూ ఉంటారు. అవసరమైనపుడు వారు ప్రత్యర్థులను చీల్చి చెండాడేవారు. కాని అలా చేయడంలో ప్రత్యర్థుల నుండి రక్తపు బొటుటమాట అలా ఉంచి, ఒక్క కన్నీరు బొట్టు పడడంగాని, వారి హృదయాలకు రవ్వత నొప్పి తగలడంగాని జరిగేదికాదు. పార్లమెంటేరియన్‌గా డా. రామకృష్ణారావుగారి అద్వితీయ కళాకౌశలమట్టిది.

బహుభాషావేత్త

వారు చాల ప్రతిభావంతులైన భాషావేత్తలనే విషయం అందరికీ తెలిసనదే. వారు చదువుకున్న చాల భాషలు వాటియందలి అభిరుచులచే ప్రయివేటుగా చదువుకొన్నవే. ముఖ్యమంత్రిగా ఉంటున్న రోజులలో డా. రామకృష్ణారావుగారు ప్రతిరోజూ అర్ధరాత్రివరకు ఆఫీసుపైళ్లు చూచుకొని, ఆ తర్వాత నమ్మశక్యం గాని ఉత్సాహంతో సంస్కృత ప్రాచీన కావ్యాలు చదవడంలో ఎలా మునిగి పోయేవారో నాకిప్పటికీ స్పష్టంగా జ్ఞాపకం ఉంది. బహుముఖ ప్రతిభావంతులైనప్పటికీ, డా. రామకృష్ణారావుగారు ప్రధానంగా సాహితీ జగత్తుకు చెందినవారని నా నమ్మకం. ఇది చాల వింతగానే తోచవచ్చు. ఎందుకంటే వారి సాహిత్య వ్యాసంగం జరుగవలసినంత ఎక్కువగా జరుగలేదు.

బహుముఖ ప్రజ్ఞతో వచ్చిన చిక్కే యిది. డా. రామకృష్ణారావుగారు ముట్టని, పెంపొందించని క్షేత్ర ఏదీ లేదంటే అందులో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. కాని ఏం లాభం? ఏ సాహిత్య క్షేత్రానికైతే వారి సునిశిత మేధా సంపతిత ఎక్కువ అనుకూలంగా ఉండేదో, ఆ సాహిత్య క్షేత్రంలో చెప్పుకోదగ్గ రచనలు చేయడానికే వారికి అవకాశం కలుగలేదు. రాజకీయవేత్తగా కూడ వారు తమ కాలంనాటి అంటే దేశచరిత్రలో చాల ప్రధానమైన, ఉత్తేజకరమైన దశాబ్దాలకు సంబంధించిన స్మృతులను గ్రంథస్థం చేసి ఉండవలసింది. నాబోటి హితైషులెంత చెప్పినప్పటికీ వారా పనులు చేయలేకపోయారు. ఆవిధంగా వారు తమ జీవిత కాలంలో ఎంతో విలువైన పనులు చేసినప్పటికీ, చేయకుండా వదిలివేసింది కూడ అంతకన్న ఎక్కువ విలువైనదే అని నా అభిప్రాయం. ఎందుకంటే ఆ పనులు చేయడానికి యితరులెవరికంటె కూడ వారే మిక్కిలి సమర్థులు. ఇందుకు నేనూ, నాలాగే యితరులు చాలమంది కూడ ఎప్పుడూ బాధపడుతూనే ఉన్నాం.

వారి ఔదార్యం, ఉపకారబుద్ధి ఎంతవరకు ఉండేదంటే, ఒక్కొక్కపుడది ఒక దోషంగా పరిణమించేది. అసాధ్యమైన కోరికలు కోరినపుడు కూడ వారు నెమ్మదిగా నచ్చచెప్తూ ఓపికగా చాలసేపు కూర్చొనేవారు. అపుడు వారి స్థానంలో మరొకరెవరైనా ఉండిఉంటే ఒక్క చీదరింపుతో దానిని వెంటనే పరిష్కరించి ఉండేవారు. కాని డా. రామకృష్ణారావుగారి ఔదార్యం అలా చేయనిచ్చేది కాదు. వారి ఉదార ప్రకృత్తి వలన న్యాయముగా ఎక్కువ ధ్యానముంచవలసిన పనులకంటే, శక్తిని, సమయాన్ని వ్యర్థపరిచే పనులకు అప్పుడప్పుడు వారు ప్రాధాన్యమివ్వడం జరుగుచుండేది. ఏమైతేనేమి? వారావిధంగా మలచబడ్డారు. అది అంతే.

ఉపకారశీలి

డా. రామకృష్ణారావుగారిది పెద్ద కుటుంబం. ఆ కుటుంబానికి వారిక ఆత్మీయులైన తండ్రి. ఆ కుటుంబానికే కాదు, ప్రతిచోటా ఆత్మీయుడైన తండ్రిగానే ఉంటూ ఉండేవారు. వారు ఎక్కడైనా బయలుదేరితే దారిలో వారిని ఎవరైనా ఎక్కడైనా ఆపి కష్టసుఖాలు చెప్పుకోవచ్చు. అందుచేత వారు ప్రతిదానికి ఆలస్యంగా రావడానికి పేరుబడ్డారు. అయినప్పటికీ మిత్రులు, సహచరులు, ప్రజలుకూడ ఎంతో ప్రేమతోను, ఓర్మితోను, గంటల తరబడి వేచిఉంటూ ఉండడం, వారు రాగానే – "సోదర సోదరీమణులారా; నేను అలవాటు ప్రకారం నేడు కూడ ఆలస్యంగానే వచ్చాను" అంటూ ఉండడం పరిపాటి అయిపోయింది.

వారి సామాజిక యాత్ర ఎప్పుడూ సాఫీగా జరుగలేదు. రకరకాలైన ఒడుదుడుకులను వారు ఎదుర్కొనవలసివచ్చేది. చాల సందర్భాలలో విపత్కర పరిస్థితులు సేనావాహినిలా వచ్చి చుట్టుముట్టేవి. అయినప్పటికీ వారు చలించేవారుకాదు. మనస్థైర్యాన్ని సమచిత్తను వారు ఎన్నడూ విడనాడేవారు కాదు. విజయాలు లభించినప్పుడు సంతోషంతో ఉప్పొంగనూ లేదు. కష్టాలు సంభవించినప్పుడు అధైర్యంతో క్రుంగిపోవనూ లేదు. స్నేహితులు ద్రోహం తలపెట్టినప్పుడు కాని, ప్రత్యర్థులు దూషించినప్పుడుగాని వారనేదల్లా ఒకటే– "సరే– అవన్నీ ఆటలో ఉండేవేగా" అని.

డాక్టరు రామకృష్ణారావుగారిని గురించి ఎంతైనా వ్రాయవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే వారు పూర్ణపురుషులు.

('ఆంధ్రప్రదేశ్' డిసెంబర్, 1972)

పోణంగి శ్రీరామ అప్పారావు

తెలుగు సంస్కృతి మానవతారూపు దాల్చిన మనీషి శ్రీ మండలి వేంకట కృష్ణారావు

1. తెలుగు సంస్కృతీ మూర్తి :

ఆనంద సంవత్సరం ఉగాది (24.03.1974) సందర్భంగా వారం రోజులపాటు అఖిల భారత తెలుగు సాంస్కృతిక ఉత్సవం జరిగింది. అంతకు ముందు కొన్ని సంవత్సరాలుగా ఆంధ్రాభ్యుదయోత్సవాలు జరుగుతూ వచ్చినవి. ఇవి రాష్ట్రంలోని తెలుగు వారికి పరిమితమైనవి. మరి భారతదేశంలోని తెలుగువారిని అందరినీ సమైక్యం చేయాలన్న దీక్షతో శ్రీ కృష్ణారావు గారు ఈ అఖిల భారత ఉత్సవం తలపెట్టారు. ఈ ఉత్సవం చాల జయప్రదమైనది. అంతేకాదు నిజాం కళాశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభలో "అధికార భాష సంఘము"ను నెలకొల్పినట్లు, దానికి శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారిని అధ్యక్షులుగా ఎన్నుకొన్నట్లు ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు ప్రకటించారు.

అప్పుడు తెలుగు అకాడమికి డైరక్టర్‌గా ఉన్న నాకు "తెలుగు పుస్తక ప్రదర్శన" బాధ్యతను అప్పగించారు. నేను ఏర్పాటు చేసిన తెలుగు పుస్తక ప్రదర్శన అందరి మన్ననలను అందుకొంది. విద్యా సాంస్కృతిక మంత్రిగా ఉన్న శ్రీ కృష్ణారావుగారు పుస్తక ప్రదర్శనను సందర్శించి, మెచ్చుకొన్నారు. అదే వారితో నా ప్రథమ పరిచయం. తరువాత వారు నన్ను పిలిపించి ఇట్లా అన్నారు– "అప్పారావు గారూ! మీరు ఆరు సంవత్సరాలుగా తెలుగు అకాడమికి డైరక్టర్‌గా ఉండి, దానికి ఒక సుస్థిర రూపం ఇచ్చారు. ఇంక అది నిరాటంకంగా కొనసాగుతుంది. అందుచేత మీకు ఇంకో క్రొత్త బాధ్యత అప్పగించదలచాము. మీరు మరల సెక్రటేరియట్‌లో మీ పూర్వపు బాధ్యతలు చేపట్టండి. అంతేకాదు. ప్రపంచ తెలుగు మహాసభలు జరపాలని నిర్ణయించినాము. ఆ ఆహ్వాన సంఘమునకు ప్రధాన కార్యదర్శిగా మీరు కృషి చేయాలి" అని ఆదేశించినారు. అందుకు నా అంగీకారం తెలిపాను. అప్పటి నుండీ కృష్ణారావుగారితో సన్నిహితంగా పనిచేసే అవకాశం లభించింది. 1974 జూలై నెలలో సెక్రటేరియట్‌లో సాంస్కృతిక వ్యవహారాల ప్రత్యేకాధికారిగా ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వాన సంఘం యొక్క ప్రధాన కార్యదర్శిగా రెండు బాధ్యతలు చేపట్టాను.

ఆంధ్ర శాతవాహన చక్రవర్తుల కాలంలో తెలుగువారి ముఖ్య ప్రాంతాలు ఒకే పరిపాలనలో ఉండేవి. అప్పుడప్పుడు అవి విడిపోవటం, మరల కలిసి ఉండటం జరుగుతూ వచ్చినా, ఆంగ్లేయుల పరిపాలనలో అవి విడిపోయాయి. అయితే పెద్దల సమిష్టి కృషి ఫలితంగా 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పడటంతో మరల మూడు ప్రాంతాలు ఏక పరిపాలనలోకి వచ్చాయి.

కాని, తరువాతి కాలంలో, ప్రత్యేక తెలంగాణా, పిమ్మట జై ఆంధ్ర ఉద్యమాలు తల ఎత్తటంతో పెద్దల మనసులు క్షోభపడటమే కాక రాష్ట్రం ఆర్థికంగా నష్టపడింది. ఆ సమయంలో శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు, శ్రీ భాట్టం శ్రీరామ మూర్తిగారు సమైక్య ఆంధ్రప్రదేశ్ కొనసాగాలనే వాదానికి పట్టుకొమ్మలైనారు. ఇరువురు పెక్కు నిందలకు, కష్టాలకు లోను కావలసి వచ్చినా చలించలేదు. ఆనాటి దీక్షా ఫలమే అఖిల భారత తెలుగు మహాసభల నిర్వహణ. ఈ సభలు విజయవంతం కావటంతో, భారతదేశంలో ఉన్న తెలుగు వారినే కాక ప్రపంచమంతటా విస్తరించి ఉన్న తెలుగువారిని అందరినీ సమైక్య పరచాలనే భావం బలపడింది. 1974 ఏప్రిల్ 6వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు గారి అధ్యక్షతలో జరిగిన పుర ప్రముఖుల సమావేశంలో పెద్దలు చేసిన సూచన మేరకు, 1975 ఏప్రిల్ 12వ తేదీ ఉగాది నుంచి వారం రోజుల పాటు హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు జరుపవలెనన్న నిర్ణయం జరిగింది. ఆహ్వాన సంఘానికి ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావుగారు అధ్యక్షులుగా, శ్రీ కృష్ణారావుగారు కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎన్నుకోబడినారు. ఆ ఆహ్వాన సంఘానికే నేను ప్రధాన కార్యదర్శిని.

ఆహ్వాన సంఘం కార్యాలయం రవీంద్ర భారతి మొదటి అంతస్తులో ఏర్పాటు అయింది. ఈ ఆహ్వాన సంఘం 23 ఉపసంఘాలను నియమించింది. ఒక్కొక్క ఉప సంఘం బాధ్యతలు ఒక్కొక్క మంత్రికి అప్పగింపబడినాయి. ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలుగువారి సహాయ సహకారాలను పొందటం కోసం మదరాసు, బెంగుళూరు, బొంబాయి, నాగపూర్, కలకత్తా, న్యూఢిల్లీలలో ప్రాంతీయ సంఘాలు ఏర్పడినాయి. ఈ ప్రాంతీయ సంఘాలు మహాసభలకు ప్రతినిధులను ఎన్నుకొనటంలో తోడ్పడటమేకాక, ఆయా ప్రాంతాలలో ఉత్సవాలు జరిపి, ప్రత్యేక సంచికలను వెలువరించాయి. ఆయా కార్యకలాపాల సమన్వయ బాధ్యత ఆహ్వాన సంఘ కార్యాలయం చేపట్టింది.

ఆహ్వాన సంఘ కార్యాలయం సుమారు 10 నెలలపాటు రాత్రింబవళ్ళు అవిరామంగా పనిచేసిందనటంలో అతిశయోక్తి లేదు. ప్రతిరోజు ఉదయం ఏడు గంటలకు "అప్పారావు గారూ ! బయలుదేరుతున్నారా?" అని శ్రీ కృష్ణారావుగారు ఫోన్‌చేసేవారు. అప్పటికే సిద్ధంగా ఉన్న నేను "బయలుదేరాను సార్" అంటూ స్కూటర్ ఎక్కేవాణ్ణి. ప్రతిరోజూ ఉదయం శ్రీ కృష్ణారావు గారు మాతో కూర్చుండి జరిపిన కృషిని, జరుగవలసిన కృషిని సమీక్షించుకొని రాత్రిపూట మరల కార్యాలయానికి వచ్చేవారు. ఏనాడు మేం రాత్రిపూట 12 గంటల లోపు ఇళ్ళకు పోలేదు. ఒక్కరోజున మేం మధ్యాహ్న భోజనం చేయటానికి వీలు పడేదికాదు. అప్పుడు కృష్ణారావుగారు ఇంటికి ఫోన్‌చేసి "పది మంది భోజనానికి వస్తున్నారు. తయారుచేసి ఉండు" అని చెప్పేవారు. ఆ చల్లని తల్లి శ్రీమతి ప్రభావతిగారు ఆదరంతో అందరికి భోజనం పెట్టేవారు (శ్రీ కృష్ణారావుగారు శాకాహారి)

1974 అక్టోబరులో అఖిల భారత తెలుగు బాలల ఉత్సవం జరిపించారు శ్రీ కృష్ణారావుగారు. ఇవికూడా చాలా బాగా జరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన బాలబాలికలు 'ఆంధ్ర దర్శిని' పేరుతో రాష్ట్రంలోని ముఖ్య ప్రదేశాలను చూపించడానికి కూడా ఏర్పాటు చేశారు శ్రీ కృష్ణారావుగారు.

ఆహ్వాన సంఘ కార్యాలయం అప్రమత్తంగా నిర్విరామ కృషి చేస్తున్నది. 1975వ సంవత్సరమును "తెలుగు సాంస్కృతిక సంవత్సరం"గా ప్రభుత్వం చేత ప్రకటింపజేశారు శ్రీ కృష్ణారావుగారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తెలుగువారిని అందరిని ఉత్తేజపరచటం కోసం ప్రతి జిల్లాలోను 'జిల్లా సాంస్కృతిక మండలి'ని ఏర్పాటు చేశారు శ్రీ కృష్ణారావుగారు. ఈ ఏర్పాటు మంచి ఫలితాలను ఇచ్చింది. 1975 ఫిబ్రవరి నెలలో ఈ మండలులు, ఆయా జిల్లాలలో సాంస్కృతిక ప్రదర్శనలు మహోత్సాహంతో నిర్వహించినాయి.

ఇంకొక ముఖ్య విషయం. శ్రీ కృష్ణారావుగారు అకాడమీల వార్షిక గ్రాంట్లను రెట్టింపు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది కళాకారులకు మహదానందదాయకమైంది. అంతేకాదు వృద్ధ కళాకారుల పింఛన్లు కూడా పెంచడమే కాక మరికొంత మందికి క్రొత్తగా పింఛన్లు ఇచ్చారు శ్రీ కృష్ణారావు గారు.

మద్రాసులోని సినీ కళాకారులను కలిసికొని, వారు రాష్ట్రంలో పలు ప్రదర్శనలు ఇచ్చేటట్లు అంగీకరింపజేశారు శ్రీ కృష్ణారావుగారు. అట్లా, ప్రముఖ తెలుగు సినీ కళాకారులు బృందంగా ఏర్పడి రాష్ట్రంలో మొత్తం ఎనిమిది ప్రదర్శనలిచ్చి, మహా సభల నిర్వహణ నిమిత్తం రూ.13.76 లక్షల నిధిని సమకూర్చటమే కాక జరుగబోయే ప్రపంచ తెలుగు సభలను గూర్చి విశేషంగా ప్రచారం చేశారు.

మహాసభలు ఫతే మైదానంలో వారం రోజులపాటు ఏప్రిల్ 12 నుంచి, 18వ తేదీ వరకు వైభవోపేతంగా జరిగాయి. డా.రాధాకృష్ణన్, శ్రీ ఖండూబాయి దేశాయి గార్ల మరణాల వల్ల 17వ తేదీన సభలు జరుగలేదు. కాని 17వ తేదీన జరుగవలసిన కార్యక్రమం, 18వ తేదీ కార్యక్రమంతో 18వ తేదీన జరిగాయి.

12వ తేదీ ఉదయం 9 గంటలకు ఫతే మైదానంలో పతాకోత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి విచ్చేసిన వారందరికీ ఉగాది పచ్చడితో ఆహ్వానం ఇప్పించారు శ్రీ కృష్ణారావుగారు. శ్రీ కృష్ణారావుగారి కృషి వల్ల కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తపాలా బిళ్ళను ప్రచురించింది. ఇందులో 12వ శతాబ్దికి చెందిన సరస్వతీ విగ్రహంతో పాటు 'దేశ భాషలందు తెలుగు లెస్స' 'ఎందరో మహానుభావులు', 'పంచదారకన్న పనసతొనలకన్న, కమ్మని తేనె కన్న తెలుగు మిన్న' అనే సుభాషితాలు కూడా చోటు చేసికొన్నాయి.

శ్రీ కృష్ణారావుగారి కృషి వల్ల ప్రతినిధులకు రైళ్ళల్లో, బస్సులలో చార్జీలలో సగం కన్సెషన్ లభించింది.

ఈ మహా సభలకు 16 దేశాల నుంచి 92 మంది ప్రతినిధులు పరిశీలకులు విచ్చేసినారు. ఇందులో 40 మంది ఆహ్వాన సంఘం రాకపోకల ఖర్చులు చెల్లించింది. ఒకరు మారిషస్ నుంచి, ఇద్దరు రష్యా నుంచి, ఆయా ప్రభుత్వాలు ఖర్చుమీదనే ప్రతినిధులుగా వచ్చారు. యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రతినిధి స్నాతకోత్సవ సభలో పాల్గొన్నారు. సతీసమేతంగా వచ్చిన కాశ్మీరం ముఖ్యమంత్రి శ్రీ షేక్ అబ్దుల్లా ఈ సభలో ప్రసంగించారు.

ఇతర రాష్ట్రాల నుంచి 921 మంది, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 4439 మంది ప్రతినిధులుగా మహా సభలలో పాల్గొన్నారు. అందరికీ ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పించబడినవి. ప్రతిరోజు సుమారు రెండు లక్షల మంది సభలను, సాంస్కృతిక కార్యక్రమాలను, చర్చా గోష్ఠులను సందర్శించి ఉంటారని అంచనా.

సభలు, చర్చాగోష్ఠులు, సాంస్కృతిక ప్రదర్శనలు– వీటితో పాటు అందరినీ ఆకట్టుకొన్నది "తరతరాల తెలుగు జాతి" ప్రదర్శన. 2500 సంవత్సరాల తెలుగు జాతి చరిత్రను కళ్ళకు కట్టినట్లు ఈ ప్రదర్శనం చూపించింది. ఇ.సి.ఐ.ఎల్. వారు సభా ప్రాంగణంలో వంద టెలివిజన్ సెట్లను అమర్చి, దూరంగా కూర్చున్న ప్రేక్షకులకు ఎంతో సదుపాయం కలిగించటం మరో విశేషం.

మహా సభలు తొలిరోజు సాయంకాలం సభలో లండన్ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన కుమారి టంగుటూరి సూర్యకుమారి శ్రీ శంకరం బాడి సుందరాచారి గారి "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" అనే గేయాన్ని గానం చేసి ప్రేక్షకులను ఉత్తేజితులను చేశారు !

మహాసభలను పురస్కరించుకొని, 78 మోనోగ్రాఫ్‌లు– 2500 సంవత్సరాల తెలుగు జాతి చరిత్రను చిత్రించినవి, ప్రకటింపబడినవి, అట్లాగే తెలుగుజాతి సమగ్ర చరిత్రను సంక్షిప్తంగా తెలియజేసే సావనీర్లు నాలుగు– తెలుగు, హిందీ, ఉర్దు, ఇంగ్లీషు భాషలలో ప్రచురింపబడినవి. మహా సభల సమయంలో అన్ని రంగాలలోని "తెలుగు వెలుగులు" 239 సన్మానితులైనారు. మహాసభలను భారత ఉపరాష్ట్రపతి శ్రీ బి.డి.జెట్టి గారు ప్రారంభించినారు. తరువాత, చివరి రోజున రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌గారు స్నాతకోపన్యాసం చేశారు. నేటి భారత ప్రధాని, శ్రీ ఐ.కె.గుజ్రాల్ గారు మహా సభలలో ఏర్పాటు అయిన చలనచిత్రోత్సవ సభకు అధ్యక్షత వహించారు.

13వ తేది ఉదయం జరిగిన చర్చాగోష్ఠుల ప్రారంభోత్సవ సభలో "అంతర్జాతీయ తెలుగు సంస్థ"ను స్థాపించవలెనని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం ప్రవేశ పెట్టబడింది. దీనిని శ్రీ జె.పి.ఎల్ గ్విన్ గారిచేత ప్రతిపాదింపజేశారు శ్రీ కృష్ణారావు గారు.

వారం రోజులుగా జరిగిన ఈ మహాసంరంభంలో ఎటువంటి ప్రమాదాలు జరగకపోవటం విశిష్టమని చెప్పక తప్పదు. మరి శ్రీ కృష్ణారావుగారు "ఇందుగలడందులేడని సందేహము వలదు" అన్నట్లుగా నిరంతరం పర్యవేక్షిస్తున్నప్పుడు వేరే విధంగా ఎట్లా జరుగుతుంది? అసలు ఆ రోజులలో వారు సరిగా అన్నంతిన్నారో లేదో అనుమానమే.

మహాసభలు పూర్తి అయిన వెంటనే విదేశీ ప్రతినిధులను వరంగల్లు, భద్రాచలం, బెజవాడ, శ్రీకాకుళం, కూచిపూడి, అమరావతి, గుంటూరు వగైరాలకు తీసికొని వెళ్ళి, అచ్చటి విశేషాలను సందర్శింపజేశారు శ్రీ కృష్ణారావుగారు.

మహా సభలలో ఏకగ్రీవంగా అంగీకరింపబడిన తీర్మానం ప్రకారం, సెప్టెంబరు 8వ తేదీన "అంతర్జాతీయ తెలుగు సంస్థ"కు రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ గారి చేత ప్రారంభోత్సవం చేయించారు శ్రీ కృష్ణారావుగారు. ఈ సంస్థ ప్రధానాశయాలు– ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో ఉన్న తెలుగువారితో విద్యా సాంస్కృతిక విషయక సంబంధాలను పెంపొందించటం, తెలుగు భాషా అధ్యయనమునకు తెలుగులో పరిశోధనలకు జాతీయ అంతర్జాతీయ విద్వాంసులకు అవకాశం కల్పించటం, తెలుగు భాషా సంస్కృతులకు అంతర్జాతీయ ప్రఖ్యాతి లభింపజేయటం. ఈ మహా సభల సత్ఫలితమే అమెరికాలో తానా ఏర్పడటం. ఈ మహాసభలకు విచ్చేసిన మలేషియా ప్రతినిధులు రెండవ ప్రపంచ మహాసభలను కౌలాలంపూర్‌లో జరుపగలమని ప్రకటించారు.

"తరతరాల తెలుగుజాతి" అనే సాంస్కృతిక ప్రదర్శనను సుస్థిరం చేయాలన్న సంకల్పంతో, 1975 సెప్టెంబరు 13వ తేదీన పబ్లిక్ గార్డెన్స్‌లో "తెలుగు సాంస్కృతిక సంగ్రహాలయం"కు రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ గారిచేత శంకు స్థాపన చేయించారు శ్రీ కృష్ణారావుగారు.

"ఆరుకోట్ల తెలుగువారు", "తెలుగు వారు బహుళ ప్రతిభావంతులు" అనే నినాదాలిచ్చి, దేశ విదేశాలలో ఉన్న తెలుగు వారిని అందరిని ఉత్తేజపరచి, తమ పవిత్ర వారసత్వాన్ని గ్రహించి, తమదైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకొనేటట్లు తీర్చిదిద్దిన శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు అమరులు.

2. మానవతావాది :

1969లో గాంధీజీ శతజయంత్యుత్సవాలు జరిగాయి. ఆ సందర్భంలో అవనిగడ్డలో గాంధీక్షేత్రం స్థాపించారు శ్రీ కృష్ణారావుగారు. ఈ గాంధీ క్షేత్రానికి అనుబంధంగా అనేక ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించే సంస్థలు చాలా వెలసినవి. మంచి గ్రంథాలయం నెలకొన్నది. మహిళా సేవ సంఘం ఏర్పడింది. దీనజన సంక్షేమ సమితి, గ్రామీణ యువజన వికాస సమితి, దివిసీమ లలితా కళా సమితి, దివిసీమ సాహితీ సమితి మొదలగు సంస్థలు గాంధీ క్షేత్రానికి అనుబంధ సంస్థలుగా విద్యా వినోద– కళా వికాసములకు, గ్రామీణాభివృద్ధికి తోడ్పడుతున్నవి. ఇటీవలి కాలంలో ముద్రణాలయం, రూత్‌డైక్ మన్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్, వికలాంగుల శిక్షణాలయం మున్నగునవి ఏర్పడి, కుట్టుపని–టైపు– కార్పెంటరీ మున్నగు వివిధ వృత్తులలో యువతకు శిక్షణ ఇవ్వబడుతున్నది. ఇచ్చటి ముద్రణాలయం నుంచే "గాంధీక్షేత్రం" అనే పత్రిక చి॥మండలి బుద్ధప్రసాద్ సంపాదకత్వంలో వెలువడుతున్నది.

ప్రపంచ మహాసభలు జయప్రదం కావటం శ్రీ కృష్ణారావు గారిలో ఎంతటి ఆనందం కలిగిందో, 19–11–1977 తేదీన వచ్చిన పెనుతుఫాను అంతకంటే అధికంగా శ్రీ కృష్ణారావుగారిని క్రుంగదీసింది. అయినా ఆయన గుండెదిటవు చేసుకొన్నారు. ఆయనలో సేవాభావం త్రివిక్రముని వలె విక్రమించింది. దారీ తెన్నూ లేని పల్లెలలో బాధితులను ఓదారుస్తూ, ఆ శవాల గుట్టల మధ్య, ఆ పశుపక్ష్యాదుల కళేబరాల మధ్య, అహోరాత్రులు శ్రమించి, ఆర్తులకు ఉపశమనం కలిగించి, ఆ సేవతో తన ఆరోగ్యాన్ని తన కాళ్ళలో గుచ్చుకొన్న ముళ్ళను లెక్క చేయక బాధితులకు సేవ చేసిన మానవతామూర్తి, మహోన్నతుడు శ్రీ కృష్ణారావుగారు. ఆనాడు గాంధీ క్షేత్రం సహాయ కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా,

శరణాలయంగా, అన్న సత్రంగా రూపొందింది. బాధితులకు పునరావాసం కల్పించటంలో కృతకృత్యులై, దివిసీమను మరల దివ్యసీమగా తీర్చిదిద్దారు శ్రీ కృష్ణారావు గారు.

తనకున్న కొద్దిపాటి పిత్రార్జితంలో ఐదు ఎకరాల భూమిని హరిజనులకు, పేద కుటుంబాలకు పంచి ఇచ్చిన త్యాగశీలి శ్రీ కృష్ణారావుగారు. అట్లాగే శ్రీమతి మండలి ప్రభావతీదేవిగారు దానం చేసిన స్థలంలో స్థాపించబడిన సేవాశ్రమం పదెకరాల ప్రదేశంగా అభివృద్ధి పొందింది. మామూలు బస్సులలో ప్రయాణాలు చేయటం, సభలలో పూలదండలు మున్నగునవి నిరాకరించటం– శ్రీ కృష్ణారావు గారి నిరాడంబరతకు, మానవత్వమునకు నిదర్శనములు.

ప్రతి సంవత్సరం శ్రీ రాధాకృష్ణన్ గారు పుట్టిన రోజును “ఉపాధ్యాయ దినం”గా పాటించటం జరుగుతున్నది. ‘దినం’అనే పదానికి తెలుగులో చెడు అర్థం వచ్చింది. అందుచేత ఆ పేరు మార్చాలన్నారు శ్రీ కృష్ణారావుగారు. అప్పుడు నేను, శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తిగారు ఆలోచించి “గురు పూజోత్సవం” అంటే బాగుంటుందన్నాము. చాలా బాగున్నదన్నారు శ్రీ కృష్ణారావుగారు. ఆనాటి నుండి సెప్టెంబరు 5వ తేదీ ‘గురుపూజోత్సవం’ గా పాటింపబడుతున్నది.

శ్రీమతి ఇందిరాగాంధీ రెండు సార్లు గాంధీక్షేత్రాన్ని సందర్శించారు. నాటి భారత రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు, ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయి గారు, శ్రీయుతులు చవాన్ జగ్జీవన్‌రాం– జ్యోతిబసు వంటి పెద్దలు కూడా గాంధీ క్షేత్రం సందర్శించి, అచ్చటి కార్యకలాపాలను పరిశీలించి అభినందించారు. పెనుతుఫాన్ తరువాత మదర్ థెరిస్సా కూడా గాంధీక్షేత్రం దర్శించి మండలి సేవాతత్పరతను కొనియాడినారు.

“శ్రీ కృష్ణారావుగారు బాలానంద సంఘంలో బాలుడుగా, లలితా కళా సమితిలో సర్వ కళా ప్రియుడుగా సాహితీ సమితిలో సాహితీ రసజ్ఞుడుగా ప్రత్యక్షమయ్యేవారు. సమాజంలో ప్రజ్ఞ ఎవరిది ఎంత వరకు ఏ విధంగా ఉన్నదో గుర్తించి, దానిని ఉపయోగింపజేసే ప్రజ్ఞ ఆయనలో ఉంది. రాజకీయవేత్తలు, అధికారులు, నటులు, గాయకులు, కవులు, పండితులు, కర్షకులు, కార్మికులు– అందరూ ఆయనకు మిత్రులే. వారితో ఆయన అనుబంధం వెలకట్టలేనిది.”

శ్రీ కృష్ణారావుగారి ఉత్తమ సేవా నిరతికి గుర్తింపుగా పెక్కు అవార్డులు లభించాయి. అట్లా అందిన సొమ్మును వివిధ సంస్థల అభివృద్ధికి విరాళంగా ఇచ్చేసేవారు.

“పెనుతుఫాను బీభత్సంలో, పీనుగుల నడుమ మెలగినవాడు
అనాధబాలలను భుజాలపై మోసినవాడు
అనాథ ప్రేత సంస్కారం చేసినవాడు
కన్నీటి కడలిలో ఈదుకొంటూ
కన్నీటి బ్రతుకులను కాపాడినాడూ
మహాత్ముడు చెప్పాడు, మండలి చేసి చూపాడు” – దాశరథి

ఇటువంటి మహామనీషికి రాష్ట్రంలో, దేశ–విదేశాలలో ఉన్న తెలుగువారందరూకూడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎంతో ఋణపడి ఉన్నదన్నమాట పరమసత్యం. కీర్తిశేషులైన శ్రీ కృష్ణారావుగారి ఆశయాలను కొనసాగిస్తూ; వారి యశఃకాయమును గౌరవించటం అందరి ధర్మం.

(గాంధీ క్షేత్రం మాసపత్రిక)

మండపాక రాజేశ్వరశాస్త్రి

చిరస్మరణీయమైన సమావేశము

విశ్వకవి రవీంద్రనాథ ఠాకూరుతో వీణాచార్య తుమరాడ సంగమేశ్వరశాస్త్రి పరిచయము

శ్రీ రవీంద్రనాథ ఠాకూరు 1919 సంవత్సరం మొదటి మాసాలలో (సంయుక్త) మదరాసు రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతాలలో పర్యటించి అనేక పట్టణాలలో ఉపన్యాసాలిచ్చియున్నారు. తమ సహజమైన సంగీతాభిమానంతో వారు సందర్శించిన ప్రతి పట్టణంలోనూ వైణికులను రావించి వారి వాద్యం వింటూ ఉండేవారు. ఏప్రిల్ నెలలో శ్రీ ఠాకూరు మదరాసు నగరం వచ్చినప్పుడు వారి శిష్యులైన శ్రీపిఠాపురం రాజావారు వారిని పిఠాపురం విచ్చేయమని కోరగా ఠాకూరు ఇట్లు జవాబు వ్రాసినారు : "మీ ఆహ్వానం పురస్కరించుకొని నేను కొద్ది రోజులలో పిఠాపురం వస్తున్నాను. మీ సంస్థానంలో గాని మీ ప్రాంతాలలో ఎక్కడైనా వైణికులెవరైనా ఉంటే సిద్ధంగా ఉంచండి. వారి వాద్యం వినడానికి నాకెంతో కుతూహలంగా ఉంది" అని. శ్రీ రాజావారు వెంటనే జవాబు వ్రాసినారు :

"మీ కోరిక ప్రకారమే ఏర్పాటు చేస్తాను. మా సంస్థానంలోనే వైణికు డున్నాడు. మూడు గంటల కాలం మీ రోపికగా కూర్చోగలిగితే మా ఆస్థాన వైణికుని వాద్యం వినవచ్చును" అని.

శ్రీ ఠాకూరు మద్రాసులో పర్యటన ముగించుకొని పిఠాపురం వచ్చిననాటికి శ్రీ రాజావారిక్కడి యేర్పాట్లన్నీ పూర్తి చేసి ఉంచారు. గానసభలు విశిష్టంగా ఉండడానికి శ్రీ తుమరాడ సంగమేశ్వర శాస్త్రిని వీణకు, శ్రీ సుసర్ల గంగాధరశాస్త్రిని వేణువుకు, గాత్రానికి మరొకరిని, పక్కవాద్యాలతో సహా సమకూర్చి హాలులో కూర్చోబెట్టారు.

సమంగా సాయంత్రం మూడు గంటలకు సభ ప్రారంభమైంది. శ్రీ ఠాకూరు, శ్రీ రాజావారు, దివాను. ఆస్థాన విద్వాంసులు, ఉద్యోగులు, ఠాకూరుతో వచ్చినవారు, ఆహూతులైన పురప్రముఖులు – సభ నిండుగా కూర్చొని ఉన్నారు. మొదట, సంగమేశ్వరశాస్త్రిని వీణ ప్రారంభించవలసినదిగా శ్రీ రాజావారు కోరినారు. శాస్త్రి వీణ ప్రారంభించే పద్ధతి వారి నెరిగిన వారందరికీ అనుభవమే. ఆయన వీణపై సరస్వతి, లక్ష్మి, గణపతి, మారుతి మొదలైన మూర్తుల దంతపు విగ్రహాలు స్థాపితమైన ఉంటవి. ఆయన ప్రతి విగ్రహాన్ని స్పృశించి కళ్ళ నద్దుకొని, కొద్ది క్షణాలు కళ్ళు మూసుకొని ధ్యాన నిమగ్నులై, తరువాత వీణ శ్రుతి చెయ్యడం ప్రారంభిస్తారు. శ్రుతులు పూర్తికాగానే రెండు చేతులూ జోడించి వీణకు నమస్కారం చేసి, ఎత్తి వడిలో నుంచుకొని, ఆయన సభ నంతటినీ కలయజూస్తారు. ఆ వొక్క చూపుతోనూ సభలోని యావన్మంది తాలూకు సమిష్టి రసాస్వాదన జ్ఞానం ఆయన కవగాహనై పోతుంది. ఆయన వీణ నిలబెట్టి వాయిస్తారు. నేత్రాలు అర్ధనిమీలితంగా ఉంటవి. తంత్రులలోని అపస్వరం తెలిసినట్టే, తన వాద్యం శ్రోతలకు నచ్చినదీ లేనిదీ ఆయనకి తెలిసిపోతుంది. శాస్త్రి వీణ ప్రారంభిస్తూ, మామూలు రస్తాలో 'వాతాపి గణపతిం భజే' అన్న ముత్తుస్వామి దీక్షితుల హంసధ్వని కీర్తన ఎత్తుకొని పూర్తి చేసి, తరువాత తగుమాత్రంగా రాగం వాయిస్తూ మరి రెండు మూడు కీర్తనలు పలికించి, పల్లవి వాయించే ఉద్దేశంతో కాంభోజి రాగాలాపన చేస్తూ అప్రయత్నంగా ఠాకూరువైపు చూశారు. ఠాకూరు ముఖంలో ఎటువంటి రసానుభూతీ కనబడలేదు! వారన్యమనస్కులై వీణవైపూరక చూస్తూ కూర్చున్నారు!

తను వాయించేపద్ధతి ముఖ్యశ్రోతకు నచ్చలేదని శాస్త్రికి తెలిసిపోయింది. ఉత్తరక్షణమే, అద్భుతమైన సమయస్ఫూర్తితో… శాస్త్రి రెండు మూడు విసురులతో కాంభోజిరాగం పూర్తిచేసి, వెంటనే, అదే స్వరాలలో కమాచ్‌రాగం ఎత్తుకొని రుద్ర వీణ ఫగడ్‌లో వరికపట్టి రెండుమూడు రాగ ఖండికలు వాయించారు. ఠాకూరు మోము మబ్బుల లోంచి బైటపడ్డ చంద్రబింబంవలె క్షణంలో విప్పారి ఆనందంతో తొణికిసలాడింది! ఆలాపన సాగినకొద్దీ వారి ఆవేశ మధికమైంది. శరీర మవశంగా నాగస్వరం పాటకు నాగుబాములవలె ఊగిస లాడింది! పుష్పాంజలి పట్టి దైవసన్నిధిని కూర్చొని ధ్యానినిమగ్నుడైన యోగివలె ఠాకూరు వీణపలుకులు వింటూ, దోసిలి పట్టి చివరి వరకూ అలాగే కూర్చున్నారు. శాస్త్రి ఏమి వాయిస్తున్నారో శాస్త్రికే జ్ఞాపకం లేదట! నిముషములే కాదు, గంటలే గడిచి పోతున్నా ఎవరికీ చైతన్యము లేదు. రాత్రి ఎనిమిది గంటలైపోయింది. అప్పటికి శాస్త్రికి అనుమానం వేసి అడిగించారట – ఇంకా వాయించమన్నారా ఆపివెయ్యమన్నారా అని. అంతవరకూ తదేక ధ్యానంలో ఉన్న ఠాకూరు చప్పున తెలివి తెచ్చుకొని, మోమున చిరునవ్వులు చిలుకగా, అమృతం చిప్పిల్లే కంఠంతో అన్నారు : "ఈ వీణానాదామృత వాహినిలో మునుగుతూ తేలుతూ ఇలాగే రాత్రంతా కూర్చోవాలనే ఉంది. కాని, పండిట్‌జీకి ఆయసామైనట్టుంది, ఆపివెయ్యమనండి. వారికి నా హృదయపూర్వకమైన ధన్యవాదాలు", అని.

మరుసటిదినం శ్రీరాజావారు ఇతర విద్వాంసుల సంగీతం కూడా వినవలసిందని ఠాకూరును కోరగా వారు నవ్వి, "అలాగే వింటాను గాని, శాస్త్రి వీణమాత్రం మరువకండి" అన్నారు. మర్నాడు జరిగిన సభలో ఠాకూరు ఒక్కొక్క వాద్యం ప్రారంభదశలోనే ఆపించివేసి, సంగమేశ్వర శాస్త్రినే వీణ వాయించమని కోరినారు. ఆనాడుకూడా ఠాకూరు ఐదుగంటలకాలం ఆనందపరవశులై శాస్త్రి వీణావాదనం విన్నారు.

ఇద్దరు మహావ్యక్తులు! ఒకరి ప్రతిభ ఒకరింతకుముందెరుగరు. ఒకరపూర్వ శైలిలో, అపురూప కవితామృతధారతో, మృదుమధుర భావ మూటలూరే పదమార్దవంతో ప్రపంచమునే ఉర్రూత లూగించగా, ఆ విశ్వకవినే తన వీణామధుర మధుర నాద సుధారస ప్రవాహంలో ముంచి సమ్మోహితులను చెయ్యగలిగిన మహావైణికులింకొకరు. ఈ యిద్దరి సమావేశం నిజంగా చిరస్మరణీయమైన చరిత్రాత్మక సంఘటన.

వీణావాదన పూర్తికాగానే ఠాకూరు సంగమేశ్వర శాస్త్రిని శాంతినికేతనానికి ఆహ్వానిస్తూ, ఆయనను తప్పకుండా పంపవలసిందని శ్రీ రాజావారిని కోరినారు.

× × ×

సంగమేశ్వరశాస్త్రికి తెలుగు తప్ప హిందీ గాని, ఇంగ్లీషు గాని, మరే యితర భాష గాని తెలియదు. అందుచేత ఆయన ఇంగ్లీషు, సంగీతము తెలిసిన నన్ను వెంటబెట్టికొని సం. 1919 సెప్టెంబర్ నెలలో బయలుదేరి కలకత్తామీదుగా శాంతినికేతనం చేరుకున్నారు. కలకత్తాలోని ఠాగూరు భవనంలో కొన్ని గంటలు విశ్రాంతి తీసుకున్నప్పుడాయనకు ప్రఖ్యాత చిత్రకళాకారులు శ్రీఅవనీంద్రనాథ ఠాకూరుతో పరిచయమయింది. అవనిబాబు శాస్త్రి వీణా వాద్యం విన్నారు. నీలాంబరి రాగం పురమాయించి విని విశేషంగా మెచ్చుకున్నారు. వారు సంగ్రహించిన అనేక కళాఖండాలు చూచి శాస్త్రి అద్భుతం చెందారు.

శాంతినికేతనంలో సంగమేశ్వరశాస్త్రికి ఘనమైన స్వాగత మివ్వబడినది. హాస్టలు సమీపంలో ఉన్న రెండు గదుల కుటీరంలో ఆయన బస యేర్పాటైంది. మర్నాడుదయమే శ్రీ రవీంద్రనాథ ఠాకూరు కుటీరానికి విచ్చేసి శాస్త్రి యోగ క్షేమాలు విచారించారు. ఠాకూరు ఫోటోలె వందలాదిగా వివిధమైనపోజులలో మనం నిత్యమూ చూస్తూనే ఉన్నాం. కాని, ఆజానుబాహులైన వారి ఠీవి, మందహాసంలోని సౌహార్ద్రత, నేత్రములలోని గంభీరత, ముఖములోని బ్రహ్మతేజస్సు ఏ ఛాయా చిత్రం చూపగలదు! వారిని కళ్ళతోచూసి ధన్యులు కావలసిందే! వారి యెదుటపడిన మహామేధావులు సహితం మాటలకు తడుముకోవలసిందే! మాటల సందర్భంలో ఠాకూరు అన్నారు : "శ్రీ (పిఠాపురం) రాజావారికి సంగీతములో, ముఖ్యంగా వీణలో, అంతంత మాత్రమే అభిరుచి ఉందనుకుంటాను. లేకపోతే ఇట్టి మహావైణికుడు తన సంస్థానంలోనే ఉన్నాడని గర్వించవలసి ఉండగా, వారు 'మీరు మూడు గంటల కాలం ఓపికతో కూర్చోగలిగితే' అంటూ వ్రాస్తారా?" అని.

సంగమేశ్వరశాస్త్రి శాంతినికేతనంలో ఉన్న కాలంలో రెండు రోజుల కొకసారి సాయంత్రం 7 గం. నుండి 9–30 గం. వరకూ ఠాకూరు సమక్షంలో వీణ వాయించవలసి ఉండేది. ఈ సమావేశాలు కళామందిరం పై అంతస్తులోని హాలులో జరిగేవి. ఒక్కొక్కప్పుడివి ఠాకూరు కుటీరంలోనే ఏర్పాటయేవి. వీణ వినడానికి శాంతినికేతనంలోని పెద్దలు, కలకత్తావంటి స్థలాల నుండి తరుచుగా వచ్చే ప్రసిద్ధ వ్యక్తులు హాజరయ్యే వారు. పిల్లలు మాత్రం లోపలికి వచ్చుటకు వీలు లేదు. ఠాకూరు శాస్త్రిని పెద్దలందరికీ పరిచయంచేస్తూ ఇలాగన్నారు :

"నేను దక్షిణదేశమంతా తిరిగి అనేక విద్వాంసుల సంగీతం విన్నాను. నాకు సంగీతమంటే వెర్రి అని మీకు తెలుసును గదా! వారందరూ మహా విద్వాంసులే, సందేహం లేదు. ఒక్కొకరిలో ఒకొక్క విశేషమైన ప్రతిభ ఉన్నది, తప్పకుండా. కాని, వారెవరూ నా హృదయాన్ని కరిగింపలేక పోయారు, వీరిలా. వారి వాద్యమును వినటముతోనే వీరిని నా గురువుగా గుర్తించాను" అని.

ఇంకొక సందర్భంలో – అప్పటి బెంగాలు గవర్నరుగావున్న లార్డ్ రొనాల్డ్ షే శాంతినికేతనం సందర్శించినప్పుడు సంగమేశ్వరశాస్త్రినీ ఆయన వీణనూ గవర్నరుకు పరిచయం చేస్తూ, "ఇది మా జాతీయ వాద్యము. వీరు మా గురుప్రముఖులు" అన్నారు ఠాకూరు.

శాస్త్రి వీణా వాదనలో అట్టి విశిష్టత ఉంది. ఠాకూరు వీణకు కాస్తదూరంగానే కూర్చొనేవారు. మీటు శబ్దం వినబడకుండా, కటుకేమాత్రం లేకుండా, నాదం అనవసరంగా పెంచకుండా, ఏదో లోకం లోంచి పారివస్తున్నట్టుండాలి వీణావాద్యం, – ఠాకూరు చెవి అంత సున్నితమైనది. ఇట్టి వాద్యం ఏకైక వ్యక్తి శ్రీ సంగమేశ్వరశాస్త్రికే చేతనౌను. నిజమైన వీణ పలుకులు శాస్త్రి చేతులోనే వినగలిగినారు ఠాకూరు. వారికి వీణ యెడల విశేషాదరాభిమానాలే కాక విశిష్టమైన పూజ్యభావ ముండేది. వీణ శరీరంగాను, వీణా తంత్రులు హృదయతంత్రులు గాను, వీణా వాద్యం హృదయ గానం గాను, వాదకుడు భగవంతుడే అనీ వారు తమ గేయాలలో ఉదాహరించి ఉన్నారు.

ఆ రోజులలో నేడు వ్యాప్తిలో ఉన్నన్ని కృతులు వ్యాప్తిలో లేవు. ఉన్నవాటిలో అనేకం ఠాకూరు చెవుల కింపుగా వీణపై ప్రదర్శించుట కనుగుణ్యంగా ఉండేవికావు. అయితే, శాస్త్రి సంగీత జ్ఞాన మనంతం. వారి వీణ నుంచి సంగీతం నిత్య నూతనంగా జీవనదివలె ప్రవహించేది. ఆయన ఒకే కీర్తన ఒక్కొక్క మారొక్కక్క విచిత్రరీతిని వాయించేవారు. ఏది వాయించినా, ఎలాగు వాయించినా రక్తినీ భావమునూ గాలికి

విడిచిపెట్టి, కేవలం విద్వత్ప్రదర్శన కొరకే యాంత్రికంగా వీణాగానంచేసే స్వభావం కాదాయనది. ఒక్కొక్క మారాయన అప్పటికప్పుడు కొత్త వరుస కల్పన చేసి వాయించేవారు. జావళుల వంటి తేలిక పాటలను ఆకర్షణీయమైన రాగకల్పనతో వాయించి ఠాకూరు మన్ననలను పొందేవారు. శాస్త్రి రాగాలాపన ఆద్యంతమూ రసభరితమై, అమృత ధారవలె సాగిపోయేది. ఆయన తాను వాయించే పద్ధతి ఒక అపూర్వమైన కళాప్రక్రియ. రాగ ధర్మానుసారగా తాన శైలి మారుతూ ఉండేది. రవపట్టు, వరికపట్టు, జోడుమీటు, తడమీటు, గత్తు, సందర్భాన్ని బట్టి ఏదో ఒకదానిలో ఆయన తానం వాయించేవారు. ఒకే వీణలో పది వీణలు పలికినట్టు భ్రమ కలిగించేది. నానావిధ పుష్పశోభిత నందనవనాన్ని స్ఫురింపజేసేది. సెలయేటి గల గల ననుకరించేది. శంఖధ్వనులతో, నాగుబాము సరసర, కుందేటి కుప్పిగంతుల వింతవింతగతులతో సాగుతూ శ్రోతల నూపివైచేది! ఆయనొకసారి కళ్యాణిరాగంలో తానం వాయించినప్పుడు ఠాకూరు సమ్మోహితులై, తరువాత నాట్యమందిరంలో వారవేగతులలో ఎంతోసేపు నృత్యం చేసినారు! ఆయన వీణ వాయిస్తున్నంతసేపూ ఠాకూరు దోసిలిపట్టి, కన్నులు మూసుకొని, నాద చాలనంతో సమానంగా ఊగుతూ, తన్మయులై వినేవారు, శాస్త్రి వాద్యంలో మరొక విశేషం గమనింపతగినది : శ్రోత లెందరున్నా, ప్రతి ఒక్కరూ తన ఒక్కరి కోసమే వీణ వాయిస్తున్నారని అనుకుంటారు. హృదయం ద్రవీభూతం చేసే బహు సున్నితమైన సంగతులనేకం వారి వాద్యంలో వెలువడి శ్రోతల కన్నులలో నీరు నిండేది. ఠాకూరు సరేసరి. ఇటు వంటి ఘట్టాలలో వారి నేత్రాలు జలపూరితమై, ముఖంలో భావోద్రేకం ప్రతిఫలించడం నేను అనేక సారులు చూసి ఉన్నాను.

రవీంద్రనాథ ఠాకూరు మహాకవి అని వారూ వీరూ చెప్పగా శాస్త్రి విని ఉన్నారు. కాని ఠాకూరుకు గానం చెయ్యడంలోనూ విశేషమైన ప్రజ్ఞ ఉందని ఆయనకు తెలియదు. శాస్త్రికే కాదు, చాలామంది మన తెలుగువారికే తెలియదేమో! అనేకులు ఠాకూరు గీతాంజలి, గార్డెనర్, క్రెసెంట్‌మూన్ వంటి గేయకావ్యాలు, కథలు, నాటికల తాలూకు ఇంగ్లీషు తర్జుమాలు చదివి ఆనందిస్తున్నారు. కాని ఠాకూరు తమ గేయాలు తామే గానం చెయ్యగా విన్నవారు బహుతక్కువ. ఒకనాటి సభకు సీమ నుంచి వచ్చిన ఒక ఫ్రెంచి ప్రొఫెసరూ ఆయన సతీమణీ శాస్త్రి వీణ విని చాలా సంతోషించి, తరువాత ఠాకూరు వారిని గేయాలు పాడమని ఎంతో బ్రతిమాలుకున్నారు. ఆ దంపతుల మాట తోసి వెయ్యలేక ఠాకూరు గొంతుక సవరించుకొని పాడడం ప్రారంభించారు.

ఏమి దివ్యగానమది! వారి శరీరం ముతుకతీగ కట్టిన వీణానాదమే. గౌళగాత్రంలో పాడుతున్న స్త్రీ కంఠమే! వారిపాట పాటేకాదు – హృదయ మధ్యమునుండి ఉబికివచ్చే ఆవేదన! మన ప్రాంతాలలో పాటరానివారుండరు. అంతో యింతో అందరం పాడుతాం. అయితే, మన పాటకి రాగచైతన్యం తక్కువ; శయ్య అంతంతమాత్రం; స్వర, తాళ చైతన్యం జాస్తీ. భావచైతన్యం మాత్రం పూజ్యమనే చెప్పాలి. ఠాకూరు గానంలో ప్రతి మాటకూ, ప్రతి అక్షరానికీ ప్రాణంవచ్చి, ఆమాటా, ఆ అక్షరం పాటలోంచి పైకి లేచివచ్చి శ్రోతల హృదయ ఫలకాలమీద నృత్యం చేస్తున్నట్టనిపించింది. పాడుతున్నంత సేపూ వారేవో దివ్యసీమలలో విహరిస్తున్నట్లే కనపడ్డారు. వారి నేత్రా లేవో దివ్య దృశ్యాలు తిలకిస్తున్నట్టే కనపడినవి. ఆవేశాతిశయంలో చేతు లాకాశంవైపు చాపుతూ, నిరాశతో కంఠం కుంచిస్తూ, ఏకాంతంగా ఏదో ఎవరికో చెప్పుకుంటున్నట్టు మెల్లగా పలుకుతూ, దుఃఖ భారభరిత గద్గదకంఠంతో, దుర్భర వేదనాపూరితమైన కంపిత గాత్రంతో వారు పాడుకుంటూ పోయినారు. సముద్ర కెరటాలవలె పొర్లుకు వస్తున్న ఇన్ని భావాలు భరించలేక అక్కడ కూర్చున్నవారనేకసారులు నీళ్ళతో నిండిన కళ్ళు వత్తుకున్నారు. ఫ్రెంచి ప్రొఫెసరు దంపతులు సమ్మోహనాస్త్రం వేసినట్టు నిశ్చేష్టులైనారు. శాస్త్రి సరేసరి. ఆయన కొంతసేపటికి తెములుకొని, “ధన్యోస్మి! ధన్యోస్మి!” అనుకుంటూ, నాతో “విన్నావుటోయ్ ఠాకూరు పాట? సాక్షాత్తూ దేవలోకంపాటే సుమా అది!” అని పదేపదే అన్నారు.

సంగమేశ్వర శాస్త్రి శాంతినికేతనపు అనుభవాలలో మేరుఘట్టంవంటి దొకటుంది : వసంత పూజ, లేక వసంతోత్సవం – పేరు జ్ఞాపకం లేదు – అన్న నాటకంలో విశ్వకవీ మహావైణికుడూ కలసి గానం చెయ్యడం. కథానాయకుడొక ఋషి. వనంలోని వృక్షాలూ, లతానికుంజాలూ తపో నిమగ్నుడైన ఆ ఋషికి తమతమ పుష్పగుచ్ఛాలనో, కొమ్మలనో, లేజిగుళ్ళనో కానుకగా సమర్పిస్తవి. ఋషి పాత్ర ఠాకూరే ధరిస్తారు. వారు పాడిన పాటలను శాస్త్రి వీణమీద అనుకరిస్తారు. కలకత్తా నుండి ప్రముఖులనేకులు హాజరైన ఈ చరిత్రాత్మక ప్రదర్శనలో శ్రోతలందరికీ ఠాకూరు పాట, శాస్త్రీ వీణావాద్యమూ మరువరాని దివ్యానుభూతిని కలిగించినవి. వేర్వేరు మందంగల తీగలుకట్టిన వీణలు రెండు కలసి గానం చేస్తున్నట్టే అందరికీ అనిపించింది. ప్రదర్శన మధ్యలో లైట్లారిపోయినా ఠాకూరు పాటనాపలేదు. శాస్త్రి వీణ మానలేదు. ఆ గాఢాంధకారంలో ఒక దైవీ వీణ – గాత్రం, ఒక మానుషీవీణ – వీణ కలసి అమృత తుల్యమైన అమరగానం అందిస్తున్న ఆ మధుర క్షణాలు మరపురానివిగా శ్రోతల హృదయాలలో హత్తుకు పోయినవి. తరువాత లైట్లు వచ్చి నాటక మత్యంత జయప్రదంగా తుదివరకూ సాగి పోయింది.

సంగమేశ్వర శాస్త్రి మూడుసారులు శాంతినికేతనం వెళ్ళియున్నారు. తరువాత ఠాకూరుకు అమెరికా నుండి ఆహ్వానం రాగా, వారు బయలు దేరుతూ శాస్త్రిని కూడా తమతో అమెరికా రమ్మని కోరినారు. కాని, పూర్వాచార చేదస్తం వల్ల శాస్త్రి అందుకొప్పుకొనలేదు. దీనితో ఆంధ్రదేశపు వీణకు యావత్ప్రపంచంలో రావలసిన కీర్తి దురదృష్ట వశాత్తూ తప్పిపోయింది.

శాస్త్రి వీణావాద్య విశిష్టతకు శాంతినికేతనంలో పెద్దబంగారు పతకం బహూకరించబడినది. ఆయన కోరికపై దక్షిణదేశపు సంస్థానాధీశ్వరు లందరికీ పరిచయపత్రా లివ్వబడినవి. ఈ పత్రాలను శాస్త్రి బాగానే వినియోగం చేసుకున్నారు.

శాంతనికేతన సంగీత శిక్షణలో మన వీణను – సరస్వతీ వీణను మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టి సరియైన పద్ధతిని వీణ నేర్పినవారు శ్రీ సంగమేశ్వరశాస్త్రిగారే. ఈ వీణే, సింహంతల మార్చి హంసతల అమర్చబడి, మరొక పేరుతో ఈనాటికీ వ్యాప్తిలో ఉంది.

(శ్రీ రవీంద్ర శతవార్షికోత్సవ విశేష సంచిక)

డా॥ బెజవాడ గోపాలరెడ్డి

గురుచరణ సన్నిధి

విశ్వభారతిలో నేను మహాకవి రవీంద్రుని శిష్యునిగా ఉండి ఉండుట గొప్ప అదృష్టముగా భావించుచున్నాను. 1920లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సభ నుండి శాంతినికేతన్ వెళ్ళి అచటి అందములను కన్నులార చూచి వచ్చిన మా అన్నగారి వల్ల ఆ నిలయమును గురించి వివరములు విన్నాను. మా అన్నగారు రవీంద్ర రచనకు ఇంగ్లీషు తర్జుమాలు కొన్నిన్నీ, శాంతినికేతనమును గురించి పియర్సన్ వ్రాసిన పుస్తకమున్నూ నాకు తెచ్చిఇచ్చారు. ఈ విధముగా నాకు విశ్వకవి దెస అపురూపమైన గౌరవ మర్యాదలు ఏర్పడి, నేనున్నూ ఆ ఆశ్రమంలో విద్యార్థిగా వుండవలెననే కాంక్ష నాలో జనించినది. కాని, అప్పుడు నాకు పదమూడేండ్లు. మా నెల్లూరుకు శాంతినికేతనము ఎంతో దూరమనిపించింది, అప్పుడు.

నాగపుర కాంగ్రెస్ అనంతరము ప్రభుత్వ కళాశాలలో నా చదువు మానివేసి, నేను బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రవేశించాను. కళాశాలలో ఉండగా రవీంద్ర కథానికలు చదువుతూండగా అందు జాలిగొలిపే కరుణ రసపూరిత ఘట్టములు నా కనుల వెంట అశ్రుబిందువులను జల జల రాల్చినది, నాకిప్పటికీ జ్ఞాపకము. ఆ లేత వయస్సులో నన్ను ఈ విధముగా కదిలించినట్టు తదుపరి జీవితంలో ఏ విషయమూ కదిలింప లేదని చెప్పవచ్చునేమో. ఆ రోజులలోనే మా అన్నగారు నాకు చదివి వినిపించిన "క్రిసెంట్‌మూన్" లోని కొని రచనలు నాకు ప్రియతమమైనవి. బందరు జాతీయ కళాశాలలో ఉండగనే శాంతినికేతనం వెళ్ళవలెననే ఆశ నాలో మరింత గాఢము కాజొచ్చినది. నా కంటె వయసున పెద్దయైన ఒక స్నేహితుడు శాంతినికేతనములో జేరి అచటి ఆశ్రమ జీవితమును గురించి ఎంతో గొప్పగా వర్ణిస్తూ ఊరిస్తూ ఉండేవాడు, నన్ను, తన ఉత్తరాల ద్వారా. అప్పుడే మా కళాశాలలో రవీంద్రుని "హోమ్ అండ్ ది వరల్డ్" అనే గ్రంథం మాకు పాఠ్యగ్రంథముగా ఉండి అందలి వివిధ ప్రకృతుల పాత్రల పాత్రపోషణ అద్భుతమైన ఉపమానములు నన్ను చాలా ఆకర్షించి శాంతినికేతనానికి వెళ్ళవలెననే ఆశను మరింత చేసినవి. నా కోరికపైననే 1924 జూలైలో మా అన్నగారు నన్ను శాంతినికేతనము తీసుకు వెళ్ళి అచట శిక్షాభవనము చదువులో జేర్పించిరి. ఈ చదువు మూడేండ్లు చదివి పరీక్ష ఇచ్చి నెల్లూరు వచ్చివేశాను.

శాంతినికేతనమును గురించి నేను కనిన కలలు ఫలించినవి. ఆశ్రమ దృశ్యములు నేను ఆశించిన రీతినే నాకెంతో ఆనందమును ఒనగూర్చినవి. ఉదయాస్తమాన సమయముల ఆరుబయట మేము చేయు ధ్యానము, ఆశ్రమమున ఉత్తరాయణ భవనములో రవీంద్ర దర్శనము, విద్యార్థుల, అధ్యాపకుల కళామయ రసవత్తర జీవితము నన్ను మిక్కిలి ఆకర్షించినవి. అచట చేరిన మరునాడే నేను బెంగాలీ భాషను

అభ్యసింపసాగితిని. ఇందుకు అప్పటి కప్పుడే విద్యాభవనములో ఎనిమిదేళ్ళుగా విద్యార్థిగా ఉండిన శ్రీ చలమయ్య చాలా సాయపడినారు. వారి సహాయముతో ఒక్క పదిహేను రోజుల్లోనే నేను రవీంద్రుని 'శిశు' – అనగా క్రిసెంట్ మూన్‌కు బెంగాలీ మాతృకను చదువగలిగాను. రవీంద్రుని రచనలు వారి మాతృభాషలోనే చదువ గలుగుట నా హృదయమును ఆనందముతో నింపి వేసినది. ప్రతీ అక్షరము కూడబలుక్కుంటూ చదివినా, మాటల అర్థము నాకు సుగమమై అందలి భావోద్రేకం వల్ల తన్మయుడనై పోతూండేవాణ్ణి. శాంతినికేతనంలో నా చదువులో ఇంగ్లీష్, చరిత్ర ఇత్యాది ఇతర పాఠములకంటె నా బెంగాలీ చదువే నాకు ఎక్కువ ఆకర్షణీయంగా ఉండేది. 'శిశు' కావ్యమును చదివినకొద్దీ నిత్య నూతనంగా కనిపిస్తూ కొత్త కొత్త అందాలతో మరువరానిది. ఇప్పటికీ రవీంద్రుని రచన బెంగాలీలో గాని, ఇంగ్లీషులోగాని చదువుతూంటే పట్టరాని భక్తితో ప్రశంసతో నిండి పొర్లి పోతుంది, నా మనస్సు. ఎటువంటి గొప్ప ఆంగ్లేయరచన చదువుతూన్నా గోచరింపని విశ్వజనీనత రవీంద్రుని రచనలలో ప్రస్ఫుటమౌతుంది, నాకు. రవీంద్రుని విశిష్టశైలి, అందలి భావోద్రేకము రచనా శిల్పము ఎప్పుడూ ఒక నవ చైతన్యాన్ని కలిగిస్తూ ఉంటవి, చదువుతూ ఉంటే.

శాంతినికేతనంలోని మూడేళ్ళూ ఎంతో సంతోష ప్రదంగా గడచిపోయినవి. పరీక్షల దారుణత్వం లేని మా నిత్య జీవితంలో దేశము నాలుగుమూలల నుంచి వచ్చిన విద్యార్థులందరితో కలసిమెలసి ఉండడంవల్ల నాలో ఒక అతి విశాలమైన దృక్పథము ఏర్పడి నా అభిరుచులు, నా భావములు తదనుగుణ్యంగానే విస్తరిల్ల సాగినవి. కవిత, గానము, చిత్రకళ నిత్యమూ నాట్యమాడుతూ ఉన్న ఆ ప్రదేశములో, అన్ని గొప్ప పుస్తకాల మధ్య, అంతకంటె ముఖ్యంగా, అతి పవిత్రమైన గురుదేవ సన్నిధిని, గడిపిన నా జీవితములో గొప్పగా పరిగణింప తగిన ఆ రోజులను ఇప్పటికీ ఆనందంతోనూ కొంత గర్వంతోనూ జ్ఞాపకం చేసుకుంటున్నాను. నన్ను శాంతినికేతనంలో జేర్పించి మా అన్నగారు స్వగ్రామానికి బయలుదేరేముందు మేము ఇద్దరమూ గురుదేవుని సందర్శించడానికి వెళ్ళినాము, తొలిసారి. గురుదేవులు మమ్ములను మిక్కిలి ఆదరించి, కుశల ప్రశ్నలడుగుతూ మా జన్మస్థలాన్ని గురించి ప్రశ్నించారు. మాటల సందర్భంలో "నెల్లూరి ఆబోతులు" ప్రసిద్ధముకదా అన్నారు కూడా ఛలోక్తిగా. ఆ సంభాషణ అంతా మా అన్నగారే జరిపారు. నేను గురుదేవుని చూస్తూ గంభీరమైన ఆయన కంఠస్వరాన్ని వీనులవిందుగా వింటూ అట్లే కూర్చున్నాను. నిజానికి, నేను అన్ని రోజులు శాంతినికేతనంలో ఉన్నా, గురుదేవుని కొన్ని పర్యాయాలే సందర్శించాను. కాని, వారిని దూరాన్నుంచి చూస్తూ, ఆయన ఎప్పుడు ప్రసంగించినా వారి ప్రసంగాన్ని అతిశ్రద్ధగా వింటూ ఉండేవాడను. మొదట, కొంతకాలము ఆయన మాటలు నాకు పూర్తిగా అర్థమయ్యేవి కావు; అయినా శ్రద్ధతో వినే వాడను. తరచు ప్రార్థన మందిరానికి వెళుతూ, మన ఉపనిషత్తులను గురించి కవితారీతిని ఎంతో ఆకర్షణీయంగా ఆ వేదాంతాన్ని విశదపరచే ఆయన సంభాషణను చాలా ఆసక్తితో వినేవాడను. ఆయన ఎవరితోనో సంభాషిస్తున్నా, మందిరంలో ఉపన్యసిస్తున్నా, శ్రవణపేయమైన ఆయన కంఠస్వరాన్ని వింటూ తన్మయుడనై ఉండిపోయేవాడిని. ఏ పురుష కంఠములోను అంతటి మాధుర్యము ఉండగలదని నేననుకోను. ఒక గానవాహిని ప్రవిస్తున్నట్టుండేది ఆయన మాట్లాడుతూ ఉంటే. అయితే, అది స్త్రీ కంఠము కాదు; కాకపోయినా, మిక్కిలి లలితమై, ఎంతో ఎంతో ఆర్ద్రమైనది. ఇటువంటి కంఠ స్వరమును నేను మరెక్కడా వినలేదు. రవీంద్రుని మాటలు నాకు అర్థమైనా కాకపోయినా వారి దీర్ఘ కేసరములూ అందమైన గడ్డమూ, మిక్కిలి ఆకర్షవంతమైన ముఖమూ, కోటేరు వేసినటువంటి నాసికా, వీనికేసి చూస్తూ, తన్మయుడనై, వారి సంభాషణను ఆలకిస్తూ అలాగే ఉడిపోయేవాడను, చాలాసేపు. వారిని చూడడమే ఒక మహదానందము. అలా చూస్తూ నాలో నేను అనుకునేవాణ్ణి "సందేహము లేదు; సమకాలిక కవులలోకల్లా మేటి కవి ఈయన!" అని. వారం వారం ఈవిధముగా ఆయనను సందర్శిస్తూ, వారి ప్రవచనాలు వింటూ ఉండడము ఒక గొప్ప అదృష్ట మనుకున్నాను. వంగదేశములోనూ ఉత్తరహిందూస్థానమంతటా పెద్దల పాదములనుతాకి వంగి నమస్కరించడము ఒక ఆచారము. ఈ ఆచారము ప్రకారము తోటి బెంగాలీ విద్యార్థులతోజేరి నేనున్నూ, గురుదేవుల పాదములను తాకి వంగి నమస్కరిస్తూ ఉండే వాడను. ప్రపంచవిఖ్యాతిగాంచిన మహనీయ కవి పుంగవుడు, కమనీయ గాయకుడు, మహాఋషి ఆయన. ఆయనకు ఈ విధముగా నమస్కరించడము ఎంత గొప్ప అదృష్టము! ఇన్నేళ్ళు గడచినా, గురుదేవులయెడల అప్పుడు నాకుగల గౌరవాతిశయము రవంతైనా సన్నగిలలేదు. తదుపరి జీవితంలో, రాజకీయ ఖైదీగా నేను జైలులో ఉండగా నా సహచరులకు బెంగాలీభాషను నేర్పుతున్నా, రవీంద్ర రచనలను అనువదిస్తున్నా నిరంతరమూ రవీంద్రునిగురించే తలచుకొంటూ ఉండే వాడను. ఇలా వారిని గురించి తలచుకుంటూ ఉండడము మానసికంగా నాకెంతో బలమును ప్రసాదించి అప్పటి నా నిత్యజీవితములోని అనేక అసౌకర్యాలనూ, విసిగింపులనూ ఎదుర్కొనే ధైర్యాన్ని ప్రసాదించినది. మనస్సు మిక్కిలి అలసత్వానికి లోనైనపుడు రవీంద్రుని గురించిన నా తలంపులు ఆ అలసత్వాన్నంతా పటాపంచలు చేసి నాకొక క్రొత్త ఉత్సాహాన్ని కలిగింపజేసెడివి. రవీంద్రుని గీతాంజలి నాకొక పారాయణగ్రంథమైనది. నా ప్రతి పుట్టినరోజునా, మా ఇంట ప్రతి శుభసమయమునా, గీతాంజలి నుండి కొన్ని గీతికలు చదువుతూ, ఆ భావములలో పూర్తిగా నిమగ్నుడనైపోతూ ఉంటాను. 1938లో నా వివాహ సందర్భంలో తగిన ముహూర్త నిర్ణయము విషయమై పండితుల తర్జనభర్జనలు జరుగుతుండగా ఒక్క తృటిలో ఆ వివాదాలను తేల్చివేశాను, మా వివాహము మే 8వ తేదీని జరుగవలెనని నిర్ణయించి, గురుదేవుల జన్మదినముకంటె వేరు శుభముహూర్తము లేదు.

తదుపరి, మహాత్ముని ఆదేశమును అనుసరిస్తూ నా చదువు మాని, స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటూ పలుసార్లు కారాగృహానికి వెళ్ళాను. 1930 నుండి నాకు కాంగ్రెస్‌తో మిక్కిలి సన్నిహిత సంబంధము ఏర్పడినది. కాని, ఎల్లప్పుడూ నన్ను రవీంద్రుని దెస ఏవో అనిర్వచనీయమైన అనురాగ ప్రభలతో అల్లిన పట్టుతాళ్ళు బంధించి నటులనే భావిస్తూ వచ్చాను. రాజకీయ రంగములో నేను గాంధీజీ శిష్యవర్గములోని వాడనై

పూర్తిగా వారిని అనుసరిస్తూ, కళారంగములోనూ సాంస్కృతిక విషయాలలోనూ రవీంద్రుని నాకు గురువుగా నెలకొల్పుకున్నాను. రవీంద్ర సాహిత్యములో నేను ఉత్తీర్ణుడనని చెప్పుకోలేను; కాని, గడచిన ఈ ముప్పది ఏండ్లలోనూ రవీంద్రుని గురించి నేను తలచుకోని నిమిషమే లేదనగలను.

శాంతినికేతనములో నుండగా నాకు లభ్యమైన తెలుగు పుస్తకాలు ఎన్నో లేకపోయినా, నాకు తెలుగు సాహిత్యములో ఆసక్తి నానాటికి అతిశ యిల్ల జొచ్చినది. కాని బెంగాలీవారికిగల మాతృ భాషా పరిచయంతో మనవారి మాతృభాషా పరిచయాన్ని పోల్చి చూసుకొని, 'ఎంత వ్యత్యాసమున్నదీ' అనుకోసాగాను. బెంగాలీవారు ఏ ఉద్యోగములో ఉన్నా ప్రతివారికీ తమ సాహిత్యముతో గొప్ప పరిచయము. మన వారికి నాడూ నేడూ కూడా తమ మాతృభాషతో పరిచయము తక్కువే. ఇందుకు ఇతర కారణాలేవైనా, ఒక ముఖ్య కారణము మన గ్రాంధిక భాషలోని ప్రబంధశైలీ అందలి కష్టమైన సమాసాలూ అనుకుంటాను. గ్రాంధిక వంగభాషగాని ఆధునిక వంగభాషగాని ఇంతటి సమాస భూయిష్టము కాదు. వారి భాష సులభముగా అర్థమవుతుంది. నిజానికి, ఆధునిక వంగసాహిత్య సంపద ఎంతో ఎంతో మెచ్చుకో తగినది. ఐనా, నా మాతృభాష ప్రియతమమై నానాటికి నాకు తెలుగులో ఆసక్తి ఎక్కువ కాజొచ్చినది.

ప్రపంచములోని వివిధ సంస్కృతుల మధ్య గల సన్నిహితత్వాన్ని గుర్తిస్తూ, ఈ సన్నిహితత్వమును అభివృద్ధిపరచి తద్వారా వసుధైక కుటుంబము అనే లక్ష్యాన్ని సాధించాలి అనే విశ్వభారతి ఆశయము నన్ను చాలా ఆకర్షించినది. ఈ లక్ష్యసిద్ధికై విశ్వభారతి ఇతర దేశాలనుంచి విద్యార్థులను మన దేశానికి ఆహ్వానిస్తూ ఇతర దేశ జ్ఞాన సంపదను గురించి తెలుసుకోడానికి మన దేశములోని కొందరు విద్యార్థులను ఆ దేశాలకు పంపుతూ కృషి చేస్తున్నది. నాలోనున్న జాతీయతా భావం వల్ల ఈ పద్ధతిని, మొట్టమొదట భారతదేశములోని వివిధ ప్రాంతాల మధ్య సాంస్కృతిక సన్నిహితత్వమును పెంపొందించేందుకు ఉపయోగించవలెనని నాకు కుతూహలము కలిగినది. ఐరోపా దేశాల సంస్కృతిగానీ, మధ్య ప్రాచ్య దేశాల సంస్కృతినిగానీ అవగాహన చేసుకొనేముందు, భారత దేశములోని వివిధ ప్రాంతముల సంస్కృతినీ ఆయా భాషలతో పరిచయమువల్ల అర్థము చేసుకొనుట అవసరమనిపించినది. ఇందువలననే నేను మన దేశములోని వేరువేరు భాషలను నేర్చుకొన ప్రారంభించాను. మొట్టమొదట ఉత్తర హిందూ స్థానములోని భాషలను నేర్చుకొంటూ ఆయా సాహితీ చరిత్రలను గురించిన్నీ తెలుసుకోవడానికి ప్రయత్నించాను. ఉర్దూ, అస్సామీ, ఒరియా కొంతకొంతగా అభ్యసిస్తూ, గుజరాతీ భాషను కొంచెం ఎక్కువ శ్రద్ధతో నేర్చుకొనసాగాను. తర్వాత కొన్నాళ్ళు పూనాలో ఉండి మహారాష్ట్ర భాష నేర్చుకున్నాను. తదుపరి, నా కారాగారావాసమున, దాక్షిణాత్య భాషలను అభ్యసింప యత్నించాను.

భారతదేశములోని ఈ వేర్వేరు భాషలతో కలిగిన పరిచయంవల్ల, ఈ భాషలు పైకి వేర్వేరుగా కన్పించినా మన సంస్కృతి ఏక సంస్కృతి అని నేను గుర్తింపగలిగాను. ఈ వేర్వేరు భాషలను నేర్చుకోవడం ద్వారా ఈ వేర్వేరు ప్రాంతాలలోని నా సోదర భారతీయులతో పరిచయం కలుగజేసుకొన గలిగినందుకు సంతోషించాను. అందువల్ల, ఈ భాష మాట్లాడేవారు నావారు, మరొక భాషమాట్లాడే వారు నావారుకారు అనే భావం ఏమాత్రమూ రాకుండా ఉండగలిగాను. ఇటువంటి విశాలదృష్టి నా శాంతినికేతన అనుభవం వల్లనే నాకు లభించినది.

ఆలోచించిన కొలదీ నాకు ఒక విషయము మరీమరీ ప్రస్ఫుటంగా తోస్తోంది : మన విశ్వకళాపరిషత్తులలోను, మన వేరువేరు కళాశాలలలోనూ భారతదేశపు అన్ని భాషలూ బాగా తెలిసిన విద్యార్థులు ఉండటము అత్యవసరమని. మనకు స్వాతంత్ర్యము సిద్ధించినా, మనవారికి ఇరుగు పొరుగు భాషలను నేర్చుకొనవలెను అనే ఆసక్తి ఉన్నట్టు కన్పించదు. మాటవరసకు, తమిళముగాని, మహారాష్ట్రముగాని తెలిసినవారు వంగదేశమున ఎందరున్నారు? మళయాళముగాని తెలుగుగాని, గుజరాతీగాని తెలిసిన విద్యార్థులు ఆయా ప్రాంతాల బయట ఎందరున్నారు? విశ్వకళా పరిషత్తులున్నూ యూనివర్శిటీగ్రాంట్స్ కమీషన్ వారున్నూ ఈ విషయాన్ని గురించి బాగుగా ఆలోచించి ఉద్యోగార్హత విషయంలో భారతదేశ వివిధ భాషలతో తగిన పరిచయము అత్యవసరమని నిర్ణయిస్తే బాగుంటుందేమో.

విశ్వకవి ప్రభావం వల్ల శాంతినికేతనము వాతావరణం పూర్తిగా సంగీత సాహిత్యములతోనూ నృత్యకళతోనూ, చిత్రకళతోనూ శోభాయమానమైంది. నేను అచట ప్రవేశించిన కొన్ని నెలలలోనే నాకు వంగదేశ సంగీతమందు, అనగా రవీంద్ర సంగీతమందు గొప్ప అభిరుచి ఏర్పడినది. నేను కృషి చేసి కొన్ని పాటలు నేర్చుకున్నాను కూడా. రవీంద్ర సంగీత మందు కొన్ని ప్రార్థనా గీతములైనా, చాలా పాటలు ఆయా ఋతువులను వర్ణించునవి. వర్షఋతువును వర్ణించే పాటలు జులై ఆగస్ట్ నెలలలోనే వినవచ్చును. వసంత ఋతువుకు సంబంధించిన పాటలు మార్చ్, ఏప్రిల్‌లోనే వినవచ్చును. పండు వెన్నెలలో వెన్నెల పాటలు వినిపించేవారు. రవీంద్రకవి ఒక క్రొత్త పాటను రచించడమే తడవుగా ఆ పాట శాంతినికేతనమంతటా వ్యాపించిపోయేది. తరచు ఏదో ఒక పండుగ సందర్భములోనో ఉత్సవ సమయములోనో రవీంద్రుడు ఆ సంబంధమైన పాటలను రచించి వానిని ఆయనే స్వయముగా విద్యార్థులకు నేర్పేవారు. ఇక, అందరి గొంతుకలలోనూ ఆ పాటలే. మరేదో ఉత్సవానికి మరి వేరే పాటలు వచ్చేవరకూ ఈ పాటలు ఆశ్రమము మూలమూలలా మారుమ్రోగుతూ ఉండేవి. రవీంద్రుడు నిరంతరంగా క్రొత్తపాటలు పాడుతూన్నందున శాంతినికేతనము వాతావరణం ఎప్పుడూ సంగీత మయముగా ఉండేది.

గురుదేవులు తన నివాసమైన ఉత్తరాయణ గృహమునందు విద్యార్థులు కొందరిని జేర్చి వారికి తన క్రొత్త నాటికను గాని కథానికను గాని చదివి వినిపించేవారు. ఆయన రచించిన నృత్యనాటికలు ఆశ్రమవాసులచేత తానే స్వయంగా ప్రదర్శింప జేస్తూండేవారు. ఒక్కొక్క ప్రదర్శన మందు చాలా చాలా శ్రద్ధతో తరిఫీదు చేసేవారు, అందరినీ. ఈ ప్రదర్శనలకు కలకత్తా నుంచిన్నీ ఆసక్తిగల ప్రేక్షకులు వచ్చేవారు. కొన్ని నృత్యములందు తగిన శిక్షణ నియ్యడము నేను స్వయముగా చూచాను. శాంతినికేతనంలో, ఆయా ప్రాంతాల నృత్య రీతులను బోధించుటకు తగిన నటనాచార్యులు ఆయా ప్రాంతాల నుంచి వచ్చినవారు ఉండేవారు. కథకళికి కేరళ నుంచీ, మణిపురీ నృత్యరీతులకు మణిపూర్ నుంచీ,

వచ్చినవారు ఆ విద్యను నేర్పేవారు. ఇతర దేశ నృత్యరీతులను నేర్చుకొని వచ్చి, ఇక్కడ నేర్పడానికి ప్రత్యేకంగా కొందరిని విదేశాలకు పంపుతూ ఉండేవారు కూడా.

ఈవిధముగా ఏదో ఒక క్రొత్త నాటకముతో ఏదో ఒక క్రొత్త నృత్యముతో శాంతినికేతనపు వాతావరణం నిత్యనూతనముగా ఉండేది. ముగ్గులు పెట్టుటలో అచటివారు అతి నిపుణులు. రంగస్థలము ఇటువంటి రకరకాల క్రొత్తక్రొత్త ముగ్గులతో కన్నులపండువగా అమరేది. ప్రతిసారీ ఏదో ఒక క్రొత్తముగ్గుతో అలంకరించేవారు, ఎంతో ఎంతో శ్రమపడి. ఒకప్పుడు రవీంద్రుడున్నూ, నాటకములో ఒకపాత్ర ధరించేవారు. కాని, క్రమేణా అది మాని నాటకమునకు దర్శకత్వమును మాత్రము వహించేవారు. అప్పుడప్పుడు ఆయన రంగస్థలము పైకి వెళ్ళి తను రచించిన క్రొత్త గీతమునుగాని, గేయమునుగాని, గానము చేసేవారు. 'నటరాజు'ను కీర్తిస్తూ వారు వ్రాసిన గీతమును ఒక మహాసభలో వారలా గానము చేయుట నాకు బాగా జ్ఞాపకము. స్వచ్ఛమైన పసుపురంగు దుస్తులను ధరించి వారు ప్రేక్షకుల ఎదుట నిలచి గానము చేయుట నాకిప్పటికినీ స్పష్టముగా కనిపిస్తోంది.

శాంతినికేతనములో నేను ఉన్న కడపటి సంవత్సరములో, ఇక కొద్దికాలములో నేను ఆశ్రమమును విడిచి వెళ్ళిపోవలెను అనే ఆలోచనే నాకు చాలా బాధను కలిగించేది. నా జీవితమును పునీతము చేసిన ఆ వాతావరణమును విడిచి వెళ్ళడమంటేనే ఎంతో దిగులుగా ఉండేది, నాలో. నేను వెళ్ళిపోవలసిన సమయము ఆసన్నమైన కొలదిన్నీ నాకు శాంతినికేతనము మరింత ప్రేమాస్పదమైనది.

1927వ సంవత్సరము ఏప్రిల్‌లో ఒకనాటి మధ్యాహ్నము నేను గురుదేవునివద్ద సెలవు తీసుకొనుటకై వారి సమక్షానికు వెళ్ళాను. పడకకుర్చీలో కూర్చుని ఏమో వ్రాసుకుంటున్నారు ఆయన. జంకుతూ జంకుతూ వారిని సమీపించి, వారి పాదములను తాకి, శిక్షాభవనములో నా చదువును పూర్తి చేసుకుని, నేను ఇంటికి తిరిగి వెళుతున్నాని మనవి చేశాను, గురుదేవునితో. “ఇకముందు ఏమి చేయదలచుకున్నావు?” అని నన్ను వారడిగారు. ఆ రోజులలో మా అన్నగారు అరవిందభక్తులై ఆ సంబంధమైన జ్ఞానమును సంపాదించుటలో నిమగ్నులై యుండిరి. అందువల్ల మా భూములను చూచుకొనే భారము నేను వహింపవలసి వచ్చినది. గురుదేవుని ప్రశ్నకు నేను “మా భూములను చూచుకోవలసి ఉన్నది” అని సమాధానమిచ్చాను. వారు నన్ను ఆశీర్వదించి పంపారు. బరువు టెడదతో, చెమ్మగిల్లిన కనులతో నేను శాంతినికేతనమును విడిచివచ్చాను.

తదుపరి, నేను నాలుగుసార్లు మాత్రమే తిరిగి ఆశ్రమాన్ని చూడగలిగాను. కడసారి వెళ్ళినపుడు ఇదివరకు నాకు చిరపరిచితమైన ప్రతిచోటకు వెళ్ళి కాలక్రమేణా ఆ స్థలములు ఎంత మారిపోయినవో గుర్తించాను. ముఖ్యంగా, గురుదేవులు లేనందున, రాగమును గోల్పోయిన గీతమువలె తోచినది శాంతినికేతనము నాకు. పెద్ద పెద్ద చెట్లున్నవి బారులు బారులుగా; ఇదివరకున్న చిన్ని చిన్న సౌధములముందు గొప్పగొప్ప భవనములు తలలెత్తినవి. ఎన్నో ఎన్నో అవసరమైన మార్పులూ వచ్చినవి. కాని, క్రొత్త శాంతినికేతనము చుట్టూ పూర్వపు శాంతినికేతన స్మృతి పూర్తిగా అలముకొని ఉన్నది, నా ఊహలో. గురుదేవుడు నడచిన ప్రతి అంగుళము నేలా వారి పాదస్పర్శవల్ల పవిత్రమైనది.

నేను శాంతినికేతనములో ఉన్న రోజులలలో కూడా, మన దేశీయులూ విదేశీయులూ ఎందరో ఎడతెగక తీర్థప్రజగా వచ్చి వెళుతూండేవారు, ఆ దివ్యక్షేత్రాన్ని దర్శించి ధన్యులగుటకు. 1935లో మా పిల్లవానిని ఒకతనిని శాంతినికేతనములో జేర్పించడానికి నేను అక్కడకువెళ్ళగా, తిరిగి గురుదేవుని దర్శించినాను. ప్రస్తావవశమున, వారు శ్రీ జయపురంరాజా వారును, శ్రీ పిఠాపురంరాజావారును, శాంతినికేతనమునకు ఇచ్చెదమని వాగ్దానము చేసిన విరాళములను గురించి నాకు జ్ఞప్తిపరచారు. నేను మన ప్రాంతములకు తిరిగివచ్చి ఆ విషయమై తగిన చర్యను తీసుకున్నాను.

1937 మద్రాస్‌లో శ్రీరాజగోపాలాచారి ఆధ్వర్యమున కాంగ్రెస్ ప్రభుత్వము నెలకొల్పినపుడు నేను అందు మంత్రిగా జేరినపుడు గురుదేవునికి వారి ఆశీర్వాదము అర్థిస్తూ తంతిని పంపాను. వారు దయతో నన్ను ఆశీర్వదించారు. ఆ సంవత్సరమే సెప్టెంబర్‌లో నేను వారిని కలకత్తాలో దర్శించి, రామనాథపురంలో ఒకరు శాంతినికేతనానికై ఇచ్చిన వేయిరూపాయల విరాళాన్ని వారికి అందజేశాను. నన్ను కాంగ్రెస్ మంత్రిగా ఆహ్వానిస్తూ గురుదేవులన్నారు. “బెంగాల్‌లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వ మేర్పడి ఉంటే ఎంత బాగుండేది!” అని. అప్పుడు బెంగాల్‌లో ఫజుల్‌హక్ ముఖ్యమంత్రి.

శ్రీ రాజగోపాలచారి, నేనూ, ఇతర కాంగ్రెస్ సేవకులూ తిరుచునాపల్లి జైలులో ఉండగా రవీంద్ర అస్తమయమును గురించిన దుఃఖ వార్త రేడియోలో విన్నాము. వెంటనే జైలులోనే సంతాప సూచకమైన సభ ఏర్పరిచాము. నేను రవీంద్రుని గురించి నాకు తెలిసినది చెప్పాను.

ఇప్పుడు జరిగిన విషయాలను గురించి ఆలోచిస్తూ ఉంటే, శాంతినికేతనములో నేను ఉన్న రోజులు జ్ఞప్తికి వచ్చి గురుదేవుల శుశ్రూష వలన, వారి మాటలను వినుటవలన, వారి రచనలు చదువుట వలన నాలో కలిగిన ఉత్తేజము మరీ మరీ స్మరిస్తున్నాను. నా జీవిత దృక్పథాన్ని ఏర్పరచిన ఈ ప్రభావమువలనే ప్రేమ, సౌందర్యములకు పుట్టినిల్లైన ఆ గురుదేవ సంస్మరణ ద్వారా, నా జీవితము నిరంతరమూ కొత్త ఉత్సాహమును సంపాదించుకొనునని నా ఆశ.

శ్రీ రవీంద్ర శతవార్షికోత్సవ విశేష సంచిక)

అడివి బాపిరాజు

ఆస్వాల్డు కూల్డ్రే గురువు

చూళిక

కొద్దిరోజుల క్రిందటనే నా గురువుగారు ఆస్వాల్డు జెన్నింగ్స్ కూల్డ్రేగారు వారు రచించి, ఆక్సుఫర్డులో అచ్చువేయించిన గ్రంథం పంపించారు.

ఆ గ్రంథంలో ఆయన రాజమహేంద్ర నగరం ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా ఉన్న రోజులలో వారికి సంభవించిన అనుభవాలనాధారంగా రచించిన కథలు, గాథలూ! ఆ గాథల్లో ఆయన శిష్యులం చాలామంది పాత్రధారులం అయ్యాము. పేరులు మార్చినారు.

ఒక్కొక్క ప్రకరణం చదువుతూ ఉంటే ఏమేమో మహోత్తేజితమైన భావాలు ఉద్భవించసాగినవి.

ఆయన తన పద్యాలు "థేమ్సు అండ్ గోదావరి" అన్నపేరుతో గ్రంథంగా ప్రచురించారు. ఇంకో మహత్తరమైన గ్రంథంలో వారానాటి తన అనుభవాలను రచించారు. ఆ గ్రంథం పేరు "సౌత్ ఇండియన్ అవర్సు" (దక్షిణ భారత ఘడియలు). ఆ గ్రంథం నాకూ, దామెర్ల వెంకటరాయనికీ, కవికొండల వెంకట్రావుకీ అంకితం ఇచ్చారు. ఈనాడు ఈ గ్రంథం మొదటి పుట చదవడం ప్రారంభించి, ఆ పట్టుపట్టు గ్రంథం అంతా పూర్తిచేశాను. ఎంత మధురంగా, ఎంత ఠీవిగా, ఎంత లోతుగా నడిచింది వారి ఇంగ్లీషు భాష.

పుస్తకం చదవడం పూర్తి చేసినప్పటి నుండీ నా కాలేజీ చదువుదినాలు నా ఎదుట నృత్యమాడినవి. ఆయన శిష్యుడనై, ఆయనకు అంతేవాసినై నడచిన ఆ సంవత్సరాలు నా జీవితంలో అమూల్యమై వెలుగొందినవి. మట్టిముద్దలా ఉన్న నన్ను ఆయన ఒక అద్భుత కలశంగా మార్చినారు.

నేను గొప్పచిత్రకారుణ్ణి కావాలనీ, గొప్ప కవినీ కావాలనీ ఆశయాలూ, ఆశలూ ఉద్భవించాయి. ఆయన 'రామ్'ను ఆంధ్రదేశానికి ఇచ్చినారు. నన్నూ ఆయన నా దేశానికి సమర్పిస్తారుగాక అనుకున్నాను అన్నాడు. ఆ ప్రగాఢమైన వాంఛతో నా జీవితాన్ని సాగించాను. మా జీవిత ప్రవాహాలకు ఆయన ఆనకట్టలు కట్టి కాలువలు నిర్మించారు.

ఈ ఆలోచనలతో నా భావాలు ఆలా చిన్ననాటి కాలేజీ క్షణికాలపై ప్రసరించాయి. అస్వాల్డు జెన్నింగ్సు కూల్డ్రే గారిని గూర్చి, మా అంతేవాసిత్వాన్ని గూర్చీ రంగాలు, అంకాలు సినిమా దృశ్యాలు అట్టు నా ఎదుట ప్రవహించసాగినవి.

నాకు స్కూలు ఫైనలు పరీక్షలో బాగా మార్కులు వచ్చినవి. ఎన్నో కాలేజీలకు ఇంటరులో చేరడానికి దరఖాస్తు పెట్టినాను. రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలకు మాత్రం దరఖాస్తు పంపలేదు. అక్కడ "ఆటలెక్కువ చదువు తక్కువా"అని ఆ దినాలల్లో వాడుక. "ఆ కళాశాల ప్రిన్సిపాలు పండితుడు కాడు, వట్టి ఆటలమారి!" అన్నారు మావాళ్లు. అన్ని కాలేజీలనుండి సీట్లు వచ్చాయి. కాకినాడ కాలేజీలో చేరనిశ్చయించాము.

కాని దైవసంఘటనం వేరే ఉంది. ఒక మహాకళావేత్త పాదాలకడ నా విద్యాజీవితం గడపవలసిన అదృష్టం నాకు నొసట వ్రాసి ఉందాయను. అలాంటప్పుడు నేను ప్రభుత్వోద్యోగాలు చేసి ధనవంతుణ్ని ఎట్లా కాగలను చెప్పండీ!

బెజవాడ (విజయవాడ) కనకదుర్గా హిందూ హైస్కూలులో స్కూలు ఫైనలు చదివినవాడనవడంవల్ల, అక్కడికి వెళ్ళి నా సర్టిఫికెట్ తీసుకొని కాకినాడ వెడుతూ ఉంటే దారిలో నాకు చటుక్కున పెద్ద జ్వరం తగిలింది. నాకు రాజమహేంద్రవరం నిండా చుట్టాలున్నారు. నా సహాధ్యాయులలో కొందరు రాజమహేంద్రవరం కాలేజీలో జేరుతున్నారు. వాళ్ళు రాజమహేంద్రవరం స్టేషనులో దింపి, నన్ను మావాళ్ళ యింటికి తీసుకువెళ్లినారు. జ్వరం ఆ సాయంకాలానికే తగ్గిపోయింది. మా చుట్టం "మీ నాన్నగారికి ఈ ఊళ్ళో వర్తక సంబంధాలున్నాయి. మేమంతా చుట్టాలం ఇక్కడ ఉన్నాం. ఈ ప్రభుత్వ కళాశాలాధ్యక్షులు కూల్డ్రేగారు చాలా ఉత్తములు. కళావేత్త. నువ్వు కవిత్వం అంటావు, కథలంటావు! బొమ్మలు గీస్తానంటావు. ఇక్కడే నువ్వు ఉంటే, ఏనాటికైనా ఆయన కళ్లబడక మానవు. ఆయన తలుచుకుంటే నిన్ను ఇంగ్లండుకూడా పంపిస్తాడు. తెన్నేటి సూర్యనారాయణ గారిని పంపలేదురా మరీ! వెఱ్ఱివెఱ్ఱి వేషాలు వేయక ఈ కాలేజీలో చేరు" అని కొంచెం తీవ్రంగానే నన్ను చీవాట్లు పెట్టినారు.

నేను, "నేనీకాలేజీకి దరఖాస్తు పెట్టలేదండి!" అన్నాను.

"దరఖాస్తు పెట్టేదేమిటి? నీ మార్కులు చూస్తే ఆయన వెంటనే సీటు యిస్తారు."

ఆ మర్నాడు కొంచెం నిస్పృహతోనే కాలేజీకి వెళ్లాను. ఇదివరకే ప్రవేశం ఇస్తామని ఉత్తరాలు వెళ్లినవారు జేరుతున్నారు.

నాకు లెక్కలలో మాత్రం 26 మార్కులే వచ్చాయి. నాకు లెక్కలకూ మొదటినుండి అంత స్నేహం లేదు. ఏదో స్వప్న ప్రపంచాలలో విహరించే బుద్ధి కలవాడికి లెక్కలు ఏల సన్నిహితం అవుతాయి గనుకా! కాని తక్కిన మార్కులు మాంచి బాగున్నాయి. ఆ రోజులలో మార్కులు చూచి కాలేజీ అధ్యక్షులవార్లు విద్యార్థులకు ప్రవేశం ఈయవలసిందేకాని, ఇప్పటివల్లే మోడరేషను బోర్డులూ, "పైకి చదవడానికి ఈయీ వీరు తగినవారు" అని నిర్ణయించడాలూ లేవు.

ఏమిటీ నాకీ రాజమహేంద్రవరం చదువు. అసలే మన చదువు అంతంత మాత్రం, ఎప్పుడూ కవిత్వాలూ, అష్టావధానాలు, ఆశుధారలు అని ఏ అయ్యప్పనో, ఏ కొప్పరపు సుబ్బారావునో జంటకవిగా ఏర్పాటుచేసుకొని, హైస్కూలు రోజులలోనే కవిగా చెల్లుబడి అయ్యానాయను. తోటి విద్యార్థులు మెచ్చుకున్నా, వేళాకోళం చేసినా, హుషారు పొందినవాడిని. నోట్సు పుస్తకాలలో నోట్సు రాసుకొనే అసలు సిసలైన విద్యార్థిని కాదాయను. ఆ పుస్తకాలన్నీ బొమ్మలే. ఎదుట పాఠం చెప్పే మాష్టారు బొమ్మో లేక మరో బొమ్మో ఎప్పుడూ నా కలంలోంచి వస్తూఉండేది. ఈలా స్వప్న ప్రపంచంలో రెండు రెక్కలతో ఎగిరే నాబోటి విద్యార్థి చిత్రకారుడూ కవీ అయిన ప్రిన్సిపాలుగారి దగ్గర ఏం చదువు సాగిస్తాడు అనే భయమేకదా నన్ను మొదటినుండీ ఆవహించుకు ఉన్నది. అయినా ఇది ఎందుకు వచ్చిందో అనుకుంటూ నీరసంగా ప్రిన్సిపాల్‌గారి గదిముందు వరండాలో గోడనానుకొని నిలుచుండి ఉన్నాను.

ఇంతలో రైటరుగారు ఈవలకివచ్చి "ఈ సర్టిఫికెట్ పుస్తకాలు తిరిగి ఇచ్చివేశారు. వీరికి ప్రవేశం లేదు. తక్కినవారు ఒక్కొక్కరే వచ్చి ప్రిన్సిపాలుగారిని చూడండి!" అని అంటూ కొందరి పుస్తకాలు ఇచ్చివేసినారు. అందులో నా పుస్తకమూ ఉంది. నేను తెల్లబోయినాను. కొంచెం ఆడపిల్లతనం నాలో ఉండడం చేత, జ్వరం తగ్గి నీరసంగా ఉండడంచేతనూ చటుక్కున కళ్ళనీళ్ళు తిరిగినవి.

నాకు బాగా మార్కులు వచ్చాయే! చరిత్రవాణ్ణి. చరిత్ర పుచ్చుకున్నవానికి లెక్కలు తక్కువ వచ్చినా ఫరవాలేదనిగా నాకు ప్రెసిడెంసీ కాలేజీనుంచి కూడా సీటు వచ్చింది. చాలా రోషం వచ్చింది.

విద్యార్థులందరూ ఒక్కొక్కరే వెళ్లిపోయారు. మా చుట్టం నన్ను అనవసరంగా మాటలన్నాడు. నేను కాకినాడే వెళ్లి నాయుడుగారి శిష్యుణ్ని కావలసింది. ఈ ప్రభుత్వ కళాశాలలో నాబోటివానికి చదువేమి సాగుతుంది? అనీ ఇప్పుడు మాత్రం మించిపోయిందేముంది. మధ్యాహ్నం ప్యాంసింజరులో కాకినాడపోవచ్చును అనుకున్నాము. కాని ఇంత చక్కని మార్కులు, వచ్చిన నా సర్టిఫికెట్ పనికిరాదనడానికి ఈ కూల్డ్రే ఎవరు? ఈ బాలురలో ఎవరైనా మన సంగతి తెలిసి నన్ను తమ హృదయాలలో ఎద్దేవా చేసుకుంటున్నారేమో అన్న పౌరుషమూ వచ్చింది.

అలా ఒంటరిగా నీరసంగా గోడనానుకుని, రహస్యంగా కళ్ళనీళ్ళు తుడుచుకొని ప్రిన్సిపాలుగారి గదిముందు వరండాలో తలవాల్చికొని, సర్టిఫికెట్టు పుస్తకం హృదయానికదుకొని నిలబడి ఉన్నాను.

"సీటుకోసం వచ్చినావా?" అన్న మాటలు నాకు గబుక్కున ఆలోచనాపథంలోంచి కాలేజీ ప్రపంచంలోకి లాక్కుని వచ్చాయి. నా ఎదుట కాలేజీ వైస్ ప్రిన్సిపాలు "విల్కిన్‌సన్" గారు నిలబడి ఉన్నారు.

"అవునండి."

"నీ సర్టిఫికేట్టు ప్రిన్సిపాలుగారికి చూపించినావా? నీ సబ్జెక్టు ఏది?"

"నేను చరిత్ర విద్యార్థినండి. చరిత్రలో డబ్బై వచ్చాయండి."

విల్కిన్‌సన్‌గారు చరిత్ర ముఖ్యాచార్యులు. అది నాకప్పుడు తెలియదు. ఆయన నా ఇంగ్లీషు మార్కులు బాగా వచ్చాయని తెలిసి చాలా సంతోషించి, నా సర్టిఫికేట్టు పుస్తకం పుచ్చుకొని పరిశీలించినారు. ఆయన పుస్తకం ప్రిన్సిపాలుగారి కడకు తీసుకొని వెడుతూ ఉంటే నేను లోనికి వెళ్లినాను. అంత ధైర్యం నాకప్పుడేలా వచ్చిందో!

కూల్డ్రేగారు ఆయిదడుగుల పది అంగుళాల పొడుగువారు. ఆజానుబాహులై బలసంపద గలవారు. ఆయన బ్రునెట్! అంటే నల్లజుట్టు, గాఢనీలం కనుపాపలు కలవారు. బ్లాండులకు బంగారం జుట్టు, సాధారణ నీల కనుపాపలూ ఉంటాయి. కూల్డ్రేగారి తల్లి ఇటాలియను జాతినుండి ఉద్భవించినదట. కాబట్టి కూల్డ్రేగారిలో కొంచెం లాటిన్ రక్తం ప్రవహిస్తున్నది. ఆయన మోము కోలు. నుదురు అతి విశాలం; బాగా వెడల్పు, కళ్ళు చాలా పెద్దవి. ఆ పెద్ద కళ్ళకు తగినట్టు పెద్ద కళ్ళజోడు. ఆ రకం జోళ్ళు ఇప్పుడు సర్వసాధారణంగాని ఆరోజుల్లో కొత్త. ఆయన విగ్రహాన్ని చూడగానే నాకు దడ పుట్టింది.

కూ[్డే– ఈ పుస్తకం నేను ఇదివరకే చూశానే.

విల్కిన్‌సన్ – మీరు చూడలేదని ఆ బాలకుడు చెప్పినాడే!

కూ[్డే– అబద్ధం. నేను చూశాను. పనికి రాదని తిరగగొట్టి వేసినాను. అతణ్ణి పిలు శామ్యూఏల్!

శామ్యుఏల్ కాలేజీ బం[ట్రోతు. [ప్రిన్సిపాల్‌గారి దగ్గిర ఉంటాడు.

నేను– ఇక్కడే ఉన్నానండీ!

కూ[్డే– నాకు చూపించి, చూపించలేదని ఎందుకు చెప్పినావు.

ఆయన మాటలు ఉరుములలా [ప్రతిధ్వనించాయి. పైగా స్వచ్ఛమైన ఇంగ్లీషు పెద్దమనుష్యుని మాటలు అదే మొదటిసారి వినడం. మాటలు పులుముకుపోయినట్లు వినబడ్డాయి.

నేను – (బేజారై) క్షమించండి, తాము చెప్పేది? ("బెగ్ యువర్ పార్డన్") అని నీకు తెలియకపోతే తిరిగి చెప్పమని [ప్రార్థించడానికంటారని మా [ప్రధానోపాధ్యాయులు, శ్రీ రామస్వామి అయ్యర్‌గారు నూరిపోసినారు.

కూ[్డేగారి మాట విల్కిన్‌సన్ గారు నాకు స్పష్టంచేసి చెప్పారు.

నేను– నాకు బాగా మార్కులు వచ్చాయి. అల్లాంటి సర్టిఫికేటు చూసి ఉంటే [ప్రిన్సిపాలుగారు తిరిగి ఇచ్చివేసి ఉండరని అనుకున్నాను.

కూ[్డే– (నావైపు ఎగా దిగా చూసి) తెలివిగా ఉంది మాట. అయితే నీకు ఫోర్తు ఫారం పరీక్షలో సున్నలు వచ్చాయి. కాబట్టి స్కూలు ఫైనలులో కాపీచేసినావేమో?

నేను – ఆ పేజీ [క్రింద మా [ప్రధానోపాధ్యాయులు [వ్రాసిన విషయం గమనించండి. నాకాఏడు చాలా జబ్బు చేసింది. అందుకని పరీక్షలో మార్కులు రాలేదు. కాని మొదటి అర్థ సంవత్సరం బాగా మార్కులు వచ్చాయి కాబట్టి నన్ను పై తరగతిలో వేసినారు.

కూ[్డేగారు ఆ నిజం అంతా గమనించారు. నావైపు తీక్షణంగా ఒక నిమిషం చూశారు. "సరే రేపు నువ్వు చేరవచ్చును" అంటూ పుస్తకం తమ దగ్గిర ఉంచుకున్నారు. నేను పట్టరాని సంతోషంతో వారిరువురకూ నమస్కరించి ఈవలకి వచ్చేసాను.

ఆ శుభముహూర్తం నుంచీ కూ[్డేగారి అంతేవాసినయ్యాను.

గోదావరీ నది అంటే కూ[్డేగారికి మహాభక్తి. "గోదావరి తెలుగునది బాపిరాజూ! మహారాష్ట్రంలో పుట్టుగాక, కాని నూటికి నూరుపాళ్ళు ఈ నదీమతల్లి ఆం[ధనదే సుమా?" అన్నారాయన ఒకనాడు.

నేను– అనాదికాలం నుంచి ఉన్న ఈ నది తెలుగునది ఎలా అవుతుంది గురువుగారు!

కూ[్డే – గోదావరి తెలుగుజాతికే తల్లి! కృష్ణానది అక్కగారు. ఒకజాతికోసం ఒక నది ఉద్భవించడం అన్ని దేశాలలోనూ ఉంది. గంగానది భారతదేశానికంతకూనది. జీలం కాశ్మీరానికి నది. థేమ్సు ఇంగ్లీషువారి నది. వోల్గా రష్యావారిది. ఆగ్జసు పెరిసియావారిది. జోర్దాను హి[బ్రూవారిది. ఆ నదులు లేక ఆయా జాతుల సంస్కృతి ఆయా విధాలుగా వృద్ధి పొంది ఉండకపోవచ్చును.

నేను – అరేబియన్ నైట్సుకు టై[గీస్ నది [ప్రాణం కదా అండి!

కూ[్డే –అవును! కావేరి అరవజాతి నది. మహానది ఉరియావారిది. నర్మద గుజరాతీ వారిది. కాని ఏ నదులైనా సరే గోదావరి అందానికి సరిపోవు సుమా!

నేను – హిమాలయాలలో నదులు ఎంతో అందంగా ఉండవా గురువుగారూ!

కూ[్డే – హిమాలయ నదుల అందాలు అందరికీ అందుబాటులో లేవు. ఏనాడు ఆ నదులు భారతీయ నిత్యజీవితంలో భాగం పంచుకుంటాయో, ఆనాడు భారతదేశ సంస్కృతి ఇంకా ఉన్నత పథాలకు పోతుంది సుమా!

మా కాలేజీ గోదావరి ఒడ్డునే ఉన్నది. సాయంకాలం టెన్నిస్ ఆడిన వెనుక కొందరి శిష్యులను వెంటబెట్టుకొని గోదావరి గట్టునే వాహ్యాళి బయలుదేరేవారు మా గురువుగారు.

ఎవరైనా గోదావరిని, బొబ్బర్లంక మొదలైన లంకలను, అవలిగట్టును, ఇసుక తిప్పలను, తెల్లటి రెక్కలను చాపి ఆకాశాన తేలిపోయే పక్షులువలె గోదావరిలో తెరచాపలెత్తి తేలిపోవు పడవలను గమనించకుండా నడిచే యవకుడు కళ్ళు ఉండి లేనివాడే అనేవారాయన. లంకపొలాల్లో తిరిగే ఆవులు, ఎద్దులు, నాగళ్లు, రైతులు ఆయనకు ఎప్పుడూ ఆనందం సమకూర్చేవారు. "గోదావరి[ప్రక్క వ్యవసాయం చేసే కాపూ, గోదావరి మీద పడవ నడిపే నావికుడూ, గోదావరికి నిజమైన బిడ్డలు సుమా!"అని అంటూ, మావైపు తిరిగి, "మీరు ఎప్పటికైనా నిజమైన తెలుగు బిడ్డలు కావాలంటే గోదావరిలో ఈతన్నా నేర్చుకోవాలి సుమండీ!" అని చిరునవ్వు నవ్వారు కూ[్డేగారు. శిల్పిరాం, కూ[్డేగారిని చూచి, "మీ జీవితంలో థేమ్సు బాగా హత్తుకుపోయి నట్లుంది!" అన్నాడు.

"నేను ఎబింగ్డర్ వాసినయ్యా! ఎబింగ్డర్ మీ రాజమం[డివంటిదే!"

కూ[్డే గొప్ప ఈతకాడు. ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయంలో ఆయన ఈత పందెంలో మొదటి బహుమానం పొందినవాడు. సము[ద్రం ఈత, [ట్రడ్జన్ యీతలలో యీయన [ప్రజ్ఞ అసాధారణం. ఈ రెండూ మాకందరికీ నేర్పాడు. నాకు సము[ద్రం యీత బాగా పట్టుబడింది. బాగా రావడమే కాదు! అందంగా యీదడం చాతనయింది. నా ఆ యీత చూడడానికి ఆయన జడ్జీ కాటన్‌గారిని, సబ్‌కలెక్టరు కింగుగారినీ, ఆయన భార్యనూ, ఇంపీరియల్ బ్యాంకు ఏజెంటు [బూక్సుగారినీ ఇంకా ఎవరెవరినో తీసుకువచ్చేవాడు.

ఒక్కొక్క నదికి ఒక్కొక్క యీత అందంగా ఉంటుందంటారాయన. బాగా యీదుతూ, నదీ హృదయం తన హృదయానికి హత్తుకోవాలట! ఒకసారి [ప్రేమ నిధానంలా, ఒకసారి కన్నతల్లిలా, ఒకసారి స్నేహితురాలిలా, ఒకసారి మహారాజ్ఞిలా ఆమె [ప్రత్యక్షం అవుతుంది. ఏ విధంగా దర్శనం ఇస్తుందో, ఆ దానికి అనుగుణంగా మనం అయిపోవాలన్నారు.

ఆయన యిలా చేయిపట్టుకు నడిపించుకు పోతూవుంటే మా కవికొండల గోదావరి పాటలు పాడినాడు! మా "రామ్" ఎన్నో గోదావరి బొమ్మలు వేసినాడు; నేను గోదావరిని తలుస్తూ కంఠం విప్పినాను.

విద్యార్థులందరినీ పడవలలో పట్టిసం తీసుకవెళ్లి, పిచికల లంక తీసుకువెళ్లి, గోదావరీ లంకలలో విడిదలు చేయించి, ఆటలతో, విందులతో, పాటలతో మా బ్రతుకులలో ఏవో మధురానుభూతులను ప్రత్యక్షం చేసినాడాయన. ఆ వెనక గోదావరి ప్రవహిస్తూ ఉండేది.

ఈనాటికీ రాజమహేంద్రవర నగరం ఏ పూర్వాంధ్ర నగరంలానో ఆయనకు దర్శనమిస్తుందని కూల్ద్రేగారన్నారు. ఆ నగరంలో ఆయన నడయాడని ప్రదేశం లేదు. ఈలా పరిక్రమిస్తూ ఉండడంలో ఆయనకు ఎంత మందో స్నేహితులయ్యారు. దుకాణాల యజమానులు, వకీళ్లు, ఉద్యోగాలు చేసి పించను పుచ్చుకునే పెద్దలు, బాలురు, కూలివాళ్లు ఎంత మందితోనో ఆయన నేస్తం కలిపినారు.

"పూర్వకాలంలో ఈనగరం ఇంత అసహ్యంగా ఉండేదికాదు. ఆనాడు మీవాళ్లకు గ్రామపారిశుధ్య భావం వారి జీవితంలో భాగం అయి ఉండాలి. లేదా సర్వాధికారాలు కలిగిన ఉద్యోగులు గ్రామం సౌందర్యంగా, శుభ్రంగా ఉండేటట్లు చూచేవారు అనుకుంటాను." అని మా గురువుగారన్నారు.

"అవునండి. మేము ప్రస్తుతం రెంటికిందెడిన రేవడై ఉన్నాము. అటు పాశ్చాత్య శుభ్రతా లేదు. ఇటు ప్రాచీన భారతీయమైన శుభ్రతా లేదు." అని నేను ఏవో యుగాల వెనక్కు పరువిడిపోయిన ఆలోచనలతో అన్నాను.

"మొదట రాజమహేంద్రవరానికీ, ఆ వెనక ఆంధ్రదేశానికి నేను పెంపుడు బిడ్డను సుమా బాపన్నా!"

నన్ను మా గురువుగారు ఓసారి "బాపన్నా!" అనీ, ఓసారి "బాపూ!" అనీ, ఇంకోసారి "బాపీ!"అని, మరోసారి "బాపిరాజూ!" అని పిలుస్తూ ఉండేవారు. ఒక్కొక్క రకంగా పిలవడం ఒక్కొక్క మనోవృత్తిని శబ్దిస్తుందట. "రామ్!" నీ, కవీ అనీ, కవికండలా అనీ, వర్డ్సువర్తూ అనీ కవికొండల వెంకట్రావుని పిలిచేవారు కూల్ద్రే. రామ్ మీ సింహద్వారాలు ఎంతో అందమైనవి. ఆ నల్ల చేవకఱ్ఱలో పద్మాలు, లతలు, చిలుకలు, జామకాయలు, దానిమ్మపండ్లు, హంసలు, సింహాలు, మకరాలు, ఏనుగులు, ఎంత శ్రుతియుక్తంగా ఉత్తమ శిల్పవిన్యాసం చెక్కుతారోయి. కొంచెం పెద్ద సైజులో మంచి సింహద్వారం పూర్ణంగా రచియించి నాకిస్తావా?" అని ఒకనాడు కూల్ద్రేగారన్నారు.

అక్కడినుండి రామారావూ, ఇద్దరు వేంకటరావులు, నేను ఇంకా కొంతమంది కూల్ద్రే ప్రియశిష్యులూ– అందరం రాజమండ్రి ఊరంతా తిరిగినాము. గుమ్మాలు, ద్వారబంధాలు, పక్కపట్టీలు, గడపలు, అడ్డపట్టీలు, అన్నీ పరిశీలించాము. అక్కడక్కడ, కొన్ని మారుమూలల్లో, కొన్ని పెద్ద వీధులలో, కొన్ని పూర్వకాలపు ఇండ్లకు, కొన్ని కొత్తమేడలకు శిల్పం మూర్తించిన సింహద్వారాలు చూచినాము. పై ప్రక్క పెట్టెళ్ళు అశ్వరూపాలుగా ఉండి వాటినోటి కళ్లేలనుంచి కుచ్చులు వేలాడుతున్నవి; పైన అడ్డపెట్టెకు మధ్య గజలక్ష్ములున్నవి. నటరాజు లున్నవి. విఘ్నేశ్వరుడున్నవి. వట్టి అరవైనాలుగు రేకుల పద్మాలున్న సింహద్వారాలు కనపడినవి.

"ఇప్పుడు రాజమహేంద్ర నగరము మీరు నిజంగా చూస్తున్నారు," అన్నారు మా గురువుగారు.

"ఇది రాజరాజనరేంద్రుడు కట్టించిన నగరం. ఆనాటి వస్తువులు ఇప్పుడేమున్నాయి? ఏవో అక్కడక్కడ దొరికిన కొన్ని చాళుక్య విగ్రహాలు మా హుళక్కి మ్యూజియంలో ఉన్నాయి గురువుగారు!" అన్నాడు దామెర్ల వెంకట్రావు.

"మనమంతా నన్నయ, నారాయణభట్టులు తిరిగిన వీధులలో తిరుగుతున్నాము. ఆయన స్నానం చేసిన గోదావరిలో స్నానం చేస్తున్నాము" అని నేను.

"శ్రీనాథుడు ఎంత చక్కగా వర్ణించాడు రాణ్మహేంద్రపురాన్ని! ఆనాడు సాగరము కొమ్మ, ఈనాటి నదీతన్వే! ఆ మొల్లగూరు శక్తి ఇప్పుడూ మా పట్టణాన్ని రక్షిస్తున్నది. ఆనాడు గోదావరి పాడుకొన్న పాటలే యీ నాడూ పాడుతున్నవి." అని కవికొండల!

"ఆ చాళుక్య శిల్పుల ప్రతిభ గోదావరి వరదలలో నుండి ఉద్భవించి ఉంటుంది." అని రామారావు తన పెద్దకళ్ళు అరమూతలుకాగా అన్నాడు.

రెబ్బాప్రెగడ సుబ్బారావు "ఆంధ్రభారతం ఒడెస్సే మా ఆంధ్రులకు !" అని ముందుకు వస్తూ అన్నాడు.

"నేను కుందవాంజను గూర్చి గొంతెత్తి పాడుకోవాలిని ఉంది," అని జయంతి గంగన్నగారు నెమ్మదిగా నడుస్తూ ఏవో దూరాల ఆవల పథాలకు చూపులు ప్రసరిస్తూ అన్నాడు.

కాలేజీకి ఎక్కువరోజుల సెలవులు "మైకేల్ మాస్"కూ, క్రిష్టమస్కూ, చివర వేసవికాలానికి ఇచ్చేవారు. మైకేల్మాస్కూ, క్రిష్టమస్కూ పదిహేనేసి రోజులు సెలవులు. ఈ సెలవులు వస్తున్నాయనగానే ఏదో ముఖ్య ప్రదేశానికి యాత్ర ఏర్పాటుచేసుకొనేవారు మా గురువుగారు. భారతదేశంలో ఉన్న శిల్ప క్షేత్రాలన్నిటికీ ఆయన యాత్రలు సాగించాడు. అజంతా, ఎల్లోరా, సాంచి, భువనేశ్వరము, మహాబలిపురము, అమరావతి మొదలయిన పురాతన పవిత్ర కళా ప్రదేశాలెన్నో ఆయన దర్శించారు.

ఆ యాత్రలకు ఒక్కొక్కప్పుడు తన శిష్యులలో కొందరిని వెంటబెట్టుకొని వెళ్లినారు. అజంతాకు "రామూ", నేనూ మా గురువుగారితో కలిసి వెళ్లినాము.

నేనూ, ఆయనా అమరావతికి వెళ్ళినాము. కవికొండల, దామెర్ల వెంకట్రావు, రామూ, నేను ఆయనతో భువనేశ్వరము వెళ్ళినాము. దామెర్ల సహోదరులూ, నేనూ కూల్ద్రే గారితో పాపికొండలకు "స్టాఫ్" పడవమీద పోయి ఆ పడవలో కొండమొదలు దగ్గిర పదిహేనురోజులు మకాం చేసినాము. దామెర్ల వెంట్రావూ, కూల్ద్రే గారూ కలిసి సింహళయాత్ర పూర్తిచేశారు.

ఆనాడు అజంతాకు చాలా కష్టమైన ప్రయాణం. బెజవాడ మీదుగా సికిందరాబాదుపోయి, అక్కడినుండి "గోదావరి లోయ రైలువే" పై ప్రయాణించి మనమాడు వెళ్లాలి. మనమాడు దగ్గిర కూల్ద్రే గారినీ, నన్నూ రామ్ బొంబాయినుంచి వచ్చి కలుసుకున్నాడు.

నా జన్మలో అంత పెద్ద ప్రయాణం చేయడం అదే మొదటిసారి. మా గురువుగారు శిష్యులను పువ్వులలో పెట్టి యాత్రలు చేయించేవారు. ఆనాడు ఒక "అంగరీజ్సాబ్"తో ప్రయాణం చేయడం వైసురాయిగారితో వెళ్లడం వంటిదే! అందులో మా గురువుగారు మామీద ఈగనుకూడా వాలనిచ్చేవారు కారు. మన్మాడ్ నుంచి జాల్గాం వెళ్లినాము. ఆ గ్రామంలో రెండు టోంగాలు కుదుర్చుకొని నలభై ఎనిమిది మైళ్ల దూరంలో ఉన్న అజంతా చేరుకున్నాము.

దారిపొడుగునా భారతీయ వేదాంతం గురించి ఆయన నన్ను ప్రశ్నించాడు. భారతీయులలో వేదాంతం ఎవరెరుగరు ఆరోజుల్లో! ఆయన "ఈ ప్రపంచం నిజమా అబద్ధమా బాపిరాజూ!" అని అడిగినారు.

"అబద్ధం అండి."

"నువ్వూ నేను ఎదురెదురుగా వాదించుకుంటున్నాము. టోంగాలు మీద ప్రయాణం చేస్తున్నాము. అజంతా చూడడానికి వెడుతున్నాము! ఇదంతా అబద్ధమే?"

"కాదండి. ఇవన్నీ కొంత కాలమేకద ఉండేవి. శాశ్వతం నిజం అయితే, అశాశ్వతపు వస్తువు అబద్ధం అని మావాళ్ళంటారండి."

"అదే కుతర్కం!"

"నిజంలో శాశ్వతనిజం, క్షణికనిజం ఉండవచ్చును. విశ్వంలో నీరుంది. అది నీరు. నీటి చిన్న చిన్న భాగాలు, నూయి, చెరువు, కాల్వ, నదీ మొదలైనవి. వానిని కొద్ది నీరు కలవి అంటాము. అంతేకాని నీరులేనివి అనం కదా!"

ఈ వాదనలో ఏదో తప్పు ఉంది అని తెలుసును. కాని నా ఆ చిన్నతనంలో ఏమి వాదించగలను? అయినా ఏదో మొండిగా వాదించాను. ఆయనకు చిరాకు వచ్చి నన్ను తమ టోంగాలోనుండి దింపి బట్లరు టోంగాలోకి పంపారు. రాము నా స్థలం ఆక్రమించాడు. నాకు పట్టరాని దుఃఖం వచ్చింది.

మధ్య మకాం నెరీ బంగాళాలో మా బళ్ళు ఆరాత్రికి ఆగినవి. అప్పుడు నా స్థితి గమనించి, మా గురువుగారు నన్నెంతో బుజ్జగించారు.

మర్నాడు "నెరీ" గ్రామం, ఆ గ్రామం ముందు ప్రవహించే భోగీరానది, కోట మొదలైన దృశ్యాలను కూర్లే గారూ, రామూ బొమ్మలు విన్యసించుకొనసాగినారు. నేనూ కొన్ని బొమ్మలు వేసినాను.

పదిగంటలకు అజంతా చేరినాము. వంటలు చేసుకొని భోజనాలు చేసి సాయంకాలం ఒక దారిచూపే మనుష్యునితో గుహల కడకు బయలుదేరాము.

కూర్లేగారు మా అందరికన్న ముందు నడుస్తున్నారు. గుహల ప్రథమ దర్శనము ఆయనకు కావాలన్నారు.

"నేను ఒక్కణ్ణే వెనక హ్యూయన్‌త్సాంగులా ఈ గుహలను దర్శనం చేస్తాను. ఆనాటి ఏ మతగురువో, ఆ సంఘారామ కులపతో నాకు దర్శనమిస్తారేమో! మీరు వెనకరండీ!" అని ఆయన మాతో అన్నారు.

"ఈ ప్రకృతి దృశ్యం వర్ణనాతీతం. ఆ ప్రాచీన ఋషులు ఈలాంటి ప్రదేశాలలో ఆశ్రమాలు నిర్మించుకున్నారంటే ఆశ్చర్యం ఏముందీ!" అన్నారాయన.

ఆ గుహలు ఒకమలుపు తిరగడంతోటే కనబడిన దృశ్యం సౌందర్యాతీతమైన సంఘటన. మా గురువుగారు భోగీరానది మధ్యవడులలో నిలుచుండి ఆ దృశ్యం చూస్తూ ఆనందంతో మ్రాన్పడిపోయినారు. ఆయన అలా నిలుచుండడం నాకేదో వేదకాలంనాటి గాథను తలపింపచేసింది.

"నా కళ్ళయెదుట ఈ సంఘారామం ఉచ్ఛస్థితిలో ఉన్న దినాలు ప్రత్యక్షం అయ్యాయి. ఆ దివ్యదర్శనం నాకు కలిగించిన ఆనందం అవధులను దాటింది" అని ఏవో లోకాలను దర్శినలోని చూపులతో ఆరాత్రి కూర్లే గారు మాతో మకాం చేసిన బంగళా ముందు భోగీరానది గట్టున మేమంతా కూర్చున్నప్పుడన్నారు.

ఆ పట్టుపట్టు వారం రోజులు మకాం వేసినాము. ఇప్పుడున్న ఏర్పాట్లు ఆనాడు లేవు. అలాగే పెద్ద గాసుదీపాలతో బొమ్మలు గమనించాము. రాము ఆనందం పట్ట పగ్గాలు లేవు. కాని అతడు అనందపూర్ణుడైనప్పుడు సంచలిత రహిత మునీశ్వరువలె అయిపోతాడు. కూర్లే గారు మాకు ఇటాలియన్ కుడ్య చిత్రలేఖన విధానానికీ, అజంతా కుడ్య చిత్రలేఖన విధానానికీ తేడాలు తెలియజేశారు. "ఇది ఆంధ్ర చిత్రలేఖన సంప్రదాయము సుమండీ. ఇది భారతీయ సంస్కృతికి మకుటాయమానమైన విధానం!" అని ఆయన ఉత్సాహంతో పొంగిపోయినారు. వారి అభిప్రాయాలన్నీ శాశ్వతంగా గ్రంథరూపం చేసినారు. కొన్ని వ్యాసాలు "జాగ్రఫీ" మాసపత్రికలో ప్రచురించారు.

ఇలా ఎన్నో ప్రదేశాలకు మమ్ము తిప్పినారు. మాకు పాశ్చాత్య శిల్ప రహస్యం అంతా బోధించారు. రాముకు బొమ్మలు వేసే విధానం నేర్పినారు. నాకు బి.యే. పూర్తిచేస్తేగాని నేర్పనన్నారు.కాని నా జీవితం అణువణువునా ఆయన బోధనిండి ఉంది. నా కళానేత్రాలు, జ్ఞానచక్షువులు ఆయనే విప్పారచేసినారు.

మేము చర్చించుకున్నవి ఒక్క విషయమేమిటి, సర్వ ప్రపంచమూను. రాజకీయాలు, మతాలు, సంఘపరిణామం, సంస్కృతులు, సర్వకళలు.

రాముతోపాటు అతని స్నేహితులు ఆయన భాష్యకార్లు, వరదా వెంకటరత్నం కూర్లే గారి జ్యోత్స్నలోనికి వచ్చి చేరినారు. కాలేజీ విద్యార్థులలో కవులూ, గాయకులూ, నటులూ, ఆటకాండ్రూ కూర్లేగారి అంతేవాసులే ఆయెను.

మేము భారతీయులమని ఆయన మాకు నేర్పినారు. పాశ్చాత్యవిధానాలు అన్నీ భారతీయ జీవితానికి శ్రుతికావన్నారు.

"మీ దుస్తులు ఎంతో అందమైనవి బాపన్నా! మీ ఆడవాళ్లు కట్టే చీరలు గ్రీసు దుస్తులకన్న అందమైనవి. అలాంటి సౌందర్యపూరీత విధానం మటుమాయం చేసి, అందంకాని మా పాశ్చాత్య విధానాలు మీకెందుకయ్యా?" అని ఆయన వాదించేవారు. ఆయనకు ఉప్పాడ పంచలన్నా, కండువాలన్నా మహాఇష్టం. ఇంటి దగ్గర అవే కట్టేవారు. ఆ తెల్లని విశాల వక్షంపై జిలుగుబూటా ఉప్పాడ కండువా వల్లెవాటువేసి, జరీ అంచులు ఉప్పాడ పంచెకట్టి ఆయన ఆల్కట్టు తోటలో ఉన్న తన బంగళా తోటలో పూలచెట్ల మధ్య కూర్చుని ఉంటే భూమిపైనిదేవుడెవరో అవతరించినట్లు నాకు దర్శనమయ్యేది.

(కిన్నెర అక్టోబరు 1950)



కనిపింపదే నేడు ! కాకతీయ ప్రాజ్య
సామ్రాజ్య జాతీయ జయపతాక
వినిపింపదే నేడు ! విద్యానగరరాజ
సభలోని విజయదుందుభుల మ్రోత
చెలగదే నేడు ! బొబ్బిలికోట బురుజుపై
తాండ్ర పాపయ తళత్తళలబాకు

నిప్పచ్చరంబయ్యె నే నేడు - వీరప
ల్నాటి యోధుల సింహనాదలక్ష్మి
చెక్కుచెదరని యేనాడు మొక్కవోని
ఆంధ్ర పౌరుష మిప్పుడధ్వాన్నమయ్యె;
మరలనొకమారు వెనుకకు మరలి చూచి
దిద్దుకోవమ్మ! బిడ్డల, తెనుగుతల్లి!

- కరుణశ్రీ